కీర్తనలు

# అధ్యాత్మ సంకీర్తనలు-1,2,3,4,5,7,9,10



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 1

# అధ్యాత్మ సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త

కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

1998

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి. వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీవేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి టి జగన్నాధరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది

ప్రధమత: తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం.

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A ,Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం

**M.K.R. వినాయక్**

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి, ప్రపత్తి, దేహాత్మైశవిచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు, జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు. ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు అన్నమయ్య గ్రాంధిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంలో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యధాతథంగా ముద్రింప బడుచున్నాయి పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి

ఈ సంపుటాల ముద్రణకు అధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం కె ఆర్ వినాయక్ I A S గారికి కృతజ్ఞతాంజలి

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A ,Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి తి దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు

డా॥ మేడసాని మోహన్ M A ; Ph D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

తేది 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీఠిక

వేంకటేశపరబ్రహ్మ రసతుందిలమానసం।
అధ్యాత్మవిద్యామర్మజ్ఞం అన్నమార్యం నమామ్యహమ్॥

తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ కీర్తనలుగల మొదటి-వంద రేకులకు సంబంధించినది యీసంపుటము. ఈవందలో 51 నుండి 60 వరకు గల 10 రేకులు, 71 నుండి 77 వరకుగల 7 రేకులు, వెరసి 17 రేకులు లేవు. కాగా 83 రేకులలోని పాటల సంపుటమిది.

ఈ 83 రేకులలో 54 రేకులోలని 331 పాటలను కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 22-6-1950 నాటికి "అన్న-మాచార్యుల అధ్యాత్మకీర్తనలు" అనుపేరుతో 5 వ సంపుటముగ ప్రకటించిరి. మిగిలిన 29 రేకులలోనిపాటలు 173గా కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, తాము ప్రకటించిన 11 వ సంపుటములో 3-వ భాగముగ 30-3-1955 నాటికి ముద్రింపించి ప్రకటించిరి. వీరు ప్రకటించిన రేకులలో 69 వ సంఖ్యగల రేకునకు సంబంధించిన రెండుపాటలు వీరిముద్రణమున జారిపోయినవి. కాగా వీరు ప్రకటించిన 29 రేకులలోనివిగా వీరనినట్లు 173 మాత్రమే కాక పూర్వముద్రితములో జారిపోయిన రెండుపాటలతో కలిసి 175 పాటలు కాగలవు. ప్రభాకరశాస్త్రిగారి 331 పాటలూ, రాళ్లపల్లివారి 175 పాటలూ వెరసి 506 పాటలు ఈసంపుటమున ప్రకటింపబడినవి

అన్నమాచార్యఅధ్యాత్మకీర్తనల మొదటివందరేకులలోని-పాటలు పైతెలిపినవిధముగ అస్తవ్యస్తముగ ఎందుకు కీ॥ శే॥ శాస్త్రి

గారు కీ॥ శే॥ శర్మగారు వరుసగా 5. 11 సంపుటములలో ప్రకటింప-వలసివచ్చినదో తెలుపుట నాకర్తవ్యము

ఈ రేకులలోని తాళ్లపాకకవులసారస్వతము గడ్డకు తీసికొని వచ్చుటకు ప్రయత్నముచేసినవారలలో మొట్టమొదటివారు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. పెద్దరేకులు తప్ప తక్కినరేకులలోనిపాట-లన్ని 1922-23 సంవత్సరములలో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి-గారు, అప్పటి అధికారులఅండతో ఎత్తివ్రాయించి పెట్టినట్లును, ఏదో కారణముగ ఆవ్రాతప్రతులు శిథిలములైనట్లును, శ్రీ సాధు సుబ్ర-హ్మణ్యశాస్త్రిగారే స్వయముగ నాతో చెప్పిరి ఇట్లు నష్టమై పోయినవ్రాతప్రతులలో హతశేషములుగా మిగిలిన కొన్నింటిని, 'The Minor works of Tallapaka Poets'' (తాళ్లపాకకవులలఘు-కృతులు)అనుపేరుతో మొదటిసంపుటముగా పండిత విజయరాఘవా-చార్యుల పరిష్కరణముతో 1935 లోను, ''అన్నమాచార్య అధ్యాత్మ సంకీర్తనలు'' అనుపేరుతో రెండవసంపుటముగా 1936 లోను ''అన్నమాచార్య శృంగార సంకీర్తనలు'' అనుపేరుతో మూడవ సంపుటముగా 1937 సంవత్సరమునందును కొన్ని ముద్రింపించి ప్రకటిం పబడినవి. ఈ మూడుసంపుటములకు పరిష్కర్త కీ॥ శే॥ పండిత విజయరాఘవాచార్యులుగారే. ఆ తర్వాత, ముద్రణమునకు వ్రాత ప్రతులు లేకపోవుటచేతనో, మరెందుచేతనో ఆముద్రణకార్యము స్తంభించినట్లున్నది.

తర్వాత కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారిసంబంధము ఈ రాగి-రేకుల సారస్వతమున కబ్బినది. పైతెల్పినమూడుసంపుటములపరి-ష్కారప్రకటనములు కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి రుచింపక పోవుటచేకాబోలు, ఆ రేకుల నన్నిటిని కవులవారీగా, అధ్యాత్మ శృంగార సంకీర్తనలవారీగా వింగడించుకొని, ఆసారస్వతమును వారు వరుసగా ప్రకటించుటకు పూనినట్లు 1947 న శ్రీ శాస్త్రిగారు

వెలువరించిన 4వ సంపుటముపీఠికవలన తెలియుచున్నది. వారు 4వ-సంపుటములో అన్నమాచార్యుల శృంగారసంకీర్తనములను కొన్నింటిని 1947 న ప్రకటించి, తరువాత 5 వ సంపుటములో పై తెల్పిన-విధముగా అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనలను ప్రకటించిరి విజయ రాఘవాచార్యులపరిష్కరణముతో వెలువడినసంపుటములలో రేకులసంఖ్యగాని, నేటి వ్రాతకుతగినట్లు వ్రాతమోడిగాని పాటింపబడలేదు. అందువలననే కీ॥ శే॥ శాస్త్రిగారు ఇవి-యివి ఫలానా ఫలానా వారి రేకులు అని విభజించి, పాతవారు రెండవ సంపుటముగా ప్రకటించిన అధ్యాత్మకీర్తనలలో తాము (కీ॥ శే॥ శాస్త్రి గారు) నిర్ణయించిన రేకులక్రమములో లేనివానినిమాత్రమే 5 వ-సంపుటమున పరిష్కరించి ముద్రింపించిరి. తాము నిర్ణయించిన-రేకులక్రమమునకు చెందినపాటలు రెండవ సంపుటమున ఉన్నచో, అవి పరిష్కృతములుగానే భావించి వదలిపెట్టిరి.

కీ॥ శే॥ శర్మగారు, శాస్త్రిగారి రేకులక్రమమునే పాటించుచు, శాస్త్రిగారు పరిష్కరించి 5వ సంపుటమున ప్రకటించిన రేకులను వదలి, శాస్త్రిగారి రేకులక్రమము ననుసరించి రెండవ సంపుటములో ఉన్న మొదటి వంద రేకులలోని పాటలను 11 వ సంపుటములో 3-వ భాగముగా ప్రకటించిరి. దీనికి కారణముగా శ్రీ శర్మ గారు "1936 లో తిరుమల తిరుపతి దేవస్థానమువారు ప్రచురించిన The works of Tallapaka poets vol-II' అను దానిలోని అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనల ముద్రణము చాలా అసడ్డగా జరిగినది. పైని రేకులను వ్రాతప్రతులను పరిశీలించి సరియైనపాఠములతో వానిని మరల పచురించుట అత్యావశ్యకమనిపించినది. అట్లు చేసి సవరించిన 173 అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు ఈ సంపుటమున మూడవభాగముగా ప్రకటింపబడినవి". (11 వ సంపుటము పీఠిక 1955) అని తెలిపిచ్చిరి

అందువలన మొదటి వందరేకులలోని పాటలు 5, 11 సంపుటములలో శాస్త్రిగారి, శర్మగారి పరిష్కరణములతో వెలువడినవి. ఈచరిత్ర తెలియనివారికి ఇది అస్తవ్యస్తముగ కనబడునని నేనిది వ్రాయవలసివచ్చినది.

కీ॥ శే॥ శాస్త్రిగారు, శర్మగారలు ప్రకటించిన 5, 11 సంపుటములలోని రేకులవివరము: —

| శాస్త్రిగారు 5–వ సంపుటములో ప్రకటించిన రేకులు | | | | శర్మగారు 11 వ సంపుటము 3–వ భాగములో ప్రకటించిన రేకులు | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 నుండి 10 | రేకుల | వరకు | 10 | 11 నుండి 20 | రేకుల | వరకు | 10 |
| 21 నుండి 30 | ,, | వరకు | 10 | 31 నుండి 36 | ,, | వరకు | 6 |
| 37 నుండి 50 | ,, | వరకు | 14 | 61 నుండి 70 | ,, | వరకు | 10 |
| 81 నుండి 100 | ,, | వరకు | 20 | 78 నుండి 80 | ,, | వరకు | 3 |
| | మొత్తం రేకులు | | 54 | | మొత్తం రేకులు | | 29 |

51 నుండి 60 వరకుగల 10 రేకులు, 71 నుండి 77 వరకుగల 7 రేకులు, వెరసి 17 రేకులు లేవని ముందే తెలిపియున్నాను మొదటివందరేకులలో శాస్త్రిగారు వదలిన రేకులలోని పాటలు 2 వ సంపుటమున గలవు ఆ పాటలనే శర్మగారు 11 వ సంపుటము మూడవభాగమున ప్రకటించిరి.

సుప్రసిద్ధులగు శాస్త్రిగారు, శర్మగారు విడివిడిగ పరిష్కరించి ముద్రింపించిన అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనల మొదటివంద-రేకులలోనిపాటలు ఒకసంపుటముగ నేనిపుడు పరిష్కరింపవలసి వచ్చినది. అన్నివిధముల పెద్దలగు వారిద్దరు పరిష్కరించిన భాగములను నేను పరిష్కరింపబూనుట సాహసమే.

(శ్రీ) శాస్త్రిగారిపరిష్కరణములో కొన్ని రేకుపాఠములు స్వతంత్రముగ రూపాంతరము ధరించినవి ఈ రేకులవ్రాతలో అరసున్నలు, శకటరేఫలు పట్టువదలక వున్నప్పటికీ వ్రాయసకాండ్రమెలకువో, చెప్పి వ్రాయించినవారి మెలకువోగాని ఆ రెండును పలుతావుల పట్టుదప్పినట్లు రేకులవ్రాతలో నున్నవి. 'అందరి, ఇందరి' మొదలగు స్థలములలో పలుతావుల సాధురేఫమే కలదు. శాస్త్రిగారిపరిష్కరణములో గ్రాంథికదృష్టితోకాబోలు పెక్కుతావుల అది శకటముగా మారినది. ఇప్పుడు అవన్నియు రేకులప్రకారము సాధురేఫములుగా మారినవి. తెనుగునకు ఈ సాధుశకట రేఫలు పెద్దతీట. 'ఎవని తరమౌను తిక్కనయే భ్రమించె' అన్నారు, తిరుపతి వేంకటకవులు. అట్లనే పదములు కొన్ని, యతిప్రాసస్థానములు కొన్ని గమనింపబడలేదు. గ్రాంథికవ్యావహారిక భాషలు పాలునీరువలె కలిసి సాగినఈవాఙ్మయములో మనము వ్యాకరింప కుండుట మంచిదేమో. అన్నిటికిని అక్కడక్కడనే పాదదీపికలో (foot notes) పూర్వముద్రితపాఠము (పూ. ము పా.), రేకుపాఠము (రేకు) ఇత్యాదిగా చూపియున్నాను.

1. రేకులో అపపాఠముండి పరిష్కర్తల పరిష్కరణములలో మంచి పాఠమెక్కియున్నచో ఆ పాఠమునట్లే నిలిపి 'రేకు' అని పాదీపికలో చూపియున్నాను.

2. రేకులోనిపాఠము వ్యావహారికముగనో, మాండలికముగనో ప్రసిద్ధార్థమైయున్నప్పుడు, పరిష్కర్తలు దానిని మార్చియున్నచో రేకుపాఠమును పైనచూపి, పూర్వముద్రితపాఠము (పూ. ము. పా.)ను పాదదీపిక (foot notes) లో చూపియున్నాను

3. రేకునందును, పరిష్కర్తలపాఠములోను కొంత వింతగా కనపడినప్పుడు మంచిగా నాకు తోచినపాఠమును పైనచూపి పాద

దీపికలో, 'పూ.ము.పా, రేకు' అని చూపియున్నాను. నా యీ-పరిష్కరణము లో ఏ పాఠముగాని తొలగింపబడలేదు. మూలపాఠ మును స్వతంత్రముగ మార్పుచేయలేదని మనవి చేయుచున్నాను. నా చూపినపాఠములలో దోషము లున్నను పాఠకులు పరిశీలించి తెలిపినచో సవరించుకొనుటకు, తప్పొప్పుకొనుటకు వెనుకాడను. అసలు పాఠములను చూపక, స్వేచ్ఛగ పాఠములను మార్చుట మంచిదికాదని నేను పెద్దలవలన విన్నమాట.

శర్మగారిపరిష్కరణములో పెక్కుతావుల స్పష్టతకొరకు-కాబోలు పదాదినున్న యి, యె, వు, వూ, వొ, వో లు మొదల గునవి అచ్చులుగా మారినవి అవి ఇప్పుడు రేకులప్రకారము నిలిచి-నవి పాటను, పాఠమును, అర్థమును గమనించి పని సాగించుట వారిపద్ధతి ఈ విషయము నాకు వారిబహుకాలసాహచర్య-ముతో సుదృఢముగ తెలిసినది ఈ పరిష్కరణమున వారిపాఠ-ములన్నియు తాళపత్రాకృతిలోనున్న నిడురేకులు (ని. రే.), కడియాలు వేసిన పెద్దరేకలు (పె. రే), పెద్దసంఖ్యలోనున్న సాధారణరేకులు (సా. రే.) చూచి నిర్ణయింపబడినవి అందువలననే వారిపరిష్కరణ-ములో పాదదీపికలు (foot notes) ఎక్కువ అసహాయముగ పై తెల్పిన మూడువిధముల రేకులను చూచి అనితరసాధారణముగ సాగించిన వారిపాదదీపికలను తొలగింపలేక పోయితిని. మనము చేయలేకపోయినను ఒకరు చేసినదొడ్డపనిని యథారూపమున నుంచుట మంచిదని భావించితిని శాస్త్రిగారిపరిష్కరణములో అపు-రూపముగా, శర్మగారిపరిష్కరణములో విరివిగా పాదదీపికలు (Foot notes) కలవు దానికంతటికి వారుభయులు 1,2,3 మొదలగు-గుర్తులు, నక్షత్రముల (*) గుర్తును చూపియున్నారు దానికి భిన్న-ముగా నాసవరణలను యు ౧,౨,౩,౪ మొదలగు తెలుగుఅంకెలలో చూపియున్నాను పాఠకులు గమనింపగలరు.

# పరిష్కర్త బాధ్యత

వ్రాతప్రతులు మొదలగు వానిలోనున్న అక్షరములను అచ్చు-లోకి తెచ్చుటమాత్రమే పరిష్కర్తబాధ్యత కాదని పెద్ద లెఱిగినదే. సుబోధ-దుర్బోధములగు భావములను, సుగ్రహ-దుర్గ్రహములగు పదములను, దురన్వయ-దూరాన్వయములగు వాక్యములను గమ-నించి వివరించి, కామాలు (,), సెమికోలన్లు (;) etc, ఆయాసందర్భములకు తగినవిరుపుగుర్తులను చూపి, పాఠకునిమనస్సు రసాస్వాదనము-నకు మళ్లించుటకూడ పరిష్కర్తబాధ్యతలలో ముఖ్యమైనది పాత కాలమందు సాధారణముగ ప్రతికవికి కొందరు వ్రాయసకాండ్రు ఉండుట సహజము. కవి ఉచ్చరించినదానిని లేఖకులు సరిగ గమనించి వ్రాయవచ్చు. వ్రాయలేకపోవచ్చు. అందులోనితప్పొప్పులను గమ-నించియో, గమనింపకయో మూలగ్రంథమునుండి ఎత్తివ్రాసికొన్న-వారు పలువురుందురు వారివ్యుత్పత్తిప్రకారముకూడ కొన్ని పాఠాంతరములు పుట్టుచుండును. కావున మూలప్రతియొకటి, దాని-పుత్రికలు చాలా. ఒక్కొక్కదానిలో అక్కడక్కడా పాఠభేదములు ఉండుట సహజము. మూలప్రతిలోనివ్రాత గజిబిజిగా నున్నచో దానిపుత్రికలలోనిపాఠములకు కొదువే వుండదు. అందువలననే భారతాదిగ్రంథములు నేటికిని బహుపాఠసంకలితములై అచ్చగు చున్నవి. ఇట్టివానిని చూచియే అప్పకవి:—

'నన్నయముఖ్యసత్కవిజనంబులకావ్యములందు లెఖకుల్
గొన్నియుఁ,బాఠకాధములు గొన్నియుఁ బోకడఁబెట్టఁ,దక్కువై
యున్నెడఁ గాంచి జానపదు లోడకదిద్దినతప్పుత్రోవలె-
ల్ల న్నిజమంచుఁ గైకొనిన, లక్షణవేత్తలు సమ్మతింతురే.,

అప్ప. 3-202)

అని వాపోయినాడు. వ్రాయసకాండ్రుకూడ అహంకరించక తాము వ్రాసిన ప్రతికడపట:-

1. క॥ వ్రాలా శిథిలు తప్పులు
చాలంగల వేమ శబ్దసంగతు లెరుగన్
కేలింబెట్టక నవ్వక
పోలంగా దిద్దరయ్య బుధజనులారా॥

2. క॥ యతిగణనియమము లెరుగను
అతిశిథిలు వ్రాలు చూడ నన్నియు తప్పుల్
ప్రతి చూచి వ్రాసినాడను
మతిమంతులు తప్పు దిద్ది మన్నించరయా॥

3. క. వ్రాలా శిథిలు తప్పులు
త్సాలంగల వేమ శబ్దసంగతు లెరుగన్
గేలిం బెట్టక నవ్వక
ప్రోలంగా దిద్దరయ్య బుధజనులారా॥

4 శ్లో॥ యాదృశీ పుస్తకం దృష్ట్వా తాదృశీ లిఖితం మయా
అబద్ధత్వా సుబద్ధత్వా మమ దోషో న విద్యతే॥

ఇత్యాదిగా వ్రాయుట కలదు. * ఈ పై చూపిన పద్యములలోనే వ్రాయసకాండ్రవ్యుత్పత్తి తెల్లమగుచున్నది. పాతకాలములో అక్షర-రమ్యతనుమాత్రము ఆదరించి వ్యుత్పత్తిని గమనింపక వ్రాయస-కాండ్ర నుంచుకొనుట ఒకఅలవాటుగా సాగినది స్వయముగా కవులే వ్రాసినతాళపత్రప్రతులు నేటికి వ్రేళ్లమీద లెక్కింపవలసినవి-మాత్రమే కలవేమో? ఈ పద్ధతి తాళపత్రి గ్రంథములను పరిష్క-రించు వారందరికి సువిదితమే.

* పై తెల్పిన 1, 2, 3, 4 సంఖ్యగల పద్యములు 'వరాహపురాణము' (హరిభట్ట ప్రణీతము)ను పరిశోధించి ముద్రించిన డా॥ దేవళ్ల చిన్నికృష్ణయ్య ఎం. ఏ, ఎం. లిట్., పి హెచ్ డి వారిపీఠికనుండి గ్రహించినవి

ఇట్లు పెక్కుప్రతులగలపుస్తకములు ముద్రించుటలో కొంతసౌకర్యము కలదు. ఏదో ఒకదానిలోనైన అర్థానుకూలమగు-పాఠము కనపడవచ్చు. కాని ఒకేమాతృకకలిగినపుస్తకములను పరిష్కరింపవలసివచ్చినచో ఆ పరిష్కర్తయాతన చెప్పనక్కరలేదు

దుర్బోధములగు అపపాఠములతో నిండిన "హంస వింశతి" ని పరిష్కరించి ముద్రింపించిన కీ॥ శే॥ మద్దులపల్లి వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రి (నంద్యాల)గారితో పాఠచర్చ చేసినప్పుడు, పూజ్యులు కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారితో కలిసి 'పాండురంగ మాహాత్మ్యమును' అన్నమయ్యకీర్తనల కొన్ని సంపుటములను పరిష్కరించినపుడు నాకీశ్రమ బాగా అర్థమైనది పరిష్కర్త వ్యుత్పన్నుడై మెలకువగలిగి పాఠపరిశోధనమునందు తాను బాగా పరిశ్రమిస్తే పాఠకునకు కొంత ఊరట తప్పక కలుగును పరిష్కర్త, వ్రాతప్రతి-లోనిఅక్షరములనుమాత్రము అచ్చులోనికి తెచ్చిపెట్టుటకో, పెద్ద-వాడనిపించుకొనుటకు మూలపాఠములను చూపక యథేచ్ఛగ సవ-రించుటకో పూనుకొన్నచో పాఠకునియాతన చెప్పనలవికానిది తన-వ్యుత్పత్తితో సవరించుటకుగాని, అర్థము వింగడించుటకుగాని వలను-పడనప్పుడు తనకది అర్థము కాలేదని వ్రాయుట మర్యాద. అట్లు వ్రాసినచో తన పాండిత్యమునకు వెలితగునేమోయని కొందరు వ్రాయలేరు ఉన్న పాఠములనిచ్చి తనకు తోచినపాఠములను తెలిపి, ఇది యిట్లర్థము కావచ్చునని చూపినచో సహృదయులు దానిని మెచ్చినచో గ్రహింతురు లేకున్న దిగవిడుతురు.

ఈ తాళ్లపాకకవుల పదవాఙ్మయమునకు రేకులపాఠ-మొక్కటే మూలప్రకృతి. ఈ వాఙ్మయమంతయు గ్రాంథికవ్యావ-హారికభాషలతో సంకీర్ణము. వారికాలమునాడు మాండలిక

ముగ వ్యావహారికముగ నున్నపదరాశినంతటిని జంకుగొంకులేక వాడినారు మన మీవాఙ్మయమును పరిష్కరింపవలసివచ్చునప్పుడు చాల వింతవింతసమస్యలు ఎదురగుచుండును. సంధులు, సమాసములు, కారకములు ఇత్యాదులలోకూడ వీరివ్యావహారికదృష్టి పట్టువిడువలేదు.

వీరి వాఙ్మయసాగరమున కొంతకాలము మునిగితేలినవ్యుత్పన్నునికిగాని దీనిలోతు తెలియుట కష్టము. మామూలు వాఙ్మయమును చూచిన దృష్టితోకాక దీనిని విశేషదృష్టితో గమనింపవలసినఅవసర మెంతైన గలదు. ఈవిషయమున నాఅల్పమతికి వెలుగుచూపినవారు కీ॥ శే॥ పూజ్యులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు. వారిభిక్షయే ఈవిషయమున నాఆకలి తీర్చినది. సుప్రసిద్ధులైనమహాకవులరచనలలో ఒక్కొక్కదానిలో ఒక్కొక్కవింత, ఒక్కొక్కగొప్పదనము, ఒకఅభ్యాసము తప్పక కన్పట్టును. ఆకవివాఙ్మయమును తదేకధ్యానముగ పరిశీలించినవానికిగాని దానిలోనిమర్మము అంతుచిక్కదు. బహుగ్రంథపరిశీలకులందరుకు ఈవిషయము సుప్రసిద్ధమే.

పై తెల్పినరీతిగ నాస్వల్పమతికి తోచినది అక్కడక్కడ పాదదీపికలో (Foot notes) చూపుకొనియున్నాను. పూర్వముద్రిత ప్రతులలో వారుచూపిన విశేషములను నేనెక్కడా తొలగింపలేదు. వానికితోడు తెలుగుఅంకెలతో నాతెలిపినవియు గలవు. విరుపుగుర్తులు పూర్వముద్రితప్రతులలో ఎక్కడా లేవు. అవన్నీ నావే.

ఈ వాఙ్మయమున సాధారణముగ ఏపాదమున కాపాదము అన్వితమై, ఒక్కొక్కచరణమంతయు ఒక వాక్యముగ ఏర్పడి, పల్లవిలోనిసంగ్రహాభావమును పోషించుచుండును. కొన్ని కొన్ని పెద్దపాటలలో, సంగ్రహముగ రచించిన చిన్నపాటలలోను, అక్క-

డక్కడ విరామచిహ్నములు (Punctuvations) లేకున్నచో అన్వయ మంతసులభముకానట్లు తోచినది. అందువలన వాక్యాన్వయమును సులభముచేయుటకై చూపిన విరామచిహ్నములన్నియు నావే.

ఈ పదవాఙ్మయమంతయు సంగీత సాహిత్యముల సమష్టి-పంటగా వెలిసినది. అందువలన సాహిత్యదృష్టితో అనవసరముగ తోచినదీర్ఘములు కొన్ని వ్రాతలలో కలవు. నేనేకాక పూర్వపరి-ష్కర్తలందురుకూడ సాహిత్యానురూపముగ ఆదీర్ఘములను అక్క-డక్కడ హ్రస్వములుచేసినపద్ధతియు గలదు. ఐతే సముచ్చయాత్మక మగు దీర్ఘమును లయకనుగుణముగ విధిగా అన్ని చరణములందు పాటింపబడిన దీర్ఘముమాత్రము నేనెక్కడా హ్రస్వము చేయలేదు.

గానమునకు అవసరమైనదీర్ఘము మనము లిపిలో చూపినను చూపకున్ననూ, సంగీతానుగుణముగ గాయకులు దీర్ఘములను చేర్చి వాడుకొనుట పరిపాటి. దానివలన లిపిలో దీర్ఘమున్నను, లేకున్నను వారిస్వాతంత్ర్యమునకు భంగము రాదు.

## పరిశ్రమ

ఈ రేకులవ్రాతలో హ్రస్వదీర్ఘములకు నేటివ్రాతమాదిరి విడి విడిగ గుర్తులు లేవు. "ఆ(హల్లులపైకూడ) నూ, మీ, మూ, మో, యూ, యో, లూ, వూ" తప్ప దీర్ఘాక్షరములు కానరావు, పై చూపినవికాక తక్కిన హల్లులపై ఇ, ఈ కారములను, ఎ, ఏ కార ములను, ఒ, ఓ కారములను మనమే వింగడించుకొనవలెకాని వ్రాతలో ప్రత్యేకచిహ్నాలు లేవు. 'మో' 'యో' లుమాత్ర మంతటా దీర్ఘముగనే యుండును. 'మోగి' 'మోక్కు' 'యోక్క' ఇత్యా దులలో, కురుచ చేయుట మనపని. నేటికాలముమాదిరి, పూర్వ-కాలములందలివ్రాతలలోను విరామచిహ్నలువగైరా వుండనేవుండ-

వనుట అందరికి తెలిసినదే. దీనివలన గ్రాంథిక వ్యావహారిక సంకీర్ణమైన- ఈ భాషలో సందర్భానుగుణముగ మనమే పదస్వరూపమును, విరామ- చిహ్నాములను గురుతించుకొనవలసియుండును. పై తెలిపిన గజిబిజితో ఒక్కొక్కప్పుడు పదవిభాగమేకూడ శ్రమసాధ్యమైయుండును. ద్విత్వ హల్లునకు ముందున్న పూర్ణానుస్వారము పూర్ణానుస్వారముగా, ద్విత్వరహితమైన హల్లునకు ముందున్న నిండుసున్న అరసున్నగా గ్రహింపవలసియున్నది ఈ అనుస్వారపద్ధతులు ఊష్మ, రేఫ సంయుక్త మహాప్రాణాక్షరములకుమాత్రము లేదు అవి మామూలు గనే జరుగుచుండును తాళపత్రములందును ఈ క్రమ సమానమే, పరిష్కర్తలందరికీ ఇది అనుభవ నిరూఢమే. దీనివలన పటుతావుల పద వాక్య సమాస నిర్ణయములు సులభములు కావు. వ్రాతప్రతులను చూచివ్రాయుపరిష్కర్తలందరిపరిశ్రమ ఒక్కసారి అనువాదము- చేయుటమాత్రమే నాఉద్దేశము.

## రేకుల గజిబిజి

23 వ సంపుటము పుట 303 to 308 లలో పెదతిరుమయ్య అధ్యాత్మకీర్తనల 98 వ రేకులోని పాటలను 527 to 532 పాటలుగా పరిష్కర్తలు ముద్రింపించినారు.

అన్నమాచార్య, పెదతిరుమలాచార్య, చినతిరుమలాచార్యుల- అధ్యాత్మ-శృంగార సంకీర్తనలరేకులలెక్కను ఆనాటిలెక్కప్రకా- రము తొలుత 1947 లో 4 వ సంపుటమున చూపినవారు కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వీరి లెక్కలో అన్నమాచార్య- అధ్యాత్మకీర్తనల రేకుల మొదటి వందలో 51—60 వరకు (10). 71 నుండి 77 వరకు (7). వెరసి 17 రేకులు లేవు అట్లే పెదతిరుమలా- చార్యుల అధ్యాత్మకీర్తనల మొదటివంద రేకులలో 11, 30 సంఖ్యగల

రేకులు (2), 78 నుండి 100 దాకగల (23) రేకులు, వెరసి 25 రేకులు లేవు. కాని పెదతిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనల రేకులలో 98 సంఖ్యగల రేకు ఒకటి కలదని నా భావము. అధ్యాత్మసంకీర్తనల రేకులపైన 'అ', శృంగారసంకీర్తనల రేకులపైన '(శ్రీ)' గుర్తుంచుట పద్ధతి. ఈ గుర్తులుగల రేకులలో అధ్యాత్మకీర్తనల రేకులలో శృంగారకీర్తనలు, శృంగారకీర్తనల రేకులలో అధ్యాత్మకీర్తనలు ఒకటి రెండు చెదురుముదురుగా అక్కడక్కడ కన్పించుచున్నవి నాపరిష్కరించిన శృంగారసంకీర్తనల సంపుటములలో పై విధముగ దొరలినఅధ్యాత్మకీర్తనలను గురుతించియున్నాను. కాని పెదతిరుమలాచార్యుల శృంగారసంకీర్తనల వందరేకులలో 98 వ రేకుపై పై చెప్పినట్లు '(శ్రీ)' వున్నది. కాని ఆ రేకులోని ఆరు పాటలు అధ్యాత్మకీర్తనలే. రేకంతా అధ్యాత్మకీర్తనలుండి, రేకుపైన '(శ్రీ)' అని వ్రాయుట వ్రాయసకానిపొరపాటని భావింపవచ్చు. 23 వ సంపుటమును పరిష్కరించినవారు ఈవిషయమును పేర్కొనియున్న బాగుండెడిది.

'(శ్రీ)' 98 అనురేకులోని అధ్యాత్మకీర్తనలను గుర్తించి,రచనా శైలినిబట్టి అవి పెదతిరుమలయ్యవిగా ఉండవచ్చునని భావించి '(శ్రీ)' పొరపాటుగా దానిపైన పడినదని తలచి, 1974 లో ఈ రేకులను పర్వరచునపుడు, పై '(శ్రీ)' 98 ని పెదతిరుమలయ్య అధ్యాత్మకీర్తనరేకులలో చేర్చి 'అ' 98 అను రేకును అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనలరేకులలో చేర్చి, రేకులగణన చూపునప్పుడు 98 '(శ్రీ)' అను రేకు పెదతిరులాచార్యుల శృంగార సంకీర్తనరేకులలో పొరపాటుగా చేరియుండవచ్చునని వ్రాసితిని. '(శ్రీ)' 98 రేకులోని అధ్యాత్మకీర్తనలను ఈ సంపుటము కడపట విడిగా ముద్రించి తెలుపుకొనుచున్నాను. పై నా భావము సరియైనది. కానిది రసికు లూహింపగలరు. ఆ రేకుపై '(శ్రీ)' పొరపాటుగ బడినదని యే ఇప్పటికిని నా

భావము. 1974 లో రేకుల గణనపట్టిక క్రింద ఈవిషయ మియ్యదలచి గుర్తించుకొంటినిగాని, 1975 అన్నమాచార్యవర్ధంతిఉత్సవమునకు 22వ సంపుటము వెలువరించుపనితొందరలో ఆసంపుటము పీఠికలో ఈ విషయము వ్రాయుటకు మరచితిని.

రేకులపైనున్న 'అ' '(శ్రీ)' అను సంకేతాక్షరములను, సంఖ్యను మాత్రము గుర్తించి పాటలలోని విషయమును, రచనా పద్ధతిని, గమనింపనికారణముగ ఈ ప్రమాదము జరిగియుండవచ్చునని తలచుచున్నాను. రేకులపైనున్న సంకేతాక్షరములు(అ, (శ్రీ)) లతోనే ఇవి అధ్యాత్మకీర్తనలు, ఇవి శృంగారకీర్తనలు అని నిర్ణయింప వలసివచ్చినచో, ఏ గుర్తులేని 89, 90 సంఖ్యలుగలరేకులు, అన్నమా చార్యుల అధ్యాత్మకీర్తనలలో చేర్చియుండుట వింత కాగలదు. ఆపని తొలుత కీ॥ శే॥ శాస్త్రిగారు చేసినారు. తరువాత వచ్చిన పరిష్కర్త లందరకు శాస్త్రిగారి రేకులలెక్కయే మూలాధారము. 1974న నా-పరిష్కరించిన 22వ సంపుటములో ఈరేకుల గజిబిజిని గూర్చి కొంత వ్రాసియున్నాను. ఏగుర్తులేని 89, 90 రేకుల పాటలరచనాపద్ధతిని, పాటలలోనివిషయమునుబట్టి అవి అన్నమాచార్యుల అధ్యాత్మ-కీర్తనరేకులు కాగా, '(శ్రీ)' గుర్తుగల 98 రేకు పెదతిరుమలా చార్యుల అధ్యాత్మ కీర్తనలరేకుగా, విషయమునుబట్టి ఏల నిర్ధరింప-రాదు? రేకులను వ్రాయించినవారు, వ్రాసినవారు కూడా మానవులే. మానవసహజములైన భ్రమప్రమాదములు వారికీ వుండవచ్చు. ఇంత పెద్దవాఙ్మయమును మోసిన ఈ రేకులు రెండుమూడింటిలో ప్రమాదవశమున సంకేతాక్షరములు లేకుండుట, మారుట సంభవింప కూడదా? దానిని మనము గుర్తింపవలసిన అవసరమున్నదని మాత్రమే నామాట. మనమూ ప్రమాదము పడకూడదా అన్నచో అదీ సహజమే.

కీ॥ శే॥ శాస్త్రిగారిచ్చిన రేకులలెక్క, వారిచ్చిన కొలతల ప్రకారమేకూడ తడబడుచున్నదని 22వ సంపుటమునందే తెలుపు

కొన్నాను. కాని శాస్త్రిగారు ఆమాత్రముశ్రమ తీసికొనకుండినచో రేకులవిషయమున ఈపాటినిర్ధారణగూడ నేటికిని కుదిరియుండదు. వారి జాగ్రత్త చాల మెచ్చుకొనదగినది. ఆయా రేకులను ఫలానా ఫలానా వారివి అని తెల్పుటకు రేకులోని-"పాటల మొదళ్లు' అని కూడ ౫ వ సంపుటమున వారిపీఠికలో గురుతించియున్నారు.

ఒక పెద్దవారు నిశ్చయించినదానిని హేత్వాభాసములతో తారుమారు చేయుట మంచిసంప్రదాయము కాదు. అన్నమయ్య కీర్తనలుగలకొన్ని రేకులలో అన్నమయ్యను అన్నమయ్యయే స్తుతించుకొన్నట్లు కొన్ని పాటలు గలవు. ఇదంతా చూస్తే మొదలు వ్రాసిపెట్టినకీర్తనలను, రేకులకెక్కించుసందర్భములో కొంత ప్రమాదము జరిగి యుండవచ్చుననక తప్పదు. ఇంత పెద్ద వాఙ్మయము ఒకేవంశమునకుచెందినకవులరచనలను, ఇంతగొప్పశ్రద్ధతో శాశ్వతముగ నుండునట్లు రేకులకెక్కించునట్టి దొడ్డపరిశ్రమలో ఆమాత్రముతడబాటు తోయరానిదే. అంతమాత్రమున వారిశ్రద్ధను కార్యదీక్షను తక్కువ చేయరాదు. అది మహాపచారము కాగలదు.

ఈ ప్రమాదము ఈ దొడ్డపనికి పూనుకొన్న పెద్దలదైనా కావచ్చు. లేక ఈ వాఙ్మయమును రేకులపై చెక్కిన పోగరపనివారిదైనా కావచ్చు.

## అన్నమయ్య వేదాంతము

అన్నమయ్య, తత్పుత్ర పౌత్రులు రచించిన సంకీర్తనల రాశినంతటిని అధ్యాత్మకీర్తనలని, శృంగార కీర్తనలని రెండువిధములుగ విభజించియున్నారు. ఈ విభజనము కవులదే. రేకులందే ఫలానా వారు విన్నపముచేసిన 'అధ్యాత్మ సంకీర్తనలు', 'శృంగారసంకీర్తనలు' అని కలదు. వేదాంతమునకు, భక్తికి, లోకనిందకు (సంసార

నిందకు) ఇత్యాదులకు సంబంధించినకీర్తనలు అధ్యాత్మకీర్తనలని, దూతి, నాయికా-నాయక, సపత్ని వ్యవహారములతో నిండి, విభా వానుభావ సంచారిభావములతో పండి, ఉభయవిధ (సంయోగ-వియోగ) శృంగారములు పరిమళించుకీర్తనలు శృంగారసంకీర్తనలని వీరినిశ్చయము.

క॥ పదములు శృంగార వధూ
మృదుమధురమనోజ్ఞవాక్యమిశ్రములైనన్
విదితార్థగ్రామ్యోక్తులు
పదిలముగాఁ బొంకమెఱిఁగి పలుకఁగఁజెల్లున్ —56

క॥ పల్లవనారీమ్లేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసకముఖ్యనాటకాదికఫణితిన్ —58

క॥ దేహాత్మేశవివేకో-
త్సాహంబును లోకవేదధర్మాధర్మా-
ద్యూహాపోహంబులఁగల-
యాహరిసంకీర్తనంబు లధ్యాత్మంబుల్ —61

—సంకీర్తన లక్షణము—56, 58, 61 చినతిరుమలాచార్యులు.

పై తెల్పిన 61 వ పద్యము ప్రకారము దేహము, ఆత్మ (జీవాత్మ) ఈశ (పరమాత్మ) ఈమూడింటి విభాగమునందును, లోకమునందు, వేదమునందు కానవచ్చెడి ధర్మాధర్మముల బలాబలములు మొదలగునవి గలిగినహరిసంకీర్తనములు అధ్యాత్మసంకీర్తనములని తెలియుచున్నది.

అన్నమయ్యకు గలిగిన ఈభక్తి, ఈపాండిత్యము, ఈరచనాశక్తి ఇవన్నియు జన్మసిద్ధములే. పెద్దగ గురువులవద్ద చదివి సంపాదించినవి

కావు. అందువలననే భాషాప్రయోగమునందు ఈత డతిస్వతం-త్రుడుగ కనపడుచుండును. ఈతనికి గురూపదేశము నిమిత్తము మాత్రమే. జన్మసిద్ధమై వెలికి ఉబుకపోవుచు గట్టులొరచుకొను చున్న శక్తి, జ్ఞాన ప్రవాహములకు ఆగురూపదేశము అడ్డుకట్ట మాత్రము తొలగించినది. విద్యలన్నియు

"తాం హంసమాలాః శరదీవ గంగాం మహౌషధిం నక్తమివాత్మభాసః।
స్థిరోపదేశాముపదేశకాలే ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః॥

(కుమారసంభవము 1-30)

అన్నట్లు కాలము కాచుకొనియుండి, గురూపదేశము నెపముగా తమకుతామే లోకముపై విసరుకొని వచ్చినవి. క్రొత్తగా ఈతని ఆత్మలో జ్ఞాన ముత్పాదింపబడలేదు. ఈతనికి గురువైనమహాత్ముడు ధన్యుడు. అల్పపరిశ్రమతో అనల్పమైనఫలమును సాధింపగలిగి-నాడు. అదే మనకు లభించినఈసంకీర్తనల రాశి.

శరీర జీవాత్మపరమాత్మలచర్చయే ప్రధానముగ వేదాంత మునకు సంబంధించినది. తక్కిన లోకనిందమొదలైనవి, తనకున్న విరక్తికి సూచకములుగా, హేతువులుగా మాత్రమే ఉపయోగపడు చుండును. జన్మము (దానికి సంబంధించిన శరీర సంసారచింత), మరణము (దానికి సంబంధించిన రోగనరక పునర్జన్మములు), జ్ఞానము (దానిని పొందుటకు దగిన జ్ఞాన-ధ్యాన-భక్తి-యోగ సంకీర్తనాది క్రమము) ఇవన్నీ అన్నమయ్యకీర్తనలలో విపులముగ చర్చింపబడినవి. ఈ దేహాత్మేశచర్చ అన్నివేదాంతములకు సమమైనను, ముక్తిస్వరూ-పము, దానికి సంబంధించినసాధనసంపత్తిమాత్రము ప్రతిమతము-నందును భిన్న భిన్నముగ మారుచుండును మతము లెన్నియో పుట్టినవి పుట్టు చున్నవి. చచ్చినవి చచ్చుచున్నవి. కాని శ్రుతి స్మృతి ప్రమాణ బలముతో నిలిచిన మతములు ద్వైతాద్వైత విశిష్టాద్వై-తములు మూడే

జీవాత్మ పరమాత్మలు శాశ్వతముగ వేరు వేరని చెప్పినది ద్వైతము. జీవాత్మ పరమాత్మలకు దశాభేదమే కాని వస్తువు ఒక్కటే అనునది అద్వైతము. జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అయినను వాటి-సంబంధము శరీరశరీరి భావముతో కూడినది. శరీరి ప్రధానము శరీరమప్రధానము. శరీరము శరీరిని ఆశ్రయించియుండునది అని చెప్పునది విశిష్టాద్వైతసిద్ధాంతము. ఇదియే అన్నమయ్యమతము.

శ్రీరాగం

దేహము దా నస్థిరమట దేహి చిరంతనుఁడౌనట
దేహపుమోహపునేఁతలు తీరుట లెన్నఁడొకో ॥ పల్లవి ॥

కన్నులఁ బుట్టినకాంక్షలు కప్పికదా దుర్బోధల
కన్నులు మనసునుఁ దనియక గాసిఁబడిరి జనులు
తన్నేఁక నెరుఁగుట లెన్నఁడు తలఁపులు దొలఁగుట లెన్నఁడు
తిన్ననిపరవశములచేఁ దిరుగుట లెన్నఁడొకో ॥ దేహ ॥

సిగ్గులుదొలఁగనియాశలఁ జిక్కికదా దుర్మానపు-
సిగ్గులయెగ్గులచేతను చిక్కువడిరి జనులు
సిగ్గులు దొలఁగుట యెన్నఁడు చిత్తములోనొ పెన్నఁడు
తగ్గులమొగ్గులనేఁతలు తలఁగుట లెన్నఁడొకో ॥ దేహ ॥

మనసునబుట్టినయాతఁడు మనసునఁ బెనగొని తిరుగఁగ
మనసే తానగుదైవము మరచిరి యందరును
అనయము తిరువేంకటపతి యాత్మఁ దలఁచి సుఖింపుచు
ఘనమగు పరమానందము కలుగుట లెన్నఁడొకో ॥ దేహ ॥

(ఈసంపుటము పాట 136)

దీనినే వైష్ణవ సిద్ధాంతమనికూడ చెప్పుచుందురు. విష్ణువు తప్ప మిగతా ప్రపంచమంతా (సర్వదేవతలతో సహా) ఈమతమున అప్రధానమే. ఇతరదేవతారాధనము అపచారముగనే భావింపబడుచున్నది

బౌళి

అన్నిటా నీ వంతర్యామివిఅవుట ధర్మమే అయినాను
యెన్నఁగ నీవొక్కఁడవేగతియని యెంచికొలుచుటే ప్రపన్న
సంగతి ॥పల్లవి॥

యేకాంతంబున నుండినపతిని యెనసిరమించుటే సతిధర్మంబు
లోకమురచ్చలోనుండినపతి లోఁగొని పైకొవి(న?) దానట్లు;
యీకొలఁదులనే సర్వదేవతలయిన్నిరూపులై నీవున్నప్పుడు
కైకొని నిను బహుముఖములఁ గొలుచుట గాదు పతివ్రత
ధర్మంబు ॥అన్ని॥

పూనినబ్రాహ్మణులలోపలనే వినుఁ బూజించుట వేదోక్తధర్మము
శ్వానకుక్కుటాదులలోపల విను సరిఁ బూజించఁగరానట్లు,
యీనియమములనె ప్రాకృతజనులను యీశ్వర నీశరణాగత
జనులను
కానక, వొక్కట సరిగాఁజూచుట కాద(ది?) వివేకధర్మంబు
॥అన్ని॥

శ్రీవేంకటపతి గురువనుమతినే సేవే నాకును శిష్యధర్మము
ఆవలనీవల నితరమార్గములు యాత్మలోన రుచిగానట్లు.
భావింపఁగ సకలప్రపంచమును బ్రహ్మం సత్య జ్ఞాన మనంతము
కైవశమై యిన్నిటా వెనుతగులు కాద(ది?)వివేకధర్మంబు
॥అన్ని॥

(ఈసంపుటము. పాట 386)

వీరికి అన్నిటికంటె హరిభక్తిమిన్న, అన్నిటికంటె వైష్ణవము మిన్న.

సామంతం

సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుఁడౌట ॥పల్లవి॥

కొదలేనితపములు కోటానఁగోటులు-
నదన నాచరించి యటమీఁద
పదిలమైనకర్మబంధములన్నియు
వదలించుకొనికదా వైష్ణవుఁడట ॥ సుల ॥

తనివోవియోగతంత్రములు లక్షలసంఖ్య
అవఘుఁడై చేసినయటమీఁద
జననములన్నిట జనయించి పరమపా-
వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట ॥ సుల ॥

తిరిగితిరిగి పెక్కుతీర్థములన్నియు-
నరలేక సేవించినటమీఁద
తిరువేంకటాచలాధిపుఁడైనకరిరాజ-
వరదునికృపఁగదా వైష్ణవుఁడౌట ॥ సుల ॥

(ఈ సంపుటము. పాట 144)

వైష్ణవమునకు తానూహించిన లక్షణములను ఈ క్రింది విధముగ అన్నమయ్య పాడొనినాడు

ఆహిరి

మదమత్సరము లేక మనసుపేదైపో
పదరినయాసలవాఁడువో వైష్ణవుఁడు ॥ పల్లవి ॥

ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి
యెట్టివారినైనా దూరి యెవ్వరినైనఁ జేరి
వట్టియాసలఁబడనివాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥

గడనకొరకుఁ జిక్కి కాముకవిద్యలఁ జొక్కి
నిడిపి నేమైనాఁ గవి నిక్కినిక్కి
వొడలిగుణముతోడ వుదుటువిద్యలఁ జాల
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥

ఆవల వారులఁ జెడనాడఁగ వినివిని
చేవమీరి యెవ్వరినిఁ జెడనాడక
కోవిదు శ్రీవేంకటేశుఁ గొలిచి పెద్దలకృప
వావివర్తనగలవాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥

(ఈసంపుటము. పాట 59)

ఈలక్షణము ఇంచుమించు అధ్యాత్మికిసి సంబంధించినదే.

వేదాంతులకు సహజమైనసంసారనింద ఈతని అధ్యాత్మ-
ర్తనలో విశిష్టమైనస్థానము నాక్రమించియున్నది ఈతని సంసార-
రూషణమును వినినచో మహాభోగికూడ విరక్తుడుకాక తప్పదు. దీని
గారమేనేమో కవికర్ణరసాయనములోని ఈ క్రిందిపద్యము.

గీ॥ యతి విటుఁడు గాకపోవు పెట్లస్మదీయ-
కావ్యశృంగారవర్ణ నాకర్ణనమున
విటుఁడు యతిగాక పోదాదు వెస మదీయ-
కావ్యవైరాగ్యవర్ణ నాకర్ణనమున

(కవికర్ణరసాయనము. పీఠిక - 22.)

అన్నమయ్యకు తన గురువులవలన వచ్చిన వైష్ణవమతభక్తి.
గానివలన తాను సాధించినసుగతి, చాలగొప్పగా తెలియుచున్నది.
మతదీక్ష తనను ఎంతవానిగా జేసినదో

## శ్రీరాగం

ఆదిగాక నిజమతం బదిగాక యాజకం-
బదిగాక హృదయసుఖ మదిగాక పరము ॥ పల్లవి ॥

అమలమగువిజ్ఞానమనుమహాధ్వరమునకు-
నమరినది సంకల్పమనుమహాపశువు
ప్రమదమనుయూపగంబమున విశసింపించి
విమలేందు(ద్రి?)యాహుతులు వేల్పంగవలదా ॥ ఆది ॥

అరయ నిర్మమకార మాచార్యుఁడై చెలఁగ
వరుసతో ధర్మదేవత బ్రహ్మగాఁగ
దొరకొన్న శమదమాదులు దానధైర్యభా-
స్వరగుణాదులు విప్రసమితిగావలదా ॥ ఆది ॥

తిరువేంకటాచలాధిపునిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతనికృపాపరిపూర్ణజలధిలో
నరుహులై యవబృథం బాడంగవలదా ॥ ఆది ॥

(ఈసంపుటము, పాట 40)

అనుపాటవలన తెలియుచున్నది. ఇందులో పేర్కొన్నవిషయము-లన్నియు యోగవాసిష్ఠాదులలో తపస్వి లక్షణములుగా చెప్పబడినవి. విశిష్టాద్వైతమతదీక్ష లోకోత్తరమగుతపమే అని అన్నమయ్యా-విశ్వాసము. ఇందు జ్ఞానము, సంకల్పము, ఆనందము, ఇంద్రియములు, నిర్మమకారము, ధర్మదేవత, శమదమాదులు, వేంకటేశ్వరుని ధ్యానము యివన్నియు యజ్ఞమునకు వలసినసర్వాంగములుగా రూపింపబడి, ఆయావస్తువులకు తగినక్రియలతో పరిపుష్టములై యజ్ఞపరి-సమాప్తిలో జరుగుఅవబృథస్నానము తీర్థముగా, స్వామికృప పరి

పూర్ణ జలధిగా పర్యవసించినది ఇంతటి మహాయాగము జరిగి, ఈ-యవబృథము ముగిసినవెనుక ఈ యజ్ఞ ఫలముగా సిద్ధించునది శుద్ధ-కైవల్యమే. దానికై అన్నమయ్య అఱ్ఱులుసాచి సంకీర్తనాత్మకమైన-తపము చేసినాడు

ఈతడు సంసారముతో ఎంతబాధపడినాడోకాని దానిపై ఈతని కేర్పడినవిరక్తి, దానిని దూషించుటకై యితడు ప్రయోగించిన వబంధము, ఏ మాత్రము విజ్ఞానమున్నవానికైన దాని-వలన కలిగెడి సదుపదేశసిద్ధి, ఇవన్నీ కలసి యీతనిలోకమర్మజ్ఞతను చాటుచున్నవి.సంసారనింద

భైరవి

సడిఁబెట్టెఁ గటకటా సంసారము । చూడ -
　　జడధిలోపలియీఁత సంసారము ॥ పల్లవి ॥

జమునోరిలో బ్రదుకు సంసారము । చూడ
　　చమురుదీసినదివ్వె సంసారము
　　సమయించుఁబెనుదెవులు సంసారము చూడ
　　సమరంబులో నునికి సంసారము ॥ సడి ॥

సందిగట్టినతాడు సంసారము చూడ
　　సందికంతలతోవ సంసారము
　　చందురునిజీవనము సంసారము చూడ
　　చందమేవలెనుండు సంసారము ॥ సడి ॥

చలువలోపలివేఁడి సంసారము చూడ
　　జలపూఁతబంగారు సంసారము
　　యిలలోనఁ దిరువేంకటేశ నీదాసులకు
　　చలువలకుఁ గడుఁజలువ సంసారము ॥ సడి ॥

(ఈ సంపుటము - పాట 198)

శ్రీరాగం

ఇదివో సంసార మెంతసుఖమోకాని
తుదలేనిదుఃఖమనుతొడవు గడియించె ॥ పల్లవి ॥

పంచేంద్రియంబులనుపాతకులు దనుఁదెచ్చి
కొంచెపుసుఖంబునకుఁ గూర్పఁగాను
మించి కామంబనెడి మేఁటితనయుండు జని-
యించి దురితధనమెల్ల గడియించె ॥ ఇది ॥

పాయమనియెడిమహాపాతకుఁడు తనుఁ దెచ్చి
మాయంపుసుఖమునకు మరుపఁగాను
పోయగపుమోహమనుసుతుఁ దేచి గుణమెల్లఁ
బోయి యీనరకమనుపురము గడియించె ॥ ఇది ॥

అతిశయుండగు వేంకటాద్రీశుఁడనుమహా-
హితుఁడు చిత్తములోన నెనయఁగాను
మతిలోపల విరక్తిమగువ జనియించి య-
ప్రతియయి మోక్షసంపదలు గడియించె ॥ ఇది ॥

(ఈ సంపుటము - పాట 308)

అన్నమయ్యకు శ్రీ వేంకటేశ్వరుఁడు ఆరాధ్యదైవమైనను అరమరలేనినెచ్చెలికాడుగాగూడ చెల్లినట్లు ఆతనిఅధ్యాత్మ శృంగారసంకీర్తనలవలన తెలియుచున్నది. అందువలననే శృంగారసంకీర్తనలందు ఆతనితో పచ్చిపచ్చిమాటలసంభాషణమునకుగూడ వెనుదీయడు. అట్లనే అధ్యాత్మమునందు వ్యాజనిందగనో, వ్యాజస్తుతిగనో ఆతనిని ఎత్తిపొడుచుటకు, తన పరోక్ష దైన్యమును చూపుటకు ఇంతవర కెవ్వరు చవిచూడనిరీతిలో తిట్లు దీవనలు సాగించుచుండును. తిట్లతో దీవనలు సాగించినది :—

ముఖారి

సేవింతురా యితనిఁ జెలఁగి పరు; లిట్లనే
కావించె మమ్ము నెక్కుడిదైవ మితఁడు ॥ పల్లవి ॥

పాలచవి యితఁడెఱుఁగు పాలఁ బవళించ గో-
పాలుఁడని నేమితని భజియించఁగా
పాలుపడి తల్లిచనుఁబాలుసహితంబు నే-
కాలమునుఁ బాపె నెక్కుడిదైవ మితఁడు ॥ సేవిం ॥

పుట్టింపఁ దానె మఱి పురుషోత్తముఁడు మంచి-
పుట్టువొసగిననుచుఁ బూజించఁగా
పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువులెల్లఁ
గట్టిపెట్టించె నెక్కుడిదైవ మితఁడు ॥ సేవిం ॥

కర్మకర్తారుఁడని కడలేనిపుణ్యముల-
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా
కర్మగతిఁ దెచ్చి వేంకటవిభుఁడు మావుభయ-
కర్మములఁ జెరిచె నెక్కుడిదైవ మితఁడు ॥ సేవిం ॥

(ఈ సంపుటము పాట - 283)

చనవుబలముకొలది స్వామిని నిలదీసి అడిగిన ఖండితవాది తత్వమునకు :—

ధన్నాసి

సామాన్యమా పూర్వసంగ్రహంబగుఫలము
నేమమునఁ బెనగొనియె నేఁడు నీవనక ॥ పల్లవి ॥

జగతిఁ బ్రాణులకెల్ల సంసారబంధంబు
తగుల బంధించుదురితంపుఁగర్మమున
మగుడ మారుకుమారు మగువ నీపురముపై
తెగికట్టి రెవ్వరో దేవుండవనక ॥ సామా ॥

పనిలేక జీవులను భవసాగరంబులో
మునుఁగ లేవఁగఁజేయు మోహదోషమున
పనిపూని జలధిలోఁ బండఁబెట్టిరి నిన్ను
వెన కెవ్వరో మొదలివేలుపనక ॥ సామా ॥

వుండనియ్యక జీవనోపాయమున మమ్ము
కొండలను గొబల తతిగొని తిప్పుఫలము
కొండలను నెలకొన్నకోనేటిపతివనఁగ-
నుండవలసెను నీకు నోపలేననక ॥ సామా ॥

(ఈ సంపుటము = పాట 200)

సాళంగనాట

ఎట్టివారికినెల్ల నిట్టికర్మములు మా-
యెట్టివారికి నింక నేది తోవయ్య ॥ పల్లవి ॥

పాముఁ జంపినయట్టిపాతకమునఁ బెద్ద-
పాముమీఁద నీకుఁ బవళించవలసె
కోమలిఁ జంపినకొఱఁతవల్ల నొక్క-
కోమలి నెదఁబెట్టుకొని యుండవలసె ॥ ఎట్టి ॥

బండి విఱిచినట్టిపాతకమునఁ బెద్ద-
బండిబోయఁడవై పనిసేయవలసె
కొండ వెఱికినట్టిగుణమునఁ దిరుమల-
కొండమీఁద నీకుఁ గూచుండవలసె ॥ ఎట్టి ॥

(ఈ సంపుటము - పాట 277)

ఈ పాటలలోనిరుచి నేను వేరుగా పండితులకు వినతిచేయవలసిన పనిలేదు. అందులో 298 వ పాటలోని వ్యాజనింద, 200 వ పాట లోని పరోక్షదైన్యము, 277 వ పాటలోని కర్మఫలము తోయరా.- కుంటయు స్పష్టముగ తెలియుచున్నది. ఈ పాటలలో ఎగతాళి తొంగిచూచుచున్నను, కల్పనముమాత్రము అచుంబితముగా కనబడుచున్నది.

అన్నమయ్యాది చదివినేర్చిన వేదాంతము కాదని, భగవద్భక్తమై జన్మసిద్ధమైనదేనని, గురూపదేశము దానికి మెరుగుమాత్రమేయని తెలియుచున్నది అధ్యాత్మ సంకీర్తనములకుగాని, శృంగారసంకీర్తన ములకుగాని ఈయనరచనలో ఉపక్రమ-క్రమవృద్ధి-ఉపసంహారములు మొదలగు ప్రతిపాదసహజలక్షణములు ఎక్కడా కానరావు. ఏ వేళకు ఏ భావము ఎట్లు తోచితే అట్లు దానిని స్వతంత్రముగ నడిపించినాడు.

కొన్నిపట్టులందు పరమతదూషణము, స్వమతభూషణము రెండును కనబడుచున్నవి. అందులోను ఇతరమతములకంటె అద్వైతమునే అక్కడక్కడ తాకి ఖండించినట్లు తోచుచున్నది.

మలహరి

సహజాచారములెల్లా సర్వేశ్వరునియాజ్ఞే
అహమించి నమ్మకుండు టదియే పాషండము ॥ పల్లవి ॥

నిద్ధిరించువానిచేతినిమ్మపంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జారె
పొద్దువొద్దు తనలోన భోగకాంక్షలుండఁగాను
అద్దలించి కర్మమొల్లనను టే పాషండము ॥ సహ ॥

కలగన్నవాఁడు మేలుకవినటువలెనే
తలఁగి ప్రపంచ మెందో దాఁగితే దాఁగె
యిల నీదేహము మోఁచి యింతాఁ గల్లలనుచు
పలికి తప్పనడచేభావమే పాషండము ॥ సహ ॥

ధర నద్దముచూచేటితవరూపమువలె
గరిమతోఁ దనయాత్మ కంటేఁ గనె
సరుస శ్రీవేంకటేశుసాకార మటు గవి
కరఁగి భజించలేవికష్టమే పాషండము ॥ సహ ॥

(ఈ సంపుటము – పాట 431)

ఇందు 3-వ చరణమున, ఆత్మదర్శనమైనను వేంకటేశ్వరుని సాకారదర్శనము ఒల్లననుట మహాపాతకముగ పాషండపద్ధతిగ కీర్తింపబడినట్లున్నది. పాట అంతా ఈ ధోరణిలోనే నడచినదనుట స్పష్టమే. అట్లనే వైష్ణవమును, శరణాగతిని, దాసభక్తిని పెద్దగా కొండాడినపట్టులు దండిగ గలవు. మచ్చునకు ఒకటి రెండు. మొదటిది వైష్ణవ సిద్ధాంత భక్తికి, రెండవది శరణాగతికి- దాసభక్తికి గురుతుగా ఇవ్వబడినవి.

మలహరి

వలెననువారిదె వైష్ణవము యిది
వలపుఁదేనెవో వైష్ణవము ॥ పల్లవి ॥

కోరిక లుడుగుచు గుటి నిన్నిటిపై
వైరాగ్యమెపో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలమునుఁ దనలో
వారించుటవో వైష్ణవము ॥ వలె ॥

సుడిగొను దేహపుసుఖదుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముడివడి యింద్రియములకింకరుఁడై
వడఁబడనిదెపో వైష్ణవము ॥ వలె ॥

వుడుటునఁ దనసకలోపాయంబులు
వదలుటపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వరునామము
వదనము చేర్చుట వైష్ణవము ॥ వలె ॥

(ఈ సంపుటము పాట 405)

గుండక్రియ

మఱగి వీరెపో మాదైవంబులు
కెరలినహరిసంకీర్తనపరులు ॥ పల్లవి ॥

వినియెడివీనులు విష్ణుకథలకే
పనిగొందురు మాప్రపన్నులు
కనియెడికన్నులు కమలాక్షునియం-
దసువుపరతు రటు హరిసేవకులు ॥ మఱి ॥

పలికెడిపలుకులు పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
తలఁచేటితలఁపులు ధరణీధరుపై
నిలకొలుపుదు రాదియ్యలు ॥ మఱి ॥

కరముల శ్రీపతికైఁకర్యములే
మరియుఁ జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీవేంకటేశ్వరునందే
సిరుల నమ్ముదురు శ్రీవైష్ణవులు ॥ మఱి ॥

(ఈ సంపుటము పాట 402)

ఇప్పటికి అన్నమయ్య వేదాంతస్వరూపమును సంగ్రహముగ చూపితిని. తక్కినదంతయు సహృదయులు గ్రంథముతో తెలిసికొన-గలరు.

## అద్వైతవాసన

అన్నమయ్య నందవరీకవంశమునకు చెందినస్మార్త-బ్రాహ్మణుడు కావున, ఆతడు కులానుగతముగా అద్వైతి. అది తన-పుట్టుకతో గట్టి వైష్ణవముగా మారినది. కాని కొన్ని పట్టులందు వంశక్రమముగా వచ్చినఅద్వైతవాసనజిడ్డు ఈతనిని వదలలేదని తోచుచున్నది.

అద్వైతులు, మాయవలన కనపడే ప్రపంచమంతా అసత్యమనీ, ప్రకృతి అంతటిలో బయటికి కనబడనిపరమాత్మతత్త్వమే సత్యమనీ చెప్పుచున్నారు అందువలననే ఇతరమతస్థులు అద్వైతులను మాయా-వాదులని నిందించుటయు గలదు.

> అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్।
> ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా॥
>
> (భగ - అ 4 - శ్లో 6)

> దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।
> మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే॥
>
> (భగ - అ 7 - శ్లో 14)

ఇత్యాదిస్థలములందు మాయాశబ్దార్థవిషయమున ఆయామతము-లందు వ్యాఖ్యానములు భిన్నముగ నుండుటయు స్పష్టమే.

అన్నమయ్య అక్కడక్కడ మాయను ప్రస్తావించుటవలన, ప్రపంచమును అనిత్యముగ చెప్పుటవలన, దశావతారములందు

బుద్ధావతారమును పలుతావుల కీర్తించుటవలనను, 465వ పాటలో జీవన్ముక్తావస్థను కొండాడుటవలన ఇతనికి జన్మాంతరాద్వైతవాసన ఇంకను పూర్తిగా వదలలేదేమో అనిపించుచున్నది.

సాళంగం

పుట్టుమాలినబరుబోఁకిపి నన్నుఁ
దిట్టే వదేమోసి దిమ్మరిమాయి ॥ పల్లవి ॥

ఒరపులాడక పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించే వేమోసి విష్ణుభక్తినంటా-
నెరఁగనటే నీయేతు లిన్నియును ॥ పుట్టు ॥

పుడుటు చెల్లదు పోపో వోసి మాయ నా-
యెదుర మాఁటలు నీకు నెఁకనేలే,
వదరేవు హరిభక్తివనిత, తెలియదు, నే-
నిదురవుచ్చినవారు నీవు నా కెదురా ॥ పుట్టు ॥

వొల్లవటే జీవ మోసిమాయ నీ-
కల్లలిన్నియును లోక మెఱుఁగును,
నల్లనివిభునిమన్ననభక్తినంటా,
జెల్లఁబో పాపపుచేఁదు మేయకువే ॥ పుట్టు ॥

పూరకుండవుగా వోసిమాయ నిన్నుఁ
బేరఁ బిలుపము గుంపెనలాడేవు,
నారాయణభక్తినాతి, నన్నును నిన్నుఁ
గోరి యిందరు నెఱుఁగుదు రేల పోవే ॥ పుట్టు ॥

వోవవు ననుఁజూచి వోసి మాయ నా-
తోవ వచ్చినను నొత్తువు నీవు
శ్రీవేంకటగిరిదేవునిభక్తి నా-
హావళికే నిన్ను నలమి రిందరును ॥ పుట్టు ॥

(ఈ సంపుటము పాట – 107)

ఈకీర్తనము మాయా, విష్ణుభక్తిసంవాదముగా నడచినది. ఇది ప్రబోధచంద్రోదయ, సంకల్పసూర్యోదయనాటకములపరిశీలనఫలితముగా తోచుచున్నది.

కేదారగౌళ

పరమాత్ముని నోఁగఁ బాడుచును యిరు-
దరులు గూడఁగఁ దోసి దంచీ మాయ ॥ పల్లవి ॥

కోలఁది బ్రహ్మాండపుకుందెనలోన
కలికి జీవులనుకోలుచు నించి
కలికిదుర్మోహపురోఁకలి వేసి
తలఁచి జనవులను దంచీ మాయ ॥ పర ॥

తొంగలిరెప్పలు రాత్రులుఁ బగలును
సంగడికనుఁగవ సరిఁదిప్పుచు
చెంగలించి వెసఁ జేతులు విసరుచు
దంగుడుబియ్యముగా దంచీ మాయ ॥ పర ॥

అనయముఁ దిర వేంకటాధీశ్వరుని
పసుపడి తనలోఁ బాడుచును
వానరి విన్నాణిజీవులనెడబియ్యము
తనర నాతనికియ్య దంచీ మాయ ॥ పర ॥

(ఈ సంపుటము పాట 130)

ఇందు మాయాకార్యములు స్పష్టముగ వింగడింపబడినవి. తుదకు ఆ-మాయ శుద్ధవిద్యగా మారి, ప్రాణులను విజ్ఞానులుగా చేసి, స్వామికి సమర్పించుచున్నట్లు వర్ణింపబడినది.

ఇదిగాక నరసింహావతారవర్ణనముగల 259 వ పాటలో "నమకచమకహిత నారసింహా" అని వర్ణించుటచే, స్మార్త సంప్ర-దాయ మింకను ఈతనిలో మాసినట్లు గనపడదు. స్మార్తులీనాటికి నృసింహపూజయందు నమకచమకములను వేదమంత్రములతో అభి-షేకించుట కలదు. మంత్రశాస్త్రమునందు, అద్వైతసంప్రదాయ-మునందును నరసింహమూర్తి హరిహరావతారము. "ఆకంఠం విష్ణు రూపాయ అత ఊర్ధ్వం శివరూపిణే" అని కలదు. శృంగారకీర్తన-లందు పెండ్లిని వర్ణించుసందర్భములో తలంబ్రాలు, నాగవల్లి, ఐరేని-కుండలు మొదలైన సంప్రదాయములు ఈతని కీర్తనములలో కొల్లలు. అవి నేటి దాక్షిణాత్య వైష్ణవులందు కానరావు.

## నవ నారసింహులు

అన్నమయ్యకు వేంకటేశ్వరస్వామివలెనే బాగా మనసుపట్టిన-దైవము అహోబలనరసింహస్వామి. అన్నమయ్య వేదాంతవిద్యా-భ్యాసము అహోబలములోనే జరిగినట్లు చెప్పుచున్నారు. అందుకే నవనారసింహులుగా ప్రసిద్ధిచెందినమూర్తులన్నింటిని ఒక్కపాటలో పేర్కొన్నాడు.

### పాట

**నవనారసింహా నమో నమో**
భవనాశితీర యహోబలనారసింహా ॥ పల్లవి ॥

సతతప్రతాప రౌద్రజ్వాలానారసింహ
వితతవీరసింహవిదారణా
అతిశయకరుణ యోగానంద నరసింహ
మతిశాంతపుకానుగుమానినారసింహ ॥ నవ ॥

మరలి బీభత్సపుమట్టెమళ్ల నరసింహ
నరహరి భార్గోటినారసింహ
పరిపూర్ణశృంగార ప్రహ్లాదనరసింహ
సిరుల నద్భుతపులక్ష్మీనారసింహ ॥ నవ ॥

వదనభయానకపువరాహనరసింహ
చెదరనివై భవాలశ్రీనరసింహ
అదన శ్రీవేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలురూపములబహునారసింహ ॥ నవ ॥

(ఈ సంపుటము — పాట 459)

ఈ నవనారసింహులను గూర్చి

"జ్వాలాఽహోబల మాలోల క్రోడ కారంజ భార్గవాః
యోగానంద చ్ఛత్రవట పావనా నవమూర్తయః

అని పెద్దలు కీర్తించియున్నారు. ఈతని వాఙ్మయమునందు నరసింహ-స్వామివర్ణన పెక్కుతావుల కనపడుచుండుటయు ఈతని నృసింహ-భక్తి కొకతార్కాణము. ఏ మూర్తిని వర్ణించినా వేంకటేశ్వరునితో అభేదాధ్యవసాయము చేయుట ఈతనికి పరిపాటి.

## దశావతారములు

ఈతడు అధ్యాత్మ శృంగార సంకీర్తనలన్నింటియందును దశావతారములను చిత్ర చిత్ర పదబంధములతో, వింత వింతఅర్థసంద-

దర్పములతో, అలంకారసంపదతో వర్ణించియున్నాడు. అధ్యాత్మ-కీర్తనల మొదటివంద రేకులలోని 31 వ రేకులోమాత్రము 'అవతా-రాలు' అను శీర్షిక క్రింద దశావతారములు వర్ణింపబడినవి. తక్కిన స్థలములందంతటా శబ్దచమత్కార, అర్థచమత్కారములనుబట్టి మనమే ఊహించుకొనవలసినదే. ఆయాపట్టులందు పాదదీపిక (Foot Notes) లందు 'ఇందు దశావతార సమన్వయము కలదు' ఇత్యాదిగా సూచించియున్నాను.

తునుకతునుక తేటతెలుగుపదములతో ఈ క్రిందిపాటలో ఎంత చక్కగా దశావతారములను వర్ణించియున్నాడో చూడవచ్చు.

అవతారాలు - సామంతం

తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము; తన-
లోనఁ బెట్టుకొని మాకు లోనైనవాఁడు ॥ పల్లవి ॥

చదివించి, కూడువెట్టి, జారకుండ నిల్లుగట్టి,
బెదురులేనిబుద్ధి పిన్ననాఁడే చెప్పి,
యెదిరి నడిగి. ద్రవ్యమిది గొమ్మనుచు నిచ్చి,
పదిలమై తమ్ముఁబాలించువాఁడు ॥ తానే ॥

మోహవియోగమ్ము, మోహానురాగమ్ము,
దేహవిభాగంబు దెలిపిన కలికి
ఐహికమున వేంకటాధీశుఁడై సర్వ-
దేహరక్షకుఁడై తిరుగుచున్నాఁడు ॥ తానే ॥

(ఈ సంపుటము పాట - 192)

ఇందు

"మత్స్యః కూర్మోవరాహశ్చ నారసింహశ్చ వామనః ।
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ ॥"

అను దశావతారక్రమము పాటింపబడినవిధానము, భాషా-పాండిత్యమునకు—సంగ్రహశక్తికి-ప్రతిభాసంపదకు- ఆలోచనాసరళికి తార్కాణము కావచ్చు.

## శబ్ద-అర్ధ-వ్యాకరణ చర్చ

**1 అగ్నీకరణ :** పాట - 281

ఈపదము అనన్వితముగా ఉన్నదని కాబోలు పూర్వ-ముద్రణమునందు 'అగ్నౌకరణ' గా సవరింపబడియున్నది. అన్ని హోమములను 'అగ్నౌకరణ' మనుటలేదు. శ్రాద్ధమునందు పితృ-దేవతా తృప్తికై చేయు హోమము మాత్రమే అగ్నౌకరణము అది వైదికపరిభాష. దానిలో తప్పొప్పులచర్చ మనది గాదు. 'అగ్నీకరణ' అన్న రేకుపాఠమునకు నాకు తోచిన అర్థమును ఈ పాట-పాదదీపికలో చూపియున్నాను.

**2 ఆలజాలము :** పాటలు 218, 321.

ఈపదము నిఘంటువులలో కానరాలేదు. ఆలజాలంబు= నీరు దండిగా నిండినపుడు, దానిపై మూతిదగ్గర తోకదగ్గర రెండురెండు పొడవైనవెంట్రుకలు కలిగి సన్ననిశరీరముతో (సాలెపురుగువలె) ఈదులాడెడు జలచరమా? అనిపించుచున్నది ఈఅర్థము పాటలోనిప్రకరణమునుబట్టిమాత్రమే నిర్ణయింపబడి-నది. నీటిప్రవాహమునందు కోలాహలముగ తిరుగులాడు ఈజల-జంతువులఆటయే కాబోలు నేటికిని, చాలా ఉత్సాహముతో చెల-రేగిన కార్యక్రమమును చెప్పునప్పుడు 'ఆలజాలంగా వుంది' అని వ్యవహారములో కలదు.

3 గడిచీటి : పాటలు 118; 280.

గడి= సీమ, పొలిమేర, సరిహద్దు ఇత్యాదిగా-సూ.ని. ఈ పదముతో కూడినసమాసమే 'గడిచీటి'. ఒకహద్దు పూర్తి అయినదని తెలిపెడి చీటి. ఇంచుమించు Retairment Notice కావచ్చు. ఈ-పాట (280) పల్లవిలో, 'పరుసము సోకినరాగి మొదలగు నాణె-ములు వెండిగనో, బంగారుగనో మారి తన పూర్వరూపమును కోల్పోవుచున్నవి అవి మరల పూర్వరూపము నందుటలేదు. అట్లే వేంకటేశ్వరుని కొలిచినవారు మరల కర్మబంధములపాలు కావలసిన పనిలేదు.' అని తెలిపినాడు. దాని విస్తృతప్రతిపాదనమే మొదటిచరణములోనికడపటిపాదమగు "గడిచీటిచ్చియు నింకఁ గడమున్నదా' =నీవు పాటింపవలసిన హద్దు పూర్తియైనదని చీటి (certificate) పొందినతర్వాత, మిగత విషయములు (ముందు కార్యమునకు సంబంధించినవి) మరలా ఎందుకు?" అని అర్థమగుచున్నది. ఈ పాదము పూర్వముద్రణమున "గడియించి తెచ్చియు నింకఁ గడమున్నదా" అని మారినది. కారణము తెలియదు.

4 దంగుడు : పాట 130

ఈ పదము గ్రంథములందును నిఘంటువులందును మాత్రము కానవచ్చుచున్నది ఈ నాటికి తెలంగాణాలో కొంతప్రాంతమున 'బియ్యము దంగినాంయ్' ఇత్యాది వ్యవహారమున్నట్లు వినికిడి. దంచు, అను ప్రేరణచువర్ణాంతమునకు ఇదియే మూలరూపము కావచ్చు.. 'దంగు' 'ఎంచు' వలె సకర్మకచువర్ణాంతములు చాలభాగము ప్రేరణచువర్ణాంతములుగనే భావింపవచ్చు.

5 వట్టిఁగట్లా : పాట 280

ఇది పై తెలిపినపాటలో రెండవచరణములోనిది వట్టిఁగట్లా=బ్రహ్మచర్యమా? అనునర్థములో అశ్లీలపదము ప్రయో-

గించినట్లు కానవచ్చుచున్నది. ఈతరగతికవులకు విషయప్రతిపాదన-తీవ్రతలో శ్లీలా ఒశ్లీలములు అంత లెక్కకు రావు. వ్యాసుడే దీనికి ప్రథమోదాహరణము.

వట్టన్ + కట్లా (కట్టులా) అని పదవిభాగమేమో? లేకున్న అరసున్న చింత్యము.

6 సంతపాకలంజ : పాట 282

సంతపాకలంజ = సంతలోనో, సంతప్రక్కనో పాకవేసుకొని వచ్చేపొయ్యేవారికి ఉపయోగపడేవ్యక్తి కావచ్చు. ఇట్టిమాటలు భాణములలో సుప్రసిద్ధములు. "అయి రతిప్రపే" అని ఒకభాణమున సంబోధన. విషయమును స్పష్టముగ చెప్పదలచినపుడు అన్నమయ్య శ్లీల, అశ్లీల మర్యాదకు తావివ్వడనుటకు ఇదియొక ఉదాహరణము.

సాగబ్రహ్మమయాఖ్యుని : పాట 141

'సాగబ్రహ్మమయాఖ్యుని' ఈ క్రీగీతగల భాగము స్పష్టముగా అర్థమగుటలేదు. యతిప్రాసల నిర్బంధముతో ఇట్లుండవచ్చునని సూచించుటకును వీలులేదు.

సాసముఖా : పాట 12

ఈ శబ్దముయొక్క అర్థము కొంత విచారింపవలసియున్నది. కొందరుపండితులు 'సహస్రముఖా' కావచ్చునని సూచించిరి. అది ప్రకరణమునకు అతుకునట్లు లేదు. ప్రకరణమునుబట్టి ఈ శబ్దము-యొక్క అర్థము ను విచారింతము.

అటి స్వామికి మజ్జనసమయము, అన్నిలోకములలోని వారు గుంపుగకూడి స్వామితో వినోదసంభాషణము సాగించుచున్న-

ట్లున్నది. కాలమునకు తగిన కార్యములను నెరవేర్చుటకు కొందరు నియోగింపబడియుందురు. ఆవెండిగుదెలవారు వచ్చి గుమికూడిన-గుంపును హెచ్చరింపుచు, స్వామికిది మజ్జన సమయమని తెలియ-జేయుచున్నారు. ఇప్పుడును స్వామివారి నివేదన మజ్జనసమయ-ములందు సన్నిధి! సన్నిధి! అని అరచుటకలదు. అనగా స్వామి వారివద్దకు మమ్ము పోనిండు, త్రోవవిడువుడు అనిఅర్థము. ఈ సన్నిధి పదమే అన్నమయ్యనాడు సముఖ (సముఖము) పదముగా నుండిన-దేమో? సన్నిధి! సన్నిధి! అని రెండుసార్లు ఉచ్చరించినట్లే ఆనాడు సముఖము సముఖము (సముఖ సముఖ) అని ఉచ్చరించు చుండిరేమో? ఆ ద్విరుక్తపదమునే అన్నమయ్య 'సముఖ సముఖకు' బదులు 'సాస ముఖా' అని ఆమ్రేడిత సంధి చేసి యుండవచ్చు. ఇట్టి ప్రక్రియలలో అన్నమయ్య చాల స్వతంత్రుడు. 'వావాదము' వంటిప్రయోగములు ఈతనిలోకలవు. పై విధముగ ఊహించి నేనీపాటక్రింద శబ్దస్వరూ-పమును పాదదీపిక (Foot notes) లో చూపియున్నాను ఈ పాటలో తరువాత ఆయాకార్యములందు దేవతలు, సూర్యచంద్రులు, ఆది-శేషుడు నియోగింపబడుటచే ఇది సహస్రముఖశబ్దభవము కాదేమో అనిపించుచున్నది. గుంపును తొలగించునపుడు పో! పో! పో! అని ఏకవచనముగా కాని, పొండి! పొండి!పొండి! అని బహువచనముగా కాని వాడుట సంప్రదాయము. అందువలన 'సందడి విడువుము' లోనిఏకవచనము బాధకము కాదు.

ఇదే శబ్దము అన్నమయ్య ఇట్టిసందర్భముగల మరియొక-పాటలో వాడియున్నాడు అదికూడ నాఊహకు కారణమే.

బౌళి

సాసముఖా ననదె సాసముఖా
ఆసలిపరివారము అవధారు దేవా ॥ పల్లవి ॥

మత్తిలి జీవుఁడనేటిమహిమగలుగురాజు
చిత్తమనియెడిపెద్దసింహాసనంబెక్కి
బత్తితోఁ బంచేంద్రియపుపరివారము గొలువ
చిత్తజుపారుపత్యము సేసీ నిదివో ॥ సాస ॥

కడుమదించి నహంకారమనేయేనుగపై
యెడనెడ నెక్కి తోలీ నిదె జీవుఁడనురాజు
బడిబడిఁ గర్మముల పౌఁజులు దీర్చరో
వెడమాయపట్టణపువీధుల నేఁగీని ॥ సాస ॥

మించినసంసారమనేమేడలో నేకాంతమున
పొంచి జీవుఁడనేరాజు భోగము భోగించఁగా
అంచెల శ్రీవేంకటేశుఁడనేదేవుఁడు వచ్చి
మంచితనమునఁ దానె మన్నించె నదివో ॥ సాస ॥

(సంపు - 9 - పాట 97)

ఇక్కడగూడ స్వామిసన్నిధికి త్రోవవిడువుమని చెప్పుటయే అర్థముగా కనపడుచున్నది. ఇక్కడ 'దేవా అవధారు' అని విన్నపముకూడ తెలియుచున్నది. ఈపాటలో సంబోధ్యుఁడు-మన్నించుక్రియలో కర్త కూడ శ్రీవేంకటేశుడే. చాల చక్కగ సాగిన సావయవరూపకము ఈ పాట పూర్వముద్రణమునందు 'నదె' అను పాఠము ఎట్లుపడినదో చెప్పలేము. రేకులో 'నడె' అనియే కలదు. అది సముఖము! సముఖము నడునడు అనుఅర్థముతో నాఁడూహా కింకను దగ్గరైనది.

మచ్చుకు కొన్నిమాత్రము పీఠికలో చర్చించితిని. అన్నిపాఠములను పాదదీపికలో చూపియున్నాను. గమనింపగలరు.

౧. 'నదె' పూ.ము.పా.

ఇట్టి వాఙ్మయమున శబ్దచర్చ ఒకప్రత్యేకవ్యాసంగముగా సాగింపవలసియున్నది.

## నరసింహాకవి

కవికర్ణరసాయనకర్త యగు సంకుసాల నరసింహాకవి అన్నమాచార్యుల ప్రథమ భార్యాపుత్రుడు కావచ్చునని, కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఊహించిరి.౧ ఈ విషయమునే ఎ. వి. శ్రీనివాసాచార్యులుగారు, "అన్నమయ్యకు తిమ్మక్కవలన నరసింహాకవి జన్మించెను. నరసింహాకవి 'పాడను వర్ణపద్ధతి జెప్పను, నీడుజోడు లేడని సభలో వాదించి జయించినవాఁ'డని అష్టమహిషీ కల్యాణమున గలదు. ఇతడే కవికర్ణగసాయనమును రచించిన–సంకుసాల నరసింహాకవి౨", అని గట్టిగ నిర్ణయించి, అపుటలోనే పై వాక్యములకు క్రింద "తిరుమలమ్మకుమారుఁడైన నరసింగన్న తన తల్లి మరణానంతరము అక్కలమ్మ తనకు సవతితల్లియగుట, ఆమెకు నీతనికి గిట్టకపోవుట కారణములుగా తాతగారిల్లైన సుంకేసుల (కడపజిల్లా పులివెందుల తాలూకా) చేరియుండును! లేదా సాళ్వ నరసరాయలకు అన్నమయ్యకు గిట్టనిదినములలో సుంకేసుల చేరి–యుండనచ్చును. అచటనుండి యతఁడహోబలము చేరి ఒమమఠ–గురువులప్రోత్సాహముతో శ్రీరంగము చేరినట్లున్నాడు! ఈ కారణములచే నతఁడు తాను రచించిన కవికర్ణరసాయనమున తన తల్లిదండ్రులను పేర్కొన లేదేమో!

సుంకేసులలోని నరసింహస్వామి కృపాకటాక్షమున కలిగిన వాఁడగుటచేతనే యతనికి అన్నమాచార్యుల తండ్రి, తాత, ముత్తాతల

---

౧. అన్నమాచార్య చరిత్ర పీఠిక. పుట 76.

౨ 16 వ సంపుటము పుట 9. 'అధ్యాత్మ శృంగార సంకీర్తనలు చి. తి. లాచార్యులవి.

పేళ్లలో ఒకదానిని పెట్టక నరసింహుఁడని యతనికి పేరుపెట్టి-నట్లున్నాఁడు.

కవికర్ణరసాయనపుతాళపత్త్రప్రతులలో దేనియందుఁగాని యవతారికలోను నాశ్వాసాంతగద్యలలోను సుంకేసుల యనికాని సంకుసాల యనికాని లేదు. అది యా తరువాత నెప్పుడు చేరినదో!" ౧ అని వ్రాయుచు తన సందేహమును స్పష్టముగ వెలిబుచ్చిరి. ఈ క్రింది వ్రాతనుబట్టి పైనిర్ణయముగూడ సందేహాస్పదమేనేమో.

తరువాత ఈ విషయమునే శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు "తాళ్లపాకకవులకృతులు-వివిధ సాహితీప్రక్రియలు" అను గ్రంథమున 'నరసింహకవి' అను శీర్షికక్రింద, "పదకవితాపితామహుఁడగు అన్నమాచార్యునకును, విదుషీమణియగు తిమ్మక్కకును కల్గిన సుపుత్రుడే నరసింగన్న నిరుపమాన. సుకవితానిర్వాహకుఁడగు తెనాలి రామకృష్ణ–కవి తన–సమీపకాలమువారగు తాళ్లపాకకవుల నిట్లు–సన్నుతించెను

క॥ చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్యశ్రేణిన్

అతఁ డీపద్యమున తనకు సమకాలికుఁడుగా వర్తిల్లిన చిన్నన్నను, అతని తండ్రియగు పెదతిరుమలాచార్యుని, అతని యన్నయగు నర-సింగన్నను మెచ్చినాఁడు. 'ద్విపదమునకు చిన్నన్న వ్రాలును. పదములకు పెదతిరుమలయ్య వ్రాలును. పద్యగద్య(ని)శ్రేణిని నరసింగన్న మిన్నందె మ్రోగును అని దీని యర్థమనుకొందును' అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వివరించి, వృద్ధానుశ్రుతిని బట్టి కవికర్ణ-రసాయనకర్తయగునరసింగన్నయే తాళ్లపాకనరసింగన్న కాఁ

౧ 16 వ సంపుటము, పుట 9, అధ్యాత్మ శృంగారసంకీర్తనలు. (చి. తి. లాచార్యులవి)

గూడుననునభిప్రాయము బలపరచిరి ౧" అని నిర్ణయించి, అదే పుస్తకము 111 వ పేజీలో "కవికర్ణరసాయనకర్త యాతఁడే యగు-నేని పుత్ర వ్యామోహమున యువనాశ్వుఁడు పరితపించుచుండినట్లా-తఁనోట చెప్పింపబడిన పద్యములైదారును నరసింగన్నకు సంతానము మీఁదిమమకారమును సూచించునవే కాఁగలవు" అని సందేహ మును గూడ వెలిబుచ్చిరి. కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు నేను కలిసి పనిచేయునప్పుడు, ఈ విషయమై కీ॥ శే॥ నారునాగ నార్యునిద్వారా ఈ విషయము తేల్పవలెనని కొంత ప్రయత్నించి తిమి. అదిగూడా అంతంతమాత్రముననే నిలిచిపోయినది. శర్మ గారును కవికర్ణరసాయనమునందలి వైష్ణవ శ్రద్ధను విశిష్టాద్వైత సిద్ధాంత ప్రశంసనుబట్టి, ఈతఁడు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఊహించినట్లు అన్నమాచార్యునిపుత్రుడే కావచ్చునేమో యను చుండిరి. కవులచరిత్రమును వ్రాసిన వారెవ్వరు ఈవిషయ మును అంతగాప్రస్తాపించలేదు. నరసింగన్న దేశకాలములనుగూర్చి మాత్రమే చర్చించి, రాయల పుత్రికయగు మోహనాంగి కథను విశ్వసింపక కొందరు, విశ్వసించి కొందరు ఖండనమండనములు సాగించినారు

ఈ సంపుటమును పరిష్కరించునపుడు పై వారి సందేహము లన్నిటిని నిశ్చయములుగా మార్చుటకు తగినట్లు ఒకపాట నామతికి తట్టినది.

శ్రీరాగం

బయలు వందిలి పెట్టి పరగఁ జిత్తము గలిగె
దయమాలి తిరుగ నాత్మజుఁ డొకఁడు గలిగె ॥ పల్లవి ॥

---

౧. చూ. పుట. 110. తాళ్లపాకకవులకృతులు వివిధ సాహితీ ప్రక్రియలు.

కనుచూపువలన నుడుగనికోరికలు గలిగె
తనుకాంక్షవలనఁ బరితాపంబు గలిగె
అనుభవనవలన మోహాంధకారము గలిగె
తనివిదీరమివలన తలపోఁత గలిగె ॥ బయ ॥

అడియాసవలన పాయనిచలంబునుఁ గలిగె
కడుమమతవలన చీఁకటి దవ్వఁగలిగె
కడలేనితమకమునఁ గాఁతాళమునుఁ గలిగె
నడుమ నంతటికి మాననిప్రేమ గలిగె ॥ బయ ॥

తరితీపువలన చిత్తభ్రాంతి తగఁ గలిగె
విరహంబువలన పురవేదనలుఁ గలిగె
తిరువేంకటాచలాధిపునికరుణామృతము
పరిపూర్ణమైనయాపద నీఁదఁ గలిగె ॥ బయ ॥

(ఈ సంపుటము - పాట 129)

ఈఅన్నమయ్యా పాటలోనిదయమాలినకొడుకు నరసింగన్న యేనా? అని సందేహింపవలసివచ్చుచున్నది. తన కాలము లందలి దురాచారములను, రాజుల ఔద్ధత్యమును, సదసత్సంతానము, సత్పురుషుల బాధలు వగైరా విషయములను అన్నమయ్యా సందర్భానుగుణముగ ఒక్కొక్కసారి చెప్పుట కలదు. కావున నేనిట్లు సందేహించితిని.

పై తెల్పినఅందరిసందేహములతోపాటు ఈ క్రొత్త కారణముతో నా సందేహమూ ఒక్కటి. ఈ పాట పల్లవిలోనిక్రీగీతలో చూపినదితప్ప, మిగిలినపాటలోని, భావమంతయు అవిషయమునే గూర్చి చెప్పినట్లు వ్యాఖ్యానించుటకు అంతగా తావులేదు. కాదనుటకును వీలులేదు, కాదంటే పల్లవి చరణముల అర్థములు భిన్నములు కావలసివచ్చును. ఇట్టి హేత్వాభాసములలో మన మీచిక్కుసమస్యను విడదీయలేము. కేవలజనశ్రుతులు గట్టిగా విశ్వసించుటకు చాలవు.

ప కొందరివిషయమో తప్ప కవులచరిత్రములన్నియు ఇట్లే సందేహా-సంరత్మకములు. ఈవిషయమున అత డన్నమాచార్యునిపుత్రుడే అనుటకు తగిన ఆధారములు ఎంతగట్టివో, కాదనుటకును అంతకంటె గట్టి కారణములు కనబడుచున్నవి.

1. అంతటిగ్రంథకర్త, అంతసంస్కారిఅయినకవికర్ణ రసా-యనకర్త నిజముగా అన్నమాచార్యపుత్రుడైయున్నచో, పరమ-భాగవతుడు, పదకవితాపితామహుడు, సుప్రసిద్ధమహాకవి, తనకు దేహమిచ్చినవాడుఅగుతండ్రిని, తనవంశమును పేర్కొనకుండునా?

2. "దయమాలి తిరుగ నాత్మజుఁడొకఁడు గలిగె" అని అన్నమాచార్యుడన్నట్లు వారికుటుంబకలహములేవో వున్నచో తండ్రి పేరు చెప్పుకొనకపోయినను వంశముపేరైన చెప్పుకొనియుండడా ?

3 తుదకు తనగోత్రమునైన చెప్పుకొనియుండడా?

4 తాళ్లపాకయను తనఇంటిపేరు, సంకుసాలగా మారుటకు కారణమేమి మేనమామలైన చెప్పరా? పోనీ వారిపేరైనా చెప్పడా?

5. అతడు తనఇంటిపేరు వాడుకొనకపోయినను ఎవరో పరిష్కర్తలు ఆతనిపేరుకుముందు సంకుసాల అను పదమును తగిలించిరే యనుకొన్నచో, అది సంకుసాలయే కావలెనా ?

6. తెనాలి రామకృష్ణకవిచాటువు తాళ్లపాకకవుల—వరుసనే చెప్పినదా, లేక పరస్పర సంబంధములేక తనకాలమున ప్రసిద్ధిగన్న కవుల నెవ్వరినైన చెప్పినదా ? అనియు సందేహింపవచ్చు. ఆ పద్యములోని చిన్నన్న, పెదతిరుమలయ్య లిద్దరు ఒకవంశము వారుగా నుండుటచే, ఈ నరసింగన్న కూడ ఆవంశమువాడే కావచ్చునని ఊహింపవచ్చుగాని. ఇదిగా కావలెననునిర్బంధము లేదు కదా.

7. సుంకేసుల సంకుసాలగా ఎట్లు మారినది? సుంకేసుల పేరుతో కడప, కర్నూలు మండలములలో నేటికిని గ్రామములు కలవు. మధ్యకాలములో మాత్రము అది సంకుసాలగా నుండినదా? కావున, కవి కర్ణరసాయనకర్త నరసింగన్న అన్నమాచార్య పుత్రుడే అనే వాదములు, గట్టివెన్నెముకలేనిఊహాలు. ఇంతకూ కవికర్ణరసాయనకర్తనుగూర్చి ఒలమైనవ్యాసంగము చేసి, దానిపై సారస్వత పట్టభద్రు (పి. హెచ్. డి.) లైన మిత్రులు శ్రీ చలపతిగారు ఈ క్రింది విధముగ పేర్కొనియున్నారు.

"ప్రభాకరశాస్త్రిగారు రామకృష్ణుని చాటువును అష్టమహిషీ కల్యాణపీఠికను ఆధారము చేసికొని సంకుసాల నరసింహాకవి అన్న మయ్యపుత్రుడని అభిప్రాయపడిరి. సుంకసాల తిరుమలకవి తన'భాగవతవైభవము' అనుద్విపదగ్రంధమున తాను నరసింహాకవి మనుమడనని,

'సుంకసాలకులాబ్ధిసోమ నిష్కామ
పంకజోదరపాదభక్త్యేకధామ
నిమితవిద్వజ్జననరసింహాఖ్యా౦
రమణీయగుణగణ రఘునాథపుత్ర
తిరుమలశుభనామధేయప్రణీత —
వరవాక్యమగుభాగవతవైభవమున'

అనుద్విపదపంక్తులలో చెప్పుకొనెను. ఇందు పేర్కొనబడిన నరసింహూడెవరు? 'సుంకసాల' అని తిరుమలకవి పేర్కొనియుండుటచే ఇతడే సంకుసాల నరసింహాకవియని చెప్పవచ్చును. నరసింగన్నకు నారాయణుడు. లప్పలార్యుడు, అన్నమార్యుడు అను ముప్వురు కొడుకులున్నట్లు అష్టమహిషీకల్యాణపీఠికలో కలదు కాని 'భాగవతవైభవ' పీఠికలో రఘునాదుడొక్కడే కొడుకున్నట్లు చెప్ప-

బడినది దీనినిబట్టి అన్నమాచార్యునికుమారుడు నరసింగన్న. సంకుసాల నరసింహాకవి వేర్వేరని తేలుచున్నది ''౧

సంకుసాలకు దగ్గరదైన 'సుంకసాల' అను ఇంటిపేరు, ఆ యింటిపేరుతో ప్రసిద్ధుడైన ఒకకవి, అతనిపుత్రపౌత్రపారంపర్యము పై ఉదాహరించిన నాగినాని వైభవముతో తెలియుచున్నది. ఈ చరిత్ర బయల్పడుటవలన ఈ కవివిషయము ఇంకను చిక్కులో పడినది. అందువలన కవికర్ణరసాయనకర్త అన్నమాచార్యులపుత్రుడే అని నిర్ధరించుటమాత్రము సాహసమే కాగలదు.

నరసింహాకవి, నరసింగన్న, నరసింహాచార్యులు, ఇత్యాది-నామములతో అన్నమాచార్యులకు పెద్దభార్యయందు ఒక పుత్రుడు కలిగినట్లును, అతనిశ్రాద్ధదినకైంకర్యమునకై చిన్నన్న ఒక దాన-శాసనమును నిర్మించినట్లును చరిత్ర చెప్పుచున్నది. ఆ నరసింగన్న యే కవికర్ణరసాయనకర్తయా? అనుటమాత్రమే సందేహింపదగిన విషయము. అష్టమహిషీకల్యాణములో చిన్నన్న,

"తిమ్మాంబకు నాత్మసంభవుఁడు
పాడఁజెప్పఁగ వర్ణపద్ధతి నీడు—
జోడు లేఁడని సభఁజొచ్చి వాదించి
పొంగినధీశాలి ప్రతివాదిదైత్య
నరసింహుఁడనఁగ నెగ్గె నరసింహగురుఁడు ౨

పేర్కొన్నట్లు, అతడుద్దండపండితుడై, కవికర్ణరసాయనము కాక మరి యేవైనకృతులు రచియించినాడేమో? ఈనాటివరకు కవి బయటపడలేదేమో? లేక కొన్ని మహాగ్రంథములవలె అవియు కాలగర్భమున కలిసిపోయినవో? లేకున్నచో చిన్నన్న యే 'కవికర్ణరసాయనము' ను పేరుతో ఏల చెప్పలేదు. 'అష్టమహిషీ

౧ కవికర్ణరసాయనకావ్యానుశీలనము పుట 8 శ్రీ జి. చలపతి.
౨. అష్టమహిషీకల్యాణము పీఠిక చిన్నన్న

కల్యాణమునాటికి, కవికర్ణరసాయనము పుట్టలేదనుట అసంభావ్యము. ఈ విషయ మింకను కాలము నిర్ణయింపవలసినదే.

## దేవస్థానమువారికృషి — కృతజ్ఞతలు

**మా** తిరుమల తిరుపతి దేవస్థానము వారు ఈ తాళ్లపాక కవుల వాఙ్మయము వెలికి తెచ్చుటకు 1922-23 సంవత్సరములనుండి కృషి చేయుచునేయున్నారు. 'శ్రేయాంసి బహువిఘ్నాని' అన్నట్లు ఈపని తాబేటినడకగనే సాగుచున్నది. ఈనడుమ కొంతతొందరగా నడచుచున్నది. ఈ వేగముతో పని నడచినట్లయితే ఈసంకీర్తనరాశి-నంతటిని (అముద్రితమయినదానిని) రెండు లేక మూడేండ్లలో పూర్తిగా ప్రకటింపవచ్చు. అచ్చుపని త్వరత్వరగ సాగించుటకు నత్త నడకను గుఱ్ఱపుస్వారీగా మార్చి, తగిన ఏర్పాట్లుచేసి ఆయవ్యయము-లను గణింపక పని సాగించుచున్న తి. తి దే. కమిటీ చేర్మన్ శ్రీ డా॥ ఎన్. రమేశన్, ఐ.ఏ.ఎస్., గారికి, ఎంతపనినైన సంకల్పబలముతో సులభసాధ్యముగ చేయగలనేర్పునిండిన తి. తి దే. కార్యనిర్వహణాధి-కారులు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ ఏ.ఎస్., గారికిని నాకృతజ్ఞ-తాభివాదములు. ముద్రణకార్యమునందు మా చేతికి నిండుపని కల్పించుచు మాకు తోడ్పడుచున్న ప్రెస్ మేనేజరు శ్రీ ఎమ్. విజయకుమారరెడ్డిగారికి, ఈపనులలో తాము పైచూపువారైనను మెలకువవదలని తి. తి. దే. పౌరసంబంధశాఖాధికారి శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, ఎమ్.ఏ., గారికి, అనుక్షణము మాపను-లలో వలసినట్లు తోడ్పడుచున్న తి. తి. దే. 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కె సుబ్బారావు, ఎమ్.ఏ., గారికిని నా కృతజ్ఞతాంజలులు. ఈ పరిష్కరణకార్యములో నాకన్నివిధముల నిండుసహాకారమిచ్చు-చున్న చి॥ జె. బాలసుబ్రహ్మణ్యమ్. ఎమ్.ఏ., కు నా మంగళాశాసన ములు. వేగముగ సాగుఅచ్చుపనిలో కూడ మెలకువపడలనిఅచ్చు—

కూర్పరులను నిండుమనసుతో దీవించుట తప్ప నేను వారికి చేయు ఉపకార మేమున్నది? సుప్రసిద్ధ పరిష్కరణములను మరల పరిష్కరించుటలో నావలన ఏర్పడిన గుణదోషములను సహృదయులు గమనించి తెలిపినచో, కృతజ్ఞతతో స్వీకరించి తప్పులను సవరించుకొనగలను.

శ్లో॥ విశిష్టాద్వైతసిద్ధాన్తవీథీసతతసంచరం।
అన్నమప్రతిరూపం తం రాళ్లపల్లిగురుం స్తువే॥

విధేయుడు,

గౌరిపెద్ది రామసుబ్బశర్మ,

స్పెషల్ ఆఫీసరు

తిరుపతి — తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణశాఖ,

22–11–79 — అన్నమాచార్యప్రాజెక్టు.

*

# ఉపోద్ఘాతము

* * * *

శ్రీ తాళ్లపాక సంకీర్తనల యోగ్యతను లోకము గుర్తించునట్లు అన్నమాచార్యోత్సవమును వెలయించి ఉత్తమ సంకీర్తనము లను కొన్నింటిని గ్రంథముగా నుద్ధరించి ప్రకటింపించి వానిని లోకమున విరివిగా పంచిపెట్టి, సంకీర్తనముల పోటీ పరీక్షలుపెట్టి అందు గెలుపొందినవారికి, పాడినవారికి, బహుమానములు, సత్కారములు జరగించి గొప్ప ప్రచారము కావించుచున్న శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన ప్రధానాధికారుల భాషాభిరుచికి, భక్తి తత్పరతకు జోహారులు. పలువురు గాయకులును, అలిండియా రేడియో మదరాసు, విజయవాడవారును పాడి, పాడించి అన్నమాచార్య సంకీర్తనములకు వన్నె తెచ్చుచున్నారు. పైవారందరు మాపరిశ్రమను సఫలీకరించుచున్నందుకు సంతోషించుచున్నాము. ఇంతకు పూర్వము అన్నమాచార్య శృంగార సంకీర్తనములను 565-ని. అధ్యాత్మ సంకీర్తనములను 180-ని ప్రకటించుటయినది. క్రొత్తగా ఈ సంపుటములో అధ్యాత్మసంకీర్తనములు 331 ప్రకటించుటయినది. ఇంకను అధ్యాత్మ సంకీర్తనములు 1746, శృంగార సంకీర్తనములు 11406, ప్రకటింపవలసియున్నవి. నిరంతరముగా వీనిని బ్రకటించుట సాగినను నన్నింటిని బ్రకటించుట కెంత తక్కువయినను పది యేండ్లగును ఈశ్వరసంకల్ప మెటులున్నదో!

## 2.వ సంపుటము-అధ్యాత్మ సంకీర్తనలు

రాగిరేకులలో తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల రేకులు 30, పెదతిరుమలాచార్యులవి 39 రేకులుమాత్రమే ప్రకటి

తములయినవి. ఆ ప్రకటనముకూడ కలగపులగముగా, అపక్రమముగా, నివి యన్నమాచార్యుల రచనములు, ఇవి పెద తిరుమలాచార్యుల రచనములుఅని వేర్పాటులేక యున్నది ఉపక్రమమున మాత్ర మన్నియు నన్నమాచార్యుల రచనములే యగునట్టున్నది.

---

౧—కీ॥శే॥ వేటూరి—ప్రభాకరశాస్త్రిగారు, 5 వ సంపుటమునకు 1950 లో వ్రాసిన ఉపోద్ఘాతమిది. యథారూపముగ ప్రకటింపబడినది పాటలకు చూపినపుటలు 2,5 సంపుటములకు చెందినవి.

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకులు.


| రేకు నంబరు. | రేకులలోని మొదటిపాట మొదళ్లు. | అచ్చుపుటస |
|---|---|---|
| 1 | వలచి పైకొనఁగ రాదు | 1 |
| 11 | అలర ఁచంచలమైన | 45 |
| 12 | పరదేశి పట్టణమున | 48 |
| 13 | ఏటివిజ్ఞానమేటి | 51 |
| 14 | ఎందుఁ బుట్టితిమో | 55 |
| 15 | ఊరికిఁ బోయెడి | 60 |
| 16 | ఏదిచూచినఁ దమకు | 63 |
| 17 | ఏటికిఁ దలఁచెద | 67 |
| 18 | పుట్టుమాలిన | 72 |
| 19 | ఎన్నాళ్లదాక | 76 |
| 20 | తోరణములే దోవెల్లా | 80 |
| 31 | పారకుమీ వో మనసా | 115 |
| 32 | ఏఁటికిఁ నెవ్వరిపొందు | 123 |
| 33 | వెన్నవెట్టుకనేయి | 127 |
| 34 | పోయం బోయ | 13 |
| 35 | ఎండగాని నీడగాని | 13 |
| 36 | ఏడ వలపేడ | 13 |
| 61 | తలఁప వెనకముయ్యే | 19 |
| 62 | ఎంతగాలమో | 20 |
| 63 | పేఁడెపో వింత | 20 |

| రేకు నంబరు. | రేకులలోని మొదటిపాట మొదళ్లు | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 64 | ఏమి గలదిందు | 211 |
| 65 | ఇందరికి నభయంబు | 215 |
| 66 | ఎందుఁ జూచినందుకు | 219 |
| 67 | నానా దిక్కుల | 223 |
| 68 | కాయము జీవుఁడు | 227 |
| 69 | దొరకు నాయితని | 231 |
| 70 | ఏపనులు సేసినా | 235 |
| 78 | ఎట్టువేగించే | 266 |
| 79 | నీయాజ్ఞఁ దలమోచి | 270 |
| 80 | దేవ నీమాయ | 274 |


## పెదతిరుమలాచార్యుల అధ్యాత్మసంకీర్తనల రేకులు.


| రేకు నంబరు. | రేకులలోని మొదటిపాట మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య |
|---|---|---|
| 1 | అందులకు గాదు | 4 |
| 2 | కర్మమంటా మాకు | 9 |
| 3 | నన్ను నింతగా | 13 |
| 4 | వెన్నలు దొంగిలి | 17 |
| 5 | రామరామ | 21 |
| 6 | ఇది నీకునుపకార | 25 |
| 7 | ఎక్కడి మానుష | 29 |

| రేకు నంబరు. | రేకులలోని మొదటిపాట మొదళ్లు | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 8 | దైవమా నన్నిందులో | 33 |
| 9 | పాపము చేరువ | 37 |
| 10 | హరిభక్తి గలిగితే | 41 |
| 22 | చూడఁగ జూడఁగ | 87 |
| 23 | పోయిన బంధములటు | 91 |
| 24 | కోరి ధర్మముచాలు | 95 |
| 25 | కానని యజ్ఞానులారా | 99 |
| 26 | అదియె పోహరి | 103 |
| 27 | ఇందునందు నెంచ | 107 |
| 28 | విదురుని విందా | 111 |
| 29 | కరుణానిధివి | 115 |
| 37 | ఇందులో నేనెవ్వఁడను | 144 |
| 38 | ఎదురా రఘుపతికి | 148 |
| 39 | శరణు శరణు | 152 |
| 40 | ఒండె లౌకికము | 156 |
| 41 | ఇది యొక్కటే | 160 |
| 42 | లేరా దేవతలు | 164 |
| 43 | కొల్ల వలపులు | 168 |
| 44 | బందుగుఁడ వన్నిటాను | 172 |
| 45 | అల్లనాఁడే కంటి | 176 |
| 46 | అటుగానా ఏమి | 180 |

| రేకు నంబరు. | రేకులలోని మొదటిపాట మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 47 | కాదు వివేకము | 184 |
| 48 | శ్రీపతి కరుణే | 187 |
| 49 | ఎంతగాలం బైన | 191 |
| 50 | తతిగాని యేమరక | 195 |
| 71 | నీవున్నచోటే | 239 |
| 72 | వెదకి వెదకి | 242 |
| 73 | పురాణపురుషా | 246 |
| 74 | నాయంతనే | 250 |
| 75 | భక్తవత్సలుఁడవుగా | 254 |
| 76 | అటు గాన శరణంటి | 258 |
| 77 | ఆమూరితియే | 262 |


## ౧ ఈ సంపుటములో ముద్రితములైన అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకులు.


| రేకుల సంఖ్య. | రేకులలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 1 | వలచి పైకొనఁగరాదు | 1 |
| 2 | సదా సకలము | 5 |
| 3 | గాలినే పోయెఁ | 9 |
| 4 | దురితదేహులే | 14 |


౧. పాత ఐ[illegible] సంపుటము,

| రేకు సంఖ్య. | రేకులలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య |
| --- | --- | --- |
| 5 | పెంచఁ బెంచ మీఁదఁ | 19 |
| 6 | వైష్ణవులు గాని | 23 |
| 7 | పుట్టుగు లమ్మీ | 27 |
| 8 | కొనుట వెగ్గళము | 31 |
| 9 | ఏమి సేయవచ్చుఁ | 36 |
| 10 | పదిలముకోట | 40 |
| 21 | పెక్కు లంపటాల | 44 |
| 22 | పరగు బహుసజ్జన్మ | 48 |
| 23 | భావయామి గోపాలబాలం | 52 |
| 24 | ఆపదల సంపదల | 56 |
| 25 | ఒప్పులై నొప్పులై | 60 |
| 26 | ఎనుపోతుతో నెద్దు | 64 |
| 27 | ఏమీ నెఱఁగనిమమ్ము | 67 |
| 28 | తొలుఁబాపపుణ్యాలతోడ | 72 |
| 29 | కోరిక దీరుట యెన్నఁడు | 76 |
| 30 | చెల్లుఁగా కిటు నీకే | 80 |
| 37 | అదె చూడు | 84 |
| 38 | వేసరితి మెట్ల | 87 |
| 39 | కానరో కానరో | 92 |
| 40 | నిగమనిగమాంతవర్ణిత | 96 |
| 41 | కాక మఱి | 100 |

| రేకు సంఖ్య. | రేకులలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
| --- | --- | --- |
| 42 | నీవేకా చెప్పఁ | 104 |
| 43 | ఆదిమునుల | 108 |
| 44 | ఈ దేహవికారము | 112 |
| 45 | ఎచ్చోట కేఁగిన | 116 |
| 46 | పరుసము సోఁకియు | 120 |
| 47 | ఏమీ నెఱఁగనినా | 124 |
| 48 | సేవింతురా | 128 |
| 49 | కాలాంతకుఁడను | 132 |
| 50 | ఎఱుఁక గలుగునాఁ | 136 |
| 51 నుండి 60 వఱకు | రేకులు లేవు | |
| 71 సుండి 77 వఱకు | రేకులు రేవు | |
| 81 | పీనిఁ జూచియైన | 140 |
| 82 | విధినిషేధములకు | 143 |
| 83 | ఇతరధర్మము | 147 |
| 84 | వలెననువారిదె | 151 |
| 85 | మిక్కిలిపుణ్యులు | 155 |
| 86 | తహ తహ లిన్నిటికి | 159 |
| 87 | సులభమా యిందరికిఁ | 163 |
| 88 | వివేక మెఱఁగని | 167 |
| 89 | దేవ యీతగవు | 171 |

| రేకు సంఖ్య. | రేకులలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 90 | ఉన్నవిచారము | 175 |
| 91 | తప్పఁ దోయవే | 179 |
| 92 | నవనారసింహా | 183 |
| 93 | నే నేమి సేయుదును | 187 |
| 94 | బోధకు లెవ్వరు | 191 |
| 95 | ఎక్కెఁగా రాఁగా | 195 |
| 96 | ఇందులోనే కానవద్దా | 199 |
| 97 | అమ్మే దొకటి | 203 |
| 98 | అట్టివేళఁ గలఁగని | 207 |
| 99 | తెలిసిన బ్రహ్మోపదేశ | 211 |
| 100 | శతాపరాధములు | 215 |


రాగిరేకులను సరిగాఁజదివి అచ్చులిపిరీతితోఁ దీర్చి దిద్ది వ్రాయుచు యచ్చుచిత్తులను దిద్దుచు సందిగ్ధములగు పట్టుల మూలము రేకులను, వేసంగి సెలవులలోఁగూడఁ దెచ్చి నాతోఁగూడ సరిచూచుచు వడివడిగా అచ్చు నిర్వహించుటలో నాకుఁ గుడిభుజమై తోడ్పడిన దేవస్థానపు లైబ్రరి తెల్గుపండితుని చిరంజీవి ఉదయగిరి శ్రీనివాసాచార్యుని మదీయుని సంభావించుచున్నాను.

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యవిద్యాపరిశోధనాలయము,
తిరుపతి.
22—6—50

వే. ప్రభాకరశాస్త్రి.

శుభమస్తు

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

---

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగునేఁటి-క్రోధిసంవత్సరమందు, తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించినపదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమై తేను, అదిమొదలుగాను శాలివాహనశకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటిదుందుభిసంవత్సరఫాల్గుణ బ ౧౨ నిరుధానకు[౧] (నిరోధానకు? తిరోధానానకు!) తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమా-చార్యులు విన్నపముచేసిన అధ్యాత్మసంకీర్తనలు.

శ్రీ వేంకటేశాయ నమః

## సామంతం

వలచి పైకొనఁగరాదు వలదని తొలఁగరాదు
కలికిమరుఁడు సేసినాజ్ఞ కడవఁగరాదురా ॥ పల్లవి ॥

అంగడికెత్తినట్టిదివ్వె లంగనముఖాంబుజములు
ముంగిటిపసిఁడికుంభములును ముద్దులకుచయుగంబులు
యెంగిలిసేసినట్టితేనె లితవులైన మెఱుఁగుమోవులు
లింగములేనిదేహారములు లెక్కలేనిప్రియములు ॥ వలచి ॥

---

౧. ఈశబ్దము 'విరోధ' 'విరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గావచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాఁడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకర శాస్త్రిగారూహించిన "వరియగు" అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును 'అవధి' అను నర్థములో "ఈ విరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమివారి విష్ణుపారిజాతము" 55 వ పుట. వే-వీప్రయోగమివ్వగా శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, "నిఱుత్తం" అను అరవపదము కూడ 'విలువు' అనునర్థముతో దీనికి సహాయపడునవిరి.

కంచములోనివేఁడికూరలు గరువంబులుఁ బొలయలుకలు
యెంచఁగ నెండలోనీడలు యెడనెడకూటములు
తెంచఁగరాని ° వలెతాళ్లు తెలివిపడనిలేఁతనవ్వులు
మంచితనములోనినొప్పులు మాటలలోనిమాటలు ॥ వలచి ॥

నిప్పులమీఁదఁజల్లిననూనెలు నిగిడి తనివిలేనియాసలు
దప్పికి నేయిదాగినట్లు తమకములోనితాలిమి
చెప్పఁగరానిమేలు గనుట శ్రీవేంకటపతిఁ గనుటలు
అప్పనికరుణగలిగి మనుట అబ్బురమైన సుఖములు ॥ వలచి ॥ 1

దేసాక్షి

వేదవేద్యులు వెదకేటిమందు
ఆదినంత్యములేనిఆమందు ॥ పల్లవి ॥

అడవిమందులుఁ గషాయములు నెల్లవారు
కడగానక కొనఁగాను
తొడిఁబడ నొకమందు దొరకె మాకు భువి-
నడియాలమైనట్టిఆమందు ॥ వేద ॥

లలితరసములుఁ దైలములు నెల్లవారు
కలకాలము గొనఁగాను
చెలువైన దొకమందు చేరె మాకు భువి-
నలవిమీఱినయట్టియామందు ॥ వేద ॥

కదిసినజన్మరోగముల నెల్లవారు
కదలలేక వుండఁగాను
ఆదన శ్రీతిరువేంకటాద్రిమీఁదిమందు
అదివో మాగురుఁ డిచ్చె నామందు ॥ వేద ॥ 2

° 'వల'కావచ్చు.

దేసాళి

హీనదశలఁ బొంది యిట్లనుండుటకంటె
నానావిధులను నున్ననాఁడే మేలు ॥ పల్లవి ॥

అరుదైనక్రిమికీటకాదులందుఁ బుట్టి
పరిభవములనెల్లఁ బడితిఁగాని
యిరవైనచింత నాఁ డింతలేదు యీ
నరజన్మముకంటె నాఁడే మేలు ॥ హీన ॥

తొలఁగక హేయజంతువులయందుఁ బుట్టి
పలువేదనలనెల్లఁ బడితిఁగాని
కలిమియు లేమియుఁ గాన నేఁ డెఱఁగి
నలఁగి తిరుగుకంటె నాఁడే మేలు ॥ హీన ॥

కూపనరకమునఁ గుంగి వెనకకు నేఁ
బాపవిధులనెల్లఁ బడితిఁగాని
యేపునఁ దిరువేంకటేశుఁ నా కిటువలె
నాపాలఁగలిగిననాఁడే మేలు ॥ హీన ॥ 3

సామంతం

ఏవం శ్రుతిమత మిదమేవ త —
ద్భావయితు మతఃపరం నాస్తి ॥ పల్లవి ॥

అతులజన్మభోగాసక్తానాం
హితవైభవసుఖ మిదమేవ
సతతం శ్రీహరిసంకీర్తనం త —
ద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి ॥ ఏవం ॥

ఐహికమరణపరిభవచిత్తానా-
మిహపరసాధన మిదమేవ
అహిశయనమనోహరసేవా త-
ద్విహరణం వినా విధిరపి నాస్తి ॥ ఏవం ॥

సంసారదురితజాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతకవేంకటగిరిపతేః ప్ర-
శంసైవా° పశ్చా దిహ నాస్తి ॥ ఏవం ॥ 4

పాడి

వేదం బెవ్వని వెదకెడిని
ఆదేవునిఁ గొనియాడుఁడీ ॥ పల్లవి ॥

అలరిన చైతన్యాత్మకుఁ డెవ్వఁడు
కలఁ డెవ్వఁ డెచటఁ గలఁడనిన
తలఁతు రెవ్వనినిఁ దనువియోగదశ
యిల నాతని భజియించుఁడీ ॥ వేదం ॥

కడఁగి సకలరక్షకుఁ డిం దెవ్వఁడు
వడి నింతయు నెవ్వనిమయము,
పిడికిట తృప్తులు పితరు లెవ్వనినిఁ
దడవిన, ఘనుఁ డాతనిఁ గనుఁడీ ॥ వేదం ॥

కదిసి సకలలోకంబులవారలు
యిదివో కొలిచెద రెవ్వనిని
త్రిదశవంద్యుఁ డగుతిరువేంకటపతి
వెదకి వెదకి సేవించుఁడీ ॥ వేదం ॥ 5

° "వా" దీర్ఘము సంగీతసంబంధి కావచ్చు.

గుండక్రియ

మానుషము గాదు మఱి దైవికము గాని
రానున్నా అది రాకుమన్నఁ బోదు ॥ పల్లవి ॥

అనుభవనకుఁ బ్రాప్తమైనది
తనకుఁదానె వచ్చి తగిలికాని పోదు ॥ మాను ॥

తిరువేంకటగిరిదేవుని -
* కరుణచేతఁ గాని కలుష మింతయుఁబోదు ॥ మాను ॥ 6

2 రేకు శుద్ధవసంతం

సదా సకలము ౧సంపదలే
తుద దెలియఁగవలెఁ దొలఁగఁగవలయు ॥ పల్లవి ॥

అహర్నిశమును నాపదలే
సహించిన నవి సౌఖ్యములే
యిహమున నవి ౨యిందఱికిని
మహిమ దెలియవలె మానఁగవలెను ॥ సదా ॥

దురంతము లివి దోషములే
పరంపర లివి బంధములు
విరసములౌ నరవిభవములౌ-
సిరులే మరులౌ చిరసుఖ మవును ॥ సదా ॥

గతి యలమేల్ మంగ ౩నాంచారికిఁ
బతియగువేంకటపతిఁ దలఁచి
రతు ౪లెఱుఁగగవలె రవణము వలెను
హిత ౫మెఱుఁగఁగవలె నిదె తనకు ॥ సదా ॥ 7

* ఈయాఱు సంకీర్తనలు II సంపుటములో మొదట ముద్రితమయినవి.
౧. సంపదలే; పూ ము.పా. యతిభంగము ౨) యందఱికి పూ.ము.పా. యతిభంగము.
౩. నాచారికి అనిరేకు; ౪,౫. (లె)(మె)ఱుఁగఁగ అని రేకు. ఇదియే వారిసహజప్రయోగము.

## శుద్ధవసంతం

ఇందిరానామ మిందరికి
కుందనపుముద్ద వో గోవింద ॥ పల్లవి ॥

అచ్యుతనామము అనంతనామము
ఇచ్చినసంపద లిందరికి
నచ్చినసిరులు నాలుకతుదలు
కొచ్చికొచ్చి నో గోవిందా ॥ ఇంది ॥

వైకుంఠనామము వరదనామము
ఈకడనాకడ నిందరికి
వాకుఁదెరపులు వన్నెలు లోకాలఁ
గూకులు వత్తులు నో గోవిందా ॥ ఇంది ॥

పుండరినామము పరమనామము
ఎండలువాపెడి దిందరికి
నిండునిధానమై నిలిచినపేరు
కొండలకోనేటివో గోవిందా ॥ ఇంది ॥ 8

## బౌళి

ఎవ్వరిఁ గాదన్న ౧నది నిన్నుఁ గాదంట
యెవ్వరిఁ గొలిచిన ౨నది నీకొలువు ॥ పల్లవి ॥

అవయవములలో నది గా దిది గా-
దవి మే లివి మే లన నేలా
భువియుఁ బాతాళము దివియు నందలిజంతు-
నివహ మింతయును నీదేహ మేకాన ॥ ఎవ్వ ॥

---

౧. ౨. "వది" అని పూ. ము. పా. "అది" అనిరేకు. యతిభంగము.

పు లేనిచోటు విజముగఁ దెలిసిన
ఆవల నది గా దనవచ్చును
శ్రీవేంకటగిరిం శ్రీనాథ సకలము
భావింప నీవే పరిపూర్ణుఁడవుగాన ॥ ఎవ్వ ॥ 9

## సామంతం

హజవైష్ణవాచారవర్తనుల-
సహవాసమె మాసంధ్య ॥ పల్లవి ॥

శియమగుశ్రీహరిసంకీర్తన
సతతంబును మాసంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురతమెఱసినసంధ్య. ॥ సహ ॥

రమభాగవతపదసేవనమే
సరవి నెన్న మాసంధ్య
సిరివరుమహిమలు చెలువొందఁగ వే-
సరక వినుటె మాసంధ్య. ॥ సహ ॥

ంతుకెక్క తిరుమంత్రపఠనమే
సంతతమును మాసంధ్య
కంతుగురుఁడు వేంకటగిరిరాయని-
సంతర్పణమే మాసంధ్య. ॥ సహ ॥ 10

## మాళవిశ్రీ

ంచుకొరకె యిందరును నిట్లయిరి
కిందుపడి మఱికాని గెలుపెఱఁగరాదు. ॥ పల్లవి ॥

---

౧. 'శ్రీనాథ' అని రేకు

అటమటపువేడుకల నలయించి మఱికదా
ఘటియించుఁ బరము తటుకన దైవము
ఇటు సేయ నీశ్వరున కీసు గలదా? లేదు.
కుటిలమతిఁ గని కాని గుణిఁ గానరాదు. ॥ ఇందు ॥

బెండుపడ నవగతులఁ బెనఁగించి మఱికదా
కొండనుచుఁ బర మొసఁగును దైవము
బండుసేయఁగ హరికిఁ బంతమా? యటుగాదు.
యెండదాఁకక నీడహిత వెఱఁగరాదు. ॥ ఇందు ॥

మునుప వేల్పులకెల్ల మ్రొక్కించి మఱికదా
తనభక్తి యొసఁగు నంతట దైవము
ఘనవేంకటేశునకుఁ గపటమా? అటుగాదు.
తినక చేఁదునుఁ దీపు తెలియనేరాదు. ॥ ఇందు ॥ 11

ధన్నాసి

సందడి విడువుము ౧సాసముఖా
మంధరధరునకు మజ్జనవేళా ॥ పల్లవి ॥

అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టును ౨కాళాంజి
జమలిచామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు. ॥ సంద ॥

అణిమాదిసిరులనలరెడు శేషుఁడ
మణిపాదుక లిడు మతి చెలఁగా
ప్రణుతింపు కదిసి భారతీరమణ
గుణాధిపు మరుగురు బలుమరును. ॥ సంద ॥

---

౧. సముఖము + సముఖము (సముఖ + సముఖ) అను పరాకువచనమునకు అన్నమయ్య చేసిన తెలుగు ఆమ్రేడితసంధిరూపముగా తోచుచున్నది.
౨. 'కాఁళాజి' అని రేకు.

వేదఘోషణము విడువక సేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుండగుశ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడె ॥ సంద ॥ 12

శంకరాభరణం

మలసీఁ జూడరో మగసింహము
అలవిమీఱినమాయలసింహము ॥ పల్లవి ॥

అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళముమీఁదిపెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు
కదిసి కానఁగలేనిఘనసింహము ॥ మల ॥

మెచ్చిమెచ్చి చూడరో మితిమీఱినయట్టి
చిచ్చుఱకంటితోడిజిగిసింహము
తచ్చినవారిధిలోనతరుణిఁ గౌఁగిటఁ జేర్చి
వచ్చినగోళ్లశ్రీనరసింహము ॥ మల ॥

బింకమునఁ జూడరో పిరితియ్యక నేఁడు
అంకపుదనుజసంహారసింహము
వేంకటనగముపై వేదాచలముపై
కింక లేక వడిఁ బెరిగినసింహము ॥ మల ॥ 13

3 రేకు కన్నడగౌళ

గాలినే పోయఁ గలకాలము
తాలిమికిఁ గొంతయుఁ బొద్దు లేదు. ॥ పల్లవి ॥

అపరాధః తకోట్లయినవి వొక్క-
  నెపమున నను( గావనేరవా
  అపరిమితదురితాలైనవి యే-
  ఉపమచేత నన్నునుద్ధరించెదవయ్య ॥ నీవే ॥

అతిశయముగ( గర్మనైతిని నీ-
  మతము నాకొకయింత మరపవా
  ఇతరకర్మారంభహీతు(డను
  గతి మోక్ష మెటువలె( గల్పించెదవయ్య ॥ నీవే ॥

తిరువేంకటాచలాధీశ్వరా నీ-
  శరణాగతుల( బ్రోవ(జాలవా
  పరమదయానందపరు(డవు యే-
  వెరవున భవములు వెడల(ద్రోచెదవయ్య ॥ నీవే ॥ 17

గుండక్రియ

తెలియ( జీ(కటికి దీపమెత్తక పెద్ద-
  వెలు(గులోపలికి వెలు(గేలా ॥ పల్లవి ॥

అరయ నాపన్నుని కభయ మీవలె(గాక
  ఇరవైనసుఖి( గావనేలా
  వఱత(బోయెడివాని వడి( దీయవలె(గాక
  దరివాని( దివియంగ( దానేలా ॥ తెలి ॥

ఘనకర్మారంభునికట్లు విడవలె(గాక
  యొనసి మునక్తుని( గావనేలా
  అనయము దుర్బలుని కన్నమిడవలె(గాక
  తనిసినవానికి( దానేలా ॥ తెలి ॥

మితిలేనిపాపకర్మికిఁ దా వలెఁగాక
హితవెఱుఁగుపుణ్యుని కేలా
ధృతిహీనుఁ గృపఁజూచి తిరువేంకటేశ్వరుఁడు
తతిఁ గావకుండినఁ దానేలా ॥ తెలి ॥ 18

### ముఖారి

చిత్తములో నిన్నుఁ జింతించనేరక
మత్తుఁడనై పులుమానిసినైతి ॥ పల్లవి ॥

అరుత లింగము గట్టి యది నమ్మఁజాలక
పరువతమేఁగినబత్తుఁడ నైతి
సరుస మేఁకపిల్లఁ జంకఁబెట్టుక [1]నూఁత-
నరయుగొల్లనిరీతి నజ్ఞాని నైతి ॥ చిత్త ॥

ముడుపు కొంగునఁగట్టి మూలమూలలవెదకే-
వెడమతినై నే[2]వెర్రుడ నైతి
విడువ కిక్కడ శ్రీవేంకటేశ్వరుఁ డుండ
పొడగానక మందబుద్ధి నే నైతి ॥ చిత్త ॥ 19

### శ్రీరాగం

అన్నియును నతనికృత్యములే
ఎన్నియైనా నవు నతఁ డేమిసేసినను ॥ పల్లవి ॥

అణురేణుపరిపూర్ణుఁ డవలిమోమైతేను
అణువౌను కమలభవాండమైన
ఫణిశయనునికృపాపరిపూర్ణమైతే
తృణమైన మేరువౌ స్థిరముగా నపుడే ॥ అన్ని ॥

---

౧ ఈందరనున్న చింత్యము  ౨ 'వ్యర్థ' శబ్దభవము కావచ్చు.

పురుషోత్తమునిభక్తి పొరపొచ్చమైతే
ఎరవులౌ నిజసిరులు ఎన్నైనను
హరిమీఁదిచింత పాయక నిజంబైతే
నిరతిఁ బట్టినవెల్లా నిధానములే ॥ అన్ని ॥

మదనగురునిసేవ మదికి వెగ్గలైతేను
పదివేలుపుణ్యములు పాపంబులే
పదిలమై వేంకటపతిభక్తి గలితేను
తుదిపదంబునకెల్లఁ దొడవవు నపుడే ॥ అన్ని ॥ 20

రేకు 4 శుద్ధవసంతం

౧దురితదేహులే తొల్లియును శ్రీ-
హరి భజించి నిత్యాధికులైరి ॥ పల్లవి ॥

అనంతకోటి౨ మహామునులు ఈ-
సనకాదులు నిశ్చలయశులు
ఇనశశినయనుని నితనిని మును
గని భజించి గతకల్మషులైరి ॥ దురి ॥

అతిశయమతులు మహామహులు సుఖ-
రతిప్రముఖులును చిరంతనులు
హితవిచారమతి నితనిని సం-
తతమును భజించి ధన్యులైరి ॥ దురి ॥

దేవతాధిపులు దివ్యులును కడుఁ-
౩బావనులును తగఁ బరహితులు
యీవేంకటపతి నితనిని
సేవించి సుఖాంచితమతులైరి ॥ దురి ॥ 21

౧. 'దురితా' అని రేకు. ౨) 'మహాముమలు' అని రేకు.
౩. 'బావనలు' అని రేకు.

## శ్రీరాగం

ఇందిర వడ్డించ నింపుగను
చిందక యిట్లే భుజించవో స్వామి— ॥పల్లవి॥

అక్కాళపాశాలు నప్పాలు వడలు
పెక్కైనసయిఁదంపుపేణులును
సక్కెరరాసులు సద్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ ॥ఇంది॥

మీరినకెళంగు మిరియపుఁదాళింపుఁ-
గూరలు కమ్మనికూరలును
సారంపుఁబచ్చళ్ళు చవులుగ నిట్టే
కూరిమితోఁ జేకొనవో స్వామీ ॥ఇంది॥

పిండివంటలునుఁ బెరుగులుఁ బాలు
మెండైన ం పాశాలు మెచ్చి మెచ్చి.
కొండలపొడవు కోరి దివ్యాన్నాలు
వెండియు మెచ్చవే వేంకటస్వామీ ॥ఇంది॥ 22

## శ్రీరాగం

అదివో ౨ అల్లదివో హరివాసము
౩ పదివేలుశేషులపడగలమయము ॥పల్లవి॥

అదె వేంకటాచల ౪ మఖిలవున్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు-
నదె చూడుఁ డదె మొక్కుఁ డానందమయము ॥అది॥

౧. ఇది 'పాయస' శబ్దమునకు వ్యావహారికరూపము కావచ్చు.
౨. 'అల్లదిహో' పూ ము. పా.
3. 'పదివేల' కావచ్చు ౪) 'అఖిలోన్నతము' పూ ము పా

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతలనిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్నధనము
బంగారుశిఖరాల బహ్మబహ్మామయము ॥ అది ॥

కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకలసంపదరూప మదివో
పావనములకెల్లఁ బావనమయము ॥ అది ॥ 23

ఆహిరి

వననిధిఁ గురిసినవాన లివి మతి-
పనిలేనిపనులభారములు ॥ పల్లవి ॥

అడవులవెన్నెల లారిడిబదుకులు
తడతాఁకులపరితాపములు
వొడలొసఁగినహరి నొల్లక యితరుల
బడిబడిఁ దిరిగినబంధములు ॥ వన ॥

కొండలనునుపులు కొనకొనమమతలు
అండలకేఁగిన నదవదలు
పండినపంటలు పరమాత్మ విడి -
బండయితిరిగినబడలికలు ॥ వన ॥

బచ్చనరూపులు పచ్చలకొలపులు
నిచ్చలనిచ్చల నెయ్యములు
రచ్చలవేంకటరమణుని( గొలువక
చచ్చియుఁ జావనిజన్మములు ॥ వన ॥ 24

## శ్రీరాగం

నిత్యానంద ౧ధరణీధర ధరారమణ
కాత్యాయనీస్తోత్ర కామ కమలాక్ష ॥ పల్లవి ॥

అరవిందనాభ జగదాధార భవదూర
పురుషోత్తమ నమో భువనేశ
కరుణాసమగ్ర రాక్షసలోకసంహార-
కరణ కమలాధీశ కరిరాజవరద ॥ నిత్యా ॥

భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగరనిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణనిజదేహ
భాగీరథీజనక పరమ పరమాత్మ ॥ నిత్యా ॥

పావన పరాత్పర శుభప్రద పరాతీత
కైవల్యకాంత శృంగారరమణ
శ్రీవేంకటేశ దాక్షిణ్యగుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిరకృపాభరణ! ॥ నిత్యా ॥ 25

## ముఖారి

అనుమానపుబ్రదు కది రోఁతా తన-
మనసెనయనికూటమి మరి రోఁతా ॥ పల్లవి ॥

అపకీర్తులఁబడి అడికెలోనై
అపవాదియౌట అది రోఁత
పుపమ ౨గెలిచేనని వారుఁ జెరుచుటలు
విపరీతపుగుణవిధ మొకరోఁతా ॥ అను ॥

౧. 'ధరణి' అని పూ. ము. పా. ౨. 'గెలిచె' అని పూ. ము. పా.

తనగుట్టెల్లా నెఱిఁగినవారలముందట
తనయెమ్మెలు చెప్పుకొనుట రోఁత
వనితలముందట వదరుచు వదరుచు
కనుఁగవఁ గాననిగర్వము రోఁత ॥ అను ॥

భువి హరి గతియని బుద్ధిఁదలంచని-
యవమానపుమన సది రోఁత
భవసంహరుఁడై పరగువేంకటపతి-
నవిరళముగఁ గొలువని దది రోఁత ॥ అను ॥ 26

దేసాక్షి

నిన్నుఁ ౧దలఁచి నీపేరు ౨దలఁచి
నన్నుఁ గరుణించితే నెన్నికగాక ॥ పల్లవి ॥

అధికునిఁ గాచు టేమరుదు నన్ను-
నధమునిఁ గాచుట యరుదుగాక నీకు
మధురమౌ టేమరుదు మధురమూ, చేఁదు
మధురమౌటే మహిలో నరుదుగాక ॥ నిన్నుఁ ॥

అనఘునిఁ గరుణింప నరుదుగాదు నీకు
ఘనపాపుని నన్నుఁ గాచు టరుదుగాక
కనకము గనకము గానేల, యినుము
కనకమవుటే కడు నరుదుగాక ॥ నిన్నుఁ ॥

నెలకొన్నభీతితో నిన్నుఁ జెనకితిఁగాక
తలకొన్నసుఖినైనఁ దలఁచనేల నిన్ను
యెలమితోఁ దిరువేంగళేశుఁడ నాపాలఁ
గలిగి నీకృప గలుగఁజేతువుగాక ॥ నిన్నుఁ ॥ 27

౧, ౨ 'దలంచి' అని పూ.ము పా

పాడి

పాపపుణ్యములరూపము దేహ మిది దీని-
దీపనం బణఁగింపఁ దెరు వెందు లేదు ॥ పల్లవి ॥

అతిశయంబైనదేహాభిమానము దీర
౧ గతిఁగాని పుణ్యసంగతిఁ బొందరాదు
మతిఁ గోసి దేహాభిమానంబు విడుచుటకు
రతి ౨ పరాఙ్ముఖుఁడు గాక రపణంబు లేదు ॥ పాప ॥

సరిలేనిమమకారజలధి దాఁటినఁగాని
అరుదైననిజసౌఖ్య మది వొందరాదు
తిరువేంకటాచలాధిపునిఁ గొలిచినఁగాని
పరగుబ్రహ్మానందపరుఁడుఁ దాఁ గాఁడు ॥ పాప ॥ 28

5 రేకు ఆహిరి

పెంచఁబెంచ మీఁదఁ బెరిగేటిచెలిమి
ఇంచుకంత తాలిముల కెడలేనిచెలిమి ॥ పల్లవి ॥

అంటుముట్టులేక మనసులంటుకొన్నచెలిమి
కంటఁగంట నవ్వించేఘనమైనచెలిమి
వెంటవెంటఁ దిరిగాడువెట్టిగొన్నచెలిమి
యింటివారిచిత్తములకు నెడరైనచెలిమి ॥ పెంచ ॥

చెక్కుచెమటపెక్కు ౩ వలనే చిక్కునైనచెలిమి
యెక్కుడౌటా తమ్ముఁదమ్మ ౪ నెఱఁగనీనిచెలిమి
చక్కఁదనమే చిక్కు మేనుచిక్కినట్టిచెలిమి
లెక్కలేనియాసలెల్లా లేఁతలయినచెలిమి ॥ పెంచ ॥

---

౧. 'గతిగాని' అని వుండవచ్చు. ౨. 'పర ఙ్ముఖుఁడు' అని రేకు.
౩. 'వలెనే' పూ-ము-పా. వెఁ ౪. 'నెఱుఁగని వీచెలిమి' పూ-ము-పా.

అంకురించినట్టితలఁపు ఁధికమయినచెలిమి
లంకెలయినయాసలెల్లా లావుకొన్నచెలిమి
వేంకటాద్రివిభునిఁ గూడి వేడుకయినచెలిమి
పంకజాననలకెల్లఁ బాయరానిచెలిమి ॥ వెంచ ॥ 29

ఆహిరి

ఆలాగుపొందులును నటువంటికూటములు
యీలాగులౌట నేఁ డిదె చూడనయితి ॥ పల్లవి ॥

అడియాసచూపులకు నాసగించితిఁగాని
°పెడమాయలని లోను వెదకలేనైతి
కడువేడుకలఁ దగిలి గాసిఁబొందితిఁగాని
యెడలేనిపరితాప మెఱఁగలేనైతి ॥ ఆలా ॥

చిరునగవుమాటలకుఁ జిత్తగించితిఁగాని
తరితీపులని లోనుఁ దలఁపలేనైతి
వరుస మోహపుఁబసలవలలఁ జిక్కితిఁగాని
గరువంపుఁబొలయలుక గానలేనైతి ॥ ఆలా ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జింతసేసితిఁగాని
దేవోత్తమునిలాగుఁ దెలియలేనైతి
యీవైభవముపై విచ్చగించితిఁగాని
యీవైభవానంద మిది పొందనైతి ॥ ఆలా ॥ 30

గౌళ

ఎన్ని లేవు నా కిటువంటివి
కన్నులెదుట నిన్నుఁ గనుగొనలేనైతి ॥ పల్లవి ॥

° 'పెడమాయ లనిలోను' అని పూ. ము. పాఠవదవిభాగము.

అరయ నేఁజేసినయపరాధములు చూచి
కరుణించి పోకడై నాఁ గాచునా
కరచరణాదులు కలిగించిననిన్నుఁ
బరికించి నీసేవాపరుఁడఁ గాలేనైతి ॥ ఎన్ని ॥

యేతరినై నే నెఱిఁగి సేసినయట్టి-
పాతక మొకఁడై నాఁ బాపునా
ఆతుమలోనుండి యలరి నీవొసఁగిన-
చేతనమున నిన్నుఁ జెలఁగి చేరనైతి ॥ ఎన్ని ॥

శ్రీవేంకటేశ నేఁ జేసినయితరుల-
సేవ కొకఁడు దయసేయునా
౦నీవే యిచ్చినయట్టి నే నీశరీరముతోడ
నీవాఁడ ననుబుద్ధి నిలుపనేరనైతి ॥ ఎన్ని ॥ 31

## గుండక్రియ

ఎంతటివారలు నెవ్వరును హరిఁ
జింతించక నిశ్చింతులు గారు ॥ పల్లవి ॥

అతిజితేంద్రియులు ననశనవ్రతులు-
నతులతపోధనులగువారు
చతురాననగురుస్మరణము దొరకక
తతి నూరక పుణ్యతములు గారు ॥ ఎంత ॥

౦ 'నీవేయిచ్చినయట్టియీశరీరముతోడ' అను సమాసమధ్యమున 'నే' శబ్దఘటనము వింత లేక 'అట్టి'కి 'నే' లో అన్వయమా? యతినిర్బంధముకాబోలు.

అనఘులు శాంతులు నధ్యాత్మతతులు-
ననుపమపుణ్యులు యాజకులు
వనజోదరు ననవరతముఁ దలఁచక
వినుతిస్మృతికిని విబుధులు గారు ॥ ఎంత ॥

దురితవిదూరులు దుర్మతిహీనులు
నిరతానందులు నిత్యులును
తిరువేంకటగిరిదేవుని గొలువక
పరమార్గమునకు బ్రహ్మలు గారు ॥ ఎంత ॥ 32

## సామంతం

పరమపాతకుఁడ భవబంధుఁడ శ్రీ-
హరి నినుఁ దలఁచ నే నరుహుఁడనా ॥ పల్లవి ॥

అపవిత్రుఁడ నే నమంగళుఁడఁ గడు-
నపగతపుణ్యుఁడ ౧నలసుఁడను
కపటకలుషపరికరహృదయుఁడ నే-
నపవర్గమునకు నరుహుఁడనా ॥ పర ॥

అతిదుష్టుఁడ నే నధికదూషితుఁడ
హతవివేకమతి ౨నదయుఁడను
౩పతిలేనిరమాపతి మిముఁ దలఁచలే-
నతులగతికి నే నరుహుఁడనా ॥ పర ॥

అనుపమవిషయపరాధీనుఁడ నే-
ననంతమోహభయాతురుఁడ
వినుతింపఁగఁ దిరువేంకటేశ ఘను-
లనఘులుగాక నే నరుహుఁడనా ॥ పర ॥ 33

౧ 'నలసుఁడను'
౨. నదయుఁడను } అని వ్రా. ము. పా
౩. "పతి" ప్రతిశబ్దభవము కావచ్చు

నాదరామక్రియ

ఇన్నియుఁ గలుగు నేజన్మమునన్నైనఁ
జెన్నలర హరిసేవ సిద్ధించుకొరకు ॥ పల్లవి ॥

అరయ వేదాధ్యయన మది బ్రహ్మశుద్ధికొర-
కిరవైనశాస్త్రంబు లెరుకకొరకు
తరి యజ్ఞములు రుణోత్తారమయ్యేదికొరకు
సరిలేనిదానములు జన్మములకొరకు ॥ ఇన్ని ॥

మమకారదూరంబు మనసు గెలుచుటకొరకు
సమవివేకంబు శాంతములకొరకు
అమర శ్రీతిరువేంకటాద్రీశుమనసుం౧ నీ-
జము గెలుచుబ్రహ్మవిజ్ఞానంబుకొరకు ॥ ఇన్ని ॥ 34

సామంతం

ఏ నిన్నుదూరక నెవ్వరి దూరుదు నీ-
వాని ౨ నన్నొకయింత వదలక ౩ నను నేలవలదా ॥ పల్లవి ॥

అపరాధిఁగనక నన్నరసి కావుమని
అపరిమితపుభయ మంది నీకు శరణంటిఁగాక
నెపములేక నన్ను నీకుఁ గావఁగనేల
అపవర్గరూప దయాంబుధి తిరువేంకటాధిపా ॥ ఏని ॥

ఘనపాపిఁగనక నీకరుణఁ గోరి నీ-
వనవరతము నాయాతుమ విహరించుమంటిఁగాక
యెనసి నన్నుఁ గాచే మేమి యరుదు నీకు-
ననఘుఁడ పరమతత్త్వానంద తిరువేంకటాధిప ॥ ఏని ॥ 35

---

౧ 'నీ-జము గెలుచు బ్రహ్మవిజ్ఞానంబు కొఱకు' అ పూ ము పా

౨, ౩ పునరుక్తి ఇట్టి వక్కడక్కడ గలవు.

6 రేకు ధన్నాసి

వైష్ణవులుగానివార లెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁ గాన ॥ పల్లవి ॥

అంతయు విష్ణు౧మయం బట మరి దేవ-
తాంతరములు గలవననేలా
భ్రాంతిఁ బొంది౨ యీ భావము భావించి-
నంతనే పుణ్యులవుట దప్పదుగాన ॥ వైష్ణ ॥

యెవ్వరిఁ గొలిచిన నేమిగొరఁత మరి
యెవ్వరిఁ దలఁచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరిరూపుగానివా-
రెవ్వరు లే రని యెరుకదోఁచినఁ జాలు ॥ వైష్ణ ॥

అతిచంచలంబైనయాతుమ గలిగించు-
కతమున బహుచిత్తగతులై
యితరులఁ గొలిచిన యెడయక యనాథ-
పతితిరువేంకటపతి చేకొనుఁగాక ॥ వైష్ణ ॥ 36

శ్రీరాగం

మనసిజగురుఁ డితఁడో మఱియుఁ గలఁడో వేద-
వినుతుఁ డితఁడుగాక వేరొకఁడు గలఁడో ॥ పల్లవి ॥

అందరికి నితఁడెపో అంతరాత్ముఁ డనుచు-
నందు రితఁడో మఱియు నవల నొకఁడో
నందకధరుఁడు జగన్నాథుఁ డచ్యుతుఁడు గో-
విందుఁ డితఁడుగాక వేరొకఁడు గలఁడో ॥ మన ॥

---

౧. 'మయఁబట' అని రేకు ౨. 'యేభావ' పూ. ము. పా. రేకు.

తనర నిందరికిఁ౧ జైతన్యమొసఁగినయాతఁ-
డౌనర నితఁడో మఱియు నొకఁడు గలఁడో
దినకరశతతేజుఁడగు దేవదేవుఁడు, త-
ద్వినుతుఁ డితఁడుగాక వేఱొకఁడు గలఁడో ॥ మన ॥

పంకజభవాదులకుఁ బరదైవ మితఁడని
అంకింతు రితఁడో అధికుఁడొకఁడో
శాంకరీస్తోత్రములు సతతమును గైకొనెడి-
వేంకటవిభుఁడో కాక వేరొకఁడు గలఁడో ॥ మన ॥ 37

భూపాళం

ఇప్పు డిటు కలగంటి నెల్లలోకములకు -
నప్పఁడగుతిరువేంకటాద్రీశుఁ గంటి ॥ పల్లవి ॥

౨ అతిశయంబైనశేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేనిగోపురప్రభలు గంటి
శతకోటిసూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడగంటి చయ్యన మేలుకంటి ॥ ఇప్పు ॥

కనకరత్నకవాటకాంతు లిరుగడఁ గంటి
ఘనమైనదీపసంఘములు గంటి
అనుపమమణిమయమగుకిరీటము గంటి
కనకాంబరము గంటి గక్కన మేలుకంటి ॥ ఇప్పు ॥

అరుదైనశంఖచక్రాదు లిరుగడఁ గంటి
సరిలేనిఅభయహస్త౩ము గంటిని
తిరువేంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి ॥ ఇప్పు ॥ 38

---

౧ 'జేతన్య' అని రేకు ౨ 'అతిశయఁబైన' అని రేకు.
౩ 'స్తమును గంటి' అని యుండవచ్చు. మొదటినుండి అనుక్రమ మట్లే యున్న

బౌళి

తీపనుచు చేఁదు తెగఁదిని వెనకఁ బదరాని -
ఆపదలచేతఁ బొరలాడేము[౧]గాన ॥ పల్లవి ॥

అప్పుదీరినదాఁకా నలవోకకైనవా -
రెప్పుడునుఁ దమవార లేలౌదురు
అప్పటప్పటికిఁ బ్రియ మనుభవింపుచు మమత
చెప్పినటువలెఁ దాము సేయవలెఁగాక ॥ తీప ॥

పొందైనవారమని పొద్దు[౨]వోకకుఁ దిరుగు -
యిందరునుఁ దమవార లేలౌదురు
కందువగుతమకార్యగతులు దీరినదాఁక
సందడింపుచుఁ బ్రియము జరపవలెఁగాక ॥ తీప ॥

తెగనికర్మము దమ్ముఁ దిప్పుకొని తిరిగాడ
అగడుకోరిచి పెక్కులాడ నేమిటికి
తగువేంకటేశ్వరునిఁ దలఁచి యిన్నిటాఁ దాము
విగతభయులయి భ్రాంతి విడువవలెఁగాక. ॥ తీప ॥ 39

శ్రీరాగం

అదిగాక నిజమతం బదిగాక యాజకం -
బదిగాక హృదయసుఖ మదిగాక పరము ॥ పల్లవి ॥

అమలమగువిజ్ఞానమనుమహాధ్వరమునకు -
నమరినది సంకల్పమనుమహాపశువు
ప్రమదమనుయూపగంబమున విశసింపించి
[౩]విమలేందు(ద్రి?)యాహుతులు వేల్పంగవలదా ॥ అది ॥

౧. 'గాక' కావచ్చు. ౨ 'పోఁదైవ' అనిరేకు - ౩ పూము. పరిష్కర్తలు వివరణములందింతట ఇట్లు చూపియుండిన చాలబాగుండెడిది.

అరయ నిర్మమకార మాచార్యుఁడై చెలఁగ
వరుసతో ధర్మదేవత బ్రహ్మ గాఁగ
దొరకొన్న శమదమాదులు దానధైర్యభా –
స్వరగుణాదులు విప్రసమితి గావలదా ॥ అది ॥

తిరువేంకటాచలాధిపునిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతనికృపాపరిపూర్ణజలధిలో
నరుహులై యవబృథం౧బాడఁగవలదా ॥ అది ॥ 40

శంకరాభరణం

తలపోఁత ౨బాఁతె తలఁపులకుఁ దమ –
కొలఁదెఱంగనిమతి గోడాడఁగా ॥ పల్లవి ॥

ఆపదలు బాఁతె అందరికినిఁ దమ –
చాపలపుసంపదలు సడిఁబెట్టఁగా
పాపములు బాఁతె ప్రాణులకును మతిఁ
బాపరానియాస దమ్ముఁ బాధించఁగా ॥ తల ॥

జగడాలు బాఁతె జనులకునుఁ దమ –
పగలైనకోపాలు పైకొనఁగా
వగలు బాఁతె వలలఁబెట్టెడి తమ్ముఁ ॥ తల ॥
దగిలించు మమత వేదనముసేయఁగా

భయములు బాఁతె పరులకును తమ –
దయలేక అలయించుధనముండఁగా
జయములు బాఁతె సతతమును యింత –
నయగారివేంకటనాధుఁ డుండఁగాను ॥ తల ॥ 41

---

౧. 'బాడఁగ,' అనిరేకు ౨ 'బ్రాఁతె' అని పూ ము. పా రేకువందంతటా 'బాఁతే' గలదు. ఈ వాఙ్మయమునందంతటను ఈవద మిటే రేకులలో నున్నది.

7 రేకు ధన్నాసి

పుట్టుగు లమ్మే భువిఁ గొనరో
జట్టికిని హింసలే మీధనము ॥ పల్లవి ॥

ఆపద లంగడి నమ్మేఁ గొనరో
పాపాత్ములు పై పయిఁ బడకా
కైపులఁ బుణ్యులఁగని కోపించే –
చూపులు మీ కివి సులభపుధనము ॥ పుట్టు ॥

కడుఁగుంభీపాతకంబులు గొనరో
బడిబడి నమ్మేఁ బాలిండ్ల
తొడరుఁ బరస్త్రీద్రోహపుధనములె
ఒడవుబె మీ కివి దాఁచినధనము ॥ పుట్టు ॥

లంపుల చండాలత్వము గొనరో
గంపలనమ్మేఁ గలియుగము
రంపపువేంకటరమణునికథ విన –
నింపగు వారికి ౦ని దేధనము ॥ పుట్టు ॥ 42

లలిత

అప్పుడువో నినుఁ గొలువఁగ నరుహము గలుగుట ప్రాణికి
కప్పినదియుఁ గప్పనిదియుఁ గనుఁగొనఁగలనాఁడు ॥పల్లవి॥

ఆపదలకు సంపదలకు నడ్డముచెప్పనినాఁడు
పాపములకు పుణ్యములకుఁ బనిదొలఁగినవాఁడు
కోపములకు శాంతములకుఁ గూటమి మానిననాఁడు
లోపల వెలుపల తనమతిలోఁ దెలిసిననాఁడు ॥ అప్పు ॥

---

౦ ఇది + ఏధనము

తనవారలఁ బెరవారలఁ దాఁ దెలిసిననాఁడు
మనసునఁ జైతన్యంబును మఱపందిననాఁడు
పనివడి తిరువేంకటగిరిపతి నీదాసులదాసుల
గనఁగొని నీభావముగాఁ గనువిచ్చిననాఁడు ॥ అప్పు ॥ 43

సామంతం

కొలువుఁడీ భక్తిఁ గొండలకోనేటి-
నిలయుని శ్రీనిధి యైనవాని ॥ పల్లవి ॥

ఆదిదేవుని నభవుని సామ-
వేదనాదవినోదుని నెర-
వాది జితప్రియు నిర్మలతత్త్వ-
వాదులజీవనమైనవాని ॥ కొలు ॥

దేవదేవుఁడైనదివ్యుని సర్వ-
భావాతీతస్వభావుని
శ్రీవేంకటగిరిదేవుఁడైనపర-
దేవుని భూదేవతత్పరుని ॥ కొలు ॥ 44

లలిత

మంచిదివో సంసారము మదమత్సరములు మానిన
కంచునుఁ బెంచును నొకసరిం గాఁ దా చూచినను ॥ పల్లవి ॥

ఆపదలకు సంపదలకు నభిమానింపకయుండిన
పాపముఁ బుణ్యము సంకల్పములని తెలిసినను
కోపము శాంతము తమతమగుణములుగా భావించిన
తాపము శైత్యమునకుఁ దాఁ దడఁబడకుండినను ॥ మంచి ॥

ం "గాదా చూచినను" అని రేకు

వెలియును లోపలయును నొకవిధమై హృదయం బుండిన
పలుకునుఁబంతము దా నొక భావన దోఁచినను
తలఁపునఁ దిరువేంకటగిరిదైవము నెలకొనియుండిన
సొలపక యిన్నిటికినిఁ దా ౦సోఁకోరుచెనైనా ॥మంచి॥ 45

లలిత

మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మునకు ధర్మస్వరూపునకూ, జయజయ ॥పల్లవి॥

ఆదికినినాదైనదేవున కచ్యుతున కంభోజనాభున-
కాదికూర్మంబైనజగదాధారమూర్తికిని
వేదరక్షకునకును సంతతవేదమార్గవిహారునకు బలి-
భేదికిని సామాదిగానప్రియవిహారునకు ॥మంగ॥

హరికిఁ బరమేశ్వరునకును శ్రీధరునకును గాలాంతకునకును
పరమపురుషోత్తమునకును బహుబంధదూరునకు
సురమునిస్తోత్రునకు దేవాసురగణశ్రేష్ఠునకు కరుణా-
కరునకునుఁ గాత్యాయనీనుతకలితనామునకు ॥మంగ॥

పంకజాసనవరదునకు భవపంకవిచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు
వేఁకటాచలవల్లభునకును విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభకుంకుమపంకలోలునకు ॥మంగ॥ 46

సామంతం

పాయని ౨కర్మంబులె కడుబలవంతము లనినప్పుడె
కాయమునకు జీవునకునుఁ ౩గర్తృత్వము లేదు ॥పల్లవి॥

౦. సోఁకు ఓరుచుటచేతనైనా అని అర్థము కాబోలు. ౨. 'కర్మఁబులె' అని రేకు, కర్మములే' అని పూ ము. పా ౩ 'గర్తత్వము' అని రేకు

ఆతుమ సకలవ్యాపకమని తలపోసినపిమ్మట
జాతియుఁ గులాభిమానముఁ జర్చింపనెరాదు
ధాతువికారములన్నియుఁ బురుషోత్తముఁ డనినప్పుడు
పాతకములపుణ్యంబులపని తనకే లేదు ॥ పాయ ॥

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచినఁ మొక్కకపోరాదు
కదిసినయిప్పటిసుఖములె కడుదుఃఖములని తెలిసిన
చెదరక సంసారమునకుఁ జేసాఁపనెరాదు ॥ పాయ ॥

పరిపూర్ణుఁడు తిరువేంకటపతియనఁగా వినినప్పుడు
యెరవులహీనాధికములు యెగ్గులు మరి లేవు
పరమాత్ముండగునీతనిభక్తులం దలఁచినయప్పుడు
తిరముగ నీతనికంటెను దేవుఁడు మరి లేఁడు ॥ పాయ ॥ 47

బౌళి

ఏడ౦సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో హోమమై పోయఁ గాలము. ॥ పల్లవి ॥

ఇదె మేలయ్యీడి నా కదె మేలయ్యీడి నని
కదిసినయాసచేఁ గడవలేక
యెదురుచూచి చూచి ౨యెలయించి యెలయించి
పొదచాటుమృగమై పోయఁ గాలము ॥ ఏడ ॥

ఇంతటఁ దీరెడి దుఃఖ మంతటఁ దీరెడినని
వింతవింతవగలచే వేఁగివేఁగి
చింతయు వేదనలఁ జిక్కువడుచు నగ్ని—
పొంతనున్నవెన్నయై పోయఁ గాలము ॥ ఏడ ॥

---

౦ 'సుగ్నాన' అనిరేకు ౨. 'యెలఇంచి యెలఇంచి' అనిరేకు.

యిక్కడ సుఖము నా కక్కడ సుఖంబని
యెక్కడికైనా నూర కేఁగియేఁగి
గక్కన శ్రీతిరువేంకటపతిఁ గానక
పుక్కిటిపురాణమయి పోయఁ గాలము ॥ఏడ॥ 48

8 రేకు గుండక్రియ

కొనుట వెగ్గళము దాఁ దినుట యల్పము, మీఁదు-
౦గనుట వినుట లేక దా కడచన్నభవము ॥పల్లవి॥

ఆపద వడ్డికినిచ్చి అనుభవింపఁబోయిన
యేపున నెవ్వరికి నిం దేమిగలదు
పాపపుపైరువిత్తినపండినపంటలలోన
రూపింపఁగ నిందు రుచి యేమిగలదూ ॥కొను॥

ఘనుఁడైనతిరువేంకటనాథుఁ డిన్నిటికి-
యును భోక్తయుఁ గర్మియును నైనవాఁడు
పనిలేదు నిష్ఠూరపరుఁడు దానై వుండు
తనకుఁదానె కర్తతనమౌటఁ గాన ॥కొను॥ 49

ఆహిరి

జీవాతుమై యుండుచిలుకా నీ-
వావలికి అ పరమాత్ముఁడై యుండుచిలుకా ॥పల్లవి॥

ఆతుమపంజరములోన నయమున నుండి నా-
చేతనే పెరిగినచిలుకా
జాతిగాఁ గర్మపుసంకెళ్లఁబడి కాలఁ
జేతఁ బేదైతివే చిలుకా ॥జీవా॥

---
౦ 'గనుట వినుటలే కదా' అని పూ ము పా అ. 'వావలికిఁ బర' అని పూ.ము.పా

ఖాతిగాఁ జదువులు పగలురేలును నా -
చేత నేరిచినట్టిచిలుకా
రీతిగా దేహంపురెక్కలచాటున నుండి
సీతుకోరువలేనిచిలుకా ॥ జీవా ॥

బెదరి ౧అయిదుగురికిని భీతిఁబొందుచుఁ గడుఁ-
౨బెదరఁగఁ జూతువే చిలుకా
అదయు౩లయ్యినశత్రులారుగురికిఁగాక
అడిచిపడుదువే నీవు చిలుకా

వదల కిటు ౪యాహారవాంఛ నటు పదివేల-
వదరులు వదరేటిచిలుకా
తుదలేనివిమమతలు తోరమ్ముసేసి నా-
తోఁగూడి మెలగినచిలుకా ॥ జీవా ॥

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవే నేనై యుందుఁ జిలుకా
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి
సేవించు ౫కొని గట్టిచిలుకా

దైవమానుషములు తలఁపించి యెపుడు నా -
తలఁపునఁబాయనిచిలుకా
యేవియును నిజముగా నివి యేఁటికవి నాకు
నెఱిఁగించి నటువంటి చిలుకా౬ ॥ జీవా ॥ 50

౧. యైదుగురికిని' అని పూ ము పా
౨. 'జెదరంగ' అని పూ ముపా
౩. 'శైవ' పూ.ము.పా
౪. 'లాహార' అని పూ. ము. పా. ౫ 'కొను' లేక 'కొమవట్టి' కావచ్చు.
౬. ఇది పెద్దపాట. దీనిలో ప్రతిచరణము రెండువంక్తులకొకపాదముగ గుర్తింపవలెను. తొలిచరణము నాలుగువంక్తులకే 'జీవా' అను పల్లవి గ్రహణము పొరపాటుగ పడినది.

ముఖారి

నదులొల్లవు నాస్నానము కడు-
సదరము నా కీస్నానము ॥ పల్లవి ॥

ఇరువంకల ౧నీయేచినముద్రలు
ధరియించుటె నాస్నానము
ధరపై నీనిజదాసులదాసుల-
చరణధూళి నాస్నానము ॥ నదు ॥

తలఁపులోన నినుఁదలఁచినవారలఁ
దలఁచుటే నాస్నానము
వలనుగ నినుఁగనువారలశ్రీపాద-
జలములే నాస్నానము ॥ నదు ॥

పరమభాగవతపాదాంబుజముల-
దరుశనమే నాస్నానము
తిరువేంకటగిరిదేవ నీకథా-
స్మరణమే నాస్నానము ॥ నదు ॥ 51

శ్రీరాగం

చాలదా హరినామసౌఖ్యామృతము దమకు
చాలదా హితవైనచవులెల్ల నొసఁగ ॥ పల్లవి ॥

ఇది యొకటి హరినామ మింతైనఁ జాలదా
చెదర కీజన్మములచెఱలువిడిపించ
మదినొకటె హరినామమంత్ర మది చాలదా
పదివేలునరకకూపముల వెడలించ ॥ చాల ॥

౧. 'నీవేచిన' అని పూ ము. పా.

కలదొకటి హరినామకనకాద్రి చాలదా
తొలఁగుమని దారిద్ర్యదోషంబు చెఱుప
తెలివొకటి హరినామదీప మది చాలదా
౧కలుషంపుకరినచీఁకటి పారఁద్రోల ॥ చాల ॥

తగువేంకటేశుకీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబువలెనుండ
సొగిసి యీవిభునిదాసులకరుణ చాలదా
నగవుఁజూపులను నున్నత మెపుడుఁ జూప ॥ చాల ॥ 52

## శ్రీరాగం

వందే వాసుదేవం
బృందారకాధీశవందితపదాబ్జం ॥ పల్లవి ॥

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ-
చందనాంకితలసచ్చారుదేహం
మందారమాలికామకుటసంశోభితం
కందర్పజనక మరవిందనాభం ॥ వందే ॥

ధగధగితకౌస్తుభా ౨ధరణ ౩వక్షస్థలం
ఖగరాజవాహనం కమలనయనం
౪నిగమాధిసేవితం నిజరూపశేషప-
న్నగరాజశాయినం ౫ఘననివాసం ॥ వందే ॥

---

౧. కలుషంపుఁ గరిన, చివ్వగురులో గటిక? అని మూ.ము.పా. 'కరినచీఁకటి'కి, 'కటికచీఁకటి' అనునవరింపు మంచిదే. కరినచీఁకటివంటివిరుద్ధసమాసములు వింతపదప్రయోగములు, ఈ వాఙ్మయమునకు క్రొత్తలుకావు. ౨. 'దరణ' కావచ్చు. ౩. వక్షస్స్థలం అని మూ.ము.పా. ౪. 'నిగమాదిసేవితం' కావచ్చు. ఆదిశబ్దముచేత ఉపనిషచ్ఛాస్త్రపురాణములు సేవించినట్లు. ౫. 'నగ' కావచ్చు. కానిచో యతిభంగమగునేమో.?

౧ కరిపురనాథసంరక్షణే తత్పరం
కరిరాజవరదసంగతకరాబ్జం
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలా ౨దేవం భజే ॥ వందే ॥ 53

భూపాళం

నీకథామృతము నిరతసేవన నాకు
చేకొనుట సకలసంసేవనం బటుగాన ॥ పల్లవి ॥

ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు-
నిదియె వేదసంహితపాఠము
యిదియెబహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు -
నిదియె సంధ్య నా కిదియ జప మటుగాన ॥ నీక ॥

యిదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు-
నిదియె దుఃఖవిరహితమార్గము
యిదియె భవరోగహితభేషజము నాకు-
నిదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన ॥ నీక ॥

యిదియె దానఫల మీఁజాలినది నాకు
యిదియె తలఁపఁ బరహితకర్మము
యిదియె తిరువేంకటేశ నీసంస్మరణ-
మిదియె యిదియె ఇన్నియును నటుగాన ॥ నీక ॥ 54

9 రేకు సామంతం

౩ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినంతేకాని లేదు
తాము సేసినంత ౪వట్టు తమకుఁ బోరాదు ॥ పల్లవి ॥

౧ కృష్ణరాయబారము ఉద్దేశింపబడినదా? లేక 'కరిపురనాథ' శబ్దముతో అర్జునుడో పాండవులో ఉద్దేశింపబడిరా? ౨. 'ధీశం' కావచ్చు. ౩. ఇందు దశావతార సమన్వయము కలదు. ౪. వట్టుఁ దమకు అని మూ. ము-పా.

ఇట్టునట్టు మిట్టిపడ్డ యించుకంతా లేదు, వీఁపు
బట్టగట్ట మోపు మోఁచి పాటువడ్డా లేదు
తట్టువడ లోకమెల్లఁ ౧దవ్వుకొనినా లేదు
తెట్టఁదెరువున నోరుదెరచినా లేదు ॥ ఏమి ॥

అడిగి పరులబడు కాసపడ్డా లేదు, భీతి
విడిచి నెత్తుటఁదోఁగి వీరుఁడైనా లేదు
అడవులెల్లాఁ దిరిగి అలమటించిన లేదు
యిడుమపాటుకుఁ జొచ్చి యియ్యకొన్నా లేదు

వచ్చివచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చులగుఱ్ఱము నెక్కి మెరసినా లేదు
యెచ్చరికఁ దిరువేంకటేశుఁ గొలువక వుంటే
యిచ్చటనచ్చట సుఖ మించుకంతా లేదు ॥ ఏమి ॥ 55

ముఖారి

౨నగుఁబాట్లఁబడేనాజిహ్వ
పగటున నిదివో పావనమాయ ॥ పల్లవి ॥

ఇల నిందరి నుతియించి పెంచువలె
నలినలియైవది నాజిహ్వ
నలినోదరుశ్రీనామము దలఁచిన-
ఫలమున కిదివో పావనమాయ ॥ నగు ॥

భ్రమఁబడి మాయపుపడఁతులతమ్మలు
నమలి చవులుగొనె నాజిహ్వ
అమరవంద్యుఁడగుహరి నుతియించఁగ
ప్రమదము చవిగొని పావనమాయ ॥ నగు ॥

---

౧ 'దవ్వ' అని వ్రా ము పా. ౨ 'నగుఁబాట్లఁ బడెవా జిహ్వ' అని వ్రా ము.పా.

నెలఁతలపలుయోనిద్రవనదులను
నలుగడ౧ నీఁదెను నాజిహ్వ
అలసి వేంకటనగాధిపయనుచును
పలికినయంతనె పావనమాయ ॥నగ॥ 56

శ్రీరాగం, యేకతాళి

విడుమనవో రోలు విడుమనవో వేగ
విడుమనవో తల్లి వెఱచీ౨ నీబాలుడు ॥పల్లవి॥

యెన్నఁడు గొల్లెతలయిండ్లు వేమాఱుఁ జొచ్చి
వెన్నలుఁ బాలును ౩వెఱఁజఁడు
వన్నెలనీకోప మింత వద్దు నీకు ౪నీయాన
కన్నులనవ్వుల ముద్దుగారీ నీబాలుడు ॥విడు॥

సారెకు పెరుగులచాడెలూ నేఁడుమొదలూ
గోరమై కోలలఁ బగులమొత్తేఁడు
కూరిమిలేక నీవు కోపగించఁగాఁ గన్నీరు
జా[illegible]నా రాలఁగా నిన్నే చూచీ నీబాలుఁడు ॥విడు॥

చాలు నీకోప మిది సరిలేనిమద్దులివి
రోలనే౫యిట్లను విరుగఁద్రోయఁడు
మేలిమివేంకటపతి మేఁటినీకొమారుఁ డిదె
కేలెత్తి నీకు మ్రొక్కీడి నిదె బాలుఁడు ॥విడు॥ 57

౧. 'వింటెను' అని పూ. ము. పా. ౨. 'వెఱచీని+ఈబాలుఁ'డు' అంతటా ఇంతే.
౩. 'వెఱఁజండు' అని పూ. ము. పా.
౪. 'నియ్యాన'రేఫ. 'నీ+ఆన' ఇదియొక వింతత్రిక సంధి. ఈ వాఙ్మయమున అక్కడక్కడ గలదు. ౫. 'పీట్లను' కావచ్చు.

భైరవి-రచ్చెతాళం

పట్టవసముగానిబాలుఁడా పెనుఁ-
బట్టపుబలువుఁడ బాలుఁడా ॥ పల్లవి ॥

ఇరుగడ బ్రహ్మయు నీశ్వరుఁడును నిన్ను
సరుస నుతింప జఠరమున
అరుదుగ నుండి ప్రియంబున వెదలిన-
పరమమూర్తివా బాలుఁడా ॥ పట్ట ॥

తల్లియుఁ దండ్రియుఁ దనియనిముదమున
వెల్లిగ లోలో వెఱవఁగను
కల్లనిదురతోఁ గనుమూసుక రే-
పల్లెలోఁబెరిగినబాలుఁడా ॥ పట్ట ॥

యేదెసఁ జూచిన నిందరిభయముల-
సేదలు దేఱఁగఁ జెలఁగుచును
వేదపల్లవపువేంకటగిరిపై
పాదముమోపినబాలుఁడా ॥ పట్ట ॥ 58

**ఆహిరి**

మదమత్సరము లేక మనసుపేదై పో
ం పదరినయాసలవాఁడువో వైష్ణవుఁడు ॥ పల్లవి ॥

ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి
యెట్టివారినైనా దూరి యెవ్వరినైనఁ జేరి
వట్టియాసలఁబడనివాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥

---

ం. 'వదలిన' కావచ్చు. అక్షరములు సందిగ్ధముగనున్నవి.

గడనకొఱకుఁ జిక్కి కాముకవిద్యలఁ జొక్కి
నిడివి నేమైనాఁ గని నిక్కినిక్కి
వొడలిగుణముతోడ వుదుటువిద్యలఁ జాల
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥

ఆపల వొరులఁ జెడనాడఁగ వినివిని
¹చేవమీఱి యెవ్వరినిఁ జెడనాడక
కోవిదు శ్రీవేంకటేశుఁ గొలిచి పెద్దలకృప
వావివర్తనగలవాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥ 59

సామంతం

ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే
వేదవిరహితులకు వెఱతు మటుగాన ॥ పల్లవి ॥

ఇరవుకొని రూపంబులిన్నిటానుఁ గలనిన్నుఁ
బరికించవలెఁగాని భజియింపరాదు
గరిమచెడి ²సత్సమాగంబు విడిచిన నీ-
స్మరణవిజ్ఞానవాసన గాదుగాన ॥ ఏది ॥

యిహదేవతాప్రభలనెల్ల వెలుఁగుట నీకు
సహజమనవలెఁగాని సరిఁ గొలువరాదు
అహిమాంశుకిరణంబు లన్నిచోట్లఁ బరగు
గ్రహియింపరా దవగ్రాహములుగాన ॥ ఏది ॥

యింతయునుఁ దిరువేంకటేశ నీవునికిఁ దగఁ
జింతింపవలెఁగాని సేవింపరాదు
అంతయు ³ననరుహమును నరుహంబనఁగరాదు
అంతవానికిఁ బరుల కలవడదుగాన ॥ ఏది ॥ 60

---

౧. 'చావ' అనిరేకు యతిభంగము ౨. 'సత్సమాగమము' అని పూ. ము. పా
౩. 'అనర్హ', 'అర్హ' అని. పూ. ము. పా

10 రేకు శంకరాభరణం

పదిలము కోట పగవారు
అదనఁ గాచుకొందు రాఱుగురు ॥ పల్లవి ॥

ఇమ్మైఁ జెప్ప యిందరిచేత
తొమ్మిదినెల్లఁ దోఁగినది
కొమ్మతీరునఁ గుదురైనకోట
దొమ్మికాండ్లైదుగు రుందురు ॥ పది ॥

వొంటికాఁడు రాజు వుడుగక తమలోన
౧వొంటనీనిమంత్రు లొకయిద్దరు
దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు-
బంటు లేడుగురు బలవంతులు ॥ పది ॥

కలవు తొమ్మిది ౨కనుమల తంత్రము
నిలుపఁగలిగినట్టినెరవాదులు
తెలిసి కొనేటితిమ్మనాయుఁడు చొచ్చె
బలిసె యీకోట భయమేల ॥ పది ॥ 61

సామంతం

ఎంతచదివిన నేమివినిన తన-
చింత యేల మాను సిరులేల కలుగు ॥ పల్లవి ॥

ఇతరదూషణములు యెడసినఁగాక
అతికాముకుఁడుగానియప్పుడు గాక
మతిచంచలము గొంత మానినఁగాక
గతి యేల కలుగు దుర్గతులేల మాను ॥ ఎంత ॥

౧ 'ఒంటరి నీమంత్రు' అని పూ. ము. పా. ౨ 'కనుమలు' తంత్రము — కావచ్చునేమో? నెరవాదులు కనుమలకు విశేషణము?

పరధనములయాస పాసినఁగాక
అరిదినిందలులేనియప్పుడు గాక
విరసవర్తనము విడిచినఁగాక
పరమేల కలుగు నాపదలేల మాను ॥ ఎంత ॥

వేంకటపతి నాత్మ వెదకినఁగాక
కింక మనసునఁ దొలఁగినఁగాక
బొంకుమాట లెడసిపోయినఁగాక
శంక [1]యాల మాను జయమేల కలుగు ॥ ఎంత ॥ 62

సామంతం

కాలవిశేషమో లోకముగతియో సన్మార్గంబుల -
కీలు వదలె సౌజన్యము కిందయిపోయినది ॥ పల్లవి ॥

ఇందెక్కడిసంసారం, బేదెసఁ జూచిన ధర్మము
కందయినది, విజ్ఞానము కడకుఁ దొలంగినది,
గొందులు [2]దరిఁబడె, శాంతము కొంచెంబాయ, వివేకము
మందుకు వెదకినఁ గానము మంచితనంపుఁబనులు ॥ కాల ॥

మఱి యిఁక నేఁటివిచారము, మాలిన్యంబై పోయిన-
[3]వెఱుకలు, సంతోషమునకు నెడమే లేదాయ,
కొఱమాలెను నిజమంతయు, కొండలకేఁగెను సత్యము,
మఱఁగై పోయను వినుకులు, మతిమాలెను తెలివి ॥ కాల ॥

తమకిఁక నెక్కడిబ్రదుకులు, తడఁబడె నాచారంబులు,
సమమైపోయిన వప్పుడె జాతివిడంబములు,
తిమిరంబింతయుఁ బాపఁగఁ దిరువేంకటగిరిలక్ష్మీ -
రమణుఁడు గతిదప్పను కలరచనేమియు లేదు ॥ కాల ॥ 63

౧. 'యేల' అని పూ. ము. పా. ౨. 'దరెఁబడె' అనిరేకు. ౩. 'వెఱుకలు' అని పూ. ము. పా. యతిభంగము

## శ్రీరాగం

ఈ విశ్వాసంబు యెవ్వరికిఁ దోఁప దిది
పావనులహృదయమునఁ బ్రభవించుఁగాని ॥ పల్లవి ॥

ఇమ్మయినపాపంబు లెన్నివలసినఁ బ్రాణి
సమ్మతంబునఁ జేయఁజాలుఁగాకేమి
కుమ్మరికి నొకయేఁడు గుదియ కొకనాఁడవును
నమ్మి తలఁచినవిష్ణునామంబుచేత ॥ ఈవి ॥

కొదలేనిదురితములు ౧కొండలునుఁ గోట్లును
చెదర కెప్పుడుఁ బ్రాణి చేయుఁగాకేమి
పొదరి గొరియలలోన పులిచొచ్చినట్లౌను
హృదయంబు హరిమీఁద నుండినంతటను ॥ ఈవి ॥

సరిలేనిదుష్కర్మసంఘములు రాసులై
పెరుగఁజేయుచు ప్రాణి పెంచుఁగాకేమి ?
బెరసి కొండలమీఁదఁ బిడుగువడ్డట్లౌను
తిరువేంకటాచలాధిపునిఁ దలఁచినను ॥ ఈవి ॥ ౬4

## కన్నడగౌళ

తనకర్మవశం బింతక, దైవకృతం బొకయింతక,
మనసువికారం బింతక, మానదు ప్రాణులకు ॥ పల్లవి ॥

ఈదైన్యము లీహైన్యము లీచిత్తవికారంబులు
యీదురవస్థలు గతులును యీలంపటములును
యీదాహము లీదేహము లీయనుబంధంబులు మరి
యీదేహముగలకాలము యెడయవు ప్రాణులకు ॥ తన ॥

౧. 'కొండలుఁగోట్లును' అని పూ. ము. పా.

యీచూపులు యీతీపులు నీనగవులు నీతగవులు-
నీచొక్కులు నీపొక్కులు నీవెడయలుకలును
యీచెలుములు నీబలువులు నీచనవులు నీఘనతలు-
నీచిత్తముగలకాలము యెడయవు ప్రాణులకు ॥ తన ॥

యీవెరవులు నీయెరుకలు యీతలఁపులు నీతెలువులు-
దైవశిఖామణితిరుమలదేవునిమన్ననలు
దైవికమున కిటువగవక తనతలఁ పగ్గలమైనను
దైవము తానౌ తానే దైవంబవుఁగాన ॥ తన ॥ 65

శ్రీరాగం

ఈపాదమేకదా యిలయెల్లఁ గొలచినది
యీపాదమేకదా ఇందిరాహస్తముల కితవైనది ॥ పల్లవి ॥

ఈపాదమేకదా ఇందరును మ్రొక్కెడిది
యీపాదమేకదా యీగగనగంగ పుట్టినది
యీపాదమేకదా యెలమిఁ బెంపొందినది
యీపాదమేకదా యిన్నిటికి నెక్కుడైనది ॥ ఈపా ॥

యీపాదమేకదా యిభరాజు దలఁచినది
యీపాదమేకదా యింద్రాదులెల్ల వెదకినది
యీపాదమేకదా యీబ్రహ్మ గడిగినది
యీపాదమేగదా యెగసి బ్రహ్మాండమంటినది ॥ ఈపా ॥

యీపాదమేకదా యిహపరము లొసగెడిది
యీపాదమేకదా ఇల నహల్యకుఁ గోరికైనది
యీపాదమేకదా యీక్షింప దుర్లభము
యీపాదమేకదా యీవేంకటాద్రిపై నిరవైనది ॥ ఈపా ॥ 66

11 రేకు ఆహిరి

అలరఁ జంచలమైనఆత్మలందుండ నీ-
యలవాటు సేసె నీవుయ్యాల
పలుమారు ౧నుచ్ఛ్వాసపవనమందుండ నీ-
భావంబు దెలిపె నీవుయ్యాల ॥ పల్లవి ॥

ఉదయాస్త శైలంబు లొనరఁ గంభములైన-
వుడుమండలము మోఁచె నుయ్యాల
అదన నాకాశపద మడ్డదూలంబైన
అఖిలంబు నిండె నీవుయ్యాల
పదిలముగ వేదములు బంగారుచేరులై
పట్టె వెరపై తోఁచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవతపీఠమై మిగుల
వర్ణింప నరుదాయ నుయ్యాల ॥ అల ॥

మేలుకట్లయి మీకు మేఘమండలమెల్ల
మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాల
నీలశైలమువంటినీమేనికాంతికిని
నీలమైనతొడవాయ నుయ్యాల
పాలిండ్లు గదలఁగాఁ బయ్యదలు రాఁపాడ
భామినులు వడినూఁచునుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరగునోయని భీతి-
నొయ్యనొయ్యన వూఁచి రుయ్యాల ॥ అల ॥

కమలకును భూసతికి కదలుకదలుకు మిమ్ముఁ
గౌఁగిలింపఁగఁజేసె నుయ్యాల

౧ 'నుశ్వాస' అని రేకు 'ఉయ్యాల' పదము రేకు నిండంతటా 'ఉయ్యాలా' అనియే వున్నది.

అమరాంగనలకు నీహావభావవిలాస
మందంద చూపె నీవుయ్యాల
కమలాసనాదులకుఁ గన్నులకు పండుగై
గణుతింప నరుదాయ నుయ్యాల
ంకమనీయమూర్తి వేంకటశైలపతి నీకు
కడువేడుకై వుండె నుయ్యాల ॥ అల ॥ 67

నాఁట

ఘోరవిదారణ నారసింహా నీ-
వీరూపముతో నెట్లుండితివో ॥ పల్లవి ॥

ఉడికెడికోపపుటూర్పులఁ గొండలు
పొడిపొడియై నభమునకెగయ
బెడిదపురవమున పిడుగులు దొరుగఁగ
యెడనెడ నీ వపు డెట్లుండితివో. ॥ ఘోర ॥

కాలానలములు గక్కుచు నయన-
జ్వాలల నిప్పులు చల్లుచును
ఖాలాతుమతో బ్రహ్మాండకోట్ల-
కేలికపై నీ వెట్లుం[1]డితివో. ॥ ఘోర ॥

గుటగుటరవములు కుత్తికఁ గులుకుచు
గిటగిటఁ బండ్లు గీఁటుచును
తటతటఁ బెదవులు దవడలు వణఁకఁగ
ఇటువలె నీ వపుడెట్లుండితివో ॥ ఘోర ॥

---

ం. 'కమనియ్య' అనిరేకు. నిదురేకు 11 లోని పాఠములు. 1, నాఁడెట్లుండి.

గోళ్ళమెఱుఁగుల కొంకులపెదపెద-
వేళ్ళ దిక్కులు వెదకుచును
నీళ్ళతీగెలు [2]నిగుడఁగ నోర ను-
చ్చిళ్ళ గమ్మఁగ [3]నెట్లుండితివో || ఘోర ||

హిరణ్యకశిపుని నేపడఁచి భయం-
కరరూపముతోఁ గడుమెరసి
తిరువేంకటగిరిదేవుఁడ [4]నీవిఁక
యిరవుకొన్నాఁ డెట్లుండితివో || ఘోర || 68

గౌళ

నేల మిన్ను నొక్కటైననీబంటు వొక్క-
వేలనే యక్షునిఁ దెగవేసెఁగా నీ బంటు. || పల్లవి ||

ఉంగరమెగరవేసి యుదధిలోఁ బడకుండ
నింగికిఁ జెయిచాఁచె నీబంటు
[2]చంగున జలధిదాఁటి జంబుమాలి నిలమీఁద
కుంగఁదొక్కి పదములఁ గుమ్మెఁగా నీబంటు || నేల ||

వెటగా రావణు రొమ్ము విరుగఁ జేతనే గుద్దె
నిట్టతాడుపంటివాఁడు నీబంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగఁ దెచ్చె బాపురే నీబంటు || నేల ||

---

నిడురేకు 11 లోనిపాఠములు 2 నిగిడి నోర. 3. గారఁగ. 4. డవై యిందిరవుకొంటి.
ఇందు 2,3 చరణములు వ్యత్యస్తముగాఁ గలవు. దీనిరాగము 'అహిరి' గా ఇందున్నది.
౧. 'నోరనుచ్చిళ్ళ' అని పూ ము. పా ౨. 'చంగవ' అని రేకు

అలర నన్నియుఁ జేసి అజునిపట్టానకు
నిలుచున్నాఁ డదివో నీబంటు
బలువేంకటేశ ఈ [1]పవననందనుఁడు
కలిగి లోకములెల్లఁ గాచెఁగా నీబంటు ॥నేల॥ 69

దేవగాంధారి

తలఁచినవిన్నియుఁ దనకొరకేఁ వెలిఁ
దెలియుట దనలోఁ దెలియుటకొరకే ॥పల్లవి॥

ఉదయమందుట భవముడుగుటకొరకే
చదువుట మేలువిచారించుకొరకే
బ్రదుకుట పురుషార్థపరుఁడౌటకొరకే
యెదిరిఁ గనుట తన్నెఱుఁగుటకొరకే ॥తలఁ॥

తగులుట విడివడఁదలఁచుటకొరకే
నొగులుట కర్మమనుభవించుకొరకే
చిగురౌట కొమ్మయి చెలఁగుటకొరకే
బెగడుట దురితము పెడఁబాయుకొరకే ॥తలఁ॥

యీవలఁ జేయుట ఆవలికొరకే
ఆవలనుండుట యీవలికొరకే
యీవలనావల నెనయఁ దిరుగుటెల్ల
శ్రీవేంకటేశ్వరుఁ జేరుటకొరకే ॥తలఁ॥ 70

కన్నడగౌళ

ఎంతసేసినా నెడయకే పోయ
ముంతలోనినీట మునిఁగిలేచుట ॥పల్లవి॥

పెదరేకు 2. 1. నీపవం

ఉట్టిపై చెరలాట మూరఁబొత్తులకూడు
పట్టుచాలనికొమ్ము(మ్మ?) బహునాయకము
వెట్టిమోపరిలాగు వెఱ్ఱివోయినపోక
నట్టింటివైరంబు నగుఁబాటుబ్రదుకు ॥ ఎంత ॥

రాకపోకలచేఁత ౧ఁగినపెనుఁబుండు
వాకులేనివరము వలవనివలపు
యేకాలము వేంకటేశునికృపలేక
ఆకడీకడ నడయాడెడినడపు ॥ ఎంత ॥ 71

12 రేకు బౌళి

పరదేశిపట్టణమున పదుగురునేగురుఁ గూడుక
పరగఁగ వరి చెడ నూదర బలిసినయట్లాయ. ॥ పల్లవి ॥

ఊరేలెడియతఁ డలసత నూరకయుండఁగ నడుముల-
వారలు నిక్కపుఁగర్తలవలె నుండినగతిని
ధీరత చెడి తను జీవుఁడు దెలియఁగనేరక[1] యుండిన
ధారుణిలోపల దొంగలధర్మాసనమాయ ॥ పర ॥

వొడలంతంతకుఁ జిక్కఁగ నుబ్బినరోగము సుఖమున-
కెడమియ్యక నానాఁటికి నేఁచినచందమున
తడఁబడువిజ్ఞానము గతిదప్పఁగ బలుపగుపట్నము
కడుఁజెడఁగా, మాలవాడ ఘనమైనట్లాయ ॥ పర ॥

పొసఁగఁగ నిది గని యధికుఁడు పుక్కటి[2]కాండ్ల నందరిఁ
బసమారిచి[3] మొదలికర్తఁ బాలించినగతిని
పసగలతిరువేంకటగిరిపతి నా హపుఁబురి నీ-
వసమై వెన్న(న్ను?)కుఁ బండ్లు వచ్చినయట్లాయ ॥ పర ॥ 72

విడురేకు 86 1. యుండఁగ 2. పుక్కటి. 3. మాలిచి.
౧. 'విజ్ఞానము' అని రేకు.

వరాళి

పోరా పోరా యమ్మలాల బొమ్మలాటవారము
యీరసాన మమ్ము నిట్టె యేమి సేసేరు ॥ పల్లవి ॥

ఊరులేనిపొలమేర పొడలుమోచుకొని నేము
తేరదేహ మెక్కుకొని తిరిగేము
వారువీరనుచు వట్టివావులు సేసుక లేని-
పేరుపెట్టుకొని లోలోఁ బిరువీకులయ్యేము ॥ పోరా ॥

బుద్ధిలేనిబుద్ధితోడ పొందుసేసుకొని వట్టి-
యెద్దుబండికంటెఁ[౧]సంది సీఁగేము
నిద్దురలో తెలివంటా నీడలోని [౨]యెండంటా
వుద్దువుద్దులై లేనివొద్దిక నున్నారము ॥ పోరా ॥

మాటులేనిమాటు దెచ్చి మరఁగువెట్టుక వట్టి-
మేటానమేట్లవలె మెరసేము
గాటమైనతిరువేంకటగిరినిలయుని-
నాటకమే నిజమని నమ్మిక నున్నారము ॥ పోరా ॥ 73

రామక్రియ

ఎవ్వఁడో కాని యెరఁగరాదు కడు-[1]
దవ్వులనే వుండు తలఁపులోనుండు ॥ పల్లవి ॥

ఎడయువు తనరెక్క తెగసిపోలేఁడు
కడు దాఁగుఁగాని దొంగయుఁ గాఁడు
వడిఁ గిందుపడును సేవకుఁడునుఁ గాఁడు
వెడఁగుగోళ్ళు వెంచు విటుఁడునుఁ గాఁడు ॥ ఎవ్వఁ ॥

---

విడురేకు 43. 1. కరుఁగడు. ౧. 'సంది' ఇది పూ. ము. న తప్పినది. రేకులో నున్నది. ౨. 'యండ' అని రేకు. ౩. ఇందు దశావతారసమన్వయము కలదు.

మిగులాఁ బొట్టివాఁడు మింటికినిఁ బొడవు
జగడాలు తపసివేషములును
మగువకై పోరాడు మరి విరక్తుఁడును
తగుఁగాఁపుఁబనులు నెంతయుఁ దెల్లఁదనము. ॥ ఎవ్వఁ ॥

తరుణుల వలపించు తగిలి పైకొనఁడు
తురగముఁ దోలు రౌతునుఁ గాఁడు
తిరువేంకటాద్రిపైఁ దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీఘనుఁడు. ॥ ఎవ్వఁ ॥ 74

## శ్రీరాగం

నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం-
స్తుత్యుఁ డీతిరువేంకటాద్రివిభుఁడు ॥ పల్లవి ॥

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాతఁ-
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాతఁ-
డేమూర్తి నిజమోక్షమియ్యఁజాలెడునాతఁ-
డేమూర్తి లోకైకహితుఁడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియునుఁ గాఁడు
యేమూర్తి త్రిమూర్తు లేకమైనయాతఁ-
డేమూర్తి సర్వాత్ముఁ డేమూర్తి పరమాత్ముఁ-
డామూర్తి తిరువేంకటాద్రివిభుఁడు ॥ నిత్యా ॥

యేదేవుదేహమున నిన్నియును జన్మించె
నేదేవుదేహమున [1] నిన్నియును నణఁగె మరి
యేదేవువిగ్రహం బీసకల మింతయును
యేదేవునేత్రంబు లినచంద్రులు

పెద్దరేకు 2. 1. మేనిలో;

ఆహిరి

అతిదుష్టుఁడ నే నలసుఁడను
యితరవివేకం బిఁకనేది ॥ పల్లవి ॥

ఎక్కడ౧ నెన్నిట యేమి సేసితినా
నిక్కపుఁదప్పులు నేరములు
గక్కన నిన్నిట కలిగిననీవే
దిక్కుగాక మరి దిక్కేది ॥ అతి ॥

ఘోరపుఁబాపము కోట్లసంఖ్యలు
చేరువ నివె నాచేసినవి
నీరసునకు నిటు నీకృప నాకిఁక
కూరిమి నా౩ యెడ గుణమేది ॥ అతి ॥

యెఱిఁగి చేసినది యెఱఁగక చేసిన-
కొఱతలు నా౪ యెడఁ గోటు లివే
వెఱపు దీర్చి శ్రీవేంకటేశ[1] కావు
మఱవక నాగతి మరి యేది ॥ అతి ॥ 78

కన్నడగౌళ

దైవకృతంబట చేఁతట తనకర్మాధీనంబట
కావలసినసౌఖ్యంబులు గలుగ కమానీనా ॥పల్లవి॥

ఎక్కడిదుఃఖపరంపర లెక్కడిసంసారంబులు
యెక్కడిజన్మము ప్రాణులకేలా కలిగినది
యెక్కడిమోహవిడంబన యెక్కడియాశాబద్ద(ంధ?)ము
యెక్కడికెక్కడ నిజమై యివి దానుండీనా ॥ దైవ ॥

---

ఏడు రేకు. 29. 1. వేంకటు కావుము.

౧. 'నిన్నిట' అని రేకు. ౩, ౪. 'యెడ' అని రేకు

యీకాంతలు నీద్రవ్యము లీకన్నులవెడయాసలు
యీకోరికె లీతలఁపులు యిట్టే వుండీనా
యీకాయం బస్థిరమన కీదుర్దశలకు లోనై
యీకల్మషములఁ బొరలఁగ నివి గడతేరీనా ॥ దైవ ॥

దేవశిఖామణితిరుమలదేవునికృపగలచిత్తము
పావనమై దురితంబులఁ బాయక మానీనా
అవిభుకరుణారసమున నతఁడే తను మన్నించిన
ఆవేడుక లీవేడుక లాసలు సేసీనా ॥ దైవ ॥ 79

## శంకరాభరణం[1]

ఆదిమపూరుషుఁ డచ్యుతుఁ డచలుఁ డనంతుం° డమలుఁడు
ఆదేవుఁ డీతఁడేపో హరి వేంకటవిభుఁడు ॥ పల్లవి ॥

ఏకార్ణవమై ఉదకములేచినబ్రహ్మాండములోఁ
బైకొనియుండఁగ నొకవటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొకశిశువై వడిఁ దేలాడిన–
శ్రీకాంతుఁ డీతఁడేపో శ్రీవేంకటవిభుఁడు ॥ ఆది ॥

అరుదుగ బలిమద మడఁపఁగ నాకసమంటినరూపము
సరుగన భూమింతయు నొకచరణంబున గొలచి
పరగినపాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁ డీతఁడేపో పతివేంకటవిభుఁడు ॥ ఆది ॥

క్షీరపయోనిధిలోపల శేషుఁడు పర్యంకముగా
ధారుణియును సిరియునుఁ బాదము లొత్తఁగను[2]
చేరువఁ దను బ్రహ్మాదులు సేవింపఁగఁ జెలుఁవొందెడి[3]
నారాయణుఁ డితఁడే వున్నతవేంకటవిభుఁడు ॥ ఆది ॥ 80

---

1. పెద్దరేకులో దీనిరాగము సామంతము. ౦. 'అనంతుఁడమలుఁడు' అని రేకు. విడురేకు 11. 2. పాదంబులు గుద్దగను 3. వెలుఁగొందెడి

### దేసాళం

అప్పులవారే అందరును
  కప్పఁగఁ దిప్పఁగఁ గర్తలు వేరీ ॥ పల్లవి ॥

ఎక్కడ చూచిన నీప్రపంచమునఁ
  జిక్కులు సిలుగులుఁ జింతలునే
  దిక్కెవ్వరు యీతీదీపులలోఁ
  దిక్కుముక్కులకు దేవుఁడెకాక ॥ అప్ప ॥

యేదిం దలంచిన నేకాలంబును[1]
  సూదులమూఁటలసుఖము లివి
  కాదన నౌననఁ గడ గనిపించఁగ[2]
  పోదితాఁడు తలఁపునఁ గలఁ దొకఁడే ॥ అప్ప ॥

యెన్నఁడు వీడీ [3]నెప్పుడు వాసీఁ
  బన్నినతమతమబంధములు
  వున్నతి సేయఁగ వొప్పులు నెరపఁగ
  వెన్నుఁడు వేంకటవిభుఁడే కలఁడు[4] ॥ అప్ప ॥ 81

### శంకరాభరణం

పాపములే సంబళమెపుడూ యీ-
  యాపదఁబడి నే నలసేనా ॥ పల్లవి ॥

ఎన్నిపురాణము లెటువలె విన్నా
  మన్నమనువు దిమ్మరితనమే
  నన్ను నేనే కానఁగలేనట నా-
  విన్నవినుకులకు వెఱచేనా ॥ పాప ॥

నిడురేకు 11లో 1. ఏదిచూచినను ఇటువలెనేపో 2. నౌననఁ గర్తలు వేరి 3. ఎన్నడు దీర్థి 4. దేకాక. ౧. 'దలఁచిన' అని రేకు.

యెందరుపెద్దల నెట్లఁ గొలిచినా
నిందల నామతి నిలిచీనా
కందువెఱఁగి చీఁకటికిఁ దొలఁగనటు
అందపుఁబరమిఁక నందేనా ॥పాప॥

తిరువేంకటగిరిదేవుఁడే పరమని
దరి గని తెలి విఁక దాఁగీనా
తిరముగ నినుఁ జింతించినచింతే
నిరతము ముక్తికి నిధిగాదా ॥పాప॥ 82

14 రేకు ముఖారి

ఎందుఁ బొడమితిమో యెఱఁగము మా-
కందువ శ్రీహరికరుణే కాక ॥పల్లవి॥

ఏఁటిజన్మమో యెఱఁగము పర-
మేఁటిదో నే మెఱఁగము
గాఁటపుకమలజుఁ గాఁచినయా-
నాఁటకుఁడే మానమ్మినవిభుఁడు ॥ఎందుఁ॥

యెవ్వారు వేల్పులో యెఱఁగము సుర-
లెవ్వరో నే మెఱఁగము
రవ్వగుశ్రీ సతిరమణుఁడు మా-
కవ్వనజోదరుఁ డంతరియామి ॥ఎందుఁ॥

యింకానేఁటిదో యెఱఁగము యీ-
యంకెలబాముల నలయము
ఉంకెల దనుజులఁ జదిపినతిరు-
వేంకటేశుఁడు మావిడువనివిభుఁడు ॥ఎందుఁ॥ 83

రామక్రియ

వెలయునిన్నియును ౧వృథా వృథా
తలఁపున శ్రీహరిఁ దడసినను ॥ పల్లవి ॥

ఎడయనిపుణ్యము లెన్నియైనా
విడువక సేయుట వృథా వృథా
బడిబడి నే శ్రీపతి నాత్మలోఁ
దడవక యితరము దడవినను ॥ వెల ॥

యెరవులతపముల నెంతైనా
విరవిరవీఁగుట వృథా వృథా
హరినచ్యుతుఁ బరమాత్మునిని
మరిగి తలఁచక మఱచినను ॥ వెల ॥

దైవము నెఱఁగక తమకమున
వేవేలైన వృథావృథా
శ్రీవేంకటగిరిచెలువునిని
సేవించక మతిఁ జెదరినను ॥ వెల ॥ 84

నాఁట

ఇలయును నభమును నేకరూపమై
జలజల గోళ్ళ జళిపించితివి ॥ పల్లవి ॥

ఎడసిన నలముక హిరణ్యకశిపునిఁ
దొడికిపట్టి చేతుల బిగిసి
కెడపి తొడలపై గిరిగొన నదుముక
కడుపు చించి కహకహ నవ్వితివి ॥ ఇల ॥

౧. 'వ్రిథావ్రిథా' అని యంతటా రేకు.

రొప్పుల నూర్పుల రొచ్చుల కసరులు
గుప్పుచు లాలలు గురియుచును
కప్పినబెబ్బులికసరుహుంకృతుల
దెప్పరపసురలం ధృతి[1] యణఁచితివి ॥ ఇల ॥

పెళపెళనార్చుచుఁ బెడబొబ్బలిడుచు
థళథళ మెఱువఁగ దంతములు
ఫళఫళ వీరవిభవరసరుధిరము
గుళగుళ దిక్కుల గురియించితివి ॥ ఇల ॥

చాతినఁప్రేవులజన్నిదములతో
వాతెరసింహపువదనముతో
చేతులువేయిటఁ జెలఁగి దితిసుతుని
పోతర మణఁపుచు భువి మెరసితివి ॥ ఇల ॥

అహోబలమున నతిరౌద్రముతో
మహామహిమల మలయుచును
తహతహ మెదుపు[2]చుఁ దగువేంకటపతి
యిహముఁ బరము మా కిపు డొసఁగితివి ॥ ఇల ॥ 85

సామంతం

ఇతరము లిన్నియు నేమిటికి
మతిచంచలమే మానుట పరము ॥ పల్లవి ॥

ఎక్కడిసురపుర మెక్కడివైభవ-
మెక్కడి విన్నియు నేమిటికి
యిక్కడనే పరహితమునుఁ బుణ్యము
గక్కునఁ జేయఁగఁ గల దిహ పరము. ॥ ఇత ॥

విడిరేకు. 10. 1. దిటము. 2. బెదపుచు.
౧. 'ధ్రితి' అని రేకు.

యెవ్వరు చుట్టము లెవ్వరు బంధువు-
లెవ్వ రిందరును నేమిటికి
రవ్వగులక్ష్మీరమణునిఁ దలఁపుచు
యివ్వలఁ దాఁ సుఖియించుట పరము. ॥ ఇత ॥

యెందరు దైవము లెందరు వేల్పులు
యెంద రిందురును నేమిటికి
కందు వెఱఁగి వేంకటగిరిరమణుని
చిందులేక కొలిచిన దిహపరము ॥ ఇత ॥ 86

భూపాళం

పారితెంచి మొత్తివేసి పారవెళ్ళితివి(వి?)
నీరసపుటెద్దవైననీకు నే ముద్దా ॥ పల్లవి ॥

ఎద్దవై నన్నేల తొక్కి- యేమిగట్టుకొంటివి
వొద్దనైన వచ్చి వూరకుండవైతివి
వొద్దిక భూమెత్తినయాయెద్దుకు నే ముద్దుగాక
నిద్దురచిత్తముతోడినీకు నే ముద్దా ॥ పారి ॥

కాఁపురపుఁబాపపునాకర్మమును ౧ ధరించి
వీఁపువగులఁగ౨దాఁకి విఱ్ఱవీఁగితి
ఆఁపఁగ నెద్దేమెఱుఁగు నడుకులచవి మూట-
మోపరివి నీకు నాముదము ముద్దా ॥ పారి ॥

మచ్చరించి అల్లనాఁడు మాలవాఁడు కాలఁదన్ని
తెచ్చినయప్పటిధర్మదేవతవు
యెచ్చరించి తిరువేంకటేశుదాసుఁడని నన్ను
మెచ్చి తాఁకితివి నామేను నీకు ముద్దా ॥ పారి ॥ 87

౧. 'నుద్దరించి' అని పూ. ము. పా. ౨. 'వగుల దాఁకి' అని పూ. ము. పా.

శ్రీరాగం

ఎందాఁక నేచిత్త మేతలఁపో
    ముందుముందు వేసారితి షలిగి వేసరితి ॥పల్లవి॥

ఏమిసేతు నేడచొత్తు నేమని బోధింతును
    నామాఁట విన దిదే నావిహారము
    [1]యేమరినాఁ దలఁపించీ నేమైనా గడించీ
    సాముసేసి వేసారితి జడిసి వేసారితి తి ॥ఎందాఁ॥

యేడ చుట్టా లేడ బంధు లేడ పొందు లెవ్వరూ
    తోడైనవారుఁ గారు దొంగలుఁ గారు
    కూడుచీరగానిచోటై కొరగానిపాటై
    వాడివాడి వేసారితి వడిలి వేసారతి ॥ఎందాఁ॥

యెందునున్నాఁ డేమిసేసీ నెక్కడ భోగించీని
    విందులకువిందయినవేంకటేశుఁడు
    యిందరిహృదయములో నిరవై యున్నాఁ డతఁడూ
    చెంది నన్నుఁ గాచుఁగాక చెనకి వేసారితి ॥ఎందాఁ॥ 88

15 రేకు ఆహిరి

ఊరికిఁ బోయెడి [2]వోతఁడ కడు-
    చేరువతెరు వేఁగి చెలఁగుమీ ॥పల్లవి॥

ఎడమతెరువువంక కేఁగిన దొంగలు
    తొడిఁబడఁ గోకలు దోఁచేరు
    కుడితెరువున కేఁగి కొట్టువడక మంచి-
    నడిమితెరువుననే నడవుమీ ॥ఊరి॥

౧ 'ఏమరిన' అని రేకు. ౨. 'ఓ + అతఁడ' = ఓమనిషీ.

అడ్డపుఁదెరువుల నటునిటుఁ జుట్టాలు
వెడ్డువెట్టుచు నిన్ను వేఁచేరు
గొడ్డేరేచిన్నదిడ్డితెరువు వోక
దొడ్డతెరువువంక తొలఁగుమీ ॥ ఊరి ॥

కొండతెరువు కేఁగి కొంచపుసుఖముల
బందై తిరుగుచు బడలేవు
అండనుండెడిపరమాత్ముని తిరుమల-
కొండతెరువు తేఁకువ నేఁగుమీ ॥ ఊరి ॥ 89

ఆహిరి

అక్కడ నాపాట్లువడి యిక్కడ నీపాటు పడి
కుక్కనోరికళాసమై కొల్లఁబోయ బతుకు ॥ పల్లవి ॥

ఎండచేత నీడచేత నెల్లవాఁడు నిట్లానే
బందుబందై యెందుఁ గడపల గానక
వుండగిలి నరకాల నుడుకబోయెద మింక
వండఁదరిగినకూరవలెనాయ బతుకు ॥ అక్క ॥

పంచమహాపాతకాలబారిఁ బడి భవములఁ
దెంచి తెంచి ముడివేయఁ దీదీపులై
పొంచినయాసలవెంటఁ బొరలఁబోయెద మింక
దంచనున్నరోలిపిండితలఁపాయ బతుకు ॥ అక్క ॥

యీదచేత వానచేత నెల్లనాఁడుఁ బాయని-
బాదచేత మేలెల్ల బట్టబయలై
గాదిలివేంకటపతిఁ గానఁగఁబోయెద మింక
బీదగాగచినబూరెప్రియమాయ బ్రదుకు ॥ అక్క ॥ 90

సామంతం

నాఁటికి నాఁడే నాచదువు
మాటలాడుచును మఱచేటిచదువు ॥ పల్లవి ॥

ఎనయ నీతని నెఱుఁగుటకే పో
వెనకవారు చదివినచదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటిప్రౌఢలచదువు ॥ నాఁటి ॥

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుతఁ గృతయుగాదులచదువు
కలిగినయీఁఅనిఁ గాదననే పో
కలియుగంబులోఁ గలిగినచదువు ॥ నాఁటి ॥

పరమని వేంకటపతిఁ గనుటకే పో
దొరలగుబ్రహ్మాదులచదువు
సిరుల నితని మఱచెడికొరకే పో
విరసపుజీవులవిద్యలచదువు ॥ నాఁటి ॥ 91

నాట

ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె ॥ పల్లవి ॥

ఎగసినగరుడని యేపున 'ధా'యని
జిగిదొలఁక చబుకుచేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడఁకె ॥ ఇటు ॥

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు గోపించినను
సరస నఖిలములు జర్జరితములై
తిరువున నలుగడ దిరదిరఁ దిరిగె ॥ ఇటు ॥

పల్లించిననీపసిఁడిగరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షససమితి నీమహిమ-
వెల్లి మునుఁగుదురు వేంకటరమణా ॥ ఇటు ॥ 92

నాదరామక్రియ

ఈసుర లీమును లీచరాచరములు
౧ యీసకలమంతయు నిది యెవ్వరు ॥ పల్లవి ॥

ఎన్నిక నామము లిటు నీవై యుండఁగ
యిన్నినామములవా రిది యెవ్వరు
వున్నచోటనే నీవు వుండుచుండఁగ మరి
యిన్నిటాఁ దిరుగువా రిది యెవ్వరు ॥ ఈసు ॥

వొక్కరూపై నీవు వుండుచుండఁగ మరి
తక్కిన యీరూపములు తా మెవ్వరు
యిక్కడనక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ
మక్కువ నుండువారు మరి యెవ్వరు ॥ ఈసు ॥

శ్రీవేంకటాద్రిపై చెలఁగి నీ వుండఁగా
దైవంబులనువారు తా మెవ్వరు
కావలసినచోట కలిగి నీ వుండఁగ
యీవిశ్వపరిపూర్ణు లిది యెవ్వరు ॥ ఈసు ॥ 93

---

౧. 'యీసకల' అని రేకు.

లలిత

తాప లేక మేఁద దెక్కఁగలఁచేము
యేపులేనిచిత్తముతో యాహీహీ నేము ॥ పల్లవి ॥

ఎఱుకమాలినబుద్ది యె(నె?)వ్వరైనాఁ బతులంటా
తెఱఁగెఱఁగక వీధిఁ దిరిగేము
పఱచైనజవరాలు పరులెల్లా మగలంటా
వొఱపునిలిపిన ట్లోహోహో నేము ॥ తాప ॥

యిందరును హితులంటా యెందైనా సుఖమంటా
పొందలేనిబాధఁ బొరలేము
మందమతివాఁడు యెండమావులు చెరువులంటా
అందునిందుఁ దిరిగిన ట్లాహాహా నేము ॥ తాప ॥

మేటివేంకటేశుఁ బాసి మీఁదమీఁదఁ జవులంటా
నాటకపుతెరువుల నడిచేము
గూటిలో దవ్వులవాఁడు కొండలెల్ల నునుపంటా
యేటవెట్టి యేఁగిన ట్లీహీహీ నేము ॥ తాప ॥ 94

16 రేకు శ్రీరాగం

ఏది చూచినఁ దమకు యిచ్ఛయును నిటువలెనె
వేదువిడిచినకూడు వెదకినను లేదు ॥ పల్లవి ॥

ఏకాంతసౌఖ్యంబు లెక్కుడివి ప్రాణులకు
పైకొన్నదుఃఖముల పాలుపడే(డి?)గాక
యేకమగుపుణ్యంబు లేదఁగల విందరికి
కైకొన్నదురితములు కలపాటిగాక ॥ ఏది ॥

హితవైనమమకార మెందుఁగల దిందరికి
ప్రతిలేనివిరహతాపముకొలఁదిగాక
మతిలోనివేడుకలు మరియేవి మనుజులకు
జితమైనదైవమిచ్చినపాటిగాక ॥ఏది॥

యిరవైనదైవకృప యేల దొరకునుఁ దమకు
పరమైనకర్మంబు పరిపాటిగాక
యెరవైనపెనుబంధ మేల వీడెడు నాత్మఁ
దిరువేంకటేశుకృప తిరమైనఁగాక ॥ఏది॥ 95

బౌళి

చూడరెవ్వరు దీనిసోద్యంబు పరికించి
చూడఁజూడఁగఁ గాని సుఖ మెఱఁగరాదు ॥పల్లవి॥

[1] ఎడతెగనిమమత వేయఁగరానిపెనుమోపు
కడలేనియాస చీఁకటిదవ్వుకొనుట
నిడివైనకనుచూపు నీడనుండిన [2]యెండ
వడిచెడనితమకంబు వట్టితాపంబు ॥చూడ॥

బుద్ధిమానినచింత పోనియూరికిఁ దెరువు
పొద్దువోవనివలపు పొట్టపొంకంబు
యెద్దుఁబట్టినసివం బెఱుకమాలినప్రియము-
[3]లొద్దికవిహారంబు లుబ్బుఁగవణంబు ॥చూడ॥

తీపులోపలితీపు తిరువేంకటేశ్వరుని-
చూపు, దనుఁబొడగననిచూపు లోచూపు,
ఆపదలువాయునెయ్యపుఁదలఁపు లీ(లో?)తలఁపు
రూపైనరుచిలోనిరుచి వివేకంబు ॥చూడ॥ 96

1. 'ఎడ' ను, 'యెడ' గ భావించిరేమో? కాకున్న యతిభంగము.
2. 'యండ' అనిరేకు. 3 'ఒద్దిక, పూ. ము. పా.

నాట

ఎవ్వరెవ్వరివాడో యీ జీవుఁడు చూడ-
నెవ్వరికి నేమౌనో యీజీవుఁడు ॥ పల్లవి ॥

ఎందరికిఁ గొడుకుగాఁ డీజీవుఁడు వెనక-
కెందరికిఁ దోఁబుట్టఁ డీజీవుఁడు
యెందరిని భ్రమయించఁ డీజీవుఁడు దుఃఖ-
మెందరికిఁ గావింపఁ డీజీవుఁడు ॥ ఎవ్వ ॥

యెక్కడెఁ ౦క్కడఁ దిరుగఁ డీజీవుఁడు వెనక-
కెక్కడో తనజన్మ మీజీవుఁడు
యెక్కడిచుట్టము దనకు నీజీవుఁడు యెప్పు-
డెక్కడికి నేఁగునో యీజీవుఁడు ॥ ఎవ్వ ॥

ఎన్నఁడును జేటులేనీజీవుఁడు వెనక-
కెన్నిదనువులు మోవఁ డీజీవుఁడు
యెన్నఁగలతిరువేంకటేశుమాయలఁ దగిలి
యెన్నిపదవులఁ బొందఁ డీజీవుఁడు ॥ ఎవ్వ ॥ 97

సామంతం

ఎంతచేసిన తనకేది తుద
చింత శ్రీహరిపైఁ జిక్కుటే చాలు ॥ పల్లవి ॥

ఎడపక పుణ్యా లెన్నిచేసినాఁ
గడమే కాకిఁకఁ గడ యేది
తడఁబడ హరియే దైవమనుచు మది
విడువకవుండినవెరవే చాలు ॥ ఎంత ॥

౦ 'క్కడదిరు' రేకు.

యెన్నితపము లివి యెట్లఁ జేసినా
అన్నువ కధికము కలవేది ౧
వన్నెలఁ గలఁగక వనజాక్షునిపై
౨వున్నచిత్త మది వొక్కటే చాలు ॥ ఎంత ॥

యిందరివాదము లెట్ల గెలిచినా
కందే గా కిఁక గరిమేది
ఇందరి నేలినయీ వేంకటపతి
పొందగుమహిమలపొడవే చాలు ॥ ఎంత ॥ 98

సారణి

ఏణనయనలచూపు లెంత సొబగై యుండు
ప్రాణసంకటములగుపనులు నట్లుండు ॥ పల్లవి ॥

ఎడలేనిపరితాప మేరీతిఁ దా నుండు
అడియాసకోరికెలు నటువలెనె యుండు
కడలేనిదుఃఖసంగతి యెట్లఁ దా నుండు
అడరుసంసారంబు నట్లనే వుండు ॥ ఏణ ॥

చింతాపరంపరలఁ జిత్త మది యెట్లుండు
వంతఁదొలఁగనిమోహవశము నట్లుండు
మంతనపుఁబనులపయి మనసు మరి యెట్లుండు
కంతుఃరమార్గములగతి యట్ల నుండు ॥ ఏణ ॥

దేవుఁదొక్కఁడెయనెడితెలివి దన కెట్లుండు
శ్రీవేంకటేశుకృపచేఁత లట్లుండు
భావగోచరమైనపరిణతది యెట్లుండు
కైవల్యసౌఖ్యసంగతులు నట్లుండు ॥ ఏణ ॥ 99

---

౧. 'అలవి+ఏది' ౨. 'నున్న' అనీ వూ. ము. పా.

గీతం - నాట

౧ఏదైవముశ్రీపాదన్న(న?)ఖమునఁ బుట్టినగంగ
త్రిలోకపావనము చేయను త్రిపథగామిని ఆయను
యేదైవమునాభినలినంబున జనియించినఅజుండు
అఖిలాండంబులు సృజియింప నధిపతి ఆయను
యేదైవమువురస్థలంబు దనకును మందిరమైనయిందిర
మాతయయ్యె ఝూజగంబులకెల్లను
యేదైవముఅవలోకన మింద్రాదిదివిజగణంబుల-
కెల్లప్పుడును సుఖంబు లాపాదించును
యేదైవము దేహవస్తు ౨(వస్తు)వని అనిమిషులందరుఁ గూడి
శ్రీనారాయణదేవుండని నమ్మియుండుదురు
ఆదేవుఁడే సిరుల కనంతవరదుఁడు తిరువేంకట-
గిరినాథుఁ డుభయవిభూతినాథుఁడే నానాథుఁడు ॥ఏదై॥ 100

17 రేకు ఆహిరి

ఏఁటికిఁ దలఁకెద రిందరును
గాఁటపుసిరు లివి కానరో ప్రజలు ॥పల్లవి॥

ఎండలఁ బొంలక యేచినచలిలో-
నుండక చరిలో నుడుకక
అండనున్నహరి నాత్మఁదలఁచిన
పండినపసిఁడే బ్రతుకరో ప్రజలు ॥ఏఁటి॥

౧. ఈపాటకు పల్లవి చరణ విభాగములు రేకులో చూపలేదు. 'గంగ'తరువాతి నిలువుగీత ప్రామాదికమా? ప్రాసపద్ధతితో రెండేసిపంక్తు లొకపాదముగ స్వీకరిస్తే, మొదటినాలుగుపంక్తులు పల్లవిగ, తరువాతియెనిమిదిపంక్తులు ఒకచరణముగ కాగా, ఒంటి చరణముతో ముగిసినది కావచ్చు. ఈ వాఙ్మయమున ఈ పద్ధతి అపురూపమే.

౨. ఈ చివ్వగుర్తులోని 'వస్తు' కూడా రేకులో నున్నది.

అడవుల నలయక ఆకునలముఁ దిని
కడుపులు గాలఁగఁ గరఁగక
బడిబడి లక్ష్మీపతికి దాసులై
పొడవగుపదవులఁ బొందరో ప్రజలు ॥ ఏఁటి ॥

పొక్కిటికాళ్ళ పుండ్లు రేఁగఁగ
దిక్కులనంతటఁ దిరుగక
గక్కన తిరు౧వేంకటగిరిపతిఁ గని
వొక్కమనసుతో నుండరో ప్రజలు ॥ ఏఁటి ॥ 101

బౌళి

ఏదితుద దీని కేదిమొదలు
పాదుకొనుహరిమాయఁ బరగు జీవునికి ॥ పల్లవి ॥

ఎన్నిబాధలు దనకు నెన్నిలంపటములు
యెన్నివేదనలు మరి యెన్నిదుఃఖములు
యెన్నిపరితాపంబు లెన్నిదలపోఁతలు
యెన్ని చూచిన మరియు నెన్నైనఁ గలవు ॥ ఏది ॥

యెన్నికొలువులు దనకు నెన్నియనుచరణలు
యెన్నియాసలు మరియు నెన్నిమోహములు
యెన్నిగర్వములు దనకెన్నిదైన్యంబు లివి యివి
ఇన్నియునుఁ దలఁప మరి యెన్నైనఁ గలవు ॥ ఏది ॥

యెన్నిటికిఁ జింతించు నెన్నిటికి౨హర్షించు
నెన్నిటికి నాసించు నెన్నిటికిఁ దిరుగు
యిన్నియును దిరువేంకటేశులీలలు గాఁగ-
నెన్ని చూచినను దా నెవ్వఁడును గాఁడు ॥ ఏది ॥ 102

౧. 'వేంకటపతి' అని పూ. ము. పా. ౨. 'హాసమించు' రేకు.

### సామంతం

చక్కఁదనములవారఁ సతులాల
యిక్కువతెక్కువల మీ రేమిసేసే రిఁకను[1] ॥ పల్లవి ॥

ఒప్పుగా నరకము మాకు ౧బలిచ్చి మనమెల్ల
కప్పముగొంటిరిగా యింగనలార
అప్పుడే గోవిందునికి ఆహివెట్టితిఁ జిత్తము
యిప్పుడు యెమ్మెల మీ రేమిసేసే(?)రిఁకను[2] ॥ చక్క ॥

పంచమహాపాతకాలబారిఁ దోసి మాసిగ్గులు
లంచముగొంటిరిగా నెలఁతలార
వంచనతోఁడుత హరివారమైతి మిఁక మీ-
యించుకగుట్టుల(లు?) మీరెందు చొచ్చే [3]రిఁకను ॥ చక్క ॥

దొంగిలి మాగుట్టులెల్లా దోవ వేసి మరుబారి
భంగపెట్టితిరిగా వోభామలార
చెంగలించి వేంకటేశు సేవకుఁ జొచ్చితిమి
యెంగిలిమోవులను మీ రేడఁబడే రిఁకను ॥ చక్క ॥ 103

### బౌళి

ఎట్టుచేసినఁ జేసె నేమిసేయఁగవచ్చు
చుట్టపువిరోధంబు సూనాస్త్రుచెలిమి ॥ పల్లవి ॥

ఒడలిలోపలిరోగ మొనరఁ బరితాపంబు
కడుపులోపలిపుండు కడలేనియాస
తడిపాఁతమెడగోఁత తలఁపువిషయాసక్తి
గుడిమీఁదితరువు జలకులము(ఖలుగులము?)ప్రాణలకు ॥ ఎట్టు ॥

---

విడురేకు 26. 1. యెక్కువ తక్కువల మీరు యెందుఁబోయే రిఁకను.
2 యెమ్మెలు మీరు నేడఁ జొచ్చేరిఁకను; 3 గుట్టును మీరు యెందు.

౧. బలి+ఇచ్చి. బలి=చర్మకోశము 'బలీ' చామరదండే స్త్రీత్వక్కోశే గృహదారుణి, ఇత్యాదిగా ప్రతాపనిఘంటు.

నీడలోపలం౧యెండ నెలకొన్న బంధంబు
గోడపైనున్నంబు కొదలేనియెఱుక
పాడూరిలో బ్రదుకు పాపకర్మపుబుద్ధి
తాడుపైతపసు తమధనము ప్రాణులకు ॥ఎట్టు॥

మంటఁజేసినబొమ్మమనికి సంసారంబు
రెంటికినిగానివీరిడికొలువు బ్రదుకు
యింటివేలుపువేంకటేశుఁ గొలువక పరుల-
వెంటఁ దిరుగుట వోడ౨విడిచి౩వదరిడుట ॥ఎట్టు॥ 104

వరాళి

తలఁపు కామాతురత్వముసోఁదనలవడిన-
నిల నెట్టివారైన నేలాగు గారు ॥పల్లవి॥

ఓలి నిరువురుసతుల నాలింగనముసేయ
లోలుఁ డటుగాన నాలుగుచేతులాయ
వేలసంఖ్యలుసతుల వేడుకల రమియింపఁ
బాలుపడెఁగాన రూపములు పెక్కాయ ॥తలఁ॥

పొలయలుకకూటములభోగి దా నటుగాన
మలసి యొక్కొకవేళ మాఁపుమొగమాయ
లలితలావణ్యలీలావిగ్రహముగాన
కొలఁదివెట్టఁగరానిగోళ్ళనిడుపాయి ॥తలఁ॥

చిరభోగసౌఖ్యములఁ జెంద ననుభవిగాన
తిరువేంకటాచలాధీశ్వరుండాయ
పరగ సంసారసంపదకు బద్ధుఁడుగాన
అరుదుగా సకలాంతరాత్మకుఁడాయ ॥తలఁ॥ 105

౧. 'యండ' రేకు. ౨. 'నిడిచి' రేకు. ౩. వదరు=నొరకాయ.

లలిత

ఎక్కడిదిదురవస్థ లేఁటిదేహము లోనఁ
జిక్కి జీవుఁడు౧ మోక్షసిరిఁ జెందలేఁడు ॥ పల్లవి ॥

ఒడలు మాంసపూర మొక పూఁటయిన మీఁదు
గడుగకున్నఁ గొరగాదు
కడలేనిమలమూత్రగర్హితం౨ మిది, లోను
గడుగరాదు యెంతగడిగినఁ బోదు ॥ ఎక్క ॥

అలర చిత్తము చూడ నతిచంచలము దీనఁ
గలసిన పెనుగాలి గనము
మెలుపులేనిచిచ్చు మీఁద౩ మిక్కిలిఁ గొంత
నిలుపు లేదు పట్టి నిలుపఁగరాదు ॥ ఎక్క ॥

తిరువేంకటాచలాధిపుఁడు నిత్యానంద-
కరుఁడు జీవునకు రక్షకుఁడు
కరుణించి యొకవేళఁ గాచినఁగాని మేను-
చొరకమానెడుబుద్ధి చోఁక దెవ్వరికి ॥ ఎక్క ॥ 106

18 రేకు సాళంగం

౪పుట్టుమాలినబరుబోఁకివి నన్నుఁ
దిట్టే వదేమోసి దిమ్మరిమాయ ॥ పల్లవి ॥

ఒరపులాడక పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించే వేమోసి విష్ణుభక్తినంటా-
నెరఁగనటే నీయేతు లిన్నియును ॥ పుట్టు ॥

౧. ఇది విరుద్ధసమాసము. ఇట్టిచిల్లరదోషముల కీవాఙ్మయమున పట్టింపు లేదు. ౨ 'గరిహిత' రేకు. ౩. 'మీఁదు' కావచ్చు ౪. మాయకూ-హరిభక్తికీ సంవాద మీపాట. విడురేకు 82. 1. సాళంగనాట.

వుడుటు చెల్లదు పోపో వోసి మాయ నా-
యెదుర మాఁటలు నీకు నిఁకనేలే,
వదరేవు హరిభక్తివనిత, తెలియరు నే-
నిదురవచ్చినవారు నీవు నా కెదురా ॥ పుట్టు ॥

వొల్లవటే జీవ మోసిమాయ నీ-
కల్లలిన్నియును లోక మెఱుఁగును,
నల్లనివిభునిమన్ననభక్తినంటాఁ
జెల్లఁబో పాపపుచేఁదు మేయకువే ॥ పుట్టు ॥

వూరకుండవుగా వోసిమాయ నిన్నుఁ
బేరఁ బిలువము గుంపెనలాదేవు,
నారాయణభక్తినాతి నన్నును నిన్నుఁ
గోరి యిందరు నెఱుఁగుదు రేల పోవె ॥ పుట్టు ॥

వోవవు ననుఁజూచి వోసిమాయ నా-
తోవ వచ్చినను నొత్తువు నీవు,
శ్రీవేంకటగిరిదేవునిభక్తి నా-
హావళికే నిన్ను నలమి రిందరును ॥ పుట్టు ॥ 107

గుజ్జరి

నాపాలిఘననిధానమవు నీవే నన్ను
నీపాల నిడుకొంటి నీవే నీవే ॥ పల్లవి ॥

ఒలిసి నన్నేలేదేవుఁడవు నీవే, యెందుఁ
దొలఁగనినిజబంధుఁడవు నీవే
పలుసుఖమిచ్చేసంపదవు నీవే, యిట్టే
వెలయ నిన్నియును నీవే నీవే ॥ నాపా ॥

పొదిగి పాయని యాప్తుఁడవు నీవే, నాకు -
వదనఁ దోఁడగుదేహమవు నీవే
మదమువాపెడినామతియు నీవే, నాకు
వెదక నన్నియును నీవే నీవే ॥ నాపా ॥

యింకా లోకములకు నెప్పుడు [1] నీవే, యీ -
పంకజభవాదిదేవపతివి నీవే
అంకిలి వాపఁగ నంతకు నీవే, తిరు -
వేంకటేశ్వరుఁడవు నీవే నీవే ॥ నాపా ॥ 108

వరాళి

౧ పుడమి నిందరిఁ బట్టె భూతము కడుఁ -
బొడవైననల్లనిభూతము ॥ పల్లవి ॥

కినిసి వోఁదమింగెడిభూతము
పునుకవీఁపుపెద్దభూతము
కనలి కవియుచీఁకటిభూతము
పొనఁగుసోమపుమోముభూతము ॥ పుడ ॥

చేటకాళ్ళ మించినభూతము
పోటుదారలపెద్దభూతము
గాఁటపుజడలబింకపుభూతము
జూటరినల్లమునుఁగుభూతము ॥ పుడ ॥

కెలసి బిత్తలేతిరిగేటిభూతము
పొలుపుదాంట్లపెద్దభూతము
బలుపువేంకటగిరిపయిభూతము
పులుగుమీఁదిమహాభూతము ॥ పుడ ॥ 109

---

విడుపేకు 50..1 నెక్కుడు: 2. వాఁడె, ౧. ఇందు దశావతారసమన్వయము కలదు.

సామంతం

చాలదా మా జన్మము నీ-
పాలింటివారమై బ్రదుకఁగఁగలిగె ॥ పల్లవి ॥

కమలాసనాదులుగాననినీపై
మమకారముసేయ మార్గము గలిగె
అమరేంద్రాదులకందరానినీ-
కొమరైననామము కొనియాడఁగలిగె ॥ చాల ॥

సనకాదులును గానఁజాలనినిన్నుఁ
తనివోవ మతిలోనఁ దలపోయఁగలిగె
ఘనమునీంద్రులకు నగమ్యమైవున్న-
నిను సంతతమును వర్ణింపఁగలిగె ॥ చాల ॥

పరమమై ౧భవ్యమై పరగిననీ -
యిర విట్టిదని మాకు నెఱుఁగంగఁగలిగె
తిరువేంకటాచలాధిప నిన్ను యీ-
ధరమీఁదఁ బలుమారు దరిసింపఁగలిగె చాల ॥ 110

ఆహిరి

దిక్కెందరికినైనదేవుఁడు కడుఁ
దెక్కలికాఁడైనదేవుఁడు ॥ పల్లవి ॥

కొత్తపెండ్లికూఁతుఁ గోరి చూడఁబోయి
యెత్తి తేరిమీఁద నిడుకొని
నెత్తికన్ను మానినవాని పెండ్లికి
దెత్తిగొన్నయట్టి దేవుఁడు ॥ దిక్కె ॥

---

౧. 'దివ్యమై' అని పూ. ము. పా. ౨. 'కూఁతు కోరి' అని రేకు

గొప్పయినపెద్దకొండమీఁద నుండి
దెప్పరమ్ముగా దిగఁబడి
కప్పి రెండుదునుకలు గూడినవాని
తిప్పఁదీరులాదేదేవుఁడు ॥ దిక్కు ॥

బెరసి మేనమామబిడ్డకునై పోయి
నిరతఁపుబీరాలు నెరపుచు
యిరవైనమాయపుబెద్దులఁ బొరిగొన్న -
తిరువేంకటగిరి దేవుఁడు ॥ దిక్కు ॥ 111

శ్రీరాగం

ఏమి గల దిందు నెంతగాలంబైన[1]
పామరపుభోగ మాపదవంటి దరయ. ॥ పల్లవి ॥

కొండవంటిది యాస, గోడ[2]వంటిది తగులు
బెండువంటిది లోనిపెద్దతనము
పుండువంటిది మేను, పోలించినను మేడి -
పండువంటిది సరసభావమింతయును ॥ ఏమి ॥

కంచువంటిది మనసు, కలిమిగల దింతయును
మంచువంటిది, రతి భ్రమతవంటిది
మించువంటిది రూపు, మేలింతయును ముట్టు-
పెంచువంటిది, దీనిప్రియ మేమిబ్రాఁతి ॥ ఏమి ॥

ఆఁకవంటిది జన్మ, మడవివంటిది చింత
పాఁకువంటిది కర్మబంధమెల్ల
యేఁకటను దిరువేంకటేశుఁ దలఁచినంకోర్కి-
కాఁక (?) సౌఖ్యములున్న గవివంటి దరయ ॥ ఏమి ॥ 112

విడురేకు 48. 1.లముడిన. 2. గొడవ. ౧. కోర్కి-కాఁక=కోరికవలన గలిగిన తాపము అని అర్థము కావచ్చు. 'కాఁగు', ధాతువునకు కృదంతరూపము కావచ్చు.

19 రేకు ఆహిరి

ఎన్నాళ్ళదాఁకఁ దా నిట్టై వుండుట బుద్ధి
కన్నపోవుట పూర్వకర్మశేషం[1] ॥ పల్లవి ॥

కలకాలమెల్ల దుఃఖమెకాఁగఁ బ్రాణికిని
వలదా సుఖము గొంతవడియైనను
కలుషబుద్ధులఁ [ం]బ్రజ్ఞగల దింతయును మంటఁ
గలసిపోవుటే పూర్వకర్మశేషం ॥ ఎన్నా ॥

జాలి తొల్లియుఁబడ్డజాలె నేఁడునుఁగాక
మేలు వొద్దా యేమిటినైనాను[౨]
తాలిమి లో హరిఁ దలఁచక యెఱుకెల్ల
గాలిఁబోవుట పూర్వకర్మశేషం ॥ ఎన్నా ॥

తరగనినరకబాధయు నేఁడునుగాక
దరి చేరవలదా యింతటనైనను
తిరువేంకటాద్రిపై దేవునిఁ గొలువక
[3] గరివడే (?) భవమెల్ల కర్మశేషం ॥ ఎన్నా ॥ 113

గుజ్జరి[2]

అప్పులేనిసంసార మైనపాటే చాలు
తప్పులేనిజీత మొక్కటారమైనఁ జాలు ॥ పల్లవి ॥

కంతలేనిగుడిశొక్కగంపంతయినఁ జాలు
చింతలేనియంబలొక్కచేరెఁడే చాలు
జంతగానితరుణి యేజాతైన నదె చాలు
వింతలేనిసంప దొక్కవీసమే చాలు ॥ అప్పు

విడురేకు 38. 1. అంతటను 'కర్మశేషము' అనియే. కావి యిది లయవిరుద్ధ దోఁచెడివి. 2. దేసాళం ౧. 'బ్రగ్గ' రేకు. ౨. 'నైనను' పూ. ము. పా
3. గరివడు = మోటువారుట కావచ్చు.

తిట్టులేనిబ్రదు కొక్కదినమైన నదె చాలు
ముట్టులేనికూడొక్కముద్దెడే చాలు
గుట్టుచెడి మనుకంటే కొంచెపుమేలైనఁ జాలు
వట్టిజాలిఁ బడుకంటే వచ్చినంతే చాలు ॥ అప్పు ॥

లంపటపడనిమేలు లవలేశమే చాలు
రొంపికంబమౌకంటె రోయుటే చాలు
రంపపుఁగోరికకంటె రతి వేంకటపతి-
పంపున నాతనిఁజేరేభవమే చాలు ॥ అప్పు ॥ 114

శ్రీరాగం [1]

కూడువండుట గంజికొరకా తనకు
వేడుకలుగలసుఖము వెదకుటకుఁగాక ॥ పల్లవి ॥

కుప్ప నురుచుట [2] కసవుకొరకా తనవు
గొప్పయవు టిది మదముకొరకా
వొప్పయినవేడుకల నొరసి మనసు
నెప్పునకురాఁ దివియనేరవలెఁగాక ॥ కూడు ॥

కొలుచు దంచుట పొట్టుకొరకా తాఁ-
గులజుఁడై మూడుఁడౌ [3] కొరకా
తలపోసి యిన్నింటఁ దగిలి మీఁదు-
తెలిసి సుఖదుఃములఁ దెలియవలెఁ [4] గాక ॥ కూడు ॥

కొండ దవ్వుట యెలుకకొరకా తాఁ
గొండ యెక్కుట దిగుటకొరకా
కొండలకోనేటిపతిఁ [5] గొలిచి ౧ తనదు -
నిండినాపదలెల్ల నీఁగవలెఁ గాక ॥ కూడు ॥ 115

---

నిడురేకు 18. 1. దేసాళం 2. వేయుట 3 కులజుఁడౌటిది చలముకొరకా. 4. మలభంబైన తెరువుగనవలె 5 కోండకోనేటి. ౧. 'తనకు' అని.పూ.ము.పా.

### శుద్ధవసంతం

ఘనుఁ డీఁతఁడొకఁడు గలుగఁగఁగదా వేదములు
జననములుఁ గులము లాచారములుఁ గలిగె ॥ పల్లవి ॥

కలుషభంజనుఁ డితఁడు గలుగఁగఁగదా జగతిఁ
గలిగె నిందరిజన్మగతులనెలవు
మలసి యితఁడొకఁడు వొడమఁగఁగదా యిందరికి
నిలువ నీడలు గలిగె నిధినిధానములై ॥ ఘను ॥

కమలాక్షుఁ డితఁడు గలుగఁగఁగదా దేవతలు
గమిగూడి రిందరును గండిగడచి
ప్రమదమున నితఁడు నిలుపఁగఁగదా సస్యములు
అమర౧ ఫలియించె లోకానందమగుచు ॥ ఘను ॥

గరిమె వేంకటవిభుఁడొకఁడు గలుగఁగఁగదా
ధరయు నభమును రసాతలము గలిగె
పరమాత్ముఁడితఁడు లోపల గలుగఁగాఁగదా
అరిది చవులును హితవు లన్నియునుఁ గలిగె ॥ ఘను ॥ 116

### భైరవి

చూడుఁ డిందరికి సులభుఁడు హరి-
తోడునీడయగుదొరముని యితఁడు ॥ పల్లవి ॥

కైవల్యమునకుఁ గనకపుతాపల-
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మొకరూపమై విరజకు
నావై[1]యున్నాఁ డిదె యితఁడు ॥ చూడు ॥

---

౧. 'అమరఁ ఫలియించె' రేకు. సిదురేకు 88 1. భువినున్నాఁడిదె.

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన-
దీపమై[1] జగతికిఁ దేజమై
పాపాలడఁపఁగ భవపయోధులకు
తేపై[2]యున్నాఁ డిదె యితఁడు ॥చూడు॥

కరుణానిధిరంగపతికిఁ గాంచీ-
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబలనృకేసరికిఁ ద-
త్పరుఁడగు శఠగోప(ం) ముని యితఁడు ॥చూడు॥ 117

సామంతం

కలలోనిసుఖమే[3] కలియుగమా, వెన్న
కలిలో నెక్కడిదె కలియుగమా ॥పల్లవి॥

కడిగడి గండమై కాలము గడపేవు
కడుగఁగడుగ రొంపి కలియుగమా
బడలికె వాపవు సరిమేదో చూపవు
గడిచీటియును నీవు కలియుగమా ॥కల॥

కరపేవు కలతలే మఱపేవు మమతలే
కరకలు విడువవు కలియుగమా
తెరచీర మఱఁగింతే తెరువేల మూసేవు
గరుసేల దాఁచేవో కలియుగమా ॥కల॥

కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు
కానీలే కానీలే కలియుగమా
పై నిదే వేంకటపతిదాసులుండఁగ
కానవా నీ విదేమి కలియుగమా ॥కల॥ 118

---

'విడురేకు 86' 1. ంబై జగతికిఁ దొడవై. 2. జగములఁ దిరిగీ నితఁడు (లయచ్ఛాయకిపారములే యుక్తములు) 3. సుఖమైన.

20 రేకు ఆహిరి

తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచినలతల ॥పల్లవి॥

కూరిమిమటములు గోపురంబులును
తేరుపడగెలే తెరువెల్లా
కోరినపండ్లుగురిసేటితరువులు
తోరములైనవెదురుజొంపములు ॥తోర॥

ఆటలుఁ దిరుపులు నందపుటుదుపులు
పాటలు వనవైభవమెల్లా
కూటువ[౧]నెమళ్ళ కోవిల[౨]గుంపు
పేటలఁ దేటలపెనుఁగూటములు ॥తోర॥

వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను ॥తోర॥ 119

మాళవి

[౩]బాపు దైవమా మా పాలిభవమా
తీపు రాకాసినెత్తురు దీం దోందోం దోందోం దోందోం ॥పల్లవి॥

కాలనేమిపునుకిది కంచువలె లెస్స వాఁగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త [1]
కాలమెల్ల మాభూతగణమెల్ల వీఁడె కాచె
నేలఁబడి నేఁడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం[2] ॥బాపు॥

నిడురేకు 120. 1. తత్తత తత్తరా. 2. ధిం. ౧. 'నెమళ్ళ' ౨. 'గుంపులు' కావచ్చు. ౩. ఈపాట అన్నమయ్య, భక్తిశివమెత్తి వ్రాసినట్లున్నది.

పగగొని మానక [1]పచ్చినెత్తు రెప్పుడును
తెగి కొనుఁ దానె తిత్తి తిత్తి [2]తిత్తితి
తగుమహోదరుపీఁపు ధణధణమని వాఁగి
బిగియించరే తోలు బింభిం బింభిం బింభింభిం ॥దాపు॥

మురదనుజునిపెద్దమొదలియెముకఁ దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు[3]
తిరువేంకటగిరిదేవుఁడు గెలిచిన స-
మరమునను మమ్మ మమ్మ మమ్మ మమ్మమ ॥బాపు॥ 120

భూపాళం

వాఁడె వేంకటేశుఁడనేవాఁడె వీఁడు
వాఁడిచుట్టుఁగైదువవలచేతివాఁడు ॥పల్లవి॥

కారిమారసుతునిచక్కనిమాటలకుఁ జొక్కి-
చూరగా వేదాలగుట్టు చూపినవాఁడు
తీరని వేడుకతో తిరుమంగయాళువారి-
ఆరడిముచ్చిమికూటి కాసపడ్డవాఁడు ॥వాఁడె॥

పెరియాళువారిబిడ్డ పిసికి పైవేసిన-
విరులదండల మెడవేసినవాఁడు
తరుణి చేయివేసిన దగ్గరి బుజము చాఁచి
పరవశమై చొక్కి పాయనివాఁడు ॥వాఁడె॥

పామరులఁ దనమీఁదిపాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్లా నోర నూరిపోసినవాఁడు
మామకూఁతురలమేలుమంగనాచారియుఁ దాను
గీముగానే వేంకటగిరి నుండేవాఁడు ॥వాఁడె॥ 121

---

నిడురేకు 120. 1. మాకిందు. 2. తిత్తి. (ఇందు రెండవ చరణమున పూర్వోత్తరార్థములు వ్యత్యస్తములు) 3. తుత్తుతూ.

ఆహిరి

అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె
వెంటఁబారనీదు నన్ను వెడమాయతురుము ॥పల్లవి॥

కాఁగెడుపెరుగుచాడె కవ్వముతోఁ బొడిచి
లేఁగలఁ దోలుకొని అలిగిపోయీని
రాఁగతనమున వాఁడె రాతిరి నారగించఁడు
ఆఁగి నన్నుఁ గూడడిగె నయ్యో ఇందాఁకను ॥అంటఁ॥

కొలఁదిగానిపెరుగు కొసరికొసరి పోరి
కలవూరుఁగాయలెల్లఁ గలఁచిపెట్టి
పలుకఁడు చేతిఁచట్టి[1] పారవేసి పోయీనదె
చెలఁగుచు మూఁటగట్టెఁ జెల్లఁబో యిందాఁకను ॥అంటఁ॥

మట్టుపడ కిటు నూరుమారులైనా నారగించు
ఇట్టె యిందరిలోన నిన్నిష్టుసు
వెట్టికి నాకొరకుఁగా వేంకటేశుఁ డారగించె[2]
యెట్టు నేఁ డాఁకట ధరియించెనో యిందాఁకను ॥అంటఁ॥ 122

భూపాళం

ఏమో తెలిసెఁగాని యీజీవుఁడు
నేమంపునెరవిద్య నేరఁడాయ ॥పల్లవి॥

కపటాలె నేరిచెఁగానీ జీవుఁడు
యెపుడైనా నిజసుఖ మెఱఁగఁడాయ
కపురులే చవిగొనెఁగానీ జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ ॥ఏమో॥

---

పెదరేకు 3. 1. చద్ది. 2. గించు.

౧. 'చద్ది' పాఠము సా.రే.లోనే కలదు. 'చట్టి' పాఠము దేనిలోనిదో?

కడలనే తిరిగీఁగానీ జీవుఁడు
నడుము మొదలుఁ జూచి నడవఁడాయ
కడుపుకూటికే పోయీఁగానీ జీవుఁడు
చెడనిజీతముపొంతఁ జేరఁడాయ ॥ ఏమో ॥

కనియుఁ గానకపోయిఁగానీ జీవుఁడు
దివము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలనె చొక్కీఁగానీ జీవుఁడు
తనియ నిట్టే మంచిదరిఁ జేరఁడాయ ॥ ఏమో ॥ 123

సామంతం—అటతాళం

తనదీఁగాక ౧యిందరిదీఁగాక
తనువెల్ల బయలై దరిచేరదు ॥ పల్లవి ॥

కడుపూ నిండదు కన్నూఁ దనియదు
కడఁగి లోనియాఁకలియుఁ బోదు
నడిఁబడి కుడిచినకుడుపెల్ల నినుము-
గుడిచినసీరై కొల్లఁబోయె ॥ తన ॥

చవియూఁ దీరదు చలమూఁ బాయదు
లవలేశమైన నొల్లకపోదు
చివచివ నోటికడవలోనిసిరై
కవకవ నవియుచుఁ గారీని ॥ తన ॥

అలపూఁ దోఁచదు అడవీ నెండదు
యెలయించుభంగమయినఁ బోదు
తెలిసి వేంకటగిరిదేవునిఁ దలఁపించు-
తలఁపైనఁ దనకు ముందర నబ్బదు ॥ తన ॥ 124

---

౧. 'యొందరి' అని రేకు.

21 రేకు ఆహిరి

౧పెక్కులంపటాల మనసు పేదవై తివి నీకు
నెక్కడా నెవ్వరు లేరు యేమిసేతువయ్యా ॥ పల్లవి ॥

కన్ను మూయఁ బొద్దులేదు, కాలు చాఁచ నిమ్ముлేదు,
మన్ను దవ్వి కిందనైన మనికి లేదు,
మున్ని టివలెనే గోరుమోపనైనఁ జోటు లేదు,
యిన్నిటా నిట్లానై తి వేమిసేతువయ్యా ॥ పెక్కు ॥

అడుగిడఁగ నవ్వల లేదు, అందనైన నుండ లేదు,
పుడమిఁ గూడు గుడువనైనఁ బొద్దులేదు,
వెడఁగుఁదనము విడువలేదు, వేదమైనఁ జదువలేదు,
యెడపఁదడవ నిట్ల నీకు నేమిసేతువయ్యా ॥ పెక్కు ॥

వుప్పరములు మానినైన నుండలేదు లోకమందు,
నిప్పుడైన నీవిహార మిట్ల నాయను
చెప్పనరుదు నీగుణాలు శ్రీవేంకటేశ యిట్ల-
నెప్పుడును ఘనుఁడ వరయ నేమిసేతువయ్యా ॥ పెక్కు ॥125

శ్రీరాగం

ఇతఁడుచేసిన సేఁత లెన్నిలేవిలమీఁద
యితఁడు జగదేకగర్వితుఁడౌనో కాఁడో ॥ పల్లవి ॥

కుడువఁడా ప్రాణములుగొనుచుఁ బూతకిచన్ను
తుడువఁడా కపటదైత్యులనొసలివ్రాలు
అడువఁడా నేలతో నలమి శకటాసురుని
వడువఁడా నెత్తురులు వసుధ కంసునిని ॥ ఇతఁ ॥

౧. ఇందు సదశావతార మన్వయము కలదు.

పెట్టఁడా దనుజారిబిరుదు లోకమునందు
కట్టఁడా బలిదైత్యు కర్మబంధముల
మెట్టఁడా కాళింగుమేటిశిరములు, నలియఁ-
గొట్టఁడా దానవులఁ గోటానఁగోట్ల ॥ఇతఁ॥

౧మరపఁడా పుట్టువులు మరణములుఁ బ్రాణులకు
పరపఁడా గంగఁ దనపాదకమలమున
చెరపఁడా దురితములు శ్రీవెంకటేశుఁ డిదె
నెరపఁడా లోకములనిండఁ దనకీర్తి ॥ఇతఁ॥ 126

## సామంతం

ఆదిదైవుఁడై అందరిపాలిట-
కీ దేవుఁడై వచ్చె నితఁడు ॥పల్లవి॥

కోరినపరమయోగులచిత్తములలోన
యేరీతినుండెనో యీతఁడు
చేరవచ్చినయాశ్రితులనెల్లఁ బ్రోవ
యీరీతి నున్నవాఁ డీతఁడు ॥ఆది॥

కుటిలదానవుల ౨కోటానఁగోట్ల
యెటువలెఁ ౩ద్రుంచెనో యీతఁడు
ఘటియించి యిటువంటికారుణ్యరూపుఁడై
యిటువలె నున్నవాఁ డీతఁడు

తక్కక బ్రహ్మాండతతులెల్ల మోచి తా-
నెక్కడ నుండెనో యీతఁడు
దిక్కుల వెలసినతిరువేంకటేశుఁడై
యిక్కడ నున్నవాఁ డీతఁడు ॥ఆది॥ 127

---

౧. ఈ చరణము 2,3,4, పాదములందు ప్రాసస్థానమున శకటరేఫము పూ. ము. పా. రేకులో సాదురేఫమే. ౨. 'లఁగోటానఁ' పూ. ము: పా. ౩. 'దృంచె' రేకు.

గుండక్రియ

తానే తెలియవలె తలంచి దేహి తన్ను
మానుపువారలు మరి వేరీ ॥ పల్లవి ॥

కడలేనిభవసాగరమ్ము చొచ్చినతన్ను
వెడలించువారలు వేరీ
కడుబంధములచేతఁ గట్టుపడినతన్ను
విడిపించువారలు వేరీ ॥ తానే ॥

కాఁగినినుమువంటికర్మపుతలమోపు-
వేఁగు దించేటివారు వేరీ
మూఁగినమోహపుమూఁకలు తోడిఁబడ
పీఁగఁ దోలేటివారలు వేరీ ॥ తానే ॥

తిరువేంకటాచలాధిపునిఁ గొలువుమని
వెరవుచెప్పెడువారు వేరీ
పరివోనిదురితకూపములఁ బడకుమని
వెరవుచెప్పెడివారు వేరీ ॥ తానే ॥ 128

శ్రీరాగం

బయలు పందిలి వెట్టి పరగఁ జిత్తముగలిగె
దయమాలి తిరుగ నాత్మజుఁ డొకఁడు గలిగె ॥ పల్లవి ॥

కనుచూపువలన నుడుగనికోరికలు గలిగె
తనుకాంక్షవలనఁ బరితాపంబు గలిగె
అనుభవనవలన మోహాంధకారము గలిగె
తనివి ౧ దీరమివలన తలపోఁత గలిగె ॥ బయ ॥

౧. 'దీరని' రేకు.

అడియాసవలన పాయనిచలంబునుఁ గలిగె
కడుమమతవలన చీఁకటి దవ్వఁగలిగె
కడలేనితమకమునఁ ౧గాఁతాళమునుఁ గలిగె
నడుమ నంతటికి మాననిప్రేమ గలిగె ॥ బయ ॥

తరితీపువలన చిత్తభ్రాంతి తగఁ గలిగె
విరహంబువలన పురవేదనలుఁ గలిగె
తిరువేంకటాచలాధిపునికరుణామృతము
పరిపూర్ణమైన యాపద నీఁదఁగలిగె ॥ బయ ॥ 129

### కేదారగౌళ

పరమాత్ముని నోరఁ బాడుచును యిరు-
దరులు గూడఁగఁదోసి దంచీ మాయ ॥ పల్లవి ॥

కొలఁదిబ్రహ్మాండపుకుండెనలోన
కులికి జీవులనుకొలుసు నించి
కలికినిర్మోహపురోఁకలి వేసి
తలఁచి తనువులను దంచీ మాయ ॥ పర ॥

తొంగలిరెప్పలు గాత్రములుఁబగులును
సంగడికసుఁగవ సరిఁదిప్పుచు
చెంగలించి వెనఁ జేతులు విసరుచు
దంగుడుబియ్యముగా దంచీ మాయ ॥ పర ॥

అనయముఁ దిరువేంకటాధీశ్వరుని
పనుపడి తనలోఁ బాడుచును
పొనరి ౨విన్నాణిజీవులనెడిబియ్యము
తనర నాతనికియ్య దంచీ మాయ ॥ పర ॥ 130

---

౧. 'గాంతాళము' పూ.ము.పా. రేకులలో అంతటా 'గాఁతాళ' మనియే. ౨. 'విన్నాణి'రేకు.

22 రేకు నారణి

పరగుబహుసజ్జన్మపరిపక్వహృదయుఁడై[౧]
మరికదా వేదాంతమార్గంబు గనుట ॥ పల్లవి ॥

కలుషహరమగువివేకమ్ము గలిగినయట్టి-
ఫలముగాదా కృపాపారీణుఁడౌట
తలపోసి సకలభూతదయావిశేషంబు
కలిగికాదా గుణవికారంబు గనుట ॥ పర ॥

యెదిరిఁ దనవలెనె తా నెఱఁగనేర్చినఫలము
అదిగదా ద్రవ్యమోహంబు గడచనుట
పదిలమగునాశానుభవము పాపినయట్టి-
తుదగదా తాను సంతోషంబు గనుట ॥ పర ॥

రతి[౨]పరాఙ్ముఖమహారాజ్యమబ్బినఫలము-
మతిగదా తాను కర్మత్యాగియౌట
తతితోడ ఫలపరిత్యాగిచిత్తవ్యాపి-
ధృతిగదా వేంకటాధిపుదాసుఁడౌట ॥ పర ॥ 131

ముఖారి

చలపాదిరోగ మీసంసారము నేఁడు
బలువైనమందు విష్ణుభక్తి జీవులకు ॥ పల్లవి ॥

కీడౌట మది నెఱింగియు మోహ మెడల దిది
పాడైనవిధికృతము బలపంతము
[౩]యీడనే ఇది మాన్ప హితవైనవజ్రాంగి
జోడువో హరిఁ దలంచుట జీవులకును ॥ చల ॥

---

౧. 'యుడై' రేకు. ౨. 'పరాఙ్ముఖ' రేకు. ౩. 'ఈడనే యిది' వ్రా. ము. పా.

హేయమని తెలిసి తా నిచ్చగించీ యాత్మ
పాయ దీరతిసుఖము బలవంతము
మాయ నుగ్గులుసేయ మాధవునిదంచనపు-
రాయివో వైరాగ్యరచన జీవులకు ॥చల॥

పొలయుదురితంపురొంపులు దన్ను వడి ముంచ
పలుమారుజన్మ మీబలవంతము
నెలవుకొని సకలంబు నిర్మలముగాఁ గడుగు-
జలధివో వేంకటేశ్వరుఁడు జీవులకు ॥చల॥ 132

### వరాళి

చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలువలె నున్నవి
యీడులేనికన్ను లవె యినచంద్రులు ॥పల్లవి॥

కంటేఁ గంటి వాఁడె వాఁడె ఘనమైనముత్యాల-
కంటమాల లవే పదకములు నవె
మింటిపొడవై నట్టిమించుఁగిరీటం బదె
జంటలవెలుఁగుశంఖచక్రా లవె ॥చూడఁ॥

మొక్కు మొక్కు వాఁడె వాఁడె ముందరనే వున్నాఁడు
౧చెక్కు లవే నగవుతో జిగిమోమ దదె
పుక్కిట లోకము లవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలుజవరా లదె ॥చూడఁ॥

ముంగైమురాలును నవె మొల కఠారును నదె
బంగారునిగ్గులపచ్చ ౨పచ్చుబట్టదె
యింగిత మెరిఁగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటినిధానమైనమూలభూత మదే ॥చూడఁ॥ 133

౧. 'చెక్కుల లేనగవుతో జిగిమోము' కావచ్చు.
౨. 'పచ్చఁబట్ట' రేకు. పచ్చవిఁబట్టలో 'వి' స్థానమున వచ్చినసామాసికఖండబిందు వేమో?

### ముఖారి

ఎంతసేయఁగలేదు యిటువంటివిధి యభవు-
నంతవానిని భిక్షమడుగుకొనఁజేసె ॥ పల్లవి ॥

కోరి చంద్రునిఁ బట్టి గురుతల్ప[౧]గునిఁ జేసె
కూరిమలరఁగ నింద్రుఁ గోడిఁ జేసె
ఘోరకడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె
వీరుఁడగునలుఁ బట్టి [౨]విద్రూపుఁ జేసె ॥ఎంత॥

అతివ [౩]నొడ్డుగఁ జూదమాడ ధర్మజుఁ జేసె
సతి నమ్మకొన హరిశ్చంద్రుఁ జేసె
కుతిలపడ శూద్రకుని గొత్తెముచ్చుగఁ జేసె
మతిమాలి కురురాజు మడుఁగుచొరఁజేసె ॥ఎంత॥

పడనిపాట్లఁ బరచి బ్రహ్మతల వోఁజేసె
తొడరి కాలునికాలు దునియఁ జేసె
[౪]అడర నీవిధికి విధియగు వేంకటేశుకృప
పడయకుండఁగ భంగపడకపోరాదు ॥ ఎంత ॥ 134

### కాంబోది

ఏఁటిసుఖము మరి యేఁటిసుఖము వొక-
మాటమాత్రమున నటమటమైనసుఖము ॥ పల్లవి ॥

కొనసాగుదురితములె కూడైనసుఖము
తనువిచారములలో దాకొన్నసుఖము
పనిలేనియాసలకుఁ బట్టయినసుఖము
వెనకముందరఁ జూడ వెరగైనసుఖము ॥ఏఁటి॥

---

౧. 'తల్పగు' రేకు; పూ.ము.పా. ౨. 'విద్రూపు' చింత్యము. 'విరూపు'కావచ్చు. సంగీతమునకై 'వీరూపు' అని పాడుకొన్నా ఫరవాలేదు.
౩. 'నొడ్డుక' కావచ్చు. ౪. 'అడరని విధికి' పూ.ము.పా.

నిందలేకులోనైనసిరసపుసుఖము
బొందికిని లంచంబుపుణికేటిసుఖము
కిందుపడి పరులముంగిలిగాచుసుఖము
పందివలె తనుఁదానె బ్రదికేటిసుఖము ॥ఏఁటి॥

ధృతిమాలి యిందరికి దీనుఁడగుసుఖము
మతిమాలి భంగములు మఱపించుసుఖము
పతివేంకటేశుకృప పడసినది సుఖము
యితరంబులన్నియును నీపాటిసుఖము ॥ ఏఁటి ॥ 135

## శ్రీరాగం

దేహము దా నస్థిరమట దేహి చిరంతనుఁడౌనట
దేహపుమోహపునేఁతలు తీరుట లెన్నఁడొకో ॥పల్లవి॥

కన్నులఁబుట్టినకాంక్షలు కప్పికదా దుర్బోధల
కన్నులు మనసునుఁ దనియక గాసిఁబడిరి జనులు
త న్నిఁక నెరుఁగుట లెన్నఁడు తలఁపులు దొలఁగుట లెన్నఁడు
తిన్ననిపరవశములచేఁ దిరుగుట లెన్నఁడొకో ॥దేహ॥

సిగ్గులుదొలఁగనియాశలఁ జిక్కికదా దుర్మానపు-
సిగ్గులయెగ్గులచేతను చిక్కువడిరి జనులు
సిగ్గులు దొలఁగుట యెన్నఁడు చిత్తము లోనౌ టెన్నఁడు
తగ్గులమొగ్గులనేఁతలు తలఁగుట లెన్నఁడొకో ॥దేహ॥

మనసునబుట్టినయాతఁడు మనసునఁ బెనగొని తిరుగఁగ
మననే తానగుదైవము మరచిరి యందరును
అనయము తిరువేంకటపతి యాత్మఁ దలఁచిసుఖింపుచు
ఘనమగుపరమానందము గలుగుట లెన్నఁడొకో ॥ దేహ ॥136

23 రేకు ధన్నాసి

భావయామి గోపాలబాలం మన-
స్సేవితం తత్పదం ౧చింతయేయం సదా ॥ పల్లవి ॥

కటిఘటితమేఖలాఖచితమణిఘంటికా-
పటలనినదేన విభ్రాజమానం
కుటిలపదఘటితసంకుల ౨శింజితే నతం
చటులనటనాసముజ్జ్వలవిలాసం ॥ భావ ॥

నిరతకర ౩కలితనవనీతం బ్రహ్మాది-
సురనికరభావనాశోభితపదం
తిరువేంకటాచలస్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం ॥ భావ ॥ 137

ధన్నాసి

పంకజాక్షులు సొలసిపలికి నగఁగా-
నింకా నారగించు మిట్లనే అయ్యా ॥పల్లవి॥

కలవంటకములు పులఁగములు దుగ్ధాన్నములు
పలుదెరఁగులైనఅప్పములగములు
నెలకొన్ననేతులును నిరతంపుచక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా ॥ పంక ॥

పెక్కువగుసైఁదంపుపిండివంటలమీఁద
పిక్కటిలుమెఱుఁగుఁబోడిబెల్లములును
వొక్కటిగఁ గలపుకొని వొయిపుఁబప్పులతోడ
కిక్కిరియ నిటు లారగించవయ్యా ॥ పంక ॥

౧. 'చింతయేఽహమ్' కావచ్చు. ౨ 'శింజితానతం' కావచ్చునేమో. ఏమైనా అర్థ మంతసరిగా దోపదు. ౩. 'కీలిత' రేకు.

కడుమధురమైనమీఁగడపెరుగులను మంచి-
అడియాలపూరుఁగాయలరుచులతో
బడిబడిగ నవకంపుఁబళ్లెరంబులతోడ
కడునారగించు వేంకటగిరీంద్రా ॥పంక॥ 138

భూపాళం

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే ॥పల్లవి॥

కన్నులు దెరవక కమలబాంధవుఁడు
వెన్నెలరేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీ విటు మేలుకొనవే ॥భోగి॥

తెల్లనికన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్న వివే
కల్లనిదుర నిఁక గవియఁగనియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే ॥భోగి॥

౧తెరవగురెప్పలఁ దెల్లవారవలె
తెరవక చీఁకటి దీర దిదే
తెరఁగువేంకటాధిప నీ వెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే ॥భోగి॥ 139

---

౧. ఈ చరణములో రేఫలో, ఈ చరణము మొదటినుండి మూడుపాదముల-వరకు ప్రాసస్థానమున సాధురేఫమే. కడపటిపాదమున శకటరేఫ. యతిప్రాసస్థలములో ఈ వాఙ్మయమున సాధుశకటరేఫలసాంకర్య మరుదు. ప్రాయసకానిలోపము కావచ్చు. 'మెరుఁగు'ను 'మెఱుఁగు' గాచెక్కినాడేమో?

### శ్రీరాగం

ఏది చూచినను( గడు నిటువంటిసోద్యములే
    మేదినికిఁ గిందుపడి మిన్నందనేలా ॥ పల్లవి ॥

కరిరాజుగా[౧]చినకరుణానిధివి నీవు
    అరిది నరసింహరూపై తివేలా
    వురగేంద్రశయనమున నుండి నీవును సదా
    గరుడవాహనుఁడవై గమనించనేలా ॥ ఏది ॥

పురుషోత్తమఖ్యాతిఁ బొదలి యమృతము వంప
    తరుణివై వుండ నిటు దైన్యమేలా
    శరణాగతులకు రక్షకుఁడవై పాము నీ-
    చరణములకిందైన చలముకొననేలా ॥ ఏది ॥

దేవతాధిపుఁడవై దీపించి యింద్రునకు
    భావింప తమ్ముఁడనఁ బరగితేలా
    శ్రీవేంకటాచలస్థిరుఁడవై లోకముల-
    జీవకోట్లలోనఁ జిక్కువడనేలా ॥ ఏది ॥ 140

### మలహరి

కోరుదు నామది ననిశము [౨]గుణాధరు నిర్గుణుఁ గృష్ణుని
    నారాయణు విశ్వంభరు నవనీతాహారు ॥ పల్లవి ॥

కుండలిమణిమయభూషణు కువలయదళవర్ణాంగుని-
    నండజపతివాహనుని నగణితభవహరుని
    మండనచోరకదమనుని మాలాలంకృతవక్షుని
    నిండుకృపాంబుధిచంద్రుని నిత్యానందునిని ॥ కోరు ॥

---

౧. 'గాచిన' రేకు. పూ.ము పా.

౨. 'గుణ(ణా ?) పూ.ము.పా. 'గుణాధారు' వుండవచ్చునేమో.

ఆగమపుంజపదార్థుని ఆపత్సఖసంభూతుని
నాగేంద్రాయతతల్పుని నానాకల్పవిని
సాగబ్రహ్మమయాఖ్యుని సంతతగానవిలోలుని
వాగీశ్వరసంస్తోత్రుని వైకుంఠోత్తముని ॥ కోరు ॥

౧కుంకుమవసంతకాముని గోపాంగనకుచలిప్తుని ?
శంకరసతిమణినుతుని సర్వాత్ముని సముని
౨శంకనినాదమృదంగుని చక్రాయుధ౩వేదీప్తుని
వేంకటగిరినిజవాసుని విభవసం౪దాయినిని ∗ ॥ కోరు ॥ 141

సామంతం

అటు గుడువు మనస నీ వన్నిలాగులం బొరలి
ఇటు గలిగె నీకు నై౫ హితవిచారములు ॥ పల్లవి ॥

కోరికలకును గలిగె ఘోరపరితాపంబు
కూరిమికిం గలిగె ననుకూలదుఃఖములు
తారతమ్యములేనితలపోఁతలకుఁ గలిగె
భారమైనట్టిలంపటమనెడిమోపు ॥ అటు ॥

తనువునకుఁ గలిగె సంతతమైనతిమ్మటలు
మనువునకుఁ గలిగె నామనివికారములు
పనిలేనిసంసారబంధంబునకుఁ గలిగె
ఘనమైనదురితసంగతితోడిచెలిమి ॥ అటు ॥

దేహికినిఁ గలిగె నింద్రియములను బోధింప
దేహంబునకుఁ గలిగె తెగనిసంశయము
దేహాత్మకుండయినతిరువేంకటేశునకు
దేహిదేహాంతరస్థితిఁ జూడఁగలిగె ॥ అటు ॥ 142

---

∗ ఈరచన యప్రశస్తముగా నున్నది.

౧. 'గోపాంగనాకుచలిప్తకుంకుమవసంతకాముని' అను భావముతో ఈపాదము ఇట్లు చెరినదేమో? కొన్నితావుల యతిప్రాసలనిర్బంధము ఈపని చేయించుచున్నది. ౨. ప్రాసనిర్బంధముతో 'శంఖ' 'శంక' అయినదేమో. ౩. 'విదీప్తుని' కావచ్చు. ౪. 'విధాయకుని' కావచ్చునేమో. ౫ 'నైహిత' కావచ్చు.

24 రేకు వరాళి

ఆపదల సంపదల నలయు టేమిట మాను
రూపింప నిన్నిటను రోసినను గాక ॥ పల్లవి ॥

కడలేనిదేహరోగంబు లేమిట మాను
జడనువిడిపించునౌషధసేవఁగాక
విడవ కడియాస తను వేఁచు టేమిట మాను
వొడలికఁగుణమెల్ల నుడిగిననుఁగాక ॥ ఆప ॥

దురితసంగ్రహమైనదుఃఖ మేమిట మాను
సరిలేనిసౌఖ్యంబు చవిగొన్నఁగాక
కరుదైనమోహాంధకార మేమిట మాను
అరిదితేజోమార్గ మలవడినఁగాక ॥ ఆప ॥

౧చావులోఁ బెనగొన్నజన్మ మేమిట మాను
౨యీవలావలి కర్మ మెడసినఁ గాక
భావింప నరుదైనబంధ మేమిట మాను
శ్రీవేంకటేశ్వరుని సేవచేఁగాక ॥ ఆప ॥ 143

సామంతం

సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుఁడౌట ॥ పల్లవి ॥

కొదలేనితపములు కోటానఁగోటులు
నదన నాచరించి యటమీఁద
పదిలమైనకర్మబంధము లన్నియు
వదలించుకొనికదా వైష్ణవుఁడౌట ॥ సుల ॥

౧. 'చావుతో' కావచ్చు. ౨. 'యీవలావలి' పూ. ము పా. ప్రాసభంగము.

నివో నియాగతంత్రములు లక్షలసంఖ్య
అనఘుఁడై చేసినయటమీఁద
జననములన్నిట జనియించి పరమపా -
వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట ॥ సుల ॥

తిరిగితిరిగి పెక్కుతీర్థములన్నియు -
నరలేక సేవించినటమీఁద
తిరువేంకటాచలాధిపుఁడైనకరిరాజ -
వరదునికృపఁగదా వైష్ణవుఁడౌట ॥ సుల ॥ 144

ఆహిరి

ల సమకొను సుకృత మెల్లవారికి మహా-
మాలిన్యమున నాత్మ మాసినదిగాన ॥ పల్లవి ॥

లికాలదోషంబు కడవరానిదిగాన
తలఁపుదురితముల కాధారంబుగాన
బలుపూర్వకర్మములు పట్టరానివిగాన
మలమూత్రజన్మంబు మదకరముగాన ॥ ఏల ॥

గాఁపైనగుణవికారములు బహుళముగాన
ఆఁపరానివి యింద్రియంబు లటుగాన
దాఁపరంబగుమమత దయదలంపదుగాన
కాఁపురముచే నాస కప్పుకొనుఁగాన ॥ ఏల ॥

హృదయంబు చంచలం బిరవుగానదుగాన
చదువు బహుమార్గములఁ జాటునటుగాన
యెదురనుండెడువేంకటేశ్వరునినిజమైన -
పదముపై కోరికలు పైకొనవుగాన ॥ ఏల ॥ 145

శ్రీరాగం

౧ వలపు లధికము సేయు వైభవములు
తలఁపు లధికము సేయుఁ దలపోఁతలు ॥ పల్లవి ॥

కోప మధికముసేయుఁ గోరికలు
తాప మధికముసేయుఁ దమకంబులు
కోపంబుఁ దాపంబుఁ గూడ నధికముసేయు
యేపయినమోహముల నేమందమే ॥ వల ॥

మచ్చి కధికముసేయు మన్ననలు
యిచ్చ లధికముసేయు నీరసములు
మచ్చికలు నిచ్చలును మగుడ నధికముసేయు-
నెచ్చరికకూటముల నేమందమే ॥ వల ॥

అందమధికముసేయుఁ నైక్యములు
పొందు లధికముసేయుఁ బొలయలుకలు
అందములుఁ బొందులును నలర నధికముసేయు-
నెందు నరుఁదగువేంకటేశుకృపలు ॥ వల ॥ 146

వరాళి

చిత్త మతిచంచలము చేఁత బలవంతంబు
తిత్తిలో జీవుఁ డిటు దిరిగాడుఁగాక ॥ పల్లవి ॥

కదిసి జీవుఁడు పుట్టఁగాఁ బుట్టినటువంటి-
మొదలుఁదుదయునులేనిమోహపాశములు
వదలు పెటువలెఁ దారు వదలించు పెటువలెను
పదిలముగ నీవిచేఁ బడి పొరలుఁగాక ॥ చిత్త ॥

౧. ఇది ఒకపాటి శృంగారకీర్తనంబాయులో విది.

కడలేనిజన్మసంగ్రహములై యెన్నఁడును
 గడుగవసములుగానికర్మపంకములు
 విడుచు టెటువలెఁ దారు విడిపించు టెటువలెను
 విడువనివిలాపమున వేఁగుటలుగాక ॥ చిత్త ॥

యిందులోపల జీవుఁ డెన్నఁడే నొకమాటు
 కందు వెళిఁగి వివేకగతులభాగ్యమున
 అందముగఁ దిరువేంకటాద్రీశు సేవించి
 అందరానిసుఖంబు లందుఁగాక ॥ చిత్త ॥ 147

## ధన్నాసి

౧ ఉప్పవడము గాకున్నా రిందరు
 యెప్పుడు రేయి నీకెప్పుడు పగలు ॥ పల్లవి ॥

కన్నుల చంద్రుఁడును కమలమిత్రుఁడును
 వున్నతి నివి నీకుండఁగను
 వెన్నెలయెండలు వెలయఁగ మేల్కొను-
 టెన్నఁడు నిద్దుర యెన్నఁడు నీకు ॥ ఉప్ప ॥

కందువ సతికనుఁగలువలు ముఖార-
 విందము నిదివో వికసించె
 ముందర నిద్దుర మొలవదు చూచిన
 విందగునీతెలివికిఁ దుద యేది ॥ ఉప్ప ॥

తమము రాజసము తగుసాత్వికమును-
 నమరినదీమాయారతులు
 కమలాధిప వేంకటగిరీశ నిన్ను
 ప్రమదము మఱపునఁ బైకొను టెట్లా ॥ ఉప్ప ॥ 148

౧. ఇది ఒకపాటిశృంగారకీర్తనల ఛాయలోనిది.

దేశాక్షి

ఒప్పులై నొప్పులై వుండుఁగాన
అప్పటప్పటికిఁ జూడ నదియేకా నిజము ॥ పల్లవి ॥

కన్నుల కిన్నియుఁ జూడ కలలై వలలై
వున్నతాలు నడ్డాలై వుండుఁగాన
చిన్న[1]చిన్న చిటి[2]పొటి చిమ్ముదొమ్ముదిమ్ము లవి
వున్నవన్నియుఁ జూడ నొకటేకా నిజము ॥ ఒప్పు ॥

సారెకు నోరికిఁ జూడ చవులై నవ్వులై
వూరటమాటలై వుండుఁగాన
తారుమారు తాఁకుసోఁకు తప్పుదోఁపు లిన్నియు
వోరపారులేనివెల్ల వొక్కటేకా నిజము ॥ ఒప్పు ॥

మేనికి నిన్నియుఁ జూడ మృదువై పొదువై
వూని సంపదలై వుండుఁ గాన
తేనై తీపై తిరువేంకటేశ నిన్ను
కానవచ్చినదే [3]వొక్కటేకా నిజము ॥ ఒప్పు ॥ 149

శంకరాభరణం

పనిలేనిధనవాంఛఁ బడిపొరలిన నిట్టి-
కనుమూయలేకాక కడ నేమిగలదు ॥ పల్లవి ॥

కనుచూపుకాఁకలఁ గలయుట వెడయాస-
లనుభవింపుటగాక యందేమిగలదు
తనుపల్లిసోఁకులఁ దగులుట మమతల-
నెనయఁగోరుటగాక యిందేమిగలదు ॥ పని ॥

౧. 'చన్న' రేకు. ౨. 'పాటి' రేకు. ౩. 'వొక్కటే నిజము' రేకు.

యెలమి నధర మాను పెరిఁగి యెంగిలి నోర-
నలముకొనుట గాక యందేమిగలదు
పలులంపటములచేఁ బడుట దుఃఖంబులు
తలఁజుట్టుపేకాక తన కేమికలదు ॥ పని ॥

శ్రీవేంకటాద్రీశుఁ జేరనిపనులెల్ల -
సేవగింతలేకాక యిం దేమిగలదు
ఆవల సురతభోగ మనుభవింపఁబోయి
రావలయుటగాక రచనేమిగలదు ॥ పని ॥ 150

సామంతం

కొండలలో నెలకొన్నకోనేటిరాయఁడు వాఁడు
కొండలంతవరములు గుప్పెడువాఁడు ॥ పల్లవి ॥

కుమ్మరదాసుఁడైనకురువరతినంబి
ఇమ్మన్నవరములెల్ల నిచ్చినవాఁడు
దొమ్ములు సేసినయట్టితొండమాంజక్కురవర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాఁడు ॥ కొండ ॥

అచ్చపువేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోఁచినవాఁడు
మచ్చికదొలఁకఁ దిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు ॥ కొండ ॥

కంచిలోన నుండఁ దిరుకచ్చినంబిమీఁదఁ గరు-
ణించి తనయెడకు రప్పించినవాఁడు
యెంచ నెక్కుడైనవేంకటేశుఁడు మనలకు
మంచివాఁడై కరుణఁ బాలించినవాఁడు ॥ కొండ ॥ 151

### గుండక్రియ

కడుఁ జంచలములు కడు ౧నధ్రువములు
కడునల్పములని కాదందురు ॥ పల్లవి ॥

కర్మబోధవికారంబులు
ధర్మతంత్రసంధానములు
దుర్మదైకసందోహములు
కర్మదూరు లివి గాదందురు ॥ కడు ॥

పరమభాగవతభవ్య౨మతులు
పరమబోధసంభావకులు
తిరువేంకటగిరిదేవుసేవకులు
కరుణాధికు లివి గాదందురు ॥ కడు ॥ 152

### గుండక్రియ

పోయం గాలము ౩వృథయై పుట్టినమొదలుం గటకట
౪నీయెడ నామది నిజమై నిలుచుట యెన్నఁడొకో ॥ పల్లవి ॥

కుడిచిన నాఁకలి దీరదు కుడువఁగఁగుడువఁగఁ బైపై
కడుఁబొదలెడుదీపన మిది గడచుట యిఁక నెట్లు
కుడువకమానుట యెన్నఁడు కోరికదీరుట యెన్నఁడు
తడయక నీరూపము నేఁ దలఁచుట లెన్నఁడొకో ॥ పోయ ॥

జీవుఁడుపుట్టినమొదలునఁ జేతికి నూఱట చాలక
యేవిధమున భుజియించిన నెడయదు దీపనము
శ్రీవేంకటపతి నా కిఁక శ్రీకరుణామృత మియ్యక
పావనమందదు నామది పాలించందగదా ॥ పోయ ॥ 153

---

౧. 'నధ్రువ' రేకు. ౨. 'మమతలు' పూ.ము.పా.
౩. 'వ్రిథయై' రేకు. ౪. 'యడ' రేకు.

లలిత

అతిశయమగుసౌఖ్య మనుభవింపుమన్న
హితవు చేకొననొల్ల రిందరు ॥ పల్లవి ॥

కడలేనివిజ్ఞానగతికిఁ దోడుగారు
యెడపులవారలె యిందరు
అడరినమోక్షసహాయు లెవ్వరు లేరు
యిడుమపాట్లవారె యిందరు ॥ అతి ॥

తిరమైనపుణ్యము బోధించేవారు లేరు
యెరవులవారే యిందరు
తిరువేంకటాచలాధిపునిమీఁదిచిత్త-
మిరవుసేయకపోయి రిందరు ॥ అతి ॥ 154

మాళవి

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీశ్రీపాదమే శరణు ॥ పల్లవి ॥

కమలాసతీముఖకమలకమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమన శ్రీ-
కమలనాభ నీపదకమలమే శరణు ॥ శ్రీమ ॥

పరమయోగిజనభాగధేయ శ్రీ-
పరమపూరుషా పరాత్పరా
పరమాతుమ పరమాణురూప శ్రీ-
తిరువేంకటగిరిదేవ శరణు ॥ శ్రీమ ॥ 155

26 రేకు లలిత

ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
యెనసి ముందర సాగ దేఁటిబ్రదుకు ॥పల్లవి॥

కడలేనియాసచే కరఁగికరఁగి చిత్త-
మెడమవంకకు వచ్చె నేఁటిబ్రదుకు
పొడవైనమమతతోఁ బొదలఁ బొదల మాన-
మిడుమపాట్లఁ బడె నేఁటిబ్రదుకు ॥ఎను॥

తెగుదెంపులేనిభ్రాంతికిఁ జిక్కి యాచార-
మెగసి గొందులు దూరె నేఁటిబ్రదుకు
పగగొన్నమోహతాపము వేరుగ విజ్ఞాన-
మిగురువెట్టక మానె నేఁటిబ్రదుకు ॥ఎను॥

భావింప రోఁతలోఁబడి పొరలెడిసౌఖ్య-
మేసఁగింపఁడు జీవుఁ డేఁటిబ్రదుకు
శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటె కాని
యేవంక సుఖము లే దేఁటిబ్రదుకు ॥ఎను॥ 156

శ్రీరాగం

చావుతోసరియైనసౌఖ్యంబులోఁ దగిలి
వేవేలుదురితముల వేగించు టొండె ॥పల్లవి॥

కనుఁగొనల నిరుమేను గాఁడిపాఱుట లొండె
చనుఁగొండలను ౧మహాచరులఁ బడు టొండె
తనివోనిసురతములఁ దగిలి మునుఁగుట యొండె
ఘనమోహబంధములఁ గట్టువడు టొండె ॥చావు॥

౧. 'మహాచరులఁ' విరుద్ధసమాసము. ఈచిల్లరదోషముల కీవాఙ్మయమున పట్టింపులేదు.

మొనసి యాశాపాశములయురులఁ బడు టొండె
కనలి పొలయలుకచేఁ గాఁగు టది యొండె
మనసు ¹కాఁతాళమున మల్లువెనఁగుట లొండె
పనిలేనిమదనాగ్నిఁ బడి పొరలు టొండె ॥ చావు ॥

తడసి మమతల నిరంతర²దైన్య మది యొండె
నడుమనే కన్నుగానక తిరుగు టొండె
యెడప కీతిరువేంకటేశుఁ దలఁపఁగలేక
పడనిపాట్లనెల్లఁ బడి వేఁగు టొండె ॥ చావు ॥ 157

ముఖారి

ఆఁకటివేళల నలపైనవేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱి లేదు ॥ పల్లవి ॥

కొఱమాలివున్నవేళ కులముచెడినవేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైనహరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మఱి లేదు తెరఁగు ॥ ఆఁక ॥

ఆపదవచ్చినవేళ యారడిఁబడినవేళ
పాపపువేళల భయపడినవేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాఁకాఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ॥ ఆఁక ॥

సంకెళఁబెట్టినవేళ చంపఁబిలిచినవేళ
అంకిలిగా నప్పులవా రాఁగినవేళ
వెంకటేశునామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ॥ ఆఁక ॥ 158

౧. 'కాంతాళమున' పూ.ముపా. రేకులందంతటా 'కాఁతాళ'మనియే వున్నది.
౨. 'ధైర్య' పూ.ము.పా.

ముఖారి

మోసమున మాయావిమోహితుఁడై పోయి
కాసు సేయనిపనికి గాసిఁబడెఁ బ్రాణి ॥ పల్లవి ॥

కన్నులనియెడిమహాకల్పభూజము లివి
తన్నుఁ బుణ్యునిఁజేయఁ దగిలి వచ్చినవి
వున్నతోన్నతబుద్ధి నొనగూర్ప కది దేహి
కన్నచోటికిఁ బఱపి గాసిఁబడెఁ బ్రాణి ॥ మోస ॥

చిత్తమనియెడిమహాచింతామణి దనకు
తొత్తువలె వలసి తనుఁ దోడుతేఁగలది
హత్తించి హరిమీఁద నలరింప కది వృథా
తిత్తిలో సుఖమునకు తిరిగె నీప్రాణి ॥ మోస ॥

కామతత్వంబనెడికామధేనువు దనకు
వేమారుఁ గోరికల వెల్లిగొలిపెడిది
యీమేను తిరువేంకటేశుఁ జేరకపోయి
కామాంధుఁడై మిగుల గతిమాలెఁ బ్రాణి ॥ మోస ॥ 159

దేసాక్షి

కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ ॥ పల్లవి ॥

కాకివోటు జముచేత కందుకుందు మదుచేత
మా కాపని గాదు మనుజులాల
పోకుమని యాఁపరాదు పొమ్మని చెప్పఁగరాదు
మీకుమీకే చూచుకొండు మీరే కనుఁడు ॥ కొండో ॥

గాములిల్లు పుట్టమీఁదికప్పు తోలు పైకప్పు
నేమా యెఱఁగము నిపుణులాల
పామునోరికడి మీప్రాణపుటూరుపుగాలి
జాము జాము మేలుఁగీడు చక్కఁజేయఁ గనుఁడు ॥ కొండో ॥

రచ్చమావిచింతకింద రాఁపులకూటమిపొందు
ముచ్చో చిచ్చో మూఢులాల
యెచ్చరికతోడ వేంకటేశుదాసులఁ గూడి
పచ్చిగచ్చుమేనితోడ భయమెల్లఁ బాయుఁడు ॥ కొండో ॥ 160

నాట

మందు లేదు దీనికి మంత్ర మేమియు లేదు
మందుమంత్రము దనమతిలోనే కలదు ॥ పల్లవి ॥

కదలకుండఁగఁ దన్నుఁ గట్టివేసినఁ, గట్టు
వదలించకొనఁ గొంత వలదా
వదలించఁబోయిన వడిగొని పైపైనే
కదియుఁగావి తన్ను వదల దేమియును ॥ మందు ॥

మనసులోపలనుండి మరి మీఁదఁ దా నుండి
యెనసినతిరువేంకటేశుని
తనరినతలఁపునఁ దలఁప దుష్కృతములు
తనకుఁదానే పీడుఁ దలఁకవలదుగాన ॥ మందు ॥ 161

27 రేకు ఆహిరి

ఏమీనెఱఁగనిమమ్ము నెక్కువసేసి
పామరుల దొడ్డఁజేసె భాష్యకారులు ॥ పల్లవి ॥

గతచన్న వేదాలు కమలజునకు నిచ్చి
అతనికరుణచేత నన్నియుఁ గని
గతిలేకపోయినకలియుగమున వచ్చి
ప్రతిపాలించఁగలిగె భాష్యకారులు ॥ ఏమీ ॥

లోకమెల్ల వెల్లిఁబోఁగా లోననే సురలఁ గాచి
ఆకుమీఁదఁ దేలినయతనికృప
కాకరిమతములెల్ల గాలిఁబుచ్చి పర మిచ్చే
పైకొనఁగఁ గరుణించె భాష్యకారులు ॥ ఏమీ ॥

పంకజపుఁజేయి చాఁచి పాదపుఁబరమిచ్చిన-
వేంకటేశుకృపతోడ వెలయఁ దానే
తెంకినే వాదయవరై తిరుమంత్రద్వయాన
పంకమెల్లఁ బోఁగడిగె భాష్యకారలు ॥ ఏమీ ॥ 162

కన్నడగౌళ

౧ఆటవారిఁ గూడితౌరా
ఆటవారిఁగూడి అన్నిచోట్ల బొమ్మ-
లాట లాడించ నధికుండవైతివి ॥ పల్లవి ॥

గురుతరమగుపెద్దకొట్టాములోపల
తిటమైనపెనుమాయఁ దెరగట్టి
అరయ నజ్ఞానము లవి యడ్డముగఁజేసి
పరగ సుజ్ఞానదీపములు ముట్టించి ॥ ఆట ॥

౧. ఈపల్లవి మూడుపాదములుగా నున్నది.

తోలుబొమ్మల దోరకొని గడియించి
గాలిచేత వానిఁ గదలించి
తూలేటిరసములు తొమ్మిది గడియించి
నాలుగుముఖముల నలువున నాడించ ॥ ఆట ॥

నిన్నే మెత్తురుగాని నీకేమి నీలేరు
మన్నించుదాతలు మరి లేరు
యెన్నఁగఁ దిరువేంకటేశ్వర నీదాసు-
లున్నతులై నిన్ను నుబ్బించి పొగడఁగ ॥ ఆట ॥ 163

## సామంతం

౧బ్రువంతి బౌద్ధా బుద్ధఇతి
స్తువంతి భక్తా సులభ ఇ౨తి ॥ పల్లవి ॥

గదంతికిల౩ సాంఖ్యాస్త్వాం పురుషం
పదవాక్యజ్ఞాః పదమితిచ
విదంతి త్వా వేదాంతిన-
స్సదా బ్రహ్మ లసత్పదమితిచ ౪ ॥ బ్రువం ॥

జపంతి మీమాంసకా స్త్వాం చ
విపులకర్మణో విభవ ఇతి
లపంతి ౫నయసకలా స్సతతం
కృపాళుకర్తా కేవలమితిచ ॥ బ్రువం ॥

భణంతి వేంకటపతే మునయో-
హ్యణిమాదిప్రద మతులమితి
గుణవంతం నిర్గుణం పునరితి
గృణంతి సర్వే కేవలమితిచ ॥ బ్రువం ॥ 164

౧. 'బృవంతి' రేకు. ౨. 'సులభమితి' రేకు. పూ. ము. పా. ౩ ఖిల,. రేకు.
౪. 'స్త్వా' రేకు. ౫ 'నయ(న్యాయ) వాదినః సకలాః' అని విగ్రహవాక్యము కావచ్చు.

సామంతం

సతతం శ్రీశం
హితం పరాత్పర మీడే ॥ పల్లవి ॥

గదాధరం మేఘగంభీరని-
నదం పరమోన్నతశుభదం
మృదుతరగమనం మేదినీధరం
హృదయనిలయ మహ మీడే ॥ సత ॥

నందకధరం జనార్దనం గో-
విందం చారుముకుందం
నందగోపవరనందనకందం
యిందురవినయన మీడే

గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరిదేవ మతులం మ-
హిరమణం స్థిర మీడే ॥ సత 165 ॥

ఆహిరి

ఇన్నిలాగులచేతు లివియపో కడు-
నెన్నికకెక్కినచేతు లివియపో ॥ పల్లవి ॥

గునియుచుఁ దనునెత్తుకొమ్మని తల్లిపై-
నెనయఁ జాఁచినచేతు లివియపో
కినిసి గోవర్ధనగిరి వెల్లగించిన-
యినుమువంటిచేతు లివియపో ॥ ఇన్ని ॥

పిసికి పూతకిచన్ను బిగియించిపట్టిన-
యిసుమంతలు చేతు లివియపో
పసులఁ గాచుచు గొల్లపడుచుల యమునలో
యిసుకచల్లినచేతు లివియపో ॥ ఇన్ని ॥

రమచైతన్యమై ప్రాణులకెల్లను
యొరవులిచ్చినచేతు లివియపో
తిరువేంకటగిరిదేవుఁడై ముక్తికి-
నిరవుచూపెడుచేతు లివియపో ॥ఇవి॥ 166

సాళంగనాట

నినంతు విడిచినవాఁడే యోగి; యీ-
ఆసలెల్లా విడిచినఅతఁడే యోగి ॥పల్లవి॥

ంచి పారెడుతురగమువంటిమనసు
వద్దవి మరలించినవాఁడే యోగి
వొద్దనే కొండలవంటివున్నతదేహగుణాలు
దిద్ది మట్టుపెట్టువాఁడే ధీరుఁడైనయోగి ॥వాసి॥

ంచుకొన్న యింద్రియపుమోహజలధిలోన
వంచన మునుఁగనట్టివాఁడే యోగి
పొంచి పుణ్యపాపములు పొట్టువంటికర్మములు
దంచి పారఁజల్లువాఁడే తత్త్వమైనయోగి ॥వాసి॥

తుకామాదుల వెళ్లఁగొట్టి శాంతుఁడై
వగలుడిగినయట్టివాఁడే యోగి
నిగిడి శ్రీవేంకటపతినిజదాసుఁడై భక్తిఁ
దగిలి నిలుపువాఁడే ధన్యుఁడైనయోగి ॥వాసి॥ 167

గుండక్రియ

లేనిబంధము తోడునీడై నెను-
పెఁలినా నన్ను వదల దేమిసేతు ॥పల్లవి॥

గులిమికొలుచు దీరఁగుడువనియ్యక కొత్త-
కొలుచు మీఁదమీఁదఁ గొలవఁగా
కలసినకర్మపుఁగలిమిచేతఁ [1]దృష్ట
వెలితిగాక యిల్లువెడల దేమినేతు ॥ తుద ॥

అన్నియు నొకమాటే యనుభవింపఁగఁజేసి
కొన్ని వెచ్చము [2]లోనఁగూడించి
యిన్నిటాఁ దిరువేంకటేశ నిర్మలునిఁగా
నన్నుఁజేసి నీవు నాకుఁ గలుగవయ్య ॥ తుద ॥ 168

28 రేకు సాళంగం

తొలుఁబాపపుణ్యాలతోడఁ బుట్టితినట
బలువైనభవములఁ బడలేనా ॥ పల్లవి ॥

గాములయింటనే కాఁపనయితినట
పాముపుట్టనుండియైన బతుకలేనా
గోమున హేయపుఁగుండకూడు నించితినట
గామిడి[3]నేగారేతిత్తిఁ గానోపనా ॥ తొలుఁ ॥

కష్టైనగుణములచే కట్టువడితినట
చుట్టపుబంధాలరొచ్చుకు నోపనా
దట్టపుటాసల నేఁ దాల్చితినట నా-
వెట్టకాయము మోవవెఱచేనా ॥ తొలుఁ ॥

[4]నిగిడినలోపల నీ వుండుదువట
పగవారికి నేఁ బగిలేనా
తగువేంకటేశ నీదయవాఁడనట యీ-
వగల నిన్నిఁట గెలువఁగలేనా ॥ తొలుఁ ॥ 169

---

౧. 'దృష్ట' పూ. ము. పా. ౨. 'లొనఁగూడించి' లో అరసున్న చింత్యము
౩. 'నేగారేతిత్తిఁ'=(నేయిగారుతిత్తివి)' కావచ్చు. ౪. 'నిగిడి నాలోపల' కావచ్చు

## శ్రీరాగం

[1]ఈతఁ డఖిలంబునకు నీశ్వరుఁడై సకల-
భూతములలోనఁ దాఁ బొదలువాఁ డితఁడు ॥ పల్లవి ॥

గోపాంగనలమెఱుఁగుగుబ్బచన్నులమీఁద
చూపట్టుకమ్మఁగస్తురిపూఁత యితఁడు
తాపసోత్తములచింతాసౌధములలోన
దీపించుసుజ్ఞానదీప మితఁడు ॥ ఏత ॥

జలధికన్యాపాంగలలితేక్షణములలో
కలసి వెలుఁగుచున్నకజ్జలం బితఁడు
జలజాసనునివదనజలధిమధ్యమునందు
అలర వెలువడినపరమామృతం బితఁడు ॥ ఏత ॥

పరివోనిసురతసంపదలనింపులచేత
వరవధూతతికి పరవ [2]మైనయితఁడు
తిరువేంకటాచలాధిపుఁడు దానై యుండి
పరిపాలనముసేయ భారకుం డితఁడు ॥ ఏత ॥ 170

## సామంతం

ఎన్నఁగలుగుభూతకోటినెల్లఁ జేసినట్టిచేఁత
నిన్నుఁ జేసుకొనుటగాక నీకుఁ దొలఁగవచ్చునా ॥ పల్లవి ॥

గుట్టుచెరిచి లోకమెల్ల ఘోరసంసారమందు
కట్టివేసినట్టిపాపకర్మ మేల తీరును
పట్టితెచ్చి నిన్ను రోలఁగట్టివేసి లోకమెఱుఁగ
రట్టుసేసుఁగాక నిన్ను [3]రాఁజనన్న విడుచునా ॥ ఎన్న ॥

---

౧ 'ఏతదఖిలంబు' పూ.ము పా. ౨. 'మైనదిత' పూ ము పా. ౩. 'రాజవన్న' రేకు.
౧, ౨. లలో పూ. ము. పాఠము మంచిది కావచ్చు. రేకుపాఠము చూపి మనపాఠము లిచ్చుట మంచిదిగదా ?

మిఱ్ఱుపల్లములకుఁ దెచ్చి మెరసి భూతజాలములకుఁ
దొఱ్ఱుపెసలు గొలచినట్టి దోసమేల పాయును
అఱ్ఱుసాఁచి గోపసతుల నలమి వెంటవెంటఁ దిరుగ
వెఱ్ఱిఁ జేయుఁగాక నీవు విభుఁడనన్న విడుచునా ॥ఎన్న

పరులఇంటి కేఁగి పరులపరుల వేఁడఁజేసినట్టి-
౧యెరుకమాలినట్టిచేఁత లేల నిన్ను విడుచును
వెరవుమిగిలి వేంకటాద్రివిభుఁడననుచు జనులచేత-
నరులుగొనఁగఁ జేయుఁగాక ఆస నిన్ను విడుచునా ॥ఎన్న॥ 17

బౌళి

ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను
యేమరక కొలిచిన నీతఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై
తనుఁగొలువుమని చిత్తములిచ్చుఁ గరుణించి
వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితములేనికొడుకుల నిచ్చును
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు
నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము ॥ఏమి॥

పంతమాడి కొలిచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు
యెంతటిపదవులైన నిట్టె యిచ్చు
వింతవింతవిభవాలవేంకటేశుఁ డిదె మా-
యంతరంగముననుండేఅరచేతిదైవము ॥ఏమి॥ 172

౧. 'యెఱుక' పూ. ము. పా.

పాడి

వెట్టిమోపువంటిమేను విడనాడి వీఁ
డిట్టె దాఁటిపోయె నెటువంటిజాణే ॥ పల్లవి ॥

ఘోరమైనఆసలనెడికూఁకటవేరు దవ్వి -
పారవేసి యిడుమలఁ బడనొల్లక
యీరసపుసంసార మింగలము దగిలించి
యేరు దాఁటిపోయె నెటువంటిజాణే ॥ వెట్టి ॥

కన్నవారిఁ దన్నుఁ బ్రేమ నన్నవారి దిగనాడి
వున్నతమైనచోట నుండఁబోయి
తన్నుఁదా వేంకటపతిదాసులఁజేరి వాఁడు
యెన్నఁడుఁ దిరిగిరాఁడే యెటువంటిజాణే ॥ వెట్టి ॥ 173

లలిత

వలవనిమోహావస్థలఁ బొరలెడి-
మలినం బెన్నఁడు మానును ॥ పల్లవి ॥

ఘోరదురితవికారంబుల-
కారణ మెన్నఁడు దీరును
వైరముగొని తనువదలనిబంధపు-
భారం బెన్నఁడు వాయును ॥ వల ॥

జడమగుజిహ్వాచాపల్యముగల-
వెడమతి యెన్నఁడు వీడును
చెడనిజీవునకు శ్రీవేంకటపతి-
కడచూ పెన్నఁడు గలుగును ॥ వల ॥ 174

లలిత

ఆశాబద్ధుఁడనై యలసి నిన్నుఁ గడు-
గాసిఁబెట్టినవాఁడఁ గాను ॥ పల్లవి ॥

ఘనకర్మపరుఁడనై కర్మరూపునిఁ జేయ
నిను దూరి భారము నీకుఁ గట్టినవాఁడఁ గాను
పనిలేనిదుఃఖలంపటుఁడనై దుఃఖము
గనుపించకుమని కడువేఁడినవాఁడఁ గాను ॥ ఆశా ॥

శ్రీవేంకటగిరిదేవేశ నా కిది
గావలెననువాఁడఁ గాను
కావలసినయవి గదిసిన నవి నాకుఁ
గావనుమనుజుండఁ గాను ॥ ఆశా ॥ 175

29 రేకు శ్రీరాగం

కోరికె దీరుట యెన్నఁడు గుణమును నవగుణమునుఁ జెడి
వూరక యీమది నీపైనుండుట యెన్నఁడొకో ॥ పల్లవి ॥

చిత్తం బాఁకలి దీరదు, చింత దలంపునఁ బాయదు
యెత్తినపరితాపమునకు నేదీ మితిమేర
హత్తినపుణ్యము బాపము నప్పటిసుఖములకొరకే
వత్తికి నూనెకుఁ గొలఁదై వడిఁ జనె దివసములు ॥ కోరి ॥

జీవుఁడె పరతంత్రుఁడుగన చింతింపఁడు నిన్నో కు
చావునఁ బుట్టుగు సహజము శరీరధారులక
శ్రీవనితాహృదయేశ్వర శ్రీవేంకటగిగివల్లభ
పావనమతిపై ప్రాణులు బ్రదుకుట యెన్నఁడొకో ॥ కోరి ॥ 176

కాంబోది

గడ్డపార మింగితే నాఁకలి దీరీనా ౹యీ-
వొడ్డినభవము దన్ను ంవొడ కమ్ముఁగాక ॥ పల్లవి ॥

చించుక మిన్నులఁబారేచింకలను బందిఁగట్టి
వంచుకొనేమన్న నవి వసమయ్యీనా
యెంచరానియింద్రియము లెవ్వరికి నేల చిక్కు-
పొంచి పొంచి వలపుల బొండఁబెట్టుఁగాక ॥ గడ్డ ॥

మంటమండేయగ్గి దెచ్చి మసిపాఁత మూఁటగట్టి
యింటిలోన దాఁచుకొన్న నితవయ్యీనా
దంటమమకార మిట్టే తన్ను నేల సాగనిచ్చు
బంటుఁజేసి ఆసలనే పారఁదోసుఁగాక ॥ గడ్డ ॥

పట్టరానివిషములపాముఁ దెచ్చి తలకిందఁ
బెట్టుకొన్నా నది మందపిలి వుండీనా
వెట్టసంసార మిది వేంకటేశుఁ గొలువని-
వట్టిమనుజుల పెడవాడఁబెట్టుఁగాక ॥ గడ్డ ॥ 177

కన్నడగౌళ

కటకటా దేహంబు గాసిఁబెట్టఁగవలనె
నిటువంటిదెసలచే నిట్లుండవలసె ॥ పల్లవి ॥

చంపనొల్లకకదా సంసారమనియెడి-
గంపమోఁపు గడించె కర్మసంగ్రహము
లంపటము విరియించ లావుచాలక తుదిని
దింప నొకకొంతైన తెగుదెంపులేదు ॥ కట ॥

---

౧. 'ఒల్ల' కావచ్చు.

మనుపనోపకకదా మాయావిలంబమున
కనుమూసి కాంక్ష మఱి కట్టె దైవంబు
దినభోగములు విడువఁ దెఱఁ గేమిటను లేక
తనివిఁబొందించ నెంతయు వసముగాదు ॥ క॥

తెలుపనోపకకదా తిరువేంకటేశ్వరుఁడు
వెలలేనివేదనల వేఁచెఁ బ్రాణులను
బలిమి నజ్ఞానంబుఁ బాయలే కితనినే
౧తలఁచి భవబంధముల దాఁటంగరాదు ॥ కట ॥

సామంతం

అయ్యో పోయఁ బ్రాయముఁ గాలము
ముయ్యంచుమనసున నే మోహమతి నైతి ॥ పల్ల॥

చుట్టంబులా తనకు సుతులుఁగాంతలుఁ జెలులు
వట్టియాసలఁ బెట్టువారేకాక
నెట్టుకొని వీరు గడునిజమనుచు హరి నాత్మఁ
బెట్టనేరక ౨వృథా పిరివీకులైతి ॥ అయో

తగుబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
వగలఁ బెట్టుచుఁ దిరుగువారేకాక
మిగుల వీరలపొందు మేలనుచు హరి నాత్మఁ
దగిలించలేక చింతాపరుఁడనైతి ॥ అయో

అంతహితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతువాసికిఁ బెనఁగువారేకాక
అంతరాత్ముఁడు శ్రీవేంకటాద్రీశుఁ గొలువ కిటు
సంతకూటములయలజడికి లోనైతి ॥అయ్యో॥

౧. 'తలఁచికాని' అని అర్థము కావచ్చు. ౨. 'వ్రిథా' రేఫ.

లలిత

మనసున నెప్పుడు మాన దిది
దినబాధెటువలెఁ దీఱీనో ||పల్లవి||

చిత్తవికారము జీవులపాపము
తత్త్రరపరచేక తడయ దిది
కత్తులబో నీకాయపువయసున-
నెత్తినమదమున కేదిగతో ||మన||

అసలుఁగంబ మీయాశాదోషము
విసిగిన నూరక విడువ దిది
వసులమూఁట మోవఁగఁ బడవేయఁగ
వసము గాని దెటువలెనౌనో ||మన||

పాముచెలిమి రంపపుసంసారము
గాములమోఁచినగంప యిది
కామించుచు వేంకటపతిఁ దలఁపక
యేమరివుండిన నేమౌనో ||మన|| 180

ధన్నాసి

ఎంతవిభవము గలిగె నంతయును నాపదని
చింతించినదిగదా చెడనిజీవనము ||పల్లవి||

చలముఁ గోపంబుఁ దనుఁ జంపేటిపగతులని
తెలిసినది యదిగదా తెలివి
తలకొన్నపరనింద తనపాలిమృత్యువని
తొలఁగినది యదిగదా తుదగన్నఫలము ||ఎంత||

మెఱయువిషయములే తనమెడనున్నవురులుగా
యెఱఁగినది యదిగదా యెరుక
పఱివోనియాస దనుఁ బట్టుకొనుభూతమని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ ॥ ఎంత ॥

యెనలేనితిరువేంకటేశుఁడే దైవమని
వినఁగలిగినదిగదా వినికి
అనయంబు నతనిసేవానందపరులయి
మనఁగలిగినదిగదా మనుజులకు మనికి ॥ ఎంత ॥ 181

30 రేకు ఆహిరి

చెల్లఁగా కిటు నీకే చింతింపఁగా పూరి-
పుల్ల మేరువుసేయ భూమిలో నిపుడు ॥పల్లవి॥

చెలఁగి నే మునుసేసినచేఁత లుండఁగా
మలసి నేఁ దిరుగుతిమ్మట లుండఁగా
తొలఁగఁదోసి తుప్పుడుతోడనే లోహంబు
వెలయ బంగారుగావించినగతిని ॥ చెల్లు ॥

బిగిసి నామైనున్న పెనుకట్లుండఁగా
జగడగాండ్లు పగచాటఁగను
జిగిగలచేఁతిముసిఁడికాయయగునన్ను
మొగిఁ గల్పకముఫలముగఁ జేయవసమా ॥ చెల్లు ॥

పొదలిన యింద్రియంబులు వెంట రాఁగా
మదవికారము నే మరుగఁగానే
వదలక వేంకటేశ్వర నన్ను నిదే నీ-
పదపంకజములు చేర్పఁగ నిది వసమా ॥చెల్లు॥ 182

పాడి

చక్రమా హరిచక్రమా
వక్రమైనదనుజుల వక్కలించవో ॥పల్లవి॥

చుట్టిచుట్టి పాతాళముచొచ్చి హిరణ్యాక్షుని -
చట్టలు చీరిన వోచక్రమా
పట్టినశ్రీహరిచేతఁ బాయక యీజగములు
వొట్టుకొని కావగదవో వోచక్రమా ॥చక్ర॥

పానుకొని దనుజులబలుకిరీటమణుల -
సానలఁదీరినవోచక్రమా
నానాజీవముల ప్రాణములుగాచి ధర్మ-
మూని నిలుపఁగదవో వోచక్రమా ॥చక్ర॥

వెఱచి బ్రహ్మాదులు వేదమంత్రము[1]ల నీ-
వుఱుట్లు గొనియాడే రోచక్రమా
అఱిముఱిఁ దిరువేంకటాద్రీశువీధుల
వొఱవుఁ మెఱయుదువో వోచక్రమా ॥చక్ర॥ 183

వరాళి

వట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు
బట్టబయలు యీసంసారంబని గుట్టుదెలియలేవుప్రాణీ ॥పల్లవి॥

చాల నమ్మి యీసంసారమునకు సోలిసోలి తిరిగేవు
బాలయవ్వనప్రౌఢలభ్రమఁ బడి లోలుఁడవై తిరిగేవు
మేలుదెలియ కతికాముకుండవై మీఁదెఱఁగక తిరిగేవు
[2]మాఱెమీఁద పరు వెండాఁకా నీమచ్చిక విడువఁగలేవు ॥వట్టి॥

౧. 'లని వుఱుట్లు' పూ.ము.పా. ౨. 'మాళిగ'కు వ్యావహారికరూపమా? తేనెదీయునప్పుడు కొండచరులనడుమ గట్టెడిచిన్నమంచెవంటిదియా?

మానితముగ దురన్నపానముల మత్తుఁడవై వుండేవు
నానావిధములఁ[1]దుష్కర్మంబులు నానాటికి నాటించేవు
మేనిలోని యేగురు నార్గురును మిత్రులనుచు నమ్మేవు
ఆనందంబున నాకర్మమునకు అధిపతులని తెలియఁగలేవు॥వట్టి॥

[2]పామరివై దుర్వ్యాపారమునకు పలుమారునుఁ బొయ్యేవు
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామమనుచు నుండేవు
ప్రేమముతో హరిదాసులపై సంప్రీతి నిలుపఁగాలేవు
తామసమతివయి వేంకటనాథునితత్వ మెఱుఁగఁగాలేవు॥వట్టి॥ 184

శ్రీరాగం

ఈభవమునకుఁ జూడ నేది గడ పల తనదు-
ప్రాభవం బెడలించి బాధఁ బెట్టించె ॥పల్లవి॥

చెప్పించెఁ బ్రియము వలసినవారలకునెల్ల
రప్పించె నెన్నఁడును [3]రానిచోట్లకును
ఉప్పించె నాసలకు వోరంత ప్రొద్దునను
తిప్పించె కోరికల తిరిగి నలుగడల ॥ఈభ॥

పుట్టించె హేయంపుభోగయోనులనెల్ల
కట్టించె సంసారకలితబంధముల
పెట్టించె ఆసలనుపెడ[4]కొాడముఁ దన్ను
తిట్టించె నిజద్రవ్యదీనకులచేత ॥ఈభ॥

బెదరించె దేహంబు పెనువేదనలచేత
చెదరించె శాంతంబు చెలఁగి చలమునను
విదళించె భవములను వేంకటేశ్వరుఁ గొలిచి
పదిలించె సతతనిష్కృప పరమసౌఖ్యములు ॥ఈభ॥ 185

---

1. 'దుః కర్మ' రేకు. 2. 'పామర' శబ్దమునకు వ్యావహారికశబ్దము కావచ్చు.
3. 'రొద్దు'రేకు. 4. 'కొడము' ప్రవాహమున చేపలనుపట్టుటకు ఒడ్డెడిసాధనము కావచ్చు.

### భైరవి

ఎంతపాపకర్మమాయ ౧యెంతవింతచింతలాయ
వింతవారితోడిపొందు వేసటాయ దైవమా ॥పల్లవి॥

చూడఁజూడఁ గొత్తలాయ చుట్టమొకఁడు లేఁడాయ
పీడుఁబట్టు అలుచాయ వేడుక లుడివోయను
జోడుజోడు గూడదాయ చొక్కుఁదనము మానదాయ
యేడకేడ తలపోఁత యెంతసేసె దైవమా ॥ఎంత॥

నీరులేనియేఱు దాఁటనేర దెంతేలోఁతాయ
మేరవె౨ళ్ల నీఁదఁడాయ మేఁటిఁ జేరఁడాయను
తోరమైన ఆస లుబ్బి తోవ గానిపించదాయ
కోరి రాకపోకచేత కొల్లఁబోయఁ గాలము ॥ఎంత॥

తల్లి దండ్రి దాత గురువు తానెయైన౩నాచారి–
వల్లభుఁడు నాకు మేలువంటిదాయ జన్మము
కల్లగాదు వేంకటేశుఘనునిపాదసేవ నాకు
మొల్లమాయ నామనసు మోదమాయ దైవమా ॥ఎంత॥ 186

### రామక్రియ

కుడుచుఁగాక తనకొలఁదిగానిమేలు
౪దడవినా నోరు తగిన౫యెంతయును ॥పల్లవి॥

చ-పవచ్చినకర్మసంగ్రహంబగుబుద్ధి
గంప ౬గమ్మక తన్ను గాచీనా
పంపుడుదయ్యమై బాధఁ ౭బెట్టెడుయాస
కొంపలోన నుండ౮నీఁగోరీనా ॥కుడు॥

---

౧. 'యంత' రేకు. ప్రాసయతి కూర్చిరేమో. ౨. 'వేళ్ల' పూ.ము.పా. ౩. 'నాంచారి' ఏమో? 'నాచ్చియార్' తమిళము. ౪. 'దడవి నానోరు' పూ.ము.పా. ౫. 'యంత' కావచ్చు. ౬. 'నమ్మక' కావచ్చు. ౭. బెట్టిదు + ఆస = బెట్టిదుయాస. ఈవింతసంధులకు ఈవాఙ్మయమున పట్టింపు లేదు. ౮. ఇవ్వన్ + కోరీనా = ఈఁగోరీనా కావచ్చు.

శ్రీవేంకటగిరి శ్రీనాథుఁ డిందరిఁ
గావఁ బ్రోవఁగ నున్న ఘనుఁడు
దేవోత్తముని నాత్మఁ దెలియ కితరములయిన-
ట్రోవ లెన్నిన మేలు దొరకీనా ॥ కుడు ॥ 187

31 రేకు ఆహిరి

పారకుమీ వోమనసా పంతము విడువకుమీ మనసా
పారిన నీవే బడగయ్యేదవు చేరువ నాఁడే చెప్పనె మనసా ॥పల్లవి॥

చింతించకుమీ శివునివై రిచే చిక్కువడకుమీ వోమనసా
కంతువారకము వయసుఁ బ్రాయములు కావటికుండలు వోమనసా
౧యెంతే మేలుఁగీ దేకాలము ఎప్పుడు నుఁడదు వోమనసా
సంతరించుకో వానిని మనసున సంతోషముగా వో మనసా ॥ పార ॥

యెన్నికలే తలపోయకుమీ యేమరకుండుమి వోమనసా
కన్నవిన్నవారిలో నెప్పుడు కాకుపడకుమీ వోమనసా
పున్నమమాసలు పుడమిలో బదుకులు పోయివచ్చేవి వోమనసా
మిన్నో నేలనిమన్న దినములో మీఁదుచూడకుమి వోమనసా॥పార॥

కన్నులసంగాతము సేయకుమీ కళవళించకుమి వోమనసా
వన్నెలమాటలు చెవులఁబెట్టక వాసివిడువకుమి వోమనసా
మున్నిఁటిసురలు బ్రహ్మదులకై నను ముక్తిసాధనము వోమనసా
వెన్నుని వేంకటగిరిపతిఁదలఁచుమువేసారకుమీ వోమనసా॥పార॥188

---

౧. 'యెంతా మేలూఁ గీ' అని పూ.ము.పా

ముఖారి

ఏల పొరలేవులేవే యింతలోనిపనికి
మాలయింటితోలుకప్పుమాయ లిటువంటివి ॥పల్లవి॥

చిక్కులతమకముల చీఁకటిగప్పిననాఁడు
యెక్కువ వాసనలౌ[1] హేయపుమేను
వెక్కసపు ప్రియ[2]మది విరిగితే రోఁతలౌ
లక్కపూఁతకపురు లీలాగు లిటువంటివి ॥ ఏల ॥

మించినచిత్తములో మేలుగలిగిననాఁడు
యెంచరానిచవులౌ నెంగిలిమోవి
పెంచుకంటే కష్టమౌ ప్రియముదీరిననాఁడు
చంచలపుచిత్తములచంద మిటువంటిది ॥ ఏల ॥

వెల్లిగొనుసురతపువేళ[3] మరపులయింపు
కొల్లలాడుటౌ కొనగోరితాఁకులు
నల్లితిండౌ[4] మరి మీఁద మరగితే రోఁతలౌ (?)
వుల్లమిచ్చేవేంకటేశు నొద్ది కిటువంటిది ॥ ఏల ॥ 189

ముఖారి

ఎట్టు దరించీ నిదె యీజీవుఁడు
బట్టబయలుగాఁ బరచీ నొకటి ॥ పల్లవి ॥

చెడనిమట్టిలోఁ జేసినముద్దే
నడుమ ముంచుకొన్నది వొకటి
తడియనినీరై తడివొడమింపుచు
వడిసీని వేపుర వడితో నొకటి ॥ ఎట్టు ॥

---

విదురేకు 83. 1. సనదౌను. 2. ప్రేమమది. (1-2 చరణములు వెనుకముందై కలవు) 3. వెదమర. 4. దోఁగాక నలగిన వింతలోనే.

పాయనితనుదీపనములుగా నటు
చేయుచు మది వేఁచీ నొకటి
కాయపుచుట్టరికమ్ములు చేయుచు
రేయుఁబగలు విహరించీ నొకటి ॥ఎట్టు॥

యిన్నియుఁ దానే యేచి కపటములు
పన్ని నిదె లోపల నొకటి
వెన్నెలచూపుల వేంకటేశ నిను
యెన్నికతోఁ గడు నెదిరీ నొకటి ॥ ఎట్టు ॥ 190

## ముఖారి

[౧]బ్రహ్మగడిగినపాదము
బ్రహ్మము దానె నీపాదము ॥పల్లవి॥

చెలఁగి వసుధ [౨] గొలిచిననీపాదము
బలితలమోపినపాదము
తలఁకక గగనము దన్నినపాదము
బలరిపుఁ గాచినపాదము ॥ బ్రహ్మ ॥

కామినిపాపము గడిగినపాదము
పాముతలవిడినపాదము
ప్రేమపుశ్రీసతి [౩] పిసికెడిపాదము
పామిడి[1]తురగపుఁబాదము ॥ బ్రహ్మ ॥

పరమయోగులకుఁ బరిపరివిధముల
పరమొసఁగెడి నీపాదము
తిరువేంకటగిరి తిరమనిచూపిన-
పరమపదము నీపాదము ॥ బ్రహ్మ ॥ 191

---

ఏడురేకు 80. 1. పామెడి. ౧: ఈపాటలో 'నీపాదము' అనుట ఉచితమేమో? 'ఈపాదము' అని గాయకులు పాడుట గలదు. ౨. 'గొలచి' రేకు. ౩. 'పిసికేటి' రేకు.

౧అవతారాలు - సామంతం

తానేకా కెవ్వరు మాకు దాతయు దైవము తన-
లోనఁ బెట్టుకొని మాకు లోనైనవాఁడు ॥ పల్లవి ॥

చదివించి, కూడుపెట్టి, జారకుండ నిల్లుగట్టి,
బెదరులేని బుద్ధి పిన్ననాఁడే చెప్పి,
యెదిరి నడిగి, ద్రవ్య మిదిగొమ్మనుచు నిచ్చి,
పదిలమై తమ్ముఁ బాలించువాఁడు. ॥ తానే ॥

మోహవియోగమ్ము, మోహానురాగమ్ము,
దేహవిభాగంబు దెలిపిన కలికి
ఐహికమున వేంకటాధీశుఁడై సర్వ-
దేహరక్షకుఁడై తిరుగుచున్నాఁడు ॥ తానే ॥ 192

బౌళి

చెదఱక వెలుఁగే చేనుమేయఁగఁజొచ్చె
అదలించి తగదు నీ కనువారు వేరీ ॥ పల్లవి ॥

చిత్త మింద్రియములచేఁ జిక్కి, కడు। మద-
మెత్తిన వద్దన నిఁక వేరీ
హత్తినమనసు మోహాదులతోఁ గూడి
తత్తరించిన మాన్పఁదగువారు వేరీ ॥ చెద ॥

జీవుఁ డిన్నిటికిఁ దాఁ జిక్కి పోయినత్రోవఁ
బోవఁజొచ్చిన బుద్ధిపొల మేది
శ్రీవేంకటేశునిచింతాపరతఁ గాని
కావఁగ నాత్మకు గతి దానేది ॥ చెద ॥ 193

౧. ఈ పాటలో మాత్రము దశావతార సమన్వయమున్నట్లు రేకు చెప్పినది.

కన్నడగౌళ

పోయఁ గాలం బడవికిఁ గాయుఁ[1]వెన్నెలకరణిని
శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు మాయఁబడి చెడక ॥ పల్లవి ॥

చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను
చిత్తజగురునిఁ దలఁచుఁడీ చిత్తజుఁ జొరనీక ॥ పోయఁ ॥

బూరుగుమాఁకునఁ జెందినకీరముచందమున
ఆరయ నిష్ఫలమగు మరి యన్యులఁ జేరినను ॥ పోయఁ ॥

కూరిమి మాతిరువేంకటగిరిగురుశ్రీపాదములు
చేరినవారికి భవములు చెంద వెపుడు నటుగాన ॥పోయఁ॥ 194

32 రేకు పాడి

ఏఁటికి నెవ్వరిపొందు యిస్సిరో చీచీ
నాటకములాల చీచీ నమ్మితిఁగా మిమ్మును ॥ పల్లవి ॥

జవ్వనమదమ చీచీ చక్కఁదనమరో చీచీ
రవ్వైనరాజసగర్వమరో చీచీ
కొవ్వైనమదమ చీచీ కూరిమియాసరో చీచీ
నవ్వులదేహమ చీచీ నమ్మితిఁగా మిమ్మును ॥ ఏఁటి ॥

ముచ్చటమమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ
బచ్చురపణములోనిబచ్చన చీచీ
తెచ్చుకోలుతాలిములదిట్టతనమరో చీచీ
పుచ్చినపోకరో చీచీ పోయఁగా మీకాలము ॥ ఏఁటి ॥

సిరులచీఁకటి చీచీ సిలుగుసంపద చీచీ
వరవిభవమ చీచీ వాసిరో చీచీ
కరుణించెఁ దిరువేంకటగిరిపతి నన్ను
విరసవర్తన చీచీ వీడెఁగా మీభారము ॥ ఏఁటి ॥ 195

---

౧. 'వెన్నెలల' రేకు.

సామంతం[1]

మనుజుఁడై పుట్టి మనుజుని సేవించి
అనుదినము దుఃఖమందనేలా ॥ పల్లవి ॥

జుట్టెఁడుగడుపుకై చొరనిచోట్లు చొచ్చి
పట్టెఁడుగూటికై బతిమాలి
పుట్టినచోటికే పొరలి మనసుపెట్టి
వట్టిలంపటము వదలనేరఁడుగాన ॥ మను ॥

అందరిలోఁ బుట్టి అందరిలోఁ ౧బెరి-
గందరిరూపము లటు దానై
అందమైనశ్రీవేంకటాద్రీశు సేవించి
అందరానిపదమందె నటుగాన[2] ॥ మను ॥ 196

నాట[3]

లంకెలూడుటే లాభము యీ-
కింకరులను నలఁగెడికంటెను ॥ పల్లవి ॥

జంపులఁ జంపక [4]సరుగనఁబాసేటి-
లంపటమేపో లాభము
[5]కంపమోపుతోఁ గనలి శరీరపు-
కొంపలోనవేఁగుటకంటెను ॥ లంకె ॥

యీవలనావల నేచేటియాసల-[6]
లావు దిగుటెపో లాభము
యేవగించతలకు సిరవగు నరకపు-
కోవులఁబడి మునుఁగుటకంటెను ॥ లంకె ॥

---

నిడురేకు 34. 1. గుండక్రియ 2. పదమందరాదా. నిడురేకు 29. 3. సామంతం. 4. నొంపక 5. గంపమోపు, నిడురేకు 28. 6 ఆవల వీవల నాసలు సేసెడి.

౧. 'శేరి। అంద' పూ. ము. పా.

తివిరి వేంకటాధిపుదాసులకృప-
లవలేశమెపో లాభము
చవులని [1] నోరికి సకలము దిని తిని
భవకూపంబులఁ బడుకంచెను ॥ ఎంత ॥ 1

నాట

తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు [౧]చంచలబుద్ధి మానీనా ॥ పల్లవి

జడ్డుమానవుఁడు చదువఁజదువ నాస
వడ్డివారుఁగాక వదలీనా
గుడ్డికుక్క సంతకుఁబోయి తిరిగిన
దుడ్డుపెట్లేకాక దొరకీనా ॥ తన ।

దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీవేంకటేశ్వరు సేవాపరుఁడుగాక
పావనమతియై పరగీనా ॥ తన ॥ 198

భైరవి

[౨]సదిఁబెట్టెఁ గటకటా సంసారము।చూడ-
జదధిలోపలియీఁత సంసారము ॥ పల్లవి ॥

జమునోరిలో బ్రదుకు సంసారము । చూడ
చమురుదీసినదివ్వె సంసారము
సమయించుఁబెను దెవులు సంసారము చూడ
సమరంబులో మనికి సంసారము ॥ సడి ॥

1. చవికొని. ౧ 'చెంచెల' రేకు. ౨. ఈపాటకు రేకులో వ్రగ్రహమునకు గుర్తు సరిగా చూపలేదు.

సందిగట్టినతాడు సంసారము చూడ
సందికంతలతోవ సంసారము
చందురునిజీవనము సంసారము చూడ[1]
చంద మేవలెనుండు సంసారము. ॥ సది ॥

చలువలోపలివేఁడి సంసారము చూడ
జలపూఁతబంగారు సంసారము
యిలలోనఁ దిరువేంకటేశ నీదాసులకు
చలువలకుఁ గడుఁజలువ సంసారము ॥ సది ॥ 199

ధన్నాసి

సామాన్యమా పూర్వసంగ్రహంబగుఫలము
నేమమునఁ బెనగొనియె నేఁడు నీవనక ॥ పల్లవి ॥

జగతిఁ బ్రాణులకెల్ల సంసారబంధంబు
తగుల బంధించుదురితంపుఁగర్మమున
మగుడ మారుకుమారు మగువ నీపురముపై
తెగికట్టి రెవ్వరో దేవుండవనక ॥ సామా ॥

పనిలేక జీవులను భవసాగరంబులో
మునుఁగ లేవఁగఁజేయుమోహదోషమున
పనిపూని జలధిలోఁ బండఁబెట్టిరి నిన్ను
వెనకెవ్వరో మొదలివేలుపనక ॥ సామా ॥

వుండనియ్యక జీవనోపాయమున మమ్ము
కొండలను గొబల తతిగొని తిప్పుఫలము
కొండలను నెలకొన్నకోనేటిపతివనఁగ-
నుండవలసెను నీకు నోపలేననక ॥ సామా ॥ 200

విడురేకు 80. 1. గాక.

దేవగాంధారి

ఎందరివెంట నెట్లఁ దిరుగవచ్చు
కందువెఱఁగి చీఁకటిదవ్వుకొనుఁగాక[1] ॥ పల్లవి ॥

తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలినయట్టిదేహి
కొలఁదిమీరినదేవకోట్లు దనలోన
కలవాని నొక్కనినే కొలుచుఁగాక ॥ ఎంద ॥

కాలిచపడఁగ నెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టిప్రాణి
మేలిమిజగములు మేనిలోఁ గలవాఁడు
పాలిటివాఁడై ప్రణుతికెక్కుఁగాక ॥ ఎంద ॥

సూరేంద్ల[2] నెందరి నుతియింపఁగలవాఁడు
చేరఁదావులేనిజీవి
శ్రీరమణీశుఁడు శ్రీవేంకటేశుని
కోరికెఁ దలఁచి నుతి[3] కొల్లగొనుటగాక ॥ ఎంద ॥ 201

33 రేకు శ్రీరాగం

వెన్నవట్టుక నేయి వెదకనేలా మరియు-
నెన్నివలసినను దమయేలెటివే[4] కావా ॥ పల్లవి ॥

తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు
కలుగుటే కలుగవలెఁగాక
వలనైనభోగములు వైభవంబులు మరియు
కలవెల్ల తమయెదుటఁ గలిగినవె కావా ॥ వెన్న ॥

విడురేకు 47. 1. చీఁకటికి. దొలఁగుఁ. 2. నోరెండ 3. ముక్తి. విడురేకు 34
4. యెదిటివే.

పదిలముగ హరినామపఠన[1] మంత్రము నోరు
కదియుటే కలుగవలెఁగాక
తుదలేనిసంపదలు తొలగనిముదంబులును
కదల కెప్పుడుఁ దమకుఁ గలిగినవె [౧]కావా ॥ వెన్న ॥

యించుకైనను వేంకటేశుగిరిశిఖరంబు
కాంచుటే కలుగవలెఁగాక
అంచితంబైననిత్యానందపదవులును
మించి తమయెదుటఁ బ్రభవించినవె కావా ॥ వెన్న ॥ 202

ముఖారి

పసలేని యీబ్రదుకు
అసలు చొచ్చిచొచ్చి అలసినట్లాయె ॥పల్లవి॥

తొల్లిటిజన్మాదులఁ గానినరరూపు
పల్లించుకొన్న యీబ్రదుకు
కల్లసుఖములచే కనలి కమ్మర
ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్లాయ ॥ పస ॥

బూటకములనెల్లఁ బొరలి సంసారంపు-
పాటుదెచ్చినయీబ్రదుకు
నీటుగ నెద్దు దన్నినని గుఱ్ఱము-
చాటు కేఁగినయట్టిచందమాయె ॥ పస ॥

పగగొన్నపొగ కోపక మంటఁ బడిపడి
పగలు రేలైనయీబ్రదుకు
తగువేంకటేశ్వరుఁ దలఁచి నేలనుండి
యెగసి మేడమీఁది కేఁగినట్లాయె ॥ పస ॥ 203

1. పరమ మంత్ర.  ౧. 'కాక' రేఫ.

ముఖారి

ఎంత మానుమన్నఁ జింతలేల మానునే[1]
పంతపుమనసు హరిపై నుండేఁగాక ॥ పల్లవి ॥

తీరనిబంధాలు నేఁడే తెగుమంటే నేల తెగు
భారపుమమతఁ బెడఁబాసినఁగాక
వూరటగా మమత నేనొల్లనంటే నేల మాను
వోరుపుతో లంపటము లొల్లకుండేఁగాక ॥ ఎంత ॥

వేఁకపుఁగోపము నేఁడే విడుమంటే నేల విడు
తోఁకచిచ్చయినయాసఁ దుంచినఁగాక
ఆఁకట నానేల మాను అన్నిటాను యిందరికి
మాఁకుపడి తత్తరము మఱచుండేఁగాక ॥ ఎంత ॥

పెట్టినిది దైవ మిట్టే పెట్టుమంటే నేల పెట్టు
ఘట్టే వేంకటపతి యిచ్చినఁగాక
యిట్టునట్టు నీతఁడు దా నిందరికి నేల యిచ్చు
వొట్టినవిరక్తి నేమీ నొల్లకుండేఁగాక ॥ ఎంత ॥ 204

సామంతం

చాలదా హరిసంకీర్తనంగల-
మే లిది దీననే మెరసిరి ఘనులు ॥ పల్లవి ॥

తలఁప వేదశాస్త్రములు గానక
అలరుచు ౧వాల్మీకాదులు
తలకొని హరిమంత్రమే దగఁ బేర్కొని
అలవిమీరఁ గడు౨నధికములైరి ॥ చాల ॥

---

విడురేకు. 42, 83. 1. మానును. 83. 2. దీరుమంటే నేలతీరు.
౧. 'వాల్మీక్యాదులు' కావచ్చునేమో. ౨. 'నధికులునైరి' కావచ్చునేమో.

యితరదైవముల నెఱఁగనేరక
ప్రతిలేనిమహిమఁ బార్వతి
మతిఁ దలఁపుచు హరిమంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె ॥ చాల ॥

చదువులఁ బలుమరుఁ జదువనోపక
అదివో నారదాదులు
పదిలపువేంకటపతిహరినామమే
వదల కిదియ జీవనమై మనిరి ॥ చాల ॥ 205

## సామంతం

పోయఁబోయఁ గాలమెల్ల ౧పూఁటవూఁటకు
చేయి నోరు నోడాయ చెల్లఁబో యీరోఁతలు ॥ పల్లవి ॥

తిప్పన తొప్పన కేతు[1]దేవన బావన గన్ను[2]
పప్పన బొప్పనగారిఁ బాడిపాడి
కుప్పలఁదెప్పలు[3]నైనకోరికెలు మతిలోన
యెప్పుడుఁ బాయకపోయ నెన్ని లేవు రోఁతలు ॥ పోయఁ ॥

కాచన పోచన మాచు[4]కల్లప బొల్లప మల్లు
బాచన దేచనగారిఁ బాడిపాడి
యేచినపరసుఖము నిహమును లేకపోయ
చీచీ విరిగితిమి చెప్పనేల రోఁతలు ॥ పోయఁ ॥

---

విడురేకు. 61. 1. మాచ. 2. గంగు. 3. దిప్పలు. 4. కేతు.
౧. పూఁట+పూఁట='పూఁట వూఁట'

బిక్కన తిక్కన చెల్లు బూమన కామన పేరి-
బక్కలి నిందరి నోరఁ బాడిపాడి
యెక్కువై నతిరువేంకటేశుని దలఁచలేక
కుక్కకాటుఁ జెప్పుటా(చే?)పై కూడె విన్నిరోఁతలు
॥పోయఁ॥ 206

సాళంగనాట

పటుశిష్టప్రతిపాలకుఁడ వనఁగ
ఘటన నఖిలమును గాతువుగా ॥పల్లవి॥

తుత్తుమురుగ దైత్యుల దనుజుల నవి
మొత్తి మోఁది చలమునఁ జెలఁగి
జొత్తుపాపలుగ సొరిది విరోధుల-
నెత్తురు వడుతువు నీవేకా ॥పటు॥

తళతళమెఱుచుసుదర్శనాయుధం-
బలరుచు నొకచే నమరఁగను
బలుదైత్యులదొబ్బలుఁ బేగులు నని
నిలువునఁ జెండుదు నీవేకా ॥పటు॥

దిట్టవు సూత్రవతీపతి వసురలఁ
జట్టలు చీరఁగఁ జతురుఁడవు
రట్టడి వేంకటరమణుని వాకిటి-
పట్టపుసేనాపతివటకా ॥పటు॥ 207

34 రేకు దేసాక్షి

పోయఁ బోయఁ గాలమెల్ల పూఁట పూఁటకు[1]
రోయనిరోఁతలు చూచి రుచి చూరఁబోయ ॥పల్లవి॥

విడురేకు 83. 1. పోయెఁ దా యీ కాలమెల్ల పొద్దు పొద్దుకు.

తాడిమానెక్కేటివాని తడయక పట్టిపట్టి
తోడఁదోడ నెందాఁకాఁ దోయవచ్చును
కాడువడ్డచిత్త మిది కలకాలము నిట్టే
ఆడికెలకులోనై *తనియక[1] పోయ ॥ పోయఁ ॥

మన్నుదినియేటిదూడ మానుమంటా మొత్తిమొత్తి
కన్నిగట్టి యెందాఁకఁ గాయవచ్చును
సన్నపుటాసలమీఁదిచరిఁబడ్డదేహమిది
కన్నపుఁగత్తులచూపు కట్టరాకపోయ ॥ పోయఁ ॥

హేయము దొక్కకుమన్న యేచి తినేననేవాఁడు
చాయకు రాకున్న నేమిసేయవచ్చును
మాయలవేంకటపతి మచ్చుచల్ల నాయాత్మ
పాయక యాతనిఁ జేరి భయమెల్లఁ బోయ ॥ పోయఁ ॥ 208

మాళవిగౌళ

పాపమెరఁగనిబ్రాహ్మఁడు । యెందుఁ
జూపరానిచోటు చూపీనయ్యా ॥ పల్లవి ॥

తనివోక ౧జీవముతలకాయ నంజుడు
పనివడి తిని తిన్నబ్రాహ్మఁడు,
యెనసి యెదిరిఁ దన్నునెఱఁగక విభుఁడై
ఘనవంశము మంటఁ గలపీనయ్యా ॥ పాప ॥

---

* ఇందు 'నైత' అనునక్షరములనడుమ మరిరెండక్షరములు చెక్కి తరువాత రాచి చెఱిచినట్లున్నది. ఛందోరీతి నూహించిచూడఁగా, నై-య అను రెంటిలో ఏది యతిస్థానముగాఁ గొన్నను, రెండక్షరములు కావలయునేమో అనిపించుచున్నది. 1. తనియకే

౧ జీవము = మేక మొదలగుజంతువు అని మాండలికము. 'నావినాలుగుజీవాలు తప్పిపోయినవి' ఇత్యాది వ్యవహారముకూడ కలదు.

యెవ్వారు నెఱఁగనియెముకలయింటిలో
పవ్వళింపుచునున్నబ్రాహ్మఁడు,
జవ్వనమదమున జడిసేటికోమలిఁ
బువ్వులతోఁటలోఁ బొదిగినయ్యా ॥పాప॥

చెలఁగి కన్నెరికముచెడనిపడుచుఁ దెచ్చి
పలువేదనలఁబెట్టేబ్రాహ్మఁడు,
తెలిసి వేంకటాధిపునిదాసుఁడై
పులుగు పంజరానఁ[1] బొదిగినయ్యా ॥పాప॥ 209

శంకరాభరణం

ఇన్ని చేఁతలును దేవుఁడిచ్చినవే
వున్నవారియాపులెల్ల నొద్దికయ్యీనా ॥పల్లవి॥

తెగనియాపదలకు దేవుఁడే కలఁడుగాక
వగలుడుపఁ బరులవస మయ్యీనా
నొగిలి యితరులకు నోళ్ళుదెరచిన
నగుఁబాటేకాక మానఁగఁబొయ్యీనా ॥ఇన్ని॥

అగ్గలపుదురితాలు హరియే మానుపుఁగాక
బగ్గన నొక్కరు వచ్చి పాపఁబొయ్యేరా
తగ్గుముగ్గులైనవేళ తలఁచినవారెల్ల
సిగ్గుఁబాటేకాక తమ్ముఁ జేరవచ్చేరా ॥ఇన్ని॥

యెట్టు సేసినను వేంకటేశుఁడే నేరుచుఁగాక
౧కట్టఁగడవారెల్లఁ గరుణించేరా[2]
యిట్టే యేమడిగిన నీతఁడే యొసఁగుఁగాక
వుట్టిపడి యెవ్వరైనా నూరడించేరా ॥ఇన్ని॥ 210

విడురేకు 66 1. పంజరము పుడికినయ్యా. 2. గావఁబోయేరా.
౧. కడ+కడ = 'కట్టకడ'. ఇక్కడ అరసున్నవిచార్యము.

ఆహిరి

ఎటువంటిరౌద్రమో యెటువంటికోపమో
తటతట నిరువంక దాఁటీ వీఁడే[1] ॥ పల్లవి ॥

తోరంపుఁబెనుచేతుల మల్లచఱచి
దారుణలీలఁ బెదవు లవుడుకఱచి
కారించి చాణూరుఁ గడుభంగపఱచి
వీరుఁడై యెముకలు విఱచీ వీఁడే ॥ ఎటు ॥

పిడుగడచినయట్లు పెడచేత నడిచిం-
పడనీక పురములోపలఁ జొరఁబొడిచి
తొడికి చాణూరు నెత్తుక దయవిడిచి
వడివెట్టి నెత్తురు వడిచీ వీఁడే ॥ ఎటు ॥

ఉసకొట్టుచును వూరుపులఁ జెమరించి
మసిగాఁగ బెదపెదమల్లుల దంచీ-
నెసఁగి శ్రీతిరువేంకటేశుఁడై మించి
ముసిముసినవ్వుల ముంచీ వీఁడే ॥ ఎటు ॥ 211

ఆహిరి

ఆసమీఁద విసుపౌ (వొ?)[2] దాఁక, యీ-
గాసిఁబరచుతనకపటమే సుఖము ॥ పల్లవి ॥

తిరమగుఁగర్మము దెగుదాఁక, । తన-
గరిమసుఖము పొగడునందాఁక[3]
పరమార్గం బగపడుదాఁక, తన-
పరితాపపులంపటమే సుఖము ॥ ఆస ॥

---

వివురేకు, 48. 1. తడవటి చరణములో మాత్రము 'వీఁడే' తక్కినచోట్ల నెల్ల 'వాఁడే'. వివురేకు 58. 2. విసుపౌదాఁక 3. పొదగనుదాఁక. ౧. 'చిఁబర' రేకు.

కాయము గడపల గనుదాఁక । యీ-
మాయ దన్ను వెడమరుదాఁక
రాయడిమదము గరఁగుదాఁక । యీ-
రోయఁదగినతనరూపమే సుఖము ॥ ఆస ॥

లంకెలఁబొరలి నలఁగుదాఁక । యీ-
యంకెలభవము లెరవౌదాఁక
వేంకటపతిఁ దడవినదాఁక యీ-
కింకరువా[1] ణపుగెలుపే సుఖము ॥ ఆస ॥ 212

సాళంగం

తనకర్మ మెంత చేఁతయు నంతే
గొనకొన్న పని యంత కూలీ నంతే ॥ పల్లవి ॥

తలఁపులో హరి నెంత దలఁచె నేఁడే వాని-
కలిమియు సుఖమును గల దంతే
తులఁదూఁచఁ బైఁడెంత తూఁకము నంతే
నెలకొన్నపిండెంత నిప్పటీ నంతే ॥ తన ॥

సిరివరుపూజెంత సేసె నేఁడే వాని-
దరియును దాపు నెంతయు నంతే
పురిగొన్నయీవెంత పొగడూ నంతే
నరపతిచనవెంత నగవూ నంతే ॥ తన ॥

శ్రీ వేంకటపతి చింత యంతగా నేఁడే
భావపరవశము పలుకూ నంతే
దైవము కృప యంత తానూ నంతే
యేవంక జయమెంత యిరవూ నంతే ॥ తన ॥ 213

1. కువ్వాణ. గా. 'యంతే'. రేకు.

35 రేకు, బౌళి

ఎండగాని నీడగాని యేమైనఁగాని
కొండలరాయఁడే మాకులదైవము [1] ॥ పల్లవి ॥

తేలుగాని పాముగాని ౧ దేవపట్టయినఁగాని
గాలిగాని ధూళిగాని కాని యేమైనా
కాలకూటవిషమైన గక్కనమింగిననాటి-
నీలవర్ణుఁడే మానిజదైవము ॥ ఎండ ॥

చీమగాని దోమగాని చెలఁది యేమైనఁగాని
గాముగాని నాముగాని కాని యేమైనా
పాములనిన్నిటిమింగేబలుతేజిపైనున్న-
ధూమకేతువే మాకు దొరదైవము ॥ ఎండ ॥

పిల్లిగాని నల్లిగాని పిన్నయెలుకైనఁగాని
కల్లగాని పొల్లగాని కాని యేమైనా
బల్లిదుఁడై వేంకటాద్రిపైనున్నయాతఁడే మ-
మ్మెల్లకాలమును నేలేయింటిదైవము ॥ ఎండ ॥ 214

ఆహిరి

ఇందునందుఁ దిరుగుచు నెవ్వరివాఁడవుగాక
బందెపసురమవైతి బాపు జీవుఁడా ॥ పల్లవి ॥

తోలుబొక్కలోనఁ జొచ్చి తూలేటియాఁకలిచేత
పాలుమాలి యిందరికి బంటుబంటవై
యేలినవానిఁ గానక యేచినయాసలవెంట
కూలికిఁబో దొరకొంటి కూళజీవుఁడా ॥ ఇందు ॥

---

విడురేకు 115 1. గురుదైవము. ౧. దేవపట్టు = యక్షరాక్షసాదు లుండేటి-స్థలము కావచ్చు. "విద్యాధరోఽప్సరో యక్ష రక్షో గంధర్వ కింనరాః। పిశాచో గుహ్యకస్సిద్ధో భూతోఽమీ దేవయోనయః॥" అమరము. 'దేవపట్టు' వంటిసమాసములు ఈవాఙ్మయమున కలంకారములు.

తీఁటమేనిలోనఁ జొచ్చి దిమ్మరిదొంగలచేత
 మూఁటగట్టించుక [1] నీవు మూలదొరవై
గాఁటపువిభునిచేతిఘనత కోరికలకు
 వేఁటకుక్కవై తివి వెట్టిజీవుఁడా ॥ ఇందు ॥

చీమలింటిలోనఁ జొచ్చి చిక్కవడి అందరిలో
 దోమకరకుట్లకు తోడిదొంగవై
యేమరి వేంకటవిభు నెఱఁగక జాడుఁజొప్ప
 నాము మేయ దొరకొంటి నాలిజీవుఁడా ॥ ఇందు ॥ 215

శ్రీరాగం

వేదనఁ బొరలే వెరవేలా
 యీదయ విధి దన కీయదా ॥ పల్లవి ॥

తత్తరపాట్ల తనువికారములఁ
 జిత్తము దెంచేచెలువేలా
బత్తితో దాఁచిన పరధనంబుంగొని
 సత్తయి వుండుట చాలదా ॥ వేద ॥

యెక్కవతమకపుటింతులఁ బొందక
 వక్కచువాదేవయనేలా
మొక్కుచు దాఁచిన మూలధనము గన-
 నెక్కవ దైవం బియ్యదా ॥ వేద ॥

నేఁతలఁ బొరలెడి చిక్కులఁ గెరలెడి-
 రోఁతల యీనేరుపులేలా
బాఁతిగ వేంకటపతిరతిఁ జిత్తపు-
 టూఁతలఁ గోరిక లూనవా ॥ వేద ॥ 216

---

1 విడురేకు. 99. 1, గదించుక ౦. 'గవి' రేకు.

ముఖారి

వెరపులు నొరపులు[1] [2]వృథా వృథా
ధరపై మరి యంతయును వృథా ॥ పల్లవి ॥

తడయక చేసినదానంబులు వృథ
యెడనెడ నెఱిఁగినయెఱుక వృథా
వొడలిలోనిహరి నొనరఁగ మతిలోఁ
దడవనిజీవమె తనకు వృథా ॥ వెర ॥

జగమునఁ బడసినసంతానము వృథ
తగిలి గడించినధనము వృథా
జగదేకవిభుని సకలాత్ముని హరిఁ
దెగి కొలువనిబుద్ధియును వృథా ॥ వెర ॥

పనివడికూడినపరిణామము వృథ
వొనరఁగనుండినవునికి వృథా
ఘనుఁడగుతిరువేంకటగిరిహరిఁ గని
మననేరనిజన్మములు వృథా ॥ వెర ॥ 217

ఆహిరి

ఏమి గలిగెను మా కింద్రియవలన
వేమారుఁ బొరలితిమి వెఱ్ఱిగొన్నట్లు ॥ పల్లవి ॥

తటతటన నీటిమీఁదట నాలజాలంబు-
లిటునటుఁ జరించవా యీఁది యీఁది
అటువలెనెపో తమకమంది సంసారంపు-
ఘటనకై తిరిగితిమి కడ గానలేక ॥ ఏమి ॥

రేకు 18. 1. మరపుల 2. 'వృథా వృథా' అంటూ లేదు

డట్టముగఁ బారావతములు మిన్నుల మోవ
కొట్టఁగొన కెక్కవా కూచికూడి
వట్టియాసలనే యిటువలెనేపో యిన్నాళ్ళు
బట్టబయ లీఁదితిమి పనిలేనిపాట ॥ఏమి

బెరసి కుమ్మరపురువు పేఁడలోపలనెల్ల
పొరలదా పలుమారుఁ బోయిపోయి
వరుస జన్మముల నటువలెనె(పో?) పొరలితిమి
తిరువేంకటాచలాధిపుఁ దలఁచలేక ॥ఏమి॥ 218

ఆహిరి

హరినెఱఁగనిపుణ్య మంటేరుగాన
దురితాలే దురితాలే దురితాలే సుండీ ॥పల్లవి॥

దొడ్డపుణ్యములు సేసి తుదలేనిసంపదలు
అడ్డగించుకొని రాసులగు[1]గురుతు
జడ్డులేనిహరికథ చవిలేకుండిన నిట్టే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండీ ॥హరి॥

వలెనని మేలెల్ల వడిఁజేసి కైవల్య-
మలమి చేతికిలోననగు గురుతు
తలఁపు వైష్ణవభక్తిఁ దగులకుండిన నంతా
ఆలయికే అలయికే అలయికే సుండీ ॥హరి॥

తిరమైనతీర్థాలు దిరిగి యందరిలోన
ధరఁ బుణ్యుఁడవుట యంతకు గురుతు
తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా
విరసాలే విరసాలే విరసాలే సుండీ ॥హరి॥ 219

విడురేకు 34. 1. చేకొవిలోనగు.

36 రేకు నాట

ఏడ వల పేడ మచ్చి కేడ సుద్దులు
ఆడుకొన్నమాటలెల్ల నవి నిజాలా ॥ పల్లవి ॥

తొలుకారుమెఱుపులు తోఁచి పోవుఁగాక
నెలకొని మింట నవి నిలిచీనా
పొలఁతులవలపులు పొలసిపోవుఁగాక
కలకాలం బవి కడతేరీనా ॥ ఏడ ॥

యెండమావులు చూడ నేరులై పారుఁగాక
అందకుఁబోవ దాహ మణఁగీనా
నిండినట్టిమోహము నెలఁతలమదిఁ జూడ
వుండినట్టేవుండుఁగాక వూఁతయ్యీనా ॥ ఏడ ॥

కలలోనిసిరులెల్ల కనుకూర్కులేకాక
మేలుకవఁ జూడ నవి మెరసీనా
అలివేణులమేలు ఆసపాటేకాక
తలఁపు వేంకటపతిఁ దగిలీనా ॥ ఏడ ॥ 220

ఆహిరి

ఏమి సేయఁగవచ్చు నీశ్వరాధీనంబు
తామసపుబుద్ధి కంతలు దూరవలసె ॥ పల్లవి ॥

తెగి దురాపేక్షఁబడ తివియ గతిలేదుగన
పగగొన్నవగలకూపములఁ బడవలసె
తగుమోహసలిలంబు దాఁట మతి లేదుగన
మగుడఁబడి భవముతో మల్లాడవలసె ॥ ఏమి ॥

పాపకర్మములఁ జంపఁగ శక్తిలేదుగన
కోపబుద్ధులచేత కొరమాలవలసె
రూపములఁ బొడగాంచి రోయఁ దరిలేదుగన
తాపములచేఁ [౧]బొరలి తగులఁగావలసె ॥ ఏమి

తిరువేంకటాచలాధిపుఁ గొలువలేదుగన
గరిమెచెడి విషయకింకరుఁడు గావలసె
పరతత్వమూర్తిఁ దలఁపఁగఁ బ్రొద్దులేదుగన
దొరతనం బుడిగి యాతురుఁడు గావలసె ॥ ఏమి ॥ 22

## వరాళి

తనవారని యాసఁ దగిలి భ్రమయనేల
[౨]తనువుఁ బ్రాణునికంటె తగులేది ॥ పల్లవి ॥

తనువుఁ బ్రాణుఁడు రెండు తగిలి గర్భమునందు
వొనర నేకమై యుదయించి
దినములు చెల్లిన తివిరి యాప్రాణుఁడు
తనువువిడిచిపోయ దయలేక ॥ తన ॥

ప్రాణికై దేహము పాపపుణ్యముసేయు
ప్రాణి వెంటనె బొందిపాటుందదు
ప్రాణి యచ్చటనైన బాధలఁ బడకుండ
ప్రాణి రక్షించు బొందిబడి దాఁ బోయనా ॥ తన ॥

యెరవుల దేహాలివి నిజమని నమ్మి
యెరిఁగినెఱుఁగలేరిది యాలా
అరయఁ బరమునకు నాది[౩]పురుషుఁడై
పరగుశ్రీ వేంకటపతి గలిగుండఁగా ॥ తన ॥ 222

౧ 'బొరల' రేకు ౨ 'తనువుఁబ్రాణు' ఇందలి అరసున్న చింత్యము. వముచ్చ-యమేమో? 'ప్రాణుఁడు' కూడ విచిత్రమే 'జీవుడు' కావచ్చు. ౩. 'పురుషుఁడే' రేకు.

సామంతం

సకలభూతదయ చాలఁగఁ గలుగుట
ప్రకటించి దేహసంభవమైనఫలము ॥ పల్లవి ॥

తలకొన్నఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త-
మలవరించుట కర్మమైనఫలము
పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి
గలుగుట హరికృపగలిగినఫలము ॥ సక ॥

యెప్పుడుఁ దిరువేంకటేశుసేవకుఁడౌట
తప్పక జీవుఁడు దానైనఫలము
కప్పినసౌఖ్యదుఃకర్మము (ఖమ్మ?)లు సమముగా
నొప్పుట విజ్ఞానమొదవినఫలము ॥ సక ॥ 223

వరాళి

అన్నలంటాఁ దమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
వన్నెల నప్పులుగొన్నవారువో వీరు ॥ పల్లవి ॥

తెగనీక అప్పులెల్లాఁ దీసితీసి । వారు
తగిలినఁ బెట్టలేక దాఁగిదాఁగి
వెగటునఁ బారిపోఁగా వెంట వెంట । పెక్కు-
వగల నప్పులుగొన్నవారువో వీరు ॥ అన్న ॥

సేయరానిపనులెల్లఁ జేసిచేసి । తప -
రాయడికి లోలోనే రాసిరాసి
కాయములో చొచ్చిచొచ్చి కాఁచికాఁచి । మున్ను
వ్రాయనిపత్రాల కాఁగేవారువో వీరు ॥ అన్న ॥

దొరయై యప్పులవారిఁ దోసితోసి । యీ-
పరిభవములనెల్లఁ బాసిపాసి
సిరులవేంకటపతిఁ జేరిచేరి । యిట్టి-
వరుసనే గెలిచినవారువో వీరు ॥ అన్న ॥ 22

## కన్నడగౌళ

ఏది కడ దీవి కేది మొదలు । వట్టి-
వేదవలు తన్ను విడుచు టెన్నఁడు ॥ పల్లవి ॥

తొడరినహృదయమే తోడిదొంగయై
వడిగొని తన్ను వలఁబెట్టఁగాను
కడఁగి కర్మములఁ గడచు టెన్నడు
నిడివిబంధముల నీఁగు టెన్నఁడు ॥ ఏది ॥

తతిగొన్నతలఁపులే దైవయోగమై
మతినుండి తన్ను మఱఁగించఁగాను
ప్రతిలేనియాపదఁ బాయు టెన్నఁడు
ధృతిమాలినయాస దీరు టెన్నఁడు ॥ ఏది ॥

పొదలినమమతయే భూతమై తన్నుఁ
బొదిగొని బుద్ధి బోధించఁగాను
కదిపి వేంకటపతిఁ గనుట యెన్నఁడు
తుదలేనిభవములఁ దొలఁగు టెన్నఁడు ॥ ఏది ॥ 22

## శుద్ధవసంతం

కడలుడిపి నీరాడఁగాఁ దలఁచువారలకు
కడలేనిమనసునకుఁ గడమ యెక్కడిది ॥ పల్లవి ॥

దాహమణఁగినవెనక తత్త్వమెరిఁగెదనన్న
దాహమేలణఁగు తా తత్త్వమేమెరుఁగు
దేహంబుగలయన్నిదినములకుఁ బదార్థ-
మోహమేలుడుగు దా ముదమేల కలుగు ॥ కడ ॥

ముంద రెరిఁగినవెనక మొదలు మరచెదనన్న
ముంద రేమెరుఁగుఁ దా మొదలేల మరచు
అందముగఁ దిరువేంకటాద్రీశుమన్ననల
కందువెరిఁగినమేలు కలనైన లేదు ॥ కడ ॥ 226

37 రేకు మలహరి

[౧]అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము-
లందు [౨]వెలుగొందీ ప్రభ మీరఁగాను ॥ పల్లవి ॥

తగ నూటయిరువైయెనిమిదితిరుపతులఁ గల-
స్థానికులును చక్రవర్తిపీఠకములును
అగణితంబైన [౩]దేశాంత్రులమఠంబులును
నధికమై చెలువొందఁగాను

మిగులనున్నతములగుమేడలును మాడుగులు
మితిలేనిదివ్యతపసులున్న గృహములును
వొగి [౪]నొరగుఁబెరుమాళ్ళవునికిపట్టయి వెలయు-
దిగువతిరుపతి గడవఁగాను ॥ అదె ॥

పొదలి యరయోజనముపొడవునను బొలుపొంది
పదినొండుయోజనంబులపరపునను బరగి
చెదర కేవంకచూచిన మహాభూజములు
సింహశార్దూలములును

౧. ఇది పెద్దపాట. రెండేసిపంక్తు లొకపాదముగ, చరణమున కెనిమిదిపంక్తులుగ గుర్తించుకొనవలెను. ౨. 'వెలుగొందీ' పూ. ము. పా. ౩. 'దేశాంత్రులు' వ్యావహారిక ప్రతికిది తార్కాణ. ౪ ఒరగుఁబెరుమాళ్ళు=పండుకొన్నగోవిందరాజస్వామి కావచ్చు

కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడగంధర్వయక్షులును విద్యాధరులు
విదితమై విహరించువిశ్రాంతదేశముల
వేడుకలు దైవారఁగాను ॥ అదె ॥

యెక్కువలకెక్కువై యెసఁగి వెలసినపెద్ద-
యెక్కు డతిశయముగా నెక్కినంతటిమీఁద
అక్కజంబైనపల్లవరాయనిమటము
అలయేట్లపేడ గడవఁగ
చక్కనేఁగుచు నవ్వచరిఁ గడచి హరిఁ దలఁచి
మ్రొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీఁద-
నక్కడక్కడ వేంకటాద్రీశుసంపదలు
అంతంతఁ గానరాఁగాను ॥ అదె ॥

బుగులుకొనుపరిమళంబులపూవుఁదోఁటలును
పొందైననానావిధంబులవనంబులును
నిగిడి కిక్కిరిసి పండినమహావృక్షముల-
నీడలను నిలిచి నిలిచి
గగనంబు దాఁకి శృంగారరసభరితమై
కనకమయమైనగోపురములనుఁ జెలువొంది
జగతీధరునిదివ్యసంపదలుగలనగరు
పరుగననుఁ గానరాఁగాను ॥ అదె ॥

ప్రాకటంబైనపాపవినాశనము[౧]లోని
భరితమగుదురితములు పగిలి పారుచునుండ
ఆకాశగంగతోయములు సోఁకిన భవము-
లంతంత వీఁడి పారఁగను

---

౧ 'లోన' కావచ్చు.

యీకడనుఁ గోనేట యతులుఁ బాశుపతుల్ మును-
లెన్న నగ్గలమైవున్న వైష్ణవులలో
యేకమై తిరువేంకటాద్రీశుఁ డా దరిని
యేప్రొద్దు విహరించఁగాను ॥ అదె ॥ 227

ముఖారి

సిరిదొలంకెడిపగలుచీఁకటా యితఁ డేమి
యిరవుదెలిసియుఁ దెలియనియ్యఁ డటుగాన ॥ పల్లవి ॥

తలపోయ హరినీలదర్పణంబో ఇతఁడు
వెలుఁగుచున్నాడు బహువిభవములతోడ
కలగుణం బటువలెనెకాఁబోలు లోకంబు
గలదెల్ల వెలిలోనఁ గనిపించుఁగాన ॥ సిరి ॥

మేరమీరిననీలమేఘమో యితఁ డేమి
భూరిసంపదలతోఁ బొలయుచున్నాఁడు
కారుణ్యనిధియట్లకాఁబోలు ప్రాణులకు
కోరికలు దలఁపులోఁ గురియు నటుగాన ॥ సిరి ॥

తనివోనిఆకాశతత్వమో యితఁ డేమి
అనఘుఁ డీతిరువేంకటాద్రివల్లభుఁడు
ఘనమూర్తి అటువలెనెకాఁబోలు సకలంబు
తనయందె యణఁగి యుద్భవమందుఁగాన ॥ సిరి ॥ 228

ఆహిరి

తనవారలు పెరవారలుఁ దాననియెడివాఁ డెవ్వఁడు
తనుగుణముల దిగవిడిచినధన్యం డాతఁడెపో ॥ పల్లవి ॥

తెగఁబడి మదనసముద్రము దేహముతోడనె దాఁటిన-
విగత[1]భయుం డతఁ డెవ్వఁడు [2]వీరుం డెవ్వఁడొకో
పగగొని పంచేంద్రియములప్రాణముతోడనె బతికి
జగదేకప్రీతుండగుచతురుం డాతఁడెపో ॥ తన ॥

యేచినపరితాపాగ్నుల నేమియు నొవ్వక వెడలిన
[3]ధీచతురుం డతఁ డెవ్వఁడు ధీరుం డెవ్వఁడొకో
చూచినమోహపుఁజూపులఁ జురుచూండ్ల కెడమియ్యని
[4]రాచటికపునెరజాణఁడు రసికుం డాతఁడెపో ॥ తన ॥

చావుకుసరియగుద్రవ్యవిచారపుతగులుఁ బాసిన-
పావనుఁ డెవ్వఁడు బహుజనబాంధవుఁ డెవ్వఁడొకో
శ్రీవేంకటగిరినాథుని చిత్తములోపల నిలిపిన-
దేవసమానుఁడు నాతఁడె ధీరుఁడు నాతఁడెపో ॥ తన ॥ 229

దేవగాంధారి

చెప్పుడుమాటలే చెప్పుకొనుటగాక
చెప్పినట్లఁ దాము సేయ రెవ్వరును ॥ పల్లవి ॥

దొడ్డయినశరీరదోషమైనయట్టి-
జడ్డు దొలఁగవేయఁజాల రెవ్వరును
గడ్డబడి యీఁతకాండ్లౌటగాని
వొడ్డునడుమ నీఁద నోప రెవ్వరును ॥ చెప్పి ॥

శ్రీవేంకటేశుపైఁ జిత్త మర్పణసేసి
యీవిధు లన్నియు నెడయ రెవ్వరును
చావుఁబుట్టుగులేనిజన్మముగలసర్వ-
దేవతామూర్తులై తిరుగ రెవ్వరును ॥ చెప్పి ॥ 230

---

౧. "భయుఁడ ౨. "వీరుఁడె" రేకు. ౩. ఈపాదమంతటా రేకులో డుజ్ స్థానికమైనసున్నలస్థానములో అరసున్నలే. అరసున్నలు అంతటా ఒక్కచే.
౪. 'రాచధిక' రేకు.

38 రేకు దేసాక్షి

వేసరితి ౧ మెట్ల నీవెంటఁ దిరిగి
గాసిఁబెట్టక మమ్ముఁ గావరాదా ॥ పల్లవి ॥

తీసితివి కోరికల తెగనీక పంచలకు
తోసితివి యింటింటఁ దోయఁదోయ
చేసితివి నీచేఁత చెల్లె నీకన్నైనను
ఆస నీపొందొల్ల మంపరాదా ॥ వేస ॥

కట్టితివి కర్మముల కడదాఁక నాపదలఁ
బెట్టితివి దుఃఖములఁ బెనచిపెనచి
పట్టితివి చలము మము పాయనని యాస నీ-
విట్టైన గొంతసుఖ మియ్యరాదా ॥ వేస ॥

కలిపితివి పాపములే కడఁగి నానావిధుల
నెలిపితివి దుర్దశలే నేర్పు మెరసి
తెలఁ గొసంగియును శ్రీతిరువేంకటేశ్వరుని-
నెఱిఁగియును నెఱఁగలే మింక నేతెరువో ॥ వేస ॥ 231

సామంతం

నీవనఁగ నొకచోట నిలిచివుండుటలేదు
నీవనుచుఁ గనుఁగొన్న నిజమెల్ల నీవే ॥ పల్లవి ॥

తనయాత్మవలెనె భూతములయాతుమలెల్ల -
ననయంబుఁ గనుఁగొన్నయతఁడే నీవు
తనుఁగన్నతల్లిఁగా తగనితరకాంతలను
అనఘుఁడై మదిఁజూచునతఁడే నీవు ॥ నీవ ॥

౧ మెట్లు=కొండలు కావచ్చు.

సతతసత్యవ్రతాచారసంపన్నుఁడై
అతిశయంబుగ మెలఁగునతఁడే నీవు
౧ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు-
హతకాముకుఁడైనయతఁడే నీవు ॥ నీవ ॥

మోదమున సుఖదుఃఖములు నొక్కరీతిగా
నాదరింపుచునున్నయతఁడే నీవు
వేదోక్తమతియైనవేంకటాచలనాథ
ఆదియును నంత్యంబు నంతయును నీవే ॥ నీవ ॥ 232

ముఖారి

ఎవ్వరికైనను యీవ్రాఁత । నను
నవ్వులు సేసెఁబో నావ్రాఁత ॥ పల్లవి ॥

తొలిజన్మంబున దోషకారియై
నలుగడఁ దిప్పెను నావ్రాఁత
యిల దుర్గుణముల కీజన్మంబున-
నలఁకువ సేసెఁబో నావ్రాఁత ॥ ఎవ్వ ॥

పురుషునిఁ జే శల్పుని ననిపించుట
నరజన్మమునకు నావ్రాఁత
తరుచయ్యీనపాతక మరుపెట్టుక
నరకము చూపెఁబో నావ్రాఁత ॥ ఎవ్వ ॥

౨పామఱితనమున బహువేదనలను
నామన సెనసెఁబో నావ్రాఁత
కామితఫలు వేంకటపతినిఁ గొలిచి
నామతి దెలిపెఁబో నావ్రాఁత ॥ ఎవ్వ ॥ 233

౧. 'ధృతి' రేకు ౨. 'పామరుతనము' కావచ్చు.

### ఆహిరి - అటతాళం

కూడులేక యొకటికిఁ గూరఁ దిన్నట్లు
ఆఁడనీడ మోవిచిగురాకు దినేరయ్యా ॥ పల్లవి ॥

దుండగపుఁబగవారు దోఁచఁగానే తమకాన
కొండలెక్కినట్లు సిగ్గు గొల్లఁబోఁగాను
దండువెళ్లేమదనునిదాడికి సతులచన్ను-
గొండలెక్కి సారెసారె ౧గోడనేరయ్యా ॥ కూడు ॥

పొదిగొన్నయలపుతోఁ ౨బొదలుతీగెలక్రింద
తుదలేనిభయముతోఁ దూరినట్లు
మృదువైనతరుణులమెఱుఁగుబాహులతల-
పొదలెల్లఁ దూరితూరి పుంగుడయ్యేరయ్యా ॥ కూడు ॥

వలసగంపలమోపువలె లంపటము మోఁచి
తలఁకుచుఁ బారలేక దాఁగినయట్లు
యిల వేంకటేశ నిన్నెఱఁగ కింద్రియముల
తలవరులిండ్లనే దాఁగేరయ్యా ॥ కూడు ॥ 234

### శ్రీరాగం

వెఱతు వెఱతు నిండువేడుకపడ సిట్టి-
కుఱుచబుద్ధుల నెట్టు గూడుదునయ్యా ॥ పల్లవి ॥

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాఁడు
ద్రోహిగాక నేఁడు దొరయట
ఆహికముగ నిట్టి అధమప్రవృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్యా ॥ వెఱ ॥

౧. గోడు+అనేరు. ౨. 'బొదల' కావచ్చు.

తోడఁబుట్టినవాని తొడరి చంపెడువాఁడు
　చూడ దుష్టుఁడుగాక సుకృతియట
పాడైనయిటువంటిపాపబుద్ధులు సేసి
　నీడ నిలువ నెట్టు నేరుతునయ్య ॥ వెఱ॥

కొడుకు నున్నతమతిఁ గోరి చంపెడువాఁడు
　కడుఁబాతకుఁడుగాక ఘనుఁడట
కడలేనియిటువంటికలుషప్రవృత్తికి నాత్మ
　వొడఁబరపఁగ నెట్లోపుదునయ్య ॥ వెఱ॥

తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడుగాక
　యెల్లవారలకెల్ల నెక్కుడట
కల్లరియనుచు లోకము రోయుపని యిది
　చెల్లఁబో నే నేమిసేయుదునయ్య ॥ వెఱ॥

యింటివేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట-
　వెంటఁ దిప్పెడువాఁడు విభుఁడట
దంటనై యాతనిదాసానుదాసినై ౧
　వొంటినుండెద నేమి నొల్లనోయయ్య ॥ వెఱ॥ 235

దేవగాంధారి

ఏమిఫలము దా నిన్నియునుఁ దెలిసినను
　సాము సేసినఫలము జయశీలుఁ డౌటగాక ॥ పల్లవి ॥

తానుగలిగినఫలము దయ సేయఁగలుగుట
　మేనుగలిగినఫలము మేలెల్ల గనుట
మానుషముగలఫలము మంచివాఁడౌట తనుఁ-
　దానె తెలిసినఫలము తత్వపరుఁడౌటగాక ॥ ఏమి ॥

---

౧. 'దాసుడై' కావచ్చు.

పదిలమగుకులముగలఫలము తాఁ జదువుట
చదివినఫలం బర్థసారంబు గనుట
పొదలి శాస్త్రార్థంబు పొడగన్నఫలము మతిఁ౧
దలఁకకిటు వేంకటేశుదాసుఁడౌటగాక ॥ఏమి॥ 236

39 రేకు  శంకరాభరణం

కొనరో కొనరో మీరు కూరిమిమందు
వునికిమనికికెల్ల నొక్కటే మందు ॥పల్లవి॥

ధ్రువుఁడుగొనినమఁదు తొల్లియుఁ బ్రహ్లాదుఁడు
చవిగాఁ గొనినమందు చల్లనిమందు
భవరోగములు వీడిపారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన నిచ్చలమైనమందు ॥కొన॥

నిలిచి నారదుఁడు గొనినమందు జనకుఁడు
గెలుపుతోఁ గొని బ్రదికినయామందు
మొలచి నాలుగుయుగములరాజులు ఘనులు
కలకాలముగొని కడగన్నమందు ॥కొన॥

అజునకుఁ బరమాయువై ౨యొసగినమందు
నిజమై లోకములెల్ల నిండినమందు
త్రిజగములు నెఱఁగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటిదరినున్నమందు ॥కొన॥ 237

సామంతం

పాయపుమదములబంధమా మము
౩జీయని యిఁకఁ గృపసేయఁగదో ॥పల్లవి॥

---

౧. 'మ । తిదలఁకకిటు' పూ. ము పా. ప్రాసకుదిలివది. యతిభంగము. ఇపుడు అచ్చుఅయినది రేకుపారము. ప్రాసభంగము. ౨. 'యొసగిన' కావచ్చు. ౩. 'జేయని' పూ. ము. పా.

ధనధాన్యములై తనులంపటమై
పనిగొంటివి నను బంధమా
౧దినదినంబు నునుతీదీపులఁ బెను-
గనివైతివి యిఁకఁ గావఁగదో ॥పాయ॥

సతులై సుతులై చలమై కులమై
పతివైతివి వో బంధమా
రతిఁ బెరరేఁపుల రంతులయేఁపుల
గతిమాలితి విఁకఁ గావఁగదో ॥పాయ॥

పంతై పొఁడై బలుసంపదలై
ఉంటుగ నేలితి బంధమా
కంటి మిదివో వేంకటగిరిపై మా-
వెంబరాక తెగి విడువఁగదో ॥పాయ॥ 238

సామంతం

కటకటా యిటుచేసెఁ గర్మబాధ
యెటువంటివారికిని నెడయ దీబాధ ॥పల్లవి॥

దినదినముఁ బ్రాణులకు దీపనముచే బాధ
తనుపోషణములు కందర్పబాధ
మనసుశాంతికి సదా మమకారములబాధ
తనివోనికోర్కులకు దైవగతిబాధ ాధ ॥కట॥

వెడయాసచూపులకు వేడుకలచే బాధ
కడువేడ్కలకు వియోగములబాధ
తొడవైనయెఱుకలకు దురితబుద్ధులబాధ
జడియుఁబరచింతలకు సంసారబాధ ॥కట॥

అరిది నిశ్చయమతికి ననుమానములబాధ
సరిలేనిజీవులకు జన్మబాధ
తిరువేంకటాచలాధిపునిఁ గని మని కొలుచు-
వెరవుచేతనె కాని వీడ దీబాధ ॥కట॥ 239

---

౧. 'దినదినంబును నుతి దీపులఁ' పూ.ము.పా.

శ్రీరాగం

ముచ్చుఁగన్నతల్లి చేరి మూలకు నొదిగినట్టు
తెచ్చినసంబళమెల్లఁ దీరుఁబో లోలోనె ॥ పల్లవి ॥

దప్పముచెడినవానితరుణి కాఁగిటఁ జేరి
అప్పటప్పటికి నుస్సు రనినయట్టు
వొప్పయినహరిభక్తివొల్లనివానియింటి -
కుప్పలైనసంపదలు కుళ్లఁబో లోలోనె ॥ ముచ్చు ॥

ఆఁకలిచెడినవానిఅన్నము కంచములోన
వోఁకిలింపుచు నేల నొలికినట్టు
తేఁకువైనహరిభక్తితెరువుగాననివాని -
వేఁకపుసిరులు కొంపవెళ్లఁబో లోలోనె ॥ ముచ్చు ॥

వొడలుమాసినవాని వొనరుఁజుట్టములెల్ల
బడిబడినే వుండి పాసినయట్టు
యెడయక తిరువేంకటేశుఁ దలఁచనివాని -
అడరుబుద్ధులు పగలౌఁబో లోలోననె ॥ ముచ్చు ॥ 240

శ్రీరాగం

అంగడి నెవ్వరు నంటకురో యీ -
దొంగలఁగూడినద్రోహులను ॥ పల్లవి ॥

దోసము దోసము తొలరో శ్రీహరి -
దాసానదాసుల దగ్గరక
ఆసలనాసల హరినెఱఁగక చెడి
పీసరపోయినవెఱ్ఱులను ౧ ॥ అంగ ॥ ౧

౧. 'వెఱ్ఱులము' కావచ్చు.

పాపము పాపము పాయరో కర్మపు-
దాపపువారము దగ్గరక
చేపట్టి వేదపుశ్రీహరికథలు
యేపొద్దు విననిహీనులము ॥ అంగ ॥

పంకము పంకము పైకొనిరాకురో
కొంకఁగొనరులకూళలము
వేంకటగిరిపై విభునిపుణ్యకథ
లంకెల వినరియన్యులము ॥ అంగ ॥ 241

బౌళి - జంపెతాళం

సొగియునా మఱియు ముచ్చుకుఁ బండువెన్నెలలు
పగవానివలెనె లోపల దాఁగుఁగాక ॥పల్లవి॥

దక్కునా పేదకును తరముగానిధనంబు
చిక్కి యెవ్వరికైనఁ జేరుఁగాక
వెక్కసంబైనగోవిందునిఁదలఁపుబుద్ధి
తక్కినపరులకెల్లఁ దలఁపేల కలుగు ॥ సొగి ॥

అరగునా దుర్బలున కరుదైనయన్నంబు
౧ కురుచబుద్ధులను నరమిగొనుఁగాక
తొరలునా హరివినుతి దుష్టునకు నది నోరఁ
దొరలెనా యతనినే దూషించుఁగాక ॥ సొగి ॥

చెల్లునా యమృతంబు సేవించ నధమునకు
వొల్లనని నేలపై నొలుకుఁగాక
వెల్లిగొనుమందునకు వేంకటేశుస్మరణ
చల్లనౌనా మనసు శరియించుఁగాక ॥ సొగి ॥ 242

౧. 'కరుచ బుద్ధులను' పూ.ము.పా యతిభంగముకాబోలు.

40 రేకు సామంతం

నిగమనిగమాంతవర్ణితమనోహరరూప
నగరాజధరుఁడ శ్రీనారాయణా ॥ పల్లవి ॥

దీపించువైరాగ్యదివ్యసౌఖ్యం బియ్య-
నోపకకదా నన్ను నొడఁబరపుచు
పైపైనె సంసారబంధములఁ గట్టేవు
నాపలుకు చెల్లునా నారాయణా ॥ నిగ ॥

చీకాకుపడిననాచిత్తశాంతము సేయ-
లేకకా నీవు బహులీల నన్ను
కాకుసేసెదవు బహుకర్మములఁ బడువారు
నాకొలఁదివారలా నారాయణా ॥ నిగ ॥

వివిధనిర్బంధముల వెడలఁద్రోయక నన్ను
భవసాగరములఁ దడఁబడఁ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా ॥ నిగ ॥ 243

కాంబోది

తెల్లవారనియ్యరో తెరువు యీ-
పల్లదపుదొంగలెల్లఁ బారాడుతెరువు ॥ పల్లవి ॥

దొంతరపూవులతోఁట తూరుపుఁదెరువు
చింతపూవుఁదేనెలచెమ్మతెరువు
సంతులేనిసతియింటిచాయతెరువు
యింతలోనె చలిఁబడి యెండగాఁకేతెరువు ॥ తెల్ల ॥

పాముపుట్టగొంటిమీఁదిపడుమటితెరువు
చీమకదొంతరలోనిచిన్నతెరువు
గాములుగాచుకయుండేగాలితెరువు
యేమిటా నెక్కడవుత నెరఁగనితెరువు ॥ తెల్ల ॥

అన్నిదిక్కులునుఁ దానేయైవున్నతెరువు
పన్నిటికాలూవలబాటతెఱువు
కన్నుల వేంకటపతిఁ గన్నతెరువు
మిన్నునేలఁగూడినమీఁదితెరువు ॥ తెల్ల ॥ 24

శ్రీరాగం

౧ నమో నారాయణాయ నమః
సమధికానందాయ సర్వేశ్వరాయ ॥ పల్లవి ॥

ధరణీసతీఘనస్తనశైలపరిరంభ -
పరిమళశ్రమజలప్రమదాయ
సరసిజనివాసినీసరసప్రణామ ౩ యుత-
చరణాయ తే నమో సకలాత్మకాయ ॥ నమో ॥

సత్యభామాముఖాంచనపత్రవల్లికా -
నిత్యరచనక్రియానిపుణాయ
కాత్యాయనీస్తోత్రకామాయ తే నమో
ప్రత్యక్షనిజపరబ్రహ్మరూపాయ ॥ నమో ॥

దేవతాధిపమకుటదివ్యరత్నాంశుసం-
భావితామలపాదపంకజాయ
కైవల్యకామినీకాంతాయ తే నమో
శ్రీవేంకటాచలశ్రీనివాసాయ ॥ నమో ॥ 24

---

౧. ఈపాటలో నమశ్శబ్దముపై కొన్నిసంధులు వింతైనవి.
౨. 'ధరణిసతి' పూ. ము. పా.
౩. 'యుత' రేఫు. ౪. 'సకలా' రేఫు. పూ. ము. పా.

సామంతం

పాపినై ననాపాలఁ గలిగి తోవ
చూపుమన్న నెందుఁ జూపరు ॥ పల్లవి ॥

ధృతిదూలి జగమెల్లఁ దిరిగి వేసరితి
యితరాలయముల కేఁగియేఁగి వేసరితి
గతిమాలి పరులపైఁ గనలి వేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి ॥ పాపి ॥

విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యముపైఁ గోరి వేసరితి
కసుగంది లోలోనె కాఁగి వేసరితి ॥ పాపి ॥

కోవిదులగువారిఁ గొలిచి వేసరితి
దైవములందరిఁ దడవి వేసరితి
శ్రీవేంకటేశునిసేవ మాని పట్టి-
సేవలన్నియు నేఁ జేసి వేసరితి ॥ పాపి ॥ 246

శ్రీరాగం

సకలశాస్త్రజ్ఞానసంపన్నుఁడట చిత్త-
మొకటికినిఁ జొరదు విధియోగమౌఁగాదో ॥ పల్లవి ॥

౧దొరతనంబట కలిమి దోడుగాదట మంచి-
తరుణులట మోహమట ౨దైన్యంబట
విరహమట దారిద్ర్యవివశుఁడౌనట చూడ-
నరయ నిది కర్మఫలమౌనో కాదో ॥ సక ॥

౧. 'దొరతవఁబట' రేకు. ౨ 'దైన్యఁబట' రేకు.

రాజసన్మానమట రవణహీనత్వమట
తేజమట నలువంక(౧)దిరిపెంబట
వాజివాహనములట వా(డి లేదట తొంటి-
పూజఫలమిది వెలితిభోగమో(గాదో ॥సక॥

యిలయెల్ల నేలునట ఇంట లేదట మిగుల
బలిమిగలదట సదా పరిభవమట
చెలువలర వేడుకల శ్రీవేంకటేశ్వరుని
గొలువనేరనివెనక( గొర(తలో(గాదో ॥సక॥ 247

ముఖారి

సొరిది సంసారంబు సుఖమా యిందరికి
వెరవెఱంగక వగల వే(గేరుగాక ॥పల్లవి॥

దేహములు దలంప సుస్థిరములా ప్రాణులకు -
నూహింప లోభ మట్లుండు(గాక
మోహంబుచే వెనకముం దెఱు(గలేక తమ-
దేహసుఖములు మరిగి తిరిగేరుగాక ॥సొరి॥

వెలకొన్న ద్రవ్యములు నిలుచునా యెవ్వరికి
అలవి నిలుప(గరానియాసగాక
బలువైనవట్టివిభ్రాంతిచే( దగులువడి
తెలిసియును( దెలియ కిటు తిరిగేరుగాక ॥సొరి॥

నెఱయువిభవములెల్ల నిజములా యిందరికి
కొఱమాలినట్టితమగుణముగాక
యెఱుకతో( దిరువేంకటేశు( గొలువ(గలేక
తెఱ(గుమాలినబుద్ధి( దిరిగేరుగాక ॥సొరి॥ 248

౧. 'తిరిపె(బట' రేకు.

41 రేకు ఆహిరి

కాక మరి యింతేల కలుగుఁ దమకేతమకు
చేకొన్నకోరికలు చేరునందాఁకా ॥ పల్లవి ॥

దొరతనములన్నియును దొరసినందాఁకా
నెరతనములన్నియును నెరపినందాఁకా
గరగరికలన్నియును కలసినందాఁకా
విరసంబులన్నియును విసుగునందాఁకా ॥ కాక ॥

యెడమాటలన్నియును యెనసినందాఁకా
అడియాసకోరికలు అడుకునందాఁకా
జడిగొన్నగుక్కిళ్లు చవిగొన్నయందాఁక
వాడ లోముటలు మోహ ముడుగునందాఁకా ॥ కాక ॥

యీవెల్లఁ దమయాత్మ యిచ్చగించినదాఁక
శ్రీవేంకటేశుకృప చేరునందాఁక
లోవెలుతులన్నియును లోఁగొన్నయందాఁక
వేవేగ బంధములు వీడునందాఁకా ॥ కాక ॥ 249

వరాళి

ఏమిసేయువార మిఁకను
ఆమనిచేలపచ్చలాయ బ్రదుకు ॥ పల్లవి ॥

దీపనమనియెడితీరనియాస
రేపుమాపుఁ బెడరేఁచఁగా
తోపుసేయఁగరాక దురితపుతరవుల-
కాపదలకు లోనాయ బ్రదుకు ॥ ఏమి ॥

వేడుకనెడిపెద్దవిడువనితరవు
వోడ కెపుడు వొద్దనుండఁగా
జోడు విడువరాక చులుకఁదనంబున-
కాడికెలకు లోనాయ బ్రదుకు ॥ ఏమి ॥

మమకారమనియెడిమాయతరవు
తిమిర మెక్కించుక తియ్యఁగా
విమలమూరితియైనవేంకటగిరిపతి
అమరఁ జేరక [1]యరవాయ బ్రదుకు ॥ ఏమి ॥ 250

ముఖారి

కడునడుసు చొరనేల కాళ్లు గడుగఁగనేల
కడలేనిజన్మసాగర మీఁదనేల ॥ పల్లవి॥

దురితంబునకునెల్లదొడవు మమకారంబు-
లరిదిమమతలకుఁ దొడ వడియాసలు
గురుతయినయాసలకుఁ గోరికలు జీవనము
పరగ నిన్నిటికి లంపటమె కారణము ॥ కడు ॥

తుదలేనిలంపటము దుఃఖహేతువు దుఃఖ-
ముదుటయినతాపమున కుండఁగఁ జోటు
పదిలమగుతాపంబు ప్రాణసంకటము లీ-
మదముపెంపునకుఁ దనమనసు కారణము ॥ కడు ॥

వెలయఁ దనమనసునకు వేంకటేశుఁడు గర్త
బలిసి యాతనిఁదలఁచుపనికిఁ దాఁ గర్త
తలకొన్నతలఁపు లివి దైవమానుషముగాఁ
దలఁచి యాత్మేశ్వరునిఁ దలఁపంగ వలదా ॥ కడు ॥ 251

---

1. 'యెరవు' వకు వ్యావహారికరూపము కావచ్చు.

శ్రీరాగం

ఇతరులకు నిను నెఱఁగఁదరమా
సతతసత్యవ్రతులు సంపూర్ణమోహవిర-
హితులెఱుఁగుదురు నిను నిందిరారమణా ॥ పల్లవి ॥

నారీకటాక్షపటునారాచభయరహిత-
శూరు లెఱుఁగుదురు నినుఁ జూచేటిచూపు
ఘోరసంసారసంకులపరిచ్ఛేదులగు-
ధీరు లెఱుఁగుదురు నీదివ్యవిగ్రహము ॥ ఇత ॥

రాగభోగవిదూరరంజితాత్ములు మహా-
భాగు లెరుఁగుదురు నినుఁ బ్రణుతించువిధము
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా-
యోగు లెఱుఁగుదురు నీవుండేటివునికి ॥ ఇత ॥

పరమభాగవతపదపద్మసేవానిజా-
భరణు లెఱుఁగుదురు నీపలికేటిపలుకు
పరగునిత్యానందపరిపూర్ణమానస-
స్థిరు లెఱుఁగుదురు నినుఁ దిరువేంకటేశ ॥ ఇత ॥ 252

శంకరాభరణం

ఎరుఁగుదు రింవరు నెఱిఁగీనెఱఁగరు
హరి దానే నిజపరమాతుమని ॥ పల్లవి ॥

నలినాసనుఁ డెఱుఁగు నారదుఁ డెఱుఁగు
కొలఁది శివుఁ డెఱుఁగు గుహుఁ డెఱుఁగు
యిలఁ గపిలుఁ డెఱుఁగు నింతా మను వెఱుఁగు
తలఁప విష్ణుఁడే పరతత్వమని ॥ ఎరు ॥

బెరసి [1]ప్రహ్లాదుఁడు భీష్ముఁడు జనకుఁడు
గురుతుగ బలియు శుకుఁడుఁ గాఁడుఁడు
వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ
హరి యితఁడే పరమాత్ముఁడని ॥ ఎరు ॥

తెలియదగిన దిది తెలియరాని దిది
తెలిసినాను మదిఁ దెలియ దిది
యిల నిందరుఁ దెలిసి రిదే పరమమని
కలవెల్లఁ దెలిపె వేంకటరాయఁడు ॥ ఎరు ॥ 253

దేవగాంధారి

లేదు బ్రహ్మవిద్యామహాసుఖము తమ-
-కీడు తమకర్మ మేమి సేయఁగవచ్చు ॥ పల్లవి ॥

నానావిధులఁ బొరలి నరుఁడు దానై వివిధ-
మైనకర్మములే అనుభవించి
లేనిలంపటములకు లోనై దురితా-
ధీనులై క్రమ్మరఁ దిరిగిపోవుటే కాని ॥ లేదు ॥

పరగ నిన్నిటఁ బొడమి బ్రాహ్మణుఁడై
సరిలేనివేదశాస్త్రములు చదివి
అరుదయినకాంక్షచే నతిపాపపరులై
వెరవునఁ బొడవెక్కి విరుగఁబడుటే కాని ॥ లేదు ॥

చేరనిపదార్థములే చేరఁగోరుటగాని
చేరువనే యామేలు సిద్ధింపదు
ధీరులై తమలోనఁ దిరువేంకటేశ్వరుఁ
గోరి యిటు భజియింపఁగూడు టెన్నఁడుగాన ॥ లేదు ॥ 254

---

౧. 'ప్రంహ్లాదుఁడు' రేకు.

42 రేకు లలిత

నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి ॥ పల్లవి ॥

నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాౚపతికి నిజ-
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి ॥ నీవే ॥

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులువంపేధీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి ౨ నిందరిని నీ-
సిసువులఁగా నేలిన సేనమొదలారి ॥ నీవే ॥

దొరలై నయసురుల తుత్తుమురుసేసి జగ-
మిరవుగా నేలితి వేకరాజ్యమై
పరగుసూత్రవతీపతివై వేంకటవిభు-
సిరులపెన్నిధి నీవే సేనమొదలారి ॥ నీవే ॥ 255

పాడి

బాలులతో వీధులలోఁ బారాడువాఁడు
కోలలెత్తుక వుట్లు గొట్టీఁజుండీ ॥ పల్లవి ॥

నారికడపువక్కలు నానినసనగలు
చారపప్పుఁ దేనెలు చక్కెరలును
పేరినేతులు నానబియ్యాలు నుట్లనవే
చేరి యశోదబిడ్డకుఁ జెప్పేరుసుండీ ॥ బాలు ॥

౧. 'సతికి' రేకు. ౨ 'నిందఱినీ' పూ ము పా.

చక్కిలాలు నడుకులు ౧ సనిగెపప్పులును
చెక్కినమెత్తనితూఁటచెఱకులును
పెక్కువగా నుట్లలో బిందెల నించిన వవే
చక్కనెశోదబిడ్డకుఁ జాపేరుసుండీ ॥ బాలు ॥

నువ్వులుఁ జిటిబెల్లాలు నున్ననిచిమ్మిలులు
నువ్వుటిడియునుఁ జిన్నినురుగులును
౨ యెవ్వారు వేంకటపతి కెఱుగించ నారగించి
కివ్వకివ్వ నవ్వ నణఁకించీజుండీ ॥ బాలు ॥ 256

కన్నడగౌళ

౩ పుండు జీవుల కెల్లఁ బుట్టక మానదు
పుండు మాన మందువోయఁగదయ్య ॥ పల్లవి ॥

నెత్తురు నెమ్ములు నిండినపుంటికి
తిత్తిలో సోదించనేరా
నిత్తెమూ వేనీళ్లఁ గడిగినాను
మత్తిలి వుబ్బు మానదేలయ్యా ॥ పుండు ॥

చల్లఁగూడు వెట్టి చల్లఁగా। పొత్తు-
లెల్లఁ బెట్టి బిగియించఁగాను
కల్లగాదు చీము గారు తొమ్మిదిగండ్ల
పిల్లలాఁ జాలఁ బెట్టెఁగదయ్యా ॥ పుండు ॥

ఆదినుండీ పాకమైనది। యెవ్వ-
రేదిరో మొక మేరుపడదు
ఆదరించి వేంకటాధిప నీవింక
సోదించి మానఁజూడఁగదయ్యా ॥ పుండు ॥ 257

౧. 'సనిగలు' యతిస్థానములోనుండుట గమనింపవలెను.
౨ 'యెవ్వరు' పూ.ము.పా. ౩. ఈపాటలో పూ.ము.పా. న "ప్రగ్రహ"చిహ్నాలు లేవు.

సామంతం

భావమునఁ బరబ్రహ్మ మిదె
దైవసమై మాకద చూడరా ॥పల్లవి॥

నీలమేఘ ముపనిషదర్థం బిదె
పాలుదొంగిలెడిబాలులలో
చాలు నదియ మాజన్మరోగముల-
చీలి దివియ మముఁ జెలఁగించరా ॥భావ॥

తనియనివేదాంతరహస్యం బిదె
వొనర గోపికలవుట్లపై
పనుపడి సకలాపజ్జాలంబుల-
పనులు దీర్చ మముఁ బాలించరా ॥భావ॥

భయములేనిపెనుఁబరమపదం బిదె
జయమగువేంకటశైలముపై
పయిపడుదురితపుఁబోఁజుల నుక్కున
లయముసేయ మము లాలించరా ॥భావ॥ 258

సామంతం

నగధర నందగోప నరసింహా వో-
౧నగజవరద శ్రీనారసింహా ॥పల్లవి॥

నరసింహా పరంజ్యోతి నరసింహా వీర-
నరసింహా లక్ష్మీనారసింహా
నరసఖ బహుముఖ నారసింహా వో-
నరకాంతక జేజే నారసింహా ॥నగ॥

౧. నగజవరద = గజవరద. "మతంగజో గజో నాగః" అను నిఘంటువులోని- 'నాగ' శబ్దవ్యుత్పత్త్యర్థముగా 'నగజ' శబ్దప్రయోగము. ౨. 'నరసింహా' : 'నారసింహా' ఇత్యాదిగా రేకులలో.

నమో ౧నమో పుండరీకనారసింహా వో-
నమితసురాసురనారసింహా
నమకచమకహిత నారసింహా వో-
నముచిసూదనవంద్య నారసింహా ॥ నగ ॥

నవరసాలంకార నారసింహా వో-
నవనీతచోర శ్రీనారసింహా
నవగుణివేంకటనారసింహా వో-
నవమూర్తి మందెమునారసింహా ॥ నగ ॥ 259

పాడి

కడగనుటే సౌఖ్యముగాక యీ-
తడతాఁకుల నెందరు చనరిట్లా ॥ పల్లవి ॥

నిలిచినదొకటే నిజమని తెలిసిన-
తెలివే ఘన మింతియకాకా
కలకాలము చీఁకటి దవ్వుకొనెడి-
వలలభ్రమల నెవ్వరు వడ రిట్లా ॥ కడ ॥

పరహిత మిదియే పరమని తెలిసిన-
పరిపక్వమె సంపదగాకా
దురితవిధుల గొందుల సందులఁ బడి
ధరలోపల నెందరు చనరిట్లా ॥ కడ ॥

ఘనుఁ డీతిరువేంకటపతియని కవి
కొనకెక్కుట తేఁకువగాకా
పనిమాలినయీపలులంపటముల
తనువు వేఁచు టెంతటిపని యిట్లా ॥ కడ ॥ 260

---

౧. 'నమో పుండరీక' ఇది వ్యావహారికసంధి

43 రేకు ధన్నాసి

ఆదిమునులసిద్ధాంజనము
యేదెసఁ జూచిన నిదివో వీఁడే ॥ పల్లవి ॥

నగినవెలవిఁ బదు నాలుగుజగములు
మొగమునఁ జూపే మోహనము
నిగిడి యశోదకు నిధానంబై
పొగడొందీ గృహమున నిదె వీఁడే ॥ ఆది ॥

కనుదెరచిన నలుగడ నమృతము లటు
అనువునఁ గురిసీ నపారము
వనితలు నందవ్రజమునఁ జెలఁగఁగ
మనికికి నిరవై మలసీ వీఁడే ॥ ఆది ॥

పరమునకునుఁ దాఁ బరమై వెలసిన-
పరిపూర్ణ పరాత్పరుఁడు
సరుస రుక్మిణికి సత్యభామకును
వరుఁడగువేంకటవరదుఁడు వీఁడే ॥ ఆది ॥ 261

సామంతం

నారాయణ నీనామము బుద్ధిఁ
జేరినాఁ జాలు సిరు లేమిటాఁతి ॥ పల్లవి ॥

నసుపైన(శ్రీ)విష్ణునామము । పేరు-
కొనఁగానే తేఁకువమీరఁగా
ఘనమైనపుణ్యాలు గలుగఁగా । తమ-
కనయముఁ బర మది యేమిటాఁతి ॥ నారా ॥

నలువైన శ్రీహరినామము మతిఁ-
దలఁచిననా బంధము లూడఁగా
యెలమి దీనిఁ బరియించినా । యీ-
కలుషములేల కలుగు నెవ్వరికి ॥ నారా ॥

వేంకటపతినామవిభవము । కర్మ-
పంకములెల్లఁ బరిమార్పఁగా
బింకమై తలఁపెడిప్రియులకు । యెందు-
నింక నీసుఖ మిది యేమిబ్రాఁతి ॥ నారా ॥ 262

ఆహిరి

మోహము విడుచుటే మోక్ష మది
దేహ మెఱుఁగుటే తెలివి నదే ॥ పల్లవి ॥

ననిచినతనజన్మముఁ గర్మముఁ దన-
పనియు నెఱుఁగుటే పరమ మది
తనకు విధినిషేధములుఁ బుణ్యముల-
ఘనత యెఱుఁగుటే కలిమి యది ॥ మోహ ॥

తటిఁదటిఁ బ్రేమపుతల్లిదండ్రులను
యెఱఁగనిదే కులహీన తది
చఱులఁ బొరలి యాచారధర్మములు
మఱచినదే తనమలిన మది ॥ మోహ ॥

కమ్మరఁగమ్మరఁ గామభోగములు
నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకటనిలయునిదాసుల-
సొమ్మయి నిలుచుట సుకృత మది ॥ మోహ ॥ 263

ముఖారి

శ్రీశోఽయం సుస్థిరోఽయం
కౌశికమఖరక్షకోఽయం ॥ పల్లవి ॥

నిగమనిధినిర్మలోఽయం
జగన్మోహనసతీపతి[1]-
విగతభయోఽయం విజయసఖోఽయం
భృగుమునినా సంప్రీతోఽయం ॥ శ్రీశో ॥

సకలపతి శ్శాశ్వతోఽయం
శుకముఖమునిజనసులభోఽయం
ప్రకటబహుళశోభనాధికోఽయం
[2]వికచరుక్మిణీవీక్షణోఽయం ॥ శ్రీశో ॥

సరసోఽయం పరిసరప్రియోఽయం
తిరువేంకటాధిపోఽయం
చిరంతనోఽయం చిదాత్మకోఽయం
శరణాగతవత్సలోఽయం ॥ శ్రీశో ॥ 264

శుద్ధవసంతం

కిం [3]కరిష్యామి కిం కరోమి బహళ-
శంకాసమాధానజాడ్యం వహామి ॥ పల్లవి ॥

నారాయణం జగన్నాథం త్రిలోకైక-
పారాయణం భక్తపావనం
దూరీకరోమ్యహం [4]దురితదూరేణ సం-
సారసాగరమగ్నచంచలత్వేన ॥ కింక ॥

---

౧. 'పతిః' కావచ్చు. ౨ అర్థసమాసములు విచార్యములు ౩. 'కరుష్యామి' రేకు. ౪. 'దురిత .....లత్వేన' ఈభాగమున కర్తము విచార్యము.

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ-
వరదం శరణాగతవత్సలం
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణభవదేహాభిమానం వహామి ॥ కింక ॥ 265

## శ్రీరాగం

ఆపన్నులపాలిదైవ మాతఁడే [౧]గతిఁ దక్క-
యేప్రొద్దును భజియించఁగ నితరుఁడు మరి [౨]కలఁడా ॥పల్లవి॥

నిరుపాధికనిజబంధుఁడు నిరతిశయానందుఁడు
కరివరదుఁ డితఁడేకాక ఘనుఁ డధికుఁడు గలఁడా ॥ ఆప ॥

సంతతగుణసంపన్నుఁడు సాధులకుఁ బ్రసన్నుఁడు
అంతర్యా మితఁడేకాక అధికుఁడు మరి కలఁడా ॥ ఆప ॥

పరమాత్ముఁడు పరమపురుషుఁడు పరికింపఁగఁ గృపాలుఁడు
తిరువేంకటవిభుఁడేకాక దేవుఁడు మరి కలఁడా ॥ ఆప ॥ 266

## కురంజి-అటతాళం

[౩]మందరధర మధుసూదన
నందగోపనందనా ॥ పల్లవి ॥

నరసింహ గోవింద నవనీతానంద
హరిముకుంద నయనారవింద
కరివరద గరుడగమనరూప
గురుచాపా యదుకులదీపా ॥ మంద ॥

౧. 'మతిఁదక్క' రేకు. 'గతిదక్క' ఉండవచ్చు.
౨. 'కలఁడ' అవియే అంతటా పూ.ము పా.
౩. ఇది హ్రాస్వదీర్ఘాంతమైనతెలుగుసంబోధనములతో కూడినది.

భవదూర భయహర పరిపూర్ణామృత
భువనపాలన సురపాలన
భువనభూషణ పరపురుష పురాతన
నవభోగా కరుణాయోగా ॥ మంద ॥

పంకజాసననుత భవ్యనిర్మలపాద-
పంకజ పరమ పరాత్పర
వేంకటశైలనివేశ శు-
భంకరా క్షేమంకరా ॥ మంద ॥ 267

44 రేకు లలిత

ఈ దేహవికారమునకు నేదియుఁ గడపల గానము
మోదమెఱంగని మోహము ముందర గననీదు ॥ పల్లవి ॥

నిత్యానిత్యవివేకము నీరసునకు నొనగూడదు
సత్యాలాపవిచారము జరగదు లోభికిని
హత్యావిరహితకర్మము అంటదు క్రూరాత్మునకును
ప్రత్యక్షంబగుపాపము పాయదు కష్టునకు ॥ ఈదే ॥

సతతానందవికాసము సంధించదు తామసునకు
గతకల్మషభావము దొరకదు వ్యసనికిని
జితకాముఁడు దా నవుటకు సిద్ధింపదు దుష్కర్మికి
అతులితగంభీరగుణం బలవడ దధమునకు ॥ ఈదే ॥

శ్రీవేంకటగిరివల్లభు సేవాతత్పరభావము-
౧దోవ మహాలంపటులకు తోఁపదు తలఁపునకు
దేవోత్తముఁడగు సీతనిదివ్యామృతమగునామము
సేవింపఁగ నితరులకును చిత్తం బొడఁబడదు ॥ ఈదే ॥ 268

---

౧. ద్రోవ=తత్పరమార్గము అని అర్థము కావచ్చు.

## శ్రీరాగం

[1]నమో నారాయణాయ
నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ-
పారాయణాయ శోభనమూర్తయే నమో ॥ పల్లవి ॥

నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యాధి-
పత్యాయ మునిగణ[2]ప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ [3]సన్మానససాం-
గత్యాయ జగదవనకృత్యాయ తే నమో ॥ నమో ॥

అక్రమోద్ధతబాహువిక్రమాతిక్రాంత-
శుక్రశిష్యోన్మూలనక్రమాయ
శక్రాదిగీర్వాణవక్రభయభంగని-
ర్వక్రాయ నిహతారిచక్రాయ తే నమో ॥ నమో ॥

అక్షరాయాతినిరపేక్షాయ పుండరీ-
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణవిజ్ఞానదక్షయోగీంద్రసం-
రక్షానుకంపాకటాక్షాయ తే నమో ॥ నమో ॥

కరిరాజవరదాయ కౌస్తుభాభరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందుకోటీరతరుణీ[4]మనస్తోత్ర-
పరితోషచిత్తాయ పరమాయ తే నమో ॥ నమో ॥

---

౧. చరణాంతములందు అంతటా ॥నారా॥ అనియే పూ.ము.పా. పల్లవిప్రారంభము 'నమో'. పాటకడపట "నారాయణాయ" పదము పూ.ము.పా. లో లేదు. పల్లవిలో 'మ' ప్రాస లేదు. 'నారాయణాయ నమో' కు బదులు,'నమో నారాయణాయ' వడివదేమో? రేకు ననుసరించి చరణాంతములందు 'నమో' గుర్తించితిని. పల్లవిమొదటితునుక పాటకడపట అనూచ్చారితమైనట్లు ఉన్నది. ౨. 'ప్రత్యాయా' రేకు. ౩. 'సన్మానసం। గత్యాయ' రేకు. ౪. 'మనస్తోత్ర' రేకు.

పాత్రదానోత్సవప్రథిత వేంకటరాయుం
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిరగాత్రాయ రవిచంద్ర-
నేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో నారాయణాయ॥నమో॥269

కన్నడ గౌళ

నీమహత్త్వంబు లోనికిఁ వెలుపలికిఁ గప్పి
కామింప నిట్టిదని కానరా దటుగాన ॥ పల్లవి ॥

నిండి యిన్నిటిలోన నీవు గలవని భ్రాంతి-
నుండుదువుగాని నీ వొకటియునుఁ గావు
దండిగలగిరి ప్రతిధ్వని దోచుఁగాని యది
కొండలోపల లేదు కొండయునుఁ గాదు ॥ నీమ ॥

బలసి యిన్నిటిలోపలనుఁ జైతన్యమై
మెలఁగుదువుగాని యేమిట నీవు లేవు
పలుదెర గులైనదర్పణమునం దొకనీడ
వొలయుఁగా కందు దలపోయ నది లేదు ॥ నీమ ॥

వుడుగ కన్నిటిలోన నుండుటయు లేదు నీ-
వుడివోయి యం దుండకుండుటయు లేదు
చెడనితేజముగాన శ్రీవేంకటేశ నీ-
పొడవు పరిపూర్ణమై పొలుపొందుఁగాన ॥ నీమ ॥ 270

మాళవి

అది నాయపరాధ మిది నాయపరాధ-
మదియు నిదియు నాయపరాధము ॥ పల్లవి ॥

నెరయ రూపములెల్ల నీరూపమేకా-
నరయనియది నాయపరాధము
పరిపూర్ణుఁడగునిన్నుఁ బరిచ్ఛిన్నునిఁగా-
నరయుట యది నాయపరాధము ॥ అది ॥

---

౧. ఇది పంబోధనమా?

జీవాత్మునిఁగాఁ జింతింపఁ దలఁచుట
యావంక నది నాయపరాధము
సేవించి నిను నాత్మఁ జింతింపకుండుట
ఆవల నిది నాయపరాధము ॥ అది ॥

యీడెరఁగక వేంకటేశుఁడ నినుఁ గొవి-
యాడుట యది నాయపరాధము
యేడఁ జూచిన నాయెదుర నుండఁగ నిన్ను-
నాడనీడ వెదకు టపరాధము ॥ అది ॥ 271

కన్నడగౌళ

సతతవిరక్తుఁడు సంసారి గాఁడు
రతిసమ్మదుఁడు విరక్తుఁడు నితఁడె ॥ పల్లవి ॥

నిత్యుఁడైనవాఁడు నిఖిలలోకములఁ-
బ్రత్యక్షవిభవసంపన్నుఁడు గాఁడు
నిత్యుఁడు నితఁడే నిరుపమానుఁడైన-
ప్రత్యక్షవిభవసంపన్నుఁ డితఁడె ॥ సత ॥

యోగియైనవాఁడు వొనర నేకాలము
భోగియై భోగిపై భోగింపలేఁడు
యోగియు నితఁడే వుడుగక భోగిపై
౧ భోగించునటువంటిపురుషుండు నితఁడె ॥ సత ॥

దేవుడైనవాఁడుఁ దెలుప లోకముల
దేవతారాధ్యుఁడై దీపింపలేఁడు
దేవుఁడు నితఁడే దివిజవంద్యుఁడైన-
శ్రీవేంకటగిరిదేవుం డితఁడె ॥ సత ॥ 272

౧. 'భోగించి' రేకు.

45 రేకు వరాళి

ఎచ్చోటి కేఁగిన యెప్పుడూఁ దమ్మలోని-
మచ్చిక పెనుఁదెవులు మానకపోయె ॥ పల్లవి ॥

పాయపుసతులగుబ్బలపెదపొట్లాల
కాయము వడి నొత్తి కాఁచఁగను
రాయిడిచే ఘనమాయఁగాని లోని-
మాయపుపెనుఁదెవులు మానకపోయె ॥ ఎచ్చో ॥

అతివలమోహపుటధరామృతములు
యితవుగ నోరి కందియ్యఁగను
అతిమోహమే ఘనమాయఁగాని లోని-
మతకరిపెనుఁదెవులు మానకపోయె ॥ ఎచ్చో ॥

తరుణులమేనిమెత్తనిపరపులమీఁద-
నిరవుగ విటు సుఖియించఁగను
తిరువేంకటాచలాధీశుకృపచేఁగాని
మరుచేతిపెనుఁదెవులు మానకపోయె ॥ ఎచ్చో ॥ 273

మలహరి

పండియుఁ బండదు చిత్తము పరిభవ మెడయదు కాంక్షల
యెండలనే కాఁగితి మిఁక నేలాగో కాని ॥ పల్లవి ॥

పదిగోట్లుజన్మంబులఁ బాయనికర్మపుఁబాట్లు
వదలక [1]లోకం నిమిషములో వడిఁ దీరుచు నితఁడు
చెదరనినిజదాసులకును శ్రీహరి, మా కిపు డంతక[2]
హృదయము నిలువదు [3]చంచల మేలాగో కాని ॥ పండి ॥

౧. 'విషయములో' పూ.ముపా ౨. అంతక = అంతవరకు కావచ్చు.
౩. 'చెంచెల' రేకు.

[1]కూపపుబహునరకంబుల కోట్లసంఖ్యలఁ బొరలేటి-
పాపము లొకనిమిషములోఁ బాపఁగఁగలఁ డితఁడు
కాపాడఁగఁ దలచిన[2]యీకమలాపతి, నే మీతని-
యేపునఁ గని మనలే మిఁక నేలాగోకాని ॥ పంది ॥

జడిగొని యెన్నఁడు బాయనిసంసారపుబంధంబుల
విడుమని వొకనిమిషములో విడిపించును యితఁడు
కడుఁగొలిచినవారికి వేంకటపతి, నే మీతని-
నెడయక కొలువఁగలేమిఁక నేలాగోకాని ॥ పంది ॥ 274

వరాళి

వాడలవాడలవెంట వాఁడివో వాఁ[3]డివో
నీడనుండి చీరలమ్మే నేఁతబేహారి ॥ పల్లవి ॥

పంచభూతములనెడిపలువన్నెనూలు
చంచలపుగంజి వోసి చరిసేసి
కొంచెపుకండెలనూలిగుణముల నేసి
మంచిమంచిచీరలమ్మీమారుబేహారి ॥ వాడ ॥

మటమాయములఁ దనమగువ పసిఁడినీరు
చిటిపొటియలుకలఁ జిలికించఁగా
కుటిలంపుఁజేఁతలు కుచ్చులుగాఁ గట్టి
పటవాళిచీరలమ్మీబలుబేహారి ॥ వాడ ॥

మచ్చికకర్మమనేటిమైలసంతలలోన
వెచ్చపుకర్మధనము వెలువచేసి
పచ్చడాలుగాఁ గుట్టి బలువేంకటపతి
ఇచ్చకొలఁదుల నమ్మీఇంటిబేహారి ॥ వాడ ॥ 275

---

౧. 'బహునరకకూపంబులకోట్లు' అనుట పహజము. ఈ వింతసమాసములు ఈ వాఙ్మయమున గలవు. ౨. 'యాకమలా' పూ.ము.పా. ౩. 'డెవో' పూ.ము.పా. 'వాడు + ఇగో'కు వ్యావహారికము. ఇట్టివి ఈ వాఙ్మయమున గలవు. చూ: 279 పాట. ౪. 'విలువ' పూ.ము.పా.

## సామంతం

తొక్కనిచోట్లు దొక్కెడిమనసు
యెక్కడ గతిలే దింక౧నో తెరువు ॥పల్లవి॥

పాపము వాయదు పైపై మనసున
కోపము దీరదు కొంతైనా
దీపనబాధయుఁ దీర దిన్నియును
యేపునఁ బెనఁగొనె నింకనో తెరువు ॥తొక్క॥

౨యెవ్వనమదమును నెడయదు కోరికె
కొవ్వును నణఁగదు కొంతైనా
రవ్వగుమమకారముఁ బెడఁబాయదు
యెవ్విధియును లే దింకనో తెరువు ॥తొక్క॥

వెఱపును విడువదు వెడమాయలఁబడి
కొఱఁతయుఁ దీరదు కొంతైనా
తెఱఁ గొసఁగేటిశ్రీతిరువేంకటపతి-
నెఱఁగినెఱఁగలే మిఁకనో తెరువు ॥తొక్క॥ 276

## సాళంగనాట

ఎట్టివారికినెల్ల నిట్టికర్మములు మా-
౩యెట్టివారికి నింక నేది తోవయ్యా ॥పల్లవి॥

పాముఁజంపినయట్టిపాతకమునఁ బెద్ద-
పాముమీఁద నీకుఁ బవళించవలసె
కోమలిఁజంపినకొఱఁతవల్ల నొక్క-
౪కోమలి నెదఁ బెట్టుకొని యుండవలసె ॥ఎట్టి॥

---

౧. 'ఓతెరువు' సంబోధనమా? 'తెరువా' కావలె. ఇంకనో తెరువు=ఇంకానా మనకు త్రోవ? అని కావచ్చు. ౨. 'యవ్వన' పూ ము.పా. యతిభంగము. 'యెడయ' లోని యకారమునకు గూర్చిరేమో? ౩. 'యిట్టి' పూ ము.పా. 'మాయట్టి' అనుదానికి 'మాయెట్టి' అను వ్యావహారికరూపము ఈ వాఙ్మయమున గలదు. ౪. 'గోమలి' పూ.ము.పా

బండివిఱిచినట్టిపాతకమునఁ బెద్ద -
బండిబోయిఁడవై పనిసేయవలసె
కొండవెఱికినట్టిగుణమునఁ దిరుమల౧ -
కొండమీఁద నీకుఁ గూచుండవలసె ॥ ఎట్టి ॥ 277

## ముఖారి

అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్నిరూపుల భ్రమయింతువుగా ॥ పల్లవి ॥

పాలజలనిధి నుండి బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి
భూలోకనిధివై పురుషోత్తమాన నుండి
వేలసంఖ్యలరూపై విచ్చేతుగా ॥ అన్ని ॥

వుత్తరమధురలో నయోధ్యలోపల నుండి
సత్తైననందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను ॥ అన్ని ॥

కైవల్యమున నుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీవేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా ॥ అన్ని ॥ 278

## సామంతం

మాయపుదనుజులమదవైరి కపి-
రాయఁడు ౨వీఁడివో రాముని బంటు ॥ పల్లవి ॥

---

౧ 'తిరుమలకొండ' గూడా 'వేంకటేశ' ముద్రయేనేమో? ౨. 'వీఁడెవో' పూ.ము.పా. చూ: 275 పాట.

పెట్టినజంగయు పెంపుమిగుల మొలఁ
గట్టినకాసెయు గర్వమున
నిట్టనిలిచి పూనినచేత పడిమి-
దిట్ట వీఁడువో దేవునిబంటు ॥ మాయ ॥

నవ్వుచు లంకానగరపుదనుజుల-
కొ వ్వణఁచినకపికుంజరుఁడు
మువ్వురువేల్పుల మొదలిభూతియగు-
రవ్వగు సీతారమణునిబంటు ॥ మాయ ॥

పంకజసంభవుపట్టముగట్టను
వుంకించిన తనవాడయనిచే
పొంకపుకలశాపురహనుమంతుఁడు
వేంకటరమణునివేడుకబంటు ॥ మాయ ॥ 279

46 రేకు శంకరాభరణం

పరుసము సోఁకియు బ్రదుకవద్దా
తిరిగి కర్మము లింక తీదీపులా ॥ పల్లవి ॥

పదిగాలువడియున్న ప్రాణాచారముల-
పడఁతుల నధములఁ బాలించితి
యిడుమలఁ బెడఁబాప నింకనేల తెగి కొంక
౧గడిచీటిచ్చియు నింకఁ గడ మున్నదా ॥ పరు ॥

మితిలేనిధనములు మెరసి కానుకగొని
అతిపుణ్యు లిందరి నలర్చించితి
ధృతిహీనులకునెల్ల దీక్షయు కాతువుగాక
వ్రతముచెల్లిన నింక వట్టఁగట్లా ॥ పరు ॥

౧. 'గడియించి తెచ్చియు' పూ. ము. పా.

పాలించి నావిన్నపమున వేంకటరాయ
లాలించితివి నే నీలలనఁగానా
యీలాగుననె లోకమింతాఁ గాతువుగాక
పాలుదాగినమీఁదఁ బై కుడుపులా ॥ పరు ॥ 280

## శ్రీరాగం

భాలనే[త్ర]ానలప్రబలవిద్యుల్లతా-
కేలీవిహార లక్ష్మీనారసింహా ॥ పల్లవి ॥

ప్రళయమారుత ఘోరభస్త్రికా ౧ ఘూత్కార-
లలితనిశ్వాసడోలారచనయా
కులశైలకుంభినీకుముదహితరవిగగన-
చలనవిధినిపుణ నిశ్చలనారసింహా ॥ భాల ॥

వివరఘనవదనదుర్విధహసననిష్ఠ్యూత-
లవదివ్య౨పరుషలాలాఘటనయా
వివిధజంతువ్రాతభువన౩మగ్నీకరణ
నవనవప్రియ౪ గుణార్ణవనారసింహా ॥ భాల ॥

దారుణోజ్జ్వలధగద్ధగితదంష్ట్రానలవి-
కారస్ఫులింగసంగక్రీడయా
వైరిదానవఘోరవంశభస్మీకరణ-
కారణ ప్రకటవేంకటనారసింహా ॥ భాల ॥ 281

## కన్నడగౌళ

ఇంత నేసేఁటో దైవ మింతలోననే అయ్యో
సంతపాకలంజఁ దెచ్చి సన్యాసిఁ జేసె ॥ పల్లవి ॥

---

౧. 'ఘూత్కార' రేఖ ౨ 'ప్రత్న-పురాతన;నూత్న-నూతన' శబ్దములవలె 'పర్ష-పరుష' శబ్దములా? ౩. 'మగ్నీకరణ' పూ.ము.పా. 'అగ్ని' శబ్దమునకు, 'అగ్నిసాత్' వరకు అర్థము చెప్పుకొని 'అగ్నీకరణ' ప్రయోగించినట్లున్నది. నాయీఊహకు పై చరణములోని 'భస్మీకరణ' ప్రయోగముకూడ ఆధారము. ౪. 'వివిధజంతు ప్రియ, వరకుగల- భాగము అంత సుఘటితార్థము కాదు.

పరిగెలేరేటివాని( బట్టపురాజు(గా
నిరతభోగము లిచ్చి నిలిపినట్లు
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు
అరయ నిత్తడి( దెచ్చి యపరంజి( జేసె ॥ ఇంత ॥

కుక్కలవండుకతినే కులహీనుని( దెచ్చి
వెక్కసపు(బా(పని( గావించినయట్లు
దిక్కులెఱ(గ(గ( గష్టదేహిని నన్ను( దెచ్చి
గక్కన( దెలుకపిండి కస్తూరి సేసె ॥ ఇంత ॥

చెడుగైనదోమ( దెచ్చి సింహపు(గొదమ(గా
బెడిదంపు(బ్రేమతోడ( బెంచినయట్లు
కడునధముని వేంకటపతి నను నిటు
చిడిపిరాయి దెచ్చి చింతామణి సేసె ॥ ఇంత ॥ 282

నాట

మాన( డెన్న(డు శరీరి దు-
ర్మానబోధితు(డుగాన ॥ పల్లవి ॥

పంచభూతవికారంబులు
పంచేంద్రియములూ
పంచమహాపాతకములకును
పంచివేసినవిగాన ॥ మాన( ॥

త్రైగుణ్యవికారంబులు
త్రైగుణ్యపు( దనువులు
శ్రీగురు(డగుశ్రీవేంకటపతి-
భోగయోగ్యములుగాన ॥ మాన( ॥ 283

శ్రీరాగం

ఎన్నిబాధలఁ బెట్టి యేఁచెదవు నీ వింక నెంతకాలముదాఁకఁ గర్మమా
మన్నించుమనుచు నీమఱఁగు చొచ్చితిమి మా మొఱాలకించ వో-
కర్మమా ॥ పల్లవి ॥

ప్రతిలేనిదురితములపాలు సేయక నన్నుఁ బాలించవైతి వోకర్మమా
తతితోడ నాత్మపరితాపంబుతోడుతను తగులేల సేసి తోకర్మమా
జితకాములకుఁగాని చేతికిని లోనయి చిక్క వేకాలంబు కర్మమా
మతిహీనులైనట్టిమాకు నొకపరిపాటిమార్గంబు చూప వో-
కర్మమా ॥ ఎన్ని ॥

ఆసలనియెడితాళ్ల నంటగట్టుక విధికి నప్పగించితివిగదె కర్మమా
వాసి విడిచితిమి నీవారమైతిమి మమ్ము వన్నెచెడనీకు వోకర్మమా
కాసుకునుఁగొఱగానిగతిలేనిపనికిఁగా కాలూఁదనీవేల కర్మమా
¹వోసరించొకమారు వొయ్యనే వొకరీతి నొల్లనని తలఁగుమీ
కర్మమా ॥ ఎన్ని ॥

తిరువేంకటాచలాధిపునిమాయలచేత దెసలఁదిరిగినయట్టికర్మమా
హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా
వరుస నేనుగమీఁదవాని సున్నం బడుగవచ్చునా నీకిట్లఁ గర్మమా
పరమపురుషోత్తముని భ్రమతఁబడి నీవిట్ల బట్టబయలైతిగా
కర్మమా ॥ ఎన్ని ॥ 284

దేవగాంధారి

ఇన్ని స్నేఁతలకు నిది యొకచే
కన్నా మనసిది కానదుగాని ॥ పల్లవి ॥

౧. ఓసరించి+ఒకమారు.

పాతకకోట్లు భవములు భస్మీ-
భూతము సేయఁగఁ బొడవాకచే
శ్రీతరుణీపతిచింత, నిజముగా
యేతరి చిత్తం బెఱఁగదుగాని ॥ ఇన్ని ॥

మరణభయంబులు మదములు మలినీ-
కరణము సేయఁగఁగల దొకచే
హరినామామృత, మందుమీఁది రతి
నిరతము నా కిది నిలువదుగాని ॥ ఇన్ని ॥

కుతిలములును దుర్గుణములునుఁ దృణీ-
కృతము లు సేయఁగ గురుతొకచే
పతియగు వేంకటపతిసేవారతి,
గతియని మతి గని కానదుగాని ॥ ఇన్ని ॥ 285

47 రేకు ముఖారి

ఏమీ నెఱఁగనినా కేడపుణ్యము
తామసుండఁ జుమ్మీ ముందరనున్న దైవమా ॥ పల్లవి ॥

పాతకపుఁజేతులనే పట్టి నిన్నుఁ బూజించు-
ఘాతుకుఁడ నాకు నెక్కడిపుణ్యము
చేతనముఁ బొదిసేయుచిత్తము నీదేకాన
రాతిబొమ్మఁ జుమ్మీ భారము నీది దైవమా ॥ ఏమీ ॥

హీనినయెంగిలినోర నొప్పగునిన్నుఁ బొగడు-
హీనజంతువునకు నా కేఁటిపుణ్యము
తేనెవూసి నీ విట్లాఁ దిప్పఁగానే తిరిగేటి-
మానిబొమ్మఁ జుమ్మీ నామతిలోనిదైవమా ॥ ఏమీ ॥

జాలిఁబడి సంసారజలధిలో మునిఁగేటి-
కూళఁడ నాకేఁటితేఁకువపుణ్యము
పాలువోసిపెంచిననాపాలివేంకటేశ నే
౧తోలిబొమ్మఁజుమ్మీ కాతువుగాని దైవమా ॥ ఏమి ॥ 286

దేవగాంధారి

భారమైనవేఁపమాను పాలువోసి పెంచినాను
తీరనిచేఁదేకాక తియ్యనుండీనా ॥ పల్లవి ॥

పాయఁదీసి కుక్కతోఁక బద్దలువెట్టి బిగిసి
చాయ కెంతగట్టినాను చక్కనుండీనా
కాయపువికార మిది కలకాలముఁ జెప్పినా
పోయినపోకలేకాక బుద్ధి వినీనా ॥ భార ॥

ముంచిముంచి నీటిలోన మూల నానఁబెట్టుకొన్నా
మించినగొడ్డలి నేఁడు మెత్తనయ్యీనా
పంచమహాపాతకాలబారిఁబడ్డచిత్త మిది
దంచిదంచిచెప్పినాను తాఁకి వంగీనా ॥ భార ॥

కూరిమితోఁ దేలుఁ దెచ్చి కోకలోనబెట్టుకొన్నా
సారెసారెఁ గుట్టుగాక చక్కనుండీనా
వేరులేనిమహిమలవేంకటవిభునికృప
ఘోరమైనఆస మేలుకోరనోఁకీనా ॥ భార ॥ 287

భూపాళం

ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా
శ్రీకాంతుభజియించుసేవకులకు ॥ పల్లవి ॥

౧. తోలుబొమ్మకావచ్చు. 'తోలు' ఔపవిభక్తికమా ?

పాతాళ మద్దమా బలిమథనుదాసులకు
భూతలం బద్దమా పుణ్యులకును
సేతుకైలాసములు చిరభూము లివ్వియును
పైత్రోవలట పరమభాగవతులకును ॥ ఆకా ॥

అమరావతద్దమా హరిదాసులకు మహా-
తిమిరంబు లద్దమా దివ్యులకును
కమలాసనునిలోకం బదియు నద్దమా
విమలాత్ములై వెలుఁగువిష్ణుదాసులకు ॥ ఆకా ॥

పరమపద మద్దమా ౧బ్రహ్మాండధరుఁడైన-
ధర వేంకటేశ్వరునిదాసులకును
యిరవైనలోకముల విన్నిటా భోగించి
వరుసలమ విహరించువరవైష్ణవులకు ॥ ఆకా ॥ 288

దేవగాంధారి

ఆదిదేవ పరమాతుమా
వేదవేదాంతవేద్య నమో నమో ॥ పల్లవి ॥

పరాత్పరా భక్తభవభంజనా
చరాచరలోకజనక నమో నమో ॥ ఆది ॥

గదాధరా వేంకటగిరినిలయా
సదానంద ప్రసన్న నమో నమో ॥ ఆది ॥ 289

భైరవి

హరిఁ గొలిచియు మరీ నవరములా
తిరముగ నతనినే తెలియుటగాకా ॥ పల్లవి ॥

---

౧. 'బ్రహ్మాండధరుఁడైనవేంకటేశ్వరుఁడు' అను సమాసమధ్యమున 'ధర' శబ్దప్రయోగము వింత. 'ధరలోపివేంకటేశ్వరుఁడు' అని ముందు సమసించి, తరువాత 'బ్రహ్మాండధరుఁడైన' అనుభాగముతో సమసింపవలెనేమో. చూ: 335 పాట.

పంకజనాభునిపాదములు దలఁచి
యింకా మరియొకయితరములా
అంకెల నతనినే అతనిదాసులనే
కొంకక నిజముగఁ గొలుచుటగాకా ॥ హరి ॥

పన్నగశయనునిబంట్లకు బంట్లై
కొన్నిటిపై మరి కోరికెలా
యిన్నికోరికలు యిదియే తనకని
కొన్నదికోలై కోరుటగాకా ॥ హరి ॥

వీసుల వేంకటవిభునామామృత-
మూనిన మతి మరియును రుచులా
తేనెలుగారెడితీపు లతనినుతి
నానారుచులై నసుచుటగాకా ॥ హరి ॥ 290

లలిత

దైవమా పరదైవమా
యిచగంతలు నాకు నెట్టు దెచ్చేవో ॥ పల్లవి ॥

పాపకర్మునిఁ దెచ్చి పరమియ్యఁదలఁచిన
మేపులకే పోక మెయికొనీనా
తీపులు రూపులుఁ దివిరి ౧నావెనువెంట-
నేపొద్దు నీ వేఁడఁ దెచ్చేవో ॥ దైవ ॥

అధమాధమునిఁ దెచ్చి యధికుని జేసేనంటే
విధినిషేధములు వివరించునా
విధినిధానములు విచ్చనిచ్చలుఁ బెక్కు-
విధముల నెటువలె వెదచల్లెదవో ॥ దైవ ॥

౧. 'నావెంట' పూ.ము.పా. మాత్రాభంగము.

అతికష్టుఁడగునాకు నలవిగానియీ-
మత మొసఁగిన నేను మరిగేనా
ప్రతిలేనివేంకటపతి నీదునామా-
మృత మిచ్చి నను నీవే మెరయింతుగాక ॥దైవ॥ 291

భూపాళం

ఏకులజుఁ డేమి యెవ్వఁడైన నేమి
ఆకడ నాఁతడె హరి నెఱిఁగినవాఁడు ॥పల్లవి॥

పరగినసత్యసంపన్నుఁడైనవాఁడే
పరనిందసేయఁ దత్పరుఁడుగానివాఁడు
అరుదైనభూతదయానిధియగువాఁడే
పరులుదానేయని భావించువాఁడు ॥ఏకు॥

నిర్మలుఁడై యాత్మనియతి గలుగువాఁడే
ధర్మతత్పరబుద్ధిఁ దగిలినవాఁడు
కర్మమార్గములు గడవనివాఁడే
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు ॥ఏకు॥

జగతిపై హితముగాఁ జరియించువాఁడే
పగలేక మతిలోన బ్రదికినవాఁడు
తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే
తగిలి వేంకటేశుదాసుఁడయినవాఁడు ॥ఏకు॥ 292

48 రేకు ముఖారి

సేవింతురా యితనిఁ జెలఁగి పరులిట్లనే
కావించె మమ్ము నెక్కుడిదైవ మితఁడు ॥పల్లవి॥

పాలచవి యితఁడెఱుఁగు పాలఁ బవళించ గో-
పాలుఁడని నే మితని భజియించఁగా
పాలుపడి తల్లిదనుఁ బాలుసహితంబు నే-
కాలమునఁ బాపె నెక్కడిదైవ మితఁడు ॥ సేవిం

పుట్టింపఁ దానె మఱి పురుషోత్తముఁడు మంచి-
పుట్టు వొసగీననుచుఁ బూజించఁగా
పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువులెల్లఁ
గట్టిపెట్టించె నెక్కడిదైవ మితఁడు ॥ సేవిం ॥

కర్మకర్తారుఁడవి కడలేనిపుణ్యముల-
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా
కర్మగతిఁ దెచ్చి వేంకటవిభుఁడు మావుభయ-
కర్మములఁ జెరిచె నెక్కడిదైవ మితఁడు ॥ సేవిం ॥ 29

౩౦౦ ఖారి

అరిదినేఁతలే చేసి తల్లాడ విల్లాడ
సరిలేక వుండితివి జలరాశికాడ ॥ పల్లవి ॥

పొలియఁ ౧బీర్చితి వొకతిఁ బురిఁటిమంచముకాడ
వలఁచితి వొకని గగనంబుకాడ
బలిమిఁ దన్నితి వొకని బండిపోతులకాడఁ
దులిమితివి యేడుగురఁ ౨దోలి మందకాడ ॥ అరి ॥

తడవి మోదితి వొకవి తాటిమాఁకులకాడ-
నడిచితివి వొకనిఁ బేయలకాడను
పిడిచివేసితి వొకవి బృందావనముకాడ
వొడిసితివి వొకవి నావులమందకాడ ॥ అరి ॥

---

౧. 'దీర్చితి' పూ.ము.పా. 'పీఁచ్చు' ధాతువునకు 'పీఁచు' అనియు వ్యవహారము గలదు. ౨. 'దొలి' పూ.ము.పా.

పటపటన దిక్కులు పగుల బగతులఁ దునిమి
నటియించితివి మామనగరికాడ
కుటిలబహుదైత్యాంతకుఁడవు వేంకటరాయ
పుటమెగసితి జగంబులయింటికాడ ॥ అరి ॥ 294

## పాడి

బలువగుఁ దనరూపము చూపెన్
కలదింతయుఁ దనఘన తెలిఁగించెన్ ॥ పల్లవి ॥

౧పాండవరక్షణపరుఁడై నరునకు
నండనే తెలిపె మహామహిమ
దండి విడిచి తనదయలో నర్జునుఁ-
డుండఁగ మగటిమి నొదఁబడఁ బలికె ॥ బలు ॥

మగుడఁగ కులధర్మములుఁ బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెన్
నగుచు నతనితో నానాగతులను
నిగమమునియమము నిజ మెఱిఁగించెన్ ॥ బలు ॥

వెరవుమిగుల నావిజయునిమనుమని
పరీక్షిత్తుఁ దగఁ బ్రదికించెన్
తిరువేంకటగిరిదేవుఁడు దానై
గరిమల బారతకథ గలిగించెన్ ॥ బలు ॥ 295

## సామంతం

బలువగుకర్మము లివివో జీవులప్రారబ్ధంబులు సంచితంబులును
బలిసి తీరవివి పెరుగనేకాని బ్రహ్మలబహుకల్పంబులదాఁక ॥ పల్లవి ॥

౧. 'పాండమరక్షక' రేకు.

పాయనిజన్మంబులకర్మంబులు పాయక జీవులప్రారబ్ధములై
యేయెడఁజూచిన నెదిటికొలుచులై[1]యిచ్చల నిటు భుజియించఁగను
కాయపుఁబెడతటిగండఁడు విధి,దనుఁగడతేర్చిన తనకడకర్మములు
పోయి సంచితంబులఁ గలసిన, నవి పొదలుచుఁ గొండలపొడవై
పెరుగు ॥ బలు ॥

పొదలి సంచితంబులు వడిఁబెరుగును పొలియును
జీవునిపుణ్యముఁ జాలక
యెదిగినపుణ్యం బిగురును కాఁగినయినుముమీఁదిజలములవలెను;
పదిలములై కడుఁబాపకర్మములే బరువై పరగఁగఁ బ్రాణికి నెన్నఁడు
తుదయు మొదలు నెందును లేక, వడిఁ దొలఁగక భవములతొడవై
తిరుగు ॥ బలు ॥

తలఁపులో నవ్వయఁదలఁచినజంతువు, కలుషహరుఁడు-
వేంకటగిరిపతి దను-
దలఁచుభాగ్య మాత్మకు నొసగినఁ, జిత్తము పరిపక్వంబై యెప్పుడు
జలజోదరుఁదలఁచఁగఁబ్రారబ్ధంబులుసంచితంబులుఁ బొలిసి పుణ్యులై
చెలువగునిత్యానందపదంబునఁ జెలఁగి సుఖించగఁ జేరుదు రపుడు
॥ బలు ॥ 296

భైరవి

చాల నొవ్వి సేయునట్టిజన్మమేమి మరణమేమి
మాలుగలపి దొరతనంబు మాన్పు టింత చాలదా ॥ పల్లవి ॥

పుడమిఁ బాపకర్మమేమి పుణ్యకర్మమేమి తనకు
కడపరానిబంధములకుఁ గారణంబులై నవి
యెడపకున్న పసిఁడిసంకెలేసు యినుపసంకెలేమి
మెడకుఁ దగిలియుండి యెప్పుడు మీఁదుచూడరానివి ॥ చాల ॥

---

౧. "యిచ్చట నిటు భజి" పూ.ము పా. ౨. 'తలఁపులో మనుపఁదలఁచిన' కావచ్చు. 'స్వామి తవమనసులో కాపాడ దలచినప్రాణిని' అని అర్థము కావచ్చు.

చలముకొన్న ఆపదేమి సంపదేమి యెపుడుఁ దనకు
అలమిపట్టి దుఃఖములకు నప్పగించినట్టిది
యెలమిఁ బసిఁడిగుదియయేమి యినుపగుదియయేమి తనకు
ములుగ ములుగఁ దొలితొలి మోఁదు టింత చాలదా ॥ చాల ॥

కర్మమైనయేమి వికృతకర్మమైననేమి దనకు
కర్మఫలముమీఁదకాంక్ష గలుగు టింత చాలదా
మర్మమెరిఁగి వేంకటేశుమహిమలనుచుఁ దెలిసినట్టి-
నిర్మలాత్మ కిహముఁ బరము నేఁడు గలిగెఁ జాలదా
॥చాల॥ 297

49 రేకు కన్నడగౌళ

కాలాంతకుఁడను వేఁటకాఁ డెప్పుడుఁ దిరిగాడును
కాలంబనియెడితీవ్రపుగాలివెర వెరిఁగి ॥ పల్లవి ॥

పరమపదంబ- నేనికి పసిగానునరమృగములకును
తరమిడి, సంసారపుటోఁదములనె యాఁగించి,
పురవడిఁ జేసినకర్మపుటురులు దరిద్రంబనువల
వారపుగ ౧మాయనుపోఁగులు వాకవెరవున వేసీ ॥ కాలాం ॥

కదుముకవచ్చేటిబలురోగపుఁగుక్కల నుసికొలిపి,
వదలక ముదిసినముదిమే వాకట్టుగఁ గట్టి,
పొదలుచు మృత్యువు పందివోటై నల్లెట నాడఁగ,
పదిలముగాఁ గింకరులనుచొప్పరులఁ బరవిడిచీ ॥ కాలాం ॥

ఆవోఁదంబులఁ జిక్కక, ఆవురులనుఁ దెగనురికి,
ఆవేఁటకాండ్ల నదలించాచేనే చొచ్చి,
పావనమతిఁ బొరెవాడిచి పరమానందముఁ బొందుచు
శ్రీవేంకటపతి మనమునఁ జింతించీ నరమృగము॥కాలా॥ 298

౧. మాయ + అను.

భూపాళం

ఏలవచ్చీ యేలపోయీ నెందుండీఁ బ్రాణి
తోలుతిత్తిలోనఁ జొచ్చి దుంక దూరనా ॥పల్లవి॥

పుట్టులేక నరకాలపుంగుడై తా నుండక యీ-
పుట్టుగున కేల వచ్చీ బోయీఁ బ్రాణి
పుట్టుచునే కన్నవారిఁ బుట్టినవారి నాసలఁ
బెట్టిపెట్టి దుఃఖములఁ బెడరేఁచనా ॥ఏల॥

భూతమై యడవిలోఁ బొక్కుచుఁ దా నుండక యీ-
బూతుజన్మమేల మోఁచెఁ బుచ్చినప్రాణి
రాతిరిఁబగలు ఘోరపుఁబాటు వడిపడి
పాతకాలు చేసి యమబాధఁబడనా ॥ఏల॥

కీటమై వేంకటగిరి కిందనైన నుండక యీ-
చేటువాటుకేల నోఁచె చెల్లఁబో ప్రాణి
గాటమైనసంపదల కడలేనిపుణ్యాల-
కోటికిఁ బడగెత్తక కొంచెపడనా ॥ఏల॥ 299

నాట

[1]అయ్యో మానుపఁగదవయ్య మనుజుఁడు తన-
కయ్యపుఁగంటఁ గానఁడు ॥పల్లవి॥

పాపపుణ్యలంపటుఁడైనా దుష్ట-
రూపుడూ జన్మరోగి యటుగాన
పైపైనే ద్రవ్యతాపజ్వరము పుట్టి
యేపొద్దు వాదలెరఁగఁడు ॥అయ్యో॥

౧. ఈపాటములోనిభావము సుస్పష్టముగా తోపదు.

నరకభవనపరిణతుఁడైనా కర్మ-
పురుషుఁడు హేయభోగి యటుగాన
దురితపుణ్యత్రిదోషజ్వరము వట్టి
అఱవెఱమాట లాడీని ॥ అయ్యో ॥

దేహమోహాసుస్థిరుఁడైనా ని-
ర్వాహుఁడు తర్కవాది యటుగాన
శ్రీహరి వేంకటశ్రీకాంతుని గని
వూహలఁ జేరనొల్లఁడు ॥ అయ్యో ॥ 300

నాట

ఏదియునులేని దేఁటిజన్మము
వేదాంతవిద్యావివేకి గావలెను ॥ పల్లవి ॥

పరమమూర్తిధ్యానపరుఁడు గావలె నొండె
పరమానందసంపద లొందవలెను
పరమార్థముగ నాత్మభావింపవలె నొండె
పరమే తానై పరగుండవలెను ॥ ఏది ॥

వేదశాస్త్రార్థకోవిదుఁడు గావలె నొండె
వేదాంతవిదుల సేవించవలెను
కాదనక పుణ్యసత్కర్మి గావలె నొండె
మోదమున హరిభక్తి మొగినుండవలెను ॥ ఏది ॥

సతతభూతదయావిచారి గావలె నొండె
జితమైనయింద్రియస్థిరుఁడు గావలెను
అతిశయంబగువేంకటాద్రీశుసేవకులె
గతియనుచు తనబుద్ధిఁ గలిగుండవలెను ॥ ఏది ॥ 301

## గుండక్రియ

కడుపెంత తాఁ గుడుచుకుడుపెంత దీనికై
పడనిపాట్లనెల్లఁ బడి పొరలనేలా ॥పల్లవి॥

పరులమనసునకు నాపదలు గలుగఁగఁజేయఁ
బరితాపకరమైనబ్రదుకేలా
సొరిది నితరులమేలు చూచి సైఁపఁగలేక
తిరుగుచుండేటికష్టదేహ మిది యేలా ॥కడు॥

యెదిరి కెప్పుడుఁ జేయుహితమెల్లఁ దనదనుచు
చదివిచెప్పనియట్టిచదువేలా
పొదిగొన్నయాసలోఁ బుంగుడై సతతంబు
పదమదంబై పడయుచవులు దనకేలా ॥కడు॥

శ్రీవేంకటేశ్వరుని సేవారతికిఁగాక
జీవనభ్రాంతిఁబడుసిరులేలా
దేహోత్తముని నాత్మఁ దెలియనొల్లక పెక్కు -
త్రోవ లేఁగినదేహిదొరతనం బేలా ॥కడు॥ 302

## సామంతం

ఘనమనోరాజ్యసంగతి చెలఁగినఁగాని
జనుల కెప్పుడు నాత్మసౌఖ్యంబు లేదు ॥పల్లవి॥

ప్రతిలేనిధైర్యంబు పదిలపరచినఁగాని
మతిలోనిపగవారిమద మణఁపరాదు
మితిలేనిశాంతమను మేఁటికైదువఁగాని
౧క్రితకంబువిషయముల గెలుపెరఁగరాదు ॥ఘన॥

౧. 'కృతకంబు' నకు వ్యావహారికమా?

సొరిది నిర్మోహమనుజోడు దొడిగినఁగాని
వెరపుడిగి మమతచే వెళ్లఁబడరాదు
యిరవైనవిజ్ఞానపింట నుండినఁగాని
అరసి జగమెల్ల తానై యేలరాదు ॥ ఘన ॥

యిన్నియును దిరువేంకటేశుఁ డిచ్చినఁగాని
తన్నుఁదానెరిఁగి యాతనిఁ గొలువరాదు
కన్నులను వెలి లోను గలయఁజూచినఁగాని
సన్నంబుఘనమనెడిజాడ గనరాదు ॥ ఘన ॥ 303

50 రేకు ముఖారి

ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా
మఱచినమేనితో మరి యెఱిఁగీనా ॥ పల్లవి ॥

పటువై భవములఁ బరగేటినాఁడే
తటుకున శ్రీహరిఁ దలఁచఁడటా
కుటిలదేహియై కుత్తికఁ బ్రాణము
తటతటనదరఁగఁ దలఁచీనా ॥ ఎఱు ॥

ఆలుబిడ్డలతో మహాసుఖ మందుచు
తాలిమితో హరిఁ దలఁచఁడటా
వాలినకాలునివసమైనప్పుడు
౧. దాలు వెండఁగాఁ దలఁచీనా ॥ ఎఱు ॥

కొఱఁతలేక తేఁకువఁ దా నుండేటి–
తఱి వేంకటపతిఁ దలఁచఁడటా
మఱులు దేహియై మఱచివున్నయెడ
తఱచుటూరుపులఁ దలఁచీనా ॥ ఎఱు ॥ 304

౧. 'దాలు (లి?) వేఁదఁగా' పూ.ము.పా

## సామంతం

కాలము కాలముగాదు కపటాలే తరుచాయ
చాలునింక దీనితోడిజాలి మానరే ॥ పల్లవి ॥

పిన్ననాటనుండి తనపెంచినయీదేహము
మున్నిటివలెగాదు ముదిసీని
యెన్నికదినాలచేత నెప్పు దేడఁ బడునో
కన్నవారిచేతికి గక్కన నియ్యరే ॥ కాల ॥

తోలునెముకలచేత దొడ్డనయీదేహము
గాలిచేత దాలిమీఁదఁ గాగీని
కీలుగీలు ౧యెప్పు దేడ కింద పీడిపడునో
మేలుఁగీడు లేనిచోట మేఁటిఁజేసిపెట్టరే ॥ కాలు ॥

కింకపుకిసరుచేత కీడైనదేహము
వంకవంకతెరువుల వడిసీని
యింక నీవిధిచేత నెప్పు దేడఁ బడునో
వేంకటేశుఁ జేరఁ బడవేయఁగదరే ॥ కాల ॥ 305

## బౌళి

ఇటువలెనేపో సకలము యించుకగన భావించిన
అటమటములసంతోషము ఆసలు నేయుటలు ॥ పల్లవి ॥

పగగొనితిరిగేటిజన్మపుబాధలు తన కేకాలము
తగుసుఖ మెక్కడ నున్నది తడతాఁకులేకాక
పొగలోపల ౨సెక గాసిన భుగభుగఁ గన్నుల నీళ్లు
నిగిడిన దుఃఖమేకాకిటు నిజసౌఖ్యము గలదా ॥ ఇటు ॥

---

౧. 'యివ్వ' రేకు ౨. 'శక' రేకు

పొలసినమాయపురూపులు పొలఁతులమచ్చికమాటలు
తలఁచిన తనకేమున్నది తలఁపోఁతలేకాక
బలువునఁ బారఁగ మోహపుపాశము తనమెడఁ దగిలిన
తలకిందుగఁ బడుబెల్లను తనకిది ప్రియమౌనా ॥ ఇటు ॥

చేతిపదార్థము దలఁచక చేరువనుండినవారల-
చేతిపదార్థము గోరిన చేతికి లోనౌనా
ఆతుమఁగలవేంకటపతి నాత్మఁ దలఁచి సుఖింపక
యేతరిసుఖములఁ దిరిగిన యింపులు దనకౌనా ॥ ఇటు ॥ 306

కాంభో(బో?)ది

శమముచాలనియట్టిజన్మం బిదేమిటికి
దమముచాలనియట్టితగు లిదేమిటికి ॥ పల్లవి ॥

పగయునుఁబోలె నాపై సేయునదియాస
తగిలి యేపనేకాని దయ గొంత లేదు
జగడమునఁబోలె వలసతిలేనిమమత దను
తెగి వేఁచనేకాని తీరుగడ లేదు ॥ శమ ॥

ఋణమునుఁబోలె తీరియుఁదీరనది కర్మ
గణనగలకాలంబు కడ మొదలు లేదు
వ్రణమునుఁబోలె విడువక రాఁగ[1]దేహంపు-
గుణము సౌఖ్యముతెరువు గొంతయును లేదు ॥ శమ ॥

నీతియుఁబోలెఁ బ్రాణికి వేంకటేశుకృప
చేతికి నిధానంబు చేరినట్లాయ
భూతములుఁబోలె తలఁపున కితరసంస్మరణ-
భీతిపుట్టించి యప్రియభావమాయ ॥ శమ ॥ 307

---

౧. 'రాఁగ' లో అరసున్న విచార్యము 'రాఁగు' కావచ్చు 'రాఁగు' లో ఈ వాఙ్మయమున అరసున్న కలదు.

శ్రీరాగం

ఇదివో సంసార మెంతసుఖమోకాని
తుదలేనిదుఃఖమనుతొడవు గడియించె ॥ పల్లవి ॥

పంచేంద్రియంబులను పాతకులు దను(దెచ్చి
కొంచెపుసుఖంబునకు( గూర్ప(గాను
మించి కామంబనెడి మే(టింతనయందు జని-
యించి దురితధనమెల్ల గడియించె ॥ ఇది ॥

పాయమనియెడిమహాపాతకు(డు తను( దెచ్చి
మాయంపుసుఖమునకు మరుప(గాను
పోయగపుమోహమనుసుతు( దేచి గుణమెల్ల(
బోయి యీనరకమనుపురము గడియించె ॥ ఇది ॥

అతిశయుండగువేంకటాద్రీశు(డనుమహా-
హితు(డు చిత్తములోన నెనయ(గాను
మతిలోపల విరక్తిమగువ జనియించి య-
ప్రతియయి మోక్షసంపదలు గడియించె ॥ ఇది ॥308

బౌళి

చిత్తమో కర్మమో జీవు(డో దేవు(డో
వొత్తినయీచే(త లోకరివి గావు ॥ పల్లవి ॥

పదిలమైనమోహపాశంబులు దెచ్చి
మెదలకుండ(గ నాకు మెడ(జుట్టి
యెదిరివారు నవ్వ నింటింట( దిరిగించి
తుదలేనియాసల దుఃఖాతురుని( జేసె ॥ చిత్త ॥

౧. 'తనయందు' పూ. ము. పా.

కొలఁదిమీఱ జన్మకోట్లఁ బెనగొని
తొలఁగనినాలోనిదురితము
తొలఁగింప నాలుకతుదకు నీపేరిచ్చి
తెలుపు మింతియ చాలుఁ దిరువేంకటేశా ॥ చిత్త ॥ 309

## 51 నుండి 60 వరకు గల 10 రేకులు లేవు.

61 రేకు ఛాయానాట

తలఁప ౧వెనక నుయ్యి తగరు ముందట(?) దీనఁ
దొలఁగ నాకుఁ దెరువుదోపఁ దేమిసేతు ॥ పల్లవి ॥

మమకార(ము?) విముక్తి౨మార్గదూరము నీపై
మమతసేయక నాకు మనరాదు
మమత మేలో నిర్మమత మేలో దీని-
క్రమమునక్రమము నేఁ గాన నేమిసేతు ॥ తలఁ ॥

కర్మమార్గము జన్మగతికిఁ జేరువ ని-
ష్కర్మము పాతకమునకుఁ దొడవు
కర్మి గావలెనో నిష్కర్మి గావలెనో యీ-
మర్మంపు౩మదము మాన దేమిసేతు ॥ తలఁ ॥

శరణాగతరక్షకుడవై నయట్టి-
తిరువేంకటగిరిదేవుఁడా
పరిపూర్ణుఁడవో నీవు పరిచ్ఛిన్నుఁడవో ని-
న్నరసి భజింపలేనైతి నేమిసేతు ॥ తలఁ ॥ 310

---

౧. 'వెవకనుయ్యి ముందర గొయ్యి' అని ఈనాటివాడుక. అన్నమయ్యకు 'వెనుక నుయ్యి ముందు కొండ' అనునలవాటు. ఇక్కడ ముందట 'తగరు' వచ్చినది.

౨. మార్గ 'సహజమార్గము' కావచ్చు. ౩. "మదము=అజ్ఞానము" అని ఉపచారార్థమున ప్రయోగము కావచ్చు.

మలహరి

పాలదొంగవద్ద వచ్చి పాడేరు తమ-
పాలిటిదైవమని బ్రహ్మాదులు

రోలఁ గట్టించుక పెద్దంరోలలుగా వాపోవు
బాలునిముందర వచ్చి పాడేరు
ఆలకించి వినుమని యంబరభాగమునందు
నాలుగుదిక్కులనుండి నారదాదులు ॥పాల

నోరునిండా జొల్లుగార నూఁగి [1] ధూళిమేనితో
పారేటిబిడ్డనివద్దఁ బాడేరు
వేరులేనివేదములు వెంటవెంటఁ జదువుచుఁ
జేరిచేరి యింతనంత శేషాదులు ॥పాల

ముద్దులు మోమునఁగార మూలలమూలలదాఁగే-
బిద్దెబాలునివద్దఁ బాడేరు
అద్దివో శ్రీతిరువేంకటాద్రీశుఁ డితఁడని
చద్దికి వేఁడికి వచ్చి సనకాదులు ॥పాల॥ 31

ధన్నాసి

నందనందన వేణునాదవినోద ము-
కుంద కుందదంతహాస గోవర్ధనధరా ॥పల్లవి॥

రామ రామగోవింద రవిచంద్రలోచన
కామ కామకలుషవికారవిదూరా
ధామ [3] ధామవిభవప్రతాపరూప (?) దనుజని-
ర్ధూమధామకరణచతుర భవభంజనా ॥నంద॥

---

నిడురేకు 48. 1. నోర జొల్లుగారఁగను నూఁగుధూళి ఏనుతి 2. పేయుచునుండ.
ఏడురేకు. 50. 3. దామ విభవ ప్రతాపరూప. ౧. 'రాదలు' కావచ్చు.

౧కమల కమలవాస కమలారమణ దేవో-
త్తమ తమోగుణసతతవిదూర
ప్రమదత్ప్రమదా[1]నుభవభావకరణ[2] (?)
సుముఖ సుధానంద శుభరంజనా ॥ నంద ॥

పరమ పరాత్పర పరమేశ్వరా[3]
వరద వరదామల వాసుదేవ
చిరచిర ఘనవగ శ్రీ వేంకటేశ్వర
నర[4]హరినామ పన్నగశయనా - ॥ నంద ॥ 312

కన్నడగౌళ

౨. వెలికీ వెళ్ళఁడు చలికీ వెరవఁడు
పులికీ సులికీ సులికీనయ్యా ॥ పల్లవి ॥

రోగియై తా రుచులఁ బాయఁడు
భోగియై రతిపొందల్లఁడు
వేగిమిగిలినవెడచీఁకటినీరు
తాగీఁ దాగీఁ దాగీనయ్యా ॥ వెలి ॥

తొడికీఁ దొడుకఁడు పుడికీ నుడుకఁడు
కదిసీఁ గసరఁడు కడుఁజేరఁడు
మడికీ గుడికీ మానినమమతలఁ
బుడికీఁ బుడికీఁ బుడికీనయ్యా ॥ వెలి ॥

నిండీ నిండఁడు నెరసీ నెరయఁడు
పండీఁ బండఁడు బయలీఁతలా
అండనె తిరువేంకటాధిపుఁ దలఁపుచు-
నుండీ నుండీ నుండీనయ్యా ॥ వెలి ॥ 313

1. ప్రమదప్రమదా. 2. కారణ 3. శ్వరపరావర వరదా 4. వరనామ పన్నగరాజ ౧. ఔషధమా? వైద్యుఁడా? ౨. దీనిభావము స్పష్టమగుటలేదు.

## ధన్నాసి

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరిరఘుపుంగవం ॥ పల్లః

రాజవరశేఖరం రవికులసుధాకరం
ఆజానుబాహునీలాభ్రకాయం
[౧]రాజారికోదండరాజదీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం ॥ దేః

నీలజీమూతసన్నిభశరీరం [౨]ఘనవి-
శాలవక్షం విమలజలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం ॥ దేః

పంకజాసనవినుతపరమనారాయణం
[౩]శంకరార్జితజనకచాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వేంకటేశం సాధువిబుధవినుతం ॥ దేవ ॥ ౧

## ఆహిరి

ఎడమపురివెట్టె పరహితవివేకము, లోన
గుడుసువడెఁ జదువు, మెరుఁగులువారెఁ జలము ॥ పల్లః

లంపు మేయఁగఁ దొణఁగె లలితంపుమతి లోనె,
తెంపు దిగవిడిచె యెడతెగనిమానంబు,
చంప దొరకొనియె వేసటలేనితమకంబు,
యింపు ఘనమాయ నే నిఁకనేమి సేతు ॥ ఎడ

౧. 'రామునితో యుద్ధముచేసినశత్రురాజులు ఆతనికోదండలాఘవము తాము విలువిద్య నేర్చిరి' అనుభావమున ఈ సమాసమేర్పడినదేమోః అప్పుడు 'అరిం సహజము. 'రాజారి' ప్రాస నిర్బంధము. ౨. ఈ వాఙ్మయమున 'విశాలవ తప్పుగాదు. 'విశాలవత్సం' కావచ్చు. ౩ 'అర్చిత' కావచ్చు. 'జనకార్చిత శం చాపదళనం' అను భావమే మో

బయలువందిలివెట్టు(ట్టి?) పనిలేనిలంపటము,
దయ విడువఁదొడఁగె చిత్తములోనికాంక్ష,
పయికొన్నమోహంబు పడనిపాట్లఁ బరచె,
లయమాయ శాంతి మెల్లనె తీరె నెరుక ॥ ఎద ॥

చావుఁబుట్టువు మఱచె సంసారబంధంబు,
దైవమును విడిచె యా(నే?)తరికంపుఁబ్రియము
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తరంజకుఁడు యిఁకఁ
గావలసినది యతనికరుణ ప్రాణులకు ॥ ఎద ॥ 315

62 రేకు శ్రీరాగం

ఎంతగాలమొకదా యీదేహధారణము
చింతాపరంపరలఁ జిక్కువడవలసె ॥ పల్లవి ॥

వడిగొన్నమోహంబువలలఁ దగులైకదా
కడలేనిగర్భనరకము లీఁద[1]వలసె
నడిమిసుఖములచేత ననుపుసేయఁగఁగదా
తొడరి హేయపుదిడ్డిఁ దూరాడవలసె ॥ ఎంత ॥

పాపపుంజములచేఁ బట్టువడఁగాఁగదా
ఆపదలతోడిదేహము మోవవలసె
చూపులకులోనైనసుఖము గానక[2]కదా
దీపనభ్రాంతిచేఁ దిరిగాడవలసె ॥ ఎంత ॥

హితుఁడైనతిరువేంకటేశుఁ గొలువకకదా
ప్రతిలేనినరకకూపమునఁ బడవలసె
అతనికరుణారసం బబ్బకుండఁగఁగదా
బతిమాలి నలుగడలఁ బారాడవలసె ॥ ఎంత ॥ 316

---

తా. వేం. శేషాచార్యులవ్రాతప్రతిలో. (84) 1. నరకగర్భమునఁ బడవలసె. విడు రేకు 18. 2. గోరఁగఁగదా ?

నాట

తెలిసినఁ దెలియుఁడు తెలియనివారలు
 తొలఁగుఁడు బ్రహ్మాదులె యెరుఁగుదురు ॥ పల్లవి

వరదుఁ డఖిలదేవతలకు వంద్యుఁడు
 గరదుఁ డ(కరదుట?)సురలకుఁ గంటకుఁడు
 పరమాత్ముఁ డంబుజ(దబ్జ?)భవశివాదులకుఁ
 బరులకెల్ల ముమ్మూరలో నొకఁడు ॥ తెలి

దేవుఁడు సనకాదిమునులకును, బర-
 దైవ మఖిలవేదములకును,
 కైవల్యమొసఁగుఘననిధి, విధికిమ -
 హావిధి, జడులకు[2] యాదవకులుఁడు ॥ తెలి ॥

ఆద్యుఁ డచలుఁడు మహాభూత మితఁ డ-
 భేద్యుఁ డసాధ్యుఁడు భీకరుఁడు
 సద్యఃఫలదుఁడు సకలమునులకును
 వేద్యుఁ డితఁడెపో వేంకటవిభుఁడు ॥ తెలి ॥ 317

సామంతం

ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన
 నిక్కమెరిఁగినమహానిత్యుఁడే ఘనుఁడు ॥ పల్లవి ॥

వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి[3]
 యాదరించనిసోమయాజికంటె
 యేదియునులేనికులహీనుఁడైనను విష్ణు-
 పాదములు సేవించుభక్తుఁడే ఘనుఁడు[4] ॥ ఎక్కు ॥

విడురేకు 86. 1. శ్రీరాగం; 2. జనులకు. విడురేకు 70 3. హరికథల
4. పాదసేవకుఁడె పో బ్రాహ్మణోత్తముఁడు

పరమమగువేదాంతపఠన దొరకియు సదా
హరిభక్తిలేనిసన్న్యాసికంటె
పరవిమాలినయంత్యజాతికులజుఁడైన-
నరసి విష్ణునివెదకునాతఁడే ఘనుఁడు ॥ ఎక్కు ॥

వినియుఁ జదివియును శ్రీవిభునిదాసుఁడుగాక
తనువు వేఁపుచునుండుతపసికంటె
యెనలేనిశ్రీవేంకటేశుప్రసాదాన్న -
మనుభవించినయాతఁ డప్పుడే ఘనుఁడు ॥ ఎక్కు ॥ 318

శ్రీరాగం

కనుఁగొనఁగ [1]జీవుఁ డెరఁగఁడుగాక యెఱిఁగినను
అనవరతవిభవంబు లప్పుడే రావా ॥ పల్లవి ॥

విసుగ కెవ్వరినైన వేఁడనేర్చనోరు
దెసలకును బలుమారుఁ దెరచునోరు
వసుధాకళత్రుఁ దడవదుగాక తడవినను
యెసఁగఁ గోరికలు తన[2]కిప్పుడే రావా ॥ కనుఁ ॥

ముదమంది యెవ్వరికి[3] మ్రొక్కనేర్చినచేయి
పొదిగి యధముల నడుగఁబూనుచేయి
అదన హరిఁ బూజసేయదుగాక సేసినను
యెదురెదురఁ గోరికలు యిప్పుడే రావా. ॥ కనుఁ ॥

తడయకేమిటికైనఁ దమకమందెడిమనసు
అడరి యేమిటికైన[4] నలయుమనసు
వడి వేంకటేశుఁ గొలువదుగాక కొలిచినను
బడిబడినె చెడనిసంపద లిట్లు రావా ॥ కనుఁ ॥ 319

చిఱురేకు 121. 1. ఘనసుఖము జీవు. 2. విభవములెల్ల నిప్పు 3. యిందరికి. 4. యెందుకునైన నల ౧. 'శాయదు' రేకు

ముఖారి

జనులు నమరులును జయలిడఁగా
ఘనుఁడదె పుయ్యాలగంభముకాడ ॥ పల్లవి ॥

వదలక వలసినవారికి వరములు
యెదురెదురై తానిచ్చుచును
నిదురలేక పెనునిధివిధానమై
కదలఁ డదే గరుడగంభముకాడ ॥ జను ॥

కోరినవారికి కోరినవరములు
వోరంతబ్రొద్దు౧ నొసఁగుచును
చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ ॥ జను ॥

వడి వేంకటపతి వరములరాయఁడు
నుడుగఁ(గు?)గాళ్ళఁ గన్నులు నుతుల
బడిబడి నొసఁగుచ (ను?) బ్రాణచారులకు౩
కడిమి నీడదిరుగనిచింతాడ ॥ జను ॥ 320

ధవుళి

కొండ దవ్వుట యెలుక గోరిపట్టుట దీన
బండాయ సంసారబంధము ॥ పల్లవి ॥

వెలయఁ జిత్తంబునకు వేరుపురువై బుద్ధిఁ
గలఁగించె మోహవికారము
కలకాలమునకు లింగముమీఁదియెలుకయై
తలకొనియె౨ నాత్మపరితాపము ॥ కొండ ॥

౧. 'వోరంతబ్రొద్దు' రేకు. ౨. 'కొనియు' రేకు. ౩. ప్రాణచారులకు కావచ్చు

అరయఁ జంచలముచే నాలజాలంబువలెఁ
దిరుగదొరకొనియెఁ దనదేహము
తిరువేంకటాచలాధిపుని మన్ననఁగాని
పరిపాటిఁ బడదు తనభావము ॥ కొండ ॥ 321

63 రేకు భైరవి

ంపీఁడివో యిదె[1] వింతదొంగ
వేఁడిపాలు వెన్న [2]వెరఁజినదొంగ ॥ పల్లవి ॥

వెలయ నీటఁ జొప్పువేసేటి[3] దొంగ
తలగాననీక దాఁగుదొంగ
తలఁకక నేలదవ్వేటిదొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి[4]దొంగ ॥ పీఁడి ॥

అడుగుకింద లోకమడఁచేటి[5] దొంగ
ఆడరి తల్లికినైన నలుగుదొంగ
అడవిలో నెలవై యున్నదొంగ
తొడరి నీలికానెతో నుండుదొంగ ॥ పీఁడి ॥

మోస మింతులఁ జేయుమునిముచ్చుదొంగ
రాసికెక్కినగుఱ్ఱంపుదొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరిమీఁద
మూసినముత్యమై మదమందుదొంగ ॥ పీఁడి ॥ 322

శ్రీరాగం

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథా ॥పల్లవి ॥

---

విడురేకు. 35. 1. వోయల. 2. వెన్నలుఁబాలు. 3. వేసిన 4. తిరుగాడు.
5. మణఁచిన. ం. ఇందు దశావతార సమన్వయము గలదు.

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత-
కౌశేయవసన జగన్నాథా ॥ త్వమే ॥

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ-
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా ॥ త్వమే ॥

వటపత్రశయన భువనపాలన జంతు-
ఘటకారకకరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం-
కటగిరినిలయ జగన్నాథా ॥ త్వమే ॥ 323

సామంతం

ఆదిదేవుఁడనఁగ మొదల నవతరించి జలధి సొచ్చి
వేదములును శాస్త్రములును వెదకి తెచ్చె సీతఁడు ॥ పల్లవి ॥

వాలి తిరుగునట్టిదైత్యవరులమోహవతులనెల్ల
మూలమూలఁ ద్రోసి ముసుఁగుపాలు సేసె నీతఁడు
వేలసంఖ్యలైనసతుల వేడుకలలరఁజేసి వొంటి-
నాలిమగనిరీతిఁ గూడి యున భవించె నీతఁడు ॥ ఆది ॥

కడుపులోనిజగములెల్లఁ గదలకుండఁ బాఁపరేని-
పడుక నొక్కమనసుతోడఁ బవ్వళించె నీతఁడు
అడుగుకింద లోకమెల్ల నడఁచఁదలఁచి గుఱుతుమీర
పొడవు పెరిగి మిన్నుజలము పొడిచి తెచ్చె నీతఁడు ॥ ఆది ॥

కోదెవయసునాఁడు మంచి గోపసతుల మనములెల్ల
ఆడికెలకు నోపి కొల్లలాడి బ్రదికె నీతఁడు
వేడుకలర వేంకటాద్రి వెలసి భూతకోటి దన్నుఁ
జూడుఁడనుచు మోక్షపదము చూరవిడిచె నీతఁడు ॥ ఆది ॥324

## ముఖారి

మాదృశానాం భవామయదేహినాం
యీదృశం జ్ఞానమితి ౧యేఽపి న వదంతి ॥ పల్లవి ॥

వాచామగోచరం వాంఛా సర్వత్ర
నీచకృత్యైరేవ నిబిడీకృతా
కేచిదపి వా విష్ణుకీర్తనం ప్రీత్యా
సూచయంతో వా శ్రోతుం న సంతి ॥ మాదృ ॥

కుటిలదుర్బోధనం కూ(కు?)హకం సర్వత్ర
విటవిడంబనమేవ వేద్మ్యధీతం
పటువిమలమార్గసంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే న సంతి ॥ మాదృ ॥

దురితమిదమేవ జంతూనాం సర్వత్ర
విరసకృత్యైరేవ విశదీకృతం
పరమాత్మానం భవ్యవేంకటానామ-
గిరివరం భజయితుం కేవా న సంతి ॥ మాదృ ॥ 325

## శ్రీరాగం

కాకున్న సంసారగతులేల
లోకకంటకములగులోభంబులేల ॥ పల్లవి ॥

౧. ఈ వాఙ్మయమున 'యత్, కిం' శబ్దముల ప్రయోగము శాస్త్రరీతిగా లేదు.

వినికిగనవలసినను విష్ణుకీర్తన చెవికి
  వినికిచేసిన నదియె వేదాంతబోధ
మనికిగనవలసినను మధువైరిపై భక్తి
  ౧వునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు ॥ కాకు ॥

చదువు గనవలసినను శౌరినామము దిరుగఁ
  జదువుటే సకలశాస్త్రములసమ్మతము
విదుర గనవలసినను నీరజాక్షునికిఁ దన-
  హృదయమర్పణసేయు టిది యోగనిదుర ॥ కాకు ॥

ఆస వలసిన వేంకటాధీశ్వరునికృపకు-
  నాసనేయుటే పరమానందసుఖము
వాసి గనవలసినను వైష్ణవాగారంబు
  వాసి సేయుట తనకు వైభవస్ఫురణ ॥ కాకు ॥ 326

దేశి

జీవుఁ డెంతటివాఁడు చిత్త మెంతటిది తన-
  దైవికము గడవ నెంతటివాఁడు దాను ॥ పల్లవి ॥

విడిచిపోవనియాస విజ్ఞానవాసనఁ
  ౨గడచి మున్నాడె నెక్కడివివేకములు
వుడుగనియ్యనిమోహ ముబ్బి పరమార్థముల
  మెడవట్టి నూకె నేమిటికింక నెరుక ॥ జీవుఁ ॥

పాయనియ్యనిమహాబంధ షడ్వ్యాత్మతో
  రాయడికిఁ దొడఁగె నైరణలేల కలుగు
మాయనియ్యనికోపమహిమ కరుణామతిని
  వాయెత్తనియ్య దెవ్వరికిఁ జెప్పుదము ॥ జీవుఁ

---

౧ 'వునికిఁ బాణులకు' రేకు. ౨. 'గడచె' కావచ్చు.

సరిలేనియాత్మచంచల మంతరాత్మకుని-
నెరఁగనియ్యదు దనకు నేఁటిపరిణత(తు?)లు
తిరువేంకటాచలాధిపునిమన్ననఁగాని
వెరసి యిన్నిటి గెలువ వెరవు మఱిలేదు ॥ జీవుఁ ॥327

64 రేకు. వరాళి

ఏమిగల దిందు నెంతపెనగినఁ వృథా
కాముకపుమనసునకు కడమొదలు లేదు ॥ పల్లవి ॥

వత్తిలోపలినూనెవంటిది జీవనము
విత్తుమీఁవటిపొల్లువిధము దేహంబు
బత్తిసేయుట యేమి పాసిపోవుట యేమి
పొత్తులసుఖంబులకు పొరలుటలుగాక ॥ ఏమి ॥

ఆకాశపాకాశ మరుదైనకూటంబు
లోకరంజకము తములోనిసమ్మతము
చాకిమణుఁగులజాడ చంచలపుసంపదలు
చేకొనిననేమి యివి చెదరినను నేమి ॥ ఏమి ॥

గాదెఁబోసినకొలుచు కర్మసంసారంబు
వేదువిడువనికూడు వెడమాయబదుకు
వేదనల నెడతెగుట వేంకటేశ్వరుకృపా-
మోదఁబు వడసినను మోక్షఁబు గనుట ॥ ఏమి ॥ 328

శ్రీరాగం

* కొంచెమును ఘనముఁ గనుఁగొననేల హరిఁదలఁచు-
పంచమహాపాతకుఁడే బ్రాహ్మణోత్తముఁడు ॥ పల్లవి ॥

---

* ఈ సంకీర్తన 318 వ సంకీర్తనకు, అత్యల్పభేదముతోడియనువాదమే.

వేదములఁ జదివియును విముఖుఁడై హరికథల-
నాదరించనిసోమయాజికంటె
యేదియునులేనికులహీనుఁడైనను విష్ణు-
పాదసేవకుఁడువో బ్రాహ్మణోత్తముఁడు ॥ కొంచె ॥

పరమమగువేదాంతపఠన దొరకియు సదా
హరిఁ దలఁచలేనిసన్న్యాసికంటె
మరిగి పసుఁముఁదినెడిమాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు ॥ కొంచె ॥

వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృథా
తనువు వేఁపుచుఁ దిరుగుతపసికంటె
చనవుగలవేంకటేశ్వరుదాసులకు వెంటఁ
బనిదిరుగునధముఁడే బ్రాహ్మణోత్తముఁడు ॥ కొంచె ॥ 329

బౌళి

తెలిసియు నత్యంతదీనుఁడై తన్నుఁ
దెలియఁగఁగోరేటితెలివే పో తెలివి ॥ పల్లవి ॥

వలచినసతి దన్ను వడిఁ గాలఁదన్నిన
అలరి యెట్లా నుబ్బు నటువలెనే
తలఁక కెవ్వరు[1] గాలఁదన్నినా మతిలోన
అలుగక ముదమందునదివో తెలివి ॥ తెలి ॥

అరిది మోహపు[2]వనిత ఆలిపైఁ దిట్టిన-
నరవిరై చొక్కినయటువలెనే[3]
పరులు దన్ను వెలుపల నిట్లఁ బలికిన
అరలేక రతిఁ జొక్కునదివో తెలివి ॥ తెలి ॥

నిడురేకు. 1. కెవ్వఁడు 2. హావనిత. 3. చొక్కుట్లననే.

తనివోక ప్రియకాంతతమ్మిలపురస మాన-
నయమును నటు గోరునటువలెనే
తనర వేంకటపతిదాసులప్రసాదంబు
అనిశము[1]ను గొనఁగోరునదివో తెలివి ॥ తెలి ॥ 330

## గుండక్రియ

పోరాక పోయి తలఁపుననున్న దైవంబుఁ
జేరనొల్లక పరులఁ జేరఁదిరిగెదము ॥ పల్లవి ॥

వడిఁబారుపెనుమ్మగము వలలలోపలఁ దగులు-
వడి వెడల గతిలేక వడఁకుచున్నట్లు
చెడనికర్మములలోఁ జిక్కి భవములబాధఁ
[౧]బడియెదముగాక యేపనికిఁ దిరిగెదము ॥ పోరా ॥

నీరులోపలిమీను నిగిడి యామిషముకై
కోరి గాలము మ్రింగి కూలఁబడినట్లు
జారిపోయిననేల సంసారసౌఖ్యవి-
కారంపుమోహముల్ఁ గట్టువడియెదము ॥ పోరా ॥

శ్రీవేంకటేశు నాశ్రితలోకరక్షకుని
భావింప దేవతాపతియైనవాని
సేవించుభావంబు చిత్తమొదఁబడక సే-
మీవలావలిపనుల నిట్లఁ దిరిగెదము ॥ పోరా ॥ 331

## శ్రీరాగం

సకలసందేహమై జరగుచున్నది యొకటి
ప్రకటింప జీవమో బ్రహ్మమో కావి ॥ పల్లవి ॥

---

1. అనయము. ౧. 'బడియద' రేకు. ఇట్లే తక్కిన స్థలముల.

వసుదేవుజఠరమనువననిధికిఁ జంద్రుఁడై
అసమానగతిఁ బొడమినాఁ డీతఁడు
వసుధఁ జంద్రుఁడు నీలవర్ణుఁ డేఁటికినాయ
రసరెత్తి నునుఁగందు గలయఁగొనుఁబోలు ॥ సక ॥

ఇనవంశమున లోకహితకల్పభూజమై
అనఘుఁడై జనియించినాఁ డీతఁడు
ననుపై నసురతరువు [౧]నల్లనేఁటికినాయ
పెనుఁగొమ్మలో చేఁగ పెరిగిరాఁబోలు ॥ సక ॥

తిరువేంకటాద్రిపైఁ దెలియఁ జింతామణై
అరిదివలెఁ బొడచూపినాఁ డీతఁడు
గరిమె నది యిపుడు చీఁకటివర్ణమేలాయ
హరినీలమణులప్రభ లలమికొనఁబోలు ॥ సక ॥ 332

## ముఖారి

చిరంతనుఁడు [1]శ్రీవరుఁడు
పరమం భవ్యం పావనం ॥ పల్లవి ॥

వేదమయుఁడు కోవిదుఁ డమలుఁడు పరుఁ-
డాదిపురుషుఁడు మహామహుఁడు
యేదెస నేమని యేది దలఁచిన న-
ఖేద మవాద మఖిలసమ్మతం ॥ చిరం ॥

నిఖిలనిలయుఁడు మునివరదుఁ డధికుఁడు
మఖముఖశుకాభిమతరతుఁడు(?)
శిఖరం శివం సుశీలన మతిశయ-
ముఖరం ముఖ్యం మూలమిదం ॥ చిరం ॥

౨డురేకు 66 1. చిరతరుండు శ్రీధరుఁడు 2. దపరుఁడా. ౧ నల్లన+ఏఁటికి+ఆయ.

అనేకప్రదుఁ డనాదినిధనుఁడు
ఘనుఁ డీతిరువేంకటవిభుఁడు
దినందినం సముదితరవికోటిభ-
జనం (?) సిద్ధాంజనం ధనం ॥ చిరం ॥ 333

65 రేకు సామంతం

౧ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి
కందువగుమంచిబంగారుచేయి ॥ పల్లవి ॥

వెలలేనివేదములు వెదకితెచ్చినచేయి
చిలుకుగుబ్బలికిందఁ జేర్చుచేయి
కలికియగుభూకాంతఁ గాఁ(గౌ?)గిలించినచేయి
వలనైనకొనగోళ్ళవాఁడిచేయి ॥ ఇంద ॥

తనివోక బలిచేత దానమడిగినచేయి
వొనరంగ భూదానమొసఁగుచేయి
మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చినచేయి
యెనయ [1]నాఁగేలు ధరియించుచేయి ॥ ఇంద ॥

పురసతులమానములు పొల్లు[2]సేసినచేయి
తురగంబుఁబరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు-
తెరువు ప్రాణులకెల్లఁ దెలిపెడిచేయి ॥ ఇంద ॥ 334

పాడి

అందరిబ్రదుకులు నాతనివే
కందువెల్ల శ్రీకాంతునివే ॥ పల్లవి ॥

---

విడురేకు. 46' 1. యెనసి. 2. పొల్లు. ౧. ఇందు దశావతార సమన్వయము కలదు.

వేసరుఁ జదివెడివిప్రులవేదము
సోము(మ?)కవైరియశోవిభవం
శ్రీ మించునమరలజీవనమెల్ల సు-
౧ధామథనునిసంతతకరుణే ॥ అంద ॥

హితవగు నిలలో నీసుఖమెల్లను
దితిసుతదమనుఁడు దెచ్చినదే
తతి తల్లిదండ్రి తానై కాచిన-
రతి ప్రహ్లాదవరదునికృపే ॥ అంద ॥

అలరినయమరేంద్రాదులబ్రదుకులు
బలిబంధనుకృపఁ బగిగినవే
బలసి మునులయాపదలు వాపుటకు
బలునృపభంజను పరిణతలే ॥ అంద ॥

పూవి యనాథుల పొందుగఁ గాచిన-
జానకీవిభునిసరసతలే
నానాభూభరణంబులు నఁదుని-
సూనుఁడు చేసినసుకృతములే ॥ అంద ॥

తలకొని ధర్మము తానై నిలుపుట
కలుషవిదూరునిగర్వములే
నిలిచి లోకములు ౨నిలిపినఘనుఁడగు-
కలియుగమునవేంకటపతివే ॥ అంద ॥ 335

కన్నడగౌళ

పాయక మతినుండి ౩పరగ మేలుఁగిడును
సేయించి కర్మిఁ దాఁ జేయు నెవ్వరిది ॥ పల్లవి ॥

---

౧. 'సుధామథనుని' రేకు. ౨. 'నిలిపిన ఘనుడగు వేంకటపతి' అను పదాపద్యమున 'కలియుగమున' పదము చేరుట వింత. 'కలియుగమున వేంకటపతి' ముందు పఠించుకొని తరువాత పూర్వపదముతో పఠింపవలెనేమో. చూ: 288 పాట. ౩. 'పరగు' రేకు.

వెలయఁ జరాచరవిభుఁడైనవిభు నాత్మఁ
దలఁచుఁగాక ప్రాణి దా నేమిసేయు
తెలిపి నిర్మలభక్తి దీపించి తనుఁజేరఁ
౧గొలిపించుకొనలేమి కొరత యెవ్వరిది ॥ పాయ ॥

కొందరు సుఖులై కొదలేక మెలఁగఁగ
కొందరిదుఃఖపుకొరత యెవ్వరిది
అందరిమతి వేంకటాద్రివల్లభ నీవు
చెంది కర్మములఁ జేయుచేఁత యెవ్వరిది ॥ పాయ ॥ 336

ఆహిరి

ఎండలోవినీడ యీమనసు
పండు గాయసేయఁబనిలేదు మనసు ॥ పల్లవి ॥

వానచేతక౨ములవలెనాయ మనసు
గోనెఁబట్టినబంకగుణమాయ మనసు
మానఁజిక్కినకోలమతమాయ మనసు
తేనెలోపలియీఁగతెఱఁగాయ మనసు ॥ ఎండ ॥

గడిరాజుబదుకాయ కడలేనిమనసు
నడివీదిపెసరాయ నయమైనమనసు
గడకుఁగట్టినపాఁతగతి దోఁచె మనసు
అడుసులోపలికంబమై తోఁచె మనసు ॥ ఎండ ॥

తెరువుచూపినజాడఁ దిరుగు నీమనసు౩
మరుగఁజేసినచోట మరుగు నీమనసు
తిరువేంకటేశుపైఁ దిరమైనమనసు
సిరిగలిగినచోటఁ జేరు నీమనసు ॥ ఎండ ॥ 337

౧. 'గొలిపించుకొనలేని' కావచ్చు ౨. 'చాతక' కావచ్చు.
౩. 'తిరుగును+ఈమనసు'. తక్కిన స్థలములలో ఇంతే.

భూపాళం

అలర నుతించరో హరిని
యెలయించి మిము భ్రమయించీనిఁ గాలము ॥పల్లవి॥

సేయరో మనుజులార చింత హరి నిఁకనైన
రోయరో మీభుజియించురుచులమీఁద
కాయ మస్థిరము యీకలి మధ్రువము చాలఁ
బోయఁబో యెందుకుఁగాకపోయఁ గాలము ॥అల॥

మెచ్చరో మనుజులార మీరే హరికథలు
పుచ్చరో మీమదిలోనిపొరలెల్లాను
కొచ్చరో మనుజులార కోరికలెల్లను మీకు-
నిచ్చీని శుభములు యివి యెల్లకాలము ॥అల॥

కనరో వేంకటపతిఁ గన్నులుదనియఁగా
వినరో యీతనిస్తుతి వీనులు నిండ
మనరో శ్రీహరిచేతిమన్ననలు(ల?) మీరు
తనమీఁదిమది బుద్ధి దాఁచీనిఁ గాలము ॥అల॥ 338

ధన్నాసి[1]

చదివెఁబో ప్రాణి సకలము యీ-
చదువుమీఁదింవిద్య చదువఁడాయఁగాని ॥పల్లవి॥

పిరులు చంచలమని చేఁత లధ్రువమని
పరగుసంసారము బయలని
తొరలినసుఖమెల్ల దుఃఖమూలమని
యెరిఁగి లోభముపీడ నెరఁగఁడాయఁగాని ॥చది॥

విడురేకు 34. 1. దేవగాంధారి ౧. 'చదువు' వ్రా.ము.పా.

తలకొన్న ధర్మమే [1] తలమీఁదిమోఁపని
వలసినొల్లమి దైవవశమని
కలిమియు లేమియుఁ గడవఁగ [2] రాదని
తెలిసి లోభముపిడఁ దెలియఁడాయఁగాని ॥ చది ॥

యేచిన పరహితమెంతయుఁ దమ [3] దని
వాచవులిన్ని [4] నెవ్వగలని
యీచందమున వేంకటేశుచేఁతలని [5]
చూచి లోభముపీడఁ జూడడాయఁగాని ॥ చది ॥ 339

రేకు శుద్ధవసంతం

ఎందుఁ జూచినఁ దనకు నిన్నియును నిట్లనే
కందులేనిసుఖము కలనైన లేదు ॥ పల్లవి ॥

సిరులుగలిగినఫలము చింతఁ బొరలనె కాని
పొరిది సంతోష మించుకయైన లేదు
తరుణిగలఫలము వేదనలఁ బొరలుటె కాని
నెరసులేనిసుఖము నిమిషంబు లేదు ॥ ఎందు ॥

తనువుగలఫలము పాతకముసేయనె కాని
అనువైనపుణ్యంబు అది యింత లేదు
మనసుగలఫలము దుర్మతిఁబొందనే కాని
ఘనమనోజ్ఞానసంగతి గొంత లేదు ॥ ఎందు ॥

చదువుగలిగినఫలము సంశయంబే కాని
సదమలజ్ఞాననిశ్చయ మింత లేదు
యిది యెరిఁగి తిరువేంకటేశ్వరునిఁ గొలిచినను
బ్రదుకు గలుగును భవము ప్రాణులకు లేదు ॥ ఎందు ॥ 340

1. కర్మమే 2. గడవఁగ 3. దనదని 4. వెల్ల 5. లన్ని చూచి
ంతుమఁ దన్నుఁ జూడ

ఆహిరి

సతతము నేఁ జేయు ననాచారములకుఁ గడ యెక్కడ
మతి ననుఁగని కావుము రామా రామా రామా ॥పల్లవి॥

౧నేసిననా బ్రహ్మహత్యలు శిశుహత్యలు గోహత్యలు
ఆసలనెన్నో యెన్నో అయాజాడలను
యీసున నే నివు డెరిఁగియునెరఁగక సేసేదురితపు-
రాసులకును గడలే దిదె రామా రామా రామా ॥సత॥

నమలెడినావాచవులకు నానావిధభక్షణములు
కమిలినదుర్గంధపుశాకమ్ములు దొమ్ములును
జముబాధల నరకంబుల సారెకు నన్నె(కునెటు)టువలె శ్రీ-
రమణుఁడ ననుఁ గాచే విటు రామా రామా రామా ॥సత॥

కపటపునాధనవాంఛలు కలకాలముఁ బరకాంతలఁ
జపలపుఁదలఁపుల-౨నేఁతలసంఖ్యము లరయఁగను
యెపుడును నిటువలెనుండెడుహీనుని నన్నెటు గాచెదో
రపమున శ్రీవేంకటగిరిరామా రామా రామా ॥సత॥ 341

కన్నడగౌళ

కరుణానిధిం గదాధరం
శరణాగతవత్సలం భజే ॥పల్లవి॥

శుకవరదం కౌస్తుభాభరణం
అకారణప్రియ [1] మనేకదం
సకలరక్షకం జయాధికం సే-
వకపాలకమేవం భజే ॥కరు॥

ఏడురేకు 78 1. అకారణద మనేక
౧. 'నాసేసిన బ్రహ్మహత్యలు' అనుట సహజము ౨. 'సఖ్యము' కావచ్చు

పురగశయనం మహోజ్జ్వలం తం
గరుడారూఢం కమనీయం౧
పరమపదేశం పరమం భవ్యం
హరిం దనుజభయదం[1] భజే ॥ కరు ॥

లంకాహరణం లక్ష్మీరమణం
పంకజసంభవభవప్రియం
వేంకటేశం వేదనిలయం శు-
భాంకం లోకమయం భజే ॥ కరు ॥ 342

## సామంతం

చాలదా బ్రహ్మ మిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం ॥ పల్లవి ॥

సంతోషకరమైనసంకీర్తనం
సంతాప మణఁగించు సంకీర్తనం[2]
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలఁచుఁ డీసంకీర్తనం ॥ చాల ॥

సామజముఁ గాంచినది సంకీర్తనం
సామమున కెక్కుడీసంకీర్తనం
సామీప్య మిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణుసంకీర్తనం ॥ చాల ॥

జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళిసౌఖ్యములిచ్చు సంకీర్తనం
శమదమాదులఁ జేయు సంకీర్తనం ॥ చాల ॥

---

1. దనుజహరం (భయహరం అని సరియైన పాఠమేమో) విడురేకు 91 .2 (రెండవ మూఁడవపాదములు వ్యత్యస్తములు) ౧. 'కమనియ్యం' రేకు.

జలజాసనునినోరిసంకీర్తనం
చలిగొండసుతదలఁచుసంకీర్తనం
చలువ గడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలఁచుఁ డీసంకీర్తనం ॥ చాల

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం
సరుస వేంకటవిభునిసంకీర్తనం
సరుగనను దలఁచుఁ డీసంకీర్తనం ॥ చాల ॥ 34

శుద్ధవసంతం

ఎదుటినిధానమ వెటుచూచిన నీ-
వదె వేంకటగిరియనంతుఁడా ॥ పల్లవి ।

పొగిసి భాద్రపదశుద్ధచతుర్దశి
తగువేడుక నిందరు గొలువ
పగటుసంపదలు బహుళమొసఁగుం నీ-[1]
వగు వేంకటగిరియనంతుఁడా ॥ ఎదు ।

తొలుత సుశీలకు దుశ్శీలవలన
వెలయ సంపదల విముఖుఁడవై
వలెనని కొలిచిన వడిఁ గాచినమా -
యలవేంకటగిరియనంతుఁడా ॥ ఎదు ॥

కరుణఁ గాచితివి కౌండిన్యుని మును
పరగినవృద్ధబ్రాహ్మఁడవై
దొరవులు మావులు ధ్రువముగఁ గాచిన-
హరి వేంకటగిరియనంతుఁడా ॥ ఎదు ॥ 344

---

రేకు. 42. 1. సఁగినిధివగు (సగునిధి?) ౧. ఈపారమే సులభమే మొ.

శుద్ధవసంతం

ఏమి వొరలేరు యేమి మరలేరు
యీమాయలంపటం బీఁదమోఁదనేకాని ॥ పల్లవి ॥

సతులుగలమేలు దా సడిఁబొరలనేకాని
సతమైనసౌఖ్యస్వస్థానంబు లేదు
హితులుగలమేలు తా నిడుమఁబొరలనెకాని
హితవివేకము నరుల కెంతైన లేదు ॥ ఏమి ॥

తనువులెత్తినమేలు తగులాయమేకాని
కనుఁగొనఁగ యోగభోగము గొంత లేదు
ఘనముగలమేలు తా గర్వాంధమేకాని
ఘనుఁడైనశ్రీనాథుఁ గనుఁగొనఁగ లేదు ॥ ఏమి ॥

చింతగలిగినమేలు చివుకఁబట్టనెకాని
చింత వేంకటవిభునిఁ జింతించ లేదు
సంతుగలిగినమేలు సంసారమేకాని
సంతతముఁ జెదనిసద్గతిఁ జేర లేదు ॥ ఏమి ॥ 345

67 రేకు ఆహిరి

నానాదిక్కుల నరులెల్లా
వానలలోననె వత్తురు గదలి ॥ పల్లవి ॥

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు సు-
వ్రతములతోడనె వత్తురు గదలి ॥ నానా ॥

౧. 'ఈఁత–మోఁత' అని అన్నమయ్య అలవాటు. ఇక్కడ 'ఈఁదుట–మోఁదుట' కావున రెండవపదముతో 'మోయుట' కాక 'మోఁదుట' కావలసివచ్చినది.

ముకుపులు జాశెలు మొగిఁ దలమూఁటలు
కదలేనిధనముఁ గాంతలును
కడుమంచిమణులు కరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి ॥ నానా ॥

మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులును
తగువేంకటపతి దరుశింపఁగ బహు-
వగలసంపదల వత్తురు గదలి ॥ నానా ॥ 346

నాట

ఎంత బోధించి యేమిసేసినఁ దన-
దొంతికర్మములు తొలఁగీనా ॥ పల్లవి ॥

సతతదురాచారజడునకుఁ బుణ్యసం-
గతి దలపోసినఁ గలిగీనా
అతిపాపకర్మబోధకుఁడై వెలయుదుష్టు
మతిఁ దలపోసిన మరి కలిగీనా ॥ ఎంత ॥

బహుజీవహింసాపరుఁడైనవానికి
యిహపరములు దైవ మిచ్చీనా
విహితకర్మములువిడిచినవానికి
సహజాచారము జరిగీనా ॥ ఎంత ॥

దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము దెలిసీనా
శ్రీవేంకటేశ్వరుఁ జింతింపకుండిన
పాపసమతుఁడై (మతియై?) బ్రతికీనా ॥ ఎంత ॥ 347

శ్రీరాగం

ఏఁటిబ్రదుకు యేఁటిబ్రదుకు। వొక్క-
మాటలోనే యటమటమైనబ్రదుకు ॥ పల్లవి ॥

సంతకూటములే చవులయినబ్రతుకు
దొంతిభయములతోడిబ్రదుకు
ముంతనీళ్లనే మునిఁగేటిబ్రదుకు
వంతఁ బొరలి కడవరం లేనిబ్రదుకు ॥ ఏఁటి ॥

మనసుచంచలమే మనువయినబ్రదుకు
దినదినగండాలఁ దీరుబ్రదుకు
తనియ కాసలనె తగిలేటిబ్రదుకు
వెనకముందర చూడ వెరపయినబ్రదుకు ॥ ఏఁటి ॥

తెగి చేఁదె తీపయి తినియేటిబ్రదుకు
పగవారిపంచలపాలైన[1] బ్రదుకు
తగువేంకటేశ్వరుఁ దలఁచనిబ్రదుకు
పొగకు నోపక మంటఁ బొగిలేటిబ్రదుకు ॥ ఏఁటి ॥ 348

లలిత

సకలసంగ్రహము సకలసంచయము
అకృతసుకృత మిది హరినామం ॥ పల్లవి ॥

సకలవేదశాస్త్రములసార మిది
సకలమంత్రరాజంబు నిది
సకలపురాణరసములమధుర మిది
అకుటిలపావనం[2] హరినామం ॥ సక ॥

---

ఱేకు 58. 1. పాలిబ్రదుకు. ఱేకు 108. 2. అఖిలపావనం.
౧. 'కతపల' కావచ్చు. ౨. 'చెడి' పూ. ము. పా. ప్రాసభంగము.యతిభంగము.

సకలతత్వసంశయఖండన మిది
సకలకర్మనిశ్చయము నిది
సకలవిధిరహస్యప్రధాన మిది
అకారణహితం హరినామం ॥ సక ॥

సకలదేవతాస్వామిప్రియం బిది
సకలలోకరక్షణము నిది
ప్రకటం వేంకటపతినామాంకిత-
మకించనధనం హరినామం ॥ సక ॥ 349

## పాడి

కటకటా జీవుఁడా కాలముదోలుకరాఁగ
సటవటలనే పొద్దు జరపేవుగా ॥ పల్లవి ॥

సమత నన్నియును జదివి కడపటను
కుమతివై అందరిఁ గొలిచేవుగా
తమిగొని ప్రేమ నెంతయును గంగకుఁ బోయి
తమకించి నూతినీరు దాగేవుగా ॥ కట ॥

తనువుఁ బ్రాయము నమ్మి దానధర్మము మాని
చెనటివై కర్మాలు సేసేవుగా
వొనరఁగ మీఁదనొడ్డిన మొగులు నమ్మి
దొనలనీళ్ళు వెళ్ళఁదోసేవుగా ॥ కట ॥

యెలమితోఁ దిరువేంకటేశుఁ గొలువలేక
పొలమురాజులవెంటఁ బొయ్యేవుగా
చిలుకకువలె బుద్ధిచెప్పినఁ గానలేక
౧పలుమారుకే తోడుఁ బాడేవుగా ॥ కట ॥ 350

---

౧. పలు=చాలగ, మారుకే=మన్మథునికే కావచ్చు. పలు, శబ్దమును వ్యస్తముగ ధాతుజవిశేషణముగ వాడుట వింత. లేక, బలుమారుకే=బలవంతుడైన మన్మథునకే కావచ్చు.

సామంతం

అందరి కాధారమైనఆదిపురుషుఁ డీతఁడు
విందై మున్నారగించె విదురునికడ నీతఁడు ॥ పల్లవి ॥

సనకాదులుగొనియాడెడిసర్వాత్మకుఁ డీతఁడు
వనజభవాదులకును దైవంబైనతఁ డీతఁడు
యినమండలమునఁ జెలఁగేటిహితవైభవుఁ డీతఁడు
మునువుట్టిన[1] దేవతలకు మూలభూతి యీతఁడు ॥ అంద ॥

సిరులొసఁగి యశోదయింట శిశువైనతఁ డీతఁడు
ధరనావులమందలలో తగఁ జరించె నీతఁడు
సరసతలను గొల్లెతలకుఁ జనవులొసఁగె నీతఁడు
ఆరసి కుచేలునియడుకు లా[2]రగించె నీతఁడు ॥ అంద ॥

పంకజభవునకును బ్రహ్మపద మొసఁగెను యీతఁడు
సంకీర్తన లాద్యులచే జట్టిగొనియె నీతఁడు
తెంకిగ నేకాలముఁ బరదేవుఁడయినయీతఁడు
వేంకటగిరిమీఁదఁ బ్రబల వెలసినఘనుఁ డీతఁడు ॥ అంద ॥351

68 రేకు నాట

కాయము జీవుఁడుగలనాఁడే తెలియవలె
యీయత్నములు దనకెన్నఁడు ॥ పల్లవి ॥

సతతము సంసారజడుఁడు దానట యాత్మ-
హితవు దెలుసుకొల మెన్నఁడు
రతిసరసముల వూరకే ప్రాయ మెడలంగ
యితరసుఖము దన కెన్నఁడు ॥ కాయ ॥

---

విడురేకు 70. 1 ముట్టిన. 2. కులవార.

యెడపక ద్రవ్యమోహితుఁడై తిరుగఁ దన-
యిడుమపాటు మాను టెన్నఁడు
కడలేనివిషయాలయలుకలచేతఁ దనదేహ-
మిడియఁగ నిజసుఖ మెన్నఁడు ॥ కాయ ॥

శ్రీవేంకటేశునిఁ జేరి తక్కినసుఖ-
మేవగించుకాల మెన్నఁడు
శ్రీవల్లభునికృప సిరిగాఁ దలఁచి జీవుఁ-
డీవైభవముఁ గాంచు టెన్నఁడు ॥ కాయ ॥ 352

సామంతం

అతఁడే సకలవ్యాపకుఁ డతఁడే యాతురబంధువుఁ -
డతఁడు దలఁపులముంగిట నబ్బుట యెన్నఁడొకో ॥ పల్లవి ॥

సారెకు సంసారంబనుజలనిధు లీఁదుచు నలసిన -
వారికి నొకదరిదాపగువాఁ డిఁక నెవ్వఁడొకో
పేరినయజ్ఞానంబనుపెనుఁజీఁకటి తనుఁగప్పిన
చేరువవెలుఁగై తోఁపెడిచెలి యిఁక నెవ్వఁడొకో ॥ అతఁ ॥

దురితపుకాననములలో త్రోవటుదప్పినవారికి
తెరు విదె కొమ్మని చూపెడిదేవుఁ డి(ద ?)దెవ్వఁడొకో
పెరిగినయాశాపాశము పెడగేలుగఁ దనుఁగట్టిన
వెరవకుమని విడిపించేటివిభుఁ డిఁక నెవ్వఁడొకో ॥ అతఁ ॥

తగిలినయాపదలనియెడిదావానలములు చుట్టిన
బెగడకుమని వడినార్పెడిబిరు దిఁక నెవ్వఁడొకో
తెగువయుఁ దెంపునుగలిగినతిరువేంకటవిభుఁ డొక్కఁడే
సొగిసి తలంచినవారికి సురతరువగువాఁడు ॥ అతఁ ॥ 353

ముఖారి

ఎక్కడనున్నా నీతఁడు
దిక్కయి మాదెసఁ దిరిగీఁగాక ॥ పల్లవి॥

సరసుఁడు చతురుఁడు జగదేకగురుఁడు
పరమాత్ముఁ డఖిలబంధువుఁడు
హరి లోకోత్తరుఁ డతఁడే నామతి
సిరితోఁ బాయక చెలఁగీఁగాక ॥ ఎక్క ॥

ఉన్నతోన్నతుఁ డుజ్జ్వలుఁ డధికుఁడు
పన్నగశయనుఁడు భవహరుఁడు
యిన్నిటఁగలిగిన యిందిరా(ర?)రమణుఁడు
మన్ననతో మము మనిపీఁగాక ॥ ఎక్క ॥

మమతల నలమేల్మంగకు సంతత-
రమణుఁడు వేంకటరాయఁడు
౧మశిసంపదల సరసవిభవముల
తమకంబున మముఁ దవిపీఁగాక ॥ ఎక్క ॥ 354

కన్నడగౌళ

విశ్వప్రకాశునకు వెలింయేడ లోనేడ
శాశ్వతున కూహింప జన్మ మిఁక నేడ ॥ పల్లవి ॥

సర్వపరిపూర్ణునకు సంచార మిఁక నేడ
నిర్వాణమూర్తికిని నిలయ మిఁక నేడ
వుర్వీధరునకుఁ గాలూఁద నొకచోటేడ
పార్వతీస్తుత్యునకు భావ మిఁక నేడ ॥ విశ్వ ॥

౧. 'యాడ' రేకు.

నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
ఆననసహస్రునకు నవ్వలివ లేడ
మౌనిహృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞానస్వరూపునకుఁ గాన విన నేడ ॥ విశ్వ ॥

పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురితదూరునకు సంస్తుతినింద లేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ
హరికి నారాయణున కవుఁగాము లేడ ॥ విశ్వ ॥ 355

వసంతం

౧ తలఁపులోపలితలఁపు దైవ మితఁడు
పలుమారుఁ బదియునుఁ బదియైనతలఁపు. ॥ పల్లవి ॥

సవతైనచదువులు సరుగఁ దెచ్చినతలఁపు
రవళిఁ దరిగుబ్బలిని రంజిల్లుతలఁపు
కవగూడఁ గోరి (రు?)భూకాంతముంగిటితలఁపు
తివిరి దూషకు గోళ్ళఁ దెగటార్చుతలఁపు ॥ తలఁ ॥

గొడగువట్టినవానిఁ గోరి యడిగనతలఁపు
తడఁబడక విప్రులకు దానమిడుతలఁపు
వొడిసి జలనిధినిఁ గడగూర్చితెచ్చినతలఁపు
జడియక హలాయుధము జళిపించుతలఁపు ॥ తలఁ ॥

వలపించి పురసతులవ్రతము చెరిచినతలఁపు
కలికితనములు చూపఁగలిగున్నతలఁపు
యిల వేంకటాద్రిపై నిరవుకొన్నతలఁపు
కలుషహరమై మోక్షగతిచూపుతలఁపు ॥ తలఁ ॥ 356

---

౧. ఇందు దశావతారసమన్వయము కలదు.

పాడి

*అస్మదాదీనాం అన్యేషాం
తస్మిన్ తస్మిన్ తత్రచ పునశ్చ ॥ పల్లవి ॥

సతతాధ్యయననిష్ఠాపరాణాం దృఢ-
వ్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా 'జగత్యాం పర-
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ ॥ అస్మ ॥

మోహినామత్యంతముష్కరాణాం గుణ-
గ్రాహిణాం భువనైకకఠినానాం
దేహసంక్షళన విదేశకోవా సదా
శ్రీహరిస్మరణవిశేషః పునశ్చ ॥ అస్మ ॥

కింకుర్వాణదుఃఖితజీవినాం
పంకిలమనోభయభ్రాంతానాం
శంకాం నిరుణద్ధి స్వరసా కా, శ్రీ-
వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ ॥ అస్మ ॥ 357

69 రేకు సామంతం

దొరకునా యితనికృప తుదిపదంబు
అరిదివిభవము లొల్లమనినాఁ బొదలు ॥ పల్లవి ॥

సొంపలర నితఁడు కృపఁజూచు టరుదనికాక
యింపు సామాన్యమా యితనికరుణ
లంపటముఘనమైనలక్ష్మీకటాక్షములు
సంపదలు తోడనే చల్లువెదలాడు ॥ దొర ॥

---

* ఈకీర్తన సుగ్రహముగా లేదు. ఇందలిది యథామూలపాఠము. విడురేకు 2 లో రెండవచరణపుమూఁడవపాదమున 'సంక్షళనవిధిశ్చ కోవా'-అని కొంత మేలైన పాఠము కలదు.

తగ నితనిపై భక్తి తగులు టరుదనికాక
నగుట సామాన్యమా ననిచి యితఁడు
జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులువాయఁగ నితఁడు దిప్పు దీరాడు ॥ దొరకు ॥

తిరువేంకటాద్రి సిద్ధించు టరుదనికాక
[1] మరుగఁ దను నిచ్చునా మరియొకరివి
యిరవైనభోగములు యిష్టసామ్రాజ్యములు
విరివిగొని యితనిదయవెంటనే తిరుగు ॥ దొర ॥ ౩౫౮

ఆహిరి

౦చెలి నేఁడు తా నేమిసేయునమ్మ
చెలి యేమిసేయు నీచెలు లేమిసేయుదురు
చెలువైనవిభుమేనిచెలు వింత సేయఁగా ॥ పల్లవి ॥

సతి నేఁడు బంగారుచవికెలోఁ జిత్రంపు-
గతు లెంత చూపినఁ గడకంటఁ జూడదు
అతనిఁజూచినమంచియబ్బురపుఁజూపులు
అతనివెంటనే పోయ నటుగాఁబోలును ॥ చెలి ॥

తేనియలూరేటిమంచితియ్యనిమాటలు మంత్ర-
గానములుగా వినుపించి కడువేసరితిమి
వానిమాటలు విన్నవలనైనముదమున
వీనులు ముద్రించినవిధముగాఁబోలును ॥ చెలి ॥

---

విడురేకు 2. 1. ఇరవు సామాన్యమా యిందరికిని, సరిలేని విభవములు సరసతలు సౌఖ్యములు అరిది నీతనిమహిమ నందనే వుండు.

౧. 359, 360 పాటలు రెండూ పూర్వముద్రణమున తప్పిపోయినవి. 359వ పాట శుద్ధశృంగారసంకీర్తనములలో నుండదగినది. 360 వ పాట వేదాంతవిషయోపమాన-ములతో కూడినశృగారసంకీర్తనము.

విచ్చళపుమోమున నెయ్యము దైలువారె
బచ్చనచేఁతలు గుబ్బలపై నిండనొప్పెను
అచ్చపువేడుక వేంకటాద్రీశుఁ డీరేయి
నెచ్చెలికి విచ్చినట్టినేరుపు గాఁబోలును ॥ చెలి ॥ 359

## సామంతం

ఇత్తడి బంగారుసేయ నింతకు నేరుతునంటా
కొత్తసేఁతలెల్ల దొరకొంటిగా నీవు ॥పల్లవి॥

హీనులైనవారు విన్ను నేచి కొలిచిన ఘన-
మైనపదవులఁ బెట్టేయెం౧(యఁ?)టువలెనే
మానక యెవ్వతెనైన మచ్చికఁ దగిలి నాతో-
నానిపట్టి సరిసేసే వద్దిరా నీవూ ॥ ఇత్త ॥

కడుఁబాతకులు విన్నుఁ గదిసి కొలిచేరంటా-
నదరి పుణ్యులఁజేయునటువలెనే
కడఁగి యెవ్వతెనైన గాజు మాణికము సేసి
వడి నన్నుఁ గెరలించవద్దురా నీవూ ॥ ఇత్త ॥

దిందుపడ మాయసేసి దేవుఁడ నేఁగానంటా-
నందరి భ్రమలఁబెట్టువటువలెనే
అందమైనతిరువేంకటాద్రీశ నీప్రేమ
చెంది నన్నుఁ గూడి దాఁచఁజెల్లునా నీవూ ॥ ఇత్త ॥ 360

## బౌళి

ఎక్కడ చొచ్చెది దీటవమేదియుఁ గడపల గానము
పుక్కుటనఁ బరితాపానల మూదక మండెడిని ॥ పల్లవి ॥

---

౧. యతిభంగము.

హృదయవికారము మాన్పఁగ నేతెరఁగును సమకూడదు
మదనానందము చెరుపఁగ మందేమియు లేదు
పొదలినదేహగుణంబులఁ బోనడువఁగ గతి గానము
బ్రదికించినకోరికెలకుఁ బ్రాయము దిరిగినది ॥ ఎక్క ॥

కమలినయజ్ఞానం బిది కన్నులముందరఁ గావదు
తిమిరము పొదిగొని చూడ్కికి దెరువేమియు లేదు
తెమలనియాశాపాశము తెంపఁగ సత్వము చాలదు
మమకారము వెడలింపఁగ మతి యెప్పుడు లేదు ॥ ఎక్క ॥

దురితంబులు పుణ్యంబులు తొడిఁబడ నాత్మనుఁ బెనగొని
జరగఁగ శరీరధారికి సత్కర్మము లేదు
తిరువేంకటగిరిపతియగుదేవశిఖామణిపాదము
శరణని బ్రదుకుటదప్పను సన్మార్గము లేదు ॥ ఎక్క ॥ 361

గుండక్రియ

ప్రాణులనేరమి గాదిది బహుజన్మపరంపరచే
ప్రాణులుసేసినతమతమపాపఫలముగాని ॥ పల్లవి ॥

హరి సకలవ్యాపకుఁడని అందరుఁ జెప్పఁగ నెరిఁగియు
పరదైవంబులఁ గొలువకపాయరు మానవులు
నరపతి భూమేలఁగ భూవరు భజియింపఁగనొల్లక
పరిసరవర్తులబెంబడిఁ బనిసేసినయట్లు ॥ ప్రాణు ॥

పొందుగ తమతమసేసినపూజలు మ్రొక్కులు గైకొను(న?)
అందముగాఁ బురుషోత్తముఁ డాతఁడే కలఁడవియు
అందరు నెరిఁగియు యితరులఁ జెందుదు రున్నతశైలము -
నందక చేరువతరువుల నందుకొనినయట్లు ॥ ప్రాణు ॥

శ్రీ వేంకటపతి యొక్కఁడె చెప్పఁగ జగములకెల్లను
దైవము నాతుమలోపలిధనమనఁగా వినియు
సేవింపరు పామరు లీదేవుని మధురంబొల్లక
వావిరిఁ బులుసులు చేఁదులు వలెనని కొనునట్లు ॥ప్రాణ॥ 362

### ధన్నాసి

ఘోరదురితములచే గుణవికారములచే-
నిరతిఁబడునాకు నేది దెరువు ॥పల్లవి॥

హరి జగన్నాథు * లోకారాధ్యు-
నెరఁగనేరనివాని కేది దెరువు
పరమపురుషుని జగద్భరితు నంతర్వ్యాప్తి-
నిరవుకొలువనివాని కేది దెరువు ॥ఘోర॥

శ్రీ వేంకటేశుఁ దలఁచినవెనక సకలంబు-
నేవగింపనివారి కేది దెరువు
దేవోత్తమునిమహిమ దెలిసితెలియఁగలేని-
యీవివేకంబునకు నేది దెరువు ॥ఘోర॥ 363

70 రేకు

### ఆహిరి

ఏపనులు సేసినా నిటువలెనేపో
యీపనికిఁ జొరవిపని యేటిలోపైరు ॥పల్లవి॥

హరికథలమీఁది(ప్రియమబ్బ(బే?)నా తొంటితమ-
పరిపక్వమగుఁదపఃఫలముగాక
గరిమె నివిలేకున్నఁ గలకాలములుఁ జేయు-
నిరతంపుఁదపమెల్ల నీటిలో [1] వ్రాఁత ॥ఏప॥

---

* ఇందు 'అఖిలాత్మకుంటి' పద మొకటి యైదుమాత్రలది లోపించినది గాఁబోలును.

విదురేకు 47. 1. నీటిపై.

నారాయణునిభక్తి ననిచెనా ధనమెల్లఁ
బారఁజల్లిన దానఫల మదియపో
కోరి యివి [1] లేకున్న కోటిదానములైన
పేరుకాని [2] వరతఁగలపినచింతపండు ॥ ఏప ॥

వదల కిటు వేంకటేశ్వరుఁడే దైవంబనుచుఁ
జదువఁగలిగిన మంచిచదు వదియపో
పదిలముగ నీవిధము పట్టియ్యకుండినను
చదువు లసురలు మున్ను చదివేటిచదువు ॥ ఏప ॥ 364

శ్రీరాగం - జంపె

అణురేణుపరిపూర్ణుఁడైనశ్రీ వల్లభునిఁ
బ్రణుతించువారువో బ్రాహ్మలు ॥ పల్లవి ॥

హరినామములనె సంధ్యాదివిధు లొనరించు-
పరిపూర్ణమతులువో బ్రాహ్మలు
హరిమంత్రవేదపారాయణులు హరిభక్తి-
పరులైనవారువో బ్రాహ్మలు ॥ అణు ॥

యేవి చూచినను హరి యిన్నిటాఁ గలఁడనుచు-
భావించువారువో బ్రాహ్మలు
దేవకీనందనుఁడె దేవుఁడని మతిఁదెలియు-
పావనులు వారువో బ్రాహ్మలు ॥ అణు ॥

ఆదినారాయణుని ననయంబుఁ దమయాత్మఁ
బాదుకొలిపినవారు బ్రాహ్మలు
వేదరక్షకుఁడైనవేంకటగిరీశ్వరుని-
పాదసేవకులువో బ్రాహ్మలు ॥ అణు ॥ 365

1. యిది 2. కాన

దేశాక్షి

- శోకవిఘాతక వో-
పాతాళలంకాపతివిభాళా ॥ పల్లవి ॥

హనుమంతరాయ ¹అంజనీతనయ వో-
వనధిలంఘనగాత్ర వాయుపుత్రా
యినకులాధిపనిజహిత జగన్నుత-
వనజోదర సేవక సత్వధనికా ॥ సీతా ॥

ప్రళయాంతకరూప బలదీప రవిఫల-
గిళనప్రతాప సుగ్రీవప్రియా
కుళకదానవసంకులవిదారణ
భళిభళి జగత్పతిబలుబంటా ॥ సీతా ॥

పంకజాసనుదివ్యపదవైభవ వో-
లంకిణీప్రాణవిలంఘన
వేంకటేశ్వరు సేవావీర మహాధీర
కింకరరాయ సుఖీభవా ॥ సీతా ॥ 366

శ్రీరాగం

ఇన్నిజన్మము లేఁటికి హరిదాసు-
లున్నవూరఁ దా నుండినఁ జాలు ॥ పల్లవి ॥

హరిభక్తులయింటియన్నము గొమువారి-
వరువుడై వుండవలెనన్నఁ జాలు
పరమభాగవతభవనంబులఁ జెడ్డ-
పురువు దానయి పొడమినఁ జాలు ॥ ఇన్ని ॥

౧. 'అంజినీ' రేకు.

వాసుదేవునిభక్తవరులదాసులు మున్ను —
రోసినయెంగిలి రుచిగొన్నఁ జాలు
శ్రీ సతీశునిఁదలఁచినవారి ౧దాసాన-
దాసుఁడై వుండఁదలఁచినఁ జాలు ॥ ఇన్ని ॥

శ్రీ వేంకటేశుఁ జూచినవారిశ్రీ పాద-
సేవకుఁడై ౨యుండఁజేరినఁజాలు
యీవిభుదాసులహితులపాదధూళి-
పావనమై సోఁకి బ్రదికినఁ జాలు ॥ ఇన్ని ॥ 367

## ముఖారి

భోగీంద్రులను సీరుఁ బోయి రండు
వేగన మీఁదటివిభవాలకు ॥ పల్లవి ॥

హరుఁడ పోయిరా; అజుఁడ నీవునుబోయి
తిరిగిరా మీఁదటితిరుణాళ్లకు;
సురలు మునులును భూసురలుఁ బోయిరండు
అరవిరి నిన్నాళ్లు నలసితిరి ॥ భోగి ॥

జముఁడ పోయిరా; శశియు [1] నీవును బోయి
సుముఖుఁడవై రా సురలఁ గూడి;
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయిరండు
ప్రమదాన నిన్నాళ్లు బడలితిరి ॥ భోగి ॥

నారదసనకసనందనాదులు
భూరివిభవములఁ బోయిరండు;
దూరముగాఁ బోకిట్టె [2] తొరలి వేంకటగిరిఁ
జేరి నన్నిట్లనే సేవించుఁడీ ॥ భోగి ॥ 368

విడురేకు 58 1. శవి సీ. 2. దూరంగాకిట్టే. ౧. 'దాసాను' కావచ్చు. ౨. 'వుండ'రేకు.

సామంతం

౧అతనికెట్ల సతమైతినో కడు-
హితవో పొందులహితవో యెఱఁగ ॥ పల్లవి ॥

హృదయము తలఁపున నిరవయినఁగదా
పదిలమౌను లోపలిమాట
వెదకినచిత్తము వెర వెఱఁగదు నే-
నెదిరి నెఱఁగ నే నేమియు నెఱఁగ ॥ అత ॥

కాలూఁద మనసుగలిగికదా నా-
తాలిమి మతిలోఁ దగులౌట
మేలిమిపతితో మెలఁగుటెదో నే-
నేలో నే నిపుడెక్కడో యెఱఁగ ॥ అత ॥

నేఁడని రేపని నే నెఱిఁగికదా
పోఁడిమి మతిలో పొలుపౌట
వాఁడే వేంకటేశ్వరుఁడు రాఁగలిగె
౨ఆఁడుజన్మమేనౌటిది యెఱుఁగ ॥ అత ॥ 369

## 71 నుండి 77 వరకుగలయేడురేకులు లేవు

78 రేకు శ్రీరాగం

౩ఎట్టు వేగించే దిందుకేగురే సితరకాండ్లు
వెట్టివేమిసేయుమంటా వెన్నడించే రిపుడు ॥ పల్లవి ॥

వొంటికాలఁ గుంటికుంటి వూరిబందెలకుఁ జిక్కి-
పంటదాఁకా దున్నె నొక్కపసురము
గంటుగంటులాక లొత్తి కల్లలనడిమిపంట
కుంటివాఁడు గావలుండి కుప్ప లేరుపరచె ॥ ఎట్టు ॥

౧. ఇది శృంగారకీర్తనలలో నుండదగినది. ౨. ఆఁడుజన్మము+ఏమ+ఔట.
౩. దీనిభావము స్పష్టమగుట లేదు.

కలది కుక్కిమంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో [౧]దొగ్గినంబలి దావకూళ్ళు
వెలిఁగంతలకొంపలు వీడుఁబట్లు చూపేరు
తలవరులెందులోనాఁ దప్పు వెదకేరు ॥ ఎట్టు ॥

వాళ్ళుచెడ్డవాఁ డొకఁడు వుభయమార్గము గోవి
కల్లదొరపుట్టుబడి కడుఁగట్టివి
చల్లవిశ్రీవేంకటేశ సకలలోకపతివి
యిల్లిదె నీశరణంటి మిందరిని గావవే ॥ ఎట్టు ॥ 370

లలిత

తప్పదు తప్పదు దైవముకృప యిది
ముప్పిరి నింతా ముకుందుఁడే ॥ పల్లవి ॥

వెక్కసపుమతి వెలుతులుదీరిన-
నెక్కడ చూచిన నీశ్వరుఁడే
గుక్కక యాసలు గోసివేసినను
విక్క మడుగడుగు విధానమే ॥ తప్ప ॥

పొంచి శరీరపుభోగము లుడిగిన
చుంచుఁబాపములు సుకృతములే[౨]
[౩]దంచెడివిషయపుతగులమిఁ(ము?) బాసిన
యెంచిచూచినను యిహమే పరము ॥ తప్ప ॥

---

౧. 'దొగ్గ' రేకు ౨. 'సుగృతములే' రేకు. ౩. 'దంచేటి' రేకు.

శ్రీవేంకటపతిసేవే కలిగిన
వేవేలువగలు వేడుకలే
చేవదీరె సందియము లే దిదే*
భావమునమ్మినప్రపన్నులకును ॥ తప్ప ॥ 371

## బౌళి

దేవ నీవిచ్చేయందుకు దీనికిఁగా నింతయేల
యేవేళ మాయెరుకలు యెందుకుఁ గొలుపును ॥ పల్లవి ॥

యెవ్వరివసములు బుద్దెరిఁగినడచేమన
యివ్వల నారాయణ నీవియ్యక లేదు
దవ్వుచేరువ మనసుతనయిచ్చయితేఁగనక
రవ్వగ మృగాదులెల్ల రాజ్యమేలనేరవా ॥ దేవ ॥

సారెకు నిన్నుఁదలపించ జంతువులవసమా
కేరి నీవు జిహ్వఁ బరికించఁగాఁగాక
యీరీతి లోకమెల్లాఁ దమయిచ్చకొలఁదులనయితే
దూరానఁ గొక్కెరలు చదవవా వేదాలు ॥ దేవ ॥

యిందరిపాపపుణ్యాలు యిన్నియు నీచేఁతలే
కందువ స్వతంత్రులు గారు గాన
చందపుశ్రీవేంకటేశ శరణంటి నిదె నీకు
చెంది నీవే కాతుగాక చేఁతలూను వలెనా ॥ దేవ ॥ 372

## సామంతం

పరుస మొక్కటేకాదా పయిఁడిగాఁ జేసేది
అరయ లోహమెట్టున్నా నందుకేమీ ॥ పల్లవి ॥

---

* ఈ పాదమున యతి లేదు. 'చావదీరె సంశయము లేవిదె' అని పాఠము గాఁబోలును. 'చేవ' యే 'చావ' గా వ్రాతలోనుండుట సామాన్యము.

వనజనాభునిభక్తి వదలకుండినఁ జాలు
మనసు యెందు దిరిగినా మరియేమి
మొనసి ముద్రలు భుజముల నుండితేఁ జాలు
తనువెంతహేయమైనా దావికేమి ॥ పరు ॥

శ్రీకాంతునామము జిహ్వఁ దగిలితే జాలు
యేకులజుఁడైనాను హీనమేమి
సాకారుఁడైనహరి శరణుచొచ్చినఁ జాలు
చేకొని పాపము లెన్ని చేసిననేమి ॥ పరు ॥

జీవుఁ డెట్టున్నానేమి జీవునిలో యంతరాత్మ
శ్రీవేంకటేశున కాచింతయేమి
యేవలనఁ బరమైన యిహమైన మాకుఁ జాలు
దైవశమాయ నతఁడు కడమలింకేమీ ॥ పరు ॥ 373

భూపాళం

మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా ॥ పల్లవి ॥

ఆవులు పేయలకుఁగా నఱచీఁ బిదుకవలె
గోవిందుఁడ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలిపడుచు లాటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥ మిన్న ॥

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
గూడియున్నా రిదే మేలుకొవయ్యా
తోడనే యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
యీడకుఁ దెచ్చిపెట్టె నిఁక మేలుకోవయ్యా ॥ మిన్న ॥

పిలిచీ నందగోపుఁడు పేరుకొని యదె కన్నుఁ -
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రిమీఁదిబాలకృష్ణ
యిల మామాటలు వింటి విఁక మేలుకోవయ్యా. ॥మిన్ను॥ 374

పాడి

ఇందునుండ మీ కెడ లేదు
సందడిసేయక చనరో మీరు ॥పల్లవి॥

నాలుక శ్రీహరినామం బున్నది
తూలుచుఁ బారరో దురితములు
చాలి భుజంబున చక్రం బున్నది
తాలిమి భవబంధము లటు దలరో ॥ఇందు॥

అంతర్యామై హరి వున్నాఁ డిదె
చింతలు వాయరో చిత్తమున
వింతలఁ జెవులను విష్ణుకథ లివిగో
పొంతఁ గర్మములు పోరో మీరు ॥ఇందు॥

కాపయి శ్రీవేంకటపతిపే రిదె
నాపై నున్నది నయమునను
కోపపుకామాదిగుణములాల మీ -
రేపున కడఁగడ నెందైనఁ బోరో ॥ఇందు॥ 375

79 రేకు రామక్రియ

నీయాజ్ఞ దలమోచి నీదేహధారి నైతి
యీయెడ గోవిందుఁడ నే నీడేరే దెట్లో ॥పల్లవి॥

తనువు వేసరినాను తలఁపు వేసరదు
ధనముగడించెడితరితీపున
చెనకి మగఁడు విడిచిన మామ విడువని -
పనియాయ హరి నాబదుకుజాడ యెట్లో ॥ నీయా ॥

పాయము ముదిసినాను భావము ముదియదు
వేయైనా సంసారవిషయాలను
వోయయ్య కలివోసినావుట్లదిక్కు చూచేది
మాయదాయ నీక నామనసుజాడెట్లో ॥ నీయా ॥

కడలేనినావిధులు కన్నులారఁ జూచి నీవు
నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితి
నొడుగులు దప్పినాను నోముఫలము దప్పవి -
అడియాల మబ్బె నాకు నానతిచ్చి తెట్లో ॥ నీయా ॥ 376

భూపాళం

మేదిని జీవులఁ గావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా ॥ పల్లవి ॥

తగుగోపికల కన్నుఁదామరలు ౧వికసించె
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనేతిమిరము విరియఁగ
నెగడినపరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా ॥ మేది ॥

ఘనదురితపునల్లఁగలువలు వికసించె
మినుకు౨శశివర్ణుఁడ మేలుకోవయ్యా,
పనివడి వేదాలనేపక్షులెల్లాఁ బలుకఁగ
౩జనక (?) యాశ్రితపారిజాత మేలుకోవయ్య ॥ మేది ॥

---

౧. 'వికసించ' కావచ్చు. ౨. 'శశినేత్రుఁడ' కావచ్చు. ౩. 'తండ్రీ' అనువర్థములో జనకశబ్దము కావచ్చు. పూ.ము.పాఠములో ప్రశ్నార్థకచిహ్నమెట్లో?

వరలక్ష్మీకుచచక్రవాకము లొండొంటి రాయ
మెరయుదోషారహిత మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ నేఁడు మేలుకోవయ్యా ॥ మేది ॥ 377

## లలిత

ఆతుమ సంతసపెట్టుటది యెఱుక, తా-
నేతెరువు నొల్లకుండు టిదియే యెఱుక ॥ పల్లవి ॥

ముంచినబంధములలో ముణుఁగుడువడక తా-
నంచల విడఁదన్ను టది యెఱుక
చంచలపువిషయాల సగ్గుడుముగ్గుడుగాక
యెంచిఁ హరిఁదలపోయు టిదియే యెఱుక ॥ ఆతు ॥

పాయనియర్థములకు బంటుబంటై తిరుగక
ఆయతమై మోసపోని దది యెఱుక
పాయపుఁగామినులతోఁ బలుమారుఁ జేయుపొందు
హేయమనితలపోయు టిదియే యెఱుక ॥ ఆతు ॥

ధరమీఁదఁగలప్రాణితతుల నొప్పించక
అరయఁగ సముఁడగు టది యెఱుక
గరిమల శ్రీవేంకటపతిదాసుఁడై
యిరవొంద సుఖించు టిదియే యెఱుక ॥ ఆతు ॥ 378

## రామక్రియ

ఇందిరానాయక యిదివో మాపాటు
చెంది నీవే గతి చేకొనవయ్యా ॥ పల్లవి ॥

తీసీఁ గోరికతీదీపు లోకవంక
లాసీ సంసారలంపటము
మూసీఁ గర్మము మునుకొని పరచింత
నేసేదేమిఁకఁ జెప్పే దేమి ॥ ఇంది ॥

పంచీ నాసలు వలసినచోటికి
పొంచీ దుర్గుణభోగములు
ముంచీ యౌవనమోహాంధకారము
యెంచేదేమి సోదించేదేమి ॥ ఇంది ॥

యెఱిఁగీఁ జిత్తము యించుకించుక నిన్ను
మఱవనినీపైభక్తి మతినుండఁగా
నెఱి శ్రీవేంకటపతి నీవే కాతువుగాక
వెఱచి నేఁజేసేవిన్నపమేమి ॥ ఇంది ॥ 379

## రామక్రియ

నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో
యీరచనలనే యెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి ॥ పల్లవి ॥

గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో యనుచు
యీవరుసలనే యెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి
॥ నారా ॥

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీమహిళా[1]పతయే నమో శిష్ట[2]రక్షిణే నమో నమో
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
యీమేరలనే యెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి
॥ నారా ॥

---

౧. 'పతియేన్నమో' రేకు ౨. 'రక్షణే' రేకు.

పరిపూర్ణాయ నమో నమో ౧ప్రణవగ్రాయ (?) నమో నమో
చిరంతన శ్రీ వేంకటనాయక శేషశాయినే నమో నమో
నరకధ్వంసే (?) నమో నమో నరసింహాయ నమో నమో
యిరవుగ నీగతి నెవ్వరు దలఁచిన యిహాపరమంత్రము-
లిందరికి ॥ నారా ॥ 380

### లలిత

అంతర్యామీ అలసితి సొలసితి
యింతట నీశరణిదె చొచ్చితిని ॥ పల్లవి ॥

కోరినకోర్కులు కోయనికట్లు
తీరవు నీ వవి తెంచక
భారపుఁబగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోనీవు నీవు వద్దనక ॥ అంత ॥

జనులసంగములఁ జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించక
వినయపుదైన్యము విడువనికర్మము
చనదది నీవిటు ౨సంతపరచక ॥ అంత ॥

మదిలోచింతలు మయిలలు మణుఁగులు
వదలవు నీవవి వద్దనక
యెదుటనె శ్రీవేంకటేశ్వర నీ వదె
అదనఁ గాచితివి అట్టిట్టనక ॥ అంత ॥ 381

80 రేకు

### ఆహిరి

దేవ నీమాయతిమిర మెట్టిదో నా-
భావము చూచి గొబ్బునఁ గావవే ॥ పల్లవి ॥

---

౧. 'పణవాగ్రాయ' కావచ్చు. ౨. 'సంతపరచు'=శాంతపరచు, అని అర్థము కావచ్చు.

వెడదుఃఖమపుడెల్లా వేసరుచుండుదుఁగాని
తడవి విరతిఁబొంది తలఁగలేను
అడియాసలఁ దిరిగి అలయుచుండుదుఁగాని
మది దొసకు(గు?)ల నివి మానలేను ॥ దేవ

హేయము శ్రీ(స్త్రీ?)సుఖమని యెఱుఁగుచుండుదుఁగాని
పాయపుమదముచేతఁ బాయలేను
పాయనిపాపాలు చూచి భయమందుచుండుఁగాని
వోయయ్య యివి సేయకుండలేను ॥ దేవ।

కలకాల మిన్నియును గందువిందుఁగాని మఱి
యెలమి నొక్కటనైన యెచ్చరలేను
బలిమి శ్రీవేంకటేశ బంధముక్తునిఁ జేసి
తలఁపులో నెలకొని దయఁజూడవయ్యా ॥ దేవ ॥ 382

పాడి

అభయ మభయమో హరి నీకు (వు?)
విభుఁడ వింతటికి వెర విఁక నేది ॥ పల్లవి ॥

జడిగొని మదిలో శాంతము నిలువదు
కడుఁగడుదుస్సంగతివలన
యిడుమలేనిసుఖ మించుక గానము
అడియాసల నాయలమటవలన ॥ అభ ॥

తలఁపులోన నీతత్త్వము నిలువదు
పలులంపటములభ్రమవలన
కలిగినవిజ్ఞానగతియును దాఁగెను
వెలివిషయపుపిరివీకులవలన ॥ అభ ॥

పక్కన( బాపపుబంధము లూడెను
చిక్కక నిను( దలచినవలన
చిక్కులు వాసెను శ్రీవేంకటపతి
నిక్కము నా కిదె నీ కృపవలన ॥ అధ ॥ 383

బౌళి

కొందరి కివి సమ్మతియైతే కొందరి కవి గావు
యిందరిలోపల నీవెదమాయలు యేగతి( దెలిసే నేనయ్యా
॥ పల్లవి ॥

దూరము కర్మమునకు జ్ఞానము; తోడనే(తొడునే?)వొండొకటికిని
దూరము; పరమునకు బ్రపంచము తొలుత విరుద్ధంబు;
దూరము విరతికి సంసారము; తుదమొదలే లేదు;
యీరీతుల నీ వెదమాయలు యేగతి( దెలిసెద నేనయ్యా
॥ కొంద ॥

కూడదు దేహమునకు నాత్మకు గోత్రవిరోధం ; బెన్న(డును
కూడదు కోపమునకు శాంతము గుణావగుణములను;
కూడదు బంధమునకు మోక్షము కోరికలే కట్లుగాన;
యేడ గొల(దిగా శ్రీహరిమాయలు యేగతి( దెలిసెద నేనయ్యా
॥ కొంద ॥

శ్రీవేంకటపతి నన్నీగతి( జిక్కించితి వీజగమునను;
భావింప(గరాదు నీమహిమ బహుముఖములయర్థముగాన;
యేవిధమును నే(టికి నాకి(క యెందెందని తగిలెద నేను
దైవికమగు నీ[1]దాసానుదాస్యము దక్కెనదే నాకు
॥ కొంద ॥ 384

౧. 'దాసాన' రేకు.

పాడి

అంతయు నీవే హరి పుండరీకాక్ష
    చెంత నాకు నీవే శ్రీరఘురామా ॥పల్లవి

కులమును నీవే గోవిందుఁడా, నా-
    కలిమియు నీవే కరుణానిధీ,
    తలఁపును నీవే ధరణీధరా, నా-
    నెలవును నీవే నీరజనాభా ॥ అంత

తనువును నీవే దామోదరా, నా-
    మనికియు నీవే మధుసూదనా,
    వినికియు నీవే విట్ఠలుఁడా, నా-
    వెనకముందు నీవే విష్ణుదేవుఁడా ॥ అంత

పుట్టుగు నీవే పురుషోత్తమా కొన
    నట్టనడుము నీవే నారాయణా,
    యిట్టె శ్రీవేంకటేశ్వరుఁడా నాకు
    నెట్టన గతి యింక నీవే నీవే ॥ అంత ॥ 38

బౌళి

అన్నిటా నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను
    యెన్నఁగ నీవొక్కఁడవే గతియని १యెంచికొలుచుటే ప్రపన్న
    २సంగతి ॥ పల్లవి ॥

యేకాంతంబున నుండినపతివి యెనసిరమించుటే సతిధర్మంబు
    లోకమురచ్చలోనుండినపతి లోఁగాని పైకొని(నః)రావట్లు;
    యీ కొలఁదులనే సర్వదేవతలయిన్నిరూపులై నీ వున్నప్పుడు
    కైకొని నిను బహుముఖములఁగొలుచుట గాదు పతివ్రతవ్రత
    ధర్మంబు ॥ అన్ని ॥

---

१. 'యేచికొలచుటే' రేకు. २. 'సుగతి' రేకు.

పూనినబ్రాహ్మణులలోపలనే నిన్నుఁ బూజించుట వేదోక్తధర్మము
శ్వానకుక్కుటాదులలోపల నిను సరిఁ బూజించఁగరానట్లు,
యీనియమములనె ప్రాకృతజనులను యీశ్వర నీశరణాగత
జనులను
కానక, వొక్కట సరిగాఁ(౧)జూచుట కాద(ది?)వివేకధర్మంబు
॥ అన్ని ॥

శ్రీ వేంకటపతిగురువనుమతినే నేవే నాకును శిష్యధర్మము
ఆవలనీవల నితరమార్గములు యాత్మలోన రుచిగానట్లు,
భావింపఁగ సకలప్రపంచమును బ్రహ్మం సత్యజ్ఞానమనంతము
కైవశమై యిన్నిటా వెనుతగులు కా(ది?)వివేకధర్మంబు
॥ అన్ని ॥ 386

ఆహిరి

౨కోరు వంచరో ౩కోటూరు
ఆరసి మనసా అంతరాత్మకు ॥ పల్లవి ॥

కొండలవొడవులు కోరికకుప్పలు
పండినపంటలు భవము లివి
నిండినరాసులు నిజకర్మంబులు
అండనె యివె మాయారంభములు ॥ కోరు ॥

వెలిధాన్యంబులు విషయపురాసులు
౪పొలివా రేటివూపుపుగములు(?)
కలుషపుమదమున కావుగప్పినవి
అలవిమీర మాయారంభములు ॥ కోరు ॥

౧. 'చూచుటకాద+వివేకధర్మంబు' అని విభజింపవచ్చునేమో.
౨. కోరు+వంచరో ౩. 'కొటారు' కావచ్చు. ౪. పొలివారుట = తూర్పెత్తుట, తూర్పుపారుట కావచ్చు

ఐదీ విం(ద్రియములబంతులు నరిపి
కదురతుల దండగట్టలతో
మొదనెద శ్రీ వేంకటేశుమహిమ లవే
ఆదియాలపుమాయారంభములు ॥ కోరు ॥ 387

81 రేకు దేసాళం

వీనిఁ జూచియైన నేము విరతిఁబొందగలేము
పూని మా(బదు కిందుఁబోలదాయఁగా ॥ పల్లవి ॥

పరుల వేడఁగబోవు పరపిందకుఁ జొరవు
పరపురుషార్థమే ఫలవృక్షతతులెల్ల
నరులమై ఘనులమై నానాబుద్ధు లెఱిఁగి
పొరి మా(బదుకు లిందుఁబోలదాయఁగా ॥ వీనిఁ ॥

కామక్రోధాదులు లేవు కామతత్వ మెఱఁగవు
కామించినట్లవు నెక్కడనైనా శిల లివి
దీమసము గలిగియుఁ దెలివి గలిగియును
భూమిలో మా(బదు కిందుఁబోలదాయఁగా ॥ వీనిఁ ॥

వొకరిఁ గొలువఁబోవు వొకపంట సేయఁబోవు
వొకమానిగూడు చేరివుండు పక్షు లాదనాద
వొక(శ్రీ వేంకటపతి నమ్మియుండలేము
౧మొకెమో మా(బదు కిందుఁబోలదాయఁగా ॥ వీనిఁ ॥ 388

సాళఁగం

పనిమాలినట్టి వట్టి౨పఱఁదుగాక ।మాకు
ననిచి యిదియు నొక్కనగుఁబాట్లా ॥ పల్లవి ॥

---

౧. 'ముఖ్య' శబ్దభవమా? అర్థము అదే కావచ్చు ౨. 'పఱఁదు' పూ.ము.పా.

కన్నవారినెల్లా వేఁడేకష్టమే దక్కుటగాక
పన్ని దైవమియ్యనిది పరులిచ్చేరా
యెన్నికతోఁ దేహమిచ్చె నిహమెల్లాఁ జెందనిచ్చె
వున్నవా రింతటిపని కోపఁగలరా ॥ పని ॥

బదలి తా నెందైనాఁ బడ్డపాటేదక్కెఁగాక
[1]కడఁగి రానిది దే నొక్కరివసమా
కడుపులో నుండఁగానే కలవి నుదుట వ్రాసె
తడవి దైవముచేఁత దాఁటవసమా ॥ పని ॥

దెప్పరపుసంపదకుఁ దిమ్మటలే దక్కెఁగాక
యెప్పుడూ శ్రీవేంకటేశుఁ[2] డీకమాసీనా
చప్పుడుగా నతవికే శరణన్నఁ జాలుఁగాక
తప్పులును వొప్పులు నాతనివేకావా ॥ పని ॥ 389

దేసాళం

పరులసేవలు చేసి బ్రదికేరటా
సిరివరుదాసులు సిరులందు టరుదా ॥ పల్లవి ॥

కోరి వొకనరునిఁ గొలిచినవారలు
ధీరులై సలిగెలఁ దిరిగేరట
కూరిమి బ్రహ్మాండకోటులేలెడివాని-
వార లింతటఁ జనవరులౌ టరుదా ॥ పరు ॥

చేకొన్నతుమ్మెదచేపడ్డకీటము-
లాకడఁ దుమ్మెదలయ్యీనట
శ్రీకాంతునిపాదసేవకులగువార-
లేకులజులయినా నెక్కుడౌ టరుదా ॥ పరు ॥

---

౧. 'కడఁగిరాని దిదే నొక్కరివసమా'. పూ ము.పా. ౨. 'డీకమాపీనా' పూ.ము.పా.

ధరణీశునాజ్ఞల తమదేశమునందు
పరులనాణెపుముద్ర చెల్లినట
తిరువేంకటాద్రిశ్రీదేవునిముద్రలు
ధరియింపఁగా వింతటఁ జెల్లుటరుదా ॥ పరు ॥ 390

గుజ్జరి

ఇటుగన సకలోపాయము లుడిగిన యీశ్వరుఁడే రక్షకుఁడు
తటుకున స్వతంత్రముడిగినయాత్మకు తగువిశ్రాంతమే
పరసుఖము ॥ పల్లవి ॥

ఆఁకటి కడుగనిశిశువుకుఁ దల్లి యడిచి పాలు ద్రాగించినరీతి,
యీకడఁ గోరికలుడిగినయోగికి నీశ్వరుఁడే రక్షకుఁడు
చేకొని బుద్ధెఱిఁగినబిడ్డలపైఁ జింతింపరు తొల్లిటివలెఁ దల్లులు
యీకొలఁదులనే స్వయత్నదేహుల కీశ్వరుఁడును వాత్సల్యము
వదలు ॥ ఇటు ॥

తతిఁ గరిరాజుఁగాచినయట్లు ద్రౌపదిమానము గాచినయట్లు,
హితమతి స్వతంత్రముడిగినయోగికి యీశ్వరుఁడే రక్షకుఁడు
అతనుఁడు భస్మంబయ్యెననాఁడుఅజునిశిరం బటు
ద్రుంచిననాఁడు,
చతురుఁడు దా నడ్డమురాఁడాయను స్వతంత్రముడుగనిజీవులు
గాన ॥ ఇటు ॥

దిక్కని యనిశముఁ జిత్తములో౧నఁ జింతించేటిశరణాగతజనులకు,
యిక్కడనక్కడ శ్రీవేంకటగిరియీశ్వరుఁడే రక్షకుఁడు
మక్కువతోఁ దనయంతర్యామిని మఱచినస్వామిద్రోహులకెల్లా
అక్కరతోఁ బుట్టుగులే భోగ్యం బహంకారము విడువరుగాన
॥ ఇటు ॥ 391

౧. 'లోనాఁ' పూ.ము.పా. రేకు.

వరాళి

రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రిభరతశత్రుఘ్నులతోడ జయమందుదశరథరాఘవా ॥పల్లవి॥

శిరసుకూఁకటులరాఘవా చిన్నారిపొన్నారిరాఘవా
గరిమ నావయసునఁ దాటకిఁ జంపినకౌసల్యానందనరాఘవా
అరిదియజ్ఞముగాచురాఘవా అట్టె హరువిల్లువిఱిచినరాఘవా
సిరులతో జనకునియింటను జానకిఁ జెలఁగి పెండ్లాడినరాఘవా
॥ రామ ॥

మలయునయోధ్యారాఘవా మాయామృగాంతకరాఘవా
చెలఁగి చుప్పనాతిగర్వ మడఁచి దైత్యసేనలఁజంపినరాఘవా
సొలసి వాలిఁ ౧జంపి రాఘవా దండిసుగ్రీవునేలినరాఘవా
జలధిబంధించినరాఘవా లంకసంహరించినరాఘవా ॥ రామ ॥

దేవతలుచూడ రాఘవా నీవు దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁ జంపి విభీషణు రాజ్యమేలించినరాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి ౨రాఘవా
శ్రీ వేంకటగిరిమీఁద నభయము చేరి మాకిచ్చినరాఘవా
॥ రామ ॥ 392

82 రేకు దేవగాంధారి

విధినిషేధములకు వెఱవఁగఁబనిలేదు
మధుసూదన నీమన్ననదాసుఁడైతే ॥ పల్లవి ॥

విడువరానిధర్మ౩విధుల పురుషులను
విడిచి గోపికలు విచ్చనవిడి
బడి నిన్నుఁ దగులుటే పరమధర్మమాయ
యెడయునితరధర్మా లిఁకనేఁటికయ్యా ॥ విధి ॥

౧. 'జంపిన' కావచ్చు. ౨. 'మేలిన' కావచ్చు. ౩. 'విదుల' రేకు, పూ. ము. పా

మానరానికర్మమార్గము లటు మాని
  పూనినయతులే పూజ్యులట
  [1]నీనారాయణనియతే ధర్మమాయ
  యీనిజ మొకటియు నెఱఁగఁగవలయు ॥ విధి ॥

యిన్నిట శ్రీ వేంకటేశ నీదాసుఁడై-
  వున్న విచారాల నొదుగనేలా
  నిన్నుఁగూర్చినట్టినిజభక్తి గలదని
  తిన్ననై తెలిపేటితెలివే కలది ॥ విధి ॥ 393

## రామక్రియ

సులభుఁడు మధుసూదనుఁడు మన-
  మెలమి నమ్మిన నిట్టేనుండీ ॥ పల్లవి ॥

పడుచుమాటన కా[2]ప్రహ్లాదునెదుట
  పొడచూపె నాదిపురుషుఁడు
  అడవిదేహానక ఆదంతిమొఱకును
  తడవికాచినదైవమునుండీ ॥ సుల ॥

అఁడుమాటలనక అంతలో ద్రౌపదిని
  వాఁడిమిఁ గాచినవరదుఁడు
  పోఁడిమిఁ బేదనక పొందినకుచేలని[3]
  వీఁడె సంపదిచ్చె విష్ణుఁడు నుండీ[4] ॥ సుల ॥

వీరువారన కిదె వేఁడినవరములు
  సారెకు నిచ్చినసర్వేశుఁడు
  మేరతో లోకముల మెఱసె నిప్పుడును
  యీరీతి శ్రీ వేంకటేశుఁడేనుండీ ॥ సుల ॥ 394

---

౧. 'నారాయణ నీనియతే ధర్మమాయ' అనుట సహజము ప్రాసనిర్బంధముకాఁబోలు. 'ప్లంప్లాదు' రేకు. ౩. 'కుచేలునికి' లేక 'కుచేలుకు' కావచ్చు. ౪. నుమ్మీ' రేకు.

ధన్నాసి

కింకదీం 'నద్వైతం కేశవాత్పర'మని
ఉంకువైననాలో నీవుపమ లివే ॥ పల్లవి ॥

కంటి నీవొక్కఁడవే లోకములకు దైవమని
వొంటి మతి నిన్నుఁబోల నొకరిఁ గాన
వింటి నీవే ఘనమని వేదాంతమందు నీ-
కంటె నితరము వినఁ గరుణానిధీ ॥ కింక ॥

తోఁచె నాకు నీసేవే తుదిపదమని; మతి
తోఁచ దీబుద్ధికి; సరితూఁగ దెందును
పూఁచి నాగురుఁడు నిన్నే బోధించేగాని మతి
దాఁచఁడాయ నీమహిమ ధరణీధరా ॥ కింక ॥

సమ్మతించె నామతిఁ జవియైనా(నీ?)కథలె
నమ్మతించ ౧దెక్కడోరచ్ఛలనుద్దులు
నమ్మిక శ్రీవేంకటేశ నంటున నీపాదాలే
నమ్మితి నేమియు నమ్మ నారాయణా ॥ కింక ॥ 395

రామక్రియ

ఓహో దేందేం వొగి బ్రహ్మ మిదియని
సాహసమున శ్రుతి చాటెడిని ॥ పల్లవి ॥

పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా
వెరవుదెలియుచే వివేకము
పరము దేవుఁడును; అపరము జీవుఁడు,
తిరమైనప్రకృతియె దేహము ॥ ఓహో ॥

౧. 'నెక్కడో' వ్రా. ము. పా.

జ్ఞానము-జ్ఞేయము జ్ఞానగమ్యమును
వూని తెలియుటే యోగము
[1] జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ,
జ్ఞానగమ్యమే సాధించుమనసు ॥ ఓహో ॥

క్షరము నక్షరమును సాక్షి పురుషుఁడని
సరవిఁ దెలియుటే సాత్వికము
క్షరము ప్రపంచ, మక్షరము కూటస్థుఁడు,
సిరిపురుషోత్తముఁడే శ్రీవేంకటేశుఁడు ॥ ఓహో ॥ 396

శంకరాభరణం

చీచీ నరుల దేఁటిజీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక ॥ పల్లవి ॥

అడవిలో మృగజాతియైనఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువఁగవచ్చునా
వుడివోనిపక్షియై వుండనైనావచ్చుఁగాక
విడువ కెవ్వరినైనా వేఁడవచ్చునా ॥ చీచీ ॥

పసురమై వెదలేనిపాటు వడవచ్చుఁగాక
కసివో నొరులఁ బొగడఁగావచ్చునా
[2] వుసురుమానై పుట్టివుండనైనవచ్చుగాక
విసువక వీరివారి వేసరించవచ్చునా ॥ చీచీ ॥

[3] యెమ్మెలఁ బుణ్యాలు సేసి యిల యేలవచ్చుఁగాక
కమ్మి హరిదాసుఁడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీచిత్తమేకాక
దొమ్ములకర్మము లివి తోయవచ్చునా ॥ చీచీ ॥ 397

---

౧. ఈ రెండుమూడుపాదములయర్థము అంతగా సరిపోయినట్లు తోచదు.
౨. వుసురుమాను=(ప్రకరణమునుబట్టి) మునిసిడిమాను (ముష్టిచెట్టు) కావచ్చునేమో.
3. 'యెమ్మెలఁ..... .గావచ్చునా' ఈ రెండుపాదములు అన్నమయ్యస్వభావమునకు విరుద్ధముగా నున్నవి.

గుజ్జరి

ఇంతే మఱేమిలేదు యిందుమీఁదను
దొంతులకర్మాలు దుమ్ముదూరుపెట్టుట ॥ పల్లవి ॥

పుల్లములో నుండి దేహ మొగి రక్షించేహరి-
నొల్లకున్న తన్నుఁ దా నొల్లకుండుట
బల్లిదుఁ డాతని మాని పరుల వేఁడేదెల్లా
పొల్లకట్టు దంచిదంచి పోగుసేసుకొనుట ॥ ఇంతే ॥

[1]యెయ్యేడాఁ బుణ్యఫలము లేమి గలిగిన హరి-
కియ్యకున్న నది దైవమియ్యకుండుట
చెయ్యార నాతని కొప్పనేయనిభోగములెల్లా
చయ్యనఁ [2]జెలకుఁ బిప్పి చవిగొనుట ॥ ఇంతే ॥

శ్రీకాంతుడైనట్టిశ్రీవేంకటేశ్వరునిఁ
జేకొంటే సిరులెల్లాఁ జేకొనుట
మేకుల శ్రీహరినామమే నోర నుడుగుట
తైకొన్నయమృతపుఁగందు వగుట ॥ ఇంతే ॥ 398

83 రేకు ఆహిరి

ఇతరధర్మము లందు నిందు గలవా
మతిఁ దలఁప పరము నీమతమునసే కలిగె ॥ పల్లవి ॥

విదురునకుఁ బరలోకవిధి చేసెనట తొల్లి
ఆదె ధర్మసుతుఁడు వర్ణాశ్రమంబులు విడిచి
కదిసి నీదాసుఁడై నకతమునసేకాదె యీ-
యెదురనే తుదిపదం బిహమునసే కలిగె ॥ ఇత ॥

---

౧. 'యేయడాఁ' రేకు. ప్రాసభంగము. ౨ 'జలకుఁ' రేకు.

అంటరానిగద్దకుల [1]మంటి జటాయువుకు నీ-
[2]వంటి పరలోకకృత్యములు సేసితివి మును
వెంట నీకైంకర్యవిధి కలిమినేకాదె
వొంటి నీహస్తమున నో(యో?)గ్యమై నిలిచె ॥ ఇత ॥

యిరవైనశబరిరుచు లివియె నైవేద్యమై
పరగెనట శేషమును బహువిశేషములనక
ధరఁ దదీయప్రసాదపువిశేషమేకాదె
సిరుల శ్రీవేంకటేశ చెల్లుబడులాయ ॥ ఇత ॥ 399

సాళంగనాట

దేవదేవుఁ డెక్కె నదె దివ్యరథము
మావంటివారికెల్ల మనోరథము ॥ పల్లవి ॥

జగతి బాలులకై జలధులు వేరఁజేసి
పగటునఁ దోలెనదె పైఁడిరథము
మిగులఁగఁ గోపగించి మెరయురావణమీఁద
తెగి యెక్కె తోలెనదె దేవేంద్రరథము ॥ దేవ ॥

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకుఁ
బక్కన మరలిచెఁ బుష్పకరథము
నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కి తోలె
వెక్కసపురెక్కలతో విష్ణురథము ॥ దేవ ॥

బలిమి రుక్మిణిఁ దెచ్చి పరులగెలిచి యెక్కె
అలయేఁగుబెండ్లికల్యాణరథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
కలకాలమును నేఁగె ఘనమైనరథము ॥ దేవ ॥ 400

౧. ౨. 'అంటి' 'అంటి' ఇవి పునరుక్తులు. ఇట్టి వక్కడక్కడ గలవు.
౩. 'దియ్య' రేకు

### కాంబోది

ఏమిసేతు దేవదేవ యింతయును నీమాయ
కామినులఁ జూచిచూచి కామించె భవము ॥ పల్లవి ॥

చంచలపుఁగనుదోయి సతులవారికిఁ జిక్కి-
చంచలమందెను నాదిచ్చరిమనసు
కంచుఁగుత్తికలవారిగానములఁ జొక్కిచొక్కి
కంచుఁబెంచునాయఁబో నాకడలేనిగుణము ॥ ఏమి ॥

తీపులమాటల మించి తెలివలభ్రమఁ దరి-
తీపులపాలాయఁబో నాతెలివెల్లాను
పూఁపలనవ్వులతోడిపొలఁతులఁ జూచిచూచి
పూఁపలుఁబి దెలునై పొల్లువోయఁ దపము ॥ ఏమి ॥

కూటమి సతులపొందు కోరి కోరి కూడికూడి
కూటువ నావిర తెందో కొల్లఁబోయను
నీటున శ్రీవేంకటేశ నినుఁగని ౧ యింతలోనె
జూటరినై ౨ యింతలోనె సుజ్ఞానినైతి ॥ ఏమి ॥ 401

### గుండక్రియ

మరిగి వీరెపో మాదైవంబులు
కెరలినహరిసంకీర్తనపరులు ॥ పల్లవి ॥

వినియెడివీనులు విష్ణుకథలకే
పనిగొందురు మాప్రపన్నులు
కనియెడికన్నులు కమలాక్షునియం-
దనువుపరతు రటు హరిసేవకులు ॥ మరి ॥

౧. ౨ ఇవి పునరుక్తములు

పలికెడిపలుకుల పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
౧ తలఁచేటితలఁపులు ధరణీధరుపై
౨తలకొలుపుదు రాతదియ్యులు ॥ మరి ॥

కరముల శ్రీపతికైంకర్యములే
మురియుచుఁ జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీవేంకటేశ్వరుమతమే
సిరుల నమ్ముదురు శ్రీవైష్ణవులు ॥ మరి ॥ 402

బౌళి

ఏమీ నడుగనొల్ల హెచ్చుకుందు లననొల్ల
కామించి నీవిచ్చితివి కైవల్యపదము ॥ పల్లవి ॥

పుట్టుగులకు వెఱవ భువిలోన హరి నీకు-
నెట్టె నీదాసుఁడ నైతేఁజాలు
వెట్టికి నేజాతియైన వెఱవ నీనామములు
వొట్టి నానాలికమీఁద నుంచేఁజాలు ॥ ఏమీ ॥

దురితాలకు వెఱవఁ దుద వేయైనా హరి నీ-
కరుణఁ గైంకర్యము గలిగితేఁ జాలు
నిరతి నింద్రియాలకు నే వెఱవ నీ వాత్మఁ
బెరరేఁపకుఁడవై పెరిగితేఁ జాలు ॥ ఏమీ ॥

యేలోకమైనా వెఱవ యెప్పుడూ శ్రీవేంకటేశ
పాలించి నీకృప నాపైఁ బారితేఁ జాలు
కాలమెట్టయినా వెఱవ కర్మ మెట్టయినా వెఱవ
యేలిననీదాసులు నన్నియ్యకొంటేఁ జాలును ॥ ఏమీ ॥ 403

౧. 'తలఁచెడి' కావచ్చు. లయ కనుగుణము.
౨. 'తలకొలుపుదురా తదియ్యులు' పూ. ము. పా.

భూపాళం

కనియుఁ గాననిమనసుకడమగాక
యెనలేనిహరిమహిమ కిది గుఱుతుగాదా ॥పల్లవి॥

కనుకలిగి హరిఁగొలిచి ఘనులైరిగాక మును
మనుజులే కారా మహాపురుషులును
మనసులో నిపుడైన మరిగి కొలిచినవారు
ఘనులౌట కిదియ నిక్కపుగుఱుతుగాదా ॥కని॥

భావించి హరిఁగొలిచి పదవులందిరిగాక
జీవులే కారా దేవతలును
కావించి కొలిచినను ఘనపదవు లేమరుదు
యేవలన నిందరికి నిది గుఱుతుగాదా ॥కని॥

పన్ని హరిఁగొలిచి నేర్పరులైరిగాక ధర-
నున్నవారే కారా యోగివరులు
యెన్నికల శ్రీవేంకటేశు నమ్మినవార-
లిన్నియునుఁ జేకొనుట కిది గుఱుతుగాదా ॥కని॥ 404

84 రేకు మలహరి

వలెననువారిదె వైష్ణవము యిది
వలపుఁదేనెవో వైష్ణవము ॥పల్లవి॥

కోరిక లుడుగుచు గుఱి నిన్నిటిపై
వైరాగ్యమెపో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలమునుఁ దనలో
వారించుటవో వైష్ణవము ॥వలె॥

సుడిగొను దేహపుసుఖదుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముడివడి యింద్రియములకింకరుఁడై
వడఁబడనిదెపో వైష్ణవము ॥ వలె

వుదుటునఁ దనసకలోపాయంబులు
వదలుటపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వరునామము
వదనముచేర్చుట వైష్ణవము ॥ వలె ॥ 40

## పాడి

శ్రీహరి సేసినచిహ్న లివి యీ -
మోహము విడుచుట మోక్ష మది ॥ పల్లవి

మలినం బేది మఱుఁగననేది
కలుషపుమలముల కాయ మిది
కలిగిన దేది కడు లేందేది
చలనపుమాయలజన్మ మిది ॥ శ్రీహ

తనిసిన దేది తనియనిదేది
దినదిన మాఁకలి దీరదిది
కొన యిందేది గుఱి మొదలేది
పనిగొనుకర్మపుబంధ మది ॥ శ్రీహ

నిండిన దేది నిండనిదేది
కొండలపొడవులకోరి కది
అండనె శ్రీ వేంకటాధిపు శరణని
వుండుటె యిహపరయోగ మది ॥ శ్రీహ ॥ 40(

౧. సాళంగనాట

దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక
వేవేలుకర్మాల వేసారఁగవలసె ॥ పల్లవి ॥

హరియంటేఁ బాపేటిఅన్నిపాపాలు నేసిన
పౌరి నందుపై నమ్మిక పుట్టదుగాక
నరసింహాయంటే వచ్చేనానాపుణ్యాలకు
తిరముగా ఋణములు దీర్చుకొనఁగలనా ॥ దైవ ॥

దేవ జగన్నాథయంటే తెగనిజన్మము లేవి
దైవశము నామనసు గాదుగాక
గోవిందయనియంటేఁ గూడనిపదవు లేవి
కావిరిఁ గాల మూరకె కడపేము నేము ॥ దైవ ॥

వేదనారాయణయంటే ౨వీడేటిబంధములు
ఆదిగా మూఁడులోకాలనైనా ౩నున్నదా
శ్రీదేవిపతియైనశ్రీవేంకటేశ్వరుఁడా
యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాక ॥ దైవ ॥ 407

గుజ్జరి

ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము-
లొక్కట గెలిచితి మోహో నేము ॥ పల్లవి ॥

ప్రపన్నులెదుటనుఁ బడినయాతుమకు
చపలత మరి నాశము లేదు
ఉపమల గురుకృపనొనరినమనసుకు
రపముల మఱి నేరములే లేవు ॥ ఎక్క ॥

౧. 'సాళంగం'పూ. ము పా. ౨. 'వీడవి' కావచ్చు. ౩. 'నున్నవా'కావచ్చు.

ఘనతరద్వయాధికారగుదేహికి
    మినుకుల భవభయమే లేదు
చనవుల హరిలాంఛనకాయమునకు
    వెనుకొనుకర్మపువెట్టియు లేదు ॥ ఎక్క ॥

శ్రీవేంకటేశ్వరుఁ జేరినధర్మికి
    ఆవల మఱి మాయలు లేవు
కైవశమాయను కైవల్యపదమునుఁ
    జావుముదిమితో సడ్డే లేదు ॥ ఎక్క ॥ 408

లలిత

సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను
    సర్వాపరాధినైతి చాలుఁజాలునయ్యా ॥ పల్లవి ॥

వూరకున్నజీవునికి వొక్కొక్క స్వతంత్ర మిచ్చి
    కోరేటియపరాధాలు కొన్ని వేసి
    నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటా
    దూరువేసే వింతేకాక దోష మెవ్వరిదయ్యా ॥ సర్వా ॥

మనసు చూడవలసి మాయలు నీవే కప్పి
    జనులకు విషయాలు చవులుచూపి
    కనుఁగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి
    ఘనము నేసే విందుఁ గర్త లెవ్వరయ్యా ॥ సర్వా ॥

వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే
    కన్నకన్నభ్రమతలే కల్పించి
    యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
    నిన్ను నన్ను నెంచుకొంటే నీకే తెలుసునయ్యా ॥ సర్వా ॥ 409

రామక్రియ

భక్తికొలఁదివాఁడే పరమాత్ముఁడు
    భుక్తిముక్తిఁ దానే యిచ్చు భువిఁ బరమాత్ముఁడు ॥పల్లవి॥

పట్టినవారిచేబిడ్డ పరమాత్ముఁడు
    బట్టబయటిధనము పరమాత్ముఁడు
    పట్టుపగటివెలుఁగు పరమాత్ముఁడు
    యెట్టనెదుటనే వున్నాఁ డిదె పరమాత్ముఁడు ॥భక్తి॥

పచ్చిపాలలోనివెన్న పరమాత్ముఁడు
    బచ్చనవాసినరూపు పరమాత్ముఁడు
    బచ్చుచేతివొరగల్లు పరమాత్ముఁడు
    యిచ్చకొలఁదివాడువో యీపరమాత్ముఁడు ॥భక్తి॥

పలుకులలోనితేట పరమాత్ముఁడు
    ఫలియించు నిందరికిఁ బరమాత్ముఁడు
    బలిమి శ్రీవేంకటాద్రిపరమాత్ముఁడు
    యెలమి జీవులప్రాణ మీపరమాత్ముఁడు ॥భక్తి॥ 410

85 రేకు దేవగాంధారి

మిక్కిలిపుణ్యులు హరి మీదాసులే హరి
    తక్కినవారు మీకృపదప్పినవారు హరి ॥పల్లవి॥

వున్నతపుసంపదల నోలలాడేయట్టివాఁడు
    మున్నిటిజన్మాన నీకు మొక్కినవాఁడు హరి
    పన్ని పడనిపాట్లఁ బడలఁగొలిచేవాఁడు
    వున్నతి మిము సేవించనొల్లనివాఁడు హరి ॥మిక్కి॥

పూని దేవేంద్రాదులై పొడవుకెక్కినవారు
శ్రీనాథ మిమ్మునే పూజించినవారు హరి
నానానరకముల నలఁగుచుండేవారు
నానాఁడే నీమహిమ నమ్మనివారు హరి ॥ మిక్కి ॥

పావనులై నిజభక్తిఁ బ్రపన్నులయ్యినవారు
శ్రీవేంకటేశ మిమ్ముఁ జేరినవారె హరి
వేవేలుదేవతలవెంటఁ దగిలేటివాఁడు
కావించి మిమ్మెఱఁగనికర్మి యాతఁడే హరి ॥ మిక్కి ॥ 411

ముఖారి

చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ నింతే
అప్పటి నపరాధమా ఆదరించవలదా ॥ పల్లవి ॥

[౧]నియ్యాజ్ఞ దేహము నే మోఁచితి నింతే
[౨]యియ్యెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
[౩]వెయ్యవేలై వేగుదాఁకా వెట్టిసేసి యలసితి
[౪]వొయయ్య కొంతైనా వూరడించవలదా ॥ చెప్పి ॥

నీవునేనేకర్మము నేఁ జేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవరమై వెంటవెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంతవడైనా దప్పిదీర్చవలదా ॥ చెప్పి ॥

మతిలో శ్రీవేంకటేశ మనికైనవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్యా
యితవై పనిసేసేటియింటిపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డువెట్టఁదగదా ॥ చెప్పి ॥ 412

౧. 'నీ+ఆజ్ఞ'. 'నీమీ' శబ్దములపైగూడ త్రికసంధి వింత. ఈవాఙ్మయమున యిది పలుతావుల గలదు. 'నీయాజ్ఞ' అని పూ. ము. పా. అట్లనే ౨. 'యీయెడ' ౩. 'వేయి' అని పూ.ము.పాఠములు. ప్రాసభంగము. ౪. 'వొయ్యన' కావచ్చు. లేకున్న ప్రాసభంగము.

బౌళి

వెట్టివాఁడు వెట్టిగాఁడు; విష్ణునిదాస్యము లేక
విట్టువీఁగేయహంకారి వెట్టివాఁడు ॥ పల్లవి ॥

నాలుకపై శ్రీహరినామ మిట్టే వుండఁగాను
జోలితో మఱచిననీచుఁడే వెట్టివాఁడు
ఆలరియీజగమెల్లా హరిరూపై వుండఁగాను
వాలి తలపోయలేనివాఁడు వెట్టివాఁడు ॥ వెట్టి ॥

కూరిమి బ్రహ్మాండాలు కుక్షినున్నహరికంటే
కోరి వేరే కలఁడనేకుమతి వెట్టివాఁడు
చేరి తనయాత్మలోన శ్రీరమణుఁడుండఁగాను
దూరమై తిరుగువాఁడే దొడ్డవెట్టివాఁడు ॥ వెట్టి ॥

సారపుశ్రీవేంకటేశుశరణాగతి వుండఁగా
సారెఁ గర్మములంటెడిజడుడు వెట్టివాఁడు
చేరువ నాతనిముద్ర చెల్లుబడి నుండఁగా
మోరతోపైవున్నవాఁడే ముంచు వెట్టివాఁడు ॥ వెట్టి ॥ 413

మాళవి

నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరల శరణని బ్రదుకరో సాటికిఁ బెనఁగక జడులాల ॥ పల్లవి ॥

సకలోపాయశూన్యులు సమ్యగ్జ్ఞానపూర్ణులు
అకలంకులు శంఖచక్రలాంఛను లన్నిటఁ బూజ్యులు వైష్ణవులు
వొకటిఁ గోరరు వొరులఁ గొలువరు వొల్లరు బ్రహ్మాదిపట్టములు
అకటా వీరలసరియనఁ బాపం బొరుమతంబులపూఁతకోకలఁ ॥ నిత్య ॥

మంత్రాంతరసాధనాంతరంబులు మానినపుణ్యులు విరక్తులు
యంత్రపుమాయలఁ బొరలుపరులకు యెంతైనా మొక్కరు వైష్ణవులు
తంత్రపుకామక్రోధవిదూరులు తమనిజధర్మము వదలరు
జంత్రపుసంసారులతో వీరల సరియని యెంచఁగఁ బాపమయ్య ॥నిత్య॥

తప్పరు తమపట్టినవ్రత మెప్పుడు దైవ మొక్కడేఁ గతియనుచు
వొప్పగుతమపాతివ్రత్యంబున నుందురు సుఖమున వైష్ణవులు
కప్పినశ్రీవేంకటపతిదాసులు కర్మవిదూరులు సాత్వికులు
చెప్పకుఁ డితరుల సరిగా వీరికి సేవించఁగ నే ధన్యుఁడనైతి ॥నిత్య॥41

లలిత

మా కెల్ల ౧'రామానుమతో ధర్మ' యిది నీ-
యాకడఁ గలుగుట కేమరుదు ॥పల్లవి॥

అలగరుడగమన మహీశయనంబును
కలిసి నీయందె కలిగెనటా
పొలసినపాపముఁ బుణ్యము నరులకు
యెలమిఁ గలుగుటకు నేమరుదు ॥మాకె॥

యిదె నీడకన్ను యెండకన్ను మరి
కదిసి నీయందె కలిగెనట
సదరపునరులకు జననమరణములు
యెదురనె కలుగుట కేమరుదు ॥మాకె॥

శ్రీకాంత ఒకదెస భూకాంత ఒకదెస కదెన
కైకొని నీకిటు గలిగెనట
యీకడ శ్రీవేంకటేశ యిహపరము
యేకమై మా కగు టేమరుదు ॥మాకె॥ 415

---

౧. 'రామానమతో ధర్మమిది' రేకు.

భైరవి

తెలియరాదు మాయదేహమా మమ్ము
పలువికారాలఁబెట్టి పవిగొన్న దేహమా ॥ పల్లవి ॥

దినమొక్కవయసెక్కే దేహమా సారె
పెనుమదముగురిసేటెండు దేహమా
దినదినరుచిగోరే దేహమా నన్ను
ఘనమోహపాశాలఁ గట్టెఁగదె దేహమా ॥ తెలి ॥

తెలివినిద్రలుగల దేహమా నీ-
పొలము పంచభూతాలపొత్తు దేహమా
తిలకించి పాపపుణ్యాల దేహమా
బలువుగలదాఁకా బదుకవో దేహమా ॥ తెలి ॥

తీరనిసంసారపు దేహమా ఇట్టె
వూరట లేనిభోగాల వో దేహమా
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలిచితి వీక్ష నాకు
కారణజన్మమవై కలిగిన దేహమా ॥ తెలి ॥ 416

86 రేకు                                    లలిత

తహతహలిన్నిటికి తానే మూలము గాన
సహజాన నూరకున్న సంతతము సుఖము ॥ పల్లవి ॥

భారమైనపదివేలుపనులు గడించుకొంటే
సారెసారె నలయించక పోవు
తీరనియాసోదము దేహములో నించుకొంటే
వూరూరఁ దిప్పితిప్పి వొరయక మానవు ॥ తహ ॥

వుండివుండి కిందుమీఁదు వుపమఁ జింతించుకొంటే
వుండుఁబో మంచముకింద నొకనూయి
కొండంతదొరతనము కోరి మీఁద వేసుకొంటే-
నండనే ౧యాబహురూప మాడకపోదు ॥ తహ

మనసురానివైన మంచివి చేసుకొంటే
తినఁదిన వేమైనఁ దీపవును
తనిసి శ్రీవేంకటేశు౨దాసానదాసుఁడైతే
యెనయుచు నేపని కెదురే లేదు ॥ తహ ॥ 41

సాళంగనాట

ఇదియే మర్మము హరి యిందుఁగాని లోనుగాఁడు
పదపడి జీవులాల బదుకరో ॥ పల్లవి ॥

హరిఁ గానలేరు మీరు ౩అరసెందువెదకినా
హరిదాసు లెఱుఁగుదు రడుగరో
గరిమెఁ బ్రత్యక్షము గాఁడు దేవుఁ డెవ్వరికి
ధరఁ బ్రత్యక్షము హరిదాసులఁ గొలువరో ॥ ఇది ॥

చేత ముట్టి గోవిందుని శిరసు వూజించలేరు
చేతులార బ్రపన్నులసేవ సేయరో
జాతిగాఁగ విష్ణుని బ్రసాద మేడ దొరకీని
ఆతల వారిఁ బ్రసాద మడుగరో ॥ ఇది ॥

అంతరంగమున నున్నాఁడందురు విష్ణుఁడు గాని
అంతటా నున్నారు వైష్ణవాధికులు
చెంతలఁ దదియ్యులచేతియనుజ్ఞ వడసి
సంతతం శ్రీవేంకటేశుశరణముచొరరో ॥ ఇది ॥ 411

౧. 'యాబయి' లేకు. ౨. 'దాసాను' కావచ్చు. ౩. అరసి+ఎందున్+వెదకినా.

దేసాక్షి

ఎవ్వరివాఁడో యీ దేహి
 యివ్వలనవ్వల నీదేహి ॥ పల్లవి ॥

కామించు నూరకే కలవియు లేనివి
 యేమి గట్టుకొనె నీదేహి
 వాములాయ నిరువదియొకవావులు
 యేమని తెలిసెనో యీదేహి ॥ ఎవ్వ ॥

కందువ విజములుఁ గల్లలు నడిపీ
 యెందుకు నెక్కెనో యీ దేహి
 ముందర నున్నవి మొగిఁ దనపాట్లు
 యిందే భ్రమసీ నీదేహి ॥ ఎవ్వ ॥

పంచేంద్రియములపాలాయ జన్మము
 యించుక యెఱఁగఁడు యీదేహి
 అంచెల శ్రీవేంకటాధీశ నీకృప
 వంచఁగ గెలిచెను వడి నీదేహి ॥ ఎవ్వ ॥ 419

రామక్రియ

ఎంతవిచారించుకొన్నా నిదియే తత్వము హరి
 వంతుకు నీకృపగలవాఁడే యెఱుఁగు హరి ॥ పల్లవి ॥

నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
 నిన్ను నొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి
 మున్ను దేవతలు నీకు మొక్కి బదికిరి హరి
 వున్నతి నసురలు ని న్నొల్లక చెడిరి హరి ॥ ఎంత ॥

యేపున నీపేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి
నీపేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడే హరి
౧ కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁ దిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి ॥ ఎంత ॥

యిట్టె నీవిచ్చినవర మెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగా నీవియ్యనివి కపటములే హరి
అట్టె శ్రీవేంకటేశ నీ వంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న వొచ్చము దేహికి హరి ॥ ఎంత ॥ 420

మాళవి

౨ నగుమొగముతోడి వో నరకేసరి
నగరూప గరుడాద్రినరకేసరి ॥ పల్లవి ॥

అమితదానవహరణ ఆదినరకేసరి
నమితబ్రహ్మాదిసుర నరకేసరి
కమలాగ్రవామాంక కనకనరకేసరి
నమోనమో పరమేశ నరకేసరి ॥ నగు ॥

రవిచంద్రశిఖనేత్ర రౌద్రనరకేసరి
నవనారసింహ నమో నరకేసరి
భవనాశినీతీరభవ్యనరకేసరి
నవరసాలంకారనరకేసరి ॥ నగు ॥

శరణాగతత్రాణ సౌమ్యనరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవేంకటాద్రినరకేసరి
నరసింహ జయ జయతు నరకేసరి ॥ నగు ॥ 421

---

౧. 'కైపుల' కావచ్చు ౨. భక్తిపారవశ్యమున పాడిన ఈపాటలో సంస్కృతాంధ్ర సంధిసమాసములు, పదములూ పెద్దలు విమర్శింపరు. 'నరకేసరీ' అని దీర్ఘాంతమగుట మంచిదేమో?

లలిత

వాఁడె వేంకటాద్రిమీఁద వరదైవము
పోఁడిమితోఁ బొడచూపెఁ బొడవైనదైవము౧ ॥పల్లవి॥

వొక్కొక్కరోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
పిక్కటిల్ల వెలుఁగొందే పెనుదైవము
పక్కనను తనలోనిపదునాలుగులోకాలు
తొక్కి పాదానఁగొలచేదొడ్డదైవము ॥వాఁడె॥

వేదశాస్త్రాలు నుతించి వేసరి కానఁగలేని-
మోదపుపెక్కుగుణాలమూలదైవము
పోది దేవతలనెల్లఁ బుట్టించ రక్షించ
ఆదికారణంబైనఅజుఁగన్నదైవము ॥వాఁడె॥

సరుస శంఖచక్రాలు సరిఁబట్టి యసురల
తరగి పడవేసినదండిదయివమూ
సిరి వురమున నించి శ్రీవేంకటేశుఁడయి
శరణాగతులఁగాచేసతిమయినదయివము ॥వాఁడె॥ 422

87 రేకు రామక్రియ

సులభమా యిందరికిఁ, జూడ సులభముగాక
కలిగె మీకృప నాకుఁ గమలారమణా ॥పల్లవి॥

సతతదయాచారసంపన్నుఁడై మతికదా
అతిశయవైష్ణవాన కరుహుఁడౌట
వ్రతోపవాసతీర్థవరసిద్ధుఁడై కదా
మితిమీరి నరహరి మీదాసుఁడౌట ॥సుల॥

౧. 'దేహము' వ్రా. ము. పా.

సకలయజ్ఞఫలము సత్యము ఫలముగదా
ప్రకటించి విష్ణునామపాఠకుఁడౌట
అకలంకమతితోడ నాజన్మశుద్ధుఁడై కదా
అకుటిలమగుమీచక్రాంకితుఁడౌట ॥ సుల ॥

కెరలి సదాచార్యకృపగలిగినఁగదా
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ గనుట
మరిగి మీపై భక్తి మతి ముదిరినఁగదా
అరయ మీకే శరణాగతుఁడౌట ॥ సుల ॥ 423

శంకరాభరణం

అదె వాఁడె యిదె వీఁడె అందు నిందు నేఁగీని
వెదకివెదకి తిరువీధులందు దేవుఁడు ॥ పల్లవి ॥

అలసూర్యవీధి నేఁగీ నాదిత్యునితేరిమీఁద
కలికికమలానందకరుఁడుగాన
తలపోసి అదియును దవ్వు చుట్టరికమని
యిలఁ దేరిమీఁద నేఁగీ నిందిరావిభుఁడు ॥ అదె ॥

చక్కఁ సోమవీధి నేఁగీఁ జందురునితేరిమీఁద
యెక్కువై నకువలయహితుఁడుగాన
చుక్కలుమోచినదవ్వుచుట్టరిక మిదియని
యిక్కువతో వీధి నేఁగీ నెన్నికైనదేవుఁడు ॥ అదె ॥

యింతులమనోవీధి నేఁగీ మరుతేరిమీఁద-
నంతటా రతిప్రియుఁ డటుగాన
రంతుల నదియుఁ గానరానిచుట్టరికమని
వింతరీతి నేఁగీ శ్రీవేంకటాద్రిదేవుఁడు ॥ అదె ॥ 424

బౌళి

శ్రీవేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే
పావనపువైకుంఠపతియును నితఁడే ॥పల్లవి॥

భాగవతములోఁ జెప్పేబలరాముతీర్థయాత్ర-
నాగమోక్తమైనదైవ మాతఁ డితఁడే
బాగుగా బ్రహ్మాండపురాణపద్ధతియాతఁ డితఁడే
యోగమై వామనపురాణోక్తదైవ మీతఁడే ॥శ్రీవేం॥

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము-
లలరఁ జేసినదేవుఁ డాతఁ డీతఁడే
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి
కలిమిఁ దపమునేసి కన్నదేవుఁ డీతఁడే ॥శ్రీవేం॥

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్నతత్వ మీతఁడు
చక్క నారదాదులసంకీర్తనకుఁ జొక్కి-
నిక్కినశ్రీవేంకటాద్రినిలయుఁడు నీతఁడే ॥శ్రీవేం॥ 425

బౌళి

పట్టినచోనే వెదకి భావించవలెఁగాని
గట్టిగా నంతర్యామి కరుణించును ॥పల్లవి॥

యింటిలోనిచీఁకటే యిట్టే తప్పకచూచితే
వెంటనే కొంతవడికి వెలుఁగిచ్చును
అంటి కానరానితనయాతుమ తప్పకచూచు-
కొంటేఁ దనయాతుమయు గొబ్బునఁ గాన్పించును ॥పట్టి॥

మించి కఠినపురాతిమీఁదఁ గడవ పెట్టితే
అంచెలఁ దానే కుదురైనయట్టు
పొంచి హరినామమే యేపొద్దు నాలికతుదను
యెంచి తలఁచఁదలఁచ నిరవౌ సుజ్ఞానము ॥ పట్టి ॥

వాక్కొక్కయడుగే వాగి ముందరఁ బెట్టితే
యెక్కువై కొండైనా నెక్కఁ గొనకు
యిక్కువ శ్రీవేంకటేశు నిటు దినదినమును
పక్కనఁ గొలిచితే బ్రహ్మపట్ట మెక్కను ॥ పట్టి ॥ 426

సాళంగనాట

నాతప్పు లోఁగొనవే నన్నుఁ గావవే దేవ
చేఁత లిన్నిఁ జేసి నిన్నుఁ జేరి శరణంటిని ॥ పల్లవి ॥

అందరిలో నంతర్యామివై నీ వుండఁగాను
యిందరిఁ బనులుగొంటి నిన్నాళ్లను
సందడించి యిన్నిటా నీచైతన్యమై యుండఁగాను
వందులేక నేఁ గొన్నివాహనా లెక్కితిని ॥ నాత ॥

లోకపరిపూర్ణుఁడవై లోనా వెలి నుండఁగాను
చేకొని పూవులుఁ బండ్లుఁ జిదిమితిని
కైకొని యీమాయలు నీకల్పితమై వుండఁగాను
చౌకలేక నే వేరే సంకల్పించితిని ॥ నాత ॥

యెక్కడచూచిన నీవే యేలికెవై వుండఁగాను
యిక్కడాఁ దొత్తుల బంట్ల నేలితి నేను
చక్కని శ్రీవేంకటేశ సర్వాపరాధి నేను
మొక్కితి నన్ను రక్షించు ముందెఱఁగ నేను ॥ నాత ॥ 427

నాట

పరిపూర్ణ గరుడాద్రిపంచాననం
పరమం సేవే పంచాననం ॥ పల్లవి ॥

క్రూరదంష్ట్రాగ్నికణఘోరపంచాననం
పారీణచక్రధరపంచాననం
వీరపంచాననం విజయపంచాననం
భార౧భూభారహరపంచాననం ॥ పరి ॥

దివిజపంచాననం తీవ్రవనఖకాననం
భవనాశినీతీరపంచాననం
కువలయాకాశసంఘోషపంచాననం
పవిశబ్దదంతరవపంచాననం ॥ పరి ॥

శ్రీవేంకటాఖ్యఘనశిఖరిపంచాననం
౨పావనం పంచముఖపంచాననం
సేవితప్రహ్లాదసిద్ధిపంచాననం
భావితం శ్రీయుక్తపంచాననం ॥ పరి ॥ 428

88 రేకు బౌళి

వివేకమెఱఁగనివెఱ్ఱులముగాక నేము
దివారాత్రము నిన్నే దిష్టించవలదా ॥ పల్లవి ॥

మానివోడ నమ్మి వొక్కమనుజుఁడు వార్ధి దాఁటి
నానార్థములుఁ గూర్చి నటించఁగాను
దానవారికృప నమ్మి తగినసంసారవార్ధి —
లోను చొచ్చి దాఁటి గెల్వ లోకులకుఁ జెల్లదా ॥ వివే ॥

---

౧. 'భూభార' రేకు. ౨. 'పావనము' రేకు.

జుట్టెఁడుయినుము నమ్మి సొరిది నొక్కఁడు భూమిఁ
గట్టిడిభయములెల్లఁ గడవఁగాను
నెట్టనఁ జక్రాయుధునినిజనామ మిటు నమ్మి
తట్టి భవభయములు తరి దాఁటఁజెల్లదా ॥ వివే ॥

వేలెఁడుదీపము నమ్మి వెడఁగుఁజీఁకటిఁ బాసి
పోలిమి నొక్కనరుఁడు పొదలఁగాను
ఆలించి శ్రీవేంకటేశుఁ డాత్మలో వెలుఁగఁగాను
మేలి మాతవిఁ గొలిచి మెరయంగఁవలదా ॥ వివే ॥ 429

గుండక్రియ

ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము
దీమపువిజ్ఞానమే దివ్యౌత్తుఫలము ॥ పల్లవి ॥

పాపచింత మదిలోనఁ ౧బారకుండా నిలిపితే
చేపట్టి దానములెల్లాఁ జేసినంతఫలము
కోపానలములోన కోరికలు వేల్చితేనే
యేపున యజ్ఞాలు నేసి యేచినంతఫలము ॥ ఏమి ॥

కనకముపై యాస కాదని పోఁదొబ్బితేనే
తనకు వేవేలుఘోరతపములఫలము
వనితలమోహములవలఁ బడకుండితేనే
దినము గోటితీర్థాలు దిరిగినఫలము ॥ ఏమి ॥

శ్రీవేంకటేశ్వరుఁ జేరి కొలుచుటే
౨ధావతిలేనియట్టితనజన్మఫలము
భావించి యాచార్యపాదపద్మమూలమే
సావధానమున సర్వశాస్త్రార్థఫలము ॥ ఏమి ॥ 430

౧. 'జాయకుండా' పూ. ము. పా. ౨. 'దావతి' రేకు.

మలహరి

సహజాచారములెల్లా సర్వేశ్వరునియాజ్ఞే
అహమించి నమ్మకుండు టదియే పాషండము ॥ పల్లవి ॥

విద్దిరించువానిచేతిసిపఁ్మపంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జారె
వొద్దువొద్దు తనలోన భోగకాంక్ష వుండఁగాను
అద్దలించి కర్మమొల్లనను టే పాషండము ॥ సహ ॥

కలగన్నవాఁడు మేలుకనినటువలెనే
తలఁగి ప్రపంచ మెందో దాఁగితే దాఁగె
యిల నీదేహము మోఁచి యింతాఁ గల్లలనుచు
పలికి తప్పనడచేభావమే పాషండము

ధర నద్దముచూచేటితనరూపమువలె
గరిమతోఁ దనయాత్మ కంటేఁ గనె
సరుస శ్రీవేంకటేశుసాకార మటు గని
కరఁగి భజించలేనికష్టమే పాషండము ॥ సహ ॥ 431

సామంతం

తెలియక వూరక తిరిగేము
చలమరి కగునా సంతతసుఖము

హేయము కడుపున నిడుకొని యింకా
'చీ'యననిమాకు సిగ్గేది
పాయము పిడికిటఁబట్టుచునుండేటి-
కాయధారులకుఁ గలదా విరతి ॥ తెలి ॥

అంగనలరతులయాసలనీఁదేటి-
యెంగిలిమనుజుల కెగ్గేది
ముంగిట నార్గురుముచ్చులఁగూడిన-
దొంగగురుని కిందుల నిజమేది ॥ తెలి ॥

జననమరణములు సరి గని కానని
మనుజాధమునకు మహిమేది
యెనగాని శ్రీవేంకటేశు శరణ మిటు
గని మనకుండిన గతి యిఁక నేది ॥ తెలి ॥ 432

### లలిత

౧హరి నీయనుమతో అది నాకర్మమో
పరమే యిహమై భ్రమయించీని ॥ పల్లవి ॥

కలుగదు శాంతము కటకట బుద్ధికి
చలమున నింతాఁ జదివినను
నిలువదు చిత్తము నీపై చింతకు
పలుసంపదలనుఁ బరగినను ॥ హరి ॥

తగులదు వైరాగ్యధన మాత్మకును
వొగి నుపవాసము లుండినను
అగపడదు ముక్తి ఆసలనాసల
జగమింతా సంచరించినను ॥ హరి ॥

విడువదు జన్మము వివేకముననే
జడిసి స్వతంత్రము జరపినను
యెడయక శ్రీవేంకటేశ్వర నీవే
బడిఁగాచితి విదె బ్రదికితి నేను ॥ హరి ॥ 433

౧. 'ఇహమే పరమై' అనుట న్యాయ్యమేమో?

సామంతం

ఇందిరాధిపుని సేవ యేమరకుండుటగాక
బొందితోడిజీవులకు బుద్ధు లేఁటిబుద్ధులు ॥ పల్లవి ॥

రేయెల్లా మింగిమింగి రేపే వెళ్లనుమియు
బాయట నిద్రా దేవి పలుమారును
చాయలకు నిచ్చనిచ్చాఁ జచ్చిచచ్చి పొడమేటి -
మాయజీవులకునెల్లా మని కేఁటిమనికి ॥ ఇంది ॥

కనురెప్ప మూసితేనే కడు ౧సిష్టే చీఁకటౌను
కనురెప్ప దెరచితే క్రమ్మరఁ బుట్టు
ఘనమై నిమిషమందే కలిమి లేమియుఁ దోఁచె
యెనయుజీవుల కింక యెఱు కేఁటియెఱుక ॥ ఇంది ॥

నొప్పగుఁ బ్రాణము లవి పూరుపుగాలివెంట
యెప్పుడు ౨లోనివెలికి నెడతాఁకును
అప్పఁడు శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డందరికి
తప్పక యాతఁడే కాచు; తలఁ పేఁటితలఁపు ॥ ఇంది ॥ 434

89 రేకు మలహరి

దేవ యీతగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా ॥ పల్లవి ॥

తనువునఁ బొడమినతతి నింద్రియములు
పొనిఁగి ౩యెక్కడికిఁ బోవునయా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేఁగుదురయ్యా ॥ దేవ ॥

---

౧. 'సృష్టే' కావచ్చు. ౨ 'లోనికి వెలికి' అని ద్వంద్వము కావచ్చు. ౩. 'యక్క' రేకు.

పొదుగుచు మనమునఁ బొడమినయాసలు
అదన నెక్కడికి నరుగునయా
వొదుగుచు జలములనుండుమత్స్యములు
పదపడి యేగతిఁ బాసీనయ్యా ॥ దేవ ॥

అలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందునయా
బలుశ్రీవేంకటపతి నాయాత్మనుఁ
గలిగితి వెక్కడికలుషములయ్యా ॥ దేవ ॥ 435

నాట

నిక్కించీఁ గర్ణములు మానిసిమెకము ౧
నిక్కపుఁగరుణతో మానిసిమెకము ॥ పల్లవి ॥

కొండ తనకు గద్దెగాఁ గోరి కూచుండిన దదే
నిండురాజసమున మానిసిమెకము
గండుమీరి దానవునికండలు చెక్కుచు నూర్పు
నిండించీ నాకసము మానిసిమెకము ॥ నిక్కి ॥

కరములువేయింటాఁ గైకొని యాయుధములు
నిరతి జళిపించీ మానిసిమెకము
సురలను నసురలఁ జూచిచూచి మెచ్చిమెచ్చి
నెరపీని నవ్వులు మానిసిమెకము ॥ నిక్కి ॥

యెక్కించి తొడమీఁద నిందిరతో మేలమాడీ
నిక్కపుఁగాఁగిటను మానిసిమెకము
అక్కడ శ్రీవేంకటాద్రి నహోబలమునందు
నెక్కొని మమ్మేలెను మానిసిమెకము ॥ నిక్కి ॥ 436

౧. మానిసిమెకము=నరసింహుఁడు.

శుద్ధవసంతం

అంతరంగమెల్లా శ్రీహరి కొప్పించకుండితే
వింతవింతవిధముల వీడునా బంధములు ॥ పల్లవి ॥

మనుజుఁడై ఫలమేది మఱి జ్ఞానియౌదాఁకా
తనువెత్తి ఫలమేది దయగలుగుదాఁకా
ధనికుఁడై ఫలమేది ధర్మముసేయుదాఁకా
పనిమాలి ముదిసితే పాసెనా భవము ॥ అంత ॥

చదివియు ఫలమేది శాంతముగలుగుదాఁకా
పెదవెత్తి ఫలమేది ప్రిథ్థుమాడుదాఁకను
మదిగల్గి ఫలమేది మాధవుఁదలఁచుదాఁకా
యెదుట తా రాజైతే నేలెనా పరము ॥ అంత ॥

పావనుఁడై ఫలమేది భక్తిగలిగినదాఁకా
జీవించేటిఫలమేది చింతదీరుదాఁకను
వేవేల ఫలమేది శ్రీవేంకటేశుఁ గన్నదాఁకా
భావించి తా దేవుఁడైతేఁ బ్రత్యక్షమవునా ॥ అంతా ॥ 437

సామంతం

ఆపద్బంధుఁడు హరి మాకుఁ గలఁడు
దాపిలి తలఁచినా దోషహరము ॥ పల్లవి ॥

గరుడనినెక్కినఘనరేవంతుఁడు
౧గరుడకేతనముగలరథుఁడు
గరుడఁడే తనకును గరియగుబాణము
గరిమె నీతఁడేపో ఘనగారుడము ॥ ఆప ॥

---

౧. 'గరుడకేతనము గల' వరకు అభావబహువ్రీహి. దానిపై 'రథ' శబ్దముతో బహువ్రీహి. ఇది వింత. ౨. 'గరుడుని కేతనముగాగలరథము గలవాడు. అని భావమా? లేక గరుడుని కేతనముగ రథముగ గలవాడనియా?

పాముపరపుపైఁ బండినసిద్ధుఁడు
పాముపాశములపరిహారము
పామున నమృతముఁ బడఁదచ్చినతఁడు
వేమరు నీతఁడే విషహరము ॥ ఆప ॥

కమలాక్షుఁ డీతఁడు కమలనాభుఁడును
కమలాదేవికిఁ గైవశము
అమరిన శ్రీవేంకటాధిపుఁ డితఁడే
మమతల మా కిదే మంత్రౌషధము ॥ ఆప ॥ 438

లలిత

ఇరవగువారికి యిహపర మిదియే
హరిసేవే సర్వాత్మలకు ॥ పల్లవి ॥

దురితమోచనము దుఃఖపరిహారము
హరినామమెపో ఆత్మలకు
పరమపదంబును భవనిరుహరణము
పరమాత్మచింతే ప్రపన్నులకు ॥ ఇర ॥

సారము ధనములు సంతోషకరములు
శౌరికథలు సంసారులకు
కోరినకోర్కియు కొంగుబంగరువు
సారె విష్ణుదాస్యము లోకులకు ॥ ఇర ॥

యిచ్చయగుసుఖము యిరవగుపట్టము
అచ్చుతుకృప మోక్షార్థులకు
అచ్చపుశ్రీవేంకటాధిపుశరణము
రచ్చల మాపాలిరాజ్యపుసుగతి ॥ ఇర ॥ 439

బౌళి

పెరుగఁబెరుగఁ బెద్దలుగాఁగా పెనువెఱ్ఱి వట్టు బుద్ధెఱఁగితే,
మరులు మఱచితేనే యిన్నిటిగెలిచేమర్మముసుండీ జ్ఞానులకు
॥ పల్లవి ॥

జననమందినయప్పుడు దేహి సన్యాసికంటే నిరాభారి
తనరఁ గౌపీనకటిసూత్రములం౧తగులములేనిదిగంబరి
తనుఁ దా నెఱఁగఁడు యెదిరి నెఱఁగఁడు తత్త్వధ్యానాలయ-
నిర్మలచిత్తుఁడు
పెనఁగేకోరిక యించుకంత లేదు పేరులేనివాఁడు వీఁడువో
యమ్మా ॥ పెరు ॥

నిద్దురవొయ్యేటి౨యప్పుడు దేహి నిత్యవిరక్తునివంటిఘనుఁడు
బుద్ధి సంసారముపై నించుకా లేదు భోగమేమీ నొల్లఁడు
వొద్దనే యేపనులకుఁ జేయఁబోఁడు వున్నలంపటాల కేమియుఁ
జొరఁడు
కొద్దిలేనియాస యెందువోయనొకో కోప మేమి లేదు వీఁడివో
యమ్మా ॥ పెరు ॥

హరి శరణన్నయప్పుడు దేహి అమరులకంటే కడునధికుఁడు
పరమునిహము నఱచేతిదే ప్రయాస మించుక లేదు
దురితము లేదు దుఃఖములు లేవు తోడనే వైకుంఠ మెదురుగా
వచ్చు
గరిమ శ్రీవేంకటేశుఁడు వీఁడివో కానరైరిగా యిన్నాళ్లమ్మా
॥ పెరు ॥ 440

౧. 'తగులమి' రేకు. ౨. 'యెప్పుడు' రేకు.

90 రేకు ౧సాళంగం

ఉన్నవిచారములేల వోహో సంసారులాల
యిన్నిటి కితఁడే రక్ష యిదే మీకు మనరో ॥ పల్లవి ॥

తక్కక బ్రహ్మలఁగన్నతండ్రిఁ గొలిచి మీరు
యెక్కువ సంతతిగల్గి యీడేరరో
అక్కున లక్ష్మీనారాయణులఁ దలఁచి మీరు
చొక్కి మీమీదంపతులు సుఖమున నుండరో ॥ ఉన్న ॥

భవరోగవైద్యునిపాదములు సేవించి
భువి రోగములఁ బాసి పొదలరో
తవిలి పదిదిక్కులు తానైనవానిఁ
గవిసి పొగడి దిక్కుగలిగి బ్రదుకరో ॥ ఉన్న ॥

తల్లిదండ్రీ నితఁడే తగఁ జుట్టమితఁడే
యెల్లగాఁ బుట్టించి పెంచేయేలి కితఁడే
చల్లఁగా శ్రీవేంకటేశు శరణంటి మిదె మేము
కొల్లగా మీరెల్లా మమ్ము గుఱిగా వర్ధిల్లరో ॥ ఉన్న ॥ 441

మలహరి

కలిగినది యొక్కటే కమలాపతిసేవ
తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికేను ॥ పల్లవి ॥

హరియే పరతత్వ మతఁడొక్కఁడే గతి
ధరలోన దేవతలెందరైనాఁ గలుగనీ
మురహరనామము మించి యొక్కటే యెక్కుడు
యిరవైనమంత్రము లెన్నియైనా నుండనీ ॥ కలి ॥

౧. 'సాళంగనాట' వ్రా. ము. పా.

గోవిందుదాసులే పెక్కువఘను లిందరిలో
వేవేలుపెద్ద లటు వేలసంఖ్య లుండనీ
వైవసపువిష్ణుకైంకర్యమే సాధనము
యీవలనావల పుణ్యమెంతైనాఁ గలుగనీ ॥ కలి ॥

పట్టినశ్రీవేంకటేశుభక్తి యొక్కటే ఘనము
యిట్టే శాస్త్రజ్ఞాన మెట్లున్నాను
వొట్టినయాతనిముద్ర[1] లొక్కటికి మూలము
యెట్టిలాంఛనము లిల నెన్నియైనా నుండనీ ॥ కలి ॥ 442

సామంతం

కంటి నిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి
నంటున నిందుకంటెను నాణె మెందూ లేదు ॥ పల్లవి ॥

మేఁటివైరాగ్యముకంటే మిక్కిలి లాభము లేదు
గాఁటపువిజ్ఞానముకంటే సుఖము లేదు
మీఁదైనగురువుకంటే మీఁద రక్షకుఁడు లేఁడు
బాటసంసారముకంటే పగ లేదు ॥ కంటి ॥

పరపీడసేయుకంటే పాపము మరెందు లేదు
పరోపకారముకంటే బహుపుణ్యము లేదు
విరతశాంతముకంటే నిజధర్మ మెందు లేదు
హరిదాసుఁడౌకంటే నట గతి లేదు ॥ కంటి ॥

కర్మసంగము మానుకంటేఁ దేజము లేదు
అర్మిలిఁ గోరికమానేయంతకంటే బుద్ధి లేదు
ధర్మపుశ్రీవేంకటేశుఁ దగిలి శరణుచొచ్చి
నిర్మలాన[2] నుండుకంటే నిశ్చయము లేదు ॥ కంటి ॥ 443

---

౧. 'లొక్కటే' కావచ్చు. ౨. 'నుఁడు' రేకు.

గుజ్జరి

ఆతనినే నే కొలిచి నే నందితిఁ బో నిజసుఖము
శ్రీతరుణీపతి మాయాధవుఁడు౧సృష్టియింతయును వారి
మూలము ॥పల్లవి॥

కోరుదుమా దుఃఖములు కోరక కేతెంచు తముఁదామే
ఆరీతులనే సుఖములు యేతెంచు నందును విచార మంతేల
సారెకు దైవాధీనము లివి రెండు స్వయత్నములుగా వెవ్వరికి
కోరేటి దొకటే హరిశరణాగతి గోవిందుఁడే యింతకు మూలము ॥ఆత॥

కమ్మంటిమా ప్రపంచము గలిగీ స్వభావము౨ అందుకది
యిమ్ముల మోక్షము యీరీతులనే యీశ్వరుఁడిచ్చిన యిది గలుగు
కమ్మి యంతర్యామికల్పితంబు లివి కాదననవుననరా దెవ్వరికి
సమ్మతించి ఆసపడియెడి దొకటే సర్వలోకపతి౩నిజదాస్యము ॥ ఆత ॥

సరి నెఱఁగుదుమా పోయినజన్మము సారెకు నేమేమి చేసితిమో
యిరవుగ నట్లా నీదఁటిజన్మముయెఱుకలు మఱపులు యిఁకనేలా
పిరతమై శ్రీవేంకటేశుఁడు తనయిచ్చ నిర్మించిన దిది యీదేహము
గరిమెల నాతనికైంకర్యమెపో కలకాలము మాకు కాణాచి ॥ఆత॥ 444

గుజ్జరి

దైవమ నీవే గతి మాతప్పులు పనిలేదు
శ్రీవల్లభుఁడవు నీవే చేకొని కావఁగదే ॥ పల్లవి ॥

౪జనని నీమాయా, జనకుఁడవు నీవు,
జనులము నేమిందర మొకసంతతిబిడ్డలము
వొనరెడిదినభోగములు వూరేటిచనుఁబాలు
మునుకొను మానడవళ్లివి ముద్దులు మీ కివివో ॥ దైవ ॥

౧. 'సిష్టి' రేకు. ౨. 'దానికది' అని అర్థము కావచ్చు. ౩. నిజ=తనయొక్క (అతనియొక్క) ౪. 'జనని నీమాయాజనకుఁడవు' పూ. ము పా.

౩. జలపక్షిమృగాదులు తగ తోఁబుట్టుగులు
పురుటగుమా దేహంబులు పుయ్యలతొట్టెలలు
మరిగినసంసారము బొమ్మరిండ్లయాట లివి
నిరతి మాయజ్ఞానంబు నీకే నవ్వులయ్యా ॥ దైవ ॥

౪. ావులుఁబుట్టుగు లాడెడిసరి దాఁగిలిముచ్చులు
భావపుటారంభంబులు బాలలీలగతులు
కైవశమందఁగ శ్రీవేంకటపతి నీదాస్యం బిది
మావంటివారికెల్లను నీమన్ననలాలనలు ॥ దైవ ॥ 445

## పాడి

ంఱియు మఱియు నివె మావనులు
మెఱసితి మిందే మిక్కిలిని ॥ పల్లవి ॥

రాయణునకు నమస్కారము
ధారుణీపతికిని దండము
శ్రీరమణునకునుఁ జేరి శరణ్యము
వారిధిశాయికి వరుస జోహారు ॥ మఱి ॥

ామకృష్ణులకు రచనలబంటను
దామోదరునకు దాసుఁడను
వామనమూర్తికి వాకిటిగొల్లను
సోమార్కనేత్రునిసొరిదిలెంకను ॥ మఱి ॥

ోవిందునికే కొలువులు సేతుము
దేవోత్తముబడిఁ దిరుగుదుము
భావజగురునకు పంపునడతుము
శ్రీవేంకటపతి సేవింతుము ॥ మఱి ॥ 446

91 రేకు శ్రీరాగం

తప్పఁదోయవే దైవశిఖామణి
యిప్పుడు నీకృప నెనసితి నేను ॥ పల్లవి ॥

అనలముఁ బొడగని యటునిటు మిడుతలు
కినిసి యందు మగ్గినయట్లు
అనువగువిజ్ఞాన మాత్మ వెలుఁగఁగ
మొనసి యింద్రియములు మూఁగీ నాకు ॥ తప్పఁ ॥

అఱిముఱిఁ గమలము లటు వికసించిన
మెఱసి తుమ్మిదలు మించుగతి
తఱి నాహృదయము తగవికసించిన
౧తఱమీ నజ్ఞానతమ మది నాకు ॥ తప్పఁ ॥

ఈరీతి శ్రీవేంకటేశ్వర యిన్నియు
నూరకే యుండఁగా నొదిఁగియుండె
నేరిచి నీభక్తి నిలుపఁగ మదిలో
చేర గతిలేక చిమిడీ నదివో ॥ తప్పఁ ॥ 447

రామక్రియ

మరలి మరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము ॥ పల్లవి ॥

కమలారమణికిఁ గమలాక్షునకును
మమతల జయజయమంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము ॥ మర ॥

---

౧. 'తఱుము' ధాతువు కావచ్చు.

జలధికన్యకును జలధిశాయికిని
మలయుచును శుభంమంగళము
కలిమికాంత కాకలికివిభునికివి
సుశువులయారతి శుభమంగళము ॥ మర ॥

చిత్తజుతల్లికి శ్రీవేంకటపతికి ౹కి
మత్తిల్లినజయం మంగళము
యిత్తలనత్తల యిరువురకాఁగిటి-
జొత్తులరతులకు శుభమంగళము ॥ మర ॥ 448

మాళవిగౌళ

చదువులోనే హరని జట్టిగొనవలెఁగాక
మదముగప్పినమీఁద మగుడ నది గలదా ॥ పల్లవి ॥

జడమతికి సహజమే సంసారయాతన యిది
కడు నిందులోఁ బరము గడియించవలెఁగాక
తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకితేఁ గలదా ॥ చదు ॥

భవబంధునకు విధిపాపపుణ్యపులంకె
తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెఁగాక
అవల వెన్నెలలోనె అల్లునేరే ళ్లింతే
నివిరి విన్నటివునికి నేఁటికిఁ గలదా ॥ చదు ॥

దేహధారికిఁ గలదే తెగనియింద్రియబాధ
సాహసంబున భక్తి సాధించవలెఁగాక
యీహలను శ్రీవేంకటేశుదాసులవలన
వూహించి గతిగానక వాదిఁగితేఁ గలదా ॥ చదు ॥ 449

లలిత

కలది గలట్టే కర్మఫలంబులు
నిలిపితిమా నేము నిమ్మకుఁ బులుసు ॥ పల్లవి ॥

యెంత సేసినా యిహమున జీవికి
చెంత నజుఁడువ్రాసినకొలఁదే
వంతల ముంటికి వాఁడి వెట్టితిమా
కొంతతీపు చెఱకుకుఁ జల్లితిమా ॥ కల ॥

ఘనముగ బుద్ధులుగఱపినదేహికి
మును నోఁచిననోముఫలంబే
నినుపుఁ[౧]దెంకాయకు నీరు నించితిమా
వొనర వేమునఁ జేఁదు నిచితిమా ॥ కల ॥

యిరవుగ శ్రీవేంకటేశుఁడే ప్రాణికి
కెరలి భాగ్య మొసఁగినయంతే
మరువమునకుఁ బరిమళము సేసితిమా
పెరిగేటియడవులు పెంచితిమా ॥ కల ॥ 450

లలిత

వెలుపలెల్ల తనలోనుగాక తను విడువదు వెడమాయా
నలువున యోగీంద్రులెల్ల మునునడచినమార్గంబు ॥ పల్లవి ॥

జీవము నిర్జీవముగాక సిద్ధించదు పరము
వావులెల్ల నొకవావిగాక మఱి వదలదు ప్రపంచము
భావంబెల్ల నభావముగాక పాయదు కర్మంబు
దైవజ్ఞులు మును నడచి రిదియపో తప్పనిమార్గంబు ॥ వెలు ॥

---

౧. 'టెంకాయ' వ్రా.ము.పా 'తెన్ + కాయ' అను సహజవ్యుత్పత్తికి రేకు అనుకూలము.

మాటలెల్లఁ గడమాటలుగాక మాయదు మలినంబు
కూటంబులు కాలకూటంబుగాక కొనకెక్కదు భవము
చాటుఁదృష్ణ లగచాటునఁబడక చాలదు సౌఖ్యంబు
తేటగా మును పెద్ద లివియెపో తేర్చినమార్గంబు ॥ వెలు ॥

గుణములెల్ల నిర్గుణముగాక తలకూడదు శాంతంబు
అనువున కనుపై అంతయుఁ దాఁగాక ఆనందము లేదు
ప్రణుతింపఁగ శ్రీ వేంకటరమణుని బహుళమహిమెల్లా
గణనకెక్కఁగా పురాతనులు మును కడకట్టినమతము ॥ వెలు ॥ 451

గౌళ

రెండుమూలికలు రెయిఁబగలు నున్నవి
అండదేహమం దొకటి అతుమలో నొకటి ॥ పల్లవి ॥

యిదివో ౧రసబద్ధము, యింద్రియములు మేనిలో
పదిలముగా నిలిపి బంధించుట
అదివో వేధాముఖ, మంతరంగపుమనసు
చెదరకుండాఁ జొనిపి శ్రీహరిఁదలఁచుట ॥ రెండు ॥

తారవిద్య గంటిమి; తగిలి నాసాగ్రమందు
మేరతో ద్రిష్టినిలిపి మేలుఁబొందుట
చేరువ సువర్ణవిద్య, చిత్తములోఁ బ్రణవము
ధీరత నాదముసేసి దేవునిఁ బొగడుట ॥ రెండు ॥

పుటజయమాయ; నిట్టె పుణ్యపాపము లందులో
కుటిలపుఁగోరికల కొన దుంచుట
యిటులనే శ్రీ వేంకటేశుఁ డిందిరయును
అటు ౨ప్రకృతిపురుషులనుటొరవచ్చుట ॥ రెండు ॥ 452

---

౧. 'రసబంధము' కావచ్చు. ౨. ప్రకృతిపురుషులు + అనుట + ఒరవచ్చుట

92 రేకు నాట

నవనారసింహా నమో నమో
భవనాశితీర యహోబలనారసింహా ॥ పల్లవి ॥

సతతప్రతాపరౌద్రజ్వాలానారసింహా
వితతవీరసింహవిదారణా
అతిశయకరుణ యోగానందనరసింహా
మతి శాంతపుకానుగుమానినారసింహా ॥ నవ ॥

మరలి బీభత్సపుమట్టెమళ్లనరసింహా
నరహరి భార్గోటినారసింహా
పరిపూర్ణశృంగారప్రహ్లాదనరసింహా
సిరుల నద్భుతపులక్ష్మీనారసింహా ॥ నవ ॥

వదనభయానకపువరాహనరసింహా
చెదరనిపై భవాలశ్రీనరసింహా
అదన శ్రీవేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలురూపములబహునారసింహా ॥ నవ ॥ 453

శంకరాభరణం

అంగనలాల మనచే నాడించుకొనెఁగాని
సంగతెఱిఁగిననెరజాణఁ డితఁడే ॥ పల్లవి ॥

వొడలులేనివాని [1] కొక్కఁడే తండ్రాయఁగాని
తడయక పురుషోత్తముఁ డితఁడే
బడబాగ్ని జలధికిఁ బాయకల్లుఁడాయఁగాని
వెడలించె నమృతము విష్ణుఁ డితఁడే ॥ అంగ ॥

---

౧. 'కొక్కఁడే' రేకు

పులిగూడుదిన్నవానిపొం దొక్కఁటే సేసెఁగాని
నలువంక లక్ష్మీనాథుఁ డితఁడే
చలికిఁ గోవరివానిసరుస బావాయఁగాని
పలుదేవతలకెల్లఁ బ్రాణబంధుఁ డితఁడే ॥ అంగ ॥

యెక్కడో గొల్లసతుల కింటిమగఁడాయఁగాని
తక్కక వెదకేపరతత్వ మితఁడే
మిక్కిలి శ్రీవేంకటాద్రిమీఁద మమ్ము నేలెఁగాని
తక్కక వేదముచెప్పేదైవమితఁడే ॥ అంగ ॥ 454

లలిత

నీ వేలికవు మాకు; నీదాసులము నేము
ఆవల నితరుల నే మడుగఁబొయ్యేమా ॥ పల్లవి ॥

పసురమై వుండి యిచ్చీఁ బక్కనఁ గామధేనువు
యెసఁగి మానై వుండి యిచ్చీఁ గల్పవృక్షము
వెస రాయైవుండి యిచ్చీ వేడుకఁ జింతామణి
మసలని శ్రీపతివి మాకు నిచ్చే దరుదా ॥ నీవే ॥

గాలి యావటించి యిచ్చీఁ గారుమేఘము మింట
పీలి జీర్ణమై యిచ్చీ విక్రమార్కువిబొంత
కాలినపెంచై వుండి కప్పెర దివ్యాన్నమిచ్చీ
మైలలేని శ్రీపతివి మాకు నిచ్చు టరుదా ॥ నీవే ॥

అండనే కామధేనువ వాశ్రితచింతామణివి
పండినకల్పకమవు భక్తులకెల్లా
నిండిన శ్రీవేంకటేశ నీవు మమ్ము నేలితివి
దండిగా నమ్మితే నీవు దయఁజూచు టరుదా ॥ నీవే ॥ 455

ముఖారి

అక్కఱకొదగనియట్టియర్థము
  లెక్క లెన్నియైనా నేమి లేకున్న నేమిరే ॥ పల్లవి ॥

దండితోఁ దనకుఁగానిధరణీశురాజ్యంబు
  యెండెనేమి యది పండెనేమిరే
  బెండుపడఁ గేశవునిఁ బేరుకొననినాలికె
  వుండెనేమి వుండకుండెనేమిరే. ॥ అక్క ॥

యెదిరిఁ దన్నుఁ గానవియెడపులగుడ్డికన్ను
  మొదలఁ దెఱచెనేమి మూసెనేమిరే
  వెదకి శ్రీపతిసేవ వేడుకఁ జేయనివాఁడు
  చదివెనేమి చదువు చాలించెనేమిరే ॥ అక్క ॥

ఆవల నెవ్వరులేనిఅడవిలోనివెన్నెల
  కావిరిఁ గాసెనేమి కాయకున్ననేమిరే
  శ్రీవేంకటేశ్వరుఁ జేరనిధర్మములెల్ల
  తోవల నుండెనేమి తొలఁగిననేమిరే ॥ అక్క ॥ 456

లలిత

పట్టినదెల్లా బ్రహ్మము
  దట్టపుజడునికి దైవంబేలా ॥ పల్లవి ॥

ఘనయాచకునకు కనకమే బ్రహ్మము
  తనువే బ్రహ్మము తరువలికి
  యెనయఁ గాముకున కింతులే బ్రహ్మము
  తనలో వెలిఁగేటితత్త్వం బేలా ॥ పట్టి ॥

అఁకటివానికి నన్నమే బ్రహ్మము
లోకమే బ్రహ్మము లోలునికి
కై కొని కర్మికి కాలమే బ్రహ్మము
శ్రీకాంతునిపైఁ జింతది యేలా ॥ పట్టి ॥

భువి సంసారికి పుత్రులె బ్రహ్మము
నవ మిందరి కిది నడచేది
యివలను శ్రీ వేంకటేశుదాసులకు
భవ మతనికృపే బ్రహ్మము ॥ పట్టి ॥ 457

గుండక్రియ

రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోటఁ దా నుండ దదివో ॥ పల్లవి ॥

వొకరి రాజుఁజేసు నొకరి బంటుగఁ జేసు
వొకరి కన్నెకల వేరొకరికి నమ్మించు
వొకచోటనున్నధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము ॥ రూక ॥

కొందరిజాశలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యులఁజేసుఁ గొందరి పాపులఁజేసు
కొందరికొందరిలోన కొట్లాట పెట్టించు
పందెమాడినటువలెఁ బచరించు పసిఁడీ ॥ రూక ॥

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశుతరుణియై తా నుండు
తెగనిమాయై యుండు దిక్కు దెసయై యుండు
నగుతా మాపాల నుండి నటియించు బసిఁడీ ॥ రూక ॥ 458

93 రేకు గుండక్రియ

నే నేమిసేయుదును నీవు నాలోపలనుండి
శ్రీనాథుఁడవు నీచేఁత లింతేకాక ॥ పల్లవి ॥

తను వేమిసేయును తనువులోపలనున్న -
చెనఁటియింద్రియములచేఁతలుగాక
మన నేమిసేయును మనసులోపలనున్న -
నినుపుఁగోర్కులు చేసేనేరములుగాక ॥ నేనే ॥

జీవుఁ డేమిసేయును జీవునిఁ బొదుగుకున్న -
భావప్రకృతి చేసేపాపముగాక
చేవదేరఁ బుట్టు వేమిసేయు ముంచుకొన్నట్టి-
దైవపుమాయలోనిధర్మ మింతేకాక ॥ నేనే ॥

కాలమేమిసేయును గక్కన శ్రీ వేంకటేశుఁ —
డేలి మన్నించేమన్నన యిదియేకాక
యేల యేల దూర నింక నెవ్వరు నేమిసేతురు
మేలిమి నినుఁ దలఁచి మెచ్చుటేకాక ॥ నేనే ॥ 459

బౌళి

[1]పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువ కిందరిఁ గాచు వెడబోయనాయఁడు ॥ పల్లవి ॥

పొలసి మీసాల పెద్దబోయనాయఁడు
మలిగి పీఁపునఁ గట్టేమంకుబోయనాయఁడు
పొలమురాజై [2]తిరిగేబోయనాయఁడు
వెలయ [3]మోటునునుండేవేఁటబోయనాయఁడు ॥ పొడ ॥

---

౧. ఇందు దశావతార సమన్వయము కలదు. ౨. 'తిరిగీ' పూ. ము. పా.
౩. మోటు = స్తంభమా?

పొట్టిపొట్టియడుగులబోయనాయఁడు యెందుఁ
బుట్టుపగసాధించేబోయనాయఁడు
బొట్టులమెకమునేసేబోయనాయఁడు
పట్టపునెమలిచుంగుబలుబోయనాయఁడు

పొంచి శిగ్గెగ్గెఱఁగనిబోయనాయఁడు
మించి రాలమీఁదదాఁటేమెండుబోయనాయఁడు
అంచెల శ్రీవేంకటేశుఁడనేబోయనాయఁడు
పంచఁ గాలవేలములబలుబోయనాయఁడు ॥ పొడ ॥ 460

ముఖారి

౧వెడమంత్ర మిఁకనేల వేరువెల్లంకులు నేల
పుశమిధరుఁడు మాకు భువనౌషధము ॥ పల్లవి ॥

హరి యచ్యుతాయంటే నణఁగుఁ బాపములు
నరసింహా యనియంటే నాఁటినదుఃఖములు మాను
పురుషోత్తమాయంటేఁ బుండ్లు బూచులు మాను
పరమౌషధ మితఁడే పాటింప మాకు ॥ వెడ ॥

వాసుదేవ యనియంటే వదలు బంధములెల్లా
వాసికిఁ గృష్ణాయంటే వంతలరోగాలు మాను
శ్రీసతీశ యనియంటే చింతలిన్నియును మాను
గాసిదీర నితఁడేపో ఘనదివ్యౌషధము ॥ వెడ ॥

గోవిందా యనియంటేఁ గూడును సంపదలు
యీవల మాధవయంటే నిహముఁ బరముఁ జేరు
దేవ నారాయణయంటే దేహము సుఖియై యుండు
శ్రీవేంకటేశుఁడే మాకు సిద్ధౌషధము ॥ వెడ ॥ 461

౧. 'వేదమంత్ర' పూ.ము.పా. ప్రాసభంగము. గురుపూర్వ లఘుపూర్వ పాదకల్పన.

రామక్రియ

మహి నింతటివారువో మనవారు
బహుమహిమలవారు ప్రపన్నులు ॥ పల్లవి॥

జయమంది జననపుజరామరణముల-
భయములేనివారు ప్రపన్నులు
క్రియలెల్ల నుడిగి మూఁగినకర్మపుటడవి
బయలుచేసినవారు ప్రపన్నులు ॥ మహి ॥

ధీరులై మాయాంధకారంబు నెదిరించి
పారఁదోలినవారు ప్రపన్నులు
సారమయ్యినసంసారసాగరము
పారముగన్నవారు ప్రపన్నులు ॥ మహి ॥

అండ నిన్నిటాఁ దనిసి యాసలెల్లాఁ దెగఁగోసి
పండినమనసువారు ప్రపన్నులు
దండిగా శ్రీవేంకటేశుదాసులై పరముతోవ
బండిబాట చేసినారు ప్రపన్నులు ॥ మహి ॥ 462

దేవగాంధారి

సర్వజ్ఞత్వము వెదకఁగనొల్లను సందేహింపఁగనొల్లను
సర్వజ్ఞుండును నాచార్యుండే సర్వశేషమే నాజీవనము ॥ పల్లవి ॥

యెఱఁగఁగనొల్లము విజ్ఞానపుగతి యెఱుకలు నే మిటుంసోధించి
యెఱిఁగి యితరులను బోధించెదమనుయీపెద్దరికము నొల్లము
యెఱిఁగేటివాఁడును యాచార్యుండే, యెఱుకయు సర్వేశ్వరుఁడే
యెఱుకయు మఱపును మానివుండుటే యిదియేపో మావిజ్ఞానము
॥ సర్వ ॥

---

౧. 'సోధించి' రేకు,పూ.ము,పా.

చదువఁగనొల్లము సకలశాస్త్రములు సారెకుసారెకు[1]సోదించి
చదివి పరులతో యుక్తివాదములు జగడము గెలువఁగనొల్లము
చదివేటివాఁడును నాచార్యుండే, చదువును నాయంతర్యామే
చదువుకుఁ జదువమికియుఁ దొలఁగుటే, నానాసాత్త్వికభావమే నా
తెలివి ॥ సర్వ ॥

అన్నిటికిని నే నధికారిననెడియహంకారము నొల్లను
కన్నులఁజూచుచు [2]నందరితో నేఁ గాదని తొలఁగానొల్లను
మన్నన శ్రీవేంకటేశ్వరుకరుణను మాయాచార్యుఁడే అధికారి
వున్నరీతినే అస్తినాస్తులకు నూరకుండుటే నాతలఁపు ॥సర్వ॥ 463

బౌళి

ఇందిరానాథుఁ డిన్నిటి కీతఁ డింతే
బందెలకర్మములాల పట్టుకురో మమ్మును ॥ పల్లవి ॥

యెఱిఁగి సేసినవెల్లా నీతనిమహిమలే
యెఱఁగక చేసినది యీతనిమాయే
తెఱఁగొప్ప రెంటికిని తెడ్డువంటివాఁ డ నింతే
పఱచుఁగర్మములాల పట్టకురో మమ్మును ॥ ఇంది ॥

కాయములోపలివాఁడు ఘనుఁ డొక్కఁ డితఁడే
కాయ మీతనిప్రకృతికల్పిత మింతే
తోయరాక రెంటికిని తోడుపీడై తి వింతే
బాయటికర్మములాల పట్టకురో మమ్మును ॥ ఇంది ॥

యేలినవాఁడు శ్రీవేంకటేశుఁ డితఁ డొక్కఁడింతే
యేలికసానై పెంచేది యీతనిసతే
పోలి నే వీరిఁగొలిచేసూత్రపుబొమ్మ నింతే
పాలుపుఁగర్మములాల పట్టకురో మమ్మును ॥ ఇంది ॥ 464

---

౧. 'బోధించి' పూ ము.పా. రేకు. ౨. 'నందరితో నేఁ గాదని' పూ ము.పా

94 రేకు కన్నడగౌళ

బోధకు లెవ్వరు లేక భోగినైతిని
శ్రీధరుఁడే మాకు దిక్కు చింతింప నిఁకను ॥ పల్లవి ॥

పట్టి దిగంబరినై పాలే యాహారముచేసి
తొట్టినపంచేంద్రియములతోవ విడిచి
పుట్టితి సన్యాసినై బుద్దెఱిఁగీనెఱఁగక
అట్టె నడుమ సంసారినైతి నేనూ ॥ బోధ ॥

గచ్చుల నన్నీ మఱచి గాలే ఆవటించుకొని
అచ్చపుఁబరమయేకాంతసమాధి
నిచ్చలు నిద్రాభ్యాసనిర్మలయోగినైతి
కచ్చుపెట్టి మేలుకొని ఘనకర్మినైతి ॥ బోధ ॥

భావము పారవిడిచి బ్రహ్మాండమెల్ల నిండి
వేవేలుఁగోరికల వేడుకతోడ
జీవన్ముక్తుఁడనైతి శ్రీవేంకటేశ్వరుఁ జేరి
ధావతు లిన్నియు మాని తన్మయుఁడనైతి ॥ బోధ ॥ 465

భైరవి

మొదలుండఁ గొనలకు మోచి నీళ్ళువోయనేల
యెదలో నీవుండఁగా నితరములేలా ॥ పల్లవి ॥

నిగమమార్గముననే నడచేనంటే
నిగమములెల్లను నీమహిమే
జగములోకులఁ జూచి జరగెదనంటే
జగములు నీమాయ[౧]జనకములు ॥ మొద ॥

౧. 'జనితములు' కావచ్చు.

మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే
మనసుకోరికలు నీమతకాలు
తనువు నింద్రియములు తగ గెలిచేనంటే
తనువు నింద్రియములు దైవమ నీమహిమ ॥ మొద ॥

యింతలోనిపనికిఁగా యిందు నందుఁ జొరనేల
చెంత నిండుచెరువుండ చెలమలేలా
పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి
సంతకూటాలధర్మపుసంగతి నాకేలా ॥ మొద ॥ 466

బౌళి

చీచీ వోబదుకా సిగ్గులేనిబదుకా
వాచవికి బతిమాలి వడఁబడ్డబదుకా ॥ పల్లవి ॥

ఆసలకుఁ జోటు గద్దు అంతరంగాన నెంతైన
వీసమంతాఁ జోటు లేదు విరతికిని
యీసున సంసారమున కెందరైనాఁ గలరు
వోసరించి మోక్షమియ్య నొకరు లేరు ॥ చీచీ ॥

భోగించ వేళ గద్దు పొద్దువొడవుఁగుంకును
వేగమే హరిఁదలచ వేళలేదు
వోగులలంపటమున కోపి కెంతైనాఁ గద్దు
యోగపుసత్కర్మాన కొకయింత లేదు ॥ చీచీ ॥

యెదుట ప్రపంచాన కెఱు కెంతైనాఁ గద్దు
యిదివో యాత్మజ్ఞాన మించుకా లేదు
మది శ్రీవేంకటేశుఁడు మమ్ము నిట్టె కాచెఁగాని
[illegible]రి నానేరములు పాప మఱి లేరు ॥ చీచీ ॥ 467

దేసాక్షి

సకలజీవులకెల్ల సంజీవి యీమందు
వెకలులై యిందరు సేవించరో యీమందు ॥ పల్లవి ॥

మూఁడులోకము లొక్కటఁ ముంచి పెరిగినది
పోఁడిమి నల్లనికాంతిఁ బొదలినది
పేఁడుక కొమ్మలు నాల్గు పెనచి చేయివారినది
నాఁడే శేషగిరిమీఁద నాఁటుకొన్నమందు ॥ సక ॥

పదిగెలువేయింటిపాము గాచుకున్నది
కడువేదశాస్త్రముల గబ్బువేసేది
యెదయక వొకకాంత యెక్కుక వుండినది
కడలేనియంజనాద్రిగారుడపుమందు ॥ సక ॥

బలుశంఖుఁజక్రములబదనికె లున్నది
తలఁచినవారికెల్లఁ దత్వమైనది
అలరినబ్రహ్మరుద్రాదులఁ బుట్టించినది
వెలుఁగుతోడుత శ్రీవేంకటాద్రిమందు ॥ సక ॥ 468

గుండక్రియ

ముందటిజన్మములెల్లా ముంచెఁ బారుబడివడ్డి
యెందు చొచ్చినానుఁ బోనియ్య దీరుణము ॥ పల్లవి ॥

నుదుట వ్రాసినవ్రాలు నూరేండ్లపత్రము
పొదలు నాకర్మమే పూఁటకాఁపు
వెదకి సంసారము వెంటఁ బైతరవు
యిది యెందుచొచ్చినాఁ బోనియ్య దీరుణము ॥ ముంద ॥

పుట్టినప్పుడే తనువు భోగ్యమై నిలిచెను
జట్టిఁ గామినులపొందు సరియాఁకలు
నెట్టనయాహారములు నిచ్చనిచ్చ లంచాలు
దిట్టనై యెందు చొచ్చినాఁ దీర దీరుణము ॥ ముంద ॥

యెక్కువై నశ్రీవేంకటేశుమఱఁగు చొచ్చి
తెక్కుతోడ సలిగెలఁ దిరుగఁగను
అక్కరతో నప్పులెల్లా నవి మాకుఁ ౧దామచ్చి
చిక్కి యెందు చొచ్చినాఁ జేరు నీరుణము ॥ ముంద ॥ 469

దేసాళం

అన్నిటికిఁ గారణము హరియే ప్రపన్నులకు,
పన్నినలోకులకెల్ల ప్రకృతి కారణము ॥ పల్లవి ॥

తలఁపు గారణము తత్వవేత్తలకును
చలము గారణము సంసారులకును
ఫలము గారణము పరమవేదాంతులకు
కలిమి గారణము కర్ములకును ॥ అన్ని ॥

తనయాత్మ గారణము తగినసుజ్ఞానులకు
తనువే కారణము తగ జంతువులకు
ఘనముక్తి గారణము కడగన్నవారికెల్లా
కనకమే కారణము కమ్మినబంధులకు ॥ అన్ని ॥

దేవుఁడు గారణము తెలిసినవారికెల్లా
జీవుఁడు గారణము చిల్లరమనుజులకు
దేవుఁడు వేరే కాఁడు దిక్కు శ్రీవేంకటేశుఁడే
పావన మాతనికృప పరమకారణము ॥ అన్ని ॥ 470

౧. 'తాము+అచ్చి'.

95 రేకు లలిత

ఎక్కఁగా రాఁగా రాఁగా యిందాఁకాఁ దగులు
యిక్కువ శ్రీహరిమాయ నింకనెంతో తగులు ॥ పల్లవి ॥

తెగనికర్మమునకు దేహము దగులు
తగినదేహమునకు తరుణితో తగులు
పొగిసి యారెంటికి సుతు లొక్కతగులు
అగడాయఁ గనకము అన్నిటితో తగులు ॥ ఎక్కఁ ॥

యింతటిసంసారికి యి ల్లొక్కతగులు
బంతికి ౧నందు గలిగె పాఁడిపంట తగులు
చెంత నీలంపటానకు క్షేత్రము తగులు
సంతగూడేదాసదాసీజనులెల్లా దగులు ॥ ఎక్కఁ ॥

మొదల జీవుఁ డొక్కఁడే మోపులాయఁ దగులు
వదలవిబంధములు వడ్డివారెఁ దగులు
వుదుటిహముఁ బరము నొక్కయందె తగులు
అదె శ్రీవేంకటపతి యంతరాత్మ తగులు ॥ ఎక్కఁ ॥ 471

గుండక్రియ

ఎవ్వరివాఁడో యెఱఁగరాదు
అవ్వలివ్వలిజీవుఁ డాటలో పతిమే ॥ పల్లవి ॥

ధర జనించకతొలుత తనుఁ గానరాదు
మరణమందినవెనక మఱి కానరాదు
పురువడిదేహముతో నుండినయన్నాళ్లే
మరలుజీవునిబదుకు మాయవో చూడ ॥ ఎవ్వ ॥

౧. 'నందుఁ గలిగె' కావచ్చు.

యిహములో భోగించు నిందుఁ గొన్నాళ్లు
మహిమ పరలోకమున మలయుఁ గొన్నాళ్లు
తహతహలఁ గర్మబంధములఁ దగిలినయపుడే
అహహా దేహికిఁ బడుచులాటవో బదుకు ॥ ఎవ్వ ॥

సంతానరూపమై సాగు ముందరికి
కొంత వెవకటిఫలము గుడువఁ దాఁ దిరుగు
యింతటికి శ్రీవేంకటేశుఁ డంతర్యామి
బంతి నితనిఁగన్నబదుకువో బదుకు ॥ ఎవ్వ ॥ 472

శంకరాభరణం

ఎంత భక్తవత్సలుఁడ విట్టుండవలదా
వింతలు నీసుద్దులెల్లా వినఁబోతే నిట్టివే ॥ పల్లవి ॥

యిల నసురారియనేయీబిరుదు చెల్లె నీకు
బలివిభీషణాదులపాలికే చెల్లదు
కెలసి అవులే నీవు గెలుతు వెందరినైనా
తలఁచి చూడ నీదాసుల కోడుదువు ॥ ఎంత ॥

యిందరిపాలిటికిని యీశ్వరుఁడ వేలికవు
పందవై యర్జునుబండిబంట వైతివి
వందనకు నౌలే దేవతలకే దొరవు
అందపునీదాసులకు నన్నిటా దాసుఁడవు ॥ ఎంత ॥

కడుపులో లోకముకన్నతండ్రి విన్నిటాను
కొడుకవు దేవకికిఁ గోరినంతనే
తడవితే వేదములు తగిలేబ్రహ్మమవు
విడువనిమాకైతే శ్రీవేంకటాద్రిపతివి ॥ ఎంత ॥ 473

సాళంగనాట

రాముఁ డిదే లోకాభిరాముఁ డితఁడు
గోమున పరశురాముకోప మార్చెనటరే ॥ పల్లవి ॥

యీతఁడా తాటకిఁ జంచె యీపిన్నవాఁడా
ఆతల సుబాహుఁ గొట్టి యజ్ఞముఁ గాచె
చేతనే యీకొమారుఁడా శివునివిల్లు విఱిచె
సీతకమ్మఁ బెండ్లాడె చెప్పఁ గొత్త గదవె ॥ రాముఁ ॥

మనకౌసల్యకొడుకా మాయామృగము నేసె
దనుజుల విరాధుని తానే చెఱిచె
తునుమాడె నేడుదాళ్ల తోడనే వాలి నడఁచె
యినకులుఁ డితఁడా యెంతకొత్త చూడరే ॥ రాముఁ ॥

యీవయసుతానే యీయెక్కువజలధి గట్టి
రావణు జంపి సీత మరలఁ దెచ్చెను
శ్రీవేంకటేశుఁ డితఁడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేఁడు కంటి మిట్టె కధరే ॥ రాముఁ ॥ 474

లలిత

ఏమి సేసినా నీరుణ మెట్టు వాసును
కామితఫలద వోకరుణానిధి ॥ పల్లవి ॥

చేరి కర్మములు నన్ను చెఱవట్టుకుండఁగాను
పేరువాడి వచ్చి విడిపించుకొంటివి
సారె తగవట్టె కాదా శక్తిగలవారెల్లా
నారయ దీనులఁ గంటే నడ్డమై కాతురు ॥ ఏమి ॥

అరులు పంచేంద్రియము లందు నిందు దియ్యఁగాను
వెరవుతోడ వెనక వేసుకొంటివి
పరగ నట్టేకాదా బలువులైనవారు
అరయఁ బేదలకైనఆపద మానుతురు ॥ఏమి॥

పలుజన్మములే నన్ను పరి అరికట్టుకోఁగా
తొలఁగఁదోసి నాకుఁ దోడైతివి
యెలమి శ్రీవేంకటేశ యిల శూరులైనవారు
బలుభయ మిందరికిఁ బాపుచుందురు ॥ఏమి॥ 475

ముఖారి

దైవముపుట్టించినట్టితనసహజమే కాక
కోవిదునికైనా జాలిగుణమేల విడుచు ॥పల్లవి॥

అరయఁ బంచదార నద్దుక తినఁబోతే
చేరరానిముష్టిగింజ చేఁదేల మాను
సారమైనచదువులు సారె సారెఁ జదివినా
గోరపుదుష్టునికి కోపమేల మాను ॥దైవ॥

నిప్పు దెచ్చి వొడిలోన నియమానఁ బెట్టుకొంటే
యెప్పుడును రాఁజుఁగాక యిది ౧యేల మాను
ముప్పిరిఁ బాతకుఁడైనమూఢుఁ డెన్నియాచారాలు
తప్ప కెంతసేసినాను దయ ౨యేల కలుగు ॥దైవ॥

యింటిలోనఁ గొఱ్ఱు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁదవ్వ కేలమాను
గొంటరై శ్రీవేంకటేశుఁ గొలువకుండినవాఁడు
తొంటిసంసా రవుఁగాక దొర యేఁటి కౌను ॥దైవ॥ 476

---

౧. ౨. 'యాల' రేకు.

96 రేకు నాట

ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని
విందువలె నొంటిమెట్టవీరరఘురాముని ॥ పల్లవి ॥

యెందు చొచ్చె బ్రహ్మవర మిల రావణుతలలు
కందువ రాఘవుఁడు ఖండించునాఁడు
ముందట జలధి యేమూల చొచ్చెఁ గొండలచే
గొందిఁబడఁ గట్టివేసి కోపగించేనాఁడు ॥ ఇందు ॥

యేదనుండె మహిమలు యిందరి కితఁడు వచ్చి
వేడుకతో హరివిల్లు విఱిచేనాఁడు
వోడక యింద్రాదు లెందు నొదిగి రీతనిబంటు
కూడఁబట్టి సంజీవికొండ దెచ్చేనాఁడు ॥ ఇందు ॥

జముఁ డెక్కడికిఁ బోయ సరయువులో మోక్ష-
మమర జీవుల కిచ్చె నల్లనాఁడు
తెమలి వానరులై యీదేవతలే బంట్లైరి
తిమిరి శ్రీవేంకటపతికి నేఁడు నాఁడు ॥ ఇందు ॥ 477

శంకరాభరణం

ఆలవటపత్రశాయివై నరూప మిట్టిదని
కొలువై పొడచూపేవా గోవిందరాజా ॥ పల్లవి ॥

పడఁతులిద్దరిమీఁదఁ బాదములు చాఁచుకొని
వొడికపురాజసాన నొత్తగిలి
కడలేనిజనాభికమలమున బ్రహ్మను
కొడుకుఁగాఁ గంటి విదె గోవిందరాజా ॥ అల ॥

సిరులసొమ్ములతోడ శేషునిపైఁ బవళించి
సొరిది దాసులఁ గృపఁ జూచుకొంటాను
పరగుదైత్యులమీఁద పాముదిషములే నీవు
కురియించితివిగా గోవిందరాజా ॥ అల ॥

శంకుఁజక్రములతోడఁ జాఁచినకరముతోడ
అంకెల శిరసుకిందిహస్తముతోడ
తెంకిని శ్రీవేంకటాద్రి దిగువతిరుపతిలో
కొంకక వరములిచ్చేగోవిందరాజా ॥ అల ॥ 478

ముఖారి

కంటే సులభ మిది; కానక యుంటే దుర్లభ:-
మింటిలోననే వున్న దిహముఁ బరమును ॥ పల్లవి ॥

హరిదాసులు మెట్టినక్కడే పరమపద-
మరయ నిందుకంటె నవల లేదు
తిరమై వీరిపాదతీర్థమే విరజానది
సొరిది నన్నిచోట్లు చూచినట్టే వున్నది ॥ కంటే ॥

మచ్చిక వైష్ణవులమాటలెల్లా వేదములు
యిచ్చల నిందుకంటే నింక లేదు
అచ్చట వీరిప్రసాద మమృతపానములు
అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది ॥ కంటే ॥

చెలఁగి ప్రపన్నుల సేవే విజ్ఞానము
ఫల మిందుకంటే మఱి పైపై లేదు
తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు-
లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి ॥ కంటే ॥ 479

బౌళి

అరుదరుదు నీమాయ హరిహరీ
అరసి తెలియరాదు హరిహరీ ॥ పల్లవి ॥

అనంతబ్రహ్మాండము లవె రోమకూపముల
అనంతములై వున్నవి హరిహరీ
పొనిఁగి కుంగినపొక్కు భూమి నీ వెత్తినది యే-
మని నుతింతు నిన్ను హరిహరీ ॥ అరు ॥

పొదిగి బ్రహ్మాదులు నీబొడ్డున నేకాలము
అదివో పుట్టుచున్నారు హరిహరీ
పొదలి యీజీవులను పుట్టించేయీసామర్థ్యము
అదన నేమనిచెప్పే హరిహరీ ॥ అరు ॥

పావనవైకుంఠము నీపాదమూలమం దున్నది
ఆవహించేశక్తిచేత హరిహరీ
శ్రీవేంకటాద్రిమీఁద చేరి నీ విట్టె వుండఁగా-
నావల వెదకనేల హరిహరీ ॥ అరు ॥ 480

శ్రీరాగం

జడమతిరహం కర్మజంతురేకోఽహం
జడధిసిలయాయ నమో[1] పారసాక్షయ ॥ పల్లవి ॥

పరమపురుషాయ నిజభక్తజనసులభాయ
దురితదూరాయ సింధురహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో ॥ జడ ॥

౧. ఇట్టి సంధులు ఈవాఙ్మయమునకు అలవాటైనవే.

నగసముద్ధరణాయ నందగోపసుతాయ
౧జగదంతరాత్మాయ సగుణాయ
మృగసరాంగాయ నిర్మితభవాండాయ ప-
న్నగరాజశయనాయ నమో నమో ॥ జద ॥

దేవదేవేశాయ దివ్యచరితాయ బహు-
భావనాతీతాయ పరమాయ
శ్రీవేంకటేశాయ జితదైత్యనికరాయ
భూవల్లభాయ నమో ౨పూర్ణకామాయ ॥ జద ॥ 481

### మలహరి

ఎన్నఁడు పక్వము గాదిదె యింద్రియభోగంబులచే
సన్నము దొడ్డునుఁ దోఁచీ సంసారఫలంబు ॥ పల్లవి ॥

తిత్తితో నూరేండ్లకును దేహము పండఁగఁబండఁగ
చిత్తం బెన్నఁడు పండక చిక్కెను కసుఁగాయై
పొత్తులపుణ్యముఁబాపము పులుసును తీపై రసమున
సత్తు నసత్తునుఁ దోఁచీ సంసారఫలంబు ॥ ఎన్నఁ ॥

వెదవడి పుత్రులుపౌత్రులే విత్తులు లోలో మొలచియు
పొదిఁ గర్మపుపూ మారదు ౩పూపిందెయిన దిదే
తుద నిదె సుఖమును దుఃఖము తోలును గింజయి ముదురుక
చదురము వలయము తోఁచీ సంసారఫలంబు ॥ ఎన్నఁ ॥

వినుకలిచదువుల సదలో వేమరు మాఁగఁగఁ బెట్టిన
ఘనకర్మపుటొగ రుడుగదు కమ్మర పులిగాయై
మనుమని శ్రీవేంకటేశుకు మహి నాచార్యుఁడు కానుక
చనవున నియ్యఁగ వెలసెను సంసారఫలంబు ॥ ఎన్నఁ ॥ 482

---

౧. 'జగదంతరాత్మనే' అని యుండవచ్చు. ౨. ఇట్టిసంధు లీవాఙ్మయమునకు అలవాటైనవే. ౩. 'పూపిందె+అయినది' 'పూపిందయిన' పూ. ము. పా.

97 రేకు లలిత

[1] అమ్మేడి దొకటి -అసిమలోదొకటి
బిమ్మిటి నిందేటిపెద్దలమయ్యా ॥ పల్లవి ॥

సంగము మానక శాంతియుఁ గలుగదు
సంగలంపటము సంసారము
యెంగిలిదేహం బింతకు మూలము
బెంగల మిందేఁటిపెద్దలమయ్యా ॥ అమ్మే ॥

కోరికె లుడుగక కోపం బుడుగదు
కోరకుండ దిక్కావమనసు
క్రూరత్వమునకు కుదువ యీ బ్రదుకు
పేరడి నేమిటిపెద్దలమయ్యా ॥ అమ్మే ॥

ఫలము లందితే బంధము వీడదు
ఫలముతో తగులు ప్రపంచము
యిలలో శ్రీవేంకటేశుదాసులము
పిలువఁగ నేమిటిపెద్దలమయ్యా ॥ అమ్మే ॥ 483

లలిత

అటువంటివాఁడువో హరిదాసుఁడు
అటమటాలువిడిచినాతఁడే సుఖి ॥ పల్లవి ॥

తిట్టేటిమాటలును దీవించేమాటలును
అట్టే [3] పరెవి తలఁచినాతఁడే సుఖి
పట్టిచంపేవేళను పట్టముగట్టేవేళ
అట్టు నిట్టు చలించనియాతఁడే సుఖి ॥ అటు ॥

---

౧. 'అమ్మేదొకటి' పూ.ము.పా. ౨. 'అసిమపంచి' అశ్వసంచి' కి వికృతియా?
౩. 'పరి + అవి'

చేరి పంచదారిడినఁ జేఁదు దెచ్చిపెట్టినాను
అరగించి తనివొందేయతఁడే సుఖి
తేరకాండ్లఁ జూచిన తెగరానిచుట్టముల
నారయ సరిగాఁజూచేయాతఁడే సుఖి ॥ అటు ॥

పొంది పుణ్యము వచ్చిన పొరిఁ బాపము వచ్చిన-
నందలిఫలమొల్లనియాతఁడే సుఖి
విందుగా శ్రీవేంకటాద్రివిభునిదాసులఁ జేరి
అందరానిపద మందిననాతఁడే సుఖి ॥ అటు ॥ 484

గుండక్రియ

ఎవ్వరు గర్తలు గారు యిందిరానాథుఁడే కర్త
నివ్వటిల్లాతనివారై నేమము దప్పకురో ॥ పల్లవి ॥

కర్మమే కర్తయైతే కడకు మోక్షము లేదు
అర్మిలి జీవుఁడు గర్తయైతేఁ బుట్టుగే లేదు
మర్మపుమాయ గర్త అయితే మరి విజ్ఞానమే లేదు
నిర్మితము హరి దింతే నిజమిదెఱఁగరో ॥ ఎవ్వ ॥

ప్రపంచమే కర్తయైతే పాపపుణ్యములు లేవు
వుపమ మనసు గర్తైఉంటే నచారమే లేదు
కపటపు దేహములే కర్తలయితే చావు లేదు
నెపము శ్రీహరి దింతే నేరిచి బ్రదుకరో ॥ ఎవ్వ ॥

పలుశ్రుతులు గర్తలై పరగితే మేర లేదు
అల బట్టబయలు గర్తైతే నాధారము లేదు
యెలమి నిందరికిఁ గర్త యిదివో శ్రీవేంకటాద్రి-
నిలయపుహరి యింతే నేఁడే కొలువరో ॥ ఎవ్వ ॥ 485

బౌళి

ఇరవైనఁజుట్టుండు ¹యెఱఁగనీ దీమాయ
తెరమఱఁగుమెకమువలె తిరుగు నీబ్రదుకు ॥ పల్లవి

అనిశమును దేహమున కన్నపానము లిడిన
యినుము గుడిచిననీరు యెందుకెక్కెనదో
గొనకొన్నమానినులకూటములసుఖము లివి
మనసుదాగినపాలు మట్టులేదెపుడు ॥ ఇర

వొడలఁబెట్టినసొమ్ము లొగిఁ దనకుఁ గానరా-
వడవిఁ గాసినవెన్నె లది కన్నులకును
పుడివోవిపరిమళము లొకనిమిషమాత్రమే
బెడిదంపుభ్రమలోడి పెనుగాలిమూఁట ॥ ఇర

చద్దిసంసారమున సరుస సుఖదుఃఖములు
యెద్దుయెనుపోతునై యేకంబు గావు
వొద్దికై శ్రీవేంకటోత్తముఁడు యింతలో
అద్దంపునీడవలె నాత్మఁ బొడచూపె ॥ ఇర ॥ 48

భైరవి

నీవేమి సేతువయ్య నీవు దయానిధి వందువు
భావించలేవివారిపాప మింతేకాని ॥ పల్లవి

పరమపద మొసఁగి పాపమడఁచేనని
చరమశ్లోకమునందు చాటితివి తొలుతనె
నిరతిని భూమిలోన నీవల్లఁ దప్పు లేదు
పరగ నమ్మనివారిపాప మింతేకాని ॥ నీవే

౧. 'యెఱఁగవి దీమాయ' పూ.ము.పా.

నీపాదములకు నాకు నెయ్యమైన ౧లంకెని
యేపున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత
దాపుగా నీవల్ల వింకఁ దప్పు లేదు యెంచిచూచి
పైపై నమ్మనివారిపాప మింతే కాని ॥ నీవే ॥

బంతిఁ బురాణములను భక్తసులభుఁడ నని
అంతరాత్మ పీమాట ఆడితివి తొలుతనే
ఇంతట శ్రీవేంకటేశ యేమి నేతువయ్య నీవు
పంతాన నమ్మనివారిపాప మింతేకాని ॥ నీవే ॥ 487

బౌళి

కాయమనేవూరికిఁ గంతలు తొమ్మిదియాయ
పాయక తిరిగాడేరు పాపపుతలారులు ॥ పల్లవి ॥

కాముఁడనియెడిరాజు గద్దెమీఁద నుండఁగాను
దీము గోపపుప్రధాని దిక్కులేలీని
కోమలపుజ్ఞానమెల్లాఁ గొల్లఁబోయ నాడనాడ
గామిడులై రింద్రియపుఁగాఁపులెల్లా నిదివో ॥ కాయ ॥

చిత్తమనేదళవాయి చింతలనేపౌఁజు వెట్టి
యిత్తలవిషయములు యెన్నికిచ్చిరి
తుత్తుములైరెకోరికెల దొంగెము రేఁగఁగఁజొచ్చె
జొత్తుల వెరగుపడిచూచీఁ బుట్టుగులు ॥ కాయ ॥

బలుసంసారమనేటిభండారము ఘనమాయ
కలదీగి జవ్వనపుకై జీతము
యిలలో శ్రీవేంకటేశుఁ డింతలో జీవుఁడనేటి-
బలువుని రాజుఁజేసి పాలించె నన్నును ॥ కాయ ॥ 488

---

౧. 'లంకె+అని'. 'లంకని' పూ.ము.పా.

98 రేకు సాళంగనాట

అట్టివేళఁ గలఁగనీ దదివో వివేకము
మట్టుపడితే శాంతము మఱి యేలా ॥ పల్లవి ॥

జడధులు వొంగినట్టు సందడించు నింద్రియములు
వొడలిలో జీవునికి నొక్కొక్కవేళ
బడబాగ్ని రేఁగినట్టు పైకొనీ ముంగోపము
వుడికించు మనసెల్ల నొక్కొక్కవేళా ॥ అట్టి ॥

ఆరయఁ గొండయెత్తినట్టు పేఁగొ సంసారము
వూరక కలిమిలేము లొక్కొక్కవేళ
మేరలేనిచీఁకటియై మించును దుఃఖములెల్లా
వూరబలేనికర్మికి నొక్కొక్కవేళా ॥ అట్టి ॥

పెనుగాలి వీచినట్టు పెక్కుకోరికెలు ముంచు
వొనర నజ్ఞానికి నొక్కొక్కవేళ
యెనయఁగ శ్రీవేంకటేశుదాసుఁడై నదాఁకా
వునికిఁ బాయ విన్నియు నొక్కొక్కవేళా ॥ అట్టి ॥ 489

శంకరాభరణం

నెరవాది సాహసులు నిత్యశూరులు
దురితవిదూరులు ధ్రువాదులు ॥ పల్లవి ॥

తక్కక శ్రీహరిభక్తితాపలు నేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడనేసుక దాఁటిరి
పెక్కుసంసారజలధి భీష్మాదులు ॥ నెర ॥

కడువిరక్తియనేటికత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసులపౌఁజులు గూడుకొనిరి
నుడివడ కిహమందే శుకాదులు ॥ నెర ॥

పరమశాంతములనేపట్టపేనుగులమీఁద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు ॥ నెర ॥ 490

గుజ్జరి

సంసారినైననాకు సహజమే
కంసారి నే నిందుకెల్లాఁ గాదని వగవను ॥ పల్లవి ॥

నరుఁడనైననాకు నానాసుఖదుఃఖములు
సరి ననుభవించేది సహజమే
హరిని శరణాగతులైనమీఁదఁ బరాభవ-
మరయ నిన్నంటుననిఅందుకే లోఁగేను ॥ సంసా ॥

[1]పుట్టిననాకుఁ గర్మపు [2]పొంగుకు లోనైనవాఁడ
జట్టిగాఁ గట్టువడుట సహజమే
యిట్టే నీవారికి మోక్షమిత్తునన్న నీమాట
పట్టు [3]వోయీనోయని పంకించే నే నిపుడు ॥ సంసా ॥

మాయకులోనైననాకు మత్తుఁడనై యిన్నాళ్లు
చాయకు రానిదెల్లా సహజమే
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
మోయరానినేను నీకు మోపని వీఁగేను ॥ సంసా ॥ 491

---

౧. కారకాన్వయ మంతగా సరిలేదు. ౨. 'పోఁగు' రేకు. ౩. 'వోయినో' రేకు, పూ.ము.పా.

సామంతం

ఇహమునుఁ బరమును యిందే వున్నవి
వహికెక్కఁ దెలియువారలు లేరు ॥ పల్లవి ॥

చట్టువంటి దీచంచలపుమనసు
కొట్టులఁబడేది గుటిగాదు
దిట్ట వొరులు బోధించినఁ గరఁగదు
పట్టఁబోయితే పసలేదు ॥ ఇహ ॥

చిగురువంటి దీజీవశరీరము
తగుళ్ల పెక్కులు తతి లేదు
తెగనిలంపటమే దినమునుఁ బెనచును
మొగము గల దిదే మొనయును లేదు ॥ ఇహ ॥

గనివంటిది యీఘనసంసారము
తనిసితన్పినాఁ దగ లేదు
ఘనుఁడగుశ్రీ వేంకటపతి గావఁగ
కొనమొద లేర్పడె కొంకే లేదు ॥ ఇహ ॥ 492

సాళంగం

నేరిచిబ్రదికేవారు నీదాసులు
నేరమిఁ బాసినవారు నీదాసులు ॥ పల్లవి ॥

కామముఁ గ్రోధము రెంటిఁ గాదని విడిచి మంచి-
నేమము వట్టినవారే నీదాసులు
దోమటిఁ బాపపుణ్యాలఁ దుంచివేసి చూడఁగానే
నీమాయ గెలిచినారు నీదాసులు ॥ నేరి ॥

కిక్కిరించినయాసలఁ గిందవేసి మోక్షము
నిక్కి నిక్కి చూచేవారు నీదాసులు
వెక్కసపుభక్తితోడ వెఱపు మఱపు లేక
నెక్కొన్నమహిమవారు నీదాసులు ॥ నేరి ॥

అట్టె వేదశాస్త్రములఅర్థము దేటపఱచి
నెట్టుకొని మించినారు నీదాసులు
యిట్టె శ్రీవేంకటేశ యితరమార్గములెల్లా
నెట్టువడఁ దోసినారు నీదాసులు ॥ నేరి ॥ 493

ముఖారి

ఇందిరాపతిమాయలు యింతులు సుండీ
మందలించి హరిఁ గొల్చి మనుదురుగాని ॥ పల్లవి ॥

అతివలచూపులే ఆయాలు దాఁకీఁ జుండీ
జితమైనపులకలఁ జిల్లులౌఁజుండీ
రతిపరవశములు రాఁగినమూర్ఛలు సుండీ
మతిలోఁ దప్పించుక మనుదురుగాని ॥ ఇంది ॥

మెఱయించేచన్నులే మించుఁబెట్లుగుండ్లు సుండీ
మెఱుఁగుమోవులే మచ్చుమేపులు సుండీ
మఱి మంచిమాటలు మాయపుటురులు సుండీ
మఱవక తప్పించుక మనుదురుగాని ॥ ఇంది ॥

బలుసంసారపుపొందు పాముతోడిపొత్తు సుండీ
వెలలేనివలపులు విషము సుండీ
యెలమితో శ్రీవేంకటేశ్వరుమఱుఁగు చొచ్చి
మలయుచు నొలయుచు మనుదురుగాని ॥ ఇంది ॥ 494

99 రేకు శ్రీరాగం

తెలిసిన బ్రహ్మోపదేశ మిదే
సులభ ౧ మనుమ నిదే చూచీఁగాక ॥ పల్లవి ॥

పుట్టించినహరి పూరి ప్రేమపునా
గట్టిగా రక్షించుఁగా కతఁడు
కట్టడిజీవుఁడు కానక నోళ్ల
తెట్టఁదెరువునకు తెలిచీఁ గాక ॥ తెలి ॥

అంతరాత్మ తనునట్టే మఱచేనా
చింత లోఁ బెరరేఁచీఁగాక
పంతపుజీవుఁడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచుఁ దూరీఁగాక ॥ తెలి ॥

నొసల వ్రాసినవి నోమించుఁగా కతఁ-
డెసగినశ్రీవేంకటేశ్వరుఁడు
విసుగక జీవుఁడు వీరిఁడిమాయల -
నసురుసురయి తా నలసీఁగాక ॥ తెలి ॥ 495

బౌళి

కనినవాఁడాఁ గాను కాననివాఁడాఁ గాను
పొనిఁగి వారులకై తే బోధించే నేను ॥ పల్లవి ॥

ధరణిఁ గర్మము గొంత తగినజ్ఞానము గొంత
సరికి సరే కావి నిశ్చయము లేదు
వారిమె యెంచిచూచితే నొకటివాఁడాఁగాను
సరవి దెలియ కేమో చదివేము నేము ॥ కని ॥

---

౧. 'మనుచు' కావచ్చు.

యీతల నిహము గొంత యింతలోఁ బరము గొంత
చేతులు రెండు చాఁచే చిక్కుట లేదు
యీతెరువులో నొకటి నేరుపరచుకోలేను
కాతరాన కతలెల్లా గఱచితి నేను ॥ కని ॥

దైవిక మొకకొంత తగుమానుషము గొంత
చేవలుచిగురువలెఁ జేసేను
యీవల శ్రీవేంకటేశుఁ డిది చూచి నన్నుఁ గాచె
భావించలేక యిన్నాళ్ళు భ్రమసితి నేను ॥ కని ॥ 496

సాళంగనాట

మంచినవేడుకతోడ మొక్కుటగాక
కంచములోపలికూడు కాలఁదన్న నేఁటికి ॥ పల్లవి ॥

వేదార్థములు నీవేవిహరించినసుద్దులే
కాదని అవునని కొన్ని వాదములేల
యేది నీవు సేసినాను యిన్నియును నియ్యకోలే
సోదించనేఁటికి యందు సొట్టు లెంచనేఁటికి ॥ మంచి ॥

కర్మము లిన్నియును నీకైంకర్యసాధనాలే
అర్మిలిఁ దారతమ్యము లడుగనేల
నిర్మితము నీ దింతే నెరసు లెంచంగనేల
ధర్మమందు నింక గజదంతపరీక్షేఁటికి ॥ మంచి ॥

భక్తియింతా నొక ౧ ఘంటాపథము నీళావలే
యుక్తిఁ బాత్రాపాత్రములు యూహించనేల
ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీపాదములు
సక్తులయి నమ్ముటగాక చలపదమేఁటికి ॥ మంచి ॥ 497

౧. 'ఘంటాపథముషిళావళె' మూ.ము.పా. 'నీవేవలే' అమటకు 'నీళావలే' వ్యావహా

దేసాక్షి

అంచితపుణ్యులకైతే హరి దైవ మవుఁగాక
పంచమహాపాతకులభ్రమ వాప వశమా ॥ పల్లవి ॥

కానని యజ్ఞానులకు కర్మమే దైవము
ఆనినబద్ధులకు దేహమే దైవము
మాననికాముకులకు మగువలే దైవము
పానిపట్టి వారివారిభ్రమ మాన్ప వశమా ॥ అంచి ॥

యేమీ నెఱఁగనివారి కింద్రియములు దైవము
దోమటిసంసారి కూరదొర దైవము
తామసులకెల్లాను ధనమే దైవము
పామరుల బట్టినట్టిభ్రమఁ బాపవశమా ॥ అంచి ॥

ధర నహంకారులకు తాఁదానే దైవము
దరిద్రుఁడైనవానికి దాత దైవము
యిరవై మాకు శ్రీవేంకటేశుఁడే దైవము
పరులముంచినయట్టిభ్రమఁ బాపవశమా ॥ అంచి ॥ 498

మలహరి

ఎట్టయినాఁ జేయుము యిఁక నీచిత్తము
కిట్టిననీసంకీర్తనపరుఁడ ॥ పల్లవి ॥

కొందరు జ్ఞానులు కొందరు భక్తులు
కొందరు వైరాగ్యకోవిదులు
యిందరిలో నే నెవ్వఁడఁ గా నిదె
సందడి హరి నీశరణాగతుఁడ ॥ ఎట్ట ॥

జపితలు గొందరు శాస్త్రులు గొందరు
ప్రపత్తిఁ గొందరు బలువులు
వుపమించఁగ ౧నిన్నొకఁడాఁ గా నిందు
కపురుల నీడింగరీఁడ నేను ॥ఎట్టు॥

ఆచార్యపురుషులు అవ్వలఁ గొందరు
యేచినసమయులై యేర్పడిరి
కాచేటిశ్రీవేంకటపతి నేనైతే
తాచి నీదాసులదాసుఁడను ॥ఎట్టు॥ 499

## రామక్రియ

ఒక్కఁడే అంతర్యామి వుపకారి చేపట్టు
తక్కినవి యిన్నియును తలఁపు రేఁచెడిని ॥పల్లవి॥

యెఱుఁగుమీ జీవుఁడా యింద్రియాలు సొమ్ము గావు
గుఱియై మాయలలోనఁ గూడించే వింతె
మఱవకు జీవుఁడా మనసు చుట్టము గాదు
తెఱఁగొప్ప ఆసలానే తిప్పెడి దింతె ॥ఒక్క॥

తెలుసుకో జీవుఁడా దేహమును నమ్మరాదు
వలసితే నుండుఁ బోవు వన్నెవంటిది
తలఁచుకో జీవుఁడా ధనము దనిచ్చ గాదు
పలులంపటములచేఁ బరచెడి దింతె ॥ఒక్క॥

సమ్మతించు జీవుఁడా సంసార మొకజాడ గాదు
బిమ్మటి పొద్దొకజాడ పెనచు నింతె
యిమ్మల శ్రీవేంకటేశుఁ డితనిమూలమే యింత
నెమ్మిఁ దానే గతియంటే నిత్యమవు నింతే ॥ఒక్క॥ 500

---

౧. 'నేనొకఁడా' కావచ్చు.

100 రేకు శంకరాభరణం

శతాపరాధములు సహస్రదండన లేదు
గతి నీవని వుండఁగ కావకుండరాదు ॥ పల్లవి ॥

తలఁచి నీకు మొక్కఁగా దయఁజూడకుండరాదు
కొలిచి బంటననఁగా కోపించరాదు
నిలిచి¹ భయస్తుఁడనై నీయెదుట దైన్యమే
పలుకఁగఁ గావకుండఁ బాడిగాదు నీకు ॥ శతా ॥

శరణు చొరఁగ నీకు సారె నాజ్ఞ వెట్టరాదు
సరిఁ బూరి గరవఁగ చంపరాదు
అరయ జగద్రోహినౌదు నైనా నీనామము
గరిమె నుచ్చరించఁగఁ గరఁగక పోదు ॥ శతా ॥

దిక్కు నీవని నమ్మఁగా దిగవిడువఁగరాదు
యెక్కువ నీలెంకఁగాఁగా యేమనరాదు
తక్కక శ్రీవేంకటేశ తప్పులెల్లాఁ జేసి వచ్చి
యిక్కడ నీదాసినైతి నింకఁదోయరాదు ॥ శతా ॥ 501

పాడి

ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి ॥ పల్లవి ॥

ముంచిననారాయణమూర్తులే యీజగమెల్ల
అంచితనామములే యీయక్షరాలెల్లా
పంచుకొన్న శ్రీహరిప్రసాద మీరుచులెల్లా
తెంచివేసి మేలు దాఁ దెలిసేటివారికి ॥ ఎదు ॥

౧. 'భయహస్తుఁడ' పూ ము.పా. భయస్థుఁడు, భయస్తుఁడు=భయముగలవాడని వ్యవహారము.

చేరి పారేటినదులు శ్రీపాదతీర్థమే
భారపుయీ ౧భూ మెతనిపాదరేణువే
సారపుఁగర్మములు కేశవునికైంకర్యములే
ధీరులై వివేకించి తెలిసేటివారికి ॥ ఎదు ॥

చిత్తములో భావమెల్లా శ్రీవేంకటేశుఁడే
హత్తినప్రకృతి ౨యెల్లా నాతనిమాయే
మత్తిలి యీతనికంటే మరి లే దితరములు
తిత్తిదేహపుఁబదుకు తెలిసేటివారికి ॥ ఎదు ॥ 502

లలిత

ఏల మోసపోయిరొకో యెంది యీకాలపువారు
బాలకృష్ణునిబంటై బ్రదుకవద్దా ॥ పల్లవి ॥

పసులఁగాచేవాని బ్రహ్మ నుతించెనంటేను
దెసల దేవుఁడేయని తెలియవద్దా
సినువు గోవర్ధనాద్రి చేతఁబట్టి యెత్తెనంటే
కొస రీతనిపాదాలే కొలువవద్దా ॥ ఏల ॥

నరునికి విశ్వరూపున్నతిఁ జూపెనంటేను
నరహరి యితఁడని నమ్మవద్దా
పరగఁ జక్రముచేత భానుని నణఁచెనంటే
సౌరి దీతని శరణుచొరవద్దా ॥ ఏల ॥

అందరుసురలలోన నగ్రపూజ గొన్నప్పుడే
చెంది యీతనికృపకుఁ జేరవద్దా
అంది శ్రీవేంకటేశుఁ డట్టె ద్రిష్టదైవమంటే
విందులఁ బరులసేవ విడువవద్దా ॥ ఏల ॥ 503

---

౧. 'భూమితని' పూ.ము.పా. 'భూమి+అతని' ఇట్టిసంధు లీవాఙ్మయమున కొల్లలు
౨. 'యల్లా' రేకు

శుద్ధవసంతం

ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగఁగ
యెంతవారమో భాగ్య మేమిచెప్పే దిఁకను ॥ పల్లవి ॥

తలకొని వొకకొంతధనము గనినవాఁడు
వెలలేనిగర్వముతో విఱ్ఱవీఁగీని
బలువుతో వొకరాజుఁబట్టి కొలిచినవాఁడు
సలిగెతో నాకెవ్వరుసరి యనీని ॥ ఇంత ॥

వింతగా నొకపరుసవేది చేతఁగలవాఁడు
యెంతవారిఁ గైకోఁడు యెక్కుడంటాను
పొంత నొకమంత్రము పంపుసేయించుకొనేవాఁడు
అంతటికి గురుఁ[1]డంటానని మురిసీని ॥ ఇంత ॥

యెగువ నొకదుర్గము నెక్కుక యేలేవాఁడు
పగవారిఁ గైకొనక బలువయ్యీని
[2]అగపడి శ్రీవేంకటాద్రిమీఁదనున్న నిన్నుఁ
దగ నమ్మినట్టివాఁడ ధన్యుఁడ నేను ॥ ఇంత ॥ 504

బౌళి

సుఖమును దుఃఖమును జోడుకోడెలు
అఖిలముఁగన్నవారు అడ్డమాడ రెపుడు ॥ పల్లవి ॥

యెందాఁకా సంసార మెనసి తాఁ జేసేను
అందాఁకా లంపటము లవి వోవు
కందువ జీవుఁడు భూమిఁ గాయ మెన్నాళ్ళు మోఁచె
అందుకొన్నతనలోనియాసలూఁ బోవు ॥ సుఖ ॥

౧. 'అంటానని' లోని 'అని'కి ఇక్కడ అర్థము పొసగుట లేదు. ౨. అగపడి = ప్రత్యక్షమై కావచ్చు.

అప్పటిఁ దనకు లోలో ఆఁక లెంతగలిగినా
తప్పక అందుకుఁ దగ దాహముఁ బోదు
అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్లు వుండె
ముప్పిరి వడ్డివారక మూలసుండినాఁ బోదు ॥సుఖ॥

దైవముపై భక్తిలేక తనకు నెన్నాళ్లుండే
దావతి కర్మపుపాటు తనకుఁ బోదు
శ్రీవేంకటేశ్వరునిసేవ దన కెప్పు డబ్బె
వోవరి సందలిమేలు వొల్లనన్నాఁ బోదు ॥సుఖ॥ 505

సాళంగం

మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను
మఱఁగుచొచ్చితి మీకు మముఁ గావరో ॥పల్లవి॥

యేపున మనసనియేటిమాపెంపుడు[1] లేడు
పాపమనేయడవిఁ బడినది
రాపున హరికింకరపువేఁటకాండ్లాల
పైపైని మా కింకఁ బట్టియ్యరో ॥మొఱ॥

అంచెల మావిజ్ఞానమనెడికామధేనువు
పంచేంద్రియపుర్వొంపిఁ బడినది
మించి వైకుంఠానకేఁగేమేటితెరువరులాల
దించక యెత్తెత్తి వెళ్లఁదియ్యరో ॥మొఱ॥

అండనే మోహాంధకారమనెడిమాదిగ్గజము
దండి[2] మీదయనేటివోఁదానఁ బడెను
నిండి శ్రీవేంకటేశుఁడనేటిమావటీనిచేత
గండికర్మపుకంబానఁ గట్టించరో ॥మొఱ॥ 506

---

౧. 'లేడి' కావచ్చు, ౨. 'దయయనేటి' కావచ్చు.

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగ, సంకీర్తనసంఖ్యాసూచి

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| ఆహిరి | ... | 24, 29, 30, 50, 59, 67, 78, 89, 90, 101, 111, 113, 119 122, 145, 162 166, 182, 188, 211, 212, 215, 218, 219, 221, 229, 234, 249, 263, 315, 337, 341, 346, 359, 364 382, 387, 399 |
| కన్నడగౌళ | ... | 14, 65, 71, 79, 163, 178, 194, 225, 257, 270, 272 282, 298, 313, 336, 342 355, 465 |
| కాంబో(భో)ది | .... | 16, 135, 177, 244, 307, 401 |
| కురంజి | .... | 267 |
| కేదారగౌళ | .... | 130 |
| గుండక్రియ | .... | 6, 18, 32, 49, 77, 128, 152, 153, 168, 302, 331, 362, 402, 430, 458, 459, 469, 472, 485 |
| గుజ్జరి | .... | 108, 114, 391, 398, 408, 444, 445, 491 |
| గౌళ | .... | 31, 69 452 |
| ఛా(చా)యానాట | ... | 310 |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| దేవగాంధారి | ... | .70, 201, 230, 236 254, 285, 287. 289, 393, 411, 463 |
| దేశా(సా)క్షి | .... | 2, 3, 27, 76, 149, 160, 208 231, 366, 419 468 498 |
| దేశి | .... | 327 |
| దేసాళం | ... | 81, 388, 390, 470 |
| ధ(ద)న్యాశి(సి) | .... | 12, 36, 42, 137, 138, 148, 181, 200, 261. 312, 314, 339, 369, 395 |
| నాట | .... | 68, 85, 92, 97, 100, 161, 197, 198, 220, 283, 300, 301, 317. 347, 352, 428; 436, 453, 477 |
| నాదరామక్రియ | ... | 34, 93 |
| నారణి | .... | 99, 131 |
| పాడి | .... | 5, 28, 173, 183, 195, 256, 280, 295, 335, 350, 357; 375, 383, 385, 406, 446, 502 |
| బౌళి(భవుళి) | .... | 9, 39, 48, 72, 96, 102, 104, 172, 193, 214, 242, 306, 309, 321, 330, 361, 372, 384, 386, 403, 413, 425, 426, 429, 440, 460, 464, 467, 480, 486, 488, 496, 505 |
| భూపాళం | .... | 38, 54, 87, 121, 123, 139, 288, 292, 299, 338, 374, 377, 404 |

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| భైరవి | ... | 58, 117, 186, 199, 290, 297, 322, 416, 466, 487 |
| మలహరి | .... | 141, 227, 274, 311, 405, 431, 435, 442, 482, 499 |
| మాళవి | .. | 11, 120, 155, 271, 414, 421 |
| మాళవిగౌళ | ... | 209, 449 |
| ముఖారి | .... | 19, 26, 51 56, 83, 125, 132, 134, 158, 159, 189, 190, 191, 203, 204, 217, 228, 233, 248, 251, 264, 278, 286, 293, 294, 304, 320, 325, 333, 354, 368 412, 456, 461, 476, 479 494 |
| రామక్రియ | .... | 74, 84, 187, 376, 379, 380, 394, 396, 410 420, 423, 448, 462, 500 |
| లలిత | .... | 43, 45, 46, 94, 106, 154, 156, 174, 175, 180 255, 268, 291, 349, 371, 378, 381, 409, 415, 417, 422, 433, 439, 450, 451, 455, 457, 471, 475, 483, 484, 503 |
| వరాళి | .... | 15, 73, 105, 109, 133, 143, 147, 184, 222, 224, 250, 273, 275, 328, 392 |
| వసంతం | .... | 356 |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| శంకరాభరణం | 13, 41, 61, 80 82, 150, 210, 237, 253, 280, 397, 424, 454, 473, 478, 490, 501 |
| శ్రీరాగం | 17, 20 22, 23, 25, 37, 40, 52, 53, 57, 64, 66, 75, 88, 95, 112, 115, 126 129, 136, 140, 146, 157, 170, 176, 185, 202, 216, 235, 240, 241, 245, 247, 252, 266, 269, 281, 284, 308, 316, 319, 323, 326, 329, 332, 348, 365 367, 370, 447, 481, 495 |
| శుద్ధవసంతం | 7, 8, 21, 116, 226, 265, 340, 344, 345, 437, 504 |
| సామంతం | 1, 4, 10, 33, 35, 44, 47, 55, 60, 62, 63, 86, 91, 98, 103 110, 118, 124, 127, 142, 144, 151, 164, 165, 171, 179, 192, 196, 205 206, 223, 232, 238, 239, 243, 246, 258 259, 262, 276, 279, 296, 303, 305, 318, 324 334, 343, 351, 353, 358, 360, 369, 373, 432, 434, 438, 443, 492 |
| సాళంగం | 107, 169, 213, 389, 407, 493, 506 |
| సాళంగనాట | 167, 207, 277, 400, 418, 427, 441, 474, 489, 497 |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి


| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంగడి నెవ్వరు | శ్రీరాగం | 241 |
| అంగనలాల | శంకరాభరణం | 454 |
| అంచితపుణ్యుల | దేసాక్షి | 498 |
| అంటఁబారి | ఆహిరి | 122 |
| అంతరంగమెల్లా | శుద్ధవసంతం | 437 |
| అంతయునీవే | పాడి | 385 |
| అంతర్యామీ | లలిత | 381 |
| అందరికాధార | సామంతం | 351 |
| అందరిబ్రదుకులు | పాడి | 335 |
| అక్కడనాపాట్లు | ఆహిరి | 90 |
| అక్కఱకొదగని | ముఖారి | 456 |
| అటుగుడువు | సామంతం | 142 |
| అటువంటివాఁడు | లలిత | 484 |
| అట్టివేళఁగ | సాళంగనాట | 489 |
| అణురేణు | శ్రీరాగం | 365 |
| అతఁడేసకల | సామంతం | 353 |
| అతనికెట్ల | సామంతం | 369 |
| అతిదుష్టుఁడ | ఆహిరి | 73 |
| అతిశయమగు | లలిత | 154 |
| అదిగాక | శ్రీరాగం | 40 |
| అదినాయపరాధ | మాళవి | 271 |
| అదివో అల్లదివో | శ్రీరాగం | 23 |

| కీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దెచూడు | మలహరి | 227 |
| దెవా(డె | శంకరాభరణం | 424 |
| నుమానపు | ముఖారి | 26 |
| న్నలంటా(దమ్మ | వరాళి | 224 |
| న్నిచోట్ల(బర | ముఖారి | 278 |
| న్నిటా నీ | బౌళి | 386 |
| న్నిటికి(గా | దేసాళం | 470 |
| న్నియును | శ్రీరాగం | 20 |
| ప్పుడువో | లలిత | 43 |
| ప్పులవారె | దేసాళం | 81 |
| ప్పులేనిసంసార | గుజ్జరి | 114 |
| భయ మభయమో | పాడి | 383 |
| మ్మెడి దొకటి | లలిత | 483 |
| య్యోవోయ(బ్రాయ | సామంతం | 179 |
| య్యోమానుప(గ | నాట | 300 |
| రిదిసే(తలే | ముఖారి | 294 |
| రుదరుదు | బౌళి | 480 |
| లర(ంచల | ఆహిరి | 67 |
| లర నుతించ | భూపాళం | 338 |
| లవటపత్ర | శంకరాభరణం | 478 |
| స్మదాదీనాం | పాడి | 357 |
| (కటివేళల | ముఖారి | 158 |
| కాశమడ్డమా | భూపాళం | 288 |
| టవారి(గూడి | కన్నడగౌళ | 163 |
| తనినేనే | గుజ్జరి | 444 |
| తుమసంతస | లలిత | 378 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఆదిదేవ | దేవగాంధారి | 289 |
| ఆదిదేవుఁడ | సామంతం | 324 |
| ఆదిదేవుఁడై | సామంతం | 127 |
| ఆదిమపూరుషుఁడ | శంకరాభరణం | 80 |
| ఆదిమునుల | ధన్నాసి | 261 |
| ఆపదలసంపదల | వరాళి | 143 |
| ఆపద్బంధుఁడు | సామంతం | 438 |
| ఆపన్నులపాలి | శ్రీరాగం | 266 |
| ఆలాగుపొందు | ఆహిరి | 30 |
| ఆశాబద్ధుఁడనై | లలిత | 175 |
| ఆసమీఁద | ఆహిరి | 212 |
| ఇంతటిదైవమవు | శుద్ధవసంతం | 504 |
| ఇంతసేసెనెఁబో | కన్నడగౌళ | 282 |
| ఇంతేమరేమి | గుజ్జరి | 398 |
| ఇందరికినభయంబు | సామంతం | 334 |
| ఇందిరవడ్డించ | శ్రీరాగం | 22 |
| ఇందిరాధిపుని | సామంతం | 434 |
| ఇందిరానాథుఁడిన్నిటి | బౌళి | 464 |
| ఇందిరానామ | శుద్ధవసంతం | 8 |
| ఇందిరానాయక | రామక్రియ | 379 |
| ఇందిరాపతి | ముఖారి | 494 |
| ఇందుకొరకె | మాళవి | 11 |
| ఇందునందుఁదిరుగు | ఆహిరి | 215 |
| ఇందునుండ | పాడి | 375 |
| ఇందులోనే | నాట | 477 |
| ఇటుగనసకలో | గుజ్జరి | 391 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇటుగరుడని | నాట | 92 |
| ఇటువలెనే పో | బౌళి | 306 |
| ఇతఁడు సేసిన | శ్రీరాగం | 126 |
| ఇతరధర్మము | ఆహిరి | 399 |
| ఇతరము లిన్నియు | సామంతం | 86 |
| ఇతరులకు | శ్రీరాగం | 252 |
| ఇత్తడిబంగారు | సామంతం | 369 |
| ఇదియేమర్మము | సాళంగనాట | 418 |
| ఇదివో సంసార | శ్రీరాగం | 308 |
| ఇన్నిచేఁతలును | శంకరాభరణం | 210 |
| ఇన్నిజన్మము | శ్రీరాగం | 367 |
| ఇన్నియుఁగలుగు | నాదరామక్రియ | 34 |
| ఇన్నిలాగుల | ఆహిరి | 166 |
| ఇన్ని నేఁతలకు | దేవగాంధారి | 285 |
| ఇప్పుడిటు | భూపాలం | 38 |
| ఇరువగువారికి | లలిత | 439 |
| ఇరవైనయట్టుండు | బౌళి | 486 |
| ఇఁయును | నాట | 85 |
| ఇహమునుఁబరము | సామంతం | 492. |
| ఈదేహవికారము | లలిత | 268 |
| ఈపాదమే కదా | శ్రీరాగం | 66 |
| ఈభవమున | శ్రీరాగం | 185 |
| ఈవిశ్వాసంబు | శ్రీరాగం | 64 |
| ఈసురలీమునులీ | నాదరామక్రియ | 93 |
| ఉన్నవిచారము | సాళంగనాట | 441 |
| ఉప్పవడము | ధన్నాసి | 148 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఊరికిఁబోయెడి | ఆహిరి | 89 |
| ఎండగాని | బౌళి | 214 |
| ఎండలోని | ఆహిరి | 337 |
| ఎంతగాలము | శ్రీరాగం | 316 |
| ఎంతచేసిన | సామంతం | 98 |
| ఎంతటివారలు | గుండక్రియ | 32 |
| ఎంతపాపకర్మ | భైరవి | 186 |
| ఎంతబోధించి | నాట | 247 |
| ఎంతభక్తవత్సలుఁడ | శంకరాభరణం | 473 |
| ఎంతమానుమన్నఁజింత | ముఖారి | 204 |
| ఎంత విచారించు | రామక్రియ | 420 |
| ఎంతవిభవము | ధన్నాసి | 181 |
| ఎంత సదివిన | సామంతం | 62 |
| ఎంత సేయఁగ | ముఖారి | 134 |
| ఎంత నేసినా | కన్నడగౌళ | 71 |
| ఎంతైనఁ దొలఁగవై | దేసాక్షి | 76 |
| ఎందరివెంట | దేవగాంధారి | 201 |
| ఎందాఁక | శ్రీరాగం | 88 |
| ఎందుఁజూచినఁదన | శుద్ధవసంతం | 340 |
| ఎందుఁ బొడిమితిమో | ముఖారి | 83 |
| ఎక్కడ చొచ్చెదిదీ | బౌళి | 361 |
| ఎక్కడనున్నా | ముఖారి | 354 |
| ఎక్కడి పాపము | గుజ్జరి | 408 |
| ఏక్కడి దురవస్థ | లలిత | 106 |
| ఎక్కువకులజుఁడైన | సామంతం | 318 |
| ఎక్కెఁగారాఁగా | లలిత | 471 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎచ్చోటి కేఁగిన | వరాళి | 273 |
| ఎటువంటి రౌద్రమో | ఆహిరి | 211 |
| ఎట్టయినాఁజేయు | మలహారి | 499 |
| ఎట్టివారికినెల్ల | సాళంగనాట | 277 |
| ఎట్టు చేసినఁజేసె | బౌళి | 104 |
| ఎట్టు దరించీ | ముఖారి | 190 |
| ఎట్టువేగించే | శ్రీరాగం | 370 |
| ఎదమపురివెట్లై | ఆహిరి | 315 |
| ఎముట నెవ్వరు | పాడి | 502 |
| ఎదుటినిధానము | శుద్ధవసంతం | 344 |
| ఎనుపోతుతో | లలిత | 156 |
| ఎన్నఁగలుగు | సామంతం | 171 |
| ఎన్నఁడు పక్వము | మలహరి | 482 |
| ఎన్నాళ్ళదాఁకఁదా | ఆహిరి | 113 |
| ఎన్నిబాధలఁబెట్టి | శ్రీరాగం | 284 |
| ఎన్నిలేవు నా | గౌళ | 31 |
| ఎరుఁగుదు | శంకరాభరణం | 253 |
| ఎఱుక గలుగు | ముఖారి | 304 |
| ఎవ్వఁడోకాని | రామక్రియ | 74 |
| ఎవ్వరిఁగాదన్న | బౌళి | 9 |
| ఎవ్వరికైనను | ముఖారి | 233 |
| ఎవ్వరివాఁడోయీ | దేసాక్షి | 419 |
| ఎవ్వరివాఁడోయెఱఁగ | గుండక్రియ | 472 |
| ఎవ్వరు గర్తలు | గుండక్రియ | 485 |
| ఎవ్వరెవ్వరి వాఁడో | నాట | 97 |
| ఎవ్వారు లేరూ | వరాళి | 15 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏఁటికిఁ దలఁకెద | ఆహిరి | 101 |
| ఏఁటికి నెవ్వరి | పాడి | 195 |
| ఏఁటిబ్రదుకు | శ్రీరాగం | 348 |
| ఏఁటి విజ్ఞాన | గుండక్రియ | 77 |
| ఏఁటి సుఖము | కాంబోధి | 135 |
| ఏకులజుఁడేమి | భూపాళం | 292 |
| ఏడవలపేశ | నాట | 220 |
| ఏడసుజ్ఞాన | బౌళి | 48 |
| ఏణనయనల | నారణి | 99 |
| ఏతదఖిలంబునకు | శ్రీరాగం | 170 |
| ఏది కడ దీనికేది | కన్నడగౌళ | 225 |
| ఏది చూచినఁదమ | శ్రీరాగం | 95 |
| ఏది చూచిన | శ్రీరాగం | 140 |
| ఏది చూచినా | సామంతం | 60 |
| ఏది తుద | బౌళి | 102 |
| ఏదియును లేని | నాట | 301 |
| ఏదైవము శ్రీ | నాట | 100 |
| ఏనిన్ను దూరక | సామంతం | 35 |
| ఏపనులు సేసినా | ఆహిరి | 364 |
| ఏమి కలిగెను | ఆహిరి | 218 |
| ఏమి గలదిందు | శ్రీరాగం | 112 |
| ఏమిగలదిందు | వరాళి | 328 |
| ఏమిఫలము దా | దేవగాంధారి | 236 |
| ఏమియుఁజేయఁగ | గుండక్రియ | 430 |
| ఏమి వలసిన | బౌళి | 172 |
| ఏమి వొరలేరు | శుద్ధవసంతం | 345 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమి సేతు | కాంబోది | 401 |
| ఏమి సేయఁగ | ఆహిరి | 221 |
| ఏమి సేయ | సామంతం | 55 |
| ఏమి సేయువార | వరాళి | 250 |
| ఏమి సేసినా | లలిత | 475 |
| ఏమీనడుగ | బౌళి | 403 |
| ఏమీ నెఱఁగని నా | ముఖారి | 286 |
| ఏమీ నెఱఁగనిమమ్ము | ఆహిరి | 162 |
| ఏమో తెలిసెఁగా | భూపాళం | 123 |
| ఏల పొరలేవు | ముఖారి | 189 |
| ఏల మోసపోయి | లలిత | 503 |
| ఏలవచ్చి | భూపాళం | 299 |
| ఏల సమకొను | ఆహిరి | 145 |
| ఏవంశ్రుతి | సామంతం | 4 |
| ఒక్కఁడే అంతర్యామి | రామక్రియ | 500 |
| ఒప్పులై నొప్పులై | దేసాక్షి | 149 |
| ఓహోడేండేం | రామక్రియ | 396 |
| కంటిని | సామంతం | 443 |
| కంటే సులభ | ముఖారి | 479 |
| కటకటా జీవుఁడా | పాడి | 350 |
| కటకటా దేహంబు | కన్నడగౌళ | 178 |
| కటకటాయిటు | సామంతం | 239 |
| కడగనుటే | పాడి | 266 |
| కడలుడిపి | శుద్ధవసంతం | 226 |
| కడుఁ జంచలపుఁబు | గుండక్రియ | 152 |
| కడునడుసు | ముఖారి | 251 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కడుపెంత | గుండక్రియ | 302 |
| కనినవాఁడాఁగాను | బౌళి | 496 |
| కనియుఁగానని | భూపాళం | 404 |
| కనుఁగొనఁగ | శ్రీరాగం | 319 |
| కరుణానిధిం | కన్నడగౌళ | 342 |
| కలదిగలట్టే | లలిత | 450 |
| కలలోని సుఖమే | సామంతం | 118 |
| కలిగినది | మలహరి | 442 |
| కాకమతి | ఆహిరి | 249 |
| కాకున్న సంసార | శ్రీరాగం | 326 |
| కాయమనే | బౌళి | 488 |
| కాయము జీవుఁడు | నాట | 352 |
| కాలము కాలము | సామంతం | 305 |
| కాలవిశేషమో | సామంతం | 63 |
| కాలాంతకుఁడను | కన్నడగౌళ | 298 |
| కింకదీర | ధన్నాసి | 395 |
| కింకరిష్యామి | శుద్ధవసంతం | 265 |
| కుడుచుగాక | రామక్రియ | 187 |
| కూడులేక | ఆహిరి | 234 |
| కూడువండుట | శ్రీరాగం | 115 |
| కొంచెమును | శ్రీరాగం | 329 |
| కొండ దవ్వుట | భవుళి | 321 |
| కొండలలో | సామంతం | 151 |
| కొండోనుయ్యో | దేసాక్షి | 160 |
| కొందరికివి | బౌళి | 384 |
| కొనరో కొనరో | శంకరాభరణం | 237 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కొనుట వెగ్గళము | గుండక్రియ | 49 |
| కొలువుఁడీ | సామంతం | 44 |
| కోరిక దీరుట | శ్రీరాగం | 176 |
| కోరుదు | మలహరి | 141 |
| కోరుపంచరో | ఆహిరి | 387 |
| గడ్డపారమింగితే | కాంబోది | 177 |
| గాలినే పోయ | కన్నడగౌళ | 14 |
| ఘన మనోరాజ్య | సామంతం | 303 |
| ఘనుఁడీతఁడొకఁడు | శుద్ధవసంతం | 116 |
| ఘోర దురితముల | ధన్నాసి | 363 |
| ఘోర విదారణ | నాట | 63 |
| చక్కఁదనముల | సామంతం | 103 |
| చక్రమా హరి | పాడి | 183 |
| చదివెఁబో | ధన్నాసి | 339 |
| చదువులోనే | మాళవిగౌళ | 449 |
| చలపాది | ముఖారి | 132 |
| చాలదా బ్రహ్మ | సామంతం | 343 |
| చాలదా మాజన్మ | సామంతం | 110 |
| చాలదా హరినామ | శ్రీరాగం | 52 |
| చాలదా హరిసంకీర్తన | సామంతం | 205 |
| చాలనొవ్వి నేయు | భైరవి | 297 |
| చావుతో సరియైన | శ్రీరాగం | 157 |
| చిత్తమతి చంచలము | వరాళి | 147 |
| చిత్తములో | ముఖారి | 19 |
| చిత్తమో కర్మమో | బౌళి | 309 |
| చిరంతనుఁడు | ముఖారి | 333 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చీ చీ నరుల | శంకరాభరణం | 397 |
| చీ చీ వో బదుకా | బౌళి | 467 |
| చూడఁజూడ | వరాళి | 133 |
| చూడ రెవ్వరు | బౌళి | 96 |
| చూడుఁడిందరికి | భైరవి | 117 |
| చెదఱక వెలుఁగే | బౌళి | 193 |
| చెప్పినంతపని | ముఖారి | 412 |
| చెప్పుదు మాటలె | దేవగాంధారి | 230 |
| చెలినేఁడు | ఆహిరి | 359 |
| చెల్లుఁగాకిటు | ఆహిరి | 182 |
| జడమతి | శ్రీరాగం | 481 |
| జనులు నమరులు | ముఖారి | 320 |
| జీవాతుమై | ఆహిరి | 50 |
| జీవుఁ డెంతటి | దేశి | 327 |
| తన కర్మమెంత | సాళంగం | 213 |
| తనకర్మవశంబించుక | కన్నడగౌళ | 65 |
| తనక్షేత్ర చదువు | నాట | 198 |
| తనదీఁగాక | సామంతం | 124 |
| తనవారని | వరాళి | 222 |
| తనవారలు | ఆహిరి | 229 |
| తప్పదు తప్పదు | లలిత | 371 |
| తప్పుఁదోయవే | శ్రీరాగం | 447 |
| తలఁచిన విన్ని | దేవగాంధారి | 70 |
| తలఁపవెనక | ఛాయానాట | 310 |
| తలఁపుకామాతుర | వరాళి | 105 |
| తలఁపులోపలి | వసంతం | 356 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తలపోఁత | శంకరాభరణం | 41 |
| తహ తహ | లలిత | 417 |
| తానే కాకెవ్వరు | సామంతం | 192 |
| తానే తెలియ | గుండక్రియ | 128 |
| తాపలేక | లలిత | 94 |
| తీపనుచు చేఁదు | బౌళి | 39 |
| తుదలేనిబంధము | గుండక్రియ | 168 |
| తెలియఁ జీఁకటి | గుండక్రియ | 18 |
| తెలియక వూరక | సామంతం | 432 |
| తెలియరాదు | భైరవి | 416 |
| తెలిసినఁదెలియుఁడు | నాట | 317 |
| తెలిసియు నత్యంత | బౌళి | 330 |
| తెలిసిన బ్రహ్మోప | శ్రీరాగం | 495 |
| తెల్లవారవియ్యె | కాంబోది | 244 |
| తొక్కనిచోట్లు | సామంతం | 276 |
| తొలుఁబాపపుణ్యాల | సాళంగం | 169 |
| తోరణములే | ఆహిరి | 119 |
| త్వమేవ శరణం | శ్రీరాగం | 323 |
| దిక్కెందరికి | ఆహిరి | 111 |
| దిబ్బలువెట్టు | కాంబోది | 16 |
| దురితదేహాలే | శుద్ధవసంతం | 21 |
| దేవదేవం | ధన్నాసి | 314 |
| దేవదేవుఁడె | సాళంగనాట | 400 |
| దేవ నీమాయ | ఆహిరి | 382 |
| దేవ నీ విచ్చే | బౌళి | 372 |
| దేవ యీ తగవు | మలహరి | 435 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| దేహము దా | శ్రీరాగం | 136 |
| దైవకృతం | కన్నడగౌళ | 79 |
| దైవమ నీవేగతి | గుజ్జరి | 445 |
| దైవమా నీకు | సాళంగం | 407 |
| దైవమా పర | లలిత | 291 |
| దైవము పుట్టించి | ముఖారి | 476 |
| దొరకునా | సామంతం | 358 |
| నంద నందన | ధన్నాసి | 312 |
| నగధర | సామంతం | 259 |
| నగుఁబాట్లఁబడే | ముఖారి | 56 |
| నగుమొగము | మాళవి | 421 |
| నదులొల్లవు | ముఖారి | 51 |
| నమోనారాయణాయ | శ్రీరాగం | 269 |
| నమోనారాయణాయనమః | శ్రీరాగం | 245 |
| నవ నారసింహా | నాట | 453 |
| నాఁటికినాఁడే | సామంతం | 91 |
| నా తప్పులోఁగొన | సాళంగనాట | 427 |
| నానాదిక్కుల | ఆహిరి | 346 |
| నాపాలిఘన | గుజ్జరి | 108 |
| నారాయణ నీ | సామంతం | 262 |
| నారాయణాయ | రామక్రియ | 380 |
| నిక్కించీ | నాట | 436 |
| నిగమ నిగమాంత | సామంతం | 243 |
| నిత్యాత్ముఁడై | శ్రీరాగం | 75 |
| నిత్యానంద | శ్రీరాగం | 25 |
| నిత్యులు ముక్తులు | మాళవి | 414 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నిన్నుఁదలఁచి | దేసాక్షి | 27 |
| నీ కథామృతము | భూపాళం | 54 |
| నీ మహాత్త్వంబు | కన్నడగౌళ | 270 |
| నీయాజ్ఞదలమోచి | రామక్రియ | 376 |
| నీవనఁగ | సామంతం | 232 |
| నీవేకా చెప్పఁజూప | లలిత | 255 |
| నీవేకానింక | శ్రీరాగం | 17 |
| నీవేమి సేతు | భైరవి | 487 |
| నీవేలికవు | లలిత | 455 |
| నెరవాది | శంకరాభరణం | 490 |
| నేనేమి సేయు | గుండక్రియ | 459 |
| నేరిచిబ్రదికే | సాళంగం | 493 |
| నేలమిన్ను | గౌళ | 69 |
| పంకజాక్షులు | ధన్నాసి | 138 |
| పందియుఁబండదు | మలహరి | 274 |
| పటు శిష్ట | సాళంగనాట | 207 |
| పట్ట వసము | భైరవి | 58 |
| పట్టినచో | బౌళి | 426 |
| పట్టినదెల్లా | లలిత | 457 |
| పదిలముకోట | శంకరాభరణం | 61 |
| పనిమాలినట్టి | సాళంగం | 389 |
| పనిలేనిధన | శంకరాభరణం | 150 |
| పరగు బహు | నారణి | 131 |
| పరదేశి | బౌళి | 72 |
| పరమపాతకుఁడ | సామంతం | 33 |
| పరమాత్మని | కేదారగౌళ | 130 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పరిపూర్ణ | నాట | 428 |
| పరుల సేవలు | దేసాళం | 390 |
| పరుసము | శంకరాభరణం | 280 |
| పరుసమొక్కటే | సామంతం | 373 |
| పసలేని యీ | ముఖారి | 203 |
| పాపపుణ్యముల | పాడి | 28 |
| పాపములే | శంకరాభరణం | 82 |
| పాపమెరఁగని | మాళవిగౌళ | 209 |
| పాపినైనవా | సామంతం | 246 |
| పాయక మతి | కన్నడగౌళ | 336 |
| పాయని కర్మము | సామంతం | 47 |
| పాయపుమదముల | సామంతం | 238 |
| పారకుమీవో | ఆహిరి | 188 |
| పారితెంచి యెత్తి | భూపాళం | 87 |
| పాలదొంగ | మలహరి | 311 |
| పుండు జీవుల | కన్నడగౌళ | 257 |
| పుట్టుగులమ్మి | ధన్నాసి | 42 |
| పుట్టుమాలిన | సాళంగం | 107 |
| పుడమినిందరిఁబట్టె | వరాళి | 109 |
| పెంచఁబెంచ | ఆహిరి | 29 |
| పెక్కులంపటాల | ముఖారి | 125 |
| పెరుగఁబెరుగఁబెద్ద | బౌళి | 440 |
| పొడవైనశేషగిరి | బౌళి | 460 |
| పోయఁ గాలంబ | కన్నడగౌళ | 194 |
| పోయం గాలము | గుండక్రియ | 153 |
| పోయఁబోయఁగాల | దేసాక్షి | 208 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పోయెఁబోయెఁగాల | సామంతం | 206 |
| పోరాకపోయి | గుండక్రియ | 331 |
| పోరా పోరా | వరాళి | 73 |
| ప్రాణుఁ నేరమి | గుండక్రియ | 262 |
| బయలు వంఢిలి | శ్రీరాగం | 129 |
| బలువగుఁదన | పాడి | 295 |
| బలువగు కర్మము | సామంతం | 296 |
| బాపు దైవమా | మాళవి | 120 |
| బాలులతో | పాడి | 256 |
| బోధకు లెవ్వరు | కన్నడగౌళ | 465 |
| బ్రహ్మగడిగిన | ముఖారి | 191 |
| బ్రువంతిబౌద్ధా | సామంతం | 164 |
| భక్తికొలంది | రామక్రియ | 410 |
| భారమైన | దేవగాంధారి | 287 |
| ఫాలనేత్రానల | శ్రీరాగం | 281 |
| భావమునఁబర | సామంతం | 258 |
| భావయామి | ధన్నాసి | 137 |
| భోగి శయన | భూపాళం | 139 |
| భోగీంద్రులును | ముఖారి | 368 |
| మంగళము గోవిందునకు | లలిత | 46 |
| మంచిదివో | లలిత | 45 |
| మందరధర | కురంజి | 247 |
| మందు లేదు | నాట | 161 |
| మదమత్సరము | ఆహిరి | 59 |
| మనసిజగురుఁడితఁడో | శ్రీరాగం | 37 |
| మనసుననెప్పుడు | లలిత | 180 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మనుజుఁడై | సామంతం | 196 |
| మరలి మరలి | రామక్రియ | 448 |
| మరిగివీరెపో | గుండక్రియ | 402 |
| మఱియు మఱియు | పాడి | 446 |
| మలసీఁజూడరో | శంకరాభరణం | 13 |
| మహినింతటి | రామక్రియ | 462 |
| మాకెల్ల రాజా | లలిత | 415 |
| మాదృశానాం | ముఖారి | 325 |
| మానఁడెన్నఁడు | నాట | 283 |
| మానుషము | గుండక్రియ | 6 |
| మాయపుదనుజుల | సామంతం | 279 |
| మిక్కిలిపుణ్యులు | దేవగాంధారి | 411 |
| మిన్నకవేసాలు | భూపాళం | 374 |
| ముంచినవేడుక | సాళంగనాట | 497 |
| ముందటిజన్మము | గుండక్రియ | 469 |
| ముచ్చుఁగన్నతల్లి | శ్రీరాగం | 240 |
| మేదిని జీవులఁగావ | భూపాళం | 377 |
| మొదలుండఁగాన | భైరవి | 466 |
| మొఱవెట్టెదము | సాళంగం | 506 |
| మోసమున | ముఖారి | 159 |
| మోహాము | ఆహిరి | 263 |
| రామరామ | వరాళి | 392 |
| రాముఁడిదే | సాళంగనాట | 474 |
| రూకలై మాడలై | గుండక్రియ | 458 |
| రెండు మూలికలు | గౌళ | 452 |
| లంకెలూడుచే | నాట | 197 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| లేదు బ్రహ్మ | దేవగాంధారి | 254 |
| వందే వాసుదేవం | శ్రీరాగం | 53 |
| వట్టియాసలకు | వరాళి | 184 |
| వననిధిఁ గురిసిన | ఆహిరి | 24 |
| వలచిపై కొనఁగ | సామంతం | 1 |
| వలపు లధికము | శ్రీరాగం | 146 |
| వలపని మోహా | లలిత | 174 |
| వలెనను వారిదే | మలహరి | 405 |
| వాఁడె వేంకటాద్రి | లలిత | 422 |
| వాఁడె వేంకటేశుఁడ | భూపాళం | 121 |
| వాడవాడల వెంట | వరాళి | 275 |
| వాసివంతు | సాళంగనాట | 167 |
| విడుమనవో | శ్రీరాగం | 57 |
| విధి నిషేధములకు | దేవగాంధారి | 393 |
| వివేక మెఱఁగని | బౌళి | 429 |
| విశ్వప్రకాశునకు | కన్నడగౌళ | 355 |
| వీఁడివో యిదె | భైరవి | 322 |
| వీనిఁజూచి | దేసాళం | 388 |
| వెట్టిమోపువంటి | పాడి | 173 |
| వెన్నవట్టుక | శ్రీరాగం | 202 |
| వెరపులు | ముఖారి | 217 |
| వెఱతు వెఱతు | శ్రీరాగం | 235 |
| వెఱ్ఱివాఁడు | బౌళి | 413 |
| వెలయు నిన్ని | రామక్రియ | 84 |
| వెలికివెళ్లఁడు | కన్నడగౌళ | 313 |
| వెలుపలెల్ల | లలిత | 451 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వేదంబెవ్వని | పాడి | 5 |
| వేదనఁబొరలే | శ్రీరాగం | 216 |
| వేదమంత్ర | ముఖారి | 461 |
| వేదవేద్యులు | దేసాక్షి | 2 |
| వేసరితిమెట్ల | దేసాక్షి | 231 |
| వైష్ణవులు | ధన్నాసి | 36 |
| శతాపరాధములు | శంకరాభరణం | 501 |
| శమము చాలని | కాంబోది | 307 |
| శ్రీమన్నారాయణ | మాళవి | 155 |
| శ్రీవేంకటేశుఁడు | బౌళి | 425 |
| శ్రీశోఽయం | ముఖారి | 264 |
| శ్రీహరినేసిన | పాడి | 406 |
| సందడివిడువుము | ధన్నాసి | 12 |
| సంసారి | గుజ్జరి | 491 |
| సకలజీవుల | దేసాక్షి | 468 |
| సకలభూతదయ | సామంతం | 223 |
| సకలశాస్త్ర | శ్రీరాగం | 247 |
| సకలసంగ్రహము | లలిత | 349 |
| సకల సందేహమై | శ్రీరాగం | 332 |
| సడిఁబెట్టె | భైరవి | 199 |
| సతతంశ్రీ | సామంతం | 165 |
| సతతము | ఆహిరి | 341 |
| సతతవిరక్తుఁడు | కన్నడగౌళ | 272 |
| సదాసకలము | శుద్ధవసంతం | 7 |
| సర్వజ్ఞత్వము | దేవగాంధారి | 483 |
| సర్వాంతరాత్ముఁడ | లలిత | 409 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సహజవైష్ణవాచార | సామంతం | 10 |
| సహజాచారము | మలహరి | 431 |
| సామాన్యమా | ధన్నాసి | 200 |
| సిరి దొలంకెడి | ముఖారి | 228 |
| సీతాశోక | దేశాక్షి | 366 |
| సుఖమును | బౌళి | 505 |
| సులభమా మనుజుల | సామంతం | 144 |
| సులభమా యిందరి | రామక్రియ | 423 |
| సులభుఁడు మధు | రామక్రియ | 394 |
| సేవింతురా | ముఖారి | 293 |
| సొగియునా | బౌళి | 242 |
| సొరిది సంసారంబు | ముఖారి | 248 |
| హరి గొలిచిగా | భైరవి | 290 |
| హరి నీయనుమతో | లలిత | 433 |
| హరి నెఱఁగని | ఆహిరి | 219 |
| హీన దశలఁబొంది | దేసాక్షి | 3 |

'శ్రీరాగ' అను పెదతిరుమలాచార్యుల రేకులోని

# అధ్యాత్మ కీర్తనలు

౧ సామంతం

ఇన్నిటికి మూలము యీతనిరూపు
 యెన్నఁగ నుపమలకు నిరవైనట్లుండె ॥ పల్లవి ॥

కమలనాభునికి కప్పురకాపు మేన
 సముచితముగఁ బైపై చాఁతినపుడు
 అమృతముదచ్చేవేళ నట్టే మేనఁ దుంపుర్లు
 తమితోడ విందుకొని దట్టమైనట్లుండె ॥ ఇన్ని ॥

దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను
 చేవమీర నించి సేవసేసేయప్పుడు
 వేవేలుగా యమునలో వేమారు నీఁదులాడఁగా
 కావిరి కాళిమ నిండాఁగప్పినయట్టుండె ॥ ఇన్ని ॥

అలమేలుమంగతోడ నట్టే శ్రీవేంకటపతి-
 కెలమితో సొమ్ముపెట్టి యెంచినపుడు
 కులికి గొల్లెతలను కూడఁగా గుబ్బలమీఁదఁ
 గలపసపెల్లా వచ్చి కమ్ముకొన్నట్లుండె ॥ ఇన్ని ॥ 1

---

౧. ఈ పాటలన్నిస్వామిమజ్జనమును వర్ణించినవే. ఆస్నానవేళ స్వామిలో అక్కడక్కడ కనబడిన శృంగారరేఖలు, అధ్యాత్మమునకును సహజములే.

''కమలాకుచచూచుకకుంకుమతో, నియతారుణితాతులనీలతనో'' ''కుచోన్నతే కుంకుమరాగశోణే'' ల వంటివే.

## దేసాళం

ఇందుకేకాఁబోలు నీవు యిట్టే యవధరించేవు
కందువ లన్నియు నీమై గనియైనట్లుండె ॥ పల్లవి ॥

హరి నీవు కప్పురకా పవధరించేవేళ
విరివిగా నిందరు భావించి చూచితే
తరుణులనవ్వులెల్లా దట్టమై నీమేనిమీఁద
పెరిగిపెరిగి యట్టే పేరినయట్లుండె ॥ ఇందు ॥

భువనేశ నీవు తట్టుపుణుఁగు చాఁతుకొనఁగ
యివల నీదాసులెల్లా నెంచిచూచితే
కవగూడి నీసతులకనుచూపులెల్లాను
తివిరి నీమేనిమీఁద తిరమైనట్లుండె ॥ ఇందు ॥

శ్రీవేంకటేశ నీచెలి యలమేల్మంగతో
తావున మెరసేది నేఁ దలఁచితేను
కోవరపుగొల్లెతలగుబ్బలకుంకుమనిగ్గు
వేవేలయి నీయం దచ్చువేసినయట్టుండె ॥ ఇందు ॥ 2

## శంకరాభరణం

చేతులెత్తి మొక్కరమ్మ చేరి యారతెత్తరమ్మ
యేతులే బూమెల్లా నిండె నీదేవదేవునికి ॥ పల్లవి ॥

తతిగొని పన్నీటిధారలు పై వించివించి
సతముగాఁ బెద్దలు మజ్జనమార్చఁగా
అతివలచనుఁగొండ లంగము లొత్తినందుకు
యితవులై తోఁచె నేఁడు యిందిరాపతికి ॥ చేతు ॥

కప్పురపుధూళి మేనఁ గలయఁగ గంపెఁదేసి
నెప్పున సందుసందుల నిగిడించఁగా
చొప్పులెత్తి గొల్లెతలచూపులు దాఁకినకుమ్మె-
లప్పు దన్నియునుఁ గప్పె నందువల్ల హారికి ॥ చేతు ॥

తట్టుపుణుఁ గలఁది యందపుటలమేలుమంగ-
నట్టే పురముమీఁద నమరించఁగా
నెట్టనఁ బచ్చిసేసిననెలఁతలచేఁతలలో
చిట్టకములెల్లాఁ గప్పె శ్రీవేంకటపతికి ॥ చేతు ॥ 3

బౌళి

ముగురువేలుపులకు మూల మీతఁడు
జిగిమీరి నెదుటను సేవించరే ॥ పల్లవి ॥

అంచలఁ బన్నీటిబిందె లందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా
వంచి సముద్రముమీఁద వానలు గురిసినట్టు
పొంచి యన్నిటాను ఉప్పొంగుచునున్నాఁడు ॥ ముగు ॥

పచ్చకప్పురము మేనఁ బలుమారు మెత్తఁగాను
తచ్చి పున్నమచంద్రుఁడే తానై వున్నాఁడు
అచ్చపుఁదట్టుపుణుఁగు ఆమీఁదఁ బుయ్యఁగాను
నిచ్చఁ గల్పకతరువునీడయై వున్నాఁడు ॥ ముగు ॥

అలమేలుమంగతోడ నన్నిసొమ్ములు నించఁగా
పలుపంచవన్నెలసంపద యైనాఁడు
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ బ్రతాపించి
తలికి పుణ్యాలకెల్లా గురియైనాఁడు ॥ ముగు ॥ 4

లలిత

మహిమెల్లాఁ దొప్పఁదోఁగె మజ్జనవేళ
సహజశృంగారాలు జడిసె శ్రీపతికి ॥పల్లవి॥

ముత్తేలవాసలెల్ల ముంచి కురిసినయట్టు
హత్తి పన్నీట జలకమాయ హరికి
తత్తరానఁ దెల్లమొయిలు తనుఁ బొదిగినయట్లు
కొత్తగాఁ గప్పురకాపు గుప్పిరి దేవునికి ॥మహి॥

నీలపుఁబేరులెల్లా నిండాఁ గట్టినయట్టు
తేలఁ దట్టుపుణఁగు మెత్తిరి పతికి
ఆలరిమెఱుఁగుఁదీగె లలముకొనినయట్టు
కోలుముందై సొమ్ములెల్లా గుప్పిరి విష్ణునికి ॥మహి॥

పెక్కునవరత్నములు పెద్దరాసి వోసినట్టు
యెక్కువదండలు గట్టిరి మూరితికి
వొక్కట నలమేలుమంగ నురమునఁ గట్టిరిదె
చిక్కనినవ్వులు మించె శ్రీవేంకటేశునకు ॥మహి॥ 5

మలహరి

ఏకతాన వున్నవాఁడు యిదివో వీఁడె
చేకొని మొక్కరో మీరు చేతులెత్తి యిపుడు ॥పల్లవి॥

మంచిమంచిపన్నీట మజ్జన మవధరించి
పంచమహావాద్యాలతో పరమాత్ముఁడు
అంచలఁ గప్పురకాపు అంగముల మెత్తుకొని
కొంచక నిలుచున్నాఁడు గోణాముతోడను ॥ఏక॥

తట్టుపుణుఁగామీఁద దట్టముగ నించుకొని
తెట్టలై వేదనాదాల దేవదేవుఁడు
గుట్టుతోడ సొమ్ములెల్లా(?)గుచ్చికుచ్చి కట్టుకొని
వెట్టదీర సురట్ల విసరించుకొంటాను ॥ఏక॥

తనిసి యలమేల్మంగఁ దాళిగాఁ గట్టుకొనె
వెనుకొని యిదెవో శ్రీవేంకటేశుఁడు
మునుకొని యారగించి మూఁడులోకములు మెచ్చ
చనవరిసతులతో సరసమాడుతాను ॥ఏక॥ 6

---

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, తిరుపతి. కా. 2,000.

తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 2

# అధ్యాత్మ సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త

కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

1998

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు. ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం.

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు.

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి.

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది. తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు.

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు. క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి.

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు.

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి.

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి.

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు.

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రింపబడ్డాయి.

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది.

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది.

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాధరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు.

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది. తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి. తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది.

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది.

ప్రథమతః తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం. శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A ,Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం.

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం.

**M.K.R. వినాయక్**<br>
కార్యనిర్వహణాధికారి<br>
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి, ప్రపత్తి, దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు, జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు పల్లవి, చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై 'పదకవితాపితామహుడ'ని కీర్తి గడించాడు అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు అన్నమయ్య గ్రాంధిక, శిష్టవ్యావహారిక, వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు, ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది. అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక, ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు, పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు, 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి

తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ, మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీరికలు యధాతథంగా ముద్రింపబడుచున్నాయి పరిష్కర్తచే పీరికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ, పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి, మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి

ఈ సంపుటాల ముద్రణకు ఆధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం కె.ఆర్ వినాయక్ I A S గారికి కృతజ్ఞతాంజలి

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త), విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యుమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A , Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి, తి తి దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు

డా॥ మేడసాని మోహన్ M A , Ph D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

తేది 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| ంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| ంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది. ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి. పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు. ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి. అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి. వివిధ దశలలో 5, 6, 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి. వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు. ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు.

# పీ ఠి క

రామానుజీయసిద్ధాంతరథ్యావిహరణవ్రతం।
ఆత్మసాత్కృతశేషాద్రినాయకం తం భజేఽన్నమమ్॥

పాతకాలమున 50 రేకుల కొకసంపుటముగ ముద్రణమంది చెల్లిపోయిన అధ్యాత్మకీర్తనలసంపుటములలో, ఇప్పుడు వందరేకుల కొకసంపుటముగ వెలువరించువానిలో రెండవసంపుట మిది. ఇందులో అధ్యాత్మకీర్తనముల 101 రేకునుండి 150 రేకుల వరకుగల 50 రేకుల లోని 284 సంకీర్తనములను, 6-వ సంపుటముగా శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులవారు 1951 లో ప్రచురించిరి. ఈ 50 రేకులలో 121 నుండి 130 వరకుగల 10 రేకులు నాడూ నేడూ కూడ దొరకలేదు.

అదేసంవత్సరమున 151 నుండి 200 రేకుల వరకుగల 50 రేకుల-లోని 285 పాటలను, పూజ్యపాదులు కీర్తిశేషులు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారూ, శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులును కలిసి 7-వ సంపుటముగా వెలయించిరి. ఆరెండుసంపుటములకు చెందిన 100 రేకులలోని 519 అధ్యాత్మకీర్తనలు ఇప్పుడీరెండవసంపుట-మున సుపరిష్కృతపద్ధతిలో వెలువరింపబడుచున్నవి.

పూర్వపరిష్కరణమునకు ఇప్పటి పరిష్కరణమునకు ఏవైన భేదములున్నచో అవియన్నియు, పాదదీపికలో (Foot notes) ౧,౨,౩ వగైరా గుర్తులతో సూచించియున్నాను.

నేను పరిష్కరించిన ప్రతిసంపుటమునందు పీఠికలో ఏదోవొక వ్యాకరణ విశేషమును చర్చించుచూ వచ్చితిని. అధ్యాత్మసంకీర్తనల-సంపుటములందుమాత్రము వేదాంతవిషయములకే పీఠికలో ప్రాధాన్య మివ్వదలచితిని. అధ్యాత్మకీర్తనల తొలివందరేకులకు సంబంధించిన-

మొదటిసంపుటములో, 'అన్నమయ్య వేదాంతము' అను విషయముపై సంగ్రహముగ చర్చ సాగించితిని. ప్రకృత సంపుటమునందు ప్రపత్తి - శరణాగతి - పంచసంస్కారముల*ను గూర్చి లఘువుగ చర్చింపదలచితిని. తొలుత శరణాగతినిగూర్చి విచారింతము

## శరణాగతి

శరణం యథాతథా ఆగతిః' అని విగ్రహవాక్యము కావచ్చు. ఆగతిః అను పదము విరువనిచో శరణాగతి యను దీర్ఘము కుదురదు. శరణశబ్దము అకారాంతము గదా! "శరణం గృహరక్షిత్రోః" అని అమరము గృహమును, రక్షకుడైన వానిని ఈ శబ్దము చెప్పుచున్నది. కాని పాంచరాత్రమునకు సంబంధించిన సంహితలలో

"ఉపాయే గృహరక్షిత్రోశ్శబ్దః శరణమిత్యయం
వర్తతే, సాంప్రతం చైష ఉపాయార్థైకవాచకః"

(అహిర్బుధ్న్యసంహిత. 3—7—28)

ఉపాయమునకుగూడ ఈశబ్దము వాచకమనీ, శరణాగతి శబ్దమునందు ఉపాయమే ప్రధానముగ గ్రహింపబడినదనీ తెలియుచున్నది. భర్తను పరమపదమునకు తీసికొనిపోవుటకు, భగవంతు డొకడే సాధనము అని దాని అర్థము. ఈ శరణాగతి ఆరువిధములుగ పేర్కొనబడినది.

---

* శరణాగతి పంచసంస్కారములనుగూర్చి నాకు సతీర్థ్యులు, సహోపాధ్యాయులుగ నుండినవారు, సహృదయులు నగు శ్రీమాన్ టి. ఏ. కృష్ణమాచార్యుల నుండి, ప్రపత్తిని గూర్చి శ్రీమాన్ కందాడై-శేషాచార్యుల ఆంధ్రీకృతియగు 'రహస్యత్రయసారము' నుండి, శ్రీమాన్ కుంటిమద్ది శేషశర్మగారి 'శ్రీమద్రామాయణ పర్యావలోకనము నుండియు విషయములు గ్రహింపబడినవి.

ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం।
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా।
ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః॥

అని వచనము. ఈ ఆరింటియందును ఆత్మనిక్షేపము అంగిగా, తక్కినవి ఐదును దానికి అంగములుగా చెప్పబడుచున్నవి. యోగమునకుకూడ యమ - నియమ - ఆసన - ప్రాణాయామ - ప్రత్యాహార ధ్యాన - ధారణ - సమాధులు అష్టాంగములుగా పేర్కొనబడినను, వానిలో సమాధి అంగిగా, తక్కినవి దానికి అంగములుగా పేర్కొనబడినట్లే, షడ్విధశరణాగతిలో కూడ మనము గ్రహింపవలసియున్నది.

1, ఆనుకూల్య సంకల్పము :

"శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా" అను భగవద్వచనాను సారము, శ్రుతిస్మృతులలో చెప్పబడిన నిత్యనైమిత్తికములందు, భగవద్విషయమునందు మాత్రమే శ్రద్ధ గలిగియుండునటుల సంకల్పించుకొనుట.

2. ప్రాతికూల్య వర్జనము :

భగవద్వ్యతిరిక్తములు, భగవద్విరుద్ధములు అగు విషయములను పరిత్యజించుట.

3. రక్షిష్యతీతి విశ్వాసము :

భగవంతుడు తప్పక నన్ను రక్షించును, అను గాఢశ్రద్ధ.

4 గోప్తృత్వ వరణము :

నీవుతప్ప నాకు వేరు రక్షకుడు లేడు అని, భగవంతునినే తనకు రక్షకుడుగా నిర్ణయించుకొనుట.

**౫. ఆత్మ నిక్షేపము :**

తనకు సంబంధించిన సర్వభారమును (పోషణము, రక్షణము, ఆపదలనుండి కాపాడుట, పరమగతికి తీసికొనిపోవుట వగైరాను) స్వామికే సమర్పించుట.

**౬. కార్పణ్యము :**

నేను అకించనుడను, అన్యథా గతిలేనివాడను. నాకు నీవే దిక్కు. నన్ను తప్పక కాపాడవలెను అని, తన దీనత్వమును చాటుకొనుట.

ఈ ఆరింటిలోను పైన చెప్పినట్లు ఆత్మనిక్షేపము అంగిగా, తక్కినవి అంగములుగా పరిగ్రహించవలెను.

విక్షేపాపరపర్యాయః న్యాసః పంచాంగసంయుతః ।
సన్న్యాస స్త్యాగ ఇత్యుక్తః శరణాగతిరిత్యపి ॥

అను వచనముతో స్పష్టమగుచున్నది. దీనిని భరన్యాసమని కూడ వ్యవహరించుచున్నారు. అందు కనియే సన్న్యాసము = ఇహాముత్ర ఫలభోగనిరాసము అని వ్యవహరించుచుందురు. ఇతరమతములలో సన్న్యాసాశ్రమమునకు పెద్దవిలువ కలదు. శ్రీవైష్ణవసంప్రదాయము-నందు సన్న్యాసులకు అంత పెద్దవిలువ కానరాదు శ్రీవైష్ణవుడుగ పుట్టినప్రతిప్రాణియు శరణాగతి పొందినవాడుగనే చెప్పబడు-చున్నాడు. గృహస్థాశ్రమమును వదలియుండుటమాత్రమే శ్రీవైష్ణవసన్న్యాసులలో విశిష్టత. "ఋణానిత్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్" అను మనువచనము ప్రకారము దేవర్షిపితౄణములు మూడును చెల్లివవెనుక సన్న్యాసము వీరిలో పద్ధతి. ఇతర-మతములందు నైష్ఠికబ్రహ్మచారిగనే ఉండి "యదహారేవ విరజేత్ తదహారేవ ప్రవజేత్" అను వచనము ప్రకారము బ్రహ్మచర్యాశ్ర

మమునుండియే సన్న్యసించి పీఠాధిపతులగుట కలదు. ఇతరులలో కూడ గృహస్థాశ్రమమునుండి సన్న్యసించినవారికి అంతపెద్దవిలువ లేదనియే చెప్పవచ్చును.

❊

# శరణాగతి పద్ధతి

"అహమస్మ్యపరాధానా మాలయోఽకించనోఽగతిః
త్వమేవోపాయభూతో మే భవేతి ప్రార్థనామతిః
శరణాగతి రిత్యుక్తా సా దేవేఽస్మిన్ ప్రయుజ్యతామ్"

(అహిర్బుధ్న్య సంహిత 36–38)

అను వచనము ప్రకారము అకించనః = ఉపాయరహితః (ఏ ఉపాయము లేనివాడను), అగతిః = రక్షకాంతరరహితః (నన్ను రక్షించు వేరు దిక్కెవ్వడు లేనివాడను) అను భావముతో నీవే నన్ను దరిజేర్చుటకు ఉపాయభూతుడవు అని ప్రార్థించి శరణు పొందుటయే శరణాగతి. ఇట్లు శరణాగతుడైనప్పుడే. వీడు ఏదిక్కులేనివాడు నన్నే నమ్ముకొన్నవాడు నేనే వీనిని తప్పక ఉద్ధరించవలెను అను భావముతో, స్వామి ఆ భక్తుని తప్పక ఉద్ధరించును అని శ్రీవైష్ణవ సిద్ధాంతము. ఇందు కుదాహరణముగ గజేంద్రమోక్ష కథా వగైరాదులను ఉదాహరించుచుందురు. గజేంద్రుడు కొన్ని యేండ్లు మకరితో పోరాడి, తన బలముచేతనే మకరిని జయించి, తన్ను రక్షించుకొనవ-గలనను ఉద్దేశముతో తాను పోరాడినంతకాలమూ, స్వామి తనకు పట్టనట్లే వుండివాడు. రానురాను ఆ గజేంద్రుడు క్షీణబలుడై, తన-శక్తికి మించిన ప్రభుశక్తియే ఈ మకరిని చంపి నన్ను రక్షించగలదు

అను ఉద్దేశముతో భగవంతుని స్వరూపమును, శ్రుతిస్మృతులలో వేర్కొన్నదానిని గానము చేసినాడు ఫలములేదు. తుదకు

నాయం వేద సమంత్మానం యచ్ఛక్త్యాహంధియా హతః
తం దురత్యయమాహాత్మ్యం భగవంతమితోఽస్మ్యహమ్॥
(భాగవతము 8–3–29)

అను వచనముతో స్వామిని శరణాగతి పొందినాడు. అప్పుడే స్వామి కరుణించి, గజేంద్రుని తనవానినిగా స్వీకరించి పరుగెత్తి వచ్చినాడు. మకరిని చంపి కాపాడినాడు. ఈఘట్టమునందు పోతన స్పష్టముగ

ఓ కమలాప్త! యోవరద! యో ప్రతిపక్షవిపక్షదూర! కు-
య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యోశరణాగతామరా-
నోకహ! యో మునీశ్వరమనోహర! యోవిమలప్రభావ! రా
వే, కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే॥
(ఆంధ్రమహాభాగవతము 8–92)

అను పద్యములో 'శరణార్థిని' అను పదమును ప్రయోగించి శరణాగతికి ఉన్న మహిమను చాటినాడు సంస్కృత భాగవతములోని అహం=నేను; ఇతః=శరణంగతః, అస్మి=ఉన్నాను అను అర్థమునకు ప్రతీకమిది

★

# ప్రపత్తి

ప్రకృష్టం యథాతథా పద్యతే ఇతి ప్రపత్తిః అని విగ్రహము.

సాధనం భగవత్ప్రాప్తౌ స ఏవేతి స్థిరా మతిః
సాధ్యభక్తిః స్మృతా, సైవ ప్రపత్తిరితి గీయతే ॥

అని భగవచ్ఛాస్త్రము.

ప్రపత్తిః = మానసికాధ్యవసాయాత్మకజ్ఞానము. భగవంతు డొక్కడే నాకురక్షకుడు అనుగట్టివిశ్వాసము.

" అభీష్టే దుస్సాధ్యే స్వత ఇతరతో వా క్వచన తత్
భరన్యాసం యాచ్ఞాన్విత మభివదంతి ప్రపదనం ।
ఇతః పశ్చా దస్మద్వ్యతనవిరపేక్షేణ భవతా
సమర్థ్యోఽపావర్గ స్త్వితి మతివిశేషం తదవిదుః ॥

— రహస్యత్రయసారము, సాంగప్రపదనాధికారం—1.

దీనితో జీవుడు స్వామికి తనసర్వస్వమును సమర్పించుకొనుటయే ప్రపత్తి అని తెలియుచున్నది.

అహం మద్రక్షణభరో మద్రక్షణఫలం తథా ।
నమమ శ్రీపతేరేవేఽత్యాత్మానం నిక్షిపేద్బుధః ॥

— న్యాస దశకము.

ఇత్యాదులతో అహం = [భగవంతుని అపరప్రకృతియగు పంచభూతములతో సృష్టింపబడి, సుఖదుఃఖములకు లోనవుతూ మోహాబద్ధుడగు సంసారిజీవుడు, అనంతసంసారములో తెలిసి తెలియక చేసినపనుల వలన కలిగినతఆచార్యకృపావిశేషమువలన, ముక్తికి ఉపాయముగా ప్రపత్తినే గ్రహించదలచిన జీవుడు, నారాయణేతర దైవములను

ఆశ్రయింపనివాడు, ఇతర దైవతములకు బంటుకానివాడు, ప్రపత్తి తప్ప ఇతరోపాయములను ఆశ్రయింపని జీవుడు.] అగు నేను; న మమ=నాకుగా కాను, శ్రీపతేరేవ=లక్ష్మీపతికే నేను దాసుడను. అని ఆత్మానం = తనను నిక్షిపేత్ = సమర్పించుకోవలెను. అట్లనే మద్రక్షణభరః = నన్ను రక్షించుకొనే భారముకూడ, న మమ = నాకు కాదు; మద్రక్షణఫలం = నన్ను రక్షించినదానివల్ల లోకమునకు గాని, స్వామికిగాని, ఏదైనాకలిగే ఫలితముంటే అదికూడ, న మమ= నాకు కాదు; శ్రీపతేరేవ=ఇవన్నియు లక్ష్మీపతికే సమర్పితములగు చున్నవి. అని భరన్యాసమును చేయుటయే ప్రపత్తి అని వడగల సంప్రదాయమువారు చెప్పుచుందురు. పైవిధముగ శరణాగతి పొంది ఇట్లు భరన్యాసము చేసినవానిని, స్వామి తప్పక కటాక్షించి కడతేర్చు నని వీరిభావము. జీవునికి స్వరక్షణశక్తిగాని పరరక్షణశక్తిగాని లోత్తిగా లేదనియే

"స్వయం మృత్పిండభూతస్య పరతంత్రస్య దేహినః।
స్వరక్షణే ప్యశక్తస్య కోహేతుః పరరక్షణే ॥"

— రహస్యత్రయసారము 168 పుట.

ఇత్యాది శ్లోకములలో స్పష్టముగ అర్థమగుచున్నది శరణాగతిలో చెప్పిన ఆత్మనిక్షేపమే "ఆత్మాత్మీయ భరన్యాసోహ్యాత్మనిక్షేప ఉచ్యతే" ఇత్యాదివాక్యములతో విశేషమగు భరన్యాసమునే ప్రపత్తిగా ఈతెగవారు భావించుచుందురు

వపురాదిషు యోపికోపివా గుణతోసాని యథాతథావిధః।
తదయం తవపాదపద్మయో రహ మద్యైవ మయా సమర్పితః॥

— రహస్యత్రయసారము 171 పుట.

అను ఆళవందార్ స్తోత్ర పద్యముకూడ ఈ ప్రపత్తికే ఎక్కువగ సహాయపడుచున్నది. ఒక్కమాటలో చెప్పవలెనంటే తననూ, తన

సర్వస్వమునూ స్వామికే సమర్పించి నేటినుండి, నేను నీ వాడ నను- టయే శరన్యాసపరమార్థముగ కనబడుచున్నది శరణాగతికి ప్రపత్తికి పెద్దభేదము లేదని తెంగలె వైష్ణవులు శరణాగతి యున్నను ప్రపత్తి విశిష్టమైనదని వడగలవాండ్లును వ్యవహరించుకొనుచుందురు. మా అన్నమయ్య శరణాగతిని ప్రపత్తిని రెండింటిని పలుతావుల వాడి యున్నందున ఈయన తెంగలవాడో వడగలవాడో నిర్ధరించుట కష్టమనిపించుచున్నది.

నాదరామక్రియ

ప్రపన్నులకు విధి పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥ పల్లవి ॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము ॥ ప్రప ॥

దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

(ఈ సంపుటము పాట—317)

ఇంతకూ ఈ వ్యవహారములో దూరముగ నుండుటయే మంచిదని నా భావము.

నేటికాళ్ళపాకవంశీయులుమాత్రము వడగలనామమునే ధరించుచున్నారనుట నిర్వివాదము.

# పంచ సంస్కారములు

శ్రీవైష్ణవమతదీక్ష పుచ్చుకొనువారికి పంచ సంస్కారములు అతిప్రధానములు

తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః
అమీ పరమసంస్కారా పారమైకాంత్యహేతవః ॥

1. తాపము :

తాపము = ముద్రాధారణము. రెండు భుజములందును శంఖ చక్రములు కాల్చి ముద్రించుకొనుట. దీనినే సమాశ్రయణమనియు-నందురు.

2. పుండ్రము :

ముఖమున ఊర్ధ్వపుండ్రము ధరింతురు. శ్రీవైష్ణవమతదీక్ష ఇచ్చునపుడు ఆదీక్ష ఇచ్చుగురువే, ముఖముననున్న ఊర్ధ్వపుండ్ర-ములు కాక భుజములు, వక్షస్థలము, ఉదరము, కంఠము మొదలగు-స్థలములయందు మరి పదకొండు ఊర్ధ్వపుండ్రములు, దీక్షపొందు వానికి ధరింపజేతురు. ముఖమునందున్న దానితోకూడ ఈపదకొండు కలిసి ద్వాదశోర్ధ్వపుండ్రములుగా ప్రసిద్ధికెక్కినవి.

3 నామము :

నామకరణసమయమున తల్లిదండ్రులు పెట్టినపేరుకాక, దీక్షా సమయమున దీక్షానామముగ 'రామానుజదాసః' 'శ్రీనివాసదాసః' ఇత్యాదిపేర్లుంచి వ్యవహరింతురు. 'దీక్షాజన్మ తృతీయం స్యాత్' అని మంత్రశాస్త్రముగూడ.

4 మంత్రము :

వీరికి ప్రధానమంత్రము "ఓం నమోనారాయణాయ" అను అష్టాక్షరియే. ఇది కాక ద్వయమని రెండు మంత్రములను కూడ ఉపదేశింతురు.

1. శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే
2. ఓం నమో భగవతే నారాయణాయ

అనునవి. ఈమంత్రములను నిత్యమూ యథాశక్తి జపించుచుండుట శ్రీవైష్ణవదీక్షలో ఒక భాగము.

5. యాగము :

ఈ శబ్దము 'యజ దేవపూజాయాం' అను ధాతువునుండి పుట్టినది. శ్రీ వైష్ణవమతసిద్ధాంతముప్రకారము భగవదారాధన పద్ధతినుపదేశింతురు. ఈ ఐదుసంస్కారములు పరమైకాంతులుగ (భగవంతునికి చాలసన్నిహితులుగ) నగుటకు కారణములని శ్రీ వైష్ణవ సిద్ధాంతము.

మన అన్నమయ్య ఈ పంచసంస్కారములను విష్ణునామక యతిచే పొందినట్లు చిన్నన్న తెలిపినాడు. వీరికి శరణాగతి, ఆశరణాగతి పొందినదానికి ఫలితముగా కూడా శ్రీమద్రామాయణ, భారత, వరాహపురాణములనుండి మూడు చరమశ్లోకములను ఉదాహరించుచుందురు.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యః దదామ్యేత ద్వ్రతం మమ॥"
— శ్రీమద్రామాయణము.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వా సర్వ పాపేభ్యః మోక్షయిష్యామి మాశుచః॥"
— మహాభారతము.

స్థితే మనసి, సుస్వస్థే శరీరే సతి, యోనరః
ధాతుసామ్యే స్థితే స్మర్తా విశ్వరూపం చ మామజం।
తత స్తం మ్రియమాణంతు కాష్ఠపాషాణసన్నిభమ్
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్ ॥

— వరాహపురాణము.

ఇది వరాహపురాణ చరమశ్లోకముగా ప్రసిద్ధము.

శరణాగతి పొంది, నిరంతరము అష్టాక్షరిమంత్ర-ద్వయోపాసకునకు అవసానకాలమందు భగవన్నామస్మరణము అత్యావసరము, తప్పక కలుగవలెనుకూడ కాని అవసానకాలమున, వాతకఫాదులతో అడ్డగింపబడిన కంఠముకలిగి, స్మృతిదప్పి పడియున్నవానికి భగవన్నామస్మరణము కలుగకపోవచ్చును. అట్టి యవసానస్థితిలోకూడ వానిని నేనుద్ధరించుచున్నాను. బాగున్నకాలమున నన్ను స్మరించిననాభక్తుని, కొయ్యవలెనో - రాతివలెనో అపస్మారస్థితిలోనున్నవానిని నేనే స్మరింతును. నేనే వానిని పరమగతికి తీసికొనిపోవుదును. అను భగవద్వచనముగలవరాహచరమశ్లోకము స్వామికరుణను ఎంత గొప్పగ చాటుచున్నదబ్బా.

మన అన్నమయ్య పైె చెప్పిన పంచసంస్కారములను తాను పొందినట్లు, గురుముఖముగ విశిష్టమైన యాగమును తాను చేయించుకొనినట్లు ఈ క్రిందిపాటలవలన అర్థమగుచున్నది

ధన్నాసి

జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము
నానార్థములు విన్నే నడపె మాగురుఁడు ॥ పల్లవి ॥

అలరి దేహమనేటియాగశాలలోన
బలువై యజ్ఞానపుపశువు బంధించి
కలసివైరాగ్యపుకత్తుల గోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు ॥ జ్ఞాన ॥

మొక్కుచు వైష్ణవులనేమునిసభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థసోమపానము[1] వించి
చక్కగాఁ సంకీర్తనసామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁబో-మాగురుఁడు ॥ జ్ఞాన ॥

తదియ్యగురుప్రసాదపుపురోడాశ మిచ్చి
కొదదీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు విటు ప్రత్యక్షముచేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మా గురుఁడు ॥ జ్ఞాన ॥

(ఈ సంపుటము పాట - 148)

దేసాళం

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥ పల్లవి ॥

యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి -
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడేకా వుపదేశమిచ్చె నష్టాక్షరిమంత్ర -
మీతఁడే రామానుజులు యిహపరదైవము ॥ గతు ॥

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము ॥ గతు ॥

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశునగమెక్కె వాకిటను
దయఁజూచి మమ్ము నిట్టే తల్లిదండ్రిదైవము ॥ గతు ॥

(ఈ సంపుటము పాట - 372)

---

[1] ఈ శ్రీ పాదతీర్థపద్ధతి వడగల వారికి లేదందురు.

ఈపంచసంస్కార-శరణాగతి-ప్రపత్తులను నమ్మినవాడు నిత్య-నైమిత్తిక కర్మలను తప్ప, కామ్యకర్మలను ఆచరింపరాదు. ఇతర-దేవతలను కొలువరాదు అను వైష్ణవసిద్ధాంతమును అన్నమయ్య ఈసంపుటము 22వ పాటలో చాటుకొన్నాడు.

గుజ్జరి

కలదిదివో సుఖము గలిగినను గర్వము విడువక మానునా
మలసి కామ్యకర్మములకుఁ జొచ్చిన మగుడఁ బుట్టువులు
మానునా ॥పల్లవి॥

పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులుగట్టిన నలబ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మినవరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము
వదలు ॥కల॥

అలరినసంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపున నొక యిఱ్ఱిఁ బెంచినంతనే తనకును నాజూవు దగిలె
ములుగుచు లంపటములు దెగవిడిచి మోక్షము వెదకెటివరుఁడు
వలవనిదుస్సంగతులు పెంచినను వాసన లంటక మానునా
॥కల॥

అటుగన శాఁబట్టినవ్రత ముండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోక్షుఁడై నట్లు
తటుకన శ్రీవేంకటపతి నొక్కనిదాస్యము భజియించినవరుఁడు
ఘటనల నాతనికైంకర్యములకు కడుఁబాత్రుఁడుగాక మానునా
॥కల॥

(ఈ సంపుటము పాట—22)

ఈ దీక్షపొందిన వారలలో నారద సనక సనందనాదులు ముఖ్యులని, వారితోపాటు వైకుంఠముననున్న అన్నమయ్యను కలిపి, పెదతిరుమలయ్యయో లేదా చినతిరుమలయ్యయో పాడినపాటగ ఈ సంపుటములో 24-వ పాటగా ప్రకటింపబడుచున్నది.

లలిత

శరణంటి మాతవినవమ్మ౦ధమునఁ
మరిగించి మమునేలి మన్నించవే ॥ పల్లవి ॥

సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి వినఁ బాడి పావనుఁడైన-
అకలంకుఁడు తాళ్ళపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవేంకటనిలయ ॥ శర ॥

నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి విన్నఁబాడి పెద్దలైనట్టి-
ఆరీతిఁ దాళ్ళపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టి శ్రీవేంకటనిలయ ॥ శర ॥

సామవేదసామగానసప్తస్వరములను
బాముతో వీనతి విన్నఁ బాడినయట్టి-
ఆముకొన్నతాళ్ళపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా ॥ శర ॥

(ఈసంపుటము పాట—24)

వారందరూ నిత్యసూరులని వ్యవహరింపబడుచుందురు. వారిని గూర్చి ఈ క్రింది పాటలో ఘనముగ కొనియాడినాడు.

వరాళి

అదివో నిత్యసూరులు అచ్యుత నీదాసులు
యెదురులేనివారు యేకాంగవీరులు ॥ పల్లవి ॥

రచ్చల సంసారమనేరణరంగములోన
తచ్చి కామక్రోధాలతలలు గొట్టి
అచ్చపుతిరుమంత్రపుటారుపుబొబ్బలతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

మొరసి పుట్టుగులనేముచ్చుఁబోఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి
పోరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁ దూరి
యెరగొని తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

వొడ్డినదేహములనేవూళ్ళలోపల చొచ్చి
చెడ్డయహంకారమను(మనః?)చెఱలు వట్టి
అడ్డమై శ్రీవేంకటేశు నండనుండి లోకులనే-
యెడ్డలఁ జూచి నవ్వేరు యేకాంగవీరులు ॥ అది ॥

(ఈ సంపుటము. పాట—25)

ఇది అన్నమయ్యదే.

తప్త చక్రాంకమును పరిహాసించేఇతరమతస్థులకు తెలిపెడిగాఁ ఆ చక్రాంకనము వేద ప్రసిద్ధమని అన్నమయ్య 485-వ పాటలో స్పష్టము చేసినాడు.

రామక్రియ

అదె శిరశ్చక్రములేనట్టిదేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో ॥ పల్లవి ॥

"అనాయుధాసో అసురా అదేవా" యని
ంగ ఋగ్వేదము దెలిపెడి
విష్ణుచక్రధారణకును
మందే తెలియరో ॥ అదె ॥

"యచ్చ యింద్రే" యని "యచ్చ సూర్యే" యని
అచ్చుగ తుదకెక్కె (క్కె?) నదె పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణ మందే తెలియరో ॥ అదె ॥

మును "నేమినా త్తముద్రాం ధారయే" త్తని
వెనువెంటశ్రుతి యదె వెల్లవిరిసేసీని
మొనసి శ్రీవేంకటేశు ముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో ॥ అదె ॥

(ఈసంపుటము పాట 485)

'అనాయుధాసో' అను ఋక్కును గూర్చి మాదేవస్థానములో వేద-పారాయణమును చేయు బ్రహ్మశ్రీ వేదమూర్తులు సుబ్బావధానుల-వారి నడుగగా, ఈక్రింది ఋక్కును వారు వ్రాసి ఇచ్చినారు. దానినే ఇందు చూపుచున్నాను.

"తిగ్మ మాయుధీం మరుతా మనీకం క స్త ఇంద్రపతి వజ్రం దదర్శ।
అనాయుధాసో అసురా అదేవా శ్చక్రేణ తాం అపవపఋజీషిన్ ॥
మహఉగ్రాయ తవసే సువృక్తిం ప్రేరయ శివతమాయ పశ్వః।
గిర్వాహసే గిర ఇంద్రాయ పూర్వీర్ధేహి తన్వే కువిదంగ వేదత్ ॥
ఉక్థవాహసే విభ్వే మనీషాం"

(ఋగ్వేదము—8వ అష్టకము, 8వ అధ్యాయము—33-వర్గము)

దీనియర్థము ఋగ్వేదభాష్యముతో తెలియదగినది. వీనివలన మన అన్నమయ్య వేదప్రమాణసిద్ధమైనవిగా తెలిసికొనియే, పంచ-సంస్కారములతో శ్రీవైష్ణవమతదీక్షను పుచ్చుకొన్నాడని తెలియుచున్నది. అందువలననే ఆమతదీక్షయందు గాఢశ్రద్ధ గలిగి, ఆ సంప్ర-దాయానుసారముగనే స్వామినారాధించి, సిద్ధి పొందినవాడని తెలియుచున్నది.

ఆహిరి

విడువరా దెంతైనా వెట్టివాడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును ॥ పల్లవి ॥

జ్ఞానము నే నెఱఁగ నజ్ఞానము నే నెఱఁగను
మానను విషయములు మరిగెంతైనా
నీనామము నొడిగి నీదానుఁడ ననుకొందు
దీనికే వహించుకొని తిద్దుకో నన్నును ॥ విడు ॥

అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకటసంసారముపై పాటు మానను
వొకపనివాఁడనై వూని ముద్రధారినైతి
మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును ॥ విడు ॥

వెనకఁ గానను ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మొక్కేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కని పోవిడువరాదు కరుణించు నన్నును ॥ విడు ॥

(ఈసంపుటము పాట 2)

అందుకనియే ఈ రెండవపాటలో 'కడవారు' నవ్వకుండా అను పదముతో, నేనొకమతమువారిలో పుట్టి నీమతము స్వీకరించితిని. నాఇన్మమతమువారు నన్ను నవ్వకుండునట్లు నన్ను కాపాడుము అని స్వామికి నివేదించుకొన్నాడు. ఈపాట రెండవచరణములోని "ఒకపనివాడనై వూని ముద్రధారినైతి" అనుదానితో, అనితరలభ్యసులభోపాయముతో దివ్యమోక్షసిద్ధిని గోరి నేను ముద్రాధారినైతిని అని స్పష్టము చేసికొనినాడు.

సాళంగనాట

దొరకె మాపాలికిఁ గందువయర్థము
దరిదాపై యుండినతత్వార్థము ॥ పల్లవి ॥

తిరముగ నల్లదివిఁ దెచ్చినయర్థ మిదివో
విరజవోడ రేవున వెళ్లినర్థము
పరమభాగవతులు పాఁతినర్థ మిదివో
పురుషోత్తముఁడనేటిపురుషార్థము ॥ దొర ॥

చందపువేదముఁ(లు?) శాసనము వేసినర్థము
ముందు సముద్రలకెల్లా మొదలర్థము
అందరియాత్మలనేటిఅంగళ్లలోవియర్థము
యెందు సహస్రనామపుటెన్నికర్థము ॥ దొర ॥

కొలచి బ్రహ్మాండముల కొప్పెరలోనర్థము
యిల విహపరముల కెక్కినర్థము
యెలమి హీనునినైన యెక్కుడుసేసేయర్థము
అలరి శ్రీవేంకటేశుఁడైనయర్థము ॥ దొర ॥

(ఈ సంపుటము పాట-8)

ఈ మూఁడవపాటలో, "ముందు సముద్రలకెల్లా మొదలర్థము" అనుదానితో ఈ ముద్రాధారణమునకు ప్రధానార్థము పురుషోత్తమ-సాన్నిధ్యమే అని చాటినాడు. ఈ పంచసంస్కారముల నంది, శ్రీ-వైష్ణవమతసంప్రదాయానుసారము నడచుకొను తనయందు చిల్లర-మల్లర దోషములు పవైనా కనపడితే, అవి ఆయారజస్తమోగుణ-ములప్రభావమేకాని, నాఆత్మ పరివర్తనము చెందినదనికాదు. అని గట్టిగా గద్దించి తెలిపినాడు. నేను నీమతదీక్ష బొంది నీవు నన్ను దరిచేర్తువని, గురుముఖముగ శరణాగతుడనై నడచుకొనుచున్న

నాయందు, దోషములేవైన ఉన్నచో అవి నాగురుని జూచియైన మన్నించవయ్యా అని, పరమపిధేయుడై వేడుకొనుచున్నాడు. తుదకు 'నీభక్తుడనైన నాకు ఏదైన ఆపద సంభవించినట్లైతే అది నీకే చెడ్డపేరు స్వామీ. కావున 'నిన్నుఁ జూచుకొని నన్ను నీవే ఏలవయ్యా' అని సూటిగా అడిగినాడు. చూడుడు:—

సాళఁగనాట

నాకు నందు కేమి వోదు నన్ను నీ వేమిచూచేవు
నీ కరుణ గలిగితే నించి చూపవయ్యా ॥ పల్లవి ॥

ఘోరమైనదేహపు దుర్గుణ మేమి గలిగిన
అరసిఁ బ్రకృతిఁ బోయి నడుగవయ్యా
నేరవినాజన్మముతో (లో?) నేరుపేమిగల్లా నన్ను
ధారుణిఁ బుట్టించినవిధాత నడుగవయ్యా ॥ నాకు ॥

పంచేంద్రియములలోని పాప మేమి గలిగినా
అంచెలఁగామునిఁబోయి అడుగవయ్యా
ముంచిననాకర్మములో మోసమేమి గలిగినా
మంచితనానఁ జేయించేమాయ నడుగవయ్యా ॥ నాకు ॥

అన్నిటా నా వెనకటి అపరాధ మేమిగల్లా
మన్నించి నాగురుఁ జూచి మానవయ్యా
మిన్నక శ్రీ వేంకటేశ మీఁదిపనులేమిగల్లా
నిన్నుఁజూచుకొని నన్ను నీవే యేలవయ్యా ॥ నాకు ॥

(ఈ సంపుటము పాట—28)

ఈపాటలో "కామోకార్షీత్ మన్యురకార్షీత్" అను శ్రుత్యర్థము నిగూఢమైయున్నదని భావింపవలసియున్నది.

భూపాళం

ఇవి సేయఁగ నే నలఁసుడ యెటువలె మోక్షం బడిగెదను
వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁగాక ॥ పల్లవి

జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగ జిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
అపరిమితదేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు ॥ ఇవి ॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలినపంచేంద్రియవిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళధర్మార్థకామంబులు మతియైశ్వర్యములకు మూలములు
అవలగ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము ॥ ఇవి ॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికివి సంసారభోగము
హరి వరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడిదాతవు
సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు వేకాలమును మమ్మును ॥ ఇవి ॥

(ఈ సంపుటము పాట—328)

కాని ఈపాటతో అన్నమయ్య సోమరివాడై, ఉపవాస వ్రతములు, తపోనిష్ఠలు మొదలైనవి సాగింపలేక, శరణాగతి సులభమని, ఆపద్ధతి నవలంబించినాడేమో అని అనుకొనవచ్చు. స్వామియే దిక్కని ఆతనిపైననే సర్వభారము నిడి, మనసా-వాచా-కర్మణా ఆతనినే సేవించుచు, ఇతరభోగములకు అఱ్ఱులు సాచక, తక్కువకాలములో ఫలమునిచ్చు ఇతరదేవతల నారాధింపక, జీవితాంతము శ్రీహరినే నమ్మి, తనను ఆతనిబంటుగనే భావించి, ఆతని-సంకీర్తనములందే మునిగి కాలముతోయుట ఇతరులకు సాధ్యమా? ఏదో దెబ్బతిన్నవాడు, బలవంతునిచే పీడింపబడినవాడు, తన ప్రాణ-

రక్షణకు ఒక దొడ్డవానిని తాత్కాలికముగ శరణని అనవచ్చు గాని, సర్వకాలమూ స్వామియందే మనసు నిలిపి, మోక్షార్థియై ఆతనిపరిచర్య-యందే కాలముగడుపుచుండుట అనెడిశరణాగతికి, ప్రాణరక్షణకోస-రము శరణనుశరణాగతికిని భేదములేదా ఈపై రెండు శరణాగతు-లకు, పూటగడచుటకు పడుపువృత్తి చేకొను పడతికిని, పతినే దైవముగా భావించి కాలముదోయుమహాపతివ్రతకును గలఅంతరువుగలదు

ఎంత శరణాగతిపొందినా, ఎంతప్రపత్తిచేసినా, ఎంతయోగియైనా పరిపూర్ణజ్ఞానముగలిగి, పరమాత్మ సాన్నిధ్యము సిద్ధించునంత వరకు లోకధర్మములను పాటింపవలసినదే అను భావమునూ, తన గురుభక్తిని ఈ క్రింది పాటలలో చాటుకొన్నాడు చూడుడు.

ధన్నాసి

హరిదాసులతోడ నవ్వులు సరెనాదు
గురుఁడు శిష్యుఁడునవేగుటి దప్పుఁగానా ॥పల్లవి॥

కోరి ముత్యపుఁజిప్పలఁ గురిసినవానయు
సారెఁబెంకులలోవాన సరియౌనా
శ్రీరమణుఁ డిన్నిటాఁ జేరియుండే నుండేఁగాక
సారెకుఁ బాత్రాపాత్ర సంగతింతా లేదా ॥హరి॥

మలయాద్రి మాఁకులును మహిమీఁదిమాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥హరి॥

అమరులజన్మములు నసురులజన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతేనాయఁగాక
తమితో నధికారిభేదములు లేవా ॥హరి॥

(4వసంపుటము పాట—44)

మలహరి

అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు ॥ పల్లవి ॥

అందరును సమమైతే నరుహానరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁగాక
బొందితో విప్రునిఁ దెచ్చి పూజించినట్టు వేరే -
పొందుగావిళునకముఁ బూజించఁదగునా ॥ అన్ని ॥

అన్నిమతములు సరియైతేను వాసిలేదా
చెన్నగుఁబురాణాలు చెప్పుఁగాక
యెన్నఁగ సౌర్ణాటంక మింతటానుఁ జెల్లినట్లు
సన్నపుఁదోలుబిళ్లలు సరిగాఁ జెల్లునా ॥ అన్ని ॥

గక్కనఁ బైరు వి త్తఁగా గాదము మొరచినట్లు
చిక్కనకర్మములెల్లాఁ జెలఁగేఁగాక
తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్లు
యెక్కడా మోక్షోపాయ మిఁకఁ జెప్పనున్నదా ॥ అన్ని ॥

(ఈసంపుటము పాట–170)

భక్తిబలముకలిగినప్రాణి, జంతువైనను, మనుజుడైనను భేదములేదు. భక్తిబలము లేనివాడు దొడ్డరాజైనను ప్రయోజనము లేదనువిషయమును ఈ 181 వ కీర్తనలో గొప్పగ చెప్పినాడు.

లలిత

ఇహమేకావి యిఁకఁ బరమేకావి
బహుళమై హరి నీపై భక్తే చాలు ॥ పల్లవి ॥

యెందు జనించిన నేమి యెచ్చోటనున్ననేమి
కందువనీదాస్యము గలిగితేఁ జాలు
అంది స్వర్గమేకావి అలనరకమేకావి
అందపునీనామము నా కబ్బుటే చాలు ॥ ఇహ ॥

దొరయైనఁ జాలుఁ గడుఁ దుచ్ఛపుబంటైనఁ జాలు
కరఁగి విన్నుఁదలఁచఁగలితేఁ జాలు
పరులుమెచ్చినమేలు పమ్మిదూషించినమేలు
హరినీసేవాపరుఁడౌటే చాలు ॥ ఇహ ॥

యిలఁ జదువులురాసీ యిటు రాకమానసీ
తలఁపు నీపాదములతగులే చాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను విట్టె
చలపట్టి నాకు నీశరణమేచాలు ॥ ఇహ ॥
(ఈ సంపుటము పాట–181)

దీనికి

"దివివా భువివా మమాస్తువాసః
నరకేవా నరకాంతక ప్రకామమ్।
అవధీరిత శారదారవిందౌ
చరణౌ తే మరణేఽపి సంశ్రయామి॥"

అని కులశేఖరాళ్వార్ ప్రతిపాదించిన ముకుందమాలాస్తవమును జ్ఞప్తికి తెచ్చుచున్నది ఈ పాట.

శరణాగతి పొందినవారికి సర్వోపాయములు శ్రీలక్ష్మీనాథుడే అన్నవిషయమును, తననిత్యానుష్ఠానములో నున్నదానిని, ఎంత చక్కగ ఈ 182 వ పాటలో చెప్పుకొన్నాడో గమనింపుడు.

మలహరి

సర్వోపాయముల (లు?) జగతి నాకితఁడే
పుర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే ॥ పల్లవి ॥

సకలగంగాదితీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరిణీజలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ జాతువడికైంకర్య
మిదియే ॥ సర్వో ॥

ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు లొగి భుజింపుటే నాకు
దినదినంబు
జపరహస్యోపదేశంబు లితనిపాదజలంబులు శరణనేటిసేవయొకటే
ఉపమింపఁ బుణ్యపురుషులదర్శనము నాకు నొగినిచటిబహువృక్ష
దర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షి
కలకలంబు ॥ సర్వో ॥

తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులఁ దగులుసంవాససహయోగంబు
వెలయ నిందుమహోత్సవంబు లిన్నియు నితనివిభవంబులెసఁగు
తిరునాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింతయు నాకు శ్రీవేంకటేశ్వరుని
శరణాగతి
అలరునానంపదలు యితని పట్టపురాణి అలమేలుమంగకడకంటి
చూపు ॥ సర్వో ॥

(ఈ సంపుటము పాట—182)

ఇంతగాఢభక్తిగలశరణాగతునికి మోక్షమివ్వక శ్రీవేంకటేశ్వరుడు తప్పించుకొనగలఁడా?

బొమ్మగానున్నస్వామికి జరిగెడి ప్రత్యుత్సవమునూ, ఆయన "యెవిధములుగ సాక్షాత్పరమపురుషునికి జరిగినట్లుగ భావించినాడో ఈ 148 పాట గొంతెత్తి చాటుచున్నది. చూడుడు :—

లలిత

ఎందు నీకుఁ బ్రియమో యీతెప్పతిరుణాళ్ళ
దిందువడె సిరులతో తెప్పతిరుణాళ్ళ ॥ పల్లవి ॥

పాలజలవిధిలోఁ బవ్వళించి పాముతెప్పఁ
దేలుచున్న దది దెప్పతిరుణాళ్ళ
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకుమీఁద
తేలుచున్న దది తెప్పతిరుణాళ్ళ ॥ ఎందు ॥

అమృతము దచ్చునాఁడు అంబుధిలో మందరము
తెమలఁ దేలించుతెప్పతిరుణాళ్ళ
యమునలో కాళింగునంగపుపడిగెమీఁద
తిమిరి తొక్కిన తెప్పతిరుణాళ్ళ ॥ ఎందు ॥

అప్పుడు పదారువేలుఅంగవలచెమటల
తెప్పలఁ దేలిన తెప్పతిరుణాళ్ళ
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁ గోనేటిలోన
తెప్పిరిల్లె నేఁటనేఁట తెప్పతిరుణాళ్ళ ॥ ఎందు ॥

(ఈ సంపుటము పాట–148)

ప్రతివ్రతాధర్మముతో వేంకటేశ్వరునితప్ప ఇతరులను సేవింపని–అన్నమయ్య లోకులను రాజులను మనసులో వుంచుకొని, ఎవ్వరిని లెక్కసేయని విధముగ ఎట్లు ఎత్తిపోయుచున్నాడో ఈ 144వ పాట చెప్పుచున్నది. చూడుడు :–

లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిది మాకాఁపురము ॥ పల్లవి ॥

నరహరికీర్తన నావినజిహ్వ
 వొరుల నుతింపఁగనోపదు జిహ్వ
 మురహరు పదముల మొక్కినశిరము
 పరులవందనకుఁ బరగదు శిరము ॥ తలఁ ॥

శ్రీపతినే పూజించినకరములు
 చోఁపి యాచనకుఁ జొరవు కరములు
 యేపున హరికథ కేఁగినకాళ్ళు
 పాపులయిండ్లకుఁ బారవు కాళ్ళు ॥ తలఁ ॥

శ్రీవేంకటపతిఁ జింతించుమనసు
 దావతి నితరముఁ దలఁచదు మనసు
 దేవుఁ డతనియాధీనపుతనువు
 కేవల మితరాధీనము గాదు ॥ తలఁ ॥

(ఈ సంపుటము పాట–144)

ఈయన పాటలలో శ్రుత్యర్థము సాహిత్యరూపము ధరించి, ఎంతచక్కగ రూపకాలంకారముగ ఇముడుచున్నదో గురుతింపవచ్చు.

 ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు
 బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవచ ।
 ఇంద్రియాణి హయానాహుః విషయాన్ స్తేషు గోచరాన్
 ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥

(కఠోపనిషత్తు)

ఈ శ్రుతికి వన్నెలు దిద్ది, పూర్ణరూపణము చేసినాడు అన్నమయ్య. ఇందులో శ్రుత్యర్థము ఛాయగా మాత్రమే తీసికొని, దానికి మంచి అలంకార సంస్కారము చేసినాడు.

మాళవి

గుఱ్ఱాలఁ గట్టనితేరు కొంక కెంద్రైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీని వేడుకతో జీవుఁడు ॥ పల్లవి ॥

సరి పిఱుఁదే రెండు జంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁ జూపులు రెండు గట్టినపగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుపెక్కేలు
మించైనశిరసే మీఁదనున్నశిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పాపపుణ్యములు రెండు పక్కనున్నచీలలు
తోపులయన్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

(ఈ సంపుటము పాట-152.)

అద్వైతదూషణము - భావనము

అన్నమయ్య నందవరీకస్మార్తబ్రాహ్మణకుటుంబములో జన్మించుటచే ఆయన పుట్టుకతో అద్వైతి. ఇతనికాలము నుండి ఆ-ఇంటిపేరుగల వీరి కుటుంబమునందు మాత్రము, విశిష్టాద్వైతము తావు చేసికొన్నది. పరతత్వవిషయములో అద్వైతవిశిష్టాద్వైతములకు ఏమంత పెద్దభేదము కానరాదు. కాని ఈయనది మధ్యవైష్ణవము గదా. కావున కొన్ని పాటలయందు సాక్షాత్తుగ అద్వైతమునే ఖండనచేసినపట్టులు కానవచ్చుచున్నవి.

బౌళి

పురుషుండని శ్రుతి వొగడీనట ఆపురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి విని వింటే నసంబద్ధములు ॥పల్లవి॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆ మూరితి అవయవరహితుఁడట
తగుబాహువులను రాజులట ఆతత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యలట ఆబ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతనిరూపము లేదట ॥ పురు ॥

తనవందనమునుఁ గలదట దైవము తనుఁ జూడఁ గన్నులు లేవట
తనవిన్నపమునుఁ జేయునట ఆతనికివి వీనులు లేవట
తనయిచ్చినదే నైవేద్యంబట దైవమునోరే లేదట
తనయిచ్చేటిధూపంబును గలదట దైవము ముక్కును
లేదట ॥ పురు ॥

అంతాఁ దానే దైవమటా; యజ్ఞము లొరులకుఁ జేయుటట
సంతతమునుఁదా స్వతంత్రుఁడటా జపముల వరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపుశ్రీవేంకటపతి మాయలు పచారించిన వివియట ॥పురు॥

(ఈ సంపుటము పాట-252.)

శంకరాభరణం

ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల ॥ పల్లవి ॥

పాప మొక్కఁడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున వొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁ డొక్కఁడైతే సుర లిందరుఁ గావలదా ॥ ఏకా ॥

వొకఁ డపవిత్రుఁడైతే నొగి పిందరుఁ గావలదా
వొకఁడు శుచై వుండితే వోడ కిందరుఁ గావలదా
వొకవిరతిసుఖ మంటి యిందరును వొనరఁ బొందవలదా
వొకవిదుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా ॥ ఏకా ॥

అకడ నొకఁడు ముక్తుఁడయితే నందరుముఁగావలదా
దీకొవి యొకఁడు బంధుఁ(బద్ధు)డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి -
లోకపుమునులనుఁ దెలుసుకోవలదా ॥ ఏకా ॥

(ఈ సంపుటము పాట 253)

లలిత

దోమటి వింతెరఁగరా తొల్లిటివారు
వామదేవవసిష్ఠవ్యాసాదులు ॥ పల్లవి ॥

తానే దైవమైతే తపమేల జపమేల
పూవి సారెఁ బూజించేపూజలేల
కూసు వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను ॥ దోమ ॥

తగఁ దా స్వతంత్రుఁడైతే దరిద్రదుఃఖములేల
నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
వగుబాటులైన జననమరణములేల
ముగురువేల్పులదండ మొనచూపరాదా ॥ దోమ ॥

శ్రీవేంకటేశుఁడే శేఖరపుదైవమవి
సావధానుఁ డితనికి శరణుచొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాపి
తావుల నాతనికృప దండ చేరరాదా ॥ దోమ ॥

(ఈ సంపుటము పాట-415)

వై ఖండనలోని విషయములుకూడ అంత పెద్దశాస్త్రీయములూ గావు, దుస్సమాధేయములూ కావు. అన్నమయ్యకు వైష్ణవమతము, మతదీక్ష. దానికి సంబంధించిన సంప్రదాయసిద్ధములగు అర్చనా-లు ఉన్నట్లు స్పష్టముగ తెలియుచున్నవి. కాని ఎన్నో జన్మల-ండి వెంబడించిన అద్వైతవాసన ఈతనిలో పూర్తిగ మాసినట్లు నరాదు. ఆమూపు పెదతిరుమలాచార్యాదులందు స్పష్టముగ నవచ్చుచున్నది. ఒక్కొక్క పట్టునందు తనకు తెలియకనే అద్వైత వన ఇతని పాటలలో దొరలుచున్నట్లు కానవచ్చుచున్నది.

### శ్రీరాగం

ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగవచ్చును
దొంతిఁబెట్టినకుండలు తొడరినజన్మములు ॥ పల్లవి ॥

కలలోపలిసంభోగము ఘనమగుసంపద లిన్నియు
వలలోపలినిడిపరువులు వన్నెలవిభవములు
తలఁపున గలిగియు నందునే తగులకపోదెవ్వరికిని
తెలిసినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ ఇంత ॥

అద్దములోపలినీడలు అందరిదేహపురూపులు
చద్దికివండినవంటలు జంటఁగర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి నజ్ఞానాంబుధిలో-
నద్దిన దిది దెలియఁగరా దంబుదములమెఱుఁగు ॥ ఇంత ॥

మనసునఁ దాగినపాలివి మదిఁగలకోరిక లిన్నియు
యినుమున నిగిరిననీళ్లు యిల నాహారములు
పనివడి శ్రీ వేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని విడిచిన మనుజులకాయపుమర్మములు ॥ ఇంత ॥

(ఈ సంపుటము పాట-133)

పాడి

చూచే చూపొకటి సూటి గురి యొకటి
తాచి రెండు నొకటైతే దైవమే సుండీ ॥పల్లవి॥

యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు
మాను దలఁచిన నట్టే మ్రానై పొడచూపు
పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు
తానే మనోగోచరుఁడు దైవమే సుండీ ॥చూచే॥

బట్టబయలు దలఁచ బయలై పొడచూపు
అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు
పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు
తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ ॥చూచే॥

శ్రీ వేంకటాద్రిమీఁది శ్రీపతిఁ దలఁచితేను
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతై పొడచూపు
భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
తావు మనోగోచరుఁడు దైవమే సుండీ ॥చూచే॥

(ఈ సంపుటము పాట-141)

గుజ్జరి

అందాఁకాఁ దాఁ దానే అంతకెక్కుఁడు గాఁడు
ముందువెనకెంచేనా ముఖ్యుఁడే యతఁడు ॥పల్లవి॥

చిత్తమంతర్ముఖము సేసుకొననేర్చెనా
అత్తల నతఁడు యోగియనఁబడును
సత్తసత్తనెడిసువిచారంబు గలిగెనా
వుత్తమవివేకియని వూహింపఁబడును ॥అందాఁ॥

భావము సభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁడని కానఁబడును
దైవంబుఁ దన్ను మతిఁ దలపోయనేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు ॥ అందాఁ ॥

అదరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిడువై జితేంద్రియస్థిరుఁ డాతఁడు
జడియు శ్రీవేంకటేశ్వరు దాసుఁ డాయనా
బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు ॥ అందాఁ ॥

(ఈ పెంపుటము పాట-452)

ఈ భావములు పరికించినపుడు ఈతడు మహాయోగిరైు విష్ణు భక్తుడై పరమార్థమున ఏమతమునకు చెందనియోగివలె కన్పించు చున్నాడు.

బౌళి

ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచిచూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ ఎంత ॥

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములఁ(ల?)మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ ఎంత ॥

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁదితామెరపు
ఆవల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని
యీవలనే నీ శరణనియెదను యిదియే పరతత్వము నాకు॥ఎంత॥
(ఈ సంపుటము పాట-393)

అద్వైతులభక్తిలో శివకేశవ భేదము లేదనుట సుస్పష్టమే కదా. అందులకనియే అప్పయ్య దీక్షితులవారి పద్యములుగా ఈ క్రింది రెండు పద్యముల నుదాహరించుచుందురు.

"మారమణ ముమారనుణం
ఫణధరతల్పం ఫణాధరాకల్పం।
పురమథనం మురమథనం
వందే బాణారి మసురబాణారిమ్॥

వాసుదేవ ఇతి వామదేవ ఇ -
త్యస్తికల్పక మహీరుహద్వయం।
యద్యపీహ 'సుమ' భేదసంభవః
నాస్త్యథాపి ఫలభేద సంభవః॥

ఒక చర్చాసందర్భమున వీనిలో మొదటిపద్యమును నేనుదాహరింపగా, పూజ్యులు కీర్తిశేషులు మద్గురువర్యులు పండితరాజ డి. టి. తాతా-చార్యస్వాములవారు రెండవపద్యము నుదాహరించిరి. రెండును మనోహరములే. ఉత్తరహరివంశాదులందలిపద్యములు అందరకు తెలిసినవే.

## దేవునిలో లోపము

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుణ్ని తననెచ్చెలికానిగా తన-ప్రాణవిభునిగా భావించి తరించినాడు. ఆ స్నేహాగుణము స్వామిని ఎత్తిపొడుచుటకు గూడ వెనుదీయదు. భక్తునికి ప్రత్యక్షదైన్యము,

పరోక్షదైన్యము అను రెండుగుణములు సహజములే. ప్రత్యక్ష దైన్యముతో నేను అకించనుడను, జడప్రాయుడను, దిక్కులేనివాడను ఇత్యాదిగా వాపోవుచుండును. పరోక్షదైన్యముతో స్వామిదోషము లనే యెత్తిచూపి దెప్పుచుండుటయు అది ఒకవిధమైన సరదాభక్తి. భక్తునికి స్వామియందుగల చనవునకు గురిగా సాగుచుండును.

నాదరామక్రియ

పరులకైతే నిదే పాపముగాదా
పురిగొని నీవంటే పుణ్యమాయఁగాక ॥ పల్లవి ॥

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధింపఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు ॥ పరు ॥

నారాయణుఁడ నీవు నడపినదే తగవు
ఆరూఢి నీవౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు ॥ పరు ॥

శ్రీవేంకటేశ నీవుచేసినదే నీతి
చేవతో నీవాడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
అవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు ॥ పరు ॥

ఇందు తండ్రికొడుకులకు విరోధము పెట్టుట, అన్నదమ్ములను విడదీయుట, మనుమనిచే తాతను చంపించుట మొదలగునవి సాధారణ లోకధర్మముతో పాపకార్యములు. కాని స్వామి ప్రహ్లాదహిరణ్యకశిపులకు విరోధము కల్పించుట, వాలి సుగ్రీవులను విడదీయుట, అరు

మునిచే భీష్ముని చంపించినాడనుట పురాణప్రసిద్ధము. దీని అంతరార్థమును పరిశీలింపక పైపై లౌకికార్థములు మాత్రమే పరిగ్రహించి తిట్టదలచినవారు నోరారా తిట్టవచ్చు. అదే ఈ పాటలో జరిగినపని. స్వామితో చనవుబలియనిసామాన్యభక్తుడు ఈమాట లనలేడు. అందుకనియే కూరత్తాళ్వాన్ అను వైష్ణవభక్తుడు అతిమానుష స్తవమునందు

యత్వత్ప్రియం తదిహపుణ్య మపుణ్యమన్యత్
నాన్య త్తయో ర్భవతి లక్షణ మత్ర జాతు ।
ధూర్తాయితం తవ తు యత్కిల రాసగోష్ఠ్యాం
తత్కీర్తనం పరమపావన మామనంతి ॥

అని స్వామిని కీర్తించినాడు. 'స్వామీ నీకిష్టమైనపని పుణ్యకార్యము. నీవు సమ్మతింపనిది పాపము. ఈ పుణ్యపాపములు రెంటికిని ఇక వేరు లక్షణము లేదు. రాసగోష్ఠియందు నీవు చేసినధూర్తకృత్యము పరమపావనముగ కీర్తింపదగినదని వ్యాసాదులగు పెద్దలందరు వాపోవుచున్నారు' అని దీనిభావము.

## తప్పుచేసి తప్పించుకొనే పద్ధతి.

ఈ పద్ధతినికూడ మన అన్నమయ్య ధారాళముగనే చాటినాడు. కామాదులను యథేచ్ఛముగ ననుభవించి అవి నాకు సంబంధించినవికావు అని అంటే పోతాయట, పాముకాటు చీరతో తుడిస్తే పోతుందా? అని మన మడుగవచ్చు. మనము ఈ ప్రశ్న ఎవ్వరి నడుగుచున్నాము. మన మెంతటివారము అని ముందు పరామర్శించుకోవలెను. మనలో ఉన్న అంతర్యామిని పరమాత్మగ భావించి తన్మయముగ మారినమహానుభావులు, ఇంచుమించు అత్యాశ్రమి ధర్మముగలవారు ఏపని చేసినా చెల్లుతుంది. శ్రీకృష్ణుడు గోపికలను సత్కరించినాడని మనమూ అట్టిపనికి అర్రులు సాచ-

వచ్చుగాని, ఆతడుచేసిన గోవర్ధనోద్ధరణము, దావానలకబళనము, విశ్వరూపప్రదర్శనము మనకు సాధ్యములా? ఆ కార్యములతో ఆతనిఅంతస్తును గుర్తెరిగి, అట్టివాడు ఎన్నిపనులు చేసినా చెల్లును కాని, మనము అట్టికార్యములు చేసి తప్పునుండి బయట పడలేము అనినోరుమూసికొని పడియుండుట మనబోటి వారికి తగినపని.

"ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥

అను శ్రుత్యర్థమునే అన్నమయ్య ఈ రెండు కీర్తనములందును విపులముగ వివరించినాడని తలపోయవలసియున్నది. చూడుడు.

మాళవిగౌళ

ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁ డింతే
పన్ని యీతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము ॥ పల్లవి ॥

మనసునఁ బుట్టిన మంకుఁగామక్రోధాలు
పసిలేవు తనకంటేఁ బాపకుంటదు
పనివి తొడిమ నూడి పండు తీఁగె నంటదు
జనులకెల్లాఁ బ్రకృతిసహజ మింతే ॥ ఇన్ని ॥

చేతులారఁ జేసేటిచేకొన్నకర్మానకు
ఘాతలఁ గర్తఁ గానంటే కట్టువడఁడు
ఆతల నణక ముఁచినట్టివేఁడి చెయ్యంటదు
జాతి దేహము మోఁచినసహజ మింతే ॥ ఇన్ని ॥

వాకుననాడినయట్టివట్టిపల్లదాలనెల్లా
దాకొని పొరయనంటే తప్పులే లేవు
పైకొని శ్రీవేంకటేశుబంటుకు వళకులేదు
సైకమైన హరిభక్తిసహజ మింతే ॥ ఇన్ని ॥

(ఈ సంపుటము పాట-288)

రేవగుప్తి

నీ వెరఁగనిది లేదు నీ యాజ్ఞ మోఁచితి నింతే
నీవాఁడ నింతె హరి నే నన్నఁ జోఁ ॥ పల్లవి ॥

కన్నుల కెందైనఁ జూపుకలది స్వభావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁజోఁచేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్ననకర్మాలు నన్నుఁ బైకొనఁ జోఁచేది ॥ నీవె ॥

నాలికకుఁ జవియైతే నమలుచే సహజము
నాలి అభోజ్యపునింద నాకుఁ బనేమి
మూల వాసనగొనేది ముక్కుకు సహజము
జోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁజోఁచేది ॥ నీవె ॥

కాయము కాయముపొంత గరఁగుచే అ గుణము
నేయవిచేఁతలు నాపైఁ జెప్పఁ జోఁచేది
యీయెడ శ్రీ వేంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో నుందువు పట్టఁగఁజోఁచేది ॥ నీవె ॥

( సంపుటము—పాట 388)

పెదతిరుమలాచార్యుల వచనములు — వానికి మూలము

శాఖ్యపాకకవులందరిసారస్వతమునకు అన్నమయ్యసారస్వతమే బీజముగా, భిక్షగా మనము తలపోయ వలసియున్నది. అన్నమయ్య పెట్టిన భిక్షనే ఆతనితనయులు మనుములు శాఖోపశాఖలుగ నానాచందస్సులలో పండించినారనుట సత్యము.

మాళవిగౌళ

నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టిపరమాత్మునికి ॥ పల్లవి ॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొనచూపులే ఘనదీపములట
తనలోపలియంతర్యామికిని ॥ నిత్య ॥

పలుకే మంత్రమట పాదైననాలికే
కలకల మనుపిడిఘంటయట
నలువైనరుచులే నైవేద్యములట
తలఁపులోపలనున్నదైవమునకు ॥ నిత్య ॥

గమనచేష్టలే యంగరంగగతియట
తమిగలజీవుఁడే దాసుఁడట
అమరినవూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని ॥ నిత్య ॥

(ఈ సంపుటము పాట-82)

## గుజ్జరి (ఏకతాళి)

శ్రీ వేంకటగిరిదేవా నాదేహంబు నీవుండెడి నిత్యనివాసంబు
నాజ్ఞానవిజ్ఞానంబులు నీయుభయ పార్శ్వంబుల దీపంబులు
నాముకుఁ జెలిమలయూర్పులు నీయిరుదెసలం బట్టెడియాలవట్టంబులు
నామనోరాగంబు నీకుం జంద్రకావివలువ
నీకుమొక్క నెత్తినచేతులు రెండును మకరతోరణంబులు
నాభక్తియే నీకు సింహాసనంబు
నామేనం బొడమిన పులకలు నీకు గుదులుగ్రుచ్చి యర్పించినపూదండలు
నే మిమ్ము నుతించిననుతులయక్షరరవంబుల
భేరీభాంకారఘంటికానాదంబులు
నాపుణ్యపరిపాకఫలంబులు నీకు నైవేద్య తాంబూలాదులు

మదీయవిత్తసేవాసమయనిరీక్షణంబులు నీసర్వాంగంబుల
నలందిన తట్టుపునుంగు
నాసాత్త్వికగుణంబు నీకు ధూపపరిమళంబు నీవు దేవదేవుఁడు
నే నర్చకుండను
ఈరీతి విత్తోత్సవంబు నాయందు నవధరింప శ్రీవేంకటేశ్వర
రా మఱియును

(-పెదతిరుమలయ్య-వేంకటేశ్వరవచనములు-౧)

## విరలునిచరిత్ర

### బౌళిరామక్రియ

వసుధఁ జూడఁ బిన్నవానివలె నున్నవాఁడు
వెస నన్ని విద్యలాను వెలసె విట్ఠలుఁడు ॥ పల్లవి ॥

పరగ నేడునూటడెబ్బదియేడుగురిచేత—
నిరపై పాడించుకొన్నాఁ డీవిట్ఠలుఁడు
సరస నై దులక్షలిం డ్లజవ్వనపుగొల్లెతల
మరిగించుకొన్నవాఁడు మఱి యీ విట్ఠలుఁడు ॥ వసు ॥

(ఈ సంపుటము పాట-217)

ఈ విట్ఠలుని చరిత్రము అన్నమయ్య పలుతావుల పలుకీర్తన-లలో గానముచేసినాడు. కాని ఈపాటలోని కొన్ని విశేషములు నేటి కింకను బయల్పడవలసియున్నవి. అన్నమయ్య నాటికే 770 మందిచేత పాడించుకొన్నాడట విఠలుడు. ఐదులక్షలజవ్వనపు—గొల్లెతలను మరిగించుకొన్నాడట. ఈ రెండుచిట్టాలు చరిత్రకారులు, శ్రీమద్భాగవతపరిశీలకులు తేల్చవలసియున్నది.

## పరమార్థ గ్రంథములు

అన్నమయ్యకు భారత భాగవత రామాయణములు పరమ ప్రామాణిక గ్రంథములు. శృంగార సంకీర్తనలలో భాగవతమునందలి

గోపికల చరిత్రమే అడుగడుగున పట్టిచూపుచుండును. అధ్యాత్మ కీర్తనలందన్నచో భారత, భాగవత, రామాయణాలు మూడును సమప్రధానముగ వాడుకొనుచుండును. ఇందుకు దృష్టాంతముగ ఈ క్రిందిపాట నుదాహరింపవచ్చు.

లలిత

వాదులేల చదువులు వారు చెప్పినవేకావా
వాదులేల మీమాట వారికంటే నెక్కుడా ॥ పల్లవి ॥

నాలుగువేదాల బ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు
వాలినపురాణాల వ్యాసుఁ డెవ్వని దాసుఁడు
లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు
ఆలకిం చెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుఁడు ॥ వాదు ॥

భారత మెవ్వనికథ భాగవతము చెప్పిన-
ధీరుఁడైన శుకుఁడు యేదేవుని కింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి సన్యసించి నడిగేటి-
నారాయణనామపునాథుఁ డేపో దేవుఁడు ॥ వాదు ॥

విష్ణువాజ్ఞయని చెప్పేవిధి సంకల్ప మేదది
విష్ణుమాయయని చెప్పే విశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ" మనేవేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రి విభుఁడే ఆదేవుఁడు ॥ వాదు ॥

(ఈ సంపుటము పాట-404)

## లోకపరిశీలనము - ఆత్మపరిశీలనము

అన్నమయ్య లోకములోనిప్రాణులందరిని ఎంత చక్కగ పరిశీలించి చూచినాడో మనమీపాటలో గురుతింపవచ్చు.

రామక్రియ

పాటెల్లా నొక్కచో నుండు; భాగ్య మొక్కచోనుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁబనిలేదు ॥ పల్లవి ॥

సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు
గరిమ నీకృప విన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోడఁ దపముసేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥ పాటె ॥

వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షముగను
యెక్కడా నీ కల్పన కేమి సేయవచ్చును ॥ పాటె ॥

భావించ నటుగాన ఫలమెల్లా నీ మూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁగద్దు
జీవులు విన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేతువు ॥ పాటె ॥

(ఈ సంపుటము పాట - 182)

అట్టులే (శ్రీ) వేంకటేశపాదార్పితమైనచిత్తముగలిగిన — అన్నమయ్యా, తనను — తన వారినీ — తనభోగములను అన్నింటినీ స్వామికే సమర్పించి గాఢప్రపత్తిని చూపి, తుదకు నీ ఇష్టమువచ్చి - నప్పుడు నీ యిష్టము వచ్చిన వరము నాకీయవయ్యా అని నిర్దాక్షిణ్యముగ శరణాగతి చేసినాడు.

సాళంగం

చేకొంటి విహమే చేరినపరమని
కైకొని నీవిందు కలవేకాన ॥ పల్లవి ॥

జగమునఁ గలిగిన సకలభోగములు
తగిన నీ ప్రసాదములే యివి
అగపడునేఁబదియక్షరపంక్తులు
నిగమగోచరపునీమంత్రములే ॥ చేకొం ॥

పొదిగొని సంసారపుత్రదార లిల
వదలని నీదాసవర్గములే
చెదరక యేపొద్దుఁ జేయునాపనులు
కదిసిన నియ్యాజ్ఞాకైంకర్యములే ॥ చేకొంటా ॥

నలుగడ మించిననాజన్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీవిఁక
వలసినప్పు డీ వరములు నాకు ॥ చేకొం ॥

(ఈసంపుటము పాట - 517)

ఈపాట విన్నప్పుడు పదిహేనుపర్వముల మహాభారతమును ఏకదీక్షతో రచించిన తిక్కన చెప్పినమాట జ్ఞాపకమునకు వచ్చుచున్నది.

చ॥ పరమపదాప్తిహేతువగుభారతసంహిత శౌనకాది భూ-
సురవరు లింపునం గరఁగుచొప్పునఁ జెప్పిన, వారు మోదసం-
భరితతఁ బొంది యక్కథకు బ్రాఁతిగ నర్చితుఁ జేసి రర్మిలిన్;
హరిహరనాథ సర్వభువనార్చిత నన్దయఁజూడు మెప్పుడున్

(-భారతము - స్వర్గా - 94)

ఈ మాటను పలికిన తిక్కనభావము అన్నమయ్య భావము ఒకటిగనే తోచుచున్నవి. ఆ దయకు ఫలితమేదో కూడా ఆయన పేర్కొనలేదు. ఇంత నిరీహముగ రచన సాగించిన తిక్కనయే అన్నమయ్యకు భాషావిషయములందును, భావసంపదయందును మార్గదర్శకుడైనా-డని మనమూహింపవచ్చు.

## స్వామి పుష్కరిణి

దైవమును, క్షేత్రమును, తీర్థమును దర్శించినపుడు సాధారుణులకు ఏదో చెప్పరాని ఆనందము మనసులో మెదలాడునే కాని, దాని స్వరూపమును — గొప్పదనమును నలుగురి మనసులకు పట్టునట్లు చెప్పలేరు. అదే ఒక మహాకవియో, అంతకంటె మించిన మహాభక్తుడో పైవస్తువుల మూడింటిని చూచినప్పుడు, ఆతని మనసులో దివ్యభావములు పరువెత్తి, ఆవస్తువును అతిలోకముగ అందరి కండ్లకు కట్టునట్లు వర్ణింపగలడు. దానికి మనము నిత్యము చూచుచూ తీర్థమాడుచున్న స్వామిపుష్కరిణిని గూర్చి, అన్నమయ్యకుగలిగిన భావనము, వర్ణనమే సాక్షి.

### గుండక్రియ

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥ పల్లవి ॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోపానాలు
అర్మిలి నాలుగువేదా లదె నీదరులు
నిర్మలపునీజలము నిండునసప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వోకోనేరమ్మా ॥ దేవు ॥

తగినగంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీదరి మేడలు
మొగి నీచుట్టుమాఁకులు మునులోయమ్మా ॥ దేవు ॥

వైకుంఠనగరము వాకిలే నీయాకారము
చేకొను పుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా ॥ దేవు ॥

(౹౪సంపుటము-పాట-420)

## అన్నమయ్య – పోతన

కడపమండలమునకు భూషలుగా ఇంచుమించు ఒకే కాలమున ఇద్దరు తీవ్రభక్తులు ఉద్భవమందినారు. ఒకరు అన్నమయ్య. మరియొకరు పోతనామాత్యులు. వీరిద్దరూ ఎంతభక్తులో అంత శృంగారప్రియులుకూడ. ఆ శృంగారముకూడ శ్రీమన్నారాయణ-మూర్తికే పరిమితము. అన్నమయ్యది తాళ్లపాక. పోతన్నది ఒంటిమిట్ట. ఆ ఇద్దరిభావములు ఎట్లు ఏకముగా సాగుచున్నవో ఈ క్రింది పాటలో పద్యములో గుర్తింపగలరు.

### దేసాక్షి

ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముగ నితనిశరణంబే సర్వఫలప్రద మిందరికి ॥ పల్లవి ॥

హరిఁ గొలువని కొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు
గరిమల నచ్యుతు విననికథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁ గానితపంబులు పాతాళములనిధానములు
మరుగురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు

వైకుంఠుని నుతియించనివినుతులు వననిధిఁ గురిసినవానలు
ఆకమలోదరుఁ గోరనికోరికె లందనిమానిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
దాకొని విష్ణుని తెలియనితెలువులు తగ నేటినడిమిపైరులు

వావిరిఁ గేశవునొల్లనిబదుకులు వరతఁగలపుచింతపండు
గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
భావించి మాధవుపైలేనితలఁపులు పలుమేఘములవికారములు
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు॥ ఎంచి ॥

(ఈ సంపుటము పాట –235)

సీ॥ కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే
పవనగుంఫితచర్మభస్త్రిగాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడిఢక్కగాక
హరిపూజనములేని హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మితదర్విగాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరంధ్రములుగాక

చక్రిచింతలేనిజన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబుగాక
విష్ణుభక్తిలేనివిబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక।

(భాగ-7-170)

యథావాక్కుల అన్నమయ్య

ఈ యథావాక్కుల అన్నమయ్య మనఅన్నమయ్యకు దాదాపు 200 ల సంవత్సరముల ముందువాడు. ఈతని కృతి సర్వేశ్వర శతకము. ఈతను ఆరాధ్యశైవుడు. ఈ యిద్దరన్నమయ్యల-మధ్యగల భేదమంతా శైవవైష్ణవమతములకు సంబంధించినది మాత్రమే. యథావాక్కుల అన్నమయ్య మంచిప్రౌఢకవి, సర్వేశ్వరునియందు గాఢభక్తిగలవాడు. వీరిద్దరికి పోలికగల భావములు పెక్కుతావుల గలవు. మచ్చునకొకటి:—

మ॥ అమరంగా స్ఫుటభక్తినాటకము భాషాంగక్రియాంగాభిర-
మ్యముగాఁ జూపిన మెచ్చి మీరలు పురే యన్నంతకున్, యోనిగే
హములన్ రూపులు వన్నుకొంచును నటుండై వచ్చి సంసారరం-
గములోనం బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా.॥

(సర్వేశ్వరశతకము-ప-28)

రామక్రియ

మెచ్చు: మెచ్చవలెంటే మాను; మించి నే నాడకమాన
అచ్చపునీసూత్రధారి నవధారు దేవ ॥ పల్లవి ॥

వాక్కుల నే జీవుడను వోహో హరీ
పెక్కుబహురూపాలే పెంచియాడితి
తక్కినయింద్రియములే తగుమేళము
అక్కజపువిద్యవాడ నవధారు దేవ ॥ మెచ్చు ॥

సూటి నించుకంతవాడ జూడవే హరీ
వీటిసంసారపుబారి విద్య లాడితి
పాటి నాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాడ నింతె నేను అవధారుదేవ ॥ మెచ్చు ॥

చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేడు
మేరతో భక్తినేమోకుమీద నాడేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవధారు దేవ ॥ మెచ్చు ॥

(ఈ సంపుటము—పాట 160)

యథావాక్కులవారి పద్యరచనలోని సంగ్రహభావము, మన అన్నమయ్య విస్తారరచనయగు గేయములో విశేషాకారమును సంతరించుకొన్నది. క్రియాభాషాంగము, భాషాంగక్రియాభిరమ్యముగా, మెచ్చు ధాతుప్రయోగము, బహురూపమాడుట ఇత్యాదులు ఉభయత్ర సమానములు, ఈ భావములు సమానాభిప్రాయములు గలభక్తులకు ఒకరివాఙ్మయము మరొకరు చూడకయేకూడ కలుగవచ్చు. అయినను మన అన్నమయ్యకు సనామధేయుడ ఇతనికంటే ప్రాచీనుడు, ఈతనివలెనే గట్టిగా పరమేశ్వరుని వాడు ఒకడు కలడు అని తెలుపుటకుమాత్రము ఈ ఇద్దరి

తమ్యము లుదాహరించితిని. మనఅన్నమయ్యలో విష్ణువు ప్రధాన-మైతే, ఆ అన్నమయ్యలో శివుడు ప్రధానము. ఇంతే వీరికిగలభేదము దానివలన నానావర్ణనలయందు, ఇరువురియందును ఆ యామతాను సారముగ ఉచ్చనీచభావములు సాగుట సహజమే

## అన్నమయ్య కీర్తనలసంఖ్య

అన్నమయ్య ముప్పదిరెండువేల కీర్తనములను రచించినట్లు "పరమతంత్రములు ముప్పదిరెండువేలు" అను చిన్నన్న మాటవలన తెలియుచున్నది. ఈ ముప్పదిరెండువేలే ఏల వ్రాసినారు? అని పరా-మర్శింపవలసియున్నది. ఆయన జీవితము, 32 వేల కీర్తనలు రచించు-నాటికి ముగిసిపోయినది కావున, ముప్పదిరెండువేలు రచించినారు; అని చెప్పుట సహజము. కాని అన్నమయ్య సాక్షాత్తుగ అహోబల-మున నుండియే విశిష్టాద్వైతవేదాంతాధ్యయనము చేసి, అక్కడనే ఆదివన్ శఠగోపయతిచే మంత్రోపదేశము పొంది, ఆ మంత్రమునే జీవితాంతము వేంకటేశ్వరమూర్తిపై గురిచేసి ఉపాసించుచుండినా-రనుట నిర్వివాదమైన విషయము. ఆదివన్ శఠగోపయతి అహోబల మఠముజీయరు. ఆయన నృసింహోపాసకుడు. వారున్నది అహో బలక్షేత్రము కావున తప్పక నృసింహోపాసకులే. అన్నమయ్యను బాగా పరీక్షించిన ఆదివన్‌శఠగోపయతి, ఆ మంత్రము నే అన్న మయ్య కుపదేశించి యుందురనుట త్రిసత్యమైనమాట. ఆ మంత్రము ద్వాత్రింశదక్షరము. దానికి మంత్రరాజమనికూడ ప్రసిద్ధి. ముప్పై రెండు అక్షరములుగల ఆ మంత్రమునే జపించుచూ, నిత్యమూ వేంకటేశ్వరునిపై ఒక కీర్తనకు తక్కువకాకుండ కీర్తనలు రచించిన అన్నమయ్య, అక్షరమునకు వేయివంతున ఆ మంత్రాక్షరసంఖ్యతో ముప్పైరెండువేల కీర్తనలను రచించినారని స్పష్టముగ చెప్పవచ్చు. అన్నమయ్య రచించినఅహోబలపతిపైనికీర్తనల సంఖ్యకూడ దీనికి

ఉదాహరణము కావచ్చు. శ్రీవేంకటేశ్వరునిపై రచించిన కీర్తనలను పక్కకు పెడితే, అహోబలపతిపై రచించినన్నికీర్తనలు మరి ఏ-దైవముపైనను రచింప లేదనుట సుప్రసిద్ధము. ఏ దైవమును పేర్కొన్నను అందరినీ తుదిచరణములో వేంకటేశ్వరునితో ముడి పెట్టుట ఆయనజీవితసిద్ధాంత లక్ష్యము.

ఇట్లు పలు విషయములకు పలుపాటలను ఉదాహరణముగ ఎత్తి చూపవచ్చును. కాని విస్తరభీతిచే ఆ భారము సహృదయులగు పాఠకులకే వదలితిని.

### శబ్దచర్చ

1) గోసమాణే: (పాట: 374)

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥పల్లవి॥

మీనకూర్మవరాహా మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ॥డోలా॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ॥డోలా

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి నిలయ ॥డోలా॥

(ఈసంపుటము పాట 374)

ఈ పాటలోని 'గోసమాణే' అనుపదము 'ఘోషమణే' అనుటకుబదులుగ పడినదా అనిపించుచున్నది. ఇదిఇంకను విచార్యము.

2) హా సమీచీన ............ ... (పాట: 368)

హాసమీచీనరూపహాసంతే
దాసై ప్రకాశితం దరిదంతులోకే ॥పల్లవి॥

ద్వారకా పట్టణే త్వం పురాచ స్వయదీక్షితస్తు త్రియః కేశముష్టిఃకథం
సారస కురువంతి సరసవేళాయాం ॥హాస॥

వర శిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారి అథోచే స్తదేతిగోప
తరుణయః కిమితి వా తద్వసతి త్వం ॥హాస॥

తత్ర బృందావనే త్వం పురా చ శ్రియా వేంకటాద్రౌ ఇదం విష్వి
భాపి ఇదం
చిత్త మిత్యమరాశ్చ దిసేవంతి సర్వే ॥హాస॥

(ఈసంపుటము పాట 368)

ఇది సవరించుటకు వలనుపడనిపాట. రేకులపాఠ మొక్కటే ఆధారమైనందున పాఠాంతరముకూడ లేదు.

3) జుంటీఁగ (పాట: 29)

తూమెల్ల మేసినా నాఁబోతుకు బందెలేదు
నేమపుఁ బ్రపన్నునికి నిందలేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మమంటితే జుంటీఁగకతవును ॥మటి॥

(ఈ సంపుటము పాట 29)

జున్ను + ఈఁగ. లోపవిభక్తికకార్యములు జుంటీఁగ తేనెలో బడిన ఈఁగ అన్న అర్థము ప్రకరణమును బట్టి వచ్చుచున్నది. కాని ఆ యర్థమున జుంటీఁగ రూపము సిద్ధించునా? జున్ను చేసెడి ఈఁగయే కదా 'జుంటీఁగ'. 'సోమరి కర్మమంటితే జుంటీఁగ కతవును' = శరణా-

గతుడు (కర్మలను వదలినవాడు) మరలా కర్మలజోలికిపోతే; అనే అర్థములో 'తేనెలో బడినఈగ' అనే అర్థమే సబబని తోచుచున్నది. తేనెటీఁగల చరిత్రలో తల్లిఈఁగ, రాణిఈఁగ ఇత్యాదుల విషయమేమైన సంబంధించియున్నదా అని విచారింపవలసియున్నది.

4) బ్రహ్మ మనుకోనేరము: (పాట: 30)

నేమే బ్రహ్మ మనుకోనేరము: నేము
కామించిన స్వతంత్రము గడు లేదుగాన ॥ పల్లవి ॥
(పాట—30)

పూర్వముద్రితములో 'బ్రహ్మ మనుకొనేరము=బ్రహ్మము అనుకొందుము' అను నర్థమున ఆ పాఠము గ్రహించినట్లున్నది. ప్రకరణము ఒట్టి అనుకోనేరము = అనుకొనుటకు చాలము అని తోచుచున్నది. ఈ రేకులపాఠములో హ్రస్వదీర్ఘములకు ఒకేలిపి కావున ఇటువంటి పాఠభేదములు అక్కడక్కడ దొర్లుచుండవచ్చు.

5) కాకి జున్ను (పాట: 167)

అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు
దినదినకొత్తలాయ దృష్ట మిదే మాకు ॥ పల్లవి ॥

ఆడెడిబాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారాై చోద్యమాయనమ్మా ॥ అన ॥

తీఁటతీగెలు సొమ్ముంటా దేహమునిండాఁ గట్టి
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటిసొమ్ములాయ కొత్తలోయమ్మా ॥ అన ॥

కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తిసిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవేంకటేశుఁ డాబాలులకంటిసీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము ॥ అన ॥

(ఈ సంపుటము పాట 187)

ఈ పదము నిఘంటువులలో కానరాదు. 'కాకివెండి, కాకి బంగారము, కాకియెంగిలి' 'కాకి వెదురు' 'కాకి చిప్ప' ఇత్యాదులు ప్రసిద్ధములుగా నున్నవి. వెండికానిదానిని వెండిగా వ్యవహరించే టప్పుడు కాకివెండి. అట్లులే పైవికూడ. కాని జున్ను కానిదానిని జున్నుగా వ్యవహరించినట్లు ఇక్కడ కావలెను. 'కాకిజున్ను' యేదో అర్థము కాలేదు. పలువురు విద్వాంసుల నడిగియు ప్రయోజనము లేకపోయినది.

1. ఈ పీఠిక సిద్ధమైనవెనుక శ్రీ వి. వి. శేషాచార్యులు (70 సంవత్సరములు) అనంతపురము వారు మాయింటికి వచ్చియుండిరి. వారిని విచారించగా, వర్షాకాలమున చెట్లవెంబడి బుడగలుబుడగలుగా నురుగుమాదిరిగ జారేవస్తువును, నీళ్ల పారుదలతో పాచిపట్టినబండల వెంబడి ఆ పాచికి పక్కగా తెల్లగా, ఎఱ్ఱగా, రంగు రంగులలో బుడ గలుగా తయారయ్యే వస్తువును కాకిజున్ను అని వ్యవహరిస్తుండగా నా చిన్నతనములో విన్నాను. అది పట్టుకొంటే చేతికి రాదుకూడా. మూతికి రాస్తే జిల్ అని అవుతుంది. దానికి పిల్లలుపడుస్తారు! అని సెలవిచ్చిరి.

2. తాళ్ళపాకలోనే నివసిస్తున్న జంగా సుబ్బయ్యగారిని (దాదాపు 70 పండ్ల వయస్సువారు) ఉత్తరముతో విచారించగా, వారు "కాకి జున్ను అను పదమును గూర్చి మా గ్రామ పరిసరప్రాంతము లలో విచారించగా తేలిన సారాంశము:—పాలు ఆముదము రంగలించి అందులో ముసాంబరము మాత్రను సాదిన ఉగ్గును పిల్లలకు పెట్టుట

ఉనాదిగా ఆచారము. పిల్లలు పాలు త్రాగుట మాన్పించుటకు ఈ ఉగ్గును పెట్టెదరు. ఈ ఉగ్గును త్రాగునపుడు పిల్లలకు బాధాకరంగా ఉంటుంది. కారణం ఆ ఉగ్గు చేదు పదార్థము. కాకిజున్ను= ముసాంబరము. కలబంద పాలతో ముసాంబరమును తయారు చేయుదురు. కాకిజున్ను-జున్ను (తేనె) కానిది కాకి జున్ను. ఈ పదము ఆయుర్వేద వైద్యశాస్త్రంలో సాంకేతిక పదముగా వాడఁబడుచున్నది" అని సమాధానమిచ్చిరి. ఈ రెండును కూడ ప్రకరణమునకు అంతగా అతుకునట్లు తోఁచదు.

అదీకాక పై రెండు చరణములలో దుమ్మే చక్కెరగా, తీఁట-దీగెలు సొమ్ములుగా మారినట్లు వర్ణింపబడినవి. ఇక్కడ కాకిజున్నే ముత్యములుగా మారలేదు. కాకిజున్ను తిన్న వారి కన్నీళ్లు ముత్య-ములుగామారినవి. చక్కెర అని దుమ్మువేస్తే చక్కెరగామారింది. సొమ్ములు అని తీఁటతీగెలు వేస్తే సొమ్ములుగా మారినవి. జున్ను కాని కాకిజున్ను తినిపిస్తే, వాండ్లు పడిస్తే, వాండ్ల కన్నీళ్లు ముత్యాలుగా అయినాయి. ఇక్కడ ప్రక్రమభంగముకూడ నున్నది. ఈ శబ్దము యొక్క అర్థము ఇంకనూ తెలిసినవారివలన తెలుసుకోఁదగియున్నది.

6) ఎంచీనా ; తలఁగీనా ; మాసీనా (పాట : 168)

దేసాక్షి

నిజము దెలియవిమానేరమేకాక
భజన నీవు చేపట్టినందుఁ గదమా ॥ పల్లవి ॥

అంచలఁ బరుసము లోహాపుఁగాళికల నెల్ల
యెంచీనా పసిఁడి గావించుఁగాక
వించిన నిన్నాతుమఁ జింతించువారిపాతకాలు
మించనిచ్చేవా మేలే మెరయింతుగాక ॥ నిజ ॥

నలువంక రవికిరణాలు మేలగీడని
తలఁగీనా యిన్నిటిలోఁ దానేకాక
యిల నీదాసుఁడు జాతి నెవ్వఁడైనా నీకృపఁ
జెలఁగి పావనుఁజేసి చేకొనుఁగాక ॥ నిజ ॥

పూసిన దిక్కులగాలి పొందుగ నీడాడని
మానీనా లోకమెల్లా మరయుఁగాక
మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే–
దేనెలవైనా నీకిరవేకాదా ॥ నిజ ॥

(పాట-168)

ఈపాట ప్రతిచరణము రెండవపాదమునందు "యెంచీనా, తలఁగీనా, మానీనా" ఇత్యాదిగ సవరింపబడినవి. పూర్వముద్రణమునందు "యెంచినా, తలఁగినా, మానినా," ఇత్యాదిగా కలదు. ప్రకరణమును బట్టి చూస్తే నీవు చేపట్టినందుఁ గడమా అనే పల్లవిలోని దీర్ఘము ప్రశ్నార్థకముగా స్పష్టము. యెంచినా, ఇత్యాదిగావుంటే 'ఎంచినను' ఇత్యాదిగా అర్థము వచ్చునేకాని ప్రశ్నార్థకము రాదు. "పరుసము లోహపుఁ గాశికలనెల్ల యెంచీనా" అన్న స్థలములో లోహపుముక్కలను ఇది పలానా ఇది పలానా జాతికి చెందినది; అని లెక్కపెడుతుందా? అంటే లెక్కపెట్టదు అని అర్థము. తాను సోకిన ముక్కలనన్నిటిని బంగారుగా చేయుటయే దానిపని. ఇట్లనే తక్కిన స్థలములయందుకూడ. ఇక్కడగూడ హ్రస్వదీర్ఘములకు ఒకేలిపి యుండుటే కారణము.

7) సహజి పాట : 212

మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
సహజివలెనుఁ డేమీ సాధింపలేఁడు ॥ పల్లవి ॥

'సహాజః' ఈ శబ్దము విశేష్యనిఘ్నము. సహాజము కల [illegible] సహాజి. పుట్టినవాడు పుట్టినట్లే (ప్రయత్నము చేయక) పుండుట. అను నర్థమున ప్రయోగించినట్లున్నది. 'సహాజః స్వభావః అస్యాస్తీతి-సహాజీ' పుట్టిననాటి స్వభావమే కలవాడు. ఏమీయెరుగనివాడు శబ్దము వ్యాకరణ విరుద్ధము కాదుగాని, బహుళప్రయోగ ప్రహతము కాదనిమాత్రమే మనవి.

8) యతిస్థానంలో చర్చ: (పాట 419)

యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ డేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు ॥ దేహి ॥

ఇక్కడ 'చలియించు' అను తత్సమపదము యతిస్థానములో 'చెలియించు' అని ప్రయోగింపబడియుండుట, వీరి వ్యావహారిక భాషాదృష్టికి తార్కాణము కాగలదు. ఇట్టి వింకను అక్కడక్కడ గలవు.

9) యద్భావం తద్భవతి : (పాట 435)

ధరలో "నెద్భావం తద్భవ" తనెఁగాన
హరిమయమే జగమంతాను ॥ పల్లవి ॥

ఈ 'యద్భావం' అనుదానికి Foot note లో అప్పటికి తోచిన దానిని ఇచ్చినాను. 'యద్భావ్యం తద్భవతి' అనుటసముచితమేమో అనిపించుచున్నది.

10) సందడించేరు : (పాట 436)

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతముగ వాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సందడించేరు ॥ ఎంచాఁ ॥

సందడించేరు = సందడిచేయుచున్నారు. "సందడివిడువుము సానముఖా"లో క్రియగీత కలిగిన పదమును వ్యాఖ్యానించునపుడు అధ్యాత్మకీర్తనల సంపుటము 1 (1981) నందు 12వ పాటలో సందడి శబ్దమును వ్యాఖ్యానించలేదు. ఈ అన్నమయ్య వాఙ్మయములో సందడి, సందడించు శబ్దములు 'తొందరపెట్టు' 'అంటుకొనియుండు' ఇత్యాద్యర్థములలో వాడినట్లు ఇక్కడ ప్రయోగమునుబట్టి ఊహించు చున్నాను.

11) రాచాజ్ఞ : (పాట 447)

రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి విది మానుపవే ॥ పల్లవి ॥

రాచాజ్ఞ = రాజాజ్ఞ. రాజ్ఞః ఆజ్ఞా అని విగ్రహము. ఇది సమాసైకదేశము తద్భవీకరించిదైనా కావచ్చు. 'రాచవారియొక్క ఆజ్ఞ' అని తద్భవ శబ్దముతోనే స్వతంత్రముగ సమసించిన సమాసమైనా కావచ్చు.

27 వ సంపుటములో 'సమాసములు' అను విషయముపై సాగించిన నా చర్చను చూచిన డా॥ సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు, "వ్యావహారికభాషను యథేచ్ఛగ వాడిన అన్నమాచార్యుల కృతులలో వ్యాకరణచర్చ పలక్కా" అన్నారు. కాని "ఆ కృతులలోనే అరసున్నలు శకటరేఫలు స్థానపతి

తములు, ఆస్థానపతితములు దండిగ నుండుటచే, ఆ భాషను శిష్టవ్యావహారికముగనో, అశిష్టవ్యావహారికముగనో గ్రాంథిక సన్నిహితమైన-దానిని విమర్శించక ఎట్లుండేదిస్వామీ" అన్నాను. 'సరే నీయిష్టము' అన్నారు

12) సాసముఖా (పాట: 471)

సామంతం

సింగారమూరితివి చిత్తజగురుఁడవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా ॥ పల్లవి ॥

పూవులతెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి
పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సాసముఖా ॥ సింగా ॥

అంగరంగవైభవాల నమరకామినులాడ
నింగినుండి దేవతలు నిన్నుఁ జూడఁగా
సంగీతతాళవాద్యచతురతలు మెరయ
సంగడిఁ దేవేరికి నీకు సాసముఖా ॥ సింగా ॥

పరగఁ గోనేటిలోన పసిఁడిమేడనుండి
అరిది నిందిరయు నీవారగించి
గరిమ శ్రీ వేంకటేశ కన్నుల పండువగాఁగ
సరవి నోలాడుమీకు సాసముఖా ॥ సింగా ॥

అధ్యాత్మ కీర్తనల సంపుటము — 1 యందు 12 వ పాటలో 'సాసముఖా' శబ్దమును 'సముఖ సముఖ' అను రెండు పదముల ఆమ్రేడిత సంధిగా వ్యాఖ్యానించియుంటిని. దానికి మరొకపాట కూడ 9 సంపుటము 97 వ దానిని ఉదాహరణమని చూపియుంటిని.

ప్రకృతము ఈపాటలో 'సానముఖా' శబ్దము 'జోహారు' అను అర్థ-ములో ప్రయోగించినట్లు ప్రకరణమునుబట్టి తెలియుచున్నది.

## పూర్వోత్తర ముద్రణములు

6 వ 7 వ సంపుటములందు పూర్వముద్రణపరిష్కర్తలు చూపిన పాఠములకు కొన్నిటికి భిన్నముగ నేను పాఠములను చూపి, వారి పాఠములను పూర్వముద్రణపాఠము అని పాదదీపిక (Foot note) లో చూపియున్నాను. అందులో పూజ్యులు కీ॥ శే॥ శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును, శ్రీఅర్చకం ఉదయగిరి శ్రీనివాసా చార్యులును కలిసి పరిష్కరించిన 7 వ సంపుటములో, 'సంస్కరణ-ములు' అను శీర్షికతో తప్పొప్పుల పట్టిక నొకదానిని చూపి, కొన్ని పాఠములకు మాత్రము సవరణలు చూపినారు. 6 వ సంపుటములో మాకు ముద్రణమునకు ఇచ్చిన పుస్తకములో ఆ తప్పొప్పులపట్టిక కానరాలేదు. 7 వ సంపుటములో మాత్రము పేజి వరుసనంబరుకూడ ఇచ్చిన తప్పొప్పులపట్టిక ఉన్నది. కాని ఆ తప్పొప్పుల పట్టికలోకూడా మేముచూపిన పాఠాంతరములన్నీ లేవు, కావున నేను ఆ తప్పొప్పుల పట్టికను లెక్కకు తీసికొనకయే 'పూర్వముద్రితపాఠము' అని ఇత్యాదిగా చూపియున్నాను. దీనివలన పూర్వముద్రణపరిష్కర్తలను లక్ష్యము చేయలేదని భావింపరాదు. ఇట్టి పరిష్కరణములలో తప్పులు సర్వసహజములని అందరకు తెలిసిన విషయమే. వానిలో ఎక్కువ తక్కువలు మాత్రమే సూక్ష్మజ్ఞతకు గురుతు. మేముమాత్ర మేమి తక్కువతిన్నామా? అన్నట్లు ఈ పరిష్కరణములోకూడ రేకు పాఠములు కొన్ని తొలగిన ఘట్టములు కలవు. వానిలో మేము గమనించినవాని సవరణలిందు చూపుచున్నాను.

| పాట | ఉన్నపాఠము | ఉండవలసినపాఠము |
|---|---|---|
| 21 (3-2) | మూఁటగరాట్టదు | మూఁట గట్టరాదు. |
| 74 (2-3) | బెడిదవుఁ | బేడిదవుఁ |

| | | |
|---|---|---|
| 81 (2–4) | వికిరణా | వికిరణా |
| 83 పల్లవి | కేళవాత్సరమహో | కేళవాత్సరమహో |
| 212 పల్లవి | సాధింపలేదు | సాధింపలేదు |
| 243 (2–4) | పాలించే ప్రతాప | పాలించేభక్తుల ప్రతాప |
| 244 (1–1) | మాయాదేవిపట్టిన | మాయాదేవి పుట్టిన |
| 245 (1–2) | కాగినపోట్లు | కాడినపోట్లు |
| 246 (3–2) | సోదించేరటా | సోదించేరంటా |
| 323 (1–1) | నాతరతమ్య | నాతారతమ్య |
| 387 (2–2) | నెప్పుగా | నొప్పుగా |
| 408 (3–1) | తనివోని ఘోరతప | తనివోనిఘనహోరతప |
| 409 (3–1) | నెవ్వరైనా నేమి | నెవ్వరైనా నేమి |
| పాటల అకారాది సూచికలో పుట 363 లో ఎంత మాత్రము | 159 | 398 |

నా యీ పీఠికవెనువెంటనే పూర్వముద్రణ పరిష్కర్తల పీఠికలనుకూడ జతచేసి ప్రకటించుచున్నాను.

ఈ తాళ్లపాకకవుల వాఙ్మయమును త్వరత్వరగ గడ్డకు తేవ-లెనను సంకల్పముతో, ఆయవ్యయములతో జమకట్టక మాకు వలసిన వసతులను ఏర్పాటుచేయుచున్న తి. తి. దే. కమిటీచైర్మన్ శ్రీ వి. యన్. రెడ్డిగారికి, వారి సంకల్పమును మూడుపూవు లారుకాయ-లుగ పండింపగల సంకల్పసిద్ధులు, ఎంతపనినైన అవలీలగ నెరవేర్ప-గల కార్యదక్షత పండి నిండిన తి. తి. దే. కార్యనిర్వాహణాధికారులు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ ఐ. ఏ. ఎస్., గారికిని నా కృతజ్ఞతాభి వాదములు. ముద్రణకార్యమునందు మాకు చేదోడు వాదోడుగా తోడ్పడుచున్న తి. తి దే. ప్రెస్ మేనేజరు శ్రీ యమ్. విజయ కుమార్ రెడ్డిగారికిని, ఈ పనులలో చాల మెలుకువగల తి. తి. దే. పౌరసంబంధశాఖాధికారి శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి ఎం ఏ.

గారికి, ప్రతిక్షణమును మాపనులకు వలసినట్లు సాయపడుచున్న తి. తి. దే. సప్తగిరి సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు ఎం.ఏ., గారికిని నాధన్యవాదములు. ఈ పరిష్కరణకార్యములో నాకు కుడి-చేయిగ పనిచేయుచున్న చి॥ జె. బాలసుబ్రమణ్యాం ఎం. ఏ, కు నా మంగళాశాసనములు. వేగముగా సాగుచున్న అచ్చుపనిలోకూడ మెలకువవీడనిఅచ్చుకూర్పరులకు మనస్ఫూర్తిగ నామంగళాశాస-నము లందించుటతప్ప నేను వారికిచేయు నుపకారమేమున్నది? పెద్దల పరిష్కరణములను మరలా పరిష్కరించుటలో నావలన ఏర్పడిన గుణదోషములను మరల పుస్తకములు చదివిన సహృదయులు ఎత్తి చూపిన, విధేయతతో స్వీకరించి, పైపై పరిష్కరణములలో జాగ్రత్త వహింపగలను.

శ్లో॥ మైసూరురాజధానీనగరకళాశాలికాబుధం మాన్యం।
సంగీతసాహితీవీధీసంచారం నమామి తం కృష్ణమ్ ॥

ఇట్లు బుధవిధేయుడు,

గౌరిపెద్ది రామసుబ్బశర్మ,

స్పెషల్ ఆఫీసరు.

తాళ్లపాకవాఙ్మయపరిష్కరణశాఖ,

అన్నమాచార్య ప్రాజెక్టు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

తిరుపతి,
2–7–81

# పీఠిక

తామ్రఫలకములలోఁ దలుపుచాటున దాగియుండిన తాళ్ళపాక వారికవిత ప్రభాకరులకరస్పర్శమున వెలుగుమొగము చూచినది. ప్రథమమున తాళ్ళపాకవారిసంకీర్తనలయోగ్యతనుగుర్తించి, పైయధికారులకు తెలియజేసి, సంకీర్తనములు లోకమున ప్రచారముఁ జెందుటకై యన్నమాచార్యోత్సవమును వెలయింపించినవారు గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తిరుపతిలో నన్నమాచార్యోత్సవము ప్రతి సంవత్సరము జరుగుచుండుటతో వారిరచనలలోని కవితాసౌందర్యము, సాహితీగౌరవము, సంగీతసారస్యము, భక్తిపారమ్యము, గుర్తింపఁబడుచున్నవి. తెలుఁగున ముడులు విడనిపదములకుఁ, బ్రయోగములకు, నెన్నిటికో యర్థము, నన్వయము కుదురుటతో భాషాసంశోధకుల దృష్టి వీరిరచనములపైఁ బడుచున్నది. ప్రాఁతపాటలతో విసుగుచెందుచున్న భావుకుల వినోదమునకై క్రొత్తదనముఁగోరుచున్న సంగీతవిద్వాంసుల యాదరమును వీనికి లభించుచున్నది. తాళ్ళపాకవారి రచనముల సత్వర ముద్రణమునకై శ్రీతిరుమల తిరుపతి దేవస్థాన ప్రధానాధికారులుచూపుచున్న ఆదరాభిమానములకు, భాషాభిరుచికి, భక్తితత్పరతకు జోహారులు.

శ్రీ తాళ్ళపాకవారి రచనముల సంపుటములైదు ఇంతదనుక ప్రకటితములయినవి. ఇది యారవసంపుటము. తాళ్ళపాక అన్నమాచార్యుల (100-వ రేకునుండి 150-వ రేకువరకుగల) అధ్యాత్మ సంకీర్తనము లిందు ముద్రితములయినవి. ఇఁకపై నేఁబదిరేకుల కొకసంపుటముగా వీరిరచనములు ప్రకటింపఁబడగలవు.

మద్గురుదేవులు కీర్తిశేషులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పర్యవేక్షణమున నేతత్సంకీర్తనముల ముద్రణకార్యమున నుద్యోగించుచుండి నేనీసంపుటమును వారి యాదేశముల మేరకుఁ బరిష్కరించితిని. తప్పొప్పులకు సహృదయులు ప్రమాణము.

తాళ్ళపాకవారిరచనము లెల్లఁ ద్వరలోఁ బ్రకటింపఁబడవలయు ననెడి వారిసంకల్పము నెఱవేర్పుభారము పై యధికారులది, శ్రీ వేంకటేశ్వరులవారిది.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
19—2—51.

విద్వద్విధేయుఁడు
ఉదయగిరి శ్రీనివాసాచార్యులు

శ్రీ

# పీఠిక

ఇది శ్రీ అన్నమాచార్యకీర్తనల యేడవసంపుటము. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఐదవసంపుటము శోధించి ప్రకటించి అకాలమున పరమపదమలంకరించిరి. ఆరవసంపుటమును దీవివి రేకులనుండి సవరించి యెత్తి వ్రాసినవారు శ్రీ శాస్త్రిగారి శిష్యులై వారికి చేదోడు వాదోడుగా నుండిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులే. ఈ కీర్తనల శోధనకార్యమునకై శ్రీవేంకటేశ్వర దేవాలయాల అధ్యక్షులచే నియమింపఁబడి నేను వచ్చి చేయివేయునరికి ఈ సంపుటము బహుభాగము ముద్రితమైనది. కడపటి రెండు మూఁడు ఫారములు మాత్ర మునేను పరిచూడఁగల్గితిని. ఈ సంపుటమున ౧౩౧-వ రేకు మొదలు ౨౦౦-వ రేకు వఱకునుఁగల అధ్యాత్మకీర్తనలు కలవు.

శ్రీప్రభాకరశాస్త్రిగారు వేసిన పథమున, శ్రీ శ్రీనివాసాచార్యుల నిష్కళంక భక్తిశక్తులు తోడుగా, ఇఁకముందు తాళ్ళపాకకృతుల శోధన ప్రకటనములు త్వరగా జరుగఁగలవని యాశంసించుచున్నాను. కాని యీ మహాకార్యము పూర్తియగుటకు ఆ శ్రీనివాసుని మహా సంకల్పమే సాధనమై మమ్ము నడపవలసియున్నది

ఈ కైంకర్యమునకు నాకవకాశముఁగల్పించిన శ్రీవేంకటేశ్వర దేవాలయాధికారులదయ నా కృతజ్ఞతాశక్తిని మించిన బరువు.

శ్రీవేంకటేశ్వరప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
తిరుపతి
30-11-51.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

శుభమస్తు

## శ్రీ తాళ్ళపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు-నేఁటి క్రోధిసంవత్సరమందు, తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన-వదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను, ఆదిమొదలుగాను శాలివాహనశకవరుషంబులు ౧౪౨౪ అగుఁ నేటిదుందుభిసంవత్సర ఫాల్గుణ-బహుళ ౧౨ నిరుధానకు[1] (విరోధానకు? తిరోధానానకు?) తిరువేంగళనాథుని-మీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన-అధ్యాత్మ సంకీర్తనలు.

రేకు 101 కాంబోది

విచారించు హరి నావిన్నప మవధరించు
పచారమే నాదిగాని పనులెల్లా నీవే ॥ పల్లవి ॥

తనువు ౧నాదెందుఁగాని ౨తనువులోనింద్రియములు
అనిశము నాచెప్పినట్టు సేయవు
మనసు నాదెందుఁగాని మర్మము నాయిచ్చ రాదు
పనివడి దూరు నాది పరులదే భోగము ॥ విచా ॥

---

1. ఈశబ్దము 'విరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చు చున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాడు కడవటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన "సరియగు" అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అనునర్థములో "ఈ నిరుద్ధమువకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ వెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది. సాహిత్య అకాడమీవారి-విష్ణుపారిజాతము ౬౯ పుట. నే పీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ-శర్మగారు. "నిబుత్తం" అనుతరవపదముకూడ 'నిలుపు' అనునర్థముతో దీనికి సహాయపడువనిరి. ౧. నాది+అందుఁగాని. ౨. తనువులోని+ఇంద్రియములు. ఇట్టిసంధు లీవాఙ్మయమున గలవు.

అలరి నానిద్దుర నాదేఁడఁగాని, ¹సుఖమెల్ల
కలలోని ²కాఁపిరాలకతలపాలె
తెలివి నాదెందుఁగాని దినాలు కాలముసొమ్ము
యెలమిఁ బేరు నాది యెవ్వరిదో బలువు ॥ విచా ॥

కర్మము నాదెందుఁ గాని కర్మములోఫలమెల్ల
ఊర్మిలి నాజన్మముల ³ఆధీనమె
ధర్మపు శ్రీవేంకటేశ దయానిధివి నీవు
నిర్మితము నీ దింతే నేరుపు నీమాయది ॥ విచా ॥ 1

ఆహిరి

విడువరా దెంతైనా వెఱ్ఱివాఁడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును ॥ పల్లవి ॥

జ్ఞానము నే నెఱఁగ నజ్ఞానము నే నెఱఁగను
మానను విషయములు మఱిగెంతైనా
నీనామము నొడిగి నీదాసుఁడ ననుకొంచు
దీనికే వహించుకొని తిద్దుకో నన్నును ॥ విడు ॥

అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకటసంసారముపై పాటు మానను
వొకపనివాఁడనై వూని ముద్రధారినైతి
మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును ॥ విడు ॥

వెనకఁ గాన ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మొక్కేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కని పోవిడువరాదు కరుణించు నన్నును ॥ విడు ॥ 2

1. 'యాసుఖమెల్ల' పూ.ము.పా. రేకులోలేదు. 2. 'కాఁపురాల' పూ.ము.పా
3. 'అధీనమె' పూ ము.పా.

సాళంగనాట

దొరకె మాపాలికిఁ గంటినయర్థము
దరిదాపైయుండినతత్త్వార్థము ॥పల్లవి॥

శిరముగ ౧నల్లదీవిఁ దెచ్చినయర్థ మిదివో
విరజవోడరేవున వెళ్లినర్థము
పరమభాగవతుల పాలిటినర్థ మిదివో
పురుషోత్తముఁడనేటిపురుషార్థము ॥దొర॥

చందపువేదముల(లు ?) శాసనము వేసినర్థము
ముందు సముద్రలకెల్లా మొదలర్థము
అందరియాత్మలనేటిఅంగళ్ల లోనియర్థము
యెందు సహస్రనామపుటెన్నికర్థము ॥దొర॥

కొలచి బ్రహ్మాండముల ౨కొప్పెరలోనర్థము
యిల నిహపరముల కెక్కినర్థము
యెలమి హీనులనైన యెక్కుడు సేసేయర్థము
అలరి శ్రీవేంకటేశుఁడైనయర్థము ॥దొర॥ ౧

భైరవి

దైవమా ౩నీమాయ తలమో తెఱఁగనీదు
కావరపువిషయాలకట్లు వదలవు ॥పల్లవి॥

గక్కనఁ దెరిగివచ్చీ కాలము మీఁదమీఁద
వొక్కనాఁటి కొక్కనాఁటి కొత్తు కొత్తుక
చిక్కి తుమ్మిదలవంటినెరులెల్లాఁ దెల్లనాయ
కక్కురమాయ మేను కాంతులూ నుడుగవు ॥దైవ॥

౧. 'వల్లదివిం' వ్రా.ప్ర.పా. నల్లదీవి = 'జంబూద్వీపము' కావచ్చు.
౨. కొప్పెరలోని + అర్థము. ౩. 'నీమాయతలమో తెఱఁగ నీదు' వ్రా.ప్ర.పా.

చిన్ననాఁడు మోహించినచెలులు నేఁ జూడఁగానే
పన్నినవయసుమీరి ప్రౌఢలైరి
వన్నెకుఁబెట్టినసొమ్ము వడి [౧]రాసి యెత్తుదీసె
మున్నిటివే వెనకాయ ముచ్చటాఁ దొలఁగదు ॥దైవ॥

సిగ్గులెల్లాఁ బెడఁబాసె చేరి యవ్వరు నవ్వినా
యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్ను నేలుకొని
దగ్గరి నాలోనుండఁగా తలపూఁ గైవాలదు ॥దైవ॥ 4

ముఖారి

[౨]పులుగు చెప్పేది నదె పొంచి మాగురుఁడు నీకు
తలఁచుకో నేఁడు నీవు దాఁచినర్థము ॥పల్లవి॥

యిలమీఁద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే. ॥పులు॥

చేరి తమవూరివారి చెఱవట్టుకొని పోతే
[3]కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు
వూరక నీకుక్షిలోనవున్న నన్ను నీమాయ
వీరానఁ జెఱవట్టెను విడిపించుకొనవే ॥పులు॥

బడిదప్పి తిరిగేటిపడుచుల తమవారు
తడయక తెచ్చుక ఆదరించినట్టు
వెడబుద్ధిఁ దిరిగేను వెఱ్ఱిని శ్రీవేంకటేశ
విడువక అజ్ఞానినన్ను విడిపించుకొనవే ॥పులు॥ 5

---

౧. రాసి=రాచుకొని. ౨. 'పులుఁగు' వూ.ము.పా. పులుగు = అబద్ధము, 'పుళుహు' తమిళము. ౩. ఈ పాదమున యతిభంగమా? 'తెచ్చుకొన్నట్టు' లోని 'కొ' తోనా?

ఆహిరి

ఇందులో మొదలికర్త యెవ్వఁడు లేఁడుగాఁబోలు
ముందు కరివరదుఁడే ముఖ్యుఁడుగాఁబోలు ॥ పల్లవి ॥

ఆడితిఁబో బహురూపా లన్నియోనులఁ బుట్టి
తోడనె బ్రహ్మాదులనేదొరలెదుటా
జాడలు మెచ్చాలేరు చాలునన్నవారు లేరు
వేడుక నడవిఁగాసేవెన్నెలాయ బ్రదుకు ॥ ఇందు ॥

అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతి—
నన్నివేదములనేటియంగడివీధి
నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు
వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు ॥ ఇందు ॥

సంసారపునాటకసాలలో ప్రతిమనైతి
కంసారి శ్రీవేంకటపతిమాయలోన
౧యింస లిన్నియుఁ దేరె నిందరుఁ జుట్టములైరి
హంసచేతిపాలునీరునట్లాయ బ్రదుకు ॥ ఇందు ॥ 6

రేకు 102 లలిత

ఒల్లఁడుగాక దేహి వుద్యోగించఁడుగాక
కొల్లలైనమేలు తనగుణములో నున్నది ॥ పల్లవి ॥

తలఁచుకొంటేఁజాలు దైవమేమి దవ్వా
నిలుచుక తనలోనే నిందుకున్నాఁడు
చలపట్టితేఁజాలు ౨సర్గ మేమి బాఁతా
చలివేఁడినాలికపై సత్యములో నున్నాఁడు ॥ ఒల్ల ॥

---

౧. 'హింస' కు వికృతియా. ౨. సర్గము 'స్వర్గము'నకు వికృతియా?

సాళంగనాట

అన్నిటి కెక్కుడుయీవి హరియిచ్చేది
మన్నించునాతనికంటే మఱి లేరు దొరలు ॥పల్లవి॥

తగుబ్రహ్మలోకముదాఁకా నెక్కిచూచిన
మగుడఁ బుట్టేలోకాలే మనుజులకు
తెగి ౧ యిచ్చే యింద్రాదిదేవతలవరములు
మెగువదిగువలను యీసందివే ॥అన్ని॥

మాయలోనఁ బుట్టేది మాయలోనఁ బెరిగేది
౨ కాయదారులకు నెల్లాఁ గలిగినదే
సేయరానిపుణ్యమెల్లాఁ జేసి గడించుకొనేది
చాయల బహురూపపుసంసారమే ॥అన్ని॥

చెడనివైకుంఠ మిచ్చుఁ జేటులేనిపర మిచ్చు
వెడమాయఁ బెడఁబాపు విష్ణుఁ డీతఁడే
యెడయక శ్రీవేంకటేశుఁడై వున్నాఁడు వీఁడె
జడియ కితఁడే కాచు శరణంటేఁ జాలును ॥అన్ని॥ 9

మలహరి

అతిసులభం బిది యందరిపాలికి
గతియిది శ్రీపతికైంకర్యంబు ॥పల్లవి॥

పాలసముద్రము బలిమిఁ దచ్చికొని —
రాలరిదేవత లమృతమును
నాలుక నిదె హరినామపుటమృతము
యేల కానరో యిహపరసుఖము ॥అతి॥

---

౧. 'యింద్రాదిదేవతలు యిచ్చేవరములు' అనుట సహజము.
౨. 'కాయధారులు' కావచ్చు.

అదరి బాఁతిపడి యవని దేవతలు
బడివాయరు యజ్ఞ భాగాలకు
విడువక చేతిలో విష్ణుప్రసాదము
కడిగడియైనది కానరుగాని ॥ అతి ॥

యెక్కుడురు దిగుదు రేడులోకములు
పక్కనఁ దపముల బడలుచును
చిక్కినాఁడు మతి శ్రీవేంకటేశ్వరుఁ-
డిక్కడితుదిపద మెఱఁగరుగాని ॥ అతి ॥ 10

సామంతం

ఏమి సేయుదు నింక నిందిరాధీశ్వరుఁడా
నీమఱఁగు చొచ్చితిని నెరవేర్తుగాక ॥ పల్లవి ॥

కడి వోనిజవ్వనము కలిమిలేమెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁగాక
అడియాసలెల్లాఁ బుణ్యముఁబాప మెఱుఁగునా
వెడగుఁదనలో దయ విడిపించుఁగాక ॥ ఏమి ॥

వలపువెఱ పెఱుఁగునా వాఁడిమొనలకు నైన
బలిమిఁ దూరించఁ జలపట్టుఁగాక
చలనమందినమనసు జాతి నీ తెఱుఁగునా
కలిసి హేయమున కొడిగట్టించుఁగాక ॥ ఏమి ॥

యెలమి రతిపరవశము యెగ్గుసిగ్గెఱుఁగునా
బలిమిఁ దిట్లకు నొడఁబఱచుఁగాక
యిలలోన శ్రీవేంకటేశ నీమాయ లివి
తలఁగించి యేలితివి దయసేతుగాక ॥ ఏమి ॥ 11

భైరవి

అయ్యో మాయలఁ బొంది అందు నిందు నున్నవారు
యియ్యగొనఁ గర్తలుగా రెఱఁగరు జడులు ॥పల్లవి॥

చుక్కలై యుండినవారు సురలై యుండినవారు
యిక్కడనుండిపోయినయీజీవులే
దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు
యెక్కుడైనహరి నాత్మ నెఱఁగరు జడులు ॥అయ్యో॥

పాతాళవాసులును పలులోకవాసులును
యీతరవాతనుండినయీజీవులే
కాతరాన వారిపుణ్యకతల వినేరుగాని
యీతల శ్రీహరికత లెఱఁగరు జడులు ॥అయ్యో॥

యిరవెఱిఁగినముక్తు లెఱఁగని[1] బద్ధులు
యిరవై మనలోనున్నయీజీవులే
సిరుల మించినవాఁడు శ్రీవేంకటేశ్వరుఁడే
శరణాగతులు దక్క చక్కఁగారు జడులు ॥అయ్యో॥ 12

రేకు 103 శుద్ధవసంతం

చీ చీ వివేకమా చిత్తపువికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు ॥పల్లవి॥

బతికేనంటాఁ బోయి పయిఁడి పుచ్చుక తన-
పతియవసరములఁ బ్రాణమిచ్చీని
బతు కందులోన నేది పసిఁడి యెక్కడ నుండు
గతిహరిఁ గొలువక కట్టువడె జీవుఁడు ॥చీచీ॥

---
౧. 'బద్ధులు' పూ.ము.పా.

దొడ్డవాఁడనయ్యేనని దొరలఁ గొలిచి వారి-
కడ్డము సిడుపు మొక్కనతిదీనుఁడై
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు ॥ చీచీ ॥

చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుఁ డింట నున్నాఁడు
దేవుఁ డాతఁడే నేఁడు తెలిసి కొలిచేఁగాని
భావించ కిన్నాళ్ళదాఁకా భ్రమఁ బడె జీవుఁడు ॥ చీచీ ॥ 13

## రామక్రియ

అనుచు నిద్దరునాడే రమడలవలెనే
మొనసి యివెల్లాఁ జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు ॥ పల్లవి ॥

రాముఁడ పండ్లు నాకు [1]రండు వెట్టరా
యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు
ప్రేమపుతమ్ముఁడఁగాన పిన్ననే నీకు
యీమాట మఱవకు యిందరా కృష్ణుఁడా ॥ అను ॥

యెక్కన [2]వుట్టిపై నన్ను నెక్కించరా వోరి
వుక్కనఁ బడేవు రాకు వద్దురా నీవు
పక్కన మొక్కెరా నీపయిఁడికాళ్లకు వోరి
అక్కతోఁ జెప్పేఁగాని అందుకొనే రారా ॥ అను ॥

[3]యెవ్వరు వొడవో సరి విటు విలుతమురా వోరి
నివ్వటిల్ల నీ వింత నిక్కవొద్దురా
రవ్వల శ్రీవేంకటాద్రిరాయఁడనేరా, అయితే —
యివ్వల నీకంటేఁ [4]బెద్ద యిది నీ వెఱఁగవా ॥ అను ॥ 14

1. 'రెండు' కు రూపాంతరము 2 'పుట్టి' రేకు.
3. ఎవ్వరు+పొడవో. 4. పెద్ద=పెద్దవాడను; యిది=ఈ విషయము.

ధన్యాసి

పెట్టినసీ వెఱఁగుదు పెఎదిక్కు-
ఇట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి ॥పల్లవి॥

కర్మమూలమైనట్టికాయము మోచి నేను
కర్మము విడువఁబోతే కడుసంగతా
మర్మమెఱిఁగినసీవే మాయలఁ [1] గట్టుండఁగాను
పేర్మి నే విడువఁబోతే బిగియదా కట్టు ॥పెట్టి॥

బంధమూలమైనట్టిప్రపంచమందు నుండి
బంధముఁ బాసేనంటేఁ బాసునా అది
అంధకారమైనట్టిఅజ్ఞానానఁ దోసితివి
అంధకారమున వెలఁ గరసితేఁ గలదా ॥పెట్టి॥

నిచ్చలు నీసంసారపునీరధిలోన ముసిఁగి
చొచ్చి వెళ్లి చేరేనంటేఁ జోటు గలదా
యిచ్చట శ్రీవేంకటేశ యిహమందే పరమిచ్చి
అచ్చు మోపి యేలఁగా నే నన్నియుఁ దెలిసితి ॥పెట్టి॥ 15

ముఖారి

వెనకేదో ముందరేదో వెట్టి నేను నా—
మనసుమరులు దేర మందేదొకో ॥పల్లవి॥

చేరి మీఁదటిజన్మముసిరులకు నోమేఁగావి
యేరూపై పుట్టుదునో యెఱఁగ నేను
కోరి విద్రించఁ బరచుకొన నుద్యోగింతుఁగావి
సారె లేతునో లేవనో జాడ దెలియ నేను ॥వెన॥

1. కట్టు+ఉండఁగాను.

తెల్లవారినప్పుడెల్లా తెలిసితినే(గాని
కల్లయేదో నిజమేదో కాన నేను
వల్ల చూచి కామినుల వలపించే(గాని
మొల్లమై నామేను ముదిసిన దెర(గ ॥ వెన ॥

పాపాలు చేసి మఱచి బ్రదుకుచున్నా(డ(గాని
వైపుగ( జిత్రగుప్తు(డు వ్రాయు టెఱ(గ
యేపున శ్రీవేంకటేశు నెక్కడో వెతకే(గాని
నాపాలిదైవమని నన్ను( గాచు టెఱ(గ ॥ వెన ॥ 16

మలహరి

అంతరుమాలినయట్టి యధములాల
[1]పొంత సంతకూటమి పొరిచూపు గాదా ॥ పల్లవి ॥

కనక మిత్తడితోడ కలయ సరిదూ(చితే
[2]అనువవునా అది దోష మవు(గాక
ఘను(డైనహరితో( గడుహీనదేవతల
నవిచి సరివెట్టితే నయ మవునా భువిని ॥ అంత ॥

పట్టభద్రు(డు గూర్చుండేబలుసింహాసనముపై
వెట్టిబంటు( బెట్టేవారు వెఱ్ఱిలేకారా
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతల(
బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా ॥ అంత ॥

క్రొంచక సింహముండేటిగుహ నుండవచ్చునా
పొంచి నక్కలకెల్ల బొక్కలేకాక
అంచెల శ్రీవేంకటేశు( డాత్మలోనే వుండ(గాను
కొంచపుదైవాల పలువంచలనేకాక ॥ అంత ॥ 17

---

౧. 'పొంతసంత కూటమిపో రిచూపు గాదా' వ్రా.ము.పా. అర్థము విచార్యము.
౨. 'ఉను' వ్రా.ము.పా. యతిభంగము.

దేవగాంధారి

కల్లమాడ దొడ్డముద్ర కటకటా
చెల్లుబడికల్లలు చెప్పేరు లోకులు ॥పల్లవి॥

యిప్పుడేలే బ్రహ్మదేవు( డిట్టే వుండ(గ మీ(దటి-
వొప్పగు బ్రహ్మపట్టము వొకరికి వెచ్చపెట్టి
అప్పటి మూ(డుమూర్తులయందులో నీతవి సరి-
చెప్ప(బొయ్యే రీమాట చెల్లునా లోకులకు ॥కల్ల॥

కైలాసము రుద్రు(డుగలబ్రహ్మాండకోట్లు
పోలించి విష్ణు(డు కడుపున నించుకుండ(గాను
చాలి మూ(డుమూర్తులలో సరి యీత( డంటాను
కూళలై యాడేరుగాక కూడునా లోకులకు ॥కల్ల॥

ఘను(డీతనిపాదము గడిగె బ్రహ్మదేవు(డు
మనుమట్టి శిరసున మో(చె శివు(డు
వొనర మూ(డుమూర్తులం దొక(డు శ్రీవేంకటేశు-
డనుమాట యిది తగవపునా లోకులకు ॥కల్ల॥ 18

రేకు 104 పాడి

తెలిసితేమోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బదుకు ఘనునికిని ॥పల్లవి॥

అనయము సుఖమేడ దవల దుఃఖమేడది
తనువుపై నాసలేనితత్త్వమతికి
పొని(గితే( బాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమొల్లనియోగికిని ॥తెలి॥

తగినయమృతమేది తలఁపఁగ విషమేది
తెగి నిరాహారియైనధీరునికిని
పగవారనఁగ వేరి బంధులనఁగ వేరీ
వెగటుప్రపంచమెల్ల విడిచేవివేకికి ॥ తెలి ॥

వేవేలువిధులందు వెఱపేది మఱపేది
దైవమునమ్మినయట్టిధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
యీవలేది యావలేది యితనిదాసునికి ॥ తెలి ॥ 19

భైరవి

నీదాస్యమొక్కటే నిలిచి నమ్మఁగలది
శ్రీదేవుఁడవు నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

అనుష్ఠానములు ౧ గతియని నమ్మి చేసితినా
తనువిది మలమూత్రములప్రోగు
జనులలో నుత్తమపుజన్మమే నమ్మితినా
వానరఁ గర్మమనేవోఁదానఁ బడినది ॥ నీదా ॥

చదువులశాస్త్రములజాడలు నమ్మితినా
పొదలినమతములపోరాట మది
మదిమదినుండినవాసననే నమ్మితినా
అదియును నింద్రియాల కమ్ముడువోయినది ॥ నీదా ॥

పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా
పాత్రమగురుణానుబంధము లవి
చిత్రముగ ననుఁ గావు శ్రీవేంకటేశ నీవే
పత్రపుష్పమాత్రమే నాభక్తియెల్లా నీకు ॥ నీదా ॥ 20

౧. "గతి యని చేసి నమ్మితినా" పూ.ము.పా.

మలహరి

౧ కంచుఁగాదు ౨ పెంచుఁగాదు కడుఁబెలుచు మనసు
యెంచరాదు పంచరాదు యెట్టిదో యీమనసు ॥ పల్లవి ॥

పట్టఁ బసలేదు చూడ బయలుగా దీమనసు
నెట్టనఁ బారుచునుండు నీరుఁగా దీమనసు
చుట్టి చుట్టి పాయకుండుఁ జుట్టముఁ గా దీమనసు
యెట్టనెదుటనే వుండు నేఁటిదో యీమనసు ॥ కంచు ॥

రుచు లెల్లాఁ గానుపించు రూపు లేదు మనసు
పచరించు నాసలెల్లాఁ బసిఁడిగా దీమసు
యెచటాఁ గరఁగదు రాయిఁగాదు మనసు
యిచటా నచటాఁ దానే యేఁటిదో యీమనసు ॥ కంచు ॥

తప్పక నాలో నుండు దైవముఁ గాదు మనసు
కప్పి మూఁటగరాట్టదు గాలిఁ గాదు మనసు
చెప్పరానిమహిమల శ్రీవేంకటేశుఁ దలఁచి
యిప్పు డిప్పిటా గెలిచె నేఁటివో యీమనసు ॥ కంచు ॥ 21

గుజ్జరి

కలదిదివో సుఖము గలిగినను గర్వము నిలువక మానునా
మలసి కామ్యకర్మములకుఁ జొచ్చినమగుడఁ బుట్టువులు మానునా ॥ పల్లవి ॥

పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులు గట్టిన నలబ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మిననరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము
వదలు ॥ కల ॥

---

౧. ౨. "కంచుఁగాదు పెంచుఁగాదు" పూ.ము.పా.

ఈ పాటలో మూడవచరణము 'దైవము' తప్ప తక్కిన సముచ్చయార్థకస్థలము-లందంతటా దీర్ఘములే కలవు. పూ.ము.పా. లలో అదీర్ఘములు హ్రస్వములైనవి. మూడవచరణము రెండవపాదము తప్పిపోయినది. మూడవ చరణము మూడవపాదము ఏమీవ్రాయకయే ప్రశ్నచిహ్నముతో నిలిచినది.

అలరినసంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపుచు నొకయిఱ్ఱిఁ బెంచినంతనే తనకును నారూపు దగిలె
ములుగుచు లంపటములు దెగ విడిచి మోక్షము వెదకెడినరుఁడు
వలవనిదుస్సంగతులు పెంచినను వాసన లంటక మానునా ॥కల॥

అటుగన తాఁ బట్టినవ్రత ముండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోరుఁడైనట్లు
తటుకన శ్రీవేంకటపతిం నొక్కని దాస్యము భజియించిననరుఁడు
ఘటనల నాతనికైంకర్యములకు కడుఁబాత్రుఁడుగాక మానునా
॥కల॥ 2

శ్రీరాగం

చెల్లఁబో యీజీవు లిలఁ జేసినపాప మెంతో
వుల్లమున నున్నహరి వూరకే దవ్వాయ ॥పల్లవి

కన్నచోటనే హరి కలఁడన్నవారికి
విన్నచోటనే విష్ణుడు వివేకులకు
వున్నతిఁ గొలువలేక వొద్దనుండఁగాఁ గొందరు
మిన్నుమీఁద వెదకేరు మితిమీఱఁ జదివి ॥చెల్లు

పట్టినదే బ్రహ్మము పరమార్థవేత్తలకు
తిట్టులోనా దైవము దివ్యులకును
ముట్టి చేత మొక్కలేరు ముందటనే వుండఁగాను
బట్టబయలు పాకేరు బహుకర్మవిదుల ॥చెల్ల

ఊపిరిలో దేవుఁడున్నాఁడు యోగీంద్రులకు
దాపున నున్నాఁడు హరిదాసులకును
యేపున శ్రీవేంకటేశు నేచి శరణనలేక
చాపలాన వెదకేరు సకలదేవతల ॥చెల్ల॥

---

౧. 'పతియొక్కని' కాబోలు. ఇది సమానము. ద్రుతము విచార్యము. లేదా దాస్యము అనునది 'సుఖముండి' ఇత్యాదులవలె తృతీయార్థకము కాబోలు.

లలిత

[౧]శరణంటి మాతని [౨]సమ్మంధమునఁ జేసి
మరిగించి మము నేలి మన్నించవే ॥పల్లవి॥

సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి నినుఁ బాడి పావనుఁడై న-
అకలంకుఁడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవేంకటనిలయ ॥శర॥

నారదాదిసనకసనందనాదులవలె
పేరుపడి నిన్నుఁ బాడి పెద్దలై [3]నట్టి-
ఆరీతిఁ దాళ్లపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టిశ్రీవేంకటనిలయ ॥శర॥

సామవేదసామగానసప్తస్వరములను
బాముతో నీసతి నిన్నుఁ బాడినయట్టి-
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చినశ్రీవేంకటనిలయా ॥శర॥ 24

రేకు 105 వరాళి

అదివో నిత్యశూ(సూ?)రులు అచ్యుత నీదాసులు
యెదురులేనివారు యేకాంగవీరులు ॥పల్లవి॥

రచ్చలసంసారమనేరణరంగములోన
తచ్చి కామక్రోధాలతలలు గొట్టి
అచ్చపుతిరుమంత్రపుటారుపుబొబ్బలతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు ॥అధి॥

---

౧. ఈ పాట పెదతిరుమలయ్యదో, చినతిరుమలయ్యదో కావలసియున్నది. అన్నమాచార్యుల సంబంధముతో మేము గొప్పవారమైతిమని చెప్పుకొనుచున్నారు.

౨. సంబంధ: పూ.ము.పా ౩ 'అట్టి' అను విశేషణము పై పాదములోని-తాళ్లపాకఅన్నమాచార్యులతో సమసింపవలసియున్నది సమాస మధ్యమున "ఆరీతిఁ" అనుపదము చొచ్చుకొన్నది. ఇట్టివికటసమాసములు ఈవాఙ్మయమున కోకొల్లలు.

మొరసి పుట్టుగులనేముచ్చుఁబోఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి
పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటుఁ దూరి
యెరగొని తిరిగేరు యేకాంగవీరులు ॥ అది ॥

వొడ్డినదేహములనేవూళ్లలోపల చొచ్చి
చెడ౧యహంకారమును చెఱలుపట్టి
అడ్డమై శ్రీవేంకటేశు నండ నుండి లోకులనే-
యెడ్డల జూచి నవ్వేరు యేకాఁగవీరులు ॥ అది ॥ 25

సాళంగం

౨జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాల
నానావిధాల నివి నమ్మేరు సుండి ॥ పల్లవి ॥

ఆలరియింతులయధరామృతము లివియెల్ల
కాలకూటవిషములకరణి సుండి
శీలముతో వీరలచెట్టలు వట్టుటెల్లా
బాలనాగాలఁ దొడికి పట్టుట సుండి ॥ జ్ఞాను ॥

కాంతలు నవ్వుచునైనాఁ గన్నులఁ జూచినచూపు
పంతమున నలుగులపాఁతర సుండి
బంతుల నెదుటనున్నపడఁతులచన్ను లివి
కంతల నొడ్డినబడిగండ్లు సుండి ॥ జ్ఞాను ॥

జవ్వనపుఁగామినులసరసపుమాటలెల్లా
మవ్వమైనయట్టిచొక్కుమంత్రాలు సుండి
యివ్వలను శ్రీవేంకటేశ్వరుదాసుల కివి
చివ్వనఁ జెప్పినట్టు చేసేవి సుండి ॥ జ్ఞాను ॥ 26

౧. 'అహంకారమును' కావచ్చు. ౨ జ్ఞానులార' ఇత్యాదికి బదులుగ 'జ్ఞానులాల' ఇత్యాదిగనే ఈరేకులలో పెక్కుతావుల సంబోధనము కానవచ్చుచున్నది.

కాంబోది

సంతలే చొచ్చితిఁగాని సరకుఁ గాననైతి
యింతట శ్రీహరి నీవే యిటు దయఁజూడవే ॥ పల్లవి ॥

కాంతచనుఁగొండలు కడకు నెక్కితిఁ గాని
యెంతైనా మోక్షపుమెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనేఅడవి చొచ్చితిఁగాని
సంతతహరి౧భక్తినేసంజీవి గాననైతి ॥ సంత ॥

తెగి సంసారజలధిఁ దిరుగులాడితిఁగాని
అగడై వైరాగ్యరత్న మది దేనైతి
పొగరుజన్మాలరణభూములు చొచ్చితిఁగాని
పగటుఁగామాదులపగ సాధించనైతి ॥ సంత ॥

తనువనియెడికల్పతరువు యెక్కితిఁగాని
కొనవిజ్ఞానఫలము గోయలేనైతి
ఘనుఁడ శ్రీవేంకటేశ కమ్మర నీకృపచేతఁ
దవిసి యే౨విధులనుఁ దట్టువడనైతి ॥ సంత ॥ 27

సాళంగనాట

నాకు నందు కేమివోదు నన్ను నీ వేమిచూచేవు
నీకరుణ గలిగితే నించి చూపవయ్యా ॥ పల్లవి ॥

ఘోరమైనదేహపుదుర్గుణ మేమిగలిగిన
అరసిఁ బ్రకృతిఁబోయి అడుగవయ్యా
నేరఁనినాజన్మముతో నేరుపేమిగల్లా నన్ను
ధారుణిఁ బుట్టించినవిధాత నడుగవయ్యా ॥ నాకు ॥

౧. 'భక్తనే' పూ ము:పా భక్తి+అనే=భక్తైనే. ఇట్టిసంధులు ఈవాఙ్మయమున
లోకొంలు. ౨. 'విదుల' రేకు.

పంచేంద్రియములలోవిపాప మేమిగలిగినా
అంచెలఁ గామునిఁబోయి అడుగవయ్యా
ముంచిననాకర్మములో మోసమేమి గలిగినా
మంచితనానఁ జేయించేమాయ నడుగవయ్యా ॥ నాకు ॥

అన్నిటా నావెనకటిఅపరాధ మేమిగల్లా
మన్నించి నాగురుఁ జూచి మానవయ్యా
యిన్నిక శ్రీవేఁకటేశ మీఁదిపను లేమిగల్లా
నిన్నుఁ జూచుకొని నన్ను నీవే యేలవయ్యా ॥ నాకు ॥ 28

దేసాక్షి

మఱి హరిదాసుఁడై మాయలఁ జిక్కువడితే
వెఱపించఁబోయి తానే వెఱచినట్లవును ॥ పల్లవి ॥

శూరుఁడైనవాఁ దేడఁజొచ్చిన నడ్డము లేదు
ఆరీతిజ్ఞానికి విధు లడ్డము లేవు
కారణాన నప్పటినీఁ గలిగెనా నది మరి
తేరిననీళ్ల వందు దేరిన ట్లవును ॥ మఱి ॥

సిరులరాజైతే నేమిసేసిన నేరమి లేదు
పరమాధికారియైతేఁ బాపము లేదు
అరసి తనకుఁదానే అనుమానించుకొనెనా
తెరువే బో ుసుంకరిఁ దెలిపిన ట్లవును ॥ మఱి ॥

భూమెల్ల మేసినా నాఁబోతుకు బందె లేదు
నేమపుఁబ్రపన్నునికి నింద లేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మమంటితే జుంటీఁగ కతవును ॥ మఱి ॥ 29

ముఖారి

నేమే బ్రహ్మమను౧ కోనేరము; నేము-
కామించిన౨ స్వతంత్రము గడు లేదుగాన ॥ పల్లవి ॥

క్షణములోపలనె సర్వజీవావస్థలూను
గణుతించేవాఁ డొకఁడు గలఁడు వేరే
అణుమహత్త్వములందు నంతర్యామైనవాని
ప్రణుతించి దాసులమై బ్రదికేముగాని ॥ నేమే ॥

పనిగొని యేలుటకు బ్రహ్మాదిదేవతలఁ
గనిపించేవాఁ డొకఁడు గలఁడు వేరే
ననిచి సిరుల లక్ష్మీనాథుఁడైనవాని-
పనులవారము నేము బ్రదికేముగాని ॥ నేమే ॥

సతతరక్షకుఁడయి శంఖచక్రధరుఁడయి
గతి శ్రీవెంకటపతి గలఁడు వేరే
అతనిమఱఁగు చొచ్చి యానందపరవశానఁ
బ్రతిలేక యిందరిలో బ్రదికేము గాని ॥ నేమే ॥ ౩౦

రేకు 106 శంకరాభరణం

ఇందుకేపో వెరగయ్యీ నేమందును
కందులేనినీమహిమ కొనియాడఁగలనా ॥ పల్లవి ॥

అటు దేవతలకెల్ల నమృతమిచ్చిననీవు
యిటు వెన్న దొంగిలుట కేమందును
పటుగతి బలీంద్రుని బంధించినట్టినీవు
సట రోలఁగట్టువడ్డచందాన కేమందును ॥ ఇందు ॥

౧. 'కొనేరము' పూ.ము.పా. ౨. 'స్వతంత్రముదుగ లేదు గాన' పూ ము పా. ఇక్కడ 'స్వతంత్ర'శబ్దము భావప్రధాననిర్దేశము.

కలిగి యాకరిరాజుఁ గరుణఁ గాచిననీవు
యిల నావులఁ గాచుట కేమందును
తలఁప బ్రహ్మాదిదేవతలకుఁ జిక్కనినీవు
చెలులకాఁగిళ్లకుఁ జిక్కితి వేమందును ॥ ఇఁ

భావించ నన్నిటికంటేఁ బరమమూర్తివి నీవు
యీవల బాలుఁడవైతి వేమందును
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని
శ్రీవేంకటాద్రి నిలిచితి వేమందుమ ॥ ఇందు ॥

పాడి

వెన్నలుదొంగిలునాటివెట్టివా నీవు
విన్నకన్నజాడ గాదు వెట్టివా నీవు ॥ పల్ల

చేరి విన్నునొల్లనట్టిజీవుల నీవుదరాన
వీరుఁడవై మోఁచేవు వెట్టివా నీవు
నారపేరు నుడిగితే నాపేరంటాఁ దగిలేవు
వీరానఁ జుట్టమవై వెట్టివా నీవు ॥ వెన్నె

బంటులైనవారికిఁ బరతంత్రుఁడవై యీ–
వెంటవెంట దిరిగేవు వెట్టివా నీవు
అంటే ననరాదు రెఁడుబడుకులకే చొచ్చేవు
వింటే మాకు నవ్వువచ్చీ వెట్టివా నీవు ॥ వెన్నె

పావనులయి లోకమెల్లా బదుకుమంటాఁ బేళ్ల
వేవేలు పెట్టుకొంటివి వెట్టివా నీవు
శ్రీవేంకటేశుఁడవై చెంది వరము లిచ్చేవు
వేవేగ నెవ్వరికైనా వెట్టివా నీవు ॥ వెన్నె ॥

### రామక్రియ

అయ్యో వారిభాగ్య మంతేకాక
నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు ॥ పల్లవి ॥

దేవుఁడు వెల్లవిరై దిక్కులెల్లా నిండుండఁగా
సోవల నాస్తికునకు శూన్యమై తోఁచు
యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా
కావరపుజీవునకు ౧గతుగతుకే ॥ అయ్యో ॥

హరి శరణంటేఁ గాచేఅట్టియుపాయమే వుండఁగ
విరసానకుఁ గర్మమే వెగ్గళమాయ
పరగ నరులకెల్లాఁ బట్టపగలై యుండఁగా
అరయఁ గొన్నిజంతుల కంధకారమాయను ॥ అయ్యో ॥

యిక్కడ శ్రీవేంకటేశుఁ డెదుటనే వుండఁగాను
అక్కటా మూఢున కెందు ననుమానమే
మక్కువ నింతా నమృతమయమైనఁ గోడికి
తెక్కుడఁ దవ్వఁబొయ్యేది తిప్పపెంటలే ॥ అయ్యో ॥ 33

### లలిత

కరుణించు మిఁకనైన కాఁపురమా
కరికరిఁ బెట్టకుమీ కాఁపురమా ॥ పల్లవి ॥

కలలోనిసుఖమైనకాఁపురమా
కలుషమేచవియైనకాఁపురమా
కలను బేహారపుకాఁపురమా
కలఁడు మా కిదే హరి కాఁపురమా ॥ కరు ॥

---

౧. 'గతుకు+గతుకు=గతుగతుకు' కావచ్చు.

౧ గంటవేఁటలో తగులుకాఁపురమా
కంటువత్తివెట్టికాఁచేకాఁపురమా
గంటుగిందుగాఁ బొరసేకాఁపురమా
కంటిమి శ్రీపతికృప కాఁపురమా ॥ కరు ॥

కావిరి వెట్టిచేరాయి కాఁపురమా
కావలసినట్లయ్యేకాఁపురమా
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్ను నన్ను నొక్క-
కైవశము ౨ సేసెఁగదో కాఁపురమా ॥ కరు ॥ 34

పాడి

వేసరకు వీఁ దేల యనకుము విడువ నిన్నిఁక శరణు చొచ్చితి
నీసరెవ్వరు లేరు వెదకిన నిందుబందికిఁ జేట వేఁగా ॥ పల్లవి ॥

మీరు నాకుఁ గలరు నేనేమి సేసినఁ గాతురనియెడి -
ధీరతను జము సరకు గొనకే తివిరిఁ సేసితిఁ బాపము;
వోరసేయుచు నెంతలేదని వూరకే మీరుంటిరేనియు
వారికివిఁ గొరగాను; నే నెవ్వరిని నెఱఁగను మిమ్మేకాని ॥ వేస ॥

మిమ్ముఁగొలిచినగర్వమున నేమీఁ జేయక కాలమందే,
నమ్మి కర్మములెల్ల మాఁటితి నాకునాకే వేసరి;
దొమ్మి కోపక మీకు నాకును దూరమనుచుఁ బరాకుచేసిన,
యిమ్ములను నన్నవియు రోసును యేల నా కవి నీవేకాక ॥ వేస ॥

నీకు మొక్కినమందెమేళము నే నొక కొండసేసుక
లోకములదేవతలకెల్లను లోను వెలిగానైతి;
యీకడను శ్రీవేంకటేశుఁడ యిప్పు డిటు ననుఁగరుణఁజూచితి
చేకొనుచు వారె మెత్తురు చెలఁగి నీ కింకరుఁడనను చు ॥ వేస ॥ 35

౧. 'గంట వెంటగ' పూ. ము. పా ౨. సేసెఁ గదె + ఓకాపురమా'

వరాళి

ఏమందురు యీమాటకు నిందరూ నిన్ను
  నీమాయ యెంతైనా నిన్ను మించవచ్చునా ॥ పల్లవి ॥

నేను నిన్నుఁ గొలిచితి నీవు నన్ను నేలితివి
  ౧పాని పంచేంద్రియాలేల పనిగొనీని
కానిలేనిబంట్లఁ దేరకాండ్లు వెట్టిగొనఁగ
  దానికి నీ కూరకుండ ధర్మమా సర్వేశ్వరా ॥ ఏమం ॥

పుట్టించినాఁడవు నీవు పుట్టినవాఁడను నేను
  పట్టి కర్మమేల నన్ను బాధపెట్టీని
వొట్టినసొమ్ముకు వేరొకరు చేయిచాఁచితే
  తట్టి నీవు వహించుకోఁదగదా సర్వేశ్వరా ॥ ఏమం ॥

యెదుట నీవు గలవు యిహములో నేఁ గలను
  చెదరినచిత్తమేల చిమ్మరేఁచీని
అదన శ్రీవేంకటేశ ఆరితేరినట్టినన్ను
  వదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా ॥ ఏమం ॥ 36

రేకు 107 సాళంగనాట

ఆమీఁదినిజసుఖ మరయలేము
  పామరపుచాయలకే భ్రమసితిమయ్యా ॥ పల్లవి ॥

మనసునఁ బాలు దాగి మదియించివున్నట్టు
  ననిచి గిలిగింతకు నవ్వినయట్టు
యెనసి సంసారసుఖ మిది నిజము సేసుక
  తనివొంది యిందులోనే తడఁబడేమయ్యా ॥ ఆమీఁ ॥

---

౧. 'పాని' క్త్వాంత 'పూను' ధాతువు వ్యావహారికమా?

బొమ్మలాట నిజమంటాఁ బూఁచి చూచి మెచ్చినట్టు
తెమ్మగా శివమాడి తా దేవరైనట్టు
కిమ్ముల యీజన్మమందు కిందుమీఁదు ౧నేఱక
పమ్మి భోగములనే తెప్పలఁ దేలేమయ్యా ॥ ఆమీఁ ॥

బాలులు యిసుకగుళ్లు పసఁ గట్టి కాడినట్టు
వీలి వెట్టివాఁడు గంతువేసినయట్టు
మేలిమి శ్రీవేంకటేశ మిమ్ముఁ గొలువక నేము
కాల మూరకే యిన్నాళ్లుఁ గడపితిమయ్యా ॥ ఆమీఁ ॥ 37

దేసాక్షి

దేవ నీదయ యెంతునో దివ్యసుఖ మెంతునో
కావించి గంటగట్టుక కాచుకుండే విదివో ॥ పల్లవి ॥

వెదక నావసమా వేగుదాఁకా నిన్ను నేను
కదిసి నీమూరితి కానవసమా
యెదుట శంఖుచక్రాల ౨యెట్టిదైవమ నేనని
పొదుగుచు నీకునీవే పొడచూపేవుగాక ॥ దేవ ॥

పొగడ నావసమా పురుణించి నీగుణాలు
తగుల నావసమా నీతలఁపెఱిఁగి
నిగిడి వేదశాస్త్రాల నిన్ను నీవే చెప్పుకొని
పగటుమాయజ్ఞానము పాపే వింతేకాక ॥ దేవ ॥

కొలువ నావసమా గుఱుతెఱిఁగి నీవెంట
చెలఁగి నాచేతులఁ బూజించవసమా
పిలిచి శ్రీవేంకటేశ నీవే నాయదలో నుండి
మలసి పెరరేఁపుచు మన్నించేవుగాక ॥ దేవ ॥ 38

---

౧. 'నెఱ(గ)క' వ్రా.ము పా ౨. 'యెట్టిదైవ మనేనని' వ్రా.ము పా. 'యిట్టి దైవము' కావచ్చు.

కన్నడగౌళ

నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించకపో దంతర్యామి ॥ పల్లవి ॥

౧సొమ్ము వోవేసినవాఁడు చుట్టిచుట్టి వీధులెల్లా
కమ్మక వెదకీనట కన్నదాఁకాను
నమ్మినఅజ్ఞానములో నన్నుఁ బడవేసుకొని
అమ్మరో వూరకుందురా అంతర్యామి ॥ నన్ను ॥

వోడబేరమాడేవాఁడు వొకదరి చేరిచి
కూడినయర్ధము గాచుకొనీనట
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరిచేర్చి
వోడక కాచుకోరాదా వోయంతర్యామి ॥ నన్ను ॥

చేరి పువ్వమ్మేవాఁడు చిట్లు వేఁ గనుఁడట
వూరకే శ్రీవేంకటేశ వోపికతోడ
ఆరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నాభార-
మేరీతి నైన మోవు మిఁక నంతర్యామి ॥ నన్ను ॥ 39

భూపాళం

హరివారమైతిమి మ మ్మవుఁగాదనఁగరాదు
తరముగా దిఁకను మాతప్పులు లోఁగొనరో ॥ పల్లవి ॥

వెన్నడించిసూడువట్టేవిష్ణుమాయ నీకు నేము
యిన్నిటాఁ బంతమిచ్చేము యింకఁ గావరో
నన్నల వెట్టిగొనేటిసంసారబంధము నీకు
మున్నె కిందుపడితిమి ముంచి దయఁజూడవో ॥ హరి ॥

'సొమ్ము + వో వేసిన' కావచ్చు.

ఆడించేటికామక్రోధాదిజూజరులాల
వోడితిమి మీకుఁ దొల్లె వోరయకురో
పీడవికర్మమ నీకు వెఱచి పూరి గఱచే-
మీడనే ధర్మదార మా కిఁకనైనాఁ బట్టవో ॥హరి॥

దక్కఁగొన్నమాలోనితనుభోగములాల
మొక్కితిమి మాకుఁ గొంతమొగమోడరో
యెక్కువ శ్రీవేంకటేశుఁ డేలె మాజన్మములాల
గక్కన వేఁడుకొంటిమి కపటాలు మానరో ॥హరి॥ 40

బౌళి

అతిసులభం బిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతిలే దిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి ॥పల్లవి॥

వేసరకుమీ జీవుఁడా వెదకివెదకి దైవమును
ఆసపాటుగా హరి యున్నాఁ డిదె అందుకుఁ బ్రహ్లాదుఁడు సాక్షి
మోసపోకుమీ జన్మమా ముంచినయనుమానములను
సేసినభక్తికిఁ జేటు లేదు యీసేఁత కెల్ల ధ్రువుఁడే సాక్షి ॥అతి॥

తమకించకుమీ దేహమా తగుసుఖదుఃఖంబుల నలసి
అమితము నరహరికరుణ నమ్మితే నందుకు నర్జునుఁడే సాక్షి
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబులు యీఁదీఁది
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుఁడే సాక్షి ॥అతి॥

మరిగివుండుమీ వోజిహ్వా మరి శ్రీవేంకటపతినుతులు
అరయఁగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులె సాక్షి
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపుమాయలకును లోఁగి
సరిలే దితనిపాదసేవకును సనకాదులబ్రదుకే సాక్షి ॥అతి॥ 41

లలిత

తుద సమస్తమును దుర్లభమే
అదె సులభుఁడు మాహరి యొకఁడే ॥ పల్లవి ॥

సురలును నరులును సొంపగుసిరులును
వొరసిన నిన్నియు నుపాధులే
నిరుపాధికుఁడును నిజకరుణానిధి
అరయఁగ నిదె మాహరి యొకఁడే ॥ తుద ॥

అందరియూవులు సఖిలకర్మములు
అందఁగరానిప్రయాసములే
యిందిరారమణి నేచినసేవిది౧
చెందరు సుజనులు చెప్పంగలదే ॥ తుద ॥

యితరోపాయము లేవి చూచినా
శ్రుతివిరహితములు శూన్యములే
రతి శ్రీవేంకటరమణునిమతి యిది
హితపరిపూర్ణం బిది యొకటే ॥ తుద ॥ 42

రేకు 108 లలిత

ఎవ్వరిభాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరువకు తానే గురుతు ॥ పల్లవి ॥

పరమమంగళము భగవన్నామము
సురలకు నరులకు శుభకరము
యిరవుగ నెఱిఁగిన యెదుటనె వున్నది
వరుసల మఱచినవారికి మాయ ॥ ఎవ్వ ॥

౧. 'శేవధి' కావచ్చు.

వేదాంతసారము విష్ణుభక్తి యిది
ఆదిమునులమత మయినది
సాదించువారికి సర్వసాధనము
కాదని తొలఁగినఁ గడుశూన్యంబు ॥ ఎవ్వ ॥

చేతివిధానము శ్రీవేంకటపతి
యేతలఁ జూచిన నిందరికి
నీతియు నిదియే నిజసేవకులకు
పాతకులకు నది భవసాగరము ॥ ఎవ్వ ॥ 43

ధన్నాసి

హరిదాసులతోడ నల్పులు౧ సరెనరాదు
గురుఁడు శిష్యుఁడునసే గుఱి దప్పఁగానా ॥ పల్లవి ॥

కోరి ముత్యపుఁజిప్పలఁ గురిసినవానయు
సారెఁ బెంకులలోవాన సరియౌనా
శ్రీరమణుఁ డిన్నిటానుఁ జేరియుంటే నుండెఁగాక
సారెకుఁ బాత్రాపాత్రసంగ తింతా లేదా ॥ హరి ॥

మలయాద్రి౨ మ్రాఁకులును మహిమీఁదిమ్రాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతే నాయఁగాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా ॥ హరి ॥

అమరులజన్మములు నసురలజన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతే నాయఁగాక
తమితో నధికారిభేదములు లేవా ॥ హరి ॥ 44

---

౧. 'సరెనరాదు' పూ.ము.పా. సరి+అనరాదు = సరెనరాదు.
ఈ వ్యావహారికసంధులను పనిపూని ప్రయోగించినట్లున్నది ఈ వాఙ్మయమున.
౨. 'మాకు' రేకు.

దేసాళం

నే ననఁగా నెంతవాఁడ నెయ్యపుజీవులలోన
యీనెపాన రక్షించీ నీశ్వరుఁ డేకాక ॥ పల్లవి ॥

యెవ్వరు బుద్ధిచెప్పిరి యిలపైఁ జీమలకెల్లా
నెవ్వగఁ బుట్టలఁ గొల్చి నించుకొమ్మని
అవ్వల సంసారభ్రాంతి అనాదినుండియు లోలోఁ
దవ్వించి తలకెత్తే యంతర్యామే కాక ॥ నేన ॥

చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలానఁ
బుట్టి కాచి పూచి పండఁ బొదలుమని
గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని
తిట్టపెట్టి రచించినదేవుఁ డింతేకాక ॥ నేన ॥

బుద్ధు లెవ్వరు చెప్పిరి పుట్టినట్టిమెకాలకు
తిద్ది చన్నుదాగి పూరి దినుమని
పొద్దువొద్దు లోన నుండి భోగములు మఱపిన-
నిద్దపుశ్రీవేంకటాద్రినిలయుఁడే కాక ॥ నేన ॥ 45

రామక్రియ

తెలిసినవాఁడఁ గాను తెలియనివాఁడఁ గాను
యిల నొకమాట నీ కెత్తిచ్చితిఁగాని ॥ పల్లవి ॥

పుట్టించేవాఁడవు నీవే బుద్ధిచ్చేవాఁడవు నీవే
యెట్టున్నా నపరాధ లేవి మాకు
అట్టూ నన్నువారముగా మనఁగా నీచిత్తమెట్టో
కిట్టి వొకమాట నడిగితి నింతేకాని ॥ తెలి ॥

మనసులోపల నీవే మరి వెలుపల నీవే
యెనసి అపరాధాలు యేవి మాకు
నిను నొంగాదనలేము నీసరివారముఁ గాము
అనవలసినమాట అంటి మింతేకాని ॥ తెలి ॥

అంతరాత్మవును నీవే అన్నిటాఁ గావఁగ నీవే
యెంతైనా నపరాధా లేవి మాకు
వింత లేక శ్రీవేంకటవిభుఁడ నీబంట వింతే
వంతుకు నే నొకమాట వాకుచ్చితిఁగాని ॥ తెలి ॥ 46

సాళంగనాట

నీయంతటివా రెవ్వరు నీకు నెదురేది యెందు
చాయల నీసుద్ది విని శరణంటి నేను ॥ పల్లవి ॥

కావలెనంటేఁ దొల్లి కంభము చించుకవెళ్లి
కైవశమై ప్రహ్లాదుఁ గావవా నీవు
తేపలనంటే బ్రహ్మదేవునికి వేదములు
సోవల సముద్రమయిన చొచ్చి తేవా నీవు ॥ నీయం ॥

పట్టియెత్తవలెనంటేఁ బాతాళానఁ బడ్డకొండ
తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు
మట్టుపెట్టవలె నంటే మరి భూమి చాపగాఁగ
చుట్టుకపోతేఁ దెచ్చి సొంపుగ నిలుపవా ॥ నీయం ॥

పక్షపాతమయ్యేనంటేఁ బాండవుల గెలుపించి
యీక్షితి యేలించి చనవియ్యవా నీవు
రక్షించేనంటేఁ గాతరాన శ్రీవేంకటాద్రిఁ బ్ర-
త్యక్షమై మావంటివారిఁ దగఁ గరుణించవా ॥ నీయం ॥ 47

సామంతం

అందరివలెనే వున్నాఁ డాతఁడా వీఁడు
యిందుముఖులఁ గూడినాఁ డీతఁ డానాఁడు ॥ పల్లవి ॥

యిందరూ నేఁ జేఁటఁ జేసేయింద్రయాగపుముద్దలు
అందుకొని యారగించినాతఁడా వీఁడు
చెంది మునులసతులసతఁ దెప్పించుక మంచి-
విందు లారగించినాఁడు వీఁ డానాఁడు ॥ అంద ॥

తొలుత బ్రహ్మదాఁచినదూడలకు బాలులకు
అలరి మారుగడించినాతఁడా వీఁడు
నిలుచుం దేడుదినాలు నెమ్మది వేలఁ గొండెత్తి
యిల నావులఁ గాచినాఁ డీతఁ డానాఁడు ॥ అంద ॥

బాలుఁడై ఘాతనాగుల బలురక్కసులఁ జంపి
అలరియాటలాడినయాతఁడా వీఁడు
~~యీలీల శ్రీవేంకటాద్రి యెక్కినాఁడు తొలుతే~~
యేలెను బ్రహ్మదుల నీతఁ డానాఁడు ॥ అంద ॥ 48

రేకు 109 దేసాక్షి

ఏపీ నుపాయాలుగావు యెక్కువ భక్తేకాని
దావతిఁ బడక యిది దక్కితే సులభము ॥ పల్లవి ॥

ముంటిపై సుఖమందుట ముక్కున నూరుపువట్టి
దంటవాయువు గెలువఁదలఁచేదెల్లా
వెంటికవట్టుక పోయి వెసఁ గొండ వాఁకుట
వెంటఁ గర్మమార్గమున విష్ణుని సాధించుట ॥ ఏపీ ॥

యేనుగుతోఁ బెనఁగుట యిల నిరాహారియై
కానవిపంచేంద్రియాలఁ గట్టఁబోవుట
నానిం చినుపగుగిళ్లు నమలుట బలిమిని
ధ్యానించి మనసుఁబట్టి దైవము సాధించుట ॥ఏపీ॥

దప్పికి నెండమావులు దాగ దగ్గరఁబోవుట
తప్పుఁజదువులలోఁ దత్త్వము నెంచుట
పిప్పిచవి యడుగుట పెక్కుదైవాలఁ గొలిచి
కప్పిన శ్రీవేంకటేశుకరుణ సాధించుట ॥ఏపీ॥ 49

7

శంకరాభరణం

అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు
యిప్పు డీట్టిమహిమల నెక్కుడాయ నీతఁడు ॥పల్లవి॥

చేకొని వాంతాలుతె చేసినపన్నీరుకాపు
జోకఁ గాలువలై సొరిది జార
సైకపునీలాద్రినుండి జలజలజారేటి-
రేకలసెలయేయలంత నున్న దిదివో ॥అప్ప॥

తెప్పలుగా గుప్పినట్టితెల్లనికప్పురకాపు
చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను
పుప్పొడిఁదోఁగినకల్పభూజము నిలుచున్న
చొప్పున నున్నాఁడిదివో సొంపులు మీరుచును ॥అప్ప॥

పొందుగ నంతటిమీఁదఁ బూసినపునుగుకాపు
కందువ మాణిక్యముల గనియైనట్టు
అంది శ్రీవేంకటేశ్వరు కదె యలమేలుమంగ
చెంది యరతఁ గట్టఁగా శ్రీవిభుఁడై నిలిచె ॥అప్ప॥ 50

మలహరి

ఏమి సేసే మిఁక నేము యెంతని దాఁచుకొందుము
నీమహిమ యింతంతననేరము నేమయ్యా ॥ పల్లవి ॥

అంది నిన్ను నొకమాటు హరి యని నుడిగితే
పొందినపాతకమెల్లాఁ బొలిసిపోయ
మందలించి మఱి యొకమాటు నుడిగినఫల-
మందె నీ కప్పగించితి మదిగోవయ్యా- ॥ ఏమి ॥

యిట్టె మీకు రెండుచేతులెత్తొకమాటు మొక్కితే
గట్టిగా విహపరాలు గలిగె మాకు
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల-
మట్టె నీమీఁద నున్నది అదిగోవయ్యా ॥ ఏమి ॥

సరుగ నీకొకమాటు శరణన్నమాత్రమున
సిరులఁ బుణ్యుఁడ నైతి శ్రీవేంకటేశ
ధరలోన నే నీకు దాసుఁడనైనఫల-
మరయ నీమీఁద నున్న దదిగోవయ్యా ॥ ఏమి ॥ 51

సాళంగం

ఎక్కడిమతము లింక నేమి సోదించేము నేము
తక్కక శ్రీపతి నీవే దయఁజూతుగాక ॥ పల్లవి ॥

కాదనఁగ నెట్టువచ్చు కన్నులెదిటిలోకము
లేదనఁగ నెట్టువచ్చు లీలకర్మము
నీదాసుఁడ ననుచు నీమరఁగు చొచ్చుకొంటే
యేదెసనైనాఁ బెట్టి యీడేరింతుగాక ॥ ఎక్క ॥

తోయ నెట్టువచ్చు మించి తొలఁకేటినీమాయ
పాయ నెట్టువచ్చు యీభవబంధాలు
చేయార విన్నుఁ బూజించి చేరి నీముద్రలు మోఁచి
యీమెడ నుండఁగా నీవే యీదేరింతుగాక ॥ఎక్క॥

తెలియఁగ నెట్టువచ్చు ద్రిష్టమైననీమహిమ
తలఁచఁగ నెట్టువచ్చు తగునీరూపు
నెలవై శ్రీవేంకటేశ నీవు ౧గలవనుండఁగా
యిలమీఁద మమ్ము నీవే యీదేరింతు గాక ॥ఎక్క॥ 52

శుద్ధవసంతం

పురుషోత్తముఁడ నీవు౨ పురుషాధముఁడ నేను
ధరలో నాయందు మంచితన మేది ॥పల్లవి॥

అనంతాపరాధములు అటు నేము సేసేవి
అవంతమయినదయ అది నీది
విను నెఱఁగకుండేటినీచుగుణము నాది
నను నెడయకుండేగుణము నీది ॥పురు॥

సకలయాచకమే సరుస నాకుఁ బని
సకలరక్షకత్వము సరి నీపని
ప్రకటించి నిన్ను దూరేపలుకే నా కెప్పుడూను
వెకలివై వనుఁగాచేవిధము నీది ॥పురు॥

నేర మింతయును నాది నేరు పింతయును నీది
సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు
యీరీతి శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి
ధారుణిలో నిండెను ప్రతాపము నీది ॥పురు॥ 53

---

౧. 'కలవు+అని+ఉండగా' ౨. 'నీవు' రేకు.

గుండక్రియ

నారాయణాచ్యు తానంత గోవిందా
నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు ॥పల్లవి॥

నిగమాంతవిదులైతే నిన్నెఱుఁగుదురుగాక
మృగసమానులకేల మీమీఁదిభక్తి
వెగటుగాఁ గృపతోడ విశ్వరూపు చూపినాను
పగటుదుర్యోధనుఁడు బహురూప మనఁడా ॥నారా॥

చిరపుణ్యులైతే మీసేవలు సేతురుగాక
దురితచిత్తులకు మీత్రోవ యేఁటికి
గరిమఁ బ్రత్యక్షమై కంబములోఁ గలిగినా
హిరణ్యకశిపుఁడు మిమ్మెంచి శరణనెనా ॥నారా॥

దేవతలయితే మిమ్ముఁ దెలియనేర్తురుగాక
యేవల నసురలు మిమ్మెఱిఁగేరా
శ్రీవేంకటాద్రిమీఁద సిరితో నీ వుండఁగాను
కేవలసంసారు లెఱిఁగియును మఱవరా ॥నారా॥ 54

రేకు 110 శంకరాభరణం

లేదు భయము మఱి కాదు భవము
ఆదియు నంత్యముఁ దెలిసిన హరియాజ్ఞకాన ॥పల్లవి॥

తలఁపులుగడుగక వొడలటు తాఁ గడిగిన నేమి
వెలుపలికాంక్షలు వుడుగక విధులుడిగిన నేమి
అలరుచు శ్రీహరిదాస్యము అతుమఁ గలిగినయాతఁడు
చెలఁగుచు పనులైనా సేసిన మరి యేమి ॥లేదు॥

పొంచినకోపము విడువక భోగము విడిచిననేమి
పంచేంద్రియములు ముదియక ౧పైముదిసిన నేమి
వించినదైవము నమ్మిన నిర్భరుఁడయినయాతఁడు
యెంచుక యేమార్గంబుల నెట్టుండిన నేమి ॥ లేదు ॥

వేగమె లోపల గడుగక వెలి గడిగిన నేమి
యోగము దెలియక పలుచదువులు దెలిసిన నేమి
యీగతి శ్రీ వేంకటపతి నెఱఁగి సుఖించేటియాతఁడు
జాగుల ప్రపంచమందును సతమైనా నేమి ॥ లేదు ॥ 55

గుండక్రియ

హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని
తరఁగుమొరఁగులను దాఁటలే రెవ్వరును ॥ పల్లవి ॥

నిండుఁజింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండిపుణ్యపాపాలే దరులు
కొండలవంటికరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

ఆపదలు సంపదలు అందులోనిమకరాలు
కాఁపురపులంపటాలే కైయొత్తులు
చాపలపుగుణములే సరిఁజొచ్చేయేరులు
దాపుదండ చేకొని దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

నెలవై ౨పుబ్బసగ్గులే నిచ్చలుఁ బోటునుఁ బాటు
బలువైనయాశే బడబాగ్ని
యెలమి శ్రీ వేంకటేశుహితులకే కాల్నడ
తలఁచి యితరులెల్ల దాఁటలే రెవ్వరును ॥ హరి ॥ 56

---

౧. పై=శరీరము. ౨. 'పుబ్బసగ్గు లేవిచ్చలుఁ' పూ.ము.పా.

### గౌళ

ఈతనిఁ గొలిచితేనే యిన్ని ౧గోలలునుఁ దీరు
౨చేతనఁబెట్టుపుణ్యాలు చేరుచనే కలుగు ॥పల్లవి॥

పట్టి కాళింగునిఁ దోలి పాముకోల దీర్చినాఁడు
బట్టబాయిటనే రేపల్లెవారికి
అట్టె పూతనఁ జంపి ఆఁడుఁగోల దీర్చినాఁడు
గట్టిగాఁ గృష్ణుఁడు లోకమువారికెల్లను ॥ఈత॥

బలురావణుఁ జంపి బాఁపనకోల దీర్చినాఁడు
యిలమీఁదఁ గలిగినఋషులకెల్లా
కొలఁదిమీరినయట్టికోఁతికోల దీర్చినాఁడు
సొలసి రాఘవుఁ డదె సుగ్రీవునికిని ॥ఈత॥

వాలిసి పురాలు చొచ్చి వూరఁ గోల దీర్చినాఁడు
ఆల తనదాసులైనయమరులకు
సిలుగుఁగోలలు దీర్చి సేన వరా లిచ్చినాఁడు
చెలఁగి పరుషలకు శ్రీవేంకటేశుఁడు ॥ఈత॥ 57

### శ్రీరాగం

వివేకించ వేళ లేదు విజ్ఞానమార్గమందు
భవసంపదలపెద్దపోఁజు చూచీ జీవుఁడు ॥పల్లవి॥

చిత్తమనియెడిమహాసింహాసనం బెక్కి
హత్తిబహుంపరాకాయ నదె జీవుఁడు
గుత్తపుదేహమనేటికొలువుకూటములోన
ఒత్తుఁ బ్రకృతినాట్యము చూచీని జీవుఁడు ॥వివే॥

---

౧. గోలలు' పూ.ము.పా ౨, 'చేతనంబెట్టు' పూ.ము.పా "చేతనన్ = బుద్ధి యందు; పెట్టు=వుంచుకొన్న" కావచ్చు "ప్రతిపజ్జ్ఞప్తి చేతనా:" అని అమరము.

పంచేంద్రియములనేబలు తేజీలపై నెక్కి
అంచల వయ్యాళిదోలీ నదె జీవుఁడు
ముంచినకర్మములనేముద్రలపెట్టెలు దెచ్చి
సంచముగా లెక్కవెట్టి సరి దాఁచీ జీవుఁడు ॥ వివే ॥

యిచ్చఁ గామక్రోధాలనే హితమంత్రులునుఁ దారు
తచ్చి తలపోసుకొనీఁ దగ జీవుఁడు
అచ్చపుశ్రీవేంకటేశుఁ డంతరాత్మయై యుండఁగా
పచ్చిగా నాతనిఁ జూచి భ్రమసీని జీవుఁడు ॥ వివే ॥ 58

సామంతం

చెల్లఁబో తియ్యనినోరఁ జేఁ దేఁటికి యీ-
పల్లదపుఁగోరికలపాలు సేయవలెనా ॥ పల్లవి ॥

ఆసలకు నాదేహ మమ్ముకొంటి వింటింట
దాసునిఁగా నాపాలిదైవమా నీవు
పోసరించి భూమిలోనఁ బుట్టించి రక్షించి
యీసులేక భంగపెట్టు టిది గొంత వలెనా ॥ చెల్లఁ ॥

పామరపుటింద్రియాలబారిఁ దోసితివి నన్ను
దామెనకట్టుగాఁ గట్టి తత్వమా నీవు
దోమటి నామతిలోనఁ దోడునీడవై యుండి
పామేటిసుఖములనే భ్రమయించవలెనా ॥ చెల్లఁ ॥

గక్కన నింతట నన్నుఁ గరుణించితివి నేఁడు
మొక్కితి శ్రీవేంకటాద్రిమూలమా నీకు
దిక్కుదెసవై నాకు దేవుఁడవై యేలికవు
చొక్కి నామన సింత సోదించవలెనా ॥ చెల్లఁ ॥ 59

భూపాళం

చూపఁజెప్పఁగలభక్తసుజనుఁడవు మాకు
దాపైనహరి యిట్టె తప్పెఁ దారెననక ॥పల్లవి॥

కోరి పాండవులయింటఁ గూర లారగించినట్టు
సారపుశబరివిందు చవిగొన్నట్టు
వూరకే మాయింట నీవు వొదవినపాటి నీ-
వారగించవయ్య చవు లోఁగాములెంచక ॥చూపఁ॥

తొల్లియు రేపల్లె గొల్లదోమటి దొడికినట్టు
తల్లిఅనసూయపాలఁ దనిసినట్టు
చిల్లరైనమాయింటఁ జేసినపా టారగించు
చల్లతోడిబోనమైన చాలుఁజాలదనక ॥చూపఁ॥

అంకెల శ్రీవేంకటాద్రి నారగించినయట్టు
కొంకులేక సిరితోడఁ గోనేటిరాయ
లెంకనయిననాయింటిలేశమైన నారగించు
౧అంకించి నీనాలోనిఅంతరము లెంచకా ॥చూపఁ॥ 60

రేకు 111 లలిత

ఏగతి ౨నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసెఁబో పనులు ॥పల్లవి॥

పరగి నాలుకసొంపు ష్వరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁబాపములవినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటికులాచారములు ॥ఏగ॥

---

౧. 'లంకించి' వ్రా.ము.పా. యతిభంగము. ౨. 'వన్నుద్ధరించే' వ్రా.ము.పా.

మొక్కలానఁ బరధనమునకుఁ జాఁచి చాఁచి
యెక్కువఁ జేతులమహి మెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటిముందరిపుణ్యములు ॥ఏగ॥

యెప్పుడు నీచులఇండ్ల కెడ తాఁకి పాదములు
తప్పనితపములెల్లాఁ దలఁగిపోయ
యిప్పుడే శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁ జేసినట్టి[1]నేరమెల్లా నడఁగె ॥ఏగ॥ 61

ముఖారి

పాప మెఱఁగను పుణ్యఫల మెఱఁగను
యేపనులు నీకు [2]సెల విన్నియునుఁ గావా ॥పల్లవి॥

మునుప నీవిషయముల ముద్ర[3]మానుసులఁగా-
నునిచితివి నామీఁద నొకటొకటినే
అనిశంబు నవి చెప్పినట్లఁ జేయకయున్న
ఘనుఁడ నీయాజ్ఞ నేఁ గడచుటే కాదా ॥పాప॥

కలిమిగలయింద్రియపుఁగాఁపులుండినవూరు
యెలమి నా కొసఁగితివి యేలు మనుచు
అలసి వీరల నేను నాదరించక కినిసి
తొలఁగఁద్రోచిన నదియు ద్రోహమే కాదా ॥పాప॥

కుటిలములఁ బెడఁబాపి కోరినచనవులెల్ల
ఘటనఁ జెల్లించితివి; ఘనుఁడ నేను:
అటుగనక శ్రీవేంకటాద్రీశ నీదాసి-
నెటుచేసినా నీకు నితవేకాదా ॥పాప॥ 62

౧. 'నేరములెల్లా' పూ.ము.పా. ౨. 'శల' రేకు, ౩. 'మానసులఁగా' కావచ్చు.

శుద్ధవసంతం

చిక్కవడ్డపనికిఁ జేసినదే చేఁత
    లెక్కలేనియప్పునకు లేమే కలిమి ॥పల్లవి॥

తగవులేమి కెదిరిధనమే తనసొమ్ము
    జగడగానికి విరసమే కూడు
    తెగుదెంపులేమికి దీనగతే దిక్కు
    విగువుఁగూటికి వట్టిబీరమే తగవు ॥చిక్క॥

పతిలేనిభూమికి బలవంతుఁడే రాజు
    గతిలేనికూటికిఁ గన్నదే కూడు
    సతిలేనివానికి జరగినదే యాలు
    కుతదీరుటకు రచ్చకొట్టమే యిల్లు ॥చిక్క॥

యెదురులేమికిఁ దమకేదైనఁ దలఁపిది
    మదమత్తునకుఁ దనమఱపే మాట
    తుదిపదమునకుఁ జేదొడై నవిభవము
    పదిలపుశ్రీవేంకటపతియే యెఱుక ॥చిక్క॥ 63

శ్రీరాగం

అన్నిటికి నొడయఁడవై న శ్రీపతివి నీవు
    యెన్నరాదు మాబలఁగఁ మెంచుకో మాపాఁజు ॥పల్లవి॥

జ్ఞానేంద్రియము లైదు శరీరిలోపల
    ఆనక కర్మేంద్రియము లైదు
    తానకపుకామక్రోధాలవర్గము లారు
    యీనెలవు పంచభూతా ౧ లెంచ మాపాఁజు ॥అన్ని॥

౧. 'లేఁచు' రేకు.

తప్పనిగుణాలు మూఁడు తనువికారము లారు
అప్పటి మనో[౧] బుద్ధ్యహంకారాలు
వుప్పతిల్లువిషయము లుదివోని వొకఅయిదు
యిప్పటి మించేకోపము యెంచుకో మాపోఁజు ॥ అన్ని ॥

ఆఁకలి దప్పియును మానావమానములును
సోఁకినశీతోష్ణాలు సుఖదుఃఖాలు
మూఁకగమికాఁడ నేను మొక్కెద శ్రీవేంకటేశ
[౨]యేఁకటారఁ[౩] గదపేవా నెంచుకో మాపోఁజు ॥అన్ని॥ 64

లలిత

ఈడ నుండె నిందాఁకా నింటిముంగిట
ఆడ నెందుఁ బోఁడుగద అప్పుడే యీకృష్ణుఁడు ॥ పల్లవి ॥

యేడ పూతకిఁ జంపె నింతపిన్నవాఁడంటా
ఆడుకొనే రదే వీధి నందరుఁ గూడి
వేడుకతో మనగోవిందుఁడు గాఁడుగదా
చూడరమ్మ వీఁడు గడుచల్లరీఁడు పాపఁడు ॥ ఈడ ॥

మరలి యప్పటివాఁడె మద్దులు విఱిచెనంటా
పరువులు వెట్టేరు పడఁతులెల్లా
కరికరించఁగ రోలఁ గట్టితే నప్పుడు మా-
హరి గాఁడుగదా ఆడనున్నబిడ్డఁడు ॥ ఈడ ॥

వింతగాఁగ నొకబండి విఱిచె నప్పటినంటా
రంతు సేసే రదివో రచ్చల్లొ వింది
అంత యీశ్రీవేంకటేశుఁ డైనమనకృష్ణుఁడట
యింతేకాక యెవ్వరున్నా రిటువంటిపాపఁడు ॥ ఈడ ॥ 65

౧. బుద్ధిహంకారాలు'రేకు ౨. 'ఏఁకట + అరవ్' ౩. గదపేవా + అని + ఎంచుకో.
'అని' కి ముందు మధ్యమపురుష వింత.

పాడి

విభుఁడ వింతటికి వెరవుతో ననుఁగావు
అభయహస్తముతోడిఆదిమూలమా ॥ పల్లవి ॥

పలులంపటాలచేతఁ బాటువడి పాటువడి
అలసితిఁ గావవే వోఆదిమూలమా
చలమరి యితరసంసారభ్రాంతిఁ జిక్కితి న-
న్నలరించి కావవే వోఆదిమూలమా ॥ విభుఁ ॥

యెంతకైనా నాసలచే యేఁగేఁగి వేసరితి-
నంత కోపఁ గావవే వోఆదిమూలమా
సంతలచుట్టరికాల జడిసితి నిఁకఁ గావు
అంతరాత్మ నాపాలిఆదిమూలమా ॥ విభుఁ ॥

౧రంటదెప్పుటింద్రియాల రవ్వైతిఁ గావవే వో-
అంటినశ్రీవేంకటాద్రిఆదిమూలమా
గెంటక ముమ్మాటికిని నీకే శర-
ణంటిఁ గావవే వో ఆదిమూలమా ॥ విభుఁ ॥ 66

రేకు 112 శ్రీరాగం

ఏఁటిమాట లివి విన నింపయ్యీనా మది-
౨నేఁటవెట్టి దాసుఁడౌ టిదిసరియా ॥ పల్లవి ॥

జీవుఁడే దేవుఁడని చెప్పుదురు గొందరు
దైవముచేఁతలెల్లాఁ దమ కున్నవా
ఆవలఁ గొందరు కర్మ మది బ్రహ్మ మందురు
రావణాదు లివి సేసి రతికెక్కిరా ॥ ఏఁటి ॥

---

౧. 'రంటదెప్పు టింద్రియాల' పూ.ము.పా. రంటఁ దిప్పు నింద్రియాల కావచ్చు. రంటన్=పుణ్యపాపములు రెండింటియందు. లేక సుఖదుఃఖములందు కావచ్చు.

౨. 'నేఁటి' పూ.ము.పా. 'ఏఁటవెట్టి'. అర్థము విచార్యము.

మిగులఁ గొందరు దైవమే ౧లేదనెందురు
తగ నీప్రపంచమెల్లాఁ దనచేఁతలా
గగన మతఁడు నిరాకార మందురు గొంద-
రెగువఁ బురుషసూక్త మెఱఁగరా తాము ॥ ఏఁటి ॥

యెనిమిదిగుణములే యితని వందురు గొంద-
రనయము మిగిలిన వవి దమవా
యెనయఁగ శ్రీవేంకటేశ్వరుదాసులై
మనుట నిత్యముగాక మరి యేమినేలా ॥ ఏఁటి ॥ 67

రామక్రియ

అన్నిటా శ్రీహరిదాసుఁడగువానికి
కొన్నిదైవములఁ గొలువఁగఁ దగునా ॥ పల్లవి ॥

విహితకర్మము సేసి వెదకేటిహరి నిట్టె
సహజమై కొలచేటిసరసునికి
గహనపుఁగర్మాలు కడమలైన నేమి
మహిఁ గనకాద్రికి మరి పైఁడి వలెనా ॥ అన్ని ॥

పలుదానములకెల్ల బలమైనహరి నిట్టె
బలువుగఁ జేకొన్న భక్తునికిని
నెలకొని యాతఁ డన్నియునుఁ జేసినవాఁడె
తెలిసి సూర్యునిఁ జూడ దీపాలు వలెనా ॥ అన్ని ॥

౨వేదవేద్యుఁడు శ్రీవేంకటపతినామ-
మాదిగాఁ బఠియించే యధికునికి
ఆదైనచదువులు అఱచేతి వతనికి
మేదినిఁ దిరుగాడ మెట్లు వలెనా ॥ అన్ని ॥ 68

౧. 'లేదనందురు' పూ.ము.పా. 'లేదని + అందురు' ఈ వ్యావహారిక సంధులీ వాఙ్మయమున కొల్లలు. ౨. 'వేవేదద్యుఁడు' పూ.ము.పా.

## మలహరి

[౧] ఊహీ శ్రీహరిఁగంటే యింత లేదుగా వట్టి-
దాహపుటాసల వెట్టి దవ్వ టింతేకాకా ॥ పల్లవి ॥

పలుమారు నిందరిసి భంగపడి వేఁదేది
యిలపై దేహమువెంచేయిందు కింతేకా
కలికికాంతలచూపుఘాతలకు భ్రమనేది
చెలఁగి [౨] మైమఱచేటిచేఁత కింతేకా ॥ ఊహీ ॥

పక్కన జన్మాలనెల్లాఁ బాటువడేదెల్లాను
యెక్కడో సంసారాన కిందు కింతేకా
వొక్కరిఁ గొలిచి తిట్టు కొడిగట్టే దెల్లాను
చక్కుముక్కునాలికెపై చవి కింతేకా ॥ ఊహీ ॥

గారవాన ధనములు గడియించేదెల్లాను
ఆరయ నాదని వీఁగేయుందు కింతేకా
చేరి శ్రీవేంకటపతి సేవకుఁ జొరనిదెల్లా
బారపుఁగర్మపుబాధఁ బట్టువడికా ॥ ఊహీ ॥ 69

## బౌళి

ఎంత బాఁపనా [౩] సోద మింత గలదా
అంతయు నీమహిమే హరిభట్లూ ॥ పల్లవి ॥

సూరిభ ట్లోకవంక చొరనిచోట్లు చొచ్చి
వారబియ్య మెత్తి యెత్తి వడదాఁకి
నీరువట్టుగొని భూమి నీళ్లెల్లా వారవట్టీ
కేరికేరి నగవయ్య క్రిష్ణభట్లూ ॥ ఎంత ॥

---

౧. 'ఊహి' పూ. ము. పా. ఈ 'ఊహీ' ఎగతాళి చేసి వప్పుటకు అనుకరణ శబ్దము. ౨. 'మైమఱచేది చేఁత' పూ.ము.పా, రేకు. ౩. 'సోద(ద్య?)' పూ.ము.పా. 'ఆసోద' శబ్దము 'ఆస్వాద్య' శబ్ద భవము కావచ్చు. పూ.ము.పా. లో '(ద్య?)' సూచన మక్కరలేదేమో.

దేవరాజ్యు లోకవంక దిక్కులలోఁ బొలగూడు
దీవెనతో నారగించి తీపుమరిగి
యీవలఁ బెట్టినవారి కేమైనా నొసఁగిని
వేవేలుమాయలవిష్ణుభట్లూ ॥ ఎంత ॥

౧సోమయాదు లోకవంక సొరిది సురలకెల్లా-
నామనితో విందువెట్టీ ననుదినము
హోమపువిప్రులసొమ్ము లొడిసి తాఁ బుచ్చుకొసీ
వేమరు శ్రీవేంకటాద్రివెన్నుభట్లూ ॥ ఎంత ॥ 70

## గుండక్రియ

అటుగన నే రోయఁగఁ దగవా
నటనల శ్రీహరి౨నటమింతే ॥ పల్లవి ॥

చిదుముడి మూఁగినజీవులలోపల
కడఁగి నే నొక్కఁడ నింతే
విడువక పక్షులు వృక్షము లిలపై
వెడఁగుభోగములు వెదకీనా ॥ అటు ॥

తనువులు మోచినతగుప్రాణులలోఁ
గనుఁగొన నొకమశకము నింతే
మునుకొని కీటకములుఁ జీమలు నిల
చెనకి దొరతనము సేసీనా ॥ అటు ॥

శ్రీవేంకటపతిసేవవారిలో
సోవల నొకదాసుఁడ నేను
భావించి సురలు బ్రహ్మాదు లతని-
దైవపుమాయలు దాఁటేరా ॥ అటు ॥ 71

---

౧. 'సోమయాజు' కావచ్చు. ౨. 'నట=నటనము' కావచ్చు. అచ్ప్రత్యయాంతము.

రామక్రియ

సేయనివాఁ [1]దెవ్వఁడు చేరి చిల్లరదోషాలు
యేమెడ జీవులజాడ లీశ్వరకల్పితమే ॥ పల్లవి ॥

దేవునినమ్మినయట్టిదేహియట యాతనికి
యీవల నెంతటిపాప మేమిసేసును
భావించి యన్నినేరాలు పరిహరించు నతఁడే
అవటించుసూర్యునికి నంధకార మెదురా ॥ సేయ ॥

పూజింపించుకొనేవాఁడు భువనరక్షకుఁడట
తేజముతో దురితాలు తెంచఁగలేఁడా
రాజు సేసినయా[2]జ్ఞ రాజుకంటే నెక్కుడా
వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు ॥ సేయ ॥

చేతనాత్మకుఁడట శ్రీవేంకటేశ్వరుఁడు
జాతిలేనిజీవునికి స్వతంత్ర మేది
కాతరపుజన్మానకుఁ గార్యకారణ మేది
యేతున గరుడనికి నెదురా పాములు ॥ సేయ ॥ 72

రేకు 113 మాళవి

ధ్రువవరదా సంస్తుతవరదా
నవమైనయార్తుని నన్నుఁ గావవే ॥ పల్లవి ॥

కరిరాజవరదా కాకాసురవరదా
శరణాగతవిభీషణవరదా
సిరుల వేదాలు నిన్నుఁ జెప్పఁగా [3]వినివిని
మరిగి మఱఁగుచొచ్చే మమ్ముఁ గావవే ॥ ధ్రువ ॥

---

౧. 'దెవ్వఁడు చేరి' ఈ 'చేరి' పూ.ము.పా. లో తప్పిపోయినది.

౨. 'యా(యా?)జ్ఞ' పూ.ము.పా. 'అన+అజ్ఞ' కలిపి వ్యావహారికముగానో, వ్రాతతప్పుగనో 'అనాజ్ఞ' అని యుండవచ్చు. అన=అజ్ఞ ఏకార్థములైనను కలిపి వాడుట నేటికి వ్యవహారములో సుప్రసిద్ధమే. ౩. 'వినివిని=వినియును' కావచ్చు 'వినివిన్నీ' అని లోక వ్యవహారము ఈనాటికిని కలదు.

అక్రూరవరదా అంబరీషవరదా
శక్రాదిదివిజనిచయవరదా
విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు
చక్రధర శరణంటి సరిఁ గావవే ॥ ధ్రువ ॥

ద్రౌపదీవరదా తగ నర్జునవరదా
శ్రీపతీ ప్రహ్లాదశిశువరదా
యేపున శ్రీవేంకటాద్రి నిటు నేను నాగురుఁడు
చూపఁగాఁ గొలిచే నచ్చుగఁ గావవే ॥ ధ్రువ ॥ 73

గుండక్రియ

నమ్మిన దొకటే నాకు నీశరణము
యెమ్మెలసంసార మింతే యిం దేమి గలదు ॥ పల్లవి ॥

యేఁటికర్మము నా కేఁటిధర్మము
యేఁటిదో నేఁ జేయఁగా నీ కేమి గూడెను
నాఁటిశుకపుత్రులంటివారు నడచినమార్గమపె
౧ యీఁటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు ॥ నమ్మి ॥

యేదతపము నా కేదజపము నే
వాదికఁ జేయఁగ నీకు వచ్చినదేమి
బెదిదపుఁబెద్దలెల్లాఁ బెట్టినతిట్టములంటా
యీడుకుఁ జేసేఁగాక యిం దేమి గలదు ॥ నమ్మి ॥

యెక్కడిపుణ్యము నా కెక్కడిభోగములు
యిక్కువ నన్నిట్లఁ జేసి యేమిగంటివి
నిక్కపుశ్రీవేంకటేశ నిన్నుఁ గనుటగాక
యెక్కడి కెక్కడిమాయ లిం దేమి గలదు ॥ నమ్మి ॥ 74

౧. 'యీటు' మూ.ము.పా. ఇక్కడ 'యీఁటు'లో అరసున్న విచార్యము.

బౌళి

అన్నియును హరినేసేయటమటాలే యివి
పన్నినసుజ్ఞానికి బయలై తోఁచు ॥ పల్లవి ॥

తిరుపై యవ్వలవ్వలఁ దిరుగుచుండేటివేళఁ
దిరిగినట్ల నుండు దిక్కులెల్లాను
సిరులసంసారభ్రమఁ జిక్కినజీవునికివి
పరగ నైహికమే పరమై తోఁచు ॥ అన్ని ॥

సొగిసి యద్దమునీడ చూచినవేళఁ దనకు
మగుడ వేఱొకరూపు మతిఁ దోఁచును
తగిలి యిట్లానేపో తనుఁదా నెఱఁగకున్న
నిగిడినపుట్టువులు నిజమై తోఁచు ॥ అన్ని ॥

కదిసినసకలాంధకార మంతటాఁ గప్పి
వుదయమైతే నన్ని నొదిగినట్టు
హృదయపుశ్రీవేంకటేశుఁడు వెల్లవిరైతే
మదిలో [1]నజ్ఞానము మాయమై తోఁచు ॥ అన్ని ॥ 75

లలిత

అవి యటు భావించినట్లాను
కవగొని యిందుకుఁ గలఁగరు ఘనులు ॥ పల్లవి ॥

అరయఁగ నేఁబదియక్షరములె పో
ధరలోపల నిందాస్తుతులు
సరిఁ బురాణములు శాస్త్రవేదములు
యిరవుగ విన్నియు నిందే పొడమె ॥ అవి ॥

---

౧. 'విజ్ఞానము' పూ ము.పా.

వొక్క దేహమున నున్నయంగములు
పెక్కువిధములై బెరసినవి
చిక్కులఁ గొన్నిటి సిగ్గుల దాఁతురు
యెక్కువయతులకు నివ్వియు సమము ॥ అవి ॥

అంతరాత్మలో నంతర్యామై
బంతులఁ దిరిగేటిబంధువులు
చింతింప నతఁడే శ్రీవేంకటేశ్వరుఁ -
డింతకుఁ గర్తని యెంతురు బుధులు ॥ అవి ॥ 76

మాళవి

బలువుఁడు హరిఁ జేపట్టితిని
తలఁచినదెల్లా దక్కెను నాకు ॥ పల్లవి ॥

దురిత [౧] ధ్వంసుఁడు దుఃఖవిదారుఁడు
అరిభయంకరుఁ డచ్యుతుఁడు
సిరివరుఁ డితనినిఁ జేకొని కొలిచిన
పరమసుఖమెపో భయ మెక్కడిది ॥ బలు ॥

దానవాంతకుఁడు దైవశిఖామణి
మానరక్షకుఁడు మాధవుఁడు
నానాముఖముల నాపాలఁ గలఁడు
యేనెపముల నా కెదురే లేదు ॥ బలు ॥

అనయము నిర్మలుఁ డఖిలానందుఁడు
ఘనుఁ డీశ్రీవేంకటవిభుఁడు
కనుకొని మము నిటు గాచుక తిరిగీ
యొనయఁగ నేలికె యితఁడే మాకు ॥ బలు ॥ 77

౧. 'ద్వంసుఁడు' రేకు.

దేవగాంధారి

మేలు లేదు తీలు లేదు మించీ నిదే హరిమాయ
కాలమందే హరిఁ గంటి కైవల్య మొకటే ॥పల్లవి॥

సురలును జీవులే నసురలును జీవులే
ధర నిందుఁ బ్రకృతిభేదమేకాని
సురలకు స్వర్గ మసురలకు నరకము
పరగ నీరెంటిగతి పాపపుణ్యములే ॥మేలు॥

పొలఁతులు జీవులే పురుషులు జీవులే
తలఁప భావభేదములేకాని
బలిమి స్వతంత్రముఁ బరతంత్ర మొకరికి
యెలమి నిందులోఁ జెల్లే హీనాధికములే ॥మేలు॥

రాజులును జీవులే రాసిబంట్లు జీవులే
వోజతో సంపద చెల్లే దొకటే వేరు
సాజపుశ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి
బాజుఁ గర్మ[1] మొందొకటి బంధమోక్షములు ॥మేలు॥ 78

రేకు 114 సాళంగనాట

అదె వచ్చె నిదె వచ్చె నచ్యుతుసేనాపతి
పదిదిక్కులకు నిట్టె పారరో యసురలు ॥పల్లవి॥

గరుడధ్వజం బదె ఘనశంఖరవ మదె
సరుసనే విష్ణుదేవుచక్ర మదె
మురవైరిపంపు లవె ముందరిసేన లవె
పరచి గగ్గుల [2]కాడై పారరో దానవులు ॥అదె॥

౧. 'మందొకటి' పూ.ము.పా. ౨. 'కాత్రై' కావచ్చు.

తెల్లని ౧గొడుగు లవె దేవదుందుభులు నవె
యెల్లదేవతలరథా లింతటా నవె
కెల్లురేఁగి విక్క హరికీర్తి భుజము లవె
పల్లపుపాతాళానఁ బడరో దనుజులు ॥ అదె ॥

వెండిపైఁడిగుదె లవె వెంజామరము లవె
మెండగుకై వారాలు మించిన వవె
దండి శ్రీవేంకటపతి దాడిముట్టె నదె యిదె
బఁడుబండై ౨జజ్ఝరించి పారరోదై తేయులు ॥ అదె ॥ 79

లలిత

అయ్యో నేనేకా అన్నిటికంటెఁ దీలు
గయ్యాళినై వ్రిధా గర్వింతుఁగాని ॥ పల్లవి ॥

తడిపివుదికినట్టిధౌతవస్త్రములు నా-
యొడలు మోఁచినమీఁద యోగ్యము గావు
వుడివోక వనములో వాప్రైనవిరులు నే-
ముడిచివేసినంతనే ముట్టరాదాయను ॥ అయ్యో ॥

వెక్కసపురచనలవేవేలురుచులు నా-
వొక్కనాలు కంటితేనే యోగ్యముగావు
పక్కనదేవార్ఘ్యపుఁబరిమళగంధములు నా-
ముక్కుసోఁకినంతలోనే ముట్టరాదాయను ॥ అయ్యో ॥

గగనాననుండి వచ్చేగంగాజలములైన
వాగి నాగోరంటితేనే యోగ్యము గావు
నగుశ్రీవేంకటపతి నన్నే రక్షించినదాఁక
మొగడై యెరుకతుది ముట్టరాదాయును ॥ అయ్యో ॥ 80

౧. 'గొడగు' రేకు. ౨. 'జర్ఝరించి' కి వ్యావహారికము గావచ్చు.

నాట

మర్ద మర్ద మమ బంధాని
దుర్దాంతమహాదురితాని ॥ పల్లవి ॥

చక్రాయుధరవిశత[1] తేజోఽంచిత
సక్రోధసహస్ర[2] ప్రముఖా
విక్రమక్రమా విస్ఫులింగకణ
నక్రహరణ హరినవ్యకరాంకా ॥ మర్ద ॥

కలితసుదర్శన[3] కఠినవిదారణ
కులిశకోటిభవ ఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళితదైత్యగళరక్తసంకీరణా ॥ మర్ద ॥

హితకరశ్రీవేంకటేశప్రయుక్త
సతతపరాక్రమజయసంకర
చతురోఽహం తే శరణం గతోఽస్మి
యితరాన్ విభజ్య యిహ మాం రక్ష[4] ॥ మర్ద ॥ 81

మాళవిగౌళ

[5]నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టిపరమాత్మునికి ॥ పల్లవి ॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుగొన చూపులే ఘనదీపము లట
తనలోపలియంతర్యామికిని ॥ నిత్య ॥

---

౧. 'తేజాంచిత' రేకు ౨. 'ప్రముఖ' శబ్దమునకు 'ముఖమే' అర్థముకాబోలు. ౩. 'కఠిన' రేకు. ౪. ఈ సంస్కృత కీర్తనములో సంబోధనములు దీర్ఘాంతముగా నుండుట సంగీతప్రభావముతోనేమో. అన్నమయ్య సంస్కృత రచన ఒక స్వతంత్రమైన తీరుగా నుండును. ౫. ఈ పాటలోని భావమే పె. తి. వచనరచనలో కన్పట్టునది.

పలుకే మంత్రమట [౧]పాదైననాలికే
కలకలమనుపిడిఘంటయట
నలుపైనరుచులే నైవేద్యములట
తలఁపులోపల నున్నదైవమునకు ॥ నిత్య ॥

గమనచేష్టలే యంగరంగగతియట
తమిగలజీవుఁడే దాసుఁడట
అమరినపూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని ॥ నిత్య ॥ 82

ముఖారి

కిన్నజానేఽహం కేశవాత్పర మహో
సన్నుతాకర మమాచరణాయ తస్మై ॥ పల్లవి ॥

వేదాంతవేద్యాయ విశ్వరూపాయ నమో
ఆదిమధ్యాంతరహితాధికాయ
భేదాయ పునరప్యభేదాయ నమో నమో
నాదప్రియాయ మమ నాథాయ తస్మై ॥ కిన్న ॥

పరమపురుషాయ భవబంధహరణాయ నమో
నిరుపమానందాయ నిత్యాయ
దురితదూరాయ కలిదోషవిధ్వస్తాయ
[౨]హరియచ్యుతాయ మమ [౩]ఆత్మాయ తస్మై ॥ కిన్న ॥

కాలాత్మకాయ నిజకరుణాకరాయ నమో
శ్రీలలామకుచాశ్రితగుణాయ
హేలాంక శ్రీవేంకటేశాయ నమోనమో
పాలితాఖిల మమాభరణాయ తస్మై ॥ కిన్న ॥ 83

౧. 'పాదైన' వ్రాము.పా., ౨. 'హరయేఽచ్యుతాయ' కావచ్చు. ౩ 'ఆత్మనే' కావచ్చు. అన్నమయ్య సంస్కృతరచన ఒక స్వతంత్రమైనదని ముందే వ్రాసియుంటిని.

కాంబోది

౧చెల్ల నెక్కెకొంటివిగా జీవుఁడ యీబలుకోటా
బల్లిదుఁడ నీకు నేఁడు పట్టమాయఁ గోటా ॥ పల్లవి ॥

తొమ్మిదిగవనులైనదొడ్డతోలుఁగోటా
కొమ్మలచవులమూలకొత్తళాలకోటా
వమ్ములేనిమెదవంపువంకదారకోటా
పమ్మి పగవారినెల్లా పట్టుకొన్నకోటా ॥ చెల్ల ॥

తలవాకిలిదంతపుతలుపులకోటా
తలిరుఁజేతులపెద్దదంతెనాలకోటా
వెలియాసలనేదండువిడిసినకోటా
గులగై యింద్రియములు కొల్లగొన్నకోటా ॥ చెల్ల ॥

నడచప్పరములనేనలువైనకోటా
జడిసినచెవుల మించుసవరణకోటా
పడవిపాట్లఁ బడి ఫలియించెఁ గోటా
యెదమిచ్చి శ్రీవేంకటేశుఁ దేలెఁ గోటా ॥ చెల్ల ॥ 84

రేకు 115 శంకరాభరణం

౨నాటికి నాఁడు గొత్త నేటికి నేఁడు గొత్త
నాటకపుదైవమవు నమోనమో ॥ పల్లవి ॥

సిరుల రుక్మాంగదుచేతికత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీకృపకలిమి నట్లనే అరులచే
కరిఖడ్గధార నాకుఁ గలువదండాయ ॥ నాఁటి ॥

---

౧ ఇందు దీర్ఘాంతమైన 'కోట' శబ్దము సంగీతానుబంధి కావచ్చు.
౨. అన్నమయ్య జీవితచరిత్ర మిందులో కానవచ్చుచున్నది.

మునుప హరిశ్చంద్రుమొనకత్తిధారఁ దొల్లి
పొనఁగి చంద్రమతికిఁ బూవుదండాయ
వనజాక్ష నీకృపను వరపుత్రుతెత్తినట్టి-
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥నాఁటి॥

చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ॥నాఁటి॥ 85

సాళంగనాట

కంటిమి రెంటికి భూమిఁ గలుగుదృష్టాంతము
గొంటరిరావణునందు గుహునియందు ॥పల్లవి॥

నీదాస్యముగలనీచజన్మమైన మేలు
యేదియునెఱఁగనట్టియెక్కువజన్మానకంటె
వాదపుగర్వము లేదు వట్టియాచారము లేదు
సాదించి నైచ్యానుసంధానమే కావి ॥కంటి॥

మిమ్ముఁ దలపుచుఁ జేయుమృగయానమైన మేలు
సొమ్ముపోక మీకుఁగానిసుకృతము సేయుకంటె
ఒమ్మరిజన్మము లేదు తెగనికోరిక లేదు
పమ్మి నీపైఁ బెట్టినట్టిభారమే కాని ॥కంటి॥

దిక్కులు సాధించుకంటె తెలిసి శ్రీవేంకటేశు-
౧దిక్కు నీనామమే కా సాధించుటే మేలు
యెక్కువ తక్కువ లేదు యెఱుకెఱఁగమి లేదు
చక్కఁజాడతో నీకు శరణంటేఁ గావి ॥కంటి॥ 86

౧ ఈపాద మనన్వితము, లేక 'కా' శబ్దమును 'మేలు' తో చేర్చ వచ్చునా?

లలిత

కామధేనువై కలిగె నీధరణి
వాములు వలసినవారికి విధులు ॥పల్లవి॥

అందరు జీవులే ఆయాకర్మముఁ
బొంది బుద్ధు లెప్పుడు వేరు
కొందరు స్వర్గము గోరి సుఖింతురు
కొందరు నరకానఁ గూలుదురు ॥కామ॥

దేవుఁ డిందరికి దిక్కై యుండును
భావాభావమే బహువిధము
దేవత లమృతాధీనమై మనిరి
[౧]తోవనె దనుజులు దురిత మందిరి ॥కామ॥

పుట్టుగందరికి పొంచి కలిగినదె
దట్టపుమనసులే తమకొలఁది
యిట్టే శ్రీవేంకటేశుఁడు సేసిన-
యట్లో నాటఁకు అదివో యెదుట ॥కామ॥ 87

గుండక్రియ

ఏపురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడ రెన్నఁడును ॥పల్లవి॥

హరివిరహితములు అవి గొన్నాళ్లకు
విరసంబులు మరి విఫలములు
నరహరిఁ గొలిచి నమ్మినవరములు
నిరతము లెన్నఁడు నెలవులు చెడవు ॥ఏపు॥

౧. తోవనై, పూ.ము.పా.

కమలాక్షుని మతిఁగాననిచదువులు
కుమతంబులు బహుకుపథములు
జమళి నచ్యుతునిసమారాధనలు
విమలములే కాని వితథముగావు ॥ఎవ్వ॥

శ్రీవల్లభుగతిఁ జేరనిపదవులు
దావతులు కపటధర్మములు
శ్రీవేంకటపతి సేవించు సేవలు
పావనము లధికభాగ్యపుసిరులు ॥ఎవ్వ॥ 88

ముఖారి

ఏలోకమందున్నా నేమీ లేదు
కాలిమి నందుకుఁదగ్గదావతే కాని ॥పల్లవి॥

సురల కసురలకు సూడునుఁబాడునే కాని
పొరసి సుఖించఁగఁ బొద్దు లేదు
ధరలో ఋషులకును తపము సేయనే కాని
మరిగి భోగించఁగ మరి పొద్దు లేదు ॥ఏలో॥

గక్కన సిద్ధులకైనా గంటియు బొంతయే కాని
చిక్కపరువము గలిగి నెలవులేదు
రెక్కలు గలపక్షికి రేసుతిమ్మటలే కాని
చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు ॥ఏలో॥

సకలజంతువులకు జన్మాదులే కాని
అకటా నిత్యానంద మందలేదు
వెకలి శ్రీవేంకటేశువిష్ణుదాసులకే మంచి-
కులెల్లాఁ గలవు సుడివడలేదు ॥ఏలో॥ 89

దేవగాంధారి

అన్నియును దనఆచార్యాధీనము
చెన్నుమీఱ హరిపాదసేవసేయు మనసా ॥పల్లవి॥

దైవమూ గొంచము గాదు తానూ గొంచము గాదు
భావించికొలచేవారిపరిపాటి
చేవల బత్తిముదుగు చేవిముదుగూ లేదు
వావిరి బోగెత్తేటివారివారినేరుపు ॥ అన్ని ॥

కాలము కడమలేదు కర్మము కడమలేదు
కేలి విశ్వాసముగలిగినపాటి
వ్రాలకు ముదిమీ లేదు వక్కాణ ముదిమీ లేదు
పోలించేటివిద్వాంసులబుద్ధిలోనినేరుపు ॥ అన్ని ॥

జ్ఞానానకు దప్పు లేదు జన్మానకు దప్పు లేదు
నానాటికి వివేకించి నడచేపాటి
పావిపట్టి శ్రీవేంకటపతి యింతకు మూలము
అనక యీతని శరణనేవారినేరుపు ॥ అన్ని ॥ 90

రేకు 116 సాళంగనాట

విఱిగిరి దానవవీరు లదె
అఱిముఱి దేవత లాడే రదె ॥పల్లవి॥

పరగుకంబ మదె పగిలె పగిలె నదె
హరినరసింహంబాయ నదె
గరుడధ్వజ మదె ఘనచక్రం బదె
మొరసేటిశంకపుమ్రోత లవె ॥ విఱి ॥

వెడలె వెడలె నదె వెనుకొని హిరణ్యుఁ
డొడికిపట్టె నదె తొడమీఁద
విడువక చించిన వేయిచేతులవె
కడపమీఁదనే కదలఁ డదె ॥ విటి ॥

అదె వామాంకంబందు లక్ష్మి యదె
కదిసి శాంతమదే కరుణ యదె
వుదుటున ప్రహ్లాదు నూరడించె నదె
యిదె శ్రీవేంకట మెక్కె నదె ॥ విటి ॥ 91

సామంతం

ఇద్దరు దేహసమ్మంధ మిదివో మాయ
గద్దించి ౧ యాడవుఁడునో కడసారీ తాను ॥ పల్లవి ॥

తోడఁబుట్టినమమత తొడఁగి కొన్నాళ్లకు
వాడికె పుత్రులమీఁదవలె నుండదు
వేడుక వారెవ్వరో వీరెవ్వరో కాని
౨ కూడపెట్టీ వీరికే కొట్లాడీ వారికే ॥ ఇద్ద ॥

తల్లిమీఁదఁ గలభక్తి తనకే కొన్నాళ్లకు
యిల్లాలుమీఁదవలె నింత వుండదు
వెల్లవిరి నది యెంత విచారించ నిది యంత
యిల్లుముంగి లొక్కరిది యెరవు వొక్కరిది ॥ ఇద్ద ॥

నీతితో శ్రీవేంకటేశునిత్యసేవ కొన్నాళ్ల -
కీతల సంసారమంత యితవు గాదు
ఆతఁడెట్టు యివియెట్టు అందరూ నెఱిఁగినదే
చేతు లొకటిమీఁదట చిత్త మొకయందు ॥ ఇద్ద ॥ 92

౧. 'యాదవుండు నొకరు నారితాను', వ్రా. ము. పా. అర్థము చింత్యము
౨. 'కూడపెట్టి వీరికే కొట్లాదేవారికి', వ్రా. ము. పా. అర్థము చింత్యము.

నాట

దేవశిఖామణి దివిజులు పొగడఁగ
వేవేలుగతుల వెలసీ వాఁడే ॥ పల్లవి ॥

వీధుల వీధుల వేసఁ దురగముపై
భేరుల బల్లెము బిరబిరఁ దిప్పుచు
మోదముతోడుత మోహనమూరితి
యేదెసచూచిన నేఁగీ వాఁడే ॥ దేవ ॥

కన్నులు దిప్పుచు కర్ణములు గదల
సన్నల ౧రాగెకు చౌకళింపుచును
అన్నిటఁ దేజి యాడఁగ దేవుఁడు
తిన్నఁగ వాగేలు దిప్పీ వాఁడే ॥ దేవ ॥

వలగొనఁ దిరుగుచు వాలము విసరుచు
నిలిచి గుఱ్ఱమటు నేర్పులు చూపఁగ
బలు శ్రీవేంకటపతి యహోబలపుఁ-
బొలమున సారెకుఁ బొదలీ వాఁడే ॥ దేవ ॥ 93

రామక్రియ

ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు
గొందినున్న మానుషము కొలుప దైంతైనా ॥ పల్లవి ॥

తనంతఁ దా నూరకున్న దైవమే తోడౌను
కినిసి తాఁ బదరితే కిందుమీఁదౌను
తనుఁదానే చేరె హరి దధివిభాండకునకు
కొనకెక్కఁ ౨బోయి నీవి కొంచపడెఁ ద్రోల్లి ॥ ఇంద ॥

౧. 'రాగాకు' పూ.ము.పా.
౨. 'బోయి నివి' పూ.ము.పా. నీవి=పందెమొడ్డిన ధనము.

౧ వొక్కటివాఁడు దానైతే వున్నచోనే మేలు చేరు
పెక్కుబుద్ధులఁ బోతేను పిరివీకొను
పక్కన నంబరీషుఁడు పట్టినవ్రతాన గెల్చె
దిక్కులెల్లా దూర్వాసు తిరిగి బడలెను ॥ ఇంద ॥

శ్రీవేంకటేశ్వరుచేతి ౨ లోవీజగములు
భావించి యాతఁడు నడపక మానఁడు
వావిరి నిదెఱఁగక పట్టియలమటఁబడి
జీవులేల బడలేరు చింత లిట్టె పాయరో ॥ ఇంద ॥ 94

## శ్రీరాగం

ఎంత ౩ వాటువడె నీశ్వరుఁడు
జంతువుల కేది సతమోకాని ॥ పల్లవి ॥

వోముచు లోలో ౪ నొకదేహమునకై
యేమి రచించెను యీశ్వరుఁడు
కామించి మోక్షసుఖమునకునైతే
వోమినస్రిష్టులు ౫ వొకటిఁ గావు ॥ ఎంత ॥

భోగించ బుట్టినభూతకోట్లను
యేగతి మోఁచీ నీశ్వరుఁడు
చేగదేర తనసేవకుఁ జొచ్చిన-
యోగము సులభం బొకటొకటికివి ॥ ఎంత ॥

పన్నినజగముల ప్రాణాధారము
యెన్నిట నున్నాఁ డీశ్వరుఁడు
కన్నుల శ్రీవేంకటపతి యని కని
వున్న వేళ తమవునికే సుఖము ॥ ఎంత ॥ 95

---

౧. ఒక్కటివాఁడు = ఒక్కనిశ్చితాభిప్రాయమునకు వచ్చినవాఁడు. ౨. 'లోని జగములు' పూ.ము.పా. ౩. 'పాటువడె' పూ.ము.పా. ఎంత+పాటు+పడె. ౪. 'నొక దేహము నకే' పూ.ము.పా. ౫. సృష్టు' లకు వ్యావహారికరూపము.

దేసాక్షి

నమ్మలేము కానలేము నరులాల మనమింతే
సమ్మతించి యేలేవాఁడు సర్వేశుఁడేసుండీ ॥పల్లవి॥

కంటికిఁ గంటిరెప్ప కాచుకవుండినయట్టు
వొంటి దేహమెల్లా జీవొడ్డుకొన్నట్టు
అంటుక దేహి నేపొద్దు అంతరాత్మయై వుండీ
జంటయై కాచుకున్నాఁడు సర్వేశుఁడేసుండీ ॥నమ్మ॥

చీఁకటి నోటికిఁ ౧గడి చేసే కొంటవచ్చినట్టు
ఆఁకటికి గుక్కిళ్ళు ఆసయినట్టు
వీఁకల జంతువులకు వెలుపల లోననుండి
సాఁకుచునున్నాఁ డిదివో సర్వేశుఁడేసుండీ ॥నమ్మ॥

తమదేహ మెంతైనా తానే యింపయి మోచినట్టు
తెమలి ప్రాణ మిన్నిటాఁ దీపయినట్టు
అమరినభోగమోక్ష లడిగినవారి కిచ్చి
సముఁడు శ్రీవేంకటాద్రి సర్వేశుఁడేసుండీ ॥నమ్మ॥ 96

రేకు 117 ౨ రామక్రియ

ఇట్టిజీవుల కింక ౩నేది వాటి
దట్టమై దేవుఁడ నీవే దయఁజూతుగాకా ॥పల్లవి॥

తనజన్మవిధు(ధు?)లనుఁ దలఁచు నొక్కొకవేళ
వానర మఱచు నట్టె.వొక్కొకవేళ
వినుఁ బురాణకధలు వివరించి యొకవేళ
పెనచి సందేహములె పెంచు నొకవేళ ॥ఇట్టి॥

౧. 'గడిచే యేకొంట' పూ.ము.పా. ౨ 'శ్రీరాగం' పూ. ము. పా.
౩. నేటిపాటి పూ.ము పా.

విసిగి సంసారమందు విరతుఁడౌ నొకవేళ
వొసఁగి యందె మత్తుఁడౌ నొకవేళ
పసిగొని యింద్రియాలబంట్లై వుండు నొకవేళ
౧ ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ ॥ ఇట్టి ॥

కోరి తపములు చేసి గుణియౌ తా నొకవేళ
వూరకే అలసివుండు నొక్కవేళ
యీరీతి శ్రీవేంకటేశ యెదలో నీ వుండఁగాను
బీరాన నీకే మొఱవెట్టు నొకవేళ ॥ ఇట్టి ॥ 97

సామంతం

ఎంత చదివి చూచిన నీతఁడే ఘనముగాక
యింతయు నేలేటిదైవ మింక వేరే కలరా ॥ పల్లవి ॥

మొదల జగములకు మూలమైనవాఁడు
తుదఁ బ్రళయమునాఁడు తోఁచేవాఁడు
కదిసి నడుమ నిండి కలిగివుండెడివాఁడు
మదనగురుఁడేకాక మఱి వేరే కలరా ॥ ఎంత ॥

పరమాణువైనవాఁడు బ్రహ్మాండమైనవాఁడు
సురలకు నరులకుఁ జోటయినవాఁడు
పరమైనవాఁడు ప్రపంచమైనవాఁడు
హరి యొక్కఁడేకాక అవ్వలనుఁ గలరా ॥ ఎంత ॥

పుట్టుగులయినవాఁడు భోగమోక్షాలైనవాఁడు
యెట్టనెదుర లోనను యిన్నిటివాఁడు
గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి-
పట్టపుదేవుఁడేకాక పరు లిఁకఁ గలరా ॥ ఎంత ॥ 98

౧. 'ముసిపితోదై వానకు' పూ.ము.పా.

పాడి

భోగసహాయులై పొరుగెల్లా
ఆగమవిదు(ధు?)లును ననంతములు ॥పల్లవి॥

కులమునఁ జుట్టాలు కోటానఁగోట్లు
కలిమిలేమి కొక్కఁడనే గుఱి
పలులంపటములప్రజలే యిందరు
నిలిచినచోటికి నే నొక్కఁడనే ॥భోగ॥

చెట్టపట్టిన నిదె చేటఁడుపండ్లు
గుట్టు దెలుసుకొన గురి నేను
వొటుక సంసార మూరల్లా నిదె
పుట్టినప్పటికి భువి నొక్కఁడనే ॥భోగ॥

చనవుమనవులకు జగమెల్లా నిదె
కొనకు మొదలికిని గురి నేను
యెనయుచు శ్రీవేంకటేశుఁ దేలెఁగన
[1]నినుపుగమికాఁడ నే నొక్కఁడనే ॥భోగ॥ 99

శ్రీరాగం

[2]హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుఁ డీతఁ డన్నమయ్య ॥పల్లవి॥

వైకుంఠనాథునివద్ద పడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య
[3]అకళపువిష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

---

౧. 'నినుపుగ మీవాఁడ' పూ.ము.పా. ౨. ఈపాటగూడ పె.తి. లయ్యదో చి.తి.లయ్యదో అయ్యుండవచ్చు. ౩. 'అకసపు' పూ.ము.పా.

క్షీరాబ్ధిశాయి విట్టే సేవింపుచునున్నవాఁడు
ఆరితేరి తాళ్లపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆరీతులఁ దాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥

యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశుపాదములందె వున్నవాఁడు
అ(హా ?)వభావమై తాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥ 100

మలహరి

కోరి మాభుజముల డాగులు మోచుకున్నారము
ధారుణిలోపల మమ్ము దయఁజూచుఁగాక ॥ పల్లవి ॥

సతతము హరిచేతిశంఖచక్రములే
గతియై మాపాలనుండి కాచుఁగాక
అతిరయమైనట్టిఅచ్యుతునిఆయుధాలే
హితవుగ మమ్ము నిట్టె యేలుఁగాక ॥ కోరి ॥

కమలాపతిచేతులగదాపద్మములు
మహాభారముతో మము మన్నించుఁగాక
సమరవిజయమైనశార్ఙ్గాదిశరములు
తమితోడ మాకు దాపుదండై వుండుఁగాక ॥ కోరి ॥

ముంచి శ్రీవేంకటేశుఁడు మెడఁగట్టినకరారు
అంచెల మాకెల్ల రక్షై అమరుఁగాక
అంచ నీతనికై దువులమరినహస్తములు
పంచల మాకిట్టే వజ్రపంజరా లవుఁగాక ॥ కోరి ॥ 101

లలిత

ఎన్నఁడొకో బుద్దెరిఁగి యీదేరేది జంతువులు
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి ॥ పల్లవి ॥

కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది
వేవేలుపాతకాలెల్ల విదళించుమనుచు ॥ ఎన్నఁ ॥

చింతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టె బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి
దొంతులైనభవముల తుదగనుమనుచు ॥ ఎన్నఁ ॥

అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి
బందె దీర నీకు మ్రొక్కి బ్రదుకుమని
అందపుశ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ-
వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు ॥ ఎన్నఁ ॥ 102

రేకు 118 దేసాళం

జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు
కావక పోరాదు మాకుఁగలయంతర్యామివి ॥ పల్లవి ॥

పైపై నెదురుకట్లఁ బంచదార వుండఁగాను
చేపట్టి యడిగి తెచ్చి చేఁదు దిన్నట్లు
పూప లైనచేతిలోనే పుణ్యములు వుండఁగాను
పాపములు చవియంటాఁ బట్టఁబొయ్యీ జీవుఁడు ॥ జీవు ॥

యింటిలోనే నవరత్నా లెన్నియైనా నుండఁగాను
కంటగించి గాజుఁబూస గట్టుకొన్నట్లు
వెంటనే హరినామాలు వేయివేలై వుండఁగా
జంట నితరమంత్రాలు జపియించీ జీవుఁడు ॥ జీవు ॥

చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండఁగాను
వేసరక వెలయాలి వెతకినట్లు
మేసుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండఁగా
వాసిఁ బరులఁ గొలువనే వడిఁ గోరీ జీవుఁడు ॥ జీవు ॥ 103

గౌళ

ఊరకే దొరకునా వున్నతోన్నతసుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట ॥ పల్లవి ॥

తలఁపులోపలిచింత దాఁటినప్పుడుగదా
అలరి దైవంబు ప్రత్యక్షమౌట
కలుషంపుదుర్మదము గడచినప్పుడుగదా
తలకొన్న మోక్షంబు తనకుఁ జేపడుట ॥ ఊర ॥

కర్మంబుకసటు వోఁ గడిగినప్పుడుగదా
నిర్మలజ్ఞానంబు నెరవేరుట
మర్మంబు శ్రీహరి నీమఱఁగుచొచ్చినఁగదా
కూర్మిఁ దనజన్మ మెక్కుడు కెక్కుడౌట ॥ ఊర ॥

తనశాంత మాత్మలోఁ దగిలినప్పుడుగదా
పనిగొనఁ దనచదువు ఫలియించుట
వేంకటేశ్వరునిదాస్యంబు

భైరవి

ఏమిసేతు దైవమా యెన్నఁడు గరుణించేవో
దామెనసంసారములోఁ దట్టువడీ మనసు ॥ పల్లవి ॥

యెక్కడిపగయోకో ఇంద్రియాలు నన్నుఁబట్టి
చక్కుముక్కు[1] సేసి యెంచి సాదించీని
గుక్కక యేమిసేసినకొలయోకో[2] వెంటవెంట
పెక్కసపు[3] పుట్టువులై వెనుతగిలీని ॥ ఏమి ॥

యెన్నాళ్లపాపమోకో యెడతెగక నాలోన
వున్నతపుఁగోపమై వుమ్మగిలీని
తిన్ననై యెవ్వరిచేతితిట్టుర[4] దాఁకినవిధమో
విన్ననై విజ్ఞానమెల్లా వీటఁబోయఁ దుదిని ॥ ఏమి ॥

యేవేళగుణమో యెడతెగనికర్మాలు
రావిమానిజిగురై వూరక యంటీని
శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తములోపల నుండి
కావఁగఁగదా నీవే గతి యనవలసె ॥ ఏమి ॥ 105

ముఖారి

నిరుహేతుకదయానిధివి నీవు
కరుణించు నీకు నొక్కటి విన్నపము ॥ పల్లవి ॥

దేవా నీమహిమ తెలియనెవ్వరివశ -
మీవల నీవే[5] గతెను టింతేకాక
భావించలేరు నిన్ను బ్రహ్మాదులునహితము
నీవేడ నేనేడ నే నొక జంతువను ॥ నిరు ॥

---

౧. 'ఏఁచి' కావచ్చు ౨. 'సేసినా కొలయోకో' పూ.ము.పా. రేకు. ౩. 'పుట్టువులే' పూ.ము.పా. ౪. 'దాకినా విధమో' పూ.ము.పా. రేకు. ౫. గతి + అను 'గతను' పూ.ము.పా.

౧ చిత్తాహరి నాదిక్కు చేకొని యపలోకించవే
యిత్తల సంసారవార్ధి యీఁదుచున్నాఁడ
హత్తి చూచేవారేకాని అడ్డగించేవారు లేరు
పొత్తుల నాధర్మము పుణ్యము నీచేతిది ॥ విరు ॥

అవధారు శ్రీవేంకటాధీశ నాజన్మము
కవిసి యింద్రియములఁ గట్టువడ్డాఁడ
జవళి నీపాదములే శరణము చొచ్చినాఁడ
తవిలి నీచిత్తమింతే తరవాత నీఁక్షను ॥ విరు ॥ 106

బౌళి

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి విజయముఁ బొంది
దేవతలు చూడ దశదిక్కులకు నేసెను ॥ పల్లవి ॥

అరికమ్మ వేసెనట్టె అల్లనరకాసురుపై
మేరమీరి రావణునిమీఁద నేసెను
సారపుజలధిమీఁద జలములింకఁగ నేసె
దారి దప్పకుండ నేడుదాళ్ల దెగనేసె ॥ శ్రీవేం ॥

పగదీర మింటిమీఁదిబాణునిమీఁద నేసె
మిగుల మెరసి మాయామృగము నేసె
జగములో రాక్షసుల సంహారముగ నేసె
వెగిడి ౨ రక్తగుండాలు నిండ నేసెను ॥ శ్రీవేం ॥

ఖరదూషణాదుల కడిఖండలుగ నేసె
సరుసఁ గుంభకర్ణునిఁ జావనేసెను
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
గరుడనిమీఁద నెక్కి కంటువాయ నేసెను ॥ శ్రీవేం ॥ 107

౧. 'చిత్తములోనున్నహరి' కావోలు. ౨. ఇటువంటిచిల్లరసమాసదోషములకు ఈ వాఙ్మయమున పట్టింపు లేదు.

బౌళి

ఆర్పులు బొబ్బలు నవె వినుఁడు
యేర్పడ నసురల సిటువలె గెలిచే ॥ పల్లవి ॥

కూలినతలలును గుఱ్ఱపుడొక్కలు
నేలపైఁ బారిననెత్తురులు
వోలిఁ జూడుఁ డిదె ౧వృద్ధగళలీరణ(?)
కేలిని విష్వక్సేనుఁడు గెలిచె ॥ ఆర్పు ॥

పడినరథంబులు బాహుదండములు
కెదసినగజములు గొడగులును
అడియాలము లివె అక్కడ నిక్కడ
చిదుముడి విష్వక్సేనుఁడు గెలిచె ॥ ఆర్పు ॥

పగుల పగుల వృషభాసురునిఁ జంపె
పగ నీఁగె అతనిబలములతో
అగపడి శ్రీవేంకటాధిపుపంపున
జిగి గలవిష్వక్సేనుఁడు గెలిచె ॥ ఆర్పు ॥ 108

రేకు 119 లలిత

సకలబలంబులు నీవే సర్వేశ్వర నాకు
అకలంకంబగుసుఖమే అన్నిట నిదే నాకు ॥ పల్లవి ॥

పొందుగఁ జక్రాంకితమే బుజబల మిదె నాకు
అందినహరి నీచింతే ఆత్మబలము నాకు
సందడిఁ బేరుబలము కేశవనామము నాకు
యిందును నందును భవభయ మిఁక లే దిదే నాకు ॥ సక ॥

---

౧. చూడుఁడిదె, వృద్ధగళలు=పైకెగసినకళలు కావచ్చు. 'ఈరణకేలిని' అని విఱుచవచ్చునా? ప్రశ్నచిహ్నము పూ. ము. పా.

అంగపుఁదిరుమణు లివి పంచాంగబలము నాకు
సంగతి నీపై పాటలె స్వరబలి మిదే నాకు
రంగుగ నీగుణరాసులే రాసిబలము నాకు
యింగితముగ నిహపరముల ౧కెదురే దిదే నాకు ॥సక॥

కనుఁగొను నీవిగ్రహమే గ్రహబలి మిదె నాకు
విను నీదాసులసేవే వెనుబలి మిదె నాకు
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు
ఘనమే చెప్పఁగ నింతటఁ గలిగెబో యిదే నాకు ॥సక॥ 109

సాళంగనాట

ఇదివో పీడపీడుల సీతనితేరు
యెదుట శ్రీవేంకటాద్రివితేరు ॥పల్లవి॥

చట్టువడఁ దోలె నాఁడు సముద్రాలపైఁ దేరు
యెట్టుగాఁ దోలెను పౌండ్రకునిపైఁ దేరు
జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు
కొట్టి తోలె హంసడిభకులపై తేరు ॥ఇది॥

ఘోరమై కుంగఁగఁ దోలె కులగిరులపైఁ దేరు
కౌరవసేనపైఁ దోలె గక్కనఁ దేరు
కోరి మధురమీఁద నక్రూరుఁ గూడి తోలెఁ దేరు
ఆరసి సంధిమాటలు ఆడఁదోలెఁ దేరు ॥ఇది॥

తచ్చి శిశుపాలాదిదైత్యులపైఁ దోలెఁ దేరు
మెచ్చుగాఁ దోలె రుక్మిణిపెండ్లితేరు
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చెచ్చెరఁ దోలె దిక్కుల సింగారపుఁదేరు ॥ఇది॥ 110

౧. 'కెదురేటిదే' పూ.ము.పా. ౨. 'దిచటుల' రేకు.

పాడి

అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు
నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా ॥పల్లవి॥

అదివో కోనేటిలోన నదివో సర్వతీర్థములు
అదివో పైఁడిమేడలవాలినగరు
పొదలి పరుషలెల్లా పొదిగి సేవించేరు
యిదివో వరము లిచ్చె నిందిరానాథుఁడు ॥అను॥

అదివో వేదఘోషము అదివో సురలమూఁక
అదివో విశ్వరూపము అద్భుతమందె
గుదిగొనెఁ బుణ్యములు కోట్లసంఖ్యలు చేరె
యిదివో దయదలఁచె నీశ్వరేశ్వరుఁడు ॥అను॥

అదివో శ్రీవేంకటేశుఁ డక్కున నలమేల్మంగ
అదివో నిత్య[౧]శూరులు అశవారలు
నిఖిలశేషాచలము నిక్కి పైపైఁ బొడచూపె
యిదివో కొలువున్నాఁడు హృదయాంతరాత్ముఁడు ॥అను॥ 111

నాట

అహోబలేశ్వరుఁ డరికులదమనుఁడు
మహామహిమలను మలసీ వాఁడె ॥పల్లవి॥

కదలుఁగన్నులును కరాళవదనము
గుదిగొనుభయదపుఁగోరలును
అదరుమీసములు నలరఁగ నవ్వుచు
వుదుటుతోడఁ గొలువున్నాఁడు వాఁడె ॥అహో॥

౧. 'సూరులు' కావచ్చు.

అతిసితనఖములు ననంతభుజములు
　విततపరాక్రమవేషమును
　అతులదీర్ఘ[౧] జిహ్వాయుఁ గడు మెరయఁగ
　మితిలేనికరుణ మెరసీ వాఁడే ॥ అహో ॥

సందడిసొమ్ములు శంఖచక్రములు
　పొందుగ దివిజులు పొగడఁగను
　యిందిరఁ దొడపై నిడి శ్రీవేంకట-
　మందు నిందుఁ గడు నలరీ వాఁడే ॥ అహో ॥ 112

సాళంగనాట

సిరిఁ దొడపై నిడి శ్రీనర[౨]సింహుఁడు
　యిరవుగ వరముల నిచ్చిని వాఁడే ॥ పల్లవి ॥

ఘనమగుకోరలు కరాళవదనము
　చెనకుచు గొడ[౩] సెటిజిహ్వాయును
　[౪] ఏనుపుఁగటమరలు నిటలలోచనము
　నొనరఁగ గొలువై యున్నాఁడు వాఁడే ॥ సిరిఁ ॥

చటులచక్రకరంబును [౫] శార్ఙకరంబును
　అటు వరదాభయహస్తములు
　పటుతరయోగపుపట్టబంధమును
　కటితటిఁ జెలఁగఁగఁ గడఁగీ వాఁడే ॥ సిరిఁ ॥

పరపగు శేషునిపడగలనీడల
　అరుదగురవిచంద్రాంకముల
　సిరులగద్దెపై శ్రీవేంకటేశుఁడు
　ఇహార్యుఁడై పరగీ వాఁడే ॥ సిరిఁ ॥ 113

లేదు. ౨. 'సింహ్వుఁ' లేదు ౩. 'సేటి' వ్రా.ప్ర.పా.
టమరలు(?)' వ్రా.ప్ర.పా. ౫. 'శార్ఙ' లేదు.

శ్రీరాగం

నిర్మలులు వీరు నిత్యసుఖులు
కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు ॥ పల్లవి ॥

పరమజ్ఞానసంపన్నులగువారికిని
అరుదుగా దిచటిమహా[1]దైశ్వర్యము
హరికృపాధనము చేనబ్బినమహాత్ములకు
సరకుగాకుండు పంచల విధానములు ॥ నిర్మ ॥

బలిమిని వేదాంతపట్ట[2]భద్రులకు నిల
బలురాజ్యపదవు లిరుగడబంట్లు
బలిమీరి హరిచక్రలాంఛనపుశూరులకు
యెలమి విజయములెల్ల నింటిలో నుండు ॥ నిర్మ ॥

యీవలను శ్రీవేంకటేశుశరణాగతుల-
కావటించినపుణ్య[3]మడువుగాదు
దైవజ్ఞులయినయాధర్మస్వరూపులకు
వేవేలభోగములు వెనుతగులుచుండు ॥ నిర్మ ॥ 114

రేకు 120 శంకరాభరణం

చీచీ వో జీవుఁడా చింతించుకో జీవుఁడా
ఆవందాన కీచందము అరుహమా జీవుఁడా ॥ పల్లవి ॥

వుత్తముఁడయినహరివుండేటియాతుమలోన
తత్తరపుఁగొంతలను తలపోసేదా
వొత్తి నారాయణనామ ముచ్చరించేనోరను
రుత్తియధరపుఁదోలు రుచిగొనేదా ॥ చీచీ ॥

---

౧. 'మహదైశ్వర్యము' వంటిచిల్లరవమాసదోషములు మావాఙ్మయమున లెక్కకురావివి. ౨. 'బద్ధు' రేకు. ౩. 'అడుగు' లోని గకారము వకారమైనదేమో.

పొందుగా గోవిందునిఁ బూజించేటిచేతులను
సందడిఁ జన్నులమీఁదఁ జాఁచఁబొయ్యేదా
కందువ దేవునిరూపు కనుఁగొనేచూపులు
ముందరి మర్మపుటంగములమీఁదఁ బెట్టేదా ॥ చీచీ ॥

వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను
ఆవటించి యాడసుద్దులాలకించేదా
శ్రీవేంకటేశ్వరుని సేవించేయీజీవనము
భావించక విషయాలపాలు సేసేదా ॥ చీచీ ॥ 115

దేసాక్షి

ఇంతదేవుఁ డింక వేఁడీ యెంచి చూపుఁడా
చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో ॥ పల్లవి ॥

వేసితే వేయురూపులు విశ్వరూప మితఁడు
శ్రీసతీశుఁ డిందరిలో శ్రీమంతుఁడు
భాసురపుభూమిమోచేబలవంతుఁ డిన్నిటాను
దాసులైతే మన్నించు నీదైవముఁ గొలువరో ॥ ఇంత ॥

గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాఁడు
అట్టె దేవతలమొర లాలించేవాఁడు
చిట్టకపుదానవుల చించిచెండాడేటివాఁడు
ఇట్టె శరణంటేఁ గాచు నీతనిఁ గొలువరో ॥ ఇంత ॥

కాలముఁ గర్మము మాయ గల్పించినయట్టివాఁడు
ఆలించి సర్వజీవులఅంతర్యామి
వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాఁడు
యేలీఁ గొల్చిన మెచ్చు నీవిభుఁ గొలువరో ॥ ఇంత ॥ 116

భూపాళం

అప్పుడు చూచేదివో అధికుల నధముల
తప్పక యెచ్చరి యిదే తలఁచవో మనసా ॥ పల్లవి ॥

కొండలవంటిపనులు కోరి ముంచుకుంటే నూర-
కుండి త్రైకొననివాఁడే యోగీంద్రుఁడు
నిండినకోపములకు నెపములు గలిగితే
దండితోఁ గలఁగనియాతఁడే ధీరుఁడు ॥ అప్ప ॥

సూదులవంటిమాటలు సొరిదిఁ జెవి సోఁకితే
వాదులువెట్టుకొననివాఁడే దేవుఁడు
పాదుకొన్నసంసారబంధము నోరూరించితే
ఆదిగొని మత్తుఁడు౧ గానెట్టివాఁడే పుణ్యుఁడు ॥ అప్ప ॥

గాలాలవంటియాసలు కడుఁ దగిలి తీసితే
తాలిమితోఁ గదలనాతఁడే ఘనుఁడు
మేలిమి శ్రీవేంకటేశుమీఁద భారము వేసుక
వీలక తనలో విఱ్ఱవీఁగువాఁడే నిత్యుఁడు ॥ అప్ప ॥ 117

మలహరి

కొన మొద లేదో గుఱిగాన రొరలు
మునుకొనుసంసారమోహాంధమందు ॥ పల్లవి ॥

తలఁచును బ్రహ్మాండతతులకు నవ్వల
తలఁచేటిజీవుఁడు తా నణువు
అలరినయాసల ననలునుఁ గొనలును
వెలసీ సంసారవృక్షములోన ॥ కొన ॥

౧ 'మత్తుఁడుగా వద్దెవాఁడే' పూ.ము.పా. కాని+అట్టి=కానెట్టి. ఇది వ్యావహారిక సంధి.

పుట్టునఁ బొదలును భువి బహురూపుల
పుట్టేటియాతఁడు పౌరి నొకఁడే
వొట్టుక యీఁదును వుభయకర్మముల
చట్టెదుసంసారసాగరములను ॥ కొన ॥

తగులు నన్నిటా తనుభోగంబుల
తగిలేటిపురుషుఁడు తా ఘనుఁడు
నిగిడి శ్రీవేంకటనిలయుఁడు ౧గతైతే
అగపడ సంసారానందమందు ॥ కొన ॥ 118

ఆహిరి

కలిదోషములాల కడు నేల మీరేరు
యిలధరుఁ డుండుగాను యిఁక నేఁటిసుద్దులు ॥ పల్లవి ॥

జగములేలెడువాఁడు సర్వాంతరాత్ముఁడు
జిగి నింక నీకీబుద్ధి చెప్పనోపఁడా
నిగిడి పుట్టించేటివాఁడు నిండుక వుండేటివాఁడు
తెగనికర్మము లెల్ల తిద్దకేల మానును ॥ కలి ॥

దనుజులఁ గొట్టేవాఁడు ధర్మము నిలిపేవాఁడు
పనిగొన్న దురితాలు పాపనేరఁడా
కొనయెదటైనవాఁడు గురి దానైనవాఁడు
వునికి మనికి నీసేయ కూరకుండీనా ॥ కలి ॥

స్వతంత్రుడైనవాఁడు స్వామియైనవాఁడు
గతియై దాసులనెల్లఁ గావకుండీనా
యితఁడే శ్రీవేంకటేశుఁ డిందిరాపతైనవాఁడు
సతతము మాకు నిట్టే సంపద లొసఁగఁడా ॥ కలి ॥ 119

౧. ఈ రేకు రెండవప్రక్క బాగా చిలుమెక్కినది. అక్షరములు సరిగా కానవచ్చుట లేదు. 'గతైతే' అనుపాఠము అక్షరసందర్భమును జూచి నే నూహించినదే. 'గతై' [illegible]

దేసాళం

వాదమేల పోరేల వట్టి ముక్తి లేదంటా
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా ॥పల్లవి॥

అరయ జీవులకెల్లా నానందమైతే
గురుఁడు శిష్యుఁడు లేఁడు కూడదు ధర్మము
సారెకు నాతుమలోన సోహంభావమైతే
సరి మనసులకు దేవపూజలు చెల్లవు ॥వాద॥

సహజలీలానుభూతి సర్వానకు సిద్ధమైతే
బహుయాగాదికర్మాల ఫలము లేదు
మహిలో నందరికి మరణాంత సాయుజ్యమైతే
విహితాచారము నేఁడు విధి లేదు ॥వాద॥

ఘటనఁ బ్రహ్మము నిరాకారమైతేఁ దరియింప
యిటు పురుషసూక్తాదు [1]లవి యేలరేల
అటు శ్రీవేంకటేశు దాస్యము లేక బిగిసితే
[2]సటలాడుకొనెడి రాక్షసమత మువును ॥వాద॥ 120

121 నుండి 130 వరకు గల 10 రేకులు లేవు.

రేకు 131 పాడి

ఇదివో సుజ్ఞానము 'సూత్రే మతిగణా యివ' గాన
మది నితంమే లేదు మాటలు '[3]యద్భావం తద్భవతి' ॥పల్లవి॥

యెదుటఁ గని యీజగము లేదని పలుకఁ బెఱుతును
అది విపరీతజ్ఞానము [4]'యద్దృష్టం తన్నష్టము' గాన
పొలయుచుండేటి యీజగము పొసఁగ నీవు గావన పెఱుతు
యిది విపరీతజ్ఞానము 'సదేవచ్ఛాహం' బంటివి గాన ॥ఇది॥

---

౧. 'లవి' పూ.ము.పా. యతిభంగము. ౨. 'సటలాడు గొనెడి రాక్షసమత మువును' పూ.ము.పా. దీని అర్థము విచార్యము. ౩. 'యాద్భావే' కావచ్చు. అన్నమయ్య లోకవ్యవహారమును ఉదాహరించి నట్లున్నది. ౪. 'యదృష్టం' రేకు.

నిండినయీజీవులు నీవేయన వెఱతును
దండనే బద్దులు వీరు [1]ద్వాసుపర్ణ వున్నది గాన
మెండగుయీజీవులను మీరు గారన వెఱతును
వుండెడివీరలు నిత్యులు వాగి 'నహామాదిశ్చమధ్యము'గాన॥ఇది॥

యిది మనుపె నీచిక్కు యిందుకు ద్రిష్టం బొక్కటె
తుదఁ దొల్లె నీదాసులు గలరు తుదఁ దొల్లియే నీవుఁ గలవు
వెదకు మాశ్రీవేంకటపతి నిను సేవించఁగ నిను సేవించఁగను
అదన నిన్నంటినవారలు నీయంతలు సేతువుగాన ॥ఇది॥ 121

ముఖారి

ఏ దుపాయము యే నిన్నుఁ జేరుటకు
ఆదినంత్యములేనిఅచ్యుతమూరితివి ॥పల్లవి॥

వెలయ నీగుణములు వినుతించేనంటే
తెలియ నీవు గుణాతీతుఁడవు
చెలరేఁగి నిను మతిఁ జింతించేనంటే
మలసి నీ వచింత్యమహిముఁడవు ॥ఏదు॥

పొదిగి చేతుల నిన్నుఁ బూజించేనంటే
కదిసి నీవు విశ్వకాయుఁడవు
అదన నేమైన సమర్పించేనంటే
సదరమై అవాప్తసకలకాముఁడవు ॥ఏదు॥

కన్నులచేత నిన్నుఁ గనుఁగొనేనంటే
సన్నిధి దొరక నగోచరుఁడవు
యిన్నిటాను శ్రీవేంకటేశ నీవు గలవవి
వన్నెల శరణనేవాక్యమే చాలు ॥ఏదు॥ 122

---

1. 'బద్ధులు' కావచ్చు.

పాడి

వేడొకభవనలేల వీనితోఁ బెనఁగనేల
తూటినందే హరిఁగూర్చి ౧తుదగంటగాక ॥పల్లవి॥

చూచేకన్నుల నేమీఁ జూడకుండవచ్చునా
చూచినందెల్లా హరిఁ జూచుటగాక
వేచినవీనుల నేమీ వినకుండవచ్చునా
కాచి యవే హరికథగా వింటగాక ॥వేడొ॥

కోరేటిచవుల జిహ్వా గోరకుండవచ్చునా
కోరినచవుల హరిఁ గూర్చుటగాక
ఆరీతిబారేమనసు అడఁచఁగవచ్చునా
అరితేరి అన్నిటాను హరిఁ గంటగాక ॥వేడొ॥

వాడలు మోచినదేహి వోమకుండవచ్చునా
వాడలు శ్రీహరిదనే వోముటగాక
బడినే శ్రీవేంకటేశుఁ బాసివుండవచ్చునా
యెడయ కందె సుఖియించుటగాక ॥వేడొ॥ 123

గౌళ

ఏదనుందురో తాము యెన్నికెపోఁజులు దాఁటి —
రాదకాదే పొడచూపే రాహో మేలు ॥పల్లవి॥

యెలమి స్వప్నమనేయెడపుఁజావడిలో
వాలిసి జీవుఁడు కొలువున్నపుడు
వెలినున్న చైతన్యవిధులదొరలచేతి -
యలబలము గాన మాహో మేలు ॥ఏద॥

౧. 'తుదగట్ట' పూ.ము.పా.

ఉప్పదమయి దేహమనేవూరఁ బెద్దచావడి
ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు
చప్పుడుతో నింద్రియవిషయపరివారము
అప్పుడు౧ పారాడుదురు ఆహా మేలు ॥ఏద॥

అక్కడ నిద్దురలనేఅంతఃపురాల కేఁగి
వుక్కున భోగాన నాత్మ వున్నపుడు
యెక్కవ(శ్రీ)వేంకటేశ యెవ్వరూ నాడకుఁ బోరు
అక్కడా నీవే వుందువాహా మేలు ॥ఏద॥ 124

బౌళి

౨నానామార్గముల నాఁటుకొను నొకయోగి
మానిమీఁదితపసి సాయుజ్యుఁ డాయోగి ॥పల్లవి॥

పున్నునవమాసఁ గూడఁ బొదిగి నొక్కొకయోగి
కన్నులచూపులు ..రిగాఁ దూఁచు౩ నొకయోగి
మిన్నునూయి చేఁతాటఁ జేఁది మెచ్చు మింగు నొకయోగి
వెన్న సన్నముగ నూరి పీఁగు నొకయోగి ॥నానా॥

గాలి ముడియగఁ గట్టి కలుగుడిగట్టుయోగి
నాలిమింటివిత్తు వెట్టి నగు నొకయోగి
మూలనిధానము గని మందు గానఁ దొకయోగి
నేల దలకిందుసేసి విక్కు నొకయోగి ॥నానా॥

గతజలముల కెల్లఁ గట్టగట్టు నొకయోగి
తతిఁ బూవులమాటల దడిగట్టు యోగి
యితవైన(శ్రీ)వేంకటేశునిమఱఁగు చొచ్చి
గతిగనె నాతఁ దొక్కఁడే యోగి ॥నానా॥ 125

౧. 'పారేడుదురు' రేకు. ౨. ఈపాటలోని భావము స్పష్టమగుట లేదు,
౩. 'జూఁచు' పూ.ము.పా.

## ముఖారి

హరియే సకలక్రియలై తృప్తి యిచ్చుఁగాక
యెరవులవారిచేఁత లెందాఁకా వచ్చీని ॥ పల్లవి ॥

నరులకు నరులే పరలోకక్రియలు
సిరిమోహాచారాలఁ జేతురుగాక
ఉరుపాషాణపశుతతుల కెవ్వరు సేసే-
రరయఁగ భ్రమగాక అవి పస్తులున్నవా ॥ హరి ॥

కొడుకులుగలవారు కోరి పితృముఖ[౧]మున
కుడుపులు దమవారిఁ గూర్చపెట్టఁగా
అడరి శ్రీహరియే అన్నియుఁ దాఁ జేకొని
తడవి వారిఁ గొంత దయఁజూచుఁగాక ॥ హరి ॥

తారేడ వారేడ దైవము శ్రీవేంకటేశుఁ-
డారయ నంతరాత్ముఁ డవి తెలిసి
ధారతో యాతనియాజ్ఞఁ దప్ప కాదివసాన
చేరువఁ జేసేవెల్లాఁ జేయుఁడీ యాతనికి ॥ హరి ॥ 126

రేకు 132

## గుండక్రియ

హరిహరి నీమాయాజగ మిది అందనే చూచుచు నవ్వుచును
అరసి యందులో నిను భావించేటిఆత్మభావమిది యెన్నఁడొకో ॥ పల్లవి ॥

సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి
సకలేంద్రియములజాలటు మాని సకలవిషయములరహితుఁడై
సకలముఁ దనవలె భావించి సర్వాంతరాత్మవు నినుఁ దెలిసి
అకలంకంబున నుండెడిభావం బది యిఁక నెన్నఁడొకో ॥ హరి ॥

---

౧. 'మఖ' కావచ్చునేమో.

ఘనమగుకోర్కులఁ జాలించి ఘనకోపంబు నివారించి
ఘనకాముకత్వముల నటు దనిసి ఘనమగునాసలఁ దొలఁగించి
ఘనముఁగొంచముల విను దలఁచి ఘనాఘనుఁడవు నీవనుచు
అనుమానము [౧]లటు సుఖియించే దది యిఁక నెన్నఁడొకో॥ హరి॥

పరచింతలలోఁ దడఁబడక పరమార్గంబుల కగపడక
పరహింసలకును యెన్నఁడుఁ జొరక పరదూషణలకు నెడగిలిసి
పరదేవుఁడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు
అరమరపుల నేఁ [౨]జొక్కితి తనిసేదది యిఁక నెన్నఁడొకో ॥హరి॥
127

బౌళి

ఏది వలనె నీవది సేయు యిందులోన నోజీవాత్మ
పొదగుమనలో నంతరాత్మయై పరగినశ్రీహరిపనుపునను ॥ పల్లవి ॥

మనవంటిజీవులే మహిలోన నొకకొన్ని
శునః ముఖై [౩] కుక్కుటములై సూకరములునైనవి
దినదినముఁ గర్మపాశములఁ దిరిగెడిదుర్దశ లటు చూడు
సనకాదులై కొందరుజీవులు శౌరిదాసులై రటు చూడు ॥ ఏది ॥

తన్నులఁగాళ్ల మనవలెఁ దనువులు గై కొని కొందరునరులు
పన్నినతొత్తులు బంట్లునై మనపనులు సేయుచున్నారు
యెన్నఁగ శ్రీహరి నెఱఁగక యిడుమలఁబొరలెడి దది చూడు
మున్నె హరిదాసులై నారదముఖ్యులు గెలిచిన దది చూడు॥ ఏది ॥

[౪] యింతగాలమును యీపుట్టుగులనె యిటువలెఁ బొరలితి [౫] మిన్నాళ్ల
యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి యీజన్మంబున మము నేలె
వింతలబొరలిననరకకూపముల వెనకటిదైన్యము లటు చూడు
సంతసమున ముందరి మోక్షము సర్వానందం బది చూడు ॥ఏది॥ 128

---

౧. 'లేక' కావచ్చు. ౨. 'జొక్కుచు' కావచ్చు.. ౩'కక్కుటములై సూకరములైనవి' పూ.ము.పా. ౪. ౫. ఇట్టి పునరుక్తులక్కడక్కడ గలవు

శంకరాభరణం

నీవు సర్వసముఁడవు నీవు దేవదేవుఁడవు
యీవల నాగుణదోషా లెంచ నీకనేలా ॥ పల్లవి ॥

పూవులపైఁ గాసీఁ బోరి ముండ్లపైఁ గాసీని
ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా
పావనుల నటు గాచి పాపపుంజమైననన్నుఁ
గావఁగా నీకృపకును గడమయ్యీనా ॥ నీవు ॥

గోవుమీఁద విసరీఁ గుక్కమీఁద విసరీని
పావనపుగాలికిని పాపమంటీనా
దేవతలరక్షించి దీనుఁడనైననాకుఁ
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా ॥ నీవు ॥

కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేఁడు గావవే ॥ నీవు ॥ 129

సామంతం

నెప్పున ధర్మపుణ్యము నీచేతి దింతే
యెప్పుడు గాచినఁ గావు మింతా నీచిత్తము ॥ పల్లవి ॥

యేవల నరుఁడు లేక యెద్దే తా దున్నునా
నీవు సేయించక వేరే నేఁ బుణ్యము సేసేనా
దేవుఁడ సూర్యుఁడురాక తెల్లవారునా రేయి
వేవేగ నీకృపఁగాక విజ్ఞానినౌదునా ॥ నెప్పు ॥

కుమ్మరవాఁడు లేకే కుండ గాఁ బుట్టునా
నెమ్మి నీవు పుట్టించక నేనే పుట్టితినా
వమ్ముల రాట్నము నిలువక గుండ్రలు సిల్చునా
పమ్మి నీయప్పణ లేక భవములు మానునా ॥ నెప్పు ॥

మక్కువ మగఁడులేనిమనువు గలుగునా
లెక్కించి యంతర్యామివి లేనినే నున్నాఁడనా
చక్కఁగ శ్రీవేంకటేశ శరణనేబుద్ధి నాకు
తక్కక నీవియ్యకుండే దాసుఁడ నే నౌదునా ॥ నెప్పు ॥ 130

లలిత

ఇహమేకాని యిఁక బరమేకాని
బహళమై హరి నీపై భక్తే చాలు ॥ పల్లవి ॥

యెందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి
కందువ నీదాస్యము గలిగితేఁజాలు
అంది స్వర్గమేకాని అలనరకమేకాని
అందపునీనామము నాకబ్బుటేచాలు ॥ ఇహ ॥

దొరయైనఁజాలుఁ గడుఁ దుచ్ఛపుబంటైనఁజాలు
కరఁగి నిన్నుఁ దలఁచఁగలితేఁజాలు
పరులుమెచ్చినమేలు పస్మి దూషించినమేలు
హరి నీసేవాపరుఁడౌటే చాలు ॥ ఇహ ॥

యిలఁ జదువులు రానీ యిటు రాక మాననీ
తలఁపు నీపాదముల తగులే చాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీశరణమే చాలు ॥ ఇహ ॥ 131

రేకు 133 మలహరి

సర్వోపాయములు జగతి నా కితఁడే
పుర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే ॥ పల్లవి ॥

సకలగంగాదితీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరణిజలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సిరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపారంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ జాతుపడికైంకర్య మిదియే ॥ సర్వో ॥

ఉపవాసతపములివి యితనిప్రసాదంబులొగి భుజించుటే నాకు దినదినంబు
ఉపరహస్యోపదేశంబు లితనిపాదతీర్థంబులు గొనుటే నేటి సేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము సరిగొని తిరుచటిబహువృక్ష దర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షికలకలంబు ॥ సర్వో ॥

తల పుగఁ యోగంబులు శ్రీవైష్ణవులఁదగులుసంవాససహయోగంబు
వెలయ నిండుమహోత్సవం బిన్నియు నితనివిభవంబులెసఁగు తిరు॰నాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింటయు నాకు శ్రీవేంకటేశ్వరునిశరణాగతి
అలరునాసంపదలు యితని పట్టపురాణిఅలమేలుమంగకడకంటిచూపు ॥ సర్వో ॥ 132

## శ్రీరాగం

ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగ వచ్చును
దొంతిఁబెట్టినకుండలు తొడరినజన్మంబులు ॥ పల్లవి ॥

కలలోపలిసంభోగము ఘనవైభవసంపద లిన్నియు
వలలోపలిసిడిపరులు పన్నెలసంభవములు
తలఁపునఁ గలిగియు నిందునే తగులకపో దెవ్వరికిని
తెలిసినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ ఇంత ॥

౧. 'నాకు' పూ.ము.పా. రేకు.

అద్దములోపలినీడలు అందరిదేహపురూపులు
చద్దికి వండినవంటలు [1] జంటఁగిర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి నజ్ఞానాంబుధిలో-
నద్దిన దిది దెలియఁగరా దంబుదములమెఱుఁగు ॥ ఇంత ॥

మనసునఁ దాగినపా లివి మదిఁగలకోరిక లిన్నియు
యినుమున నిగిరినసీళ్ళు యిల నాహారములు
పనివడి శ్రీవేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని విడిచినమనుజులకాయపుమర్మములు ॥ ఇంత ॥ 133

లలిత

షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥ పల్లవి ॥

అలరువిశ్వాత్మకున కావాహన మిదె సర్వ-
నిలయున కాసనము నెమ్మి నిదె
అలగంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదె ॥ షోడ ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకార మిదె
సరిశ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధపుష్పధూపములు
తిర మిదె కోటిసూర్యతేజునకు దినము ॥ షోడ ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము
అమరినశ్రీవేంకటాద్రిమీఁదిదేవునికి
[2] తమితోఁ ప్రదక్షిణాలు దండములు నివిగో ॥ షోడ ॥ 134

౧. 'ట' ప్రక్కన అరసున్న విచార్యము. ౨. కర్పూరనీరాజన మొగిరిపోయి 15 ఉపచారాలే మిగిలినవి.

### మాళవిగౌళ

ఏమీ నెఱఁగనివాఁడు యిటు నిన్నుఁ గొలిచేనా
నీమాయ దెలుపఁగా నిను ననేఁగాకా ॥ పల్లవి ॥

పసురముగఁ జేసితే బడి నిన్నుఁ దలఁచేనా
వెస రాయిఁజేసితే వెదకి నిన్నెఱిఁగేనా
పొసఁగ మానుగ నన్నుఁ బుట్టించితేఁ బొగడేనా
మసిపి నరుఁజేయఁగా మొరయిదేఁగాక ॥ ఏమీ ॥

మొగి మృగముఁ జేసితే మొక్కనెఱిఁగేనా
తగఁ బక్షిఁ జేసితేఁ దరిఁ బూజనేసేనా
జిగి నితరజంతువుగఁ జేసితేఁ దగిలేనా
అగపడి వివేకిఁ జేయఁగ ననేఁగాక ॥ ఏమీ ॥

యింత కధికారిఁ జేసి యీప్రపంచజ్ఞాన-
మింత యొసఁగితివి మరఁ గిఁకనేలా
చింత లిన్నియుఁ దీర శ్రీవేంకటేశ నను
సంతతము నేలఁగా శరణనేఁగాక ॥ ఏమీ ॥ 135

### శుద్ధవసంతం

పరమాత్ముఁ డొక్కఁడే పరమపావనుఁడుగన
పరిపూర్ణుఁడనెడియీభావమే చాలు ॥ పల్లవి ॥

హేయ మిందే దుపాదేయ మిం దేది
బాయిటనే హరి సర్వపరిపూర్ణుఁడు
సేయునెడ గుణభావజీవకల్పనము లివి
రోయఁజూచినఁ దనదుకాయమే రోఁత ॥ పర ॥

జాతి యిలదే దంత్యజాతి యిం దేది
జాతులిన్నిటా నాత్మ సర్వేశుఁడు
ఆతలను అంటుముట్టనేదిభావనలెల్ల
బాఁతిపడి యెఱఁగనోపనివెలితే తనట ॥ పర ॥

తెలివిగలదాఁకాఁ ౧ దెగనిసుఖఁ ంలివి
తెలిసినంతటిమీఁదఁ దీపు సంశయము
యిలలోన శ్రీవేంకటేశ్వరునికరుణచే
వెలసి యీజ్ఞానంబు పిడుఁగా మనుగా ॥ పర ॥ 136

రేకు 134 రామక్రియ

వెలుపల మఱవక లోపల లేదు వెలుపలఁ గలిగిన లోపల మఱచు
చలమున నిదియే ఘడియు ఘడియకును సాధించినసుఖ మటు దోఁచు
॥ పల్లవి ॥

వెలుపలి వెలుఁగే చూడఁగ లోపలి వెడచీఁకటి గానరానట్లు
అలరి ప్రపంచజ్ఞానికిఁ దనలో నాత్మజ్ఞానము గనరాదు
పలుమరు చీఁకటి చూడఁగఁ ౨ జూడఁగ బయలే వెలుఁగై తోఁచినయట్లు
అలయక తనలోచూపు చూచినను అంతరంగమున హరిఁ గనును ॥ వెలు ॥

జాగరమే కడుఁ జేయఁగఁ జేయఁగ సతతము నిద్దుర రానట్లు
చేగలనింద్రియములలోఁ దిరిగినచిత్తవికారము లయపడదు
యీగతి నిద్దుర వోఁగాఁ బోఁగా నిలలో సుద్దులు యెఱఁగనియట్లు
యోగపుటేకాంతంబును దనమన సొగి మరవఁగ మరవఁగ హరిఁ
గనును ॥ వెలు ॥

దేహపుటాకాశపునిట్టూర్పులు బాహిరపుబయట నడఁగినయట్లు
ఆహా జీవునిజననమరణములు అందే పొడముచు నం దడఁగు
వూహల శ్రీవేంకటపతివాయువు కొనగి నాకాశము వొక్కసూత్రము
ఆహా ప్రాణాపానవాయువులు ఆతుమ నిలుపుటే హరిఁ గనుట॥ వెలు॥ 137

౧. 'దెగవిమఱఁగు' పూ.ము పా. రేకు. ౨. ఈ 'జూడఁగ' పూ.ము.పా. లో తప్పిపోయినది.

### గుజ్జరి

ఇందరిలో నే మెందుఁబోలుదుము యిందరఁ బోలినజీవులమే
కందువ వీరలఁ దలఁచి చిత్తమిది కలఁగెడి దైవమ కావఁగదే ॥పల్లవి॥

యెందరోకో జరాదుఃఖము లేచి యనుభవించేటివారు
యెందరోకో [1]దరిద్రదుఃఖము లెసఁగి యలపుటి వేటివారు
యెందరోకో బంధనతాడనహీనదెసల[2] నుండెడివారు
యెందరోకో దాసదాస్యవిధి నెడయారాక చెఱ [3]ఁయినవారు ॥ఇంద॥

యెందరోకో మరణదెసలచే నిల సంయోగవియోగదుఃఖితులు
యెందరోకో జన్మరోగముల నెక్కువభయమందేటివారు
యెందరోకో రాజులచోరులహింసలకు లోనయినవారు
యెందరోకో పొడమినజీవుల కెక్కడ నెక్కడ నేపాటో ॥ఇంద॥

యెందరోకో యీదుఃఖనివృత్తికి యెడసి మిమ్ముఁ గొలిచినవారు
యెందరోకో సంపదలకు లోనై [5]యేతాయాతనఁ బడువారు
యెందరోకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి
యిందును నందును సుఖులై లోకుల [6]నిందరిఁ జూచుచు
నవ్వేడివారు ॥ఇంద॥ 138

### గుండక్రియ

నిన్నూ నన్నూ నెంచుకోనినేరమిగాక
వన్నినసూర్యునికాంతి ప్రతిసూర్యుఁడౌనా ॥పల్లవి॥

జలధిలోపలిమీను జలధి దా నౌనా
జలములాధారమైనజంతువుగాక
నెలవై నీలోనివాఁడ నీవే నే నౌదునా
పొలసి [7]నీయ్యాధరువుబొమ్మ నింతేకాక ॥నిన్నూ॥

---

౧. 'ఇది భావప్రధానవిర్దేశము' కావచ్చు. ౨. హీనదెసలు' వంటి చిల్లర సామాసికదోషములు ఈ వాఙ్మయమున లెక్కకు రావు. ౩. 'లయ్యిన' రేకు.
౪. 'నయ్యిన' రేకు. ౫. 'యాతాయాతములఁ' కావచ్చు. ౬. 'నిందరుఁ' పూ ము.పా. రేకు. ౭. 'నీ+అధరువు' ఇదియొక విలక్షణసంధి.

రాజువద్దనున్నబంటు రాజే తా నౌనా
రాజసపుచనవరిరచనే కాక
సాజమై నిన్నుఁ గొలిచి సరిగద్దె నుండునా
వోజతో నిన్ను సేవించి వుందు నింతే కాక ॥ విన్నా ॥

ముత్తెపుఁజిప్పలనీరు మున్నిటివలె నుండునా
ముత్తెములై బలిసి లో మొనపుఁగాక
నిత్తెపుశ్రీవేంకటేశ నీశరణాగతులము
మొత్తపులోకులమా ముక్తులముగాక ॥ విన్నా ॥ 139

మాళవి

ఇందుకుఁ జింతించనేల యీశ్వరునిమాయ లివి
యెందుకు మూలము హరి యీతనిఁ జింతించరే ॥ పల్లవి ॥

౧అల నారికడపుఁగాయకు నీరు వచ్చినయట్టు
తలఁచి రాఁగలమేలు తన్నుఁ దానే వచ్చురే
లలి నేనుగుదిన్న వెలఁగపంటిబేసము-
వలెనే పోఁగలవెల్ల వడిఁ దానే పోవురే ॥ ఇందు ॥

నిండినయద్దములోన నీడ వొడచూపినట్టు
దండియైనపుట్టుగులు తన్నుఁ దానే వచ్చురే
పండినపండ్లు తొడమఁబాసి వూడినయట్టు
అండనే మరణములు అందరికి సరిరే ॥ ఇందు ॥

పెనురాతిపైఁ గడవ పెట్టఁగాఁ గుదురైనట్టు
తనుఁదానే చింతింపఁ దలఁపు నిలుచురే
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గని శరణన్నఁ జాలు
వెనక పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే ॥ ఇందు ॥ 140

౧. 'యల' వ్రా.ము.పా. యతిభంగము.

పాడి

చూచేచూపొకటి సూటిగుఱి యొకటి
తాచి రెండు నొకటైతే దైవమే సుండీ ॥ పల్లవి ॥

యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు
మాను దలఁచిన నట్టే మానై పొడచూపు
పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు
తానే మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥

బట్టబయలు దలఁచ బయలై పొడచూపు
అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు
పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు
తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥

శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతిఁ దలఁచితేను
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతై పొడచూపు
భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
తావు మనోగోచరుఁడు దైవమే సుండీ ॥ చూచే ॥ 141

రేకు 135 శ్రీరాగం

బిరుదులన్నియు నీవే బిరుదులోకములెల్ల
అరయ నీపాదమందె అణఁగుండెఁగాన ॥ పల్లవి ॥

బహుదేవతాసార్వభౌమబిరుదు నీకే
సహజము నీవు భూపతిపతివిగాన
వహి దేవతాచక్రవర్తిబిరుదు నీకే
విహితము చక్రముచే వెలసేవుగాన ॥ బిరు ॥

పెనుదేవశిఖామణిబిరుదు నీకే చెల్లు
ఘనకౌస్తుభమణిగలవాఁడవుగాన
మును దేవదేవోత్తముఁడనుబిరుదు నీకే
[1] ననిచెఁ బురుషోత్తమనాముఁడవుగాన ॥ బిరు ॥

వొట్టుకొని దేవరాహుత్తరాయబిరుదు నీదే
కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివిగాన
తిట్టమై శ్రీవేంకటేశ దేవ సింహాసనము నీదే
అట్టె నారసింహుఁడవై అమరితిగాన ॥ బిరు ॥ 142

లలిత

ఎందు నీకుఁ బ్రియమో యీతెప్పతిరుణాళ్ళు
దిందుపడె సిరులతో తెప్పతిరుణాళ్ళు ॥ పల్లవి ॥

పాలజలనిధిలోఁ బవ్వళించి పాముతెప్పఁ
దేలుచున్న దది తెప్పతిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకుమీఁద
తేలుచున్న దది తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము
తెమలఁ దేలించు తెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగునిగపుపడిగెమీఁద
తిమిరి తొక్కిన తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥

అప్పుడు పదారువేలు అంగనలచమటల-
తెప్పలఁ దేలినతెప్పతిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి సన్నిధిఁ గోనేటిలోన
తెప్పిరిల్లె [2] నేఁటనేఁట తెప్పతిరుణాళ్ళు ॥ ఎందు ॥ 143

---

1. 'పనిచేపురుషోత్తమ' కావచ్చు 2. ఏఁటన్+ఏఁటన్.

లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
  కలిగిన దిది మా కాఁపురము ॥పల్లవి॥

నరహరికీర్తన నానినజిహ్వా
  వొరుల నుతింపఁగనోపదు జిహ్వా
  మురహరుపదముల మొక్కినశిరము
  పరులవందనకుఁ బరగదు శిరము ॥తలఁ॥

శ్రీపతినే పూజించినకరములు
  చోఁపి యాచనకుఁ జొరవు కరములు
  యేపున హరికడ కేఁగినకాళ్ళు
  పాపులయిండ్లకుఁ బారవు కాళ్ళు ॥తలఁ॥

శ్రీవేంకటపతిఁ జింతించుమనసు
  దావతి వితరముఁ దలఁచదు మనసు
  దేవుఁ డతనియాధీనపుతనువు
  తేవల వితరాధీనముగాదు ॥తలఁ॥ 144

రామక్రియ

ఏల మమ్ము గాసిసేసే రింకా మీరు
  కాలముతో నిలిచెను కైవల్యపదవి ॥పల్లవి॥

పాపములు హరినామపఠనచేఁ బాపుకొంటి
  కైపుగఁ జిత్రగుప్తుఁ డాకవిలె గట్టు
  కోపులఁ బుణ్యములెల్ల గోవిందుని కిచ్చితిమి
  పూఁవలస్వర్గముత్రోవ భుజవేయరో ॥ఏల॥

ఆతుమలో నజ్ఞాన మాచార్యుఁడే పాపె
ఆతల జన్మాలవాకి లటు ముయ్యరో
చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడనైతి
జాతియధర్మములాల సంబంధము విడరో ॥ ఏల ॥

పరమాత్మచింతచేత బదుకు నిశ్చయమాయ
ధరఁ గైవసము గావో తగుచిత్తమా
యిర వైన శ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము
పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు ॥ ఏల ॥ 145

భైరవి

మఱి యెందూ గతిలేదు మనుప నీవే దిక్కు
అఱసి లక్ష్మీశ నీశరణమే దిక్కు ॥ పల్లవి ॥

భవసాగరంబులోఁబడి మునిఁగిననాకు
తివిరి నీనామమను తేపయే దిక్కు
చివికి కర్మంబనెడిచిచ్చు చొచ్చిననాకు
జవళి నాచార్యు౧ కృపజలధియే దిక్కు ॥ మఱి ॥

ఘనమోహపాశముఁగాలిఁ జొయ్యేడినాకు
కొనల నీ౨పాదచింతకొమ్మయే దిక్కు
కనలి మనసనెడియాకాసముననున్ననాకు
కనుఁగొనఁగ నీదాస్యగరుడఁడే దిక్కు ॥ మఱి ॥

మఱిగి సంసారమనెడిమంటికిందటినాకు
ధర భక్తియనుబిలద్వారమే దిక్కు
యిరవైన శ్రీవేంకటేశ యిన్నిటా నాకు -
నరుదైన నీవంతరాత్మవే దిక్కు ॥ మఱి ॥ 146

౧. 'కృపా' కావచ్చు. లేక తత్సమసమాసమైన కావచ్చు. ౨. 'పాదమనెడి చింతకొమ్మ' లేక 'పాదచింత అనెడి కొమ్మ' చిల్లరసమాస దోషములు లెక్కలేవి-యీ వాఙ్మయమున 'చింతకొమ్మ' యనుచే బాగున్నట్లుతోచెడివి. చింతకొమ్మ చాలగట్టిదిగదా. మోక్షమునకు హరిపాదములంత గట్టివి.

రామక్రియ

శ్రీపతి నీయాజ్ఞ సేసెద మిదివో
పూఁపలమాయలఁ బొరలఁగనేలా ॥పల్లవి॥

కాయము సుఖదుఃఖములకు మూలము
పాయము యింద్రియపరవశము
ఆయము రెంటికి నన్నపానములు
మోయనిమోఁపిది ములుగఁగనేలా ॥శ్రీప॥

తలఁపు పుణ్యపాతకములమూలము
కలిగినపుట్టువు కర్మగతి
ఫల మిది రెంటికి బలుసంసారము
కలిగిన వెట్టికి కాదన నేలా ॥శ్రీప॥

జీవుఁ డింతటా ౧సృష్టికి మూలము
భావముఁ బ్రకృతికిఁ బ్రపంచము
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర
నీ వంతరాత్మవు నెమకఁగ నేలా ॥శ్రీప॥ 147

రేకు 136 ధన్నాసి

జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము
నానార్థములు విన్నే నడపె మాగురుఁడు ॥పల్లవి॥

అలరి దేహమనేటియాగశాలలోన
బలువై యజ్ఞానపుపశువు బంధించి
కలసి వైరాగ్యపుకత్తులఁ గోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు ॥జ్ఞాన॥

౧. 'శ్రిష్టికి' రేకు.

మొక్కుచు ౧వైష్ణవులనేమునిసభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థసోమపానము నించి
చక్కఁగా సంకీర్తనసామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁబో మాగురుఁడు ॥జ్ఞాన॥

౨తదియ్యగురుప్రసాదపుపురోడాశ మిచ్చి
కొద దీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుఁడు ॥జ్ఞాన॥ 148

శ్రీరాగం

లావణ్యశృంగారరాయ లక్ష్మినాథ
యేవేళ నీవినోదాన కేదాయ నేమి ॥పల్లవి॥

పాలజలధివంటిది పవ్వళించు నామనసు
గాలివూర్పులే కడళ్లు కలదు లోఁతు
చాలఁగఁ దొల్లి నీవు సముద్రశాయివట
యీలీల నీవినోదాన కేదాయ నేమి ॥లావ॥

నిక్కపుభూమివంటిది నెలవుకో నామనసు
పెక్కులివ్వియుఁ గలవు పెరుగుచుఁడు
పుక్కటఁ దొల్లియు నీవు భూసతిమగఁడవట
యెక్కువ నీవినోదాన కేదాయ నేమి ॥లావ॥

నిండుఁగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి
౩వుండుచోటనేవుండు నొక్కచోటను
కొండలరాయఁడవట కోరికె శ్రీవేంకటేశ
అండ నీవినోదానకేది యాయ నేమి ॥లావ॥ 149

---

౧. వైష్ణవుల నేము నీసభ పూ.ము.పా

౨. 'తదీయ' కావచ్చు. ౩. 'వుండ' పూ.ము.పా; లేకు.

రామక్రియ

మెచ్చు; మెచ్చుకుంటే మాను; మించి నే నాడకమాన
అచ్చపునీసూత్రధారి నవధారు దేవ ॥ పల్లవి ॥

వొక్కఁడ నే జీవుఁడను వోహో హరీ
పెక్కుబహురూపాలే పెంచి యాడితి
తక్కినయింద్రియములే తగుమేళము
అక్కజపువిద్యవాఁడ నవధారు దేవ ॥ మెచ్చు ॥

సూటి నించుకంతవాఁడఁ జూడవే హరీ
పీటిసంసారపుబారి విద్య లాడితి
పాటినాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతె నేను అవధారు దేవ ॥ మెచ్చు ॥

చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేఁడు
మేరతో[౧] భక్తైనేమోకుమీఁద నాదేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవదారు దేవ ॥ మెచ్చు ॥ 150

శ్రీరాగం

[౨] దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే ॥ పల్లవి ॥

అనంతగరుడముఖ్యులైనసూరిజనులతో
ఘననారదాదిభాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే ॥ దిన ॥

---

౧. 'భక్తనే' వ్రా.ము.పా. 'భక్తి+అనే; ఈ వ్యావహారిక సంధులు ఈ వాఙ్మయమున కొల్లలు.

౨. ఈపాట అన్నమయ్య శ్రాద్ధ దినమును గూర్చివ్రాసినది గాన, అన్నమయ్య రచన కాదు. అన్నమయ్యకీర్తనలరేకులలో ఇది పొరపాటున చేరియుండవచ్చు.

వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపవిత్రము క్తులలోన నుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుఁ గూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే ॥ దిన ॥

సంకీర్తనముతోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రిభూమి నుండి
లంకె శ్రీవేంకటగిరిలక్ష్మివిభుఁడు నీవు-
నంకెల మాయింటివిందు లారగించవే ॥ దిన ॥ 151

మాళవి

గుఱ్ఱాలఁ గట్టవితేరు కొంక కెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ ౧దీసీని వేడుకతో జీవుఁడు ॥ పల్లవి ॥

నరి పిఱుఁదే రెండుజంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁజూపులు రెండు గట్టినపగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుపెక్కెలు
మించైనశిరసే మీఁదనున్నశిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥

పాపపుణ్యములు రెండు పక్కనున్నచీలలు
తోపులయన్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥ గుఱ్ఱా ॥ 152

౧. తీసీ= (ప్రకరణముతో) పరుగులు పెట్టించిన కావచ్చు.

సాళంగం

ఉన్నమంత్రా లిందుసరా వొగి విచారించుకొంటే
విన్నకన్నవారికెల్ల విష్ణునామమంత్రము ॥ పల్లవి ॥

పరగఁ బుచ్చకాయలఁ బరసిపోదు మంత్రము
గరిమ ముట్టంటులేనిఘనమంత్రము
వరుస నెవ్వరువిన్నా వాఁడిచెడనిమంత్రము
అరయ నిదొక్కటేపో హరినామమంత్రము ॥ ఉన్న ॥

యేజాతినోరికైన నెంగిలిలేనిమంత్రము
వోజదప్పితేఁ [1] జెడకవుండేమంత్రము
తేజాన నొకరికిస్తేఁ దీరిపోనిమంత్రము
సాజమైన దిదేపో సత్యమైనమంత్రము ॥ ఉన్న ॥

యిహముఁ బరముఁ దానే యియ్యఁజాలినమంత్రము
సహజమై వేదాలసారమంత్రము
బహునారదాదులెల్ల పాటవాడినమంత్రము
విహితమయినశ్రీ వేంకటేశుమంత్రము ॥ ఉన్న ॥ 153

రేకు137 సాళంగనాట

అనుచు దేవగంధర్వాదులు పలికేరు
కనకకశిపు నీవు ఖండించేవేళను ॥ పల్లవి ॥

నరసింహా నరసింహా నన్నుఁగావు నన్నుఁగావు
హరి హరి నాకు నాకు నభయమీవే
కరిరక్ష కరిరక్ష గతమైరి దనుజులు
సురనాథ సురనాథ చూడు మమ్ముఁ గృపను ॥ అను ॥

౧. 'జడక' రేకు.

దేవదేవ వాసుదేవ దిక్కు నీవే మాకు మాకు
శ్రీవత్స శ్రీవత్స సేవకులము
భూవనితనాథ నాథ పాదమే సంప్రతాయము
పావన పావన మమ్ముఁ బాలించవే ॥ అను ॥

జయజయ గోవింద శరణుచొచ్చేము నీకు
భయహర భయహర పాప మడఁగె
దయతో శ్రీవేంకటేశ తగిలి కాచితి మమ్ము
దయఁజూడు దయఁజూడు దాసులము నేము ॥ అను ॥ 154

లలిత

కటకటా కర్మమా కాలములో మర్మమా
మటమాయైపోతివంటా మది నమ్మివుంటిఁగా ॥ పల్లవి ॥

పాపబుద్ధి యాడనుండె పాయము రానినాఁడు
కోప మేడ నుండె గర్భగోళమున నున్ననాఁడు
దీపన మేడ నుండె దేహధారి గానినాఁడు
యేపున భూమిఁ బుట్టితే నేడనుండి వచ్చెనో ॥ కట ॥

నగుసంసార మెందుండె నరకాననుండునాఁడు
తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె
వాగి లోభ మేడ నుండె వొంటి నున్ననాఁడు
వెగ్గై నేఁడెట్టు నన్ను వెదకి పైకొనెనో ॥ కట ॥

ఇహబంధా లేడ నుండె ప్రళయకాలమునాఁడు
మహిఁ గోరికె లెందుండె మతి మఱచిననాఁడు
యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేఁడు
విహితమై మాకు నెట్టు వెఱచెనో తాము ॥ కట ॥ 155

సామంతం

హరి నీప్రతాపమున కిద్దమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా ॥పల్లవి॥

పు నీళ్ళు నమలితే నిండెను వేదములు
యీవల( దలెత్తితేనె యింద్రపదవులు మించె
మోవ మూ(తి గిరిపితే మూ(డులోకాలు నిలిచె
మోవి( బార నవ్వితేనే ముగిసి రసురలు ॥హరి॥

[1]ం గిరతే నీరై కొండలెల్ల( దెగ(బారె
మారుకొంటే బయిటనే మడుగులై నిలిచె
చేరి యడుగువెట్టితే శిలకు( బ్రాణము వచ్చె
కూరిమి( గావలెనంటే కొండ గొడగాయను ॥హరి॥

'ంగుజారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి గమనించితేనే కలిదోషములు మానె
రంగుగ నీశరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ॥హరి॥ 156

దేసాక్షి

ాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా ॥పల్లవి॥

యినంటే ఇంచుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్ల( జాలదు
పిలినయీయాసా [2] వెట్టివానిచేతిరాయి
చాలం నింక హరి నిట్టె శరణను జీవు(డా ॥మాపు॥

1. ఇందు దశావతార సమన్వయము కలదు. 2. 'వెట్టి' పూ.ము.పా.

పాఱకున్న [1]పశుబాలై బడలదు మనసు
పాఱితే జవ్వనమునఁ బట్టరాదు
మీఱిన నీరుకొద్దిదామెర యింతె యెంచి చూడ
జాఱవిడిచి దేవుని శరణను జీవుఁడా ॥ మాపు ॥

సేయకున్నఁ గర్మము శ్రీపతిసేవనే వుండు
సేయఁబోతేఁ గాలమెల్లా [2]సేనాసేన
వోయయ్య యిది యెల్లా [3]వుమినాఁకే చవుతాలు
చాయల శ్రీవేంకటేశు శరణను జీవుఁడా ॥ మాపు ॥ 157

ధన్నాసి

దైవమా నీవే మమ్ము దయదలఁచుటగాక
చేవల నీసేఁతలెల్ల చెల్లును లోకానను ॥ పల్లవి ॥

తీపునంజేవేళ నట్టె తేటఁబులు సింపౌను
పై పైఁ బుణ్యమయితేఁ బాప మింపౌను
వోపి జంతువుల కివి వొకటొకటికి లంకె
చేపట్టి పాపము లెట్టు సేయకుండవచ్చును ॥ దైవ ॥

కడుఁజలువైతేను గక్కన వేఁడింపౌను
వెడనివిరతివేళ సిరు లింపౌను
వొడలుమోచినవారి కొకటొకటికి లంకె
తొడరుభోగాలు మాని తోయ నెట్టువచ్చును ॥ దైవ ॥

యివియు నీమాయే యిన్నియు నీయాజ్ఞలే
జవళిఁ బ్రాణులకెల్ల సమ్మతైనవి
యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
తవిలి నీవే గతి దాఁగ నెట్టువచ్చును ॥ దైవ ॥ 158

---

౧. 'పసుబాలై' పూ.ము.పా. 'పసిబాల' కావచ్చు.
... 'మరు వాకి నని చూచుటయు' కావచ్చునా?

శంకరాభరణం

వట్టిలంపటాలఁ బడి వడఁ బొరలుటకంటే
వొట్టినవిరతి నూరకుండుటే సుఖము ॥పల్లవి॥

పాపముమానినయట్టిబదుకొక్కటె సుఖము
కోపమువిడిచినట్టిగుణమొక్కటి సుఖము
చేపట్టి గురుబుద్ధి సేసేటిదే సుఖము తీ-
దీపులఁబడనియట్టి ౧దినమే సుఖము ॥వట్టి॥

మహిఁ జంచలములేనిమనసొక్కటి సుఖము
సహజాచారముతోడి జన్మమొక్కటి సుఖము
యిహపరసాధనపుయెన్నికొక్కటి సుఖము
బహుళపుటాసకంటె పరిపాటి సుఖము ॥వట్టి॥

పరులఁ బీడించితేనిపనిఁ దొక్కటి సుఖము
గరిమ నిజముతోడఁగలమాటలే సుఖము
ధరలో శ్రీవేంకటేశుదాసానుదాసుఁడయి
సరవితో నడచేటిశాంతమే సుఖము ॥వట్టి॥ 159

రేకు 138 దేసాళం

వారిదేపో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి
భారతరామాయణాలై పరగె నీకథలు ॥పల్లవి॥

భువిమీఁద రావణుఁడు పుట్టఁగాఁగా రాముఁడవై
తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు
అవతార మందితే నిన్నందరునుఁ జూతురు ॥వారి॥

---

౧. 'దినమే' పూ.ము.పా.

రమణఁ గంసాదియసురలు లూటి సేయఁగాఁగా
తమిఁ గృష్ణావతార మిందరికైతివి
గములై యంతటివారు గలిగితేఁగా నీవు నేఁడు
అమర జనించి మాటలాడుదు విందరితో ॥వారి॥

యెంత వుపకారియో హిరణ్యకశిపుఁడు
చెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను
యింతట శ్రీవేంకటేశ యిన్నిరూపులును నీవే
పంతాన నీశరణని బ్రదికితి మిదివో ॥వారి॥ 160

సామంతం

ఊరకైతే నిన్నుఁ గాన మొకకారణానఁ గాని
పూరిజీవులము, నీవు పురుషోత్తముఁడవు ॥పల్లవి॥

అసురలు భువిఁ బుట్టుటవి వుపకారమే
అసురలు బాధింతు రమరులను
పొసఁగ వారికిఁగాను పూనుకవచ్చి నీవు
వసుధ జనించితేను వడి నిన్నుఁ గందుము ॥ఊర॥

అడరి ధర్మము చెడి యధర్మమైనా మేలు
వెదఁగుమునులు విన్నవింతురు నీకు
తడవి ధర్మము నిల్ప ధరణిఁ బుట్టుదు నీవు
బడి నిన్ను సేవించి బ్రదుకుదు మపుడే ॥ఊర॥

నీకంటే మాకుఁ జూడ నీదాసులే మేలు
పైకొని వారున్నచోటఁ బాయకుందువు
చేకొని శ్రీవేంకటేశ చెప్పఁగానే వారిచేత
నీకథలు విని విని నే మీదేరితిమి ॥ఊర॥ 161

సాళంగనాట

పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి
నోరు మూసుకున్నఁ బోదు నున్నవినీసుద్దులు ॥పల్లవి॥

౧వేసులు మాకుఁ జెప్పె విన భారతముగాఁగ
మోస నీపాలముచ్చిమి మొదలుగాను
రాసికెక్క శుకుఁడు రవ్వగాఁ బొగడఁజొచ్చె
ఆసలఁ బరకాంతల నంటిననీసుద్దులు ॥పేరు॥

రంతున వాల్మీకి చెప్పె రామాయణముగాను
సంతగాఁ దాటకాదులఁ జంపినదెల్లా
అంతకముందె నారదుఁ డవి దండెమీటి చెప్పె
యింతటా వేఁటాడి జీవహింసలు సేసినది ॥పేరు॥

వెదుక నజుఁడు చెప్పె వేదముగా నీవు దొల్లి
వోదక మీనై కొన్నాళ్ళుండితివంటా
తోడనే సప్తరుషులు తొల్లియునుఁ జెప్పిరదె
యీడనే శ్రీవేంకటాద్రి విరవైతి వనుచు ॥పేరు॥ 162

గుండక్రియ

దేహ మిది యొకటే దేవుఁడ నీవొకఁడవే
యీహల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥పల్లవి॥

రాతి రొక్కలోకము రవ్వపడెఁ గలలోన
ఘాతలఁ బగలొక్కలోకము వేగితే
యీతల రెప్పలే మరఁ గిందుకు నందుకుఁ జూడ
యేతుల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥దేహ॥

---

౧. 'వ్యాసులకు' వ్యావహారికము గావచ్చు.

పతికాఁగి లోకటే జవ్వనపుఁగాఁక రేఁచు
సుతకాఁగి లోకవేరెసుఖమై తోఁచు
మతిలోనిమరఁగింతే మగువలే యిద్దరును
ఇతవై రెంట దెప్పర మిదివో మాబదుకు ॥ దేహ ॥

దైవమా నిన్నాతుమలోఁ దలఁచి యానందింతు
పూవుల నిన్నుఁ బూజింతు పొంచి [౧] వెలిని
శ్రీవేంకటేశ నీసేవలోనిమరఁగింతే
యీవల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥ దేహ ॥ 163

రామక్రియ

చాలెద నిదియే సత్యము సుండో
చేటు లేదీతని సేవించినను ॥ పల్లవి ॥

హరినొల్లనివా రసురలు సుండో
సుర లీతనిదాసులు సుండో
పరమాత్మఁ డితఁడె ప్రాణము సుండో
మరుగక మఱచిన మఱి లేదిఁకను ॥ చాలె ॥

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో
సోదించె శుకుఁ దచ్చుగ సుండో
ఆదిబ్రహ్మఁగన్నాతఁడు సుండో
యేదెస వెదకిన నితఁడే ఘనుఁడు ॥ చాలె ॥

యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవేంకట-
మహీధరంబున మనికై నిలిచె ॥ చాలె ॥ 164

౧. 'వెలని' పూ.ము.పా.

కేదారగౌళ

మీరు సాక్షి మీరు సాక్షి మే మేమీ ననలేము
చేరి చూడరమ్మ వీని చెల్లుబడి యమ్మా ॥ పల్లవి ॥

పిన్నవాఁడు నిద్ర వోఁగ పెనచి కూఁకటతోడ
పన్ని లేఁగతోఁకఁ గూడ బంధించి కట్టె
వున్నతిఁ దొలఁగ వాని వాళ్లెల్లా దోఁగిపోయ
కన్నెలార యీకృష్ణుఁ గంటిరటరమ్మా ॥ మీరు ॥

లేఁగల నన్నిటి నేము లేవక తొల్లె పడిచె
మూఁగి ఆవులఁ బేయలు మొగిఁ గలయు
ఆఁగి పట్టఁ బోతేము అప్పుడే తా గదె వెట్టి
రాఁగతనాన నున్నాఁడు రాచబలుసమ్మా ॥ మీరు ॥

వారము సేసేమనుచు వడి నింటివారమెల్లా
కూరలు [1]పాళాలు దొంతిఁగూడఁ బెట్టితే
ఆరగించ వేలుపుల అలికి పూసి కుడిపీ
కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుఁ డమ్మా ॥ మీరు ॥ 165

రేకు 139 భూపాళం

ఇదివో మాయింట నేఁడు యింత సేసెఁ గృష్ణుఁడు
ఇదివో మాయింటాను యింత సేసెఁ గృష్ణుఁడు ॥ పల్లవి ॥

గంట వాఁగకుండా నిండఁ గసవు దురిగి మా-
యింటివారు నిద్దిరించ నిల్లుచొచ్చెను
అంటివచ్చి వొకదూడ అపూరి మేసితేను
గంట గణగణ వాఁగె గక్కున మేల్కొంటిమి ॥ ఇది ॥

౧. పాళాలు = పాయసములు కావచ్చు.

వొక్కరోలు దాపు వెట్టి వుట్టియెక్కి అందుమీఁది -
చక్కెరల్లా మెసఁగి మాచంటివానిని
వుక్కఁబట్టి వుట్టిమీఁద నునిచి రోలు దీసె
దొక్కి తా నెందున్నాఁడో చొప్పు ఇదే కంటిమి ॥ ఇది ॥

ఆవుఁ వెళ్లవిడిచె నవి సేఁ ౧దోలి తేఁబోతే
నీవల దూడలఁ దెచ్చి యింటిలోఁ గట్టె
దావతి నింతా వెదకి తలుపు దెరచితేను
శ్రీవేంకటేశునిమాయఁ ౨జిక్కి లోన నున్నవి ॥ ఇది ॥ 166

దేసాక్షి

అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు
౩దినదినక్రొత్తలాయ ద్రిష్ట మిదే మాకు ॥ పల్లవి ॥

ఆదెదిబాలుల హరి అంగిలిచూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడి పోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥ అన ॥

తీఁటతీగెలు సొమ్మంటా దేహము నిండాఁ గట్టె
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥ అన ॥

కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవేంకటేశుఁ డాబాలుల కంటినీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము ॥ అన ॥ 167

౧. 'దోలితేఁ బోతే' పూ.ము.పా. ౨. 'జొక్కి' పూ.ము పా. యతిభంగము.
౩. 'దినదినక్రొత్తలు' వంటి చిల్లర సామాసిక దోషములు మా వ్యావహారికవాఙ్మయము-నకు అలంకారములు

దేసాళి

నిజముదెలిసిన నీమాసేరమే కాదా
భజన నీవు పుట్టించినందుకే నీమా ॥ పల్లవి ॥

అంచెల( బరుసవేది లోహపు(గాళికలనెల్ల
మించినా పసిడి గావించు(గాక
వంచిననీన్నాతుమ( జింతించువారిపాతకాలు
మించవచ్చునా మేలే మెరయింతుగాక ॥ నిజ ॥

నలువంకరవికిరణాలు మేలుగిడుసి
తెలి(గినా యిప్పటిలో( దానేకాక
యిల నీదాసుడు జాతి నెవ్వ(డైనా నీకృప(
దెలి(గి పావను( జేసి ౧ చేకొను(గాక ॥ నిజ ॥

ఘనా( దిక్కులగాలి పొందుగ నిసిడాడని
మూసినా పోక మెల్లా మలయు(గాక
మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే-
దెసెలవైనా నీకరవేకాదా ॥ నిజ ॥ 168

భైరవి

నీవు జగన్నాథుడవు నే నొకజీవుడ నింతే
నీవలె ననుభవించ నే నెంతవాడను ॥ పల్లవి ॥

వైకుంఠపదమేడ వడి( గోర నెంతవాడ
యీకడ నీదాసుడనౌటే చాలదా
చేకొని నీసాకారచింత యేడ నేనేడ
పైకొని నీడాగు మోచి ౨ బ్రదికితే( జాలదా ॥ నీవు ॥

౧. 'చేకొందుగాక' కావచ్చు. ౨. ఈడవ్+అడవ్+అవి.

సొంపుల నీయానందసుఖ మేడ నే నేడ
యింపు శ్రీవైష్ణవసల్లాపన చాలదా
నింపుల విజ్ఞాన మేడ నేఁ దెలియ నెంతవాఁడ
యింపుగా నీకథ విను టిదియే చాలదా ॥ నీవు ॥

కైవల్యమందు నీతో కాణాచి యేడ నాకు
శ్రీవేంకటాద్రిమీఁదిసేవ చాలదా
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చినవిజ్ఞానమున
భావించి నిన్నుఁ బొగడేభాగ్యమే చాలదా ॥ నీవు ॥ 169

మలహరి

అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు ॥ పల్లవి ॥

అందరును సమమైతే నరుహానరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁగాక
పొందితో విప్రునిఁ దెచ్చి పూజించినట్టు వేరే
పొందుగా నిజనకముఁ బూజించఁదగునా ॥ అన్ని ॥

అన్నిమతములు సరియైతేను వాసి లేదా
చెన్నగుఁ బురాణాలు చెప్పుఁగాక
యెన్నఁగ సౌర్ణాటంక మింతటానఁ జెల్లినట్లు
సన్నపుఁదోలు[౧]బిళ్లలు సరిగాఁ జెల్లునా ॥ అన్ని ॥

గక్కనఁ బైరువిత్తఁగా గాదము మొలచినట్టు
చిక్కినకర్మములెల్లాఁ జెలఁగెఁ గాక
తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు
యెక్కడా మోక్షోపాయ మిఁకఁ జెప్ప నున్నదా ॥ అన్ని ॥ 170

౧. 'బిల్లలు' రేకు.

ముఖారి

ఇదియే బుద్ధి నాకు నింతకంటె మఱి లేదు
కదిసి నీబంటనంటె కాతువు నన్నును ॥ పల్లవి ॥

నేరిచి నడచేనంటే నేఁ గాను స్వతంత్రుఁడను
సేరమి చేసేనంటే విందును దూరు
యీరెంటికిఁ గాక నేను యిట్టె నీకు శరణంటే
గారవించి వహించుక కాతువు నన్నును ॥ ఇది ॥

వొక్కచో సర్ధ మర్జించుకుండితే జన్మాలు పెక్కు
యెక్కేనంటే మోక్షము యేదో యెఱఁగ
యెక్కుడిసుద్దులు నేల యిచ్చట నీనామము
గక్కనఁ బేర్కొంటేఁ దయఁ గాతువుగా నన్నును ॥ ఇది ॥

తపసినయ్యేనంటేఁ జిత్తము కై వశము గాదు
చపలసంసారి నైతే శాంతి యుండదు
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి
కపటము మానితేను కాతువు నన్నును ॥ ఇది ॥ 171

రేకు 140 శంకరాభరణం

ఆహా యేమిచెప్పేది హరి నీమాయ
మోహములే చిగిరించీ మొదల జవ్వనము ॥ పల్లవి ॥

యెంచఁగ భూమి యెక్కుటే యేలినరాజు లెందరో
పొంచి వారివెంటవెంటఁ బోవదాయను
అంచలసూర్యచంద్రులనే [1] గడెకుడుకల
ముంచి కొలచి పోసీవి మనుకోవి కాలము ॥ ఆహా ॥

---

౧. 'గడెకుడుకల' కాలమును కొలచెడి కొలపాత్ర కావచ్చునేమో. అర్థమింకను విచార్యము.

దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో
కైవశమై యేలఁగ నొక్కటిదీ గాదు
ఆవటించి పంచభూతాలనేటిశాఖలు వెళ్లి
సావధానానఁ బెరగీ సంసారవృక్షము ॥ ఆహా ॥

యిచ్చట నీ వొక్కఁడవే యిటు నీదాసు లెందరో
తచ్చి యెంత సేవించినాఁ దనివిలేదు
నిచ్చలు శ్రీవేంకటేశ నిధానము నీభక్తి
యెచ్చినాఁడ వింతటా నీదేరీ జన్మము ॥ ఆహా ॥ 172

ముఖారి

ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను
వారివారిపాలికి వరదుఁడవౌదువు ॥ పల్లవి ॥

చేరికొల్చినవారికిఁ జేపట్టుఁగుంచమవు
కోరినుతించినవారికొంగుపైఁడివి
మేరతోఁ దలఁచువారిమేటినిధానమవు
సారపువివేకులకు సచ్చిదానందుఁడవు ॥ ఏరీ ॥

కావలెననేవారికి కామధేనువవు మరి
సేవసేసేవారికి చింతామణివి
నీవే ౧గతెన్నవారికి నిఖిలరక్షకుఁడవు
వావిరి శరణువేఁడేవారిభాగ్యరాశివి ॥ ఏరీ ॥

నిన్నుఁ బూజించేవారినిజపరతత్వమవు
యిన్నిటా నీదాసులకు నేలికెవు
యెన్నఁగ శ్రీవేంకటేశ యిహపరములకును
పన్ని కాచుకున్నవారిఫలదాయకుఁడవు ॥ ఏరీ ॥ 173

౧. గతి+అన్న=గతెన్న.

వరాళి

ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు
మతి వారూఁ దమవంటిమనుజులేకాక ॥ పల్లవి ॥

చేరి మేలుసేయఁ గీడుసేయ నెవ్వరు గర్తలు
ధారుణిలో నరులకు దైవమేకాక
సారెఁ దనవెంటవెంటఁ జనుదెంచేవా రెవ్వరు
వోరువఁ జేసినపాపపుణ్యాలేకాక ॥ ఇత ॥

తొడఁగి పొగడించాను దూషించా మూఖ్యలెవ్వరు
గుడిగొన్న తనలోనిగుణాలేకాక
కడుఁగీర్తి నపకీర్తి గట్టెడివా రెవ్వరు
నడచేటితనవర్తనములేకాక ॥ ఇత ॥

ఘనబంధమోక్షాలకుఁ గారణ మిఁక నెవ్వరు
ననిచిన జ్ఞానాజ్ఞానములే కాక
తనకు శ్రీవేంకటేశుఁ దలపించేవా రెవ్వరు
కొనమొదలెఱిఁగినగురుఁడేకాక ॥ ఇత ॥ 174

దేసాళం

అక్కటా నే నిర్మలుఁడనయ్యే దిఁక నెన్నఁడో
చక్క నన్ను దిద్దుకోనే సర్వేశ్వరా ॥ పల్లవి ॥

నేనే మంచివాఁడనైతే నిందుకోదా జ్ఞానము
కానీలే యింకా నేమేమిగడమోకాక
అనుక సుకృతినైతే నలవడదా విరక్తి
కానరానితప్పు లెన్నిగలవోకాక ॥ అక్క ॥

నామననే చక్కనైతే నాకుఁ బ్రత్యక్షము గావా
చేముంచి నేరమేమి సేసితినోకాక
ఆముక మోక్షాధికారి నైతే నెదురుగా రాదా
కామితార్థాలు భోగించఁ గలుగఁబోలుఁగాక ॥ అక్క ॥

ఔలే నామేను పవిత్ర మైతే సేవ గొనవా
యేలాగున్నదో నీచిత్త మెఱఁగఁగాక
యీలీల శ్రీవేంకటేశ యెదుటనే వున్నాఁడవు
యేలుకొని చేపట్టి యీడేర్చవుగాక ॥ అక్క ॥ 175

శ్రీరాగం

చొచ్చితి నీకు శరణు సుద్ధు లిఁకనేఁటికి
కచ్చుపెట్టెవ్వరివల్లాఁ గలిగే దేమీ ॥ పల్లవి ॥

పుట్టక మునుపెఱఁగ పుట్టుగు మీఁదెఱఁగను
యిట్టె యెప్పటి యెఱుక యేడ కెక్కీని
పట్టె మదనుభూతము పరసిపోయను బుద్ధి
వట్టిపెద్దతనాలను వచ్చేదేమీ ॥ చొచ్చి ॥

రానివి రప్పించఁగ నేరను వచ్చే వాఁపనేర
తానకపునాస్వతంత్ర మెందాఁకా వచ్చును
అనుకున్నది ముదిమి అట్టె జారె శాంతము
నే నెంత విఱ్ఱవీఁగినా నిందేదెమీ ॥ చొచ్చి ॥

యిప్పుడు నే నెవ్వఁడనో యెక్కడ నీ వున్నాఁడవో
కప్పిననావుపాయాలే కార్య మిచ్చీని
నెప్పున శ్రీవేంకటేశ నీయెదుటఁ బడ్డపని
తప్పక యీడేర్తుగాక తలపోసేదేమీ ॥ చొచ్చి ॥ 176

కన్నడగౌళ

చేసిననావిన్నపము చిత్తానఁ బెట్టుకొమ్మీ
వేసరించి యిప్పుడే నే వేఁడుకొంటిఁ జుమ్మీ ॥ పల్లవి ॥

యిందె నాపుణ్యఫలములు నీ కిచ్చితినంటి
కందువఁ గోరనివి సంకల్పించితిని
యిందు మఱచి తప్పినా యిస్సి నీకె ౧నెలవు
పొందవేసి నన్ను నీవె నేరము లెంచకుమీ ॥ చేసి ॥

నిన్నేకాని యితరుల నేఁ గొలువనొల్లనంటి
వున్నతిఁ బరద్రవ్యా లొల్లనంటి
అన్నిటా నేనే మఱి యప్పటిమాటే యంచు
సన్నల నన్నందుకు నొచ్చమని దూరకుమీ ॥ చేసి ॥

నానావుపాయాల నాఁడే శరణంటి
పూని నీసాకారమునేఁ బొడగంటిని
నేను మత్తుఁడనై వున్నా నీవే తలఁచి తెలుపుకో
కోనేటిశ్రీవేంకటేశ కొసరించుకోకుమీ ॥ చేసి ॥ 177

రేకు 141 శుద్ధవసంతం

దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు రాముఁడు
జానకీపతిఁ గొలువుఁడీ ఘనసమరవిజయుఁడు రాముఁడు ॥ పల్లవి ॥

హారునితారకబ్రహ్మమంత్రమై యమరినయర్థము రాముఁడు
సురలఁ గాచి యసురల నడఁచినసూర్యకులజుఁడు రాముఁడు
సరయువందును ముక్తిచూరలు జనుల కొసఁగెను రాముఁడు
హరియె యీతఁడు హరివంశముల కాదిపురుషుఁడు రాముఁడు ॥దీన॥

౧. 'శలవు' రేకు.

మునులరుషులకు నభయమొసఁగినమూలమూరితి రాముఁడు
మనసులోపలఁ బరమయోగులు మరుగుతేజము రాముఁడు
పనిచి మీఁదటిబ్రహ్మపట్టము బంటు కొసఁగెను రాముఁడు
మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముఁడు ॥ దీన ॥

బలిమి మించినదైవికముతో భక్తసులభుఁడు రాముఁడు
నిలిచి తనసరిలేనివేలుపు నిగమవంద్యుఁడు రాముఁడు
మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీఁది దేవుఁడు రాముఁడు
వెలసె వావిలిపాటిలోపలివీరవిజయుఁడు రాముఁడు ॥దీన॥ 178

బౌళి

తెలిసినమాటలు నీసముఖంబున దీకొని వి న్నడుగకపోదు
సులభుఁడ వన్నిట ప్రాణనాథుఁడవు చొప్పుగ నాపతి యియ్యఁ
గదే ॥పల్లవి॥

నీవే బలవంతుఁడవో నీకంటేఁ గర్మము బలువో
దైవసముగ నే నెంచిచూచితే కర్మముకంటె బలువుఁడవు
భూవలయంబుల ప్రారబ్ధంబులు భోగించవలెనని యంటివా
వావిరి నిట్లైతే నీదేవత్వమునకు వెలితగదే ॥ తెలి ॥

ఐనాఁగాని లోకములోపల నది నీయాజ్ఞని తలఁచితిమా
నేను నీశరణు చొచ్చినమీఁదట నీవే పరిహరించఁగవలదా
కానిపించె నా కిఁక నొకబుద్ధి కర్మముపై నెప మటువేసి
పూనుచుఁ గాలక్షేపంబునకై భువిని వినోదము గాఁబోలు ॥ తెలి॥

యెందాఁకా జీవులతోడుత నీ వేలాటంబులు జరపెదవు
అందరికిని నీవే తలిదండ్రివి అయి రక్షింపుచునున్నాఁడవు
కందువ దెలిసెను శ్రీవేంకటేశ్వర కర్త వెట్టు చేసిన మేలు
చందమాయ నిది దగవౌ నీకును సంతోషించితి మిటు నేము
॥ తెలి ॥ 179

౧. అక్ష+అవి.

### వరాళి

ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ
కామించి బ్రహ్మాదులనుఁ గప్పీ నీమాయ ॥ పల్లవి ॥

బచ్చెనరూపులు పెక్కు[౧]పదెచ్చుల వేసినట్లు
నిచ్చలు [౨]నినుచున్నది నీమాయ
తచ్చి వారివారిరతి తమతమకే తెలియ
పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ ॥ ఏమ ॥

మఱి తొలునాటిభోగాలు మరునాటికి చింతగా
నెఱపుగాఁ దమకించీ నీమాయ
విఱుచరానిదుఃఖము వెస నిద్రవోయితేనే
మఱపించి నవ్వించీ మహిలో నీమాయ ॥ ఏమ ॥

పట్టరానిజవ్వనము పరసిపోతే ముదిమి
నెట్టుకొల్పి వుబ్బించీ నీమాయ
గట్టిగా శ్రీవేంకటేశ ఘనుఁడవై ననీదాసుల
పట్టకుండాఁ జేయుము బలిసెనీమాయ ॥ ఏమ ॥ 180

### నాట

ఎంత కఠినమో హృదయ మిది
చెంత దూరఁజేసిరి గాఁబోలు ॥ పల్లవి ॥

అమరఁ బురాణములందు నరకముల-
క్రమములు చదివియుఁ గలంగవు
యమకింకరఘోరాకృతు లటు విని
భ్రమసి యించుకా భయపడ నేను ॥ ఎంత ॥

౧. పదెచ్చు=పడియచ్చు. ౨. నినిచి+ఉన్నది.

మనుజులదారుణమహితకర్మముల-
అనుభవములు గని యలయను
వొనర ౧మహోగ్రయహోరాత్రంబులు
చనుచుండఁగా జడియను నేను ॥ ఎంత ॥

కలుషరౌద్రదుఃఖముల కించుకా
కలఁగను చిరికిఁ గైకొనను
యెలమిని శ్రీవేంకటేశుఁడ నాపాలఁ
గలిగి కాచితివి గాసిల నేను ॥ ఎంత ॥ 181

రామక్రియ

పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు ॥ పల్లవి ॥

సరవిఁ గలకాలమూఁ జదువుచుండు నొకఁడు
గరిమె నీకృప . నిన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోఁడఁ దపముసేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥ పాటె ॥

వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షము గను
యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును ॥ పాటె ॥

భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁ గద్దు
జీవులు నిన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు ॥ పాటె ॥ 182

౧. మహోగ్ర+అహోరాత్రంబులు=మహోగ్రయహోరాత్రంబులు ఇట్టివి కొన్ని వింతసంధులు గలవు. లేక 'మహోగ్ర'. అని సంశోధనమా?

రేకు 142 రామక్రియ

అందుకల్లా లోనుగాక అట్టే యెచ్చరికె తోడ
పొందుగా హరిఁ దలఁచేపురుషుఁడే ఘనుఁడు ॥ పల్లవి ॥

చలములు పుట్టించ సారె మత్సరము రేఁచ
కలుగు నానావిధకారణములు
తలఁపులు భ్రమయించ తగువేడ్క లొనరించ
పలుమారు యెదుట నిల్చు బహురూపాలు ॥ అందు ॥

తగవులు దిద్దించ తగ నలమటఁ బెట్ట
తగులు ననేకబంధములెల్లాను
పగసాధింపించ నప్పటి నుపాయాలు నేర్ప
విగిడివచ్చు౧ ననేకనెపములెల్లాను ॥ అందు ॥

౨తేరకే మేలయించ దేహమెల్లా నావటించ
వూరకే తోఁచు ననేకవుద్యోగాలు
కోరి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి నిశ్చింతుఁడైతే
ఆరయ మతిలో నిండు నానందాలు ॥ అందు ॥ 183

మాళవిగౌళ

నేరఁగల దొక్కటె నిశ్చలబ్రహ్మవిద్య
వారివారియంతర్యామే వచ్చి పెరరేఁచీని ॥ పల్లవి ॥

వొక్కరు నేర్పఁగవద్దు వొగి సంసారధర్మము
దిక్కై పుట్టించినప్రకృతియే నేర్పీని
గుక్కక ౩జంతులు చన్నుగుడువ నేరుపవద్దు
చక్కఁగా ననాదివాసనలే నేర్పీని ॥ నేరఁ ॥

---

౧. 'అనేకనెపములు' అనేకసార్లు వంటివి. ఈ చిల్లర దోషములు మా వాఙ్మయమునకు భూష. ౨. 'తేర తేమే వలయించ' పూ.మ.పా. ౩. 'జంతూలు' రేకు.

అంచ నెవ్వరు నిద్రవోమ్మని బుద్ధిచెప్పవద్దు
మించి వారితమోగుణమే కప్పీని
కొంచక భుజియించుమని కోరి యుచ్చరించవద్దు
పెంచినతనయాఁకలే పిలిచితెచ్చీని ॥ నేరఁ ॥

అట్టె పనివాటల అలవాటు చూపవద్దు
యెట్టైనా తనజాతే సేయిపించీని
వొట్టుక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు కోనేటిదండ
పట్టికొలిచినవారే భాగ్యవంతు లిలను ॥ నేరఁ ॥ 184

శంకరాభరణం

అది నే నెఱఁగనా అఁతలో భ్రమతుఁగాక
మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే ॥ పల్లవి ॥

యెంత లోకానుభవము అంతయు వృథా నష్టి
కొంతైనా బ్రహ్మచింత కోటిలాభము
వింతైనజనులతోడివినోదము నిష్ఫలము
చెంత సజ్జనసంగతి చేరినయాదాయము ॥ అది ॥

నానాదేశవార్తలు నడుమఁ జింతామూలము
పూనినపురాణగోష్ఠి పుణ్యమూలము
ఆవినకృషివాణిజ్యాలన్నియుఁ దీరనివెట్టి
మాననియాచార మాత్మకుఁ బడ్డపాటు ॥ అది ॥

పలుచుట్టరికములు బట్టబయలుతగుళ్లు
చెలఁగునాచార్యసేవ జీవన్ముక్తి
బలిమి శ్రీవేంకటేశ పరగ రెండువిధాలు
నిలుకడయినవాఁడవు నీవే యిన్నిటికి ॥ అది ॥ 185

దేవగాంధారి

ఒక్కఁడే మోక్షకర్త వొక్కఁడే శరణాగతి
దిక్కని హరిఁ గొల్చి బదికిరి తొంటివారు ॥ పల్లవి ॥

నానాదేవత లున్నారు నానాలోకము లున్నవి
నానావ్రతా లున్నవి నడచేటివి
జ్ఞానికిఁ గామ్యకర్మాలు జరపి పొందేదేమి
అనుకొన్న వేదోక్తాలైనా నాయఁగాక ॥ ఒక్క ॥

వొక్కఁడు దప్పికిఁ ద్రావు వొక్కఁడు కడవ నించు
నొక్కఁ డీఁదులాడు మడుగొక్కటియందే
చక్కజ్ఞానియైనవాఁడు సారార్థము వేదమందు
తక్కక చేకొనుఁగాక తలకెత్తుకొనునా ॥ ఒక్క ॥

యిది భగవద్గీతార్థ మిది యర్జునునితోను
యెదుటనే వుపదేశమిచ్చెఁ గృష్ణుఁడు
వెదకి వినరో శ్రీవేంకటేశుదాసులాల
బ్రదుకుఁద్రోవ మనకు పాటించి చేకొనరో ॥ ఒక్క ॥ 186

భైరవి

ననుఁ జూచి హరి నీవు నవ్వకుందేవా
పనిమా లెంత బయలుపాఁకీ నామనసు ॥ పల్లవి ॥

మనసుకు గోచరమా మాటలకు గోచరమా
కనుఁగొన వసమా నీఘనరూపము
నిను వెదకుచున్నాఁడ నీవెక్కడ నే నెక్కడ
జనుఁడ నింతె యెంత సాహసము నాది ॥ నను ॥

వున్నచో వెఱఁగుదునా వోయీ అంటేఁ బలికేవా
యెన్న తెలియఁదరమా యిట్టి నీమాయ
అన్నిటా నీకొలువు సేయఁ గడఁగుచున్నవాఁడ
యెన్నటిపొందు నీవు నా కెంత దిట్టతనమో ॥ నను ॥

వాకిలి౧ గానవచ్చునా వంచించి ౨చొరవచ్చునా
రాకపోక కబ్బునా పరమపదము
శ్రీకాంతుఁడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె
కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో ॥ నను ॥ 187

లలిత

ఎన్నటికి జీవుఁ డీఁక నీడేరేది
పన్ను కొనేటిచింతలే బలిసీఁగాని ॥ పల్లవి ॥

కలవు వివేకులు కలదిటు ధర్మము
కలఁడు దైవము నేఁడు గావలె నంటే
వలవనిసందేహాన వట్టిజాలిఁ బొరలేటి-
తలపోఁత లేమిటికో తడఁబడీఁ గాని ॥ ఎన్న ॥

వున్నవి వేదశాస్త్రాలు వున్నది విశ్వాసము
వున్నవాఁ డాచార్యుఁడు వుపదేశించ
తిన్నఁదానే మోసపోయి తత్వము నిశ్చయించక
మిన్నక చంచలమే లో మెరసీఁగాని ॥ ఎన్న ॥

యిదిగో పుణ్యనిధులు యిదిగో సంకీర్తన
వివరింప వీఁ డిగో శ్రీవేంకటేశుఁడు
భవములచే భ్రమసి బహుసంగతులచేత
యివల నామన సిప్పు డెటఁగీఁగాని ॥ ఎన్న ॥ 188

---

౧. 'వాకిటఁ' గావచ్చు. ౨. 'తొరవచ్చునా' వ్రా.ము.పా.

రేకు 143 గుజ్జరి

ఎన్నియు నడుగవే నేనే మఱపితి నను హరి నీకే తెలిసినవి
మన్నించి నా కీజన్మ మొసఁగితివి మర్మగాఁడు మన్మథుఁ
డొకఁడు ॥ పల్లవి ॥

పలుజన్మంబుల నేఁ బ్రాగినచనుఁబాలు గొలచితే నెన్నాళ్లనో
తలిదండ్రులు మరియెందరో తా మెక్కడ నున్నారో
తిలకింపఁగ నాహారంబునకును తెగినకొలుచు లవి యెన్నెన్నో
యిలపై నే బ్రదికినకాలము యెంతని వ్రాసెనో చిత్రగుప్తుఁడు
॥ ఎన్ని ॥

చిమఁగఁగఁ జిమఁగఁగఁ గట్టుకోకలకుఁ జెల్లినవత్తి దా నదియంతో
కనక మెంతో నా కాభరణములై కాయంబులతో నొరసినది
పెనఁగి రమించినకామినీమణులపేరు లెన్నియో తొల్లిటివి
ఘనముగ నను నిటు భోగించఁజేసినకర్మమే యెఱుఁగు
వివియెల్లా ॥ ఎన్ని ॥

గరిమల నే గడియించినయిండ్లుఁ గాణాచివోట్లు యేడేడో
పొరలినయిడుమలు యెందుకెక్కెనో పొదలితి భువిపై నిన్నాళ్లు
అరయఁగ నందరి కంతర్యామివి అఖిలకారణంబును నీవే
నిరతపుశ్రీవేంకటేశ్వర దయగలనీచిత్త మెటువలెఁ దలఁచీనో
॥ ఎన్ని ॥ 189

మలహరి

దైవమా నీపెరరేఁపణ లివి తప్పక వున్నవి జీవులకు
భావించి కాదనిదొబ్బి దీకొనఁగ బ్రహ్మాదులకైనను వసమా
॥ పల్లవి ॥

యెక్కడ సిద్ధించు బ్రహ్మచర్యము యెగుటనే కాంతలఁ జూచినవేళను
చక్కఁగా మనోవ్యభిచారంబునఁ జలియించుంగాక
చిక్కనే విరతి ధనధాన్యంబులు చేతికి లోనయినఁ జూచి
వొక్కటియై తా నందే మగ్నమునొందించుం గాక ॥ దైవ ॥

---

౨. 'నయ్యన' రేకు. ౧, ౩. 'చుఁగాక, చుఁగాక' కావచ్చు.

కలుగునే తనివి బహుపదార్థములు గక్కున నంగళ్లనుఁ జూచి
కొలఁదిమీఱఁ గడుతరితీపులతో కోరుచు నోరూరుం<sup></sup>గాక
వలనుగ సమాధి యెటువలె దొరకొను వాజవారణంబులఁ జూచి
యెలమితోడ మంగిళ్లనెల్లఁ జరియింపించుఁ గాక ॥ దైవ ॥

యేరీతి నెలకొను నీమీఁదితలఁపు యిహలోకపుసౌఖ్యము చూచి
భారపులంపటములు పైఁ దగిలించి పసులకుఁ బరికొలుపుఁ గాక
ధారుణి నే నిప గెలుచుట యెన్నఁడు తగ శ్రీవేంకటనాయక నీవే
గారవించి రక్షింపుము నీ కిది కడు నుపకారంబౌఁగాక ॥ దైవ ॥ 190

అహిరి

ఎంత మహిమో నీది యెవ్వరి కలవిగాదు
చింతించితే దాసులకుఁ జేపట్టుఁగుంచమవు ॥ పల్లవి ॥

పూరకే నీ న్నెవ్వరికి యుక్తుల సాధింపరాదు
సారెకుఁ దర్కవాదాల సాధింపరాదు
అరసి వెదకి ఉపాయముల సాధింపరాదు
భారములేనియట్టి [3] భక్తసాధ్యుఁడవు ॥ ఎంత ॥

మిక్కుటపుసామర్థ్యాన మెరసి తెలియరాదు
దిక్కరించి నేర్పులఁ దెలియరాదు
వెక్కసాన భూముల వెదకి తెలియరాదు
మొక్కి నీకు శరణంటే ముందర విలుతువు ॥ ఎంత ॥

చెలరేఁగి తపములు చేసినా నెఱఁగరాదు
యిల నెన్ని చదివినా నెఱఁగరాదు
నెలవై శ్రీవేంకటేశ నీదాసానుదాసులఁ
గొలిచితేఁ జాలు గక్కనఁ గృప వేతువు ॥ ఎంత ॥ 191

---

౧. 'రుఁగాక' కావచ్చు ౨. 'తంకొను' పూ.ము.పా. ౩. 'భక్తి' కావచ్చు.

కన్నడగౌళ

నీవు నన్ను రక్షించితే నిందఁ నీపైఁ బడదు
భావించి నన్నెట్టయినా బ్రదికించుకొనవే ॥ పల్లవి ॥

చింతతమము నన్నెంచితే సర్వాపరాధి నేను
యెంత నీ వేమిచేసినా నెంత కర్మ్ఁడ
అంటెటిలోకజననియైనలక్ష్మిఁ జూచి కావి
అంతరాత్మ నిన్నుఁ జూచియైనా మన్నించవే ॥ నీవు ॥

కల పెనైన్నా నాఁ దప్పులు కరఁగొన నావల్ల
చెలఁగి యుండుకుఁ బ్రాయశ్చిత్తము లేదు
బలి నాభుజము చక్రలాంఛనము చూచి కావి
అల నానోరిమంత్రమైనాఁ జూచి యేలుమీ ॥ నీవు ॥

మతి నిన్నెఱఁగేనంటే మదోన్మత్తుఁడ నేను
గతి యేది నాకు శ్రీవేంకటగిరినాయక
సతితము నీబిరుదు సారెకుఁ జూచి కావి
ప్రతిలేనినీదయయైనా భావించి చేకొనవే ॥ నీవు ॥ 192

దేసాళం

ఇందరిబ్రదుకను యీశ్వరువి చేతి౧దే
యెందూ సుజ్ఞానులు విన్నే యెఱిఁగి కొలిచిరి ॥ పల్లవి ॥

వినఁ గనఁగొనలేక నీచేఁత దెలియక
మనుజులదృష్టమని మది నెంతురు
అనిశము నీసృష్టి యిట్లని విశ్చయించరాక
తనరఁ గొందరు తమతమకర్మ మందురు ॥ ఇంద ॥

---

౧. 'చేతివే' కావచ్చు.

మహి నీలీల లెంచక మహిమలు దెలియక
బహుగతి జగత్తుస్వభావ మందురు
నిహితమై నీ వింతటా నిండుకుండుట చూడక
తహతహఁ గొందరు యింతా మిథ్య యందురు ॥ఇంద॥

భావములోన నిన్ను భావించవశముగాక
ఆవల నిరాకారమని యందురు
శ్రీవేంకటేశ నీవు చేరి యెదుట నుండఁగా
దేవుఁడు మనవాఁడుగా తెలిసితి మందురు ॥ఇంద॥ 193

రేకు 144 సాళంగనాట

ఏమని తలఁచవచ్చు నిటువంటినీచిత్తము
దీమసాన నీభావము తెలియ దెవ్వరికి ॥పల్లవి॥

రవిచంద్రగ్రహతారకములకుఁ దెరువు
వివరించ నున్నదా నీవే యాధారముగాక
పవనునికి భువికి పదునాల్గులోకముల-
కవల వేరొకచోట నాధార మున్నదా ॥ఏమ॥

తిలకింపఁ గులాచలదిగ్గజశేషాదులకు
నిలువఁ జోటున్నదా నీవే యాధారముగాక
నలుదిక్కులకు గగనమునకు మేఘాలకు
కలది నీయధారమేకాక వేర వున్నదా ॥ఏమ॥

అనంతబ్రహ్మాండముల కట్టే నీరూపములకు
వెనకముందున్నదా నీవే యాధారముగాక
వినుతి కెక్కినశ్రీవేంకటేశ నీకు నీవే
మనికైనయాధారము మఱి యెంచ నున్నదా ॥ఏమ॥ 194

పాడి

విష్ణుఁడే యింతానని భావించుటే బుద్ధి
వైష్ణవుఁడై యాచార్యసేవసేయుటే బుద్ధి ॥ పల్లవి ॥

కొండవంటితనలోనికోపము రేఁగ వచ్చితే
దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి
మెండుగా బరకాంతల౧ మీఁదితమి పుట్టితేను
౨ అందుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥

ఆట్టె యెవ్వరయినా గృహారామాదులపై నాస
వుట్టించితేఁ వానివెంటఁ బోనిదే బుద్ధి
చుట్టపుసమ్మంధాన సోఁకితే పరబాధలు
ఛుట్టుకోక లోనుగాక జునుఁగుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥

తప్పదింతా దైవికమే తనవద్దనున్నవారిఁ
దప్పులువట్టనిదే తగినబుద్ధి
యెప్పుడూ శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
చొప్పెత్తి యాతనిమూర్తి చూచుటే బుద్ధి ॥ విష్ణుఁ ॥ 195

కన్నడగౌళ

సకలమైనవారికి సహజ మిది
అకటా యెట్టు గల్పించి ఆడించేవు దేవుఁడా ॥ పల్లవి ॥

తనియ కొరులచక్కఁదనమే చూచుఁగాని
తనభావము తనకుఁ దలఁపు గాదు
చొనిపి యౌవ్వనపుసుద్దులే చెప్పుఁగాని
పొవీఁగి తనవయసు పోవుట దెలియదు ॥ సక ॥

౧. 'మీఁద తమిపుట్టితేను' అనుట సహజము. ౨. అందుకాచి+అందుకు

దారుపాషాణబుద్ధులు దైవముపైఁ బెట్టుఁగాని
యీరీతినే తనదేహ మెంచుకోఁడు
వూరిలోనిమాటలెల్లా వుగ్గడించఁబోఁపుఁగాని
కారణపుతనజన్మకథలు దడపఁడు ॥ నక ॥

వేడుకతో నిక్షేపాలు వెదకఁగోరుఁగాని
ఆడనే ఆత్మనిక్షేప మది వొల్లఁడు
వీడక శ్రీవేంకటేశ వెలయ నీదాసులకు
తోడఁదోడఁ దెలుపుచు తోడయి రక్షింతువు ॥ నక ॥ 196

భైరవి

ఇంతకంటే నే మున్నది యెంత దలపోసినాను
చింతదీర నీసేవ సేయుటే కలది ॥ పల్లవి ॥

ఉపకారముగ దేహ [illegible]తి విటు నాకు
ఉపమించి నేఁ [illegible]పకార మిఁక నేది
యెపుడూ నీధర్మమున [illegible]టు నీరుణస్థుఁడనై
ప్రపన్నుఁడనై నేను బ్రదుకుటే కలది ॥ ఇంత ॥

వేవేగ వెట్టిఁ జేయగ [illegible] జేసితివి
యీవికి నే మారుకుమా రిచ్చే దెక్కడ నున్నది
యీవల నీకుఁ గీర్తిగా విట్టే నీయాధీనుఁడనై
భావించి భయము లేక బ్రదుకుటే కలది ॥ ఇంత ॥

జడులలోఁ గూర్చక యాచార్యునిలోఁ(తోఁ?) గూర్చితివి
నడపేటినీసరవికి నాపరవి యేమున్నది
యెడయక శ్రీవేంకటేశ నీకు బంటనై
బడివాయ కిట్లా నే బ్రదుకుటే కలది ॥ ఇంత ॥ 197

ముఖారి

వెలుపల వెదకితే వెస నాత్మఁ గనునా
పలుమారు నిదే యభ్యాసము గావలెను ॥ పల్లవి ॥

యిన్ని చింతలు మఱచి యింద్రియాలఁ గుదియించి
పన్నివుండినహృదయపద్మమందును
యెన్న నంగుష్ఠమాత్రపుటీశ్వరుపాదాలకింద
తన్ను నణుమాత్రముగాఁ దలఁచఁగవలెను ॥ వెలు ॥

పలుదేహాపుఁగాళ్లఁ బరువులు వారక
బలుదేహాపుటింటిలోపల చొచ్చి
చలివేఁడిఁ బొరలక సర్వేశుపాదాలకింద
తలకొన్నతన్నుఁ దానె తలఁచఁగవలెను ॥ వెలు ॥

తైకొన్న భక్తితో నిక్కపుశరణాగతితో
చేకొని విన్నపాలు చేసుకొంటాను
యేకాంతాన శ్రీవేంకటేశ్వరుపాదాలకింద
దాకొని తన్నుఁ దానే తలఁచఁగవలెను ॥ వెలు ॥ 198

శ్రీరాగం

ఇంతేకాని తెలిసితే నెవ్వరూఁ గర్తలు గారు
బంతినే వీని కెప్పుడుఁ బ్రకృతి గారణము ॥ పల్లవి ॥

యివిగో గుణాలు మూఁడే యింద్రియాలఁ గూడుకొని
భువిఁ బ్రాణులనెల్లాను పూఁచి పెనలుగొనేవి
కపిసి కర్మములై ఘనలోకాలఁ దిప్పేవి
అవలఁ బుట్టుగులకు నప్పటిఁ దెచ్చేవి ॥ ఇంతే ॥

పంచభూతా లివియే పరగ జీవులకెల్లా
దించరాక యెప్పుడును దేహాలయ్యేవి
అంచెలఁ గంచములోఁ బద్దార్థములై వుండినవి
తెంచరానిపాశములై తీపులఁబెట్టేవి ॥ ఇంతే ॥

మనసొక్కటే [1]జంతులమర్మములు రేఁచేది
తనుభోగములలోనఁ దనిపిచ్చేది
అనయము శ్రీవేంకటాధిప నీమహి మిది
నినుఁ గొల్చినదాసుల నెరవేర్చేది. ॥ ఇంతే ॥ 199

రేకు 145 దేసాళం

భావించలే రెవ్వరును బయలువాఁకేరుగాని
నీవే గుఱుతు మాకు నీరజనాభా ॥ పల్లవి ॥

కైవల్య మెట్టుండునో నిక్కపుజ్ఞాన మెట్టుండునో
దైవిక మెట్టుండునో తలఁచరాదు
జీవన మెట్లనుండునో చిత్త మేరీతినుండునో
ఆవిధ మెవ్వరి కిట్టట్టనఁగరాదు ॥ భావి ॥

వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో
ఆది నంత మెట్టుండునో అరయరాదు
భేద మనే దెట్టుండునో అభేద మది యెట్టుండునో
సోదించి యెవ్వరికిని చూడఁగరాదు ॥ భావి ॥

ఫల మెట్లానుండునో భక్తి యెట్లానుండునో
తెలివి యెట్టుండునో సాధించఁగరాదు
యిలపై శ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి
నిలుకడై వున్నారము నీకృప యిఁకను ॥ భావి ॥ 200

---

[1]. 'జంతూల' రేకు.

## గౌళ

ఒడఁబరచుకొంటిని వుపేంద్ర నిన్ను నిపుడె
చిడిముడి నీసేవకే సెలవుచేసుకొమ్మీ ॥ పల్లవి ॥

కన్నుల నేఁ జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే
విన్నవినుకులెల్లా విష్ణుఁడ నీకథలే
తిన్నవినామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే
అన్నిటా నాభావము సమర్పణము నీకును ॥ ఒడఁ ॥

అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే
గుట్టున నాసేఁతలెల్లా గోవింద నీకైంకర్యాలే
ముట్టి నేభుజించినవి ముకుంద నీప్రసాదాలే
నెట్టన నాభోగమెల్లా నీవశము చేసితి ॥ ఒడఁ ॥

యిల నేఁ [౧] బండఁబడేవి యీశ్వర నీకు మొక్కులే
తలఁచే నాతలఁపెల్లా దామోదర నీధ్యానమె
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి ॥ ఒడఁ ॥ 201

## కన్నడగౌళ

నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని
వున్నవాఁడ నిఁక వేరే ఉపాయ మేమిటికి ॥ పల్లవి ॥

గతియై రక్షింతువో కాక రక్షించవోయని
మతిలోనిసంశయము మఱి విడిచి
యితరులచే ముందర నిఁక నెట్టౌదునోయని
వెతతోఁ దలఁచేటివెఱపెల్లా విడిచి ॥ నిన్ను ॥

---

౧. పండఁబడేవి=పండుకొనునవి. స్వార్థమున 'పడు' ధాత్వనుప్రయోగము.

తిరమైననీమహిమ తెలిసేవాఁడనటే—
గరువము ౧తోడవుద్యోగము విడిచి
వెరవున నీరూపు వెదకి కానలేనటే—
గరిమ నలపు నాస్తికత్వము విడిచి ॥ విన్న ॥

ధ్రువమైననాచేతను తోడుదెచ్చుకొనేనటే
అవల నన్యులమీఁదియాస విడిచి
వివరించలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తవిలితి నాపుణ్యమంతయు నీకే విడిచి ॥ విన్న ॥ 202

లలిత

భ్రమయఁకువుండేదే పరమార్థము
నెమకితే నన్నిటాను నీవే వుండుదువు ॥ పల్లవి ॥

వసుధలోఁ బురుషులవనితలరూపులు
వెస మాయయంత్రపువెరబొమ్మలు
ముసరి యొండొంటికి మోహించేమోహములు
అసురుసురయ్యేఇంద్రియావేశములు ॥ భ్రమ ॥

తగినతనులో చక్కఁదనాలు వయసులు
పగటురక్తమాంసాలపపూర్ణులు
జిగి నిందుకుఁగాఁ బుట్టేచిత్తవికారములు
నిగుడుచు బయలువన్నినమట్టిపురులు ॥ భ్రమ ॥

లలి మీరి యన్యోన్యవిలాసములు భోగములు
వలవని మొయిలులేనివానజల్లు
యెలమి శ్రీవేంకటేశ యివెల్లా నీదాసులకుఁ
దెలిపి బ్రహ్మానందము తిరముగా నిత్తువు ॥ భ్రమ ॥ 203

---

౧. 'తోడ' కావచ్చు. వ్యస్తస్థలములలోకూడ చేత—తోడ—మీఁద—వలన అను వానిపై 'ఉ' వర్ణము ఈ వాఙ్మయమున తరచుగ కనుపట్టుచుండును.

పాడి

దైవముతోడిదే తనతగులు
జీవుఁ డిది యెఱఁగితే చిక్కనీదు తగులు ॥పల్లవి॥

కన్నులఁ జూచినంతనే కలుగునుఁ దగులు
మిన్నక మాటలాడితే మించుఁ దగులు
పన్నుగా నవ్వితేను పాదుకొనుఁ దగులు
యెన్నైనా నూరకుండితే నేమీ లేదు తగులు ॥దైవ॥

వీనులొగ్గి వినఁబోతే విశ్వమెల్లాఁ దగులు
ఆని మేనివాసన నంటుకొనుఁ దగులు
పూని లోకులపొందుల పొంగారుఁ దగులు
మోనాన నూరకుండితే మొగియదు తగులు ॥దైవ॥

కరుణించి యేమిచ్చినా గట్టిగా నవునుఁ దగులు
దొరతనాన మించితే తొడరును తగులు
ధరణి శ్రీవేంకటేశుఁ దలఁచి యేకాంతాన-
నిరవై వూరకుండితే నెనయదు తగులు ॥దైవ॥ 204

సామంతం

ఇందరూ జీవులే యెంచి చూచితే-
నందులో భావము లనియే వేరు ॥పల్లవి॥

అంతటఁ జూచిన యాహారనిద్రలు
జంతురాసులకు సహజములు
సంతోషంబును సాత్వికగుణమును
శాంతచిత్తులకు సహజములు ॥ఇంద॥

మనసునఁగలకామక్రోధంబులు
జననశీలులకు సహజములు
వినయంబును ఘనవిజ్ఞానము స-
జ్జనుల కెప్పుడును సహజములు ॥ ఇంద ॥

విడువనియాసలు వేవేలుచింతలు
జడులకు సం(నెం?)దును సహజములు
ఐడి శ్రీవేంకటపతికొలువుఁదపము
జడియువిదాసులసహజములు ॥ ఇంద ॥ 205

రేకు 146 శంకరాభరణం

కలది యీమూ ర్తివల్ల గతి గనవలెను
యిల నిందు నమ్మకుంటే యెందు మరి లేదు ॥ పల్లవి ॥

కంటిమా బ్రహ్మము వేంకటపతిఁ గనినట్టు
కంటిమా అవతారాలు కతలెకాక
కంటిమా హృదయములోఁ గలిగినదైవమును
కంటిమా [1] వైకుంఠము కడవారైనాను ॥ కల ॥

తెలిసీనా జ్ఞానము యీదేవునిమహిమవలె
తెలిసీనా వేదాలు సందేహమేకాక
తెలిసీనా మాయ యిది యెంత చదివినా
తెలిసీనా ముందరితెరువు వెదకితే ॥ కల ॥

చిక్కీనా మనసు యీశ్రీవేంకటేశ్వరువలె
చిక్కీనా ధ్యానము వట్టిచింతలేకాక
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము
చిక్కీనా పెద్దలు చెప్పేజితమైనశాంతి ॥ కల ॥ 206

---

1. వైకుంఠముకడవారైనాను = "వైకుంఠము దగ్గర నున్నవారైనా" అను నర్థమున ప్రయోగించిరేమో? లేక కడవారైనా = తుదిమెట్టు నందుకొన్నవారైనా "వైకుంఠము కంటిమా" అను రీతిగా ప్రయోగించిరేమో?

నాట

అందరిబోనా నెక్కుడు హనుమంతుఁడు
కందువ మతంగగిరికాడిహనుమంతుఁడు ॥ పల్లవి ॥

కనకకుండలాలతో కౌపీనముతోడ
జనియించినాఁడు యీహనుమంతుఁడు
ఘనప్రతాపముతోడ కఠినహస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్దహనుమంతుఁడు ॥ అంద ॥

తివిరి జలధిదాఁటి దీపించి లంకయెల్లా
అవలయివల నేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డహనుమంతుఁడు ॥ అంద ॥

తిరమైనమహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశుబంటై సేవింపుచు
వరములిచ్చీఁ బొడవాటిహనుమంతుఁడు ॥ అంద ॥ 207

సాళంగనాట

ఈతఁడు తారకబ్రహ్మ మితఁడు మాదేవుఁడు
కౌతుకానఁ జెప్పే వినఁగదరే వోజనులు ॥ పల్లవి ॥

రాముఁడు యిందీవరశ్యాముఁడు నానాసార్వ-
భౌముఁడు షోడశకళాసోముఁడు
దోమటిరాక్షసులను తుత్తుమురుసేసినాఁడు
కామితఫలములిచ్చి కాచినాఁడు సురల ॥ ఈత ॥

పూ[1]ర్ణుఁడు నీలమేఘవర్ణుఁడు దాసమున వి-
స్తీర్ణుఁడు [2]వాహనసుపర్ణుఁడు
అర్ణవము దాఁటి రావణాదుల గెలిచినాఁడు
నిర్ణయించి చెప్పరాదు నేఁ డీతనిమహిమ ॥ఈతఁ॥

వరుఁడు సీతకు పరాత్పరుఁడు [3]కోదండదీక్షా-
గురుఁడు దివ్యామోఘశరుఁ డితఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నెలవై యుండేటివాఁడు
సరి భరతలక్ష్మణశత్రుఘ్నసహితుఁడు ॥ఈతఁ॥ 208

శ్రీరాగం

ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్ఛగించువాఁడే ఘనుఁడు
వదలకురో హరిదాసులసంగతి మిది వర్ణించెద నోవివేకులాలా ॥పల్లవి॥

దేవుఁడుగలఁడని మదిలోఁ దెలియుటే జన్మఫలంబు
తావుగ నాతని నెప్పుడుఁ దలఁచుటే తనభాగ్యము
శ్రీవైష్ణవధర్మము లొప్పక చెలఁగుటయే వైభవము
దేవతాంతరంబులన్నియు మానినదియే సుకృతంబు ॥ఇది॥

కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము
చేముంచి పాపము సేయకమానుటే చెప్పఁగ లాభము
నేమముతోడుత విరక్తుఁడగుటే నిర్మలానందము
వేమరు నాచార్యసేవ సేయుటే విచారింపఁగ దాఁచినధనము ॥ఇది॥

ప్రకృతివికారములకుఁ జొరకుండుటే పరమమైనసాత్త్వికము
సకలబంధములఁ బెడఁబాసినదే సామ్రాజ్యపదము
ప్రకటింపఁగ నలమేలుమంగకును పతియగుశ్రీవేంకటవిభుని
అకలంకుఁడై కొలిచియుండుటే యనంతమహిమాతిశయంబు ॥ఇది॥209

---

౧. రేకులో 'ర్ణ' వర్ణములన్నీ 'ర్ణ' గానే యున్నవి.

౨. 'సుపర్ణవాహనుఁ' డనుట సహజము. "స్తీర్ణ, పర్ణ" శబ్దములప్రాస యతి-ప్రభావము కాబోలు. లేక అహితాదిగణమనియా?

౩. చూ: ప్రథమ సంపుటము, పాట: 314.

కేదారగౌళ

ఇదియే ఉపాయ మిఁక నాకు నిందులకింతె మఱి లేదు
మది నితనిదాసులదాసుఁడనై మహిమలతోఁ గడుమెఱసేఁగాక
॥పల్లవి॥

కడచితినా నాజన్మములు గక్కన మాసిసినైనంతనే
విడిచితినా పాపము సేయక వేవేలుచదివినయంతనే
అడఁచితినా సంసారవారధి అఖిలదేవతలఁ గొలిచినయంతనే
బడిబడి హరినామము నుతించి నేఁ [౧] బావనమయ్యేఁగాక
॥ ఇది ॥

గెలిచితినా యీమాయను నేఁ గెరలి తపంబులు సేసినంతనే
తలఁగితినా నరకములు చొరక ధరయెల్లా [౨] నేలినంతనే
తెలిసితినా తత్త్వరహస్యము తిరముగ కులజుఁడనయినంతనే
యిలలో శ్రీపతి శరణుచొచ్చి నేనిప్పుటఁ బుణ్యుఁడ నయ్యేఁగాక
॥ఇది॥

వదలితినా నాదుర్గుణములు వర[illegible]ఁ జుట్టాలు గలిగినంతనే
వెదకితినా ముక్తి [illegible] లెఱిఁగినేర్చినంతనే
యిదివో శ్రీవేంకటేశుఁడు నాకును యేలికయై మన్నించఁగను
పదిలము[illegible] నాతని సేవచేసి [illegible]నానందుఁడ నయ్యేఁగాక
॥ఇది॥ 210

రేకు 147 సా[illegible]

ఎట్టు దో[illegible] [illegible] తవిచారికై నాను
పట్టి నీకు [illegible]చే [illegible]తువుగాక ॥ పల్లవి ॥

మాలతనమువంటిది మతిఁదగులుఁగామము
ఆలరి ముట్టువంటిది అంటుఁగ్రోధము
కేలి నొడిగించునెంగిలివంటిది లోభము
వాలాయించి నెందుండ్డినా వచ్చును లోకులకు ॥ ఎట్టు ॥

౧ 'పావనుఁడయ్యేఁ గాక' కావచ్చు. ౨. 'నేలితినంతనే' పూ.ము.పా.

చుట్టి మద్యమువంటిది చొక్కించు మోహము
వట్టిమాంసమువంటిది వయోమదము
పుట్టినభ్రమవంటిది పొదిగినమచ్చరము
వుట్టిపడి నోరూరించు నూరకే ప్రాణులను ॥ ఎట్టు ॥

గోడమఱఁగువంటిది గుట్టుతోడిసంసారము
పీడవికట్టువంటిది వేడుకయాస
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నీదాసుల
జాడదప్పవియ్యవు యీచందము జీవులది ॥ ఎట్టు ॥ 211

వరాళి

మహి నుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
౧ సహజివలె నుండేమీ సాధింపలేఁడు ॥ పల్లవి ॥

వెదకి తలఁచుకొంటే విష్ణుఁడు గానవచ్చు
చెదరి మఱచితే ౨ సృష్టి చీఁకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టి రావచ్చు
నిదిరించితేఁ గాలము నిమిషమై తోఁచు ॥ మహి ॥

వేడుకతోఁ జదివితే వేదశాస్త్రసంపన్నుఁడౌ
జాడతో నూరకుండితే జడుఁడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుఁడౌ
కూడక సోమరియైతే గుణహీనుఁ డౌను ॥ మహి ॥

మురహరుఁ గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెఱఁగకుండితే పికిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుఁడు రక్షించును
పరగ సంశయించితే ౩ పాషండుఁడౌను ॥ మహి ॥ 212

౧. సహజి = సహజమైనవాడు 'పుట్టినవాడు పుట్టినట్టే ఏపనీ లేనివాడు' అని భావము. ౨. 'శ్రష్టి' రేకు. ౩. 'పాషణ్ను' రేకు.

కేదారగౌళ

తనలో నుండినహరిఁ దాఁ గొలువఁ డీదేహి
యెనలేక శరణంటే నితఁడే రక్షించును ॥పల్లవి॥

కోరి ముదిమిమానుపుకొనేయాస మందులంటా
పూరకే చేఁదులుదిన నొడఁబడును
ఆరూఢి మంత్రసిద్ధుఁడనయ్యేననేయాసలను
ఘోరపుఁబాట్లకు గక్కున నొడఁబడును ॥తన॥

యిట్టె యక్షిణిఁ బంపు సేయించుకొనేయాసలను
వొట్టి జీవహింసలకు నొడఁబడును
దిట్టతనమునఁ దా నదృశ్యము సాధించేయాస
జట్టిగ భూతాలఁ బూజించఁగ నొడఁబడును ॥తన॥

చాపలపుసిరులకై శక్తిఁ గొలిచేయాసను
వోపి నిందలకునెల్లా నొడఁబడును
యేపున శ్రీవేంకటేశుఁ దేలి చేపట్టినదాఁకా
ఆఁపరానియాస నెందుకైనా నొడఁబడును ॥తన॥ 213

ధన్నాసి

దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే
సేవసేయకుండినా రక్షించ నీకు భారము ॥పల్లవి॥

ఆడివచ్చినబిడ్డని నపరాధిఁ జేసి తల్లి
వోడక యన్నము పెట్టకుండవచ్చునా
వేడుకకాఁడు చిల్కకు వింతమాటలెల్లా నేర్పి
ఆడినట్టే యాడితేను అదలించవచ్చునా ॥దేవ॥

౧చిక్కినావు తొడుకుమేసి వచ్చేనంటా గొల్లఁడు
దక్కక కావక పోఁదోలవచ్చునా
యెక్కేగుఱ్ఱము గోళిగ నెనసి పైకొంటే రౌతు
తక్కక దానిఁ జీకటితప్పు గొనవచ్చునా ॥ దేవ ॥

పతిఁ బెండ్లాడినయాలు పక్కనుండి నిద్రించితే
కొలికి కాలానుభాగి గొనవచ్చునా ?
తతి నేఁపటికి రాక తానుసుఁడై వుండినా
గతియై శ్రీవేంకటేశ కావకుండవచ్చునా ॥ దేవ ॥ 214

రామక్రియ

ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు సేసితి
తటుకన నీవనేనిధానము చేకొంటిని ॥ పల్లవి ॥

కామించితి నాత్మ నిన్నుఁ గలసి భోగించుటకు
వేమఱుఁ గ్రోధించితి నీవిరోధులపై
నేమమున ౨లోభించితి నీమంత్రమన్యుల కియ్య
ఆముకొని మోహించితి హరి నీరూపునకు ॥ ఇటు ॥

యెఱుకతో మదించితి యిట్టే నీదాస్యమున
మఱి నిన్నొల్లనిచదువు మచ్చరించితి
తఱిఁ జలపట్టితి నీతప్పనిభక్తియందు
వెఱవక నిన్నొల్లనివిధుల నిందించితి ॥ ఇటు ॥

కలకర్మములెల్లా నీకైంకర్యములందు వెట్టితి
బలుమమకారము నీపైఁ జేర్చితిఁ
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
నిలిచినకాలమెల్లా నీసేవే చేసితి ॥ ఇటు ॥ 215

౧. చిక్కిన+ఆవు. ౨. 'లోభించితివి మంత్ర' వ్రా.ము.ప్ర.

మాళవి

కలశాపురముకాడఁ గాచుకున్నాఁడు
వలసినవరాలిచ్చీ వాయునందనుఁడు ॥పల్లవి॥

మాయాబిలముచొచ్చి మగుడి యంబుధిలోని —
ఛాయాగ్రహముఁ జంపి చయ్యన దాఁటి
ఆయెడ లంకిణిఁ గొట్టి యింతలో జానకిఁగని
వాయువేగానవచ్చినవాయునందనుఁడు ॥కల॥

కదగిదరిసుండినకపులతోఁ గూడుకొని
పడిదీరఁగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతాపరిణామమెల్లాఁ జెప్పె
వడిగలవాఁ డితఁడు వాయునందనుఁడు ॥కల॥

రావణాదిరాక్షసుల రామునిచే సాధింపించి
ఆవిభుని సీతఁ గూర్చి అయోధ్య నుంచె
శ్రీవేంకటేశుఁ గొల్చి శిష్టరక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు ॥కల॥ 216

రేకు 148 బౌళిరామక్రియ

వసుధఁ జూడఁ జిన్నవానివలె నున్నాఁడు
వెస నన్నివిద్యలాను వెలసె విట్ఠలుఁడు ॥పల్లవి॥

పరగ నేడునూటడెబ్బదియేనుగరిచేత —
నిరవై పాడించుకొన్నాఁ డీవిట్ఠలుఁడు
సరస నైదులక్షలిండ్ల జవ్వనపుగొల్లెతల
మరిగించుకొన్నవాఁడు మఱి యీవిట్ఠలుఁడు ॥వసు॥

బత్తితోడ తనమీఁదపాటలు వాడితేను
యిత్తలమోమై తిరిగె నీవిఠ్ఠలుఁడు
హత్తి తన్నొల్లకపోఁగా నందరి మేడ[౧] దేవళ్ల
యెత్తి పాదాలందుఁ జూపె నితఁడే విఠ్ఠలుఁడు ॥వసు॥

గట్టిగాఁ బుండరీకుఁడు కడువేడుకఁ బెట్టిన —
యిట్టికపీఁటపై నున్నాఁ డీవిఠ్ఠలుఁడు
అట్టె తానే శ్రీవేంకటాద్రిఁ బాండురంగమున
యెట్టు గొల్చినా వరము లిచ్చీ విఠలుఁడు ॥వసు॥ 217

మాళవి

ఇతఁడు రాముని బంటు యితని కెవ్వ రెదురు
చతురత మెరసె నిచ్చట హనుమంతుఁడు ॥పల్లవి॥

ఆకాస(శ?)మంతయు నిండి యవ్వలికిఁ దోఁక చాఁచి
పైకొని పాతాళానఁ బాదాలు మోపి
కైకొని దశదిక్కులు కరములఁ గబళించి
సాకారము చూపినాఁ డిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁ॥

కొంచక సురలు రోమకూపముల విహరించ
ముంచి ధ్రువమండలము మొగమై యుండ
యెంచఁగ లోకములెల్లా యెడనెడ సందులుగా
చంచుల మెరసినాఁ డిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁ॥

గరిమ రవిచంద్రులు కర్ణకుండలములుగా
ధరణి మేనవు కటితటము గాఁగా
ఇరవుగ శ్రీవేంకటేశుని సేవకుఁడై
బెరసె నిచ్చట నిదె పెద్దహనుమంతుఁడు ॥ఇతఁ॥ 218

౧. 'మెడదేవళ్ల' మూ.తాపా, మేడదేవళ్ల=పెద్ద పెద్ద గోపురాలు, భవనాలు గలిగిన దేవళాలు కావచ్చు

పాడి

రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య-
　ధాముఁడు రణరంగభీముఁడు వాఁడె ॥ పల్లవి॥

వరుఁడు సీతకు ౧ఫలాధరుఁడు మహోగ్రపు-
　శరుఁడు రాక్షససంహారుఁడు వాఁడే
స్థిరుఁడు సర్వగుణాకరుఁడు కోదండదీక్షా
　గురుఁడు సేవకశుభకరుఁడు వాఁడే ॥ రాముఁ ॥

ధీరుఁడు లోకైకవీరుఁడు సకలా-
　ధారుఁడు భవబంధదూరుఁడు వాఁడే
శూరుఁడు ధర్మవిచారుఁడు రఘువంశ-
　సారుఁడు బ్రహ్మసాకారుఁడు వాఁడే ॥ రాముఁ॥

బలుఁడు యిన్నిటా రవికులుఁడు భావించ వి-
　ర్మలుఁడు నిశ్చలుఁ డవికలుఁడు వాఁడే
వెలసి శ్రీవేంకటాద్రి విజనగరములోన
　తలకొనెఁ బుణ్యపాదతలుఁడు వాఁడే ॥ రాముఁ ॥ 219

సాళంగనాట

శరణు శరణు విభీషణవరదా
　శరధిబంధన రామ సర్వగుణస్తోమ ॥ పల్లవి ॥

మారీచసుబాహుమదమర్దన తాటకాహర
　క్రూరేంద్రజిత్తులగుండుగండా
　దారుణకుంభకర్ణదనుజ౨శిరచ్ఛేదక
　వీరప్రతాపరామ విజయాభిరామ ॥ శర ॥

---

౧ ఫలాధరుఁడు = బింబఫలాధరుఁడు కాబోలు. ౨. 'శిరచ్ఛేదక' రేకు, శబ్దము అకారాంత పుంలింగము కలదు గదా. "విచకర్త శిరాన్ ద్రౌణేః అధః పాద-శమాన్" అని ప్రయోగము. దీనితో 'రజస్' శబ్దముకూడ అకారాంతమైనది.

వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక
లాలితవానరబల లంకాపహార
పాలితసవనాహల్యాపాపవిమోచక
పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ ॥ శర ॥

శంకరచాపభంజక జానకీమనోహర
పంకజాక్ష సాకేతపట్టణాధీశ
అంకితబిరుద శ్రీవేంకటాద్రినివాస
ఓంకారరూప రామ పురుసత్యకామ ॥ శర ॥ 220

రామక్రియ

శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
యేవిధానఁ దలఁచినా యిన్నిటికిఁ దగును ॥ పల్లవి ॥

కరిరాజుఁగాచినచక్రముపట్టినహస్తము
కరితుండమని చెప్పఁగా నమరును
వరములిచ్చేయట్టివరదహస్తము కల్ప-
తరుశాఖ యని పోల్పఁదగు నీకును ॥ శ్రీవేం ॥

జలధిఁబుట్టినపాంచజన్యహస్తము నీకు
జలధితరఁగయని చాటవచ్చును
బలుకాళింగునితోఁకపట్టినకటిహస్తము
పాఁపపై ఫణీంద్రుఁడని పొగడఁగఁదగును ॥ శ్రీవేం ॥

కలిసినహస్తంబుల నురమున నున్న నీయుర-
మలమేలుమంగ కిరవఁదగును
బలు శ్రీవేంకటగిరిపై నెలకొన్న నిన్ను-
నలరి శ్రీవేంకటేశుఁ డనఁదగును ॥ శ్రీవేం ॥ 221

దేసాళం

పంట పండుకొనేవారిభాగ్యము లిటమీఁద-
నంటిముట్టి వెదకితే నాతుము లోనున్నది ॥ పల్లవి ॥

వేదములలో మొలచె వేదాంతాలఁ గొనసాగె
గాదిలి శ్రీహరిభక్తికల్పలత
పోదియెక్కె వైరాగ్యబోధలచేఁ బలుమారు
పాదుకొని వేరువారె పంచసంస్కారాలను ॥ పంట ॥

అల్లుకొనె మునులలో నంటెనుఁ బురాణాల
చెల్లుబడి శాస్త్రాలఁ జిగిరించెను
చల్లఁగాఁ బూవులు పూచె సత్కర్మవిదులను
మెల్లనే పిందెలు నిండె మించి సుజ్ఞానమున ॥ పంట ॥

పరమయోగములఁ బూఁపలఁ బిందెలు పుట్టె
పరగె సురలనేపందిటియందు
యిరవై శ్రీవేంకటేశుఁ డిందుకు ఫలమైనాఁడు
గురుసేవలను దొరకును వివేకులకు ॥ పంట ॥ 222

149 శంకరాభరణం

మతంగపర్వతమాడ మాల్యవంతముపీద
అతిశయిల్లినపెద్దహనుమంతుఁ డితఁడా ॥ పల్లవి ॥

యీతఁడా రామునిబంటు యీతఁడా వాయుసుతుఁడు
ఆతతబలాఢ్యుఁ డందు రాతఁ డితఁడా
సీతనువెదకివచ్చిచెప్పినయాతఁ డితఁడా
ఘాతలలంకలోని రాక్షసవైరి యితఁడా ॥ మతం ॥

అంజనాసుతుఁ డితఁడా అక్షమర్దనుఁ డితఁడా
సంజీవనికొండ దెచ్చె సారె నితఁడా
భంజించెఁ గాలనేమిని పంతమున నితఁడా
రంజితప్రతాపకపిరాజసఖుఁ డితఁడా ॥ మతం ॥

చిరజీవి యీతఁడా జితేంద్రియు డితఁడా
సురల కుపకారపుచుట్ట మీతఁడా
నిరతి శ్రీవేంకటాద్రివి విజనగరములో -
నరిది వరములిచ్చీ నందరికి నితఁడా ॥ మతం ॥ 223

కాంబోది

ఏమని విన్నవింతు నిదివో నాభాగ్యము
కామించి మీశరణంటిఁ గమలారమణా ॥ పల్లవి॥

కలది యందరికైతేఁ గర్మఫలము
కెలన నాకైతే నీకృపాఫలము
అల సురలకు మథితామృతము
నెలకొన్న నా కైతే నీనామామృతము ॥ ఏమ ॥

సకలాత్మలబదుకు సంసారమూలము
ప్రకటించ నాకైతే నీపాదమూలము
వెకలిలోకులరతి వీధివీధిని నా-
త్రికరణరతి నీదివ్యభావవీధిని ॥ ఏమ ॥

రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు
సంగతి నాకు నీభక్తజనులయందు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
చెంగట నాధ్యానము నీశ్రీమూర్తియందు ॥ ఏమ ॥ 224

పాడి

పరసాధన మీతలఁపు
సహజజ్ఞానికి సత మీతలఁపు ॥ పల్లవి ॥

ఉఱుముంగిటను జిగిఁ దడఁబడఁగా
హరిని మఱవనిది యది దలఁపు
సరిఁ గాఁత లెదుట సందడిగొనఁగా
తిరమయి భ్రమయనిదే తలఁపు ॥ ఇహ ॥

కలి వయోమద ముప్పతిల్లినను
అడఁచి మెలఁగుట యది దలఁపు
కడఁగుచు సుఖదుఃఖములు ముంచినను
జడియని నామస్మరణమే తలఁపు ॥ ఇహ ॥

సంసారపుమాయ గప్పినను
అతికాంక్షఁ జొరని దది తలఁపు
గతియై శ్రీవేంకటపతి గాచిన
సతతము నితనిస్మరణమే తలఁపు ॥ ఇహ ॥ 225

శంకరాభరణం

అన్నవిభీషణుఁ గరుణఁ గాచినవాఁడు
పరికింపఁ దారకబ్రహ్మమీ యీరాముఁడు ॥ పల్లవి ॥

౧ విల్లువిఱిచి వాలికై యమ్ము వేసిన-
వాలుమగఁటిమిగలవాఁడా వీఁడు
కోలను జలధిగట్టి కేలను మోక్షమిచ్చి
మేలెను జటాయువును యీతఁడా రాముఁడు ॥ పర ॥

మింటికట్లు దెగనేసి యంటి పగసాధించి
దంటదాకుమారుఁడు తా నీఁడూరుఁడా
బంటుగా వాయుజు నేలి నంటు సుగ్రీవుతోఁ జేసి
కంటకరావణువైరి ఘనుఁడా యీరాముఁడు ॥ శర ॥

రాకాసుల మర్దించి కాకాసురు నటు గాచి
మైకొన్న జానకీరమణుఁ డితఁడా
యీకడ శ్రీవేంకటాద్రి నిరవై తాను న్నాఁడు
దీకొన్నప్రతాపపుఁదేవుఁడా యీరాముఁడు ॥ శర ॥ 226

సాళంగనాట

౧ మిన్నునేలా నొక్కటైనమేటితేరు
కన్నులపండువయినశ్రీకాంతునితేరు ॥ పల్లవి ॥

జలధులమీఁదను చక్కఁగా నేఁగెను తేరు
బలిమిఁ గులాద్రులపైఁ బారెను తేరు
పెలుచులంకముంగిట పేరెలువారెను తేరు
చెలఁగె దిగ్విజయపుశ్రీహరితేరు ॥ మిన్ను ॥

రమణఁ గుండిననగరము చుట్టుకొన్నతేరు
తిముఁచు రుకుమిణిఁ దెచ్చినతేరు
సమరములో జరాసంధునిఁ దోలినతేరు
అమరులవెనుబలమగుశౌరితేరు ॥ మిన్ను ॥

వొట్టి సృగాలవాసుదేవుని భంగించినతేరు
బెట్టుపౌండ్రకునిపై దాడివెట్టినతేరు
అట్టె శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
పట్టమేలుచు నెక్కిన పరమాత్ముతేరు ॥ మిన్ను ॥ 227

౧. చూ. ఇదే రాగములో కొంతపదబంధభేదము భావభేదము గలిగిన రేకుపాట సంఖ్య 118.

సాళంగనాట

సింగారాల మించీ నరసింహదేవుఁడు
చెంగట నున్నాఁడు నరసింహదేవుఁడు ॥ పల్లవి ॥

సురలు [1] జయ వెట్ట నసురలెల్ల మొఱవెట్ట
సిరితో మెలఁగీ నరసింహదేవుఁడు
ధరణి [2] దవంపెట్టఁ బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట
శిరసెత్తె నలి నరసింహదేవుఁడు ॥ సింగా ॥

కాంచనదైత్యుఁడు [3] దొరకాలువనెత్తురు వార
చించెను గోళ్ల నరసింహదేవుఁడు
పంచలఁ బంతాలు మీరి భవనాళియేరు వార
చెంచతలఁ గోరీ నరసింహదేవుఁడు ॥ సింగా ॥

బలిమి పై పై నెక్క ప్రహ్లాదుఁ డట్టె మొక్క
చెలికీఁ గరుణ నరసింహదేవుఁడు
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీఁద
చెలువమే చూపీ నరసింహదేవుఁడు ॥ సింగా ॥ 228

రేకు 150 నాట

[4] దానవారితోడిపగ ధరించరాదు మీకు
కానుకిచ్చి శరణని కప్పము లియ్యరో ॥ పల్లవి ॥

భ్రమసి వార్ధిఁబడ్డాను పాతాళము దూరినాను
సమయింపక మానఁడు శత్రులార
రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న
తమిఁ జంపక మానఁడు దైతేయులాల ॥ దాన ॥

---

౧ 'జయజయ' పూ ము పా. ౨. దంపెట్ట. ='ఓపెట్ట' = అరచుట కావచ్చు.
'జయపెట్టు' వలె 'ఓపెట్టు' అనునది నేటికిని వ్యవహారమున గలదు.
౩ 'దోర' కావచ్చు. దోర='ఎఱ్ఱనైన' కావచ్చు. ౪. ఇందు దశావతార
సమన్వయము గలదు.

రాసిమిన్నులో దాఁగిన రాచమూకలలోనున్న
కోసివేసీఁ దల లరికుమతులాల
ఆసఁ ద్రికూటమెక్కినా ఆచక్రవాళమంటినా
తోసి సాధించకపోఁడు దుర్మతులాల ॥ దాన ॥

సతుల మాఁటుననున్నా సరి నెందెందు వోయినా
రతి మెట్టక మానఁడు రాకాసులాల
యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులేదితనికి
గతియని మొక్కరో వోకపటులాల ॥ దాన ॥ 229

సాళంగం

భోగించఁ బుట్టినసొమ్ము పొంచి [1]పరానకేలోపు
శ్రీగురుఁడ నీవే దయనేతువుగాని ॥ పల్లవి ॥

యీరెండుచేతులే యిన్ని పాపాలకు నోపు
వూఁగకే పుణ్యము సేయనోపవుగాని
[2]మారుకొ నీరెండుఁగాళ్లే మాపుదాఁకాఁ జుట్టనోపు
యేరీతి దేవ నీగుడి కేఁగ నలసుఁ గాని ॥ భోగిం

కన్ను లివి రెండే మిన్నుగలంతాఁ జూడనోపు
ఉన్నతి నాసాగ్ర[3]దృష్టి కోపవుగాని
అన్నిటా రెండుపెదవు లధరామృతాన కోపు
సన్నల మోక్షముత్రోవ జపించవు గాని ॥ భోగిం ॥

యీవీనులురెండే విశ్వమంతా నాలించనోపు
వోవల శాస్త్రాలకైతే నోపవుగాని
శ్రీవేంకటేశ నీవే చిత్తాన జ్ఞానమిచ్చితే
భావించి జీవుఁడిన్నిటా బ్రదుకనోపుఁగాని ॥ భోగిం ॥ 230

---

౧. పరానకు+ఏల+ఓపు. ౨. 'మారుకొని రెండు గాళ్లె' వ్రా.ము.పా. 'మారుకొని+ఈ రెండు కాళ్లే'. రెండవ చరణము రెండవ పాదమున తప్ప అంతటా ఈ రెండు' 'ఇవి రెండు' అనియే వున్నది. ౩. 'ద్రిష్టి' రేకు.

ముఖారి

పరము నిహము ౧ పంటవండినయట్టు
యిరవుగాఁ దానే యెట్టయెదుట నున్నాఁడు ॥ పల్లవి ॥

ముంచినమహిమలెల్లా మూర్తివంతమైనట్టు
కొంచిననక్షరములు సాకారమైనట్టు
అంటె శృంగారరసాన తంగములు వచ్చినట్టు
యెంచఁగ శ్రీవేంకటేశు డెదుర నున్నాఁడు ॥ పర ॥

చెలఁగి ఆకాశానకు చైతన్యము వచ్చినట్టు
అల దయాసింధువు ప్రత్యక్షమైనట్టు
మొలచి సుజ్ఞానపు మోసులెత్తివుండినటు
యెలమి శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు ॥ పర ॥

పరగ నానందము ప్రతిబింబించినయట్టు
సురలభాగ్యము పొడచూపినట్టు
పురుషై యలమేల్మంగ నురమున నించుకొని
యిరవై శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు ॥ పర ॥ 231

భైరవి

పరమాత్ముఁడు సర్వపరిపూర్ణుఁడు
సురలకు నరులకు చోటయియున్నాఁడు ॥ పల్లవి ॥

కన్నులఁ గంటానే కడు మాటలాడుతానే
తన్నుఁగానివానివలె దాఁగియున్నాఁడు
అన్నియు వింటానే అట్టే వాసనగొంటానే
వన్నెలనూనెకుంచమువలె నున్నాఁడు ॥ పర ॥

---

౧. పంట + పండిన.

తనువులు మోచియు తలఁపులు దెలిసియు
యెనసియు నెనయక యిట్లున్నాఁడు
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు ॥ పర ॥

వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై
పూవులువాసనవలెఁ బొంచియున్నాఁడు
భావించనిరాకారమై పట్టితే సాకారమై
శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతై యున్నాఁడు ॥ పర ॥ 232

హిందోళవసంతం

మూఁడే మాటలు మూఁడుమూండ్లు తొమ్మిది
వేఁడుకొని చదువరో వేదాంతరహస్యము ॥ పల్లవి ॥

జీవస్వరూపము చింతించి యంతటాను
దేవుని వైభవము తెలిపి
భావించి ప్రకృతిసంపద యిది యెఱఁగుటే
వేవేలువిధముల వేదాంతరహస్యము ॥ మూఁడే ॥

తనలోనివిజ్ఞానము తప్పకుండాఁ దలపోసి
పనితోడ నందువల్ల భక్తి నిలిపి
మనికిగా వైరాగ్యము మఱవకుండుటే
వినవలసినయట్టివేదాంతరహస్యము ॥ మూఁడే ॥

వేడుకతో నాచార్యవిశ్వాసము గలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి దాసుఁడౌటే
పీడస్బ్రహ్మానంద వేదాంతరహస్యము ॥ మూఁడే ॥ 233

సామంతం

ట్లానే యోగలక్ష్య మెఱుఁగుకొంటే ఫలించు
యెట్లయినా గురువాక్య మేమరకుఁడీ ॥ పల్లవి ॥

ంతఁ దలచుకొంటేనే కామోద్రేకము పుట్టు
యింతలోఁ గూడెనా యేడకేడ సూత్రము
చింతకాయతొక్కు చూచితేనే నోరూరు
యెంతకెంతదవ్వు యేడకేడ సూత్రము ॥ ఇట్లా ॥

నుల మంచిమాటలు వింటేనే సంతోష ముబ్బు
యేవిజము గనె నేడకేడ సూత్రము
ఆనించితే నాలుకనే ఆరురుచులుఁ దెలిసీ
యీనెపమున నేడకేడ సూత్రము ॥ ఇట్లా ॥

ముక్కుకొనఁ బ్రాణ ముండి ముందువెనుకకు వచ్చి
యెక్కడ ం మోచున్న దేడ కేడ సూత్రము
చిక్కి శ్రీవేంకటేశుఁడు జీవుల కంతర్యామి
యిక్కు వెఱిఁగితే నీడ కిదే సూత్రము ॥ ఇట్లా ॥ 234

151 దేసాక్షి

) చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
)తముగ నితనికరణంబే సర్వఫలప్రద మింతరికి ॥ పల్లవి ॥

ఁ గొలువనికొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు
మల నచ్యుతు ఁనని కథలు భువి గజస్నానములు
మాత్మకుఁగానితపంబులు పాతాళములకుధనములు
)గురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు ॥ ఎంచి ॥

వైకుంఠమునుతియించనివినుతులు వననిధిఁ గురిసినవానలు
ఆకమలోదరుఁ గోరనికోరికె లందనిమానిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
దాకొని విష్ణునితెలియనితెలువులు తగ నేటినడిమిపైరులు ॥ఎంచి॥

ఆవిరిఁ గేశవునొల్లనిబదుకులు వరతఁ గలపుచింతపండు
గోవిందునికటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
భావించి మాధవుపైలేవితలఁపులు పలు[1] మేఘములవికారములు
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు ॥ఎంచి॥235

## గుజ్జరి

త్రికరణశుద్ధిగఁ జేసినపనులకు దేవుఁడు మెచ్చును లోకము మెచ్చును
వొకటి కోటిగుణితంబగుమార్గము లుండఁగఁ బ్రయాసపడనేలా ॥పల్లవి॥

తనమనసే పరిపూర్ణమైన[2] గోదావరి గంగా కావేరి
కనకబిందుయమునాగయాది[3] ముఖ్యక్షేత్రంబుల సంతతము
దినకరసోమగ్రహణకాలముల తీర్థాచరణలు సేసినఫలము
తనుఁదానే సిద్ధించును వూరకే దవ్వులు దిరుగఁగ మరి యేలా ॥త్రిక॥

హరి యనురెండక్షరములు నుడివిన నఖిలవేదములు మంత్రములు
గరిమ ధర్మశాస్త్రపురాణాదులు క్రమమునఁ జదివినపుణ్యములు
పరమతపోయోగంబులు మొదలగుబహుసాధనములసారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకఁగనేలా ॥త్రిక॥

మొదల శ్రీవేంకటపతికినిఁ జేయెత్తి మొక్కినమాత్రములోపలనే
పదిలపుషోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును
వదలక సాంగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా పలుమారు
మదిమదినుండే కాయక్లేశము మాఁటికి మాఁటికిఁ దనకేలా ॥త్రిక॥236

---

౧. ఈ 'వలు' వ్రా.ము. ప్రాలో తప్పిపోయినది. ఇదిలేకున్న యతిభంగము. ౨. రేకులో 'ర్ణ' కుబదులు ణ్ణైన అనియున్నది. ౩. వ్రా.ము. ప్రాలో 'ముఖ్య' తప్పిపోయినది. ఇది లేకున్నచో యతి భంగము.

### ముఖారి

ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు
ఆతనిబంట్లము మాకు నన్నిటా [౧] విశ్చింతము ॥ పల్లవి ॥

యేలికెగలబంటుకు యెక్కడిది విచారము
పాలించేమగఁడుగలపడఁతి కేడ చింత
కోలుముందై తండ్రిగలకొడుకు కేది తొడుసు
యీలీల హరిదాసుని కెక్కడికోరికెలు ॥ ఆతఁ ॥

బలుదుర్గమువానికి భయ మేమిటా లేదు
కలిమిగలవానికి కడమ లేదు
యిల క్షేత్రవంతునికి నెందూ [౨] దరిద్రము లేదు
అల శ్రీపతిబంట్లకు నణమట లేదు ॥ ఆతఁ ॥

పట్టినముద్రుంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయు సేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే ॥ ఆతఁ ॥ 237

### గుండక్రియ

మనసులో మర్మమై మరలఁ బొడచుచుండు
పొనఁగువడ్డమదము పోవఁగనీదు ॥ పల్లవి ॥

అంటేనే విషమెక్కు దష్టముగ విషలత
కంటేనే ఫలమెక్కుఁ గొంతలను
అంటిముట్టి కాఁగిట నలముకొంటేఁగనక
వుంటఁగలసిన భ్రమ మానలేదు ॥ మన ॥

---

౧. 'విశ్చింతయె' కావచ్చు. లేక 'మనసు' అధ్యాహారము కావచ్చు.
౨. 'దరిద్రము' ఇది భావప్రధాన నిర్దేశము కావచ్చు. లేక వ్యావహారిక ప్రయోగమైన కావచ్చు.

మెట్టితేనే కఱచును మెలుపుతోడుతఁ బాము
పట్టితే విడువనీదు పచ్చనిపైఁడి
దట్టమై మేన సొమ్ములు తగులుకొంటేఁగనక
తొట్టి వెల్లిఁబోయినాస తొలఁగనీదు ॥ మన ॥

ఆహారము వెట్టితేను అట్టె పిడుచు భూతము
ఆహారానకుఁ బోదెక్కు నట్టే ప్రాయము
యీహల శ్రీవేంకటేశుఁ డిట్టె కరుణించితేను
సాహాయమై వచ్చుఁ దానే సత్వగుణజ్ఞానము ॥ మన ॥ 238

## సాళంగనాట

దిక్కులు సాధించఁబూని దేవదుంధుభులు మ్రోయ
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డెక్కెఁ దేరు ॥ పల్లవి ॥

పన్నిద్దరుసూరియులబండికండ్లతేరు
సన్నుతి శేషాదిదేవాననపుఁదేరు
కన్నులపండుగై నగరుడధ్వజపుఁదేరు
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥ దిక్కు ॥

మించునానామేఘములమేలుకట్లతేరు
చుంచులనక్షత్రాలకుచ్చులతేరు
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టితేరు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥ దిక్కు ॥

అట్టె కిం దేడులోకములంతరువులైనతేరు
నట్టనడుమను బ్రహ్మాండపుతేరు
దిట్టయలమేల్మంగతోఁ దిరమై వుండేటితేరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥ దిక్కు ॥ 239

రేకు 152 శుద్ధవసంతం

మాయ కిదె సహజము మాయను గెలువరాదు
మాయానాథుఁ గొలిచితే మన్నించు నాతఁడే ॥ పల్లవి ॥

చేతికి లోనై నట్టుండు ౧ సృష్టిలోనివేడుకలు
పోతరించి పట్టఁబోతేఁబోవు నట్టటే
ఆతుమలో వేసరి అలసి వూరకుండితే
వైతాళపునీడవలె వచ్చు వెంటవెంటను ॥ మాయ ॥

తీపువలెనే వుండు దిష్టపుఁబదార్థాలు
మేపుగొంటే మీసాలమీఁదితేనౌను
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను
మూపునఁగట్టినచద్దై మోఁపించును ॥ మాయ ॥

తలఁపులోనే వుండు తనలోని యంతరాత్మ
తెలుపుకోఁబోతే పెక్కుదేవతలౌను
చలపట్టి యీతనినే శరణని కొలిచితే
యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడై రక్షించును ॥ మాయ ॥ 240

మంగళకౌశిక

దేవుఁ డొక్కఁడే గురితెలిసినవారికి
యీవలావల చూచినా నింత లేదు తెఱఁగు ॥ పల్లవి ॥

కోపము మానితేనే కోటిజపాలు సేయుట
పాపము సేయకుంటేనే బలుతపము
లోపల తా నూరకుంటే లోకమెల్లాఁ జరించుట
మాపుదాఁకా వెదకినా మఱి లేదు తెఱఁగు ॥ దేవు ॥

---

౧. 'శ్రిష్టి' రేకు.

పరకాంత నంటకుంటే బలుపుణ్యాలు సేయుట
సొరిది నాస మానుటే సోమపానము
సరి మోనాన నుండుటే సన్యాసము చేకొనుట
యిరవైతే నంతకంటె నిఁక లేదు తెలుఁగు ॥ దేవు ॥

పలుసుఖదుఃఖములఁ బాసివుండుటే మోక్షము
అల చంచలము మాను టది యోగము
యిలపై శ్రీవేంకటేశుఁ డిచ్చినసుజ్ఞాన మిది
యెలమి బుద్ధిఁ బోల నిఁక లేదు తెలుఁగు ॥ దేవు ॥ 241

సౌరాష్ట్రం

తలఁచుకో వోమనస తగినదృష్టము లివి
వెలలేక తెచ్చేటివివేకము లోధనము ॥ పల్లవి ॥

గాలిఁబోయేమాఁటలు లోకములోవిసుద్దులెల్లా
గాలిఁబో వెన్నఁడును శ్రీకాంతునుతులు
జాలిఁబడేచేఁతలు సంసారభోగములెల్లా
జాలిలేనివి విష్ణువిసంతతపుపూజలు ॥ తలఁ ॥

మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా
మాయముగానివి దైవికమహిమలెల్లా
కాయకములే తమకల్పితము లన్నియును
కాయకము గాక విల్చుఁ గమలాక్షుమన్నన ॥ తలఁ ॥

పుడివోవు రాఁగారాఁగా నున్నతకర్మఫలాలు
పుడివోదు దేవునిపై నొనరుభక్తి
జడియు నితరులిచ్చేసకలవరములును
జడియదు శ్రీవేంకటేశ్వరుఁడిచ్చేవరము ॥ తలఁ ॥ 242

### సాళంగనాట

అహోబలేశ్వరునకు నాదిమూర్తికి
విహారమే పంతము వీరసింహమునకు ॥ పల్లవి ॥

చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు
దిక్కులు చేతు లెఁడలు దివ్యాయుధాలు
మిక్కుటపువేదములు మించుఁగొసవెంట్రుకలు
రక్కసులఁ జెండేవిదారణసింహమునకు ॥ అహో ॥

శైలములే పాదములు జానువులే లోకములు
కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు
చాలుకొన్న మేఘములు సకలదివ్యాంబరాలు
పాలించేప్రతాపపుసింహమునకు ॥ అహో ॥

అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుఁదు
వంతఁ గృపారసము వార్ధులెల్లాను
యింతటా శ్రీవేంకటాద్రి యిరవు మహాగుహ
రంతు లురుములు ఘోరరౌద్రసింహమునకు ॥ అహో ॥ 243

### పాడి

ఈరూపమై వున్నాఁడు యీతఁడే పరబ్రహ్మము
శ్రీరమాదేవితోడ శ్రీవేంకటేశుఁడు ॥ పల్లవి ॥

పొదలి మాయాదేవిపట్టినసముద్రము
అదె పంచభూతాలుండే[౧] అశ్వత్థము
గుదిగొన్నబ్రహ్మాండాలగుడ్లఁ బెట్టేహంస
సదరపుబ్రహ్మలకు జలజమూలకందము ॥ ఈరూ ॥

౧. ‘అశ్వత్థము’ రేకు.

అనంతవేదాలుండేటిఅక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము
కనలు దానవమత్తగజసంహారసింహము
మొనసి సంసారభారము దాల్చేవృషభము ॥ ఈరూ ॥

సతతము జీవులకు చైతన్యసూత్రము
అతిశయభక్తులజ్ఞానామృతము
వ్రతమై శ్రీవేంకటాద్రి వరములచింతామణి
తతిగొన్న మోక్షపుతత్త్వరహస్యము ॥ ఈరూ ॥ 244

నాట

విఱిగి పారెడియట్టివీరిడియోరిపులాల
తఱి శరణుచొరరో దరిడాలువెట్టరో ॥ పల్లవి ॥

వీఁడె వచ్చెఁ గృష్ణుఁ డిదె వేయరో కైదువులు
కాఁగినపోట్లు రాఁగీ కదియకురో
పోఁడిమితో భీతివాయ పూరి నోళ్లఁ గరవరో
ఆఁడువార మనుకోరో అతఁడు దయవఁడు ॥ విఱి ॥

గోవిందుఁడు దాడివచ్చె గునుకుచుఁ బారరో
కావు మని మెడలఁ బాగలువేయరో
౧వేవేగ బిడ్డలఁ బేర్లు విభునికిఁ బెట్టరో
వో వో యెంగిలికిఁ జేతు లొగ్గరో రక్షించీని ॥ విఱి ॥

మొత్తీ శ్రీవేంకటేశుఁడు మూలలకు దాఁగరో
వొత్తిలి పంతములిచ్చి మీ రోడఁగదరో
హత్తి మీతలలు విరియఁగఁ బోసుకొనరో
బొత్తుగా మిమ్ము గెలిచెఁ బొగడరో మెచ్చీని ॥ విఱి ॥ 245

౧. ఈపాదము వున్నదున్నట్లుగా సమన్వయ మగుటలేదు, 'బిడ్డలకుఁ బేర్లు విభునివి పెట్టరో' అనిన బాగుండునేమో. తమ్ముగెలిచినవానిపేర్లు తమబిడ్డలకు పెట్టుట పరాజితలక్షణములలో నొక్కటి. లేక "బిడ్డలపేర్లువిభునికి = ప్రభువునకు సంబంధించినదిగా పెటరో" అని కావచ్చు. అప్పుడు "బిడ్డలఁ" లో అరసున్న చింత్యము కావచ్చు.

రేకు 153 నాట

పొరి నీకును విఱిగిపోయినదానవులు
బిరుదులుడిగి వోడబేహారులైరి ॥పల్లవి॥

మకుటాలు దీసి జటామకుటాలు గట్టుకొని
వెకలిరిపులు మునివేషులైరి
మొకములను సోమపుమొకములు వెట్టుకొని
అకటా కొందరురిపు లాటవారైరి. ॥పొరి॥

పేరులు విడిచి సంకుఁబేరులు మెడ వేసుక
సారెకుఁ గొందరు శివసత్తులైరి
బీరపుసాములు మాని పెద్దగడసాము నేర్చి
తోరపుఁబగతులెల్ల దొమ్మరులైరి. ॥పొరి॥

నాదించ వెఱచి సింగినాదా లూదుకొంటాను
సోదించేరటాఁ గొందరు జోగులైరి
యీడెన శ్రీవేంకటేశ యిన్నియు మాని కొందరు
౧ దాదాత నీశరణని దాసరులైరి. ॥పొరి॥ 246

కాంబోది

ఐనట్టయ్యీఁగాక హరికల్పితము లివి
మానేటి వేఁటివో మానని వేవో ॥పల్లవి॥

వొక్కరు తలఁచినట్టు వొకరితలఁపు రాదు
పక్కన నందరికి బహుభావాలు
అక్కట మొద లొకటి ౨ అనలుఁగొనలు వేరు
యెక్కడని తగిలేది యేమిసేసేది. ॥ఐన॥

---

౧. 'దాదాతని శరణని దాసరులైరి' పూ.ము.పా.

౨. 'వనలుఁగొనలు' అనుట సహజము. ఇక్కడ 'అనలు' యతి స్థానము గూడ.

పొరుగువానిచేఁత ఆపొరుగువాఁడు మెచ్చఁడు
నరులకర్మములు నానావిధాలు
గరిమ నన్ను మొక్కఁచే కడుపుతనివి వేరు
కరుణించౌనన నేవి కావన నేవి. ॥ఐన॥

కడఁగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు
బెడఁగుజీవులపొందు పెక్కురీతులు
కడుశ్రీవేంకటేశుఁ డొక్కఁడు జగత్తులు వేరు
వాడిఁగట్టుకొనే దేది వొల్లననే దేది ॥ఐన॥ 247

నాట

వింటె విన్నిచోటులను నీమహిమలే
అండనే మొక్కేము నీకు నాదినారసింహా ॥పల్లవి॥

కూరిమి యిందిరమీఁద, కోపము అసురమీఁద
తారుకాణనవ్వు దేవతలమీఁదను
ఆరీతి నీకొలు విట్టె అహోబలముమీఁద
నారుకొనె నీనేరుపు నారసింహా ॥వింటె॥

కరుణ ప్రహ్లాదుమీఁద, గన్నులు దిక్కుల మీఁద
సరిచేతులు పేగులజంద్యాలమీఁద
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద
తిరమాయ నీకోరిక దివ్యనారసింహా ॥వింటె॥

శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద
కాంతులెల్లా తనదివ్యకాయముమీఁద
చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీఁద
సంతతమై నీకుఁ జెల్లె జయనారసింహా ॥వింటె॥ 248

సాళంగనాట

అన్నిటా నీపెంపు వింత హనుమంత నీ-
వున్నచోటు నిశ్చింత మోహనుమంతా. ॥ పల్లవి ॥

రామునిసేనలఁ గాచి రావణుగర్వ మడఁచి
ఆముకొన్న బలవంత హనుమంతా
గోమున జలధి దాఁటి కొండతో సంజీవి దెచ్చి
ధీమంతుఁడవైతి వింత దివ్యహనుమంత ॥ అన్ని ॥

చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోఁచె
అక్కజపునీరూ పంత హనుమంత
చొక్కమై మీ రుండఁగాను సుగ్రీవాదులకెల్లా
అక్కర లేదించుకంతా హనుమంతా ॥ అన్ని ॥

జంగచాఁచి చేయెత్తి సరిఁ బిడికిలించుక
రంగము విక్కించి తెంత హనుమంత
రంగగుశ్రీవేంకటాద్రిరామునిదేవి కిచ్చితి-
వంగులియ్యక మొక్కంత హనుమంతా ॥ అన్ని ॥ 249

రామక్రియ

మగటిమిగలహనుమంతరాయ
౧దిగువపట్టణములోనిదేవ హనుమంత ॥ పల్లవి ॥

చక్కఁగాఁ దోఁక చాఁచి జంగవెట్టి చేచాఁచి
అక్కజపుప్రతాపపుహనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రామునిదేవులకు
దిక్కై వుంగరమిచ్చినదేవ హనుమంత ॥ మగ ॥

౧. దిగువపట్టణము దిగువతిరుపతియా?

కీలు[1] గంటు వేసుకొని కెరలి పిడికిలించి
అలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండఁ బెరిగి యసురి
తీలుపడఁగొట్టినట్టిదేవ హనుమంతుఁడా ॥ మగ ॥

తమితోడ దాసులను తప్పక కాచేనని
అమర నభయమిచ్చినహనుమంతుఁడా
జమళి శ్రీవేంకటేశునరసపూడిగానకు
తిమురుచు నుండేయట్టిదేవ[2] హనుమంతా ॥ మగ ॥ 250

శ్రీరాగం

ఏమి చెప్పే దిది యీశ్వరమాయలు
దీము ప్రతిమకును త్రిజగము గలిగె ॥ పల్లవి ॥

మలమూత్రంబులమాంసపుముద్దకు
కులగోత్రంబులగుతి గలిగె
తొలులుతొమ్మిదగుతోలుఁది త్తికిని
పిలువఁగఁ బేరునుఁ బెంపునుఁ గలిగె ॥ ఏమి ॥

నెత్తురునెమ్ములనీరుబుగ్గకును
హత్తినకర్మము లటు గలిగె
కొత్తవెంట్రుకలగుబురులగంతికి
పొత్తులసంసారభోగము గలిగె ॥ ఏమి ॥

నానాముఖములనరములపిడుచకు
పూనినసిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీవేంకటాధిపుఁ డేలఁగ
దీనికిఁ బ్రాణము తిరముగఁ గలిగె ॥ ఏమి ॥ 251

---

౧. పూ.ము.పా. లో 'కీలుగంటుగంటు' అని ఒక 'గంటు' శబ్దము ఎక్కువగా నున్నది. ౨. 'హనుమంతుఁడా' పూ.ము.పా.

రేకు 154 బౌళి

పురుషుండని శృతి వొగడీనట ఆపురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి నివి వింటే నసంబద్ధములు ॥ పల్లవి ॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట అమూరితి అవయవరహితుఁడట
తగుబాహువులను రాజులట ఆతత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆబ్రహ్మముదేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతనిరూపము లేదట ॥ పురు ॥

తనవందనమును గలదట దైవము తనుఁ జూడఁ గన్నులు లేవట
తనవిన్నపమునుఁ జేయునట ఆతనికిని వీనులు లేవట
తనయిచ్చినదే నైవేద్యంబట దైవమునోరే లేదట
తనయిచ్చేటిధూపంబును గలదట దైవముముక్కును లేదట ॥ పురు ॥

అంతాఁ దానే దైవమటా యజ్ఞము లొరులకుఁ జేయుటట
సంతతమునుఁ దా స్వతంత్రుఁడటా జపములవరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపుశ్రీవేంకటపతిమాయలు పచారించిన విధియట ॥ పురు ॥ 252

శంకరాభరణం

ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల ॥ పల్లవి ॥

పాప మొక్కఁడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున నొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁడొక్కఁడైతే సురలిందరుఁ గావలదా ॥ ఏకా ॥

ఒకఁ డపవిత్రుఁ డై తే నొగి నిందరుఁ గావలదా
ఒకఁడు శుచై వుండితే వోద కిందరుఁ గావలదా
ఒకనిరతిసుఖ మంటి యిందరును నొనరఁ బొందవలదా
ఒకనిదుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా ॥ఏకా॥

ఆకడ నొకఁడు ముక్తుఁడయితే నందరునుఁ గావలదా
దీకొని యొకఁడు ౧బంధుఁ డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి-
లోకపుమునులనుఁ దెలుసుకోవలదా ॥ఏకా॥ 253

శంకరాభరణం

దేవుఁడుగలవారికి దిగులుఁ జింతయు లేదు
శ్రీవిభుఁడే యన్నిటా రక్షించుఁగనక ॥పల్లవి॥

యేలికగలబంటుకు యేవిచారములేదు
వోలి మగఁడుగలాలికి వొప్పమి లేదు
పోషిమిఁ దండ్రిగలపుత్రుని కంగద లేదు
మేలుగాఁ బండినభూమికిఁ గరవు లేదు ॥దేవు॥

బలముగలరాజుకు భయమేమియు లేదు
కలిమిగలవాని కక్కుర లేదు
యిల నాచారవంతుని కేపాపమును లేదు
తలఁపుఁబుణ్యముగలఅతనికిఁ జేటు లేదు ॥దేవు॥

గురువుగలవానికిఁ గొఱఁత యేమియు లేదు
పరముగలవానికి భ్రాంతులు లేవు
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు
అరయ దాసులము మా కడ్డాఁకే లేదు ॥దేవు॥ 254

---

౧. 'బద్ధుఁడయితే' అనుట సబబేమో? లేక బద్ధార్థములోనే 'బంధు' శబ్దమా?

కేదారగౌళ

౧కమలారమణ నీకల్పితపుమానిసిని
తమితోడ నాదిక్కు దయఁ జూడవే ॥ పల్లవి ॥

ఆరీతి బ్రాహ్మణుఁడ ననుటేకాని దేహము
కోరి యాచారమునకుఁ గొలుపదు
పేరు వైష్ణవుఁడననేపెద్దరికమే కాని
సారమైనమనసులో జ్ఞానమే లేదు ॥ కమ ॥

చదివితినవియెడి౧చలపాద మింతే కాని
అదన నందులోనిఅర్థ మెఱఁగ
పదరి సంసారమనే బహురూపమే కాని
చతురుఁడనాన నందు సమర్థుఁడఁ గాను. ॥ కమ ॥

దేవ మీభక్తుఁడననేతేజ మొకటె కాని
చేవమీర నినుఁ బూజించ నేరను
శ్రీవేంకటేశ నీచేతిలోనివాఁడ నేను
భావించి మఱి యేపాపము నెఱఁగను. ॥ కమ ॥ 255

కాంబోది

ఇన్నాళ్లు నందునందు నేమి గంటివి
అన్నిటా శరణు చొచ్చి హరి నినుఁ గంటివి ॥ పల్లవి ॥

అంగనలపసఁ జిక్కి అలయికలే కంటి
బంగారువెంటఁ దగిలి భ్రమ గంటివి
ముంగిటిక్షేత్రాలంటి ముంచి వెట్టిసేయఁ గంటి
అంగపునన్నే చూచి అంతరాత్మఁ గంటి ॥ ఇన్నా ॥

౧. 'కమలారమణుని' పూ. ము పా.

చుట్టాలఁ జేరి చూచి సుద్దులవావులు గంటి
మట్టులేనివయసుతో మదము గంటి
వట్టికామములు సేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణాయని భక్తి నిన్నుఁ గంటిని ॥ఇన్నా॥

వింతచదువులవల్ల వేవేలుమతాలు గంటి
సంతకర్మములవల్ల సాము గంటిని
యింతట శ్రీవేంకటేశ యిటు నాజీవభావము
చింతించి అందులోన నీశ్రీపాదాలు గంటి. ॥ఇన్నా॥ 256

రేకు 155 సామంతం

సొరిది మమ్మిట్టే దయఁజూతువుగాకా
వెరసి మరి యెక్కడా నేమి విన్నవించే మిఁకను ॥పల్లవి॥

తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు
కలసితి నీదాసులగమిలోనను
చలివాసె భవములు సడిదీరెఁ గర్మములు
యెలమి నీమహిమలు యేమిచెప్పే మిఁకను ॥సొరి॥

నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి
చేముట్టి పూజించితి శ్రీయంగాలు
తామసములెల్లా నూడె తతివచ్చె సాత్వికము
గోమున మరేమి విన్న కొసరే మిఁకను. ॥సొరి॥

తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి
విరివైన నీకథలు వీనుల వింటి
పరగ శ్రీవేంకటేశ పరమము నిహముఁ గంటి
అరసి యితర మేమి ఆశపడే మిఁకను. ॥సొరి॥ 257

వరాళి

శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు
పైపై నీశరణమే పరమపదంబు. ॥ పల్లవి ॥

పరమాత్మునిపై నాత్మప్రవేశింపఁజేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము
గరిమ నాహృదయాకాశమునఁ దలఁచుటే
గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము ॥ శ్రీప ॥

మంచిపరమహంసనామము ప్రాణులచే వింట
చంచులవినేటిదూరశ్రవణము
కొంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట
యెంచఁగ దూరగమన మింటిలో నౌట ॥ శ్రీప ॥

సావధానమె లోచూపు సర్వథా నిన్నుఁ జూచుట
తావులనే అనిమిషత్వము చేరుట
శ్రీవేంకటేశ్వర నీసేవకుఁడై నిలుచుటే
వేవేలుతత్వజ్ఞానవిధుల నిలుచుట ॥ శ్రీప ॥ 258

దేసాళం

అంతరంగములో నున్నహరియే గతిగాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును ॥ పల్లవి ॥

పుట్టించినకర్మమే పోషించకుండునట
బెట్టుగా మనసే మఱపించునట
పట్టైనమేనే ఆసల బతిమాలింపించునట
చుట్టములెవ్వరు యెంచిచూచినఁ బ్రాణికిని ॥ అంత ॥

పక్కన విత్తినభూమి పంట పండకుండునట
యెక్కడా మాయే భ్రమయింపించునట
అక్కరతోఁ జేసినపుణ్యమే కట్టివేసునట
దిక్కు దెస యెవ్వరు యీదేహిఁ గరుణించను ॥ అంత ॥

ఆసలఁబెట్టేపాయమే అటమటమౌనట
సేనేసంసారమే జ్ఞానిఁ జేయునట
వేసరక యింతకూ శ్రీవేంకటేశుఁ డేలికట
మోసపుచ్చేవారెవ్వరు ముదమే జీవునికి ॥ అంత ॥ 259

దేసాళం

ధరణి నెంద రెన్నితపములు చేసినాను
హరికృపగలవాఁడే అన్నిటాఁ బూజ్యుఁడు ॥ పల్లవి ॥

మితిలేనివిత్తు లెన్ని మేదినిపైఁ జల్లినాను
తతితో విత్తినవే తగఁ బండును
యితరకాంతలు మఱి యెందరు గలిగినాను
పతి మన్నించినదే పట్టపుదేవులు ॥ ధర ॥

పాలుపడి నరు లెన్నిపాట్లఁ బడి కొలిచినా-
నేలికె చేపట్టినవాఁడే యెక్కుడుబంటు
మూల నెంతధనమున్నా ముంచి దానధర్మములు
తాలిమితో నిచ్చినదే దాఁపురమై నిల్చును ॥ ధర ॥

యెన్ని కెకుఁ గొడుకులు యెందరు గలిగినాను
యిన్నిటా ధర్మపరుఁడే యీడేరును
వున్నతిఁ జదువు లెన్ని వుండినా శ్రీవేంకటేశు
సన్నుతించినమంత్రమే సతమై ఫలించును ॥ ధర ॥ 260

దేవగాంధారి

అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్ని నమాయలో వారు బయలు వాఁకేరు ॥ పల్లవి ॥

ప్రకృతిబోనులలోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాలసంధిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు ॥ అన్ని ॥

కామువియేట్ల దిగఁగా రేటిదేహాలు
దోమటితమబదుకే దొడ్డదనేరు
పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తల మనేరు ॥ అన్ని ॥

యితరలోకాలనెదియేఁతపుమెట్లప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలమేల్మంగపతిశ్రీవేంకటేశ్వర
మతకాననున్నవారు మారుమలసేరు ॥ అన్ని ॥ 261

దేసాక్షి

ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా
వింతలైననీమూర్తి వెసఁ దెలిసేమా ॥ పల్లవి ॥

లోకములో సముద్రములోఁతు చెప్పఁగరాదట
ఆకాశ మింతంతని యవరాదట
మేకొని ధూరేణువులు మితి వెట్టఁగరాదట
శ్రీకాంతుఁడ నీమహామ చెప్పిచూపవశమా ॥ ఎంత ॥

అల గాలి దెచ్చి ముడియగాఁ గట్టఁగరాదట
వెలయఁ గాలము గంటువేయరాదట
కలయ నలుదిక్కులకడ గానఁగరాదట
జలజాక్ష నీరూపు తలపోయఁగలనా ॥ఎంత॥

కేవలమైననీమాయ గెలువనేరాదట
భావించి మనసుఁ జిక్కఁబట్టరాదట
దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కొల్వవశమా ॥ఎంత॥ 282

రేకు 156 శంకరాభరణం

నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను
యేచి నీవు రక్షించేదే యెక్కుడుపుణ్య మింతే ॥పల్లవి॥

పాటించి నీభావము పట్టవశమా తలఁచి
మేటినామనసు నీకు మీఁదెత్తు టింతే
నూటికైన నీనామము నుడుగఁగవశమా
మాటలు నీసెలవుగా నుట్టుపెట్టు టింతే ॥నీచి॥

వేవేలైననీకథలు వినఁగ నాతరమా
సోవగా వీనులు తావు చూపుట యింతే
దేవ నీసాకారము ద్రిష్టించనావశమా
పావనముగా వందులోఁ బవిగొను టింతే ॥నీచి॥

గట్టిగా నిన్నుఁ బూజించఁ గమ్మటి నావసమా
నెట్టన నామేను నీకు నేమించు టింతే
పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
జట్టిగొనుకొరకు నీశరణను టింతే ॥నీచి॥ 283

గౌళ

నమ్మవలెఁగాని యెన్నఁడు సందేహము లేక
యిమ్ముల దేవుఁడు కరమిచ్చు నేమరుదు ॥ పల్లవి ॥

మగనిపై బత్తిసేసి మంచిలోకా లెక్కేరట
౧ తగుదండకోల వట్టి తత్త్వగతి గనేరట
పగటున నొకవేరు వట్టి పాముఁ బట్టేరట
తగిలి హరిదాసులు ధన్యు లౌ టేమరుదు ॥ నమ్మ ॥

యేలికెకు ధనమిచ్చి హితభోగా లందేరట
కేలఁ గత్తివూని పగ గెల్చేరట
గాలి లోలోఁ బూరించి ఘనసిద్ధు లయ్యేరట
యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు ॥ నమ్మ ॥

దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యేరట
మొక్కి విప్రుల నర్చించి మంచి సిరు లందేరట
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరుఁ
జక్కనఁ గొల్చినదాసులు జ్ఞాను లౌ టేమరుదు ॥ నమ్మ ॥ 264

ముఖారి

నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి
యీకడ లాలించితే మే మిటు నిన్నుఁ గొలుతుము ॥ పల్లవి ॥

మాటలకు లోఁగాని బ్రహ్మమనంటా దాఁచి దాఁచి
మాటాడకుండేవుసుమ్మీ మాతో నీవు
నీటున మనసులో నిలుపరానివాఁడనంటా
పాటించి మాకుఁ బొడచూపకుండే గతి యేది ॥ నీకే ॥

౧. 'తగుదండ కోలవట్టి' పూ.ము.పా.

శ్రుతులకుఁ బట్టరానిచోద్యపుబ్రహ్మమనంటా
మతకానఁ జిక్కక మానేవుసుమ్మీ
పతివి నీ౧ గంభీరము బయటఁబడీ నంటా
౨ అతిగోప్యాన వి న్నది యెట్టైతేఁగేము ॥ నీకే ॥

మాయవన్నుకొనినవుమ్మడిబ్రహ్మమనంటా
యేయెడనైనా భ్రమయించేవుసుమ్మీ
పాయపుటలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ ॥ నీకే ॥ 265

[౩] దేసాక్షి

కోటానఁగోట్లాయ కోరికెలు జన్మములు
కూటువ గూడి రాట్నపుగుండ్ర లైనారయ్యా ॥ పల్లవి ॥

మిన్నుపైనున్నజీవులు మన్నుపైఁ బ్రవేశించి
అన్నద్వారమున దేహము మోఁచి
మున్నిటిదానఫలా లిమ్మల భుజించి యప్పటి
తిన్ననికర్మములు గాదెలఁ బో సేరయ్యా ॥ కోటా ॥

యిరవు మఱచి మఱి యెరవులకాఁపిరేల
సురలు నరులమంటాఁ జొక్కిచొక్కి
సొరిది లోకములెల్లాఁ జొచ్చి కాలగతులను
పొరి నాయుష్యము గొల్చిపోయుచున్నారయ్యా ॥ కోటా ॥

దండగాఁగఁ దిరుమలకొండ యెక్కి సుజ్ఞానులు
పండినమనసుతోడ బత్తిసేసి
అండనే శ్రీవేంకటేశు నలమేల్మంగనుఁ గొల్చి
విందువిధానములై విల్చినారయ్యా ॥ కోటా ॥ 266

౧. 'గంభీరము' బావ ప్రధాన నిర్దేశము కావచ్చు. ౨. 'అతిగోప్యాన నున్న దన్న' అని 'వున్న' పదమును అధ్యాహారము చేసికొనవలె కాబోలు.
౩. 'దేసాళం' పూ.ము.పా.

భూపాళం

మొదలనే యెచ్చరికెతో మోసపోక యేపొద్దూ
వెదకి హరికథలే వినుచుండవలయు ॥పల్లవి॥

వెలఁదులసుద్దులు వీనులను వింటేను
పెలుచుఁజూపులఁ జూడఁ బ్రేమ వుట్టించు
మలసి యాచూపులు మనసునఁ దగిలించు
తలఁపు మాటలాడఁ దమిరేఁచును ॥మొద॥

మగువలతోడుత మాటలాడదొరకొంటే
నగినగి సంసారాలనంటు గల్పించు
తగిలిననవ్వులు తనువులు సోఁకింపించు
మిగులాఁ దనుసోఁకులే మించి వలపించును ॥మొద॥

సతులతో మోహము సంపదలు పోరించు
అతిసంపదలు దేహి నజ్ఞానిఁ జేయు
తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడే
గతియని కొలిచితే ఘనునిఁగాఁ జేయును ॥మొద॥ 267

ముఖారి

ఇందువల్ల నేమిగద్దు యినుపగుగ్గిళ్లింతే
యిందిరారమణు సేవే యిరవైనపదవి ॥పల్లవి॥

సతులతో నవ్వులు చందమామగుటుకలు
మతితలపోఁత లెండమావులనీళ్లు
రతులలో మాటలు రావిమానిపువ్వులు
తతి విరహపుకాఁక తాటిమానినీడ ॥ఇందు॥

లలనలజవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని నేసేబత్తి నీటిపై వ్రాఁత
చెలువపువినయాలు చేమకూరశైత్యాలు
కొలఁదిలేనినసువు గోడమీఁదిసున్నము ॥ ఇందు ॥

పడఁతులవేడుకలు పచ్చివడఁగండ్లగుళ్లు
కడుమోవితీపు చింతకాయకజ్జము
ఐడి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరుఁ-
డదరించినమాయలు అద్దములోనీడలు ॥ ఇందు ॥ 268

రేకు 157 బౌళి

సత్యముసేయఁగవచ్చును సర్వేశ్వర యీమాటకు
నిత్యము నీవే యెఱుఁగుదు నేనేమీ నెఱఁగఁజుమీ ॥ పల్లవి ॥

సులభుఁడవౌదువు వొకమరి చూడఁగ దుర్లభుఁడవౌదువు
తలఁపింతువు మఱపింతువు తగఁ బ్రాణములోనుండి
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు
వెలయఁగ నీవే వెలిగా వేరొకటి నేఁ జేయఁజుమీ ॥ సత్య ॥

వొనరఁగఁ బూజలు గొందువు వొక్కొకపరి మానుదు వటు
కను మూయింతువు నిదురలఁ గడు మేల్కొలుపుదువు
ఘనముగ అజ్ఞానిఁ జేతువు కరుణతో జ్ఞానిఁ జేతువు
నను బుట్టించితి నీవే నా కాపని గాదుసుమీ ॥ సత్య ॥

వేంకటగిరి నుందువు
యుదేరింతువు
వు భువి నీదాసునిఁ జేతువు
కపటము నే నేరఁజుమీ ॥ సత్య ॥ 269

రామక్రియ

వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ల
ధీరతతో నేది మేలో తెలుసుకోరో ॥ పల్లవి ॥

అట్టే కొందరు మతము లన్నియు నేకమని
పట్టవర్ధనము నెత్తి బెట్టి చూపిరి
ఇట్టె గొందరు జీవులు జంగమే లింగముగాని-
పుట్టుగెల్లా భస్మమని పూసుక చూపిరి ॥ వారి ॥

కొందరేమియును లేదు కొట్టగొన లయమని
అంది వట్టిలలాటశూన్యము చూపిరి
కందువ గొందరు లక్ష్మీకాంతు డంతరాత్మయని
ముందే నామము శ్రీచూర్ణమును బెట్టి చూపిరి ॥ వారి ॥

చెలగి దిష్ట మిపుడు శ్రీవేంకటేశుడు
[1] అలమేలుమంగపతి యై యున్నవాడు
[2] యిలవీర నీదాసుల కిట్టిభాగ్యరేఖలు
వలసినవారికెల్లా వ్రాసినా డితడు ॥ వారి ॥ 270

లలిత

విచార మెన్నడు లేదు వీగిడిజీవులకును
పచారించేరు బదుకు బహ్మనాటనుండియు ॥ పల్లవి ॥

పొద్దువొడచుటయును పొరిగ గూగుటయె కాని
అద్దుకొని మిగుల నందేమి లేదు
వొద్దిక బుట్టుటయును వుడుగ జూచుటె కాని
కొద్దితోడ గాలమేమి గురియై నిలువదు ॥ విచా ॥

౧. 'అలమేలుమంగపతి...రేఖలు' వరకు గల భావము అంత సుగ్రహముగ లేదు.

౨. 'అలమేలు....వాడు' వరకుగల భాగమును 'కలవారు యిలలోవీరు' అని వూ.ము.పా పరిష్కర్తల భావముగా తోచుచున్నది. 'కలవారు' అనునది అధ్యాహార్యము. 'యిలవీరని' విభజించి చూపినారు. 'అలమేలు ..వాడు' వరకు గల భాగము 'కలవారు యిలవీర=, 'వీరే నీదాసులు' అని అన్వయముగా తోచుచున్నది. 'నీ దాసులకు' విభక్తి అతుకుట లేదు. కాని 'యిల వీర అని' 'అని' పదము గూడ అధ్యాహరించుకొన్నచో అర్థము సుగ్రహము సంగతము అగునని తోచుచున్నది.

అన్నము భుజించేదియు నాఁకలి గొనేదె కాని
యెన్నికకుఁ జెప్పిచూప నేదియు లేదు
ఇన్నిటఁ దిరిగాడేది ఇంటికి వచ్చేదే కాని
పన్ని తననిలుకడ భావించ లేదు ॥ విచా ॥

జవ్వనము మోఁచేదియు సర ముదుసేదే కాని
తవ్వి కట్టుకొనే దేది దాఁచే దేది
నవ్వుతా నలమేల్మంగనాయక శ్రీవేంకటేశ
రవ్వల నీ వేలికవు రక్షించు మిఁకను ॥ విచా ॥ 271

శంకరాభరణం

౧ ఇంతకంటే నేమిసేసే మిదే మా మానసపూజ
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుఁడవు ॥ పల్లవి ॥

అంతర్యామివైనమీకు నావాహన మదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపుఁగోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలముచల్లేమీకుఁ బాద్యము ॥ ఇంత ॥

జలధు లన్నియును నాచమనియ్యము మీకు
అల యా వరుణజల మిదియే స్నానము
పలనుగా మీమహిమలే వస్త్రాభరణములు
ఆల వేదములే మీకు యజ్ఞోపవీతములు ॥ ఇంత ॥

ఇరవుగఁ గుజ్జ తొల్లిచ్చినదే మీకు గంధము
ధర మాలాకారునిపూదండలే మీకు పువ్వులు
ఉరుగతి మౌనులహోమమే మీకు ధూపము
తిరమైనమీకు రవితేజమే దీపము ॥ ఇంత ॥

౧. పాటలో పంచదశోపచారములే కలవు. 'నీరాజనము' తప్పిపోయినది.

నానామృతములే మీకు నైవేద్యతాంబూలములు
పూనినభక్తి షోడశోపచారములు
అనుత శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తానకపుజపములే తగ మీకు నుతులు ॥ఇంత॥ 272

శ్రీరాగం

రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ ॥పల్లవి॥

దశరథతనూజాయ ౧తాటకదమనాయ
కుశికసంభవయజ్ఞగోపనాయ
పశుపతిమహాధనుర్భంజనాయ నమో
విశదభార్గవరామవిజయకరణాయ ॥రాజీ॥

భరితధర్మాయ శూర్పణఖాంగహరణాయ
ఖరదూషణాదిరిపుఖండనాయ
౨తరణిసంభవసైన్యరక్షకాయ నమో
నిరుపమమహావారినిధిబంధనాయ ॥రాజీ॥

హతరావణాయ ౩సంయమినాథవరదాయ
అతులితాయోధ్యాపురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో
వితతవావిలిపాటివీరరామాయ ॥రాజీ॥ 273

లలిత

భోగము నేను నీకు, భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును ॥పల్లవి॥

౧. సంస్కృతకీర్తనలో 'తాటక' అను తత్సమపదము వింత. 'తాటకా' కావచ్చు.
౨. 'తర...కాయ=సుగ్రీవసైన్యాధిపత్యము? ౩. 'సంయ్యమి' లేదు.

చక్కనిజన్మపుసంసారవృక్షమునకు
పక్కన(వ?)ఫలము నీవు [illegible]
మక్కువఁ గర్మమనేటిమత్తగజమునకును
యెక్కినమావటీఁడవు యెంచఁగ నీవు ॥భోగ॥

నెట్టన దేహమనేటి [illegible]ర్మ[illegible]రాజ్యమునకు
పట్టమేలుచుండినభూపతివి నీవే
దిట్టయైనచిత్తమనేటి తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు ॥భోగ॥

సంతతమైనభక్తిచంద్రోదయమునకు
రంతులఁ జెలఁగుసముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనేమేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁ జూచినను ॥భోగ॥ 274

రేకు 158 సాళంగనాట

కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసురవరద జయపరిపూర్ణరామ ॥పల్లవి॥

మునుప దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి ॥కౌస॥

సుప్పనాతి శిక్షించి సొరిది ఋషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి
కప్పి హనుమంతు బంటుఁగా నేలుకొంటివి ॥కౌస॥

౧. తేజిగుఱ్ఱము='ఉత్తమాశ్వము' కావచ్చు. లేకున్న పునరుక్తి

సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి
చెలఁగితి వయోధ్యలో శ్రీవేంకటేశుఁడా ॥కౌస॥ 275

గౌళ

గట్టిగాఁ దెలుసుకొం-టే కన్నదే కంటి ౧గురుమ (తు?)
దట్టమై సుజ్ఞానము తనలోనే వున్నది ॥పల్లవి॥

బయలే పంటలు వండె బయలే పాఁడి విదికె
బయలు ప్రపంచమై భ్రమయించెను
బయటనే ప్రకృతియు బయటనే జీవులు
బయటనే బ్రహ్మము పరిపూర్ణమాయె ॥గట్టి॥

ఆకసము చూలాయ నాకసము రూపులాయ-
నాకసము సంసారమై యలవడెను
ఆకసాన దివియును నాకసాన లోకములు
ఆకసాన శ్రీహరి యవతారమందెను ॥గట్టి॥

అంతరంగమే భోగము అంతరంగమే యోగము
అంతరంగమే అన్నిటి కావాసమయ్యె
అంతరంగాన శ్రీవేంకటాధిపుఁ డున్నవాఁడు
అంతరంగాన మోక్షము అతఁడే యొసఁగెను ॥గట్టి॥ 276

గౌళ

ఆతురబంధుగుఁడవు హరినారాయణ కృష్ణ
మాతలఁ పెఱిఁగి నీవే మన్నించితి విపుడు ॥పల్లవి॥

---

౧. 'గురుమ' ఈ వాఙ్మయమున చాలచోట్ల కలదు. 'పెద్దరికము' 'తేజము' ఇత్యాదిగ అర్థములు కావచ్చు. చూ. సంపు. 25. పీఠిక పేజీ 12.

గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు
ధరలో గజరాజు నుద్ధరించినట్లు
గరిమఁ జెరలుమాన్పి కాంతలఁ బెండ్లాడినట్లు
సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి ॥ ఆతు ॥

నేరుపుననే రుకుమిణిదేవిఁ దెచ్చినయట్లు
ధీరత మునిపుత్రులఁ దెచ్చినయట్లు
భారమైనయహల్యశాపము మానిపినయట్లు
గారవించి మము నేఁడు కరుణఁ జూచితివి ॥ ఆతు ॥

లంక సాధించి సీతను లలిఁ జేకొనినయట్లు
తెంకికి ననిరుద్ధునిఁ దెచ్చినయట్లు
అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని
పొంకముగ మాపాలిటఁ బొసఁగి యేలితివి ॥ ఆతు ॥ 277

శంకరాభరణం

వేదములు నుతించఁగ వేడుకలు దైవారఁగ
ఆదరించీ దాసుల మోహననారసింహుఁడు ॥ పల్లవి ॥

నెఱులజడలతోడ నిక్కఁగర్ణములతోడ
కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ
వుఱక సిరిఁ దొడపై నుంచుక సింహాసనాన
మెఱసీఁ బ్రతాపములు మేటినారసింహుఁడు ॥ వేద ॥

విడుపమీసాలతోడ విట్టూరుపులతోడ
మిడిగుడ్లతోఁ దెల్లవిమేనితోడ
వొడలసొమ్ములు వెట్టి వొడ్డోలగమై వుండి
కడు మంచివరాలిచ్చీ ఘననారసింహుఁడు ॥ వేద ॥

చిలుకుగోళ్లతోడ వెలవినవ్వులతోడ
బలు[1] జిహ్వాతోడ యోగపట్టెముతోడ
అలరి శ్రీవేంకటాద్రి నహోబలగిరిని
అల [2]ప్రహ్లాదుని గాచె నాదినారసింహుఁడు ॥ వేద ॥ 278

## శ్రీరాగం

సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు
శుకయోగివంద్యునిసుజ్ఞాన మెంత ॥ పల్లవి ॥

మరునితండ్రికిని మఱి చక్కఁదనమెంత
సిరిమగనిభాగ్యము చెప్ప నెంత
పురుషోత్తముఘనత పొగడఁగ వీఁక నెంత
గరిమ జలధిశాయి [3]గంభీర మెంత ॥ సక ॥

వేవేలుముఖాలవానివిగ్రహము చెప్ప నెంత
భూవల్లభునివోరుపు పోలించ నెంత
వావిరి బ్రహ్మతండ్రికి వర్ణింప రాజస మెంత
యేవల్లఁ జక్రాయుధుని కెదురెంచ నెంత ॥ సక ॥

అమితవరదునికి ఔదార్యగుణ మెంత
విమతాసురవైరివిక్రమ మెంత
మమతల నలమేలుమంగపతిసొబ గెంత
అమర శ్రీవేంకటేశుఆధిక్య మెంత ॥ సక ॥ 279

## సామంతం

కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీమహిమలే పరబ్రహ్మము ॥ పల్లవి ॥

---

౧. 'జింహ్వ' రేకు. ౨. 'ప్రంహ్లాదు' అని రేకు.
౩. 'గాంభీర్య' కావచ్చు. లేదా ధర్మప్రధాన నిర్దేశము కావచ్చు.

ఆకాశమువంటిమేన నమరెమూర్తివిగాన
ఆకాశనదియే నీకు నభిషేకము
మేకాని నీవే నిండుమేఘవర్ణుఁడవుగాన
నీకు ౧ మేఘపుష్పాలే పన్నీరుకాపు ॥ కోటి ॥

చంద్రుఁడు నీమనసులో జనించె నటుగాన
చంద్రికలు కప్రకాపై సరి నిండెను
ఇంద్రనీలపుగనుల యిలధరఁడవుగాన
తంద్రలేవియీపెచూపే తట్టుపునుఁగాయను ॥ కోటి ॥

లక్ష్మిపతివిగాన లాగుల నీవురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీతాళి
సూక్ష్మమై శ్రీవేంకటేశ చుక్కలపొడవు గాఁగ
పక్ష్మనక్షత్రములే యాభరణహారములు ॥ కోటి ॥ 280

రేకు 159 పాడి

చంచలపడఁగవద్దు సారె సారెఁ గోరవద్దు
పొంచుకున్నదైవమే బుద్ధులు నేర్పీని ॥ పల్లవి ॥

లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁడిదే
నాకు నభయములిచ్చి నన్నుఁ గాచును
శ్రీకాంతుఁ డీతఁడే నాచిత్తములో మలసీని
దాకొని శుభములెల్లాఁ దానే వొసఁగును ॥ చంచ ॥

పరమపురుషుఁడు నాప్రాణనాథుఁడై నాఁడు
పరగ నాపాలివాఁడై బ్రదికించును
ధరణీశుఁ డీతఁడే నాదాపుదండై కడఁగీని
విరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు ॥ చంచ ॥

---

౧. 'మేఘపుష్పాలే' పూ.ము.పా.

శ్రీవేంకటేశుఁడు నాజిహ్వఁ దగిలి వున్నాఁడు
పావనునిఁ జేసి నాకు ఫల మిచ్చును
గోవిందుఁ డీస్వామి నన్నుఁ గొలిపించుకొన్నవాఁడు
యీవలనావల నాకు నిహపరా లిచ్చును ॥ చంచ ॥ 281

రామక్రియ

నెట్టన శ్రీసతిమగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైనదేవునికి శరణు ॥ పల్లవి ॥

చెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై వుండేయాతనికి శరణు
తెలివై మఱపై దేహాలలో సూత్రమై
వలనై రక్షించేయట్టివానికి శరణు ॥ నెట్ట ॥

చక్కఁగా వేదములకు సకలశాస్త్రములకు
నెక్కొని గురువైనవానికి శరణు
దిక్కుదెసయి స్వతంత్రుఁడయి తేరినఆదిమూలమై
అక్కజపుమహిమలయాతనికి శరణు ॥ నెట్ట ॥

యిరవుగఁ గరుణించి యిహపరాలొసగేటి-
విరతిశ్రీవేంకటేశునికి శరణు
గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము-
లెరవులేకయిచ్చేటియాతనికి శరణు ॥ నెట్ట ॥ 282

మాళవి

[౧] పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా
పురుఁడు లే దింక నీకుఁ బురుషోత్తమా ॥ పల్లవి ॥

---

౧. ఇందు దశావతార సమన్వయము గలదు.

పొలసులాడకు నీవు పురుషోత్తమా
బలిసి లోఁగఁగనేల పురుషోత్తమా
పొలమురాజవు నీవు పురుషోత్తమా నీ౧
పొలఁకు వదే కంబమునఁ బురుషోత్తమా ॥ పురు ॥

పొదవులకుఁ బొడవైన పురుషోత్తమా విరుదు
పుడిసిళ్లఁ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిఁగైకొంటి పురుషోత్తమా
పొడమెఁ జీఁకటితప్పు పురుషోత్తమా ॥ పురు ॥

బూటకపుబుద్ధిగలపురుషోత్తమా
పోటి౨గుఱ్ఱపుఁబసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటముమీఁద నొసఁగే విదివో
పూటవూఁటవరాలు పురుషోత్తమా ॥ పురు ॥ 283

సామంతం

అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్నినమాయలో వారు బయలువాఁకేరు ॥ పల్లవి ॥

ప్రకృతిబోనులలోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాలసందిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు ॥ అన్ని ॥

కామునియేట్ల దిగఁగారేటిదేహులు
దోమటితమబదుకే దొడ్డదనేరు
పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తలమనేరు ॥ అన్ని ॥

౧. ఈ పాదములో ఈ 'నీ' పూ.ము.పా. తొలగినది.
౨. 'గుఱువుఁ' రేకు, పూ.ము.పా.

ఇతరలోకాలనెడియేఁతపుమెట్లప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వర
మతకాన నున్నవారు మారు మలసేరు ॥ అన్ని ॥ 284

వరాళి

౧ ఏఁటిజాణతనమే యేమే నీవు
కోటియైనా యాఁటది కక్కూఁరితికిఁ జొచ్చునా ॥ పల్లవి ॥

వరుసకువచ్చి యావనిత గాచుకుండఁగా
యెరవులసన్నఁ బతినేల పిల్చేవే
తెరమఱుఁగున నొక్కతను మీఁదెత్తినమోవి
యిరవుగ నీకది యెంగిలిగాదా ॥ ఏటి ॥

పొందైనయాపె యింటిలో బోనము పెట్టుకుండఁగా
విందు నీవేల చెప్పేవే విభునికిని
అందాకె మనసుపెట్టినటువంటికాఁగిలి—
కిందటనే ౨ వాఁడి మిగిలినదిగాకా ॥ ఏటి ॥

సేసవెట్టినమగువ చెఱఁగువట్టుకుండఁగా
ఆసతో నీవెట్టు గూడి యలరితివే
యీసరినే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వోసరించితే బువ్వము పూరఁబొత్తుగాదా ॥ ఏటి ॥ 285

ముఖారి

౩ ఇంతిజవ్వనవనాన నిన్నియు నెలకొనెను
వంతులవాసులతోడ వలరాచపౌఁజులు ॥ పల్లవి ॥

---

౧, ౨. ఇందరసున్నచింత్యము. ౩. ఇవి శృంగారసంకీర్తనలలో నుండదగినది.

కుటిలాలు మాని సరిఁ గూచున్నవి చూడవే
సతియురముమీఁదట చక్రవాకాలు
గతిగూడ గుంపుగట్టి కాఁపురము సేసీ నవే
మితిమీరి శిరసుపై మేఁటితుమ్మెదలు ॥ ఇంతి ॥

కలికిపానాలతోడఁ గడుమించీఁగదవే
జలజాక్షి మోముననే చకోరములు
పలుకులలో సినే పాడికొనె నివు డిట్టె
చెలరేఁగి మోవిమీఁద చిలుకముత్తములు ॥ ఇంతి ॥

తగుశ్రీవేంకటేశ్వరుదండ నిల్చిఁ జూడవే
మగువనడపులనేమంచిహంసలు
మిగుల రతివేళను మెరసీఁ దా మిన్నిటాను
పగటుఁగుత్తికలోన పావురములు ॥ ఇంతి ॥ 286

రేకు 160 భైరవి

ఎవ్వరినేర్పులు జెప్ప విందు నేది
రవ్వ సేయక జీవుల రక్షించవయ్యా ॥ పల్లవి ॥

తలపోసి తలపోసి ధ్యానము సేతురు విన్న
యెలమి నింతని నిశ్చయించపలేరు
పలుమారు నీగుణాలు పైకొవి నుతింతురు
కొలఁదిపెట్టుచు మీగుఱుతు లెంచలేరు ॥ ఎవ్వ ॥

పొదిగి పొదిగి విన్నుఁ బూజలెల్లాఁ జేతురు
యెదుట నీశ్రీమూర్తి యెఱఁగలేరు
వెదకి వెదకి సారె విందురు నీకతలెల్లా
పదిలపునీభక్తి పట్టఁగలేరు ॥ ఎవ్వ ॥

నిక్కి నిక్కి చేతులెత్తి నీకు మొక్కుదురుగాని
మక్కువ నీమహిమ నమ్మఁగలేరు
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నీకరుణచేత
తక్కక నిన్ను సేవించి తనియలేరు ॥ ఎవ్వ ॥ 287

### మాళవిగౌళ

ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁ డింతే
పన్ని యీతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము ॥ పల్లవి ॥

మనసునఁబుట్టినమంకుఁగామక్రోధాలు
పనిలేవు తనకంటేఁ బాప మంటదు
పవివి తొడమ నూడి పండు తీఁగె నంటదు
జనులకెల్లాఁ బ్రకృతిసహజ మింతే ॥ ఇన్ని ॥

చేతులారఁ జేసేటిచేకొన్నకర్మానకు
ఘాతలఁ గర్తఁ గానంటే కట్టువడఁడు
ఆతల నబక ముంచినట్టివేఁడి చెయ్యంటదు
జాతి[1] దేహమునోఁచినసహజ మింతే ॥ ఇన్ని ॥

వాకుననాడినయట్టివట్టిపల్లదాలనెల్లా
దాకొని పొరయనంటే తప్పులే లేవు
పైకొని శ్రీవేంకటేశుబంటుకు వళకు లేదు
సైకమైనహరిభక్తిసహజ మింతే ॥ ఇన్ని ॥ 288

### సాళంగనాట

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద ॥ పల్లవి ॥

---

౧. 'దేహము' రేకు.

మిహిరశశినయన మృగనరవేష
బహిరంతస్థలపరిపూర్ణ
అహినాయకసింహాసనరాజిత
బహుళగుణగణ ప్రహ్లాదవరద ॥ జయ ॥

చటులపరాక్రమ సమఘనవిరహిత
నిటలనేత్ర మౌనిప్రణుత
కుటిలదైత్యతతికుక్షివిదారణ
పటువజ్రనఖ ప్రహ్లాదవరద ॥ జయ ॥

శ్రీవనితాసంశ్రితవామాంక
భావజకోటిప్రతిమాన
శ్రీవేంకటగిరిశిఖరనివాస
పావన¹చరిత ప్రహ్లాదవరద ॥ జయ ॥ 289

సామంతం

²ఎంత నలచితివయ్యా యింతికి
చెంతనుండే రేఁతనవ్వే నేసపాలుగావా ॥ పల్లవి ॥

చెలి నీపైఁ జిగురాకు చిదిమివేసితేను
వలరాజడిదమని వంచించితివి
వెలయఁగ విరహపువేళ వాఁడెక్కుఁగాక
మెలుపునఁ గదిసితే మెత్తనేకాదా ॥ ఎంత ॥

వనరుహాక్షి పువ్వాడి ప్రేమ నీపైఁ జల్లితేను
వసంతువిచొక్కుమచు వసివాడేవు
పెసఁ దెరమరఁగైతే వేగమే నామెక్కుఁగాక
రసికత నొద్దనుంటే రజమేకాదా ॥ ఎంత ॥

౧. 'చెరిత' రేకు. ౨ ఇది శృంగార కీర్తనలలో నుండదగినది.

అలమేలుమంగ సురటట్టె నీపై విసరితే
మలయానిలు వేఁడంటా మాటువెట్టేవు
తలఁచి శ్రీవేంకటేశ దవ్వైతే వేఁడెక్కఁగాక
చలపట్టి కూడితివి చల్లనేకాదా ॥ ఎంత ॥ 290

## శ్రీరాగం

౧ ఎంత లేదు నీబత్తి యెరఁగరా యిందరును
దొంతిఁబెట్టేవు౨ పత్రియాలు దొరకుదాఁకాను ॥ పల్లవి ॥

పొరుగాపెపైవలపు పూసేవు నామీఁద
వరుసల వద్ది కాపె వచ్చుదాఁకాను
సరుస నావంక నీవు చక్కఁ జూచే వప్పటిని
అరసి యవ్వలిపొందు అదనౌదాఁకాను ॥ ఎంత ॥

కడవారిపొందు నాతోఁ గసి వుచ్చుకొనే విట్టే
అడరి వారితో మాఁట లాడుదాఁకాను
నడుమ నవ్వులెల్లాను నవ్వేవు యీవేళను
వుడివోనియట్టికాఁగి లొనరుదాఁకాను ॥ ఎంత ॥

పోరచిపనితమారు పొందగేవు నన్ను విట్టే
చేరి యాపె నిన్నుఁగూడి చెలఁగువాఁకా
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోరికె లన్నియునుఁ జేకూరుదాఁకాను ॥ ఎంత ॥ 291

## శుద్ధవసంతం

౩ ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు
జవళి నెంచిచూచితే సరిబేసివంటివి ॥ పల్లవి ॥

౧. ఇదీ శృంగారకీర్తనే. ౨. 'పత్రియాలు' పూ.ము.పా. రేకు. ౩. ఇదీ శృంగారకీర్తనే

అంగనలచూపులు అరతులవంటివి
కుంగక నీవు కొలువై కూచున్న వేళ
చెంగట లేఁతనవ్వులు సేసపాలవంటివి
కొంగులువట్టుచు నీవు కొసరేటివేళ ॥ ఇవి ॥

కాంతలపలుకులెల్లా కప్పురాలవంటివి
అంతలో నీవు సరసాలాడేటివేళ
బంతిమోవులయీవులు పాలకూళ్లవంటివి
మంతనాన నుండి నీవు మన్నించేవేళను ॥ ఇవి ॥

వెలఁదులకాఁగిళ్లు విడిదిండ్లవంటివి
చలములఁ నీరతులు సలిపేవేళ
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తలఁపులవంటి వన్నీ తమకపువేళను ॥ ఇవి ॥ 292

రేకు 161 లలిత

[౧] ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన నెఱఁగనీదు
అట్టె మాగురునానుమతినే ప్రత్యక్షమవై తివిగాని ॥ పల్లవి ॥

కరుణాకరా మిమ్మునుఁ గవి తెలియఁగలేను
ధర మీమహిమలు వినివిని తగ నరుదందుదును
నరహరి నీవు నాలో నుండఁగ నమ్మక పురాణకథలందు
అరయఁగ మీచరితలు చెప్పఁగ నాపతోడ మిముఁ దలంతును॥ ఎట్టి ॥

జగదీశా మీనామంబులు జపించనలయుదును
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదకుదు వింతటను
నగధర మీపై భక్తి సేయఁగ మనంబున నొగఁబడను
పగటున మీరిచ్చువరములకొరకే పలుమారు మీకు
మొక్కుకొందును ॥ ఎట్టి ॥

౧. శక్తునిభక్తిలో ప్రథమవోపానము.

శ్రీవేంకటేశా నీమూరితి చింతించి చేపట్టఁగలేను
దేవుఁడ వనియెడువిశ్వాసమునకే తిరముగఁ గొలిచెదను
శ్రీవనితాధిప వేదాలు మిమ్మునుఁ జెప్పఁగా నే తర్కింపుదును
వేవేలుపరుషలు సేవింపఁగ నీవే కర్తవని నిశ్చయింతును ॥ఎట్టి॥ 293

లలిత

అతని నడుగవో చిత్రగుప్త నాయందలియోగాము లన్నియును
అతఁడే మీ కుత్తరము చెప్పెడివి యన్నిటికిని మముఁ దడవకుమీ
॥ పల్లవి ॥

కరచరణాదులు నాకుఁ గల్పించినయతఁడే
గరిమల నావుభయకర్మసంఘములకుఁ దాఁ గర్తా
సరుగఁ బ్రాణము ౧లోనఁగి చైతన్య మతఁడే
పరగఁగ నాయపరాధంబులు పరిహరించఁ గర్తా ॥ అత ॥

రమణతో నన్నుఁ బుట్టించి రక్షించేయతఁడే
అమరఁగ నన్ను వహించుక నావశకంతయుఁ దీర్చఁగఁ దాఁ గర్తా
ప్రమదమున నాయంతరాత్మయైపొదుకొన్నయతఁడే
మమతల మీలోకము చొరకుండా మాఁటలాడుకొనఁ దానే కర్తా ॥అత॥

యెప్పుడుఁ బాయక దాసునిఁగా నేలుకొన్నయతఁడే
తప్పక యిహముఁబరమునిచ్చి వారులు దడవకుండఁ జేయఁగఁ
గర్తా
చెప్పఁగ నాపాలిదేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే
అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నటు మముఁ గావఁగఁ
దానే కర్త ॥ అత ॥ 294

లలిత

అవధారు వరాకు సేయకు మపరాధముగా నెంచకు
వివరింపఁగ నీవే గతి విష్ణుఁడ మన్నించఁగదే ॥ పల్లవి ॥

---

౧. 'లొసంగిన' కావచ్చు.

నాకునాకే నీసన్నిధానము గల్పించుకొని
చేకొని విన్నపములెల్లాఁ జేయుచున్నాఁడను
కాకుసేసి నన్ను నీఁ డెంత గట్టువాయయనక
శ్రీకాంతా నీ[1] వింతట నుండవు చిత్తగించి వినవే ॥ అవ ॥

చూచిచూచి నీమూరితి నాసొమ్ముగఁ జేసుకొని
చేచేత నాలో ధ్యానముసేయుచునున్నాఁడను
కాచుకొని వీనికి నాకూఁ [2]గారణమేమనక
యేచోటా నీరూపమే హరి యెదలో నుండఁగదే ॥ అవ ॥

కోరికోరి నేనూరక నీకొలువుగడించుకొని
చేరి నీవూడిగములు సేయుచునున్నాఁడను
యీరీతులు శ్రీవేంకటేశ్వర యివి యేఁటిసలిగెలనక
నారాయణ సర్వేశ్వరుఁడవు నన్ను నేలఁగదవే ॥ అవ ॥ 295

లలిత

ఎట్టు నియ్యఁగలవాఁడవో యిఁక నీచేతివి నావునికి
నెట్టన నీదాసుఁడనైతిని నీచిత్తం బిఁకను ॥ పల్లవి ॥

సారెకుఁ గొలువునేతు చనవులు నీ విత్తువోయనుచు
నేరకున్నాఁ బాడుదును నీవు మెత్తువనుచు
వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలంతువోయనుచు
చేరి వాకిలిగాచుకుండుదు చిత్తమురావలెననుచు ॥ ఎట్టు ॥

కమ్మటి విచ్చకములు నెరపుదు కైవసముగావలెననుచు
వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగమోడుదువనుచు
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరములెంచక కాతువని
నమ్మి విన్ను నేఁ బూజింతు నను నీ వీడేరింతువని ॥ ఎట్టు ॥

---

1. 'అంతట' కావచ్చు. 2. కారణము=సంబంధము కావచ్చు. వ్యావహారికము.

ఆసతో నిను భావింతు అన్నిట నన్నేలుదువనుచు
వేసరక నీమంత్రము నుడుగుదు వేగమే వర మొసఁగుదువనుచు
దాసికి నెక్కఁగ శ్రీవేంకటేశా రక్షించితి విప్పుడు నన్ను
వాసితోడ నే నిన్నుఁ దగులుదును వదలక నాపాలఁ గలవనుచు
॥ ఎట్టు ॥ 296

రేకు 162 గౌళ

ఇటులైతేఁ బుణ్యము నీకు యిది వుపకారంబౌను
తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును ॥ పల్లవి ॥

సురాసురగంధర్వయక్షులు మిమ్ముఁ దెలియఁగలేరు
పరాశరాదులు మీరూపు భావించఁగలేరు
నరు లెరుఁగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుఁడవై
కరీంద్రుఁ గాచినయటువలెఁ గాతువుగాక ॥ ఇటు ॥

సనాతనబహువేదశాస్త్రంబులు మిము నుతింపలేవు
అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించఁగలేవు
తనూధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను
వినోదముగఁ గాచినయటువలె నెసఁ గాతువుగాక ॥ ఇటు ॥

రమాసతి ౧ నీళామహిరాములు మీతలఁ పెఱుంగరు
సమేతులైన శేషాదులు మీజాడ మీరలేరు
తమోమయు లిందరును ధరణీధర శ్రీవేంకటేశ
నమోనమో యని మొక్కఁగాఁ ననుఁ గాతువుగాక ॥ ఇటు ॥ 297

సామంతం

సరిగాఁడు వీఁడన వలదు జగమున రాజు ౨ వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట ॥ పల్లవి

౧ 'నీలా', వ్రా. ము. పా. ౨ 'వలచినది' కావచ్చు.

జగదేకబంధుఁడవట సకలజీవులకును, గుఱుతుగ
మొగముచూపవయ్యా మీకు మొక్కెద నిదె నేను
తగులైనచుట్టరికము దాఁచఁగ నీకనేలా
తెగరానిమమకారము తెలుపఁగవలెఁగాక ॥ సరి ॥

యితవైనప్రాణమవట యీచరాచరములకు, అభయము
సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను
మతిఁ బాయనికూటంబులు మానుప మరి యాలా
జతనంబునఁ జాలాఁబ్రియములు జరపఁగవలెఁగాని ॥ సరి ॥

నెలవైనయేలికెవట నీదాసులకెల్లా, వేళలు
దెలియఁజెప్పవయ్యా మిమ్మును తిరముగఁ గొలిచెదను
బలువయిన[౧] శ్రీవేంకటేశ పరాకు లిఁకనేలా
చెలరేఁగి నీసులభత్వమే చెలిం[illegible]లెఁగాని ॥ సరి ॥ 298

ఎదురుమాటలాడితి నీకు [illegible] గొను నీవు
పదరఁగఁదగదు నీకు పంతములిచ్చితిఁ గావఁగదే ॥ పల్లవి ॥

మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనకవేసుకో శరణు చొచ్చితిని విడువకు నన్ననుచు
ననుఁజూచి 'దేహి' యంటే 'నాస్తి' యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడుదాతవు నీవు ॥ ఎదు ॥

వెదకి నిను వేఁడుకొంటివి విచ్చేసితివి మాయింటికి
వదలఁదగదు నీభక్తి యొసఁగు నీవాఁడను పాయకుమనుచు
పదిలంబుగ మొక్కినచేతులు బలిమిఁ గోయరాదు
యిదివో బంటను నేను యేలినవాఁడవు నీవు ॥ ఎదు ॥

---

౧. 'బలువయ్యిన' రేకు.

మరిగి నీముద్రలు మోచితిని మన్నించితి విటు నను నీవు
కరుణతోడ నాయపరాధంబులు కడవు కావుమనుచు
యిరవై నీపేరు వెట్టితే నిష్యకొనక పోరాదు
నరమాత్రుఁడ నే శ్రీవేంకటేశ నాయకుఁడవు నీవు ॥ ఎదు॥299

సామంతం

ఏదిగతి నే నొక్కఁడనే యెందరి కోపుదును
నీదయతో మన్నించఁగదవే నీరజనాభా ॥ పల్లవి ॥

మోహాంధకారము యెక్కఁడచూచిన ముంచుకవున్నది
దేహాభిమానము అందుకుఁ దోడు దీకొనివచ్చీని
సాహసభూతము ఘనహింసలకే చాఁపించీఁ జేయి
దాహపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని ॥ ఏది ॥

కోపాగ్నికణములు సారెకుఁ జుట్టుక గుబ్బతిలఁదొడఁగె
పైపై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని
చాపలగర్వము యెవ్వరినైనా సాధింపించీని
తీపులధనములు ౧ మీఁదిమీఁదనే తీదీపులు రేఁచీని ॥ ఏది ॥

భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని
వేవేలుసంపద లెందుచూచినా వేడుకనేసీని
శ్రీవేంకటేశ యలమేల్మంగను చేకొనుదేవుఁడా
యీవేళను నన్నేలితివి నాకు నిన్నియు తగ వసమయ్యీని
॥ ఏది ॥ 300

రేకు 163 సామంతం

ఆనతియ్యఁగదవే అందుకే కాచుకున్నాఁడను
పూనుక నీ వెంతనేర్పరివైనా భువి మనసుపేదను నేను॥ పల్లవి ॥

---

౧. 'మీఁద' కావచ్చు

కొలిచేమనేబంట్లు నీకుఁ గోటానఁగోట్లు గలరు నిన్నుఁ
దెలిసేమనేజ్ఞానులు తెందేప లున్నారు
తలఁచి వరములడిగేవారలు తలవెంట్రుకలందరు వారె
యిల సందడిలో నాకొలువు యెటువలె నెక్కీనో ॥ అన ॥

పనులకుఁ బొల్పడినవారు బ్రహ్మాదిదేవతలట
వినుతులు సేయఁ[1] దొడంగినవె వేదరాసులట
మునుకొని ధ్యానించువారు మునులెందరైనాఁ గలరట
వినయపునామనవిసన్నపులకు వేళ లెపుడు గలిగీనో ॥ అన ॥

వున్నతితోడుత నిన్ను మోఁచుటకు వున్నారు గరుఁడఁడు శేషుఁడు నీకు
అన్నిటాను నీకాఁగిటిలోపల నలరీ నలమేల్మంగ
యెన్నఁగ శ్రీవేంకటేశా నన్నును యేలితి వింతటిలోనె
పన్నిననామొక్కులు నీ కెబాఁగులఁ జేరీనో ॥ అన ॥ 301

సామంతం

ఇప్పుడే నే నొడఁబడ మరవఁగఁదగదు జెప్పితి యెల్లనాఁడు
నెప్పున నే[2] నెంతకల్లరినైనా నీదాసుఁడనని యందురుగా
॥ పల్లవి ॥

మఱతునో తలఁతునో నిన్ను మాఁటల నేతప్పు గలుగునో
యెఱఁగక నీదాసులఁ జూచి యేమని పలుకుదునో
నెఱసిననాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని
మఱి నామీఁదట నేరము లెంచక మాధవ నన్నిటు రక్షించవే
॥ ఇప్పు ॥

అలతునో సొలతునో నే నీయందు భక్తి సేతునో[3] సేయనో
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో
తలఁచేటినామనసే నీకును ధనముగాఁ గప్పము వెట్టితిని
పలుమరు నన్నును తగవుకుఁదియ్యక పరమాత్మా ననుఁ
గావఁగదే ॥ ఇప్పు ॥

౧. 'దొడఁగినవె' పూ.ము.పా. ౨. 'నెంతటి' పూ.ము.పా. ౩. 'శాయనో' రేకు.

నేరనో నేర్తునో [illegible] మాపితినో
నీరూపము నే సేవించి [illegible] చితినో
మేరతోడ మావారు చెప్పఁ[illegible] నే నమ్మితిని
వారిఁ జూచైన శ్రీవేంకటేశా వరదుఁ[illegible] మము మన్నించఁ
గదవే ॥ ఇప్పు ॥ 302

### ముఖారి

సర్వేశ్వరా నీతో సరి ౧యెవ్వరు
పూర్వపువారు చెప్పఁగాఁ బూఁచి కొలిచేఁగాని ॥ పల్లవి ॥

చేరి వేదములు నిన్నుఁ జెప్పఁగా వినుటేకాని
నీరూపము దర్శించేవార లెవ్వరు
౨ధారుణిలో నీ యవతారాలే చూచుట
ధీరత నీమహిమలు తెలిసేవా రెవ్వరు ॥ సర్వే ॥

భూమివారిఁ జూచి నిన్నుఁ బూజలు సేయుటగాని
కామించి నీతో మాటాడేవా రెవ్వరు
దీమసాన నీదాసుల దృష్టి మెరుఁగుటగాని
యీమేర నీదైవిక మెరిఁగేవా రెవ్వరు ॥ సర్వే ॥

వరములు నీ వియ్యఁగా వచ్చి సేవించుటగాని
కెరలి నీమూర్తి వెదకేవా రెవ్వరు
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌటగాని
అరసి నిన్ను సుద్దులడిగేవా రెవ్వరు ॥ సర్వే ॥ 303

### ముఖారి

ఇట్టినావెట్టితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁజూడవే ॥ పల్లవి ॥

---

౧. 'యవ్వరు, రేకు. ౨. 'ధారుణిలో నియవతారాలే, పూ.ము.పా.

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడ నేరుతునంటా మరి నే నహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను
గాఁటాన దొరనంటా గర్వింతు నేను ॥ ఇట్టి ॥

నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు ॥ ఇట్టి ॥

మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును
వున్నతి శ్రీవేంకటేశ నన్ను నేమి చూచేవు
అన్నిటా నాయాచార్యవిన్నపమే వినవే ॥ ఇట్టి ॥ 304

ముఖారి

ఇటు నిన్నుఁ దెలియఁగ నెంతటివారము
తటుకన నాసలఁ దగులుటగాక ॥ పల్లవి ॥

నానామూర్తులు నగధర నీరూపు
యేనెలవుల విన్నెటువలెఁ దలఁచుట
పూవి నీభావము పొందుగాఁ జెప్పఁగా
వీనులు చల్లఁగా వినుటేకాక ॥ ఇటు ॥

పెక్కునామములు బిరుదు లనంతము
లెక్కడ గొలదిగ ౧నెన్నెవి పొగడుట
యిక్కువ సేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుటగాక ॥ ఇటు ॥

౧. ఎన్ని+అవి

వేవేలు గలవు నీవిహారభూములు
యేవిధమున నెం దెందని తిరుగుట
శ్రీవేంకటేశా నీశృంగారమెల్లను
సేవించి ముదమునఁ జెలఁగుటగాక ॥ ఇటు ॥ 305

164 ముఖారి

ఎవ్వరికి యెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు
అవ్వలనివ్వల నీ వనాథనాథుఁడవు ॥ పల్లవి ॥

కాయకము లందరునుఁ గార్యవశపరులే
పాయవినీ వకారణబంధుఁడవు
దాయగాం డ్లెవ్వరినై నాఁదప్పించుకొనేవారే
బాయటనున్నా నీ వాపన్నశరణ్యుఁడవు ॥ ఎవ్వ ॥

అట్టె లోకమువారు అర్థకామపరులే
జట్టిగావి నీ వైతే సర్వదాతవు
పొట్టఁబోరుగుచుట్టాలు భోజనసహాయులే
నెట్టన నీ వైతే మాకు నిర్వాహకుఁడవు ॥ ఎవ్వ ॥

అంతటా వారికివారు ఆత్మపోషకులే
రంతుల నీ వైతే నానారక్షకుఁడవు
సంతతము శ్రీవేంకటేశా మమ్ము నేలితివి
పంతమున నీవు భక్తపరిపాలకుఁడవు ॥ ఎవ్వ ॥ 306

ముఖారి

దేవ నీవు గల్పించినతెరువు లివి
నీవారైనవారినేరుపు లివి ॥ పల్లవి ॥

పరమశాంతునకుఁ బాపము రాదు
విరతిగలవానికి వెరపు లేదు
గురుసేవారతునకుఁ గోపము రాదు
ధర సత్యవిదునకుఁ దప్పు లేదు ॥ దేవ ॥

పుట్టుబ్రహ్మచారికి బుద్ధి చెడదు
అట్టె ఆసలేనివారికి అలపు లేదు
తొట్టినసుజ్ఞానికి దుఃఖము లేదు
గట్టియైనమౌనికి కలహమే లేదు ॥ దేవ ॥

సమచిత్తునకును చంచలము గాదు
విమలాచారునకు వెలితి లేదు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులై కొల్చి
భ్రమయనివారికి భారము లేదు ॥ దేవ ॥ 307

శ్రీరాగం

వారివారికర్మములే వారిఁ జుట్టుకొనఁగాను
యీరీతి నీవె వారియెఱుక ౧మాల్పితివి ॥ పల్లవి ॥

హిరణ్యకశిపుపాటు యెఱఁగఁడా రావణుఁడు
ధరలో హరికిఁ బగై తానూఁ బొలిసె
విరసపుకంసుగతి వినఁడా దుర్యోధనుఁడు
పరుగఁ దానూఁ బగై సమసినాఁడు ॥ వారి ॥

తెగి మురాసురుజాడ తెలియఁడా నరకుఁడు
మొగిసి పోటుకుఁ బోయి మొక్కపోయను
సొగిసి ౨సోమకుదెస చూడరా దానవులెల్లా
మగిడి మగిడి పోరి మడిసిరిగాక ॥ వారి ॥

౧. 'మాప్పితివి' పూ.ము.పా, ౨. 'సోమకు' కావచ్చు.

బలివోయినతెరువు బాణుఁడు విచారించఁడా
    బలిమిఁ దొడరి భంగపడెఁగాక
    యెలమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు
    యెలమి విప్పటివారూ నెఱఁగరేకాక ॥ హరి ॥ 308

## శ్రీరాగం

హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము
    విరివైననీసుద్దులు వింటిమయ్యా ॥ పల్లవి ॥

నెమ్మదిని నీవనేటినిధానము గన్నవారు
    కిమ్ముల సంపన్నులై సుఖింతురయ్యా
    కమ్మటి నీభక్తియనేకామధేను వున్నవారు
    వుమ్మడి నచ్చికము లే కుందురయ్యా ॥ హరి ॥

చేరి నీపై చింతయనేచింతామణిగలవారు
    కోరినట్టల్లా బదుకుదురయ్యా
    సారపునీకృపాపారిజాతమబ్బినవారు
    తోరన సంతోసాలఁ బొదలుదురయ్యా ॥ హరి ॥

హత్తి నీనామమనేఅమృతముగలవారు
    విత్తైమైనపదవుల నిలుతురయ్యా
    యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
    ¹సత్తుగా నీవారు నాకుఁ జనవిత్తురయ్యా ॥ హరి ॥ 309

## శ్రీరాగం

దైవమా నీ వొక్కఁడవే దక్కినధనముగాక
    యీవలానావలా మఱి యెంచ నే మున్నది ॥ పల్లవి ॥

---

1. 'సత్తు' 'సత్య' శబ్దభవము కావచ్చు

పుట్టినవారికెల్లా ౧పొత్తుల దీజగము
మెట్టితూచుండేయరఁగు మేదినియెల్లా
బట్టబయటిభోగాలు బంతికూటిబోజనాలు
పట్టి తమవవి యేరుపరచ నే మున్నది ॥ దైవ ॥

పంచుకొన్న భాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుప నే మున్నది ॥ దైవ ॥

మనోవికారాలు మానుషపుటెఱుకలు
వినోదమాత్రాలు వేడుకలెల్లా
యెనలేవిశ్రీవేంకటేశ నీమహిమ లివి
వెనకా ముందరా విన్నవించ నే మున్నది ॥ దైవ ॥ 310

శ్రీరాగం

ఇట్టివాఁడవు సులభమెట్లా నైతివో కాక
అట్టినీదయ దలఁచి అరుదయ్యీ నాకు ॥ పల్లవి ॥

యేమేమి చదువవలె నెందరి నడుగవలె
ఆముక విన్నుఁ దెలిసేయందుకొరకు
భూమిలోన నెంతేసిపుణ్యములు సేయవలె
కామించి నీపై భక్తిగలిగేటికొరకు ॥ ఇట్టి ॥

యెన్నిజన్మా లెత్తవలె నెందెందు వెదకవలె
కన్నుల నీసాకారము గనేకొరకు
వున్నతి నెంతగాలము వొగ్గి కాచుకుండవలె
విన్నవించి నీసేవ వేఁడుకొనేకొరకు ॥ ఇట్టి ॥

౧. 'పొత్తులది జగము' పూ.ము.పా.

మేదేది యెఱఁగవలె యెట్లభ్యసించవలె
నీదాసుఁడనిపించుకొనేటికొరకు
సాదరాన శ్రీవేంకటేశ్వర నన్ను మన్నించితి-
వేదెసఁ బొగడవలె యింతసేసేకొరకు ॥ఇట్టి॥ 311

165 శ్రీరాగం

చెప్పితేఁ బాసునందురు చేసినదోసములెల్లా
వొప్పుగొని మన్నించ నుచితమా నీకు ॥పల్లవి॥

క్షమియించుకొనవే సర్వాపరాధములు
క్రమ మెఱఁగ కేమేమి గావించితినో
రమణతో సర్వలోకరక్షకుఁడవట నీవు
తమితోడ నన్నుఁగావఁ దగవౌను నీకు ॥చెప్పి॥

పరిహరించఁగదవే బహునరకబాధలు
గరిమల నెటువలెఁ గాచుకున్నవో
అరుదుగా సురలమొరాలించితివట తొల్లి
ధర నన్ను వహించుకోఁ దగవౌను నీకు ॥చెప్పి॥

వెనుకొని యడ్డము రావే శ్రీవేంకటేశ్వర
అనుభవించేకర్మము లవేమున్నవో
పనివడి భక్తపరిపాలకుఁడవట నీకు
తనుభోగాలు భోగించఁ దగవౌను నీవు ॥చెప్పి॥ 312

నాదరామక్రియ

తఁడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు
చతురుఁ డితఁడే రక్షించఁగలవాఁడు శరణవిబ్రదుకవో వోమనసా
॥పల్లవి॥

మరుతండ్రిఁ జూచినమించికన్నులను మరొకరిఁ జూచిన నింపౌనా
సిరివరునామము నొడిగిననోరను చిక్కినపేరులు యితవౌనా
పరమాత్ముఁ దలఁచినమనసులోపలను పరులఁ దలఁచితే నొడఁబడునా
కరుణానిధిపుణ్యకథలు వినినచెవుల కడలసుద్దులు విననమ్మతించునా
॥ అతఁ ॥

నరహరిఁ బూజించినయట్టికరములు నరులసేవసేయ నరుహములా
మురహరు శరణని మొక్కినశిరసున మూఢులకు మొక్క నుచితములా
హరిమందిరమున కరిగెడుపదములు అధములిండ్ల కేఁగఁగ నలవడునా
పురుషోత్తము౧ లాంఛనము మోచినమేను భువిహీన౨వృత్తికిఁ
బొసఁగీనా ॥ అతఁ ॥

గోవిందుఁడే దిక్కైవుండు ఘనులకు కొలిపీనా దేవతాంతరంబులు
భూవల్లభుదెసఁ బుట్టినజ్ఞానము పొందిది వేరొకట నిలిచీనా
శ్రీవేంకటపతిపై నిడినభక్తి చెలులపై నునుపఁగఁ దగవవునా
దేవకినందనుఁ డితవిదాసులఁ దెలియఁగ జడులకుఁ దరమయ్యీనా
॥ అతఁ ॥ 313

నాదరామక్రియ

ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినాఁ దానే
యెదిటబ్రహ్మాండము యిమ్మచాల దిందుకు ॥ పల్లవి ॥

పనిగొంటే భువిలో నేఁబదియే అక్షరములు
కొనాడితే నీగుణాలు కోటానఁగోటి
యెనసి పదునాలుగే యెదమైన లోకములు
అనిశము నీవైతే ననంతమహిమలు ॥ ఇది ॥

---

౧. 'లాంచనము' రేకు. ౨. 'వ్రిత్తికి' రేకు.

మించి యిందుకొంటే నెనిమిదియే దిక్కులు
అంచల నీకతలైతే ననేకములు
యెంచి చూచితేఁ గలవి పంచమహాభూతాలే
ముంచిననీమాయ తుదమొదలే లేదు ॥ఇది॥

వుపమించి తెలిసితే నొక్కటే జగము
అపురూపపునీసృష్టి అతిఘనము
అపరిమితపుజీవు లణుమాత్రులైనాను
యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు ॥ఇది॥ 314

నాదరామక్రియ

ఎంతకత నడపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా ॥పల్లవి॥

కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరిచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచేకొరకైతే నీచే చక్ర-
మూరకే వేసితే దుష్టులొక్కమాటే తెగరా ॥ఎంత॥

చేకొని వానరులఁగాఁ జేయనేల దేవతల
జోకతో లంకాపురి చుట్టుకోనేల
కాకాసురు వేసినకసవే రావణుమీఁద-
నాకదఁ బంపువెట్టితే నప్పుడే సమయఁడా ॥ఎంత॥

గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడసితే తానే పొలియఁడా ॥ఎంత॥ 315

నాదరామక్రియ

పరులకైతే విదే పాపముగాదా
పురిగొని నీవంటకఁ బుణ్యమాయఁగాక ॥పల్లవి॥

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధించఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు ॥పరు॥

నారాయణుఁడ నీవు నడిపినదే తగవు
ఆరూఢి నీ వౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో ఖండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు ॥పరు॥

శ్రీవేంకటేశ నీవు చేసినదే నీతి
చేవతో నీ వాడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు ॥పరు॥ 316

రేకు 166 నాదరామక్రియ

ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥పల్లవి॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరుశరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము ॥ప్రప॥

దురహంకారము దుఃఖము సుఖమును(
బొరయక ప్రాకృతులపొంత( బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూ( దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటనిలయుం(డే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥ 317

రామక్రియ

జతనము జతనము సర్వేశున్నగ రిది
బతుకు(దోవ యిదె బదకరము ॥ పల్లవి ॥

హృదయములోపల నీశ్వరు( డున్నా(డు
.దిలము మనసా బదకరము
తుద నల కామాదుల( జొర నియ్యక
పదరక కావుము బదకరము ॥ జత ॥

యెంచుకొని విదే యేలిక మిము నిం(క
పంచభూతములాల బదకరము
మించినపురి తొమ్మిదివాకిళ్లను
పంచుక వున్నారు బదకరము ॥ జత ॥

నడుమ నడుమ( బ్రాణములాలా మీరు
బడివాయకుండరో బదకరము
యెడయక శ్రీవేంకటేశ్వరునకు మీరు
బడలక కొలువరో బదకరము ॥ తజ ॥ 318

భైరవి

ఆతఁడే విష్ణుం డఖిలము నడపెడి
యీతల నెవ్వరి కేఁటికిఁ జింతా ॥ పల్లవి ॥

పుట్టించఁ బెంచఁగ బొడ వెక్కించ దేహాల
గట్టిగా మాఁటలాడించఁ గదలించ
పట్టి వాన గురియించ పైరులు మోఁ
తిట్ట పెట్ట నొకానొకదేవుఁడు గలఁడు ॥ ఆతఁ ॥

అన్నపానము లొసఁగ నాపదలు గడపఁగ
పన్ని మాయలు భువిఁ బచరించ
విన్నపాలు సురలవి విని యందరి రక్షింప
వున్నతోన్నతుఁడై వొకానొకకర్త గలఁడు ॥ ఆతఁ ॥

కాల మక్షయము [1]సేయ కర్మము ఫలించఁజేయ
తాళుకొని మరపించఁ దలఁపించ
పాలుపడి శ్రీవేంకటపతియై వేదాలుచెప్పె-
యేలిక యొకానొకయీశ్వరుఁడు గలఁడు ॥ అతఁ ॥ 319

భైరవి

హరి హరి జగ[2]మెఱుంగ నీ వాతుమలోనే వున్నాఁడవు
సురలఁ గాచుటయు నసురల నడఁచుట చొప్పడియున్నది
నీగురుతు ॥ పల్లవి ॥

వేదార్థము [3]దప్పందెలిసినవిద్వాంసునివంటిది
పాడుగఁ జదువక తర్కించఁబోవుపాండిత్యమువంటిది
మేదిని నడవులఁ దెరువుదప్పి మరి మెలఁగేటితెరువరివంటిది
ఆదిమూర్తి నీశరణుచొచ్చి నిను నారాధించనివానిబదుకు ॥ హరి ॥

౧. 'శాయ' రేకు ౨. 'మెఱుంగ' పూ.ము.పా. రేకు. ౩. 'దప్పఁదెలిసిన' పూ.ము పా.

వట్టిజోలితో నూరక దేవరలేనిపూజవంటిది
వొట్టుక ఫలములులేనిపంటలకు వొడిగట్టేయటువంటిది
నెట్టనఁ గర్ణధరుండులేనిజలనిధినడిమియోడవంటిది
బట్టబయటనే పరమేశ్వర నీపైభక్తిలేనివానిబదుకు ॥హరి॥

పొందుగ ధర్మముబోధించెడిసత్పురుషులులేనిసభవంటిది
చెంది శ్రీవేంకటేశ్వర నీమహిమలు చెప్పనికథవంటిది
సందడి నన్నియుఁ జేసి దక్షిణలుచాలనియజ్ఞమువంటిది
యిందిరారమణ నీ వెక్కుడనుచు నిన్నిటఁ దెలియని... ...కు
॥హరి॥ 320

భైరవి

అరుదు నీచెరిత్రము హరి నే నిదియే తలఁచుకొని
శరణంటిఁ గావు మిదియ విన్నపము సరిలేరు నీకు ॥పల్లవి॥

పరగ నీయకారణబంధుత్వ మహల్యయందుఁ గంటిమి
రియందు నార్తరక్షకత్వము మెరయఁగఁ గంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము గంటిమి
శరణంటెఁ గాచుట ధర విభీషణునందుఁ గంటిమి ॥అరు॥

మును భక్తవత్సలత్వము నీకు శబరియందుఁ గంటమి
అనాథనాథుడవు నీ వగుట సుగ్రీవునందుఁ గంటిమి
పెనఁగి నిరుహేతుకప్రేమ పరీక్షితునందుఁ గంటిమి
వినుఁ గింకరాధీనుఁడని ప్రహ్లాదునియందుఁ గంటిమి ॥అరు॥

గోవర్ధనమందు సర్వజీవదయాపరత్వము గంటిమి
భావించి సాందీపునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవ శ్రీవేంకటేశ్వర నీవు ద్రిష్టవరదుఁడవగుట
తావైననీకొనేటిదండ నౌనఁగేయందే కంటిమి[1] ॥అరు॥ 321

---

౧. ఈపాటలో ప్రతిచరణమునందునూ 'కంటిమి' దీర్ఘాంతముగనే కలదు.

రేకు 167 భైరవి

ఎంతపుణ్యమో యిటు మాకుఁ గలిగె
చెంతనే నీకృప సిద్ధించఁబోలు ॥ పల్లవి ॥

శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణఁగెను భయ ముడిగె
తీపుగఁ దులసితీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ ॥ ఎంత ॥

గోవింద మిమ్ముఁ గనుఁగొంటి మిప్పుడే
పావనమైతిమి బ్రతికితిమి
తావుల మీపాదములకు మొక్కితి
వేవేలుఁ గలిగెను వేడుకలాయ ॥ ఎంత ॥

శ్రీవేంకటేశ్వర సేవించితి మిము
ధావతి దీరెను తపసితిమి
వావిరి ముమ్మారు వలగొని వచ్చితి
నీవారమైతిమి నిలిచితి మిపుడు ॥ ఎంత ॥ 322

మలహరి

అనంతాపరాధి నేను అటుగాన శరణంటిని
మొనలేనినీగుణాలు యేమిచూచేనయ్యా ॥ పల్లవి ॥

దగ్గరి కొలుతు నాతరతమ్య మెంచుకోను
సిగ్గువడ నిట్టే నిన్నుఁ జేరి పాడుదు
వొగ్గి విన్నపాలు నేతు వుబ్బునఁ జిత్త మెరఁగ
యొగ్గు లెంచితే నావల్ల నెన్ని లేవయ్యా ॥ అనం ॥

పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలఁచను
సాదించి కొలువవత్తు సత్వా చూడను
యేదెసనైనా నుతింతు యెంగిలినోరని మాన
పాదుగా విచారించితే బలుమూఢుఁడనయ్యా ॥ అనం ॥

మంచముపైఁ దలపోతు మందెమేళమనియన
కంచముకూడర్పింతుఁ గాదననేర
యెంచఁగ శ్రీవేంకటేశ యిన్నిటా నీబంట నైతి
పంచలఁ జూచితే నీపాలివాఁడనయ్యా ॥ అనం ॥ 323

## మలహరి

అన్నిటా నీవే వుందువంచువుగాన
యిన్ని నీవు పుట్టించిన వివి నిసొమ్ములే ॥ పల్లవి ॥

నిలిచినరూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు
మెలఁగేటిచైతన్యము మిమ్ముగాఁ దలఁతు
యిలలోనిధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు
కలపంచభూతాలుపకరణాలుగాఁ దలఁతు ॥ అన్ని ॥

నారుకొన్నపంటలు నీనైవేద్యాలుగాఁ దలఁతు
నీరెల్లా నీతీర్థమని నెమ్మిఁ దలఁతు
ధారుణి భోగాలు పూజాద్రవ్యాలుగాఁ దలఁతు
నేరిచినపనులెల్లా నీలీలలుగాఁ దలఁతును ॥ అన్ని ॥

కాలత్రయము నీగతులుగానే తలఁతు
చాలి సురల నీయనుచరులఁగానే తలఁతు
నాలోని శ్రీవేంకటేశ నాతండ్రివని తలఁతు
తాలిమి నీదేవులను తల్లియని తలఁతును ॥ అన్ని ॥ 324

మలహరి

అందుకేపో నీపై నాసవుట్టి కొలిచేది
మందలించితి నిఁక మరి నీచిత్తము ॥ పల్లవి ॥

యిందరుఁ జెప్పఁగా వింటి యెవ్వరికైనా విష్ణుఁడే
కందువ మోక్ష మియ్యఁ గర్త యనఁగా
ముందే వింటి నారదుఁడు మంచి నిన్నుఁ బాడఁగా
పొందుగ లోకములోనఁ బూజ్యుఁడాయననుచు ॥ అందు ॥

అప్పటి వింటి లోకము లన్నిటికి హరియే
కప్పి రక్షకత్వానకుఁ గర్త యనఁగా
యిప్పుడే వింటి ధ్రువుఁడు యిటు నిన్ను నుతించే
వుప్పతిల్లి పట్ట మేలుచున్నాఁడనుచును ॥ అందు ॥

యిదె వింటి శ్రీవేంకటేశ బ్రహ్మకుఁ దండ్రివై
కదిసి పుట్టించఁ బెంచఁ గర్త వనుచు
వదలక వింటి నీకు వాల్మీకి కావ్యము చెప్పి
చెదర కాద్యులలోఁ బ్రసిద్ధుఁడాయననుచు ॥ అందు ॥ ౩౨౬

భూపాళం

అపరాధిని నే నైనాను
కృపగలవారికిఁ గపటము లేదు ॥ పల్లవి ॥

సనాతనా అచ్యుతా సర్వేశ్వరా
అనాదికారణ అనంతా
జనార్దనా అచల సకలలోకేశ్వరా
విను మఱచియున్నాఁడ వనుఁ దెలుపవయా ॥ అప ॥

పురాణపురుషా పురుషోత్తమా
చరాచరాత్మక జగదీశా
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా
యిరవు నీవేయట యెఱఁగించఁగదే ॥ అప ॥

దేవోత్తమా శశిదినకరనయనా
పావనచరితా పరమాత్మా
శ్రీవేంకటేశా జీవాంతరంగా
సేవకుఁడను బుద్ధిచెప్పఁగవలయు ॥ అప ॥ 326

భూపాళం

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు
యెప్పుడును జింతించే విదేపనై నేను ॥ పల్లవి ॥

పొలసి నీరూప మెట్టు పొడచూపేవో
యెలమి న భాగ్య మిఁక నెట్టున్నదో
అలరి నా కేబుద్ధి ఆనతిచ్చేవో
కలిగిననీమాయ యేగతిఁ గడచేనో ॥ చెప్ప ॥

వరుస నా కెట్లాఁ గైవసమయ్యేనో
యిరవై నాజన్మఫల మెట్టున్నదో
పరగ నామతి నెట్టు పాయకుండేవో
కరుణానిధివి నిన్నేకరణి మెప్పించేనో ॥ చెప్ప ॥

పనివడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా-
మనసుచంచల మెట్టు మట్టుపడీనో
యెనలేని నాతలఁపు యెఱిఁగి శ్రీవేంకటేశ
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో ॥ చెప్ప ॥ 327

రేకు 168 భూపాళం

ఇవి సేయఁగ నే నలసుఁడ యెటువలె మోక్షం బడిగెదను
వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁగాక ॥ పల్లవి ॥

జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగ జిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
అపరిమిత దేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు ॥ ఇవి ॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలినపంచేంద్రియని(గ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళధర్మార్థకామంబులు మఱి యైశ్వర్యములకు మూలములు
అవల గ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము ॥ఇవి॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికిని సంసారభోగము
హరి నరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొనఁగెడిదాతవు
సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు వేకాలమును మమ్మును ॥ ఇవి ॥ 328

ధన్నాసి

నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము
కావు మానేర మెంచక కరుణానిధీ ॥ పల్లవి

నెట్టన సూర్యు[1]లోవినెలకొన్న తేజమా
గట్టిగాఁ జంద్రునిలోవికాంతిపుంజమా
పుట్టిరక్షించేయజ్ఞపురుషునిప్రకాశమా
వొట్టుక దేవతలలోనుండినశక్తీ ॥ నీవే ॥

---

1. 'లో' న' కావచ్చు.

నిరులఁమించినయట్టిజీవులలో ప్రాణమా
గరిమ వేదములలోఁగలయర్థమా
పరమపదమునందుఁ బొదుకొన్నబ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా ॥ నీవే ॥

జగములో వెలనేటిసంసారసుఖమా
నిగిడినమంత్రములనిజమహిమా
మిగుల శ్రీవేంకటాద్రిమీఁదనున్నదైవమా
ముగురువేల్పులలోనిమూలకందమా ॥ నీవే ॥ 329

ధన్నాసి

నీ వెంత నే నెంత నేఁడు నాయగ్గలి కెంత
దేవ నీదాసులఁ జూచితేనే నిన్నుఁ గనుట ॥ పల్లవి ॥

వొక్కొక్కరోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
ఉక్కుమీరి ధరించుక ఉన్నాఁడవట
విక్కననీరూప మెంతో నిన్నుఁ గనుఁగొను టెట్టు
అక్కజపువేదముల కగోచరుఁడవు ॥ నీవెం ॥

యెన్నో శిరసులట యెన్నో పాదములట
యెన్నరానిచేతులట యిట్టినీమూర్తి
కన్నులఁ జూచుట యెట్టు కడగురు తందు కేది
అన్నిటా మునీంద్రులకు నచింత్యుఁడవు ॥ నీవెం ॥

కోటిసూర్య లొక్కమాటే కూడ నుదయించినట్టు
గాటపునీతిరుమేనికాంతులట
మేటివి శ్రీవేంకటేశ మిమ్ము ద్రిష్టించుట యెట్లు
పోటిదేవతలకెల్లాఁ బొడవెనవాఁడవు ॥ నీవెం ॥ 330

ధన్నాసి

నారాయణ నీపంపో నాభాగ్యమో ఇది
పేరుకొని పిలువనిపేరటమై వున్నది ॥ పల్లవి ॥

వుడిగినాఁ గామాఁడు లోకొక్కొక్కవ్యాజాన వచ్చి
సుడిసి నడుముచొచ్చుచుట్టాలవలె
తడవకున్నాఁ గర్మాలు తమ్ముఁ దామె నేయించీ
బడిబడిఁ దిరుగును బంట్లవలె ॥ నారా ॥

చూడకున్నా దుర్గుణాలు సొంట్లు సోదించవచ్చి
వాడవాడలఁ ౧దల రుఁవలె
యేడ నున్నా లంపటాలు యెదుటనే వొలసీని
జోడువాయనీక తోడునీడలవలె ॥ నారా ॥

కలఁచకున్నా భోగాలు తనువుతోఁ బెనఁగీని
చెలరేఁగి గరడిలో ౨జెట్లవలె
బలిమి శ్రీవేంకటేశ భావములో నీమూరితి
నిలుపవే యెందుకైనా నిగిడీ నామనసు ॥ నారా ॥ 331

దేవగాంధారి

పసులఁ గాచుచు యెట్టు బండిబోయిఁడవౌ పెట్టు
వెస నిన్నుఁ దలఁచితే వెరగయ్యీ నాకు ॥ పల్లవి ॥

పరుస నంతరియామిత్వము నవతారములు
పరగ మూఁడుమూర్తులప్రభావము
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై
తిరమైనయాదిదేవదేవుఁడవు నీవు ॥ పసు ॥

౧. 'దళవరులవలె' రేకు. ౨. 'జెట్లువలె' రేకు.

అవికళము జీవులకు నణువుకు మహత్తుకు
వెనుకొన్నమాయకు విరాట్టుకు
పొనఁగవిమహిమలపొడవుకుఁ బొడవైన
దినకరకోటికోటితేజమవు నీవు ॥ పను ॥

సర్వశాస్త్రములలో సనకాదులలో
పర్వినగరుడానంతప్రముఖులలో
సర్వదా మెలఁగుచు జనవరదుఁడవై
వుర్వి శ్రీవేంకటాద్రినున్న దేవుఁడవు ॥ పను ॥ 332

రేకు 169 దేవగాంధారి

ఏపొద్దూ నీచేఁతలెల్లా యెదుటనే కానవచ్చీ
వీఁపు గానరాఁగా దాఁగేవిద్య నీదిగాక ॥ పల్లవి ॥

పుట్టినమేకానకుఁ బూరి మేయ నేరిపితా
అట్టె పిల్లలఁ బెట్ట నటు నేర్పిరా
చుట్టి నీళ్లున్నచోటు సోదించ నేరిపిరా
మట్టులేవి దింతా నీమాయ యింతేకాక ॥ ఏపొ ॥

తీవెలకుఁ జుట్టి చుట్టి దిక్కులఁ బాఁక నేరిపిరా
తావులఁ దతికాలానఁ బూవ నేరిపిరా
[౧] వేవేలుపక్కొమ్మలు వెనఁ బెట్ట నేరిపిరా
యేవలఁ జూచినా నీమహిమ లింతేగాక ॥ ఏపొ ॥

కోరి పక్షులు కొరులు గూండ్లువెట్ట నేరిపిరా
సారె జాతియ్యాహారాలచవి నేర్పిరా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నియు లోకములోన
చేరి నీవు సేసిన[౨] సృష్టి యింతేకాక ॥ ఏపొ ॥ 333

---

౧. 'వేవేలపకొమ్మలు' పూ.ము.పా. పక్క+కొమ్మలు=పక్కొమ్మలు కావచ్చు.
౨. 'స్రిష్టి' రేకు.

దేవగాంధారి

ఇంతకంటే మరి లేదు యెవ్వరికి నుపాయము
యెంతైనా నిదియు నీ విచ్చితేనే కలుగు ॥ పల్లవి ॥

హరి నీచిత్తమువట్టేయందుకు నుపాయము
ధర నిన్ను బోధించేనీదాసులమాఁటే
దురితములన్నిటిని తొలగించేవుపాయము
నిరంతరమును నీనామజపమే ॥ ఇంత ॥

దండితోడ నీమాయ ౧దాఁటేయందు కుపాయము
నిండుసిద్ధాంతమైననీపై భక్తే
అండనున్నకామాదుల నణచుట కుపాయము
కొండవంటినీమూర్తిఁ గోరి శరణనుటే ॥ ఇంత ॥

పుట్టుగులు గెలిచి నిన్నుఁ బొందుట కుపాయము
అట్టె నీరూపమైనఆచార్యుడే
యిట్టె శ్రీవేంకటేశ యిన్నిటికి నుపాయము
మట్టులేనిరామానుజమతము చేకొనుటే ॥ ఇంత ॥ 334

దేవగాంధారి

తెలియరాదు నీమాయ తెరమఱఁగుపెక్కు-
వలలఁ జిక్కక నిన్నే కొలువఁగవలయు ॥ పల్లవి ॥

చూడఁగ నీజగత్తుకు సూత్రధారివి నీవు
జోడై నీసూత్రాన నాడుచును సర్వంబునున్నది
యేడఁ జూచినా నీ వుందు వెవ్వరికిఁ గానరావు
వోడక స్వతంత్ర మొకరిపై వేతువు ॥ తెలి ॥

---

౧. 'దాఁటి' రేకు.

మఱపించాఁ దలఁపించా మర్మజ్ఞుఁడవు నీవు
గుఱియై నీసంకల్పముకొలఁదె యీజీవులెల్లా
మఱి నీ వీశ్వరుఁడవు మాఁటలకుఁ జిక్కవు
కఱకరి నితరులఁ గర్తలఁగాఁ జేతువు ॥ తెలి ॥

అందరిమొర లాలించి అట్టె రక్షింతువు నీవు
కందువ శ్రీవేంకటేశ కానవచ్చె నీమహిమ
చెంది వరము లిత్తువు చేతికి సులభుఁడవు
సందడి నెవ్వరినైనా సరిగా మన్నింతువు ॥ తెలి ॥ 335

ధన్నాసి

నీవే దయదలఁచుక నెమ్మి రక్షించుటగాక
యీవలఁ గొలిచేనంటే యీడైనవాఁడనా ॥ పల్లవి ॥

పరగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే
హరి నీకు నెదురుమాఁటాడేవాఁడనా
గరిమ సువస్తువులు కానుక ఇచ్చేనంటే
సరుస నీకన్నా నేను సంపన్నుఁడనా. ॥ నీవే ॥

మెలఁగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే
జలజాక్ష నే నీతో సరివాఁడనా
బలువైన నీపరమపదము గోరేనంటే
వలనైన నీతోడివంతువాఁడనా. ॥ నీవే ॥

తాలిమితో నాలో నిన్ను ధ్యానము సేసేనంటే
పాలసుఁడ నేను నీపాటివాఁడనా
యేలితివి శ్రీవేంకటేశ నన్నుఁ గృపతోడ
యీలీల నీమహిమలు యెఱిఁగేటివాఁడనా. ॥ నీవే ॥ 336

దేవగాంధారి

చిత్తానఁ బెట్టు మీమాఁట శ్రీరమణ మఱవకు
పత్తి నిన్నే మెఱఁగుదు నజ్ఞాని నేను ॥పల్లవి॥

నెలకొని నాలోన నీవున్నాఁడవుగనక
తలఁచకున్నా నిన్నుఁ దలఁచినవాఁడనే
యెలమి నందరి నీవే యేలినవాఁడవుగనక
కొలువకున్నా నిన్నుఁ గొలిచినవాఁడనే ॥చిత్తా॥

చక్కని ఆకారమెల్లా నీపాదమేకనక
మొక్కకున్నా నేను నీకు మొక్కినవాఁడనే
చిక్కి నానాక్షరములు నీపేరే కనక
పెక్కులుగఁ బిలువకున్నాఁ బిలిచినవాఁడనే ॥చిత్తా॥

వోజ నారగములాను నున్నాఁడవుగాన
పూజించకున్నా నిన్నుఁ బూజించినవాఁడనే
తేజపుశ్రీవేంకటేశ దేవ నీవే గతిగాన
సాజాన నే నుఁబెనా శరణన్నవాఁడనే. ॥చిత్తా॥ 337

గుండక్రియ

[1]దాఁచుకో నీపాదాలకుఁ దగ నే జేసినపూజ లివి
పూఁచి నీకీరితిరూపపుష్పము లివియయ్యా ॥పల్లవి॥

వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచి వుండనీ
వెక్కసమగు నీ నామము వేలసులభము ఫల మధికము
దిక్కై నన్నేలితి యిఁక నవి తీరని నాధనమయ్యా ॥దాఁచు॥

---

1. 'దాఁచుకొని పాదాలకుఁ' పూ. ము. పా.

నానాలికపైనుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్నుఁ బొగడించితివి
వేనమాఱు వెన్నుఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥దాఁచు॥

యీపాటి గర్వము నాకు నీమహిమే కొనియాడితిఁగాని
చేముంచి ¹నాస్వాతంత్ర్యము చెప్పినవాఁడఁ గాను
నేమానఁ బాడేవాఁడను నేరము లెంచకు మీ
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా ॥దాఁచు॥౩॥౮

రేకు 170 గుండక్రియ

హరి గోవిందా హరి గోవిందా
ఆనంద మానంద మాతుమకును
గురూపదేశాన వెదకఁగా వెదకఁగా
గరిమ నీయర్థము కంటి మోయయ్యా ॥పల్లవి॥

సరి నన్యధర్మములు మానుమంటివి
శరణు నీకుఁ జొరుమంటివి
దురితము లణఁచేనంటివి
పరగ మోక్షం బిచ్చేనంటివి
హరి నీవచనము అమోఘము
నరులము నే మిది నమ్మితిమి
పరమపద మిప్పుడే కలిగెను
ధర నొక్క మనసుతో నమస్కారమయ్యా ॥హరి॥

౧. 'స్వాతంత్రము' రేకు.

యెందు నీవే గతి ౧యనుమంటివి
యేచి యొక్కమాఁటే చాలునంటివి
యిందరి కభయ మిత్తునంటివి
యిది నీ కెపుడు వ్రతమంటివి
కందువ నీబిరుదుసత్యము
కావుమ్మని నేము చేపట్టితిమి
అంది నీవే మాకు దిక్కైతివి
అన్నిటా సంతోసాన నున్నారమయ్యా ॥ హరి ॥

ఆసమానినవాఁ డెక్కు డంటివి
అతనివెంటఁ దిరిగేనంటివి
భాసురపాదరేణువు౨నే నంటివి
పావన మయ్యేనని యంటివి
మోసలేనిది నీసంకల్పము
మొక్కె మిందులకు శ్రీవేంకటేశా
ఆసపడ నితరుల నాకు నీవే యాస
యని నీదాసులమై యున్నారమయ్యా ॥ హరి ॥ 339

గుండక్రియ

ఇదివో నాసంపదా ఆస్తియుఁ బాస్తి నీవు ఇతరంబులు నాకుఁ బనిలేదు
పదిలంబుగ నాబ్రతుకెల్లా నీవే పాలించఁగదే నారాయణా॥ పల్లవి ॥

ఉపమల నే నార్జించినఉన్నతధనంబు నీవు
తపము ౩ సేయఁగాఁ గలిగెడుతత్ఫలంబు నీవు
జపములవలనఁ గలిగెడునాతేజఃప్రభావమును నీవు
కపురులదానధర్మపరోపకారంబులఁ బొందెడుమేలు నీవు ॥ ఇది ॥

౧. 'యెను' రేకు. ౨. 'చేనంటివి' రేకు. ౩. 'కాయఁగా' రేకు.

పరము నాకు నీవు పరాత్పరమును నీవు
గరిమల నిలలోపలి యనంతభోగంబులు నీవు
గరుడోరగామరసిద్ధసాధ్యగంధర్వపదములు నీవు
సురమునిపితృపూజావేదపాఠసుకృతంబులు నీవు ॥ఇది॥

నాలుగాశ్రమంబులు నానావిద్యలు నీవు
తాలిమి నాపంచవింశతితత్త్వంబులు నీవు
ఈలీల శ్రీవేంకటేశ్వర యిన్నియు నీవు నా కవి యెరిఁగితి
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు
॥ ఇది ॥ 340

శుద్ధవసంతం

అందుకేసుమ్మీ నేఁ జేసేటిచారాలు దైవమా
నిందవాయ నామనసు నీపై నిలుపవే ॥ పల్లవి ॥

బట్టబయటఁ దోలితేను బంద మేయుఁ బసురము
పట్టి మేపితేను తనపనులు సేయు
ఇట్టె వదలితేను యెందైనాఁ బారు మనసు
కట్టుక నేమస్తుఁడైతే కైవసమై యుండును ॥ అందు ॥

బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు
౧ యెడయక కూడుకొంటే హితు లౌదురు
విడిచితే నిటులానే కడకుఁ బారు మనసు
వొడలిలో నణఁచితే వొద్దికై వుండును ॥ అందు ॥

చే వదలితే పెంచినచిలుకైనా మేడ లెక్కు
రావించి గూఁటఁ బెట్టితే రామా యనును
భావించకుండితే యిట్టె పారు నెందైనా మనసు
శ్రీవేంకటేశుఁ గొల్చితే చేతఁ జిక్కి వుండును ॥ అందు ॥ 341

౧. 'యడయక' పూ.ము పా. రేకు. యతిభంగము.

### బౌళి

జపములుఁ దపములు సంధ్యాదివిధులును
నెపము నామీఁద నుంచితే నీకే[1] నెలవు ॥పల్లవి॥

ఫలము నినుఁ గోరనిపంతమువాఁడఁ గాను
[2]అపలెననెడుగ నెంత వాఁడను నేను
చెలఁగి నీవు కర్మము సేయించఁగాఁ జేసేటి-
వెంటలేక తెచ్చుకొన [3]వెట్టివాఁడ నేను ॥జప॥

ఆస మానితిననేటి యహంకారి నేఁ గాను
వాసికి నీతోఁ బెనఁగేవాఁడ నా నేను
వేసరకుండాఁ గట్లు వడిపించి యేలుకోఁగా
దాసుఁడనై బదికేటిధర్మపువాఁడ నేను ॥జప॥

జ్ఞాని నై తిననేగర్వాచారపువాఁడఁ గాను
కానక నీపై మోపుగట్టనోపను
ఆనుక శ్రీవేంకటేశ ఆతుమ నీ వుండఁగాను
మోనాన నీకు మొక్కేటిమఱువాఁడ నేను ॥జప॥ 342

### హిందోళవసంతం

అందరి రక్షించేదేవుఁ డాడించీ జీవులను
పొందుగా [4]యీమేలెరిఁగి పొగడరో లోకులు ॥పల్లవి॥

వనము వెట్టినవాఁడు వాఁడకుండా నీరు వోసి
పెనచి కలుపు దీసి పెంచినయట్లు
పసివడి గొల్లవాఁడు పచ్చికపట్టునఁ బసుల
తనియఁగ నిల్పి నిల్పి తానే మేపినట్లు ॥అంద॥

---

౧. 'కలవు' రేకు. ౨. 'వలెననెడుగ' రేకు. అవి+అడుగ 'అనెడుగ' ఇట్టి-సంధు లీవాఙ్మయమున కోకొల్లలు. ౩. 'వెట్టివాఁడను' వూ. ము. పా. ౪. 'మీమేలెరిఁగి' వూ. ము. పా.

కన్నతల్లి బిడ్డకును [illegible] వెన్నయుఁ బాలు-
[illegible] డి [illegible] చినటువలె
యెన్నఁగ [illegible] లేమేలిక జీతాలు వెట్టి
[illegible] మిసుటు ॥ అంద ॥

[illegible]సుధ వై[illegible] మూతు లిచ్చి
[illegible] బోషించినట్లు
యెన్నఁగ [illegible] దే [illegible] టింబి
[illegible] చీనట్లు ॥ అంద ॥ 343

రేకు 171 ధన్నాసి

ఎఱఁగ వేసారు [illegible] జీవుఁడు
మెఱసి నిండుకున్నాఁడు [illegible] యీ దేవుఁడు ॥ పల్లవి ॥

వూరకే పరాకై వుట్టుండు[illegible] దేవుఁడు
[illegible]రుకొన [illegible]తిలోఁ దనపైనే చింత
[illegible] మరి [illegible]యుట్టే వుండును
యీరీతి మాటాడించేవాఁ డన్నిటా నితఁడే ॥ ఎఱఁ ॥

యెంతు లేసయుట్టేవుండు నెంచి చూచితే దేవుఁడు
చెంది [illegible]కశరీరియై చె[illegible]రేగిని
అందు[illegible] యె[illegible] దాను అద గినట్టు నే యుండు
[illegible]డరిఁ బోషించేవాఁడు యెప్పుడూ నితఁడే ॥ ఎఱఁ ॥

చేరి [2]లోనుగానెట్టుండు శ్రీవేంకటేశ దేవుఁడు
కోరి [illegible]గము లిచ్చు గురులుగాను
వారికి [illegible]ల్మంగపల్లిఖుఁ డిట్టిదేవుఁడు
యీరూపుతో నుండు నిందరిలో నితఁడే ॥ ఎఱఁ ॥ 344

౧. 'లిచ్చి భావించినట్లు' వ్రా.ము.పా.

౨. 'లోనుగానట్టుండు' వ్రా. ము. పా. లోనుగాని+అట్టుండు=లోనుగానెట్టుండు. ఇది వ్యావహారికసంధి. ఈ వాఙ్మయమున పలుతావుల గలదు.

నాట

విష్ణుఁ డొకఁడే విశ్వాత్మకుఁడు
వైష్ణవమే సర్వంబును ॥ పల్లి

పరమేష్ఠి సేయుబ్రహ్మాండసృష్టియు
హరునిలోనిసంహారశక్తి
పరగఁగ నింద్రునిపరిపాలనమును
అరసిచూడ శ్రీహరిమహిమలు ॥ విష్ణు

యిలఁ బంచభూతములలో గుణములు
అల నవగ్రహవిహారములు
తలకొను కాలత్రయధర్మంబులు
అలరఁగ నారాయణునిమహిమలే ॥ విష్ణు

అంతటఁ గలమాయావిలాసములు
పొంతఁ బరమపదభోగములు
వంతుకు నెక్కినవరుసమస్తమును
యింతయు శ్రీవేంకటేశుమహిమలే ॥ విష్ణుఁ ॥

గుజ్జరి

ఒకటి కొకటి లంకై పూరకైనాఁ బెనగొను
అకటా యెవ్వరు దాఁటేరయ్య నీమాయలు ॥ పల్లి

తనయెదుటివెల్లాను తలఁపులోఁ బారును
మనసులోపలివెల్లా మర్మము లంటు
ఘనమర్మములు రేఁగి కాయమెల్లాఁ గరఁగించు
తనువుసౌఖ్య మవ్వలితనువున నంటును ॥ ఒక

అవ్వలిదేహభోగము లట్టె పరములోన
ముప్వంకిఁ గర్మాలు లోకములై చెంగును
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు
తెవ్వపికాలము నిద్రఁ దెలిసినై ముంచును ॥ ఒక ॥

వెస నాతెలివి యొకవేళ నన్నెఱిఁగించు
వసమై ఆయుఋతుకు వయసు మెత్తువు
యొసగి నీవు మెచ్చితే విహారము లిత్తువు
మిసిమి శ్రీవేంకటేశ మెరయు నియ్యాప ॥ ఒక ॥ 346

సాళంగనాట

శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా ॥ పల్లవి ॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమబలవంతా దహన వార్ధిలంఘన
ఘనసురనుత కలశాపురనివాస ॥ శర ॥

రవితనయసచివ రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువనపూర్ణదేహ బుద్ధివిశారద
జవసత్త్వవేగ కలశాపురనివాస ॥ శర ॥

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుకశ్రీవేంకటేశకరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస ॥ శర ॥ 347

బౌళి రామక్రియ

నమో నమో లక్ష్మీనరసింహా
 నమో నమో సుగ్రీవనరసింహా ॥పల్లవి॥

వరద సులభ భక్తవత్సల నరసింహా
 నరమృగవేష శ్రీనరసింహా
 పరమపురుష సర్వపరిపూర్ణ నరసింహా
 గిరిగుహానిలయ సుగ్రీవనరసింహా ॥నమో॥

భయహర ప్రహ్లాదపాలన నరసింహా
 నయనత్రయారవింద నరసింహా
 జయ జయ సుర నుతిసంనుత నరసింహా
 క్రియాకలాపసుగ్రీవనరసింహా ॥నమో॥

అతిప్రహాసిల స్మిత మోహనాకరూప నరసింహా
 నతపితామహముఖ్య నరసింహా
 సతత శ్రీవేంకటేశ్వర దివ్యనరసింహా
 కితవారిభంజన సుగ్రీవనరసింహా ॥నమో॥ 34

భైరవి

చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు
 యిత్తల మానేరములు యెన్ని లేవయ్యా ॥పల్లవి॥

అంగము యేడుజానలు ఆస కొండంతపొడవు
 యెంగిలిమేను ఆచార మెంతైనా గద్దు
 ముంగిలింతే సంసారము సాధించేది లోకమెల్లా
 అంగడికెక్కి జీవుని కలపు లేవయ్యా ॥చిత్త॥

మఱి సల్లెఁడంతలికె మాటలు గంపెఁడేసి
యెఱుక గొంచె విజ్ఞాన మెంచఁగరాదు
గుఱిలేనిది బదుకు కొండంత తేలు భోగము
నెఱవనిజీవునికి నేఁటి కేమయ్యా ‖ చిత్త ‖

పట్టరానిది మనసు బయలుఁదంపలి చేఁత
చుటుకొన్నది చిత్తము పట్టిఁ గట్టు
యిట్టె [1]యలమేలుమంగ నేలె శ్రీవేంకటేశుఁడు
నట్టన నీబంటుజీవుని కిఁక మఱి లేదయ్యా ‖ చిత్త ‖ 349

రేకు 172 ప్రతాపనాట

ఏమని నుతించవచ్చు నితని సిరులెల్లా
భీమవిక్రముఁ డితఁడు పెద్దహనుమంతుఁడు ‖ పల్లవి ‖

వొక్కలంగ చాఁచినాఁడు వొగిఁ దూర్పుఁ బడమర
తక్కక భుజాలు చాఁచె దక్షిణోత్తరాలు నిండ
మిక్కిలి బ్రహ్మలోకము మీఁదను శిరసెత్తెను
పిక్కటిల్లుమహిమతోఁ బెద్దహనుమంతుఁడు ‖ ఏమ ‖

వేడుక వాలము మీఁకాశవీధితోఁ బెనచినాఁడు
యేడుజలధులు చేనె యిదే మోకాళ్ళబంటి
వోడక పిడికిలించు నుగ్రదైత్యులతలలు
బేడలుగాఁ జేసినాఁడు పెద్దహనుమంతుఁడు ‖ ఏమ ‖

జళిపించి వలకేలు సకలము మెచ్చనెత్తె
కులగిరులు తనతొడలసందినే యడఁచె
బలువుఁడు శ్రీవేంకటపతిబంటు మతంగాద్రి-
బిలమువాన నున్నాఁడు పెద్దహనుమంతుఁడు ‖ ఏమ ‖ 350

---

౧. 'యలమేలుమంగ నేలే శ్రీవేంకటేశుఁడ' కావచ్చు.

దేసాళం

పనిగొననేరిచితే పాపమే పుణ్యమౌను
నినుఁగొలిచేయట్టినీసేవకులకు ॥ పల్లవి ॥

మనసు చంచలమైనా మరి నిన్నుఁ దలఁచితే
జనులకు నిహపరసాధనమౌను
తనువు హేయమైనా తగ నిన్నుఁ గొలిచితే
పనివడి యంతలోనే పవిత్రమౌను ॥ పని ॥

కర్మము బంధకమైనా కమ్మి నీసొమ్ముచేసితే
నర్మిలి మోక్షమిచ్చు నాధారమౌను
మర్మము కోరికయైనా మహి నీభక్తికెక్కితే
ధర్మములకుఁ బరమధర్మము దా నౌను ॥ పని ॥

జగమెల్లా మాయయైనా సరి నీకే శరణంటే
పగటున నదే తపఃఫలమౌను
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
మిగులా నిహమైనా మించి పరమౌను ॥ పని ॥ 351

లలిత

మనసు నమ్మనేర్చితే మనుజుఁడే దేవుఁడౌను
తనలోనే వున్నవాఁడు తావుకొని దైవము ॥ పల్లవి ॥

మగనిపై భక్తిచేసి మగువ యొక్కరితె
తెగి పరలోకము సాధించీనట
వొగి వీరవైష్ణవుఁడై వున్నవాఁడు హరిఁ గొల్చి
అగపడి ఘనమోక్ష మందనోపఁడా ॥ మన ॥

యేలికకై పగవారి నెదిరించి బంటొకఁడు
మేలైనపదవులంది మెరసీనట
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలు చేసి
కాలమందే యందరిలో ఘనుఁడు గానోపఁడా ॥ మన ॥

పరమపురుషార్థపుపని చేసి యొకరుఁడు
అరిది నధికపుణ్యుఁ డయ్యీనట
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ బూజించి దాసుఁడు
పరము నిహముఁ జెంది బ్రదుకఁగ నోపఁడా ॥ మన ॥ 352

దేసాక్షి

సోదించి చూడఁబోతే చూచి మఱపు
వో దేవదేవ మించె నోహో నీమాయ ॥ పల్లవి ॥

వొక్కటే పదార్థము వూరివారెల్లాఁ జూచితే
గుక్కిళ్ల మింగించి యానకొలుపుచుండు
[1] మక్కళించందరిలోనిమనసులు వేరు వేరో
వొక్కటో యేమనవచ్చు నోహో నీమాయ ॥ సోదిం ॥

ధరలో బిడ్డ వొక్కటి తల్లిదండ్రులిద్దరు
తొరలింపువేడుకలై తోఁచుచుండు
పెరిగేటిపుట్టుగులు భేదమో అభేదమో
వారుల కేమనవచ్చు నోహో నీమాయ ॥ సోదిం ॥

కోరేమోక్ష మొక్కటే కొలచే దిద్దరినట
చేరెవి న్నలమేల్మంగ శ్రీవేంకటేశ
మీ రిద్దరు నేకమో మీభావాలు వింతలో
వూరకే యేమనవచ్చు నోహో నీమాయ ॥ సోదిం ॥ 353

1. 'మక్కళించెందరిలో' లేక 'మక్కళించి+అందరిలో' ఇది వ్యావహారికసంధి. ఈవాఙ్మయమున దండిగ గలదు.

దేసాళం

ఎన్నిపాట్లఁ బడ్డాను యెవ్వరికిఁ జెప్పేనాను
పన్ని నీముద్రలఁగాక పాపము వోయీనా ॥ పల్లవి ॥

కందువ నీపాదాలపైఁ గట్టిపెట్టినఁగాక
సందులుదూరెమనసు చక్కనుండీనా
నిందలేక యేపొద్దు నిన్నే కొలిచినఁగాక
తుందుడుకు నీమాయ తొలఁగిపోయీనా ॥ ఎన్ని ॥

వుదివో నిరుచులు నీ కొప్పగించినఁగాక
బదిఁ బంచేంద్రియములు పయచ్చీనా
జడియక నే నీకు శరణుచొచ్చినఁగాక
వొదలిలో కామక్రోధా లుడిగిపోయీనా ॥ ఎన్ని ॥

నిక్కపునాకర్మములు నీకొరకునైనఁగాక
యిక్కడ నేఁ జేసేటిహింస మానీనా
పక్కన నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
అక్కర నీకు మొక్కక అజ్ఞానము వోయీనా ॥ ఎన్ని ॥ 354

నాట

౧వాఁడెవో ప్రహ్లాదవరదుఁడు
౨వాఁడె వో భక్తవత్సలుఁడు ॥ పల్లవి ॥

కోరదవడలతోడ కోటిసూర్యతేజముతో
హారకేయూరాదిభూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదులెల్లాను సేవలు సేయఁగాను
మేరమీరినశిలలమేడలో నున్నాఁడు ॥ వాఁడె ॥

---

౧, ౨. 'వాఁడివో' రేకు. దగ్గరగా చేతితో చూపినట్లు రేకు పాఠము కావచ్చు.

తెల్లని మేనితోడ తీగెనవ్వులతోడ
చల్లని గంధముల వాసనలతోడ
వెల్లిగా నారదాదుల వేడుకొని నుతించఁగా
వెల్లవిరిఁ గొలువై వేడుక నున్నాఁడు ॥వాఁడె॥

సతులఁ జక్రములతోడ ఘంటపూదండలతోడ
పొంకపునానావిధభోగములతో
అంకపుశ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెల నేపొద్దూ నెలవై తా నున్నాఁడు ॥వాఁడె॥ 355

రేకు 173 మలహరి

ఎఱిఁగినవారికి హింస లిన్నియు మాని
మఱి సత్యమాడితేను మాధవుఁడే దిక్కు ॥పల్లవి॥

కలుగుఁ గారణములు కామక్రోధములు రేఁగ
వెలసినమాయావికార మది
కలఁగఁగనెలవదు కర్త లెవ్వరుఁ గారు
తెలిసి వోరుచుకొంటే దేవుఁడే దిక్కు ॥ఎఱిఁ॥

పదార్థా లెదుట నిలుచుఁ బంచేంద్రియాలు రేఁగ
వెదచల్లేటిమాయావికార మది
పదరి పైకొనవద్దు పట్టితేఁ బసలేదు
చెదరక వోరిచితే శ్రీపతే దిక్కు ॥ఎఱిఁ॥

సిరులు తానే వచ్చు చిత్తాన నాసలు రేఁగ
విరసపుమాయావికార మది
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు
శరణంటే నతనిచరణాలే దిక్కు ॥ఎఱిఁ॥ 356

ధన్నాసి

ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము
ప్రకటించి వొకటి చేపట్టరో వివేకులు ॥ పల్లవి ॥

తనుఁ దలఁచుకొంటేను తక్కినదేహభోగాలు
పనికిరావు అవి ప్రకృతిగాన
ఘనమైనలోకభోగములతో లోలుఁడైతే
తనుఁ గానరాదు జీవతత్వముగాన ॥ ఒక ॥

దైవము నెఱిఁగితేను తనకామ్యకర్మములు
భావించి మఱవవలె బంధాలుగాన
కావించేటితనకామ్యకర్మాలఁ గట్టువడితే
దైవము లోను గాఁడు స్వతంత్రుఁడుగాన ॥ ఒక ॥

సరి మోక్షముగోరితే స్వర్గము తెరువు గాదు
అరయ స్వర్గము తెరువలమోక్షానకు
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశువి
శరణాగతియె సర్వసాధనముగాన ॥ ఒక ॥ 357

లలిత

హరి హరి నీమహిమ లనంతములు
నిరతి జీవులకెల్ల నేరుపులై వున్నవి ॥ పల్లవి ॥

యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి
అందరికిఁ దమతమదై వుండును
కందువ నెవ్వ రెవ్వరి కాణాచి యైనదో భూమి
సందడించీఁ బంటలను సకలసస్యములు ॥ హరి ॥

చుట్టాల యెం(యెం?)దరికిని సొమ్మయినదో కాలము
అట్టె అందరిఆయుష్యమై యున్నది
గట్టిగా నెవ్వరెవ్వరిఁ బంచముకూడదో యీమాను
దట్టపుసంసారములధర్మములై యున్నవి ॥ హరి ॥

ముంచి యెం(యెం?)దరికై నాను మోపులై వుండీ కర్మము
పంచు కందరికిఁ దమ¹ పనిపాటలై
వంచుక శ్రీవేంకటేశ వారివారిబ్రదుకులు
సంచి నీవే యైతివి నిధినిధానమవై ॥ హరి ॥ 358

## భూపాళం

²పావనము గావో ³జిహ్వ బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని పొంక వేమారునుఁ బాడి ॥ పల్లవి ॥

హరినామములే పాడి అతనిపట్టపురాణి
ఇరవై మించినయట్టియింపరఁ బాడి
సరి నిర వంకలాను శంఖచక్రములఁ బాడి
వరదకటిహస్తాలు పటునతోఁ బాడి ॥ పావ ॥

ఆదిపురుషునిఁ బాడి అట్టె భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపుబ్రహ్మాండాలు మోచేవుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి ॥ పావ ॥

---

౧. 'పనివాటలై' రేకు. పని+పాటలు=పనిపాటలు. ఈసంధు లీవాఙ్మయమున కొల్లలు. ౨. ఈపాటలో 'వరదహస్తము' పేర్కొనబడినది. క్రిందికి శనకుడి చేతితో పాదములను చూపుచున్న వైకుంఠహస్తమే వరదహస్తముగ భావించిరేమో. ఉరమున శ్రీదేవి, వీపున భూదేవి, శిరముపై తులసి ఉన్నట్లు ఈ వాఙ్మయమున పలుతావుల గలదు. 'సర్వాంగములు' అని చెప్పుటచే అన్ని అవయవములను స్వామిస్వరూపము గానే భావించుట వీరి పరిపాటి. ౩. 'జింహ్వ' రేకు.

శ్రీవేంకటేశుఁ బాడి శిరసుతులసిఁ బాడి
శ్రీవత్సముతోడురముఁ జెలఁగి పాడి
లావుల మకరకుండలాలకర్ణములు పాడి
ఆవటించి యితనిసర్వాంగములుఁ బాడి ॥పావ॥ 359

దేసాక్షి

నీవు వెట్టినట్టిదిక్కు నీవే తెలుపవలె
నావశమా తెలియ నారాయణా ॥పల్లవి॥

నీటిలోన నొకబుగ్గ నిమిషములోనఁ బుట్టి
కోటిసేసినట్లుండుఁ గొంతవడి
పాటించి యందే యడఁగెఁ బ్రకృతియో బ్రహ్మమో
యేఁటిదో వీనియర్థ మెరిఁగించవయ్యా ॥నీవు॥

ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయు పిసరు లోలోనె
మైకొని యందే యడఁగె మాయయో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్యా ॥నీవు॥

భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవేంకటేశ
వాములై వెలయు సేసేవారికి
ఆముక యందే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెరిఁగించవయ్యా ॥నీవు॥ 360

నాట

ఎత్తుకొన్న బహురూప మిఁక మరి మానరాదు
చిత్తగించి మన్నించు శ్రీనరసింహా ॥పల్లవి॥

పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి
గట్టిగా కనకదైత్యు ఖండించితివి
యిట్టినీచేఁతలు విని యిందరుఁ గొల్చేరు నిన్ను
కట్టుకొంటి వింతపని ఘననారసింహా ॥ ఎత్తు ॥

దేవతలమొ రాలించి దీకొంటి వింతపనికి
చేవ నభయము లిచ్చి చేయెత్తితివి
దేవుఁడ వని యెఱిఁగి త్రిజగాలు మొక్కె నీకు
నీవల్లనే వచ్చె నిది నిత్యనారసింహా ॥ ఎత్తు ॥

భూకాంతవిన్నపము పొంచి విని గుర్రైతివి
శ్రీకాంత తొడమీఁదఁ జేకొంటివి
మీకును శ్రీవేంకటాద్రిమీఁదనే శరణంటిమి
దాకొనె మీమహిమలు దండినారసింహా ॥ ఎత్తు ॥ 361

రేకు 174 లలిత

ఆతనిమూలమే జగమంతా నిది
ఆతుమలో హరి కీలుఆయివుండుఁగాని ॥ పల్లవి ॥

మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
యెచ్చు కుందు లేకున్న నెక్కడైనా సుఖమే
యిచ్చకుఁడై హరి తన కియ్యవలెఁగాని ॥ ఆత ॥

నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రతమైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టె హరి దనకు నియ్యవలెఁగాని ॥ ఆత ॥

చెప్పినట్లు నేసితేను చేరి దేహమే చుట్టము
తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పునహరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డియ్యవలెఁగాని ॥ అత ॥ 362

సాళంగనాట

దిక్కు నీవే జీవులకు దేవసింహమా
తెక్కులగద్దియమీఁది దేవసింహమా ॥ పల్లవి ॥

సురలెల్లాఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల
తిరమైనమహిమల దేవసింహమా
నిరతిఁ బ్రహ్లాదుఁడు నీయెదుట నిలిచితే
తెరదీసితి మాయకు దేవసింహమా ॥ దిక్కు ॥

భుజము లుప్పొంగఁగాను పూఁచినశంఖుఁజక్రాల
త్రిజగములు నేలేటి దేవసింహమా
౧ గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి-
ద్విజమునిసంఘముల దేవసింహమా ॥ దిక్కు ॥

ముప్పిరిదాసులకెల్లా ముందు ముందే యొసగేటి-
తిప్పరానివరముల దేవసింహమా
చిప్పల నహోబలాన శ్రీ వేంకటాద్రిమీఁద
తెప్పలదేలేటియట్టి దేవసింహమా ॥ దిక్కు ॥ 363

౧. గజ=దండి అని అర్థము కావచ్చు. 'దండిసిరులు' అనుటకు 'గజసిరులు' అనియు వీరిప్రయోగము. 'గజదొంగ' వలె దీనిని సాధించుకొనవలెనేమో. 'గజభజింపుచు' కూడ అట్లనే.

బౌళి

కన్నులపండుగలాయ కమ్మి సేవించేవారికి
సన్నుల నీ దాసులము సంతసించేము ॥ పల్లవి ॥

పడఁతు లిద్దరు నీపాదములు వొత్తఁగాను
కొంగుకు బ్రహ్మదేవుఁడు కొలువఁగాను
కడుపులో లోకములు కడు జయవెట్టఁగాను
గుడిగొనె నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥

మెత్తఁగా శేషుఁడు నీకు మించుఁబరపై వుండగా
జొత్తుమధుకైటభులు సుక్కి వోడఁగా
హత్తి దేవతలు నిన్ను నందరుఁ బూజించఁగాను
కొత్తలాయ నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥

పరగి నీముందరను పంచబేరము లుండఁగా
గరిమఁ జక్రము నీకుఁ గాపై వుండఁగా
తిరమై శ్రీవేంకటాద్రితిరుపతిలోపలను
గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా ॥ కన్ను ॥ 364

శ్రీరాగం

కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూశినముత్తైమువలె మొక్కేము నీకు ॥ పల్లవి ॥

నెమ్మిఁ జక్రాయుధుఁడవు నీవు గల వటుగాన
నమ్మి మాకు నెన్నఁడును భయమే లేదు
యిమ్ముల లక్ష్మీపతివి యేలిక వైతివిగన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు ॥ కేశ ॥

పుట్టించినవాఁడవు భూధవుఁడ వటుగన
దట్టముగ నెంచగఁ బదస్థుఁడ నేను
తొట్టి కరిరాజవరదుఁడ నీవే దిక్కుగన
గట్టిగా నాకోరిక లిక్కడ ఫలియించెను ॥ కేశ ॥

గురువవు గొల్లలకు గోవిందరాయవుగన
నిరంతరమునుఁ బొడి నిండెను మాకు
చిరంతనదేవుఁడవు శ్రీవేంకటేశ్వర నీవు
పరము నిహము మాకు బలువుగాఁ గలిగె ॥ కేశ ॥ 365

గౌళ

హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరం౧ జ్యోతిస్స్వరూపపుపైఁడికుండతేరు ॥ పల్లవి ॥

గరుడధ్వజపుఁదేరు కనకమయపుఁదేరు
సురలు బొమ్మలైనారు చుట్టుఁదేరు
మెరుఁగుల మేఘములమించుఁగొణిఁగెలతేరు
సిరుల ధ్రువలోకపుశిఖరపుఁదేరు ॥ హరి ॥

బలుకులపర్వతాలె బండికండ్లైనతేరు
నలుదిక్కులంచులవున్నతపుఁదేరు
కొలఁదిలేనిచుక్కలకుచ్చులముత్తెలతేరు
మెలుపునాకాశగంగమేలుకట్లతేరు ॥ హరి ॥

మునులనే వుత్తమాశ్వములఁగాఁ గట్టినతేరు
ఘనమహిమలనేసింగారపుఁదేరు
యెనసి శ్రీ వేంకటేశుఁ డెప్పుడూ నలమేల్మంగ
దినదినభోగములఁ దిరమైనతేరు ॥ హరి ॥ 366

౧. 'జ్యోతిస్స్వరూప' కావచ్చు.

బౌళి

పరమపురుష[౧] నిరుపమాన శరణు శరణు రే[౨] యే యే యే యే ఇందిరా-
నిజమందిరా ॥ పల్లవి ॥

కమలనాభ కమలనయన కమలచరణు[౩] రే
అమితసురమునినాధయూథపనాయకా వరదాయకా ॥ పర ॥

చతురమూరితి చతురబాహుశంఖచక్రధరా
అతిశయశ్రీవేంకటాధిం అంజనాకృతిరంజనా ॥ పర ॥ 367

మాళవి

[౪] హాసమీచీనమపహాసం తే
దాసైప్రకాశితం దరిదంతు లోకే ॥ పల్లవి ॥

ద్వారకాపట్టణే త్వం పురా చ స్వయదీక్షితస్తా స్త్రియః
కేశముష్టిః కథం సారస కురువంతి సరసవేళాయాం ॥హాస ॥

వరశిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారి అధోచేస్తదేతి
గోపతరుణయః కిమితి వా తద్వసతి త్వం ॥ హాస ॥

తత్తబృందావనే త్వం పురా చ శ్రియా వేంకటాద్రౌ ఇదం .
నిర్విభాసి ఇధుల చిత్తమిత్యమరాశ్చ ది సేవంతి సర్వే ॥*హాస॥368

---

౧. 'నిరుపమాణ' రేకు. ౨. ఈ నాలుగు యెకారములు పూర్వముద్రణమున జారిపోయినవి. ఈ 'యె' కారములు 'శరణురే' లోని 'ఎ' కారమునకు అనుబంధి-స్వరప్రతీకములుగా వుంచినారేమో. పల్లవి ఒకపాదముగా, చరణములన్నియు రెండేసి పాదములుగా నడచిన దీపాట. ౩. 'చరణ' కావచ్చు. ౪. ఈ కీర్తనవిషయములో పూర్వపరిష్కర్తలభావమే నాదికూడ. * ఈసంకీర్తన సంస్కరింప వీలుకాకున్నది.

రేకు 175 దేవగాంధారి

సదానందము సర్వేశ్వర నీ-
పదారవిందముపై భక్తి ॥ పల్లవి ॥

నయనానందము నరులకు సురలకు
జయమగు హరి నీసాకారము
నయమగుశ్రవణానందము వినినను
క్రియగలిగిననీకీర్తనము ॥ సదా ॥

చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁ గొనునీప్రసాదము
నలుగడ దేహానందము బుధులకు
బలునీపాదప్రణామములు ॥ సదా ॥

ధరఁ బరమానందము నీదాస్యము
గరిమల శ్రీవేంకటవిభుఁడా
నరహరి విత్యానందము నినుఁ దగ-
వరవిరిఁ జేయుసమారాధనము ॥ సదా ॥ 369

సామంతం

అరసి వేరొకచో ముక్తుడుగఁగవలదు
సారపులౌకికవిమోచనమే ముక్తి ॥ పల్లవి ॥

మొగిఁ బుణ్యపాపవిముక్తియే ముక్తి
వెగటుఁబ్రపంచపువిముక్తే ముక్తి
తగులుసంసారబంధవిముక్తే ముక్తి
జగములోఁ గలుగుయాశాముక్తే ముక్తి ॥ అర ॥

కామక్రోధాదిసంగవిముక్తే ముక్తి
వేమారు రుచులపై విముక్తే ముక్తి
నాముల దేహాభిమానపుముక్తే ముక్తి
పామెడికోరికలసంపదముక్తే ముక్తి ॥ ఆర ॥

ముందువెనకల కర్మమోచనమే ముక్తి
అంది సుఖదుఃఖభయముక్తే ముక్తి
కందువ శ్రీవేంకటేశుఁ గని యుందే శరణని
విందుల నితరసేవావిముక్తే ముక్తి ॥ ఆర ॥ 370

సాళంగనాట

ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచిచూచఁ
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు ॥ పల్లవి ॥

విశ్వరూపపుబ్రహ్మము విరాట్టయినబ్రహ్మము
ఐశ్వర్యస్వరాట్టౌసామ్రాట్టయినబ్రహ్మము
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైనబ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము ॥ ఈతఁ ॥

సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలునిభాస్వత్తేజము
కార్యపుటవతారాలఁ గనుఁగొనే తేజము
౧వీర్యపుటెజ్ఞభాగాలవిష్ణునామతేజము ॥ ఈతఁ ॥

---

౧. 'వీర్యము+యజ్ఞభాగాలు' సామాసికములైన "పు.టు" ఆగమములు వచ్చి జరిగిన వ్యావహారిక సంధి. "యజ్ఞము" లోని యకారము అచ్చుగా గ్రహించుట వింత.

పరమపురుషమూర్తి ప్రకృతియైనమూర్తి
గరిమతో మహదహంకారమూరితి
ధరఁ బంచతన్మాత్రలు తత్వము లైనమూరితి
గరుడానంత[1] నేనేశక ర్తయైనమూరితి ॥ ఈతఁ ॥

భాగవతపుదైవము భారతములో దైవము
సాగినపురాణవేదశాస్త్రదైవము
బోగులైనబ్రహ్మలను బొడ్డునఁ గన్నదైవము
శ్రీగలిగి భూపతైనశ్రీవేంకటదైవము ॥ ఈతఁ ॥ 371

### దేసాళం

గతులన్ని ఖిలమైనకలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥ పల్లవి ॥

యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి-
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర-
మీతఁడే రామానుజులు యిహపరదైవము ॥ గతు ॥

వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము ॥ గతు ॥

నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశునగ[2] మెక్కెవాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టే తల్లితండ్రిదైవము ॥ గతు ॥ 372

౧. 'శనేశక' పూ.మూ.పా. ౨. 'మెక్కె' రేకు.

నాదరామక్రియ

నే నేమెఱిఁగి సేసేనో నీకుఁ దిరువారాధన
అని మున్నిటిబ్రహ్మరుద్రాదులు సేయఁగలేరు ॥ పల్లవి ॥

అనుగునీరూప ౧ మింతంత నెఱిఁగి సేసేనో
వునికై నీ వొక్కచోనే వుండే దెఱిఁగి సేసేనో
తనిసి నీకు నొక్కమంత్రమ నెఱిఁగి సేసేనో
కనరానినీమహిమే కడయెఱిఁగి సేసేనో

మఱిగి నీకు నొక్కనామము నెఱిఁగి సేసేనో
అరసి యించుకేకాలమ నెఱిఁగి సేసేనో
నిరతి నీ కేమి లేవని యెఱిఁగి సేసేనో
బెరసి ౨ నన్నుఁ గొంత మెప్పించ నెఱిఁగి సేసేనో ॥ నేనే ॥

తెలిసి నీకు నొక్కమూర్తియ నెఱిఁగి సేసేనో
అలమిననీమాయఁ గొంత నెఱిఁగి సేసేనో
అలమేల్మంగకుఁ బతియగుశ్రీవేంకటేశుఁడ
వొలిసి నీ కుపమింప నొక్కటెఱిఁగి సేసేనో ॥ నేనే ॥ 373

వరాళి

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥ పల్లవి ॥

మీనకూర్మ ౩ వరాహా మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ॥ డోలా ॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ ॥ డోలా ॥

---

౧. 'ఇంతంత+అని+ఎఱిఁగి'. ఇట్టి స్థలములందంతటా ఇట్లే.

౨. 'నిన్నుఁ' కావచ్చు   ౩. 'వరాహ' కావచ్చు.

ధారుణ బుద్ధ కలికి దశవిధఅవతారా
శిరపాణే గోసమాణే శ్రీవేంకటగిరికూటవిలయ[1]॥ డోలా ॥374

రేకు 176 బౌళి

జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటునాసోదంబు ఇది నీవెలితో నావెలితో ॥ పల్లవి॥

యెన్నిమారులు సేవించినఁ గన్నులూ దనియవు
విన్ననీకథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వాయుఁ దనియదు
విన్న కన్నది గాదు ఇది నావెలితో నీవెలితో ॥ జగ

కడఁగి నీప్రసాదమే కొని కాయమూఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములు సేసి పాదములు [2]నివిఁ దనియవు
నుడివి సాష్టాంగఁబు చేసి నుదురునూఁ దనియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నావెలితో నీవెలితో ॥ జగ ॥

[3]చెలఁగి నిను నేఁ బూజించి చేతులూఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తమూఁ దనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మ నను మోహించఁజేసితి
వెలయ నన్నియుఁ దేరె మును నీవెలితో నావెలితో ॥జగ॥375

---

౧ ఈ పాటలో ప్రతిచరణమునందును మొదటి పాదమునకు తరువాత పల్లవి వలె "డోలాయాం చల దోలాయాం" ఇత్యాదిగా కలదు. సంగీతకోవిదులగు పూజ్యపాదులు రాళ్లపల్లివారిపరిష్కరణము గావున పూర్వముద్రణమును మార్చలేదు. ౨. 'ఇయున్' లో 'యు' లోపించిన రూపము కావచ్చు. ౩ ఈపాదములో క్త్వాంతమైన 'పూజించు' ధాతువులో కర్త నేను, 'తనియు' ధాతువులో కర్తలు చేతులు.

దేవగాంధారి

అందుకే నేఁ జింతించెదను అచ్యుత నీశరణాగతుఁడ
సందిడి నాభవ మిందువల్లనే సఫలంబాయనయ్యా ॥ పల్లవి ॥

వొకనినామము వొగిఁ దలంచిన
అకలంకం బగునాపాపంబులు అన్నియుఁ బారణేనేసె
అకటా తక్కిన అనంతనామములు
వొకట నుపవాసములున్న వోయయ్యా ॥ అందు ॥

హరి నీపాదము లవి రెండే
పరమును నిహమును నా కొసఁగెను పయిపైఁ గృపతోడ
ధర నీయనంతకరములు తా మేమి
సిరు లిత్తు మనుచు చెలఁగీనయ్యా ॥ అందు ॥

ఇల నీదాస్యం బిది యొకటే
సిలుగులభవములజిలుగు మాన్పె నదె చిత్తముతహ దీర
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ విదె
తలఁపునఁ బాయక దక్కితివయ్యా ॥ అందు ॥ 376

మాళవి

దేవ నమో దేవా
పావనగుణగణభావా ॥ పల్లవి ॥

జగదాకారచతుర్భుజ
గగననీలమేఘశ్యామ
నిగమపాదయుగ నీరజనాభ
అగణితలావణ్యానా ॥ దేవ ॥

౧ఘనవేదాంతైగణన విస్తార
కనకశంఖచక్రకరాంకా
దనుజమణిశిక్షాదిదివ్యపటోదయ
అనుపమంపవిబింబాధరా. ॥ దేవ ॥

భావజకంజభవజనక
శ్రీవనితాహృదయేశ
శ్రీవేంకటగిరిశిఖరవిహార
పావనగుణగణభావా. ॥ దేవ ॥ 377

బౌళి

దేహంబొకటే దేహియు నొకఁడే
దాహంబెంతటఁ దనియునో తలఁపు ॥ పల్లవి ॥

వినుకలి వెంట వెడలీఁ దలఁపు
కనుకలి వెంటఁ గదలీఁ దలఁపు
కొననాలుక మదిఁ గూడీఁ దలఁపు
తువిగినయెన్నెన్నితునకలో తలఁపు ॥ దేహం ॥

నయమగుచోటను నవ్వీఁ దలఁపు
భయమగుచోటను బడలీఁ దలఁపు
లయమై నిద్రల లవమౌఁ దలఁపు
క్రియ నెందరిపంగెనయో తలఁపు ॥ దేహ ॥

భావించినగతిఁ బారీఁ దలఁపు
వేవేలుగతుల వెలసీఁ దలఁపు
శ్రీవేంకటపతిచిత్తములోపల
నీవే తెలుపఁగ నిలుఁగనె తలఁపు ॥ దేహం ॥ 378

౧. 'ఘనవేదాంతి+ఐ' అని విభజిస్తే బాగున్నట్లు తోచదు. 'వేదాంతైకగణన' లేక 'వేదాంతగణన' కావచ్చునేమో

సాళంగనాట

మొక్కరె మొక్కరే మిరు ముందు ముందే జయ లిడి
దక్కి శ్రీవేంకటేశుఁడే తానైనదేవునికి ॥ పల్లవి ॥

కరములు వే యవే కరములను భయం-
కరనఖాయుధములు కడలే వవే
సిరి దొడపై నదె సింహపునెమ్మొ మదే
నరరూపు సగమదె నరసింహునికి ॥ మొక్క ॥

వంకరకోర లవె వజ్రపుదంతము లవె
సంకుఁ జక్రము నిరువంకలా నవె
జంకెల నేత్రము లవె జడలు మూఁపున నవె
అంకె నభయహస్తము అదె నరహరికి ॥ మొక్క ॥

నిక్కినకర్ణము లవె నీలిమచ్చపుర మదె
చుక్కలమొలపూసల నొక్కరూ పదె
తొక్కినపాపము లవె తోడనే శ్రీవేంకటాద్రి
పక్కెరనరసింహపుప్రళయసింహునికి ॥ మొక్క ॥ 379

భౌళి

తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లిదె నట్టనడుమ నింతేసి మెరసీ ॥ పల్లవి ॥

పుట్టినప్పుడే దేహి బుద్ధు లేమీ నెఱఁగఁడు
యిట్టె లోకులఁ జూచి యింత నేరిచె
[1] ముట్టుకొన్న యింద్రియాల ముదిసి ముదిసి రాఁగా
తట్టువడి తనమేను తానే మఱచె ॥ తొల్లి ॥

౧ 'ముట్టుకొన్న యింద్రియాలు' కావచ్చు.

మనుజుఁడైనప్పుడే తా మాటలేమి నెరఁగఁడు
జనులాడుకొనఁగానె సంగడి నేర్చె
దినదినభోగాలదృష్టాంతము లెల్ల
అనుభవనై తన కదియాలమాయ ॥ తొల్లి ॥

తచ్చి తాఁగలప్పుడే దైవము నెఱఁగఁడు
విచ్చ నాచార్యునవల్ల నేఁ డెఱిఁగె
అచ్చపుశ్రీవేంకటేశుఁ డంతర్యామై యుండి
యిచ్చఁ గరుణించఁగాను యెక్కుడాయఁ దాను ॥ తొల్లి ॥ 380

రేకు 177 గుజ్జరి

జగమంతా నీమయము సర్వం విష్ణుమయంబుగాన ॥ పల్లవి ॥

యెనయుచు నేఁ గర్మమార్గముల నితరదేవతల భజియించెదను
అని యపరాధం బెంచకుమీ అన్యము నీకంటె మరి లేదు
పనివడి "మత్తః పరతరం" బని పలికితి విన్నియు నీ
యాజ్ఞలు ॥ జగ ॥

దేవ నావుదరపోషణకు తిరిగి హింస చేసెదను
పీ విది నావల నెంచకుమీ నీవే అఖండ ౧చేతన్యుఁడవు
దేవ మిము ౨"నైతేన వినా తృణాగ్రమపి" యని శ్రుతి
వొగడెడివి ॥ జగ ॥

భువిలో నాకట పూర్వకర్మమట పొసఁగదు నే నీసరణి నీయడను
అవి నా కేమియుఁ బనిలేవు అంతరియామివి నీవు
అవలను "త్వమేవశరణం గతి" యనుటది నమ్మితి
శ్రీవేంకటనిలయా ॥ గజ ॥ 381

---

౧. 'చైతన్య' కావచ్చు. ౨. మిమునైతే "న వినా తృణాగ్రమపి" యని కావచ్చు-నేమో. "నహి తేన వినా" అని గదా శ్రుతి. పూర్వపరిష్కర్తలు 'నైతేన' శ్రుతివాక్యముగ గ్రహించిరి.

గుజ్జరి

అర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే ॥ పల్లవి ॥

సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుఁడవు
సర్వసర్వంసహాచక్రవర్తి
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే ॥ అర్తుఁ ॥

పరమాత్ముఁడవు నీవు ౧ పరంజ్యోతివి నీవు
పరమ పరానంద పరమపురుషా
కరిరాజవరదా కారుణ్యనిలయా
శరణాగతుఁడ నన్ను సరిఁ గావవే ॥ అర్తుఁ ॥

అణువులోపలినీవు ఆదిమహత్తును నీవు
ప్రణుతశ్రీవేంకటప్రచురనిలయా
అణిమాదివిభవా ఆద్యంతరహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు ॥ అర్తుఁ ॥ 382

లలిత

విజాతు లన్నియు ౨ వృథా వృథా
అజామిళాదుల కది యేజాతి ॥ పల్లవి ॥

జాతిభేదములు శరీరగుణములు
జాతి శరీరము సరిఁ ౩ దోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపుదాస్యం బిది యొక్కటె పో సుజాతి ॥విజా॥

౧. 'పరంజోతి' రేకు ౨. 'వ్రిథ వ్రిథా' రేకు.
౩. 'సరిఁ' ఈ పదము పూర్వముద్రణమున జారిపోయినది. యతిభంగము.

హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి ॥ విజా

లౌకికవైదికలంపటులకు నివి
కైకొను నవశ్యకర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతినేసిననంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి॥విజా॥ 383

గుజ్జరి

ఉపకారి దేవుఁడు అపకారి గాఁడు ॥ పల్లవి ॥

దేహం బొసఁగెను దేవుఁడు తనుఁ దెలియఁగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముఁడు మరి దేహచైతన్యుఁడా దాను
దేహి యేలోకంబున కేఁగిన దేవుఁడు దా వెంటనే యేఁగును
దేహి కోరినట్టే కమ్మర దేవుఁ డనుమతి ఇచ్చీఁగాన ॥ ఉప ॥

చేయుటకును చేయకమానుటకును జీవుఁడు స్వతంత్రుఁడాయం టేను
కాయపుసుఖములు గోరఁగఁ గర్తట కడగనుటకుఁ గర్త గాఁడా
యీయెడ నాయెడ నంతర్యామే యిన్నిటికివిఁ బ్రేరకుఁ డింతే
దాయక పాయక తనతలఁపుకొలఁది దైవమే సృజియించీఁగాన ॥ ఉప ॥

ఇవి యెరిఁగి చిత్తమా నీ వితనందే అభిరతి నేయుము
నదయుఁడు మనశ్రీవేంకటగిరిసర్వేశ్వరుఁడు సత్యుఁడు
మొదలనే యీయర్థము కిరీటితో మొగి నానతి ఇచ్చినాఁడు
అదే "నమోఽహం ౧పర్వభూతేషు" అని గీతలలో నున్నది
గాన ॥ ఉప ॥ 384

---

౧. 'పర్వం' రేకు.

బౌళి

౧ తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥ పల్లవి ॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ॥ తంద ॥

కందువగుహీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరె అంతరాత్మ ॥ తంద ॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్రదదియు నొకటే
మెండైనబ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁ డుండేటి సరిభూమి యొకటె ॥ తంద ॥

---

౧ పూర్వముద్రితపాఠమును యథారూపముగ పైన చూపియున్నాను. ఈ పరిష్కరణము సంగీతకోవిదులగు పూజ్యపాదులు శ్రీ॥ శే॥ రాళ్లపల్లివారిచేతిమీదుగా ముందు జరిగినది. సంగీతాను గుణముగ వారు పై చూపినటు మార్చియుందురని, నేటికి గాయని గాయకసంప్రదాయములో వున్నపాఠమని దానిని పైనచూపి రేకు పాఠము ఇందు చూపుచున్నాను.

తందనాన యాహి తందనాన ఆహా తందనాన। పురే తందనాన।
భళా తందనాన పరబ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే
పరబ్రహ్మ మొకటే
కందువగు హీనాధికము లిందు నేది
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతానొకటే. ॥ పల్లవి ॥
అని రేకుపాఠము

అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే
ఘనకీటపశువులకు కామసుఖ మొకటే
(1)దినమహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర (2)నిరుఁబేదకును వొక్కటే అవియు ॥తంద॥

కొరలి శిష్టాన్నములుగొనునాఁక లొకటే
తిరుగుదుష్టాన్నములు దినునాఁక లొకటే
పరగ దుర్గంధములపై వాయు వొకటే
వరుసఁ బరిమళముపై వాయు వొకటే ॥తంద॥

కడఁగి యేనుఁగుమీఁదఁ గాయు నెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయు నెండొకటే
కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే ॥తంద॥ 385

రేకు 178 బౌళి

మచ్చికఁ బ్రపంచపుమరపే బ్రహ్మానంద-
మిచ్చల తానే గురి ఇన్నిటికి నాత్మ ॥పల్లవి॥

ఈచూపే వెలిఁబడి లోకమయి తోఁచీని
ఆచూపే మరలితే నది మోక్షము
యేచి రెంటికి నెడమధ్య మీమేను
తాచి వొకఁడే గురి తానాయ నాత్మ ॥మచ్చి॥

---

౧. 'దినయహోరాత్రములు' రేకు. ౨. 'నిఱుపేద' పూ.ము.పా.

మన సొక్కుచోట నందిమాయలై తోఁచీని
మనసు తనందుంటే మహి యోగ్యము
వెనకమునుపులకు వీడుఁబట్టు జననము
కొనమొదలునుఁ దానే గురియాయ నాత్మ ॥ మచ్చి ॥

బయలు దునిసి బహుంభానులై తోఁచీని
బయ లొక్కట యఖండపరిపూర్ణము
నయమై శ్రీవేంకటనాథుకరుణచేత
జయమై తానున్నచోనే సతమాయ నాత్మ ॥ మచ్చి ॥ 386

బౌళి

నందగోపనందనుండే నాఁటిబాలుఁడు
ఇందు నేఁడే రేపల్లె నేచి పెరిగెను. ॥ పల్లవి ॥

పువ్వువంటిమట్టియాకుపొత్తిఁ బవళించనేర్చె
యెవ్వఁడో కావి తొల్లె యీబాలుఁడు
మువ్వంకవేదములను ముద్దుమాఁట లాడనేర్చె
యెవ్వరూఁ గొంత నేర్పనేఁటికే వీవికి ॥ నంద ॥

తప్పటడుగు లిడఁగనేర్చె ధరణియందు నాకసమున-
నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీఁ జెంద్రునందు పగలు
గొప్పసూర్యునందు వింకఁ గొత్త నేర్పనేఁటికే ॥ నంద ॥

మంచివెన్నబువ్వ లిపుడు మెలసి యారగించనేర్చె-
నంచితముగ శ్రీవేంకటాద్రిమీఁదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కాఁగిలించనేర్చె
దించరావిపురముమీఁద దివ్యకాంతను ॥ నంద ॥ 387

లలిత

అంతరాత్మ హరిగలఁ డంతే చాలు
యెంత కెంత చింతించ నేలా వెరవ ॥ పల్లవి ॥

వెనక జన్మపుగతి వివరించి నే నెరఁగ
అనుగుమీఁదటిజన్మ మది యెఱఁగ
నవిచి యీజన్మము నానాఁటఁ దెలిసేము
యెనసి యీభవములకేలా వెఱవ ॥ అంత ॥

విన్నటిదినముకత నిమిషమై తోఁచీని
కన్నుల రేపటిచేఁత కానఁగరాదు
పన్ని నేఁటిదినము మున్ను నోఁచినట్లే
యెన్నఁగ నెందుకునైనా నేలా వెఱవ ॥ అంత ॥

పరము నిహము నేఁ బైకొన నాయిచ్చ గాదు
హరి శ్రీవేంకటపతి యఖిలకర్త
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది
యిరవైతి వింకా నాకేలా వెఱవ ॥ అంత ॥ 38॥

గుండక్రియ

అదియేల తా మాను మాయందు విష్టారమే కాక
చెదరి విత్తొకటియుఁ జెట్టొకటి యౌనా ॥ పల్లవి ॥

కడుఁ బుణ్యపాపాలు గలిగినజన్మము
చెడుఁబుణ్యపాపాలు నేయకుండీనా
పుడమిలో ముష్టిమానఁ బొడమివశాఖలు
వడి ముష్టిపండ్లై పండకుండీనా ॥ అది ॥

పంచేంద్రియాలఁ బుట్టి పరగినయీ మేను
పంచేంద్రియాలమీఁదిభ్రమ మానీనా
పొంచి హేయములోనఁ బుట్టినకీటములెల్ల
కొంచి హేయమే చవిగొనకుండీనా ॥ అది ॥

శ్రీవేంకటేశ నీవుచేసినయీ మాయలు
నీవల్ల మానుఁగాక నేఁ గర్తనా
దైవమవై నాలోనఁ దగిలి నాదుర్గుణాలు
వేవేగ మానుపఁగ వెతదీరెఁగాక ॥ అది ॥ 389

శ్రీరాగం

అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు
పోల్ప నెంతపనికిఁ బూనితినయ్యా ॥ పల్లవి ॥

నీపదధ్యానములోనే నిండెను నామనసెల్ల
యేపున నీసాకార మేమిట భావింతునయ్య
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ నిదె
ఆఁపి నే నీయంగకాంతు ల వేమిట జూతునయ్య ॥ అల్ప ॥

నాలుక నీకథలేనినామములే నుడిగీని
మేలిమి నీగుణము లేమిటఁ బొగడుదునయ్య
గాలివంటివీనులు నీకథలఁ దనిసెనయ్య
యీలీల నీయనంతమహిమ -యెందు నిందునయ్య ॥ అల్ప ॥

నీకు శరణని యట్టె నే ధన్యుఁడనైతి
యీకడ నీసేవ సేసి యేమి గట్టుకొందునయ్య
శ్రీకాంతుఁడవైన శ్రీవేంకటేశ నీకు
పూఁకొన నాజన్మఫల మొకమొక్కు చాలునయ్య ॥ అల్ప ॥ 390

బౌళి

గరుడగమన గరుడధ్వజ
నరహరి నమోనమోనమో ॥ పల్లవి ॥

కమలాపతి కమలనాభా
కమలజజన్మ[౧] కారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో ॥ గరు ॥

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య[౨] జంతుకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో ॥ గరు ॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాధిప[౩] తేహం
అనుపమ నమో హరి నమో ॥ గరు ॥ 391

రేకు 179 సాళంగనాట

జీవుని తేకాలము శ్రీహరి చేరువబంధువుఁ డీతఁడు
భావములోపలి పెరరేఁపకుఁడై భక్తి చేకొనును యీతఁడు ॥ పల్లవి ॥

పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువుఁ డీతఁడు
ధరఁ దనుఁదలఁచిన మారుకుమారై తా రక్షించును యీతఁడు
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
వురుగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు ॥ జీవు ॥

౧. 'కారణిక' కావచ్చు. స్వార్థ'క'ప్రత్యయము. ౨ 'జంతూకల' రేకు. 'జంతూకుల' కావచ్చు. ౩. ''వేంకటాధిపతేహం'' పూ. ము. పా. వేంకటాధిప, తే=తుభ్యం, అహం నమః=నమస్కరోమి, అని కావచ్చు.

గలకాలము యిరువదియొక్కటవావులబంధువుఁ డీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యిన్నిటఁ బనులకు నొదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తుఁ డీతఁడు
పొదలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతఁడు
॥ జీవు ॥

నిధినిక్షేపములిచ్చేటివుపకారపుబంధువుఁ డీతఁడు
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతఁడు
నవిచి శ్రీవేంకటేశ్వరుఁడై యిటు నాపాలఁ గలుగు నీతఁడు
పనివడి అరులను సూదుపట్టి కడుఁ బగసాధించును యీతఁడు
॥ జీవు ॥ 392

బౌళి

మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
ంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

ంతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
ంకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
ంతురు మిము శైవులు తగినభక్తులను శివుఁ డనుచు
లరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ఎంత॥

నన్నెదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు
దరిశనములు మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు
సల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పం బవుదువు
రిమల మిమునే ఘనమని తలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥

నఁ గొరతే లేదు మరి నీరుకొలఁదితామెరవు
వల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
వేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని
వల నే నీశరణనియెదను యిదియే పరతత్వము నాకు ॥ఎంత॥393

---

౧ 'దరిశనముల' కావచ్చు.

బౌళి

గరుడగమన గరుడధ్వజ
నరహరి నమోనమోనమో ॥పల్లవి॥

కమలాపతి కమలనాభా
కమలజజన్మ౧ కారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో ॥గరు॥

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య౨ జంతుకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో ॥గరు॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాధిప౩ తేహం
అనుపమ నమో హరి నమో ॥గరు॥ 391

రేకు 179 సాళంగనాట

జీవుని తేకాలము శ్రీహరి చేరువబంధువుఁ డీతఁడు
భావములోపలి పెరరేఁపకుఁడై భక్తి చేకొనును యీతఁడు ॥పల్లవి॥

పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువుఁ డీతఁడు
ధరఁ దనుఁదలఁచిన మారుకుమారై తా రక్షించుసు యీతఁడు
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
పురుగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు ॥జీవు॥

---

౧. 'కారణక' కావచ్చు. స్వార్థ'క'ప్రత్యయము. ౨. 'జంతూకల' రేకు. 'జంతూకుల' కావచ్చు. ౩. "వేంకటాధిపతేహం" పూ. ము. పా. వేంకటాధిప, తే=తుభ్యం, అహం నమః=నమస్కరోమి, అని కావచ్చు.

వడిఁ గలకాలము యిరువదియొక్కటివావులబంధువుఁ డీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యిన్నిటఁ బనులకు నొదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తుఁ డీతఁడు
పొడలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతఁడు
॥ జీవు ॥

ఘననిధినిక్షేపములిచ్చేటివుపకారపుబంధువుఁ డీతఁడు
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతఁడు
ననిచిన శ్రీవేంకటేశ్వరుఁడై యిటు నాపాలఁ గలుగు నీతఁడు
పనివడి అరులను సూడువట్టి కడుఁ బగసాధించును యీతఁడు
॥ జీవు ॥ 392

బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడవి
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁ డనుఁచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ఎంత॥

సరి నన్నెదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు
౧ దరిశనములు మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁదితామెరవు
ఆవల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని
యీవల నే నీశరణనియెదను యిదియే పరతత్త్వము నాకు ॥ఎంత॥ 393

౧ 'దరిశనముల' కావచ్చు.

సాళంగం

నీవే మూలమువో నేరిచినపెద్దలకు
దేవుఁడు నీయందులోనే తిరమాయ విదివో ॥ పల్లవి ॥

బాపురే వో దేహమా బాపురే వో నీవు
వోపి నేఁ బెట్టినకొద్ది నుందువుగా
రూపు నీవు గలిగితే రుచులెల్లఁ గానఁగద్దు
చాపలాన ధర్మములు సాధింపఁగలదు ॥ నీవే ॥

మెచ్చితి నోమనసా మెచ్చితివో [illegible]
యిచ్చకొలఁది నెందైనా నేఁగుదువుగా
అచ్చపునీకతమున నవుఁగాము లెంచఁగద్దు
పచ్చిగా యేమూర్తినైనా భావించఁగలదు ॥ నీవే ॥

మేలు మేలు నాలికె మేలు మేలు నీవు
వోలి యేమాటకునైనా నొనరుదుగా
చాలి నీవు మెలఁగంగ చదువు చదువఁగద్దు
పోలించి శ్రీవేంకటేశుఁ బొగడఁగఁగలదు ॥ నీవే ॥ 394

లలిత

హరి నీవే బుద్ధిచెప్పి యాదరించు నామనసు
హరి నీవే నాయంతర్యామివిగాన ॥ పల్లవి ॥

వసముగావికరివంటిది నామసను
యెసఁగి సారెకు మదియించీఁగాన
పొసఁగఁ బాదరసముఁబోలిననామనసు
అసము దించక సదా అల్లాడీఁగాన ॥ హరి ॥

వడి నడవుల చింకవంటిది నామనసు
బడిబడిఁ బట్టఁబట్టఁ బారీఁగాన
కడఁగి విసరుపెనుగాలివంటిది మనసు
విడువక కన్నచోట విహరించీఁగాన ॥హరి॥

వరుస విందుజలధివంటిది నామనసు
వొరసి సర్వము లోనై వుండీఁగాన
గరిమ శ్రీవేంకటేశ కావవే నామనసు
సరి నీయానతి నీకే శరణాసీఁగాక ॥హరి॥ 395

ధవళి

జలజనాభ హరి జయ జయ,
యిల మానేరము లెంచకువయ్యా ॥పల్లవి॥

బహుముఖముల నీప్రపంచము
సహజగుణంబుల చంచలము
మహిమల నీ విది మరి దిగవిడువవు
విహరణ జీవులు విడువఁగఁగలరా ॥జల॥

పలువవలయీప్రకృతి యిది
తెలియఁగఁ గడువింద్రియవశము
కలిసి నీ వందే కాఁపురము
మలినపుజీవులు మానఁగఁగలరా ॥జల॥

యిరవుగ శ్రీవేంకటేశుఁడ నీమాయ
మరలుచ నీవే సమర్థుఁడవు
శరణనుటకే నే శక్తుఁడను
పరు లెవ్వరైనాఁ బాపఁగఁగలరా ॥జల॥ 396

రేకు 180 సామంతం

ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు
పొందుల శ్రీహరితోడిపొత్తుల మాబదుకు ॥ పల్లవి ॥

బడబాగ్ని ఆఁకటిబారిఁబడ్డబ్రదుకు
పడఁతులకూటములఁ బడ్డబదుకు
వొడలిఁ౧తోలినెమ్ముల వొడిగట్టేబదుకు
బడిఁ బుణ్యపాపాలపైతరవు బదుకు ॥ ఇందు ॥

నాలుక గడచితేను నరకపుబదుకు
మూలమలమూత్రాల మూటగట్టేబదుకు
కాలము నడిపి వూర్పుగాలిఁబుచ్చేబదుకు
పాలుమాలేయింద్రియాల పంగెమాయ బదుకు ॥ ఇందు ॥

ఇంపుసుఖదుఃఖాల యెండనీడబదుకు
మంపుఁగామక్రోధాలమాటు బదుకు
టంపుల శ్రీవేంకటేశుశరణు చొరఁగ నేఁడు
సొంపు లిచ్చెటా మాకు సుఖమాయ బదుకు ॥ ఇందు ॥ 397

రేవగుప్తి

నీ వెరఁగవిది లేదు నీయాజ్ఞ మోచితి నింతే
నీవాఁడ నింతె హరి నే నసఁజోలేది ॥ పల్లవి ॥

కన్నుల కెంపైనఁ జూపుకంది స్వభావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁ జోలేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్నినకర్మాలు నన్నుఁ బైకొనఁ జోలేది ॥ నీవె ॥

౧. 'తోలునెమ్ముల' కావచ్చు.

నాలికకుఁ జవి యైతే నమలుటే సహజము
నాలి అభోజ్యపునింద నాకుఁ బనేమి
మూల వాసనగానేది ముక్కుకు సహజము
ఘోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁ జోటేది ॥ నీవె ॥

కాయము కాయముపొంతఁ గరఁగుటే ఆగుణము
సేయనిచేఁతలు నాపైఁ జెప్పఁ జోటేది
యీయెడ శ్రీవేంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో నుందువు పట్టఁగఁ జోటేది ॥ నీవె ॥ 398

లలిత

ఇదివో వున్నార మింతట నంతట
వెదకి కదియకుమీ విష్ణునిమాయ ॥ పల్లవి ॥

హరిదాసులము హరికింకరులము
కరివరదునిడింగరులము
యిరవెఱిఁగితినవక యెఱఁగనక
సరి మాగురుతిది సర్వేశుమాయ ॥ ఇది ॥

హితులము శరణాగతులము కేశవ –
వ్రతులము వైష్ణవమతులము
గతి నినుఁ బాసితి కడు నిఁక మామీఁద
అతి దయమరవకు దైవముమాయ ॥ ఇది ॥

శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి
భావింప నితవిపరికరము
యీవలనావల నిహపరములకును
తోవదొలఁగుమీ తొలిఁదొలి మాయ ॥ ఇది ॥ 399

### రామక్రియ

ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా
యెంత సేసినా నీకు నెదురాడేనా ॥ పల్లవి ॥

కోపగించి చంకబిడ్డఁ గోరి తల్లి డించితేను
పై పై నే పడుఁగాక పాసిపొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసరితే
నీపాదాలే గతిగాక నే మానేనా ॥ ఇంత ॥

చదివించే౧ అయఁగారు జంకించి చూచితేను
వాదిగి చదువుఁగాక వోపననీనా
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను
యిదె నీకే మొక్కుదుఁగా కింక మానేనా ॥ ఇంత ॥

చెక్కు మీటి పాలు పెంచినదాది వోయఁగాను
గక్కన మింగుటగాక కాదనీనా
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించఁగ
నిక్కి నే మెరతుఁగాక నే మానేనా ॥ ఇంత ॥ 400

### మంగళకౌశిక

తే శరణ మహం తే శరణ మహం
శైశవకృష్ణ తే శరణం గతో౽స్మి ॥ పల్లవి ॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసురదళన
దశదిశాపరిపూర్ణ తప౨నీయస్వరూప
దశావరణ లోకతత్వాతీత ॥ తేశ ॥

---

౧. ఇందరనున్న వింత. ౨. 'వియ్య' రేకు

సహస్రలోచన సంతతవినుత
సహస్రముఖశేషశయనా
సహస్రకరకోటిసంపూర్ణతేజా
సహస్రారదివ్యచక్రాయుధా ॥ తేర ॥

అనంతచరణ సర్వాధారాధేయ
అనంతకరదివ్యాయుధా
అనంతనిజకల్యాణగుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రినివాసా ॥ తేర ॥ 401

శంకరాభరణం

అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము ॥ పల్లవి ॥

మంచిమాఁటలైనాఁ గానిమాటలైన నొకచోట
ముంచిముంచి యాకాశముననే యణఁగును
యెంచరానిచిట్టూర్పు లెవ్వి వాదమినాను
అంచల నణఁగిపోవు నాకాశముననె ॥ అది ॥

చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
అపొంతనే యణఁగు నాకాశముననె
రూపుల మైనీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున ॥ అది ॥

యిలఁ జీఁకటి వెలుఁగు యెంచ నహోరాత్రాలఁ
గలసి మెలఁగు నాకాశతత్వమున
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా —
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున ॥ అది ॥ 402

రేకు 181 తెలుఁగు కాంబోది

చూచి మోహించకుందురా సురలైన నరులైన
తాచి నీవు ముందరఁ బ్రత్యక్షమైనను ॥ పల్లవి ॥

భాగీరథి పుట్టినపాదపద్మములు
భోగపుమరునిజన్మభూమి నీతొడలు
యోగపునబ్రహ్మ ఉండిననీనాభి
సాగరకన్యకలక్ష్మి సతమైనవురము ॥ చూచి ॥

అందరి రక్షించేటి అభయహస్తము
కంద నసురలఁ జంపేగదాహస్తము
సందడి లోకములయాజ్ఞాచక్రహస్తము
చెంది ధ్రువు నుతియించఁజేయుశంఖహస్తము ॥ చూచి ॥

సకలవేదములుండేచక్కనినీమోము
వొకటై తులసిదేవవుండేటిశిరసు
ప్రకటపుమహిమలఁ బాయనినీరూపము
వెకలిశ్రీవేంకటాద్రివిభుఁడ నీభావము ॥ చూచి ॥ 403

లలిత

వాదులేల చదువులు వారు చెప్పినవేకావా
వాదులేల మీమాట వారికంటే నెక్కుడా ॥ పల్లవి ॥

నాలుగువేదాలబ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు
వాలినపురాణాలవ్యాసుఁ డెవ్వనిదాసుఁడు
లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు
ఆలకిం చెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుఁడు ॥ వాదు ॥

భారత మెవ్వనికథ భాగవతము చెప్పిన–
ధీరుఁడైన శుకుఁడు యేదేవునికింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి¹ సన్యసించి నుడిగేటి –
నారాయణనామపునాథుఁడే వో దేవుఁడు ॥ వాడు ॥

విష్ణువాజ్ఞయని చెప్పే విధిసంకల్ప మేదది
విష్ణుమాయయని చెప్పే విశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ" మనేవేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రివిభుఁడే ఆదేవుఁడు ॥ వాడు ॥ 404

నాట

ఇతని కితఁడే కాక యితరులు సరియా
మితి లోకా లితని మేనిలోనే కావా ॥ పల్లవి ॥

కమలనాభువిభయంకరకోపముతోడ
రమణ వేరొకరివరములు సరియా
తమితోడఁ దల ద్రుంచి తగినవరము లిచ్చె
అమరఁగ నరకాసురాదులకు నితఁడు ॥ ఇత ॥

కరివరదుని పేరుగలసినట్టితో
పరదేవతలమంత్రపఠనలు సరియా
విరతి శిశుపాలునినిందకు శిక్షించి
పరలోక మిచ్చినట్టిభావము వినరా ॥ ఇత ॥

చలిమి శ్రీవేంకటేశుశరణాగతితోడ
బలిమి మించినబ్రహ్మపట్టము సరియా
వొలిసినధ్రువునకు నున్నతలోక మిచ్చె
అలబ్రహ్మలోకమున కదె మీఁదె తెలుఁగరా ॥ ఇత ॥ 405

---

౧. 'సన్యాసించి' రేకు

పాడి

గోరబై మొద లుండఁగఁ గొనలకు నీ రేల
దొరదైవ మితఁడే తుదఁగలఫలము ॥ పల్లవి ॥

క్రతువులు హరియే కర్మము హరియే
పితరులకు హరియే పెనుఁదృప్తి
సతతమంత్రములసారము హరియే
యితనిసేవే పో యిన్నిటిఫలము ॥ గోర ॥

అనలము హరియే ఆహుతి హరియే
జననీజనకులసరవి హరే
పనివడి వేదముఁ బ్రణవము హరియే
ఘనసితవిపూజ యిన్నిటిఫలము ॥ గోర ॥

యేలికె హరియే యిరవును హరియే
వాలాయము సర్వము హరియే
కాలము శ్రీవేంకటగిరిహరియె
నేల నీతనిశరణే సఫలంబు ॥ గోర ॥ 406

లలిత

దొంతివిషయములాల దొరలాల
చెంత మీఁదటిబుద్ధి చెప్పరో మాకు ॥ పల్లవి ॥

దురితంబు లోకకొన్ని దుర్గుణము లోకకొన్ని
మరుగుటలు గొన్ని మర్మములు గొన్ని
ధర నెరుక లోకకొన్ని తగ నెరఁగములు గొన్ని
యిరవు మనసంట లివి యెందు వోయుదమో ॥ దొంతి ॥

ఆస లోకకొన్ని మిథ్యాచారములు గొన్ని
వాసు లోకకొన్ని గర్వములు గొన్ని
రేసు లోకకొన్ని మీరనరుచులు నొకకొన్ని
యీసునఁ గడి చితిమి యిముడఁ జోటేదో ॥ దొంతి ॥

వైరాగ్యములు గొన్ని వరభక్తు లొకకొన్ని
నేరుపులు గొన్ని యిన్నియును గలిగి
యీరీతి శ్రీవేంకటేశుగతి చేరితిమి
మేర మిము మీరితిమి ౧మీకు గతి యేదో ॥ దొంతి ॥ 407

శుద్ధవసంతం

ఏవుపాయములు మా కిఁకఁ బవిక్రాపు
నీవే హరి కావవే నిరుహేతుకమున ॥ పల్లవి ॥

యివల నింద్రియజయం బేడ నే నేడ
భువి నింద్రియములతోఁ బుట్టె నీతనువు
అవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెమే యెపుడు ॥ ఏవు ॥

మొలమిఁ గర్మవిముక్తి యేడ నే నేడ
తెలియంగఁ గర్మాధీన మీబ్రదుకు
కుళకమగుసాత్వికపుగుణ మేడ నే నేడ
కలియుగం బిది యిందుఁ గలవాఁడ నేను ॥ ఏవు ॥

తనివోవిఘోరతప మేడ నే నేడ
అనిశంబు నీకు శరణాగతుఁడను
యెనలేని శ్రీవేంకటేశ్వరుఁడ నీబిరుదు
కనుఁగొనఁగ శరణాగతపారిజాతం ॥ ఏవు ॥ 408

౧. 'మాకు' పూ.ము.పా. యతిభంగము.

రేకు 182 సామంతం

సమబుద్ధే యిందరికి సర్వవేదసారము
సముఁ డిందరికి హరి సాధనమోయయ్యా ॥ పల్లవి ॥

చీమకుఁ దనజన్మము చేరి సుఖమై తోఁచు
దోమకుఁ దనజన్మము దొడ్డసుఖము
ఆమని యీఁగకు సుఖ మాజన్మమై తోఁచు
యేమిటా నెక్కువసుఖ మెవ్వరి కేదయ్యా ॥ సమ ॥

జంతురాసులకు నెల్లా జననము లొక్కటే
అంతటాను మరణము లవి యొక్కటే
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే
ఇంతటా నిందుకంటే నెవ్వ రేమి గట్టిరయ్యా ॥ సమ ॥

ఇందులోన నెవ్వరైనా నేమి శ్రీవేంకటపతి-
నందముగాఁ దలఁచిన దది సుఖము
యెంచిచూఁ జూచినా నీతఁ డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి స్వతంత్ర మేదయ్యా ॥ సమ ॥ 409

బౌళి

కరుణానిధివిగాన కాచితేనే మోకాని
సరికి బేసికి నిన్ను జరయఁ జోటున్నదా ॥ పల్లవి ॥

కాయములోపలి నిన్నుఁ గని మని కొలువక
ఆయపుఁగర్మమె బ్రహ్మ మని వుంటిని
చేయవిన్నా చేఁతకు నే సిగ్గువడుందుటగాక
ఆయమేమైనా నిన్ను వడుగఁ జోటున్నదా ॥ కరు ॥

సకలచైతన్యుఁడవై సరి నాలో నుండఁగాను
వికటపువిషయాలవెంటఁ బారితి
వొకరు రక్షించఁగా వేరొకరిపాలైననాకు
తుకతుకలేకాక దూరఁగఁ జోటున్నదా ॥ కరు ॥

పట్టి శ్రీవేంకటగిరిఁ బ్రత్యక్షమై యుండఁగాను
ఇట్టు నట్టు వైకుంఠ మేల కోరేను
దిట్టనై నానేరమి నే తెలిసి నవ్వుట యింతే
ఇట్టె నీచిత్తము గాక యెంచఁగఁ జోటున్నదా ॥ కరు ॥ 410

శంకరాభరణం

ఇన్నిటా నొరయక యెఱు కేది
వెన్నునికృపఁగా వెలసేది ॥ పల్లవి ॥

కోపము మతిలోఁ గుందినపుడు వో
పాపము లవ్వియుఁ బాసేది
తీపులయాసలు దీరినపుడు వో
తాపత్రయములు దలఁగేది ॥ ఇన్ని ॥

ఘనకర్మంబులు గడచినపుడు వో
వెనుకొనుభవములు విడిచేది
మునుకొని యింద్రియములు వీడినఁటో
పనివడి విరక్తి బలిసేది ॥ ఇన్ని ॥

ఆఁకటిరుచు లివి యణఁగినపుడు వో
చేకొని సుఖమునుఁ జెందేది
యీకడ శ్రీవేంకటేశ్వరుశరణము
పైకొనిననుఁబో బదికేది ॥ ఇన్ని ॥ 411

సాళంగనాట

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రులు పూజించే యాసాకారమె ప్రమాణము ॥ పల్లవి ॥

సగుణంబని నిన్నుఁ గొందరు సరి నిర్గుణమని కొందరు
వగలఁ బెక్కుగతిఁ జదివినకొలఁదుల వారికివారే వాదింతురు
అగణితస్వతంత్రుఁడవుగాన బల వాల్మీకి ఇట్టిట్టనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి ఇచ్చుటే
ప్రమాణము ॥ సక ॥

"సోహం" బని కొందరు "దాసోహం" బని కొందరు
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు
దేహధారియై "దాసోహం" బని తేరి శుకుఁడు మీలోఁ గలసె
సోహపుభావన సర్వజగత్తులఁ జూపిన దే ప్రమాణము? ॥ సక ॥

ఆరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మములనైనాను
యీరీతిల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగుభక్తు లిందరును నానాగతు లరసి చూచి
సారపుశ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము ॥ సక ॥ 412

లలిత

ఇల జాణతనము లిన్నిటికిఁ గలదు
తలఁపే కూళై తగిలీఁగాని ॥ పల్లవి ॥

మఱవదు దేహము మహిఁ దనగుణములు
గుఱి నాహారము గొను నెపుడు
మఱవ వింద్రియములు మర్మస్థలములు
మఱచితి నను నేమరులోకాని ॥ ఇల ॥

చెదరని కర్మము సేసినంతయును
పొదిగి జీవమును భోగించును
చెదరదు సంసారశీతలబంధము
మదిఁ ౧జెదరెడి నామరులేకాని ॥ ఇల ॥

తొలఁగవు మాయలు తొడరి ప్రపంచము
కలవలెఁ బెనగొని కడసీని
బలు శ్రీవేంకటపతికృపచే నాకు
తొలఁగె భవము లెటు దూరీనో మరులు ॥ ఇల ॥ 413

మాళవి

హరి నెఱఁగనిజన్మ మది యేలా ఆ-
సహస నాతఁడులేనిచదువేలా ॥ పల్లవి ॥

దయదొలఁగినయట్టితపమేలా
భయములేనియట్టిభక్తేలా
ప్రియముమానినయట్టిపెనఁగేలా మంచి-
క్రియావిరుద్ధపుకీర్తనలేలా ॥ హరి ॥

ఫలములేనియట్టిపనులేలా కడుఁ-
గలిమిలేనియట్టిగర్వమేలా
బలిమిలేనియట్టిపంతమేలా శౌరిఁ-
దలఁచలేనియట్టితనువది యేలా ॥ హరి ॥

తన కమరనిదొరతనమేలా
చనవులేనియట్టిసలిగె యేలా
మొనలేని శ్రీవేంకటేశ్వరుని శరణని
మనఁగలిగినమీఁద మరిచింతలేలా ॥ హరి ॥ 414

---

౧. 'జెదరేది' పూ.ము.పా.

రేకు 183 లలిత

దోమటి నింతెరఁగరా తొల్లిటివారు
వామదేవవసిష్ఠవ్యాసాదులు ॥ పల్లవి ॥

తానే దైవమైతే తపమేల జపమేల
పూని సారెఁ బూజించేపూజలేల
కూను వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను ॥ దోమ ॥

తగఁ దా స్వతంత్రుఁడైతే దరిద్రదుఃఖములేల
నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
నగుఁబాటులై నజననమరణములేల
మగురువేల్పులదండ మొనచూపరాదా ॥ దోమ ॥

శ్రీవేంకటేశుఁడే శేఖరపుదైవమని
సావధానుఁ డితనికి శరణుచొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాసి
తావుల నాతనికృప దండ చేరరాదా ॥ దోమ ॥ 415

గుండక్రియ

అవియు నాకుఁ బ్రథమాచార్యులు
తవిలి యీనెపము మిముఁ దలఁపించుఁగాన ॥ పల్లవి ॥

ధనవాంఛ మతిలోనఁ దగిలినప్పటివేళ
దనుజారి మీమీఁదఁ దలఁపు గలుగు
ఘొనిగి భయదుఃఖములఁ బొరలినప్పటివేళ
పనివూని మీమీఁదిభక్తి గలుగు ॥ అవి ॥

చెలఁగి పాపములు మించినవేళ హరి మీ-
నలువునా మోచ్చారణంబు గలుగు
బలిమి భవరోగముల బడలినప్పటివేళ
వలుమారు మీసంప్రార్థనలు గలుగు ॥ అవి ॥

ఇన్నిటాఁ దొలఁగి మిము నెరిఁగి కొలిచినవేళ
మన్ననలపరిణామంబు గలుగు
వున్నతపుశ్రీవేంకటోత్తముఁడ మిము నెదుటఁ
గన్నయీవేళ సౌఖ్యంబులే కలుగు ॥ అవి ॥ 416

## లలిత

ఈతని మరచివుంటి మిన్నాళ్లను
యీతల నేఁ దెచ్చరిఁచె నీతఁడే పో విష్ణుఁడు ॥ పల్లవి ॥

తల్లియై పోషిఁచు తండ్రియై రక్షించు
వుల్లపుబంధువుఁడై వొడ లరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్లవిధబంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు ॥ ఈత ॥

యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధిచెప్పు
చాలుమానిసియై యంచలఁ దిరుగు
బాలుఁడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు
యీలాగులబంధుఁ డీతఁడే పో విష్ణుఁడు ॥ ఈత ॥

దేవుఁడై పూజగొను దృష్టిగోచరమై
శ్రీవేంకటాద్రిమీఁద సిరు లొసగు
తావై యెడమిచ్చు తలఁపై ఫలమిచ్చు
యీవలనావల బంధుఁ డీతఁడేపో విష్ణుఁడు ॥ ఈత ॥ 417

లలిత

వీదిలోన నదేకదే విష్ణుపదము
ఆదెసనే పాయకుండు నాదిమూలము ॥ పల్లవి ॥

చూచేటిచూపులకును నూటియైనమొదలేదో
యేచి వినుకలిమర్మ మెందు దాఁకీనో
వాచవిచవులు చూచేవంటశాలచోటేదో
ఆచాయనే వుండు నాదిమూలము ॥ వీది ॥

పూఁపతలపోఁతలకు పుట్టినయిల్లది యేదో
పైపై నూర్పులు నిలుపఁగఁ జోటేదో
మాపులు నిద్రించువేళ మరచేటిచోటేదో
ఆపొరుగుననే వుండు నాదిమూలము ॥ వీది ॥

నేరిచినవిద్యలెల్లా నించి దాఁచేచోటేదో
కోరనియానందముకొన యేదో
ఆరయ శ్రీవేంకటేశుఁ డాతనే పాయక వుండు
ఆరితేరి నాలోఁ డితఁ డాదిమూలము ॥ వీది ॥ 418

బౌళి

దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నామనసా యిది మరవకుమీ ॥ పల్లవి ॥

గుదిఁ బాఁతచీర మాని కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి మొగిఁ గొత్తమేను మోచు
అదనఁ జంపఁగలేవు ఆయుధము లితనిఁ
గదిసి [1]యగ్నియు నీరు గాలియుఁ జంపఁగ లేవు ॥ దేహి ॥

---

౧. 'యజ్ఞియు' రేకు.

యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ [1] చెలియించఁ దేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు ॥ దేహి ॥

చేరి కానరానివాఁడు చింతించరానివాఁడు
[2] భారపువికారాలఁ బాసినవాఁ డీయాత్మ
ఆరయ శ్రీవేంకటేశునాధీన మీతఁడని
సారము దెలియుటే [3] సత్యం జ్ఞానము [4] ॥ దేహి ॥ 419

భవుళి

హరిసే వాకటే యనంతము
గురుబోధలకును కొలఁదే లేదు ॥ పల్లవి ॥

తలఁచినకొలఁదే తనలో భావము
నిలిపినకొలఁదే నేమము
పలికినకొలఁదే పరమగుసత్యము
యిల నెవ్వరికిని యెక్కుడు లేదు ॥ హరి ॥

జరిపినకొలఁదే సకలాచారము
నెరపినకొలఁదే నిజకీర్తి
తిరము సేయుకొలఁదే ధర్మంబును
యిరవుగ నందుకు నెక్కుడు లేదు ॥ హరి ॥

నేసినకొలఁదే చేకొనుకర్మము
రోసినకొలఁదే రుచివిరతి
ఆసల శ్రీవేంకటాధిపుశరణను—
దాసుఁడే యెక్కుడు తప్పే లేదు ॥ హరి ॥ 420

---

౧. 'చలియించ' ఐతే యతిభంగము. ౨. 'భావపు' రేఫ. ప్రాసభంగము. ౩. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" శ్రుతి. ౪. చూ:- భగవద్గీత 2 అధ్యా 22 నుంచి 24 శ్లోకాలు.

రేకు 184 లలిత

ఇది యరుదను నొకఁ డిది యరుదని చెప్ప
యిది యరుదని విను నెవ్వఁడూ నెఱఁగఁడు ॥ పల్లవి ॥

పుట్టినవారికి నెల్లా భువి మరణము నిత్య-
మట్టే చచ్చినవారి కవ్వలజననము
పుట్టనినాఁడై తేను పొడగానరాదు మేను
కొట్టఁగొనఁ గానరాదు కొన్నాళ్లే కాని ॥ ఇది ॥

జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తనుధర్మములఁ బాయరాదు
సావధాన మిదియే సంసారయోగము ॥ ఇది ॥

చిత్తమా నీలోపలను శ్రీవేంకటేశ్వరుఁడు
పొత్తుఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది
[1]ఇత్తలాదైనగుణము యిది మఱవకుమీ ॥ ఇది ॥ 421

ముఖారి

నాకు నీవు గలవు హరి నాలోపలనుండి
పైకొని యిన్నియు బదుకనీవయ్యా ॥ పల్లవి ॥

పసిగొని రుణానుబంధముకొలఁదే
పసులునుఁ బడతులు బహుసుతులు
వసముగావు తమవంతులు దీరిన
పసగా నవియే బదుకనీవయ్యా ॥ నాకు ॥

---

౧. ఇత్తలన్+అది+ఐనగుణము

పెనగొని ఘటులకుఁ బెట్టినకోలఁదియు
పసులునుఁ గీర్తులు పంతములు
అనువులు దప్పను అవి గడమైతే
పనివడి యివియే బదుకనీవయ్యా ॥ నాకు ॥

డుసంపదలును కాలముకొలఁదే
బడిబడిఁ జవులై ఫలియించు
యెడపక శ్రీవేంకటేశుఁ డిచ్చె నివే
పడసితి మివియును బదుకనీవయ్యా ॥ నాకు ॥ 422

సామంతం

నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటినే ॥ పల్లవి ॥

చలువయును వేఁడియును సకలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీరెంటఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు ॥ నారా ॥

పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు
తగుమేను వొడచూపు తనుఁ దానె తొలఁగు
నగియించు నొకవేళ నలఁగించు నొకవేళ
వొగరుఁగారపువిదె మిబ్బించినట్లు ॥ నారా ॥

ఇహముఁ బరమునువలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతివి
సహజశ్రీవేంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే ॥ నారా ॥ 423

గుండక్రియ

కలుగుట గలిగిననాఁడే నే ఘనపాపములకు ౧ దొలంగినా
యెలమి నేనిపుడే యెఱిఁగితిని యిన్నాళ్లీమతి లేదు ॥పల్లవి॥

౨ జనియించిననే నిటుమునుపుసకలయోనిగతజన్మములు
౩ కనుఁగొని యవె నే సారెకుఁ బలుమరు ఘనవర్ణాశ్రమధర్మములు
అనుభవించినవే సకలార్థంబులు అయిహికవిషయము లన్నియును
మనసున వాకున శ్రీహరి నొకని నేమఱచియుఁ దలఁచుట లేదు ॥కలు॥

తిరిగినవే ౪ నే నాసలకొరకును దిక్కు లన్నియును ౫ నేను
యిరవుగ తొల్లియు నెఱిఁగినవే యీసంసారపుసుఖము లివి
పొరలినవే నేఁ గామినీజనులపొందులసుఖములభోగములు
యెరవులదొకటే శ్రీహరిదాస్యం బిది గతియని యెఱుఁగుటలేదు ॥కలు॥

గడియించినవే నేఁ బూర్వకాలమున ఘనమగుసంపద లిన్నియును
నొడిగినవే నే శబ్దజాలములు నోరఁ గొలఁదు లివి యిన్నియును
తడఁబడి నే నిటు సకలలోపాయపుధర్మము లిన్నియుఁ జూచితిని
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణం బిటువలెఁ జేయుటలేదు ॥కలు॥ 424

లలిత

నీ వొక్కఁడవే నాకుఁ జాలు నీరజాక్ష నారాయణ
నీవే నాకు గతియని తెలిసితి నెక్కాఁడి యితరము వృథా వృథా
॥పల్లవి॥

మీనామోచ్చారణమే మెరసిన దుఃఖనివారణము
మీనామోచ్చారణమే మెఱఁగుశుభకరము
నానావేదశాస్త్రములు నవపురాణేతిహాసములు
మీనామములోనే వున్నవి మిగిలిన విన్నియు వృథా వృథా ॥నీవొ॥

---

౧. 'దొలంగేనా' కావచ్చు. ౨. 'జనియించినవే' కావచ్చు. ౩. 'కనుఁగొనినవె' కావచ్చు.
౪. ౫. పునరుక్తి. ఇట్టి వక్కడక్కడ గలవు.

నీపాదమూలము నింగియు భువియు రసాతలము
నీపాదమూలము నిఖిలజీవపరిణామములు
దీపించినచ చరంబులు దివ్యులు మునులను సర్వమును
నీపాదమూలమే మరి నెరి నితరంబులు వృథా వృథా ॥నీపా॥

దేవ మీతిరుమేను దిక్కును బ్రహ్మాండాధారము
దేవ మీతిరుమే నుత్పత్తిస్థితిలయములకును ఆకరము
శ్రీవేంకటపతి నాభావము చిత్తము నీకే సమర్పణ
దేవ మీశరణము చొచ్చితి దిక్కులన్నియును వృథా వృథా॥నీపా॥ 425

రేకు 185 గుండక్రియ

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥పల్లవి॥

ధర్మార్థకామమోక్షతతులు నీ౧సోబనాలు
అర్మిలి నాలుగువేద లదె నీదరులు
నిర్మలపునీజలము నిండుసప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వోకోనేరమ్మా ॥దేవు॥

తగినగంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మును లోయమ్మా ॥దేవు॥

వైకుంఠనగరమువాకిలే నీయాకారము
చేకొనుపుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీతీర్థమాడితిమి కావవమ్మా ॥దేవు॥ 426

౧. 'సోపానాలు' కావచ్చు.

కాంబోది

నన్నెఱఁగలేనయ్యో నాయంతర్యామై
వున్నతపుహరి నాలో నున్నాఁడట ॥పల్లవి॥

యిల నేఁడుఁజానలమే నిందులోనివాఁడ నింతే
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపొయ్యీని
కలువరేకులంతేసికన్నులవాఁడ నింతే
సొలసి చూ పాకాశమే చూరగొనీని ॥నన్నె॥

వెడ వెంట్రుకదూరేటిపీనులవాఁడ నింతే
కడలేనిశబ్దము లొక్కట వినేను
నడుమ నే సల్లెఁడంతనాలికెవాఁడ నింతె
వుడివోనిసుద్దు లెల్లా నుగ్గడించేను ॥నన్నె॥

అచ్చనఁ బదారంగుళాలప్రాణ మింతే
కుచ్చి కాలపుదినాలు గొలచీని
కొచ్చినశ్రీవేంకటేశుకొలువుడుబంట నింతే
పచ్చియింద్రియాల కెల్లాఁ బంపు సేసేను ॥నన్నె॥ 427

సామంతం

విక్కమైవనాలోనినెలవు గాన లేను
దిక్కు నీవే హరి నాతెలి వేఁటితెలివి ॥పల్లవి॥

నీటిలో మునిఁగి వచ్చి నిర్మలుఁడ ననుకొందు
గాఁటమై యావేగి లేచి కా నందును
తేటలఆదేహమే దిష్టము అనేనే
పాటిలేవిభావపునాబదు కేఁటిబదుకు ॥విక్క॥

యెన్ను నొక బంటు నేలి యేలికె నే ననుకొందు
పన్ని నే నొకరిఁ గొల్చి బంట నందును
మున్నిటినామనసె మొదలినాపుట్టుగే
యిన్ని వికారాలనాయెరు కేఁటియెరుక ॥ నిక్క ॥

కాంచనము చేతనుంటే ఁలవాఁడ ననుకొందు
పెంచి యొకవేళ నేఁ బేద నందును
కంచుమాయఁ బొరలఁగాఁ గాచితి శ్రీవేంకటేశ
కొంచినయిన్నాళ్ల నాగుణ మేఁటిగుణము ॥ నిక్క ॥ 428

మాళవి

అరు దరుదు నీమహి మతిమానుషము చూడ
పురుషోత్తమ నుదివ్యపురజగన్నాథా ॥ పల్లవి ॥

పసులఁగాచే దేడ బ్రహ్మ నుతియించు చేడ
సిసువా చేడ నాలుగుచేతు లేడ
కొసరి వేలనే యేడ కొండగొడగెత్తు చేడ
వనమా నన్నా [illegible] ॥ అరు ॥

జనవేష మేడ పారిజాతము దెచ్చిన దేడ
తనివెన్నముచ్చి మేడ దైవిక మేడ
పని బండిబోయిఁదేడ బాణుని నరకు చేడ
వినఁ గత నీమహిమ విష్ణు జగన్నాథా ॥ అరు ॥

కమ్మి రోలఁ గట్టు చేడ గరుడవాహన మేడ
దొమ్మి భద్రసుభద్రులతోఁబుట్టు వేడ
చిమ్ముల నిలగిరిని (?) శ్రీవేంకటాద్రిమీఁద-
నుమ్మడి విరవుకొంటి వోజగన్నాథా ॥ అరు ॥ 429

రేకు 184 లలిత

ఇది యరుదను నొకఁ డిది యరుదని చెప్పు
యిది యరుదని విను నెవ్వఁడూ నెఱఁగఁడు ॥పల్లవి॥

పుట్టినవారికి నెల్లా భువి మరణము నిత్య-
మట్టే చచ్చినవారి కవ్వలజననము
పుట్టనినాఁడైతేను పొడగానరాదు మేను
కొట్టఁగొనఁ గానరాదు కొన్నాళ్లేకాని ॥ఇది॥

జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తమధర్మములఁ బాయరాదు
సావధాన మిదియే సంసారయోగము ॥ఇది॥

చిత్తమా నీలోపలను శ్రీవేంకటేశ్వరుఁడు
పొత్తునఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది
౧ఇత్తలాదైనగుణము యిది మఱవకుమీ ॥ఇది॥ 421

ముఖారి

నాకు నీవు గలవు హరి నాలోపలనుండి
పైకొని యిన్నియు బదుకనీవయ్యా ॥పల్లవి॥

పసిగొని రుణానుబంధముకొలఁదే
పసులును బతులు బహుసుతులు
వసముగావు తమవంతులు దీరిన
పసగా నవియే బదుకనీవయ్యా ॥నాకు॥

౧. ఇత్తలన్+అది+ఐనగుణము

పెనగొని ఘటులకుఁ బెట్టినకొలఁదియు
పనులునుఁ గీర్తులు పంతములు
అనువులు దప్పను అవి గడమైతే
పనివడి యివియే బదుకనీవయ్యా ॥ నాకు ॥

ధనసంపదలును కాలముకొలఁదే
బడిబడిఁ జవులై ఫలియించు
యెడపక శ్రీవేంకటేశుఁ డిచ్చె నివే
పడసితి మివియును బదుకనీవయ్యా ॥ నాకు ॥ 422

సామంతం

నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటినే ॥ పల్లవి ॥

చలువయును వేఁడియును సటలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీ రెంటఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు ॥ నారా ॥

పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు
తగుమేను పొడచూపు తనుఁ దానె తొలఁగు
నగియించు నొకవేళ నలఁగించు నొకవేళ
వొగరుఁగారపువిడె మబ్బించినట్లు ॥ నారా ॥

ఇహముఁ బరమునువలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతివి
సహజశ్రీవేంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే ॥ నారా ॥ 423

### కాంబోది

నన్నేఁగలేనయ్యో నాయంతర్యామై
వున్నతపుహరి నాలో నున్నాఁడట ॥ పల్లవి ॥

యిల నేడుజానలమే నిందులోనివాఁడ నింతే
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపొయ్యీని
కలువరేకులంతేసికన్నులవాఁడ నింతే
సొలసి చూపాకాశమే చూరగొనీని ॥ నన్నె ॥

వెడ వెంట్రుకదూరేటివీనులవాఁడ నింతే
కడలేనిశబ్దము లొక్కట వినేను
నడుమ నే నల్లెఁడంతనాలికెవాఁడ నింతె
వుడివోనిసుద్దు లెల్లా నుగ్గడించేను ॥ నన్నె ॥

అచ్చనఁ బదారంగుళాలప్రాణ మింతే
కుచ్చి కాలపుదినాలు గొలచీని
కొచ్చినశ్రీవేంకటేశుకొలువుడుబంట నింతే
పచ్చియింద్రియాల కెల్లాఁ బంపు సేసేను ॥ నన్నె ॥ 427

### సామంతం

నిక్కమైననాలోనినెలవు గాన లేను
దిక్కు నీవే హరి నాతెలి వేఁటితెలివి ॥ పల్లవి ॥

నీటిలో మునిఁగి వచ్చి నిర్మలుఁడ ననుకొందు
గాఁటమై యావేగి లేచి కా నందును
తేటలఅదేహమే దిష్టము అనేనే
పాటిలేనిభావపునాబదు కేఁటిబదుకు ॥ నిక్క ॥

యెన్న నొక బంటు నేలి యేలికె నే ననుకొందు
పన్ని నే నొకరిఁ గొల్చి బంట నందును
మున్నిటినామనసె మొదలినాపుట్టుగే
యిన్నివికారాలనాయెరు కేఁటియెరుక ॥ నిక్క ॥

కాంచనము చేతనుంటే ంలవాఁడ ననుకొందు
పెంచి యొకవేళ నేఁ బేద నందును
కంచుమాయఁ బొరలఁగాఁ గాచితి శ్రీవేంకటేశ
కొంచినయిన్నాళ్ల నాగుణ మేఁటిగుణము ॥ నిక్క ॥ 428

మాళవి

అరు దరుదు నీమహి మతిమానుషము చూడ
పురుషోత్తమ నుదివ్యపురజగన్నాథా ॥ పల్లవి ॥

పసులఁగాచే దేడ బ్రహ్మ నుతియించు ఏడ
సిసువా ఏడ నాలుగుచేతు లేడ
కొసరి వేలనే యేడ కొండగొడగెత్తు ఏడ
~~వనమా నన్నా [illegible] జగన్నాథా~~ ॥ అరు ॥

జనవేష మేడ పారిజాతము దెచ్చిన దేడ
తనివెన్నముచ్చిమేడ దైవిక మేడ
పని బండిబోయిఁదేడ బాణుని నరకు ఏడ
వినఁ గత నీమహిమ విష్ణు జగన్నాథా ॥ అరు ॥

కమ్మి రోలఁ గట్టు ఏడ గరుడవాహన మేడ
దొమ్మి భద్రసుభద్రులతోఁబుట్టు వేడ
చిమ్ముల నిలగిరిని (?) శ్రీవేంకటాద్రిమీఁద-
నుమ్మడి విరవుకొంటి వోజగన్నాథా ॥ అరు ॥ 429

మాళవిగౌళ

కలియుగ మెటులైనాఁ గలదుగా నీకరుణ
జలజాక్ష హరిహరి సర్వేశ్వరా ॥ పల్లవి ॥

పాప మెంత గలిగినఁ బరిహరించేయందుకు
నాపాలఁ గలదుగా నీనామము
కోప మెంత గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు
చేపట్టి కలవుగా నాచిత్తములో నీవు ॥ కలి ॥

ధర నింద్రియా లెంత తరముకాడిన నన్ను
సరిఁ గావఁగద్దుగా నీశరణాగతి
గరిమఁ గర్మబంధాలు గట్టినతాళ్లు వూడించ
విరతిఁ గలదు గా నీభక్తి నాకు ॥ కలి ॥

హితమైనయిహపరా లిష్టమైనవెల్లా నియ్య
సతమై కలదుగా నీసంకీర్తన
తతి శ్రీవేంకటేశ నాతపము ఫలియింపించ
గతి గలదుగా నీకమలాదేవి ॥ కలి ॥ 430

గుండక్రియ

జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి ॥ పల్లవి ॥

శరణాగతపారిజాతమా
హరి నసురలపాలిభూతమా
అరుదయిన సృష్టికి నాదిమూలమా వో
హరి నమో పరమపుటాలవాలమా ॥ జయ ॥

సకలదేవతాచక్రవర్తి
వెకలిపై నిండినవిశ్వమూర్తి
అకలంకమైనదయానిధి
వికచముఖ నమో విధికి విధి ॥ జయ ॥

కొలిచినవారలకొంగుపైఁడి
మలిగిఁవాంకి మొనవాఁడి
కలిగినశ్రీవేంకటరాయా
మలసి దాసులమైనమాకు విధేయా ॥ జయ ॥ 431

రేకు 186 దేవగాంధారి

అణురేణుపరిపూర్ణమైనరూపము
అణిమాదిసిరి యంజనాద్రిమీఁదిరూపము ॥ పల్లవి ॥

వేదాంతవేత్తలెల్లా వెదకేటిరూపము
ఆదినంత్యములేవియారూపము
పాదుగయోగీంద్రులు భావించురూపము
యీదెస నిదివో కోనేటిదరిరూపము ॥ అణు ॥

పాలజలవిధిలోనఁబవళించేరూపము
కాలపుసూర్య౧చంద్రాగ్నిగలరూపము
మేలిమి వైకుంఠాన మెరసినరూపము
కీలైన దిదే శేషగిరిమీఁదిరూపము ॥ అణు ॥

ముంచినబ్రహ్మాదులకు మూలమైనరూపము
కొంచనిమట్టాకుమీఁదికొనరూపము
మంచిపరబ్రహ్మమై మమ్మునేలినరూపము
యెంచఁగ శ్రీవేంకటాద్రి విదేరూపము ॥ అణు ॥ 432

---

౧. 'చంద్రాగ్నిఁగల' రేకు. ఇందలిఅరసున్న చింత్యము.

గుండక్రియ

నేనేమిఁ జేయఁగలేను నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నే నధికుఁడ ౧ విన్నిటా నీవు ॥ పల్లవి ॥

దండముపెట్టుట నాది, తప్పు లోఁగొనుట నీది
వెండి నీవెప్పుడు దయానిధివి గాన
అండఁబేరుకొంట నాది అందుకు నూఁకొంట నీది
దండియైనదేవదేవోత్తముఁడవు గాన ॥ నేనే ॥

శరణుచొచ్చుట నాది సరుగఁ గాచుట నీది
పరమపురుష శ్రీపతివి నీవు
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది
వొరి నీవు భక్తసులభుఁడ వటుగాన ॥ నేనే ॥

దాసుఁడననుట నాది తప్పక యేలుట నీది
ఆసదీర్చేవరదుఁడ వటుగాన
నీసేవ యొక్కటి నాది నిచ్చలుఁ గైకొంట నీది
యీసులేవిశ్రీవేంకటేశుఁడవుగాన ॥ నేనే ॥ 433

బౌళి

ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను
యిట్టే నీకు శరణంటి విదియే తెరఁగు ॥ పల్లవి ॥

చేకొని నే మొక్కఁగాను చేతులు గోయఁగరాదు
ఆకడఁ దప్పుకుఁదగినాజ్ఞ మానరాదు
కైకొని యపరాధాలే కావించితి నెన్నైనా
యీకడ నీశరణంటి విఁకనో తెరఁగు ॥ ఎట్టై ॥

---

౧. 'వన్నిటా' వూ.ము.పా. యతిభంగము.

చిక్కి దైన్యపడఁగాను చెలఁగి ఖండించరాదు
చక్కఁగా నాద్రోహాలు సైరించరాదు
అక్కడఁ జూచిన శరణాగతబిరుదు నీకు
యిక్కడ నీశరణంటి నిఁకనో తెరఁగు ॥ఎట్టై॥

సేవసేయుచుండఁగాను జీతము మానుపరాదు
యీవిధి నాన దోసితే నిందుకోరాదు
దేవుఁడ నిన్నుఁ గొలిచి తెగి కర్మా లుడిగితి
యీపల శ్రీవేంకటేశ ఇఁకనో తెరఁగు ॥ఎట్టై॥ 434

గుండక్రియ

ధరలో "[1]నెద్భావం తద్భవ"తనేఁగాన
హరిమయమే జగమంతాను, ॥పల్లవి॥

మహా నెదిటివారందు మలినము దలఁచిన
తహతహ మనసే తా [2]మలినము
వహి నెదిటందు [3]భావనము భావించిన
బహువిధములఁ దానూ భావనమే ॥ధర॥

యెక్కువ నెదిటిపాపా లెంచి నిందించేటి-
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటిపుణ్యా లుగ్గడించి ఘన మంటే
దక్కినపుణ్యపుజిహ్వ తానూ ఘనమే ॥ధర॥

సారె శ్రీవేంకటపతి సగుణము దలఁచిన
సారపుజీవుఁడు దాను సగుణమే
నేరుపుల నాతనినిర్గుణము దలఁచిన
తారతమ్యములులేనితానూ నిర్గుణమే ॥ధర॥ 435

---

౧. "యద్భావం తద్భవతి" అనుటకు వ్యావహారికమేమో 'యద్భావం కర్మ తత్ = తత్ఫలం భవతి' అని అర్థము కావచ్చు. ౨. 'మలినం' రేకు. ౩. భావనము = (ప్రకరణముతో) మేలు, మంచి కావచ్చు.

### భూపాళం

ఎందాఁక నిద్ర నీ కిదె తెల్లవారెఁగదె
యిందిరారమణ నీ విటు మేలుకొనవే ॥పల్లవి॥

కమలనాభుఁడ నీకు గంగాదినదులెల్ల-
నమర మొకమజ్జనం బాయితముసేసె
తమితోడఁ గనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే ॥ఎందాఁ॥

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతమగువాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సంధడించేరు ॥ఎందాఁ॥

కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీచేలాగు కదివో
యీమహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించి యన్నియునుఁ గైకొంటి విపుడు ॥ఎందాఁ॥ 436

### సాళంగనాట

రామా రామభద్ర రవివంశ రాఘవ
యేమి యరుదిది నీ కింతటివానికిని ॥పల్లవి॥

నాఁడు రావణుతలలు నఱకినలావరివి
నేఁడు నాపాపములు ఖండించరాదా
వాఁడిప్రతాపముతోఁడ వారిధిగట్టిననాటి-
వాఁడ విట్టె నామనోవార్ధిఁ గట్టరాదా ॥రామా॥

తలసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువరాదా
యెలసి హరునివిల్లు యెక్కువెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా ॥ రామా ॥

మనస విభీషణుఁడు శరణంటే గాచితివి
వినుము నే శరణంటేఁ గావరాదా
తొరలి శ్రీవేంకటేశ దొడ్డగొంచ మెంచనేల
ఉరవై లోకహితాన కేదైనా నేమీ ॥ రామా ॥ 437

రేకు 187 లలిత

ఇసి యానతిచ్చెఁ గృష్ణుఁ డర్జునునితో
ఎని యాతని భజించు వివేకమా ॥ పల్లవి ॥

"భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల
దీముతో నే మోచేటిదేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటిదేవుఁడ నేను ॥ అవి ॥

[1] దీపనాగ్నినై జీవదేహముల నున్నములు
తీపుల నరగించేటిదేవుఁడ నేను
యేపున నిందరిలో నిన్నూదయములోన నుందు
దీపించుఁ దలఁపుమరపై దేవుఁడ నేను ॥ అవి ॥

వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచేతా
ఆదికి నెరఁగఁగఁగినయాదేవుఁడను
శ్రీదేవితోఁ గూడి శ్రీవేంకటాద్రిమీఁద
పాదైనదేవుఁడను భావించ నేను" ॥ అవి ॥ 438

1. 'దీపనాజ్ఞి' రేకు.

గుండక్రియ

తలఁపులో కొట్టఁగొన దైవమే వున్నాఁడు
తలఁచినరూపులెల్లా తా నయ్యీనయ్యా ॥ పల్లవి ॥

కలలో ప్రపంచము కంటి నే నొకటి
వెలినున్న ప్రపంచవిధివలెనే
కలనున్నవాఁడ నేనే వెలి నున్నవాఁడ నేనే
తెలి(య?) మాబతుకు రెంట దెప్పరములయ్యా ॥ తలఁ ॥

దేహామీఁద నుండఁగానే దిక్కులకేఁగీ మనసు
దేహముతో దిక్కులెల్లాఁ దిరిగినట్టే
దేహములోవాఁడ నేనే దేహముపైవాఁడ నేనే
వోహో మాజన్మములో నొకటి రెండయ్యా ॥ తలఁ ॥

కన్నులెదుట శ్రీవేంకటపతిఁ గొలిచెద
కన్నుమూసి యాతనినే కమ్మర భావించెదను
కన్నులలోపల నేనే కన్నులవెలిని నేనే
వున్నతి నీరెండును వొక్కటాయనయ్యా ॥ తలఁ ॥ 439

శ్రీరాగం

చాలు నిదే నావిరతి సకలసామ్రాజ్యము
నాలోనిపని యెంతైనా నాకుఁ గలదు ॥ పల్లవి ॥

వడఁబడి పరులిండ్లవాకిలి గాచే నేను
వడి నాలో హరియున్న వాకిలి గాచేను
బడి నొకరిఁ గొలిచి బహురాజ్యమేలే నేను
యెడ నామనోరాజ్యమింతా నేలేను ॥ చాలు ॥

చేరి యొడలకుఁ బనిసేసి యలసేనేను
సారె నాయోగాభ్యాసాన నలసేను
ఆరసి నే నడుగఁగ నన్యులిచ్చేయీవులు
తారి పూర్వకర్మాదిదైవమే యిచ్చీని ॥ చాలు ॥

అందు సంతోషమే ఫల మిందు సంతోషమే ఫల-
మందును మాయాకల్పిత మిందును మాయే
అందు నిందు శ్రీవేంకటాధీశుఁడే కర్త
అందై తేఁ బరతంత్రుఁ డిందు నే స్వతంత్రుఁడ ॥ చాలు ॥ 440

సామంతం

నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్య
దాసుఁడ నే నింతే దైవమవు నీవు ॥ పల్లవి ॥

లోకము లేఁదువట లోకములోపలినేను
పైకొని నీ వేలినట్టిబంటనేసుమ్మీ
ఆకడ నావుఁ గొంటే నావువెంట దూడయును
జోకలఁ గొన్నట్టివారిసొమ్మే కాదా ॥ నీసొ ॥

చేర నన్ను నీవే పుట్టించితివట నేఁ జేసే-
మేరతోఁ బుణ్యపాపాలు మీవేసుమ్మీ
ఆఱగ విత్తినవాఁడు ౧ ఆరుగలోపలికంది
ఆరితేరి పండితేను ఆతనిదేకాదా ॥ నీసొ ॥

శ్రీవేంకటేశ నీవు జీవాంతరాత్మవట
కావించి నాపాలఁ గలవేసుమ్మీ
కైవసమై చందురుఁడు కలువలజాతికెల్ల
భావింప సర్వవిధబంధువే కాఁడా ॥ నీసొ ॥ 441

౧. * అరుగలోపలికంటే (?) పూ మ పా.

బౌళిరామక్రియ

అన్నిటికి హరి యంతర్యామి మూలము
విన్నకన్నగతులెల్లాఁ[1] వృథా మూలము ॥ పల్లవి ॥

లాలితవైరాగ్యమూలము మోక్షము
ఆలరి సంసారమూల మతిబంధము
మేలిమి శాంతమూలమే సుఖము
వీలి క్రోధమూలమే వెసదుఃఖము ॥ అన్ని ॥

కైకొన భవములే కర్మమూలము
శ్రీకాంతుపై భక్తి చిన్మూలము
పైకొన్న ధ్యానమెల్ల భావమూలము
దీకొని లంపటములు దేహమూలము ॥ అన్ని ॥

అడుదై సుజ్ఞాన మాచార్యమూలము
ధరణిఁ జగతెల్లా దయమూలము
పరము శ్రీవేంకటపతిమూలము
హరి నాకితనిశరణాగతి మూలము ॥ అన్ని ॥ 442

దేవగాంధారి

వానికి ముద్దుల యిచ్చి వద్దని మానుపవే
శ్రీనారాయణ నీచేతనే వేసరితి ॥ పల్లవి ॥

నీకల్పితములే యీనిఖిలేంద్రియములు
యీకడ నీయింద్రియాల నెట్టు గెలువఁగవచ్చు
నీకడ నిన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వానిఁ
బైకొని చోఁపుటగాక బలిమా రాచాజ్ఞతో ॥ వాని ॥

---

౧. 'ప్రథా' రేకు.

నీపంపునఁగప్పిననిజమైనమాయ యిది
మాపాటివారెల్లా మహి నెట్టు దాఁటవచ్చు
మీపాదాలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని
పైపైఁ దోయుటగాక బలిమా రాచాజ్ఞతో ॥వాని॥

శ్రీవేంకటేశ నీచిక్కులే యీపుట్టుగులు
నీవు సేసేచేఁతలకు నే నెట్టు దొలఁగవచ్చు
నీవొద్ద శరణంటి నీయానతినే వాని
భావించి తోసితిఁగాక బలిమా రాచాజ్ఞతో ॥వాని॥ 443

రేకు 188 గుండక్రియ

నీవే సేసినచేఁత నీవే చేకొనుటింతే
యీవల నీసొమ్ము నీకే ఇయ్య సిగ్గయ్యీనయ్యా ॥పల్లవి॥

ఆలు బిడ్డలఁ గని యటు దనమగనికి
సీలాన సమర్పణ సేయవలెనటవయ్యా
తాలిమిఁ బుణ్యాలు సేసి దైవమా నే నీకు
యేలీల సమర్పించే విందుకే నవ్వు వచ్చీనయ్యా ॥నీవే॥

అంకెలఁ గన్నకొడుకటు దమతండ్రికిని
తెంకి నే నీవాఁడ నని తెలుపఁగవలెనటవయ్యా
లంకె నాలోపలనున్న లక్ష్మీశ నే నీకు
పొంకపు నీ బంట నన్నఁ [1]బునరుక్తయ్యీ నయ్యా ॥నీవే॥

తననీడ యద్దములోఁ దానే యటు చూచి
సవివడి వూరకే భ్రమయవలెనటయ్యా
అనుగుశ్రీవేంకటేశ ఆతుమలోనున్న నిన్ను
గని మని శరణంటిఁ గడఁ బూజించనేలయ్యా ॥నీవే॥ 444

---

౧. 'బునరుక్తెయ్యీ' రేకు. పునరుక్తి+అయ్యీనయ్యా. ఈ సంధులివాఙ్మయమున కొల్లలు.

బౌళి

అనలము సూర్యుఁడు నన్నిటందు వెలసిన (నా ?)
ఘనపవిత్రమైనట్టు ఘనుఁడే పో జ్ఞాని ॥ పల్లవి ॥

కాంచనము అంటువడినఁ గలదా అందు నింద్యము
పెంచు ముట్టంటువడినఁ బెక్కుపదూష్యముగాక
అంచల సుజ్ఞానిఁ బాపమంటనా తాఁ జేసినాను
పంచల నజ్ఞాని నై తేఁ బైకొనీఁగాక ॥ అన ॥

యెఱుకగలం ౧నాలిక నింతైనా జిడ్డంటునా
యెఱుకలేవిచేత నింతా జిడ్డంటుఁగాక
కఱతలయోగిని కర్మములివంటునా
చుఱచుఱ జడునై తేఁ జుట్టుకొనుఁగాక ॥ అన ॥

తామెరపాకుల నీరు తగ నంచు నంటునా
ఆమేర నెండైనాను నంటుఁగాక
యీమేర శ్రీవేంకటేశుఁనిదాసుఁడు భూమిఁ
గామించి తా నుండినానుఁ గడు మాయలంటునా ॥ అన ॥ 445

చాయానాట

కమ్మంటేఁ గావా కాఁగల వన్నియు
చిమ్ముల మాయలు సేయఁగనేలా ॥ పల్లవి ॥

సరసిజాక్ష నీసంకల్పమాత్రము
అరుదగుఘనబ్రహ్మాండ మిది
అరయఁగ ధరలో నల్పపుఁబనులకు
హరి యవతారం బందితివేలా ॥ కమ్మం ॥

---

౧. 'నాలికె' రేకు

సతతసురాసురజననమరణములు
మతి నీహుంకారమాత్రములు
గతియై యమృతము గల్పించుకొరకును
తతి ఘోరజలధి దచ్చితివేలా ॥ కమ్మ ॥

యిహ వైకుంఠము యీశేషగిరే
మహి నీ దర్శనమాత్ర మిది
విహరింపఁగ శ్రీవేంకటేశ యిటు
బహులోకపుకల్పన లవి యేలా ॥ కమ్మ ॥ 446

సామంతం

రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥ పల్లవి ॥

౧ నహంకరించినను తొల్లి ఘనుడు నారదమౌని
బెడిదపుటింతిఁ జేసి నీమాయ అతని బిడ్డలఁ గనిపించెను
అడరి నే ననఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁగలనా
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁజేయవే
॥ రాచా ॥

మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనివి
సహజపునీహస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ
బహుముఖముల. నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ
అహిశయనుఁడ నే నీశరణంటిని అది నన్ను దగ్గరకుండఁ
జేయవే ॥ రాచా ॥

సారపుశ్రీవేంకటేశ స్వతంత్రుఁడవు నీవు
గారవపుమాయ నీదే కమ్మి నే నీవాఁడనే
మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ
బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ ॥ రాచా ॥ 447

మాళవిగౌళ

ఎందుకు విచ్చేయనేల ఇన్నియు నాలోనివే
అంది యివే చేకొనవే ఆరడి నీకేల ॥ పల్లవి ॥

కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియమైతే
కాముకత్వము నాయందుఁ గలదెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే
నాముల క్రోధ మిదివో నాలో నున్నది ॥ ఎందు ॥

లోకులచీర లీకుండేలోభమే ప్రియమైతే
యీకడ లోభము నాలో హెచ్చినదిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియమైతే
చేకొను మదము నాలో సేనాసేన ॥ ఎందు ॥

మఱి శిశుపాలునిపై మచ్చరమే ప్రియమైతే
మెఱయుమత్సర మిదే మించీ నాలో
తఱి శ్రీవేంకటపతి దాసులపై మోహము
నెఱి నీకుఁ బ్రియమైతే నేనేకానా ॥ ఎందు ॥ 448

శంకరాభరణం

కానవచ్చె విందులోనే కారుణ్యనరసింహా
తానకమై నీకంటే దాస్యమే పో ఘనము ॥ పల్లవి ॥

యెనసి ప్రహ్లాదుఁడు యెక్కడఁ జూపునోయని
వనిచి లోకమెల్ల నరసింహగర్భములై
పనిపూని వుంటి వటు భక్తపరతంత్రుఁడవై
తనిసి నీ వధికమో దాసులే యధికమో ॥ కాన ॥

మక్కువ బ్రహ్మాదులు మానుపనానికోపము
ఇక్కువై ప్రహ్లాదుఁడు యెదుట నిలిచితేను
తక్కక మానితి వట్టే దాసునియాధీనమై
నిక్కి నీకింకరుఁడే నీకంటే బలువుఁడు ॥ దాన ॥

అరసి కమ్మర ప్రహ్లాదవరదుఁడని
పేరువెట్టుకొంటి విట్టే బెరసి శ్రీవేంకటేశ
సారె నీశరణాగతజనుల కాధీనమైతి-
వీరీతి నీదాసునికే యిదివో మొక్కము కా॥ 449

రేకు 189 ధన్నాసి

అటుగాన మోసపోక హరి నీకే యన్నియును
ఘటియించుటే యెక్కుడు కమలారమణ ॥ పల్లవి ॥

నిన్నుఁ జూడనికన్నులు నెమలికన్నులు
చిన్నినీకథవిననిచెవులు గాట్రపుఁజెవులు
వున్నతి నీకడకు రాకున్నకాళ్లు మురగాళ్లు
సన్నుతిసేయనిజిహ్వ సరి సర్పజిహ్వ ॥ అటు ॥

చేరి నిన్నుఁ బూజించనిచేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టితలయే పెడతల
సారె నీముద్రలేనిభుజములు బుద్బుదములు
తేరి నీదాస్యములేనిదేహము సందేహము ॥ అటు ॥

వనమాలలున్నగ్రీవము కంబుగ్రీవము
ఘన మిది దెలియుటే కైవల్యము
యెనయ శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
అనుమానమెల్లఁ బాసె నన్నిటా నాకును ॥ అటు ॥ 450

## సామంతం

అందుకుఁ గాదు నేఁ గల్చు టామీఁదిపని కింతే
ఇందు నందు నీవే కర్త యిందిరారమణ ॥ పల్లవి ॥

ఇంచుకంత వేలఁ గొండ యెత్తినదేవుఁడవు
ముంచి నాసంసారభారము మోవలేవా
అంచల దేవతలకు నమృతమిచ్చిననీవు
కంచాన నన్నముపెట్టి కాచుట నన్నెంత ॥ అందు ॥

వడి ద్రౌపది ౧ కక్షయవలువలిచ్చిననీవు
బెడఁగునాకుఁ గట్ని (ట్టవి?) చ్చి పెంచు టెంత
జడిసి యింద్రాదులకు సంపదిచ్చినట్టినీవు
కడు నాకు నైహికభోగము లిచ్చుటెంత ॥ అందు ॥

పొసఁగ లోకములెల్లఁ బూర్ణుఁడవైననీవు
వుసురై నాలోన (నే?) నీవు వుండుటెంత
వసుధ శ్రీవేంకటేశ వరములిచ్చేనీకు
దెస నాకోరికెలెల్లాఁ దీర్చుటెంత ॥ అందు ॥ 451

## గుజ్జరి

అందాఁకాఁ దాఁ దానే అంత కెక్కుఁడు గాఁడు
ముందు వెన కెంచేనా ముఖ్యుఁడే యతఁడు ॥ పల్లవి ॥

చిత్త మంతర్ముఖము సేసుకొననేర్చెనా
అత్తల నతఁడు యోగియనఁబడును
సత్తసత్తనెడిసువిచారంబు గలిగెనా
వుత్తమవివేకియని వూహింపఁబడును ॥ అంటఁ ॥

---

౧. 'అక్షయవలువలు' సమాసదోషము. ఈ పాటచిల్లర సామాసికదోషములకు ఈవాఙ్మయమున పట్టింపులేదు.

భావము నభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁడవి కానఁబడును
దైవంబుఁ దన్ను మతిఁ దలపోయనేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు. ॥ అందాఁ ॥

అదరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిడువై జింతేంద్రియస్థిరుఁ డాతఁడు
జడియు శ్రీవేంకటేశ్వరుదాసుఁ డాయచా
బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు. ॥ అందాఁ ॥ 452

మలహరి

పరమపురుష హరి పరమ పరాత్పర
పరరిపుభంజన పరిపూర్ణ నమో. ~~॥ పల్లవి ॥~~

కమలాపతి కమలనాథ కమలాసనవంద్య
కమలహితానంతకోటిఘనసముదయతేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
౧ కమలషట్కయోగీశ్వరహృదయం తే హం నమోనమో(?) ॥పర॥

జలనిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
౨ జలధియంతరవిహార మచ్ఛకచ్ఛపయవతారా (?)
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తకగమన
జలనిధికారుణ్య నమో తేహం జలవిధిగంభీర నమో నమో ॥ పర ॥.

---

౧. 'కమలషట్కయోగీశ్వర హృదయం నమో నమో తేహం నమో నమో.' అని రేకు. తర్వాతి చరణములను చూచి పూర్వపరిష్కర్తలు పై విధముగ సవరించిరేమో. 'కమలషట్క......హృగయు' అని వుండవచ్చునేమో. 'హృదయం' పాఠములో అర్థము అంత సంగతముకాదు. ౨. జలధియంతర........తారా=జలధిలో సంచరించు చేప తాబేటి యవతారములవాఁడా ? అని అర్థము కావచ్చు. ఈ పాటలో కొన్నిసంధులు కొన్నిపదముల అర్థములు సుగమములు సాధువులు కావు.

నగధర నగరిపునందిత నగచరయూథపనాథా
నగపారిజాతహర సారసపన్నగపతిరాజశయన (?)
నగకులవిజయ శ్రీవేంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా హం తే సర్వేశ్వర నారాయణ నమో నమో ॥ పర ॥ 453

పాడి

అట్టయితే నాయంతర్యామివేలైతివయ్యా
మట్టుమీఱి ముక్తియాస మాననటవయ్యా ॥ పల్లవి ॥

పొలఁతులు లేరా భూమి భోగించే నే లేనా
కలకాల మింద్రియాలకాణాచి లేదా
తొలి యీసంసారము లేదో నాకాంక్షలు లేవో
యెలమి నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా ॥ అట్ట ॥

ధరలోఁ బసిఁడి లేదా తగిలి నాయాస లేదా
సిరులయజ్ఞానపుచీఁకటి లేదా
అరయఁ జవులు లేవా అందుకో నాలికె లేదా
యిరవై నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా ॥ అట్ట ॥

అట్టే సర్వాపరాధి నపరాధా లెంచనేల
గట్టిరాళ్లలో మలిగండ్లేరనేల
నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ (౧)జూచి కావకుంచే
ఇట్టే నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా ॥ అట్ట ॥ 454

౧. 'చూచి=చూచియును' కావచ్చు.

బౌళి

మరిగితి నేమి సేతు మగిడి నే నెందు వోదు
సరుస దైవము నీకే శరణుచొచ్చేను ॥పల్లవి॥

తల్లి గోపించి మొత్తినఁ దనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
వెల్లవిరై హరి నీవు విషయాలఁ జిక్కించితే
ఇల్లిదే నిన్నుఁ దలఁచి ఇటు దూరే నేను ॥మరి॥

కన్నతండ్రి బాలునిఁ జంకంబెట్టి దించితేను
౧కొన్నేసి విలుచు ముద్దుగునిసినట్టు (?)
వున్నతి నాలోనుండి వూరకే మాయ నాపై
బన్నితే నిన్నే సొలసి పగటులాడేను ॥మరి॥

దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే నీ బంట నే వింతే
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడనయిననేను చెలఁగి మొక్కేను ॥మరి॥ 455

రేకు 190 లలిత

ఎట్టు వలసినఁ జేయు మిన్నియు నీచిత్తమె
౨నెట్టన(నె?) నొకఁడనా నీవే యింతాను ॥పల్లవి॥

వేవేలు నీకు విన్నవించేదేమి, తొల్లే
సావధానముగ సర్వసాక్షివి నీవు
ఆవల నా కిటు సేయుమని చెప్పేదేమి నేను
దైవికమైనట్టిస్వతంత్రుఁడవు నీవు ॥ఎట్టు॥

౧. 'కొన్నేసి=కొన్నిసార్లు' పిలుచు కావచ్చునేమో? ౨. 'నెట్టన(నే) నొకఁడనా నీవే యింతాను' అని కావచ్చు. 'నానీవే=నాలోని నీవే' అని వుండవచ్చు.

తగిలి నిన్ను నాలో ధ్యానించేదేమి, తొల్లె
జగతి నీవు పూర్ణచైతన్యుఁడవు
జిగి నీనామము నోరఁ జిక్కించి నుడిగేదేమి
మగుడి శబ్దాక్షరమంత్రరూపుఁడవు ॥ ఎట్టు ॥

చేవమీర సిరులఁ బూజించేదేమి నిన్ను
శ్రీవేంకటేశ నీవు శ్రీపతివి
దేవదేవ నిన్ను నీవే తేఁకువెల్లా నెంచుకొని
కావుము నీ వొక్కఁడవే కరుణానిధివి ॥ ఎట్టు ॥ 456

బౌళి

ఈతనిమూలమెపో యిలఁగలధనములు
యీతఁడు మాకు గలఁడు యెంత లేదు ధనము ॥ పల్లవి ॥

విరతి మాధనము, విజ్ఞానమే ధనము
మరిగినతత్వమే మాధనము
పరము మాధనము, భక్తే మాధనము మా-
కరిరాజవరదుఁడే కైవల్యధనము ॥ ఈత ॥

శాంతమే మాధనము, సంకీర్తనే ధనము
యెంతైనా విశ్చింతమే ఇహధనము
అంతరాత్మే మాధనము, హరిదాస్యమే ధనము
యింతటా లక్ష్మీకాంతుఁ డింటిమూలధనము ॥ ఈత ॥

ఆనందమే ధనము, ఆచార్యుఁడే ధనము
నానాటఁ బరిపూర్ణమే ధనము
ధ్యానమే మాధనము, దయే మాధనము
పావనశ్రీవేంకటాద్రిపతియే మాధనము ॥ ఈత ॥ 457

భవుళి

నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు
కామించి హరి నీ వొక్కఁడవే నిజము ॥పల్లవి॥

చచ్చేటి దొకమాయ సరిఁ బుట్టేదొకమాయ
మచ్చుమేపులసిరులు మాయలో మాయ
వచ్చేటి దొకమాయ వచ్చిపొయ్యే దొకమాయ
కచ్చుపెట్టి హరి నీ వొక్కఁడవే నిజము ॥నీమా॥

పొద్దువొడచేది మాయ పొద్దుగుంకే దొకమాయ
నిద్దురయు మేల్కనేది నిండుమాయ
వొద్దనే సుఖము మాయ వొగి దుఃఖ మొకమాయ
గద్దరిశ్రీహరి నీ వొక్కఁడవే నిజము ॥నీమా॥

కూడేటి దొకమాయ కూడి పాసే దొకమాయ
యేడ నేర్చితి శ్రీవేంకటేశుఁడ నీవు
వేడుక నీశరణంటి విడిపించు మీమాయ
వోడక వెదకితి నీ వొక్కఁడవే నిజము ॥నీమా॥ 458

దేసాళం

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురతబిన్నాణరాయ సుగుణకోనేటిరాయ ॥పల్లవి॥

సిరులసింగారరాయ చెలువపుతిమ్మరాయ
సరసవైభవరాయ సకలవినోదరాయ
వరవసంతములరాయ వనితలవిటరాయ
గురుతైన [౧]తేగరాయ కొండలకోనేటిరాయ. ॥తిరు॥

---

౧. 'తేగరాయ = త్యాగముగలరాజు' కావచ్చు.

గొల్లెతలవుద్దండరాయ గోపాల ౧కృష్ణరాయ
చల్లువెదజాణరాయ చల్లఁబరిమళరాయ
చెల్లుబడిధర్మరాయ చెప్పరానివలరాయ
కొల్లలైనభోగరాయ కొండలకోనేటిరాయ ॥ తిరు ॥

సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్యవిభాళరాయ
కామించి నిన్నుఁ గోరితే గరుణించితివి నన్ను
శ్రీమంతుఁడ నీకు జయ శ్రీవేంకటరాయ. ॥ తిరు ॥ 459

ఠవుళి

అన్నిటా శాంతుఁడైతే హరిదాసుఁడు దానే
సన్నుతిఁ దానేపో సర్వదేవమయుఁడు. ॥ పల్లవి ॥

అత్తల మనసు యింద్రియాధీనమైతేను
చిత్తజుఁడనెడివాఁడు జీవుఁడు దానే
కొత్తగాఁ దనమనసే కోపాన కాధీనమైతే
తత్తరపురుద్రుఁడునుఁ దానే తానే ॥ అన్ని ॥

భావము వుద్యోగములప్రపంచాధీనమైతే
జీవుఁడు బ్రహ్మాంశమై చెలఁగుఁ దానే
కావిరి రేయిఁబగలు కన్నుల కాధీనమైతే
ఆవలఁ జంద్రసూర్యాత్మకుఁడుదానే ॥ అన్ని ॥

కోరికఁ దనబ్రదుకు గురువాక్యాధీనమైతే
మోరతోపులేనినిత్యముక్తుఁడు దానే
ఆరయ శ్రీవేంకటేశుఁ డాతుమఅధీనమైతే
ధారుణిలో దివ్యయోగి తానే తానే ॥ అన్ని ॥ 460

---

౧. 'క్రిష్ణ' రేకు.

సాళంగనాట

ఇహమెట్టో పరమెట్టో ఇఁక నాకు
సహజమై హరియే శరణము నాకు ॥పల్లవి॥

చిత్తమిది యొకటే చింత వేవేలసంఖ్య
వొత్తుల హరిఁదలఁచఁ బొద్దులేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు
తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు ॥ఇహ॥

చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిఁబూజించ నిచ్చ లేదు
జాతి నాలిక వొకటే చవులు కోటానఁగోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు ॥ఇహ॥

వీను లివి రెండే వినికి కొలఁదిలేదు
పూని హరిభక్తి విన బుద్ధి లేదు
యీనటన శ్రీవేంకటేశుఁ డిటు చూచినను
తానే యేలె నిఁకఁ దడఁబాటు లేదు ॥ఇహ॥ 461

రేకు 191 రామక్రియ

వినవమ్మ జానకి నీవిభుఁ డింతసేసినాఁడు
యెనసి యీరఘురాముఁ డిఁక నేమి సేసునో ॥పల్లవి॥

వానరులదండు గూడి వారిధి కొండలఁ గట్టె
ఆవి లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటమెక్కె గొడగు లన్నియుఁ జెక్కె
యేనెపాన రఘురాముఁ డిఁక నేమిసేసునో ॥విన॥

కోరి ఇంద్రజిత్తుఁ జంపె కుంభకర్ణు నిర్జించె
ఘోరదానవులనెల్ల కూలఁగుమ్మెను
మారణహోమము సేసె మతకమింతాఁ జెరిచె
యీరసాన రఘురాముఁ డింక నేమిసేసునో ॥ విన ॥

లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె
చేవల నోసీత నిన్నుఁ జేకొనెను
భావించి శ్రీవేంకటాద్రిఁ బట్టము దాఁ గట్టుకొనె
యీవలనావల నాతఁ డింక నేమిసేసునో ॥ విన ॥ 462

శ్రీరాగం

ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ దెలుపరో గురువులాల ॥ పల్లవి ॥

తనువూ హరియే తలఁపూ హరియే
వివికి మనికియును విష్ణుఁడే
కనుఁగొనుచూపులు కమలనాభుఁడే
యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో ॥ ఇంత ॥

లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నున్నవాఁడనో ॥ ఇంత ॥

వెనకను కృష్ణుఁడే వెస ముం దచ్యుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగునాస్వతంత్ర మది యేడనున్నదో ॥ ఇంత ॥ 463

లలిత

కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథాశ్రవణం ॥ పల్లవి ॥

అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతిశోభితం
అచలం బిదివో హరికీర్తనం ॥ కలి ॥

నిరతం నిత్యం నిఖిలశుభకరం
౧ దురితం హర భవదూరం
పరమమంగళం భావాతీతం
కరివరదం నిజకైంకర్యం. ॥ కలి ॥

సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవేంకటపతిశరణం
౨ జలజోదరనిచ్చ స్తోత్రం. ॥ కలి ॥ 464

బౌళి

ఎఱుఁగుటకంటే నెఱఁగమే మేలు
మఱి తెలివికంటే మఱపే శుభము ॥ పల్లవి ॥

లంపటా లెఱఁగము లవలవ లెఱ గము
పంపులబాల్యమే పరిణామము
యింపులు నెఱఁగము యెగ్గులు నెఱఁగము
జంపులనిదురే ౩ సకలసౌఖ్యము ౹. ఎఱు ॥

---

౧. 'దురితంహర' అనునది 'దురితహరం' కావచ్చు. 'దురిత(హరం?)ం హర భవదూరం' పూ. ము. పా. దీనిలో ఒక హర ఎక్కువ ప్రామాదికమై యుండవచ్చు.
౨. 'జలజోదరనిత్యస్తోత్రం' కావచ్చు. ౩. 'సకల' రేకు.

ఆస లివెఱఁగము అలమట లెఱఁగము
మూసినగర్భమే మును సుఖము
వాసులు నెఱఁగము వంతులు నెఱఁగము
వేసట వుట్టనివిధమే సుఖము ॥ ఎఱు ॥

పాపము లెఱఁగము బంధము లెఱఁగము
శ్రీపతిదాస్యమే శేఖరము
యేపున శ్రీవేంకటేశ్వరుశరణమే
తీపులు మఱపేటిదివ్యానందము ॥ ఎఱు ॥ 465

లలిత

కలిగె నిదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది ॥ పల్లవి ॥

జయ పురుషోత్తమ జయ పీతాంబర
జయ జయ కరుణాజలనిధి
దయ యెఱంగ నే ధర్మము నెఱఁగ నా-
క్రియ యిది నీదివ్యకీర్తనమే ॥ కలి ॥

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీజనార్దన
పరమ మెఱంగను భక్తి యెఱంగను
నిరతము నాగతి నీదాస్యమే ॥ కలి ॥

నమో నారాయణ నమో లక్ష్మిపతి
౧నమో పుండరీకనయనా
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను ౨నీకయింకర్యమే ॥ కలి ॥ 466

౧. 'నమః' కావచ్చు. ౨. కయింకర్యమే' వ్రాయసకాని వ్యుత్పత్తి కావచ్చు.

శంకరాభరణం

హరియు నొక్కఁడే గురి ఆత్మలో నొక్కటే గురి
విరివి నెంత చదివినా వేరు గాఁబొయ్యీనా ॥పల్లవి॥

అందరిచూపులు నొక్కటైనందుకు గురి
యెందుఁ గొండ కొండేకాక యితరముగాఁ జూచేరా
అందరిరుచులు నొక్కటైనందుకు గురి
చెంది తీపు తీపే కాక చేఁదుగాఁ జేకొనేరా ॥హరి॥

వొప్పుగా నందరివూర్పు లొక్కటైనందుకు గురి
కప్పుర మదేకాక కస్తూరిగా మూఁకొనేరా
యెప్పుడూ నిందరివీని కేకమైనందుకు గురి
తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా ॥హరి॥

యీరీతి నిందరిచిత్త మేకమైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతి రయ్యీనా
తేరి శ్రీవేంకటపతి దేవుఁడై నందుకు గురి
కోరినవారివరాలే కొంగుపైఁడిగాదా ॥హరి॥ 467

రేకు 192 బౌళి

నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే
నిరతి నాకారకే వో నిను సేవించేది ॥పల్లవి॥

ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని
బందుకట్టుదుదుఃఖములఁ బాపుదువని
యిందలియాసలనేపో యేచిన నాభయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు ॥నిరు॥

జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి
వెనకటినీకథలు వినివిని
నినుపై యీయాసనేపో నిన్ను సారెఁ బొగడేది
వానర నీయాసేపో వుపకారగురువు ॥ విరు ॥

లోకులు గొలువఁగాను లోన నీవు వుండఁగాను
దీకొవి గురుఁడు బోధించఁగాను
కైకొవి శ్రీవేంకటేశ కరుణించగా నీవు
దాకొవి యీయాసకే నీదాసినై కొలిచితి ॥ విరు ॥ 468

సాళంగం

నానాభక్తు లివి నరులమార్గములు
యేనెపానవైనా నాతఁ డియ్యకొను భక్తి ॥ పల్లవి ॥

హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి వొక్కటే అనందభక్తి ॥ నానా ॥

అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతనిదాసులసేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే ౧గతవి వుండు టదివైరాగ్యభక్తి ॥ నానా ॥

అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశుకైంకర్యమే సేసి
తట్టుముట్టులేవిదే తగ నిజభక్తి ॥ నానా ॥ 469

౧. 'గతెవి' రేకు. గతి+అవి. ఈసంధులు కోకొల్లలు.

## సాళంగనాట

కంటిరా వింటిరా కమలనాభునిశక్తి
వొంటి నితనిశరణ మొకటే వుపాయము ॥ పల్లవి ॥

యీతనినాభిఁ బొడమె యెక్కువైన(బ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁ డాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పో హరి మనకిందరికి దైవము ॥ కంటి ॥

యీతఁడే యసురబాధ లిన్నియుఁ బరిహరించె-
నీతనిమూఁడడుగులే యీలోకాలు
యీతఁడే మూలమంటే నేతెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లేఁక మరి కలరా ॥ కంటి ॥

యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ-
డీతఁడే వేదోక్తదైవ మిన్నిటాఁ దానె
యీతఁడే ౧అంతర్యామి యీచరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁ డిహపరధనము ॥ కంటి ॥ 470

## సామంతం

సింగారమూరితివి చిత్తజగురుఁడవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా ॥ పల్లవి ॥

పూవులతెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి-
పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సాసముఖా ॥ సింగా ॥

---

౧. 'అంతరియామి' రేకు.

అంగరంగవైభవాల నమరకామినులాడ
వింగినుండి దేవతలు విన్నుఁ జూడఁగా
సంగీతతాళవాద్యచతురతలు మెరయ
సంగడిఁ దేలేటిమీకు సొనముఖా ॥ సింగా ॥

పరగఁ గోనేటిలోన పసిఁడి మేడనుండి
అరిది విందిరయు నీవారగించి
గరిమ శ్రీవేంకటేశ కమ్మలపండువగాఁగ
సరవి నోలాడుమీకు సొసముఖా ॥ సింగా ॥ 471

## శంకరాభరణం

పట్టలేనిమనభ్రమ గాక
నెట్టనఁ దాఁ గరుణించనివాఁడా ॥ పల్లవి ॥

హితప్రవర్తకుఁ డీశ్వరుఁడు
తతి నంతరాత్మ తాఁగాన
రతి నాతని దూరఁగనేలా
గతియని తలఁచిన కావనివాఁడా ॥ పట్ట ॥

తెగనిబంధువుఁడు దేవుఁడు
బగివాయఁ డిహముఁ బరమునను
అగపడి సందేహములేలా
తగ నమ్మిన దయదలఁచనివాఁడా ॥ పట్ట ॥

హృదయము శ్రీవేంకటేశ్వరుఁడు
మొదలనే ఆనందమూర్తిగన
కదిసి వెలివి వెదకఁగనేలా
యెదురఁ గవిన వరమియ్యనివాఁడా ॥ పట్ట ॥ 472

### గుండక్రియ

తానే తెలియుఁగాక తలఁచఁగ నెట్టువచ్చు
నానాగతుల తననాటకపుమాయ ॥ పల్లవి ॥

అట్టె ౧యేఁబదియైనయక్షరాలలోనట
తిట్టులట వొకకొన్ని దీవెనలటా
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని
యిట్టివి చిక్కులు భూమి నిఁకనెన్ని గలవో ॥ తానే ॥

కదిసిన యఱువదిగడియలలోనట
పొదలు నడకలట భోగములటా
విదురట వొకకొంత నేరుపులు కొన్నియట
యెదుట చూడఁగఁ జూడ నిఁక నెన్ని గలవో ॥ తానే ॥

రేవగలు కమ్ముకొని రెంటిలోనేయట
దైవము జీవులలోనే తానకమట
శ్రీవేంకటాద్రిమీఁద ౨జెలఁగి యా (గెనా?) తఁడే యట
యేవంక నీచేఁతలు యిఁక నెన్నిగలవో ॥ తానే ॥ 473

రేకు 193

### దేసాళం

ఇంతటఁ బో కానవచ్చు నెక్కువ తక్కువలెల్ల
దొంతి ఇంద్రియాలకెల్లఁ దొలఁగి వుండేము ॥ పల్లవి ॥

మాటలాడవచ్చుఁగాని మనసులు పట్టరాదు
చాటువకెక్కినయట్టిసతులఁ గంటే
కోటి చదువఁగవచ్చు కోపము నిలుపరాదు
జూటరై వొకఁడు దన్ను సోఁకనాడితేను ॥ ఇంత ॥

---

౧. 'యాఁబది' రేకు ౨. 'జెలఁగి' కావచ్చు. ద్రుతముపై యడాగమము ఈ
[illegible]

అందరి దూషించవచ్చు నాసలు మానఁగరాదు
కందువైనమించులబంగారు గంటే
అందాల మొక్కఁగవచ్చు హరిభక్తి సేయరాదు
పొందులసంసారపుభోగము గంటేను ॥ ఇంత ॥

మొదలఁ బుట్టఁగవచ్చు మోక్షముఁ బొందఁగరాదు
పొదిగి పుణ్యరాసులభోగము గంటే
యెదుట శ్రీవేంకటేశ ఇదివో నీశరణంటే
కదిసితి విట్టె పో నీకరుణ గంటేను ॥ ఇంత ॥ 474

లలిత

అంతర్యామీ అలసితి సొలసితి
ఇంతట నీశర ణిదే చొచ్చితిని ॥ పల్లవి ॥

కోరినకోర్కులు కోయనికట్లు
తీరవు నీవవి తెంచకా
భారపుఁబగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోవు నీవు వద్దనకా ॥ అంత ॥

జనులసంగములఁ జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించకా
వినయపుదైన్యము విడువనికర్మము
చనదది నీవిటు ౧సంతపరచకా ॥ అంత ॥

మదిలో చింతలు మయిలలు మణుఁగులు
వదలవు నీవవి వద్దనకా
యెదుటనె శ్రీవేంకటేశ్వర నీ వదె
అదనఁ గాచితివి అట్టిట్టనకా ॥ అంత ॥ 475

౧. సంతపరచు = 'శాంతపరచు' కావచ్చు.

జగము లేలేటివాఁడు సంసారఁ జేసినవాఁడు
తగులై వుండినవాఁడు తానేకాఁడా
వెనకముందర దినాలు పెరుగఁజేసేటివాఁడు
తగినట్టు నడపించఁ దా నేరఁడా. ॥ఒక్క॥

మొదలై వుండేటివాఁడు ముందరఁ దుదయ్యేవాఁడు
యిదిలోవాఁడు శ్రీవేంకటేశుఁడే కాఁడా
చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాఁడు
పొదిగి నాదాపుదండై భోగించఁడా ॥ఒక్క॥ 477

సాళంగనాట

దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ నింతటిలో భూభారమెల్ల నణఁగె ॥పల్లవి॥

నేఁడు కృష్ణుఁడు జనించె నేఁడే శ్రీజయంతి
నేఁడే రేపల్లెలోన నెలవైనాఁడు
పేఁడుక యశోదకు బిడ్డఁడైనాఁ డిదె నేఁడే
పోఁడిమి జాతకర్మ మొప్పుగ నాయ నేఁడు ॥దేవ॥

ఇప్పు డిదె గోవుల కిచ్చెను పుత్రోత్సవము
ఇప్పుడు తొట్టెల నిడి రింతులెల్లాను
చెప్పరాని లలిల సేయఁగలదెల్లాఁ జేసి
కప్పెను విష్ణుమాయలు గక్కన నేఁ డిపుడు ॥దేవ॥

ఇదివో వసుదేవునిఇంటిచెరలెల్లఁ బాసె
ఇదివో దేవకితప మిట్టె ఫలించె
చెదరక తా నిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె
యెద నలమేలుమంగ యెక్కివున్నా డిదివో ॥దేవ॥ 478

బౌళి

హితవే సేసుఁగా కాతఁడేల మానును
మితి నాతని దూరక మెచ్చవలెఁగాక ॥ పల్లవి ॥

ఆగమభోగములకు హరి నాలో నున్నవాఁడు
వేగదేర నాకు మేలే చింతించుఁగాక
సాగినప్రపంచములో సంసారిఁ జేసినవాఁడు
యేగతి రక్షించఁ దానే ఇన్నిటి కౌఁగాక ॥ హిత ॥

భూమిమీఁద దేహమిచ్చి పుట్టించినట్టివాఁడు
ప్రేమతో నన్నపానాలు పెట్టుఁగాక
ఆమని పంచేంద్రియాల నటు పెడరేఁచేవాఁడు
నేమపుఁబుత్రదారాలై నిందుకుండుఁగాక ॥ హిత ॥

ఇహపరములకుఁ దా నిరవైనట్టివాఁడు
సహజాన నన్నియును జరపుఁగాక
వహి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాఁడు
మహిమతో మమ్ము నేలి మన్నించుఁగాక ॥ హిత ॥ 479

రేకు 194 కన్నడగౌళ

ఎవ్వర నేమనఁగల నెంతబలువుఁడ నేను
నవ్వుచు నీవే యిఁక నన్ను మన్నించవయ్యా ॥ పల్లవి ॥

కామక్రోధములకు కాణాచి నేఁపను
ఆమనియింద్రియముల కడిబంటను
దీమసపుటాసలకు తీరని [1]లగ్గస్థుఁడను(?)
యీ మరఁగువాఁడ నిన్ను నెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥

౧. లగ్గస్థుఁడను = లగ్నస్థుఁడను, తగులుకొన్నవాఁడను (స్వాధీనమైనవాఁడను) అని తాత్పర్యము కావచ్చు; నమ్మకస్తుఁడు అనుమానస్తుఁడు ఇత్యాదులవలె కావచ్చు.

పాయనిసంసారానకు [2] బడివనివాఁడను
కాయపుభోగాల పూదిగపువాఁడను
పాయపుమదములకు [3] పంగెమైనవాఁడను (?)
యీ యెడ నీవాఁడ నని యెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥

సరిఁ గర్మములకెల్ల చనవరిబొడుకను
పొరలేజన్మములయప్పులవాఁడను
అరయ శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
యిరవై ఇట్టుండకన్న నెట్టు గొలిచేనయ్యా ॥ ఎవ్వ ॥ 480

## దేసాక్షి

ఎఱుఁగువా రెరుఁగుదు రీయర్థము
యెఱఁగనివారి కిది యెఱఁగనియ్యదు ॥ పల్లవి ॥

మొదలఁ గలుగువాఁడే ముందరనుఁ గలవాఁడు
ఆదన నాతఁడే పరమాత్ముఁడు
యెదుటఁ గలిగినదే ఇన్నిటాఁ గలిగినది
పదపడి యిదియే ప్రపంచము ॥ ఎఱు ॥

చెడనిదానికి మరి చేటెన్నఁడును లేదు
జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము
పుడివోఁగల దెన్నఁడు పుడివోఁ గలిగినదే
కడగడనే తిరుగు కర్మమార్గము ॥ ఎఱుఁ ॥

యెంచి తొల్లి నడచేవే ఇపుడును నడచేవి
మంచి శ్రీవేంకటేశ్వరుమహిమ లివి
అంచ నిపుడు గానవి వల్లనాఁడుఁ గాననివే
మంచువంటివిషయపుమాయావాదములు ॥ ఎఱుఁ ॥ 481

---

౧. బడి+పనివాడను = ఈ సంధులీ వాఙ్మయమునకొల్లలు. వ్యాకరణసమ్మతములుకావు.
పంగెమైనవాఁడను = లంగపడినవాఁడను, లోఁబడినవాఁడనని తాత్పర్యము కావచ్చు.

లలిత

కేశవ దాసినైతి గెలిచితి నన్నిటాను
యీ శరీరపునేరా లింకనేలా వెదక ॥ పల్లవి ॥

నిచ్చలుఁ గోరికలియ్య నీనామమే చాలు
తెచ్చి పునీతుఁజేయ నీతీర్థమే చాలు
పచ్చిపాపా లణఁచ నీప్రసాదమే చాలు
యెచ్చుకొందువుపాయా లింకనేల వెదక ॥ కేశ ॥

ఘనునిఁ జేయఁగను నీకైంకర్యమే చాలు
మొనసి రక్షించను నీముద్రలే చాలు
మనిపి కావఁగఁ దిరుమణిలాంఛనమే చాలు
యెనసెను దిక్కుదెస ఇంకనేల వెదక ॥ కేశ ॥

నేఁ జేనసుఖమియ్య నీధ్యానమే చాలు
అదాపుదండకు నీయర్చనే చాలు
యిలపై శ్రీవేంకటేశ యిన్నిటా మాకుఁ గలవు
యెలమి నితరములు యింకనేల వెదక ॥ కేశ ॥ 482

దేసాళం

కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడ నీవు మాకుఁ జిక్కేమర్మ మిదివో ॥ పల్లవి ॥

చేపట్టి నీశిరసు పూజించేఅహమికకంటే
నీపాదాలుపూజించేనేమ మెక్కుడు
మాపుదాఁకా నినుఁగొల్చి మందెమేళమౌకంటే
దాపగునీదానుల శేషత్వ మెక్కుడు ॥ కైవ ॥

హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే
నరయ నీదాసులలెంకౌ టెక్కుడు
వెరవున నీచెవిలో విన్నపాలు సేయుకంటే
ధర నీవూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు

జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే
అట్టె నీనామఫలమందు టెక్కుడు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే
తిట్టపుమాగురునుపదేశ మెక్కుడు ॥ కైవ ॥ 483

శ్రీరాగం

నావల్ల నీ కేమున్నది నారాయణ నీవు నన్ను
కావించి రక్షించేవుపకారి మింతేకాక ॥ పల్లవి ॥

సొమ్ము దినఁబుట్టినట్టిసోమరిబంటు చేలికకు
ఇమ్ముల నందుకుఁ బ్రతి యేమి సేసీని
చిమ్ముచు [1]నాతఁడు నేమించినపనివాటలలో
వుమ్మడిఁ జేసేటివట్టివూడిగాలేకాక ॥ నావ ॥

ఆసపడి వచ్చినట్టిఅతిథి బలిరాజుకు
రాసి నేసి యేమిచ్చిన రతికెక్కీని
బేసబెల్లి తనమున బ్రియాన నిచ్చుతమాది
మూసి దైన్యపుఁజేతులమొక్కు లింతేకాక ॥ నావ ॥

శరణాగతుఁడ నీకెచ్చట శ్రీవేంకటేశుఁడ
దొరనై యేమిట సరిఁదూఁగఁగలను
ధరలోన నీవు దయదలఁచి నన్నేలుకోఁగా
పరగు నిమఱఁగున బదుకుదుఁగాక ॥ నావ ॥ 484

---

౧. 'నాతని' కావచ్చు.

### రామక్రియ

అదె శిరశ్చక్రములేనట్టిదేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో ॥పల్లవి॥

“అనాయుధాసో [౧]అసురా అదేవా” యని
వినోదముగ [౨]ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాదిప్రమాణ మందే తెలియరో ॥అదె॥

[౩]“యెచ్చ యింద్రే” యని “యచ్చ సూర్యే” యని
అచ్చుగ తుద కెక్కె(క్క?) నదే పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణ మందే తెలియరో ॥అదె॥

మును “నేమినా [౪]తప్త ముద్రాం ధారయే” త్తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవిరిసేసీని
మొనసి శ్రీవేంకటేశుముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో ॥అదె॥ 485

రేకు 195

### పాడి

ఇట్టి బ్రాహ్మణ్య మెక్కుడు యిన్నిటిలోన
దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము ॥పల్లవి॥

హరిఁగొలిచేవారి కమరు బ్రాహ్మణ్యము
పరమవైష్ణవమే పో బ్రాహ్మణ్యము
హరిణోర్ధ్వపుండ్రదేహులాచే బ్రాహ్మణ్యము
తిరుమంత్రవిధులదే తేఁకువ బ్రాహ్మణ్యము ॥ఇట్టి॥

---

౧. ‘అసురా’ రేకు. ౨. ‘ఋగ్గువేదము’ రేకు. ౩. ‘యచ్చ’ కావలె లేకున్న యతిభంగము ‘తప్తం ముద్రం ధారయ’ రేకు.

సతమై చక్రాంకితులచరితే బ్రాహ్మణ్యము
పతిశరణాగతియే బ్రాహ్మణ్యము
వెతలేని వీరలసాత్త్వికమే బ్రాహ్మణ్యము
తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము ॥ ఇట్టి ॥

అంచఁ బరమభాగవతాధీనము బ్రాహ్మణ్యము
పంచసంస్కారాదులదే బ్రాహ్మణ్యము
నెంచఁగ శ్రీవేంకటేశుఁ డిచ్చీఁదే బ్రాహ్మణ్యము
మించి యీతనివారౌటే మొదలి బ్రాహ్మణ్యము ఇట్టి ॥ 486

మాళవిగౌళ

వీధులవీధులనెల్లా విష్ణుఁడు సంచరించీని
పోది మాని కన్నుగత్తై పొంగీ మోదనుఁడు ॥ పల్లవి ॥

తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముఁడు వాఁడె
సారమైన శంఖచక్రశార్ఙ్గాయుధము లవే[1]
కారుకమ్మి నాకాసాన గరుడధ్వజం బదె
పారరో దానవులాల పంతములు విడిచి ॥ వీధు ॥

దండవెట్టె నల్లవాఁడే దైవాలరాయఁడు
దండి నెట్టెపుఁజుట్లతపారపుచుంగు లవే
కొండవంటిరథ మదె కొన వైఁడిఘంటలవే
గుండుగూలి విరుగరో గొబ్బున దైతేయులు ॥ వీధు ॥

విజయశంఖము వట్టె వీఁడె శ్రీవేంకటేశుఁడు
భజన నలమేల్మంగ పలుమారు మెచ్చీ నదె
త్రిజగాన నాతనిఁ జేరినదాసు లిదె వీరె
గజబెజ లిఁక నుడుగరో రాక్షసులు ॥ వీధు ॥ 487

౧. 'శాఙ్గ' రేకు.

లలిత

కామధేను విదే కల్పవృక్ష మిదే
ప్రామాణ్యముగల ప్రపన్నులకు ॥ పల్లవి ॥

హరినామజపమే ఆభరణంబులు
పరమాత్మునినుతి పరిమళము
ధరణీధరుపాదసేవే భోగము
పరమం బెఱిఁగిన ప్రపన్నులకు ॥ కామ ॥

దేవునిధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభుభక్తే జీవనము
ఆవిష్ణుకైంకర్యమే సంసారము
పావనులగుయీ ప్రపన్నులకు ॥ కామ ॥

యేపున శ్రీవేంకటేశుఁడే సర్వము
దాపై యితనివందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు
పైపయి గెలిచిన ప్రపన్నులకు ॥ కామ ॥ 488

మాళవిగౌళ

నీచిత్త మిందరినేరుపునేరమి
తోఁచి కాచి యిటు తుద కీడేర్పె ॥ పల్లవి ॥

దేవతలపాలు తీరనిపుణ్యము
ఆవలఁ బాపం బసురలది
భావింప మనుజులపాలివి రెండును
శ్రీవల్లభ నీసేసినమాయ ॥ నీచి ॥

వేదశాస్త్రములు విజ్ఞానమూలము
ఆది నసత్యము లజ్ఞానమూలము
సాధింప రెండును జగత్తుమూలము
భేదించి యివి నీపెరరేఁపణలు ॥ నీవి ॥

కావింపఁ గర్మము కాయముచేతిది
భావముచేతిది పరమము
తావుల రెండునుఁ దప్పనిప్రకృతివి
శ్రీవేంకటేశ్వర చేఁతలు నీవి ॥ నీవి ॥ 489

దేవగాంధారి

అర్థము చెప్పఁగరాదు అవుఁగాదనఁగరాదు
వొద్దిన దనుభవించే దోపిక జీవులది ॥ పల్లవి ॥

యీరికలెత్తె జన్మము లిన్ని జంతువులయందు
కోరికలు గొనసాగెఁ గోటానఁగోటి
నారుకొనె సంపదలు నానారూపములై
తీరదేమిటా నీచిక్కు దేవుఁడు వెట్టినది ॥ అర్థ ॥

అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి
వెల్లవిరాయను మాయ వెనకా ముందు
కెల్లురేఁగె దేహమందే కిమ్ములచుట్టరికాలు
పొల్లువో దెన్నఁడు భూమి పుట్టఁగాఁ బుట్టినది ॥ అర్థ ॥

పండెను సంసారము ౧ ఫలమైననానాఁటికి
నిండెను నాలికకు నెమ్మదిఁ జవులు
అండనే శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండి
౨ పంద వండనట్లుగ (?) వన్నె కెక్కించినది ॥ అర్థ ॥ 490

---

ఫలమై నానాఁటికి' కావచ్చు. ౨. పూ.ము.పా లోని ప్రశ్నార్థకము బోధపడలేదు.

శంకరాభరణం

ఎంత కెంత యిది యేమని పొగడుట
యింతసేయ నీకు నెదురా వీరు ॥ పల్లవి ॥

పిడుగులఁబోలెడి పెనునీనఖముల-
కెదయక హిరణ్యుఁ డెట్లుండెనో
వుదికెటిచక్రాయుధమువేఁడికిని
జడియక మకరెటు సహించెనో ॥ ఎంత ॥

శరపరంపరల శిరములు నఱకఁగ
యెరగొవి రావణుఁ డేమనెనో
పరియలువారఁగ బ్రహ్మాండభాండము
ఉరుశంఖరవం బోర్చుట యెట్లో ॥ ఎంత ॥

గాఁటపువిష్ణురగదాహతికి మధు-
కైటభులతలలకత లెట్లో
యీటున శ్రీవేంకటేశ నీకృపను
పాటించి దాసులు బ్రదుకుట యెట్లో ॥ ఎంత ॥ 491

రేకు 196 దేవగాంధారి

నీయంత నీవే యెఱిఁగి నిచ్చ నన్నుఁ గాతుగాక
మాయలలోఁ బొరలేదిమ్మరివాఁడ నేను ॥ పల్లవి ॥

నీసరివాఁడనా నిన్ను దూరేవాఁడనా
దాసుఁడనై కొలిచిన తనుధారిని
వేసరించ నోపుదునా వెరపించఁగలనా
మాసినపాపాలలోనిమైల నోఁకినాఁడను ॥ నీయ ॥

విన్నవించేవాఁడనా వీడుకోలువాఁడనా
అన్నిటా శరణుచొచ్చినట్టిజీవిని
యెన్నిటి కుత్తరమిచ్చే యేపని సేసి మెప్పించే
మున్నిటికర్మములకు ముంగిట నున్నాఁడను ॥ నీయ ॥

యెదురాడేవాఁడనా యెలయించేవాఁడనా
పదరాన నీకు మొక్కేజంతువ నేను
ఇదివో శ్రీవేంకటేశ యెరుక నీ వొసగఁగా
పొదిగి నీమహిమలు పొగడఁచున్నాఁడను ॥ నీయ ॥ 492

సాళంగనాట

ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను
చెచ్చెరఁ దగవు లింకఁ జెప్పఁగదరో ॥ పల్లవి ॥

నిలిచినది జగము నిండినది భోగము
కలిగె జీవుల కొక్కకాణాచి
వలయశాసనాలు వడి నాల్గువేదములు
చలపట్టి జాణలు చదువుకోరో ॥ ఇచ్చి ॥

పారినవి మనసులు పట్టినది జననము
పోరు దీరెఁ గర్మములపొలమేర
కోరికలె సాక్షులు గుట్టలు త్రిగుణములు
వూరుఁ బేరుఁ దెలుసుక వొడఁబడరో ॥ ఇచ్చి ॥

దక్కినది ధర్మము తప్పనిది భాగ్యము
లెక్కించ మదుటిత్రావాలె లిఖితములు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటికి మూలము
చిక్కులు వాపె నితని సేవించరో ॥ ఇచ్చి ॥ 493

## రామక్రియ

వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ॥పల్లవి॥

మడిచివేసినపువ్వు ముడువయోగ్యము గాదు
కుడిచివేసినపుల్లె కుడువఁగాఁ గాదు
బడి నొకరుచెప్పినఁ బ్రతి చెప్పఁబోతేను
అడరి శ్రీహరి కది అరుహము గాదు ॥వెఱ్ఱు॥

గంపెఁ డుముక దినఁగా నొక్క వరిగింజ
తెఁపునఁ గలసితే తెలియ నెట్టు వచ్చు
జంపులఁ బలవరించఁగ నొక మంచిమాట
ఇంపైతే హరి యందుకిచ్చునా వరము ॥వెఱ్ఱు॥

వుమిసినతమ్మలో నొకకొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల
అమరఁగ ౧ఛాయాపహారము సేసుక
తమమాట గూర్చితే దైవము నగఁడా ॥వెఱ్ఱు॥

ఏలికివేసినగింజ చేతఁ బట్టఁగనేల
గబుక కెంగిలిబూరె గడుగఁగ మరి యేల
తొలుకకవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వఁడా దేవుఁడై నాతఁ ॥వెఱ్ఱు॥

మించుచద్దికూటిమీఁద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మరిచెప్పనేరక
కంచుఁ బెంచు నొక్కగతి నదికితే మట్టు—
పెంచువలెనే చూచు పెరుమాళ్లు వాని ॥వెఱ్ఱు॥

---

౧. 'ఛాయా' లేదు.

పుచ్చినట్టిపండుబూఁజి లోననే వుండు
బచ్చనకవితలు బాఁతిగావు యెందు
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిగినట్టు
ముచ్చిమి నుతులేల మొక్కరో హరికి ॥ వెట్టి ॥

వుల్లిదిన్న కోమ టూరకవున్నట్టు
జల్లెడ నావాలు జారిపోయినట్టు
కల్లలు చెప్పి యాకథ కుత్తరములేక
మెల్లనే వుండితే మెచ్చునా దైవము వెట్టి ॥

నేతిబీరకాయ నేయి అందు లేదు
రాతివీరునికి బీరము ఇంచుకా లేదు
ఘాత బూరుగుఁబండుకడుపులోన దూది
యేతులసుడుగులు యెక్కునా హరికి ॥ వెట్టి ॥

ఇరుగువా రెరఁగరు పొరుగువా రెరఁగరు
గొరబైనమాటలు గొణఁగుచు నుందురు
పరులఁ గాదందురు బాఁతిగారు తాము
విరసు లట్టివారి విడుచు దేవుఁడు ॥ వెట్టి ॥

యెన్నఁగ శ్రీవేంకటేశుఁ దాళ్లపాక
అన్నమాచార్యులు అఖిలదిక్కులు మెచ్చ-
మన్ననితోఁ బాడి రొకఁ డెవ్వఁడో తాను
నన్ను నొరసునట నమ్మునా హరికి ॥ వెట్టి ॥ 494

లలిత

చిరకాలధర్మములు చివుకు దవ్వఁగఁబోతే
హరిమహిమఁగు చొచ్చితి మాతఁడే రక్షించెను ॥ పల్లవి ॥

భువిఁ దొల్లి లేరా పుణ్యము సేసినవారు
జవళిశాస్త్రములెల్లాఁ జదివినవారు లేరా
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా
యివల నే మివి సేసి యెవ్వరిఁ బోలేము ॥ చిర ॥

తగఁ దొల్లి వినమా తపము సేసినవారి
జిగి నన్నియజ్ఞములు సేసినవారి ౧ వినమా
మిగులా సిద్ధిపడసి మించినవారి వినమా
యెగువ నే మింతటఁజే యెక్కుడు సేసేమా ॥ చిర ॥

పెక్కుమతములు చూచి బెండుపడ్డవారు లేరా
పక్కన నన్నివిద్యలాఁ బరగినవారు లేరా
వొక్కఁడే శ్రీవేంకటేశుఁ డుల్లములో నుండఁగాను
యెక్కుడితనిఁ గొలువ కెవ్వరిఁ బోలేము ॥ చిర ॥ 495

రేకు 197 శంకరాభరణము

చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ-
శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా ॥ పల్లవి ॥

చెలఁగు వేయిచేతుల శ్రీనరసింహా
చిలికేటినగవుల శ్రీనరసింహా
సిలుగులేవిమంచి శ్రీనరసింహా నీ-
చెలిఁ దొడెక్కించుకొన్న శ్రీనరసింహా ॥ చేప ॥

౧. ఈ 'వినమ' పూ. ము. లో జారిపోయినది.

క్షీరసముద్రమువంటిశ్రీనరసింహా దైత్యుఁ
జీరినవజ్రపుగోళ్ల శ్రీనరసింహా
చేరి ప్రహ్లాదునిమెచ్చేశ్రీనరసింహా నుతిం-
చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా ॥ చేప ॥

శ్రీవనితతో మెఱపు(గుః)శ్రీనరసింహా
చెపదెరె సిఖిహిముశ్రీనరసింహా
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీనరసింహా సర్వ-
జీవదయాపరుఁడ వో శ్రీనరసింహా ॥ చేప ॥ 496

సాళంగనాట

నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడుగాక
ధరణిఁ గిరీటికెక్కె దశరథసుతుఁడు ॥ పల్లవి ॥

యీతఁడా తాటకిఁ జంపె నీమారీచసుబాహుల-
నీతఁడా మదమణఁచె నిందరుఁ జూడ
యేతులకు హరువిల్లు యీతఁడా విరిచి యట్టె
సీతఁ బెండ్లియాడెను యీటన్న రాముఁడా ॥ నరుఁ ॥

చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యులఁ జంపి
ఒప్పు దిప్పె వాలి నేసినాతఁ డీతఁడా
గుప్పించి కోఁతుల నేలి కొండల జలధి గట్టి
కప్పి లంక సాధించె నీకౌసల్యానందనుఁడా ॥ నరుఁ ॥

రావణాదులనుఁ జంపి రక్షించి విభీషణుని
భావించయోధ్య నీతఁడు పట్టమేలెను
శ్రీవేంకటేశుఁ డితఁడే ౧సృష్టి రక్షించె నితఁడే
యీవల మాపాలనున్న యీరామచంద్రుఁడా ॥ నరుఁ ॥ 497

౧. 'శ్రష్టి' రేకు.

పాడి

అదివో చూడరో అందరు మొక్కరో
గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని ॥ పల్లవి ॥

రవిమండలమున రాఁజిల్లుతేజము
దివిఁ జంద్రునిలో తేజము
భువి ననలంబునఁ బొడమినతేజము
వివిధంబులైనయపూర్వతేజము ॥ అది ॥

క్షీరాంబుధిలోఁ జెలఁగుసాకారము
సారె వైకుంఠపుసాకారము
యీరీతి యోగీంద్రులెంచుసాకారము
సారెకు జగములసాకారము ॥ అది ॥

పొలసినయాగంబులలో ఫలమును
పలుతపములలో ఫలమును
తెలఁచినతలఁపుల దానఫలంబును
బలిమి శ్రీవేంకటపతియే ఫలము ॥ అది ॥ 498

రామక్రియ

ఆతనిఁబో పొగడేము ఆతని శరణంటిమి
ఆతఁడే సర్వజీవుల అంతర్యామి ॥ పల్లవి ॥

పెక్కుబ్రహ్మాండకోట్లు పెక్కుబ్రహ్మకోట్లు
పెక్కురుద్రకోట్లును పెక్కుయింద్రులు
వొక్కొక్కరోమకూపాల నొగి నించుకుండునట్టి-
వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు ॥ ఆత ॥

అనంతసూర్యచంద్రులు అనంతవాయువులును
అనంతనక్షత్రసము లనంతమేఘములు
కొనలుసాగి నన్నిటికూటువ(ఁ) గూడుకొన్నట్టి-
అనంతుఁ డొక్కఁడే మించి నాదిమూరితి ॥ అన ॥

అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు
అసంఖ్యశక్తులు వరా లసంఖ్యములు
పొసఁగ నిన్నిటిఁ దానే పుట్టించి రక్షించినట్టి-
అసంఖ్యాతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు ॥ అన ॥ 499

దేసాళం

నీవే రక్షింతువుగాక నన్ను నమ్మితిమి నేము
దైవమవై నీ వుండఁగ తగ మాదె బ్రదుకు ॥ పల్లవి ॥

కోరి వాకరాతివీరుఁ గొల్చి బతికీ నొకఁడు
పైరు వొక్కచెట్టువెట్టి బతికేననీ నొకఁడు
కూరిమిఁ బాము చేఁబట్టుకొని బతికీ నొకఁడు
శ్రీరమణునిదాసులచేతిదేవో భాగ్యము ॥ నీవే ॥

ఇనుమంతమన్ను వట్టి యేచి బతికీ నొకఁడు
పసురము నింటఁ గట్టి బతికేననీ నొకఁడు
పసగా వేసె డినుము పట్టి బతికీ నొకఁడు
వసుధేశ నివు గలవారి కేమిగడమ ॥ నీవే ॥

ఆకు నలముఁ గసవు నంటి బతికీ నొకఁడు
లోకులు పెక్కుపాయాల లోలులై బతికే రదే
యీకడ శ్రీవేంకటేశ ఇవెల్లా నీమహిమలే
చేకొని నీమరఁగుచొచ్చినవారే ఘనులు ॥ నీవే ॥ 500

ముఖారి

బయలు మొరఁగగుపరచు మాయ ఇది
నయమైన లోనైన నిజముగాను ॥ పల్లవి ॥

కలఁడు హరి యొకఁడే కాన జగములకు
కలిగినతఁడు లేక మానఁడు
తెలిసి ఇందరికిఁ దెలియ యర్థమే
మలసి యెప్పటి మరతురు గాని ॥ బయ ॥

పుట్టినదెల్లా భోగముకొరకే
పుట్టినభోగము పోదెపుడు
ఎట్టి యీమాఁటలే పలుకుదు రిందరు
మట్టులేక ఇది మంతురుగాని ॥ బయ ॥

కర్మము శ్రీవేంకటపతికార్యము
కర్మము దేహికిఁ గాణాచి
ధర్మ మీదేవునిదాస్యం బందురు
మర్మము లోకులు మరతురుగాని ॥ బయ ॥ 501

రేకు 198 శ్రీరాగం

ఎఱిఁగితి నమ్మితి నితఁడు దయానిధి
మఱఁగులు మొరఁగులు మరి యిఁక లేవు ॥ పల్లవి ॥

వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు
ఆదిమూర్తి శ్రీఅచ్యుతుఁడు
సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాలి పతఁడే కలఁడు ॥ ఎఱిఁ ॥

పరమపురుషుఁ డాపన్నివారకుఁడు
హరి శాంతుఁడు నారాయణుఁడు
శరణంటే మితఁడు చేకొని కాచెను
తరవాతిపనులఁ దప్పఁ డితఁడు ॥ ఎటిఁ ॥

హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు
ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు
వెదకితి మీతఁడు విడువఁడు మమ్మిఁక
తుదకును మొదలికి దొరకినవాఁడు ॥ ఎటిఁ ॥ 502

మాళవిగౌళ

౧ ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్టబాయిటనే నీవు పదిరూపు లైతివి ॥ పల్లవి ॥

చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ॥ ఇట్టె ॥

అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీఁగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అడరి పాకవులదిక్కై విలిచితివి ॥ ఇట్టె ॥

త్రిపురకాంతలగుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికిరూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మానుతులకు విరవైతివి ॥ ఇట్టె ॥ 503

౧. ఇందు దశావతారవర్ణనము స్పష్టము.

### శంకరాభరణం

ఇతవిప్రసాదమే యిన్నియును
గతి యితనిదేకన కాదనరాదు ॥ పల్లవి ॥

కాయములో నొకఘనసంసారము
ప్రాయంబులతోఁ బ్రబలీని
ఆయ మందుకును హరి దానేయై
దాయక పాయక తగిలున్నాఁడు ॥ ఇత ॥

వానరినకలలో నొకసంసారము
మనసుతోడనే మలసీని
ననిచి యందుకును నారాయణుఁడై
కొనమొదలై తా గురియైనాఁడు ॥ ఇత ॥

వుడిబడి కోర్కుల నొకసంసారము
బడిబడియాసలఁ బరగీని
విడువక యిది శ్రీవేంకటేశ్వరుఁడే
తొడిఁబడఁ గల్పించి ధ్రువమయినాఁడు ॥ ఇత ॥ 504

### ముఖారి

ఊరకే కలుగునా వున్నతపుమోక్షము
శ్రీరమణుకృపచేతఁ జేరు మోక్షము ॥ పల్లవి ॥

కలుషముఁ బెడఁబాసి కర్మగండము గడచి
మలసినప్పుడుగా మరి మోక్షము
చలన మించుకలేక సంసారవారిధి దాఁటి
నిలిచినప్పుడుగా నిజమోక్షము ॥ ఊర ॥

పంచేంద్రియాల మీఁది భక్తి హరిమీఁదఁ బెట్టి
మంచివాఁడై నప్పుడుగా మరి మోక్షము
అంచల యాసలు మాని ఆచార్యసేవ చేసి
మించినప్పుడుగా ఆమీఁది మోక్షము ॥ ఊర ॥

శాంతమే కూడుఁగా నుండి సమచిత్తమునఁ బొంది
మంతుకెక్కినప్పుడుగా మరి మోక్షము
అంతట శ్రీవేంకటేశుఁ డాదరించి మన్నించితే
నంతరంగమున నున్న దనాది మోక్షము ॥ ఊర ॥ 505

వరాళి

వెదకనేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని
మొదలఁ గలిగితేనే నుందవాఁ గలుగుట ॥ పల్లవి ॥

తనపూర్వభావము దలఁచి మరవకుంటే
పనివడి తనపుణ్యఫల మబ్బుట
౧ మనసార్తి నానాఁటిఁ బాయ చూపెట్టుకుండితే
జనించినతనకు విజ్ఞానసిద్ధి యగుట ॥ వెద ॥

పుట్టినయప్పటితనభోగము దలఁచుకొంటే
కొట్టఁగొన తనకోర్కి. కొనసాగుట
వట్టదిమిజగమునటనఁ దెలుసుకొంటే
గుట్టుతోడిగురుబోధగురుతు చేచిక్కుట ॥ వెద ॥

జీవకళ నంటినట్టిచిక్కు వదిలించుకొంటే
దేవుఁడు తనచేఁ జిక్కి తిరమౌట
శ్రీవేంకటేశుఁ డితవిఁ జేరి శరణంటేను
ఆవలనీవలఁ దాను అన్నిటా గెలుచుట ॥ వెద ॥ 506

౧. మనసు + ఆర్తి.

పాడి

హరి నారాయణ [1]కృష్ణ అదివో మావిన్నపము
తరవాతిమాట నీవే తలఁచుకోవయ్యా ॥ పల్లవి ॥

నడిఁబడ్డనాతలఁపు చక్కఁగాక వుండినాను
వొడయఁడవు నీకృప వొగిఁ జక్కనే
గుడిగొన్నయే రెంత కొంకరవంకరలైనా
పుడమికి లోఁగొనక పోవునటవయ్యా ॥ హరి ॥

కాయకపునాభక్తి కడుఁ గొంచమైనాను
ఆయపునీవరములు అతిఘనమే
యేయెడ గుడి గొంచమయిన గుడిలోదేవుని-
కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా ॥ హరి ॥

శ్రీవేంకటేశ నిన్ను జింతించక నే నుండినా
జీవాంతరాత్ముఁడవై చేకొంటి నీవే
ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా
ఆవేళ సూత్రధారుఁ డాడించుఁ గదవయ్యా ॥ హరి ॥ 507

రేకు 199 నాట

ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు
కదలేసూర్యచంద్రులకన్నులవాఁడు ॥ పల్లవి ॥

సెలవినవ్వులవాఁడు చేకత్తిగోళ్ళవాఁడు
పలుపేగులజంద్యాలపంతాలవాఁడు
యెలమిఁ జెలిఁ దొడపై నిడుకొన్నట్టివాఁడు
చెలఁగిన ఘననారసింహుఁడటే వీఁడు ॥ ఇదె ॥

---

౧. 'క్రిష్ణ' రేకు.

కొండగద్దెమీఁదివాఁడు గొప్పకిరీటమువాఁడు
దిండుపైఁడిచీరకాశ(సె?)తెక్కులవాఁడు
రెండురూపులొకటైనరీతులమాయలవాఁడు
అండఁ బ్రహ్లాదవరదుఁ డాతఁడటే వీఁడు ॥ ఇదె ॥

భవనాసిపొంతవాఁడు భావించఁ దెల్లనివాఁడు
ఇవల శ్రీవేంకటాద్రినిరవైనాఁడు
జవళిపంతాలవాఁడు శంఖుచక్రములవాఁడు
తివిరినఅహోబలదేవుఁడటే వీఁడు ॥ ఇదె ॥ 508

బౌళి

పరమపురుషుఁ డీబాలుఁడట
హరవిరించులు మొక్కే రదివో వాకిటను ॥ పల్లవి ॥

దేవుఁ డితఁడు సర్వదేవతల కొడయఁడు
వేవేలువేదములచే వేద్యుఁ డితఁడు
దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ
యీవిధము నోఁచిరి వీ రెంతభాగ్యవంతులో ॥ పర ॥

అంతటాఁ దా నున్నవాఁడు అరయ స్వతంత్రుఁడు
అంతము నాదియులేని ఆదిమూరితి
వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి
దొంతరకొడుకైనాఁడు తొల్లి వీ రేపుణ్యులో ॥ పర ॥

ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు
కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు
మందగొల్లెతలకెల్ల మరఁది దానైనాఁడు
ఇందరు నిందరే వీరి కెన్నటి౧ సంబంధమో ॥ పర ॥ 509

౧. 'సమ్మంధమో' రేకు.

లలిత

ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే ॥ పల్లవి ॥

అదె చంద్రుఁ డుదయించె నచ్యుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి ద్విజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశిశువుకు శరణనరె ॥ ఎన్నఁ ॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక చెల్లిన పచ్చె
దండి గోకులము నిండె ద్రౌపదితపము పండె
చండప్రతాపున కిట్టె శరణనరే ॥ ఎన్నఁ ॥

రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుఁడు డాసె
గోపికలమనసుల కోరిక వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే ॥ ఎన్నఁ ॥ 510

ముఖారి

అతఁడే గతియని యే టీ నన్నిటా మాన్యుఁడు
ఇతరాలు మానఁగానె యీతనికే శలవు ॥ పల్లవి ॥

శ్రీరమణునినిత్యసేవకులకుఁ దొల్లె
వేరులేనికర్మముల వెట్టిమాన్యము
ఆరీతి నితనిభక్తులైనవచనవరులకు
అరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు ॥ అతఁ ॥

తక్కక యితనిముద్ర ధరించినదాసులకు
చొక్కుల భవబంధాలసుంక మాన్యము
లెక్కించ నితవికై నలెంకలకు బొడుకల-
కొక్కట విధినిషేధా లూహింప లేవు ॥ అత ॥

సరుస శ్రీవేంకటేశుశరణాగతులకును
పరగ మాయలదొడ్డిబండె మాన్యము
పరమమైనయితనిపళ్లెము కూటివారికి
ధరలో నేమిటివంకాఁ దప్పులే లేవు ॥ అత ॥ 511

సామంతం

నీచేతలోవారము నివారము
యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము ॥ పల్లవి ॥

ఇన్నిటాఁ బూర్ణుఁడవు నీ వెరఁగనియర్థమేది
విన్నపము నేఁ జేసేవిధమేది
మన్నించిననీమన్ననే మహిమలో మాబదుకెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము ॥ నీచే ॥

ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి
గొనకొని నే విన్నఁ గొసరేదేమి
పొనుగక యేలితివి పుట్టినమాపుట్టుగెల్ల
ననిచి విన్న నమ్మిననమ్మికే మావ్రతము ॥ నీచే ॥

శ్రీవేంకటేశుఁడ నీవు చిత్తగించనిది యేది
భావించి నేఁ బొందనిభాగ్య మేది
యేవల ౧మాపరభారా లింతయు నీ కెక్కినది
ఆవటించి నే నీశరణన్నదే మావ్రతము ॥ నీచే ॥ 512

౧. పరభారాలు = ఎక్కువైనబరువులు లేక పరలోకపుభారములు కావచ్చు.

వెళావళి

కనియుండి భ్రమసితిఁ గట్టా నేను
యెనలేక గురియై చిట్టే నేను ॥ పల్లవి ॥

తోలునెముకలు గట్టి దొరసంటా మురిసేను
ఆలుబిడ్డలమరఁగు ఆహా నేను
గాలి యాసటించుకొని కాలములు గడపేను
వోలిఁ బుణ్యపాపములను వోహో నేను ॥ కని ॥

పంటిసంక బదుకుగా మదియించి ముదిసేను
ఇంటిముంగిటనే వుండి యీహీ నేను
వొంటివాఁడనై వుండి వూరఁగలవెలాఁ గోరే
వొంటిసయాసలతోడ నూహూ నేను ॥ కని ॥

నూలికోకఁ గట్టువడి నన్నునే నే మురిసేను
యీలాగు నాబదుకెల్ల యేహీ నేను
పాలించి శ్రీవేంకటాద్రిపతి నాకుఁ గలుగఁగ
ఆలరినై గెలిచితి హైహై నేను ॥ కని ॥ 513

రేకు 200 మాళవిగౌళ

నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొకదుర్గుణిని
మానవు న న్నొకయెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా
॥ పల్లవి ॥

యేలినవాఁడవు నీవు ఇటు నేఁ గొలిచినవాఁడ
పోలింపఁగ నీవే దేవుఁడవు భువి నే నొకజీవుఁడను
పాలించేవాఁడవు నీవు బ్రదికేవాఁడను నేను
తాలిమి నన్నొకసరిచేసుక ననుఁ దప్పు లెంచనేలా అయ్యా ॥ నీవు ॥

అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు జిగి నేఁ బరతంత్రుఁడను
ఇంత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు నే నిర్దయుఁడను
చెంతల నన్నొకమొనసేసుక నాచేఁత లెంచనేలా అయ్యా ॥నీవు॥

శ్రీవేంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను ఇటు నేను
ఆవలనీవల దాతవు నీవు యాచకుఁడను నేను
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
తైవళమగు నను ప్రతిపెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా
॥నీవు॥ 514

నాట

వెడలె వెడలె నదె వీధులవీధుల
తొడికి దైత్యులనుఁ దుంచఁగను ॥పల్లవి॥

కోటిసూర్య లోకకూటువ గూడుక
చాటువ మెరసేటిచక్రము
గాఁటపువేవేలు కాలరుద్రు లటు
నీటునఁ దొలఁకేటినిబిడచక్రము ॥వెడ॥

ప్రళయకాలముల బడబాగ్నులొలుకు-
చలమరిప్రతాపచక్రము
కలకలరవముల కాలభైరవులు
కలసి మెలంగేటిగండచక్రము ॥వెడ॥

యమసహస్రములనంత మేకమై
సమరముగెలిచేటిచక్రము
అమరుచు శ్రీవేంకటాధిపుకరమునఁ
దెమలకయుండేటిదివ్యచక్రము ॥వెడ॥ 515

## బౌళి

మొక్కెద మిదివో మూఁడు మూర్తులును
వొక్కరూపమై వొనరెఁ జక్రము ॥ పల్లవి ॥

చెండినరావణుశిరో౧ మాలికల
దండలపూజల తఱచుగను
మెండుగఁ గంసుని మెదడు గందముగ
వింద నలఁదుకొని వెలిచెఁ జక్రము ॥ మొక్క ॥

చించి ౨ హిరణ్యకసిపుపెనురక్తపు-
అంచనర్ఘ్యపాద్యమ్ములను
పంచజనఘనకపాలపుటెముకను -
పంచవాద్యములఁ బరగుచక్రము ॥ మొక్క ॥

బలుమధుకైటభప్రాణవాయువుల
అలరిననైవేద్యంబులను
యెలమిని శ్రీవేంకటేశుహస్తముల
వెలసి విలిచె నిదే విజయచక్రము ॥ మొక్క ॥ 516

## సాళంగం

చేకొంటి విహమే చేరినపరమని
కైకొని నీ విందు కలవేకాన ॥ పల్లవి ॥

జగమునఁ గలిగినసకలభోగములు
తగిననీప్రసాదములే యివి
అగపడునేఁబదియక్షరపంక్తులు
నిగమగోచరపునీమంత్రములే ॥ చేకొం ॥

---

౧. మాలికల=వరుసలే మో॥ ౨. 'హిరణ్య....పాద్యమ్ములను' వరకుగల సమస్తపదములో 'అంచ' అను-పదము ఇముడ్చుట వింత

పొదగొని సంసారపుత్రదార లిల
వదలనినీదాసవర్గముతే
చెదరక యేపొద్దుఁ జేయునాపనులు
విదిసిన౧ నియ్యాజ్ఞాకైంకర్యములే ॥ చేకొం ॥

నలుగడ మించిననాఁడున్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ కింక
వలసినప్పు దీ వరముఁ నాకు ॥ చేకొం ॥ 517

లలిత

కానవచ్చెఁ గానరాదు కమలాక్ష నీమాయ
తానే వెంటవెంటఁ దగిలీ నిదివో ॥ పల్లవి ॥

తొల్లి నీవు గలవు తోడనే నేఁను గలను
యెల్లగా నీప్రపంచము యింతాఁ గలదు
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే నొత్తలైనట్లు
చల్లనినేనొకఁడనే జన్మములే వేరు ॥ కాన ॥

వేదములు నాటివే వినుకులు నాటివే
ఆదినుండి చదివే నదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకఁ బోయినయట్లు
దాదాత నాతెలివి యుత్తరుని నడిగేను. ॥ కాన ॥

వైకుంఠమూ నున్నది వరములు నున్నవి
యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను
కైకొని పువ్వు ముదిరి గక్కునఁ బిందెయైనట్లు
నీకు శరణనఁగాను నేనీడేరితిని ॥ కాన ॥ 518

౧. ని+ఆజ్ఞ=నియ్యాజ్ఞ. విఁశత్రికసంధి.

దేసాళం

కడనుండి చూచేనీకుఁ గనికరమైతేఁగన
బడి నన్నుఁ గావు నీతో బలిమేలే ॥ పల్లవి ॥

మొదలుమోచినయది యొకయపరాధము
అదరి సంసారినౌటె యపరాధము
బడి నివి పఱచినపాట్లఁ బడకపోదు(ము?)
యెడనీకు మొరవెట్టి నిఁకఁ జోటేదయ్యా ॥ కడ ॥

అన్నపానములు గొన్న దది యొక్కనేరమి
వున్నతి సంపదఁ బొందు టొకనేరమి
యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు
విన్నపాలు సేసి నీతో విసుగఁ జోటేది ॥ కడ ॥

మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల
అదనఁ గర్మాధికారినౌటొకకల్ల
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి
తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా ॥ కడ ॥ 519

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగ-సంకీర్తన-సంఖ్యాసూచి

| రాగములు | | సంకీర్తనసంఖ్యలు |
|---|---|---|
| ఆహిరి | ... | 2, 6, 119, 191. |
| కన్నడగౌళ | ... | 39, 177, 192, 196, 202, 480. |
| కాంబోది | ... | 1, 27, 84, 224, 247, 256, 427 |
| కేదారగౌళ | .... | 165, 210, 213, 255. |
| గుండక్రియ | ... | 54, 56, 71, 74, 88, 127, 189, 163, 238, 338, 339, 340, 389, 416, 424, 426, 431, 433, 435, 439, 444, 473. |
| గుజ్జరి | . | 22, 138, 189, 236, 346, 381, 382, 384, 452. |
| గౌళ | .... | 57, 104, 124, 201, 264, 276, 277, 297, 366. |
| చాయానాట | ... | 446 |
| తెలుఁగుకాంబోది | .... | 403. |
| దేవగాంధారి | .... | 18, 78, 90, 186, 261, 332, 333 334, 335, 337, 369, 376, 432, 443, 490, 492. |

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| దేశా(సా)క్షి | .. | 29, 33, 49, 96, 116, 157, 167, 168, 235, 262, 266, 358, 360, 481, 513. |
| దేసాళం | .... | 45, 103, 120, 160, 175, 193, 200, 222, 259, 260, 351, 354, 372, 459, 474, 483, 500, 519. |
| ధన్నాసి | ... | 15, 44, 148, 158, 214, 329, 330, 331, 336, 344, 357, 450, 477. |
| నాట | .... | 81, 93, 112, 181, 207, 229, 245, 246, 248, 345, 355, 361, 405, 508, 515. |
| నాదరామక్రియ | .... | 313, 314, 315, 316, 317, 373. |
| పాడి | ... | 19, 32, 35, 66, 99, 111, 121, 123, 141, 195, 204, 219, 225, 244, 281, 406, 454, 486, 498, 507. |
| ప్రతాపనాట | .... | 350 |
| బౌళి(భవుళి) | .... | 41, 70, 75, 107, 108, 125, 128, 179, 252, 269, 342, 364, 367, 375, 378, 380, 385, 386, 387, 391, 393, 396, 410, 419, 429, 434, 445, 455, 457, 458, 460, 465, 468, 479, 509, 516. |

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| బౌళిరామక్రియ | ... | 217, 348, 442. |
| భూపాళం | .... | 40, 60, 117, 166, 267, 326 327, 328, 359, 436 |
| భైరవి | .... | 4, 12, 20, 105, 146, 169, 187 197, 232, 287, 319, 320, 321 322, 349. |
| మంగళకౌశి(సి)క | .... | 241. 401. |
| మలహరి | .... | 10, 17, 21, 51, 69, 101, 118, 132, 170, 190, 323, 324, 325, 356, 453, 476. |
| మాళవి | .... | 73, 77, 140, 152, 216, 218, 233, 368, 377, 414, 429. |
| మాళవిగౌళ | ... | 82, 135, 184, 288, 430, 448, 487, 489, 503, 514. |
| ముఖారి | ... | 5, 16, 30, 62, 88, 89, 106, 122, 126, 171, 173, 198, 231, 237, 265, 268, 286, 303, 304, 305, 306, 307, 422, 505, 511. |
| రామక్రియ | .... | 14, 33, 46, 68, 72, 94, 97, 137, 145, 147, 150, 164, 182, 183, 215, 221, 250, 270, 282, 313, 400, 462, 485, 494, 499. |
| రేవగుప్తి | .... | 398. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| లలిత | 7, 24, 34, 42, 43, 61, 65, 76, 80, 87, 102, 109, 131, 134, 143, 144, 155, 188, 208, 271, 274, 293, 294, 295, 296, 352, 358, 362, 383, 388, 395, 399, 404, 407, 413, 415, 417, 418, 421, 425, 438, 456, 464, 466, 475, 482, 488, 495, 510, 518. |
| వరాళి | .. 25, 36, 174, 180, 212, 258, 285, 374, 506 |
| శంకరాభరణం | ... 31, 50, 55, 85, 115, 129, 159, 172, 185, 206, 223, 226, 253, 254, 263, 272, 278, 402, 411, 449, 467, 472, 491, 496, 504. |
| శ్రీరాగం | .... 23, 58, 64, 67, 95, 100, 114, 133, 142, 149, 151, 176, 199, 209, 251, 278, 279, 291, 308, 309 310, 311, 312, 365, 390, 440, 463, 484, 502. |
| శుద్ధవసంతం | .... 13, 53, 63, 136, 178, 240, 292, 341, 408. |
| సామంతం | .... 8, 11, 48, 59, 92, 98, 130, 156, 161, 205, 211, 234, 257, 280, 284, 290, 298, 299, 300, 301, |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| | 302, 370, 397, 409, 423, 428, 441, 447, 451, 471, 501, 512. |
| సాళంగం | ... 26, 52, 153, 230, 394, 469, 517. |
| సాళంగనాట | ... 3, 9, 28, 37, 47, 79, 86, 91, 110, 113, 154, 162, 194, 208, 220, 227, 228, 239, 243, 249, 275, 289, 347, 363, 371, 379, 392, 412, 437, 461, 470, 478, 493, 497. |
| సౌరాష్ట్రం | ... 242. |
| హిందోళవసంతం | ... 233, 348. |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన రాగ సంఖ్యాసూచి


| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంతరంగ | దేసాళం | 259 |
| అంతరాత్మ | లలిత | 388 |
| అంతర్యామీ | లలిత | 475 |
| అంతరు | మలహరి | 17 |
| అందరి | హిందోళవసంతం | 343 |
| అందరిలోనా | నాట | 207 |
| అందరివలె | సామంతం | 48 |
| అందాఁకాఁదాఁదా | గుజ్జరి | 452 |
| అందుకల్లా | రామక్రియ | 183 |
| అందుకుఁగాదు | సామంతం | 451 |
| అందుకే | దేవగాంధారి | 376 |
| అందుకేపో | మలహరి | 325 |
| అందుకేసుమ్మీ | శుద్ధవసంతం | 341 |
| అక్కటా | దేసాళం | 176 |
| అట్టయితే | పాడి | 454 |
| అటుగన | గుండక్రియ | 71 |
| అటుగాన | ధన్నాసి | 450 |
| అద్దము | దేవగాంధారి | 490 |
| అణురేణు | దేవగాంధారి | 482 |
| అతఁడు | నాదరామక్రియ | 313 |
| అతఁడే | ముఖారి | 511 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అతని | లలిత | 294 |
| అతిసులభం బిది | మలహరి | 10 |
| అతిసులభంబిదె | బౌళి | 41 |
| అదినే | శంకరాభరణం | 185 |
| అదియేల | గుండక్రియ | 389 |
| అదియేవిష్ణు | శంకరాభరణం | 402 |
| అదివో చూడ | పాడి | 498 |
| అదివో నిత్య | వరాళి | 25 |
| అదెవచ్చె | సాళంగనాట | 79 |
| అదెశిర | రామక్రియ | 485 |
| అనంతాప | మలహరి | 323 |
| అనరాదు | దేసాక్షి | 167 |
| అనలము | బౌళి | 445 |
| అవియానతి | లలిత | 438 |
| అన్నిటా నీపెంపు | సాళంగనాట | 249 |
| అన్నిటానీవే | మలహరి | 324 |
| అన్నిటాను | మలహరి | 170 |
| అన్నిటాశాంతుఁడై | భవుళి | 460 |
| అన్నిటాశ్రీహరి | రామక్రియ | 68 |
| అన్నిటికి నొడ | శ్రీరాగం | 64 |
| అన్నిటికి మూల | దేవగాంధారి | 261 |
| అన్నిటికి మూల | సామంతం | 284 |
| అన్నిటికి హరి | బౌళిరామక్రియ | 442 |
| అన్నిటి కెక్కుఁడు | సాళంగనాట | 9 |
| అన్నియునడుగ | గుజ్జరి | 189 |
| అన్నియునుఁదన | దేవగాంధారి | 90 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అన్నియును హరి | బౌళి | 75 |
| అనుచు దేవ | సాళంగనాట | 154 |
| అనుచు నిద్దరు | రామక్రియ | 14 |
| అనుచు లోక | పాడి | 111 |
| అపరాధి | భూపాళం | 326 |
| అప్పుఁడు | శంకరాభరణం | 50 |
| అప్పుడు | భూపాళం | 117 |
| అయ్యోనేనేకా | లలిత | 80 |
| అయ్యోమాయ | భైరవి | 12 |
| అయ్యోవారి | రామక్రియ | 33 |
| అరుదరుదు | మాళవి | 429 |
| అరుదు | భైరవి | 321 |
| అల్పశక్తి | శ్రీరాగం | 390 |
| అవధారు | లలిత | 295 |
| అవియటు | అలిత | 78 |
| అవియు | గుండక్రియ | 416 |
| అహోబలేశ్వరుఁడ | నాట | 112 |
| అహోబలేశ్వరు | సాళంగనాట | 243 |
| ఆతఁడే యజ | ముఖారి | 237 |
| ఆతఁడే విష్ణుండ | భైరవి | 319 |
| ఆతనిఁ టో | రామక్రియ | 499 |
| ఆతనిమూలమే | లలిత | 362 |
| ఆతురబందు | గౌళ | 277 |
| ఆనతియ్యఁగ | సామంతం | 301 |
| ఆమీఁది | సాళంగనాట | 37 |
| ఆరసి | సామంతం | 370 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఆర్తుఁడ | గుజ్జరి | 382 |
| ఆగ్వులం | బౌళి | 108 |
| ఆహా యేమి | శంకరాభరణం | 172 |
| ఇంతకంటేఁదగు | తామక్రియ | 400 |
| ఇంతకంటేనేమి | శంకరాభరణం | 272 |
| ఇంతకంటేనేమున్నది | భైరవి | 197 |
| ఇంతకంటేమరి | దేవగాంధారి | 334 |
| ఇంతటఁబో | దేసాళం | 474 |
| ఇంతటాహరి | శ్రీరాగం | 463 |
| ఇంతదేవుఁడింక | దేశాక్షి | 116 |
| ఇంతయు | శ్రీరాగం | 133 |
| ఇంతిజవ్వన | ముఖారి | 286 |
| ఇంతేకాని | శ్రీరాగం | 199 |
| ఇందరిబుద్ధు | రామక్రియ | 94 |
| ఇందరిబ్రదు | దేసాళం | 193 |
| ఇందరిలో | గుజ్జరి | 138 |
| ఇందరూ | సామంతం | 205 |
| ఇందుకా | సామంతం | 397 |
| ఇందుకే | శంకరాభరణం | 31 |
| ఇందుల | మాళవి | 140 |
| ఇందులో | ఆహిరి | 6 |
| ఇందువల్ల | ముఖారి | 268 |
| ఇచ్చినవాఁడు | సాళంగనాట | 493 |
| ఇటునిను | ముఖారి | 305 |
| ఇటులై | గౌళ | 297 |
| ఇటువంటి | రామక్రియ | 215 |
| ఇట్లానే | సామంత | 234 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇట్టిజీవుల | రామక్రియ | 97 |
| ఇట్టి నావెట్టి | ముఖారి | 304 |
| ఇట్టి బ్రాహ్మణ్య | పాడి | 486 |
| ఇట్టివాఁడ | శ్రీరాగం | 311 |
| ఇట్టెమమ్మ | మాళవిగౌళ | 503 |
| ఇతఁడు | మాళవి | 218 |
| ఇతవికితఁడే | నాట | 405 |
| ఇతవిప్రసాద | శంకరాభరణం | 504 |
| ఇతరుల | వరాళి | 174 |
| ఇది యారుదను | లలిత | 421 |
| ఇదియేఉపాయ | కేదారగౌళ | 210 |
| ఇదియేకావలె | శ్రీరాగం | 209 |
| ఇదియేబుద్ధి | ముఖారి | 171 |
| ఇదివోనా | గుండక్రియ | 340 |
| ఇదివోనీ | నాదరామక్రియ | 314 |
| ఇదివోమా | భూపాళం | 166 |
| ఇదివోపీది | సాళంగనాట | 110 |
| ఇదివోవున్నార | లలిత | 389 |
| ఇదివోసుజ్ఞాన | పాడి | 121 |
| ఇదెవీఁడె | నాట | 508 |
| ఇద్దరు | సామంతం | 92 |
| ఇన్నాళ్ల | కాంబోది | 256 |
| ఇన్నిటా | శంకరాభరణం | 411 |
| ఇన్నిటికి | మాళవిగౌళ | 288 |
| ఇప్పుడే | సామంతం | 302 |
| ఇలజాణ | లలిత | 413 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇవిగో | శుద్ధవసంతం | 292 |
| ఇవి సేయఁగ | భూపాళం | 328 |
| ఇహపర | పాడి | 225 |
| ఇహమెట్టో | సాళంగనాట | 461 |
| ఇహమే | లలిత | 131 |
| ఈడనుండె | లలిత | 65 |
| ఈతఁడు | సాళంగనాట | 208 |
| ఈతఁడే | సాళంగనాట | 371 |
| ఈతనిఁగొలిచి | గౌళ | 57 |
| ఈతనిమరచి | లలిత | 417 |
| ఈతనిమూలమై | బౌళి | 457 |
| ఈరూపమై | పాడి | 244 |
| ఈహీ శ్రీ | మలహరి | 69 |
| ఉన్నమంత్రా | సాళంగం | 153 |
| ఉపకారి | గుజ్జరి | 384 |
| ఊరకేకలుగునా | ముఖారి | 505 |
| ఊరకేదొరకునా | గౌళ | 104 |
| ఊరకైతే | సామంతం | 161 |
| ఎంచిచూడరో | దేసాక్షి | 235 |
| ఎంతకతినమో | నాట | 181 |
| ఎంతకత | నాదరామక్రియ | 315 |
| ఎంతకెఁ | శంకరాభరణం | 491 |
| ఎంతచదివి | సామంతం | 98 |
| ఎంత పుణ్యమో | భైరవి | 322 |
| ఎంత బాఁప | బౌళి | 70 |
| ఎంతమహిమో | ఆహిరి | 191 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంత మాత్రమున | బౌళి | 159 |
| ఎంత లేదు | శ్రీరాగం | 291 |
| ఎంత వలచితి | సామంతం | 290 |
| ఎంత వాటుపడె | శ్రీరాగం | 95 |
| ఎంత సోదించి | దేసాక్షి | 262 |
| ఎందాఁక నిద్ర | భూపాళం | 436 |
| ఎందుకు | మాళవిగౌళ | 448 |
| ఎందునీ | లలిత | 143 |
| ఎక్కడిమతము | సాళంగం | 52 |
| ఎట్టిదోమీ | లలిత | 293 |
| ఎట్టుదోయ | సామంతం | 211 |
| ఎట్టువలసి | లలిత | 456 |
| ఎట్టుసేయఁగ | లలిత | 296 |
| ఎట్టైనాఁగావక | బౌళి | 434 |
| ఎత్తుకొన్న | నాట | 361 |
| ఎదురుమాట | సామంతం | 299 |
| ఎన్నఁడు | లలిత | 510 |
| ఎన్నఁడొకో | లలిత | 102 |
| ఎన్నటికి | లలిత | 188 |
| ఎన్నిపాట్లఁబడ్డా | దేసాళం | 354 |
| ఎఱఁగక | ధన్నాసి | 344 |
| ఎఱిఁగితి | శ్రీరాగం | 502 |
| ఎఱిఁగిన | మలహరి | 356 |
| ఎఱుఁగుట | బౌళి | 465 |
| ఎఱుఁగువారె | దేసాక్షి | 481 |
| ఎవ్వరికి | ముఖారి | 306 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎవ్వరినేమనఁగ | కన్నడగౌళ | 480 |
| ఎవ్వరినేర్పు | భైరవి | 287 |
| ఎవ్వరిభాగ్యంబె | లలిత | 43 |
| ఏఁటిజాణ | వరాళి | 285 |
| ఏఁటిమాట | శ్రీరాగం | 67 |
| ఏకాత్మవాదు | శంకరాభరణం | 253 |
| ఏగతినన్నుద్ధ | లలిత | 61 |
| ఏడనుందురో | గౌళ | 124 |
| ఏదిగతి | సామంతం | 300 |
| ఏదివలనె | బౌళి | 128 |
| ఏదుపాయము | ముఖారి | 122 |
| ఏపురాణ | గుండక్రియ | 88 |
| ఏపొద్దూ | దేవగాంధారి | 333 |
| ఏమందురు | వరాళి | 36 |
| ఏమవితలఁచ | సాళంగనాట | 194 |
| ఏమవినుతించ | ప్రతాపనాట | 350 |
| ఏమవిపొగడ | వరాళి | 180 |
| ఏమవివిన్న | కాంబోది | 224 |
| ఏమిచెప్పే | శ్రీరాగం | 251 |
| ఏమిసేతుదైవమా | భైరవి | 105 |
| ఏమిసేయుదు | సామంత | 11 |
| ఏమిసేసే | మలహరి | 51 |
| ఏమీనెఱఁగని | మాళవిగౌళ | 135 |
| ఏరీతినెవ్వరు | ముఖారి | 173 |
| ఏలమమ్మ | రామక్రియ | 145 |
| ఏలోకమంతున్నా | ముఖారి | 89 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏపీనుపాయాలు | దేశాక్షి | 49 |
| ఏవుపాయములు | శుద్ధవసంతం | 408 |
| ఐనట్టయ్యీఁగాక | కాంబోది | 247 |
| ఒకటికొకటి | గుజ్జరి | 346 |
| ఒకటి సుజ్ఞాన | ధన్నాసి | 357 |
| ఒక్కఁడే | దేవగాంధారి | 186 |
| ఒక్కమనసు | ధన్నాసి | 477 |
| ఒడఁబరచు | గౌళ | 201 |
| ఒల్లఁడు | లలిత | 7 |
| కంచూఁగాదు | మలహరి | 21 |
| కంటిమి | సాళంగనాట | 86 |
| కంటిరా | సాళంగనాట | 470 |
| కటకటా | లలిత | 155 |
| కడనుండి | దేసాళం | 519 |
| కనియుండి | దేసాక్షి | 513 |
| కన్నులపండుగ | బౌళి | 364 |
| కమలారమణ | కేదారగౌళ | 255 |
| కమ్మంటేఁగావా | చాయానాట | 446 |
| కరుణావిధివి | బౌళి | 410 |
| కరుణించు | లలిత | 34 |
| కలదిదివో | గుజ్జరి | 22 |
| కలదియామూర్తి | శంకరాభరణం | 206 |
| కలశాపురము | మాళవి | 216 |
| కల్లమాడ | దేవగాంధారి | 18 |
| కలిగెనిదె | లలిత | 466 |
| కలిగెమాకు | లలిత | 464 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కలిదోషము | ఆహిరి | 119 |
| కలియుగ | మాళవిగౌళ | 430 |
| కలుగుట | గుండక్రియ | 424 |
| కానవచ్చెఁగాన | లలిత | 518 |
| కానవచ్చె | శంకరాభరణం | 449 |
| కామధేనువిదే | లలిత | 488 |
| కామధేనువై | లలిత | 87 |
| కిన్నెరానేఁ హం | ముఖారి | 83 |
| కేశవదాసి | లలిత | 482 |
| కేశవనారాయణ | శ్రీరాగం | 365 |
| కైవల్యమున | దేసాళం | 483 |
| కొనమొద | మలహరి | 118 |
| కోటానఁగోట్లాయ | దేసాక్షి | 266 |
| కోటిమన్మథా | సామంతం | 280 |
| కోరిమా | మలహరి | 101 |
| కౌసల్యానందన | సాళంగనాట | 275 |
| గట్టిగాఁదెలుసు | గౌళ | 276 |
| గతులన్ని | దేసాళం | 372 |
| గరుడగమన | బౌళి | 391 |
| గుత్తాలఁగట్ట | మాళవి | 152 |
| గొరవై | పాడి | 406 |
| చంచలపడఁగ | పాడి | 281 |
| చాచెద | రామక్రియ | 164 |
| చాలువిదే | శ్రీరాగం | 440 |
| చిక్కువడ్డ | శుద్ధవసంతం | 63 |
| చిత్తగించి | భైరవి | 349 |

| కీర్తనమొదలు | రాగము | కీర్తనసంఖ్య |
|---|---|---|
| చిత్తానఁబెట్టి | దేవగాంధారి | 337 |
| చిరకాల | లలిత | 495 |
| చీచీవివేక | శుద్ధవసంతం | 13 |
| చీచీవో | శంకరాభరణం | 115 |
| చూచిమోహించ | తెలుఁగుకాంబోది | 403 |
| చూచేచూపొకటి | పాడి | 141 |
| చూపఁజెప్పఁగల | భూపాళం | 60 |
| చెప్పవేనన్ను | భూపాళం | 327 |
| చెప్పితేఁబాసు | శ్రీరాగం | 312 |
| చెల్లఁబోతియ్యని | సామంతం | 59 |
| చెల్లఁబోయీ | శ్రీరాగం | 23 |
| చెల్లనెక్కి | కాంబోది | 84 |
| చేకొంటి | సాళంగం | 517 |
| చేపట్టి | శంకరాభరణం | 496 |
| చేసిననా | కన్నడగౌళ | 177 |
| చొచ్చితినీకు | శ్రీరాగం | 176 |
| జగన్మోహనా | బౌళి | 375 |
| జగమంతా | గుజ్జరి | 381 |
| జతనము | రామక్రియ | 318 |
| జపము | బౌళి | 342 |
| జయజయ | సాళంగనాట | 289 |
| జయమంగళము | గుండక్రియ | 431 |
| జలజనాభ | ధవళి | 398 |
| జీవునికి | దేసాళం | 103 |
| జీవునికే | సాళంగనాట | 392 |
| జ్ఞానయజ్ఞ | ధన్నాసి | 148 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| జ్ఞానులాల | సాళంగం | 26 |
| ఢోలాయాం | వరాళి | 374 |
| తందనాన | బౌళి | 385 |
| తనలో | కేదారగౌళ | 213 |
| తలఁగరో | లలిత | 144 |
| తలఁచుకో | సౌరాష్ట్రం | 242 |
| తలఁపులో | గుండక్రియ | 439 |
| తానే తెలియఁగా | గుండక్రియ | 473 |
| తిరుమలగిరి | దేసాళం | 459 |
| త్రికరణశుద్ధి | గుజ్జరి | 236 |
| తుదసమస్తము | లలిత | 42 |
| తెలియరాదు | దేవగాంధారి | 335 |
| తెలిసితే | పాడి | 19 |
| తెలిసినమాట | బౌళి | 179 |
| తెలిసినవాఁడాఁగాను | రామక్రియ | 46 |
| తేళరణ | మంగళకౌసిక | 401 |
| తొల్లి యెట్టుండు | శవళి | 380 |
| దాఁచుకో | గుండక్రియ | 338 |
| దానవారి | నాట | 229 |
| దిక్కు నీవే | సాళంగనాట | 363 |
| దిక్కులు | సాళంగనాట | 239 |
| దినము | శ్రీరాగం | 151 |
| దీనరక్షకుఁడ | శుద్ధవసంతం | 178 |
| దేవతలు | సాళంగనాట | 478 |
| దేవనమో | మాళవి | 377 |
| దేవసీదయ | దేసాక్షి | 38 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దేవనీవు | ముఖారి | 307 |
| దేవనే | ధన్నాసి | 214 |
| దేవశిఖామణి | నాట | 93 |
| దేవుఁడు | శంకరాభరణం | 254 |
| దేవుఁడొక్కఁడే | మంగళకౌశిక | 241 |
| దేవునికి | గుండక్రియ | 426 |
| దేహంబొకచే | బౌళి | 378 |
| దేహమిది | గుండక్రియ | 163 |
| దేహినిత్యుఁడు | బౌళి | 419 |
| దైవమానీపెర | మలహరి | 190 |
| దైవమానీమాయ | భైరవి | 4 |
| దైవమా నీవే | ధన్నాసి | 158 |
| దైవమా నీవొక్కఁడ | శ్రీరాగం | 310 |
| దైవముతోడిదే | పాడి | 204 |
| దొంతివిషయము | లలిత | 407 |
| దొరకె | సాళంగనాట | 3 |
| దోమటి | లలిత | 415 |
| ధరణి | దేసాళం | 260 |
| ధరలో | గుండక్రియ | 435 |
| ధ్రువవరదా | మాళవి | 73 |
| నందగోప | బౌళి | 387 |
| ననుఁజూచి | భైరవి | 187 |
| నన్నునింత | కన్నడగౌళ | 39 |
| నన్నెరఁగ | కాంబోది | 427 |
| నమోనమో | బౌళిరామక్రియ | 348 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| నమ్మలేము | దేసాక్షి | 96 |
| నమ్మవలెఁగాని | గౌళ | 264 |
| నమ్మినదొకటే | గుండక్రియ | 74 |
| నరుఁడా | సాళంగనాట | 497 |
| నాఁటికి | శంకరాభరణం | 85 |
| నాకునందు | సాళంగనాట | 28 |
| నాకునీవు | ముఖారి | 422 |
| నానాభక్తులివి | సాళంగం | 469 |
| నానామార్గముల | బౌళి | 125 |
| నారాయణ | ధన్నాసి | 331 |
| నారాయణాచ్యుతా | గుండక్రియ | 54 |
| నారాయణాచ్యుతా | సామంతం | 423 |
| నావల్లనీ | శ్రీరాగం | 484 |
| నిండె నిన్ని | నాట | 248 |
| నిక్కమైన | సామంతం | 428 |
| నిజము దెలియ | దేసాక్షి | 168 |
| నిత్యపూజ | మాళవిగౌళ | 82 |
| నిన్ను నమ్మి | కన్నడగౌళ | 202 |
| నిన్నూనన్నూ | గుండక్రియ | 139 |
| నిరుహేతుక | ముఖారి | 106 |
| నిరుహేతుకాన | బౌళి | 468 |
| నిర్మలులు | శ్రీరాగం | 114 |
| నీకేలయీ | ముఖారి | 265 |
| నీచిత్తమిందరి | మాళవిగౌళ | 489 |
| నీచిత్తము | శంకరాభరణం | 263 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీచేతలో | సామంతం | 512 |
| నీదాస్యమొక్కటే | భైరవి | 20 |
| నీమాయ | ధవళి | 458 |
| నీయంతటి | సాళంగనాట | 47 |
| నీయంతనీవే | దేవగాంధారి | 492 |
| నీవుజగన్నాథుఁడవు | భైరవి | 169 |
| నీవు నన్ను | కన్నడగౌళ | 192 |
| నీవు వెట్టినట్టి | దేసాక్షి | 360 |
| నీవు సర్వగుణ | మాళవిగౌళ | 514 |
| నీవు సర్వసముఁడ | శంకరాభరణం | 129 |
| నీవెంత | ధన్నాసి | 330 |
| నీవెరఁగ | రేవగుప్తి | 398 |
| నీవేదయ | ధన్నాసి | 336 |
| నీవేమాకు | ధన్నాసి | 329 |
| నీవేమూలము | సాళంగం | 394 |
| నీవేరక్షింతువు | దేసాళం | 500 |
| నీవేసేసిన | గుండక్రియ | 444 |
| నీవొక్కఁడ | లలిత | 425 |
| నీసొమ్ము | సామంతం | 441 |
| నూఁతులు | సామంతం | 8 |
| నెట్టన | రామక్రియ | 282 |
| నెప్పున | సామంతం | 130 |
| నేననఁగా | దేసాళం | 45 |
| నేనేమిఁజేయఁగ | గుండక్రియ | 433 |
| నేనేమెరిఁగి | నాదరామక్రియ | 373 |

| పంక్తి రచన మొదలు | రాగము | పంక్తి రచన సంఖ్య |
|---|---|---|
| నేమేబ్రహ్మ | ముఖారి | 30 |
| నేరఁగల | మాళవిగౌళ | 184 |
| పంటవండు | దేసాళం | 222 |
| పట్టలేని | శంకరాభరణం | 472 |
| పనిగొన | దేసాళం | 351 |
| పరమపురుష | బౌళి | 367 |
| పరమపురుష | మలహరి | 453 |
| పరమపురుషుఁడీ | బౌళి | 509 |
| పరమాత్ముఁడు | భైరవి | 232 |
| పరమాత్ముఁడొ | శుద్ధవసంతం | 136 |
| పరము విహము | ముఖారి | 231 |
| పరులకై తే | నాదరామక్రియ | 316 |
| పసులఁగాచు | దేవగాంధారి | 332 |
| పాపెల్లా | రామక్రియ | 182 |
| పాపమెఱుఁగ | ముఖారి | 62 |
| పావనము | భూపాళం | 359 |
| పురుషుండని | బౌళి | 252 |
| పురుషులకు | మాళవి | 283 |
| పురుషోత్తముఁడ | శుద్ధవసంతం | 53 |
| పులుఁగు | ముఖారి | 5 |
| పెట్టినసీ | ధన్నాసి | 15 |
| పేరునారాయణుఁడవు | సాళంగనాట | 162 |
| పొరిసీకును | నాట | 246 |
| ప్రపన్నులకు | నాదరామక్రియ | 317 |
| బయలు మొరంగగు | సామంతం | 501 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| బలువుడు | మాళవి | 77 |
| బిరుదులన్నియు | శ్రీరాగం | 142 |
| భావించ | దేసాళం | 200 |
| భోగము | లలిత | 274 |
| భోగసహాయులె | పాడి | 99 |
| భోగించబుట్టిన | సాళంగం | 230 |
| భ్రమయక | లలిత | 203 |
| మగడు విడిచినా | మలహరి | 476 |
| మగటిమిగల | రామక్రియ | 250 |
| మచ్చికప్రపంచపు | బౌళి | 386 |
| మతంగపర్వత | శంకరాభరణం | 223 |
| మనసునమ్మ | లలిత | 352 |
| మన లో | గుండక్రియ | 238 |
| మరిగితి | బౌళి | 455 |
| మర్దమర్ద | నాట | 81 |
| మరియెందూ | భైరవి | 146 |
| మరిహరి | దేసాక్షి | 29 |
| మహినుద్యోగి | వరాళి | 212 |
| మాపులే | దేసాక్షి | 157 |
| మాయకిదె | శుద్ధవసంతం | 240 |
| మిన్నునేలా | సాళంగనాట | 227 |
| మీరుసాక్షి | కేదారగౌళ | 165 |
| మూడేమాటలు | హిందోళవసంతం | 233 |
| మెచ్చుమెచ్చు | రామక్రియ | 150 |
| మేలులేదు | దేవగాంధారి | 78 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మొక్కరే | సాళంగనాట | 379 |
| మొక్కెద | బౌళి | 516 |
| మొదలనే | భూపాళం | 267 |
| రాచాజ్ఞ | సామంతం | 447 |
| రాజీవనేత్ర | శ్రీరాగం | 273 |
| రామారామ | సాళంగనాట | 437 |
| రాముఁడు | పాడి | 219 |
| లావణ్య | శ్రీరాగం | 149 |
| లేదుభయము | శంకరాభరణం | 55 |
| వట్టిలంపటాలఁబడి | శంకరాభరణం | 159 |
| వసుధఁజూడఁబిన్న | బౌళిరామక్రియ | 217 |
| వాఁడెవో | నాట | 355 |
| వాదమేల | దేసాళం | 120 |
| వాదులేల | లలిత | 404 |
| వానికి | దేవగాంధారి | 443 |
| వారిదేపో | దేసాళం | 160 |
| వారివారికర్మ | శ్రీరాగం | 308 |
| వారివారిభాగ్య | రామక్రియ | 270 |
| విచారమేన్నఁడు | లలిత | 271 |
| విచారించు | కాంబోది | 1 |
| విజాతులన్నియు | లలిత | 383 |
| విడువరాదెంతైనా | ఆహిరి | 2 |
| వినవమ్మ | రామక్రియ | 462 |
| విభుఁడ | పాడి | 66 |
| వితిగిపారెడి | నాట | 245 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| విఠగిరి | సాళంగనాట | 91 |
| వివేకించ | శ్రీరాగం | 58 |
| విష్ణుఁదేయింతా | పాడి | 195 |
| విష్ణుఁడొక్కఁడే | నాట | 345 |
| వీదిలోన | లలిత | 418 |
| వీచుల | మాళవిగౌళ | 487 |
| వెడలె వెడలె | నాట | 515 |
| వెదకనేఁటికి | వరాళి | 506 |
| వెనకేదో | ముఖారి | 16 |
| వెన్నలు | పాడి | 32 |
| వెలుపల మఱవక | రామక్రియ | 137 |
| వెలుపల వెదకితే | ముఖారి | 198 |
| వె [illegible]ాల | రామక్రియ | 494 |
| వే[illegible]లు | శంకరాభరణం | 278 |
| వేరొకభావన | పాడి | 123 |
| వేసరకు | పాడి | 85 |
| శరణంటి | లలిత | 24 |
| శరణన్న | శంకరాభరణం | 226 |
| శరణుశరణువిభీషణ | సాళంగనాట | 220 |
| శరణుశరణువేద | సాళంగనాట | 347 |
| శ్రీపతినీయాజ్ఞ | రామక్రియ | 147 |
| శ్రీపతినీవు | వరాళి | 258 |
| శ్రీవేంకటేశ్వరుఁడు | బౌళి | 107 |
| శ్రీవేంకటేశ్వరుని | రామక్రియ | 221 |
| షోడశకళానిధి | లలిత | 134 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| సంతలే | కాంబోది | 27 |
| సకలబలంబు | లలిత | 109 |
| సకలమైన | కన్నడగౌళ | 196 |
| సకలలోక | శ్రీరాగం | 279 |
| సకలోపాసకులకు | సాళంగనాట | 412 |
| సత్యముసేయఁగ | బౌళి | 269 |
| సదానందము | దేవగాంధారి | 369 |
| సమబుద్ధే | సామంతం | 409 |
| సరిగాఁడు | సామంతం | 298 |
| సర్వేశ్వరా | ముఖారి | 303 |
| సర్వోపాయముల | మలహరి | 132 |
| సింగారమూరితి | సామంతం | 471 |
| సింగారాల | సాళంగనాట | 228 |
| సిరిఁదొడపై | సాళంగనాట | 113 |
| సేయవివాఁడెవ్వఁడు | రామక్రియ | 72 |
| సొరిదిమమ్మిట్టే | సామంతం | 257 |
| సోదించి | దేసాక్షి | 353 |
| హరిగోవిందా | గుండక్రియ | 339 |
| హరిదాసుల | ధన్నాసి | 44 |
| హరినారాయణ | పాడి | 507 |
| హరి నీదాసుల | శ్రీరాగం | 309 |
| హరి నీప్రతాప | సామంతం | 156 |
| హరినీవే | లలిత | 395 |
| హరినెఱఁగని | మాళవి | 114 |
| హరిభక్తి | గుండక్రియ | 56 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| హరియవతార | శ్రీరాగం | 100 |
| హరియునొక్కఁడే | శంకరాభరణం | 467 |
| హరియు సిరియు | గౌళ | 366 |
| హరియే | ముఖారి | 126 |
| హరివార | భూపాళం | 40 |
| హరిసేవొకటే | ధవళి | 420 |
| హరిహరి జగ | భైరవి | 320 |
| హరిహరి నీమహిమ | లలిత | 358 |
| హరిహరి నీమాయా | గుండక్రియ | 127 |
| హాసమీచీన | మాళవి | 368 |
| హితవే | ఖౌళి | 479 |

# 3-వ అనుబంధము

## సందిగ్ధ పదసమీక్ష

[తాళ్లపాకకవులవాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈ పని గొప్పగ సాగవలసియున్నది. దానికుపస్కారకముగ, ఈ సంపుటములో నాదృష్టికి వచ్చిన కొన్నిపదములను లఘువుగ చర్చించితిని. నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అన్యార్థములందు ప్రయోగింపబడినవీ, వ్యాకరణమును పట్టిచూచేవి, ఇతరభాషానిఘంటుప్రసిద్ధములు మాత్రమే ఇందు చర్చింపబడినవి.]

ఉంబళి : (పాట · 310)

పంచుకొన్నభాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుపనేమున్నది.

ఉంబళి=పన్ను లేక అనుభవించువస్తువు అని శ. ర. అదియే ఇక్కడ సరిపోవుచున్నది 'ఉమ్మడి' శబ్దము, 'పొత్తల' 'ఒకే సమయమున' ఇత్యాద్యర్థములలో ప్రసిద్ధమగుటచే దీనితో అర్థమున సామ్యము లేదు.

2. కాయకము : (పాటలు: 242, 306)

మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా
మాయముగానివి దైవికమహిమలెల్లా
కాయకములే తమకల్పితము లన్నియును
కాయకము గాక నిల్చుఁ గమలాక్షుమన్నన ॥ తలఁ ॥

(సంకీర్తన—242)

కాయకము అందరునుఁ గార్యవశపరులే
పాయని నీవకారణబంధుఁడవు
దాయగాం డ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే
బాయటనున్నా నీ వాపన్నశరణ్యుఁడవు ॥ ఎవ్వ ॥

(సంకీర్తన—306)

ఈ పదముకూడ సాక్షాత్తుగ నిఘంటువులందు కానరాదు. ప్రకరణములనుబట్టి మాయలు, అశాశ్వతములు అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

ఒక_౧. ప్రత్యహవృద్ధి, రోజువడ్డి (శే. వి.) ౨. తాకట్టు పెట్టిన ఐ ఆవులు మున్నగువాని నుపయోగించుకొని ఆ రూపమునఁ బుచ్చుకొనువడ్డి.

కాయకము = శరీరమునకు సంబంధించినది (పాపాది) అని సూ. ని. ఇచ్చినఅర్థములు ఇందు పొసగవు. 'కాయక' 'కాయిక' 'యకార' 'యికార' ములకు మన అన్నమయ్యలో అంత పట్టింపు లేదు కావున ఈ. సూ. ని. చూపితిని.

3. కాలానుభాగి: (పాట: 214)

పతిఁ బెండ్లాడినయాలు పక్కనుండి నిద్రించితే
కాతికి కాలానుభాగి గానవచ్చునా ?
తతి సేపనికి రాక తామసుఁడై వుండినా
గతియై శ్రీ వేంకటేశ కావకుండవచ్చునా.

కాలానుభాగి = ఆయానసమయములందు అనుభవము ౹కు భాగమైన దానిని, ఉంపుడుకత్తెను అని తాత్పర్యము కావచ్చు.

4. కుట్టిచాతనివారికి (పాట: 237)

పట్టిన మృదంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయము సేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే ॥ అతఁ ॥

కుట్టిచాతనివారికి=తక్కువజాతి సాతానివారికి కావచ్చునేమో? లేక కుట్టిసైతాన్ అను క్షుద్రప్రయోగము చేయువాఁడు కావచ్చు. మొదటి అర్థములో కుట్టిశబ్దము నట్టివిశేషణము మాత్రమే. 'చాత్తాదె' అను పదము 'చాతాని' 'సాతాని' అని వ్యవహారములో నున్నది. అది 'చాతని' అను ధాతుజవిశేషణముగ ప్రయోగించినట్లు ఊహింపవచ్చును. జాతితో తక్కువవాడునై, వైష్ణవము పుచ్చుకొన్న బిగువుతో అందరియొద్ద జంకుగొంకులేక తిరుగువాడని తాత్పర్యార్థము కావచ్చు. కుట్టిసైతాన్' అను క్షుద్రప్రయోగము చేయువాడుకూడ, తానూ పెద్దమంత్రశాస్త్రవేత్తవలె అందరివద్ద జంకుగొంకులేక తిరుగువాడు అను తాత్పర్యముకూడ సరిపోవుచున్నది. ఈ రెండును పాటలోని ప్రధానభావమునకు సరిపడుటలేదు.

5. తండుముండు పడేవారే (పాట: 56)

విండుఁ జింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండి పుణ్యపాపాలే దరులు
కొండలవంటి కరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండు పడేవారే దాఁటలే రెవ్వరును ॥ హరి ॥

తండుముండుపడేవారే=దుందుడుకుగా ముందుకు దూకేవారే అని ప్రకరణముతో తోచుచున్నది.

కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు కాఁక్రైనఁ గనుఁడీ ॥ పల్లవి ॥

అధ్యా. సంపుటము-1 (1980) సంకీర్తన 180.

ఇక్కడ ఈ పదము "గడ్డిగాదము, పిల్లాజెల్లా" వలె జంట పదముగా తోచుచున్నది. ఇంకను అర్థము విచార్యము.

6. తలపిడి కొలుపిడి : (పాట: 5)

యిలమీఁద తమ సొమ్ము లెవ్వరివద్దనుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీ సొమ్మనుచు విడిపించుకొనవే ॥ పులు ॥

తలపిడి, కొలుపిడి ఈ పదముల కర్థము నిఘంటువులలో కానరాలేదు. సొమ్ముశబ్దసాహచర్యముతో నే నిట్లూహించుచున్నాను. దండలు మొదలైనవి చేయించునపుడు, ఇన్నిపిళ్ల(పిడుల)కొలత అని చేయించుట నేటికిని సంప్రదాయము. అట్లు చేయించిన సొమ్మును ఎవరైనదొంగిలించి, వారివద్ద పట్టుపడినచో, తలపిడి = తొలుత చేయించిన పిళ్లకొలత, కొలుపిడి = (ఇప్పుడాసొమ్మును పట్టు కొన్నప్పుడు) కొలువగా వచ్చిన పిళ్లకొలత ఒకటే ఐనచో ఇది నా సొమ్మే అని నిర్ధరించి తీసికొనునట్లు అనే అభిప్రాయముగా తోచు చున్నది. ఈ శబ్దమింకను విచార్యము.

తిట్టపెట్టి (పాట: 45)

చెట్టుల కెవ్వరు బుద్దిచెప్పేరు తతికాలానఁ
బుట్టి కాచి పూచి విండాఁబొదలుమని
గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని
తిట్టపెట్టి రచించినదేవుఁ డింతేకాక ॥ నేన ॥

తిట్ట పెట్టి = దిట్టముచేసి 'కావచ్చు'. 'ఈవస్తువు స్వభావము ఇట్లా' అని నిర్ణయించుట. 'దిద్దు' నకు 'తిద్దు' ప్రయోగము ఈ వాఙ్మయమున ఎక్కువగ నుండుటచే దిట్టమును 'తిట్ట' అని వ్యవహరించిరేమోయని నా యూహ. అట్లే,

యేడతపము నాకేడజపము నే
వాడికఁ జేయఁగ నీకు వచ్చేనదేమి
బేడిదపుఁబెద్దలెల్లా బెట్టినతిట్టములంటా
యీడుకుఁజేసెగాక యిందేమిగలదు ॥ నమ్మి ॥
(పాట 74)

అను ప్రయోగముకూడా దీని కాధారమే.

8. దాదాత (పాటలు : 246, 518)

నాదించ వెఱచి సింగినాదా లూదుకొంటాను
సొదించేరంటాఁ గొందరు జోగులైరి
యీదెస శ్రీవేంకటేశ యిన్నియి మాని కొందరు
దాదాత నీ శరణవి దాసరులైరి
(పాట—246)

వేదములు నాటివే వినుకులు నాటివే
ఆదినుండి చదివే నదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకఁబోయినయట్టు
దాదాత నాతెలివి యితరుల నడిగేను ॥ కాన ॥
(పాట 518)

ఈ పదము నిఘంటులయందు కానరాలేదు. ప్రకరణమునుబట్టి ఆయాస్థలములందు 'గట్టిగా' 'ఇంచుమించు' ఇత్యాది అర్థములయందు ప్రయోగించినట్లు కానవచ్చుచున్నది. ఇది ఇంకను విచార్యము.

9 నానుడిమాట (పాట : 298)

నరిగాఁడు పీఁడనవలదు జగమునరాజు వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట ॥ పల్లవి ॥ 29

'నాఁడు' కు సంబంధించిన 'నుడి' 'నానుడి'. నేడు నానుడులనీ, పలుకుబళ్లనీ, జాతీయములనీ, వ్యవహరించు పదములన్నియు ఇంచుమించు ఒకజాతికి చెందినవే. 'ఈ సీమయందు వాడుకొనే మాట' అనవచ్చు. ఇక్కడ మాట శబ్దమునకు పునరర్థము శంకింపరాదు. నానుడి అనునది సమస్తవ్యవహారము, మాటసామాన్యముగా ప్రయోగించినది. 'నానుడియైన (లోకమున ఈయర్థమున యీ మాట ప్రసిద్ధము అయిన) మాట, విగ్రహము.

10 బుద్బుజములు: (పాట: 450)

చేరి విన్నుఁ బూజింపవిచేయి దంతెనపుఁజేయి
ఠారి నీకు మొక్కనట్టితలయే పెడతల
సారె నీముద్రలేనిభుజములు బుద్బుజములు
తేరి నీదాస్యములేనిదేహము సందేహము ॥ అటు ॥

ఇది ఈ యాకారముతో నిఘంటువులందు కానరాలేదు.

"బుద్బుదమనంగఁ దనరును బుద్బుదంబు
లద్దువయనంగ లట్వ చెలంగు చుండు ......."

(ఆం. భా 2-255)

భక్ష్య విశేషమని సూ. ని. ఆ భక్ష్యమేదో తెలియరాలేదు. కొంచెము గుండుగా సుమారుపాటి పొడవైన భక్ష్యవిశేషమైతే ప్రకరణానికి సరిపోతుంది బుద్బుదమునకు బుద్బుజము అవి వ్యావహారికమేమో? ఇది ఇంకను విచార్యము. బుద్బుదము = (A bubble) అని ౘ్రౌణ్యము. పెద్దనదులందు, సముద్రములందు, పొడవుగ నేర్పడే బుడగగూడ సరిపోతుంది.

11 బేడలు (పాట: 350)

వేడుక వాల మాకాశవీధితోఁ బెనచినాఁడు
యేడు జలధులు చేసె నిదే మోకాళ్లబంటి
వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁ జేసినాఁడు పెద్దహనుమంతుఁడు ॥ ఏమ ॥

రెండుగా చీలిన పప్పుధాన్యములు. కందిబేడలు సెనగబేడలు వగైరా. ఈ బేడలు వ్యవహారము రాయలసీమయందు మాత్రమే ప్రసిద్ధము. సర్కారువారిలో కందిపప్పు సెనగపప్పు అవియే వ్యవహారము. రాయలసీమలో వుడికినదానికే పప్పు అనివ్యవహారము.

12 రళిత (పాట: 81)

కలితసుదర్శనకఠినవిదారణ
కులిశకోటిభవఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళిత దైత్యగళరక్తవికిరణా ॥ మర్ద ॥

రల—ధాతువు కానరాలేదు. 'లల ఈప్సాయాం' అను ధాతు కృదంతరూపమగు 'లలిత' మునకు 'రలయోరభేదః' అనున్యాయమును జోడించి 'రళిత' వాడినట్లున్నది. 'గలిత' అనుట సహజము. యతిభంగమగునేమో? అయినను అన్నమయ్యసంస్కృతముపై మనమింత చర్చచేయవలసిన పనిలేదు. ఆయన చాల స్వతంత్రుడు.

13. స్వరూపదీక్ష (పాట: 148)

తదియ్యగురుప్రసాదపుపురోడాశ మిచ్చి
కొాదదీర ద్వయమనుకుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుఁడు ॥ జ్ఞాన ॥

స్వస్వరూపమును తెలిసికొానెడి దీక్ష. తన నిజస్వరూపమును గుర్తెరిగెడిదీక్ష అని భావము.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, కా. 2000.

తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 3

# అధ్యాత్మ సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)


పరిష్కర్త

**కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ**



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

**1998**

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహాత్మ్యాన్ని, తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు తాళ్లపాక అన్నమాచార్యులు ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు మాత్రమే లభించాయి వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతాబ్దాలకు చెందినవారు వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామం

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కేంద్రంగా చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రియలను రచించినవారు తాళ్లపాకకవులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన ధన్యమూర్తులు

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల, తాళ్లపాక పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసనం క్రీ॥శ॥ 1530 సంవత్సరంలో కనిపిస్తుంది తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554, 1558 సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కనిపిస్తుంది ఇవి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ముద్రణలో వివిధ దశలు కనిపిస్తాయి

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరేకుల్లోని తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సంకీర్తనలు సంపుటాలుకొన్ని వెలువడ్డాయి

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు [illegible] సంపుటాలు ముద్రించబడ్డాయి

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన తాళ్లపాక పదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీర్తనలు [illegible] సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపుటాలు పునర్ముద్రించబడ్డాయి

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి టి జగన్నాధరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి, ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది

ప్రధమత తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యుమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్ శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం

**M K R వినాయక్**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి ప్రపత్తి, దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు జీవాత్మ పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు, వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు మనుమడు తాళ్లపాక చినతిరుమల [illegible]చార్యులు శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి క[illegible]ల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు పల్లవి చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై పదకవితాపితామహుడని కీర్తి గడించాడు అన్నమ[illegible] [illegible]లో సంగీతం సాహిత్యం భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన [illegible]మూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణ[illegible] క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యుల[illegible] అందించే ప్రయత్నంచేశాడు అన్నమయ్య గ్రాంధిక శిష్టవ్యావహారిక వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు తాళ్లపాక చినతిరుమలాచార్యులు

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించింది అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక ఆంధ్రేతర [illegible] కూడా బహుళ ప్రచారం, ప్రాచుర్యం పొందాయి

[illegible]న్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్ర[illegible]- [illegible]గ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది అన్న[illegible] [illegible]లచే వేలకొలదిగా సంగీత సభలు పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహిం[illegible] [illegible] [illegible]ళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామో[illegible] పొందింది

[illegible]ల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచా[illegible] వర్ధంతి ఉత్సవాలు 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహిం[illegible] [illegible]న్నవి మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరా[illegible]వరకు జరుగుచున్నాయి అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసే వారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంత గ్రంథాలు సమర్పింపబడ్డాయి

తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య, తాళ్లపాక పెదతిరుమలయ్య తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి

ఈ సంపుటాల ముద్రణకు ఆధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం కె ఆర్ వినాయక్ I A S గారికి కృతజ్ఞతాంజలి

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్ హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్ శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A Ph D గారికి (పరిశోధకులు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం లక్ష్మణరావుగారికి, వారి సిబ్బందికి తి తి దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు

డా॥ మేడసాని మోహన్ M A Ph D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

తేది 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యులు |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయబడుచున్నది ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి పై పట్టికలో చూపబడినవి పై పట్టికలోని మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33 34, 35 సంపుటాలు ఇంతవరకు ముద్రింపబడలేదు ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి అయినప్పటికి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి వివిధ దశలలో 5 6 7, 8, 9 సంపుటాలు ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి వివరములకు ఆయా సంపుటాల పీఠికలు చదువగలరు ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు

# పీఠిక

శ్లో॥ వేంకటేశాత్మనాఽఽత్మానం సర్వం లోకంచ భావయన్ ।
బహిరంతస్స్ఫురద్రూప మన్నమార్యం నమామ్యహమ్ ॥

పూజ్యపాదులు కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు 201 వ రేకునుండి 250 వ సంఖ్యరేకువరకుగలపాటలను 8 వ సంపుటముగా 15–4–1952 న ప్రకటించి. 251 వరేకునుండి 300 వ రేకువరకుగల 50 రేకులను 9 వ సంపుటముగా 18—6—52 న ప్రకటించిరి

8 వ సంపుటమునందలి రేకులలో 216 వ రేకు, 9 వ సంపుటమునందలి రేకులలో 300 వరేకు వారికి దొరకనట్లు, 9 వ సంపుటమునందు పీఠికలో చెప్పినారు

కాని 300 వరేకుమాత్రము మాకు లభించినది. ఈ రేకు ఆ మధ్య ఎట్లు అంతర్ధానమయియుండినదో తెలియదు పాత 8, 9 సంపుటముల సమష్టిరూపమే ఇది 201 నుండి 300 వరకు గలరేకులకు సంబంధించినది ఈ సంపుటము.

మునుపటిఅధ్యాత్మకీర్తనలసంపుటములవలెనే ప్రాచీనులు ప్రకటించినవానికి, మా పరిశోధనలో దొరికిన, ఊహించిన భావములను, అక్కడక్కడ కఠిన పదములకు అర్థములను ౧, ౨, ౩ ఇత్యాది తెలుగుసంఖ్యలలో గుర్తించి ప్రకటించినాము 1 నుండి 4 వ ఫారము వరకు పొరపాటుతో 1, 2, 3, ఇత్యాది సంఖ్యలతో గుర్తింపబడినవి. సహృదయులు మన్నించి చదువుకొనగలరు పాతపరిష్కర్తలు చాల—స్థలములందు మూలపాఠముదగ్గర ప్రశ్నచిహ్నములతో తమసందేహములను వెలిబుచ్చినారు అట్టి స్థలములందు ౧ ౨, ౩ మొదలుగా గలతెలుగుఅంకెలతో గుర్తించి సాధ్యమైనన్ని స్థలములలో నాకు

తోచినఅర్థమును సూచించియున్నాను దాని బాగోగులకు సహృదయహృదయమే ప్రమాణము.

అన్నమయ్య తాను రామానుజమతస్థుడనని బాహాటముగచెప్పు కొన్నాడు. తదితరమతములను ఘాటుగా దూషించినాడుకూడ. అందులో ప్రధానముగ దూషణ పాత్రమైనది అద్వైతమే. శైవుల కైనను వైష్ణవులకైనను ఉమ్మడి శత్రువు అద్వైతియేకదా.

అన్నమయ్య తనఅధ్యాత్మకీర్తనలలో అక్కడక్కడ శైవ మతమునుగూడ ఖండించినాడు. అన్నమాచార్యులు ఖండించిన — అద్వైతమునకు, శైవమునకు సంబంధించి మచ్చుకు కొన్నిపాటల సంఖ్యలను ఉదాహరించుచున్నాను చూడవచ్చు. అద్వైత ఖండ నము ఈ సంపుటములో 5, 33, 40, 52, 58, 65, 74 సంఖ్యలుగల పాటలలో గుర్తింపవచ్చును అట్లే శైవమత దూషణము 361, 364 సంఖ్యగలపాటలలో గుర్తింపవచ్చు.

గాఢముగా ఒక మతమును విశ్వసించినవారు మరియొక— మతమును దూషించుట ఆనాళ్లలో పరిపాటి. అసలు సోమన, పండి తారాధ్యుడు మొదలైనవారలవీరశైవమునకు ఎదురొడ్డినిలిచిన— వీరవైష్ణవవాఙ్మయ మిది. దీనిలో ఈపాటిఖండన ముండుట తప్పు కాదనియే భావింపవచ్చు. శ్రుతి స్మృతి పురాణములయందు కూడా ఒకచోట విష్ణువు మరియొకచోట శివుడు, ఇంకొకచోట బ్రహ్మ సర్వోత్కృష్టులుగ కీర్తింపబడుట మన మెరిగినదే.

శైవమునకో, వైష్ణవమునకో చెందినవ్యక్తులు ఆ మూర్తిని సర్వోత్కృష్టముగ సాధింపవలినాడు ఆమతమే కుప్పకూలిపోవలసి— వచ్చును అందువలన రామానుజమతస్థుడగు అన్నమాచార్యులు పరమవిష్ణుభక్తుడు పరమ వైష్ణవుడుకూడ ఆ మతమునకు సాక్షా త్తుగా విరుద్ధమయిన శైవమునుగాని, శివకేశవులను సమానభక్తితో

సేవించుఅద్వైతమునుగాని ఆయన ఖండించుటయు న్యాయ్యము. ఇంకొక్కవిశేషము. ఈయనవరకు ఈతని వంశములోని వారందరూ, అద్వైతసంప్రదాయమునకే చెందినవారు. ఈతనినుండి ఈ వంశము రామానుజమతవంశముగా సిద్ధమైనది. ఈతనిలోకూడ జన్మసిద్ధమైనఅద్వైతవాసన పూర్తిగా నశించలేదని, అక్కడక్కడ మినుకు మినుకుమని గోచర మగుచున్నదని, 185, 296, 342, 440 మొద లగు పాటలలో తెలియుచున్నది

అన్నమయ్యలో ఆవేశించినవైష్ణవము ఈ క్రిందిపాటలలో బాగ గుర్తింపవచ్చు.

శంకరాభరణం

అచ్యుత మిమ్ముఁదలఁచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్యఁగా ॥పల్లవి॥

మిమ్ము నెఱఁగినయట్టిమీదాసుల నెఱఁగే-
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవ సేసుకుండేటివైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥అచ్యు॥

నిరతి నీకు మొక్కేనీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుఁ బూజించే ప్రపన్నులఁ బూజించే-
సరిలేనిభాగ్యము చాలదా నాకు ॥అచ్యు॥

అంది నీకు భక్తులైనయలమహానుభావుల-
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడునీబంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదా నాకు ॥అచ్యు॥

(ఈసంపుటము-పాట 23)

ముఖారి

సులభపుమార్గములు చుట్టిరానే వుండఁగాను
బలుప్రయాసపుకర్మబద్ధులై రి జీవులు ॥ పల్లవి ॥

శ్రీపతిభక్తియనేటిచింతామణి వుండఁగాను
యేపున మోసపొయ్యేరు యేలో జీవులు
చేపట్టి నామాంకితపుసిద్ధరసము గలిగి
తోపుల నుడిగి పనిగొనరేలో జీవులు ॥ సుల ॥

అక్కడనే శరణాగతనేవోడ వుండఁగాను
యెక్కి భవవార్ధి దాఁటరేలో జీవులు
తక్కక దాస్యమనేటిధనము దమకుండఁగా
లెక్కించి కూడబెట్టుకోలేరు యేలో జీవులు ॥ సుల ॥

అట్టె శ్రీవేంకటేశుఁ డంతరాత్మై వుండఁగాను
పట్టి కొలువరేలో పైపై జీవులు
పట్టపుహరిదాసులు ప్రత్యక్షమై వుండఁగాను
యిట్టె వారికృప చేరుకొన్నఁడో యీ జీవులు ॥ సుల ॥

(ఈసంపుటము-పాట 279)

వైష్ణవమునందును తత్రాపి శరణాగతియందును కలసులభ — మైనగొప్పఫలము ఈ క్రిందిపాటలో గుర్తింపవచ్చు

సాళంగనాట

ఈమాట విని నిన్ను నిందుకే నమ్మితి నేను
నేను మెంక నేమింత నీకరుణ యెంత ॥ పల్లవి ॥

సకలకర్మముచేత సాధ్యముగానినీవు
వోక ఇంచుకంతభక్తి కొగి లోనైతి
ప్రకటించి బహువేదపరల జిక్కనినీవు
మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి ॥ ఈమా

కోటిదానములచేత కోరి లోనుగానినీవు
పాటించి శరణంటేనే పట్టి లోనైతి
మేటివుగ్రతపముల మెచ్చి కైకొననినీవు
గాటపుదాసులై తేనే కైకొని మన్నించితివి ॥ ఈమా ॥

పెక్కుతీర్థములాడిన భేదించరానినీవు
చొక్కి నీముద్రవారికి సులభుఁడవు
గక్కనదేవతలకుఁ గానరానినీవు మాకు
నిక్కడ శ్రీవేంకటాద్రి నిరవైతివి ॥ ఈమా ॥

(ఈ సంపుటము-పాట 56)

భగవంతుడూ, సర్వవ్యాపీ, పరిమకారుణికుడూ అగు శ్రీ మహావిష్ణువు యొక్క దయాళుత్వమును అన్నమయ్య ఎంత చక్కగా గుర్తించెనో ఈ క్రిందిపాటలో తెలిసికొనవచ్చు.

శ్రీరాగం

మఱి యేపురుషార్థము మావంక లేదు మీకు
అఱువడము మాకెంత అత్తువో నీవు ॥ పల్లవి ॥

హరి నీవు నాకు నంతర్యామివై నఫలము
తిరిగినందె మావెంటఁ దిరిగెదవు
ఇరవుగ నీవు మాకు నేలికవై నఫలము
గరమె మాపాపమెల్లఁ గటుకొంటివి ॥ మఱి ॥

భువిలోన నీవు నన్నుఁ బుట్టించినఫలము
ఇవల రక్షించేతోడు నిదొకటాయ
తివిరి నన్ను నీకుఁ దెచ్చిడుకొన్నఫలము
ఇవళి నా నేరములు చక్కఁబెట్టఁబడెను ॥ మతి ॥

గారవాన నన్ను వెనకవేసుకొన్నఫలము
చేరి నన్నుఁ బుణ్యునిఁగాఁ జేయవలసె
అరసి నాకుఁ బ్రత్యక్షమైనఫలమున నన్ను
యీరీతి శ్రీవేంకటేశ ఇముడుకోఁబడెను ॥ మతి ॥

(ఈ సంపుటము-పాట 69)

శ్రీ వైష్ణవమునందు హరికంటె హరిభక్తు లధికులు భక్తుడు గొప్పయా? భగవంతుడు గొప్పయా? అన్నప్రశ్నమునకు, భారత భాగవత రామాయణాదులయందు భక్తుడే గొప్ప అని నిరూపించు-నంశములు కొల్లలు గలవు మచ్చుకు భారతకథ భాగవతమున, భీష్మార్జునయుద్ధమునందు కృష్ణుడు, అర్జునునితో నిన్ను చంపింతునని భీష్మునితో పలికెను. భీష్ముడు నిచే చక్రము పట్టింతునని కృష్ణునితో ననెను. ఎనిమిదవనాటి యుద్ధమున కాబోలు భీష్మునిధాటికి అర్జునయ్యు కొయ్యబారగా, శ్రీకృష్ణుఁడు మహాసంరంభముతో చక్రము చేబట్టి రథముపైనుండి దుమికి భీష్మునివైపు పరుగెత్తెను ఆ సందర్భమున,

సీ॥ కుప్పించి యెగసినకుండలంబుల కాంతి
గగనభాగంబెల్ల గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న
జగములవ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయకు
మన్నింపుమని క్రీడి మఱలఁదిగువ

తే॥ గరికి లంఘించుసింహంబుకరణి మెఱసి,
నేఁడు భీష్ముని జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు

అనుపద్యముతో ప్రాప్తకాముడు, పరమభాగవతుడునగు భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించెను

(ఆంధ్రమహాభాగవతము ప్రథమస్కంధము పద్యం—222)

శ్రీమద్భాగవతమున నృసింహావతార కథయే ఇందుకు తార్కాణము లోకులందరి దృష్టిలో ప్రహ్లాదుడు పరమబాలభాగవతుడుగ, హిరణ్యకశిపుడు మిక్కిలి క్రూరుడుగ కనపడుట సహజము. కాని ఇందు విచారించినచో హిరణ్యకశిపుడు ఆంతరంగికముగ ఎంతగా సాత్త్వికభక్తుడో, అంతగా బయటికి పరమరాక్షసుడు. ప్రపంచములో ఎక్కడ ఏతండ్రిగాని ఏకొడుకునుగాని ఇంత హింసల పాలుచేసినవాడు కానరాడు. ఈ ఘట్టములో పోతన నడిపించినకథ చాలహృదయంగమము. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని బాధించిన పద్ధతి —

సీ॥ ఒకమాటు దిక్కుంభియూథంబుఁ దెప్పించి
కెరలి డింభకునిఁ ద్రొక్కింపఁ బంపు —
నొకమాటు విషభీకరోరగశ్రేణుల
గడువడి నర్భకుఁ గఱవఁబంపు -
నొకమాటు హేతిసంఘోగ్రానలములోన
విసరి కుమారుని వ్రేయఁబంపు —
నొకమాటు కూలంకషోల్లోలజలధిలో
మొత్తించి బాలకు ముంపఁబంపు

ఆ॥ విషముఁ బెట్టఁ బంపు, విదళింపఁగాఁ బంపు,
దొడ్డకొండచఱులఁ ద్రోయఁ బంపుఁ,
బట్టి కట్టఁ బంపు, బాధింపఁగాఁబంపు
బాలుఁ గినిసి దనుజపాలుఁ డధిప.

సీ॥ ఒకవేళ నభిచారహోమంబు సేయించు—
నొకవేళ నెండల నుండఁబంచు—
నొకవేళ వానల నుపహతి నొందించు —
నొకవేళ రంధ్రంబు లుక్కఁబట్టు —
నొకవేళఁ దనమాయ నొదవించి బెగడించు—
నొకవేళ మంచున నొంటి నిలుపు —
నొకవేళఁ బెనుగాలి కుమ్మఘుఁ గావించు —
నొకవేళఁ బాఁతించు నుర్వియందు

తే॥ నీరు నన్నంబు నిడనీక నిగ్రహించుఁ
గళల నడిపించు ఉవ్వించు గండశిలల
గదల వ్రేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ నమరారి క్రోధియగుచు.

(ఆంధ్రమహాభాగవతము — సప్తమస్కంధం, 198 199. పద్య)

ఇంత బాధించినను చావని కొడుకునుగని "ఏకాంతంబున దురంత చింతా పరిశ్రాంతుండయి రాక్షసేంద్రుండు తన మనంబున,

ఉ॥ ముంచితి వార్ధులన్, గదల మొత్తితి, శైలతటంబులందు ద్రో—
బ్బించితి, శస్త్రరాజిఁ బొడిపించితి, మీఁద నిభేంద్రపంక్తి బో—
ప్పించితి, ధిక్కరించితి, శపించితి, ఘోరదవాగ్నులందుఁ ద్రో—
యించితిఁ, బెక్కు పాట్ల నలయించితిఁ జావఁ డిదేమిచిత్రమో!

చ॥ ఎఱుఁగఁడు జీవనౌషధము, లెవ్వరు భర్తలులేరు, బాధలం
దరలఁడు; నైజతేజమునఁ దథ్యము జాడ్యములేదు, మిక్కిలిన్
మెరయుచునున్నవాఁ; డొకని మేషము దైన్యము నొందఁ, డింక నే
తెఱఁగునఁ ద్రుంతు వేసరితి, దివ్యము వీని ప్రభావ మెట్టిదో?"

(ఆంధ్ర భాగ సప్తమస్కంధం - 201, 202, పద్య.)

అని తానే చింతించి తుదకు ఓసిగి వేసారి వీని అంతు కనుగొని
యెదనని నీ విష్ణుఁడెందుగలడని ధిక్కరించి అడిగిన,

క॥ ఇందుఁగలఁ డందు లేఁడని
సందేహము వలదు, చక్రి సర్వోపగతుం,-
డెందెందు వెదకి చూచిన -
నందందే కలఁడు దానవాగ్రణి వింటే

(ఆంధ్ర భాగ స్క-7- పద్యం- 275)

అని ప్రహ్లాదుడు భాషింప

క॥ స్తంభమునఁ జూపవేనిం
గుంభిని నీశిరసుఁ ద్రుంచి కూల్పఁగ రక్షా -
రంభమున వచ్చి హరి వి-
స్రంభంబున నడ్డపడఁగ శక్తుండగునే

(ఆంధ్ర. భాగ స్క 7- ప-280)

అని గద్దించి పలుక ప్రహ్లాదుఁడు,

శా॥ అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబునం దుండఁడే!
స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు నేసందేహమున్ లేదు ని-
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్

(పద్యం 282)

అని సమాధానింప,

శా॥ వినరా డింభక! మూఢచిత్త గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద, వైన నిందుఁగలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డరచేత వ్రేసెను, మహోదగ్ర ప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్

(ఆంధ్ర. భా స్క 7- పద్యం 284)

అని స్తంభమును అరచేత గ్రుద్దెను. అప్పుడు స్వామి నరసింహా—స్వరూపముతో బ్రహ్మాదిపిపీలికాపర్యంతము నిండియుండుటచే, దెబ్బ పడిన స్తంభమునుండి ఫెళ ఫెళార్భటులతో భయంకరాట్టహాసంబుతో ఆవిర్భవించినం. గనుంగొని హిరణ్యకశిపుడు,

క॥ నరమూర్తి గాదు కేవల—
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే—
సరియాకారము నున్నది
హరిమాయారచితమగు యథార్థము సూడన్

ఉ॥ తెంపున బాలుఁ డాడినను, ధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి, యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి—
క్షింపఁగ వచ్చినాఁడు, హరిచే మృతియుంచుఁ దలంతు నైన. నా
సొంపును బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రువున్
పలికెను.

(ఆంధ్ర. భా. స్క-7- పద్యం - 286, 287)

ఈ 287వ పద్యములో హిరణ్యకశిపుని జ్ఞానిత్వము వ్యక్తమగుచున్నది 'హరిచే మృతియంచు దలంతును' అన్న వాక్యములో. వాడు పూర్వము ఘోరతపముచేసి బ్రహ్మనుండి కోరినవరములను

శా॥ గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రభల భూరిగ్రాహరక్షోమృగ—
వ్యాళాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ—
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే

(పద్యం 90)

నిరూపించు పద్యమును ఒక్కసారి మననము చేయుదుమేని పంచభూతములు, తద్వికారములు, కాలము, దిక్కులు, వెలుపల, లోపల, పగలు, రాత్రి, పైన, క్రింద కాని ప్రదేశమునందును, ప్రాణము కలిగినవి, ప్రాణములేనివి కాని వస్తువులతో మరణమును కోరు-కొన్నాడు ఇన్నింటికి అతీతమైనఉత్తమవస్తువు శ్రీమన్నారా-యణమూర్తి కాక వేరొకటుండునె? కావుననే, సర్వము శ్రీమన్నారా-యణ అపరావతారమగు నృసింహునిచేత, స్వామిఒడిలోనే, ఏ ఆయుధములు లేక స్వామి గోళ్లచేతనే తనచావును కోరుకొన్నాడు భక్తుడు. భక్తుడు కోరుకొన్న కోరికను, వాని తపస్సుకు సంతుష్టుడైన పరమేశ్వరుడు కాదనక,

"వ॥ ఇట్లు కేవలపురుషరూపంబును, మృగరూపంబునుం గాని నరసింహరూపంబున, రేయునుం బవలునుంగాని సంధ్యాసమ-యంబున, నంతరంగంబును బహిరంగంబునుంగాని సభాద్వారంబున, గగనంబును భూమియునుంగాని యూరుమధ్యంబునఁ, బ్రాణసహి-తంబులును బ్రాణరహితంబులునుంగాని నఖంబులం, ద్రైలోక్య జన-హృదయ భల్లుండయిన దైత్యమల్లుని వధియించి, మహోదహనకీలా కీలదర్శనుండును, గరాళవదనుండును, లేలిహానభీషణ జిహ్వుండును, శోణితపంకాంకిత కేసరుండును నై, ప్రేవులు కంఠమాలికలుగ ధరించి, కుంభికుంభవిదళనంబు సేసి చనుదెంచుపంచాననంబునుం బోలె దనుజ కుంజర హృదయకమల విదళనంబు సేసి, తదీయ రక్త సిక్తంబులైననఖంబులు సంధ్యారాగరక్తచంద్ర రేఖల చెలువు వహింప సహింపక లేచి, తనకెదురు నాయుధంబు లెత్తుకొని తత్తఱంబున రణంబునకు నురవడించురక్కసులఁ బెక్కుసహస్రంబులఁ జక్రాదికనిర్వక్రసాధనంబుల నొక్కనిఁ జిక్కకుండం జక్కడిచె"

దీనివలననే హిరణ్యకశిపుడు పరోక్షభక్తుడు ప్రహ్లాదుడు ప్రత్యక్షభక్తుడు ప్రహ్లాదునితల్లి కయాధు పరమపతివ్రతయని తెలినది.

శ్రీమద్రామాయణమున రావణునికథ సుప్రసిద్ధమే వాడు పతివ్రతలను, యజ్ఞములను, సాధువులను ఎందరినో భంగపరిచెను. వాడు చేయనిపాపమంటూ లేదు

ఇంకొకవైపు చూచినచో, వాడు గొప్పశాస్త్రవేదిత, మహా-మాహేశ్వర భక్తుడు ఆజ్ఞ చేసి దేవేంద్రునికూడ తనయొద్దకు రప్పించుకొనగలఅధికారము గలవాడు హేమమయమైన దివ్య-పత్తనము లంక వాని నివాసము, పుట్టినది బ్రాహ్మణవంశము ఇన్నిటికీ బిందెడుపాలలో ఒక ఉప్పుగల్లన్నట్టు, వాడు లోకములను వేధించినకారణముగ దశముఖుడు రావణాసురుడైనాడు.

వీనికి కూడ శ్రీమహావిష్ణువునందు అంతరంగికముగ అపారమైన భక్తి కాని బయటికి తనరావణత్వము మాత్రము విడువడు తుదకు రామావతారముననున్న స్వామిభార్యనే అపహరించుకొని పోయినాడు. ఇంతకంటె వేరొక పాపము వానివిషయమున చెప్పవలసినదే లేదు

భార్యను పోగొట్టుకొన్న రాముడు, కన్నీరు మున్నీరుగా ఏడ్చి లక్ష్మణ సహితుడై, సుగ్రీవునితో స్నేహము చేసుకొని, వానరులచే సీతను వెదకించి, లంకయందున్నట్లు తెలిసికొని, వారధిగట్టి దక్షిణ సముద్రము దక్షిణతీరమునకు చేరెను, ఇంతలో సాక్షాత్తు రావణుని-తమ్ముడు పరమభాగవతుడు మహాసత్త్వసంపన్నుడు అయిన విభీషణుడు సీతను రాముని కప్పగించుట మేలని అన్నకు బుద్ధి చెప్పి వానిచే తాడితుడై రాముని శరణు చొచ్చెను వెంటనే రాముడు విభీషణునకు లంకారాజ్య పట్టాభిషేకము చేయించెను రావణునితో యు [illegible] జరిగెను రాక్షసులందరు వరుసగ మడిసిరి

ద్విశ్శరం నాభిసంధత్తే
ద్విః స్థాపయతి నాశ్రితాన్
ద్విర్దదాతి న చార్థిభ్యః
రామో ద్విర్నాభిభాషతే ॥

అని కీర్తి గడించిన శ్రీరాముడు రావణుని చంపుటకు మనసురాక, వానిని సంస్కరించి దొడ్డరాజుగా చేయవలెనను అభిప్రాయముతో, వానిని నాలుగుసార్లు గుక్క త్రిప్పుకొననట్లు చేసి, యుద్ధభూమి నుండి లంకకు త్రిప్పి పంపెను కాని రావణుడు పట్టువిడువక ఐదవ సారి యుద్ధమునకే వచ్చెను. అప్పుడు రాముడు ఇంక వీనిని సంస్కరించుట వీలుగాని పని అని దొడ్డగా విజృంభించి "అరావణ మరామం వా జగద్ద్రక్ష్యథ వానరాః" అని పలికి రావణునిపై యుద్ధమునకు తలపడెను. రావణుడు కూడ పట్టువిడువక యుద్ధమునకే ఉపక్రమించెను. అప్పుడు వీరిరువురిమనస్సులలోని భావములను సరిగా తూచి పసికట్టిన వాల్మీకి.

జేతవ్యమితి కాకుత్స్థః
మర్తవ్యమితి రావణః"

అని వారిరువుర ఆంతరంగిక అభిప్రాయములు వెలువరించినాడు. తుదకు తన కోరిక ప్రకారము అంతర్భాగవతుడగురావణుడు చచ్చెనే కాని, రాముని కోరిక ప్రకారము సంస్కరింపబడలేదు. కావున పై చూపిన భారతభాగవతరామాయణములకు సంబంధించిన గాథలప్రకారము భగవంతునికంటె భక్తుడే గొప్ప.

ఈ నిర్ణయమే విశిష్టాద్వైత సిద్ధాంతమునందు ప్రబలముగ కానవచ్చును. దీనిని గురుతించేటటు అన్నమయ్య చూపిన ఈ సంపుటములోని ఈ క్రింద 23, 48, 450 పాటలు ఉదాహరణముగ తీసి కొనవచ్చును

శంకరాభరణం

అచ్యుత మిమ్ము( దల( చేయ(ంతపని వలెనా
యిచ్చల మీ వారే మాకు నిహపరా లియ్య(గా ॥ పల్లవి ॥

మిమ్ము నెఱి(గినయట్టిమీదాసుల నెఱి(గే-
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవసేసుకుండేటివైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥ అచ్యు ॥

నిరతి నీకు మొక్కేపీడింగరిలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్ను( బూజించే ప్రపన్నుల( బూజించే-
సరిలేనిభాగ్యము చాలదా నాకు ॥ అచ్యు ॥

అంది నీకు భక్తులైన యీలమహానుభావుల -
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడునిబంటుబంటుకు
నందిడి బంట నవుటే చాలదా నాకు ॥ అచ్యు ॥

(ఈ సంపుటము-పాట28)

దేసాళి

నీవే నేరవుగాని నిన్ను( బండించేము నేము
దైవమా నీ కంటే నీదాసులే నేర్పరులు ॥ పల్లవి ॥

పట్టిభక్తి నీమీ(ద వలుకువేసి నిన్ను(
బట్టితెచ్చి మతిలోన( బెట్టుకొంటిని
పట్టె(డుదులసి నీ పాదములపై( బెట్టి
జట్టిగొనిరి మోక్షము జాణలు నీదా ॥ నీకే ॥

నీవు నిర్మించినవే నీకే సమర్పణసేసి
సోవల నీ కృపయెల్లఁ జూరగొంటిమి
భావించొక మొక్కు మొక్కు భారము నీపై వేసిరి
పావనపునీదాసులే పంతపుచతురులు ॥ నీవే ॥

చెరువులనీళ్లు దెచ్చి చేరఁ(రెఁ?)డు నీపైఁజల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీవేంకటేశ యిటువంటివిద్యలనే
దరిచేరి మించిరి నీదాసులేపో ఘనులు ॥ నీవే ॥

(ఈ సంపుటము—పాట—49)

శుద్ధవసంతం

ఎందు వెదకనేల యే ప్రయాసాలునేల
యిందే వున్నది బ్రదు కిహపరములకు ॥ పల్లవి ॥

ముక్కోటితీర్థములు ముకుందుదాసుల—
వొక్కపాదాంగుటమున నొలికీనిదె
మిక్కిలిజపతపాలు మించినప్రపన్నుల—
చిక్కనికృపాకటాక్షసీమ నున్నదిదివో ॥ ఎందు ॥

చేసేటిపుణ్యఫలాలు శ్రీవైష్ణవులచేత
దాసులై యిరుదెసల రాలీనిదె
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల—
భాసురపుఁబెదవులఁ బాఁతి పైపై నున్నది ॥ ఎందు ॥

సకలదేవతలచే సాధించేవరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవేంకటాద్రివిభునిమహిమలెల్లా
ప్రకటించి వీరసల్లాపాన నున్నదిదివో ॥ ఎందు ॥

(ఈ సంపుటము—పాట 450)

ఇంతమాత్రమేకాక తాళ్ళపాకకవులవాఙ్మయ మందంతటా "దాసాను దాసుడను" ఇత్యాది ప్రయోగములుకూడ ఈ భావమునకే సూచకములు.

ప్రాచీనుడు ఆళ్వారులలో నొకడునగు కులశేఖరాళ్వార్ రచించిన ముకుందమాలలోని

త్వద్భృత్యభృత్య పరిచారకభృత్యభృత్య।
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ

అను పద్యమూ.

దాసానుదాసచరమావధిదాసదాసః॥

ఇత్యాదులుకూడ ఈ సిద్ధాంతమునకు పరమోదాహరణములు కాగలవు.

ఈ సంపుటము నందు కొన్ని పదములు వ్యావహారిక దృష్టితో ప్రయోగింపబడి కొంత వివరణ మపేక్షించు చున్నట్లున్నవి. వానిలో మచ్చుకు కొన్ని

1. చెల్లపిళ్లలు. పాట 54 -1వ చరణం -2వ పాదం
   శెల్వప్పిళ్లై = ముద్దుబిడ్డ అని తమిళము అదియె చెల్ల పిళ్లలుగా వ్యావహారికరూపము రించి వుండవచ్చు.
2. దూప పాట 183 - 2వ చరణం - 1 వ పాదం

తోడికి మింటికాపలు తుంచి దూప(?) దాఁకినమ్ము

ఈ సంపుటము అచ్చువేయుసందర్భమున ఈ పదమునకు ఏదో ఒకటి అప్పటికి తోచినఅర్థము ఇచ్చినాను తరువాత యోచింపగా ఈ క్రింది అర్థము గోచరించుచున్నది

సీతారామకల్యాణానంతరము దశరథుడు వశిష్ఠాదులతో కలిసి అయోధ్యకు బయలుదేరగా, మార్గమధ్యమున భార్గవరాముడు ఎదురుపడతాడు అప్పుడు అతడు శ్రీరామునిగూర్చి 'నీ పరాక్రమము విన్నాను, ఈ ధనుస్సును ఎక్కుపెట్టుము బాణము సంధించుము, చూతము నీ బలము' అని అడుగగా అతడట్లు చేయును అప్పుడు రాముడు,

బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే
విశ్వామిత్రకృతేన చ
తస్మాచ్ఛక్తో న తే రామ
మోక్తుం ప్రాణహరం శరమ్॥

ఇమాం పాదగతిం రామ
తపోబలసమార్జితాం
లోకా న్నప్రతిమా న్వా తే
హనిష్యామి యదీచ్ఛసి॥

నహ్యాయం వైష్ణవో దివ్యః
శరః పరపురంజయః
మోఘః పతతి వీర్యేణ
పరదర్పవినాశనః॥
(శ్రీమద్రామాయణము - బాలకాండ - 76 సర్గ శ్లో 6, 7, 9)

అంటాడు పరశురామునితో. దా.కి బదులుగా పరశురాముడు,

న చేయం మమ కాకుత్స్థ
వ్రీడా భవితు మర్హతి
త్వయా త్రైలోక్యనాథేన
యదహం విముఖీకృతః॥

II

శర మప్రతిమం రామ
మోక్తు మర్హసి సువ్రత
శరమోక్షే గమిష్యామి
మహేంద్రం పర్వతోత్తమమ్॥
స హతాన్ దృశ్య రామేణ
స్వాన్ లోకాన్ తపసాఽఽర్జితాన్
జామదగ్న్యో జగామాశు
మహేంద్రం పర్వతోత్తమమ్॥

శ్రీమద్రామాయణము - బాలకాండ - 76 సర్గ - శ్లోకం - 19, 20, 22.

ఈ పై వాక్యములు చెప్పినాడు.

ఇందు అభివ్యక్తమైన ఈగాథయే ఈపాదమునందు సూచితమైనదని నాయభిప్రాయము

మింటి తావలు=ఊర్ధ్వలోకపు మెట్లు, పరశురాముడు దీర్ఘకాల తపస్సుతో ఊర్ధ్వలోకములకు నడచిపోవుశక్తిని సంపాదించుకొనియుండినాడు. ఆ ఊర్ధ్వలోకగతిని రామబాణము హరించినది. బాణము వ్యర్థము కాకూడదు కదా. అందువలననే నేటికిని పరశురాముడు చిరంజీవులలో ఒకడుగా ఇహలోక వాసిగా కీర్తింపబడుచున్నాడు,

అశ్వత్థామా బలి ర్వ్యాసః హనూమాంశ్చ విభీషణః।
కృపః పరశురామశ్చ సప్తైతే స్థిరజీవినః॥

అని.

దూప=దప్పి, శ్రమ కావచ్చు. ఈ రెండర్థములు శ. ర. లో సూ. ని. లో ఇవ్వబడినవే

దూపతాఁకిన=దప్పిగొన్న, శ్రమగొన్న - కావచ్చు.

8. తిరుపళ్చ్చి - పాట 298 – పల్లవి–1వ పాదం.

ఇది "తిరు పళ్ళి ఎళుచ్చి" అను అరవపదమునకు సంగ్రహ రూపమైన వ్యావహారిక పదము కావచ్చు.

తిరుపళ్ళిఎళుచ్చి = శ్రీ శయ్యోత్థాపనము = మంగళకరమైన పడకనుండి మేలుకొలుపు కావచ్చు.

ఈ సంపుటమునకు ఇంతమాత్రము పీఠిక తయారు చేసి, ఈ వాఙ్మయమున ఏయే పెద్దలు ఎంతెంత వరకు పనిచేసి ఎంతెంత కార్యము సాధించినారనువిషయమును ఏ సంపుటమునైన ఇయ్య-వలెనను ఆశ ఒకటి వుండినది. దానిని దీనికి అనుబంధముగా "తాళ్ల-పాకకవులవాఙ్మయము—పరిష్కర్తలు" అను శీర్షికతో ఇచ్చు చున్నాను.

# తాళ్లపాకకవులవాఙ్మయము – పరిష్కర్తలు

అన్నమాచార్యప్రాజెక్టుక్రింద పరిష్కరణశాఖ ఒకటి, ప్రచారశాఖ రెండుగా పనిచేయుచున్నవి. అందులో పరిష్కరణ శాఖకు సంబంధించిన విషయములను ఇందు తెలుపుచున్నాను.

1974 నుండి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీ వేంకటేశ్వర-ప్రాచ్యకళాశాల ఆంధ్రాశాఖాధ్యక్షపదవినుండి పాక్షికముగాను, 1976 జూలైనుండి పూర్తిగ అన్నమాచార్యవాఙ్మయపరిష్కరణ చేయుటకు బదిలీ చేయబడిరి తదుపరి 1979 జనవరినుండి ఈ అన్నమాచార్య వాఙ్మయపరిష్కరణశాఖకు "స్పెషలాఫీసరు" హోదాతో శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, J బాలసుబ్రహ్మణ్యముM A. అను సహాయకునితో కలిసి పనిచేయుచున్నారు.

## దీని సంగ్రహపూర్వచరిత్ర

ఈ తాళ్ళపాక కవుల వాఙ్మయము 1922-23 ప్రాంతమునుండి. అప్పటి దేవస్థానపు టుద్యోగియగు శ్రీ. శే. సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి గారి సూచనపై, రాగిరేకులను పరిష్కరణ ప్రకటన కార్యములు ప్రారంభము లైనవి. వారు ఆ రాగిరేకులలోని వాఙ్మయమునంతా అప్పటి పేష్కార్ తెలుగు పండితులు శ్రీ. శే. కలబరగి వేంకటరమణ శాస్త్రి [illegible] ప్రతి వ్రాయించినారట. వారు ఉద్యోగనియంత్రణ—ముల [illegible] పేర కచేరీకి బదిలీ కాగా, అప్పటిచెక్క పెట్టెలనిండా నింపిన [illegible] వాఙ్మయమంతా నష్టమైపోయినదని శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారే స్వయముగా నాతో చెప్పిరి. హతశేషమైన ఆ వాఙ్మయమును చూచి రాజశ్రీ రావుబహద్దూరు శ్రీ K సీతారామ రెడ్డి. B A B L ([illegible] బి. బి. దే) గారి అధికారముక్రింద, శ్రీ. శే. పండిత [illegible] ము వాచార్యులు (ఎపిగ్రాఫిస్టు, బి. బి. దే) వారిపరి—ష్కరణతో, [illegible] కవుల లఘుకృతులు (The Minorworks of [illegible]) [illegible] పీఠికతో మొదటి సంపుటము (vol I) ను 19[illegible] లో [illegible] ంచిరి. తరువాత "[illegible] ధ్యాత్మసంకీర్తనలు" గల రెండవ [illegible] (vol II) ను 1936 లోను, "శృంగార సంకీర్తనలు" గల [illegible] టము (vol III) ను 1937 లోను శ్రీమాన్ [illegible] రాఘవాచార్యులుగారు పరిష్కరించి ప్రకటించిరి. [illegible] ణములందు ఎక్కడను రేకులసంఖ్యగాని, నేటి [illegible] మూడి [illegible] అచ్చు [illegible] టింపబడినను పై రెండవ, [illegible] పుటలలో [illegible] యు [illegible] తరువాతి [illegible] వచ్చెపోయినవి కావున ఆ సంపుటములు [illegible] నవలంబనపనికి లేదు.

పై వాటన్నిటిని [illegible] తాళ్ళపాకవంశమునకు

వెం[illegible] [illegible] మూడు

ద్విపదకావ్యములు I) అష్టమహిషీ కల్యాణము (1937), II) ఉషా కల్యాణము (1938), (III) పరమయోగి విలాసము (1938) ప్రకటితములైనవి

1940-1941 విద్యాసంవత్సరమునందు తి తి దేవస్థానము వారిచే "శ్రీ వేంకటేశ్వరసంస్కృత పాఠశాల" "శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల"గా రూపొందింపబడి, దానిలో తెలుగు, హిందీ, అరవము మొదలైన విద్వాన్ పట్టములు ప్రారంభింపబడినవి అట్లనే 1939వ సంవత్సరములోనే "శ్రీ వేంకటేశ్వరప్రాచ్య పరిశోధనసంస్థ" కూడ ప్రారంభింపబడినది ఆ పరిశోధనాలయమునందు పలువురు ఉద్దండ పండితులు పరిశోధనలు సాగించినారు వారిలో శ్రీ॥ శే॥ మానవల్లి రామకృష్ణకవిగారు, శ్రీ॥ శే॥ వేటూరిప్రభాకరశాస్త్రి గారు తెలుగునకు సంబంధించిన ప్రముఖులు శ్రీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తొలుత ప్రాచ్యకళాశాలలో ఆంధ్రశాఖాధ్యక్షులుగ పాఠములు బోధించుచుండిరి తరువాత కొంతకాలమునకు వారు పరిశోధన కంకితమైరి. అప్పుడు వారు తాళ్లపాక కవుల వాఙ్మయమును పరిశోధించి ప్రకటింపబూనిరి

శ్రీ శాస్త్రిగారు పరిశోధనకు దిగిన వెంటనే తాళ్లపాక పెద-తిరుమలాచార్యుల వైరాగ్యవచనగీతములను రేకులలో నున్న-వాటితోపాటు తంజావూరునందు లభించినవానిని కూడ చేర్చి, 1945 సంవత్సరమున "వైరాగ్యవచనమాలికలు" అను పేరుతో వెల-యించిరి తరువాత కీర్తనల ఖండములను వరుసగా ప్రకటించుటకు, కీర్తనల రేకులను శ్రీ, ఇవి ఫలానా ఫలానా వారివి అని విభజించి 1947లో, శ్రీ॥ శే॥ పండిత విజయరాఘవాచార్యులు ప్రకటించిన లఘుకృతుల, కీర్తనల సంపుటముల సంఖ్య ననుసరించి IV వ సంపుటముగ అన్నమయ్య శృంగారకీర్తనలతో నిండిన రేకుల లోని 31 వ రేకులోని 3 వ దానిని మొదలు 60 వ రేకు వరకు గల

పూర్తిపాటలను ప్రకటించిరి. తక్కినవి III సంపుటమున ముద్రితములు గనే భావించి వదలివేసిరి. తరువాత 1950వ సంవత్సరమున అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనల తొలివంద రేకులలోని 54 రేకులలోని 331 పాటలను V సంపుటముగ ప్రకటించిరి ఈ మధ్యలో 1949 వ సంవత్సరమున శ్రీ శాస్త్రిగారు, చిన్నన్న రచించిన అన్నమాచార్యచరిత్ర (ద్విపద)47 పేజీలతో ముగియగా, దానికి 183 పేజీల విపులపీఠికను సంతరించి, ఆ చరిత్రకు సాక్ష్యములిచ్చు కీర్తనలను జోడించి, పై చరిత్రతో కలిపి ప్రకటించినారు. ఈ సందులో "శ్రీ వేంకటేశ్వరలఘుకృతులు" అనుపేరుతో నానాకవులు నానావిధవృత్తములతో రచించినగ్రంథము నొకదానిని ప్రకటించిరి.

ఈ 5 గ్రంథముల ప్రకటనతరువాత కాలపురుషుడు శాస్త్రిగారిని మనకు దూరము చేసినాడు శ్రీ శాస్త్రి గారు ఈ సంపుటములను ముద్రించి ప్రకటించడముతోపాటు, దేవస్థానము వారి సాహాయ్యముతో అన్నమాచార్యుల వర్ధంతి నొకదానిని సాగించుచువచ్చిరి అందు పండితప్రముఖులచేత తాళ్లపాక వాఙ్మయములోని సాహిత్యమును విమర్శింపజేయుచు, విజయవాడ ఆలిండియా రేడియా వారి సహాయముతో తాళ్లపాక వారి సంకీర్తనగానసుధను నలుమూలల వ్యాపింపజేయుచు వచ్చిరి. ఆ సాంప్రదాయ మీ నాటికిని సాగుచున్నది వారసేవ ఈ వాఙ్మయమునకు 5 సంవత్సరములే ఐనను మరపురాని మహౌషధిగా పనిచేసినది

— —

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| I సంపుటము | 1935 | తాళ్లపాకకవులలఘుకృతులు (రేకులసంఖ్యలేదు) | పండిత వి.విజయ రాఘవాచార్య |
| II సంపుటము | 1936 | అధ్యాత్మసంకీర్తనలు రేకుల సంఖ్యలేదు | ,, |
| III సంపుటము | 1937 | శృంగార సంకీర్తనలు (రేకులసంఖ్య లేదు.) | ,, |
| (I) ద్విపద | 1937 | అష్టమహిషీకల్యాణము (చిన్నన్న) | , |
| (II) ద్విపద | 1938 | ఉషాకల్యాణము (చిన్నన్న | ,, |
| (III) ద్విపద | 1938 | పరమయోగి విలాసము (చిన్నన్న) | ,, |
| వైరాగ్యవచన మాలికలు | 1945 | పెదతిరుమలయ్య వచనములు | వేటూరి ప్రభాకర శాస్త్రి |
| IV సంపుటము | 1947 | అన్నమాచార్యుల శృంగార కీర్తనలు (30 రేకులు) | ,, |
| అన్నమాచార్యచరిత్ర | 1947 | చిన్నన్నద్విపద + పీఠిక | ,, |
| V సంపుటము | 1950 | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | ,, |
| VI సంపుటము | 1951 | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | ఏ. వి. శ్రీనివాసాచార్యులు |
| సంకలనము | 150 | ఉత్సవగాయకోవ యోగార్థముద్ధృతములు | ,, |
| VII సంపుటము | 1951 పాటలు | అన్నమయ్యఅధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | రా. అ. కృష్ణశర్మ ఏ. వి శ్రీనివాసాచార్యులు |
| VIII సంపుటము | 1952 | ,, (50 రేకులు) | ,, |
| IXసంపుటము | 1952 | అన్నమయ్య అధ్యాత్మకీర్తనలు (50 రేకులు) | గాళ్లపల్లి అనంత కృష్ణశర్మ |

## ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| X సంపుటము | 1952 | ,, (50 రేకులు) | రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ |
| XI సంపుటము | 1955 | ,, (70 రేకులు + కొన్ని విడురేకుల్లోని కీర్తనలు) | ,, |
| (I) సంపుటము | 1955 | 54 పాటలు స్వరరచినవి | ,, |
| (II) సంటము | 1956 | ,, ,, | ,, |
| XII సంపుటము | 1956 | అన్నమయ్య శృంగార సంకీర్తనలు (64 రేకులు) | |
| XIII సంపుటము | 1960 | ,, (100 రేకులు) | ,, |
| XIV సంపుటము | 1961 | ,, (50 రేకులు) అ-శృంగార సంకీర్తనలు | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ ఏ వి శ్రీనివాసా చార్యులు |
| XV సంపుటము | 1961 | ,, (50 రేకులు) | ఏ వి శ్రీనివాసా చార్యులు |
| XVI సంపుటము | 1962 | చి॥ తిరుమలయ్య అధ్యాత్మ + శృంగార కీర్తనలు (30 రేకులు) | ,, |
| XVII సంపుటము | 1963 | అన్నమయ్య శృంగార కీర్తనలు (100 రేకులు) | |
| XVIII సంపుటము | 1964 | అన్నమయ్య శృంగారకీర్తనలు (100 రేకులు) | పి టి జగన్నాథ రావు |
| XIX సంపుటము | 1965 | అన్నమయ్య శృంగార కీర్తనలు (100 రేకులు) | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| XX సంపుటము | 1965 | ,, (100 రేకులు) | ,, |
| XXI సంపుటము | 1975 | పెద తిరుమలయ్య అధ్యాత్మ కీర్తనలు (100 రేకులు) | పి టి జగన్నాథ రావు |

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| 22 (XXII) | 1975 | అన్నమయ్యశృంగారకీర్తనలు (100 రేకులు) | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 12 (XII) | 1976 | అన్న-శృం-యూనివర్సిటి వారికై విపులమైనపీఠికతో | గౌ. రా శర్మ |
| 23 (XXIII) సం | 1976 | పెదతిరుమలయ్యశృంగార కీర్తనలు (100 రేకులు) | పి టి. జగన్నాథ రావు |
| 24 (XXIV) సం | 1977 | అన్నమయ్య శృంగారకీర్తనలు (100 రేకులు) | గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 25 (XXV) సం | 1977 | ,, (100 రేకులు) | |
| అన్నమాచార్యచరిత్ర పీఠిక | 1978 | మూడవ ముద్రణ | |
| 26 (XXVI) సం | 1979 | ,, (100 రేకులు) | ,, |
| 27 (XXVII) సం | 1979 | ,, (100 రేకులు) | ,, |
| 28 (XXVIII) సం | 1980 | ,, (100 రేకులు) | ,, |
| 29 (XXIX) సం | 1980 | ,, (100 రేకులు) | |
| 30 (XXX) సం | 1983 | ,, (100 రేకులు) | ,, |
| 31 (XXXI) సం | 1984 | ,, (100 రేకులు) | ,, |
| 1 వ సంపుటము | 1980 | ద్వితీయముద్రణ | ,, |
| | | అన్నమయ్య అధ్యాత్మకీర్తనలు (100 రేకులు) | ,, |
| 2 సంపుటము | 1981 | ,, (100 రేకులు) ద్వితీయ ముద్రణ | ,, |

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింప బడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.

| సంపుటము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|
| 3వ సంపుటము | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (100 రేకులు) ఈ సంపుటమే | గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 32 ,, | అన్నమయ్య శృంగార సంకీర్తనలు 100 రేకులు ముద్రణమునకు సిద్ధము చేయబడినది | ,, |
| 33 ,, | ,, (100 రేకులు) | ,, |
| 34 ,, | ,, (100 రేకులు) | ,, |
| 35 ,, | ,, (100 రేకులు) | ,, |
| 4 ,, | అన్నమయ్యఅధ్యాత్మకీర్తనలుద్వితీయ (100 రేకులు)ముద్రణకు సిద్ధము చేయబడినది. | ,, |

శ్రీమాన్ ఏ వి శ్రీనివాసాచార్యులు తి. తి. దేవస్థాన—వేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయములో నుండియే VI వ సంపుటమును స్వతంత్రముగను, VII, VIII సంపుటములను కీ॥ శే॥ పూజ్యులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారితో కలిసియు వెలువరించిరి.

1956 లో వేంకటేశ్వరప్రాచ్య పరిశోధనాలయము, అందున్న పండితులు, సిబ్బందితోపాటు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము—నకు దేవస్థానము వారిచే దానము చేయబడిన తరువాత, విశ్వవిద్యా—లయమువారి అనుమతితో XV, XVI, XVII సంపుటములను శ్రీమాన్ శ్రీనివాసాచార్యులుగారు స్వతంత్రముగ వెలువరించిరి

వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చేతనే 'సంగీత సాహిత్యపుష్టి గలవా' రని పేర్కొనబడిన పూజ్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

గారు మైసూరు ప్రభుత్వకళాశాలనుండి విశ్రాంతిగై కొన్న తరువాత, ఈ దేవస్థానములో దఫాలు వారిగా కొన్ని సార్లు పనిచేసిరి. 1962లో శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు దేవస్థానమునుండి విశ్రాంతిగై కొనగా, ఈ వాఙ్మయమంతయు కీ శే. పి టి జగన్నాథ రావు గారికి అప్పగింపబడి, వారు XVIII సంపుటమును ప్రకటించిరి XIX, XX సంపుటములను పూజ్యులు కీ॥ శే. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ కలిసి పరిష్కారముద్రణములు సాగించినారు కీ॥ శే. పి టి, జగన్నాథరావుగారు పెదతిరుమలా చార్యుల శృంగార, అధ్యాత్మసంకీర్తనలుగల XXI XXIII సంపుట ములను కూడ వెలువరించిరి.

24 (XXIV) సంపుటమునుండి ఇప్పటివరకు జరిగిన జరుగు చున్న సంపుటముల పరిష్కరణమంతయు శ్రీ గౌరిపెద్దిరామసుబ్బ శర్మ చేతిమీదుగనే సాగినది. సాగుచున్నది.

ఇది కాక ఎన్నడో అచ్చై చెల్లిపోయిన చిన్నన్న ద్విపద కావ్య ములు కూడ ప్రస్తుతం శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ పరిష్కరించు చున్నారు అవి త్వరలో ముద్రణభాగ్యమునందగలవు.

* శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ ఉద్దేశము ప్రకారము అన్నమా చార్య అధ్యాత్మకీర్తనల సంపుటములు-4, అన్నమాచార్య శృంగార కీర్తనల సంపుటములు-20, పెదతిరుమలాచార్యుల అధ్యాత్మకీర్తనల సంపుటము-1, పెదతిరుమలాచార్యుల శృంగారకీర్తనల సంపుటము1, చినతిరుమలాచార్యుల శృంగారాధ్యాత్మకీర్తనల సంపుటము - 1 (అన్నికలిసి 30 రేకులు కాబట్టి) కాగా, తాళ్లపాక కవుల లఘు కృతుల సంపుటము-1, చిన్నన్న రచించిన ద్విపదకావ్యములు 3, అన్న మాచార్య చరిత్రతోకూడ -4, వెరసి 32 సంపుటములు-అగును, నార సింహమంత్ర సంఖ్యతో "తాళ్లపాకకవుల వాఙ్మయనారసింహము" అను పేరుతో ఈ గ్రంథమండలిని అంతా ప్రకటింపవచ్చును.

పరమ భాగవతులు, మన వేంకటేశ్వరస్వామికి మీదుగట్టి భక్తిగలవారు అగు ఈ తాళ్లపాకకవుల వాఙ్మయమును లోకమునందంతటా ప్రకాశింప జేయుటకు రాగిరేకులలో నున్నదానిని పుస్తకరూపముగా ప్రచురించుటకు ఎంత ఖర్చైనను వెనుకాడక తి తి దేవస్థానముల కమిటీ చైర్మన్, శాసనసభ్యులునగు శ్రీ వి డి వి సత్యనారాయణరాజుగారికి, వారి ఆదేశమును ఇబ్బ ముబ్బడిగా పండింపగల తి. తి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ యస్. లక్ష్మీనారాయణ ఐ ఏ యస్ గారికిని నా ధన్యవాదములు తమది పై అజమాయిషీయే అయినా సొంతమగు శ్రద్ధతో ఈ పనికి తోడ్పడుచున్న తి. తి. దేవస్థానముల పౌరసంబంధశాఖాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తిగారికి, మాపనియందు నిత్య సంబంధము గలిగి మాకడుగడుగున తోడ్పడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు M A, గారికి, అచ్చుపనిలో పనికి ముందుస్థానమిచ్చి నడిపించుచున్న తి. తి. దే ప్రెస్ మేనేజర శ్రీ యం విజయకుమారరెడ్డిగారికిని నాకృతజ్ఞతలు.

ఈ పరిష్కరణ కార్యమునందు నాకు సర్వవిధముల చేదోడ వాదోడుగా పనిచేయుచున్న చి॥ జె బాలసుబ్రహ్మణ్యం. యం ఏకు నామంగళాశాసనములు

అచ్చుపనిలో కడుజాగరూకులై మాకు తోడ్పడుచున్న - దేవస్థానము అచ్చుకూర్పరులకు నా మంగళాశాసనములు. మాకనగప్పి దొంలిన తప్పులను సవరించి మా కను విప్పగలసహృదయులకు మా అభినందనములు

శ్లో॥ రంగనాథకవేః సత్తాం సహేతుం యోన్వరూపయత్
కట్టమంచిమతిక్రమ్య రాళ్లపల్లిగురుం స్తువే

తిరుపతి,
22-7-85

ఇట్లు
బుధవిధేయుడు
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
తాళ్లపాక వాఙ్మయ పరిష్కర్త

# పీఠిక

అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనలలో ౨౦౧-వ రేకు మొదలు ౨౫౦-వ రేకు వఱకును గల ౨౮౯ సంకీర్తనలు ఈ యెనిమిదవ సంపుటముగా ప్రకటింపఁబడినవి. ఇఁక మూఁడుసంపుటములలో ఆయనగారి అధ్యాత్మకీర్తనలన్నియు ముగిసి ముద్రణకెక్కఁగలవు. వాని సంశోధనకార్యము త్వరగా సాఁగుచున్నది. అందుపై వారి శృంగారసంకీర్తనల సముద్రము నీఁదు ప్రయత్నము చేయవలసియున్నది. ఈఁదించువాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు. ఈఁదు కోరికమాత్రమే మాది

ఇందలి సంకీర్తనలలో 'అతిమితిఁ జూడఁబోతే' అను ౧౨౬వ దియు, 'ఈతఁడే ముక్తిదోవ' అను ౧౮౩వదియు అన్నమాచార్యునివి కావనుట స్పష్టము. కుమారుఁడు పెదతిరుమలయ్యగారిదో మనుమలదో కాఁగలదు చెప్పినవారిదో చెక్కినవారిదో అసడ్డచేత అన్నమాచార్యసంకీర్తనములలోఁ గలిసినవి. రేకులలోని క్రమమును మార్చు స్వాతంత్ర్యము వహింపలేదు గనుక ఉన్నరీతినే ప్రకటించుటయైనది.

కీర్తనలకన్నిటికిఁ గాకున్నను కొన్నిటికైనను లఘుటీక వ్రాసి ప్రకటించుట మేలని కొందఱు మిత్రులు సూచించిరి. కాని 'దీన్నిగడిచి దీర్ఘాయుష్మంతుఁడై తేగదా పెన్నదాటి పెరుమాళ్ళ-సేవ చేసేది' అను సామెత పదే పదే జ్ఞప్తికి వచ్చి నన్ను భయపెట్టుచున్నది ప్రకృత మీయుండుపరస్పరప్రకృతులను ప్రకటింపఁ గల్గితిమేని అదే పదివేలు. అందుమీఁద అన్నమాచార్యుల భాష, కవిత, మతము మొదలగు విషయములచర్చ యెంతో చేయవలసియున్నవి. అది నాచేతనే చేయించునో నాకంటె సమర్థతరుల కా-కైంకర్యమునిచ్చునో ఆ శ్రీనివాసులకే యెఱుక!

యథాపూర్వముగా ప్రాచ్యపరిశోధనాలయమందలి గ్రంథ-భాండాగార పండితులగు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసా-చార్యులు ఈ సంకీర్తనల సంశోధన కైంకర్యమందు చూపుచున్న అసాధారణశ్రద్ధాభక్తులు అభినందనీయములు. వారికి నాయనంత-మంగళాశాసనములు

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య విద్యా
పరిశోధనాలయము.
తిరుపతి
15-3-52.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

# పీఠిక

ఈ తొమ్మిదవ సంపుటమున ౩౫౧-వ రేకు మొదలు ౩౯౯-వ రేకు వఱకునుగల ౩౮౮ అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు ప్రకటింపఁబడినవి. ఒక్కొక్కసంపుటమందు ౫౦ రేకులసంకీర్తనములను క్రమముగా ప్రచురించుట యిూవల మేమవలంబించిన పద్ధతి. ౪౦౦-వ రేకు మాకు లభింపమిచే ౪౯ రేకుల సారస్వతము మాత్రమే ఇందు చేర్పఁబడినది. ౮-వ సంపుటమునఁగూడ ౩౧౬-వ రేకు లభింపమిచే ఇట్లే ౪౯ రేకులకే సంపుటము ముగింపఁబడినది. ఈ సంపుటమున ౩౯౬-వ రేకును పేర్కొనక పోవుట పొరఁబాటు. ౩౬౫-వ సంకీర్తనము మొదలు ఆఱు పదములు ఆ సంఖ్యగల రేకులోనివి.

౧౮౪-వ సంకీర్తనము 'ఆరీతిఁ తాళ్ళపాక అన్నమయ్య ఘనుఁడాయ-వారివారమై నేము వహికి నెక్కితిమి' అని ముగియుటచే, ౮ వ సంపుటమందలి ౧౩౬, ౧౮౪, సంఖ్యలసంకీర్తనములవలె, ఇదియు అన్నమాచార్యుల రచన కాదనియు, పుత్ర పౌత్రులలో ఎవరో రచించినదనియు, సంకలనముచేసినవారి పొరఁబాటున ఇందు చేరినదనియు ఊహింపవలసియున్నది.

యథాపూర్వముగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయమందలి గ్రంథభాండాగారపండితులు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఈ సంపుటమును సిద్ధపఱుచుటయందు నాకు చేసిన తోడ్పాటు శ్రీ శ్రీనివాసుని పరమానుగ్రహమునకుఁ బాత్ర-

మైనది. తప్పొప్పులపట్టిక యావశ్యకత లేకుండవలెనను సంకల్పముతో చిత్తులు దిద్దుట జరిగినది. ఐనను అందందు కొన్ని చిలు తప్పులు కన్నుమిఱి నిలిచినవి. సహృదయులు వానిని సులభముగా సవరించుకొందురు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము. తిరుపతి.
18—6—1952

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,
సంగీతవాఙ్మయ పరిశోధకుఁడు.

శుభమస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగునేఁటిక్రోధిసంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించినపదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగునేఁటిదుందుభి సంవత్సరఫాల్గుణ బ ౧౨*నిరుధానకు (నిరోధానకు? తిరోధానానకు) తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు

రేకు 201 మాళవి

ఇట్టిప్రతాపముగలయీతనిదాసులనెల్ల
కట్టునా కర్మములెల్ల గాలిఁ బోవుఁగాక ॥ పల్లవి ॥

యెలమిఁ జక్రాయుధున కెదురా దానవులు
తొలఁగ కెందుచొచ్చినఁ దుండించుఁగాక
ఇల గరుడధ్వజుపై నెక్కునా విషములు
కలఁగి నీరై పారి గాలిఁ బోవుఁగాక ॥ ఇట్టి ॥

---

* ఈ శబ్దము, 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చుచున్నది అడ్డగింపు, అవధి అని యర్థము ఆనాఁడు కదవటిదినమని తాత్పర్యము ౯॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన 'సరియగు' అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును అవధి' అను నర్థముతో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండవెంగమాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది' సాహిత్య అకాడమీవారి 'విష్ణుపారిజాతము' ౯౯ పుట నేనీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు 'నిబుత్తం" అనునరవపదముగూడ 'నిలుపు అను నర్థముతో దీనికి సహాయపడుననిరి

గోవర్ధనధరునిపై కొలువునా మాయలు
వేవేలు దనుకలై విరుగుఁగాక
కేవలుఁడచ్యుతునొద్దఁ గీడు చూపఁగలవా
కావరమై తాఁ దానె గాలిఁ బోవుఁగాక. ॥ఇట్టి

వీరనారసింహునకు వెరపులు గలవా
దూరాన గగ్గులకాడై తొలఁగుఁగాక
కోర యీ శ్రీవేంకటేశుఁ గొలిచితి మిదివో
కారుకొన్న పగలెల్ల గాలిఁ బోవుఁగాక. ॥ఇట్టి॥

బౌళి

ఏది నిజంబని యెటువలె నమ్ముదు
పోదితోడ నను బోధింపవే ॥పల్లవి

సత్తు నసత్తని సర్వము నీవని
చిత్తగించి శ్రుతి చెప్పెడిని
వుత్తమమధ్యమ మొగిఁ గలదని మరి
యిత్తల శాస్త్రము తేర్పరచీని. ॥ఏది

నానారూపులు నరహరి నీవని
పూనినవిధు లిటు పొగడెడిని
మానక హేయము మరి వుపాధే(దే?)యము
కానవచ్చి యిలఁ గలిగియున్నవి. ॥ఏది॥

భావాభావము పరమము నీవని
దైవజ్ఞులు నినుఁ దలఁచెదరు
శ్రీవేంకటగిరిఁ జెలఁగిననీవే
కావుగ మదిలోఁ దగిలితివి ॥ఏది॥ 2

సాళంగనాట

గెలిచితి భవములు గెలిచితి లోకము
యెలమి నీదాసుల కెదు రింక నేది. ॥పల్లవి॥

జయ జయ నరసింహా జయ పుండరీకాక్ష
జయ జయ మురహర జయ ముకుంద
భయహరణము మాకుఁ బాపనాశనము
క్రియతోడి నీసంకీర్తన గలిగె ॥గెలి॥

నమో నమో దేవ నమో నాగపర్యంక
నమో వేదమూర్తి నారాయణా
తిమిరి మమ్ముఁ గావఁగ దిక్కయి మాకు నిలువ
జమళిభుజముల [1]శంకుఁజక్రములు గలిగె. ॥గెలి॥

రక్ష రక్ష పరమాత్మ రక్ష శ్రీవేంకటపతి
రక్ష రక్ష కమలారమణ పతి
అక్షయసుఖ మియ్యఁగల న(వ?)టు దాపుదండగా
పక్షివాహనుఁడ నీభక్తి మాకుఁ గలిగె ॥గెలి॥ 3

దేసాళం

ఎక్కడ చూచిన వీరే యింటింటిముంగిటను
పెక్కుచేఁతలు సేసేరు పిలువరే బాలుల. ॥పల్లవి॥

పిన్నవాఁడు కృష్ణుఁడు పెద్దవాఁడు రాముఁడు
వన్నె నిద్ద రమడలవలె నున్నారు
వెన్నలు దొంగిలుదురు వీఁడు వాఁడు నొక్కచే
పన్నుగడై వచ్చినారు పట్టరే యీబాలుల. ॥ఎక్క॥

1 శంఖచక్రములు' పూ. ము. పా.

నల్లనివాఁడు కృష్ణుఁడు తెల్లనివాఁడు రాముఁడు
అల్లదివో జోడుకోడెలై వున్నారు
వెలఁరై తిరిగేరు వేసు తేఁద్దరకిని
పెల్లుగ యశోదవద్దఁ బెట్టరె యీబాలుల ॥ఎక్క॥

రోలఁ జక్కె నొకఁడు రోఁకలి వట్టె నొకఁడు
పోలిక సరిబేసికిఁ బోలించి వున్నారు
మేలిమి శ్రీవేంకటాద్రి మించిరి తానే తానై
ఏలించి నె(యొ?)వ్వర నేమి ననకురే బాలుల ॥ఎక్క॥ 4

నాట

దాసోహ మనుబుద్ధిఁ దలఁచరు దానవులు
యీసులకే పెనఁగేరు యిప్పుడూఁ గొందరు ॥పల్లవి॥

హరిచక్రముదూషించేయట్టివారే యసురలు
అరయఁ దామేదైవమన్నవారు నసురలే
ధర నరకాసురుఁడు తానె దైవమని చెడె
యిరవై యిది మానరు యిప్పుడూఁ గొందరు. ॥దాసో॥

పురుషోత్తమునిపూజపొంతఁ బోరు అసురలు
సరవి విష్ణుని జపించనివారు నసురలే
హిరణ్యకశిపుఁడును యీతని నొల్లక చెడె
ఇరవై యీతని నొల్ల రిప్పుడూఁ గొందరు ॥దాసో॥

సురలును మునులును శుకాదియోగులును
పరమము శ్రీవేంకటపతి యనుచు
శరణని బ్రదికేరు సరి నేఁడు వైష్ణవులు
యెరపరికానఁ బోయ్యే రిప్పుడూఁ గొందరు. ॥దాసో॥ 5

గౌళ

వెట్టివాఁడ వెట్టివాఁడ వినియుఁ గనియుఁ మఱ
వెట్టి దెలిసి రోఁకలి వేరె చుట్టేఁగాక. ॥ పల్లవి ॥

పుట్టించినవాఁడట పూఁచి నన్నుఁ బెంచలేవా
[1]కట్టుఁగడ నమ్మని నాకడమే కాక
వొట్టి నాలో నుండునట వొగిఁ బాపము గాకేని
గట్టిగాఁ బుణ్యము వేరే కట్టుకొనేఁగాక ॥ వెట్టి ॥

యెడనైనా నీవేయట యెదుట నుండఁగలేవా
వెడ(డ?)వెట్టి యెడనైనా వెదకేఁగాక
ఆడినదెల్లా నీవట అందులోఁ గప్పుకొన్నవా
పీడుపడ్డతలఁపుతో వెరచేఁగాక ॥ వెట్టి ॥

భావించితే మెత్తునట పరము నీవియ్యలేవా
[2] నీవాఁడననినా నేరమే గాక
శ్రీవేంకటేశుఁడ నేను చేరి నీకు శరణంటి
దేవుఁడవై కావఁగా నే దిద్దుకొనేఁగాక ॥ వెట్టి ॥

రేకు-202 ఆహిరి

పూఁచినయీదేహము పువ్వుగాని పిందెగాని
చేచేత నెవ్వరికిఁ జెప్పనోపఁ బ్రియము. ॥ పల్లవి ॥

పుట్టించినదైవము పూరి మేపునా మమ్ముఁ-
బట్టినపూర్వకర్మము పాసిపోయ్యీనా
మెట్టినసంసారము మెదిగినపాటే చాలు
తొట్టి కన్నవారినెల్ల దూఁకనోప మిందుకు ॥ పూఁచి ॥

1 అంటున్నవిచార్యము, 2 నివాఁడను+అనని

నొసలఁ వ్రాసినవ్రాలు నుసిగితే మానీనా
కొసర జగము నాకే కొత్తలయ్యీనా
వుసురుతోడిసుఖము వుండినపాటే చాలు
కొసరి జన్మము లింకాఁ గోరనోప నేను. ॥పూచి॥

యేలినవాఁడు శ్రీహరి యేమిసేసినా మేలె
వేళతో నాతఁడే శ్రీవేంకటేశుఁడు
పాలించె నాతఁడు మమ్ము పదివేలులాగులను
యీలాగులనే సుఖియించేము నేము ॥పూచి॥ ౭

ధన్నాసి

పుట్టినట్టె వున్నవాఁడ పోలేదు రాలేదు
ఇట్టె నీదాసుఁడ నైతి యెంగిలెల్లఁ బాసె ॥పల్లవి॥

వెలినున్న జగమెల్ల విష్ణుఁడ నీమహిమే
అలరి నాలోన నీవే అంతరాత్మవు
తెలిసి నేనున్నచోటే దివ్యవైకుంఠము
వెలలేనినరకములవెరపెల్లఁ దీరె ॥పుట్టి॥

తనువుతోనుండేది నీతలఁచినతలఁపే నా
మనుపుసంసారము నీమాయచేతిదే
పనులనాకర్మము నీపంచినట్టిపనుపే
మనసులోపలియనుమానమెల్లఁ బాసె. ॥పుట్టి॥

తెరమరుగుదినాలు దేవుఁడ నీకల్పితమే
పొరిది యీసురలెల్ల చుట్టాలే నాకు
నిరతి శ్రీవేంకటేశ నీమఱఁగు చొచ్చి నేఁడు
గురునియానతిచేతఁ గొంకులెల్లా బాసె ॥పుట్టి॥ ౮

వరాళి

ఐనదయ్యీఁ గానిదెల్లా నటు గాకుండితే మాని
మానుపరా దివి హరిమాయా మహిమలు ॥ పల్లవి ॥

పుట్టేటి వెన్ని లేవు పోయేటి వెన్ని లేవు
వెట్టిదేహాలు మోచినవెడజీవులు
గట్టిగాఁ దెలుసుకొంటే కలలోనివంటి దింతే
పట్టి ఇందుకుఁగా నేల బడలేమో నేము ॥ ఐన ॥

కడచిన వెన్ని లేవు కాచుకున్న వెన్ని లేవు
సుడిగొన్నతనలోనిసుఖదుఃఖాలు
యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే
కడనుండి [1]నేమేలకరఁగేమో [2] ^ము ॥ ఐన ॥

కోరినవి యెన్ని లేవు కోరఁగల వెన్ని లేవు
తీరనిసంపదలతో తెందేపలు
ధారుణి శ్రీవేంకటేశుదాసులమై యిన్నియును
చేరి కైకొంటిమి యేమిసేసేమో నేము ॥ ఐన ॥ 9

సాళంగం

భక్తసులభుఁడును పరతంత్రుఁడు హరి
యుక్తిసాధ్య మిదె యొకరికీఁ గాఁడు. ॥ పల్లవి

నినుపగులోకముల నిండినవిష్ణుఁడు
మనుజుఁడ నాలో మనికియయ్యె
మునుకొని వేదముల ముడిగినమంత్రము
కొననాలికలలోఁ గుదురై నిలిచె ॥ భక్త ॥

1 2 ఇట్టి పునరుక్తులక్కడక్కడ గలవు

యేమి దేవతలనేలినదేవుఁడు
నలుగడ నధముని నను నేలె
బలుపగు లక్ష్మీపతియగు శ్రీహరి
యిల మా యింటను యిదివో నిలిచె ॥ భక్తి

పొడవుకుఁ బొడవగుపురుషోత్తముఁ డిదె
బడిబడి మాచేతఁ బూజ గొనె
విడువక యిదివో శ్రీవేంకటేశ్వరుఁడు
బడివాయఁడు మాపాలిట నిలిచి. ॥ భక్తి ॥ 1

లలిత

జ్ఞానినైనా నీకుఁ బో దజ్ఞానినైనా నీకుఁ బోదు
నేను చేసిననేరమి నీకే సెలవయ్యా ॥ పల్లవి

గరిమ మాపుట్టుగు నీగర్భవాసములోనే
అరయ మామోహము నీమాయచేతిదే
వెరవు లెంచుకోఁబోతే వేరె మాకు గతి లేదు
నిరతి మాబదుకులు నీకే సెలవయ్యా. ॥ జ్ఞాని

పండినమాకోరికలు నీపెరరేఁపులే
వుండఁ జోటు నీకు నావుల్లములోనే
చండిపెట్టి మాకైతే స్వతంత్ర మించుకా లేదు
నిండినమాచేఁతలెల్లా నీకే సెలవయ్యా ॥ జ్ఞాని

యిదె మాసంసారములు యిట్టె నీకల్పితములు
తుదమొదలును నీవే తోడునీడవు
యెదుట శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవే
నిదురమాదినములు నీకే సెలవయ్యా ॥ జ్ఞాని ॥ 1

సాళంగనాట

ఎక్కడి నరకములు యెక్కడి మృత్యువు మాకు
దక్కె నీదివ్యనామామృతము చూరగొంటిమి ॥ పల్లవి ॥

తమితో [1] శ్రీపతి నీదాసులఁ జేరనప్పుడే
యమకింకరభయము లణఁగిపోయ
జమళి నీయాయుధలాంఛనము మోచినప్పుడే
అమరఁ గాలదండము లవియెల్లఁ బొలిసె ॥ ఎక్క ॥

మును నీనగరిత్రోవ మొగమైనయప్పుడే
ఘనయామ్యమార్గము గట్టువడియ
వొనర నీతిరుపతి నొకరాత్రి వున్నపుడే
కనలు కాలసూత్రాదిఘాతలెల్లఁ బూడె ॥ ఎక్క ॥

యెడలై నీమంత్రజప మెంచుకొన్నయపుడే
కడుఁ జిత్రగుప్తునిలెక్కలు గడచె
వడిగా శ్రీవేంకటేశ్వర మీశరణనఁగా
అడరి వైకుంఠము మాయరచేత నిలిచె ॥ ఎక్క ॥ 12

రేకు—203 సామంతం

పురుషుల నీగతి బోధించి బోధించి
సురతసమాధియందుఁ జొక్కించే రదివో ॥ పల్లవి ॥

కొంకక సతులనేటిగురువు లందరికి
కంకిగా మర్మాలు సోఁకఁగ హత్తించి
లంకెలను బంచాంగుళహస్తమస్తకమున
వుంకువఁ దమయంగము వుపదేశించేరు ॥ పురు ॥

1 'శ్రీపతిదాసులఁ' వూ. ము పా

మదనమంత్రములెల్ల మరి చెవిలోనఁ జెప్పి
మొదల నఖాంకురవుముద్రలు వెట్టి
పదమారులుఁ దమ్ములప్రసాదములు వెట్టి
వుదుట సంసారబ్రహ్మ ముపదేశించేరు ॥ పుర

బడలించి అనంగాక్షరవస్తువును జూపి
కడపట విరక్తిఁ గడు బోధించి
తడవి శ్రీ వేంకటేశు దాపుఁ దప్పించి
వుడివోని జీవులకు నుపదేశించేరు ॥ పురు ॥ 1

గుజ్జరి

ఇంతేపో వారివారిహీనాధికములెల్ల
పంతాన తా మేపాటిభాగ్యము నాపాటే ॥ పల్లవి

అందరిలో దేవుఁడుండు అందధికులు గొందరు
కొందరు హీనులై కుందుదు రింతే
చెంది వీచేగాలొకటే చేసేపంటా నొకటే
పొంది గట్టికొలుచుండి [1] పొల్లు కడఁబడును ॥ ఇంతే

పుట్టుగందరి కొకటే భూమిలో యేలికలును
వెట్టిబంట్లుఁ గొందరై వీఁగుదు రింతే
చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టెలై మేలొకటికి తీలొకటికాయ ॥ ఇంతే

కోరి శ్రీ వేంకటపతికుక్షిలోనే లోకములు
ఆరయఁ [2] గిందెడు మీఁదెడై వున్నవింతే
యీరీతి నితనిదాసు లెక్కిరి పాడవులకు
ఆరి కిందికి దిగిరి దానవులై కొందరు ॥ ఇంతే ॥ 1

1 'పొల్లుగడఁ' రేకు 2. "గిందేడు మీఁదేడై" పూ ము పా కిందెడు= కిందికి దిగినవి ఎుఁదెడు=పైకెక్కినవి

లలిత

అన్నిటా నాపాలిటికి హరి యాతఁడే కలఁడు
యెన్నికగాఁ దుదిపద మెక్కితిమి మేలు ॥పల్లవి॥

కొందరుజీవులు నన్నుఁ గోపగించినా మేలు
చెంది కొందరట్టె సంతసించినా మేలు
నిందించి కొందరు నన్ను నేఁడే రోసినా మేలు
పొందుగ కొందరు నన్నుఁ బొగడినా మేలు ॥ అన్ని ॥

కోరి నన్నుఁ బెద్దసేసి కొందరు మొక్కినా మేలు
వేరే హీనుఁడని భావించినా మేలు
కూరిమిఁ గొందరు నన్నుఁ గూడుకుండినా మేలు
మేరతో విడిచి నన్ను మెచ్చకున్నా మేలు ॥ అన్ని ॥

యిప్పటికిఁగలపాటి యెంతపేదయినా మేలు
వుప్పతిల్లుసంపద నాకుండినా మేలు
యెప్పుడు శ్రీవేంకటేశు కే నిచ్చినజన్మ మిది
తప్పు లే దాతనితోడితగులమే మేలు, ॥ అన్ని ॥ 15

ధన్నాసి

ఊరకే నీశరణని వుండుటే నాపనిగాక
యీరీతి నావుపాయము లేడ కెక్కీనయ్యా ॥ పల్లవి ॥

ముందే అంతర్యామివై మొగి నాలో నుండఁగాను
చెంది నిన్ను లేనివానిఁ జేసుక నామనసులో
గొంది నీయాకారముగా కొంత నే భావించుకొంటా
ఇందుఁ గల్పితధ్యానము లెట్టు చేసేనయ్యా ॥ ఊర ॥

కన్నులఁ జూచినందెల్ల కమ్మి నీవై యుండఁగాను
అన్నిటాఁ బ్రత్యక్షమందు అభావన చేసుకొని
విన్ననై తెలియలేక వేరే యెందో వెదకుచు
పన్నినప్రయాసాలఁ బడనేఁటికయ్యా ॥ ఊర

శ్రీ వేంకటాద్రిమీఁద శ్రీపతివై కొలువుండి
ఆవటించి తలఁపులో నచ్చొత్తి నట్టుండఁగాను
దేవుఁ డెట్టివాఁడంటా తెగనిచదువులందు
సోవలుగా నింకనేమి సోదించేనయ్యా ॥ ఊర ॥

రామక్రియ

భూమిలోనఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిదివో
నేమపు[1]కృష్ణజయంతి నేఁడే యమ్మా ॥ పల్లవి

కావిరి బ్రహ్మాండము కడుపులోనున్నవాని
దేవకి గర్భమున నద్దిర మోచెను
దేవతలెల్ల వెదకి తెలిసి కాననివాని
యీవల వసుదేవుఁడు యెట్టు గనెనమ్మా. ॥ భూమి

పొడవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు
అడరి తొట్టెలబాలుఁడాయ నమ్మ
వుడుగక యజ్ఞభాగ మొగి నారగించేవాఁడు
కొడుకై తల్లిచన్నుగుడిచీనమ్మా ॥ భూమి

పాలజలధియల్లుండె(డై?) పాయకుండేయీతనికి
పాలవుట్లపండుగ [2]బాఁతే(తా?)యనచే
ఆలరి శ్రీవేంకటాద్రి [3]నాటలాడనే మరిగి
పేలరియై కడు పెచ్చువెరిగీనమ్మా ॥ భూమి ॥

---

1. 'క్రిష్ణ' రేకు 2 'బాఁతేయ' రేకు బాఁతి+అయ=బాఁతేయ ఇట్టి వ్యావహారిక సంధు లీవాఙ్మయమున కొల్లలు, 3 నాటలాడ నే మరిగి। పూ ము. పా.

లలిత

అందాఁకా నమ్మలేక అనుమానపడు దేహి
అంది నీసొమ్ముగనక అదియుఁ దీరుతువు ॥ పల్లవి ॥

నీదాసుఁడననేటినిజబుద్ధి గలిగితే
ఆదెస నప్పుడే పుణ్యుఁడాయ నతఁడు
[1]వేద(దు?)తో నొక్కొక్కవేళ వెలుతులు గలిగితే
నీదయవెట్టి వెనక నీవే తీరుతువు ॥ అందా ॥

తొలుత నీశరణము దొరకుటొకటేకాని
చెలఁగి యాజీవునికిఁ జేటు లేదు
కలఁగి నడుమంత్రాన గతిదప్పనడచిన
నెలకొని వంకలొత్త నీవే నేరుతువు. ॥ అందా ॥

నీవల్లఁ గొరత లేదు నీపేరు నొడిగితే
శ్రీవేంకటేశ యిట్టె చేరి కాతువు
భావించలేకుండఁగాను భారము నీదంటేఁ జాలు
నీవారి రక్షించ నీవె దిక్కౌదువు ॥ అందా ॥ 18

రేకు 204 లలిత

కడునజ్ఞానపుకరవుకాల మిదె
వెడలదొబ్బి మావెరపు దీర్చవే. ॥ పల్లవి ॥

పాపపుసురము బందెలు మేయఁగ
పోపులపుణ్యము పొలివోయ
శ్రీపతి నీకే చేయి చాఁచెదము
యేపున మమ్మిఁక నీడేర్చవే ॥ కడు ॥

---

1 'వేధ'కు 'వేద' అని ఈవాఙ్మయమున పలుతావుల గలదు

యిలఁ గలియుగమనుయెండలు గాయఁగ
చెలఁగి ధర్మమనుచెరు వింకె
పొలసి మీకృపాంబుధి చేరితి మిదె
తెలిసి నాదాహము తీర్చవే ॥కడు

వడిగొని మనసిజవాయువు విసరఁగ
పొడవగు నెఱుకలు పుటమెగసె
బడి శ్రీవేంకటపతి నీశరణము
విడువక చొచ్చితి వెసఁ గావఁగదే ॥కడు॥ 1

గుజ్జరి

భావించి నేరనైతి పశుబుద్ధి నైతిని
యీవల నాయపచార మిది గావవయ్యా ॥పల్లవి

హరి నీవు ప్రపంచమందుఁ బుట్టించితి మమ్ము
పరము నే సాధించేది బలుద్రోహ మవుఁగాదో
సిరులనేలేటివాఁడు చెప్పినట్టు సేయక
విరసాలు బంట్లకు వేరే సేయఁదగునా ॥భావిం

పంచేంద్రియములు నాపైఁ బంపువెట్టితివి నీవు
యెంచి వాని నే దండించే దిది నేరమౌఁగాదో
పెంచేటితల్లిదండ్రులు ప్రియమై వడ్డించఁగాను
కంచము కాలఁదన్న సంగతియా బిడ్డలకు ॥భావిం

మిక్కిలిసంసారము మెడఁగట్టితివి నాకు
అక్కర నే వేసారేది అపరాధ మవుఁగాదో
దిక్కుల శ్రీవేంకటాద్రిదేవుఁడ నీవియ్యఁగాను
యెక్కడో జీవుఁడ నేను యెమరాడఁదగునా ॥భావిం॥ 2

## రామక్రియ

గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బైపై సేవించను ॥ పల్లవి ॥

పాడిరి సోబాన నదె భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైనఅచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభునిపెండ్లికిని ॥ గరు ॥

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభిమోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమైమించినదేవదేవునిపెండ్లికిని ॥ గరు ॥

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదె తలఁబాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
సేసలువెట్టినయట్టిసింగారపుపెండ్లికి. ॥ గరు ॥ 21

## గుండక్రియ

ఇతరచింత లిఁక నేమిటికి
అతఁడే గతియై అరసేటివాఁడు. ॥ పల్లవి ॥

కర్మమూలమే కాయము నిజ—
ధర్మమూలమే తనయాత్మ
అర్మిలి రెంటికి హరియొకఁడే
మర్మ మితఁడే మనిపేటివాఁడు ॥ ఇత ॥

బహుభోగమయము ప్రపంచము
- నిహితజ్ఞానము నిజముక్తి
ఇహపరములకును యీశ్వరుఁడే
సహజపుఁగర్త జరపేటివాఁడు ॥ ఇత ॥

అతిదుఃఖకరము లాసలు
సతతసుఖకరము సమవిరతి
గతి యలమేల్మంగతో శ్రీవేంకట-
పతి యొకఁడే నేఁటఁ బాలించువాఁడు ॥ ఇత ॥ 22

శంకరాభరణం

అచ్యుత మిమ్ముఁదలఁచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్యఁగా ॥ పల్లవి ॥

మిమ్ము నెఱిఁగినయట్టిమీదాసుల నెఱిఁగే-
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవ సేసుకుండేటివైష్ణవుల -
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥ అచ్యు ॥

నిరతి నీకు మొక్కేనీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుఁ బూజించేప్రపన్నులఁ బూజించే-
సరిలేనిభాగ్యము చాలదా నాకు ॥ అచ్యు ॥

అంది నీకు భక్తులైనయలమహానుభావుల-
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడు నీబంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదా నాకు. ॥ అచ్యు ॥ 23

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో ॥ పల్లవి

హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నరనారాయణరూప నమో నమో. ॥ నవ ॥

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక –
నగరాధినాయక నమో నమో. ॥ నవ ॥

వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకరగుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననుత నమో నమో. ॥ నవ ॥ 24

రేకు 205 శంకరాభరణం

ఆతఁడే సకలము అని భావింపుచు
నీతితో నడవక నిలుకడ యేది ॥ పల్లవి ॥

యెందునుఁ జూచిన యీశ్వరుఁ డుండఁగ
విందుల మనసుకు వెలితేది
సందడించేహరిచైతన్య మిదివో
కందువలిఁక వెదకఁగ నేది ॥ ఆతఁ ॥

అంతరాత్ముఁడై హరి పొడచూపఁగ
పంతపుకర్మపుభయ మేది
సంతత మాతఁడే స్వతంత్రుఁ డిదివో
కొంత గొంత మరి కోరెడి దేది. ॥ఆతఁ॥

శ్రీవేంకటపతి జీవుని నేలఁగ
యీవల సందేహ మిఁక నేది
భావం బీతఁడు ప్రపంచ మీతఁడు
వేవేలుగ మరి వెదకెడి దేది ॥ఆతఁ॥ 25

సాళంగనాట

అద్దిరా వోయయ్య నే నంతవాఁడనా। వొక-
కొద్ది నీదాసులసేవ కోరఁగలఁగాక ॥పల్లవి॥

హరి నీమాయలకు నే నడ్డము చెప్పేవాఁడనా
అరిదైన దదియు రాచాజ్ఞ గనక
పరఁగ పదాన కాసపడుటయు ద్రోహము
సొరిది నీభండారము సొమ్ము గనక ॥అద్ది॥

పంచేంద్రియముల నేఁ బాఁగదోలేవాఁడనా
ముంచి నీవు వెట్టినట్టిముద్ర కర్తలు
అంచల నావిజ్ఞాన మది దాఁచవచ్చునా
నించి నీవు పాఁతినట్టినిధాన మది ॥అద్ది॥

వొట్టి సంసారపుమోపు వోపననేవాఁడనా
వెట్టి మమ్ముఁ జేయించేటివేడుక నీది
గట్టిగా శ్రీవేంకటేశ [1]కదిసి నీశరణంటి
అట్టుగ నేఁ జెప్పేనా మీఱఁగ నీరహస్యము ॥అద్ది॥ 26

1 కదిసి—రేకు

రామక్రియ

ఇచ్చలోఁ గోరేవల్లా ఇచ్చేధనము
అచ్చుతనామమెపో అధికపుధనము. ॥ పల్లవి ॥

నారదాదులువొగడేనాలుకపయిధనము
సారపువేదములలో చాటేధనము
కూరిమిమునులు దాఁచుకొన్నట్టిధనము
నారాయణనామ మిదే నమ్మినట్టిధనము ॥ ఇచ్చ ॥

పరమపదవికి సంబళమైనధనము
యిరవై భక్తులకెల్లా నింటిధనము
పరగ నంతరంగాన పాఁతినట్టిధనము
హరినామ మిదియపో అరచేతిధనము. ॥ ఇచ్చ ॥

పొంచి శివుఁడు కాశిలో బోధించేధనము
ముంచినఆచార్యులమూలధనము
పంచి శ్రీవేంకటపతి పాలించేధనము
నించి విష్ణునామ మదే నిత్యమైనధనము ॥ ఇచ్చ ॥ 27

శ్రీరాగం

ఇతనికంటె ఘను లిఁక లేరు
యితరదేవతలయిందరిలోన ॥ పల్లవి ॥

భూపతి యీతఁడె పొదిగి కొలువరో
శ్రీపతి యీతఁడే చేకొనరో
యేపున బలువుఁడు నీతఁడే చేరరో
పైపై వేంకటపతి యైవాఁడు

మరుగురుఁ డితఁడే మతి నమ్మఁగదరో
పరమాత్ముఁ డితఁడె భావించరో
కరివరదుఁ డితఁడె గతి యని తలఁచరో
పరగ శ్రీవేంకటపతి యై వాఁడు. ॥ ఇత ॥

తల్లియు నితఁడే తండ్రియు నితఁడే
వెల్లవిరై యిఁక విడువకురో
చల్లగా నితని శరణని బ్రతుకరో
అల్ల శ్రీవేంకటహరి యయినాఁడు. ॥ ఇత ॥ 28

లలిత

చూడ వేడుకలు సొరిది నీమాయలు
తోడనే హరి హరి దొరసీ నిదివో. ॥ పల్లవి ॥

పుట్టేటిజీవులు పొదలేటిజీవులు
జట్టిగొని రిదియే జగమెల్లా
కట్టిడికర్మము కాయజుమర్మము
నెట్టుకొన్న దిదె నిఖిలంబెల్లా ॥ చూడ ॥

ములిగేటిజనములు మోచేటిధనములు
కలిమి మెరసె లోకంబెల్లా
పొలసి వేగుటలు పొద్దు గుంకుటలు
కలిగిన విదివో కాలంబెల్లా ॥ చూడ ॥

తగిలేటిపురుషులు తమకపుకాంతలు
బగివాయని దీబదుకెల్లా
అగపడి శ్రీవేంకటాధిప నీకృపఁ
దెగనిజీవనము దినదినమెల్లా ॥ చూడ ॥ 29

దేవగాంధారి

ఎన్నఁడొకో నేఁ దెలిసి యెక్కుడయి బ్రదికేది
పన్నిననాగుణమెల్లా భ్రమతపాలాయ ॥పల్లవి॥

ధనమద మిదె నన్ను దైవము నెఱఁగనీదు
తనుమద మెంతయిన తపముఁ జేయనీదు
ఘనసంసారమదము కలుషముఁ బాయనీదు
మనెడినామనువెల్ల మదముపాలాయ ॥ఎన్న॥

పొంచి కామాంధకారము పుణ్యము గానఁగనీదు
కంచపుజన్మపుచిక్కు గతి చూపదు
పెంచి యజ్ఞానతమము పెద్దఁ నెరఁగనీదు
చించరానినాబుద్ధి చీఁకటిపాలాయ. ॥ఎన్న॥

(శ్రీ) వేంకటేశ్వరుమాయ చిత్తముఁ దేరనీదు
యేవంకా నితఁడే గతి యిన్నిటా మాకు
యేవుపాయమును లేక యీతనిమఱఁగు చొచ్చి
దేవుఁ డంతర్యామి యని తేజముఁ బొందితిమి ॥ఎన్న॥ 80

రేకు 206 సాళంగనాట

అని రావణుతల లట్టలుఁ బొందించి
చెనకి భూతములు చెప్పె బుద్ధి ॥పల్లవి॥

కట్టిరి జలనిధి కపిసేన లవిగో
చుట్టు లంక కంచుల విడిసె
కొట్టిరి దానవకోట్లతల లదె
కట్టిడిరావణ గతియో నీకు ॥అని॥

యెక్కిరి కోటలు యిందరు నొకపరి
చిక్కిరి కలిగినచెరయెల్ల
పక్కన సీతకుఁ బరిణామమాయ
[1]నిక్కె(క్కి?)ము రావణ నీకో బ్రదుకు. ॥ అని ॥

పరగ విభీషణుఁ బట్టము గట్టెను
తొరలి లంకకును తొలఁదొలుతే
గరిమెల శ్రీవేంకటగిరి రాముఁడు
మెరసెను రావణ మేలాయఁ బనులు. ॥ అని ॥ 81

దేవగాంధారి

దైవము నీవే యిఁక దరి చేరుతువుగాక
జీవులవసము గాదు చిక్కిరి లోలోననే ॥ పల్లవి ॥

పుట్టుట సహజ మిది పొదలేజీవులకెల్ల
గట్టిగా జగమునందు కలకాలము
నట్టేటివరదవలె నానాటినీమాయ
కొట్టుక పారఁగఁజొచ్చె కూడినవిజ్ఞానము ॥ దైవ ॥

పాపమే సహజము బద్ధసంసారులకెల్ల
కాఁపురపువిధులలో కలకాలము
తేపలేనిసముద్రము తెరఁగున కర్మమెల్లా
మాపు రేపు ముంచఁజొచ్చె మతిలోనిధైర్యము. ॥ దైవ ॥

లంపటమే సహజము ఇలి దేహధారులకు
గంపమోపు [2]కోరికెలకలకాలము
యింపుల శ్రీవేంకటేశ ఇదె నీదాసులని
పంపుసేసి బ్రదికించె బ్రపన్నసుగతి ॥ దైవ ॥ 82

1 'నిక్కెము' వంటిప్రయోగము ఈ వాఙ్మయమున వందిగ గలవు
2. 'కోరికలు కలకాలము' కావచ్చు.

గుండక్రియ

ఇట్టి నాస్తికులమాట యేమని నమ్మెడి దిక
పట్టి సములమంటానే భక్తుల దూషింతురు. ॥ పల్లవి ॥

వేదములు చదువుతా విశ్వమెల్లాఁ గల్లనేరు
ఆదెస తాము పుట్టుండి అదియును మాయనేరు
పొందగునాత్ముఁడుండఁగ బయలు తత్త్వమనేరు
లేదు జీవత్వమంటా లేములఁ బొందుదురు ॥ ఇట్టి ॥

కర్మమై తమయిండ్ల దేవపూజలు సేసేరు
ధరలోన తముఁ దామే దైవమనేరు
అరయఁ గర్మమే బ్రహ్మమని యాచరించేరు
సరి నదే కాదని సన్యసించేరు. ॥ ఇట్టి ॥

అందుక పురుషసూక్తమర్థముఁ జెప్పుదురు
కందువ నప్పటి నిరాకారమందురు
యిందులో శ్రీవేంకటేశ యిటు నీదాసులుగాక
మందపురాణులా దేమతము నడతురు. ॥ ఇట్టి ॥ 38

వసంతవరాళి

ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక
అహిశయనునిదాసులంతవారు వేరి ॥ పల్లవి ॥

సిరిగలిగినవారు చింతలన్నిటనుఁ బాసి
నిరతపువర్గ(గర్వ?)ముతో నిక్కేరటా
సిరికి మగఁడయిన శ్రీపతి యేలి మ----
వ్యర్థయుచున్నాఁడు మాయింట

బలవంతుఁడైన వాఁడు భయములిన్నిటఁ బాసి
గెలిచి పేరువాడుచుఁ గెంటీనటా
బలదేవుఁడైన శ్రీపతి మా యింటిలోన
అలరివున్నాఁడు మాయంతవారు వేరీ

భూములేలేటివాఁడు భోగములతోఁ దనిసి
కామించి యానందమునఁ గరఁగీనటా
సేమముతో భూపతైన శ్రీవేంకటేశుఁడు మాకు
ఆముకొనివుండఁగా మాయంతవారు వేరీ

మాళవిగౌళ

అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె
కన్నుల మా వేడుకకు కడయేది యిఁకను

కామధేనువు [1]గలి(గి?)తే గర్వించు నొక్కరుఁడు
భూమి యేలితే నొకఁడు పొదలుచుండు
కామించి నిధి గంటె కళలమించు నొకఁడు
శ్రీమంతుఁడగువాఁడె చిక్కె మాకు నిదివో

పరుసవేదిగలి(గి?)తే పంతములాడు నొకఁడు
ధరఁ జింతామణబ్బితే దాఁటు నొకఁడు
సురలోక మబ్బితేను చొక్కుచునుండు నొకఁడు
పరమాత్ముఁడే మాపాలఁ జిక్కెనిదివో.

అమృతపానముసేసి యానందించు నొకఁడు
భ్రమసు దేహసిద్ధిఁ బరగొకఁడు
తమి శ్రీవేంకటేశుఁడే దాఁచినధనమై మాకు
అమరి నామతిఁ జిక్కె నడ్డములే దిదివో.

1 'కలిగితే' అనుటకు 'కలితే' ఈ వాఙ్మయమున కోకొల్లలుగ కలవు

దేవగాంధారి

పట్టరో పీదులఁ బరువులువెట్టి
పుట్టుగులతో హరి పొలసీ వీఁడే ॥పల్లవి॥

వేవేలు నేరాలు వెదకేటిదేవుఁడు
ఆవులఁ గాచీ నలవాఁడే
పోవుగ బ్రహ్మలఁ బుట్టించుదేవుఁడు
నోవల యశోదసుతుఁడట వీఁడే ॥పట్ట॥

ఘనయజ్ఞములకుఁ గర్తగుదేవుఁడు
కినిసి వెన్న దొంగిలె వీఁడే
మునులచిత్తములమూలపుదేవుఁడు
యెనసీ గొల్లెతలయింటింట వీఁడే ॥పట్ట॥

నుడిగి నారదుఁడు నుతించుదేవుఁడు
బడిరోలఁగట్టువడె వీఁడే
వుడివోనివరము లొసఁగెడుదేవుఁడు
కడఁగినశ్రీవేంకటగిరి వీఁడే ॥పట్ట॥ ౩౬

రేకు 207 భైరవి

వెట్టివారిఁ దెలుపుట వేవేలు సుకృతము
ముట్టుఁబాలఘంకే కాని ముందు గాన దైవమా ॥పల్లవి॥

ఇంతకతొల్లిటిజన్మ మెటువంటిదో యెరఁగ
పొంతనే ఇటమీఁదటిపుట్టు వెరఁగ
అంతరానఁ బెరిగేకాయమే నాకు సుఖమై
సంతసాన మురిసేను సంసారమందును ॥వెట్టి॥

వొడలిలోపలిపేయు మొకఇంతాఁ దలఁచను
బడి నెదిటిదేహాలవచ్చి దలఁచ
సుడిసి పైపచారాలే చూచి సుగతసుఖాన
పడఁతుఁ దొంటు హొంది పరిణామించేను ॥ వెట్టి ॥

పాపమూలమున వచ్చేబలునరకము లెంచ
యేపునఁ బుణ్యపుబుద్ధి ఇంచుకా నెంచ
దీపనపుజంతువునుఁ దెచ్చి పావనుఁ జేసితి
చేపట్టి నన్ను రక్షించు శ్రీవేంకటేశుఁడా ॥ వెట్టి ॥ ౪

సామంతం

ఎందరితోఁ బెనఁగేను యెక్కడని పొరలేను
కందర్పజనక నీవే గతిగాక మాకు ॥ పల్లవి ॥

నిక్కి నాబలవంతాన నేనే గెలిచేనంటే—
నొక్కపంచేంద్రియముల కోపఁగలనా
తక్కనసంసార వార్ధి దాఁటఁగలనో మరి
దిక్కుల కర్మబంధము తెంచివేయఁగలనో. ॥ ఎంద ॥

పన్నుకొన్న పాయమున పగము సాధించేనంటే
యెన్న నీమాయ కుత్తర మియ్యఁగలనా
పన్నెలనామనసే వంచుకోఁగలనో మరి
కన్నట్టి యీప్రపంచమే కడవఁగఁగలనో ॥ ఎంద ॥

వుల్లములో నిన్ను ధ్యాన మొగి నేఁ జేసేనంటే
తొల్లిటియజ్ఞానము తోయఁగలనా
ఇల్లిదే శ్రీవేంకటేశ యెదుటనే నీకు మొక్కి
బల్లిదుఁడ నౌదుఁగాక పంద నేఁ గాఁగలనా. ॥ ఎంద ॥ ౪౪

### ఆహిరి

అయ్యో నానేరమికే అట్టె యేమని వగతు
ముయ్యంచుచంచలాన మోసపోతిఁగాక ॥ పల్లవి ॥

కానరా నావంటివారే కారా యీజంతువులు
నానాయోనులఁ బుట్టి నడచేవారు
మానక నాగర్వమున మదాంధవునై ముందు
గానక భయపడినకర్మి నింతేకాక ॥ అయ్యో ॥

చదువనా నేఁ దొల్లి జన్మజన్మాంతరముల
ఇది పుణ్య మిది పాప మింతంతని
వదలక నాభోగవాంఛలే పెంచి పెంచి
తుదకెక్క వెదకనిదుష్టుఁడ నేను ॥ అయ్యో ॥

వినవా నేఁ బురాణాల వెనకటివారినెల్ల
మనెడిభాగవతులమహిమలెల్లా
యెనయుచు శ్రీవేంకటేశుకృపచేత నేడు
ఘనుఁడ నయితిఁగాక కష్టుఁడఁగానా ॥ అయ్యో ॥ 39

### సాళంగనాట

తాము స్వతంత్రులు గారు 'దాసోహము' నన లేరు
పామరపుదేహులకు పట్టరాదు గర్వము ॥ పల్లవి ॥

పరగుబ్రహ్మాదులు బ్రహ్మమే తా మనలేరు
వారికే మొరవెట్టేరు ఆపదైతేను
ధరలో మనుజులింతే తామే దయివమనేరు
పోరిఁ దాము చచ్చిపుట్టే పొద్దెరఁగరు ॥ తాము ॥

పండినవ్యాసాదులు ప్రపంచము కల్లనరు
కొండలుగాఁ బురాణాలఁ గొనియాడేరు
అండనే తిరిపెముకై అందరి నడిగి తా —
మండుండి లేదనుకొనే రొష్పపిన్నా మానరు ॥ తాము ॥

సనకాదియోగులు శౌరిభక్తి సేసేరు దు-
ర్జనులు భక్తి వొల్లరు జ్ఞానులమంటా
ననుపయి శ్రీవేంకటేశ నినుఁ జేరి మొక్కుకానె
అనిశము నిరాకారము సేరు యీద్రోహులు ॥ తాము ॥ 40

శంకరాభరణం

ఎట్టు మోసపోతి నేను యివెయ్యు సజమని
నెట్టన హరి నే నమ్మనేర నయితిఁగా ॥ పల్లవి ॥

దేహమిది నాదని తెలిసి నమ్మివుండితే
ఆహా నే నొల్లనన్నా నదే మురిసె
వూహల సంభోగమెల్లా వొళ్లఁబట్టెనంటా నుంటే
దాహముండ నిరుముదాగినవి రాయఁగా ॥ ఎట్టు ॥

మనసు నాదని నమ్మి మది మది నే పెంచితి—
ననుఁగుఁబంచేంద్రియములందుఁ గూడెనా(ను?)
యెనసి ప్రాణవాయువు లిప నొవ్వునని నమ్మితి
మొనసి లోను వెలినై ముక్కువాత నున్నవి ॥ ఎట్టు ॥

ఇందుకొరకె నేను ఇన్నాళ్లు పాటువడితి
ముందు వెనకెంచక నే మూఢుఁడ నైతి
అంది శ్రీవేంకటేశ్వరుఁ డంతటా నుండి నా—
చందము చూచి కావఁగ జన్మమే యీడేరె. ॥ ఎట్టు ॥ 41

నాట

ఎందరైనఁ గలరు నీ కింద్రచంద్రాదిసురలు
అందులో నే నెవ్వఁడ నీ వాదరించే దెట్టో ॥పల్లవి॥

పెక్కుబ్రహ్మాండములు నీపెనురోమకూపములఁ
గిక్కిరిసున్న వందొకకీటము నేను
చక్కఁగా జీవరాసులసందడిఁ బడున్నవాఁడ
ఇక్కువ నన్నుఁ దలఁచి యెట్టు మన్నించేవో ॥ ఎంద ॥

కోటులైనవేదములు [1]కోనాడీ [2]నిన్నందులో నా—
నోటివిన్నపము లొక్క నువ్వుగింజంతే
మాటలు నేరక కొఱఁబాలి వాకిట నుండ
కాటగా నీదయ నాపైఁ బారు టెట్టో ॥ ఎంద ॥

అచ్చపునీదాసులు అనంతము వారలకు
రిచ్చల నే నొకపాదరేణువు నింతే
ఇచ్చగించి శ్రీవేంకటేశ నిన్నుఁ దలఁచుక
మచ్చికఁ గాచితి నన్ను మఱవనిదెట్టో ॥ ఎంద ॥ 42

రేకు 208 ముఖారి

పుట్టించేవాఁడవు నీవే పోరులు వెట్టేవు నీవే
యెట్టు నేరుచుకొంటి విది నీవినోదమా ॥ పల్లవి ॥

కొందరు దేవతలును కొందరు రాక్షసులును
ఇందరి కంతర్యామి వెప్పుడు నీవు
అంది కోప మొకరిపై నట్లై ప్రసాద మొకరి—
కిందులోనే పక్షపాత మిది నీకే తగును ॥ పుట్టిం ॥

1. 'కోనాడీ' వ్రా. ము. పా. కొని+ఆడీ=కొనాడి
2 'నిన్నందులోన' వ్రా. ము. పా.

నరకమనుచుఁ గొంత నగి స్వర్గమని కొంత
నిరతి గురిసేసేవు నీకుక్షిలోనే
ధరఁ జీఁక టొకవంక తగ వెన్నె లొకవంక
నెరపేవు నీమాయ నీకే తెలుసును ॥ పుట్టిం ॥

దాసపరిపాలనము తగు దుష్టశిక్షణము
వాసిఁ గైకొంటివి నీకు వశమై రెండు
దోసము నీవల్ల లేదు తొలుతే శ్రీవేంకటేశ
సేసినపాపపుణ్యమే చిత్తానఁ బెట్టితివి ॥ పుట్టిం ॥ 43

దేవగాంధారి

ఇతరదేవతల కిది గలదా
ప్రతి వేరి నీప్రభావమునకు ॥ పల్లవి ॥

రతిరాజజనక రవిచంద్రనయన
అతిశయశ్రీవత్సాంకుఁడవు
పతగేంద్రగమన పద్మాసతీపతి
మతి నినుఁ దలఁచిన మనోహరము. ॥ ఇత ॥

ఘనకిరీటధర కనకాంబర పా—
వన క్షీరాంబుధివాసుఁడవు
వనజచక్రధర వసుధావల్లభ
నినుఁ జేరుకొనిన నిర్మలము ॥ ఇత ॥

దేవపితామహ త్రివిక్రమ హరి
జీవాంతరాత్మక చిన్మయుఁడా
శ్రీవేంకటేశ్వర శ్రీకర గుణనిధి
నీవార మనుటే నిజసుఖము ॥ ఇత ॥ 44

మాళవిగౌళ

ఎట్టు వలసినాఁ జేయు మేఁటి విన్నపము లేక
కట్టుకో పుణ్యమైనాఁ గాక మరేమైనాను ॥పల్లవి॥

నన్ను నెంచి కాచేనంటే నా యవగుణి నేను
నిన్ను నెంచి కాచేనంటే నీవు లక్ష్మీపతివి
యిన్నిటా నాకంటే హీనుఁ డేక మరెవ్వఁడూ లేఁడు
వున్నతి నీకంటే ఘను లొకరూ లేరు ॥ఎట్టు॥

నిలువెల్లా నెంచుకొంటే నివ్వరిముల్లంత లేను
బలువుఁడ నీవైతే బ్రహ్మాండము
యేలమి నే నుపకార మెవ్వరికిఁ జేయలేను
మెలఁగి నీవే తృణము మేరువు సేయుదువు ॥ఎట్టు॥

భావించ నీ వేలికవు బంటుమాత్ర మింతే నేను
నీవు సర్వాంతరాత్మవు నే నొకఁడను
సావధానమున నేను సర్వభక్షకుఁడ నింతే
శ్రీవేంకటేశ నీవు జీవరక్షకుఁడవు. ॥ఎట్టు॥ 45

శంకరాభరణం

వేవేలు బంధములు విడువ ముడువఁబట్టె
దైవమా నిన్నెట్టు తగిలేమయ్యా. ॥పల్లవి॥

పారీ ముందటిభవపాశములు
తీరీఁ దొల్లిటితిత్తిలో పుణ్యము
వూరీఁ గోరిక లొకటొకటే
యేరీతి సుజ్ఞాన మెరిఁగేనయ్యా. ॥వేవే॥

పట్టి నాకొంగు పంచేంద్రియములు
 తొట్టిఁ దాపము తోడుతనే
 పెట్టి భ్రమలఁ బెరిగి నీమాయలు
 అట్టే మోక్ష మెన్నఁ డందేమయ్యా ॥ వేవే ॥

విందై యిహము వెనకకుఁ దీసీ
 అందీ వై[1]రాగ్య మరచేతికి
 కందువ శ్రీవేంకటపతి యీరెండు
 బొందించితి వేది భోగింతునయ్యా ॥ వేవే ॥ 46

కన్నడగౌళ

ఎట్టు గెలుతుఁ బంచేంద్రియముల నేఁ
 బట్టరానిఘనబలవంతములు ॥ పల్లవి ॥

కడునిసుమంతలు కన్నులచూపులు
 ముడుఁగక మిన్నులు ముట్టెడిని
 విడువక సూక్ష్మపువీనులు యివిగో
 బడిబడి నాదబ్రహ్మము మోచె ॥ ఎట్టు ॥

అదె తిలపుష్పంబంతనాసికము
 కదిసి గాలి ముడెగట్టెడని
 పొదిగి నల్లెఁడే పొంచుక నాలికె
 మెదలుచు సర్వము మింగెడిని ॥ ఎట్టు ॥

బచ్చెనదేహపుపైపొర సుఖమే
 యిచ్చఁ బ్రపంచం బీనెడిని
 తెచ్చెర మనసిది శ్రీవేంకటేశ్వరుఁ
 దచ్చి తలఁచఁగా దరం చేరెడిని. ॥ ఎట్టు ॥ 47

1. 'వయిరాగ్య' రేకు

బౌళి రామక్రియ

నే నొక్కఁడ లేకుండితే నీకృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు. ॥పల్లవి॥

అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను
ప్రతిలేనిఘనగర్వపర్వతమను
తతిఁ బంచేంద్రియములధనవంతుఁడను నేను
వెతకి నావంటివాని వీడువఁగఁ జెల్లునా ॥నేనొ॥

మహిలో సంసారపుసామ్రాజ్యమేలేవాఁడ నేను
యిహమునఁ [1]గర్మవహికెక్కితి నేను
బహుయోనికూపసంపదఁ దేలేవాఁడ నేను
వహించుక నావంటివానిఁ దేనోపేవా. ॥నేనొ॥

భావించి నావంటినీచుఁ బట్టి కాచినప్రభుఁడుగా
యేవంక నీకీర్తి గడు నెంతురు భువి
నావల్ల నీకుఁ బుణ్యాము నీవల్ల నే బ్రదుకుదు
శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జిమ్మి మేలు ॥నేనొ॥ 48

రేకు 209 దేసాళి

నీవే నేరవుగాని నిన్నుఁ బండించేము నేము
దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు ॥పల్లవి॥

వట్టిభక్తి నీమీఁద వలుకువేసి నిన్నుఁ
బట్టితెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని
పట్టెఁడుదులసి నీపాదములపైఁ బెట్టి
జట్టిగొనిరి మోక్షము జాణలు నీదాసులు. ॥నీవే॥

1 'కర్మివహి' లేక 'కర్మమహి' కావచ్చునేమో?

నీవు నిర్మించినవే నీకే సమర్పణసేసి
 సోవల నీకృపయెల్లఁ జూరగొంటిమి
 భావించి మొక్కి మొక్కి భారము నీపై వేసిరి
 పావనపునీదాసులే పంతపుచతురులు ॥ నీవే ॥

చెరువులనీళ్లు దెచ్చి చేర(రె ?)డు నీపైఁజల్లి
 వరము వడసితిమి వలసినటు
 యిరవై శ్రీవేంకటేశ యిటువంటివిద్యలనే
 దరిచేర మించిరి నీదాసులే పో ఘనులు ॥ నీవే ॥ 49

దేసాళం

ఎన్నఁడు దీరీ నీతెందేపలు
 పన్నినజీవులబంధములు ॥ పల్లవి ॥

భారపుఁజిత్తము ప్రవాహరూపము
 పూరేటిమదములు పూటెత్తె
 తీర విం(ద్రియపుదేహభ్రాంతులు
 కోరేటికోర్కులఁ గొండలు వెరిగె ॥ ఎన్నఁ ॥

[1]ఉడికేటిపాపము లుగ్రనరకములు
 తొడికేటికర్మము తోడంటు
 విడువవు భవములు వెంటవెంటనే
 చిడుముడిఁ జిత్తము చీఁకటి వడెను ॥ ఎన్నఁ ॥

రపణపుభవములు రాట్నపుగుండ్రలు
 చపలపుబుద్ధులు జలనిధులు
 ఇపుడిదె శ్రీవేంకటేశుఁడ నీవే
 కపటము వాయఁగఁ గరుణించితివి. ॥ ఎన్నఁ ॥ 50

1 'ఉడికేటిపాతము' పూ ము పా

ముఖారి

నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు
దైవమా సిగ్గువడక తగిలే నేఁ గాకా. ॥పల్లవి॥

చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మాసేవలు నీకు నేడకువచ్చు
పొంది [1]వసిష్ఠాదు లట్టె పూజలు సేయఁగాను
సందడి మాపూజలు సరకా నీకు ॥నీవెం॥

సనకాదియోగులు సారె నిన్నుఁ దలఁచఁగా
యెనసి మాతలఁపు నీ కేడకెక్కను
నునుపుగా శేషాదులు నుతులు నిన్నుఁ జేయఁగా
పనివడి మానుతులు [2]బాఁతేయనా నీకు ॥నీవెం॥

కిట్టి నారదాదులు నీకింకరులై వుండఁగాను
యిటె నీదాసుఁడనను టెంత కెంత
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు
పట్టి నీదాసులబంటుబంట నయ్యేనికను ॥నీవెం॥ 51

లలిత

అయ్యో వికల్పవాదులంతటా సిగ్గువడరు
యియ్యెడ నెట్టుగలిగె నీయసురమతము. ॥పల్లవి॥

నీముద్రలూ నొల్లరు నీదాసోహము నొల్లరు
కామించి నీమీఁదిభక్తి కడు నొల్లరు
నామమంత్రము నొల్ల రనామయుండ [3]వనెందురు
తాము వైష్ణవుల మంటాఁ దర్కింతురు. ॥అయ్యో॥

1 'వసిష్ఠా' రేకు 2 'బాఁతేయ' రేకు "బాఁతి + అయనా = బాఁతేయనా, ఇట్టిసంధులీవాఙ్మయమున కొల్లలు 3 అని+అందురు=అనెందురు, ఈవాఙ్మయమున ఈ సంధులు కొల్లలు

పైతృకవేళ నీప్రసాదమూ నొల్లరు
ఘాతలనూర్ధ్వపుండ్రము గాదందురు
జాతరదై వాల నిన్ను సరిగాఁ బూజింతురు
ఆతల వైష్ణవులు దామనుకొందురు ॥ అయో

శ్రీవైష్ణవులఁ గంటేఁ జేతులెత్తి మొక్కరు
భావింతురు పగవారిఁబలెఁ గన్నట్లు
ఆవల వైకుంఠమూ ననిత్యమందురు
కావించి వైష్ణవులము కామా నే మందురు ॥ అయో

వరుస రావణాదులవలె నెజ్ఞాలు సేతురు
సరుస నష్టే వేదమూఁ జదువుదురు
నిరతి శ్రీవేంకటేశ నీమహిమ తెరఁగక
అరిది వైష్ణవులమే యని యాడుకొందురు ॥ అయ్యో ॥

గుండక్రియ

నీయంతవారు గారు నిండుసామర్థ్యము లేదు
యీయహంకారపుముక్తి యీడేరీనా తమకు ॥ ప

నీసేవలే సేసి నీకృప రక్షించఁగాను
ఆసలఁ బొందేముక్తి అదిచాలక
నీసరివారలై నీవే తా మనుకొని
యీసులఁ బొందేముక్తి యీడేరీనా తమకు ॥ నీయ

పొంచినరాక్షసులెల్ల పూర్వదేవతలమంటా
యెంచుక పెట్టినమద మీగర్వము
అంచెలఁ గర్మమే సేసేరాయాదేవతలఁ గూర్చి
ఇంచుకంతలోనే ముక్తి యీడేరీనా తమకు. ॥ నీయ

హరిలాంఛనపుభక్తి కందుకు నొడఁబడరు
సరి రోగికిఁ బథ్యము చవిగానట్టు
గరిమ శ్రీవేంకటేశుఁ గని మనవివారికి
యెరవులనే ముక్తి యీడేరినా తమకు. ॥ నీయం॥ 53

బౌళి

పట్టిమోపు మోయనేల వడిఁ ములుగఁగనేల
పట్టిన నేమముతోడ బ్రదుకఁగవలదా. ॥ పల్లవి ॥

తల్లిదండ్రిగలవారు తమలేము లెఱఁగక
చెల్లపిళ్లలై యాటలఁ జెందినయట్టు
వుల్లములో హరినమ్మివుండినప్రపన్నులెల్ల
పల్లదాన నిర్భరులై బ్రతుకఁగవలదా. ॥ వట్టి ॥

మగఁడుగలసతులు మంచి ముత్తైదువలై
యెగువ నితరమార్గా లెరఁగనట్టు
నగుతా లక్ష్మీపతి నమ్మినప్రపన్నులెల్ల
పగటుఁ గర్మము మాని బ్రదుకఁగవలదా. ॥ వట్టి ॥

యేలికె నమ్మినబంటు లేరికిఁ బ్రియము చెప్ప—
కోలిఁ బతివాకిలి గాచుండినయట్టు
తాలిమి శ్రీవేంకటేశుదాసులై నప్రపన్నులు
పాలించినాతని నమ్మి బ్రతుకఁగవలదా. ॥ వట్టి ॥ 54

రేకు 210 భూపాళం

నీయాధీనము లింతే నిఖిలప్రపంచమును
మాయాకృతము నీవు మానుమంటే మానదా ॥ పల్లవి ॥

నీకు నరుహంబైన నిండినయీమనసు
కాకువిషయాలపాలుగా నరుహామా
చేకొని నీవు పెరరేఁచినయీచైతన్యము
పైకొని అకర్మములపాలు సేయఁదగునా. ॥ నీయా

అంచల నీవంతర్యామివైనయీదేహము
పంచేంద్రియముల కొప్పనసేతురా
యెంచఁగ నీకుఁబిలోన నెత్తినయీజన్మము
కొంచెపుభోగములకు గురిసేయవలెనా ॥ నీయా

శ్రీవేంకటేశ నీకుఁ జిక్కినయీదాస్యము
యీవల సంసారమున కియ్యవలెనా
దేవుఁడవు నీవేయని తెలిపితి విదే మాకు
జీవులము మమ్ము నిఁక చిమ్మిరేఁచనేఁటికి ॥ నీయా ॥ ౫

నాళంగనాట

ఈమాట విని నిన్ను నిందుకే నవ్వితి నేను
నేమమెంత నేమెంత నీకరుణ యెంత ॥ పల్లవి ॥

సకలకర్మముచేత సాధ్యముగానినీవు
వొకఇంచుకంతభక్తి కొగి లోనైతి
ప్రకటించి బహువేదపఠనఁ జిక్కనినీవు
మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి ॥ ఈమా ॥

కోటిదానములచేత కోరి లోనుగానినీవు
పాటించి శరణంటేనే పట్టి లోనైతి
మేటి వుగ్రతపముల మెచ్చి కైకొననినీవు
గాటపుదాసులైతేనే కైకొని మన్నించితి ॥ ఈమా ॥

దైవమును నొల్లము ధర్మమును నొల్లము
దావతిసంసారముతో తగులే కాని
భావపుభవబంధాలభయమూ నెఱఁగము
వేవేలు విధులే కాని వెగిలేచి నేము. ॥ బోధిం ॥

ముందు విచారించము [2]మొదల విచారించము
పొందేటిసతులతోడిభోగమే కాని
చెందినమనసులోనిచింతలను బాయము
మందపుమదమే కాని మాపుదాఁకా నేము. ॥ బోధిం ॥

పరమూఁ దడవము భక్తీఁ దడవము
అరిది ధనముమీఁది ఆసలే కాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డేలుకొనెఁ దానే నన్ను
నిరతి నెఱఁగనైతి నే నించుకంతాను. ॥ బోధిం ॥ 58

## శ్రీరాగం

మఱి యేపురుషార్థము మావంక లేదు మీకు
అఱువడము మాకెంత అత్తువో నీవు ॥ పల్లవి ॥

హరి నీవు నాకు నంతర్యామివైనఫలము
తిరిగినందే మావెంటఁ దిరిగేదవు
ఇరవుగ నీవు మాకు నేలికవైనఫలము
గరిమె మాపాపమెల్లఁ గట్టుకొంటివి ॥ మఱి ॥

భువిలోన నీవు నన్నుఁ బుట్టించినఫలము
ఇవల రక్షించేతోడుసిదోకటాయ
తివిరి నన్ను నీకుఁ దెచ్చిడుకొన్నఫలము
అవల నానేరములు చక్కఁ బెట్టఁబడెను. ॥ మఱి ॥

---

1. ముందు=కార్యప్రారంభమునకుముందు 2 మొదల=కార్యప్రారంభమునందు.

గారవాన నన్ను వెనక వేసుకొన్న ఫలము
చేరి నన్ను బుణ్యునిఁగాఁ జేయవలసె
ఆరసి నాకుఁ బ్రత్యక్షమైనఫలమున నన్ను
యీరీతి శ్రీవేంకటేశ ఇముడుకోఁబడెను ॥ మంటి ॥ 59

ఆహిరి

పనోరువెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుఁ దలఁచినది నిమిషమూ లేదు ॥ పల్లవి ॥

పాయమెల్ల సంసారముపాలే పడితిఁగాని
చేయార నీసేవ నేఁ జేసుట లేదు
కాయమెల్ల కాంతలకే కడుశేషమాయఁగాని
నీయవసరములందు నే నొదుగలేదు ॥ పనో ॥

చిత్తము ఆసలపాలే సేసి బదికితిఁ గాని
హత్తి నిన్ను ధ్యానము సేయఁగలేదు
సత్తెపునానాలుకెల్ల చవుల కమ్మితిఁగాని
మత్తిలి నీకీర్తనము మరపుటా లేదు ॥ పనో ॥

పుట్టుగెల్లా నజ్ఞానముపొంతనే వుంటిఁగాని
వొట్టి నీవిజ్ఞానము నొల్లనై తిని
యెట్టు నన్ను మన్నించితి విందుకే పో వెరగయ్యా
నెట్టన శ్రీవేంకటేశ నిన్నడుగా లేదు ॥ పనో ॥ 60

రేకు 211 దేసాళం

తనసొమ్మే దేరించక తా మానీనా
పెనఁగుచు నే మూరకే బిగిసేముగాక. ॥ పల్లవి ॥

భూమితోఁ బ్రపంచమెల్లఁ బుట్టించిన దేవుఁడు
ఆమీఁదిపారుపత్యాన కందుకోపఁడా
నామమాత్రజీవులము నడుమంతరాల వచ్చి
నేము గర్తలమనుచు నిక్కేము గాక ॥ తన ॥

యెనలేక యెదిరికి ఇనుమడిచేవానికి
తనతగర మడువఁ దడవయ్యీనా
గునిసి సంసారపుకొండనే మోచేనంటా
తినికేమిదియు వట్టి దీమసముగాక ॥ తన ॥

చిత్తములో నున్నట్టిశ్రీవేంకటేశ్వరుఁడు
మత్తిల్లి నను గావక మానఁబోయ్యీనా
కొత్తగా నీతని నేఁడు కొలిచేమనుచు నేము
తత్తరపుస్వతంత్రానఁ దగిలేముగాక ॥ తన ॥ 61

ముఖారి

తాము స్వతంత్రులు గారు తమయంతను
ఆమీఁదటిగురి అది నీవు ॥ పల్లవి ॥

యెలమి స్వర్గమేలేటిఇంద్రునికైనాను
అలమి కోరేటిఫల మది నీవు
బలిమిఁ గైలాసమేలేపశిరుద్రునికైనా
నిలుకడైనపదము నీపదము. ॥ తాము ॥

యెక్కుడు సత్యలోకము యేలేబ్రహ్మకునైనా
ఇక్కువఁ జేరేచోటు యెందును నీవు
వెక్కసపుఁబుణ్యముల వేదములకైనాను
అక్కరతో ముఖ్యమైన అర్థమెల్లా నీవు, ॥ తాము ॥

నాఁడు నాఁడే ముక్తులైన నారదశుకాదులకు
నేఁడును విహరించేనెలవు నీవు
పోఁడిమి శ్రీవేంకటేశ పోలించ నెవ్వరూ లేరు
[1]మూఁడులోకముల నీవే మూలము నీవే ॥ తాము ॥ 62

గౌళ

చింతలు రేఁచకు మమ్ము చిత్తమా నీవు
పంతముతో మముఁగూడి బతుకుమీ నీవు ॥ పల్లవి ॥

తల్లి శ్రీమహాలక్ష్మి తండ్రి వాసుదేవుఁడు
ఇల్లు మాకు బ్రహ్మాండమింతా నిదె
బల్లిదపుహరిభక్తి పాఁడిఁ బంటా నాకు
వొల్లము కర్మఫలము లొకటి నేము. ॥ చింత ॥

జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు [2]సొమ్ము
పూనినవైరాగ్యమే వుంబళి మాకు
ఆనినగురుసేవలు [3]ఆఁడుబిడ్డలు నాకు
మేనితోనే తగులాయ మేలు మాకుఁ జేరెను ॥ చింత ॥

యేలికె శ్రీవేంకటేశుఁ డింటిదేవపూజ మాకు
పాలుగలబంధువులు ప్రపన్నులు
కీలు మాకు నీతనిసంకీర్తన మోక్షమునకు
యేలా ఇంకా మాకు నేమిటికి గొడవ. ॥ చింత ॥ 63

ఆహిరి

ఎక్కడనున్నారో సురలెవ్వరు భూమికి దిక్కై
తొక్కులఁబడె జీవుఁడు దుండగీలచేతను ॥ పల్లవి ॥

1. 'మూఁడులోకములు' [illegible].
2. ఈ "సొమ్ము" పూర్వముద్రితములో తప్పిపోయినది.
3. "ఆఁడుబి(లుబి?)డ్డలు" పూ. ము [illegible].

ఆసలని యెడివెట్టి యంగడివెంటాఁ దిప్పె
 దోసిలొగ్గించె దైన్యము దొరలెదుట
 యీసుల నాఁకటి(లి?) విషమేమైనాఁ దినిపించె
 గాసిఁబడె జీవుఁడిదె కన్నవారిచేతను. ॥ఎక్క॥

కడుఁగోపపుభూతము కాయమెల్లా మఱపించె
 వడి నజ్ఞానపుటేరు వరతఁగొట్టె
 నడుమఁ బాపపుచొక్కు నరకపుగుంటఁదోసె
 గడుసాయ జీవుఁ డిదె కన్నవారిచేతను ॥ఎక్క॥

భవము సంసారపుబందెలదొడ్డిఁ బెట్టించె
 [1]తగి(వి?)లింద్రియపుతాళ్లు[2] దామెనఁ గట్టె
 యివల శ్రీవేంకటేశుఁ డింతలో దిక్కయి కాచె
 కవదువాసె జీవుఁడు కన్నవారిచేతను ॥ఎక్క॥ 64

సాళంగనాట

ఏదెస మోక్షము లేదు యెవ్వరికి ననేరు మీ—
 వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసేరా ॥పల్లవి॥

అంతా బ్రహ్మమైతే[3]నాతుమూ వొక్కటియైతే
 చింతింప గురుఁడు లేఁడు శిష్యుఁడూ లేఁడు
 బంతినే ముక్తుఁడూ లేఁడు బద్ధుఁడూ లేఁడిట్లయితే
 వంతుల సత్కర్మమెల్ల వఱతపాలాయఁబో ॥ఏదె॥

ఇహమెల్లాఁ గల్లనేరు యేఁటికిఁ బుట్టినవారు
 సహజమే యిదనేరు చావనేఁటికి
 మహి మీకు బోధించినమహాత్మ్మ శంకరాచార్యుఁ—
 డహరహ [4]మేమైయున్నా నాతనికేది గతి (?) ॥ఏదె॥

---

1. 'ప్రాణభంగము' 2. 'దామేనఁ' పూ. ము. పా. 3. 'నాదుమా' లేకు.
4. ఏమైయున్నాఁ డాతనికేదిగతి" కావచ్చు.

కొందరికి సుఖమిది కొందరికి దుఃఖమది
యిందుఁ జిక్కి బ్రహ్మమున కీఘోర మేలా
అందిన శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డొక్కఁడింతే
మందలించికొలువరు మంటికా మీజ్ఞానము ॥ ఏదె ॥ 65

పాడి

వాఁడివో వీఁడివో హరి వలసినవారికెల్లా
మూఁడులోకముల మరి మొరఁగఁ జోటేది ॥ పల్లవి ॥

బహిరంతరాన హరి ప్రత్యక్షమై యుండఁగాను
సహజానఁ బ్రత్యక్షవిచారమేల
ఇహములోఁ గలవెల్లా యీతనిలీలై యుండఁగా
విహరించేలీల వేరే వెదకనేలా ॥ వాఁడి ॥

మనికై యన్నిటా నుండి మాటలాడుచుండఁగాను
వెనక హరి మాటలు వేరేవున్నవా
కనుచూపతఁడంతటా కలగొనఁ జూడఁగాను
చనవిచ్చి [1]కృపాదృష్టి చల్లుమననేలా. ॥ వాఁడి ॥

నెలవై యాతఁ డిన్నిటా నిండుకొనియుండఁగాను
అలరి వేరే వచ్చీనననేలా
యెలమి శ్రీవేంకటేశు డిచ్చకొలఁదే [2]యింతా
పలుమారు నిట్టట్టని భావించఁదగునా ॥ వాఁడి ॥ 66

రేకు 21౨ లలిత

చెలఁగి నా కిందుకే చింతయ్యీని
తెలిసిచూడఁగా నిది దిష్టమయ్యీనా ॥ పల్లవి ॥

1 'ద్రిష్టి' రేకు 2. ఈ 'యింతా' పూర్వముద్రితములో తప్పిపోయినది

హరి పుట్టించినదేహి హరినే కొలువక
నరులఁ గొలుచుట అన్యాయమయ్యా
గరిమ నేరు గుడిచి కాలువఁ బొగడఁబోతే
యెరవెరవేకాక యితవయ్యీనా ॥ చెలఁ ॥

దేవుఁడిచ్చినట్టిబుద్ధి దేవునిపయిఁ బెట్టక
థావమింద్రియాలకియ్యఁ బాపమయ్యా
జీవిత మొకరిసొమ్ము జీవించి యొకరివెంట
ఆవలఁ బరువులిడు టందమయ్యీనా ॥ చెలఁ ॥

అరిది శ్రీవేంకటేశుఁ డంతరాత్మయి వుండఁగాను
శరణనకుండు టనాచారమయ్యా
ధరఁ దనయింటఁ గోటిధన మట్టేవుండఁగాను
మరలి తిరియఁబోతే మట్టుపడీనా ॥ చెలఁ ॥ 67

పాడి

కాకుంటే యీశూన్యవాదకఠినచిత్తులచేత
పై కొని వివేకులకు బ్రదుకఁగవచ్చునా. ॥ పల్లవి ॥

అల్ల నాఁడు నిరాకారమనెడిమాటలచేత
వెల్లిఁబోయ లోకములో విజ్ఞానమెల్లా
కల్లని మీత్రివిక్రమాకారము చూపి మీరు
చెల్లఁబెట్టితిరి వేదశిఖలందు మరియు. ॥ కాకుం ॥

ఆలకించి యహంబ్రహ్మమనెడిబుద్ధులచేత
గాలిఁబోయ భక్తి [1]యెల్లా కాలమందే
యేలి ప్రహ్లాదునికిఁగా హిరణ్యకశిపునొద్ద
యేలికబంటువరుస లిందె చూపితిగ. ॥ కాకుం ॥

1. 'యెల్లకాలమందే' వ్రా. ము. పా.

ఇంతా నొక్కటియనే అపర్మాధులచేత
గుంపించు దేఁ బుద్ధిమెల్లాఁ గొల్లఁబోయ
ఇంతట శ్రీవేంకటేశు డెక్కుడు నేఁ గని కొండ
పంతగాఁగఁ గొండవెక్కె నలినిగిరిపై ॥ కాకుం ॥ 68

శుద్ధవసంతం

చేకొనువారికి చేరువిదే పైకొను జీవుల భాగ్యమిదే
యేకడఁ జూచిన యితరము లేదు ॥ పల్లవి ॥

కలఁపులలోన చింతారత్నమిదివో
తెలిసిచూచితే దృష్టంబు
చలమున నదె ధనమత్తసల దేహించిన
కలిగిన హరి యదులోనే యిలుపు ఱేఁడు ॥ చేకొ ॥

వెసఁ గనుదెఱచిన విశ్వాత్మకుఁ డిదె
దెసల నింతటా దృష్టంబు
పసిగొని తనుఁ బాపములు భ్రమించిన
కసరి సృష్టి చీఁకటివడు నపుడే ॥ చేకొ ॥

చేరి కొలిచితే శ్రీవేంకటపతి
నారే బ్రతుకువకు శాసనము
పైరగుతనలో భక్తి వదలితే
కూరిమి తెరమఱుగునకును మఱుగు ॥ చేకొ ॥ 69

వరాళి

పెంచి తముఁ బెట్టుఁజెట్టు పెరికివేయ రెవ్వరు
మంచివాఁడఁ గాకున్న మన్నించకుండేవా ॥ పల్లవి ॥

తెరువు దప్పి యడవిఁ దిరిగేటివారిఁ దెచ్చి
తెరువునఁ బెట్టుదురు తెలిసినవారలు
నరుఁడనై నేరక నడచేటినన్ను నీవు
మరిగించి కావక మానవచ్చునా. ॥ పెంచి ॥

దిక్కుమాలినట్టివారిఁ దెచ్చి దయగలవారు
దిక్కయి కాతురు వారి దిగఁదోయరు
తక్కక మాయలోఁ బడి దరిదాపులేనినన్ను
వెక్కసాన రక్షించక విడిచేవా నీవు. ॥ పెంచి ॥

ఆవల భయపడ్డవా రంగడిఁబడితే దొర-
లోవల విచారించి వూరడింతు రంతలోనే
శ్రీవేంకటేశ నీవు [1]సృష్టికల్లా నేలికవు
వేవేలు మామొర నీవు విచారించకుండేవా. ॥ పెంచి ॥ 70

సామంతం

ఎన్నఁడు మంచివాఁడ నయ్యేను నేను
నన్ను నీవే మన్నించి నడుపవే దయివమా ॥ పల్లవి ॥

వేఁపమానికిని చేఁదు విడువక వుండేది
యేపొద్దు సహజమే యెంతైనాను
పాపపుణ్యాలంపటానఁ బరగివుండేటినేను
చాపలదుర్గుణినౌట సహజమే. ॥ ఎన్నఁ

పాముకు విష మెప్పుడు పండ్లఁ బెట్టుకుండేది
భూమిలో సహజమే పోరి నెంతైనా
కామక్రోధుఁడ నాకుఁ గరుణ యించుక లేక
సామజపుదుర్మదము సహజమే. ॥ ఎన్నఁ

1 'స్రిష్టి' రేకు

అటుగాన శ్రీవేంకటాధిప నాకిఁక వేరె
తటుకన నేఁడు శాంతము వచ్చెనా
ఘటన నీకృపయందుగలిగిన మేలు నాపై
తటుకన ముంచి నన్నుఁ దరిచేర్చవే. ॥ఎన్నఁ॥ 7

గుజ్జ-

వెట్టి మానుప రెవ్వరు వేఁదురు నాయంత విడువదు (ను?)
ముట్టిఁబాలలోఁ బుట్టిన ముంచిన వెట్టెయ్యా ॥పల్ల॥

జగములు రక్షించఁ జాల్పడి సర్వేశ్వరుఁడే వుండఁగ
అగణితుఁ డాతనిశక్తి యల్పముగాఁ దెలిసి
జిగి [1] నాసంసారరక్షణ నేనెదనంచునుఁ దిరిగెద
నగుఁబాట్ల యల్పుఁడ నే నావెట్టిదేయయ్యా. ॥వెట్టి॥

అంతర్యామై దేవుఁడు అటు సుఖదుఃఖము లొసఁగఁగ
అంతయు మనుజులు సేసేరని నేఁ దిరిగితిని
బంతినే నావంటిజీవులబడిఁ దిరిగాడుచుఁ గర్మపు-
దొంతులఁ జిక్కిననా [2] వెట్టితోడనే యిదేయయ్యా. ॥వెట్టి॥

శ్రీవేంకటపతి యెదుటనే చేకొని వరము లొసఁగఁగ
దావతిపడి యితరుల నేఁ దగులుచు నడిగితిని
యీవేళనే నాగురుఁడును యీ దైవము నిటు చూఁపఁగ
తో వెరఁగిటు నే బతికితి తొల్లెల్ల వెట్టినయ్యా ॥వెట్టి॥ 7

రేకు 218 దేసాక్షి

ఇతనికంటే నుపాయ మిఁక లేదు
మతిలోననున్నవాఁడు మర్మ మిదే సుండీ. ॥పల్లి॥

---

1. ఈ 'నా' పూర్వముద్రణమున తప్పినది 2. 'వెట్టి' రేకు.

ఇన్నిలోకసుఖములు ఇంద్రియప్రీతులే
తన్నుఁ గనినతల్లిదండ్రి తనుపోషకులే
కన్న లెదిటిధనాలు కామితార్థములే
వున్నతి నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు ॥ఇన్ని

కలదేవత లిందరు కర్మఫలములే
లలి విద్యలెల్ల ఖ్యాతిలాభపూజలకొరకే
పలుమంత్రములెల్లను [1]బ్రహ్మలోక మీసందివె
వొలిసి ఇష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు ॥ఇన్ని

అనుదినరాజసేవ లల్పార్థహేతులే
కొనఁ గల్పవృక్షమైనఁ గోరినవిచ్చేటి దే
ఘన శ్రీవేంకటేశుఁడు కల్పించె జీవునిఁ గావ-
నొసర నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు ॥ఇన్ని 7

బౌళి

నన్ను నెవ్వరు గాచేరు నాఁటిపగేతురుగాక
నిన్ను నేఁ డిరోఁతలైతే నీకియ్యానా నాకును ॥పల్లవి

దేవుఁడ నేనేయంటా తిరిగే నాస్తికుఁడనా
దేవతలకు మొక్కఁబోతే నీకు నగరా
భావించి యింద్రియములు పగలేని యున్నాళ్ల నుండి
ఆవల జితేంద్రియుఁడనంటే నవి నగవా. ॥నన్ను

కర్మము దొల్లి సేయక కడుదూరమై ఇఁక నా-
కర్మము సేయఁగఁబోతే కర్మమే నగదా
దుర్మతి సంసారినై తొయ్యలులకు మోహించి
అగ్గలి దూషించితేఁ అటె వారు నగరా. ॥నన్ను

1. "బ్రహ్మలోకమిసందివె(?) పూ ము. పా.

నేనే స్వతంత్రుఁడనంటా నిండుదానాలెల్ల మాని
పూని యుక్కఁ జేయఁబోతే పొంచి యవి నగవా
నే నిన్నిటా సిగ్గువడి నీమరఁగు చొచ్చితిని
అనఁగొని శ్రీవేంకటాధిపుఁడ కావవే ॥నన్ను॥ 74

సామంతం

పరుసము సోఁకక పసిఁడౌనా
పురుషోత్తముఁడే బుద్ధిచ్చుఁగాక ॥పల్ల॥

పరిభోగములకుఁ బుట్టినదేహము
పరమపుమోక్షము వెదకీనా
యిరవుగ సకలము నేలేటిదేవుఁడు
తఱిరక్షింపుట ధర్మముగాక ॥పరు॥

తెరసి యాసలనే పెరిగేటిదేహము
ధరఁ గొంతయుఁ దనసీనా
అరుదుగ నంతర్యామగుదేవుఁడు
పొరిఁ బెరరేఁచుటే పొందౌఁగాక ॥పరు॥

ఘనమగుసంసారకారణజీవుఁడు
తనసుజ్ఞానముఁ దలఁచీనా
వెనక మునుప శ్రీవేంకటపతియే
కనుఁగొని యిమ్మెటు కాచుటగాక ॥పరు॥ 75

లలిత

నిమిషా మది ¹యెంత నీవు చేసేచేఁత లెంత
దిమసపునీమాయలు తెలియరాదయ్యా.

---

1. 'యంత' రేకు

నీపాదతీర్థము నెత్తి మోచె నొకఁడు
పూఁపకొడుకై యొకఁడు బొడ్డునఁ బుట్టె
యేపున నింతటివారి కెక్కుడైనదైవమవు
మోపుచు ధర్మరాజుకు మొక్కువెట్టయ్యా ॥నీమ॥

నీలీల జగమెల్లా నిండియున్న దొకవంక -
నోలి నీలో లోకా లున్న వొకవంక
యేలీలఁ జూచినాను యింతటిదైవమవు
బాలుఁడవై రేపల్లెలోఁ బారాడితి వెట్టయ్యా. ॥నీమ॥

శ్రీసతికి మగఁడవు భూసతికి మగఁడవు
యీసరుస శ్రీవేంకటేశుఁడవు
రాసికెక్క నీవింతటిరాజసపుదైవమవు
దాసులము మాకెట్ల దక్కితివయ్యా ॥నీమ॥ 76

ఆహిరి

కలకాల మిట్లాయఁ గాఁపుర మెల్లా
అలదైవ మెందున్నాఁడో ఆలకించఁడుగా ॥పల్లవి॥

తనకే సంతసమైతే తనభాగ్యము వొగడు
తనకుఁ జింతవుట్టితే దైవము దూరు
మనుజునిగుణమెల్లా మాపుదాఁకా నిట్లానె
ఘనదైవ మెందున్నాఁడో కరుణఁ జూడఁడుగా ॥కల॥

విరివిఁ బాపాలు సేసేవేళ నాదాయము లెంచు
నరకమఁది పుణ్యము నాఁడు వెదకు
తిరమైనజీవునితెలివి యెలా నీలాగె
ధర దైవ మెందున్నాఁడో దయఁ జూడఁడుగా ॥కల॥

వేళతో నిద్దిరింపుచు విరక్తునివలె నుండు
మేలుకొన్నవేళ నన్ని మెడఁ బూనును
యీలీల దేహిగుణము యెంచి శ్రీవేంకటేశుఁడు
యేలీ(లే?)దైవ మెందున్నాఁడోయిట్టే మన్నించఁడుగా. ॥కల॥ 77

శంకరాభరణం

ఉన్నచోనే మూఁడులోకా లూహించి చూచితే నీవే
కన్నచోటనే వెదకి కానఁ డింతేకాక. ॥పల్లవి॥

యెక్కడ వొయ్యీడి జీవుఁ డే వైకుంఠము
యిక్కడ హరి యున్నాఁడు హృదయమందె
ముక్కున నూరుపు మోచి ముంచి పుణ్యపాపాల-
కక్కసానఁ జిక్కి తమ్ముఁ గానఁ డింతేకాక ॥ఉన్న॥

యేమి విచారించీ దేహి యేఁదు దేవుని వెదకీ
కామించి యాతఁ డిన్నిటాఁ గలిగుండఁగా
దోమటిసంసారపుదొంతికర్మములఁ జిక్కి-
కాముకుఁడై కిందుమీఁదు గానఁ డింతేకాక ॥ఉన్న॥

యేవిధులు తాఁ జేసీ యెవ్వరి నాడఁగఁబోయీ
శ్రీవేంకటేశ్వరుసేవ చేతనుండఁగా
థావ మూతఁడుగాను బ్రతికె నిదవో నేఁడు
కావరాన నిన్నాళ్ళు కానఁ డింతేకాక. ॥ఉన్న॥ 78

రేకు 214 ధన్నాసి

కటకటా యేమిటాను కడవర గానఁడిదే
నిటఃఫ్వాఁత యెట్టో నిజము దెలియదు. ॥పల్లవి॥

బాదలసంసారము పరవంజుకొని తొల్లి
యేది నమ్మి పాటువడె నీజీవుఁడు
గాదెలకొలుచుగాఁగఁ గట్టుకొని కర్మములు
యేదెస చొచ్చినో కాని యీప్రాణి. ॥కట॥

కాఁపురమై తన తల్లికడుపున వచ్చి పుట్టి
యేపని గలిగెనో యీదేహి
కాపాడీ నిక్షేపాలు కడునాసతోఁ బాఁతి
యేపదవిఁ బా నుండునో యీజంతువు ॥కట॥

దప్పుల యమబాదలు దలఁచి వెరవఁ డిదె
యెవ్వరి సలిగెన మోక్ష యీజీవి
రవ్వగా శ్రీవేంకటాద్రిరాయఁడు మన్నించఁగాను
యివ్వల బతికెఁగాక యెవ్వఁడోయి తాను. ॥కట॥ 79

కాంబోది

ఎవ్వరు దిక్కింక నాకు నేది బుద్ధి
యివ్వేళ విచారించవే ఇందిరారమణా ॥పల్లవి॥

వెంటఁబెట్టి కామక్రోధపితతులు చుట్టి [1]నన్ను
కొంటి మీసేవకు [2]చన్ను దూరము సేసె
కంటకపుటింద్రియాలు కడుహితశత్రులై
అంటిన మోహముత్రోవ నంటకుండాఁ జేసెను ॥ఎవ్వ॥

తిప్పి తిప్పి నాయాసలు తెగ వైష్ణవధర్మానఁ
దెప్పలఁ దేలసందాను తీదీక్ష సేసె
వొప్పగుసంసార మిది వున్నతి నాచార్యసేవ
చొప్పు మాపి పుణ్యాలకుఁ జోరకుండాఁ జేసెను. ॥ఎవ్వ॥

1. 2. ఇట్టిపునరుక్తులక్కడక్కడ గలవు.

మచ్చరపుదేహ మిది మనసట్టె పండనిక
తచ్చి యజ్ఞానమునకుఁ దావుసేసె
ఇచ్చట శ్రీవేంకటేశ ఇంతలో నన్ను నేలఁగ
నిచ్చలు నీకృపే నన్ను నిర్మలము సేసెను. ॥ఎవ్వ॥ 80

దేసాళం

అనంతమహిముఁడవు అనంతశక్తివి నీవు
యెనలేనిదైవమా ని న్నేమని నుతింతును. ॥పల్లవి॥

అన్నిలోకములు నీయందు నున్న వందురు నీ—
వున్నలోక మిట్టిదని వూహించరాదు
యెన్న నీవు రక్షకుఁడ విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి నేనెవ్వరి నందును. ॥అనం॥

తల్లివి దండ్రివి నీవు తగుబ్రహ్మాదులకు
యెల్లగా నీతల్లిదండ్రు లెవ్వరందును
యిల్లిదె వరములు నీ విత్తు విందరికిని
చెల్లఁబో నీకొకదాత చెప్పఁగఁ జోటేది. ॥అనం॥

జీవుల కెలికవు శ్రీవేంకటేశుఁడవు నీ—
వేవలఁ జూచిన నీ కేయేలికె లేఁడు
వేవేలు మునులును వెదకేరు నిన్నును
నీ వెవ్వరి వెదకేవు నిర్మలమూరితివి. ॥అనం॥ 81

శ్రీరాగం

పాటించి నమ్మిన వారభాగ్యముగాదా
కోటిసుద్దులేల యిదె కోరి చేకొనేది. ॥పల్లవి॥

స్వామిద్రోహియైనచండిరావణాసురుఁడు
కామించి శరణంటేను కాచే నంటివి
యేమని నీదయ యెంతు నెంతని నీమహిమెంతు
ఆమాటకు సరియా నఖిలవేదములు ॥ పాటిం ॥

దావతి సీతాద్రోహము దలఁచి కాకాసురుఁడు
కావుమని శరణంటేఁ గాచితివి
ఆవల నీపని యెట్టు అట్టె నీమన్నన యెట్టు
యీవల నీశరణనే ఇందుసరే తపము ॥ పాటిం ॥

చిక్కి లిన్ని నిఁకనేల చేరి యేపాటివాఁడైన
గక్కన నీశరణంటేఁ గాతువు నీవు
అక్కరతో నిన్ను శరణంటిమి శ్రీవేంకటేశ
యెక్కువ నీబిరుదుకు యీడా పుణ్యములు. ॥ పాటిం ॥ 82

పాడి

నేఁడు దప్పించుకొంటేను నేరుపున్నదా
పేఁడుక భోగించుతానే పెనఁగఁ జోటున్నదా ॥ పల్లవి ॥

తనువుమోచిననాఁడే తప్పులెల్లాఁ జేసితిని
వెనక మంచితనాలు వెదక నేది
ననిచి సంసారినైననాఁడే నిష్ఠూరానకెల్ల
మునుప నే గురియైతి మొరఁగఁ జోటున్నదా. ॥ నేఁడు ॥

సిరులు చేకొన్ననాఁడే సిలుగెల్లా గట్టుకొంటి
తరవాతిపను లింకఁ దడవనేల
నరలోకముచొచ్చిననాఁడే పుణ్యపాపముల—
పొరుగుకు వచ్చితిని బుద్ధు లింక నేల ॥ నేఁడు ॥

వూపిరి మోచిననాఁడే వొట్టికొంటి నానలెల్లా
మాపుదాఁకా వేసరిన మానఁబోయ్యీనా
యేపున శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గావఁగా
పైపై గెలిచితిఁగాక పంతమాడఁగలనా ॥ నేఁడు ॥ 83

దేసాళం

ఇన్ని దేహములఁ బుట్టి యేమిగంటిమి
వున్నతపుహరిదాస్య మొక్కటేకాక ॥ పల్లవి ॥

హీనజంతువైననాఁడు యేనుగై పుట్టిననాఁడు
ఆనంద మొక్కటే అంగాలే వేరు
యీనేటియజ్ఞానము యీజీవుల కొక్కలాగే
జ్ఞానమే యెక్కుడుగాక సరిలేఁదొకటే ॥ ఇన్ని ॥

నరలోకభోగానకు నరకానుభవానకు
సరేకాని [1]మిగులదు చనెఁ దొల్లె (?)
గరిమ నేర్పడ నందు ఘనమేమి కొంచమేమి
హరిదాసుఁడై బ్రదుకుటదియే లాభము ॥ ఇన్ని ॥

బాలుఁడైనయప్పుడూను పండి ముదిసినప్పుడు
కాలమొక్కటే బుద్ధి కడు లేదు
ఆలకించి శ్రీవేంకటాధిపతి సేవించి
యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము ॥ ఇన్ని ॥ 84

రేకు 215 గుజ్జరి

ఎన్నఁడు మానవు యీదుర్గుణములు యేది అపుపథము యిఁదుకును
కన్నులఁ జూచుచుఁ జెవుల వినుచు [1]నేఁ గనియు వినియునిదె కష్టుఁడ
[నయ్యా [2]నేను ॥ పల్లవి ॥

---

1. "మిగులదంచనెఁ దొల్లె" కావచ్చు
1. 2. ఇట్టిపునరుక్తు లక్కడక్కడ గలవు

హృదయములోపల దేవుఁ డుండఁగా నెఱఁగక భ్రమయుచుఁ
గన్నచోటనే
వెదకియుఁ గానక అనుమానించేటి వేఁదుఁనయ్యా నేను
చెదరినజననము దుఃఖరూపమని చెప్పఁగ విని యది సుఖమని కోరుచు
మది దీపమువట్టుక నూఁతఁబడినమత్తునిలెనవయ్యా నేను ॥ఎన్నఁ॥

పరమగురువులదె భక్తిమార్గ మిటు ప్రాణులకెల్లనుఁ బెట్టివుండఁగా
విరసపుటింద్రియమార్గములఁ దిరుగువీరిడినయ్యా నేను
దరిచేర్పఁగ హరినామము గలిగియు దైన్యము నొందితి సంసారములో
పరుసము చేతఁబట్టుక తిరిసేటిభ్రాంతునివలెనయ్యా నేను. ॥ఎన్నఁ॥

శ్రీవేంకటపతి యెదుటనుండఁగా సేవింపఁగ సంసారములోపల
దావతిఁ బొరలుచు వేసరుచుండేటితగనిజడుడనయ్యా నేను
కైవశమై యీదేవుఁడే యిటు ననుఁ గరుణింపుచు రక్షింపుచు నుండఁగ
పూవునుఁ బరిమళమునువలనే నేపొదలుచు నుండెదనయ్యా[2]నేను. ॥ఎనఁ॥85

దేవగాంధారి

ఎంతగాలమునకైనా యీయర్థమే కలది
యింతటిలోననే హరి నెఱఁగఁగవలయు. ॥పల్లవి॥

యెంచి నూరేండ్లమీఁద యెప్పుడో మరణము
ముంచి యిట్టె మోచినదె మురికిదొక్క
యించుకంత యిందుకుఁగా నేల కోరేమో సుఖము
కాంచన మెవ్వరికిఁగా గడియించేమో. ॥ఎంత॥

కలిగినదినములు కాఁపుగానకే నెఱ
తలఁపెల్ల నాఁకెకంతటఁ [3]గొలఁది(?)
ఫల మిందు నేమిగద్దో ప్రాణి కిందేమిటివాఁడో
తెలిసి పాపఁగలేము తీరని యీచిక్కు ॥ఎంత॥

1 2. ఇట్టిపునరుక్తు లక్కడక్కడ గలవు. 3. కొలఁదిచాలినది కావచ్చు

సేసినకర్మములెల్లా చెప్పరానిమోపులాయ
రాసికెక్కి యింద్రియాలరపమాయను
వేసరి యిన్నిటికి శ్రీవేంకటేశుఁ గొలిచితి
నూసినదే మణుఁగాయ మాకు నేఁడ జన్మము ॥ఎంత॥ 86

నాళంగనాట

ఇన్నియు ముగిసెను ఇటు నీలోననె
పన్ని పరులఁ జెప్పఁగఁ జోటేది ॥పల్లవి॥

కుందనినీరోమకూపంబులలో
గొందుల బ్రహ్మాండకోట్లట
యెందరు బ్రహ్మలో యెంత ప్రపంచమో
యిందుఁ బరులమని యెంచఁగనేది ॥ఇన్ని॥

నీకొనచూపున నెటిఁ గోటిసూర్యు-
లేకమగుచు నుదయింతురటా
నీకాయ మెంతో నీవునికేదో
నీకంటెఁ బరుఁని నిక్కఁగనేది ॥ఇన్ని॥

జీవకోటి నీచిన్నిమాయలో
ప్రోవులగుచు నటు పొడమెనటా
శ్రీవేంకటేశ్వర చెప్పఁగ నీ వెంతో
అవలఁ బరులకు నాధిక్యమేది ॥ఇన్ని॥ 87

బౌళి

ఎన్నఁడు నే నిఁక బుద్దెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలెడిది
విన్నప మిదియే నీకే భారము వీని గెలువ నావశమౌనా ॥పల్లవి॥

తగిలెడి నీనయనేంద్రియములు తగఁ జూచినయందెల్లను
తగిలెడి నీశ్రవణేంద్రియములు తగినలోకవార్తలకెల్లా
మగుడఁగనేరవు జన్మజన్మముల మనసు వీనికే సహాయము
తెగ వెన్నటికిని యింద్రియసంపద తీగెలుసాగుచు నొకటొకటి. ॥ఎన్న॥

యెక్కుడిని నానాఁటికి మదమెంతైనా నజ్ఞానమున
యెక్కుడి నీసంసారమే హరియెదుటనే మత్తాయిగొన్నట్లు
చిక్కు డెంతయిన మోక్షమార్గమున జీవుఁ డిందుకే లోలుఁడు
దిక్కమెకమువలెఁ గిందికి మీఁదికిఁ దిప్పెడిఁ గర్మము దేహమును. ॥ఎన్న॥

మెఱయుచుఁ బెరిగెడి నీయాసలు గడు మీఁదమీఁద లంపటమగుచు
మఱియునుఁ బెరిగెడి పుణ్యపాపములు మలసి రాసులై పెక్కగుచు
యెఱఁగను శ్రీవేంకటేశ్వర [1] యెంతో ఇఁక నాలోపలిదుర్గ (ర్గు?) ణములు
మఱఁగుచొచ్చితిని నే నిన్నాళ్లకు మరి నాభాగ్యము నీచిత్తము. ॥ఎన్న॥88

సామంతం

దేవా [2] నీమాయ తెలియ నలవిగాదు
భావభేదముల భ్రమసితిని. ॥ పల్లవి ॥

జననంబొకచే జంతుకులమొకచే
తనువికారములే తగఁ బెక్కు
దినములు నివియే తివిరి లోకమిదె
పనులే వేరయి పరగీని ॥ దేవా ॥

మాటలు నొకచే మనసులు నొకచే
కోటులసంఖ్యలు గుణము లివి
నాటకము లిట్లనె గుణిఁ గామిఁ దొకఁడె
మేటివలపులకె మేరలే లేవు. ॥ దేవా ॥

1 యంతో' రెకు 2 "నీమహిమ" వ్రా ... ప్రా

జ్ఞానమొకటే యజ్ఞానము నొకటే
నానామతములు నడచీని
అనుక శ్రీవేంకటాధిప నీకృప
తానే మమ్మిటు తగఁ గాచీని ॥దేవా॥ 89

## 216 వ రేకు లేదు.

రేకు 217 దేశాక్షి

కన్నవిన్నవారెల్లా కాకుసేయరా
వున్నతుఁడవైననీ కీవొచ్చములేలయ్యా ॥పల్లవి॥

దేవతలఁగాచినట్టిదేవుఁడ నీకుఁ బసుల
నీవలఁ గాచితివనే హీనమేలా
కావించి పాలజలధిఁ గాఁపురముండినయట్టి—
నీవు పాలదొంగవనే నింద నీకేలయ్యా ॥కన్న॥

కాలమందు బలిదైత్యుఁ గట్టివేసినట్టినీకు
రోలఁ గట్టువడినట్టిరోఁత నీకేల
పోలించి లోకాలకెల్ల పొడవైనదేవుఁడవు
బాలుఁడవై రేపల్లెలోఁ [1]బారాడనేలయ్యా. ॥కన్న॥

పాముమీఁదఁ బవ్వళించి పాయకుండినట్టినీకు
పాముతల దొక్కినట్టిపగ కేలా
కామించి శ్రీవేంకటాద్రికడపరాయఁడ నివు
భూమి మాయలణఁచి నేర్పులమాయలేలయ్యా ॥కన్న॥ 90

వరాళి

చేసినట్లె సేసుఁగాక చింత మాకేలా
వాసి వంతూ నడనిదే వట్టిజాలియేలా. ॥పల్లవి॥

---

1 'బారేచ' రేకు పారి + ఆడన్ = పారేడన్. ఈవ్యావహారికసంధు లీ-
వాఙ్మయమున కొల్లలు.

కర్మమూలమైనవి యీకాయపువర్తనలెల్లా
ధర్మమూలమైనది యీదైవికము
మర్మమైనవాఁ డొక్కఁడే మనసులోనున్నహరి
నిర్మితమాతనిదింతే నేర నే నెంతవాఁడ. ॥ చేసి ॥

ధనమూలమైనది యీతగినప్రపంచమెల్లా
తనువుమూలమైనది యీతపసులెల్లా
ననిచి యీరెంటికిని నారాయణుఁడే కర్త
కొనమొదలాతనిదే కొసరు నాకేల ॥ చేసి ॥

భోగమూలమైనది యీపొందైనసంసారము
యోగమూలము విరతి కొక్కటైనది
యీగతి శ్రీవేంకటేశుఁ డెట్లువేసినఁ జేసు
బాగులుగా నీతనిశ్రీపాదమే మాదిక్కు. ॥ చేసి ॥ 91

పాడి

ఎదురేది యెంచిచూడ నితనిప్రతాపానకు
పదిదిక్కులను భంగపడిరి దానవులు ॥ పల్లవి ॥

యెక్కువగా వినోదాన నీతఁడు తేరెక్కెను
యెక్కిరిదైత్యులు గొబ్బు లింగరుఁ గూడి
నిక్కఁగా నితఁడు చేతఁ జక్ర మెత్తినమాత్రాన
దిక్కులఁ బరువెత్తిరి దిమ్మరిఅసురులు ॥ ఎదు ॥

దట్టమై యీఅనిభేరిఁ దగ నాదువుట్టితేను
పుట్టైనుత్పాతాలు వైరిపురములందు
అట్టె గరుడధ్వజ మటు మిన్నుముట్టితేను
కిట్టి దనుజుల కపకీర్తి శుదముల్లైను ॥ ఎదు ॥

అపరాధియైనట్టియాతనితమ్మునినే
కృపఁజూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్ముమైన దానకుఁజిక్కినవాని
నెపానఁ గాచి విడిచి నీవాదరించితివి ॥ రామా ॥

సేయరానిద్రోహము సేసినపక్షికి నీవు
పాయక అప్పటి నభయమిచ్చితి
[1] చాయసేసుకొని వుండి స్వామిద్రోహిఁ జెప్పనట్టి -
తోయపుశేలెని మంచితోవనే పెట్టితివి(?). ॥ రామా ॥

నేరము లెంచవు నీవు నీదయే చూపుదుగాని
బీరపు శరణాగతబిరుద(పు?) నీవు
చేరి నేఁడు నిలుచుండి శ్రీవేంకటాద్రిమీఁదఁ
గోరినవరములెల్లా కొల్లలొసఁగితివి ॥ రామా ॥ 94

ఆహిరి

ఎట్టయినాఁ జేసుకో ఇఁక నీచిత్తము నన్ను
పట్టిచ్చె మాగురుఁడు నీపాదాలు విడువను. ॥ పల్లవి ॥

పోఁడిమి నానామములు పొద్దువొద్దు నుడిగిని
వీఁడేమడుగునోయని వెఱవకుమీ
నాఁడే నాయాచార్యుఁడు నాకు నన్నీ యిచ్చినాఁడు
నేఁ డిదేలంటే నతనినేసుము నే మానను ॥ ఎట్ట ॥

ప్రేమతో వీఁడు నన్నింటఁ బెట్టుక పూజించీని
యేమిగారణమోయని యెంచుకోకుమీ
కామించి యాచార్యుఁడే కారణము నీకు నాకు
యీ మరులేలంటే నాతఁడిచ్చినసొమ్మే నేను ॥ ఎట్ట ॥

1. ఇది దర్భశయనవృత్తాంతమా?

పలుమారు పీఁడు నాపై బత్తిచేసి నేఁటికని
వెలయ శ్రీవేంకటేశ వేసరకుమీ
యేఁమి నాచార్యుఁ డదేపని చేసినాఁడు
నిలిచేఁ గలకాలము నీకు నాకుఁ బోదు ॥ఎట్టు॥ 95

రేకు 218 గుండక్రియ

విసరముమాలినట్టివెట్టిదేహ తొల్లి
జనకట్టినంతే కాక చండవోరనేఁటికే ॥పల్లవి॥,

మనసంతే మంగళము మరి యెంత వొరలినా
తనువుకొలఁదియే సత్వములెల్లాను
తనకలి మెంచుకోక తగనిమురి పెముల
పెనఁగఁబోతే తీపు పిప్పిలోనఁ గలదా ॥విస॥

చెంది విత్తినకొలఁదే చేరి మొలచేటిపైరు
అంది ఆఁకటికొలఁదే ఆహారమెల్ల
ముందువెనక చూడక మొక్కలపువరువేల
అందనిమానిపంటికి నాసపడవచ్చునా. ॥విస॥

శ్రీవేంకటేశ్వరుఁ గొలిచినకొలఁదియే మేలు
భావించ నాతఁడిచ్చేది భాగ్యమెల్లాను
వేవేలు మొక్కులేల వెస నానాఁటికినెల్ల
తోవగానితోవఁ బోతే తుదకెక్కఁగలదా. ॥విస॥ 96

సామంతం

ఈతగవె నాకు నీకు నెంచి చూచితే
కాతరపుజీవులకుఁ గలదా వివేకము. ॥పల్లవి॥

ఘారము నీదిగనక పలుమారుఁ బాపములే
చేరి మొక్కలాన నేఁ జేసితిని
పేరడిఁ దల్లిదండ్రులు బిడ్డ లేమిసేసినాను
వోరుచుక ముద్దుసేసుకుందురు లోకమున. ॥ ఈత ॥

కావ నీవుగలవని కడదాఁకా నేరములే
వేవేలు సేసితిని వెఱవక
ఘావించుక యింటిదోర పసురము దెంచుకొని
యేవిధిఁ బైరుమేసినా నెగ్గుసేయఁ డతఁడు. ॥ ఈత ॥

పుట్టించేవాఁడవు నీవు పొదలేవారము నేము
యెట్టుండినా నీకుఁ బోదు యెన్నటికిని
వొట్టుక శ్రీవేంకటేశ వోడఁగట్టినదూలము
అటునిట్టుఁ బొరలినా నండవాయ దెపుడు. ॥ ఈత ॥ 97

లలిత

ఏఁటినేను యేఁటిబుద్ధి యెక్కడిమాయ
పీటఁబొయ్యో వెట్టిఁ గాను వివేకిఁ గాను. ॥ పల్లవి ॥

అరసి కర్మముసేసి అవి(ది?)నన్నుఁ బోదిగితే
దూరుదుఁ గర్మము గొంది దూరుచు నేను
నేరక లంపటములు నేనే కొన్నిగట్టుకొని
పేరడిఁ బరుల నందుఁ బెట్టరంటాను. ॥ ఏఁటి ॥

యెక్కుడు నాదోషములు యెన్నైనా వుండఁగాను
వొక్కరిపాపము లెంతు వూరకే నేను
తిక్కవట్టి నాకునాకే దేవతలకెల్లా మొక్కి
వొక్కరివాఁడ గాకుందు వుస్సురనుకొంటాను ॥ ఏఁటి ॥

విరతిఁ బొందుటఁ గొంత వేరేసంసారముఁ జేతు
యొరవుల గూడనే యెప్పుడు నేను
అరిది శ్రీవేంకటేశుఁ డంతలో నన్ను నేలఁగా
దొరనైతి నధముఁడఁ దొల్లే నేను ॥ఏఁటి॥ 98

భైరవి

ఆతఁడు భక్తసులభుఁ డచ్యుతుఁడు
రాతిగుండెవాఁడు గాఁడు రంతు మానుఁ డీఁకను. ॥పల్లవి॥

జీవుఁడా వేసరకు చిత్తమా జడియకు
దైవము గరుణించఁ దడవుగాదు
త్రోవచూపె మనకుతొల్లే ఆచార్యుఁడు
కావలసినట్లయ్యీఁ గలఁగకుఁ డీఁకను. ॥ఆతఁ॥

కాలమా వేగిరించకు కర్మమా నన్నుమీరకు
పాలించ దైవానకు నే భార మిఁకను
ఆలించి తిరుమంత్రమే ఆతని నన్నుఁ గూరిచె
వేళగానిఅందాఁకా వేసరకుఁ డీఁకను. ॥ఆతఁ॥

వెఱవకు దేహమా వేసరకు ధ్యానమా
యొలిఁగి శ్రీవేంకటేశుఁ డెడసిపోఁడు
తఱి నిహపరము లితనిదాసు లిచ్చిరి
గుఱియైతి నిన్నిటికిఁ గొంకకుఁడీ ఇఁకను. ॥ఆతఁ॥ 99

సాళంగం

పలువిచారములేల పరమాత్మ నీవు నాకు
గలవు కలవు వున్నకడమలేమిటికి. ॥పల్లవి॥

నీపాదములచింత నిబిడమైతేఁ జాలు
యేపాతకములైన నేమిసేసును
యేపార నీభక్తి యింత గలిగినఁజాలు
పైపై సిరు లచ్చుటఁ బాదుకొనినిలుచు ॥ పలు ॥

సారిది నీ శరణము చొచ్చితినంటేఁ జాలు
కరుణించి యప్పుడట్టె కాతువు నీవు
సరుస నీముద్రలు భుజముల నుంటేఁజాలు
అరుదుగాఁ జేతనుండు అఖిలలోకములు. ॥ పలు ॥

నేరక వేసినఁ జాలు నీమీఁద నొకపువ్వు
కోరినకోరికలెల్లఁ గొనసాగును
మేరతో శ్రీవేంకటేశ మిమ్ము ౧గొలిచితి నేను
యేరీతి నుండినఁగాని యిన్నిటా ఘనుఁడను. ॥ పలు ॥ 100

బౌళి

ఇందుకంటే మరి యిఁకలేదు హితోపదేశము వోమనసా
అంది సర్వసంపన్నుఁడు దేవుఁడు ఆతనికంటే నేరుతుమా. ॥ పల్లవి ॥

కల దొకఁటే ధర్మము కల్పాంతమునకు నిలిచినది
తలఁకక మీశరణుచొచ్చి మీదాసుఁడ ననెడి దొకమాఁట
వలవనిజోలే యింతాను వడి నిదిగాక యేమిసేసినను
సులభ మిందునే తొల్లిటివారలు చూరలుగొనిరదె మోక్షంబు ॥ ఇందు ॥

మొదలొకటే యిన్నిటికి ముందర వెనకా వచ్చేది
వొదుగుచు గోవిందునిదాసులకు నొక్కమాటే మొక్కినఁజాలు
తుదకెక్కనివే యితరములు దొరకొని ఎంతేమిసేసినను
బదికిరిందునే పరమవైష్ణవులు పలుచదువులలో వినరాదా. ॥ ఇందు ॥

---

౧. 'గొలిచిరి' రేకు.

తగులోకమే విడువరానిది తతి నెన్నటికినిఁ జెడనిది
వొగి శ్రీవేంకటపతినామజపము వొకమాటే అబ్బినఁ జాలు
నగుబాటే యింతాను నానాఁటి కేమేమిసేసినను
తగునీబుద్ధుల నడచిరి మున్నిటిదైవజ్ఞులు పూర్వాచార్యులును
॥ ఇందు ॥ 101

రేకు 219 దేసాళి

ఏలోకమున లేఁడు యింతటిదైవము మరి
జాలి దవ్వి తప్పి రెయింత సోదించినాను. ॥పల్లవి॥

మంచిరూపున నెంచితే మరునిగన్నతండ్రి
ఇంచుకంత సరిలేదు ఇతనికిని
మించుసంపదల నైతే మేటిలక్ష్మీకాంతుఁడు
పొంచి యీతనికి నీడు పురుఁడించఁగలరా ॥ఏలో॥

పగఁ బ్రతాపమునను దానవాంతకుఁ డితఁడు
తగుల నీతనిమారుదైవాలు లేరు
పొగరుమగతనానఁ బురుషోత్తముఁ డితఁడు
వెగటై యీతనిపాటి వెదకిన లేరు. ॥ఏలో॥

ఒట్టి మొదలెంచితేను బ్రహ్మఁగన్నతండ్రితఁడు
పుట్టున నింతటివారు మరి వేరి
గట్టి శ్రీవేంకటేశుఁ డిగికి పరదుఁడు
చుట్టంగొన నితరుల గురిసేయఁగలరా ॥ఏలో॥ 102

బౌళి

ఆత్మసకలకామముఁ దనుమాట నీకుఁ జెల్లె
వివేకించఁ బురుషార్థవీధి మాయందేది. ॥పల్లవి॥

మఱిగి నీపై భక్తి మాకుఁ గలుగుటెల్లాను
అరసి నీవు రక్షించే ఆసకొరకే
హరి నీవు భక్తవాత్సల్యము మాపైఁ జేయుటెల్ల
ఇరవైననీకు నిరుహేతుకమే ॥ అవా ॥

కొసరుచు నిన్ను నేము కొలిచినదెలాను
వెస మాభారము నీపై వేయుకొరకే
వసముగా నీవు నన్ను వలెనని యేలుటెల్ల
యిసుమంతైన నిరుహేతుకమే. ॥ అవా ॥

శ్రీవేంకటేశ్వర నీకుఁ జేయెత్తి మొక్కుటయెల్ల
నీవే మావాఁడవై మన్నించుకొరకే
ఆవటించి అంతర్యామివై నీవుండుటయెల్ల
యేవలఁ జూచిన నిరుహేతుకమే ॥ అవా ॥ 103

బౌళి

మఱచిన వెఱచిన మఱి లేదు
యెఱిఁగినసులభుఁడు యీ హరి యొక్కఁడే ॥ పల్లవి ॥

ఆతుమ తొల్లిటిదే అంతరాత్మ తొల్లిటిదే
నీతితో యీదేహములే ౧ నిత్యకొత్తలు
యీతల నేర్పరులకు నిందే యిహపరములు
చేతిలో నున్నవి యిది చింతించరో జనులు ॥ మఱ ॥

కాలము నెందూఁ బోదు కర్మము నెందూఁ బోదు
జాలిఁబడ్డమనసే సావివోయను
పోలింప వివేకులకు పుణ్యమునుఁ బాపమును
వేళవేళనే వున్నవి వెదకరో జనులు ॥ మఱ ॥

౧ 'నిత్యకొత్తలు' వంటి సమాసములు ఈ భాషకు భూషలు.

ఆఁకలినిఁ దీరదు అన్నమునుఁ దీరదు
తేఁకువ తనధైర్యమే తీరెఁ గాని
తాఁకక శ్రీవేంకటేశుదాసులై తేఁ జాలుఁగాని
జాఁక దీరు నిందరికిఁ గనుఁగొనో జనులు. ॥మఱి॥ 104

## రామక్రియ

చవులకుఁ జవి సంసారము
భవము నానాఁటికి పచ్చిదే. ॥పల్లవి॥

దైవికము మాస్వతంత్రముతోఁ గూడె
సావి వోదెన్నఁడు సంసారము
పూవుపిందెవలెఁ బొడమివున్నవి
యేవల యీరెండు నేకమే ॥చవు॥

పాపముఁ బుణ్యము పైపైఁ గూడుకొని
చాపకిందినీరు సంసారము
రేపుమాపువలె రెట్టించి వున్నవి
యేపొద్దు నీరెండు నేకమే. ॥చవు॥

మాయ గొంత నిజమార్గమునుఁ గొంత
చాయ దప్పదిదే సంసారము
చేయిచ్చి వున్నాఁడు శ్రీవేంకటేశుఁడు
యీయెడ నీరెండు నేకమే ॥చవు॥ 105

## దేవగాంధార

ఒరసి చూడఁగఁబోతే నొకటీ నిజములేదు
పొరలమేను ధరించి పొరలఁగఁ బట్టెను ॥పల్లవి॥

పాతకములట కొన్ని బలుపుణ్యాలట కొన్ని
యీతల స్వర్గనరకాలిచ్చేవట
యేతుల నందుఁగొన్నాళ్లు యిందుఁగొన్నాళ్లు గహాఁ
పోతరించి కాతరించి పొరలనే పట్టెను ॥ ఒర ॥

పొలఁతులట కొందరు పురుషులట కొందరు
వెలుఁగును జీఁకట్లు విహారమట
కలవరింతలు గొంత ఘనసంసారము గొంత
పొలసి జీవులు రెంటాఁ బొరలఁగఁబట్టెను. ॥ ఒర ॥

వొక్కవంక జ్ఞానమట వొక్కవంకఁ గర్మమట
మొక్క ఇహపరాలకు మూలమిదట
తక్కక శ్రీవేంకటేశు దాసులై గెలిచిరట
పుక్కట నిన్నాళ్లు రెంటాఁ బొరలఁగఁ బట్టెను ॥ ఒర ॥ 10౮

భూపాళం

మదించినయేనుగను మావటీఁడు దిద్దినట్టు
త్రిదశవంద్యుఁడ నీవే తిప్పఁగదే మనసు ॥ పల్లవి ॥

నేరమి సేసినవాఁడు నిక్కపుఁజేలికఁ గని
తారి తారి యిందు నందు దాఁగినయట్టు
తీరని పంచేంద్రియాలదిమ్మరియై తిరిగాడి
కోరి నీపై భక్తియంటే కొలువదు మనసు ॥ మదిం ॥

పగసేసుకొన్నవాఁడు బలుమందసములోన
వెగటుజాగరముల వేగించినట్టు
మిగుల వేదమార్గము మీరి పాపమునఁ జిక్కి
జిగి నిన్నుఁ జేరుమంటేఁ జింతించీ మనసు. ॥ మదిం ॥

నిరుఁజేదయైనవాఁడు నిధానము వొడగని
గరిమ భ్రమసి యట్టె కాచుకున్నట్లు
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నిన్నుఁ బొడగని
వెరవున నీగుణాలు వెదకీని మనసు ॥మది॥ 107

రేకు 220 గుజ్జరి

అయ్యో సదా మత్తుఁడను హరి నీదాసులు నన్ను
ఇయ్యెడనే దయఁజూచి యీడేర్చిరిగాక. ॥పల్లవి॥

తెగక కన్నులుమూసి దేహము మఱచేవాఁడ
నిగిడి దేవుఁడవని నిన్నెరిఁగేనా
తగఁ బసిఁడిచూచి నే ధర్మము మరచేవాఁడ
జగతి విజ్ఞానము సరవెరిఁగేనా ॥అయ్యో॥

వలచి సతులనేటివలలఁ బడేటివాఁడ
మలసి తప్పించుక నీమాయ దాఁటేనా
వెలయ నన్నిఁ జదివి వివేకమొల్లనివాఁడ
చలివాసి నీభక్తి చవిగొనేనా. ॥అయ్యో॥

మించుసంసారము చొచ్చి మీఁదు దెలియనివాఁడ -
నంచ నీ వంతర్యామి వని మొక్కేనా
యెంచక శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
మంచిదాయ నిఁక నిది మానలొయ్యేనా ॥అయ్యో॥ 108

గుండక్రియ

గోవింద హరి గోవింద గునిసి యాడుదం బిటురారో
ఆవటించి మన నెట్టు గడచెదము ఆశ్చరియం బిది హరిమాయా ॥పల్లవి॥

కర్మానుగుణము కాలము
ధర్మానుగుణము దైవము
మర్మము రెంటికి మనుజుఁడు
అర్మిలిఁ బొదిగీ హరిమాయా. ॥గోవిం॥

అజ్ఞానహేతువు లాసలు
విజ్ఞానహేతువు విరతొకటి
౧తజ్ఞుల రెంటఁదగిలిరి (?)
జిజ్ఞాను (సు?) గప్పెను శ్రీహరిమాయా. ॥గోవిం॥

సకలకారణము సంసారము
ప్రకటకారణము ప్రపంచము (?)
అకటా శ్రీవేంకటాద్రీశుదాసులు
వోకరిఁ దడవదువో హరిమాయా ॥గోవిం॥ 109

శంకరాభరణం

ఉడివోనిసంసారాస నున్నారము ౨నట్ట-
నడుమాయ నవ్వులకు నాబ్రతుకు ॥పల్లవి॥

పుట్టనిజన్మము లేదు పొందనిభోగము లేదు
నెట్టన మాయలఁ జిక్కి నేఁ దొల్లి
కొట్టఁగొన కెక్కలేదు కోరి మొదలను లేదు
నట్టనడుమ నున్నది నాబ్రదుకు ॥ఉడి॥

చొరనిలోకము లేదు చూడనివిద్యలు లేదు
నిరతి మాయలఁ జిక్కి నేఁ దొల్లి
దరిచేరుటా లేదు తగులు లేదు నానాఁడు
నరకమే కురిసీని నాబ్రదుకు. ॥ఉడి॥

౧. ప్రాసభీతితో 'తద్జులు' 'తజ్ఞులు' అయినట్టున్నది
౨. శః 'నట్ట' పూర్వముద్రితములో తప్పిపోయినది

చేయనికర్మము లేదు చెందని ఫలము లేదు
 నీయిచ్ఛామాయలఁ జిక్కి నేఁ దొల్లి
యీయెడ శ్రీ వేంకటేశ యిట్టె నీవు నన్నేలఁగా
 నాయిచ్ఛ సఫలమాయ నాబ్రదుకు. ॥ ఉడి ॥ 110

గుండక్రియ

ఒక్కటితరువాత వేరొకటై కాచుకుండు
 చక్కఁ దెరనాటకముసంగతి సంసారము. ॥ పల్లవి ॥

వొండె నాపద దీరితే నొండె సంపదైనా వచ్చు
 అండ నెన్నఁడుఁ దీరదు హరిఁ దలఁచ
తండోపతండములై తలమోపులు పనులు
 చండిపెట్టి పనిగొను సంసారము. ॥ ఒక ॥

పాప మొల్లనంటేను బలుపుణ్యమై తగులు
 యేపొద్దుఁ దీరదు హరి నిటు దలఁచ
వోపనన్నాఁ బోనీదు వూరకైనఁ బనిగొను
 చాపకిందినీరువలె సంసారము. ॥ ఒక ॥

పగలెల్లా నలసితే పైకొను రాతిరి నిద్ర
 అగపడ దెప్పుడును హరిఁ దలఁచ
తగిలి శ్రీవేంకటాద్రిదైవమే పొడచూపఁగా
 జగడము ౧సంతమాయ సంసారము ॥ ఒక ॥ 111

ముఖారి

ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు
 వేడుక సంతసములు వెల్లవిరియాయను. ॥ పల్లవి ॥

---

౧. శాంతశబ్దభవము కావచ్చు. అర్థమూ అదే.

కమలనాభుఁడు పుట్టెఁ గంసునిమదమణఁచ
 నిమిరి దేవకిదేవిదేహమందును
 అమరులకు మునుల కభయమిచ్చె నితఁడు
 కొమరెగొల్లెతలపైఁ గోరికలు నిలిపె ॥ ఆడ ॥

రేయిఁ బగలుగఁ జేసి రేపల్లెఁ బెరుగఁజొచ్చె
 ఆయెడ నావులఁ గాచె నాదిమూలము
 యీయెడ లోకాలు చూపె నిట్టె తనకడుపులో
 మాయసేసి యిందరిలో మనుజుఁడై నిలిచె ॥ ఆడ ॥

బాలలీలలు నటించి బహుదైవికము మించె
 పాలువెన్నలు దొంగితెఁ బరమమూర్తి
 తాళి భూభార మణఁచె ధర్మము పరిపాలించె
 మేలిమిశ్రీవేంకటాద్రిమీఁద నిట్టె నిలిచె ॥ ఆడ ॥ 11౭

ధన్నాసి

అంతవాని కింతసేయ నమరునటే
 వింతలు యీసుద్దులకే వెరగయ్యీ మాకు. ॥ పల్లవి ॥

కదిసి బ్రహ్మాండములు గర్భములోనున్న దేవుఁ—
 డిదె దేవకిగర్భాన నెట్టు పుట్టెనే
 అదె మఱ్ఱాకుమీఁదట నటు పవ్వళించువాఁడు
 యెదుట యశోదచేత నెట్టు వినోదించీనే. ॥ అంత ॥

అడుగులుమూఁట లోకా లటు గొలచినవాఁడు
 బడిబడి రేపల్లెఁ బారాడీని
 అడరి యజ్ఞభాగము లారగించేదేవుఁడు
 నడితో వెన్న ముచ్చిలి చపిగొనీ నిదివో ॥ అంత॥

వేదపల్లవములందు విహరించేదేవుఁడు
సాదుగొల్లెతల రతిసంగడిఁ జిక్కె
మోదపువైకుంఠాన ముదమందేకృష్ణుఁడు
యీదెస శ్రీవేంకటాద్రి నిరవాయ నిదివో ॥ అంత ॥ 113

రేకు 241 లలిత

చూడ నరుదాయనమ్మ సొరిది నందరికిని
వేడుకతో వచ్చి సేవించేరు బ్రహ్మాదులు ॥ పల్లవి ॥

కోరి చంద్రుఁడుదయించ గోకులచంద్రుఁడు వుట్టె —
నేరితి నీతఁడు నాతఁ డేమౌదురో
వారిధిఁబొడు కతఁడు వారిధియల్లుఁ డీతఁడు
యీరీతి నీతఁ డాతని కేలికాయఁగాని ॥ చూడ ॥

నల్లనివాఁ డీతఁడాయ తెల్లనివాఁ డతఁడాయ
యెల్లవారికిఁ జూడ వీ రేమౌదురో
అల్లాతఁడే యమృతము అమృతనాథుఁ డీతఁడు
చల్లనైనహరితోడ సరిగాఁడుగాని. ॥ చూడ ॥

అతఁడు పూర్వాద్రిమీఁద నమరెఁ నిందరుఁ జూడ
నీతఁడు శ్రీ వేంకటాద్రి నిరవైనాఁడు
యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్యమెప్పు డీతఁడు సింగారవిభుఁడుగాని ॥ చూడ ॥ 114

దేసాక్షి

దేవత లెందున్నవారో దిష్ట మెవ్వారిఁ గానము
యీవలఁ దామే కలితే నేమని రావలదా ॥ పల్లవి ॥

పరమేదో ఇహమేదో బదికేజీవులకెల్ల
నరకపుదేహాలలో నానుచున్నారు
అరసి పుట్టించినట్టిఆజుఁ డెందు దాఁగినాఁడో
సరి గాన మెవ్వరిఁ గొసరేమంటేను. ॥ దేవ ॥

యేమి గలి గేమి సెల వెన్నటికో తమమేలు
యీమేరఁ బ్రాణులు మాయ నీఁదుచున్నారు
భూమికి దిక్కైనవారు పొడచూపి కావవద్దా
దీముగా నిలువలేరు తెలిసేనుంటేను. ॥ దేవ ॥

తుద యేడ మొదలేడ ౧తొంగిచూచేవా రెవ్వరు
అదె సంసారానఁ బ్రాణు లాడుచున్నారు
ఇదె శ్రీవేంకటేశ్వరుఁ డింతలో విచ్చేసి కాచె
యెదుట రక్షకుఁడై తే నిట్టుండవలదా. ॥ దేవ ॥ 115

సామంతం

నీవు దేవుఁడవు నేనొక జీవుఁడ
యీపిధి నిద్దరి కెంతంతరువు. ॥ పల్లవి ॥

పొడమినజగములు పుట్టెడిజగములు
గుడిగొనె మీరోమకూపముల
యెడయక నీరూప మేమని ధ్యానింతు
అడరి మీవాఁడ నే ననుటేకాక ॥ నీవు ॥

మునుపటిబ్రహ్మలు ముందరిబ్రహ్మలు
మొనసి మీనాభిని మొలచేరు
ఘనుఁడవు ని న్నేగతి నేఁ దెలిసెద
అనువుగ మిము శరణనుటేకాక ॥ నీవు ॥

---

౧. 'తోఁగి' రేకు ఈ 'తోఁగి' రూపము ఈ వాఙ్మయమున పలుతావుల గలదు.

సహజానందము సంసారానంద-
మిహముఁ బరముగా నిచ్చేవు
అహిపతి శ్రీవేంకటాధిప నీకృప
మహిలో సేవించి మనుటే కాక ॥ నీవు ॥ 116

ధన్నాసి

శరణాగతవజ్రపంజరుఁ డీతఁడు చక్రధరుఁ డసుర సంహారుఁడు
వెరవుతోడఁ దను శరణనువారివెనుబల మీతఁడే రక్షకుఁడు. ॥ పల్లవి ॥

హరినామోచ్చారణఁ దెగనికర్మ మవల వేరొకటున్నదా
అరసి యెందు నమ్మికచాలక ప్రాయశ్చిత్తంబులు చెప్పెదురు
ధర నెరఁగనివా రేమనినాఁ దామసులగొడవ యేమిటికి
హర హరి యంటే దురితము లణఁగెను అతఁడే మాకిఁక రక్షకుఁడు. ॥శర॥

శ్రీపతి దిక్కయి కావఁగ మరియును జేరనిసంపద లిఁకనేవి
చాపలబుద్ధుల(లు?) నది నమ్మక విచ్చనవిడి నోములు చెప్పెదురు
తీపులు పుట్టించి యెవ్వరేమనినఁ దెలిపి వాదడువ నేమిటికి
శ్రీపతిఁ గొలిచితి చేరె సంపదలు జిగి నితఁడే మారక్షకుఁడు ॥ శర ॥

అంతరాత్మ శ్రీ వేంకటేశ్వరుఁడు అన్యము భజించఁ జో టేది
యింతట నమ్మక దేవతాంతరము లేఁటేఁటివో మరి చెప్పెదురు
యెంత లేదు ప్రాకృతజనములభ్రమ యెవ్వరిఁ గాదన నేమిటికి
యింతకు శ్రీవేంకటేశుదాసులము యీతఁడే మా కిఁక రక్షకుఁడు.
॥శర॥ 117

లలిత

వెదకినఁ దెలియదు వెనకముందరలు
పదమున నిలుపవె పరమాత్మా. ॥ పల్లవి ॥

కోరిక లూరక కొనలు సాగఁగా
జారలు చాఁచీఁ బ్రపంచము
యీరీతి జీవులు ఇలఁ బొడమఁబొడమ
దూరం బాయను తొలుతటిరాక. ॥ వేద ॥

కాయపుమదములు కప్పఁగఁగప్పఁగ
ఆయము లంటీ నదె మాయ
పాయక ఇందే పనుపడి పనుపడి
చాయలు మరచిరి జంతువులు. ॥ వేద ॥

బలుశరణాగతి ప్రాణులు దలఁచఁగ
నెలవున నిలిపెను నీకరుణ
ఇలపై శ్రీవేంకటేశ్వర యిహపర—
మలవడి దొరకెను అరచేతికిని. ॥ వేద ॥ 118

భౌళి

కనకము కనకమే కడు నిమ్మినుమే
వెనక సరిదూఁగితే వెలువకురాదు. ॥ పల్లవి ॥

హరిఁ గొలిచినవారి కమరు నన్నిసుఖాలు
గరిమతో వారలభాగ్యమే భాగ్యము
తెంమరఁగుల కర్మదేహులెల్ల వీరితోడ
పురుఁడు వెట్టుకోఁబోతే పోలికలు రావు. ॥ కన ॥

భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు
నేగదేర వారలు ససినదే చేఁత
౧ తిరిగెసంసారమత్తులు తెలియక వీరివలె
వెగిసంశా నయ్యేమంటే వెరవులఁ బడవు (?) ॥ కన ॥

---

౧ వెగనిసంసారములో తిరిగేమత్తులు, హరిదాసులవలె ప్రతామంటే సరిపడ—దని భావమా ?

శ్రీవేంకటేశుదాసులు చేసినదెల్లా సృష్టి
యేవంకా ధ్రువపట్టమే ఇటు వారికి
కావరపు మనుజులు గలిగనేమని వారి —
తోవల నడవఁబోతేఁ దూఁగదు తమకును ॥కన॥ 119

రేకు 222 సామంతం

ఇందునే వున్నది యెఱుకయు మఱపును
చందమిదివో ఇకఁ జదివెడిదేది ॥పల్లవి॥

అంది కర్మముల ననుభవింపుచును
ముందర మరి సుఖములు గోరు
కందువ నీదేహి కనియుం గానఁడు
౧దిందుపడ(?)నోరులు తెలిపెడి దేది ॥ఇందు॥

వొకచేత పోయ ముడుగక కడుగును
వొకచేత భుజించు నోగి రుచులు
అకటా దృష్టం బరచే నుండఁగ
సకలము నుపదేశము లిఁక నేవి ॥ఇందు॥

మలయుభోగములు మాయలని యెరుఁగు
నిలిచిన మోక్షపునిజ మెరుఁగు
యిలపై శ్రీవేంకటేశుఁడు గలఁ డిదె
బలిమి గలిగె నిఁకఁ బదరెడిదేది. ॥ఇందు॥ 120

లలిత

పురుషోత్తముఁడ నీవే పుణ్యము గట్టుక నన్ను
దరిచేర్చి రక్షించి దయఁజూడఁగదవే. ॥పల్లవి॥

౧. దిందుపడన్="అజ్ఞానము మాసిపోవునట్లుగా" కావచ్చునేమో.

ధరలో యాచకునకు ధర్మాధర్మము లేదు
పికులఁ గాముకునికి సిగ్గు లేదు
పరమపాతకునకు భయ మించుక లేదు
విరసపుచాకైతే వివేకమె లేదు ॥పుర॥

మించినకృతఘ్ననికి మే లెన్నఁడును లేదు
చంచలచిత్తునకు నిశ్చయమే లేదు
అంచల నాస్తికునకు నాచారమే లేదు
కొంచవిమార్గుఁడ నాకు గుణమే లేదు ॥పుర॥

మదించినసంసారికి మఱి తనివే లేదు
పొదిగొన మూర్ఖునకు బుద్ధే లేదు
అదన శ్రీవేంకటేశ అలమేల్మంగదాసుఁడ—
నిదివో చనవరి నాకెదురే లేదు ॥పుర॥ ।౮।

నాళింగనాట

తిరువీధు లేఁగీని దేవతలు జయవెట్ట
హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున. ॥పల్లవి॥

కనకపుఁగొండవంటిఘనమైనరథముపై
దన జమర్దనుఁడెక్కె దరుణులతో
వినువీధిఁ బడెగె(డగ?)లు వేవేలు కుచ్చులతోడఁ
వెనగొనఁగఁ గదలె భేరులు మ్రోయఁగను. ॥తిరు॥

వరుసఁ జంద్రసూర్యులవంటిబండికండ్లతోడ
గరుడధ్వజుఁ డొరసిఁ గడు దిక్కులు
పరగు వేదరాసులే పగ్గాలు పట్టితియ్యఁగ
సరుగ దుష్టులఁ గొట్టి జయము చేకొనెను. ॥తిరు॥

అటులఁ బాటలు వింటా నలమేల్మంగయుఁ దాను
యీటున శ్రీవేంకటేశుఁ డెనసితేక
వాటపుసింగారముతో వాకిటవచ్చి సిలిచీ
కోటానఁగోటివరాలు కొమ్మకు ఇచ్చుచును ॥తిరు॥ 122

వరాళి

ఇన్నిటికి నీశ్వరేచ్ఛ యింతేకాక
తన్నుఁదానే హరి గాచు దాసుఁడై తేఁ జాలు ॥పల్లవి॥

ప్రకృతిఁ బుట్టినదేహి ప్రకృత(తి?)గుణమే కాని
వికృతి బోధించబోతె విషమింతెకాదా
పోకవిత్తు వెట్టితే పోకచెట్ల మొలచును
ప్రకటమైనవట్టిప్రయాసమె కాక. ॥ఇన్ని॥

పాపానఁ బుట్టినమేను పాపమే సేయించుఁగాక
యేపునఁ బుణ్యముతోవ యేల పట్టును
వేపచేఁదు వండితేను వెస నేల బెల్లమవును
పైపై బలిమి సేసేశ్రమ యింతేకాక ॥ఇన్ని॥

ప్రపంచమైనపుట్టుగు ప్రపంచమునకె కాక
ఉపమించ మోక్షమున కొడఁబడునా
ప్రపన్నుఁడైనవేళ భాగ్యాన శ్రీవేంకటేశుఁ-
డపుడు దయఁజూడఁగ నధికుఁడౌఁగాక ॥ఇన్ని॥ 123

సాళంగం

ఎక్కడిసుద్ది యీభ్రమనేల పడేరు
అక్కటా వోదేహులాల హరినే తలఁచరో. ॥పల్లవి॥

బలుదేవతలకునుఁ జాయదట వ్యామోహము
యిలపై నరులము నే మెంతకెంత
కలదట మునులకుఁ గడ(డు?) రాగద్వేషాలు
చలనచిత్తులము మాజాడ యిఁక నేది ॥ఎక్క॥

పరగఁ దొల్లిటివారు పంచేంద్రియబద్ధులట
నెరవుగా ముక్తులమా నేఁటివారము
అరిదిఁ బ్రపంచము మాయామయమట నేము
దురితవర్తనులము తొలఁగేమా ॥ఎక్క॥

ఘనసిద్ధగంధర్వులు కడ గానలేరట
దినమత్తులము మా తెలివేఁటిది
ఘొనలేని శ్రీవేంకటేశ్వరు శరణుచొచ్చి
మనువార మింతేకాక మరి గతియేది ॥ఎక్క॥ 124

దేసాళం

దేవదుందుభులతోడ తేటతెల్లమైనాఁడు
సేవించరో యిదే వీఁడే సింగారదేవుఁడు. ॥పల్లవి॥

బంగారుమేడలలోనఁ బన్నీట మజ్జనమాడి
అంగముతడి యొత్తఁగా నదే దేవుఁడు
ముంగిటఁ బులకడిగినముత్యమువలె నున్నాఁడు
కుంగనిరాజసముతో కొండవంటిదేవుఁడు. ॥దేవ॥

కాంతులుమించినమాణికపుదోరణముకింద
అంతటఁ గప్పురముచాతు కదే దేవుఁడు
పొంతల నమృతమే పోగై నట్టున్నవాఁడు
సంతతము సంపదలసరిలేని దేవుఁడు ॥దేవ॥

తట్టుపుణుఁగు నించుక దండిసొమ్ములెల్లాఁ బెట్టి
అట్టెలమేల్మంగ నురుతఁ గట్టి
నెట్టన నమ్మినవారినిధానమై వున్నవాఁడు
పట్టపు శ్రీవేంకటాద్రిపతియైనదేవుఁడు ॥ దేవ ॥ 125

రేకు 228 సామంతం

ఒడఁబడఁగదవో వో మనసా
పెడరేఁచి యతఁడే పెనఁగీఁగాక ॥ పల్లవి ॥

అంతయుఁ జూచిన హరిసంకల్పమే
చింతలు సిలుగులు జీవులవి
భ్రాంతివట్టి యిఁకఁ బదరఁగనేఁటికి
చెంతనతఁడు దయసేసీఁగాక. ॥ ఒడఁ ॥

౧ ఘనవిశ్వకుటుంబిని(?)కమలాక్షుఁడే
జననమం(మా?)త్రములే జంతులవి
గానకొని యిందుకుఁ గోరికలేఁటికి
వొనరించి యతఁడె వొపగీఁగాక ॥ ఒడఁ ॥

సరు లందించఁగ శ్రీవేంకటేశుఁడు
పరగు భోగములె ప్రాణులవి
మరుగక యీమేలు మఱవఁగనేఁటికి
గరిమ నీతఁ డెపుడు గలిగీఁగాక. ॥ ఒడఁ ॥ 126

దేవగాంధారి

౨ అలిమఁటిఁ జూడఁబోతే నజ్ఞాని నేను
మఱఁగు చొచ్చితి మీకు మహిలో నారాయణా ॥ పల్లవి ॥

---

౧. 'ఘనవిశ్వకుటుంబి—యీకమలాక్షుఁడే' అని కావచ్చునేమో?
౨ ఈపాటకూడ పెదతిరుమలయ్యదో చినతిరుమలయ్యదో అయి—యుండవచ్చు.

నిన్ను ధ్యానము సేసీని నిచ్చ నిచ్చఁ దాళ్లపాక—
అన్నమయ్యంగారు యెదుట నదిగోవయ్యా
వన్ని యాతనినే చూచి వాతికులమైనమమ్ము
మన్నించవయ్యా వో మధుసూదనా ॥ అది ॥

సంకీర్తనలు సేసీ సారెఁ దాళ్లపాకన్నఁగారు
అంకెల నీసన్నిధినే అదిగోవయ్యా
అంకించి నే వాఁడవాఁడనని దుష్టుఁడనైనా నా—
సంకె దీరఁ గావవయ్యా సర్వేశ్వరా. ॥ అది ॥

పాదాలందున్నాఁడు దాళ్లపాకన్నమయ్య మీకు
ఆదరాన ముక్తుఁడై యదిగోవయ్యా
యీదెస శ్రీవేంకటేశ యీసమ్మంధాననే ౧నన్ను
నీదయవెట్టి రక్షించు నెమ్మది భూరమణా. ॥ అది ॥ 127

సాళంగనాట

తప్పదు యీయర్థము ధరణిలోన
వొప్పుగ నేకచిత్తాన నుండవచ్చు నీఁకను ॥ పల్లవి ॥

కాకాసురుదోషము కడకుఁ బరిహరించి
చేకొంటివి శరణంటే చేరి మగుడ
యీకడ మానేరములు యింతకంటే నెక్కుడా
నీకే నే శరణంటి నీవు మమ్ముఁ గాతువు ॥ తప్ప ॥

౨అమ్మునవేసినవాఁడు అట్టె దండము వెట్టితే
నిమ్ముల నిహపరము లిచ్చితివి
యెమ్మెల మావంకనైతే నింతేసిచేఁతలు లేవు
నెమ్మి నీకే మొక్కితిమి నీవే మమ్ముఁ గాతువు. ॥ తప్ప ॥

౧. ఈ ‘నన్ను’ పూర్వముద్రణములో తప్పిపోయినది.
౨. ఇది కృష్ణావతార విషయము.

వెరులఁ గొలిచి వచ్చి ప్రాణాచారాలువడితే
సిరుల వరాలిచ్చేవు శ్రీవేంకటేశా
వొరులఁ గొలువము నే మొగి నీసొమ్మౌటే నమ్మి
నిరతిఁ గొలిచేమి నీవే మమ్ముఁ గాతువు ॥తప్పు॥ 128

కాంబోది

ఏడ పెద్దల మెచ్చితిమో మరి
తోడనే నవ్వేము దొరకొ నమ్మను. ॥పల్లవి॥

పంచేంద్రియములఁ బట్టఁగ లేమట
యెంచఁగ వివేక మెన్నటికి
అంచెల మమతల సణఁచఁగలేమట
పొంచినబుద్ధుల పుట్టు వెన్నటికి ॥పద॥

వెడవెడ నాసలు విడువఁగలేమట
యెడయనిధైర్యం బెన్నటికి
తొడుసగుబంధముఁ దుంచఁగలేమట
బెడిదపుతనలో విరుదెన్నటికి ॥పద॥

కామక్రోధములఁ గడవఁగలేమట
యీమానుషములు యెన్నటికి
కామించ శ్రీవేంకటపతి గలఁడట
నేమపుతపముల నే మెన్నటికి ॥పద॥ 129

లలిత

ఇదిగాన తనధర్మ మించుకా పగలుగాదు
వుదుటున వారివారై వుండవలెఁగాసి. ॥పల్లవి॥

జాతిచండాలము దీరు జన్మాంతరములను
యేతులఁ గర్మచండాల మెన్నఁడూఁ బోదు
యీతల స్వర్గము చేరనియ్యకుండఁగాఁ ద్రిశంకుఁ —
డాతలఁ దాఁ బ్రతిస్వర్గమందు నున్నాఁ డదివో ॥ ఇది ॥

ఆస్తికులయినవారు అట్టె రామునిఁ గూడిరి
నాస్తికు లసురకుఁ బ్రాణము లిచ్చిరి
ఆస్తికనాస్తికుఁడై తా నం దెవ్వరివాఁడూఁగాక
కస్తిఁబడి వాలి వృథాకలహానఁ బొలిసె. ॥ ఇది ॥

యింక నొక్కటి గలదు యెదుటనే వుపాయము
అంకెల శ్రీవేంకటేశుఁ డందే వున్నాఁడు
సంకెదీర నీతనికి శరణుచొచ్చి వరాలు
పొంకనుగాఁ జేకొనేరు భూజనులు నేఁడును ॥ ఇది ॥ 190

౧ శంకరాభరణం

నలినాక్ష నీకు నమస్కరించిన —
ఫలము వొగడ నిఁక బ్రహ్మకు వశమా. ॥ పల్లవి ॥

పూర్వదోషములఁ బోఁదోలి మఱియు
సర్వాపచారము క్షమియించి
గర్వితమదముల కసటు వాపి నను
నిర్వహించె నిదె నీనామము ॥ నలి ॥

నేఁడునుఁ జేసిననేరము లణఁచి
వేఁడికర్మముల విడిపించి
వాఁడిదుఃఖముల వడిఁ బరిహరించె
నాఁ డెఱఁగఁగ నీనామము. ॥ నలి ॥

వుమ్మడి సుఖముల నొనరించీ మాకు
సమ్మతిశుభములు జయమొసఁగీ
యిమ్ముల శ్రీవేంకటేశ్వర యిదివో
నెమ్మది రక్షించె నీనామము. ॥ వలి ॥ 131

రేకు 224 దేసాళి.

జాలి ౧మోహినిగజము సంసారమిది
లోలుఁడఁ గాకపోదు లోకముసహజము(?) ॥ పల్లవి ॥

నేరమెల్లా జీవునిది నేరుపెల్లా దేవునిది
దారదప్పి విట్టుపిఁగఁ దనకేల
కారణ మాతఁడు దాఁ గార్యమాత్ర మింతే
కూరుఁడై వెంటాఁ జొరక చూచుటే సుఖము. ॥ జాలి ॥

ప్రకృతి కాతుమ దాను పరమాత్ముఁ డాతఁడు
తకపికలై మురియఁ దనకేల
సకలము నాతఁడు సత్తామాత్రము దాను
వొకటిఁ గోరక వూరకుండుటే సుఖము ॥ జాలి ॥

సేవించఁ దనకుఁ గద్దు శ్రీవేంకటేశుఁ డాతఁడు
దావతిఁ గర్మపుఁబాటు తనకేల
శ్రీవిభుఁ డాతఁడు దాను చేతనమాత్ర మింతే
కేవల మాతనివాఁడై గెలుచుటే సుఖము ॥ జాలి ॥ 132

నాట

బాపు బాపు రాఘవ నీప్రతాప మేమనిచెప్ప
పైపై నీపేరు విని పారేరు రాకాసులు ॥ పల్లవి ॥

---

౧. పెద్ద మోహశక్తి అని యర్థమా?

వాలినెత్తుర నీటను వాఁడిపదనిచ్చినమ్ము
కూలిచె నొక్కమాటునఁ గుంభకర్ణుని
యీలకోని మాయామృగ మెమ్మలనొరసినమ్ము
రాలించె నుత్తరగోపురముపై గొడగులు ॥బా॥

తొడిక మింటితావలు తుంచి దూప(?)దాఁకినమ్ము
జడధిమరుదేశాల జల మింకించె
యొడయక కౌశికునియజ్ఞముగాచినమ్ము
అడరి రావణుని పూర్ణాహుతిగఁ జేసెను ॥బా॥

సెరసి యేపొద్దును నీపిడికిటిలోనియమ్ము
సురలభయముఁ బాపి నూటికెక్కెను
ఒరవై శ్రీవేంకటాద్రి నిటు మునీంద్రుఁడవై
పరగఁగ నీయమ్ము పగయెల్ల నీఁగెను ॥బాపు॥ 1

లలిత

ఎటుమారు వారమేల పంతమేమివచ్చె ని(మీ?)కు
చలమో ఫలమో సాధించుకోరయ్యా ॥పల్లవి॥

ధరమీఁదఁ జేయఁబోతే తగు పుణ్యాలు లేవా
హరిదాసుఁడయ్యేపుణ్య మందుటగాక
సురలు బ్రహ్మాదులును చూడఁగా నేపాడవున
తిరమై యున్నారో తెలుసుకోరయ్యా ॥పలు॥

ఎవ్వుదాఁకా సలిగెలు మహిమలు లేవా
శ్రీపతిదాసులై యంత చెల్లదుగాక
చేపడినమాత్రమున చేటులేనిపదవుల
యేపున నెవ్వ రున్నారో యెరుఁగరయ్యా ॥పలు॥

---

'దూపి' కావచ్చునా? దూప=దాహము కలుగునట్లు కావచ్చునా?

యెవలఁ గొలువఁబోతే నెందరు దైవాలు లేరు
శ్రీవేంకటేశ్వరుని రక్షించరుగాక
కోపరమై యేఁటనేఁటాఁ గోరి నరకు లకుఁగా
గావించి కరుణవచ్చేకత చూచుకోరయ్యా ॥పలు॥ 134

శుద్ధవసంతం

౧నగుఁబాట్లకు లోనై నడచుఁగాక
అగపడి పరసుఖ మందఁబోయీనా ॥పల్లవి॥

కడిగేది వొకచేత కష్టమే దినదినము
కుడిచేది వొకచేతఁ గోరినవెల్లా
యెడయక తనసిగ్గు యెరఁగని యీదేహి
అడరి హరిసుహిమల నెరఁగీనా ॥నగు॥

కొద్దనుండి రాతిరెల్లా వొడలేమి నెరఁగఁడు
పొద్దువొడచినమీఁద భోగమే కోరు
గొద్దిమాలిగట్టితన ఘోరము విచారించఁడు
సుద్దులైనహరిభక్తి సాధించీనా ॥నగు॥

అనుభవించేటి యిచ్ఛా సంగచలమాంసమే
అనిశము సేయఁబో రొయ్యే వాచారములే
తనివోక మనసులో తలవెట్టి గానఁడు
మనుఁడు శ్రీవేంకటేశుఁ గానబోయీనా ॥నగు॥ 135

దేవగాంధారి

ధర్మాధర్మములాల దైవములాల
నిర్మితమాత్రులే కాని నే నేమి నెఱఁగ ॥పల్లవి॥

౧ ఈపాటలో మొదటిచరణము భావమే కుడి ఎడమగ 120 వ పాట-
రెండవచరణమును దొరలినది.

పుట్టించేటివాఁడు వారి పుట్టెడివాఁడ నేను
నెట్టన నున్నపనులు నే నెఱుఁగ
వెట్టివాఁడ నే నింతే విష్ణుఁడు నాకేలికె
చుట్టిననడుమంత్రాలసుద్దులూ నెఱఁగ ॥ధర్మా॥

లోకము దేవునిమాయ లోనైనవాఁడ నేను
చేకొని కర్మములలో చేఁతలెరఁగ
సాకిరిమాత్రము నేను సర్వజ్ఞుఁడాతఁడు
దాకొని నేఁ దలఁచేటితలఁపూ నెఱఁగ. ॥ధర్మా॥

[1]అంతరాత్మ యాతఁడు ఆతనిబంట జీవుఁడ
సంతాన నాలోపలిభావ మెరఁగ
యింతయు శ్రీవేంకటేశుఁ డిటువంటివాఁడ నేను
చెంతల నానంద మిది చెప్పనేమి నెఱఁగ ॥ధర్మా॥ 136

శంకరాభరణం

పట్టి పిసుక నిఁక బనిలేదు
గుట్టు దెలిసితే గులగులలు. ॥పల్లవి॥

ఆలకించితే నంతా హేయమె
సోలి భోగములు సుజ్ఞానికి
మేలు దెలుసుకొని మెచ్చేదమంటే
[1]నాలికెఁ గడచితే నరకములు ॥పట్టి॥

యోఁచి చూచితే నింతా నెరవె
పొంచి ప్రపంచము పుణ్యునికి
దించక తిరిగేతిమ్మటలన్నియు
అంచల వెట్టులలమటలు. ॥పట్టి॥

1. ఈ పాదమంత సుబోధముగా లేదు.

పట్టినదెల్లా బ్రహ్మానందమె
గట్టిగ శరణాగతునికిని
యిట్టె శ్రీవేంకటేశుకరుణ నీఁక
పుట్టినప్పుడే భోగ్యములు. ॥పట్టి॥ 137

రేకు 225 రామక్రియ

అన్నిటా నేరుపరి హనుమంతుఁడు
పిన్ననాఁడే రవినంటె పెద్దహనుమంతుఁడు. ॥పల్లవి॥

ముట్టినప్రతాపపురాముని సేనలలోన
అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుఁడు
చుట్టి రా నుండినయట్టిసుగ్రీవుప్రధానులలో
గట్టియైనలావరి చొక్కపుహనుమంతుఁడు. ॥అన్ని॥

వదలక కూడినట్టివనచరబలములో—
నదె యేకాంగవీరుఁడు హనుమంతుఁడు
చెదరక కుంభకర్ణుచేతిశూలమందరిలో
నదరాన విరిచె భీషణహనుమంతుఁడు ॥అన్ని॥

త్రిజగములలోపల దేవతాసంఘములోన
అజునిపట్టాన నిల్చె హనుమంతుఁడు
విజయనగరాన శ్రీవేంకటేశు సేవకుఁడై
భుజబలుఁడై యున్నాఁ డిప్పుడు హనుమంతుఁడు. ॥అన్ని॥ 138

గౌళ

వివరించుకొనివారి వెట్టితన మింతేకాక
తవిలి రెంటికి గురి తామేకారా. ॥పల్లవి॥

కడుఁబాపకర్మానకుఁ గలిగినట్టిబలిమి
నడఁపుఁ బుణ్యకర్మమునకు లేదా
అడరి నరలోకమందు గలిగినవిధి
కడు మంచిస్వర్గలోకమునను లేదా ॥ఏవ॥

తప్పక బంధములను తగిలించేలోకకె
ముప్పిరిఁగొనేటిమోక్షమునకు లేదా
కప్పి యట్టె కల్లలాడఁగలిగినసాలికె
దప్పిదీర శ్రీహరిఁ దలఁచఁగలేదా ॥ఏవ॥

పంచుకొన విషయాలబారిఁ జిక్కే జీవుఁడు
అంచెలవైరాగ్యమునందు లేఁడా
పంచల నరులవెంటఁ బారాడి చేమసు
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిపింపలేదా ॥ఏవ॥ ౧౬౮

దేసాక్షి

తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడూఁ దలఁచు
కలసినబంధువుఁడు కమలారమణుఁడే ॥పల్లవి॥

ఆతుమలోననే వుండు నన్నిటాఁ బాయనివాఁడు
యీతలనాతలఁ దానే యెట్లైనా నిచ్చు
౧చేతిలోఁ జేసేకర్మాలు చెడనియ్యఁ డెన్నఁడును
ఆతురబంధువుఁడు వారి యొక్కఁడే ॥తలఁ॥

నిచ్చలు విందులు వెట్టు నెలఁతల నొడఁగూర్చు
యిచ్చెరఁగి కప్పఁ గోక లెంకైనాఁ దెచ్చు
మెచ్చు నేమిటికైనా యిచ్చినది గైకొను
ముచ్చటైనబంధువుఁడు ముకుందుఁడే ॥తలఁ॥

---

౧. "చేతితో" కావచ్చు.

తోడునీడై వచ్చి మరి దొరతనము సేయించు
పాడితోఁ బంచేంద్రియాలఁ బ పు సేయించు
మేడెపు సంసారములో మించినసిద్ర దెలుపు
వేడుకబంధువుఁడు శ్రీవేంకటేశుఁడే ॥తల॥ 140

వసంతవరాళి

నారాయణుఁ డితఁడు నరులాల
మీరు శరణనరో మిమ్ముఁ గాచీని ॥పల్లవి॥

తలఁచినచోటను తానే వున్నాఁడు
వలెననువారికై వస మెపుడు
కొలచెను మూఁడడుగుల జగమెల్లాను
కొలిచినవారిఁ జేకొనకుండునా ॥నారా॥

యెక్కడఁ బిలి(చి)నా నేమని పలికి
మొక్కిన మన్నించు మునుముగను
రక్కసుల నణఁచి రక్షించు జగములు
దిక్కనినమ్మినఁ దిరముగా నేలఁడా. ॥నారా॥

చూచినయందెల్ల చూపును రూపము
౧వాచికఁ (?)బొగడిన వుండు నోటను
యేచిన శ్రీవేంకటేశుఁడే యితఁడట
చేచేతఁ బూజింప సేవలు గొనఁడా. ॥నారా॥ 141

సాళంగనాట

కొమ్మలు చూడరే గోవిందుఁడు
కుమ్మరించీ ముద్దు గోవిందుఁడు. ॥పల్లవి॥

---

౧. 'వాచిక 'మునకు వ్యావహారికమా?

దిట్టబాలులతోఁ దిరిగి వీధుల
గొట్టి నుట్లు గోవిందుఁడు
పట్టినకోలలు పైపైఁ జాఁచుచు
౧కుట్టిఁ దూంట్లుగా గోవిందుఁడు ॥ కొమ్మ

నిలువుఁగాళతో నిడిగూఁతలతో
కోలకోలమని గోవిందుఁడు
వలసినపాలు వారలువట్టుచు
కులికి నవ్వీ గోవిందుఁడు ॥ కొమ్మ

తారలు చాఁచుచుఁ బట్టఁగ నింతులఁ
గూరిమిఁ గూడీ గోవిందుఁడు
చేరి జవ్వనుల శ్రీవేంకటాద్రిపై
గోరఁ జెనకీ గోవిందుఁడు. ॥ కొమ్మ ॥ 1

సాళంగనాట

అంజనాతనయుఁడైనహనుమంతుఁడు
రంజితపునుతంగపర్వతహనుమంతుఁడు. ॥ పల్లవి

తాకానునెల్లాఁ గొట్టి రావణుని భంగపెట్టి
౨ఆకాసము మోచె నదే హనుమంతుఁడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పె
భీకరప్రతాపపుపెద్దహనుమంతుఁడు ॥ అంజ

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాఁడు హనుమంతుఁడు
స్వామికార్యమునకే సరిఁ బేరువడ్డవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁబెద్దహనుమంతుఁడు ॥ అంజ

౧. 'కొట్టి' కావచ్చు. ౨. 'అకసము' కావచ్చునేమో?

ఉదయాస్తశైలముల కొక్కజంగగాఁ జాఁచి
అదె సూర్యుతోఁ జదివె హనుమంతుఁడు
యెదుట శ్రీవేంకటేశు కిష్టుఁడై రామజపానఁ
బెదవులు గదలించీఁ బెద్దహనుమంతుఁడు ॥అంజ॥ 143

రేకు 226 సాళంగనాట

అవధారు దేవ హరికులరామ
వివిధమై నీబంటు వెలయుచున్నాఁడు ॥పల్లవి॥

అదె కలశాపురముహనుమంతరాయఁడు
కదనములోన రక్కసులఁ గొట్టి
యెదుట నిందరిలోన నేకాంగవీరుఁడై
కొదలేక ప్రతాపించి కొలువై వున్నాఁడు ॥అవ॥

చల్లనివనాలనీడ సాగుడుఁగొండలోన
వల్లెగా వేసుకొన్న వాలముతోడ
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని
కొల్లున మంటపములోఁ గొలువై వున్నాఁడు ॥అవ॥

పెక్కుపండ్లగొలలు పిడికిటఁ బట్టుకొని
చక్కఁగాఁ బెరిగి పెద్దజంగ చాఁచి
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైనసర్వేశ
గుక్కక నీపై భక్తిఁ గొలువై వున్నాఁడు ॥అవ॥ 144

మాళవిగౌళ

రెక్కలకొండవలె మీరినబ్రహ్మాండమువలె
వెక్కసమైనతేరుపై వెలసీని దేవుఁడు. ॥పల్లవి॥

విఱువిఱుఁ దిరిగేటి పెనుబండికండ్లతో
గుఱ్ఱులైన పడగెలగుంపులతో
తఱితో ధరణి గ్రక్కదలఁ గదలెను తేరు
మెఱసీ వీధివీధుల మేఁటియైన దేవుఁడు ॥ రెక్క ॥

ధగధగమను నాయుధపు మెఱుఁగులతోడ
జిగిమించుఁ బగ్గములచేరులతో
సగటురాణువులపైఁ జారీఁదె తేరు
నిగిడ నలుదిక్కులు నీటు చూపీ దేవుఁడు ॥ రెక్క ॥

ఘణఘణమని మోఁడిగంటలరవముతోడ
ప్రణుతి నలమేల్మంగపంతాలతోడ
రణములు గెలిచి సురలెనదే తిరుతేరు
గణుతికెక్కెను శ్రీవేంకటగిరిదేవుఁడు. ॥ రెక్క ॥ 145

### దేసాళం

ఇందిరయుఁ దానుఁ గూడి యిట్టె వరాలొసఁగుతా
సందడించి దిక్కులెలా సాధించీ నిదివో ॥ పల్లవి ॥

వేదములే గుఱ్ఱములు విష్ణురథమునకు
వాదపుశాస్త్రములే తీవ్రపుఁబగ్గాలు
పాదగు పంచభూతాలే పరగుబండికండ్లు
ఆదిగొని మనోవీధులందు నేఁగీ నదివో ॥ ఇంది ॥

జీవులెల్లా సారథులు శ్రీవిభుని తేరునకు
కావించుఁ నెఱ్ఱాలు పడిగలగుంపులు
భావించఁ దనప్రకృతి పట్టపుసింహాసనము
వేవేలుసంపదలతో వెలసీ నేఁ డిదివో. ॥ ఇంది ॥

చందురుఁడు రవియును సరుసఁ బై ఁడికుండలు
    చెందినపుణ్యములెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
    కందువల మెరయుచు కరుణించీ నిదివో ॥ఇంది॥ 146

ఆహిరి

పన్నవము లేమిసేసే వేగినంతాను
    మన్నించి రక్షించెనీమహిమలే ఘనము ॥పల్లవి॥

నీవంక నేరమిగద్దా నేనే అపరాధిని
    దేవ నే జడుఁడఁగాన తెలుసుకోను
వావాత మీగురుఁ డాదేవాక్యము నీయాధీనము
    పావనమైననీపలుకెల్లా సత్యాను. ॥విన్న॥

మంచితనమల్లా నీదె మాయదారవాఁడ నేను
    చంచలుఁడఁ గనక విచా(చా?)రించుకోను
అంచల నీదాసునిఆనతి యమోఘము
    యెంచ నీవిచ్చినవర మెం(మిం?)దుకంటే బలువు. ॥విన్న॥

కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది
    నరుఁడఁగనక అట్టె యరసుకోను
పరగ మాజనకుని ప్రతిజ్ఞ యు నీపంపు
    నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము ॥విన్న॥ 147

రామక్రియ

మొక్కరయ్యా అన్నిటికి మూల మీతఁడు
    చుక్కలు మొలపూసలై సొంపుమీరీ నితఁడు. ॥పల్లవి॥

అదె కలశాపురహనుమంతుఁడు
పుదయార్క ఫలమని వొగ్గుచున్నాఁడు
వుదుటు బాలక్రీడ నుబ్బుచున్నాఁడు
మదించి రామునిబంటై మలయుచున్నాఁడు. ॥ మొక్క

జలనిధి కొకజంగ చాఁచుకున్నాఁడు
యిలఁ బ్రతాపమునఁ జేయెత్తుకున్నాఁడు
బలువాల మల్లార్చి పట్టుకున్నాఁడు
వెలయఁగఁ గీలుగంటు వేసుకున్నాఁడు ॥ మొక్క

సరుగ లంకారాజ్యము సాధించినాఁడు
అరిది సీతకు సేమ మందించినాఁడు
నిరతి శ్రీవేంకటాద్రినిలయునికి
పరగిన సేవలనుఁ బ్రబలుచున్నాఁడు ॥ మొక్క ॥ 14

శంకరాభరణం

అక్కలాల చూడుఁ డందరును
నిక్కి వారవట్టీ నేఁడు కృష్ణుఁడు ॥ పల్లవి ॥

ఆనవాలవుట్టి అడుకులవుట్టి
పానకపుటుట్టి బలిమినే
అనుక కోలల నందియంది కొట్టి
౧తేనెవుట్టి(?)గొట్టీ దేవకీసుతుఁడు ॥ అక్క

పెరుగువుట్టి మంచిపేరిన నేతివుట్టి
సరివెన్నవుట్టి చక్కెరవుట్టి
వెరవుతోఁ గొట్టి వెస బాలులతో
౨పొరుగువుట్టి(?)గొట్టీ పొంచి రాముఁడు ॥ అక్క ॥

౧ 'తేనెవుంచినవుట్టి' కావచ్చు ౨ 'పొరుగింటివారివుట్టి' కావచ్చు

మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు
చొక్క శ్రీవేంకటేశుఁడు వీధుల
నిక్కవుట్లెల్లా నిండాఁగొట్టి౧ వుట్టి(?)—
చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు. ॥ అక్క ॥ 149

రేకు 227 దేసాళం

పచ్చిదేరుచు నుట్ల పండుగాయను
గచ్చులకు గొల్లెతలు కాఁగిలించిపట్టఁగా. ॥ పల్లవి ॥

పితాంబరముమీఁద పెద్దకిరీటముమీఁద
నేతిపాలచారలెల్ల నిండె నదివో
జాతిగొల్లెతలవుట్లు సారెఁ గోలలెత్తి కొట్టి
చేతులుదాఁచారగించి చిమ్మి రేఁగఁగాను ॥ పచ్చి ॥

సొరిది సొమ్ములమీఁద సోయగపుచెక్కులపై
పెరుగులు మీఁగడలు సేరుకొనెను
అరుదుగ వీధులను అందరివుట్లు గొట్టి
దొరతనములతోడ దొమ్మిసేయఁగాను ॥ పచ్చి ॥

పూని శ్రీవేంకటేశుపై ౨పొందె(దియ?)లమేలుమంగపై
తేనెలునుఁ జక్కెరలుఁ దెట్టెగట్టెను
నానావిధములను నడును నుట్లు గొట్టి
ఆనందాన నారగించి అలరుచుండఁగను. ॥ పచ్చి ॥ 150

ధన్నాసి

విఁడె వీఁడె కూచున్నాఁడు వేడుకతో గద్దెమీఁద
వాఁడి|ప్రతాపముతోడి వరదానసింహము. ॥ పల్లవి ॥

---

౧ 'వుట్టిలోనున్నచక్కిలాలు' కావచ్చు పాటలో అంతటా వుట్టిశబ్దమును సమాసాంతములోవాడి ఇక్కడమాత్రము పూర్వపదముగా వాడుట వింత.

౨ పొందెలమేలుమంగ' రేకు పొంది + అలమేలుమంగ = పొందెలమేలుమంగ ఈ సంధు లీవాఙ్మయమున కొల్లలు

అరయఁ బ్రహ్లాదుని౧ ఆపదోద్ధారసింహము
గిరిపై యిందిరకును క్రీడాసింహము
నిరతి ౨ సురలభయనివారణసింహము
నరి హిరణ్యకశిపుసంహారసింహము. ॥ వీఁ

ఇన్నిటా విశ్వమునకు నేలికైనసింహము
గట్టిగ శరణాగతులఁ గాచేసింహము
దిట్టయై వేదాలలోని తెరవేఁటసింహము
నెట్టుకొనినదురితనివారణసింహము ॥ వీఁ

అంచల మూఁడుమూర్తులకాధారమైనసింహము
పంచల మునులభాగ్యఫలసింహము
పొంచి శ్రీవేంకటాద్రికి భూషణమైనసింహము
చెంచుల అహోబలపు శ్రీనారసింహము ॥ వీఁడె ॥ 1

లలిత

సర్వసులభుఁ డితఁడు సర్వేశ్వరుఁడు
గర్వముఁ బాసితేను కానవచ్చు నితని ॥ పల్లవి

చింతలెల్లా నుడిగితే శ్రీపతి యందేవుండు
మంతనాన నుండితేను మరి నాతఁడే
పంతపువుబ్బు మానితే పరమాత్ముఁడు దోడాలు
వింతలు దలఁచకుంటే విశ్వరూపమే ॥ సర్వ

వెడకర్మాలు దోసితే విష్ణునిసాన్నిధ్య మబ్బు
కడునాస లొల్లకుంటే కలఁ డాతఁడు
వొడ లోముకొనకుంటే వుపేంద్రుఁడు రక్షించు
పొడిఁబడకుంటేనే పూర్ణభావ మలరు. ॥ సర్వ

౧ 'ఆపదుద్ధార' కావచ్చు 'అపదోద్ధార' వ్యావహారిక ప్రయోగము.
౨ "సురల కభయ వివారణసింహము" పూ ము పా

ఇతర మెఱఁగకుంటే యిందిరానాథుఁడు మెచ్చు
సతిబారిఁ బడకుంటే జంటౌ నాతఁడు
హీనవులు గోరకుంటే నెదుట ¹శ్రీపతి నిల్చు
జితేంద్రియవ్రతమందే శ్రీవేంకటేశుఁడు. ॥సర్వ॥ 152

నాట

నానాటికిఁ బెరిగెని నరసింహాము
ఆనుక వరములిచ్చీ సౌభళపుసింహాము ॥పల్లవి॥

వేఁడిప్రతాపముతోడ విభవాలు మెఱయుచు
మూఁడుమూర్తులొక్కటైనముఖ్యసింహాము
వాఁడివాఁడికోరలతో పెడ నసుగఁ జక్కాడి
తీఁడేటి²మీసాలతోడిదేవ దేవసింహాము ॥నానా॥

పరుస శంఖచక్రాదిసకలాయుధాలు పట్టి
పరబ్రహ్మమే తానైనపటుసింహాము
వరుసఁ గొలువులు దేవతలెల్లాఁ జేయఁగాను
తిరమైనకృపతోడి దివ్యసింహాము ॥నానా॥

కేలిసింహాసనముపై కిరీటము ధరియించి
చాలు వేయిచేతు కాంచనసింహాము
పాలించీ ప్రహ్లాదుఁ భక్తుం గాలిటి ³కీలు—
వేలుపై శ్రీసతితో శ్రీవేంకటాద్రిసింహాము ॥నానా॥ 153

మాళవి

ఎందుజూచినా నీవే ఇదివో నీప్రతాపము
నందకధరుఁడ నీకు నమో నారసింహా ॥పల్లవి॥

---

౧. 'శ్రీసతి' పూ. ము. పా.
౨. 'మీసాలతోడి దేవసింహాము' పూ. ము. పా. ఈ పాఠములో ఒక 'దేవ' శబ్దము తప్పిపోయినది. ౩ 'కీలువేలుపు' పూ. ము. పా.

అచ్చలపు బ్రహ్మాండ మది నీకుఁ బెద్దగుహ
చెచ్చెర నహోబలాద్రి సింహాసనము
అచ్చుటఁ గనకదైత్యుఁ డాహారపు మెగము
విచ్చనవిడిఁ జెలఁగు విజయనారసింహ ॥ ఎంద

జలధు లేడును నీకు జలకపుమడుగులు
అలరి భూమెల్లా విహారదేశము
కెలన రెలుఁబగళ్లు కిందిమీఁది రెప్పలు
వెలయఁగ విహరించు విజయనారసింహా. ॥ ఎందు

చక్కటి శ్రీమహాదేవి జంటైనఆడుసింహము
నిక్కపుదేవతలెల్లా నీపిల్లలు
యెక్కువై శ్రీవేంకటాద్రి నిన్నిటా భోగించేవు
వెక్కసమై మమ్మేలుకో విజయనారసింహ ॥ ఎందు ॥ 16

శ్రీరాగం

శరణు వేఁడెద యజ్ఞసంభవ రామ
అరసి రక్షించు మమ్ము నయోధ్యారామా. ॥ పల్లవి

ధారుణిలో దశరథతనయ రాము
చేరినయహల్యను రక్షించినరామ
వారిధిబంధన కపివల్లభ రామ
తారకబ్రహ్మమైనసీతాపతిరామా. ॥ శర

ఆదిత్యకులాంబుధిమృగాంక రామ। హర—
కోదండభంజనముచేకొనినరామ
వేదశాస్త్రపురాణాదివినుత రామ
ఆదిగొన్నతాటకాసంహార రామా ॥ శర ।

రావణునిఖండించిన రాఘవ రామ
వావిరి విభీషణవరద రామా
సేవ నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడవై
యీవల దాసులనెలా నేలినట్టిరామా ॥శర॥ 155

రేకు 228 సామంతం

ముందరఁ గలదని మోసపోతి నిదె
యిందునే తుదిపద మెక్కితినా. ॥పల్లవి॥

కాయము మోచితి ౧ఘడన గడించితి
చేయారఁబుణ్యము సేసితినా
పాయము గైకొంటి పలురుచు లెరిఁగితి
రోయఁదగిన విల రోసితినా ॥ముంద॥

నిదుర మేల్కనితి నిక్కల గంటిని
హృదయపువిజ్ఞాన మెఱిఁగితినా
చదువులు చదివితి జపములు సేసితి
మది చంచలములు మానితినా ॥ముంద॥

అందరిఁ గొలిచితి నన్నియుఁ జూచితి
నెందునైన మే లెఱిఁగితినా
కందువ శ్రీవేంకటపతి నీవే
చెంది కాచితివి చెదరితినా ॥ముంద॥ 156

శంకరాభరణం

సీతారమణ వో శ్రీరామచంద్ర దా—
దాత లక్ష్మణుఁ డదే తగు రామచంద్ర ॥పల్లవి॥

౧ 'గరన' కావచ్చు

చెలువపుసింగారాల శ్రీరామచంద్ర నీ—
సెలవుల నవ్వు గారీ శ్రీరామచంద్ర
చెలఁగీ చెక్కుటద్దాల శ్రీరామచంద్ర
మొలచె మోహనము నీమోమున రామచంద్ర. ॥ సీతా ॥

ఎక్కువనిమురి పెదవుల శ్రీరామచంద్ర
చిక్కులేదు పెద్దకొప్పు శ్రీరామచంద్ర
చిక్కె నీచే మగనుఁడు శ్రీరామచంద్ర
చొక్కపుసున్న నీమేనిసొంపు రామచంద్ర. ॥ సీతా ॥

సేవ దేరీ సిగ్గుల శ్రీరామచంద్ర
శ్రీవేంకటాద్రిపతి శ్రీరామచంద్ర
యీవల దాసరి పెళ్లినివకు కొన్న మీ—
సేవకుల మమ్ము నేలే శ్రీరామచంద్ర ॥ సీతా ॥ 167

దేవగాంధారి

ఎందు నైనా మీరఁబోతే నెవ్వరికిఁ జవిగాదు
యిందరిలోఁ దనకొలఁ దెంచుకొనవలెను ॥ పల్లవి ॥

మంచితనమె వలె మాటలాడేయప్పుడెల్లా
కొంచి కొంచి యుండవలె కోపపువేళ
వంచన యెప్పుడూవలె నరుస ఘనులఁ గంటే
చంచలము గానవలె సతతము దేహికి. ॥ ఎందు ॥

ప్రియయుకుఁ డఁగవలె పెడఁతులఁ గంటేను
తప కించకుండవలె అన్నఁ దిట్టితే
సుముఖుఁడై యుండవలె చూచినవారికి నెల్ల
అనరియుండఁగవలె నిన్నిటాను దేహికి ॥ ఎందు ॥

కైవశమై యుండవలె ఘనపుణ్యములకెల్ల
దైవము నమ్మఁగవలె తను వెత్తితే
యీవల శ్రీవేంకటేశుఁ డితనికే శరణని
భావించి బ్రతుకవలె పనివడి దేహికి ॥ ఎందు ॥ 158

సాహా

సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదె
వుర్విలోన నేమెంచేవుపమ తేజన్నప ॥ పల్లవి ॥

వెలయ నేమిటికైనా వెరవకుండేనంటే
యెలమి ధైర్యము నీయెక్క లేదు
బలిమి చూపెద నేపట్టుపనైనా నంటే
చెలఁగి నీవే లోనిచేతనాత్మకుఁడవు. ॥ సర్వే ॥

జగములోపల నేనెచ్చరికై వుండేనంటే
అగపడి బుద్ధి నీవియ్యక లేదు
పగటుసంసారము భ్రమ విడిచేనంటే
మగటిమిగల నీవు మాయానాథుఁడవు ॥ సర్వే ॥

కేవల మీపుట్టుగును గెలిచివుండేనంటే
ఆవేళ నీవు ముక్తియ్యక లేదు
శ్రీవేంకటేశ్వర నీకు చేకానుకిచ్చేనంటే
లావుసంపదల నీవు లక్ష్మీనాథుఁడవు ॥ సర్వే ॥ 159

భైరవి

ఆఁడే యిన్నియు నిచ్చు నడిగినవల్లాను
చేతిలోనే వుండఁగాను చింతించరు హరి ॥ పల్లవి ॥

వలెనంటే సంపదలు వట్టి యలమటఁబెట్టు
అలసి వోపనంటేను అండనే వుండు
తలఁచి యిందరు నీతరతీపులఁ జిక్కి
తలఁచ రెండును బరతత్వమైనహరిని ॥ అత ॥

ఆసపడితే నింతులు అన్నిటాను బిగుతురు
వాసితో నుంటేనే తామే వత్తు రొద్దికి
పోసరించి యిందరు నీపొందులభ్రమలఁ బడి
పాసివున్నారదే తమపతియైనహరిని. ॥ అత ॥

గట్టిగా రాతిరెల్లాను కలయై యుండు జగము
పట్టపగలై తే తమపాల నుండును
బట్టబయలు పందిలి పెట్టేరుగాని చే
పట్టబు శ్రీవెంకటాద్రిపై నున్నహరిని ॥ అత ॥ 160

సాళంగనాట

పైకొని చూడరో పుట్టపండుగ నేఁడు
ఆకడ గొల్లెతలకు నానందము నేఁడు ॥ పల్లవి ॥

ఆదికాలమునఁ గృష్ణుఁ డవతరించినయట్టి
ఆదట శ్రావణబహుళాష్టమాయను
దాదాత రోహిణినక్షత్రము ౧గూడె నడురేయి
సాదించ లోకులకెల్లా జయంతియాయను. ॥ పైకొ ॥

వసుదేవునిని దేవకిని మన్నించి కృష్ణుఁ—
డెసఁగి రేపల్లెకు నేతెంచుటాయను
కొసరి యశోదానందగోపులకుఁబుత్రోత్సవ—
మసమున నిచ్చి మించె నన్నిటా మేలాయను ॥ పైకొ ॥

---

౧. 'గూడినరేయి' పూ. ము పా.

తొట్టినరాకాసులతోడఁ గూడ భువిమీఁద
నట్టె కంసునిమదము హతమాయను
రట్టడి శ్రీవేంకటేశుఁ డిట్టె వీధులనెల్ల
జట్టిగా మెరసేయట్టిసంభ్రమము లాయను. ॥పైకొ॥ 161

రేకు 229 దేవగాంధారి

ఒకరి కొకరు వొడ్డు దప్పులనే
పకపకనవ్వు పచరించేరు ॥పల్లవి॥

కొట్టి నుట్లదె గోవిందుఁ డంతలో
తిట్టేరు గోపసతీమణులు
పట్టెఁ జన్నులట్టె పైపై గోవిందుఁడు
మెట్టెలపాదాల మెట్టే రింతులు ॥ఒక॥

వారవట్టెఁ జాలు వంచి గోవిందుఁడు
గోర గీరే రదే గొల్లెతలు
చీర లంటీ నట్టె చెంది గోవిందుఁడు
మేరతోఁ గొప్పు వంచి మించే రింతులు. ॥ఒక॥

కెలసి వెన్నారగించీ గోవిందుఁడు
తొలఁగఁ దోసేరు దొడ్డివారు
కలసెను శ్రీవేంకటాద్రిగోవిందుఁడు
అలమేరు మరి నంగనలు. ॥ఒక॥ 162

శంకరాభరణం

మదనజనకునికి మజ్జనవేళ
పదివేలుభోగములు పరగీనదె ॥పల్లవి॥

మిన్నంటి వేదఘోషాలు నురిగ్ధరునిపైఁ
పన్నిటి కాలువలు పారీనదె
మున్నిటిమునులహస్తములఁ గప్పురపుధూళి
కన్నులపండుగగాఁ గప్పీనదె ॥ ముద ॥

సేసలుగా నెలవంక శ్రీపతివిభునిమీఁద
వాసన తట్టుపుణుఁగు వడిసీనదె
భాసురపుఁ జంద్రగావిపట్టుగట్టి కాంతలెల్లా
ఆసల మొలఁ గట్టఁగా నమరీనదె ॥ ముద ॥

చెలరేఁగి సొమ్ములెల్లా శ్రీవేంకటేశ్వరుమేన
నెలకొని కాంతులతో నిండీనదె
అలమేలుమంగ వురమందు నెలకొని యుండె
కలిగె కృపారసము చల్లీనదె ॥ ముద ॥ 168

సాళంగ నాట

ఢీకొనపుచక్ర మదె పిడుగులు రాలీనదె
పైకొని నిలువరాదు పారరో దిక్కులకు. ॥ పల్లవి ॥

బండికండ్లరవమదే బంగారు మెఱుఁగులవే
కొండవంటిరథమదె గొడుగులవే
మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే
బండుబండై యసురలు పారరో దిక్కులకు ॥ ఢీక ॥

గరుడధ్వజమదే ఘంటారవములవే
సొరిది ముత్యాలకుచ్చులు నవే
బిరుదుశంఖము మ్రోఁత బెరయించీ దేవుఁడదే
పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు ॥ ఢీక ॥

ముంగిట బలములవే మొరసీ భేరులవే
సంగతిఁ బ్రతాపమదే సాకారమదే
కుంగ కలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడు
భంగపెట్టీ దైత్యులు పారరో దిక్కులకు ॥ భీక ॥ 164

శ్రీరాగం

భావించరే చెలులాల పరమాత్ముని
చేవదేరి చిగురులో చేఁగయై యుండెను. ॥ పల్లవి ॥

మలసి పన్నీట హరి మజ్జనమాడేవేళ
కలశాబ్ధిఁ దేలేమాణికమువలె నుండెను
అలరి కప్పురకాపు అవధరించేటివేళ
మొలచినవెన్నెల మొలకయై యుండెను ॥ భావిం ॥

అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటివేళ
యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను
మించినహారములెల్ల మేన నించుకొన్నవేళ
మంచి మంచి నక్షత్రమండలమై యుండెను ॥ భావిం ॥

వున్నతి నలమేల్మంగ నురముననుంచువేళ
వెన్నెదై పూచినట్టి సంపెంగవలె నుండెను
వన్నె శ్రీవేంకటేశుఁడు వరములిచ్చేటివేళ
తిన్ననై యందరిభాగ్యదేవతయై యుండెను. ॥ భావిం ॥ 165

సామంతం

చెప్పరానిమహిమల శ్రీదేవుఁ డితఁడు
కప్పి కన్నులపండుగగాఁ జూడరో ॥ పల్లవి ॥

అద్దుచుఁ గప్పురధూళి యట్టె మేన నలఁదఁగా
వొద్దిక దేవునిభావ మూహించితేను
ముద్దులు విరిచినట్టి మంచి బాలకృష్ణునికి
ముద్దులకాంతి మేన మలసినటుండె ॥ చెప్ప ॥

అమరఁ దట్టుపుణుఁగు అవధరించఁగాను
తమితోఁ బోలికెలెల్లఁ దచ్చిచూడఁగా
యమునానది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానదినలుపు అంటినయట్లుండె ॥ చెప్ప ॥

అంగముల శ్రీవేంకటాధిపున కింతటాను
సింగారించి సొమ్ములెల్లఁ జెలరేఁగఁగా
బంగారపుటలమేలుమంగ నురాన నుంచఁగా
బంగారము మేననెల్లాఁ బరగినట్టుండె ॥ చెప్ప ॥ 168

పాడి

నేరనైతి నింతేకాక నే నిన్నాళ్లు
యేరీతి విచారించినా నిదివో నిశ్చయము ॥ పల్లవి ॥

నాకుఁగా వేరొకరు విన్నపము సేసేరా నీకు
వాకుచ్చి నేనే ఆడవలెఁగాక
యీకడ నాకంటే హీను నీఁక నీవు [1]గా(ం)చేవా
శ్రీకాంతుఁడ యిఁక నీచిత్త మింతే కాక. ॥ నేర ॥

నీవల్లి బతుకలేక నే నొకరి వేఁడేనా
వావిరి నిన్నే కొసరవలెఁగాక
నీవితరణగుణము నీలోనే దాఁచుకొనేవా
సోవ నావంటివారికిఁ జూపవలెఁగాక. ॥ నేర ॥

౧. 'గాచేవా' రక్షించేవా? అనునర్థమే బాగున్నది.

తల్లికిలేనిముద్దు దాదికిఁ గలదా మరి
చెల్లుబడి నీవే దయసేయుటగాక
తొల్లె శ్రీవేంకటేశ్వర తూరి నాలో నున్నాఁడవు
చల్లఁగా నీచనవిచ్చి జరుపుటగాక ॥నేర॥ 167

రేకు 230 లలిత

ఎట్టున్నదో నీచిత్త మెదురాడ నే వెఱతు
గట్టిగా హరి నీమాయ కడవఁగరాదు. ॥పల్లవి॥

నిచ్చ పతితులఁజూచి నేను సంసారినై యుందు
అచ్చపుసన్న్యాసులఁ జూ చటువలె నయ్యేనందు
హెచ్చి మోఁచివచ్చితేను యెక్కుడిగొడవ యందు
ఇచ్చట నిశ్చలబుద్ధి యెందూ నేఁ గానను. ॥ఎట్టు॥

కర్ములఁ జూచొకవేళ కర్మము నేఁ జేయఁబోదు
మర్మపుజ్ఞానులఁ జూచి మంచిదందును
అర్మిల రెండూఁ జూచి అంతలో సందేహింతు
నిర్మలమయినబుద్ధి నే నెందుఁ గానను. ॥ఎట్టు॥

వారణాసి వోఁజూచి వారివెంటఁ దగులుదు
తేరి కొంతదవ్వు వోయి తిరుగుదును
నేరిచి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గాచితివి
యీరీతిఁ దేరినబుద్ధి యెందూ నేఁ గానను ॥ఎట్టు॥ 168

లలిత

శ్రీపతి యీతఁడుండగాఁ జిక్కినవారి నమ్ముట
తీపని మిసాలమీఁదితేనె నాకుటసుండీ. ॥పల్లవి॥

తలఁచినంతటిలోనె దైవ మెదుటఁ గలఁడు
కొలువనేరనియట్టికొంతే కాని
ఇల నరులఁ గొలుచు టెందో కోకలు వేసి
బలుకొక్కెరలవెంటఁ బారాడుటసుండీ ॥శ్రీప॥

శరణన్నమాత్రమున సకలవరము లిచ్చు
నిరతి మరచినట్టినేరమే కాని
పొరి నితరోపాయాలఁ బొరలుట గాజుఁబూస
గరిమ మాణికమంటాఁ గట్టుకొంటసుండీ ॥శ్రీప॥

చేత మొక్కితేఁ జాలు శ్రీవేంకటేశుఁడు గాచు
కాతరాన సేవించనికడమే కాని
యీతల నిది మాని మరెన్నిపుణ్యాలు సేసినా
రీతి నడవిఁగాసినరిత్తవెన్నెలసుండీ ॥శ్రీప॥ 169

బౌళి

కోఁదిపుణ్యపాపాలే కొంగురొక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ వేగింమే రారో. ॥పల్లవి॥

జననాలు మరణాలు సంసారభోగములును
అనిశము భూమిమీఁద నగ్గువలు
కొనేవారుఁ దినేవారు కూడి కూడి మూఁకలై
దినసంతలెక్కె నిదే దేహులాల రారో ॥కోలఁ॥

౧అంగనలవలపులఅంగళ్లు వెట్టి రదే
చెంగట వయసులనేచింతలకింద
సంగతిఁ గాయమనేసంచుల నించుకొందము
చెంగి పోరాదు మనకు జీవులాల రారో ॥కోలఁ॥

౧. 'అంగనలు' కావచ్చు.

లంపటాలు సంపదలు లలి[1] నంబారాసు లాయ
ఇంపుల ముంచి తలల కెత్తుకోరో
దింపక ఇందులోననె తిరిగి శ్రీవేంకటేశు—
పంపున లాభము చేరె ప్రాణులాల రారో. ॥కోలఁ॥ 170

ముఖారి

దైవమా వో దైవమా నన్ను దయఁజూడఁదగదా
నే వెట్టివాఁడనైతే నీవు వెట్టివా ॥పల్లవి॥

చవిగొంటి నెత్తురెల్లా చన్నుఁబాలనుచు నేను
భువిఁ దొల్లే నోఁచితి పుట్టే నంటాను
యివల గడుపులోన హేయమౌతాఁ గూడవుతా
సివిరి న న్నెరఁగను ని న్నెఱఁగేనా ॥దైవ॥

మొగిఁ జావుకు వెరతు ముందర గాన నేను
వెగటులంపటమైతే వేసరుకొందు
వగపును నగవును వడి నొక్కమొకమందే
తగులైనవాఁడ నీపై తలఁపు నాకున్నదా. ॥దైవ॥

మతి భ్రమసితిఁ గొంత మన్ను నాకు రాజ్యమని
సతులంటా సుతులంటా సంసారినైతి
గతియై శ్రీవేంకటేశ కాచితి వింతటిలోనే
యితరుఁడ నింతే నీకు నేమి బాఁతి నేను. ॥దైవ॥ 171

లలిత

హరి నిను నెరఁగనియలమట లింతేకాయ
శరణంటి నిదె నీకే పరేశ కావవే. ॥పల్లవి॥

౧. 'అంబారాసులు' 'అంబార' మనే యర్థములోనేనా? అంబారము = ధాన్యరాశి అని శ-ర.

చొచ్చితి స్వర్గము దొల్లి సుకృతములెల్లాఁ జేసి
ఇచ్చఁ గొలిచితి సుర లిందరిని
గచ్చులఁ బుణ్యము దీరఁ గమ్మటిజన్మములకే
వచ్చితి పురుషార్థము వడి నెందూఁ గానను ॥ హ

వెదకితి భూము లెల్లా విశ్వకర్తెవ్వఁడోయంటా
చదివితిఁ బుస్తకాలు సారె సారెకు
తుద ననుమానమున దొమ్మి సీకలు దెల్లఁగా
మదిసితి నింతేకాని ముందరేమీఁ గానను. ॥ హ

చింతలెల్ల నుడిగితి శ్రీవేంకటేశ్వర నిన్ను
వింత లేక శరణని వెలసితిని
చెంతల నిన్నాళ్ళదాఁకా చిక్కి కర్మముల నట్టి
గంతులు వేసితిఁగాని కడ గాననైతిని ॥ హరి ॥ 1

మాళవిగౌళ

నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి
యీరుణాకే మొక్కితి నిందిరారమణా. ॥ పల్లవి

కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి
అమితదుర్గుణరాసి నన్నిటా నేను
అమరఁగ స్వతంత్రుఁడ వటు నిన్ను నెంచితేను
తమి నించుకంతా స్వతంత్రుఁడ నేఁ గాను. ॥ నీకు

దేవ నీవైతే సర్వదేవరక్షకుఁడవు నే
జీవుఁడ నింద్రియాలఁ బెంచేవాఁడను
ఆవల బ్రహ్మాండాల కన్నిటాఁ బొడవు నీవు
భావించ నే నణువై పరగేటివాఁడను ॥ నీకు

నానార్థసంపన్నుఁడవు నావల్ల నేమి గంటివి
అనుక నాయంతర్యామివై పాయవు
శ్రీనిధివి నీవైతే శ్రీవేంకటాద్రిపతివి
దీనుఁడ నొకఁడ నేను ద్రిష్టించి కాచితివి. ॥నీకు॥ 173

రేకు 281 ధన్నాసి

వెట్టిదెలిసి రోఁకలి వెసఁ జుట్టుకొన్నట్టు
యిట్టిదీముభోగముల నెన సేము. ॥పల్లవి॥

మురికి దేహము మోచి మూలల సిగ్గువడక
పొరిఁ బరిమళములు పూసేము
పరగ పునుకతల పావనము సేసేమంటా
నిరతితోడ దినము నీట ముంచేము. ॥వెట్టి॥

పుక్కట పంచేంద్రియపుపుట్టు పుట్టి యందరిలో
మొక్కించుక దొరలమై మురిసేము
అక్కర నజ్ఞానమనేఅంధకారమునను౦డి
దిక్కుల వెదిరి వారిఁ దెలిపేము ॥వెట్టి॥

దిసంసారమే మాకు దేవుఁడని కొలుచుక
వెనుకోని ఘనము శ్రీ వెదకేము
యెనలేక శ్రీవేంకటేశ మమ్ముఁ గావఁగాను
తనిసి తొల్లిటిపాటు దలఁచేము. ॥వెట్టి॥ 174

రామక్రియ

ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు
కొంకి తెంచి ముడిగొంటే కుఱుచే కాదా. ॥పల్లవి॥

పైకొని నీదాసులు బ్రహ్మాదులఁ గొల్వమని
లోకులఁ గొల్చితే వారు లోలో నవ్వగా
కోక చాకిఁటియింట వేసి కొక్కెరాలవెంటఁ బోతే
అకడ పురుషార్థము నందీనా జీవుఁడు ॥ ఇంత ॥

వుమ్మడిఁ గర్మఫలము వొల్లమని పసిఁడికి
నమ్మిక చేయి చాఁచితే నవ్వదా అది
కమ్మి శిరసుండఁగా మోకాల పేసవెట్టఁబోతే
సమ్మతి నిందలోన జాణౌనా జీవుఁడు. ॥ ఇంత ॥

సారెకు మాయాప్రపంచమునకు లోను గాక
నారులకు లోనైతే నవ్వరా వారు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నీశరణని
కూరవండి కప వేఁగోరినా జీవుఁడు ॥ ఇంత ॥ 17

బౌళి

అమ్మో దొకటియును అసిమలోని దొకటి
ఇమ్ముల మాగుణములు యెంచఁ జోటేదయ్యా ॥ పల్లవి ॥

యెప్పుడు నేము చూచిన నింద్రియకింకరులము
ఇప్పుడు నీకింకరుల మెట్టయ్యేమో
తప్పక ధనమునకు దాస్యము నేము సేసేము
చెప్పి నీదాసుల మన సిగ్గుగాదా మాకు. ॥ అమ్మో ॥

వడఁతుల కెప్పుడును పరతంత్రులము నేము
వడి నీపరతంత్రభావము మాకేది
నడుమ రచులకే నాలుక అమ్ముడవోయ
యెడయేది నిన్ను నుతియించే అందుకును ॥ అమ్మో ॥

తనువులంపటానకు తగ మీఁదె త్తితిమిదె
వొనరి నీవూడిగాన కొడిగెదెట్టు
ననిచి శ్రీవేంకటేశ నాఁథే నీకు శరణంటి
వెనక ముందెంచక నీవే కావవయ్యా. ॥అమ్మో॥ 176

దేసాళి

వెట్టి దెలిసి మరియు వేఁదురు దప్పేము నేము
ముజ్జుఁబాలమంకువాఁడ మూలమా శరణు ॥పల్లవి॥

తోలు నెముకలు ముట్టి దోసమంటాఁ దీర్థమాడి
తోలునెముకలమేనితోడ నున్నాఁడ
వాలినజీవహింస వద్దని చైతన్యముతో
తేలించి శాకపాకాల దిగమింగేము. ॥వెట్టి॥

భూతునఁ బుట్టినందుకు పుణ్యములెల్లాఁ జేసి
భూతులసంసారమే భోగించేము
పాతకములెల్లాఁ బోను బహుదానము లొసఁగి
ఆతల నొరులఁ బోయి అడిగేము నేము. ॥వెట్టి॥

కర్మము లన్నియుఁ దోసి ఘనముక్తిఁ బొందేనంటా
కర్మాచరణములే కడుఁ జేసేము
నిర్మించి శ్రీవేంకటేశ నేరాలు నన్ను నెంచక
ధర్మము దలఁచి నీవే దయఁ జూడవే. ॥వెట్టి॥ 177

దేసాళం

ఏమనఁగవచ్చునమ్మ ఇటువంటివారిఁ జూచి
కామించి గోపికలెల్లాఁ గాచుకున్నా రదివో. ॥పల్లవి॥

రోలఁ గట్టువడ్డ వాఁడు రోఁకలి వట్టిన వాఁడు
వేళ లేదు వెన్నలెల్లఁ ౧వెరఁజాడేరు
వేలఁ గొండెత్తినవాఁడు వేరే యేరు సేసే వాఁడు
బాలులవలెనే వీధిఁ బారాడేరు వారివో ॥ పమ ॥

కాటుకమైచాయవాఁడు కప్పురపు పన్నెవాఁడు
కూటమి గూడుక జోడుకోడలైనారు
నీటుఁ బైఁడికోక వాఁడు నీలికాశతోడి వాఁడు
తేటలై దూడలఁ గాచి తిరిగేరు వారివో ॥ పమ ॥

చేరి చీరలిచ్చు వాఁడు చెలిఁ గుంగించినవాఁడు
ధీరులై రేపల్లెలోనఁ దిరిగే రదే
యీరీతి శ్రీవేంకటాద్రి నిద్దరును నేకరూపై
కోరినవారివరాలు కొల్లలిచ్చే రదివో ॥ పమ ॥ 178

పాడి

చేరి యందెలమోఁతతో చెన్నకేశవా
యీరీతి మాడుపూరిలో నిట్లాడేవా. ॥ పల్లవి ॥

మున్ను యశోదవద్దను ముద్దు ౨గునిశాడితివి
పన్ని రేపల్లెవీధులఁ బారాడితివి
పిన్నవై గోపాలులతోఁ బిల్లదీపులాడితివి
యెన్నిక మాఁడుపూరిలో యిట్లాడేవా. ॥ చేరి ॥

కాళింగుపడిగెలపై కడు నాట్యమాడితివి
కేళి యమునలో రాసక్రీడ లాడితి
చేలలంటి గోపికల చెట్టాపట్టాలాడితివి
యీలీల మాఁడుపూరిలో యిట్లాడేవా. ॥ చేరి ॥

---

౧. వెరఁజి+ఆడేరు

౨. గునిసి+ఆడితివి=గునిశాడితివి-వ్యావహారికసంధి.

తగువిభాండకునితో దాఁగిలి ముచ్చలాడితి
అగడుగా బండివిరిచాటలాడితి
వొగి శ్రీవేంకటగిరినుండి వచ్చి మాఁడుపూర—
నెగనెగసి ౧గతుల కిటులాడేవా(?) ॥చేరి॥ 179

రేకు 232 లలిత

వెన్న చేతఁబట్టి నేయి వెదకనేలా
యిన్నిటా నెంచిచూచితే నిదియే వివేకము. ॥పల్లవి॥

నీదాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె
వేదతో వేరొకచోట వెదకనేలా
ఆదిగొని వారిరూపు లవియే నీరూపులు
పోది నిన్ను మదిఁ దలపోయనేలా ॥వెన్న॥

వారలతోడిమాటలు వడి వేదాంతపరన
సారె వట్టిచదువులు చదువనేల
చేరి వారికరుణే నీచేపట్టినమన్ననలు
కోరి యింతకంటే ౨మిమ్ముఁ గొసర నేలా ॥వెన్న॥

నావిన్నపము నిదె నారదశుకాదులును
యీవిధముననే ఆనతిచ్చినారు
శ్రీవేంకటేశ నీవు చేపట్టినదాసులకు
కైవశమౌ యీబుద్ధి కడమేలా ॥వెన్న॥ 180

దేవగాంధారి

హీనుఁడైననన్నుఁ దెచ్చి యింతగా మన్నించితివి
దానవారి నీవు సేసే తగ విట్టిదయ్యా. ॥పల్లవి॥

---

౧. 'గతులు' = నాట్యప్రక్రియలేమో?
౨ 'మమ్ముఁ' పూ. ము పా.

విరతిబొందినయట్టివిమలచిత్తుఁడఁ గాను
ధరణి నెక్కుడయినతపసిఁ గాను
అరుదుగ గెంటులేనిఆచారవంతుఁడఁ గాను
హరి నీకరుణ నాపై నంటుటెట్లయ్యా ॥హీనుఁ॥

చేముంచి యిందరిలోన జితేంద్రియుఁడఁ గాను
భూమెల్లా దానమిచ్చినపుణ్యుఁడఁ గాను
దోమటికర్మాలు సేసి తుదకెక్కేవాఁడఁ గాను
యేమిటికిఁ గాచితివో యిది సోద్యమయ్యా. ॥హీనుఁ॥

వివరించి తెలిసినవిజ్ఞాని తొలుతఁ గాను
తవిలి నీభక్తిగలధన్యుఁడఁ గాను
భవసాగరములోనిప్రాణిమాత్ర మింతే నేను
యివల శ్రీవేంకటేశ యెట్టేలితివయ్యా ॥హీనుఁ॥ 181

మంగళకౌశిక

ఇదె నీకన్నులయెదిటికి వచ్చితి
కదియుచు నెట్టయినఁ గావకపోదు. ॥పల్లవి॥

పరమపురుష నీభక్తి దొరకకే
యిరవగుజన్మము లెత్తితిని
హరి నీకరుణకు నరుహము లేకే
దురితవిదులసందులఁ బడితి ॥ఇదె॥

జగతీశ్వర నీశరణము లేకే
వొగి సంసారపువురిఁ బడితి
భగవంతుఁడ నీపదములు గనకే
తెగనిపాపముల తీదీపు లైతి ॥ఇదె॥

గోవిందుఁడ నినుఁ గొలువఁగ నేరకే
ధావతి యాసలఁ దగిలితిని
శ్రీవేంకటేశ్వర చేరి నీవు నా—
దైవమువుగాఁగ ధన్యుఁడనయితి ॥ఇదె॥ 182

౯ దేసాళం

౧ ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మాయాచార్యుఁ
డీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి. ॥పల్లవి॥

అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి —
పదములు సేసి పాడి పావనము సేసెను ॥ఈతఁ॥

అలరుచుఁ దాళ్లపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీవేంకటనిధియే తానై
కలిదోషములు వాప ఘనపురాణములెల్ల
పలుకుల నించి నించి పాడినాఁడు వారిని ॥ఈతఁ॥

అంగవించెఁ దాళ్లపాక అన్నమాచార్యులు
బంగారు శ్రీవేంకటేశుపాదములందు
వంగుమీర శ్రీవేంకటరమణుని యలమేలు —
మంగను యిద్దరిఁ జాడి౧మమ్ము గరుణించెను ॥ఈతఁ॥ 183

లలిత

నేఁడు నిమహిమ నెరపెడిసమయము
వాఁడి మెరసి యిటు వరదుఁడ రావే ॥పల్లవి॥

---

౧ ఈపాటకూడ పెదతిరుమలాచార్యులదో, చినతిరుమలాచార్యులదో కావలయును 'మమ్ముఁ గరుణించెను' అనుదానితో ఇది ఇతరులదనుట స్పష్టము. ౧ "మమ్ముఁ" కావలెను

అల చక్రపాణివై యసురలతల—
లిలఁ గూల్చిన జగదీశ్వరుఁడ
చలమున హిరణ్యాఁ జక్కాడి యిటు భూ—
వలయుము నిలిపిన వరాహామా ॥ నేఁడు ॥

పెంచల నీదాసుఁ బఱచినకశిపునిఁ
జించిన శ్రీనరసింహామా
యెంచి విభీషణు కిటు లంక యొసగి
కొంచనిప్రతాప కోదండరామా ॥ నేఁడు ॥

నరకాసురు నటు నఱకి కామినుల
సిరులఁ జెఱగొన్న శ్రీకృష్ణ
పొరిఁబోరి బలిచే భూదాన మడిగి
సిరి నిటుగూడిన శ్రీవేంకటేశా ॥ నేఁడు ॥ 184

శంకరాభరణం

కని [౧]గుడ్డును నదె విని చెవుడును నిదె
ననిచి జగత్తు గడచీనదివో ॥ పల్లవి ॥

వుదయాస్తమయము లొకదినముననే
యెదుటనె వున్నవి యెంచినను
యిదవో జీవులు యెంచక తమతమ-
బ్రదుకులు సతమని భ్రమసెదరు. ॥ కని ॥

వెలుఁగును జీఁకటి వెసఁ గనుఁగొనలనె
నిలిచీ నూరక నిమిషములో
కలవలె నుండినగతి సంసారము
బలువుగ సతమని భ్రమసెదరు. ॥ కని ॥

౧. 'గుడ్డియు' కావచ్చు.

కాంతలుఁ బురుషులు కాయ మొక్కటనె
పొంతనే పుట్టుచుఁ బొదలెదరు
యింతయు శ్రీవేంకటేశ్వరుమహిమల—
పంతము దెలియక భ్రమసెదరు. ॥కని॥ 185

రేకు 288 రామక్రియ

౧ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లేక
త్రిదశవంద్యుఁడు హరిఁ దేరిచూడఁగలరా ॥పల్లవి॥

ఘాత మీస మదరితే గగ్గులకాడవుదురు
ఘాతఁడు దలచూపితే నెదిరించ రరులు
ఆతురాన గోరిశరాయడికి నోపఁగ లేరు
చేతిగోరు మీటితేనే ఛిన్నభిన్న మవుదురు. ॥ఎది॥

పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురుగుండాలపాలౌదురు
తూపు చేత నంటితేనె తుత్తుమురై పారుదురు
రాపుపీలికాశ గంటే రణభీతి గొందురు. ॥ఎది॥

మంతన మీతఁ డాడితే మానముగోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁగూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁ డెక్కడఁ జూచినఁ దానే
వింతప్రతాపముతోడ వెలుపిఁగి నిదివో. ॥ఎది॥ 186

వరాళి

కలిమి గలిగియు నధమగతి యదేల
బలిమిగలిగియు లోఁగి బతిమాలనేల. ॥పల్లవి॥

---

౧. ఇందు దశావతారసమన్వయము కలదు.

ఇలువేలు పొడఁడు హరి ఇంటనే వుండఁగా
పలువేలుపులతోడిభ్రమ లేల
మెలఁగి సూర్యుఁ డొక్కఁడు మిక్కిలిని వెలుఁగఁగా
వెలలేనిదీపములు వేయి నేమిటికి ॥కలి॥

హరిభక్తి యొక్కటే ఆత్మలో నుండగా
పరయుక్తు లెంచేటిపనులేల
సిరులఁ జింతామణటు చేతిలో నుండఁగా
సరి గాజుఁబూస మెచ్చఁగ నదేమిటికి. ॥కలి॥

నాలుకను మంచి హరినామ మొకటుండఁగా
గాలిఁ బోయేటివూరగాథలేల
యీలీల శ్రీవేంకటేశుఁ డెదుటనె వుండగా
మూలలకుఁ జేచాఁచి మొక్క నిఁక నేలా ॥కలి॥ 187

గుండక్రియ

నీవే యెరిఁగి సేయు నీచిత్తము వచ్చినట్లు
తావులఁ గొసరేనన్నా తనివోదు నాకు. ॥పల్లవి॥

హరి నిన్ను నమ్మితి నే ౧ననన నెట్టు వచ్చు నాకు
ఇరవైన బుద్ధి నా ఇచ్చగాదు
వెరవున నొకటి నే విన్నవించెదనంటేను
సరి నీవు వెలిగాను స్వతంత్రుఁడఁ గాను. ॥నీవే॥

యిట్టె నీపై భారము నే నెట్టు వేయఁగవచ్చు
పట్టి నీకుఁ బురుషార్థపరుఁడఁ గాను
గుట్టుతోడ నే నిన్నుఁ గొలువఁగఁ గొలువఁగ
యెట్టైనాఁ గానిమ్మ యెరఁగ నెవ్వరిని. ॥నీవే॥

౧. 'ననక' పూ. ము. పా.

యింతటిదైవమవు నీ విన్నిఁట నేఁడు వెదకేను
చెంత శరణాగతులచేతి వాఁడవు
వింతగాదు నీకును శ్రీవేంకటేశ నాకును
అంతర్యామివి నీయానతిలో వాఁడను ॥నీవే॥ 188

బౌళి

ఇట్టియవివేకబుద్ధి యేపనికివచ్చు నిఁక
జట్టిగొని నాగుణము చక్కఁజేయఁగదవే ॥పల్లవి॥

హరి నీయిచ్చఁ బ్రపంచమంతా నీవు నడపఁగ
అరసి నీశక్తి దెలియక నమ్మక
౧వెర వెరఁగనియట్టి వెట్టివాఁడ నే నొక్క—
దొరనంటాఁ బమల కుద్యోగించేను ॥ఇట్టి॥

అంతరాత్మవై నీవు అన్నియుఁ బెర రేఁచఁగ
బంతినే నీమహిమెల్లా భావించక
చెంత నిసంసారము సేసే వాఁడ నే నంటా
దొంతులకోరికలతోఁ దూరిపారేను ॥ఇట్టి॥

ఆదినుండి స్వతంత్రుఁడవై యేలినట్టినిన్ను
సోదించి శరణు వాఁడే చొరఁగలేక
యీదెస శ్రీవేంకటేశ యిప్పుడు నీదాసుఁడనై
నీదయకలిమితోడ నేఁడు మొక్కేను. ॥ఇట్టి॥ 189

లలిత

ఓపితేఁ దానే తగిలి వోపకున్నఁ దానే మాని
మాపు రేపునలయించేమాయ మాకేలా. ॥పల్లవి॥

---

౧. వెరపెరఁగని' పూ. ము పా.

చింతాయకుఁడగు(?)హరి చిత్తములో నుండఁగాను
వింతవింతవిచారాలఁబెట్టి మాకేలా
చెంతల పరుసవేది చేతిలోనే వుండఁగాను
దొంతరవిద్యలతోడిదోవ మాకేలా. ॥ టపి ॥

తోడు నీడై యచ్యుతుఁడు తొలఁగక వుండఁగాను
జాడదప్పితిరిగేటిజాలి మాకేలా
యేడనో కోకలు వేసి యేమియు నెరఁగలేక
వేడుకతో కొక్కెరాలవెంట మాకేలా. ॥ టపి ॥

వెల్లవిరై యెదుట శ్రీవేంకటేశుఁ డుండఁగాను
బల్లిదుఁ డితనిఁ జూసి భ్రమ మాకేలా
యెల్లధాన్యములు మాయింటిలో నుండఁగాను
పొల్లికట్టుదంచేమని బుద్ది మాకేలా ॥ టపి ॥ 190

గుజ్జరి

మాకేమి నీకరుణ మహాప్రసాదమునేము
నీకు నీదాసులచేతినింద బెట్టుగాదా. ॥ పల్లవి ॥

నమ్మి మిమ్ముఁ గొలిచినదాఁట్లఁ బరులు దమ—
సొమ్మనుచుఁ దియ్యఁగాఁ జూచేదా
వుమ్మడి నీవిందుకెల్లా నూరకున్నఁగన మిమ్ము
నమ్ముమన్న వేదాలయానతి కొంచెపడదా ॥ మాకే ॥

నీముద్ర మోచినవారి నీచులు దడవఁగాను
యీమేర నడ్డమురాక యిట్లుండేదా
వోమక నీవీవేళ నూరకున్న నల్లనాఁటి —
సామజముఁ గాచినది సందేహించఁబడదా. ॥ మాకే ॥

మీరుమన్నించినవారు మీవాకిలి గావ కేడో
వారివాకిలి గావఁగా వద్దనరాదా
నేరిచి శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గావకున్న
ధారుణి మీదయే మిమ్ముఁ దప్పులెంచుకొనదా ॥మా కే॥ 191

రేకు 234 సాళంగనాట

౧నే సింతసేసినయట్టినేరమి మరవవయ్యా
అనుకొని తాళ్లపాక అన్నమయ్యఁ జూచి ॥పల్లవి॥

నావొళ్లియపరాధా లెన్నక ౨నీన్ను సారె సారె
వేవేలు దూరితి విచారించక
కావించి కన్నులలోనికిఁ జంకు దెలియలేక
ఆవలఁ జందురు నలు వణఁకించినట్లు. ॥నేని॥

పాయక నేఁ జేసినట్టిపాపము లెంచుకొనక
ఆయాలు మోవనాడితి నడివో నిన్ను
మాయల నా దేహమిది మలినమే తలఁచక
చాయలేదని యద్దము సారెఁ దోమినట్లు ॥నేని॥

మదమత్సరాలు నాలో మానకిట్టే వుండఁగాను
అదియే నీచేఁతంటా నాడుకొందును
యెదలో శ్రీవేంకటేశ యిరవై నీ వుండఁగాను
వెదకి వెదకి నీకే వెట్టిగొన్నయట్లు ॥నేని॥ 192

లలిత

ఆదివిష్ణు వితఁడే యటరమ్మా.
ఆదిగొని భూభారం మణఁచీనోయమ్మా ॥పల్లవి॥

౧ ఈపాటకూడ పెదతిరుమలాచార్యులదో చినతిరుమలాచార్యులదో కావలసి యున్నది ౨ ఈ 'నిన్ను' పూ ము. పా. లో తప్పిపోయినది

చందురునుదయవేళ నవ రేతిరి కాడ
కందువ దేవకి బిడ్డఁ గనెనమ్మా
పొందుగ బ్రహ్మాదులు పురుఁటింటి వాకిటను
చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా ॥ ఆది ॥

వసుదేవునియెదుట వైకుంఠనాథుఁడు
౧సిసువై యవతరించి చెలఁగీ నమ్మా
మునిమునినవ్వులతో మునులకు ఋషులకు
యిసుమంత వాఁ డభయమిచ్చీనమ్మా ॥ ఆది ॥

కన్నతల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి
అన్నిటా రాకాసిమూఁక లణఁచీనమ్మా
వున్నతి శ్రీవేంకటాద్రినుండ లక్ష్మిదేవితోడ
పన్ని నిచ్చకల్యాణాలఁ బఱగీనమ్మా ॥ ఆది ॥ 193

సామంతం

పసిఁడియక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసలఁ బేరటాండ్లు దేవుని పెండ్లికిని ॥ పల్లవి ॥

శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁ బెండ్లిముహూర్తము నేఁడు
కావించి పేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె
దేవతలు రారో దేవుని పెండ్లికిని ॥ పసిఁ ॥

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలఁ దలఁబాలు నేఁడు
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరి పెండ్లికిని ॥ పసిఁ ॥

---

౧. 'శిసువై' రేకు.

అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలితిరునాళ్లకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరము లివె
కదలి రారో పరుష ఘనులపెండ్లికిని ॥ పసిఁ ॥ 194

గౌళ

ఇందుకే కాలమందే యీతని శరణంటిమి
ముందు ముందే దయఁజూచి మొగిఁ గాచుఁగాక ॥ పల్లవి ॥

పుడమి గుంగిన నెత్తె పురుషోత్తముఁ డితఁడు
యెడసి కొండ గుంగితే నెత్తె నితఁడు
అడరి సంసారవార్ధి నడఁగినదాసులను
యిడుమలఁ బొందకుండా యెత్తి కాచుఁగాక. ॥ ఇందు ॥

పట్టి ప్రహ్లాదుబాధలు పాపినదేవుఁ డితఁడు
రెట్టిగా వేదము లుద్ధరించె నితఁడు
వట్టిదుష్టులలో సహవాసమైతే దాసులను
దిట్టయై వెళ్లఁదీసి తా దిక్కై కాచుఁగాక ॥ ఇందు ॥

లంకలో సీతఁదెచ్చినలావరి తానే యితఁడు
మంకు అహల్యశాపము మాన్పె నితఁడు
అంకెల శ్రీవేంకటేశుఁ డతిథితిఁ జూపి మమ్ము
గొంకక తనదాసులఁ గూడి కాచుఁగాక ॥ ఇందు ॥ 195

దేసాళం

ఓడవిడిచి పదర పూరకేల పట్టేవు
గోడ గడుగ నడుసే కుగిసీ నోమనసా ॥ పల్లవి ॥

చిత్తములోపలనున్న చింతామణి యీహరి
యిత్తలఁ గోరినవెల్లా నియ్యఁగాను
తత్తరించి తలఁచక దవ్వువోయి పరులకు
దెత్తివై యేల నోళ్లు దెరిచే వోమనసా ॥ ఒడ ॥

కన్నులెదుటనే హరి కల్పవృక్షమై యుండి
మన్నించి లోకమెరఁగ మనుపఁగాను
యెన్నివలసిన మరి యీతనినే యడుగక
కన్నవారి నేలడుగఁ గటకటా మనసా ॥ ఒడ ॥

శ్రీవేంకటేశుఁడే మనచేతిపరుసమై యుండి
తావున నిహపరాలు తా నియ్యఁగాను
భావించి మొక్కక వేరే బద్ధులై నజీవులను
దావతిపడుచు నేల తగిలే వోమనసా. ॥ ఒడ ॥ 196

లలిత

మంగళసూత్రమొక్కటే మగనాలికిఁ గట్టేది
అంగవించే మీఁదిపన్నులన్ని యు విభునివే ॥ పల్లవి ॥

తలఁపులోపల నిన్నుఁ దలఁచినానుఁ గలవు
తలఁచకున్నా నంతరాత్మవై కలవు
పలుపూజ లిఁకనేల భక్తిసేయనేల నీవు
గలవని నమ్మేదొక్కటే బుద్ధిగాకా ॥ మంగ ॥

మొక్కినా రక్షింతువు మొక్కకున్నా జగములో
యిక్కువతో రక్షింతువు యెపుడు నీవు
వెక్కువిన్నపాలేల పిలిచి యలయనేల
తక్కక నమ్మేటిది నీదాస్య మొక్కటే ॥ మంగ ॥

కడుసుజ్ఞానినైనా నీగర్భవాసమే వునికి
వెడ నజ్ఞానినైనాను విడిదక్కడే
బడినే శ్రీవేంకటేశ పలునావుద్యోగాలేల
నిడివి నిన్ను నుతించేనేమమే నాది ॥ మంగ ॥ 197

రేకు 235 సామంతం

ఏడ ధర్మ మేడ కర్మ మిన్నియు నీసేవే కాక
యీడనే యిందుకు సాక్షి ఇట్లై నిలిపితివి ॥ పల్లవి ॥

తెగువసేసి నీకుఁ దెచ్చిరి బోనములు
మగండ్లమాటదోసి మౌనిసతులు
తగ నిన్నుఁ జేపట్టుటే ధర్మముగా నిలిపి
జగ మెరఁగఁగ వేదసమ్మతి సేసితివి ॥ ఏడ ॥

బల్లిదాన నిన్నుఁ బొందె బలుసాహసము సేసి
తల్లిదండ్రిమాట దోసి తానే రుక్మిణి
యెల్లగా నీకు మోహించు టెక్కుడుతగవు సేసి
వెల్లవిరి నాపె నీవు వీధుల నేఁగితివి ॥ ఏడ ॥

శ్రీవేంకటేశ నిన్ను సేవించవచ్చితేఁ జాలు
భావించి రక్షింతువు నీపరుషలను
యీవల నీకు మొక్కుటే యిన్ని పుణ్యములూఁ ౧జేసి(?)
కావించి హీనుల మమ్ము ఘనులఁ జేసితివి ॥ ఏడ ॥ 198

లలిత

నమో నారాయణ నావిన్నప మిదివో
సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే ॥ పల్లవి ॥

---

౧. ఈ 'చేసి' క్త్వాంతము హేత్వర్థకము కావచ్చు.

మనసు నీయాధీనము మాటలు నీ వాడేటివే
తనువు నీపుట్టించినధన మిది
మును నీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే ॥నమో॥

భోగములెల్లా నీవి బుద్ధులు నీ విచ్చినవి
యీగతి నాఁబతుకు [౧]నీవిరవైనది
చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే. ॥నమో॥

వెలి నీవే లో నీవే వేడుకలెలా నీవే
కలకాలమును నీకరుణే నాకు
యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే. ॥నమో॥ 199

ఆహిరి

ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను
నీమరఁగు చొచ్చితిఁగా నీచిత్త మిఁకను ॥పల్లవి॥

పుట్టినవాఁడను నేను భోగించేవాఁడను నేను
గట్టిగా నిప్పుడు నాకుఁ గర్తవు నీవు
పట్టరాదు జవ్వనము పాయరాదు సంసారము
యిట్టివెల్ల నీమాయ యేమీ ననరాదు ॥ఏమి॥

కడుఁగాంక్షలు నాసొమ్ము కర్మములు నాసొమ్ము
నడమ నంతర్యామివి నాకు నీవు
పుడివోవు కోరికలు వొదుగదు కోపము
కడదాఁకా నీమహిమ కాదనరాదు. ॥ఏమి॥

---

౧. 'నీకిరవైనది' పూ. ము. పా., నీవిరవైనది=నీవే నిండుకొన్నది లేక, నీవే స్థానముగాకలది కావచ్చు.

భావించలేనివాఁడను ప్రకృతిలోనివాఁడను
శ్రీవేంకటేశ దయసేసితివి నీవు
తోవదప్పదు జ్ఞానము తొలఁగదు వివేకము
దేవుఁడవు నీమర్మము తెలియఁగరాదు ॥ఏమి॥ 200

## కాంబోది

ఏమిసేయఁగలవార మెందుకు నోదుము నేము
శ్రీమాధవ నీవే దయఁ జిత్తగించు మమ్మును ॥పల్లవి॥

వేపరక పుణ్యాలు గావించేదే యరుదుగాని
సేసేనంటే పాపములు చేతిలోనివే
గాసిలక చూచితేఁ జీఁకటైనా వెలుఁగౌఁగాని
వీసమంత మఱచినా వెలుఁగైనాఁ జీఁకటే. ॥ఏమి॥

తెలివితో మోక్షము సాధించేద యెక్కుడుగాని
అలయించేలోకము లెన్నైనా గలవు
తలఁచితే నీరూపము తానే యెదుట నుండు
యిలఁ బరాకై వుండితే నెచ్చోటాఁ జిక్కదు ॥ఏమి॥

యీవల నీదాసుఁ డయ్యేదె ఘనముగాని
దావతి రాజసా లంతటా నున్నవి
శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు. ॥ఏమి॥ 201

## నాట

గాదసేటివా రెవ్వరు కడలనుండి
సేదదేరిచి నీవేమిసేసినానుఁ జెల్లును. ॥పల్లవి॥

తక్కక బ్రహ్మాదిదేవతలకు నాయకుఁడవు
మక్కువ శ్రీసతికి మగఁడవు
చక్కనివాఁడవు మరి చంద్రసూర్యనేత్రుఁడవు
వుక్కుమీరి నీవెట్లానుండినా నమరును. ॥ కాద ॥

కామునిఁ గన్నతండ్రివి కడుఁజక్కఁదనమున
ఆముకొన్నయట్టిచక్రాయుధుఁడవు
కామించి యెందుఁజూచినా గరుడవాహనుఁడవు
వేమరు నీవెటువలె వెలసినా నమరును. ॥ కాద ॥

అందరిలోపల నుండే అంతర్యామివి నీవు
చందమైనపరబ్రహ్మస్వరూపుఁడవు
యెందును శ్రీవేంకటాద్రి నిరవైనవాఁడవు
అంది మమ్ము నేలితేను అన్నిటా నమరును. ॥ కాద ॥ 202

లలిత

తెగక పరమునకుఁ దెరువులేదు
పగయెల్లా విడువక భవమూఁ బోదు. ॥ పల్లవి ॥

కన్నులయెదుటనున్న కాంచనముపై మమత
వున్నంతదడవు మోక్ష మొనగూడదు
అన్నముతోడిరుచులయలమట గలదాఁకా
పన్నినసుజ్ఞానము పదిలము గాదు. ॥ తెగ ॥

పక్కనున్న కాంతలభ్రమగలకాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపుసంసారవిధి నున్నంతదడవు
నిక్కి పరమధర్మము నిలుకడ గాదు ॥ తెగ ॥

చిత్తములోపలిపలుచింతలు మానినదాఁకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశుఁ దేలినదాసులకైతే
హత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు ॥తెగ॥ 203

రేకు 236 వరాళి

ఎన్నఁడు వివేకించే దీదేరె దెన్నఁడు
యెన్నిలేవు జీవిపా క్లేమిచెప్పే దిఁకను ॥పల్లవి॥

నరజన్మమునఁ బుట్టి నానాభోగాలు మరిగి
హరి నెరఁగక మత్తుఁడై వుండును
సురలోకము చొచ్చి సుకృతఫలములంది
గరిమ విజ్ఞానమార్గము విచారిఁచఁడు. ॥ఎన్నఁ॥

పెక్కుగాలము బ్రతికి పెనుఁగోరికలే కోరి
అక్కడ విష్ణుఁ గొల్వక అఁసుఁడౌను
మిక్కిలిఁ దపము చేసి మించైనఘనత కెక్కి
తక్కక పరమమైనతత్త్వము దెలియఁడు ॥ఎన్నఁ॥

వేవేలుబుద్దులు నేర్చి వేడుకసంసారియై
శ్రీవేంకటేశుఁ డెందక చింతఁ గుందును
దైవ నూతడే దయదలఁచి మన్నించుఁగాని
భావించి తనంతనైతే భవములఁ బాయఁడు ॥ఎన్నఁ॥ 204

దేశాక్షి

నివొక్కఁడవె యిత్తువు నిన్నుఁ గొల్చినవారికి
శ్రీవల్లభుఁడవు రక్షించవే నారాయణా ॥పల్లవి॥

[illegible]ములు శుచిని బెరిగేటి మోక్షము
వో[illegible]కరమునఁ దెబ్బ లియ్య[illegible] రెవ్వరు
అక్క[illegible]నప్పుధ[illegible]లు లంగళ్ల[illegible] నున్నవి
గ[illegible] గో[illegible]మంటే మోక్షము గొనరాదు ॥ నీవో ॥

పు[illegible] [illegible] వోడ్డి యుండే మోక్షము
మిన్నక యె[illegible]మంటే మెట్లు గావు
యెన్నఁగ సంసారధర్మ మిదివో మోక్షము చూప
చన్నమన్న వారికెల్లా సాధనము గాదు ॥ నీవో ॥

పదునాల్గులోకములు పన్నివున్నవి మోక్షము
తుదకెక్కించ నవైనాఁ దోడుగావు
యిదివో శ్రీవేంకటేశ యిహాపరము లొసఁగి
హృదయములో నున్నాఁడ వింకనేల చింత ॥ నీవో ॥ 205

ఆహిరి

అక్కటా నీమాయ కగపడె జీవుఁడు
యెక్కువ తక్కువ లివి యేమిఁ దలపోయఁడు. ॥ పల్లవి ॥

గొందినున్న స్వర్గము గోరి పుణ్యము సేయును
యెందో తనవ్రాఁతఫల మెరఁగడు
సందడించి మరునాఁటిచవులకే కూడపెట్టు
పొంది మింగినకళ్ళపులుసర మెంచఁడు ॥ అక్క ॥

అప్పటిదేహసమ్మంధపాలికే మనసు పెట్టు
తప్పిపోయినవారలఁ దగులఁడు
కప్పుకొనేలోకలకే కడఁగి చేతులు చాఁచు
చిప్పిలఁ దొల్లి చించివేసిన వెన్నో యెంచఁడు ॥ అక్క ॥

యెదిటిగృహారామాలివే తన కాణాచను
చెదరి కలలోనివి చేపట్టఁడు
వెదకు వైకుంఠపువిష్ణుమూర్తిఁ గనేనని
హృదయములో శ్రీవేంకటేశుఁ జూడనెంచఁడు ॥అక్క॥ 206

దేవగాంధారి

నీవే నన్ను దయఁ గావు నీవు స్వతంత్రుఁడవు
జీవుఁడ నింతే నేను శ్రీమన్నారాయణా ॥పల్లవి॥

నిను నామనసుఁ గొని నేఁ దలఁచేనంటినా
మనసు ప్రకృతిఁ బుట్టె మరి నిన్నెట్టు దలఁచీ
తనువుఁ గొని నీసేవ తగిలి సేసేనంటినా
తనువు కర్మాధీనము తగిలీనా నిన్నును. ॥నీవే॥

గరిమ సర్థమిచ్చి నీగతి గనేనంటినా
హిరణ్య మజ్ఞానమూల మెట్లు నీకు నియ్యనిచ్చి
సిరుల నాజన్మము నీసెలవు సేసేనంటినా
సరిఁ బుట్టుగు సంసారసాధ్యము నిన్నంటినా ॥నీవే॥

యిలఁ బుణ్యఫలము నీకిచ్చి మెప్పించేనంటినా
ఫలము బంధమూల మెర్పడనియ్యనిచ్చీనా
నిలిచి శ్రీవేంకటేశ నే నీశరణు చొచ్చితి
యెలమి నీకరుణ నన్నె దయనిచ్చీనా ॥నీవే॥ 207

సామంతం

మాయామయము లివి మాయకు నీ వేలికవు
చాయకుఁ దెచ్చేనంటే స్వతంత్రుఁడ నయ్యేనా. ॥పల్లవి॥

తెగనికోరిక తానే తీఁగెవలె నల్లుకోఁగా
తగదని మానుప నాతరమయ్యీనా
పగలఁ గోపము పామువలె నాలుక చాఁచఁగ
పగటుతోడఁ దొడికి పట్టఁగనేరుతునా ॥మాయా॥

వయసు తానే మేఘమువలె సోన గురియఁగా
జయించి నే దాని నణఁచఁగ నోపేనా
లయించక లోభము జలఁగవలెఁ బీరుచఁగా
నియమించి మట్టుపెట్ట నేఁడు నాకు వసమా ॥మాయా॥

యేపున గర్వము దానే యేనుగవలె మీరఁగా
చేపట్టి చిక్కించుకో నాచేత లోనౌనా
యేపొద్దు శ్రీవేంకటేశ యివి వానిస్వభావాలు
కాపాడవే నన్ను నే నెక్కఁడా నీదాసుఁడను ॥మాయా॥208

శ్రీరాగం

చిత్తగించవే దేవ శ్రీపతి నావిన్నపము
హత్తి నీదాసుఁడనైతి నపరాధా లున్నవా. ॥పల్లవి॥

జగములువడచేటిసహజ మింతేకాక
వెగటు నాచేఁతలు వేరే వున్నవా
జిగిఁ గర్మములఁ జేయుంచేకాఁపురమేకాక
నిగిడి నావల్ల వేరే నేప్పనేరా లున్నవా. ॥చిత్త॥

పంచమహాభూతాలస్వభావము లింతేకాక
అఁచెల నాకు వేరే జన్మాదు లున్నవా
కొంచక పనిగొనేటిగుణత్రయ మింతేకాక
పంచివేయ నాకు వేరేపాపపుణ్యా లున్నవా ॥చిత్త॥

సరి( గౌమారయవ్వనజరాలచందాలే కాక
గరిమ నాకు వేరేవికారా లున్నవా
యిరవై శ్రీవేంకటేశ యింతా నీకల్పితమే
కరుణించు మీయాత్మ కొ(గాము లిక నున్నవా. ॥చిత్త॥ 209

రేకు 237 ధన్నాసి

ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు
పదిలాన( గొలువ(గా ప్రత్యక్షమయ్యేవు ॥పల్లవి॥

యెదలో నుండుదువని యిన్నివేదాలు చెప్ప(గా
వెదకి ధ్యానము సేతు వెస( గను(గొంట లేదు
చెదర కందే మరి జీవు(డు నున్నా(డందురు
పదిలము గా( జూతు భావించరాదు ॥ఇది॥

అంతటా నుందువని ప్రహ్లాదు(డు చెప్పెన(గా
చింతించి పట్టు(దలతు చేతికి( జిక్కుట లేదు
సంతతజ్ఞానాన నిరాకారమున్న దందురు
మంతనాన( బిల్తు నొకమాట విన(బడదు ॥ఇది॥

రవిలో నుందువని సురలు నిన్ను( గొలువ(గా
తవిలి పూజించేనంటే దగ్గరి వచ్చుట లేదు
యివల శ్రీవేంకటాద్రి నిరవై నీవున్నా(డవు
తివిరి సేవించితిమి ద్రిష్టమాయ మాకు ॥ఇది॥ 210

దేసాళం

ఆత్మజ్ఞానమాత్రమున నెవ్వరైనా ముక్తులే
పుట్టుగులు మరి లేవు పొందుదురు మోక్షము. ॥పల్లవి॥

అతిసూక్ష్మ మీయాత్మ అందులో హరి యున్నాఁడు
కతలే వినుటగాని కానరాదు
క్షితి దేహాలు ప్రకృతిఁ జెందినవికారములు
మతి నిది దెలియుటే మహితసుజ్ఞానము. ॥ఇట్టె॥

లోకము శ్రీపతియాజ్ఞలో తత్త్వా లిరువదినాల్గు
కైకొని సేఁతలు సేసేఁ గర్తలు లేరు
సాకిరింతే జీవుఁడు స్వతంత్రుఁడు దేవుఁడు
యీకొలఁది గని సుఖియించుటే సుజ్ఞానము. ॥ఇట్టె॥

కాలము దైవముసృష్టి కలి మన్వుల భాగ్యము(?)
వాలాయించి యెవ్వరికి వచింప రాదు
యీలీలలు శ్రీవేంకటేశునివి ఆచార్యుఁడు
చాలిమిఁ జెప్పఁగా విని తలఁచుటే సుజ్ఞానము ॥ఇట్టె॥ 211

భూపాళం

పరమయోగీశ్వరులపద్ధతి యిది
ధరణిలో వివేకులు దలపోసుకొనుట ॥పల్లవి॥

మొదల నాత్మజ్ఞానము దెలిసి పిమ్మట
హృదియములోనిహరి నెరుఁగుట
వుదుటైనయింద్రియాల నోడిసి వంచుకొనుట
గుదిగొన్న ఆసలలో కోరికె లుడుగుట ॥పర॥

తనపుణ్యఫలములు దైవము కొసఁగుట
పనివడి యతనిపై భక్తిచేసుట
తనివితో నిరంతర ధ్యానయోగపరుఁడౌట
మనసునఁ బ్రపంచసంబంధము మరచుట. ॥పర॥

నడుమ నడుమ విజ్ఞానపుకథలు వినుట
చిడుముడి నాచార్యసేవసేయుట
యెడయక శ్రీవేంకటేశుపై భారమువేసి
కడు వైష్ణవులకృప గలిగి సుఖించుట ॥పర॥ 212

శుద్ధవసంతం

లే దందువల్లఁ దెలివి యెన్నటికిని
నీదయ నాపై నించినఁ గాని ॥పల్లవి॥

అరయఁగఁ బ్రపంచ మలవడినటువలె
అరుదగువైరాగ్య మలవడదు
తరుణులరతి మతిఁ దలఁచినయటువలె
ధర నీసాకారము దలఁచదు మనసు ॥లేదం॥

గొనకొన్నయర్థము గోరినయటువలె
కొనయగు మోక్షము గోరదు
తనుభోగములకుఁ దగిలినయటువలె
తనిసి నీకథలకుఁ దనియదు మనసు. ॥లేదం॥

చలమును బాపము చవియైనటువలె
ఫలితపుణ్యము చవి గాదు
సులభ శ్రీవేంకటేశుఁడ నీమహిమిది
గలిగితివి నాకుఁ గలఁగదు మనసు. ॥లేదం॥ 213

ముఖారి

పామరుల కెంతైనా ఫలియించనేరదు
శ్రీమాధవ నీవు దయసేసితే నీడేరును ॥పల్లవి॥

అన్నిటా దైవము( దమ్ము నందరు నెరు(గుదురు
యెన్నుక నావివర్తన లెరు(గుదురు
పన్ని జననమరణభయము లెరు(గుదురు
వన్నెల నెరి( గెరి(గి వల(( జిక్కుదురు ॥ పాము ॥

వీందురు పురాణాలు విందు రుపదేశాలు
వీందురు తొల్లిటి వారివిచారాలు
వీందురు స్వర్గనరకవిభవము లన్నియును
మందలించి విని విని మాయకు లోనౌదురు ॥ పాము ॥

నడతు రాచారమున నానాదానాలు( జేతురు
విడువక తీర్థయాత్ర వెస( జేతురు
యెడయక శ్రీవేంకటేశ నీవుండ(గ( దప-
ముడవుల( జేసి చేసి అలయుచుండుదురు ॥ పాము ॥ 214

నాగవరాళి

ఎట్టు వేగించీ జీవు( డిన్నిటిలోనా చే—
పట్టిరక్షింతువు గాక పరమేశ్వరా ॥ పల్లవి ॥

బల్లిదు(డై వైరాగ్యాన పదార్థము లన్నియును
వొల్లనంటే నే నోరూరించును
వొల్లనే కావలెనని వొడిసి పట్టు(జూచితే—
నల్లంతనుండి యాసల నలయించును ॥ ఎట్టు ॥

యించుక మొదలువెట్టు యిచ్ఛాద్వేషాలు ముందు
మించు రాగా రా(గా(౧ బెట్టిమీ(ద( గప్పును
పొంచి యంతలో( దెలిసి పొంగణ(గి వుండితేను
వంచిం చొక్కకారణాన వచ్చి ప్రవేశించును ॥ ఎట్టు ॥

౧ 'బెట్టెమీ(ద(' పూ ము పా 'మీ(ద(బెట్టి' అని యుంచే సందేహమే గలిగియుండదు.

వేసరి యెడవినుచున్నా వెంటనే సుఖదుఃఖాలు
పాసిపోక కొంగ యనుభవింపించును
రోసి పాయలే రెవ్వరు రుచుల యెగ్గ తోఁచు నిసి
శ్రీసతీశ కనుఁగొను శ్రీవేంకటేశ్వరా ॥ఎట్టు॥ 215

రేకు 238 ౧కన్నడగౌళ

ఏమిసేతు నాభాగ్య మిట్టున్నది
నేమమేమీ నెరఁగను నీవె గతి యింకను ॥పల్లవి॥

అగపడి నిరంతర మున్నవాఁడవై జగత్తు
మొగముఁ గట్టినట్టు మలఁగి మురలీదు
తగిలి నిన్నెటువలె ధ్యానము సేతు నేను
అగడు సేసి సహాయముగాదు మనసు ॥ఏమి॥

విడువక యెల్లప్పుడూ విడిదలైన దేహము
మెడఁగట్టినట్టున్నది మెలఁగీ సురులదు
వాడయుఁడ నీవుండఁగ మొదిగి నే నెట్టుసేతు
అడరి కప్పిననీమాయాఁ దోడుగాదు ॥ఏమి॥

వొద్దనే పెక్కుగాలము పూనినపుణ్యకృతము
చద్దిమూఁకలై యనుభవించఁ జేసీ మానదు
అద్దుక శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
వొద్దికతో రక్షించు నావోజఁ దోడుగాదు ॥ఏమి॥ 216

రామక్రియ

ఏలికె వీఁ పరికి యీదేహభూమి నీది
మేలు అన్ని మట్టుపెట్టి మించరాదా జీవుఁడ ॥పల్లవి॥

---

౧ ‘రామక్రియ’ పూ. ము. పా.

వెలిఁబడ్డయింద్రియాల వెలయ లోనికిఁ దిప్పి
కొలువులు సేయించుకోనరాదా
కలఁచెడిలోలోని కామాదిశత్రువుల
వెళకనీ కడ్డపెట్టింపించరాదా జీవుఁడ ॥ పలి ॥

అట్టె పరువుదోలినఆసలనేగుఱ్ఱముల
గట్టిగ లోలాయమునఁ గట్టుకోరాదా
వొట్టి యెదుట పోఁజూత్తె వుండినభోగములను
ముట్టి యంతర్యామి కిచ్చి మొక్కరాదా జీవుఁడ ॥ పలి ॥

పంపువెట్టి దండంపినబలులివుద్యోగాల—
గుంపు గూర్చి ముక్తి చూరగొనరాదా
ఇంపుల శ్రీవేంకటేశుఁ డితఁడే సర్వకర్త
సొంపుగ భావించి చక్కఁజూడరాదా జీవుఁడ. ॥ పలి ॥ 217

ధన్నాసి

తప్పించుకోరా దిఁక దైవమే గతి
యెప్పుడు నుద్ధరించేవా రెవ్వరును లేరు. ॥ పల్లవి ॥

మలసి దేహానందమే మఱగినయాత్మకు
తొలుత బ్రహ్మానందము దొరకదు
అలవాటై క్షుద్రభోగాలందుఁ జిక్కినయాత్మకు
బలిమి విరతిఁ బొంద బలపడదు ॥ తప్పి ॥

సర్వదా బ్రహ్మాండములోఁ జరియించేయాత్మకు
నిర్వహించి వెడలఁగ నేరుపు లేదు
వుర్విలోపలిచింత లుడుగనియాత్మకు
నిర్వికారభావము నెలకొనదు. ॥ తప్పి ॥

పరసుకతసనే వెలసేటియాత్మకు
పరగఁ ౧ బేదలమీఁది భక్తి పుట్టదు
ధరలో (శ్రీ) వేంకటేశుదాసుఁడుగాఁ యాత్మకు
వెర పేమిటా లేదు వెదకి చూచి ను ॥ తప్పి ॥ 218

సాళంగనాట

నీవారైనవారికి నిష్టై భక్తేకాక
భావించనేరక వట్టిభ్రమఁ బడవలెనా ॥ పల్లవి ॥

కరుణానిధి నీవు కలిగివుండఁగాను
తిరుమంత్రమే నాకు దిక్కయివుండఁగా
వరుస నాచార్యుఁడు వహించుక వుండఁగాను
పరగఁ దపము చేసి బడలఁగవలెనా. ॥ నీవా ॥

కమలాక్ష నీముద్రలే కాచుక చాకుండఁగాను
అమరి దాస్యము కాణాచై వుండఁగా
తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా దిష్షించవలెనా. ॥ నీవా ॥

(శ్రీ) వేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా
ఆవటించి నుతి వుపాయమై వుండఁగా
కాపులనే శరణనేధర్మము రక్షించఁగాను
వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా ॥ నీవా ॥ 219

ముఖారి

పరమాత్మ నిన్ను గొల్చి బ్రదికేము
విరసపుజాలిఁ జిక్కి వెతఁబడనోపము. ॥ పల్లవి ॥

---

౧. 'బెద్దల' కావచ్చు.

మగఁడు విడిచినా మామ విడువనియట్లు
నగి నామనసు రోసినా లోకులు మానరు
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు
మొగమోటలను నేను మోసపోవనోపను. ॥పర॥

పొసఁగ దేవుఁ డిచ్చినా పూజరి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసరేరు కోరిక దీర్చుమనేరు
వసలేనివసులకు వడల నే నోపను ॥పర॥

నుడుగులు దప్పినా నోముఫల మిచ్చినట్టు
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు
తడవేరు తగిలేరు తామే శ్రీవేంకటేశ
బుడిబుడి సంగాతాలఁ బొరల నే నోపను. ॥పర॥ 220

భైరవి

కరుణానిధి నీవే కనుఁగొంచు నున్నాఁడవు
యిరవై నాలో నున్నాఁడ వేది గతి యిఁకను. ॥పల్లవి॥

పేరుచున్నవి నాలోనఁ బెక్కువికారములు
వూరుచున్న వెన్నైనా వూహలెల్లాను
చేరుచున్న వొక్కొక్కటే సేనాసేనకోరికలు
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యిఁకను ॥కరు॥

పట్టుచున్నవి నానాప్రకృతులవోజలు
పుట్టుచున్నవి యనేకభోగేచ్ఛలు
చుట్టుకొనుచున్నవి సులభపువేడుకలు
యిట్టివి నానడతలు యేది గతి యిఁకను. ॥కరు॥

సందడింపుచున్నవి సారెకు నామమితలు
ముందువెనకై వున్నవి మోహాలెల్లా
చెందె నీపై భక్తి నేఁడు శ్రీ వేంకటేశ్వర
యెందునూ నీవే కాక యేది గతి యిఁకను ॥కరు॥ 221

రేకు 239 బౌళి

నీ వొక్కఁడవే సర్వాధారము నిన్నే యెఱిఁగిన నన్నియు నెఱుఁగుట
భావించి యింతయుఁ దెలియఁగవలసి బ్రహ్మవేత్తలకు గతి దెవువు ॥పల్లవి॥

నీయందె బ్రహ్మయు రుద్రుఁడు నింద్రుఁడు నీయందె దిక్పాలకులు
నీయందె మనువులు వసువులు రుషులు నీయందె విశ్వాదేవతలు
నీయందె వురగులు యక్షరాక్షసులు నీయందె గరుడగంధర్వులు
నీయందె ౧పితరలు సిద్ధసాధ్యులు నీయందె ద్వాదశాదిత్యులు ॥నీవొ॥

నీవలననె కిన్నరకింపురుషులు నీవలనె విద్యాధరులు
నీవలనె యచ్చరలు చారణులు నీవలనె నక్షత్రములు
నీవలనె గ్రహములు చంద్రుఁడును నీవలన(నె?) నభోంతరిక్షములు
నీవలననెజలధులు పవమానుఁడు నీవలనె గిరులును భూమి యును॥నీవొ॥

నీలోననె నదులును నగ్నియు నీలోననె సచరాచరములును
నీలోననె వేదశాస్త్రములు మొదలుగనిఖిలశబ్దములును
నీలోననె అన్నియు నిన్నర్చించిన నిఖిలత్రప్తికర్మము
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిదె మతము ॥నీవొ॥

మలహరి

దేహముసమ్మంధము యిది దేహికిఁ బనిలేదు
వూహించనేర్చినవారలే వోరుచుకుంసురయ్యా. ॥పల్లవి॥

---

౧ పితరులు' కావచ్చు.

విడువవు శీతోష్ణంబులు విడువవు సుఖదుఃఖంబులు
వెడ వెడ మరణభయంబులు విడిచినయందాఁకా
పుడుగవు కాంతులు మమతలు నుద్యోగంబులు చింతలు
పొడవగువిరక్తి వగలోఁ బొడమినయందాఁకా ॥ దేహ ॥

మానదు చిత్తవికారము మానదు దుర్గుణదోషము
మానదు భోగములన్నియు మానినయందాఁకా
పోనీదు సేసినదురితము పోనీదు ప్రాఁకథఫలంబును
పూనినతనయజ్ఞానము పోయినయందాఁకా ॥ దేహ ॥

తెగవటు భవబంధంబులు తెగ వెడ యఖిగర్వంబులు
నిగిడినయీయాత్మజ్ఞానము నిచ్చినయందాఁకా
జగదేకవిభుఁడ శ్రీవేంకటేశ్వర సర్వము నీయానతికోలఁదే
తగులుమందు సిరి సిశ్చల ము నీ దాస్యము గలిగినయందాఁకా ॥229॥

దేసాళం

చూడవే గోవింద నోదన్ను లీలయు
యేడాఁ గర్మము యున్నిట నాకు ॥ పల్లవి ॥

చీరినఁ దుముఁగక చేసినదురితము
సారవలెనే కడు నారటిలి
కాదుకోని తలఁపు కలఁగగపంబుల
వారక వెనునదివలెఁ జారీని ॥ చూడ ॥

యెట్టఁగాఁ గ్రూరత్వ మెప్పుడుఁ గొలిమికో
కట్టువలెనే కడుఁగాఁగిని
వొట్టిదై ప్రకృతి వొరసి వేఁటకుల
యిట్టివలెనే యెల మంచీని ॥ చూడ

వీడక వీమూర్తి వెంటవెంటనే
తోడునీడరైయై తొరలీని
యీడనే శ్రీవేంకటేశ నీమహిమ
వాడనివనములవలెఁ జిగిరించీని. ॥ చూడ ॥ 224

ముఖారి

ఎవ్వరివసము గెల్వ నింతా నీనిమయమే
యివ్వల నీవు గాచితే నేమోకాని. ॥ పల్లవి ॥

వొక్కలోభము పెంచితే వొగి లోకమెల్లాఁ దానే
యెక్కడ చూచినాఁ దానే యీదివనము
వెక్కసమైనది తానే వేగిలేచి సేసేపని
తక్కక యిన్నిటా నెట్టు తప్పించుకోవచ్చును. ॥ ఎవ్వ ॥

పలుమారు వచ్చీఁ దానే పనిలేనిపరాకు
వలచుకొన్నది తానే వట్టిభీతి
నిలుచుకున్నది తానే నిలువుననే సిగ్గు
మెలుపున నెటువలె మెదలఁగవచ్చును. ॥ ఎవ్వ ॥

కనుగొంటే నెందూఁ దానే కార్పణ్యము దైన్యము
అనిశము మించీఁ దానే యాచకత్వము
నను నేలుకొంటి విదే నమ్మితి శ్రీవేంకటేశ
ఆనుఁడను యివి నేను సాధించుటెట్టు. ॥ ఎవ్వ ॥ 225

మాళవిగౌళ

ఇంత రెరిఁగినపని కిఁకఁ దప్పించుకోరాదు
పొందుగానిమాయలఁ బొరలఁగనేఁటికి. ॥ పల్లవి ॥

గతియై బ్రహ్మాండాలు కల్పించ నేరిచి
సుతులై బ్రహ్మాదులు చూపట్టఁగా
శ్రుతి వేదశాస్త్రాలచేతఁ బొగడించుకొంటా
నితరు లెఱఁగకుండా నింత దాఁగనేటికి ॥ ఇంద ॥

వున్నతపరమపద మొసఁగ నీవు గర్తవై
అన్నిటా లక్ష్మీనాథుఁడవనఁ బెంపొంది
పన్నిక యిన్నివిద్యలాఁ బ్రసిద్ధుఁడై వుండి
కన్నులకుఁ బ్రత్యక్షము గాకుండనేటికి ॥ ఇంద ॥

సురల యాపదలెల్లా సులభాన దీర్చి
పరగ ధర్మములెల్లాఁ బరిపాలించి
పరుషలకు వరాలు పలుమారుఁ గృపచేసి
మఱిగి శ్రీవేంకటేశ మాటాడ వదేఁటికి ॥ ఇంద ॥ 226

రేకు 240 సామంతం

ధర నీవే తల్లియును దండ్రియునై యుండఁగాను
యిరవుగ నెవ్వరూ వహించుకోనేమిటికి ॥ పల్లవి ॥

పుట్టినజీవులు తొల్లి భువిలోనై ననేకులు
అట్టై వారిచరితలు ననేకములు
పట్టిజాలిఁ దమతమవారలంటాఁ గంచుక
బట్టబయటే నానాభావాలఁ బొందుదురు ॥ ధర ॥

సరవి నంపిరుఁ జేసేసంసారములు పెక్కు
సిగులవారిగుణాల విషలు పెక్కు
అరసి యమవారినో వని యెల్లాఁ జెప్పుకొంటా
దరినుండే వగరించి తలఁకింప వుందురు ॥ ధర ॥

వడి నెన్నైనాఁ గలవు వావు తెంచిచూచుకొంటే
గడియించేపదార్థాలు కల వెన్నైనా
యెడయక శ్రీవేంకటేశ నీదయ ౧గలి(గి?)తే
జడియక నీదాసులు సంతసమందుదురు. ॥ధర॥ 227

## దేశాక్షి

నారాయణ నీదాసుల నడకలివి
ధారుణి నిదేవన్నై వెలుఁగఁగవలెను ॥పల్లవి॥

ఆతుమలో హరిమీఁది అందోళమె వలె
చేతికి లోఁగాకుంటేను చింతించవలె
ఆతనిఁ జూచేయందుకు నాపటఁ బొరలవలె
రీతి నివెప్పుడు విచారించుకొనవలెను ॥నారా॥

నీలవర్ణుకథలకు నివ్వెరగు నొందవలె
ఆలకించి యందు భ్రమయఁగవలెను
తాలిమితో మహిమలు దలపోసుకొనవలె
వేళ వేళ ధ్యానించి వెదకఁగవలెను ॥నారా॥

చేరి శ్రీవేంకటేశు సేవించుకుండఁగవలె
గారవాన సదా మరుగఁగవలెను
ఆరసి పెద్దల నన్ని నడుగుచుండఁగవలె
నోరునిండా నేపొద్దూ నుతియించవలెను ॥నారా॥ 228

## ముఖారి

జగము లేలేనాఁడవు జనార్దనుఁడవు
తగ నీవారిమై(మే?) నేను ధర నెట్టుండితేనాను, ॥పల్లవి॥

---

౧. 'కలుగు' ధాతువుకు బదులు 'కలు' ధాతువు ఈవాఙ్మయమున పలుతావుల కలదు ఈనాటికి పామరులనోట కడపజిల్లాలో వినవచ్చు

గతి నీవు మతి నీవు కాణాచిచోటు నీవు
పతమై యన్నిటికిని సాక్షివి నీవు
చతురత వలసితే జరతుము కొలుతుము
తతి నేము సేసినతప్పులు లోఁగొనవే ॥ జగ ॥

తల్లియుఁ దండ్రివి నీవు దాత దైవమువు నీవు
యెల్లవారికిఁ బగము నిహాము నీవు
మల్లడి నొక్కొకవేళ మఱతుము తలఁతుము
చల్లఁగా మానేరములు సైరంచుకొనవే ॥ జగ ॥

దరి నీవు దాపు నీవు దయామూర్తివి నీవు
పరగ శ్రీవేంకటేశ పతివి నీవు
విరివిగా నేమైనా వేఁడుకుము నుతింతుము
శరణుచొచ్చితి మిఁక క్షమియించుకొనవే. ॥ జగ ॥ 229

పాడి

ఏకాలము నామనే యొరిఁగినదాసులకు
దాకొని శ్రీహరి భక్తిధారిణ గలిగితేను ॥ పల్లవి ॥

తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ బొల్లు వోదు
బడినే శ్రీహరిభక్తిపంట వండితే
వుడివో దేకాలము ౧వొకతతి రావద్దు(?)
చెడని శ్రీహరిభక్తి చెట్టుకట్టితేను. ॥ ఏకా ॥

వలువదిసితేఁ బోదు వాడుకొంటే వెత్తిగాదు
కొలచి శ్రీహరిభక్తి కుప్పచేసితె
యెలుకకుఁ దినరాదు యెన్నాళ్లున్నాఁ జివుకదు
తలఁచి హరిభక్తి చిత్తపుగాదెఁ బెట్టితె. ॥ ఏకా ॥

---

౧. ఒకతతి రావద్దు = పూచుటకో కాచుటకో ఒక ఋతువే కావలెనను పద్ధతివద్దు అని కావచ్చునేమో.

కలవుకుఁ లోఁగాదు సుంకరవాని బ్రదుకు
యెలుకతో హరిభక్తి యిలు నిండితే
నెలవై శ్రీవేంకటేశ నీకృపగలవారికి
గలిగాఁగ హరిభక్తి కూడ పెట్టుకొనేను. ॥ పకా ॥ 230

దేసాళం

విశ్వరూప ౧నీమూర్తి వివేకించలేను నేను
శాశ్వతుఁడ నీవున్నచందమేమీ నెఱఁగ. ॥ పల్లవి ॥

నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట
దొబ్బుకొంటాఁ దిరిగేము తోవల నిన్న
వుబ్బి సముద్రము వలెనున్న నీప్రకృతియందు
గబ్బినై యీఁదుచున్నాఁడఁ గలఁగకుమీ. ॥ విశ్వ ॥

కడయు మొదలు లేని కాలము నీతన వట
నడుమ నందుతోనె పెనఁగుచున్నాఁడ
అడరి నీసొమ్ములైనఆత్మలలో నొకఁడనై
చిడుముడి నున్నవాఁడ చిక్కువఱచకుమీ ॥ విశ్వ ॥

పరమున నీమహిమనఁ బ్రబలియున్నాఁడవట
గరిమ సోదించేము కన్నులనిన్నుఁ
ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్న నేము
శరణు చొచ్చితి మీఁక చనవిచ్చి కావుమీ. ॥ విశ్వ ॥ 231

నాట

కొలిచినవారికిఁ గొమ్మని వరములిచ్చీ
వెలయఁ గలశాపురవీధిహనుమంతుఁడు. ॥ పల్లవి ॥

---

౧ ఈ 'నీమూర్తి' పూ. ము ప్రా. లో తప్పి పోయినది ఇదిలేకుంచే వాక్యములో కర్మ కుదురదు

బెట్టుగా నొకచేతఁ జూపెడి నభయహస్తము
పట్టుకున్నాఁ డొకచేతఁ బండ్లగోల
మెట్టుకొన్నవి రాకాసిమెదడుతోడితలలు
రట్టడి కలశాపురిదిట్టహనుమంతుఁడు ॥కొలి॥

చెచ్చెర వీనుల నాలించేది సురలనుతులు
కొచ్చి కొచ్చి తోఁకఁ జుట్టుకొన్నది నింగి
తచ్చి చూచేది సన్నుల దాసులమీఁదికరుణ
రచ్చకెక్కెఁ గలశాపురముహనుమంతుఁడు ॥కొలి॥

వసుధ మతిలోనిది స్వామికార్యవిశ్వాసము
వెసఁ దనవద్దనది విష్ణుభక్తి
పసగా శ్రీవేంకటేశ బలు నీబంట్లలోన
రసికుఁడు కలశాపురముహనుమంతుఁడు. ॥కొలి॥ 2౬

రేకు 241 రామక్రియ

రాముఁడు లోకాభిరాముఁడు
ఆముక ఏజనగరమందు నున్నవాఁడు. ॥పల్లవి॥

చక్కఁదనములవాఁడు జానకీవల్లభుఁడు
గక్కున శబరిపూజ గైకొన్నవాఁడు
వెక్కసమైన పైఁడివిల్లునమ్ములవాఁడు
రక్కసులవైరి దశరథనందనుండు ॥రాము॥

శరధిగట్టినవాఁడు చాయఁగల్లనివాఁడు
యిరవై సుగ్రీవాదుల నేలినవాఁడు
సరి భరతశత్రుఘ్నసౌమిత్రిసేవితుఁడు
అరిది మునుల కభయమిచ్చినవాఁడు. ॥రాము॥

అచ్చపుబాలుఁడై శకటాసురు మర్దించినాఁడు
కుచ్చి కాఁగిళ్ల నింతులఁగూడినాఁడు
మచ్చిక ౧ దోఁగెడుతాను మద్దులు విరిచినాఁడు
పిచ్చిలఁ బూతకిచన్ను పీరిచినాఁడు ॥ ఉవి ॥

పిన్ననాఁడే కోడెలతోఁ బెనఁగి గెలిచినాఁడు
యెన్నికగా వేలఁ గొండ యెత్తినాఁడు
వెన్నడిని కొండపాము వెస రెండు సేసినాఁడు
పన్ని కంసునిమదము భంజించినాఁడు ॥ ఉవి ॥

పొంచి పెద్దవాఁడై భూభారము దించినాఁడు
అంచెఁ బాండవులకు దిక్కైనవాఁడు
మించి శ్రీవేంకటగిరిమీఁద నిదె వున్నవాఁడు
వంచించక దాసులకు వరాలిచ్చేవాఁడు ॥ ఉవి ॥ 285

ఆహిరినాట

అరుదరు దీగతి యహోబలేశ్వర
పోరిఁబోరి దాసులు పొగడుట యెట్టు ॥ పల్లవి ॥

యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని
అదె ప్రహ్లాదుఁడు బంటగు టెట్లు
కదిసినరుద్రునిగర్వ మడఁచితివి
గుదిగొనదివిజులు కొలుచుట యెట్టు ॥ అరు ॥

ఘనసింహాకృతి గైకొనివుంటివి
యెనయఁగఁ గరిఁ గాచినదెట్లు
పనివడి కంబమువగుల వెడలితివి
మనుజులు పూజించి మరుగుట యెట్లు ॥ అరు ॥

---

౧. 'దొంగెడు' రేకు. "తొంగు తోఁగు" ధాతువులు ఈ వాఙ్మయమున నున్నట్లే, 'దోఁగు దొంగు' ధాతువులుకూడ ఉండవచ్చు.

సరవితో వీరరసమున మించితివి
అరయఁగ శృంగారి వౌటెట్లు
సిరి వుర మెక్కెను శ్రీవేంకటాద్రిని
యిరవుగ నీతోడ యెక్కుట యెట్లు ॥ అరు ॥ 286

దేసాళం

నిండు కంతటా నున్నది నీమాయ
వొండొకరు జనులకు నుపదేశించనేలా ॥ పల్లవి ॥

నేరకుంటే సంసారము నేరుపును నీమాయ
చేరకుంటే గడులోనుచేసుకొను నీమాయ
వూర కొడఁబడకుంటే వొడఁబరచు నీమాయ
పోరి బిడ్డలకు తండ్రి బుద్ధి చెప్పవలెనా ॥ నిండు ॥

నాలికె కారురుచులు నలిఁ దెలుపు నీమాయ
వేలుఁడై విరక్తుఁడై భిక్షమెత్తించు నీమాయ
పాలుమాలేమంకునై ఁ పనిసేయించు నీమాయ
తెలుఁబగ శ్లోకరు ప్రేరేఁపుచుండవలెనా ॥ నిండు ॥

చొక్కించి నోరుఁ జేతికి సూటి చూపు నీమాయ
పెక్కులాగుల నన్నిటాఁ బెనగించు నీమాయ
వెక్కసపలమెల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తక్కక నీమహిమిది తలపించవలెనా ॥ నిండు ॥ 287

లలిత

మనుజు లూరకే తాము మరఁగులంటా నుందురు
యెనసి దేవుఁడు సేసే నిందరికి మాయ. ॥ పల్లవి ॥

వీని కందరి కొక్కటే వివరములే వేరు
కనుచూపులు నొక్కటే కాంతులే వేరు
మనసూ నొక్కటే సోనిమర్మములే వేరు
తనివియు నొక్కటే తనువులే వేరు. ॥ మను ॥

లోకమును నొక్కటే లోనువెలుపల వేరు
వాకు లొక్కటే భాషలవరుసే వేరు
జోక నాహార మొక్కటే సారిది రుచులే వేరు
కైకొన్నరతి యొక్కటే కందువలే వేరు ॥ మను ॥

పరిమళ మొక్కటే భోగించుకొనుటే వేరు
యిరవైన దొక్కటే యింపులే వేరు
అరిది శ్రీవేంకటేశ అన్నిటా నీదాసుఁడు(ల?)
శరణాగతి యొక్కటే జాతులే వేరు ॥ మను ॥ 28

రేకు 242 సాళంగనాట

శరణని బ్రదుకరో జనులాల
గరిమ మెరసె నిదె కనకస్తంభము. ॥ పల్లవి ॥

అహరహమునుఁ బ్రహ్లాదుఁడు దొరకొని
బహువిధముల హరిమహిమలు వొగడఁగ
కహకహ హిరణ్యకసిపుఁడు నగి హరి
సహజ మేదియని చఱచెఁ గంభము ॥ శర ॥

అటమరి పెటపెటమని బెంల్లెగసి
చిటచిటరవములఁ జిరుతపొగ లెగసి
తటతట మనుచును తరళి బ్రయ్యాలై
పటపమనుచును పగిలెఁ గంభము. ॥ శర ॥

బెడిదపుచూపులమిడుఁగురు లెగయఁగ
పుడమి యదర నూర్పులు చెలఁగ
గడగడ వడఁకి దిక్తటము లల్లాడఁగ
వెడలెఁ గంభమున విజయసింహము ॥శర॥

నగవుల నుడివడె నభోంతరంబులు
పొగ లెగసెను పెనురోమముళ్ళ
పగటుచార్పులను పగిలెనుఁ గొండలు
వెగటుగ వెడలెను వీరసింహము. ॥శర॥

తెఱచినవోరఁ బ్రతిధ్వని లెసగఁగ
కఱకుగతుల చుక్కలు చెదర
నెఱిహుంకృతులను నిఖిలము బెదరఁగ
వెఱచఱవఁ గెరలె విమలసింహము. ॥శర॥

పటువిహారముల బ్రహ్మాండ మగల
గుటగుటరవళి నాకులు వొగడ
నిటలనేత్రమున నెఱమంట లదర
పటుగతి మెరసెను భయదసింహము. ॥శర॥

పెదపెదకోఱల పిడుగులు రాలఁగ
తుదనఖముల నెత్తురు దొరుగ
గుదిగొనుకసరుల కులగిరు లూఁటాడ
వుదయించె నదివో వుగ్రసింహము ॥శర॥

అట్టహాసమున నసురలు వారఁగ
ముట్టి వాయువులు మొగతిరుగ
దట్టములై జలధరములు మునరఁగ
దిట్టయై వెడలె ధీరసింహము ॥శర॥

జలధులు గలఁగెను జడిసె లోకములు
తలఁకె సప్తపాతాళములు
పులికిపడఁదొడఁగె నూర్ధ్వలోకములు
కొలువున నిలిచెను ఘోరసింహము ॥ శర ॥

అచ్చట హిరణ్యు నదరంటఁబట్టి
యిచ్చలఁ దొడపై నిడి చించి
కుచ్చి వానిపేగులు జందెములుగ
విచ్చి వేసుకొనె విష్ణుసింహము ॥ శర ॥

పొగడిరి దివిజులు భువనములు వెలసె
పగయుడిగి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు
మిగులశాంతమున మించె శ్రీవేంకట-
నగమున నహోబలనారసింహము ॥ శర ॥ 239

బౌ॥

దేవా నీవే యిన్నిచందముల తిరముగ మహోపకారి వైతివి
యేవలనైనా నీవేకాక భువి నింతటివారలు యిఁకఁ గలరా ॥పల్లవి॥

జనులకు నీవే వాక్కొక్కచోటను శాస్త్రార్థములై కడఁగుదువు
తనియక నీవే మరి వారికి బోధకులఁ గొందరినిఁ గల్పింతువు
మనసులో నంతలో వొడఁబడికె చేసి మలయుచు నీవే నిలుతువు
కనుఁగొన నీవే సుజ్ఞానమార్గము ౧కైవసముగాఁ దెలుపుదువు ॥ దేవా

కడఁగి యప్పటి నీవే యజ్ఞాదికర్మఫలములై వుండుదువు
తడయక నీవే తిరుపతుల దేవతామూర్తులై పొడచూపుదువు
యెడయక నీవే తపోమహిమలై యెదుటనే తార్కాణ లౌదువు
వొడలై నీవే యిహపరములకును వొడిగట్టి సాధింపింతువు. ॥ దేవా ॥

౧ 'కైవశము' రేకు.

ఆవేళ నీవే తత్త్వనిర్ణయము నాధారమునై యేర్పరతువు
నీవే కమ్మటి ఆచారవిధులకు నియమములెల్లా నేర్పుగువు
భావింప నీవే అలమేల్మంగకుఁ బతివై శ్రీవేంకటేశ రక్షింతువు
జీవుల కంతర్యామివై నీవే శిష్టుల బరిపాలింతువు. ॥ దేవా ॥ 240

సన్నాసి

విచారించుకోరో యిది వివేకులాల మెండు-
వచారాలు చూచి మీరు భ్రమయకురో ॥ పల్లవి ॥

భావింప నారదునికి బ్రహ్మపట్టమరుదా
వేవేలైనాఁ గొంచెమని విడిచెఁగాక
దేవతలు తన్నుఁ జూచి దిగ్గన లేచి మొక్కేటి-
అవైభవపుపద మందెఁగాక ॥ విచా ॥

మిక్కిలి జ్ఞానము గల్గి మించి శుకుఁడేరు పెల్లా
చిక్కి సంసారముపాలు సేయవలెనా
యెక్కువ హరిదాసుఁడై యిట్లానే వైకుంఠ-
మెక్కెడితోవ సాధించె దిది మేలుగాక. ॥ విచా ॥

మూలమని నుడిగితే ముంచి యెవ్వఁడు గాచెను
పోలించ నెవ్వని నాభిఁ బుట్టె లోకాలు
చాలి యెవ్వనికుక్షి నీజగము లున్నవి మరి
కాలమందే ఆదేవునిఁ గానవలెఁగాక. ॥ విచా ॥

యిదియే శ్రీవైష్ణవులు యిలఁ బూర్వాచార్యులు
వెదకి చదివి కన్నవివరమెల్లా
తుదమొద లెరఁగనిదుష్టులకతలు మాని
పదిలమై యిట్టే నమ్మి బ్రదుకుటగాక. ॥ విచా ॥

సంకుఁజక్రములు మా (మూ?)ని సమానభోగముతోడ
అంకెల శ్రీవేంకటేశునండ నుండరో
పొంకపుబుద్ధు లిమ్మని పొంచి గాయత్రి జపించి
ఇంక బ్రహ్మవేత్త లెంచే దిందుకే కాక ॥విచా॥ 2

రేకు 243 శంకరాభరణం

కలిగినమీఁదాఁ గడమేలా
పలులంపటములఁ బడుటే కాక. ॥పల్లవి॥

దురిత మణఁగె నిటు తుదకెక్కె సుఖము
హరి యొక్కఁడె గతియన్నపుడే
పొరి నిఁకఁ జేసెటిపుణ్యములెల్లా
వరుసతోడ నెవ్వరికో కాని ॥కలి॥

సార మెరిఁగె తనజన్మము గెలిచెను
శ్రీరమణుని దలఁచినయపుడే
సైరణతో నిఁకఁ జదివేటిచదువు
మేరమీఁద నేమిటికో కాని ॥కలి॥

శ్రీవేంకటపతి చిత్తాన నిలిచెను
కావించి గురునిఁ గన్నపుడే
భావించి యితరప్రార్థన లన్నియు
యీవలావలను యెందుకో కాని ॥కలి॥ 24

వసంతవరాళి

వట్టిస్వతంత్ర మిందు లేదు వావాద మిందు లేదు
గుట్టు దెలియక లోలో గునిసేరు వీరివో ॥పల్లవి॥

నేరిచి బ్రదుకువారు నేరక వీఁగేటివారు
యేరీతిఁ జూచినాను యెవ్వరు లేరు
తీరుగాఁ దమలో నుండేదేవుఁడు పెరరేఁచఁగా
మేరతోనే జీవులెల్లా మెరసేరు వీరివో ॥ వట్టి ॥

కొందరు గొప్పజీవులు కొందరు చిన్నజీవులు
యెందుఁ జూచినా భూమి నెవ్వరు లేరు
పొందులే వెరు వెరుగాఁ బుట్టించె దేవుఁడే
అందాలు సేయఁగ లోకు లమరేరు వీరివో ॥ వట్టి ॥

అసురకాణాచివారు అమరకాణాచివారు
యెసఁగ విచారించుకో నెవ్వరు లేరు
వెస శ్రీవెంకటేశుఁడు వినోదించినయట్లు
వసుధమీఁదటఁ గానవచ్చేరు వీరివో ॥ వట్టి ॥ 243

కన్నడగౌళ

సరవులు దెలియఁగఁ జనుఁగాకా
పరమార్థములో భంగము గలదా ॥ పల్లవి ॥

హరి స్వతంత్రుఁడట హరిసంకల్పము
విరసంబౌనా విశ్వమున
సరవిఁ బ్రపంచపుసకలమతంబులు
వరుస నెంచఁ గొదువలు మఱికలవా ॥ సర ॥

యితఁడు పూర్ణుఁడట యితనివిహారము
వెతకఁగవలెనా వేమరును
కతకరచినయీకన్ను లెదిటివే
మతిఁ దోఁచీ నిఁక మఱుఁగులు గలవా ॥ సర ॥

అంతరాత్మయట ఆతని వేరె
చింతించవలెనా సిలుగులను
చెంతనే యిదివో శ్రీవేంకటేశుఁడు
యెంతదెలిసినా యితరము గలదా ॥ సర ॥ 24

దేసాళం

అచ్యుతుకృపాలబ్ధ మతియుఁగాక
మచ్చిక నాతఁడు సేసేమతకముగాక ॥ పల్లవి ॥

నానాపాట్లఁ బడె నాఁడు కరి మకరిచే
హీనదెస ప్రహ్లాదుఁడు హిరణ్యుచేఁ బాటువడె
పానిపట్టి హరి యది పరిహరించని గాఁడా
ఆనుక హరిదాసుల కంటకవే భంగమా ॥ అచ్యు ॥

తగిలి భీష్ముఁడు శరతల్పమందు నుండఁడా
అగడై విభీషణుఁడు అన్నచేఁ దన్నువడఁడా
పగవాఁడే చూచుచుండ భాగవతులను ౧ హరి(?)
తగినపుణ్యుల నిందు తప్పు లెంచవచ్చునా ॥ అచ్యు ॥

మంతనాన నారదుఁడు మాయలకుఁ లోనుగాఁడా
చెంతల నర్జునునకు చేతులు దెగిపడవా
ఇంతలో శ్రీవేంకటేశుఁ డిట్టె వీని మన్నించఁడా
ఇంతటిమహానుభావు లిందుకు జడుతురా ॥ అచ్యు ॥ 245

దేసాక్షి

పుట్టుగు నీయాధీనమె భోగము నీయాధీనమె
అట్టె యీభావనకు నరుదయ్యీ నాకు. ॥ పల్లవి ॥

---

౧. ఈ 'హరి' సంబోధనమా?

కానసట్టుండ వచ్చు నీకల్పితసుఖదుఃఖాలు
మేను మోచి మీయాజ్ఞ మీరవచ్చునా
నానాజీవుల నడేవాలిఘోరములు చూచి
దీనికెంగ వగతువో దేవ నీచిత్తానను ॥ పుట్టు ॥

తొట్టినపాపపుణ్యాలు తొల్లె నసంఖ్యలే
పుట్టినమీమాయలెల్లాఁ బోదోబ్బేమా
వొట్టుకొన్నజీవులు వొందుచుండఁగఁ జూచి
యెట్టు నీవోంచేవో యీవేదన కిప్పుడు ॥ పుట్టు ॥

చెక్కర యీజన్మములు శ్రీవేంకటేశ్వర నీవే
యిచ్చినవి నీతోడ నెగ్గాడేమా
నిచ్చలు నూవంటి వారనేరుపు నేరాలు చూచి
వచ్చి నె శరణనఁగా వహించుకోవలెనె ॥ పుట్టు ॥ 248

### దేవగాంధారి

అంతటిదైవమ వటుగాఁగా
చెంత నిన్నుఁ గూర్చినదే ఘనము ॥ పల్లవి ॥

వెరవునఁ బంచమవేదసారములు
సిరుల నినునుతించిననుతులు
సరసతోడి బహుశాస్త్రసంతతులు
నిరతిఁ జెప్పెడిని నీకథలు ॥ అంత ॥

కొంగుపైఁడియగుగురుమంత్రంబులు
సంగడి వైష్ణవసంభాషలు
నింగికి భూమికి నిజప్రాణములు
సంగతిగల నీసంకీర్తనలు ॥ అంత ॥

పూనినవిధుల మహోపనిషత్తులు
నానాగతి నీనామములు
వీనులకును శ్రీవేంకటేశ మీ—
జ్ఞానార్థములు మిముఁజదువుచదువులు ॥ అంత ॥ 247

రేకు 244 భైరవి

ఏపాటిగలవాఁడ నిదివో నేను
నాపాటు చూచి హరి నన్నుఁ గావఁగదవే ॥ పల్లవి ॥

౧నిలువు నూరు వండీని(?)నిచ్చలు నీదేహ మైతే
వొలిసీ దుఃఖములకు నోరువ లేదు
కులము గోటిసేసును గుంపుల జన్మాదులైతే
అలరి వోరులఁబోయి అడిగేదే యెపుడు ॥ ఏపా ॥

పట్టితే పసిఁడి రాలీ బచ్చనసంసారము
గుట్టుదెలియఁ బ్రాణము కూటిచేతిది
పుట్టిపడీ మానుషము వొకనాటి కొకనాఁడు
పట్టికాంతలయెదుట భంగపడే మిదివో ॥ ఏపా ॥

చేరి చెట్టడిచితేను చేటఁడు చుట్టరికాలు
యీరీతి నిన్నాళ్లదాఁకా నెందుండిరో
ఆరిచితే మూరెఁ డెక్కీనదే నామకీర్తనము
కూరిమి శ్రీవేంకటేశ కొననాలికెకును ॥ ఏపా ॥ 248

గౌళ వరాళి

దైవమా నీచేతిదే మాధర్మపుణ్యము
పూవువంటికడులేఁతబుద్ధి వారము ॥ పల్లవి ॥

---

౧ 'నిలువు నూరువండీని' మనిషిపొడవే నూరువిధములపంటలు పండుతుంచి అని యర్థమా?

యేమిటివారము నేము యిదివో మాకర్మ మెంత
భూమి నీవు పుట్టించఁగఁ బుట్టితిమి
నేమముతో నడచేటినేరుపేది మావల్ల
దీముతో మోచిన తోలుదేహులము ॥ దైవ॥

యెక్కడ మాకిఁక గతి యెరిఁగే దెవ్వఁడు నేము
చిక్కినట్టినీచేతిలో జీవులము
తక్కక నీమాయతెల్లఁ దాఁటఁగలమా మేము
మొక్కలపుటజ్ఞానపుముగ్ధలము ॥ దైవ॥

యేది తుద మొదలు మాకిఁక నిందులో నీవే
ఆదిమూర్తి నీకు శరణాగతులము
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీదయ గలుగఁగాను నీ చారము ॥ దైవ॥ 249

బౌళి

శరణు నేఁ జొచ్చినది సరి నీవు మన్నించేది
యిరవై నగురుతుగా కిందుఁ గూడపెట్టేవా ॥ పల్లవి ॥

యెంగిలినోరు వెట్టుక యేమాటలాడినాను
సంగతిగా నవి నేఁడు సత్యమయ్యీనా
అంగనలమోహాము నాయంతరంగానఁ బెట్టుక
ముంగిటిఆచారాలు ముఖ్యమయ్యీనా ॥ శర ॥

ఆసలు మెడఁగట్టుక అన్నియుఁ జదివినాను
దోసములెల్లా మాని దొరనయ్యీనా
రోసాలు మదిఁబెట్టుక రోఁత మేను గడిగితే
వేసాలయ్యీ తోఁచుఁగాక వేరేపుణ్యా మున్నదా. ॥ శర ॥

ఘనసంసారము మోఁచి కర్మ మెంత సేసినాను
తను దా జన్మించినట్టితప్పు దీరీనా
యెనలేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
తనిసితి నిఁక నేను తమకించేనా. ॥ శర ॥ 250

సాళంగనాట

ఇంక నేల నాకు వెగ పింతమాట గలిగియు
సంకెళ్లఁ బాసె నాస్వతంత్రము లొక్కఁడే ॥ పల్లవి ॥

నే నెంతపాపబుద్ధినై నేర మెంత సేసినాను
కానిలే నన్నేలేవాఁడు కావఁగలఁడు
ఆనలిచ్చెఁ దొల్లె యాతఁ డదె చరమార్థమందు
మేనిదోసమెల్లఁ బాపి మే లొసఁగేననుచు. ॥ ఇంక ॥

మట్టు లే కతని నెంతమరచి నే వుండినాను
పుట్టించినదేవుఁడే ప్రోవఁగలఁడు
గుట్టు చూపె తొల్లె తనగుణము పాండవులందు
గట్టిగాఁ దనవారై తే కాచుకుందు ననుచు. ॥ ఇంక ॥

తప్ప నే నడచినాను తగిలి శ్రీవేంకటేశుఁ—
డొప్పులు సేసి రక్షించ నొద్దఁగలఁడు
చెప్పనేల గోపికలు సేసినదోసాలు దొల్లి
కప్పుక పుణ్యాలు సేసె ఘనుఁడఁ దాననుచు. ॥ ఇంక ॥ 251

భూపాళం

నిత్యానందులము నిర్మలుల మిదే నేము
సత్యముగ మమ్మాతఁడు సరిఁ బుట్టించఁగను ॥ పల్లవి ॥

యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును
వొక్కటె నంతర్యామై వున్నాఁడదె
ఇక్కడ నాతనిగురా లెన్నేసి చదివే మిఁక
పక్కన తనదాసులభక్తికి సులభుఁడు ॥ నిత్యా ॥

యేమేమి వేడుకొనేము యిటమీఁద నాతని
నామములు నాలికపై నటించీనదె
నేమమున నింకా నెట్టు నిచ్చలు భుజించేమో
కామించి సంసారపుకైంకర్య మాతనిదె ॥ నిత్యా ॥

ధ్యాన మేమని సేసేము తలఁచినంతెల్లాను
వూని శ్రీవేంకటేశుఁడే వుండఁగాను
నానాఁట నిఁక నేమి నమ్మికతి మనేదేమి
పేని మమ్ముఁ దనకుఁడుఁ బెట్టి పెంచఁగాను. ॥ నిత్యా ॥ 252

మాళవిగౌళ

ఏమని చెప్పఁగవచ్చు నీసంతోసపుసుద్ది
నామము శ్రీకృష్ణుఁడట నారాయణునికి ॥ పల్లవి ॥

జనని దేవకిదేవి జనకుఁడు వసుదేవుఁ—
డనఘుఁడైనయట్టిఆదిమూర్తికి
ఘనలోకరక్షణ కంసుమామగండనును
తనకుఁ గారణమట దైవశిఖామణికి ॥ ఏమ ॥

పుట్టినది మధుర పెంపుడుఁజోటు రేపల్లె
వొట్టినమాయలపురుషోత్తమునికి
పట్టినపాండవపక్షపాతము కౌరవవైర—
మిట్టి ప్రాఁతఫలమట యీశ్వరేశ్వరునికి. ॥ ఏమ ॥

గోవులఁ గాచేదియు గొల్లెతలఁ బొందేదియు
ఆవేళ గుణము యీయచ్యుతునికి
శ్రావణబహుళాష్టమి చంద్రోదయము రోహిణి
కావింప జన్మమిదివో శ్రీవేంకటపతికి ॥ పను ॥ 253

రేకు 245 గుజ్జరి

వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణుఁ డొకఁడే కాక
అనుమానములన్నియు నుడిగితిని అలసితి నిఁక నేను ॥ పల్లవి ॥

పట్టినచలము మానదు ప్రకృతి స్వతంత్రమున
పెట్టెడ మాయలనే కమ్మర పెట్టదు వివేకము
పుట్టితి నిన్నాళ్లాయను పొదలితి ౧ బుద్దెరిఁగి
దిట్టనై అది గాదని తోసేటిదీమసమూ లేదు ॥ వెను ॥

తగిలెడిఅనుబంధము మానదు తలఁపును నొకవంక
తెగనియ్యదు కర్మము లేమిటిని తెగించుఁ బుణ్యాముల
నగుచునే మఁదిమికి లోనైతి నానాఁటికి నేను
మగటిమి నే దాని నణఁచను మరిగెడిదేకాని ॥ వెను ॥

చేసినఅలవాటు మానఁడు జీవుఁడు తనగుణము
వేసరదు అనుభవించుటకు వేసరు ముక్తికిని
దాసునిఁగా శ్రీవేంకటేశుఁడు దయఁజూచెను నను నీవేళ
మోహములన్నియును దేరెను మునుపు వెనక యేదో. ॥ వెను ॥ 254

సామంతం

హరియే యెరుఁగును అందరిబ్రతుకులు
యిరవై యీతని యెరుఁగుటే మేలు. ॥ పల్లవి ॥

---

౧. 'బెద్దెరిఁగి' పూ. ము. పా

వెనకట్టిబ్రహ్మలు వేవేలసంఖ్యలు
యెనసి బ్రహ్మాండము తేలిరట
పెనగొని వారలపేరులు మరచిరి
మనుజకీటముల మరెవ్వఁ డెఱుఁగు. ॥ హరి ॥

ఆఁ దొల్లి మును లనంతకోట్లు
చేసిరి తపములు సేనలుగా
యేసిరు లందిరి యెఱఁగ రెవ్వరును
వేసపునరులకు విధి యేదో ॥ హరి ॥

కల వనేకములు కర్మమార్గములు
పలుదేవత లిటు పాటించిరి
బలిమి శ్రీవేంకటపతికి మొరఇడి
తెలిసిరి తుద నిదే వెర విందరికి ॥ హరి ॥ 265

పాడి

వారివారిసహజపురుచు లివి
కారణము తొల్లే హరికల్పితమిది ॥ పల్లవి ॥

వేరే విరుద్ధము లేదు వివేకించిచూచితేను
శూరుఁడై వుండిన మహాసుజ్ఞానికి
యేరీతిఁ జూచినాను యేకసమ్మతి లేదు
సారము దెలియరానిసంసారికి ॥ వారి ॥

సకలభావములును చక్కనయ్యేతోఁచివుండు
ప్రకటించి నేంచినప్రౌఢలకును
అకటా జగడములే అన్నిటా వెంటనేవచ్చు
వికలులైనమూఢవిచారులకు ॥ వారి ॥

సేయఁగలకర్మమెల్లా సేసి తొల్లె ఫలించెను
దాయిదండగల హరిదాసులకును
రాయడిఁ బుణ్యపాపాలు రాగాఁపుల్లై యుండు
యేయెడ శ్రీవేంకటేశు నెరఁగనివారికి ॥వారి॥ 256

బౌళి

కమ్మరను జీవునికిని ఇది కారణ మేమియు లేదట
ఇమ్ముల రాజూ నెఱఁగని ౧వెట్టెటి యెవ్వరికెక్కును నారాయణా
॥పల్లవి॥

యిలలో జీవునివిషయభోగముల నెందునుఁ బోరయనివాఁడవట
చలమా యేల పుట్టించితి వీసంసారవారధిని
కలకాలము నీగర్భగోళములఁ గాఁపురముండఁగ నిటు చేసి
ఫల మేమిగట్టుకొంటివి భావము దెలుపవే నారాయణా ॥కమ్మ॥

నడపెడి యీజగము లన్నియును నటనలు నీవట తొలుతనే
యెడయక యుండే వినోదించెదవు యెద్దతనంబా నీ కేమి
జడియక నీవే సేసినచేఁతలు సర్వమునను నిలుపఁగవలదా
కడుఁగఁగ నేఁటికి నెంగిలిబూరెట౨కడవేయునేల(?)నారాయణా ॥కమ్మ॥

పరగినయీకర్మమార్గములు బంధహేతువని చెప్పితివి
యిరవుగను వేదమార్గములు నేలా కాచుక తిరిగెదవు
గరిమల శ్రీవేంకటేశ్వర యిచ్ఛాకల్పితములు యిన్నియు నీకు
నరి నెరిగించితి విఁక నీచిత్తము పరేశ్వర వో నారాయణా ॥కమ్మ॥257

పాడి

శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
౩సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాఁడు ॥పల్లవి॥

---

౧ వెట్టి+అట=వెట్టెట. ౨. కడవెయుట=పారవేయుట ౩. 'సృష్టించ' రేకు

హరి కృష్ణావతార మందినయంతలోనే
పరమమునులకెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి
సిరులమించినయట్టి శ్రీజయంతినాఁడు. ॥ శిష్ట ॥

గోవిందుఁడు వసుదేవుకొడుకైనయప్పుడే
గోవులు రంకెలువేసె గొల్లపల్లెను
నోవితోఁడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె
చేవలుమీరినయట్టి శ్రీజయంతినాఁడు ॥ శిష్ట ॥

నారాయణుఁడు భువి నరుఁడు దాఁ గాఁగానే
మేరఁ బాండవు లెచ్చిరి మేనవావిని
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుఁడు
చేరువనే మెరయఁగ శ్రీజయంతినాఁడు. ॥ శిష్ట ॥ 258

సామంతం

ఇంతకంటె ఘన మిఁక లేదు
సంతతసౌఖ్యము జనార్దనుఁడే ॥ పల్లవి ॥

భయనివారణము పరమాత్మునినుతి
జయకారణ మీశ్వరచింత
అయుతపుణ్యఫల మచ్యుతునిసేవ
క్రియతో నిజ మెరిఁగినవారికిని. ॥ ఇంత ॥

కర్మహరము శ్రీకాంతుదరిశనము
ధర్మరాసి మాధవుశరణు
అర్మిలిసంపద లనంతునితగులు
నిర్మలముగఁ బూనినదాసులకు ॥ ఇంత ॥

ఆగమోక్త మీహరికైంకర్యము
భోగము విష్ణునిపూజ యిది
యోగము శ్రీవేంకటోత్తమునికొలువు
బాగులు నేర్చినప్రపన్నులకును ॥ఇంత॥ 25

రేకు 246 దేసాళం

ఎటువంటివెఱ్ఱినో యేమని విన్నవింతును
ఘటనలు నావంటా గర్వింతునయ్యా. ॥పల్లవి॥

తలఁచేతలఁపు నీది తనువు నీ విచ్చినది
నిలిచినజగమెల్లా నీమయము
వలవంత నే నిందులో వట్టియహంకారినై
తెలియక నేనేయంటాఁ దిరిగేనయ్యా. ॥ఎటు॥

సేసేచేఁత నీయాజ్ఞ చిత్తమెల్లా నీయిచ్చ
రాసులకర్మములు నీరసము లివి
ఆసపడి నే నిందులో అన్నియు నావనుచును
పోసరించి మాయలలోఁ బొరలేదనయ్యా. ॥ఎటు॥

ఇహము నీవినోదమే యెన్నఁ బరము నీసొమ్మే
సహజము నీకు మాకోచైతన్యాలు
మహిలో శ్రీవేంకటేశ మరి నీదాసుఁడనై యీ
బహుభక్తి నీమీఁదఁ బచరించేనయ్యా ॥ఎటు॥ 260

లలిత

ఇందరు నెఱుఁగుదు రియర్థమే భువి
కందువఁ దగులుట కర్మముకోలఁది. ॥పల్లవి॥

ఆదికి సనాది హరిదాస్యం బిది
వేదాంతంబుల వెలసినది
సోదించి కనిరి శుకనారదాదులు
పాదుగ నీకదె దమభాగ్యముకొలది. ॥ ఇంద ॥

అతిరహస్య మిది అచ్యుతుపై భక్తి
ప్రతిలేనిపరమపావనము
చతురులై తెలిసిరి సనకాదిమునులు
తతి దొరకుట సుకృతఫలముకొలది ॥ ఇంద ॥

పరము శ్రీవేంకటపతిసంకీర్తన
సొరిది గురుఁ డొసఁగుసూక్ష్మ మిద
చిరపుణ్యులు మును చేకొన్ననిజ మిది
మరిగి మనుట తమమనసులకొలఁది ॥ ఇంద ॥ 261

హిందోళవసంతం

ఎన్నికై శ్రీవేంకటేశుఁ డితడు గలుగఁగానె
అన్నిటా నందరిలోనిఅజ్ఞానాలుఁ బాసెను. ॥ పల్లవి ॥

సకలశాస్త్రములందు సందేహమే కాని
వోకరు దైవమిహము కొడఁబడరు
అకటా బాసచేసినయందుకైనా నమ్మరు
వికలచిత్తులెల్లాను విష్ణుదాస్యమునకు ॥ ఎన్ని ॥

గక్కనఁ గర్మము చేసి కడునలయుటే కాని
వొక్కమాటు హరిఁ బాడ నొడఁబడరు
తక్కక పెద్దలుగాఁగ తలవణఁకుటే కాని
పుక్కటికాండ్లు హరిఁ బూజించనేరరు ॥ ఎన్ని ॥

చిత్తములో వివేకించి చింతఁ బొరలుచేకాని
వొత్తి హరిపై భార మొప్పగించరు
హత్తిన శ్రీవేంకటేశుఁ డటె దయదలఁచఁగా
మత్తిలి ప్రపన్నులెల్లా మరేమిటాఁ దప్పరు ॥ఎప్పి॥ 262

దేసాళం

వానివానిసహజము వద్దనవేల
యీనేటిప్రపంచ మది యేమిసేయఁగలదు ॥ పల్లవి ॥

హరి పుట్టించినయట్టిఆయాప్రకృతులను
విరసాలఁ దిప్పేమంటే వేరొకటౌనా
పరమజ్ఞాన మొక్కటే పాటించితేఁ జాలు
యెరవుల పుణ్యపాపా లేమిసేయఁగలవు ॥ వాని ॥

బలువుగ విష్ణుమాయఁ బ్రబలేసంసారమును
చలమున దిద్దఁబోతేఁ జక్కనౌనా
తెలివితో హరిభక్తి తెగక వుండితేఁజాలు
ఖులపైఁ బంచేంద్రియాలు లేమిసేయఁగలవు ॥ వాని ॥

శ్రీవేంకటేశుఁ డాత్మఁ జేకొని వుండినది
భావించకున్న నాతఁడు బడివాసీనా
సావధానాన నితని శరణనుకొంటేఁజాలు
యేవిధులు భవములు నేమి సేయఁగలవు ॥ వాని ॥ 263

రామక్రియ

నారాయణుఁడే సర్వనాయకుఁడు
వేరేదురాశలు వెదకఁ జోటేదయ్యా ॥ పల్లవి ॥

ఆకస మొకపాదము అట్లై భూమొకపాదము
పై కొని యొకపాదము పాతాళము
యేకమైనాఁ డేడనున్నా యిందులోవారే జీవులు
ఆకడఁ బరులఁగొల్చేమనఁజోటేదయ్యా. ॥నారా॥

కడుపులో జగములు కాయ మిన్నిటాధారము
యెడగలచోటనెల్లా యీతనిమాయే
కడుఁబోరా దితఁడే కారణ మందరికి
తడవి మరుపాయాలఁ దగులఁజోటేదయ్యా. ॥నారా॥

౧ చేతన్య మీతనిది సృష్టి యీతనిఘటన
ఆతుమ శ్రీవేంకటేశుఁ డంతర్యామి
రాతిరిఁబగలుఁ దానే రక్షకుఁడు మనలకు
పోతరించి ఇఁక మెచ్చి పొగడఁజోట్లేదయ్యా. ॥నారా॥ 264

ఆహిరి

ఇంక నాదైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని
సంకెదీరఁ బులిసితి సర్వేశ్వరా. ॥పల్లవి॥

తపముసేసి నీమాయ దాఁటేననుచుఁ బెనఁగి
అపుడే యలసితిని అదివో నేను
కృపఁ జూచి నీవింక గెలిపించే దెట్టోకాని
వుపమల సరివోరి వోడితి నే వానికి ॥ఇంక॥

పంచేంద్రియములను పారఁదోలేనని చూచి
వంచఁగ సత్వలేక వసమైతిని
అంచె ౨ నాపాటు చూచి నీవడ్డమౌ టెప్పుడోకాని
దించని వీరములాడి దిగితి నే వానికి ॥ఇంక॥

---

౧ 'చైతన్య' కావచ్చు ౨ 'అంచనాపాటు' వూ ము పా

మోహాంధకారముపై మొనచూపేనని పోయి
సాహాసములేక నే జడిసితిని
వూహాల శ్రీవేంకటేశ వున్నతి నన్నేలితివి
బాహుబలమున తుదివదమయితి వానికి ॥ ఇంక ॥ 265

రేకు 247 దేసాళి

నీదాసులభంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా. ॥ పల్లవి ॥

పాలసముద్రముమీఁదఁ బవ్వళించినట్టి నీకు
బేలలై సురలు మొరవెట్టినయట్టు
వేళతో మామనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా ॥ నీదా ॥

ద్వారకానగరములో తగ నెత్తమాడేనీకు
వీరాన ద్రౌపది మొరవెట్టినయట్టు
ఘోరపురాజసభలఁ గుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా ॥ నీదా ॥

యెనసి వైకుంఠములో నిందిరఁగూడున్న నీకు
పెనఁగి గజము మొరవెట్టినయటు
చనవుతో మాకోరికె సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా ॥ నీదా ॥ 266

సామంతం

దాసవర్గములకెల్లా దరిదాపు మీరె కాన
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును. ॥ పల్లవి ॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా
శ్రీనాథునికి నేము సేసేవిన్నపము
ఆనుక భాష్యకారులు అట్టె మీరుఁ జేయరాదా
మానక విన్నపము మామనవి చనవులు ॥ దాస ॥

వేయినోళ్లభోగి నీవు విన్నపము సేయరాదా
వేయేసిమావిన్నపాలు విష్ణునికిని
ఆయితమై గరుడఁడ అట్టె మీరుఁ జేయరాదా
యేయెడ విన్నపము మా కేమివలసినాను. ॥ దాస ॥

దేవులమ్మ యిందిర మాకైకై విన్నవించరాదా
శ్రీవేంకటపతికి చిత్తమందను
ఆవేళ శేషాచలమ అట్టె మీరుఁ జేయరాదా
యీవేళ మావిన్నపము లీడేర నిఁకను. ॥ దాస ॥ 267

లలిత

ఒక్కఁడే యీజీవుఁడు వొడలు మోపనినాఁడు
యెక్కడి కెక్కడిమాయ యేమిగట్టుకొనెనో ॥ పల్లవి ॥

పొంచి గర్భమున మాసు పొదిగి వుండిననాఁడు
యెంచుకొని ముచ్చటాడ నెవ్వరున్నారు
అంచలఁ ౧ బరఁదు(?)కొవేయట్టిసంసారమిదియు
అంచుమోచి తానెందు అణఁగుండెనో. ॥ ఒక్కఁ ॥

నిచ్చ నిచ్చ రాతిరులు నిద్దురవో యేవేళ
యిచ్చలఁ దాఁ జేసేపను లేమున్నవి
కచ్చుపెట్టి తనమేనఁ గాచుకున్నకర్మములు
యెచ్చుకుందుల నాచోట నెందు వోయనో ॥ ఒక్కఁ ॥

---

౧ 'పరఁగు' కావచ్చు.

బుద్దెరఁగక బాలుఁడై పొత్తులలోనున్నపుడు
కొద్దిలేక తా నెవ్వరి గురుతెరుఁగు
అద్దుక శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండ
దిద్దుక రాఁగానే కాక తెలివెందు నున్నదో. ॥ ఒక్కఁ ॥ 268

కన్నడగౌళ

ఈయపరాధములు సహించవయ్యా
పాయక మమ్ము రక్షించేపని నీదే కాదా. ॥ పల్లవి ॥

అకడ నీకడ మాలో నంతర్యామివి నీవు
నీకుఁ జేసేవిన్నపాలు నీవెరఁగవా
పైకొని వోరువలేక పదరితి మింతేకాక
రాకపోక నీవు మమ్ము రక్షించకుండేవా. ॥ ఈయ ॥

అట్టుకెక్కి దాసుల మఱవక రక్షించేనీవు
గుట్టుతో మమ్ము వహించుకొనకుండేవా
పట్టలేక వేగిరించి పైపై దూరితిమిగాక
ఇట్టె మా కీసిరులు నీ విచ్చినవే యెపుడు. ॥ ఈయ ॥

యిదె శ్రీవేంకటేశ మమ్మేలినవాఁడవు నీవు
వదలకుండ నీవు నావాఁడవే కావా
అదన మన్నించఁగానే ఆసఁ జే చాఁచితిఁగాక
చెదరక నాఁడే నాకుఁ జేతిలోనివాఁడవు. ॥ ఈయ ॥ 269

నారాయణి

౧ ఇందాఁకా వచ్చెఁ జేఁతలు యిఁకనో బుద్ధి
యెందుకు నీవే కర్తవు యిఁకనో బుద్ధి ॥ పల్లవి ॥

---

౧. ఈపాటలో పూర్వముద్రితపాఠమున 'ఓబుద్ధి' అని సంబోధనాంతముగ విరువబడినది కాని 'యిఁకనో బుద్ధి' = ఇంకమీఁద బుద్ధి(వచ్చెను)అను నర్థముగా తోచుచున్నది

పుట్టితి నీయాజ్ఞను భుజించితిఁ గర్మమెల్లా
ఇట్టె జీవుఁడ నాకు నిఁకనో బుద్ధి
కట్టుకొంటి సంసారము కలిగెఁ బంచేంద్రియాలు
యెట్టనెదటిపనుల కిఁకనో బుద్ధి ॥ ఇందా ॥

వున్నాఁడ నీమాయలోనె వొట్టుకొంటి ఆసలెల్లా
యెన్నికె యీప్రాణికి నిఁకనో బుద్ధి
పన్నుకొంటి సంపదలు ౧పంచభూతాల లోనైతి
యిన్నిటా నీపంపుననే యిఁకనో బుద్ధి. ॥ ఇందా ॥

భూమిపై నన్నేలితివి భోగములకు గురైతి
యేమనేవు యీదేహి కిఁకనో బుద్ధి
శ్రీమంతుఁడ విన్నిటాను శ్రీవేంకటేశ్వర నీవు
యీమహిమలెల్లా నివే యిఁకనో బుద్ధి, ॥ ఇందా ॥ 270

పాడి

ఈతఁడు బలువుఁడౌట కివియే సాక్షి
యీతఁడు బ్రహ్మమౌట కీతఁడే సాక్షి. ॥ పల్లవి ॥

అమరుల మొరాలించి అసురబాధలు మాన్పె
అమరుల కెక్కుడౌట కదియే సాక్షి
అమృతము పంచిపెట్టి యాదిలక్ష్మిఁ గైకొనె
అమృతమథనమే అన్నిటికి సాక్షి ॥ ఈత ॥

యిందరుండే బ్రహ్మాండాలు యిదె కుక్షి నించుకొనె
యిందరి కెక్కుడగుట కిదియే సాక్షి
కందువ వరములిచ్చు కడ నెన్నఁడు జెడవు
కందువ పురాణాలలో కథలే సాక్షి. ॥ ఈత ॥

౧. 'పంచభూతాలకు' కావచ్చు.

ఆదిబ్రహ్మఁ బుట్టించె మఱ్ఱాకుమీఁదఁ దుదఁ దేలె
ఆదినంత్యమీతఁడాట కదివో సాటి
పాదుగా శ్రీవేంకటాద్రిపై మహిమ వెదచల్లె
పాదుకొన్నయీతనిశ్రీపాదములే సాటి ॥ ఈతఁ ॥ 271

రేకు 248 సామంతం

అంతరాత్మ నీయాధీన మింతయు
చింతలు నిలుగులు జీవుల కెల్లా. ॥ పల్లవి ॥

చిత్తంబు లియెడిసింహాసన మది
వుత్తమపురుష నీవుండెడిది
హత్తి యింద్రియము లంగ ప్రధానులు
ప్రత్తెకురాజ్యము ప్రకృతియుఁ గలిగె ॥ అంత ॥

కన్నులుఁ జెవులును ఘ్రాణము నాలికె
వన్నె మేను నీవాహనములు
పన్నినకోర్కులు భండారంబులు
సన్నుతి సంసారసంపద గలిగె ॥ అంత ॥

పుట్టినపుట్టుగు భోగపుకోటారు
పట్టము కర్మానుబంధంబు
గట్టిగ శ్రీవేంకటపతి వేలిక—
విట్టినీమహిమ లిన్నిటఁ గలిగె. ॥ అంత ॥ 272

ముఖారి

మొదలే తెలియవలె మోసపోక మానవలె
పదిలపుయోగికైనా బ్రహ్మకైనాను ॥ పల్లవి ॥

అలుగులపైఁ బడితే నాయాలు దాఁకకుండునా
కలికిసతులచూపు కాఁడకుండునా
యిలఁ ౧దోఁడుదొక్కితేను యెండించకుండునా(?)
చెలులయిండ్లకుఁ బోతే చిక్కించకుండురా ॥ మొద ॥

చిచ్చు గాఁగిలించుకొంటే చిమిడించకుండునా
గచ్చుఁబరస్త్రీలపొందు కాఁచకుండునా
తచ్చి విషము మింగితే తలకెక్కకుండునా
పచ్చిసతులవలపు భ్రమయించకుండునా ॥ మొద ॥

తెగి సముద్రము చొచ్చితే లోఁబడకుండునా
మొగి నింతులమాటలు ముంచకుండునా
తగు శ్రీవేంకటేశ్వరుదాసుఁడై గెలిచితేనే
పగటున నివి యెల్లాఁ ౨దంపుసేయకుండునా ॥ మొద ॥378

నాట

వీది వీది వాఁడే వాఁడే వీఁడే వీఁడే చెలఁగిని
ఆదిదేవుఁడు శ్రీవేంకటాద్రిమీఁదటను ॥ పల్లవి ॥

గరుడధ్వజంబదె ఘనవిష్ణురథమదె
సరి శంఖచక్రములు ౩శార్ఙ్గమునదె
హరి యందుమీఁదటను ఆయిత్తమై యున్నాఁడదె
అరులనెల్ల గెలిచి అమరులఁ గావను ॥ వీది ॥

---

౧ చేతబడికి తోడుబోతు అని వ్యవహారముగలదు. ఆ తోడుబోతు చేసి, నాలుగు వీథులు కలిసేచోట నిమ్మకాయలు, అక్షతలు, బొగ్గులు, వెంట్రుకలచుట్టవగైరా ఉంచివేసినపదార్థములు పారవేయుదురు. దాని నెవరైన తొక్కితే వారెండిపోవుచుందురు వారికి ఏవైద్యమూ కుదురదు దీనినే తోడుశబ్దముతో వాడినాడా?

౨. 'దంపుసేయకుండును' కావచ్చు ౩ "శార్ఙ్ఙ" రేకు పూ. ము పా.

సారథి యల్ల వాఁడె చాలి రణభేరి యదె
అరయ నిరుమేలా బ్రహ్మాదులు వారే
పేరుకొన్న వేదములబిరుదుపద్యము లవె
శ్రీరమణుఁడు మెరసె చిక్కులు వాపఁగను ॥ విది ॥

ఆటలుఁ బాటలు నవె అచ్చరలేమలు వారె
చాటువ నలమేల్మంగసంగడి నదె
యీటులేని శ్రీవేంకటేశుఁ డేఁగీ నల్లవాఁడె
కోటానఁగోటిదాసులకోరిక లీడేర్పను ॥ వీది ॥ 274

భైరవి

జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు
యీవల ధర్మపుణ్యము లివివో నీచేతివి ॥ పల్లవి ॥

పుట్టినయట్టిదోషాలు పురుషోత్తమా నీవు
పట్టి తెంచివేయక పాయనేరవు
గట్టిగా సంసారములోఁ గలిగినలంపటాలు
ముట్టి నీవల్ల నేకాని మోయరావు ॥ జీవుఁ ॥

పంచభూతవికారాలు పరమాత్ముఁడా నీవే
కొంచక నీయాజ్ఞఁగాని కొద్ది నుండవు
అంచెల జగములోనిఆయాసహజములు
వంచుక నీవల్లఁగాని వైపుగావు ॥ జీవుఁ ॥

చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె
హత్తించి చూపినఁగాని యంకెకురాదు
సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె
నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చె యిఁకను. ॥ జీవుఁ ॥ 275

లలిత

వెఱవకు మనసా విష్ణునియతభయము
నెఱపుగ నెదుటనె నిలిచినది ॥పల్లవి॥

శ్రీపతికరుణే జీవరాసులకు
దాపును దండై తగిలినది
పైపై దేవునిబలుసంకల్పమే
చేపట్టి రక్షించఁ జెలఁగేది ॥ వెఱ ॥

నళినోదరునిజనామాంకితమే
యిలపై దాసుల నేలేది
కలిభంజనుశంఖచక్రలాంఛన —
మలవడి శుభముల నందించేది ॥ వెఱ ॥

శ్రీవేంకటపతిసేసినచేఁతలే
వేవేలువిధుల వెలసేది
భూవిభుఁ డితఁడు పూఁచినమహిమలే
కైవశమై మముఁ గాచేవి ॥ వెఱ ॥ 276

గౌళ

కనియుఁ గానరు నీమహిమ కౌరవకంసజరాసంధాదులు
మనుజులు దనుజులఁ జంపిరనఁగ విని మరి నీశరణము చొరవలదా॥పల్లవి

పుక్కిటనే లోకములు చూపితి పూతకిచ న్నటు దాగితివి
పక్కననే బండి దన్ని విరిచితివి బాలులు సేసేటిపను లివియా
అక్కరతో తృణావర్తు నణఁచితివి ఆఁబోతులకీ టణఁచితివి
చిక్కించి యనలము చేత మింగితి శిశువులు సేసేటిపను లివియా. ॥కని॥

తోడఁబడ మద్దులు భువిపైఁ గూలఁగఁదొబ్బి యసురునుఁ జంపితి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పసులుచులు సేసేటిపను లివియా
అదరి బ్రహ్మమాయకుఁ బ్రతిమాయలు ఇట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగఁ గొట్టితి పిన్నలు సేసేటిపను లివియా. ॥కని॥

కాళింగునిమద మణఁచి దవ్వుగా కడగడలకుఁ బోఁదోఁసితివి
గొల్లవై యజ్ఞఫలము లిచ్చితివి *గోవాళు సేసేటిపను లివియా
యీలీల శ్రీవేంకటాద్రిమీఁదనె యిందరికిని పొడచూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలుసేసేటిపను లివియా ॥కని॥ 277

రేకు 249 దేవగాంధారి

ఎదుటనే వున్నవి యిన్నియును
యిది కైవసమగు టెన్నఁడో కాని ॥పల్లవి॥

ఆకస మొకటే అలభూ మొకటే
లోకములు పెక్కు లోలోనే
శ్రీకాంతుఁ డదివో చిత్తములోననె
యేకచిత్త మగు టెన్నఁడో కాని ॥ఎదు॥

యిరవగుకాలం బెప్పటిసహజమె
అరుదగుదినములు అనంతము
పరమాత్ముఁడు లోపల వెలుపల నిదె
యెరవుమాని చేరు టెన్నఁడో కాని. ॥ఎదు॥

భావించఁగ నొకబ్రహ్మాండంబే
జీవరాసులే సేసలివే
శ్రీవేంకటేశుఁడు సృష్టించినవాఁడు
యీవిధిఁ గని మను టెన్నఁడో కాని ॥ఎదు॥ 278

* 'గోవాళ్లు' శబ్దము అమాయకుడు, పసివాడు అనునర్థములో ప్రయోగించినట్లున్నది

ముఖారి

సులభపుమార్గములు చుట్టిరానే వుండఁగాను
బలుప్రయాసపుకర్మబద్ధులైరి జీవులు ॥పల్లవి॥

శ్రీపతిభక్తియనేటిచింతామణి వుండఁగాను
యేపున మోసపొయ్యేరు యేలో జీవులు
చేపట్టి నామాంకితపుసిద్ధరసము గలిగి
కోపుల నుడిగి పనిగొనరేలో జీవులు. ॥సుల॥

అక్కడనే శరణాగతనేవోడ వుండఁగాను
యెక్కి భవవార్ధి దాఁటరేలో జీవులు
తక్కక దాస్యమనేటిధనము దమకుండఁగా
లెక్కించి కూడపెట్టుకోలేరు యేలో జీవులు. ॥సుల॥

అలరె శ్రీవేంకటేశుఁ డంతరాత్మై వుండఁగాను
పట్టి కొలువరేలో పైపై జీవులు
పట్టపుహరిదాసులు ప్రత్యక్షమై వుండఁగాను
యిట్లె వారికృప చేరుకొన్నఁడో యీజీవులు ॥సుల॥ 279

శంకరాభరణం

ఆడరో పాడరో ఆనందించరో
వేడుక మొక్కరో విజ్ఞానులు. ॥పల్లవి॥

హరి రక్షకుఁడై యందరి కుండఁగ
పరగఁగ బదికేరు బ్రహ్మాదులు
గరిమ నతఁడే చక్రము చేఁబట్టఁగ
సురిగి పారి రదెం చూడుఁడు సురలు. ॥ఆడ॥

---

౧ 'చూఁడు దసురలు' కావచ్చు

పదిలపువిష్ణుఁడె ప్రాణమై యుండఁగ
యిదివో మెలఁగేరు యీజీవులు
మొదలను యితఁడే మూలమై యుండఁగ
పొదలె నీతనివంపున లోకములు. ॥ఆడ॥

శ్రీ వేంకటాద్రిని శ్రీపతి యుండఁగ
తావుల నిలిచెను ధర్మములు
యీవల నితఁడే యిచ్చేటివరముల
పావనులై రిదే ప్రపన్నులు ॥ఆడ॥ 280

### మాళవి

అందరికి సులభుఁడై అంతరాత్మ యున్నవాఁడు
యిందునే శేషగిరిని యిరవై విష్ణుఁడు. ॥పల్లవి॥

యోగీశ్వరులమతినుండేటిదేవుఁడు శీత—
సాగరశాయియైనసర్వేశుఁడు
భాగవతాధీనుఁడైనపరమపురుషుఁడు
ఆగమోక్తవిధులందు నలరిననిత్యుఁడు ॥అంద॥

వైకుంఠమందునున్నవనజనాథుఁడు పర—
మాకారమందునున్నఆదిమూరితి
ఆకడ౧సూర్యకోట్లందునున్నపరంజ్యోతి
దాకొన బ్రహ్మాండాలుధరించినబ్రహ్మము ॥అంద॥

నిండువిశ్వరూపమై నిలిచినమాధవుఁడు
దండివేదాంతములు వెదకే ధనము
పండినకర్మఫలము పాలికివచ్చినరాసి
అండనే శ్రీ వేంకటేశుఁడైనలోకబంధుఁడు. ॥అంద॥ 281

౧. 'సూరియ' రేకు

సాళంగనాట

నమో నమో దానవవినాశచక్రమా
. సమరవిజయమైనసర్వేశుచక్రమా ॥పల్లవి॥

అట్టె పదారుభుజాల నమరినచక్రమా
పట్టినఆయుధముల బలుచక్రమా
నెట్టన మూఁడుగన్నుల నిలిచినచక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా ॥నమో॥

ఆరయ నారుగోణాల నమరినచక్రమా
ధారలు వేయిటితోడితగుచక్రమా
ఆరక మీఁదికివెళ్లేఁఅగ్నిశిఖలచక్రమా
గారవాన నీదాసులఁ గావవే చక్రమా ॥నమో॥

రవిచంద్రకోటితేజరాశియైనచక్రమా
దివిజసేవితమైనదివ్యచక్రమా
తవిలి శ్రీవేంకటేశుదక్షిణకరచక్రమా
యివల నీదాసులము యేలుకోవే చక్రమా ॥నమో॥ 282

వరాళి

హరి హరి నాబదుకు ఆశ్చర్యమాయ నాకు
శరణంటి నిన్నిటికి సెలవుగా నీకును. ॥పల్లవి॥

వున్నతి జలధిఁగలవుప్పెల్లాఁ దింటిఁగాని
యెన్నిక సుజ్ఞానమింతా నేఱఁగనైతి
దిన్నగా భూమి వేరుగ దేహములెత్తితిఁగాని
పన్నిన నాభోగకాంతఁ బాయఁగలేనైతిని ॥హరి॥

౧. 'అజ్ఞి' రేకు.

చాలికఁ జెలితిఁ గాని నానాభాషలెల్లా
తాలిమి హరినామము దడవనైతి
నాలిసంసారము బ్రహ్మనాఁటనుండిఁ జేసేఁగాని
మేలిమి మోక్షముతోవ మెఁగఁగనైతిని ॥హరి॥

పూరకే దినదినాలయుగాలు దొబ్బితిఁగాని
నేరిచి వివేకము నిలుపనైతి
మేరతో శ్రీవేంకటేశ మీరే దయఁజూడఁగాను
దారదప్పి కిట్టె మీదాసుఁడనైతిని. ॥హరి॥ 283

రేకు 250 సామవరాళి

దైవమా నీవెలితేది తమవెలితే కాని
[1] జీవుల(లు?)పట్టినకొల్ల చేతిలోనే వున్నది. ॥పల్లవి॥

నిండినవి జగముల నీనామము లనంతము—
లండఁ దలఁచేవారిభాగ్యమే కాని
పండియున్న దిదె దేవభక్తి యెందు చూచినాను
దండితోడఁ బనిగొనే తమనేర్పే కాని. ॥దైవ॥

మనసులలో నున్నది మరి నీపై జ్ఞానము
వొనరఁ దెలిసేవారి వోపికే కాని
ఘనమైనమున్నిటినీకథలెల్లా నున్నవి
విననేరిచినవారివివేకమే కాని ॥దైవ॥

శ్రీవేంకటేశ మీముద్ర చెల్లుబడై వున్నది
వేవేగ ధరించేవారివేడుకే కాని
కావుకొని చేరువ నీదాస్య మిట్టే వున్నది
భావించి నమ్మేటివారిపని యింతే కాని ॥దైవ॥ 284

---

[1] 'జీవులయొక్కపట్టినకొల్ల' అను విగ్రహవాక్యముతో సమాసము కావచ్చు

దేవగాంధారి

ఎన్నఁడొకో బుద్దెరిఁగి యీడేరెది జంతువులు
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి. ॥ పల్లవి ॥

కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది
వేవేలు పాతకాలెల్ల విదలించుమనుచు ॥ ఎన్నఁ ॥

చెంతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టే బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రశిద్ధ్వనులై వున్నవి
దొంతులైనభవములతుద గనుమనుచు ॥ ఎన్నఁ ॥

అందరికి నీసేవలు-హస్తగతాలై వున్నవి
బందెదీర నీకు మొక్కి బ్రదుకుమని
అందపు(శ్రీ)వేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ—
వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు. ॥ఎన్నఁ॥ 285

బౌళి

మమ్ముఁ జూడ నేమున్నది మూవంక నీకేలాభము
కమ్మిక దయదలఁచి కరుణింతుగాక. ।పల్లవి ॥

(శ్రీ)కాంతుఁడ నీపాద సేవకులయినవారు
పాకశాసనాదులును బ్రహ్మాదులు
పైకొని నరుఁడ నేను బంటఁగాఁగ నెంతవాఁడ
కైకొని నీపుణ్యానకుఁ గాచుటింతేకాక. ॥ మమ్ముఁ ॥

నారాయణుఁడ నిన్ను నమ్మినట్టిదాసులు
నారదాదిసనకసనందనాదులు
వీరిలో నేనెంతవాఁడ వికటపుజీవుఁడను
యీరీతి నీమూఁకఁ గూడ నేలుటింతే కాక. ॥ మమ్ముఁ ॥

శ్రీవేంకటేశ నీపై చేరి భక్తిసేసేవారు
కావించి యనంతముఖ్యగరుడాదులు
దేవ నేనొక్కనీచుఁడ దీనరక్షకుఁడవు నీ—
వీవిధ మెంచక మమ్ము నీడేరింతుగాక ॥ మమ్ముఁ ॥ 286

దేసాళం

కాదన్నవారికి వారికర్మమే సాక్షి
యేదెస చూచిన మాకు నీతఁడే సాక్షి. ॥ పల్లవి ॥

వేదాలు సత్యమౌటకు విష్ణుఁడు మత్స్యరూపమై
ఆదటఁ దెచ్చి నిలిపె నది సాక్షి
ఆదిఁ గర్మములు సత్యమౌటకు బ్రహ్మయఁగాన
పోదితో నీతఁడు యజ్ఞభోక్తౌటే సాక్షి ॥ కాద ॥

అదె బ్రహ్మము సాకారమౌటకు పురుషసూక్త—
మెదుట విశ్వరూపము యిది సాక్షి
మొదలనుండి ప్రపంచమును తథ్యమగుటకు
౧పొదిగొన్నయాగములే భువిలో సాక్షి ॥ కాద ॥

ఔరసి జీవేశ్వరులభేదము గలుగుటకు
పోరి బ్రహ్మాదులహరిపూజలే సాక్షి
యిరవై దాస్యాన మోక్షమిచ్చు నీతఁడనుటకు
వరమిచ్చే శ్రీవేంకటేశ్వరుఁడే సాక్షి ॥ కాద ॥ 287

౧. అన్నమయ్య వడగలవారనుటకు సాక్షి.

### దేసాళం

ఛాఁటలేను యీమాయ దైవమా నేను
నీటునఁ జేసేవాఁడవు నీవె నీవెకా ॥పల్లవి॥

యీమురికిదేహమె కా యెంతగాలమైన నేను
వోముకొంటా భువిమీఁద నుండఁగోరేది
దోమటినింద్రియాలేకా తోడునీడలై నన్ను
వేమరు భోగించఁజేసి వెనుబలమైనవి ॥ఛాఁట॥

పొంచిన నాకర్మమేకా పుట్టించి పుట్టించి
పంచల సంసారముపాలు సేసేది
అంచెల నీచిత్తమేకా ఆసలాసలనుఁ దిప్పి
చంచుల నా కేపొద్దు చనవరియయ్యేది ॥ఛాఁట॥

చుట్టుకొన్న సంపదేకా సూటియైననాఁటికి
జట్టిగొని లోలోనే చవిసేసేది
అట్టె శ్రీవేంకటేశ అంతరంగాన నీవెకా
పట్టుఁగొమ్మవై యుండఁగ బదికేది నేను. ॥ఛాఁట॥ 288

### శంకరాభరణం

ఇతరము లేదిఁక నెంచి చూచితేఁ
బ్రతివచ్చు నితఁడు ప్రత్యక్షమై ॥పల్లవి॥

సకలలోకములు చర్చించి వెదకిన
వొకఁడేపో పురుషోత్తముఁడు
ప్రకటము బహురూపములయి వాతఁడు
అకుటిలమహిమలయనంతుఁడే. ॥ఇత॥

పర్వినజీవుల భావించిచూచిన
సర్వాంతరాత్ముఁడు సర్వేశుఁడే
పుర్విని వెలుపల నుండినయాతఁడు
నిర్వహించె నీనీరజాక్షుఁడే. ॥ ఇత

చన్నకాలమున మన్నకాలమున
నున్నవాఁడు యీవుపేంద్రుఁడే
కన్నులెదుట నిఁకఁ గలకాలంబును
అన్నిటా శ్రీవేంకటాధీశుఁడే. ॥ ఇత ॥ 289

రేకు 251 ముఖారి

హేయము తనవాసన తెలమూనును
చీయన్న మాన దిదే చెప్పరానిమాయ. ॥ పల్లవి ॥

ఎంగిలిమనుజునకు సరుసఁ బాపమే చవి
అంగవించవలదంటే నగ్గలమౌను
ముంగిట నిల్లాలుండఁగ ముట్టఁగోరుఁ బరస్త్రీల
యెంగిలి కిరెండు సరె యిదివో మాయ. ॥ హేయ ॥

పరగినజీవునికి పంచేంద్రియాలె సుఖము
ధర నెంతగాలమైన తనివిలేదు
సిరులు దనకుండినాఁ జేయిచాఁచుఁ బరులకు
యిరువు తెరఁగరాదు యిదివో మాయ. ॥ హేయ ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యాత్మలో నుండఁగ
భావించు నితనికృప ఫలించువాఁడు
పూవువంటి సంసారము పొదుగుకవుండఁగాను
ఆవటించుఁ బుణ్యఫలా లదివో మాయ. ॥ హేయ ॥ 290

రామక్రియ

అతఁడు సేసేచేఁత లన్నీలు సేయఁగలరా
జాతుల మనుజులెల్లా సతమయ్యేరా ॥ పల్లవి ॥

దిక్కులేనివారికెల్లా దేవుఁ డొక్కఁడే దిక్కు
చిక్కినవారికినెల్లా శ్రీపతే గతి
తక్కినఅనాథులకు దైవమే రక్షకుఁడు
యెక్కడా నాతఁ డుండఁగా నేఁటి కిఁక చింత ॥ అతఁ ॥

బలిమిలేనివారికి పరమాత్మఁడే బలిమి
కలిమిచాలనివారికలిమి హరే
యిల నేరనివారికి నిందిరానాథుఁడే నేర్పు
వెల సీతనికే విన్నవించు టింతే కాక. ॥ అతఁ ॥

పొందులేనివారికెల్లాఁ బురుషోత్తముఁడే పొందు
విందును వేడుకయు శ్రీవేంకటేశుఁడే
యెంద రెందరుండినాను ౧ యీతఁడు గలఁడు మాకు
సందడి నాతఁడే అన్ని చక్కఁబెట్టీఁ బనులు ॥ అతఁ ॥ 291

సామంతం

ధ్రువవిభీషణాదులు సాక్షి
వివరపుజీవులు వెదకేదిది. ॥ పల్లవి ॥

దేవేంద్రసంపద దిక్కులకెక్కుడు
కావిరినది యొక కాలముది
తావున శ్రీహరిదాసులసంపద
తేవల నెన్నఁడుఁ దీరనిది. ॥ ధ్రువ ॥

---

౧. 'యాతఁడు' పూ. ము పా. యతిభంగము.

బలువుగ నడచేటి బ్రహ్మపట్టమును
తొలుబ్రహ్మాండముతోడిది
అలజాతునినిజశరణాగతి యిది
కలకాలమునకుఁ గాణాచి ॥ధ్రువ

వైకుంఠమున కివ్వలిలోకంబులు
రాకల పోకల రచనలవి
యీకడ శ్రీవేంకటేశ్వరుసన్నిధి
పైకొని దొరకిన బదికేదిది. ॥ధ్రువ॥ 292

వరాళి

బయలీఁదించీ నదివో ప్రాణులను హరిమాయ
క్రియదెలుసుకొనేటి కీలింతే కాని. ॥పల్లవి॥

పెక్కుపురుషులలోన పెరకొకసతి యుంటే
యిక్కువై యుండే నాఁటు నిందరిచూపు
దక్కి యందరికాఁగిళ్ల తరుణి యుండుట లేదు
గక్కన వట్టియాసలఁ గరఁగుటే కాని ॥బయ॥

చింతకాయకజ్జాయము చేరి యిసుమంతవుంటే
అంతటనే నోరూరు నందరికిని
పొంతనే బాలుకలకు పులుసై యుండుటే లేదు
కొంత భావించి మింగేటి గుటుకలే కాని. ॥బయ॥

శ్రీవేంకటేశు తేరు దీసేటిమనుజులెల్లాను
సేవగా నేమే తీసితిమందురు
ఆవల నాతఁడే తమఅంతరాత్మయైయుండి
కావించుట యెఱఁగరు గర్వములే కాని. ॥బయ॥ 293

పూర్వగౌళ

ఏమని చెప్పీనో కాక యిలఁగలశాస్త్రాలు
కామించి వాదించేవారికడమేదో ॥పల్లవి॥

అంచెల జగములకు హరియే ఆధారము
యెంచఁగ నాధారము యితనికేదో
పొంచిన వేదార్థములపురుషార్థ మీతఁడు
నించినయర్థము యీతనికి నేదో. ॥ఏమ॥

పొందినప్రాణులకెల్లా పుట్టుగైనాఁడీతఁడు
యెందును తనకుఁ బుట్టుగిఁక నేదో
చందపుఁగర్మములకు సాధన మీదేవుఁడు
మందలించ సాధనము మరి తనకేదో. ॥ఏమ॥

కలయన్నిమాయలకుఁ గారణ మీమూఁర్తి
తలపఁగ కారణము తనకేదో
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే సర్వసాక్షి
మలసి యీతనికిఁక మరి సాక్షి యేదో ॥ఏమ॥ 284

సామంతం

ఎక్కడఁ గడచే రినరులు
తక్కులఁ జెట్టేరు తరుణులు భువిని ॥పల్లవి॥

కన్నులచూపులు గాలపుచిలుకులు
వెన్నెలనవ్వులే వెలితెరలు
మిన్నక పురుషామృగములవేఁటలు
వన్నక యాడేరు పడఁతులు భువిని ॥ఎక్క॥

ముంచినమాటలే మోహనఘంటలు
మంచియధరములే మచ్చులవి
మించినపురుషామృగములవేఁటలు
అంచెల నాడేరు అతివలు భువిని ॥ఎక్క

కట్టువగట్లు కందువకుచములు
పట్టు శ్రీవేంకటపతిమాయ
మెట్టుగ పురుషామృగములవేఁటలు
నెట్టన నాడేరు నెలఁతలు భువిని ॥ఎక్క॥ 295

రేకు 252 మలహరి

ఇన్నిటిమూలం బీశ్వరుఁ డాతని —
మన్ననకొలఁదినె మలయుటగాక ॥పల్లవి॥

మాయామయమై మనియెడిజగమిది
చాయల నిందు నిజము గలదా
కాయము సుఖదుఃఖములకుఁ బొత్తిది
రేయిఁ బగలు నొకరితె కలదా. ॥ఇన్ని॥

దైవాధీనము తగుసంసారము
వావిరి జీవులవసమవునా
ధావతి మనసిది తన కర్మమూలము
వేవేలైనా విడువఁగవశమా ॥ఇన్ని॥

పంచేంద్రియములఁ బరగేటిబ్రదుకిది
చంచలంబు నిశ్చలమవునా
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుకృపతో
సంచయమయితే సతమవుఁగాక ॥ఇన్ని॥ 296

ధన్నాసి

ఎందుకుఁ బనిగొందము యేమి సేత మివియెల్లా
చెదిన మా కిఁక బుద్ధి చెప్పవే నారాయణా ॥ పల్లవి ॥

హరినామ మొకటనే అణఁగెఁ బాపములు
వొరసి యన్నినామము లూరకున్నవి
సిరు లిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామములెల్లా పెట్టెలలో నున్నవి ॥ ఎందు ॥

గోవిందనామ మొకటే కూడబోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా
శ్రీవిష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావై యున్న నామములు ౧ తమకించీ నీవికి ॥ ఎందు ॥

ఇత్తల కేశవునామ మియ్యఁగలవెల్లా నిచ్చె
పొత్తులనామములెల్లాఁ బొంచుకున్నవి
చిత్తమున నిన్నుఁ జూపె శ్రీవేంకటేశనామమే
హత్తినామములెల్లా నందులోనే వున్నవి. ॥ ఎందు ॥ 297

భూపాళం

వేఁకునఁ దిరువళిచ్చి విష్ణునికిఁ జేయరో
ఆఁకటికొదగినట్టిఆరగింపులు ॥ పల్లవి ॥

అతిబ్రహ్మాండాలు గుటుకు నటు ధరించినయట్టి—
అతనికిఁ జేయరో ఆరగింపులు
ప్రతిలేని క్షీరాబ్ధిఁ బవళించి లేచినట్టి—
చతురునికిఁ జేయరో చవి నారగింపులు ॥ వేఁకు ॥

---

౧ "తమకించినివికి(?)" వ్రా ము పా. ఈ వికి తమకించీని=ఇచ్చుట కుబలాటపడుచున్నవి.

యేడుదినములదాఁకా నెత్తెను గోవర్ధనము
అడివచ్చేబాలునికి నారగింపులు
మేడెపుగోపికలతో మిక్కిలిఁ బెనఁగినట్టి—
వెడుకకానికిఁ బేరో విందు లారగింపులు ॥ వేఁకు

పట్టపుదేవుళ్లుఁ దాను బంతి సాగి వున్నవాఁడు
అట్టె సేయరో పులుఁగ మారగింపులు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁ డారగించీని
మట్టులేక వడ్డించరో మంచియారగింపులు ॥ వేఁకు ॥ 298

దేసాళి

ఏపొద్దు చూచిన దేవుఁ డిటూనే యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెను ॥ పల్లవి ॥

మేరుమందరాలవలె మెరయు ౧ నిడ్డెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు
ఆరనిరాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ ఏపొ ॥

పలుజలధులవంటి పైఁడివెండిగిన్నెలు
వెలిఁగొండలంతలేసివెన్నముద్దలు
బలసినచిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరువెన్నెలరస మందిచ్చినట్లుండెను ॥ ఏపొ ॥

పండినపంటలవంటిపచ్చళ్ళుఁ గూరలును
వండ యలమేలుమంగ వడ్డించఁగా
అండనే శ్రీవేంకటేశుఁ డారగించీ మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను. ॥ ఏపొ ॥ 299

---

౧ 'వడ్డెనలు' రేకు.

### గుండక్రియ

జయజయ రామా సమరవిజయ రామా
భయహర నిజభక్తపారీణ రామా ॥ పల్లవి ॥

జలధిబంధించినసౌమిత్రిరామా
సెలవిల్లువిరచినసీతారామా
అలసుగ్రీవునేలినఅయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచేకౌసల్యరామా ॥ జయ ॥

అరిరావణాంతక ఆదిత్యకులరామా
గురుమౌనులనుఁ గాచేకోదండరామా
ధర నహల్యపాలిటిదశరథ రామా
హరురాణినుతులలో కాభి రామా ॥ జయ ॥

అతిప్రతాపముల మాయామృగాంతక రామా
సుతకుశలవప్రియ సుగుణ రామా
వితతమహిమలశ్రీవేంకటాద్రిరామా
మతిలోనఁబాయనిమనువంశరామా ॥ జయ ॥ ౪౦౦

### సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు ॥ పల్లవి ॥

పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుఁడు
పట్టెను౧ యెడమచేతి బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాశితలలు
కొట్టెననుచు నెత్తె గొప్ప వలకేలు ॥ మొక్క ॥

---

౧. 'యదమ' రేకు.

వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోఁక
పెంచెను మిన్నులుమోవ పెనుదేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవడల
కాంచనపు[౧]పుట్టుకాళ కడు బిగిఇంచెను. ॥ మొక్క

పెనచి తోఁడలుదాఁక పెద్దపదకము వేసె
తనువుపై వేలాడేదండలతోఁడ
అనయము శ్రీవేంకటాద్రిదేవునిబంటు
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను ॥ మొక్క ॥ 80

రేకు 253 గుండక్రియ

ఘనుఁ డాతఁడా యితఁడు కలశాపురముకాడ
హనుమంతుఁ డితఁడా అంజనాతనయుఁడు ॥పల్లవి॥

పెడచేత లోఁచేత బెరసి కొందరిఁ గొట్టె
అడరి దానవుల హనుమంతుఁడు
బెడిదంపుఁబెనుదోఁక బిరబిరఁ దిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు ॥ ఘనుఁ ॥

దాకాల మోఁకాలఁ దాటించెఁ గొందరి
ఆకాశవీధినుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడఁదాఁకెఁ గొందరి
అకడ జలధిలోను హనుమంతుఁడు ॥ ఘనుఁ ॥

అరుపుల నూరుపుల నందరఁ బారఁగఁ దోలె
ఔరా సంజీవికొండహనుమంతుఁడు
మేరతో శ్రీవేంకటాద్రిమీఁదిదేవునిబంటు
అరితేరినబిరుదు హనుమంతుఁడు ॥ ఘనుఁ ॥ 802

౧ 'పట్టుకాళ' పూ. ము. పా. పుట్టుకతో వచ్చినకాళకావచ్చు. సహజకవచమువలె.

బౌళి

హరి దగ్గరనే వున్నాఁ డెందాఁకాఁ జారనీదు
కురుచలోనే మగుడు గోవిందుమాయ. ॥ పల్లవి ॥

చెనకిపంచేంద్రియపుచెరువు లైదింటికి
మనసనెడి దొకటి మహాప్రవాహము
దినముఁ జారుచునుండు దిగువకు వెళ్ళలేదు
తనలోనే జానిగురు దైవమాయ. ॥ హరి ॥

తూలనిపంచభూతాలతోఁట లైదింటికి
కాలమనియెడి దొక్కకాలువ వారుచునుండు
నేలాఁ దడియదు నీరూఁ దివియదు
తోలుఁదిత్తికే కొలఁది దొరకొన్నమాయ. ॥ హరి ॥

ముట్టి పంచప్రాణములమొలక లైదింటికి
పుట్టుగులనియేటియేరు పొదలి పారుచునుండు
చెట్టు చెట్టుకే కొలఁది (శ్రీ)వేంకటేశ్వరుఁడు
నట్టనడుమ నున్నాఁడు నాననీదు మాయ ॥ హరి ॥ 303

పాడి

రామభద్ర రఘువీర రవివంశతిలక నీ౧-
నామమే కామధేనువు నమో నమో. ॥ పల్లవి ॥

కౌసల్యానందవర్ధన ఘన దశరథసుత
భాసురయజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క(క్కు?)కోదండరచనవిద్యాగురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా ॥ రామ ॥

౧. పూ. ము. పా. లో ఈ 'సీ' తప్పిపోయినది.

మారీచసుబాహుమర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్యరత్నాకర కాకాసురవరద
సారెకు వేదవిదులు జయవెట్టేరయ్యా ॥ రామ ॥

సీతారమణ రాజశేఖరశిరోమణి
భూతలపుటయోధ్యాపురనిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయినరాఘవ
ఘాత నీప్రతాపమెల్లాఁ గడు నిండెనయ్యా ॥ రామ ॥ 304

బౌళి

ఎట్టువలసినాఁ జేయు మేమి నననేరమయ్యా
వొట్టిననామనసు నీ కొప్పనసుమ్మయ్యా ॥ పల్లవి ॥

అదిగో శ్రీహరి నీవంపినయింద్రియాలకు
చెదరక నేము పంపు సేతుమయ్యా
వెదకి యాసలకెల్లా వెట్టియుఁ జేతుమయ్యా
మదిమది నేనీమాయకు లోనయ్యా. ॥ ఎట్టు ॥

దేవ నీవిచ్చినయట్టిదేహపుటూరిలోన
చేవమీరఁ గాఁపురము సేసేమయ్యా
ఆవల నీకర్మముల కప్పనము నత్తుమయ్యా
ఆవటించి కామాదుల కాన మీరమయ్యా. ॥ ఎట్టు ॥

నిన్నుఁ దలచుటకంటే నీవుచెప్పినపనులే
యెన్నికఁ జేసినదే యెక్కుడయ్యా
అన్నిటా శ్రీవేంకటేశ ఆత్మలో నున్నాఁడవు
విన్నపములేల యిది విడునమయ్యా ॥ ఎట్టు ॥ 305

గుజ్జరి

ఇతని మఱచితిమి యెదుటనే యుండఁగ యిన్నాళ్లును నే మెరఁగక
ప్రతిలే దితనికి జీవకోట్లకుఁ బ్రాణబంధుఁ డితఁడు ॥ పల్లవి ॥

ముందు నేను ఘనగర్భనరకమున మునిఁగియున్న నాఁడు
బొందితోడనే సుఖదుఃఖంబులఁ బొరయు తోడునీడితఁడు
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడఁ బావెను వెంటనే
చందపునాయాతుమలోఁ బాయనిసర్వాత్మకుఁ డితడే ॥ ఇత ॥

అనిపట్టి నేఁ బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు
మానుపనోల్లఁడు తాఁ బెరరేఁచును మతి కనుకూలం బితఁడు
నానావిధులనుఁ బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు
తానును ఆపరిణామంబులకు తగులై వుండును యీతఁడు. ॥ ఇత ॥

తలఁచిన దగ్గరుఁ దడవకయుండిన దవ్వయివుండు నితఁడు
కలసి మెలసి ఇహపరము లోసంగఁగఁ గాచుకవుండును యీతఁడు
మెలఁగుచు సాకారముతో నున్నాఁడు మేటిశ్రీవేంకటపతి యితఁడు
వలసిన వావులరూపులు దాల్చినవాఁ డొకఁడేపో యీతఁడు. ॥ఇత॥306

గుండక్రియ

కడనుండి రావు కానివి నైనవి
పుడుగనిదయ నీదొకచే కలది. ॥ పల్లవి ॥

హరి నీచక్రంబంటినయపుడే
సొరిది నసురలే సురలైరి
నిరతపుచీఁకటినిండనమింటను
వెరవున రవిచే వెలుఁగైనట్లు. ॥ కడ ॥

తతి నీనామము దలఁచినవారి -
అతిపాపమె పుణ్యంబాయ
గతియై పరుసముఁ గదిసినలోహమె
ప్రతిలేక ధరణిఁ బసిఁడియైనట్లు ॥కడ॥

కొంకక నిను నిటు గొలిచినమనుజులె
అంకెల శుకాదులైనారు
యింకను శ్రీవేంకటేశ నీజగము(?)—
సంకల్పమే మోక్షంబై నిలిచె. ॥కడ॥ 307

రేకు 254 లలిత

ఇవ్వల వెదకితేనే యేమి లేదు
అవ్వలికి దాఁటి మీరు అందుకోరో శుభము ॥పల్లవి॥

కనురెప్పలతుదలఁ గట్టువడెఁ గాలము
మనమై చేతులతుదఁ గర్మమున్నది
మనసుకొట్టఁగొననే మరి దైవమున్నాఁడు
చెనకి యిఁక నెన్నఁడు సేయరో పుణ్యములు ॥ఇవ్వ॥

కనకము దాఁటితేనే ఘనసుఖమున్నది
వెనక చీఁకటికొన వెలుఁగున్నది
పనితలఅవ్వలనే వరవిజ్ఞానమున్నది
పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు. ॥ఇవ్వ॥

కాయముకొట్టఁగొననే ఘనవైకుంఠమున్నది
బాయట శ్రీవేంకటపతి వున్నాఁడు
మాయలకొనలవెల్లా మనము నున్నారము
పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు. ॥ఇవ్వ॥ 308

దేసాళం

ఇంతగా మన్నించి నన్ను నేలుకొంటి యిలలోన
వింతగా నెవ్వరినిఁక వేఁడఁబొయ్యేనయ్యా ॥పల్లవి॥

కలవారిలోన నీవు గలవాఁడవని నేను
కలసి లేనివారిలో కర్మములేనివాఁడను
బలువులలో నీదాస్యబలవంతుఁడ నేను
యెలమి మాకిఁకఁ జూడ నేమిగడమయ్యా. ॥ఇంత॥

నెమ్మదిలోనివారిలో నీకుక్షిలోపలివాఁడ
నమ్మనివెలివారిలో నాస్తికులవెలివాఁడ
పమ్మి పదస్థులలోన పరమపదనువాఁడ
ఇమ్మని నిన్నడగేది ఇఁక నేఁటిదయ్యా ॥ఇంత॥

ధర్మపువారిలో నీదయాధర్మపువాఁడ
మర్మపువారిలో నీమాయలమర్మమువాఁడ
అర్మిలి శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
నిర్మించినవాఁడ నేను నెఁకొంటినయ్యా ॥ఇంత॥ 809

గుండక్రియ

అందాఁకా వైష్ణవ మటకటకే
నిందకుఁ జాసిన నిర్మలుఁ డగును. ॥పల్లవి॥

పాపపురాసులు పరిహారమైతే
దీపించువారిభక్తి వొడమును
చేపట్టి పుణ్యము చేరువలయితే
శ్రీపతిదాసులసేవే దొరకు. ॥అందాఁ॥

కొట్టఁగొనకు మతి గోరి పొరితే
జట్టిగ హరికథ చవిగలుగు
పట్టినజన్మము పావనమైతే
మట్టులేనితిరుమంత్రము దొరకు ॥ అందాఁ ॥

గురుకటాక్ష మొకకొంత సోఁకితే
శరణాగతి నిశ్చలమవును
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితే
పరమపదమునకుఁ బాత్రుండవును ॥ అందాఁ ॥ 310

ఆహిరి

సేయరానిచేఁతలెల్లాఁ జేసితి నేను ౧ నీ-
గా(కా?)యగంటివాఁడ నేను గతిచూపవయ్యా ॥ పల్లవి ॥

శరణాగతులఁ గూడి జ్ఞానము దొంగిలినాఁడ
అరిది నీకర్మపుటాజ్ఞలు మీరినవాఁడ
సరిఁ బ్రపంచకులముజాడ వాసినవాఁడ
ధరణి నీతప్పులకు దండన యేదయ్యా. ॥ సేయ ॥

బహుసంసారములెల్లఁ బంచలఁ దోసినవాఁడ
సహజపింద్రియముల జారినవాఁడ
మహి నాపుట్టుగులకే మరి బొమ్మఁబెట్టినాఁడ
విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా. ॥ సేయ ॥

గురుమంత్రమునకుఁ గొండెము చెప్పినవాఁడ
పరకాంతఁగూడేలోకభయము మానినవాఁడ
సిరులమించినయట్టి శ్రీవేంకటేశ నిన్ను
మరిగి శరణంటిని మన్నించవయ్యా ॥ సేయ ॥ 311

౧ నీగాయగంటి = "నీయొక్కగాయముస్థానమున మచ్చకావచ్చు" లేక, నీకాయకము=నీపనినే, కంటివాఁడి=కన్నుగాగలవాడ ననియా ?

గుండక్రియ

ఇదిగా వదిగా దిన్నియు నింతే
పదిఁబది హరి నీపదమే నిజము ॥ పల్లవి ॥

సురలును నసురలు చూపట్టు రాజులు
అరసి కనక(ఁగ?) గతమగువారె
సిరుల వీరిఁ గొలిచెద మంటే మఱి
తెరలి పరుల రక్షింపఁగఁగలరా ॥ ఇది ॥

పదునాలుగవది బ్రహ్మలోకమును
కడసి వీరుమునుకలహాలము
చెదరక యిఁకఁ దముఁ జేరినవారల
పుట్టున నిముడుక వుండఁగఁగలరా(దా?). ॥ ఇది ॥

అచ్యుతుఁడవు నీయచ్యుతపద మది
యిచ్చట శ్రీవేంకటేశుఁడవు
చొచ్చిరి నీశరణు శుకసనకాదులు
మచ్చిక నిదిగని మరిగితిమయ్యా. ॥ ఇది ॥ 812

వరాళి

పెట్టినట్టివ మెరుఁగు బీరకాయలోవిచిక్కు
దిట్ట కూళప్రాణులమై తిరుగుతగాకా ॥ పల్లవి ॥

కాయము మోచి పుట్టి కర్మమున కొడిగట్టి
రోయఁబోతే మేనిలోనిరోఁత వోయీనా
పాయపువలఁ దగిలి పాపపుణ్యములఁ జిక్కి
తీయఁబోతే వచ్చునా తెగరానిబంధము. ॥ పెట్టి ॥

జగములోఁ గటువడి సంసారదుఃఖమంది
నగఁబోతేఁ గొంతైనా నవ్వు వచ్చీనా
చిగురుటాసఁ దగిలి చింతాజలధిఁ బడి
యెగదిగఁ జూడఁబోతే యెందుకు నెక్కీనది ॥పెట్టి॥

పరమాత్మునతిఁ గని భవములెల్లఁ గడచి
ధరణి మాయలతోడితగు లున్న దా
సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ్వరుని
మరిగి కొలిచిన మాకు మరి చింతలేలా ॥పెట్టి॥ 313

రేకు 255 లలిత

ఏల వెట్టిసేయించే విందుక నీకేమివచ్చె
కాలముఁ గర్మముచేతఁ గప్పేవు లోకులను ॥పల్లవి॥

బద్ధులమాటలాడి భ్రమయించి రేపల్లెలో
ముద్దులు చూపి వెన్నలు ముచ్చిలినట్టు
కొద్దిమాలినకర్మము కొంత మాకు గడియించి
వద్ద నిన్నుఁ౧గానివాని(?)వలె దాఁగవలెనా ॥ఏల॥

మఱి పాండవులకు నెమ్మది వావులటు చెప్పి
మొఱఁగి యిందరిలోన మొక్కినయట్టు
కుఱకుఱ్ఱ వాలఁ గొందరను గడియించి
యెఱిఁగి నెఱఁగనట్టె యేమి సేసేవయ్యా. ॥ఏల॥

వర మడుగఁగఁబోయి వడి ఘంటాకర్ణునికి
యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు
తిరమై శ్రీవేంకటాద్రిఁ దిరువారాధన గొని
వరుస నీదాసులకు వరమిచ్చేవయ్యా ॥ఏల॥ 314

౧ నిన్నుఁగానివానివలె = 'నీకుసంబంధములేనివానివలె' కావచ్చు

## ధన్నాసి

తగు మునులు ౧ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మము దెగదా. ॥ పల్లవి ॥

ధరణీధర మందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁ గాచితి కాకముఁ గాచితి నీ-
కరుణకుఁ బాత్రము గలదిదియా. ॥ తగు ॥

భవహర మురహర భక్తపాపహర
భువనభారహర పురహరా
కవిసినపురుతనుగద్దను మెచ్చితి—
వివల నీదయకు నివియా గురుతు ॥ తగు ॥

శ్రీవేంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవుల నేలితి కోఁతుల నేలితి
పావనపుఁగృపకుఁ బాత్రము లివియా. ॥ తగు ॥ 315

## శంకరాభరణం

ఎవ్వరుఁ గాననివాఁడు యశోద గనె నట్టె
వవ్వళించే బ్రహ్మతండ్రి బాలుఁడయ్యె నట్టె ॥ పల్లవి ॥

ఘనయోగీంద్రులమతిఁ గట్టువడనట్టివాఁడు
పనిలేక రోలఁ గట్టువడినాఁడట్టె
తనియ సురలకు పాదము చూపనట్టివాఁడు
మొనసి బండిమీఁద మోపినాఁ డట్టె ॥ ఎవ్వ ॥

---

౧. 'రుషులు' రేకు.

అమృతము చేతఁ దచ్చి అందరికిచ్చినవాఁడు
తమితో వెన్న దొంగిలెఁ దానె యట్లై
గుమురై దేవదానవకోటికిఁ జిక్కనివాఁడు
భ్రమసి గోపికలపాలఁ జిక్కినాఁ డట్లై. ॥ ఎవ్వ ॥

యిందుఁ గలఁ డిందులేఁడ నెంచి చూపరానివాఁడు
అందమై రేపల్లెవాడ నాడీనట్లై
అంది కృష్ణావతారమయినట్టిదేవుఁడే
యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచె నట్లై ॥ ఎవ్వ ॥ 316

రామక్రియ

పెరిగి పెద్దఁగాను మరి పిన్నవాఁడఁగాను
యిరవుగ నే బుద్ధెరిఁగెడి దెపుడు. ॥ పల్లవి ॥

కంకిగ బహునరకంబులు చొచ్చితి—
నింకా భయ మది యెగఁగను
జంకెనలనే పలుచదువులు చదివితి
మంకుఁదనం బిది మానదు ॥ పెరి ॥

తియ్యక కడుఁ బెనుదేహాలు మోచితి-
నయ్యో యింకా నలయను
నెయ్యపు హేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గూఁ బడను. ॥ పెరి ॥

ధర్మము సేసితి దానము లొసఁగితి
కర్మము లింకాఁ గడపను
అర్మిలి శ్రీవేంకటాధిప నీకృప
నిర్మల మైతిని నే నిపుడు ॥ పెరి ॥ 317

గౌళ

కన్న దేఁటిదో విన్న దేఁటిదో కాఁగలదిఁక నేదో
నన్నుం గానను నిన్నుం గానను నడుము బట్టబయలు. ॥ పల్లవి ॥

నీమాయమహిమో నే నేరనికడమో
భూమిలోన నీవున్నాఁడవు నా పుట్టుగులుఁ గలవు
యేమి గాఁగలనో యింకా మీఁదట నిటకతో ల్లి యేమైతినో
సోమార్కులవుదయాస్తమయంబులు చూచుచునున్నాఁడను నేను ॥కన్న

జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో
నీనామంబులు అనంతకోట్లు నిలుకడ గాఁగాను
కానఁగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో
కానరాని యీ ముక్తున నూర్పులు కాలముఁ గొలచేటికుంచములు॥కన్న

నీకు నీవే నను దయ దలఁచితివో నేనాచార్యుని నమ్మితినో
కైకోని నాయంతర్యామివి నినుఁ గంటి నిపుడే నేను
శ్రీకాంతుఁడ వో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు. ॥కన్న ॥318

దేసాళి

కావరు నాలుగుకరములవానిని
శ్రీనాథుండని చేరఁగవలదా. ॥ పల్లవి ॥

ఘనచక్రములతో గరుడనినెక్కుక
కనిసి మెరయు నలకృష్ణునిని
ఘనులై ఇప్పటికాలపుమనుజులు
మునుప విష్ణుఁడని మొక్కఁగవలదా. ॥ కావ ॥

పలుదేవతలకు భయములు మాన్పుచు
అలవిశ్వరూపమైనపుడు
చలము మాని యచ్చటి కౌరవులును
తెలిసి దేవుఁడని కొలువఁగవలదా ॥ కాన ॥

చెప్పినయితఁడే శ్రీవేంకటమున
యెప్పుడు వరములు ఇయ్యఁగను
తప్పక యీతని దాసులవలెనే
యిప్పటివారలె యెరఁగఁగవలదా. ॥ కాన ॥ 319

రేకు 256 శ్రీ

నిందుమననే నీపూజ
అండఁ గోరకుండు టదియు నీపూజ. ॥ పల్లవి ॥

యిందు హరి గలఁ డందు లేఁడనేటి—
నిందకుఁ బాయుటే నీపూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే—
అందదుకు మాను టది యే నీపూజ ॥ నిందు ॥

తిట్టులు గొన్నని దీవెనె గొంతని
నెటుకోనిదే నీపూజ
పెట్టినబంగారు పెంకును నినుమును
అట్టే సరి ం మటదియు నీపూజ ॥ నిందు ॥

సర్వము నీవని స్వతంత్రముడిగి
నిర్వహించుటే నీపూజ
పర్వి శ్రీవేంకటపతి నీదాసు ల—
పూర్వమనియెడిబుద్ది నీపూజ ॥ నిందు ॥ 320

రామక్రియ

పలుచెరువులు నీకుఁ బాటించఁజెల్లును
వొలిసి మీదాసు లవ్వటొక్కటే మాచెరువు. ॥పల్లవి॥

హరి నీకు జీవరాసులందరును సరియే
సురల కెక్కుడు నీవు చూడ మాకైతే
యురవులు గలవు నీ కెక్కుడ చూచినను
అరదినీ(శ్రీ)పాదాలందె మాయురవు ॥పలు॥

నందగోపాదులకెల్ల నందనుఁడవు నీవు
యిందరికిఁ దండ్రివి మా కిటు నీవైతే
అందిన శబరివిందు అఖలభాగ్యము నీకు
చిందిననీప్రసాదమే సిరు లిచ్చె మాకును ॥పలు॥

అచ్చుగ మునులు రు(ఋ?)షులందరును నీబంట్లే
తచ్చినయేలికలు నీదాసులు మాకు
యిచ్చల (శ్రీ)వేంకటేశ యిహాపరమెల్లా నీవు
చొచ్చితిమి నీమరఁగు నూదివెంట దారమై ॥పలు॥ 321

శుద్ధవసంతం

భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తిచూచిన నిజం బొక్కటే లేదు. ॥పల్లవి॥

కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమే రేఁచు
తలఁపెంత పెంచినాఁ దగిలించు కోరికలు
యెలమి విజ్ఞానంబు యేమిటా లేదు. ॥భక్తి॥

ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ బిక్కుందనంబు మోహములు రేఁచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బైపై మదము
యెనయఁగఁ బరమపద మించుకయు లేదు ॥భక్తి॥

తరుణు లెందరుఁ గయిన తాపములు సమకూడు
సిరు లెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లిఁక లేవు. ॥భక్తి॥ 322

లలిత

ఇంతగాలమాయ నన్ను నేమీ నన్నవారు లేరు
చింతసంసారపుమాయఁ జిక్కించనే కాని ॥పల్లవి॥

యెందరు బ్రహ్మలో నన్ను యిటు పుట్టించినవారు
యెందరు యములో హరియించినవారు
యిందుకు నందుకే కాని యిల నేఁ జేసినపాప—
మంది వహించుక కాచినట్టివారు లేరు ॥ఇంత॥

తల్లిదండ్రు లెందరో తనువు పెంచినవారు
కొల్లగా సతు లెందరో కూడినవారు
చిల్లరపనికే కాని చేరఁబిలిచి వైకుంఠ—
ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు ॥ఇంత॥

కాలమును వీటిఁబోయె కర్మమునుఁ దెగదాయ
మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను
ఆలించి శ్రీవేంకటేశ అంతరాత్మవై నన్ను—
నేలితివి యింతపని కెవ్వరును లేరు. ॥ఇంత॥ 323

సాళంగనాట

పంచేంద్రియములనేపట్టణస్వాములాల
తెంచి బేర మాడుకొని దించరో బరవు ॥ పల్లవి ॥

తగినసంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపుటోడబేహారి వాఁడ
జగతిఁ బుణ్యపాపపుసరకులు దెచ్చినాఁడ
దిగిలి బూతురేవునఁ దీరుచరో సుంకము ॥ పంచే ॥

అదరి గుణత్రయములనేటిఎద్దులచేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁజంచలములనేగాలిచాప లెత్తినాఁడ
వెడమాయపుసరకు వెలకియ్యరో ॥ పంచే ॥

ఆతుమయనేటికంట మఁటరాత్మఁ దెక్కియుండి
సీతితో మమ్ముఁగాచుక నిలుచున్నాఁడు
ఆతఁడే శ్రీవేంకటేశుఁ డటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణ మియ్యరో ॥ పంచే ॥ 324

పాడి

ఏడే తేనలు యీదేహంబును
యేడా నిఁకమరి యొరఁగము నేము ॥ పల్లవి ॥

నిండును జలధులు నిమిషమాత్రమున
నిండియు నిండదు నేటి మనసు
పండును భువిఁగల పంట లన్నియును
పండదు నాలోఁ బాపపుమనసు ॥ ఏడే ॥

పట్టవచ్చు నల పారేటిపాము
  పట్టరాదు నాపాయము
  అట్టే ఆరును అనలము నీటను
  యెట్టైన నారదు యీకోపంబు ॥ఏడే॥

కానవచ్చు నదె ఘనపాతాళము
  కానరాదు నాకాలము
  శ్రీనగవిహార శ్రీవేంకటేశ్వర
  నేనలఁ బుట్టిన సుద్దులు నివిగో ॥ఏడే॥ 325

రేకు 257 సాళంగనాట

ఎక్కడిదివివేక మెంతవారికిని యిన్నియు నీమాయఁ దోయక లేదు
పక్కన అజ్ఞానపుజీవులయీపాప మిట్లనే వుండఁగను ॥పల్లవి॥
విచ్చనవిడి నటు కౌరవులెదుటను విశ్వరూపు చూపినయపుడు
యిచ్చల నిను నమ్మఁగలేకకా యింద్రజాలమనిరి
తచ్చిన నిప్పటి నాస్తికజనులును తగునీసాకారము చూచి
నిచ్చలుఁ గల్లని నిరాకారము నిజమని తర్కించక మానుదురా ॥ఎక్క॥
గరుడవాహనము శంఖచక్రములు కనియుండియు ద్వాపరజనులు
ధరలో నిను హరి¹మూర్తెని తెలియక తమయాదవుఁ డొకఁ డితఁడనిరి
సరుస దేవతాంతరములఁగొలిచేటిచంచలచిత్తులు ఇఁక నిన్నే
పరదైవంబననేరరు సరిగా బ్రహ్మాదులలో నొకఁడవందురు. ॥ఎక్క॥
యెఱిఁగినదాసులు యెఱుఁగుదురు నీ వెక్కుడనుచు యేకాలమును
యెఱఁగనిపామరు లెఱఁగరు నిను మతి నెంతైనా నాఁడు నేఁడును
తఱితో శ్రీవేంకటేశ్వర నినుఁగవి తగుశరణాగతు లున్నట్లు
మఱుఁగున నుండినప్రాకృతులకు నీమహిమలు గానఁగఁదరమువునా
॥ఎక్క॥ 326

---

౧. మూర్తి+అని='మూర్తెని' ఈ సంధి లీవాఙ్మయమున కొల్లలు. 'మూర్తని' పూ. ము. పా.

లలిత

పుట్టినమొదలు నేను పుణ్యమేమిఁ గాననైతి
యెట్టు గాచేవయ్య నన్ను యిందిరానాథా ॥పల్లవి॥

కామినులఁ జూచి చూచి కన్నులఁ గొంతపాపము
వేమరు నిందలు విని వీనులఁ గొంతపాపము
నామువారఁ గల్లలాడి నాలికఁ గొంతపాపము
గోమునఁ బాపము మేనఁ గుప్పలాయ నివిగో. ॥పుట్టి॥

కానిచోట్లకు నేఁగి కాఁగిళ్ళఁ గొంతపాపము
సేన దానా లందుకొని చేతులఁ గొంతపాపము
మాననికోపమే పెంచి మతిఁ గొంతపాపము
పూని పాపములే నాలోఁ బోగులాయ నివిగో. ॥పుట్టి॥

చేసినట్టివాఁడఁ గాన చెప్ప నీకుఁ జోటులేదు
దాసుఁడ నైతిఁ గాన దయదలఁచితివయ్యా
యీసరవులెల్లఁ జూచి యేమని నుతింతు నిన్ను
ఆసల శ్రీవేంకటేశ అయఁబోయఁ బనులు ॥పుట్టి॥ 327

వరాళి

కలిమిలేములెల్లా కాలముస్వభావము
తలఁపులో జ్ఞానము దక్కెడి దొకటే. ॥పల్లవి॥

పుట్టుగులు జీవునికి పూఁచినస్వభావము
వొట్టి యిదె సారెసారె వోమనేలా
పట్టి నానాఁటిబ్రదుకు ప్రపంచముస్వభావము
కొట్టఁగొన హరి ముక్తి గోరెటి దొకటే ॥కలి॥

మక్కువసంసారము మాయలస్వభావము
చిక్కి తన్నువారికెల్లా మొక్కుకోనేలా
తక్కక రక్షించేది దైవముస్వభావము
నిక్కపువైరాగ్యము నిలుచుట వోకటే. ॥ కలి ॥

కప్పినభోగములెల్లా కర్మముస్వభావము
తప్పక ప్రియముచెప్పేదైన్యమేలా
యెప్పుడు శ్రీవేంకటేశ యెదలో నాకుఁగలవు
చప్పుడుసేయక నీకు శరణనే దొకటే ॥ కలి ॥ 328

కన్నడగౌళ

ఏమిసేయఁగల యెంతటికుఁడను
తామసపుమనసు తనియదు నాకు ॥ పల్లవి ॥

యిలలోపల నూరేండ్లబ్రదుకే
కలవుదోగ్యము కల్పాంతంబులు
నిలిచినవాఁడను నేనొక్కఁడనే
పలుసంసారము బండ్లకోలఁది ॥ ఏమి ॥

ఆరయఁ బట్టెఁడుఅన్నమువాఁడను
కోరినకోర్కులు కోటానఁగోట్లు
నారవంటిదే నల్లెఁడునాలుక
తీరవు రుచులివె తెప్పలకోలఁది. ॥ ఏమి ॥

నిరతరతిసుఖము నిమిషములోనిదే
విరహపుం వెదలు వేవేలు
యిరవుగ శ్రీవేంకటేశ నీమఱఁగు
చొరఁగా నాకివి సులభములాయ. ॥ ఏమి ॥ 329

౧. 'వేదలు' పూ. ము పా. వెద 'శబ్దము' "వ్యథా" శబ్దభవముకదా.

లలిత

ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరివీకులై
నవ్వుచు నీశరణంటి నన్నుఁ గావవయ్యా ॥ పల్లవి ॥

తగఁ బంచేంద్రియములు తమవాఁడ ననేరు
వగఁ దల్లిదండ్రి తమవాఁడననేరు
చిగురుఁగర్మాలు తమసీమవాఁడననేరు
తెగదీ తగవు నీవే తీర్దపయ్యా ॥ ఎవ్వ ॥

కొందరు నరకమందు కొంతవళకువేసేరు
కొందరు స్వర్గమువారు కొంతవళకువేసేరు
యిందుకు నందుకుఁ బోనీ రిహాలోకమందువారు
దిందుపడనివళకు తీరుచవయ్యా ॥ ఎవ్వ ॥

కాంతలు తమవాఁడంటాఁ గనుచూపులఁ గట్టేరు
చెంతలఁ గాంచనములు చేయివట్టుకొనె నన్ను
ఇంతటా శ్రీవేంకటేశ యెదలోనున్నాఁడవు
వంతు కీతగవు నీవే వహించుకోవయ్యా. ॥ ఎవ్వ ॥ 380

రేకు 258 సామంతం

ఇంకనైన వారిఁ జేరు యింతే చాలు
సంకెలెల్లాఁ బెడఁబాపి చక్కఁజేసీ నతఁడే. ॥ పల్లవి ॥

యెఱఁగక పుట్టితివి యిన్ని యోనులందుఁ దొల్లి
తటి నాఁటి కాయఁబోయ దానికేమి
నెటి నఱకములో వాని తివియుఁ గొన్నాళ్ళు
తఱవాయి దెలుసుకో దానికేమి ॥ ఇంక ॥

పాపపుణ్యములు సేసి పరులఁగొలిచి తొల్లి
తాపములఁ బొందితివి దానికేమి
పూపసంసారము నమ్మి పుంగుఁడై యిన్నాళ్ళదాఁకా
దాపులేక బ్రతికితి దానికేమి ॥ఇంక॥

జగములోవారిఁ జూచి సారెసారె నాసలనే
దగదొట్టై నీకుఁ దొల్లి దానికేమి
జిగి శ్రీవేంకటపతి చిత్తములో నున్నవాఁడు
తగవెంచుకో జీవుఁడ దానికేమి ॥ఇంక॥ 331

ముఖారి

గోవిందాదినామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవలనీవల నోరఁ గుమ్మలుగ నాడుద మీతనిఁ బాడుదము ॥పల్లవి॥

సత్యము సత్యము సకలసురలలో
నిత్యుఁడు శ్రీహరి నిర్మలుఁడు
ప్రత్యక్షమిదే ప్రాణులలోపల
అత్యంతము శరణనరో యితని. ॥గోవిం॥

చాటెడి చాటెడి సకలవేదములు
పాటించినహరి పరమమని
కూటస్థుఁ డితఁడు గోపవధూపతి
కోటికి యీతనిఁ గొలువరో జనులు. ॥గోవిం॥

నిలుచున్నాఁ డిదె నేఁడును నెదుటను
కలిగిన శ్రీవేంకటవిభుఁడు
వలసినవారికి వరదుఁ డితఁడు
కలఁడు గలఁ డితనిఁ గని మనరో. ॥గోవిం॥ 332

దేసాళి

ఒక్కఁ డెవ్వఁడో పుర్వికి దైవము
యెక్కువ నాతని నెరఁగవో మనసా. ॥ పల్లవి ॥

పొట్టినజీవుల కొక బ్రహ్మ గలఁడు
పట్టినవిప్రులు బ్రహ్మలమందురు
నట్టనడుమవారే నవబ్రహ్మలు
జట్టిగ బ్రహ్మలసంతాయ జగము ॥ ఒక్కఁ ॥

కైలాసంబునఁ గలఁ డొక రుద్రుఁడు
తాలిమి నేకాదశరుద్రులు మరి
కాలరుద్రుఁడును కడపట నదివో
చాలినరుద్రులసంతాయ జగము. ॥ ఒక్కఁ ॥

అవతారంబున నలరినవిష్ణువు
అవలవిష్ణుమయ్యె మనియెడివిష్ణువు
భువి శ్రీవేంకటమున నున్నాఁ డిదె
జవళి వరంబులసంతాయ జగము. ॥ ఒక్కఁ ॥ 333

దేవగాంధారి

ఇంకనైనా రోయరాదా యీపాటివార మింతే
మంకుఁదనమేల మామాట వినరాదా. ॥ పల్లవి ॥

తోలుబొంతగట్టుకొన్నదొర నింతే నన్ను నీవు
కూళసంసారమా యేల కొసరేవు
యీలకొన్నయెముకలయింటిలో కాఁపుర మింతే
యేల మాయ వెంటఁబెట్టే వేమి గద్దు నీకును. ॥ ఇంక ॥

పంచభూతపుచుట్టాలబదుకులో వాఁడ నంతే
యెంచ కింద్రియయాచకు లేల వచ్చేరు
కంచపుగాలావటించేకలిమిలో వారి మింతే
చంచలపుటాసలు చేయిచాఁచనేఁటికి. ॥ఇంక॥

నెత్తురుజలదుర్గాన నిలిచినవాఁడ నింతే
కొత్తుఁబాపములు యేల చోటడిగేరు
హత్తిన శ్రీవేంకటేశుఁ డాత్మలోన నున్నవాఁడు
మత్తపుటజ్ఞానమా మన్నిమి చూచేవు. ॥ఇంక॥ ౩౩౪

మలహరి

తమయొుక తముకుఁ దగినంతే
నెమకిన మాకును నీకృప యింతే. ॥పల్లవి॥

పొసఁగ నీనాభినిఁ బుట్టినబ్రహ్మాలు
యెసఁగిననీపూర్వ మెఱిఁగేరా
వెస నీముఖమున వెడలినవేదము
దెసల నీమహిమ తెలియఁగఁగలదా ॥తమ॥

నగుచు నీమాయల నడచేజగములు
సొగసి నీమూరితి చూపెడినా
తగ నినుఁ గానఁగ తపించు మునులును
పొగరుల మము నిఁక బోధించేరా ॥తమ॥

అంతేసివారల కటువలె నుండఁగ
వింతజీవులకు వివేక౧మెట్లొకో
యింతట శ్రీవేంకటేశ నీవే మము
చెంతఁజేరి దయసేయఁగదే ॥తమ॥ ౩౩౫

౧. 'మెట్లకో' రేకు

శంకరాభరణం

ఎన్నఁడు దెలిసే మెచ్చరికెపుడో
ఇన్నియుఁ గన్నవె యెఱిఁగినెఱుఁగ ||పల్లవి||

ఎన్నటియాఁకలి నేఁడూ నున్నది
కన్నదినంబే కడచనెను
పన్ని నిదుర మాపటికి నున్న దదె
యెన్నఁగ రాతిరి యెందో పోయ. ||ఎన్నఁ||

కాయపుసుఖములు గంపల నున్నవి
పాయమే కైవాలి పండెనదె
యీయెడ సంసార మింటనే వున్నది
చేయును నోరును చెనకై నిలిచె ||ఎన్నఁ||

విడువనిజన్మములు వెంటనే వచ్చి
తడవేటిమోక్షము దవ్వాయ
యెడపక శ్రీవేంకటేశ నీమఱఁగు
బడిఁ జొచ్చితి నాధారము నీది. ||ఎన్నఁ|| 336

259 ముఖారి

పుణ్యమున నన్నుఁగాచి పురుషార్థివౌదుగాక
గణ్యమా నే నీకు నాకథ యెంతవున్నది. ||పల్లవి||

వెలయ నిన్నుఁబొగడేవేదము లనంతములు
యెలమి నిన్నుఁ బొగడ నెంతవాఁడను
యిల నిన్నుఁ బూజించేరు ఋషులు కోటానఁగోటి
అలరి నిన్నుఁబూజించేయంతవాఁడనా. ||పుణ్య||

శరణు నీకుఁ జొచ్చినజంతువు లనంతములు
వరుస నే నందులో నెవ్వరిఁ బోలుదు
సొరిది నిన్నుఁ గొలిచేసురలు సేనాసేన
పరగ నేఁగొలిచేటిపని నీకు నెంత ॥ పుణ్య ॥

కాల మెంతైనాఁ గద్దు కర్మములు వేవేలు
ఆలించ నందులో నే నణుమాత్రము
తాలిమి శ్రీవేంకటేశ దయార్ణవము నీది
పాలించవే నీవు నన్నుఁ బలుకు లేమిటికి ॥ పుణ్య ॥ 337

లలిత

నాలో నున్నాఁడవు నన్నుఁగావ(క) నీకుఁబోదు
యీలీలఁ బట్టుచీ రెరవిచ్చినవానివలె. ॥ పల్లవి ॥

చుట్టుకొంటిఁ గర్మములు సొరిదిఁ బసిరికాయ
నట్టనడిమిపురువునడకవలె
వటిజాలిఁ దిరిగితి వడిఁ బంచేంద్రియముల
పట్టిననీటిలో జలభ్రమణమువలెను?. ॥ నాలో ॥

ధరలోనఁ బుట్టి పుట్టి తగ ఎచ్చినందే వచ్చి
వరుస రాట్నపుగుండ్రవలె నైతిని
అరసి నే నంటుకొంటి అంగనలపొందులను
చొరఁబారి వేలుకాడేనూదిరాతివలెను. ॥ నాలో ॥

అంతటను ౧స్వర్గనరకాదిలో కాలు మెట్టితి
బంతిగట్టి నురిపెడిపసురమునై
చెంతల శ్రీవేంకటేశ చేరితి నీవద్ద నేఁడు
వంతుకుఁ గామధేనువుదూడవలెను ॥ నాలో ॥ 338

---

౧ 'పర్వ' పూ ము. పా

సామంతం

జననమరణములు జంతురాసులకు
వెనకముందరను విడువనికోలలు ‖ పల్లవి ‖

తలఁచినచోటను తగుదేహములై
పొలసిపోయినాఁ బోనీవు
వెలుపల లోపల వెలయు భోగములు
కలలోపలివలెఁ గన్నది తెలివి ‖ జన ‖

పూఁచినచోటుల పుత్రమిత్రులై
కాఁచి కరఁచినాఁ గరఁగవివి
తూఁచిన నిరుదెస దుఃఖసుఖంబులు
౧ వూఁచి విడుచుటే వోపిన తెలివి ‖ జన ‖

అనాదివాసన లంటినచిగురులు
మనోగుణములై మానవివి
వినోదములు (శ్రీ) వేంకటేశుకని
కనేవుపాయము కందువతెలివి ‖ జన ‖ 339

ధన్నాసి

అక్కడ నెక్కడినరకము ఆమాటే కల్లా
దిక్కుల ని(నిం?)దె ఇన్నియుఁ దీరుచుకొంటిమయ్యా ‖ పల్లవి ‖

తనువిది మలమూత్రంబుల(లు?) దాకొనియుండినపట్టము
దినదినమును ౨ వుచ్చిష్టపుదిడ్డఁ దూరెడము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడిగుంతలు
మని మని నరకము చొచ్చిన మనుజుల మిదె నేము. ‖ అక్క ‖

---

౧ 'వూఁచి' లోని 'వు'వర్ణస్థానీయ 'వూ' వర్ణమునకు, వోపిన 'లో' అద్వైత వ్యావహారికముగ 'వో' అయిన దానికిని యతి. అచ్-హల్లులకుయతి ఈవిధమైన యతి వింత లేక 'ఊఁచుట' అనునర్థముగల 'ఊఁచు' ధాతువా? అర్థము సరిపడదు ౨ పూర్వముద్రణమున ఈ 'ను' జారిపోయినది

మదనజలంబుల కాలువ మా పెద్దలగపూర్వంబులు(?)
పొదలినపుత్రులయిసిళ్ళపుట్లు వెట్టెదము
యెదుటనె సంసారంబులు యెడయనికారాగృహములు
మది మది నరకముచవిగొనుమనుజుల మిదె నేము. ॥అక్క॥

పుట్టినదే నగ్నత్వము బూతో బందో యెరఁగము
చిట్టంట్లవాచవులగుజీవుల గ్రిమింగెదము
నెట్టన శ్రీవేంకటేశ్వర నీతోఁ గూడఁగ జగములు
మట్టినచోటేమట్టేమనుజుల మిదె నేము. ॥అక్క॥ 340

దేసాళం

తప్పులు వొప్పులు దేహి తనమూలమే
రెప్పలతుద నివిగో రేపులు మాపులును ॥పల్లవి॥

తనలోనిపాపములే తగిలి యెదిటివారి-
నినుపునేరములై నిందింపించు
మనసులోపుణ్యములే మహిఁ గన్నవారిమీఁద
పొనుఁగనినేరుపులై పొగడింపించును ॥తప్పు॥

తొల్లిటిమరణములు తోడనేపుట్టినపుడే
యెల్లవారుఁ జూడఁగాను యేడుపించును
వెల్లిరేఁగి తాఁజేసే పెనుఁగర్మబంధములే
మెల్లనే నానాఁటికి మేను గొప్పచేసును. ॥తప్పు॥

పాపిఁ దననడకలే స్వర్గనరకములై
జీవులకు మాయగప్పి చిక్కింపించు
శ్రీవేంకటేశ్వరు సేవ చేతిలోనిమోక్షమై
కేవలప్రపంచము గెలుపించును ॥తప్పు॥ 341

---

౧ 'పూరంబులు' కావచ్చు.

శ్రీరాగం

నడుమ రెంటికిని నామేను
వడఁబడె ౧యొందలివాఁడనో నేను ॥పల్లవి॥

కంటిమి జగమిది కన్నులయెదుటను
అంటి యిదియు నిజమనరాదు
వింటిమి స్వర్గము వేరేకలదని
కంటగించి అది గాదనరాదు. ॥నడు॥

కట్టుకొంటి మిదె ఘనసంసారము
గట్టిగ నిఁకఁ దొలఁగఁగరాదు
పట్టుకొంటి మిదె పాపపుణ్యములు
తెట్టఁదెరువునని దించాలేము. ॥నడు॥

నగితి నొకసెలవి నానాఁటిబదుకు
మొగి నొకచే నిను మొక్కితిని
అగపడె శ్రీవేంకటాధిప నీకృప
నిగుడి గురుచే నిముఁ గనఁగలిగె ॥నడు॥ 342

రేకు 260 ఘూపాళం

వెట్టి దెలిసి జగము వెస రోఁకలి చుట్టైను
వొట్టిదేవతలవరా లోగి నెందు కెక్కునో. ॥పల్లవి॥

తగిలి సంపదలచేఁ దనిసినవారు లేరు
అగపడి దైవమానుషాలందును
వొగరుసంసారభార మోపనన్నవారు లేరు
వగవఁగఁ జదువు లెవ్వరికిఁ జెప్పెనో. ॥వెట్టి॥

౧. యందలి' రెకు.

జడిసి ౧ ఆయుష్యము చాలునన్నవారు లేరు
  పొడమేటిపదునాల్గుభువనాలందు
తడవి తనముదిమి తా రోసేవాఁడు లేఁడు
  యెడయనితపముల యెవ్వరిఁ ౨ దెచ్చెనో(?) ॥ వెట్టి॥

నడుమనే తిరిగాడీ నానాధర్మములు
  పడని పాట్ల నేము పడఁగాను
తడవి శ్రీవేంకటేశుదాసులు మమ్ముఁ గాచిరి
  బడిబడి నిత్యకర్మఫలము లెన్నటికో ॥ వెట్టి॥ 343

రాయగౌళ

ఇంతగాలమాయను యేడనున్నారో వీరు
  వింతలై యడవిఁగాసేవెన్నెలాయ బ్రదుకు ॥ పల్లవి ॥

యేలేవారి దూరితి యెడరువుట్టినవేళ
  కాలమును దూరితిని కలఁగేవేళ
తాలిమిలేనివేళ తగుఁగర్మము దూరితి
  యేలాగని కాచేవారి నెవ్వరిఁ గానము ॥ ఇంత ॥

దైవమును దూరితి తమకించినట్టివేళ
  కావించి నన్నే దూరితిఁ గాఁగినవేళ
వోవగాఁ గోపపువేళ చుట్టాల దూరితిమి
  యీవలఁ దోడైనవారి నెవ్వరిఁ గానము ॥ ఇంత ॥

పుట్టుగు దూరితిమి పోరానియట్టివేళ
౩ కట్టఁగడ నెందువంకఁ గానమైతిమి
  జట్టి శ్రీవేంకటేశుఁడు శరణంటేనే కాచె
  యిట్టె యింతటివారు యెవ్వరును లేరు ॥ ఇంత ॥ 344

---

౧ 'అయిష్యము' రేకు ౨ 'దేర్చెనో' కావచ్చునేమో? ౩ 'కట్టఁగడ' లో అరసున్న చింత్యము

నాట

తల మొలా నొక్కసరా తను వొక్కఁడుఁగాక
కొలఁది యెఱిఁగ తనిఁ గొలువరో మీరు ॥ పల్లవి ॥

బొడ్డున బ్రహ్మఁగనినపురాణపురుషుఁడే
దొడ్డుగాక, ఆతనితోడివాఁడ(డా?)
వొడ్డిన కైలాసమేలేవుమాపతిఁ గడుపులో
వెడ్డువెట్టి పెంచేవాఁడు వీరితోవాఁడా ॥ తల ॥

చక్కసికన్నుల సూర్యచంద్రులుగాఁ గలవాఁడు
యెక్కుడుగా, కిందరిలో నీడువెట్టేదా
అక్కర యీదేవతల కాపద మాసిపేవాఁడు
వెక్కసమేకాక యెంచ వీరిలోనే వొకఁడా ॥ తల ॥

అందరు నీతనియందే అణతే నౌదురుగాక
యెందును శ్రీపతితోడియీడువారా
కందువ శ్రీవేంకటాద్రి ఘనవరము లోసఁగె
దిందుపడ్డలోకులకు ద్రిష్ట మిదే కాదా ॥ తల ॥ 345

పాడి

ఏమిచెప్పెడినో శాస్త్రరహస్యము యేమిచెప్పెడినో వేదములు
తామసమై బహుమాయకమాయను తత్వమెఱుంగఁగఁ దరమేదయ్యా
॥ పల్లవి ॥

కొన్నిజంతువులు రోసినహేయము కొన్నిజంతువుల కమృతము
కొన్నిజంతువులదివములే రాత్రులు కొన్నిజంతువులకు
అన్నియు నిట్లనె వొక్కటొక్కటికి అన్యోన్యవిరుద్ధములు
పన్నినజీవుల కేకసమ్మతము భావించఁగ మరి ఇఁక నేదయ్యా ॥ ఏమి ॥

కొందరు విడిచినసంసారము మరికొందరికి నది భోగ్యంబు
కొందరివునుకులు వూర్ధ్వలోకములు కొందరివునుకులు పాతాళంబు
అందరు నందరె వారివారరుచు లవిగా దిది(వి?) యనరాదు
కందువజీవులు విచారించేటి కార్యాకార్యము లిఁకనేదయ్యా ॥ఏమి॥

కొంతభూమి నటు చీఁకటినిండినఁ గొంతభూమి వెన్నెలగాయు
కొంతట సురలును కొంతట నసురలు కోరికై కొనిరి జగమెల్లా
ఇంతట శ్రీవేంకటేశ్వర నీవే యిందరియంతర్యామివి
చింతలు వాయవు యెవ్వరిమనసునఁ జేరి నీకు శరణంటేఁ గాని॥ఏమి 346

సామంతం

అణుమాత్రపుదేహి నంతే నేను
మణిఁగెద లేచెద ముందర గానను ॥ పల్లవి ॥

తగుసంసారపుతరఁగలు నీమాయ
నిగమములయడవి నీమాయ
పగలునిద్రలుపుచ్చేభవములు నీమాయ
గగనపునీమాయఁ గడవఁగవశమా ॥ అణు ॥

బయలువందిలి కర్మబంధములు నీమాయ
నియమపుఁబెనుగాలి నీమాయ
క్రియ నినుకపాఁతరం[?]కెల్లొత్తు నీమాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా ॥ అణు ॥

కులధనములతోఁ జిగురుఁగండె నీమాయ
నిలువు నివురగాయ (?)నీమాయ
యెలమితో శ్రీవేంకటేశ నీకు శరణని
గెలుచుటగాక యిది గెలువఁగవశమా ॥ అణు ॥ 347

---

౧ 'కెల్లొత్తు' = పెళ్లగిల్లుటయా?

బౌళి

ఎన్నఁడుఁ దీరవు యీపనులు
పన్నిన నీమాయ బహాళంబాయ ॥ పల్లవి ॥

పెక్కుమతంబుల పెద్దలు నడచిరి
వొక్కసమ్మతై వొడఁబడరు
పెక్కుదేవతలు పేరువాడెదరు
తక్కక ఘనులము తామేయనుచు । ఎన్నఁ ॥

పలికెటిచదువులు బహుమార్గంబులు
కలసి యేక వాక్యత గాదు
చ(ఛ?)లవాదంబులు జనులును మానరు
పలుతర్కంబులె పచరించేరు. ॥ ఎన్నఁ ॥

శరణాగతులకు శ్రీవేంకటేశ్వర
తిరముగ నీవే తీర్చితివి
పరమవైష్ణవులు పట్టిరి వ్రతము
యిరవుగ నాచార్యు లెరుఁగుదురు ॥ ఎన్నఁ ॥ 348

రేకు 281 బౌళి

ఇంతలోనే యెచ్చరేది ఇంతలో మోసపోయేది
చెంత వలసినట్లఁ ౧ జేసుకొంట(?) దేహికి ॥ పల్లవి ॥

నిమిషములోనిది నింగిఁ దిరిగాడేది
జమళిలోను వెలికి సరదూఁగేది
సమతైవుంటే నుండు చాలించిపోతేఁ బోవు
భ్రమవంటిది ప్రాణము పట్టరాదు దేహికి ॥ ఇంత ॥

౧ చేసుకొంట=తలపోయుట, పశ్చాత్తాపపడుట ఇత్యాదులు కావచ్చు.

నీరుబుగ్గవంటిది నిచ్చకొత్తలైనది
పోరచి పంచభూతాలపోరుగైనది
తీరితేనే తీరును తీరకుండితే నిలుచు
నారువంటిది మేను నమ్మరాదు దేహికి ॥ ఇంత ॥

రేపుమాపులైనది రెండు మొకాలైనది
పైపై శ్రీవేంకటేశుధారమైనది
రూపై దగ్గరియుండు రుచులై యెదుటనుండు
తీపువంటిది కాలము తెగదెందు దేహికి. ॥ ఇంత ॥ 349

దేవగాంధారి

పాపము పాపము ప్రజలాలా
పైపై నిటువలెఁ బలుకకురో. ॥ పల్లవి ॥

హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును
హరితో సరి వీరను టెట్లూ
సిరిఁ గొండలందుఁబుట్టినశిల లివి
సరుసఁ బెట్టితే సరియౌనా ॥ పాప ॥

యిందిరాధిపుని విలఁగలసిరులివి
అంది మరొకరివి అనుటెట్లు
కొందరము యేరు గుడిచి కాలువలఁ
బొంది పొగడితేఁ బొసఁగీనా ॥ పాప ॥

శ్రీవేంకటపతిసేవకులకు సరి
అవల మరి కలరనుటెట్లు
కావించిన యల కామధేనువుల—
కేవి యూరఁబను లీడవునా. ॥ పాప ॥ 350

గుజ్జరి

చెప్పఁగా నెఱఁగరా చేరి వేదవ్యాసులు
తప్పక చేతులెత్తి దైవ మితఁ డన్నది ॥ పల్లవి ॥

యిరవుగా నెఱఁగరా యెల్లదేవతలలో
పొరిఁ గృష్ణుఁడు అగ్రపూజ గొన్నది
తిరమై తెలియరా యీదేవుని పాదపూజ
హరునిశిరసుమీఁద నమరివుండినది ॥ చెప్పఁ ॥

యింకా నెఱఁగరా యితని రామమంత్రము
తెంకినుండి హరుఁ డుపదేశించేది
పొంకమిదెరఁగరా భువిమీఁద శరభము—
మంకుదనఁమెల్లఁ దీర మానిపివేసినది. ॥ చెప్పఁ ॥

చూచియు నెఱఁగరా సొరిది శ్రీవేంకటాద్రి—
వేచినవరములెల్లాఁ నిచ్చ్యఁగాను
కాచేదెఱఁగరా ఘనుడితఁ డెవ్వారైనా
చేచేత శరణంటేఁ జేకొనేవిరుదు. ॥ చెప్పఁ ॥ 351

వసంతవరాళి

వెలుగఁగఁ బెలుగఁగఁ బెద్దల మైతిమి నేము
కలికలితేకాని కడగంటలేదు. ॥ పల్లవి ॥

సరి నిన్న భుజియించి చాలునన్నయన్నమే
అరిది నేఁడప్పటిని నాస రేఁచీని
ధరలో రాతిరి గూడి తనిసినసతులే
పరగ నప్పటిని విభ్రాంతి రేఁచీని ॥ వెలు ॥

మాయఁ గట్టివిడిచిన మలినపుఁగోకలు
యీయెడ నుదికితే నే యిచ్చ రేఁచీని
కాయముపై మోఁచి పెట్టెఁగట్టివేసినసొమ్ములు
మాయలై ఓనదినము మమత రేఁచీని. ॥ ॥

నీవుపట్టినచలమో నేము సేసినట్టితపో
శ్రీవేంకటేశ్వరుఁడ చిక్కితి మిందు
మోవరాని మోపయి ములుగనియ్యదు మమ్ము
చేవసంసారముపైఁ జిమ్మిరేఁచీని. ॥ పెఱు ॥ 352

బౌళి

ఇంకానేలా తర్కవాదములు యిన్నియు నిందునే ముగిసెను
యింకా నేలా కొందరు మోక్షం బెవ్వరికిని లేదనుమాటా ॥పల్లవి॥

సరయువుపొంతను సకలజీవులకు
సిరుల మోక్షమిచ్చితివని విన్నపుడే
మరలుచు నాయనుమానము వాసెను
ధర నీవొకఁడవే దైవమువని కంటినయ్యా. ॥ ఇంకా ॥

తగిన లంకవొద్దను రాక్షసులను
తెగనడిచి ముక్తితెరువు చూపినపుడే
వగలఁ బెక్కుదేవతలవరంబులు
జగతి నీపగకు సరిగావయ్యా ॥ ఇంకా ॥

యేమని చెప్పుదు నిట్టినీమహిమ
వేమరుఁ బురాణవిధి విన్నపుడు
శ్రీమంతుఁడవు శ్రీవేంకటేశ్వర
కామించ నీకంటే ఘనము లేదుగదవో అయ్యా. ॥ఇంకా॥ 353

సామంతం

అన్నియుఁ జదివితిఁగా అహో నేను
నున్నవిమాటల నోరు వుడిగెవి దేదో ॥ పల్లవి ॥

వొద్దనుండే నాజన్మ మోహానో మఱచితిఁగా
చద్దివంటి మాతల్లిచన్ను మఱచితిఁగా
మద్దుతోఁ బొరలే మలమూత్రము మఱచితిఁగా
యెద్దువంటివాఁడ నేను యెఱిఁగేటిదేదో ॥ అన్ని ॥

యిప్పటిచవి రేపటి కెంచి తనియలేఁగా
తప్పక కాంతలఁజూచి తలఁపు దనియలేఁగా
ముప్పిరిఁ బెక్కుగాలము మురిసీఁ దనియలేఁగా
పిప్పివంటివాఁడ నేను పెనఁగేటిదేదో ॥ అన్ని ॥

యేడదో యీదేహమౌత యు నేమి నెఱఁగఁగా
కూడినమనువెక్కడో గురుతూ నెఱఁగఁగా
యీడనే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గాచెఁగా
నీడవంటివాఁడ నేను నేరుపింక నేదో. ॥ అన్ని ॥ 354

రేకు 262 దేవగాంధారి

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ. ॥ పల్లవి ॥

ఆదినుండి సంధ్యాదివిధులలో
వేదంబయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీదివీధులనే విష్ణుకథ. ॥ విన ॥

వదలక వేదవ్యాసులు నుడిగిన—
విదితపావనము విష్ణుకథ
సదనంబై నది సంకీర్తనమై
వెదకినచోటనే విష్ణుకథ ॥విన॥

గొల్లెతలు చల్ల గొనకొని చిలుకఁగ
వెల్లవిరియాయ విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరునామము
వెల్లిగొలిపె నీవిష్ణుకథ. ॥విన॥ 355

సాళంగనాట

భవరోగవైద్యుఁడవు పాటించ నీవొకఁడవే
నవనీతచోర నీకు నమో నమో ॥పల్లవి॥

అతివలనెడిసర్పాలధరాలు గఱచిన
తతి మదనవిషాలు తలకెక్కెను
మితిలేనిరతులఁ దిమ్మిరివట్టె దేహాలు
మతిమఱచె నిందుకు మందేదొకో ॥భవ॥

పొలఁతులనెడిమహాభూతాలు సోఁకిన
తలమొలలు విడి చిత్తలై యున్నారు
అలరుచెనకులచే నంగములు జీరలాయ
మలసి యిందుకు నిఁక మంత్రమేదొకో ॥భవ॥

తరుణులకాఁగిలనేతాపజ్వరాలు వట్టి
కరఁగి మేనెల్ల దిగఁగారఁజొచ్చెను
నిరతి శ్రీవేంకటేశ నీవే లోకులకు దిక్కు
అరుదుసుఖాననుండే యంత్రమేదొకో. ॥భవ॥ 356

సామంత

కలిగినన్నాఁడే పుట్టరికంబులఁ దిరుగు నివి
నలుగడ నివి సతమని మతి నమ్ముట పాపమయా. ॥పల్లవి॥

దేహముతోడనె పెరుగును తీరని యీయింద్రియములు
దేహముతోడనె ముదియును తేటతెల్లమిగను
ఆహా పుట్టినినాఁడును అంతమునొందిననాఁడును
శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ వివి. ॥కలి॥

తెలిసున్నపుడే తగులును తియ్యనియీసంసారము
తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో
మలయక నిద్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు
చలమరి జీవునితోడుత సమ్మతమే లేదు. ॥కలి॥

కన్నులుదెరచినయప్పుడే కాన్పించును యీలోకము
కన్నులు మూసినయప్పుడె కడగడఁ దా నణఁగు
అన్నిట శ్రీవేంకటేశ్వరుఁ డాత్మను వెలిఁగెడివేళను
వున్నతిజీవులఁ దగులవు వొదుగుచుఁ దిరుగు నివి ॥కలి॥ 857

దేసాళం

అతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు
అతని మానుటలెల్లా నవిధిపూర్వకము. ॥పల్లవి॥

యెవ్వనిపేరఁ బిలుతు రిలఁ బుట్టినజీవుల
నవ్వుచు మాసనక్షత్రనామములను
అవ్వల నెవ్వని కేశవాదినామములచే
రవ్వగా నాచమనాలు రచియింతురు. ॥అతఁ॥

ఉచ్చమే దేవుని నారాయణనామమే గతి
చచ్చేటివారికి సన్న్యాసము దక్కి
ఇచ్చ నెవ్వరిఁ దలఁచే యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వరి నామమునే సంకల్పము ॥అంత॥

నారదుఁడు దలఁచేటినామ మిది యేది
గౌనుఁడిగేటినామకథ యేడది
తారకమై బ్రహ్మాదులతతి కెవ్వరి నామము
యీరీతి శ్రీవేంకటాద్రి నెవ్వఁ డిచ్చీ వరము ॥అంత॥ 358

దేసగాంధారి

పంటఁ భాగ్యులు వీరా బహువ్యవసాయులు
ఇంటిముట్టి యిట్లఁ గా పాడుమరు ఘనులు. ॥పల్లవి॥

పొత్తుల పాపమనేటిపోడు నఱకి వేసి
చిత్తమనియెడి చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనేమంచి వానఁ దనుఁ
విత్తుమరు హరిభక్తి వివేకులు ॥పంట

కామక్రోధాదులనేకలుపు దవ్వివేసి
వేమరువై భాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువులు వేసి
వోముచున్నారు ౧జ్ఞానపుఁబై రుద్యోగజనులు. ॥పంట॥

యెందు చూచిన శ్రీవేంకటేశుఁ డున్నాఁడని యెడి—
అందిఁ చేసినపంట లనుభవించి
సందడించి తమవంటిశరణాగతులఁ దాము
గొంది నిముడుకొందురు గురుకృప జనులు. ॥పంట॥ 359

౧. "జ్ఞానపుఁబేరుద్యోగ" రేకు.

శంకరాభరణం

మానుపఁబరాదు మాయా మోహము లివియు
శ్రీనాథుఁడు దాను సేసినవే ॥ పల్లవి ॥

రాతిరి చీఁకటి రతిఁ బగలు వెలుఁగు
ఘాతల నెప్పుడు గలదదియే
యీతల జ్ఞానుల కిల నజ్ఞానుల—
జాతివైరములు సహజములే. ॥ మాను ॥

జీవులకును జీవుల కనాదినుండియు
అనయమున వైరంబది గలదే
౧యొసగి వైష్ణవు కిలఁ బ్రాకృతులకు
పొసఁగని వాదము పుట్టుఁ గలదే ॥ మాను ॥

యిహమునఁ బరమున యీలంకెలతో
విహితము చెప్పెడి వేదములే
అహిపతి శ్రీవేంకటాధిపు మతమిది
నిహితము తెలిసిన నిశ్చలమే ॥ మాను ॥ 560

రేకు-263 సామంతం

ఎక్కడనున్నాఁ బోదు యెంతటైనాఁ బోనీదు
వొక్కటి కొక్కటిబంధము వూహించ నెక్కుడు. ॥ పల్లవి ॥

బుడిబుడిమాయలఁ బొరలేటి దేహికి
కడవరానిబంధము కాంతలు
యెడపడ కందుకంటే నెక్కుడైనబంధము
కడునాసఁ బొరలించు కనకము ॥ ఎక్క ॥

---

౧. 'పొసగి' పూ. ము. పా. యతిభంగము.

బాలులకు ౧వృద్ధులకు పాయపువివేకులకు
తెలిఁచేబంధములు దిగఁచులు
మూఁనున్నాఁ బోనీదు ౨ముంగిటనే పనసేది
వేళగాచినబంధము విద్యాగర్వము. ॥ఎక్క॥

పాయ దేజంతువులైనాఁ బశుపశులకునైనాం
బాయటి గీముల ౩కట్టుఁబాటు బంధము
యేయెడ శ్రీవేంకటేశ ఇంక నీదాసులకైతే
చాలైయె చెప్పినట్టు సేసు సకలబంధములు ॥ఎక్క॥ 361

లహరి

దైవమా యేమిసేతు తలఁప నీవే దిక్కు
భావించి చదువఁబోయి పశుబుద్ధినైతి ॥పల్లవి॥

కనను సంసారము కడలేనిభారమౌట
కనినాఁ దొలఁగరాదు కాఁబురులు
వినినా యీదేహము విరసపుహేయమౌట
వినినా జిగురుఁగండె విడిపించరాదు. ॥దైవ॥

తెలియనా ఇంద్రియాలు దిష్టపువిరోధమౌట
తెలిసినాఁ బోఁగువలెఁ దెంచరాదు
పలుకనా పాపములు పాయ ౧బంధములని
పలికినాఁ గొన్నవెట్టి పట్టితోయరాదు ॥దైవ॥

యెఱఁగనా యీలోక మిది మాయమయమని
యెఱిఁగినాఁ బడ్డవోఁద మొక్కరాదు
మెఱయ శ్రీవేంకటేశ మేనిలోననేపుండి
మఱిముందు నన్నునేల మన్ననసేసితివి ॥దైవ॥ 362

---

౧ నిద్దు' రేకు ౨. 'మున్నిటి' పూ. ము. పా. ౩. 'లఁగట్టు' పూ. ము. పా.

పాడి

మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి
కొంచెము(మొ?) దొడ్డ సరికోరి ఇందుకందుకు. ॥పల్లవి॥

చేసేటిపుణ్యములకు చెందేటిపాపములకు
యీసుల సరికిసరి ఇందుకిందుకు
వాసులఁబుట్టుగులకు వడి మరణాలకును
ఆసల సరికిసరి యిందుకందుకు ॥మించి॥

దినదినసుఖాలకు ౧ తీదీపుదుఃఖములకు
యెనసి సరికిసరి ఇందుకిందుకు
అనుఁగుఁబున్నములకు అమాసచీఁకట్లకు
అనయము సరికిస రిందుకందుకు. ॥మించి॥

శ్రీవేంకటేశ బుట్టేజీవులకు నేదిగతి
యేవి చూచిన సరికిస రిందుకిందుకు
వేవేగ నీశరణని వెలసి బ్రతికితిమి
యేవల్ల లేదు సరి యెంగకం(కెం?)దుకు. ॥మించి॥ ౩౬౩

సాళంగనాట

హరియిచ్చినవరము లటువలెఁ గావుగా
తిరమై వివేకులెల్లాఁ దెలిసేటి దిదియే. ॥పల్లవి॥

శిరసులు తుంచి తుంచి చిచ్చులోన వేలిచి
వరములు వడసె రావణుఁ ౨ డెన్నైనా
నిరతి రామునిచేత నిమిషములోననే
వరములన్నియు నెందో వరతిపాలాయ. ॥హరి॥

---

౧. 'సుఖాలు' పూ. ము. పా. ౨ 'డెంన్నైనా' రేకు.

వీరఘోరతపముల వెలయ బాణాసురుఁడు
కోరి చేకొన్న ఫలాలు కోటానఁగోటి
పూరకే కృష్ణునిచేత నొక యిసుమంతలోనే
తోరమైన వరములు తుత్తునియలాయ ॥ హరి ॥

వట్టిజాలిఁ బొరలక వరుస విభీషణుఁడు
జట్టిగ రఘుపతికి శరణనెను
నెట్టన నాతనిఁ గాచె నేఁడూ నున్నాఁ డదె
యిట్టె శ్రీవేంకటాద్రి నిచ్చీ వరములు ॥ హరి ॥ 364

మాళవి

వీఁడుగదె శేషుఁడు శ్రీవేంకటాద్రిశేషుఁడు
౧ వేఁడుక గరుడనితోఁ బెన్నుద్దైన శేషుఁడు ॥ పల్లవి ॥

౨ వేయిపడిగెలతోడ వెలసిన శేషుఁడు
చాయ మేనితళుకువజ్రాల శేషుఁడు
మాయనిశిరసులపై మాణిక్యాల శేషుఁడు
యే యెడ హరికి నీడై యేఁగేటిశేషుఁడు ॥ వీఁడు ॥

పట్టపువాహనమైనబంగారుశేషుఁడు
చుట్టుచుట్టుకొనినమించుల శేషుఁడు
నట్టుకొన్న రెండువేలునాలుకల శేషుఁడు
నెట్టన హరిఁబొగడ నేరుపరి శేషుఁడు. ॥ వీఁడు ॥

కడిసి పనులెల్లఁ గాచుకున్న శేషుఁడు
మొదల దేవతలెల్లా మొక్కేశేషుఁడు
అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
పదరక యేపొద్దూ పాన్పైనశేషుఁడు ॥ వీఁడు ॥ 365

౧. వేఁడుక' పూ. ము. పా. ౨ వేయి+పడిగెలు

శ్రీరాగం

ఎక్కడి విరతి మాకు నిహమెట్టాఁ దగులు
౧ముక్కళించి ముక్కళించి మాయయెంతాఁ దగులు ॥పల్లవి॥

పుట్టినప్పుడే పాపపుణ్యములు దగులు
అట్టె యాదేహమున కన్నియూఁ దగులు
గట్టిగా నీరె డూన్నై తే క్కుఁ దగులు
ఎట్టుసుఁ గోరాను మాయకింతాఁ దగులు ॥ఎక్క॥

... సంసారమైతే ...లు దగులు
పనగంగఁ బెనగఁగా బిడ్డలూఁ దగులు
అనువై యీలంపటాన కాసలెన్నాఁ దగులు
మన సొక్కటొక్కటై మాయకింతాఁ దగులు ॥ఎక్క॥

అసగాని శ్రీవేంకటేశుఁ డాత్మలోనే తగులు
శరణన్నవారికి విజ్ఞానము దగులు
గరిమ నందువల్లనే ఘనమోక్షమూఁ దగులు
మెరిగినప్పుడేసుఖ్ఖ మాయకింతాఁ దగులు ॥ఎక్క॥ ౩॥౬

రేకు 264 శుద్ధవసంతం

కదనుండేవిజ్ఞానికిఁ గా దిటు వలెను
వొదలిరోతలు చూచి వూరకైనా నవ్వును ॥పల్లవి॥

తలిసిఁ బాముగరచినట్టివాఁడు దినఁబోతే
జాలినివేఁపచేఁదైనాఁ జప్పనై తోఁచు
పేలిడై సంసారపువిష మెక్కినవానికి
చూలితె హేయ ...ంతలు సుఖములై తోఁచును ॥కద॥

౧. 'మక్కళించి మక్కళించి' పూ ము పా.

చెంగట వెట్టివానికి చేసినచేఁతలెల్ల
తొంగలించి వివేకులై తోఁచినట్లు
మింగుచుఁ గర్మపు ఫలము మోసినసంసారికి
అంగడికర్మమే బ్రహ్మమై తోఁచును ॥కడ॥

జగమిది యొక్కటే చవులు వేరే వేరే
మొగి నెలుకకు అపు ముడిచున్నది
పగటు శ్రీవేంకటేశుఁ బట్టి కొలువని వాఁడు
తెగని మాయలలోనఁ దేలాడవలసె. ॥కడ॥ 367

బౌళి

నరహరి నీదయమీఁదట నాచేఁతలు గొన్నా
శరణాగతియును జీవుని స్వతంత్రము రెండా. ॥పల్లవి॥

మొఱయుచు నరకపు వాకిలి మూసిరి హరి నీదాసులు
తెఱచిరి వైకుంఠపురము తెరువుల వాకిళ్ళు
నుఱిపిరి పాపము లన్నియు నుగ్గుగ నిటు దూర్పెత్తిరి
వెఱవము వెఱవము కర్మపువిధు లిఁక మాకేలా ॥నర॥

పాపిరి నాయజ్ఞానము పరమాత్ముఁడ నీదాసులు
చూపిరి నిను నామతిలో సులభముగా నాకు
రేఁపిరి నీపై భక్తిని రేయినిఁ బగలును నాలో
వోపము వోపము తపములు వూరకె యిఁక నేలా ॥నర॥

దిద్దిరి నీధర్మమునకు దేవా శ్రీవేంకటేశ్వర
అద్దిరి నీదాసులు నీయానందములోన
ఇద్దరినీనాపొందులు యొగ్గర చిటుకలఁ గూర్చిరి
వొద్దిక నొద్దిక నా కిఁక నుద్యోగము లేలా ॥నర॥ 368

ముఖారి

ఎంత విచారించుకొన్నా నిదియే తత్త్వము హరి
వంతుకు నీకృపగలవాఁడే యెరుఁగు హరి. ॥ పల్లవి ॥

నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్ను నొల్లనట్టివాఁడు నిరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మొక్కి బ్రదికిరి హరి
వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి ॥ ఎంత ॥

యేపున నీపేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి
నీపేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడు హరి
కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁదిట్టి శిశుపాలుఁడు పీఁగెను హరి ॥ ఎంత ॥

యిట్టె నీవిచ్చినపది మెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగ నీవియ్యనివి కపటములే హరి
అట్టె శ్రీవేంకటేశుఁడ వంతరంగుఁడవు హరి
వుట్టివడి కానకున్న వొచ్చెము దేహికి హరి ॥ ఎంత ॥ 369

సామంతం

ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటి కాధారము దానె ॥ పల్లవి ॥

మది జలధుల నొకదైవము వెదకిన మత్స్యావతారం బితఁడు
అదివో పాతాళమునందు వెదకితే నాదికూర్మ మీవిష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకిచూచితే భూవరాహము కంటిమి
చెదరక కొండల గుహల వెదకితే శ్రీనరసింహం బున్నాఁడు ॥ ఇత ॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁ డొకఁడై నాఁడు
తలఁపున శివుఁడునుఁ బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు
కెలఁకుల నావులమందల వెదకిన [౧]కృష్ణుఁడు రాముఁడు నై నారు ॥ ౩
పొంచి యసురకాంతలలో వెదకిన బుద్ధావతారం బైనాఁడు
మించినకాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యవతారము
అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుక ఇహముఁ బరమున వెదకిన యీతఁడే శ్రీవేంకటవిభుఁడు
॥ ఇత ॥ 870

## లలిత

చాలుఁజాలు నీహరిచే మాకును సకలక్రియలకు నాయకుఁడు
నాలుకతుదనే యీతఁ డుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము ॥పల్లవి॥
యేలినవాఁడట లక్ష్మీవిభుఁడట యేమిటనుఁ గొరత మాకిఁకను
నాలోనున్నాఁడు బ్రహ్మతండ్రియట నాకాయుష్యము బాఁతా
పాలజలధిపై దేవునివారము పాఁడి మాకు నిఁక నేమరుదు
ఆలింపఁగ నే మింతటివారము అన్యుల కిఁకఁ జేయి చాఁచేమా ॥చాలుఁ
భూకాంతాపతికింకరులము యీ భూము లిన్నియును మాసొమ్మె
పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి
యీకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికని నాశములేదు
యేకొలఁతని ఇఁక నాసపడుచు నే మెవ్వరికి నోళ్లు దెరచేము ॥చా
శ్రీవైకుంఠనివాసులమట యరచేతిది మోక్షము మాకిదివో
పావనగంగాజనకుని బంట్లము పాపము లన్నిటఁ బాసితిమి
శ్రీవేంకటపతి వరము లియ్యఁగాఁ జిక్కిన వెలుతులు మాకేవి
యీవైభవములఁ దనిసిన మాకును ఇతరులఁ దగిలెడి దిఁకనేది
॥ చాలుఁ ॥ 871

---

౧. 'క్రిష్ణుఁడు' రేకు

రేకు 265 లలిత

ధరఁ గడపట నేజంతువుకైనా తనజన్మమే సుఖమై తోఁచు
హరి గలఁడని కా నమ్మివుండఁగా నతఁడిచ్చేసుఖ మొల్లరు. ॥ పల్లవి ॥

మొదలఁ గొందరికి స్వర్గలోకమే మోక్షసుఖంబని తోఁచును
అదె కొందరికి దేవత్వమె బ్రహ్మానందంబై తోఁచును
వుదుటునఁ గొందరికి సంసారమే వున్నతసుఖమై తోఁచును
తుద నామీఁదటిహరిదాస్యసుఖము ధ్రువపట్టంబని కానరు. ॥ ధరఁ ॥

సొరిదిఁ గొందరటు శూన్యతత్త్వమే సుఖమని మాఁటలనందురు
యిరవెరఁగనివారికి ధనధాన్యము లెక్కువసుఖమై తోఁచును
నిరతిఁ గొందరికి విరతీవులాఁచే నిత్యసుఖంబని తోఁచును
వరుసల శ్రీపతిపై భారంబిదె వైరాగ్యపుసుఖ మెఱుఁగరు ॥ ధరఁ ॥

యెక్కడఁ జూచిన మాయలసుఖములు యెన్నైనాఁ గల వెప్పుడును
చొక్కపుశ్రీవేంకటపతితోడుత సుఖియించేటిసుఖ మొల్లరు
యిక్కడ నక్కడ నీతనిదాసులే యేచి సుఖింతురు నిజసుఖము
కిక్కిరిసినయజ్ఞానాంధకారులు కిందును మీఁదును నెరఁగరు ॥ ధరఁ ॥
372

మలహరి

నీ కెటు వలసె నటుసేతు నీచిత్తము నాభాగ్యము
యేకడనైనా లక్ష్మీకాంతుఁడ నిదియే పో నావిన్నపము ॥ పల్లవి ॥

నాగుణములే యెంచితివా నరకకూపములు చాలవు
ఆగతి నే నాకర్మములూ అనుభవించి తీరేనంటే
నీగుణములే యెంచితివా నిఖిలసంపదలు చాలవు
యీగి నన్నుఁ గరుణించి యెపుడు నీవిచ్చేనంటేను. ॥ నీకె ॥

నా పాపములే లెక్కించితినా నదులయిసుకలును జూఁడవు
యేపున నెంతైనాఁ గలదు అది యెన్నఁడు దీరును దేవా
చేపట్టి నీవు రక్షించినయాజీవుల నెంచితివా తొల్లి
చూపట్టెడియీయాకసంబుపై చుక్కలెక్కించే మనము ॥నీకె॥

మఱి నాబుద్ధులు యోచించఁగ నెంచఁగ మించవు లెంక నీమాయ
గుఱి నీకథలివి వినఁబోతే నివె కొండలుఁ గోటానఁగోట్లు
నెఱపఁగ శ్రీవేంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని
తఱి దరిచేర్పఁగఁ గూడువెట్టఁగా దైవము నీకే భారము ॥నీకె॥ 37

## లలిత

అరసి నన్నుఁ గాచినాతనికి శరణు
పరము నిహము నేలేపతికిని శరణు. ॥పల్లవి॥

వేదములు దెచ్చినట్టివిభునికి శరణు
ఆదిమూలమంటే వచ్చినాతనికి శరణు
యేదెసాఁ దానై యున్నయాతనికి శరణు
శ్రీదేవిమగఁడైన శ్రీపతికి శరణు ॥అర॥

అందరికిఁ బ్రాణమైనఅతనికి శరణు
ముందు మూఁడుమూర్తులమూర్తికి శరణు
దిందుపడి దేవతలదేవునికి శరణు
అంద మిన్ను నేలనేకమైనతనికి శరణు. ॥అర॥

తానే ౧ చేతన్యమైనదైవానకు శరణు
నానాబ్రహ్మాండాలనాథునికి శరణు
అనుక శ్రీవేంకటాద్రియందునుండి వరములు
దీనుల కిందర కిచ్చే దేవునికి శరణు ॥అర॥ 574

౧. 'చైతన్య' కావచ్చు.

బంగాళ కౌశిక

౧ఇది నమ్మనేఁడు పుణ్యాలేమేమో చేసి దేహి
పొదలి యిందు నంకనే పొడవెక్కలేఁడా ॥ పల్లవి ॥

మంచిమందుగొన్నవాఁడు మహామహారోగముల
అంచెలఁ బాసి సుఖియయ్యీనటా
అంచితపుహరినామముమందుగొన్నవాఁడు
పొంచి భవరోగములఁ బోఁదోలలేఁడా ॥ ఇది ॥

జోడు దొడగినవాఁడు చొక్కపు టలుగులకు
వోడక రణజయము నొందీనటా
వాడిగ హరిదాస్యపు వజ్రపంజరపువాఁడు
పీడ జన్మపుటమ్ములు విదలించలేఁడా ॥ ఇది ॥

వైపుగఁగాణాచిగలవాఁడు దరిద్రముఁ బాసి
పైపై సంపదలతో బ్రదికీనటా
చూపై శ్రీవేంకటేశుపాదములందుఁ గాణాచి
యేపొద్దూఁ గలుగువాఁడు యెక్కువగాలేఁడా ॥ ఇది ॥ 875

గుండక్రియ

ఎక్కడిపుద్యోగాలు నేడ కెక్కు జీవునికి
నిక్కిచూచి హరి గరుణించినదాఁకాను ॥ పల్లవి ॥

తపసినవారు లేరు తగనింద్రియభోగాలు
పెనఁగఁబెనఁగఁ బైపైఁ బెరుగుఁగాని
మనసులోనికి రాగు మాటలలోని విరతి
తునిగినట్లనుండు దొరకుదాఁకాను ॥ ఎక్క ॥

౧ ఈపాటలో రెండు, నాలుగు పాదముల కడదీర్ఘము రేకులోనిది. పూ ము. పా. లో టాలంతా టలుగా ముద్రితము.

గడిచినవారు లేరు విషయాలచే వలపడక
పుడుగక కోరఁగోరఁ బొడవగుఁగాక
పుడమిఁ బుట్టుఁడుదు పుస్తకాలలో చదువు
నడుమంత్ర పలుకు డు నానినదాఁకాను ॥ ఎక్క

తెలిసిన వారు లేరు దేవుని నాతుమలోన
పలులంపటాలఁ బడి భ్రమసుఁగాని
యెలమి శ్రీ వేంకటేశుఁ డేమిటా మెచ్చఁడు తన్నుఁ
దలఁచి భక్తితోడ దగ్గులుగాఁ గాను ॥ ఎక్క ॥ 6

రేకు 269 (raga illegible)

సకలశాంతికంము సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె బదికించు నిదియె ॥ పల్లి

మనసులో నా బుద్ధి నురి యొనరఁ దలఁచితా
నినుఁ దలఁచినంత నే నీరౌను
కనుఁగొన్న పాపములు కడ లేనివైనాను
మనుఁడ నిన్నుఁ జూచితే కడకుఁ దొలఁగును. ॥ స

చేతనంటి పాతకాలు సేనగా నేఁ జేసినాను
ఆతల నీకు మొక్కితే నన్నిఁ గనుఁ బాయు
ఘాతఁకె చెవుల వినఁగా నంటినపాపాలు
నీతితో నీకథ వింటే నిమిషానఁ బాయును. ॥ స

కాంగ నుకుఁ జేసేటికర్మపుఁబాపములెల్ల
నాయపు ముద్రలచే గక్కున వీడు
యే యెడ శ్రీ వేంకటేశ యేనో యెంతటివాఁడైనా
నయమైన నీశరణాగతిచే నణఁగు ॥ సక ॥

లలిత

రెప్పలు మరఁగదె రేపును మాపును
యిప్పుడే తోఁచీ నదివో కీలు ॥పల్లవి॥

మనసున నున్నవి మాయలన్నియును
మనసు మరచితే మాయలు మానును
ఎనసిండి మనసుకుఁ జారఁగవిడిచిన
కనుఁగొన మాయలు కడలే విడిగో ॥రెప్ప॥

దేహమునందున్నది తెగని లంపటము
దేహ మఱచితేఁ దెగును లంపటము
వూహల దేహమే వోపుగఁదొడఁగిన
మోహపుమాయలు మోపులకోలఁది ॥రెప్ప॥

ఆతుమ నున్నాఁడు అంతరాత్ముఁడు
ఆతుమఁ గురిచిన నాతఁడు మరమను
యీతఁడె శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చేచేతనే సుఖములు సేనాసేన. ॥రెప్ప॥ 378

మాళవి

అన్నియు నాయందే కంటి నన్నిటి వాఁడా నేనె
మున్నె నా భావముతో ముడిచివేసినది ॥పల్లవి॥

చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి
ములిగి ముక్తిదలఁచి ముక్తుఁడనైతి
పలుమాఱు దలఁచి పాషండబుద్ధినైతి
చెలఁగి శ్రీపతిఁ దలఁచి వైష్ణవుఁడనైతి. ॥అన్ని॥

పొసఁగఁ బుణ్యముసేసి పుణ్యాత్ముఁడనైతి
పసలఁ బాపముచేసి పాపకర్ముఁడనైతి
వెస బ్రహ్మచారినైతి వేగ యాచారమున
ముసిపి మరొక చారమున సన్న్యాసినైతి ॥ అన్ని ॥

వొగి నొడ్డెభాషలాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగువాఁడ నైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీదాసుఁడనై దాసరి నే నైతి ॥ అన్ని ॥ 379

సాళంగనాట

ఇహ పరములు [1]గొన నీదేవుఁడే
సహజ మిన్నిటాను సర్వేశుఁడే. ॥ పల్లవి ॥

తలఁచి చూచినాను తనలోనే వుండి విన(నా?)
తలఁపులకొనవాఁడు దైవ మొకఁడే
పలికిచూచినాను పలుకక యూని నాను
పలుకులకొనవాఁడు పరమాత్ముఁడే ॥ ఇహ ॥

కనుఁగొని చూచినాను కనురెప్ప మూసినాను
కనుచూపుకొనవాఁడు కమలాక్షుఁడే
విని యాలకించినాను వినకట్టె మానినాను
వినుకులకొననెల్లా [2]విష్ణుఁ డొక్కఁడే ॥ ఇహ ॥

మేలుకొనివుండినాను మించి నిద్దిరించినాను
కాలముకొనలవాఁడు ఘనుఁ డీహరే
యీలాగు శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
కీలు విచారించితే శ్రీకృష్ణుఁ డితఁడే ॥ ఇహ ॥ 380

౧ 'గొనా' పూ ము పా., రేకు. అదీప్సము సంగీత పరమైనదనుకొందు
౨. 'క్రిష్ణ' రేకు

ధన్నాసి

నేనేమి జాలి నీకు నీరుణము వాపలేను
నానాజన్మముల నీవే నన్నుఁ గాయవుగా ॥ పల్లవి ॥

మతిలోఁ జీఁకటి మాన్ప మాణిక్యదీపమవై
సతమై నాలికెపైకి చనిదేనైయై
కతలై నన్నుఁ జొక్కించఁ గర్ణామృతమవను
గతివైయైతివిగా నాకుఁ గమలారమణా ॥ నేనే ॥

చేరి నాకన్నులెదుట శృంగారరసమవై
ఆరసి రక్షించఁ బ్రియగార్ద్రమవై
సారపుటిహపరాలసంసారసుఖమవై
యీరీతిఁ బెంచితిగా నా కిందిరారమణా ॥ నేనే ॥

తనువిచ్చి జీవునికిఁ దల్లి వితండ్రివినై
ఘనమవై దాతవు దైవమువునై
అనఁగు శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవై
నను మన్నించితివిగా నారాయణా ॥ నేనే ॥ 381

శంకరాభరణం

ముగియదు కాలము ముందఁటికింకాఁ
దెగనిప్రవాహము దినదినమిదిగో ॥ పల్లవి ॥

పొంకపుహరిచేఁ బొడమిన జగమిది
యింకాఁ బొడమీ నివి గొన్ని
కంకిగఁ జెరువులు కాల్వలు నంటా
అంకెల నిర్మితమయ్యీ నివిగో ॥ ముగి ॥

---

౧. ఇక్కడ, 'నా' పూ ము పా లో ఎక్కువ. రేకులో లేదు.

దేహము భోగించి దించినవిషయము-
లివాఁ పిఁదెత్తె నివి గొన్ని
ఆహారములై అన్యస్త్రీలై
వూహలనె నోరూరించీ సిగ్గో ॥ముగి॥

మనసునఁ దలఁచిన మాయలు కమ్మర-
నినుమడించె మతి నివి గొన్ని
కనుఁగొని శ్రీవేంకటపతిదాసులు
పెనఁగి పెంచఁగాఁ బెరిగీ సిదిగో ॥ముగి॥ 382

రేకు 267 లలిత

పెద్దతెరు వుండఁగాను పెడగంతలు దీసుక
పొద్దువోక యడవులఁ బుంగుడయ్యేరు ॥పల్లవి॥

తొల్లిటిపెద్ద లెంచిరి దొడ్డవాఁడు హరియంటా
అల్లదె భారతరామాయణభాగవతములు
ఇల్లిదె నేఁటిపెద్దలు యెవ్వరో దైవములంటా
వెల్లవిరిగా నింకా వెదకేరు. ॥పెద్ద॥

దేవలోకమువారు దేవుఁడు శ్రీపతియని
భావించి మొరవెట్టి బ్రదికిరి
యీవల నిప్పటివారు ఇందరికి మొరవెట్టి
కావిరి నెవ్వరివారుగాక వున్నారు ॥పెద్ద॥

నానాభూములవారు నమ్మి శ్రీవేంకటపతిఁ
గానవచ్చి యేఁటనేఁట ఘనులయ్యేరు
యీనిజ మిక్కడివారు యెన్నియుఁ దెలిసుండియు
మానక చలాలఁబోయి మాయలఁ బొందేరు ॥పెద్ద॥ 383

లలిత

నా కేల విచారము నా కేల యాచారము
సాకిరైనవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు. ॥పల్లవి॥

ప్రపంచమధీనము పాలువడ్డ దేహమిది
ప్రపంచముతోడిపాటు పరగీని
యెప్పుడూ నీయాతుమ యీశ్వరాధీనము
అపు డాతఁ డెట్టునిచె నట్టె అయ్యీని ॥నా కే॥

కర్మాన కధీనము కలిములు లేములు
కర్మమెట్టు గల్పించెఁ గలిగీని
అర్మిలి నాయాచార్యునధీనము మోక్షము
ధర్మమతనికృపను తానే వచ్చీని. ॥నా కే॥

చిత్తమున కధీనము చిల్లరయింద్రియములు
చిత్తము చిక్కినప్పుడు చిక్కీనవి
హత్తి శ్రీవేంకటేశుదాస్యమధీనము జన్మము
పొత్తుల నందుకు నడ పూఁచినట్టయ్యీని. ॥నా కే॥ 384

మాళవి

ఏఁటి పరిణామము మమ్మేల యడిగేరయ్యా
గాఁటపుహరి యొక్కఁడే గతి మాకిఁకనయ్యా. ॥పల్లవి॥

మరుగుచు శ్రీహరిమాయలోఁ జిక్కినయట్టు
గరిమలఁ గులకాంత కాఁగిటఁ జిక్కితిమయ్యా
తిరముగఁ గాలములు దిగమింగినయట్టు
సొరిది చవులు మింగుచునున్నారమయ్యా ॥ఏఁటి॥

జననీగర్భమునుండి చక్కఁగా మునిఁగినట్లు
మునుకొని సిద్ధుఁడై పొంగివున్నారమయ్యా
చనవున గర్మము వెలుపలికి వచ్చినట్లు
ధనిధానమును కలిగివున్నారము స్వామీ ॥పంటి॥

పేదవాఁడు నిధిగని పెక్కుగా బతికినట్లు
గాదిలి శ్రీవేంకటేశుఁగని చెలఁగితిమయ్యా
యీదెస ౧మొక్కెదైవ మెదురుగా వచ్చినట్లు
ఆదెవుఁడే మాకు నంతరాత్ముఁడాయనయ్యా ॥పంటి॥ ౩౮౫

బౌళి

సాసముఖా ౨అదె సాసముఖా
ఆపలపరివారము అవధారు దేవా ॥పల్లవి॥

మత్తిలి జీవుఁడనేటిమహిమగలుగురాజు
చిత్తమనియెడపెద్దసింహాసనం బెక్కి
బత్తితోఁ బంచేంద్రియపుపరివారము గొలువ
చిత్తజుపారుపత్యము సేసీనిదివో ॥సాస॥

కడుమదించినహంకారమనే యేనుగపై
యెడసెడ నెక్కి తోలీనదె జీవుఁడనురాజు
బడిబడిఁ గర్మములబంటులు దించిరో
వెడమాయపట్టణపువీధుల నేఁగీని ॥సాస॥

మించిననంసారమనేమేడలో నేకాంతమున
పొంచి జీవుఁడనే ఆ భోగము భోగించఁగా
అంచెల శ్రీవేంకటేశుఁడనేదేవుఁడు వచ్చి
మంచితనమునఁ దానె మన్నించెనదివో ॥సాస॥ ౩౮౬

---

౧. "యీదెస మొక్కె దైవ మెదురుగా" పూ ము పా యతిభంగము
౨. 'అదె' పూ ము పా ఈపాట చారణ మా ప్రథమసంపుటముపీఠిక (1980)

ముఖారి

నీకు నీసహజ మిది నాకు నాసహజమిది
యేకడా నీవే నిరుహేతుకబంధుఁడవు ॥పల్లవి॥

నే నిన్నుఁ దలఁచినా నెట్టి నిన్ను మఱచినా
పూని నాయంతరాత్మవై వుండకపోవు
పూని నిన్నుఁ బూజించినాఁ బూజించకుండినాను
కనీలే యీశ్వరుఁడవు గాకమానవు. ॥నీకు॥

యిట్టె నే నడిగినా నేమీ నడుగకుండినా
జట్టిగా నీవు రక్షించకమానవు
తొట్టి నిన్ను దగ్గినా దూరమున నుండినాను
పుట్టించి నీగర్భములోఁ బొదలించకుండవు. ॥నీకు॥

కోపించి నీకు మొక్కినాఁ బరాకై మానినా—
నేవి చూచినా నీవై యిఁకఁ బాయవు
శ్రీవేంకటేశుఁడ నీవే చింతాయకుఁడవు
కావించేటినావుద్యోగము లేమి బాఁతి. ॥నీకు॥ ౫౦7

రామక్రియ

కాంతలమానమునేటికిరవట్టాలరు దిగె
మంతనాన జీవుఁడనే మంచిమురకాఁడు. ॥పల్లవి॥

గరిడి సంసారము చేయంబుధిలోనఁ బెరిగి
వురుగితి దేహపుటోడమీఁద
సరిఁ బాపపుణ్యములసరకులు నించుకొని
దరి నేరె శివ్వుఁడనేతల మురకాఁడు ॥కాంత॥

కడలేనినిట్టూర్పుగాలి విసరఁగాను
జడియుఁ గోరికలనేచాపలెత్తి
అడిబరవుగ మాయ అందునిండా నించుకొని
యెడతాఁకె జీవుఁడనేయీమరకాఁడు ॥ కాంత ॥

అలర శ్రీవేంకటేశుఁడని యేటిమాలిమి
నలుదిక్కులకు నోడ నడపఁగాను
ములిగె ధర్మార్థకామమోక్షధనము గడించి
పలుమాఱు జీవుఁడనేబలుమరకాఁడు ॥ కాంత ॥ 388

రేకు 268 లలిత

చంకగుదియ యిదే శరణార్తి నే నిదే
తెంకి నాభావము దేవుఁడే యెరుఁగు. ॥ పల్లవి ॥

కోరెడిచిత్తము కోరక మానదు
వైరాగ్యము నే వదలను
యీరితి దినములు యిట్లనే కడచీ
తేరినపను లేక దేవుఁడే యెరుఁగు ॥ చంక ॥

తగుసంసారము తనువునఁ బెనఁగీ
వెగటై మోక్షము వెదకేను
పగటున రెంటాఁ బరగినజీవుఁడు
తెగువలుఁ దగులమి దేవుఁడే యెరుఁగు ॥ చంక ॥

పంచేంద్రియములు పారీ నిక్కడ
పెంచఁ బెద్దనై పెరిగేను
అంచెల శ్రీవేంకటాధిపుఁ గొలిచితి
దించనియీమాయ దేవుఁడే యెరుఁగు ॥ చంక ॥ 389

లలిత

ఆడుతాఁ బాడుతా నీతో నట్టె ముద్దుగునుసుతా
వోడక నిదండ చేరి వున్నారమయ్యా ॥పల్లవి॥

కనఁ దల్లిదండ్రిమోము గట్టె చూచి శిశువులు
యే సుఖదుఃఖములుఁ దా మెరఁగనట్టు
వాసుల శ్రీపతి మిమ్ము నడి నాత్మఁ దలఁచుక
యీసుల పుణ్యపాపము లెఱఁగమయ్యా. ॥ఆడు॥

యేలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు
అలకించి పరులఁగాబోయడుగనట్టు
తాలిమి శ్రీపతి మీరు తగ నమ్ము రక్షించఁగా
యేలని యేమిఁయుఁ గోర నెరఁగమయ్యా. ॥ఆడు॥

దేతఁ జిక్కి నిధానము చేరి యింటఁగలవాఁడు
యేతులఁ గలిమిలేము లెరఁగనట్టు
ఆతుమతో శ్రీవేంకటాధిప నీ వుండఁగాను
యీతల నేవెలితులు నెరఁగమయ్యా. ॥ఆడు॥ 390

బౌళి

కాపు రే వో ప్రాణి కాపు రే వోమనసా
వోపనన వెందుకైనా నోడఁబడేవు. ॥పల్లవి॥

మరికి దేహమొకటి మోచుక నీ వప్పటిని
మురికి దేహానతుల మోవఁగో రే వప్పటిని
కరకుహేయము గొంత కడుపున నించుకొని
తిఁగ ౨ హేయమేకాను(?) తినఁబోయే వప్పటి ॥కాపు॥

---

౧. బోయి+అడుగనట్టు ౨ 'హేయమే కాను'=హేయమేయగుటకు. మరల తిన్నఅన్నముకూడ హేయమగుట సహజముకదా.

పసిఁడి కపట్రముడువోయి పరులఁగొలిచి మరిఁ
బసిఁడి సొమ్ములఁబూఁనై పెట్టఁ గోరేవు
పిసరుఁ బాపపుణ్యాలఁ బెడ గేల గట్టించుక
విసువక యివియే కావించ బోయేవే వప్పటి ॥బాపు

పంచభూతములచేతఁ బట్టువడి కమ్మరాను
పంచభూతాల దేహాల బంధులంటాఁ దగిలేవు
అంతలో శ్రీవేంకటేశుఁ డాతుమ నున్నవాఁడు
యెంచక తెలిసిందు నుతు మఱచే వప్పటి ॥బాపు॥ 39

భూపాళం

నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పసిగా దేవియును
ధారుణిలోపలఁ బుట్టించితివి చరవాతిపనులు నీకే సెలవు. ॥పల్లవి॥

శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లే
యేపున విషయములందులోఁ దగిలి యేమంచిన నీకే సెలవు
చూపరఁ బసురము తొగలు వోయినను సొమ్ముగలుగు వాఁడే పరవంజూక
పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారమగాన, ॥నారా

యీడులేక శ్రీహరి నీవు యెడియీ దేహపువికరమూఁ
బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడి దిప్పెడి నీకే సెలవు
వోడక యధికులు తమ దాసులు మరివోకరిపంపు లటు సేయఁగను
చూడరు తమబలిమి యనే విడిపించుక తామే రక్షింతురు గాని. ॥నారా

శ్రీవేంకటపతి నీవే నన్నిటు సృష్టించినజీవుఁడ నింతే
ఆవిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు
ధావతిఁ దలిదండ్రులు అమబిడ్డలతనువులఁ బంకము ఉంటినను
యేవిధముల నీరార్చి పెంతు రటు ఇన్నిట నీవే గతి నాకు. ॥నారా॥ 392

ధన్నాసి

అందితిఁ బొందితి నీయం దఖిలభోగములు
కందర్పజనక నాకుఁ గలిగితి వన్నిటా. ॥ పల్లవి ॥

ఘనకుండలములు నీకథలు నాచెవులకు
ననుపైనరుచులు నీనామములు నాలుకకు
అనువై నీకు మొక్కఁగ నంటిన నొసలికున్న
పసవడి నాకు పట్టబద్ద(ద్ధ?)ము ॥ అంది ॥

మంటసిర్మాల్యపుదండ మంగళసూత్రము నాకు
కాంచనపురాసి నీచక్రాయాపు నామతికి
పంచామృతన్నాలు నీపాదతీర్థము మేనికి
పంచినముద్ర లదే వజ్రాంగిజోడు ॥ అంది ॥

సకల బంధులు నీదాసానుదాసులే నాకు
అకలంక జన్మఫల మిన్నిటా నీకృప నాకు
ప్రకటపు శ్రీవేంకటపతివి నాయాత్మలో
మొకరపై యుండి నన్ను మోహించఁ జేసితివి. ॥ అంది ॥ 393

భూపాళం

పాపముఁ బుణ్యముఁ బరకట నున్నది
చేపట్టుము నీచేతి దీప్రాణి ॥ పల్లవి ॥

నాలుక కొనలనే నానుచు నున్నది
గాలపుసిజముసుఁ గల్లయును
వాలుచును తానుఁబొరసన్న దిదే
ఈ లిమి ధర్మాధర్మములు ॥ పాప ॥

చేతులకొనలను చేఁతై యున్నది
జాతిగ నరకము స్వర్గమును
ఆతల వేదోక్తమైనకర్మములు
దాతనె పిడికిటఁ దగిలెను ౧ వెదకు(?) || పాప ||

మనసుకొట్టఁగొన మాయయు నున్నది
వెనక శ్రీవేంకటవిభుఁడు నదే
తనరినయాతనిదాస్యము నున్నది
ఒని చేకొందువు వెదకవో నీవు || పాప || 394

రేకు 269 లలిత

తప్ప దీయర్థమొకటి దాఁచినధనముసుండీ
విప్పరాదు చెప్పరాదు వేదమందు సున్నది || పల్లవి ||

హరిభక్తిగలిగినయతనికి మోక్షము
పొరుగుననున్నట్టు పొసఁగినది
దరళనభక్తిచేఁ దనరినవారికి
యిరవైనమోక్షము యెదిటిది || తప్ప ||

మక్కువభాగవతాభిమానముగలవారి—
కక్కురలేని మోక్ష మరచేతిది
నిక్కి యాచార్యాభిమాననిరతులైనవారికి
తక్కక మోక్ష మింతాఁ దనలోనిది || తప్ప ||

యెంత విచారించుకొన్నా నేమేమి చదివినా—
నెంతవారికైనా మోక్ష మిందులోనిది
పంతగా శ్రీవేంకటవిభునిసంకీర్తన—
వంతులకు మోక్షము వదనములోనిది. || తప్ప || 395

---

౧ 'వెద' 'వ్యథ' శబ్దభవము గదా.

మలహరి

ఎవ్వరి దూరఁగఁ జోటు లేదు మరి యేమనఁ గల దిదివో తగవు
యివ్వల నందరి బడిబడిఁ దిరిగే యీకర్మముదే నేరమి ॥పల్లవి॥

నీదాసులకును నేరమి లేదు నీవే గతియని వుండఁగను
ఆదినుండి నీకును నేరమి లేదఖిలానకుఁ గర్తవుగాన
పాదుపడక నడుమనుఁ దిరిగాడెడిప్రపంచముదే నేరమి
యేదెస నొకచో నిజమేరుపడక యిటువలెఁ దిరిగాడెడిఁగాన ॥ఎవ్వ॥

పాపము లేదిదె యజ్ఞానులకును భావమెరంగనిపశువులుగాన
మోపై సుజ్ఞానులకునుఁ బాపము మోవదు నినుఁ గొలిచిరిగాన
చాపలముగ నమ్మించి చెరుమ పలుచదువులదే యీపాతకము
పైపై నొకయర్థ మేరుపరచక భ్రమయఁగ వాదము వెట్టెడిఁగాన ॥ఎ॥

యీలోకులకును అధర్మము లే దిన్నియు నీచేఁతలే కాన
మూలనున్నముక్తులకు నధర్మము మొదః లేదు నీకృపగనక
కాలము గడపుచు నీవు రచించినకపటపుమాయదే అధర్మము
ఆలరి శ్రీవేంకటేశ్వర య(యె?)క్కడ నడ్డము తానే వచ్చిఁగాన ॥ఎ॥398

బౌళి

ఇదె చిక్కితి విఁక నెందు వోయెదవు
వుదిరి తొలఁగరా దోహో నీవు ॥పల్లవి॥

జీవులలోపలఁ జెలఁగేటిమూర్తివి
దేవతలకు పరదేవుఁడవు
కైవల్యమునకుఁ గలుగుబ్రహ్మమవు
ఆవలిపరమున కర్గమవు ॥ఇదె॥

ఘనకర్మములకుఁ గలిగినఫలమువు
మనసులోనికి మాయావు
జనియించుడువుకు దాఁచినధనమువు
మునుప జగములకు మూలమువు. ॥ఇదె॥

వలసినవారికి వర్ణించురూపవు
సులభులకు సంసార సుఖమువు
అలరునదాసులమిగుమాకైతే
కలిగిన శ్రీవేంకటపతివి ॥ఇదె॥ 397

భూపాళం

తెలిసియుఁ దెలియను తెగ దీచి కేమిటాను
కలకాల మిందుననే గరివడె బ్రదుకు ॥పల్లవి॥

దేహముపై రోఁత తెలుసుకొనేటివేళ
ఆహా యిదే హేయమై తోఁచును
మోహించి విషయాల మునిఁగేటివేళ నిదె
యీహాల సంతతిలోనే యింపులై వుండును ॥తెలి॥

చదివి నేఁ బురాణాలు సారెకు వినేటివేళ
అదివో విరతి ఘనమై వుండును
కదిసి సంసారసుఖకాంతలఁ బొందేటివేళ
మది నన్నియు మరచి మదమెక్కివుండును ॥తెలి॥

యెక్కుడది వివేక మెవ్వరు గెలిచినారు
చక్కఁ బోడవెక్కించు చరిఁ దోసును
దిక్కు నీవే శ్రీవేంకటదేవుఁడ నీశరణంటే
యెక్కువ బ్రహ్మకుండోవ యిదియే కలది. ॥తెలి॥ 398

దేసాక్షి

అల్లనాఁడే యిదెరఁగమైతిమిగాక
యిల్లిదె దేవుని కృప యీడ నున్నదిసుండీ ॥పల్లవి॥

చేరువవో మోక్షము శ్రీహరిభక్తికిని
ధారుణిఁ గర్మమునకే దవ్వుగాని
యీరీతి నింద్రియముల నించుకంతె దాఁటిన
దూరముగాదు జ్ఞానపుతోవ వున్నదిసుండీ ॥అల్ల॥

ధరఁ జేతిది వైకుంఠ మటు నిదానమునకు
పరధర్మముల కగపడదుగాని
అరుదైనయాసలజయము వోడిచితేనే
అరసి యాకంతగుండా నందవచ్చుఁజుండీ. ॥అల్ల॥

తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి
శిలుగుఁబుణ్యములకుఁ జిక్కదుగాని
తెలిసి శ్రీవేంకటేశుతిరుమంత్రము నాలికెఁ
బలికినాఁడనే దివ్యపద మబ్బుఁ జుండీ ॥అల్ల॥ 399

సామంతం

మూఁడుమూర్తులనైన ముంచుకొను నీవ పు
వేఁడివిరహములోనె వేఁచు నీవలపు ॥పల్లవి॥

పాపమెరఁగదు వలపు భయమెరంగదు వలపు
రూపెరఁగదు మతికి రుచిసేయు వలపు
పూసవయసున పండు వోడమించు నీవలపు
తీపుఁ గుఁ గడుదీపు దినదినము వలపు. ॥మూఁడు॥

సిగ్గెరంగదు వఁపు శిరసు కెక్కును వలపు
వొగ్గించు నన్నిటికి వొడిగట్టు వలపు
బగ్గనను నటు గుండె పగిలించు నీవలపు
అగ్గలపుబాణలకు నాయ మీవలపు ॥ మూఁడు ॥

తెగువ దెచ్చును వలపు తేలిం-చు నీవలపు
యిగిరించి కలిమిలే మెఱఁగ దీవలపు
వగల శ్రీవేంకటేశ్వరుమాయి లీవలపు
౧తగులువిరికాని(?)వలెఁ దగిలించు వలపు. ॥ మూఁడు ॥ 400

రేకు 270 దేసాళం

ఎదురులేక చరింతు రెట్టైనా శ్రీవైష్ణవులు
మదించినేనుగులకు మట్టు మేర వున్నదా ॥ పల్లవి ॥

భాగీరథిలోనఁ బాపమున్నదా పుణ్య—
భోగపువేదములలో బొంకు లున్నవా
సాగరపుటమృతపుచవిలోఁ జేఁదున్నదా
ఆగతి హరిదాసుల కప గాథ మున్నదా ॥ ఎదు ॥

ఆకసములోన ౨నెరుసందునున్నదా భూమిఁ
జేకొని రవియెదుటఁ జీఁకటున్నదా
యీకడఁ గామధేనువు కియ్యరాని వున్నవా
కైకొన్నప్రపన్నులను గరిసించ నున్నదా. ॥ ఎదు ॥

హరినామమంత్రములో నోఁగాము లున్నవా
గురుకృప గలిగియుఁ గొరతున్నదా
నగవి శ్రీవేంకటేశు శరణన్నవారికి
విరసంబు లందులో వెదకఁగఁ గలదా ॥ ఎదు ॥ 401

---

౧. తగులువిరికాఁడు=సంబంధము కలిగించు మన్మదుడా?
౨. నెరుసు+అందున్+ఉన్నదా=నెరసందునున్నదా.

### రామక్రియ

వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండవిహారించేదేవుఁడు ॥పల్లవి॥

కొండ గొడుగుగ నెత్తి గోవులఁ [1]గాచె నాఁడు
కొండవంటిదానవునిఁ గోరి చించెను
కొండ శ్రీవేంకట మెక్కి కోలు వున్నాఁ డప్పటిని
కొండవంటిదేవుఁ డిదే కోనేటిక యితను ॥వీఁడి॥

మాఁకులమద్దులు దొబ్బి మరి కల్పభూజమనే—
మాఁకు వెరికి తెచ్చెను మహిమీఁదికి
మాఁకుమీఁద నెక్కి గొల్లమగువలచీర లిచ్చి
మాఁకులకోనేటిదండ మరిగినాఁ డిదివో. ॥వీఁడి॥

శేషునిపడగెనీడఁ జేర యశోదయింటికి
శేషజాలికాళింగుఁ జిక్కించి కాచె
శేషాచలమనేటి శ్రీవేంకటాద్రిపై
శేషమై కోనేటిదండఁ జెలఁగిని దేవుఁడు ॥వీఁడ॥ 402

### సామంతం

కడుపు నిండె నిఁకఁ గడమేది। మును
తడవినయపుడే నే ధన్యుఁడనైతి ॥పల్లవి॥

హరిహరి యని నే నన్ననాఁడె నా-
పరగినజన్మము ఫలియించె
కెరలి మీఁద మిక్కిలి నీసేవలు
వరుస జలధిలో వానలు ॥కడు॥

---

౧. 'గాచేనాఁడు' పూ ము పా

పురందర నీకును మొక్కినయపుడే
అందితిఁ దుదపద మగుసుఖము
యిందుగ మీఁదటివేవేలుసేవలు
యెందును శ్రీమంతు కిచ్చినసిరులు ॥కడు॥

శ్రీవేంకటపతి శరణనినపుడే
దైవము పాపాల దక్కితిని
చేవలఁ గవ న్నర సేవించుసేవలు
వేవేలు పూజలవేడుకలు ॥కడు॥ 403

దేవగాంధారి

మాయలఁబొరలఁగనేఁటికి మనసా కలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతుఁ డితనిఁ దలఁచవుగా ॥పల్లవి॥

మన్నునఁ బుట్టినకాయము మన్నున నణఁగేటి దింతే
మిన్నులమీఁదికిఁ బోవదు మెరయుచు నెంతైనా
అన్నిట నీజీవునికని అంతర్యామి మీదేవుఁడు
యెన్నఁడుఁ బాయనిబంధువుఁ డితనిఁ దలఁచవుగా ॥మాయ॥

ధరపైఁ బుట్టినదేహము ధరపైఁ [1] బుట్టి(ట్టు?)న దింతే
పరమానందము గోరదు పైపై నెంతయినా
గరిమల నీజీవునికిని గతియగుదేవుం డితఁడు
నిరతపుసుఖములె యొసఁగును నీ విటు దలఁచవుగా ॥మాయ

శ్రీవేంకటపతిసొమ్ములు చేరెడి చాతని నింతే
ఆవల నితరుల నంటవు ఆతుమ లన్నియును
యేవిధముల నీజీవుని కేలికె యీదేవుండే
పావనముగ బ్రదికించెను పలుకొని తలఁచవుగా. ॥మాయ 404

---

[1] 'గిట్టెడి' కావచ్చునేమో?

మాళవిగౌళ

రుచులు నే నిటు గొనని వేడవి రోతలయ్యెడిఁగాక నేఁడు
వచనముల హరి నీకు శరణని వసుధఁ బావనమైతిఁగాక ॥ పల్లవి ॥

నేను సేయనిపాప మేడది నిఖిలలోకములందును
నేను చొరనినరక మేడది నెఱయ దుర్గతుల
నేను పొడమనియోను లేడవి నిఖిలజంతువులందును
పూని హరి నిను శరణుచొరఁగాఁ బుణ్యుఁగాఁ జేసితివిగాక ॥ రుచు ॥

నిరతి వాదనికల్ల లేదవి నేను నాలుకతుదలయందును
పొరలి నడవనికర్మ మేడది భువి ననాచారములలో
తిరిగి తిరిగి నీచులిండ్లను తిరియనర్థము లింక నేడవి
గరిమ హరి నే నిన్ను శరణనఁగాను ఘనుఁ జేసితివిగాక. ॥ రుచు ॥

తలఁపు నజ్ఞానములు నపరాధములు నాయెడ లేని వేడవి
యెలమి నన్ని ట్లేలఁ దగునా యేలితివిగాక
నిలిచి శ్రీవేంకటగిరీశ్వర నీకు శరణనుమాత్ర మింతే
కలసి నాయెడ నేమి గంటివి కాచితివి భువనములలోను. ॥ రుచు ॥ 405

రేకు 271 సామంతం

ఎవ్వరి దూరఁగనేల యేమీ ననఁగనేల
నవ్వుచు హరికి మొక్కి నడచుటగాక. ॥ పల్లవి ॥

కోపమే యెక్కుడుసేసు కొందరిగుణములోన
పాపమే యెక్కుడుసేసు పరులఁ గొందరికి
దీపన మెక్కుడుసేసు దేహములఁ గొందరికి
శ్రీపతిఆజ్ఞ లివి చెల్లీ లోకానను. ॥ ఎవ్వ ॥

కొందరి నసురలఁగా గుట్టుతోడ నటు సేసు
కొందరి దేవతలఁగా కోరి తానే యిటు సేసు
కొందరి మనుజులఁగా కూటపుజీవులఁ జేసు
విందువలె హరిమాయ వెలసీ లోకానను ॥ఎవ్వ॥

వరుస నెరిఁగి నడవ నెవ్వరి కిచ్చగాదు
సరిస ౧వనాదినుండే సహజమె కలది
చిరపుణ్యు లిన్నిటిలో శ్రీవేంకటేశుఁ గని
శరణనఁగా సుఖము జరగీ లోకానను ॥ఎవ్వ॥ 406

## గుండక్రియ

పొదలఁ బొదలఁగఁ దనువు పుణ్యపాపముపొత్తు
వదల వదలఁగ మనసు వద్దనే నిలుచు ॥పల్లవి॥

పెరుగు నింద్రియసుఖము పెంచఁగాఁ బెంచఁగా
ధరఁ బెరుగుఁ గోరికలు తలఁచఁ దలఁచ
కెరలు లంపటము మిక్కిలి కూర్పుఁ(ర్చఁ?) గూర్పఁగా
మరలింప మరలింప మనసులో నణఁగు. ॥పొద॥

కలుగు పనులేమైనఁ గడుఁ జేయఁ జేయఁగా
మలసి కలుగును ౨రుచులు మరుగ మరుగ
బలియు నజ్ఞానంబు భ్రమయఁగా భ్రమయఁగా
నిలువ నిలువఁగ మనసు నిశ్చలం బవును ॥పొద॥

నెగడు గుణములు పెక్కు నించఁగా నించఁగా
మిగుల(లు?) సంసారంబు మెలఁగ మెలఁగ
తగిలి శ్రీవేంకటేశు దగ్గర కొలువఁగఁ గొలువ
పొగడఁ బొగడఁగ నతఁడు పొంతనే నిలుచు ॥పొద॥ 407

---

౧. 'సరిస్+ఇవి+అనాది', ౨ 'రుచుల' రేఖ

ధన్నాసి

నీ వెటు సేసిన నిజభోగ్యం బౌ
చేవలఁ గైకొని చెలఁగుటగాక ॥పల్లవి॥

దేవ నీయానతిఁ దిరిగేటిచిత్తము
నావద్ద నిలుపఁగ నావశమా
యీవల నీవేయిచ్చినపుట్టుగు
యేవిధిఁ ౧దప్పిన యిఁక మాకవశమా. ॥నీవె॥

వామన నీపంపు వచ్చినప్రకృతిదే
నామాఁట వినుమన నావశమా
శ్రీమంతుఁడ నీచేఁత దేహ మిది
దోమటి గుడువక తోయఁగవశమా ॥నీవె॥

నగధర నీ విటు నడపేటికర్మము
నగినగి తోయఁగ నావశమా
తగు శ్రీవేంకటదైవమ నాపాలఁ
దగిలితి వితరముఁ దలఁచఁగవశమా. ॥నీవె॥ 408

భైరవి

విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో
శాశ్వతుల మైతి మింక జయము మాజన్మము. ॥పల్లవి॥

కొండవంటిహరిరూపు గురుతైనతిరుమల
పండినవృక్షములే కల్పతరువులు
నిండినమృగాదులెల్ల నిత్యముక్తజనములు
మెండుగఁ బ్రత్యక్షమాయ మేలువో నాజన్మము. ॥విశ్వ॥

౧. 'దప్పిన' పూ. ము. పా.

మేడవంటిహరిరూపు మించైనపైఁడిగోపుర-
మాడనే వాలినపక్షు లమరులు
వాడలఁ గోనేటిచుట్ల వైకుంఠనగరము
యీడ మాకుఁ బొడచూపె ఇహమేపో పరము ॥విశ్వ

కోటిమదనులవంటిగుడిలోచక్కనిమూర్తి
యీటులేని శ్రీవేంకటేశుఁ డితఁడు
వాఁటపు సొమ్ములు ముద్రవక్షపుటలమేల్మంగ
కూటువై వన్నెలిరి యొక్కవపో నాతనము. ॥విశ్వ॥ 409

## అహిరి

నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్యా
పైకొని శ్రీహరి నీవే ౧పరిహరించవే ॥పల్లవి॥

విజ్ఞానములు గొన్ని విందు నే నూరకే
సుజ్ఞానములు గొన్ని చూతు నే నేపొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞాహీనుఁడ నెంత పాపకర్మమో. ॥నీకే॥

సుకృతము లొకమటి సొరిది నే బోధింతు
ప్రకృతి యొకొక్కకవేళ భావింతు నాత్మలో
అకృతములే నే ననిశముఁ జేసేది
వికృతాచారుఁడ నింకా వికార మెంతో ॥నీకే॥

ధర్మమార్గముఁ గొంత తలఁపున నెరిఁగితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరిఁగితి
నిర్మించి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
మర్మ మెరిఁగితి నెట్ల మన్ననఁ గాచితివో ॥నీకే॥ 410

౧. 'పరిహరించేవే' రేకు.

రామక్రియ

అంతటిదైవము లేఁడు యెందుఁ జెప్పి చూపఁగ
వంతులకుఁ గొలిచేటివారిభాగ్య మిఁకను. ॥పల్లవి॥

గక్కన మన్మథునిఁగన్నతండ్రిగనక
యెక్కువచక్కఁదనాల కితఁడే దొడ్డ
నిక్కపుసూర్యచంద్రాగ్ని నేత్రుఁడుగనక
దిక్కులఁ గాంతుల నీదేవుఁడే దొడ్డ. ॥అంత॥

అంచెల లక్ష్మికి మగఁడైనాఁడుగనక
యెంచరానిసంపదల కితఁడే దొడ్డ
పంచినచోటఁ జక్రము పంపుచేసీఁగనక
మించినప్రతాపాన మిక్కిలిని దొడ్డ. ॥అంత॥

దైవికపుఁబురుషోత్తముఁ డితఁడుగనక
దేవతలకెల్లా నీదేవుఁడే దొడ్డ
వావాత శ్రీవేంకటాద్రి వరము లిచ్చీఁగనక
యేవల జాతలలోన నితఁడే దొడ్డ ॥అంత॥ 411

రేకు 272 దేసాళం

కలవి రెండే భూమి కామనిధానంబులు
జలజాతుఁడు వతని శరణాగతియును ॥పల్లవి॥

పరులు లేరా భూమి నానాదిక్కులలోన
హరిదాసుఁ డొక్కఁడే యరుదుగాక
సురలు లేరా మింట సోదించ ఘనుఁ డొక్కఁడే
పరమపదమేలు శ్రీపతియేకాక. ॥కల॥

మాటలు లేవా భూమి మంత్రము లెంచిచూడఁగ
తేటలహరినామమే తేఁకువగాక
కోటిపూజ లిల లేవా కుమతులు నేసేవి
పాటల ప్రపన్నునిభక్తి దొడ్డుగాక ॥కల॥

విహితసుఖము లేదా విశ్వములో భోగించ
సహజమోక్షసుఖమే సారముగాక
యిహమున శ్రీవేంకటేశుఁ డిందరికి లేఁడా
మహి శ్రీవైష్ణవులకే మనికాయఁగాక ॥కల॥ 412

ముఖారి

విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁ డని
వైష్ణవు లానతియ్యఁగా వట్టిచదువులేల ॥పల్లవి॥

వెన్న చేతఁబట్టి నేయి వెదకఁగ నిఁకనేల
నిన్ను లోన నించుకొని నిజమేదో యననేల
వున్నతి దీపమువట్టి వొగి నూతఁబడనేల
వన్ని నీదాస్యము గల్గ బహుకర్మమేల ॥విష్ణుఁ॥

చాలాధనము గల్గి సంతలఁ దిరియనేల
వాలుక నీపేరు గల్గ నానాజపములేల
కాలము నేరు గుడిచి కాలువ వొగడనేల
పాలించ నీవుండఁగాను పరచింతలేల ॥విష్ణుఁ॥

మిన్ను చూచేయందుకుఁగా మిక్కిలి తోదోపులేల
అన్నిటా నీవుండఁగాను అడుగనేల
యెన్నఁగ శ్రీవేంకటేశ యిందరి నేలేవు నీవే
నిన్నే కొలుచుటగాక నీటుగర్వాలేల ॥విష్ణుఁ॥ 413

వరాళి

చంచలము మానితేను సంసారమే సుఖము
పొంచి హరిదాసుఁడైతే భూమెల్లా సుఖము. ॥ పల్లవి ॥

హొరుల వేఁడకవుంటే వున్నచోనే సుఖము
పరనింద విడిచితే భావమెల్లా సుఖము
సరవిఁ గోపించకుంటే జన్మమెల్లా సుఖమే
హరిఁ గొలిచినవారి కన్నిటాను సుఖమే ॥ చంచ ॥

కానిపని సేయకుంటే కాయమే సుఖము
మౌనమున నుండితేను మరులైనా సుఖము
దీనత విడిచితేను దినములెల్లా సుఖము
ఆని హరిఁ దలఁచితే నంతటా సుఖమే ॥ చంచ ॥

చలము విడిచితేను సంతతము సుఖము
యిల నాసలుడిగితే నిహమెల్లా సుఖమే
తలఁగి శ్రీవేంకటేశుదాసులైనవారు వీని
గెలిచి నటించఁగాను కిందా మీఁదా సుఖమే ॥ చంచ ॥ 414

దేసాళం

వెదకవో చిత్తమా వివేకించి నీవు
అదనఁ దదియ్యసేవ అంతకంటే మేలు ॥ పల్లవి ॥

మాపులెన్నైనాఁ గలవు సూర్యమండలముదాఁకా
చూపులు శ్రీహరిరూపు చూడ దొరకదుగాని
తీపులెన్నైనాఁ గలవు తినఁ దిన నాలికెకు
తీపు శ్రీహరిప్రసాదతీర్థమని కోరదు. ॥ వెద ॥

మాటలెన్నైనాఁ గలవు మరిగితే లోకమందు
మాటలు శ్రీహరినామము మరపఁగ వలె
తేటలెన్నైనాఁ గలవు తీరనిచదువులందు
తేటగా రామానుజులు ౧తేరిచె వేదములలో ॥వేద॥

చేఁత లెన్నైనాఁ గలవు సేసేమంటే భూమి
చేఁతల శ్రీవేంకటేశుసేవ సేయవలెను
వ్రాఁత లెన్నైనాఁ గలవు వనజభవునిముద్ర—
వ్రాఁతలు చక్రాంకితాలె వహికెక్కేముద్రలు ॥వేద॥ 415

లలిత

బహుకుటుంబివి నీవు బ్రదుకఁగ వెరవేదో
విహగగమన నాకు వెరగయ్యీ నిందుకే. ॥పల్లవి॥

పుట్టేటిజంతువులు భువనము లెల్లా నిండె
ఇట్టి బ్రహ్మాండకోట్లు ఇన్నియు నీమేన నిండె
ఇక్కై ఇందరి రక్షించే యుక్తైనవిధ మేదో
వొట్టుగ కాఁపురము నీ వుండఁగఁ దోఁచేదో. ॥బహు॥

చిన్ని చిన్ని దేవతలచేఁతల ముద్దులు నిండె
కన్నుల నీ కివి చూచి కడుసంతసాలు నిండె
మన్ననలు వీరికిచ్చి మలసేటివిధ మేదో
వున్నతి నీచింతదీరి వుండు టేక నెన్నఁడో ॥బహు॥

నీదేవులైనలక్ష్మి నిచ్చ సంపదలు నిండె
ఆదినై శ్రీవేంకటేశ ఆకె నీవురాన నిండె
పోదినై నీవివియెల్లా భోగించే దెపొద్దో
నీదాసులము నేము నిన్నుఁ జింతించితిమి ॥బహు॥ 416

---

౧. 'తెరిచె' పూ. ము. పా.

లలిత

నిలిచినచోటనెల్లా నిధాన మీతఁడు
యిల వెలవ వెలవ నేమిటికి నిఁకను. ॥ పల్లవి ॥

హరి నాకుఁ గలఁడుగా అన్నిటిఁ బరిహరించ
నిరతి గర్మములెంత నిండుకుండినా
దరిదాపు ఇతఁడేకా తగ వెనుకవేసుకో
విరవిరఁ బాపాలు నా వెంటఁబడినాను. ॥ నిలి ॥

గోవిందుఁడు గలఁడుగా కొంకుదీర్చి నను గావ
కావరపుభవములు గదిమినాను
దేవుఁ డితఁ డున్నాఁడుగా దిక్కుదెసై నిలువఁగా
భావపుసంసారవార్ధి పైకొని ముంచినను ॥ నిలి ॥

శ్రీవేంకటేశుఁడే చిత్తగించి నన్నేలఁగా
వావాత నింద్రియాలు వశకాడినా
యీవలనావల నితఁ డిహపరా లిచ్చెఁగా
వావిరి నే దాస్యగర్వముతో నుండినను. ॥ నిలి ॥ 417

రేకు 278 బౌళి

దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు
యీవల నీబంట నాకు నెదురింక నేది. ॥ పల్లవి ॥

కామధేనువుఁ బిదుకఁగలకోరికె లివెల్ల
కామధేనువులు పెక్కు గాచేకృష్ణుఁడవట
కామించి నీ బంటనట కమ్మి నిన్నుఁ దలఁచితి-
నేమి మాకుఁ గడమయ్య యిందిరారమణా. ॥ దేవ ॥

యెంచఁ గల్పవృక్షమును యిచ్చు సిరులెల్లాను
నించి కల్పవృక్షములనీడల కృష్ణుఁడవట
అంచెల నీబంటనట ఆత్మలో నిన్ను నమ్మితి
వంచించఁ గడమ యేది వసుధాధీశ ॥ దేవ ॥

తగ నొక్క చింతామణి తలఁచినట్లఁ జేసు
మిగులఁ గౌస్తుభమణిమించినకృష్ణుఁడవట
పగటు శ్రీవేంకటేశ భక్తుఁడ నీకట నేను
జగములోఁ గొఱతేది జగదేకవిభుఁడా ॥ దేవ ॥ 418

సాళంగం

కొలిచినవారలకొంగుపైఁడితఁడు
బలిమిఁ దారకబ్రహ్మ మీతఁడు ॥ పల్లవి ॥

యినవంశాంబుధి నెగసినతేజము
ఘనయజ్ఞంబులఁ గలఫలము
మనుజరూపమున మనియెడిబ్రహ్మము
నినువులరఘుకులనిధాన మితఁడు. ॥ కొలి ॥

పరమాన్నములోపలిసారపుఁజవి
పరగినదివిజులభయహరము
మరిగినసీతామంగళసూత్రము
ధరలో రామావతారం బితఁడు ॥ కొలి ॥

చకితదానవులసంహారచక్రము
సకలవనచరులజయకరము
వికసితముగు శ్రీవేంకటనిలయము
ప్రకటితదశరథభాగ్యం బితఁడు. ॥ కొలి ॥ 419

### గౌళిరామక్రియ

అభయదాయకుఁడ వదె నీవే గతి
యిభరక్షక నను నిపుడు గావవే ॥పల్లవి॥

భయహర దైత్యభంజన కేశవ
జయ జయ నృసింహా సర్వేశ్వరా
నియతము మాకిదె నీపాదములే గతి
క్రియగా మమ్మేలి కింక లుడుపవే ॥అభ॥

బంధవిమోచన పాపవినాశన
సింధురవరదా శ్రితరక్ష
కంధరవర్ణుఁడ గతి నీనామమె
అంధకారముల నణఁచి మనుపవే ॥అభ॥

దైవశిఖామణి తతచక్రాయుధ
శ్రీవేంకటగిరి శ్రీరమణా
సావధాన నీశరణ్యమే గతి
వేవేలకు నావిన్నప మిదియే ॥అభ॥ 420

### శంకరాభరణం

శరణు కపీశ్వర శరణం బనిలజ
సరవి నెంచ నీసరి యిఁక వేరీ ॥పల్లవి॥

పుట్టిననాఁడే భువనములెరఁగఁగ
పట్టితి సూర్యునిఁ బండనుచు
ముట్టినచుక్కలు మోవఁగఁ బెరిగితి
విట్టిప్రతాపివి యెదురేదయ్యా. ॥శర॥

అంపినయప్పుడె యంబుధి దాఁటితి-
యింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపునుఁ బేర్కొనవశమా ॥శర॥

చెదరక నేఁడే శ్రీ వేంకటగిరిఁ
గదిసి రాముకృప గైకొంటి
వదలక నీకృపవాఁడనైతి నిదె
యెదుటనె కాచితి విఁకఁ గడమేమీ. ॥శర॥ 421

నారాయణి

దేవ నీపక్షపాతమో తిరిగేలోకులవెట్టో
శ్రీవిభుఁడ నీవే కాదా చిత్తములోనయ్యా ॥పల్లవి॥

దివములు సరియే దినరాత్రులును సరే
యివల సుఖదుఃఖాలు హెచ్చుకుందులేలయ్యా
భవములు సరియే ప్రాణములు సరియే
భువిఁ బుణ్యపాపములభోగము వేరేలయ్యా. ॥దేవ॥

విని కిందరి కొకటే విషయాలు నొకరీతే
మునుఁగేటిజాతిభేదము లివేలయ్యా
అనయముఁ జూపొక్కటే ఆఁకలియు నొకటే
పెనఁగేటిగుణముల పెక్కుజాడ లేలయ్యా ॥దేవ॥

అంతరాత్మ నీవొక్కఁడ వన్నిటా శ్రీవేంకటేశ
చింతలు వేవేలైన సిలుగేలయ్యా
యింత సేసీ నీమాయ లిందుకే నీశరణంటే
కాంతుఁడ నన్నిందుకే కాచితివి నేఁడయ్యా. ॥దేవ॥ 422

మంగళకౌశిక

నేమెంత మూఢులమైనా నీలవర్ణుఁ డంతరాత్మ
    మామనసు వెలితేల మంచిదౌఁగాక ॥పల్లవి॥

దైవముకృప గలితే తనకర్మా లడ్డమా
    ఆవేళ ఘనపుణ్యుఁడౌఁగాక
    గోవిందుఁడు మన్నించితేఁ గొంచము దొడ్డున్నదా
    కోవరపుసిరు లంది కొనకెక్కుఁగాక. ॥నేమెం॥

పరమాత్ముఁ డేలుకొంటే బంధములు గలవా
    తెరదీసినట్లానె తెగుఁగాక
    హరి విజ్ఞానమిచ్చితే నడ్డము మాయలుండునా
    తొరలి జీవుఁడు మాయఁ దొలఁగుఁగాక. ॥నేమెం॥

శ్రీవేంకటేశ్వరురూపు చిత్తములోఁ జిక్కితేను
    చావుఁబుట్టుగు లున్నవా జయమౌఁగాక
    కైవల్య మీతఁ డిచ్చితేఁ గడమలు గలవా
    కేవలపుజగమెల్లా గెలుపించుఁగాక. ॥నేమెం॥ 428

రేకు 274 మంగళకౌశిక

పడువవో మాయా విష్ణువధీనము
    వొడలిది నీ కెందు నునికే లేదు ॥పల్లవి॥

శ్రీపతినామము చేకొనేనాలుక
    యేపాపములకు నెడలేదు
    దాపగుగోవిందుఁ దలఁచినమనసిది
    కోపముల కిరవుకొన నెడలేదు. ॥విడు॥

తెలవుగ హరికథ నిండెను వీనుల
కలిదోషము లిక్కడ లేవు
అలరినజన్మం బచ్యుతు శరణని
నిలిచె దుఃఖములనివారణము ॥ విడు ॥

శ్రీవేంకటపతిఁ జేరె నాత్మ యిది
భావవికారము పని లేదు
దైవాధీనము తత్త్వవిచారము
వేవేలుఁ కర్మపువిధులే లేవు. ॥ విడు ॥ 424

లలిత

ఇన్నిటా శ్రీహరిభక్తి యిది లాభము
పన్నినతపముచేత బడలుటే లాభము ॥ పల్లవి ॥

యోనయఁ గర్మదేహా మిదెన్నిపాట్లు వచ్చినా
ననుభవించి తీరుచు టది లాభము
తన పాపవర్తన యితరు లెంత నిందించినా
ననుమానించక పడుటదె లాభము ॥ ఇన్ని ॥

తగుసంసారజీవుఁడు తన్నెంత వేసరించినా
నగి రుణము దీర్చుట నానాలాభము
చిగురువంటిచిత్తము చేరి యొందు దిప్పినాను
తగిలి యలయుటే దక్కినట్టిలాభము ॥ ఇన్ని ॥

శ్రీవేంకటేశ్వరుఁడు జీవములో నుండఁగాను
యేవేళ నెట్లయినా నివి లాభము
పావనమైనట్టియాత్మ భావ మెంత మఱచినా
ఆవల నానందించు టది లాభము. ॥ ఇన్ని ॥ 425

లలిత

మనసొకటి కోరికలు ౧మాలు గలవుమ(?)నుండు
తనిసితే నదియె పరతత్త్వమై నిలుచు ॥ పల్లవి ॥

కన్నులనియెడిపాపకర్మంబు లివి రెండు
పన్ని యీమెన్నంటిపైనైనఁ జారు
మున్నె యివి హరిపాదములమీఁద నిలిపినను
అన్నిపుణ్యంబులును అందునే కలుగు ॥ మన ॥

వీనులనియెడిమహావేడఘోరనరకములు
అని పరనిందలే ఆలింపుచుండు
నానాట యిందులో నారాయణునికథలు
పూని వించిన పుణ్యభోగములే యొసఁగు. ॥ మన ॥

నాలుకనియెడిగుహను నాచుఁబా మది యొకటి
గాలి అన్యులపువిషము గ్రక్కుచుండు
యీలీల శ్రీవేంకటేశునామామృతము
సోలి సించవే ఆత్మ శుభములే కలుగు ॥ మన ॥ 428

౨ కేదార గౌళ

ఎన్ని చందముల నెట్టైన నుతింతు
కన్నుల నిన్నే కనుఁగొంటిఁగాన ॥ పల్లవి ॥

గోవిందాయని కొలిచిననిన్నే
శ్రీవల్లభుఁడని చింతింతును
భూవిభుఁడవు యిది పునరుక్తనకుమీ
దైవ మొకఁడవే ధరణికిఁగాన ॥ ఎన్ని ॥

౧ మాలు=శూన్యము కావచ్చు. ౨. 'కన్నడగౌళ' పూ ము. పా

పరమాత్ముఁడవని భక్తిసేసి నిను
నరహరవని ధ్యానము సేతు
సరవులఁ జర్వితచర్వణమనకుమీ
అరయఁగ గుణ యంత రాత్మవుగాన. ॥ఎన్ని॥

గురుగ శ్రీవేంకటేశ్వర నీదాస్యము
మరిగితి నదె ముమ్మాఁటికిని
తిరిగినయందె తిరిగెదననకుమీ
యిరవుగ నితరం బిఁక లేదుగాన ॥ఎన్ని॥427

గుజ్జరి

దేవ నీవేకాల మెట్టు దిప్పినాఁ దిరుగుట గా
కీవలఁ బెద్దరికము యెక్కడిదో తనకు ॥పల్లవి॥

దొరకొని జీవుఁడు దుఃఖముల కోపఁడు
నరకములోనఁ దననాఁటిపా టెంచఁడుగాని
సిరుఁ గొరకుఁగాఁ జిందువందయ్యీఁ బ్రాణి
పురుషై పుట్టినపుడే బుద్ధు లెందువోయనో ॥దేవ॥

కాల్లువో కీమేను నేఁడు భోగించకుండలేదు
తల్లికడుపులోనుండి తానేమి భోగించెనో
యిల్లు ముంగి లాసపడీ నిప్పుడే యీగుణము
తొల్లి జనించనినాఁడు తొలఁగి యెందుండెనో ॥దేవ॥

గుక్కిన వసను నేఁడు కొంక వుండఁగలేదు
శక్కి బ్రహ్మప్రళయానఁ దా నెట్లుండెనో
లెక్కి శ్రీవేంకటేశ్వర నీమునఁగు నేఁ జొచ్చితి
యెక్కినఁ దానిటమీఁద నెంచుకు దాఁగినో ॥దేవ॥ 428

కన్నడగౌళ

నడపే వేఁటికి నాటకము
అడరి నిజముగా నానతి యీవే ॥పల్లవి॥

విశ్వమూర్తి కొకవిన్నపము
శాశ్వతములాయ జగములివి
యీశ్వరేశ్వరున కింకొకవిన్నపము
ఐశ్వర్య మోక్షం బాత్మలకేది. ॥నడ॥

రమాధిపతి కొకరహస్యము
సమానుఁడవు నీవు సర్వమున
క్రమాన నీఁక నొకరహస్యము
(1)సమోహి (2)నరకము స్వర్గము నేలా ॥నడ॥

హరి నే నొకమాఁ టడిగెదను
నిరంతరాత్మవు నీవుగదే
యిరవుగ శ్రీవేంకటేశ నే నడిగెద
విరసము లేదిఁక విచార మేలా. ॥నడ॥ 429

రేకు 275 శంకరాభరణం

చానిపిలోపలఁ జవిగలదా । యిపు
మానిపి నీగతి మరపుదుగాకా. ॥పల్లవి॥

చంచలపుగుణముల జడిసినజీవుఁడు
మంచిగుణంబుల మలసీనా
అంచెల హరి నీ వంతర్యామివి
నించి నీగుణమే నెరపుదుగాకా. ॥చాని॥

1 సమోహి నరకము స్వర్గము నేలా = అన్నిటా సముఁడుగదా? వానికి స్వర్గనరకభేద మేలా। అని భావమేమో? వాక్యమధ్యములో 'సమోహి' అని సంస్కృతము వాడుట వింత

భూతుల యెంగిలిఁ బుట్టినదేహము
జాతిగ ౧శుచియై పరగీనా
౨చైతన్య మందులో శ్రీపతి నీవు
నీతత్త్వఫలమే నెరపుదుగాకా. ॥చాని॥

లలి సుఖదుఃఖపులంకె కాఁపురము
మెలుపున సాజాన మెలఁగీనా
యిలపై శ్రీవేంకటేశ్వర నీవిది
కలిగించితి విఁకఁ గాతువుగాకా. ॥చాని॥ ౪౩౦

లలిత

అన్నిటికి నారదాదు లదివో సాక్షి
యిన్నిటా మాకుఁ గలిగె నేమైనాఁగాని ॥పల్లవి॥

భూమిలోన నెన్నియైనా పుణ్యములు గలవు
౩కామింప నాచారాలు కల వెన్నైనా
సామజవరదు నొక్కసారె దలఁచినందుకు
యేమియును సరిగావు యెట్టయినాఁగాని. ॥అని॥

పుత్తమలోకసుఖము లొగి నెన్నైనాఁ గలవు
యిత్తల సిరులు గల విఁక నెన్నైనా
చిత్తజగురుని నటు సేవించేపుణ్యమువలె
నిత్తెము గావుగాని నిచలు నెంతైనను ॥అన్ని॥

కలవు మతాలు గొన్ని కలవు ముక్తులు గొన్ని
కలవు మాయలు పెక్కు గల్పించేవి
తలఁచి శ్రీవేంకటేశుదాసుఁడైనభాగ్య మిఁక
గలిగె నిక్కెు మాకుఁ గానాచిగాని ॥అన్ని॥ ౪౧.

---

౧. 'సుచియై' రేకు ౨. 'చేతన్య' రేకు ౩. 'కావింప' రేకు. ప్రాసభంగము

లలిత

రామకృష్ణ నీవు నందే రాజ్య మేలుచుండుదువు
యేమిసేసే విక్కడ నీ యిరవుకే పదవే ॥ పల్లవి ॥

లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
అంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
వంకకు సంజీవి దేను వాయుజు నంపినట్టు
వేంకటాద్రిపొంచుండ వేగ మమ్ము నంపవే ॥ రామ ॥

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁగపుల కిండ్ల కంపినట్టు
వొనర గోపికలొద్ది కుద్ధవుని నంపినట్టు
నను వశేషాద్రినుండ నన్ను నంపవే ॥ రామ ॥

వెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనే ముందరఁ గంత నంపినయట్టు
వెండియు శ్రీవేంకటేశ వేఁట వచ్చి యురలితి-
వుండ(డు?)చోట నుండిన న న్నూడిగాని కంపవే ॥ రామ 432

రామక్రియ

విచ్చేయవయ్యా వేంకటాచలముపొంచ-
కచ్చుగా నేనున్నచోటి కచ్యుత నారాయణా. ॥ పల్లవి ॥

అల్లనాఁడు లంక సాధించందరును బొగడఁగ
మల్లడి నయోధ్యకు మరలినట్లు
యెల్లగాఁ గైలాసయాత్ర కేఁగి కమ్మర మరలి
వెల్లవిరి ద్వారకకు విచ్చేసినట్లు. ॥ విచ్చే ॥

యెన్నికెతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరలినట్లు
అన్నిచోట్లానుండి అల్లిరము లారగించ
వెన్నుఁడవై వేడుకతో విచ్చేసినట్లు ॥ విచ్చే ॥

వహి కెక్కఁ ద్రిపురాలవనితల బోధించి
మహి నిందిర వొద్దికి మరలినట్లు
విహగగమన శ్రీవేంకటేశ మముఁ గావ
విహితమై నామతిలో విచ్చేసినట్లు ॥ విచ్చే ॥ 483

బౌళి

మాదురితములు వాపి మమ్ముఁ గాచు టరుదా
శ్రీదేవీరమణుఁడ శ్రీవేంకటేశ ॥ పల్లవి ॥

అంబరీషుఁ డై కొన్న ఆపదలన్నియుఁ బాపి
బెంబడిఁ గాచె నీచేపెనుచక్రము
అంబరాననున్న ధ్రువు నజ్ఞానమెల్లఁ బాపె
పంబి నీచేతనుండినపాంచజన్యము ॥ మాదు ॥

పక్కన జరాసంధుబలమెల్ల నుగ్గాడి
నిక్కము మధురనిల్పె నీచేగద
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరిచేటి నీఖడ్గము ॥ మాదు ॥

వెడరావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిదుముడి పడక నీచేశార్ఙ్గము
యెడమీక శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గాచె
బడిబడి నీనామపఠన నేఁడిదిగో ॥ మాదు ॥ 484

దేవగాంధారి

తప్పు లెంచ కిఁక దరిచేర్చవయ్యా
చెప్పనేల నీచిత్తమయ్యా ॥పల్లవి॥

కలిదోషహరణ కర్మవిదారణ
సులభపునీదాసులమయ్యా
కలిగినశరణాగతవజ్రపంజర
వలనగునీమరఁగు వారమయ్యా ॥తప్పు॥

దురితనివారణ దుఃఖవిమోచన
దొరకొని నీభక్తులమయ్యా
కరిరాజవరద కరుణాసముద్ర
సరి నిను నమ్మినఁ[1]జంతులమయ్యా. ॥తప్పు॥

శ్రీకాంతప్రియ శ్రీవేంకటేశ్వర
కైకొన్న నీకింకరులమయ్యా
మాకేల యితరపుమతదైన్యంబులు
పైకొనఁ బోఁజేసి పాలించవయ్యా ॥తప్పు॥ 435

రేకు 276 రామక్రియ

ఎంతగాలమైనాను హెచ్చీ నాసలు శ్రీ-
కాంతుఁడ వింతటనైనాఁ గరుణించరాదా. ॥పల్లవి॥

పచ్చితనాన దిరిగి పండవద్దా చిత్తము
గచ్చులఁ దాఁ గసుగాయే కలకాలము
చచ్చి చచ్చి పుట్టి పుట్టి జారవద్దా కర్మము
కొచ్చి కొచ్చి చేసి చేసి గోరపడీఁగాక. ॥ఎంత॥

---

1. జంతూల' రేకు

రోఁత గడుపున నించి రోయవద్దా దేహము
కూఁతలతో రుచులెల్లాఁ గోరీఁగాక
చేఁతలు యీగుణమైన సిగ్గునడవలదా
బాఁతిపడి విషయాలఁ బరచయ్యీఁగాక. ॥ఎంత॥

నావాఁడే విరతిఁబొందె నవ్వు నవ్వవలదా
మానక యీజీవుఁ డనుమానించీఁగాక
మోనాన శ్రీవేంకటేశ మొక్కి నీదాసుఁడఁగాఁగా
అనినవిన్నియుఁ బరిహార మయ్యీఁగాక ॥ఎంత॥ 486

లలిత

సొమ్ముగలవాఁడు తనసొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీసొమ్మను నేను కాపాడవే హరి. ॥పల్లవి॥

పసురమడవిఁబడ్డ పసురముగలవాఁడు
దెసలు వెద కింటికిఁ దెచ్చుకొన్నట్టు
వసగా నానలలోన వడిఁబడ్డనామనసు
యెసగ మళ్లించవే నన్నేలినగోవిందుఁడా. ॥సొమ్ము॥

గొందిఁ బంటసేయువాఁడు కొలుచులు పరకళ్లఁ
జిందకుండా గాదెఁ బోసి చేరి కాచీని
కందువ మమ్ముఁ బుట్టించి కన్నవారివాకిళ్లఁ
జెంది కావనియ్యకువే జీవునిలోదేవుఁడా ॥సొమ్ము॥

కడుపులోనిశిశువు కన్నతల్లి(ఁ?) దన్ని తేను
బెడగులెంచక కని పంచీనటా
యెడమీక శ్రీవేంకటేశ నీకుక్షిలో నేను
తడవి తప్పుసేసినా దయఁ గావవే. ॥సొమ్ము॥ 487

ధన్నాసి

మెచ్చులదంపతులార మీరే గతి
మెచ్చితి నిన్నిట మిమ్ము మెరసె మీచేఁతలు. ॥ పల్లవి ॥

తమ్మిలోనిమగువా వో ధరణీధరుఁడా
మిమ్మునే నమ్మితి నాకు మీరే గతి
నెమ్మది నో యిందిరా నీరజలోచనుఁడా
కమ్మి యేపొద్దును మీరే కలరు నాపాలను ॥ మెచ్చు ॥

పాలజలధికూఁతుర భక్తవత్సలుఁడ హరి
మేలిచ్చి రక్షించ నాకు మీరే గతి
కేలి నో శ్రీమహాలక్ష్మి కేశవ దయానిధి
తాలిమి మీరే నాకు దాపు దండ యెపుడు ॥ మెచ్చు ॥

చెన్నగురమాకాంత చెందిన వో మాధవ
మిన్నక యేపొద్దు మాకు మీరెగతి
చిన్ని యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడా
యెన్నికె కెక్కించి నన్ను నేల కొంటి రిదిగో ॥ మెచ్చు ॥ 498

శంకరాభరణం

దైవంబవు కర్తవు నీవే హరి
యీవలనావల నెవ్వఁడనయ్యా ॥ పల్లవి ॥

తలఁచినతలఁపులు దైవయోగములు
కలిగినచేఁతలు కర్మములు
వెలసిన దేహము విషయాధీనము
యిల నోఁగాదన నెవ్వఁడనయ్యా ॥ దైవం ॥

జిగి నింద్రియములు చిత్తపుమూలము
తగులమి(ము?)మాయకుఁ దనుగుణము
జగతిఁ బ్రాణములు సంసారబంధము
యొగ దిగ నాడఁగ నెవ్వఁడనయ్యా ॥ దైవం ॥

శ్రీతరుణీశ్వర శ్రీవేంకటపతి
ఆతుమ యిది నీయధీనము
యీతల నీవిఁక నేలైనఁ జేయుము
యేతలపోఁతకు నెవ్వఁడనయ్యా ॥ దైవం ॥ 439

దేసాళి

ఎన్నఁడఁక యేది గోఁదినాటు
ధన్నతపుమాయలకే వొడిగట్టవలసె ॥ పల్లవి ॥

ఛీ ఛీ మనసా ఛీ మనసా
కాచేటిపూ చేటివోఘనజన్మమూ
నీచు యెండమావులెల్లా నిళ్లంటా నమ్మినట్టు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె. ॥ ఎన్నఁ ॥

కట్టా జీవుఁడా కటకటా జీవుఁడా
తొట్టినపంచభూతాలతోడిదేహమూ
వెట్టి జెలకుపోఁకకి వెదురు నిమిలినట్టు
కట్టినయీకనకమే బ్రహ్మ మనవలెసె. ॥ ఎన్నఁ ॥

బాపుబాపుదైవమా భావజ్ఞ శ్రీవేంకటేశ
చూపుల నాయాతుమలో సుజ్ఞానమూ
దోపుచుఁ బూవులవల్లి తుంగ చిలకెక్కినట్టు
బాపగునాలికె నిన్నుఁ దలఁచఁగవలసె ॥ ఎన్నఁ ॥ 440

లోకము మాయామయమై లోనుగాకుండుఁగాని
జోక పరమాత్మలోనే సోదింపముగాని
కైకొని మూసితెరచేకనురెప్పలనుఁ జిక్కి
వాకిలిఁ గనేఁ ౧జూపరో వద్దనున్న కాలమా(?) ॥రాతి॥

రూపము విజ్ఞానమే రూఢి కెక్కనైతిఁగాని
కాపు శ్రీవేంకటేశుఁడే గతి గంటిఁగాని
౨యీవారినేనైతే నిహపరాలకుఁ జిక్కి
పైపూఁట లేమి గానఁ బాలించవో గురుఁడా ॥రాతి॥ 442

## సామంతం

ఇంతటఁ గానఁగదే ఇందిరానాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు ॥పల్లవి॥

దించనిపంచభూతాలదేహము మోచితిఁగాని
నించినయజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ బట్టువడ్డవాఁడఁగాన
యెంచరానిపాపసంగతి ఇన్నియు జేసితిని ॥ఇంత॥

మిన్నులంటిజఠరాగ్ని మించివున్నవాఁడఁగాన
కన్నవెల్లా వేఁడి వేఁడి కష్టపడితి
పన్నినసంసారభ్రమఁ బడ్డవాఁడఁగాన
అన్నిటా దేవతలకు నరిగాఁపనైతి ॥ఇంత॥

ఆతుమలో నీవుండేభాగ్యముగలవాఁడఁగాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాఁడఁగాన
బాతితో సర్వము నీకొప్పనము సేసితిని ॥ఇంత॥ 448

---

౧ 'చూపవో' కావచ్చు కనురెప్పలు మూసితెరచుటతో నేర్పడు నదేగదా కాలము
౨ '–పాటి' కావచ్చు.

లలిత

తనిసితి మిన్నిటితగుతేలో
మినుకులదినములు మెచ్చేమయ్యా. ॥ పల్లవి ॥

మనసూ రోసితి మరులూఁ బాసితి
తనువేలో పైతరవాయ
వెనకాఁ దెలిసితి మునుపూఁ జూచితి
నను నేనే యిఁక నవ్వేమయ్యా ॥ తని॥

మాయల వెడలితి మమతల బడలితి
పాయంబేలో పదరీని
దాయల గెలిచితి ధర్మముఁ దెలిచితి
పోయినజన్మముఁ బొగడేమయ్యా. ॥ తని ॥

శరణూఁ జొచ్చితి జయవుల హెచ్చితి
దురితము లెందో తొలఁగీని
గరిమల శ్రీవేంకటపతిఁ గొలిచితి
తరతర మించే దక్కితిమయ్యా. ॥ తని ॥ 444

శ్రీరాగం

నీవు నట్ల నేరుపు నేరమి నేఁడు నాయెడకుఁ జూడకుమీ
సేవలయెడ తృణము మేరువుగఁ జేసుకోఁగలవు నీమహిమలను ।పల్లవి

తప్పు లెరంగము వొప్పు లెరంగము దైవము నే నిను నుతియించేదా
చెప్పిన వేదము సకలశబ్దము నీవేయని చాటఁగ వినుచు
ఇప్పుడు ద్రిష్టాంత మొకటి చెప్పెద నిందుకు సముద్రుఁ డిటు తనలో
చిప్పలు గుల్లలు బహురత్నంబులు చేకొని గర్భీకరించుఁగదా ॥ నీవు

కర్మ మెరంగ నకర్మ మెరంగను కరుణానిధి నినుఁ బూజించేదా
నిర్మలవేదము చైతన్యంబిది నీవేయని చాటఁగ వినుచు
అర్మిలి ద్రిష్టాంత మిందుకు నొకటె అన్నియు గర్భీకరించుకొని
ధర్మాధర్మపుమనుజులనెల్లాఁ దగ నీభూకాంత మోచుఁగదా ॥ నీవు

జ్ఞాన మెరఁగ నజ్ఞాన మెఱఁగను సారెకు నిను నేఁ దలఁచేదా
అనినవేదము శ్రీవేంకటేశ్వర అంతరాత్మ నినుఁ జాటఁగను
పూని ద్రిష్టాంతము మీకిటు సరిగాఁ బోలుపరా, దిఁకనైనాను
తానే సూర్యుఁడు రాత్రి గలబయట తనగుణము వేగి నెరపుఁగదా
॥ నీవు ॥ 445

లలిత

కల దందేవో సర్వముఁ గలదు కామితార్థమునుఁ గలదు
కలదు గలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు
॥ పల్లవి ॥

ఆకాశంబున మోక్షము వెదకిన నందులోపలా లేదు
పైకొని తానెంత వెదకి చూచినా పాతాళంబున లేదు
యీకడ ధరలో మూలమూలలను యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతిఁ జింతించి యాసలఁజిక్కక తొలఁగిన నందే కలదు
॥ కల ॥

కోటిజన్మములు యెత్తిన ముక్తికి కొనమొదలేమియుఁ గనరాదు
వాటపుసంసారములోఁ గర్మపువార్ధి యీఁదినాఁ గనరాదు
కూటువతో స్వర్గాదిలోకములఁ గోరి వెదకినాఁ గనరాదు
గాఁటపుకేశవభక్తి గలిగితే కైవల్యము మతిఁ గానఁగవచ్చు ॥ కల ॥

సకలశాస్త్రములు చదివినాఁ బరము చక్కటిమార్గము దొరకదు
వికటపుపలువేల్పుల నెందరిఁ గడువెదకి కొలిచినా దొరకదు
అకలంకుఁడు శ్రీవేంకటగిరిపతి అంతరంగమున నున్నాఁడనుచును
పకటముగా గురుఁ డానతిచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు
॥ కల ॥ 446

రు 278 సామంతం

౧ సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకునిభక్తి గలిగితే మేలు ॥పల్లవి॥

వినయపుమాటల విద్య సాధించితే మేలు
తనిసి యప్పులలోన దాఁగకుంటే మేలు
మునుపనే భూమి దన్ను మోచి దించకుంటే మేలు
వెనుకొన్నకోపము విడిచితే మేలు. ॥సంసా॥

కోరి వొకరినడిగి కొంచపడకుంటే మేలు
సారె సారె జీవులను చంపకుంటే మేలు
ఘారపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్లు కొడిగట్టకుంటే మేలు ॥సంసా॥

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీవేంకటాద్రివిభునిఁ గొల్చి
యిరవై నిశ్చింతుఁడైతే నిన్నిటాను మేలు. ॥సంసా॥ 447

లలిత

భగవద్విభవపుప్రత్యక్షం బిది
జిగి నిందొకటియుఁ జేయఁగఁగలమా. ॥పల్లవి॥

దైవికమెపో తతియగువానలు
తావగుమొలకలు దైవికమే
కావిరినివెల్లాఁ గఁటూ వింటూ
దైవము నేలో తలఁచము మనము ॥భగ॥

• ఇందు దశావతారసమన్వయము గలదు.

జననమరణములు సరి దైవికమే
తనుపోషణములు దైవికమే
యెనసి యివెల్లా నెఱిఁగియు మరిగియు
కొన దైవము నేలో కొలువము మనము. ॥భగ॥

యిహాపరంబులును యివి దైవికమే
తహతహ లుడుపఁగ దైవికమే
అహిపతి శ్రీవేంకటాధిపుకృపచే
మహిమ గంటిమిఁక మఱవము మనము ॥భగ॥ 448

బౌళి

నన్నెంచఁబనిలేదు నిన్నెంచుటే కాని
మన్నించు హరి నీమఱఁగు చొచ్చితిని. ॥పల్లవి॥

రాజుఁ బెండ్లాడినయట్టిరమణి యేజాతైనా
పూజితమై యిన్నిటాను భోగించినట్టు
సాజాన నేనెంతసకలహీనుఁడనైనా
వోజతో నిన్నుఁ గొలిచి వున్నతుఁడనైతిని ॥నన్నెం॥

వేల ముద్దుటుంగరము వేడుకనిడి ప్రధాని
కేలెత్తి యిందరిచే మొక్కించుకొన్నట్టు
నేలనే నీముద్ర మోచి నే నేఁటివాఁడనైనా
పేలరిజగములోనఁ బెద్దనైతి నిదివో. ॥నన్నెం॥

తల్లిదండ్రిగలవాఁడు తప్పులేమైనాఁ జేసి
తల్లితో ముద్దు గునిసి తప్పించినట్టు
చల్లని శ్రీవేంకటేశ సరవి నీకృపవల్ల
కెల్లున నిన్ను నుతించి గెలిచితినిదివో. ॥నన్నెం॥ 449

శుద్ధవసంతం

ఎందు వెదకనేల యేప్రయాసాలు నేల
యిందే వున్నది బ్రదుకు కిహపరములకు. ॥పల్లవి॥

ముక్కోటితీర్థములు ముకుందుదాసుల-
వాక్కుపాదాంగుటమున నొలికీనిదే
మిక్కిలిజపతపాలు మించినప్రపన్నుల-
చిక్కనిక్రుపాకటాక్షసీమ నున్న దిదివో. ॥ఎందు॥

చేసేటిపుణ్యఫలాలు శ్రీవైష్ణవులచేత
రాసులై యిరుదెసల రాలీనివే
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల-
భాసురపుఁబెదవులఁ ఞాఁతి పైపై నున్నది ॥ఎందు॥

సకలదేవతలచే సాధించేవరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవేంకటాద్రివిభునిమహిమలెల్లా
ప్రకటించి వీరిసల్లాపాన నున్న దిదివో ॥ఎందు॥ 450

సాళంగం

నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపుదయ
జోక నురుత మెచ్చిన సులభుఁడవే కా. ॥పల్లవి॥

నేరములు దొలఁగించ నెలవులు గలిగించ
గారవించ హరి నీవే కలవు నాకు
నారపేరఁ బిలిచితే నారాయణ యనెనంటా
చేరి కాచినటువంటి శ్రీపతివిగా. ॥నీకుఁ॥

దురితము లణఁగించ దుఃఖములు వెడఁబాప
గరిమఁ గేశవ నీవే కలవు నాకు
మరమరా యంటేను మరి రామ యనేనంటా
తిరముగఁ గాచినట్టి దేవుఁడవుగా. ॥ నీకు ॥

వినుతులు చేకొని వేడుకతో నన్నుఁ గావ
ఘనుఁడ శ్రీవేంకటేశ కలవు నాకు
మనసునఁ దలఁచితే మాటలఁ బిలిచెనంటా
తనిసి కంఠాన వెళ్లే దైవమవుగా. ॥ నీకు ॥ 451

గుండక్రియ

ఏపాటితనకర్మ మాపాటి కాపాటె
శ్రీపతిదాసుఁ డయితే చిహ్నా లిటువలెఁబో ॥ పల్లవి ॥

అందరిని నిర్మలులే యని తలఁచిన తన-
నిందలేనిమనసే నిర్మలము
మందలిఁచి లోకులతో మంచిమాఁట లాడితేను
బందెలేని తనసోరే భావించ మంచిది. ॥ ఏపా ॥

అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన-
యంతరంగమున నుండు నాదేవుఁడే
చింతించి యీజగము చేకొని పావనమంటే
పంతపుతనదేహముఁ బరమపావనమే ॥ ఏపా ॥

పుట్టితేఁ దనపాలికిఁ బుట్టె నీప్రపంచము
దట్టమైనపుట్టెల్లఁ దనతోడిదే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిచ్చినాఁ డీగుణము
పట్టమై నావద్దనుండు ౧ పరమవిజ్ఞానము. ॥ ఏపా ॥ 452

౧. 'పరమ విజ్ఞానమా' రేకు

కలుగక మానదు కాఁగలభోగము
కలిమిఁ బురాకృతకర్మమిది
అలసి యిందు నాయాస లేమిటికి
కలిగినపాటే కానీవయ్యా. ॥ వద్ది ॥

తగులక మానదు తనసంసారము
వెగటగుమాయావిలాసము
అగపడి శ్రీవేంకటాధిపుకృపచే
తగినపాటినే తనిసేవయ్యా ॥ వద్ది ॥ 454

దేవగాంధారి

ఒక్కమాటు శరణని వుండేనింతేకాక
పెక్కువిధముల నెట్టు పెనఁగేనయ్యా. ॥ పల్లవి ॥

వాలికె వొక్కటే నీనామము లనంతము
పోలించి నే నిన్నెట్టు పొగడేదయ్యా
వోలి నాకన్నులు రెండే వొగి నీమూర్తులు పెక్కు
సోలి నే నిన్నెటువలెఁ జూచెదనయ్యా ॥ ఒక్క ॥

పట్టి నాచేతులు రెండే పదములు నీకుఁ బెక్కు
వొట్టి నిన్నుఁ బూజించ నోపికేదయ్యా
గట్టి నాచెవు లిసుమంత కథలు నీ కవిరెన్నో
పట్టవు నేనెట్టు విని భజియించేనయ్యా ॥ ఒక్క ॥

యేమిటాఁ జిక్కవు నీవు యింతదేవుఁడవుగాన
కామించి నీదాగు మోచి గతిగనేను
యీమేర శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గావు
దీమసాన నిఁక వేరే తెరువు లేదయ్యా. ॥ ఒక్క ॥ 455

సామంతం

గరిమల నెరఁగరుగాక మానవులు
సిరులఁ దియ్యనినోరఁ జేఁదుమేసెదా. ॥పల్లవి॥

హరినారాయణ యనియెడినోరను
ధర నితరులపేళ్లు దడవుటెట్టు
సరవితో వేదములు చదివేటినోరను
పరులమీఁదిపదాలు పాడేదా ॥గరి॥

మునుప శ్రీపతికి మ్రొక్కినచేతుల
అనరుహులకు దండమనుట యెట్టు
మునుకొని పూవులు ముడిచినసిరసున
౧కసవలి కట్టెలు మోచి కాకయ్యేదా. ॥గరి॥

బలిమి శ్రీవేంకటపతిఁ గొలిచినవారు
తెలియ కల్పులఁ గొల్చి తిరుగుటెట్లు
జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగ
వలవనికోలితో వదరువట్టేదా ॥గరి॥ 456

గౌళ

వేళలేదు జాడలేదు వీనితోడిదే పాటు
కూళఁడనై తిరిగేను గుణమేది నాకు. ॥పల్లవి॥

వేగిరించి పెరరేఁచి వేసరించీఁ జనులు
సాగి ముందరఁ గొలసి చలపట్టీ సిరులు
జాగుసేసి వచ్చి వచ్చి చవిచూపీఁ గాయము
యేగతి నిన్నుఁ దలఁతు నేది బుద్ది నాకు. ॥వేళ॥

౧ 'కసలు' పూ. ము పా

తన్నుఁదానే వచ్చి వచ్చి తగిలీ లంపటము
వున్నతి భోగముల నోరూరించీ సుఖము
కన్నచోనే యెలయించి కదిమీ సంసారము
యెన్నఁడు నిన్నుఁ దలఁతు నెఱుకేది నాకు ॥ వేళ ॥

తాలిమితో మీఁదమీఁదఁ దరవయ్యీఁ గర్మము
నాలితోడ సన్నసేసి నవ్వు నవ్వీ మర్మము
యేలితివి శ్రీవేంకటేశ్వరుఁడ నన్ను నీవు
నీలాన నీవాఁడనైతిఁ జెప్పనేది నాకు. ॥ వేళ ॥ 457

లలిత

అంతర్యామి వో అంతర్యామి
బంతి నాకేమిగల్లా నాపాలివాఁడవుగావా. ॥ పల్లవి ॥

దొంతులై అన్నియోనులఁ దొల్లి నేఁ బుట్టేటినాఁడే
అంతరాత్మవైనవాఁడ వటు నీవేకా
ఇంతట విడిచేవా నన్నింద్రియాలఁ గట్టివేసి
చెంతఁ జూచేవిటు నాకుఁ బొత్తులకాఁపవుగా. ॥ అంత ॥

తొడరి ౧స్వర్గనరకదుఃఖసుఖములనాఁడు
అడరి కర్మసాక్షి వటు నీవేకా
విడువ వెప్పుడు నన్ను విషయాలఁ జిక్కినాఁడ
కడ నూరకుండనేల కన్నవాఁడవుగావా ॥ అంత ॥

నీచేతఁగానిది లేదు నీవు నాకుఁ బ్రాణమవు
కాచుటకు నీకంటే నొక్కరు వచ్చేరా
చేచేత శ్రీవేంకటేశ చేరి నీకు శరణంటి
యేచి నన్ను మన్నించితి విది నీతేజముగాదా. ॥ అంత ॥ 458

౧. "స్వర్గనరక దుఃఖసుఖము" అనుట అనుక్రమమును దప్పించినయతిబాధ.

రేకు 280 సాళంగనాట

తీరుచు నతఁడే దినకర్మంబది
నూరిటిరుణ మొకనూలిపోఁగుహా. ॥ పల్లవి ॥

తొల్లిటికర్మము దోఁడఁ గుడుచుటకె
తెల్లమి జీవుఁడు దేహము మోచుట
వొల్లనన్నఁబో దున్నంతగాలము
మల్లాడి హరినే మఱవఁగవలదు. ॥ తీరు ॥

కోరినకోర్కికి గురియగునందుకె
సారవుసంసారసంగమిది
నేరిచి బ్రదికేటినెపమునఁ బోదది
కూరిమి హరినే కొలువఁగవలయు. ॥ తీరు ॥

తెంచనియాసలఁ దిప్పుటకే పో
పంచేంద్రియములపంతమిది
చించినఁ బోదిది శ్రీవేంకటపతి
నించి మనసులో నించగవలయు. ॥ తీరు ॥ 459

లలిత

ఎక్కడి పుట్టుగు లిఁక నెక్కడి మరణములు
మిక్కిలి నీముద్రలు నామేన నున్న విదిగో. ॥ వల్లవి ॥

కెరల పాపములకుఁ గెరల కర్మములకు
హరి నీనామము నోర నంటితేఁజాలు
వరకము లేమిసేసు నానేర మేమిసేసు
నిరతి నామతిలోన నీ వుండఁగాను. ॥ ఎక్క ॥

చిక్క నింద్రియములకు చిక్కను బంధములకు
చొక్కి హరి నీమఱఁగుచొచ్చితిఁ జాలు
మొక్కనేలే యెవ్వరికి మొరవెట్ట నేమిటికి
నిక్కపుమాయిలువేల్పు నీవై వుండఁగా. ॥ ఎక్క ॥

దగ్గరవు మాయలింక దగ్గరవు దుర్గుణాలు
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు గల్గఁగా
యెగ్గులేదు తగ్గులేదు యిఁక నీదాసులలోన
౧వుగ్గువలె నీప్రసాద మూనినది వొడల ॥ ఎక్క ॥ 460

దేసాళం

జోజో యని మీరు జోల వాడరో
సాజపుజయంతి నేడే సఫల మిందరికి ॥పల్లవి॥

అదె చంద్రోదయమాయ హరి యవతారమంచె
మొదల జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణముఁ జేయరో. ॥జోజో॥

కాయము దేవకి కిచ్చి గక్కన వాసుదేవుని –
కీయరో గంధాక్షత లిటు విడేలు
కాయకపుగాడిదెకు కవణము వెట్టి మరి
పీయపుచుట్టాలెల్ల పీడువెట్టరో ॥జోజో॥

షోడశోపచారములఁ జొక్కించి శ్రీవేంకటేశుఁ
జాడరో ధర్మము నిల్పె ధర మఱఁచె
వోడించెఁ గౌరవదానవులఁ గంసాదులఁ జంపె
ఆడనే పాండవులఁ గాచె నని యర్ఘ్యమియ్యరో. ॥జోజో॥461

౧. 'వుగ్గువలేని ప్రసాద' వూ. ము పా

సాళంగం

చరమార్థమందు నీవు చాటితివిగాన
ఇరవిది నమ్మితి నాకెదురెందు లేదు. ॥ పల్లవి ॥

పతికిఁ జనవరైనప్రాణధారిలెంకలకు
తతి నేమి సేసినాను తప్పులేదు
సతతము హరి నీశరణాగతుఁడ నాకు ౧(గాన?)
అతిపాపము సేసిన అది నాకు లేదు ॥చర॥

పారుచు నగరి డాగు పసుర మెవ్వరిచేని-
పైరు మేసినా నందు బందె లేదు
సారె నీముద్రలు మోచి సంసారవిషయాల
యేరీతిఁ బొరలినా యెగ్గే లేదు ॥చర॥

ధర్మానఁ గొనితెచ్చినదాసులకు వూర వెట్టి-
అర్మిలిఁ జేయఁగఁ బని అంతలేదు
నిర్మల శ్రీవేంకటేశ నీకరుణగలనాకు
కర్మలోపమైనాను కడమే లేదు. ॥చర॥ ॥462॥

పాడి

నీమాయ లింతేకాక నీరజనాభుఁడ। యివి
నామది నిజమనెట్టు నమ్మేదయ్యా. ॥పల్లవి॥

బాలుఁడనై నేఁ జన్నుఁబాలు దాగేనాఁడు
వోలి ననుష్ఠానము లెందుండెనయ్యా
చాలి యానేసె బ్రహ్మచారినయినమీఁద
వాలి యవె యెందుండి వచ్చెనయ్యా. ॥ నీమా ॥

౧ ఈ "(గాన?)" రేకులోలేదు వూ. ము. పా.

నేను దినదినమును నిద్దురవోయే వేళ
వూని నిత్యకర్మము లెందుండెనయ్యా
జ్ఞానముతో మేలుకొని సంసారినైనవేళ
అనుకొని యెందుండి అంటుకొనెనయ్యా. ॥నీమా॥

యేడ కర్మ మేడ ధర్మ మింతలో సన్యాసైతే
వేడుకకివియెల్లా నీవిలాసాలు
జాడ నీమనసువస్తే సరుగఁ గరుణింతువు
వోడక శ్రీవేంకటేశ వున్నసుద్దులేఁటికి. ॥నీమా॥ 463

రామక్రియ

హరి హరియని వెరగందుటగాక
సిరివర మాకు బుద్ధి చెప్పఁగదవయ్యా. ॥పల్లవి॥

పాపపుకొంపలోవారు పంచమహాపాతకులు
కాపులకు పదుగురు కర్త లందుకు
ఆపికాండ్లారుగురు ధర్మాసనమువారు
చాపలమే పనులెట్టు జరగీనయ్యా. ॥హరి॥

పలుకంతలచేను బండవెవసాయము
బలిమిఁ దొక్కఁగ గుంటిపసురము
కలవరులు ముగురు తగువాదు లేఁదెయారు
పొలసి ఆవాజ్ఞ కిందుఁ జోచేదయ్యా. ॥హరి॥

బూతాల పొంగటికే పొడమినపంటలెల్లా
కోఁతవేఁత చూచుకొని కోరు కొటారు
యీతల శ్రీవేంకటేశ యిన్ని విచారించి నీ-
చేఁతే నిలిపితి విఁకఁ జెప్పేదేఁటిదయ్యా. ॥హరి॥ 464

రేకు 281 శుద్ధవసంతం

ఏమి సేయుదును నా కేది బుద్ధి యంతర్యామి
యీమతులఁ జిక్కి నీచిత్తమునకు నెట్టుండునో యని
చింతయ్యెడిని ॥పల్లవి॥

కులగోత్రంబులు గుణశీలంబులు
తెలియఁగ గర్వోద్రేకములు
కలసి మెలఁగినఁ గలుగదు జ్ఞానము
తొలఁగిన లోకద్రోహంబు ॥ఏమి॥

మఱియు గృహారామక్షేత్రంబులు
జఱిగొను మాయాజనకములు
మఱవఁగ నివియే మదకారణములు
౧ విఱిగిన సంసారవిరుద్ధము(?) ॥ఏమి॥

అనుపమవ్రతకర్మానుష్ఠానము-
లెనలేని బంధహేతువులు
తనిసితి నింక నీదాస్యంబే గతి
ఘనుఁడవు శ్రీ వేంకటనాథా. ॥ఏమి॥ 465

బౌళి

పారవేసినపుల్లాకు బండికల్లై మించినట్లు
కోరి నీముద్రలు మోచి కొండగొంటి నిదివో. ॥పల్లవి॥

మూఁడుగుణములలోన మునిఁగేటివాఁడఁగాన
పోఁడిమి నాకొకబుద్ధి పుట్ట దెందును
నేఁడు నీశరణమనే నిశ్చయమిచ్చితిగాన
వాఁడిమి నిన్నిటా నేఁ బావనమైతి నిదివో. ॥పార॥

౧ విఱిగిన సంసారవిరుద్ధము—గృహారామక్షేత్రాదులనుండి తొలగినచో వాని ... నుండుటకు విరోధమగును" కావచ్చు

పంచభూతాలతనువు పాటించి మోచితిఁగాన
పంచేంద్రియవికారాలు పాయవు నాకు
యెంచఁగ నీదాస్యము నాకినామిచ్చితిగాన
పంచల నాపుట్టుగు సఫలమాయ నిదివో ॥ పార ॥

తగిలి ఇన్నిటికి స్వతంత్రుఁడ నేఁ గాను గాన
జిగి నిన్ను నెరిఁగి పూజించలేను
నగుతా శ్రీవేంకటేశ నాలో నుండుదుగాన
పగటున నిన్ను నమ్మి బ్రదికితి నిదివో. ॥ పార ॥ 466

బౌళి

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను. ॥ పల్లవి ॥

తనువే వొళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టినతాళ్ళు
మనసే నీబద్దితాడు మరి గుణాలె జీవాళి
మొనసినపుట్టుగే మూలమైన కరడి. ॥ పాడే ॥

పాపపుణ్యా లిరువంక పైఁడివెండియనుసులు
పైపైఁ గుత్తికె మేటిపై చనిగె
కోపులనాలికె లోనఁగుచ్చికట్టినట్టితాడు
చూపరానిసంసారమే సూత్రపుగణికె. ॥ పాడే ॥

జీవునికిని దండెసేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరాలిచ్చితివి మెచ్చితివి
శ్రీవేంకటేశ నీవే చేకొన్నదాతవు ॥ పాడే ॥ 467

### సాళంగనాట

తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత
మానవులలంపటాలు మరి చెప్పఁగలదా. ॥పల్లవి॥

తెలఁగి నేలఁ దారేటిచీమసయితమును
కలసి వూరకే పారుఁ గమ్మర నెందో మరలు
తలమోఁచి కాఁపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము దనకిఁక నెంతగలదో. ॥తానెం॥

౧యేడో జాయిటఁ జారేయీఁగ సయితమును
వాడుదేర నడవుల వాలి వాలి
కూడపెట్టుఁ దేనెలు గొందులఁ బిల్లలఁబెట్టు
యేడకేడ సంసార మిఁక నెంతగలదో ॥తానెం॥

హెచ్చి గిజిగాండ్లుసయిత మెంతోగూఁడువెట్టు
తెచ్చి మిణుఁగురుఁబురువు దీపమువెట్టు
తచ్చి శ్రీవేంకటేశ నీదాసులు చూచి నగుదు-
రిచ్చలఁ దానిసంసార మిఁక నెంత గలదో ॥తానెం॥ 468

### దేవగాంధారి

చెలఁగి యధర్మము వుట్టింప నీకేల సృష్టింపఁగ మరి నీకేల
పులులను లేళ్ల నొక్కకదుపుగా పులు మేపుదురచే మాధవుఁడా. ॥పల్లవి॥

గొనకొని పాపండులదుర్భ్యాపల క్రోధము సహింపరాదు
దనుజులపుట్టువు వారలనుచు నిజతత్వజ్ఞానము నీ వియ్యవు
అనిశముఁ జూచిన వారికి మాకును అంతర్యామివి నీవు
పెనఁచి చీఁకటియు వెలుఁగును నొకచోఁ బెంచెద వేలే ముకుందుఁడా.
॥చెలఁ॥

---

౧. 'యేదో(?)' వ్రా. ము పా యేదో=ఎక్కడనో

ఖలుల తామసపుదేవతార్చనలు కనుఁగొని యవి యోర్వఁగరాదు
నెలకొని వారలు నరకవాసులని నీమీఁది భక్తియు నీ వియ్యావు
పొలుపుగ నిందరిలోపలఁ గ్రమ్మరఁ బూజగొనేటివాఁడవు నీవే
చలమునఁ బుణ్యము పాపము నొకచో సరిచేతురటవే గోవిందుఁడా
॥ చెలఁ ॥

సతతము నీదాస్యద్రోహులతో సహయోగంబును సహింపదు
క్షితిలో నీవటువంటివారలను సృజింప కేర్పడ మానవు
హితవుగ శ్రీవేంకటేశ్వర నీవే యిహపరములకుఁ గర్తవు
గతి నీశరణాగతి యని నమ్మినఁ గల విందరికిని నారాయణా.
॥ చెలఁ ॥ 469

రేకు 282 లలిత

అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ-
డతనికంటే మరి యధికులు వేరయ్యా. ॥ పల్లవి ॥

కమలవాసిని లక్ష్మి కలదా యెవ్వరికైనాఁ
గమలనాభునికి నొక్కనికే కాక
కమలజుఁడైనబ్రహ్మ కలఁడా యెవ్వనినాభి-
నమరవంద్యుఁడు ౧మాహరికే కాక. ॥ అతఁ ॥

అందరు నుండెడిభూమి యన్యులకుఁ గలదా
అందపుగోవిందునికే ఆలాయఁగాక
చెందినభాగీరథి శ్రీపాదాలఁ గలదా
మందరధరుఁడయినమాధవునికిఁగాక. ॥ అతఁ ॥

నిచ్చలు నభయమిచ్చేనేరుపు యెందుఁగలదా
అచ్చుగనారాయణునియందే కాక
రచ్చలశరణాగతరక్షణ మెందుఁ గలదా
తచ్చిన శ్రీవేంకటాద్రిదైవానకే కాక ॥ అతఁ ॥ 470

౧. ఈ 'మా' పూ. ము. పా. లో తప్పిపోయినది.

రామక్రియ

కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తెట్టలాయ మహిమలే తిరుమలకొండ. ॥ పల్లవి ॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకములకొనలకొండ
శ్రీదేవుఁడుండేటిశేషాద్రి యీకొండ. ॥కట్టె॥

సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైనకొండ
వుర్విఁ దపసులే తరువులై నిలిచినకొండ
పూర్వపుటంజనాద్రి యీపొడవాటికొండ. ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కాణించి పెంచేకొండ
పరగులక్ష్మీకాంతుసోబనపుఁగొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండినకొండ
విరివైన దిదివో శ్రీవేంకటపుఁగొండ. ॥కట్టె॥ 471

సామంతం

విజయపుటమ్ము వేసె వేంకటేశుఁడు
విజయునిసఖుఁడు యీవేదమూరితి ॥ పల్లవి ॥

పాటితెంచి దశకంఠుపదిశిరసులమీఁద
ఆటికి(?)నమ్ము వేసె నాదిదేవుఁడు
ఆటుడిసేనలతోడ నంబుధిమీఁద వేసె
వేటొకయమ్ము దొడిగి విష్ణుదేవుఁడు. ॥ విజ ॥

చాలుగ నేడుదాళ్ల ౧ సర్వము నొక్కటిగాఁగ
ఆలములో నమ్ము వేసె నఖిలేశుఁడు
ఆలించి రుక్మిణిఁ బెండ్లియాడునాఁడు వైరులపై
౨ జాలి(?)యమ్ము వేసెను విజయకృష్ణుఁడు. ॥ విజ ॥

భజన నిందిరఁగూడి పంతమున నమ్ము వేసె
విజయదశమిని శ్రీవేంకటేశుఁడు
సుజనుల దేవతల సొరిది నిందరిఁ గాచు
విజయము చేకొనె విష్ణుదేవుఁడు ॥విజ॥ 472

## లలిత

౩ నీదాఁకావలెనా నిచ్చలు నారాయణా
అది నీదాసుఁడే చాలు నందరి రక్షించను. ॥ పల్లవి ॥

నీపాదమూలమున నిలిచిన ౪జలమును
మోపుగా మోచె రుద్రుఁడు ముందుముందే
కాపాడు నీనామమునఁ గలిగిన మహిమచే
పైపై మునులు యిహపరములు గనిరి ॥ నీదాఁ ॥

పందేటివాలవెల్లి నీప్రసాదమునఁ గాదె
దండిగా దేవతలెల్ల ధన్యులైరి
అండనే నీసాకార మాతుమఁ దలఁచి కాదె
నిండిన యోగీంద్రులు నిత్యముక్తులైరి. ॥ నీదాఁ ॥

చేరి నీవిహారమైన శ్రీవేంకటాద్రిఁ గాదె
కోరి నరులు వరాలు కొల్లగొనిరి
ఆరీతిఁ దాళ్లపాక అన్నమయ్య ఘనుఁడాయ
వారివారమై నేము వహికెక్కితిమి. ॥ నీదాఁ ॥ 473

౧ 'సర్పము' రేకు ౨ రుక్మితనకు బావమరదికావున చంపుటకిష్టములేక పట్టుకొనుటకు మాత్రమనువుగా దయ (జాలి)తో వేసిన అమ్ముకావచ్చు. ౩ ఈ పాటగూడ పెదతిరుమలయ్యదో, చినతిరుమలయ్యదో కావలసియున్నది ౪. 'జలమున' రేకు.

శుద్ధవసంతం

దీనుఁడ నేను దేవుఁడవు నీవు
నీనిజమహిమే నెరపుటగాకా ॥ పల్లవి ॥

మతి జనన మెఱుఁగ మరణం బెఱుఁగను
యితవుగ నిను నిఁక నెరిఁగేనా
శితిఁ బుట్టించిన శ్రీపతివి నీవే
తతి నాపై దయ దలఁతువుగాకా ॥ దీనుఁ ॥

తలఁచఁ బాపమని తలఁచఁ బుణ్యమని
తలఁపున నిఁక నిను దలఁచేనా
అలరిననాలో యంతర్యామివి
కలుష మెడయ ననుఁ గాతువుగాకా. ॥ దీనుఁ ॥

తెడవ నాహేయము తడవ నామలినము
తడయక నీమేలు దడవేనా
విడువలేని శ్రీవేంకటవిభుఁడవు
కడదాఁకా నిఁకఁ గాతువుగాకా. ॥ దీనుఁ ॥ 474

మాళవి

నారాయణాచ్యుతానంత నిన్నొకచోట
గోరి వెదకనేల నీరివల్లఁ గంటిఁబో. ॥ పల్లవి ॥

సొలసి నీరూపము శ్రుతులలోఁ జెప్పఁగాని
బలిమి నాచార్యుఁడై తేఁ బ్రత్యక్షము
పలికి నీతీర్థము భావనలందేకాని
అల నీదాసులతీర్థ మరచేత నిదివో. ॥ నారా ॥

నీయానతు లెన్నఁడు నేము దెలియముగాని
మాయాచార్యునిమాట మంత్రరాజము
కాయములో నీవుండేది కడు మఱఁగులుగాని
యీయెడ నీపరికర మిన్నిటా నున్నదివో. ॥నారా॥

అరిది నీవందన మొకర్చావతారానఁగాని
గురుపరంపరనై తేఁ గోట్లాయఁబో
హరి నిన్ను శ్రీవేంకటాద్రినే చూచితిఁగాని
పరమున నిహామునఁ బంచి చూపె నతఁడు. ॥నారా॥ 475

రేకు 283 దేసాళం

నేరుపు నతఁడే నేరమి నతఁడే
భారమెల్ల నాతఁడే పని లేదు మాకు. ॥పల్లవి॥

దేవుఁడట యంతరాత్మ దేహ మెంచిచూచితేను
పోవులకర్మాలు సేయఁబుట్టినదట
జీవుఁ డేఁటివాఁ డిందు శ్రీపతియానాజ్ఞగాక
భావించఁ బాపపుణ్యాలు పనిలేదు మాకు ॥నేరు॥

హరి లోకాలేలునట అతనిమాయకులోనై
నరులజీవనములు నడచీనట
వెరవులు మాకేల విష్ణుఁడే యింతాఁగాక
పరచువిచారాలు పనిలేదు మాకు. ॥నేరు॥

వేడుక నాలుకను శ్రీవేంకటేశు నామమట
పాడితో నాతనికి నే బంటనట
తోడునీడ యాతఁడే తోవ చూప నాతఁడే
పాడయిన కోరికలు పనిలేదు మాకు ॥నేరు॥ 476

శంకరాభరణం

మునులతపము నదె మూలభూతి యదె
వనజాక్షుఁడే గతి వలసినను ॥పల్లవి॥

నరహరినామము నాలుక నుండఁగ
పర మొకరి నడుగఁబనియేల
చిరపుణ్యము నదె జీవరక్ష యదె
సరుగఁ గాచు నొకసారె నుడిగినా ॥మును॥

మనసులోననే మాధవుఁ డుండఁగ
వెనుకొని యొకచో వెదకఁగనేఁటికి
కొనకుఁగొన యదే కోరెడి దదియే
తనుఁ దా రక్షించుఁ దలఁచినను. ॥మును॥

శ్రీవేంకటపతి చేరువ నుండఁగ
భావకర్మముల భ్రమయఁగనేఁటికి
దేవుఁడు నతఁడే తెరువూ నదియే
కావలెనంటేఁ గావకపోఁడు ॥మును॥ 477

వరాళి

విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా
యెత్తిన శ్రీహరి నీవే యీడేర్చవయ్యా ॥పల్లవి॥

పాపపుణ్యాదేహికి బంధములే సహజము
యేపునఁ గాదని తోయనెట్టువచ్చును
పూపవంటిమనసుకు భోగములే సహజము
తేపగా విరతి వొందుఁ దెచ్చుకోనేమయ్యా ॥విత్తొ॥

మాయలజన్మమునకు మమతతే సహజము
యేయెడఁ జొరక మాననెట్టువచ్చును
కాయవంటిగుణాసికి కర్మమే సహజము
చాయల నేమెటువలె శాంతిఁబొందేమయ్యా ॥ విత్తొ ॥

తప్పనిజ్ఞానమునకు దైవమే సహజము
యెప్పుడు స్వతంత్రుఁడుగా నెట్టువచ్చును
చెప్పున శ్రీవేంకటేశ నీమహిమే ఇంతాను
చెప్పఁజూపఁ జోటులేదు చేరివుండేమయ్యా. ॥ విత్తొ ॥ 478

మాళవిగౌళ

ధరలో నాజన్మమే తనువు నదియె
యిరవై నీదాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే ॥ పల్లవి ॥

అలరావణునితమ్ముఁ డసురనరభోజనుఁ-
డలరి తొల్లెల్లా నీవాఁడైనమీఁదను
కులజుఁడు పుణ్యుఁడు గుణనిధి యిందరునుఁ
దలఁప యోగ్యుఁడు నట దాస్యమహి మెట్టిదో ॥ ధర ॥

౧జాతిబోయ పాతకుఁడు సత్యతపుఁడట తొల్లి
నీతి నరణియనేటినీదాసుఁ జేరి
ఆతల బ్రహ్మఋషాయ నష్టాక్షరమంత్రాన
చేఁతల నీదాసుల సేవాఫల మెట్టిదో. ॥ ధర ॥

నానాజంతువులందు నవభక్తిగలిగితే
హీనాధిక్యము లేక యేచి కాతువు
శ్రీనాథ కాచితివి శ్రీవేంకటేశ మమ్ము
నేనూ ధన్యుఁడనైతి నీమహిమ యెట్టిదో. ॥ ధర ॥ 479

౧. ఈకథ "వరాహపురాణము" లో కలదు.

శంకరాభరణం

తెలిసినవారికి దేవుఁ డితఁడే
వలవనిదుష్టులవాదములేలా. ॥పల్లవి॥

పురుషులలోపలఁ బురుషోత్తముఁడు
నరులలోన నరనారాయణుఁడు
పరదైవములకుఁ బరమేశ్వరుఁడు
వరుస మూఢులకెవ్వరో యితఁడు ॥తెలి॥

పలుబ్రహ్మలకును పరబ్రహ్మము
మలయునిశులకు మహేశుఁ డితఁడు
ఇల నాత్మలలో నిటు పరమాత్ముఁడు
ఖలుల కెట్లుండునో కానము యితఁడు. ॥తెలి॥

వేదంబులలో వేదాంతవేద్యుఁడు
సోదించ కరిఁ గాచుచో నాదిమూలము.
యీదెస శ్రీవేంకటేశుఁ డిందరికి
గాదిలిమతులనుఁ గైకొనఁ డితఁడు. ॥తెలి॥ 480

లలిత

సంసారికిఁ గల సహజమిది మతిఁ
గంసారి మనకుఁ గలఁ డటుగాన. ॥పల్లవి॥

చేతులు చాఁచుచు సేయఁగఁదొడఁగిన
ఘాతల నిన్నిఁ గర్మములే
వాతులు మోవఁగ వలెనిన వెదకిన
పూఁతల నిన్నియు భోగములే. ॥సంసా॥

వోగి లంపటముల కోపిక గలిగిన
జగమింతాఁబో సంపదలు
జిగిఁ జిత్తములోఁ జింతించిచూచిన
సగుణం బింతా సంతోషములు ॥ సంసా ॥

యేచిన శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చూచినవెల్లా సులభములే
తాచి యీతనికై దాసులమైతిమి
కాచె నతఁడు మముఁ గడమలు లేవు ॥ సంసా ॥ 481

రేకు 284 శ్రీ రాగం

కొలిచినవారిపాలి కొల్లలివివో
యిల నిట్టి దైవమవు యిఁక వేరేకలరా ॥ పల్లవి ॥

యెక్కైన నభయహస్త మెత్తుక కాచుకున్నాఁడ-
వక్కౌ దాసులఁ గాచేనంటా నీవు
తొట్టినపాపాలు పోఁదోలు నీనామమంత్రాలు
జట్టిగా లోకాల వెదచల్లినాఁడవు. ॥ కొలి ॥

తలఁచినవారికెల్లా ధనధాన్యా లిత్తు నంటా
వొలసి శ్రీసతి మోచుకున్నాఁడవు
యిలఁ బావనులఁగా నిందరిఁ జేసేనంటా
నెలమిఁ బాదతీర్థ మేరు చేసినాఁడవు. ॥ కొలి ॥

పుట్టించ జీవులను భువనములోపల
గట్టిగ బ్రహ్మను నాభిఁ గన్నాఁడవు
అట్టుగఁ బాలుపడి చుట్టి రక్షకత్వానికే
యిట్టె శ్రీవేంకటాద్రి యెక్కినాఁడవు. ॥ కొలి ॥ 482

భైరవి

కాను స్వతంత్రుఁడనని గాదని తలఁగలేను
నేను నీకింకరుఁడ నీరచనల ॥ పల్లవి ॥

యెంతైనాఁ దీర దిదే యెందు చూచిన పనులు
అంతటాను నీమాయ అలయించఁగా
దొంతులగుఁగర్మములు తోడనే తిరిగీని
పంతకూటపుబ్రతుకు సటలఁ బెట్టీని ॥ కాను ॥

మాన విం(ద్రి)యము లివి మతిలోనఁ బెర రేఁచు
నానాగము(తు?)లఁ బ్రకృతి నటియించఁగా
పూని పురాకృతములు పోనీక తిరిగీని
సానఁబట్టినవయసు సటలఁ బెట్టీని. ॥ కాను ॥

తరవులనే పెట్టీని తతితేని యాసలివి
నిరతంపుజన్మములు నిడుసాగఁగా
వరుస శ్రీవేంకటేశ్వర నీవు నన్నేలి
కరుణించఁగా భక్తి ఘనత మీరీని. ॥ కాను ॥ 483

భూపాళం

ఏమి నిద్దిరించేవు యెంచాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లఁ గాచుకున్నా రిదివో. ॥ పల్లవి ॥

పులుఁగాలుఁ బచ్చళ్ళు బోనమువెట్టినదిదే
వెలయుధనుర్మాసవేళయు నిదే
బలసి సంకీర్తనపరులు పాడేరిదే
జలజాతుఁడ లేచి జలకమాడవయ్యా. ॥ ఏమి ॥

తోడనే గంధాక్షతలు ధూపదీపాలివిగో
కూడినవిప్రులవేదఘోషణలివే
వాడుదేరఁ బూజించవలెఁ గప్పురబుప్పులివె
వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా ॥ఏమి॥

చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాము డిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవేంకటాధిప మాచరపిదే
యెదుట నిన్నటిమాపే యియ్యకొంటివయ్యా ॥ఏమి॥ 484

శుద్ధవసంతం ||65

చేరి యశోదకు శిశు విత(డు
ధారుణి బ్రహ్మకు దండ్రియు నిత(డు. ॥పల్లవి॥

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదచల్లెడులక్షణు(డు
నిలిచిననిలువున నిఖిలదేవతల
కలిగించు సురలగనివో యిత(డు. ॥చేరి॥

మాటలాడినను మరియజాండములు
కోటులు వొడమేటిగుణరాశి
నీటగుమూర్పుల నిఖిలవేదములు
చాటువనూరేటిసముద్ర మిత(డు ॥చేరి॥

ముంగిటఁ బొలసినమోహాన మాత్మలఁ
బొంగించేఘనపురుషు(డు
సంగతి మావంటిశరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపుఁ డిత(డు ॥చేరి॥ 481

సాళంగం

జీవన్ముక్తులము శ్రీపతిదాసులము
భావించవో వమ్ముసను ప్రపంచపుమాయా. ॥ పల్లవి ॥

ఇవల దానధర్మము లేమిఁ జేయుటలేదు
తవిలినపాతకాలు దైవమే వహించుకొనె
భువిలోన నాకిఁక బుట్టఁబనిలేదు లేదు
భవరోగవైద్యుఁడు శ్రీపతి గలఁడుగాన ॥ జీవ ॥

యెలమి స్వర్గాదిలోకాలేమీఁ గోరుటలేదు
కలవైకుంఠము హరి కాలమునాఁడే యిచ్చె
తొలుత నాకుఁ జాపులతోడిపడ్డ పద్దు వద్దు
బలువైనయచ్యుతునిబంట్లముగాని. ॥ జీవ ॥

పూపసుఖమూ నొల్లము పొంచి దుఃఖమూ నొల్లము
చేపట్టి బ్రహ్మానందము శ్రీవేంకటేశుఁ డిచ్చెను
దూపయు నాఁకటికిఁగా తోడోపు మాకిఁక వద్దు
కాఁపమృతమధనుఁడు గలఁ డిచ్చేకాన. ॥ జీవ ॥ 486

పాడి

కాఁపులము నేము కర్తవు నీవు
దాపుదండై మము నిట్టే దయఁ జూడవయ్యా. ॥ పల్లవి ॥

నెట్టన నైదుగురికి నేము డాగుపెట్టేము
చుట్టి చుట్టి వీడుఁబట్టు మాపివున్నది
అట్టె కర్మములకు నడిగోరు పెట్టేము
నట్టుకొట్టి(ట్టే?)జీవులకు నరకమేలయ్యా ॥ కాపు ॥

మించినయాసల కిదే మేరలెల్లాఁ జెల్లేము
పొంచి మమతలలోఁ గాఁపుర మున్నారం(ము?)
పంచేంద్రియములకే పైరులు సేసితిమి
అంచెలఁ బ్రాణులకిఁక నానాజ్ఞలేలయ్యా ॥కాపు॥

కూరిమి విషయముల కొట్నాలు దంచేము
చేరి నీవు చెప్పినట్టే సేసేము
యీరీతి శ్రీవేంకటేశ యిటు నీకే దాసులము
ఆరూఢిగా మన్నించితి వంతే చాలు నౌనయ్యా ॥కాపు॥487

రేకు 285 మలహరి

సకలముఁ జదివిన శాస్త్రము తెలిఁగిన
శుకధ్రువాదు లిటు చూపినది ॥పల్లవి॥

భవభవములకును ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం బెప్పుడు నొకటే
కవిసిననీమాయఁ గడచినది. ॥సక॥

మతము మతమునకు మార్గము వేరే
అతిసంశయములు అవి వేరే
గతి నీశరణము గలిగినదొకటే
యితవగు మోక్షం బిచ్చేది ॥సక॥

జాతిజాతియాచారము వేరే
ఆతల మోక్షంబది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవేంకటేశ్వర
చేత మాగురుఁడు చెప్పినది. ॥సక॥ 488

ముఖారి

ల్లిటివారికంటే దొడ్డ నేను పాతకాన
బల్లిదుఁడవగుటకుఁ బ్రతాపమిదివో. ॥ పల్లవి ॥

హరి యచ్యుత వో నారాయణా
గురుఁడు నిన్నుఁ గొండించెఁ(?)గోరి నే వింటి
గరిమ నొక్కతప్పున కాకికిఁ బరమిచ్చితి
సిరులఁ బెక్కుతప్పులు సేసితి నేమిచ్చేవే. ॥ తొల్లి ॥

ందరధరుఁడ వో మధుసూదనా
అందరు నిన్నొకమాఁట ఆడఁగా వింటి
సింద కొకటి బొంకితే నీవు ధర్మజుఁ గూడితి
వంది పెక్కుబొంకుల నాయందుఁ గూటమెంతో ॥ తొల్లి ॥

వేంకటేశ్వర శ్రీసతీమనోహర
సేవ నీదాసులే నిన్ను చేతఁ జూపేరు
మోవ నొక్కతునకము మొర యాలించితివట
వేవేలు విన్నాలెత్తితి యీవిధ మెట్లాలించేవో. ॥ తొల్లి ॥ 489

వరాళి

చాలదా మమ్ము నీడేర్చను
అదన నెవ్వఁ డెరుఁగు నటమీఁదిపనులు. ॥ పల్లవి ॥

పంచసంస్కారా లెచ్చోటు నుండినాను
పట్టైనవారే మాకుఁ బ్రమాణము
మట్టుగ వీరూపనామము లెందు నుండినాను
అకట్టఁగడవారైన ఘనపుణ్యులు. ॥ ఇదె ॥

---

ండాఁడెను' అనుటకు వ్యావహారికమా? లేక 'కొండెము' పైనామధాతువా?
సవో అర్థము పొసగునా? ౨. 'కట్టఁగడ' లో అరసున్నవిచార్యము'

పలుక వైష్ణవవేషము వ లెందు నుండినాను
వలసిగ మా  సహవాసయోగు తే
తలకొన్న ౧ సాను   మంటి యుండినాను
అల కర్మదూరులై  నంతరంగులు. ॥ ఇదె

యెక్కువ సంకీర్తన మెచ్చోటి  డి  సు
అక్కడ పరమున  నుది భాగ్యము
చక్కంగ వేదశాస్త్రసం స్త్రుతము విది యే
పక్కన శ్రీవేంకటేశుపరమార్థము  దె ॥ ఇదె ॥ 49

రామక్రియ

అన్నిటిమూలం బతఁడు
వెన్నునికంటెను వేల్పులు లేరు ॥ పల్లవి

పంచభూతముల ప్రపంచమూలము
మించినబ్రహ్మకు మూలము
పొంచినజీవులపుట్టుగుమూలము
యెంచఁగ దైవము యితఁడే కాఁడా ॥ అన్ని ॥

వెనుకొని పొగడేటివేదాలమూలము
మునులతపములకు మూలము
ఘనయజ్ఞాదుల కర్మపుమూలము
యెనలేనిదైవ మితఁడే కాఁడా ॥ అన్ని ॥

అగపడి సురలకు నమృతమూలము
ముగురుమూర్తులకు మూలము
నగుశ్రీవేంకటనాథుఁడే మూలము
యెగువలోకమతి యితఁడే కాఁడా. ॥ అన్ని ॥ 491

౧ 'దాసాన' రేకు

లలిత

అవధారు రఘుపతి యందరిని జిత్తగించు
యివల నిందరో గొలు విదె [1]నిదె సముఖా ॥ పల్లవి ॥

రామ రాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమ నారదుఁడు పాడీఁ బెక్కు రంభాదు లాడేరు
మోమెత్తి పులెల్లా మొక్కేరదివో ॥ అవ ॥

యినవంశకులజాత ఇక్ష్వాకుతిలకా
రఘువరదశరథసుత కౌశికప్రియ
మునులు దీవించేరు ముందట భరతుఁ డదె
వెనక లక్ష్మణుఁడు సేవించీ వింజామర. ॥ అవ ॥

కందువఁ గౌసల్యాగర్భరత్నాకర
చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాసా
సందడిఁ గుశలవులు చదివేరు వొక వంక
చెంది నీర జసము చెప్పరాదు రామా. ॥ అవ ॥ 492

దేసాళం

అక్కటా రావణబ్రహ్మహత్య నీకు నేడది
పుక్కిటిపురాణలింగపూజ నీకు నేడది ॥ పల్లవి ॥

గురుహత్య బ్రహ్మహత్యఁ గూడీ ద్రోణాచార్యువంక
వారి నీకృప నర్జును కవి లేవాయ
ఘోరపుగాఁ గల్లలాడి యేచినధర్మజునకు
పరగ నీయనుమతిఁ బాపము లేదాయను ॥ అక్క ॥

౧. 'నదె' పూ. ము. పా.

అదివో రుద్రుని బ్రహ్మహత్య వాయఁ గాసి యిచ్చి
పొదలిననీ వతనిఁ బూజింతువా
అదనఁ బార్వతిదేవి కాతఁడే నీమంత్ర మిచ్చె
వదరుమాటల మాయావచనాలేమిటికి ॥ అక్క

తగిలి నీనామమే తారకబ్రహ్మమై
జగమువారిపాపాలు సంతతముఁ బాపఁగాను
మిగుల శ్రీవేంకటేశ మీకు నేడ పాతకాలు
నగుఁబాటు లింతేకాక నానా దేశముల ॥ అక్క ॥ 49

రేకు 288 సామంతం

నారాయణుఁడ నీ నామము మంత్రించివేసి
పారేటియీజంతువులభ్రమ విడిపించవే ॥ పల్లవి ॥

మదనభూతము సోఁకి మగువలుఁ బురుషులు
అదన ౧ విరిదలలై యంగమెులలై
పెదవి నెత్తురు వీర్చి పెనుగోళ్ళఁ జించుకొంటా
కొదలు కుత్తికలనుఁ గూసేరు జీవులు. ॥ నారా ॥

పంచభూతములు సోఁకి భ్రమసి యజ్ఞానులై
పొంచి హేయములు మన్నుఁబూసుకొంటాను
అంచెల వీడెపురస మందు నిందు గురియుచు
యెంచి ధనముపిశాచాలిల్లైరి జీవులు ॥ నారా ॥

తమితోడ మాయాభూతము సోఁకి బహుజాతి-
యెముకలుఁ దోలు నరా లిరవుచేసి
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ జేర కెక్కడైన
తముఁ దా మెరఁగరింతటాఁ జూడు జీవులు. ॥ నారా ॥ 494

౧ 'విరిదలై ' పూ ము పా

వసంతం

నీ శరణమేగతి నే నితరమెరఁగ
పాశబంధముల పనులేలయ్యా ॥పల్లవి॥

పూఁచినతొలుకర్మంబులు భోగించకపోవు
చాఁచుకున్నయీ శరీరగుణములు చాలునన్నఁ బోవు
రేఁచినజననమరణములు రెంటికిఁ దీసీని
మోఁచివచ్చితే విజ్ఞాన మెరఁగఁగ మొదలికిఁ గొనకును యెడ
యేదయ్యా ॥నీ శ॥

కోరినవాకోరికలు కొనసాగకపోవు
శారిఁబడుచు కాలము దా బడిఁదగులకపోదు
మేరతో పంచేంద్రియములు మెడ చుట్టకపోవు
యేరీతుల సంసారము గెలువఁగ నెదురుబడిని బలిమిఁక నేదయ్యా॥నీశ

మనసును వాకునుఁ జేఁతయు మానుమన్నఁ బోవు
తనువులోన నా యంతర్యామివి తలఁచక ఇఁకఁ బోదు
ఘనుఁడవు శ్రీవేంకటపతి నన్నుఁ గావక ఇఁకఁ బోదు
కని కాననియజ్ఞానజంతువను కడమలెంచ నీఁకఁ గొల(లఁ?)దేదయ్యా.
॥నీ శ॥ 495

ముఖారి

కడవరాదు హరి ఘనమాయ। తెగి
విడువఁగరాదు వేసరరాదు ॥పల్లవి॥

చూపుల యెదిటికి సోద్యంబై నది
పాపపుణ్యములప్రపంచము
తీపులు పుట్టించు దినదినరుచులై
పూపలసంసారభోగములు ॥కడ॥

మనసులోపలికి మర్మంబైనది
జననమరణములశరీరము
వెనవెనకఁ దిరుగు వెడ లంపటమై
కనకపుటాసలకర్మములు. ॥కడ॥

తగుమోహమునకుఁ దాపయైన దిదె
నగి హరిఁ దలఁచిన నాలుకిది
వెగటు దీరె శ్రీవేంకటపతియై
యగపడె నిపుడు పురాకృతము ॥కడ॥ 496

రామక్రియ

పంచేంద్రియములాల పంచభూతములాల
అంచెలఁ దొమ్మి సేయకురో మీరు ॥పల్లవి॥

కొందరికి మంచివాఁడ కొందరికిఁ గానివాఁడ
నిందకుఁ గీర్తికిఁ బొత్తు నే నొకఁడనే
అంది నిర్దించువాఁడ నటు మేలుకొనువాఁడ
బొందితో నెఱుకమఱపులకు నొక్కఁడనే. ॥పంచేం॥

దైవము నిర్మించినది ధరణిఁ బొడమినది
యీవలావలికిఁ బొత్తు యీ దేహమే
వేవేలుపుణ్యములకు వెలయుఁ బాపములకు
యీవల రెంటికి గురి ఇదివో నా మనసు. ॥పంచేం॥

తుంచి పగమటు వోవు తోడనే సగము వచ్చు
పంచి లోనికి వెలికిఁ బ్రాణ మొక్కటే
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
చంచివాయఁ బనులెల్లా చుమ్ముఁ గాచె నితఁడు ॥పంచేం॥ 497

భైరవి

అటమీఁద శరణంటి నిఁకెటూ మాన్యనవు నాకు
యెటుసేసినాఁ జెల్లె నిఁకనేల మాటలు ॥ పల్లవి ॥

ఏదిపుణ్యమో నాకు నేదిపాపమో కాని
శ్రీదేవుఁడవు నీవే సేయించేవు
సేదదేర నామీఁదఁ జిత్రగుప్తుఁ డేల వ్రాసీ
మేదిని స్వతంత్రమేది[౧]మెరయను నీబంటను ॥ అట ॥

పుట్టినట్టి[౨]తెరువేదో పోయేటిజాడ యేదో
పుట్టించితి నీవే పురుషోత్తమ
వెట్టి సంసారబంధాలు వెంట వెంట నేఁటవచ్చి
యిట్టె యెవ్వరివాఁడ నిందులోన నేను. ॥ అట ॥

చిత్త మెటువంటిదో జీవుఁ డెటువంటివాఁడో
హత్తిన శ్రీవేంకటేశ అంతరాత్మవు
యెత్తినమదము నిన్ను నేల కాననియ్యదాయ
నిత్తెము తొల్లే నేను నీవాఁడఁగాన ॥ అట ॥ 498

పాడి

సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసినరఘురామా. ॥ పల్లవి ॥

చెలిమి సుగ్రీవుతోడఁ జేసినరామ తొల్లి
శిలనుఁ బడఁతిఁ గావించినరామా
చెలరేఁగిన వానరసేనలరామా
శిలుగు మాయామృగముఁ జెండిన రామా. ॥సౌమి॥

౧ 'మెరయనిబంటను' పూ. ము. పా. ౨. 'పుట్టనట్టి' రేకు

తరణివంశ తాటకాంతక రామా
నరనాథ కౌసల్యానందన రామా
సిరులఁ బెండ్లాడిన సీతారామా
గరిమతో సేతువుగట్టినరామా. ॥సామి॥

రావణాదిదనుజహరణ రామా
కావించి విభీషణునిఁ గాచినరామా
దీవెన లయోధ్యలోఁ జెందినరామా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామా. ॥సామి॥ 4౯౯

రేకు 287 సాళంగనాట

అదివో నీప్రతాపము హనుమంతా
యెదురులేదు నీకు నెక్కడా హనుమంతా ॥పల్లవి॥

యెత్తిననీ కుడిహస్తమిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీయెడమచేతిపిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా. ॥అది॥

నలియఁదొక్కిననీవున్నతపుఁబాదముకింద-
నలమటించే రరులు హనుమంతా
చలపట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలుదానవులు భంగపడిరి హనుమంతా ॥అది॥

పడి నీవు మీఁదికి వాలమల్లార్చిన
అడఁగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవేంకటేశుపంపున నీవు గెల్వఁగ
బెడిదమై పొగడేరు పెద్దహనుమంతా ॥అది॥ 500

మాళవి

దిక్కులెల్లా సాధించి దేవదుందుభులు మ్రోయ-
నెక్కడ చూచినఁ దానే యేఁగీ సేవించరో ॥పల్లవి॥

అదివో శ్రీహరితేరు అదె గరుడధ్వజము
కదలేటిఘనతురంగము లవిగో
పొదలుఁబూఁదండ లవే పూఁచి వాఁగేఘంటలవే
యెదుటఁ దిరువీధుల నేఁగీ సేవించరో ॥దిక్కు॥

వారె అచ్చరలేమలు వారె మునులు రుషులు
వారక కొలిచే దేవతలు వారే
వీరె యనంతగరుడవిష్వక్సేనాదులు
యీరీతిఁ బ్రహ్మాసాన నేఁగీ సేవించరో ॥దిక్కు॥

వీఁడె శ్రీవేంకటేశుఁడు వీఁ డలమేల్మంగపతి
వీఁడె శంఖచక్రాదుల వెలసినాఁడు
వోఁడిమి వరములిచ్చీఁ బొసఁగ దాసులకెల్లా
యేఁడేఁడు దప్పకుఁడాను యేఁగి సేవించరో. ॥దిక్కు॥ 501

బౌళి

ఆనందనిలయ ౧ ప్రహ్లాదవరదా
భానుశశినేత్ర జయ ప్రహ్లాదవరదా. ॥పల్లవి॥

పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా
హరి యచ్యుతానంత ప్రహ్లాదవరదా
పరిపూర్ణగోవింద ప్రహ్లాదవరదా
భరితకల్యాణగుణ ప్రహ్లాదవరదా. ॥ఆనం॥

౧. రేకులో అంతటా "ప్రంహ్లాద" అనియే.

అరిది సీతఁ బెండ్లాడి అభయ మందరికిచ్చి
శరధిఁగట్టినరామచంద్రనరేంద్రా
అరసి రావణుఁ జంపి అయోధ్యానగర మేలి
సరవినేలినరామచంద్రనరేంద్రా ॥శర॥

పన్నగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు-
సన్నిధినిల్చినరామచంద్ర నరేంద్రా
అన్నిటా లక్ష్మణభరతాంజనేయశత్రుఘ్నుల-
సన్నుతికెక్కినరామచంద్రనరేంద్రా. ॥శర॥ 505

రేకు 288 నాట

కంభమున వెడలి ఘననరసింహము
కుంభిని హిరణ్యుఁ గూలిచెను ॥పల్లవి॥

తొడికి దైత్యుఁ దనతొడపైకిఁ దిగిచి
కడుపుచించి రక్తము చల్లి
ఉడియక పేగులు జందెంబులుగా
మెడఁ దగిలించుక మెరసీ వాఁడే ॥కంభ॥

పెదవులు చింపుచు పెనుగోళ్ల నదిమి
పుదుటుఁబునుక గోరి కుమియుచును
సదరపుగుండెలు చప్పరింపుచును
మెదడు గందముగ మెత్తీ వాఁడే ॥కంభ॥

దేవతలభయము దీర్చి యంకమున
శ్రీవనితనుఁ గృపసేయుచును
పావనపుటహోబలగిరిదైవము
శ్రీవేంకటగిరిఁ జెలఁగీ వాఁడే ॥కంభ॥ 506

సాళంగనాట

ఆదిమపురుషుఁడు అహోబలమునను
వేదాద్రిగుహలో వెలసీ వాఁడే ॥ పల్లవి ॥

వుదయించె నదిగో వుక్కుఁగంభమున
చెదరక శ్రీనరసింహుఁడు
కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు-
నెదుట గద్దెపై నిరవై నిలిచె. ॥ ఆది ॥

పొడచూపె నదిగో భువి దేవతలకు
చిడుముడి శ్రీనరసింహుఁడు
అడర నందరికి నభయం బొసగుచు
నిడుకొనెఁ దొడపై నిందిరను. ॥ ఆది ॥

సేవలుగొనె నదె చెలఁగి సురలచే
౧శ్రీవేంకటనరసింహుఁడు
దైవమై మమ్మేలి దాసుల రక్షించె
తావుకొనఁగ నిటు దయతోఁ జూచి ॥ ఆది ॥ 507

దేవగాంధారి

మని నుతింతు నేను యిందిరానాయక నీవు
కామించి కోరినవారి కల్పలతవు. ॥ పల్లవి ॥

ట్టనఁ దలఁచేవారినిండునిధానమవు
పట్టినవారిచేతిబంగారమవు
చుట్టరిక మెంచేవారిచోటికిఁ దల్లిదండ్రివి
ముట్టి కొలిచినవారముంజీతమవు. ॥ ఏమ ॥

౧ వేంకట'తరువాత 'గిరి' యనురెండక్షరములు సన్నగా వ్రాసిరిగాని చెక్కలేదు.

సేవ చేసినవారికి చేతిలో మాణికమవు
భావించువారికి పరబ్రహ్మమవు
కావలెనన్నవారికి ఘనమనోరథమవు
వావిరిఁ బూజించువారి వజ్రపంజరమవు ॥ఏమ॥

భక్తిసేసినవారికి భవరోగవైద్యుఁడవు
హత్తి నుతించినవారియానందమవు
పొత్తులఅలమేల్మంగబువ్వపు శ్రీవేంకటేశ
ఇత్తల మాపాలిటికి నిహపరదాతవు ॥ఏమ॥ 508

దేసాళం

సురలు సంతోషించి రసురలెల్లా నడఁగిరి
తొరలి దిక్కుల దేవదుందుభులు మొరసె. ॥పల్లవి॥

కడఁగి వసుదేవుని కాంత దేవకిదేవికి
పుడివోని వేడుకఁ జంద్రోదయవేళ
కొడుకై జన్మించినాఁడు కూరిమి శ్రీకృష్ణుఁడు
నడురేయి నిదే శ్రావణబహుళాష్టమిని ॥సుర॥

రేపల్లె కెమున దాఁటి చేరి రే తెచ్చి తండ్రి
పాపని యశోదవద్దఁ బండఁగఁ బెట్టి
ఆపొద్దే మధురలోని కాఁడుపాపఁ దెచ్చుకొనె
కోపగించి కంసుని మార్కొనె నందనందని. ॥సుర॥

పురుఁడు వెళ్లెను మరిం పుణ్యావాజన సేసిరి
ముంపేసి గొల్లెతలు ముద్దాడిరి
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగపతై
యిరవై కొల్చినవారి నిందరి రక్షించెను. ॥సుర॥ 509

౧ 'పుణ్యావాజన' వంటివ్రాత కేవలము రేకులు చెక్కినవారికే వాడమే.

బౌళి

దేవదుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను ॥పల్లవి॥

గరుడధ్వజముతోడ కనకపుగుబ్బాలతో
పరఁగైన యష్టదిక్కుల బండికండ్లతో
నిరతితో పట్టుసూలినిడుపపగ్గాలతోడ
యిరవై శ్రీపతితేరు యేఁగీ వీధులను. ॥ దేవ ॥

పచ్చలప్రతిమలతో పగడపునొగలతో
హెచ్చినవై డూర్యపుటిరుసులతో
కుచ్చులముత్యాలతో గుంపుఁబైఁడికుండలతో
యిచ్చల భూధవుతేరు యేఁగీ వీధులను ॥ దేవ ॥

మంచినీలాలగద్దెతో మణిదర్పణాలతోడ
పొంచినసింగారాలతో పూదండలతో
అంచె శ్రీవేంకటేశుతో నలమేలుమంగతోడ
యెంచఁగ దేవునితేరు యేఁగీ వీధులను. ॥ దేవ ॥ 510

పాడి

సేవించి చేకొన్నవారిచేతిభాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను ॥ పల్లవి ॥

గరుడగంభముకాడ కడుఁబ్రాణాచారులకు
వరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలములెల్ల
పరువల కొసఁగీని పరమాత్ముఁడు ॥ సేవిం ॥

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించీని నారాయణుఁడు
కానుక పైఁడిగాదెలకాఁడఁ దననిజరూపు
అనుక పాదచూపీని అఖిలేశుఁడు ॥ సేన ॥

సన్నిధి గర్భగృహాన చనవిచ్చిమాటలాడి
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు
యెన్నికఁ బాదాలవద్ద యిహముఁ బరముఁ జూపి
మన్ననల అలమేలుమంగవిభుఁడు. ॥ సేన ॥ 511

రేకు 289 సాళంగనాట

చూడరో చూడరో నేఁడు సుగలార నరులాల
దాడివోయి దనుజుల దండించి తా వచ్చె ॥ పల్లవి ॥

వాయువేగమున వచ్చె వనజాక్షునరదము
వేయిసూర్యులప్రతాపవిభవముతో
చాయల చక్రవాళాద్రిపముద్రాలు దాఁటివచ్చె
ఆయితమై పైఁడకెక్కే లవే కానవచ్చె ॥ చూడ ॥

మునుకొని మనోవేగమున వచ్చె హరితేరు
తనరారుకోటిచంద్రప్రభలతో
వెనుకొని దిక్కులెల్లా విజయము సేసి వచ్చె
కనకాచలముతో గక్కన సరివచ్చె. ॥ చూడ ॥

గరుడవేగాన శ్రీవేంకటేశురథము వచ్చె
మరిగినయలమేలుమంగసిరితో
ధరలోన వీధులేఁగి తనవెలవుకు వచ్చె
పరగ హరిదాసులపంతములు వచ్చె ॥ చూడ ॥ 512

సామంతం

నానాభరణములనరసింహా
పూనినప్రతాపములనరసింహా ॥పల్లవి॥

నగవులనెమ్మోమునరసింహా
పొగరుమించుటూర్పులనరసింహా
నగముమీఁదిఘననరసింహా
తగుకాంతులయందపునరసింహా ॥నానా॥

నలిననేత్ర శ్రీనరసింహా
పొలుపొందునఖంబులనరసింహా
నలుదెసలమెఱయునరసింహా
వెలయుమూఁడుగన్నులనరసింహా ॥నానా॥

నమితసురాసురనరసింహా
కమనియ్యగుణాకరనరసింహా
నమోస్తుతే శుభనరసింహా
కమలాంక శ్రీవేంకటనరసింహా ॥నానా॥ 518

శంకరాభరణం

నమితదేవం భజే నారసింహం
సుముఖకరుణేక్షణం సులభనరసింహం ॥పల్లవి॥

విజయనరసింహం వీరనరసింహం
భుజబలపరాక్రమస్ఫుటనృసింహం
రజనీచరవిదళనవిరాజితనృసింహం
సుజనరక్షకమహోఘోరనరసింహం ॥నమి॥

దారుణనృసింహం ప్రతాపనరసింహం
చారుకల్యాణనిశ్చలనృసింహం
ధీరచిత్తావాసదివ్యనరసింహం
సారయోగానందచతురనరసింహం ॥నమి॥

విమలనరసింహం విక్రమనృసింహం
కమనీయగుణగణాకరనృసింహం
అమితసుశ్రీవేంకటాద్రినరసింహం
రమణీయభూషాభిరామనరసింహం ॥నమి॥ 514

వరాళి

దేవుఁడప నీవు జీవులు నీబంట్లు
చేవ దేరి నీసేఁతే శేఖరమై నిలిచె ॥పల్లవి॥

చేరి నేరమిసేసేది జీవునికి స్వభావము
నేరిచి రక్షించేది నీస్వభావము
ధారుణిలోపల మరి తప్పులెంచఁబోలేది
మేర మీరి నీమహిమే మిక్కుటమై నిలిచె ॥దేవుఁ॥

మత్తుఁడై వుండేదే మనుజునిస్వభావము
నిత్తెపుజ్ఞాన మిచ్చేదినీస్వభావము
వొత్తి గుణావగుణాలు వోరయఁగఁబోలేది
సత్తుగా నీకరుణే సతమయి నిలిచె ॥దేవుఁ॥

చెలఁగి నీశరణుచొచ్చేదే నాస్వభావము
నెలవై యేలుకొనేది నీస్వభావము
మలసి శ్రీవేంకటేశ మనసు సోదించ నేది
చలిమి బలిమిని నీస్వతంత్రమే నిలిచె ॥దేవుఁ॥ 515

సాళంగనాట

సీతాసమేత రామ శ్రీరామ
రాతి నాతిఁజేసిన శ్రీరామ రామ. ॥ పల్లవి ॥

ఆదిత్యకులమునందు నవతరించినరామ
కోదండభంజన రఘుకులరామ
ఆదరించి విశ్వామిత్రుయాగముగాచినరామ
వేదవేదాంతములలో వెలసినరామ ॥ సీతా ॥

బలిమి సుగ్రీవునిపాలినిధానమ రామ
యిల మునులకభయమిచ్చినరామ
జలధి నమ్మునమొనసాధించినరామ
అలరు రావణదర్పహరణ రామ ॥ సీతా ॥

లాలించి విభీషణుని లంకయేలించినరామ
చాలి శరణాగతరక్షక రామ
మేలిమి శ్రీవేంకటాద్రిమీఁద వెలసినరామ
తాలిమితో వెయు ప్రతాపపురామ ॥ సీతా ॥ 516

దేసాళం

కోనేటిదరుల గనుఁగొనరో మూఁడుదేరులు
నానాదేవతలార నరులార మీరు ॥ పల్లవి ॥

తెంకిగా ముంపర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుఁడు
వేంకటేశుఁ డెక్కె నదె వేరొక్క తేరు
లంకెలై శ్రీభూసతులు లలి నొక్క తేరెక్కిరి
కొంకక వీధుల నడగొండలో యనఁగను. ॥ కోనే ॥

యిరవై శ్రీకృష్ణునిది యిదె వానరధ్వజము
గరుడధ్వజము శ్రీవేంకటపతిది
కరిలాంఛనధ్వజము కమలకు మేదినికి
అలరి చూపట్టెను బ్రహ్మాండాలవలెను ॥కోనే॥

చెలఁగి చెఱకువిల్లు చేతఁబట్టె శ్రీకృష్ణుఁడు
బలు శ్రీవేంకటేశుఁడు పట్టెఁ జక్రము
అలమేలుమంగ భూమి యంబుజాలు చేఁబట్టిరి
కలసి మెలసేరు బంగారుమేడ లనఁగ ॥కోనే॥ 517

రేకు 280 నాట

దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ
కేరలీఁ బంతముల సుగ్రీవనారసింహము. ॥పల్లవి॥

నిక్కినకర్ణములతో నిట్టచూపుగుడ్లతో
మిక్కుటమైనపెద్దమీసాలతోడ
వెక్కసపునోరితోడ వెలయుబుగ్గలతోడ
క్రిక్కిరిసీ నవ్వుల సుగ్రీవనారసింహము. ॥దొర॥

చల్లునూరుపులతోడ సంకుఁజక్రములతోడ
మొల్లమైనసహస్రకరములతోడ
తెల్లనిమేనితోడ దిండైనపిరుఁదుతోడ
కెల్లురేఁగీఁ గరుణ సుగ్రీవనారసింహము ॥దొర॥

విరులపాదాలతోడ వెలయుసొమ్ములతోడ
తిరమైనకోటిసూర్యతేజముతోడ
విరులదండలతోడ వేడుక శ్రీవేంకట-
గిరిమీఁద వెలసె సుగ్రీవనారసింహము. ॥దొర॥ 518

౧ 'దీఁడైన' రేకు

బౌళి

వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
పేఁడుకొన్న ప్రతాపాన బెద్దహనుమంతుఁడు ॥పల్లవి॥

ఇదె పుట్టుఁ గౌపీనము హేమకుండలములతో-
నుదయించినాఁ డితఁ డుర్విమీఁదను
పదరి బాలార్కుని పండనుచుఁ బట్టినాఁడు
వదలక దేవతలవర మందినాఁడు ॥వీఁడి॥

నులిచి తా వాలము మిన్నులు మోవఁ జాఁచినాఁడు
జలధి దాఁటఁగ జంగ చాఁచినాఁడు
ఇల నసురలమీఁద వలచెయ్యెత్తినవాఁడు
నిలువెల్ల సాహసమై నిండుకొనున్నాఁడు ॥వీఁడి॥

పెక్కువండ్లగోలలు పడికలించినవాఁడు
మిక్కిలి లంక సాధించి మించినవాఁడు
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంట్లైనవాఁడు
తక్కక లోకములెల్లా దయఁగాచేవాఁడు ॥వీఁడి॥ 519

సామంతం

అనిశముఁ దలఁచరో అహోబలం
అనంతఫలదం బహోబలం ॥పల్లవి॥

హరినిజనిలయం బహోబలం
హరవిరించినుత మహోబలం
అరుణమణిశిఖర మహోబలం
అరిదైత్యహరణ మహోబలం. ॥అని॥

అతిశయసుఖదం బహోబలం
అతులమనోహర మహోబలం
హతదురితచయం బహోబలం
యతిమతసిద్ధం బహోబలం ॥అగ॥

అగు శ్రీవేంకట మహోబలం
అగమ్య మసురల కహోబలం
అగపడుఁ బుణ్యుల కహోబలం
అగకులరాజం బహోబలం. ॥అగ॥

పాడి

కలశాపురముకాడ గంధపుమాకులనీడ-
నలరేవు మేలు మేలు హనుమంతరాయ. ॥పల్లవి॥

సంజీవికొండ దెచ్చి సౌమిత్రి బతికించితి
భంజించితి వసురుల బలువిడిని
కంజాప్తకులరాఘవుని మెప్పించితివి
అంజనీతనయ వో హనుమంతరాయ ॥కల॥

లంక సాధించితివి నీలావులెల్లాఁ జూపితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి
అంకెలెల్లాఁ నీకుఁ జెల్లె హనుమంతరాయ. ॥కల॥

దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంటవైతివి
అక్కజపుమహిమలహనుమంతరాయ. ॥కల॥ 521

రామక్రియ

అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత-
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి. ॥ పల్లవి ॥

అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజదూతవైతి గురుహనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి ॥ అఖి ॥

అంజనీదేవికుమార హనుమంతుఁడ
కంజాప్తఫలహస్త ఘనహనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకులరక్షకుఁడ వైతివి ॥ అఖి ॥

ఆట లంకసాధించినహనుమంతుఁడ
చటులసత్వసమేత జయహనుమంతుఁడ
ఘటన నలమేల్మంగకాంతు (శ్రీ) వేంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్చితివి. ॥ అఖి ॥ 522

గౌళ

౧ త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు
అనుజువిజనకుఁడై నఆదినారాయణుఁడు. ॥ పల్లవి ॥

గరుడనిమీఁద నెక్కి ఘనచక్రము చేఁబట్టి
పరమపదానముండి పరతెంచి
మురిసేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు
అరుదైనప్రతాపపుఆదినారాయణుఁడు. ॥ త్రిజ ॥

౧ 'త్రిజగములు' రేకు

కనకాంబరము గట్టి కౌస్తుభము మెడఁ బెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండఁగా
పనివూని జయముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు. ॥త్రిజ॥

త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్లి
ముదమున దాసులెల్లా మొక్కఁగాను
వదల కెల్లవారికి వరము లిచ్చీ వాఁడే
అదె శ్రీవేంకటవిభుఁ డాదినారాయణుఁడు. ॥త్రిజ॥ 523

రేకు 291 దేసాళి

ఇది యెఱిఁగినవారే యెంచఁగ నీదాసులు
వెదకి తెలుసుకొంటే వేదాంతాల నున్నవి. ॥పల్లవి॥

పట్టితే నీస్వరూపము బయలు లోపల నిండి
అట్టె సర్వశక్తితో సాకారముతో
యెట్టు దలఁచినాఁ [2]జిత్తాఇత్తమై వున్నాఁడవు
వొట్టి ప్రకృతిపురుషు లొగి నీదేహములు ॥ఇది॥

అనంతమైనప్రకృతి అఖిలవికారములై
పనివడి నీమాయయై ప్రపంచమై
వొనరి జడమై యుండ నొకచో దివ్యమై యుండు
నినుపై ఇహపరాలు నీయైశ్వర్యములు ॥ఇది॥

జీవుఁ డణువు జ్ఞానము చింతించఁగా విభువు
యీవిధము నానాజీవు లివె నీయందె
శ్రీవేంకటేశుఁడ నీవే చేకొన్నచైతన్యమవు
కావింపఁ గర్మభక్తులే కారణఫలములు ॥ఇది॥ 524

---

1 'కరము' పూ. ము. పా. క్రి గీత గలవి రేకులలో నస్పష్టములు.
2 'జత్తాఇత్తము' రేకు.

పాడి

కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో. ॥పల్లవి॥

యీపొద్దుకుఁ బోయిరారో ఇంద్రాదిదేవతలు
శ్రీపతి పవ్వళించెను శేషునిమీఁద
తీపులఁబ్రసాద మీరో దేవమునులకునెల్ల
వైపుగఁ దెల్లవారఁగ వత్తురుగాని ॥కొలు॥

పాళెలపట్టుకుఁ బోరో బ్రహ్మరుద్రాదు లిందరు
పాలసముద్రాన హరి పవ్వళించెను
వేళగాదు లోనికిట్టె విచ్చేసె హరి ద్వార-
పాలకులు వాకిళ్ళఁ బదిలముసుండో. ॥కొలు॥

గీత మొయ్యనే పాడరో కిన్నరకింపురుషులు
యీతల శ్రీవేంకటేశుఁ డెక్కెను మేడ
ఘాత నెడ నెడ నూడిగకాండ్లు నిలువరో
రాతిరెప్పుడైనా మిమ్ము రమ్మనునో యతఁడు. ॥కొలు॥525

లలిత

ఇతరుల నడుగము యితఁడే మాదాత
యితనియీవి వొరు లియ్యఁగఁగలరా. ॥పల్లవి॥

దేవదేవుఁ డాదిమపురుషుఁడు హరి
శ్రీవత్సాంకుఁడు చిన్మయుఁడు
యీవల నావల యిబువేలు పతఁడు
భావజగురుఁడు మా పాలిటివాఁడు. ॥ఇత॥

జగదేకగురుఁడు శాశ్వతుఁ డచ్యుతుఁ—
డగజకు వరదుఁడు అనంతుఁడు
తగి మమునేలినదైవము యేలిక
నిగమమూర్తి మానిజబంధువుఁడు. ॥ ఇత ॥

కలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
అలరిన శ్రీవేంకటాధిపుఁడు
చలిమి బలిమి మాజననియు జనకుఁడు
అలమి యితఁడు మాయంతర్యామి ॥ ఇత ॥ 526

భైరవి

శ్రీహరి నిత్యశేషగిరీశ
మోహనాకార ముకుంద నమో శ్రీహరి ॥ పల్లవి ॥

దేవకీసుత దేవ వామన
గోవిందా గోపగోపీనాథా। శ్రీహరి
గోవర్ధనధర గోకులపాలక
దేవేశాధిక తే నమోనమో. ॥ శ్రీహ ॥

సామజాన(వ?)న సారంగ(శార్ఙ్గ?)పాణి
వామనా కృష్ణ వాసుదేవా। శ్రీహరి
రామనామ నారాయణ విష్ణో
దామోదర శ్రీధర నమో నమో. ॥ శ్రీహ ॥

పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి। శ్రీహరి
చిరంతనాచ్యుత శ్రీవేంకటేశ
నరమృగ తే నమో నమో ॥ శ్రీహ ॥ 527

దేవగాంధారి

వేసరితేనే లేదు విచారించితేఁ గద్దు
మూసినదిదే కీలు ముంచి వివేకులకు ॥ పల్లవి ॥

యెవ్వరు మనసులోన నిందిరేశుఁ దలఁచిన
అవ్వలఁ బాయకవుండు నదియే వైకుంఠము
దవ్వులకు నేఁగవద్దు తపము జపము వద్దు
యివ్వల నిదే కీలు యెరిఁగినవారికి. ॥ వేస ॥

నాలుక నెవ్వరైనాను నారాయణుఁ బొగడిన
చాలి యాతఁ డాడ నుండు జగములూ నుండును
కాలమూ నడుగవద్దు కర్మమూ నడుగవద్దు
పోలింప నిదే కీలు పుణ్యమానసులకు ॥ వేస ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జేరి యెవ్వరు నమ్మినా
కైవసమై యాతఁ డింటఁ గాచుకుండును
సావధానములు వద్దు శరణంటేనే చాలు
భావింప నిదే కీలు పరమయోగులకు. ॥ వేస ॥ 528

శంకరాభరణం

ఋలు గనిరి తత్వమిది
వనజాక్షునికృప వసించనేలా ॥ పల్లవి ॥

పరమాత్ముఁ డనాదిపురుషుఁడు
సురలకు నరులకు సులభుఁడు
కారికోపముతో నన్యులవరములు
గరిగా వెంచఁగ జగములలోన. ॥ దను ॥

వేదాంతవిదుఁడు విష్ణుఁడు కృష్ణుఁడు
శ్రీదేవికిఁ బతిశేఖరుఁడు
పోదిఁ బరస్తుతి పుణ్యాముకంటే
పాదుగ వారిఁ దిట్టేపాపము మేలు. ॥దను

నారాయణుఁ డున్నతుఁ డచ్యుతుఁ డుప-
కారుఁడు శ్రీవేంకటవిభుఁడు
చేరి యీతఁడే శిక్షించ రక్షించ
పూరదయివములు వాగి నితనిసరా ॥దను॥ 529

రేకు 292 మలహరి

విశ్వమెల్ల నీ విరాడ్రూపము
శాశ్వతహరి నీశరణులము. ॥పల్లవి॥

కన్నులఁ సూర్యుఁడు కమలాప్తుఁడు నీ-
వన్నినమోమున బ్రాహ్మణులు
వున్నతివైశ్యులు వూరువులందును
యెన్నఁగ శూద్రులు యిదె పాదముల ॥విశ్వ॥

యింద్రాదిదేవత లీశానబ్రహ్మము-
నీంద్రు లంగముల నెనఁగిరదే
సాంద్రలోకములు జఠరంబున నవె
రుంద్రతేజ మదె రోమములు. ॥విశ్వ॥

కాలముఁ గర్మముఁ గైవల్యంబును
ఆలోను వెలియు నది నీవు
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర
కోలుముందు నినుఁ గొలిచితిమయ్య. ॥విశ్వ॥ 530

దేవగాంధారి

ందు తిరుమంత్రము కల దిహాముఁ బరము
కలిమి గలుగు మాకుఁ గడమే లేదు ॥ పల్లవి ॥

ంలాంఛ నీవు మాకుఁ గలిగియుండఁగ భూమి
నమరలేనిదొకటి నవ్వల లేదు
నెమకి నాలుకమీఁద నీనామము మెలఁగఁగ
తమితోఁ బరుల వేఁడఁ దాఁ జోటులేదు. ॥ కల ॥

రి నీ చక్రము నాభుజముమీఁద నుండఁగాను
యీరసపుఁబగ లేదు యెదురూ లేదు
చేరువ నీసేవ నాచేతులపై నుండఁగాను
తీరనికర్మపువెట్టి దినమూ లేదు. ॥ కల ॥

వ్రత నీపైభక్తి యాతుమలో నుండఁగాను
రచ్చలఁ బుట్టిన యపరాధమూ లేదు
ఒిచ్చలు శ్రీవేంకటేశ నీశరణాగతుండఁగా
ంచ్చినవిదేకాని విచారమే లేదు. ॥ కల ॥ 581

దేసాళి

డొక్కఁడే మాకు దిక్కుగాని
ావ నెవ్వరును లేరు కతలింతేకాని ॥ పల్లవి ॥

వొళ్లు మోచితిమి పాపమెల్లాఁ జేసితిమి
ాచ్చినమీఁదటిసుద్దు లేఁటివోకాని
చ్చులఁబడె మా గుట్టు రమణులచేఁత బెట్టు
చ్చమై యిందుకుఁ బరిహారమేదోకాని. ॥ దేవుఁ ॥

గాలిమూఁటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటివారమయ్యేమోకాని
మైల గొంత మనసూ మఱుఁగు గొంతానాయ
తాలిమి నా విధి యేమి దలఁచినో కాని. ॥ దేవ ॥

మాయలఁ బొరలితిమి మరచితి మింతలోనే
చాయల శ్రీవేంకటేశు శరణంటిమి
రోయఁజొచ్చె జగమెల్లా రుచియాయ వైరాగ్య-
మాయము నాలోపలి అంతరాత్మే కాని. ॥ దేవ ॥ 58

వసంతవరాళి

అతని నమ్మరే రల్పమతులు భువి
నతఁడాద్యుఁడు పరమాత్ముఁడు. ॥ పల్లవి ॥

సకలలోకపతి సర్వేశ్వరుఁడట
వొకఁడిఁక దొర మరి వున్నాఁడా
ప్రకటించఁగ శ్రీపతియే దాతట
వెకలి నియ్యఁ గొన వేరేకలరా. ॥అత॥

దివిజవందితుఁడు దిక్కుల హరియట
ఇవల మొక్క సురలిఁక వేరి
కవ నంతర్యామి కరుణాకరుఁడట
వివిధభంగులను వెదకఁగనేలా ॥ అత ॥

వేదాంగుఁడు శ్రీవేంకటపతియట
ఆదిమతము లిఁక నరసేదా
యేదెస నెవ్వరి కెప్పుడుఁ గలఁ డితఁ-
డీదేవుఁడె మన కిహపర మొసఁగ. ॥ అత ॥ 58

సాళంగనాట

ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు
సకలముహరియని సరిఁదోఁచీని. ॥ పల్లవి ॥

అంతరాత్మ శ్రీహరి యతఁ డొకఁడే
జంతువులన్నియు సమములే
బంతులఁ బాత్రాపాత్రము వెదకిన
అంతట హరిదాస్యమేపో ఘనము. ॥ ఒక ॥

జగమును నొకటే చైతన్య మొకటే
తగినపంచభూతము లొకటే
నగుతా నెదిరిని నన్నును నెంచిన
మొగి నాపై హరిముద్రలె ఘనము. ॥ ఒక ॥

కారు స్వతంత్రులు కడపట నొకరును
యీరీతి నొఁగాము లిఁక నేలా
శ్రీరమణీపతి శ్రీవేంకటేశుఁడే
కారణము శరణాగతియే ఘనము ॥ ఒక ॥ 584

సాళంగనాట

వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడై నవిష్ణుని నెఱఁగరా ॥ పల్లవి ॥

తోలె నదె గరుడనిఁ దొడఁగి బాణునిమీఁద
వాలెను కంసునిమీఁద వడి నెగసి
కేలుచాఁచి చక్రమునఁ గెడపె శిశుపాలునీ
వేలుపుల రాయఁడై నవిష్ణుని నెఱఁగరా. ॥ వేద ॥

తొక్కెను బలీంద్రునిఁ దొల్లి పాతాళానఁ గుంగ
మొక్కలాన జలధమ్ము మొనకుఁ దెచ్చె
పక్కన బ్రహ్మాండము పగులించెఁ బెనువేల
వెక్కసపుదైవమైనవిష్ణుని నెఱఁగరా ॥ వేద ॥

భేదించె రావణాదిభీకరదైత్యులనెల్ల
నాదించె శంఖమున నున్నతజయము
సేదదేర నిపుడును శ్రీవేంకటాద్రిమీఁద
వీధి వీధి మెరసేటివిష్ణుని నెఱఁగరా. ॥ వేద ॥ 585

రేకు 298 లలిత

ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేఱు గుడిచి కాలువ పొగడుట ॥ పల్లవి ॥

హరిపాదమువనే యడఁగె లోకములెల్ల
హరినాభినే పొడమి రదివో బ్రహ్మాదులు
హరినామము వేదాల కాదియు నంత్యము నాయ
హరిదాసులే వశిష్ఠాదు లిందరును. ॥ ఈత ॥

విష్ణుఁడే యమృత మిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె
విష్ణువాజ్ఞ నడచేది విశ్వమింతాను
విష్ణుచక్రమున దైత్యవీరులెల్లా నడఁగిరి
విష్ణువుముఖమునందే విప్రులు జనించిరి. ॥ ఈత ॥

పరమపుశ్రీపతివే భారతరామాయణాలు
పరమాత్ముఁ డితఁడే పలుజీవులయందెల్లా
పరము చేచేతఁ జూపె పట్టి శ్రీవేంకటేశుఁడు
పరమానంద మొసఁగు భక్తులకు నితఁడు. ॥ ఈత ॥ 586

శుద్ధవసంతం

నిండినజగములెల్లా నీయాధీనము
బండుజన్మములవాఁడ భయమేమి నెరఁగ ॥ పల్లవి ॥

పాతకపుదేహమిది ప్రకృతియాధీనము
ఆతుమ శ్రీహరి నీయాధీనము
యీతల నాతల నే నెవ్వరి నేమనలేను
చేతనుఁడ నింతే నేను చిక్కినవేమెఱఁగ. ॥నిండి॥

వెలయునాకర్మము నీవేదశాస్త్రాధీనము
నిలిచినజ్ఞానమెల్లా నీయాధీనము
తలఁచి యెవ్వరి నేఁ దగుఁ దగదనలేను
కొలఁదిజీవుఁడనింతే కొనమొద లెఱఁగ ॥ నిండి ॥

అక్కడ నామనసిక నాచార్యాధీనము
నిక్కపునామోక్షము నీయాధీనము
యెక్కువ శ్రీవేంకటేశ యెవ్వరి నేమనలేను
పక్కన నీబంటునింతే పరచింత లెఱఁగ. ॥ నిండి ॥ 5౮7

రామక్రియ

ఏమి సేయఁగలఁడు తా నీజగమెల్లాను
కోమలపుదేహి కొక్కకోకే కలది. ॥ పల్లవి ॥

మించినకోరిక లివి మిన్నులపొడవులు
కొంచపుదేహము దనకొలఁది గాదు
యెంచరానిసిరు లవి యెన్ని గలిగినా
కంచములోనికూడే కలిగినది. ॥ ఏమి ॥

గోరపడి గడించేవి కోట్లకొలఁదులు
తారి తూరి నోటికిఁ దగ్గంత గాదు
యేరువరచి యింతుల నెందరిఁ బెండ్లాడినాను
కూరిమి నతి యొకతె కూటమికిఁ గలది. ॥ఏమి॥

తలఁచి మొక్కేసురలు తలవెంట్రుకలందరు
యిలఁ దన బతుకెంతో యెరఁగరాదు
చెలఁగి రక్షించేవాఁడు శ్రీవేంకటేశుఁ డొకఁడే
కల దంతరంగమునఁ గైవల్యమే కలది. ॥ఏమి॥ 538

లలిత

వీరు వారనేటి వింతేల
శ్రీరమణునికృప సిద్ధముగాక ॥పల్లవి॥

యెక్కడిపాపము యెక్కడిపుణ్యము
దక్కిన శ్రీపతిదాసునికి
పక్కన లోహముఁ బరుసము దాఁకిన
యెక్కువ నంతా హేమమేకాదా ॥వీరు॥

యేది హీనము యేది యధికము
పాదుగ నడచుప్రపన్నునికి
మేదినిఁ దేమెలుఁతఁ బెండ్లాడిన
సాదించ నేలికసానేకాదా. ॥వీరు॥

యేడ నింద లిఁక నేడ సంస్తుతులు
జాడల శ్రీవైష్ణవునికిని
యీడనే శ్రీవేంకటేశుఁ డాత్మయట
యీడులేనియతఁ డెక్కుడేకాదా. ॥వీరు॥ 539

రామక్రియ

నేనా గెలువ లేను నీమాయ
 శ్రీనాథ నీవు సేసేచేఁతలే నీమాయ ॥పల్లవి॥

తమకము గడు రేఁచు తలఁపు ఉబ్బించు తలఁచు
 నిమిష మూరకుండదు నీమాయ
 తిమిరము బుద్ధిఁ గప్పు తెలివల వెంటఁ దిప్పు
 అమరి తోడునీడ ఆయఁబో నీమాయ. ॥నేనా॥

పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులుసేసు
 నిట్టి(ట్ట?) పిడిఁ బోనీదు నీమాయ
 కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు
 మట్టుతే దింతింతని మరియు నీమాయ. ॥ నేనా ॥

పలులంపటాల ముంచు భావజుచే భ్రమయించు
 నిలిచినచోటనెల్లా నీమాయ
 యెలమి శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
 మలసి సొలసి నన్ను మన్నించె నీమాయ ॥నేనా॥ 540

సామవరాళి

తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే
 మనసులోనే కలుగు మహామహిమ. ॥పల్లవి॥

కనురెప్ప మూసితేనే కడ దాఁగె జగమెల్ల
 కనుదెరచినంతనే కలిగెఁ దాను
 ననిచివుండుట లేదు నమ్మకపోవుట లేదు
 తనతోడిదే యిన్నిఁ దాఁ గలితేఁ గలవు. ॥తనుఁ॥

కడుపు నిండినంతనే కైపాయ రుచులెల్లా
  చెడిదపుటాఁకలై తేఁ బ్రియమాయను
  యెడనెడఁ దేఁదుగాదు యింతలోనే తీపు గాదు
  వొడలితోడిదే యిది వుండినట్టే వుండును ॥తను॥

అద్దములోఁ దననీడ అంతటా మెరసినట్లు
  పొద్దు వొద్దు తనతోనే భోగాలెల్లా
  అద్దిన శ్రీవేంకటేశుఁ డంతరాత్మయైనవాఁడు
  కొద్ది లేదాతనిమాయ కొనసాగుచుండును. ॥తను॥ 541

రేకు 294 శంకరాభరణం

చవిచేసుక యిటు జరగెదము
  జవదాఁటకురో సంసారులార. ॥పల్లవి॥

యెదిచూచినా నెరవెరవే
  పోదిఁ గూడఁగా పొదపింతే
  ఆదికినాది హరి యొకఁడే
  పాదుగఁ బుట్టెడిభవములె వేరు ॥చవి॥

కలుములు లేములు కతలింతే
  నిలుకడగలచో నిజమౌను
  యిలయును జగమును యిదే యిదే
  తెలిసి చూడఁగా దినములే ఘనము. ॥చవి॥

చెంతల నిందరు జీవులే
  బంతులఁ బుణ్యముఁ బాపమునె
  యింతట శ్రీవేంకటేశ్వరుఁడే
  కాంతలుఁ బురుషులగతులై నిలిచె. ॥చవి॥ 542

### భూపాళం

హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నా మోము తప్పకిటు చూడు. ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడి నాడను
చాలు నిఁక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు-
వేళాయ నాతండ్రి వేగ లేవే. ॥హరి॥

కను దెరవు నాతండ్రి కమలాప్తుఁ డుదయించె
వనిత ౧ మొకమజ్జనము వడిఁ దెచ్చెను
మొనసి మీతండ్రి యిదె ముద్దాడఁ జెలఁగీని
దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే. ॥హరి॥

లేవె నాతండ్రి నీలీలలటు వొగడేరు
శ్రీవేంకటాద్రిపతి శ్రీరమణుఁడా
దేవతలు మునులుఁ జెందిననారదాదులు
ఆవలనుఁ బాడేరు ఆకసమునందు. ॥హరి॥ 548

### లలిత

విశ్వాత్మ నీకంటె వేరేమియునుఁ గాన
ఐశ్వర్యమెల్ల నీయతివచందములే. ॥పల్లవి॥

కలవు మతములు పెక్కు కర్మభేదములగుచు
కలవెల్ల నీయందె కల్పితములే
కలరు దేవతలు బహుగతులమహిమల మెరయు
అలరి వారెల్ల నీ యంగభేదములే. ॥విశ్వా॥

౧. మొకమజ్జనము=ముఖముకడుగుట.

ఘనమంత్రములు పెక్కు గలవు వరముల నొసఁగు
నని చి యవియెల్ల నీనామంబులే
పెనగొన్న జంతువులు పెక్కులెన్నె గలవు
పనిగొన్న నీదాసపరికరములే ॥విశ్వా॥

యెందును దగులువడ కేకరూపని నిన్ను
నందువఁ గొలుచువాఁడే ఘనపుణ్యుఁడు
అందపు శ్రీవేంకటాద్రీశ అన్నిటా—
నందినపొందినవెల్లా హరి నీయనుమతే. ॥విశ్వా॥ 544

సామంతం

ఇహపరములకును యిది సుఖము
సహజావస్థే జరగేటిసుఖము. ॥పల్లవి॥

శ్రీరమణుఁడే చింతాయకుఁడని
వూరక వుండుట వొకసుఖము
కోరకుండఁగా గూడినయర్థము
ఆరయఁ గైకొను టది సుఖము ॥ఇహ॥

వసముగానిపని వడిఁ దలకెత్తుక
అసురుసురుగాని దది సుఖము
౧యెసరెత్తుక లేక్లేవని తొలక
పసఁ దనవిధిఁ గలవాలే సుఖము. ॥ఇహ॥

పెక్కు చంచలము పెనచుక తిరుగక
వొక్క సుఖంబొ టురుసుఖము
యెక్కువ శ్రీవేంకటేశ్వరు శరణని
నిక్కితిమిదె మానిజమే సుఖము ॥ఇహ॥ 545

౧ ఈమూడవపాదము సుఘటితార్థము కాదు.

లలిత

వింటిమి నీకతలు కంటిమి నీమాయలు
బంటుల మచ్యుత నీపాలివారమయ్యా ॥పల్లవి॥

కలిగిరి నీవల్లనే కడఁగి బ్రహ్మాదులు
నిలిచిరి సురలెల్లా నీవల్లనే
తెలిసిరి మునులెల్లా దేవుఁడవు నీవేయని
చలపట్టి హరి నీకు శరణనేమయ్యా. ॥వింటి॥

నుతియించీ వేదములు నోరార నీమహిమ
గతి యాయ వైకుంఠమే ఘనులకెల్లా
ప్రతిలేనినీరూపే భావించేరు యోగీంద్రులు
తతితో శ్రీపతి నీకే దాసులమయ్యా. ॥వింటి॥

ఆదె నీచక్రముచేత నడఁగి రసురలెల్లా
బదికిరి విప్రులు నీపాదసేవను
మొదలి శ్రీవేంకటేశ పొంది నీకరుణచేత
మొదల వెనక నీకే మొక్కేమయ్యా. ॥వింటి॥ 546

గుండక్రియ

ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి
తొట్టినవాబ్రదుకుకుఁ దుదయు లేదు ॥పల్లవి॥

నాని యీజన్మమెత్తి నాటివెల్లా మఱచితి
పూని యేమిటా విరతి పుట్టనేరదు
కానను ముందరవచ్చేఘనకర్మపాశములు
౧పానివట్టి(?) యించుకంతా భయమూలేదు. ॥ఎట్టొ॥

౧. 'పూనివట్టి' కి వ్యావహారికరూపము కావచ్చు

పంచేంద్రియములఁ జిక్కి భావమెల్లాఁ జిక్కువడె
అంచెల మోహముతోవ అరయ లేను
యెంచి నాదేహములోనిహేయమును సాత్మించె
చంచలపుదుర్గుణాలు చక్కనైనాఁ గావు. ॥ఎట్టొ॥

నగుసంపదలచేత నన్ను నేనే మరచితి
౧తెగువది వివేకించఁ దీర దెప్పుడు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
జగమెల్లా నెరఁగ నే సాత్వికుఁడనైతి. ॥ఎట్టొ॥ 547

రేకు 295 తెలుఁగుకాంబోది

ఇందునే తుదిపద మెక్కి రిందరును
మందరధర నీమహిమిదివో ॥పల్లవి॥

మరిగినపుణ్యులమతిలో కోరిక
పరమపుహరి నీపాదములు
గరిమ గోపికలు గావలెనన్నది
హరి నీసంభోగ మదియేపో. ॥ఇందు॥

పొంచి వేదములు పొగడెడియర్థము
అంచెల గుణకథ లవి నీవి
పంచి యజ్ఞములఫలమై యున్నవి
నించి దేవ నీ నిజపూజలెపో. ॥ఇందు॥

కైవల్యమునకుఁ గడుఁ దెరువై నది
ఆవల నీశరణాగతియే
శ్రీవేంకటేశ్వర చెప్పె మాగురుఁడు
మావద్ద నిదె నీ మంత్రమెపో. ॥ఇందు॥ 548

౧. 'తెగువడి' పూ. మ పా

సామంతం

గోవిందుదాసులమై కొనకెక్కుదుముగాక
వేవేలువిధుల నమ్మి వెతఁబడఁగలమా ॥పల్లవి॥

మనసులోపలిమామర్మము దెలియలేము
ఘనుఁడైనహరి నెట్టు గానఁగలము
తనువుతో భోగాలు తగులు వీడగలేము
వెనకకర్మపాశాలు వీడించుకోఁగలమా ॥గోవిం॥

పడిఁబెట్టేయింద్రియాల వద్దని మానుపలేము
తోడరి సంసారము తోయఁగలమా
బడిబడి నానాటిబతుకు చెప్పుకోలేము
పొడలేటియితరుల బోధించఁగలమా ॥గోవిం॥

కొంకక ఆడినమాట గురుతువెట్టఁగలేము
లంకె వేదవాక్యము దలఁచఁగలమా
యింకా శ్రీవేంకటేశుఁ డితఁడే మాదేవుఁడని
సంకెలేకుందుముగాక జాలిఁబడఁగలమా. ॥గోవిం॥ 549

బౌళి

పుట్టుగులు వొక్కటే పుణ్యపాపములే వేరు
యెట్టుసేసినాఁ జేసీ నేమి సేయవచ్చును ॥పల్లవి॥

పగలే రేయి యీలడిఁ గొన్నిజీవులకు
వొగి నా రేయి పగలౌ నొకరికిని
తగుదైవ మొకఁడే తమమతములే వేరు
పగటుల విష్ణుమాయ భ్రమయించీ నిదివో. ॥పుట్టు॥

నిలువెల్లాఁ జేఁదే నెరిఁ గొన్నివృతములు
కలదెల్లఁ దీపే కమ్మరఁ గొన్ని
తలఁపును నొకటే తత్వములే వేరువేరు
చెలరేఁగి విష్ణుమాయ చిక్కువెట్టీ నిదివో ॥పుట్టు॥

ఇహమే పరము యెరిఁగితేఁ గొందరికి
మహిఁ బరమే ఇహము మరొకరికి
వహితో శ్రీవేంకటేశు వలెనని కొలిచితే
సహజపువిష్ణుమాయ జారిపోవు నపుడే ॥పుట్టు॥ ౫౫౦

కన్నడగౌళ

దైవమా నీవే యిందు దయ దలఁచుటగాక
తోవనున్నజీవు లెట్లు తోసేరు నీమాయ ॥పల్లవి॥

౧ పలుచవులందునెల్ల బ్రాణమే మిక్కిలి చవి
బలిమి తీపులలోనఁ బ్రాణమే తీపు
యిలపైఁ బూజ్యులలోన నింతులే కడుఁబూజ్యులు
తలఁచి జీవులు యెట్లు దాఁటేరు నీమాయ ॥దైవ॥

తగుచుట్టరికాలలో ధనమే చుట్టరికము
జగతిఁ గట్టనికట్టు సంసారము
వగలైనగుణాలలో వైరమే నిజగుణము
జిగిఁ బ్రాణు లెట్లు గెలిచేరు నీమాయ. ॥దైవ॥

తమలో నెవ్వరికైనా తమజాతి తమనేర్పు
తమకు నెక్కుడై తోఁచు తక్కువనరు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులకే కాని
భ్రమసినజీవులెల్లాఁ బాయరు నీమాయ ॥దైవ॥ ౫౫౧

౧. 'పలుచదువు' పూ. ము. పా.

లలిత

తెలిసినవారి కింతా దేవుఁడై యుండు
కలఁడన్నచోట హరి గలఁ డటుగాన. ॥ పల్లవి ॥

అందు నిందుఁ బోయి శ్రీహరిని వెదకనేల
బొందితోడిరూపులెల్లాఁ బోరి నతఁడే
కొందరిలో నుండి ఇచ్చుఁ గోరినట్టియీవులెల్ల
కొందరిలో మాటలాడుఁ గొందరిలో నగును. ॥ తెలి ॥

లోన వెలిఁ జూచి పరలోకము వెదకనేల
యేనెలవైన వైకుంఠ మెదుట నదె
పూని వోళచోట నెండ పొడచూపు నక్కడనే
నానినవెన్నెల గాను నానారీతులౌను ॥ తెలి ॥

చొక్కి చొక్కి యానందసుఖము వెదకనేల
మక్కువఁ దా శాంతుఁడైతే మతిలో నదె
యెక్కువతో శ్రీవేంకటేశ్వరుదాసుఁడ నైతి
వొక్కఁడే మాకిన్నిటికిఁ నొడయఁడై నిలిచె. ॥తెలి॥ 552

భవుళి

ఇంక మాబోంట్ల కేది విధో
కింకరులమనియెడిగెలుపే కాక ॥ పల్లవి ॥

యెవ్వరు గడచిరి యింతకతొలుతను
నివ్వటిల్లు హరి నీమాయ
నవ్వుచు నీశరణాగతి నమ్మిన
మువ్వంక శుకాదిమునులే కాక. ॥ ఇంక ॥

కన్నవారెవ్వరు ఘనవైకుంఠము
    వున్నతమగునీవురుమహిమ
మున్ను నిపుడు నీ ముద్రలు మోచిన
    అన్నిటా ఘనసనకాదులుగాక. ॥ఇంక॥

తెలియువారెవ్వరు దివ్యజ్ఞానము
    చలనముగాఁ జెప్పుశాస్త్రములు
యిలలో శ్రీవేంకటేశ నీ వారై
    చెలఁగిరి శేషాదిజీవులుగాక. ॥ఇంక॥ 553

రేకు 298 సాళంగనాట

ఎందరు గలిగిన నితనిలోనే
    ముందు వెనకలను ముఖ్యం బితఁడే. ॥పల్లవి॥

భవవిదూరుఁ డాపద్బంధుఁడు హరి
    వివరించి కొలువ వేల్పితఁడు
కవతో లక్ష్మీకాంతుఁ డితఁడు
    రవిశశినేత్రుఁడు రక్షకుఁడు. ॥ఎంద॥

కలిదోషహరుఁడు కారుణ్యనిలయుఁడు
    వలెననువారికి వరదుఁడు
తలఁపులోనఁగలతత్వం బితఁడు
    సులభుఁ డితఁ డరసిచూచినను ॥ఎంద॥

శ్రీవేంకటేశుఁడు చిత్తజగురుఁడు
    యేవలఁజూచిన నితఁడే
గోవిందుఁ డితనిఁ గొలిచితిమిదివో
    తోవయుఁ గంటిమి తుదకెక్కితిమి. ॥ఎంద॥ 554

శుద్ధవసంతం

కనుఁగొననిది హరికల్పితము
తనకు నిందులోఁ దగినంతే. ॥ పల్లవి ॥

నానాభేదములు నరులగుణంబులు
నానారుచు లివి నవపదార్థములు
ఔ ననేదేది యటు గాదనేదేది
వానివానివిధి వలసినయట్టు. ॥ కనుఁ ॥

నడచుఁ బ్రపంచము నడపేవిధముల
నడచు మాయ లెన్నఁగరావు
విడిచేటి వేఁటివి విడువని వేఁటివి
పడఁగఁబడఁగ నవి పరచినయట్లు. ॥ కనుఁ ॥

తెగనికర్మములు దేహధర్మములు
తెగనియాస లివె దినదినము
తగు శ్రీవేంకటదైవము దాసులు
నగుదు రిన్నిటిని నటనలు చూచి. ॥ కనుఁ ॥ 555

వరాళి

అరిగాఁపులము నేము అంతర్యామివి నీకు (వు?)
యిరవై నీచెప్పినట్టు యేమిసేతుమయ్యా. ॥ పల్లవి ॥

గాలి ౧ ముడిగట్టినట్టు కాయముమోచితిమి
కాలముగొలచితిమి కనురెప్పల
జాలి రొప్పితిమి వట్టిసటలనే యేపొద్దు
యేల మెచ్చ వింకాను యేమిసేతుమయ్యా. ॥ అరి ॥

౧ 'ముడె' రేకు.

చుక్కలు లెక్కించినట్టు చూడఁగ మాజన్మములు
పుక్కునఁ గర్మములకు నొడిగట్టితి (మి?)
తెక్కులను వెంట వెంటఁ దిరిగేము బంట్లమై
యెక్కువాయ వెట్టి మాకు నేమిసేతుమయ్యా ॥అరి॥

పాలు ౧ వొంగినటువలెఁ బాయము మోచితిమి
నాలుక కెక్కినవెల్లా నమలితిమి
యీలీల శ్రీవేంకటేశ ఇంత సేసితివి
యేలినవాఁడవు ఇంకా నేమిసేతుమయ్యా. ॥అరి॥ 556

శంకరాభరణం

మిగిలిన దే మిఁక మీఁదట దేహికి
అగపడు నొక పడెఁ డన్నంబు ॥పల్లవి॥

రతిఁ బగటివెలుఁగు రాత్రిచీఁకటికి
సతము గాదు అది సరికి సరి
అతిభోగములకు నార్జించుటకును
చతురవుసంపద సరికి సరి ॥మిగి॥

అలయపథ్యమున నౌషధము గొనుట
చలువకు వేఁడికి సరికి సరి
నిలిచినపుణ్యము నిండుఁ బాపములు
తలువు వెలువులకు సరికి సరి. ॥మిగి॥

మహి మరణములకు మరి పుట్టుగులకు
సహజ మందరికి సరికి సరి
యిహమున శ్రీవేంకటేశ్వరుఁ డాత్మకు
సహకారి యతఁడు సరికి సరి. ॥మిగి॥ 557

౧. 'వొఁగి' రేకు

మాళవి

తెలుపఁగరానిది దేవునిమాయలు
ఫల మెఱుఁగరు యీ పట్టినవెట్టి. ॥పల్లవి॥

పుట్టిరి దివిజులు పురుషోత్తమునం-
దట్టే యణఁగిరి యతనందు
యిట్టె యీతని యిందరితో సరి-
వెట్టి కొలుచుటే వెనువెట్టి. ॥తెలు॥

హరివరముననే యందరు బదికిరి
పరులవరము గని బడలిరి యసురలు
యిరవెఱఁగితని నిందరిలోపల
సరిగా మొక్కుట సహజపువెట్టి. ॥తెలు॥

జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడు
యేవల శ్రీలక్ష్మి యీతని దేవులు
వేవేలు సిరులు వీరె యొసఁగిరని
భావించువారికిఁ బట్టదు వెట్టి. ॥తెలు॥ 558

ముఖారి

కలలోన నిట్లనే కాఁపురము నిట్లనే
నిలువు గల్లందమో నిజమందమో. ॥పల్లవి॥

వొక్కనాటిప్రపంచము వొక్కనాటివలె రాదు
వొక్కనిమిషమువలె నొకటి గాదు
పక్కన మాయమై పోపు బడిబడినే వచ్చు
నెక్కొని కల్లందమో నిజమందమో. ॥కల॥

పొద్దు వొడచేది గొంత పొద్దు గూఁకేది గొంత
చద్ది గొంత వేఁడి గొంత చవులు గొంత
వొద్దనే కాలము నుండు వుండుండీ దవ్వయిపోవు
నిద్దపుఁగల్లందమో నిజమందమో. ॥కల॥

పావపుణ్యా లంటెనంటాఁ బాయవు సుఖదుఃఖాలు
పైపై ననుభవించఁ బరసిపోవు
యేపొద్దు శ్రీవేంకటేశుఁ డెదలోనే వున్నాఁడు
యేపునఁ గల్లందమో యిది నిజమందమో. ॥కల॥ 559

రేకు 297 నారాయణి

ఏఁటివిచారము యెక్కడి యాచారము
మాటున జీవుఁ డింతేసి మాయలఁ బొరలును ॥పల్లవి॥

పరగ నూరేండ్లబ్రతుకునకేకా
ధర నన్నియునుఁ గూర్చి దాఁచుకొనేది
పొరసి నానాసుఖభోగాలు చింతించుఁగాని
పరమున కిపాటిప్రయాస పడఁడు ॥ఏఁటి॥

కడుపు నించుకొరకుఁ గామసుఖమునకేకా
చెడనివుద్యోగాలు సేయఁగోరును
మిడిసి లోకములెల్ల మెప్పించ నడచుఁగాని
చిడుముడి హరి మెప్పించే ననలేఁడు. ॥ఏఁటి॥

సారె సారెఁ బుట్టి చచ్చి జననము వొందేదెల్లా
వూరఁగలకర్మము లొగిఁ జేయుట
మేరలేక నరులను మెచ్చుగఁ గొలుచుఁగాని
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలువఁగలేఁడు. ॥ ఏఁటి ॥ 560

దేసాళి

భావములోనా బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువవో మనసా. ॥పల్లవి॥

హరియవతారములే యఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామములే అన్నిమంత్రములు
హరి హరి హరి యనవో మనసా ॥భావ॥

విష్ణునిమహిమలే విహితకర్మములు
విష్ణునిఁ బొగడీ వేదములు
విష్ణుఁ డొక్కఁడే విశ్వాంతరాత్ముఁడు
విష్ణు విష్ణువని వెదకవో మనసా ॥భావ॥

అచ్యుతుఁ డితఁడే ఆదియు నంత్యము
అచ్యుతుఁడే యసురాంతకుఁడు
అచ్యుతుఁడు శ్రీవేంకటాద్రిమీఁద నిదె
అచ్యుత యచ్యుత శరణనవో మనసా ॥భావ॥ 581

గుండక్రియ

అంతయు నతనిమహామహిమే అతఁ-
డెంత సేసినా నెట్టయిన నవును. ॥పల్లవి॥

రావలెనన్నవి రాక మానవు
పోవలె నన్నవి పోకుండవు
ఆవలీవల వలమటలేఁటికి
దైవమొక్కఁడే తగిలినగుఱుతు. ॥అంత॥

కాయపుగుణములు కలిగినవే భువి-
నీయెడ జీవుఁడు యిటు గలఁడే
ఆయమిందుఁ గా దవునన నెవ్వరు
కాయజగురుఁ డొక్కఁడే ప్రేరకుఁడు ॥అంత॥

అంతరంగమే యాత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడమాయ
చింతించి రక్షించ శ్రీవేంకటేశుఁడు
మంతుకెక్కె నిఁక మతకములేల. ॥అంత॥ 562

సాళంగం

ఒక్కఁడే దైవం బున్నతుఁ డితఁడు
తక్కినతలఁపులు తప్పుఁదెరువులు. ॥పల్లవి॥

పురుషులకెల్లాఁ బురుషోత్తముఁడు
సురేంద్రాదులకు సురేంద్రుఁడు
హరునికి నజునికి నవ్వలిమూరితి
హరి యతఁడే పరమాత్ముఁడు. ॥ఒక్కఁ॥

వేదాంతంబుల వేద్యుఁ డితఁడు
ఆదికినాదియునన నితఁడే
మేదిని నరులకు మేదినీశ్వరుఁడు
యేదెసఁ జూచిన నీశ్వరుఁ డితఁడే. ॥ఒక్కఁ॥

యెక్కువలకెల్ల నెక్కువ యీతఁడు
మక్కువ మరునికి మరుఁ డితఁడు
యిక్కడ శ్రీవేంకటేశుఁడై మిగుల
పక్కన నిదివో ప్రత్యక్ష మితఁడు ॥ఒక్కఁ॥ 563

శ్రీరాగం

ఓహో నిలిచిన దొకటిదియే
శ్రీహరిసాకారచింతనము ॥పల్లవి॥

పంచమగవేదపుపద్మాక్షునామము
అంచెఁ బాపహార మౌషధము
పంచలఁ బీతాంబరుశరణాగతి
ముంచినయజ్ఞానమునకు దీపము ॥ఓహో॥

విందులకుడుపులు విష్ణుకీర్తనము
చందపువైకుంఠ(ము?) సంబళము
పొందుగ నచ్యుతుఁబూజించుపూజలు
కిందటఁ గొనకెక్కెడినిచ్చెనలు ॥ఓహో॥

కట్టినముడుపగు ఘనకృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము
యిట్టె శ్రీవేంకటేశ్వరుకృప యిది
పట్టినవారికి బలువగుసొమ్ము(మ్మ?). ॥ఓహో॥ 584

శంకరాభరణం

వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియుఁ దీర్చదు యిది నీమాయ. ॥పల్లవి॥

నీవల్ల బ్రదికిరి నిండుదేవతలు
నీవల్ల నసురలు నెఱిఁజెడిరి
ఆవల నిందరి కాత్మవు నీవే
చేవదేర నీచిక్కులే భువిని. ॥వేద॥

౧. 'వేదము' కావచ్చు.

నెమ్మిఁ బాండవుల నీవారంటివి
కమ్మర విడిచితి కౌరవుల
యిమ్ముల నీవావి యిద్దరికొకచే
తెమ్మలాయ నీతీరనిచిక్కు. ॥ వేద ॥

జగమున నీదే స్వతంత్రమెల్లా
నెగడినజీవులు నీవారు
తగు శ్రీవేంకటదయివమ యిన్నియు
తెగి నీదాసులు తెలిసినచిక్కు ॥వేద॥ 565

రేకు 298 దేవగాంధార

మాయామోహము మానదిది
శ్రీయచ్యుత నీచిత్తమే కలది ॥ పల్లవి ॥

యెంతవెలుఁగునకు నంతేచీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధ మపథ్యమును సరి
వింతే మిగిలెను వేసటే కలది ॥ మాయా ॥

చేసినకూలికి జీతమునకు సరి
పూసినకర్మభోగము సరి
వాసులజన్మము వడి మరణము సరి
ఆసల మిగిలిన దలపే కలది. ॥ మాయా ॥

మొలచినదేహము ముదియుటకును సరి
తలఁచినదైవము తనలోను
యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ—
గలిగినమాకెల్ల ఘనతే కలది. ॥మాయా॥ 566

సాళంగనాట

చేకొని కొలువరో శ్రీనరసింహము
శ్రీకరమగు నిదె శ్రీనరసింహము ॥ పల్లవి ॥

వెడలేటివూర్పుల వేఁడిమి చల్లి
చిడుముడికోపపు శ్రీనరసింహము
గడగడవడఁకేటిగండస్థలములు
౧ వెడలు గదలిచీ శ్రీనరసింహము ॥ చేకొ ॥

వంకరగోళ్లవైపులు వెదకీ
చింకచూపులను శ్రీనరసింహము
హుంకారంబుల నుదధులు గలఁచీ-
నంకెల శ్రీపతియగు నరసింహము ॥ చేకొ ॥

వదనము దిప్పుచు వడి నసురమేను
౨ చిద్రుపలు చేసెను శ్రీనరసింహము
అదివో శ్రీవేంకటాద్రి యెక్కి యిటు
చెదరక నిలిచెను శ్రీనరసింహము. ॥ చేకొ ॥ 567

వరాళి

అతనిలోనే యణఁగె నన్నియును
కతలెన్నైనాఁ గలవు కమలాక్షుఁ గనరో ॥ పల్లవి ॥

యిసుక లెక్కవెట్టితే నెంతైనాఁ గలదు
ఆసముదించనిపుణ్యా లటువంటివే
వసగానిపెక్కుదేవతలఁ గొలుచుకంటే
నుసరాన హరివారై సుఖయించరో. ॥ అత ॥

౧. 'వెడలు' వ్యావహారికము యతి. ౨. 'చిద్రుపలు' రేకు.

గోడ గడుగఁగఁ బోతేఁ గొనదాఁకా రొంపే
ఆడుకోలుతర్కవాదా లటువంటివే
వాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివాఁడై యీడేరరో ॥అత॥

మనసునఁ జాలు దాఁగితే మట్టు లేదు మేర లేదు
అనుగుసంసారభోగా లటువంటివే
దినదినతపములఁ దీదీపులవుకంటే
తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో ॥అత॥ 568

సౌరాష్ట్రం

మరల విచారించితే మంచముకిందే నుయ్యి
తిరుల హరిహరై రి [illegible]వాదులు ॥పల్లవి॥

ఆడేటిమాటలకెల్ల నాది నంతము లేదు
పీడనికర్మములకు విధి లేదు
తాడువడ్డమనసుకు దైవము విష్ణుఁడేయని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు ॥మర॥

పుట్టపదేజన్మముల కూరట యెందూ లేదు
౧కట్టడి ఇంద్రియాలకు గతి లేదు
తట్టువడ్డజీవునికి దైవము శ్రీహరియని
యిట్టె మొరయిడిరి యింద్రాదులు. ॥మ

కప్పినయీమాయలకు కడవ రెండూ లేదు
తిప్పనిహరిభక్తికిఁ దిరుగు లేదు
చొప్పుగా శ్రీవేంకటేశుఁ డొక్కఁడే దైవమని
చొప్పువట్టి కొలిచిరి శుకాదులు. ॥మ

౧ 'కట్టిడి', రేకు. వ్యావహారికము కావచ్చు

సామవరాళి

ఏవల్ల నొఁగాము * లిఁక నేవి అన్నియు నీలోనే
శ్రీవల్లభుఁడ నిన్నుఁ జేటితిమి నేము ॥ పల్లవి ॥

సగుణనిర్గుణములును సావయవనిరవయవ-
మగుఁదర్కవాదకలహములు ఘనము
జగములో చదువులును సంశయంబేకాని
తెగనీదు నీమాయ తెలియవసమా ॥ ఏవ ॥

వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత
పోదిమతములవారిపోరు ఘనము
పాదైనమునిరుషులు బహుముఖములేకాని
సోదించి వొకమాట చూపంగలేరు ॥ ఏవ ॥

వెనఁ గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక
వసగావు రెంటిబలవంతములును
వసుధ శ్రీవేంకటేశ్వర నీవు గావు మిఁక
ముసుఁగువెట్టినవాదు ముగియదెంతైనా. ॥ ఏవ ॥ 570

బౌళి

సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ నా-
పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి. ॥ పల్లవి ॥

వేగిలేచి నేఁ జేసేవెడచేఁత నీ చేఁతే
ఆగడపుమాటాడిన వది నీ మాటే
ఆగము భోగములు నా యన్నపానాదులు మరి
శ్రీగురుఁడ నాలోని చింతయు నీ చింతే ॥ సర్వా ॥

* "లి(కనేవిఅ) న్నియు" పూ ము పా తాళము చెడునసుభయముతో (కనెవి అ) అక్షరములు చివ్వగుర్తులో ఉంచిరేమో?

కోపము శాంతములును గుణావగుణము నా—
రూపును నీ సాకారరూపమే
పాపపుణ్యములు నా ప్రాణవాయువులును
శ్రీపతి నా సంసారసేవయు నీసేవే. ॥సర్వా॥

ఉదయాస్తమపుదినా లున్నాఁడ నీ దినములే(?)
యెదురు నేను నీ వాఁడ నింతా నీదె
అదివో శ్రీవేంకటేశ అంతరియామివి నీవే
నిదుర మేల్కొనుటయు నీ మహిమే. ॥సర్వా॥ 571

రేకు 299 శంకరాభరణం

తన చిత్తముకొలఁది తమకించ నేఁకనేల
మనసువచ్చినప్పుడే మన్నించీఁగాక. ॥పల్లవి॥

కొండలందు నదులందుఁ గోరి యాకసాన భువి
నిండియున్నాఁడు తొలుతే నీలవర్ణుఁడు
అండనే నాయందు లోకులందు నుండుటరుదా
గండికాఁడై తనమాయ గాననీఁడుగాక. ॥తన॥

గాలియై పంచమ(హా?)వాద్యగతులై శబ్దములై
ఆలకించి పలికీని యాదిమూరితి
నాలుకకొనవనే వుండి నానాభాషలాడీని
కాలముతో నెదిరికిఁ గాననీఁడుగాక. ॥తన॥

వేదమందు శాస్త్రమందు వేవేలువాదములందు
పాదుకొని బోధించీఁ బరమాత్ముఁడు
యీదెసనే శ్రీవేంకటేశుఁడై పొడచూపె
గాదిలితనదాసులఁ గరుణించీఁగాక. ॥తన॥ 572

లలిత

శ్రీపతి యొకఁడే ౧శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది ॥ పల్లవి ॥

ఆసలు మిగులా నాతుమ నున్నవి
యీసులేనిసుఖ మెక్కడిది
చేసినపాపము చేతుల నున్నది
మోసపోనిగతి ముందర నేది ॥ శ్రీప ॥

కోపము గొందుల గుణముల నున్నది
యేపున నిజసుఖ మిఁక నేది
దీపనాగ్నితోఁ దిరిగేటిదేహము
పైపై విరతికిఁ బట్టేది ॥ శ్రీప ॥

పంచేంద్రియములపాలిటిబదు కిది
యించుక నిలుకడ కెడ యేది
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుఁ డొకఁడే
పంచినవిధులను పాలించుఁగాక. ॥ శ్రీప ॥ 578

మాళవిగౌళ

నారాయణ నీనామమహిమలకు
గోరఁ బోవుటకు గొడ్డలి దగునా. ॥ పల్లవి ॥

హరియని నొడిగిన నణఁగేటిపాపము
సిరుల నేను నుతిసేయఁగఁగలనా
పరగినపిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకొని పూరకె తొడిగినయట్లు. ॥ నారా ॥

---

వ్యావహారికముగ "శరణము" అనియుఁ? లేకున్న యతిభంగము.

అచ్యుతయనఁగా నందెటిసంపద
యిచ్చల నెంచిన నిఁక గలవా
కొచ్చి కొచ్చి యొకకొండంతకనకము
వెచ్చపుఁబోఁకకు వెల యిడినట్లు. ॥నారా॥

యెదుటనే శ్రీవేంకటేశ్వర యనఁగాఁ
బొదిగెటితపముల పుణ్యము గలదా
కదిసి సముద్రము గడచి వోడలోఁ
జిదిసి యినుము దెచ్చినయట్లు ॥నారా॥ 574

లలిత

నీ వెటు దలఁచిన నిఖిలము నట్టో
యేవల స్వతంత్రమింతా నీది ॥పల్లవి॥

యేఁటిపురాకృత మెక్కఁడికర్మము
దాఁటక హరి నీదయ గలితే
నీటున నిన్నియు నీ కల్పితములు
పాటించి నీవే పాపఁగలేవా ॥నీవె॥

యెక్కడిజన్మము లెక్కడిమరణము-
లొక్కఁడవె నీవు వొద్దంటే
యెక్కువ నిందరి నేలెటివాఁడవు
యిక్కడఁ గొలిచితి మితరము లేలా. ॥నీవె॥

యేది పాపము యేది పుణ్యము
పోదిగ నీవే పొమ్మంటే
చేదో డిందుకు శ్రీవేంకటేశ్వర
ఆదెస నిమ శరణంటిమి గొంత. ॥నీవె॥ 575

రతికేలి రుక్మిణికి రంగు మోవిపగడము
మితి గోవర్ధనపుగోమేధికము
సతమై శంఖచక్రాలసందుల వైడూర్యము
గతియై మమ్ముఁగాచేటికమలాక్షుఁడు. ॥ముద్దు॥

కాళింగునితలలపైఁ గప్పినపుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రియింద్రనీలము
పాలజలనిధిలోనఁ బాయనిదివ్యరత్నము
బాలునివలెఁ దిరిగీఁ బద్మనాభుఁడు ॥ముద్దు॥ 577

౧ రేకు 800 దేసాక్షి

ఇందరు నెఱిఁగిన దీబదుకు
పొందినదాఁకా భోగించవలయు ॥పల్లవి॥

పొట్టఁబోరుగు లివె పుణ్యపాపములు
నట్టనడుమనే నాబదుకు
వెట్టిమోపువో వెడ సంసారము
ముట్టినదాఁకా మోవఁగవలెను ॥ఇంద॥

తోడునీడ యిది తొలఁగనిజన్మము
యేడకుఁ బోరాదు యీబదుకు
పీడనికట్లు వెడవెడయాసలు
వూడినదాఁకా నుండఁగవలెను ॥ఇంద॥

చేతిలో ధనము శ్రీవేంకటపతి
యీతనితోడిదె యీబదుకు
ఆతుమలోనే యలవైకుంఠము
ధాతు మాతుగని తలఁచఁగవలెను ॥ఇంద॥ 578

౧ పూర్వముద్రణసమయాని కీరేకు దొరకలేదు.

లలిత

నీవే యంతర్యామివి నీవున్న దేవైకుంఠము
    అవలఁ బరమపదమన నింకాఁ గలదా ॥ పల్లవి ॥

యిందరు జంతువులు నీవిచ్చినరూపులు మోచి
    పొందితో నీకే సెలవై పుట్టినారు
కందువ నీ ప్రపంచపుకైంకర్యములు సేసి
    అందరి జీవన్ముక్తు లదివో చాలదా ॥ నీవే ॥

యేలిక వంచినపనే యింద్రియభోగములెల్ల
    తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు
కాలము నిన్నుఁ బాయరు గర్భగోళమం దున్నారు
    యీలోకమే సాలోక్య మిది యింత చాలదా ॥ నీవే ॥

జ్ఞానము నజ్ఞాన మేది స్వామికార్యములోన
    మానక నిపనులలో మత్తులైనారు
శ్రీనాథుఁడవు నీవే శ్రీవేంకటేశ్వర
    నీనాటకములోనే నిత్యులైరి చాలదా ॥ నీవే ॥ 579

ధన్నాసి

పరిణామమే మాకుఁ బతివి నీవు గలుగ
    శరణాగతే మాకు సకలరక్షయ్యా ॥ పల్లవి ॥

నుదుట వ్రాసినవ్రాఁత నూఁటికి నీతిరుమణి
    కొదువ లేదు మాకు నేఁడు యేఁడులోకాల
పెదవిమీఁదటిదె పేరుకొనేనీజపము
    అదన మాకు నదివో అక్కర లేదయ్యా ॥ పరి ॥

చేతికివచ్చినసొమ్ము చేరె నీశంఖుచక్రాలు
ఘాతల మాకిఁక నేది గడమలేదు
నీతితో వెనుబలము నీదాసులసేవ
రాతిరిఁబగలు నిదె రాజులమోయయ్యా ॥ పరి ॥

తొల్లిఁటిపుణ్యఫలముతోడనే నీసంకీర్తన
తల్లి దండ్రి నీవు నీతరుణియును
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నియుఁ గలిగె మాకు
చల్లఁగా బ్రతికితిమి జయమందవయ్యా ॥ పరి ॥ 580

పాడి

ఇందులోన నే నెవ్వరిఁబోలుదు
అంది నీవాఁడ నేననుకొంటిఁ జుమ్మీ ॥ పల్లవి ॥

జలజనాభ నీ శరణను వారలు
అల నారదసనకాదులు
కెలన మరియు నీ ౧కింకరవర్తులు
తెలిసిన బ్రహ్మాదిదేవతలు ॥ ఇందు ॥

నోరార హరి నిను నుతించువారలు
చేరువనుండేటి శేషాదులు
ధారుణిలో నీదాసాన(ను?)దాసులు
మారుతిముఖ్యులు మహామహులు ॥ ఇంద ॥

బడి నీచే ముక్తివడసినవారలు
సుడిగొనుమునిజనశుకాదులు
కడఁగిన శ్రీవేంకటపతి నీవే
తడవి నన్ను దయదలఁచుమీ ॥ ఇంద ॥ 581

౧ కింకరాః ఇవ వర్తంతే ఇతి కింకరవర్తినః' దానితత్సమ మిది కావచ్చు

శుద్ధవసంతం

అతుయింబగుమోతు మందులే తగుఁగాక
    భక్షించుపండ్లకుఁ బ్రాణ మీఁదగునా ॥ పల్లవి ॥

కొండంతపసిఁడి కలగూరకె వెలయిడిన-
    నిండినవివేకులకు నేరమిదిగాఁదా
దండమిడి హరి నిన్ను దలఁచినఫలంబెల్ల-
    నండ పాపము వాపుమనుట కిది దగునా ॥ అతు ॥

గుఱుతుగలరత్నంబు గుగ్గిళ్లు గొనఁగ వెల-
    పఱచుటే తన బుద్ధి పాడౌట గాదా
అఱిముఱి హరి నిన్నునర్చించుఫలమెల్ల
    కఱకుఁదనదేహభోగముల కనఁదగునా ॥ అతు ॥

కామధేనువుఁ దెచ్చి కాసుకె వెలకొసఁగ
    కామించ నధికులకు కడుఁగొరతగాదా
శ్రీమంతుఁడై నట్టి శ్రీవేంకటేశ నిను
    సేమమునఁ గొలిచి తుచ్ఛము లడుగఁదగునా ॥ అతు ॥ 582

దేసాళం

ఎవ్వరము నేమిసేసే మేమిగడమలు నీకు
    రవ్వగా శరణంటే రక్షించుటింతే ॥ పల్లవి ॥

అందరుఁ జేసినకర్మము లవి నీకు జీవనమై
    అంది జీవించేవంటే నదియూఁ గాదు
కొందరు సురల(లు?)తోడై కూడిరాఁగా నసురల-
    యిందరి గెలిచేవంటే నిదియూఁ గాదు ॥ ఎవ్వ ॥

వొకచోటఁ గలవు వేరొకచోట లేవంటే-
నకటా యెంచిచూచిన నదియూఁ గాదు
మొకమిచ్చి వొకగుణమునఁ దిరిగేవంటే
సకలగుణుఁడ వాజాడయుఁ గాదు ॥ఎవ్వ॥

కపట మిదనరాదు కడునవుననరాదు
వుపమించరాదు వొల్లకుండఁగరాదు
యెపుడును శ్రీవేంకటేశ నీ చిత్తమింతే
విపరీతములు లేవు వెలితీ లేదు ॥ఎవ్వ॥ 588

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగసంకీర్తన సంఖ్యాసూచి

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| ఆహిరి | 7, 39, 60, 64, 77, 95, 147, 200, 206, 265, 311, 410. |
| ఆహిరినాట | 436 |
| కన్నడగౌళ | 47, 216, 244, 269, 329, 429, 551. |
| కాంబోది | .... 80, 129, 201 |
| కేదారగౌళ | 427. |
| గుండక్రియ | 22, 33, 58, 96, 109, 111, 188, 300, 302, 307, 310, 312, 376, 407, 452, 547, 562 |
| గుజ్జరి | 14, 20, 72, 85, 108, 191, 254, 306, 351 428 |
| గౌళ | .... 68, 189, 528 |
| తెలుగుగాంబోది | 548. |
| దేవగాంధారి | .... 30, 32, 36, 44, 86, 106, 127, 136, 158, 162, 181, 207, 224, 247, 278, 285, 334, 350, 355, 359, 404, 435, 441, 455, 469, 508, 528, 531, 566. |
| దేసాళం | 49, 78, 90, 102, 115, 132, 140, 177, 205, 211, 228, 246, 260, 266, 288, 299, 319, 333, 341, 399, 412, 440, 524, 532, 561, 578 |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| దేసాళం | 4, 50, 61, 81, 84, 125, 146, 150 178, 188, 196, 231, 237, 245 263, 287, 309, 358, 401, 415, 461 476, 493, 509, 517, 583 |
| ధన్నాసి | ... 8. 16, 79, 113, 117, 151, 174, 210 218, 241, 272, 297, 315, 340, 381 393, 408, 438, 580 |
| నాగవరాళి | ... 215. |
| నాట | 5, 42, 133, 153, 202, 232, 274 345, ౬06, 518 |
| నారాయణి | .... 270, 422, 560. |
| పాడి | ... 66, 68, 83, 92, 167, 179, 230 256, 25, 271, 304, 325, 346, 368 377, 463, 487, 499, 511, 521, 525 581. |
| పూర్వగౌళ | ... 294. |
| బౌళి | 2, 6, 24, 54, 58, 74, 88, 94, 101 103, 104, 119, 170, 176, 189, 195 223, 240, 250, 257, 277, 286, 303 305, 318, 320, 348, 349, 353, 368 386, 391, 391, 397, 418, 434, 449 454, 457, 466, 467, 502, 510, 519 550, 553, 571 |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| బౌళిరామక్రియ | 48, 420 |
| భూపాలం | 55, 107, 212, 252, 298, 348, 392, 394, 398, 484, 543, |
| భైరవి | . 37, 99, 160, 221, 248, 275, 409, 483, 498, 527 |
| మంగళకౌశిక | 182, 375, 423, 424. |
| మలహరి | ... 159, 223, 296, 335, 362, 373, 396, 488, 530 |
| మాళవి | 1, 154, 281, 365, 379, 385, 475, 489, 501, 558 |
| మాళవిగౌళ | 35, 45, 145, 173, 226, 258, 405, 479, 574. |
| ముఖారి | 43, 51, 62, 112, 171, 214, 220, 225, 229, 235, 273, 279, 290, 332, 337, 369, 387, 413, 489, 496, 504, 559, 576 |
| రామక్రియ | .... 17, 21, 27, 105, 138, 148, 175, 186, 217, 233, 234, 291, 317, 321, 388, 402, 411, 433, 436, 442, 453, 464, 471, 491, 497, 503, 522, 538, 540. |
| రాయగౌళ | 344. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
| --- | --- |
| లలిత | 11, 15, 18, 19, 29, 52, 57, 67, 76, 98, 114, 118, 121, 130, 134, 152, 168, 169, 172, 180, 184, 190, 193, 197, 199, 203, 238, 261 268, 276, 308, 314, 323, 327, 330, 338, 371, 372, 374 378, 383, 384, 389, 390, 395, 416, 417, 425, 426, 431, 432, 437, 444, 446, 448, 458, 460, 470, 473, 481, 492, 526, 536, 539, 544, 546, 552, 573, 575, 579, |
| వరాళి | 9, 70, 91 123, 187, 204, 249, 283, 293, 313, 323, 414, 478, 490, 515, 556, 568 |
| వసంతం | .... 495. |
| వసంతవరాళి | . .. 34, 141, 243, 352, 533. |
| శంకరాభరణం | 23, 25, 41, 46, 78, 110, 131, 137, 149, 157, 163, 185, 242, 280, 289, 316, 336, 360, 382, 421, 430, 439, 477, 480, 514, 529, 542, 557, 565, 572. |
| శుద్ధవసంతం | .... 69, 135, 213, 322, 367 450, 465, 474, 485, 537, 555, 582. |
| శ్రీరాగం | 23, 59, 82, 155, 165, 209, 342, 366, 445, 482 505, 564. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| సామంతం | 13, 38, 71. 75, 89, 97. 116, 120 126, 156, 166, 194. 198. 208, 227 255, 259, 267, 292, 295, 331, 339 347. 354, 357. 361, 370, 400, 403 406. 443, 447, 456, 472. 494, 513 520, 545, 549 |
| సామవరాళి | . . 284, 541, 570 |
| సాళంగం | 10, 100, 124. 419. 451, 462, 486 568. |
| సాళంగనాట | 3, 12, 26, 31, 40. 56. 65, 87, 93 122, 128, 142. 143, 144. 161, 164 192, 219, 234, 239, 251, 282, 301 324. 326, 356, 364, 380, 459, 468 500. 507. 512, 516. 534, 535, 554 567, 577. |
| సౌరాష్ట్రం | 569. |
| హిందోళ వసంతం | 262 |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి,

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంజనా | సాళంగనాట | 143 |
| అంతటి | దేవగాంధారి | 247 |
| అంతయు | గుండక్రియ | 562 |
| అంతరాత్మ | ధన్నాసి | 272 |
| అంతర్యామీ | లలిత | 458 |
| అంత వాని | ధన్నాసి | 113 |
| అందరికి | మాళవి | 281 |
| అందాకానమ్మ లేక | లలిత | 18 |
| అందాకా వైష్ణవ | గుండక్రియ | 310 |
| అందిరిని | ధన్నాసి | 393 |
| అక్కటా నీమాయ | ఆహిరి | 206 |
| అక్కటారావణు | దేసాళం | 493 |
| అక్కడ నెక్కడి | ధన్నాసి | 340 |
| అక్కలాల | శంకరాభరణం | 149 |
| అఖిలలోకైక | రామక్రియ | 522 |
| అచ్చుత | శంకరాభరణం | 23 |
| అచ్చుతు | దేసాళ | 245 |
| అటమీద | భైరవి | 498 |
| అణుమాత్రపు | సామంతం | 347 |
| అతడే పరబ్రహ్మ | లలిత | 470 |
| అతనినమ్మ | వసంతవరాళి | 533 |
| అతనిలోనే | వరాళి | 568 |
| అదివో నీ | సాళంగనాట | 500 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అద్దిరా వో | సాళంగనాట | 26 |
| అనంతమహిమ | దేసాళం | 81 |
| అనిరావణు | సాళంగనాట | 31 |
| అనిశము | సామంతం | 520 |
| అన్నిటా నాపాలి | లలిత | 15 |
| అన్నిటా నేరుపరి | రామక్రియ | 188 |
| అన్నిటికి | లలిత | 431 |
| అన్నిటిమూలంబ | రామక్రియ | 491 |
| అన్నియుఁజదివి | సామంతం | 354 |
| అన్నియు | మాళవి | 379 |
| అన్నియు నీ | మాళవిగౌళ | 35 |
| అభయ | బౌళిరామక్రియ | 420 |
| అమ్మెదొకటి | బౌళి | 176 |
| అయ్యోనానేరమి | ఆహిరి | 39 |
| అయ్యోవికల్ప | లలిత | 52 |
| అయ్యోసదా | గుజ్జరి | 108 |
| అరసినన్ను | లలిత | 374 |
| అరిగాఁపులము | వరాళి | 556 |
| అరుదరుదీ | ఆహిరినాట | 286 |
| అలిముటిఁజూడఁబోతే | దేవగాంధారి | 127 |
| అల్లనాఁడే | దేసాళి | 399 |
| అవధారు దేవ | సాళంగనాట | 144 |
| అవధారు రఘు | లలిత | 492 |
| అవధారు సకల | ముఖారి | 504 |
| అవాప్తసకల | బౌళి | 108 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అతిశయంబగు | శుద్ధవసంతం | 582 |
| ఆడరమ్మ్ర | ముఖారి | 112 |
| అడరా | శంకరాభరణం | 280 |
| అడుతాఁబాడుతా | లలిత | 390 |
| అతఁడుభక్త | భైరవి | 99 |
| అతఁడు పేసే | రామక్రియ | 29′ |
| అతఁడేబ్రహ్మణ్య | దేసాళం | 358 |
| అతఁడే యిన్నియు | భైరవి | 160 |
| అతఁడే సకలము | శంకరాభరణం | 25 |
| ఆదిమపురుషుఁడు | సాళంగనాట | 507 |
| ఆదివిష్ణు | లలిత | 198 |
| ఆనందనిలయ | బౌళి | 502 |
| ఇంక నాదైన్యము | ఆహిరి | 265 |
| ఇంక నేల | సాళంగనాట | 251 |
| ఇంక నైన | సామంతం | 331 |
| ఇంక నైనా | దేవగాంధారి | 384 |
| ఇంకమాబోంట్ల | ధవుళి | 553 |
| ఇంకా నేల | బౌళి | 358 |
| ఇంకానో | రామక్రియ | 175 |
| ఇంతకంటె | సామంతం | 259 |
| ఇంతగామన్నించి | దేసాళం | 309 |
| ఇంతగాలమాయనన్ను | లలిత | 328 |
| ఇంతగాలమాయను | రాయగౌళ | 344 |
| ఇంతటఁగావఁగదే | సామంతం | 448 |
| ఇంతటిదైవము | రామక్రియ | 411 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంతలోనే | బౌళి | 349 |
| ఇంతేపో | గుజ్జరి | 14 |
| ఇందరు నెఱిఁగిన | దేసాళి | 578 |
| ఇందరు వెఱుగుదు | లలిత | 261 |
| ఇందరెరిఁగిన | మాళవగౌళ | 226 |
| ఇందాఁకా | నారాయణి | 270 |
| ఇందిరయుఁడా | దేసాళం | 146 |
| ఇందుకంటే | బౌళి | 101 |
| ఇందుకే | బౌళ | 195 |
| ఇందునేతుది | తెలుఁగుకాంబోది | 548 |
| ఇందునేవున్నది | సామంతం | 120 |
| ఇందులోవనే | పాడి | 581 |
| ఇచ్చలోఁగోరేవల్లా | రామక్రియ | 27 |
| ఇట్టినాస్తికుల | గుండక్రియ | 83 |
| ఇట్టిప్రతాప | మాళవి | 1 |
| ఇట్టియవివేక | బౌళి | 189 |
| ఇట్టెజ్ఞాన | దేసాళి | 211 |
| ఇతనికంటేఘను | శ్రీరాగం | 28 |
| ఇతనికంటేనుపాయ | దేసాళి | 78 |
| ఇతనికంటే మరి | సామంతం | 370 |
| ఇతనిమఱచి | గుజ్జరి | 306 |
| ఇతరచింత | గుండక్రియ | 22 |
| ఇతరదేవతల | దేవగాంధారి | 44 |
| ఇతరము | శంకరాభరణం | 289 |
| ఇతరుల | లలిత | 526 |
| ఇదికల్లయన | ధన్నాసి | 210 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇదిగాదది | గుండక్రియ | 312 |
| ఇదిగాన | లలిత | 180 |
| ఇదినమ్మలేఁడు | మంగళకౌశిక | 375 |
| ఇది యెరిఁగిన | దేసాళి | 524 |
| ఇదెచాలదా | వరాళి | 490 |
| ఇదెచిక్కితి | బౌళి | 397 |
| ఇదె నీ కన్నుల | మంగళకౌసిక | 182 |
| ఇన్నిటా శ్రీహరి | లలిత | 425 |
| ఇన్నిటికి | వరాళి | 128 |
| ఇన్నిటిమూలంబీశ్వరుఁడా | మలహరి | 296 |
| ఇన్ని దేహము | దేసాళం | 84 |
| ఇన్ని యుముగిసె | సాళంగనాట | 87 |
| ఇవ్వల వెదకి | లలిత | 308 |
| ఇహపరములకు | సామంతం | 545 |
| ఇహపరములు | సాళంగనాట | 380 |
| ఇహముఁబరము | వసంతవరాళి | 34 |
| ఈతఁడు | పాడి | 271 |
| ఈతఁడే | దేసాళం | 183 |
| ఈతగవే | సామంతం | 97 |
| ఈతని నెఱఁగ | లలిత | 536 |
| ఈమాటవిని | సాళంగనాట | 56 |
| ఈయపరాధ | కన్నడగౌళ | 269 |
| ఉడివోని | శంకరాభరణం | 110 |
| ఉన్న చోనే | శంకరాభరణం | 78 |
| ఉవిదలాల | ముఖారి | 285 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఊరకె | ధన్నాసి | 16 |
| ఎంతగాలమున | దేవగాంధారి | 86 |
| ఎంతగాలమైనా | రామక్రియ | 486 |
| ఎంతవిచారించు | ముఖారి | 369 |
| ఎందరితోఁ బెనఁగే | సామంతం | 38 |
| ఎందరు | సాళంగనాట | 554 |
| ఎందరైనఁగలరు | నాట | 42 |
| ఎందుకుఁబని | ధన్నాసి | 297 |
| ఎందు జూచినా | మాళవి | 154 |
| ఎందునైనా | దేవగాంధారి | 158 |
| ఎందు వెదక | శుద్ధవసంతం | 450 |
| ఎక్కడఁగడచే | సామంతం | 295 |
| ఎక్కడచూచిన | దేసాళం | 4 |
| ఎక్కడనున్నాఁడో | సామంతం | 361 |
| ఎక్కడనున్నారో | ఆహిరి | 64 |
| ఎక్కడిది వివేక | సాళంగనాట | 326 |
| ఎక్కడినరకము | సాళంగనాట | 12 |
| ఎక్కడిపుట్టుగు | లలిత | 460 |
| ఎక్కడివిరతి | శ్రీరాగం | 266 |
| ఎక్కడివుద్యోగాలు | గుండక్రియ | 376 |
| ఎక్కడిసుద్ది | సాళంగం | 124 |
| ఎటువంటి | దేసాక్షి | 260 |
| ఎట్టయినాఁజేసుకో | ఆహిరి | 95 |
| ఎట్టు గెలుతుఁబంచేంద్రియ | కన్నడగౌళ | 47 |
| ఎట్టున్నదో | లలిత | 168 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎట్టు మోసపోతి | శంకరాభరణం | 41 |
| ఎట్టు వలసినా | మాళవిగౌళ | 45 |
| ఎట్టు వలసినా | బౌళి | 305 |
| ఎట్టువేగించీ | నాగవరాళి | 215 |
| ఎట్టొకో | గుండక్రియ | 547 |
| ఎదిరించి | రామక్రియ | 186 |
| ఎదుటనే | దేవగాంధారి | 278 |
| ఎదురులేక | దేసాళం | 401 |
| ఎదురేది | పాడి | 92 |
| ఎన్నఁడిఁక | దేసాక్షి | 440 |
| ఎన్నఁడు దీరవు | బౌళి | 348 |
| ఎన్నఁడు దీరి | దేసాళం | 50 |
| ఎన్నఁడుదెలిసే | శంకరాభరణం | 386 |
| ఎన్నఁడునేనిఁక | బౌళి | 88 |
| ఎన్నఁడుమంచివాఁడ | సామంతం | 71 |
| ఎన్నఁడుమానవు | గుజ్జరి | 85 |
| ఎన్నఁడు వివేకించే | వరాళి | 204 |
| ఎన్నఁడొకో నేఁదెలిసి | దేవగాంధారి | 30 |
| ఎన్నఁడొకో బుద్దెరిఁగి | దేవగాంధారి | 285 |
| ఎన్నికై శ్రీవేంకటేశుఁడి | హిందోళవసంతం | 262 |
| ఎన్నిచందములఁ | కేదారగౌళ | 427 |
| ఎవ్వరము | దేసాళం | 583 |
| ఎవ్వరిదూరఁగఁజోటు | మలహరి | 396 |
| ఎవ్వరిదూరఁగనేల | సామంతం | 406 |
| ఎవ్వరివసము | ముఖారి | 225 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎవ్వరివాఁడా | లలిత | 380 |
| ఎవ్వరుఁగానని | శంకరాభరణం | 316 |
| ఎవ్వరు దిక్కింక | కాంబోది | 80 |
| ఏఁటినేను | లలిత | 98 |
| ఏఁటిపరిణామ | మాళవి | 385 |
| ఏఁటివిచార | నారాయణి | 560 |
| ఏకాలము | పాడి | 280 |
| ఏడధర్మ | సామంతం | 198 |
| ఏడపెద్దల | కాంబోది | 129 |
| ఏడేజేనలు | పాడి | 325 |
| ఏదినిజంబని | బౌళి | 2 |
| ఏదెస | సాళంగనాట | 65 |
| ఏనోరువెట్టుక | ఆహిరి | 60 |
| ఏపాటిగలవాఁడ | భైరవి | 248 |
| ఏపాటితనకర్మ | గుండక్రియ | 452 |
| ఏపొద్దు చూచిన | దేసాళి | 299 |
| ఏమనఁగవచ్చు | దేసాళం | 178 |
| ఏమనిచెప్పఁగ | మాళవిగౌళ | 253 |
| ఏమనిచెప్పేనో | పూర్వగౌళ | 294 |
| ఏమనినుతింతు | దేవగాంధారి | 508 |
| ఏమిచెప్పేడినో | పాడి | 346 |
| ఏమి నిద్దిరించేవు | భూపాళం | 484 |
| ఏమిసేతు | కన్నడగౌళ | 216 |
| ఏమిసేయఁగలఁడు | రామక్రియ | 588 |
| ఏమి సేయఁగలయెంతాళ | కన్నడగౌళ | 329 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమిసేయఁగలవాఁడ | ఆహిరి | 200 |
| ఏమి సేయఁగలవార | కాంబోది | 201 |
| ఏమి సేయుదును | శుద్ధవసంతం | 465 |
| ఏలవెట్టి | లలిత | 314 |
| ఏలికె | రామక్రియ | 217 |
| ఏలోకమున | దేసాక్షి | 102 |
| ఏవల్లనౌఁగాము | సామవరాళి | 570 |
| ఐనదయ్యీఁగాని | వరాళి | 9 |
| ఒకరిఁగానఁగ | సాళంగనాట | 534 |
| ఒకరికొకరు | దేవగాంధారి | 162 |
| ఒక్కఁడెవ్వఁడో | దేసాక్షి | 333 |
| ఒక్కఁడేదైవంబు | సాళంగం | 563 |
| ఒక్కఁడేయీ | లలిత | 268 |
| ఒక్కటి తరవాత | గుండక్రియ | 111 |
| ఒక్కమాటు | దేవగాంధారి | 455 |
| ఒడఁబడఁగద | సామంతం | 126 |
| ఒరసిచూడఁగ | దేవగాంధారి | 106 |
| ఓడవిడిచి | దేసాళం | 196 |
| ఓపితేఁదానే | లలిత | 190 |
| ఓహోనిలిచిన | శ్రీరాగం | 564 |
| ంటిరా ఓ జనులాల | సాళంగనాట | 234 |
| ంభమున | నాట | 506 |
| టకటా | ధన్నాసి | 79 |
| టైదుర | రామక్రియ | 471 |
| డనుండి | గుండక్రియ | 307 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కడనుండే | శుద్ధవసంతం | 367 |
| కడవరాదు | ముఖారి | 496 |
| కడునజ్ఞానపు | లలిత | 19 |
| కడుపునిండె | సామంతం | 403 |
| కనకము | గౌళ | 119 |
| కని గుడ్డును | శంకరాభరణం | 185 |
| కనియుఁగానరు | బౌళి | 277 |
| కనుఁగొన | శుద్ధవసంతం | 555 |
| కన్న దేఁటిదో | బౌళి | 318 |
| కన్నవిన్న | దేశాక్షి | 90 |
| కన్నులపండుగ | సాళంగనాట | 93 |
| కమ్మరను | బౌళి | 257 |
| కరుణానిధి | భైరవి | 221 |
| కలకాల | ఆహిరి | 77 |
| కలదందే | లలిత | 446 |
| కలదు | దేవగాంధారి | 531 |
| కలలోన | ముఖారి | 559 |
| కలవిరెండే | దేశాక్షి | 412 |
| కలశాపురము | పాడి | 521 |
| కలిగిననాఁడే | సామంతం | 357 |
| కలిగినమీఁదా | శంకరాభరణం | 242 |
| కలిమి గలిగి | వరాళి | 187 |
| కలిమిలేము | వరాళి | 328 |
| కాఁపులము | పాడి | 487 |
| కాంతలమాన | రామక్రియ | 388 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కాకుంటే | పాడి | 68 |
| కాదన్నవారికి | దేసాళం | 287 |
| కాదనేటి | నాట | 202 |
| కానరునాలుగు | దేసాళి | 319 |
| కానస్వతంత్రుఁడ | భైరవి | 483 |
| కొమ్మలుచూడరే | సాళంగనాట | 142 |
| కొలఁదిపుణ్య | బౌళి | 170 |
| కొలిచినవారల | సాళంగం | 419 |
| కొలిచినవారికిఁగొమ్మని | నాట | 232 |
| కొలిచినవారిపాలి | శ్రీరాగం | 482 |
| కొలువు విరిసె | పాడి | 525 |
| కోనేటిదరు | దేసాళం | 517 |
| గరిమల | సామంతం | 456 |
| గరుడధ్వజంబెక్కె | రామక్రియ | 21 |
| గెలిచితి | సాళంగనాట | 3 |
| గోవిందహరి | గుండక్రియ | 109 |
| గోవిందాది | ముఖారి | 332 |
| గోవిందుదాసుల | సామంతం | 549 |
| ఘనుఁడాతఁడా | గుండక్రియ | 302 |
| జ్ఞానినైనా | లలిత | 11 |
| చంకగుదియ | లలిత | 389 |
| చంచలము | వరాళి | 414 |
| చరమార్గమందు | సాళంగం | 462 |
| చవిచేసుక | శంకరాభరణం | 542 |
| చవులకు | రామక్రియ | 105 |

| సంకీర్తనములు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చానిపిలోపలఁజవి | శంకరాభరణం | 480 |
| చాలుఁజాలు | లలిత | 371 |
| చింతలురేఁచకు | గౌళ | 63 |
| చిత్తగించ | శ్రీరాగం | 209 |
| చూడసరుదాయ | లలిత | 114 |
| చూడరో | సాళంగనాట | 512 |
| చూడవేగోవింద | దేవగాంధారి | 224 |
| చూడ వేడుక | లలిత | 29 |
| చెప్పఁగానెఱఁగరా | గుజ్జరి | 351 |
| చెప్పరాని | సామంతం | 166 |
| చెలఁగి నాకిందుకే | లలిత | 67 |
| చెలఁగి యధర్మము | దేవగాంధారి | 469 |
| చేకొనికొలువరో | సాళంగనాట | 567 |
| చేకొనువారికి | శుద్ధవసంతం | 69 |
| చేరయంచెల | పాడి | 179 |
| చేరి యశోదకు | శుద్ధవసంతం | 485 |
| చేసినట్టే | వరాళి | 91 |
| జగములేలే | ముఖారి | 229 |
| జననమరణ | సామంతం | 389 |
| జయజయ | గుండక్రియ | 300 |
| జాలి మోహిని | దేసాక్షి | 182 |
| జీవన్ముక్తులము | సాళంగం | 486 |
| జీవుఁడ | భైరవి | 275 |
| జోజో యని | దేసాళం | 461 |
| తగు మునులు | ధన్నాసి | 815 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తనచిత్తము | శంకరాభరణం | 572 |
| తనసొమ్మి | దేసాళం | 61 |
| తనిసితి | లలిత | 444 |
| తనుఁదానే | సామవరాళి | 541 |
| తప్పుదీయర్థ | లలిత | 395 |
| తప్పదు | సాళంగనాట | 128 |
| తప్పించు | ధన్నాసి | 218 |
| తప్పులు | దేసాక్షి | 341 |
| తప్పులెంచకిఁక | దేవగాంధారి | 435 |
| తమ యెఱుక | మలహరి | 385 |
| తలఁచినప్పుడు | దేసాక్షి | 140 |
| తలమొలా | నాట | 345 |
| తానెంత | సాళంగనాట | 468 |
| తాము స్వతంత్రులుగారుతమ | ముఖారి | 62 |
| తాముస్వతంత్రులుగారుదాసో | సాళంగనాట | 40 |
| తిరువీధు | సాళంగనాట | 122 |
| తీరుచు నతఁడే | సాళంగనాట | 459 |
| తెగకపరము | లలిత | 203 |
| తెలిసినవారికింతా | లలిత | 552 |
| తెలిసినవారికిదేవుఁడి | శంకరాభరణం | 480 |
| తెలిసియుఁదెలియను | భూపాళం | 398 |
| తెలుపఁగ | మాళవి | 558 |
| తొల్లిటివారి | ముఖారి | 489 |
| త్రిగుణముల | గౌళ | 523 |
| ఘలు | శంకరాభరణం | 529 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దాటలేను | దేసాళి | 288 |
| దాసవర్గము | సామంతం | 267 |
| దాసోహమను | నాట | 5 |
| దిక్కులెల్లా | మాళవి | 501 |
| దీనుడ | శుద్ధవసంతం | 474 |
| దేవతలెందున్న | దేసాళి | 115 |
| దేవదుందుభుల | దేసాళి | 125 |
| దేవదుందుభుల | బౌళి | 510 |
| దేవ నీవటు | నారాయణి | 422 |
| దేవనీవేకాల | గుజ్జరి | 428 |
| దేవశిఖామణి | బౌళి | 418 |
| దేవానీమాయ | సామంతం | 89 |
| దేవానీవే | బౌళి | 240 |
| దేవుడవు | వరాళి | 515 |
| దేవుడొక్కడే | దేసాళి | 582 |
| దేహము | మలహరి | 229 |
| దైవంబవు | శంకరాభరణం | 439 |
| దైవము నీవే | దేవగాంధారి | 32 |
| దైవమా నీచేత | వరాళి | 249 |
| దైవమా నీవెలితె | సామవరాళి | 284 |
| దైవమా యిందు | కన్నడగౌళ | 551 |
| దైవమాయేమి | మలహరి | 362 |
| దైవమావో | ముఖారి | 171 |
| దొరతనము | నాట | 516 |
| ధరగడపట | లలిత | 372 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ధరనీవే | సామంతం | 227 |
| ధరలో | మాళవిగౌళ | 479 |
| ధర్మాధర్మములాల | దేవగాంధారి | 136 |
| ధ్రువ విభీషణాదులు | సామంతం | 292 |
| నగుబాట్లకు | శుద్ధవసంతం | 135 |
| నడపే | కన్నడగౌళ | 429 |
| నడుమ రెంటికి | శ్రీరాగం | 342 |
| నన్ను నెవ్వరు | బౌళి | 74 |
| నన్నెంచఁబని | బౌళి | 449 |
| నమిత దేవం | శంకరాభరణం | 514 |
| నమో నమో | సాళంగనాట | 282 |
| నమో నారాయణ | లలిత | 199 |
| నరహరి | బౌళి | 368 |
| నలినాతు | శంకరాభరణం | 191 |
| నవనీతచోర | భవుళి | 24 |
| నాకేలవిచారము | లలిత | 384 |
| నానాఁటికిఁ బెరిగీ | నాట | 103 |
| నానాఁటి బదుకు | ముఖారి | 570 |
| నానాభరణముల | సామంతం | 51[illegible] |
| నారాయణనీదాసుల | దేశాక్షి | 228 |
| నారాయణనీ నామ | మాళవిగౌళ | 574 |
| నారాయణనే | భూపాళం | 392 |
| నారాయణాచ్యుతా | మాళవి | 476 |
| నారాయణుఁడ | సామంతం | 494 |
| నారాయణుఁడితఁడు | వసంతవరాళి | 141 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నారాయణుఁడే | రామక్రియ | 264 |
| నాలోనున్నాఁడవు | లలిత | 338 |
| నిండినజగము | శుద్ధవసంతం | 537 |
| నిండుకంతటా | దేసాళం | 237 |
| నిండుమనసే | బౌళ | 320 |
| నిత్యానందుల | భూపాళం | 252 |
| నిలిచినచోట | లలిత | 417 |
| నీకుఁదొల్లే | సాళంగం | 451 |
| నీకునాకు | మాళవిగౌళ | 173 |
| నీకు నీసహజ | ముఖారి | 387 |
| నీకెటు | మలహరి | 373 |
| నీశేశరణంటి | ఆహిరి | 410 |
| నీదాఁకా | లలిత | 473 |
| నీదాసుల | దేసాక్షి | 266 |
| నీమహిమది | లలిత | 76 |
| నీమాయ | పాడి | 463 |
| నీయంతవారు | గుండక్రియ | 53 |
| నీయాధీనము | భూపాళం | 55 |
| నీవారైనవారికి | సాళంగనాట | 219 |
| నీవుదేవుఁడవు | సామంతం | 116 |
| నీవునట్ల | శ్రీరాగం | 445 |
| నీవెంత నేనెంత | ముఖారి | 51 |
| నీవెటుదలఁచిన | లలిత | 575 |
| నీవెటు సేసిన | ధన్నాసి | 408 |
| నీవేనన్ను | దేవగాంధారి | 207 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవే నేరవు | దేసాళి | 49 |
| నీవేయంతర్యామివి | లలిత | 579 |
| నీవే యెఱిఁగి | గుండక్రియ | 188 |
| నీవొక్కఁడవేయిత్తు | దేసాళి | 205 |
| నీవొక్కఁడవే సర్వా | బౌళి | 222 |
| నీశరణమే గతి | వసంతం | 495 |
| నేఁడు దప్పించు | పాడి | 83 |
| నేఁడు నీమహిమ | లలిత | 184 |
| నేనాగెలువ | రామక్రియ | 540 |
| నేనింత సేసిన | సాళంగనాట | 192 |
| నేనేమి జాఁతి | ధన్నాసి | 381 |
| నేనొక్కఁడ | బౌళిరామక్రియ | 48 |
| నేమెంత | మంగళకౌసిక | 423 |
| నేరనైతి | పాడి | 167 |
| నేరుపు | దేసాళం | 476 |
| పంచేంద్రియములనే | సాళంగనాట | 324 |
| పంచేంద్రియములాల | రామక్రియ | 497 |
| పంటలభాగ్యులు | దేవగాంధారి | 359 |
| పంతగాఁడు | రామక్రియ | 503 |
| పచ్చిదేరుచు | దేసాళం | 160 |
| పట్టరోపీదులఁబరువులు | దేవగాంధారి | 36 |
| పట్టిపిసుక | శంకరాభరణం | 137 |
| పరమ యోగీశ్వరు | భూపాలం | 21౭ |
| పరమాత్మ | ముఖారి | 220 |
| పరిణామమే | ధన్నాసి | 580 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పరుసము | సామంతం | 75 |
| పలుదెరువులు | రామక్రియ | 321 |
| పలుమారు | లలిత | 134 |
| పలువిచారము | సాళంగం | 100 |
| పసిఁడియక్షంత | సామంతం | 194 |
| పాటించి | శ్రీరాగం | 82 |
| పాడేము | బౌళి | 467 |
| పాపముఁబుణ్య | భూపాలం | 394 |
| పాపముపాపము | దేవగాంధార | 350 |
| పామరుల | ముఖారి | 214 |
| పారవేసిన | బౌళి | 463 |
| పుట్టించే | ముఖారి | 43 |
| పుట్టినట్టె | ధన్నాసి | 8 |
| పుట్టినమొదలు | లలిత | 327 |
| పుట్టుగు నీ | దేసాక్షి | 246 |
| పుట్టుగులు | బౌళి | 550 |
| పుణ్యమున | ముఖారి | 337 |
| పురుషుల | సామంతం | 13 |
| పురుషోత్తముఁడ | లలిత | 121 |
| పూచిన | ఆహిరి | 7 |
| పెంచితిమ | వరాళి | 70 |
| పెట్టినదైవ | వరాళి | 313 |
| పెద్దతెరువుండఁగా | లలిత | 383 |
| పెరిగి పెద్దఁగా | రామక్రియ | 317 |
| పెలుగఁగఁబెలుగ | వసంతవరాళి | 352 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పైకొని చూడరో | సాళంగనాట | 161 |
| పొందినవెల్లా | దేవగాంధారి | 441 |
| పొదలఁబొదలఁగ | గుండక్రియ | 407 |
| బయలీఁదించి | వరాళి | 298 |
| బలువుఁడు | రామక్రియ | 453 |
| బహుకుటుంబి | లలిత | 416 |
| బాపుబాపు | నాట | 133 |
| బాపురే | బౌళి | 391 |
| బోధింపరె | బౌళి | 58 |
| భక్తసులభుఁడ | సాళంగం | 10 |
| భక్తిసీపై | శుద్ధవసంతం | 322 |
| భగవద్విభవపు | లలిత | 448 |
| భవరోగవైద్యుఁడ | సాళంగనాట | 356 |
| భావములోనా | దేసాళి | 561 |
| భావించనేర | గుజ్జరి | 20 |
| భావించరే | శ్రీరాగం | 165 |
| భీకరపు | సాళంగనాట | 164 |
| భూమిలోనఁగొత్త | రామక్రియ | 17 |
| మంగళసూత్ర | లలిత | 197 |
| మదనజనకుని | శంకరాభరణం | 163 |
| మదించిన | భూపాలం | 107 |
| మనసొకటి | లలిత | 426 |
| మనుజులూరకే | లలిత | 238 |
| మమ్ముఁజూడ | బౌళి | 386 |
| మరఁవిచారించి | సౌరాష్ట్రం | 569 |
| మఱచిన | బౌళి | 104 |
| మఱియేపురుషార్థము | శ్రీరాగం | 59 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మాకేమినీ | గుజ్జరి | 191 |
| మాదురితములు | బౌళి | 434 |
| మానుప వశమా | శంకరాభరణం | 360 |
| మాయలంబొరలంగ | దేవగాంధారి | 404 |
| మాయామయము | సామంతం | 208 |
| మాయామోహము | దేవగాంధారి | 566 |
| మించినతల | పాడి | 363 |
| మిగిలినదే | శంకరాభరణం | 557 |
| ముందర గల | సామంతం | 156 |
| ముగియదు | శంకరాభరణం | 382 |
| ముద్దుగారే | సాళంగనాట | 577 |
| మునుల తపము | శంకరాభరణం | 477 |
| మూండుమూర్తుల | సామంతం | 400 |
| మెచ్చులదంపతు | ధన్నాసి | 438 |
| మొక్కరయ్య | రామక్రియ | 148 |
| మొక్కరో | సాళంగనాట | 301 |
| మొదలే | ముఖారి | 273 |
| రాతిరింబగలనే | రామక్రియ | 442 |
| రామకృష్ణనీవు | లలిత | 432 |
| రామభద్ర | పాడి | 304 |
| రామాదయాపర | బౌళి | 94 |
| రాముండులోకా | రామక్రియ | 233 |
| రుచులునే | మాళవిగౌళ | 405 |
| రెక్కలకొండ | మాళవిగౌళ | 145 |
| రెప్పలమరంగదె | లలిత | 378 |
| లేదందు | శుద్ధవసంతం | 213 |
| వట్టిమోపు | బౌళి | 54 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వట్టిస్వతంత్ర | వసంతవరాళి | 243 |
| వద్దిక నోపను | భవుళి | 454 |
| వాఁడివో వీఁడివో | పాడి | 86 |
| వాని వాని | దేసాళం | 263 |
| వారి వారి | పాడి | 256 |
| వింటిమి | లలిత | 546 |
| విచారించు | ధన్నాసి | 241 |
| విచ్చేయవయ్యా | రామక్రియ | 43 |
| విజయపు | సామంతం | 472 |
| విడువవో | మంగళకౌశిక | 424 |
| విత్తొకటి | వరాళి | 478 |
| వినరో | దేవగాంధారి | 355 |
| విన్నపము | ఆహిరి | 147 |
| వివరము | గుండక్రియ | 96 |
| వివరించు | గౌళ | 189 |
| విశ్వమెల్ల | మలహరి | 530 |
| విశ్వరూపనీ | దేసాళం | 231 |
| విశ్వరూపమిది | భైరవి | 409 |
| విశ్వాత్మనీకంటె | లలిత | 544 |
| విష్ణుఁడ | ముఖారి | 413 |
| వీఁడిగో | బౌళి | 519 |
| వీఁడివో | రామక్రియ | 402 |
| వీఁడుగదే | మాళవి | 365 |
| వీఁడెవీఁడె | ధన్నాసి | 151 |
| వీదివీది | నాట | 274 |
| వీరు వారనేటి | లలిత | 589 |
| వెదకవో | దేసాళం | 415 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వెదకిన | లలిత | 118 |
| వెన్న చేతఁబట్టి | లలిత | 180 |
| వెనుబల | గుజ్జరి | 254 |
| వెలువకు | లలిత | 276 |
| వెట్టిదెలిసిజగ | భూపాళం | 343 |
| వెట్టి దెలిసిమరి | దేసాళి | 177 |
| వెట్టి దెలిసిరోఁకలి | ధన్నాసి | 174 |
| వెట్టిమానుప | గుజ్జరి | 72 |
| వెట్టి వాఁడ | బౌళి | 6 |
| వెట్టివారిఁదెలుపు | భైరవి | 37 |
| వేఁకువఁదిరు | భూపాళం | 298 |
| వేదము దీర్చుదు | శంకరాభరణం | 585 |
| వేదవట్టి | సాళంగనాట | 595 |
| వేఁటొకచోట | లలిత | 57 |
| వేళలేదు | బౌళి | 457 |
| వేవేలుబంధ | శంకరాభరణం | 46 |
| వేసరితేనే | దేవగాంధారి | 528 |
| శరణని బ్రదుకరో | సాళంగనాట | 239 |
| శరణాగత | ధన్నాసి | 117 |
| శరణుకపీశ్వర | శంకరాభరణం | 421 |
| శరణు నేఁజొచ్చి | బౌళి | 250 |
| శరణు వేఁడెద | శ్రీరాగం | 155 |
| శరణు శరణు | శ్రీరాగం | 505 |
| శిష్టరక్షణము | పాడి | 258 |
| శ్రీపతియాతఁడుండ | లలిత | 169 |
| శ్రీపతియొకఁడే | లలిత | 578 |

| సంకీ ర్తనమొదలు | రాగము | సంకీ ర్తనసంఖ్య |
|---|---|---|
| శ్రీహరి నిత్య | భైరవి | 527 |
| సంసారమే | సామంతం | 447 |
| సంసారికిఁగల | లలిత | 481 |
| సకలము | మలహరి | 488 |
| సకలశాంతి | పాడి | 377 |
| సరవులు | కన్నడగౌళ | 244 |
| సర్వసులభుఁడ | లలిత | 152 |
| సర్వాత్మకుఁడ | బౌళి | 571 |
| సర్వేశ్వరా | మలహరి | 159 |
| సాసముఖా | బౌళి | 386 |
| సీతారమణ | శంకరాభరణం | 157 |
| సీతాసమేత | సాళంగనాట | 516 |
| సురలుపంతోపించి | దేసాళం | 509 |
| సులభమార్గ | ముఖారి | 279 |
| సేయరాని | ఆహిరి | 311 |
| సేవించిచేకొన్న | పాడి | 511 |
| సొమ్ములుగల | లలిత | 437 |
| సౌమిత్రి సహోదర | పాడి | 499 |
| హరికృష్ణ | భూపాళం | 543 |
| హరిదగ్గర | బౌళి | 303 |
| హరి నిను | లలిత | 172 |
| హరి యిచ్చిన | సాళంగనాట | 364 |
| హరియే | సామంతం | 255 |
| హరిహరి నా | వరాళి | 283 |
| హరిహరియని | రామక్రియ | 464 |
| హీనుడైన | దేవగాంధారి | 181 |
| హేయము | ముఖారి | 290 |

తాళ్లపాక పదసాహిత్యం - సంపుటం - 4

# అధ్యాత్మ సంకీర్తనలు

(తాళ్లపాక అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త

కీ॥ శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

1998

# విన్నపము

*ఇందరికి అభయంబు లిచ్చు చేయి*
*కందువగు మంచిబంగారు చేయి ॥*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని, మాహా
తత్త్వాన్ని 32,000 అధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించినవాడు
అన్నమాచార్యులు ఇందులో మనకు సుమారు 13,000 సంకీర్తనలు వ
లభించాయి వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, మనుమడు
చినతిరుమలాచార్యులు పదకవులే ! తాళ్లపాక కవులు క్రీ॥శ॥ 15-16 శతా
చెందినవారు వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట
తాళ్లపాకగ్రామం

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారం కోసం తిరుమలను కే
చేసుకొని శ్రీ వేంకటేశ్వరాంకితంగా వేలకొలది సంకీర్తనలను, ఇతర సాహిత్య ప్రక్రి
రచించినవారు తాళ్లపాకకవులు శ్రీ వేంకటేశ్వరస్వామివారి సేవలో త
ధన్యమూర్తులు

తాళ్లపాక పదకవిత్రయంగా కీర్తిగడించిన తాళ్లపాక అన్నమాచార్యుల,
పెదతిరుమలయ్య, తాళ్లపాక చినతిరుమలయ్యల సంకీర్తనల రాగిరేకులు తిరు
శ్రీవారి ఆలయంలో 'తాళ్లపాక అర'లో లభించాయి

తాళ్లపాక కవుల సంకీర్తనల భాండాగారం గూర్చిన మొదటి శాసన
1530 సంవత్సరంలో కనిపిస్తుంది తదుపరి క్రీ॥శ॥ 1545, 1547, 1554,
సంవత్సరాల నాటి శాసనాల్లోను సంకీర్తనభాండాగారం గూర్చిన ప్రస్తావన కని
ఇ॥ తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు

తిరుమల తిరుపతి దేవస్థానములవారు క్రీ॥శ॥ 1922 సంవత్సరం
తాళ్లపాక కవుల సంకీర్తనల ముద్రణకు పూనుకొన్నారు క్రీ॥శ॥ 1922 సంవత్సర
క్రీ॥శ॥ 1992 సంవత్సరం వరకు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాల ము
వివిధ దశలు కనిపిస్తాయి

1922 సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలవారు రాగిరే
తాళ్లపాక కవుల సంకీర్తనలను వ్రాతప్రతుల్లో వ్రాయించటానికి పూనుకొన్నారు

1935-38 సంవత్సరాల్లో తాళ్లపాక లఘుకృతులు, తాళ్లపాక కవుల సం
సంపుటాలుకొన్ని వెలువడ్డాయి

1947-65 సంవత్సరాల్లో తాళ్లపాక కవుల అధ్యాత్మ, శృంగార సం
కొన్ని సంపుటాలు ముద్రించబడ్డాయి

1947-1965 సంవత్సరాల మధ్యకాలంలో నిరాఘాటంగా కొనసాగిన
ఎదకవుల సంకీర్తనల ముద్రణ తరువాత ఒక దశాబ్దంపాటు కొనసాగలేదు

1975-1986 సంవత్సరాల మధ్యకాలంలో తాళ్లపాక పదకవుల సంకీ
కొన్ని సంపుటాలు వరకు, మరియు అధ్యాత్మ సంకీర్తనలు కొన్ని సంపు
పునర్ముద్రింపబడ్డాయి

తదుపరి 1992 సంవత్సరంలో ఒక సంపుటం ముద్రింపబడినది

ఇంతేకాక తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తాళ్లపాక కవుల ఇతర సాహిత్య ప్రక్రియలను ఈ దశల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించింది

ఈ వివిధ దశల్లో తాళ్లపాక పదకవుల సంకీర్తనలను రాగిరేకులనుండి పరిష్కరించిన మహాపండితులు కీ॥శే॥ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, పండిత విజయరాఘవాచార్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పి టి జగన్నాధరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీయుతులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారలు

తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ స్థాపించినప్పటినుండి తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనలకు దేశవ్యాప్తంగా విశేషవ్యాప్తి ఏర్పడింది తాళ్లపాక అన్నమాచార్యుల, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు సాహితీవేత్తలకు, సంగీత విద్వాంసులకు వరకవిత్వ వాణీవీణా నినాదాలైనాయి ఈ సంకీర్తనలు భక్తులకు మోక్ష మార్గాన్ని తెలిపే విశిష్టరచనలు పరిశోధకులకు, సాహిత్యచరిత్రకారులకు కొంగుబంగారమై విలసిల్లుతున్నాయి తాళ్లపాక కవుల సంకీర్తనలకు సంగీత, సాహిత్య, భక్తలోకంలో నేడువున్న ఆదరణ ఎనలేనిది

ఈ ఆవశ్యకతను గుర్తించి వివిధ దశల్లో పరిష్కరింపబడి ముద్రించబడిన తాళ్లపాకకవుల సంకీర్తనలను ఒక్కసారిగా సమగ్రరీతిలో ముద్రించడానికి తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం సంకల్పించింది

ప్రధమత తాళ్లపాక కవుల సంకీర్తనలను సమగ్రంగా 29 సంపుటాలుగా లోకానికి అందిస్తున్నాం

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళిక రూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందం గారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు, తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్, హ్యుమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) డా॥ ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరెక్టర్, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A ,Ph D గారికి, (పరిశోధకులు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి) హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు అర్పిస్తున్నాము

దీని తర్వాత తాళ్లపాక కవుల లఘుకృతులు, ఇతర కావ్యాలు వెలువరించడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నాం

ప్రస్తుతం వెలువడుచున్న తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపా కటాక్షంచే భక్తజనామోదం పొందగలవని విశ్వసిస్తున్నాం

**M K R వినాయక్**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నివేదిక

క్రీ॥శ॥ 15వ శతాబ్దంలో భక్తి, ప్రపత్తి, దేహాత్మేశ విచారాదులను తెలిపే అధ్యాత్మసంకీర్తనలు జీవాత్మ పరమాత్మల ఐక్యాన్నిచాటే అమలిన దివ్య శృంగార సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక కవులు సకల దేవతా స్వరూపమైన శ్రీ వేంకటేశ్వరస్వామి తత్త్వాన్ని ఎన్నోవేల సంకీర్తనలద్వారా లోకవిదితంచేసి ఆత్మకల్యాణంతోపాటు లోక కల్యాణం సాధించిన వారు తాళ్లపాక అన్నమాచార్యులు వీరి పుత్రుడు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు మనుమడు తాళ్లపాక చినతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వంగా భావించి ఉభయ విభూతినాయకుడైన ఆ స్వామి కల్యాణగుణాలను ఎన్నోవేల సంకీర్తనల్లో కీర్తించారు శరణాగతి తత్త్వాన్ని ప్రబోధించారు

క్రీ॥ శ॥ 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మించాడు తన పదహారవయేట శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది స్వామి ఆదేశంతో సంకీర్తనరచనకు శ్రీకారం చుట్టి ఆనాటినుండి జీవితాంతంవరకు దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా సంకీర్తన రచన సాగించాడు పల్లవి చరణాలతో కూడిన సంకీర్తన రచనకితడు మార్గదర్శకుడై పదకవితాపితామహుడ ని కీర్తి గడించాడు అన్నమయ్య పదాలలో సంగీతం సాహిత్యం భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి

శ్రీ వేంకటేశ్వరుని పరతత్త్వమూర్తిగానే కాకుండా వివిధ ఆగమ సంప్రదాయాల్లో వినుతుడైన వైభవమూర్తిగా కూడా అన్నమయ్య కీర్తించాడు ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక వైష్ణవ క్షేత్రాలను సందర్శించి ఆయాక్షేత్ర మూర్తులపై వివిధ సంకీర్తనలను రచించిన ఘనత తాళ్లపాక అన్నమాచార్యులదే!

అన్నమయ్య భగవత్తత్త్వాన్ని అనేక జానపద గేయరీతుల్లో రచించి సామాన్యులకు అందించే ప్రయత్నంచేశాడు అన్నమయ్య గ్రాంధిక, శిష్టవ్యావహారిక వ్యావహారిక భాషాశైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనల్ని రచించాడు జానపదుల జీవద్భాషను సర్వతంత్ర స్వతంత్రంగా వాడి సంకీర్తనల రచనాశైలిలో తర్వాతి వాగ్గేయకారులకి మార్గదర్శకుడైనాడు

అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు వీరి బాటను అనుసరించిన వారు తాళ్లపాక పెదతిరుమలాచార్యులు తాళ్లపాక చినతిరుమలాచార్యులు

ఇహపర శ్రేయోదాయకమైన తాళ్లపాక అన్నమాచార్యులు ఇతర తాళ్లపాకకవుల సంకీర్తనలను భక్తజనానికి అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానములు 1978 సంవత్సరంలో సంకల్పించి అన్నమాచార్య ప్రాజెక్ట్‌స్థాపించింది అప్పటినుండి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే గానంచేయబడిన తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే కాక ఆంధ్రేతర రాష్ట్రాలలో కూడా బహుళ ప్రచారం ప్రాచుర్యం పొందాయి

అన్నమాచార్య ప్రాజెక్ట్ తాళ్లపాక అన్నమాచార్య, ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనల ప్రచారం-పరిశోధన -రికార్డింగ్ శాఖల సమన్వయంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే వేలకొలదిగా సంగీత సభలు పరిశోధకులచే సాహితీసమావేశాలు నిర్వహించింది మరియు తాళ్లపాక కవుల సంకీర్తనలను ఆడియో క్యాసెట్లుగా విడుదలచేసి బహుజనామోదం పొందింది

తిరుమల తిరుపతి దేవస్థానంచే 1949 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు 1978 సంవత్సరం నుండి అన్నమాచార్య జయంతి ఉత్సవాలు జయప్రదంగా నేటికీ నిర్వహింప బడుచున్నవి మరియు అన్నమాచార్య సంకీర్తనోత్సవాలు కుగ్రామ స్థాయినుండి మహానగరాలస్థాయివరకు జరుగుచున్నాయి అన్నమాచార్య ప్రాజెక్ట్ వివిధ విశ్వవిద్యాలయాల

సమన్వయంతో తాళ్లపాక కవుల సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నది తిరుమల తిరుపతి దేవస్థానం 1978సం॥ నుండి తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసేవారికి ఉపకారవేతనం ఇచ్చి ప్రోత్సహిస్తున్నది ఈ ప్రణాళిక క్రింద ఇప్పటివరకు దాదాపు 50 సిద్ధాంతవ్యాసాలు సమర్పింపబడ్డాయి

తాళ్లపాక అన్నమాచార్యుల ఇతర తాళ్లపాక కవుల సంకీర్తనలపట్ల నానాటికీ పెరుగుచున్న ప్రజాదరణ మరియు 1935వ సంవత్సరం నుండి వివిధ దశల్లో ముద్రింపబడిన తాళ్లపాక అన్నమయ్య తాళ్లపాక పెదతిరుమలయ్య తాళ్లపాక చినతిరుమలయ్య సంకీర్తనల సంపుటాలు ఏనాడో చెల్లిపోయిన కారణంగా నేడు తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు సమగ్రంగా పునర్ముద్రించవలసిన ఆవశ్యకత ఏర్పడింది

పూర్వముద్రణ సంపుటాల్లోని పూర్వపరిష్కర్తల పీఠికలు యథాతథంగా ముద్రింపబడుచున్నాయి పరిష్కర్తచే పీఠికలో సూచింపబడిన సంపుటాల సంఖ్యలు పూర్వముద్రణకు సంబంధించినవి తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలు మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రితమవుతున్నందువల్ల ముద్రణ పాఠకుల సౌకర్యార్థం క్రమపద్ధతిలో వుండాలనే వుద్దేశ్యంతో పూర్వముద్రణ సంపుటాల సంఖ్యలు మార్చబడినవి సంపుటాల సంఖ్యల మార్పులు ప్రత్యేకంగా పట్టికలో చూపబడింది

తిరుమల తిరుపతి దేవస్థానానికి రాగిరేకుల్లో లభించిన తాళ్లపాక కవుల సంకీర్తనలు మొత్తం నేడు ముద్రించబడుచున్నందువల్ల సమగ్రమనే పదం సూచికంగా వాడబడింది

భక్తిభావ విలసితాలైన తాళ్లపాక కవుల సంకీర్తనల సంపుటాలను సమగ్రంగా ముద్రించుటకు ఆమోదించిన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వమండలి అధ్యక్షులు శ్రీకలిదిండి రామచంద్రరాజుగారికి మరియు ధర్మకర్తృత్వమండలి సభ్యులకు మా హార్దిక కృతజ్ఞతాంజలి

ఈ సంపుటాల ముద్రణకు అధికారికమైన ఆమోదాన్ని తెలిపిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం కె ఆర్ వినాయక్ I A S గారికి కృతజ్ఞతాంజలి

తాళ్లపాక పదకవుల సంపుటాల పునర్ముద్రణ ప్రణాళికరూపొందించుటలో సహకరించిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారికి (తాళ్లపాక వాఙ్మయపరిష్కర్త) విద్వాన్ శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి (విశ్రాంత తెలుగు అధ్యాపకులు తిరుమల తిరుపతి దేవస్థానాలు) ఆచార్య కె సర్వోత్తమరావుగారికి (డీన్ హ్యూమానిటీస్ & ఎక్స్‌టెన్షన్ స్టడీస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి) ఆచార్య ఎం శ్రీమన్నారాయణమూర్తిగారికి (డైరక్టర్ శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాసంస్థ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి) మరియు ఈ సంపుటాల ముద్రణలో సాహిత్యపరంగా నిర్మాణాత్మకమైన సూచనలందించిన డా॥ముదివేడు ప్రభాకరరావు M A Ph D గారికి (పరిశోధకులు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయం తిరుపతి) మా హార్దిక కృతజ్ఞతాంజలులు

ఈ సంపుటాల ముద్రణలో సాంకేతికపరమైన సహకారాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాధికారి శ్రీ ఎం లక్ష్మణరావుగారికి వారి సిబ్బందికి, తి తి దే పౌరసంబంధ శాఖాధికారి శ్రీ పి సుభాష్‌గౌడ్ గారికి కృతజ్ఞతాంజలులు

డా॥ మేడసాని మోహన్ M A Ph D
డైరక్టర్
అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

తేది 10-2-98

# తాళ్లపాక పదకవుల సంకీర్తనల సంపుటాలు

## సంఖ్యా వివరణ పట్టిక - 1998

| సంపుటాలు | మునుపటి సంఖ్య | ఇప్పటి సంఖ్య | సంకీర్తనాచార్యుని పేరు |
|---|---|---|---|
| అధ్యాత్మ సంకీర్తనలు | 1 | 1 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 2 | 2 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 3 | 3 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 10+11(1,2భాగాలు) | 4 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 12 | 5 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 4 | 6 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 13 | 7 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 14 | 8 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 15 | 9 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు | 16 | 10 | తాళ్లపాక చినతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 17 | 11 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 18 | 12 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 19 | 13 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 20 | 14 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| అధ్యాత్మ సంకీర్తనలు | 21 | 15 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 22 | 16 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 23 | 17 | తాళ్లపాక పెదతిరుమలాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 24 | 18 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 25 | 19 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 26 | 20 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 27 | 21 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 28 | 22 | తాళ్లపాక అన్నమాచార్యులు |
| శృంగార సంకీర్తనలు | 29 | 23 | తాళ్లపాక అన్నమాచార్యులు |

| | | | |
|---|---|---|---|
| శృంగార సంకీర్తనలు | 30 | 24 | తాళ్లపాక అన్నమాచార్యుల |
| శృంగార సంకీర్తనలు | 31 | 25 | తాళ్లపాక అన్నమాచార్యుల |
| శృంగార సంకీర్తనలు | 32 | 26 | తాళ్లపాక అన్నమాచార్యుల |
| *శృంగార సంకీర్తనలు | 33 | 27 | తాళ్లపాక అన్నమాచార్యుల |
| *శృంగార సంకీర్తనలు | 34 | 28 | తాళ్లపాక అన్నమాచార్యుల |
| *శృంగార సంకీర్తనలు | 35 | 29 | తాళ్లపాక అన్నమాచార్యుల |

* తాళ్లపాక పదసాహిత్యం మొదటిసారిగా సమగ్రంగా పునర్ముద్రణచేయ బడుచున్నది ఈ సందర్భంగా సంకీర్తనల సంపుటాల సంఖ్యలు క్రమపద్ధతిలో ఉండాలనే వుద్దేశ్యంతో మార్పులు చేయబడి, పై పట్టికలో చూపబడినవి పై పట్టికలో మునుపటి సంఖ్య వరుసలో సూచింపబడిన 33, 34, 35 సంపుటాలు ఇంతవరక ముద్రింపబడలేదు ఇప్పుడు ప్రథమంగా ప్రచురింపబడుతున్నాయి అయినప్పటి ప్రస్తుతం 1998 సం॥లో క్రొత్తగా 1వ సంపుటం నుండి ఇవ్వబడిన క్రమ సంఖ్యలు ఈ ప్రథమ ముద్రణ సంపుటాలకు చేర్చబడినవి వివిధ దశలలో 5, 6, 7, 8 9 సంపుటాల ప్రస్తుతం 1, 2, 3 సంపుటాలుగా గ్రహింప వినతి వివరములకు ఆయా సంపుటా పీఠికలు చదువగలరు ఈ మార్పును సహృదయ పాఠకులు గమనించగలరు

శ్రీ

# పీఠిక

ఈ పదునొకటవ సంపుటముతో అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల ముద్రణము ముగిసినది కీ శే శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యుల రచనలని ప్రత్యేకముగా గుర్తించిన అధ్యాత్మసంకీర్తనల రేకులు 1 మొదలు 391 వఱకును గలవానిలోని సంకీర్తనలన్నియు 'తాళ్ళపాకవారి గేయరచనములు' 5, 6, 7, 8, 9, 10,11 సంపుటములుగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ప్రకటించినట్టైనది మొత్తము ప్రకటనకు లభించిన అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు 2209 వీనిలో కొంచెము తక్కువగా అన్నియు సాధారణ తామ్రపట్టములలోనివే ఈ రేకులకు సా రే అను గుర్తుంచితిని

ఇవిగాక శ్రీ తాళపత్రములరీతిని సుమారు 21/2 అంగుళముల వెడల్పును 33 అంగుళముల పొడవునుగల నిడురేకులు 120 గలవు ని రే లలో చెక్కించుటకు పూర్వము ఈ రీతిగా రేకులు చేయించి చెక్కింపనుపక్రమించి వానిపలుచఁదనమును నిడుపును అనుకూలముగా తోఁపనికారణముచేఁ గాఁబోలు, అంతటితో వదలి, చేతికనువై లావైన సా రేకులలో మొదటినుండి మరల పాటలను చెక్కించినట్లు తోఁచుచున్నది మరియు నిడురేకుల వ్రాఁతగూడ అందముతక్కువ వ్రాసినవారి భాషావ్యుత్పత్తియు సామాన్యము నలుగురైదుగురు లేఖకులకైవాడము స్పష్టముగానున్నది కొన్ని రేకులలో మాత్రము కడపట ' అన్నమాచార్యుల సంకీర్తనలు ౧౦ మంగళమహా శ్రీశ్రీశ్రీఁ జేయును శ్రీతిరుమలయ్యగారి ఆనతిని అన్నమరాజు తిమ్మయ్య వ్రాసెను " ఇట్లు లేఖకుని పేరుగలదు (చూ ని-రే ౫)తక్కిన యేరకపు రేకులందుగాని వ్రాసిన వారిపేరు గానరాదు సా - రే లలో లేని అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు 77 ని-రే లలో లభించినవి ఈ సంపుటమున అవి రెండవభాగముగా చేర్పఁబడినవి నేఁటికిని దక్షిణదేశమందలి హరి భజన సంప్రదాయమున ' తోడయ మంగళం' అనఁబడు తొలిపాటలలో నొక్కటిగా సర్వత్ర వ్యాప్తిలోనున్న 'నారాయణతే నమో నమో' అను సంకీర్తన మనకీనిడురేకులలోనే దొరకినది * రాగముమాత్రము మారినది రేకులో దీనిది పాడిరాగము వ్యవహారములో ఇప్పుడిది మధ్యమావతి ఇదిగాక ఇందలి వ్రాఁత అంత వ్యుత్పన్నముగాకున్నను సా రే లలోని యెన్నోపార సందేహములిందు తీరినవి

---

* దీనినే కడపటి చరణమున 'పురందర విఠలతే నమో నమో' అని మార్చి పురందర దాసరాయల పదముగా కర్ణాటకులు కొందఱు వాడుచున్నారు !

మరియు అహోబల నరసింహస్వామి దేవళమున లభించిన పెద్ద రేకులు 35 ఇవి 27 అంగుళముల పొడవును 16 అంగుళముల వెడల్పును గలవి ఇవి ఐదైదురేకులు గుదిగా ఒకలావైన కడియములో చేర్చి యుంచఁబడినవి పె రే అని వీని గుర్తు సా రే లలోని సంకీర్తనలే ఇందును పునరుక్తములు అందలి వ్రాఁత తప్పులెన్నో ఇందు సవరింపఁబడినవి అక్షరములజాతి యదే కనుక సా-రే, పె-రే ల వ్రాఁత ఒక్కవ్యక్తి చేతిమీఁదుగానో లేక ఒక లేఖన సంప్రదాయమునకు చేరిన గురుశిష్యులచేతనో నడిచినదని యూహింప వచ్చును ఈ రెండు విధముల రేకులను ప్రత్యేకముగా తయారుచేయించి రెండుమార్లు పాటలను చెక్కించు వ్యయప్రయాసములివియని యూహించుట కష్టము దీని యుద్దేశముగూడ దురూహమే ఈ పె-రే లు ఎన్నియుండినవో తెలియదు మనకు దొరికినవి 35 మాత్రమే అందు అన్నమాచార్యుల, తిరుమలాచార్యుల అధ్యాత్మ శృంగారసంకీర్తనలు వేరుపరచి యియ్యఁబడినవి పె-రే లు సా-రే లకు అనువాదములే కనుక పాఠభేదములు ప్రాయశ ఇందు లభింపవు

ఇదిగాక తంజావూరి సరస్వతీమహలు భండారమునందలి P 465 సంఖ్యగల తాటాకులప్రతి 'శ్రీ వేంకటేశ్వర విన్నపాలు' అనుదానికి ప్రతివ్రాయించి తెప్పించఁబడినది అందు 90 సంకీర్తనలు వేంకటేశాంకితములు కలవు కాని యిందులో అన్నమాచార్యులవేవో ఇతరులవేవో తెలపఁబడలేదు రేకులలోని అన్నమాచార్యుల కృతులు కొన్ని ఇందుగలవు పాఠ వివేకమునకు ఇదియు కొంత తోడుపడినది

వీనికి తోడు తిరుపతివాసులైన శ్రీ తాళ్ళపాక వేంకటశేషాచార్యులయింటి వ్రాఁత ప్రతి యొకటి వారి దయతో లభించినది (S V O 6609) ఇందు శృంగారాధ్యాత్మరచనలు 275 కలవు కాని ఇందును కర్తలపేర్లు తెలియవు మరియు తరువాతి పదకవుల రచనలును ఇందు కలిసినట్లున్నది కొన్ని పాఠముల సవరణల కిదియు నుపకరించినది

వీని నన్నిటిని పరస్పరము సంప్రతించుపనికై కొంతకాలము పట్టినది ఇది గాక 1936లో తిరుమల-తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన 'The works o Thallapaka poets, Vol II' అను దానిలోని అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనల ముద్రణము చాల అసడ్డగా జరిగినది పైని రేకులను వ్రాఁతప్రతులను పరిశీలించి సరియైన పాఠములతో వానిని మరల ప్రచురించుట అత్యావశ్యకమనిపించినది అట్లుచేసి సవరించిన 173 అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు ఈ సంపుటమున 3-వ భాగముగ

ప్రకటింపఁబడినవి ఇట్లు చేయుటకు ఈ ప్రాచ్యపరిశోధనాలయాధ్యక్షులు శ్రీ పరవస్తు రామానుజస్వామి ఎం ఏ గారు దయతో నా కనుమతినిచ్చిరి వారికి నా ధన్యవాదములు

ఈ కారణముచేత ఈ సంపుటము కొంత విలంబముతో వెలువడవలసి వచ్చినది ఈ కార్యములో మొదటి కొన్ని దినములు మాత్రము శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల తోడు నాకు లభించినది దానికై వారికి నేను కృతజ్ఞత ఇందు తెల్పుకొనుచున్నాను తరువాత ఏకాంగిగానే నేనీపని నిర్వహింపవలసితిని ఇదిగూడ విలంబహేతువైనది

12-వ సంపుటమునుండి అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు ప్రకటింపఁబడును ఆ సంపుటము గూడ ఇంతలో ముద్రణకెక్కుస్థితిలో నున్నది స్వరపరచిన 'తాళ్ళపాకపాటలు' రెండవసంపుటమును త్వరలో ప్రకటింపఁబడుటకు సిద్ధమయినది

శ్రీ తిరుమల-తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారగు శ్రీ చెలికాని అన్నారావు బి ఏ గారు ఈ సంకీర్తనల ప్రకటనకై, వ్యాప్తికై చూపుచున్న అపారమైన యుత్సాహమునకు తగినంత త్వరగా పని జరుపు శక్తి శ్రీనివాసుఁడు నాకనుగ్రహించినచో కొంతయైనను వారి దయాఋణమును తీర్చుకోవలెననుటయే నా యాశంస

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము, తిరుపతి
30-3-55

**రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,**
సంగీతవాఙ్మయ పరిశోధకుఁడు

శ్రీ

# పీఠిక

ఈ పదవ సంపుటమున శ్రీఅన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనల తేకులలో 301 వది మొదలు 350 వ దాని వఱకును గల సంకీర్తనలు అనుక్రమముగా ప్రకటింపఁబడినవి ఎప్పటివలెనే శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల కైంకర్యమిందు చాలా కలదు

ఈ సంపుటమునఁగూడ అన్నమాచార్యుల రచన కాఁజాలని 'హరియవతారమె అతఁడితఁడు' అను పాట (192 వ సంకీర్తన) ఎట్లో రేకులో చొచ్చుకొని యుండి ప్రకటింపఁబడినది 'ఉన్నాఁడు వైకుంఠము' అను మాట యొక్కటే చాలును దీనియన్యకర్తృకత్వమును తెలుపుటకు

'ఓహో రాకాసులాల' (295) అను పదము 2వ సంపుటములోని 146వ సంకీర్తనమే కొన్ని చిల్లరపాఠభేదములు మాత్రమందుఁ గలవు కాని ముఖ్యమైన భేదము రెంటిరాగమునకు సంబంధించినది ఇందలిది 'శోకవరాళి'లో, అందలిది 'గౌళ'లో నున్నది *ఈ రాగభేదము ఆకాలమందే యెట్లు, ఏల యేర్పడెనో దురూహము అన్నమాచార్యులే ఈ సంకీర్తనను వేఱువేఱుకాలములందు వేఱురాగములందు పాడెనో, లేక తరువాతి అనుయాయులు వ్యుత్పత్తికొలఁది రుచికొలఁది రాగము మార్చిరో, చెప్పఁజాలము కాని సంగీతకళయందిట్టి మార్పులు సహజములు, దుర్నిరోధములు గూడ

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము, తిరుపతి
18-10-52

**రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ**

---

* ఇట్లే అన్నమాచార్య సంకీర్తనల రెండవ సంపుటమున 'బౌళి' రాగముననున్న 'వెన్నలు తొంగిలినాఁటి' అను (౨౬ వ) సంకీర్తనమే 6 వ సంపుటమున చిఱుమార్పులతో 'పాడి' రాగమున నున్నది

శుభమస్తు

# శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశక వరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు (నిరోధానకు ? తిరోధానానకు) తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన అధ్యాత్మ సంకీర్తనలు

**301-** రేకు రామక్రియ

ఎక్కడికంసుఁడు యిఁక నెక్కడిభూభారము
చిక్కువాప జనియించె శ్రీకృష్ణుఁడు ॥పల్లవి॥

అదివో చంద్రోదయ మదివో రోహిణిపొద్దు
అదన శ్రీకృష్ణుఁ డందె నవతారము
గదయు శంఖచక్రాలుగలనాలుగుచేతుల
నెదిరించియున్నాఁడు ఇదివో బాలుఁడు ॥ఎక్క॥

వసుదేవుఁడల్ల వాఁడే వరుస దేవకి యదే
కొసరేబ్రహ్మాదులకొండాట మదే
పొసఁగఁ బొత్తులమీఁదఁ బురుఁటింటిలోపల
శిసువై మహిమ చూపె శ్రీకృష్ణుఁడు ॥ఎక్క॥

పరంజ్యోతిరూప మిదె పాండవుల బ్రదికించె
అరిది కౌరవులసంహారమూ నిదె
హరికర్యము లీరో జయంతి పండుగ సేయరో
కెరలి శ్రీవేంకటాద్రికృష్ణుఁ డితఁడు ॥ఎక్క॥ 1

## దేసాళం

నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించఁ జెయ్యీగ్గేఁగాని ॥పల్లవి॥

సేయరానిపాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో నింద్రియకింకరుఁడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను ॥నాకు॥

వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి
యేగతిఁ గొసరి నీపై °నేఁట వేసేము
ఆగడపు బంగారుకాతుమనేన (యు?)మ్ముకొని
భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము ॥నాకు॥

కలుపుట్టుగుబదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేఁడెట్టు నీవార మయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమిసేసి నీ కెట్టు భారము వేసేము ॥నాకు॥ 2

## శంకరాభరణం

అచ్చుతుశరణమే అన్నిటికిని గురి
హెచ్చుకుందు మరి యెంచఁగనేది ॥పల్లవి॥

° ఏఁట= (ప్రకరణమునుబట్టి) నెపము నిందగా తోచుచున్నది

యోనిజనకమగు యొడ లిది
యే నెల వైనా నేఁటి కులము
తానును మలమూత్రపుఁ జెలము
నానాచారము నడచీనా ॥అచ్చు॥

పాపపుణ్యముల బదుకిది
యేపొద్దు మోక్షం బెటువలె దొరకు
దీపనబాధల దినములివి
చూపట్టి వెదకఁగ సుఖ మిందేది ॥అచ్చు॥

మరిగినతెరువల మనసుయిది
సరవినెన్న విజ్ఞానంబేది
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁడే
వెరవని కంటే వెలితిఁక నేది ॥అచ్చు॥ 3

## బౌళి

నిజమో కల్లో నిమిషములోనునె
భజించువారలభాగ్యముకొలఁది ॥పల్లవి॥

వొకఁడు కనుదెరచి వున్నది జగమను
వొకఁడు కన్నుమూశొగి లేదనును
సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును
వెకలినరులు భావించినకొలఁది ॥నిజ॥

కడుపు నిండొకఁడు లోకము దనిసె నను
కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు
తడవిన నిట్లనే దైవమిందరికి
వెడగునరులు భావించినకొలఁది ॥నిజ॥

ముదిసి యొకఁడనును మోక్షము చేర్పని
తుదఁ[○]బుట్టొకఁడది దూరమనును
యెదుటనే శ్రీవేంకటేశ్వరుఁ డిట్లనే
వెదకి నరులుభావించినకొలఁది ॥నిజ॥ 4

## వసంతవరాళి

ఏమందు మిందుకు నెఱిఁగినదే తొల్లి
శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి ॥పల్లవి॥

వొక మానఁ జేఁదూ వొక మానఁ దీపూ
కకిపికలై రెండూఁ గలవే తొల్లి
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము
సకలానఁ గలుగుట సహజమే తొల్లి ॥ఏమం॥

పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి
నిగిడి లోకములను నిజమే తొల్లి
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకుఁ గీడు
తగిలి నొసలి[⁻]వ్రాఁత తప్పదిది తొల్లి ॥ఏమం॥

వెన్నెలలు చంద్రునందు వెడ యెండ సూర్యునందు
కన్నుల లోకమువారు గన్నదే తొల్లి
యెన్నఁగ శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవు
వున్నవారు నీకింద నున్నవారు తొల్లి ॥ఏమం॥ 5

## లలిత

ఆతఁ డితఁడా వెన్న లంతట దొంగిలినాఁడు
యేతులకు మద్దులు రెండిలఁ దోసినాఁడు ॥పల్లవి॥

---

[○] బుట్టి + ఒకఁడు [⁻] 'యండ రేకు

యీతఁడా దేవకిగన్నయింద్రనీలమాణికము
౧ పూతకిచన్ను దాగి పొదలినాఁడు
యీతఁడా వసుదేవునియింటిలో నిధానము
చేతనే కంసునిఁ బుట్టచెండుసేసినాఁడు ॥ఆత॥

మేటియైనగొంతిదేవిమేనల్లుఁ డీతఁడా
కోటికిఁ బడెగెగాను కొండ యెత్తెను
పాటించి పెంచేయశోదపాలి భాగ్య మీతఁడా
వాటమై గొల్లెతలను వలపించినాఁడు ॥ఆత॥

ముగురువేలుపులకు మూలభూతి యీతఁడా
జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను
మిగుల శ్రీవేంకటాద్రిమీఁదిదైవ మితఁడా
తగి రామకృష్ణావతార మందె నిప్పుడు ॥ఆత॥ 6

## 302- రేకు శుద్ధవసంతం

పనిగొనువారలభాగ్య మిది
వెనకముందరికి వివేక మొకటే ॥పల్లవి॥

బలు పుణ్యములకుఁ బాపములకు గురి
కలియుగ మొకటే కలది
చెలఁగి సేయుటకు సేయించుటకును
తలఁపూ నొకటే తనలోఁ గలది ॥పని॥

మోదపు భోగము మోక్షమునకు గురి
యీదేహ మొకటే యెత్తినది
గోదిలి కడుఁ గుంగుటకు నెక్కుటకు
యీదెస ౨ విజ్ఞానమిదియే కలది ॥పని॥

---

౧ బూతకి రేకు ౨ 'విజ్ఞానమే కలది' పూ ము పా

ఆర్మిలిదుఃఖము నతిసుఖములకు గురి
కర్మం బొకటే కలది
కూర్మి శ్రీవేంకటగురుదైవముఁ గను-
ధర్మమున కతనిదాస్యమే కలది ॥పని॥ 7

## మంగళకౌశిక

ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు
చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని ॥పల్లవి॥

నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని
నీ నామము వినక నెరవేరె నొకఁడు
పూని నిన్ను నుతియించి భోగియాయ నొకఁడు
మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకఁడు ॥ఇంద॥

మతిలో నిన్ను దలఁచి మహిమందె నొకయోగి
తతి నిన్ను దలఁచకే తగిలె నిన్నొకఁడు
అతిభక్తిఁ బని సేసి అధికుఁడాయ నొకఁడు
సతతముఁ బనిగొని సఖుఁడాయ నొకఁడు ॥ఇంద॥

కాఁగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు
ఆఁగి నిన్ను వెంటఁదిప్పి ఆవులు మేలందెను
దాఁగక శ్రీవేంకటేశ దగ్గరైన దవ్వయిన
మాఁగి నిన్ను దలపోసేమనేసే గుఱుతు ॥ఇంద॥ 8

## ముఖారి

గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు
పరమపద మొక్కటే ఫలమింతే కాక ॥పల్లవి॥

పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు
దాఁప నవి నిమిషమాత్రములేకాక
లోపలేడ వెలియాడ లోకులకింతేకాక
మోపినదంతా యేకముఖమేకాక ॥గరి॥

రాతిరేది పగలేది రమించు సాత్వికులకు
యీతల నింతా వెలుఁగింతేకాక
ఘాతలఁ గర్మాకర్మగతులు యీసంది వింతే
పోతరించి యెక్కనెక్కఁ బొడవేకాక ॥గరి॥

చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని
వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు
జంతువుల పురుఁడులు జడులకింతేకాక
వింతవింతసుద్దులేల విభవమేకాక ॥గరి॥ 9

## గుండక్రియ

అనాది జీవుఁ డన్నియుఁ గన్నవే
వినోదమిందలి విరతే వలయు ॥పల్లవి॥

వెలిఁ దోఁచిన యీ విశ్వంబెల్లా
కలసిన మనోగతములివి
పలు విషయేంద్రియభావములెల్లా
వెలయఁ దా ననుభవించినవే ॥అనా॥

సహజపు వర్ణాశ్రమము లివెల్లా
యిహమునఁ దా ధరియించినవే
బహువేదశాస్త్రపరన లివెల్లా
వహి కెక్కఁగఁ దా వచియించినవే ॥అనా॥

దినదినసంసారతిమిరంబెల్లా
ఘనముగఁ దను మున్ను గప్పినవే (దే?)
అనయము శ్రీవేంకటాధిపుఁ డాత్మకు
ననిచి తొల్లి కల నాయకుఁడే ॥అనా॥ 10

## సామంతం

ఇతర మేదియు లేదు యెఱఁగ మింతేకాని
రతికెక్కేపనులెల్లా రామచంద్రుఁడే పో ॥పల్లవి॥

ధనమై చేరేవాఁడు దైవమై కాచేవాఁడు
మనసులోఁ దలఁచేటిమాధవుఁడే
మునుకొన్నగ్రామములై ముందరనుండేవాఁడు
కొననాలుకమీఁదటిగోవిందుఁడే పో ॥ఇత॥

తల్లియై పెంచేవాఁడు తండ్రియై పుట్టించేవాఁడు
వెల్లవిరిఁ దాఁ గొలిచే విష్ణుమూరితి
ఇల్లాలై సుఖమిచ్చి యెంచఁ బుత్రులైనవాఁడు
చెల్లుబడిఁ దా మొక్కేటిచేతిపై శ్రీహరియే ॥ఇత॥

దేహమై వుండేటివాఁడు దినభోగమైనవాఁడు
యీహల శ్రీవేంకటేశుఁ డితఁడొక్కఁడే
మోహాచారమైనవాఁడు మోక్షమై నిలిచేవాఁడు
సాహసించి నమ్మఁగలసర్వేశుఁ డితఁడే ॥ఇత॥ 11

## భవుళి

విడిచితి మనరాదు అవి మరి విడువమనఁగరాదు
అడరిన శ్రీహరి అనుమతికొలఁదే ॥పల్లవి॥

పెంచినఁ బెరుగును పెను యింద్రియములు
కొంచము సేసినఁ గుందును
పంచిన దిందును పాపముఁ బుణ్యము
యెంచఁగ నీశ్వరుఁ డిచ్చినకొలఁదే ॥విడి॥

తెలిసినఁ దేటగు తిరమగుమనసిది
కలఁచిన లోలోఁ గలఁగును
తొలఁచిన దిందునె దుఃఖము సుఖమును
యిల నంతర్యామిచ్చినకొలఁదే ॥విడి॥

చేసినఁ జెలఁగును చేఁతల కర్మము
పాసినఁ బాయును బంధముతో
ఆసల శ్రీవేంకటాధీశుఁ డిందుకు
యీసరిఁ గర్తఁడిచ్చినకొలఁదే ॥విడి॥ 12

## 303 - రేకు శంకరాభరణం

అతఁ డేమిసేసినా మాకదే గురి
మతిలో నాతఁడుండఁగా మాయలు మా కేఁటికి ॥పల్లవి॥

ఆసలకెల్లా గురి హరి యొక్కఁడేకాని
వేసరక కన్నవారి వేఁడనోపను(ము?)
చేసేటిసేఁతకు గురి శ్రీవిభుఁడేకాని
వాసి దప్పి హీనులసేవలు సేయ నోపము ॥అతఁడేమి॥

ముచ్చటకెల్లా గురి మురహరుఁడేకాని
చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్పనోపము
నిచ్చలు మాఁబ్రదుకెల్లా నీలవర్ణునికేకాని
రచ్చల దుష్టులతోడిరాఁపులకు నోపము ॥అతఁడేమి॥

పరమునిహమునకు పరమాత్ముఁడే గురి
పరులకధీనమైనబాఁతి యేఁటికి
సిరులకెల్లా గురి శ్రీవేంకటేశుఁడేకాని
అరపిరికితనపుటలమట లేదు ॥అతఁడేమి॥

## దేశాక్షి

ఎన్నఁడుఁ జెడనియీవు లిచ్చీని మాధవుఁడు
పన్నినయాస లితనిపైపై నిలుపవో ॥పల్లవి॥

కొననాలుకా హరిగుణములే నుడుగవో
మనసా అతని దివ్యమహిమెంచవో
తనువా శ్రీపతితీర్థదాహమే కోరవో
యెనలేనిఅడియాస లేఁటికి నీ కిఁకను ॥ఎన్నఁ॥

వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో
ఆనినచేతు లితనికంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో
యీనేటి పాపాలబారి నేల పడేవిఁ(రిఁ?)కను ॥ఎన్నఁ॥

నలిఁ బాదాలాల హరినగరికే నడవరో
కలభక్తి యాతనిపై ఘటియించవో
చలమా శ్రీవేంకటేశుసంగతినే వుండవో
యెలయింపుఁగోరికల కేల పారే విఁకను ॥ఎన్నఁడు॥

## సామంతం

కొసరి కొసరి యిఁకఁ గోరఁగనేఁటికి
అసురవైరి శరణనుటే చాలు

సంతతభోగము జననబంధములు
జంతురాసులకు సహజము
వంతురక్షకత్వము కరుణ భువి
నంతర్యామికి నది సహజము ॥కొస॥

కలకాలంబును గామముఁ గ్రోధము
చలమును బ్రాణుల సహజము
సులభత్వంబును సొరిది వదాన్యత
అల లక్ష్మీపతికది సహజము ॥కొస॥

వుడుగనికర్మము లొడలోముటలును
జడులము మాకిది సహజము
యెడయక శ్రీవేంకటేశ నీకు మము
నడరి కాచుటే అది సహజము ॥కొస॥ 15

## శుద్ధవసంతం

ఇహపరసాధన మిది యొకటే
సహజపుమురారిసంకీర్తన నొకటే ॥పల్లవి॥

భవసాగరములఁ బాపెడిది తేప
భువి నజ్ఞానముపులివాకట్టిది
జవళి నాశాపాశములకుఁ గొడువలి
నవనీతచోరునామం బొకటే ॥ఇహ॥

చింతాతిమిరముఁ [౧] జెరిచేటి సూర్యుఁడు
అంతట [౨]దరిద్రహతపు నిధానము
వింతమరణభయ వినాశమంత్రము
మంతుకు హరినామంబిది యొకటే ॥ఇహ॥

---

[౧] 'జెరిచెటి' పూ ము పా [౨] దరిద్ర శబ్దము భావప్రధానము దారిద్ర్యముచేత హత్యమైన దానికి అని అర్థము 'హత' శబ్దమును సామాన్య నపుంసకంగా స్వీకరింపవలెను

మించుదు ఖములమృతసంజీవని
అంచలఁ బంచేంద్రియముల కంకుశము
యెంచగఁ శ్రీవేంకటేశుదాసులకు
బంచిన పాళ్ల ( బరగినదొకటే ॥ఇహ॥

## సాళంగనాట

ఏమని పొగడుదు నిట్టి నీగుణము
యీ మహిమకుఁ బ్రతి యితరులు గలరా ॥పల్లవి॥

నిండెను జగముల నీ ప్రతాపములు
చెండిన బాణునిచేతులతో
కొండలంతలై కుప్పలువడియెను
వండఁదరగు రావణుతలలయి (లు?) ॥ఏమ॥

పూడెనుజలధులు పొరిఁ గోపించిన
తోడ బ్రహ్మాండము తూఁటాయ
చూడఁ బాతాళము చొచ్చె బలీంద్రుఁడు
కూడిన కౌరవకులములు నడఁగె ॥ఏమ॥

యెత్తితివి జగము లీరేడు నొకపరి
యిత్తల నభయం బిచ్చితివి
హత్తిన శ్రీవేంకటాధిప నీకృప
నిత్తెమాయ నీనిజదాసులకు ॥ఏమ

## దేసాళం

నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్మ
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్యా ॥పల్లః

పాపమూల మటు తొల్లి పైకొన్నదేహము
పాపము సేయకుండితే పక్కన నేల మాను
కోపమే కూడుగఁగుడిచిన యీబుద్ధి
కోపము విడువుమంటే గుణమేల మాను ॥నీకు॥

అప్పు దీర్ప వచ్చినట్టి ఆయుపు సంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను
తప్పు వేయవచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు
తప్పులు వేయక సారెఁ దా మేల మాను ॥నీకు॥

పంచమహాపాతకాలే పట్టుకొనేయింద్రియాలు
పంచమహాపాతకాలే(ల?) బారిఁ దోయ కేల మాను
అంచెల శ్రీవేంకటేశ ఆత్మలో నీవుండఁగాను
పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను ॥నీకు॥ 18

## 304 - రేకు లలిత

భావించువారలపాలిభాగ్య మితఁ
డావలనీవల నంతర్యామి ॥పల్లవి॥

యీశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు
విశ్వాత్మకుఁ డీ వివిధజీవులకు
ఐశ్వర్యము మా యంతర్యామి ॥భావిం॥

నిత్యుఁ డితఁ డొకఁడె నెరిఁ గాలములకు
సత్యం బితఁడు చదువులకు
ప్రత్యక్షం బిదె భక్తకోటికిని
అత్యంతము మా యంతర్యామి ॥భావిం॥

గుణి నిర్గుణితఁడు గురుమునిజనులకు
ప్రణవము వేదాంతపంక్తులకు
ప్రణుతి శ్రీవేంకటపతి లోకులకితఁ
డణురేణుపూర్ణుఁ డంతర్యామి ॥భావిం॥

## సాళంగనాట

జగములెల్లా నీడేరె జయ వెట్టి రిందరును
తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో ॥పల్లవి॥

[1]అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥

గోవిందుఁడు జనియించె గోకులష్టమిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
[2]భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥

అనంతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు జనియించె
ఘనశిశుపాలాదులు [3]గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో
అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో ॥జగ॥ 2(

## మాళవి

పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి
తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి ॥పల్లవి॥

---

[1] 'అచ్యుతుఁడు' పూ ము పా ప్రాసభంగము

'హతులైరి' కి వ్యావహారికము 'హతమైరి' కాగా, దాని సాదృశ్యముతో 'గతమైరి' సిద్ధించినట్లు

గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై
అరదము దోలవో చయ్యన దారకా
ధరయెల్లఁ గుమ్మెలై పాతాళ మదే కానవచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను ॥పారి॥

దనుజాంతకునిసేన దగ్గరి నడవఁజొచ్చె
చొనిపి రొప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి పగ్గములు బిగించవో పయిపైన ॥పారి॥

శ్రీవేంకటేశుబలము చిమ్మిరేఁగి మించఁజొచ్చె
○సేవించలమేల్మంగను సేనాపతీ
దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యములాయ
తావుకు మరలించవో తానకముగాను ॥పారి॥ 21

## లలిత

ఘనుఁ డాతఁడే మముఁ గాచుఁగాక హరి
అనిశము నే మిఁక నతనికె శరణు ॥పల్లవి॥

యెవ్వనినాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి
యెవ్వనిమూలము యీ సచరాచర-
మవ్వలనివ్వల నతనికే శరణు ॥ఘనుఁ॥

పురుషోత్తముఁడని పొగడి రెవ్వరిని
కరి నెవ్వఁడు గక్కనఁ గాచె
ధర యెవ్వఁడెత్తెదనుజులఁ బొరిగొనె
అరుదుగ మే మిఁక నతనికె శరణు ॥ఘనుఁ॥

○ సేవించి+అలమేల్మంగను - ఈ క్త్వార్థమును హేత్వర్థమున ప్రయోగించినట్లున్నది

శ్రీసతి యెవ్వనిఁ జేరి వురమునను
భాసిల్లె నెవ్వఁడు పరమంబై
దాసులకొరకై తగు శ్రీవేంకట
మాస చూపె నితఁ డతనికె శరణు ॥ఘను॥ 22

## మంగళకౌశిక

ఔలే నే నొకపనికి నవుదు నీకును
కూళలలో నెంచి చూడ గురి యవుదును ॥పల్లవి॥

పసురమువంటివాఁడ పాపపుబందెలు దెత్తు
శిసువువంటివాఁడ సిగ్గు నెగ్గు నెరఁగ
వసుధలో రాయివంటివాఁడను దయదలఁచ
యెసఁగ న న్నేరీతి నీ వేలితివి దై వమా ॥ఔలే॥

మాఁకువంటివాఁడ నే మతి లేదు, పుచ్చిన-
పోఁకవంటివాఁడ నెప్పుడు కొరగాను
రోఁకలివంటివాఁడ రోటిలోనిపోట్లకు
యేఁకట న న్నెటువలె నేలితివి దైవమా ॥ఔలే॥

పాము వంటివాఁడ నే పట్టినవారిఁ గరతు
గాముపంటివాఁడ లోకమువారిఁ బీడింతు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను బంటంటా-
నేమిటికిఁ గృపతోడ నేలితివి దైవమా ॥ఔలే॥ 23

## వరాళి

దేహముతోడిది లంకె తీరదిది హరిమాయ
సాహసపుజీవులకు సహజమెప్పుడును ॥పల్లవి॥

నెట్టనఁ బెక్కిండ్లవిందు నిండుకొన్నయాఁకలి
వొట్టి నిచ్చకల్యాణి కామోద్రేకము
కట్టినవోడదూలము కాయపుసంసారము
దట్టమైనప్రాణులకుఁ దనివేడదయ్యా ॥దేహ॥

పొద్దొకబైరూపము పొదలేటి యీవయసు
తిద్దుబడిగుజ్జుము హత్తినగుణము
వొద్దనుండినట్టినీడ వుడివోనియట్టినిద్ర
అద్దుకొని వుండుఁగాక అదియేల మానును ॥దేహ॥

పచ్చిగరికెకాలము ^○^ప్రపంచములో బ్రదుకు
తచ్చి చూచెటి సూత్రము తన జ్ఞానము
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాత్మలో నిధానము
యిచ్చ నెరుఁగుకొంటేనే యిహమే పరము ॥దేహ॥ 24

## 305- రేకు రామక్రియ

భావించరో వేదములు పలికేటి వునికి
జీవులు బ్రహ్మానందముఁజెందేటి వునికి ॥పల్లవి॥

నిచ్చలు నిద్దురలకు నెలవైనవునికి
యిచ్చలఁ గలలు గన నిరవైనవునికి
కుచ్చిన నిట్టూర్పులకొన దాఁకేవునికి
తచ్చిన మాటలధ్వనిదాఁకేటివునికి ॥భావిం॥

మునుకొన్నచూపులకు మొదలైనవునికి
అనిశము కతలెల్ల నాలకించేవునికి
వెనుకొన్న చవులెల్లా వెలవెట్టేవునికి
గునిసి మేల్కనుటకు గురియైనవునికి ॥భావిం॥

○ ప్రపంచముకో బ్రదుకు రేకు

వావిరి నింద్రియపరవశమందేవునికి
కైవశమై పదియారుకళలుండేవునికి
చావకుండా నమృతము జాలువారేవునికి
శ్రీవేంకటేశుపాదాలు చింతించేవునికి ॥భావి॥ 25

## దేవగాంధారి

అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు ॥పల్లవి॥

గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు ॥అమ॥

యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు ॥అమ॥

అలమేల్మంగతో నటు శ్రీవేంకట
నిలయుఁ డరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగులఁ గడుఁ బొగడేరు ॥అమ॥ 26

## దేసాళం

అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు
వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు ॥పల్లవి॥

దేవకి కొడుకుఁగన్న దినమిది శ్రీజయంతి
భావించ మన కన్నులపండుగులాయ
దేవునిఁ బూజించితిమి తేరో నైవేద్యాలు
కైవసమై కృష్ణునికి గంపల కొలఁదులు ॥అడు॥

వసుదేవుఁ డెత్తెను శ్రావణబహుళాష్టమిని
పసగాఁ దొట్లె నూఁచి పాడఁగలిగె
సిసువితనికి మొక్కి చేసేము జాగరాలు
కొసరరో వరములు కోట్లకొలఁదులు ॥అడు॥

బలభద్రుతమ్ముఁ డాయ పతి యలమేల్మంగకు
నెలమితో మనకెల్ల నేలికాయ
తలఁచి శ్రీవేంకటాద్రిఁ దానే యవతారమందె
అల సంతోషమందరో అబ్బినకొలఁదులు ॥అడు॥ 27

## ముఖారి

ఏ బలిమి నమ్మి వెరపెరఁగరు దేహులాల
గాబువలెఁ బెరిగేరు కాలము మీచుట్టమా ॥పల్లవి॥

చెలరేఁగి దానములు సేసినట్టిబలిమో
అలరి కర్మము సేసినట్టిబలిమో
చలపట్టి తపము లాచరించినబలిమో
కొలఁదిలేక సురలఁగొలిచినబలిమో ॥ఏబ॥

ధీరత సుజ్ఞానము దెలిసినబలిమో
కోరక విరక్తిగైకొన్నబలిమో
శూరత లోకానకెల్లఁ జుట్టమైనబలిమో
వూరకే బ్రహ్మకల్పములుండేటట్టిబలిమో ॥ఏబ॥

పరగ శ్రీపతినామపఠనముబలిమో
హరిదాసుల శరణన్నట్టిబలిమో
సిరుల శ్రీ వేంకటేశు సేవచేసినబలిమో
గురుభక్తితోడ నెక్కువయైనబలిమో ॥ఏబ॥ 28

## నారాయణి

అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము ॥పల్లవి॥

హరినివాస మీ యౌభళము
అరిది పరమపద మౌభళము
అరిదైత్యాంతక మౌభళము
హరముఖసేవిత మౌభళము ॥అనా॥

అమలరమాకర మౌభళము
అమితమునీంద్రం బౌభళము
అమరవందితం బౌభళము
అమరెఁ బుణ్యముల నౌభళము ॥అనా॥

అగరాజంబీ యౌభళము
అగణితతీర్థం బౌభళము
తగు శ్రీవేంకటధామవిహారం-
బగు శుభాంచితం బౌభళము ॥అనా॥ 2९

## మాళవిగౌళ

విచారించుకొనేవారి వివేకాల కొలఁదులు
పచారించి వున్నవెల్ల భావనమాత్రములు ॥పల్లవి॥

జగములన్ని నీశరీరమేకనక
తగు వైకుంఠాలే వుండేతావులెల్లాను
పొగరు స్వర్గ నరకభూములనేలోకాలెల్ల
పగటున తమలోనిభావనమాత్రములు ॥విచా॥

అన్ని పదార్థాలు నీయందే పుట్టివచ్చెఁగాన
తిన్నని నీప్రసాదాలే దినభోగాలు
వన్నెల నిష్టానిష్ట వస్తుభేదము లెల్లాను
పన్నుకొన్న యటువంటి భావనమాత్రములు ॥విచా॥

అంతరాత్మవు శ్రీవేంకటాధిప నీవేకాన
చెంతల నీ కైంకర్యాలే చేఁతలెల్లాను
వింతలైన సంసారవిహారములెల్లాను
బంతినే నానావిధ భావనమాత్రములు ॥విచా॥ 30

306 రేకు బౌళి

ఎత్తరే ఆరతులు యియ్యరేకానుకలు
యిత్తల నేఁగివచ్చీని యిందిరానాథుఁడు ॥పల్లవి॥

గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదములచేరుల తేరు
సురలు మునులుఁ బట్టి సొంపుతోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగివచ్చీ నిందిరానాథుఁడు ॥ఎత్త॥

జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువఁగా
యీవల నేఁగివచ్చీ నిందిరానాథుఁడు

పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రిమీఁదటి తేరు
కొంచక యలమేల్మంగఁ గూడి వచ్చీ నదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాధుఁడు ॥ఎత్తు॥

## నాట

కదిరినృసింహుఁడు కంభమున వెడలె
విదితముగా సేవించరొ మునులు ॥పల్లవి

ఫాలలోచనము భయదోగ్రముఖము
జ్వాలామయ కేసరములును
కాలరౌద్రసంఘటితదంతములు
హేలాగతి ధరియించుక నిలిచె ॥కది॥

ముడివడు బొమ్మలు ముంచిన వూర్పులు
గడగడనదరెటి కటములును
నిడుదనాలికెయు నిక్కుఁగర్ణములు-
నడియాలపురూపై తా వెలసె ॥కది॥

సకలాయుధములు సహస్రభుజములు
వికటనఖంబులు వెసఁ బూని
వెకలియగుచు శ్రీవేంకటేశ్వరుఁడె
ప్రకటపుదుష్టుల భంజించె నిదివో ॥కది॥ 3

## దేసాళం

చదివి బతుకరో సర్వజనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షర మిదియే

సాదించి మున్ను శుకుఁడు చదివినట్టిచదువు
వేదవ్యాసులు చదివినచదువు
ఆదికాలపువైష్ణవులందరినోటిచదువు
గాదిలినారాయణాష్టాక్షర మిదియే ॥చది॥

సతతము మునులెల్ల చదివినట్టిచదువు
వెతదీర బ్రహ్మ చదివినచదువు
జతనమై ప్రహ్లాదుఁడు చదివినట్టిచదువు
గతిగా నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥

చలపట్టి దేవతలు చదివినట్టిచదువు
వెలయ విప్రులు చదివేటిచదువు
పలుమారు శ్రీవేంకటపతినామమై భువిఁ
గలుగు నారాయణాష్టాక్షర మిదియే ॥చది॥ 33

## భైరవి

శరణ మాతనికే సర్వభావాల
యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు ॥పల్లవి॥

వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు
చొచ్చేటి త్రోవెఱఁగము సోదించి మీఁద
కుచ్చిన కర్మములతో గుదియై వేలుకాడేము
హెచ్చి మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెరుఁగు ॥శర॥

నన్ను నేనే యెఱఁగను నానాచందములను
అన్నిటా నాలోనున్నహరిఁ గానను
కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ
యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెరుఁగు ॥శర॥

మొదలు దెలియను ముంచి కొన దెలియను
చదువుచున్నవాఁడ సర్వవేదాలు
హృదయములోనుండి యిటు నన్ను గావఁగ
యిదివో శ్రీవేంకటాద్రియీశ్వరుఁడే యెఱుఁగు ॥శర॥ 34

పాడి

అప్పఁడైనహరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు ॥పల్లవి॥

సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపై ఁ బరపెఁ దేరు
తిమురుచు రుక్మకుపై ఁ దిరుగఁ దోలెఁ దేరు
ప్రమదాన సృగాలునిపై ఁ దోలెఁ దేరు ॥అప్ప॥

కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁ దేరు
బమ్మరపో [1]దంతవక్త్రుపైఁ దోలెఁ దేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాఁ దోలినతేరు
దొమ్మి రుక్మిణిపెండ్లికిఁ దోలినట్టితేరు ॥అప్ప॥

మీఱి [2]హంసడిచికులమీఁదఁ దోలినట్టితేరు
తూఱి సంధిమాటలకుఁ దోలినతేరు
ఆఱడి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చూఱలుగొన నెక్కెను శోభనపుతేరు ॥అప్ప॥ 35

గౌళ

మొదలివేల్పు మా మొఱ యాలించవె
యెదుటఁ గావు మము నిదివో దేవా ॥పల్లవి॥

---

[1] దంతవక్రు రేకు [2] 'హంసడిభకుల' కావచ్చు [3] 'అరడి' పూ ము పా ప్రాసభంగము

ధరపైఁ దపసులతపములు చెరిచెను
నిరతపుణ్యముల నీరుసేసె నదె
పరకామినులను భంగపెట్టె నదె
హిరణ్యకశిపుఁ డిదివో దేవా ॥మొద॥

మునులజడ లవిగో మోఁపులకొలఁదులు
ఇనచంద్రాదుల నెక్కువగెలిచెను
చనవరియింద్రునిస్వర్గము చేకొనె
యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా ॥మొద॥

పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను
బలిమినే ^ప్రహ్లాదుఁ బరచీని
యెలమిని శ్రీవేంకటేశ నీవలన
యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా ॥మొద॥ 36

## 307 - రేకు సామంతం

మేలెల్ల నొక్కటే ^మించుతిలూ నొకటే
తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే ॥పల్లవి॥

ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకమే ॥మేలె॥

యెందు నెండఁబడ్డఁగాని ఇంపునీడఁ గోరఁడు
కందువ సంసారియైనఁగాని మోక్షము గోరఁడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువబద్ధున కదే కట్టినట్టి కట్లు ॥మేలె॥

---

^ 'ప్రంహ్లాదు' రేకు   ^ 'మించుతిలూ' రేకు

కలయఁ జీఁకటిమైతేఁగాని దీప మిడుకోఁడు
ఇల నజ్ఞుఁడైనఁగాని యెరుక వెదకఁడు
తలఁచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే
బలిమిఁ జంచలునికి [1] బహాళ దుఃఖములే ॥మేలె॥ 3

## లలిత

ఇదియే సులభం బిందరికి
కదియఁగ వసమా కరుణనే కాక ॥పల్లవి॥

నగధరుండు పన్నగశయనుఁడు భూ-
గగనాంతరిక్షగాత్రుడు
అగణితుఁడితని నరసి తెలియఁగాఁ
[2] దగు నా కనెడిది దాస్యమే కాక ॥ఇది॥

కమలజజనకుఁడు కామునిజనకుఁడు
కమలాసతిపతి ఘనగుణుఁడు
విమలుఁడీహరి వెదకి కానఁగను
అమరునా శరణాగతిఁగాక ॥ఇది॥

దేవుఁడు త్రిగుణాతీతుఁ డనంతుఁడు
కైవల్యమొసఁగుఘనుఁడు
శ్రీవేంకటపతి జీవాంతరాత్ముఁడు
భావించవసమా భక్తినె కాక ॥ఇది॥ 38

## ధన్నాసి

హరి నీవు మాలోన నడు(డఁ?)గు టరదుగాక
శరణని నీకు నే జయ మందుటరుదా ॥పల్లవి॥

---

[1] బహాళ పూ ము పా [2] దగునా కనెడిది దాస్యమే కాక పూ ము పా ఈ విభజనతో అర్థము [illegible]
మగును

పాపపుణ్యాలంపటమైనది మేను
కూపపు యోనులఁ గుంగేటిది మేను
దీపనాగ్నిగలదిష్టము యీమేను
మోపు మోచిన నేము ములిగేది యరుదా ॥హరి॥

పొలసి పొద్దొకచాయఁ బొరలేటిమనసు
కొలఁదిలేని యాసఁ గుదురైనమనసు
మలసి సంసారమేమరిగినమనసు
కలనేము, తిమ్మటలు గైకొనేది యరుదా ॥హరి॥

పెనచి యింద్రియములఁ బేఁడినభవము
పనివడి చింతలకే పాలైనభవము
యెనలేని శ్రీవేంకటేశ నీకే శరణని
మనెఁ గాన యిఁక మీఁద మంచిదొటరుదా ॥హరి॥ 39

## గుండక్రియ

కోటికిఁ బడగయెత్తి కొంకనేల
యీటులేని పదమెక్కి యిఁకనేల చింత ॥పల్లవి॥

పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలఁ జిన్నకోపీనము
పట్టినది శ్రీహరిపాదపద్మమూలము
యెట్టయినా మాకు మేలే యిఁకనేల చింత ॥కోటి॥

చిక్కి నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
తొక్కినది భవముల తుదిపదము
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగ
యెక్కువ కెక్కువే కాక యిఁక నేల చింత ॥కోటి॥

చిత్తములోనిండినది శ్రీపతిరూపము
హత్తినది వైరాగ్య మాత్మధనము
యెత్తలఁజూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుఁ-
డెత్తి మముఁ గావఁగాను యిఁక నేల చింత ॥కోటి॥

## దేవగాంధారి

ఓహో వొడలుమాని (మా వొడలు నీ?) వోపికె గడుమేలు
యిూహల నీవుపకారమేమని నుతింతు ॥పల్లవి॥

పుట్టినచోటంటినా అది భూతములనెలవు
నెట్టన మూసిన మేను నిఖిల హేయమయము
యిట్టి నా యాతుమలోన హరి యెట్టుంటివి నీవు
అట్టె నీ చేఁతలు దలఁచి అరుదయ్యా నాకు ॥ఓహో॥

మించుల [1] మనసంటిమా అది మిగులఁ జంచలంబు
పంచల నా సంపదలు పాపపుణ్య[2] విధులు
యెంచఁగా యిటువంటి నన్ను యెట్టు ధరియించితి
నించిన నీ చేఁతలు విని నివ్వెరగయ్యాని ॥ఓహో॥

పాయ మిది యంటిమా పంచేంద్రియముల వశము
ఆయము నా కంటిమా అది అయిదు భూతముల మొరఁగు
యిూయెడ శ్రీవేంకటేశ యీడా యెట్టేలితి నన్ను
మాయల నీశరణంబిందుకే మనసయ్యా నాకు ॥ఓహో

## శుద్ధవసంతం

విత్తొకటి వెట్టఁగా వేరొకటి మొలచునా
యెత్తి హరి నీవు నను నీడేర్తుగాక ॥పల్లవి

[1] 'మనసంటిమా' లేకు [2] 'విధులు' వ్రా ము పా

మోహబాంధవములకు మూలంబు తనువు
వూహాపోహలకు వునికి యీ తనువు
దాహమున కాఁకటికి తగులు యీ తనువు
యీహీ వైరాగ్య మిందెట్టు గలుగు ॥విత్తా॥

పంచేంద్రియములకు పొదు యీ తనువు
చంచలపుటాసలకు జంట యీ తనువు
అంచె దుర్గుణములకు నాకరము తనువు
యెంచి చూడ వివేక మిందెట్టు నిలుచు ॥విత్తా॥

యిహలోకసుఖములకు హేతువీ తనువు
బహుపుణ్యపాపాలకు ఫలము యీ తనువు
యిహమునకు శ్రీవేంకటేశ నీదాస్యమున
విహరించెఁ దనువు యిఁక వెలపేల కలుగు ॥విత్తా॥ 42

## 308 - రేకు లలిత

హీనాధికము లింక నేడ నున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికి నొకటే ॥పల్లవి॥

నానావర్ణములవారు నరహరిఁ దలఁచేటి-
ఆనామమంత్రజప మది యొకటే
పూని యాతనిఁ గొలిచి భువి నేజాతైనాను
మోనమునఁబొందేటిమోక్షమూ నొకటే ॥హీనా॥

వెనకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తియొక్కటే
వునికి నాదేవుఁడు వొకఁడే అంతర్యామి
మనెడివైష్ణవకులమతమెల్లా నొకటే ॥హీనా॥

భేదాభేదము లేదు పెక్కు మరఁగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మ లొక్కటే
శ్రీదేవుఁ డై నట్టి శ్రీవేంకటేశ్వరుని-
యాదరానఁ బొందుశరణాగతియు నొకటే ॥హీం॥

### గౌళ

హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను
గరిమ నీ మాయలోనే కలగంటిఁగాక ॥పల్లె॥

యీమేనే కాదా హేయమెల్లా మోచినది
ఆమీఁదఁ బుణ్యతీర్థము లాడీఁగాక
కామించి యీరెంటిసంగాతంబు నేఁ జేసి
గామిడినై యెందువాఁడాఁ గానైతిఁగాక ॥హ॥

చిత్త మిదేకాదా చింతించెఁ బాపాలు దొల్లి
పొత్తుల పుణ్యాలు దలపోసీఁగాక
రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపురొంపిలోనికంబ మైతిఁగాక ॥హ॥

యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది
తానకపువేదములు తడవీఁగాక
పూనిన శ్రీవేంకటేశ వొంటి నీకు శరణని
తోనే యా రెండుఁ గడచి తుద కెక్కేఁగాక ॥హ॥

### వరాళి

యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాదిఫలరూప మిటు నీవై వుండవే ॥పల్లె॥

పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతిఁ బ్రాణప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ముఁగాచెడికొరకు
హరి నీమూర్తి ప్రాణ మావహించవే ॥యజ్ఞ॥

జగతికి నీపాదజలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేఁడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేకమందవే ॥యజ్ఞ॥

వేదములు దెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేదమంత్రముల పూజావిధి సేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁ గాచుటకు
వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే ॥యజ్ఞ॥ 45

## సౌరాష్ట్రం

నేము సేసేయందు మారు నీవే చేకొంటివి
నేమపు నాపూజలెల్లా నీకు నెక్కెనయ్యా ॥పల్లవి॥

పాలజలనిధిలోనఁ బవ్వళించినదియేపో
వాలిన నీకు జలాధివాసము
కోలు ముందై బ్రహ్మయజ్ఞ కుండములాహుతి గొని
వోలినుండే అది నీకు హోమము ॥నేము॥

అడన 'నాపోనారాయణుఁడ' వయిన నీకు
అదియపో మంత్రకలశాభిషేకము
మొదల నంతర్యామిమూర్తివయిన నీకు
పదవిమీర నదియే ప్రాణప్రతిష్ఠ ॥నేము॥

అక్కున శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వొక్కటై వుండినదే నిత్యోత్సవము
లెక్కలేని వరములు లీలతో మా కిచ్చితివి
యిక్కడ నేపొద్దు మాయింట నుండవయ్య ॥నేము॥

## శ్రీరాగం

ఎందుఁ గాఁపురము సేతు నేది నిజ మేది గల్ల
ముందర నొక్కదినమే మూఁడు గాలములు ॥పల్లవి॥

తనుభోగముల నివే తగ నొక లోకము
మనసులో తలపోఁత మరి యొక్క లోకము
యెనసిన కలలోని దిది యొక్క లోకము
మునుపు వెనకలివే మూఁడు లోకములు ॥ఎందుఁ॥

పంచభూతములచేతిబంధ మొక్కదేహము
యెంచఁగ నూరుపుగాలి యిది యొక్కదేహము
కొంచక త్రిగుణములగురి సూక్ష్మదేహము
ముంచె నిదె వొకటిలో మూఁడుదేహములు ॥ఎందుఁ॥

జీవునిలోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు
తావై వెలినున్నవాఁడు తా నొక్కఁడే
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగినాతఁ డీతఁడే
మూవంకల మముఁ గాచె మొక్కితి మాతనికి ॥ఎందుఁ॥

## లలిత

బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మఁ గన్న తండ్రియైన పరమాత్మచింత ॥పల్లవి॥

మూఁడు లోకములకెల్లా మొదలిచింత
మేడెపుఁ గర్మములకు మీఁదిచింత
తోడ జనించిననాటి తొల్లిటిచింత
వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత ॥బ్రహ్మ॥

అంగములోవెదకేటి యానందచింత
నింగివలెఁ బొడచూపే నిర్మలచింత
కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁగలిగె మాకు నోహో యీచింత ॥బ్రహ్మ॥

కిందు మీఁదు నేకమైన కేవలచింత
సందు లేక నిజమైన సహజచింత
కందువ శ్రీవేంకటేశుఁ గన్నచింత
యిందునే మాకుఁ గలిగె నితఁడే చింత ॥బ్రహ్మ॥ **48**

**309 - రేకు ముఖారి**

ఆదిమూలమే మాకు నంగరక్ష
శ్రీదేవుఁడే మాకు జీవరక్ష ॥పల్లవి॥

భూమిదేవిపతియైనపురుషోత్తముఁడె మాకు
భూమిపై నేడ నుండినా భూమిరక్ష
ఆమనిజలధిశాయిఅయిన దేవుఁడే మాకు
సామీప్యమందున్న జలరక్ష ॥ఆది॥

వ్రేయుచు నగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుఁడే
ఆయములు దాఁకకుండా నగ్నిరక్ష
వాయుసుతు నేలినట్టి వనజనాభుఁడే మాకు
వాయువందుఁ గందకుండా వాయురక్ష ॥ఆది॥

పాదమాకసమునకుఁ బారఁజాఁచే విష్ణువే
గాదిలియై మాకు నాకాశరక్ష
సాదించి శ్రీవేంకటాద్రి సర్వేశ్వరుఁడే మాకు
సాదరము మీరినట్టి సర్వరక్షా ॥ఆది॥

## దేశాక్షి

ఎంచి సేయుపను లిఁక లేవు
కొంచక యాతనిఁ గొలుచుటే కలది ॥పల్లవి॥

తప్పదు కర్మము తా నెందున్నా
చెప్పఁగ దీనికిఁ జింతేలా
అప్పుడు తొల్లే అనుమతించె నివి
తప్పక యాతనిఁ దలఁచుటే కలది ॥ఎంచి॥

ఆయము నన్నమునందొక లంకె
వేయుట దీనికి వెతలేలా
కాయములో హరి గలఁడంతరాత్మ
యీయెడఁ దను నుతియించుటే కలది ॥ఎంచి॥

వెలిని లోన శ్రీవేంకటేశుఁడే
తెలియని మతి సందియమేలా
యిలలో మనముల నేలె నాతఁడే
సలిగె మనకతని శరణమే కలది ॥ఎంచి॥

## దేవగాంధారి

అన్నివిధములుఁ దానై యాతుమలో మరి వీఁడే
పన్నిన యీ పరమాత్మభావనే మా బ్రదుకు ॥పల్లవి॥

గోపాలకృష్ణునిచూపే కోరిన పనులపొఁడి
గోపికావల్లభుకృపే కూర్మివనిత
శ్రీపతిదయే మాకుఁజేరే ధనధాన్యములు
చేపట్టినబ్రహ్మతండ్రిచిత్తమే మాపుత్రులు ॥అన్ని॥

జలధిశాయికరుణే సర్వరత్నములసొమ్ము
అల పీతాంబరువాత్సల్యమే వస్త్రములు
మలయు గరుడధ్వజుమన్ననే వాహనములు
యిల నచ్యుతనామమే యిదే మాకాయుష్యము ॥అన్ని॥

అమృతమధనుమహిమదె మా గాదెల కొల్చు
విమతదైత్యారి యావేశమే భయహరము
అమర శ్రీవేంకటేశునడుగులే మాకు నిండ్లు
తమితో నాతనిదేవే తల్లియుఁ దండ్రియును ॥అన్ని॥ 51

## సామంతం

[ం] తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము ॥పల్లవి॥

నిండినట్టిమడుగులనీరువంకపొలము
కొండలుమోఁచినపెద్దగొబ్బరపుఁబొలము
అండనే పొలమురాజులుండేటిపొలము
చెండివేసి మాకులెల్లా సెలగినపొలము ॥తిమ్మి॥

---

[ం] ఇందు దశావతార సమన్వయము కలదు

ఆసపడి వరదానమడిగినపాలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైనపాలము
రాసికెక్కేమునులకు రచ్చైనపాలము
వేసరక నాఁగేట వేగిలైన పాలము ॥తిమ్మ॥

మంచి గురుతైన రావిమానిచేనిపాలము
వంచిన గుజ్జముఁ దోలే వయ్యాళిపాలము
యెంచఁగ శ్రీవేంకటేశు నిరవైనపాలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటిపాలము ॥తిమ్మ॥ 52

## గుండక్రియ

నే నేమి సేయుదును నిన్నుఁ బో [?] వివేకము (?)
శ్రీనాథుమహిమలు చిమ్మి రేఁచఁగాను ॥పల్లవి॥

జీవుఁడేమి సేయును, చిత్తము వసముగాక
యీవల నావలఁ బరువెత్తఁగాను
చేవల నా చిత్తమేమి సేయు, నందులోననున్న-
శ్రీవల్లభునిమాయ చిమ్మిరేఁచఁగాను ॥నేనే॥

దేహ మేమిసేయును, దేహములోపలనున్న-
దాహపుటాసలు వెట్టి దవ్వఁగాను
యీహల నాయాసలును యేమిసేయు, నన్నిటికి
శ్రీహరి యానాజ్ఞ లిటు చిమ్మిరేఁచఁగాను ॥నేనే॥

పుట్టు గేమిసేయును, పురాకృతము వెంటఁ
గట్టిన బంధములై కలఁచఁగాను
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గొలువఁగా నన్నతఁడు
మట్టుమీరఁ బదవిచ్చి మన్నించఁగాను ॥నేనే॥ 53

[?] వివేకము కావచ్చు

## లలిత

సిరిమగఁడే మొగసిరిరక్ష
మరుగురుఁడే మా మర్మపురక్ష ॥పల్లవి॥

పులుగు నెక్కినవాఁడే పులుగుదోషపురక్ష
బలు బాలుఁడైనవాఁడే బాలగ్రహరక్ష
మొలచి పిన్నై మిన్నుముట్టఁబెరిగినవాఁడే
తొలఁగఁ దోసేటి ముట్టుదోషపురక్ష ॥సిరి॥

[1] బూతకిఁ జంపినవాఁడే బూతకి వాకట్టురక్ష
పాతాళానఁ గూర్మమైనపతి గుంతదోషరక్ష
ఘాతఁగరుణాకరుఁడై కరుణాదృష్టివాఁడే
మా తరతరము ద్రిష్టిమంత్రపురక్ష ॥సిరి॥

పాముపైఁబండేటివాఁడే పాములవాకట్టు రక్ష
సేమపుసర్వజీవాత్మ జీవరక్ష
నేమపు శ్రీవేంకటాద్రినిలయుఁడైయున్నవాఁడే
యేమిటాను మా పురుఁటియింటిరక్ష ॥సిరి॥ 54

### 310 - రేకు మాళవిగౌళ

నానావర్ణములనడగొండవలెను
దానవారి తేరదె తగ తిరువీధుల ॥పల్లవి॥

కదలె కదలె నదె గరుడధ్వజునితేరు
అదె మిన్నుమోచిననీలాద్రివలెను
యెదిరె నెదిరె నదె యిందిరాధిపునితేరు
కదిసి చుక్కలుమోచే కనకాద్రివలెను ॥నానా॥

---

[1] 'పూతన'యే వ్యవహారములో 'పూతకి'గా 'బూతకి'గాకూడ వాకొనబడినది బూ(పూ?)తకి'
పూ ము పా 'ద్రిష్ట'రేకు

తిరిగె తిరిగె నదె దేవదేవునితేరు
అరుదైన ఘనమందరాద్రివలెను
పరువులిడీ నదె పట్టపు శ్రీపతితేరు
విరివిఁ గై లాసపు వెండికొండవలెను ॥నానా॥

దగ్గరె దగ్గరె నదె దైవశిఖామణితేరు
అగ్గలపు శ్రీవేంకటాద్రివలెను
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
తగ్గులేని మొత్తపు దొంతరకొండవలెను ॥నానా॥ 55

## శ్రీరాగం

కాకున్న మాపాటు కడమున్నదా
నీ కృపవంకనే నిలిచితిఁగాక ॥పల్లవి॥

యీ నాలికేకాదా యిందరి నిందించినది
శ్రీనిధి నిన్నుఁ బొగడి చెలఁగెఁగాక
నానాపాపములు విన్న నా వీనులే కావా
దానవారి నీ కథల ధన్యమాయఁగాక ॥కాకు॥

యీ మేనేకాదా హేయపుటింతులఁ గూడె
నీ ముద్రలు ధరియించి నిక్కెఁగాక
యీ మనసేకాదా యిన్నిటిపైఁ బారినది
కామించి నిన్నుఁ దలఁచి కట్టువడెఁగాక ॥కాకు॥

యీ పుట్టుగేకాదా హీనాధికములఁ బొందె
వోపి నీ దాస్యము చేరి వొప్పెఁగాక
యేపున శ్రీవేంకటేశ యిన్నినేరములు నాకుఁ
బాపఁగా నే నిన్ను నమ్మి బ్రదికితిఁగాక ॥కాకు॥ 56

## దేసాళం

నేనే పో ఘనుఁడను నీకంటెను
దానవారి నీవు నాకు దైవమవుగాన ॥పల్లవి॥

నేరుపున నాకైతే నీ దిక్కు గలదుగాని
చేరి నీ కావల దిక్కు చెప్పి చూపఁగలదా
ఆరయ నీవైతే నాకు నాధారము గలవు [౧] గా(ని?)
[౨] నూ(వూ?)రకే నీ కాధారము వున్నదా యెక్కడను ॥నేనే॥

నిన్నుఁ గొల్చిన సలిగె నేఁడు నాఁకు గద్దుగాని
సన్నుతి నీకు నొకరి సలిగున్నదా
పెన్నిధి నిన్నుఁ దలఁచే పేరు నాకుఁ గద్దుగాని
వున్నదా నీకుఁ దలఁచ నొకరి పేరైనను ॥నేనే॥

యీవులెల్ల నాకైతే నియ్యఁగలవు గాక
ఆవల నీకీవులియ్య నన్యులున్నారా
శ్రీవేంకటేశ నాకు జీవాంతరాత్మవు నీవు
భావించ నంతరాత్మ యప్పటి నీకు నున్నదా ॥నేనే॥ 57

## గుండక్రియ

కాయము నాదే అట కర్తను నే నట నా-
చాయకవి రావు నన్నే జరసీఁగాని ॥పల్లవి॥

తలఁచినట్టుండదు తలఁపు నాదైనాను
కులికి నన్నే పనిగొనీఁగాని
నిలిపినయట్టుండవు నేఁడు నా మాటలే నాకు
పొలసి నన్నే కడు బొంకించీఁగాని ॥కాయ॥

---

[౧, ౨] ప్రయోగము వ్యావహారికముగా తప్పుకాదు కాని సంగీతనిధులైన కీర్తిశేషులు రాళ్లపల్లివారి సవరణలను అట్లనే వుంచితిని

కలిమి లేమెరఁగదు కాయము నాదైనాను
కొలఁదికి నేమైనాఁ గోరీఁగాని
యిల నాయంకెకు రావు యింద్రియములు నావైనా
కలసి నా మర్మములే కాఁడిపారీఁగాని ॥కాయ॥

పంపు నాకుఁ జేయదు భవమిది నాదైనా
తెంపున కర్మవీధులఁ దిప్పీఁగాని
యింపుల శ్రీవేంకటేశ యిది ° యరాజికమాయ
పంపున నీ కిదె మొఱ ప్రతిపాలించఁగదే ॥కాయ॥ 58

## గుండక్రియ

అతఁడు లక్ష్మీకాంతుఁ డన్నియు నొసఁగుఁగాక
యితరుల వేఁడుకొంటే నేమి గలదు ॥పల్లవి॥

మోదముతో నొకమానిమొదలఁ బోసిన నీరు
పాదుకొని కొనకెక్కి ఫలించుఁగాక
ఆదిమూలమగుహరి నాతుమ సేవించక
యే దైవములఁగన్నా నేమి సెలవు ॥అత॥

తల్లి భుజించినవెల్లా తగు గర్భముశిశువు-
కెల్లగాఁగఁ బరిణామ మిచ్చుఁగాక
వుల్లములోపలిహరి కొసగనిపూజలెల్లా
వెల్లిఁ జింతపంటివలె వృథా వృథా ॥అత॥

వోలి నెంత జారిపడ్డా నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై నిలుచుఁగాక
తాలిమి శ్రీవేంకటేశుఁదలఁచక తలఁచినా
పాలించ నాతఁడేకాక పరులకు వశమా ॥అత॥ 59

° సంస్కృతమును గూడ చాల స్థలములలో వ్యావహారికముగ వాడినాడు

## బౌళి

గోనెలె కొత్తలు కోడెలెప్పటివి
నానినలోహము నయమయ్యీనా ॥పల్లవి॥

మున్నిటిజగమే మున్నిటిలోకమె
యెన్నఁగ బుట్టుగులివె వేరు
నన్ను నెవ్వ రున్నతి బోధించిన
నిన్న నేటనే నేనెఱిఁగేనా ॥గోనె॥

చిత్తము నాఁటిదే చింతలు నాఁటివే
యిత్తల భోగములివె వేరు
°సత్తగు శాస్త్రము చాయ చూపినా
కొత్తగ నే నిఁక గుణినయ్యేనా ॥గోనె॥

జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడే
యీవల భావనలివె వేరు
ధావతి కర్మము తప్పఁ దీసినా
దైవము గావక తలఁగీనా ॥గోనె॥ 60

## 311 - రేకు శుద్ధవసంతం

జాలు దింటా మలిగండ్లాఁడి రాసిగా నేరేము
తేలుచు శ్రీహరి నీవే దిక్కౌటగాక ॥పల్లవి॥

ఆసలేల మానుఁ దన ఆఁకలి లో నుండఁగాను
బేసబెల్లి దేహముతోఁ బెరుగుఁగాక
గాసి బంధమేలఁమానుఁ గాముఁడు లో నుండఁగాను
వేసట సంసారమై వెన్నడించుఁగాక ॥జాలు॥

---

° 'సత్య' శబ్ద భవము కావచ్చు అర్థమూ అదే

ధావతులేఁటికి మానుఁ దనుభోగాలుండఁగాను
మోవరాని చింతలతో ములుగుఁగాక
కావరములేల మాను కంతలమేనుండఁగాను
తోవ చేసుకొని వెళ్లఁదోయుచుండుఁగాక ॥జాలి॥

వొక్కచిత్తమేలయౌను వూర్పుగాలి విసరఁగా
చిక్కి గుణత్రయముచేఁ జెదరుఁగాక
నిక్కి శ్రీవేంకటపతి నీకు నేనే శరణంటి
గక్కన నీజీవమును గరుణింతుగాక ॥జాలి॥ 61

## మాళవిగౌళ

పొందగు "నాత్మాపుత్రనామ" మను-
చందపువేదమె సరి నిలిపితివి ॥పల్లవి॥

పుత్రుఁడు మరుఁడట పుత్రుఁడు బ్రహ్మట నీ-
పుత్రపౌత్రులే భువినెల్లా
పుత్రకామేష్టిని బొడమితి దశరధ-
పుత్రుఁడవై యిది పొగడఁగ నరులు ॥పొంద॥

మనుమఁడు రుద్రుఁడు మనుమఁడు వశిష్టు
మనుమని మనుమలే మహి యెల్లా
మనుమఁడవై యదితిమాన్యగర్భమున
జననమందితివి జగమున కరుదు ॥పొంద॥

యిదె నీగోత్రంబీచరాచరం-
బెదుట మెరసె నిదె యిహమెల్లా
కదిసిటు శ్రీవేంకటగోత్రంబున
నుదయించి మెరసితో హరి నీవు ॥పొంద॥ 62

## శుద్ధవసంతం

ఏమి సేయువాఁడ నివి విరసమొకటొకటి
తామసంబొకవంక తత్వమొకవంక ॥పల్లవి॥

యితరోపాయరాహిత్యుండు గాఁడేని
అతిశయంబగు మోక్ష మది యబ్బదు
సతతోద్యోగానుచరితుండు గాఁడేని
వితతసంసారసుఖవిధి నడవదు ॥ఏమి॥

వివిధేంద్రియ విషయవిముఖుఁడు గాఁడేని
యివల వైష్ణవధర్మమిది యబ్బదు
అవిరళంబగు దేహానుసరణములేక
భవమాత్రమున సుకృతఫలమబ్బదు ॥ఏమి॥

పరమానందసంపన్నుండు గాఁడేని
చరమవిజ్ఞాననిశ్చలుఁడు గాఁడు
యిరవయిన శ్రీవేంకటేశ యిటువలె నీవు
కరుణించకున్న దుర్గతులచే భ్రమసీ ॥ఏమి॥ 63

## ముఖారి

ఇన్నియుఁ జదువనేల యింతా వెదకనేల
కన్ను దెరచుటొకటి కనుమూయుటొకటే ॥పల్లవి॥

వలెననే దొకమాఁట వలదనే దొకమాఁట
సిలుగులీ రెంటికిని చిత్తమే గురి
వలెనంటే బంధము వలదంటే మోక్షము
తెలిసే విజ్ఞానులకు తెరువిది యొకటే ॥ఇన్ని॥

పుట్టెడిదొకటే పోయెడిదొకటే
తిట్టమై యీ రెంటికిని దేహమే గురి
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము
వొట్టిన విజ్ఞానులకు నుపమిది యొకటే ॥ఇన్ని॥

పరమమనేదొక్కటే ప్రపంచమొక్కటే
సిరుల నీ రెంటికిని జీవుఁడే గురి
యిరవై శ్రీవేంకటేశుఁ డిహపరములకర్త
శరణాగతులకెల్ల సతమీతఁ డొకఁడే ॥ఇన్ని॥ 64

## దేసాళం

తక్కిన చదువులొల్ల తప్ప నొల్లా
చక్కఁగ శ్రీహరి నీశరణే చాలు ॥పల్లవి॥

మోపులు మోవఁగనొల్ల ములుగఁగ నేనొల్ల
తీపు నంజనొల్ల చేఁదు దినఁగనొల్ల
పాపపుణ్యా లవి యొల్ల భవమునఁ బుట్టనొల్ల
శ్రీపతినే నిరతము చింతించుటే చాలు ॥తక్కి॥

వడిగాఁ బరువులొల్ల వగరింపనేనొల్ల
వెడఁగుఁజీఁకటి యొల్ల వెలుఁగూనొల్ల
యిడుమల వేఁడనొల్ల యెక్కువ భోగములొల్ల
తడయక హరి నీదాస్యమే చాలు ॥తక్కి॥

అట్టె పథ్యములొల్ల అవుషధము గొననొల్ల
మట్టులేని మణుఁగొల్ల మైల గానొల్ల
యిట్టె శ్రీవేంకటేశు నిరవుగ సేవించి
చుట్టుకొన్న యానందసుఖమే చాలు ॥తక్కి॥ 65

## రామక్రియ

ముందే తొలఁగవలె మోసపోక సంగమెల్ల
కందువఁ బోయిననీళ్లు కట్ట గట్టవచ్చునా ॥పల్లవి॥

అనలముఁబొడగంటే నండనున్నమిడుతలు
పనిలేకున్నా నందుఁ బడకుండీనా
పానిఁగి చెలులఁగంటే పురుషులచూపులెల్లా-
ననిశము నందుమీఁద నంటఁబారకుండునా ॥ముందే॥

గాలపుటెఱ్ఱలఁగంటే కమ్మి నీటిలో మీలు
[1] జాలి నాపసలఁ జిక్కి చావకుండీనా
ఆలరిబంగారుగంటే నందరిమనసులూను
పోలిమి నాపసఁ జిక్కి పుంగుడు గాకుండునా ॥ముందే॥

చేరి ముత్యపుఁజిప్పల చినుకులునినిచితే
మేరతేటముత్యములై మించకుండీనా
ధారుణి శ్రీవేంకటేశుదాసులసంగతి నుంటే
పోరచి నే జీవులైనఁ బుణ్యులుగాకుందురా ॥ముందే॥ 66

## 312 - రేకు దేశాక్షి

నిరంతరంబును నీమాయే పరం-
పరములాయ పాపవే నీమాయ ॥పల్లవి॥

మును తల్లిగర్భమున ముంచెను నీమాయ
వెనక జనించినట్టే వెలసె నీమాయ
అనుగు కౌమారబాల్యయవ్వనములు నీమాయ
జనులకు దాఁటరానిజలధి నీమాయ ॥నిర॥

---

[1] జాలి = ఆశ

ఆస నీమాయ అంగము నీమాయ
యీసునఁ గామక్రోధము లివి నీమాయ
వాసుల సంసారమున వలఁబెట్టీ నీమాయ
గాసిఁబడి యిఁక నెట్టు గడచే నీమాయ ॥నిర॥

యెదురెల్ల నీమాయ యిహమెల్ల నీమాయ
పొదలి స్వర్గనరకభోగము (నీ?) మాయ
అదన శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవె
యిదె నీకే శరణంటి నిఁకనేలమాయ ॥నిర॥

## లలిత

ఏతపములు నేల యేదానములు నేల
శ్రీతరుణీపతినిత్యసేవే జన్మఫలము ॥పల్లవి

దేహపుటింద్రియముల దేహమందే యణఁచుటే
దేహముతోనే తాను దేవుఁడౌట
సోహలను వెలిఁ జూచేచూపు లోనుచూచుటే
ఆహా దేవతలఁ దనందే తాఁ గనుట ॥ఏత॥

వెలి నిట్టూరుపుగాలి వెళ్ళకుండా నాఁగుటే
కులికి తపోధనము గూడపెట్టుట
తలఁపు తనందే తగ లయముసేయుటే
లలిఁ బాపబంధముల లయముసేయుట ॥ఏత॥

వెనక సంసారమందు విషయవిముక్తుఁడౌటే
మునుపనే తా జీవన్ముక్తుఁడౌట
పనివి శ్రీవేంకటేశుపదములు శరణంటే
అనువైన దివ్యపదమప్పుడే తా నందుట ॥ఏత॥ (

## గుండక్రియ

పంతపుటాసలు బండ్ల రాఁగా
దొంతుల యలమటఁ దొలఁగేనా ॥పల్లవి॥

మును దీపనాగ్ని మోఁచిన దేహిని
అనిశముఁ గ్రోధాగ్ని నణఁచేనా
మనసిజాకతమున మహి జన్మించితి
విను మరునాజ్ఞకు వెలి యయ్యేనా ॥పంత॥

సటలోభపు సంసారము చొచ్చితి
ఘటన విడుము డీకఁ గలిగీనా
నటించు చపలపునాలుక గల నే
మటమాయపు చవి మానేనా ॥పంత॥

పాపపుణ్యముల భవముల జీవిని
తోపడ కర్మము దొబ్బేనా
యేపున శ్రీవేంకటేశ్వరుశరణమే
పైపయి భజించి బ్రదికితిఁగాక ॥పంత॥ 69

## బౌళి

తెలియుట యెన్నఁడు దేహి తనంతట
తెలియఁగ హరి నీదిక్కే కలది ॥పల్లవి॥

రాపుగ రేపేమూత్రపురీషంబులు
ఆపై నాఁకటియలమటలు
కైపుగ నింతటఁ గామవికారము
మాపు నిద్దురలమంపులె కలది ॥తెలి॥

కొన్నాళ్లు బాల్యము కొన్నాళ్లు కౌమార-
మన్నిటఁ గొన్నాళ్లు °యౌవ్వనము
పన్నిన ముదిమియుఁ బైపైఁ గొన్నాళ్లు
వున్నతి నంతట నుడుగుట కలది ॥తెలి॥

జంతువులకు యీ సరవులు నీవే
పొంతలఁ గల్పించి పొదిపితివి
యింతట శ్రీవేంకటేశ్వర నీకృప
చింతించి కావవే చేకొని నన్ను ॥తెలి॥ 70

## బౌళిరామక్రియ

ఇదివో శ్రుతిమూల మెదుటనే వున్నది
పదరముగా హరి చాటీ నదివో ॥పల్లవి॥

యెనసి పుణ్యముసేసి యే లోకమెక్కిన
మనికై భూమియందు మగుడఁ బొడముటే
పొనిగి "యా బ్రహ్మభువనా లోకా.
పునరావృత్తి" యనెఁ బురుషోత్తముఁడు ॥ఇది॥

తటుకున శ్రీహరి తన్ననే కొలిచిన
పటుగతితో మోక్షపదము సులభమనె
ఘటన " మాముపేత్యతు కౌంతేయ" మహిని
నటనఁ "బునర్జన్మ న విద్యతే" ॥ఇది॥

యిన్నిటా శ్రీ వేంకటేశ్వరు సేవె
పన్నినగతి నిహపరసాధన మదే
మన్నించి యాతఁడే " మన్మనా భవ" యని
అన్నిటా నందరి కానతిచ్చెఁగాన ॥ఇది॥ 71

---

° యౌవనము' కావచ్చు

## ధన్నాసి

అందులకు నందులకు హరిసేసినలంకే
కందువసంసారమందే కలదు మోక్షము గాన(క?) ॥పల్లవి॥

దేహ మెన్నాళ్లు దిరిగె భూమిమీఁద
దాహపులంపటములతగు లన్నాళ్లు
వూహించి విసుగవద్దు వొల్లనన్నఁ బోవవి
శ్రీహరి నందే తలఁచి చెలఁగఁగవలెఁగాన(క?) ॥అందు॥

దీపనమెన్నాళ్లు మేనఁ దిరమై మెలఁగుచుండు
తాపపుటాసలమీఁదితగు లన్నాళ్లు
పైపైఁ గోపించరాదు పాయుమన్నఁ బాయ వవి
శ్రీపతి నందే తలఁచి చెలఁగఁగవలెగాన(క?) ॥అందు॥

యెఱుక యెన్నాళ్లు మతి నెనసి పాయకయుండె
తఱమేయింద్రియములతగు లన్నాళ్లే
వొఱలి బంధించవద్దు వున్నతి శ్రీవేంకటేశు-
మఱఁగు చొచ్చి మఱచి మట్టుపడవలెఁగాన(క?) ॥అందు॥ 72

### 313 - రేకు పాడి

తొల్లి కలవే ఇవియు తొల్లి తానుఁ గలఁడే
కల్లయునుఁ గాదు ఇది కడు నిజము గాదు ॥పల్లవి॥

కనుదెరచినంతనే కలుగు నీ జగము
కనుమూసినంతనే కడుశూన్యమౌను
కనురెప్ప మరఁగునవె కలిమియును లేమియును
తన మనోభావనలఁ దగిలి తోఁచీని ॥తొల్లి॥

---

౧ ఈ పాటలో పల్లవి కడపట ప్రతి చరణము కడపట వున్న 'గాన లోని న కారమునకు బదులు క కారము సూచించినారు పూర్వ పరిష్కర్తలు గాక అంటె సంభావన 'గాన' హేతువాదికము

తలఁచినంతనె యెంతదవ్వయినఁ గాన్పించు
తలఁపు మరచినమతికి దట్టమౌఁ దమము
పొలసి మతిమరఁగుననె పుట్టుటలుఁ బోవుటలు
పలుచంచలవికారభావ మీ గుణము ॥తొల్లి॥

ముందు దాఁ గలిగితే మూఁడు లోకములుఁ గల-
వెందుఁ దా లేకుంటే నేమియును లేదు
అంది శ్రీవేంకటేశుఁ డాత్మలోననె వీఁడె
కందువల నితనిసంకల్ప మీపనులు ॥తొల్లి॥ 73

## శ్రీరాగం

చదివితిఁ దొల్లి కొంత చదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను యెంతైన నయ్యో ॥పల్లవి॥

వొరుల దూషింతుఁగాని వొకమారైన నా-
దురితకర్మములను దూషించను
పరుల నవ్వుదుఁగాని పలుయోనికూపముల
నరకపునామేను నవ్వుకోను ॥చది॥

లోకులఁ గోపింతుఁగాని లోని కామాదులనేటి-
కాకరిశత్రులమీఁదఁ గడుఁ గోపించ
ఆకడ బుద్దులు చెప్పి అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ దెలుసుకోలేను ॥చది॥

యితరులదుర్గుణము లెంచి యెంచి రోతుఁగాని
మతిలో నా యాసలు మానలేను
గతిగా శ్రీవేంకటేశుఁ గని బ్రదికితిఁగాని
తతి నిన్నాళ్లదాఁకా దలపోయ లేను ॥చది॥ 74

## బౌళి

ఉన్న దిందునే వొక్క విచారము
కన్నది గానుపు ఘనపుణ్యులకు ॥పల్లవి॥

అగపడి పవిత్ర మపవిత్రంబును
జగమొక్కటనే జరగెడిని
పగటున నిది నా భావవికారమొ
జగదీశ్వరునిరచననేరుపులో ॥ఉన్న॥

అలరినజ్ఞానము నజ్ఞానంబును
తలఁ పొక్కటనే తగిలెడిని
చలమున నిది నా సహజపు గుణమో
పెలుచగు శ్రీహరి పెరరేఁపనలో ॥ఉన్న॥

దాహపు నాలో ధర్మ మధర్మము
దేహ మొక్కటనె తిరిగెడిని
శ్రీహరి నాయాత్మ చేరిన ఫలమో
యీహల శ్రీవేంకటేశ్వరు కరుణో ॥ఉన్న॥ 75

## గుజ్జరి

ఇహమే పరము మరి యింతా నీ మయముగాన
సహజపుసంసారమే మోక్షము సరుసవిరక్తికి నెడ మేదయ్యా ॥పల్లవి॥

నీయందే బ్రహ్మ మరి నీయందే రుద్రుఁడు
నీయందే సచరాచరమును నీయందే యీజగము
చాయలనే యెడనెడ నే నేమిచూచినా సర్వము నీధ్యానమేకాక
యీయెడ నీయర్ధములో నితరంబిది యొఁగాదన నెడమేదయ్యా ॥ఇహ॥

నీ చేఁతలే రాత్రులుఁబగళ్లు నీ చేఁతలే కాలత్రయము
నీ చేఁతలే సర్వజంతువులనిశ్చలచైతన్యములు
చేచేత నే చేసినవెల్లా శ్రీపతి నీయాజ్ఞావిధులే
యేచాయలఁ బుణ్యాపాపములకును యెంచఁగఁ బెంచఁగ నెడమేదయ్యా ॥ఇహ

నీ శరణాగతి యొక్కటి గలిగిన నిజము గల్లలకు వెఱపేలా
ఆశల నీవంతర్యామివిగన అందిన దేహమె వైకుంఠము
రాసికినెక్కినశ్రీవేంకటగిరిరమణుఁడ నీ వుపదేశమిది
యీశ పరాత్పర తనిసితి మిందే యిఁక నొకటి గోర నెడ మేదయ్యా 76

## శుద్ధవసంతం

హరి "సర్వపాపేభ్యో అహం త్వా" యనె
గరిమ నా వాక్యమే ప్రమాణమైనట్టిగతి యొక్కటే నాకు ॥పల్లవి॥

యిన్నిజన్మములఁ బుట్టి యేఁ జేసినపాపములు-యిఁక
నన్నిజన్మములఁబుట్టి అట్టె పుణ్యములు సేసి అవి పాపుకోఁగలనా
పన్నినదొంతులపై ( బడ నొక్క గుదియపెట్టు
వున్నతి మోఁదినయట్టు హరిశరణాగతి యదియొక్కటే నాకు ॥హరి॥

యింతగాల మింద్రియముల నిట్టె సాఁగినతలఁపు - యిఁక
నంతగాలము చిత్త మాఁగి [°] యాఁగి నే నది దిప్పుకోఁ గలనా
చెంతఁ బంటెఁడుపాలలో నొక చల్లబొట్టు చేమిరివెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యది యొక్కటే నాకు ॥హరి॥

పలుశాస్త్రములు చూచి బహుదేవతలఁ గొలిచి పఱచైనయీదేహము
పలుసందేహములను వచ్చినతెరువునను పాపుకో నేఁ గలనా
యిల నంధకారపుటింటిలో నొకదీప మెత్తి మెఱసినట్టు
వొలసి శ్రీవేంకటపతిశరణాగతి వొకటే గతి నాకు ॥హరి॥ 77

---
[°] యాఁగి ఈ పదము పూర్వముద్రణలో జారిపోయినది

314 - రేకు లలిత

నిత్యసుఖానంద మిదె నీ దాస్యము
సత్యములేనిసుఖాలు చాలుఁ జాలు నయ్యా ॥పల్లవి॥

కన్ను చూపులసుఖము కడు నీచక్కనిరూపె
యెన్నఁగ వీనులసుఖమిదె నీపేరు
పన్ని నాలుకసుఖము [7] పాదపు నీతులసి
వున్న సుఖముల తెరు వొడఁబడమయ్యా ॥నిత్య॥

తనువుతోడిసుఖము తగు నీకైంకర్యము
మనసులోసుఖము నీ మంచిధ్యానము
పనివి యూర్పుసుఖము పాదపద్మమువాసన
యెనయనిపెరసుఖ మేమి సేసేనయ్యా ॥నిత్య॥

పుట్టుగు కెల్లసుఖము పొల్లులేనినీభక్తి
తొట్టి కాళ్లసుఖము పాతురలాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలిచెన్నుఁడవై
వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా ॥నిత్య॥ 78

మంగళకౌశిక

జీవములు దవ్వవోయ చీమలునుఁ బుట్టచొచ్చె
వేవేలయిన నిది విడువనయ్యా ॥పల్లవి॥

చింతలిన్నియుఁ బాసె చిత్తమింతట రోసె
యెంత లే దీయాసలు యిఁకనేలయ్యా
అంతలో గురునిగంటి హరికే శరణంటి
దొంతులభవములాల తొలఁగరో ॥జీవ॥

---

[7] 'నీ పాదపు తులసి' అనుట సహజము

గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె
యెక్కడిపలురుచులు యిఁకనేలయ్యా
చిక్కె విజ్ఞానము నేఁడె ⁰ జిహ్వ నారాయణుఁగూడె
వుక్కునఁ బాపములాల వుడుగరో ॥జీవ॥

జీవుఁడు పావనమాయ దేవుఁడే జీవనమాయ
యీవలి యావని(లి?) కర్మమిఁక నేలయ్యా
శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను
భావపుబంధములాల పారరో ॥జీవ॥ 79

## తోడి

ఇంతే యింతే యింకా నెంత చూచినా
చింతలఁ జిగురులెక్కి చేఁగదేరినట్లు ॥పల్లవి॥

వుల్లములో నెంచనెంచ నుద్యోగములే ² పెక్కు
పొల్లకట్టు దంచదంచఁ బోగులైనట్టు
బల్లిదుని హరినాత్మ భావించుటొకటే
ముల్ల(ల్లు?) ముంటఁ దీసి సుఖమున నుండినట్లు ॥ఇంతే॥

ఆనినసంసారమున నలయికలే పెక్కు
చానిపిఁ జవి వేఁడితేఁ జప్పనైనట్టు
పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే
నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు(?) ॥ఇంతే॥

వెనకఁ దలఁచుకొంటే విజ్ఞానములే పెక్కు
తినఁ దిన వేమెల్లాఁ దీపైనట్టు
చనవై శ్రీవేంకటేశుశరణనుటొక్కటే
పనివడి చెఱకునఁ బండువండినట్లు ॥ఇంతే॥ 80

⁰ జింహ్వా రేకు ² 'పిక్కు' రేకు

## నారాయణి

హరిశరణాగతి యాతుమది
సరుస నిదియపో సతమయ్యేడిది ॥పల్లవి॥

దినదినరుచులివి దేహమువి
చెనకేటికోరిక చిత్తమిది
యెనసేటికాంతలు యింద్రియంబులవి
పనివి యాత్మకివి పనిలేదయ్యా ॥హరి॥

పదరేటికోపము పావ(ప?)మిది
అదనఁ గాలములు అనాదివి
నిదుర తమోగుణనిలయమిది
యెదుట నాత్మకివి యెరవెరవయ్యా ॥హరి॥

కాయపు జననము కర్మమిది
మాయలంపటము మమతలది
యేయెడ శ్రీవేంకటేశుఁ డితనికృప
పాయనియాత్మకుఁ బ్రమాణమయ్యా ॥హరి॥ 81

## దేశాక్షి

ఎదిరికి మాకును యెక్కుడుతక్కువ లివి
పదిలపుజ్ఞానముచేఁ బవిత్రమాయ ॥పల్లవి॥

మహిఁ బొడమినవెల్లా మంచివే యందులోఁ
దహతహ దేహమే తగనిది
[1] యిహములో తృణములుయెండినా యోగ్యములాయ
బహి నిర్జీవపుమేను పనికిరాదాయ ॥ఎది॥

---

[1] 'యేహము' రేకు

పుడమిఁ జల్లినవెల్ల పురుషార్థపదములే
కడుపున నిడుకొంటేఁ గానివి
గుడికొని యితరపు గోమయమే శుద్ధి యాయ
అడరి మానుషధర్మ మతిహేయమాయ ॥ఎది॥

హరిసేవ గురుసేవ నాత్మజ్ఞానమున కెక్కె
° పారలింపుఁగర్మమే పుణ్యమంటెకే(?)
అరిది శ్రీవేంకటేశుఁడంతరాత్మకుఁ డితని
శరణనుటే సర్వసాధనమాయ ॥ఎది॥ 82

## దేసాళం

గుల్ల గుల్లే రాయి రాయే గురి యెంతవేసినాను
అల్లనాఁడే అడియాస లవియేల విడుతు ॥పల్లవి॥

మహిలోన రోగములు మాన మందు గద్దుగాక
సహజగుణము మాన్పఁజాలుమందు గలదా
బహుబంధములు నీవే పాపితే నేమోకాని
అహరహమును నేనే అవియేల విడుతు ॥గుల్ల॥

తనరూపమద్దములో తగఁ జూడవచ్చుఁగాక
మనసు దా నద్దములో మరి చూడవచ్చునా
దినచంచలము నీవే తీర్చితేనేమో కాని
అనుఁగుసంశయము నేనదియేల విడుతు ॥గుల్ల॥

నాలుకచే రుచులెల్ల నంజి చూడవచ్చుఁగాక
జాలిఁబడ్డకన్నులచేఁ జవి గానవచ్చునా
యేలి శ్రీవేంకటేశ నీవిట్టే కాతువుగాక
వేళ జీవుఁడను నా విధమేల విడుతు ॥గుల్ల॥ 83

---

'పారలింపుఁగర్మ మేపుణ్యమంటెరే (మందెరే)' అని కావచ్చునేమో!

5 - రేకు సామంతం

పట్టినవ్రతమే పంతము హరితో
గుట్టున శరణని కొంకఁగఁదగవా ॥పల్లవి॥

అవ్వల రోసినయన్నము గుడిచిన
నెవ్వరు నవ్వరు యిఁకనేలా
రవ్వగ నొల్లక రాజసము విడిచి
దవ్వులఁ జేకొనఁదగవా మనకు ॥పట్టి॥

విడిచినభూతము వెస మరలించిన
యెడయనియేహిత విఁకనేలా
యిడుమలఁ బిలుచుచు నిచ్చిన నొల్లక
అడుగఁ బోయితే నమరునె మనకు ॥పట్టి॥

శ్రీవేంకటపతిసేవవారమై
యీవిధిఁ బరులసే విఁకనేలా
కై వస మీతఁడు కంటి మితనికృప
యీవల నావల నెదురా మనకు ॥పట్టి॥ 84

సాళంగనాట

ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు
వొక్కఁడేనిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు ॥పల్లవి॥

పెట్టినజంగదండ పిడికిటిమొలచేయి
అట్టె వలచేయెత్తినయాయితము
తొట్టిన పెంజెమటలు తోడనె బుసకొట్టులు
వుట్టిపడీఁ జూడరమ్మ వుగ్రహనుమంతుఁడు ॥ఎక్క॥

నిక్కినకర్ణములు నింగిమోఁచినబొమ్మలు
చక్కశిరసుపైఁ బారఁజూచినతోఁక
చుక్కలు మొలపూసలు సూదులవాఁడిరోమాలు
వుక్కుమీరెఁ జూడరమ్మ వుగ్రహనుమంతుఁడు ॥ఎక్క॥

పుట్టుఁగౌపీనము మహాద్భుతయజ్ఞోపవీతము
గుట్టుచూపనికనకకుండలములు
పట్టపు శ్రీవేంకటేశుబంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజనగరపువుగ్రహనుమంతుఁడు ॥ఎక్క॥ 85

## శంకరాభరణం

పరమవైష్ణవులభాగ్యం బిదివో
నిరతివారలకె నే మొక్కెదను ॥పల్లవి॥

తలఁచ రొకప్పుడు ధరణి భోగములు
తలఁచ రితరమతదైవముల
తలఁతు రొకటి హరిదాసులదాస్యము
తలఁపు మోక్షములతగులమి(మె?) గాన ॥పర॥

కోరరు బ్రహ్మాదిగురుతరపదములు
కోరరు మేరువుకొనసుఖము
కోరుదురు తదియ్యకోట్లసంగము
కోరిక భక్తితోఁ గూఁడీగాన ॥పర॥

వొల్లరు కర్మము [1] లొల్లరు పుణ్యము-
[2] లొల్లరహంకార మొకపరియు
వుల్లము శ్రీవేంకటోత్తము శరణని
యెల్లందుఁ దుదిపద మెక్కిరిగాన ॥పర॥ 86

---

[1] లొలరు రేకు [2] 'లొలర రేకు

## ముఖారి

ఇందులోనఁ గలసుఖ మింతే చాలు మాకు
నిందు వెలియైనసిరు లేమియు నొల్లము ॥పల్లవి॥

ఆదిదేవు నచ్యుతు సర్వాంతరాత్మకుని
వేదవేద్యుఁ గమలాక్షు విశ్వపూర్ణుని
శ్రీదేవు హరి నాశ్రితపారిజాతుని
ఆదిగొని శరణంటి మన్యము నేమొల్లము ॥ఇందు॥

పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము ॥ఇందు॥

అనుపమగుణదేహు నణురేణు పరిపూర్ణు
ఘనుఁ జిరంతనుని కలిభంజను
దనుజాంతకుని సర్వధరు శ్రీవేంకటపతిఁ
గని కొలిచితిమి యేగతులు నేమొల్లము ॥ఇందు॥ 8

## వరాళి

హరికే మొఱవెట్టు టంతేకాక
గరిమ వేరొకటను గతి గానవచ్చునా ॥పల్లవి॥

పాపపుణ్యాలంపటాలఁ బరగినజీవునికి-
నోపనవచ్చునా వొడలిమోపు
[1] కోపపు శాంతము(?) చేతఁ గొట్టువడ్డప్రాణికి
తాపపు కర్మపువెట్టి తప్పించుకోవచ్చునా ॥హరి॥

[1] కోపము కావచ్చు

ఆఁకటినీరువట్టుల కగపడ్డదేహికి
తోఁకసంసారపుటాజ్ఞ తోయవచ్చునా
సోఁకుసుఖదుఃఖములఁ జొచ్చినజంతువునకు
మూఁకలలోకపులగ్గములఁ బాయవచ్చునా ॥హరి॥

సారె రాత్రిఁ బగటాను చచ్చిపుట్టేజంతువుకు
[1] భారపుటాసల లోనఁ బాయవచ్చునా
యీరీతి శ్రీవేంకటేశు నిటు శరణన్నఁగాక
ధారుణిఁ [2] బంచబాణము దప్పుకొనవచ్చునా ॥హరి॥ 88

## బౌళి

అడ్డములేనినాలిక నాడుదురుగాక భూమి
దొడ్డవాఁ డేమిసేసినా దోస మందు నేది ॥పల్లవి॥

ఆతుమలో మదనుఁడవయ్యేవాఁడవు నీవే
ఆతల నాలిమగఁడునసేవారలు నీవే
ఘాతల పరాంగనఁ గలసితివని నిన్ను
తోతో మునుల కిఁక దూరఁ జోటేదయ్యా ॥అడ్డ॥

దేహములోపలనున్నదీపనాగ్నియు నీవే
దాహము నాఁకలి నీవే తగురుచులెల్ల నీవే
ఆహా శబరియెంగి లారగించితనుమాట
సోహల నిందించి నవ్వఁ జోటిందు నేది ॥అడ్డ॥

పుట్టుగులోపలనున్నభోగము[3]లన్నియు నీవే
ఇట్టె ఆచారములు హీనాధికములు నీవే
గుట్టున శ్రీవేంకటేశ గొల్లఁడవై పుట్టినందు-
కుట్టిపడి యెవ్వరికి నూహించఁజోటేది ॥అడ్డ॥ 89

[1] 'భారపుటాసలు'కావచ్చు [2] 'పంచబాణుని'కావచ్చు [3] 'లనియు' రేకు

316 - రేకు గుజ్జరి

"సర్వం విష్ణుమయం" బనుభావము సత్యం సత్యం బిన్నిటను
సర్వేశ్వరుఁడే పొందేటివస్తువు శరణాగతియే వుపాయము ॥పల్లవి॥

తాననియెడిబుద్ధి దైవంబందు నునిచి
తానే తనమతి మరచిన సుఖతత్వానందమిది
మేననియెడిబుద్ధి యీమేదిని ప్రకృతియందు
ఆనింపుచుఁ దా మమతలు విడిచిన నాత్మజ్ఞానంబు ॥సర్వం॥

పొరలి జగమనేబుద్ధి మాయపై నునిచి
పరగినయింద్రియముల గెలిచినదే పరమపుయోగంబు
పొరిఁ గర్మపుబుద్ధి పుట్టువుపై నునిచి
వెరవునఁ బాపముఁ బుణ్యము విడుచుట వివేకమగుదుదిపదము॥సర్వం॥

వెలిఁ దోఁచినబుద్ధి వేగమే లోనునిచి
చలమున చంచల ముడిగియుండుటే సమాధిలక్షణము
పలుభావపుబుద్ధి భక్తి వొకట నునిచి
యెలమి శ్రీవేంకటపతిఁ గలయుటే యిది తుర్యావస్థ ॥సర్వం॥ 90

లలిత

తలఁపులోనివెలితే దైవమువెలితొ
కలగినఇదియే కారణము ॥పల్లవి॥

యెదిటి యాసలకు నెడసి తొలఁగుటే
తుద నరకములకుఁ దొలఁగుట
వదలక ఇంద్రియవర్గము గెలుచుటే
పదపడి తనపాపముల గెలుచుట ॥తలఁ॥

మగటిమి సంసారమాయ దాఁటుటే
తగుభవవారిధి దాఁటుట
జగములోపలను శాంతిగలుగుటే
అగణితమోక్షమునందుఁ బొందుట ॥తల॥

మహి ఇంతా హరిమయముగఁ గనుటే
విహితపుజ్ఞానము వెసఁ గనుట
ఇహమున శ్రీవేంకటేశు శరణనుటే
సహజపుజన్మము సఫలం బనుట ॥తల॥ 91

## రామక్రియ

మరుగుచుఁ జేసీ మానదుద్యోగము
నరహరి నీకృపే నాగతి గలది ॥పల్లవి॥

అనుపమమైనభయంబున నరకము
వినియెదఁగాని వెరచి విడువను
మనియెడిజీవులమరణభవంబులు
కనియెదఁగాని కలంగదు మనసు ॥మరు॥

రాసులమలమూత్రపుసోదన లిటు
○ సేసీఁగాని చీ యనదు తనువు
ఆసలనర్థపుటార్జనయలపుల
వేసరుదుఁగాని విరతి నిలుపను ॥మరు॥

నిరతముఁ దలఁపఁగ నిదురయుఁ దెలివియు
తొరలీఁగాని తొరలనీదు గుణము
యిరవగు శ్రీవేంకటేశ్వర నీవే
పరమాత్మవు ననుఁ బాలించఁగదే ॥మరు॥ 92

○ సేసీ రేకు ప్రాసభంగము

## సాళంగనాట

వెలినుండు లోనుండు విశ్వ మింతటనుండు
జలజాక్షుశరణమే సాధనము సుండీ ॥పల్లవి॥

మిక్కిలిఁజేసేపాపమే మీఁద నరకమై తోఁచు
నిక్కి తానే అద్వ(ద్ద?)ములోనీదై (డై ?)నట్లు
వొక్కట మొదలులేక వుంటేఁ గొనాలేదు
గుక్కకిహపరములు కోరినంతే సుండీ ॥వెలి॥

మహిఁ దొల్లి చూచినూరే మతిలోనఁ దోఁచీని
గహనపు కాఁపురమే కలయైనట్లు
సహజమై పుట్టులేక చావులే దెవ్వరికి
విహితసుఖదుఃఖములు వేఁడినంతే సుండీ ॥వెలి॥

యెండగాసేబయటనే యెక్కువవెన్నెల గాసీ
దిండురేయిఁబగలొక్కదినమైనట్లు
నిండుజీవుఁడు లేకుంటే నిక్కపుదేవుఁడు ౧ లేఁడు
అండ శ్రీవేంకటేశుఁడే అంతరాత్మ సుండీ ॥వెలి॥ 93

## పాడి

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము
నట్టనడిమిదొరలు నాకియ్యవలెనా ॥పల్లవి॥

పల్లకీలు నందలాలు పడివాగెతేజీలు
వెల్లవిరి మహాలక్ష్మివిలాసములు
తల్లి యాకె౨మ(గ)నినే దైవమని కొలిచేము
వొల్లఁగే మా కేసిరులు వొరు లియ్యవలెనా ॥పుట్టు॥

---
౧ 'లేఁడు' రేకు ౨ 'మనినే' రేకు

గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమనిభూకాంతకు నంగభేదాలు
భామిని యాకెమగని ప్రాణధారి లెంకలము
వోమి మాకాతఁడే యిచ్చీ వొరులియ్యవలెనా ॥పుట్టు॥

పసగలపదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీవేంకటేశుఁడు
యెసఁగి యాతఁడే మమ్ము నేలి ఇన్నియు నిచ్చె
వొసగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా ॥పుట్టు॥ 94

## రామక్రియ

దైవమ నీవే దయదలఁచుట గా-
కావలఁ బ్రాణికి యా (నా?) సేదయ్యా ॥పల్లవి॥

ఆస వొకటి యెంతయినాఁ దనియదు
వాసి యొకటి తనవంతులు మానదు
యీసొకటి శాంతమెరఁగని దిదె
మోసపుదేహికి ముక్తి యేదయ్యా ॥దైవ॥

పాపమొకటి భవబంధముఁ బాపదు
దీపనమొక్కటి ధీరత యొల్లదు
చూపొక టింద్రియసుఖముల గెలువదు
యేపునఁ బ్రాణికి యెఱుకేదయ్యా ॥దైవ॥

పాయమొకటి చాపలములు మానదు
కాయమొకటి తనకర్మము విడువదు
యీయెడ శ్రీవేంకటేశ్వర నీసేవ
సేయని యాత (త్మ?)కు సెలవేదయ్యా ॥దైవ॥ 95

317 - రేకు మలహరి

కటకట యీమాయ [1] గడమట యెట్లో
ఘటనలహరికృప గలిగినఁగాక ॥పల్లవి॥

యిరవగుజీవుల కెంతగలిగినా
పరధనకాంతలే బలుప్రియము
ధరఁ గర్మపుఁజేఁతలలోనెల్లా
సొరిదిఁ బాపమే సులభము ॥కట॥

నానారుచులు యనంతము గలిగిన
కానిపదార్థమె కడుఁ దీపు
పానినచదువులపరన లుండఁగా
మాననిదుర్భాషమాఁటలే హితవు ॥కట॥

యెదలో శ్రీవేంకటేశ్వరుఁడుండఁగ
[2] సదరపుదివిజులు చవులయిరి
అదనను శ్రీగురుయానతి గలుగఁగ
పొదిగొని యివి తలపోయఁగ వలసె ॥కట॥ 96

దేవగాంధారి

ఆహా నమో నమో ఆదిపురుష నీకు
యీహల నే నెంతవాఁడ నెట్టు గాచితివి ॥పల్లవి॥

లోకాలోకములు లోననించుకొన్ననీవు
యీకడ నాయాత్మలోన నెట్టణఁగితి
ఆకడ వేదములకు నగోచరమైననీవు
వాకుచే నీనామములు(ల?) వడి నెట్టణఁగితి ॥ఆహా॥

---

[1] గడమట' రేకు [2] సదరపు దివిజులు = సాధారణ దేవతలు

అన్నిటా బ్రహ్మాదులయజ్ఞభోక్తవైన నీవు
అన్నపానములివి యెట్టారగించితి
సన్నుతి పూర్ణుఁడవైజనియించిననీవు
వున్నతి నాపుట్టుగులో వొకచో నెట్టుంటివి ॥ఆహా॥

దేవతలచే పూజ తివిరికొనిననీవు
యీవల నాచే పూజ యెట్టు గొంటివి
శ్రీవేంకటాద్రిమీఁద సిరితోఁగూడిననీవు
యీవిధి నాయింట నీవు యెట్టు నిలిచితివి ॥ఆహా॥ 97

బౌళి

నీవే నీదాసులని నినుగంటిఁ గంటిని
ఆవలనీవే అంతర్యామివిగాన ॥పల్లవి॥

నీదాసులశిరసులే నీదివ్యశిరసులు
నీదాసులపాదములే నీదివ్యపాదములు
నీదాసులకన్నులే నీ దివ్యనేత్రములు
నీదాసులరూపమే నీ విశ్వరూపము ॥నీవే॥

నీకింకరులగుణాలే నీదివ్యగుణములు
నీకింకరులున్నచోటే నీకు నిత్యవై కుంఠము
నీకింకరులసేవ నీవు మెచ్చునిజసేవ
నీకింకరులకూటమే నీకు సర్వాంగములు ॥నీవే॥

యిందరిలో శ్రీవేంకటేశ నీవే పో యంటే
అంది తల్లిముట్టై యుంటే నంటవచ్చునా
యెందు నజ్ఞానపు ముట్టు యెడసినాత్మలుగాన
నిందలేని నీదాసులే నీపని సేవింతును ॥నీవే॥ 98

## ధన్నాసి

ఆయంబిది తెలియంగల దీయాత్మజ్ఞానంబు
మాయలు యీకాలము కర్మము మాధవునాధీనము ॥పల్లవి॥

దేహమునకు నీడ తిరిగినయటువలెనే[౦]
శ్రీహరికిని కళావిధమై జీవుఁడటు దిరుగు
దేహమునకుఁ గలచైతన్యము తెగి నీడకు లేదు
శ్రీహరికిని గలస్వతంత్రము జీవునికి లేదు ॥ఆయం॥

కలలోపలఁగలసుఖము ఘనసంతోషము కొరకే
యిలలోపలఁగలిగినసుఖము ఇది సంతోషము కొరకే
కలలోపలివి జీవునిసంకల్పనలిన్నియును
ఇలలోపలిప్రపంచ మింతయు నీశ్వరుసంకల్పము ॥ఆయం॥

చెదరని [౨] బాహ్యపువిషయములు జీవునిపాలిటివి
పదిలంబగు అంతరంగమే పరమపువైకుంఠము
అదనెరిఁగి కాలగాలమున ఆతుమ శ్రీవేంకటపతికి
పొదిగి యాతనికి శరణని కొలిచిన పొందగు ముక్తికి యిది గీలు॥ఆయం॥99

## పాడి

పాపపుణ్యములపక్వ మిదెరఁగను
నాపాలిటిహరి నమో నమో ॥పల్లవి॥

మానసవాచక మరి కర్మంబుల
తానకముగ నీదాసుఁడను
పూని త్రిసంధ్యల భోగభోగ్యముల
నానాగతులను నమో నమో ॥పాప॥

[౦] ఇక్కడ పాదము చివరుండవలసిన నిలుగీత లేదు [౨] బాంహ్యా రేకు

వలనుగ జాగ్రస్వ (త్స్వ?) ప్నసుషుప్తుల
యిలలో నీకేని హితభటుఁడ
వెలుపల లోపల వేళావేళల
నలినాక్ష నీకే నమో నమో ॥పాప॥

పుట్టకతొలుతను పుట్టినమీఁదట
అట్టే నీశరణాగతుఁడ
గట్టిగ శ్రీవేంకటపతి నీకృప
నట్టనడుమైతి నమో నమో ॥పాప॥ 100

## రామక్రియ

ఇందరిపై భిన్నభక్తులేఁటికి మా కిఁక
అందరిలో అంతరాత్మ యాతనిరూపే ॥పల్లవి॥

తల్లియై యుండేవాఁడు తగ నితనిరూపే
యెల్లగాఁ దండ్రైనవాఁడు నితనిరూపే
యిల్లాలై సుఖమిచ్చు నితనిమహిమరూపే
వెల్లవిరిఁ దనయు లీవిష్ణునిరూపే ॥ఇంద॥

గ్రామదేశకులములు ఘనుఁ డితనిరూపే
కామించునర్థ మీతఁడై కలుగు నీరూపే
దీమసాన నిహపరద్రిష్టము లితనిరూపే
యేమేర దాతయు దైవ మీతనిరూపే ॥ఇంద॥

కాలము నితనిరూపే కర్మము నితనిరూపే
యేలి యాచార్యుఁడు చెప్పే దితనిరూపే
శ్రీలలనాపతి శ్రీవేంకటేశ్వరుఁడే
పాలించఁగాఁ గంటి నే నీపరమాత్మురూపే ॥ఇంద॥ 101

## 318 - రేకు గుండక్రియ

ఏపను లెవ్వరికిఁగల దెంత యంతేకాని
శ్రీపతియాణా(నా?)జ్ఞలు మీఁఱగ చింతింపఁగఁ దరమా ॥పల్లవి॥

సులభంబున సుఖియించుటఁబోలదు సొంపుగ భిక్షాన్నముతోడ
పలు లంపటములఁబడి [1] ఘడియించేటి బహుధన మిదియేల
తొలుతే జంతువులకు వ్రాసెను తొడఁగి నుదుట బ్రహ్మ
కలది దైవికములఁ గడచెదమని కడుబడలెదరేలో నరులు ॥ఏప॥

పాపము సేయకమానుటఁబోలదు పరమశాంతితోను
కోపముమానక బహుపుణ్యంబులు కోట్లు చేసినను
దీపింపఁగ వేదశాస్త్రములు తెలిపెడి యర్థ మిదే
కైపుగ నిది దెలియక జీవులు కడుబడలెదరేలో నరులు ॥ఏప॥

సహజము జగమున యీపనులెల్లను జరగుచు నుండుట స్వభావము
గహనము ప్రాణులకే పనులవు ననఁ గాదన కర్తవ్య [2] మింతేది
యిహమేల శ్రీవేంకటేశ్వరునమ్మినయీతనిశరణాగతులు
మహిలోఁ జాతురు నవ్వుదు రిటువలె మానరేటికో నరులు ॥ఏప॥ 102

### భవుళి

నీకంటే వితరము మరి లేదు నేనెవ్వరితో భాషింతు
"యేకో నారాణుఁడవు నీ"వని యెన్నుచు నున్నవి వేదములు ॥పల్లవి॥

యెక్కడచూచిన నీరూపంబులే యెవ్వరిఁజూచినఁ దోఁచీని
వెక్కసముగ నీమహిమ యనంతము విశ్వాత్మకుఁడవుగాన
నిక్కి యెవ్వరిని బేర్కొని పిలిచిన నీనామములై తోఁచీని
వక్కణించఁగా సకలశబ్దములవాచ్యుఁడవటుగాన ॥నీకం॥

---

[1] 'గడియించేటి' కావచ్చు [2] 'మిందేది' కావచ్చు

యేపనిచేసిన నీపనులే అవి యివ్వలనవ్వలఁ దోఁచీని
పాపపుణ్యమని తోఁచదు నీవే పరచైతన్యమవటుగాన
దాపుగ మతిలో నేమి దలఁచినా ధాన్యము నీదైతోఁచీని
లోపల వెలుపల నిండుకవుండెడిలోకపూర్ణుఁడవుగాన ॥నీకం॥

యీ యర్థమునకు నే నమవాఁడను యెక్కడ నున్నాఁడ నీలోనే
కాయధారినై యేర్పడి నీలోఁగాక చరించితి యిన్నాళ్లు
యీ యపరాధము యెంచకుమీ నను యిందునె పో నీశరణంటి
పాయను నిన్నిఁక శ్రీవేంకటపతి పరబ్రహమవులటుగాన ॥నీకం॥ 103

సామంతం

అచ్చుతుఁడనియెడి నామముగలిగినయట్టి నీవెకాక
కుచ్చి నీకు నేశరణని కొలిచితి గురుతుగఁ గావఁగదే ॥పల్లవి॥

అణురూపగుమశకములోపల నణఁగిన నీకంటే
గుణించి యెంచి చూచినను కొంచె మింక నేది
ప్రణుతింపంగ బ్రహ్మాండకోట్లు భరియించునీకంటే
గణనకు నెక్కుడు నీవేకాక ఘన మిఁక నేది ॥అచ్చు॥

దాకొని జగములు పుట్టించుబ్రహ్మకు తంఁడ్రివి నీవే
కైకొని చదువులఁ దెలిసిచూడ రక్షకులిఁక మరి వేరీ
యేకోదకముగ వటపత్రమున యీఁదేటినీకంటే
దీకొనిపలికినకాలంబుల కొనదేవుఁడు మతి వేఁడీ ॥అచ్చు॥

శ్రీవేంకటమున వరములొసఁగేటి శ్రీపతి నీకంటే
తావునఁ గన్నులఁజూడఁగఁ బ్రత్యక్షదైవము మరివేఁడీ
వేవేలకు వైకుంఠవిభుఁడవై వెలసిన నీకంటే
భావించి చూచిన నంతరంగమునఁ బరోక్షదైవము మరివేఁడీ ॥అచ్చు॥104

## దేవగాంధారి

హరి నే నిన్నిందులకుఁగా దర్చించి కోరెడిది
గరిమల నా యంతరంగమున నినుఁ గానఁగ నడిగెదను ॥పల్లవి॥

మునుపే యీజగమెల్లా నీవు మొలవఁగఁ బెట్టినది
వెనుకొని నేను నీవాఁడనే యని విన్నవించనేల
నినుపై యీజీవరాసులన్నియు నీరక్షణలోనివి
కనుఁగొని నన్నును రక్షించుమని మరి కమ్మరఁ జెప్పఁగనేల ॥హరి॥

యిహమునఁ గర్మాధీనంబయి సిరులియ్యఁగ నిను నింకా
మహిలో నివి యవి నాకు నిమ్మనుచు మరి యడుగఁగనేల
సహజపుఁ దల్లియుఁ దండ్రియు బంధులు సంతతి నీవై యుండఁగను
విహితముగా నిను నక్కడ నిక్కడ వెదకఁగ మరి యేల ॥హరి॥

శ్రీవేంకటపతి వరములొసంగుచు చేరువ నీవై యుండఁగను
ఆవల నీవల నితరదేవతలయాసలఁ బడనేల
దైవశిఖామణి వాదిమూరితివి తగిన స్వతంత్రుఁడవు
యేవిధులు నే నెఱఁగను నీవే యింతాఁ జూమ్మా దాఁచఁగ నేల ॥హరి॥105

319 - రేకు సామంతం

పరమాత్మ నాజాడ భావించ నిట్టిది, [౧] నీవు
నిరుహేతుకాన నాకు [౨] నీవు బుద్ధియ్యఁగదె ॥పల్లవి॥

అపరాధములు పెక్కు లటు నాయందున్నఁగాని
వుపమఁ బుణ్యముత్రోవ లూహించలేను
విపరీతపాపములు వేవేలు సేసినఁగాని
చపలగర్వము మాని శరణనలేను ॥పర॥

౧, ౨ ఇట్టి పువరుక్తి ఇట్టి పువరుక్తు లక్కడక్కడ గలవు

పలులంపటాలఁ బడి బడలినఁగాని, నాకు
పలవి నిన్నుఁ దలఁచేభక్తి లేదు
పులుసు నంజినఁగాని భూమిలో మిక్కిలి తీపు
తలపోయ నోటికి నితవు గానరాదు ॥పర॥

వేవేలు నేరాలు సేసి వెరపు పుట్టినఁగాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరదు మతి
వావిరి లోకపుమాయవలలఁ జిక్కినఁగాని
వేవేగ వెడలి ముక్తి వెదకఁడు జీవుఁడు ॥పర॥ 106

## గుజ్జరి

శ్రీపతి నీసేవ చిత్తము గోరదు
పాపములవెంటనే పారీనయ్యా ॥పల్లవి॥

తెగనికర్మము దేహములు గోరు
వగలయీపీఁగ వ్రణాలు గోరు
నగుచుఁ దొల్లింటి నా పూర్వకర్మములు
పొగరుభోగములే పొందించెనయ్యా ॥శ్రీప॥

సొకిరివయసు సంసారము గోరు
చీకురువాయులు జీడిమాను గోరు
దీకొని ౧ నాతోడి తీరనింద్రియములు
కైకొని మర్మములు గలఁచీనయ్యా ॥శ్రీప॥

౨ వేదవిజ్ఞానము విరతియే కోరు
నీదాసుఁడైతేనే నీశరణు గోరు
యీదెస శ్రీవేంకటేశ నీవు నాలో
పొదైయుండి నన్ను బ్రదికించే న(వ?)య్యా ॥శ్రీప॥ 107

౧ నాతోడ కు బదులు నాతోడి ఈ వాఙ్మయమున ఇట్టి ప్రయోగము లక్కడక్కడ గలవు ౨ వేద రేకు

## లలిత

అతనిభజియించరో ఆతుమలాల శ్రీ-
పతి యితనికరుణే ఫలమింతేకాని ॥పల్లవి॥

సంగమే భంగమే(ము?) సుండి సకలవిరక్తులాల
వెంగలివిష(య)ములే విషము సుండి
అంగపుబంధువులెల్ల అంటుబంధములు సుండి
సంగతి హరి యొకఁడే సతమింతేకాని ॥అత॥

మోహమే దాహముసుండి మోక్షోపాయకులాల
సాహససంసారమే విస్పారముసుండి
దేహము గొన్నాళ్ళకు సందేహమై తోఁచుసుండి
శ్రీహరిసేవొక్కటే వచ్చినదింతేకాని ॥అత॥

కోపమే తాపముసుండి కోరనిసాత్వికులాల
రూపులేనిభోగమెల్ల రుణముసుండి
కైపుసేసి యిన్నిటాను గడచి శ్రీవేంకటేశు-
వోపి శరణని మనేదొక్కటేసుండి ॥అత॥ 108

## మాళవి

అతఁడేపో మాయేలిక అతఁడే జగన్మూల-
మాతఁడే శ్రీవేంకటాద్రియందుమీఁదిదైవము ॥పల్లవి॥

కమలవాసినిదైవకాంతఁ బెండ్లాడినాఁ(నవాఁ?)డు
కమలములో బిడ్డఁ గన్నవాఁడు
కమలాప్తునిలోనఁ గలిగి మెరయువాఁడు
కమలనాభుఁడేపో కలుగుమాదైవము ॥అతఁ॥

జలధి బంధించి లంక సంహరించినవాఁడు
జలధిచొచ్చినదైత్యుఁ జంపినవాఁడు
జలధిసుతునకు వరుస బావైనవాఁడు
జలధిశయనుఁడేపో చక్కని మాదైవము ॥అతఁ॥

కొండ గొడుగుగనెత్తి గోవులఁగాచినవాఁడు
కొండవంటి రాకాసిఁ గొట్టినవాఁడు
కొండలకు నెక్కుడైనగురుతు శ్రీవేంకటాద్రి-
కొండరూపు దానేపో కోరిన మాదైవము ॥అతఁ॥ 109

నాట

వొద్దునీవు నాకెదురా వోరి కంసుఁడా
కొద్దిగాదు పెనఁగఁగ గోవిందుతోఁ గంసుఁడా ॥పల్లవి॥

పెరిగీ రేపల్లె నదె బిరుదునీవె(వై?)రి వాఁడే
వొరసి నన్నేలపట్టే వోరికంసుఁడా
విరసాన వెరవను విష్ణునిమాయను నీ-
గొరబైనవెడబుద్ది గొలుపదు వోరా ॥వొద్దు॥

వెదకీ నీవైరి వాఁడె వీరదానవుల నదె
వుదుటు నాతోనేల వోరి కంసుఁడా
° చిదుమనా నిన్నిపుడే సెలవీఁడుగా కతఁడు
పెదవులచేటింతే పేదవానికోపము ॥వొద్దు॥

వెన్నలుఁ బాలారగించి వెసఁవాఁడె సత్యగూడ -
నున్నవాఁడు, నిన్నుగెల్వ నోరి కంసుఁడా
వెన్నుఁడు శ్రీవేంకటాద్రివిభుఁడు లోకులఁగాచె -
నన్నిటాఁ గృష్ణావతార మందఁబట్టి నేఁడు ॥వొద్దు॥ 110

° చిదుమవా రేకు

## సామంతం

ఈతఁడే ద్రిష్టవరము లియ్యఁగాఁగాఁక
ఆతలీతలిసుద్దు లవి నమ్మఁగలమా ॥పల్లవి॥

హరిరూ పెరుఁగుదుమా అరసి ఇంతకతొల్లి
సొరిది శ్రీవేంకటేశుఁ జూచికాక
గురుమంత్రము నేర్తుమా గోవిందుఁ డితనినామ
మురుటై లోకాలనెల్ల నుండఁగాగాక ॥ఈత॥

వైకుంఠ మెరుఁగుదుమా వర్ణించి ఇంతకతొల్లి
దీకొని శ్రీవేంకటాద్రిఁ దిరిగికాక
యేకడ దేవతల నేమెందునైనాఁ గంటిమా
చేకొని హరిదాసులఁ జేరి మొక్కీకాక ॥ఈత॥

పుట్టు నేఁ గంటినా పొంచి శ్రీవేంకటపతి
వొట్టి నాయంతరాత్మై యుండఁగాఁగాక
కొట్టఁగొనపర మేడ కొంచెపుదేహి నేనేడ
అట్టె యాతనికి శరణని కొలిచికాక ॥ఈత॥ 111

## 320 - రేకు శుద్ధవసంతం

హరి నీవే సకలలోకారాధ్యుఁడవుగాక
ధర నీకు శరణంటీ తలఁపిదే చాలును ॥పల్లవి॥

కింద నేఁ జేసినయట్టి కీడు నీవు వాపఁగాను
అందుమీఁదు నడిగేదా అది చాలక
పొంది పుట్టించేటి బ్రహ్మ పుత్రుఁడు నీకైవుండఁగ
ఇందరిని గొలిచేదా యెంత కూళతనము ॥హరి॥

దీకొని నాలో నీవు దిక్కై వుండఁగాను
నాకొకస్వతంత్రమా నాఁడు(?) చాలక
కైకొని లోకములు నీకడుపులో నుండఁగాను
నీకంటేఁ బరు లున్నారా నేరమింతేకాక ॥హరి॥

ఇహపరముసిరులు ఇన్నియు నీవియ్యఁగాను
సహజాన నుండవొద్దా చాలదా యింత
విహితమైన శ్రీవేంకటేశ వొక్కండవే
బహళమై వుండఁగాను బంటనంటగాక ॥హరి॥ 112

## గుండక్రియ

జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము
శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను ॥పల్లవి॥

అరుతఁగట్టినతాళి యవె వనమాలికలు
సరుసమోఁచినడాగు శంఖచక్రములు
వరుస నొసల గురివ్రాసినది తిరుమణి
ఇర వెరిఁగితి మిఁక నెపుడై నఁ గావుము ॥జ్ఞాన॥

పళ్ళెము ప్రసాద మింతే పసగా నా రుచు లివె
పి(పె?)ల్లు నేఁ బొగడేవి నీబిరుదులు
యెల్లపుడుఁ బూజించేది ఇది నీరూపుపతిమ
కల్ల లే దిందుల నీవు గన్నదింతే కానుపు ॥జ్ఞాన॥

నిక్కము నేఁ జొచ్చినది నీలెంకతనము
చక్కనాజీవనము నీ శరణాగతి
యెక్కువ శ్రీవేంకటేశ యెదలో నున్నాఁడ విదె
చిక్కినదేమియు లేదు చిత్తమింతే ఇఁకను ॥జ్ఞాన॥ 113

## పాళంగవాట

నిన్ను నీవే తెలుసుకో నిరుహేతుకబంధుఁడ-
వన్నిటాఁ బరతంత్రుఁడ నంతేపో నేను ॥పల్లవి॥

యేమి గూడీ నేఁ గర్మ మిలపైఁ జేయఁగ నీకు
యేమి మానె నేఁగర్మ మిటు మానఁగ
[౧] భూమినీనాటక మేల పూర్ణ కాముఁడవు నీవు
కామించి కాతువుగాక కరుణానిలయ ॥నిన్ను॥

యెంత గూడపెట్టితి నే నిలమీఁదఁ బుట్టఁగాను
యెంత వష్టి వే జనించ కిట్టుండగా
వింతగుయీయాయుక్తులెల్ల [౨] వృధావాదము లింతే
సతతము నమఁ గావు సర్వేశ్వరా ॥నిన్ను॥

యెవ్వరు విన్నవించేరు ఇటు నాదెస నీకు
యెవ్వరు వద్దనేరు నీ విలఁ గావఁగా
రవ్వల శ్రీవేంకటేశ రక్షింతువుగాక
అవ్వల నివ్వల శరణాగతరక్షకుఁడా ॥నిన్ను॥ 114

## బౌళి

కనియెడి దిదియే వినియెడి దిదియే కడలఁ జదివెడి దిదియపో
నినుపునీరై సర్వజగముల నిలిచె శ్రీహరిమాయ ॥పల్లవి॥

తలఁపు నొక్కటే తాను నొక్కఁడే దైవ మొక్కఁడే పో
కలిసి పెక్కుముఖంబులై లోకంబు దోఁచెనేని
తెలియఁ జిల్లులకడవలోపలిదీపమువలెనే
అలరి వెలిఁగెడి చూడఁజూడఁగ హరిప్రపంచపుమాయ ॥కని॥

[౧] 'భూమిన్+ఈ నాటకమేల [౨] 'వ్రిధా' రేకు

దేహ మొక్కటే జీవుఁ డొక్కఁడే దినము నొక్కటేపో
మోహ°జాగ్రత్స్వప్ననిద్రలు మొనపె(సె?) భేదములై
వూహఁ బెక్కులయద్దముల చంద్రోదయమువలెను
సాహసంబున భ్రమలఁబెట్టిడి చదల నిదె హరిమాయ ॥కని॥

గురువు నొక్కఁడే మంత్ర మొక్కటే కొలువు నొక్కటేపో
అరయ భక్తియ వేరు వేరై యలరుచున్న దిదే
గరిమ శ్రీవేంకటగిరీశ్వరుకల్పితమువలెనే
వెరసి వారికి వారికే ఇది వింతవో హరిమాయ ॥కని॥ 115

పాడి

సచరాచర మిదె సర్వేశ్వరుఁడే
పచరించి యితని భావింపు మనసా ॥పల్లవి॥

కదలెటి°దంతయు కమలారమణుని-
సదరపుసత్యపుచైతన్యమే
నిదిరించెటియీనిశ్చేష్టజగమును
వుదుటువ వాతఁడు వుండేసహజమే ॥సచ॥

కలిగివుండినదె కల దింతయు హరి-
నలుగడఁ బరిపూర్ణపుగుణమే
మలసి లేనిదియు మహిమల నాతని-
నిలుకడగలిగిననిర్గుణమే ॥సచ॥

జీవరాసులగు సృష్టియింతయును
శ్రీవేంకటపతిచిత్తంబే
కైవల్యమె లోకపు టిహముఁ బరము
భావించనేర్చినపరమవిదులకు ॥సచ॥ 116

° జాగ్రస్వప్న రేకు ° దెంతయు రేకు

## సామంతం

అందుల కిదె ప్రతియౌషధము
ఇందిరాపతికి నెక్కినచింత ॥పల్లవి॥

పంచబాణములబాసట మంటిన-
చంచలమౌ నిశ్చలమనసు
పంచబాణగురుపాదము దలఁచిన
కంచుఁజంచలము గక్కన మాను ॥అందు॥

కనకపుటాసలగరళం బంటిన
ననిచినవిజ్ఞానము చెదరు
కనకగర్భు నటు గన్నతండ్రిపై
మనసిడితే నిర్మలమౌ గుణము ॥అందు॥

మునుకొనిమొదలను మొలచినససికిని
పనివడి కొననే ఫలియించు
అనయము శ్రీవేంకటాధిపుకృపగల
జను . పరము సఫలంబు ॥అందు॥ 117

## 321 - రేకు సాళంగం

వెన్న చేతఁబట్టి నేయి వెదకినట్టు
యెన్నఁగ నీవుండఁగాను యెక్కడో చూచేను ॥పల్లవి॥

కన్నులు మిన్నులు దాఁకీ కాయ మీడ వున్నఁ(ండ?)గానే
తిన్నని వీనులు మెట్టీ దిక్కులనెల్ల
యిన్నిటికొడయఁడవై యిందిరేశ నీవు నాలో
నున్నరూపు గానలేను వూహించి ఇపుడు ॥వెన్న॥

కాయము పాయము గీరీ కాల మీాద నుండఁగానే
ఆయపుమనసు ముంచీ నన్నిటియందు
యేయెడ నాలోనున్న యీాశ్వర నీ నిలయము
పాయకుండఁ గోరలేనుపాయము నాకెట్టిదో ॥వెన్న॥

ఇహమే పరము గోరీ యీాడ నిట్టె వుండఁగాను
మహిలో శ్రీవేంకటేశమహిమెట్టిదో
అహరహమును నీ వంతర్యామివై
సహజమై యుండఁ గంటి చాలు నిఁక నాకు ॥వెన్న॥ 118

## లలిత

నేఁడుగాక దొరనైతి నేను నారాయణుఁ గొల్చి
పోఁడిమి నాచార్యునిబోధవంకను ॥పల్లవి॥

దీన°వృత్తి నేఁ దిరుగని చోటేది
నానాచంచలము నా మనసు
పూని నేఁగొననిభువిలోనిరుచు లేవి
హీనజన్మములెత్తిన దీమేను ॥నేఁడు॥

చేరి నేఁ జేచేతఁ జేయనిపాప మేది
ధారుణి మోహైనసంసారమునను
ఆరయ మున్ను నేనాడనికల్లలేవి
సారెకు నుదురపోషణమునకు ॥నేఁడు॥

సూటిదప్పక నేఁ జూడని చూపేది
చేటులేనిచిరకాలజీవుఁడనే
చాటువ శ్రీవేంకటేశు శరణుచొరకతొల్లి
బూటకము లెన్ని లేవు పాలయదు కాలము(?) ॥నేఁడు॥ 119

° ప్రతి రేకు

## దేసాళం

అన్నిటా నిట్టే కాని యగపడదు
అన్నమదమునఁ <sup></sup>చిత్త మగపడదు ॥పల్లవి॥

సొలసి సంసారములో సుఖముఁ బొందేనంటే
అలమటలేకాని యగపడదు
పలుచదువులవంకఁ బరము గనేనంటే
అల సంశయమేకాని యగపడదు ॥అన్ని॥

వెడదేహము మోఁచి విరతిఁ బొందేనంటే
అడియాసలేకాని యగపడదు
సడిఁ గోపమే యుండఁగ శాంతిఁ బొందేనంటే
అడవిఁబడుటేకాని యగపడదు ॥అన్ని॥

నేరిచి నీ మాయలోన నిజభక్తి గనేనంటే
ఆరీతి నాటడేకానియగపడదు
మేరతో శ్రీవేంకటేశ మించి నీకే శరణంటే
ఆరి తేరి కర్మబంధ మగపడదు ॥అన్ని॥ 120

## బౌళి

చదివి చదివి వట్టిజాలిఁబడు టింతేకాక
యెదుట నిన్ను గానఁగ నితరులవశమా ॥పల్లవి॥

ఆకాశముపొడవు ఆకాశమేయెరుఁగు
ఆకడ జలధిలోఁతు ఆ జలధే యెరుఁగు
శ్రీకాంతుఁడ నీ ఘనము చేరి నీవే యెరుఁగుదు-
వీకడ నింతంతన నితరుల వశమా ॥చది॥

---

1 చిత్తము రేకు 2 'జలదే' రేకు

నదులయిసుకలెల్ల నదులే యెరుఁగును
కదిలి గాలియిరవు గాలికే తెలుసు
అదన నాత్మగుణము లంతరాత్మ నీవెరుగు-
దిదియదియనిచెప్ప నితరులవశమా ॥చది॥
శ్రీవేంకటేశ యిన్నిచింతలకు మొదలు
యీవల నీ శరణంటే యిటు నీవే యెరిగింతు
దైవమా నీ కల్పనలు తగ నీవే యెరుఁగుదు-
వీవల నొఁగాదన నితరుల వశమా ॥చది॥ 121

## శ్రీరాగం

ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము
సత్యరూప జోలిదవ్వి జాలిఁబడ నోపము ॥పల్లవి॥

కన్నవా రెవ్వరు నిన్ను కన్నులయెదుటను
పన్ని నీదాసులు చూచేభావమువలె
విన్నవా రెవ్వరు నీవిభవపుమాటలు
అన్నిటా నాచార్యుని యానతివలె ॥ప్రత్య॥

తొడఁగి నీ ప్రసాదము దొరకినవా రెవ్వరు
జడియు నీ దాసుల ప్రసాదమువలె
కడు నీ పాదతీర్థము కడగన్నవా రెవ్వరు
బడి బడి నీ భక్తపాదజలమువలె ॥ప్రత్య॥

యేచి పరంధామమున కేఁగినవా రెవ్వరు
చాచిన నీ దాసుల సన్నిధివలె
చూచితి శ్రీవేంకటేశ సొంపుల నీ మహిమెల్ల
తాచిన నీ దాసానుదాసులయందే ॥ప్రత్య॥ 12

## దేవగాంధారి

తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి-
రిల నిదెరఁగనిది యేఁటిదోకాక ॥పల్లవి॥

కరుణానిలయుఁడట కరుణకు వెలితా
వెరవుతో నేఁ గొల్వనివెలితిగాక
నరహరి ఇతఁడట నరులఁ గాచుటరుదా
శరణననివెలితి జనములదిగాక ॥తెలి॥

వెస లక్ష్మీపతియట వితరణములేదా
పసఁదన్నేకోరనిమాపాపముగాక
యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
ససువై మొక్కనివెర్తి జగములదిగాక ॥తెలి॥

శ్రీవేంకటేశుఁ డట చిత్తములో లేఁడా
భావించి నమ్మినది మాభాగ్యముగాక
వావాత నింతటివాఁడు వరములీలేఁడా
వోవలఁగొలగానేదేవోటికింతేకాక(?) ॥తెలి॥ 123

## 322 - రేకు నారాయణి

అన్నిటిపై నున్నట్లు హరిపై నుండదు మతి
కన్నులఁ బ్రహ్లాదువలె కనుఁగొను టరుదా ॥పల్లవి॥

పులుగు నర్చిం చొకఁడు [?]పూఁచెనాగతమెరిఁగి
వెలసి ఘనుఁడనంటా విఙ్ఞవీఁగీని
జలజాక్షుపాదములు సారె నర్చించేటివారు
ఇలలోనఁ బరమార్థ మెరుఁగుటయరుదా ॥అన్ని॥

---

[?] 'పూఁచి+అనాగతము' రేకు

మానివోడ నమ్మొకఁడు మహాజలధి దాఁటి
నానార్థములు గూర్చి నటియించీని
శ్రీనాథుపాదములు చేకొనినమ్మినవాఁడు
పూని భవవార్ధి దాఁటి పుణ్యమందు టరుదా ॥అన్ని॥

దీపమువట్టి యొకఁడు తెగనిచీఁకటిఁ బాసి
చూపులనిన్నిటిఁ గని సుఖమందీని
చేపట్టి [1]పరంజ్యోతిశ్రీవేంకటేశుభక్తుఁ-
డోపి ముక్తి కడగని వున్నతుఁడౌ టరుదా ॥అన్ని॥ 124

## గుండక్రియ

హరి పరతత్త్వంబగుటకు గురి యిది
నరుల మితఁడె యని నమ్మితిమిదివో ॥పల్లవి॥

కవగూడిన భూకాంతుఁ దలఁచిపో
దివి వెలుఁగందిరి దేవతలు
జవమున రఘుపతి శరణని మని రిదె
భువి విభీషణాదిపుణ్యులు ॥హరి॥

శ్రీతరుణీపతిసేవనే చెలఁగిరి
పాతాళాధిపబలిముఖులు
భాతిగ వైకుంఠభక్తినే బ్రదికిరి
ఘాతల ననంతగరుడాదులు ॥హరి॥

శ్రీవేంకటపతిచింతనే పొదలిరి
సోవ ముక్తిగలశుకాదులు
వావిరి నీతనివరముల వెలసెను
తోవలఁ [2]బరుషసందోహములు ॥హరి॥ 125

[1] పరంజ్యోతియగు శ్రీవేంకటేశుడు వేంకటేశుని భక్తుడు అని విగ్రహము [2] 'ఖరుష' రేకు

## లలిత

కావఁగ (క?) నీకే పోదు కరుణానిధివిగాన
దేవ నీ బంట్లము మా తెరు వేఁటి తెరువు ॥పల్లవి॥

బండుబండై వూరఁగలపనులెల్లాఁ జేసేము
యెండా (డా?) తా నీడౌతా నెఱఁగము
కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు
బెండువంటివారము మా బిగు వేఁటిబిగువు ॥కావ॥

దీనుఁడనై (లమై?) యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము
కాని దెందో మంచి దెందో కానము
శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండఁగాను
మానువంటి వారము మా మనసేటి మనసు ॥కావ॥

బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా
యెందుకా (కొ?) తా నేడకొతా నెఱఁగము
యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే
చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత ॥కావ॥ 126

## పాడి

కామధేనువు దేవకల్పితము భువిలోన
వోముచును భోగించ యుక్తివలెఁగాని ॥పల్లవి॥

తలఁచినట్లనౌ దైవము(వ్రాసినవ్రాఁత
పలికినట్లనౌ పలుమంత్రజపములు
నిలిపినట్లనౌ నిర్మలచిత్తముకీలు
నెలవునఁ బనిగొన నేర్పువలెఁగాని ॥కామ॥

యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము
కమ్మన్నట్లనౌ ఘనతపములశక్తి
తెమ్మనినయట్లఁ దెచ్చు ద్రిష్టము యక్షిణీవిద్య
చిమ్ములను దనకంత చింతవలెఁగాని ॥కామ॥

వునిచినట్లనుండు నొక్కడే దేహగుణము
యెనలేని శ్రీవేంకటేశ్వరుమాయ లివి
పెనచిన యిహమేపో బీజము వుద్యోగులకు
తనివి నలమేల్మంగదయ వలెఁగాని ॥కామ॥ 12

## శ్రీరాగం

గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁగాని
యీవల సంసారమైన (నా?) యిది ధ్రువపట్టమే ॥పల్లవి॥

తలఁపులోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాఁపురముఁ గైవల్యమే
బెళకునాలుకకు నీపేరు వచ్చితేఁజాలు
పలికినవన్నియు పరమవేదములే ॥గోవిం॥

తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు
పడుచులబొమ్మరిండ్లు బ్రహ్మలోకమే
కడలేనినీభక్తి గలిగితేనే చాలు
కడజన్మమయినా నిక్కపువిప్రకులమే ॥గోవిం॥

కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు
పాయపు రతిసుఖము పరతత్త్వమే
యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే ॥గోవిం॥

## సామంతం

దివమట రాతిరట తీరుచున్నదా
కవగూడఁ బాయఁ గాక కాణాచి °వున్నదా ॥పల్లవి॥

మానుషజన్మమట మలమూత్రదేహమట
సోనల హేయమేకాక శుద్ధి వున్నదా
మానవికోరికలట మాయలసంసారమట
దీనవృత్తేకాక యిందుఁ దేజమున్నదా ॥దివ॥

చంచలపుఁజిత్తమట సకలేంద్రియములట
పొంచిన పాపమేకాక పుణ్యమున్నదా
సంచితపుఁగర్మమట జనన లయములట
ముంచినతీదీపేకాక మోదమున్నదా ॥దివ॥

శ్రీవేంకటేశుఁడట జీవుఁడనేనట యిందు
దైవపుదాస్యమే కా కితరమున్నదా
యీవలనావలనట యిహముఁబరమునట
కైవశములాయఁగాక కడమున్నదా ॥దివ॥ 129

## 323 - రేకు భూపాళం

రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో
రీతిగాదు హరి నెచ్చరికసేయరే ॥పల్లవి॥

పైపైఁ బొద్దువొడచి పంకజములు విరిసె
గోపగోవిందుని మేలుకొనుమనరే
దీపములు దెల్లఁబారె తిమిరమింతయు జారె
శ్రీపురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే ॥రాతి॥

---

° 'వున్నదా' రేకు

కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ
నెలఁతలు దేవదేవు నిద్రదెల్పరే
జలనిధి పొంగణఁగె చాయల చుక్కలుమాసె
వలరాచగురు నుప్పవడముగమ్మనరే ॥రాతి॥

జీవులు మేలుకొనిరి చెంగలించెఁ దరువులు
భావించి యచ్యుతు నిట్టె పలికించరే
కావి రింతయు విరిసె కడుసంధ్యకుఁ బొద్దాయ
శ్రీవేంకటేశుని విచ్చేయుమనరే ॥రాతి॥ 1

**బౌళి**

పుట్టెడి దింతా బూటకంబులే
గట్టి మాయ హరిఁ గానఁగ నీదు ॥పల్లవి॥

ముక్కున నున్నది ముందటఁబ్రాణము
యెక్కడ నమ్మె దిఁకఁ దనువు
చుక్కలు మోఁచీఁ జూపులెదుటనే
నెక్కొను మతికిని నిలుకడ యేది ॥పుట్టె॥

నాలుక నున్నవి నానారుచులును
వేళావేళకు వెరవేది
తోలున నున్నది దొరకొని బ్రతుకిది
కాలంబెటువలెఁ గడపేది ॥పుట్టె॥

ఆతుమనున్నది యఖిలజ్ఞానము
ఘాతల నెటువలెఁ గనియేది
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
యాతనిఁగొలిచితి మడ్డంబేది ॥పుట్టె॥ 131

## సాళంగనాట

ఉమ్మడికర్మములాల వుండఁ జోటు మీకు లేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివి లేనిచోటికి ॥పల్లవి॥

పెట్టినది నుదుటను పెరుమాళ్ల లాంఛనము
దట్టమై భుజములందు దైవశిఖామణిముద్ర
నెట్టన నాలుకమీఁద నీలవర్ణునామమిదె
అట్టె హరిదాసులకంటునా పాపములు ॥ఉమ్మ॥

మనసునఁ దలఁచేది మాధవుని పాదములు
దినముఁ గడుపునించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసిపద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు ॥ఉమ్మ॥

సంతతముఁ జేసేది సదాచార్యసేవ
అంతరంగమున శరణాగతులసంగ మిదే
యింతటాను శ్రీవేంకటేశుఁడు మమ్మేలినాఁడు
అంతటా హరిదాసుల నందునా అజ్ఞానము ॥ఉమ్మ॥ 132

## శ్రీరాగం

ఇలువేల్పితఁడే ఇందరికిని మరి
పలువేల్పులతో పని యిఁకనేలా ॥పల్లవి॥

కమలారమణునికరుణేకాదా
అమరులుగొనియెడియమృతము
అమితపుశ్రీహరి యాధారముగాదా (గద?)
నెమకేటిప్రాణులు నిలిచినభూమి ॥ఇలు॥

దనుజాంతకుబొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు
మనిక్కై హరిసతిమహిమే కాదా
నినుపై భువిలో నిండినసిరులు ॥ఇలు॥

యితనికొడుకు రచనింతాఁగాదా
సతులపతులసంసారరతి
గతి శ్రీవేంకటపతిలోకమె వు
న్నతివైకుంఠపునగరపుముక్తి ॥ఇలు॥ 133

## భవుళి

పురుషుఁడే యధముఁడు పొంచి యెందుఁ దగులక
పురుషోత్తమునికంటే పుణ్యుఁడవు నపుడే ॥పల్లవి॥

పురుషజంతువులెల్ల పొంచి యాఁడుజంతువుల
తరవాయిగొని వెంటఁ దగులుఁగాని
ధర నాఁడుజంతువులు తగ పురుషజంతువుల
యిరవు వెదకఁబోవు యిది యెట్టిమాయో ॥పురు॥

సారెకు నర్థమునకు జనులెల్ల దాసులై
కోరి వెదకుచు దిరుగుదురు గాని
చేరువ యర్థములెల్ల జీవులకు దాసులై
యీరీతి వెదకవు యిది యెట్టిమాయో ॥పురు॥

లోకమునడవ డిది లోనుగాక యిందుకెల్లా
యేకచిత్తమున నుంటే యెక్కుడుగాని
దాకొని శ్రీవేంకటేశుదాసుఁడైనవానికిని
యేకముగఁ బంపుసేసు నేమిమాయోకాని ॥పురు॥ 134

## మలహరి

మఱి విచారించఁబోతే మంచముకిందే నూయి
మెఱయఁగ హరిఁ గొల్చి మించరో ప్రజలు ॥పల్లవి॥

యేల మాను దేహమెప్పటి తనగుణము
యేల మాను మనసెడలేనియాసలు
ఊలు దింటా మలిగం డ్లేఱఁగనేల హరి మన-
పాలఁ బెట్టుక కొలిచి బ్రతుకరో ప్రజలు ॥మఱి॥

పొమ్మంటే నేల పోవు పూర్వకర్మములు
పొమ్మంటే నేల పోవు పొంచిన యింద్రియములు
కుమ్మరావమునఁ జెంబు కోరి వెదకనేల
పమ్మిని శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు ॥మఱి॥

భోగించకేల ఫోవుఁ బుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలుపెంచనేల
వేగిరమేఁటికి శ్రీవేంకటేశుమాయ లివి
బాగుగ నాతనిఁగొల్చి బదుకరో ప్రజలు ॥మఱి॥ 135

**324 - రేకు** **భవుళి**

కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతి నీవే కావఁగదవయ్యా ॥పల్లవి॥

పుడమిఁ బుట్టితిమి బుద్ధి నెరిఁగితిమి
కడుపే చెరువవుత గానమయ్యా
వొడలు మోఁచితిమి వున్నతిఁ బెరిగితిమి
వెడఁ జిల్లులఁ గారేది విడిపించ లేమయ్యా ॥కట॥

నిన్న నిద్రించితిమి నేఁడే మేలుకొంటిమి
తిన్న వెల్లఁ [1] దీరినటే తెలియమయ్యా
కన్నులఁ జూచితిమి కమ్మర మూసితిమి
వున్నచో నుండదు మతి పూరట లేదయ్యా ॥కట॥

సరిఁ జదివితిమి శాస్త్రముఁ జూచితిమి
గురుఁడే రక్షకుఁడౌత గురుతౌనయ్యా
నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడిపని మాకు లేదయ్యా ॥కట॥ 136

## దేశాక్షి

ఇందే వున్నది కానమెందో వెదకితిమి
కందర్పగురుభక్తి గంటిమి నే మిదివో ॥పల్లవి॥

కోటికోటివేదములకొనయర్థము
సాటివేదములలోని సకలార్థము
సూటిగా గురుఁడు మాకుఁ జూపినర్థము
గాటపు మనసు దవ్వి కనుఁగొంటి మిదివో ॥ఇందే॥

పరమయోగీంద్రులుపట్టినయర్థము
సురలు మునులు నెంచిచూచినర్థము
సరి మూఁడులోకములఁజాటినర్థము
గరిమ నీదేహమెత్తి కంటిమి మే మిదివో ॥ఇందే॥

పలుశరణాగతులపాలియర్థము
మలయుచుండేటితిరుమంత్రార్థము
నిలిచి శ్రీవేంకటాద్రి నిండినర్థము
కలసి విజ్ఞానవీధిఁ గమఁగొంటిమయ్యా ॥ఇందే॥ 137

[1] దీరవట్టి వుండవచ్చు

## ధన్నాసి

తొల్లిటివారువెట్టినతోవ యిది
బల్లిదులై యిందునే బదుకుటే మేలు ॥పల్లవి॥

కలఁడు సర్వేశ్వరుఁడొక్కఁడు దిక్కందరికిని
సులభుఁడు శరణముచొచ్చితేఁ గాచు నతఁడు
బలుతపములు చేసి పాట్లఁ బడ నోప మని (ము?)
బలువుఁడాతని నమ్మి బ్రదుకుటే మేలు ॥తొల్లి॥

వున్నాఁడు మనసులోనే వొక్కచో వెదకవద్దు
ఇన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చు నిహముఁ బరము
కన్నచోట్ల వెదకి కడు నలయనోపము
పన్నుగ నితనిఁ గొల్చి బ్రదుకుటే మేలు ॥తొల్లి॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిలుచున్నవాఁడు
సేవించినయంతలోనే చేకొని యేలు నీతఁడు
దేవతలఁ బ్రార్థించి తెలియఁగ నేరము
భావించితని నుతించి బ్రదుకుటే మేలు ॥తొల్లి॥ 138

## సాళంగనాట

శ్రావణబహుళాష్టమి జయంతి నేఁడు
సేవించరో నరులాల శ్రీకృష్ణుఁడితఁడు ॥పల్లవి॥

భావింప వసుదేవునిపాలిటిభాగ్యదేవత
దేవకిగనినయట్టిదివ్యరత్నము
చేవమీర సురలరక్షించేకల్పతరువు
యీవేళ జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు ॥శ్రావ॥

హరవిరంచాదులకు నాదిమూలకారణము
పరమమునులతపఃఫలసారము
గరుడోరగేంద్రులకుఁ గలిగిన నిధానము
యిరవుగా నుదయించె నిదె కృష్ణుఁడు ॥శ్రావ॥

బలు యోగీశ్వరులబ్రహ్మానందము
చెలఁగుభాగవతులచింతామణి
అలమేల్మంగకుఁ బతి యట్టె శ్రీవేంకటాద్రి-
నిలపై జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు ॥శ్రావ॥ 139

## రామక్రియ

[1] వెల (ర?) సె నహోబలాన విదారణసింహము
సురల నరుల దయఁ జూచీని వీఁడివో ॥పల్లవి॥

సరి వలకేలను చక్రము పీఁటగాఁ బెట్టి
గరిమ నొకచేత శంఖము వట్టి
హిరణ్యకసిపుని నిరుచేతులాఁ జించి
అరిదిఁ బేగులు జందేలవే వేసుకొనెను ॥వెల॥

ఘనమైన కోరలతో కహకహ నవ్వుకొంటా
దనుజు [2] ముంద రొకచేతనుఁ బట్టి
పెనఁగకుండా రొమ్ము పెడచేతుల నడిచి
నినుపు వంకరగోళ్ల నెత్తురు చిమ్మీని ॥వెల॥

అంతటఁ [3] బ్రహ్లాదుని నటు దయఁజూచి లక్ష్మీ-
కాంతఁ దొడపై నిడుక కడు శాంతుఁడై
చింత దీర గరుడాద్రి శ్రీవేంకటాద్రిని
పంతము మెరసి నిల్చి ప్రతాపించీని ॥వెల॥ 140

[1] ప్రాస భంగము [2] 'ముంద లొకచేతను' కావచ్చు [3] 'బ్రంహ్లాదు' రేకు

## శంకరాభరణం

ఆతఁడా యీతఁడు పెద్ద హనుమంతుఁడు
చేతులారా నక్షునిఁ జెండివేసినాఁడట ॥పల్లవి॥

తొలుత రాముని గాంచి తోడనే సుగ్రీవుని
కొలువఁ బెట్టి యాతనికొమ్మ నిప్పించి
జలనిధి దాఁటి లంక సాధించి చొచ్చి సీతకు-
నలర నుంగర మిచ్చె నతిసాహసమున ॥ఆతఁ॥

సీతాదేవి యానవాలు శ్రీరామునికి నిచ్చి
నీతి విభీషణుని మన్నించఁజేసి
చేతులనే పోట్లాడి చెండివేసి రాక్షసుల
ఘాతల సంజీవికొండ గక్కనఁ దాఁ దెచ్చెను ॥ఆతఁ॥

గక్కన రావణుఁ గొట్టి కాంతను రామునిఁ గూర్చి
అక్కడ నయోధ్యఁ బట్ట మటుగట్టి
నిక్కి కలశాపురిని నిండి శ్రీవేంకటాద్రిని
వుక్కుమీరి హరిఁగొల్చి వున్నాఁడు వేడుకల ॥ఆతఁ॥ 141

### 325 - రేకు వరాళి

ఎవ్వరివాఁడాఁగాను యేమందు నిందుకు
నవ్వుచు నాలోనిహరి నన్నుఁ గావవే ॥పల్లవి॥

కోపులరాజులనెల్ల కొలిచి కొన్నాళ్లు మేను
చూపుడుఁబూఁట వెట్టితి సొగిసి నేను
యేపున సంసారమున ఇదిగాక కమ్మటాను
దాపుగ తొర్లుఁబూఁట తగిలించుకొంటిని ॥ఎవ్వ॥

మొదలఁ గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువవెట్టితి నే గురి గానక
వెదకి కామునికి విషయములకు నే
అదివో నావయసెల్ల నాహివెట్టితిని ॥ఎవ్వ॥

ఇప్పుడే శ్రీవేంకటేశ యీడేర్చి నామనసు
కప్పినగురుఁడు నీకు క్రయమిచ్చెను
వొప్పించిరిందరు బలువుఁడు చేపట్టెననుచు
అప్పులెల్లఁబాసి నీ సొమ్మైతినేనయ్యా ॥ఎవ్వ॥ 142

## దేసాళం

వాసుదేవ నీవు నెలవరివి మగుడనేల
యీసరి నీవద్దనుండే యె (నె?) ట్టైనఁ జేయవయ్యా ॥పల్లవి॥

మాయదెచ్చి నాబదుకు మనుజలోకాన వేసె
కాయము సంసారవార్ధిగడ్డపై వేసె
పాయపు నాతమకము భామలవలల వేసె
చాయ నేనుండి వచ్చినజాడెఱఁగనయ్యా ॥వాసు॥

ఘనమైనయింద్రియాలు కర్మములవాత వేసె
మనసు సంసదయామనిలో వేసె
పనులెల్ల లంపటాల[1]పెయిఁ బక్కలా వేసె
కొనకెక్క నేనె నాగురుతు గాననయ్యా ॥వాసు॥

అంచెల నాదినములు ఆఁకటిబారి వేసె
ముంచిన నాగుణములు మోహముల వేసె
యెంచఁగ శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో
పొంచి నీకు శరణంటి బోధించవయ్యా ॥వాసు॥ 143

---

[1] పెయిఁ బక్కలా రేకు

## బౌళి

నమో నమో దశరథనందన రామ
కమనియ్యయాగభాగకర్త రామ ॥పల్లవి॥

కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకరగుణోన్నత శ్రీరామ
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ
భీకరతాటకాంతకబిరుద రామ ॥నమో॥

వారిధిబంధన రామ వాలిహరణ రామ
చారుహరకోదండభంజన రామ
ధారుణీజపతి రామ దశకంఠహర రామ
సారవిభీషణాభిషేచన రామ ॥నమో॥

అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ సర్వజ్ఞ రామ
విమల రామ శ్రీవేంకటగిరి రామ
రమణ శరణాగతరక్షక రామ ॥నమో॥ 144

## సాళంగనాట

హరికి లంకిణీహంత కంతర మిట్టున్నది
కరుణ నింత మన్నించె కమలావిభుఁడు ॥పల్లవి॥

విశ్వరూపు చూపినాఁడు విష్ణుఁడు దొల్లి, యట్టె
విశ్వరూపాంజనేయుఁడు వీఁడె చూపెను
శాశ్వతుఁడై యున్నవాఁడు సర్వేశ్వరుఁడు వీఁడె
శాశ్వతుఁడై యున్నాఁడు జగములో నీతఁడు ॥హరి॥

ప్రాణవాయుసంబంధి పరమాత్ముఁడు, అట్టె
ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు
రాణింప రవివంశుఁడు రామచంద్రుఁడు, తాను
నాణెపురవిసుతునినమ్మినప్రధాని ॥హరి॥

దేవహితార్థము సేసెఁ ద్రివిక్రముఁడు, అట్టె
దేవహితార్థమే జలధిలంఘనుఁడు
శ్రీవేంకటేశుఁడు చిన్మయమూర్తి, తాను
కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్పహనుమంతుఁడు ॥హరి॥ 145

## పాడి

సుగ్రీవనారసింహునిఁ జూడరో వాఁడె
అగ్రపూజ గొన్నవాఁడు ఆది[ొ]సింహము ॥పల్లవి॥

దేవతలు జయవెట్టి దివినుండి పొగడఁగ
దేవులతోఁ గూడున్నాఁడు దివ్యసింహము
భావింప నెట్టనెదుట ప్రహ్లాదుఁ డుండఁగాను
వేవేలు నవ్వులు నవ్వీ విజయసింహము ॥సుగ్రీ॥

అసురలను గెలిచి అదె సింహాసనముపై
వెసఁ గొలువున్నాఁడు వీరసింహము
పసిఁడివర్ణముతోడ బహుదివ్యాయుధాలతో
దెసల వెలుఁగొందీని ధీరసింహము ॥సుగ్రీ॥

నానాభరణాలు వెట్టి నమ్మినదాసులనెల్ల
ఆనుకొని రక్షించీఁ బ్రత్యక్షసింహము
పూని శ్రీవేంకటాద్రిని బుధులెల్లాఁ గొలువఁగా
నానావరము లొసఁగీ మానవసింహము ॥సుగ్రీ॥ 146

[ొ] 'సింహ్వము' రేకు

## శ్రీరాగం

రామచంద్రుఁడితఁడు రఘువీరుఁడు
కామితఫలములియ్యఁ గలిగె నిందరికి ॥పల్లవి॥

గౌతముభార్యపాలిటి కామధేనువితఁడు
ఘాతలఁ గౌశికుపాలికల్పవృక్షము
సీతాదేవిపాలిటిచింతామ ణీతఁడు
యీతఁడు దాసులపాలియిహపరదైవము ॥రామ॥

పరగ సుగ్రీవుపాలిపరమబంధుఁ డీతఁడు
సరి హనుమంతుపాలిసామ్రాజ్యము
నిరతి విభీషణునిపాలినిధానము
గరిమ జనకుపాలిఘనపారిజాతము ॥రామ॥

తలఁప శబరిపాలితత్త్వపురహస్యము
అలరి గుహునిపాలిఆదిమూలము
కలఁడన్నవారిపాలికన్ను లెదుటిమూరితి
వెలయ శ్రీవేంకటాద్రివిభుఁ డీతఁడు ॥రామ॥ 147

## 326 - రేకు గుండుక్రియ

కైకొంటే కాక కమలనాభునియాజ్ఞ
పైకొని ఇన్నిటాను బాసివుండ ఇనేది ॥పల్లవి॥

హరినిర్మితములే అఖిలప్రపంచము
తొరలి యేమిటి నిందు దూషించేది
ధరణిధరునికి దాసులే జీవులెల్లా
గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది ॥కైకొ॥

వాసుదేవుకల్పితమే వరసంసారబంధము
దోసమంటా యెందెందు దొలఁగేది
శ్రీసతీశురచనలే చేకొన్న రుచులెల్ల
యీసుతోడ నిందుమీఁద నెట్టురోసేది ॥కైకొ॥

గోవిందుమాయలే కూడినట్టిపనులెల్ల
వేవేలై యిందునెట్టు వేసరేది
శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా
పావనమైతిమి యిఁకఁ బరచింత యేది ॥కైకొ॥ 148

## లలిత

విష్ణుదేవుపాదములే విద్యాబుద్ధీ మాకు
వైష్ణవులమైతి మింక వదలవో కర్మమా ॥పల్లవి॥

గోవిందునిపాదములే కోరి యిహపరములు
శ్రీవిభునిపాదములే చేరువేదశాస్త్రములు
దేవదేవుపాదములే దిక్కును దెసయు మాకు
భావములోనిలిపితిఁ బాయరో పాపములు ॥విష్ణు॥

హరిపాదములే మాకు నన్నపానభోగములు
పరమాత్మపాదములే పాఁడిఁ బంటా మాకు
మురహరుపాదములే ముందర వెనకా మాకు
శరణంటి మెందైనాఁ జనరో దుఃఖములు ॥విష్ణు॥

అనంతునిపాదములే ఆయుష్య[1]భోష్యములు
దనుజారిపాదములే ధనధాన్యధర్మములు
యెనలేని శ్రీవేంకటేశుఁ డితనిపాదాలే
మనసునఁ గొలిచితి మానరో భవములు ॥విష్ణు॥ 149

---
[1] భవిష్యము కావచ్చు

## దేశాక్షి

ఇందుకేది వుపాయ మోయీశ్వర నీకే తెలుసు
మందలించ నశక్తుఁడ మరి నీదాసుఁడను ॥పల్లవి॥

ధీరుఁడనై ధరలోన దేహము నే మోచితి
కోరి పుణ్యపాపాలకు గురియు నైతి
పూరట యేమిటా లేదు వోపనని మానరాదు
తీరదు భోగించక దినదినకర్మము ॥ఇందు॥

గరిమ సంసారినైతి కంటిఁ బెక్కుసుతులను
యిరవుగఁ గట్టుకొంటి నీలంపటాలు
వెర వేమీ నెరఁగను విడువ వెంతైనాను
హరిహరి రాచినా సమయపు బలుకాంక్షలు ॥ఇందు॥

అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి
జట్టిగొని నీపాదాలే శరణంటిని
గట్టిగా నలమేల్మంగకాంతుఁడ శ్రీవేంకటేశ
యిట్టె నిన్నెరఁగలేని దిన్నాళ్ళు నానేరమి ॥ఇందు ॥ 150

## ధన్నాసి

దేవుదేవుఁ డితఁడే దివ్యమూరితి
యేవలఁ జూచినఁ దానే యీరూపై వున్నాఁడు ॥పల్లవి॥

వేంకటాచలముమీఁదివిశ్వరూపవిశేషము
అంకెల ననంతావతారాలైనవిశేషము
లంకె సింగారాది సర్వాలంకారవిశేషము
యింకనిమహిమలతో నీరూపై వున్నాఁడు ॥దేవ॥

అందరిలో నంతర్యామియైనవిశేషము
కందర్పుఁబుట్టించిన ఘనవిశేషము
ముందు జగముసృష్టించి మూలమైనవిశేషము
యిందరితోఁ గూడుకొని యీరూపై వున్నాఁడు ॥దేవ॥

పరము(మ?)యోగీంద్రులెల్ల భావించినవిశేషము
అరుదైన వేదవేదాంతార్థవిశేషము
పరగ నలమేల్మంగపతియై శ్రీవేంకటేశుఁ-
డిరవై దాసులఁ గావ నీరూపై వున్నాఁడు ॥దేవ॥ 15

## వరాళి

మఱి తనుభోగములు మాయావిలాసములు
యెఱిఁగినట్ల నుండు మఱపించుఁ దలఁపు ॥పల్లవి॥

అనిశము నీకొలువు అది యొకటే నిజము
నినుఁదలఁచుటొకటే నిజము
పనివడి నీదాసుఁడై బ్రదుకుటొకటే నిజ-
మొనర నిన్ను నుతించేదొక్కటే నిజము ॥మఱి॥

పరగ నీమీఁదఁ జేయు భక్తియే నిలిచినది
నిరతపువైరాగ్యమే నిలిచినది
శరణని నీకుమొక్కేజ్ఞానమే నిలిచినది
అరసి నిన్నుఁబూజించినదే నిలిచినది ॥మఱి॥

చదివి నిన్ను వెదకి సాధించుటే ఫలము
అదన నీకృపాపాత్రుఁడౌటే ఫలము
యెదుట నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
యెదలోన నీధ్యాన మిప్పిటికి ఫలము ॥మఱి॥ 152

## సామంతం

ఏది మాకు గతి యిఁక నీశ్వరేశ్వరా
యీదెస మముఁ గరుణ నీడేర్చవయ్యా ॥పల్లవి॥

పొంచి మున్ను భోగించిన భోగములు దలఁచి
అంచెల నాలుబిడ్డల నటు దలఁచి
కంచపుటాహారములు కన్నవెల్లాను దలఁచి
యెంచి నిన్నుఁ దలఁచక యిట్లున్నారమయ్యా ॥ఏది॥

కన్నులఁ జూచినందెల్లా కడు నాసలఁ దగిలి
విన్నవినుకులకెల్లా వేడ్కఁ దగిలి
పన్నినసుఖములకుఁ బైకొని వెనుతగిలి
వున్నతి నిన్నుఁ దగులకున్నారమయ్యా ॥ఏది॥

చెంది గృహారామక్షేత్రములు మరిగి
పొందగు సంసారమిప్పుడు మరిగి
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
కందువ మరిగీ మరుగకున్నారమయ్యా ॥ఏది॥ 153

## 327 - రేకు దేశాక్షి

ఇన్నిటికి మూలము యెప్పుడు నీవే
పన్ని మామీఁద నేరాలు పచరించకువయ్యా ॥పల్లవి॥

కోటానఁగోటులు మదిఁ గోరికలు
చీటికి మాటికి నివే చిగిరించీని
వాటమై యెవ్వరికిని వసముగావు
పాటించి వీటిని వొప్పనగానవయ్యా ॥ఇన్ని॥

లక్షోపలక్షలు కర్మలంపటములు
అక్షయపుతీగెలై అల్లుకొనీని
వీక్షించ నెన్నేఁ గలవు వింతవింతలు
రక్షించ నిన్నిటికి భారము నీదేయయ్యా ॥ఇన్ని॥

నానాముఖములు పుణ్యములెల్లాను
తానక భోగములై తగిలించీని
మానుపరా దలమేలుమంగపతివి
శ్రీనాథ శ్రీవేంకటేశ చిత్తగించవయ్యా ॥ఇన్ని॥ 154

## మాళవి

అందరికి నెక్కుడైన హనుమంతుఁడు
అందుకొనె సూర్యు ఫలమని హనుమంతుఁడు ॥పల్లవి॥

బల్లిదుఁడై లంక చొచ్చి బలురాకాసులఁ గొట్టి°
హల్లకల్లోలము చేసె హనుమంతుఁడు
వొల్లనె రాములముద్దుటుంగరము సీత కిచ్చె
అల్లదె నిలుచున్నాఁడు హనుమంతుఁడు ॥అంద॥

దాకొని యాకెముందర తనగుఱు తెరుఁగించి
ఆకారమటు చూపె హనుమంతుఁడు
చేకొని శిరోమణి చేతఁబట్టి జలనిధి
ఆకసాన దాఁటివచ్చె హనుమంతుఁడు ॥అంద॥

కొంక కిట్టె సంజీవికొండ దెచ్చి రిపులకు
నంకకాఁడై నిలిచెను హనుమంతుఁడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాఁడు
అంకెఁ గలశాపురపుహనుమంతుఁడు ॥అంద॥ 155

---

° పాదముచివరి గీత లేదు

## పాడి

రామా దశరథరామా నిజసత్య-
కామా నమో నమో ° కాకుత్థ్సరామ ||పల్లవి||

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమపురుష సీతాపతి రామ
శరధిబంధన రామ సవనరక్షక రామ
గురుతరరవివంశ కోదండరామ ||రామా||

దనుజహరణ రామ దశరథసుత రామ
విను(న?)తామరస్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణ రామ
అనిలజప్రియ రామ అయోధ్యారామ ||రామా||

సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుషరావణభయంకర రామ
విలసితరఘురామ వేదగోచర రామ
కలితప్రతాప శ్రీవేంకటగిరిరామ ||రామా|| 156

## ముఖారి

సేవించరో జనులాల చిత్తజగురుఁ డీతఁడు
కేవలదయానిధి సుగ్రీవనారసింహుఁడు ||పల్లవి||

వేయిచేతులతోడ వెన్నెలనవ్వులతోడ
చాయలు దేరేటి శంఖచక్రాలతోడ
ఆయితమై వున్నవాఁడు అదె సింహాసనముపై
శ్రీయుతుఁడై యెదుట సుగ్రీవనారసింహుఁడు ||సేవిం||

---

'కాకుస్థ' రేకు

కుంకుమగోళ్ల తోడ కోరదాడలతోడ
అంకెలరవిచంద్రనయనములతో
తెంకి నసురలఁ గొట్టి దేవతలకందరికి
కింకలెల్లాఁ బాపెను సుగ్రీవనారసింహుఁడు ॥సేవిం॥

బిరుదు పెండేలతోడ పీతాంబరముతోడ
సరిఁ గిరీటాదిభూషణములతో
సిరులకెల్లా నెలవై చెలఁగి శ్రీవేంకటాద్రి-
గిరిమీఁద వెలసెను సుగ్రీవనారసింహుఁడు ॥సేవిం॥ 157

## నాట

ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నవాఁడు
పిక్కటిల్లి సంతోసానఁ బెద్దహనుమంతుఁడు ॥పల్లవి॥

తూరుపుఁ బడుమరాను దొడ్డగా జంగ చాఁచి
సారెకుఁ నర్కునివద్దఁ జదివీ వాఁడే
ధీరతతోఁ దనమేను దిక్కులెల్లాఁ బిక్కటిల్ల
బీరముచూపీ వాఁడె పెద్దహనుమంతుఁడు ॥ఎక్కు॥

మిన్ను నేల నేకముగా మించినవాల మెత్తి
సన్నుతిగా వలకేలు చాఁచినవాఁడు
పన్నుగడై రాఘవునిబంట్లలోపలనెల్లా
పెన్నిధియై యున్నవాఁడు పెద్దహనుమంతుఁడు ॥ఎక్కు॥

మరిగి రేయుఁబగలు మతంగపర్వతమాడ
బిరుదులతోడను బెరసీ వాఁడే
యిరవై శ్రీవేంకటేశుహితుఁడై యెప్పుడుఁ బెచ్చు-
పెరుగుచు నున్నవాఁడు పెద్దహమమంతుఁడు ॥ఎక్కు॥ 15

బౌళి

ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుఁడు
రతికెక్కఁ గొలిచిన రక్షించు నితఁడు ॥పల్లవి॥

తరణివంశజుఁడై తాటకను హరియించి
అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లియాడి
పరశురాముని నిజబలిమి చేకొనెను ॥ఇత॥

మునులకభయమిచ్చి మొగి నసురలఁ ° ద్రుంచి
ఘనమైన మాయామృగముఁ జంపి
కినిసి వాలిఁ గొట్టి సుగ్రీవునిఁ బట్టముగట్టి
వనధి బంధించి లంక వడిఁ జుట్టుముట్టెను ॥ఇత॥

బలురావణునిఁ జంపి పుష్పకముపైఁ దాఁ జేకొని
లలి విభీషణునకు లంక ఇచ్చి
చెలఁగి యయోధ్య యేలి శ్రీవేంకటాద్రిమీఁద
వెలయ రాముఁడు దానై విశ్వమెల్లా నేలెను ॥ఇత॥ 159

328 - రేకు రామక్రియ

అదర శ్రావణబహుళాష్టమి నేఁ డితఁడు
నడురేయి జనియించినాఁడు చూడఁగదరే ॥పల్లవి॥

గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు
పంతపుపాండవులకు బావమరఁది
వంతుతో వసుదేవదేవకులకుమారుఁడు
ఇంతటికృష్ణుఁడు జనియించినాఁడుగదరే ॥అద॥

---

° 'ద్రుంచి రేకు

బలరామునితమ్ముఁడు పంచసాయకునితండ్రి
మలసి మేటైనయభిమన్యునిమామ
లలి సాత్యకిసుభద్రలకుఁ దోఁబుట్టినయన్న
ఇలపైఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే ॥అడ॥

[౧] సూరసేనుమనుమఁ డచ్చుగ ననిరుద్ధుతాత
పౌరవయాదవలోకబాంధవుఁడు
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్మంగకుఁ బతి
యీరీతిఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే ॥అడ॥ 160

## లలిత

చూడవమ్మ కృష్ణుఁడు నీసుతుఁ డోయమ్మ
ఆడీ వీధులవెంట యశోదమ్మా ॥పల్లవి॥

కోలలు చాఁచి వుట్లు గొట్టఁగా బాలుఁబెరుగు
కాలువలుగట్టి పారెఁగదవమ్మా
మేలములాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మ యశోదమ్మా ॥చూడ॥

చక్కిలాలకుండలెల్లా చలాన దొండ్లు వొడిచి
దిక్కన దోఁటికోలలఁ దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాతవేసితే
అక్కడ జోరునఁ గారె యశోదమ్మా ॥చూడ॥

అల్లంతనుండి తనకందరానితెంకాయలు
వల్లెతాళ్లు వేసి వంచీనమ్మా
బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అల్లిబిల్లై యున్నాఁడమ్మ యశోదమ్మా ॥చూడ॥ 161

---

[౧] శూర కావచ్చు

## గౌళ

ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు
కొంచఁ డేమిటికి వీఁడె ఘోరనారసింహుఁడు ॥పల్లవి॥

గక్కన నహోబలాన కంబములోన వెడలి
వుక్కుమీరి హిరణ్యుని నొడిసిపట్టి
చెక్కలువార గోళ్లఁ జించి చెండాడినయట్టి-
వెక్కసీఁడు వీఁడివో వీరనారసింహుఁడు ॥ఎంచి॥

భవనాసియేటిదండఁ బాదుకొని కూచుండి
జవళి దైత్యుపేగులు జందేలు వేసి
భువియుదివియు నొక్కపాదవుతో నిండుకొని
తివురుచున్నాఁడు వీఁడె దివ్యనారసింహుఁడు ॥ఎంచి॥

కదిసి శ్రీసతిఁ గూడి గద్దెమీఁదఁ గూచుండి
యెదుటఁ [2] బ్రహ్లాదుఁడు చేయెత్తి మొక్కఁగా
అదన శ్రీవేంకటాద్రి నందరికి వరాలిచ్చి
సదరమైనాఁడు వీఁడె శాంతనారసింహుఁడు ॥ఎంచి॥ 162

## సామంతం

కొలువై తా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద
బలవంతుఁ డితఁడు ప్రహ్లాదవరదుఁడు ॥పల్లవి॥

చిడుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
కడలేనినవ్వుతోడ కడురాజసముతోడ
అడరించీఁ బంతము ప్రహ్లాదవరదుఁడు ॥కొలు॥

[1] సింహ్వాఁడు' రేకు [2] బ్రంహ్లాదుఁడు రేకు

సంకుఁజక్రములతోడ చాయలమేనితోడ
సంకెదేర్చేయభయహస్తముతోడ
బింకపుమీసాలతోడ పెనువదనముతోడ
అంకె వరములిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు ॥కొలు॥

వనితకౌఁగిటతోడ వామకరముతోడ
నను్పైన [1] తమలోనానందముతోడ
యెనయుచు శ్రీవేంకటేశుఁడై యీడా నాడా
అనిశము వెలసెఁ బ్రహ్లాదవరదుఁడు ॥కొలు॥ 163

## దేసాళం

జాటుఁదనాలవాఁడవు సుగ్రీవనారసింహా
పాటించి నిన్ను నేము పంగించేవారమా ॥పల్లవి॥

మొగము సింహపురూపు మొగి మై మానిసిరూపు
జిగిఁ దొడమీఁదట శ్రీమహాలక్ష్మి
తగు నీకు నిటువంటితగవులెల్లాఁ జెల్లు
యెగసక్కేలాడ మాకు నేలయ్య నిన్నును ॥జాటుఁ॥

కట్టినది పైఁడికాశ కంబములోన వునికి
నెట్టుకొన్ననవ్వులు [2] నీలోనివే
యిట్టివల్లా నీకమరు యెన్నిలేవు నీచేఁతలు
అట్టిట్టని నిన్ను మాకు నడుగనేమిటికి ॥జాటుఁ॥

అమరుల కేలికవు అసురలకు వైరివి
రమణఁ బ్రహ్లాదునకు రక్షకుఁడవు
కొమరై శ్రీవేంకటాద్రిఁ గొత్తలు నీగుణములు
సముకానఁ బలుమారు సంతోసించే మిఁకను ॥జాటుఁ॥ 16

[1] 'తమలోని+ఆనందము [2] నీలోనివే కావచ్చు

## లలిత

మతంగపర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీవేంకటేశ్వరుఁడున్నవాఁడు ॥పల్లవి॥

కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి
తలఁచినవారినెల్లా ధన్యులఁజేసి
పొలుపుమిగుల మంచిపువ్వులతోఁటలనీడ
విలసిల్లీనదివో శ్రీవేంకటేశ్వరుఁడు ॥మతం॥

శరణన్నవారికి చనవిచ్చి రక్షించి
గరిమఁ బూజించువారిఁ గరుణఁ జూచి
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు ॥మతం॥

తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి
కని నుతించేవారికిఁ గామధేనువై
కనకమయములైనఘనమైనమేడలలో
వినుతికెక్కెను శ్రీవేంకటేశ్వరుఁడు ॥మతం॥ 165

## 329 - రేకు రామక్రియ

లెండో లెండో మాటాలించరో మీరు
కొండలరాయనినే పేర్కొన్న దిదె జాలి ॥పల్లవి॥

మితిమీరెఁ జీఁకట్లు మేటితలవరులాల
జతనము జతనము జాలో జాలి
యితవరులాల వాయించే వాద్యాలకంటె-
నతిఘోషములతోడ ననరో జాలి ॥లెండో॥

గాములువారెడిపొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమసపుపారివార దీవెపంజాలు చేఁబట్టి
యేమరక మీలో మీరు యియ్యరో జాలి ॥లెండో॥

కారుకమ్మె నడురేయి గడచెఁ గట్టికవార
సారెసారెఁ బలుకరో జాలో జాలి
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టె మేలుకొన్నాఁడు
గారవాన నిఁక మానఁ గదరో జాలి ॥లెండో॥ 166

## వరాళి

పదియారు°వన్నెలబంగారుకాంతులతోడ
పొదలిన కలశాపురహనుమంతుఁడు ॥పల్లవి॥

యెడమచేతఁ బట్టె నిదివో వండ్లగొల
కుడిచేత రాకాసిగుంపుల గొట్టె
తొడిఁబడ నూరుపులతోఁ దూరుపుమొగమైనాఁడు
పొడవైన కలశాపురహనుమంతుఁడు ॥పది॥

తొక్కి యక్షకుమారునిఁ దుంచి యడగాళ(పెడగాళ్ళ?) సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవఁ బెరిగి సుతు (సూర్యు?) వద్ద వేదాలు
పుక్కిటఁ బెట్టెఁ గలశాపురహనుమంతుఁడు ॥పది॥

గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశుబంటు తానాయ
అట్టె వాయువుకును అంజనిదేవికిని
పుట్టినాఁడు కలశాపురహనుమంతుఁడు ॥పది॥ 167

° 'వన్నెల' రేకు

## శ్రీరాగం

నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకు మరి యిన్నిటాఁ బ్రసన్నుఁడు ॥పల్లవి॥

కమలావరుడు శ్రీకరమదనగురుఁడు
సమరదానవకులసంహారుఁడు
విమలగుణాకరుఁడు విజయచక్రధరుఁడు
కమనియ్యభక్తజనకరుణాకరుఁడు ॥నల్లఁ॥

వేదాంతవేద్యుఁడు విశ్వహితాపాద్యుఁడు
ఆదియునంత్యములేని యనవద్యుఁడు
సాదితయోగిహృద్యుఁడు శమితోగ్రచైద్యుఁడు
సోదించి చూచితేను సురలకు నాద్యుఁడు ॥నల్లఁ॥

కామితఫలశక్తుఁడు ఘనమహిమయుక్తుఁడు
ఆముకొన్న లోకరక్షణసక్తుఁడు
నేమాన శ్రీవేంకటాద్రి నిలిచి మమ్మేలినాఁడు
కోమలుఁడు వీఁడిగో గోపికాస(ను?)రక్తుఁడు ॥నల్లఁ॥ 168

## పాడి

రాముఁడు రాఘవుఁడు రవికులుఁ డితఁడు
భూమిజకుఁ బతియైన పురుషనిధానము ॥పల్లవి॥

అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపఁగ నసురల [2] శిక్షింపఁగ
తిరమై యుదయించినదివ్యతేజము ॥రాముఁ॥

[2] సిక్షింపఁగ రేకు

చింతించేయోగీంద్రులచిత్తసరోజములలో
సంతతమునిలిచినసాకారము
వింతలుగా మనులెల్ల వెదకి కనేయట్టి-
కాంతులఁ జెన్నుమీరినకైవల్యపదము ॥రాము॥

వేదవేదాంతములందు విజ్ఞానశాస్త్రములందు
పాదుకొనఁ బలికేటి పరమార్ధము
పోదితో శ్రీవేంకటాద్రిఁ బొంచి విజనగరాన
ఆదికి సనాదియైనఅర్చావతారము ॥రాము॥ 169

## కన్నడగౌళ

శరణు శరణు దేవ సర్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యానందన ॥పల్లవి॥

వారిధిబంధన రావణ[౧]శిరశ్చేదక
మారీచసుబాహుబలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజసంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ ॥శర॥

సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధసప్తతాలవిధ్వంసనచతుర
భువనేశ సాకేతపురవాస రామ ॥శర॥

హరచాపహర అహల్యాశాపవిమోచక
ఖరశరవాలినిగ్రహబిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభ క్తరక్షక
ధరణిజాసమేత దశరధరామా ॥శర॥ 170

---

[౧] శిరచేదక' రేకు

## శంకరాభరణం

౦వినోదకాఁడవౌదువు విరలేశ్వరా
వినుతించ నెట్టువచ్చు విరలేశ్వరా ॥పల్లవి॥

పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ ౨ యెంత విరలేశ్వరా
పసిబాలవయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయలెల్లా యివె విరలేశ్వరా ॥వినో॥

వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విరలేశ్వరా
చన్ను దాగి రాకాసిపీఁచము హరించితివి
యెన్నికకెక్క నీబిరు దిటు విరలేశ్వరా ॥వినో॥

గొల్లెతలఁగూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విరలేశ్వరా
బల్లిదవు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విరలేశ్వరా ॥వినో॥ 171

## 330 - రేకు దేవక్రియ

విచ్చనవిడినీ యాడీ వీఁడె కృష్ణుఁడు
వొచ్చములేనివాఁడు వుద్దగిరికృష్ణుఁడు ॥పల్లవి॥

గల్లుగల్లుమనఁగాను గజ్జలు నందెలతోడ
బిల్లఁగోట్లాడీని పిన్నకృష్ణుఁడు
కెల్లురేఁగి వీధులనుఁ గేరి పుట్టచెండులాడీ
బల్లిదుఁడు గదవమ్మ బాలకృష్ణుఁడు ॥విచ్చ॥

---

౦ అంతటా 'విర్గల' గా వుండే రేకు[వ్రాత ఈ పాటలో 'విరల'గా నున్నది ౨ 'యింత' రేకు

తమితోడ గోపాలులు తానుఁ గూడి ముంగిటను
సముద్రబిల్లలాడీ [1]సాధుకృష్ణుఁడు
చెమటలుగార సిరిసింగనవత్తి యాడీ
గుమితాన వీఁడే యమ్మా గోపాలకృష్ణుఁడు ॥విచ్చ॥

వుదుటునఁ బారి పారి వుడ్డగచ్చకాయలాడీ
ముదముదొలఁకఁగాను [2] ముద్దుకృష్ణుఁడు
అదివో శ్రీవేంకటేశుఁ డాటలెల్లాఁ దానే యాడీ
పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుఁడు ॥విచ్చ॥ 172

## మేఘరంజి

వట్టిజాలిఁ బడవలదిఁకను
గట్టి విచారముగలవారికిని ॥పల్లవి॥

దేవుఁడు సులభుఁడు తెలియఁగనేర్చిన
వేవేలు లాభము విరతి
భావించు జ్ఞానమె పాదైన సౌఖ్యము
తావగు శాంతమె ధనధాన్యములు ॥వట్టి॥

గురుఁడె సాధనము కోరి వెదకినను
పరగు నాచారమె బ్రదుకెల్లా
శరణాగతియె సామ్రాజ్యపదవి
ధర జితేంద్రియత్వమె వైభవము ॥వట్టి॥

తననిజభక్తియె దండయు దాపును
మనసు నిలుపుటే మరి శుభము
యెనయఁగ శ్రీవేంకటేశుమహిమ లివి
కని మని యుండుటె ఘనవివేకము ॥వట్టి॥ 173

[1] 'సాధుఁగృష్ణుఁడు' రేకు [2] ముద్దుఁ గృష్ణుఁడు

## కురంజి

చేపట్టుఁగుంచము శ్రీవిభుఁడు
వై పెరిఁగి పొగడవలెఁ గాక ॥పల్లవి॥

మనసులోనిహరి మరవక తలఁచిన
యెనయ నిహపరము లేమరుదు
పెనగొన నాతనిపేరు నుడిగినను
తనకు మహానందము లేమరుదు ॥చేప॥

పుట్టించినాతని పొసఁగఁగ గొలిచిన
యిట్టి వివేకం బేమరుదు
చుట్టి యతనిదాసులకుమొక్కినను
పుట్టుగు గెలుచుట భువి నేమరుదు ॥చేప॥

శ్రీవేంకటేశ్వరుఁ జేరి భజించిన
యేవేళ సాత్త్వికమేమరుదు
భావించి యాతనిపై భక్తి నిలిపినను
కైవశముగఁ దనుఁ గను టేమరుదు ॥చేప॥ 174

## బౌళిరామక్రియ

ఎంత పరాక్రమము యీసింహము
చెంతనే దివిజులు సేవించేరు ॥పల్లవి॥

కొండమీఁదఁ గూచుండి దైత్యుమై
చెండివేసె నీ సింహము
నిండునగవుతో నెలఁత దనతొడపై
నుండఁగ నెరసీ నుదుటుఁదనమున ॥ఎంత॥

తటుకనఁ బ్రహ్లాదుఘటనచేఁ గంభము
చిటిలి వెడలె నీ సింహము
చటులకరంబులఁ గుటిలదానవుని
బటుగతిఁ బట్టెను పశుబంధముగా ॥ఎంత॥

పగయెల్ల నడఁచి జగములేలుచును
° జిగిమించిన నరసింహము
నిగిడి శ్రీవేంకటనిధి యహోబలము
తగు నివాసముగఁ దనరీ నిదివో ॥ఎంత॥ 175

## నాదరామక్రియ

కొసరనేల నాగుణము లివి
రసికత నీవిన్నిటా రక్షించుకొనుమీ ॥పల్లవి॥

నేరమి నాది నేరుపు నీదే
దూరు నాది బంధుఁడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమీ ॥కొస॥

నేను యాచకుఁడ నీవేదాతవు
దీనుఁడ నేఁ బరదేవుఁడవు
జ్ఞానరహితుఁడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిఁక నను జేరి కావుమీ ॥కొస॥

అరయ నే జీవుఁడ నంతర్యామివి
యిరవుగ దాసుఁడ నేలికవు
చిరజీవిని నే శ్రీవేంకటపతివి
వరదుఁడ నను జేవదలకుమీ ॥కొస॥ 176

° 'జిగిమించి నరసింహ్వము' రేకు

## హిందోళవసంతం

ఎన్నిమహిమలవాఁడె యీదేవుఁడు
కన్నులపండువులెల్లాఁ గదిసినట్టుండెను ॥పల్లవి॥

పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి
యేలీల నుండెనని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవళింపఁగా మేన
మేలిమిమీఁగఁడంటిన మెలుపుతో నుండెను ॥ఎన్ని॥

తట్టుపునుఁగుకాపు దైవశిఖామణికి
యెట్టుండెనని [1] మరి నెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టె రాత్రులు మేననంటినట్టుండెను ॥ఎన్ని॥

అలమేలుమంగతోడ నట్టె సొమ్ము ధరించఁగ
యెలమి శ్రీవేంకటేశునెంచి చూచితే
కలిమిగలయీకాంతకాఁగిటఁ బెనఁగఁగాను
నిలువెల్లా సిరులై నిండినట్టుండెను ॥ఎన్ని॥ 177

**331 - రేకు ఆందోళి**

కన్నులపండుగలాయఁ గన్నవారి కిందరికి
వెన్నుఁడేఁగీ నిల్లిదివో [2] వీధుల వీధులను ॥పల్లవి॥

అదె యెక్కెఁ దిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదచల్లుఁ గాంతులతో వీధుల వీధులను ॥కన్ను॥

---

[1] మరియున్‌లోని యువర్ణము లోపించిన రూపము కావచ్చు [2] ఈపదము పూర్వముద్రణమున జారిపోయినది

తోలి యాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్టులెల్ల జయవెట్టఁగ
గాలికిఁ బడగలెల్లాఁ గడు నల్లాడఁగఁ జొచ్చె
వేలేటి పువుదండలతో వీధుల వీధులను ॥కన్ను॥

తావు చేరెఁ దిరుతేరు ధర్మములు నిలువఁగ
యీవల నలమేల్మంగ ఇచ్చగించఁగా
శ్రీ వేంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను ॥కన్ను॥ 178

## భల్లాటి

జగతిలో మనకెల్ల జయంతి నేఁడు
పగటున నందరికి పండుగ నేఁడు ॥పల్లవి॥

అదివో శ్రావణ[1]బహుళాష్టమి నేఁడు
పొదిగొన్న రోహిణి సంపూర్ణము నేఁడు
కదిసి యర్ధమరేత్రికాడ నేఁడు
ఉదయించెఁ గృష్ణుఁడు చంద్రోదయాన నేఁడు ॥జగ॥

వసుదేవదేవకుల వరము నేఁడు
పసగా ఫలియించె రేపల్లెలో నేఁడు
కొసరి యశోదనందగోపుఁడు నేఁడు -యీ
[2]సిసువును సుతుఁడంటాఁ జెలఁగిరి నేఁడు ॥జగ॥

హరిమాయ కంసుమద మడఁచె నేఁడు
పొరుగిరుగులవా రుప్పొంగిరి నేఁడు
[3]సిరి నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడై నిల్చె
అరుదుగా గొల్లెతలు ఆడుకొనేరు నేఁడు ॥జగ॥ 179

---

[1] బహుళష్టమి రేకు [2] ప్రాసకోసము వెంపర్లాట [3] శిరి' రేకు

## ఆహిరి

కొలిచితే రక్షించే గోవిందుఁ డితఁడు
యిలకు లక్ష్మికి మగఁ డీగోవిందుఁ డితఁడు ॥పల్లవి॥

గోవర్ధనమెత్తినట్టిగోవిందుఁ డితఁడు
వేవేలుగొల్లెతలగోవిందుఁ డితఁడు
కోవిదుఁడై ఆలఁగాచేగోవిందుఁ డితఁడు
ఆవలఁగంసుఁజంపిన ఆగోవిందుఁ డితఁడు ॥కొలి॥

° క్రూరకాళింగమర్దనగోవిందుఁ డితఁడు
వీరచక్రాయుధపుగోవిందుఁ డితఁడు
కోరి సముద్రాలు దాఁటేగోవిందుఁ డితఁడు
ఆరీతి బాలురఁ దెచ్చేయాగోవిందుఁ డితఁడు ॥కొలి॥

కుందనపుకాశతోడిగోవిందుఁ డితఁడు
విందుల రేపల్లెగోవిందుఁ డితఁడు
పొంది శ్రీవేంకటాద్రిపై పొసఁగఁ దిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుఁ డితఁడు ॥కొలి॥ 180

## కాశి

కొండంతపొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు ॥పల్లవి॥

పాతాళవాసులైనబలురక్కసులమీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధిచొచ్చినట్టిదానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున ॥కొండ॥

---

° క్రూర రేకు

ఆకాశముదూరినట్టియదటుదైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి ॥కొండ॥

ధరమీఁదఁ గలిగిన దనుజకోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పొరఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరముకొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి ॥కొండ॥ 181

## వరాళి

నవమూర్తులైనట్టి నర°సింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము ॥పల్లవి॥

నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము
నగముపై యోగానందనరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము ॥నవ॥

నాఁటుకొన్న భార్గవూటునరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమళ్లనరసింహము
నాఁటి యీ కానుగమానినరసింహము వీఁడె
మేఁటి వరాహపులక్ష్మీనారసింహము ॥నవ॥

పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన
నలిరేఁగిన ౨ ప్రహ్లాదనరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీవేంకటాద్రిమీఁద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము ॥నవ॥ 182

° సింహ్వము రేకు ౨ 'ప్రంహ్లాద' రేకు

## శంకరాభరణం

కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు
తెలియ నీతఁడే సుండీ దేవదేవోత్తముఁడు ॥పల్లవి॥

పుడమికాధారము పురుషోత్తముఁడె
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి
విడువుఁ డేఁటికిఁ బారవేసినగుంటికినెల్ల
వొడయుఁ డీతఁడే సుండీ వున్నతోన్నతుఁడు ॥కొలు॥

అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడే
సములై జీవించువారు సతానసంఖ్య(?)
భ్రమయకుఁ డెండమావిబయళ్లు చెరువులంటా
అమర నీతఁడే సుండీ హరి వాసుదేవుఁడు ॥కొలు॥

చెలువుఁ డీతఁడె సుండీ శ్రీవేంకటేశుఁడె
పలుకుఁ బంతాలవారు పదివేగురు
తలఁచకుఁ డీదోమ దంతితోను సరిగా
జలజనాభుఁడే సుండీ సకలలోకేశుఁడు ॥కొలు॥ 183

## 332 - రేకు వసంతం

[°] రంటదెప్పరపురచన మా బదుకు
జంటల శ్రీపతిశరణమే నిజము ॥పల్లవి॥

కన్నులయెదుటను గలిగిన జగమే
మిన్నక మనసున మెరసేది
తిన్నఁగ రేయి నిద్రించినవాఁడనే
యెన్నఁగ రేపే యెరిఁగినవాఁడ ॥రంట॥

---

[°] 'రెంట'కు రూపాంతరము 'రెండు', రండు', 'రెడ్డి', రడ్డి' గా ప్రయోగములు కలవు

బాయట నూరక పారెటిగాలే
కాయములోపలఁ గలిగేది
పోయిన జన్మపుఁబొరుగులవాఁడనే
యీయెడ నిటు జనియించితిఁగాని ॥రంట॥

పుడమివెలుపలను బుట్టినరుచులే
కడుపులోపలను గరఁగేది
కడఁగి శ్రీవేంకటపతి నాలోననే
యెడయఁడు యతనినే యిటు గొలిచితిని ॥రంట॥ 184

## సాళంగనాట

వైష్ణవులసొమ్ము నేను వారు నీసొమ్ములింతే
విష్ణుఁడ నీవెట్టిన వివరించుకోవయ్యా ॥పల్లవి॥

నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన-
తఱి నీదాసులకే నే దాసుఁడగాక
గుఱుతెరుఁగుదునా నేఁ గోరి యింతకతొల్లి
గుఱుతు చూపిన మాగురువునేకాక ॥వైష్ణ॥

ముంచి నీకు మొక్కేఁగాక ముందే నీశరణులు
పెంచి పాదాలు నా నెత్తిఁబెట్టిరయ్యా
పొంచి నీవేడ నేనేడ బుజముల ముద్రవెట్టి
సంచితమై సేసినట్టిసంబంధమేకాక ॥వైష్ణ॥

శ్రీవేంకటేశ నీసేవే సేసేఁగాక °నే డీ-
సేవకుఁ దెచ్చెను వారిసేవేకాదా
భావమొక్కటిగా నాకుఁ బట్టిచ్చిరి నిన్ను వారు
ఆవలీవలికిఁ బరమార్థమేకాక ॥వైష్ణ॥ 185

° రేకులో 'నేడు లో'అరసున్నలోపించుటప్రామాదికము

## రామక్రియ

విత్తొకటి వెట్టఁగాను వేరొకటి [1] మొలచీనా
హత్తి దేహగుణములు ఆతుమకయ్యీనా ॥పల్లవి॥

చెంది చేఁదుదిన్ననోరు చేఁదేయయివుండుఁగాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంసారికి బలు లంపటాలేకాక
అందు హరిఁజేరి సుఖ మందఁ దీరీనా ॥విత్తొ॥

యెంగిలిఁ బుట్టినమేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనము సేసుకోనీనా
ముంగిటిదేహికిఁ గర్మములు ముంచుకొనుఁగాక
[2]రంగుగ శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా ॥విత్తొ॥

చేతికి వచ్చినసొమ్ము చేరిదాఁచుకొనుఁగాక
యేతులఁ దా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవేంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నదా ॥విత్తొ॥ 186

## మలహరి

అందుకు హరికధ యనుతీర్థంబున
నింద వాసె [3] నిఁక నిర్మలమైతి ॥పల్లవి॥

కంతునిముట్టంటు గలసె మదిలో
యెంతట శుద్ధానో యెరఁగమిఁక
సంతతసంసారజలధుల మునిఁగెద
పొంతగర్మము పోదింకాను ॥అందు॥

---

[1] మొలచిన రేకు [2] యతిభంగము [3] నిక రేకు

మాయపుటాసల మాలు గలసె మది
యేయెడ శుద్ధానో యెరఁగమిఁక
ఆయపుభవములయనలము చొచ్చితి
పోయినఁగర్మము పోదింకాను ॥అందు॥

చక్కఁగఁ గలిదోసము గలసెను మది
నెక్కడ వోయెనో యెరఁగమిఁక
దక్కి శ్రీవేంకటదైవముఁ గొలిచితి
పుక్కట గర్వము పోదింకాను ॥అందు॥ 187

## దేశాక్షి

కర్మమూలము జగము గాదనివిడువక
మర్మపుమోక్షము లేదు మానలేరో గర్వము ॥పల్లవి॥

సకలకర్మాలు మాని సన్యాసి యైతేను
వొకట వెలితిలేనివున్నతుఁడట
మొకమై వుభయకర్మములు బంధహేతువని
ప్రకటించి వేదాంతపరనమే యెక్కుడు ॥కర్మ॥

బహురూపములు మరచి బ్రహ్మా[1] నిష్ఠుఁడైనయోగి
యిహపరముల కతఁడెక్కుడట
విహితకర్మము దక్క వీరఘోరకర్మములు
సహజపాతకమనేశాస్త్రాలే యెక్కుడు ॥కర్మ॥

సంతతకర్మములెల్ల సంసారమూలములు
అంతట నిస్సంగుఁడైతే నధికుఁడట
చింతించి చింతించి శ్రీవేంకటేశ్వరు
వంతుకుఁజెప్పినహరివాక్యమే యెక్కుడు ॥కర్మ॥ 188

[1] నిష్ఠుఁడై రేకు

## దేవగాంధారి

పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు దానే
యిట్టె శ్రీహరి నన్నె ట్టీడేరించీనో ॥పల్లవి॥

యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని
యించుకవడిలోనే మోహింతు నందుకు
కంచువంటి దీమనసు కటకటా యేది వాటి
చంచలుఁడ హరి నన్నేసంగతి సేసీనో ॥పుట్టిం॥

తలఁతు నేనొకవేళ దైవము గనేనని
కలిమి నంతటిలోనె కడు మరతు
చలపట్టె నిదివో నాజన్మములకేది వాటి
కలుషచిత్తుఁడ నన్నేకందువఁ బెట్టీనో ॥పుట్టిం॥

జ్ఞానినౌదు నొకవేళ సరిఁ గర్మినౌదును
మానువంటిదీగుణము మరేది వాటి
కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మానిసి నింతే యెట్టు మన్నించీనో ॥పుట్టిం॥ 189

## 333 - రేకు గుండక్రియ

అన్నియు నాలో నుండఁగ నవ్వల నేమి చూచేము
యెన్నఁడు గాననిమాయ యెరఁగవో మనసా ॥పల్లవి॥

యీడనే సంసార మిదె యింద్రజాలమై యుండఁగ
యేడకైనాఁ జూడఁ బోయే మింద్రజాలము
పాడితో నా పుట్టుగులే బహురూపాలై యుండఁగ
వేడుకయ్యీ బహురూపవిద్యలు చూడఁగను ॥అన్ని॥

నటన దినదినము నాటకమై యుండఁగాను
నటవట నాటకాలు సారెఁ జూచేము
ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను
అటమటపువిద్యలు అన్నియుఁ జూచేము ॥అన్ని॥

పాపపుణ్యములు రెండు బారివిద్య లుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము
యేపున శ్రీవేంకటేశుఁ డిటు మమ్ము భ్రమపాపె
నాపనులు నేనే చూచి నవ్వులు నవ్వేను ॥అన్ని॥ 19

## గుజ్జరి

ఇతరోపాయములెల్ల యీసందివే
అతిశయపదమైతే హరిదాస్యఫలమే ॥పల్లవి॥

కర్మము [౧] సేయ నేరరా కడఁగి సన్యాసులు
కర్మము విడిచి మోక్షముఁ బొందిరి
ధర్మమెరఁగనివారా తత్త్వపుయోగీంద్రులు సర్వ-
ధర్మము విడిచి హరిఁ దమలోనే కనిరి ॥ఇత॥

దానాలు [౨] సేయనేరరా తగిలి యోగీంద్రు లన్ని
మాని హరిజపమే నెమ్మదిఁ జేసిరి
నానావిధు లెరఁగరా నాఁడు విభీషణాదులు
శ్రీనాథు శరణని చిరదేహులైరి ॥ఇత॥

సతతసంగములెల్ల జన్మబంధహేతువని
మతిమంతులైనవారు మానిరిగాక
హితవైనశ్రీవేంకటేశ్వరుని శరణని
బ్రతుకరా యిందు నందుఁబ్రపన్నులెల్లను ॥ఇత॥ 1

---

౧ ౨ శాయ' రేకు

## సౌరాష్ట్రం

[౧]హరియవతారమె ఆతఁడితఁడు
పరమ సంకీర్తనఫలములో నిలిపె ॥పల్లవి॥

వున్నాఁడు వై కుంఠమున నున్నాఁడు యాచార్యునొద్ద
వున్నతోన్నతమహిమ నన్నమయ్య
వున్నవి సంకీర్తనాలు వొట్టుక లోకములందు
పన్నిన నారదాదులు పైపైఁ బాడఁగను ॥హరి॥

చరియించు నొకవేళ సనకాదిమునులలో
హరిఁ బాడుఁ దాళ్ళపాకఅన్నమయ్య
తిరమై యాళువారల తేజము దానైయుండు
[౨]గరుడానంతముఖ్య ఘనులసంగడిని ॥హరి॥

శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతికొలువునందు
ఆవహించెఁ దాళ్ళపాక అన్నమయ్య
దేవతలు మునులును దేవుఁడని జయవెట్టఁ
గోవిదుఁడై తిరిగాడీఁ గోనేటిదండను ॥హరి॥ 192

## రామక్రియ

ఉండినట్టే వుండును వుండకున్న మానును
అండనే శ్రీహరిమాయ నమరినలోకము ॥పల్లవి॥

యేదైనా మంచిదే యెట్టయినా మంచిదే
సేద దేరినట్టి పూర్ణచిత్తునకును
కాదు గూడదనరాదు కలస్వభావమునకు
ఆదినుండి హరిమాయ నత్తినది లోకము ॥ఉండి॥

---

[౧] ఈ పాట పెదతిరుమలయ్యదో చినతిరుమలయ్యదో కావచ్చును [౨] 'గురుడనంత' రేకు

యెండైనా మంచిదే యెంతనీడైనా మంచిదే
పండినజ్ఞానభక్తులప్రసన్నులకు
నిండె నిండదనరాదు నిచ్చనిచ్చఁబ్రకృతికి
కొండవంటిహరిమాయ గుర్తైనలోకము ॥ఉండి॥

పాపమైన మంచిదే బలుపుణ్యమైన మంచిదే
శ్రీపతిని శరణన్నజీవునికిని
వోప నోపేన రాదు వొద్దిక శ్రీవేంకటేశు
చేపట్టినమాయలోనఁ [^1]జిక్కినది లోకము ॥ఉండి॥ 193

## శంకరాభరణం

నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు
యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నా రిఁకను ॥పల్లవి॥

కన్నులఁ జంద్రసూర్యులుగలవేలుపవు నీవు
పన్నినలక్ష్మిభూమిపతివి నీవు
అన్నిటా బ్రహ్మకుఁ దండ్రియైన యాదివేలుపవు
యెన్నఁగ నీకంటే ఘన మెవ్వరున్నా రిఁకను ॥నీకే॥

దేవతలందరు నీ తిరుమేనైనమూర్తి
ఆవలఁ బాదాన లోక మణఁచితివి
నీవొక్కఁడవే నిలిచిన దేవుఁడవు
యేవేళ నీకంటే నెక్కుడెవ్వరున్నా రిఁకను ॥నీకే॥

అరసి జీవులకెల్ల నంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చేశ్రీవేంకటేశ
పురుషోత్తముఁడవు భువనరక్షకుఁడవు
యిరవైననీవేకాక యెవ్వరున్నా రిఁకను ॥నీకే॥ 194

[^1]: 'జిక్కినది' రేకు యతిభంగము

## శుద్ధవసంతం

కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో
అటు నావశము గాదు హరి నీచేఁ గాని ॥పల్లవి॥

పాపము నెరుఁగుదు బంధము నెరుఁగుదు
మాపుదాఁకా నివి నేను మానలేఁగాని
కోపము దుర్గుణమని కొంత గొంత యెరుఁగుదు
తీపుల యాసలఁ బడి తిప్పలేఁగాని ॥కట॥

చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి
యీతల నాకు వెరపు యించుక లేదు
గాతల నామనసెల్లఁ గల్పించినట్లవును
[1] చేతనైనా చెప్పినట్టు సేయలేఁగాని ॥కట॥

నావంకఁ గడమ గాఁక నా గురుఁడు తొల్లె నన్ను
శ్రీవేంకటేశుఁడ నీచేతికిచ్చెను
దైవమొక్కఁడవే నీ దాసానుదాసుఁడనైతి
యేవిధులు నే నెరఁగ నిటు నిన్నేకాని ॥కట॥ 195

## 334- రేకు సామంతం

ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె వున్నదిదె చెప్పరాని ఫలము ॥పల్లవి॥

కోపము విడిచితేనె పాపము దానే పోవు
దీపింప సుజ్ఞానముతెరు విదివో
లోపల మనిలుఁడై లోకముమెచ్చుకొరకు
పైపైఁగడిగితేను పావనుఁడౌనా ॥ఊర॥

---

[1] చేతనేనా రేకు

[1] ముందరికోరిక వోతే ముంచిన బంధాలు వీడు
కందువ నాస మానితే కైవల్యము
బొందిలోన నొకటియు భూమిలోన నొకటియు
చిందు వందు చిత్తమైతే చేరునా వైకుంఠము ॥ఊర॥

కాంతలపొం దొల్లకుంటే ఘనదుఃఖమే లేదు
అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁడు
అంతట మాటలె యాడి హరి శరణనకుంటే
దొంతినున్నభవములు తొలఁగునా వివేకికి ॥ఊర॥ 196

## లలిత

ఎప్పుడూను నడచేవె యేకాలమైనాను
కప్పి నిష్ఠూరమేల కట్టేరయ్యా ॥పల్లవి॥

శ్రీపతి యాణాజ్ఞచేతఁ జిక్కనది జగము
యేపున మా యాణాజ్ఞ లేఁటివయ్యా
కోపగించుకొనుటింతే కొంకక లోకాలు నేము
మాపుదాఁకా మానుమంటే మానఁ బొయ్యీనా ॥ఎప్పు॥

నరహరిరక్షణమే నడచీని లోకము
యిరవై నేము రక్షించే దేఁటిదయ్యా
పొరలే గర్వ మింతె బూతులసంసారము
మరలి నేమూరకుంటే మానఁబొయ్యీనా ॥ఎప్పు॥

[2] సృష్టికిఁ గర్తైనవాఁడు శ్రీవేంకటేశుఁ డింతే
యిష్టానిష్టము మాకు నేఁటిదయ్యా
నష్టి లేదు నడచేది నడవక మానరాదు
తష్టి గట్టుకొంటిఁ(?)గాక తా మానఁబొయ్యీనా ॥ఎప్పు॥ 197

[1] 'ముందర' కావచ్చు [2] స్రిష్టి రేకు

## బౌళి

ఇంత లేకుంటే నది యెక్కడి సుజ్ఞానము
దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా ॥పల్లవి॥

యెదిటివా రెరిఁగితే యేమీ ననక మరి
చెదరకుండుటే పో శ్రీవైష్ణవం
కదిసినకాంతలను కనకము వొడగంటే
పదరకుండుటే పో పరమసాత్వికము ॥ఇంత॥

క్రియయెరఁగనివారు కీడు సేసితేఁ దాను
దయఁ జూచుటే హరిదాస్యఫలము
[1] రయమునఁ దామసము రాజసము గలిగితే
భయపడి తొలఁగుటే ప్రపన్నగుణము ॥ఇంత॥

వొరసి [2] యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన
నిరతితొ వీఁగనిదే నిచ్చ(శ్చ?)లబుద్ధి
యిరవై శ్రీవేంకటేశ్వరుదాసులఁ గని
శరణని మొక్కుటే సర్వజ్ఞగుణము ॥ఇంత॥ 198

## మలహరి

పరమోపకారులు ప్రత్యక్షదైవములు
హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము ॥పల్లవి॥

పాపుదురు లోకములో పాపపంకమెల్లాను
దీపించ శ్రీపాదతీర్థమున
వోపుదురు హీనుల పున్నెతులఁగాఁ జేయ
చేపట్టి కన్నులెదుటిసేవామాత్రమున ॥పర॥

---

[1] రయమున్నఁ రేకు [2] 'యువ్వఁడు రేకు

చెఱుతు రజ్ఞానమెల్లా జనులు తమ్ముఁజేరిన
మఱియుఁ దమప్రసాదమహిమవల్ల
° తెలిచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా
మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున ॥పర॥

చెల్లఁబెట్టుదు రెండైనా చిల్లరకులమువారి
తెల్లమిగా మంత్రోపదేశమున
యిల్లిదె శ్రీ వేంకటేశ యెక్కుడుసేసిరి మమ్ము
సల్లాపనల తమసహవాసములను ॥పర॥

## ధన్నాసి

నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు
శ్రీకాంతుఁడవు నాకు సిద్ధించుకొరకు ॥పల్లవి॥

జలధివంటిదిసుమీ ² చంచలపు నామనసు
కల వింద్రియముల నేటిజలచరములు
వొలసి భక్తినెడి వోడ యెక్కితి నేను
జలశాయి నీవ నేటిసరకు దెచ్చుటకు ॥నాకుఁ॥

కొండవంటిదిసుమీ కొనకెక్కు నామనసు
వుండుఁ గామాదులను వురుమృగములు
వుండి నీశరణమనువూఁత గొని యెక్కితిని
కొండలప్ప నీవనేటికొనఫలముకొరకు ॥నాకుఁ॥

టీ(రీ?)వులను ధరణివంటిదిసుమీ నామనసు
నీవె శ్రీవేంకటేశ నిక్షేపము
వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి
భూవిభుఁడ నీవనేటి పురుషార్థము ॥నాకుఁ॥

---

° తెలిచి+ఇత్తురు ² చెంచల రేకు యతిభంగము

## కాంభోది

అంతటనే వచ్చి కాచు [1] నాపద్బంధుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడనంటేఁ జాలు ॥పల్లవి॥

బంతిఁగట్టినురిపేటిపసురము లెడ నెడఁ
బొంత నొక్కొక్క గవుక వుచ్చుకొన్నట్టు
చెంతల సంసారముసేయునరుఁ డందులోనె
కొంత గొంత హరి నాత్మఁ గొలుచుటే చాలు ॥అంత॥

వరుసఁ జేఁదుదినేవాఁడు యెడ నెడఁ గొంత
సరవితోడుతఁ దీపు చవిగొన్నట్టు
దురితవిధులు సేసి దు:ఖించుమానవుఁడు
తరవాత హరిపేరు దలఁచుటే చాలు ॥అంత॥

కడుఁ బేదైనవాఁడు కాలకర్మవశమున
అడుగులోనే నిధాన మటు గన్నట్టు
యెడసి శ్రీవేంకటేశు నెరఁగక గురునాజ్ఞ
పొడగన్నవానిభక్తి పొడముటే చాలు ॥అంత॥ 201

## 335 - రేకు నాగవరాళి

దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే
వావిరి నొఁగాదన నవ్వల నిఁక నెవ్వరో ॥పల్లవి॥

యెంచఁగ నీదేహమిది యింద్రియాదులకుఁ [2] జర(ఁజెఱ?)
వంచనతో విడిపించువారలెవ్వరో
పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంత దయఁజూడ నిఁక నెవ్వరో ॥దైవ॥

[1] నాపద్బంధుఁడు రేకు [2] ఇట్లులే అన్ని పాదములందు

పొరచి నామన సిది పుణ్యాపాపాలకుఁ జర
మారుకొని విడిపించ మరి [1] యెవ్వరో
తీరనినాజన్మ మిది దినభోగాలకుఁ జర
యీరీతి విడిపించ నిఁక నెవ్వరో ॥దైవ॥
ఆతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర
ఆతల నెవ్వరికైనా నరుహమౌనా
యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక
ఘాతల నీదాసులకు గతి [2] యెవ్వరో ॥దైవ॥ 202

## నారాయణి

ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేఁతలకుఁ దగవు గాదనరా ॥పల్లవి॥

ఘనకర్మానుభవమే కావలె నొండె నాకు
వనజాక్ష నీసేవే వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మీ ॥ఏలి॥

పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె
తూకొని నీనామముచేఁ దుంచుట యొండె
సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
మేకొని యీమాట వింటే మెత్తురా నిన్నును ॥ఏలి॥

యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె
సరస రెండును నైన సంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరిబేసి జంటమాట జరపకు మిఁకను ॥ఏలి॥ 203

[1] 'యవ్వరో' రేకు [2] 'యెవ్వరో' రేకు

## బలహంస

ఏమి సేతు నిందుకు మందేమైనఁ ౧బోయ రాదా
సామజగురుఁడ నీతో సంగమొల్ల దేఁటికే ॥పల్లవి॥

మాయలసంసారము మరిగిన కర్మము
ఈయెడ నిను మరుగ దేఁటికో హరి
కాయజకేలిపైఁ దమిగలిగిన మనసు
కాయజుతండ్రి నీపైఁ గలుగ దిదేఁటికే ॥ఏమి॥

నాటకపుఁగనకము నమ్మినట్టిబదుకు
యేఁటికి నీభక్తి నమ్మదేలే హరి
గూఁటఁబడే పదవులు గోరేటిజీవుఁడు
కూటువైననిజముక్తి గోరది(ఁడి?)ది యేఁటికే ॥ఏమి॥

పాపపుణ్యములకె పాలుపడ్డ నేను
యేపున నీపాలఁ జిక్క నేలకో హరి
శ్రీపతివి నాలోని శ్రీవేంకటేశుఁడ
నీపేరివాఁడ నాకు నిండుమాయ లేఁటికే ॥ఏమి॥ 204

## దేసాళం

తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక
యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు ॥పల్లవి॥

యీ సంసారమునకు యితఁడే దిక్కు నేఁ-
జేసేటిచేఁతలకెల్ల శ్రీపతే లోను
పాసిపోఁడెప్పుడు నన్ను బందువుఁడితఁడే నాకు
దాసుఁడైనవాఁడు హరిఁ దగదు దూరఁగను ॥తల్లి॥

---

౧ బోయ రేకు

చావుఁబుట్టుగులవేళ సతము నీతఁడే
సావి భోగములకు నిచ్చకుఁడీతఁడే
భావములోపల నుండుఁ బ్రాణ మీతఁడే నాకు
దైవము దూరగనేల తనకేమి వచ్చినా ॥తల్లి॥

తలఁపులోపలికి యీదైవమే తోడు
యిలఁ గలిమిలేముల కీతఁడే తోడు
పలుకులోపల నుండుభాగ్య మీతఁడె నాకు
కొలిచి శ్రీవేంకటేశుఁ గొసరఁగనేఁటికి ॥తల్లి॥ 205

## సౌరాష్ట్రం

విడువ విడువ నింక విష్ణుఁడ నీపాదములు
కడఁగి సంసారవార్ధి కడుముంచుకొనిన ॥పల్లవి॥

పరమాత్మ ° నీవెందో పరాకైయున్నాను
పరగ నన్నింద్రియాలు పరచినాను
ధరణిపైఁ జెలరేఁగి తనువు వేసరినాను
దురితాలు నలువంకఁ దొడికి తీసినను ॥విడు॥

పుట్టుగు లిట్టె రానీ భువి లేక మాననీ
వట్టి ముదిమైన రానీ వయసే రానీ
చుట్టుకొన్నబంధములు చూడనీ వీడనీ
నెట్టుకొన్నయంతరాత్మ నీకు నాకుఁ బోదు ॥విడు॥

యీదేహమే యయిన ఇఁక నొక్కటైనాను
కాదు గూడదని ముక్తి కడకేఁగినా
శ్రీదేవుఁడవైన శ్రీవేంకటేశ నీకు
సోదించి నీశరణమె చొచ్చితి నే నిఁకను ॥విడు॥ 206

° నీవేఁదో రేకు

భంగాళం

చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ నింతే
అప్పటి నపరాధమా ఆదరించవలదా ॥పల్లవి॥

నీయాజ్ఞ దేహము నే మోచితినింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వోయయ్య ○ కొంతైన వూరడించవలదా ॥చెప్పి॥

నీవు సేసేకర్మము నేఁజేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవ(వు?)రమై వెంట వెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంత వడైనా దప్పిదీర్చవలదా ॥చెప్పి॥

మతిలో శ్రీవేంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్యా
యితవై పనిసేసేటియింటిపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డ వెట్టఁదగదా ॥చెప్పి॥ 207

336 - రేకు నాదరామక్రియ

ఏమని విన్నవించేను ౨ యెన్నెని కాచేవు నీవు
శ్రీమాధవుఁడ నీకుఁ జేతికి లోనయ్యా ॥పల్లవి॥

పుట్టినదె వొకతప్పు భువిమీఁద నటమీఁద
నెట్టన సంసారినౌటే నిజము రెండోతప్పు
రట్టుకెక్కి దొరనౌటే నెట్టన మూఁడోతప్పు
యిట్టె కావు కావకుండు మిదివో నాతప్పు ॥ఏమ॥

---

○ 'కో(త్తైన రేకు ౨ 'ఎన్ని+అని' ఇట్టి సంధులీవాఙ్మయమున కోకొల్లలు

అన్నపానములు గోరినదియే మొదలి బందె
యెన్నఁగఁ గాంతలఁగూడుటిదివో రాతిటిబందె
కన్నవారి వేఁడేది కడతొడుకుబందె
కొన్నిట నేమి గొనేవు కొనవయ్య బందె ॥ఏమ॥

కొనఁ బుణ్యపాపాలే గొడియకట్లు రెండు
కొనిరి నీదాసులే కోరినతప్పుదండము
వినవయ్య యిదివో శ్రీ వేంకటేశ నామనవి
మనుఁగాఁపుఁ జేసితివి మన్నించవయ్య ॥ఏమ॥ 2

## కేదారగౌళ

ఇందిరానాధుఁడవు యిందరికి నేలికవు
చిందరవందరలైన చింతలు మరేలా ॥పల్లవి॥

వుండుమంటే నుండవీ(డినవి?) వూరకే బ్రహ్మాండాలు
నిండుమంటే నిండినవి నీరధులెల్లా
మెండగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె
వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా ॥ఇంది॥

పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచినదేవతలెల్ల
అట్టే యణఁగిరిగా అసురలెల్ల
పట్టిన నీచల మిదె బహళస్వతంత్ర మిదె
వెట్టిదైవాలపనులు వేరే మరేలా ॥ఇంది॥

కమ్మంటే నాయను కైవల్యపదవులు
రమ్మంటే వచ్చె వేదరాసులెల్లను
కమ్మిన శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీకు
యిమ్ములు నీమహి మిదె యితరములేలా ॥ఇంది॥ 2

## బౌళిరామక్రియ

పలికేటివేదమె ప్రమాణము
తలఁచిన వారికి తత్త్వము సుండీ ॥పల్లవి॥

నరహరి యజాండనాయకుడు
సురలితనినే సంస్తుతించిరి
పురుషోత్తముఁ డిదె భూమికి -యీ
హరిఁ గొలువనివా రసురలు సుండీ ॥పలి॥

కమలారమణుఁడె ఘనుఁడు
అమరులె మ్రొక్కుదు రాతనికి
విమతులఁ దునిమె విష్ణుఁడు
తమిఁ బూజించక తగు గతి లేదు ॥పలి॥

భావజజనకుఁడు బ్రహ్మము
సోవగఁ గొలిచిరి శుకాదులు
శ్రీవేంకటపతిచెలువుఁడు
దైవశిఖామణిఁ దలఁచరో బుధులు ॥పలి॥ 210

## పళవంజరం

ఒక్కమాఁటలోనివే వొగి బంధమోక్షాలు
చిక్కినందాఁకా దేహి చింతఁ బొందీఁగాని ॥పల్లవి॥

హరి యని నుడిగి రెండక్షరాలఁ బాపేటి-
దురితాలు భువిలోనఁ దొల్లె లేవు
పురిగొని యందుమీఁద పొంచి విశ్వాసములేక
పెరుగఁగఁ బెరుగఁగ పెచ్చు రేఁగీఁగాని ॥ఒక్క॥

మతిలో గోవింద యన్న మాత్రమున నంటేటి-
అతిపుణ్యాలిలమీఁద నన్ని గలవా
కతగా నట్టె మహిమగానలేక వుండఁగాను
బతిమాలఁగానే యింత బయలాయఁగాని ॥ఒక్క॥

శ్రీవేంకటేశ నిన్ను సేవించితే నిచ్చేటి-
యేవల వరాలు లెక్క నెంచవసమా
భావించి తెలిసి చేపట్టెడి యరుదింత
దైవము నా కియ్యఁగాను దక్కె నింతేకాని ॥ఒక్క॥ 211

## కన్నడగౌళ

తలరో లోకాంత(ర) పరులు తడవము పుణ్యాపాపమును
వలె నని శ్రీవైష్ణవులకు వందనమే సేసెడివాఁడ ॥పల్లవి॥

తపసిఁ గాను ధర్మిఁ గాను
కృపగలశ్రీపతికింకరుఁడ
జపితఁ గాను [1] శాస్త్రిఁగాను
వుపదేశపు గురువూళిగకాఁడ ॥తల॥

[2] భయము లేదు భక్తి లేదు
జయభాగవతుల దయవాఁడ
ప్రియము న్నెరఁగను పెరిమ న్నెరఁగను
ద్వయాధికారముఁ దగిలినవాఁడ ॥తల॥

జ్ఞానము లేదు మోనము లేదు
పూని శ్రీవేంకటపురుషుఁడిదె
నానాటఁ దెలిపి నను మన్నించెను
సానఁదేరి తన శరణమువాఁడ ॥తల॥ 212

---

[1] శాస్త్రియున్ లోని యు లోపించగా సిద్ధించిన రూపము [2] భయముల్లేదు రేకు

## సామంతం

చలువకు వేఁడికి సరికి సరి
కలదిఁక హరి నీ కరుణే మాకు ॥పల్లవి॥

కాయము గలిగినఁ గలుగుఁ దోడనే
పాయపుమదములు పైపైనే
రోయదు తనుఁ గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుఁగుట యెపుడో ॥చలు॥

కడుపు నిండితే ఘనమై నిండును
బడిఁ [1]బంచేంద్రియపదిలములు (?)
విడువ వాసలును వెలయు బంధములు
కడగని మోక్షము గైకొనుటెపుడో ॥చలు॥

పెక్కులు చదివిన పెనఁగుఁ దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా-
నిక్కపు వేల్పవు నీచిత్త మిఁకను ॥చలు॥ 213

## 337 - రేకు హిందోళవసంతం

దైవమొకఁడే మాతలఁపు నొకటే
పావనమైతిమి పదరేమా ॥పల్లవి॥

హరి యెటు దలఁచిన నటయీ(ట్టయ్యీ?)ని
పరుగుఁగోరికలపనులేలా
ధర నభయమొసఁగుదైవముబంట్లము
మరలి యితరులకు మఱి వెరచేమా ॥దైవ॥

---

[1] పంచేంద్రియపదిలములు = 'పంచేంద్రియముల యొక్క నిర్భయమైన పనులు' కావచ్చు ఇట్టి విరుద్ధసమాసములు ఈ వాఙ్మయమున కలంకారములు

పురుషోత్తమానతిఁ బుట్టినవారము
అరిదిసిరులకై యలపేలా
సరి లక్ష్మీపతిశరణాగతులము
అరయఁగ నితరుల నడిగేమా ॥దైవ॥

శ్రీవేంకటపతిచేఁత జీవులము
దావతి నితరము తగులేలా
వావిరిని కరివరదునివారము
తావున బందాలఁ దగిలేమా ॥దైవ॥ 21

## నాగవరాళి

చాలుఁ జాలు నీసటలఁ బొరలితిమి
వాలి కొంత వెరవకుమనలేవు ॥పల్లవి॥

కలవు లోకముల ఘనమంత్రంబులు
అలరి ముక్తి యియ్యఁగలేవు
సులభానఁ గలరు సొరిది దేవతలు
వలగొను పాపము వారించలేరు ॥చాలుఁ॥

వున్నవి పుణ్యము లూరకె యివిగో
పన్నిన హరిఁ జూపఁగలేవు
సన్నితి(ధి?) నున్నవి సకళశాస్త్రములు
కొన్నైన భవములకొన గన నీవు ॥చాలుఁ॥

ధరలో ° సేనలు ధనధాన్యంబులు
పరమజ్ఞానవిభవ మీదు(వు?)
అరుదుగ శ్రీవేంకటాధిపుఁడే మము
యిరవై కావఁగ యీడేరితిమి ॥చాలుఁ॥

---

° 'శానలు' రేకు

## శోకవరాళి

విడువుము మనసా వీరిడిచేఁతలు
తడయక శ్రీహరిఁ దలఁచవొ యిఁకను ॥పల్లవి॥

నానాఁడే యెనఁబదినాలుగులక్షలు
యోనుల వెడలితి నొక్కఁడనే
ఆనిన భోగములందలివే పో
కానము యిఁకనేమి గడియించేము ॥విడు॥

నలుగడ నటు పదునాల్గు లోకములు
వెలయఁ జొచ్చితిని వెడలితిని
కలిగినదేదో కలుగనిదేదో
తెలియ దేమిటికిఁ దిరిగేమో ॥విడు॥

భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము
కవిసి యాఫలము గైకొంటిని
యివల శ్రీవేంకటేశుఁడింతలో
తవిలి యేలఁగా ధన్యుఁడనైతి ॥విడు॥ 216

## గుండక్రియ

ఇరవుగా నిన్నెరిఁగిరి యిదివో నీదాసులు
పరదైవములమీఁద నొల వేయనేల పనిలేవు నీమాయలు కరుణానిధీ ॥పల్లవి॥

ముంచెను నీపాదములు మూఁడులోకములయందును
యెంచెను నీ వేయినామాలు యిలలో వేదవ్యాసుఁడు
చంచులఁ దలఁచిరి నిన్ను మున్నే సనకాదియోగీంద్రులు
పొంచి యింకా నీకు దాఁగఁ జోటు లేదు యిందు బొడచూపవే
యింకవెడమాయలేలా ॥ఇర॥

కొనెను నీపాదతీర్థము బ్రహ్మ కోరి నీపాదము గడిగి
వినుతించె నీమహిమ తొల్లె వేయినోళ్లగలశేషుఁడు
అనిరి నిన్నెక్కుడనుచు మొదల శుకాదిమునీంద్రులెల్లా
పొనిగి నీవు మాయ [1]సేయఁ జోటు లేదు మమ్ము పాసఁగి యేలుకోవె
పురుషోత్తముఁడా ॥ఇర॥

యెక్కెను ధ్రువుఁడు పట్టము యిదివో నిన్నుఁ గొలిచి
చిక్కెను నీశరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను
గక్కన శ్రీవేంకటేశుఁడా యిట్టె కాచితివి మాటకే మమ్ము
యిక్కడ నీమాయ [2]సేయఁ జోటు లేదు నిన్ను నెరిఁగిరి నీదాసు
లిందిరారమణా ॥ఇర॥ 217

## హిజ్జిజ్జి

పాపముఁ బుణ్యము పరగ నొకట నదె
వోపినవారలు వొడిఁగట్టెడిది ॥పల్లవి॥

నాలుకతుదనే నానారుచులును
నాలుకవే(దే?) హరినామమును
పోలింప నొక్కటి భోగమూలము
మూల నొకటది మోక్షమూలము ॥పాప॥

మనసున నదివో మగువలమోహము
అనుగుమనసుననె హరిచింత
పనివడి యొక్కటె ప్రపంచమార్గము
కొన నొకటే వైకుంఠమార్గము ॥పాప॥

వెలుఁగుఁ జీఁకటియు వెస నొకనాఁడే
కలిగె నట్ల నివి కలిగినవి

౧ ౨ 'శాయ రేకు

యిలలో శ్రీవేంకటేశు మా యొకటి
తలఁప నొక టతనిదాసులసుగతి ॥పాప॥ 218

## సౌరాష్ట్రం

హరిదాసులే మాకు నడ్డమై కాతురుగాక
శరణంటి వారికి నే సకలోపాయములు ॥పల్లవి॥

పెరుగఁబెరుఁగఁగానే పెద్దలాయ నింద్రియాలు
యిరవైనమాబుద్ధు లిందుగొల్పినా
తిరిగితిరిగి మాకు ద్రిష్టమాయ జన్మములు
దురితాలుఁ బుణ్యాలుఁ దోసేమా యిఁకను ॥హరి॥

కూడఁగూడ నానాఁటఁ గొనకెక్కెఁ గోరికలు
వీడనిబంధము లన్నీ విడిచీనా
పాడితో నీడా నాడఁ బ్రాణములుఁ దీపులాయ
యేడనున్ననేము నేమే యెరిఁగేమా యిఁకను ॥హరి॥

చింతించఁ జింతించఁ జేతికి వచ్చె మనసు
అంతలో శ్రీవేంకటేశుఁ డంది కాచెను
దొంతులై తిరుమంత్రము తోడనే నాలుక నంటె
మంతనాన గురుసేవ మరచేమా యిఁకను ॥హరి॥ 219

## 338 - రేకు బౌళిరామక్రియ

కైకొన్నకొలఁది కర్మము
వాకుచ్చి తనతోనే వగవఁగనేలా ॥పల్లవి॥

తలఁచినకొలఁదేదైవము తన-
కలపుకోలుకొలఁదే కడనరులు
బలువుకొలఁదియే పంతము
తొలఁగర(క?) యితరుల దూరఁగనేలా ॥కైకొ॥

మచ్చిక నొడివినంతే మంత్రము
అచ్చపుభక్తి కొలఁదే యాచార్యుఁడు
నిచ్చలుఁ గోరినయంతే నిజమైనలోకము
పచ్చివెచ్చిచదువుల భ్రమయఁగనేలా ॥కైకొ॥

నెమ్మది ° జాతెంతే నియమము
సమ్మతించినంతే సంతోసము
యిమ్ముల శ్రీవేంకటేశుఁడిచ్చినంతే యిహపర-
మెమ్మెల కిది మరచి యేమరఁగనేలో ॥కైకొ॥ 220

## వరాళి

ఇన్నిజన్మము లెత్తిన యిం(దిం?)దుకా నేము
పన్నిన సంసారములబంధమే మిగిలెను ॥పల్లవి॥

తీరెఁ దీరె అన్నములు దినదినకోరికలు
కోరఁబోతే యాసలెల్ల కోటానఁగోటి
సారెఁ గొన్నరుచులెల్ల చవితో మేనిలో లేవు
ఆరితేరిబతుకఁగా నాసలే మిగిలెను ॥ఇన్ని॥

పోయఁబోయ స్వర్గాదిభోగములు వెనకకే
సేయఁబోతే పుణ్యములు సేనాసేన
ఆయమంటి వెతకితే నాతుమలోనా లేవు
కాయముతో వెంట వెంట కర్మమే మిగిలెను ॥ఇన్ని॥

అందెనందె మోక్షము హరిదాసులవల్లను
ముందు వెనకెంచితేను మూలమే హరి
గొందిఁ జిక్కె నరకాలు కోపముఁ బాపముఁబాసె
యిందు నందు శ్రీవేంకటేశుఁడే మిగిలెను ॥ఇన్ని॥ 221

° జాతి+అంతే

## బౌళి

ఏమిటికిఁక నితరపుణ్యములు
తాము దామె హరి దాసుఁడ నేను ॥పల్లవి॥

దురితములు హరి తొల్లే తను
శరణన్నపుడె చాలించినాఁడు
నరకములు మరినాఁడే (తన)
తిరుమంత్రముచేఁ దీరిచినాఁడు ॥ఏమి॥

పుట్టుగులు హరి భువి మునుపే
గట్టిముద్రలనే కడపినవాఁడు
నట్టుకొనుఅజ్ఞానము వెనకకే
పట్టి గురునిచేఁ బాపినవాఁడు ॥ఏమి॥

ఇహపరము లివియును నపుడే
సహజధర్మమున జరపినవాఁడు
విహితముగా శ్రీవేంకటపతి నను
బహుదాసులలోఁ బాలించినాఁడు ॥ఏమి॥ 222

## ఆహిరి

ఆపదలులేనిసుఖ మదియెపో విరతి
వోపితేనే కైకొంట వొల్లకుంటే మానుట ॥పల్లవి॥

అలిగించు ములిగించు నంతలోనే భ్రమయించు
కొలఁది సంసారపుగుణ మిది
మలసి రాలుదింటా మలిగండ్లనేల
వొలిసితేఁ గైకొంట వొల్లకుంటే మానుట ॥ఆప॥

ఆసపెట్టు మోసపెట్టు నంతలోనే వాసిపెట్టు
గాసిల నీసిరులకు గల దిది
వేసరి చానిపిఁ జవి వెదక నదిఁకనేల
వూసివాసిఁ గైకొంట వొల్లకుంటే మానుట ॥ఆస॥

మరపించుఁ దలపించు మరి యేమైనాఁ జేసు
మరియును దనకర్మమహిమిది
గురిగా శ్రీవేంకటేశుఁ గొలిచినవారి కిది
వులకై(వై?)నఁ గైకొంట వొల్లకుంటే మానుట ॥ఆస॥ 223

## సాళంగనాట

నీటముంచు పాలముంచు నీచిత్త మిఁకను
చాటితి నీకృప గురి సంసారమునకు ॥పల్లవి॥

హరి నీవే గురి నాయాతుమలోపలికి
అరిది శంఖచక్రాలే యంగపుగురి
పరమపదమే గురి పట్టినవ్రతమునకు
తిరుమంత్రమే గురి దిష్టపునాలికకు ॥నీట॥

గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు
తావుల నాభక్తికి నీదాసులే గురి
ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు ॥నీట॥

నగుశ్రీపతి గురి నన్ను రక్షించుటకును
తగుసంకీర్తన గురి తపమునకు
తెగనిజ్ఞానమునకు తిరుమణులే గురి
మిగుల శ్రీవేంకటేశ మించి నీవే గురి ॥నీట॥ 224

లలిత

బంటుకు బంటవుదురా పాపముగ క నీ-
బంటుకు బంట్లమై బదికేము నేము ॥పల్లవి॥

పాతాళముననున్నబలివాకిలి గాచేవు
దూతవై పాండవులపొందున నుంటివి
యీతల యేలిక బంటు యీవరుస దప్పె నిఁక
చేతనే నిన్నుఁగొలువఁ జింతయ్యీ నిందుకే ॥బంటు॥

పాండవులదూతవై పనిసేసితివి వారు
అండ నీదూతలయ్యేది అమరుఁగాక
నిండి గురు దైవమనే నియమము దప్పె నిదే
మెండునీదాసులకెల్ల మేర మితి యేదయ్యీ ॥బంటు॥

పరగ నౌలే నీవు భక్తవత్సలుండ వౌదు
తిరమై [1] యెరఁగకాడితిమి యిందాఁకాను
అరుదైన శ్రీవేంకటాద్రీశుఁడవు నీకు
సిరులనే శరణంటిఁ జేసినట్టు [2] సేయవే ॥బంటు॥ 225

139 - రేకు మాళవశ్రీ

వేగిరించనేల విష్ణుఁడే యింతకుఁ గర్త
బాగుగా నాతనియిచ్చుఁ బరగుటేకాక ॥పల్లవి॥

తలపోఁతలేల దైవము గలుగఁగాను
చెలఁగి యాతఁడే యిన్నీఁ జేసీఁగాక
యిల నేఁడె పుట్టినా యింకాఁ గలది గాదా
పలులోకాలు నడప భారము దేవునిదే ॥వేగి॥

[1] 'యురఁగ' రేకు [2] శాయవే' రేకు

చింత లేఁకనేలా శ్రీపతి గలుగఁగాను
మంతుకుఁ బుట్టించి తానే మనుపుఁగాక
వింతా యీ దేహము వేరా యీ యింద్రియాలు
యింతట బ్రహ్మాండనాథుఁ డీ వరికి నొకఁడే ॥వేగి॥

పిలుఁగు గోరికలేల శ్రీవేంకటేశ్వరుఁడు
కలఁ డాతఁడే మనలఁ గాచీఁగాక
వెలసి యాతనిమాయే విశ్వమింతా నిండినది
తెలిపి రక్షించుటకు దిక్కు దెస యితఁడే ॥వేగి॥ 226

## వరాళి

అటు [1] గొన్నాళ్లందాఁక యిటు [2] గొన్నాళ్లిందాఁక
కటకటా శునకపుగతియాయఁ గావవే ॥పల్లవి॥

పసిమిఁ బాపమనేటి బందెలు మేసితిని
కసరి దేహపు కట్టుగాడి నుంటిని
కొసరి కర్మపుమెడగుదియ మోఁచితిని
పసురమువంటివాఁడఁ బాలించవే ॥అటు॥

పంచేంద్రియములనేబాడిగె మోఁచితిని
లంచపుసంసారమనే లాడిఁబడితి
పంచల నాసలచేత బందమ(ము?) వెట్టించుకొంటి
ముంచినగుఱ్ఱమువంటి మూఢుఁడఁ గావవే ॥అటు॥

మరిగి 'యజ్ఞాన'మనేమద మెత్తి తిరిగితి
'మరుఁ'డనేమావటీనిమాయఁ జిక్కితి
గరిమ శ్రీవేంకటేశ కరిఁ గాచితివిగాన
కరి నైతి నన్ను నీవు కరుణించవే ॥అటు॥ 227

---

[1] 'గొన్నాళ్లఁదాఁక' రేకు [2] గొన్నాళ్లిఁదాఁక' రేకు

## దేసి

లోకమింతా నిండె లోచూపు వెలిచూపు
శ్రీకాంతుఁడై తోఁచె చిక్కినవి యాలా ॥పల్లవి॥

సకలజీవులలోన సర్వేశ్వరుఁడు వాఁడె
వొకరి నొఁగాదన నోపను నేను
అకట యాతనిచేఁతే అందరునుఁ జేసేవారే
వికటాలెందుకు నాడ వెరపయ్యీ నాకు ॥లోక॥

భువియందు దీని (దివి?) యందు పురుషోత్తముఁడు వాఁడె
వివరించ మేలు గీడు వెదక నే నోప
చెవి విన్న మాటలెల్ల శ్రీపతియై తోఁచీని
ఇవల కల్లనిజాలు యెంచఁజాల నేను ॥లోక॥

పగటందు రేయందు పరమాత్ముఁడు వీఁడె
తగిలి పాసే నన్ను తలఁపునోప
జిగి మించ నాలోన శ్రీవేంకటేశుఁడే
బగివాయఁ డెన్నఁడును బదుకవో మనసా ॥లోక॥ 228

## లలిత

వర్ణాశ్రమములాల వడిఁ జిత్రగుప్తులాల
వర్ణించి మమ్మెంఁకఁ దడవకురో మీరు ॥పల్లవి॥

చదువులు దెచ్చినట్టి సర్వేశుఁ గొలిచితి
చదువు నామారతఁడు చదివీఁ బోరో
అదన యోగీంద్రవంద్యుఁడైనకృష్ణుఁ గొలిచితి
చదల నాయోగములు సాదించు నతఁడే ॥వర్ణా॥

కూరిమి యజ్ఞకర్తైనగోవిందుఁ దలఁచితి
చేరి నామారతఁ డవి సేసీఁ బోరో
ఆరయ విజ్ఞానమూర్తియైనహరి శరణంటి
వూరకె నాకాతఁ డవి వుత్తరువిచ్చీని ॥వర్ణా॥

దేవతాశిఖామణియైనదేవునిఁ బూజించితిని
దేవఋషిఋణములు తీరిచీఁబోరో
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
చేవఁ బాపాలెల్లఁ బాసె సెలవిచ్చెఁ జేఁతలు ॥వర్ణా॥ 229

## దేశాక్షి

ఊరకే నోరుమూసుక వొంటి నీకు మొక్కేమయ్య
చేరి నారాయణ నీవు చేసినట్టు [1] సేయవే ॥పల్లవి॥

హరినామముఁ దలఁచి అణఁచేనంటేనయ్య
సరి నా పాతకములు చాల వందుకు
నరహరినామ మెంచి నాకుఁ గూడపెట్టేనంటే
అరుదైన పుణ్యములు అన్నిలేవు భూమిని ॥ఊర॥

రామనామము నొడిగి రవ్వలఁ బోఁ [2] జోఁపే నంటే
తామసపునరకాలు దగ్గరవందు
వామననామమెంచి వరస్వర్గ మెక్కేనంటే
యేమిటా నాకడ వారికెడచా దదియు ॥ఊర॥

గోవిందనామముచేతఁ గుదించే భవములంటే
పావనమాయను నీభక్తివల్లను
శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి
యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము ॥ఊర॥ 230

[1] 'శాయవే' రేకు [2] 'జోఁటే' రేకు

బౌళిరామక్రియ

జ్ఞానంబొకటే జగమున కధికం మరి
నానావిధములు నటనలు ॥పల్లవి॥

బహుదానఫలము పడయుటకంటే
యిహమున వైరాగ్య మెక్కుడు
సహజకర్మములు శతములకంటే
అహిశయమని [1] భక్త్యధికము ॥జ్ఞానం॥

ధరఁ దపములనంతంబులకంటే
గరిమల శాంతము ఘనము
విరసాచారము వేవేలకంటే
హరినామపరన మధికము ॥జ్ఞానం॥

ఆవల వ్రతములు అన్నిటికంటే
శ్రీవైష్ణవమే శేఖరము
శ్రీవేంకటేశ్వరుచేఁతలె యివిగన
సేవ యిదొకటే చింతింప ఘనము ॥జ్ఞానం॥ 23

340 - రేకు మంగళకౌశిక

మమ్ముఁజూడనేల నీమహిమే చూతువుగాక
వుమ్మడిఁ బరుస [2]మంటే దొక్కమాఁటేకాదా ॥పల్లవి॥

పెక్కుమారులు నిన్నుఁ బేరుకొని జపించఁగ
మక్కళించి నీకుఁ గొంత మహిమెక్కీనా
వొక్కమారు జపించి నే నూరకుండినంతలోనే
తక్కక నీమహిమలోఁ దరగి పోయీనా ॥మమ్ము॥

[1] భక్తి+అధికము [2] మంటే ఒక్క' రేకు

తగిలి నేఁ గాలమెల్ల ధ్యానము [1] సేయఁగ నీకు
జిగి నీమేనికిఁ గొంత చేవ యెక్కీనా
అగపడి యొకవేళ నటు దలఁచి మానితే
చిగురై యంతటిలోనె చిక్కి వాడీనా ॥మమ్ము॥

యిన్ని యాల శ్రీవేంకటేశ మాయింటిలోననే
వున్నతి నీవారమని వుంటేఁ జాలు
సన్నము దొడ్డెంచనేల సరివలసీచోట
అన్నియు నిత్యమింతే యలమట కోపము ॥మమ్ము॥

మాళవి

ఇదిగో రూపై తోఁచీ యిందరియెదుట నివి
మదిఁ జేపట్టేదిలేక మానెఁగాని ॥పల్లవి॥

కోపమై పొడచూపుఁ గొంత పాపము
దీ(ద్దీ?)పమై పొడచూపు [2] దేహ పాపము
మాపులు నిద్దురై చూపు [3] మరికొంత పాపము
కైపుగాఁ బరుల నింద కడమ పాపము ॥ఇది॥

శాంతమే పుణ్యము సత్యదయే పుణ్యము
అంతటాను హరిభక్తి యది పుణ్యము
చింతించ వైరాగ్యమే చేతిలోని పుణ్యము
మంతనపుజ్ఞానమే మహిఁగల పుణ్యము ॥ఇది॥

హరినామమే ముక్తి యరసి కైకొంటేను
ధర నాతనిదాస్యమే తగిన ముక్తి
సారిది శ్రీవేంకటేశుఁడే పరతత్త్వము
యిరవై కొలుచుటే యిహ నిత్యముక్తి ॥ఇది॥ 233

[1] 'శాయఁగ రేకు [2] 'గొంతపాపము' పూ ము పా [3] 'దేహపా ము పూ ము పా ఈ రెండింటిఁ యతిభంగము

## పాడి

అనుచుఁ బొగడఁ జొచ్చేరదె బ్రహ్మాదులు మింట
మొనసి యీ బాలునికే మొక్కేము నేము ॥పల్లవి॥

వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు
అన్నువ నీ దేవకిగర్భమందు వుట్టెను
సన్నుతి యోగీంద్రులమదిలోనుండెడువాఁడు
పన్నిన పొత్తులలోన బాలుఁడై వున్నాఁడు ॥అను॥

పాలజలధిలోన పాయనిగోవిందుఁడు
పాలు వెన్న లారగించె పైఁడికోరను
వోలిఁ దన విష్ణుమాయ నోలలాడినట్టివాఁడు
చాలి మంత్రసానులచే జలకమాడీని ॥అను॥

ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు
తగుబలభద్రునికి తమ్ముఁడాయను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి
యెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడే ॥అను॥ 234

## శుద్ధవసంతం

హరిపూజే బ్రహ్మాండ మవ్వలి కవ్వలగాని
యెరవెల్లా నాసందికీసందివే ॥పల్లవి॥

తపములు జపములు దానధర్మములెల్ల
యెపుడును బ్రహ్మలోక మీసందివే
విపరీతభోగాలు వెలలేనిపుణ్యాలు
కపురులు స్వర్గలోకముకాడివే ॥హరి॥

వట్టి సటరాజసాలు వర్ణాశ్రమములును
పుట్టుగులిన్నియును యీభూమిమీఁదివే
చుట్టపు [1]సంబంధాలు జోలి హావివర్తనలు
దిట్టతనములెల్ల యీదేహముతోడివే ॥హరి॥

పూఁటపూఁటకోరికలు పొరలేవుపాయాలు
మాఁటలుఁదేటలునెల్ల మతిలోనివే
గాఁటపు శ్రీవేంకటేశుగని కొలిచినఁజాలు
నాఁటకపుమతములు నవ్వులలోనివే ॥హరి॥ 235

## హిందోళం

ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు ॥పల్లవి॥

నగధర నందగోప నరసింహ వామన
జగదేకపతియనేజపము మాది
తగు హరిడింగరీఁడ దాసుఁడ బంటననేటి-
మిగులఁబెద్దతనము మించేది మాకు ॥ఉన్న॥

హరి పుండరీకాక్ష ఆదినారాయణయనేటి-
ధర నామమంత్రములే ధనము మాకు
సరుస శంఖచక్రాలు సర్వేశుదాసుల[2]సేవె(వ?)
మరిగినదె మామతమును మనికె(కి?) ॥ఉన్న॥

శ్రీవేంకటేశయని శేషగిరివేదాద్రి
భావించి కొలుచుటే మాబ్రదుకెల్లను
కైవల్యమిదియె కంటి మిట్టి మంచిత్రోవ
పావనమైతిమి మమ్ముఁ బాలించె నితఁడు ॥ఉన్న॥ 236

[1] సమ్మందాలు రేకు  [2] 'షేవే' రేకు

## శంకరాభరణం

ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ
గాఁటపుదేవతలెల్లఁ గాచుకున్నా రితని ॥పల్లవి॥

చెక్కుమీఁటి పాలువోయ చేరి నోరు దెరచితే
పక్కననుఁ బొడచూపె బ్రహ్మాండాలు
అక్కున నలముకొంటే నంగజతాపము మోఁచె
వ౯క్కువకు వెరతుము మాయపు బాలునికి ॥ఏఁటి॥

పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగుదోఁచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకొన్న వేకమై యెవ్వరికి వసగాఁడు
హత్తిచూడ వరతు మీ యారడిబాలునికి ॥ఏఁటి॥

తేటి ఏసితోడిముద్దు దేవలోకము పనులు
మీఁటి యేవి చూచినాను మితిలేనివి
ఆఁటడిగొల్లెతలము అట్టె కూడి యాడితిమి
వేఁటు౧సేయ వెరతు(ము?) శ్రీవేంకటాద్రిబాలుని ॥ఏఁటి॥ 237

### 341 - రేకు భూపాళం

కన్నవారివద్ద నెల్లఁగావంగ నేమిగద్దు
యిన్నిటికి నియ్యఁగొన నీతఁడే స్వతంత్రుఁడు ॥పల్లవి॥

పరమేష్ఠిఁ గన్నతండ్రిఁ బాటించి కొలువరో
అరుదై లోకాలకెల్ల నతఁడే తండ్రి
సిరిమగఁడైనవానిఁ జేపట్టి తలఁచరో
సిరులిచ్చేమేఁటిదాత ౨సృష్టికెల్ల నతఁడే ॥కన్న॥

---

౧ శాయ' రేకు ౨ 'స్రిష్టి' రేకు

అంబరీషుఁ గావఁ జక్రమంపినవానిఁ జేరరో
అంబుజభవాండాన కతఁడే రక్ష
పంబిన భూకాంతపతిఁ బాయక సేవించరో
వుంబళ్ల వూళ్ల నిచ్చేవున్నతుఁడు నతఁడే ॥కన్న॥

మూలమంటేఁ గరిఁగాచేముఖ్యునికి మొక్కరో
మూలధనమైయుండీ ముందర నిట్టె
యీలీలఁ జిత్తజుతండ్రి నెదలోనఁ గొలువరో
పాలించ శ్రీవేంకటాద్రిపతియాయ నితఁడే ॥కన్న॥ 238

## లలిత

తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని
యెల్లసందేహాలు బాసె నిఁకనేల చింత ॥పల్లవి॥

నారదుఁడు సోదించి నారాయణు నెరిఁగె
సారెకు శివుఁ డెరిఁగి చాటె రాముని
చేరి సోదించెఁ బార్వతి శ్రీరామచంద్రుని
యేరీతుల సోదించేము యింతకంటె నేము ॥తొల్లి॥

వేదవ్యాసులు దెలిసే వెదకి విష్ణునిఁ జెప్పె
° సాదించి(రి)తని యోగిసనకాదులు
యీదెస శుకాదులెల్ల నెరిఁగిరి మాధవుని
కాదని వీరికంటె గతి గానఁగలమా ॥తొల్లి॥

పెక్కుగాలము చదివి పెక్కేండ్లుబదికి
పెక్కు రుషులిందునునె పెద్దలైరి
దక్కఁగ శ్రీవేంకటేశు ధనముగాఁ జూపి రిదె
తక్కక కొలిచితిమి దైవమని కంటిమి ॥తొల్లి॥239

° 'సాదించింతని' రేకు

## కౌశి

నీవంటిదైవాలు వేరీ నిఖిలలోకములందు
యీవల నావల నెందు నెంచి చూడ మాకును ॥పల్లవి॥

తగిలి నీమోముచక్కఁదన మెంచి చూచితిమా
తగిన మరునిఁగన్న తండ్రివి నీవు
అగపడ్డనీగుణము లవి యెంచిచూచితిమా
నిగిడి కల్యాణగుణనిధివనీ ° శ్రుతులు ॥నీవం॥

గుట్టు నీపెద్దతనము కులమెంచిచూచితిమా
అట్టె బ్రహ్మకులము నీయందుఁ బుట్టెను
దట్టపు నీపనులవర్తన మెంచి చూచితిమా
ముట్టి సర్వరక్షకత్వమున వెలసితివి ॥నీవం॥

బెడిదమైననీబిరు దెంచిచూచితిమా
వడి శరణాగతవత్సలుఁడవు
కడఁగి శ్రీవేంకటేశ కంటిమి నీమహిమలు
బడి నిన్నే సేవించి బ్రదికితి మిదివో ॥నీవం॥ 240

## మంగళకౌశి(క)

నీవనేనమ్మినయట్టినీవారము
వేవేలువిధాలఁ జేసే విన్నపమిదయ్యా ॥పల్లవి॥

పండెనుమాకర్మములు పాలు గోరు గొనవయ్య
అండనె నామతిలోనిఅంతర్యామి
నిండెనునాకోరికలు నినుపువారిధులై
వెండిబంగారాలతోడ ° విఱవీఁగవయ్యా ॥నీవ॥

---

° 'శృతులు' రేకు ° 'విఱ్ఱవీఁగ' కావచ్చు

మలసె మాపుట్టుగులు మారుమూలసరకులై
కలసుంకము దీరుచు కరుణాకర
వెలసె సంసారాలు వెక్కసపుఁ బౌఁజులై
తొలఁగక యిటు నీవు తోడుచూడవయ్యా ॥నీవ॥

కూడెను మానుతులనే గోకులపుఁ గదుపులు
యీడుగాఁ బుల్లరి గొని యేలవయ్యా
వోడక శ్రీవేంకటేశ వొప్పగించితిమి నీకు
వేడుకలు దైవార విహరించవయ్యా ॥నీవ॥ 241

## నాగవరాళి

వెగ్గల మింతా [1]వృధా వృధా
తగ్గి పరులతో దైన్యములేలా ॥పల్లవి॥

పెంచఁగఁబెంచఁగఁ బెరగీ నాసలు
తుంచఁగఁదుంచఁగఁ దొలఁగు నవి
కంచముకూడును కట్టినకోకయు
వంచనమేనికి వలసినదింతే ॥వెగ్గ॥

తడవఁగఁదడవఁగఁ దగిలీబంధము
విడువఁగఁ విడువఁగ వీడునవి (ది?)
గుడిశలోన నొకకుక్కిమంచమున
వొడలు సగమునను వుండెడిదింతే ॥వెగ్గ॥

మరవఁగమరవేఁగ మాయలే యింతా
మురహరుఁదలచితే మోక్షము
నిరతి శ్రీవేంకటనిలయుఁడే కాయపు-
గరిమెల నిలిచిన కాణా చింతే ॥వెగ్గ॥ 242

[1] 'వ్రితా, వ్రితా' రేకు

## శుద్ధవసంతం

హరి నీవు లేవా అన్నిచోట్లను తొల్లి
అరయ నీదాసులే యరు దింతేకాక ॥పల్లవి॥

కంటిమినీదాసులను కన్నులపండుగగాను
కొంటిమి పాదతీర్థము కొల్లలుగాను
వింటిమి నీనామములను వీనులపండుగగాను
అంటిన మోక్షముత్రోవ అడుగనేమిటికి ॥హరి॥

నుతించి మాటాడితిమి నోరార నీదాసులను
మతిఁజొక్కితిమి దాస్యమహిమచేత
మతిగంటిమి వారిసంగతి కూటములవల్ల
వెతకి విజ్ఞానము వేఁడనేమిటికి ॥హరి॥

మొక్కితిఁ జాగిల నీమోహపుదాసులకును
యెక్కితిఁ బరమపదమిహమందునే
తక్కక మన్నించిరి నీదాసులె నన్నన్నిటాను
గక్కన శ్రీవేంకటేశ కడమ లేమిటికి ॥హరి॥ 243

342 - రేకు

## సాళంగం

హరివల్ల కడమలే దంతనంత నున్నవాఁడు
గరిమఁ గాననివారికల్ల యింతే సుండీ ॥పల్లవి॥

లోనఁ హరిఁ దలఁచితే లోపలందె పొడచూపు
పూని వెలిఁ దలఁచితే భూమినల్లాఁ బొడచూపు
తానే యిందరిలోన దైవమయి వున్నవాఁడు
కానకవుండినవారికల్ల యింతే సుండీ ॥హరి॥

పట్టి విచారించుకొంటేఁ బ్రాణముతోఁ బొడచూపు
జట్టిఁదనదండనల్లా సంసారమై చూపు
పట్టపగలై వున్నాఁడు బాయట నెందు చూచిన
గట్టిగాఁ గాననివారికల్ల యింతే సుండీ ॥హరి॥

శరణముచొచ్చితేనె చేతిలోనే వున్నవాఁడు
పరమభాగవతులపలుకులో నున్నవాఁడు
యిరవుగ శ్రీవేంకటేశుఁడెదుటనే వున్నాఁ డతని-
కరుణ గాననివారికల్ల యింతే సుండీ ॥హరి॥ 244

## ఆహిరి

మాకు నేమీఁ బనిగాదు మరి యేమిగలిగినా
శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల ॥పల్లవి॥

ధరణీశుపసులకుఁ దగు బందె లేదట
హరిదాసులకుఁ బాపమంటునా మరి
సరిఁ జక్రపుడాగు లిచ్చుటఁ జూచుకోరో మీరు
అరసి మీఁదటిమాట లాతని నడుగరో ॥మాకు॥

లావరిమన్ననపాత్రులకు వెట్టి లేదట
కావింప వైష్ణవులకుఁ గర్మమున్నదా
దేవునిలాంచన మిదె తిరుమణి చూచుకోరో
ఆవల నేమిగల్లాను ఆతని నడుగరో ॥మాకు॥

సతి రాణివాసమైతే జాతికులమెంచరట
హితశరణాగతులకేది జాతి
తతి శ్రీవేంకటపతిదాస్య మిది చూచుకోరో
యితవై మరేమిగల్లా నీతని నడుగరో ॥మాకు॥245

## లలిత

ఎంచి చూచితే మాకు నిందే నిత్యసుఖము
కొంచి యనుమానమైతే కొనదాఁకా లేదు ॥పల్లవి॥

హరి నీగర్భములోన నంగమయి వున్నారము
యిరవై వేరేమోక్ష మెంచ నున్నదా
నిరతిఁ జూచినవెల్లా నీరూపులే మాకు
ధరలోన నింతకంటె ధ్యానమున్నదా ॥ఎంచి॥

అంతరాత్మవైన నిన్నే యాతుమకు నిచ్చితిని
యింతకంటె నే నడిగేది యిఁకనున్నదా
పొంతనే భూకాంత పుట్టిన నెలవు మాకు
యింతకంటె తల్లిదండ్రు లిఁకనున్నారా ॥ఎంచి॥

పొరి నెరుకే జ్ఞానము పొంచి మరపే సమాధి
సొరిది నేఁడింతకంటే సుఖమున్నదా
గరిమ శ్రీవేంకటేశ కల్పితమింతా నీదె
శరణంటే యింకా విచారమున్నదా ॥ఎంచి॥ 246

## శుద్ధవసంతం

దైవమా నీచేఁతలు తప్పదు మా రోఁతలు
యేవలఁ జూచినఁ బాయ దేమందమయ్యా ॥పల్లవి॥

కాయములో హేయమదె కమ్మఁబూఁత మీఁద నదె
రోయదు చిత్తమునకు రుచియే తోఁచీ
మాయలనే పొరలేది మాఁటలనే విసిగేది
యేమెడఁ [౧] గనీ గాన మేమందమయ్యా ॥దైవ॥

---

[౧] 'గనీ గానమే యేమందమయ్యా' రేకు

పుట్టుగది యెంగిలి పూఁచిన దాచారము
గుట్టు చెడదందునాను గుణమే తోఁచీ
వట్టియాసఁ బొరలేది వంతఁ [1] బడి తిరిగేది
యెట్టు వేగించఁగవచ్చు నేమండుమయ్యా ॥దైవ॥

నిక్కిచూచితే నెరుక నిర్ధరించితే మరపు
మక్కళించినబదుకు మంచిదై తోఁచీ
మిక్కిలి శ్రీవేంకటేశ మీకు నేను శరణంటే
యెక్కువాయ నాపదవి యేమందమయ్యా ॥దైవ॥ 247

## శ్రీరాగం

అటమీఁదిపనులకు హరి నీవే కలవు
సటలైనా నిజమైనా జరపేముగాక ॥పల్లవి॥

పరమాత్మ నీమాయఁ బాయఁగ నే నెంతవాఁడ
దొరయైతే [2] రాజాజ్ఞ దోయవచ్చునా
తొరలిన యింద్రియాలఁ దోసిపోవ నెట్టువచ్చు
సిరుల నేలికపంపు సేయు టింతేకాక ॥అట॥

శ్రీపతి యీసంసారము సేయకుండ నెంతవాఁడ
మాపుదాఁకా రాచవెట్టి మానవచ్చునా
పాపపుణ్యము లొల్లక పరగ నాకెట్టు వచ్చు
తేపఁ దల్లి వుగ్గువెట్టఁ దినకుండవచ్చునా ॥అట॥

దేవ నీవిచ్చినమేను తెగి రోయ నెంతవాఁడ
కావించి రాచయీవికిఁ గడమున్నదా
శ్రీవేంకటేశ నీచిత్తములోవాఁడ నింతే
యేవిధిఁ బెట్టినా నేనియ్యకొంటగాక ॥అట॥ 248

[1] 'బది' రేకు [2] 'రాచాజ్ఞ' రేకు ఈ వాఙ్మయమున ఈ ప్రయోగము పలుతావుల గలదు

భైరవి

అనుచు మునులు ఋషు లంతనింత నాడఁగాను
వినియు విననియట్టె వీడె యాడీఁగాని ॥పల్లవి॥

ముకుందుఁ డితఁడు మురహరుఁ డితఁడు
అకటా నందునికొడుకాయఁగాని
శకుంతగమనుఁ డితఁడు సర్వేశుఁ డితఁడు
వెకలి రేపల్లెవీధి విహరించీఁగాని ॥అను॥

వేదమూరితి ఇతఁడు విష్ణుదేవుఁ డితఁడు
కాదనలేక పసులఁ గాచీఁగాని
ఆదిమూల మితఁడు యమరవంద్యుఁ డితఁడు
గాదిలిచేఁతల రోలఁ గట్టువడెఁగాని ॥అను॥

పరమాత్ముఁ డితఁడే బాలుఁడై వున్నాఁడుగాని
హరి యీతఁడే వెన్నముచ్చాయఁగాని
పరగ శ్రీవేంకటాద్రిపతియును నీతఁడె
తిరమై గొల్లెతలచేఁ దిట్టువడీఁగాని ॥అను॥ 249

343 - రేకు మలహరి

మానరో వో లోకులాల మాకు మీకు నేమి దోడు
నాఁటికిఁక మీకు నవ్వఁబాటు నేము ॥పల్లవి॥

యిరవై నానోటికి యెన్నెన్ని చదివిన
హరియనేయంతరుచి అందు లేదు
గరిమ నెన్నిరూపులు కన్నుల నేఁ జూచినాను
పురుషోత్తముఁ జూచినపూర్తి యందు లేదు ॥మాన॥

యెచ్చోట నుండినాను యిందిరేశుమందిరము
చొచ్చి యుండేసుఖ మంత చొప్పడ దందు
కచ్చుపెట్టి వీనులకుఁ గతలెన్ని విన్నాను
[1]అచ్చుతుకీర్తన వినేయందు సరి రాదు ॥మాన॥

కైపుగాఁగ కన్నవారికాళ్ళకు మొక్కినాను
శ్రీపతికిమొక్కినంత సెలవు గాదు
యేపున శ్రీవేంకటేశు నిటులఁ బూజించినట్టు
మాపుదాఁకా నితరుల మనసురాదు ॥మాన॥ 250

## దేవగాంధారి

పట్టిన ముట్టనుండరు పదరుదు రంతలోనే
యెట్టనె(యే?)దుటిమిమ్ము నెరిఁగీ నెరఁగరు ॥పల్లవి॥

గుక్కక మూఁడులోకాలు [2]గొలిచితివని నీకు
మొక్కుదురు, పరులకు మొక్కకుండరు
అక్కరదీర శ్రీపతివని నిన్ను వేఁడుదురు
వెక్కసపుఁ దైవాల వేఁడుకోక మానరు ॥పట్టి॥

కందువ బ్రహ్మగన్నట్టి ఘనుఁడవు నీవార-
మందురు, పరులవారమనకుండరు
అంది వేదాలు దెచ్చేయాతఁడవు నీవే యని
యెందు నెంచి, పరులను యెంచకుండరు ॥పట్టి॥

యిత్తల నారదాదుల కేలికని నీమరఁగు
చొత్తురు, పరులమాఁటు చొర[3]కుండరు
అత్తిన శ్రీవేంకటేశ యన్నియు నీమాయలింతే
యెత్తిన[4]వెఱ్ఱులు లోకులిట్టే భ్రమతురు ॥పట్టి॥ 251

[1] 'అచ్యుతు రేకు ప్రాసభంగము [2] 'గొలచితి రేకు [3] 'కుండదు రేకు [4] వేఱు రేకు

## లలిత

ఇంక నేమిసేసేము యిన్నిటాఁ దనిసితిమి
సంకెలెల్లాఁ దీరెఁ దీరె చాలుఁజాలుఁ గర్మము ॥పల్లవి॥

కోరి పుణ్యము లేమైనాఁ గొన్ని సేసేమంటిమా
కోరిక్కలిచ్చేటి హరి కూడి మాలోనున్నాఁడు
చేరఁ జోటువెదకి పొంచి తిరిగేమంటిమా
చేరేటివైకుంఠపతి చేతిలో నున్నాఁడు ॥ఇంక॥

భవహరముగ వేదపఠన సేసేమంటే
భవహరమగుహరిపాటలు నోట నున్నవి
తవిలి సంపదలకై దానమిచ్చేమంటిమా
భువిలోన శ్రీపతి మాపుజలో నున్నాఁడు ॥ఇంక॥

యిహసుఖములకుఁగా యిందరి వేఁడేమంటే
యిహమిచ్చేశ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు
సహజమయినయట్టిసర్వేశఁ డీతడే
మహిమలన్నియుఁ దానె మాకు నిచ్చినాఁడు ॥ఇంక॥ 252

## ధన్నాసి

నీవే దయసేసి నేఁడు మమ్ముఁ గాతుగాక
శ్రీవల్లభుఁడ నీకు సేవ సేసే[1]వారమా ॥పల్లవి॥

యిదిపుణ్య మిది పాప మెట్టని తెలిసేమయ్య
అదన నన్నపు నామే యన్నువట్టెను
యిదెదైవ మిదెగురుఁ డెట్టని యెరిఁగేమయ్య
మొదల నానాయోనిముట్టంటువారము ॥నీవె॥

---

[1] 'వారము' లేకు

ఆచారమేది యిఁక ననాచారమేదయ్యా
కాచినయాఁకటికరిగాపులము
యేచినబంద మిది మోక్ష మిది యనలేమయ్యా
పూచినపంచేంద్రియాలపొరుగైతి మిదివో ॥నీవె॥

ముంద రిది వెన కిది ముట్టి యేమనెంచేమయ్యా
కందువసంసారపుగర్వ మెక్కెను
అందపుశ్రీవేంకటేశ యన్నియు నీమాయ లివి
పొంది నీకొప్పనసేసి భోగించేమయ్యా ॥నీవె॥ 253

## పళవంజరం

హరినే యడుగరో ఆమాఁట
సరుగ నిందరికి సర్వేశ్వరుఁడు ॥పల్లవి॥

కామముఁ గ్రోధము కాయపు గుణములు
నేమపుటాత్మకు నిందేది
గామిడి మాయే కర్త యిందుకును
సోమరి మమ్మంటఁ జోటేది ॥హరి॥

పాపముఁ బుణ్యము భావవికారము
పైపై నాత్మకుఁ బనిలేదు
శ్రీపతి పంపిటు సేసితి మింతే
తాపి మమ్ముఁ దగులఁ దగవేది ॥హరి॥

కాయముఁ బ్రాయము కర్మపు గుణములు
సేయని యాత్మకు సెలవేది
యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి
చాయల నితనికి శరణంటిమి ॥హరి॥ 254

## నాదరామక్రియ

కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక
కలఁడన్న వారిపాలఁ గలిగిన దైవము ॥పల్లవి॥

యిచ్చెను సంపద లితఁ డింద్రాదులకునెల్ల
యిచ్చెను శుకాదుల కిహపరాలు
యిచ్చెను వాయుజునికి యిటమీఁదిబ్రహ్మపట్ట-
మిచ్చల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము ॥కల॥

కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద
కట్టె విభీషణుకు లంకారాజ్యము
కట్టియిచ్చె నజునికి గతచన్నవేదాలు
కట్టెను శ్రీసతిచేతఁ గంకణసూత్రములు ॥కల॥

పెట్టెను దేవతలకు పేరినమృతపువిందు
వెట్టెను భక్తవత్సలబిరు దితఁడు
యిట్టె శ్రీవేంకటాద్రి నిందరికిఁ బొడచూపి
పెట్టెఁ దనప్రసాదము పృధివి జీవులకు ॥కల॥ 255

## 344 - రేకు దేసాళం

ఎదురేది యింక మాకు యెందు చూచినను నీ-
షదము లివి రెండు సంపదలు సౌఖ్యములు ॥పల్లవి॥

గోపికానాధ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మధా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీపాదములే మాకు నిధినిధానములు ॥ఎదు॥

పురుషోత్తమా హరీ భువనపరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుందరక్షకా
ధరణి నీపాదములె తల్లియును దండ్రి ॥ఎదు॥

దేవకీనందనా దేవేంద్రవందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీపాదములె గతి యిహముఁ బరము ॥ఎదు॥ 256

## గౌళ

బాపురే నీమాయ భ్రమయించీ జీవులకు
దాపున నున్నదేకాని దవ్వులకుఁ జొరదు ॥పల్లవి॥

మోక్షమురుచి గానదు ముందర నుండఁగాను
సాక్షియై జగమిది చవి చూపఁగా
దీక్షకుఁ జొరదు మరి దేవ నీపై భక్తి లేదు
దక్షులై యాలుబిడ్డలు దండనుండఁగాను ॥బాపు॥

జ్ఞానమితవు గాదు సంగడి నుండదుగాన
నానాయోనులమేను ననిచుండఁగా
ఆనకమై వైరాగ్యమంట దలవాటులేక
కానఁబడ కర్మములు గాసిఁ బెట్టఁగాను ॥బాపు॥

మంచిదని నీ తిరుమంత్రము దలఁచుకోదు
పంచేంద్రియములాత్మ బలిశుండఁగా
యెంచుకొని శ్రీవేంకటేశ నీకే శరణని
అంచల నీదాసులైతే నన్నిటా గెలిచిరి ॥బాపు॥ 257

## పళవంజరం

వెఱపించఁబోయి తానె వెఱచెఁ దల్లి యశోద
మఱచి యీబాలు నెట్టు [1] మానిసెంటా నుండెనో ॥పల్లవి॥

వెంట రాకుమని కృష్ణు వెరపించి యశోద
వొంటి మందలో గొంగ వున్నాఁడనె
అంటి గొంగ యెందునున్నాఁడని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను ॥వెఱ॥

చందమామఁ బాడి తల్లి సరిఁ బొత్తుకు రమ్మంటే
చందురుఁ జూచి కృష్ణుఁడు సన్నసేసెను
ముందరఁ జంద్రుఁడు వచ్చి మొక్కితే యశోద చూచి
[2] ముందేలా యంటినో యని ముంచి వెరగందెను ॥వెఱ॥

[3] పాలార్చి తొట్టెలలోఁ బండఁబెట్టి యశోద
నీలవర్ణుఁ దొంగిచూచె నిద్దురో యని
వోలి శంఖచక్రాలతో నురము శ్రీసతితోడ
యీలీల శ్రీవేంకటేశుఁడై యున్నాఁడు ॥వెఱ॥ 258

## గుజ్జరి

ఏమన వచ్చును చెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు గొన్ని
శ్రీమాధవ నీ చిత్తము కొలఁదిఁక చెప్పెడిదేఁటికి జీవులకు ॥పల్లవి॥

కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు మిముఁ దలఁచనివారిది నేరమి
కలుషమెడలి సూర్యోదయమైనా కానవు కొన్ని జంతువులు
తెలిసినవారలు కందురు యీ తెరఁగ(గు?)లు రెంటికి దినమొకటే॥ఏమ॥

---

[1] 'మానిశెంటా' రేకు మానిసి+అంటా' [2] ముందు+ఏలా [3] పాలు+ఆడించిరి

శరణాగతరక్షణచతుర సర్వాంతరాత్మక యచ్యుత
సరి నిన్నుఁ గొలిచినవారిది పుణ్యము చలమున మానుటే పాపము
సరుగనఁ గాచేటి చల్లని చంద్రుఁడు జారచోరులకుఁ గడు వేఁడి
అరయఁగఁ గలువలకును హితుఁడు అందుకు నిందుకు గురి యితఁడే॥ఏం॥

శ్రీవేంకటగిరినిలయా శ్రీసతీశ పురుషోత్తమ
మీవొద్దనుండితే వైకుంఠము మిమ్ము నెడసితే నరకము
భావములోపల నీవే వుండఁగ భక్తి లేదు కొందరికైతే
శ్రీవైష్ణవులకు నిత్యము యీ చింతలు రెంటికి నీ మహిమే ॥ఏమ॥ 259

## దేసి

అజ్ఞానులకివి యరుహము లింతే
సుజ్ఞానులకివి చొరనేలయ్యా ॥పల్లవి॥

దైవమునమ్మినదాసులకు
కావింపఁగ మరి కర్మము లేదు
దావతిజలనిధిదాఁటినవారికి
వోవల మరియును వోడేలయ్య ॥అజ్ఞా॥

గురుకృపగలిగినగుణనిధికి
అరయఁ బాపపుణ్యము మరి లేదు
[1] విరసపుఁ జీఁకటివెడలినవారికి
పరగ మరియు దీపంబేలయ్య ॥అజ్ఞా॥

జగములెరుఁగు వైష్ణవులకును
తగిలెటి యపరాధంబులు లేవు
అగపడి శ్రీవేంకటాధిపుఁ గొలిచితే
యెగువ దిగువ మాకెదురేదయ్య ॥అజ్ఞా॥ 260

[1] విరసపుఁ రేకు

బౌళి

హరి సర్వాత్మకుఁ డాదిమపురుషుఁడు
పొరి నెరుఁగువారి పుణ్యముగాన ॥పల్లవి॥

నాలుకకొననే నారాయణుఁడిదె
వైళము దలఁచనివారిదె పాపము
నేలయు మిన్నును నిజవైకుంఠము
పోలించి చూడని పురుషుల వెలితి ॥హరి॥

మనసులోననే మాధవుఁడున్నాఁడు
కనుఁగొననివారికడ మింతే
తనువే విష్ణుని తత్వసాధనము
వొనరఁగ శ్రీపతి యున్నాఁడుగాన ॥హరి॥

చేరువ నిదివో శ్రీవేంకటపతి
ధారుణిఁ గొలిచేటి దాసులభాగ్యము
కారణ మితఁడే కలిగినదైవము
కోరినవారల కొంగులపసిఁడి ॥హరి॥ 261

345 - రేకు మేఘరంజి

అని బ్రహ్మాదులెంచేరు హరిబాలలీలలు
వెనక శుకాదులచే వింటిమి నేమిదివో ॥పల్లవి॥

పొత్తులలోఁ బవ్వళించె పురుషోత్తముఁడు దొల్లి
హత్తి [1]మఱ్ఱాకుపైఁ బండినటువలెనె
వొత్తగిలి బోరగిలి వుండఁజొచ్చెఁ గృష్ణుఁడు
తత్తరానఁ గూర్మావతారమైన గతిని ॥అని॥

---

[1] 'మఱేకుపై' రేకు

తప్పటడుగులు వెట్టె తగఁ ద్రివిక్రముఁడై
గొప్పపాదాలను భూమి గొలచినట్టు
అప్పుడే కొదలు మాఁటలాడఁ(జొచ్చెఁ గృష్ణుఁడు
తప్ప నసురసతులఁ దగఁ బోధించినట్లు ॥అని॥

అచ్చపు రేపల్లెలోన నాడఁ(జొచ్చెఁ గృష్ణుఁడు
మెచ్చుల వైకుంఠాన మెరసినట్లు
నిచ్చలు శ్రీవేంకటాద్రినిలయుఁడై యున్నవాఁడు
అచ్చుగ జీవులలోన నాతుమైనయట్లు ॥అని॥ 262

## గుండక్రియ

[1] నర(వ?)రూప [2] ప్రహ్లాదనరసింహా
అవిరళతేజ ప్రహ్లాదనరసింహా ॥పల్లవి॥

పగరపై కోపము బంటుఁజూచి మరచితి
నగుమొగము ప్రహ్లాదనరసింహా
యెగువ నీకోపమున కితఁడె మాఁటుమందు
అగపడె మాకును ప్రహ్లాదనరసింహా ॥నర॥

అంటముట్టరానికోప మంగనఁ జూచిమానితి
నఁటుచెల్లుఁ బ్రహ్లాదనరసింహా
జంట నీ[3]బుద్ది తిప్ప సతియె యంకుశము
అంటు వాయమిఁకను ప్రహ్లాదనరసింహా ॥నర॥

ధర మొరవెట్ట దేవతలే మొక్కితే మానితి
గరుడాద్రిఁ బ్రహ్లాదనరసింహా
యిరవై శ్రీవేంకటాద్రి నిందు నందు నీదె సుద్ది
అరసితి మిదివో ప్రహ్లాదనరసింహా ॥నర॥ 263

---

[1] ప్రాసభంగము [2] 'ప్రంహ్లాదనరసింహ్వా' రేకు [3] 'బుద్దిదిప్ప' రేకు 'బుద్ధిఁదిప్ప' కావచ్చు

## లలిత

ఏదాయ నేమి హరి యిచ్చినజన్మమే చాలు
ఆదినారాయణుఁ డీయఖిలరక్షకుఁడు ॥పల్లవి॥

శునకముబతుకును సుఖమయ్యే తోఁచుఁగాని
తన కది హీనమని తలఁచుకోదు
మనసొడఁబడితేను మంచిదేమి కానిదేమి
తనువులో నంతరాత్మ దైవమౌట దప్పదు ॥ఏదా॥

పురువుకుండేనెలవు భువనేశ్వరమై తోఁచు
పెరచోటి గుంతయైన ప్రియమైయుండు
యిరవై వుండితేఁజాలు యెగువేమి దిగువేమి
వరుస లోకములు "సర్వం విష్ణుమయ"ము ॥ఏదా॥

అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెరఁ దనతిమ్మటే జీవన్ముక్తి
కచ్చుపెట్టి శ్రీవేంకటపతిదాసుఁడైతే
హెచ్చుకుం దేమిలేదు యేలినవాఁ డితఁడే ॥ఏదా॥ 264

## ఆహిరి

ఎందరి వెంటల నేఁగేము
చందపు హరి నీ శరణనియెదము ॥పల్లవి॥

పెంచినఁబెరుఁగును పెక్కుబంధములు
తుంచినఁదునుఁగును దు ఖములు
యెంచఁగనేటికి యింద్రియమహిమలు
చుంచుల హరి నీ సూత్రములివియే ॥ఎంద॥

పఱపినఁ బారును బహుళపుటాసలు
తఱపినఁ దరగును తన మదము
వెఱవఁగనేఁటికి వెడకర్మములకు
కఱకులహరి నీ కల్పితమివియే ॥ఎంద॥

చేసినఁ జెలఁగును జిగి సంసారము
మూసిన ముణుఁగును మోహములు
యీసుల శ్రీవేంకటేశ్వర యివి నీ-
దాసులఁ దడవవు తగు నీమహిమ ॥ఎంద॥ 265

## పాడి

కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ
యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి ॥పల్లవి॥

మనసులోనికి గురి మాధవ నీ పాదాలు
తనువుపై గురి నీ సుదర్శనము
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు
పను లెన్నిగలిగినఁ బట్టకు నా నేరమి ॥కల॥

చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు
నీతి నా నాలికగురి నీ నామము
కాతరపునుదుటికిఁ గలతిరుమణి గురి
పాతకపునావలనఁ బట్టకుమీ నేరము ॥కల॥

యిహపరాలకు గురి యీ నీ శరణాగతి
సహజ మాత్మకు గురి సంతతభక్తి
మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి
బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి ॥కల॥ 266

## నాదరామక్రియ

దైవము దూరఁగనేల తమనేర్పు నేర మింతే
యీవలఁ దమకర్మము లెంచరు మనుజులు ॥పల్లవి॥

మొల్లమి గాలియొకటే ముంచి తూరుపెత్తుచోట
పొల్లకట్టు కడఁబడె పోగువడె గట్టివెల్లా
వుల్లములో శ్రీహరి ఒకఁడై వుండునతని-
నొల్లరైరి యసురలు వొలిసిరి సురలు ॥దైవ॥

మించిన జల్లి యొకటె మీఁదనుండు దొడ్డవెల్లి
చంచుల సన్నములెల్లా సందులఁ గారు
యెంచఁగ హరి యొకఁడే యెరఁగక కొందరైతే
కొంచమై రీతనిఁ గొల్చి కొందరై తె(రి?) ఘనులు ॥దైవ॥

ఆఁకలిదీరదు యటు నానాఁటికి
కాఁకలు మానవు కాంత లేక
మాఁకువంటి జన్మము గలకాలము
చీఁకటిదేహపుచిత్తపుగుణము ॥అల॥

నీవు వొసఁగినదె నిర్మలదేహము
నీవె నా నేర్పునేరములు
శ్రీవేంకటేశుఁడ జిగి నీ శరణని
దీవెనఁ బొందితి దేహపుగుణము ॥అల॥ 268

## కేదారగౌళ

మీ మతము పరిభాష మీవల్లనే పుట్టెఁగాక
యేమునులైనాఁ దొల్లి యెంచిరా యీమాఁట ॥పల్లవి॥

ముడిగి నాలుగు సూత్రములె మీ వివరణము
కడమ వ్యాససూత్రాలు కల్లలా యేమి
కడు ముఖ్యము మహావాక్యమే చాలుననెను(నేరు?)
అడరి వసిష్ఠాదు లాడిరా యీమాఁట ॥మీమ॥

తానె బ్రహ్మమనంటె తగ జీవన్ముక్తినేరు
పూని లోకులెల్లా ముక్తిఁ బొందవలెఁగా
పాని కర్మానుభవాలు బాధితాను[1]వృత్తనేరు
వీనుల సర్వపురాణాల వింటిమా యీమాఁట ॥మీమ॥

పైకొని బ్రహ్మజ్ఞానము భక్తిరూపము గాదని
చేకొని కొల్చెదరట్టె శ్రీవేంకటేశు
దీకొనుచుఁ జేసేరు దేవపూజాది యజ్ఞాలు
యేకాత్మవాదులాల యితవా యీమాట- ॥మీమ॥ 269

[1] వ్రిత్తన్నేరు రేకు

## శంకరాభరణం

చెప్పఁబోతే యీ యర్థము చిత్తము వొడఁబడదు
తప్పులు వెదకకురో తత్వజ్ఞులాల ॥పల్లవి॥

చెలఁగి మిథ్య యంటాఁ జేసేయజ్ఞాలు ఫలించునా
యిల శూన్యోపాసకుల కేడ దేవుఁడు
లలి మాయా శబళితులకు మోక్ష మెక్కడిది
నలి నభేదవాది కానందానుభవ మేది ॥చెప్ప॥

హరి శరణుచొరనియట్టివారికి దిక్కేది
గురుఁడు వేరే లేఁడట కోరి వుపదేశమేది
వెరసి శిఖాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరగ భక్తి లేదట భవమేట్టు గడచె ॥చెప్ప॥

శ్రీవేంకటేశుముద్ర ధరించక వైకుంఠమేది
యీ విభుపేరు జపించకెట్టు పాపా లుత్తరించు
వేవేగ దాసుఁడుగాక వెట్టికేల కరుణించు
సేవించినఁగాక సర్వచింతలేల యుడుగు ॥చెప్ప॥ 270

## శ్రీరాగం

అహోబలేశ్వరుఁ డఖిలవందితుఁడు
మహి నితనిఁ గొలిచి మనుఁ డిఁక జనులు ॥పల్లవి॥

మూఁడుమూర్తులకు మూలం బీతఁడు
వేఁడిప్రతాపపు విభుఁ డీతఁడు
వాఁడిచక్రాయుధవరదుఁ డీతఁడు
పోఁడిమిఁ బురాణపురుషుఁ డీతఁడు ॥అహో॥

అసురలనెల్లఁ గాలాంతకుఁ డీతఁడు
వసుధ దివ్యసింహం బితఁడు
విసువని యేకాంగవీరుఁ డీతఁడు
దెసలఁ బరాత్పరతేజం బితఁడు ॥అహో॥

నిగిడి శ్రీవేంకటనిలయుఁ డీతఁడు
బగివాయనిశ్రీపతి యితఁడు
సొగిసి దాసులకు సులభుఁ డీతఁడు
తగు నిహపరములదాతయు నీతఁడు ॥అహో॥ 271

## మాళవి

అంజినీదేవికొడుకు హనుమంతుఁడు
సంజీవినిదెచ్చినాఁడు సారె హనుమంతుఁడు ॥పల్లవి॥

కలశాపురముకాడ కదలీవనాల నీడ
అలవాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండలకోనలందలిగుహలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు ॥అంజి॥

పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురలనెల్లఁ గొట్టీ హనుమంతుఁడు
వసుధఁ బ్రతాపించి వడిఁ దోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు ॥అంజి॥

వుద్దవిడి లంకచొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవేంకటేశు ° కటుబంటై వరమిచ్చి
కొద్ది మీర సంతోసాలే గుప్పీ హనుమంతుఁడు ॥అంజి॥ 272

° ఈ 'కటు' పూ ము పా న జారిపోయినది దానివలన యతిభంగము

## వరాళి

పంతగాఁడు మిక్కిలి నీపవనజుఁడు
రంతుకెక్కె మతంగపర్వతపవనజుఁడు ॥పల్లవి॥

వాలాయమై యెంతభాగ్యవంతుఁడో దేవతలచే
బాలుఁడై వరములందెఁ బవనజుఁడు
పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి
యేలికముందరఁ బెట్టె యీ పవనుజుఁడు ॥పంత॥

పొంటులు సోదించితెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటుగాఁగఁ బొందుసేసెఁ బవనజుఁడు
వొంటినే రామునిముద్ర వొసఁగి సీతముందర
మింటిపొడవై పెరిగె మేఁటి పవనజుఁడు ॥పంత॥

కిట్టి శ్రీవేంకటేశ్వరుకృపచే ముందరిబ్రహ్మ-
పట్ట మేలనున్నవాఁడు పవనజుఁడు
చుట్టి చుట్టి తనకు దాసులయినవారికి
గట్టి వరములిచ్చె నీ ఘనపవనజుఁడు ॥పంత॥ 273

**347 - రేకు** **శ్రీరాగం**

ఏడకేడ నీచెరిత లేమని పొగడవచ్చు
యీడులేనిమహిమలయినవంశరామా ॥పల్లవి॥

పరమాన్నములోఁబుట్టి పక్కనఁ దాటకిఁ జంపి
సరుస విశ్వామిత్రుయజ్ఞము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లాడి
పరశురామునిచేత బలము చేకొంటివి ॥ఏడ॥

వైపుగాఁ సుగ్రీవుఁ గూడి వాలి నొక్కకోల నేసి
యేపున జలధి గట్టి యెసగితివి
దీపించు రావణుఁ జంపి దివిజులను మన్నించి
యేపుగా విభీషణుని రాజ్య మేలించితివి ॥ఏడ॥

సీతతోఁ బుష్పకమెక్కి జిగి నయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టము గట్టుకొంటివి
యీతల శ్రీవేంకటాద్రి నిటు విజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి ॥ఏడ॥ 274

## ఆహిరి

సులభుఁ డీతఁ డిదివో సుగ్రీవనారసింహుడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో ॥పల్లవి॥

నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు
రవ్వలుగా దేవతల రక్షించేవాఁడు
వువ్విళ్ళూర కంభములో నుదయించినవాఁడు
నివ్వటిల్లు ప్రతాపాన నెగడినవాఁడు ॥సుల॥

హేమపుచాయలవాఁడు యెదుటఁ గొల్వున్నవాఁడు
కోమలిఁ దొడపై నిడుకొన్నవాఁడు
కోమలపుమేనివాఁడు గొప్పకిరీటమువాఁడు
చేముంచి హిరణ్యదైత్యుఁ జించినవాఁడు ॥సుల॥

వాలుకగోళ్లవాఁడు వాఁడికోరలవాఁడు
మేలిమికర ఇతోడ మించినవాఁడు
వోలిఁ దుంగభద్రకాడనుండి శ్రీవేంకటాద్రిని
లీలతోఁ బ్రహ్లాదుని కేలికైయైనవాఁడు ॥సుల॥275

## చాయ

శరణు శరణు నీకు జగదేకవందిత
కరుణతో మమ్ము నేలు కౌసల్యానందన ॥పల్లవి॥

ఘనరణరంగవిక్రమ దశరథపుత్ర
వినుతామన(ర?)స్తోమ వీరరాఘవ
మునులును రుషులును ముదమునొందిరి నీవు
జననమందినందుకు ¹ జానకీరమణ ॥శర॥

సులభ లక్ష్మణాగ్రజ సూర్యవంశతిలక
జలధిబంధన విభీషణవరద
తలఁకి యసురలు పాతాళము చొచ్చిరి నీవు
విలువిద్య నేర్చితేనే విజయరామ ॥శర॥

రావణాంతక సర్వరక్షక నిర్మలభక్త-
పావన దివ్యసాకేతపట్టణవాస
వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నిను( జూచి శ్రీవేంకటేశ ॥శర॥ 276

## నాట

రాముఁడు లోకాభిరాముఁ డందరికి రక్షకుఁ డీతనిఁ దెలిసి కొలువరో
కామితఫలదుఁడు చరాచరములకుఁ గర్తయైనసర్వేశ్వరుఁడితఁడు ॥పల్లవి॥

తలఁప దశరథునితనయుఁడట తానె తారకబ్రహ్మమట
వెలయ మానుషపు వేషమట వెగటుగ హరువిల్లు విరిచెనట
అలరఁగ తానొక రాజట పాదాన నహల్యశాపము మాన్పెనట
సొలవక దైవికమానుషలీలలు చూపుచు మెరసీఁ జూఁడరో యితఁడు ॥రాము॥

¹ 'జానకీ' రేకు

జగతి వసిష్ఠునిశిష్యుఁడట జటాయువుకు మోక్ష మిచ్చెనట
అగచరులే తనసేనలట అంబుధి కొండలఁగట్టెనట
మగువకొరకుఁగానట కమలాసను మనుమనిఁ రావణుఁ జంపెనట
తగ లౌకికి ౧ వైదికములునొక్కట తానొనరించీఁ జూడరో యితఁడు ॥౯

వెస నమరుల వరమడిగెనట ౨ విభీషణపట్టము గట్టెనట
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకుఁ గొలువిచ్చెనట
పొసగ శ్రీవేంకటగిరి నివాసమట భువనము లుదరంబున ధరించెనట
సుసరపుసూక్ష్మాధికములు తనందుఁ జూపుచునున్నాఁడు చూడరో
యితఁడు ॥రాము॥

## గౌళ

అతిముఖ్యుఁడె హనుమంతుఁ డట్టిబంటు
వెలుపు లేని రఘువీరునికి బంటు ॥పల్లవి॥

యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమిగలిగినయాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు ॥అతి॥

తను మనోవంచనలెంతటా లేనివాఁడే బంటు
ధనముపట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురు మాటాడనివాఁడే బంటు
అనిమొనఁ దిరుగనియతఁడే బంటు ॥అతి॥

చెప్పినట్లనే నడచినయాతఁడే బంటు
తప్పులేక హితుఁడైనాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహిగానిహితుఁడే బంటు ॥అతి॥

---

౧ 'వైదుక' రేకు ౨ 'విభీషణు' కావచ్చు

అక్కర గలిగి కడు నాప్తుఁడైనవాఁడే బంటు
యెక్కడా విడిచిపోనియిష్టుఁడే బంటు
తక్కక ° రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తిగలవాఁడే బంటు ॥అతి॥

కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరనియాతఁడే బంటు
నానాగతి శ్రీవేంకటోన్నతుఁడైనయతనికి
తా నిన్నిటా దాసుఁడైనధన్యుఁడే బంటు ॥అతి॥ 278

## 348 - రేకు దేవక్రియ

ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడే మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు ॥పల్లవి॥

విడిసెఁ గపిబలము వెస సముద్రము దరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని ॥ఏమి॥

చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలుగాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
² మెచ్చిరందరు సీతాసమేతుఁడాయ నితఁడు ॥ఏమి॥

మగుడెఁ బుష్పకముపై మహిమ నీతనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చె నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు ॥ఏమి॥ 279

° 'రహస్య' రేకు ² మెచ్చిరిందరు రేకు

## మేఘరంజి

ఇందులోనే కానవచ్చె నిన్నిటా నీ మహిమలు
చెంది నీవే దిక్కు మాకు సీతాపతిరామా ॥పల్లవి॥

దేవ నీకు వలసితే తృణము బ్రహ్మాస్త్రమాయ
భావించితే రాతికిఁ బ్రాణము వచ్చె
కావలసి యేసితే నాకాశముకట్లు దెగె
దైవమవంటే నీవే దశరథరామా ॥ఇందు॥

కూరుచుక యేలితేను కోఁతులు రాజ్యముసేసె
కోరితేనే నీటిపైఁ గొండలు దేలె
సారెఁ గదలివచ్చె నీ సన్నల సంజీవికొండ
° యేరీతి నీసరి వేరీ యినకులరామా ॥ఇందు॥

సూటి నీవు దలఁచితే సురలు పంపుసేసిరి
చాటితేనే నీపేరు జపమాయను
ఆటల నీకతలెల్లా నాచంద్రార్కమై నిలిచె
గాటపు సిరుల శ్రీవేంకటగిరిరామా ॥ఇందు॥

## దేసి

ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ ప్రతాపము
రామ రామభద్ర సీతారమణ సర్వేశ ॥పల్లవి॥

వెరవున హరువిల్లు విరుఁగఁ దీసిననాఁడే
అరయ విరిగె నీవు లసురలకు
వరుస వనవాసవ్రతము వట్టినపుడె
పరులమతుల భీతి వట్టె రఘురామ ॥ఏమ॥

---

° 'యేలితి' రేకు ప్రాసభంగము

వచ్చి నీవు దండకావనము చొచ్చిననాఁడే
చొచ్చిరి పాతాళ మసురలెల్లాను
ముచ్చటాడి చుప్పనాతిముక్కు గోసిననాఁడే
కొచ్చి దైత్యు లాసదెగఁగోసిరి శ్రీరామ ॥ఏమ॥

అదరి మారీచుపై నమ్ము విడిచిననాఁడే
విడిచిరి దానవులు వేడుకలెల్లాను
బడి విభీషణునిఁ జేపట్టితే రక్కసులెల్లా
చిడిసి మల్లెవట్టిరి శ్రీవేంకటరామ ॥ఏమ॥ 281

## ముఖారి

కొలువరో మొక్కరో కోరి తలఁచరో
చెలఁగి మనల రక్షించీని వీఁడె ॥పల్లవి॥

పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు
వేయినామములవెన్నుఁడు
పాయకకొల్చినభక్తప్రసన్నుఁడు
యీయెడనే వరములు యిచ్చీని వీఁడే ॥కొలు॥

పరిపూర్ణుఁడు మహానుభావుఁడు
తిరమగు దేవాధిదేవుఁడు
పరమానందస్వభావుఁడు
గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె ॥కొలు॥

తెలియుఁ డీతఁడె దేవాగ్రగణ్యుఁడు
వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు
అలరఁగ శ్రీవేంకటాచలేశపుణ్యుఁడు
నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె ॥కొలు॥ 282

## సామంతం

రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరో
యేమిటికి విచారాలు యిఁక దైత్యులాల ॥పల్లవి॥

చలమునఁ దాటికిఁ జదిపినబాణము
లలి మారీచసుబాహులపైబాణము
మెలఁగి పరశురాము మేట్లేసినబాణము
తళతళ మెరసీని తలరో యసురలు ॥రాము॥

మాయామృగముమీఁద మరి వేసినబాణము
చేయి చాఁచి వాలి నేసినబాణము
తోయధిమీఁద నటు తొడిగినబాణము
చాయలు దేరుచున్నది చనరో దైతేయులు ॥రాము॥

తగఁ గుంభకర్ణునితల ద్రుంచినబాణము
జిగి రావణుఁ బరిమార్చినబాణము
మిగుల శ్రీవేంకటేశు మేఁటిపాద(ది?)లో నున్నది
పగ సాధించీ నిఁకఁ బారరో రాకాసులు ॥రాము॥ 28

## నాదరామక్రియ

అప్పటి సుఖమేకాని యటమీఁదెంచుకొనఁడు
ఉప్పతిల్లు జీవుని వుద్యోగా లిట్టివి ॥పల్లవి॥

తనుభోగపురతులు దలపోయుచుండుఁగాని
తన నరకకూపాలు దలపోయఁడు
కనకభూషణములు గని వెరగందుఁగాని
ఘనకర్మబంధాలకుఁ గడు వెరగందఁడు ॥అప్ప॥

యీకడాకడఁ దాఁ జేసేటియెమ్మెలే యెంచుఁగాని
పైకొని కూడేటిపాపము లెంచఁడు
దీకొని జగములోనిద్రిష్టములే చూచుఁగాని
భీకరపు జన్మముల పిరివీకు చూడఁడు ॥అప్పు॥

వింతవింతమాటలవేడుకలే వినుఁగాని
అంతటఁ దాఁ బడేపాట్లవి వినఁడు
ఇంతటా శ్రీవేంకటేశుఁడేలఁగా నెరిఁగెఁగాని
యెంతచెప్పినాను బుద్ధి యిన్నాళ్లు నెరఁగఁడు ॥అప్పు॥ 284

## 349 - రేకు గుండక్రియ

జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార-
మగణితముగఁ గూడె నదె స్వాతియోగము ॥పల్లవి॥

పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి
చక్కఁగాఁ గడపమీఁద సంధ్యాకాలమున
వక్కలు సేసె నురవడి నరసింహుఁడు ॥జగ॥

పిప్పిగాఁగఁ జప్పరించి పేగులు [1]జందేలు వేసి
తొప్పఁదోఁగుచు నెత్తురు దోసిటఁ జల్లె
రొప్పుచుఁ గోపముతోఁ గేరుచుఁ బకపకనవ్వి
తప్పక చూచె వాని నుదగ్రనరసింహుఁడు ॥జగ॥

యెదుటఁ బ్రహ్లాదుఁ జూచి యిందిరఁ దొడపై నుంచె
అదన నందరికి నభయమిచ్చె
కదసి శ్రీవేంకటాద్రిగద్దెమీఁదఁ గూచుండె
వెదచల్లెఁ గృపయెల్ల వీరనరసింహుఁడు ॥జగ॥ 285

---

[1] 'జందలు' రేకు

## సౌరాష్ట్రం

వీధులవీధుల విభుఁడేఁగీ నిదె
మోదముతోఁడుత మొక్కరో జనులు ॥పల్లవి॥

గరుడధ్వజ మదె కనకరథం బదె
అరదముపై హరి [1] యలవాఁడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరఁగ బగ్గములు పట్టరో జనులు ॥వీధు॥

ఆడే రదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
[2] కూడి యిందరునుఁ జూడరో జనులు ॥వీధు॥

శ్రీవేంకటపతిశిఖరముచాయదె
భావింప బహువైభవము లవే
గోవిందనామపుఘోషణ లిడుచును
దైవం బితఁడని తలఁచరో జనులు ॥వీధు॥ 286

## మాళవశ్రీ

శ్రావణబహుళాష్టమి సవరేత్రికాడను
శ్రీవిభుఁడుదయించెఁ జెలులాల వినరే ॥పల్లవి॥

అసురలశిక్షించ నమరులరక్షించ
వసుధభారమెల్లా నివారింపను
వసుదేవునికిని దేవకీదేవికిని
అసదృశమగు కృష్ణుఁ డవతారమందెను ॥శ్రావ॥

---

[1] 'యల్లవాఁడె' కావచ్చు [2] 'కూడిరిందరునుఁ' కావచ్చు

గోపికలమన్నించ గొల్లలనెల్లాఁ గావఁగ
దాపై మునులనెల్లా దయసేయను
దీపించ నందునికి దేవియైనయశోదకు
యేపున సుతుఁడై కృష్ణుఁ డిన్నిటాఁ బెరిగెను ॥శ్రావ॥

పాండవుల మనుపఁగ పదారువేలఁ బెండ్లాడఁగ
నిండి శ్రీవేంకటాద్రిపై నిలుచుండఁగా
అండ నలమేల్మంగ నక్కునఁ గాఁగలించఁగ
దండియైయుండఁ గృష్ణుఁడు తగ నుతికెక్కెను ॥శ్రావ॥ 287

## వసంతం

కోలలెత్తుకొని గోపాలులునుఁ దాను
యీలీల సోదించె యీతఁడే కదవే ॥పల్లవి॥

జన్నెవట్టి వుట్టిఁ జక్కఁగఁ బెట్టిన
వెన్నదిన్నవాఁడు వీఁడు గదె
పన్నారుదొంతులపాలుఁబెరుగులు
యిన్ని నారగించె యీతఁడు గదవె ॥కోల॥

మెఱసి యట్టుగమీఁదిచక్కిలాలు
వెఱఁజి కైకొనె వీఁడే కదె
కఱమి కఱిమి నములు గంపల నురుగులు
యెఱిఁగి దొంగిలె యీతఁడే కదవె ॥కోల॥

శ్రీవేంకటాద్రి దాఁచిన తేనెలెల్లా
వేవేగ సాధించె వీఁడే కదె
°కావించెల³మేలుమంగపతెయి మమ్మేలె
యేవంకఁ జూచినా యీతఁడే కదవే ॥కోల॥ 288

---

° కావించి+అలమేలుమంగ ³ అలమేలుమంగపతి+అయి

## శుద్ధవసంతం

ఈడ నిందరికి నేలికై వున్నాఁడు
వాడలరేపల్లెవాఁడా వీఁడు ॥పల్లవి॥

భారపువుట్ల పాలుఁబెరుగులు
వారలు వట్టినవాఁడా వీఁడు
[1] కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలుదీసిన శిశువా వీఁడు ॥ఈడ॥

ఆవులఁ బేయల నందరియిండ్ల
వావిరిఁ గాచినవాఁడా వీఁడు
వావు లొక్కటిగా వనితలఁ గూడి
వేవేలునేర్చినవిటుఁడా వీఁడు ॥ఈడ॥

అరుదై శ్రీవేంకటాద్రిమీఁదనుండి
వరములిచ్చేటివాఁడా వీఁడు
[2] మరిగెలమేల్మంగతో మమ్మేలె
సరసుఁడై వుండేజాణా వీఁడు ॥ఈడ॥ 289

## శంకరాభరణం

ధర్మమునకే మము దయఁ గావవే యిఁక
నిర్మలుఁడవు నిను నే మెరిఁగేమా ॥పల్లవి॥

కాయధారులము కర్మలోలులము
మాయ కగపడినమనుజాలము
పాయపుమదమున భ్రమసే మా మనసు
నీయెడఁ దగులై నిలిచీనా ॥ధర్మ॥

---

[1] 'కోరి కొలనిలోపలి గొల్లెతల చీరలు' అనుట సహజము [2] మరిగి+అలమేల్మంగతో

చాపల్యగుణము జడులమన్నిటాను
పాపపుణ్యసంబద్ధులము
పైపైఁగోర్కుల ప్రబలేమాబ్రదుకు
యేపనులకు నీకెక్కీనా ॥ధర్మ॥

అతిప్రాకృతులము అహంకారులము
సతతంబునుఁ ◌ జంచలులము
హితవుగ శ్రీవేంకటేశ యేలితివి
తతితో నీభక్తి తగ మరచేమా ॥ధర్మ॥ 290

**350 - రేకు భంగాళం**

భావించి తెలుసుకొంటే భాగ్యఫలము
ఆవలీవలిఫలము లంగజజనకుఁడే ॥పల్లవి॥

దానములలో ఫలము తపములలో ఫలము
మోనములలో ఫలము ముకుందుఁడే
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము
నానాఫలములును నారాయణుఁడే ॥భావిం॥

వినుతులలో ఫలము వేదములలో ఫలము
మనసులోని ఫలము మాధవుఁడే
దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము
ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే ॥భావిం॥

సతతయోగ ఫలము చదువులలో ఫలము
అతిశయోన్నత ఫలము యచ్యుతుఁడే
◌ యతులలోని ఫలము జితకామిత ఫలము
క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుఁడే ॥భావిం॥ 291

◌ జెంచెలులము రేకు యతిభంగము ◌ 'యెతులు' రేకు

## మధ్యమావతి

చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా
బత్తిసేసేరు మునులు పరికించవయ్యా ॥పల్లవి॥

సకలదేవతలును జయవెట్టుచున్నారు
చకితులై దానవులు సమసి రదె
అకలంకయగు లక్ష్మి యటు నీ తొడపై నెక్కె
ప్రకటమైన నీ కోపము మానవయ్యా ॥చిత్త॥

తుంబురునారదాదులు దొరకొని పాడేరు
అంబుజాసనుఁ డభయమడిగీ నదె
అంబరవీధి నాడేరు యచ్చరలందరుఁ గూడి
శంబరరిపుజనక శాంతము చూపవయ్యా ॥చిత్త॥

హత్తి కొలిచే రదె యక్షులును గంధర్వులు
చిత్తగించు పొగడేరు సిద్ధసాధ్యులు
సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె
యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా ॥చిత్త॥ 292

## నారాయణి

హరి హరి నీ మాయామహిమ
సరవి దెలియ నను( గరుణించఁగదే ॥పల్లవి॥

తలఁతును నా పాలిదైవమవని నిను
తలఁతును తల్లివిఁ దండ్రివని
మలసి యంతలో మఱతును తెలుతును
కలవలె నున్నది కడ గనరాదు ॥హరి॥

మొక్కుదు నొకపరి మొగి నేలికవని
మొక్కుదు నీ వాదిమూలమని
వుక్కున గర్వించి యుబ్బుదు సగ్గుదు
కక్కసమైనది కడ గనరాదు ॥హరి॥

చూతును నీమూర్తి సులభుఁడవనుచును
చూతు జగములకు సోద్యమని
యీతల శ్రీవేంకటేశ నన్నేలితివి
కౌతుకమొదవెను కడ గనరాదు ॥హరి॥ 293

## నాగవరాళి

దైవము నెరఁగము తత్త్వముఁ దలఁచము
చేవై హరి రక్షించీ నిదివో ॥పల్లవి॥

పాపముఁ బుణ్యముఁ బైకొను దేహము
కోపము శాంతపుగుణములది
వోపికవోపము లుదుటు చూపెడిది(వి?)
చేపట్టుక యిటు చెలఁగే మిదివో ॥దైవ॥

వెలికిని లోనికి విడిసేటిప్రాణము
చలువలు వేండ్లు చల్లెడిది
తెలివికి నిదురకుఁ దేపై యున్నది
బలిమిఁ జేపట్టుక బ్రదికే మిదివో ॥దైవ॥

పరమును నిహమునుఁ బట్టినజీవుఁడ
పొరుగుకు నింటికిఁ బొత్తైతి
గరిమల శ్రీవేంకటపతి శరణని
నిరతపు మహిమల నెగడే మిదివో ॥దైవ॥ 294

## * శోకవరాళి

ఓవో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో ॥పల్లవి॥

జగములో రాముఁడై జనియించె విష్ణుఁడదె
అగపడి లక్ష్మి సీతయై పుట్టెను
తగు శేష చక్ర శంఖ దైవసాధనములెల్ల
జిగి లక్ష్మణభరతాంచితశత్రుఘ్ను లైరి ॥ఓవో॥

సురలు వానరులైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగిఁ రుద్రుఁడే హనుమంతుఁడాయను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి ॥ఓవో॥

కట్టిరి సేతువపుడె ఘనులెల్ల దాఁటిరి
ముట్టిరి లంకానగరము నీదళము
యిట్టె శ్రీవేంకటేశుఁ డితఁడై రావణుఁ జంపె
వొట్టుక వరము లిచ్చీ నొనర దాసులకు ॥ఓవో॥ 295

## బౌళి

జీవుఁడూ నొక్కటే చిత్తమూ నొక్కటే
వేవేలు మాయలచే వెలయుఁ గొన్నాళ్లు ॥పల్లవి॥

వొక్కటే దేహము వూరకే బాల్యావస్థ
యెక్కడౌతా నెరఁగడు యిటు గొన్నాళ్లు
చక్కఁగ నంతటిలోనె జవ్వనపాయమునాఁడు
మిక్కిలి పోకలఁ బోయి మెరయుఁ గొన్నాళ్లు ॥జీవు॥

ఈ సంకీర్తనమే గౌళరాగమున స్వల్పపాఠభేదములతో ౨ -వ సంపుటమున ౧౪౮ వ పాటగా ముద్రితము ఈ పునరుక్తి రేకులలోనిదే

ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు
వోఁకరెన్నఁడో (?) దాఁగి వుండుఁ గొన్నాళ్లు
కాఁకల నంతటిలోనె కమ్మరఁ బుట్టినప్పుడే
వేఁకమై పలురుచులు వెదకుఁ గొన్నాళ్లు ॥జీవు॥

దేవుఁడూ నొక్కఁడే తెలియుదాఁకాఁ బెక్కు-
దేవతలై భ్రమయించు దేహము గొన్నాళ్లు
చేవమీర నంతలోనె [1]శ్రీవేంకటేశుఁడై
సేవ గొని సుజ్ఞానిఁ జేసుఁ గొన్నాళ్లు ॥జీవు॥

## రేకు 351 శ్రీరాగం

చేరి కొల్వరో యాతఁడు శ్రీదేవుఁడు
యీరీతి శ్రీవేంకటాద్రి నిరవైన దేవుఁడు ॥ పల్లవి ॥

అలమేలుమంగ నురమందిడుకొన్నదేవుఁడు
చెలఁగి శంఖచక్రాలచేతిదేవుఁడు
కలవరదహస్తముఁ గటిహస్తవుదేవుఁడు
మలసీ శ్రీవత్సవనమాలికలదేవుఁడు ॥ చేరి ॥

ఘనమకరకుండలకర్ణములదేవుఁడు
కనకపీతాంబర[2]శృంగారదేవుఁడు
ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్నదేవుఁడు
జనించెఁ బాదాల గంగ సంగతైనదేవుఁడు ॥ చేరి ॥

కోటిమన్మథాకారసంకులమైనదేవుఁడు
జూటపుఁగిరీటపుమించులదేవుఁడు
వాటపుసొమ్ములతోడి వసుధాపతిదేవుఁడు
యీటులేని శ్రీవేంకటేశుఁడైనదేవుఁడు ॥ చేరి ॥ 297

[1] 'శ్రీ వేంకటేశుఁడి' రేకు

## పళవంజరం

ఇతఁడొకఁడే సర్వేశ్వరుఁడు
సితకమలాక్షుఁడు శ్రీవేంకటేశుఁడు ॥ పల్లవి ॥

పరమయోగులకు భావనిధానము
అరయనింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతలకాఁగిటిసౌఖ్యము
సిరులొసఁగేటియీ శ్రీవేంకటేశుఁడు ॥ ఇత ॥
కలిగి యశోదకు కన్నమాణికము
తలఁచినకరికిని తగుదిక్కు
అలద్రొపదికిని యాపద్బంధుఁడు
చెలరేఁగినయీ శ్రీవేంకటేశుఁడు ॥ ఇత ॥

తగిలినమునులకు తపములసత్ఫలము
ముగురువేలుపులకు మూలము
వొగి నలమేల్మంగకొనరినపతితఁడు
జిగిమించినయీ శ్రీవేంకటేశుఁడు ॥ ఇత ॥ 298

## వసంతం

నిండెను లోకములెల్ల నెరి నితనికరుణ
పండి రాసులాయఁ గీర్తిప్రతాపములెల్లను ॥ పల్లవి ॥
గరుడవేగమునఁ గదలె విజయరథ-
మిరవై యందు దేవుడేఁగుచుండఁగా
పొరిదిఁ బట్టుకుచ్చులు చుక్కలతో సందడించ
గరిమఁ బైఁడికుండలు గగనముదాఁకను ॥ నిండె ॥

---

౧ పతి + ఇతఁడు ఇట్టివన్నీ వింతసంధులు అన్నమయ్య స్వాతంత్ర్యానికి గుర్తులు

అనిలవేగమున నదెవెడలె రథము
అనిమిషులు పగ్గములందుకొనఁగా
తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కులనిండ
సునిసి చక్రము దనుజుల సాధింపఁగను ॥ నిండె ॥

వెలయ మనోవేగాన వేంచేసీ మగిడి రథ -
మెలమిఁ దమదాసులు యేచి పొగడ
అలమేలుమంగ దనకటు విడెమియ్యఁగాను
బలిమి శ్రీవేంకటాద్రిపతి మించీనిందును ॥ నిండె ॥ 299

## బౌళిరామక్రియ

దేవతలఁగాచిన దేవుఁ డితఁడు
వేవులుప్రతాపములవీరరాముఁ డితఁడు ॥ పల్లవి ॥

రావణుఁజంపి పుష్పకరథ మెక్కి సీతతోడ
రావుగా నయోధ్యను పట్టముగట్టుక
వావిరి సుగ్రీవాదివానరకోట్లు గొలువ
చేవమీరి పొగడొందుశ్రీరాముఁ డితఁడు ॥ దేవత ॥

వసుధ యింతయునేలి వసిష్ఠాదులు వొగడ
యెసగ నశ్వమేధాలెల్లాఁ జేసి
పొసఁగఁ గుశలవుల పుత్రులుగా నటుగాంచి
రసికత మించు దశరథరాముఁ డితఁడు ॥ దేవత ॥

అలర రుద్రునెదుటనటు విశ్వరూపు చూపి
లలి బ్రహ్మవట్ట మనిలజుని కిచ్చి
యిల శ్రీవేంకటాద్రినిరవై నిలిచినాఁడు
చలము సాధించిన జయరాముఁ డితఁడు ॥ దేవత ॥ 300

## మాళవశ్రీ

నమో నమో దశరథనందన మమ్ముఁరక్షించు
కమనీయ శరణాగతవజ్రపంజరా ॥ పల్లవి ॥

కోదండదీక్షాగరుఁడ రామచంద్ర
ఆదిత్యకుల దివ్యాస్త్రవేది
సోదించుమారీచునితలగుండుగండ
ఆదినారాయణ యసురభంజనా ॥ నమో ॥

ఖరదూషణశిరఃఖండనప్రతాప
శరధిబంధన విభీషణవరదా
అరయ విశ్వామిత్రయాగసంరక్షణ
ధరలోన రావణదర్పాపహరణ ॥ నమో ॥

పొలుపొంద నయోధ్యపురవరాధీశ్వర
[౧]గెలుపుమీరిన జానకీరమణ
అలఘుసుగ్రీవాంగదాదికపిసేవిత
సలలిత శ్రీవేంకటశైలనివాసా ॥ నమో ॥ 30

## కేదారగౌళ

నిలచినవాఁడవు నీవేకాక దైవమా
నెలవై ప్రకృతి నేను నీలోనిసొమ్ములము ॥ పల్లవి ॥

తతి [౨]నిరువదేను తత్వములుండఁగాను
యెఱఁగని యజ్ఞానానకెవ్వరు గురి
నెఱిఁ జైతన్యమెల్లా నీసొమ్మై వుండఁగాను
యెఱుకవొక్కటేకాక యెవ్వరున్నారీడను ॥ నిలి ॥

---

౧ గెలుపుమీరిన పూర్వముద్రణమున గెలుపొందిన గా మారినది ౨ నిరువదేను రేకు

దినలెక్క లూరుపులు తెచ్చి తెచ్చి వొప్పించఁగ
యెనలేని జన్మములకెవ్వరు గురి
పునికై బ్రహ్మాండము వొళ్ళునీకై వుండఁగాను
యెనసే ఆనందమేకా కెవ్వరున్నారీడను ॥ నిలి ॥

అచ్చపుసుముద్రవంటాత్మ లణువైయుండగా
యిచ్చఁ గామక్రోధాల కెవ్వరు గురి
నిచ్చలు శ్రీవేంకటేశ నీవేలికవై యుండఁగా
హేచ్చేటిదాస్యమేకాక యెవ్వరున్నారీడను ॥ నిలి ॥ 302

రేకు 352 **భూపాళం**

తెలియఁడుగాక ద్రిష్టము జీవుఁడు
సులభమిదివో యిచ్చోటనే పరము ॥ పల్లవి ॥

మనసునఁ దలచిన మర్మములు గరఁగి
చొనుపుచు నింద్రియసుఖ మిచ్చు
అనువుగ నిటువలె హరిఁదలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా ॥ తెలి ॥

మాటలాడినను మరిగి మానవులు
యీటున మెచ్చిత్తురేమైనను
నాఁట నిట్ల హరినామము నొడివిన
గాఁటపువరములు కలుగునె కాదా ॥ తెలి ॥

చేసినపుణ్యము చేతఁజుట్టుకొని
రాసి వెనుతగిలి రక్షించు
వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని
ఆసల కైంకర్యము ఫలించును ॥ తెలి ॥ 303

## వసంతం

తల్లియాపె కృష్ణునికిఁ దండ్రి యాతఁడు
చల్లఁగా లోకములెల్లా సంతోసమందెను ॥ పల్లవి ॥

అరుదై శ్రావణబహుళాష్టమినాఁటిరాత్రి
తిరువవతారమందెను కృష్ణుఁడు
యిరవై దేవకిదేవి యెత్తుకొని వసుదేవు -
కరములందుఁ బెట్టితే కడుసంతోసించెను ॥ తల్లి ॥

తక్కక యమునానది దాఁటతఁడు రేపల్లెలో
పక్కన యశోదాదేవిపక్కఁ బెట్టెను
యెక్కువనాపె కృష్ణునినెత్తుక నందగోపుని
గక్కన వినిపించితే కడుసంతోసించెను ॥ తల్లి ॥

మరిగి పెద్దై కృష్ణుఁడు మధురలోఁ గంసుఁజంపి
బెరసి యలమేల్మంగఁ బెండ్లాడి
తిరమై శ్రీవేంకటాద్రిని దేవకీదేవియు
ఇరవై తే వసుదేవుఁ డేఁచి సంతోసించెను ॥ తల్లి ॥ 304

## హిందోళం

కరుణానిధివి గట్టుకో యేపుణ్యమైన
శరణాగత వజ్రపంజరుఁడవు నీవు ॥ పల్లవి ॥

మన్నించేనంటే నిన్ను మానిపేవా రెవ్వరు
పన్ని కోపగించితే నీపట్టుకెదు రెవ్వరు
చెన్నుమీర నీపెట్టుఁజెట్లే జీవులెల్లాను
వన్నెగా నీసొమ్ము నీవువలసినట్టు సేయి ॥ కరు ॥

కాచేనంటే నిన్నుఁ గాదనేవా రెవ్వరు
ఏచి యాజ్ఞవెట్టేనంటే యిదేలనేవా రెవ్వరు
లాచి పెంపుడుఁగుఱ్ఱలు లలినీజీవులెల్లాను
చేచేత నీదాసులను సేసినట్టుసేయి ॥ కరు ॥

పరమిచ్చేనంటే నడ్డపడేవా రెవ్వరు
సరి నిహమిచ్చేనంటే సాధించేవా రెవ్వరు
సిరుల శ్రీవేంకటేశ చేతిలోవారము నీకు
హరి నీపాఁతవారమెట్టైనా దయసేయి ॥ కరు ॥ 305

## భైరవి

[1]ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాఁడు శ్రీవేంకటేశుఁడు ॥ పల్లవి ॥

జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు
చలమునఁ బాతాళము సాధించినాఁడు
బలుభూమిదూరి వొక్కకొలికికిఁ దెచ్చినాఁడు
నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు ॥ ఈతఁ ॥

చేరి బ్రహ్మాండము తూఁటుసేసి చూచినాఁడు
వీరుఁడై రాచమూఁకల వెదకినాఁడు
ఘోరపుత్రికూటాదికొండలు జయించినాఁడు
వారించి చక్రవాళపర్వతము దాఁటినాడు ॥ ఈతఁ ॥

మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు
చుట్టువేడెమున యింతా సోదించినాఁడు
యిట్టె శ్రీవేంకటాద్రినిరవై యెక్కినవాఁడు
రట్టుగాఁ దనదాసులనిట్టె [2]రక్షించినాఁడు ॥ ఈతఁ ॥ 306

---

1 ఇందు దశావతార సమన్వయము కలదు 2 అట్టుగాఁ దనదాసులనిట్టె అక్షించినాఁడు' రేకు
3 ఇటువంటి సమాసములు ఈ భాష కలంకారములు

## వరాళి

జీవుఁ డించుకంత చేఁత సముద్రమంత
చేవెక్కి పలుమారుఁ జిగిరించీ మాయ ॥ పల్లవి ॥

కోపములైతేను కోటానఁగోట్లు
దీపనములైతేను [3]దినకొత్తలు
చాపలబుద్ధులు సమయని రాసులు
రాపాడీఁ గడవఁగరాదు వోమాయ ॥ జీవుఁ ॥

కోరికలైతేను కొండలపొడవులు
తీరనిమోహాలు తెందేపలు
వూరేటిచెలమలు వుడివోనిపంటలు
యీరీతినే యెలయించీని మాయ ॥ జీవుఁ ॥

మునుకొన్నమదములు మోపులకొలఁదులు
పెనఁగినలోభాలు పెనువాములు
నినుపై శ్రీవేంకటేశ నీదాసులనంటదు
యెనసి పరులనైతే యీఁదించీ మాయ ॥ జీవుఁ ॥ 307

## కాంబోధి

ఎన్నఁడొకో నే నీచెరఁ దగులక
అన్నిటా శ్రీపతికాధీనమౌట ॥ పల్లవి ॥

దేహాధీనము తిరిగేటి జీవులు
దేహము యర్థాధీనము
మోహాధీనము ముంచినయర్థము
ఆహా యిది పుణ్యాధీనము ॥ ఎన్నఁ ॥

సతతముఁ బురుషుఁడు సతులయాధీనము
అతివలు వయసుకు నధీనము
గతియగు వయసులు కాలాధీనము
అతిశయమిది మాయాధీనము ॥ ఎన్నఁ ॥

దైవాధీనము తగినజగ మిది
దేవుఁడు మోక్షాధీనము
చేవల మోక్షము శ్రీవేంకటపతి -
సేవాధీనము సిలుగే లేదు ॥ ఎన్నఁ ॥ 308

రేకు 353 **భల్లాటి**

పెదయౌబళపుఁగొండఁ బెరిగీనిదే
వదలకకొలిచితే వరములిచ్చీని ॥ పల్లవి ॥

పదివేలశిరసులబలునరసింహము
గుదిగొన్నచేతుల గురుతైనది
ఎదుటఁ బాదాలుఁ గన్నులెన్నైనఁ గలిగినది
యిది బ్రహ్మాండపుగుహ నిరవైనది ॥ పెద ॥

ఘనశంఖచక్రాదుల కైదువలతోనున్నది
మొనసి రాకాసిమెకములఁ గొట్టేది
కనకపుదైత్యుని కడుపుచించినది
తనునమ్మిన ప్రహ్లాదుదాపును దండైనది ॥ పెద ॥

శ్రీవనితఁ దొడమీఁదఁ జేకొని నిలిపినది
దేవతలు గొలున గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందుఁ జెలఁగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది ॥ పెద ॥ 309

## ముఖారి

నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభములొసఁగెను ॥ పల్లవి ॥

సందించి వైశాఖశుద్ధచతుర్దశి శనివార -
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁ జించెఁ గనకకశిపుని ॥ నరు ॥

నరమృగరూపము నానాహస్తముల
అరిది శంఖచక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచిరక్షించి నిలిచె
గురుతరబ్రహ్మాండ గుహలోనను ॥ నరు ॥

కాంచనపుగద్దెమీఁద గక్కనఁ గొలువైయుండి
మించుగ నిందిరఁ దొడమీఁదఁ బెట్టుక
అంచె శ్రీవేంకటగిరి నాదిమపురుషుండై
వంచనసేయక మంచివరాలిచ్చీనదివో ॥ నరు ॥ 310

## సామంతం

దైవమొక్కఁడే సంతత [౧]భజనీయుఁడు
భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు ॥ పల్లవి ॥

హరియే సకలాంతరాత్మకుఁ డటుగాన
తిరమై యొకరి నిందింపఁదగదు
అరయఁగ లోకములనిత్య మటుగాన
మరిగి కొందరిమీఁదిమమతయు వలదు ॥ దైవ ॥

---

౧ నియ్యుఁడు రేకు

బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన
గహనపుఁదనవుద్యోగము వలదు
సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన
వహిఁ దానేవచ్చినవి వలదనఁదగదు ॥ దైవ ॥

తపములు జపములు దాస్యమూలమె కాన
వుపమల సందేహమొగి వలదు
యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి
[1]చపలచిత్తమువారి సంగమిఁక వలదు ॥ దైవ ॥ 311

## లలిత

ఏగతి నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసె[2]బో ప(గ?)తులు ॥ పల్లవి ॥

పరగి నాలుకసొంపు పరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁబాపములవినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటి కులాచారము ॥ ఏగతి ॥

మొక్కలాన పరధనమునకుఁ జాఁచిచాఁచి
ఎక్కువఁజేతులమహి మెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటి ముందటిపుణ్యాలు ॥ ఏగతి ॥

యెప్పుడు నీచులయిండ్లకెడతాఁకి పాదములు
తప్పనితపములెల్లఁ దలఁగిపోయె
యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె ॥ ఏగతి ॥ 312

---

[1] చెపల రేకు యతిభంగము [2] బోపములు రేకు

## సాళంగనాట

*ఆయమేవ అయమేవ ఆదిపురుష
జయకరం తమహం శరణంభజామి ॥ పల్లవి ॥

అయమేవ ఖలుపురా అవనీధరస్తు సోఽ
ప్యయమేవ వటదళాగ్రావిశయన
అయమేవ దశవిట్టరవతారరూపైచ్య
నయమార్గ భువిరక్షణం కరోతి ॥ ఆయ ॥

అయమవే సతతం శ్రియ.పతి దేవేషు
అయమేవ దుష్టదైత్యాంతకస్తు
అయిమేవ సకళ భూతాంతరేష్టుక్రమ్య
ప్రియభక్తపోషణం పిద్భృత్పనోతు ॥ ఆయ ॥

అయమేవ శ్రీవేంకటాద్రి విరాజితే
అయమేవ వరదోప్యాచకానాం
అయమేవ వేదవేదాంతశ్చ సూచితో
అయమేవ వైకుంఠాధీశ్వరస్తు ॥ ఆయ ॥ 313

## సామంతం

ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నునినామమే వేదంబాయ ॥ పల్లవి ॥

నలినదళాక్షునినామకీర్తనము
కలిగి లోకమునఁ గలదొకటే
యిల నిదియే భజియింపఁగఁబుణ్యులు
చెలఁగి తలఁప సంజీవని యాయ ॥ ఇన్ని ॥

కోరిక నచ్యుత గోవిందాయని
ధీరులు దలఁపఁగఁ దెరువొకటే
ఘోరదురితహర గోవర్ధనధర
నారాయణ యని నమ్మఁగఁగలిగె ॥ ఇన్ని ॥

తిరువేంకటగిరిదేవునినామము
ధరఁదలపగ నాధారమిదే
గరుడధ్వజునిసుఖప్రదనామము
నరులకెల్లఁ బ్రాణము దానాయ ॥ ఇన్ని ॥ 314

---

ఈ కీర్తనను ఈక్రింది విధముగా సవరించి పఠింపఁ దగును

అయమేవ అయమేవ ఆదిపురుషో
జయకరం తమహం శరణం భజామి ॥ పల్లవి ॥
అయమేవ ఖలు పురా అవనీధరస్తు సో
ప్యయమేవ వటదళాగ్రాధిశయన
ఆయమేవ దశవిధైరవతారరూపైశ్చ
నయమార్గభువి రక్షణం కరోతి ॥అయ॥
అయమేవ సతతం శ్రియ పతిర్దేవేషు
అయమేవ దుష్టదైత్యాంతకస్తు
అయమేవ సకలభూతాంతరేష్వాక్రమ్య
ప్రియభక్తపోషణం ప్రీత్యా తోతి ॥అయ॥
అయమేవ శ్రీవెంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోపి యాచకానాం
అయమేవ వేదావేదాంతైశ్చ సూచితో
ప్యయమేవ వైకుంఠాధీశ్వరస్తు ॥అయ॥

రేకు 354 రామక్రియ

ఎందరు సతులో [1]యెందరు సుతులో
యిందునందు నెట్లెరిఁగే నేను ॥ పల్లవి ॥

మలయుచు నాయభిమానములని నే
కెలననిపుడు వెదకేనంటే
పలుయోనులలో పలుమా(మ?) రుఁబొడమిన -
చలమరి నాతొలుజన్మంబులను ॥ ఎంద ॥

గరిమెలఁ బాణిగ్రహణము నేసిన
సిరులచెలులఁ గలసేనంటే
తరుణులగురుతులు తలఁపున మరచితి
పరగిన బహుకల్పంబులయందు ॥ ఎంద ॥

శ్రీ వేంకటగిరిచెలువునియాజ్ఞల
[2]భావించియె కరిఁ బైకొంటి
తావులఁజూడగ తగిలికోర్కుల
భావరతుల[2]బెంబడి మనసందు (?) ॥ ఎంద ॥ 3

గుండక్రియ

కటకట హరిమాయాకల్పనెట్టిదో
తటుకునఁ బారవేసేతలఁపెందు లేదు ॥ పల్లవి ॥

అనంతకోటియుగాదులనుండియు
తనివోక విషయాలఁ దగిలుండినా
దినమొక్కొక్కరుచియై తీపులైఁ పండీఁగాని
వెనుకొన్న యాత్మకు వెగ టెందు లేదు ॥ కటకటా ॥

---

౧ యందరు రేకు యతిభంగము ౨ భావించి యేఁకరి పైకొంటి కావచ్చు

కడలేక నాలుకకుఁ గన్నయాహారములెల్ల
వొడలిలోఁ బూఁటవూఁట వొట్టుకొనినా
సడిఁ బైపై వింతవింతచవులే వెదకుఁగాని
విడువని యాత్మకు వెగ టెందు లేదు ॥ కటకటా ॥

కలకాలముననుండి కాపురపు లంపటాలె
కలిమితో మెడఁగుచ్చి కట్టుకొనినా
యెలమితో శ్రీవేంకటేశ్వరునాజ్ఞల -
నలవాటైన యాత్మకలపే లేదు ॥ కటకటా ॥316

**లలిత**

నటనల భ్రమయకు నామనసా
ఘటియించుహరియే కలవాఁడు ॥ పల్లవి ॥

ముంచిన జగమిది మోహినీగజము
పొంచినయాస పుట్టించే దిది
వంచనల నిజమువలెనే వుండును
మంచులు మాయలే మారునాఁడు ॥ నటన ॥

సరిసంసారము సంతలకూటమి
సొరిదిఁ బచారము చూపే దిది
గరిమ నెప్పుడుఁ గలకలమనుచుండును
మరులగువిధమే మాపటికి ॥ నటన ॥

కందువదేహము గానిముదియదిది
అందినబహురూప మాడేదిది
యెందును శ్రీవేంకటేశ్వరుఁడుండును
డిందుపడఁగనిదె తెరమరఁగు ॥ నటన ॥ 317

ం'తౌడ పూ ము పా

## గుండక్రియ

"నిశ్చింతం పరమం సుఖ" మనుమాటే నిజము నిజము తెలియరుగా
ఆశ్చర్యంబిది పరమయోగులకు ననుభవులకు దృష్టాంతముసుండీ ॥ప॥

కరచరణాదులుగలచైతన్యము గక్కునఁ బానుపుపై నుండి
సరుగన సడిలిన నిద్రామందము సమకూడీ నరులకటువలెనే
పరమాత్మునిపై సకలోద్యోగ వు (గో?) పాయంబులు దా దిగవిడిచి
ధరఁ దానుండిన బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ ॥ నిశ్చిం

వున్నతిఁ దానొక దేశములోపలనుండి క్రితముచూచిన నవియెల్లా
అన్ని దేశములు నటుదలపోసిన యంతకుగోచరమైనట్లు
యెన్నగఁబూర్వజ్ఞానంబున సర్వేశ్వరుఁడగు హరిఁదలఁచినను
సన్నిధియగు సుజ్ఞానానందము సత్యము సత్యంబదిసుండీ ॥నిశ్చిం॥

ననిచిన ప్రపంచకల్ప (ల్ప?) ములలో నానావిధముల జంతువులు
తనుఁదాఁజూడఁగరానిరూపు లద్దములోపలఁ గన్నట్లు
ఘనుఁడగు శ్రీవేంకటపతిరూపము గక్కన నెదుటనె సేవించి
అనయము తనుఁదా సంతసించుటే యాత్మానందంబిదిసుండీ ॥నిశ్చిం

## సాళంగనాట

ఒసఁగితివిన్నియు నొకమాఁటే
వెస నిఁకఁ జేసేవిన్నపమేది ॥ పల్లవి ॥

నారాయణ నీనామము దలఁచిన -
నీరానివరములిచ్చితివి
చేరి నిన్ను నిటు సేవించిననిఁకఁ
గోరి పడయ నిఁకఁ గోరికలేవి ॥ ఒసఁ ॥

హరి నీకొకమరి యటు శరణంటే
గరిమల నన్నిటు గాచితివి
నిరతముగా నిఁక నిను నుతియింపుచు
అరగొరతనివి నిను నడిగేదేదో ॥ ఒసఁ ॥

శ్రీవేంకటేశ్వర చేయెత్తిమొక్కిన
భావమే నీవై పరగితివి
యీవరుసల నీవింతటిదాతవు
ఆవలనినుఁ గొనియాడెడిదేమి ॥ ఒసఁ ॥ 319

భౌళి

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువఁగా తిరుతేరు ॥ పల్లవి ॥

తిరువీధులేగీని తిరుతేరు
తిరుపుగొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజాలఁ దిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు ॥ దేవ ॥

ధిక్కరించీ మోతలఁ దిరుతేరు
దిక్కరికుంభా లదరఁ దిరుతేరు
తిక్కముత్తేలకుచ్చుల తిరుతేరు
తెక్కులఁబ్రతాపించీఁ దిరుతేరు ॥ దేవ ॥

తీరిచెఁ గలకలెల్లఁ దిరుతేరు
ధీర గరుడవాహపుఁ దిరుతేరు
చేరి యలమేలుమంగతో శ్రీవేంకటేశ్వరుని -

తీరున నెలకొన్నట్టి తిరుతేరు ॥ దేవ ॥ 3

రేకు 355 సాళంగం

మాధవ భూధవ మదనజనక
సాధురక్షణచతుర శరణు శరణు ॥ పల్లవి ॥

నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ -
నారసింహా కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరి జయజయతు (?) శరణు శరణు ॥ మాధ ॥

పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరిరమణ రామ బలరామ పరమపురుష
చండభార్గవరామ శరణు శరణు ॥ మాధ ॥

దేవ దేవోత్తమ దివ్యావతార నిజ -
భావ భావనాతీత పద్మనాభ
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవసారూప్య శరణు శరణు ॥ మాధ ॥

లలిత

దొరకినయప్పుడే తుదగాక
మరుగకుమెన్నఁడు మరి మనసా ॥ పల్లవి ॥

తనుభోగంబులఁ దనిపినపిమ్మట
వెనుకొని హరిఁ దడవేనంటే
దినమునుఁ దను నింద్రియములచల మిది
తనియుట [1]యెన్నఁడు దగుమనసా ॥ దొర ॥

---

1. యన్నడు రేకు

తిరమగునాసల దీరినపిమ్మట
తెరలి విరతిఁ బొందే నంటే
మరలని యాశామయమీచిత్తము
విరతి యెన్నఁడిఁక వెడమనసా ॥ దొర ॥

ముదిసినపిమ్మట మొగి శ్రీవేంకట -
సదయుఁ గొలుతు నిచ్చలునంటే
హృదయము శ్రీవేంకటేశునినెల విది
యిదిగనుటెన్నఁడు యీమహి మనసా ॥ దొర ॥ 322

**లలిత**

తెలిసియుఁ దెలియదు దేరినచిత్తము
నలినాక్ష గోవింద ననుఁగావవయ్యా ॥ పల్లవి ॥

యేఁకట నినుగొలిచి యితరుల వేఁడనేల
వేఁకపుటాసల నాలోవెలితిగాక
చీఁకటివాసినమీఁద చీఁదరగొనఁగనేల
మాఁకువంటివెడబుద్ధి మాన దిదేమయ్యా ॥ తెలిసి ॥

పొంచి నీదాసుఁడనై యల్పుల వేఁడఁబోనేల
చంచలగుణములనాజాలిగాక
అంచలఁ దెరువుకని యడవిఁబడఁగనేలా
యించుకంత యేవవుట్ట దేమిపాపమయ్యా ॥ తెలిసి ॥

మతిలో నీవుండఁగాను మాయలఁ బొరలనేలా
వెతకి తెలియని నావేఁదురుగాక
గతియై శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
తతి నాతపమునేఁడు దరిచేరెనయ్యా ॥ తెలిసి ॥ 323

## గుండక్రియ

తెలియనివారికిఁ దెరమరుఁగు
తెలిసినవారికి దిష్టంబిదియే ॥ పల్లవి ॥

కన్నులయెదుటనుఁ గాంచినజగ మిది
పన్నిన ప్రకృతియు బ్రహ్మమునే
యిన్నిట నుండఁగ నిదిగాదని హరిఁ
గన్న చోట వెదకఁగఁబోనేలా ॥ తెలి ॥

అగపడి యిరువదియైదై జీవునిఁ
దగిలినవెల్లాఁ దత్త్వములే
నగవుల నిదియును నమ్మగఁ జాలక
పగటునఁ దమలో భ్రమయఁగ నేలా ॥ తెలి ॥

అంతరంగుఁడును నర్చావతారము
నింతయు శ్రీవేంకటేశ్వరుఁడే
చెంతల నీతనిసేవకులకు మరి
దొంతికర్మములతొడ సిఁకనేలా ॥ తెలి ॥ 32

## గుండక్రియ

ఏలొకో కర్మమా యిందుకుఁ బాలైతిని
పొలుపడిన యీ జలభ్రమణమువలెను ॥ పల్లవి ॥

ధరలోఁ బుట్టినప్పుడే తలఁచ నీ యాత్మ
మరుగఁడు పరమైతే మరచీఁగాని
అరిది దుర్భాషల నలవడ్డనాలికె
హరినామములయందు నలవడదు ॥ ఏలొ ॥

జవకట్టి పూర్వవాసనల సంసారమే

చవియే తాఁగాని ముక్తి చవిగాదు
భువిఁగల విషయాలఁ బుంగుడయ్యీఁగాని మతి
వివరించి దైవమును వెదకలేదు ॥ ఏలొ ॥

శ్రీవేంకటేశుకృపచేత నింతేకాని
వావాత నివి గైవశము గావు
[1]భావమిప్పుడితని పాదాలు చేరికాని
యేవుపమలనుఁ గాన మిన్నాళ్లును ॥ ఏలొ ॥ 325

## ముఖారి

చవి నోరి కేడఁ దెత్తు సంప దేడఁదెత్తు వీని
సవరించుటే నాసంప దిదిగాదా ॥ పల్లవి ॥

పచ్చడా లెక్కడఁదెత్తు పట్టుచీర లేడఁదెత్తు
వెచ్చనిం డ్లేడఁదెత్తు వెంట వెంటను
తెచ్చిన యీపచ్చడము దేహమిది వెంటవెంట
వచ్చీఁగాక తన్నుఁదానె వద్దనఁగవచ్చునా ॥ చవి ॥

దొరతన మేడఁదెత్తు దొడ్డసొమ్ము లేడఁదెత్తు
యెరవులసిరుల నేనేడఁదెత్తు
వెరవున నేనెవ్వరిని వేసరించఁజాలక
దరిచేరుటే దొరతనమిదిగాదా ॥ చవి ॥

తోడఁబుట్టువుల నేడఁ దోడితెత్తుఁ జుట్టాల -
నేడఁ దెత్తు సుతులపొం దేడఁదెత్తును
వేడుకైనపొందు శ్రీవేంకటేశుఁ దలఁచుటే
ఈడులేనిబంధుకోటి ఈతఁడెకాఁడా ॥ చవి ॥ 326

---

౧ 'జీవ పూ ము పొ యతిభంగము

రేకు 356 శ్రీరాగం

ఓ పవనాత్మజ వో ఘనుఁడ
బాపుబాపనఁగఁ బరగితిగా ॥ పల్లవి ॥

వో హనుమంతుడ వుదయాచలని -
ర్వాహక నిజసర్వ ప్రబల -
దేహము మోఁచిన తెగువకు నిటువలె (?)
సాహసమిటువలెఁ జాటితిగా ॥ ఓ పవ ॥

వో రవిగ్రహణ వో దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపువినతాతనయాదులు
గారవింప నిటు గలిగితిగా ॥ ఓ పవ ॥

వో దశముఖహర వో వేంకటపతి -
పాదసరోరుహపాలకుఁడా
౦యీ దేహముతో నిన్నిలోకములు
నీదేహమెక్క నిలిచితిగా ॥ ఓ పవ ॥ 32

ముఖారి

దిక్కులేనివారు నీవే దిక్కని కొలువఁగా
అక్కరకితఁడు దైవమందురువో నిన్నును ॥ పల్లవి ॥

పాలుపడి నిన్నుఁజేరి పట్టి కొలిచినవారి
జాలిపాటు తొలఁగించి జడనువాపి
మూలఁబడనీక తెచ్చి ముద్దుసేసికావఁగాను
మేలెరుఁగుబుధులెల్ల మెత్తురువో నిన్నును ॥ దిక్కు ॥

---

౦ ఇక్కడ నుండి అన్వయము కుదురుటలేదు పైన 'నిటువలె' అను పాదమునకు కీ శే రాళ్లపల్లివారే ప్రశ్నార్థకముతో పరిష్కరించిరి

కొండలుఁగోట్లునైనకోరికలుగలవారి -
యండనే కోరికలిచ్చి యాదరించఁగా
నిండినదాసులకెల్ల నీవే దైవ మవని
కొండమీఁదనుండినఁ బైకొందురువో నిన్నును ॥ దిక్కు ॥

యేకమైనమనసుతో నెవ్వరు దలఁచినాను
చేకొని కరుణఁ గృపసేయఁగాను
యేకాలము శ్రీవేంకటేశుఁడు మాదైవమని
లోకమెల్లఁ దామే కొలుతురువో నిన్నును ॥ దిక్కు ॥ 328

వరాళి

ఏదియుఁగానఁడు (గాననందు?) నేది గాదందు
ఆదిపురుష నీదాస్యమే చాలనాకు ॥ పల్లవి ॥

గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి
సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణమవట తగిలి కొందరికి ॥ ఏదియు ॥

వొకటఁ గళాపూర్తి నొనరియుందువట
వొకట నిష్కళుఁడవై వుడివోవట
వొకచో జీవుల (కు) నీకొరయ భేదమట
వొకచో నె (న?) భేదమట వున్నారట నీకు ॥ ఏదియు ॥

అదన నిందరిలోన నంతరాత్ముఁడవట
యెదుట శ్రీవేంకటేశుఁడవట
యిదియది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలే కనుఁగొంటగాక ॥ఏదియు॥ 329

## లలిత

మాధవ కేశవ మధుసూదన విష్ణు
శ్రీధరా పదనభం (ఖం?) చింతయామియూయం (మోవయం?)॥పల్లవి॥

వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో ॥ మాధవ ॥

పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణ యధోక్షజ
నరసింహ హృషీ కేశ నగధర త్రివిక్రమ
శరణాగతరక్ష జయజయ సేవే ॥ మాధవ ॥

మహితజనార్దన °మత్స్య కూర్మ వరాహ
సహజభార్గవ బుద్ధ జయతుర (గ) కల్కి
విహితవిజ్ఞాన శ్రీవేంకటేశ శుభకరం
అహమీ తహతద (అహమిహ తవపద?) దాస్యమనిశం భజామి॥మాధవ॥330

## గుండక్రియ

అందిచూడఁగ నీకు నవతారమొకటే
యెందువాఁడవై తివి యేఁటిదయ్యా ॥ పల్లవి ॥

నవనీతచోరా నాగపర్యంకా
నవనరక్షక హరీ చక్రాయుధా
అవల దేవకిపట్టివని యశోదకు నిన్ను
నివలఁ గొడుకవనేదిది యేఁటిదయ్యా ॥ అంది ॥

---

° మచ్య రేకు

పట్టపు శ్రీరమణా భవరోగవైద్య
జట్టిమాయలతోడిశౌరి కృష్ణ
పుట్టినచో టొకటి పొదలెడిచో టొకటి
[౧]యెట్టని నమ్మవచ్చు నిదియేఁటిదయ్యా ॥ అంది ॥

వేదాంతనిలయా వివిధాచరణా
ఆదిదేవ శ్రీవేంకటాచలేశ
సోదించి తలఁచినచోట నీ వుండుదువట
యేదెస నీ మహిమే యిదేఁటిదయ్యా ॥ అంది ॥ 331

## గుండక్రియ

తలపోఁత చిత్తమునఁ దరిగానక బుద్ధి
గలఁగెఁ గావనో మమ్ముఁ గర్మమా ॥ పల్లవి ॥

పాపజాతిమేనితోడఁ బడ్డపాటే చాలదా
ఆపదలకేల లోనాయ నిప్పుడు
దీపమైనహరిభక్తి దెలిసియింతటనైనఁ
గాపాడి పరమీవో కర్మమా ॥ తల ॥

చెప్పరానిసుఖములు చెప్పి చెప్పి కని కని
చప్పుడుగా లోకమునఁ జాటి చాటి
దెప్పరపుభవములఁ దిప్పుదీరైతి మిదె
కప్పుకొని కావఁగదో కర్మమా ॥ తల ॥

వేడుకలిన్నియు శ్రీవేంకటాద్రిరాయఁడే
కూడిన మాదైవమని కొనియాడి
యేడఁజూచినను బుణ్య మెక్కుడాయనని నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా ॥ తల ॥ 332

---

౧ 'యెట్టను రేకు

రేకు 357 సామంతం

సర్వేశ్వరుఁడే శరణ్యము
నిర్వాహకుఁ డిన్నిటఁగాన ॥ పల్లవి ॥

బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుఁడే శరణ్యము
అలరిన బ్రహ్మాండ మవిసిననాఁడును
నిలిపె నాతఁడిన్నిటిఁగాన ॥ సర్వే ॥

అనేకవిధముల నిఖిలజీవులకు
జనార్దనుఁడే శరణ్యము
అనాథనాథుఁ డంతరాత్మకుఁడు
అనాదిపతి యితఁ డటుగాన ॥ సర్వే ॥

తగునిశ్చలులగుతనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుఁజేవయగుశ్రీవేంకటేశుఁడు
అగువరములొసఁగు నటుగాన ॥ సర్వే ॥ 3.

లలిత

సోదించిరిదియె సురలును మునులును
ఆదికి ననాది హరినామం ॥ పల్లవి ॥

అరిది వేదశాస్త్రార్థసంగ్రహము
అరయఁగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరిభయంకరము హరినామం ॥ సోదించి ॥

సకలపుణ్యఫలసారవిహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది (శ్రీ?) హరినామం ॥ సోదించి ॥

కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యెందును శ్రీవేంకటేశ్వరు కరుణకు -
నందుకోలైన హరినామం ॥ సోదించి ॥334

## పాళంగనాట

ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను
మన్నించి నీమనసు మరిగించుమనసు ॥ పల్లవి ॥

పాలుఁతులకాఁకనే పుటమెక్కె మనసు
చలివేఁడిజవ్వనమునందిఁ జిక్కె మనసు
వలరాజుతూపునంజా వడినెక్కె మనసు
మలసి రతిసుఖాలమరపాయ మనసు ॥ ఇన్ని ॥

పచ్చనికనకముపై భ్రమఁబడె మనసు
చిచ్చువంటివిషయాల శివమెత్తె మనసు
వొచ్చెపుఁ బాపాలకెల్లా నొడిగట్టె మనసు
బచ్చన చెంచెలములఁ బాటిచెడె మనసు ॥ ఇన్ని

కోరి యంతలో గురుఁడు గూఁటవేసె మనసు
వోరుపుతో నీపాలి కొప్పగించె మనసు
ఈరీతి శ్రీవేంకటేశుఁడ నామనసు
తోరపు విజ్ఞానము తుదకెక్కె మనసు ॥ ఇన్ని ॥ 335

## రామక్రియ

నమ్మితే నితఁడే మన్ననఁ గాచు
యిమ్ముల ౧ధ్రువునిఁ బట్టమేలించినట్లు ॥ పల్లవి

తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాద -
మేరీతిఁ గొలిచినా నెవ్వరికిని
చేరరాని యడవిలో శిలలై పడియున్న
భారపుటహల్యశాపము దేరినట్లు ॥ నమ్మి

కలుగనిసిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరిఁ
గొలిచినవారికిఁ గోరినట్లే
అలనాఁడు దరిద్రుఁడైన కుచేలుని
బలుసంపదలఁ దెచ్చి బతికించినట్లు ॥ నమ్మి

చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో
వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు
యీగనే మాబోంట్లకు నిరవై కోనేటిదండ
మేడెపువరములెల్ల మెచ్చి యిచ్చినట్లు ॥ నమ్మి

## లలిత

దేవునిమరవకు మంతే మాట చిత్తమా
దీవెనై కలఁడు మాకు దేవుఁడు ॥ పల్లవి

అరుదగుజీవుని బ్రహ్మాండగోళములోన
తెరఁగై పుట్టించువాఁడు దేవుఁడు
అరసి కమ్మరవచ్చి యన్నపానాదులు వెట్టి
తిరుగ రక్షించువాఁడు దేవుఁడు ॥ దేవు

---

౧ 'ధ్రువుని' రేకు

బలుసంసారములోన భ్రమసియుండిన మాకుఁ
దెలిపి చెప్పినవాఁడు దేవుఁడు
తెలియనికర్మములు తెగనిబంధాలు వాపి
తిలకించి కాచువాఁడు దేవుఁడు ॥ దేవుని ॥

తల్లియుఁ దండ్రియునై దాతయై కలఁడు మాకు
తెల్లమి శ్రీవేంకటాద్రిదేవుఁడు
మల్లాడి తనదాసులమతిలోఁ దా నుదయించి
తెల్లవారించేవాఁడు దేవుఁడు ॥ దేవుని ॥337

## ముఖారి

ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
[1]జాలిదీర నీకే శరణుచొచ్చితిమి ॥ పల్లవి ॥

గతి నీవే మతి నీవే కర్తవు భర్తవు నీవే
పతియు వీపె (నీవే?) యేపట్టునా మాకు
యితరము లెవ్వరున్నా రెంచిచూడ నిన్నుఁబోల
చతురుఁడ నిన్ననే శరణుచొచ్చితిమి ॥ ఆలించు ॥

జననీజనకులు శరణము నీవే
వునికి మనికి నీవే [2]వుపమ నీవే
మనసిచ్చి నీవే నన్ను మన్నించుకొంటేనే
చనవి మనవి నీకే శరణుచొచ్చితిమి ॥ ఆలించు ॥

లోకసాక్షివి నీవే లోకబంధుఁడవు నీవే
యీకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గావ
సాకారరూప నీకే శరణుచొచ్చితిమి ॥ఆలించు॥338

---

౧ జాలి బాధ ౨ ఉపమ, ఉపాయము

రేకు 358 గుండక్రియ

నాఁటకమింతా నవ్వులకే
పూఁటకుఁబూఁటకుఁ బొల్లైపోవు ॥ పల్లవి ॥

కోటివిద్యలునుఁ గూటికొఱకె పో
చాటువ మెలఁగేటి శరీరికి
తేటల నాఁకలిదీరినపిమ్మట
పాటుకుఁ బాటే బయలైపోవు ॥ నాఁట ॥

మెఱసేటిదెల్లా మెలుఁతలకొరకే
చెఱలదేహములజీవునికి
అఱమరపుల సుఖమందినపిమ్మట
మొఱఁగుకుమొఱగే మొయిలై పోవు ॥ నాఁట ॥

అన్ని చదువులును నాతనికొరకే
నన్నెరిఁగిన సుజ్ఞానికిని
యిన్నిట శ్రీవేంకటేశుదాసునికి
వెన్నెలమాయలు విడివడిపోవు ॥ నాఁట ॥ 339

గుండక్రియ

ఎన్నిటికెన్నిటికని యెక్కడఁ దగిలెదము
మన్నించు దేవ మాకుఁజాలు ॥ పల్లవి ॥

ముఖరమై మాఁకులకు మొదలఁబోసిననీరు
శిఖలకుఁ దనువెక్కి చిగిరించినయట్టు
నిఖిలప్రయోజనాలు నీమూలమేకాన
మఖపతి మీసేవే మాకుఁజాలు ॥ ఎన్ని ॥

వరుసలనిన్నిటా వన్నె బంగారమే
పరిపరివిధముల పలుసొమ్ములైనట్లు
నిరతిఁ గర్మఫలాలు నీమూలమేకాన
మరుగురుఁడవు నీవే మాకుఁజాలు ॥ ఎన్ని ॥

వెలయ శ్రీవేంకటేశ వివిధజంతువులకు
అలవిలేనిభూమే యధారమైనట్లు
నెలవు దేవతలకు నీవేలికవుగాన
మలసి నీశరణమే మాకుఁజాలు ॥ ఎన్ని ॥ 340

## రామక్రియ

మాయలో మోహమున మరచితివిదే హరి
[౧]వేయింటికి వింటే వివేకమా ॥ పల్లవి ॥

అంతటికినొడయఁడు అఖిలజీవులలోన
అంతర్యామి శ్రీహరియట
యింతటిలో నీకు హితబంధువులు వేరి
వింతవారెవ్వరు నీకు వివేకమా ॥ మాయ ॥

అరయ నక్షరవాచి యతఁడట యిలలోనఁ
బరమమంత్రాలెపో పలుకులెల్ల
నిరతపునుతి యేది నిందయేది యిందులోన
వెరవెరఁగవుగాక వివేకమా ॥ మాయ ॥

మొదలను నడుమను ముగిసినర్థములందు
యెదుటను శ్రీవేంకటేశుఁడట
యిది యది యననేల యిచ్ఛాద్వేషమేల
వెదకుము సమబుద్ధి వివేకమా ॥ మాయ ॥ 341

౧ 'వేయింటికే వింటి వివేకమా' అని రేకు రేకు పాఠము పూర్వముద్రిత పాఠము- రెండును సరిగ అర్థస్ఫోరకములు కాలేదు

## రామక్రియ

సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత -
చందమాయఁ జూడరమ్మ చందమామపంట ॥ పల్లవి ॥

మునుపఁ బాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుఁగొనచూపులపంట
వినువీధినెగడినవెన్నెలలపంట ॥ సందె ॥

వలరాజుపంపున వలపువిత్తినపంట
చలువై పున్నమనాఁటి జాజరపంట
కలిమికామినితోడ కారుకమ్మినపంట
మలయుచుఁ దమలోనిమత్తిమానిపంట ॥ సందె ॥

విరహులగుండెలకు వెక్కసమైనపంట
పరగ చుక్కలరాసిభాగ్యముపంట
అరుదై తూరుపుఁగొండ నారఁగ బండినపంట
యిరవై శ్రీవేంకటేశునింటిలోనిపంట ॥ సందె ॥ 34

## ఆహిరి

ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు
విన్నపమిదె శ్రీవేంకటనాధా ॥ పల్లవి ॥

పాసినఁ బాయవు బంధములు
ఆస దేహమున్నన్నాళ్ళు
కోసినఁ దొలఁగవు కోరికలు
గాసిలి చిత్తముగలిగినన్నాళ్ళు ॥ ఎన్న ॥

కొచ్చినఁ గౌరయవు కోపములు
గచ్చులగుణములుగలనాళ్ళు
తచ్చినఁ దలఁగవు తహతహలు
రచ్చల విషయపురతులన్నాళ్ళు ॥ ఎన్న ॥

వొకటికొకటికిని వొడఁబడవు
అకట శ్రీవేంకటాధిపుఁడ
సకలము నీవే శరణంటే యిఁక
వికటములణఁగెను వేడుకనాళ్ళు ॥ ఎన్న ॥ 343

బౌళి

ఎంత వెట్టిఁ గొండదవ్వి యెలుకఁ బట్టెద నేను
పంతపు శ్రీహరి నాభ్రమ వాపవే ॥ పల్లవి ॥

పడనిపాట్లఁ బెక్కుపనులఁ దిరుగుటెల్ల
కుడిచేపట్టెఁడుగూటికొర కింతే కా
కడదాఁకాఁ జెలులతోఁ గాఁపురము సేయుటెల్ల
వొడలు మరచియుండే వొక్క నిమిషానకా ॥ ఎంత ॥

ఘనమైన గృహములు గట్టుకొనుటెల్లాను
తనువు మోచేయంతటికే కా
తనివోనిమతిలోనితలపోఁతలెల్లాను
యెనసిన బదుకు తా నెంచుటకే కా ॥ ఎంత ॥

యింతలోని పనియని యెరఁగని చేతఁలెల్లా
సంతకూటముల యీసంసారానకా
చెంతలశ్రీవేంకటేశ చేరి నీకే శరణంటే
యింతక మున్నిటినేర మేమనేవో కా ॥ ఎంత ॥ 344

రేకు 359 లలిత

నీవే కాచుటగాక నేరుపు నాయందేది
చేవల వేఁపమాను చేఁదు మానీనా ॥ పల్లవి

వొరసి దుర్గుణములనునూనిన నాచిత్తము
మరలి మంచిగుణాన మట్టుపడీనా
హరి నిన్నుఁ దలఁచక యడవిఁబడిన మరి (తి?)
దరిచేరి నిన్ను మతిఁ (రి?) దలఁచఁబోయీనా ॥ నీవే ॥

పొలుమాలి యింద్రియాలబారిఁబడ్డ పుట్టువిది
ఆలరి వైరాగ్యసుఖ మందఁబోయీనా
నీలవర్ణ నినుమాని నిత్యసంసారైన నేను
కాలమందే నిన్నెరఁగఁగలనా నేను ॥ నీవే ॥

గరిమ సుజ్ఞానము గలిగిన సాత్త్విక -
మరయ వేరొకచోట వణఁగీనా
యిరవై (మై?) శ్రీవేంకటేశుఁడ నీకరుణబ్బె
శరణాగతుఁడ నాకు స్వతంత్రమా ॥ నీవే ॥

ముఖారి

ఇందుకు విరహితములిన్నియు సజ్ఞానమని
చందమున గీతలందుఁ జాటీనిదివో ॥ పల్లవి ॥

మానావమానములు మాని డంబు విడుచుట
పూని హింసకుఁ జొరక యోరుపు గలుగుటయు
ఆని మతిఁ గరఁగుట యాచార్యోపాసన
తానెప్పుడు శుచియౌట తప్పని విజ్ఞానము ॥ ఇందు

[1]అంచల సుస్థిరబుద్ధి యాత్మవినిగ్రహము
అంచితవిషయనిరహంకారాలు
ముంచినజన్మదుఃఖములు దలపోయుట
కంచపుసంసారము గడుచుటే జ్ఞానము ॥ ఇందు ॥

అరిమిత్రసమబుద్ధి యనన్యభక్తియు
సరినేకాంతమును సజ్జనసంగ విముక్తి (?)
ధర నధ్యాత్మజ్ఞానతత్వము దెలియుట
గరిమలందుట శ్రీవేంకటపతి జ్ఞానము ॥ ఇందు 346

**లలిత**

ధ్రువవరదునివలె తుదకెక్కుఁగాక మరి
యివల గర్మఫలంబు లేవైన సతమా ॥ పల్లవి ॥

కరిరాజవరదునకు కడఁగి శరణంటేను
కరిఁగాచినట్లనే కాఁచుగాక
పరదైవముల కెంత భంగపడి మొక్కినా
అరసి రావణుకొసంగినట్లనేకాదా ॥ ధ్రువ ॥

శ్రీపతినే అడిగినను జిగి నజామిళువలె
చేపట్టి సిరుల రక్షించుఁగాక
ఆపోక కౌరవుఁడు హరిపరాఙ్ముఖుఁడైన
పైపైనే సంపదలు పార్థుచేఁ బడవా ॥ ధ్రువ ॥

శ్రీవేంకటేశుఁడిచ్చేయీవరంబులే
వోవలను ద్రిష్టమై యుండుఁగాక
భావించ నితరములు పరలోకములయందు
కై వశంబగుననేకథలవలెఁగాదా ॥ ధ్రువ ॥ 347

---

౧ అంచలను స్థిరబుద్ధి' రేకు

## బౌళి

ఏమిసేయుదు నింతయు నీమాయ
సామజవరద నా చందమిది ॥ పల్లవి ॥

జలములోపలనున్నచందురునీడవలె
నలుగడలఁ గదలీ నామనసు
పెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
వెలుఁగదు నాలోని విజ్ఞానము ॥ ఏమి ॥

కడఁగి యాకసమున గాలియణఁగినట్లు
వడిఁగానరాదు నా వైరాగ్యము
ముడిగిముత్తెపుఁజిప్పముత్యమువిధంబున
జడిసీ నాలోని సాత్వికము ॥ ఏమి ॥

యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీకృపవలె
వుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిన నీసేవవలెఁ గన్న నిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము ॥ ఏమి ॥ 348

## బౌళిరామక్రియ

ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవే
కన్ను లెదుటనుండి కరుణింతుగాక ॥ పల్లవి ॥

పొడమినయట్టె నిన్ను పొంచికొలిచేనంటే
కడు నాకప్పుడు వివేకము చాలదు
అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁబోతే
వడి జవ్వనమదము వశమిందుగాదు ॥ ఎన్నఁడు ॥

వెనక నేఁ బ్రౌఢనై విరతిఁ బొందేనంటే
ధనవాంఛ నేమియుఁ దడవనీదు
తనువు ముదిసి నీకుఁ దపముసేసేనంటే
వోనర నేమిటికి వోపికలేదు ॥ ఎన్నఁడు ॥

శ్రీవేంకటేశ యాసిలుగులఁబెట్టనేల
కైవశమై నీవు గలిగుండఁగా
నీవే కృపసేసి నేఁడిటుగావకున్న
పావనమైన యీ పదవెందుఁగద్దు ॥ఎన్నఁడు॥ 349

## సామంతం

ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు ॥ పల్లవి ॥

అరసి ధ్రువుని గాచినట్టి నీవు
కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు
కరిరాజు శరణంటేఁ గాచిన నీవు
కరతలామలకమై కలవుగా నీవు ॥ ఇందరి ॥

గట్టిగా విభీషణుఁగాచిన నీవు
అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు
చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు
కట్టిన ముడుపవై కలవుగా నీవు ॥ ఇందరి ॥

కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు
కిమ్ముల లోకములు రక్షించే నీవు
నెమ్మది శ్రీవేంకటనిలయ నీవు మాకు
కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు ॥ ఇందరి ॥ 350

రేకు 360 లలిత

దైవమే నేరుచుఁగాక తగిలించ విడిపించ
యీవల సంసారికి నేమిసేయ వచ్చును ॥ పల్లవి ॥

ఆస యెచ్చోట నుండు నక్కడ దైన్యము నుండు
వాసులన్నీ నెందు నుండు వన్నెలు నందుండు
వేసట యెక్కడ నుండు వీతరాగ మాడనుండు
యీసుల నీలంకెవాప నెవ్వరికిఁ దరము ॥ దైవ ॥

అతికోప మేడనుండు నజ్ఞాన మాడనుండు
మతిఁ బంత మెందుండు మత్సర మందుండు
మతకము లేడనుండు మాయలును నందు నుండు
యితరు లెవ్వరు నిందు కేమనఁగలరు ॥ దైవ ॥

తనభక్తి యెందుండు తపమును నందుండు
మనసెందు నుండు దీమసమును నందుండు
తనివి యెక్కడ నుండు తగు సుఖ మందుండు
తనర శ్రీవేంకటేశు దైవికము లివియే ॥ దైవ ॥ 35

ముఖారి

[౧]వింతనా నేఁ దనకు వేసాలవాఁడు
కంతునికి గురుఁ డనఁగలిగినవాఁడు ॥ పల్లవి ॥

జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు
వెడమాయలుఁగ బారి విద్యలవాఁడు
కడుసోద్యములనే కర్మపుఁ జేఁతలవాఁడు
అడరి కంభపుసూత్ర మాడెడివాఁడు ॥ వింత ॥

౧ ఇందు దశావతార సమన్వయము కలదు

యిలనుండి మిన్ను ముట్టే యింద్రజాలములవాఁడు
తల ద్రుంచి బ్రదికించుతక్కులవాఁడు
తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు
కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు ॥ వింత ॥

మిగువలభ్రమయించేమౌనవ్రతములవాఁడు
నెగ్గై రాయి గంతులు వేయించేవాఁడు
[illegible]ంచే వరముల శ్రీ వేంకటాద్రివాఁడు
ఒగివాయ కిట మమ్ముఁ బాలించేవాఁడు ॥ వింత ॥ 352

**ముఖారి**

నగవులు నిజమని నమ్మేదా
వొగి నడియాసలు వొద్దనవే ॥ పల్లవి ॥

తొల్లిటికర్మము దొంతుల నుండఁగ
చెల్లబో [illegible]కఁజేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుఁడ
వొల్లనొల్ల నిఁక నొద్దనవే ॥ నగవు ॥

పోయినజన్మము పొరుగులనుండఁగ
చీయనక యిందుఁ జెలఁగేదా
వేయినామములవెన్నుఁడ మాయలు
వోయయ్య యిఁకనొద్దనవే ॥ నగవు ॥

వలి నీనామము నాలికనుండఁగ
తలకొని యితరముఁ దడవేదా
బలు శ్రీవేంకటపతి నిన్నుఁగొలిచి
వొలుకుఁ జెంచలములొద్దనవే ॥ నగవు ॥ 353

## మంగళకౌశిక

భారకుఁ డతఁడే బంధువుఁ డతఁడే
చేరితి మతనినే చెంచెలమేలా ॥ పల్ల॥

చెనకునాయుధము చేతఁ గలిగితే
ఘననిర్భయుఁడై కడఁగీనట్ల (ట?)
అనంతాయుధుఁ డాతుమనుండఁగ
వెనుకొని యెందుకు వెఱవఁగనేలా ॥ భార

భువి నొకరాజునుఁ బొందుగఁ గొలిచిన
యివల నచ్చికం బెరఁగఁడట
భువనరక్షకుఁడె పొదిగొని యేలఁగ
వివరించి యొరుల వేఁడఁగనేలా ॥ భార

తోవ నిధానము దొరకినయప్పుడే
యేవిధములు మరి యెంచఁడట
శ్రీవేంకటపతి చేకొని కావఁగ
భావన నితరోపాయములేలా ॥ భార

## సామంతం

తానే తానే యిందరి [1]గురుఁడు
సానఁబట్టినభోగి జ్ఞానయోగి ॥ పల్ల

అపరిమితములైనయజ్ఞాలు వడిఁ జేయఁ
బ్రపన్నులకు బుద్ధి వచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మయోగి ॥ తా

౧ 'గు గురుఁడు' రేకు

అన్ని చేఁతలును బ్రహ్మార్పణవిధిఁ జేయ
మన్నించు బుద్ధులను మరుగఁజెప్పి
వున్నతపదమున కొనరఁగఁ గరుణించ (చు?)
పన్నగశయనుఁడే బ్రహ్మయోగి ॥ తానె ॥

తనరఁగఁ గపిలుఁడై దత్తాత్రేయుఁడై
ఘనమైనమహిమ శ్రీవేంకటరాయఁడై
వొనరఁగ సంసారయోగము గృపసేయు
అనిమిషగతుల నభ్యాసయోగి ॥ తానె ॥ 355

## కన్నడగౌళ

పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవే
యిరవుగఁ గంటి వింటి నిదివో నీరూపము ॥ పల్లవి ॥

పెక్కురోమకూపముల పెనుబ్రహ్మాండాలు మోచే
వెక్కసపు నీకుఁ ద్రివిక్రమాకృతి యేమి
అక్కడ వేదశ్రుతి 'యత్యతిష్ఠద (ద్ద?) శాంగుల
మెక్కువయని పొగడీ నిదివో నీరూపము ॥ పర ॥

వెదక జీవులలోనే వేవేలు రూపుల (లు?) నీకు
యెదిటి దశావతారాలేమి యరుదు
అదె 'విశ్వతోముఖ యనంతమూర్తి' వని
యిదె శ్రుతి వొగడీని యిదివో నీరూపము ॥ పర ॥

దిందుపడి సురలు నీతిరుమేనఁ బొడమఁగ
యిందరు నీవేయవుట యేమి యరుదు
యెందును శ్రీవేంకటేశ 'యేకో నారాయణ'
యిందులో శ్రుతి చాటీ నిదివో నీరూపము ॥ పర ॥ 356

రేకు 361 రామక్రియ

భళి భళి రామా పంతపు రామా నీ -
బలిమి కెదురు లేరు భయహర రామా ॥ పల్లవి ॥

విలువిద్య రామా వీరవిక్రమ రామా
తలకొన్నతాటకాంతక రామా
కొలమై (?) ఖరుని తలగుండుగండ రామా
చలమరి సమరపు జయరామ రామా ॥ భళి ॥

రవికులరామా రావణాంతక రామ
రవిసుతముఖకపిరాజ రామ
సవరఁగాఁ గొండలచే జలధిగట్టిన రామ
జవసత్త్వసంపన్న జానకీరామా ॥ భళి ॥

కౌసల్యరామా కరుణానిధిరామ
భూసురవరద సంభూతరామా
వేసాలఁ బొరలే శ్రీవేంకటాద్రిరామ
దాసులమమ్ముఁ గావఁదలకొన్న రామా ॥ భళి ॥ 357

లలిత

[1]అన్నిటికి నిది పరమౌషధము
వెన్నునినామమే విమలౌషధము ॥ పల్లవి ॥

చిత్తశాంతికిని శ్రీపతినామమె
హత్తిననిజ దివ్యౌషధము
మొత్తపు బంధవిమోచనంబునకు
చిత్తజగురుఁడే సిద్ధౌషధము ॥ అన్నిటి ॥

---

౧ ఈ పాటతో విమలౌషధ, దివ్యౌషధ నిత్యౌషధములలో తప్ప మిగతంతటా 'అవుషధము' రేకు

పరిపరివిధములభవరోగములకు
హరిపాదజలమె యౌషధము
దురితకర్మములఁ దొలఁగించుటకును
మురహరపూజే ముఖ్యౌషధము ॥ అన్నిటి ॥

యిల నిహపరముల నిందిరావిభుని -
నలరి భజింపుటె యౌషధము
కలిగిన శ్రీవేంకటపతి శరణమే
నిలిచిన మాకిది నిత్యౌషధము ॥ అన్నిటి ॥ 358

## సామంతం

ఎల్లలోకములవారి కేలిక దానే
కొల్లగావరములిచ్చేగురుతైనదైవము ॥ పల్లవి ॥

కొండల కోనలలోన కోనేటిసరిదండ
మెండైనబంగారుమేడలలోన
నిండుజవ్వనముతోడినెలఁతకౌఁగిటలోన
వుండి జగమెల్ల నేలీ నుద్దండదైవము ॥ ఎల్ల ॥

నాలుగుచేతులతోడ నవ్వులమోముతోడ
సోలి ¹సంకుఁజక్రముల సొంపుతోడ
నేలమిన్నునొక్కటైనిలుచున్న రూపుతోడ
పాలుపడి మెరసీని ప్రత్యక్షదైవము ॥ ఎల్ల ॥

సంపదలు కడుమించి చవులతో నారగించి
జొంపపు విరులపూజ సొంపుమించి
యింపులశ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడుదేవతలతోఁ బ్రతిలేనిదైవము ॥ ఎల్ల ॥ 359

---

౧ శంఖు వ్రా ము పా

## లలిత

బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటిబారి నింకఁ దోయకు మోయయ్య ॥ పల్లవి ॥

[1]చిక్కుల భవములఁ జెరఁజిక్కి వోపలేక
నిక్కి నీమరఁగు చొచ్చి నిలిచితిని
అక్కజమై యల్లనాఁడే అప్పులకర్మములెట్ల
ఇక్కడనె చుట్టుముట్టీ నేమిసేతునయ్యా ॥ బల్లిదు ॥

లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక
యిచ్చట నిన్నుఁగొలిచి యెక్కువై తిని
పొచ్చముల [2]నల్లనాఁటిపూఁట దీరదని కొన్ని
బచ్చనబంధాలు వచ్చెఁ బాఁపగదవయ్య ॥ బల్లిదు ॥

అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక
ముంచి నీపాదాలకు మొరవెట్టితి
పొంచిన శ్రీవేంకటేశ భువనరక్షకుఁడవు
పంచల మున్నాఁడ నన్నుఁ బాలించవయ్యా ॥ బల్లిదు ॥ 360

## పాడి

కలకాలము నిట్టేకాఁపురపు బదుకాయ
యిలదైవమా నాకెన్నఁడో నిశ్చయము ॥ పల్లవి ॥

గుట్టుతో వైరాగ్యమే కోరుదు నే నొకవేళ
అట్టున సంసారపుటాఅడి గోరుదు
ముట్టుపడి యొకచోట మ (వ) సెందు నిలువదు
యిట్టె చెంచెలుఁడ నాకు నెన్నఁడో నిశ్చయము ॥ కలకాల ॥

---

౧ చిక్కుల భవములచెడ' కావచ్చు లేక జరఁ' కూడ కావచ్చు ౨ అల్లనాఁడె రేకు

కొంతవడి నే సత్త్వగుణమందు నెలకొందు
అంతలో రాజసగుణినై యుందును
చెంత దామసగుణము చేకొందు నొకవేళ
యింత పలువంచలు నా కెన్నఁడో నిశ్చయము ॥ కలకాల ॥

వివరించి యొకవేళ వివేకివలె నుందు
అవల మూఢుఁడనవుదు నంతటిలోనే
తవిలి శ్రీవేంకటేశ తగ నిన్ను దలఁచంగ
యవలఁ [1]దొల్తేయాయ (?) నెన్నఁడో నిశ్చయము ॥కలకాల॥361

**బౌళి**

మానదు మతిమఱపునుఁ దెలివియు
యేనింక దైవమ యేమిసేయుదును ॥ పల్లవి ॥

సకలపురాణాలు శాస్త్రాలు విని విని
వొకవేళ సుజ్ఞానమొదవును
వికటమై యంతలో విషయసుఖము గని
అకట కమ్మర బుద్ధి నవే కతలు ॥ మానదు ॥

పలుదుఃఖములబాధఁబడువారిఁ బొడగని
పలికి సంసారముపై రోసును
నలవంక సిరులలో నటియించువారిఁ జూచి
తలఁచి యాసలవెంటాఁ దగులునంతటను ॥ మానదు ॥

యెడప కలమేల్మంగ యీరీతి నిన్ననే
బడిబడి యలసి తిట్టి పైపై నింక
విడుముడి నీమీఁద శ్రీవేంకటేశ్వర
తడవియిట్ల దయదలఁచకుండినను ॥మానదు॥362

---

[1] 'తొల్తే = జన్మములకు పూర్వావస్థయే కావచ్చు

రేకు 362 లలిత

హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
పరగ నీదాసుఁడే పరతత్త్వవేది ॥ పల్లవి ॥

పొలసి మశకమందుఁ బొడమేటి జీవుని
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపోయీనీ
నిలువెంత నీఁటెంత నీమాయ లివి భువి
బలిమిఁ దెలియువాఁడె పరతత్త్వవేది ॥ హరి ॥

తగిలి చూచిన నాత్మఁ దనుఁ గానరాదుగాని
జగమెల్ల దానైతే సరి గనీని
చిగురెంత చేగెంత శ్రీపతి యిందులో నీ -
పగటు దెలియువాఁడే పరతత్త్వవేది ॥ హరి ॥

యేవంకఁ దనబుద్ధి యెక్కడనుండునోకాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించీని
పూవెంత ఫలమెంత పురుషోత్తముఁడ నీ -
భావమెరుఁగువాఁడె పరతత్త్వవేది ॥ హరి ॥ 36?

సామంతం

అల్లదెకో విజయధ్వజము జగ -
మెల్లఁ[౧]జేకొనియె నీతఁడు ॥ పల్లవి ॥

తొక్కనిచోట్లుదొక్కటితురగపు
రెక్కలమీఁదటిరేవంతుఁడు
చక్కఁగ నసురల సంహరించి యిదె
దిక్కులుగెలిచెను దేవదేవుడు ॥ అల్లదె ॥

---

౧ జేకొనియ రేకు

వోడక శంఖము నొగిచక్రముతో
సూడుకుఁ దిరిగేటి శూరుఁడు
యీడనుండి సురలిందరిఁ గాచెను
మేడెపుమనలక్ష్మీవిభుఁడు ॥ అల్లదె ॥

శరణనవారలఁ జయ్యనగాచిన
శరణాగతరక్షణఘనుఁడు
తిరమై యింతకు దిక్కై నిలిచెను
గరిమెల శ్రీవేంకటవిభుఁడు ॥ అల్లదె ॥ 364

## రామక్రియ

ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీమహిమకు నెవ్వ రెదురయ్యా ॥ పల్లవి ॥

పల్లించి గరుడనిపై నీ వుబ్బుననెక్క
అల్లనాఁడె పారిజాత మడవికెక్కె
పల్లదపురుద్రుఁడును బాణునివాకిలి దొక్కె
చుల్లరి రాక్షసమూఁక సురసుర సుక్కె ॥ ఎక్కడ ॥

గరుడినిపై నీవు కడుఁబేరములువార
ధరజలధరుల నమృతములు దేరె
నిరతిఁ గంసాదులనెత్తురు టేరులు వారె
పరులు నీకెదిరిన పగయెల్ల దీరె ॥ ఎక్కడ ॥

బంగారుగరుడనిపై నీవు వీదులేఁగ
చెంగట శ్రీవేంకటేశ సిరులుమూఁగె
సంగతి నలమేల్మంగ సంతసాన విఱవీగె
పొంగారు దేవదుందుభులు పైపై వాఁగె ॥ ఎక్కడ ॥ 365

## వరాళి

సమమతివని నీవే చాటుదువు
రమణ నేరుపునేరము లెవ్వరివి ॥ పల్లవి ॥

రావణాదులైన రాక్షససమితిలో
నీవే, దేవతలలో నీవేకావా
భావింప నసురలు పగ నీకు నేలైరి
యీవల సురులెల్ల (లేల?) హితులైరి ॥ సమ ॥

సకలజంతువులకుఁ జైతన్యుఁడవు నీవే
వొకరు నీకుపరాకమొనరించేరా
అకట కొందరిఁ బాపాత్ములఁగాఁ జేసి
వెకలిఁ గొందరిఁ బుణ్యవిధులఁ జేసితివి ॥ సమ ॥

అటుగాన ఇట్టాయ నట్టాయననేల
యిటు నీచిత్తముకొలఁ దింతేకాక
గటియించి శ్రీవేంకటపతి నీదాసు
లిటువలె ఘనులై రిదివో నీకృపను ॥ సమ ॥ 3

## ఆహిరి

నే నవగుణినైన నీకుఁ బోదు భువి
లోన భక్తవత్సలుఁడ వటు గాన ॥ పల్లవి ॥

పరమపూరుషా భవరోగవైద్య
ధరణీధర మాధవ కేశవా
అరిది సంసారాన నలసితి నినుఁగను -
తెరు వేదా వెర వేదా తెలియ నే నిపుడు ॥ నే నవ ॥

భువనాతీతా పుండరీకేక్షణ
నవనీతప్రియ నారసింహా
యివల నాయపరాధ మెంతైనఁ గలదు నా
వివరము చింతించి వెసఁ గావరాదా ॥ నే నవ ॥

అగుణా సగుణా యాద్యంతరహితా
అగణిత శ్రీవేంకటాద్రినాధ
నిగమగోచర నేను నీయాధీనము నింతే
నగుఁబాటు గాకుండ ననుఁగావుమిపుడు ॥ నే నవ ॥ 367

**కన్నడగౌళ**

తల లేదు తోఁక లేదు దైవమా నమాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము ॥ పల్లవి ॥

తను వేఁటిదో యీ తలపోఁత లేఁటివో
యెనయు సంసార సుఖ మిది యేఁటిదో
వెనక ముం దేఁటిదో వివేక మెరఁగక
దినదినమును నేమో తిరిగేము నేము ॥ తల ॥

పుట్టు గిది యెక్కడో పోయేటి దెక్కడో
ఇట్టె యీ సిరులెల్లా నెక్కడెక్కడో
మట్టులేనిహరినిర్మాణచక్రములోన
దిట్టలమై యేమేమో తిరిగేము నేము ॥ తల ॥

నేరు పేదో ౧నేర మేదో నిలిచిన దొకటేదో
వూరకే నీదాసులమై వున్నారము
చేరి నన్నేలినయిట్టె శ్రీవేంకటేశ్వర
గారవించి కరుణించి కావఁగదవే ॥ తల ॥ 368

౧ నేరము + ఏదో

**రేకు 363** **మాళవి**

ఇదియే వేదాంత మిందుకంటె లేదు
యిదియే శ్రీవేంకటేశుని మతము ॥ పల్లవి ॥

విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వినకవారెల్ల
విరతిఁబొందకున్న వీడదు భవము ॥ ఇదియే ।

చిత్తమే పాపము చిత్తమే పుణ్యము
చిత్తమే మోక్షసిద్ధియును
చిత్తమువలెనే శ్రీహరి నిలుచును
చిత్తశాంతిలేక చేరదు పరము ॥ ఇదియే

యెంతచదివినా యెంతవెదకినా
యింతకంటె మరి యిఁకలేదు
యింతకంటె శ్రీవేంకటేశుదాసులొాట
యెంతవారికైన యిదియే తెరువు ॥ ఇదియే ॥

**గుండక్రియ**

జీవుఁడు నిత్యుఁడు యీ చింత లెట్టు దొరకెనో
భావించ నిది యేఁటి ప్రచారమో ॥ పల్లవి ॥

తనువు మోచితినంటా తరుణులపొందులంటా
దినదినరుచులంటాఁ దిరిగేము
మొనసి సంసారమే మోహినీగజమై
వెనకఁ దలఁచ [1]మేటి వికారమో ॥ జీవుఁడు

---

౧ ఇక్కడ 'ఏటి' లో ఈ వాఙ్మయములో అరసున్న లేకుండట విచార్యము

కడుపు నిండినదంటాఁ గమ్మరనాఁకలియంటా
వెడఁగుభోగములంటా వెదకేము
వుడివోనియాసలే వుబ్బుఁగవణములై
విడువదు మతి కేటివిచారమో ॥ జీవుఁడు ॥

దివము రాతిరి యంటా తెలివంటా నిదురంటా
భువిఁ గాఁపురములంటాఁ బొరలేము
ఇవల శ్రీవేంకటేశ యింతలో నీదాసినని
వివరము గంటి నెట్టివివేకము ॥జీవుఁడు॥370

## మాళవశ్రీ

ఇందుకుఁగా నా[1]యెరఁగమి నేమని దూరుదును
[2]అందియు నిను నేఁదెలియక అయ్యో నేనిపుడు ॥ పల్లవి ॥

ఆతుమలోననుండి యఖిలోపాయములు
చేతమనకు నీవే చింతించఁగాను
కాతురపడి నేను కర్తననుచుఁ బనులు
యీతలఁ జెప్పఁగఁబూనే నిస్సిరో ॥ ఇందు ॥

తను విటు నీవొసఁగి తగుభాగ్యము [3]నీపై
అనువుగ జీవుని నీయటు నీవేలఁగను
తనియక నే వొరులు దాతలనుచుఁ బోయి
కనుఁగొని వేడఁగఁ దొడఁగేఁ గటకటా ॥ ఇందు ॥

శ్రీవేంకటాద్రిపై నుండి చేరి కన్ను లెదుటను
సేవగొని యిట్టే కృపసేయఁగాను
సోవలఁ గన్నవారెల్లాఁ జుట్టములంటా నేను
జీవులతోఁ బొందుసేసేఁ జెల్లఁబో ॥ ఇందు ॥ 371

---

౧ యరఁగమి' రేకు ౨ ఇందు రెండు 'నేను' శబ్దములు కలవు ఇట్టి పునరుక్తులక్కడ కూడ గలవు
౩ నీపై రేకు

## సామంతం

ఇట్టిదివో హరికృప యెంచినను
గట్టిగా నాహరికృపే కలదువో మాకు ॥ పల్లవి ॥

[1]బలుహిరణ్యాక్షుఁడు (?) [2]ప్రహ్లాదునిబట్టి
జలధి వేసిన నీరుచట్టై తేలె
కలుషించి కమ్మరాను కడునగ్నిఁ దోసిన
నిలువెల్లఁ జల్లనినీరై తొలఁకె ॥ ఇట్టి ॥

దిట్టయై యేనుగులచే దీకొలిపిన [3]హాఁటి (?) -
నట్టె కొమ్ములు తమురైపోయను
పట్టియెత్తి రాలమీఁద బలుమారు వేసిన
బట్టబయలే దూదిపానుపులై నిలిచె ॥ ఇట్టి ॥

కడసారెఁ గంభములోఁ గలఁడంటేఁ గలిగి
చిడుముడి రక్కసులఁ జీరివేసె
జడియు శ్రీవేంకటాచల నారసింహుఁడై
పొడచూపి మాకు దిక్కై పొదలించె నేఁడు ॥ ఇట్టి ॥ 372

## శ్రీరాగం

అది బ్రహ్మాండఁ బిది పిండాండం -
బుదుటుజీవులము వున్నార మిదివో ॥ పల్లవి ॥

వుదయాస్తమయము లొనరినవలెనే
నిదురలు మేల్కను నియమములు
కదిసి త్రిసంధ్యాకాలంబులవలె
గుదిగొను దేహికి గుణత్రయములు ॥ అది ॥

---

౧ బలుహిరణ్యాక్షుఁడు=బలువుఁడైన హిరణ్యాక్షుఁడు ౨ ప్రంహ్లాద రేకు ౩ 'హాఁడి కావచ్చు

పుడమి సస్యములు పొదలినవలెనే
వొడలిరోగము లున్న వివే
వుడుగని వెలుపటి వుద్యోగమువలె
కొడిసాగేటి మితి కోరికలు ॥ అది ॥

వెలుపలఁగలశ్రీవేంకటవిభుఁడే
కలఁ డాతుమలో ఘనుఁ డితఁడే
చలమున నీతని శరణాగతియే
ఫలమును భాగ్యము బహుసంపదలు ॥ అది ॥ 373

## గుజ్జరి

ఏమిసేయవచ్చు హరియెలయించే మాయ లివి
వేమరు నాతనిఁ గొల్చి వీడుకొంటగాక ॥ పల్లవి ॥

పాయమే పరచైతేఁ బట్టఁగ నెట్లవచ్చు
రోయుదాఁకా నందులోఁ దిరుగుటగాక
కాయపువోడ తప్పుగాలి విసరినవేళ
పోయినట్టే పోనిచ్చి పొనుఁగుటగాక ॥ ఏమి ॥

మనసే మలినమైతే మఱుఁగెట్టు సేయవచ్చు
వొనర విరతిదాఁక నోర్చుటగాక
తన యంతరంగపుటద్దము మాసితే నది
మినుకు విజ్ఞానాన మెరుఁగిచ్చుటగాక ॥ ఏమి ॥

మెచ్చునాలుకఁదీపు మింగ కెట్టుమానవచ్చు
కొచ్చి కొచ్చి సారె రుచిగొనుటగాక
నచ్చులశ్రీవేంకటేశునామము నోరనుంటే
పచ్చి తనభాగ్యమంటా బ్రదుకుటగాక ॥ ఏమి ॥ 374

## రేకు 364 లలిత

ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుకఁ బరుషలెల్ల వీధినుండరమ్మా ॥ పల్లవి ॥

అల్లదివో వోఁగునూఁతులౌభళేశుపెద్దకోవ
వెల్లి పలనీటిజాలు వెడలేసోన
చల్లనిమాఁకులనీడ సంగడిమేడలవాడ
యెల్లగాఁగ నరసింహుఁడేగీ నింతితోడను ॥ ఆడ ॥

సింగారపుమండపాల సింహాలమునిమంద -
లంగపుతెల్లగోపుర మదె మిన్నంద
చెంగట నాడు (ఢు?) వార్లు చేరి పన్నిద్దరుఁగొల్వ
సంగతిఁ దాఁగొలువిచ్చీ జయనరసింహము ॥ ఆడ ॥

కందువ శ్రీవేంకటేశుకల్యాణములవేది
అందమై భూములకెల్లా నాదికి నాది
మందలపాలకొండమలకు నట్టనడుమ
విందగు దాసులతోడ [1]విహరించీ దేవుఁడు ॥ ఆడ ॥

## లలిత

ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము
సతతపూర్ణునికి శరణ్యము ॥ పల్లవి ॥

సర్వలోకముల సాక్షైకాచిన -
సర్వేశ్వరునకు శరణ్యము
వుర్వికి మింటికి నొక్కటఁ బెరిగిన -
సార్వభౌమునకు శరణ్యము ॥ ఇతర ॥

---

౧ 'విహరించీ' రేకు

శ్రీకాంత నురముచెంగట నిలిపిన -
సాకారునకును శరణ్యము
పైకొని వెలిఁగేటి పరంజోతియై (యౌ?) -
సౌకుమారునకు శరణ్యము ॥ ఇతర ॥

తగనిహపరములు దాసుల కొసఁగేటి
జగదీశ్వరునకు శరణ్యము
నగు శ్రీవేంకటనాథుఁడ నీకును
సగుణమూర్తి యిదె శరణ్యము ॥ ఇతర ॥ 376

## దేవగాంధారి

ఏదైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు
పాదుగ నాతనిమీఁది భక్తే సాధనము ॥ పల్లవి ॥

దేహమునకు ఫలము తెగని యాలుబిడ్డలు
దేహాంతరాత్మకును దేవుఁడొకఁడే ఫలము
దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము
వూహల రెంటికి మనసొక్కటే సాధనము ॥ ఏదైన ॥

పుట్టినందుకు ఫలము పొందగు భోగములే
పుట్టుగే గెలుచుటకు భువి జ్ఞానమే ఫలము
పుట్టుటకుఁ గర్మము పోవుటే యకర్మము
వెట్టే యీ రెంటికిని విరతే సాధనము ॥ ఏదైన ॥

చింతించుటకు ఫలము సిరులెల్లఁ జేకొనుటె
చింత వీడుటకు ఫలము శ్రీవేంకటేశు సేవే
చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు
కొంత దాఁచనేల శ్రీ గురుఁడే సాధనము ॥ ఏదైన ॥ 377

---

పుట్టెదె (గు?) పూ ము పా

## ధన్నాసి

శరణాగతవజ్రపంజర బిరు దది నీది
కరుణానిధివై కావవే నేఁడు ॥ పల్లవి ॥

ప్రళయకాలమునాఁడు బ్రహ్మాండకోట్లు
సొలవక నీకుక్షి చొచ్చినట్లు
చెలఁగి నీమరఁగున శ్రీవేంకటాద్రిమీఁద
యిల నరలోకమెల్ల నెక్కెఁ గావవే ॥ శరణా ॥

అసురబాధకుఁగా నఖిలదేవతలును
కొసరుచు మొరవెట్టఁగూడినట్లు
ముసరి కోనేటిదండ మూఁకలు మూఁకలుగట్టి
విసిగి ప్రాణులు విన్నవించేరు గావవే ॥ శరణా ॥

జీవులఁ బుట్టించునాఁడు చేరి యా యా నెలవుల
నీవలన జనులెల్ల నిలిచినట్లు
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరినట్టివారి నెల్ల
తావుల నిలిపి యిట్టే దయఁగావవే ॥ శరణా॥ 37

## నారాయణి

కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన
భావించి నీవని తుదపదమే యెక్కితిమి ॥ పల్లవి ॥

కరిరాజవరద నీకడనున్నవారికి
కరిరాజభయము లెక్కడాఁ బొందవు
సిరుల నీయర్థమే చింతించి చింతించి
నరలోకమెల్ల నీనగమె యెక్కితిమి ॥ కావఁ ॥

కాళింగమర్దన నిన్నుఁగని మనువారికి
కాళింగభయములెక్కడా లేవు
తాలిమితో నిదియే తలపోసి తలపోసి
కేలి మనుజులము నీగిరియె యెక్కితిమి ॥ కావఁ ॥

కందువ శ్రీవేంకటకటకేశ నీవద్ద -
నెందుఁ గటకేశభయమిఁక లేదు
యిందుకే పో జగమెల్లా నిటు శరణని మూల
కందువ నీదండ శ్రీవేంకటమె యెక్కితిమి ॥ కావఁ ॥ 379

## దేశాక్షి

అతఁడే రక్షకుఁ డందరి కతఁడే
పతి యుండఁగ భయపడఁ జోటేది ॥ పల్లవి ॥

అనంతకరము లనంతాయుధము -
లనంతుఁడు [1]ధరించెలరఁగను
కనుఁగొని శరణాగతులకు మనకును
పనివడి యిఁక భయపడఁజోటేది ॥ అతఁడే ॥

ధరణి నభయహస్తముతో నెప్పుడు
హరి రక్షకుఁడై యలరఁగను
నరహరికరుణే నమ్మినవారికి
పరఁదున నిఁక భయపడఁజోటేది ॥ అతఁడే ॥

శ్రీ వేంకటమున జీవులఁ గాచుచు
నావల నీవల నలరఁగను
దైవశిఖామణి దాపగు మాకును
భావింపఁగ భయపడఁజోటేది ॥ అతఁడే ॥ 380

---

౧ 'ధరించి+అలరఁగ, ధరించలరఁగ పూ ము పా

**రేకు 365** **హిందోళం**

కరుణించవే నిజగతి బోధించవే
హరి నిన్నుఁ గొలువక యలసీఁ బ్రాణి ॥ పల్లవి ॥

కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁ గాంతలతోడివేడుకలు
లలి నిందుకుఁగా లంపటములఁబడి
పలుమారు నూరక బడలీఁ బ్రాణి ॥ కరు ॥

నిన్నటి యాహారనిజరుచివలెనే
అన్నువ నిప్పటి యాహారము
యెన్న నిందుకే యిడుమలఁ బొరలుచు
కన్న గతులఁ గడుఁ గలఁగీఁ బ్రాణి ॥ కరు ॥

పరుసముసోఁకినబంగారమువలె
పరమభాగవతపట్టములు
అరయఁగ శ్రీవేంకటాధిప నీకృప
యిరవుగఁ గని తుదకెక్కీఁబ్రాణి ॥ కరు ॥ 38

**మంగళకౌశిక**

ముట్టితేనే మూయెఁ బట్టితేనే పంతమయీ
ఇట్టె మమ్ముఁగావవే యిందిరారమణ ॥ పల్లవి ॥

తీరుగాఁ బుణ్యముసేసితే [1]జన్మబంధమై (మయీ?)
తోరపు నాపాపములైతే దుఃఖమైని (మయీని?)
వూరకుంటే నీప్రపంచ ముల్లంఘించినట్టై
యేరీతి నడచువార మిందిరారమణ ॥ ముట్టి ॥

---

౧ జన్మబంధమై (మయీ) ఇట్లే ఈపాటలో అంతటను

అంకె దయఁ దలఁచితే నన్నిటికిఁ దగులై
కొంకక కోపించితేనే క్రూరమ్మైని
మంకున నూరకవుంటే మదోన్మత్తుఁడై
యింకనేమి సేయువార మిందిరారమణ ॥ ముట్టి ॥

యిన్ని చిక్కులునేల యిట్టె శ్రీవేంకటేశ
మిన్నక నీశరణంటే మేలైని
వెన్నెల నీయర్థమే వేదశాస్త్రసమ్మతై
యెన్న నీవే సేయువాఁడ విందిరారమణ ॥ ముట్టి ॥ 382

## శంకరాభరణం

ఎప్పు డేబుద్ధి పుట్టునో యెరఁగరాదు
దెప్పరపుమాబ్రదుకు దేవునికే ౧సెలవు ॥ పల్లవి ॥

యేడనుండి పుట్టితిమో యింతక తొల్లి యింక -
నేడకుఁ బోయెదమో యిటమీఁదను
వీడని మాయంతరాత్మ విష్ణుఁడు మా -
జాడ జన్మమతనికే సమర్పణము ॥ ఎప్పు ॥

గతచన్న పితరు లక్కడ నెవ్వరో
హితవై యిప్పటి పుత్రు లిదియెవ్వరో
మతి మాజీవనమెల్ల మాధవుఁడు
అతనికే మాభోగాలన్నియు సమర్పణము ॥ ఎప్పు ॥

తొడికి స్వర్గాదులు తొల్లియాడవో యీ -
నడచే ప్రపంచమునాకేడదో
కడఁగి శ్రీవేంకటేశు గతియే మాది
అడఁగు మాపుణ్యాపాపా లతని కర్పణము ॥ ఎప్పు ॥ 383

---

౧ 'శలవు' రేకు

### మలహరి

ఇదియే సాధనమిహపరములకును
పదిలము మాపాలి పరమవునామం ॥ పల్లవి ॥

కలిదోషహరము కైవల్యకరము
అలరిన మా శ్రీహరినామం
సులభము సౌఖ్యము శోభనతిలకము
పలుమారును శ్రీపతినామం ॥ ఇది ॥

పాపనాశనము బంధవిమోక్షము
పైపైనిది భూపతినామం
స్థాపితధన మిది సర్వరక్షకము
[1]దాఁపి రమిది మాధవనామం ॥ ఇది ॥

నేమము దీమము నిత్యకర్మమిది
దోమటి గోవిందునినామం
హేమము శరణము యిన్నిట మాకును
యేమేర శ్రీ వేంకటేశ్వరునామం ॥ ఇది ॥ 38

### పాడి

నమ్మిన దిదివో నాపితురార్జిత
మిమ్మిహిఁ జూడరో యిది మీదిగాదు ॥ పల్లవి ॥

నలినదళాక్షునినామాంకితమే
నిలువునఁ బాఁతిన నిధానము
కలకాలమిదే గాదెలకొలుచులు
నలుగడ నివియే నాలుకరుచులు ॥ నమ్మి ॥

---

౧ 'దాఁపి (వు?) ర' పూ ము పా ౨ 'లివి కావచ్చు ౩ భవిష్యములు కావచ్చు

శ్రీపతిరూపమే చింతించు తలఁపే
పైపై మాయింటి భాగ్యములు
పూఁపలమిత్రులుఁ బుత్రాదు¹లిది (?)
పైపగు మాకిదె వ్యవసాయములు ॥ నమ్మి ॥

శ్రీ వేంకటపతి సేవిది యొకటే
భావించు నాయుష్య¹భొష్యములు
కైవల్యపదమిదె కాయజసుఖమిదె
సావధానముల సంసార మిది (దే?) ॥ నమ్మి ॥ 385

భైరవి

సందడిసొమ్ములతోడిసాకారమిదె వీఁడె
యిందరు వర్ణించరే యీరూపము ॥ పల్లవి ॥

చుక్కలతో నాకాశము సూటై నిలువఁబోలు
నిక్కి రత్నాలజలధినీటుగాఁబోలు
మిక్కిలి నానావర్ణ మేఘపంక్తిగాఁబోలు
యిక్కడనే నిలుచున్న దీరూపము ॥ సంద ॥

నించినపంచవన్నెలనీలగిరిగాఁబోలు
అంచల సంధ్యాకాల మదిగాఁబోలు
¹చించ కాతని మెరుఁగుల చీఁక టిదిగాఁబోలు
యెంచఁగ నలవిగాదు యీ రూపము ॥ సంద ॥

పున్నమ సమాసయు పొగై నిలువఁబోలు
వున్నతి యోగీంద్రుల యూహగాఁబోలు
పన్నిన బ్రహ్మాండాలభర ణిదిగాఁబోలు
యిన్నిట శ్రీవేంకటేశు యీ రూపము ॥ సంద ॥ 386

---

౧ చించకా (?) తని పూ ము పా

**రేకు 366** **ముఖారి**

అతఁడే యెక్కుడుదైవ మందరికంటే
తతినింకాఁ జెప్పిచూప దైవాలు [౧]గలవా ॥ పల్లవి ॥

జలధి దచ్చేనాఁడు సకలదేవత లుండ
యెలమి నేదేవుఁ జేరె నిందిరాదేవి
అల గజేంద్రుఁడు మూలమని మొరవెట్టునాఁడు
[1]వెలయ నేదేవుఁడు విచ్చేసి కాచెను ॥ అతఁ ॥

పుడమి గొలుచునాఁడు పొడవైన దేవతలు
కెడసి యెవ్వ రడుగుకింద దాఁగిరి
కడలేనిజగములు గల్పించే బ్రహ్మదేవుఁ -
డడరి యేదేవు నాభియందుఁ బుట్టెను ॥ అతఁ ॥

యెంచి నాఁడు దేవతల నింద్రియాలఁ జొక్కించే -
పంచబాణుఁ డేదేవునిపట్టి, యిపుడు
కొంచక శ్రీవేంకటాద్రిఁ గోరిన వరము లిచ్చి
అంచల లోకములేలీ నండ నే దేవుఁడు ॥ అతఁ ॥ 387

**లలిత**

నారాయణ నీనామమె గతి యిఁక
కోరికలు నాకుఁ గొనసాగుటకు ॥ పల్లవి ॥

పైపై ముందట భవజలధి
దాపు వెనకఁ జింతాజలధి
చాపలము నడుమ సంసారజలధి
తేప యేది యివి తెగనీఁదుటకు ॥ నారా ॥

---

౧ గలరా రేకు ౩ తెలియ' పూ ము పా యతి భంగము

1 'తెలియ విచ్చేసి యే దేవుఁడు కాచెను అని పాఠమున్నచో యతి సరిపోవును

పండె నెడమఁ బాపపురాశి
అండఁ గుడిని పుణ్యపురాశి
కొండను నడుమఁ ద్రిగుణరాశి - యివి
నిండఁ గుడుచుటకు నిలుకడ యేది ॥ నారా ॥

కిందిలోకములు కీడునరకములు
అందేటిస్వర్గా లవె మీఁద
చెంది యంతరాత్మ శ్రీవేంకటేశ నీ -
యందె పరమపద మవల మరేది ॥ నారా ॥ 388

## కాంబోది

కర్మ మెంత మర్మ మెంత కలిగినకాలమందు
ధర్మ మిది ౧యేమరక తలఁచవో మనసా ॥ పల్లవి ॥

చెలువల పొంతనుంటే చిత్తమే చెదురుఁగాని
కలుగనేర దెంతైనా ఘనవిరతి
వులుక కగ్గి పొంతనుంటేఁ గాఁకలేకాక
చలువ గలుగునా సంసారులకును ॥ కర్మ ॥

బంగారువోడ గంటేఁ బట్టనాస వుట్టుఁగాని
సంగతి విజ్ఞానపుజాడకు రాదు
వెంగలి యభిని దింటే ౨వెఱి వెఱాటాడుఁగాక
అంగవించునా వివేకమప్పుడే లోకులకు ॥ కర్మ ॥

శ్రీవేంకటేశుభక్తి చేరితే సౌఖ్యముగాని
ఆవల నంటవు పాపా లతిదుఃఖాలు
చేవ నమృతముగొంటే చిరజీవియగుఁగాని
చావులేదు నోవులేదు సర్వజ్ఞులకును ॥ కర్మ ॥ 389

౧ 'యామరక రేకు ౨ 'వెఱ్ఱి వెఱ్ఱాట కావచ్చు

## సామంతం

ఒకరిబుద్దులు [౧]వేరొకరి పనికిరావు
అకలంకుఁ డింతటికి నంతర్యామి ॥ పల్లవి ॥

పొడమించు నాతఁడే పొదలింము నాతఁడే
నొడిగించు నాతఁడే నోరఁగొలఁది
గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల
అడియాలమగులోనియంతర్యామి ॥ ఒకరి ॥

మతి యిచ్చు నాతఁడే మరపించు నాతఁడే
గతియౌ నాతఁడే కరుణానిధి
వెతమాన్పు నాతఁడే వెలయించు నాతఁడే
అతిశయమగులోనియంతర్యామి ॥ ఒకరి ॥

యిహమిచ్చు నాతఁడే యెదురెదురనే వచ్చి
సహజపుఁ బరమిచ్చు సరి నాతఁడే
విహగగమనుఁడు శ్రీవేంకటేశుఁ డితఁడే
అహరహమాదరించు నంతర్యామి ॥ ఒకరి ॥ 3

## రామక్రియ

కేవల [౨]కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా ॥ పల్లవి ॥

కిరణార్కకోటితేజ కేశవా
హరి లక్ష్మినాయక యాదికేశవ
గిరిరాజసుత (తా?) నుత కేశవ నమో
శరధిగంభీరశాయి జయజయ కేశవా ॥ కేవల ॥

---

౧ 'వేరొకరికి' కావచ్చు ౨ 'క్రిష్ణ' రేకు

కేకిపింఛావతంస కేశవ
శ్రీకర గుణాభిరామ చెన్న కేశవ
[1]కేక (కి?) వాహనవరద కేశవ
పాకశాసనవంద్య భళిభళి కేశవా ॥ కేవల ॥

కింకరబ్రహ్మాదిగణ కేశవ నా -
మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ -
శంకాహరణ నమో జగదేక కేశవా ॥ కేవల ॥ 391

## ముఖారి

ఒలపక్షము [2]లేనొక్కదేవుఁడవు
నలినాక్ష హరీ నమో నమో ॥ పల్లవి ॥

నేరిచిన నే నేరకుండిన నీ
కారుణ్య మొక్కటే కలది
పారి ఘంటాకర్ణుభక్తికి సరిగా
చేరి శుకాదులఁ జేకొంటిగాన ॥ ఒల ॥

సాదనైన నేఁ జలమతినైనా నీ
పాదమొక్కటే నేఁ బట్టినది
పాదైనవసిష్ఠుభక్తికి సరిగా
మేదిని వాల్మీకి మెచ్చితిగాన ॥ ఒల ॥

యేమిటా శ్రీవేంకటేశ యెంతైన నీ
నామమొక్కటే నే నమ్మినది
సామజముభక్తి సరిగా నీవును
ప్రేమతోఁ బ్రహ్లాదుఁ బెంచితిగాన ॥ ఒల ॥ 392

---

[1] 'కుమార' ధారికావాస స్కందా భీష్టప్రదాయినే' అని వేంకటేశ్వరాష్టోత్తర శతనామస్తోత్రము
[2] లేని+ఒక్క

రేకు 367 బౌళి

ఓహో ¹యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి
సాహసపుగుణములచతురుఁడా యితఁడు ॥ పల్లవి॥

జలధిలోఁ బవళించి జలనిధి బంధించి
జలనిధికన్యకను సరిఁ బెండ్లాడి
జలనిధిలో ²నీఁది జలనిధి మథియించి
జలధి వెరించిన (వెరిఁజిన?) చలమరా యితఁడు ॥ ఓహో

ధరణికిఁ బతియై ధరణి గ్రుంగిన నెత్తి
ధరణికూఁతురుఁ దానె తగఁ బెండ్లాడి
ధరణిఁ బాదము మోపి ధరణిభారము దించి
ధరణీధరుఁడైన దైవమా ఇతఁడు ॥ ఓహో

కొండ గొడుగుగ నెత్తి కొండఁ దూఁటువడ నేసి
కొండకిందఁ గుదురై కూచుండి
కొండపై శ్రీవేంకటాద్రి కోనేటిరాయఁడై
కొండవంటిదేవుఁడైనకోవిదుఁడా ఇతఁడు ॥ ఓహో

శుద్ధవసంతం

ఏమని చెప్పెద నిటమీఁద హరీ
శ్రీమంతుఁడ నినుఁ జేరితి మిదివో ॥ పల్లవి॥

వినుచున్నారము వెనకటిపాట్లు
కనుచున్నారము కలఁగేటివారల
దినదినభావము తెలిసీఁ దెలియదు
మనసున భయ మిసుమంతయు లేదు ॥ ఏమ

---

౧ 'యంతటి రేకు ౨ 'నిండి' వూ ము సా

భువి నెరుఁగుదు మిదె పుట్టెడిదెసలను
తవిలి మరణములు దలఁచెద మట్లనె
వివరపుటాసలు విడిచీ విడువవు
నవమగువిరక్తి నాఁటదు వోయె (?) ॥ ఏమని ॥

చదివెద మిదివో సకలశాస్త్రములు
వెదకెద మిదె శ్రీవేంకటేశ నిను
మదిలోనుండఁగ మరచివుంటి మిదె
యెదుటఁగంటి మిఁక యేలాపనులు ॥ ఏమని ॥ 394

## లలిత

ఆచారవిచారా లవియు నే నెరఁగ
వాచామగోచరపువరదుఁడ (వు) నీవు ॥ పల్లవి ॥

తపమొక్కటే నాకుఁ దగునీశరణనుట
జపమొక్కటే నిన్ను సారెకు నుతించుట
వుపమొక్కటే నీవె వున్నతుఁడవంట
విపరీతవిజ్ఞానవిధులేమి నెరఁగ ॥ ఆచా ॥

కర్మమొక్కటే నీ కైంకర్యగతి నాకు
ధర్మమొక్కటే నీ దాసానుదాస్యము
మర్మమొక్కటే నామతి నిన్నుఁ దలఁచుట
అర్మిలి నింతకంటే నవల నే నెరఁగ ॥ ఆచా ॥

బలిమియొక్కటే నాకు భక్తి నీపైఁ గలుగుట
కలిమియొక్కటే నీవు గలవని నమ్ముట
యెలమితో శ్రీవేంకటేశ నీవు గతిదక్క
పలుబుద్ధుల నేఁబొరలు [1]భావనలేనెరఁగ ॥ ఆచా ॥ 395

1 'భావనలు + ఏన్+ ఎరఁగ' భావనలేస (యొ?) రఁగ పూ ము సా

### లలిత

పనిలే దేమియు నాకు పంపుడు నీబంట నింతే
యెనపినతెడ్డు చౌ లెరుఁగునటవయ్యా ॥ పల్లవి ॥

మనసు నీ విచ్చితివి మాఁటలు నీ విచ్చితివి
తనువు నీ విచ్చితివి యంతర్యామీ
చెనసి నీదువల్లఁ జేసేకర్మపు (ఁ?) బంట
నినుపుఁగణఁజాల నించుకొనవయ్యా ॥ పని ॥

సత్త్వవ నీ విచ్చితివి చలము నీ విచ్చితివి
తత్తర మిచ్చితివి యంతర్యామి
యిత్తల నావల నీవు యెందుకైనఁ బెరరేఁచి
యెత్తుక యేమైన గడియించుకొనవయ్యా ॥ పని ॥

మాయలు నీ విచ్చితివి మదము నీ విచ్చితివి
ఆయపుశ్రీవేంకటాద్రియంతర్యామి
యేయెడ నేఁ జేసేటి [1]యిన్నెపరాధాలు
వేయయిన నీవెనక వేసుకొనవయ్యా ॥ పని ॥ 396

### బౌళి

నిచ్చలూ లోకము చూచి నివ్వెరగయ్యా నాకు
చెచ్చెర శ్రీహరి నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

జీవ మతిసూక్ష్మము చిత్తము [2]చంచలము
భావము నిరాకారము భవమెల్ల నెయ్యము
యేవిధులఁ బొరలెనో యిది నాబ్రదుకు
దేవుఁడ నీచిత్తము నాతేఁకువైన భాగ్యము ॥ నిచ్చ ॥

---

౧ ఇన్ని + అపరాధాలు ఈ సంధులీ వాఙ్మయమున కొల్లలు 'యిన్నపరాధాలు పూ ము పా
౨ 'చెంచెల' రేకు

వూరుపెల్ల గాలి నా వుపమెల్ల మాయ
కూరిమెల్ల మొరఁగు నా గుణము విచారము
నేరుపేదో నేరమేదో నిజము దెలియదు
శ్రీరమణుఁడవు నీ చిత్తము నా భాగ్యము ॥ నిచ్చ ॥

కాలము పొరేటిదాడి కాయము తూంట్లబొంత
ఆలరిశ్రీ వేంకటేశ యది నీచేఁత
యేలాగు లెరఁగను యిటు నీశరణనుటే
శీలము నాకు నీ చిత్తము నా భాగ్యము ॥ నిచ్చ ॥ 397

**పాడి**

అమ్మె దొకటియును (యని?) యసిమలోదొకటి యని
కమ్ముకొని నీయందే కలిగె నీమాఁట ॥ పల్లవి ॥

సరవితో నిను నుపనిషద్వాక్యములయందు
పురుషోత్తముఁడవనుచుఁ బొగడఁగాను
అరిది నారాయణివియై యమృత మొసఁగుచో
అరయ శ్రుతిదె విరోధంబాయ నీమాఁట ॥ అమ్మె ॥

తలపోయ ధర్మసంస్థాపనుఁడవని నిన్ను
చెలరేఁగి శాస్త్రములు చెప్పఁగాను
తలఁక కిటు గోపపరదారగమనము నీవు
యిలఁ జేయ శాస్త్రవిరహితమాయ నీమాఁట ॥ అమ్మె ॥

వైకుంఠపతివనుచు వడిఁ బురాణములెల్ల
యేకమొకటే [1]వశియించఁగాను (?)
యీకడ శ్రీవేంకటేశ్వరుఁడవైతి విదె
చేకొలఁది నిటు నీకె చెల్లు నీమాఁట ॥ అమ్మె ॥ 398

---

౧ 'వచియించఁగాను' కావచ్చు

రేకు 368 గుజ్జరి

ఇతరములన్నియు నడుమంత్రములే యెంచిచూచినను యింతాను
హితవగుబందుగుఁ డీశ్వరుఁడొకఁడే యితని మరవకుమీ జీవాత్మా ॥ పల్లవి॥

భవకూపంబుల బడలెడినాఁడు పాయనిబంధువుఁ డితఁడొకఁడే
దివిస్వర్గంబునఁ దేలెడినాఁడు తిరుగఁబాయకె (ఁడె?) పు డితఁడొకఁడే
నవనరకంబుల నలఁగెడినాఁడు నటనలఁ బాయఁ డితఁడొకఁడే
యివలనవలహృదయేశుఁడు విష్ణుఁడు యీతని మరవకుమీ జీవాత్మా॥ఇతర॥

పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయనిబందుగుఁ డితఁడొకఁడే
విశదపుదుఃఖపువేళలనైనా విడువనిబంధువుఁ డితఁడొకఁడే
శిశువైనప్పుడు [1]వృద్ధైనప్పుడు చిత్తపుబందుగుఁ డితఁడొకఁడే
దశావతారపు విష్ణుఁడొకఁడే యితఁడని తలఁచుమీ జీవాత్మా ॥ఇతర॥

భావజకేలినిఁ జొక్కినప్పుడును ప్రాణబంధువుఁ డితఁడొకఁడే
యీవల నావల నిహపరములలో నిన్నిటిబంధువుఁ డితఁడొకఁడే
దైవము దానని శరణనియెడు నను దగ్గరికాచెను యితఁడొకఁడే
శ్రీవేంకటగిరి నాయకుఁ డితఁడే చేరి భజించుము జీవాత్మా॥ ఇతర ॥ 399

తెలుఁగుఁగాంబోది

తెగఁగోయుటకు హరి దివ్యనామకీర్తనము
వెగటునాయుధ మిది విడువకుమీ మనసా ॥ పల్లవి ॥

భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి
యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే
తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని
కవగూడఁ దవిలెను కామపాశములు ॥ తెగ ॥

---

[1] వ్రిద్దైన రేకు

పమ్మి లోకపురుణానుబంధపు జీవికి
యిమ్ముల సంసారబంధా లివియుఁ గొన్నే
కమ్మరఁ బుణ్యపాపకలుషబంధాలు గొన్ని
సమ్మతించ భోగములే సకలబంధములు ॥ తెగ ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె
భావించి కొలిచిన పాయును మాయలన్ని
దేవుఁ డితనినమ్మిన తీరుఁబో దుఃఖములు ॥ తెగ ॥ 400

## గుండక్రియ

హరి నీకే శరణని గెలుచుటగాక
యిరవుగ నెరఁగఁగ నెవ్వరితరము ॥ పల్లవి ॥

తనువికారములు తరవులు వెట్టిన
కొనయెరుకైనా కొరతవడు
మనసువికారము మమతలఁ దగిలిన
యెనసి యెదురుపడ నెవ్వరితరము ॥ హరి ॥

కంతువికారము కన్నులఁగప్పిన
పంతపు విరతియు బయలౌను
చింతాలహరులు చీఁదర రేఁగిన
యింతయు వీడ్కొనవె (నె?) వ్వరితరము ॥ హరి ॥

అతిగుణవికార మాసలఁ బెట్టిన
సతతయోగములు జడనుపడు
మతి శ్రీవేంకటపతి నిన్నుఁ గొలిచిన
యితరము దగ్గర నెవ్వరితరము ॥ హరి ॥ 401

## మాళవిగౌళ

నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీపాదమే గతి గలిగె ॥ పల్లవి ॥

చింతాజలధులఁ జిక్కిన దాఁటించ -
నంతట నీపాద మదె తేప
కాంతలమోహపుకట్లు దెంచఁగ
పంతపునీపాదపరశువు గలిగె ॥ నారా ॥

అతిదురితపంక మందినఁ గడుగఁగ
మితి నీపాదమే మిన్నేరు
రతిఁ గర్మజ్ఞులు (ర్మాగుమ్మలు?) రాఁజిన నార్పఁగ
వ్రతము నీపాదమే [1]వానయై నిలిచె ॥ నారా ॥

జిగినజ్ఞానపుచీఁకటి వాయఁగ
తగు నీపాదముదయపు రవి
నగు శ్రీవేంకటనాథ నన్నేలఁగ
[2]మిగులఁగ నీపాదమే శరణంబు ॥ నారా ॥ 402

## మలహరి

శరణంబితఁడే సకలము నాకును
వెరవున మనసా వెతకవో యితని ॥ పల్లవి ॥

అభయం బొసఁగేటియతఁ డెవ్వఁడు మును
యిభరక్షకుఁడతఁ డెవ్వఁడు
వుభయవిభూతుల కొడయం డెవ్వఁడు
ప్రభు వతఁడే నాపాలిదేవుఁడు ॥ శరణం ॥

---

౧ 'వాననై' రేకు ౨ మిగలఁగ' రేకు

శరణాగతులకు సరి దా పెవ్వఁడు
యిరువుగ శ్రీపతి యెవ్వఁడు
అరిదుష్టదైత్యహంతకుఁ డెవ్వఁడు
పరమును నతఁడే నాపాలిదేవుఁడు ॥ శరణం ॥

ఆదిశంఖచక్రాయుధుఁ డెవ్వఁడు
యేదెసఁ బూర్ణు డెవ్వఁడు
వేదమయుఁడు శ్రీవేంకటపతియై
పాదాయ నిదె నాపాలిదేవుఁడు ॥ శరణం ॥ **403**

**రేకు 369** **గుండక్రియ**

ఎఱఁగఁడు పరసుఖ మీశ్వర నీమాయ
నెఱివిచారముల నెగడినదాఁక ॥ పల్లవి ॥

అతిహేయములో నడరు వరాహము
అతిహేయము సుఖమని తలఁచు
మతి సంసారంబే మరగినయాతుమ
౧పతిలేని దిదే పరమని తెలియు ॥ ఎఱఁగ ॥

పారి విషయములోనఁ బొడమిన కీటము
అరిది విషము తీపని తినును
పరగ యోనిసంభవమగుదేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును ॥ ఎఱఁగ ॥

యింతేసి నిన్నియు నెరఁగిన యీయాతుమ
అంతరాత్మ నీవని తలఁచి
యింతట శ్రీవేంకటేశ్వర నిన్నే
రంతుల శరణనె రక్షించవే ॥ ఎఱఁగ ॥ **404**

---

౧ 'ప్రతి' శబ్ద భవము ౨ ఈ 'నీ' పూర్వముద్రణమున తొలగి పోయినది

## భూపాళం

ఇవియే పో ప్రద్యుమ్న యిహపరసాధనము
భవజలధులతేప పరమయోగులకు ॥ పల్లవి ॥

వామన గోవింద విష్ణు వాసుదేవ హరి కృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా
నీమహిమ గానలేము నిన్నెంచఁగలేము ॰నీ -
నామజపమే చాలు నాలుక (కు) సులభము ॥ ఇవి ॥

అనిరుద్ధ పురుషోత్తమాధోక్షజ ఉపేంద్ర
జనార్దన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగ లేము నిన్నుఁ దెలియఁగ లేము
నునుపై నీనామమే నోటికి సులభము ॥ ఇవి ॥

నారాయణ పద్మనాభ హృషీకేశ
నారసింహ మధుసూదన త్రివిక్రమ
నీరూపు భావించలేము నిక్కపు శ్రీవేంకటేశ
ఆరయ నీనామజప మన్నిటా సులభము ॥ ఇవి ॥ 405

## లలిత

కన్ను లెదుటిదే ఘనవైకుంఠము
వెన్నుని గొలిచిన విజ్ఞానికిని ॥ పల్లవి ॥

తలఁచినదెల్లాఁదత్వరహస్యమే
తెలిసిన యోగికి దినదినము
పలికినవెల్లా పరమమంత్రములె
ఫలియించినహరిభక్తునికి ॥ కన్ను ॥

పట్టినదెల్లా బ్రహ్మాత్మకమే
పుట్టుగుగెలిచినపుణ్యునికి
మెట్టినదెల్లా మిన్నేటినిధులే
అట్టడితెగువమెఱయువానికిని ॥ కన్ను ॥

వినినవియల్లా వేదాంతములే
ఘనుఁడగుశరణాగతునికిని
యెనసిన శ్రీవేంకటేశుఁడే యింతా
కొనకెక్కిననిజకోవిదునికిని ॥ కన్ను ॥ 406

## సామంతం

బాపు బాపు దేవుఁడా పంతపు వోమనసా
వోపెఁగా యిందుకు జీవుఁ డోహో నామాయ ॥ పల్లవి ॥

విన్నటిదినము నేఁడు నిజమో కల్లో
కన్నులఁ గన్నట్లాయఁ గానఁగరాదు
యెన్నఁగ రేపటిదిన మేమో యెట్లో
వున్నట్టు దెలియఁగరాదు వోహో నీమాయ ॥ బాపు ॥

బాలనాఁటి పుట్టుగిది భ్రమయో నిజమో
గాలినె కాలముఁ బోయ కతలాయను
యీలీల మీఁదిమరణ మేమో యెట్టో
వోలిఁ దెలియఁగరాదు వోహో నీమాయ ॥ బాపు ॥

నెక్కుఁ (క్కొ?)న మింగినకడి నిజమో కల్లో
గక్కున రుచియుఁ దోఁచె కానఁగరాదు
యెక్కువ శ్రీవేంకటేశ యిన్నియు నీదాసుఁడైతే
వొక్కటఁ గానఁగవచ్చు నోహో నీమాయ ॥ బాపు ॥ 407

## గుండక్రియ

వెరగుతో మరచితే వెనక లేదు
కరివరదుఁడే తక్క గతియొండు లేఁడు ॥ పల్లవి ॥

ఆసవిడిచినఁగాని యధికసుఖము లేదు
యీసు విడిచినఁగాని యిహము లేదు
వాసి విడిచినఁగాని వైపగు విరతి లేదు
వాసుదేవభక్తిఁగాని వరముక్తి లేదు ॥ వెరగు ॥

చలము మానినఁగాని సాత్వికగుణము లేదు
పలుశంక వోకకాని ఫలము లేదు
సిలుగింద్రియాల గెలిచినఁగాని త్రోవ లేదు
జలజాక్షుచింతఁగాని సమబుద్ధిలేదు ॥ వెరగు ॥

దైవము కరుణనెకాని తగువిజ్ఞానము లేదు
భావించి చూచినఁగాని బలిమి లేదు
యీవల శ్రీవేంకటేశుఁ డితడె దైవ మితని
సేవించినంతఁగాని సిద్ధి మరి లేదు ॥ వెరగు ॥ **408**

## భైరవి

హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా ॥ పల్లవి ॥

నలినాక్షుని శ్రీ నామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలఁచవో తలఁచవో తలఁచవో మనసా ॥ హరి ॥

నగధరునామము నరకహరణము
జగదేకహితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా ॥ హరి ॥

కడఁగి శ్రీవేంకటపతినామము
బడిబడినే సంవత్కరము
అడియాలంబిల నతిసుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా ॥ హరి ॥ 409

**రేకు 370** **దేవగాంధారి**

ఇందుకు ధ్రువాదు లిటు సాక్షి
చెంది నమ్మవో జీవుఁడ నీవు ॥ పల్లవి ॥

కొండలవంటివి ఘోరపాపములు
ఖండించును హరిఘననామజపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడే పరమపదంబు ॥ ఇందు ॥

జలధులవంటివి జననబంధములు
తొలఁగించును హరితూరినభక్తిది
వెలిఁగించును ఘనవిజ్ఞానంబులు
చెలఁగించును బహుసిరిసంపదలు ॥ ఇందు ॥

తోవరాని బహుదుఃఖము లణఁచును
శ్రీవేంకటపతిఁజేరినశరణము
పావనంబుగాఁ బచరించు గుణము
కైవశమగు లోకములెల్లాను ॥ ఇందు ॥ 410

## భూపాళం

చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁ బ్రపంచముల
తక్కిన భోగములెల్లా దైవమే యెరుఁగు ॥ పల్లవి ॥

అంతరంగమునఁ దాను హరిఁ దలఁచినఁ జాలు
అంతటి మీఁదటి పనులాతఁ డెరుఁగు
పంతమున నాతనిపై భారము వేసినఁ జాలు
వింత వుద్యోగములు గోవిందుఁడే యెరుఁగు ॥ చిక్క ॥

చేకొని యాతనిరూపు సేవించినఁ జాలు
ఆకడి యాకడి కర్మాలాతఁ డెరుఁగు
తేఁకువ నచ్యుతభక్తి తిరమయ్యినఁ జాలు
దీకొని పరము చూప దేవుఁడే యెరుఁగు ॥ చిక్క ॥

సాధించి మాధవుని శరణుచొచ్చినఁ జాలు
ఆదియు నంత్యములెల్లా నాతఁ డెరుఁగు
పోదియై శ్రీవేంకటేశుఁ బూజించినఁ జాలు
పాదుకొని రక్షించఁ బరమాత్ముఁ డెరుఁగు ॥ చిక్క ॥ 411

## లలిత

మఱచితిమంటే మరిలేదు
తఱితోఁ దలఁచవో దైవపు (ము?) మనసా ॥ పల్లవి ॥

పుట్టుచు నున్నది పోవుచు నున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరినామము
గుట్టునఁ దలఁచవో గొనకొని మనసా ॥ మఱ ॥

పొద్దు వొడుచునదె పొద్దు గుంకునదె
తిర్దిన జగముల దినదినము
అద్దపునీడల యంతర్యామిని
వొద్దనె తలఁచెనొనరవొ (తలఁచవొ [1]వొనరవో?) మనసా॥మఱి॥

లోపల వెలుపల లోఁగొనివున్నది
శ్రీపతి మహిమల [2]స్పృష్టియిదే
యేపున శ్రీవేంకటేశ్వరుఁ డితఁడే
దాపని నమ్మిచుఁ దలఁచవో మనసా ॥ మఱి ॥ 412

## సామంతం

చెల్లె నీచేఁతలు నీకే చేరి మేడెగుడిదిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతరాయ ॥ పల్లవి ॥

జంగ చాఁచినట్టి నీసంగడి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁజేర్చినచేయి
అంగమాయ నీసొబగు హనుమంతరాయ ॥ చెల్లె ॥

పెరిగినవాలము పెద్దైన పిరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారు [3]కాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీవునికి హనుమంతరాయ ॥ చెల్లె ॥

స్వామికార్యపుఁజింత జానికి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామనామజపముతో రతి శ్రీ వేంకటపతి -
కా మేటిబంటవైతివి హనుమంతరాయ ॥ చెల్లె ॥ 413

---

౧ (తలఁచవో వొనరఁగ?) పూ ము పా ౨ 'స్రిష్టి' రేకు ౩ 'కాశ' రేకు

### లలిత

నేనై విడువవద్దు తానై తగులవద్దు
తానే తానై వుంటేఁ దగులెల్ల నూడు ॥ పల్లవి ॥

పొద్దు వొద్దు హరిఁ దలఁచునఁ చలపోయఁగ
వొద్దికైనపలుచేఁత లున్న వెల్లా మరచును
నిద్దిరించువానిచేతినిమ్మపంటివలెనే
బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును ॥ నేనై ॥

పలుమారు గురుసేవఁ బరగఁగా బరగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానముఁ బొడచూపు
కలగన్నవాఁడు మేలుకనిన కలవలెనే
పలుసంసారములెల్ల భావనలై యుండును ॥ నేనై ॥

పక్కన శ్రీవేంకటేశుపై భక్తి వొడమఁగా
అక్కజపు టిహపరా లరచేతివి యౌను
చొక్కపు పరుసమంటి సొంపుగానిలోహము
నిక్కఁ బైఁడైనట్టు నెరుసెల్లఁ దొలఁగును ॥ నేనై ॥ 414

### శంకరాభరణం

పరగీనదివో గద్దెపై [౧]సింహము వాఁడె
పరమైన యౌభళనారసింహము ॥ పల్లవి ॥

తెల్లనిమేనిసింహము దేవసింహము
మెల్లనిచిరునవ్వులమేఁటిసింహము
చల్లేటియూరుపులతో జయసింహము వాఁడె
బల్లిదుఁడై వెలసే యౌభళనారసింహము ॥ పరగీ ॥

---

౧ సింహ్వము రేకు

నిలుచున్నసింహము నిత్యసింహము
అలరుఁ గొండలమీఁదియాదిసింహము
వెలుపలి కడపపై వీరసింహము
పలుకుఁ బంతము (ల) యౌభళనారసింహము ॥ పరగీ ॥

పుట్టుజడలసింహము పూర్ణసింహము
అట్టడి యార్పులయాఅడిసింహము
జట్టిగొన్నదాసులకు శాంతసింహము
పట్టపు శ్రీవేంకటయౌభళనారసింహము ॥ పరగీ ॥ 415

రేకు 371 బౌళి

అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
తడతాఁకులతాపత్రయము మానుపుటకు ॥ పల్లవి ॥

శరణు శరణు వోసర్వేశ్వర నీకు
మరణభయములెల్ల మానుపుటకొఱకు
మొరయె మొరయె నీకు ముకుంద మాధవ
దురితములిన్నియుఁ దొలఁగించుటకు ॥ అడియ ॥

దండము దండము నీకు దైవశిఖామణి
పండియుఁ బండని మతి పాకముసేయు కొరకు
అండనే దాస్యము దాస్యము నీకు నేనైతి
నిండు నీకరుణ నాపై నించేటి కొరకు॥ అడియ ॥

అభయ మభయమ్ము శ్రీయాదినారాయణ
వుభయకర్మము నాకు నూడుచుట కొరకు
విభుఁడ శ్రీవేంకటేశ వినుతిసేసెద నిన్ను
శుభములన్నియు మాకుఁ జూపేటి కొరకు ॥ అడియ ॥ 416

## గుండక్రియ

నీచమైననావల్ల నెరవై దైవమా
చీ చీ యిన్నివిధులఁ జిక్కువడె బదుకు ॥ పల్లవి ॥

యెదుటివేమైనఁ గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమటపడుఁ దాను
కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంక తుంగ విధమాయ మనసు ॥ నీచ ॥

యెక్కడికైన నేఁగు నెరఁగక తనువు
అక్కడ దుర్లభమైతే నంతలో వేసారు
దక్కి యందే సుఖమైతేఁ దానే విఱ్ఱవీఁగు
గక్కున రొంపిలోని కంభమాయఁ దనువు ॥ నీచ ॥

యెందుకైన సమ్మతించు నిరవైన జీవుఁడు
చెందిన పసిఁడికి చెలులకే మత్తుఁడౌను
కందువ శ్రీవేంకటేశ కరుణించవయ్య యింక
పొంది పూటచెలమాయఁ బుట్టుగుల సివము ॥ నీచ ॥ 4

## లలిత

హరి నీమయమే అంతాను
అరసి నీకు శరణనియెద [1]నేను ॥ పల్లవి ॥

యెదుట నెవ్వరిఁక నేమాటాడిన
అది నీ ఘననామాంకితమే
అదివో సకలశబ్దాఖ్యుఁడవని నిన్ను
పొదలి చదువులు పొగడీఁగాన ॥ హరి ॥

---

౧ ఈ నే పూర్వముద్రణమున తప్పినది

యెవ్వరిఁ బొడగని యెక్కడనుండిన
నివ్వటిల్ల నది నీరూపే
నెవ్వదీర నిదె నిను విశ్వరూపుఁ
డెవ్వల నని శ్రుతులెంచీఁ గాన ॥ హరి ॥

భావన యిది నీ బ్రహ్మాత్మకమే
శ్రీవేంకటేశ నాచింత యిదే
ఆవల నిను ౧సర్వాంతర్యామని
దేవ శాస్త్రములు తెలిపీఁ గాన ॥ హరి ॥ **418**

## బౌళిరామక్రియ

కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁ బాడెద నేను ॥ పల్లవి ॥

నీపాదతీర్థము నీరజభవుని
పైపై కమండలపానీయము
చేపట్టి శంభుని చిరుజడలలో
దీపించుగంగాతీర్థరాజము ॥ కలిగె ॥

ఘన నీ నామమె గౌరినాలికపై
పనిగొన్న మంత్రపారము
అనుఁగువాణికి నాదిచదువులఁ
బెనఁచే మొదలి బీజాక్షరము ॥ కలిగె ॥

శ్రీవేంకటేశ్వర చేరి నీదాసుల
సేవ నాపాలిఁటి జీవనము
ఆవిటించి శరణాగతులకును
త్రోవయైన దిదె దోషహరము ॥ కలిగె ॥ **419**

---

౧ 'సర్వాంతర్యామి+అని' ఈ సంపు లిపివాఙ్మయమున కొల్లలు 'సర్వాంతర్యామిని' పూ ము పా

## కన్నడగౌళ

౧ధరలోను జనహితము నానా భక్తరక్షణము నడపఁ గదయ్యా
॥ పల్లవి

హరీ నీకు నాగపాశబంధనమది నీమహిమకు నటు వెలితా
తరవాతను రావణాది యసురల తలలు నరకుట ప్రతాపముగాదా
॥ ధర

మును నీపై నొక భూతము నడచిన మొగి నీమహిమకు నది వెలిత
ఘనహుంకారము మాత్రమున డచినందు నే కడకుఁ దరముట
ప్రతాపముగాదా ॥ ధర

కలియుగమున శ్రీవేంకటగిరిపైఁ గదిసిన నీమహిమకు వెలితా
కలిమల మథనుఁడ కల్క్యవతారము గయికొనుటచటఁ బ్రతాపము
గాదా ॥ ధర ॥ 42।

## దేవగాంధారి

హరి నీకే నే రుణ మత్తుఁగాక తగవైతే
వొరిమ నొకరియ్యఁగ నొకరికి దిద్దుటా ॥ పల్లవి ॥

మొలచు జననలోకమునకు నుదుట వ్రాసే
బలుఁడ నీచే నేఁ బత్రసాల మందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు రుణము
యిల నత్తునట యివి యేనాటి రుణము ॥ హరి ॥

యేయెడ నేమిసేసి యేలోకమందున్నా
పాయని నీవే నాకు ప్రాణబంధుఁడవైతి

---

౧ ఇందు పల్లవి ఒకపాదముగను చరణములు రెండు పాదములు గలవిగను గుర్తింపవలసియున్న

కాయపుఁ జుట్టరికాలు ఘన కరుణానుబంధ
మీయెడఁ గలిగెనట యేనాటి రుణము ॥ హరి ॥

శ్రీవేంకటేశ [1]నీవి చిక్కులఁబెట్టి నాకు
కావిరిఁ గర్మాలు మెడఁ గట్టితివిగా
సోవల నీశరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాఁటి రుణము ॥ హరి ॥ 421

రేకు 372 శ్రీరాగం

విన్నప మిదే నీకు వేవేలు విధముల
నన్నుఁ గావవే హరి నమో నమో ॥ పల్లవి ॥

నీగుణము నేనెరిఁగి నిన్నుఁ గొలువనేర
నాగుణము నీవెరిఁగి నన్ను నేలుకొనవయ్య
సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
నాగశయనుఁడ హరి నమో నమో ॥ విన్నప ॥

నీవున్నచో టెరిఁగి నిన్నుఁ దలఁచనేర
నావున్నచో టెరుఁగుదు నన్ను నీవు దలఁచవే
కోవిదుఁడ నారఁ బేరుకొన్నవానిఁ గాచినట్టు
నావాఁడయ హరిహరి నమో నమో ॥ విన్నప ॥

మనసులో నున్న నిన్ను మరవకుండ నేర
మనసులోని నీవే నామరపు దెలుపవయ్య
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీవేంకటేశ నమో నమో విన్నప ॥ 422

---

౧ నివి (నీవె?)' పూ ము పా

## సామంతం

ఇన్నివిధాలు యిఁకనేల ప్ర -
పన్నుఁడై మీఁద బహువిధులేలా ॥ పల్లవి ॥

సతతభూతదయ సత్యవాక్యము గలితే
కుతిలపు ధర్మాలగొడవలేలా
ప్రతిలేనివిజ్ఞానభావశుద్ధి గలిగితే
మతకపుఁ గర్మాలు మరియేలా ॥ ఇన్ని ॥

పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను
సందడిలోఁ దీర్థాచరణలేలా
నిందమాని యాసమాని నిర్మలచిత్తులయితే
వందడైనవుపవాసవ్రతము లేలా ॥ ఇన్ని ॥

శ్రీవేంకటపతి చింతనము గలిగితే
పావనపు శాస్త్రాల పరనలేలా
ఆవల నీతని దాసులందుఁ బ్రేమ గలిగితే
కావరపుటితర సంగతులేలా ॥ ఇన్ని ॥ ‘

## లలిత

తథాకురుష్వ ముదా మామద్యేవ
అధోక్షజస్తే అనుదాసోహం ॥ పల్లవి ॥

తవాస్మి శరణం దహరాహం
భవదురితాని భంజ మమ
భువి కృతం చ యా పురా ప్రతిజ్ఞాం
జవన దదామి సర్వేభ్య ఇతి ॥ తథా ॥

వ్రజామి శరణం వరద తవాహం
త్యజితానుబంధ దర్మ మమ
భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యామీతి ॥ తధా ॥

చింతితం మయా శ్రీవేంకటేశ
కింతు త్వం మయి [1]కృపాంకురు
[illegible]చుహి పురాకృతం ప్రతిజ్ఞాం
అంతగతిం నయామీతి మహి ॥ తధా ॥--424

## భూపాళం

నీనామమే మాకు నిధియు నిధానము
నీనామమె యాత్మనిధానాంజనము ॥ పల్లవి ॥

నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదన
నమో త్రివిక్రమ నమో వామనా ॥ నీనా ॥

నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ◆
నమో ప్రద్యుమ్నతే నమో యనిరుద్ధా ॥ నీనా ॥

---

౧ క్రిపాం' రేకు

☩ ఈ సంస్కృత సంకీర్తన రేకులో నున్నట్లు ఎత్తి ముద్రింపఁబడినది కొన్నిచోట్ల సవరణ సాధ్యమైనను పలుచోట్ల అట్లు చేయ వీలు కాలేదు అక్షరములు మాత్రము కాక పదములే అందందు లోపించినవని యూహింపవలసి యున్నది

◆'నమో వాసుదేవ నమో సంకర్షణ అని యుండవలయును ఇప్పటి పాఠమున ప్రసిద్ధనామావళి క్రమము తప్పినది మరియు ౨౩-వ 'హరి' నామమున కింది చోటు లేదాయెను అది 'శ్రీ వేంకటేశ' అను ముద్రానామమున అంతర్హితమైనది లేదా 'హరి వేంకటేశ' అని పాఠము కాఁబోలును

నమో పురుషోత్తమ నమో యధోక్షజ
నమో నారసింహ నమోస్తు యచ్యుత
నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర
నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణా ॥ నీనా ॥ 425

## రామక్రియ

ఎంతలేదు చిత్తమా యీఁతలేల మోఁతలేల
వంతులకుఁ బారనేల వగరించనేలా ॥ పల్లవి ॥

దక్కనివి గోరనేల తట్టుముట్టు పడనేల
చిక్కినంతకే సంతసించరాదా
ఒక్కమాఁటే వుప్పుదిని వుపతాప మందనేల
చక్కజాడఁ దగినంతే చవిగొనరాదా ॥ ఎంత ॥

పారి పారి వేఁడనేల బడలిక పడనేల
మీరి దైవమిచ్చినంతే మెచ్చరాదా
వీరిడై పొడవెక్కి విరుగఁబడఁగనేల
చేరి [1]యందినంతకే చేచాఁచరాదా ॥ ఎంత ॥

జీవులఁ గొలువనేల సిలుగులఁ బడనేల
శ్రీవేంకటేశుఁ డాత్మఁ జిక్కివుండఁగా
[2]దావతి పడఁగనేల దప్పులం బొరలనేల
కైవశమైనందుకే గతిగూడరాదా ॥ ఎంత ॥ 426

## వరాళి

శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే
దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే ॥ పల్లవి ॥

---

౧ 'యుండి' ౨ 'దాపతి' రేకు పూ ము పా

పదునాలుగేండ్లను బాసి నీ కెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి
కదిసి నీశరణంటే కరిరాజునెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి ॥ శ్రీప ॥

ప్రక్కన నహల్య శాపవిమోచనముగాఁగ
అక్కరతోడుతను బ్రత్యక్షమైతివి
చక్కఁగాఁ దపముసేసేశబరియెదుట నీవు
అక్కడ నాఁ డందునుఁ బ్రత్యక్షమైతివి ॥ శ్రీప ॥

భావించినట్టు మతిఁ బరమయోగులకెల్ల
తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి
శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు
దైవమువై యిప్పుడే ప్రత్యక్షమైతివి ॥ శ్రీప ॥ 427

రేకు 373 రామక్రియ

తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ ॥ పల్లవి ॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలులరొదలు ఆకాశమె ట్టోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమ ॥ తతి ॥

[1]అంగలాచేకామినులయంగభంగపుదోఁపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టుచూచెనో
పొంగు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయఁ గలికాలమహిమ ॥ తతి ॥

---

౧ అంగలార్చే' కావచ్చు

అరుదు గోహత్యలు సేయఁగ దూడ°లంగలావ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధనచూర కెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాలమహిమ ॥ తతి ॥

దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలేరాజులకు దయ గొంత వుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలికాలమహిమ ॥ తతి ॥

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలే కలికాలమహిమ ॥ తతి ॥

వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దుఃఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుఁబాపాలు నిండెఁ గలికాలమహిమ ॥ తతి ॥

తలలువ ట్టీడువఁగా తల్లులు బిడ్డలవేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కలుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ ॥ తతి ॥

దీనత లోఁబడి గుండెదిగు లసురుసురులు
వానినెట్లు లోఁగొ (నె) నో వాయుదేవుఁడు

---

౧ 'లంగలార్వ కావచ్చు

గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ ॥ తతి ॥

పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ ॥ తతి ॥ 428

## లలిత

నీవు నాసొమ్మవు నేను నీసొమ్ము
యీవల నీవెపుడు మాయింటనుండఁ దగవా ॥ పల్లవి ॥

హరి నీరూపము నాకు నాచార్యుఁడు మున్నె
కెరలి నాపాల నప్పగించినాఁడు
నరహరి నిను నే నన్యాయమునఁ దెలియను
పారఁబడి నీ కెందుఁ బోఁదగునా ॥ నీవు ॥

జనని నీదేవి లక్ష్మి జనకుఁడవు నీవె
తనువులు నాత్మబాంధవము నీవే
అనయము నేనెంత యపరాధినైనాను
పనివడి నీవు నన్నుఁ బాయఁదగునా ॥ నీవు ॥

బహువేదములు నిన్ను భక్తవత్సలుఁడవని
సహజబిరుదు భువిఁ జాటీని
యిహమునఁ శ్రీవేంకటేశ యిది దలఁచైన
విహితమై నాకడకు విచ్చేయవే ॥ నీవు ॥ 429

## బౌళి

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మాకిటునలె
పొంది యీతనిఁ బూజించఁ బొద్దాయనిపుడు ॥ పల్లవి ॥

ధారుణి మైరావణు దండించి రాముఁదెచ్చి
నేరుపుమించిన యంజనీతనయా
ఘోరనాగపాశములఁ గొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా ॥ ఇంది ॥

నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పానిపట్టి చూపినట్టి [1]ప్రహ్లాదుఁడా
మానవుఁడై (డొ) కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండినుంచుకొన్న పోటుబంట యర్జునా ॥ ఇంది ॥
శ్రీ వల్లభునకు నశేషకైంకర్యముల
శ్రీవేంకటాద్రివైన శేషమూరితీ
కైవసమైనయట్టికార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే ॥ ఇంది ॥

తోడి

స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే -
నతికమై యాడినట్లు ఆడఁబోయేవా ॥ పల్లవి ॥

యెంత నీమనసునను యెట్టుండె నట్లనే
అంతయుఁ జేయవయ్య మాకదే చాలు
అంతకంటే నెక్కుడు నేమంటిమివో యటమీఁదఁ
జెంతల మా చెప్పినట్టు సేయఁబోయేవా ॥ స్వతం

కమ్మి నీవు మునుప సంకల్పించినట్లనే
కిమ్ములను నారీతిఁ జిత్తగించవయ్య
అమ్మరో నేమందుకుఁ గాదనినను నీవు
సమ్మతించి మాతలఁపు సాగనిచ్చేవా ॥ స్వతం

---

౧ ప్రంహ్లాదుఁడా రేకు

పొంచీదేహమున మమ్ముఁ బుట్టించినట్లనే
పెంచి నీపై భక్తిమాకుఁ బెనచవయ్యా
నించిన శ్రీవేంకటేశ నేనే పదరితిఁగాక
మంచితనములు నీవు మానఁబోయేవా ॥ స్వతం ॥ 431

రేకు 374 సామంతం

వెనక ముందరికిఁ బెద్దలకెల్లను వివరపుసమ్మతి యీ నెరవు
వెనుకొని తనగురునాథుని యనుమతి వేదోక్తంబగు నీ తెరువు ॥ పల్లవి ॥

కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొకతెరువు
వనితల భ్రమలను వలలఁ దగులని మది వైకుంఠమునకు నొకతెరువు
మునుకోపముఁ బెడఁబాసిన మతి మోక్షంబునకును నొకతెరువు
యెనసి యిందుపై హరిఁదలఁచిన మతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు ॥వెన॥

నిరతి విషయముల నణఁచిన దృఢమతి నిశ్శ్రేయసమున కొకతెరువు
విరతితోడ నెలవై నమతి విభవపుఁ బరమున కొకతెరువు
వెరపున నిందరిమీఁదటిసమమతి విష్ణులోకమున కొకతెరువు
యిరవెరిఁ గంతట హరి నమ్మినమతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు ॥వెన॥

పన్నినకోరిక తెగఁగోసినమతి పరమపదమునకు నొకతెరువు
వున్న విచారములుడిగించినమతి వున్నతపదమున కొకతెరువు
సన్నుతి భగవద్దాసుల దాస్యమె చలమతి ముక్తికి నొకతెరువు
యిన్నిట శ్రీవేంకటపతిశరణమె హితమతి నెక్కుడు యీ తెరువు ॥వెన ॥432

గుజ్జరి

కూడుదు రూరకె వొకచో గుమి విత్తురు వేరొకచో
యేడకొ తెరువులు నడతురు యేఁటిదో హరిమాయ ॥ పల్లవి ॥

కొందరు జీవులు పురుషులు కొందరు (జీవులు) కాంతలు
కొందరు గొందరు నానాకువలయజంతువులు
యిందరుఁగూడుక భువిలో నేమోయేమో చేసెద -
రెందును నేమియుఁ గానరు యిట్టిది హరిమాయ ॥ కూడు ॥

జననంబులు మరణంబులు [౧]జమునుదయాస్తమయంబులు (?)
జనులివిగనుచునె కనకము సరినార్జింపుదురు
పొనుగుచు నిలిచినదేదో పోయినదేదో కానము
యెనగొని వెరగయ్యీనిదె యిట్టిది హరిమాయ ॥ కూడు ॥

జీవులకీ బ్రహ్మాండము చీమలపుట్ట విధంబున
కావరమిటు గిప్పున్నది కాలత్రయములను
తావుల శ్రీవేంకటపతి దాసులు చొరకిటు నవ్వఁగ
యీవల నావలఁ బొదిగీ నిట్టిది హరిమాయ ॥ కూడ ॥ ౪౨

## శోకవరాళి

నడవరో జడియక నవ్యమార్గ మిది
మడుఁగిది వైష్ణవమార్గ మిది ॥ పల్లవి ॥

ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది
జనకాదుల నిశ్చలమార్గ మిది
సనత్కుమారుఁడుజరపుమార్గ మిది
మనువుల వైష్ణవమార్గ మిది ॥ నడవ ॥

నలుగడవసిష్ఠు నడుచు మార్గమిది
యిల వేదవ్యాసులమార్గం బిది
బలిమిగలుగుధ్రువపట్టపుమార్గము
మలసినవైష్ణవమార్గ మిది ॥ నడవ ॥

౧ ఈ సమాసము పై జననమరణములలో వ్యత్యస్తముగ నన్వయింపవలయును జముని అస్తమయము జననములకు జముని ఉదయము మరణములకు కారణములుగా భావింపవచ్చు

పరమమార్గం బిదె ప్రపంచమార్గము
గురుమార్గం బిదె గోప్య మిదే
గరిమెల శ్రీవేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గ మిదే ॥ నడవ ॥ 434

**ముఖారి**

సమ్మతించి కనుకొండ సరుస నిశ్చలబుద్ధి
యెమ్మె నెంత బోధించినా నెక్కుడేల కలుగు ॥ పల్లవి ॥

తలఁపులో కొలఁది దైవము, తనవల్ల
గల విరతికొలఁది ఘనసుఖము,
తెలిసిన కొలఁదే త్త్వేటల విజ్ఞాన, మందు -
నెలమి నెవ్వరికైన నెక్కుడేల కలుగు ॥ సమ్మ ॥

తపము కొలఁదియే తరువాతి ఫలమును
వుపమ కొలఁదియే యోగమును
ప్రపత్తి కొలఁదియే భాగవతభక్తియును
యెపుడు నెవ్వరికైనా నెక్కుడేల కలుగు ॥ సమ్మ ॥

చెంది చేసినకొలఁదే శ్రీవేంకటేశుసేవ
అంది పొందినకొలఁదే యానందము
కందువనీతని కృపగలకొలఁదే యింతాను
యెందును దక్కినవారి కెక్కుడేల కలుగు ॥ సమ్మ ॥ 435

**బౌళి**

వెదకిన నిదియే వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు ॥ పల్లవి ॥

మునుకొని అవయవములు [1]యెన్నైనా
పనివడి శిరసే ప్రధానము
యెనలేని సురలు యెందరు గలిగిన
మునుపటిహరియే మూలంబు ॥ వెదకి ॥

మోవని యింద్రియములు యెన్నైనా
భావపుమనసే ప్రధానము
యీవల మతములు యెన్ని గలిగినా
మూవురలో హరి మూలంబు ॥ వెదకి ॥

యెరవగుగుణములు యెన్ని గలిగినా
పరమజ్ఞానము ప్రధానము
యిరవుగ శ్రీవేంకటేశ్వరునామమే
సరవి మంత్రముల సారంబు ॥ వెదకి ॥ 436

**రేకు 375** **బౌళి**

ఎప్పటిజీవుఁడే యెప్పటిజగమే యెంతగాలమును నీరీతే
కప్పుకవచ్చితి వనాదినుండియు కర్మమ యింకా వేసరవా ॥ పల్లవి ॥

మఱచితివా తొలుజన్మంబుల మరణకాలముల దుఃఖపుఁబాట్లు
మఱచితివా యమకింకరులయి మర్దించిన బహుతాడనలు
మఱచితివా నరకకూపముల మాఁటికి మాఁటికిఁ బరచిన బాధలు
మఱియును సుఖమని భవమే కోరెదు మనసా ముందర గానవుగా॥ఎప్పటి

తలఁచవుగా జననకాలమునఁ దనువిదియే యిటు పుట్టిన రోఁతలు
తలఁచవుగా బాల్యంబునఁ దల్లితండ్రుల శిక్షలు వ్యాధులును
తలఁచవుగా సంసారమునకును దైన్యంబున యాచించెటి యలమట
తలఁపుననిదియే వలెనని [2]హోమెదు తనువా యింకా రోయవుగా ॥ఎప్పటి

౧ 'యెన్నైన' రేకు ౨ 'హోమెదు' రేకు

ంటివిగా మలమూత్రాదుల కడుగఁగఁ దీరని దినదినగండము
ంటివిగా కనురెప్పలనే కాలముగడచేటికిడత్రోవ
టివిగా శ్రీవేంకటపతి కరుణచేత నీ వివేకభావము
ంటి యిటువలెనె సార్వకాలమును అంతరాత్మ నినుఁదలఁచగా ॥ఎప్పటి॥437

**లలిత**

అన్నిమంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశుమంత్రము ॥ పల్లవి ॥

నారదుండు జపియించె నారాయణమంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహమంత్రము
కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము
వేరె నాకుఁగలిగె వేంకటేశుమంత్రము ॥ అన్ని ॥

రంగగు వాసుదేవమంత్రము ధ్రువుఁడు జపించె
నంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకునబ్బె వేంకటేశుమంత్రము ॥ అన్ని ॥

యిన్ని మంత్రములకెల్ల యిందిరానాథుఁడే గురి
పన్నినదిదియే పరబ్రహ్మమంత్రము
నన్నుఁ గావఁ గలిగెఁబో నాకు గురుఁడియ్యఁగాను
వెన్నెలవంటిది శ్రీవేంకటేశు మంత్రము ॥ అన్ని ॥ 438

**వరాళి**

హరిఁ గొలిచినఁగాని ఆపద లణఁగవని
యెరఁగక పొరలితి మిందేమి నిజము ॥ పల్లవి ॥

పుట్టిన దేహమొకటి పొందినవికారాలఁ
బట్టెన జీవుఁడొకఁడు ప్రాణములేడు (ను?)
కట్టిడిచిత్తమొకటి కరణములైతేఁ బది
యిట్టిదివో మాజన్మ మిందే ి నిజము ॥ హరి ॥

మొదలి ప్రకృతొకటి ముంచినగుణాలు మూఁడు
కదియు మోహ మొకటి కర్మాలు పెక్కు
పొదలుఁగర్మ మొకటి భోగా లనంతములు
యిదివో మాజన్మ మెంచ మిందేది నిజము ॥ హరి ॥

అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁ డొక్కఁడే
చింతించ జీవులైతే సేనాసేన
అంతలో నీతని శరణని బ్రతికితిఁగాక
యెంతలేదు మాజన్మ మిందేది నిజము ॥ హరి ॥ 439

## ముఖారి

ఇదివో తెరమరఁ గిహపరములకును
వెదకి కన్నమీఁద విచారమేలా ॥ పల్లవి ॥

హరికుక్షిగతమే యఖిలలోకములెల్ల
నరకము స్వర్గమన్న నయమెంచనేలా
యిరవై యుండినచోనే యిటు హరిదాసుఁడైతే
పరమపదము నదే భ్రమయఁగనేలా ॥ ఇది ॥

అందిరిలోపల హరి యంతరాత్ముఁడై యుండ
యిందును నరసురలని యెంచఁగనేలా
అందిన మనసులో హరిభక్తి గలిగిన -
నందునే మోక్షము దప్ప దనుమానమేలా ॥ ఇది ॥

ఘటన శ్రీవేంకటేశుకల్పితమై జన్మములు
యిటు సుఖదుఃఖములు [౧]యెంచుకొంటేలా
సటలేక యాతని శరణము చొచ్చితేనే
పటుజీవన్ముక్తి యదే పలుమాటలేలా ॥ ఇది ॥ **440**

**దేశి**

హరి నీవే సర్వాత్మకుఁడవు
యిరవగు భావన యియ్యఁగదే ॥ పల్లవి ॥

చూడక మానవు చూచేటికన్నులు
యేడనేవైనా యితరములు
నీడల నింతా నీరూపములని
యీడువడని తెలి వియ్యఁగదే ॥ హరి ॥

పారక మానదు పాపపు మన సిది
యీరసములతో నెంధైనా
నీరజాక్షయిది నీమయమేయని
యీరీతుల తలఁ పియ్యఁ గదే ॥ హరి ॥

కలుగక మానవు కాయపుసుఖములు
యిలలోపలఁగల వెన్నైనా
అలరిన శ్రీవేంకటాధిప నీకే
యిలనర్పితమను యిహ మియ్యఁగదే ॥ హరి ॥ **441**

**రేకు 376** **లలిత**

అతఁడే యెరుఁగును మముఁబుట్టించినయంతరాత్మయగునీశ్వరుఁడు
అతికీ[౨]నతుకదు చిత్తశాంతి యిదె ఆత్మవిహారం బిఁక నేదో॥ పల్లవి ॥

---

౧ యెచ్చుకొందే (కొద్దే?)లా' పూ ష సారము ౨ నదుకదు' రేకు

కనుచున్నారము సూర్యచంద్రులకు ఘనవుదయాస్తమయములు
వినుచున్నారము తొల్లిటివారలవిశ్వములోపలికథలెల్లా
మనుచున్నారము నానాఁటికి మాయలసంసారములోన
తనిసీఁదనియము తెలిసీఁదెలియము తరువాతి పనులిఁక నేవో ॥అత॥

తిరిగెద మిదివో ఆసలనాసల దిక్కుల నర్థార్జన కొరకు
పొరలెద మిదివో పుణ్యపాపములభోగములందే మత్తులమై
పెరిగెద మిదివో ౦చచ్చెడి పుట్టెడి భీతిగలుగు దేహములోనే
విరసము లెరఁగము మరచీ మరవము వెనకటికాలవు విధియేదో ॥అత॥
అట్టెనారము హరినుతిచే నాఁడి (డిఁబోవక) గురువనుమతిని
పట్టినారమిదె భక్తిమార్గమిదె (మును?) బలువగు విశ్వాసముచేత
గట్టిగ శ్రీవేంకటపతి శరణని కంటి మిదివో మోక్షము తెరువు
ముట్టిముట్టము పట్టీపట్టము ముందటి కైంకర్యంబేదో ॥ అత॥ 442

## మాళవిగౌళ

ఇతఁడే యతఁడు గాఁబో లేలిక బంటును నైరి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు ॥ పల్లవి ॥

జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరకే దాఁటె హనుమంతుఁడు
అలుకతో రావణుని యద టణఁచె నతఁడు
తలఁచి మైరావణుని దండించె నితఁడు ॥ ఇత ॥

కొండ వెల్లగించెఁ దొల్లి గోవర్ధనుఁ డతఁడు
కొండతో సంజీవియెత్తెఁ గోరి యితఁడు
గుండు గరఁచె నహల్యకొరకు సీతాపతి
గుండు గరఁగఁగఁ బాడె కోరి యితఁడు ॥ ఇత ॥

౦ "చచ్చేటి, పుట్టేటి' అని రేకు

అంజనాచలముమీఁద నతఁడు శ్రీవేంకటేశుఁ
డంజనీతనయుఁ డాయ ననిలజుఁడు
కంజాప్తకులరామఘనుఁడు దానును దయా -
పుంజమాయ మంగాబుధి హనుమంతుఁడు ॥ ఇత ॥ 443

## సామంతం

మంగాంబుధి హనుమంతుని (తనీ?) శరణ
మంగవించితిమి హనుమంతా ॥ పల్లవి ॥

బాలార్కబింబము ఫలమనిపట్టిన
ఆలరిచేఁతలహనుమంతా
తూలనిబ్రహ్మాదులచే వరములు
వోలిఁజేకొనిన వో హనుమంతా ॥ మంగా ॥

జలధిదాఁట నీ సత్వము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమిఁ బెరిగితివి భళీ హనుమంతా ॥ మంగా ॥

పాతాళములోపలి మైరావణు -
నాతలఁ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి -
నీతలఁ గొలిచే హిత హనుమంతా ॥ మంగా ॥ 444

## శంకరాభరణం

కదిసి యాతఁడు మమ్ముఁగాచుఁగాక
అదె యాతనికె శరణంటే నంటి నేను ॥ పల్లవి ॥

యెవ్వని వుదరమున నిన్నిలోకములుండు
యెవ్వని పాదము మోచె నిల యలను
యెవ్వఁడు రక్షకుఁ డాయ నీ జంతుకోట్లకు
అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు ॥ కదిసి ॥

సభలో ద్రౌపదిఁగాచె సర్వేశుఁ డెవ్వఁడు
అభయహస్త మొసంఁగె నాతఁ డెవ్వఁడు
ఇభవరదుఁ డెవ్వఁడు యీతనికే వొడిగట్టి
అభినవముగ శరణంటే నంటి నిప్పుడు ॥ కదిసి ॥

శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు
అరిది యజునితండ్రి యాతఁ డెవ్వఁడు
యిరవై శ్రీవేంకటాద్రి యెక్కి నాతఁ డితఁడే
అరసి యితనికే శరణంటే నంటి నిప్పుడు ॥ కదిసి ॥ 445

## భైరవి

అనాదివిషయవిహారము గన ఆతుమ
అనేకమై పీఁగె నందుకే యీ యాతుమ ॥ పల్లవి ॥

అన్నిట కర్మపుఁబంక మంటిన దీయాతుమ
మున్ను కోపదుర్గంధములఁ బాఁగె నీ యాత్మ
పన్ని భవముల తుప్పు పట్టిన దీయాతుమ
యెన్నఁడు సుజ్ఞానమింక నెరిఁగీనో యాత్మ ॥ అనాది ॥

చెంచెలపుఁ దిప్ప పెంటఁ జివికిన దీయాత్మ
పంచలయాసల నురిఁబడిన దీయాత్మ
కంచపు భోగపుఁగాఁక గరివడీ నీయాత్మ
యెంచి విజ్ఞానమెన్నఁ డెరిఁగీనో యాత్మ ॥ అనాది ॥

యెలమితో శ్రీవేంకటేశుకృప నీయాత్మ
తెలిసి యించుకించుక తేటపడె నాత్మ
అలరి యాచార్యుని అధీనమైనాత్మ
మలసి యజ్ఞానమెట్టు మరచెనో యాత్మ ॥ అనాది ॥ 446

రేకు 377 లలిత

నిఖిలమింతయు మేలు నేనే తీలు
సుఖరక్షకుఁడ నన్ను మన్నించవే ॥ పల్లవి ॥

నిండును జలనిధులైనా నెటి నేటిమొత్తములచే
నిండదు నామనసైతే నిచ్చా యాసల
పండును లోకములోని బహువృక్షతతులైనాఁ
బండదు నామనసైతే బహువిషయముల ॥ నిఖిల ॥

తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి
తనియదు నామనసు ధనకాంక్షల
పొనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు
పొనిగి యేపొద్దు శాంతిఁబొందదు నామనసు ॥ నిఖిల ॥

లోకములోఁ గఠినపులోహమైనాఁ గరఁగును
కైకొని నామతి గరఁగదు భ్రమసి
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను
నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే ॥ నిఖిల ॥ 447

గుండక్రియ

సిబ్బితిపడఁగనేల చింతలఁ బొరలనేల
గొబ్బున మొదలినీరు కొనకెక్కదా ॥ పల్లవి ॥

నెలవై తత్వార్థము నే నెఱఁగకుండినాను
తలఁపులోపలివాఁడు తా నెఱుఁగుఁగా
¹అలసి దేహమున నే నశుచినై యుండినాను
యిల నాయంతరియామి యెప్పుడూ శుచేకా ॥ సిబ్బి ॥

తిరమై నేను దివ్యదేశముల నుండకున్న
ధర నాలోఁ బరమాత్మ తానుండుఁగా
నిరత గుణముల నే నీచుఁడనైనాను
అరయ నాపాలిహరి యధికుఁడేకా ॥ సిబ్బి ॥

వొగి నేఁ బరతంత్రుఁడనై వుండినాను నాలోన
తగిన స్వతంత్రుఁడు తాఁ గలఁడు గా
వెగ్గటై నే నుండినా శ్రీవేంకటేశుఁ డెదుటనే
వగలెల్లఁ దీర్చి కైవశమాయ గా ॥ సిబ్బి ॥ 4

## భైరవి

ఒక్కటికొక ఱివి యోగములు
యిక్కడ మాబుద్ధు లెక్కడఁ గొలుపు ॥ పల్లవి ॥

పాయపు (వు?) మతిలో బలువగునాసలు
కాయము భువిలోఁ గలదాఁకా
ఆయము సంసార మందుకు మూలము
యేయుపా (య) ములు యెక్కడఁ గొలుపు ॥ ఒక్క ॥

మానదు కోపము మతి చెంచెలమును
కాని కర్మ మిది గలదాఁకా
ఆనినమనసే యందుకు మూలము
యే నేరుపు లేక నెక్కడఁ గొలుపు ॥ ఒక్క ॥

౧ 'అలరి' వ్రా ము పా

అందదుమోక్షం బవ్వల నివ్వలఁ
గందువ నిను మతిఁ గనుదాఁకా
అందితి శ్రీవేంకటాధిప నీకృప
యెందలి మాయలు యెక్కడఁ గొలుపు ॥ ఒక్క ॥ 449

## గుజ్జరి

హరిహరి నిను సకలాంతర్యామివి (ని?) ఆత్మఁదలఁచుటే యోగంబు
శరణాగత రక్షామణి నిన్నే శరణని[1]యెడిదే తుదిపదము ॥ పల్లవి ॥

[illegible]దే యీ సచరాచరమును నీవే చరాచరమందు నిత్యమును
[illegible]చుక వుండుట గని తలపోయుట పరమార్థంబుల సారంబు
కాయమున జీవుఁడు నీయధీనమై కలుగఁగఁ బ్రకృతియుఁ[2]బురుషునిఁగానిటు
మాయల పొంతువు మాయకుఁ జొరవని మతిఁ దలపోయుట సుజ్ఞానంబు ॥హరి॥

తనలోఁ (పల) బరతత్త్వపు నీవును తా నీపరతత్త్వములోపలఁగా
మనసునఁ దలఁచుట వేదాంతంబులమంతనములసన్మార్గంబు
ఘనమునకును మరి ఘనమై యందే కడుసూక్ష్మమునకుఁ గడు సూక్ష్మంబై
యెనసిన పూఁపలోదార మవని యెన్నుటె పరమరహస్యంబు ॥హరి॥

ఆతుమలోపల ఘనవైకుంఠము ఆతుమ నీ వైకుంఠములోపల
యీతల నాతల సరిగాఁదెలియుట యిదియే బ్రహ్మానందంబు
శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నీ భజియించెద
దాతవు దైవమవై ననుఁగావుము తలఁచెద మిదియే తత్త్వంబు ॥ హరి ॥ 450

---

౧ 'శరననియడి రేకు ౨ బురుషుడుగా పూ ము పా

గౌళ

వలసిన వారికి వై పులివి
చలమున మానుటే జయమర్మం ॥ పల్లవి ॥

తనలోనే పో దైవము
ఘనమే యణువై కనినది
కనవలె నీతనిఁ గనుటకు
మనసు లయమౌటే మర్మం ॥ వలసి ॥

భావములోనే పరమము
తావై తలఁపే తగిలినది
కైవశమై యిది గలుగుటకు
కేవల శాంతం [1]కృతమర్మం ॥ వలసి ॥

హృదయములోనే యింతాను
తుదిపదమై మదిఁ దోఁచీని
యెదుటనే శ్రీవేంకటేశ్వరుని
కదిసి భజించుటే ఘనమర్మం ॥ వలసి ॥ 45

బౌళి

రామ మిందీవరశ్యామం పరాత్పర -
ధామం సురసార్వభౌమం భజే ॥ పల్లవి ॥

సీతావనితా సమేతం
పీత (స్ఫీత?) వానరబల వ్రాతం
పూతకౌసల్యాసంజాతం
వీత భీత మౌని [2]విద్యోతం ॥ రామ ॥

---

౧ 'క్రిత' ౨ 'విద్యేతం' రేకు

వీరం రణరంగధీరం
సార ధర్మకులోద్ధారం
క్రూరదానవ సంహారం
శూరాధారాచార [1]సుగుణోదారం ॥ రామ ॥

పావనం భక్త సేవనం
దైవిక విహగవధావనం
రావణానుజసంజీవనం[2]
శ్రీవేంకట పరిచితభావనం ॥ రామ ॥ 452

**రేకు 378** **ముఖారి**

పట్టినవ్రతము నీవే పరిపాలింతువుగాక
బట్టబయలింతే నేను బలిమున్నదా ॥ పల్లవి ॥

దేవ నీవు మనసు సోదించఁగా నే ధీరుఁడనై
ఆవలఁ జలించకుండేయంతవాఁడనా
పూవువంటిచిత్త మింతే పొల్లువంటికాయ మింతే
భావించ నిందులఁ బస వున్నదా ॥ పట్టిన ॥

అంతరాత్మవై నీవు యటు మరఁగులుసేయ -
నంతనె నిముఁ దెలిసే యంతవాఁడనా
గంతివంటిగుణ మింతే గాలివంటిప్రాణ మింతే
యింతరట్టుసేయ నిందు నెడమున్నదా ॥ పట్టిన ॥

మచ్చిక శ్రీవేంకటేశ మాట నీవై యుండఁగాను
అచ్చపునిన్ను నుతించే యంతవాఁడనా
గచ్చువంటియిహ మింతే గనివంటిపర మింతే
ముచ్చట కిందుకుఁ దుద మొద లున్నదా ॥ పట్టిన ॥ 453

౧ 'సుగుణాధారం' రేకు. ౨ 'సంజీవనం' రేకు

## పాడి

నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ
సరుగ నాశత్రుల సంహరించవే ॥ పల్లవి ॥

బావతిట్లకు శిశుపాలునిఁ జంపిన -
యేవకోపకాఁడవు నేఁ డెందు వోతివి
నీవాఁడనని నన్ను నిందించి (చే?) శత్రువును
చావఁగొట్టి వానినిట్టే సంహరించవే ॥ నర ॥

దాసుని భంగించేటి తరిఁ గన్యఁ (పుఁ) జంపిన
యీసుకోపకాఁడ విపు డెందువోతివి
మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే
౧సాసించి శత్రువును సంహరింపవే ॥ నర ॥

కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁజంపిన
యెల్లగాఁగఁ గోపకాఁడ వెందువోతివి
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీమీఁదిపాటలు
జల్లన దూషించుశత్రువు సంహరింపవే ॥ నర ॥ **454**

## వరాళి

ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి
హరిదాస్యం బదియే సుఖము ॥ పల్లవి ॥

వెతలఁబొరలేఘనవిభవముకంటే
అతిపేదరిక మది సుఖము
గతి నెరవుల సింగారముకంటెను
సతమగుతననిచ్చలమే సుఖము ॥ ఎరిగీ ॥

---

౧ 'శాసించి' కావచ్చు

పలుబాములఁబడు పగలిటికంటే
తెలిసి నిద్రించు రాతిరి సుఖము
అలమట గడించు నమృతముకంటే
కలపాటి తనకు గంజే సుఖము ॥ ఎరిగీ ॥

పరపీడలొసఁగు భవమునకంటే
ధరఁ బొడమనిచందము సుఖము
గరిమల శ్రీవేంకటపతి నీకే
శరణని¹యెడి నాజన్మమే సుఖము ॥ ఎరిగీ ॥ 455

బౌళి

పుట్టఁగా బుట్టిన నాభోగపుటాస
పట్టి యేమిగట్టుకొంటి బదుకవో యాసా ॥ పల్లవి ॥

వూరు దిప్పినట్టియాస వుగముదిప్పిన యాస
చేరవచ్చి దైన్యమందించిన యాస
భారపెట్టి దేహమెల్లా బడలించిన యాస
పారి మమ్మేఁచితి వింత బదుకవో యాసా ॥ పుట్ట ॥

నాలుకరుచుల యాస నాతులకాఁకల యాస
కాలకాసుకైన బొంకు గరపే యాస
వోలిఁ బుణ్యతపమెల్ల వొరులకమ్మించు నాస
పొలుమాలించితి వింక బదుకవో యాసా ॥పుట్ట॥

కిందుపరచేటి యాస గేలిసేయించేటి యాస
పొందియట్టే సంతసానఁ బొదిపే యాస
కందువ శ్రీవేంకటేశుఁ గని శరణంటి నేను
పందతనమొల్ల నింక బదుకవో యాసా ॥ పుట్ట ॥ 456

---

౧ 'యడి', రేకు

## సామంతం

ఆ రూపమునకే హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి ॥ పల్లవి ॥

ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు
°సోలి నగ్నియును సూర్యచంద్రులును
నీలోనుండఁగ నెరిఁ గనెఁ గిరీటి
మూలభూతివగుమూర్తివి గాన ॥ అరూ ॥

అనంతశిరసుల ననంతపదముల -
ననంతనయనము లనంతకరముల
ఘన నీరూపము గనుఁగొనెఁ గిరీటి
అనంతమూరితి వన్నిటఁ గాన ॥ ఆరూ ॥

జగము లిన్నియును సకల మున్నీంద్రులు -
నగు శ్రీవేంకటనాధుఁడ విన్నే
పొగడఁగఁ గిరీటి పొడగనె నీరూపు
అగణితమహిముఁడ వన్నిటఁగాన ॥ ఆరూ ॥ 457

## రామక్రియ

ఆంజనేయ యనిలజ హనుమంత నీ -
రంజకపుఁ జేఁతలు సురల కెంచవసమా ॥ పల్లవి ॥

తేరిమీఁద నీరూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు
కౌరవుల గెలిచె నంగరభూమిని
సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట
నీరోమములు గావా నిఖిలకారణము ॥ ఆంజ ॥

---

౦ 'సోలి నగ్నులును పూ ము పా

నీమూలమునఁగాదె నెలవై సుగ్రీవుఁడు
రాముని఼ గొలిచి కపిరాజాయను
రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ ఆంజ ॥

బలుదైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁగలిగితిగా
అల శ్రీవేంకటపతి యండనే మంగాఁబుధి -
నిలయపు హనుమంత నెగడితిగా ॥ ఆంజ ॥ 458

## రేకు 379 శంకరాభరణం

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష ॥ పల్లవి ॥

మొదల నింద్రుఁడు నీమోమునకెల్లా రక్ష
యిదె నీశిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీకన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదరని (నీ) మేనికెల్ల శ్రీరామరక్ష ॥ ఏల ॥

పిరుఁదు వాలమునకు బెడిదపుశక్తి రక్ష
గరుడఁడు నీకరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీమహిమకు శ్రీరామరక్ష ॥ ఏల ॥

వడి నీపాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీయాయువుకు శ్రీరామరక్ష ॥ ఏల ॥

నలువ నీగళ రక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీసంధులకు హరుఁడు రక్ష
పలు నీరోమములకు బహుదేవతలు రక్ష
చెలఁగు నీచేఁతలకు శ్రీరామరక్ష ॥ ఏల ॥

అంగపు నీతేజమున కగ్నిదేవుఁడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీసతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీ కేకాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష ॥ ఏల ॥ 459

బౌళి

ఎన్నఁడొకో సుజ్ఞానము యీ యాత్మకు
కన్ను లెదిటివి చూచి కాలము నిట్టాయను ॥ పల్లవి ॥

హేయములో సుఖము యెంగిలిలో సుఖము
కాయము నమ్మికదా కష్టపడెను
పాయములో చవులు పాపములో చవులు
మాయలు నమ్మికదా మనసూనిట్టాయను ॥ ఎన్నఁ ॥

కల్లలోనిబదుకు కాసువీసపుబదుకు
కల్లరి ప్రాణాలు నమ్మి కట్టుపడెను
యెల్లి నేఁటి తలఁపు యింద్రియాల తలఁపు
కొల్ల సంసారముఁగూడి గుణమునిట్టాయను ॥ ఎన్నఁ ॥

అంగడిఁబెట్టే సిరులు యలయింపులో సిరులు
దొంగజీవుఁడు యిట్లానే తొట్రుపడెను
అంగపు శ్రీవేంకటేశుఁ డంతలో మన్నించఁగాను
ముంగిలెల్లా మోక్షమాయ ముచ్చటే యిట్టాయెను ॥ ఎన్న ॥ 460

## లలిత

ఏమిటివాఁడఁ గాను యిఁకనేను నా -
సామపుఁ గర్మము నీకే సమర్పయామి ॥ పల్లవి ॥

తలఁపులోపలనున్న తత్త్వము (మా?) యిట్టె
వెలినుండే నాపాలి విష్ణుమూర్తీ
పలుకులోపలనుండే పరమాత్ముఁడా। నా
చలమరి మతి నీకే సమర్పయామి ॥ ఏమి ॥

పుట్టుగులిచ్చినయట్టి పురుషోత్తమా। తుద -
ముట్టించుమోక్షపుమురమర్దనా
గుట్టుతో నిహముచూపే గోవిందుఁడా। నా
జట్టి చైతన్యము నీకే సమర్పయామి ॥ ఏమి ॥

అరిదిభోగములిచ్చేయంతరాత్ముఁడా। నాకు
శరణమైనయట్టిసర్వేశ్వరా !
వెరసి నన్నేలిన శ్రీవేంకటేశుఁడా। నా
సరవులన్నియు నీకే సమర్పయామి ॥ ఏమి ॥ 461

## పాడి

ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవమౌనా (మైనాఁడు?)
యెక్కడా హనుమంతుని కెదురా లోకము ॥ పల్లవి ॥

ముందట నేలేపట్టమునకు బ్రహ్మయినాఁడు
అందరుదైత్యులఁ జంపి హరిపేరైనాఁడు
అంది రుద్రవీర్యము దానై హరుఁడైనాఁడు
యెందు నీ హనుమంతుని కెదురా లోకము ॥ ఒక్కఁ ॥

చుక్కలుమోవఁ బెరిగి సూర్యుఁడు దానైనాఁడు
చిక్కఁబాతాళము దూరి శేషుఁడైనాఁడు
గక్కన వాయుజుఁడై జగత్ప్రాణుఁడై నాఁడు
యెక్కువ హనుమంతుని కెదురా లోకము ॥ ఒక్కఁ ॥

జలధిఁ బుటమెగసి చంద్రుఁడు దానైనాఁడు
చెలఁగి మేరువుపొంత సింహమైనాఁడు
బలిమి శ్రీవేంకటేశుబంటై మంగాంబుధి -
నిల యీ హనుమంతుని కెదురా లోకము ॥ ఒక్కఁ॥ 462

## దేశాక్షి

ఏమరక తలఁచరో యిదే చాలు
కామించినవి [1]యెల్లఁ గక్కననే కలుగు ॥ పల్లవి ॥

దురితములెల్లఁ దీరు దుఃఖములెల్ల నణఁగు
హరియని వొకమాఁటు అన్నాఁజాలు
సురలు పూజింతురు సిరులెల్లఁ జేరును
[2]మరుగురునామ మటు పేరుకొన్నఁ జాలు ॥ ఏమ ॥

భవములిన్నియుఁ బాయు పరము నిహముఁజేరు
అవల నారాయణయన్నాఁ జాలు
భువియెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు
తవిలి గోవిందు నాత్మఁదలఁచినఁ జాలు ॥ ఏమ ॥

ఆనందము గలుగు నజ్ఞానమెల్లఁ బాయు
ఆనుక శ్రీవేంకటేశ యన్నాఁ జాలు
యీ నెపాన నారదాదు లిందరు నిందుకు సాక్షి
దానవారిమంత్రజపతపమే చాలు ॥ ఏమ ॥ 463

---

౧ యల్లాఁ రేకు
౨ "మరుగుయని' పూ ము పాఠము

రేకు 380 బౌళి

ఎందును బోరా దీసంసారము
కందువ నీమాయ గడవఁగవశమా ॥ పల్లవి ॥

కలిమే చిత్తవికారహేతు వేది
అలర లేమి దైన్యహేతువు
పలులంపటములు బంధహేతువులు
తలఁగిన నడవదు తనుపోషణము ॥ ఎందు ॥

మదవికార మిదె మహితయౌవనము
తుద వార్ధకమే దురంతము
యిదె యర్థార్జన యాతాయాతన
అదియు మానితే నాఁకలి ఘనము ॥ ఎందు ॥

యెన్ని గడియించే వెన్నిట ముంచే -
విన్నిట శ్రీవేంకటేశ్వరుఁడ
అన్నిట నంతర్యామివి నీవే
కన్ను దనియ నన్నుఁ గావఁగదే ॥ ఎందు ॥ **464**

దేవగాంధారి

వారిధిశయన వో వటపత్రపరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే ॥ పల్లవి ॥

ఘనయోగిహృదయపుకమలాలు వికసించె
వొనర విజ్ఞానసూర్యోదయమాయ
మును జీవపరమాత్మములజక్కవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే ॥ వారిధి ॥

కలుషములనేటిచీఁకట్లెల్లఁ బెడఁబాసె
నలువంక వేదకీరనాదము మ్రోసె
అలరి యితరధర్మాలనేటిచుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతిమోము చూడవే ॥ వారిధి ॥

కపటరాక్షసనేత్రకలుహారములు మోడ్చె
యిపుడే సుకర్మముల యెండలు గాసె
అపురూప శ్రీవేంకటాద్రీశ మేలుకొని
నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁ గావనవే ॥ వారధి ॥ 465

## శుద్ధవసంతం

చేకొన్న భక్తులపాలిచింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుఁడు ॥ పల్లవి ॥

వాఁడిగోళ్ళచేత వడి హిరణ్యునిఁ జంపి
వేడుకనెత్తురులెల్ల వెదచల్లుచు
పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె
మూఁడుమూర్తులకును మూలమీతఁడు ॥ చేకొన్న ॥

కొండమీఁదఁ గూచుండి కోప ముపసంహరించి
అండనున్నదేవతల కభయమిచ్చి
మెండుగ సులభుఁడై మెరయుచు నున్నవాఁడు
దండిజగములకెల్ల దైవ మీతఁడు ॥ చేకొన్న ॥

వేవేలుచేతులను వెస నాయుధాలు వట్టి
చేవమీరి ప్రతాపాన సిరులు మించి
యీవల నహోబలాన నిరవై యున్నవాఁడు
శ్రీవేంకటాద్రిమీఁది సిద్ధమూర్తి యీతఁడు ॥ చేకొన్న ॥466

## సామంతం

కలశాపురముకాడ కందువ సేసుకొని
౧అలరుచున్నవాఁడు హనుమంతరాయుఁడు ॥ పల్లవి ॥

సహజాన నొకజంగ చాఁచి సముద్రము దాఁటె
మహిమమీరఁగ హనుమంతురాయఁడు
యిహమున రాముబంటై యిప్పుడూ నున్నవాఁడు
అహరహరమును దొడ్డహనుమంతరాయఁడు ॥ కల ॥

నిండునిధానపులంక నిమిషాన నీరుసేసె
మండితమూరితి హనుమంతరాయఁడు
దండితో మగిడివచ్చి తగ సీతశిరోమణి
అండ రఘుపతి కిచ్చె హనుమంతరాయఁడు ॥ కల ॥

వదలనిప్రతాపాన వాయుదేవుసుతుఁడై
మదియించినాఁడు హనుమంతరాయఁడు
చెదరక యేపొద్దు శ్రీవేంకటేశువాకిట -
నదివో కాచుకున్నాఁడు హనుమంతరాయఁడు ॥ కల ॥ 467

## లలిత

౨వేవేలచందాలవాఁడు విరలేశుఁడు
భావించనలవిగాని పరమాత్ముఁ డితఁడు ॥ పల్లవి ॥

సతతము రుక్మిణీసత్యభామలనడుమ
రతికెక్కినసింగారరాయఁ డితఁడు
చతురత సనకాదిసంయమీంద్రులమతి
నతిశయిల్లేటిపరమానంద మితఁడు ॥ వేవేల ॥

౧ ఆలరుచున్నవాఁడు' పూ ము పా ౨ 'వేవేలు రేకు

దేవతల కెల్లాను దిక్కు దెసై వెలుఁగొంది
తావుకొన్న యట్టియాధార మీతఁడు
మూవంకగొల్లెతలు మున్ను సేసినతపము
కైవశమై ఫలించిన ఘనభాగ్య మితఁడు ॥ వేవేల ॥

వరముతో యశోద వసుదేవాదులకు
పరగిన కన్నులపండు గీతఁడు
సిరులుమించినయట్టి శ్రీవేంకటాద్రిమీఁది -
నిరతి దాసుల[1]పాలినిధాన మితఁడు ॥ వేవేల ॥ 468

## తోడి

సుగ్రీవనారసింహ సులభుఁడ వందరికి -
నగ్రేసరుఁడ నీ వవధారు దేవా ॥ పల్లవి ॥

సనకాదు లొకవంక జయవెట్టుచున్నారు
యొనసి సురలు చేతులెత్తి మొక్కేరు
మును లిరుమేలానుండి మునుకొని నుతించేరు
అనుపమాలంకార అవధారు దేవా ॥ సుగ్రీ ॥

గంగాదినదులెల్లఁ గడిగీ నీపాదములు
పొంగుచు సప్తరుషులు పూజించేరు
సంగతి వాయుదేఁడు సరినాలవట్టమిడీ
అంగజకోటిరూప యవధారు దేవా ॥ సుగ్రీ ॥

పరగ నారదాదులు పాడేరు [2]నీచరితలు
పరమయోగీంద్రులు భావించేరు
సిరులుమించినయట్టి శ్రీవేంకటాద్రిమీఁద -
నరుదుగ నున్నాఁడవు అవధారు దేవా ॥ సుగ్రీ ॥ 469

---

౧ 'పావి' రేకు ౨ 'చెరితలు' రేకు

౨ 381 మాళవి

అరుదీ కపీంద్రుని యధికప్రతాపము
సురలకు నరుల కీసుద్దు లెందుఁ గలవా ॥ పల్లవి ॥

వుదయాచలముమీఁది నొక్కజంగ చాఁచుకొని
వుదుటున నపరాద్రి నొక్కజంగ చాఁచుకొని
తుద సూర్యమండలముతోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివెఁ బెద్దహనుమంతుఁడు ॥ అరుదీ ॥

వొక్క మొలగంట చంద్రుఁ డొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్లఁ బెరిగెను పెద్దహనుమంతుఁడు ॥ అరుదీ ॥

పడికిలించినచేత బిరుదులపండ్లగొల
తడయక కుడిచేత దశదిక్కులం
జడియక శ్రీవేంకటేశ్వరునిమన్ననబంటు
బెడిదపు మహిమల పెద్దహనుమంతుఁడు ॥ అరుదీ ॥ 470

బౌళి

నమో నమో రఘుకులనాయక దివజవంద్య
నమో నమో శంకరనగజ (జా?) నుతా ॥ పల్లవి ॥

విహితధర్మపాలక వీరదశరథరామ
గహనవాసినీ తాటకామర్దన
అహల్యా శాపమోచన అసురకులభంజన
సహజవిశ్వామిత్రసవనరక్షకా ॥ నమో ॥

---

క్కులు పూ ము పా

హరకోదండహర సీతాంగనావల్లభ
ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణితనూజాది తరుచరపాలక
శరధిలంఘనకృత సౌమిత్రిసమేతా ॥ నమో ॥

బిరుద రావణశిరోభేదక విభీషణ -
వరద సాకేతపురవాస రాఘవ
నిరుపమ శ్రీవేంకటనిలయ విజనగర
పురవరవిహార పుండరీకాక్షా ॥ నమో ॥ 471

## సాళంగనాట

చిత్తా అవధారు జియ్యా పరా కెచ్చరికె
హత్తి కానుక లిచ్చేరు అదె రాజరాజులు ॥ పల్లవి ॥

రామ రఘుకులవీర రాజీవలోచన
కోమలశ్యామలవర్ణ కొలువువేళ
వామదేవాదిమునులు వారె, సుగ్రీవుఁడు వాఁడె
వేమారును వానరవీరులు మొక్కేరు ॥ చిత్తా ॥

దేవ సీతాసమేత ధీరలోకనాయక
భావించ నవధరించు పూఁజావేళ
పావని యల్లవాఁడె భల్లూకపతి వీఁడె
సేవించీని భరతునిఁ జేకొను శత్రుఘ్నుని ॥ చిత్తా ॥

శ్రీమదయోధ్యావిహార శ్రీవేంకటనివాస
సామజవాజిరథాలసందడివేళ
సౌమిత్రి యీవంక విభీషణుఁడు నావలివంక
నీమహిమలెల్లా మెచ్చి నీకు విన్నవించేరు ॥ చిత్తా ॥ 472

## గుజ్జరి

హేయ మేమీలేదు జగమింతా రుచికరమే
మాయావికార మిది మనసెట్టి రోసును ॥ పల్లవి ॥

కాయధారణము లింపు కాంతలభోగము లింపు
[1]ఆయతమై వారివారి యాహారా లింపు
సోఁయఁగపుఁ గన్నులను చూచేటివేఁడుక లింపు
[illegible]ము మన సొడఁబడి సమ్మతించితేను ॥ హేయ ॥

పలుకులెల్లా నింపు భావములెల్లా నింపు
వెలదేఁగి తమతమ చేఁత లింపు
జలనుల సంగతుల సహజము లవి యింపు
వొళిసి ఘమమనసు లొడఁబడితేను ॥ హేయ ॥

తగిన జన్మము లింపు తమచక్కఁదనా లింపు
జగతివారికి వారిజాతు లింపు
నిగిడి శ్రీవేంకటేశ నీమహిమలే యివి
వొగరులేక మనసొడఁబడి వుంటేను ॥ హేయ ॥ 473

## సామంతం

ఎందరివారమో నేము యెఱఁగ వసముగాదు
సందడివిష్ణునకే శరణుచొచ్చెదము ॥ పల్లవి ॥

తెర దీసినట్టుండు తెలిసితే జ్ఞానము
మరుగక మఱచితే మరఁగై తోఁచు
వురియై తగులుఁ గర్మ మూడిచితే నూడును
యిరవైన హరిమాయ లెలఇం పుచున్నవి ॥ ఎందరి ॥

---

౧ 'ఆయతమై' రేకు

కడుఁబుణ్యవశమై కాచుకుండు స్వర్గము
నడుమఁ బాపమూలము నరకము
తడవితే నంటును దాఁటేదే నేరుపు
యెడయ కచ్యుతు మాయ లెలఇంపుచున్నవి ॥ ఎందలి ॥

పట్టితేఁ దనమనసు పరమాత్మఁ గనిపించు
చుట్టుకొంటే బంధమై సూడు సాధించు
ఒట్టి శ్రీవేంకటేశ్వరుఁ డోపి మమ్మునేలెఁ గాని
ఇట్టె యాదేవునిమాయ లెలఇంచును ॥ ఎందలి ॥ 474

## ధన్నాసి

పరమవివేకులాల బంధువులాల
తెరదీసి మాకు నిది తెలుపరో ॥ పల్లవి ॥

యేడుజా౦నలమేనిలో నిందిరానాథుఁ డున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో
పూడిచి వున్నది మతిఁ బొందుగ వైకుంఠము
చూడరో ధ్యానముసేసి సోదించరో ॥ పరమ ॥

కొడిదెఁడుబయలిలో గోవిందునినెలవఁట
చిడిముడితో నిట్టే చేరి పట్టరో
అడఁచి దాఁచివున్నది అందే బ్రహ్మానందము
విడువరో యీ ముడియ వెలయఁ జేపట్టరో ॥ పరమ ॥

వూని నల్లెఁడు నాలికలో నుండు శ్రీవేంకటేశుఁ -
డానుకొని బత్తితోడ నటు నిల్పరో
నానఁబెట్టివున్నది నామకీర్తనములందు
తానకముగా నేపొద్దూఁ దలఁచుకోరో ॥ పరమ ॥ 475

౦ జానలు' రేకు

రేకు 382 సాళంగనాట

నీగురుతులు చూచుకో నీబిరుదు లెంచుకో
యీగతిని కలబంట నిఁకనన్నుఁ గావవే ॥ పల్లవి ॥

కానిలే నేనెంతకరినచిత్తుఁడనైన
నానొసల నివే పట్టెనామములు
మేను తోలునెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మిఁతులసిపూసలపేరులు ॥ నీగు ॥

భ్రమసి నేఁజేసినవి పాపకర్మములైనాను
జమళిభుజాల నివే శంఖచక్రాలు
అమరఁ దఱచుగా నే నాడేవి కల్లలైనా
తమిఁ బాడీ నాలిక నీతగు సంకీర్తనలు ॥ నీగు ॥

తలఁచితే నావోజ తామసగుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీవేంకటేశ అన్నిట నేదుష్టనైనా
తలకొనె నాయందు దాసరితనములు ॥ నీగు ॥ 476

మాళవి

చెప్పితే నాశ్చర్యము సేసినచేఁత లితఁడు
ముప్పిరి మనుజవేషమునఁ బుట్టె నీతఁడు ॥ పల్లవి ॥

రాముఁ డుదయించె దశరథునికిఁ దమ్ములతో
గామిడైనతాటకిని ఖండించెను
ఆముక యజ్ఞముగాచె హరునివిల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లియాడెను ॥ చెప్పి ॥

మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁ బట్టముగట్టెను ॥ చెప్పి ॥

సీతాదేవితో నయోధ్యసింహాసనంబెక్కె
పోతరించి కుశలవపుత్రులఁ గాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీవేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాఁచెను ॥ చెప్పి ॥ 477

## లలిత

ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్నుఁ గక్కసించనేఁటికి ॥ పల్లవి ॥

యిహపరములలో నీ వెందు నన్నుఁ బెట్టినాను
నిహితమై రెంటిలోనా నీవు గలవు
పహి కెక్క నేలినవాఁడెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువుకుత్తరువే బంటుకుము ॥ ఏదై ॥

పాపపుణ్యములలో నేపని నన్నుఁ జేయించినా
కాపాడి రెండు నీవు కల్పించినవే
యేపున మగఁడైనవా ఁడేమి సేయించినాను
దాపగుఁ బతివ్రతాధర్మమే యాలికిని ॥ ఏదై ॥

కల్లనిజములలో నొక్కటి నన్నునాడించినా
చెల్లించ రెంటికి నీవే శ్రీవేంకటేశా
తల్లిదండ్రులే బాస దగ నాడనేర్పినాను
తెల్లమిగ నాడేది తేకువే బిడ్డనికి ॥ ఏదై ॥ 478

## వరాళి

శ్రీసతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు
చేసే నా చేఁతలెల్లా నీ సేవలెసుమ్మీ ॥ పల్లవి ॥

ఆనుక జగద్రూపుఁడవని విన్నందురుగాని (న?)
నేనిట్టే చూచినవెల్లా నీరూపులే
నానాశబ్దవాచ్యుఁడ వెన్నఁగ నీ వటుగాన
వీనుల విన్నవల్లా నీ విష్ణుకధలే ॥ శ్రీస ॥

అట్టే విశ్వభుజుఁడవైతివి తొల్లే కనక
నెట్టన నారుచులెల్లా నీప్రసాదాలే
గుట్టుతో సర్వవ్యాపకుఁడవు నీ వటుగాన
ముట్టిన నాతనుభోగములు నీకే సెలవు ॥ శ్రీస ॥

ప్రక్కన జీవులకెల్ల ప్రాణమవు నీవేకాన
ముక్కున నాయాఘ్రాణములెల్లా నీవే
నెక్కొని శ్రీవేంకటేశ నీవే లోకకుటుంబివి
తక్కక నా సంసారధర్మమెల్లా నీవే ॥ శ్రీస ॥ 479

## లలిత

బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని
యెడయని చుట్టరికాలెవ్వరికీ లేవు ॥ పల్లవి ॥

వన్నె సతులరూపులు వారివద్దనే వుండఁగా
కన్నులఁజూచేవారికి కళరేఁగును
యెన్నిక వారిగుణాలు యెడమాటలాడఁగాను
విన్నవారికి నూరకే వేడుకలు పుట్టును ॥ బడి ॥

అంతా నింతాఁ గమ్మవిరు లంగళ్ళలో నుండఁగాను
సంతవార లూరకే వాసనగొందురు
బంతివారికంచాలలో పలురుచు లుండఁగాను
వింతవారలందుకుఁగా వెస నోరూరుదురు ॥ బడి ॥

వెరవిడి దేహాలు వేరేవేరే వుండఁగాను
సురతాన సోఁకితేనే చొక్కుదురు
ఇరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటికి సూత్రధారి
సరి నితని దాసులు జడియ రిందుకును ॥ బడి ॥ 480

## కన్నడగౌళ

వట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము
నెట్టుకొని వివేకింపనేరవలెఁగాని ॥ పల్లవి ॥

కట్టుకొంటే నెంతైనాఁ గలదు సంసారము
పట్టి చేసితేఁ గలవు పనులెన్నైనా
చుట్టుకొంటే నూరఁగలచుట్టరికముఁ గలదు
అట్టె మోక్షము గడించే దరు దింతేకాని ॥ వట్టి ॥

చేసేనంటేఁ గలవు సేనాసేన పనులు
లాసి తగిలించుకొంటే లంపటా లంటు
ఆసలు పెంచఁ జూచితే నంతకంతకుఁ బెరుగు
వేసిరి శాంతిఁబొందుటే వేడు కింతేఁకాని ॥ వట్టి ॥

పనిగొంటేఁ బెనుగొనుఁ బంచేంద్రియంబులు
వెనుకొంటేఁ జిమ్మిరేఁచు వేడుకలు
తనిసి శ్రీవేంకటేశు దసానుదాసుఁడై
కొనకెక్కఁగ నాతనిఁ గొలువవలెఁగాని ॥ వట్టి ॥ 481

రే 383 రామక్రియ

ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము
వేమరు నోపుణ్యులాల వినరో యీకతలు ॥ పల్లవి ॥

అనంతసూర్యతేజుఁడట కాంతి చెప్ప నెంత
దనుజాంతకుఁడట ప్రతాప మెంత
మనసిజగురుఁడట మరిచక్కఁదన మెంత
వనజజుఁగనినట్టివాఁడట ఘన తెంత ॥ ఏమ ॥

గంగాజనకుఁడట కడుఁ జెప్పే పుణ్య మెంత
చెంగట భూకాంతుఁడట సింగార మెంత
రంగగు లక్ష్మీశుఁడట రాజసము లెంచ నెంత
అంగవించు సర్వేశుఁడట సంప దెంత ॥ ఏమ ॥

మాయానాధుఁడట మహిమ వచించు టెంత
యేయెడఁ దా విష్ణుఁడట యిర వెంత
పాయక శ్రీవేంకటాద్రిపతియై వరములచ్చే
వేయిరూపులవాఁడట విస్తార మెంత ॥ ఏమ ॥ 482

గౌళ

తలఁచరో జనులు యీతని పుణ్యనామములు
సులభముననే సర్వశుభములు గలుగు ॥ పల్లవి ॥

హనుమంతుఁడు వాయుజుఁ డంజనాతనయుఁడు
వనధిలంఘనశీలవైభవుఁడు
దనుజాంతకుఁడు సంజీవనిశైలసాధకుఁడు
ఘనుఁడు కలశాపుర [1](కాంత?) హనుమంతుఁడు ॥ తలఁచ ॥

---

1 ఈ సూచన లేనిచో యతిభంగము ఇది పూర్వ ముద్రణ కర్తలదే

లంకాసాధకుఁడు లక్ష్మణప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవుంచివ్రుఁడు
పొంకపురామునిబంటు భూమిజసంతోషదూత
తెంకినే కలశాపుర దేవహనుమంతుఁడు ॥ తలఁచ ॥

చటులార్జునసఖుఁడు జాతరూపవర్ణుఁడు
ఇటమీఁద బ్రహ్మపట్టమేలేటివాఁడు
నటన శ్రీవేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపురప్రాంత హనుమంతుఁడు ॥ తలఁచ ॥ 48

లలిత

ఇన్నిళ్ళు నెఱఁగక యిందులోనే వోలాడితి
మన్నించఁగా నీవల్లనే మరిగితి నిన్నును ॥ పల్లవి ॥

ముందు నేఁజేసినకర్మములు దోలుకరాఁగాను
అంది మరఁగుఁ జొచ్చితి నందుకే నీకు
కందువఁ బంచేంద్రియాలు కదిమి పైకొనఁగాను
చందములన్నిటా నీకు శరణంటిని ॥ ఇన్ని ॥

వెనకటిసంసారము విడువక వుండఁగాను
వినయాన నీడాగు వేసుకొంటిని
ఘనమైనజన్మములు కాణాచియై తగులఁగ
మొనసి నీపాదాలకు మొక్కితి నేను ॥ ఇన్ని ॥

జీవులసంగాతాలు చిమ్మి రేఁచి యంటుకోఁగా
భావించి నీమీఁదటిబత్తి వట్టితి
శ్రీవేంకటేశుఁడవు నీదేవు లలమేలుమంగ
నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని ॥ ఇన్ని ॥ 48

## దేవగాంధారి

[1]ఎంతని నుతియింతు రామరామ యిట్టి నీప్రతాపము రామరామ
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ ॥ పల్లవి ॥

బలుసంజీవనికొండ రామరామ ఎంటుచేఁ దెప్పించితివి రామరామ
కొలఁదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ
వెలయ నెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ
పెలుచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ ॥ ఎంత ॥

శరణంటే విభీషణుని రామరామ చయ్యనఁ గాచితివట రామరామ
బిరుదులరావణుని రామరామ పీఁచమడఁచితివట రామరామ
ధరలోఁ జక్రవాళము రామరామ దాఁటి వచ్చితివఁట రామరామ
సురలు నుతించిరట రామరామ నీ చొప్పు యిఁక నదియెంతో రామరామ ॥

సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులుఁ(డుఁ?) దమ్ములట రామరామ
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ
శ్రీమంతుఁడ వన్నిటాను రామరామ శ్రీవేంకటగిరిమీఁది రామరామ
కామితఫలదుఁడవు రామరామ కౌసల్యానందనుఁడవు రామరామ ॥ఎంత॥485

## లలిత

బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుఁడు
సిరులతో రామునికి సీతాదేవికిని ॥ పల్లవి ॥

మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు
వాఁడె హనుమంతదేవరఁ జూడరో
పోఁడిమి దైత్యులగెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు ॥ బిరుదు ॥

---

౧ పల్లవిలో రెండవపాదము కడపట మొదటిచరణము మొదటిపాదము కడపట కడపటపాదము కడపట తక్కిన చరణములందు కడపటి పాదము కడపట రామ శబ్దము దీర్ఘాంతము

ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు
సవరనై పెనుజంగ చాఁచుకున్నాఁడు
భువిఁ గవచకుండలంబులతోఁ బుట్టినవాఁడు
వివరించ నేకాంత వీరుఁడైనవాఁడు ॥ బిరుదు ॥

పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాఁడు
ఘనుఁ డిన్నిటా స్వామికార్యపరుఁడు
వినయపు శ్రీవేంటవిభునికి హితవరి
యెనసి మొక్కఁగదరో యెదుట నున్నాఁడు ॥ బిరుదు ॥ 486

**రేకు 384 దేవగాంధారి**

నమ్మితిఁజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ
ముమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమే జపించుమీ ॥ పల్లవి ॥

తలఁచకుమీ యితరధర్మములు తత్వజ్ఞానము మఱవకుమీ
కలఁగకుమీ యేపనికైనను కడుశాంతంబుననుండుమీ
వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబున నుండుమీ
కొలువకుమీ యితరదైవముల గోవిందునినే భజించుమీ ॥ నమ్మి ॥

కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ
మీరకుమీ గురువులయానతి మెఱయఁ బురాణములే వినుమీ
చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ ॥ నమ్మి ॥

వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుఁడవగుమీ
మఱవకుమీ యలమేల్మంగకుమగఁడగుశ్రీవేంకటపతిని
కెఱలకుమీ మాయారతులను కేవలసాత్వికుఁడవుగమ్మీ
తొఱలకుమీ నేరములను సింధురక్షకునినే సేవించుమీ ॥ నమ్మి ॥ 487

## సాళంగనాట

దాసులపాలిటినిధానమై వున్నాఁ డదిగో
ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు ॥ పల్లవి ॥

నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు
పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి
మృగరూపై గద్దెమీఁద మెఱసీవాఁ డదిగో
అగవూఁ దగవెఱఁగి యహోబలేశుఁడు ॥ దాసు ॥
తేరిచూచీ నదిగో దేవాదిదేవుఁడు
ఘోరపు నెత్తురు గోళ్ళఁ గురియఁగాను
నేరుపుతోఁ బేగుల జన్నిదాలవాఁ డదిగో
ఆరితేరి కొలువున్నాఁ డహోబలేశుఁడు ॥ దాసు ॥
[1]కరుణించీవాఁ డదిగో కమలాపతి దేవుఁడు
సురలు గొలువఁగాను సొంపుతోడను
యిరవై లోకములెల్లా నేలుచున్నాఁ డదిగో
హరి శ్రీవేంకటాద్రియహోబలేశుఁడు ॥ దాసు ॥ 488

## సామంతం

సముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు [2]ప్రహ్లాదవరదా ॥ పల్లవి ॥

తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి యిందిరాదేవి
బడిఁ జెలులు సోబానఁ బాడేరు
నడుమ వీణె వాఇంచీ నారదుఁ డల్లవాఁడె
అడరి చిత్తగించు ప్రహ్లాదవరదా ॥ సము ॥

---

'కరుణించె' రేకు ౨ ప్రంహ్లాద' రేకు అంతటా

గరుడోరగాదు లూడిగములు నీకుఁ జేసేరు
సురుమేలాఁ గొలిచేరు యింద్రాదులు
పరమేష్ఠి యొకవంక పనులు విన్నవించీ
అరసి చిత్తగించు ప్రహ్లాదవరదా ॥ సము ॥

పొదిగొని మిమ్ముఁనిట్టే పూజించేరు మునులెల్లా
కదిసి పాడేరు నిన్ను గంధర్వులు
ముదమున నహోబలమునను శ్రీవేంకటాద్రి -
నదె చిత్తగించుము ప్రహ్లాదవరదా ॥ సము ॥ 48[1]

మాళవిగౌళ

అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె
భువిలోనఁ గలశాపుర హనుమంతుఁడు ॥ పల్లవి ॥

రాము నీ సేవకుఁ డిదె రణరంగధీరుఁడు
ఆముకొన్నసత్వగల హనుమంతుఁడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామితఫలదుఁడు యీఘనహనుమంతుఁడు ॥ అవ ॥

జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుఁడు
పూని చుక్కలెల్లా మొలపూసలుఁగాఁగఁ బెరిగి
భానుకోటికాంతితోఁ జొప్పడు హనుమంతుఁడు ॥ అవ ॥

యినవంశ శ్రీవేంకటేశ నీకరుణతోడ
అనుపమజయశాలి హనుమంతుఁడు
పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ
యనుమతిఁ గాచుకున్నాఁడదె హనుమంతుఁడు ॥ అవ ॥ 490

---

౧ 'అదె' పూర్వముద్రణమున జారిపోయినది

## పాడి

దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీ రఘురామా ॥ పల్లవి ॥

రవికులాంబుధిసోమ రామ లక్ష్మణాగ్రజ
భువి భరత శత్రుఘ్నపూర్వజ
సవనపాలక కౌసల్యానందవర్ధన
ధవళాబ్జనయన సీతారమణా ॥ దేవ ॥

దనుజసంహారక దశరథనందన
జనకభూపాలకజామాత
వినమితసుగ్రీవవిభీషణసమేత
మునిజనవినుత సుముఖ సుచరిత్రా ॥ దేవ ॥

అసిలజవరద యహల్యాశాపమోచన
సనకాదిసేవితచరణాంబుజ
ఘనతరశ్రీవేంకటగిరినివాస
అనుపమోదారవిహార గంభీరా ॥ దేవ ॥ 491కో

**రేకు 385** **రామక్రియ**

కొలువరో మొక్కరో కోరినవరము లిచ్చీ
సులభుఁ డిన్నిటా [1]వీఁడె సుగ్రీవనరహరి ॥ పల్లవి ॥

కంబములోనఁ బుట్టి కనకదైత్యునిఁ గొట్టి
అంబరపుదేవతల కభయ మిచ్చి
పంబి సిరిఁ దనతొడపైఁ బెట్టుక మాటలాడీ
అంబుజాక్షుఁ డైనట్టి యాదమనరహరి ॥ కొలు ॥

---

౧ 'నిండెను' పూ ము పా ౨ (౦౮ ౹దు రేకు

నానాభూషణము లున్నతితోడ నిడుకొని
పూనికతో బ్రహ్లాదుని బుజ్జగించి
మానవులకెల్లను మన్నన చాలా నొసఁగి
ఆనందముతో నున్నాఁడు అదిగో నరహరి ॥ కొలు ॥

మిక్కిలి ప్రతాపముతో మించిన కాంతులతోడ
అక్కజపుమహిమల నలరుచును
తక్కక శ్రీవేంకటాద్రిఁ దావుకొని వరాలిచ్చీ
చక్కఁదనములకెల్లాఁ జక్కని నరహరి ॥ కొలు ॥ 492

## సాళంగనాట

ఈతని దెంతప్రతాప మీతని దెంతవుదుటు
యీతఁడు రామునిబంటు యీతని సేవించరో ॥ పల్లవి ॥

వుదయాస్తనగముల కొకజంగ చాఁచినాఁడు
చదివె రవితో సర్వశాస్త్రములు
తుద బ్రహ్మాండము మోవఁ దోఁక మీఁది కెత్తినాఁడు
పెదపెదకోరల పెనుహనుమంతుఁడు ॥ ఈతని ॥

కుడిచేత దనుజులఁ గొట్ట నూఁకించినాఁడు
యెడమచేఁ బండ్లగొల పిడికిలించె
వుడుమండలము మోవ నున్నతిఁ బెరిగినాఁడు
బెడితపుమేనితోడఁ బెనుహమనుమంతుఁడు ॥ ఈతని ॥

పుట్టుఁగవచకుండలంబులతోడ నున్నవాఁడు
గట్టి బ్రహ్మపట్టానకుఁ గాచుకున్నాఁడు
ఇట్టే శ్రీవేంకటేశునెదుటఁ బనులు సేసీ
బెట్టిదపుసంతోసానఁ బెనుహనుమంతుఁడు ॥ ఈతని ॥493

**లలిత**

నమో నమో జగదేకనాథ [1]తవ సర్వేశ
విమల విశ్రుత అసద్విఖ్యాతకీర్తే ॥ పల్లవి ॥

రామ రఘువర సితరాజీవలోచన
భూమిజారమణ త్రిభువనవిజయ
కోమలాంగ శ్యామ కోవిద రణరంగ
భీమవిక్రమ సత్యబిరుదప్రవీణ ॥ నమో ॥

దళితదైతేయ కోదండ దీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణరక్షక
కలితదశరథతనయ కౌసల్యానంద
సులభ వానరముఖ్య సుగ్రీవవరద ॥ నమో ॥

చారులక్ష్మణ భరత శత్రఘ్నపూర్వజ
తారకబ్రహ్మనిత్యస్వరూప
ధీర శ్రీవేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేతపురనివాసా ॥ నమో ॥ 494

**నాట**

ఎక్కడఁ జొచ్చెదరింక రక్కసులు
చిక్కి చెడుఁడు నరసింహునిచేత ॥ పల్లవి ॥

వుడుగని కోపపుటుగ్రపుఁ జూపుల
మిడుగురు లెగయఁగ మిన్నంది
పిడుగుల మ్రోఁతలఁ బెళపెళ నార్చుచు
వెడలెఁ గంభమున వీరసింహుఁడు ॥ ఎక్కడ ॥

---

1 చతుర్థ్యంతమగు 'తే' వుంటే బాగేమో!

కాలాగ్నికీలలుగక్కెడిచక్రము
కేలఁ బూని కులగిరు లదర
భాలలోచనము ప్రకటింపుచు లయ -
కాలుఁడై వెలసెఁ గడిఁది సింహుఁడు ॥ ఎక్కడ ॥

కుటిలనఖంబుల ఘోరాకారత
తొటతొటనెత్తురు దొరుగఁగను
చటుల దానవులఁ జదుపుచు శ్రీవేం -
కటమున నిలిచె [1]సాకారసింహుఁడు ॥ ఎక్కడ ॥ 495

## గుజ్జరి

కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు వీఁడే
నిండుకున్నాఁడు తలఁచు నెమ్మదినోమనసా ॥ పల్లవి ॥

నన్నుఁ బుట్టించే దేవుఁడు ౹ లోనున్నాఁడు దేవుఁడు
కన్నచోటులనే వుండే కాచే దేవుఁడు
వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు
[2]యెన్నెని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు ॥ కొండ ॥

సిరులిచ్చిన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు
గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు
మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు
ఇరవై మాయింటనున్నాఁ డీదేవుఁడు ॥ కొండ ॥

దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు
రూపు చూపె నిదివో బోరున దేవుఁడు
శ్రీపతియైన దేవుఁడు శ్రీవేంకటాద్రి దేవుఁడు
చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు ॥ కొండ ॥ 496

౧ 'సాకార ఎఢిసింహుడు' పూ ము పా ౨ ఎన్ని+అని

## సామంతం

ఔనయ్య జాణఁడవు [1]ప్రహ్లాదవరదా
ఆనలు వెట్టకుము ప్రహ్లాదవరదా ॥ పల్లవి ॥

వేసరక శ్రీసతితో వేడుకనవ్వులు నవ్వి
ఆసలు చూపేవు ప్రహ్లాదవరదా
సేసవెట్టిన చేతుల చెఱఁగువట్టి తీసేవు
[illegible] సుద్దులే చెప్పేను (వు?) ప్రహ్లాదవరదా ॥ ఔన ॥

నగటునఁ దొడమీఁదను నలినాక్షి నెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరదా
గెంటక యేపొద్దును కేలుగేలఁ గీలించుక
అంటుపాము వదివో ప్రహ్లాదవరదా ॥ ఔన ॥

కందువతోఁ గాఁగిలించి కైవసము సేసుకొంటి -
వందముగ నీకెను ప్రహ్లాదవరదా
పొంది శ్రీవేంకటమున పొంచి [2]యౌభళములోనా
అంది వరాలిచ్చేవు ప్రహ్లాదవరదా[3] ॥ ఔన ॥ 497

**రేకు 386** రామక్రియ

కంటిఁ గంటి వీఁడివో కని కృతార్థుఁడనైతి
వింటి నిందరిచేతా నీ [4]విట్టలేశు సుద్దులు ॥ పల్లవి ॥

యీతఁడా గోవర్ధనమెత్తిన పసిబాలుఁడు
కాతరీఁ డీతఁడా గోపికావల్లభుఁడు
పూతన నీతఁడా పట్టి పొరిగొన్నయట్టివాఁడు
చేత గచ్చుకాయలాడీ శ్రీవిట్ఠలేశుఁడు ॥ కంటి ॥

౧ ప్రంహ్లాద' రేకు
౨ 'యోభళము' రేకు, ౩ ఇది శృంగార సంకీర్తనలలో నుండ తగినది ౪ విఠ్ఠలేశు' రేకు

యీ దేవుఁడా కుచేలుని కిష్టసంపదిచ్చినాఁడు
పొదిగొని యీ దేవుఁడా భూభార మడఁచినాఁడు
వేదమయుఁ డీదేవుఁడా విశ్వరూపు చూపినాఁడు
సేదదేరీ మహిమల శ్రీవిట్ఠలేశుఁడు ॥ కంటి ॥

యీ మూరితా పాండురంగ మిరవై వుండినవాఁడు
కామించీమూరితి శ్రీవేంకటగిరి నున్నవాఁడు
దోమటి నీమూరితే యాద్యులపాట మెచ్చినాఁడు
క్షేమముతో వరాలిచ్చీ శ్రీవిట్ఠలేశుఁడు ॥ కంటి ॥ 498

**నాట**

సరిలే రితనికి సాహసవిక్రముఁ డీతఁ -
డరయ కలశాపురహనుమంతుఁడు ॥ పల్లవి ॥

వుదధి లఘించినాఁడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్టనడుమఁ బూజగొన్నాఁడు
సదరాననే లంక సాధించి వచ్చినాఁడు
అదివో కలశాపురహనుమంతుఁడు ॥ సరి ॥

సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు
[1]భంజించి వానరుల బదికించినాఁడు
అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యేపనుల -
నంజఁడు కలశాపురహనుమంతుఁడు ॥ సరి ॥

బలురాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు
ఇల రామునికిఁ గడు హితుఁడైనాఁడు
చెలఁగి శ్రీవేంకటేశు సేవ సేయుచున్నవాఁడు
అలరి కలశాపురహనుమంతుఁడు ॥ సరి ॥ 499

---

౧ 'భంజించిన కావచ్చు

## సాళంగనాట

సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో
వావిరిఁ బ్రహ్లాదునికి వరదుఁడు వీఁడే ॥ పల్లవి ॥

జగన్నాథుఁడు వీఁడే సర్వరక్షకుఁడు వీఁడే
నిగమవేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే
సగుణవంతుఁడు వీఁడే సర్వకాముఁడు వీఁడే
నగుమొగముసుగ్రీవనరసింహుఁడు వీఁడే ॥ సేవిం ॥

మరుజనకుఁడు వీఁడే మహిమాధికుఁడు వీఁడే
పరగ శ్రీలక్ష్మీపతి వీఁడే
సురల కేలికె వీఁడే శుభమూరితి వీఁడే
నరసఖుఁడ సుగ్రీవనరసింహుఁడు వీఁడే ॥ సేవిం ॥

భువనాధిపతి వీఁడే పురుషోత్తముఁడు వీఁడే
వివిధప్రతాపకోవిదుఁడు వీఁడే
ఇవల శ్రీవేంకటాద్రినిరవైనతఁడు వీఁడే
నవమూర్తి సుగ్రీవనరసింహుఁడు వీఁడే ॥ సేవిం ॥ 500

## బౌళి

ఎంతని పొగడవచ్చు నితనిప్రతాపము
పంతములెల్లామెరసి ప్రతాపించీ వాఁడే ॥ పల్లవి ॥

చేతులనే పెరికి సంజీవికొండ దెచ్చినాఁడు
ఆతఁడువో తొల్లి పెద్దహనుమంతుఁడు
ఘాతలఁ దానొక్కఁడే లంక సాధించి వార్ధి దాఁటి
యీతలికి వచ్చినాఁడు ఇదివో వాఁడే ॥ ఎంత ॥

ముదమున బ్రహ్మలోకముదాఁకాఁ బెరిగినాఁడు
అదివో ఇప్పుడు పెద్దహనుమంతుఁడు
వదలక తోఁక చక్రవాళపర్వతము వెంటా
వుదుటునఁ జుట్టుకొని వున్నాఁడు వాఁడే ॥ ఎంత ॥

మెల్లనే జంగ చాఁచి మెడ నిక్కించుకొన్నాఁడు
అల్లదివో మించే పెద్దహనుమంతుఁడు
వెల్లవిరైనాఁడు శ్రీవేంకటేశ్వరుని బంట్రై
చల్లఁగా లోకములేలీ సంతతము వాఁడే ॥ ఎంత ॥ 501

## పాడి

ఎంతప్రతాపమువాఁడు యెంతటినేరుపరి
యెంతని పొగడవచ్చు నీరాముని ॥ పల్లవి ॥

వాలినొక్క కోలనేసి వారిధి గట్టినవాఁడు
తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు
పాలించి విభీషణునిఁ బట్టముగట్టినవాఁడు
యేలుమని లంకకెల్లా నీరాముఁడు ॥ ఎంత ॥

కుచ్చి౦పెర (?) మొండెముగా కుంభకర్ణుఁ గొట్టినాఁడు
హెచ్చి రాకాసులఁ జంపె నీరాముఁడు
తచ్చి రావణాసురునితలలు చెండాడినాఁడు
ఇచ్చకొలఁదుల నిట్టె యీ రాముఁడు ॥ ఎంత ॥

సీతతో విమానమెక్కి చేరి యయోధ్యకు వచ్చి
యీతలఁ బట్టమేలినాఁ డీరాముఁడు
శ్రీతరుణితోఁగూడి శ్రీవేంకటేశుఁడైనాఁడు
యీతఁడే దరిసించరో యీరాముఁడు ॥ ఎంత ॥ 502

---

౦ 'పెడ' కావచ్చు

### లలిత

సర్వరక్షకుఁడైన సర్వేశుఁడేకాక
పుర్విమీఁద నందరిలో నొక్కఁడా రాముఁడు ॥ పల్లవి ॥

కొండపొడవులైన ఘోరవానరబలము
గుండుగా వారిధిదండఁ గూడఁబెట్టి
నిండు జెలనిధి గట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁ డనవచ్చునా ॥ సర్వ ॥

అన్నిటా దేవతలకు నసాధ్యమైనరావణు -
నెన్నికగాఁ బుత్రమిత్రహితులతోడ
పన్నుకొని శస్త్రాస్త్రపంక్తులనే ఖండించె
సన్నుతి నిట్టే రాముని జనుఁడనవచ్చునా ॥ సర్వ ॥

చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి
బలువుగ సీతఁగూడి పట్టమేలి
యిలలో శ్రీవేంకటాద్రినిరవై లోకముగాచీ
నలువంక రాముఁడు నరుఁడనవచ్చునా ॥ సర్వ ॥ 503

**రేకు 387**

### లలిత

కంటిమి నేఁ డిదె గరుడాచలపతి
యింటివేలుపగు యీశ్వరుఁ డితఁడు ॥ పల్లవి ॥

శ్రీనరసింహుఁడు చిన్మయకాంతుఁడు
దానవాంతకుఁడు దాయనిధి
నానామహిమల నమ్మినవారిని
పూనుక కాచే పోషకుఁ డితఁడు ॥ కంటి ॥

దేవాదిదేవుఁడు దినకరతేజుఁడు
జీవాంతరంగుఁడు శ్రీ విభుఁడు
దైవశిఖామణి ౧తలఁచినవారిని
సేవలుగొని కాచేవిభుఁ డితఁడు ॥ కంటి ॥

పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుఁడు
కరుణానిధి బుధకల్పకము
పరగు శ్రీవేంకటపతి తనదాసుల -
నరుదుగఁ గాచే యనంతుఁ డితఁడు ॥ కంటి ॥ 504

## రామక్రియ

అల్లవాఁడే గద్దెమీఁద నౌభళపుగుహాలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు ॥ పల్లవి ॥

వుక్కుఁగంభములోఁ బుట్టి వుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి
గక్కనఁ గడుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంధ్యాలుగా వేసుకొన్నాఁడు ॥ అల్ల ॥

కోరలు దీఁడుకొంటాను ఘోరనారసింహుఁడు
సారెసారె నెత్తురులు చల్లుకొంటాను
వీరులైన దానవుల వెదకి వెదకి కొట్టి
గోరికొనఁ గండలెల్లాఁ గోయుచున్నాఁడు ॥ అల్ల ॥

విచ్చన విడిని శ్రీవేంకటనారసింహుఁడు
పచ్చిదేర నట్టే పకపక నవ్వి
కచ్చు పెట్టి దేవతలఁగాచి యభియమిచ్చి
పెచ్చు రేఁగి సంతోసానఁ బెరుగుచున్నాఁడు ॥ అల్ల ॥ 505

---

౧ 'తలఁచివారిని' రేకు

### మాళవిగౌళ

ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో
పొంతనిదే కలశాపుర హనుమంతుఁడు ॥ పల్లవి ॥

పిడికిటఁ బట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులఁ గొట్టినది వలకేలు
పొడచూపీఁ గలశాపుర హనుమంతుఁడు ॥ ఎంత ॥

సందడిసమరానకు చాఁచినది పెనుజంగ
అందముగ నిక్కించినదదే వురము
కుందక వీరరసమే [1]కురిసేటిది మొగము
పొందగువాఁడు కలశాపుర హనుమంతుఁడు ॥ ఎంత ॥

వుద్ధుటున మెలఁగేవి వొద్దికైన పాదాలు
త్రిదశులమెప్పించేది దివ్యరూపము
అదె శ్రీవేంకటేశుబంటయి నిలుచున్నాఁడు
వొదలుచుఁ గళశాపుర హనుమంతుఁడు ॥ ఎంత ॥ 506

### శంకరాభరణం

ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి
చెంతనుండి మమ్మునేలే శ్రీ [2]విట్ఠలేశుఁడు ॥ పల్లవి ॥

తుంగభద్రాతటమున తొంటిపరబ్రహ్మము
అంగవించి సాకారమైవున్నాఁడు
సంగతితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించీ మహిమల శ్రీ[3]విట్ఠలేశుఁడు ॥ ఎంత ॥

---

౧ 'కుర' రేకు ౨ 'విద్ధలేశుఁడు' రేకు ౩ 'విర్ఠలేశుఁడు' రేకు మిగత స్థలములందును

అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ -
డందరికిఁ బ్రత్యక్షమై యున్నాఁడు
సందడించి గోపికాజనములతోడుత
చెంది వున్నాఁడిదివో శ్రీ విట్ఠలేశుఁడు ॥ ఎంత ॥

వెలసి వనాలలోన వేదవేద్యుఁడైన హరి
అలరి కృష్ణావతారమై యున్నాఁడు
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే పదారువేల
చెలులతోఁ గూడినాఁడు శ్రీ విట్ఠలేశుఁడు ॥ ఎంత ॥ 507

## నాట

ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు
నట్టనడుమ నీసుగ్రీవ నారసింహుఁడు ॥ పల్లవి ॥

[1]పగలూ రాతిరీఁ గాని పటుసంధ్యాకాలమందు
మొగిఁ బచ్చీ వెచ్చీగానిమొనగోళ్ళచే
[2]గగనమూ నేలాఁ గానిగగనమైనతొడమీఁద
నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహదేవుఁడు ॥ ఇట్టి ॥

వెలుపలాలోనాఁగానివెడఁగుగడపమీఁద
తలితండ్రిగానియట్టితావునఁ బుట్టి
మొలచి చిగిరించని ముదురుఁగోరలతోడ
నలి హిరణ్యు జంకించె నరసింహదేవుఁడు ॥ ఇట్టి ॥

మానిసీ మెకమూఁగానిమంచియాకారముతోడ
పూని యిల్లూఁ బందిలీఁ గాని గుహలో
ఆనుక హిరణ్యుని నడఁచీ శ్రీవేంకటాద్రి
నానాదిక్కులనేలిననరసింహదేవుఁడు ॥ ఇట్టి ॥ 508

---

౧ 'పగలు' రేకు ౨ 'గగనము' రేకు

### బౌళి

అదె చూడరయ్యా పెద్దహనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా ॥ పల్లవి ॥

వుదయాస్తశైలములు వొకజంగగాఁ జాఁచె
అదివో ధ్రువమండలమందె శిరసు
చదివె సూర్యునివెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతనిమహి మేమని చెప్పేమయ్యా ॥ అదె ॥

దండిగా బ్రహ్మాండముదాఁకఁ దోఁక మీఁదికెత్తె
మెండగు దిక్కులు నిండ మేను వెంచెను
గుండుగూడ రాకాసులఁ గొట్టఁగఁ జేతులు చాఁచె
అండనీతని ప్రతాప మరుదరుదయ్యా ॥ అదె ॥

దిక్కులు పిక్కటిలఁగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకుఁ బ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీవేంకటేశు హితవరిబంటాయ
మిక్కిలి నీతనిలావు మేలు మేలయ్యా ॥ అదె ॥ 509

రేకు 388

### రామక్రియ

నరులాల మునులాల నానాదేవతలాల
పరబ్రహ్మ మీతఁడే ప్రత్యక్షమై వున్నాఁడు ॥ పల్లవి ॥

భావించి చూడరో వీఁడె ప్రహ్లాదవరదుఁడు
సేవించరో తొడమీఁది శ్రీసతిని
వావిరి నుతించరో వరశంఖచక్రా లవె
కోవిదుఁడు గద్దెమీఁదఁ గొలువై వున్నాఁడు ॥ నరు ॥

చెలఁగి మొక్కరో వీఁడె శ్రీనరసింహదేవుఁడు
తెలియరో యీతని తేజోరూపము
అలరి పూజించరో అనంతహస్తము లవె
కొలఁదిమీరి విష్ణుఁడు కొలువై వున్నాఁడు ॥ నరు ॥

యిదె శరణనరో హిరణ్యదైత్యహరుని
అదన జపించరో యీ హరినామము
యెదుట శ్రీవేంకటాద్రిని యహోబలమునందు
కొదలే కాదిమూరితి కొలువై వున్నాఁడు ॥ నరు ॥ 51

## పాడి

[1]ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీనరసింహుఁడు ॥ పల్లవి ॥

సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా
సొరిది మోములు [2]తోఁగి చూచుకొంటాను
విరులచెండులఁగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీనరసింహుఁడు ॥ ఇంతు ॥

భవనాశిలోని నీరు పైఁ జల్లులాడుకొంటాను
నవకపుసిరులను నవ్వుకొంటాను
జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను
[3]చివన నిందిరనంటె శ్రీనరసింహుఁడు ॥ ఇంతు ॥

వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా
ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా
ఆముక శ్రీవేంకటాద్రి నొభళాన నిలిచిరి
శ్రీమహాలక్ష్మితోడ శ్రీనరసింహుఁడు ॥ ఇంతు ॥ 511

౧ ఇది ఒక విధమైన శృంగార సంకీర్తన ౨ తొంగి పూ ము పా తొంగి కి బదులుగా 'తోఁగి అనురూపము ఈ వాఙ్మయమున పలుతావులగలదు ౩ చివ్వన కు రూపాంతరము కావచ్చు

**బౌళి**

సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు
నెలకొన్నదాసులకు నిధానము వీఁడే ॥ పల్లవి ॥

తుంగభద్రాతటమున తొడపై నిందిరతోడ
సింగారించుకొన్నవేల్పుసింహము వీఁడే
సంగతిగా దేవతలు జయవెట్టి కొలువఁగా
చెంగటనే మహిమలఁ జెలరేఁగీ వీఁడే ॥ సుల ॥

చలువబండలమీఁద చక్కనికొండలదండ
అలరీని వీరనరహరి వీఁడె
వెలయుశంఖచక్రాలవేవేలుహస్తములతో
బలవంతుఁడై వున్నాఁడు పంతముతో వీఁడే ॥ సుల ॥

పువ్వులతోఁటలనీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజ కేసరి [1]వీఁడె
ఇవ్వల శ్రీ వేకంటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వుమోముతోడ భువనము లేలీ వీఁడే ॥ సుల ॥ 512

**నాట**

వినరయ్య నరసింహవిజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును ॥ పల్లవి ॥

మొదలఁ గొలువుకూటమున నుండి కశిపుఁడు
చదివించెఁ [2]ప్రహ్లాదుని శాస్త్రములు
అదన నాతఁడు నారాయణుఁడే దైవమనె
అదరిపడి దైత్యుఁడు ఆతనిఁ జావుమనె ॥ వినర ॥

---

౧ లీఁదె రేకు ఈ వీఁడె పూ ము పాఠములో జారిపోయినది ౨ 'ప్రంహ్లాద' రేకు అంతటా

అంతటఁ బ్రహ్లాదుఁడు 'అన్నిటానున్నాఁ'డనియె
పంతమున దానవుఁడు బాలునిఁ జూచి
యెంతయుఁ గడఁకతోడ 'ఇందులోఁ జూపు'మని
చెంతనున్న కంబము చేతఁగొని వేసె ॥ వినర ॥

అటమీఁదట బ్రహ్మాండం బదరుచు
కుటిలభయంకరఘోషముతో
చిట చిట చిటమని పెట పెట పెటమని
పటపట మనుచును బగిలెఁ గంబము ॥ వినర ॥

కులగిరు లదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తల్లడిలి
కలఁగెను జగములు కంపించె జగములు
ప్రళయకాలగతిఁ బాటిల్లె నపుడు ॥ వినర ॥

ఘననారసింహుఁ డదె కంబమునందు వెడలె
కనుపట్టె నదిగొ చక్రజ్వాలలు
మునుకొని వెడలెఁ గార్ముకముక్తశరములు
కనకకశిపునకుఁ గలఁగె గుండియలు ॥ వినర ॥

అడరె నద్దేవునికోపాగ్నులు బెడిదపు -
మిడుఁగురులతోడుత మిన్నులుముట్టి
పిడుగులురాలేటిభీకరనఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె ॥ వినర ॥

తొడికి పట్టి విష్ణుఁడు తొడమీఁద నిడుకొని
కడుపు చించెను వానిగర్వమడఁగ
వెడలెఁ జిల్లున వానివేఁడి నెత్తురు నింగికి
పొడి వొడియాయ శత్రుభూషణములెల్లను ॥ వినర ॥

నెళ నెళన విరిచె నిక్క వానియెముకలు
పెళపెళ నారిచి పెచ్చు వెరిగె హరి
జళిపించి పేగులు జంద్యాలుగా వేసుకొనె
తళుకుఁగోరలు తళతళమని మెరిచె ॥ వినర ॥

పెటలించి నరములు పెరికి కుప్పలువేసి
గుటగుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కలు వారఁజెండి
కుటిలదానవుఁ జూచి 'ఖో' యని యార్చెను ॥ వినర ॥
తెంచి శిరోజములు దిక్కులకు వాని -
పెంచప్రాణములుగొనెఁ బరమాత్ముఁడు
అంచెల నీరీతిని ప్రహ్లాదునిపగ నీఁగె
మించి దేవతలు మితిమీటి జయవెట్టిరి ॥ వినర ॥

అప్పు డిందిరాదేవి యంకమునఁ గూచుండె
వొప్పుగ శాంతమందె నహోబలేశుఁడు
తప్పక కోనేటిదండఁ దానై యిందును నందు
చిప్పిల వరములిచ్చీ శ్రీవేంకటేశుఁడు ॥ వినర ॥ 513

**రేకు 389** **మాళవిగౌళ**

అదె లంక సాధించె నవనిభారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితఁడు ॥ పల్లవి ॥

రవివంశతిలకుఁడు రాముఁ డితఁడు
భువిఁ బుట్టె దశరథ పుత్రుఁ డితఁడు
భవుఁడెంచెఁ దారకబ్రహ్మ మీతఁడు
పవనజుకిచ్చినాఁడు బ్రహ్మపట్ట మీతఁడు ॥ అదె ॥

---

౧ 'పెంచె' రేకు

బలువుఁడు సీతాపతి యితఁడు
తలకొన్న వాలిమర్దనుఁ డితఁడు
విలసిల్లె నేకాంగవీరుఁ డితఁడు
చలమరి కోదండదీక్షాగురుఁ డితఁడు ॥ అదె ॥

శరణాగత వజ్రపంజరుఁ డితఁడు
సరిలేని యసురభంజకుఁ డితఁడు
వరదుఁడు శ్రీవేంకటేశ్వరుఁ డితఁడు
అరయ విజయనగరాధీశుఁ డితఁడు ॥ అదె ॥ 51

## రామక్రియ

రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు ॥ పల్లవి ॥

చెలువపురూపమున జితకాముఁడు
మలసీ బిరుదున సమరభీముఁడు
పొలుపైనసాకేతపురధాముఁడు
యిలలోఁ బ్రజలకెల్లా హితమధాముఁడు ॥ రాము ॥

ఘనకాంతుల నీలమేఘశ్యాముఁడు
అనిశము నుతుల సహస్రనాముఁడు
కనుపట్టు కపినాయకస్తోముఁడు
తనునెంచితే దేవతాసార్వభౌముఁడు ॥ రాము ॥

సిరులమించిన తులసీదాముఁడు
కరుణానిధియైనభక్తప్రేముఁడు
పురుతరమహిమల నుద్దాముఁడు
గరిమల శ్రీవేంకటగిరి గ్రాముఁడు ॥ రాము ॥ 51

## సామంతం

అదిగాన నీతి శాంతాలన్నిటకిఁ గారణము
పదిలమై వివేకించి బ్రదుకఁగ వలయు ॥ పల్లవి ॥

తఱచు మాఁటలాడితే తప్పులెన్నినాఁ దొరలు
పఱచై తిరిగితేను పాప మంటును
మెఱసి తిరిగాడితే మిక్కిలి దూరు ముట్టు
యెఱకగలవాఁ డిందు నేమఱఁ డెప్పుడును ॥ అది ॥

కన్నవెల్లాఁ జూచితే కడునాస లుప్పతిలు
కన్నెలు పెక్కుగూడితే కరఁగు మేను
సన్నలు సారెకునైతే చవుకౌ దొరతనము
యిన్నిట నేర్పరైనవాఁ డేమఱఁ డెప్పుడును ॥ అది ॥

మట్టుమీరి నవ్వితే మచ్చరా లూరకే పుట్టు
గుట్టులేక నడచితేఁ గొంచపడును
నెట్టన శ్రీవేంకటేశ నీకు శరణుచొచ్చి
యిట్టె నీదాసుఁడైనవాఁ డేమరఁ డెప్పుడును ॥ అది ॥ 516

## సాళంగనాట

జయము మనది వనచరులాల
రయమున దర్మదొరలు తుత్తుతూ ॥ పల్లవి ॥

రక్కసులమీఁద రాముఁడలిగె, నలు
దిక్కుల నడవుఁడు తిడిం తిడిం
యెక్కుడుసేనలు యిటు మొరయింపుఁడు
ఢక్కానినదము ఢమఢమఢమం ॥ జయ ॥

కుటిలదానవులఁ గొట్టేఁడు, కోటలు
తటుకున దాఁటుఁడు ధణం ధణం
పటుగతినార్చుచు పట్టేఁడు లగ్గలు
పెటులు చూఁడఁ డదె పెట పెట పెటల్ ॥ జయ ॥

గుట్టున నుండక కూలె రావణుఁడు
పట్టేఁడు సంకులు భం భం భం
యిట్టె శ్రీవేంకటేశుఁడు గెలిచెను
దిట్టలై యాడుఁడు ధిం ధిం ధిం ॥ జయ ॥ 517

## శంకరాభరణం

వినుఁ డిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షసబాధ లుడిగెను ॥ పల్లవి ॥

కులగిరు లదరెను కుంభిని వడఁకెను
యిల రాముఁడు రథమెక్కినను
కలఁగె వారిధులు కంపించె జగములు
బలువిలునమ్ములు వట్టినను ॥ విను ॥

పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిఁబడి బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు
యెడపక రావణు నేసినను ॥ విను ॥

చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసురతల దుంచినను
గక్కన శ్రీవేంకటగిరి నిలువఁగ

అక్కజమగు శుభ మందరికొదవె ॥ విను ॥ 518

## బౌళిరామక్రియ

ఇతఁడే పరబ్రహ్మ మిదియే రామకథ
శతకోటివిస్తరము సర్వపుణ్యఫలము ॥ పల్లవి ॥

ధరలో రాముఁడుపుట్టి ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసులకెల్లా నభయమిచ్చె
సొరిది ముక్కుఁ జెవులు చుప్పనాతిని గోసె
ఖరదూషణులను ఖండించి వేసె ॥ ఇతఁడే ॥

కినిసి వాలిఁ జంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణకుంభకర్ణాదులను జంపి
వనితఁ జేకొని మళ్ళి వచ్చె నయోధ్యకును ॥ ఇతఁడే ॥

సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుఁడుఁ గొలువఁగ
భూమి యేలె కుశలవపుత్రులఁ గాంచె
శ్రీమంతుఁడై నిలిచె శ్రీవేంకటాద్రిమీఁద
కామించి విభీషణ లంకకుఁబట్టము గట్టె ॥ ఇతఁడే ॥ 519

ఋ 390

## మాళవిగౌళ

రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను ॥ పల్లవి ॥

తటుకన మారీచుతలపైఁ బోయఁ గర్మము
కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను ॥ రాము ॥

తరగె రావణు పూర్వతపములయాయుష్యము
ఖరదూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తుకు చినిఁగె నంతటను ॥ రాము ॥

పారిఁ గుంభకర్ణునికి పుట్టినదినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె (గ?) నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీవేంకటేశుచేఁతలెల్లా దక్కెను ॥ రాము ॥ 520

## సాళంగనాట

జయము జయము ఇఁక జనులాల
భయములు వాసెను బ్రదికితిమిపుడు ॥ పల్లవి ॥

ఘన నరసింహుఁడు కంభమున వెడలె
దనుఁజులు నమసిరి ధర వెలసె
పొనిఁగె నధర్మము భూభారమడఁగె
మునులతపము లిమ్ముల నీడేరె ॥ జయము ॥

గరిమతో విష్ణుఁడు గద్దెపై నిలిచె
హిరణ్యకశిపుని నేపడఁచె
అరసి [1]ప్రహ్లాదుని నన్నిటా మన్నించె
హరుఁడును బ్రహ్మయు నదె కొలిచేరు ॥ జయము ॥

అహోబలేశుఁడు సిరి నంకమున ధరించె
బహుగతి శుభములు పాటిల్లె
యిహపరము లొసఁగె నిందును నందును
విహరించెను శ్రీవేంకటగిరిని ॥జయము॥521

౧ ప్రంహ్లాదుని' రేకు

## రామక్రియ

గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగేఁ జూడరో చింతామణి యీపె ॥ పల్లవి ॥

పాలజలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీనరసింహులక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీలీల లోకములేలే యిందిర యీపె ॥ గరు ॥

ఘనసంపదలొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశముఁ బాయనిమహాహరిప్రియ యీపె
ధనధాన్యరూపపుశ్రీ తరుణి యీపె ॥ గరు ॥

రచ్చలవెలసినట్టిరమావనిత యీపె
మచ్చికగలయలమేల్మంగ యీపె
యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలూఁ దావుకొనిననిధాన మీపె ॥ గరు ॥ 522

## సామంతం

సమసె రావణుఁడు సమరములోపల
అమరులు కడు ముదమందిరి మెరసి ॥ పల్లవి ॥

బెరగిరి రాముని శరముల కసురలు
సురిగిరి పొట్లచురుకునను
తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన
తిరిగిరి తరుమఁగ దిక్కులకు ॥ సమసె ॥

కూలిరి భల్లూకుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి
వీలిరి యంగదు వివిధనాదముల
తూలిరి సుగ్రీవు దోర్బలముననను ॥ సమసె ॥

దాఁగిరి లక్ష్మణు దాకకు మలుకుచు
వీఁగిరి వనచర వితతికిని
పాఁగి శ్రీవేంకటపతి కృపారసమునఁ
దోఁగిరి జనులు సంతోసంబుననను ॥ సమసె ॥ 523

## శంకరాభరణం

ఆదిమూర్తి యీతఁడు [1]ప్రహ్లాదవరదుఁడు
యేదెసఁ జూచినాఁ దానె యీత[2]ఁడిది (?) దేవుఁడు ॥ పల్లవి ॥

నవ్వులమోముతోడ నరసింహరూపుతోడ
జవ్వనితొడమీఁదట సరసమాడ
పువ్వులదండలు యిరుబుజాలపై వేసుకొని
వువ్విళ్ళూరఁ గొలువై వున్నాఁడు దేవుఁడు ॥ ఆది ॥

సంకుఁ జక్రములతోడ జమళికోరలతోడ
అంకెలఁ గటియభయహస్తా లెత్తి
కంకణాలహారాలతో ఘనకిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపానఁ బొదలీ నీ దేవుఁడు ॥ ఆది ॥

నానాదేవతలతోడ నారదాదులతోడ
గానములు వినుకొంటా గద్దెపై నుండి
ఆనుక శ్రీవేంకటాద్రి నహోబలమునందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుఁడు ॥ ఆది ॥ 524

---

౧ 'ప్రంహ్లాద' రేకు ౨ 'డిదె' కావచ్చు

## బౌళిరామక్రియ

వీఁడివో కలశాపుర వీరహనుమంతుఁడు
వాఁడిమిమెరసినట్టివజ్రపాణి యితఁడు ॥ పల్లవి ॥

చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తలకొన్న రాముని ప్రతాపపువాఁడు
యెలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు
కలగుండు వడ లంకఁ గాలిచినవాఁడు ॥ వీఁడివో ॥

మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయమువాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాఁడు
పగటున మీఁదిబ్రహ్మపట్టమేలేవాఁడు ॥ వీఁడివో ॥

యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు
చెప్పఁగొత్తైనమహిమఁ జెన్నొందువాఁడు
ముప్పిరి శ్రీవేంకటేశుమూలబలమైనవాఁడు
వొప్పగు వరా లిందరి కొసగేటివాఁడు ॥ వీఁడివో ॥ 525

**రేకు 391** **రామక్రియ**

వీఁడివో కొలువున్నాఁడు ౧విట్ఠలేశుఁడు
మూఁడుమూర్తులతేజపుమూలమీతఁడు ॥ పల్లవి ॥

పంతముతో పాండవపక్షపాతి యీతఁడు
వింతలేని విదురునివిందు యీతఁడు
మంతుకెక్కినద్రౌపదీమానరక్షకుఁ డీతఁడు
చెంతనే వుద్ధవుపాలి చింతామణి యీతఁడు ॥ వీఁడివో ॥

---

౧ 'విఠ్ఠలేశుఁడు' రేకు

మందగొల్లెతలకెల్లా మంగళసూత్ర మీతఁడు
కందువ నక్రూరునిభాగ్యం బీతఁడు
నందగోప యశోదల నవనిధాన మీతఁడు
అందపురుక్మిణీమనోహరుఁ డీతఁడు

దేవకీవసుదేవులదివ్యపద వీతఁడు
భావింప నందరిపరబ్రహ్మ మీతఁడు
కైవశమై దాసులకు కల్పవృక్ష మీతఁడు
శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతి యీతఁడు ॥ వీఁడివో ॥ 526

## లలిత

ఈతని మహిమలు యెంతని చెప్పేద
చేతులమొక్కేదఁ జెలఁగుచు నేను ॥ పల్లవి ॥

శ్రీనరసింహుఁడు చిన్మయమూరితి
నానావిధకరనఖరుఁడు
దారుణదైత్యవిదారుఁడు విష్ణుఁడు
తానకమగు మా దైవంబితఁడు ॥ ఈతని ॥

అహోబలేశుఁడు ఆదిమపురుషుఁడు
బహుదేవతాసార్వభౌముఁడు
సహజానందుఁడు సర్వరక్షకుఁడు
యిహపరములొసఁగుయేలిక యితఁడు ॥ ఈతని ॥

కేవలుఁడగు సుగ్రీవనృసింహుఁడు
భావించ సుజనపాలకుఁడు
శ్రీవేంకటేశుఁడు చిత్తజజనకుఁడు
వేవేలకు నిలువేలుపు యితఁడు ॥ ఈతని ॥ 527

## సాళంగనాట

పెరిగినాఁడు చూడరో పెద్దహనుమంతుఁడు
పరగి నానావిద్యల బలవంతుఁడు ॥ పల్లవి ॥

రక్కసులపాలికి రణరంగశూరుఁడు
వెక్కసపుయేకాంగవీరుఁడు
దిక్కులకు సంజీవిదెచ్చిన ధీరుఁడు
అక్కజమైనట్టి యాకారుఁడు ॥ పెరిగి ॥

లలిమీరినయట్టిలావుల భీముఁడు
బలుకపికులసార్వభౌముఁడు
నెలకొన్న లంకానిర్ధూమధాముఁడు
తలంపున రామునాత్మారాముఁడు ॥ పెరిగి ॥

దేవకార్యముల దిక్కు వరేణ్యుఁడు
భావింపఁగఁ దపఃఫలపుణ్యుఁడు
శ్రీవేంకటేశ్వరు సేవాగ్రగణ్యుఁడు
సావధానుఁడు సర్వశరణ్యుఁడు ॥ పెరిగి ॥ 528

## దేసాక్షి

వెన్నముద్దకృష్ణుఁడు వేవేల చేఁతలవాఁడు
పిన్నవాఁడై వున్నవాఁడు బిరుదైన బాలుఁడు ॥ పల్లవి ॥

బాలెంతచన్ను గుడిచి బండివిరుగఁగఁదన్ని
గాలిరక్కసుని ములుగఁగ మోఁది
రోలఁగట్టువడి యట్టె రూఢిగా మద్దిమాఁకులఁ
గూలదొబ్బె తొల్లి వీఁడె గుట్టుతోడి బాలుఁడు ॥ వెన్న ॥

కొండ గొడుగుగఁ బట్టిగోకులమునెల్లఁ గాచి
మెండగుగొల్లెతలతో మేలమాడి
అండనే నోరుదెరచి యశోదకు లోకములు
దండిగాఁ జూపె నితఁడె దంటయైన బాలుఁడు ॥ వెన్న ॥

పరమేష్ఠికి మారొడ్డి పసిబాలకులఁ దెచ్చి
ధరఁ బదారువేలుకాంతలఁ బెండ్లాడి
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి
సిరితో వెలసె నిదే చెలువపుబాలుఁడు ॥ వెన్న ॥ 529

నాట

అదె వచ్చె రాఘవుఁ డాతని దాడి ముట్టె
యెదిరించరాదు మీకు నేది దెరు విపుడు ॥ పల్లవి ॥

భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు
అవల మీకు దిక్కేది యసురలాల
తివిరి మిమ్ము వెదకె దివ్యబాణాలాతనివి
రవళి నెందు చొచ్చేరు రాకాసులాల ॥ అదె ॥

చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట
తల చూపరాదు మీకే దైత్యులాల
వలగొని దేవతలు వానరులై వచ్చిరట
నిలువరా దిఁక మీకు నిశాచరులాల ॥ అదె ॥

రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక
దావతిఁ బారరో °మీరు దానవులాల
యీవేళ శ్రీవేంకటేశుఁడితడే విభీషణుని
లావున శరణనరో లంకావాసులాల ॥ అదె ॥ 530

---

° మీకు రేకు

## గుజ్జరి

ఏలికె చెప్పినపని కెదురాడేనా
నీలీల లివియని నిండుకుండే నేను ॥ పల్లవి ॥

నీవు నాలోనున్నాఁడవు నే నున్నాఁడ సముఖాన
కావరపుటింద్రియాలు కాకుసేసీని
దేవర నీయప్పణో తెలియనానతీ నాకు
ఆవిధమైతేనే అపరాధము లేదు ॥ ఏలికె ॥

జగదీశుడవునీవు శరణాగతుఁడ నేను
జిగిఁ గామక్రోధాలేల చిమ్మిరేఁచీని
నగుతా నప్పగించేవో నాకది గాదనరాదు
తగునిట్లానే యైతే తప్పులేదు మాకును ॥ ఏలికె ॥

పుట్టించేవాఁడవు నీవు పుట్టుగులు నాసొమ్ము
చుట్టి సుఖదు.ఖాంలేల సూడువట్టీని
నెట్టన శ్రీవేంకటేశ నీనటనో మంచిదాయ
యిట్టయితే మావంక నిఁక నేరమి లేదు ॥ ఏలికె ॥ 531

---

౦ ఈ 'లే పూ ము పాదమున తప్పినది

శ్రీః

శుభమస్తు

శ్రీ తాళ్ళపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

( నిడురేకులలోని యధ్యాత్మ సంకీర్తనలు )

4-వ రేకు ❋ ఆహిరి

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడినూఁగీని శ్రీరంగశిశువు ॥ పల్లవి ॥

కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగకిటు రంగమధ్యపు తొట్టెలఁ
పలుమారుఁ దనునూఁచి పాడఁగానూఁగీని
చిలుపాల సెలవితో శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥

అదివో కమలజుని తిరువారాధనంబనఁగ
అదనఁ గమలభవాండమనుతొట్టెలఁ
ఉదధులు తరంగములనూఁచఁగా నూఁగీని
చెదరని సిరులతోడ శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥

వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితోఁగూడి శ్రీవేంకటేశుఁడై
సేదదేరెడి వాఁడె శ్రీరంగశిశువు ॥ తొల్లి ॥ 1

---

❋ ఈ సంకీర్తన 7-వ రేకునను గలదు

13 రేకు శ్రీరాగం

వెరపు దెలుపు నీ వేగిరమే నీ
వెఱఁగియు నెఱఁగక యేమంటివో ॥ పల్లవి ॥

గోరపురుధిరము గురియు గోళ్ళ నీ
తోరమైన యా తొడమీఁద
గోరంటగోళ్ళ కోమలి నిలువఁగ
ఈరసమందక యేమంటివో ॥ వెరపు ॥

నెత్తురుఁ బెదవుల నీ మొకమలరఁగ
బిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరిగమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటినో ॥ వెరపు ॥

ఆననరౌద్రము నట్టహాసమును
పూనిన నినుఁగని బొమముడితో
లేనగవుల నదలింపెడి సిరితో
హీనాధికముల నేమంటివో ॥ వెరపు ॥

పెద పెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగు జారుసతి
యెదురెదురను నీవేమంటివో ॥ వెరపు ॥

చింపి నెరుల నీ శిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతివై
లంపటమందుచు లక్ష్మీసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో ॥ వెరపు ॥ 2

16 రేకు రామక్రియ

అందరి వసమా హరినెరుఁగ
కందువగ నొకఁడుగాని యెరఁగఁడు ॥ పల్లవి ॥

లలితపు పదిగోట్లనొకఁడుగాని
కలుగఁడు శ్రీహరిఁ గని మనఁగ
ఒలిసి తెలియు పుణ్యులకోట్లలో
ఇలనొకఁడుగాని యెరఁగడు హరిని ॥ అందరి ॥

శ్రుతి చదివిన భూసురకోట్లలో
గతియును హరినె యొకానొకఁడు
అతిఘనులట్టి మహాత్మకోటిలో
తతి నొకఁడుగాని తలఁచఁడు హరిని ॥ అందరి ॥

తుదకెక్కిన నిత్యుల కోట్లలో
పొదుగునొకఁడు తలఁపున హరిని
గుదిగొను హరిభక్తుల కోట్లలో
వెదకు నొకఁడు శ్రీవేంకటపతిని ॥ అందరి ॥ 3

ఆహిరి

మాయలకగపడి మతిగెడి ప్రాణులు
రోయఁ దలఁచియును రోయఁగలేరు ॥ పల్లవి ॥

మిసమిస మెరువఁగ మెల్లన చేరిరి
ముసిఁడిమాని ఫలములు చూచి
రసమని సంసారపుబాలకులిదె
విసిగి చేఁదుగని విరుగఁగలేరు ॥ మాయ ॥

బలువిషములికెడి పాముఁ బట్టుకొని
అలరుచు నలుగడనాడేరు
పొలసి యూసలూర్పులు నిగుడించఁగ
తెలిసియు నింకాఁ దెలియఁగలేరు ॥ మాయ ॥

తేనెదెచ్చి కత్తికి దారఁ బెట్టి (న)
నానావిధముల నాఁకేరు
దీనతలణఁచెడి తిరువేంకటపతి
చేనిపంటలకుఁ జెయి చాఁచలేరు ॥ మాయ ॥ 4

**బౌళి**

కందర్పజనక గరుడగమన
నందగోపాత్మజ నమో నమో ॥ పల్లవి ॥

వారిధిశయన వామన శ్రీధర
నారసింహ కృష్ణ నమో నమో
నీరజనాభ నిగమగోచర
నారాయణ హరి నమో నమో ॥ కంద ॥

పరమపురుషా భవవిమోచన
వరద వసుధావధూవర
కరుణాకాంతా కాళిందీరమణ
నరసఖ శౌరీ నమో నమో ॥ కంద ॥

దానవదమన దామోదర శశి
భానునయన బలభద్రానుజ
దీనరక్షక శ్రీతిరువేంకటేశ
నానాగుణమయ నమో నమో ॥ కంద ॥ 5

18 రేకు ఆహిరి

ఏమి దిరిగేమెంద్దైనను ఊర
కోమితిమి దేహమోహో బదుకు ॥ పల్లవి ॥

బ్రహ్మకల్పముదాఁక బ్రదికేమా కాక
బ్రహ్మానందంబుఁ బడసేమా
బ్రహ్మ మీ దేహలంపట మనుచు పరం
బ్రహ్మంబు వదలితిమి బాపు బ్రదుకు ॥ ఏమి ॥

ఒడిలితో నిట్టనే వుండేమా, కాక
చెడని పుణ్యములెల్లఁ జేసేమా
యొడయకమరపదం బేలేమా, వృథా
చెడిపోయె దినములిస్సీ బదుకా ॥ ఏమి ॥

ఆపదలు లేని సుఖమందేమా, కాక
పాపంబు లేని మతిఁ బరగేమా
ఏపు మీరిన వేంకటేశ్వరునిఁ గొలువ
నోపకిట్టైతిమయ్యో బదుకా ॥ ఏమి ॥ 6

19 రేకు శ్రీరాగం

కప్పురమునకుఁ గప్పురమై
చిప్పిలుఁదావి మించె నితఁడు ॥ పల్లవి ॥

బంగారమునకు బంగారమై
శృంగారమమరె శ్రీహరికి
అంగమయిన మొల పీతాంబరంబున
కొంగుబంగారై కూడె నితఁడు ॥ కప్పుర ॥

---

* రేకులో ఈ పల్లవి మొదటి చరణమునకు తరువాత చెక్కబడియున్నది

తట్టు పుణుఁగునకుఁ దట్టు పుణుఁగయి
ఘట్టిమేన మించెఁగా యితఁడు
నెట్టన నొసల నిండిన కస్తురి
బొట్టు చెమటతోఁ బొలెనిక (బొలిచెని?) తఁడు ॥ కప్పుర ॥

పన్నీట పాదాన పన్నీరే తానయి
యిన్నిట శ్రీవేంకటేశుఁడిదే
ఉన్నతి జలధి నుదయమున (నందిన?)
కన్నియకౌఁగిట ఘనుఁడితఁడు ॥ కప్పుర ॥ 7

**20 రేకు** **లలిత (అవతారాలు)**

అరుదైన భవదూరుఁడగు నీతఁడు
అరిది భవములందునతఁడు వో యితఁడు ॥ పల్లవి ॥

కొడుకుటెక్కెమురూపు కోరి కైకొని పెద్ద
కొడుకు కొరకుఁగా గోరపడి
కొడుకువైరి భక్తిఁ గూడిన యాతని
నడవిలోఁ జంపిన యతఁడు వో యితఁడు ॥ అరు ॥

ఆలితమ్మని రాకకలరి మెచ్చెడిచోట
ఆలుఁ దానును నుండి యందులోన
ఆలిచంటికింద నడ్డమువడుకున్న
ఆలవాలమువంటి అతఁడు వో యితఁడు ॥ అరు ॥

సవతి తమ్ముఁడు గోవుఁ జంపఁ బట్టుక పోయి
సవతి తమ్మునియింట సడిఁబెట్టఁగా
సవతులేనిపంటఁ జప్పరించివేసి
అవల యివల సేసి నతఁడు వో యితఁడు ॥ అరు ॥

తొడ జనించిన యింతి దొరకొనాపద సేయ (?)
దొలఁ (డ?) గి తోలాడెడి దొడ్డవాని
తొడమీఁద నిడి వానికడుపులో తొడవులే
యడియాలమగు మేని యతఁడు వో యితఁడు ॥ అరు ॥

పదము దానొసఁగుచుఁ బదమడుగగఁ బోయి
పదము వదము మోవఁ బరగఁ జేసి
పదమునవె దివ్యపదమిచ్చి మనుమని
నదిమి కాచినయట్టి అతఁడు వో యితఁడు ॥ అరు ॥

అత్తకొడుకుపేరి యాతనిఁ దనకూర్మి
యత్తయింటిలోన నధికుఁ జేసి
మత్తిల్లు తనతోడ మలసిన యాతని
నత్తలిత్తల సేసినతఁడు వో యితఁడు ॥ అరు ॥

పాముతోడుతఁ బోరి పంతముగొనువాని
పాముకుఁ బ్రాణమై పరగువాని
ప్రేమపుఁ దనయుని బిరుదుగా నేలిన
ఆమాటనిజముల అతఁడు వో యితఁడు ॥ అరు ॥

ఎత్తుక వురవడినేఁగెడి దనుజాని
యెత్తుకలుగు మద మిగుర మోఁది
మత్తిల్లు చదువుల మౌనిఁ జం
ఆత్తలేని యల్లుఁడతఁడు వో యితఁడు ॥ అరు ॥

బిగిసి మేఁకమెడ పిసికెడి మాటలు
పగలుగాఁగ రేయివగలు సేసి
జగములోన నెల్ల జాటుచుఁ బెద్దల
అగడుసేయఁ బుట్టినతఁడు వో యితఁడు ॥ అరు ॥

మెట్టనిచోట్ల మెట్టుచుఁ బరువులు
పెట్టెడిరాయ ❇
కట్టెడికాలము కడపట నదయుల (?)
నట్టలాడించిన అతఁడు వో యితఁడు ॥ అరు ॥

తలఁకకిన్నియుఁ జేసి తనుఁగాని యాతని
వలెనె నేఁడు వచ్చి వసుధలోన
వెలుఁగొంది వేంకటవిభుఁడై వెలసిన
యలవిగాని విభుఁడతఁడు వో యితఁడు ॥ అరు ॥ 8

**22 రేకు** **శ్రీరాగం**

చండ ప్రచండాది జయ విజయులన్
అండఁ బూజించి హరికటుగదా పూజ ॥ పల్లవి ॥

కూర్మ భూమ్యాదులను గోరికఁ బ్రతిష్ఠించి
ధర్మముఖ్యంబుల నధర్మాదులన్
కర్మగతిఁ జామర గ్రాహిణులఁ బూజించి
మర్మంబుగా హరికి మరికదా పూజ ॥ చండ ॥

గరుడసేనేశులను ఘనుని శేషుని మరియు
వరమతులఁ బాదసంవాహినులను
కరమొప్ప శంఖచక్రగదాసి శార్ఙ్గముల
అరసి పూజించి హరికిన (రిక?) పుడుగా పూజ ॥ చండ ॥

నవకిరీటమును గుండలహార కౌస్తుభము
లవిరళపుఁ బీతాంబరాదులలర
వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరు పూజ
యివదఁ(ల?) దళిగలు పెట్టుఁడిదిగదా పూజ ॥ చండ ॥ 9

❇ ఈ భాగములు రేకులో చిలుము దిన్నవి

## ధన్నాసి

కాయముల కాణాచి కాఁపులము
చాయల మాసుఖము జయమేఁటిదయ్యా ॥ పల్లవి ॥

పంచమహాపాతకాలఁ బైరు విత్తి దేహాల
కంచపుఁ గొలుచులుగా గాదెలఁబోసి
చంచలాలు జవ్వనాలు చవులైన కూరలుగా
నించి భుజియించే మానిజమేఁటిదయ్యా ॥ కాయ ॥

ఉడివోని లంపటాన నూళ్ళుఁ బల్లెలు నెక్కి
యిడుమల మమతల నిండ్లు గట్టి
గొడవలానాసల (?) కూరిమి సంపదల
పొడవైన మామతి పొందేఁటిదయ్యా ॥ కాయ ॥

పనిలేని మమతల్ల పాపములు బందాలు
గొనకొని ధనములు గూడపెట్టి
కని నేఁడు తిరువేంకటపతి కృపతోడ
తనియని మాతోడి తగువేఁటిదయ్యా ॥ కాయ ॥ 10

## లలిత

ఇటువలెనె పో యింకా మాకు
వటపత్రశాయి మమ్ము వదలీనా ॥ పల్లవి ॥

యన్నఁడు దెల్లవారెనో యాడఁ బొద్దు పొడచెనో
యన్నట్లనుండితి మహర్నిశము
యన్నిటాఁ గడమలేక యెక్కడ నెదురులేక
పన్నగశయనుని కృపనేకాదా ॥ ఇటు ॥

ఏడ వోవువ్యాధులెటు వచ్చి నిలిచెనో
కూడిన యాలరులెల్ల కొండలవలె
నీడలే నిలువులెల్ల నెలవులై యున్నచోట
యీడులేనివివి హరి యీవులేకావా ॥ ఇటు ॥

ఎవ్వరిచేత దాఁచితిమెచ్చుట నిధానములు
ఇవ్వలా మాతలఁచిన యిన్నియు నబ్బె
రవ్వగు వెంకటగిరిరాయఁడు మాతలఁపులో
పువ్వక కాచి పండిన భోగమేకాదా ॥ ఇటు ॥ 11

**ముఖారి**

ఎన్నటి కెవ్వరికితఁడే
అన్నిటానున్న అధికుఁడు ॥ పల్లవి ॥

ఆతుమకంతర్యామీ స్వామీ
యేతరినైనా నితఁడే
పాతకశూరుఁడపారశరీరుఁడు
పూతన ప్రాణ ఘాతకుఁడు ॥ ఎన్న ॥

అక్కర దీరచ నందాఁ జెందా
యెక్కడనైనా నితఁడే
పుక్కిటిలోకాలు పొందుగా నించి మా
దిక్కైనా పరదేవుఁడు ॥ ఎన్న ॥

నేరమి నేరుపు నించాఁ బెంచా
నేరీతినైనా నితఁడే
కారుణ్యానిధి వేంకటవిభుఁడు మా
చేరువై యున్న చెలువుఁడు ॥ ఎన్న ॥

28 రేకు భూపాళం

ఏమో తెలిసెఁ గాని యీజీవుఁడు
నేమపు నెరవిద్య నేరఁడాయ ॥ పల్లవి ॥

కపటాలే నేరిచెఁ గాని జీవుఁడు
ఎపుడైన నిజసుఖం బెరఁగఁడాయ
కపురులే చవిగొనెఁ గాని జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ ॥ ఏమో ॥

కడలేక తిరిగీఁ గాని జీవుఁడీ
నడుమ మొదలు చూచి నడవఁడాయ
కడుపుకూటికిఁ బోయీఁ గాని జీవుఁడీ
చెడని జీతముపొంతఁ జేరఁడాయ ॥ ఏమో ॥

కనియుఁ గానక పోయెఁ గాని జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలకె చొక్కెఁ గాని జీవుఁడు
తనియ నిట్టేమంచి దరిఁ జేరడాయ ॥ఏమో॥ 13

సామంతం

ఏమనవచ్చును గొందరికింపోఁ బులుసులుఁ దీపులు
సోమరితనమున నిన్నిటఁ జొరదీ నా తలఁపు ॥ పల్లవి ॥

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీవల్లభుఁడున్నాఁడుండిన
హృదయము చంచలమిన్నిట నెనయదు నామనసు ॥ ఏమన ॥

ఎక్కడఁ జూచినఁ బ్రాణులకిన్నియు నాచారములే
చిక్కక యిన్నియుఁగైకొని చేయక పోరాదు
మక్కువ నిన్నియు శ్రీహరిమతములె కానీ అయినా
ఒక్కటియేచాలును నాకొడఁబడవితరములు ॥ ఏమన ॥

ఏరీతులనటు చూచిన నిందరు బలుదైవములే
కూరిమినందరినటువలెఁ గొలువకపోరాదు
ధారుణి వేంకటపతిచేఁతలు ఇవియైనాఁగాని
కోరిక నా కితఁడే మరి కొరకొరలిన్నియును ॥ ఏమన ॥ 14

## ఆహిరి

ఓపనయ్య వోపనయ్య
వోపనయ్య యీ వొప్పులే తప్పులు ॥ పల్లవి ॥

ఎక్కడికి నెక్కడ యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు తక్కువే దారణ (?) ॥ ఓప ॥

ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తప్పులే యీ రవ్వలు చివ్వలే సిగ్గులు ॥ ఓప ॥

బొంకులే పొందులు కింకలే గిరులు (?)
వేంకటవిభుఁడ నీజంకెలే జంపులు ॥ ఓప ॥ 15

## 29 రేకు సామంతం

పాడైన యెరుకతో బంధమోక్షములొక్క
గాడిఁగట్టుట తెలివిగానకేకాదా ॥ పల్లవి ॥

భావించి నినుఁ బరబ్రహ్మమని వేదములు
వేవేలు విధుల మొరవెట్టఁగాను
కేవలపు నిన్నుఁ దక్కిన దైవములఁ గూర్చి
సేవింపుటిది తప్పు సేయుటేకాదా ॥ పాడై ॥

సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా
త్పరుఁడవని నలుగడలఁ బలుకఁగాను
వరుసతోఁ బెక్కుదైవములు సంగడి నిన్ను
తొరలఁ గొలుచుట మహాద్రోహమేకాదా ॥ పొద్దై ॥

ఎందుఁజూచిన పురాణేతిహాసములు నీ
చందమే యధికమని చాటఁగాను
చందర్పజనక వేంకటగిరిస్వామి నీ
కందు వెఱఁగనిది యజ్ఞానమేకాదా ॥ పొద్దై ॥

## సామంతం

కొంచపడితినొక కొన్నాళ్ళు
ఇంచుకించుకిపుడెరిఁగితి నేను ॥ పల్లవి ॥

ముట్టుపాఁతవలె మురిగిన దేహము
గుట్టున దాఁచితిఁ గొన్నాళ్ళు
ఇట్టే సుఖమని యిన్నిటి యోనుల
ఒట్టుక కాఁపురముండితి నేను ॥ కొంచ ॥

మురికి కడువలే ముంచిన హేయము
కురిసితి నేనొక కొన్నాళ్ళు
తెరపి లేక యీ దేహపురోఁతల
మొరఁగి దాఁచితిని మూలల నేను ॥ కొంచ ॥

విప్పుచు ముడుచుచు వెంట్రుకతుట్టెల
కొప్పులె పెట్టితిఁ గొన్నాళ్ళు
అప్ప వేంకటనగాధిప మీకృప
యిప్పుడు వెలసితి నిదివో నేఁడు ॥ కొంచ ॥ 17

## నాట

తనకేఁటి యేతులిందరిలోన
పెనఁగుచు నూరక బిగిసీఁగాక ॥ పల్లవి ॥

మరచెనా తనపాటు మాలజీవుఁడు దొల్లి
కొరమాలి బహుయోనికూపముల
పొరలి హేయములోనె పుంగుడువడి వచ్చి
మొరఁగి తా దొరనంట మురిసీఁగాక ॥ తన ॥

పాసెనా తనపాటు పాపదేహి తా
గాసిఁ బడిన భంగములెల్ల
చేసిన తనతొంటి చేఁతలన్నియును
మాసెననుచు నిట్టె మలసీఁగాక ॥ తన ॥

విడిచెనా తన పాపవిధులు ప్రాణుఁడు మున్ను
అడరి మానుషరూపమైనంతనే
చెడక వేంకటపతి సేవించి సకలము
కడుగుకొనెడి బుద్ధి కనవలెఁగాక ॥ తన ॥ 18

## రామక్రియ

అంటుకోకురో యమ్మలాలా యీ
మంటవద్ద కోరికల మాఁటు వారము ॥ పల్లవి ॥

మాసిన యాసలనెడి మాలెత వెంట వెంటనే
పాసి వుండలేక బాధఁబడ్డవారము
బేస బెల్లి యెంగిలైన పెదవినంజుడు నోరఁ
దీసి తీసి సారె సారెఁ దిన్నవారము ॥ అంటు ॥

ఇట్టు నట్టు ముట్టరాని హేయమైన తోలుఁదోలు
కుట్టి కుట్టి సిగ్గులమ్ముకొన్నవారము
ముట్టు సేయుచోటనే మూలమూల సారె సారెఁ
బుట్టి పుట్టి యాపదలఁ బొందువారము ॥ అంటు ॥

చంపి చంపి జీవులనే చవులంటఁ జెడ్డతోలుఁ
గొంపలోనఁ దెచ్చి పెట్టుకొన్నవారము
ఇంపుల నిప్పుడు వేంకటేశుఁజేరి భవముల
చింపి యింటి హరిభక్తి చరవారము (?) ॥ అంటు ॥

## 30 రేకు దేవగాంధారి

ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు - వాని
బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలువోయరే ॥ పల్లవి ॥

గామిడై పారితెంచి కాఁగెడి వెన్నలలోన
చేమపూవుకడియాల చేయిపెట్టి
చీమగుట్టెనని తనచెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయేవాని వెడ్డు వెట్టరే ॥ ఇట్టి ॥

ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగఁ బెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే ॥ ఇట్టి ॥

ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పఁడైన వేంకటాద్రి అసవాలకుఁడు (?) గాన
తప్పకుండఁబెట్టె (బట్టి?) వాని తలకెత్తురే ॥ ఇట్టి ॥ 20

## భూపాలం

❋మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన పల్లవి ॥

లేదు వేదవిధి లేశమును
మేదిని భరమై మించినది
పాదుపడదు చూపరకు భువి
గాదిలిసుతుపై గనలె జనకుఁడు ॥ మేలు ॥

కనకము చవి చెడెఁ గడుఁగడును
ఘనన్నపబాధలు గదిమినవి
దనుజాల కతివలు దలఁకెదరు
ఎనయ బలాధికులెవ్వరు లేరు ॥ మేలు ॥

అసుర సతుల పుణ్యము ఘనము
కస (సి?) మసఁగెడి కలికాలమహిమ
పసగల వేంకటపతి యిఁకను
వసుధలోని నెవ్వగలుడుపఁగను ॥ మేలు ॥ 21

34 రేకు

## సామంతం

లోకములోపల లూటిబెట్టు - ఇది
కైకొని హరి యెరఁగవుగా నీవు ॥ పల్లవి ॥

ములుగుచు వెనకయు ముందరయును నొచ్చి
పలుమారుఁగుంటెడి వసురము
నెలకొని వెదకేను నిన్నమాపటినుండి
నలిననాభుఁడ కానవుగా నీవు ॥ లోక ॥

---

❋ ఇది 38-వ రేకునను గలదు, 3వ చరణమున ఆసవాలకుడు' అని పా ఇది 38 -వ రేకునను గలదు

భంగించి తొల్లియుఁ బలుమారు గొనిపోయి
దొంగలు విడిచిన తురగము
ముంగిటలేదు యేమూల నొదిగినదో
అంగజపతి (పిత?) అరయవుగా నీవు ॥ లోక ॥

కొంకక యడవి మాఁకులుఁ గంపలు మేసి
బింక మెడలి పారు పెనుమృగము
వేంకటపతి దీని వెదకి కానలేము
సంకె వాయుఁ దేర్చవుగా నీవు ॥ లోక ॥

**35-వ రేకు భూపాళం**

అన్నివిభవముల అతఁడితఁడు
కన్నులు వేవేలుగల ఘనుఁడితఁడు ॥ పల్లవి ॥

వేదాంతకోట్ల విభుఁడితఁడు
నాదబ్రహ్మపు నడుమితఁడు
ఆది నంత్యములకు నరుదితఁడు
శ్రీదేవుఁడు సరసిజనాభుఁడితఁడు ॥ అన్ని ॥

భవములణఁచు యదుపతి యితఁడు
భువనములిన్నిటికిఁ బొడవితఁడు
దివికి దివమైన తిరమితఁడు
పవనసుతు నేలినపతి యితఁడు ॥ అన్ని ॥

గరుడని మీఁదటి ఘనుఁడితఁడు
సిరులిందరికి నిచ్చే చెలువితఁడు
తిరువేంకటనగము దేవుఁడితఁడు
పరమపదమునకుఁ బ్రభుఁడితఁడు ॥ అన్ని ॥

## బౌళిరామక్రియ

అదరీ బెదరీ నంతనంత
అదవదలై మాయామృగము ॥ పల్లవి ॥

పొలసీ మలసీఁ బొదలీఁ గదలీ
నెలసీఁ బలుమారు నెలవులను
కలసీ మృగములఁ గ్రమ్మర బెదరీ
అలసీనటు మాయామృగము ॥ అదరీ ॥

దాఁగీ లోఁగీఁ దటుకన వెనుకకు
వీఁగీ నేఁగీ విసవిసనై
రేఁగీగతి వచరింపుచుఁ జూపుల
నాఁగీనదె మాయామృగము ॥ అదరీ ॥

వెంకటగిరి రఘువీర నీముందర
కొంకీఁ గొసరీఁ గొనగొనలఁ
జంకెల బాణాసన బౌణంబున
సంకెలఁ బడె మాయామృగము ॥ అదరీ ॥ 24

37-వ రేకు సామంతం

ధనముగని మరికదా ధనికుఁడౌట - మొదల
తనుఁ దానెఱుఁగలేని తలపేఁటి తలఁపు ॥ పల్లవి ॥

మచ్చికల నినుఁగొలిచి మరికదా సుఖులౌట
యెచ్చోట నేవేల్పులెవ్వరైన
అచ్చుపడ నటువంటి హరి నిన్నుఁ గొలిచి నీ
మెచ్చువడయఁగలేని మేలేఁటి మేలు ॥ ధనము ॥

కందువగ నినుఁ గొలువఁగనికదా ఘనులౌట
యెందునరుదగు వేల్పులెందరైన
అందముగ పరదైవమని నిన్నుఁ గనలేక
గొందిఁబడి పారలేటి కూడేఁటి కూడు ॥ ధన॥

వేసరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ
దాసులై మరికదా ధన్యులౌట
వాసి వట్టముకొరకు వదలి దినములచేతఁ
బాసి పోయినవెనక పరమేడ పరము ॥ ధన॥

42 రేకు ఆహిరి

ఇట్టె సంసారికేదియు లేదాఁయ
తట్టువడుటేకాని దరిచేరలేదు ॥ పల్లవి

ములిగి భారపుమోపు మోఁచేటివాఁడు
అలసి దించుకొను నాడాడను
అలరు సంసారికి నదియు లేదాయ
తొలఁగని భారమెందును దించలేదు ॥ ఇట్టె ॥

తడవి వేఁపచేఁదు త్రావెడివాఁడు
ఎడయెడఁ దినుఁ దీపేమైనను
అడరు సంసారికి నదియు లేదాయ
కడుఁ జేఁదెకాని యెక్కడఁ దీపులేదు ॥ ఇట్టె ॥

దొరకొని హేయమే తోఁడేటివాఁడు
పరిరవించును మేనఁ బరిమళము
అరిది సంసారికి నదియు లేదాయ
ఇరవు వేంకటపతి నెఱుఁగలేఁడు ॥ ఇట్టె ॥

46 రేకు ఆహిరి

చాలదా నా సంసారము
గాలియుయ్యేలలఁ దొలఁగక యూఁగవలసె ॥ పల్లవి ॥

పాపపుణ్యములనెడి బల్లిదుల వెంటనే
దీపించు బంటనై తిరిగి తిరిగి
పైపైనె దేహంపుఁ బల్లెలొసఁగిన నరక
కూపముల మడి దున్నుకొని బ్రదుకవలసె ॥ చాల ॥

చిత్తమను విభుఁజేరి చెలఁగి విషయంబులకు
కొత్తగమికాఁడనై కొలిచి కొలిచి
హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గత్తంపు మొగసాలఁ గలదించవలసె (?) ॥ చాల ॥

గాటంపు దురితములకై జీతగాఁడనై
చేటైన కోరికలఁ జేరిచేరి
ఈటాడఁ దిరువేంకటేశుఁ గనకిన్నాళ్ళు
కోటకొమ్మలకెగసి గుంపించవలసె ॥ చాల ॥ 27

47-వ రేకు శోకవరాళి

వేంకటగిరి గోవిందుఁడా
యింకా నొకరో యిద్దరొ మీరు ॥ పల్లవి ॥

పచ్చలు దాచిన బాహుపురులతో
అచ్చపుఁ గరముల అందముతో
అచ్చలు నిచ్చలు నలను (రు?) దురిదివో
నిచ్చలు (నిచ్చలు) నీవో నీవో కాని ॥ వేంక ॥

నిలుచుండుటయును నెరిఁ బవళింపుచు
నలరుటయును మీరటు నిటును
జలజాక్షులు దొడ చరచఁగ నొరపుల
వెలయఁగ నిద్రో విభవమిదో ॥ వేంక ॥

తిరువేంకటగిరి దిగువతిరుపతిని
పరమానందపు బహుసిరులు
అరుదుగఁ బొందుచు అధికములందుచు
ఉరగశయనుఁడవొ వొడయఁడవో ॥ వేంక ॥

**48 రేకు** **సామంతం**

ఏమిసేయవచ్చుఁ గర్మమిచ్చినంత కాని లేదు
తాముసేసినంత వట్టు తమకుఁ బోరాదు ॥ పల్లవి ॥

ఇట్టు నట్టు మిట్టిపడ్డ నించుకంతా లేదు - వీఁపు
పట్టగట్ట మోఁపు మోఁచి పాటువడ్డ లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొన్న లేదు
తెట్ట తెరువున నోరుదెరచిన లేదు ॥ ఏమి ॥

అడిగిపరుల బతుకాసవడ్డ లేదు - భీతి
విడిచి నెత్తుటఁ దోఁగి వీరుఁడైన లేదు
అడవులెల్లఁ దిరిగి అలమటించిన లేదు
ఇడుమపాటుఁజొచ్చి యియ్యకొన్న లేదు ॥ ఏమి ॥

వచ్చి వచ్చి వనితల వలపించుకొన్న లేదు
మెచ్చుల గుఱ్ఱమునెక్కి మేటియైన లేదు
ఎచ్చరకఁ దిరువేంకటేశుఁ గొలువకుంటే
ఇచ్చటచ్చట సుఖమించుకంత లేదు ॥ ఏమి ॥

## కాంబోది

వాగె బలువు దైవపురాయా - నీ
రాగె జతనము పరాకెచ్చరికె ॥ పల్లవి ॥

మించులఁ దురగము మిన్నులు మోపఁగ
నంచలఁ గురుచల నాడఁగను
కంచు మించుగా గక్కనఁ దోలితి
పంచాస్త్రగురుఁడ పాదెచ్చరికె ॥ వాగె ॥

పెక్కువతేజిటు పేరెమువారఁగ
తొక్కనిచోట్ల దొక్కఁగను
చుక్కలు మోపఁగ సొంపుగఁ దోలితి
తొక్కుల దేవరదేవెచ్చరికె ॥ వాగె ॥

అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి
లంకెలఁ జాఁగు భళా యెచ్చరికె ॥ వాగె ॥ 30

## 49 రేకు కాంబోది

తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్టు నా
పల్లదా లెవ్వరి పాలయ్యీనో తాము ॥ పల్లవి ॥

మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు
ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా
గాదిలి కర్మములేడఁ గంటివో (దీనో?) తాము ॥ తల్లి ॥

కాఁపుటూరి మంగలోజు గడిమీఁది రాజుగాఁగ
కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు
ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా
పాపము లెవ్వరి పంచపాలయ్యానో తాము ॥ తల్లి ॥

ఒట్టిన మోఁపులు మోవనోపక వూరువిడిచి
వెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు
ఇట్టె నేను శ్రీవేంకటేశుఁ గొలువఁగ నా
చుట్టము లిందరు నేడఁ జొచ్చేరో తాము ॥ తల్లి ॥ 31

## పాడి

నారాయణతే నమో నమో
నారదసన్నుత నమో నమో ॥ పల్లవి ॥

మురహర భవహర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగశరీర నమో నమో ॥ నారా ॥

జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహభవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో ॥ నారా ॥

ఆదిదేవ సకలాగమపూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీవేంకటనాయక
నాదప్రియ తే నమో నమో ॥ నారా ॥ 32

50 రేకు శ్రీరాగం

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా ॥ పల్లవి ॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీ సతీశ సరసిజనేత్ర
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయవసన జగన్నాథా ॥ త్వమే ॥
బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా ॥ త్వమే ॥

వటపత్ర శయన భువనపాలన జంతు
ఘటకార కరుణ శృంగారాధిప (?)
పటుతర నిత్యవైభవరాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా ॥ త్వమే ॥ 33

పళమంజరి

పాలజలనిధిలోఁ బాయని
నీలవర్ణుఁడవట నీవా యిపుడు ॥ పల్లవి ॥

వెదచల్లుమణుల వేయిపడగలను
చెదరని మెరుఁగుల శేషునిపై
మృదువుఁ బరపుగా మెల్లనె పొరలుచు
నిదురవోదువట నీవా యిపుడు ॥ పాల ॥

---

❋ ఇది 61-వ రేకులోను గలదు

పరమ మునీంద్రులుఁ బద్మభవాదులు
ఇరువంకల నుతియించఁగను
అరవిరిమోమున నల్లన నవ్వేడి
నిరతమూర్తివట నీవా యిపుడు ॥ పాల ॥

పగటున సిరియునుఁ బరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకఁగను
తగు వేంకటగిరిఁ దనరుచుఁ జెలఁగేడి
నిగమమూర్తివట నీవా యిపుడు ॥ పాల ॥

**53 రేకు** సామంతం

*సంతత దుఃఖపు జడులాల శ్రీ
కాంతుని మరవక కనరాదా ॥ పల్లవి ॥

మలజలధులఁ బలుమరుఁ దేలుచుఁ గడు
దలఁకుచు నొరలుఁ బాతకులార
నలువున శ్రీహరి నామామృతమే
కొలఁది మీరఁ బేర్కొనరాదా ॥ సంతత

భవపంకములోపలఁ బడి మునుఁగుచు
చవి దలఁచెడి దుర్జనులాల
భవరోగములకుఁ బండితుఁడవు మా
ధవుని నాత్మఁ జెందఁగరాదా ॥ సంతత ॥

కడుఘోరపు మార్గంబున నలయుచు
వడినేఁగెడి తెరువరులాల
చెడని పదవొసఁగు శ్రీవేంకటపతిఁ
దడవి సుఖములఁ జెందఁగరాదా ॥ సంతత ॥

౧ లుచును ౨ దినైన ౩ పొరలుచు ౪ వెదకెడి ౫ నాత్మలోఁ దలఁచఁగరాదా ౬ బల

54 రేకు సామంతం

బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁ గన్నట్టివాఁడు పిన్నవాఁడు ॥ పల్లవి ॥

బిరుసైనదొకకొండ పెనుబాముతోఁ జుట్టి
బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు ॥ బొడ్డు ॥

బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోఁగూడ
పెడచేతనే వేసెఁ (వేసెపి?) బిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపే పిన్నవాఁడు ॥ బొడ్డు ॥

ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై
పెక్కురూపములైన పిన్నవాఁడు
ఇక్కడఁ దిరువేంకటేశుఁడై జగమెల్ల
పిక్కటిల్లినవాఁడు పిన్నవాఁడు ॥ బొడ్డు ॥ 36

56 రేకు పాట

ఆదిపురుషా అఖిలాంతరంగా
భూదేవతారమణ భోగీంద్రశయనా ॥ పల్లవి ॥

భవపాథోనిధి బాడబానల
భవజీమూత ప్రభంజనా
భవపర్వత ప్రళయ భయదనిర్ఘాత దు
ర్భవ కాలకూటభవ బహువిశ్వరూప ॥ ఆది ॥

భవఘోరతిమిరదుర్భవకాలమార్తాండ
భవభద్రమాతంగపంచానన
భవ కమలభవ మాధవరూప శేషాద్రి
భవన వేంకటనాథ భవరోగవైద్య ॥ 37 ॥

**58-వ రేకు సాళంగం**

నీవు తురగముమీఁద నేర్పు మెరయ
వేవేలురూపులై వెదచల్లితపుడు ॥ పల్లవి ॥

పదిలముగ నిరువంకఁ బసిఁడి పింజల యంప
పొద (దు?) ల తరకసములొరపులు నెరపఁగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైనవపుడు ॥ నీవు ॥

సొరిది శేషుని పెద్దచుట్టు పెనుఁగేవడము
సిరి దొలఁక నొకచేతఁ జిత్తగించి
దురమునకుఁ దొడవైన ధూమకేతువు చేత
ఇరవైనబల్లెమై యేచెనందపుడు ॥ నీవు ॥

కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌఁగిట నిన్నుఁ దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువుమని
మెరుఁగుఁగుచకుంభముల మిసిమితో నపుడు ॥ నీవు ॥ 3

**మలహరి**

నిద్దిరించీఁ బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీరమణునికి నొత్తరే పాదములు ॥ పల్లవి ॥

వేఁగుదాఁకఁ జిత్తగించి విద్దెలెల్లనాదరించి
బాగుగాఁ గృపారసము పంచి పంచి
యేగతిఁ బవళించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను ॥ నిద్ది ॥

వాలుఁగన్నుల రెప్పల వడదాఁకి తను తావి
చాలుకొన నూర్పుకలు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత
కాలము కన్నులఁ దిప్పిఁ గప్పరే దోమతెర ॥ నిద్ది ॥

సరగున యోగనిద్ర చాలించి లోకమెల్ల
కరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁడాయె మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు ॥ నిద్ది ॥ 39

**66 రేకు శంకరాభరణం**

దురితమ్మృత్యువట దొంగలట
సిరివరుఁడట దయసేసీనా ॥ పల్లవి ॥

మలయుచునె చేరిన మధుకైటభులను
సెల నెత్తురు వడిచినయట్ల
ఖలులఁ బిడిచి రక్తము వడిఁగ్రోలక
విలయాంతకుఁడట విడిచీనా ॥ దురి ॥

కారించి కనకకసిపుని నఖములఁ
జీరి కడుపు చించిన యతఁడు
ఈరసపసురల యెముకలు విరువక
వీరసింహుఁడట విడిచీనా ॥ దురి ॥

చెనకి దశముఖుని చేతులుఁ దలలును
చినికండలు గోసిన యతఁడు
ఘనుఁడట తిరువేంకటపతి దుష్టులు
తనువులఁ జెండక తడసీనా ॥ దురి ॥ 40

## శ్రీరాగం

ఒక్కఁడవె లోకానకొడయఁడవు నీవె
దిక్కుగా నెవ్వరులేరు తిమ్మినాయఁడా ॥ పల్లవి ॥

బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా
దొడ్డగాఁ బండఁగఁ జూచి దోసకారి మొండిదొర
దిడ్డిఁదీసి కొంటఁబోయ తిమ్మినాయఁడా ॥ ఒక్క ॥

పాలకొల్ని చందిరెడ్డి పంటసేయఁ బొద్దులేక
గాలివీటి కాఁపురానఁ గసుగందఁగా
కోలుపుచు దినమూ నీకొండమీఁది నాయకులు
తీలుపరచేరుగదే తిమ్మినాయఁడా ॥ ఒక్క ॥

కామకొల్ని మారిరెడ్డి కనుచూపువారినెల్ల
కోమలపు చెలుపలు (?) గోరు మొత్తఁగా
ప్రేమముతోఁ గేదారి పెరిగి పండిన పంట
తేమ రేఁగి ఊటువట్టె తిమ్మినాయఁడా ॥ ఒక్క ॥

గుండుఁగంటి దేవిరెడ్డి కొలిచిన వండిపెట్టు
కుండఁ గాపరింటనింట కూడుమోయఁగా
పండిన బండ్లఁగొట్టి పంటలెల్ల నానాఁటి
తిండికొక్క కొలఁదాయ తిమ్మినాయఁడా ॥ ఒక్క ॥

వెలిగొండ కాపిరెడ్డి వేఁకవు జీవనమెల్ల
తలమోఁచి తిరిపెమై తల్లడించఁగా
తెలిసి యాతనితో నొక్కటిగాఁగ నీగుట్టు
తెలిసె వేంకటగిరి తిమ్మినాయఁడా ॥ ఒక్క ॥ 41

**69 రేకు కన్నడగౌళ**

త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన ॥ పల్లవి ॥

కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమధన ॥ త్వమే ॥

మయా వా తవ మధురగతి (?)
భయాదిక (దిహ?) విభ్రాంతో2హం
తయా విమలం (?) దాతవ్యా
దయా సతతం ధరణీరమణ ॥ త్వమే ॥

ఘనం వా మమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనాద్భున వేంకటగిరిరమణ ॥ త్వమే ॥ 42

**74 రేకు లలిత**

భవములు వీడఁగఁ బాలించి
చవి మరపెను మోక్షము తెరువు ॥ పల్లవి ॥

కర్మకోట్లకు గడిచీటిచ్చెను
నిర్మలమతులకు నేఁడిపుడే

ధర్మమార్గమునఁ దడవి నడచుటకు
నర్మిలిఁ బుణ్యములందుటకు ॥ భవ ॥

ముంజేతద్దము మూలదాముగా (?)
సంజీవని సరసత నొసఁగె
గొంజ సుకృతములు కుమ్మరించి హరి
రంజించెను సర్వజనులకు ॥ భవ ॥

పట్టముగట్టెను ప్రాణులకెల్లను
గట్టిగఁ దిరువేంకటవిభుఁడు
ఒట్టిన యాపదలూడఁదోలి జను
లిట్టే నిజసుఖమిచ్చుటకు ॥ భవ ॥ 43

**ఆహిరి**

నన్నునింత సేయుకంటె నవ్వులున్నవా పంట
మన్నుపైఁడిముద్దగాఁగ మన్నువూసె (?) నితఁడు ॥ పల్లవి ॥

పంచమహాపాతకులఁ బరమపావనులఁగా
వించఁ బూనె నిందుకంటె విద్యలున్నవా
ఇంచుకంత హరినామమింతలోనె ముట్టు
పెంచు దెచ్చి మాణికపుబిల్ల సేసె నితఁడు ॥ నన్ను ॥

మాలవాని కష్టవిద్య మందవెట్టి బ్రహ్మవిద్య
పాలుసేసె నిందుకంటె బ్రతుకున్నదా
నాలుకందునున్న విష్ణునామమంత్రము చెప్పు
తోలుబిల్ల మాడకంటె దొడ్డసేసె నన్నును ॥ నన్ను ॥

కుక్కఁ దెచ్చి గంగిగోవు కొదమగాఁగ భూమిలోన
ఒక్కమాట యింతసేయ నోపవచ్చునా
దిక్కులందు వేంకటేశు దివ్యనామము రోఁత
కక్కుఁగూటి నమృతజలధిఁ గావించె నన్నును ॥ నన్ను ॥ **44**

## భూపాళం

ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయమలర భజింపరో మీ
రిటు ధనుర్మాసముల విధులన్ ॥ పల్లవి ॥

వేగ నాలుగు ఘడియలనఁగా
వేదవేద్యులు లేచి సరగున
నాగమోక్తవిధులను తమదేహానుగుణములుగా
వేగమున సంధ్యాదులొగిఁ గా
వించి విమలాంబోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడ
పక ధనుర్మాసముల విధులనె ఘనులు ॥ ముద ॥

*పరగు చీనాంబరములను నతి
పరిమళమ్ముల బుష్పముల కడు
వెరవుగా వేంకటపతి (కినై?) వేద్యసంగతుల
అరుదుగా ధూపముల బహుదీ
పాదులను తాంబూల విధులను
పరగఁ బూజింపుఁడు సమస్త
ప్రభు ధనుర్మాసమున విధులఁ ఘనులు ॥ ముద ॥ **45**

---

* ఈ రెండు చరణముల నడుమ మఱొక్క చరణము వ్రాయుటకు వలసిన చోటు రేకులో విడువఁబడినది ఈ రెండు చరణములందు కడపటి పాడిగింపు తాళమితిని మీరినట్లు వింతగానున్నది

## మేచబౌళి

అచ్చపు రాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ ॥ పల్లవి ॥

ఊరుఁగాయలును నొద్దికచద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవులు గొంటివి కృష్ణా ॥ అచ్చ ॥

ఆకసంబున కాపుర ముఖ్యులు
నాకలోకపు నాందులును (?)
కైకొని యజ్ఞకర్త యాతఁడని
జోకఁ గొనియాడఁ జొక్కితి కృష్ణా ॥ అచ్చ ॥

పేయలు లేవు పిలువుఁడనుచు
కోయని నోరఁ గూఁతలను
మాయల బ్రహ్మము మతము మెచ్చుచు
చేయని మాయలు సేసితి కృష్ణా ॥ అచ్చ ॥ * 46

**75 రేకు** **( రాగము పేరునకు చోటు విడువఁబడినది )**

ఈతఁడే హరుఁడు యీతఁడే యజుఁడు
ఈతనికి నీచేఁతలెంత ఘనమటుగాన ॥ పల్లవి ॥

కడుఁ బెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన
కడుపులో నిడుకొన్న ఘనుఁడు
వెడలి పూతకిచంటివిషము దాఁగినయంత
వడిఁ దనకు నేమాయ వట్టిబూమెలు గాక ॥ ఈత ॥

---

* కడపటి చరణమున వేంకటేశ ముద్రలేదు గనుక మరికొన్ని చరణములీ సంకీర్తనమండి ఏ కారణముచేతనో రేకులో పదలఁబడినవని యూహింపవలసి యున్నది

ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు
డుల్లసిల్లుచు నీతఁడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుఁడవని నిన్నుఁ బరిణమింతురుగాన (క?) ॥ ఈత ॥

తిరువేంకటేశ్వరుఁడు దేవదేవోత్తముఁడు
పరిపూర్ణుఁ డచ్యుతుఁ డభవుఁడు
శరణాగతుల రక్షసేయు (వా?)ఁడను మాఁటి (?)
గురుతుగాఁ దలపోసి కొనియాడఁగా వలసె ॥ ఈత ॥ 47

( రాగము పేరునకు చోటు విడువఁబడినది )

నీ కథామృతము నా నిరత సేవన నాకు
చేకొనుట సకలసుఖసేవనంబటుగాన ॥ పల్లవి ॥

ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పారము
ఇదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన ॥ నీక ॥

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహితమార్గము
ఇదియె బహులోకహితభేషజము నాకు
ఇదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన ॥ నీక ॥

ఇదియె దానఫలమియ్యఁ జాలును నాకు
ఇదియె తపవిరహిత కర్మము (?)
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటుగాన ॥ నీక ॥ * 48

* ఈ సంకీర్తన కొన్ని పాదములలో యతి గానరాదు అన్నమాచార్యుల రచనలో ఇది చాల వింత

**79 రేకు** **దేశాక్షి**

ఎవ్వరుగల రెవ్వరికి
ఇవ్వల నవ్వల నితఁడేకాక ॥ పల్లవి ॥

ముద్ద సేసినటు మొదలఁ గడుపులోఁ
బెద్దగాఁ దాఁ బెరుగునాఁడు
ఒద్దనెవ్వరుండిరొకరైనా
ఒద్దికైన బంధుఁడొకఁడేకాక ॥ ఎవ్వ ॥

వరతఁ బోవునట్టి వడి సంసారపు
తెరలఁ దగిలి తాఁ దిరుగునాఁడు
వెరవకుమని భావించువారెవరు
తరితోడ నీతఁడె కాచుఁగాక ॥ ఎవ్వ ॥

ఉడుకఁ బెట్టినట్టి వుడివోయిన నరకాల
నుడుకుచుఁ దానుండునాఁడు
తడవువారెవ్వరంతటఁ దన్ను
కడవేగ వేంకటపతిగాక ॥ ఎవ్వ ॥ 49

**80 రేకు** **ముఖారి**

కనుఁగాక పుణ్యాలు కడఁబడెనా
తనువు లేదో చేతనము లేదో ॥ పల్లవి ॥

మోసపోతిననేల మురుగ వగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మెనా
దాసుఁడుగాఁ దా లేఁడొ తలఁప శ్రీహరి లేఁడొ
వీసమంతగాలమైన విధిలేదో ॥ కను ॥

తల్లడించి పడనేల దైవము దూరనేల
చెల్లఁబో నేఁడే పండి పొల్లవోయెనా
ఉల్లములో హరి లేఁడో ఒద్దికతోఁ దా లేఁడో
కొల్లలాడఁ బుణ్యములకోరిక లేదో ॥ కను ॥

చచ్చి చచ్చి పుట్టనేల జముబారిఁ బడనేల
నొచ్చి నొచ్చి మరుచేత నొగులనేల
యిచ్చలేదొ తిరువేంకటేశుఁడొద్దనె లేఁడో
నిచ్చ నిచ్చఁ దనకింత నేరుపు లేదో ॥ కను ॥ 50

**పాడి**

కలుషపు చీఁకటి గలుగఁగను
వెలుఁగు లోకముల వెలసిన యట్లు ॥ పల్లవి ॥

మునుకొని పాతకములు గలుగఁగఁబో
జనులకుఁ బుణ్యము చవులాయ
ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి
కనకము ప్రమోదకర్మైనట్లు ॥ కలుష ॥

జగములోపల విషముగ గలుగఁ బో
మిగులఁగ నమృతము మేలాయ
వగపు గలుఁగఁగా వడి సంతోషం
బగపడుటిందరి కబ్బురమాయ ॥ కలుష ॥

బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో (?)
మహిమల శ్రీహరి మనసాయ
విహగగమనుఁడగు వేంకటేశ్వరుఁడు
ఇహమియ్యఁగఁ బరమిచ్చినట్లు ॥ కలుష ॥ 51

( రాగము పేరు లేదు )

ఓపనయ్య వోపనయ్య
ఓపనయ్య యీ యొప్పులే తప్పులు ॥ పల్ల

ఎక్కడికి నెక్కడ - యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు - తక్కువే దారణ ॥ ఓప

ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తవ్వులే యీరవ్వలు - చివ్వలే సిగ్గులు ॥ ఓప

బొంకులే పొందులు - కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీ - జంకెలే జంపులు ॥ ఓప

82 రేకు శంకరాభరణం

అధమునికి (ఁడగు?) నను విధాయకులు విధియించరో
విధిలోనఁ గొంత దుర్విధి నెరపినాఁడ ॥ పల్లవి

పాతకుని పాపాలు పరిహరింపించరో
భూతంబులాల తోఁబుట్టులాల
యేతులకు హరిఁ దలఁచి యిటువంటి యీ మేన
బూతుఁజేఁతలనె వొరపులు నెరపినాఁడ ॥ అధ ॥

పాపకర్మునికి భృగుపతనంబు చూపరో
తాపత్రయములాల తమ్ములాల
దీపించు హరిఁ దలఁచి ధృతిలేక మరి మనో
వ్యాపారములు గొన్ని వడిఁ దలఁచినాఁడ ॥ అధ ॥

చంచలున కేది నిశ్చయవిధి విధించరో
పంచేంద్రియములాల బంధులాల
ఎంచనరుదగు వేంకటేశ్వరుఁ బొగడునోర
కాంచి యితరుల నాలికకుఁ జేర్చినాఁడ ॥ అధ ॥

## లలిత

హితమిదియే కాకిఁక లేదు - మా
గతిఁ జెరి (?) నీకృపె కలదిది యెల్లా ॥ పల్లవి ॥

పాతకకోట్లం బాయునుపాయం
బేతరిఁ జూచిన నిఁక లేదు
చైతన్యాత్మక సకలేశ్వర నీ
చేతిదె ప్రాణుల జీవనమెల్లా ॥ హిత ॥

భవబంధంబులఁ బాయునుపాయం
బివల నవల మారి (కిఁ?) క లేదు
ధ్రువవరదుఁడ కౌస్తుభధర నీకృప
చవిచేతివె మాసంపదలెల్ల ॥ హిత ॥

పరమపదంబగపడు విభవము నీ
కరుణే కానిఁకఁ గడలేదు
తిరువేంకటగిరి దేవుఁడ నీకే
భరము జంతువుల పనులివి యెల్లా ॥ హిత ॥ 54

## గుండక్రియ

పాయమంట ముదిమంటా బహురూపము - యిఁక
నేయెడఁ గాచెదు మము నిందిరారమణ ॥ పల్లవి ॥

అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
పన్నుకొని తిరిగేరు బహురూపాలు
ఎన్నిక దినములలో నెవ్వరికి నేమేమి గల
రిన్నిటికి నీవె నాకు నిందిరారమణ ॥ పాయ ॥

చుట్టమంటా పక్కమంటా సుఖమంటా దుఃఖమంటా
పట్టులేక తెచ్చుకొన్న బహురూపము
వట్టివెతలఁ బడి వాడుదేరేము
ఎట్టు సేసినను జేయుమిందిరారమణ ॥ పాయ

తల్లులంటాఁ దండ్రులంటా తప్పులంటా నొప్పులంటా
బల్లిదులఁ జేయచేని బహురూపాలు
వెల్లిగొన్న కృపతోడి వేంకటేశుఁడ నాకు
నెల్లనాఁడు నీవే కలవిందిరారమణ ॥ పాయ

**84 రేకు** **దేవగాంధారి**

ఈజీవునకు నేది గడపల తనకు
నేజాతియును లేక యిట్లున్నవాఁడు ॥ పల్లవి ॥

బహుదేహకవచములఁ బారవేసినవాఁడు
బహుస్వతంత్రముల నాపదనొందినాఁడు
బహుకాలముల మింగి పరవశంబైనాఁడు
బహుయోనికూపములఁ బడి వెడలినాఁడు ॥ ఈజీ ॥

పెక్కుబాసలు నేర్చి పెంపు మిగిలినవాఁడు
పెక్కునామములచే బిలువఁబడినాఁడు
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ
పెక్కులాగులఁ బెనఁగి బెండుపడినాఁడు ॥ ఈజీ ॥

ఉండనెన్నఁడుఁ దనకు ఊరటెన్నఁడు లేక
యెండలకు నీడలకు యెడతాఁకినాఁడు
కొండ (ల) లో నెలకొన్న కోనేటిరాయని
యండ చేరెదననుచు నాసపడినాఁడు ॥ ఈజీ ॥

## వరాళి

దిక్కులేకపోయే నిట్టే దినదినము
వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వఁడో ॥ పల్లవి ॥

గుత్తముగ నెల్లవారు కుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టుకొని బయటవేసిన
మెత్తనిదంటాఁ బట్టి మింగె నెవ్వఁడో (?) ॥ దిక్కు ॥

బంతిగాఁగ నెల్లవాఁరు పండేటిమంచము
గుంతలో విరుగఁదోసెఁ గూళఁడెవ్వఁడో
దొంతుల కడవలోన తొరలి దాఁచిన పెద్ద
పొంతకూటికుండఁ గొంటఁ బోయెనెవ్వఁడో ॥ దిక్కు ॥

సొరిది సంతలలోని సుద్దులెల్ల విని విని
విరసములెల్లఁ బాపే విభుఁడెవ్వఁడో
తిరువేంకటగిరి దేవుఁడై యిందరికిఁ
గరుణ లోకము గాచే ఘనుఁడెవ్వఁడో ॥ దిక్కు ॥ 57

## దేశాక్షి

కంటి నఖిలాండ (తతి?) కర్త నధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి - నిజమూర్తిఁ గంటి ॥ పల్లవి ॥

మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజనవరత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె కంటి ॥ కంటి ॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపుఁ బుణ్యతీర్థములెల్లఁ బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరిఁ గంటి ॥ కంటి ॥

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపుఁ జూడఁగంటి ॥ కంటి ॥ 58

**86-వ రేకు దేసాళం**

❋ ఎన్నాళ్ళున్నా నిట్టే కదా
విన్నని వెరగులె వేఁడుకలాయ ॥ పల్లవి ॥

భువి నెట్టున్నాఁ బోయేదే కా
చవులకుఁ జవియగు శరీరము
ధ్రువమని యీ సుఖదుఃఖ రోగములు
భవముల కిదియే బందములాయ ॥ ఎన్నా ॥

ఎంత వొరలినా నిదే తాఁగద (?)
కంతల కంతల కాయమిది
బొంత దగులుచుక పొరలఁగఁ బొరలఁగ
సంతకూటములె సరసములాయ ॥ ఎన్నా ॥

కైపుసేసినా ఘనమౌనే కా
పాపముఁ బుణ్యముఁ బైపైనే
యీ పుట్టుగునకు ఈ వెంకటపతి
దీపించఁగఁ బెనుఁదెరువొకటాయ ॥ ఎన్నా ॥ 59

---

❋ ఈ పాట ౩౮-వ రేకునను గలదు అందు దీని రాగము 'దేసి' ౨ ఇదే కదా ౧ సినను

## ఆహరి

కలియుగంబునకుఁ గలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె ॥ పల్లవి ॥

బోధల హరినుతి పాడమెను శూద్ర
స్సాధని కలిదోషము మాన్ప
రాధా మాధవరచన సకలజన
సాధువేదమే జగమునఁ గలిగె ॥ కలి ॥

పరమగు వేదము బహుళము చదివియు
హరినెరిఁగినవారరుదనుచు
తిరువాముడియై దివ్యమంత్రమై
వెలసిన (?) పంచమ వేదమె కలిగె ॥ కలి ॥

బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకె దీరదెచ్చట ననుచు
సంకీర్తనమే సకలలోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె ॥ కలి ॥ 60

87 రేకు **శ్రీరాగం**

కత్తరాలు చిమ్ముచుండెఁ గదలుచుండె
చిత్త (జ) జనకుఁడైన శ్రీ మూరితి ॥ పల్లవి ॥

కన్నులఁ జొక్కుచునుండె కంపితము మీఁటుచుండె
సన్నపు సొలపు నిగ్గు సళుపుచుండె
అన్నువ నడిమి యింతి నక్కున నొత్తుచునుండె
ఉన్నతిఁ గోనేటిదరినున్న మూరితి ॥ కత్త ॥

మేసులు ముట్టచునుండె మేడమీఁద నిలుచుండె
కీసిన గోక గిలిగింపుచునుండె (?)
నేసకొప్పురమణికి చెక్కులు నొక్కుచునుండె
తీసిన లంఘితముల దివ్యమూరితి ॥ కత్త ॥

కిలకిల నవ్వుచుండె కిన్నెర వట్టుచునుండె
పలుమెరుఁగులు దోప బాడుచుండె
అలమేలుమంగమీఁద నలరి యొరగి యుండె
వెలయ వేంకటగిరి వేదమూరితి ॥ కత్త ॥

**105 రేకు** **ముఖారి**

మొక్కరో మీరు మోసపోక - మీకు
దిక్కుదెసైన ఆదిదేవునికి ॥ పల్లవి

(మారుచే?) తులీయవద్దు మారుగాళ్ళియవద్దు
బీర (రా?)న గుండెలు గోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన కొండాలు చొఁజవద్దు
ఊరకే మీవారమని వున్నఁ జాలు ॥ మొక్క

సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడి బడి పగ్గాలఁ బారవద్దు
సిడిమీఁద బిత్తరపు బిమ్ములు చిమ్మఁగవద్దు
కడనుం దారి గన్నఁ జాలు ॥ మొక్క

బగ్గన యెక్కడ డొక్కపడునో యేమరవద్దు
బగ్గివడ్డ యమబాధఁ బడవద్దు
ఎగ్గు సిగ్గులేక వేంకటేశుని దాసులఁజేరి
అగ్గలపు పాదరేణువైనఁ జాలు ॥ మొక్క

---

❋ ఈ పాటలో చుక్కలువేసిన చోట రేకు విరిగి పోయినది

106 రేకు శ్రీరాగం

ఎవ్వరిఁ దలఁపఁడు ఎవ్వరి నొల్లఁడు
నవ్వుల తెరువులె నడచీఁ బ్రాణి ॥ పల్లవి ॥

కలుషముఁ బుణ్యము కర్మపుఁ జేనను
వెలయఁగ జీవుఁడు విత్తుచును
కలిగిన సుఖదుఃఖములను గాదెల
కొలుచులు నించుక కుడిచీఁ బ్రాణి ॥ ఎవ్వరి ॥

చెడని ప్రపంచము శాదిదిలో?
నిడుపు గురుచలుగ నేసినది
వడి దేహములను వన్నెల వన్నెల
గడనల చీరలె కట్టీఁ బ్రాణి ॥ ఎవ్వరి ॥

కూరిమిఁ గామక్రోధాదులు మతి
చూరలఁ గొనియెడి చుట్టములే
గారవముల వేంకటపతిఁ గొలువక
చేరి కాఁపురము సేసీఁ బ్రాణి ॥ ఎవ్వరి ॥ 63

108 రేకు ధన్నాసి

ఏలయ్య పరమాత్మ యేలికవు మాకునై
నాలినే పెట్టితివి నాడూను
కాలునికి మమ్ము నరిగాఁపులే కమ్మనుచు
నేలనే తిప్పేవు నేఁడూను ॥ పల్లవి ॥

భారమగు నీటిలోఁ బవళించి నీ వాది
నారాయణుఁడవైతి నాఁడూను
పైరుగా నిందరిని ప్రకృతిలోపలఁదెచ్చి
నారుగాఁ బోసితివి నాఁడూను

నారపేరిడి తండ్రి నందనుని బిలవఁ గరు
ణారసము నించితివి నాఁడూను
చేరి కడు మమ్ము రక్షింపనోపక వట్టి
నేరములె యెన్నేవు నేఁడూను ॥ ఏలయ్య ॥

దట్టముగఁ జొచ్చి యిందరిదేహములలోన
నట్టనడుమెక్కితివి నాఁడూను
అట్టలుగ బ్రహ్మాండమవియించి జంతువుల
నట్టేట ముంచితివి నాఁడూను
ఒట్టి యిందరికి సరయూ (యవు?) దరిని మోక్షంబు
నట్టు కొట్టితి గొంత నాఁడూను
పొట్ట పొరుగునఁ దెచ్చి భూతముల మెడగట్టి
నిట్టి (ట్ట?) పిడినేఁపేవు నేఁడూను ॥ ఏలయ్య ॥

పొలుపుగా మమ్మిట్లఁ బుట్టించుకొరకునే
నలినవాభుఁడవైతి నాఁడూను
పలువేలుపులకెల్ల పదవులిన్నియు నొసగి
నలుగడల నునిచితివి నాఁడూను

చలముకొని దానవులఁ జక్కాడి దేవతల
నలఁకువలు దీర్చితివి నాఁడూను
చెలఁగి యిందరిఁగావ శ్రీవేంకటాద్రిపై
నెలకొనిటు నిలిచితివి నేఁడూను ॥ ఏలయ్య ॥ 6

## సామంతం

గద్దరి జీవుఁడు కామధేనువు మాని
యెద్దుఁ బిదుకఁ జొచ్చె నేది దెరఁగు ॥ పల్లవి ॥

మటమాయములఁ దనమనసె చంచలమంది
ఇటునటుఁ దిరిగిన నేది దెరఁగు
కటకట వూరేలు కర్తే దొంగలఁగూడి
యెటువలెఁ జేసిన నేదిదెరఁగు ॥ గద్దరి ॥

కల్లలాడఁగఁ జొచ్చెఁ గలుషపుమతి సత్య
మిల్లు వెడలఁగొట్టె నేదిదెరఁగు
చెల్లఁబో నోరే చేఁదుమేయఁగఁ జొచ్చె
నెల్లవారికి నింక నేదిదెరఁగు ॥ గద్దరి ॥

తియ్యని వెంకటాధిపుఁ బాసి పరసేవ
కియ్యకొనెడిఁ జిత్తమేది దెరఁగు
అయ్యొ చక్కనిపతి నాలు విడిచిపోయి
యెయ్యెడఁ దిరిగిన నేదిదెరఁగు ॥ గద్దరి ॥ 65

## భూపాళం

నందకధర నందగోపనందన
కందర్పజనక కరుణాత్మ ॥ పల్లవి ॥

ముకుంద కేశవ మురహర
సకలాధిప పరమేశ్వర దేవేశ ❋
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకటవిభవ నమో పరమాత్మ ॥ నంద ॥

ధ్రువ పాంచాలీ స్తుతివత్సల మా
ధవ మధుసూదన ధరణీధరా
భువనత్రయపరిపోషణతత్పర
నవనీతప్రియ నాదాత్మ ॥ నంద ॥

❋ రేకులోని పాఠమిది లయ యతులను బట్టి 'ముకుంద కేశవ - మురహర సకలా - దిక పరమేశ్వర - దేవేశ' అని సరియైన పాఠము గావలయును

శ్రీమన్ వేంకటశిఖరనివాస మ
హామహిమన్ నిఖిలాండపతే
కామితఫలభోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మన్ ॥ నంద ॥

## 111 రేకు ముఖారి

నెరబిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగనమదివో నీ బంటు ॥ పల్లవి ॥

ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవఁగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు ॥ నెర ॥

గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు ॥ నెర ॥

ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు ॥ నెర ॥ ౬

## 116 రేకు ముఖారి

నేర్పుకంటెఁ బెన్నిధి గద్దా
ఓర్పుకంటె సుఖమొకటికఁ గద్దా ॥ పల్లవి ॥

కరుణకు నెక్కుడు గతి యిఁకఁ గద్దా
సరసతకెక్కుడు సరి గద్దా
గురుమతిఁ జత్తము కూరిమి నిలిపిన
వెరవుకంటె * విధమిఁకఁ గద్దా ॥ నేర్పు ॥

కలిమికంటెఁ జీఁకటి మరి కద్దా
బలిమికంటె నాపద గద్దా
గెలుపు (గఁ) దెలిసి లంకించిన మతితోఁ
జెలఁగుకంటె నిజసిరి యిఁకఁ గద్దా ॥ నేర్పు ॥

పోయముకంటె నపాయము గద్దా
కాయపు రోఁతకుఁ గడ గద్దా
పాయక వేంకటపతికృప గోరిన
యీయభిమతమున కెదురిఁకఁ గద్దా ॥ నేర్పు ॥ 68

## సామంతం

మునుకలుగఁ బీలిచీ మూఁడులోకాలు
ధనము బండెలచేతఁ దగనందుకొనుచు ॥ పల్లవి ॥

పరుసవారిఁ బిలువ (బీలువ?) బడిబడిఁ బారితెంచి
ఒరసుదైవాల మిండఁడూళ్ళ వెంట
సిరసు పింఛెముపొగఁ జెరిగిన చుంగులతో
గరుసుమీరిన యీవిఁ గప్పములు గొనుచు ॥ మునుక ॥

లాట భోట కుకుర మరాట దేశాల ఘనుల
కూటువలు గూడించి కోట్లసంఖ్య
పేటలుఁ బేటలు పెనుఁగూటములుగాఁ దెచ్చి
చాటువైన వరములు చల్లువెదలాడుచు ॥ మునుక ॥

---

* ఈ చోట రెండుమాత్రల పదమొకటి లోపించినట్లున్నది

గక్కన నెదురువచ్చి కనిపించుకొను నాఁడె
వెక్కసపు మహిమల వేంకటేశుఁడు
పక్కల వనములెల్లఁ బసిఁడిగాదెల నించి
మొక్కులు గైకొని వరములు గోకొండనుచు ॥ మునుక

## శ్రీరాగం

ఇందిరకు నురముమీఁదిచ్చిన నాఁడు
విందువలె హరి యిందు విచ్చేసె నాఁడు ॥ పల్లవి ॥

పరమపదమునందు బహుదివ్యవరణాలు
హరి గరిమలు పొలుపలరు నాఁడు
గరుడఁడు ననంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులై రిందు నాఁడు ॥ ఇందిర

పాలజలధిలోనఁ బవళించి హరి వచ్చి
భూలోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించి నేలయు మిన్ను బహుదివ్యదేశాలు
గాలించి కోనేటిదరి గైకొంట నాఁడు ॥ ఇందిర

నరసురోరగులెల్ల నలువంకఁ గొలువంగ
పురమైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపదమిదని పాలించె నాఁడు ॥ ఇందిర

## దేవగాంధారి

కలిగి (న?) మతి వృధ గాకుండా
అలరుటె పుణ్యంబగు ఫలము ॥ పల్లవి ॥

ఒనరిన యీ భవమునురనకుండ
ఘనుఁడీ జీవుఁడు గలఫ (లము?)

తనువు మోచి చైతన్యాత్ముని మతిఁ
గనుటె వివేకముగల ఫలము ॥ కలిగి ॥

చేసిన పుణ్యము చెడిపోకుండ
శ్రీ సంపద మెరసిన ఫలము
ఈసుల రేసుల యితరదూషణలఁ
బాసుటె అపురూపపు ఫలము ॥ కలిగి

హరిఁ గొలిచియు మిధ్య గాకుండ
విరసముడిగి చదివిన ఫలము
తిరువేంకటగిరిదేవుని సరిగా
పరులఁ గొలువనిదె బహు ఫలము ॥ కలిగి ॥ 71

117 రేకు పాడి

పృధులహేమకౌపీనధరః
ప్రథితవటుర్మే బలం పాతు ॥ పల్లవి ॥

సూపాసక్తః శుచిస్సులభః
కోపవిదూరః కులాధికః
పాపభంజనః పరాత్పరోయం
గోపాలో మే గుణం పాతు ॥ పృధుల ॥

తరుణః ఛత్రీ దండకమండలు
ధరః పవిత్రీ దయాపరః
సురాణాం సంస్తుతిమనోహరః
స్థిరస్సుధీర్మే ధృతిం పాతు ॥ పృధుల ॥

త్రివిక్రమః శ్రీతిరువేంకటగిరి
నివాసోయం నిరంతరం

ప్రవిమల మసృణ కబళప్రియో మే
దివా నిశాయాం ధియం పాతు ॥ పృథుల ॥ 7

### కేదారగౌళ

నారాయణుని శ్రీ నామమిది
కోరినవిచ్చీఁ గోవో మనసా ॥ పల్లవి ॥

శుకవరదుని సొంపుగఁ దలఁచుటె
సకలభవ విజయము
అకలంకము మహాభయహరణ
మొకటి నొకటి వోహో మనసా ॥ నారా ॥

పక్షిగమన శుభము (పదము?) దలఁచుటే
అభయభోగ విహారమ్మ
వక్షపు లక్ష్మీవరుసే (చే?) సిరులు
లక్షలు గోట్లొల్లవొ మనసా ॥ నారా ॥

ఇంకా నీతలఁపులెన్ని గలిగిన
వేంకటాధిపు సేవించఁగదో
అంకెలకిన్నియునైన యీ (?)
మంకపు గాక నమ్మవో మనసా ॥ నారా ॥

### శ్రీరాగం

పొల్లమెల్లఁ దిరిగిన బోడెద్దు
గరిమెలో (తో?) నెవ్వరికి దగ్గరి రాని యెద్దు ॥ పల్లవి ॥

పురములు సాధించఁ బూనినప్పుడు భూమి
భరమెత్తి నిలచిన బండెద్దు
పరివోని మందల పసులఁ బోఁదోలి శ్రీ
వరుఁడై రోలఁ గట్టువడినెద్దు ॥ పాల ॥

ఒడలెత్తి నాలుగుయుగముల బడిఁ
బడి ధర్మదేవతై పరగినెద్దు
తడవి దేవరలను దామెర (న?) లనుఁ గట్టఁ
గిడఁగి మానిసిరూపు కపిలెద్దు ॥ పాల ॥

గోవైన భూదేవిఁ గూరిమిఁ జేకొని
లావైన వృషభాచలపు టెద్దు
మోపఁగ వేదాలు మొల్లమై సిరితోడ
శ్రీ వేంకటాద్రి మించిన మాయలెద్దు ॥ పాల ॥ 74

## లలిత

అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగ నధికులె యెసఁగఁగను ॥ పల్లవి ॥

పరంపరలగు భవములఁ బొడమియు
చిరంతనులే జీవులిదే
ధురంధరులే దురిత సుకృతముల
జరామరణ విశారదులే ॥ అన్ని ॥

సదా బహుల విషయమత్తులయ్యు
మదాతురులే మనుజులిదే
ముదాసక్తులే మోహవిదూరులే !
చిదానందులే చిరయశులే ॥ అన్ని ॥

భృశం సుఖులే పుణ్యులందరు
సుశాంతాత్ములే శుభమతులే
విశారదులే వేంకటరమణుని
వశంవదులే వరిష్ఠులే ॥ అన్ని ॥ 75

రామక్రియ

ఓయమ్మ యెట్టుసేసె నొకటొకటే
మాయలెల్లఁ జేసినాఁడు మరియింకనెట్టో ॥ పల్లవి ॥

చన్నుదాగి పూతనను సగ్గుడుగాఁ జప్పరించె
మిన్నుదాఁకె సుడిగాలి మెడ దొక్కెను
వెన్న ముచ్చిరిం (లిం?) చి గొల్లవెలఁదులనెల్ల మెచ్చి
పిన్ననాఁడె యింతసేసెఁ బెద్దయైన నెట్టో ॥ ఓయమ్మ॥

మద్దిమాఁకులు విరిచె మామయింటికేఁగి పెద్ద
యెద్దులఁ బీఁచమణఁచె నేమి చెప్పరు (సెప్పను?)
చద్దికూటి ముద్దలోనె జలజాసనుని మాయ
వద్దనక పతిసేసె వాఁడివో నేఁడెట్టో ॥ ఓయమ్మ

కొండవంటి పామునోరు కొచ్చి కొచ్చి చంపి చంపి
మెండుకొని వుక్కణంచె మేనమామను
కొండల వేంకటపతి కోనేటిరాయఁడు
నిండుకృప మముఁ గాచేనేరుపిఁక నెట్టో ॥ ఓయమ్మ॥

121 రేకు ఆహిరి

కటకటా మీరితివి కలికాలమా - పుణ్య
ఘటన గరవై పోయెఁ గలికాలమా ॥ పల్లవి ॥

భూసురుల కామినులు బోయల నామి (య?) కులఁ
జేసుకొని యీండ్లె చిచ్చురికిరి
యీసునను నీవలన నెక్కువకులములెల్ల
కాసు సేయకపోయెఁ గలికాలమా ॥ కట ॥

అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి
వన్నె సెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితిని యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా ॥ కట ॥

అరుదగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు
దొరలకమ్ముడు వోయి తొత్తులైరి
చిరకాల సుకృ త్తమునఁ గొంతైన
కరుణ మార్చితివిగా కలికాలమా ॥ కట ॥

కోవిదుల మను దొరల కులరాణి వాసములు
త్రోవలనె లంజలై తుదిమీరిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబు
గావు వట్టితివిగా కలికాలమా ॥ కట ॥

పట్టభద్రుల నతులు పలుమారు నింద
రిపెంబులై దీనులైరి
ది (ఇ?) ట్టైనఁ దిరువేంకటేశుదాసులు నిన్నుఁ
గట్టవేతురుసుమీ కలికాలమా ॥ కట ॥ 77

# అనుబంధము - 1

# అకారాదిగ రాగ - సంకీర్తన సంఖ్యా సూచి

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| ుదోళి | 178 |
| ఆహిరి | 180, 223, 245, 265, 275, 343, 367 |
| న్నడగౌళ | 170, 212, 356, 368, 42C 481 |
| బోధి | 201, 308, 389 |
| రంజి | 174 |
| ారగౌళ | 209, 269,302 |
| [illegible] | 181, 240 |
| ండక్రియ | 10, 40, 53, 58, 59, 69,102, 113, 125, 148, 190, 263, 285, 316, 318, 324, 325, 331, 332, 339, 340, 370, 401, 404, 408, 417, 448 |
| జ్జరి | 76, 90, 107, 191, 259, 374, 399, 333, 450, 473, 496, 531 |
| ళ | 36, 44, 162, 257, 278, 451, 483 |
| యు | 276 |
| ుగుకాంబోధి | 400 |
| డి | 60, 431, 469 |
| వక్రియ | 172, 279 |
| వగాంధారి | 26, 41, 51, 97, 105, 123, 139, 251, 377, 410, 421, 465, 485, 487 |

| | |
|---|---|
| దేసాళం | 2, 18, 27, 33, 57, 65, 83, 120, 143, 164, 205, 256 |
| దేశాక్షి | 14, 50, 67, 82, 137, 150, 154, 188, 230, 380, 463, 529 |
| దేసి | 228, 260, 281, 441 |
| ధన్నాసి | 39, 72, 99 138, 151,206, 253 378, 475 |
| నాట | 32, 110, 158, 277, 495, 499, 508, 513, 530 |
| నాగవరాళి | 202, 215, 242, 294 |
| నాదరామక్రియ | 176, 208 255, 267, 284 |
| నారాయణి | 29, 81, 124, 203, 293, 379 |
| పళవంజరం | 211, 254, 258, 298 |
| పాడి | 35, 73, 94, 100, 116, 127, 146, 156, 169, 234, 266, 361, 385, 398, 454, 462, 491, 502, 511 |
| బలహంస | 204 |
| బౌళి | 4, 12, 31, 60, 70, 75, 89, 98, 103, 115 121, 131, 134, 136, 144, 159, 198, 222 261, 296, 320, 344, 348, 362, 393 397, 416, 430, 436, 437, 452 456 460, 464, 471, 501, 509, 512 |
| బౌళిరామక్రియ | 71 175, 210, 220, 231, 300, 349, 419 519 525 |
| భంగాళం | 207, 291 |
| భల్లాటి | 179, 309 |

| | |
|---|---|
| భూపాళం | 130 238, 303, 405, 411, 425 |
| భైరవి | 34, 249, 306, 386, 409, 446, 449 |
| మంగళకౌశిక | 8, 23, 79, 232, 241 354, 382 |
| మధ్యమావతి | 292 |
| మలహరి | 96, 135, 187, 199, 217, 250, 384, 403 |
| మాళవశ్రీ | 226, 287, 301, 371 |
| మాళవి | 21, 109, 155, 233, 272, 369, 470, 477 |
| మాళవిగౌళ | 30, 55, 62, 402, 443, 490, 506, 514, 520 |
| ముఖారి | 9, 28, 49, 64, 87, 157, 282, 310, 326, 328, 338, 346, 352, 353, 387, 392, 415, 440, 453 |
| మేఘరంజి | 173, 262, 280 |
| రామక్రియ | 1, 25, 66, 92, 95, 101, 140, 160, 166, 186, 193, 315, 336, 341, 342, 357, 365, 391, 426, 428, 458, 482, 492, 498, 505, 510, 515, 522, 526 |
| లలిత | 6, 19, 22, 38, 43, 48, 54, 68, 78, 91, 108, 119, 126, 149, 161, 165, 197, 225, 229, 239, 246, 252, 264, 312, 317, 322, 323, 330, 334, 337, 345, 347, 351, 358, 360, 363, 375, 376, 388, 395, 396, 406, 412, 414, 418, 424, 429, 438, 442, 447, 461, 468, 478, 480, 484, 486, 494, 503, 504, 527 |
| వరాళి | 24, 45, 88, 142, 152, 167, 182, 221, |

| | |
|---|---|
| | 217, 273, 307, 329, 366, 427, 439, 455, 479 |
| వసంతవరాళి | 5 |
| వసంతం | 184, 288, 299, 304 |
| శంకరాభరణం | 3, 13, 86, 141, 171, 183, 194, 237 270, 290, 383, 415, 445, 459, 507 518, 524 |
| శుద్ధవసంతం | 7, 16, 42, 61, 63, 77, 112, 195, 235, 243, 247, 394, 446 |
| శోకవరాళి | 216, 295, 434 |
| శ్రీరాగం | 47, 56, 74, 122, 128, 133, 147, 168, 248, 271, 274, 297, 327, 373, 422 |
| సామంతం | 11, 15, 37, 52, 84 104, 106, 111, 117, 129, 153, 163, 196, 213, 283, 311, 314, 333, 350, 355, 359, 364, 372, 390, 407, 413, 423, 432, 444, 457, 467, 474, 489, 497, 510, 523 |
| సాళంగం | 118, 244, 321 |
| సాళంగనాట | 17, 20, 85, 93, 114, 132, 139, 145, 185, 224, 268, 289, 313, 319, 335, 472, 476, 488, 493, 500, 517, 521, 528 |
| సౌరాష్ట్రం | 46, 192, 206, 219, 286 |
| హిందోళం | 236, 305, 381 |
| హిందోళవసంతం | 177, 214 |
| హిజ్జిజ్జి | 218 |

# అనుబంధము - 2

# అకారాదిగ సంకీర్తన - రాగ సంఖ్యా సూచి


| కీర్తన | రాగము | కీర్తన సంఖ్య |
|---|---|---|
| అంజనీదేవి కొడుకు | మాళవి | 272 |
| అంతటనే వచ్చికాచు | కాంబోది | 201 |
| అందరికి నెక్కుడైన | మాళవి | 155 |
| అందిచూడగ నీకు | గుండక్రియ | 331 |
| అందుకు హరికథ | మలహరి | 187 |
| అందుల కిదె | సామంతం | 117 |
| అందులకు నందులకు | ధన్నాసి | 72 |
| అచ్చుతుఁడనియెడి | సామంతం | 104 |
| అచ్చుతు శరణమే | శంకరాభరణం | 3 |
| అజ్ఞానులకివి | దేసి | 260 |
| అటమీఁది పనులకు | శ్రీరాగం | 248 |
| అటుగొన్నాళ్ళుందాక | వరాళి | 227 |
| అడర శ్రావణ | రామక్రియ | 160 |
| అడుకులు చక్కిలాలు | దేసాళం | 27 |
| అడ్డములేని నాలిక | బౌళి | 89 |
| అతఁడు లక్ష్మీకాంతుఁ | గుండక్రియ | 59 |
| అతఁడే పో మా యేలిక | మాళవి | 109 |
| అతఁడే యెక్కుడుదైవ | ముఖారి | 387 |
| అతఁడే యెరుఁగును | లలిత | 442 |
| అతఁడే రక్షకుఁ డందరి | దేశాక్షి | 380 |
| అతఁ డేమిసేసినా | శంకరాభరణం | 13 |

| | | |
|---|---|---|
| అతని భజియించరో | లలిత | 108 |
| అదిగాన నీతి | సామంతం | 516 |
| అదిబ్రహ్మాండంబిది | శ్రీరాగం | 373 |
| అడియ నడియునయ్యా | బౌళ | 416 |
| అదె చూడరయ్యా | బౌళి | 509 |
| అదె వచ్చెరాఘవుఁ | నాట | 530 |
| అదె లంక సాధించె | మాళవిగౌళ | 514 |
| అనాది జగమున | నారాయణి | 29 |
| అనాది జీవుఁడన్నియు | గుండక్రియ | 10 |
| అనాది విషయవిహారము | భైరవి | 446 |
| అని బ్రహ్మాదులెంచేరు | మేఘరంజి | 262 |
| అన్నివిధములుఁదానై | దేవగాంధారి | 51 |
| అన్నిమంత్రములునిందే | లలిత | 438 |
| అన్నిటా నిట్టే | దేసాళం | 120 |
| అన్నిటికి నిది పరమౌషధము | లలిత | 358 |
| అన్నిటిపై నున్నట్లు | నారాయణి | 124 |
| అన్నియు నాలో | గుండక్రియ | 190 |
| అనుచుఁ బొగడఁ | పాడి | 234 |
| అనుచు మునులు | భైరవి | 249 |
| అప్పుఁడైన హరి | పాడి | 35 |
| అప్పటి సుఖమేకాని | నాదరామక్రియ | 284 |
| అమరాంగనలదె | దేవగాంధారి | 26 |
| అమ్మేదొకటియును | పాడి | 398 |
| అఱిముఱి | గౌళ | 278 |
| అరుదీ కపీంద్రుని | మాళవి | 470 |

| | | |
|---|---|---|
| అలబ్రహ్మాదుల | నాళంగనాట | 268 |
| అల్లదెకో విజయధ్వజము | సామంతం | 364 |
| అల్లవాఁడే గద్దెమీద | రామక్రియ | 505 |
| అవధారు చిత్తగించు | మాళవిగౌళ | 490 |
| అహోబలేశ్వరుఁ | శ్రీరాగం | 271 |
| అతఁడేపో మా యేలిక | మాళవి | 109 |
| ఆంజనేయ యనిలజ | రామక్రియ | 458 |
| ఆచార విచారా లవియు | లలిత | 395 |
| ఆడరమ్మ పాడరమ్మ | లలిత | 375 |
| ఆతఁడా యీతఁడు | శంకరాభరణం | 141 |
| ఆతఁడితఁడా వెన్న | లలిత | 6 |
| ఆదిమూర్తి యీతఁడు | శంకరాభరణం | 524 |
| ఆదిమూలమే మాకు | ముఖారి | 49 |
| ఆపదలులేని సుఖ | ఆహిరి | 223 |
| ఆయంబిది తెలియంగల | ధన్నాసి | 99 |
| ఆయమేవ అయమేవ | సాళంగనాట | 313 |
| ఆ రూపమునకే హరి | సామంతం | 457 |
| ఆలించు పాలించు | ముఖారి | 338 |
| ఆహా నమో నమో | దేవగాంధారి | 97 |
| ఇంక నేమి సేసేము | లలిత | 252 |
| ఇంత లేకుంటేనది | బౌళి | 198 |
| ఇంతులాల చూడరమ్మ | పాడి | 511 |
| ఇంతే యింతే యింకా | తోడి | 80 |
| ఇందరికిగాచిన నీవు | సామంతం | 350 |
| ఇందరిపై భిన్న భక్తు | రామక్రియ | 101 |

| | | |
|---|---|---|
| ఇందరు నీ కొక్కసరి | మంగళకౌశిక | 8 |
| ఇందిరా నాథుఁడవు | కేదారగౌళ | 209 |
| ఇంగిగా రమణుఁదెచ్చి | బౌళి | 430 |
| ఇందుకు ధ్రువాదు లిటు | దేవగాంధారి | 410 |
| ఇందుకు విరహితవు | ముఖారి | 346 |
| ఇందుకుఁగా నాయెరఁగమి | మాళవశ్రీ | 371 |
| ఇందుకేది వుపాయమో | దేశాక్షి | 150 |
| ఇందులోనఁగలసుఖ | ముఖారి | 87 |
| ఇందులోనె కానవచ్చె | మేఘరంజి | 280 |
| ఇందే వున్నది | దేశాక్షి | 137 |
| ఇట్టిసుద్దులితనివి | నాట | 508 |
| ఇట్టిదివో హరికృప | సామంతం | 372 |
| ఇతఁడు తారకబ్రహ్మ | బౌళి | 159 |
| ఇతఁడే పరబ్రహ్మ | బౌళిరామక్రియ | 519 |
| ఇతఁడే యతఁడు | మాళవిగౌళ | 443 |
| ఇతఁడొకఁడే | పళపంజరం | 298 |
| ఇతరములన్నియు | గుజ్జరి | 399 |
| ఇతరమెరఁగ గతి | లలిత | 376 |
| ఇతరమేదియులేదు | సామంతం | 11 |
| ఇతరోపాయములెల్ల | గుజ్జరి | 191 |
| ఇదిగో రూపై తోఁచీ | మాళవి | 230 |
| ఇదియే వేదాంత మిందు | మాళవి | 369 |
| ఇదియే సాధన మిహ | మలహరి | 384 |
| ఇదియే సులభం | లలిత | 38 |
| ఇదివో తెరమరఁ గిహ | ముఖారి | 440 |

| | | |
|---|---|---|
| ఇదివో శృతిమూల | బౌళిరామక్రియ | 71 |
| ఇన్నాళ్ళు నెఱఁగక | లలిత | 484 |
| ఇన్నిజన్మము లెత్తిన | వరాళి | 221 |
| ఇన్నివిధాలు యిఁకనేల | సామంతం | 423 |
| ఇన్నిటా నింతటా | సామంతం | 314 |
| ఇన్నిటికి నోపునా | సాళంగనాట | 335 |
| ఇన్నిటికి మూలము | దేశాక్షి | 154 |
| ఇన్నియుఁజదువ | ముఖారి | 64 |
| ఇరవుగా నిన్నెరిఁగిరి | గుండక్రియ | 217 |
| ఇలవేల్పితఁడే | శ్రీరాగం | 133 |
| ఇవియే పో ప్రద్యుమ్న | భూపాళం | 405 |
| ఇహపరసాధన | శుద్ధవసంతం | 16 |
| ఇహమే పరము మరి | గుజ్జరి | 76 |
| ఈడ నిందరికి | శుద్ధవసంతం | 289 |
| ఈతఁడు విష్ణుఁడు | భైరవి | 306 |
| ఈతఁడే దృష్టవరము | సామంతం | 111 |
| ఈతని దెంత ప్రతాప | సాళంగనాట | 493 |
| ఈతని మహిమలు | లలిత | 527 |
| ఉండినట్టే వుండును | రామక్రియ | 193 |
| ఉన్న దిందునే వొక్క | బౌళి | 75 |
| ఉన్న సుద్దులేల | హిందోళం | 236 |
| ఉమ్మడి కర్మములాల | సాళంగనాట | 132 |
| ఊరకే వెదకనేల | సామంతం | 196 |
| ఊరకే నోరుమూసుక | దేశాక్షి | 230 |
| ఎంచి చూచితే నితని | గౌళ | 162 |

| | | |
|---|---|---|
| ఎంచి చూచితే మాకు | లలిత | 246 |
| ఎంచి సేయుపను | దేశాక్షి | 50 |
| ఎంతని నుతియింతు | దేవగాంధారి | 485 |
| ఎంతపరాక్రమము | బౌళిరామక్రియ | 175 |
| ఎంతప్రతాపమువాడు | పాడి | 502 |
| ఎంత భాగ్యవంతులమో | శంకరాభరణం | 507 |
| ఎంతలేదు చిత్తమా | రామక్రియ | 426 |
| ఎంత వెట్టిఁ గొండదవ్వి | బౌళి | 344 |
| ఎంతని పొగడవచ్చునితనిప్రతాపము | బౌళి | 501 |
| ఎంతని పొగడవచ్చునీతని సేవించరో | మాళవిగౌళ | 506 |
| ఎందరి వెంటల | ఆహిరి | 265 |
| ఎందరు సతులో | రామక్రియ | **315** |
| **ఎందరివారమో నేము** | సామంతం | **474** |
| ఎందుఁగొపురముసేతు | శ్రీరాగం | 47 |
| ఎందును బోరాదీ | బౌళి | 464 |
| ఎక్కడఁదరికిఁజొచ్చె | నాట | 495 |
| ఎక్కడ నీ వుద్యోగ మెటు | రామక్రియ | 365 |
| ఎక్కడ నెదురులేక | సాళంగనాట | 85 |
| ఎక్కడి కంసుడు | రామక్రియ | 1 |
| ఎక్కుడు బ్రహ్మపట్టాన | నాట | 158 |
| ఎత్తరే ఆరతులు | బౌళి | 31 |
| ఎదిరికి మాకును | దేశాక్షి | 82 |
| ఎదురేది యింక | సాళం | 256 |
| ఎన్నఁడుఁజెడని | వేశాక్షి | 14 |
| ఎన్నఁడు నేఁగందు | బౌళిరామక్రియ | 349 |

| | | |
|---|---|---|
| ఎన్నఁడు విజ్ఞానమిఁక | ఆహిరి | 343 |
| ఎన్నఁడొకో నే | కాంబోధి | 308 |
| ఎన్నఁడొకో సుజ్ఞానము | బౌళి | 460 |
| ఎన్నిమహిమలవాడె | హిందోళవసంతం | 177 |
| ఎన్నిటికెన్నిటికని | గుండక్రియ | 340 |
| ఎప్పటి జీవుఁడే | బౌళి | 437 |
| ఎప్పుడూను నడచేవె | లలిత | 197 |
| ఎప్పు డేబుద్ధి పుట్టునో | శంకరాభరణం | 383 |
| ఎరిఁగీ నెరఁగదు | వరాళి | 455 |
| ఎఱఁగఁడు పరసుఖ | గుండక్రియ | 404 |
| ఎల్లలోకములవారి కేలిక | సామంతం | 359 |
| ఎవ్వరివాఁడాఁగాను | వరాళి | 142 |
| ఎఁటి బిడ్డఁగంటివమ్మ | శంకరాభరణం | 237 |
| ఏగతి నుద్ధరించేవో | లలిత | 312 |
| ఏ పనులెవ్వరికిఁగల | గుండక్రియ | 102 |
| ఏ బలిమి నమ్మి | ముఖారి | 28 |
| ఏడకేడ నీచెరిత | శ్రీరాగం | 274 |
| ఏ తపములు నేల | లలిత | 68 |
| ఏదాయునేమి | లలిత | 264 |
| ఏది మాకు గతి | సామంతం | 153 |
| ఏదియుఁగానఁడు | వరాళి | 329 |
| ఏదైన దేవుఁడు | దేవగాంధారి | 377 |
| ఏదైనా సుఖమే | లలిత | 478 |
| ఏమందు మిందుకు | వసంతవరాళి | 5 |
| ఏమన వచ్చును | గుజ్జరి | 259 |

| | | |
|---|---|---|
| ఏమని చెప్పఁగవచ్చు | దేసి | 281 |
| ఏమని చెప్పెద | శుద్ధవసంతం | 394 |
| ఏమని పొగడవచ్చు | రామక్రియ | 482 |
| ఏమని పొగడుదు | సాళంగనాట | 17 |
| ఏమని విన్నవించేను | నాదరామక్రియ | 208 |
| ఏమరక తలఁచరో | దేశాక్షి | 463 |
| ఏమి చెప్పేది | దేవక్రియ | 279 |
| ఏమిటి కిఁక | బౌళి | 222 |
| ఏమిటి వాఁడఁగాను | లలిత | 461 |
| ఏమిసేతునిందుకు | బలహంస | 204 |
| ఏమిసేయవచ్చు హరి | గుజ్జరి | 374 |
| ఏమిసేయుదు నింతయు | బౌళి | 348 |
| ఏమిసేయువాఁడఁనివి | శుద్ధవసంతం | 63 |
| ఏలవయ్యా లోకమెల్ల | శంకరాభరణం | 459 |
| ఏలికవు నీవట | నారాయణి | 203 |
| ఏలికె చెప్పినపని | గుజ్జరి | 531 |
| ఏలొకో కర్మమా | గుండక్రియ | 325 |
| ఒకరిబుద్ధులు వేరొకరి | సామంతం | 390 |
| ఒక్కటి కొకటివి | భైరవి | 449 |
| ఒక్కఁడే యేకాంగవీరుఁ | పాడి | 462 |
| ఒక్కమాటలోనివే | పళవంజరం | 211 |
| ఒద్దునీవునాకెదురా | నాట | 110 |
| ఒలపక్షము లేనొక్క | ముఖారి | 392 |
| ఒసఁగితి విన్నియు | సాళంగనాట | 319 |
| ఓ పవనాత్మజ | శ్రీరాగం | 327 |

| | | |
|---|---|---|
| ఓహోయెంతటివాఁడే | బౌళి | 393 |
| ఓవోరాకాసులాల | శోకవరాళి | 295 |
| ఓహోవాడలు మాని | దేవగాంధారి | 41 |
| ఔనయ్య జాణఁడవు | సామంతం | 497 |
| ఔలే నే నొకపనికి | మంగళకౌశిక | 23 |
| కంటిఁ గంటి | రామక్రియ | 498 |
| కంటిమి నేఁ డిదె | లలిత | 504 |
| కటకటయీమాయ | మలహరి | 96 |
| కటకట నేమూకర్తలము | బౌళి | 136 |
| కటకట హరిమాయా | గుండక్రియ | 316 |
| కటకటా యీ ప్రాణి | శుద్ధవసంతం | 195 |
| కదిరినృసింహుఁడు | నాట | 32 |
| కదిసి యాతడు | శంకరాభరణం | 445 |
| కనియెడి దిదియే | బౌళి | 115 |
| కన్నవారివద్ద | భూపాళం | 238 |
| కన్నులపండుగలాయె | ఆందోళి | 178 |
| కన్ను లెదుటిదే | లలిత | 406 |
| కరుణానిధివి | హిందోళం | 305 |
| కరుణించవే నిజగతి | హిందోళం | 381 |
| కర్మమూలముజగము | దేశాక్షి | 188 |
| కర్మమెంత మర్మమెంత | కాంబోధి | 389 |
| కలకాలము నిట్టే | పాడి | 361 |
| కలఁడా యింతటిదాత | నాదరామక్రియ | 255 |
| కలదొక్కటే గురి | పాడి | 266 |
| కలశాపురముకాడ | సామంతం | 467 |

| | | |
|---|---|---|
| కలిగె మాకిదె | బౌళిరామక్రియ | 419 |
| కాకున్న మాపాటు | శ్రీరాగం | 56 |
| కామధేనువుదేవకల్పితము | పాడి | 127 |
| కాయము నాదే | గుండక్రియ | 58 |
| కావఁగ (క?) నీకే | లలిత | 126 |
| కావఁగ నీకే పోదు | నారాయణి | 379 |
| కూడుదు రూరకె వొకచో | గుజ్జరి | 433 |
| కేవల కృష్ణావతార | రామక్రియ | 391 |
| కొండంత పాడవుతోడ | కౌశి | 181 |
| కొండవంటి దేవుఁడు | గుజ్జరి | 496 |
| కొలిచితే రక్షించే | ఆహిరి | 180 |
| కొలువరో మొక్కరో కోరి | ముఖారి | 282 |
| కొలువరో మొక్కరో కోరిన | రామక్రియ | 492 |
| కొలువుఁడు వలసితేఁ | శంకరాభరణం | 183 |
| కొలువై తా నల్లవాఁడె | సామంతం | 163 |
| కొసరనేల | నాదరామక్రియ | 176 |
| కొసరి కొసరి | సామంతం | 15 |
| కోటికిఁబడగయెత్తి | గుండక్రియ | 40 |
| కోలలెత్తుకొని | వసంతం | 288 |
| కైకొంటే కాక | గుండక్రియ | 148 |
| కైకొన్నకొలది | బౌళిరామక్రియ | 220 |
| గరిమతోవెరపేల | ముఖారి | 9 |
| గరుడాద్రి వేదాద్రి | రామక్రియ | 522 |
| గుల్ల గుల్లే రాయి రాయే | దేసాళం | 83 |
| గోనెలె కొత్తలు | బౌళి | 60 |

| | | |
|---|---|---|
| గోవింద నీవన్నిటిలోఁ | శ్రీరాగం | 128 |
| ఘనుఁడాతడే | లలిత | 22 |
| జ్ఞానంబొకటే | బౌళిరామక్రియ | 231 |
| జ్ఞానము నెఱఁగము | గుండక్రియ | 113 |
| చదివి చదివి | బౌళి | 121 |
| చదివితిఁదొల్లి | శ్రీరాగం | 74 |
| చదివి బతుకరో | దేసాళం | 33 |
| చలువకు వేఁడికి | సామంతం | 213 |
| చవినోరి కేడఁ దెత్తు | ముఖారి | 326 |
| చాలుఁజాలు నీసటల | నాగవరాళి | 215 |
| చిక్కవద్దు చొక్కవద్దు | భూపాళం | 411 |
| చిత్తజగురుఁడ | మధ్యమావతి | 292 |
| చిత్తా అవధారు | సాళంగనాట | 472 |
| చూడవమ్మ కృష్ణుఁడు | లలిత | 161 |
| చెప్పఁబోతే | శంకరాభరణం | 270 |
| చెప్పితే నాశ్చర్యము | మాళవి | 477 |
| చెప్పినంతపని నేఁ | భంగాళం | 207 |
| చెల్లె నీచేఁతలు నీకే | సామంతం | 413 |
| చేకొన్న భక్తులపాలి | శుద్ధవసంతం | 466 |
| చేపట్టుఁగుంచము | కురంజి | 174 |
| చేరి కొల్వరోయాతఁడు | శ్రీరాగం | 297 |
| జగతిలో మనకెల్ల | భల్లాటి | 179 |
| జగతి వైశాఖశుద్ధ | గుండక్రియ | 285 |
| జగములెల్లా | సాళంగనాట | 20 |
| జయము జయముఇక | సాళంగనాట | 521 |

| | | |
|---|---|---|
| జయము మనది | సాళంగనాట | 517 |
| జీవములు దవ్వుపోయ | మంగళకౌశిక | 79 |
| జీవుఁడించుకంత | వరాళి | 307 |
| జీవుఁడు నిత్యుఁడు | గుండక్రియ | 370 |
| జీవుఁడూ నొక్కటే | బౌళి | 296 |
| జూటుఁదనాలవాఁడవు | దేసాళం | 164 |
| తక్కిన చదువులొల్ల | దేసాళం | 65 |
| తతిగాని యీపాటు | రామక్రియ | 428 |
| తధాకురుష్వ ముదా | లలిత | 424 |
| తలఁచరో జనులు | గౌళ | 483 |
| తలఁపులోనివెలితే | లలిత | 91 |
| తలపోఁత చిత్తమునఁ | గుండక్రియ | 332 |
| తలరో లోకాంత | కన్నడగౌళ | 212 |
| తలలేదు తోఁకలేదు | కన్నడగౌళ | 368 |
| తల్లియాపె కృష్ణునికిఁ | వసంతం | 304 |
| తల్లియుఁ దండ్రియు | దేసాళం | 205 |
| తానె తానే యిందరి | సామంతం | 355 |
| తిమ్మిరెడ్డి మాకునిచ్చె | సామంతం | 52 |
| తెగఁగోయుటకు హరి | తెలుగుకాంబోది | 400 |
| తెలియఁడుగాక | భూపాళం | 303 |
| తెలియనివారికిఁ | గుండక్రియ | 324 |
| తెలియుట యెన్నఁడు | బౌళి | 70 |
| తెలిసినవారెల్లా | దేవగాంధారి | 123 |
| తెలిసియుఁ దెలియదు | లలిత | 323 |
| తొల్లికలవేషవియు | పాడి | 73 |

| | | |
|---|---|---|
| తొల్లిటివారువెట్టిన | ధన్నాసి | 138 |
| తొల్లి యేరుపరచిరి | లలిత | 239 |
| దాసులపాలిటి | సాళంగనాట | 488 |
| దిక్కులేనివారు | ముఖారి | 328 |
| దివమట రాతిరట | సామంతం | 129 |
| దేవతలఁగాచిన | బౌళిరామక్రియ | 300 |
| దేవదేవుఁ డితఁడే | ధన్నాసి | 151 |
| దేవదేవోత్తమతే | పాడి | 491 |
| దేవదేవోత్తముని | బౌళి | 320 |
| దేవుని మరవకు మంతే | లలిత | 337 |
| దేహముతోడిది | వరాళి | 24 |
| దైవమా నీచేఁతలు | శుద్ధవసంతం | 247 |
| దైవమా నీవే | నాగవరాళి | 202 |
| దైవము దూరఁగనేల | నాదరామక్రియ | 267 |
| దైవము నీవే | రామక్రియ | 95 |
| దైవము నెరఁగము | నాగవరాళి | 294 |
| దైవమొకఁడే మాతలపు | హిందోళవసంతం | 214 |
| దైవమొక్కఁడే సంతత | సామంతం | 311 |
| దైవమే నేరుచుఁగాఁక | లలిత | 351 |
| దొరకినయప్పుడే | లలిత | 322 |
| ధరలోను జనహితము | కన్నడగౌళ | 420 |
| ధర్మమునకే మము | శంకరాభరణం | 290 |
| ధ్రువవరదునివలె | లలిత | 347 |
| నగవులు నిజమని | ముఖారి | 353 |
| నటనల భ్రమయకు | లలిత | 317 |

| | | |
|---|---|---|
| నడవరో జడియక | శోకవరాళి | 434 |
| నమ్మితిఁజామ్మి | దేవగాంధారి | 487 |
| నమ్మితే నితఁడే | రామక్రియ | 336 |
| నమ్మిన దిదివో నాపితురార్జిత | పాడి | 385 |
| నమో నమో జగదేకనాధ | లలిత | 494 |
| నమో నమో దశరథనందన | మాళవశ్రీ | 301 |
| నమో నమో దశరథనందన | బౌళి | 144 |
| నమో నమో రఘుకుల | బౌళి | 471 |
| నర(వ?) రూప | గుండక్రియ | 263 |
| నరసింహ రామకృష్ణ | పాడి | 454 |
| నరులాల మునులాల | రామక్రియ | 510 |
| నల్లఁబల్లి చెన్నుఁడు | శ్రీరాగం | 168 |
| నవమూర్తులైనట్టి | వరాళి | 182 |
| నాఁటకమింతా నవ్వులకే | గుండక్రియ | 339 |
| నాకుఁగలపని | ధన్నాసి | 200 |
| నాకు నాకే సిగ్గయ్యీని | దేసాళం | 2 |
| నానావర్ణముల | మాళవిగౌళ | 55 |
| నారాయణ నిను | మాళవిగౌళ | 402 |
| నారాయణ నీనామమె | లలిత | 388 |
| నిఖిలమింతయు మేలు | లలిత | 447 |
| నిచ్చలూ లోకము చూచి | బౌళి | 397 |
| నిండెను లోకములెల్ల | వసంతం | 299 |
| నిజమో కల్లో | బౌళి | 4 |
| నిత్యసుఖానందమిదె | లలిత | 78 |
| నిన్ను నీవే తెలుసుకో | సాళంగనాట | 114 |

| | | |
|---|---|---|
| నిరంతరంబునువీమాయే | దేశాక్షి | 67 |
| నిలిచినవాఁడవు | కేదారగౌళ | 302 |
| "నిశ్చింతం పరమంసుఖ" | గుండక్రియ | 318 |
| నీకంటే నితరము | బౌళి | 103 |
| నీకు నీవే వలసితే | దేసాళం | 18 |
| నీకే నే శరణు | శంకరాభరణం | 194 |
| నీగురుతులు చూచుకో | సాళంగనాట | 476 |
| నీచనైన నావల్ల | గుండక్రియ | 417 |
| నీటముంచు పాలముంచు | సాళంగనాట | 224 |
| నీనామమే మాకు | భూపాళం | 425 |
| నీవంటి దైవాలు | కాశి | 240 |
| నీవనేనమ్మిన | మంగళకౌశి(క) | 241 |
| నీవు నా సొమ్మువు నేను | లలిత | 429 |
| నీవె కాచుటగాక | లలిత | 345 |
| నీవే దయసేసినేడు | ధన్నాసి | 253 |
| నీవే నీ దాసులని | బౌళి | 98 |
| నేడుగాక దొరనైతి | లలిత | 119 |
| నేము సేసేయందు | సౌరాష్ట్రం | 46 |
| నే నవగుణినైన నీకుఁ | ఆహిరి | 367 |
| నేనేపో ఘనుఁడను | దేసాళం | 57 |
| నేనేమి సేయుదున | గుండక్రియ | 53 |
| నేనై విడువవద్ద | లలిత | 414 |
| పంతగాఁడు | వరాళి | 273 |
| పంతపుటాసలు బండ్ల | గుండక్రియ | 69 |
| పట్టిన ముట్టనుండ | దేవగాంధారి | 251 |

| | | |
|---|---|---|
| పట్టినవ్రతము నీవే | ముఖారి | 453 |
| పట్టినవ్రతమే పంతము | సామంతం | 84 |
| పదియూరు వన్నెల | వరాళి | 167 |
| పనిగొనువారల | శుద్ధవసంత | 7 |
| పనిలే దేమియు నాకు | లలిత | 396 |
| పరగీనదివో గద్దెపై | శంకరాభరణం | 415 |
| పరమవివేకులాల | ధన్నాసి | 475 |
| పరమవైష్ణవుల | శంకరాభరణం | 86 |
| పరమాత్మ నాజాడ | సామంతం | 106 |
| పరమాత్ముఁడవు నీవు | కన్నడగౌళ | 356 |
| పరమోపకారులు | మలహరి | 199 |
| పలికేటి వేదమె | బౌళిరామక్రియ | 210 |
| పాపపుణ్యముల | పాడి | 100 |
| పాపముఁబుణ్యము | హిజ్జిజ్జి | 218 |
| పారిరి దానవులెల్లా | మాళవి | 21 |
| పుట్టఁగా బుట్టిన | బౌళి | 456 |
| పుట్టించినవాడుదానే | దేవగాంధారి | 189 |
| పుట్టుభోగులము | పాడి | 94 |
| పుట్టెడి దింతా | బౌళి | 131 |
| పురుషుడే యధముడు | బౌళి | 134 |
| పెదయౌబళపుఁగొండ | భల్లాటి | 309 |
| పెరిగినాఁడు చూడరో | సాళంగనాట | 528 |
| పొందగు నాత్మాపుత్ర | మాళవిగౌళ | 62 |
| ప్రత్యక్షమే మాకు | శ్రీరాగం | 122 |
| బడిబడి నింద్రియాలే | లలిత | 480 |

| | | |
|---|---|---|
| బంటుకు బంటవుదురా | లలిత | 225 |
| బల్లిదులు నీకంటెఁ | లలిత | 360 |
| బాపు బాపు దేవుఁడా | సామంతం | 407 |
| బాపురే నీమాయ | గౌళ | 257 |
| బిరుదు బంటితఁడు | లలిత | 486 |
| భళి భళి రామా పంతపు | రామక్రియ | 357 |
| భారకుఁ డతఁడే బంధువు | మంగళకౌశిక | 354 |
| భావించరో వేదములు | రామక్రియ | 25 |
| భావించి తెలుసుకొంటే | భంగాళం | 291 |
| భావించువారల | లలిత | 19 |
| బ్రహ్మాదులకు నిదే | లలిత | 48 |
| మంగాంబుధి హనుమంతుని | సామంతం | 444 |
| మతంగపర్వతము | లలిత | 165 |
| మమ్ముఁజూడనేల | మంగళకౌశిక | 232 |
| మరుగుచుఁ జేసీ | రామక్రియ | 92 |
| మఱచితిమంటే | లలిత | 412 |
| మఱి తనుభోగములు | వరాళి | 152 |
| మఱి విచారించఁబోతే | మలహరి | 135 |
| మాకు నేమీఁబనిగాదు | ఆహిరి | 245 |
| మాధవ కేశవ | లలిత | 330 |
| మాధవ భూధవ | సాళంగ | 321 |
| మానదు మతిమఱపునుఁ | బౌళి | 362 |
| మానరో వో లోకులాల | మలహరి | 250 |
| మాయలో మోహమున | రామక్రియ | 341 |
| మా మతము | కేదారగౌళ | 269 |

| | | |
|---|---|---|
| ముట్టితేనె మూయ్యెఁ | మంగళకౌశిక | 382 |
| ముందే తొలఁగవలె | రామక్రియ | 66 |
| మేలెల్ల నొక్కటే | సామంతం | 37 |
| మొదలివేల్పు | గౌళ | 36 |
| యజ్ఞమూర్తి యజ్ఞకర్త | వరాళి | 45 |
| రంట దెప్పఁగప్పురచన | వసంత | 184 |
| రాతిరెల్ల సతులతో | భూపాళం | 130 |
| రామచంద్రుఁడితఁడు | శ్రీరాగం | 147 |
| రామ మిందీవరశ్యామం | బౌళి | 452 |
| రామా దశరథరామా | పాడి | 156 |
| రాముఁడు లోకాభిరాముఁ డందరికి | నాట | 277 |
| రాముఁడు లోకాభిరాముఁ డుదయించగాను | మాళవిగౌళ | 520 |
| రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో | రామక్రియ | 515 |
| రాముఁడు రాఘవుడు | పాడి | 169 |
| రామునికి శరణంటె | సామంతం | 283 |
| ఊలు దింటా మలి | శుద్ధవసంతం | 61 |
| లెండో లండో | రామక్రియ | 166 |
| లోకమింతా నిండె | దేసి | 228 |
| వట్టిజాలిఁబడ | మేఘరంజి | 173 |
| వట్టిజోలి యెంతలేదు | కన్నడగౌళ | 481 |
| వర్ణాశ్రమములాల | లలిత | 229 |
| వలసిన వారికి | గౌళ | 451 |
| వారధిశయన వోవటపత్ర | దేవగాంధారి | 465 |
| వాసుదేవ నీవు | దేసాళం | 143 |

| | | |
|---|---|---|
| వింతనా నే దనకు | ముఖారి | 352 |
| విచారించుకొనేవారి | మాళవిగౌళ | 30 |
| విచ్చిన విడినీ | దేవక్రియ | 172 |
| విడిచితి మనరాదు | బౌళి | 12 |
| విడువ విడువ నింక | సౌరాష్ట్రం | 206 |
| విడువుము మనసా | శోకవరాళి | 216 |
| విత్తొకటి వెట్టఁగా | శుద్ధవసంతం | 42 |
| విత్తొకటి వెట్టఁగాను | రామక్రియ | 186 |
| వినరయ్య నరసింహా | నాట | 513 |
| వినుఁడిదె రఘుపతి | శంకరాభరణం | 518 |
| వినోదకాఁడవౌవుదువు | శంకరాభరణం | 171 |
| విన్నప మిదే నీకు | శ్రీరాగం | 422 |
| విష్ణుఁదేవుపాదములే | లలిత | 149 |
| వీఁడివో కలశాపుర | బౌళిరామక్రియ | 525 |
| వీఁడివో కొలువున్నాఁడు | రామక్రియ | 526 |
| వీధుల వీధుల | సౌరాష్ట్రం | 286 |
| వెగ్గల మింతా వృథా | నాగవరాళి | 242 |
| వెదకిన నిదియే | బౌళి | 436 |
| వెనక ముందరికిఁ | సామంతం | 432 |
| వెన్న చేతఁబట్టి | సాళంగం | 118 |
| వెన్నముద్దకృష్ణుఁడు | దేశాక్షి | 529 |
| వెరగుతో మరచితే | గుండక్రియ | 408 |
| వెఱపించఁబోయి | పళవంజరం | 258 |
| వెల (ర?) సె నహోబలాన | రామక్రియ | 140 |
| వెలినుండు లోనుండు | సాళంగనాట | 93 |

| | | |
|---|---|---|
| వేగిరించనేల | మాళవశ్రీ | 226 |
| వేవేల చందాలవాఁడు | లలిత | 468 |
| వైష్ణవుల సొమ్ము | సాళంగనాట | 185 |
| వొద్దునీవు నాకెదురా | నాట | 110 |
| సందడిసొమ్ములతోడి | భైరవి | 386 |
| సందెకాడఁ బుట్టినట్టి | రామక్రియ | 342 |
| సచరాచరమిదె | పాడి | 116 |
| సమమతినని నీవే | వరాళి | 366 |
| సమసె రావణుఁడు | సామంతం | 523 |
| సముఖా యెచ్చరిక | సామంతం | 489 |
| సమ్మతించి కనుకొండ | ముఖారి | 435 |
| సరిలే రితనికి | నాట | 499 |
| సరులార నేఁడువో | ముఖారి | 310 |
| సర్వేశ్వరుఁడే శరణ్యము | సామంతం | 333 |
| సిరిమగఁడే | లలిత | 54 |
| సిబ్బితిపడఁగనేల | గుండక్రియ | 448 |
| సుగ్రీవనారసింహసులభుఁడు | తోడి | 469 |
| సుగ్రీవనారసింహుని జూడరో | పాడి | 146 |
| సులభుఁ డీతఁ డిదివో | ఆహిరి | 275 |
| సులభుఁడై వున్నాఁడు | బౌళి | 512 |
| సేవించరో జనులాల చేతులెత్తి | సాళంగనాట | 500 |
| సేవించరో జనులాల చిత్తజగురు | ముఖారి | 157 |
| సోదించిరిదియె సురలును | లలిత | 334 |
| శరణం బితఁడే | మలహరి | 403 |
| శరణ మాతనికే | భైరవి | 34 |

| | | |
|---|---|---|
| ణాగతవజ్రపంజర | ధన్నాసి | 378 |
| ణు శరణుదేవ | కన్నడగౌళ | 170 |
| ణు శరణు నీకు | చాయ | 276 |
| వణబహుళాష్టమి జయంతి | సాళంగనాట | 139 |
| వణబహుళాష్టమి సవరేత్రి | మాళవశ్రీ | 287 |
| తి నీ సేవ | గుజ్జరి | 107 |
| తి నీ కెదురు | వరాళి | 427 |
| తీశ బహుజీవ | వరాళి | 479 |
| కి లంకిణీహంత | సాళంగనాట | 145 |
| కే మొఱవెట్టు | వరాళి | 88 |
| ఁ గొలిచినఁగాని | వరాళి | 439 |
| దాసులే మాకు | సౌరాష్ట్రం | 219 |
| నామము కడు | భైరవి | 409 |
| నీకే నే రుణమత్తుఁ | దేవగాంధారి | 421 |
| నీకే శరణని | గుండక్రియ | 401 |
| నీమయమే | లలిత | 418 |
| నీవాఁడనే | గౌళ | 44 |
| నీవు మాలోన | ధన్నాసి | 39 |
| నీవు లేవా | శుద్ధవసంతం | 243 |
| నీవే సకల | శుద్ధవసంతం | 112 |
| నేవే సర్వాత్మకుఁడవు | దేశి | 441 |
| నే నిన్నిందులకుఁగా | దేవగాంధారి | 105 |
| ే యడుగరో | పళవంజరం | 254 |
| పరతత్త్వం | గుండక్రియ | 125 |
| ్రాజే | శుద్ధవసంతం | 235 |

| | | |
|---|---|---|
| హరియవతారమె | సౌరాష్ట్రం | 19 |
| హరివల్ల కడమలే | సాళంగం | 244 |
| హరిశరణాగతి | నారాయణి | 81 |
| హరి " సర్వపాపేభ్యోఅహంత్వా" | శుద్ధవసంతం | 77 |
| హరి సర్వాత్ముకుఁ | బౌళి | 261 |
| హరి హరి నిను | గుజ్జరి | 450 |
| హరి హరి నీ | నారాయణి | 293 |
| హరి హరి యిందరికి | లలిత | 363 |
| హీనాధికము లింక | లలిత | 43 |
| హేయ మేమీ లేదు | గుజ్జరి | 473 |
| "సర్వం విష్ణుమయం" | గుజ్జరి | 90 |
| సర్వరక్షకుఁడైన | లలిత | 503 |
| స్వతంత్రుఁడవు నీవు | తోడి | 431 |

Editor :— Prof P. V. Ramanujaswami, M. A.

తాళ్లపాకవారిగేయరచనములు

V. సంపుటము

# అధ్యాత్మసంకీర్తనలు.

అన్నమాచార్యరచితములు


శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనశాలలో ఆంధ్రవాఙ్మయ పరిశోధకుఁడగు

శ్రీ వేటూరి-ప్రభాకరశాస్త్రిచే

పరిశోధింపఁబడినవి



తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాశాల

1950

| కీర్తన నంబరు. | కీర్తనలలోని మొదటిపాట మొదళ్లు. | అచ్చుపుటసంఖ్య. |
|---|---|---|
| 26 | అదివొ పోహరి | 103 |
| 27 | ఇందునందు నెంచ | 107 |
| 28 | ఏదురుని విందా | 111 |
| 29 | కరుణానిధివి | 115 |
| 37 | ఇంతులో నేనెవ్వఁడను | 144 |
| 38 | ఎదురా రఘుపతికి | 148 |
| 39 | శరణు శరణు | 152 |
| 40 | ఒండె లౌకికము | 156 |
| 41 | ఇది మొక్కలే | 160 |
| 42 | లేరా దేవతలు | 164 |
| 43 | [illegible] వలపులు | 168 |
| 44 | బందుగుఁడ వన్నిటాను | 172 |
| 45 | అలనాఁడే కంటి | 176 |
| 46 | అటుగానా ఏమి | 180 |
| 47 | కాదు [illegible]తేకను | 184 |
| 48 | శ్రీపతి కరుణే | 187 |
| 49 | ఎం[illegible] | 191 |
| 50 | తలఁగొని యేమరక | 195 |
| 71 | నీవున్న చోటే | 289 |
| 72 | వెదకి వెదకి | 242 |
| 73 | పురాణపురుషా | 246 |
| 74 | నాయంతనే | 250 |
| 75 | [illegible]వన్నెలుఁడవుగా | 254 |
| 76 | అటు గాన శరణంటి | 258 |
| 77 | అమూరితియే | 262 |

## ఈ సంపుటములో ముద్రితములైన అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకులు.


| రేకు సంఖ్య. | రేకులలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 1 | వలచి పైకొనఁగరాదు | 1 |
| 2 | సదా సకలము | 5 |
| 3 | గాలినే పోయఁ | 9 |
| 4 | దురితదేహాలే | 14 |
| 5 | పెంచఁ బెంచ మీఁదఁ | 19 |
| 6 | వైష్ణవులు గాని | 23 |
| 7 | పుట్టుగు లవియ్యా | 27 |
| 8 | కొనుట వెగ్గళము | 31 |
| 9 | ఏమి సేయవచ్చుఁ | 36 |
| 10 | పదిలముకోట | 40 |
| 21 | పెక్కు లంపటాల | 44 |
| 22 | వరగు బహుసజ్జన్మ | 48 |
| 23 | భావయామి గోపాలబాలం | 52 |
| 24 | ఆపదల సంపదల | 56 |
| 25 | ఒప్పులై నొవ్వులై | 60 |
| 26 | ఎనుపోతుతో నెద్దు | 64 |
| 27 | ఏమీ నెఱఁగనిమమ్ము | 67 |
| 28 | తొలుఁబాపపుణ్యాలతోడ | 72 |
| 29 | కోరిక దీరుట యెన్నఁడు | 76 |
| 30 | చెల్లుఁగా కిటు నీకే | 80 |
| 31 | అధ చూడు | 84 |

| సంఖ్య. | కీర్తనలలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 38 | వేసరితి మెట్ల | 87 |
| 39 | కొనరో కొనరో | 92 |
| 40 | నిగమనిగమాంతవర్ణిత | 96 |
| 41 | కాక మఱి | 100 |
| 42 | నివేకా చెప్పఁ | 104 |
| 43 | ఆదిమునుల | 108 |
| 44 | ఈదేహావికారము | 112 |
| 45 | ఎవ్వోట కేఁగిన | 116 |
| 46 | వరుసఁ బోఁకియు | 120 |
| 47 | ఏమీ నెఱఁగనినా | 124 |
| 48 | సేవింతురా | 128 |
| 49 | కాలాంతకుఁ డను | 132 |
| 50 | ఎఱుఁక గలుగునాఁ | 136 |
| 51 నుండి 60 వఱకు | తేకులు లేవు | |
| 71 నుండి 77 వఱకు | తేకులు లేవు | |
| 81 | వీనిఁ జూచియైన | 140 |
| 82 | విధినిషేధములకు | 143 |
| 83 | ఇతరధర్మము | 147 |
| 84 | వలెననువారిద | 151 |
| 85 | మిక్కిలిపుణ్యాలు | 155 |
| 86 | తహా తహా లిన్నిటికి | 159 |
| 87 | సులభమా యిందరికి | 163 |

| కీర్తన సంఖ్య. | కీర్తనలలోని మొదటిపాటల మొదళ్లు. | పుటసంఖ్య. |
|---|---|---|
| 88 | వివేక మెఱింగని | 167 |
| 89 | దేవ యీతగవు | 171 |
| 90 | ఉన్న విచారము | 175 |
| 91 | తప్పుఁ దోయవే | 179 |
| 92 | నవనారసింహా | 183 |
| 93 | నే నేమి సేయుదును | 187 |
| 94 | శోధకు లెవ్వరు | 191 |
| 95 | ఎక్కడఁగా రాఁగా | 195 |
| 96 | ఇందులోనే కానవద్దా | 199 |
| 97 | అమ్మే దొకటి | 203 |
| 98 | అట్టివేళఁ గలఁగకీ | 207 |
| 99 | తెలిసిన బ్రహ్మోపదేశ | 211 |
| 100 | శతాపరాధములు | 215 |


రాగిరేకులను సరిగాఁజదివి అచ్చులిపిరీతిలోఁ దీర్చి దిద్ది వ్రాయుచు యచ్చుచిత్తులను దిద్దుచు సందిగ్ధములగు పట్టుల మూలము రేకులను, వేసంగి సెలవులలోఁగూడఁ దెచ్చి నాతోఁగూడ సరిచూచుచు వడివడిగా అచ్చు నిర్వహించుటలో నాకుఁ గుడిభుజమై తోడ్పడిన దేవస్థానపు లైబ్రరి తెలుగుపండితుని చిరంజీవి ఉదయగిరి శ్రీనివాసాచార్యుని మదీయుని సంభావించుచున్నాను.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, తిరుపతి.
22—6—50.

వే. ప్రభాకరశాస్త్రి.

శుభమస్తు.

## శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు (నిరోధానకు ? తిరోధానానకు) తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

### సామంతం

వలచి పైకొనఁగరాదు వలదని తొలఁగరాదు
కలికి మరుఁడు సేసినాజ్ఞ కడవఁగ రాదురా. ॥పల్లవి॥

అంగడి కెత్తినట్టిదివ్వె లంగనముఖాంబుజములు
ముంగిటి పసిఁడి కుంభములును ముద్దులకుచయుగంబులు
యెంగిలిసేసినట్టితేనె లితవులైన మెఱుఁగు మోవులు
లింగములేని దేవారములు లెక్కలేని ప్రియములు. ॥వలచి॥

కంచములోని వేఁడికూరలు గరువంబులుఁ బొలయలుకలు
మెంచఁగ నెండలోనీడలు మెఱనెడ కూటములు
తెంచఁగరాని వల్లెతాళ్లు తెలివిపడని లేఁతనవ్వులు
మంచితనములోని నొప్పులు మాటలలోని మాటలు. ॥వలచి॥

నిప్పులమీఁదఁ జల్లిన నూనెలు నిగిడి తనివిలేని యాసలు
దప్పికి నేయి దాగినట్లు తమకములోని తాలిమి
చెప్పఁగరాని మేలుగనుట శ్రీవేంకటపతిఁ గనుటలు
అప్పని కరుణ గలిగి మనుట అబ్బురమైన సుఖములు. ॥వలచి॥ 1

## దేసాక్షి

వేదవేద్యులు వెదకేటి మందు
ఆది నంత్యము లేని ఆ మందు. ॥పల్లవి॥

అడవిమందులుఁ గషాయములు నెల్లవారు
కడగానక కొనఁగాను
తొడిఁబడ నొకమందు దొరకె మాకు భువి
నడియాల మైనట్టి ఆ మందు ॥వేద॥

లలితరసములుఁ దైలములు నెల్లవారు
కలకాలము గొనఁగాను
చెలువైన దొకమందు చేరె మాకు భువి
నలపి మీఁటినయట్టి యీమందు. ॥వేద॥

కదిసిన జన్మరోగముల నెల్లవారు
కదలలేక వుండఁగాను
అదన శ్రీతిరువేంకటాద్రి మీఁదిమందు
అదివో మాగురుఁ డిచ్చె నామందు. ॥వేద॥ 2

## దేసాక్షి

హీనదశలఁ బొంది యిట్ల నుండుటకంటె
నానావిధులను నున్ననాఁడె మేలు. ॥పల్లవి॥

అరుదైన క్రిమికీటకాదులందుఁ బుట్టి
పరిభవముల నెల్లఁ బడితిఁ గాని
యిరవైనచింత నాఁ డింతలేదు యీ
నరజన్మమునకంటె నాఁడె మేలు. ॥హీన॥

తొలఁగక హేయజంతువులయందుఁ బుట్టి
పలువేదనల నెల్లఁ బడితిఁ గాని
కలిమియు లేమియుఁ గాన నేఁ డెటుఁగి
నలఁగి తిరుగుకంటె నాఁడె మేలు. ॥హీన॥

కూపనరకమునఁ గుంగి వెనకకు నేఁ
బాపవిధుల నెల్లఁబడితిఁ గాని
యేపునఁ దిరువేంకటేశ నా కిటువలె
నాపాలఁ గలిగిన నాఁడె మేలు. ॥హీన॥ ౩

సామంతం

ఏవం శ్రుతిమత మిద మేవ త
ద్భావయితు మతఃపరం నాస్తి. ॥పల్లవి॥

అతులజన్మ భోగాసక్తానాం
హితవైభవసుఖ మిద మేవ
సతతం శ్రీహరిసంకీర్తనం త
ద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి. ॥ఏవం॥

బహుళమరణ పరిభవచిత్తానా
మిహపరసాధన మిద మేవ
అహిశయన మనోహరసేవా త
ద్విహరణం వినా విధిరపి నాస్తి. ॥ఏవం॥

సంసారదురిత జాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరి పతేః ప్ర
శంస్త్రైవా పశ్చాదిహా నాస్తి. ॥ఏవం॥ 4

## పాడి

వేదం బెవ్వని వెదకెడిని
ఆదేవునిఁ గొనియాడుఁడీ. ॥పల్లవి॥

అలరిన చైతన్యాత్మకుఁ డెవ్వఁడు
కలఁ డెవ్వఁ డెచటఁ గలఁ డనిన
తలఁతు రెవ్వనినిఁ దనువియోగదశ
యిల నాతని భజియించుఁడీ. ॥వేదం॥

కడఁగి సకలరక్షకుఁ డిం దెవ్వఁడు
వడి నింతయు నెవ్వనిమయము
పిడికిట తృప్తులు పితరు లెవ్వనినిఁ
దడవిన ఘనుఁ డాతనిఁ గనుఁడీ. ॥వేదం॥

కదిసి సకల లోకంబుల వారలు
యిదివో కొలిచెద రెవ్వనిని
త్రిదశవంద్యుఁడగు తిరువేంకటపతి
వెదకి వెదకి సేవించుఁడీ. ॥వేదం॥ 5

## గుండక్రియ

మానుషము గాదు మఱి దైవికము గాని
రానున్నా అది రాకు మన్నఁ బోదు. ॥పల్లవి॥

అనుభవనకుఁ బ్రాప్త మైనది
తనకుఁ దానె వచ్చి తగిలికాని పోదు.

తిరువేంకటగిరి దేవుని
*కరుణచేతఁ గాని కలుష మింతయుఁ బోదు. ॥మానుమ॥ 6

2 దేశ. శుద్ధవసంతం

సదా సకలము సంపదలే
తుద దెలియఁగవలెఁ దొలఁగఁగ వలయు. ॥పల్లవి॥

అహర్నిశము నాపదలే
సహించిన నవి సౌఖ్యములే
యిహామున నవి యందరికిని
మహిను దెలియవలె మానఁగవలెను. ॥సదా॥

దురంతము లివి దోషములే
పరంపర లివి బంధములు
విరసము లౌ సరవిభవము లౌ
సిరులే మరులౌ చిరసుఖ మవును. ॥సదా॥

గతి యలమేల్మంగ నాంచారికిఁ
బతియగు వెంకటపతిఁ దలఁచి
రతుల దొలఁగఁగవలె రమణము వలెను
హిత మొలఁగఁగవలె నిదె తనకు. ॥సదా॥ 7

శుద్ధవసంతం

ఇందిరానామ మిందరికి
కుందనపు ముద్దవో గోవింద. ॥పల్లవి॥

* తాళ్లపాక సంకీర్తనలు II సంపుటములో మొదట ముద్రితమయినది.

అచ్యుతనామము అనంతనామము
ఇచ్చినసంపద లిందరికి
నచ్చినసిరులు నాలుకతుదలు
కొచ్చి కొచ్చీతో గోవిందా. ||ఇంది||

వైకుంఠనామము వరదనామము
ఈకడ నాకడ నిందరికి
వాకుఁ దెరవులు వన్నెలు లోకాలఁ
గూకలు వతులు నో గోవిందా. ||ఇంది||

పండరినామము పరమనామము
ఎండలు వాపెడి దిందరికి
నిండు నిధానము నిలిచినపేరు
కొండల కోనేటి వో గోవిందా. ||ఇంది|| 8

బౌళి

ఎవ్వరిఁ గాదన్న నది నిన్నుఁగాదంట
యెవ్వరిఁ గొలిచిన నది నీకొలువు. ||పల్లవి||

అవయవములలో నదిగా దిదిగా
దవి మేలివి మే లన నేలా
భువియుఁ బాకాశము దివియు నందలిజంతు
నివహ మింతయును నీ దేహమే కాన ||ఎవ్వరి||

నీవు లేని చోటు నిజముగఁ దెలిసిన
ఆవల నదిగా దనవచ్చును
శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము
భావింప నీవె పరిపూర్ణుఁడవుగాన. ||ఎవ్వరి|| 9

### సామంతం

సహజవైష్ణవాచారవర్తనుల
సహవాసమే మాసంధ్య ॥పల్లవి॥
అతిశయ మగు శ్రీహరిసంకీర్తన
సతతంబును మాసంధ్య
యితి రామానుజమతమే మాకును
చతురత మెఱసిన సంధ్య. ॥సహజ॥

పరమభాగవతపదసేవనమే
సరవి నెన్న మాసంధ్య
సిరివరు మహిమలు చెలు వొందఁగ వే
సరక వినుటె మాసంధ్య. ॥సహజ॥

మంతు కెక్కు తిరుమంత్రపఠనమే
సంతతమును మాసంధ్య
కంతుగురుఁడు వేంకటగిరిరాయని
సంతర్పణమే మాసంధ్య. ॥సహజ॥ 10

### మాళవి

ఇందు కొఱకె యిందఱును నిట్లయిరి
కిందుపడి మఱికాని గెలు పెఱుఁగరాదు. ॥పల్లవి॥

ఆటమటపువేడుకల నలయించి మఱికదా
ఘటియించుఁ బరము తటుకన దైవము
ఇటుసేయ నీశ్వరుని కిసుగలదా లేదు
కుటిలమతిఁగని కాని గుణిఁ గానరాదు. ॥ఇందు॥

బెండుపడ నవగతులఁ బెనఁగించి మఱికదా
కొండనుచుఁ బర మొసంగును దైవము
బందు నేయఁగ వారికిఁ బంతమూ యటుగాదు
యెండదాఁకక నీడ హితవెఱుఁగరాదు. ॥ఇందు॥

మునుప వేల్పుల కెల్ల మ్రొక్కించి మఱికదా
తనభక్తి యొసఁగు నంతట దైవము
ఘనవేంకటేశునకుఁ గపటమూ అటుగాదు
ఒనక చేదనుఁ దీపు తెలియనేరాదు. ॥ఇందు॥ 11

## ధన్నాసి

సందడి విడువుము సానముఖా
మందరధరునకు మజ్జనవేళా. ॥పల్లవి॥

అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టము కాళాంజి
జమళి చామరలు చంద్రుఁడు సూర్యుఁడు
అమర నిడుఁడు పరమాత్మునకు. ॥సందడి॥

అణిమాదిసిరుల నలరెడు శేషుఁడ
మణిపాదుక లిడు మతి చెలఁగా
ప్రణుతింపు కదిసి భారతిరమణ
గుణాధిపు మరుగురుఁ బలుమరును. ॥సందడి॥

వేదఘోషణము విడువక నేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుండగు శ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడె. ॥సందడి॥ 12

## శంకరాభరణం.

మలసీ జూడరో మగసింహము
అలవి మీఱిన మాయలసింహము. ॥పల్లవి॥

అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళముమీఁది పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు
కదిసి కానఁగలేని ఘనసింహము. ॥మలసీ॥

మెచ్చిమెచ్చి చూడరో మితిమీఱినయట్టి
చిచ్చఱ కంటితోడి జిగిసింహము
తచ్చినవారిధిలోన తరుణిఁ గాఁగిటఁ జేర్చి
నచ్చిన గోళ్ల శ్రీనరసింహము. ॥మలసీ॥

బింకమునఁ జూడరో పిరితియ్యక నేఁడు
అంకపుదనుజ సంహారసింహము
వెంకటనగముపై వేదాచలముపై
కింక లేక వడిఁ బెరిగినసింహము. ॥మలసీ॥ 18

8 రేకు.

## కన్నడగౌళ

గాలినే పోయెఁ గలకాలము
తాలిమికిఁ గొంతయుఁ బ్రొద్దులేదు. ॥పల్లవి॥

అడుసు చొరనే పట్టె నటునిటుఁ గాళ్లు
గడుగుకొననే పట్టెఁ గలకాలము
ఒడలికి జీవుని కొడయఁడై నహరిఁ
దడవఁగాఁ గొంతయుఁ బ్రొద్దులేదు. ॥గాలి॥

కలఁచి చిందనే వట్టిఁ గడవ నించఁగఁ బట్టి
కలుషదేహపు బాధఁ గలకాలము
తలపోసి తనపాలిదైవ మైనవారిఁ
దలఁచఁగాఁ గొంతయుఁ బ్రొద్దులేదు. ॥గాలి॥

శిరసు ముడువఁ బట్టిఁ జిక్కు దిద్దఁగఁ బట్టి
గరిమలఁ గపటాలఁ గలకాలము
తిరువేంకటగిరి దేవుఁడైనవారి
దరిచేరాఁ గొంతయుఁ బ్రొద్దులేదు. ॥గాలి॥ 14

## వరాళి

ఎవ్వరులేరూ హితవుచెప్పఁగ వట్టి
నొవ్వులఁ బడి నేము నొగిలేమయ్యా. ॥పల్లవి॥

అడవిఁ బడినవాఁడు వెడలఁ జోటులేక
తొడరి కంపలక్రిందు దూరినట్లు
నడుమ దురితకాననములతరిఁ బడి
వెడలలేక నేము విసిగేమయ్యా. ॥ఎవ్వరు॥

తెవులువడినవాఁడు తినఁబోయి మధురము
చవిగాక పులుసులు చవిగోరినట్లు
భవరోగములఁ బడి పరమామృతము నోరఁ
జవిగాక భవములు చవులాయనయ్యా. ॥ఎవ్వరు॥

తనవారి విడిచి యిగరమైనవారి
వెనుకఁ దిరిగి తా వెఱ్ఱైనట్లు
అనయము తిరువేంకటాధీశుఁ గొలువక
మనసులోని వాని మఱచేమయ్యా. ॥ఎవ్వరు॥ 15

## కాంబోధి

దిబ్బలు వెట్టుచుఁ దేలిన దిదివో
ఉబ్బునీటిపై నొకహంసా. ॥పల్లవి॥

అనువునఁ గమలవిహారమే నెలవై
వొనరివున్న దిదే వొకహంసా
మనియెడి జీవుల మానససరముల
వునికి నున్న దిదే వొకహంసా. ॥దిబ్బలు॥

పాలునీరు నేర్పఱచి పాలలో
నోలలాడె నిదే వొకహంసా
పాలుపడిన యీ పరమహంసముల
వోలినున్నదిదే వొకహంసా. ॥దిబ్బలు॥

తడవి రోమరంధ్రంబుల బ్రహ్మల
నుడుగక పొదిగీ నొకహంసా
కడువేడుక వెంకటగిరి మీఁదట
నొడలు వెంచెనిదే వొకహంసా. ॥దిబ్బలు॥ 16

## శ్రీరాగం

నీవే కానింక నే నన్య మెఱుఁగ నే
త్రోవ చూపి రక్షించ దొడయ్యేదవయ్యా. ॥పల్లవి॥

అపరాధశతకోట్లయినవి వొక్క
నెపమున నను గావ నేరవా
అపరిమితదురితాలైనవియే
ఉపమచేత నన్నుద్ధరించెదవయ్యా. ॥నీవే॥

అతిశయముగఁ గర్మినైతిని నీ
మతము నాకొకయింత మఱవవా
ఇతరకర్మారంభ హితుఁడను
గతిమోక్ష మెటువలెఁ గల్పించెద వయ్యా. ॥నీవే॥

తిరువేంకటాచలా ధీశ్వరా నీ
శరణాగతులఁ బ్రోవఁ జాలవా
వరమదయానందపరుఁడవు యే
నెరవున భవములు వెడలఁద్రోచెదవయ్యా. ॥నీవే॥ 17

## గుండక్రియ

తెలియఁ జీఁకటికి దీపమెత్తక పెద్ద
వెలుఁగులోపలికి వెలుఁగేలా. ॥పల్లవి॥

అరయ నాపన్నుని కభయ మీవలెఁగాక
ఇరవైన సుఖిఁ గావనేలా
వఱతఁ బోయెడివాని వడిఁ దీయవలెఁగాక
దరివానిఁ దిగియుఁగఁ దానేలా. ॥తెలి॥

ఘనకర్మారంభుని కట్లు విడవలెఁగాక
మొనసి ముక్తునిఁ గావ నేలా
అనయము దుర్బలుని కన్నమిడవలెఁగాక
తనిసినవానికిఁ దానేలా. ॥తెలి॥

మితిలేని పాపకర్మికిఁ దా వలెఁగాక
హిత వెలుఁగుపుణ్యుని కేలా
ధృతిహీనుఁ గృపఁజూచి తిరువేంకటేశ్వరుఁడు
తతిఁగావకుండినఁ దానేలా. ॥తెలి॥ 18

## ముఖారి

చిత్తములో నిన్నుఁ జింతించనేరక
మత్తుఁడనై పులు మానిసినైతి. ॥పల్లవి॥

అలుత లింగము గట్టి యది నమ్మఁజాలక
పరువత మేఁగిన బత్తుఁడనైతి
నరన మేఁకపిల్లఁ జంకఁ బెట్టుక నూఁత
నరయు గొల్లనిరీతి నజ్ఞానినైతి. ॥చిత్త॥

ముడుపు కొంగునఁగట్టి మూలమూలల వెదకే
వెడమతినై నే వెర్రుండనైతి
నిడువక కిక్కడ శ్రీవేంకటేశ్వరుఁ డుండ
పాడగానక మందబుద్ధి నేనైతి. ॥చిత్త॥ 19

## శ్రీరాగం

అన్నియును నతనికృత్యములే
ఎన్నైనా నవు నతఁ డేమిసేసినను. ॥పల్లవి॥

అణురేణుపరిపూర్ణుఁ డవలిమో మైతేను
అణువౌను కమలభవాండమైనా
ఫణిశయనుని కృపాపరిపూర్ణ మైతే
తృణమైన మేరువౌ స్థిరముగా నపుడే. ॥అన్ని॥

పురుషోత్తమునిభక్తి పొరపొచ్చమైతే
ఎరవులౌ నిజసిరులు ఎన్నైనను
హరిమీఁది చింత పాయక నిజంబైతే
విరతిఁ బట్టిన వెల్లా విధానములే. ॥అన్ని॥

మదనగురునిసేవ మదికి వెగటైతేను
పదివేలు పుణ్యములు పాపంబులే
పదిలమై వేంకటపతిభక్తి గలితేను
తుదిపదంబున కెల్లఁ దొడవవునపుడే. ॥అన్ని॥ 20

రేకు ౪. శుద్ధవసంతం

దురితదేహులే తొల్లియును శ్రీ
హరి భజించి నిత్యాధికులైరి. ॥పల్లవి॥

అనంతకోటిమహామునులు ఈ
సనకాదులు నిశ్చలయశులు
ఇనశశినయనుని నితనిని మును
గని భజించి గతకల్మషులైరి. ॥దురి॥

అతిశయమతులు మహామహులు సుఖ
రతివిముఖులును చిరంతనులు
హితవిచారమతి నితనిని సం
తతమును భజించి ధన్యులైరి ॥దురి॥

దేవతాధిపులు దివ్యులును గడుఁ
బావనులును దగఁ బరహితులు
ఈవేంకటపతి నీతనిని
సేవించి సుఖాంచితమతులైరి. ॥దురి॥ 21

శ్రీరాగం

ఇందిర వడ్డించ నింపుగను
చిందక యిట్టే భుజించవో స్వామీ. ॥పల్లవి॥

అక్కాళపాశాలు సప్పాలు వడలు
పెక్కైననయిఁదంపుపేణులును
చక్కెరరాసులు సద్యోఘృతములు
కిక్కఁజేయ నారగించవో స్వామీ. ||ఇంది||

మీఁటినకెళంగు మిఁరియవుఁ దాళింపుఁ
గూరలు కమ్మనికూరలును
సారంపుఁ బచ్చళ్ళు చవులుగ నిట్టే
కూరిమితో జేకొనవో స్వామీ ! ||ఇంది||

పిండివంటలునుఁ బెరుగులుఁ బాలు
మెండైనపాశాలు మెచ్చి మెచ్చి
కొండలపొడవు కోరి దివ్యాన్నాలు
వెండియుమెచ్చవే వెంకటస్వామీ ! ||ఇంది|| 22

## శ్రీరాగం

అదివో అల్లదిహో హరివాసము
పదివేలు శేషుల పడగలమయము. ||పల్లవి||

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
నదె చూడుఁ డదె మ్రొక్కుఁ డానందమయము. ||అది||

చెంగట నల్లదివో శేషాచలము
నింగి నున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము. ||అది||

కై వల్యపదము వేంకటనగ మదివో
శ్రీవేంకటపతికి సిరు లైనది
భావింప సకలసంపదరూప మదివో
పావనముల కెల్లఁ బావనమయము. ॥అది॥ 23

ఆహిరి

వననిధిఁ గురిసినవాన లివి మరి
పనిలేనివనుల భారములు. ॥పల్లవి॥

అడవులవెన్నెల లారడిబదుకులు
తడతాకుల పరితాపములు
ఒడ లొసఁగినవారి నొల్లక యితరుల
బడిబడిఁ దిరిగిన బంధములు. ॥వన॥

కొండలనునుపులు కొనకొనమమతలు
అండల కేఁగిన నదవదలు
పండినపంటలు పరమాత్ము విడిచి
బం డయి తిరిగినబడలికలు. ॥వన॥

బచ్చనరూపులు పచ్చలకొలపులు
నిచ్చలనిచ్చల నెయ్యములు
రచ్చలవేంకటరమణునిఁ గొలువక
చచ్చియుఁజావని జన్మములు. ॥వన॥ 24

శ్రీరాగం

నిత్యానంద ధరణీధర ధరారమణ
కాత్యాయనీస్తోత్ర కామ కమలాక్ష. ॥పల్లవి॥

అరవిందనాథ జగదాధార భవదూర
పురుషోత్తమ నమో భువనేశ !
కరుణాసమగ్ర రాక్షసలోకసంహార
శరణ కమలాక్షీశ కరిరాజవరదా ! ॥నిత్యా॥

భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగరనిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణ నిజదేహా
భాగీరథీజనక పరమ పరమాత్మ. ॥నిత్యా॥

పావన పరాత్పర శుభప్రద పరాతీత
శ్రీవల్లభకాంత శృంగారరమణ
శ్రీవెంకటేశ దాక్షిణ్యగుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిరకృపాభరణ ! ॥నిత్యా॥ 25

## ముఖారి

అనుమానపుబ్రదుకు కది రోఁతా తన
మనసెనయనికూటమి మఱిరోఁతా. ॥పల్లవి॥

అవుకేరుబుఁ బడి ఆడికలోన
అపవాదియాటు అదిరోఁతా
ఉపమ గెలిచెనని యొరుఁ జెఱుచుటలు
విపరీతపుగుణవిధి మొకరోఁతా. ॥అను॥

తనగుట్టులు నెఱిగిననవారిముందట
తనమెమ్మెలు చెప్పుకొనుట రోఁతా
వనితలముందట వదరుచు వదరుచు
కనుఁగవ గానని గర్వము రోఁతా. ॥అను॥

భువి హరి గతియని బుద్ధిఁదలంచని
యువమానవుఁ డన సదిరోఁతా
భవసంహారుఁడై పరగు వెంకటపతి
నవిరళముగఁ గొలువని దది రోఁతా. ॥అను॥ 26

## దేసాళి

నిన్నుఁ దలంచి నీపేరు దలంచి
నన్నుఁ గరుణించితే నన్నిక గాక. ॥పల్లవి॥

అధికునిఁ గాచు టేమరుదు నన్ను
నధమునిఁ గాచుట యరుదుగాక నీకు
మధుర మా టేమరుదు మధురమూ చేదు
మధుర మౌటే మహిలో నరుదుగాక ! ॥నిన్ను॥

అనఘునిఁ గరుణింప నరుదుగాదు నీకు
ఘనపాపుని నన్నుఁ గాచు టరుదుగాక
కనకము కనకము గానేల యినుము
కనక మవుటే కడు నరుదు గాక ! ॥నిన్ను॥

నెలకొన్న భీతితో నిన్నుఁ జెనకితిఁ గాక
తలకొన్న సుఖానఁ దలఁచనేల నిన్ను
ఎలమితోఁ దిరువేంగళేశుఁడ నాపాలఁ
గలిగి నీకృప గలుగఁ జేతువు గాక, ॥నిన్ను॥ 27

## పాడి

పాపపుణ్యములరూపము దేహ మిది దీని
దీపనం బణఁగింపఁ దెరు వెందు లేదు ॥పల్లవి॥

అతిశయంబైన దేహాభిమానము దీఱ
గతిఁగాని పుణ్యసంగతిఁ బొందరాదు
మతిలోని దేహాభిమానంబు విడుచుటకు
గతిపరాఙ్ముఖుఁడు గాక రమణంబు లేదు ॥పాప॥

సరిలేనిమమకారజలధి దాఁటినఁగాని
అరుదైన నిజసౌఖ్య మది పొందరాదు
తిరువేంకటాచలాధిపునిఁ గొలిచినఁ గాని
పరగుబ్రహ్మానందపరుఁడు తాఁ గాఁడు ॥పాప॥ 28

6 రేకు. ఆహిరి

పెంచఁ బెంచ మీఁదఁ బెరిగేటిచెలిమి
ఇంచుకంత కాలుముల కెడలేని చెలిమి ॥పల్లవి॥

అంటుముట్టులేక మనసు లంటుకొన్న చెలిమి
కంటఁ గంట నవ్వించే ఘనమైన చెలిమి
వెంట వెంటఁ దిరిగాడు వెట్టికొన్న చెలిమి
ఇంటివారిచిత్తములకు నిష్టమైన చెలిమి ॥పెంచ॥

చెక్కుచెమట పిక్కవలెనే చిక్కనైనచెలిమి
ఎక్కడాటా తమ్ముఁ దమ్ము నెఱఁగని నీచెలిమి
చక్కఁదనమే చిక్కి మేను చిక్కినట్టిచెలిమి
లెక్కలేని యాసలెల్లా లేఁతలయిన చెలిమి ॥పెంచ॥

అంకురించినట్టితలఁపు లధికమయిన చెలిమి
లంకె లయినయాసలెల్లా లావుకొన్న చెలిమి
వేంకటాద్రివిభునిఁ గూడి వేడు కయినచెలిమి
పంకజాననలకెల్లఁ బాయరానిచెలిమి ॥పెంచ॥ 29

## ఆహిరి

అలాగుపొందులును నటువంటి కూటములు
నీలాగు లోట నేఁ డిదె చూడనయితి ॥పల్లవి॥

అడియాసచూపులకు నాసగించితిఁగాని
వెడమాయ లనిలోను వెదకలేనైతి
కడువేడుకలఁ దగిలి గాసిఁ బొందితిఁ గాని
యెడలేనిపరితాప మెఱుఁగలేనైతి ॥అలా॥

చిఱునగవుమాటలకుఁ జిత్తగించితిఁగాని
తరిలీపులని లోను దలఁపలేనైతి
వరుసమోహపుఁ బసలవలలఁ జిక్కితిఁ గాని
గరువంపుఁబొలయలుక గానలేనైతి ॥అలా॥

శ్రీవేంకటేశ్వరునిఁ జింతసేసితిఁ గాని
దేవోత్తమునిలాగుఁ దెలియలేనైతి
ఈవైభవముపై నిచ్చగించితిఁగాని
యీనైభవానంద మిది పొందనైతి ॥అలా॥ 30

## గౌళ

ఎన్ని లేవు నాకిటువంటివి
కన్నులెదుట నిన్నుఁ గనుఁగొనలేనైతి ॥పల్లవి॥

అరయ నేఁజేసిన యపరాధములు చూచి
కరుణించి యొకఁడై నాఁ గాచునా
కరచరణాదులు కలిగించిన నిన్నుఁ
భరియించి నీసేవాపరుఁడఁ గాలేనైతి ॥ఎన్ని॥

పతొరినై నే నటించి చేసినయట్టి
పాతక మొకఁడైనాఁ బాపునా
ఆతుమలోనుండి యలరి నీవొసఁగిన
చేతనమున నిన్నుఁ జెలఁగి చేరనైతి ॥ఎన్ని॥

శ్రీవేంకటేశ నేఁ జేసినయితరుల
సేవ కోకఁడు దయసేయునా
నీవే యిచ్చినయట్టి నే నీశరీరముతోడ
నీవాఁడ ననుబుద్ధి నిలుప నేరనైతి ॥ఎన్ని॥ 31

గుండక్రియ

ఎంతటివారలు నెవ్వరును వారిఁ
జింతించక నిశ్చింతులు గారు ॥పల్లవి॥

అతిజితేంద్రియులు ననశనవ్రతులు
నతులతపోధను లగువారు
చతురాననగురుస్మరణము దొరకక
తతి నూరక పుణ్యతములుగారు ॥ఎంత॥

అనఘులు శాంతులు నధ్యాత్మరతులు
ననుపమపుణ్యులు యాజకులు
వనజోదరు ననవరతముఁ దలఁచక
వినుతిస్మృతికివి విబుధులుగారు ॥ఎంత॥

దురితవిదూరులు దుర్మతిహీనులు
నిరతానందులు నిత్యులును
తిరువేంకటగిరిదేవుని గొలువక
పరమార్గమునకు బ్రహ్మలుగారు ॥ఎంత॥ 32

## సామంతం

పరమపాతకుఁడ భవబంధుఁడ శ్రీ
హరి నిను దలఁచ నే నరుహుఁడనా ||పల్లవి||

అపవిత్రుఁడ నే నమంగళుఁడఁ గడు
నపగతపుణ్యుఁడ నలసుఁడను
కపటకలుషపరికరహృదయుఁడ నే
నపవర్గమునకు నరుహుఁడనా ||పర||

అతిదుష్టుఁడ నే నధికదూషితుఁడ
హతవివేకమతి నదయుఁడను
పతిలేనిరమాపతి మిముఁ దలఁచ నే
నతులగతికి నే నరుహుఁడనా ||పర||

అనుపమవిషయపరాధీనుఁడ నే
ననంతమోహభయాతురుఁడ
వినుతింపఁగఁ దిరువేంకటేశ ఘను
లనఘులు గాక నే నరుహుఁడనా. ||పర||౩౭

## నాదరామక్రియ

ఇన్నియుఁ గలుగు టేజన్మమున నైనఁ
జెన్నలర హరి సేవ సిద్ధించుకొఱకు ||పల్లవి||

అరయ వేదాధ్యయన మది బ్రహ్మశుద్ధికొఱ
కిరవైన శాస్త్రంబు లెఱుకకొఱకు
తఱి యజ్ఞములు పుణ్యోత్తర మయ్యెడికొఱకు
వఱలేవిధానములు జన్మములకొఱకు ||ఇన్ని||

మమకారదూరంబు మనసు గెలుచుటకొఱకు
సమవివేకంబు శాంతముల కొఱకు
అమర శ్రీతిరువేంకటాద్రీశుమనను ని
జము గెలుచు బ్రహ్మవిజ్ఞానంబు కొఱకు ॥ఇన్ని॥ 34

సామంతం

ఏ నిన్ను దూరక యెవ్వరిదూరుదు నీ
వాని నన్నొకయింత వదలక నను నేలవలదా ॥పల్లవి॥

అపరాధిఁ గనుక న న్నరసి కావు మని
అపరిమితభయ మంది నీకు శరణంటిఁ గాక
నెపములేక నన్ను నీకుఁ గావగ నేల
అపవర్గరూప దయాంబుధి తిరువేంకటాధిప ॥ఏని॥

ఘనపాపిఁ గనుక నీకరుణఁ గోరి నీ
వనవరతము నా యాతుమ నిహరించు మంటిఁగాక
యెనసి నన్నుఁ గాచు టేమి యరదు నీకు
ననఘుఁడ పరమతత్త్వానంద తిరువేంకటాధిప ! ॥ఏని॥ 35

౬-వ రేకు ధన్నాసి

వైష్ణవులు గాని వార లెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁ గాన ॥పల్లవి॥

అంతయు విష్ణుమయం బట మఱి దేవ
తాంతరములు గల వననేలా
భ్రాంతిఁ బొంది యేభావము భావించి
నంతనె పుణ్యు లవుట దప్పదుగాన ॥వైష్ణ॥

ఎవ్వరిఁ గొలిచిన నేమిగొఱంత మఱి
యెవ్వరిఁ దలఁచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరిరూపు గానివా
రెవ్వరు లే రని యెఱుకదోఁచినఁ జాలు ॥వైష్ణ॥
అతిచంచలంబైన యాతుమ గలిగించు
కతమున బహుచి తగతులై
యితరులఁ గొలిచిన యెడయక యనాథ
పతితిరువేంకటపతి చేకొనుఁగాక ॥వైష్ణ॥ 36

## శ్రీరాగం

మనసిజగురుఁ డితఁడో మఱియుఁ గలఁడో వేద
వినుతుం డితఁడుగాక వేఱొకఁడు గలఁడో ॥పల్లవి॥
అందరికి నితఁడెపో అంతరాత్ముఁ డనుచు
నందు రితఁడో మఱియు నవల నొకఁడో
నందకధరుఁడు జగన్నాథుఁ డచ్యుతుఁడు గో
విందుఁ డితఁడె గాక వేఱొకఁడు గలఁడో ॥మన॥
తనర నిందరికిఁ జైతన్యమొసఁగినయాతఁ
డొనర నితఁడో మఱియు నొకఁడుగలఁడో
దినకరశతతేజుఁ డగు దేవదేవుఁడు త
ద్వినుతుఁ డితఁడు గాక వేఱొకఁడు గలఁడో ॥మన॥
పంకజభవాదులకుఁ బరదైవ మీతఁడని
అంకింతు రితఁడో అధికుఁడొకఁడో
శంకరిస్తోత్రములు సతతమును గైకొనెడి
వెంకటవిభుఁడో కాక వేఱొకఁడు గలఁడో ॥మన॥ 37

## భూపాలం

ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు
నప్పుడగు తిరువేంకటాద్రీశుఁ గంటి ॥పల్లవి॥

అతిశయంబైన శేషాద్రిశిఖరముగంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడగంటిఁ జయ్యన మేలుకంటి ॥ఇప్పు॥

కనకరత్నకవాటకాంతు లిరుగడఁగంటి
ఘనమైనదీపసంఘములు గంటి
అనుపమమణిమయమగుకిరీటము గంటి
కనకాంబరము గంటి గ్రక్కన మేలుకంటి ॥ఇప్పు॥

అరుదైనశంఖచక్రాదు లిరుగడఁగంటి
సరిలేని యభయహస్తము గంటిని
తిరువేంకటాచలాధిపునిఁ జూడఁగఁగంటి
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి ॥ఇప్పు॥ ౮౫

## బౌళి

తీపనుచు చేదు తెగఁదిని విసుకఁ బడరాదు
ఆపదలచేతఁ బొరలాడేము గాన ॥పల్లవి॥

అప్పుదీరినదాఁక నలవోక కైన వా
రెప్పుడును దమవార లే లౌదురు
అప్పటప్పటికిఁ బ్రియ మనుభవింపుచు మమత
చెప్పినటువలెఁ దాము సేయవలెఁగాక ॥తీప॥

పొందైన వారు మునిప్రౌఢవోక్తులు దిరుగు
ఇందఱునుఁ దమవారు లేరొకరు
కందువగు తమకార్యగతులు తీరినదాఁక
సందడింపుచుఁ బ్రియము జరపవలెఁగాక ! ॥తీప॥

తెగనికర్మము దమ్ముఁ ద్రిప్పుకొని తిరిగాడ
నగడు కోరిచి పెనఁకులాడ నేమిటికి
తగు వేంకటేశ్వరునిఁ దలఁచి యిన్నిటాఁ దాము
విగతభయులయి భ్రాంతి విడువవలెఁగాక. ॥తీప॥ 39

## శ్రీరాగము

అదిగాక నిజమతం బదిగాక యాజకం
బదిగాక హృదయసుఖ మదిగాక పరము ॥పల్లవి॥

అమలమగు విజ్ఞాన మను మహాధ్వరమునకు
నమరినది సంకల్పమను మహాపశువు
ప్రమదమను యూపగంబమున విశసింపించి
విమలేంద్రు (ద్రి?) యాహుతులు వేల్పఁగవలదా ॥అది॥

అరయ నిర్మమకార మాచార్యుఁడై చెలఁగ
వరుసతో ధర్మసేనత బ్రహ్మగాఁగ
దొరకొన్న శమదమాదులు దానధైర్యభా
స్వరగుణాదులు విప్రసమితిగావలదా. ॥అది॥

తిరువేంకటాచలాధిపు నిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతనికృపాపరి పూర్ణజలధిలో
నరుహులై యవబృథం బాడంగవలదా ॥అది॥ 40

## శంకరాభరణము

తలపోఁత బ్రాఁతె తలఁపులకుఁ దమ
కొలఁ దెఱుంగని మతి గోడాడఁగా ॥పల్లవి॥

ఆపదలు బ్రాఁతె అందరికినిఁ దమ
చాపలపుసంపదలు నడిఁ బెట్టఁగా
పాపములు బ్రాఁతె ప్రాణులకును మతిఁ
బాపరానియాస దమ్ముఁ బాధించఁగా ॥తల॥

జగడాలు బ్రాఁతె జనులకునుఁ దమ
పగలైనకోపాలు పైకొనంగా
వగలు బ్రాఁతె ఎలలఁ బెట్టిశీ తమ్ముఁ
దగిలించు మమత వేదనముసేయఁగా ॥తల॥

భయములు బ్రాఁతె పరులకును దమ
దయలేక యలయించు ధనముండఁగా
జయములు బ్రాఁతె సతతమును యింత
నయగారి వేంకటనాథుఁడుండఁగాను ॥తల॥ 4]

7-వ రేకు ## ధన్నాసి

పుట్టుగు ఁమిమ్మ భువిఁ గొనరో
జట్టికిని హింసలే మీధనము ॥పల్లవి॥

ఆపద లంగడినమ్మఁ గొనరో
పాపాత్ములు పైపయిఁ బడకా !
కైవులఁ బుణ్యులఁగని కోపించే
చూవులు మీకివి సులభపుధనము ॥పుట్టు॥

కడుఁ గుంభీపాతకాంబులు గొనరో
బడిబడి నమ్మీఁ బాలిండ్ల
తొడరుఁ బరస్త్రీ ద్రోహపుధనములె
తడవుటె మీకివి దాఁచినధనము ॥పుట్టు॥

లంపులచండాలత్వము గొనరో
గంపలనమ్మీఁ గలియుగము
రంపపు వేంకటరమణుని కథ విన
నింపగు వారికి నిదె ధనము ॥పుట్టు॥ 42

## లలిత

అప్పుడువో నినుఁ గొలువఁగ నరుహము గలుగుట ప్రాణికి
కప్పినదియుఁ గప్పనిదియుఁ గనుఁగొనఁగలనాఁడు ॥పల్లవి॥

ఆపదలకు సంపదలకు నడ్డముచెప్పనినాఁడు
పాపములకు పుణ్యములకుఁ బని దొలఁగిననాఁడు
కోపములకు శాంతములకుఁ గూటమి మానిననాఁడు
లోపల వెలుపల తనమతిలోఁ దెలిసిననాఁడు ॥అప్పు॥

తనవారలఁ బెఱవారలఁ దాఁ దెలిసిననాఁడు
మనసునఁ జైతన్యంబును మఱి పందిననాఁడు
పనివడి తిరువేంకటగిరిపతి నీదాసుల దాసులఁ
గనుఁగొని నీభావముగాఁ గనువిచ్చిననాఁడు ॥అప్పు॥ 43

## సామంతం

కొలువుండీ భక్తిఁ గొండల కోనేటి
నిలయుని శ్రీనిధి యైనవాని ॥పల్లవి॥

ఆదిదేవుని నభవుని సామ
వేదనాదవినోదుని నెఱ
వాది జితప్రియు నిర్మలతత్త్వ
వాదుల జీవనమైన వాని ॥కొలు॥

దేవదేవుఁడై దివ్యుని సర్వ
భావాతీత స్వభావుని
శ్రీవేంకటగిరిదేవుఁడైన పర
దేవుని భూదేవతత్పరుని ॥కొలు॥ 44

## లలిత

మంచిదివో సంసారము మదమత్సరములు మానిన
కంచును బెంచును నొకసరిగాఁ దాఁ జూచినను ॥పల్లవి॥

ఆపదలకు సంపదలకు నభిమానింపక యుండిన
పాపముఁ బుణ్యము సంకల్పము లని తెలిసినను
కోపము శాంతము తమతమగుణములుగా భావించిన
తాపము శైత్యమునకుఁ దాఁ దడఁబడకుండినను ॥మంచి॥

వెలియును లోపలయును నొకవిధమై హృదయం బుండిన
పలుకును బంతము దానొక భావనఁ దోఁచినను
తలఁపునఁ దిరువేంకటగిరి దైవము నెలకొని యుండిన
సొలవక యిన్నిటికినిఁ దా సోఁకోరుచె నైనా ॥మంచి॥ 45

## లలిత

మంగళం గోవిందునకు జయమంగళం గరుడధ్వజునకు
మంగళము సర్వాత్మునకు ధర్మస్వరూపునకూ, జయజయా ॥పల్లవి॥

ఆదికిని నాద్యైనదేవున కచ్చుతున కంభోజనాభున
కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని
వేదరక్షకునకును సంతతవేదమార్గవిహారునకు బలి
భేదికిని సామాదిగానప్రియవిహారునకు ॥మం॥

హరికిఁ బరమేశ్వరునకును శ్రీధరునకును గాలాంతకునకును
పరమపురుషోత్తమునకును బహుబంధదూరునకు,
సురమునిస్తోత్రునకు దేవాసురగణశ్రేష్ఠునకు గరుణా
కరునకును గాత్యాయనీనుతకలితనామునకు ॥మం॥

పంకజాననవరదునకు భవపంకవిచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు
వేంకటాచలవల్లభునకును విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభకుంకుమ పంకలోలునకు ॥మం॥ 46

సామంతం

పాయనికర్మములే కడుఁ బలవంతము లనినప్పుడే
కాయమునకు జీవునకును గర్తృత్వము లేదు ॥పల్లవి॥

ఆతుమ సకలవ్యాపక మనితలపోసినవిమ్మట
జాతియుఁ గులాభిమానముఁ జర్చించవలరాదు
భూతవికారము లన్నియుఁ బురుషోత్తముఁ డనినప్పుడు
పాతకముల పుణ్యంబుల పని తనకే లేదు. ॥పాయ॥

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచిన విమ్మట
మదమున నెవ్వరిఁ జూచినఁ మొక్కక పోరాదు
కదిసినయిప్పటిసుఖములె కడుదుఃఖము లని తెలిసిన
చెదరక సంసారమునకుఁ జేసాఁచవలరాదు. ॥పాయ॥

పరిపూర్ణుఁడు తిరువేంకటపతి యనఁగా వినినప్పుడు
ఎరవుల హీనాధికములు ఎగ్గులు మఱిలేవు
పరమాత్ముండగు నీతని భక్తులఁదలఁచిన యప్పుడు
తిరముగ నీతనికంటెను దేవుఁడు మఱి లేఁడు ॥పాయ॥ 47

సాళి

ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో హోమ మైపోయెఁ గాలము. ॥పల్లవి॥

ఇదేమే లయ్యీడి నా కదె మేలయ్యీడి నని
కదిసిన యాసచేఁ గడవ లేక
ఎదురుచూచిచూచి యెలయించి యెలయించి
పొదచాటుమృగ మైపోయెఁ గాలము ॥ఏడ॥

ఇంతటఁ దీరెడి దుఃఖ మంతటఁ దీరెడినని
వింతవింతవగలచే వేఁగి వేఁగి
చింతయు వేదనలఁ జిక్కువడచు నగ్ని
పొంత నున్న వెన్న యైపోయెఁ గాలము ॥ఏడ॥

ఇక్కడసుఖము నాకక్కడసుఖం బని
ఎక్కడికైనా నూర కేఁగి యేఁగి
గ్రక్కున శ్రీతిరువేంకటపతిఁ గానక
పుక్కిటిపురాణ మయి పోయెఁ గాలము ॥ఏడ॥ 48

౭-వ రేకు. గుండక్రియ

కొనుట వెగ్గళముదాఁ దినుట యల్పము మీఁదు
గనుట వినుటలే కదా కడచన్న భవము ॥పల్లవి॥

ఆపదవడ్డకినిచ్చి యనుభవింపఁ బోయిన
ఫవున నెవ్వరికి నిం కేమిగలదు
పాపపుఁ బైరువిత్తిన పండినపంటలలోన
రూపింపఁగ నిందు రుచియేమి గలదూ ॥కొను॥

ఘనుఁడై సతిరువేంకటనాథుఁడిన్నిటికి
యనుభోక్తయుఁ గర్తయును నైనవాఁడు
పనిలేదు నిష్కారపరుఁడు దానై వుండు
తనకుఁ దానే కర్త తనమూలఁ గాన ॥కొను॥ ౪౯

## ఆహిరి

జీవాత్మునై యుండు చిలుకా నీ
వావలికిఁ బరమాత్ముఁడై యుండు చిలుకా ॥పల్లవి॥

ఆతుమపంజరములోన నయమున నుండి నా
చేతనే పెరిగినచిలుకా
జాతిగాఁ గర్మపునంకెళ్లఁబడి కాలఁ
జేతఁ జేదైతివే చిలుకా
ఖాతిగాఁ జదువులు పగలు రేలును నా
చేత నేరిచి నట్టి చిలుకా!
రీతిగా దేహఁపు రెక్కలచాటున నుండి
సీతు కోరువలేని చిలుకా ॥జీవా॥

బెదరి మైదుగురికిని భీతిఁ బొందుచుఁగదుఁ
జెదరంగఁ జూతువే చిలుకా!
అదయులైన శత్రు లాఱుగురికిఁ గాక
అడిచిపడుదువే నీవు చిలుకా

వదల కిటు లాహారవాంఛ నటుపదివేలు
వదరులు వదరేటి చిలుకా
తుదలేనిమమతలు తోరమ్ము సేసి నా
తోఁగూడిమెలగినచిలుకా ! ॥జీవా॥

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవేనేనై యుండుఁ జిలుకా !
శ్రీవెంకటాద్రిపై చిత్తములో నుండి
సేవించుకొని గట్టి చిలుకా !
దైవమానుషములు తలఁపించి యెవుడు నా
తలఁపునఁ బాయని చిలుకా !
ఏవియును నిజముగా వివి యేఁటికని నాకు
నాఁగించి నటువంటి చిలుకా ! ॥జీవా॥ ౬0

## ముఖారి

నదు లొల్లవు నాస్నానము కడు
సదరము నా కీస్నానము ॥పల్లవి॥

ఇరువంకల నీ వేచినముద్రలు
ధరియించుటె నాస్నానము
ధరపై నీనిజదాసుల దాసుల
చరణధూళి నాస్నానము ॥నదు॥

తలఁపులోన నినుఁ దలఁచినవారలఁ
దలఁచుటే నాస్నానము
వలనుగ నినుఁగను వారలశ్రీపాద
జలములే నాస్నానము. ॥నదు॥

పరమభాగవతపాదాంబుజముల
దరుసెనమే నాస్నానము
తిరువేంకటగిరిదేవ నీకథా
స్మరణమే నాస్నానము ||నదు|| 51

శ్రీరాగం

చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు
చాలదా హితవైన చవులెల్ల నొసఁగ ||పల్లవి||

ఇది యొకటి హరినామ మింతైనఁ జాలదా
చెదరకీజన్మముల చెఱలు విడిపించ
మది నొకటె హరినామమంత్ర మది చాలదా
పదివేలు నరకకూపముల వెడలి చ ||చ ల||

కల దొకటి హరినామకనకాద్రి చాలదా
తొలఁగు మని దారిద్ర్యదోషంబు చెఱుచ
తెలి వొకటి హరినామదీప మది చాలదా
కలుషంపుఁగఠిన (గటిక ?) చీఁకటి పాఱద్రోల ||చాల||

తిరువేంక టేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ
సొగిసి యీవిభునిదాసులకరుణ చాలదా
నగవుఁ జూపులను నున్నత మెపుడుఁ జూప ! ||చాల|| 52

శ్రీరాగం

వందే వాసుదేవం
బృందారకాధీశ వందితపదాబ్జం ||పల్లవి||

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ
చందనాంకితలసచ్చారుదేహమ్
మందారమాలికామకుటసంశోభితం
కందర్పజనక మరవిందనాభమ్ ॥వందే॥

ధగధగితకౌస్తుభాధరణవక్షస్స్థలం
ఖగరాజవాహనం కమలనయనమ్
నిగమాదిసేవితం నిజరూపశేషప
న్నగరాజశాయినం ఘననివాసమ్ ॥వందే॥

కరిపురనాథసంరక్షణే తత్పరం
కరిరాజవరదసంగతకరాబ్జమ్
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలాదేవం భజే ॥వందే॥ 53

భూపాలం

సీకథామృతము నిరతసేవన నాకు
చేకొనుట సకలసంసేవనం బటుగాన ॥పల్లవి॥

ఇదియెమంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇవియెబహుశాస్త్ర మెల్లఁజదువుట నాకు
ఇదియె సంధ్యానా కిదియె జప మటుగాన ॥సీక॥

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
నిదియె దుఃఖవిరహితమార్గము
ఇదియె భవరోగహితభేషజము నాకు
నిదియె యుపనిషద్వాక్యపద్ధతి గాన ॥సీక॥

ఇదియె దానఫల మీఁజాలినది నాకు
నిదియె తలఁపఁ బరహితకర్మము
ఇదియె తిరువేంకటేశ నీసంస్మరణ
మిదియె ఇదియె ఇన్నియును నటుగాన ||నీక|| 54

9-వ రేకు. సామంతం

ఏమి సేయవచ్చుఁ గర్మ మిచ్చినంతే కాని లేదు
తాము సేసినంతవట్టుఁ దమకుఁ బోరాదు ||పల్లవి||

ఇట్టునట్టు మిట్టిపడ్డ యించుకంతా లేదు వీఁపు
బట్ట గట్ట మోపు మోఁచి పాటుపడ్డా లేదు
తట్టువడ లోకమెల్లఁ దప్పుకొనినా లేదు
తెట్టఁ దెరువున నోరు దెఱచినా లేదు ||ఏమి||

అడిగి పరులఁ బదు కానబడ్డా లేదు భీతి
విడిచి నెత్తుటఁ దోఁగి వీరుఁడైనా లేదు
అడవు లెల్లాఁ దిరిగి అలమటించిన లేదు
ఉడుమపాటుకుఁ జొచ్చి యియ్యకొన్నా లేదు ||ఏమి||

వచ్చివచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చులగుఱ్ఱము నెక్కి మెఱసినా లేదు
ఎచ్చరికఁ దిరువేంకటేశుఁ గొలువక యుంటె
ఇచ్చట నచ్చట సు మించుకంతా లేదు ||ఏమి|| 55

ముఖారి

నగుఁబాట్లఁ బడెనా జిహ్వ
పగటున నిదివో పావన మాయ ||పల్లవి||

ఇల నిందలకె నుతియించి పెంచువలె
నలినలి యైనది నాజిహ్వ
నలినోదరు శ్రీనామము దలఁచిన
ఫలమున కిదివో పావనమాయ ॥నగు॥

భ్రమఁ బడిమాయపుఁ బడఁతుల తమ్మలు
నమలి చవులుగొనె నాజిహ్వ
అమరవంద్యుఁడగు హరి నుతియించఁగ
ప్రమదము చవిగొని పావన మాయ ॥నగు॥

నెలఁతల పలుయోనిద్రవనదులను
నలుగడ నిండెను నాజిహ్వ
అలసి వేంకటనగాధిప యనుచును
పలికినయంతనె పావనమాయ ॥నగు॥ 56

శ్రీ రాగం, ఏకతాళి.

విడుమనవో రోలు విడుమనవో నేగ
విడు మనవో తల్లి వెఱచీని బాలుఁడు ॥పల్లవి॥

ఎన్నఁడు గొల్లెతల యిండ్లు వేమారుఁ జొచ్చి
వెన్నలుఁ బాలును వెఱఁజండు
వన్నెలనీకోప మింత వద్దు నీకు నీయాన
కన్నులనవ్వులముద్దు గారీని బాలుఁడు ॥విడు॥

సారెకుఁ బెరుగుల చాడెలూ నేఁడు మొదలూ
గోరమై కోలలఁ బగులమొత్తఁడు
కూరిమిలేక నీవు గోపగించఁగాఁ గన్నీరు
కోరునా రాలఁగా నిన్నే చూచీని బాలుఁడు ॥విడు॥

చాలు నీకోప మిది సరిలేని మద్దులివి
రోలనే యిట్లను విరుగఁ ద్రోయఁడు
మేలిమి వేంకటపతి మేఁటి నీకొమారుఁ డిదె
కేలెత్తి నీకు మ్రొక్కీడి నిదే బాలుఁడు ॥విను॥ 57

భైరవి-రచ్చెతాళం

పట్టవసము గాని బాలుఁడా పెనుఁ
బట్టపుబలువుఁడ బాలుఁడా! ॥పల్లవి॥

ఇరుగడ బ్రహ్మయు నీశ్వరుఁడును నిన్ను
సరుస నుతింప జఠరమున
అరుదుగనుండి ప్రియంబున వెడలిన
పరమమూర్తివా బాలుఁడా ॥పట్ట॥

తల్లియుఁ దండ్రియుఁ దనియనిముదమున
వెల్లిగ లోలో వెఱవఁగను
కల్లనిదురతోఁ గనుమూసుక రే
పల్లెలోఁ బెరిగిన బాలుఁడా ॥పట్ట॥

ఏదెసఁ జూచిన నిందఱిభయముల
సేదలు దేఱఁగఁ జెలఁగుచును
వేదపల్లవపు వేంకటగిరిపై
పాదము మోపిన బాలుఁడా! ॥పట్ట॥ 58

ఆహిరి

మదమత్సరము లేక మనసు పేదై పో
పదరిన యాసలవాఁడు వో వైష్ణవుఁడు ॥పల్లవి

ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కు లాడి
ఎట్టివారి నైనా దూరి యెవ్వరినైనాఁ జేరి
వట్టియాసలఁ బడనివాఁడువో వైష్ణవుఁడు ॥మద॥

గడనకొఱకుఁ జిక్కి కాముకవిద్యలఁ జొక్కి
నిడివి నేమైనాఁ గని నిక్కినిక్కి
ఒడలిగుణముతోడ నుదుటువిద్యలఁ జాల
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ॥మద॥

ఆవల వోరులఁ జెడనాడఁగ విని విని
చేవమీరి యెవ్వరిని జె[illegible]ాడక
కోవిదు శ్రీవెంకటేశుఁ గొలిచి పెద్దల కృప
వావివర్తన గలవాఁడు వో వైష్ణవుఁడు ॥మద॥ 59

సామంతం

ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే
వేదవిరహితులకు వెఱతు మటుగాన ॥పల్లవి॥

ఇరవుకొని రూపంబు లిన్నిటానుఁ గలనిన్నుఁ
బరికించవలెఁగాని భజించఁ పరాదు
గరిమ చెడి సత్సమాగమము విడిచిన నీ
స్మరణవిజ్ఞాన వాసన గాదుగాన ॥ఏది॥

ఇహదేవతాప్రభల నెల్ల వెలుఁగుట నీకు
సహజ మనవలెఁ గాని సరిఁ గొలువరాదు
అహిమాంశుకిరణంబు లన్నిచోట్లఁ బరగు
గ్రహియింప రా దవగ్రాహములుగాన ॥ఏది॥

ఇంతయునుఁ దిరువేంకటేశ నీ వునికిఁ దగఁ
జింతింపవలెఁ గాని సేవింపరాదు
అంతయు నసర్వమును సర్వం బనఁగరాదు
అంతవానికిఁ బరుల కలవడదుగాన ॥పది॥ 60

10-వ రేకు. శంకరాభరణం

పదిలముకోట పగవారు
అదనఁ గాచుకొందు రాఱుగురు ॥పల్లవి॥

ఇమ్మైఁ జెప్ప నిందటిచేత
తొమ్మిది నెల్లఁ దోఁగినది
కొమ్మతీరునఁ గుదురైనకోట
దొమ్మికాం డ్రైదుగు రుందురు ॥పది॥

ఒంటికాఁడు రాజు ఉడుగక తమలోన
ఒంటని నీమంత్రులొకయిద్దఱు
దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు
బంటు లేడుగురు బలవంతులు ॥పది॥

కలవు తొమ్మిది కనుమల తంత్రము
నిలుపఁ గలిగినట్టి నెఱవాదులు
తెలిసికొనేటి తిమ్మనాయఁడు సొచ్చి
బలిసె నీకోట భయమేల ॥పది॥ 61

సామంతం

ఎంత సదివిన నేమి వినిన తన
చింతయేల మాను సిరు లేల కలుగు ॥పల్లవి॥

ఇతరదూషణములు ఎడసినఁగాక
అతికాముకుఁడు గానియప్పుడు గాక
మతిచంచలము గొంత మానినఁ గాక
గతియేల కలుగు దుర్గతు లేల మాను ॥ఎంత॥

పరధనములయాస పాసినఁ గాక
అరిది నిందలు లేని యప్పుడుగాక
విరసవర్తనము విడిచినఁ గాక
పర మేల కలుగు నాపద లేలమాను ॥ఎంత॥

వెంకటపతి నాత్మ వెదకినఁ గాక
కింక మనమునఁ దొలఁగినఁ గాక
బొంకుమాట లెడసి పోయినఁ గాక
శంక యేలమాను జయ మేల కలుగు ॥ఎంత॥ 62

సామంతం

కాలవిశేషమో లోకము గతియో సన్మార్గంబుల
కీలువదలె సౌజన్యము క్రిం దయిపోయినది ॥పల్లవి॥

ఇం దెక్కడిసంసారం బేదెసఁ జూచినధర్మము
కం దయినది విజ్ఞానము కడకుఁ దొలంగినది
గొందులు దరిఁబడె శాంతము కొంచెం బాయె వివేకము
మందుకు వెదకినఁ గానము మంచితనంపుఁబనులు ॥కాల॥

మఱియుఁక నేఁటివిచారము మాలిన్యం బై పోయిన
నెఱుకలు సంతోషములకు నెడమే లేదాయె
కొఱమాలెను నిజమంతయు కొండలఁ కేఁగెను సత్యము
మఱుఁగయి పోయెను వినుకులు మతిమాలెను తెలివి ॥కాల॥

తమ కింక నెక్కడి బ్రతుకులు తడఁబడె నాచారంబులు
సమమైపోయిన వప్పుడె జాతివిడంబనములు
తిమిరం బింతయుఁ బాపఁగఁ దిరువేంకటగిరిలక్ష్మీ
రమణుఁడు గతినప్పను గలరచ నేమియు లేదు ॥కాల॥ 63

## శ్రీరాగము

ఈవిశ్వాసంబు ఎవ్వారికిఁ దోఁప దిది
పావనులహృదయమునఁ బ్రభవించుఁగాని ॥పల్లవి॥

ఇమ్మైనపాపంబు లెన్ని వలసినఁ బ్రాణి
నమ్మతంబునఁ జేయఁ జాలుఁ గాకేమి?
కమ్మరికి నొకయేఁడు గుదియ కొకనాఁ డౌను
నమ్మి తలఁచినవిష్ణునామంబు చేత ॥ఈవి॥

కొదలేఁ దురితములు కొండలుఁ గోట్లును
చెదర కెపుడుఁ బ్రాణి చేయుఁగాకేమి?
పొదరి గోటియలలోన పులిచొచ్చినట్లను
హృదయంబు హరిమీఁద నుండినంతటను ॥ఈవి॥

సరిలేనిదుష్కర్మసంఘములు రాసులై
పెరుగఁజేయుచుఁ బ్రాణి పెంచుఁగాకేమి?
బెరసి కొండలమీఁదఁ బిడుగుపడ్డట్లను
తిరువేంకటాచలాధిపునిఁ దలఁచినను ॥ఈవి॥ 64

## కన్నడ గౌళ

తనకర్మవశం బించుక దైవకృతం బొకయించుక
[illegible]

ఈదైన్యము లీహైన్యము లీచిత్తవికారంబులు
ఈదురవస్థలు గతులును నీలఁపటములును
ఈదాహము లిదేహము లీయనుబంధంబులు మఱి
ఈదేహము గలకాలము నెడయవు ప్రాణులకు ॥తన॥

ఈచూపులు నీతీపులు నీనగవులు నీతగవులు
నీచొక్కులు నీపొక్కులు నీవెడయలుకలును
ఈచెలుములు నీబలువులు నీచనవులు నీఘనతలు
నీచిత్తము గలకాలము నెడయవు ప్రాణులకు ॥తన॥

ఈవెరవులు నీయెఱుకలు నీతలఁపులు నీతెలువులు
దైవశిఖామణి తిరుమలదేవుని మన్ననలు
దైవికమున కిటువగవక తనతలఁ పగ్గలమైనను
దైవముతానే తానే దైవంబవుఁగాన ॥తన॥ 65

## శ్రీరాగం

ఈపాదమేకదా యిల యెల్లఁ గొలిచినది
యీపాదమేకదా యిఁగిరాహస్తముల కితవైనది ॥పల్లవి॥

ఈపాదమేకదా యిందఱును మ్రొక్కెడిది
యీపాదమేకదా యీగగనగంగ పుట్టినది
యీపాదమేకదా యెలమిఁ బెంపొందినది
యీపాదమేకదా యిన్నిటికి నెక్కుడైనది ॥ఈపా॥

ఈపాదమేకదా యిభరాజు దలఁచినది
యీపాదమేకదా యింద్రాదు లెల్ల వెదకినది
ఈపాదమేకదా యీబ్రహ్మ గడిగినది
ఈపాదమేగదా యెగసి బహ్మాండ మంటినది ॥ఈపా॥

ఈపాదమేకదా యిహపరము లొసగెడిది
యీపాదమేకదా యిల నహల్యకుఁ గోరికైనది
యీపాదమేకదా యీక్షింప దుర్లభము
ఈపాదమేకదా యీవేంకటాద్రిపై నిరవైనది ॥ఈపా॥ 66

21-వ రేకు. ముఖారి

పెక్కులంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వరులేరు యేమిసేతువయ్యా ॥పల్లవి॥

కన్ను మూయఁ బ్రొద్దు లేదు కాలు చాఁచ నిమ్ము లేదు
మన్నుద్రవ్వి క్రిందనైన మనికి లేదు
మున్నిటివలెనే గోరు మోపనైనఁ జోటు లేదు
ఇన్నిటా నిట్లానైతి వేమిసేతువయ్యా ॥పెక్కు॥

అడు గిడఁగ నవ్వలలేదు అండనైన నుండలేదు
పుడమిఁ గూడు గుడువనైనఁ బ్రొద్దులేదు
వెడఁగుఁ దనము విడువలేదు వేదమైనఁ జదువలేదు
ఎడపఁదడప నిట్ల నీకు నేమిసేతువయ్యా ॥పెక్కు॥

ఉప్పరములు మానినైన నుండలేదు లోకమందు
నిప్పుడైన నీవిహార మిట్లనాయెను
చెప్పనరుదు నీగుణాలు శ్రీ వెంకటేశ యిట్ల
నెప్పుడును ఘనుఁడ వరయ నేమిసేతువయ్యా ॥పెక్కు॥ 67

శ్రీరాగం

ఇతఁడు సేసినచేఁత లెన్నిలే విలమీఁద
ఇతఁడు జగదేకగర్వితుఁ డౌనో కాఁడో ॥పల్లవి॥

కుడువఁడా ప్రాణములు గొనుచుఁ బూతకిచన్ను
తుడువఁడా కపటదైత్యుల నొసలివ్రాలు
అడువఁడా నేలతో నలమి శకటాసురుని
వడువఁడా నెత్తురులు వసుధకంసునిని ||ఇతఁ||

పెట్టఁడా దనుజారిబిరుదు లోకమునందు
కట్టఁడా బలిదైత్యుకర్మబంధముల
మెట్టఁడా కాళింగుమేటిశిరములు నలియఁ
గొట్టఁడా దానవులఁ గోటానఁగోట్ల ||ఇతఁ||

మఱపఁడా పుట్టువులు మరణములుఁ బ్రాణులకు
పఱపఁడా గంగఁ దనపాదకమలమున
చెఱుపఁడా దురితములు శ్రీవేంకటేశుఁ డిదె
నెఱపఁడా లోకముల నిండఁ దనకీర్తి ||ఇతఁ|| 68

## సామంతం

ఆదిదైవుఁడై యందరిపాలిటి
కీదేవుఁడై వచ్చె నితఁడు ||పల్లవి||

కోరినపరమయోగులచిత్తములలోన
పరికినుండెనో యీతఁడు
చేరవచ్చినయాశ్రితుల నెల్లఁ బ్రోవ
నీరీతి నున్నవాఁ డితఁడు ||ఆది||

కుటిలదానవులఁ గోటానఁ గోట్ల
నిటువలెఁ ద్రుంచెనో యీతఁడు
ఘటియించి యిటువంటికారుణ్యరూపుఁడై
యిటువలె నున్నవాఁ డితఁడు ||ఆది||

తక్కక బ్రహ్మాండతతు లెల్ల మోచి తా
నెక్కడ నుండెనో యీతఁడు
దిక్కుల వెలసిన తిరువేంకటేశుఁడై
ఇక్కడనున్న వాఁ డితఁడు ॥అది॥ 69

గుండక్రియ

తానే తెలియవలె దలఁచి దేహి తన్ను
మానుపువారలు మఱి వేరీ ॥పల్లవి॥

కడలేనిభవసాగరము సొచ్చినతన్ను
వెడలించువారలు వేరీ
కడుబంధములచేతఁ గట్టుపడినతన్ను
విడిపించువారలు వేరీ! ॥తానే॥

క్రాఁగినినుమువంటికర్మపుతలమోపు
వ్రేఁగుదించేటివారలు వేరీ
మూఁగినమోహపుమూఁకలు తోడిఁబడ
పిఁగద్రోలేటివారలు వేరీ ॥తానే॥

తిరువేంకటాచలాధిపునిఁ గొలువుమని
వెరవుచెప్పెడువారు వేరీ
పరిపోనిదురితకూపములఁ బడకుమని
వెరవుచెప్పెడివారు వేరీ ॥తానే॥ 70

శ్రీరాగం

బయలువందిలివెట్టి పరగఁజిత్తముగలిగె
దయమాలి తిరుగ నాత్మజుఁ డొకఁడు గలిగె ॥పల్లవి॥

కనుచూపువలన నుడుగని కోరికలు గలిగె
తనుకాంక్షవలనఁ బరితాపంబు గలిగె
అనుభవనవలన మోహాంధకారము గలిగె
తనివి దీరమివలన తలపోఁత గలిగె ॥బయ॥

అడియాసవలన పాయనిచలంబునుఁ గలిగె
కడుమమతవలన చీఁకటి ద్రవ్వఁ గలిగె
కడలేనితమకమునఁ గాంతాళమునుఁ గలిగె
వడుమ నంతటికి మానని ప్రేమ గలిగె ॥బయ॥

తరితీపువలనఁ జిత్తభ్రాంతి తగఁ గలిగె
విరహంబువలనఁ బురవేదనలుఁ గలిగె
తిరువేంకటాచలాధిపునికరుణామృతము
పరిపూర్ణమైనయాపద నీఁదఁ గలిగె ॥బయ॥ 71

## కేదారగౌళ

పరమాత్ముని నోరఁ బాడుచును నిరు
గరులు గూడఁగఁదోసి దంచీ మాయ ॥పల్లవి॥

కొలఁది బ్రహ్మాండపుఁ గుండెనలోన
కలికి జీవులను కొలుచు నించీ
కలికి దుర్మోహపురోఁకలి వేసి
తలఁచి తనువులను దంచీమాయ ॥పర॥

తొంగలిరెప్పలు రాత్రులుఁ బగలును
సంగడి కనుఁగవ సరిఁ దిప్పుచు
చెంగలించి వెసఁ జేతులు విసరుచు
దంగుడుబియ్యము గా దంచీమాయ ॥పర॥

అనయముఁ దిరువేంకటాధీశ్వరుని
పనుపడి తనలోఁ జూడుచును
ఒనరి విన్నాణిజీవులనెడి బియ్యము
తనర నాతని కియ్యదంచీ మాయ ||పర|| 72

2?-వ తేకు. నారణి

పరగు బహుసజ్జన్మ పరిపక్వహృదయుఁడై
మతి కదా వేదాంతమారంబు గనుట ||పల్లవి||

కలుషహర మగువివేకమ్ము గలిగినయట్టి
ఫలము గాదా కృపాపారీణుఁడౌట
తలపోసి సకలభూతదయావిశేషంబు
కలిగికాదా గుణవికారంబు గనుట ||పర||

ఎదిరిఁ దనవలెనె తా నెఱుఁగ నేర్చినఫలము
అదిగదా ద్రవ్యమోహంబు గడచనుట
పదిలమగు నాశానుభవను పాపినయట్టి
తుదగదా తాను సంతోషంబు గనుట ||పర||

రతిపరాఙ్ముఖమహారాజ్య మబ్బినఫలము
మతిగదా తాను గర్మత్యాగి యౌట
తతితోడ ఫలపరిత్యాగిచిత్తవ్యాప్తి
ధృతిగదా వేంకటాధిపుదాసుఁ డౌట ||పర|| 73

ముఖారి

చలపాది రోగ మీ సంసారము నేడు
బలువైనమందు విష్ణుభక్తి జీవులకు ||పల్లవి||

కీడౌట చుది నెఱింగియు మోహా మెడల దిది
పాడైన ధిక్కృతము బలవంతము
ఈడనే ఘుది మాన్ప హితమైన వజ్రాంగి
జోడువో హరిఁ దలంచుట జీవులకును ॥చల॥

హేయమని తెలిసి తా నిచ్ఛగించి యాత్మ
పాయ దీరతిసుఖము బలవంతము
మాయ నుగులుసేయ మాధవుని దంచనపు
రాయివో వైరాగ్యరచన జీవులకు ॥చల॥

పొలయు దురితంపు రొంపులు దను వడి ముంచ
పలుమారుజన్మ మిా బలవంతము
నెలవుకొని సకలంబు నిర్మలముగాఁ గదుగు
జలధివో వేంకటేశ్వరుఁడు జీవులకు ॥చల॥ 74

వరాళి

చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలు వలె నున్నవి
యీడు గానిక న్నులవే యినచంద్రులు ॥వల్లవి॥

కంటిఁ గంటి వాఁడె వాఁడె ఘనమైనముత్యాల
కంటమాల లవే పదకములు నవె
మింటిపొడ వైనట్టిమించుఁగిరీటం బదె
జంటల వెలుఁగు శంఖచక్రాలవె ॥చూడ॥

మొక్కు మొక్కు వాఁడె వాఁడె సుందరనే వున్నాఁడు
చెక్కు లవే నగవుతో జిగిమోమదే
వుక్కుట లోకము లవే భుజకీర్తులును నవే
చక్కనమ్మ అలమేలుజవరా లదే ॥చూడ॥

ముంగై మురాలును నవే మొలకతారును నదె
బంగారునిగ్గులవన్నెవచ్చెబ ట్టదే
యింగిత మెఱిఁగి వేంకటేశుఁ డిదే కన్నులకు
ముంగిటినిధాన మైనమూలభూత మదే ॥చూడ॥ 75

ముఖారి

ఎంత సేయఁగ లేదు యిటువంటివిధి యభవు
నంతవానిని భిక్ష మడుగుకోనఁ జేసె ॥పల్లవి॥

కోరి చంద్రునిఁ బట్టి గురుతల్పకునిఁ జేసె
కూరి మలరఁగ నింద్రుఁ గోడిఁ జేసె
ఘోరకీడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె
వీరుఁ డగునలుఁ బట్టి విద్రూపుఁ జేసె ॥ఎంత॥

అతివ నొడ్డఁగఁ జూద మాడ ధర్మజుఁ జేసె
నతి నమ్ముకోన హరిశ్చంద్రుఁ జేసె
కుతిలపడ శూద్రకుని గొత్తమిచ్చఁగఁ జేసె
మతిమాలి కురురాజు మడుఁగుచొరఁ జేసె ॥ఎంత॥

పడనిపాట్లఁ బఱచి బ్రహ్మతల వోఁజేసె
తోడరి కాలునికాలు దునియఁ జేసె
అడరని విధికి విధి యగు వేంకటేశుకృప
పడయకుండఁగ భంగపడక పోరాదు ॥ఎంత॥ 76

కాంబోధి

ఏఁటిసుఖము మఱి యేఁటిసుఖము వోక
మాటమాత్రమున నటమట మైనసుఖము ॥పల్లవి॥

కొనసాగుదురితములే కూడైన సుఖము
తనువిచారములలో దాకొన్న సుఖము
పనిలేనియాసలకుఁ బట్టయినసుఖము
వెనకముందరఁ జూడ వెరగైనసుఖము ॥వేఁటి॥

నిందలకు లోనైన నీరసపుసుఖము
బొందికిని లంచంబు వుణికేటిసుఖము
కిందువడి పరులముంగిలి గాచు సుఖము
పందివలె తనుఁదాన బ్రదికేటిసుఖము ॥వేఁటి॥

ధృతిమాలి యిందరికి దీనుఁడగు సుఖము
మతిమాలి భంగములు మఱపించు సుఖము
పతివేంకటేశుకృప పడసినది సుఖము
యితరంబు లన్నియును నీపాటి సుఖము ॥వేఁటి॥ 77

## శ్రీరాగం

దేహము దా నస్థిరమట దేహి చిరంతనుఁ డౌనట
దేహపుమోహపుచేతలు తీరుట లెన్నఁడొకో ॥పల్లవి॥

కన్నులఁ బుట్టినకాంతులు కప్పీఁగదా దురోభ్రథల
కన్నులు మననుఁ దనియక గాసి బడిరి జనులు
తన్నిఁక సెలుఁగుట లెన్నఁడు తలఁపులు దొలఁగుట లెన్నఁడు
తిన్నని పరవశములచేఁ దిరుగుట లెన్నఁ డొకో ॥దేహము॥

సిగ్గులు దొలఁగనియాసలఁ జిక్కీఁగదా దుర్మాసపు
సిగ్గుల మొగ్గులచేతను చిక్కువడిరి జనులు
సిగ్గులు దొలఁగుట యెన్నఁడు చిత్తము లోనౌ టెన్నఁడు
తగ్గుల మొగ్గులసేతలు తలఁగుట లెన్నఁడొకో ॥దేహము॥

మనసున బుట్టినయాలేదు మనసునఁ బెనగొని తిరుగఁగ
మనసే తా నగుదైవము మరచిరి యందరును
అనయము తిరువేంకటపతి యాత్మఁ దలఁచి సుఖింపుచు
ఘనమగుపరమానందము కలుగుట లెన్నఁడొకో ॥దేహ॥ 78

ధన్నాసి

భావయామి గోపాలబాలం మన
స్సేవితం తత్పదం చింతయేయం సదా ॥పల్లవి॥

కటిఘటితమేఖలా ఖచితమణిఘంటికా
పటలనినదేన విభ్రాజమానం
కుటిల పదఘటిత సంకుల శింజితే నతం
చటులనటనాసముజ్జ్వల విలాసమ్ ॥భావ॥

నిరతకరకలితనవనీతం బ్రహ్మాది
సురనికరభావనా శోభిత పదమ్
తిరువేంకటాచలస్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలమ్ ॥భావ॥ 79

ధన్నాసి

పంకజాక్షులు సొలసి పలికి నగఁగా
నింకా నారగించు మిట్లనే అయ్యా ॥పల్లవి॥

కలవంటకములు పులుఁగములు దుగ్ధాన్నములు
పలుదెరఁగు లైనఅప్పములగములు
వెలలేని నేతులును నిరతంపుచక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా ॥పంక॥

పెక్కు వగస్తైఁదంపు పిండివంటల మీఁద
పిక్కటిలు మెఱుఁగుఁ బొడిబెల్లములును
వొక్కటిగఁ గలపుకొని వోలువుఁబప్పులతోడ
కిక్కిఱియ నిటు లారగించవయ్యా ॥వంక॥

కడుమధురమైన మీఁగడపెరుగులును మంచి
అడియాల పూరుఁగాయలరుచులతో
బడిబడిగ నవకంపుఁ బళ్లెరంబులతోడ
కడునారగించు వేంకటగిరీంద్రా ॥వంక॥ 80

భూపాలం

భోగిశయనమును బునకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే ॥పల్లవి॥

కన్నులు దెఱవక కమలబాంధవుఁడు
వెన్నెలరేఁబువు వెలయ దిదే
అన్నువమలనీ యరుణోదయ మిదే
మిన్నక నీ విటు మేలుకొనవే ॥భోగి॥

తెల్లనికన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్న విదే
కల్లనిదుర నినుఁ గవియఁగ నియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే ॥భోగి॥

తెరవగురెప్పలఁ దెల్లవాఱవలె
తెఱవక చీఁకటి దీర దిదే
తెఱఁగువేంకటాధిప నీ వెలుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే ॥భోగి॥ 81

## శ్రీరాగం

ఏది చూచిననుఁ గడు నిటువంటిసోద్యములే
మేదినికిఁ గిందుపడి మిన్నంద నేలా ॥పల్లవి॥

కరిరాజుఁ గాచినా కరుణానిధివి నీవు
అరిది నరసింహరూపైతి వేలా
పురగేంద్రశయనమున నుండి నీవును సదా
గరుడవాహనుఁడవై గమనించ నేలా ॥ఏది॥

పురుషోత్తమఖ్యాతిఁ బొదలి యమృతము వంప
తరుణివై వుండ నిటు దైన్య మేలా
శరణాగతులకు రక్షకుఁడవై పాము నీ
చరణములకిం దైన చలముకొన నేలా ॥ఏది॥

దేవతాధిపుఁడవై దీపించి యింద్రునకు
భావింప తమ్ముఁడనఁ బరగి తేలా
శ్రీవెంకటాచలస్థిరుఁడవై లోకముల
జీవకోట్లలోనఁ జిక్కువడ నేలా ॥ఏది॥ 62

## మలహరి

కోరుదు నామది నఖిళము గుణ (ణా?) ధరు నిర్గుణుఁ గృష్ణుని
నారాయణు విశ్వంభరు నవనీతాహారు ॥పల్లవి॥

కుండలిమణిమయభూషణు కువలయదళవర్ణాంగుని
అండజపతివాహనుని నగధర భవహరుని
ఖండితచాణూరకదమనుని మాలాలంకృతవక్షుని
నిత్యోత్కృపాంబుధిచంద్రుని నిత్యానందుని ॥కోరు॥

ఆగమపుంజపదార్థుని ఆపత్సఖసంభూతుని
నాగేంద్రాయతతల్పుని నానాకల్పునిని
సాగ్రబ్రహ్మమయాఖ్యుని సంతతగానవిలోలుని
వాగీశ్వరసంస్తోత్రుని వైకుంఠోత్తముని ||కో||
కుంకుమవసంతకాముని గోపాంగనకుచలిప్తుని ?
శంకరసతిమణినుతుని సర్వాత్ముని సముని
శంకనినాదమృదంగుని చక్రాయుధవేదీప్తుని
వేంకటగిరి నిజవాసుని విభవసదాయునిని * ||కో|| 83

## సామంతం

అటు గుదువు మనస నీ వన్నిలాగులఁ బొరలి
ఇటు గలిగె నీకు నై హితవిచారములు ||పల్లవి||
కోరికలకును గలిగె ఘోరపరితాపంబు
కూరిమికిఁ గలిగె ననుకూలదుఃఖములు
తారతమ్యము లేనితలపోఁతలకుఁ గలిగె
భారమైనటిలంపట మనెడిమోపు ||అటు||
తనువునకుఁ గలిగె సంతతమైనతిమ్మటలు
మనువునకుఁ గలిగె నామనివికారములు
పనిలేనిసంసారబంధంబునకుఁ గలిగె
ఘనమైనదురితసంగతితోడిచెలిమి ||అటు||
దేహికినిఁ గలిగె నింద్రియములను బోధింప
దేహంబునకుఁ గలిగె తెగనిసంశయము
దేహాత్మకండయిన తిరువేంకటేశునకు
దేహిదేహాంతరస్థితిఁ జూడఁ గలిగె ||అటు|| 84

* దీనిరచన యప్రశస్తముగా నున్నది.

౨-వ తేకు.  వరాళి

ఆపదల సంపదల నలయు టేమిట మాను
రూపింప నిన్నిటను రోసినను గాకా ॥పల్లవి॥

కడలేని దేహరోగంబు లేమిట మాను
జడను విడిపించునౌషధసేవ గాక
విడవ కడియాస తను వేచు టేమిట మాను
వొడలి కలగుణ మెల్ల నుడిగినను గాకా ॥ఆప॥

దురితసంగ్రహమైన దుఃఖ మేమిట మాను
సరిలేనిసౌఖ్యంబు చవిగొన్న గాక
కరుకైనమోహాంధకార మేమిట మాను
అరిది తేజోమార్గ మలవడిన గాకా ॥ఆప॥

చావులోఁ బెనగొన్న జన్మ మేమిట మాను
యీవలావలి కర్మ మెడసిన గాకా
భావింప నరుడైన బంధ మేమిట మాను
శ్రీవెంకటేశ్వరునిసేవచేఁ గాకా ॥ఆప॥ 85

సామంతం

సులభమా మనుజులకు హరిభక్తి
వల నొంచె మతికదా వైష్ణవుఁ డౌట ॥పల్లవి॥

కొదలేని తపములు కోటానఁగోటులు
సదన నాచరించి యటమీఁద
పదిలమైన కర్మబంధము లన్నియు
వదలించుకొనికదా వైష్ణవుఁ డౌట ॥సుల॥

తనివోనియాగతంత్రములు లక్షలసంఖ్య
అనఘుఁడై చేసినయటమీఁద
జననము లన్నిట జనియించి పరమపా
వనుఁడై మఱికదా వైష్ణవుఁ డౌట ॥సుల॥

తిరిగి తిరిగి పెక్కుతీర్థము లన్నియు
నరలేక సేవించినటమీఁద
తిరువేంకటాచలాధిపుఁ డైనకరిరాజ
వరదునికృపఁ గదా వైష్ణవుఁ డౌట ॥సుల॥86

ఆహిరి

ఏల నమకొను సుకృత మెల్లవారికి మహా
మాలిన్యమున నాత్మ మాసినది గాన ॥పల్లవి॥

కలికాలదోషంబు కడవరానిది గాన
తలఁపు దురితముల కాధారంబు గాన
బలుపూర్వకర్మములు పట్టరానివి గాన
మలమూత్రజన్మంబు మదకరము గాన ॥ఏల॥

రాఁపైనగుణవికారములు బహుళము గాన
ఆఁపరానివి యింద్రియంబు లటుగాన
దాఁపరం బగుమమత దయదలంపదు గాన
కాఁపురముచే నాన కప్పుకొనుఁ గాన ॥ఏల॥

హృదయంబు చంచలం బిరవు గానదు గాన
చదువు బహుమార్గములఁ జాటు నటుగాన
యెదుర నుండెడువేంకటేశ్వరుని నిజమైన
పదముపై కోరికలు పైకొనవు గాన ॥ఏల॥ 87

శ్రీరాగం

వలపు లధికము సేయు వైభవములు
తలఁపు లధికము సేయుఁ దలపోఁతలు ॥పల్లవి॥

కోప మధికముసేయుఁ గోరికలు
తాప మధికముసేయుఁ దమకంబులు
కోపంబుఁ దాపంబుఁగూడ నధికముసేయు
యేపయినమోహముల నేమందమే ॥వల॥

మచ్చికధికముసేయు మన్ననలు
యిచ్చ లధికముసేయు నీరసములు
మచ్చికలు నిచ్చలును మగుడ నధికముసేయు
నెచ్చరికకూటముల నేమందమే ॥వల॥

అంద మధికముసేయు నైక్యములు
పొందు లధికముసేయుఁ బొలయలుకలు
అందములుఁ బొందులును నలర నధికముసేయు
నెందు నరుఁ డగు వేంకటేశుకృపలు ॥వల॥ 88

వరాళి

చిత్త మతిచంచలము చేఁత బలవంతంబు
తిత్తిలో జీవుఁ డిటు దిరిగాడుఁ గాక ॥పల్లవి॥

కదిసి జీవుఁడు పుట్టఁగాఁ బుట్టినటువంటి
మొదలుఁ దుదయును లేనిమోహపాశములు
వదలు టెటువలెఁ దాఁ వదలించు టెటువలెను
ఖదిలముగ వీనిచేఁ బడి పొరలుఁ గాక ॥చిత్త॥

కడ లేనిజన్మసంగ్రహాములై యెన్నఁడును
గడుగ వశములు గానికర్మపంకములు
విడుచు కొటువలెఁ దారు విడిపించు కొటువలెను
విడువనివిలాపమున వేగుటలు గాక ॥చి త్త॥

యిందులోపల జీవుఁ డెన్నఁడే నొకమాటు
కందు వెఱఁగి వివేకగతుల భాగ్యమున
అందముగఁ దిరువేంకటాద్రీశు సేవించి
అందరానిసుఖంబు లందుఁ గాక ॥చి త్త॥ 89

ధన్నాసి

ఉప్పవడము గాకున్నా రిందఱు
తొప్పుదు రేయి నీకెప్పుడు పగలు ॥పల్లవి॥

కన్నుల చంద్రుఁడును కమలమిత్రుఁడును
వున్నతి నివి నీ కుండఁగను
వెన్నెలయెండలు వెలయఁగ మేలొ్కను
ఎన్నఁడు నిద్దుర యెన్నఁడు నీకు ॥ఉప్ప॥

కందువ నతికనుఁగలువలు ముఖార
విందము నిదివో వికసించె
ముందర నిద్దుర మొలవదు చూచిన
విం దగునీ తెలివికిఁ దుద యేది ॥ఉప్ప॥

తమము రాజసము తగుసాత్వికమును
నమరిన నీమాయారతులు
కమలాధిప వేంకటగిరీశ నిన్ను
బ్రమదము మఱవునుఁ బైకొను లెట్ల ॥ఉప్ప॥ 90

ఒప్పులై నొప్పులై వుండుఁ గాన
అప్పటప్పటికిఁ జూడ నదియే కా నిజము ॥పల్లవి॥

కన్నుల కిన్నియుఁ జూడ కలలై వలలై
వున్నతాలు వడ్డాలై వుండుఁ గాన
చిన్నచిన్న చిటిపొటి చిమ్ముదొమ్ము దిమ్ము లవి
వున్న వన్నియుఁ జూడ నొకటే కా నిజము ॥ఒప్పు॥

సారెకు నోరికిఁ జూడ చవులై నవ్వులై
వూరట మాటలై వుండుఁ గాన
తారుమారు తాఁకుసోఁకు తప్పుదోఁపు లిన్నియు
వోరపారు లేని వెల్ల వొక్కటె కా నిజము ॥ఒప్పు॥

మేనికి నిన్నియుఁ జూడ మృదువై పొదువై
పూని సంపదలై వుండుఁ గాన
తేనై తీపై తిరువేంకటేశ నిన్ను
కానవచ్చినదే వొక్కటె కా నిజము ॥ఒప్పు॥ 91

శంకరాభరణము

పనిలేనిధనవాంఛఁ బడి పొరలిన నిట్టి
కసుమాయలే కాక కడ నేమి గలదు ॥పల్లవి॥

కనుచూపుకాఁకలఁ గలయుట వెడయాన
లనుభవింపుట గాక యం దేమిగలదు
తనువల్లి సోఁకులఁ దగులుట మమతల

యెలమి నధర మూను టిజేఁగి యెంగిలి నోర
నలముకొనుట గాక యం దేమి గలదు
పలులంపటములచేఁ బడుట దుఃఖంబులు
తలఁ జుట్టుటే కాక తన కేమి కలదు ‖పని‖

శ్రీవేంకటాద్రీశుఁ జేరని పను లెల్ల
నేవగింతలె కాక యిందేమి గలదు
ఆవల సురతభోగ మనుభవింపఁ బోయి
రావలయుట గాక రచ నేమి గలదు ‖పని‖ 92

సామంతం

కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు వాఁడు
కొండలంతవరములు గుప్పెడువాఁడు ‖పల్లవి‖

కుమ్మరదాసుఁడైన కురువరతినంబి
యిమ్మన్నవరము లెల్ల నిచ్చినవాఁడు
దొమ్ములు సేసినయట్టితొండమాంజక్కురవర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాఁడు ‖కొండ‖

అచ్చపువేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోఁచినవాఁడు
మచ్చిక దొలంకఁ దిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు ‖కొండ‖

కంచిలోన నుండఁ దిరుకచ్చినంబిమీఁదఁ గరు
ణించి తనయెడకు రప్పించినవాఁడు
యెంచ నెక్కుడైన వేంకటేశుఁడు మనలకు
మంచివాఁడై కరుణఁ బాలించినవాఁడు ‖కొండ‖ 93

## గుండక్రియ

కడుఁ జంచలములు కడు నధ్రువములు
కడు నల్పము లని కా దందురు ॥పల్లవి॥

కర్మబోధవికారంబులు
ధర్మతంత్రసంధానములు
దుర్మదైకసందోహములు
కర్మదూరు లివి గా దందురు ॥కడు॥

పరమభాగవతభవ్యమమతలు
పరమబోధసంభావకులు
తిరువేంకటగిరిదేవుసేవకులు
కరుణాధికు లివి గా దందురు ॥కడు॥ 94

## గుండక్రియ

పోయం గాలము వృథయై పుట్టినమొదలుం గటకట
నీయెడ నామది నిజమై నిలుచుట యెన్నఁడొకో ॥పల్లవి॥

కుడిచిన నాఁకలి దీరదు కుడువఁగఁ గుడువఁగఁ బైపై
కడుఁబొదలెడుదీపన మిది గడచుట యిఁక నెట్లు
కుడువక మానుట యెన్నఁడు కోరిక దీరుట యెన్నఁడు
తడయక నీరూపము నేఁ దలఁచుట లెన్నఁడొకో ॥పోయ॥

జీవుఁడు పుట్టినమొదలును జేతికి నూఱట చాలక
యేవిధమున భుజియించిన నెడయదు దీపనము
శ్రీవేంకటపతి నాకిఁక శ్రీకరుణామృత మియ్యక
పావన మందదు నామది పాలించం దగదా ॥పోయ॥ 95

## లలిత

అతిశయమగుసౌఖ్య మనుభవించు మన్న
హితవు చేకొన నొల్ల రిందరు ॥పల్లవి॥

కడ లేనివిజ్ఞానగతికిఁ దోడు గారు
కొడవులవారలె యిందరు
అడరినమోక్షసహాయు లెవ్వరు లేరు
యిడుమపాట్లవారె యిందరు ॥అతి॥

తిరమైనపుణ్యము బోధించేవారు లేరు
మెరవులవారే యిందరు
తిరువేంకటాచలాధిపునిమీఁదిచిత్త
మిరవు సేయక పోయి రిందరు ॥అతి॥ 96

## మాళవి

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీశ్రీపాదమే శరణు ॥పల్లవి॥

కమలాసతిముఖకమలకమలహిత
కమలప్రియకమలేక్షణా
కమలాసనహిత గరుడగమన శ్రీ
కమలనాభ నీపదకమలమే శరణు ॥శ్రీమ॥

పరమయోగిజన భాగధేయ శ్రీ
పరమపూరుషా పరాత్పరా
పరమాతుమ పరమాణురూప శ్రీ
తిరువేంకటగిరి దేవ శరణు ॥శ్రీమ॥ 97

ఎనుపోతుమీఁద నెద్దు నేరు గట్టినయట్లు
యెనసి ముందర సాగ దేఁటిబ్రదుకు ॥పల్లవి॥

కడ లేనియాసచే కరఁగి కరఁగి చిత్త
మెడమవంకకు వచ్చె నేఁటిబ్రదుకు
పొడవైనమమతలోఁ బొదలఁ బొదల మాన
మిడుమపాల్లఁ బడె నేఁటిబ్రదుకు ॥ఎను॥

తెగుదెంపు లేనిభ్రాంతికిఁ జిక్కి యాచార
మెగసి గొందులు దూరె నేఁటిబ్రదుకు
పగగొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన
మిగురువెట్టక మానె నేఁటిబ్రదుకు ॥ఎను॥

భావింప రోఁతలోఁ బడి పొరలెడిసౌఖ్య
మేవగింపఁడు జీవుఁ డేఁటిబ్రదుకు
శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటె కాని
యేవంక సుఖములే దేఁటిబ్రదుకు ॥ఎను॥ 98

శ్రీరాగం

చావుతో సరియైన సౌఖ్యంబులోఁ దగిలి
వేవేలు దురితముల వేగించు టొండె ॥పల్లవి॥

కనుఁగొనల నిరుమేను గాఁడి పారుట లొండె
ఘనుఁగొండ లనమహాచరులఁ బడు టొండె
తనివోనిసురతములఁ దగిలి మునుఁగుట యొండె
ఘనమోహబంధములఁ గట్టువడు టొండె ॥చావు॥

మొనసి యాశాపాశములయురులఁ బడు టొండె
కనలి పాపయులుకచేఁ గాఁగు టది యొండె
మనను కాంతాశమున మల్లు పెనఁగుట లొండె
పని లేనిమదనాగ్నిఁ బడి పొరలు టొండె ||చావు||

తడసి మమతల నిరంతరధైర్య మది యొండె
నడుమనే కన్నుగానక తిరుగు టొండె
యెడప క్రితిరువేంకటేశుఁ దలఁపఁగ లేక
పడనిపాట్ల నెల్లఁ బడి పేఁగు టొండె ||చావు|| 99

ముఖారి

అఁకటివేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱి లేదు ||పల్లవి||

కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైనహరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మఱి లేదు తెఱఁగు ||అఁక||

ఆపద వచ్చినవేళ యాఁకడిఁ బడినవేళ
పాపపువేళల భయపడినవేళ
వోపినంతహరినామ మొక్కటే గతిగాక
మాపుదాఁకాఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ||అఁక||

సంకెళఁ బెట్టినవేళ చంపఁ బిలిచినవేళ
అంకిలిగా నప్పులవా రాఁగినవేళ
వేంకటేశునామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మఱి లేదు తెఱఁగు ||అఁక|| 100

## ముఖారి

మోసమున మాయావిమోహితుఁడై పోయి
కాసు సేయని పనికి గాసిఁ బడెఁ బ్రాణి ॥పల్లవి॥

కన్ను లనియెడిమహాకల్పభూజము లివి
తన్నుఁ బుణ్యునిఁ జేయఁ దగిలి వచ్చినవి
వున్నతోన్నతబుద్ధి నొనగూర్ప కది దేహి
కన్నచోటికిఁ బఱపి గాసిఁ బడెఁ బ్రాణి ॥మోస॥

చిత్త మనియెడిమహాచింతామణి దనకు
తొత్తువలె వలసి తనుఁ దోడుతేఁ గలది
హత్తించి హరిమీఁద నలరింప కది వృథా
తిత్తిలో సుఖమునకుఁ దిరిగె నీప్రాణి ॥మోస॥

కామతత్వం బనెడికామధేనువు దనకు
వేమారుఁ గోరికల వెల్లిగొలిపెడిది
యీమేను తిరువేంకటేశుఁ జేరక పోయి
కామాంధుఁడై మిగుల గతిమాలెఁ బ్రాణి ॥మోస॥ 101

## దేసాక్షి

కొండో నుమ్మో కుమతులాల
తండుముండు త్ట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ ॥పల్లవి॥

కాకిపోటు జముచేత కండుకుందు మరుచేత
మా కావనిగాదు మనుజులాల
పోకు మని యీఁపరాదు పొమ్మని చెప్పఁగరాదు
మీకు మీకే చూచుకొండు మీరే కనుండు ॥కొండో॥

గాములిల్లు పుట్టమీఁదికప్పుతోలుపైకప్పు
నేమా తెలుఁగము నిపుణులాల
పామునోరికడి మీప్రాణపుటూరుపుగాలి
జాము జాము మేలుఁగీడు చక్కఁజేయఁ గనుఁడు ॥కొండో॥

రచ్చమానిచింతకిందు రాఁపులకూటమిపొందు
ముచ్చో చిచ్చో మూఢులాల
కొచ్చరికతోడ వేంకటేశుడాసులఁ గూడి
వచ్చిగచ్చుమేనితోడ భయమెల్లఁ గాయుఁడు ॥కొండో॥ 102

నాట

మందు లేదు దీనికి మంత్ర మేమియు లేదు
మందు మంత్రము దనమతిలోనె కలదు ॥పల్లవి॥

కదలకుండఁగఁ దన్నుఁ గట్టివేసినఁ గట్టు
వదలించకొనఁ గొంత వలదా
వదలించఁబోయిన వడిగొని పైపై నే
కదియుఁ గాని తన్ను వదల దేమియును ॥మందు॥

మనసులోపల నుండి మఱి మీఁదఁ దా నుండి
యొనసిన తిరువేంకటేశుని
తనరినతలఁపునఁ దలఁప దుష్కృతములు
తనకుఁ దానే వీడుఁ దలఁక వలదు గాన ॥మందు॥ 103

27 రేకు. ఆహిరి

ఏమీ నెఱఁగనిమమ్ము నెక్కువ సేసి
పామరుల తోడఁ జేసె భాగ్యకారులు ॥పల్లవి॥

గతచన్న పాదాలు పులభూనకు సొచ్చి
అతనికరుణచేత నన్నియుఁ గని
గతిలేక పోయిన కలియుగమున వచ్చి
ప్రతిపాలించఁ గలిగె భాష్యకారులు ॥ఏమీ॥

లోక మెల్ల వెల్లఁబోఁగా లోననే మరలఁ గాచి
ఆకుమీఁదఁ దేలినయతనికృప
కాకరిమతము లెల్ల గాలిఁబుచ్చి వర మిట్టి
పై కొనఁగఁ గరుణించె భాష్యకారులు ॥ఏమీ॥

పంకజపుఁజేయి చాఁచి పాదపుఁబర మిచ్చిన
వేంకటేశుకృపతోడ వెలయఁ దానే
తెంకినే వొడయవరై తిరుమంత్రద్వయాన
పంక మెల్లఁ బోఁగడిగె భాష్యకారులు ॥ఏమీ॥ 104

### కన్నడగౌళ

ఆటవారిఁ గూడి తేరా
ఆటవారిఁ గూడి అన్నిచోట్ల బొమ్మ
లాట లాడించ నధికుండ వైతివి ॥పల్లవి॥

గురుతరమగు పెద్దకొట్టాములోపల
తిరమైనపెనుమాయఁ దెర గట్టి
అరయ నజ్ఞానము లవి యడ్డముగఁ జేసి
పరగ సుజ్ఞానదీపములు ముట్టించి ॥ఆట॥

తోలుబొమ్మల దొరకొని గతియించి
గాలిచేత వానిఁ గదలించి
తూలేటిరసములు తొమ్మిది గడియించి
నాలుగుముఖముల నలువున నాడించ ॥ఆట॥

మన్నించుదాతలు మఱి లేరు
మొన్నఁగఁ దిరువేంకటేశ్వర నీదాసు
లున్నతులై నిన్ను నుబ్బించి పొగడఁగ ॥అట॥ 105

సామంతం

బ్రువంతి బౌద్ధా బుద్ధ యితి
స్తువంతి భక్తా సులభ మితి ॥పల్లవి॥

గదంతి కిల సాంఖ్యా స్త్వాం పురుషం
పదవాక్యజ్ఞాః పద మితి చ
విదంతి త్వా వేదాంతిన
స్సదా బ్రహ్మాలసత్పద మితి చ ॥బ్రువం॥

జపంతి మీమాంసకా స్త్వాం చ
విపులకర్మణో విభవ యితి
లపంతి నయనకలా స్సతతం
కృపాళు కర్తా కేవల మితి చ ॥బ్రువం॥

భణంతి వేంకటపతే మునయో
హ్యణిమాదిప్రద మతుల మితి
గుణవంతం నిర్గుణం పున రితి
గృణంతి సర్వే కేవల మితి చ ॥బ్రువం॥ 106

సామంతం

సతతం శ్రీశం
శీతం పరాత్పర మీడే ॥పల్లవి॥

గదాధరం మేఘగంభీరని
నదం పరమోన్నతశుభదం
మృదుతరగమనం మేదినీధరం
హృదయనిలయు మహా మీడే ॥నత॥

నందకధరం జనార్దనం గో
విందం చారుముకుందం
నందగోపవరనందనకంగం
యిందురవినయన మీడే ॥నత॥

గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరిదేవ మతులం మ
హీరమణం స్థిర మీడే ॥నత॥ 107

ఆహిరి

ఇన్నిలాగులచేతు లివియపో కడు
నన్నిక కెక్కినచేతు లివియపో ॥పల్లవి॥

గునియుచుఁ దను నెత్తుకొమ్మని తల్లిపై
నెనయఁ జాఁచినచేతు లివియపో
కినిసి గోవర్థనగిరి పెల్లగించిన
యినుమువంటిచేతు లివియపో ॥ఇన్ని॥

పిసికి పూతకి చన్ను బిగియించి పట్టిన
యిసుమంతలు చేతు లివియపో
పసులఁ గాచుచు గొల్లపడుచుల యమునలో
యిసుక చల్లినచేతు లివియపో ॥ఇన్ని॥

పరమచైతన్యమై ప్రాణుల కెల్లను
మెరవు లిచ్చినచేతు లివియపో
తిరువేంకటగిరిదేవుఁడై ముక్తికి
నిరవు చూపెడుచేతు లివియపో ॥ఇన్ని॥ 108

సాళంగనాట

వాసివంతు విడిచినవాఁడే యోగి యీ
ఆస లెలా విడిచిన అతఁడే యోగి ॥పల్లవి॥

గద్దించి పారెడుతురగమువంటిమనసు
వద్దని మరలించినవాఁడే యోగి
వొద్దనే కొండలవంటివున్నతదేహగుణాలు
దిద్ది మట్టుపెట్టువాఁడే ధీరుఁడైన యోగి ॥వాసి॥

ముంచుకొన్న యింద్రియపు మోహజలధిలోన
వంచన మునుఁగనట్టివాఁడే యోగి
పొంచి పుణ్యపాపములు పొట్టువంటికర్మములు
దంచి పారఁజల్లువాఁడే తత్త్వమైనయోగి ॥వాసి॥

వెగటుకామాదుల వెళ్ళగొట్టి శాంతుఁడై
వగ లుడిగినయట్టివాఁడే యోగి
నిగిడి శ్రీవేంకటపతి నిజదాసుఁడై భక్తిఁ
దగిలి నిలువువాఁడే ధన్యుఁడైనయోగి ॥వాసి॥ 109

గుండక్రియ

తుద లేనిబంధము తోడుసీడై నేను
వదలినా నన్ను వదల దేమి సేతు ॥పల్లవి॥

గుఱిమి గొలుచు దీరఁ గుడువనియ్యక కొత్త
కొలుచు మీఁదమీఁదఁ గొలువఁగా
కలసినకర్మపుఁగలిమిచేతఁ దృష్ట
వలితిగాక యిల్లు వెడల దేమి సేతు ॥కుడ॥

అన్నియు నొకమాటె యనుభవింపఁగఁ జేసి
కొన్ని వెచ్చము లొనఁగూడించి
యిన్నిటఁ దిరువేంకటేశ నిర్మలునిఁగా
నన్నుఁ జేసి నీవు నాకుఁ గలుగవయ్యా ॥కుడ॥ 110

౨౮-వ రేకు. సాళంగం

తొలుఁబాపపుణ్యాలతోడఁ బుట్టితినట
బలువైనభవములఁ బడలేనా ॥పల్లవి॥

గాములయింటనే కాఁప నయితినట
పాముపుట్టనుండియైన బతుకలేనా
గోమున హేయపుఁగుండకూడు నించితినట
గామిడి నేగారే తిత్తిఁ గానోపనా ॥తొలు॥

కట్టినగుణములచే కట్టువడితినట
చుట్టపుబంధాలరొచ్చుకు నోపనా
దట్టపుటానల నేఁ దాల్చితినట నా
పెట్టకాయము మోవ వెఱచేనా ॥తొలు॥

నిగిడినలోపల నీ వుండుదువట
పగవారికి నేఁ బగిలేనా
తగువేంకటేశ నీదయవాఁడనట యీ
వగల నిన్నిఁట గెలువఁగలేనా ॥తొలు॥ 111

## శ్రీరాగం

ఏతదఖిలంబునకు నీశ్వరుఁడై సకల
భూతములలోనఁ దాఁ బొదలువాఁ డితఁడు ॥పల్లవి॥

గోపాంగనల మెఱుఁగు గుబ్బచన్నులమీఁద
చూపట్టుకమ్మఁగస్తురిపూఁత యితఁడు
తాపసోత్తముల చింతాసాధనము లలోన
దీపించు సుజ్ఞానదీప మితఁడు ॥ఏత॥

జలధికన్యాపాంగలలితేక్షణములలో
కలసివెలుఁగుచున్నకజ్జలం బితఁడు
జలజాసనుని వదనజలధిమధ్యమునందు
అలరవెలువడినపరమామృతం బితఁడు ॥ఏత॥

పరిపోని సురతసంపదల నింపులచేత
వరవధూతతికి పరవశమైనదితఁడు
తిరువేంకటాచలాధిపుఁడు దానై యుండి
పరిపాలనముసేయభారకుం డితఁడు ॥ఏత॥ 112

## సామంతం

ఎన్నఁగలుగు భూతకోటి నెల్లఁజేసినట్టిచేత
నిన్నుఁజేసుకొనుట గాక నీకుఁ దొలఁగవచ్చునా ॥పల్లవి॥

గుట్టు చెఱిచి లోక మెల్ల ఘోరసంసారమందు
కట్టివేసినట్టిపాపకర్మ మేల తీరును
పట్టితెచ్చి నిన్ను రోలఁ గట్టివేసి లోక మెఱుఁగ
రట్టుసేసుఁగాక నిన్ను రాజ నన్ను విడుచునా ॥ఎన్న॥

మిట్టువల్లములకుఁ దెచ్చి మెటిసి ఘాతజాలములకుఁ
దొట్టిపెనలు గొలచి నట్టిదోన మేలపాయును
అట్టుసాఁచి గోవనతుల నలమి వెంటవెంటఁ దిరుగ
వెట్టిఁ జేయుఁగాక నీవు విభుఁడ నన్ను విడుచునా ॥ఎన్న॥

పరులయింటి కేఁగి పరులపరులవేఁడఁజేసినట్టి
యెఱుకమాలినట్టిచేఁత లేల నిన్ను విడుచును
తెరవు మిగిలి వెంకటాద్రివిభుఁడ ననుచు జనులచేత
నరులు గొనఁగఁజేయుఁగాక అన నిన్ను విడుచునా ॥ఎన్న॥ 113

## సాళి

ఏమి వలసిన నిచ్చు నెవ్వాడైనను
యేమఱక కొలిచిన నితఁడె దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందరికిఁ గన్ను లిచ్చెఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతు లిచ్చు బలియుఁడై
తనుఁగొలువుమని చిత్తము లిచ్చెఁ గరుణించి
వొనర లోకాన కెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితములేనికొడుకుల నిచ్చును
చొచ్చినచోట చొచ్చి శుభ మిచ్చు సుఖ మిచ్చు
నిచ్చలు లోకాన కెల్ల నిజమైనదైవము ॥ఏమి॥

వంతమాడికొలిచినఁ బ్రాణమిచ్చు బ్రాయమిచ్చు
యెంతటిపదవులైన నిట్టె యిచ్చు
వింతవింతవిభవాల వెంకటేశుఁ డిదె మా
యంతరంగమున నుండే అరచేతిదైవము ॥ఏమి॥ 114

### పాడి

వెట్టిమోవువంటిమేను విడనాడి వీఁ
డిట్టి దాఁటిపోయె నెటువంటిజాణే ॥పల్లవి॥

ఘోరమైన అనలనెడి కూఁకటవేరు దవ్వి
పారవేసి యిదుములఁ బడనొల్లక
యీరసపు సంసార మింగలము దగిలించి
యేరు దాఁటిపోయె నెటువంటిజాణే ॥వెట్టి॥

కన్నవారిఁ దన్నుఁ బ్రేమ నన్నవారి దిగనాడి
వున్నతమైనచోట నుండఁబోయి
తన్నుఁదా వేంకటపతిదాసులఁ జేరి వాఁడు
యెన్నఁడుఁ దిరిగిరాఁడే యెటువంటిజాణే ॥వెట్టి॥ 115

### లలిత

వలవనిమోహావస్థలఁ బొరలెడి
మలినం బెన్నఁడు మానును ॥పల్లవి॥

ఘోరదురిత వికారంబుల
కారణ మెన్నఁడు దీరును
వైరము గొని తను వదలనిబంధపు
భారం బెన్నఁడు పాయును ॥వల॥

జడమగుజిహ్వాచాపల్యము గల
వెడమతి యెన్నఁడు వీడును
చెడనిజీవునకు శ్రీవేంకటపతి
కడదా పెన్నఁడు గల్గును ॥వల॥ 116

ఆశాబద్ధుఁడనై యలసి నిన్నుఁ గదు
గాసిఁబెట్టినవాఁడఁ గాను ॥పల్లవి॥

ఘనకర్మపరుఁడనై కర్మరూపునిఁ జేయు
నిను దూరి భారము నీకుఁ గట్టినవాఁడఁగాను
పనిలేనిదుఃఖలంపటుఁడనై దుఃఖము
గనుపించకమని కదువేఁడినవాఁడఁగాను ॥ఆశా॥

శ్రీవెంకటగిరిదేవేశ నాకిది
గావలె ననువాఁడఁ గాను
కావలసినయవి గవెసిన నవి నాకుఁ
గావనుమనుజుండఁ గాను ॥ఆశా॥ 117

29-వ తేకు. శ్రీరాగం

కోరిక దీరుట యెన్నఁడు గుణమును నవగుణమునుఁ జెడి
వూరక యీామది నీపై నుండుట యెన్నఁడో కో ॥పల్లవి॥

చిత్తం బాఁకలి దీరదు చింత దలంపునఁ బాయదు
మెత్తినపరితాపమునకు నేదీ మితిమీర
హత్తినపుణ్యము బాపము నప్పటిసుఖముల కొఱకే
వత్తికి నూనెకుఁ గొలఁదై వడిఁ జనె దివసములు ॥కోరి॥

జీవుఁడె పరతంత్రుఁడు గన చింతింపఁడు నిన్నెప్పుడు
చావును బుట్టుగు సహజము శరీరధారులకు
శ్రీవనితాహృదయేశ్వర శ్రీవేంకటగిరివల్లభ
పావనమతిమై ప్రాణులు బ్రదుకుట యెన్నఁడో కో ॥కోరి॥ 118

## కాంభోధి

గడ్డపార మింగితే నాఁకలి దీరీనా యీ
వొడ్డినభవము దన్ను వొడకమ్మీఁగాక ॥పల్లవి॥

చించుక మిన్నులఁబారే చింకలను బండిఁగట్టి
వంచుకొనే మన్న నవి వన మయ్యీనా
యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు
పొంచి పొంచి వలపులబొందఁ బెట్టుఁగాక ॥గడ్డ॥

మంటమండే యగ్గి దెచ్చి మసిపాఁత మూఁటగట్టి
యింటిలోన దాఁచుకొన్న నితవ య్యీనా
దంట మమకార మిట్టే తన్ను నేల సాగనిచ్చు
బంటుఁజేసి ఆనలనే పారఁదోసుఁగాక ॥గడ్డ॥

పట్టరానివిషములపాముఁ దెచ్చి తలకిందఁ
బెట్టుకొన్నా నది మందపిలి వుండీనా
వెట్టసంసార మిది వెంకటేశుఁ గొలువని
వట్టిమనుజుల పెడవాడఁ బెట్టుఁగాక ॥గడ్డ॥ 119

## కన్నడ గౌళ

కటకటా దేహంబు గాసిఁబెట్టఁగవలసె
నిటువంటిదెనలచే నిట్టుండవలసె ॥పల్లవి॥

చంపనొల్లక కదా సంసార మనియెడి
గంపమోఁపు గడించె కర్మసంగ్రహము
లంపటము విరియించ లావు చాలక తుదిని
దింప నొకకొంతైన తెరుపెంపు లేదు ॥కట॥

కనుమూసి కాంతు మతి కట్టె దైవంబు
దినభోగములు విడువఁ దెలుఁ గొంటను లేక
తనివిఁ బొందించ నెంతయు వనము గాదు ||కట||

తెలువ నోపక కదా తిరువేంకటేశ్వరుఁడు
వెలలేనివేదనల వేఁచెఁ బ్రాణులను
బలిమి నజ్ఞానంబుఁ బాయలే కితనినే
తలఁచి భవబంధముల దాఁటంగరాదు ||కట|| 120

సామంతం

అయ్యో పోయం బ్రాయముం గాలము
ముయ్యంచుమనసున నే మోహమతి నైతి ||పల్లవి||

చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁ జెలులు
వట్టియాసలఁ బెట్టువారే కాక
నెట్టుకొని వీరు గడు నిజ మనుచు హరి నాత్మఁ
బెట్ట నేరక వృథా పిరివీకు త్రైతి ||అయ్యో||

తగుబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
వగలఁ బెట్టుచుఁ దిరుగువారే కాక
మిగులవీరలపొందు మే లనుచు హరి నాత్మఁ
దగిలించలేక చింతాపరుఁడ నైతి ||అయ్యో||

అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతువాసికిఁ బెనఁగువారే కాక
అంతరాత్ముండు వెంకటాద్రీశుఁ గొలువ కిటు
నంతకూటముల యుట్టపడి లోనైతి ||అయ్యో|| 121

## లలిత

మనమున నెవ్వఁడు మాన దిది
దినబాధలువలెఁ దీటీనో ||పల్లవి||

చిత్తవికారము జీవులపాపము
తత్తరపరచక తడయ దిది
శత్రులతో నీకాయపువయసున
నెత్తినమదమున కేది గతో ||మన||

అనలుఁగంభ మీయాశాదోషము
విసిగిన నూరక విడువ దిది
వసులమూఁట మోవఁగఁ బడవేయఁగ
వసము గాని దెటువలె నౌనో ||మన||

పాముచెలిమి రంపపుసంసారము
గాములమోఁచిన గంప యిది
కామించుచు వేంకటపతిఁ దలఁపక
యేమటి వుండిన నేమౌనో ||మన|| 122

## ధన్నాసి

ఎంతవిభవము గలిగె నంతయును నాపదని
చింతించినది గదా చెడని జీవనము ||పల్లవి||

చలముఁ గోపంబుఁ దనుఁ జంపేటి పగతులని
తెలిసినది యదిగదా తెలివి
తలకొన్నపరనింద తనపాలి మృత్యు వని
తొలఁగినది యదిగదా తుద గన్నఫలము ||ఎంత||

మెఱియువిషయములె తనమోహ మన్నవురులుగా
యొఱఁగినది యదిగదా యొఱుక
పఱివోనియాన దనుఁ బట్టుకొనుభూత మని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ ॥ఎంత॥

యెనలేని తిరువెంకటేశుఁడే దైవ మని
వినఁగలిగినదిగదా వినికి
అనయంబు నతనిసేవానందపరులయి
మనఁగలిగినదిగదా మనుజులకు మనికి ॥ఎంత॥ 123

30-వ రేకు. ఆహిరి

చెల్లఁగా కిటు నీకే చింతింపఁగా పూరి
పుల్లమేరువునేయ భూమిలో నిపుడు ॥పల్లవి॥

చెలఁగి నే మున్ను నేసినచేఁత లుండఁగా
మలసి నేఁ దిరుగుతిమ్మట లుండఁగా
తొలఁగఁ దోసి తుప్పుడుతోడనే లోహంబు
వెలయ బంగారు గావించినగతిని ॥చెల్లు॥

బిగిసి నా మైనున్న పెను కట్లుండఁగా
జగడగాండ్లు పగ చాటఁగను
జిగిగలచేఁతిముసిఁడికాయ యగు నన్ను
మొగిఁ గల్పకముఫలముగఁ జేయవసమా ॥చెల్లు॥

పొదలిన యింద్రియంబులు వెంట రాఁగా
మదవికారము నే మరుగఁగానే
వదలక వెంకటేశ్వరనన్ను నిదే నీ
పదపంకజములు చేర్పఁగ నిది వసమా ॥చెల్లు॥ 124

పాడి

చక్రమా హరిచక్రమా
వక్రమైనదనుజుల వక్కలించవో ||పల్లవి||

చుట్టి చుట్టి పాతాళము జొచ్చి హిరణ్యాక్షుని
చట్టలు చీరినవో చక్రమా
పట్టిన శ్రీహరిచేతఁ బాయక యీజగములు
వొట్టుకొని కావ గదవో వో చక్రమా ||చక్ర||

పానుకొని దనుజులబలుకిరీటమణుల
సానలఁ దీరిన వో చక్రమా
నానాజీవముల ప్రాణములు గాచి ధర్మ
మూని నిలుపఁగదవో వో చక్రమా ||చక్ర||

వెఱచి బ్రహ్మాదులు వేదమంత్రములని
వుఱుట్లుగొని యాడే రో చక్రమా
అఱిముఱిఁ దిరువేంకటాద్రీశు వీథుల
వూఱవుల మెఱయుదువో వో చక్రమా ||చక్ర|| 126

వరాళి

పట్టియానలకు లోనై వదలక తిరిగాడేవు
బట్టబయలు యీసంసారం బని గుట్టు దెలియ లేవు ప్రాణి ||పల్లవి||

చాల నమ్మి యీసంసారమునకు పోలిపోలి తిరిగేవు
బాలయవ్వనప్రౌఢల భ్రమఁబడి లోలుఁడవై తిరిగేవు
మేలు దెలియ కతికాముకుండవై మీఁద దెలియక తిరిగేవు
మాలెమీఁద పరు వెందాఁకా నీమచ్చిక విడువఁగ లేవు ||పట్టి||

మానితముగ దురన్నపానముల మత్తుఁడవై వుండేవు
నానావిధములదుష్ కర్మంబులు నానాటికి నాటించేవు
మేనిలోనియేగురు నార్గురును మిత్రు లనుచు నమ్మేవు
ఆనందంబున నాకర్మమునకు అధిపతులని తెలియఁగలేవు ॥వట్టి॥

పామరివై దుర్వ్యాపారమునకు పలుమారును బోయ్యేవు
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామ మనుచు నుండేవు
ప్రేమముతో హరిదాసులపై సంప్రీతి నిలుపఁగాలేవు
తామసమతి వయి వేంకటనాథునితత్వమెఱుఁగఁగాలేవు॥వట్టి॥ 126

శ్రీరాగం.

ఈభవమునకుఁ జూడ నేది గతిపల తనదు
ప్రాభవం బెడలించి బాధఁ బెట్టించె ॥పల్లవి॥

చెప్పించెఁ బ్రియము వలసినవారలకు నెల్ల
రప్పించె నన్నుఁ దను రానిచోట్లకును
వొప్పించె నాసలకు వోరంతప్రొద్దునను
తిప్పించె కోరికలు తిరిగి సలుగడల ॥ఈభ॥

పుట్టించె హేయంపుభోగయోనుల నెల్ల
కట్టించె సంసారకలిత బంధముల
పెట్టించె ఆసలను పెడకొడములఁ దన్ను
తిట్టించె నిజద్రవ్య దీనకులచేత ॥ఈభ॥

బెదరించె దేహంబు పెనువేదనలచేత
చెదరించె శాంతంబు చెలఁగి చలమునకు
విడళించె భవములను వేంకటేశ్వరుఁ గొలిచి
వదిలించె సతతనిత్యవ పరమసౌఖ్యములు ॥ఈభ॥ 127

## భైరవి

ఎంతపాపకర్మమాయ యెంతనింతచింతలాయ
వింతవారితోడి పొందు వేపటాయ దైవమా ||పల్లవి||

చూడఁజూడఁ గొత్తలాయ చుట్ట మొకఁడు లేఁడాయ
పీడఁబట్టు అలుచాయ పెడకలుడివోయను
వోడుజోడు గూడదాయ చొక్కుఁదనము మానదాయ
యేడకేడ తలపోఁత యెంతసేసి దైవమా ||ఎంత||

నీరులేనియేటిదాఁట నేర దెంతేలోఁతాయ
మేర వేళ్ల నీఁదదాయ మేఁటిఁ జేరదాయను
తోరమైనఆస లుబ్బి తోవగానిపించదాయ
కోరిరాకపోకచేత కొల్లఁబోయఁ గాలము ||ఎంత||

తల్లిదండ్రిదాతగురువు తానే యైననాచారి
వల్లభుండు నాకు మేలువంటిదాయ జన్మము
కల్లగాదు వేంకటేశుమునిపాదసేవ నాకు
మెల్లమాయ నామనసు మోదమాయ దైవమా ||ఎంత|| 128

## రామక్రియ

కుడుచుఁగాక తనకొలఁదిగాని మేలు
దడవి నానోరు తగినయెంతయును ||పల్లవి||

చంపవచ్చినకర్మసంగ్రహం బాపుబుద్ధి
గంప గట్టుక తన్ను గాచినా
పంపుడుదయ్యాలు బాధఁ బెట్టుచుయీస
కొంపలోన నుండనీఁ గోరినా ||కుడు||

శ్రీవేంకటగిరిశ్రీనాథుఁ డిందరిఁ
గావఁ బ్రోవఁగ నున్నఘనుఁడు
దేవోత్తముని నాత్మఁ దెలియ కితరము లయిన
త్రోవ లెన్నిన మేలు దొరకీనా ॥కుడు॥ 129

87-వ రేకు. మలహరి

అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము
లందు వెలుగొందీ ప్రభ మీఱఁ గాను ॥పల్లవి॥

తగ నూటయిరువై యెనిమిది తిరుపతులం గల
స్థానికులును చక్రవర్తిపీఠకములును
అగణితంబైన దేశాంత్రులమఠంబులును
సధికమై చెలువొందఁగాను
మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేనిదివ్యతపసు లున్నగృహములును
వొగి నొరగుఁ బెరుమాళ్ల పునికిపట్టయి వెలయు
దిగువతిరుపతి గడవఁగాను ॥అదె॥

పొదలి యరయోజనము పొడవునను బొలుపొంది
పదినొండుయోజనంబులపరపునను బరగి
చెదర కేవంక చూచిన మహాభూజములు
సింహశార్దూలములును
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడగంధర్వయక్షులును విద్యాధరులు
విదితమై విహరించువిశ్రాంత దేశముల
వేడుకలు దైవారఁగాను ॥అదె॥

ఎక్కువల కెక్కువై యొసఁగి వెలసినపెద్ద
యెక్కు డతిశయముగా నెక్కు నంతటిమీఁద
అక్కజంబైనపల్లవరాయనిమటము
అలయేట్లపేడ గడవఁగా
చక్క నేఁగుచు నవ్వచరిఁ గడచి హరిఁ దలఁచి
మ్రొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీఁద
నక్కడక్కడ వేంకటాద్రీశుసంపదలు
అంతంతఁ గానరాఁగాను ॥అదె॥

బుగులుకొనుపరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైననానావిధంబుల వనంబులును
నిగిడి కిక్కిరిసి పండినమహావృక్షముల
నీడలను నిలిచి నిలిచి
గగనంబు దాఁకి శృంగారరసభరితమై
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలు గలనగరు
నరగుననుఁ గానరాఁగాను ॥అదె॥

ప్రాకటంబైనపాపవినాశములోని
భరితమగు దురితములు పగిలి పారుచునుండ
ఆకాశగంగతోయములు సోఁకినభవము
లంతంత వీఁడి పారఁగను
ఈకడనుఁ గోనేటయతులుఁ శాశుపతుల్ మును
తెన్ను నగ్గలమై వున్నవైష్ణవులలో
యేకమై తిరువేంకటాద్రీశుఁ డాదరిని
యేప్రొద్దు విహరించఁగాను ॥అదె॥ 180

## ముఖారి

సిరి దొలంకెడి పగలు చీఁకటా యితఁ డేమి
యిరవు దెలిసియుఁ దెలియ నియ్యఁడటుగాన ॥పల్లవి॥

తలపోయ హరి నీలవర్ణుండో యితఁడు
వెలుఁగుచున్నాఁడు బహువిధవసులతోడ
కలగుణం బటువలెనె కాఁబోలు లోకంబు
గల దెల్ల వెలి లోనఁ గనిపించుఁగాన ॥సిరి॥

మెరమీఁటినసీలమేఘమో యితఁ డేమి
భూరిసంపదలతోఁ బొలయుచున్నాఁడు
కారుణ్యనిధి యట్ల కాఁబోలు ప్రాణులకు
కోరికలు దలఁపులోఁ గురియు నటుగాన ॥సిరి॥

తనివోని ఆకాశతత్వమో యితఁ డేమి
అనఘుఁ డీతిరువేంకటాద్రివల్లభుండు
ఘనమూర్తి అటువలెనె కాఁబోలు సకలంబు
తనయందె యణఁగి యుద్భవ మందుఁ గాన ॥సిరి॥ 181

## ఆహిరి

తనవారలు పెరవారలుఁ దా నన్నియెడివాఁ డెవ్వఁడు
తనుగుణముల దిగవిడిచిన ధన్యుం డాతఁడెపో ॥పల్లవి॥

తెగఁబడి మదనసముద్రము దేహముతోడనె దాఁటిన
విగతభయుం డతఁ డెవ్వఁడు వెరం డెవ్వఁ డాతో
పగగొని పంచేంద్రియముల ప్రాణముతోడనె బతికి
జగదేకప్రీతుండగు చతురుం డాతఁడెపో ॥తన॥

యేచినపరితాపాగ్నుల నేమియు నొవ్వక వెడలిన
ధీచతురుం డతఁడెవ్వఁడు ధీరుం డెవ్వఁ డొకో
చూచినమోహపుఁజూపులఁ జిరుచూండ్ల కెడ మిండ్యాని
రాచఠీకపునెరజాణఁడు రసికుం డాతఁడెపో ॥తన॥

చావుకు నరియగుద్రవ్యవిచారపుతగులులఁ బాసిన
పావనుఁ డెవ్వఁడు బహుజనబాంధవుఁ డెవ్వఁడొకో
శ్రీవేంకటగిరినాథుని చిత్తములోపల నిలిపిన
దేవసమానుఁడు నాతఁడె ధీరుఁడు నాతఁడెపో ॥తన॥ 182

## దేవగాంధారి

చెప్పుదుమాటలె చెప్పుకొనుట గాక
చెప్పినట్లఁ దాము సేయ రెవ్వరును ॥పల్లవి॥

దొడ్డయిన శరీరదోష మైనయట్టి
జడ్డు దొలఁగవేయఁ జాల రెవ్వరును
గడ్డబడి యీఁతకాండ్లౌట గాని
వొడ్డునడుమ నీఁద నోప రెవ్వరును ॥చెప్పి॥

శ్రీవేంకటేశుపైఁ జిత్త మర్పణ సేసి
యీవిధు లన్నియు నెడయ రెవ్వరును
చావుఁ బుట్టుగు లేనిజన్మముగల సర్వ
దేవతామూర్తులై తిరుగ రెవ్వరును ॥చెప్పి॥ 183

38-వ రేకు. ## దేసాక్షి

వేసరితి మెట్ల నీవెంటఁ దిరిగి
గాసిఁ బెట్టక మమ్ముఁ గావరాదా ॥పల్లవి॥

తీసితివి కోరికల తెగనీక పంచలకు
తోసితివి యింటింటఁ దోయఁదోయ
చేసితివి నీచేఁత చెల్లె నీకనైనను
ఆన నీపాం దొల్ల మంపరాదా ||వేన||

కట్టితివి కర్మముల కడదాఁక నావదలఁ
బెట్టితివి దుఃఖములఁ బెనచి పెనచి
వట్టితివి చలము మము పాయనని యాన నీ
విట్టిన గొంతసుఖ మియ్యరాదా ||వేన||

కలిపితివి పాపములె కడఁగి నానావిధుల
నలిపితివి దుర్దశలె నేర్పు మెఱసి
తెలఁ గొనంగియును శ్రీతిరువేంకటేశ్వరుని
నెఱిఁగియును నెఱఁగలే మింక నేతెరువో ||వేన|| 184

## సామంతం

నీవనఁగ నొకచోట నిలిచి వుండుటలేదు
నీ వనుచుఁ గనుఁగొన్న నిజ మెల్ల నీవే ||పల్లవి||

తనయాత్మవలెనె భూతములయాతుమ లెల్ల
ననయంబుఁ గనుఁగొన్న యతఁడే నీవు
తనుఁగన్నతల్లిఁగా దగనితరకాంతలను
అనఘుఁడై మదిఁజూచు నతఁడే నీవు ||నీవ||

సతతసత్య వ్రతాచార సంపన్నుఁడై
అతిశయంబుగ మెలఁగునతఁడే నీవు
ధృతి దూలి ద్రవ్యంబు తృణముగా భావించు
హతకాముకుఁడై నయతఁడే నీవు ||నీవ||

మోదమున సుఖదుఃఖములు నొక్కరీతిగా
నాదరింపుచు నున్నయతఁడే నీవు
వేదోక్తమతియైన వేంకటాచలనాథ
ఆదియును నంత్యంబు నంతయును నీవే ॥నీవ॥ 185

ముఖారి

ఎవ్వరికైనను యీ వ్రాఁత నను
నవ్వులు సేసెఁబో నా వ్రాఁత ॥పల్లవి॥

తొలిజన్మంబున దోషకారియై
నలుగడఁ దిప్పెను నా వ్రాఁత
యిలదుర్గుణముల కీజన్మంబున
నలఁకువసేసెఁబో నా వ్రాఁత ॥ఎవ్వ॥

పురుషునిఁ జేసల్పుని ననిపించుట
నరజన్మమునకు నా వ్రాఁత
తరుచయ్యీన పాతక మరుపెట్టుక
నరకము చూపెఁబో నా వ్రాఁత ॥ఎవ్వ॥

పామఱితనమున బహువేదనలను
నామన సెనసెఁబో నా వ్రాఁత
కామితఫలు వేంకటపతిని గొలిచి
నామతి దెలిపెఁబో నా వ్రాఁత ॥ఎవ్వ॥ 186

ఆహిరి - అటతాళం

కూడులేక యాఁకటికిఁ గూర దిన్నట్లు
ఆడనీడమోవి చిగురాకు దినేరయ్యా ॥పల్లవి॥

దుండగళ్ళుఁబగవారు దోఁచఁగానే తమకాన
కొండ లెక్కి నట్లు సిగ్గు గొల్లఁబోఁగాను
దండు వెళ్లెమదనునిదాడికి సతుల చన్ను
గొండలెక్కి సారెసారె గోడనేరయ్యా ||కూడదు||

పొదిగొన్నయలవుతోఁ బొదలుతీగెలక్రింద
తుదలేనిభయముతోఁ దూరినట్లు
మృదువైనతరుణుల మెఱుఁగు బాహులతల
పొదలెల్లఁ దూరి తూరి పుంగుడయ్యేరయ్యా ||కూడదు||

వలనగంపలమోపువలె లంపటము మోఁచి
తలఁకుచుఁ బారలేక దాఁగినయట్లు
యిల వేంకటేశ నిన్నెఱుఁగ కింద్రియముల
తలవరులిండ్ల చే దాఁగేరయ్యా ||కూడదు|| 187

శ్రీరాగం

వెఱతు వెఱతు నిందు వేడుకపడ నిట్టి
కుఱుచబుద్ధుల నెట్టు కూడుదునయ్యా ||పల్లవి||

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాఁడు
ద్రోహి గాక నేఁడు దొరయటా
ఆహికముగ నిట్టి అధమప్రవృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్యా ||వెఱ||

తోడఁబుట్టినవాని తోడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడుగాక సుకృతియట
పాడైనయిటువంటి పాప బుద్ధులు నేసీ
నీడ నిలువ నెట్టు నేరుతునయ్యా ||వెఱ||

కొడుకు నున్నతమతిఁ గోరి చంపెడువాఁడు
కడుఁ బాతకుఁడు గాక ఘనుఁడటా
కడలేనియిటువంటికలుషవ్రిత్తికి నాత్మ
వొడఁబరపఁగ నె ట్లోపుదునయ్యా ॥వెఱ॥

తెల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడుగాక
యెల్లవారల కెల్ల నెక్కుడటా
కల్లరి యనుచు లోకము రోయుపని యిది
చెల్లఁబో నే నేమి సేయుదు నయ్యా ॥వెఱ॥

యింటివేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట
వెంటఁ దిప్పెడువాఁడు విభుఁడటా
దంటనై యూతనిదాసానుదాసినై
వొంటి నుండెద నేమి నొల్ల నోయయ్యా ॥వెఱ॥ 138

దేవగాంధారి

ఏమిఫలము దా నిన్నియునుఁ దెలిసినను
సాము సేసినఫలము జయశీలుఁ డౌటగాక ॥పల్లవి॥

తానుగలిగినఫలము దయసేయఁగలుగుట
మేనుగలిగినఫలము మే లెల్లగనుటా
మానుషము గలఫలము మంచివాఁ డౌట తను
దాన తెలిసిఁ ఫలము తత్వపరుఁ డౌటగాక ॥ఏమి॥

పదిలమగుకులముగల ఫలము తాఁ జదువుటా
చదివినఫలం బర్థసారంబు గనుటా
పొదలి శాస్త్రార్థంబు పొడగన్న ఫలము మ
తిదలఁకకిటు వేంకటేశుదాసుఁ డౌటగాక ॥ఏమి॥ 139

89-వ రేకు శంకరాభరణం.

కొనరో కొనరో మీరు కూరిమిమందు
వునికి మనికి కెల్ల నొక్కటే మందు ॥పల్లవి॥

ధ్రువుఁడు గొనినమందు తొల్లియుఁ బ్రహ్లాదుఁడు
చవిగాఁగొనినమందు చల్లనిమందు
భవరోగములు వీడిపారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన నిచ్చలమైన మందు ॥కొన॥

నిలిచి నారదుఁడు గొనినమందు జనకుఁడు
గెలుపుతోఁ గొని బ్రదికినయామందు
మొలచి నాలుగుయుగములరాజులు ఘనులు
కలకాలము గొని కడగన్నమందు ॥కొన॥

అజునకుఁ బరమాయువై యొసగినమందు
నిజమై లోకము లెల్ల నిండినమందు
త్రిజగములు నెఱుఁగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటిదరి నున్నమందు ॥కొన॥ 140

సామంతం

పాయపుమదములబంధమా మము
చేయని యీఁకఁ గృపసేయఁగదో ॥పల్లవి॥

ధనధాన్యములై తనులంపటమై
పనిగొంటివి నను బంధమా
దినదినంబును నుతి దీపులఁ బెను
గనివైతివి యీఁకఁ గావఁగదో ॥పాయ॥

సతులై సుతులై చలమై కులమై
పతి వై తివివో బంధమా
రతిఁ బెరరేఁపుల రంతులయేఁపుల
గతిమాలితి వీఁకఁ గావఁగదో ||పాయ||

పంటై పాఁడై బలుసంపదలై
బంటుగ నేలితి బంధమా
కంటి మిదివో వేంకటగిరిపై మా
వెంటరాక నేగి విడువఁగదో ||పాయ|| 141

సామంతం

కటకటా యిటుచేసెఁ గర్మబాధ
యెటువంటివారికిని నెడయ దీబాధ ||పల్లవి||

దినదినముఁ బ్రాణులకు దీవనముచే బాధ
తనుపోషణములు కందర్పబాధ
మనసుశాంతికి సదా మమకారములబాధ
తనివోనికోర్కులకు దైవగతి బాధ ||కట||

వెడయానచూపులకు వేడుకలచే బాధ
కడువేడ్కలకు వియోగములబాధ
తొడవైనయెలుకలకు దురితబుద్ధులబాధ
జడియుఁబరచింతలకు సంసారబాధ ||కట||

అరిదినిశ్చయ మతికి ననుమానములబాధ
సరిలేని జీవులకు జన్మబాధ
తిరువేంకటాచలాధిపునిఁ గని మని కొలుచు
వెరవుచేతనకాని విడవదీ బాధ ||కట|| 142

## శ్రీరాగం

ముచ్చుఁగన్నతల్లి చేరి మూలకు నొదిగినట్టు
తెచ్చినసంబళ మెల్లఁ దీరెఁబో లోలోన ॥పల్లవి॥

దప్పముచెడినవాని తరుణి కాఁగిటఁ జేరి
అప్పటప్పటికి నుస్సు రనినయట్టు
తప్పయినహరిభక్తి దొల్లనివానియింటి
కుప్పలైనసంపదలు కుళ్లెఁబో లోలోన ॥ముచ్చు॥

ఆఁకలిచెడినవాని అన్నము కంచములోన
వోఁకిలింపుచు నేల నొలికినట్టు
తేఁకువైనహరిభక్తి తెరువుగాననివాని
వేఁకవుసిరులు గొంపవెళ్లెఁబో లోలోన ॥ముచ్చు॥

వొడలుమాసినవాని వొనరుఁజుట్టములెల్ల
బడిబడినే వుండి పాసినయట్టు
యెడయక తిరువెంకటేశుఁ దలఁచనివాని
అడరుబుద్ధులు వగలాఁబో లోలోనన ॥ముచ్చు॥ 148

## శ్రీరాగము

అంగడి నెవ్వరు నంటకురో యీ
దొంగల గూడినద్రోహులను ॥పల్లవి॥

దోసము దోసము తొలరో శ్రీహరి
దాసాన దాసులదగ్గఱకా
అనలనానల హరి నెఱగక చెడి
వీవరపోయిన వెఱ్ఱులను ॥అంగ॥

# అధ్యాత్మ సంకీర్తనలు

పాపము పాపము పాయరో కర్మపుఁ
దావపువారము దగ్గరక
చేపట్టివేదవు శ్రీహరికథలు
యేపొద్దు వినని హీనులము ॥అం॥

వంకము వంకము పైకొనిరాకురో
కొంకుఁగొనరుల కూళలము
వెంకటగిరిపై విభునిపుణ్యకథ
లంకెలవిననియన్యులము ॥అం॥ 144

## గౌళి - జంపెతాళం

సాగియునా మఱియు ముచ్చుకుఁ బండువెన్నెలలు
పగవానివలెనె లోపల దాఁగుఁగాక ॥పల్లవి॥

దక్కునా పేదకును తరముగాని ధనంబు
చిక్కి యెవ్వరికైనఁ జేరుఁగాక
వెక్కసపైన గోవిందునిఁ దలఁపుబుద్ధి
తక్కినపరుల కెల్లఁ దలఁ పేల కలుగు ॥సాగి॥

అరగునా దుర్బలున కరుదైన యన్నంబు
కరుచబుద్ధులను నరమిగొనుఁగాక
తొరలునా హరివినుతి దుష్టునకు నదినోరఁ
దొరలెనా యతనినే దూషించుఁగాక ॥సాగి॥

చెల్లునా యమృతంబు సేవించ నధమునకు
వొల్లనని నేలపై నొలుకుఁగాక
వెల్లిగొను మందునకు వేంకటేశుస్మరణ
చలనౌనా మనసు కలియించుఁగాక ॥సాగి॥ 145

40-వ రేకు. సామంతం

నిగమనిగమాంతవర్ణిత మనోహరరూప
నగరాజధరుఁడ శ్రీనారాయణా ॥పల్లవి॥

దీపించువైరాగ్యదివ్యసౌఖ్యం బియ్య
నోపక కదా నన్ను నొడఁబరపుచు
పైపైనె సంసారబంధములఁ గట్టేవు
నావలుకు చెల్లునా నారాయణా ॥నిగ॥

చీకాకుపడిననాచిత్తశాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకుసేసెదవు బహుకర్మములఁ బడువారు
నాకొలఁదివారలా నారాయణా ॥నిగ॥

వివిధనిర్బంధముల వెడలఁద్రోయక నన్ను
భవసాగరములఁ దడఁబడఁ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా ॥నిగ॥ 146

కాంబోధి

తెల్లవారనియ్యరో తెరువు యీ
పల్లదపు దొంగ లెల్లఁ బారాడు తెరువు ॥పల్లవి॥

దొంతరపూవులతోఁట తూరుపుఁదెరువు
చింతపూవుఁదేనెలచెమ్మ తెరువు
సంతులేని నది యంటిచాయ తెరువు
యింతలోనె చలిఁబడి యెండదాఁకే తెరువు ॥తెల్ల॥

పాముపుట్టగొంటిమీఁదిపడమటి తెరువు
చీమక దొంతరలోనిచిన్న తెరువు
గాములు గాచుకయుండే గాలి తెరువు
యేమిటా నెక్కడవుత నెఱఁగని తెరువు ॥తెల్ల॥

అన్ని దిక్కులునుఁ దానే యైవున్న తెరువు
వన్నిటికి లువల బాట తెరువు
కన్నుల వేంకటపతిఁ గన్న తెరువు
మిన్ను నేలఁ గూడినమీఁది తెరువు ॥తెల్ల॥ 147

శ్రీరాగం

నమోనారాయణాయనమః
సమధికానందాయ సర్వేశ్వరాయ ॥పల్లవి॥

ధరణీసతిఘన స్తనశైలపరిరంభ
పరిమళశ్రమజలప్రమదాయ
సరసిజనివాసినీవరసప్రణామయుత
చరణాయ తే నమో సకళాత్మకాయ ॥నమో॥

సత్యభామాముఖాంచసపత్రవల్లికా
నిత్యరచనక్రియానిపుణాయ
కాత్యాయనీస్తోత్రకామాయ తే నమో
పత్యుతనిజపరబ్రహ్మరూపాయ ॥నమో॥

దేవతాధిపమకుట దివ్యరత్నాంశునం
భావితామలపాదపంకజాయ
కైవల్యకామినీకాంతాయ తే నమో
శ్రీవెంకటాచల శ్రీనివాసాయ ॥నమో॥ 148

## సామంతం

పాపినైననాపాలఁ గలిగి తోవ
చూపు మన్న నెందుఁ జూపరు ॥పల్లవి॥

ధృతి దూలి జగ మెల్ల దిరిగి వేసరితి
యితరాలయముల కేఁగి యేఁగి వేసరితి
గతిమాలి పరులపైఁ గనలి వేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి ॥పాపి॥

విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యముపైఁ గోరి వేసరితి
కసుగంది లోలోన కాఁగి వేసరితి ॥పాపి॥

కోవిదులగువారిఁ గొలిచి వేసరితి
దైవము లందరిఁ దడవి వేసరితి
శ్రీవేంకటేశునిసేవ మాని వట్టి
సేవ లన్నియు నేఁ జేసి వేసరితి ॥పాపి॥ 149

## శ్రీ రాగం

సకలశాస్త్రజ్ఞానసంపన్నుఁ డట చిత్త
మొకటికినిఁ జొరదు విధియోగ మేఁ గాదో ॥పల్లవి॥

దొరతనం బట కలిమి దోడుగాదట మంచి
తరుణు లట మోహ మట దైన్యం బటా
విరహ మట దారిద్ర్యవివశుఁ డౌనట చూడ
నరయు నిది కర్మఫల మౌనో కాదో ॥సక॥

రాజసన్మాన మట రవణహీనత్వ మట
తేజ మట నలువంకఁ దిరిపెం బటా
వాజివాహనము లట వాఁడి తే జట తొంటి
పూజఫల మిది వెలితిభోగ మూఁ గాదో ||నర||

యిల యెల్ల నేలునట యింట లేదట మిగుల
బలిమి గలదట సదాపరిభవ మటా
చెలు వలర నేడుకల శ్రీవేంకటేశ్వరుని
గొలువ నేరని వెనకఁ గొఱత లౌఁగాదో ||నర|| 150

## ముఖారి

సారిది సంసారంబు సుఖమా యిందరికి
వెర వెఱుంగక వగల వేఁగేరుగాక ||పల్లవి||

దేహములు దలఁప సుస్థిరములా ప్రాణులకు
నూహింప లోభ మ ట్లుండుఁగాక
మోహంబుచే నెనక ముం దెఱుఁగలేక తమ
దేహసుఖములు మరిగి తిరిగేరుగాక ||సారి||

నెలకొన్న ద్రవ్యములు నిలుచునా యెవ్వరికి
అలవి నిలుపఁగరాని యాస గాక
బలుపైనవట్టివిభ్రాంతిచేఁ దగులువడి
తెలిసియునుఁ దెలియ కిటు తిరిగేరు గాక ||సారి||

నెఱయు విభవము లెల్ల నిజములా యిందరికి
కొఱమాలినట్టి తమగుణము గాక
నెఱుకతోఁ దిరువేంకటేశుఁ గొలువఁగలేక
తెఱఁగుమాలినబుద్ధిఁ దిరిగేరుగాక ||సారి|| 15

41-వ రేకు. ఆహిరి

కాక మఱి యింతేలకలుగుఁ దమకే తమకు
చేకొన్న కోరికలు చేరునందాఁకా ॥పల్లవి॥

దొరతనము లన్నియును దొరసినందాఁకా
నెరతనము లన్నియును నెరపినందాఁకా
గరగరకలన్నియును కలసినందాఁకా
విరసంబు లన్నియును విసుగునందాఁకా ॥కాక॥

యెడమాట లన్నియును యెనసినందాఁకా
అడియాసకోరికలు అడుగునందాఁకా
జడిగొన్న గుక్కిళ్లు చవిగొన్నయందాఁక
వోడ లోముటలు మోహ ముడుగునందాఁకా ॥కాక॥

యీవెల్లఁ దమయాత్మ యిచ్ఛగించినదాఁక
(శ్రీ)వెంకటేశుకృప చేరునందాఁక
లోవెలుతు లన్నియును లోఁగొన్నయందాఁక
నేవేగ బంధనులు వీడునందాఁకా ॥కాక॥ 1[illegible]2

వరాళి

ఏమి సేయువార మింకను
ఆమని చేలవచ్చు లాయ బ్రదుకు ॥పల్లవి॥

దీపన మనియెడితీరనియాస
రేపుమాపుఁ బెడరేఁచఁగా
తోపు సేయఁగ రాక దురితపుటరవుల
కాపదలకు లోనాయ బ్రదుకు ॥ఏమి॥

వేడు కనెడిపెద్దవిడువని తరవు
వోడ కెపుడు వొద్ద నుండఁగా
జోడు విడువరాక చులుకఁ దనంబున
కాడికెలకు లోనాయ బ్రదుకు ॥ఏమి॥

మమకార మనియెడి మాయతరవు
తిమిర మెక్కించుక తియ్యఁగా
విమలమూరితి యైనవెంకటగిరిపతి
అమరఁ జేరక యరవాయబ్రదుకు ॥ఏమి॥ 153

## ముఖారి

కడు నదును చొరనేల కాళ్లు గట్టుగఁగనేల
కడ లేనిజన్మసాగర మీఁదనేల ॥పల్లవి॥

దురితంబునకు నెల్ల దోడవు మమకారంబు
లరిది మమతలకుఁ దోడ వడియాసలు
గురు తయినయాసలకుఁ గోరికలు జీవనము
పరగ నిష్పటికి లంపటమె కారణము ॥కడు॥

తుదలేనిలంపటము దుఃఖహేతువు దుఃఖ
ముదుటయినతాపమున కుండఁగఁజోటు
పదిలమగుతాపంబు ప్రాణసంకటము లీ
మదము పెంపునకుఁ దనమనసు కారణము ॥కడు॥

వెలయఁ దనమనసునకు వేంకటేశుఁడు గర్త
బలిసి యాతనిఁదలఁచువనికిఁ దాఁ గర్త
తలకొన్నతలఁపు లివి దైవమానుషముగాఁ
దలఁచి యాత్మేశ్వరునిఁ దలఁపంగ వలదా ॥కడు॥ 154

## శ్రీరాగం

ఇతరులకు నిను నెఱుఁగఁదరమా
సతతసత్యవ్రతులు సంపూర్ణమోహవిర
హితు లెఱుఁగుదురు నిను నిందిరారమణా ॥పల్లవి॥

నారీకటాక్షపటునారాచభయరహిత
శూరు లెఱుఁగుదురు నినుఁ జూచేటిచూపు
ఘోరసంసారసంకులపరిచ్ఛేదులగు
ధీరు లెఱుఁగుదురు నీదివ్యవిగ్రహము ॥ఇత॥

రాగభోగవిదూరరంజితాత్ములు మహా
భాగు లెఱుఁగుదురు నినుఁ బ్రణుతించువిధము
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా
యోగు లెఱుఁగుదురు నీ వుండేటివునికి ॥ఇత॥

పరమభాగవతపదపద్మసేవానిజా
భరణు లెఱుఁగుదురు నీవలికేటిపలుకు
పరగునిత్యానందపరిపూర్ణమానస
స్థిరు లెఱుఁగుదురు నినుఁ దిరువెంకటేశ ॥ఇత॥ 156

## శంకరాభరణం

ఎఱుఁగుదు రిందఱు నెఱిఁగినెఱుఁగరు
హరి దానే నిజపరమాత్మ మని ॥పల్లవి॥

నలినాసనుఁ డెఱుఁగు నారదుఁ డెఱుఁగు
కొలఁదిశివుఁ డెఱుఁగు గుహుఁ డెఱుఁగు
యిలఁ గపిలుఁ డెఱుఁగు నింతా మను వెఱుఁగు
తలఁప విష్ణుఁడే పరతత్త్వ మని ॥ఎఱు॥

జెరసి ప్రహ్లాదుఁడు భీష్ముఁడు జనకుఁడు
గురుతుగ బలియు శుకుఁడుఁ గాలుఁడు
వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ
హరి యితఁడే పరమాత్ముం డని ॥ఎరు॥

తెలియ దగిన దిది తెలియరాని దిది
తెలిసినాను మదిఁ దెలియుదిది
యిల నిందరుఁ దెలిసి రిదే పరమమని
కలవెల్లఁ దెలిపె వెంకటరాయఁడు ॥ఎరు॥ 156

దేవగాంధారి

లేదు బ్రహ్మవిద్యా మహాసుఖము తమ
కీడు తమకర్మ మేమి సేయఁగవచ్చు ॥పల్లవి॥

నానావిధులఁ బొరలి నరుఁడు దాసై వివిధ
మైనకర్మములే అనుభవించి
లేని లంపటములకు లోనై దురితా
ధీనులై క్రమ్మరఁ దిరిగి పోవుటకాని ॥లేదు॥

వరగ నిన్నిటఁ బొడమి బ్రాహ్మణుఁడై
సరిలేనివేదశాస్త్రములు చదివి
అరు దయినకాంక్షచే నతిపాపపరులై
వెరవునఁ బొడ వెక్కి విరుగఁబడుటకాని ॥లేదు॥

చేరనిపదార్థములే చేరఁ గోరుటగాని
చేరువనే యీమేలు సిద్ధింపదు
ధీరులై తమలోనఁ దిరువెంకటేశ్వరునిఁ
గోరి యిటు భజియింపఁ గూడు టెన్నఁడుగాన ॥లేదు॥ 157

43-వ రేకు. లలిత

నీవేకా చెప్పఁ జూప నీవె నీవెకా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి ॥పల్లవి॥

నీవెకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి ॥నీవే॥

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులువంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాల వారి నిందటినినీ
సిసువులఁగా నేలినసేనమొదలారి ॥నీవే॥

దొరలై నయసురుల తుత్తుమురు సేసి జగ
మిరవుగ నేలితి వేకరాజ్యమై
పరగునూత్రవతిపతివై వెంకటవిభు
సిరులసెన్నిధి నీవె సేనమొదలారి ॥నీవే॥ 158

పాడి

బాలులతో వీధులలోఁ బారాడువాఁడు
కోల లెత్తుక వుట్లు గొట్టీఁ జూండి ॥పల్లవి॥

నారికడపు వక్కలు నానిననగలు
చారపప్పుఁ దేనెలు చక్కెరలును
పేరిననేతులు నానబియ్యాలు నుట్ల నవే
చేరి యశోదబిడ్డకుఁ జెప్పరు నుండి ॥బాలు॥

చక్కెలాలు నదుకులు ననిగెవప్పులును
చెక్కిన మొ త్తనితూఁటచెఱకులును
పెక్కువగా నుట్లలో బిందెలని చిన వవే
చక్క యశోదబిడ్డకుఁ జాటెరు నుండి ॥బాలు॥

నువ్వులుఁ జిటిబెల్లాలు నున్ననిచిమ్మిలులు
నువ్వుటోడియునుఁ జిన్నినురుగులును
యెవ్వరువెంకటపతి కెఱుగించ నారగించి
కివ్వ కివ్వ నవ్వ నణఁకించీ జూడి ॥బాలు॥ 159

కన్నడగౌళ

వుండు జీవుల కెల్లఁ బుట్టక మానదు
వుందు మాన మందు వోయఁ గదయ్యా ॥పల్లవి॥

నెత్తురు నెమ్ములు నిండినపుంటికి
తిత్తిలో సోదించ నేరా
నిత్తెము వేనీళ్ళఁ గడిగినాను
మ త్తిలి వుబ్బు మాన దేలయ్యా ॥వుండు॥

చలఁగూడు వెట్టి చల్లఁగా పొత్తు
లెల్లఁ బెట్టి బిగియించఁగాను
కల్లగాదు చీముగారు తొమ్మిదిగండ్ల
పిల్లలం బాలఁ బెట్టఁగదయ్యా ॥వుండు॥

ఆదినుంటి పాకమైనదియెవ్వ
రేదిరో మొకమేరుపడదు
ఆదరించి వెంకటాధిప నీ వింక
సోదించి మానఁ జూడఁగదయ్యా ॥వుండు॥ 160

నమో నమో పుండరీకనారసింహా వో
నమితసురాసురనారసింహా
నమకచమకహితనారసింహా వో
నముచిసూదనవంద్య నారసింహా ॥నమో॥

నవరసాలంకార నారసింహా వో
నవనీతచోర శ్రీనారసింహా
నవగుణివేంకటనారసింహా వో
నవమూర్తి మండెమునారసింహా ॥నమో॥ 162

## పాడి

కడగనుటే సౌఖ్యము గాక యీ
తడతాఁకుల నెందరు చన రిటు ॥పల్లవి॥

నిలిచినదొకటే నిజ మని తెలిసిన
తెలివే ఘన మింతియు కాకా
కలకాలము చీఁకటి దవ్వుకొనక
వలలభ్రమల నెవ్వరు వడ రిట్లా ॥కడ॥

పరహిత మిదియే పర మని తెలిసిన
పరిపక్వమె సంపదగాకా
దురితవిధుల గొందులసందులఁ బడి
తిరలోపల నెందరు చన రిట్లా ॥కడ॥

ఘనుఁడీతిరువేంకటపతి యని కని
కొనకెక్కుట తేఁకువగాకా
పనిమాలినయీపలులంపటముల
తనువు వేఁచు టెంతటిపని యిట్లా ॥కడ॥ 163

43-వ రేకు. ధన్నాసి

ఆదిమునులసిద్ధాంజనము
యేదెనఁజూచిన నిదివో వీఁడే ॥పల్లవి॥

పగిన సిలవిఁబడునాలుగుజగములు
మొగమునఁ జూపే మోహనము
నిగిడి యశోదకు నిధానంబై
పొగడొందీగృహమున నిదె వీఁడే ॥ఆది॥

కనుదెరచిననలుగడ నమృతములటు
అనువునఁగురిసీనవారము
వనితలు నందవ్రజమునఁ జెలఁగఁగ
మనికికి నిరవై మలసె వీఁడే ॥ఆది॥

పరమునకునుఁ దాఁ బరమై వెలసిన
పరిపూర్ణ పరాత్పరుఁడు
సరుస రుక్మిణికి సత్యభామకును
వరుఁ డగువెంకటవరదుఁడు వీఁడే ॥ఆది॥ 164

సామంతం

నారాయణ నీనామము బుద్ధిఁ
జేరినఁ జాలు సిరు లేమిటికి ॥పల్లవి॥

తనుపై నశ్రీనిష్ణునామము పేరు
కొనఁగాని తేఁకువమీరఁగ
ఘనమైనపుణ్యాలు గలుగఁగా తమ
తనయము బర మది యేమిటికి ॥నారా॥

నలువైన శ్రీహరినామము మతిఁ
దలఁచినాబంధము లూడఁగా
యెలమి దీనిఁ బఠియించినా యీ
కలుషము లేల కలుగు నెవ్వరికి ||నారా||

వేంకటపతినామవిభవము కర్మ
పంకము లెల్లఁ బరిమార్చఁగా
బింకమై తలఁపెడిప్రియులకు నెందు
నింక నీసుఖ మిది యేమిబ్రాఁతి ||నారా|| 165

ఆహిరి

మోహము విడుచుటే మోక్ష మది
దేహ మెఱుఁగుటే తెలివి యదే ||పల్లవి||

ననిచినతనజన్మముఁ గర్మముఁ దన
పనియు నెఱుఁగుటే పరమ మది
తనకు విధినిషేధములుఁ బుణ్యముల
ఘనత యెఱుఁగుటే కలిమి యది ||మోహ||

తఱిఁ దఱిఁ బ్రేమవుతల్లిదండ్రులను
యెఱుఁగనిదే కులహీన తది
చఱులఁ బొరలి యాచారధర్మములు
మఱచినదే తనమలిన మది ||మోహ||

కమ్మరఁ గమ్మరఁ గామభోగములు
నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకటనిలయునిదాసుల
సొమ్మయి నిలుచుట సుకృత మది ||మోహ|| 166

## ముఖారి

శ్రీశోయం సుస్థిరోయం
శాశ్వతముఖరతుకోయం ॥పల్లవి॥

నిగమనిధినిర్మలోయం
జగన్మోహనతిపతి
విగతభయోయం విజయసఖోయం
భృగుమునినానం ప్రీతోయం ॥శ్రీశో॥

సకలపతి శాశ్వతోయం
శుకముఖమునిజనసులభోయం
ప్రకటబహుళశోభనాధికోయం
వికచరుక్మిణీమీక్షణోయం ॥శ్రీశో॥

సకపోయం పరిసరప్రియోయం
తిరువేంకటాధిపోయం
చిరంతనోయం చిదాత్మకోయం
శరణాగతవత్సలోయం ॥శ్రీశో॥ 167

## శుద్ధవసంతం

కింకరిష్యామి కింకరోమి బహుళ
శంకానమాధాన జాడ్యం వహామి ॥పల్లవి॥

నారాయణం జగన్నాథం త్రిలోకైక
పారాయణం భక్తపావనం
దూరీకరోమ్యహం దురితదూరేణ నం
సారసాగర మగ్న చంచలత్వేన ॥కింక॥

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ
వరదం శరణాగత వత్సలం
పరమపురుషం కృపాభరణం నభజామి
మరణభవ దేహాభిమానం వహామి ॥ఓక॥

శ్రీరాగం

అపన్నులపాలిదైవ మాతఁడే గతిదక్క-
యేప్రొద్దును భజియించఁగ నితరుఁడు మఱి కలఁడ ॥పల్లవి॥

నిరుపాధిక నిజబంధుఁడు నిరతిశయానందుఁడు
కరివరదుఁ డితఁడే కాక ఘనుఁ డధికుఁడు గలఁడ ॥అప॥

సంతతగుణసంపన్నుఁడు సాధులకుఁ బ్రసన్నుఁడు
అంతర్యామితఁడేకాక అధికుఁడు మఱి కలఁడ ॥అప॥

పరమాత్ముఁడు పరమపురుషుఁడు పరికింపఁగఁ గృపాలుఁడు
తిరువేంకట విభుఁడేకాక దేవుఁడు మఱి కలఁడ ॥అప॥ 169

కురంజి-అటతాళం

మందరధర మధుసూదన
నందగోప నందన ॥పల్లవి॥

నరసింహా గోవింద నవనీతానంద
హరిముకుంద నయనారవింద
కరివరద గరుడగమనరూప
గురుచాపా యదుకులదీపా ॥మంద॥

## కన్నడ గౌళ

నీమహాత్త్వంబు లోనికిఁ వెలుపలికిఁ గప్పి
కామింప నిట్టి దనికానరా దటుగాన ॥పల్లవి॥

నిండి యున్నింటిలోన నీవు గలవని భ్రాంతి
నందుదుము గాని నీ వొకటియునుఁ గావు
దండిగలగిరి ప్రతిధ్వని దోఁచుఁగాని యది
కొండలోపల లేదు కొండయునుఁ గాదు ॥నీమ॥

బలసి యున్నింటి లోపలనుఁ జైతన్యమై
మెలఁగుదువుగాని యేమిట నీవు లేవు
పలుదెఱఁగు లైనదర్పణమునం దొకనీడ
వొలయుఁగా కందు దలపోయ నిదిలేదు ॥నీమ॥

వుఱుగ కన్నిటిలోన నుండుటయు లేదు నీ
వుడివోయి యందుండ కుండుటయు లేదు
చెడని తేజముగాన శ్రీవేంకటేశ నీ
పొడవు పరిపూర్ణమై పొలుపొందుఁ గాన ॥నీమ॥ 178

## మాళవి

అది నాయపరాధ మిది నాయపరాధ
మదియు నిదియు నాయపరాధము ॥పల్లవి॥

నెరయ రూపము లెల్ల నీరూపమే కా
నరయని యది నాయపరాధము
పరిపూర్ణుఁ డగునిన్నుఁ బరిచ్ఛిన్నునిఁ గా
నరయుట యది నాయపరాధము ॥అది॥

జీవాత్మునిఁగాఁ జింతింపఁ దలఁచుట
యీవంక నది నాయపరాధము
సేవించి నిను నాత్మఁ జింతింపకుండుట
ఆవల నిది నాయపరాధము ॥అది॥

యీడెఱుఁగక వెంకటేశుఁడ నినుఁగొని
యాడుట యది నాయపరాధము
యేడఁ జూచిన నాయెదుర నుండఁగ నిన్ను
నాడ నీడ వెదకు టపరాధము ॥అది॥ 174

కన్నడగౌళ

సతతవిరక్తుఁడు సంసారి గాఁడు
రతిసమ్మదుఁడు విరక్తుఁడు నితఁడె ॥పల్లవి॥

నిత్యుఁడైనవాఁడు సకలలోకములఁ
బ్రత్యక్షవిభవసంపన్నుఁడు గాఁడు
నిత్యుఁడు నితఁడే నిరుపమానుఁడైన
ప్రత్యక్షవిభవ సంపన్నుఁ డితఁడె ॥సత॥

యోగియైనవాఁడు వొనర నేకాలము
భోగియై భోగిపై భోగింపలేఁడు
యోగియు నితఁడే వుడుగక భోగిపై
భోగించునటువంటి పురుషుఁడు నితఁడె ॥సత॥

దేవుఁడైనవాఁడుఁ దెలుపలోకముల
దేవతారాధ్యుఁడై దీపింపలేఁడు
దేవుఁడు నితఁడే దివిజవంద్యుఁడైన
శ్రీవెంకటగిరి దేవుం డితండె ॥సత॥ 175

వరాళి

ఎచ్చోటి కేఁగిన యెవ్వాఁడుఁ దనులోని
మచ్చిక పెనుఁదెవులు మానక పోయె ||పల్లవి||

పాయపుసతుల గుబ్బల పెదపొట్లాల
కాయము పడి నొత్తి కాఁచఁగను
రాయిడిచే ఘనమాయఁ గాని లోని
మాయపు పెనుఁదెవులు మానకపోయె ||ఎచ్చో||

అతివలమోహపు టధరామృతములు
యితవుగ నోరి కందియ్యఁగను
అతిమోహమే ఘనమాయఁ గాని లోని
మతకరి పెనుఁదెవులు మానకపోయె ||ఎచ్చో||

తరుణులమేని మెత్తని పరువులమీఁద
నిరవుగనిటు సుఖయించఁగను
తిరువెంకటాచలాధీశుకృపచేఁ గాని
మరుచేతి పెనుఁదెవులు మానకపోయె ||ఎచ్చో|| 176

మలహరి

పండియుఁ బండదు చిత్తము పరిభవ మొదయదు కాంక్షల
యెండలనే కాఁగిటి మీఁక నేలాగో కాని ||పల్లవి||

పదికోట్లుజన్మంబులఁ బాయనికర్మపుఁ బొట్లు
వదలక వోకవిషయములో వడిఁ దీరుచు నితఁడు
చెదరనినిజదాసులకును శ్రీహరి మాకిపు డంతక
హృదయము నిలువదు చంచల మేలాగో కాని ||పండి||

కూపపు బహునరకంబుల కోట్లసంఖ్యలఁ జొరలేటి
పాపము లొకనిమిషములోఁ బాపఁగఁ గలఁ డితఁడు
కాపాడఁగఁ దలచినయా కమలాపతి నే మీతని
యేపునఁ గని మనలే మిఁక నేలాగో కాని ||పండి||

జడిగొని యెన్నఁడు బాయని సంసారపు బంధంబుల
విడు మని వొకనిమిషములో విడిపించును యితఁడు
కడుఁగొలిచినవారికి వేంకటపతి నే మీతని
నెడయక కొలువఁగ లేమిఁక నేలాగో కాని ||పండి|| 177

వరాళి

వాడలవాడల వెంట వాఁడివో వాఁడివో
నీడనుండి చీర లమ్మే నేఁతబేహారి ||పల్లవి||

పంచభూతము లనెడి పలువన్నెనూలు
చంచలపు గంజి వోసి చరిసేసి
కొంచెపుకండెల నూలిగుణముల నేసి
మంచిమంచి చీర లమ్మే మారుబేహారి ||వాడ||

మటమాయములఁ దనమగువపసిఁడి నీరు
దిటపాటియలుకలఁ జిలికించఁగా
కుటిలంపుఁజేఁతలు కుచ్చులుగాఁ గట్టి
పటవాళిచీర లమ్మేబలుబేహారి ||వాడ||

మచ్చికకర్మ మనేటి మైలసంతలలోన
వెచ్చపుకర్మధనము విలువచేసి
వచ్చెడాలుగాఁ గుట్టి బలువేంకటపతి
ఇచ్చకొలఁదుల నమ్మే ఇంటిబేహారి ||వాడ|| 178

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల

సామంతం

తొక్కనిచోట్లు దొక్కెడి మనసు
యెక్కడగతి లేదింక నో తెరువు ||పల్లవి||

పాపము వాయదు పైపై మనసున
కోపము దీరదు కొంతైనా
దీపనబాధయుఁ దీర దిన్నియును
యేపునఁ బెనఁగొని నింక నో తెరువు ||తొక్క||

యవ్వనమదమును నెడయదు కోరిక
కొవ్వును నణఁగదు కొంతైనా
రవ్వగుమమకారముఁ బెడఁబాయదు
యెవ్విధియును లే దింక నో తెరువు ||తొక్క||

వెఱపును విడువదు వెడమాయలఁబడి
కొఱఁతయుఁ దీరదు కొంతైనా
తెలిఁ గొనఁగేటి శ్రీతిరువేంకటపతి
నెఱిఁగి నెఱఁగలే మిఁక నో తెరువు ||తొక్క|| 179

సాళంగనాట

ఎట్టివారికి నెల్ల నిట్టికర్మములు మా
యిట్టివారికి నింక నేదిత్రో వయ్యా ||పల్లవి||

పాముఁ జంపినయట్టి పాతకమునఁ బెద్ద
పామువీఁద నీకుఁ బవళించవలసె
కోమలిఁ జంపినకొఱఁతవల్ల నొక్క
గోమలి నెదఁ బెట్టుకొని యుండవలసె ||ఎట్టి||

బండి విఱిచినట్టిపాతకమునఁ బెద్ద
బండిబోయిఁడవై పని సేయవలసె
కొండ వెఱికినట్టిగుణమునఁ దిరుమల
కొండమీఁద నీకుఁ గూచుండవలసె ||ఎట్టి|| 180

ముఖారి

అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్నిరూపుల భ్రమయింతువుగా ||పల్లవి||

పాలజలనిధినుండి బదరీవనాననుండి
ఆలయమై గయలోఁ బ్రయాగనుండి
భూలోకనిధివై పురుషోత్తమాననుండి
వేలసంఖ్యలరూపై విచ్చేతుగా ||అన్ని||

వుత్తరమధురలో నయోధ్యలోపలనుండి
సత్తైననందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోననుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను ||అన్ని||

కైవల్యముననుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగముననుండి
యీవలనావలనుండి యీవేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా ||అన్ని|| 181

సామంతం

మాయపుదనుజులమదవైరి కపి
రాయఁడు వీఁడవో రామునిబంటు ||పల్లవి||

పెట్టినబంగరు పెంపుమిగుల మొలఁ
గట్టినకాసెయు గర్వమున
నిట్ట నిలిచి పూనినచేతనడిమి
దిట్ట వీఁడువో దేవునిబంటు ||మాయ||

నవ్వుచు లంకానగరవు దనుజుల
కొవ్వణంచినకపికుంజరుఁడు
మువ్వురు వేల్పులమొదలిభూతియగు
రవ్వగు సీతారమణుని బంటు ||మాయ||

పంకజసంభవుపట్టము గట్టను
వుంకించిన తనవొడయనిచే
పొంకపుకలశాపురహనుమంతుఁడు
వెంకటరమణునివేడుకబంటు ||మాయ|| 182

46-వ రేకు. శంకరాభరణం.

పరుసముసోఁకియు బ్రదుకవద్దా
తిరిగికర్మము లింక తిదీపులా ||పల్లవి||

వడిగాలు వడియున్న ప్రాణాచారముల
పడఁతులనధములఁ బాలించితి
యిడుములఁ బెడఁబావ నింక నేల తెగి కొంక
గడియించి తెచ్చియు నింకఁ గడమున్నదా ||పరు||

మితిలేనిధనములు మెఱసి కానుకగాని
అతిపుణ్యు లిందరి నలరించితి
ధృతిహీనులకు నెల్ల దిక్కయి కాతువుగాక
వ్రతము చెల్లిన నింక వట్టఁగట్లా ||పరు||

పాలించి వావిన్నపమున వెంకటరాయ
లాలించితివి నే నీలలనఁ గానా
యీలాగునని లోక మింతాఁ గాతువుగాక
పాలు దాగినమీఁదఁ బైకుడుపులా ॥పరు॥ 183

శ్రీరాగం

ఫాలనేత్రానలప్రబలవిద్యుల్లతా
కేలీవిహార లక్ష్మీనారసింహా ॥పల్లవి॥

ప్రళయమారుతఘోరభస్త్రికాఫూత్కార
లలితనిశ్వాసడోలారచనయా
కులశైలకుంభినీకుముదహితరవిగగన
చలనవిధినిపుణ నిశ్చలనారసింహా ॥ఫాల॥

వివరఘనవదనదుర్విధహసననిష్ఠ్యూత
లవదివ్యపరుషలాలాఘటనయా
వివిధజంతువ్రాతభువనమగ్నీకరణ
నవనవప్రియగుణార్ణవ నారసింహా ॥ఫాల॥

దారుణోజ్జ్వలధగద్ధగితదంష్ట్రానలవి
కారస్ఫులింగసంగక్రీడయా
వైరిదానవఘోరవంశభస్మీకరణ
కారణప్రకట వేంకటనారసింహా ॥ఫాల॥ 184

కన్నడగౌళ

ఇంత సేసెఁ బోదైవ మింతలోననే అయ్యో
నంతపాకళ్లంబఁ దెచ్చి నన్యసీఁ జేసె ॥పల్లవి॥

వరిగ తేరేటివానిఁ బట్టపురాజుఁగా
నిరతభోగము లిచ్చి నిలిపినట్లు
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు
అరయ నీ తిడిఁ దెచ్చి యాపరించఁ జేసె ||ఇంత||

కుక్కలవండుక తినే కులహీనునిఁ దెచ్చి
వెక్కసపుఁ బాఁపనిఁ గావించినయట్లు
దిక్కు లెఱుఁగఁగఁ గష్టదేహిని నన్నుఁ దెచ్చి
గక్కనఁ దెలుకపిండికస్తూరి సేసి ||ఇంత||

చెదుగ్గై నదోమఁ దెచ్చి సింహాపుఁగొదమఁ గా
బెడిదంపుఁ బ్రేమతోడఁ బెంచినయట్లు
కదు నధముని వేంకటపతి నను నిట్లు
చిడిపి రాయి దెచ్చి చింతామణిఁ జేసె ||ఇంత|| 185

నాట

మానఁ డిన్నఁడు శరీరి డు
జ్ఞానబోధితుఁడు గాన ||పల్లవి||

పంచభూతవికారంబులు
పంచేంద్రియములు
పంచమహాపాతకములకును
పంచి వేసినది గాన ||మాన||

త్రైగుణ్యవికారంబులు
త్రైగుణ్యపుఁదనువులు
శ్రీకరుఁ డగుశ్రీవేంకటపతి
భోగభాగ్యములుగాన ||మాన|| 186

శ్రీరాగం

ఎన్ని బాధలఁ బెట్టి యేఁచెదవు నీ వింక నెంతకాలముదాఁకఁ గర్మమా
మన్నించు మనుచు నీమఱఁగు చొచ్చితిమి మా మాటాలకించవో
కర్మమా ॥పల్లవి॥

ప్రతిలేనిదురితములపాలు సేయక నన్నుఁ బాలించ వైతివో కర్మమా
తతితోడ నాత్మపరితాపంబుతోడుతను తగులేల సేసితో కర్మమా
జితకాములును గాని చేతికిని లోనయి చిక్క వేకాలంబు కర్మమా
మతిహీనుఁ డైనట్టిమాకు నొకపరిపాటి మార్గంబు చూపవో
కర్మమా ॥ఎన్ని॥

ఆసలనియెడి త్రాళ్ల నంటఁగట్టుక నిధికి నప్పగించితివిగదె కర్మమా
వాసి విడిచితిమి నీవారమైతిమి మమ్ము వన్నె చెడనీకు వో కర్మమా
కాసుకును గొరగానిగతిలేనిపనికిఁగా గాలూఁద నీవేల కర్మమా
వోసరిం చొకమారు నొయ్యనే వొకరీతి నొల్లనని తలఁగుమీ
కర్మమా ॥ఎన్ని॥

తిరువేంకటాచలాధిపుని మాయలచేత దెసలఁ దిరిగినయట్టి కర్మమా
హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా
వరుస నేనుగమీఁదవాని సున్నం బడుగ వచ్చునా నీకిట్లఁ గర్మమా
పరమపురుషోత్తముని భ్రమతఁ బడి నీవిట్లు బట్టబయలైతి గా
కర్మమా ॥ఎన్ని॥ 187

దేవగాంధారి

ఇన్ని సేఁతలకు నిది యొకటే
కన్నా మన సిది కానదు గాని ॥పల్లవి॥

పాతకకోట్లు భవములు భస్మీ
భూతము సేయఁగఁ బోడ వ్రాకటే
శ్రీతరుణీపతి చింత నిజముగా
యేతరి చిత్తం బెఱుఁగదుగాని ॥ఇన్ని॥

మరణభయ బులు మదములు మలినీ
కరణము సేయఁగఁ గల దొకటే
హరినామామృత మందుమీఁది రతి
నిరతము నా కిది నిలువదు గాని ॥ఇన్ని॥

కుటిలములును దుర్గుణములును ద్రుణీ
కృతములు సేయఁగ గుఱు తొకటే
పతియగు వేంకటపతిసేవారతి
అతి దాసి మతిగని కానదు గా ॥ఇన్ని॥ 168

47.వ తేకు. ముఖారి

ఏమీ నెఱఁగనినా కేదపుణ్యము
తామసుండఁ జుమ్మీ ముందర నున్న దైవమా ॥పల్లవి॥

పాతకపుఁజేతులనే పట్టి నిన్నుఁ బూజింతు
ఘాతుకుఁడ నాకు నెక్కడిపుణ్యము
చేతనముఁ బోదనేయుచిత్తము నీదే కాన
రాతిబొమ్మఁ జుమ్మీ భారము నీది దైవమా ॥ఏమి॥

పూనినయెంగిలినోర నొప్పగునిన్నుఁ బొగడు
హీనజంతువునకు నా కేటిపుణ్యము
తేనెపూసి నీ విట్లఁ దిప్పఁగానే తిరిగేటి
మానబొమ్మఁ జుమ్మీ నామతిలోనిదైవమా ॥ఏమి॥

జాలిఁ బడి సంసారజలధిలో మునిఁగేటి
కూళఁడ నాకేటికేఁకువపుణ్యము
పాలు వోసి పెంచిన నాపాలివెంకటేశ నే
తోలుబొమ్మఁ జుమ్మీ కాతువుగాని దైవమా ॥ఏమి॥ 189

## దేవగాంధారి

భారమైన వేపమాను పాలు వోసి పెంచినాను
తీరని చేఁదే కాక తియ్యనుండీనా ॥పల్లవి॥

పాయఁదీసి కుక్కతోఁక బద్దలు వెట్టి బిగిసి
చాయ కెంత గట్టినాను చక్కనుండీనా
కాయపువికార మిది కలకాలముఁ జెప్పినా
పోయినపోకలే కాక బుద్ధి వినీనా ॥భార॥

ముంచిముంచి నీటిలోన మూల నానఁ బెట్టుకొన్నా
మించినగొడ్డలి నేఁడు మెత్తనయ్యీనా
పంచమహాపాతకాల బారిఁ బడ్డచిత్త మిది
దంచిదంచి చెప్పినాను దాఁకి వంగీనా ॥భార॥

కూరిమి తోఁ దేలుఁ దెచ్చి కోకలోన బెట్టుకొన్నా
పారిసారెఁ గుట్టుగాక చక్కనుండీనా
వేరులేనిమహిమల వెంకటవిభునికృప
ఘోరమైనఆసమేలుకోఁసోఁకీనా ॥భార॥ 190

## భూపాళం

ఆకాశ మడ్డమా అవ్వాలయు నడ్డమా
శ్రీకాంతు భజియించు సేవకులకు ॥పల్లవి॥

పాతాళ మడ్డమా బలిమథనదాసులకు
భూతలం బడ్డమా పుణ్యులకు
నేతుకైలాసములు చిరభూము లిన్నియును
క్షేత్రోవలట పరమభాగవతులకును ॥ఆకా॥

అమరావ తడ్డమా హరిదాసులకు మహా
తిమిరంబు లడ్డమా దివ్యులకును
కమలాసనునిలోకం బదియు నడ్డమా
విమలాత్ములై వెలుఁగు విష్ణుదాసులకు ॥ఆకా॥

పరమపద మడ్డమా బ్రహ్మాండధరుఁడైన
ధర వెంకటేశ్వరుని దాసులకును
యిరవైనలోకముల నిన్నిటా భోగించి
వరుసలను విహరించు వరవైష్ణవులకు ॥ఆకా॥ 191

## దేవగాంధారి

ఆదిదేవ పరమాతుమా
వేదవేదాంతవేద్య నమో నమో ॥పల్లవి॥

పరాత్పరా భక్తభవభంజనా
చరాచరలోకజనక నమో నమో ॥ఆది॥

గదాధరా వేంకటగిరినిలయా
సదానందప్రసన్న నమో నమో ॥ఆది॥ 192

## భైరవి

హరిఁ గొలిచియు మఱి పరములా
తిరముగ నతనిని తెలియుట గాక ॥పల్లవి॥

పంకజనాభుని పాదములు దలఁచి
యింకా మఱియొక యితరములా
అంకెల నతనినె అతనిదాసులనే
కొంకక నిజముగఁ గొలుచుటగాకా ||హరి||

పన్నగశయనునిబంట్లకు బంట్లై
కొన్నిట్లై మఱికోరికలా
యిన్ని కోరికలు యిదియే తనకని
కొన్నది కోలై కోరుట గాకా ||హరి||

వీనుల వెంకటవిభునామామృత
మానిన మతి మఱియును రుచులా
తేనెలు గారెడి తీపు లతనినుతి
నానారుచులై ననుచుటగాకా ||హరి|| 198

## లలిత

దైవమా పరదైవమా
యేవగింతలు నాకు నెట్టు దెచ్చేవో ||పల్లవి||

పాపకర్మునిఁ దెచ్చి పరమియ్యఁ దలఁచిన
మేపులకే పోక మేయికోనీనా
తీపులు రూపులుఁ దినిరి నా వెంట
నేపొద్దు నీ వేడఁ దెచ్చేవో ||దైవ||

అధమాధమునిఁ దెచ్చి అధికుని జేసేనంటే
విధినిషేధములు వివరించునా
నిధినిధానములు నిచ్చ నిచ్చలుఁ బెక్కు
విధముల నెటువలె వెదచల్లెదవో ||దైవ||

అతికష్టం డగునాకు నలవిగాని యీ
మత మొనఁగిన నేను మరిగేనా
ప్రతిలేని వెంకటపతి నీమునామా
మృత మిచ్చి నను నీవే మెఱయింతువుగాక ॥దైవ॥ 194

భూపాళం

ఏకులజుఁడేమి యెవ్వఁడైననేమి
ఆకడ నాతఁడె హరి నెఱిఁగినవాఁడు ॥పల్లవి॥

పరగినసత్యసంపన్నుఁడైనవాఁడే
పరనిందసేయఁ దత్పరుఁడు గానివాఁడు
అరుదైనభూతదయానిధి యగువాఁడే
పరులు దానే యని భావించువాఁడు ॥ఏకు॥

నిర్మలుఁడై యాత్మ నియతి గలుగువాఁడే
ధర్మతత్పరతబుద్ధిఁ దగిలినవాఁడు
కర్మమార్గములు గడవనివాఁడే
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు ॥ఏకు॥

జగతిపై హితముగాఁ జరియించువాఁడే
పగలేక మతిలోన బ్రదికినవాఁడు
తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే
తగిలి వెంకటేశుదాసుఁడయినవాఁడు ॥ఏకు॥ 195

48-వ రేకు. ముఖారి

సేవింతురా యితనిఁ జెలఁగి పరు లిట్లనే
కావించె మమ్ము నెక్కుడిదైవ మితఁడు ॥పల్లవి॥

పాలచవి యితఁడెఱుఁగు పాలఁ బవళించ గో
పాలుఁ గని నే నితని భజియించఁగా
పాలుగడి తల్లి చనుఁబాలుసహితంబు నే
కాలమునుఁ గాపె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥

పుట్టింపఁ దానె మఱి పురుషోత్తముండు మంచి
పుట్టు వొసగీనుచుఁ బూజించఁగా
పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువు లెల్లఁ
గట్టిపెట్టించె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥

కర్మ కర్తారుఁడని కడలేని పుణ్యముల
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా
కర్మగతిఁ దెచ్చి వెంకటవిభుఁడు నాపుభయ
కర్మములఁ జెరిచె నెక్కడిదైవ మితఁడు ॥సేవిం॥ 16

ముఖారి

అరిది నేఁతలే చేసి తల్లాడ నిల్లాడ
సరిలేక వుండితివి జలరాశికాడ ॥పల్లవి॥

పొలియఁదీర్చితి వొకతిఁ బురిఁటిమంచముకాడ
నలఁచితి వొకని నగసంబుకాడ
బలిమిఁ దన్నితి వొకని బండిపోతులకాడఁ
దులిమితివి యేడుగురఁ దొలిమందకాడ ॥అరి॥

తడవిమోదితి వొకని తాటిమాఁకులకాడ
నడిచితివి వొకనిఁ జేయలకాడను
పిడిచి వేసితి వొకని బృందావనముకాడ
వాడిసితివి వొకని నావులమందకాడ ॥అరి॥

వటపటన దిక్కులు పగులఁ బగతులఁ దునిమి
నటియించితివి మామనగరికాడ
కుటిలబహుదైత్యాంతకుఁడవు వెంకటరాయ
పుట మెగసితి జగంబులయింటికాడ ॥అరి॥ 197

## పాడి

బలువగుఁదనరూపము చూపెఁ
కలవింతయుఁ దనఘన తెఱఁగించెఁ ॥పల్లవి॥

పాండవరక్షణపరుఁడై నరునకు
నండనె తెలిపి మహామహిమ
దండి విడిచి తనదయతో నర్జునుఁ
దుండఁగ మగటిమి నొడఁబడఁ బలికె ॥బలు॥

మగుడఁగ కులధర్మములఁ బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెఁ
నగుచు నతనితో నానాగతులను
నిగమము నియమము నిజ మెఱఁగించెఁ ॥బలు॥

వెరవు మిగుల నావిజయునిమనుమని
పరీక్షిత్తుఁ దగఁ బ్రబికించెఁ
తిరువేంకటగిరిదేవుఁడు దానై
గరిమల భారతకథ కలిగించెఁ ॥బలు॥ 198

## సామంతం

బలువగుకర్మము లివివో జీవుల ప్రారబ్ధంబులు సంచితంబులును
బలిసితీర నివి పెరుగునేకాని బ్రహ్మలబహుకల్పంబులదాఁక ॥పల్లవి॥

కాయనిజన్మంబులకర్మంబులు పాయక జీవులప్రారబ్ధములై
యేయెడఁ జూచిన నిదిటేకాలునులై యిచ్చట నిటు భుజియించఁగను
కాయపుఁ బెడతటిగంపేఁడు విధి దయఁ గడతేర్చినతన కడకర్మములు
పోయిన చితంబులఁ గలసిన నవి పొదలుచుఁ గొండలపొడవై
పెరుగు ॥బలు॥

పొదలి సంచితంబులు వడిఁబెరుగును పొలియును జీవునిపుణ్యముఁ జాలక
యెదిగినపుణ్యం బిగురును కాఁగినయినుమునుమీఁదిజలములవలెను
పదిలములై కడుఁ బాపకర్మములే బరువై పరగఁగఁ బ్రాణికి నెన్నఁడు
తుదయు మొదలు నెందును లేక వడిఁ దొలఁగక భవములతోడవై
తిరుగు ॥బలు॥

తలఁపులో నవయఁ దలఁచినజంతువు కలుషహారుఁడు వెంకటగిరిపతి దను
దలఁచుభాగ్య మాత్మకు నొనగినఁ జిత్తము పరిపక్వంబై యెపుడు
జలజోదరుఁ దలఁచఁగఁ బ్రారబ్ధంబులు సంచితంబులుఁ బొలిసి పుణ్యులై
చెలువకునిత్యానందపదంబునఁ జెలఁగి సుఖించగఁ జేరును రపుడు
॥బలు॥ 199

## భైరవి

చాల నొవ్విసేయునట్టిజన్మ మేమి మరణ మేమి
మాలు గలిపి దొరతనంబు మాన్పు టింతచాలదా

పుడమిఁ బాపకర్మ మేమి పుణ్యకర్మ మేమి తనకు
కడపరానిబంధములకుఁ గారణంబులైనవి
యెడపకున్న పసిఁడిసంకె లేమి యినుపసంకె లేమి
మెడకుఁ దగిలియుండి యెపుడు మీఁదుచూడరానివి. ॥చాల॥

చలముకొన్న నాపదేమి సంపదేమి యెవ్వడుఁ దనకు
అలమిపట్టి దుఃఖములకు నప్పగించినట్టిది
మొలచిఁ బసిఁడిగుడియ యేమి యినుపగుడియ యేమి తనకు
ములుగ ములుగఁ దొలితొలి మోఁదు టింత చాలదా ॥చాల॥

కర్మమైననేమి వికృతకర్మమైననేమి దనకు
కర్మఫలముమీఁదికాంక్ష గలుగు టింతచాలదా
మర్మమెఱఁగి వెంకటేశుమహిమ లనుచుఁ దెలిసినట్టి
నిర్మలాత్మకిహముఁ బరము నేఁడు గలిగెఁ జాలదా ॥చాల॥ 200

49-వ రేకు కన్నడగౌళ

కాలాంతకుఁ డనువేఁటకాఁ డెప్పుడుఁ దిరిగాడును
కాలం బనియెడితీవ్రపుగాలివెర వెఱఁగి ॥పల్లవి॥

పరమానందం బనుచేనికి పసిగొనునరమృగములకును
తరమిడి సంసారపుటోఁదములని యోఁగించి
పురవడిఁ జేసినకర్మపు టురులు దరిద్రం బనువల
వౌరవుగ మా యనుపోఁగులు వొకవెరవున వేసి ॥కాలా॥

కడుముకవచ్చేటి బలురోగపుఁ గుక్కల నుసికొలిపి
వదలక ముదిసిన ముదిమే వాకట్టుగఁ గట్టి
పొదలుచు మృత్యువు పందివోటై నల్లెట నాడఁగ
పదిలముగాఁ గింకరులను చొప్పరులఁబరవిడిచి ॥కాలా॥

ఆవోఁదంబులఁజిక్కక ఆపురులనుఁ దెగనురికి
ఆవేఁటకాండ్ల నదలించాచేనే చొచ్చి
పావనమతిఁ బొరి వొడిచి పరమానందముఁ బొందుచు
శ్రీవేంకటపతి మనమునఁ జింతించీ నరమృగము కాలా 201

## భూపాళం

ఏల వచ్చి యేలపోయీ నెందుండీఁ బ్రాణి
తోలుతి త్రిలోనఁ జొచ్చి దుంకదూరనా ||పల్లవి||

పుట్టులేక నరకాలపుంగుడై తా నుండక యీ
పుట్టుగున కేల వచ్చి పోయీఁ బ్రాణి
పుట్టుచునే కన్నవారిఁ బుట్టినవారి నాసలఁ
బెట్టి పెట్టి దుఃఖములఁ బెడరేఁచనా ||ఏల||

భూతమై యడవిలోఁ బొక్కుచుఁ దా నుండక యీ
బూతుజన్మ మేల మోఁచెఁ బుచ్చినప్రాణి
రాతిరిఁ బగలు ఘోరవుఁబాటు వడి వడి
పాతకాలు చేసి యమబాధఁ బడనా ||ఏల||

కీటమై వేంకటగిరికిందనైన నుండక యీ
చేటు వాటు కేలనోఁచె చెల్లఁబో ప్రాణి
గాటమైనసంపదల కడలేనిపుణ్యాల
కోటిఁ బడగెత్తక కొంచెపడనా ||ఏల|| 202

## నాట

అయ్యో మానవఁగదవయ్యా మనుజుఁడు తన
కయ్యపుఁగంటఁ గానఁడు ||పల్లవి||

పాపపుణ్యాలంపటుఁడైనా దుష్ట
రూపుడు జన్మరోగి యటుగాన
పైపై నిద్రవ్యతాపజ్వరముపుట్టి
రేపొద్దు వొడ లెఱుఁగఁడు ||అయ్యో||

నరకభవనపరిణతుఁడై నా కర్మ
పురుషుఁడు హేయభోగి యటుగాన
దురితపుణ్యత్రిదోషజ్వరము వట్టి
అరవెరమాట లాడీని ॥అయ్యో॥

దేహమోహానుస్థిరుఁడై నా ని
ర్వాహుఁడు తర్కవాది యటుగాన
శ్రీహరి వెంకటశ్రీకాంతునిఁ గని
వూహలఁ జేర నొల్లఁడు ॥అయ్యో॥ 203

నాట

ఏదియును లేని దేటిజన్మము
వేదాంతవిద్యావివేకి గావలెను ॥పల్లవి॥

పరమమూర్తిధ్యానపరుఁడు గావలె నొండె
పరమానందసంపద లొంద వలెను
పరమార్థముగ నాత్మ భావింపవలె నొండె
పరమే తానై పరగుండవలెను ॥ఏది॥

వేదశాస్త్రార్థకోవిదుఁడు గావలె నొండె
వేదాంతవిదుల సేవించవలెను
కాదనక పుణ్యసత్కర్మి గావలె నొండె
మోదమున హరిభక్తి మొగి నుండవలెను ॥ఏది॥

సతతభూతదయావిచారి గావలె నొండె
శితమైనయింద్రియస్థిరుఁడు గావలెను
అతిశయం బగు వెంకటాద్రీశుసేవకుఁడై
గతి యనుచు తనబుద్ధిఁ గలిగుండవలెను ॥ఏది॥ 204

గుండక్రియ

కడుపెంత తాఁ గుడుచు కుడుపెంత దీనికై
పడనిపాట్లనెల్లఁ బడి పొరలనేలా ॥పల్లవి॥

పరులమనసునకు నాపదలు గలుగఁగఁ జేయఁ
బరితాపకరమైన బ్రదుకేలా
సొరిది నితరులమేలు చూచి సైఁపఁగలేక
తిరుగుచుండేటి కష్టదేహ మిదియేలా ॥కడు॥

ఎదిరి కెప్పుడుఁ జేయుహిత మెల్లఁ దనదనుచు
చదివి చెప్పనియట్టిచదు వేలా
పొదిగొన్న యాసలోఁ బుంగుడై సతతంబు
పదమదంబై పడయుచవులు దన కేలా ॥కడు॥

శ్రీవేంకటేశ్వరుని సేవారతికిఁ గాక
జీవనభ్రాంతిఁ బడు సిరులేలా
దేవోత్తముని నాత్మఁ దెలియనొల్లక పెక్కు-
త్రోవ లేఁగినదేహ దొరతనం బేలా ॥కడు॥ 205

సామంతం

ఘనమనోరాజ్యసంగతి చెలఁగినఁగాని
జనుల కెప్పుడు నాత్మసౌఖ్యంబు లేదు ॥పల్లవి॥

ప్రతిలేనిధైర్యంబు పదిలపరచినఁగాని
మతిలోని పగవారిమద మణఁపరాదు
మితిలేనిశాంత మనుమేటికైదువఁ గాని
త్రితకంబు విషయములగెల్వ పెనుఁగరాదు ॥ఘన॥

సారిది నిర్మోహ మనుజోడు దొడిగినఁగాని
వెర పుడిగి మమతచే వెళ్లఁబడరాదు
యిర వైనవిజ్ఞానపింట నొండినఁగాని
అరసి జగ మెల్ల తానై యేలరాదు ॥ఘన॥

యిన్నియును దిరువేంకటేశుఁ డిచ్చినఁగాని
తన్నుఁ దా నెఱిఁగి యాతనిఁ గొలువరాదు
కన్నులను వెలి లోను గలయఁజూచినఁగాని
సన్నంబుఘన మనెడిజాడ గనరాదు ॥ఘన॥ 205

60వ రేకు ముఖారి

ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా
మఱచినమేనితో మరి యెఱిఁగీనా ॥పల్లవి॥

పటువైభవములఁ బరగేటినాఁడే
తటుకున శ్రీహరిఁ దలఁచఁడటా
కుటిలదేహియై కుత్తికఁ బ్రాణము
తటతటనదరఁగఁ దలఁచీనా ॥ఎఱు॥

ఆలుబిడ్డలతో మహాసుఖ మందుచు
[illegible]లిమితో హరిఁ దలఁచఁడటా
[illegible]లినకాలుని వస మైనప్పుడు
[illegible]లు (ీ?) వేడఁగాఁ దలఁచీనా ॥ఎఱు॥

[illegible]తలేక తేకువఁ దా నుండేటి
[illegible]గటపతిఁ దలఁచఁడటా
[illegible]గాయై మఱచివున్నయెడ
[illegible]వులఁ దలఁచీనా ॥ఎఱు॥ 207

సామంతం

కాలము కాలము గాదు కపటాలే తరచాయ
చాలు నింక దీనితోడి జాలి మానరే ||పల్లవి||

చిన్ననాట నుండి తన పెంచిన యీ దేహము
మున్నిటివలె గాదు ముదిసీని
యెన్నిక దినాలచేత నెప్పు డేడఁ బడునో
కన్నవారి చేతికి గక్కున నియ్యరే ||కాల||

తోలు నెముకలచేత దొడ్డైన యీ దేహము
గాలిచేత దాలిమీఁదఁ దాగీని
కీలుగీలు నెప్పు డేడ కింద విడివడునో
మేలుఁగీడు లేనిచోట మేటిఁ జేసి పెట్టరే ||కాల||

కింకపుకీసరుచేత కీడైన దేహము
వంకవంక తెరువుల వడిసీని
యింక నీనిధిచేత నెప్పుడేడఁ బడునో
వెంకటేశుఁ జేరఁ బడవేయగదరే ||కాల|| 208

బౌళి

ఇటువలెనే పో సకలము యించుక గనభావించిన
అటమటముల సంతోషము ఆనలు సేయుటలు ||పల్లవి||

పగగాని తిరిగేటి జన్మపుబాధలు తన కేకాలము
తగుసుఖ మెక్కడ నున్నది తడతాఁకులె కాక
పొగలోపల సెక గాసిన భుగభుగఁ గన్నుఁలనీళ్లు
నిగిడినదుఃఖమె కాకిటు నిజసౌఖ్యము గలదా ||ఇటు||

పొలసినమాయపురూపులు పొలఁతులమచ్చికమాటలు
తలచినతన కేమున్నది తలఁపోఁతలె కాక
బలువునఁ బొరఁగ మోహపుపాశము తనమెడఁ దగిలిన
తలకిందుగఁ బడు బెల్లను తనకిది ప్రియమానా ॥ఇటు॥

చేతిపదార్థము దలఁచక చేరువ నుండినవారల
చేతిపదార్థము గోరిన చేతికి లోనౌనా
ఆతుమఁగల తిరువేంకటపతి నాత్మఁ దలఁచి సుఖింపక
యేతరిసుఖములఁ దిరిగిన నింపులు దనకౌనా ॥ఇటు॥ 209

కాంబోధి

శమము చాలనియట్టిజన్మం బి దేమిటికి
దమము చాలనియట్టితగు లి దేమిటికి ॥పల్లవి॥

పగయునుఁబోలె నాపై నేయునడియాన
తెగిలి యేపనే కాని దయ గొంత లేదు
జగడమునఁ బోలె నలపతలేని మమత దను
తగి వేఁచనే కాని తెరుగడ లేదు ॥శమ॥

ఋణమును బోలె తీరియుఁ దీరనిది కర్మ
గణన గలకాలంబు కడ మొదలు లేదు
వ్రణమునుఁబోలెవిడువక రాఁగదేహజవు
గుణముసౌఖ్యము తెరువు గొంతయును లేదు ॥శమ॥

నీతియుఁ బోలెఁ బ్రాణికి వెంకటేశు కృప
చేతికి నిధానంబు చేరిన ట్లాయ
భూతములఁ బోలె తలఁపున కితరసంస్మరణ
భీతి పుట్టించి యప్రియభావ మాయ ॥శమ॥ 210

శ్రీరాగం

ఇదివో సంసార మెంతసుఖమో కాని
తుదలేనిదుఃఖ మను తొడవు గడియించె ॥పల్లవి॥

పంచేంద్రియంబు లను పాతకులు దనుఁ దెచ్చి
కొంచెపుసుఖంబునకుఁ గూర్పఁగాను
మించి కామం బనెడిమేఁటితనయుఁడు జని
యించి దురితధన మెల్ల గడియించె ॥ఇది॥

పాయ మనియెడి మహాపాతకుఁడు తనుఁ దెచ్చి
మాయంపుసుఖమునకు మరుపఁ గాను
సోయగపుమోహ మను సుతుఁ డేచి గుణ మెల్లఁ
బోయి యీనరక మనుపురము గడియించె ॥ఇది॥

అతిశయం బగువేంకటాద్రీశుఁ డనుమహా
హితుఁడు చిత్తములోన నెనయఁగాను
మతిలోపలవిరక్తి మగువ జనియించి య
ప్రతియయి మోక్షసంపదలు గడియించె ॥ఇది॥ 211

శ్రీ

చిత్తమో కర్మమో జీవుఁడో దేవుఁడో
వో త్రినయా చేత లోకరివి గావు ॥పల్లవి॥

పదిలమైన మోహపాశంబులు దెచ్చి
మెదలకుండఁగ నాకు మెడఁ జుట్టి
యెదిరినారు నవ్వ నింటింటఁ దిరిగించి
తుదలేనియాపలదుఃఖాతురునిఁ జేసె ॥చి త్త॥

కొలఁది మీఱిన జన్మకోట్లఁ బెనఁగొని
తొలఁగని నాలోని దురితము
తొలఁగింప నాలుక తుదకు నీపేరిచ్చి
తెలుపు మించియు చాలుఁ దిరువేంకటేశా ॥చిత్త॥ 312

81-వ రేకు. దేసాళం

వీనిఁ జూచియైన నేము విరతిఁ బొందఁగలేము
పూని మాబ్రదుకు కిందుఁ బోలదాయఁగా ॥పల్లవి॥

పరుల వేడఁగఁబోవు పరనిందకుఁబోరవు
పరపురుషార్థమే ఫలవృక్షతతు లెల్ల
నరులమై ఘనులమై నానాబుద్ధు లెఱిఁగి
హరి మాబ్రదుకు లిందుఁ బోలదాయఁగా ॥వీని॥

కామక్రోధాదులు లేవు కాముకత్వ మెఱఁగవు
కామించినట్లవు నెక్కడనైనా శిలలివి
ధీమసము గలిగియుఁ దెలివిగలిగియును
భూమిలో మాబ్రదు కిందుఁ బోలదాయఁగా ॥వీని॥

వొకరిఁ గొలువఁబోవు వొకపంట సేయఁబోవు
వొకమానిగూడు చేరివుండుఁబక్షు లాదనాడ
వొక శ్రీవేంకటపతి నమ్మి యుండలేము
మొకమో మాబ్రదు కిందుఁ బోలదాయఁగా ॥వీని॥ 313

సాళంగం

వనిమాలినట్ల వట్టి వఱఁదు గాక మాకు
వనిదియుదియు నొక్కనగుఁబొట్లా ॥పల్లవి॥

తన్నువారినెల్లా వేడేకష్టమే దక్కుటగాక
పన్ని దైవమియ్యనిది పరు లిచ్చేరా
యెన్నికతోఁ దేహమిచ్చె నిహమెల్లాఁ జెందనిచ్చె
వున్నవా రింతటివని కొవగలరా ॥పని॥

బడలితా నెందైనాఁ బడ్డపాటేదక్కెఁగాక
కడఁగిరాని దిదే నొక్కరివనమా
కడుపులోనుండఁగానె కలవి నుదుట వ్రాసె
తడవి దైవముచేత దాఁటవనమా ॥పని॥

దెప్పరవువంపదకుఁ దిమ్మటలేదక్కెఁగాక
యెప్పుడు శ్రీవేంకటేశుఁ శికమానినా
చప్పుడుగా నతనికిశరణన్నఁ జాలుఁగాక
తప్పులును వొప్పులు నాతనివేకావా ॥పని॥ 214

## దేసాళం

పరులసేవలు చేసి బ్రదికేరటా
సిరివరుదాసులు సిరు లందుటరుదా ॥పల్లవి॥

కోరి వొకవరునిఁ గొలిచినవారలు
ధీరులై వలిగెలఁ దిరిగేరట
కూరిమి బ్రహ్మాండకోటు లేలేటివాని
వారలింతటఁ జనవరు లౌటరుదా ॥పరు॥

చేకొన్న తుమ్మెద చేపడ్డ కీటము
లా కడఁ దుమ్మెదలయ్యానట
శ్రీకాంతునిపాదసేవకు లగువార
లే కులాలయినా నెక్కుడౌటరుదా ॥పరు॥

ధరణీశునాజ్ఞల తమదేశములందు
నిరులనాతనిపుముద్ర చెల్లినట
తిరువేంకటాద్రిశ్రీదేవునిముద్రలు
ధరియించఁగా నింతటఁ జెల్లుటరుదా ॥వరు॥ 215

గుజ్జరి

ఇటుగన సకలోపాయములుడిగిన యీశ్వరుఁడే రక్షకుఁడు
తటుకున స్వతంత్ర ముడిగినయాత్మకు తగునిశ్చింతమె పరమసుఖము ॥పల్లవి॥

ఆఁకటికడుగనిశిశువుకుఁ దల్లి యడిగి పాలు ద్రాగించినరీతి
నాకడఁ గోరిక లుడిగినయోగికి నీశ్వరుఁడే రక్షకుఁడు
చేకొని బుద్ధెఱఁగినబిడ్డలపైఁ జింతింపరు తొల్లిటివలెఁ దల్లులు
యీకొలఁదులనే స్వయత్నదేహుల నీశ్వరుఁడును వాత్సల్యము వదలు
॥ఇటు॥

తతిఁ గరిరాజుఁ గాచినయట్లు ద్రౌపదిమానము గాచినయట్లు -
హితమతి స్వతంత్ర ముడిగినయోగికి యీశ్వరుఁడే రక్షకుఁడు
అతనుఁడు భస్మం బయ్యిననాఁడు అజునిశిరం బట్టుత్రుంచినవాఁడు
చతురుఁడు దా నడ్డమురాఁ డాయను స్వతంత్ర ముద్దుగనిజేవ్రులు
గానా ॥ఇటు॥

తక్కిన యనిశము చిత్తములోనఁ జింతించేటి శరణాగతజనులను
యిక్కడనక్కడ శ్రీవెంకటగిరి యీశ్వరుఁడే రక్షకుఁడు
మక్కువతోఁ దనయంతర్యామిని మఱచినస్వామిద్రోహుల కెల్లా
అక్కరతోఁ బుట్టుగులే భోగ్యం బహంకారము విడువరుగానా
॥ఇటు॥ 216

వరాళి

రామరామచంద్రరాఘవా రాజీవలోచనరాఘవా
సౌమిత్రిభరతశత్రుఘ్నులతోడ జయమందుదశరథ రాఘవా ॥పల్లవి॥

శిరసుకూఁకటులరాఘవా చిన్నారిపొన్నారిరాఘవా
గరిమ నావయసునఁ దాటకిఁ జంపినకౌసల్యానందన రాఘవా
అరిదియజ్ఞముగాచురాఘవా అట్టెహరునివిల్లువిరిచినరాఘవా
సిరులతో జనకునియింటను జానకిఁ జెలఁగి పెండ్లాడినరాఘవా ॥రామ॥

ములయునయోధ్యారాఘవా మాయామృగాంతకరాఘవా
చెలఁగి చుప్పనాతిగర్వ మడఁచి దైత్యసేనలఁ జంపినరాఘవా
సొలసి వాలిఁ జంపి రాఘవా దండిసుగ్రీవునేలినరాఘవా
జలధిబంధించినరాఘవా లంకసంహరించినరాఘవా ॥రామ॥

దేవతలుచూడరాఘవా నీవు దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁ జంపి విభీషణు రాజ్యమేలించినరాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి రాఘవా
శ్రీవేంకటగిరిమీఁద నభయము చేరి మా కిచ్చిన రాఘవా ॥రామ॥ 217

తే8?-వ కు దేవగాంధారి

విధినిషేధములకు వెలివాఁగఁ జనిలేదు
మధుసూదన నీమన్నన దాసుఁడైతే ॥పల్లవి॥

విదువరానిధర్మవిదుల పురుషులను
విడిచి గోపికలు విచ్చనవిడి
బడి నిన్నుఁ దగులుటే పరమధర్మమాయను
తొడయునితరధర్మాలింక నేటి కయ్యా ॥విధి॥

మానరాని కర్మమార్గము లటు మాని
పూనినయతులే పూజ్యు లటా
నీనారాయణనియతే ధర్మమాయ
యీనిజ మొకటియు నెఱఁగఁగ వలయు ॥విధి॥

యిన్నిట శ్రీవేంకటేశ నీదాసుఁడై
వున్నవిచారాల కొదుగనేలా
నిన్ను గూర్చినట్టినిజభక్తి గల దని
తిన్ననై తెలిపేటి తెలివే కలది ॥విధి॥ 218

రామక్రియ

సులభుఁడు మధుసూధనుఁడు మన
మెలమి నమ్మిన నిట్టె సుండీ ॥పల్లవి॥

వడుచుమాటన కాప్రహ్లాదునకు
పొడచూపె నాదిపురుషుఁడు
అడవికే పానక ఆదంతి మొఱకును
తడవి కాచిన దైవము సుండీ ॥సుల॥

ఆఁడుమాట లనక అంతలో ద్రౌపదిని
వాఁడిమిఁ గాచిన వరదుఁడు
పోఁడిమిఁ బేదన కాపాంచినకుచేలుని
పీఁడె సంప దిచ్చె విష్ణుఁడు సుండీ ॥సుల॥

వీరువారన కిదే వేఁడినవరములు
సారెకు నిచ్చినసర్వేశుఁడు
మేరతో లోకముల మెఱసె నీవ్వాడును
యీరీతి శ్రీవేంకటేశుఁడే సుండీ ॥సుల॥ 219

## ధన్నాసి

కింకదీర నద్వైవం కేశవా త్వర మని
ఉంకువైన నాలో నీ వుపమ లివే ॥పల్లవి॥

కంటి నీవొక్కఁడవే లోకములకు దైవ మని
వొంటి మతి నిన్నుఁ బోల నొకరిఁ గాన
వింటి నీవే ఘనమని వేదాంతమందు నీ
కంటె నితరము వినఁ గరుణానిధీ ॥కింక॥

తోఁచె నాకు నీసేవే తుదిపద మని మతి
తోఁచ దీబుద్ధికి సరితూఁగ కెందును
పూఁచి నాగురుఁడు నిన్నె బోధించె గాని మతి
దాఁచఁ డాయ నీమహిమ ధరణీధరా ॥కింక॥

నమ్మతించె నామతిఁ జవిగొని నా(నీ?) కథలె
నమ్మతించ వెక్కుడో రచ్చలనుద్దులు
నమ్మిక శ్రీవెంకటేశ నంటున నీపాదాలే
నమ్మితి నేమియు నమ్మ నారాయణా ॥కింక॥ 220

## రామక్రియ

ఓహో డెండెం వోగి బ్రహ్మ మిది యని
సాహసమున శ్రుతి చాటెడిని ॥పల్లవి॥

పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా
పెరవు దెలియుటే వివేకము
పరము దేవుఁడును అపరము జీవుఁడు
తిరమైన ప్రకృతియే దేహము ॥ఓహో॥

జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
వూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మజ్ఞేయము పరమాత్మ
జ్ఞానగమ్యమే సాధించుమనను ॥ఓహో॥

క్షరము నక్షరమును సాక్షి పురుషుఁ డని
నరవిఁ దెలియుటే సాత్త్వికము
క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుఁడు
సిరిపురుషోత్తముఁడే శ్రీవేంకటేశుఁడు ॥ఓహో॥ 221

## శంకరాభరణం

ఛీఛీ నరుల దేఁటిజీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాకా ॥పల్లవి॥

అడవిలో మృగజాతి యైనాఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువఁగవచ్చునా
వుడివో నిపక్షియై వుండనైనా వచ్చుఁగాక
విడువక కెవ్వరినైనా వేఁడవచ్చునా ॥ఛీఛీ॥

పసురమై వెదలేని పాటు పడవచ్చుఁగాక
కసివో నొరులఁ బొగడఁగా వచ్చునా
వుసురుమానై పుట్టి వుండనైన వచ్చుగాక
విసువక వీరివారి వేసరించ వచ్చునా ॥ఛీఛీ॥

యెమ్మెలఁ బుణ్యాలు సేసి యిల యేలవచ్చుఁగాక
కమ్మి హరిదాసుఁడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీచిత్తమే కాక
దొమ్ములకర్మము లివి తోయవచ్చునా ॥ఛీఛీ॥ 222

గుజ్జరి

ఇంతే యింతేమి లేదు యిందుమీఁదను
దొంతులకర్మాలు దుమ్ముదూరు పెట్టుటా ॥పల్లవి॥

వుల్లములో నుండి దేహ మొగి రక్షించే హరి
నొల్లకున్న తన్నుఁ దా నొల్లకుండుటా
బల్లిదుఁ డాతని మాని పరుల వేఁడేదెల్లా
పొల్లకట్టు దంచి దంచి పోగునేసుకొనుటా ॥ఇంతే॥

యెయ్యెడఁ బుణ్యఫలము లేమి గలిగిన హరి
కియ్యకున్న నదిదైవ మియ్యకుండుటా
చెయ్యార నాతని కొప్పు నేయనిభోగము లెల్లా
చయ్యనఁ జేటుకుఁ బిప్పి చవిగొనుటా ॥ఇంతే॥

శ్రీకాంతు డైనట్టిశ్రీవెంకటేశ్వరునిఁ
జేకొంటె సిరు లెల్లాఁ జేకొనుటా
మేకులశ్రీహరినామ మేనోర నుడుగుట
కైకొన్నయమ్మృతపుఁ గందు వగుటా ॥ఇంతే॥ ౩౩౩

౬౩-వ రేకు. ఆహిరి

ఇతరధర్మము లందు నిందు గలదా
మతిఁ దలఁప పరము నీమతమునసే కలిగె ॥పల్లవి॥

విదురునకుఁ బరలోకవిధిచేసె నట తొల్లి
అదె ధర్మసుతుఁడు వర్ణాశ్రమంబులు విడిచి
కదిసి నీదాసుఁడైన కతమునని కాదె యీ
యెదురనె తుదివదం బిహమునను కలిగె ॥ఇత॥

అంటరానిగద్ద కుల మంటి జటాయువుకు నీ
వంటిపరలోకకృత్యములు సేసితివి మును
వెంట నీకైంకర్యవిధి కలిమినే కాదె
వొంటినీహస్తమున నో(యో ?)గ్యమై నిలిచె ॥ఇత॥

యిరవైనశబరిరుచు లివియె నైవేద్యమై
పరగె నట శేషమును బహునిషేధము లనక
ధరఁ దదీయప్రసాదవు విశేషమె కాదె
సిరుల శ్రీవెంకటేశ చెల్లుబడు లాయ ॥ఇత॥ 224

సాళంగనాట

దేవదేవు డెక్కె నదె దివ్యరథము
మావంటివారి కెల్ల మనోరథము ॥పల్లవి॥

జగతి బాలులకై జలధులు వేరఁజేసి
పగటునఁ దోలె నదె పైఁడిరథము
మిగులఁగఁ గోపగించి మెరయు రావణుమీఁద
తెగి యెక్కి తోలె నదె దేవేంద్రరథము ॥దేవ॥

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకుఁ
బక్కన మరలిచెఁ బుష్పకరథము
నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కి తోలె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము ॥దేవ॥

బలిమి రుక్మిణిఁ దెచ్చి పరులగెలిచి యెక్కె
అలయేఁగు పెండ్లికల్యాణరథము
చెలిమి శ్రీవెంకటాద్రి నలమేలుమంగఁ గూడి
కలకాలమును నేఁగె ఘనమైనరథము ॥దేవ॥ 225

## కాంబోది

ఏమిసేతు దేవదేవ యింతయును నీమాయ
కామినులఁ జూచి చూచి కామించె భవము ॥పల్లవి॥

చంచలపుఁ గనుదోయిసతులబారికిఁ జిక్కి
చంచలమందెను నాదిచ్చరిమనసు
కంచుఁగు త్రికలవారి గానములఁ జొక్కిచొక్కి
కంచుఁ బెంచు నాయఁబో నాకడలేనిగుణము ॥ఏమి॥

తీపులమాటల మించి తెలివల భ్రమఁ దరి
తీపులపాలాయఁ బో నా తేలి వెల్లాను
పూఁపలనవ్వులతోడి పొలఁతులఁ జూచిచూచి
పూఁపలుఁ బిండెలున్నై పొల్లువోయఁ దపము ॥ఏమి॥

కూటమి సతులపొందు కోరి కోరి కూడి కూడి
కూటువ నావిర తెందో కొల్లఁబోయను
నీటున శ్రీవేంకటేశ నినుఁ గని యింత లోనె
జూటరినై యింతలోనె సుజ్ఞానినైతి ॥ఏమి॥ 226

## గుండక్రియ

మరిగి పీరెపో మార్గైవంబులు
కెరలిన హరినంకీ ంనపరులు ॥పల్లవి॥

వినియెడివీనులు విష్ణుకథలకె
పనిగొందురు మాప్రపన్నులు
కనియెడికన్నులు కమలాక్షునియం
దనువుపరతు రటు హరిసేవకులు ॥మరి॥

పలికెడిపలుకులు పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
తలఁచేటితలఁపులు ధరణీధరుపై
తలకొలుపుదురా తదియ్యులు ॥మరి॥

కరముల శ్రీపతికైంకర్యములే
మురియుచుఁ జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీవెంకటేశ్వరుమతమే
సిరుల నమ్ముదురు శ్రీవైష్ణవులు ॥మరి॥ ౨౨౭

బౌళి

ఏమీ నడుగ నొల్ల హెచ్చుకుందు లన నొల్ల
కామించి నీవిచ్చితివి కైవల్యపదము ॥పల్లవి॥

పుట్టుగులకు వెఱవ భువిలోన హరి నీకు
నట్టె నీదాసుఁడ నే నైతే జాలు
వెట్టికి నేజాతియైన వెఱవ నీనామములు
వొట్టి నానాలికమీఁద నుంటే జాలు ॥ఏమీ॥

దురితాలకు వెఱవఁ దుదవేయైనా హరి నీ
కరుణఁ గైంకర్యము గలిగితే జాలు
నిరతి నింద్రియాలకు నే వెఱవ నీవాత్మఁ
బెరరేఁపకుఁడవై పెరిగితే జాలు ॥ఏమీ॥

యేలోకమైనా వెఱవ యెప్పుడు శ్రీవెంకటేశ
పాలించి నీకృప నాపైఁ బారితే జాలు
కాల మెట్టయినా వెఱవ కర్మ మెట్టయినా వెఱవ
యేలిననీదాసులు నన్నియ్యకొంటే జాలును ॥ఏమీ॥ ౨౨౮

భూపాళం

కనియుఁ గాననిమనను కడమగాక
మొదలేనివారి మహిమ కిది గుఱుతు గాదా ॥పల్లవి॥

కను కలిగి హరిఁగొలిచి ఘను లైరి గాక మును
మనుజులే కారా మహరుషులును
మనసులో నివ్వడైన మరిగి కొలిచినవారు
ఘను లౌట కిదియ నిక్కపుగుఱుతుగాదా ॥కని॥

భావించి హరిఁ గొలిచి పదవు లందిరి గాక
శివులే కారా దేవతలును
కావించి కొలిచినను ఘనపదవు లేమరుదు
యేవలన నిందరికి నిది గుఱుతుగాదా ॥కని॥

పన్ని హరిఁ గొలిచి పేర్వరులైరి గాక ధర
నున్నవారేకారా యోగివరులు
యెన్నికల శ్రీవేంకటేశునమ్మినవార
లిన్నియునుఁ జేకొనుట కిది గుఱుతు గాదా ॥కని॥ 329

84-వ రేకు. మలహరి

వలెననువారికే వైష్ణవము యిది
తలఁపుఁదేని వో వైష్ణవము ॥పల్లవి॥

కోరిక లుడుగుచు గుటి నిన్నిటిపై
వైరాగ్యమె పో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలముఁ దనలో
వారించుటవో వైష్ణవము ॥వల॥

సుడిగొను దేహపుసుఖ దుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముడివడి యింద్రియములకింకరుఁడై
వడఁబడనిదె పో వైష్ణవము ॥వల॥

పుడుటునఁ దనసకలోపాయంబులు
వదలుట పో నిజవైష్ణవము
యెదుటను శ్రీవెంకటేశ్వరునామము
వదనము చేర్చుట వైష్ణవము ॥వల॥ 280

## పాడి

శ్రీహరినేసినచిహ్నాలివి యీ
మోహము విడుచుట మోక్ష మది ॥పల్లవి॥

మలినం బేది మఱిఁ గననేది
కలుషపుమలములకాయ మిది
కలిగిన దేది కడు లేం దేది
చలనపుమాయలజన్మ మిది ॥శ్రీహ॥

తనిసిన దేది తనియని దేది
దినదిన మాఁకలి దీర దిది
కోన యిం దేది కుతి మొద లేది
పనిగొనుకర్మపుబంధ మది ॥శ్రీహ॥

నిండిన దేది నిండని దేది
కొండలపొడవులకోరి కది
అండన శ్రీవెంకటాధిపుశరణని
వుండుటె యిహపరయోగ మది ॥శ్రీహ॥ 281

### సాళంగం

దైవమా నీకు వెలితా తలఁపువెలితే కాక
వేవేలు కర్మాల వేసారఁగ వలసె ॥పల్లవి॥

హరి యంటేఁ బాపేటి అన్నిపాపాలు నేసిన
పౌరి నందుపై నమ్మిక పుట్టదు గాకా
నరసింహా యంటే వచ్చేనానాపుణ్యాలకు
తిరముగా ఋణములు దీర్చుకోనఁ గలనా ॥దైవ॥

దేవ జగన్నాథయంటే తెగనిజన్మము లేవి
కైవసము నామనసు గాదు గాకా
గోవింద యని యంటేఁ గూడని పదవు లేవి
కావిరిఁ గాల మూరకే కడపేము నేము ॥దైవ॥

వేదనారాయణ యంటే వీడేటిబంధములు
అదిగా మూఁడులోకాల నైనా నున్నదా
శ్రీదేవిపతి యైన శ్రీవెంకటేశ్వరుఁడా
యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాకా ॥దైవ॥ ౨౮౩

### గుజ్జరి

ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము
లొక్కట గెలిచితి మోహో నేము ॥పల్లవి॥

శ్రీపన్నులెదుటనుఁ బడినయాతుమకు
చపలత మఱి నాశము లేదు
ఉపమల గురుకృప నొనరినమనసుకు
తపముల మఱి నేరములే లేవు ॥ఎక్క॥

ఘనతరద్వయాధికా రగుదేహికి
మినుకులభవభయమే లేదు
చనవుల హరిలాంఛనకాయమునకు
వెనుకొనుకర్మవు వెట్టియు లేదు ॥ఎక్క॥

శ్రీవెంకటేశ్వరుఁ జేరినధర్మికి
అవల మఱి మాయలు లేవు
కైవశమాయను కైవల్యపదమును
జావు ముదిమితో సడ్డే లేదు ॥ఎక్క॥ 288

## లలిత

సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను
సర్వాపరాధి నైతి చాలుఁ జాలు నయ్యా ॥పల్లవి॥

పూరకున్నజీవునికి వొక్కొక్కస్వతంత్ర మిచ్చి
కోరేటియపరాధాలు కొన్ని వేసి
నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటా
దూగు వేసే వింతే కాక దోష మెవ్వరి దయ్యా ॥సర్వా॥

మనసు చూడవలసి మాయలు నీవే కప్పి
జనులకు విషయాలు చవులు చూపి
కనుగొంటె మోక్ష మిచ్చి కానకుంటె కర్మ మిచ్చి
ఘనము నేసే విందుఁ గర్త లెవ్వరయ్యా ॥సర్వా॥

వున్నారు ప్రాణు లెల్లా నొక్కనీగర్భములోనే
కన్నకన్నభ్రమతలే కల్పించి
యిన్నిటా శ్రీవెంకటేశ యేలితివి మమ్ము నిట్టె
నిన్ను నన్ను నెంచుకొంటె నీకే తెలుసు నయ్యా ॥సర్వా॥ 284

రామక్రియ

భక్తికొలఁదివాఁడే పరమాత్ముఁడు
భుక్తిముక్తిఁ దానే యిచ్చు భువిఁ బరమాత్ముఁడు ॥పల్లవి॥

పట్టినవారిచేబిడ్డ పరమాత్ముఁడు
బట్టబయటిధనము పరమాత్ముఁడు
పట్టపగటివెలుఁగు పరమాత్ముఁడు
యెట్టనెదుటనే వున్నాఁడిదే పరమాత్ముఁడు ॥భక్తి॥

పచ్చిపాలలోనివెన్న పరమాత్ముఁడు
బచ్చనవాసినరూపు పరమాత్ముఁడు
బచ్చుచేతివోరగల్లు పరమాత్ముఁడు
యిచ్చకొలఁదివాఁడువో యీపరమాత్ముఁడు ॥భక్తి॥

పలుకులలోనితేట పరమాత్ముఁడు
ఫలియించు నిందరికిఁ బరమాత్ముఁడు
బలిమి శ్రీవేంకటాద్రిపరమాత్ముఁడు
యెలమి జీవులప్రాణ మీపరమాత్ముఁడు. ॥భక్తి॥ 286

286-వ రేకు. దేవగాంధారి

మిక్కిలిపుణ్యులు హరి మీదాసులే హరి
తక్కినవారు మీకృప దప్పినవారు హరి ॥పల్లవి॥

వున్నతపువసవదల నోలలాడే యట్టివాఁడు
మున్నిటిజన్మాన నీకు మొక్కినవాఁడు హరి
పన్ని పడనిపాట్లఁ బరులఁ గొలిచే వాఁడు
వున్నతి మిము సేవించ నొల్లనివాఁడు హరి. ॥మిక్కి॥

పూని దేవేంద్రాదులై పాదవు కొక్కినవారు
శ్రీనాథ మిమ్ము నే పూజించినవారు హరి
నానానరకముల నలఁగుచుండేవారు
నానాఁడే నీమహిమ నమ్మనివారు హరి ॥మిక్కి॥

పావనులై నిజభక్తి ప్రపన్ను లయ్యినవారు
శ్రీవెంకటేశ మిమ్ము జేరిన వారె హరి
వేవేలు దేవతలవెంటఁ దగిలేటివాఁడు
కావించి మిమ్మెఱఁగనికర్మి యాతఁడే హరి ॥మిక్కి॥ 286

ముఖారి

చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ నింతే
అప్పటినపరాధమూ ఆదరించవలదా ॥పల్లవి॥

నీయాజ్ఞ దేహము నే మోఁచితి నింతే
యీయెడ విజ్ఞాన మేల యియ్యవయ్యా
వేయివేలై వేగుదాఁకా వెట్టినేసి యలసితి
వోయయ్య కొంతైనా వూరడించవలదా ॥చెప్పి॥

నీవు నేసేకర్మము నేఁ జేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవరమై కొంటవెంటఁ గొలిచినబంట్లకు
కావులఁ గొంతవడైనా దప్పి దీర్చవలదా ॥చెప్పి॥

మతిలో శ్రీవెంకటేశ మనికైన వాఁడ నింతే
రతి నాపాటుకు దయ దలఁచవయ్యా
యితవై పని నేసేటి యింటిపసురమునకు
కతదీరఁ జాలార్చి కడుపెట్టఁ దగదా ॥చెప్పి॥ 287

బౌళి

వెఱ్ఱివాఁడు వెఱ్ఱిగాఁడు విష్ణునిదాస్యము లేక
వెఱ్ఱిపీఁగే యహంకారి వెఱ్ఱివాఁడు ॥పల్లవి॥

నాలుకపై శ్రీహరినామ మిట్టే వుండఁగాను
జోలితో మఱచిననీచుఁడే వెఱ్ఱివాఁడు
అలరి యీఁజగ మెల్లా హరిరూపై వుండఁగాను
వాలి తలపోయలేనివాఁడు వెఱ్ఱివాఁడు ॥వెఱ్ఱి॥

కూరిమి బ్రహ్మాండాలు కుక్షి నున్నహరికంటే
కోరి వేరే కలఁడనే కుమతి వెఱ్ఱివాఁడు
చేరి తనయాత్మలోన శ్రీరమణుఁ డుండఁగాను
దూరమై తిరుగువాఁడే దొడ్డవెఱ్ఱివాఁడు ॥వెఱ్ఱి॥

సారపు శ్రీవేంకటేశుశరణాగతి వుండఁగా
సారెఁ గర్మము లంటుడేజడుఁడు వెఱ్ఱివాఁడు
చేరువ నాతనిముద్ర చెల్లుబడి నుండఁగా
మోరతోఁపై వున్నవాఁడే ముందు వెఱ్ఱివాఁడు ॥వెఱ్ఱి॥ 288

మాళవి

నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరలశరణని బ్రదుకరో సాటికిఁ బెనఁగక జడులాల ॥పల్లవి॥

సకలోపాయశూన్యులు సమ్యగ్జ్ఞానపూర్ణులు
అకలంకులు శంఖచక్రలాంఛను లన్నిటఁ బూజ్యులు వైష్ణవులు
వొకటిఁ గోరరు వొరులఁ గొలువరు వొల్లరు బ్రహ్మాదిపట్టములు
అకటా వీరలసరి యనఁ బాపం బాఱుమతంబుల పూఁతకోకలా ॥నిత్యు॥

మంత్రాంతరసాధనాంతరంబులు మానినపుణ్యులు విరక్తులు
యంత్రపుమాయలఁ జొరలు పరులకు నెంతైనా నొక్కరు వైష్ణవులు
తంత్రపుకామక్రోధవిదూరులు తమనిజధర్మము వదలరు
జంత్రపుసంసారులతో వీరల సరియని యెంచఁగఁ బాపమయ్యా ॥నిత్య॥

తప్పరు తమపట్టినవ్రత మెప్పుడు దైవ మొక్కఁడే గతి యనుచు
వొప్పుగ తమపాతివ్రత్యంబున నుందురు సుఖమున వైష్ణవులు
కప్పినశ్రీవేంకటపతిదాసులు కర్మవిదూరులు సాత్వికులు
చెప్పఁగ నితరులవరిగా వీరికి సేవించఁగ నే ధన్యుఁడ నైతి ॥నిత్య॥ 239

లలిత

మా కెల్ల రాజానుమతో ధర్మ మిది నీ
యాకడఁ గలుగుట కేమరుదు ॥పల్లవి॥

అలగరుడగమన మహీశయనంబును
కలిసి నీయందే కలిగనటా
పొలసినపాపము పుణ్యము నరులకు
మెలఁగఁ గలుగుటకు నేమరుదు ॥మా కె॥

యిదె నీడకన్ను యెండకన్ను మరి
కదిసి నీయందే కలిగనటా
సదరపునరులకు జననమరణములు
యెదురనే కలుగుట కేమరుదు ॥మా కె॥

శ్రీకాంతి వొకదెస భూకాంత వొకదెస
కైకొని నీకిటు గలిగెనటా
యీకడ శ్రీవేంకటేశ యిహపరము
లోకమై మాకగు టేమరుదు ॥మా కె॥ 240

భైరవి

తెలియరాదు మాయదేహమా మమ్ము
పలువికారాలఁ బెట్టి పనిగొన్న దేహమా ॥పల్లవి॥

దిన మొక్కవయ సెక్కే దేహమా సారె
పెనుమదము గురిసేబెండు దేహమా
దినదినరుచి గోరేటిదేహమా నన్ను
ఘనమోహపాశాలఁ గట్టేగడ దేహమా ॥తెలి॥

తెలివినిద్రలు గలదేహమా నీ
పొలము పంచభూతాలపొత్తు దేహమా
తిలకించి పాపపుణ్యాల దేహమా
బలువుగలదాఁకా బదుకవో దేహమా ॥తెలి॥

తీరని సంసారపు దేహమా ఇట్టె
వూరట లేనిభోగాల వోదేహమా
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలిచితి నింక నాకు
కారణజన్మమవై కలిగిన దేహమా ॥తెలి॥ 241

86-వ రేకు లలిత

తహతహ లిన్నిటికి తానే మూలము గాన
సహజాన నూరకున్న సంతతము సుఖము ॥పల్లవి॥

భారమైన పదివేలు పనులు గడించుకొంటె
సారెసారె నలయించక పోవు
తీరని యాసాదము దేహములో నించుకొంటె
వూరూరఁ దిప్పి తిప్పి వోరయక మానవు ॥తహ॥

వుండివుండి కిందుమీఁదు వుపమఁ జింతించుకొంటె
వుండుఁబో మంచముకింద నొకనూయి
కొండంత దొరతనము కోరి మీఁద వేసుకొంటె
నండనే యీబహురూప మాడఁబోదు ॥తహ॥

మనసురానివైన మంచివి చేసుకొంటె
తినఁ దిన వేమైనఁ దీ పవును
తనిసి శ్రీవెంకటేశుదాసానదాసుఁడైతే
మొనయుచు నేపని కెదురే లేదు ॥తహ॥ 242

సాళంగనాట

ఇదియే మర్మము హరి యిందుఁ గాని లోనుగాఁడు
పదపడి జీవులాల బదుకరో ॥పల్లవి॥

హరిఁ గానలేరు మీరు అరసి యెందు వెదకినా
హరిదాసు లెఱుఁగుదు రడుగరో
గరిమఁ బ్రత్యక్షము గాఁడు దేవుఁ డెవ్వరికి
ధరఁ బ్రత్యక్షము హరిదాసులఁ గొలువరో ॥ఇది॥

చేత ముట్టి గోవిందుని శిరసు పూజించలేరు
చేతులార బ్రపన్నులసేవ సేయరో
జాతిగాఁగ విష్ణుని ప్రసాద మేడ దొరకీని
ఆతలవారిఁ బ్రసాద మడుగరో ॥ఇది॥

అంతరంగమున నున్నాఁ డందురు విష్ణుఁడు గాని
అంతటా నున్నారు వైష్ణవాధికులు
చెంతలఁ దదియ్యులచేతియనుజ్ఞ వడసి
సంతతం శ్రీవెంకటేశుశరణము చొరరో ॥ఇది॥ 243

### దేసాళం

ఎవ్వరివాఁడో యీదేహి
యివ్వల నవ్వల నీదేహి ॥పల్లవి॥

కామించు సూరకే కలవియు లేనివి
యేమి గట్టుకొని నీదేహి
వాము లాయ నిరువదియొక వావులు
యేమని తెలిసెనో యీదేహి ॥ఎవ్వ॥

కందువ నిజములుఁ గల్లలు నడపి
యెందుకు నెక్కెనో యీదేహి
ముందర నున్నవి మొగిఁ దనపాట్లు
యిందె భ్రమసీ నీదేహి ॥ఎవ్వ॥

పంచేంద్రియములపా లాయ జన్మము
యించుక యెఱఁగఁడు యీదేహి
అంచెల శ్రీవెంకటాధీశ నీకృప
వంచఁగ గెలిచెను వడి నీదేహి ॥ఎవ్వ॥ 244

### రామక్రియ

ఎంత విచారించుకొన్నా నిదియే తత్త్వము హరి
వంతుకు నీకృపగలవాఁడే యెఱుఁగు హరి ॥పల్లవి॥

నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్ను నొల్లనట్టివాఁడు నిరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మొక్కి బదికిరి హరి
వున్నతి నసురలు ని న్నొల్లక చెడిరి హరి ॥ఎంత॥

యేపున నీపేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి
నీపే రొల్లనివాఁడు నిర్భాగ్యుఁడే హరి
కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁ దిట్టి శిశుపాలుఁడు మీఁగెను హరి ॥ఎంత॥

యిట్టే నీ విచ్చినవర మెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగా నీ వియ్యని వీశపటములే హరి
అట్టె శ్రీవెంకటేశ నీ వంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న వొచ్చము దేహికి హరి ॥ఎంత॥ 245

## మాళవి

నగుమొగముతోడి వోనరకేసరి
నగరూప గరుడాద్రినరకేసరి ॥పల్లవి॥

అమితదానవహరణ ఆదినరకేసరి
నమితబ్రహ్మాదిసుర నరకేసరి
కమలాగ్రవామాంక కనకనరకేసరి
నమోనమో పరమేశ నరకేసరి ॥నగు॥

రవిచంద్రశిఖనేత్ర రౌద్రనరకేసరి
నవనారసింహా నమో నరకేసరి
భవనాశినీతీర భవ్యనరకేసరి
నవరసాలంకార నరకేసరి ॥నగు॥

శరణాగతత్రాణ సౌమ్యనరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవెంకటాద్రి నరకేసరి
నరసింహా జయ జయతు నరకేసరి ॥నగు॥ 246

## లలిత

వాఁడె వెంకటాద్రిమీఁద వరదైవము
పోఁడిమితోఁ బొడచూపీఁ బొడవైనదేవుము ||పల్లవి||

వొక్కొక్కరోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
పిక్కటిల్ల వెలుఁగొందే పెనుదైవము
పక్కనను తనలోనిపదునాలుగులోకాలు
తొక్కి పాదానఁ గొలిచే దొడ్డదైవము ||వాఁడె||

వేదశాస్త్రాలు నుతించి వేసరి కానఁగలేని
మోదపుపెక్కుగుణాల మూలదైవము
పోది దేవతల నెల్లఁ బుట్టించ రక్షించ
ఆదికారణంబైనఅజుఁ గన్నదైవము ||వాఁడె||

పరున శంఖచక్రాలు సరిఁ బట్టి యసురల
తిరిగి పడవేసిన దండిదైవమూ
సిరి వురమున నించి శ్రీవెంకటేశుఁ డయి
శరణాగతులఁ గాచె సతమయినదైవము ||వాఁడె|| 247

87-వ రేకు. రామక్రియ

సులభమా యిందరికిఁ జూడ సులభము గాక
కలిగె మీకృప నాకుఁ గమలారమణా ||పల్లవి||

సతతదయాచార సంపన్నుఁడైమతి కదా
అతిశయవైష్ణవాన కరువాఁ డౌట
వ్రతోపవాసతీర్థవరసిద్ధుఁడై కదా
మితిమీరి నరహరి మీదాసుఁ డౌట ||సుల||

సకలయజ్ఞఫలము సత్యముఫలముగదా
ప్రకటించి విష్ణునామపాఠకుఁ డౌట
అకలంకమతితోడ నాదన్మసిద్ధుఁడై కదా
అకుటిల ముగుదాచక్రాంకితుఁ డౌట ॥సుల॥

కెరలి సదాచార్యకృప గలిగెఁ గదా
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ గనుటా
మరిగి మీపై భక్తి మతి ముదిరెనెఁ గదా
అరయ మీకే శరణాగతుఁ డౌట ॥సుల॥ 248

## శంకరాభరణం

అదె వాఁడె యిదె వీఁడె అందు నిందు నేఁగీని
పొదలి పొదలి తిరువీధులందు దేవుఁడు ॥పల్లవి॥

అలసూర్యవీధి నేఁగి నాదిత్యునితేరిమీఁద
కలికి కమలానందకరుఁడు గాన
తలపోసి అదియును దవ్వు చుట్టరిక మని
యిలఁ దేరిమీఁద నేఁగీ నిందిరావిభుఁడు ॥అదె॥

చక్కఁ జోమవీధి నేఁగీఁ జంద్రునితేరిమీఁద
చొక్కమైన కువలయహితుఁడు గాన
చుక్కలు మోచినదవ్వు చుట్టరిక మిది యని
యిక్కువతో వీధి నేఁగి నిన్నిటికి నదేవుఁడు ॥అదె॥

యితులమనోవీధి నేఁగీ మరుతేరిమీఁద
సంతటా రతిప్రియుఁ డటుగాన
రంతుల నదియుఁ గానరానిచుట్టరిక మని

### సాళి

శ్రీవేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే
పావనపువైకుంఠపతియును నితఁడే ॥పల్లవి॥

భాగవతములోఁ జెప్పె బలరాముతీర్థయాత్ర
నాగమోక్ష మైనదైవ మాతఁ డితఁడే
బాగుగా బ్రహ్మాండపురాణపద్ధతియాతఁ డితఁడే
యోగ్యమై వామనపురాణోక్తదైవ మీతఁడే ॥శ్రీవేం॥

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము
లలరఁ జేసినదేవుఁ డాతఁ డితఁడే
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి
కొలిమిఁ దపము సేసి కన్నదేవు డితఁడే ॥శ్రీవేం॥

మొక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తొక్కక కొలిచియున్నతత్వ మీతఁడు
చక్క నారదాదులసంకీర్తనకుఁ జొక్కి
నిక్కిన శ్రీవెంకటాద్రినిలయుఁడు నితఁడే ॥శ్రీవేం॥ 250

### సాళి

పట్టినచోనే వెదకి భావించవలెఁ గాని
గట్టిగా నంతర్యామి కరుణించును ॥పల్లవి॥

యింటి లోనిచీకటి యిట్టే తప్పక చూచితే
వెంటనే కొంతవడికి వెలుఁ గిచ్చును
అంటి కానరానితనయాతుమ తప్పక చూచు
కొంటేఁ దనయాతుమయు గొబ్బునఁ గాన్పించును ॥పట్టి॥

మించి శరీరపురాశిమీఁదఁ గతవ పెట్టితే
అంచెలఁ దానే కుదురై నయట్టు
పొంచి హరినామమే యేపొద్దు నాలికతుదను
మించి తలఁచఁ దలఁచ నిరవౌ నుజ్ఞానము ॥పట్టి॥

వొక్కొక్కయడుగే వోగి ముందరఁ బెట్టితే
యెక్కువై కొండైనా నెక్కఁ గొనకు
యిక్కువ శ్రీవెంకటేశు నిటు దినదినమును
వక్కనఁ గొలిచితే బ్రహ్మపట్ట మెక్కును ॥పట్టి॥ 251

సాళంగనాట

నాతప్పు లోఁ గొనవే నన్నుఁ గావవే దేవ
చేత లిన్నిఁ జేసి నిన్నుఁ జేరి శరణంటిని ॥పల్లవి॥

అందరిలో నంతర్యామివై నీ వుండఁగాను
యిందరిఁ బనులు గొంటి నిన్నాళ్లును
పందడించి యిన్నిటా నీచైతన్యమై యుండఁగాను
పందులేక నేఁ గొన్ని పాపానా లెక్కితిని ॥నాత॥

లోకపరిపూర్ణుఁడవై లోనా వెలి నుండఁగాను
చేకొని పూవులుఁ బండ్లుఁ జిదిమితిని
కైకొని యీమాయలు నీకల్పితమై వుండఁగాను
చాక లేక నే వేరే పంకల్పించితిని ॥నాత॥

యెక్కడ చూచిన నీవే యేలికవై వుండఁగాను
యిక్కడాఁ దొత్తుల బంట్ల నేలితి నేను
చక్కని శ్రీవెంకటేశ సర్వాపరాధి నేను
యిక్కతి నన్ను రక్షించు ముందెఱఁగ నేను ॥నాత॥ 252

నాట

పరిపూర్ణ గరుడాద్రిపంచాననమ్
పరమం సేవే పంచాననమ్ ॥పల్లవి॥

క్రూరదంష్ట్రాగ్నికణఘోరపంచాననమ్
పారీణచక్రధరపంచాననమ్
వీరపంచాననం విజయపంచాననమ్
భారభూభారహరపంచాననమ్ ॥పరి॥

దివిజపంచాననం శ్రీవనఖకాననమ్
భవనాశినీతీరపంచాననమ్
కువలయాకాశసంఘోషపంచాననమ్
పవిశబ్దదంతరవపంచాననమ్ ॥పరి॥

శ్రీవేంకటాఖ్యఘనశిఖరిపంచాననమ్
పావనం పంచముఖపంచాననమ్
సేవితప్రహ్లాదసిద్ధిపంచాననమ్
భావితం శ్రీయుక్తపంచాననమ్ ॥పరి॥ 258

88-వ రేకు బౌళి

వివేక మెఱఁగనిళ్లులము గాక నేము
దివారాత్రము నిన్నే ద్రిష్టించవలదా ॥పల్లవి॥

మానివోడ నమ్మి వొక్కమనుజుఁడు వార్థి దాఁటి
నానార్థములుఁ గూర్చి నటించఁ గాను
దానవారికృప నమ్మి తగినసంసారవార్ధి
లోను చొచ్చి దాఁటి గెల్వ లోకులకుఁ జెల్లదా ॥వివే॥

జట్టెఁదుయినుము నమ్మి సారిది నొక్కఁడు భూమిఁ
గట్టిడిభయము లెల్లఁ గడవఁగాను
నెట్టనఁ జక్రాయుధునినిజనామ మిటు నమ్మి
తట్టి భవభయములు తరి దాఁటఁ జెల్లదా ॥వివే॥

వేశెఁదుదీపము నమ్మి వెడఁగుఁజీఁకటి బాసి
పోలిమి నొక్కనరుఁడు పొదలఁగాను
అలించి శ్రీవెంకటేశుఁ డాత్మలో వెలుఁగఁగాను
మేలి మాతనిఁ గొలిచి మెఱయఁగఁ వలదా ॥వివే॥ 254

## గుండక్రియ

ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము
దీమవువిజ్ఞానమే దివ్యోత్తుఫలము ॥పల్లవి॥

పాపచింత మదిలోనఁ బాయకుండా నిలిపితే
చేపట్టి దానము లెల్లాఁ జేసినంతఫలము
కోపానలములోన కోరికలు వేల్చితేనే
యేపున యజ్ఞాలు నేసి యేచినంత ఫలము ॥ఏమి॥

కనకముపై యాన కాదని పోదొబ్బితేనే
తనకు వేవేలు ఘోరతపములఫలము
వనితలమోహములవలఁ బడకుండితేనే
దినము గోటితీర్థాలు దిరిగినఫలము ॥ఏమి॥

శ్రీవెంకటేశుఁ జేరి కొలుచుటే
భావతి లేనియట్టితనజన్మఫలము
భావించి యాచార్యపాదపద్మమూలమే
సావధానమున సర్వశాస్త్రార్థఫలము ॥ఏమి॥ 255

మలహరి

సహజాచారము లెల్లా సర్వేశ్వరుని యాజ్ఞే
అహమించి నమ్మకుండు టదియే పాషండము ॥పల్లవి॥

నిద్దిరించువానిచేతినిమ్మపంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జారే
పొద్దువొద్దు తనలోన భోగకాంక్ష లుండఁగాను
అద్దలించి కర్మ మెల్ల నసుటే పాషండము ॥సహ॥

కలగన్నవాఁడు మేలుకనినటువలెనే
తలఁగి ప్రపంచమెందో దాఁగితే దాఁగె
యిల నీదేహము మోఁచి యింతాఁ గల్ల లనుచు
పలికి తప్పనసేభావము పాషండము ॥సహ॥

ధర నద్దము చూచేటితనరూపము వలె
గరిమతోఁ దనయాత్మకంటేఁ గనె
సరుస శ్రీవెంకటేశుసాకార మటు గని
కరఁగి భజించలేనికష్టమే పాషండము ॥సహ॥ 256

సామంతం

తెలియఁగ నేరక తిరిగేము
చలమరి కగునా సంతతసుఖము ॥పల్లవి॥

హేయము కడుపున నిడుకొని యింకా
ఛీ యనని మాకు సిగ్గేది
పాయము పిడికిటఁ బట్టుచు నుండేటి
కాయధారులకుఁ గలదా విరతి ॥తెలి॥

అంగనలరతులయావల నీఁటేటి
ఒంగిలిమనుజుల కగ్గేది
ముంగిట నార్గురుముచ్చులఁ గూడిన
దొంగగురుని కిందుఁ నిజ మేది ||తెలి||

జననమరణములు సరి గని కానని
మనుజాధమునకు మహి మేది
ఒనగొని శ్రీవెంకటేశు శరణ మిటు
గని మనకుండిన గతి యిఁక నేది ||తెలి|| 257

లలిత

హరి నీయనుమతో అది నాకర్మమో
పరమే యిహమై భ్రమయించీని ||పల్లవి||

కలుగదు శాంతము కటకట బుద్ధికి
చలమున నింతాఁ జదివినను
నిలువదు చిత్తము నీపై చింతకు
పలుసంపదలనుఁ బరగినను ||హరి||

తెగులదు వైరాగ్యధన మాత్మకును
వొగి నుపవాసము లుండినను
అగపడదు ముక్తి ఆసల నాసల
జగ మింతా సంచరించినను ||హరి||

విడువదు జన్మము వివేకముననే
జడిసి స్వతంత్రము జరపినను
ఒదయక శ్రీవెంకటేశ్వర నీవే
బడిఁగాచితి విడె బ్రదికితి నేను ||హరి|| 258

## సామంతం

ఇందిరాధిపునిసేవ యేమర కుండుట గాక
పొందితోడి జీవులకు బుద్ధు లేటిబుద్ధులు ॥పల్లవి॥

రే యెల్లా మింగి మింగి రేపే వెళ్ళనుమియు
బాయట నిద్రాదేవి పలుమారును
చాయలకు నిచ్చనిచ్చఁ జచ్చి చచ్చి పొడమేటి
మాయజీవులకు నెల్లా మసి కేఁటిమసికి ॥ఇంది॥

కనురెప్ప మూసితేనే కడు సిగ్గి చీఁకటౌను
కనురెప్ప దెరచితే గ్రమ్మఁటిఁ బట్లు
ఘనమై నిమిషమందే కలిమి లేమియుఁ దోఁచె
మొనయుజీవుల కింక మెలు కేఁటిమెలుకో ॥ఇంది॥

వొప్పుగుఁ బ్రాణము లవి వూరుపుగాలి వెంట
యెప్పుడు లోనివెలికి నడతాఁకను
అప్పఁడు శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డందరికి
తప్పక యాతఁడే కాచు తలఁ పేఁటితలఁపు ॥ఇంది॥ 259

89-వ రేకు. మలహరి

దేవ యీతగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నప మయ్యా ॥పల్లవి॥

తనువునఁ బొడమినతతి నింద్రియములు
పొనఁగి యొక్కడికిఁ బోవు నయ్యా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
మొనగొని యొక్కడి కేఁగుదు రయ్యా ॥దేవ॥

పొదుగుచు మనమునఁ బొడమినదయానలు
అదన నెక్కడికి నరుగునయా
పొదుగుచు జలముల నుండుమత్స్యములు
పదపడి యేగతిఁ బాసీనయ్యా ॥దేవ॥

లలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందునయా
బలు శ్రీ వేంకటపతి నాయాత్మనుఁ
గలిగితి వెక్కడికలుషము లయ్యా ॥దేవ॥ 260

నాట

నిక్కించీఁ గ్రహములు మానిసిమెకము
నిక్కపుఁగరుణతో మానిసిమెకము ॥పల్లవి॥

కొండ తనకు గద్దెగాఁ గోరి చూచుండిన దదే
నిండురాజసమున మానిసిమెకము
గండు మీఱి దానవునికండలు చెక్కుచు నూర్పు
నిండించీ నాకసము మానిసిమెకము ॥నిక్క॥

కిరణములు చేయింటాఁ గైకొని యాయుధములు
నిరతి జళిపించీ మానిసిమెకము
సురలను నసురలఁ జూచి చూచి మెచ్చి మెచ్చి
నెరపీని నవ్వులు మానిసిమెకము ॥నిక్క॥

మొక్కించీ తొడమీఁద నిందిరతో మేలమాడి
నిక్కపుఁగౌఁగిటను మానిసిమెకము
అక్కడ శ్రీ వెంకటాద్రి నహోబలము నందు
బొక్కని మమ్మేలెను మానిసిమెకము ॥నిక్క॥ 261

## శుద్ధవసంతం

అంతరంగ మెల్లా శ్రీహరి కొప్పించ కుండితే
వింత వింతవిధముల వీడునా బంధములు ॥పల్లవి॥

మనుజుఁడై ఫల మేది మఱి జ్ఞాని యౌదాఁకా
తను వెత్తి ఫల మేది దయ గలుగుదాఁకా
ధనికుఁడై ఫల మేది ధర్మము సేయుదాఁకా
పనిమాలి ముదిసితే పాసేనా భవము ॥అంత॥

చదివియు ఫల మేది శాంతము గలుగుదాఁకా
పెద వెత్తి ఫల మేది ప్రియ మాడుదాఁకను
మది గల్గి ఫల మేది మాధవుఁ దలఁచుదాఁకా
మొదుట తా రాజైతే సేలేనా పరము ॥అంత॥

పావనుఁడై ఫలము భక్తి గలిగినదాఁకా
జీవించేటి ఫల మేది చింత దీరుదాఁకను
వేవేల ఫల మేది శ్రీవెంకటేశుఁ గన్నదాఁకా
భావించి తా దేవుఁడైతేఁ బ్రత్యక్ష మవునా ॥అంత॥ 264

## సామంతం

ఆపద్బంధుఁడు హరి మాకుఁ గలఁడు
దాపిలి తలఁచినా దోషహరము ॥పల్లవి॥

గరుడని నెక్కిన ఘనరేవంతుఁడు
గరుడకేతనము గలరథుఁడు
గరుడఁడే తనకును గరియగు బాణము
గరిమ నిలెఁడె పో ఘనగారుడము ॥ఆప॥

పాముపరపుప్పై( బండినసిద్ధు(డు
పాముపాశములపరిహారము
పామున నమృతము పడ(దెచ్చినత(డు
వేమరు నిత(డే విషహారము ॥అప॥

కమలాక్షు( డిత(డు కమలనాభు(డును
కమలాదేవికి( గైవసము
అమరిన శ్రీవేంకటాధిపు( డిత(డే
మమతల మా కిదే మంత్రౌషధము ॥అప॥ 263

లలిత

ఇర వగువారికి యిహపర మిదియే
హరి నీవే సర్వాత్మలకు ॥పల్లవి॥

దురితమోచనము దుఃఖపరిహరము
హరినామమె పో ఆత్మలకు
పరమపదంబును భవనిరుహరణము
పరమాత్మునిచింతే ప్రపన్నలకు ॥ఇర॥

సారము ధనములు సంతోషకరములు
శౌరికథలు సంసారులకు
కోరినకోర్కియు కొంగుబంగరువు
సారె విష్ణుదాస్యము లోకులకు ॥ఇర॥

యిచ్చ యగుసుఖము యిర వగుపట్టము
అచ్యుతు కృపమోక్షార్థులకు
అచ్చపుశ్రీవేంకటాధిపుశరణము
రచ్చల మాపాలిరాజ్యపు సుగతి ॥ఇర॥ 264

బౌళి

పెరుగఁ బెరుగఁ బెద్దలు గాఁగా పెనువెట్టివట్టుబుద్ధెఱఁగితే
మరులు మఱచితేనే యిన్నిటి గెలిచే మర్మము సుండీ జ్ఞానులకు ॥పల్లవి॥

జనన మందినయప్పుడు దేహి సన్యాసికంటే నిరాభారి
తనరఁ గౌపీనకటిసూత్రముల తగులము లేనిదిగంబరి
తనుఁ దా నెఱఁగఁడు యెదిరి నెఱఁగఁడు తత్త్వధ్యానాలయునిర్మలచిత్తుఁడు
పెనఁగే కోరిక యించుకంత లేదు పేరులేనివాఁడు వీఁడువో యమ్మా ॥పెరు॥

నిద్దుర వొద్యేటియప్పుడు దేహి నిత్యవిరక్తునివంటిఘనుఁడు
బుద్ది సంసారముపై నించుకా లేదు భోగ మేమి నొల్లఁడు
వొద్దనే యేపనులకుఁ జేయఁబోఁడు వున్నలంపటాల కేమియుఁ జొరఁడు
కొద్ది లేనియాన యెందు వోయనొకో కోప మేమి లేదు వీఁడేవో యమ్మా ॥పెరు॥

హరి శరణన్నయప్పుడు దేహి అమరులకంటే కడునధికుఁడు
పరము నిహము నఱచేతిదే ప్రయాన మించుక లేదు
దురితము లేదు దుఃఖములు లేవు తోడనే వైకుంఠ మెదురుగా వచ్చు
గరిమ శ్రీవెంకటేశుఁడు వీఁడేవో కానరైరిగా యిన్నాళ్లమ్మా ॥పెరు॥ 265

90-వ రేకు. సాళంగనాట

ఉన్నవిచారము లేల వోహో సంసారులాల
యిన్నిటి కితఁడే రక్ష యిదే మీకు మనవి ॥పల్లవి॥

తక్కక బ్రహ్మలఁ గన్నతండ్రిఁ గొలిచి మీరు
యెక్కువసంతతి గల్గి యీడేరరో
అక్కున లక్ష్మీనారాయణులఁ దలఁచి మీరు
చొక్కి మీమీదంపతులు సుఖమున నుండరో ॥ఉన్న॥

భవరోగవైద్యునిపాదములు సేవించి
భువి రోగములఁ బాసి పొదలరో
తవిలి పదిదిక్కులు దానై నవానిఁ
గవిసి పొగడి దిక్కు గలిగి బ్రదుకరో ॥ఉన్న॥

తల్లిదండ్రి నితఁడే తగఁ జుట్ట మితఁడే
మెల్లఁగాఁ బుట్టించి పెంచేయేలి కితఁడే
వల్లఁగా శ్రీవెంకటేశు శరణంటి మిదే మేము
కొల్లఁగా మీరెల్లా మమ్ము గుటిగా వర్ధిల్లరో ॥ఉన్న॥ 266

మలహరి

కలిగినది యొక్కటే కమలాపతిసేవ
తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికేను ॥పల్లవి॥

హరియే పరతత్త్వ మతఁ డొక్కఁడే గతి
ధరలోన దేవత లెందరైనాఁ గలుగనీ
మురహరనామము మంచి యొక్కటే యొక్కడు
యిరవైన మంత్రము లెన్నైనా నుండనీ ॥కలి॥

గోవిందుదాసులే పెక్కువఘను లిందరిలో
వేవేలు పెద్దలటు వేలసంఖ్యలుండనీ
కైవసవిష్ణుకైంకర్యమే సాధనము
యీవల నావల పుణ్య మెంతైనాఁ గలుగనీ ॥కలి॥

పట్టిన శ్రీవేంకటేశుభక్తి యొక్కటే ఘనము
యిట్టే శాస్త్రజ్ఞాన మెట్లున్నాను
వొట్టినయాతనిముద్ర లోకకోటికి మూలము
యెట్టిలాంఛనము లిల నెన్నైనా నుండనీ ॥కలి॥ 267

సామంతం

కంటి నిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి
నంటున నిందుకంటెను నాణె మెందూ లేదు ॥పల్లవి॥

మేటివైరాగ్యముకంటే మిక్కిలి లాభము లేదు
గాటపువిజ్ఞానముకంటే సుఖము లేదు
మీటైనగురువుకంటే మీఁద రక్షకుఁడు లేఁడు
బాటసంసారముకంటే పగ లేదు ॥కంటి॥

పరపీడ సేయుకంటే పాపము మఱెందు లేదు
పరోపకారముకంటే బహుపుణ్యము లేదు
నిరతశాంతముకంటే నిజధర్మ మెందు లేదు
హరిదాసుఁ డౌకంటే నట గతి లేదు ॥కంటి॥

కర్మసంగము మానుకంటేఁ దేజము లేదు
అర్మిలిఁ గోరిక మానేయంతకంటే బుద్ధి లేదు
ధర్మవు శ్రీవెంకటేశుఁ దగిలి శరణు చొచ్చి
నిర్మలాన నుండుకంటే నిశ్చయము లేదు ॥కంటి॥ 268

గుజ్జరి

అతనినే నే కొలిచి నే నందితిఁ బో నిజసుఖము
శ్రీతరుణీపతి మాయాధవుఁడు సృష్టి యింతయును హరిమూలము ॥పల్లవి॥

కోరుదుమా దుఃఖములు కోర కేతెంచు తముఁదామే
ఆరీతులనే సుఖములు యేతెంచు నందుఁను విచార మఁతేల
సారెకు దైవాధీనము లివి రెండు స్వయత్నములుగా వెవ్వరికి
కోరేటి దొరకటే హరిశరణాగతి గోవిందుఁడే యింతకు మూలము ॥ఆత॥

కమ్మంటిమా ప్రపంచము గలిగీస్వభావము అందు కది
యిమ్ముల మోక్షము యీరీతులనే యీశ్వరుఁ డిచ్చిన యిది గలుగు
కమ్మి అంతర్యామి కల్పితంబు లివి కాదన నవునన రా దెవ్వరికి
సమ్మతించి ఆసపడియెడి దొరకటే సర్వలోకపతినిజదాస్యము ॥ఆన॥

సరి నెఱుఁగుదుమా పోయినజన్మము సారెకు నేమేమి చేసితిమో
యిరవుగ నట్లా మీఁదటిజన్మము యెఱుకలు మఱపులు యిఁక నేలా
నిరతమై శ్రీవెంకటేశుఁడు తనయిచ్ఛ నిర్మించిన దిది యీదేహము
గరిమల నాతనికైంకర్యమెపో కలకాలము మాకు కాణాచి ॥ఆత॥ 269

## గుజ్జరి

దైవము నీవే గతి మాతప్పులు పనిలేదు
శ్రీవల్లభుఁడవు నీవే చేకొని కావఁగదే ॥పల్లవి॥

జనని నీమాయాజనకుఁడవు నీవు
జనులము నే మిందర మొకసంతతి బిడ్డలము
వొనరిడిదినభోగములు పూరేటిచనుఁబాలు
మునుకొను మానడవళ్లివి ముద్దులు మీ కివివో ॥దై॥

ధరఁ బశుపక్షిమృగాదులు తగ తోబుట్టుగులు
పురుటగుమాదేహంబులు పుయ్యలతొట్టెలలు
మరిగినసంసారము బొమ్మరిండ్లయాటలివి
నిరతి మాయజ్ఞానంబు నీకే నవ్వులయ్యా ॥దై॥

చావులుఁ బుట్టుగు లాడెడినరి దాఁగిలిముచ్చిములు
భావవుటారంభంబులు బాలలీలగతులు
కైవసమందగ శ్రీవేంకటపతి నీదాస్యం బిది
మావంటివారి కెల్లను నీమన్నన లాలనలు ॥దైవ॥ 270

పాడి

మఱియు మఱియు నివే మాపనులు
మెఱసితి మిందే మిక్కిలిని ॥పల్లవి॥

నారాయణునకు నమస్కారము
దారుణీపతికిని దండము
శ్రీరమణునకునుఁ జేరి శరణ్యము
వారిధిశాయికి వరుస జోహారు ॥మఱి॥

రామకృష్ణులకు రచనలబంటను
దామోదరునకు దాసుఁడను
వామనమూర్తికి వాకిటగొల్లను
సోమార్కనేత్రునిసొరిదిలెంకను ॥మఱి॥

గోవిందునికే కొలువులు సేతుము
దేవోత్తముబడిఁ దిరుగుదుము
భావజగురునకు పంపునడతుము
శ్రీవేంకటపతి సేవింతుము ॥మఱి॥ 271

91-వ తేకు శ్రీరాగం

తప్పఁ దోయవే దైవశిఖామణి
యిప్పుడు నీకృప నెనసితి నేను ॥పల్లవి॥

అనలముఁ బొడగని యటునిటు మిడుతలు
కినిసి యందు మగ్గినయట్లు
అనువగువిజ్ఞాన మాత్మ వెలుఁగఁగ
మొనసి యింద్రియములు మాఁగీ నాకు ॥తప్ప॥

అతిముత్తేఁ గమలము లటు వికసించిన
మెఱసి తుమ్మెదలు మించుగతి
తతి నాహృదయము తగ వికసించిన
తఱిమీ నజ్ఞానతమ మది నాకు ॥తప్ప॥

యీరీతి శ్రీవేంకటేశ్వర యిన్నియు
నూరకే యుండఁగా నొదిఁగియుండె
నేరిచి నీభక్తి నిలువఁగ మతిలో
చేర గతిలేక చిమిడినదివో ॥తప్ప॥ 272

రామక్రియ

మరలి మరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము ॥పల్లవి॥

కమలారమణికిఁ గమలాక్షునకును
మమతల జయజయమంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము ॥మర॥

జలధికన్యకను జలధిశాయికిని
మలయుచును శుభమంగళము
కలిమికాంత కాకలికివిభునికిని
మఖువులయారతి శుభమంగళము ॥మర॥

చిత్తజుతల్లికి శ్రీవేంకటపతికి
మతిలినజయం మంగళము
యిత్తల నత్తల యిరువుర కౌఁగిటి
జొత్తులరతులకు శుభమంగళము ॥మంగ॥ 373

### మాళవిగౌళ

చదువులోనే హరిని జట్టిగొనవలెఁ గాక
మదము గప్పినమీఁద మగుడ నది గలదా ॥పల్లవి॥

జడమతికి సహజమే సంసారయాతన యిది
కడు నిందులోఁ బరము గడియించవలెఁ గాక
తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకితేఁ గలదా ॥చదు॥

భవబంధునకు విధిపాపపుణ్యాలంకే
తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెఁ గాక
అవల వెన్నెలలో అల్లునేరేళ్లింతే
నివిరి నిన్నటి పునికి నేఁటికిఁ గలదా ॥చదు॥

దేహధారికిఁ గలదే తెగనియింద్రియబాధ
సాహసంబున భక్తి సాధించవలెఁ గాక
యీహలను శ్రీవేంకటేశుదాసులవలన
వూహించి గతి గానక వొదిఁగితేఁ గలదా ॥చదు॥ 374

### లలిత

కలది గల్లట్టే కర్మఫలంబులు
నిలిచితిమా నేము నిమ్మకుఁ బులుసు ॥పల్లవి॥

యెంత సేసినా యిహమున జీవికి
చెంత నజుఁడు వ్రాసినకొలఁదే
వంతలముంటికి వాఁడి వెట్టితిమా
కొంతతీపు చెఱకుకుఁ జల్లితిమా ||కల||

ఘనముగ బుద్ధులు గలపినదేహికి
మును నోఁచిననోముఫలంబే
నినువుఁటెంకాయకు నీరు నించితిమా
వొనర వేమునఁ జేఁదు నిచితిమా ||కల||

యిరవుగ శ్రీవెంకటేశుఁడే ప్రాణికి
కిరలి భాగ్య మొసఁగినయంతే
మరువమునకుఁ బరిమళము సేసితిమా
పెరిగేటి యడవులు పెంచితిమా ||కల|| 275

## లలిత

వెలువ లెల్ల తనలోనుగాక తను విడువదు వెడమాయా
నలువున యోగీంద్రు లెల్ల మును నడచినమార్గంబు ||పల్లవి||

జీవము నిర్జీవము గాక సిద్ధించదు పరము
వావు లెల్ల నొకవావిగాక మఱి వదలదు ప్రపంచము
భావం బెల్ల నభావముగాక పాయదు కర్మంబు
దైవజ్ఞులు మును నడచి రిదియపో తప్పనిమార్గంబు ||వెలు||

మాట లెల్లఁ గడమాటలు గాక మాయదు మలినంబు
కూటంబులు కాలకూటంబు గాక కొనకెక్కదు భవము
చాటుఁ దృష్ణ లగచాటునఁ బడక చాలదు సౌఖ్యంబు
తేటగా మును పెద్ద లివియపో తేర్చినమార్గంబు ||వెలు||

గుణము లెల్ల నిర్గుణము గాక తలకూడదు శాంతంబు
అనువున కను వై అంతయుఁ దాఁగాక ఆనందము లేదు
ప్రణుతింపఁగ శ్రీవేంకటరమణుని బహుళమహిమెల్లా
గణనకెక్కఁగా పురాతనులు మును కడకట్టినమతము ॥వెలు॥ 276

గౌళ

రెండుమూలికలు రేయిఁ బగలు నున్నవి
అండదేహము దొకటి ఆతుమలో నొకటి ॥పల్లవి॥

యిదివో రసబద్ధము యింద్రియములు మేనిలో
పదిలముగా నిలిపి బంధించుటా
అదివో వేధాముఖ మంతరంగపు మనను
చెదరకుండాఁ జొనిపి శ్రీహరిఁ దలఁచుటా ॥రెండు॥

తారవిద్య గంటిమి తగిలి నాసాగ్రమందు
మేరతో ద్రిష్టినిలిపి మేలుఁబొందుట
చేరువ సువర్ణవిద్య చిత్తములోఁ బ్రణవము
ధీరత నాదము నేనె దేవునిఁ బొగడుట ॥రెండు॥

పుటజయ మాయ నిట్టే పుణ్యపాపము లందులో
కుటిలపుఁ గోరికల కొన దుంచుట
యిటులనే శ్రీవెంకటేశుఁ డిందిరయును
అటుప్రకృతిపురుషులనుటారవచ్చుట ॥రెండు॥ 277

92-వ రేకు. నాట

నవనారసింహా నమో నమో
భవనాశినీతీర యహోబలనారసింహా ॥పల్లవి॥

సతతప్రతాపరౌద్రజ్వాలానారసింహ
వితతవీరసింహవిదారణా
అతిశయకరుణయోగానందనరసింహ
మతిశాంతపుకానుగుమానినారసింహ ॥నవ॥

మరలి బీభత్సపు మట్టెమళ్ళనరసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణశృంగారప్రహ్లాదనరసింహ
సిరులనద్భుతపులక్ష్మీనారసింహ ॥నవ॥

వదనభయానకపువరాహనరసింహ
చెదరనివైభవాల శ్రీనరసింహ
అదన శ్రీవేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలురూపముల బహునారసింహ ॥నవ॥ 278

శంకరాభరణం

అంగనలాల మనచే నాడించుకొనెఁ గాని
సంగతెఱిఁగిననెఱజాణఁ డితఁడే ॥పల్లవి॥

మొదలులేనివాని కొక్కడేతం డ్రాయఁ గాని
తుదయక పురుషోత్తముఁ డితఁడే
బడబాగ్ని జలధికిఁ బాయ కల్లుఁ డాయఁ గాని
వెడలించె నమృతము విష్ణుఁ డితఁడే ॥అంగ॥

పులిగూడు దిన్నవానిపాం దొక్కటే సేసెఁ గాని
నలువంకలక్ష్మీనాథుఁ డితఁడే
చలికిఁ గోవరివానిసరుస బా వాయఁ గాని
పలుదేవతల కెల్లఁబ్రాణబంధుఁ డితఁడే ॥అంగ॥

యెక్కడో గొల్లసతుల కింటిమగఁ డాయఁ గాని
తక్కక వెదకే పరతత్వ మితఁడే
మిక్కిలి శ్రీవేంకటాద్రిమీఁద మమ్ము నేలెఁ గాని
తక్కక వేదము చెప్పే దైవ మీతఁడే ॥అం॥ 279

లలిత

నీ వేలికవు మాకు నీదాసులము నేము
ఆవల నితరుల నే మడుగఁ బొయ్యేమా ॥పల్లవి॥

పసురమై వుండి యిచ్చెఁ బక్కనఁ గామధేనువు
యెసఁగి మ్రానై వుండి యిచ్చెఁ గల్పవృక్షము
వెస రాయైవుండి యిచ్చె వేడుకఁ జింతామణి
మసలని శ్రీపతివి మాకు నిచ్చే దరుదా ॥నీవే॥

గాలి యావటించి యిచ్చెఁ గారు మేఘము మింట
పీలి జీర్ణమై యిచ్చె విక్రమార్కునిబొంత
కాలినపెంచై వుండి కప్పెరదివ్యాన్న మిచ్చె
మైల లేని శ్రీపతివి మాకు నిచ్చు టరుదా ॥నీవే॥

అండనే కామధేనువ వాశ్రితచింతామణివి
పండినకల్పకమవు భక్తుల కెల్లా
నిండిన శ్రీవేంకటేశ నీవు మమ్ము నేలితివి
దండిగా నమ్మితే నీవు దయఁ జూచు టరుదా ॥నీవే॥ 280

ముఖారి

అక్కట కొడగనియట్టి యర్థము
లెక్క లెన్నైనా నేమి లేకున్న నేమిరే ॥పల్లవి॥

దండితోఁ దనకుఁ గాని ధరణీశురాజ్యంబు
యెండ నేమి యది పండ నేమిరే
బెండుపడఁ గేశవుఁ బేరుకొననినాలిక
వుండ నేమి వుండకుండ నేమిరే ॥అక్క॥

యెదిరిఁ దన్నుఁ గానని యెడపులగుడ్డికన్ను
మొదలఁ దెఱచె నేమి మూసె నేమిరే
వెదకి శ్రీపతి సేవ నేడుకఁ జేయనివాఁడు
చదివె నేమి చదువు చాలించె నేమిరే ॥అక్క॥

ఆవల నెవ్వరు లేని అడవిలోని వెన్నెల
కావిరిఁ గాసె నేమి కాయకున్న నేమిరే
శ్రీవేంకటేశ్వరుఁ జేరని ధర్మము లెల్ల
తోవల నుండె నేమి తొలఁగిన నేమిరే ॥అక్క॥ 281

లలిత

పట్టిన దెల్లా బ్రహ్మము
దట్టపుజడునికి దైవం బేలా ॥పల్లవి॥

ఘనయాచకునకు కనకమే బ్రహాము
తనువే బ్రహ్మము తిరువలికి
యెనయఁ గాముకున కింతులే బ్రహ్మము
తనలో వెలిఁగేటితత్వం బేలా ॥పట్టి॥

ఆఁకటివానికి నన్నమె బ్రహ్మము
లోకమే బ్రహ్మము లోలునికి
కైకొని కర్మికి కాలమే బ్రహ్మము
శ్రీకాంతునిపైఁ జింతది యేలా ॥పట్టి॥

భువి సంసారికి పుత్రులె బ్రహ్మము
నవ మిందరి కిది నడచేది
యివలను శ్రీవెంకటేశుదాసులకు
భవ మతనికృపే బ్రహ్మము ॥పట్టి॥ ౨౭౨

గుండక్రియ

రూకలై మాడలై రువ్వలై తిరిగిని
దాకొని వున్నచోటఁ దా నుండ దదివో ॥పల్లవి॥

వొకరి రాజుఁ జేసు నొకరి బంటుగఁ జేసు
వొకరి కన్నకల వేరొకరికి నమ్మించు
వొకచోట నున్నధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము ॥రూక॥

కొందరి జాళిలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యులఁ జేసుఁ గొందరి పాపులఁ జేసు
కొందరి కొందరిలోన కొట్లాట వెట్టించు
పంద మాడినటువలెఁ బచరించు వసిఁడీ ॥రూక॥

నిగనిగ మనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవెంకటేశుతరుణి యై తా నుండు
తెగనిమాయై యుండు దిక్కు దెసయై యుండు
నగుతా మాపాలనుండి నటియించుఁ బసిఁడీ ॥రూక॥ ౨౮౩

౯౩-వ రేకు. గుండక్రియ

నే నేమి సేయుదును నీవు నాలోపలనుండి
శ్రీనాథుఁడవు నీచేత లింతే కాకా ॥పల్లవి॥

తనువేమి సేయును తనువులోపల నున్న
చెనటి యింద్రియములచేతలు గాక
మనసేమి సేయును మనసులోపల నున్న
నినువుఁగోర్కులు చేసే నేరములు గాక ॥నేనే॥

జీవుఁ డేమి సేయును జీవునిఁ బొదుగుకున్న
భావప్రకృతి చేసేపాపము గాక
చేవ దేరఁ బుట్టువేమి సేయు ముంచుకొన్నట్టి
దైవపుమాయలోని ధర్మ మింతే కాక ॥నేనే॥

కాల మేమి సేయును గక్కన శ్రీవెంకటేశుఁ
జేలి మన్నించేమన్నన యిదియే కాక
యేల యేల దూర నింక నెవ్వరు నేమి సేతురు
మేలిమి నినుఁ దలఁచి మెచ్చులే కాకా ॥నేనే॥ ౨౬౪

## బౌళి

పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువక కిందరిఁ గాచు వేడబోయనాయఁడు ॥పల్లవి॥

పొలసి మీసాల పెద్దబోయనాయఁడు
మలిగి వీఁపునఁ గట్టెమంకుబోయనాయఁడు
పొలమురాజై తిరిగీ బోయనాయఁడు
వెలయ మోటున నుండేవేఁటబోయనాయఁడు ॥పొడ॥

పొట్టి పొట్టి యడుల బోయనాయఁడు యెందుఁ
బుట్టు పగసాధించే బోయనాయఁడు
బొట్టులమొకము నేసేబోయనాయఁడు
పట్టపునెమలిచుంగు బలుబోయనాయఁడు ॥పొడ॥

పొంచి శిగ్గగ్గలఁగని బోయనాయఁడు
మించి రాలమీఁద దాఁటే మెండుబోయనాయఁడు
అంచెల శ్రీవెంకటేశుఁడనే బోయనాయఁడు
పంచఁగాలవేలముల బలుబోయనాయఁడు ॥పొద॥ 285

## ముఖారి

వేదమంత్ర మింక నేల వేరువెల్లంకులు నేల
పుడమిధరుఁడు మాకు భువనౌషధము ॥పల్లవి॥

హరి యచ్యుతా యంటే నణఁగుఁ బాపములు
నరసింహా యని యంటే నాఁటినదుఃఖములు మాను
పురుషోత్తమా యంటేఁ బుంద్లు బూచులు మాను
పరమౌషధ మీతఁడే పాటింప మాకు ॥వేద॥

వాసుదేవ యని యంటే వదలు బంధము లెల్లా
వాసికేఁ గృష్ణా యంటే వంతల రోగాలు మాను
శ్రీసతీశ యని యంటే చింత లిన్నియును మాను
గాసి దీర నితఁడేపో ఘనదివ్యౌషధము ॥వేద॥

గోవిందా యని యంటేఁ గూడును సంపదలు
యీవల మాధవ యంటే నిహముఁ బరముఁ జేరు
దేవ నారాయణ యంటే దేహము సుఖమై యుండు
శ్రీవెంకటేశుఁడే మాకు సిద్ధౌషధము ॥వేద॥ 286

## రామక్రియ

మహి నింతటివారువో మనవారు
బహుమహిమలవారు ప్రపన్నులు ॥పల్లవి॥

జయ మంది జననపుజరామరణముల
భయము లేనివారు ప్రపన్నులు
క్రియ లెల్ల నుడిగి మ్రాఁగినకర్మపుటడవి
బయలుచేసినవారు ప్రపన్నులు ॥మహి॥

ధీరులై మాయాంధకారంబు నెదిరించి
పారఁదోలినవారు ప్రపన్నులు
సార మయ్యేను సంసారసాగరము
పారము గన్నవారు ప్రపన్నులు ॥మహి॥

అంద నిన్నిటాఁ దనిసి యాస లెల్లాఁ దెగఁగోసి
పండినమనసువారు ప్రపన్నులు
దండిగా శ్రీవేంకటేశుదాసులై వరములోవ
బండిబాటచేసినారు ప్రపన్నులు ॥మహి॥ 287

దేవగాంధారి

సర్వజ్ఞత్వము వెదకఁగ నొల్లను సందేహింపఁగ నొల్లను
సర్వజ్ఞుండును నాచార్యుండే సర్వశేషమే నాజీవనము ॥పల్లవి॥

మొఱఁగఁగ నొల్లను విజ్ఞానపుగతి మొఱకలు నే మిటు సోధించి
మొఱఁగి యితరులను బోధించెద మను యీపెద్దతికము నొల్లము
మొఱఁగేటి వాఁడును నాచార్యుండే మొఱకయు సర్వేశ్వరుఁడే
మొఱకయు మఱవును మానివుండు టే యిదియే పో మావిజ్ఞానము ॥సర్వ॥

చదువఁగ నొల్లము సకలశాస్త్రములు సారెసారెకు సోధించి
చదివి పరులతో యుక్తివాదములు జగడము గెలువఁగ నొల్లము
చదివేటివాఁడును నాచార్యుండే చదువును నాయంతర్యామే
చదువులుఁజదువనిమికియుఁదొలఁగుటేనానాసాత్త్వికభావమేనా తెలివి ॥సర్వ॥

...న్నటికిని నే నధికారి ననెడి యహంకారము నొల్లను
న్నలఁ జూచుచు నందరితోనేఁ గాదని తొలఁగా నొల్లను
...న్నన శ్రీవెంకటేశ్వరుకరుణను మాయాచార్యుఁడే అధికారి
...న్నరీతినే అస్తినాస్తులకు నూరకుండుటే నాతలఁపు ॥నర్వ॥ 288

బౌళి

ఇందిరానాథుఁ డిన్నిటి కితఁ డింతే
బందెలకర్మము లాల పట్టుకురో మమ్మును ॥పల్లవి॥

యెఱిఁగి నేసిన వెల్లా నీతనిమహిమ తే
యెఱఁగక చేసినది యీతనిమాయే
తెఱఁగొప్ప రెంటికిని తెద్దువంటివాఁడ నింతే
వఱచుఁగర్మములాల పట్టుకురో మమ్మును ॥ఇంది॥

కాయములోపలివాఁడు ఘనుఁ డొక్కఁ డితఁడే
కాయ మీతనిప్రకృతి కల్పిత మింతే
తోయ రాక రెంటికిని తోడునీడై తి నింతే
బాయటికర్మములాల పట్టుకురో మమ్మును ॥ఇంది॥

యేలినవాఁడు శ్రీవెంకటేశుఁ డితఁ డొక్కఁ డింతే
యేలికసానై పించేది యీతనిసతే
పోలి నే వీరిఁగొలిచేమాత్రపుబొమ్మ నింతే
పాలుపుఁగర్మములాల పట్టుకురో మమ్మును ॥ఇంది॥ 289

94-వ రేకు. కన్నడగౌళ

బోధకు లెవ్వరు లేక భోగినై తిని
శ్రీధరుఁడే మాకు దిక్కు చింతింప నింకను ॥పల్లవి॥

పట్టి దిగంబరినై పాలే యాహారము చేసి
తొట్టిపంచేంద్రియములతోవ విడిచి
పుట్టితి సన్యాసినై బుద్ధిత్యాగి నెఱగక
అట్టి సడమ సంసారి నైతి నేనూ ॥బోధ॥

గచ్చుల నన్ని మఱచి గాలే ఆపటించుకొని
అచ్చపుఁబరమయేకాంతసమాధి
నిచ్చలు నిద్రాభ్యాసనిర్మలయోగి నైతి
కచ్చుపెట్టి మేలుకొని ఘనకర్మి నైతి ॥బోధ॥

భావము పార విడిచి బ్రహ్మాండ మెల్ల నిండి
వేవేలుఁ గోరికల వేడుకతోడ
జీవన్ముక్తుఁడనైతి శ్రీవెంకటేశ్వరుఁ జేరి
దావతు లిన్నియు మాని తన్మయుఁడ నైతి ॥బోధ॥ 290

భైరవి

మొదలుండఁ గొనలకు మోచి నీళు వోయ నేల
మొదలో నీవుండఁగా నితరము లేలా ॥పల్లవి॥

నిగమమార్గమునసే నడచేనంటే
నిగమము లెల్లను నీమహిమే
జగములోకులఁజూచి జరగెద నంటే
జగములు నీమాయ జనకములు ॥మొద॥

మన సెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే
మనసుకోరికలు నీమతకాలు
తనువు నింద్రియములు తగ గెలిచేనంటే
తనువు నింద్రియములు దైవము నీమహిమా ॥మొద॥

యింతలోనివనికేఁగా యిందు నందుఁ జొరనేల
చెంత నిందుచెరువుండ చెలమ లేలా
వంతాన శ్రీవెంకటేశ పట్టి నీకే శరణంటి
వంతకూటాల ధర్మవుసంగతి నాకేలా ||మొద|| 291

బౌళి

చీచీ వోబదుకా సిగ్గులేని బదుకా
వాచవికి బతిమాలి వడఁబడ్డ బదుకా ||పల్లవి||

ఆసలకుఁ జోటుగద్దు అంతరంగాన నెంతైనా
వీస మంతాఁ జోటులేదు విరతికిని
యీసున సంసారమున కెందరైనాఁ గలరు
వోసరించి మోక్ష మియ్య నొకరు లేరు ||చీచీ||

భోగించ వేళ గద్దు పొద్దువొడవుఁగుంకును
యోగమే హరిఁదలచ వేళలేదు
వోగులలంపటమున కోపి కెంతైనాఁ గద్దు .
యోగపుసత్కర్మాన కోకయింతలేదూ ||చీచీ||

యెదుట ప్రపంచాన కెఱు కెంతైనాఁ గద్దు
యిదివో యాత్మజ్ఞాన మించుకా లేదు
మది శ్రీవెంకటేశుఁడు మమ్ము నిట్టె కాచెఁగాని
వదరి నాసేరములు పాప మతిలేరూ ||చీచీ|| 292

దేసాక్షి

సకలజీవుల కెల్లసంజీవి యీమందు
వెకలులై యిందరు సేవించరో యీమందు ||పల్లవి||

మూఁడు లోకము లొక్కట ముంచి పెరిగినది
పోఁడిమి నల్లనికాంతిఁ బొదలినది
కేఁడుక కొమ్ములు నాల్గు పెనచి చేయి వాఁచినది
నాఁడె శేషగిరిమీఁద నాఁటుకొన్న మందు ॥వక॥

పడిగెలు వేయింటిపాము గాచుకున్నది
కడు వేదశాస్త్రముల గబ్బు వేసేది
నొడయక వొక కాంత యెక్కక వుండినది
కడలేని యంజనాద్రి గారుడపుమందు ॥నక॥

బలుశంఖు జక్రములబదని కెలున్నది
తలఁచినవారి కెల్లఁ దత్త్వమైనది
అలరినబ్రహ్మరుద్రాదులఁ బుట్టించినది
వెలుఁగుతోడుత శ్రీవెంకటాద్రిమందు ॥నక॥ 289

గుండక్రియ

ముందటిజన్మము లెల్లా ముంచేఁ బొరుబడివడ్డి
యెంను చొచ్చినానుఁ బోనియ్య దీరుణము ॥పల్లవి॥

నుదుట వ్రాసినవ్రాలు నూరేండ్లపత్రము
పొదలునాకర్మమే పూఁటకాఁపు
వెదకే సంసారము వెంటఁ బైతరవు
యిది యెందు చొచ్చినాఁ బోనియ్య దీరుణము ॥ముంద॥

పుట్టినప్పుడే తనువు భోగ్యమై నిలిచెను
జట్టిఁ గామినులపొందు సరియాఁకలు
నెట్టనయహారములు నిచ్చనిచ్చ లంచాలు
దిట్టనై యెందు చొచ్చినాఁ దీర దీరుణము ॥ముంద॥

యెక్కునైన శ్రీవెంకటేశుమఱఁగు చొచ్చి
తెక్కుతోడ నలిగెలఁ దిరుగఁగను
అక్కరతో నప్పులెల్లా నవి మాకుఁ దామచ్చి
చిక్కి యెందు చొచ్చినాఁ జేరు నీరుణము ॥ముంద॥ 294

దేసాళం

అన్నిటికిఁ గారణము హరియే ప్రపన్నులకు
పన్నినలోకుల కెల్ల ప్రకృతి కారణము ॥పల్లవి॥

తలఁపు గారణము తత్త్వవేత్తలకును
చలము గారణము సంసారులకును
ఫలము గారణము పరమవేదాంతులకు
కలిమి గారణము కర్మలకును ॥అన్ని॥

తనయాత్మ గారణము తగినసుజ్ఞానులకు
తనువే కారణము తగజంతువులకు
ఘనముక్తే గారణము కడగన్నవారి కెల్లా
కనకమే కారణము కమ్మినబంధులకు ॥అన్ని॥

దేవుఁడు గారణము తెలిసినవారి కెల్లా
జీవుఁడు గారణము చిల్లరమనుజులకు
దేవుఁడు వేరే కాఁడు దిక్కు శ్రీవెంకటేశుఁడే
పావన మాతనికృప పరమకారణము ॥అన్ని॥ 295

96-వ రేకు. లలిత

ఎక్కఁగా రాఁగా రాఁగా యుండాఁకాఁ దగులు
యిక్కువ శ్రీహరిమాయ నింక నెంతో తగులు ॥పల్లవి॥

తెగనికర్మమునకు దేహము దగులు
తగినదేహమునకు తరుణితో తగులు
సొగిసి యారెంటికి సుతు లొక్కతగులు
అగడాయఁ గనకము అన్నిటితో తగులు ॥ఎక్క॥

యింతటిసంసారికి యిల్లొక్కతగులు
బంతికి నందు గలిగే పాఁడిపంట తగులు
చెంత నీలంపటానకు క్షేత్రము తగులు
సంత గూడేదానదాసీజను లెల్లా దగులు ॥ఎక్క॥

కుదలజీవుఁ డొక్కఁడే మోపు లాయఁ దగులు
వదలనిబంధములు వడ్డివారే దగులు
వుదుటిహముఁ బరము నొక్కయండే తగులు
అదె శ్రీవెంకటపతి యంతరాత్మ తగులు ॥ఎక్క॥ 196

గుండక్రియ

ఎవ్వరివాఁడో యెఱఁగరాదు
అవ్వలివ్వలిజీవుఁ డాటలో పతిమె ॥పల్లవి॥

ధర జనించక తొలుత తనుఁ గానరాదు
మరణ మందినవెనక మఱి కానరాదు
పురువడి దేహముతో నుండినయున్నాళ్లే
మురలుజీవునిబదుకు మాయవో చూడ ॥ఎవ్వ॥

యిహములో భోగించు నిందుఁ గొన్నాళ్లు
మహిమ పరలోకమున మలయుఁ గొన్నాళ్లు
తహతహలఁ గర్మబంధములఁ దగిలినయపుడే
అహహ దేహికి బదుకు లాటవో బదుకు ॥ఎవ్వ॥

సంతానరూపమై సాగు ముందరికి
కొంత వెనకటిఫలము గుడుపఁ దాఁ దిరుగు
యింతటికి శ్రీవెంకటేశుఁ డంతర్యామి
బంతి నీతనిఁ గన్న బదుకువో బదుకు ॥ఎవ్వ॥ 297

శంకరాభరణం

ఎంత భక్తవత్సలుఁడ విట్టుండ వలదా
వింతలు నీసుద్దు లెల్లా వినఁబోతే నిట్టివే ॥పల్లవి॥

యిల నసురారి యనేయీబిరుదు చెల్లె నీకు
బలివిభీషణాదులపాలికే చెల్లదు
కలసి అవులే నీవు గెలుతు వెందరినైనా
తలఁచి చూడ నీదాసుల కోడుదువు ॥ఎంత॥

యిందరిపాలిటికి యీశ్వరుఁడ వేలికవు
పందవై యర్జును బండి బంట వైతివి
వందనకు నాలే దేవతలకే దొరవు
అందవునీదాసులకు నన్నిటా దాసుఁడవు ॥ఎంత॥

కడుపులో లోకము కన్నతండ్రి విన్నిటాను
కొడుకవు దేవకికిఁ గోరినంతనే
తడవితే వేదములు తగిలే బ్రహ్మమవు
విడువనిమా కైతే శ్రీవెంకటాద్రిపతివి ॥ఎంత॥ 298

సాళంగనాట

రాముఁ డితఁడే లోకాభిరాముఁ డితఁడు
గోమున పరశురాముఁ గోప మార్చె నటరే ॥పల్లవి॥

యీలేఁడా తాటకిఁ జంపె యీపిన్నవాఁడా
ఆతల సుబాహుఁ గొట్టి యజ్ఞముఁ గాచె
చేతనే యీకొమరుఁడా శివునివిల్లు విఱిచె
సీతకమ్మఁ బెండ్లాడె చెప్పఁగొత్త గదవె ||రాము||

మునుకౌసల్యకొడుకా మాయామృగము సేసె
దనుజుల విరాధుని తానే చెఱిచె
తునుమాడె నేడు దాళ్లు తోడనే వాలి నడఁచె
యినకులుఁ డితఁడా యెంత కొత్త చూడరే ||రాము||

యీవయసు తానే యీయెక్కువ జలధి గట్టి
రావణు జంపి సీత మరలఁ దెచ్చెను
శ్రీవెంకటేశుఁ డితఁడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేఁడు కంటి మిట్టె కదరే ||రాము|| 399

లలిత

ఏమి సేసినా నీరుణ మెట్టు వాసును
కామితఫలద యోకరుణానిధి ||పల్లవి||

చేరి కర్మములు నన్ను చెఱవట్టుకుండఁగాను
పేరువాడి వచ్చి విడిపించుకొంటివి
సారె తగ వట్టి కాదా శక్తిగలవా రెల్లా
నారయ దీనులఁ గంటే నడ్డమై కాతురు ||ఏమి||

అరులు పంచేంద్రియము లందు నిందు దియ్యఁగాను
కరవుతోడ మెరా వేసుకొంటివి
పరగనట్టే కాదా బలువులైనవారు
అరయఁ బేదలకైన ఆపద మానుతురు ||ఏమి||

పలుజన్మములే నన్ను పరిఅరికట్టుకొనఁగా
తొలఁగఁ ద్రోసి నాకుఁ ద్రోవ జూపితివి
యెలమి శ్రీవేంకటేశ యిల శూరులైనవారు
బలుభయ మిందరికిఁ బాపుచుందురు ॥పలు॥ 800

ముఖారి

దైవము పుట్టించినట్టితనసహజమే కాక
కోవిదుని కైనా జాలిగుణ మేల విడుచు ॥పల్లవి॥

ఆరయఁ బంచదార నద్దుక తినఁబోతే
చేరరానిముష్టిగింజ చేఁదేల మాను
సారమైనచదువులు సారె సారెఁ జదివినా
గోరపుదుష్టునికి కోప మేల మాను ॥దైవ॥

నిప్పు దెచ్చి వొడిలోన నీయమానఁ బెట్టుకొంటే
యెప్పుడును రాఁజుఁ గాక యిది యేల మాను
ముప్పిరిఁ బాతకుఁ డైనమూర్ఖుఁ డెన్నియాచారాలు
తప్పకుండ చేసినాను దయ యేల కలుగు ॥దైవ॥

యింటిలోనఁ గొక్కు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁ దవ్వ కేల మాను
గొంటరై శ్రీవెంకటేశుఁ గొలువకుండినవాఁడు
తొంటిసంసా రవుఁ గాక దొర యేటి కౌను ॥దైవ॥ 801

96-వ రేకు. నాట

ఇందులోనే కానవద్దా యిటేఁడు దైవమని
విందువలె నొంటిమిట్ట వీరరఘురాముని ॥పల్లవి॥

మెండు చొచ్చి బ్రహ్మవర మిలరావణుతలలు
కండువ రాఘవుఁడు ఖండించునాఁడు
ముందట జలధి యేమూల చొచ్చెఁ గొండలచే
గొందిఁ బడఁ గట్టివేసి కోపగించేనాఁడు ॥ఇందు॥

యేడనుండె మహిమలు యిందరి కిటఁడు వచ్చి
వేడుకతో హరువిల్లు విఱిచేనాఁడు
వోడక యింద్రాదు తెందు నోదిగి రీతనిబంటు
కూడఁబట్టి సంజీవికొండ దెచ్చేనాఁడు ॥ఇందు॥

జముఁ డెక్కడికిఁ బోయ సరయువులో మోచే
మమర జీవుల కిచ్చేనల్లనాఁడు
తెమలి వానరులై యీదేవతలే బంట్లైరి
తిమిరి శ్రీవేంకటపతికి నేఁడు నాఁడు ॥ఇందు॥ 302

శంకరాభరణం

అల వటపత్రశాయి వైనరూప మిట్టిదని
కొలువై పాదచాపేవా గోవిందరాజా ॥పల్లవి॥

పడఁతు లిద్దరిమీఁద పాదములు చాఁచుకొని
వొడికపురాజసాన నొత్తిగిలి
కడ లేనినిజనాభికమలమున బ్రహ్మను
కొడుకుఁగాఁ గంటి విదే గోవిందరాజా ॥అల॥

సిరులసొమ్ములతోడ శేషునిపైఁ బవళించి
సారిది దాసులఁ గృపఁ జూచుకొంటాను
వరుసదైత్యులమీఁద పామువిషములే నీవు
కురియించితివిగా గోవిందరాజా ॥అల॥

శంఖుఁజక్రములతోఁడఁ జాఁచినకరముతోఁడ
అంకెల శిరసుకింది హస్తముతోఁడ
తెంకిని శ్రీవెంకటాద్రిదిగువతిరుపతిలో
కొంకక వరము లిచ్చీగోవిందరాజా ॥అలి॥ 303

ముఖారి

కంటే సులభ మిది కానక యుంటే దుర్లభ
మింటిలోననే వున్న దిహముఁ బరమును ॥పల్లవి॥

హరిదాసులు మెట్టినక్కడే పరమపద
మరయ నిందుకంటె నవల లేదు
తిరమై వీరిపాదతీర్థమే విరజానది
సొరిది నన్నిచోట్లు చూచినట్టే వున్నది ॥కంటే॥

మచ్చిక వైష్ణవులమాట లెల్లా వేదములు
యిచ్చల నిందుకంటే నింక లేదు
అచ్చట వీరిప్రసాద మమృతపానములు
అచ్చుమై తెలిసేవారి కఱచేత నున్నది ॥కంటే॥

చెలఁగి ప్రపన్నులనేవే విజ్ఞానము
ఫల మిందు కంటే మఱి పైపై లేదు
తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు
తెలుమి నెదుట నున్నా రెఱఁగినవారికి ॥కంటే॥ 304

బౌళి

అరుదరుదు నీమాయ హరిహరి
అరసి తెలియరాదు హరిహరి ॥పల్లవి॥

అనంతబ్రహ్మాండము లవే రోమకూపముల
అనంతములై వున్నవి హరిహరి
పొనిఁగి కుంగిన వొక్కభూమి నీ వెత్తినది యే
మని నుతింతు నిన్ను హరిహరి ॥అను॥

పొదిగి బ్రహ్మాదులు నీబొడ్డున నేకాలము
అదివో పుట్టుచున్నారు హరిహరి
పొదలి యీజీవులను పుట్టించేయీసామర్థ్యము
అదన నేమని చెప్పే హరిహరి ॥అను॥

పావనవైకుంఠము నీపాదమూలమం దున్నది
ఆవహించేభక్తిచేత హరిహరి
శ్రీవెంకటాద్రిమీఁద చేరి నీ విట్టే వుండఁగా
నావల వెదక నేల హరిహరి ॥అను॥ 805

శ్రీరాగం

జడమతి రహం కర్మజంతు రేకోహమ్
జడధినిలయాయ నమో సారసాక్షాయ ॥పల్లవి॥

పరమపురుషాయ నిజభక్తజనసులభాయ
దురితదూరాయ సింధురహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో ॥జడ॥

నగసముద్ధరణాయ నందగోపసుతాయ
జగదంతరాత్మాయ సగుణాయ
మృగనరాంగాయ నిర్మితభవాండాయ ప
న్నగరాజశయనాయ నమో నమో ॥జడ॥

దేవదేవేశాయ దివ్యచరితాయ బహు
భావనాతీతాయ పరమాయ
శ్రీవేంకటేశాయ జితదైత్యనికరాయ
భూవల్లభాయ నమో పూర్ణకామాయ ॥జయ॥ 306

## మలహరి

ఎన్నఁడు పక్వము గాదిది యింద్రియభోగంబులచే
సన్నము దొడ్డును దోఁచీ సంసారఫలంబు ॥పల్లవి॥

తిత్తితో నూరేండ్లకును దేహము పండఁగఁ బండఁగ
చిత్తం బెన్నఁడు పండక చిక్కెను కసుగాయై
పొత్తుల పుణ్యముఁ బాపము పులుసును తీపై రసమున
సత్తు నసత్తును దోఁచీ సంసారఫలంబు ॥ఎన్న॥

వెదవడి పుత్రులు పౌత్రులే విత్తులు లోలో మొలచియు
పొదిఁ గర్మపుపూ మారదు పూపిందయిన దిదే
తుద నిది సుఖమును దుఃఖము తోలును గింజలు ముదురక
చదురము వలయము తోఁచీ సంసారఫలంబు ॥ఎన్న॥

వినుకలి చవుల నదలో వేమరు మాఁగఁగఁ బెట్టిన
ఘనకర్మపుటాఁగ రుచిగదు కమ్మఁ పూగాయై
మనువుని శ్రీవేంకటేశుఁడు మహానాచార్యుఁడు కానక
చనవున నియ్యఁగ వెలసెను సంసారఫలంబు ॥ఎన్న॥ 307

37-వ రేకు.

## లలిత

అమ్మో దొకటి అసిమలో దొకటి
బిమ్మటి నిండేటిపెద్దల మయ్యా ॥పల్లవి॥

సంగము మానక శాంతియుఁ గలుగదు
సంగలంపటము సంసారము
ముంగిలి దేహం చింతకు మూలము
చెంగల మిఁకేటి పెద్దల మయ్యా ||అమ్మ||

కోరిక లుడుగక కోపం బుడుగదు
కోరకుండ దిక్కు వమనను
క్రూరత్వమునకు కుదువ యీ బ్రదుకు
చేరడి నేమిటి పెద్దల మయ్యా ||అమ్మ||

ఫలము లందితే బంధము వీడదు
ఫలములో తగులు ప్రపంచము
యిలలో శ్రీవేంకటేశుదాసులము
పిలువఁగ నేమిటి పెద్దల మయ్యా ||అమ్మ|| 308

లలిత

అటువంటివాఁడు వో హరిదాసుఁడు
అటమటాలు విడిచినాతఁడే సుఖి ||పల్లవి||

తిట్టేటిమాటలును దీవించేమాటలును
అట్టె సరేని తలఁచినాతఁడే సుఖి
పట్టి చంపేవేళను పట్టము గట్టేవేళ
అట్టు నిట్టు చలించనియాతఁడే సుఖి ||అటు||

చేరి పంచదారిడినఁ జేఁదు దెచ్చి పెట్టినాను
అరగించి తనివొందేయతఁడే సుఖి
తేరకాండ్లఁ జూచిన తెగరానిచుట్టముల
నారయు సరిగాఁ జూచేయాతఁడే సుఖి ||అటు||

పొంది పుణ్యము వచ్చిన పోరి పాపము వచ్చిన
నందలిఫల మొల్లనియాతఁడే సుఖి
విందుగా శ్రీవేంకటాద్రివిభునిదాసులఁ జేరి
అందరానిపద మందినాతఁడే సుఖి ॥అటు॥ 309

## గుండక్రియ

ఎవ్వరు కర్తలు గారు యిందిరానాథుఁడే కర్త
నివ్వటిల్లాతనివారై నేమము దప్పకురో ॥పల్లవి॥

కర్మమే కర్తయైతే కడకు మోక్షము లేదు
అర్మిలి జీవుఁడు కర్తయైతే బుట్టుగే లేదు
మర్మపుమాయ కర్త అయితే మరి విజ్ఞానమే లేదు
నిర్మలము హరి దింతే నిజమి దెఱఁగరో ॥ఎవ్వ॥

ప్రపంచమే కర్తయైతే పాపపుణ్యములు లేవు
వుపమ మనసు కర్తై వుంటే నాచారమే లేదు
కపటపుదేహములే కర్తలయితే చావు లేదు
నెపము శ్రీహరి దింతే నేరిచి బ్రదుకరో ॥ఎవ్వ॥

పలుశ్రుతులు కర్తలై పరగితే మేర లేదు
అల బట్టబయలు కర్తైతే నాధారము లేదు
మొలమి నిందరికిఁ గర్త యిదివో శ్రీవేంకటాద్రి
నిలయపుహరి యింతే నేఁడే కొలువరో ॥ఎవ్వ॥ 310

## బౌళి

ధరవైన యట్టుండు మెఱఁగని దీమాయ
తెరమఱుఁగు మోకమువలె తిరుగు నీబ్రదుకు ॥పల్లవి॥

అనిశమును దేహమున కన్నపానము లిడిన
యినుము గుడిచిన నీరు నెందు కెక్కెనదో
గొనకొన్న మానినుల కూటములసుఖము లివి
మనసు దాగినపాలు మట్టులే దెపుడు ॥ఇది॥

వొడలఁ బెట్టినసొమ్ము లొగిఁ దనకుఁ గాదరా
వడపిఁ గాసినవెన్న లది కన్నులకును
పుడివోనివరిమళము లోకనిమిషమాత్రమే
కొడిదంపుభ్రమలోడి పెనుగాలిమూట ॥ఇది॥

చద్దిసంసారమున సరుససుఖదుఃఖములు
మొద్దు మొనుపోతున్న యేకంబు గాదు
వొద్దికై శ్రీవేంకటోత్తముఁడు యింతలో
అద్దంపునీడవలె నాత్మఁ బొడచూపె ॥ఇది॥ 311

## భైరవి

నీ వేమి సేతు వయ్య నీవు దయానిధి వందువు
భావించ లేనివారిపాప మింతే కాని ॥పల్లవి॥

పరమపద మొసఁగి పాప మడఁచే నని
చరమశ్లోకమునందు చాటితివి తొలుతనే
విరతిని భూమిలోన నీవల్లఁ దప్పు లేదు
పరగ నమ్మనివారి పాప మింతే కాని ॥నీవే॥

నీపాదములకు నాకు నెయ్యమైన లంకని
దేవున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత
దావుగా నీవల్ల నింకఁ దప్పు లేదు నెంచి చూచి
పైపై నమ్మనివారి పాప మింతే కాని ॥నీవే॥

బంటు బురాణములను భక్తసులభుఁడ నని
అంతరాత్మ నీమాట ఆడితివి తొలుతనే
యింతట శ్రీవేంకటేశ యేమి సేతు వయ్య నీవు
వంతాన నమ్మనివారి పాప మింతే కాని ॥నీవే॥ 812

వాళి

కాయ మనేవూరికి గంతలు తొమ్మిది యాయ
పాయక తిరిగాడేరు పాపపుతలారులు ॥పల్లవి॥

కాముఁ డనియెడిరాజు గద్దెమీఁద నుండఁగాను
దీము గోపవుప్రధాని దిక్కై లీని
కోమలపుజ్ఞాన మెల్లాఁ గొల్లఁబోయ నాడ నాడ
గామిడులై రింద్రియవుఁగాఁవు లెల్లా నిదివో ॥కాయ॥

చిత్త మనేదళవాయి చింత లనేపాఁజు వెట్టి
యిత్తలవిషయములు యెన్ని కిచ్చిరి
తుత్తుమురై కోరికెల దొంగము రేఁగఁగఁ జొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీఁ బుట్టుగులు ॥కాయ॥

బలుసంసార మనేటిభండారము ఘనమాయ
కలదీగి జవ్వనపుకై జీతము
యిలలో శ్రీవెంకటేశుఁ డింతలో జీవుఁ డనేటి
బలువుని రాజుఁ జేసి పాలించె నన్నును ॥కాయ॥ 813

రేకు. 338 సాళంగనాట

అట్టివేళఁ గలఁగనీ దదివో వివేకము
మటుపడితే శాంతము మతి యేలా ॥పల్లవి॥

జడధులు పొంగినట్టు సందడించు నింద్రియములు
వొడలిలో జీవునికి నొక్కొక్కవేళ
బడబాగ్ని రేగినట్టు పైకొని ముంగోపము
వుడికించు మనసెల్ల నొక్కొక్కవేళ ॥అట్టి॥

అరయఁ గొండ యెత్తినట్టు వేఁగొ సంసారము
వూరక కలిమిలేము లొక్కొక్కవేళ
మేర లేనిచీఁకటై మించును దుఃఖము లెల్లా
వూరట లేనికర్మికి నొక్కొక్కవేళ ॥అట్టి॥

పెనుగాలి వీచినట్టు పిక్కుకోరికలు ముంచు
వొసర నజ్ఞానికి నొక్కొక్కవేళ
యెనయఁగ శ్రీవెంకటేశుదాసుఁడై సదాఁకా
వునికి బాయ విన్నియు నొక్కొక్కవేళ ॥అట్టి॥ 814

## శంకరాభరణం

సరవాది సాహసులు నిత్యశూరులు
దురితవిదూరులు ధ్రువాదులు ॥పల్లవి॥

తక్కక శ్రీహరిభక్తి తాపలు నేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడ నేసుక దాఁటిరి
పెక్కుసంసారజలధి భీష్మాదులు ॥సర॥

కడువిరక్తి యనేటికత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసుల పాఁజలు గూడుకొనిరి
నుడివడ కిహమందే శుకాదులు ॥సర॥

పరమశాంతము లనేపట్టపేనుగులమీఁద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవెంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు ॥పర॥ 315

## గుజ్జరి

సంసారి నై ననాకు సహజమే
కంసారి నే నిందు కెల్లాఁ గా దని వగవను ॥పల్లవి॥

నరుఁడ నైననాకు నానాసుఖదుఃఖములు
నరి ననుభవించేది సహజమే
హరిని శరణాగతు లై సమీఁదఁ బరాభవ
మరయ నిన్నంటు నని అందుకే లోఁగేను ॥సంసా॥

పుట్టిననాకుఁ గర్మపుహాంగుకు లోనై నవాఁడ
జట్టిగాఁ గట్టువడుట సహజమే
యిట్టే నీవారికి మోక్ష మిత్తు నన్ననీ మాట
వట్టువోయినో యని వంకించే నే నిపుడు ॥సంసా॥

మాయకు లోనైననాకు మర్త్యుఁడనై యున్నాఁట్లు
ఛాయకు రాని దెల్లా సహజమే
యీమెడ శ్రీవెంకటేశ యేలితివి నన్ను నీవు
మాయరాసినేను నీకు మోపని వీఁగేను ॥సంసా॥ 316

## సామంతం

ఇహమునుఁ బరమును యిందే వున్నవి
వహి కెక్కఁ దెలియు వారలు లేరూ ॥పల్లవి॥

చుట్టువంటిదీ చంచలవుమనను
కొట్టులఁ బడేది గుఱి గాదు ।
దిట్ట వోరులు బోధించినఁ గరఁగదు
పట్టఁబోయితే పస లేదు ॥ఇహ॥

చిగురువంటిదీ జీవశరీరము
తగుళ్లు పెక్కులు తఱి లేదు
తెగనిలంపటమే దినమునుఁ జెనకును
మొగము గలదిదే మొనయును లేదు ॥ఇహ॥

గనివంటిది యీఘనసంసారము
తనిసి తన్వినాఁ దగ లేదు
ఘనుఁ డగు శ్రీవేంకటపతి గావఁగ
కొన మొదలేర్పడేకొంకే లేదు ॥ఇహ॥ 317

సాళంగం

నేరిచి బ్రదికేవారు నీదాసులు
నేరమిఁ బాసినవారు నీదాసులు ॥పల్లవి॥

కామముఁ గ్రోధము రెంటిఁ గాదని విడిచి మంచి
నేమము వట్టినవారే నీదాసులు
దోమటిఁ బాపపుణ్యాలఁ దుంచి వేసి చూడఁగానే
నీమాయ గెలిచినారు నీదాసులు ॥నేరి॥

కిక్కిరించినయానలఁ గిందు వేసి మోక్షము
నిక్కి నిక్కి చూచేవారు నీదాసులు
వెక్కసపుభక్తితోడ వెలుపు మఱుపు లేక
నెక్కొన్నమహిమవారు నీదాసులు ॥నేరి॥

అట్టివేదశాస్త్రముల అర్థము దేటపఱచి
నట్టుకొని మించినారు నీదాసులు
యిట్టి శ్రీవేంకటేశ యితరమార్గము లెల్లా
నట్టువడఁ దోసినారు నీదాసులు ॥నేరి॥ 818

ముఖారి

ఇందిరాపతిమాయలు యింతులు సుండీ
మందలించి హరిఁ గొల్చి మనుదురు గాని ॥పల్లవి॥

అతివల చూపులే ఆయాలు దాఁకే జుండీ
జిత మైనపులకలఁ జిల్లు లోఁ జుండీ
రతివరవశములు రాఁగినమూర్ఛలు సుండీ
మతిలోఁ దప్పించుక మనుదురు గాని ॥ఇంది॥

మెఱయుచేచన్నులే మించుఁజెల్లు గుండ్లు సుండీ
మెఱుఁగుమోవులే మచ్చుమేపులు సుండీ
మఱి మంచిమాటలు మాయపుటురులు సుండీ
మఱవక తప్పించుక మనుదురు గాని ॥ఇంది॥

బలుసంసారపుపొందు పాముతోడిపొత్తు సుండీ
వెల లేనివలపులు విషము సుండీ
మెలిమితో శ్రీవేంకటేశ్వరు మఱఁగు చొచ్చి
మలయుచు సొలయుచు మనుదురు గాని ॥ఇంది॥ 819

-వ రేకు. శ్రీరాగం

తెలిసిన బ్రహ్మోపదేశ మిదే
మలసి మనసు నిదే చూచీ గాక ॥పల్లవి॥

పుట్టించినవారి పూరి మేపునా
గట్టిగా రక్షించఁగా కతఁడు
కట్టడిజీవుఁడు కానక నోళ్లు
తెట్టఁదెరువునకు తెఱచీఁ గాకా ||తెలి||

అంతరాత్మ తను నట్టే మఱచేనా
చింతలోఁ బెరరేఁచీఁ గాకా
పంతపుజీవుఁడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచుఁ దూఱీఁ గాకా ||తెలి||

నొసల వ్రాసినవి నోమించుఁగాకతఁ
డసిన శ్రీవేంకటేశ్వరుఁడు
విసుగక జీవుఁడు వీఁడిమాయల
నసురుసు రయి తా నలసీఁ గాకా ||తెలి|| ౩౬౦

బౌళి

కనినవాఁడఁ గాను కాననివాఁడఁ గాను
పూనిఁగి వొరుల కైతే బోధించే నేను ||పల్లవి||

ధరణిఁ గర్మము గొంత తగినజ్ఞానము గొంత
నరికి నరే కాని నిశ్చయము లేదు
వొరిమి నెంచి చూచితే నొకటి వాఁడఁ గాను
నరవి దెలియ కేమోఁ చదివేము నేము ||కని||

యీతల నిహము గొంత యింతలోఁ బరము గొంత
చేతులు రెండు చాఁచే చిక్కుట లేదు
యీతెరువులో నొకటి నేరుపరచుకోలేను
కాతరాన కత లెల్లా గఱచితి నేను ||కని||

దైవిక మొకకొంత తగుమానుషము గొంత
చేవలు చిగురువలెఁ జేసేను
యీవల శ్రీవేంకటేశుఁ డిది చూచి నన్నుఁ గాచె
భావించలేక యిన్నాళ్ళు భ్రమసితి నేను ॥కని॥ 321

సారంగనాట

మించినవేడుకతోడ మొక్కుట గాక
కంచములోపలికూడు కాలఁ దన్న నేటికే ॥పల్లవి॥

వేదార్థములు నీవే విచారించినసుద్దులే
కాదని అవునని కొస్సివాదము లేల
యేది నీవు సేసినాను యిన్నియును నిత్యకోలే
సోదించ నేటికి యందు సొల్లు లెంచ నేటికే ॥మించి॥

కర్మము లిన్నియును నీకైంకర్యసాధనాలే
అర్మిలిఁ దారతమ్యము లడుగ నేల
నిర్మితము నీ దింతే నెరసు లెంచఁగ నేల
ధర్మమందు నింక గజదంతపరీక్షేఁటికే ॥మించి॥

భక్తి యింతా నీకు ఘంటాపథమునిశావలె
యుక్తిఁ బాత్రాపాత్రములు యూహించ నేల
ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీపాదములు
భక్తులయి నమ్ముట గాక చలపద మేటికే ॥మించి॥ 322

దేసాళం

అంచితపుణ్యులకైతే హరి దైవ మవుఁగాక
పంచమహాపాతకుల భ్రమ పాప కళిమా ॥పల్లవి॥

కానని యజ్ఞానులకు కర్మమే దైవము
ఆనినబద్ధులకు దేహమే దైవము
మానని కాముకులకు మగువలే దైవము
పానిపట్టి వారి వారి భ్రమ మాన్ప వశమా ॥అంది॥

యేమి నెఱఁగనివారి కింద్రియములు దైవము
దోమటిసంసారి కూరదొర దైవము
తామసుల కెల్లాను ధనమే దైవము
పామరుల బట్టిన భ్రమఁ బాప వశమా ॥అంది॥

ధగ నహంకారులకు తాఁదానే దైవము
దరిద్రుఁ డైనవానికి దాత దైవము
యిరవై మాకు శ్రీవేంకటేశుఁడే దైవము
పరుల ముంచినయట్టి భ్రమఁ బాప వశమా ॥అంది॥ 323

## మలహరి

ఎట్టయినాఁ జేయుము యిఁక నీచిత్తము
కిట్టిన నీసంకీర్తనపరుఁడా ॥పల్లవి॥

కొందరు జ్ఞానులు కొందరు భక్తులు
కొందరు వైరాగ్యకోవిదులు
యిందరిలో నే నెవ్వఁడఁ గా నిదె
సందడి హరి నీశరణాగతుఁడా ॥ఎట్ట॥

జపితలు కొందరు శాస్త్రులు కొందరు
ప్రవర్తిఁ గొందరు బలువులు
వుపమించఁగ ని న్నొక్కఁడఁగా నిందు
కపురుల నీడింగరీఁడ నేను ॥ఎట్ట॥

ఆచార్యపురుషులు అవ్వలఁ గొందరు
యేచినసమయులై యేర్పడిరి
కాచేటిశ్రీవేంకటపతి నేనైతే
కాచి నీదాసులదాసుఁడను ॥ఎట్టు॥ 324

రామక్రియ

ఒక్కఁడే అంతర్యామి వుపకారి చేపట్టు
తక్కినవి యిన్నియును తలఁపు రేఁచెడివి ॥పల్లవి॥

మెఱుఁగుదిరా జీవుఁడా యింద్రియాలు సొమ్ము గావు
గుఱియై మాయలలోనఁ గూడించే వింతే
మఱవకు జీవుఁడా మనసు చుట్టము గాదు
తెఱఁగొప్ప ఆసలానే తిప్పెడి దింతే ॥ఒక్క॥

తెలుసుకో జీవుఁడా దేహమును నమ్మరాదు
వలసితే నుండుఁ బోవు నన్నవంటిది
తలఁచుకో జీవుఁడా ధనము దనిచ్చగాదు
వలులంపటములచేఁ బరిచెడి దింతే ॥ఒక్క॥

నమ్మతించు జీవుఁడా సంసార మొకజాడ గాదు
టి పొద్దొక జాడ పెనచు నింతే
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డితనిమూలమే యింతా
నెమ్మిఁ దానే గతి యంటే నిత్యమవు నింతే ॥ఒక్క॥ 325

00-వ రేకు. శంకరాభరణం

శతాపరాధములు సహస్రదండన లేదు
గతి నీవని వుండఁగ కావకుందరాదు ॥పల్లవి॥

తలఁచి నీకు మొక్కఁగా దయఁజూడ కుండరాదు
కొలిచి బంట ననఁగా కోపించరాదు
నిలిచి భయహస్తుఁడనై నీయెదుట దైన్యమే
పలుకఁగఁ గావకుండఁ బాడి గాదు నీకు ॥తల॥

శరణు చొరఁగ నీకు సారె నాజ్ఞ వెట్టరాదు
వరిఁ బూరి గరవఁగ చంపరాదు
అరయ జగద్ద్రోహి నౌదు నైనా నీనామము
గరిమె నుచ్చరించఁగఁ గరఁగక పోదు ॥తల॥

దిక్కు నీవని నమ్మఁగా దిగవిడువఁగరాదు
యెక్కువ నీలెంకఁగాఁగా యేమనరాదు
తక్కక శ్రీవెంకటేశ తప్పు లెల్లాఁ జేసి వచ్చి
యిక్కడ నీదాసినైతి నిఁకఁ దోయరాదు ॥తల॥ 326

పాడి

ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి ॥పల్లవి॥

ముంచిననారాయణమూర్తులే యీజగ మెల్ల
అంచితనామములే యీయక్షరా లెల్లా
పంచుకొన్న శ్రీహరిప్రసాద మీకాయము లెల్లా
తెంచి వేసి మేలు దాఁ దెలిసేటివారికి ॥ఎదు॥

చేరిపారేటినదులు శ్రీపాదతీర్థమే
భారపుయీభూమితని పాదరేణువే
సారపుఁగర్మములు కేశవునికైంకర్యములే
ధీరులై వివేకించి తెలిసేటివారికి ॥ఎదు॥

చిత్తములో భావ మెల్లా శ్రీవేంకటేశుఁడే
హత్తినప్రకృతి యెల్లా నాతనిమాయే
మత్తిలి యీతనికంటే మరి లే దితరములు
తిత్తిదేహపుబ్రదుకు తెలిసేటివారికి ॥ఎదు॥ 327

## లలిత

ఏల మోసపోయిరో కో యెంచి యీకాలపువారు
బాలకృష్ణునిబంట్లై బ్రదుకవద్దా ॥పల్లవి॥

పసులఁ గాచేవాని బ్రహ్మ నుతించె నంటేను
దెసలదేవుఁడే యని తెలియవద్దా
సిసువు గోవర్ధనాద్రి చేతఁ బట్టి యెత్తె నంటే
కొసరీతని పాదాలే కొలువవద్దా ॥ఏల॥

నరునికి విశ్వరూ పున్నతిఁ జూపె నంటేను
నరహరి యితఁడని నమ్మవద్దా
పరగఁ జక్రముచేత బాణుని నఱకె నంటే
సారిదీతని శరణు చొఱవద్దా ॥ఏల॥

అందరు సురలలోన నగ్రపూజ గొన్నవాఁడే
చెంది యీతనికృపకుఁ జేరవద్దా
అంది శ్రీవేంకటేశుఁ డదృష్టదైవ మంటే
విందులఁ బరులసేవ విడువవద్దా ॥ఏల॥ 328

## శుద్ధవసంతం

ఇంతటిదైవము మాకు నిటు నీవు గలుగఁగ
యెంతవారమో భాగ్య మేమి చెప్పే దింకను ॥పల్లవి॥

తలకొని వొకకొంతధనము గనినవాఁడు
వెల లేనిగర్వముతో విఱ్ఱవీఁగీని
బలువుతో వొకరాజుఁ బట్టి కొలిచినవాఁడు
నలిగతో నా కెవ్వరు నరి యనీని ॥ఇంత॥

వింతగా నొకపరుసవేది చేతఁ గలవాఁడు
యెంతవారిఁ గైకోఁడు యెక్కుడంటాను
పొంత నొకమంత్రము వంపు సేయించుకొనేవాఁడు
అంతటికి గురుఁడంటా నని మురిసీని ॥ఇంత॥

మొగువ నొకదుర్గము నెక్కుక యేలేవాఁడు
పగవారిఁ గైకొనక బలువయ్యీని
అగపడి శ్రీవెంకటాద్రిమీఁద నున్ననిన్నుఁ
దగ నమ్మిపట్టివాఁడ ధన్యుఁడ నేను ॥ఇంత॥ 439

బౌళి

సుఖమును దుఃఖమును జోడుకోడెలు
అఖిలముఁ గన్నవారు అడ్డమాడ రెప్పుడు ॥పల్లవి॥

యెందాఁకా సంసార మెనసి తాఁ జేసేను
అందాఁకా లంపటము లవి వోవు
కందువ జీవుఁడు భూమిఁ గాయ మెన్నాళ్ళు మోఁచె
అందుకొన్నతనలోని యాసలూఁ బోవు ॥సుఖ॥

అప్పటి దనకు లోలో ఆఁకలెంత గలిగినా
తప్పక అందుకుఁ దగ దాహముఁ బోదు
అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్ళు వుండే
ముప్పిరి వడ్డీ వారక మూలనుండినాఁ బోదు ॥సుఖ॥

దైవముపై భక్తి లేక తనకు నన్నాళ్ళుండే
దావతి కర్మపుపాటు తనకుఁ బోదు
శ్రీవెంకటేశ్వరునిసేవ దన కెప్పు డబ్బె
నోవరినందలిమేలు వొల్లనన్నాఁ బోదు ॥సుఖ॥ 380

సాళంగం

మొఱ వెట్టెద మీకు మొగసాలవాకిటను
మఱఁగు చొచ్చితి మీకు మముఁ గావరో ॥పల్లవి॥

యేపున మన సనియెటిమా పెంపుడు లేడు
పాప మనేయడవిఁ బడినది
రావున హరికింకరపువేఁటకాండ్లాల
పైపైని మా కింకఁ బట్టియ్యరో ॥మొఱ॥

అంచెల మావిజ్ఞాన మనెడి కామధేనువు
పంచేంద్రియపుగొందిఁ బడినది
మించి వైకుంఠాన కేఁగే మేటితెరువరులాల
దించక యెత్తెత్తి వెళ్ళఁదియ్యరో ॥మొఱ॥

అందనే మోహాంధకార మనెడిమాదిగ్గజము
దండిమీదయనెటి వోఁదానఁ బడెను
నిండి శ్రీవెంకటేశుఁ డనేటిమావటీనిచేత
గండికర్మపుకంభానఁ గట్టించరో ॥మొఱ॥ 381

# సూచికలు ౧

## సంకీర్తన రాగముల అకారాది సూచి


| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| ఆహిరి | 24, 29, 30, 50, 59, 87, 104, 108, 124, 132, 137, 152, 166, 224, |
| కన్నడగౌళ | 41, 65, 105, 120, 160, 173, 175, 185, 201, 290, |
| కాంబోధి | 16, 77, 119, 147, 210, 236, |
| కురంజి | 170, |
| కేదారగౌళ | 72, |
| గుండక్రియ | 6, 18, 32, 49, 70, 94, 95, 110, 205, 237, 255, 2[illegible]8, 284, 294, 297, 310, |
| గుజ్జరి | 216, 223, 233, 269, 270, 316, |
| గౌళ | 31, 277, |
| దేవగాంధారి | 133, 139, 157, 188, 190, 192, 218, 236, 288, |
| దేసాక్షి | 2, 3, 27, 91, 102, 134, 244, 293, 323, |
| దేసాళం | 213, 215, 295, |
| ధన్నాసి | 12, 36, 42, 79, 80, 90, 123, 164, 220, |
| నాట | 103, 186, 203, 204, 2[illegible]3, 261, 278, 302, |
| నాదరామక్రియ | 84, |
| [illegible] | 78, |

5, 28, 115, 125, 159, 163, 198, 231, 271, 327, 9, 39, 48, 114, 145, 209, 212, 228, 238, 250, 251, 254, 265, 285, 289, 292, 305, 311, 318, 321, 330,

భూపాలం 38, 54, 81, 191, 195, 202, 229,

భైరవి 58, 120, 193, 200, 241, 291, 312,

మలహరి 83, 130, 177, 230, 256, 260, 267, 307, 324,

మాళవి 11, 97, 174, 239, 246,

మాళవిగౌళ 274,

ముఖారి 19, 26, 51, 56, 67, 74, 76, 100, 101, 131, 136, 151, 154, 167, 181, 189, 196, 197, 207, 237, 281, 28[illegible], 301, 304, 319.

రామక్రియ 129, 219, 221, 235, 245, 243, 273, 287, 325,

లలిత 43, 45, 46, 96, 98, 116, 117, 122, 158, 171, 194, 234, 240, 242, 247, 258, 264, 275, 276, 280, 282, 296, 300, 308, 309, 328.

వరాళి 16, 75, 85, 89, 126, 153, 176, 178, 217.

శంకరాభరణం 13, 41, 61, 92, 140, 156, 183, 222, 249, 279, 298, 303, 315, 326.

శుద్ధవసంతం 7, 8, 21, 168, 262, 329.

శ్రీరాగం 17, 20, 22, 23, 25, 37, 40, 53, 55, 57, 64, 66, 68, 71, 78, 82, 88, 93, 112, 118, 127, 133, 143, 144, 148, 150, 155, 169, 173, 184, 187, 211, 272, 306, 320.

సామంతం 1, 4, 10, 33, 35, 44, 47, 55, 60, 62, 68, ౭.
84, 86, 93, 106, 107, 118, 121, 135, 141, 142,
146, 149, 161, 162, 165, 179, 182, 199, 206,
208, 257, 259, 263, 268, 317.

సాళంగం 111, 214, 232, 318, 331.

సాళంగనాట 109, 130, 225, 243, 252, 266, 299, 314, 322.

౨

## సంకీర్తనల అకారాది సూచిక.


| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంగడి నెవ్వరు నంటకురో | శ్రీరాగం | 144 |
| అంగనలాల మనచే నాడించుకొన | శంకరాభరణం | 279 |
| అంచితపుణ్యుల కైతే హరి | దేసాక్షి | 323 |
| అంతరంగ మెల్లా శ్రీహరి | శుద్ధవసంతం | 262 |
| అక్కట కొదగనియట్టియర్థము | ముఖారి | 281 |
| అట్టివేళఁ గలఁగనీ దదివో | సాళంగనాట | 314 |
| అటు గుదువు మనన నీ వన్నిలాగుల | సామంతం | 84 |
| అటువంటివాఁడు వో హరిదాసుఁడు | లలిత | 309 |
| అతిశయమగుసౌఖ్య మనుభవింపు | లలిత | 96 |
| అదిగాక నిజమతం బదిగాక | శ్రీరాగం | 40 |
| అది నాయపరాధ మిది నాయపరాధ | మాళవి | 174 |
| అదివో అల్లదివో హరివాసము | శ్రీరాగం | 23 |
| అదె చూడు తిరువెంకటాద్రి | మలహరి | 130 |
| అదె వాఁడె యిదె వీఁడె అందు నిందు | శంకరాభరణం | 249 |
| అన్నిచోట్లఁ బరమాత్మ నీవు | ముఖారి | 181 |
| అన్నిటికిఁ గారణము | దేసాళం | 295 |
| అన్నియును నతనికృత్యములే | శ్రీరాగం | 20 |
| అనుమానపుఁబ్రదుకదిరోఁతా | ముఖారి | 26 |
| అప్పుడువో నినుఁగొలువఁగనరుహాము | లలిత | 43 |
| అమ్మే దొకటి అసిమలో దొకటి | లలిత | 308 |
| అయ్యో పోయం బ్రాయము గాలము | సామంతం | 121 |

| | రాగము | సంకీర్తన |
|---|---|---|
| అయ్యో మానుపఁగదవయ్యా | నాట | 208 |
| అరి[illegible] నేఁతలే చేసి తల్లాడ నిల్లాడ | ముఖారి | 197 |
| అరుదరుదు నీమాయ హరి | బౌళి | 305 |
| అల వటపత్రశాయివైన | శంకరాభరణం | 303 |
| ఆఁకటివేళ నలపైన వేళలను | ముఖారి | 100 |
| ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా | భూపాలం | 191 |
| ఆటవారి గూడి తౌరా | కన్నడగౌళ | 105 |
| ఆతనినే నే కొలిచి నే నందితి | గుజ్జరి | 269 |
| ఆదిదేవ పరమాతుమా | దేవగాంధారి | 192 |
| ఆదిదేవుఁడై యందరిపాలిటి | సామంతం | 69 |
| ఆదిమునులసిద్ధాంజనము | ధన్నాసి | 164 |
| ఆపదల సంపదల నలయు టేమిటికినో | వరాళి | 85 |
| ఆపద్బంధుఁడు హరి మాకుఁగలఁడు | సామంతం | 263 |
| ఆపన్నులపాలిదైవ మాతఁడే | శ్రీరాగం | 169 |
| ఆలాగుపొందులును నటువంటి | ఆహిరి | 30 |
| ఆశాబద్ధుఁడనై యలసి నిన్ను | లలిత | 117 |
| ఇంతటిదైవము మాకు | శుద్ధవసంతం | 3[illegible]9 |
| ఇంత నేసేఁబోదైవ మింతలోననే | కన్నడగౌళ | 185 |
| ఇంతే మతేమి లేదు యిందుమీఁదను | గుజ్జరి | 223 |
| ఇందిర వడ్డించ నింపుగను | శ్రీరాగం | 22 |
| ఇందిరాధిపునిసేవ యేమర కుండుట | సామంతం | 259 |
| ఇందిరానాథుఁ డిన్నిటి కిత డింతే | బౌళి | 289 |
| ఇందిరానామ మిందరికి | శుద్ధవసంతం | 8 |
| ఇందిరాపతిమాయలు | ముఖారి | 319 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇందు గొలికెయిందఱును నిట్లయిరి | మాళవి | 11 |
| ఇందులోనే కానవద్దా | నాట | 302 |
| ఇటుగన సకలోపాయములుడిగిన | గుజ్జరి | 216 |
| ఇటువలెనే పో సకలము | బౌళి | 209 |
| ఇతఁడు సేసినసేఁత లెన్ని లే విలమీఁద | శ్రీరాగం | 68 |
| ఇతరధర్మము లందు నిందు గలదా | ఆహిరి | 224 |
| ఇతరులకు నిను నెఱుఁగదరమా | శ్రీరాగం | 155 |
| ఇదియే మర్మము హరియిందు గాని | సాళంగనాట | 243 |
| ఇదివో సంసారమెంత సుఖమో కాని | శ్రీరాగం | 211 |
| ఇన్నియుఁ గలుగు టీజన్మమున నైన | నాదరామక్రియ | 34 |
| ఇన్నిలాగులచేతు లివియపో | ఆహిరి | 108 |
| ఇన్ని సేఁతలకు నిది యొకటే | దేవగాంధారి | 188 |
| ఇప్పుడిటు కలగంటి నెల్లలోకముల | భూపాలం | 38 |
| ఇర వగువారికి యిహపర మిదియే | లలిత | 264 |
| ఇరవైన యట్టుండు మొగఁగని | బౌళి | 311 |
| ఇహమునుఁ బరమును యింటే | సామంతం | 317 |
| ఈదేహవికారమునకు నేదియుఁ గడపల | లలిత | 171 |
| ఈపాదమేకదా యిల యెల్లఁ గొలిచినది | శ్రీరాగం | 66 |
| ఈవిభవమునకుఁ జూడ నేది గడపల | శ్రీరాగం | 127 |
| ఈవిజ్ఞానంబు యెవ్వరికిఁ దోఁప దిది | శ్రీరాగం | 64 |
| ఉన్నవిచారము లేల వోహో సంసారులాల | సాళంగనాట | 266 |
| ఉప్పవడము గాకున్నా రిందఱు | ధన్నాసి | 90 |
| ఎంతటివారలు నెవ్వరును హరి | గుండక్రియ | 83 |
| ఎంతపాపకర్మమాయ యెంతవింత | భైరవి | 128 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎంత భక్తవత్సలుఁడ | శంకరాభరణం | 393 |
| ఎంత విచారించుకొన్నా నిదియే తత్వము | రామక్రియ | 245 |
| ఎంతవిభవము గలిగె నంతయును | ధన్నాసి | 123 |
| ఎంత చదివిన నేమి వినిన తన | సామంతం | 63 |
| ఎంత సేయఁగ లేదు యిటువంటి | ముఖారి | 76 |
| ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము | గుజ్జరి | 333 |
| ఎక్కఁగా రాఁగా రాఁగా | లలిత | 396 |
| ఎచ్చోటి కేఁగిన నెవ్వఁడుఁ దమలోని | వరాళి | 176 |
| ఎట్టయినాఁ జేయుము యిఁక నీచిత్తము | మలహరి | 324 |
| ఎట్టివారికి నెల్ల నిట్టికర్మములు | సాళంగనాట | 180 |
| ఎదుట నెవ్వరు లేరు యింతా | పాడి | 337 |
| ఎన్నఁగలుగు భూతకోటి నెల్లఁ | సామంతం | 113 |
| ఎన్నఁడు పక్వము గా దిదె | మలహరి | 307 |
| ఎన్ని బాధలఁ బెట్టి యేఁచెదవు | శ్రీరాగం | 187 |
| ఎన్ని లేవు నా కిటువంటివి | గౌళ | 31 |
| ఎనుపోతుతో నొద్దు నేరు గట్టినయట్లు | లలిత | 98 |
| ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా | ముఖారి | 207 |
| ఎఱుఁగుదు రిందరు నెఱిఁగి నెఱఁగరు | శంకరాభరణం | 156 |
| ఎవ్వరి కైనను యీవ్రాత | ముఖారి | 136 |
| ఎవ్వరిఁ గాదన్న నది నిన్ను | బౌళి | 9 |
| ఎవ్వరివాఁడో యీదేహి | దేసాక్షి | 244 |
| ఎవ్వరివాఁడో యెఱఁగరాదు | గుండక్రియ | 297 |
| ఎవ్వరు గర్తలు గారు యిందిరా | గుండక్రియ | 310 |
| ఎవ్వారులేరూ హితవుచెప్పఁగ | వరాళి | 15 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏఁటిసుఖము మఱి యేఁటిసుఖము | కాంబోధి | 77 |
| ఏకులజుఁడేమి యెవ్వఁడైననేమి | భూపాలం | 195 |
| ఏది సుజ్ఞాన మేది తెలివి నాకు | బౌళి | 48 |
| ఏతదఖిలంబునకు నీశ్వరు | శ్రీరాగం | 113 |
| ఏది చూచిననుఁ గడు నిటువంటి | శ్రీరాగం | 82 |
| ఏది చూచినా నీవే యిన్నియును | సామంతం | 60 |
| ఏదియునులేని జేటిజన్మము | నాట | 204 |
| ఏ నిన్ను దూరక యెవ్వరిదూరుదు | సామంతం | 35 |
| ఏమిఫలముదా నిన్నియును దెలిసినను | దేవగాంధారి | 189 |
| ఏమియుఁ జేయఁగవద్దు యింతలోన | గుండక్రియ | 255 |
| ఏమి తలసిన నిచ్చు నెవ్వఁడైనను | బౌళి | 114 |
| ఏమినేతు దేవదేవ యింతయును నీమాయ | కాంబోది | 226 |
| ఏమి సేయవచ్చుఁ గర్మ మిచ్చినంతే | సామంతం | 55 |
| ఏమి సేయువార మింకను | వరాళి | 158 |
| ఏమి సేసినా నీఋణ మెట్టు | లలిత | 300 |
| ఏమీ నడుగ నోళ్ల హెచ్చుకుందు | బౌళి | 228 |
| ఏమీ నెఱుఁగనినా కేడ పుణ్యము | ముఖారి | 139 |
| ఏమీ నెఱుఁగనిమమ్ము నెక్కువసేసి | ఆహిరి | 104 |
| ఏల తానపోయిరో కో యెంచి | లలిత | 323 |
| ఏల వచ్చి యేలపోయి నెందుండి | భూపాలం | 202 |
| ఏల నమ్మకొను సుకృతమెల్లవారికి | ఆహిరి | 87 |
| ఏవం శ్రుతిమత మిద మేవ | సామంతం | 4 |
| ఒక్కఁడే అంతర్యామి వుపకారి | రామక్రియ | 325 |
| ఒప్పులై నొప్పులై వుండుఁ గాక | దేసాక్షి | 91 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఓహోడేండేంవోగి బ్రహ్మమిది | రామక్రియ | 221 |
| కంటి నిదే యర్థము ఘనశాస్త్రము | సామంతం | 268 |
| కంటే సులభ మిది కానక యుంటే | ముఖారి | 304 |
| కటకటా దేహంబు గాసిబెట్టఁగవలసె | కన్నడగౌళ | 120 |
| కటకటా యిటుచేసె కర్మబాధ | సామంతం | 142 |
| కడగనుటే సౌఖ్యము గాక యీ | పాడి | 163 |
| కడుఁ జంచలములు కడు నధ్రువములు | గుండక్రియ | 94 |
| కడు నడుసు చొరనేల కాళ్లు గడుగఁగనేల | ముఖారి | 154 |
| కడుపెంత తాఁ గుడుచుకుడు పెంత | గుండక్రియ | 205 |
| కనినవాఁడా గాను కాననివాఁడా | బౌళి | 321 |
| కనియుఁ గాననిమనసు కడమగాక | భూపాలం | 229 |
| కలది గలట్టె కర్మఫలంబులు | లలిత | 275 |
| కలిగినది యొక్కటే కమలాపతిసేవ | మలహరి | 267 |
| కాక మటి యింతేలకలుగు దమకే తమకు | ఆహిరి | 152 |
| కాయ మనేవూరికిఁ గంతలు | బౌళి | 318 |
| కాలముకాలముగాదు కపటాలె | సామంతం | 208 |
| కాలవిశేషమో లోకము గతియో | సామంతం | 68 |
| కాలాంతకుఁ డనువేఁటకాఁ డెప్పుడుఁ | కన్నడగౌళ | 2 1 |
| కింకదీర నద్దైవం కేశవాత్పర మని | ధన్నాసి | 220 |
| కింకరిష్యామి కింకరోమి | శుద్ధవసంతం | 168 |
| కుడుచుగాక తనకొలఁదిగాని మేలు | రామక్రియ | 129 |
| కూడులేక మాఁకటికిఁ గూర దిన్నట్టు | ఆహిరి | 187 |
| కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు | సామంతం | [illegible] |
| కొండొనుదయ్యో ఘమతులాల | దేసాళి | |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కొసరో కొసరో మీరు కూరిమిమందు | శంకరాభరణం | 140 |
| కొనుట వెగ్గళముగాఁ దినుట యల్పము | గుండక్రియ | 49 |
| కొలువుఁడీ భక్తిఁ గొండల కోనేటి | సామంతం | 44 |
| కోరిక దీరుట యెన్నఁడు గుణమును | శ్రీరాగం | 118 |
| కోరుదు నామది నవిశము | మలహరి | 88 |
| గడపార మిఁగితే నాకలి దీరీనా | కాంబోధి | 119 |
| గాలినే పోయెఁ గలకాలము | కన్నడగౌళ | 14 |
| ఘనమనోరాజ్యసంగతి చెలఁగిన | సామంతం | 206 |
| చక్రమా హరిచక్రమా | పాడి | 125 |
| చదువులోనే హరిని జట్టిగొనవలె | మాళవిగౌళ | 274 |
| చలపాది రోగ మీ సంసారము | ముఖారి | 74 |
| చాలదా హరినామ సౌఖ్యామృతము | శ్రీరాగం | 52 |
| చాల నొవ్విసేయునట్టిజన్మ మేమి | భైరవి | 200 |
| చావులో సరియైన సౌఖ్యంబులోఁ దగిలి | శ్రీరాగం | 99 |
| చిత్త మతిచంచలము చేత బలవంతంబు | వరాళి | 89 |
| చిత్తములో నిన్నుఁ జింతించనేరక | ముఖారి | 19 |
| చిత్రమో కర్మమో జీవుఁడో దేవుఁడో | బౌళి | 212 |
| చీచీ వో బదుకా సిగ్గులేని బదుకా | బౌళి | 292 |
| చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలు | వరాళి | 75 |
| చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ | ముఖారి | 237 |
| చెప్పేటు మాటలె చెప్పుకొనుట గాక | దేవగాంధారి | 133 |
| చెల్లుఁగా యిటు నీకే చింతించఁగా | ఆహిరి | 124 |
| ఛీఛీ నరుల దేఁటిజీవనము | శంకరాభరణం | 222 |
| జడమతి రహం కర్మజంతు రేకోహమ్ | శ్రీరాగం | 306 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| జీవాత్ముడై యుండు చిలుకా | ఆహిరి | |
| తనకర్మ వశంబించుక దైవకృతం | కన్నడగౌళ | |
| తనవారలు పెరవారలుఁ దా ననిమోడి | ఆహిరి | 182 |
| తప్పుఁ దోయవే దైవశిఖామణి | శ్రీరాగం | 272 |
| తలపోఁత బ్రాఁతే తలపులకు | శంకరాభరణం | 41 |
| తహతహ లిన్నిటికి తానే మూలము | లలిత | 343 |
| తానే తెలియవలె దలఁచి దేహి | గుండక్రియ | 70 |
| తీ పనుచు చేఁదు తెగఁదిని వెనుక | బౌళి | 39 |
| తుద లేనిబంధము తోడనీడై | గుండక్రియ | 110 |
| తెల్లవారనియ్యరో తెరువు | కాంబోధి | 147 |
| తెలియఁ జీఁకటికి దీపమెత్తక | గుండక్రియ | 18 |
| తెలియక వూరక తిరిగేము | సామంతం | 257 |
| తెలియరాదు మాయదేహమా | భైరవి | 241 |
| తెలిసిన బ్రహ్మోపదేశ మిదే | శ్రీరాగం | 320 |
| తొక్కనిచోట్లు దొక్కెడి మనసు | సామంతం | 179 |
| తొలుఁబాపపుణ్యాలతోడఁ బుట్టితినట | సాళంగం | 111 |
| దిబ్బలు వెట్టుచుఁ దేలిన దిదివో | కాంబోధి | 16 |
| దురితదేహాలే తొల్లియును | శుద్ధవసంతం | 31 |
| దేవదేవుఁ డెక్కె నదె దివ్యరథము | సాళంగనాట | 325 |
| దేవ యీతగవు దీర్చవయ్యా | మలహరి | 260 |
| దేహము దా నస్థిరమట దేహి | శ్రీరాగం | 78 |
| దైవము నీవే గతి మాతప్పులు పనిలేదు | గుజ్జరి | 270 |
| దైవమా నీకు వెలితా తలఁపువెలితే కాక | సాళంగం | 332 |
| దైవమా పరదైవమా యేవగింతలు | లలిత | 194 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ...తము పుట్టించి | ముఖారి | 301 |
| ...శ్వర నందగోప నరసింహ | సామంతం | 162 |
| ...గుఁబొట్లఁ బడినా జిహ్వ | ముఖారి | 56 |
| నగుమొగముతోడి యోనరకేసరి | మాళవి | 246 |
| నదు లొల్లవు నాస్నానము | ముఖారి | 51 |
| నమో నారాయణాయ | శ్రీరాగం | 172 |
| నమోనారాయణాయనమః | శ్రీరాగం | 148 |
| నవనారసింహా నమో నమో | నాట | 278 |
| నాతప్పు లోఁగొనవే నన్నుఁ గావవే | సాళంగనాట | 352 |
| నారాయణ నీనామము బుద్ధిఁ | సామంతం | 165 |
| నిక్కించీఁ గర్ణములు మానిసిమెకము | నాట | 261 |
| నిగమనిగమాంతవర్ణితమనోహరరూప | సామంతం | 146 |
| నిత్యానంద ధరణీధర ధరారమణ | శ్రీరాగం | 25 |
| నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు | మాళవి | 239 |
| నిన్నుఁ దలంచి నీపేరు దలంచి | దేసాక్షి | 27 |
| నీకథామృతము నిరతసేవన నాకు | భూపాలం | 54 |
| నీమహత్త్వంబు లో నికే వెలుపలికి | కన్నడగౌళ | 173 |
| నీవనఁగ నొకచోట నిలిచి వుండుటలేదు | సామంతం | 185 |
| నీవేకా చెప్పఁ జూప నీవె నీవెకా | లలిత | 158 |
| నీవే కానింక నే నన్య మెఱుఁగ | శ్రీరాగం | 17 |
| నీవేమి సేతు వయ్య నీవు దయానిధి | భైరవి | 312 |
| నీ వేలికవు మాకు నీదాసులము | లలిత | 280 |
| నిరవాది సాహసులు నిత్యశూరులు | శంకరాభరణం | 315 |
| నే నేమి సేయుదును నీవు నాలోపలనుండి | గుండక్రియ | 284 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నెరిచి బ్రదికేవారు నీదాసులు | సాళంగం | [illegible] |
| పంకజాక్షులు సొలసి పలికె నగఁగా | ధన్నాసి | [illegible] |
| పండియుఁ బండదు చిత్తము పరిభవ | మలహరి | 177 |
| పట్టవసముగాని బాలుఁడా పెను | భైరవి | 59 |
| పట్టినచోనే వెదకి భావించవలెఁ గాని | బౌళి | 251 |
| పట్టిన దెల్లా బ్రహ్మము | లలిత | 282 |
| పదిలముకోట పగవారు | శంకరాభరణం | 61 |
| పనిలేనిధనవాంఛఁ బడి పొరలిన | శంకరాభరణం | 92 |
| పనిమాలినట్టి వట్టి పఱుఁదు గాక | సాళంగం | 2'4 |
| పరగు బహునజ్జన్మ పరిపక్వహృదయుఁడై | నారణి | 73 |
| పరమపాతకుఁడ భవబంధుఁడ | సామంతం | 38 |
| పరమాత్ముని నోరఁ బాడుచును | కేదారగౌళ | 72 |
| పరిపూర్ణ గరుడాద్రిపంచాననమ్ | నాట | 253 |
| పరులసేవలు చేసి బ్రదికేరటా | దేసాళం | 215 |
| పరుసము సోఁకియు బ్రదుకవద్దా | శంకరాభరణం | 183 |
| పాపపుణ్యములరూపము దేహ మిది | పాడి | 28 |
| పాపినై ననాపాలఁ గలిగి తోవ | సామంతం | 149 |
| పాయనికర్మములే కడు బలవంతము | సామంతం | 47 |
| పాయపుమదములబంధమా | సామంతం | 141 |
| పుండు జీవుల కెల్లఁ బుట్టక మానదు | కన్నడగౌళ | 160 |
| పుట్టుగు లమ్మా భువిఁ గొనరో | ధన్నాసి | 42. |
| పెంచఁ బెంచ మీఁదఁ బెరిగేటిచెలిమి | ఆహిరి | 29 |
| పెక్కు లంపటాల మనసు పేదనై తివి | ముఖారి | 67 |
| పెరుగఁ బెరుగఁ బెద్దలు గాఁగా | బౌళి | 265 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వైన శేషగిరి బోయనాయఁడు | బౌళి | 285 |
| ం గాలము వృథమై పుట్టిన | గుండక్రియ | 95 |
| లనేత్రానలప్రబలవిద్యుల్లతా | శ్రీరాగం | 184 |
| లువందిలి నెట్టి పరగఁజిత్తము | శ్రీరాగం | 71 |
| వగుకర్మము లివివో జీవుల | సామంతం | 199 |
| వగుఁదనరూపము చూపె | పాడి | 198 |
| బాలులతో వీధులలోఁ బారాడు | పాడి | 159 |
| బోధకు లెవ్వరు లేక | కన్నడగౌళ | 290 |
| బువంతి బోద్ధా బుద్ధ యితి | సామంతం | 106 |
| కికొలఁదివాఁడే పరమాత్ముఁడు | రామక్రియ | 235 |
| రమైన వేఁపమాను పాలు వోసి | దేవగాంధారి | 190 |
| వమునఁ బరబ్రహ్మ మిదే | సామంతం | 161 |
| వయామి గోపాలబాలం | ధన్నాసి | 79 |
| భోగిశయనమును బునకొట్టిడిని | భూపాలం | 81 |
| మంగళం గోవిందునకు జయమంగళం | లలిత | 46 |
| మంచిదివో సంసారము మదమత్సరములు | లలిత | 45 |
| మందరధర మధుసూధన | కురంజి | 170 |
| మందు లేదు దీనికి మంత్ర మేమియు లేదు | నాట | 108 |
| మదమత్సరము లేక మనసు పేదై పో | ఆహిరి | 59 |
| మనసిజగురుఁ డితఁడో మఱియుఁ | శ్రీరాగం | 87 |
| మనసున నెప్పుడు మాన దిది | లలిత | 122 |
| మరలి మరలి జయమంగళము | రామక్రియ | 278 |
| మరిగి వేరెపో మాదైవంబులు | గుండక్రియ | 237 |
| మఱియు మఱియు నివే మాపనులు | పాడి | 271 |

| | రాగము | సంఖ్య |
|---|---|---|
| మలసీ జూడరో మగసింహము | శంకరాభరణం | [illegible] |
| మహి నెంతటివారు | రామక్రియ | [illegible] |
| మా కెల్ల రాజానుమతో ధర్మ యిది | లలిత | 2[illegible] |
| మానఁ డెన్నఁడు శరీరి దుర్మాన | నాట | [illegible] |
| మానుషము గాదు మఱి దైవికము | గుండక్రియ | |
| మాయాపుదనుజులమదవైరి | సామంతం | 1 |
| మిక్కిలిపుణ్యులు హరి మీదాసులే | దేవగాంధారి | 2[illegible] |
| ముంచినవేడుకతోడ మొక్కుట | సాళంగనాట | [illegible] |
| ముందటిజన్మము లెల్లా | గుండక్రియ | [illegible] |
| ముద్దుఁగన్నతల్లి చేరి మూలకు | శ్రీరాగం | 14 |
| మొదలుండఁ గొనలకు | భైరవి | 29 |
| మొఱ పెట్టెదము మీకు మొగసాల | సాళంగం | 83 |
| మోసమున మాయావిమోహితుఁడై | ముఖారి | 10 |
| మోహము విడుచుటే మోక్ష మది | ఆహిరి | 16 |
| రామరామచంద్రరాఘవా | వరాళి | 21 |
| రాముఁ డితఁడే లోకాభి రాముఁ డితఁడు | సాళంనాట | 20 |
| రూకలై మాడలై రువ్వలై | గుండక్రియ | [illegible] |
| రెండుమూలికలు రేయి బగలు నున్నవి | గౌళ | 2[illegible] |
| లేదు బ్రహ్మవిద్యా మహాసుఖము | దేవగాంధారి | 1[illegible] |
| వందే వాసుదేవం బృందారకాధీశ | శ్రీరాగం | [illegible] |
| వట్టియాసలకు లోనై వదలక | వరాళి | 1[illegible] |
| వననిధి గురిసినవాన లివి | ఆహిరి | [illegible] |
| వలచి పైకొనఁగరాదు | సామంతం | |
| వలపు లధికము సేయు వైభవములు | శ్రీరాగం | [illegible] |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| …మోహావస్థలఁ బొరలెడి | లలిత | 116 |
| …నువారిదె వైష్ణవము యిది | మలహరి | 280 |
| …ఁడె వేంకటాద్రిమీఁద వరదైవము | లలిత | 247 |
| …డలవాడల వెంట వాఁడెవో వాఁడెవో | వరాళి | 178 |
| …సివంతు విడిచినవాఁడే యోగి | సాళంగనాట | 109 |
| …మమనవో రోలు విషమనవో | శ్రీరాగం | 57 |
| …నిషేధములకు వెఱవఁగఁ బనిలేదు | దేవగాంధారి | 218 |
| …తక మొఱఁగని వెఱ్ఱులము గాక | బౌళి | 254 |
| …నిఁ జూచియైన నేము విరతిఁ బొందగలేము | దేసాళం | 218 |
| …టిమోహపుటంటిమేను విడనాడి | పాడి | 115 |
| …ఱతు వెఱతు నిందు వేడుకపడ | శ్రీరాగం | 188 |
| …జ్జివాఁడు వెఱ్ఱిగాఁడు విష్ణునిదాస్యము | బౌళి | 288 |
| …లువ లెల్ల తనలోనుగాక తను | లలిత | 276 |
| వేదం బెవ్వని వెదకెడిని | పాడి | 5 |
| వేదమంత దింక నేల | ముఖారి | 286 |
| వేదవేద్యులు వెదకేటి మందు | దేసాక్షి | 2 |
| వేసరితి మొఱ్ఱు నీవెంటఁ దిరిగి | దేసాక్షి | 184 |
| వైష్ణవులు గానివార లెవ్వరు లేరు | ధన్నాసి | 83 |
| శతాపరాధములు సహస్రదండన | శంకరాభరణం | 326 |
| శ్రమము చాలనియట్టిజన్మం బి దేమిటికి | కాంబోది | 210 |
| శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ | మాళవి | 97 |
| శ్రీవేంకటేశుఁడు శ్రీపతియుని తఁడే | బౌళి | 250 |
| శ్రీశోయం సుస్థిరోయం | ముఖారి | 167 |
| శ్రీహరినేసివదివ్యాలివి | పాడి | 281 |

SRI VENKATESVARA ORIENTAL SERIES No. 29.

Editor :—Prof. P. V. Ramanujaswami, M.A.

తాళ్లపాకవారిగేయరచనములు

VII. సంపుటము

# అధ్యాత్మ సంకీర్తనలు

అన్నమాచార్యరచితములు

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయములో సంగీతవాఙ్మయ పరిశోధకుఁడగు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మచేతను,

శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ పుస్తకశాలలో ఆంధ్రపండితుఁడగు
ఉదయగిరి శ్రీనివాసాచార్యునిచేతను,
పరిశోధింపఁబడినవి.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాశాల

1951

శ్రీః

# పీఠిక

ఇది శ్రీఅన్నమాచార్యకీర్తనల యేడవసంపుటము. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఐదవసంపుటము శోధించి ప్రకటించి అకాలమున పరమపదమలంకరించిరి. ఆరవసంపుటమును దీనిని రేకులనుండి సవరించి యెత్తి వ్రాసినవారు శ్రీశాస్త్రిగారిశిష్యులై వారికి చేదోడు వాదోడుగా నుండిన శ్రీఉదయగిరి శ్రీనివాసాచార్యులే. ఈ కీర్తనల శోధన కార్యమునకై శ్రీవేంకటేశ్వర దేవాలయాల అధ్యక్షులచే నియమింపఁబడి నేను వచ్చి చేయివేయునప్పటికి ఈ సంపుటము బహుభాగము ముద్రితమైనది. కడపటి రెండు మూఁడు ఫారసులు మాత్రము నేను సరిచూడఁగల్గితిని. ఈ సంపుటమున ౧౫౧-వ రేకు మొదలు ౨౦౦-వ రేకు వఱకునుగల అధ్యాత్మకీర్తనలు కలవు.

శ్రీప్రభాకరశాస్త్రిగారు వేసిన పథమున, శ్రీ శ్రీనివాసాచార్యుల నిష్కలంక భక్తిశక్తులు తోడుగా, ఇఁకముందు తాళ్లపాకకృతుల శోధన ప్రకటనములు త్వరగా జరుగఁగలవని యాశంసించుచున్నాను. కాని యీమహాకార్యము పూర్తియగుటకు ఆ శ్రీనివాసుని మహాసంకల్పమే సాధనమై మమ్ము నడపవలసియున్నది.

ఈ కైంకర్యమునకు నాకవకాశముఁగల్పించిన శ్రీవేంకటేశ్వర దేవాలయాధికారులదయ నాకృతజ్ఞతాశక్తిని మించిన బరువు.

శ్రీవేంకటేశ్వరప్రాచ్యవిద్యా పరిశోధనాలయము,
తిరుపతి
30—11—51.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

శుభమస్తు

శ్రీ తాళ్ల పా క

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౨౬ అగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమై తేను అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు (నిరోధానకు ? తిరోధానానకు) తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

151-వ రేకు. దేసాక్షి

ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముఁగ నితనిశరణంబే సర్వఫలప్రద మిందరికి. ॥పల్లవి॥

హరిఁ గొలువనికొలువులు మఱి యడవిఁ గాసినవెన్నెలలు
గరిమల నచ్యుతు విననికథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁ గానితపంబులు పాతాళములనిధానములు
మరుగురునికిఁ గానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు. ॥ఎంచి॥

వైకుంఠుని నుతియించనివినుతులు వననిధిఁ గురిసినవానలు
ఆకమలోదరుఁ గోరనికోరిక లందనిమానిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
దాకొని విష్ణుని తెలియనితెలువులు తగ నేటినడిమిపైరులు. ॥ఎంచి॥

వావిరిఁ గేశవు నొల్లనిబదుకులు వరతఁ గలపుచింతపండు
గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
భావించి మాధవుపై లేసితలఁపులు మేఘములవికారములు
శ్రీవెంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు. ॥ఎంచి॥ 1

గుజ్జరి

త్రికరణశుద్ధిగఁ జేసినపనులకు దేవుఁడు మెచ్చును లోకము మెచ్చును
వొకటికోటిగుణితం బగుమార్గము లుండఁగఁ బ్రయాసపడ నేలా. ॥పల్లవి॥

తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి
కనకబిందు యమునా గయాదిక్షేత్రంబుల సంతతమును
దినకరసోమగ్రహణకాలముల తీర్థాచరణలు సేసినఫలములు
తనుఁ దానె సిద్ధించును పూరకే దవ్వులు దిరుగఁగ మఱి యేలా. ॥త్రిక॥

హరి యనురెండక్షరములు నుడివిన నఖిలవేదములు మంత్రములు
గరిమ ధర్మశాస్త్రపురాణాదులు క్రమమునఁ జదివిన పుణ్యములు
పరమతపోయోగంబులు మొదలగుబహుసాధనములసారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకఁగ నేలా. ॥త్రిక॥

మొదల శ్రీవెంకటపతికినిఁ జేయెత్తి మొక్కినమాత్రములోపలనే
పదిలపుషోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును
వదలక సాంగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా పలుమారు
మది మది నుండేకాయక్లేశము మాఁటికి మాఁటికిఁ దన కేలా. ॥త్రిక॥ 2

ముఖారి

ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు
ఆతనిబంట్లము మాకు నన్నిటా నిశ్చింతము. ॥పల్లవి॥

యేలికగలబంటుకు యెక్కడిది విచారము
పాలించేమగఁడుగలపడఁతికి కేడ చింత
కోలుముందైతండ్రిగలకొడుకు కేది తొడుసు
యీలీల హరిదాసుని కెక్కడికోరికలు. ||అత||

బలుదుర్గమువానికి భయ మేమిటా లేదు
కలిమిగలవానికి కడమ లేదు
యిల క్షేత్రవంతునికి నెందూ దరిద్రము లేదు
అల శ్రీపతిబంట్లకు నలమట లేదు. ||అత||

పట్టినముద్రుంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టిచాతనివానికిఁ గొంకు లేదు
నెట్టన శ్రీవెంకటాద్రినిలయుసేవకులము
గట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే. ||అత|| 3

గుండక్రియ

మనసులో మర్మమై మరలఁ బారుచునుండు
పానుఁగువడ్డవాదము పోవఁగ నీదు. ||పల్లవి||

తింటేనే విష మెక్కు దిష్టముగ విషలత
కంటేనే వల పెక్కుఁ గాంతలను
అంటి ముట్టి కాఁగిట నలముకొంటేఁ గనక
మంటఁ గలసినభ్రమ మాన లేదు. ||మన||

మెట్టితేనే కఱచును మెలుపులోడుతఁ బాము
పట్టితే విడువనీదు పచ్చనిపైఁడి
దట్టమై మేన సొమ్ములు తగులుకొంటేఁ గనక
తొట్టి వెల్లిఁ బోయి నాస తొలఁగనీదు. ||మన||

ఆహారము వెట్టితేను అట్టే విడుచు భూతము
ఆహారానకుఁ బో దెక్కునట్టే ప్రాయము
యీహల శ్రీవెంకటేశుఁ డిట్టే కరుణించితేను
సాహాయ్యమై వచ్చుఁ దానే సత్వగుణజ్ఞానము. ॥మన॥ 4

సాళంగనాట

దిక్కులు సాధించఁ బూని దేవదుందుభులు మ్రోయ
యెక్కువతో శ్రీవెంకటేశుఁ డెక్కెఁ దేరు. ॥పల్లవి॥

పన్నిద్దరుసూరియులబండికండ్ల తేరు
సన్నుతి శేషాదిదేవాసనపుఁదేరు
కన్నులపండుగైన గరుడధ్వజపుఁదేరు
యెన్నఁగ శ్రీవెంకటేశుఁ డెక్కె నిదె తేరు. ॥దిక్కు॥

మించునానామేఘములమేలుకట్ల తేరు
చుంచులనక్షత్రాలకుచ్చుల తేరు
అంచదేవతలే బొమ్మలై వుండినట్టితేరు
యెంచఁగ శ్రీవెంకటేశుఁ డెక్కె నిదే తేరు. ॥దిక్కు॥

అట్టె కిందేడులోకము లంతరువులైన తేరు
నట్టనడుమను బ్రహ్మాండపుతేరు
దిట్టయులమేల్మంగతోఁ దిగమైవుండేటి తేరు
యిట్టె శ్రీవెంకటేశుఁ డెక్కె నిదే తేరు. ॥దిక్కు॥ 5

152-వ రేకు. శుద్ధవసంతం

మాయ కిదే సహజము మాయను గెలువరాదు
మాయానాథుఁ గొలిచితే మన్నించు నాతఁడే. ॥పల్లవి॥

చేతికి లోనైనట్టుండు సృష్టిలోనివేడుకలు
పోతరించి పట్టఁబోతేఁబోవు నట్టటే
ఆతుమలో వేసరి అలసి వూరకుండితే
వైతాళపునీడవలె వచ్చు వెంట వెంటను. ॥మాయ॥

తీపువలెనే వుండు దిష్టపుఁబదార్థాలు
మేపు గొంటే మీసాలమీఁదితే నాను
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను
మాపునఁ గట్టినచద్ది మోఁపించును. ॥మాయ॥

తలపులోనే వుండు తనలోనియంతరాత్మ
తెలుపుకోఁబోతే పెక్కుదేవత లౌను
చలపట్టి యీతనినే శరణని కొలిచితే
యెలమి శ్రీవెంకటేశుఁ డితఁడై రక్షించును. ॥మాయ॥ 6

మంగళకౌశిక

దేవుఁ డొక్కఁడే గురి తెలిసినవారికి
యీవల లావల చూచినా నిఁక లేదు తెఱఁగు. ॥పల్లవి॥

కోపము మానితేనే కోటిజపాలు సేయుట
పాపము సేయకుంటేనే బలుతపము
లోపల తా నూరకుంటే లోకమెల్లాఁ జరియించుట
మాపుదాఁకా వెదకినా మఱి లేదు తెఱఁగు. ॥దేవు॥

పరకాంత నంటకుంటే బలుపుణ్యాలు సేయుట
సొరిది నాస మానుటే సోమపానము
సరి మానాన నుండుటే సన్న్యాసము చేకొనుట
యిరవైతే నంతకంటే నిఁక లేదు తెఱఁగు. ॥దేవు॥

పలుసుఖదుఃఖములఁ బాసి వుండుటే మోక్షము
అల చంచలము మాను టది యోగము
యిలపై శ్రీవెంకటేశుఁ డిచ్చినసుజ్ఞాన మిది
యెలమి బుద్ధిఁ బోల నీఁక లేదు తెఱఁగు. ॥దేవ॥

### సౌరాష్ట్రం

తలఁచుకోవో మనస తగినద్రిష్టము లివి
వెలలేక తెచ్చేటివివేకము లోధనము. ॥పల్లవి॥

గాలిఁ బోయేమాఁటలు లోకములోనిసుద్దు లెల్లా
గాలిఁ బో వెన్నఁడును శ్రీకాంతునుతులు
జాలిఁ బడేసేఁతలు సంసారభోగము లెల్లా
జాలి లేనివి విష్ణునిసంతతపుపూజలు. ॥తల॥

మాయమౌఁ గొన్నాళ్లకు మానుషకృత్యము లెల్లా
మాయముగానివి దైవికమహిమ లెల్లా
కాయకములే తమకల్పితము లన్నియును
కాయకము గాక నిల్చుఁ గమలాక్షుమన్నన. ॥తల॥

వుడివోవు రాఁగా రాఁగా నున్నతకర్మఫలాలు
వుడివోదు దేవునిపై నొనరుభక్తి
జడియు నితరు లిచ్చేసకలవరములును
జడియదు శ్రీవెంకటేశ్వరుఁ డిచ్చేవరము. ॥తల॥ 8

### సాళంగనాట

అహోబలేశ్వరునకు నాదిమూర్తికి
విహారమే పంతము వీరసింహమునకు. ॥పల్లవి॥

చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు
దిక్కులు చేతు లెండలు దివ్యాయుధాలు
మిక్కుటపువేదములు మించుగోసవెంట్రుకలు
రక్కసులఁ జెండేవిదారణసింహమునకు. ||ఆహా||

శైలములే పాదములు జానువులేక్ష్లోకములు
కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు
వాలుకొన్నమేఘములు సకలదివ్యాంబరాలు
పాలించేప్రతాపపుసింహమునకు. ||అహో||

అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుఁదు
వంతఁ గృపారసము వార్ధు లెల్లాను
యింతటా శ్రీవెంకటాద్రియిరవు మహాగుహా
రంతు లురములు ఘోరకాద్రసింహమునకు. ||అహో|| 9

పాడి

ఈరూపమై వున్నాఁడు యీతఁడే పరబ్రహ్మము
శ్రీరమాదేవితోడ శ్రీవెంకటేశుఁడు. ||పల్లవి||

పొదలి మాయాదేవిపట్టినసముద్రము
అదె పంచభూతాలుండే అశ్వత్థము
గుదిగొన్నబ్రహ్మండాల గుడ్లఁ బెట్టేహంస
సదరపుబ్రహ్మలకు జలజమూలకందము. ||ఈరూ||

అనంతవేదా లుండేటి అక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము
కనలుదానవమత్తగజసంహారసింహము
మొనసి సంసారభారము దాల్చేవృషభము. ||ఈరూ||

సతము జీవులకు చైతన్యసూత్రము
అతిశయభక్తులజ్ఞానామృతము
వ్రతమై శ్రీవేంకటాద్రి వరములచింతామణి
తతిగొన్న మోక్షపుతత్త్వరహస్యము. ॥ఈసూ॥ 10

నాట

విఱిగి పారెడియట్టి వీరిడి యో రిపులాల
తఱి శరణు చొరరో దండాలు వెట్టరో. ॥పల్లవి॥

వీడె వచ్చెఁ గృష్ణుఁ డిదె వేయరో కైదువులు
కాఁగినపోట్లు రాఁగి కదియకురో
పోఁడిమితో భీతివాయ పూరి నోళ్లఁ గరవరో
ఆఁడువార మనుకోరో ఆతఁడు దడవఁడు. ॥విఱి॥

గోవిందుఁడు దాడి వచ్చె గుసుకుచుఁ బారరో
కావు మని మెడలఁ బాగలు వేయరో
వేవేగ బిడ్డలఁ బేర్లు విభునికిఁ బెట్టరో
వో వో యెంగిలికిఁ జేతు లొగ్గరో రక్షించీని. ॥విఱి॥

మొత్తి శ్రీవెంకటేశుఁడు మూలలకు దాఁగరో
వొత్తిలి పంతము లిచ్చి మీ రోడఁ గదరో
హత్తి మీతలలు విరియఁగఁ బోసుకొనరో
బొత్తుగా మిమ్ము గెలిచెఁ బొగడరో మెచ్చీని. ॥విఱి॥ 11

153-వ రేకు. నాట

పారి నీకును విఱిగిపోయినదానవులు
బిరుదు లుడిగి వోడబేహారు లైరి. ॥పల్లవి॥

మకుటాలు దీసి జటామకుటాలు గట్టుకొని
వెకలిరిపులు మునివేషు లైరి
మొకములను సోమపుమొకములు వెట్టుకొని
అకటా కొందరు రిపు లాటవా లైరి. ||హరి||

పేరులు విడిచి సంకుఁబేరులు మెడ వేసుక
సారెకుఁ గొందరు శివసత్తు లైరి
బీరపుసాములు మాని పెద్దగడసాము నేర్చి
తోరపుఁబగతు లెల్ల దొమ్మరు లైరి. ||హరి||

నాదించ వెరచి సింగినాదా లూదుకొంటాను
సోదించే రంటాఁ గొందరు జోగు లైరి
యీదెస శ్రీవెంకటేశ యిన్నియు మాని కొందరు
దాదాతని శరణనీ దాసరు లైరి. ||హరి|| 12

## కాంబోది

ఐన ట్టయ్యీఁగాక హరికల్పితము లివి
మానేటి వేఁటివో మానని వేవో. ||పల్లవి||

వొక్కరు తలఁచినట్టు వొక్కరితలఁపు రాదు
పక్కన నందరికీ బహుభావాలు
అక్కట మొద లొకటి అనలుఁ గొనలు వేరు
యెక్క డని తగిలేది యేమి సేసేది. ||ఐన||

హారుగువానిచేత ఆహారుగువాఁడు మెచ్చఁడు
నరులకర్మములు నానావిధాలు
గరిమ నన్ను మొక్కేటి కడుపుతనివి వేరు
కరుణించో నన నేవి కావన నేవి. ||ఐన||

కడఁగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు
బెడఁగుజీవులపొందు పెక్కురీతులు
కడు శ్రీవెంకటేశుఁ డొక్కఁడు జగత్తులు వేరు
వాడిఁ గట్టుకొనే దేది వొల్ల ననే దేది. ||ఐన|| 13

నాట

నిండె నిన్నిచోటులను నీమహిమలే
అండనే మొక్కేము నీకు నాదినారసింహా. ||పల్లవి||

కూరిమి యిందిరమీఁద కోపము అసురమీఁద
తారుకాణనవ్వు దేవతలమీఁదను
ఆరీతిని కొలు విట్టే అహోబలముమీఁద
నారుకొనె నీనేరుపు నారసింహా. ||నిండె||

కరుణ ప్రహ్లాదుమీఁదఁ గన్నులు దిక్కులమీఁద
సరిచేతులు వేగులజంద్యాలమీఁద
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద
తిరమాయ నీకోరిక దివ్యనారసింహా. ||నిండె||

శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద
కాంతు లెల్లా తనదివ్యకాయముమీఁద
చింత దీర వినోదము శ్రీవెంకటాద్రిమీఁద
సంతతమై నీకుఁ జెల్లె జయనారసింహా. ||నిండె|| 14

సాళంగనాట

అన్నిటా నీపెంపు వింత హనుమంత నీ
వున్నచోటు నిశ్చింతమో హనుమంత. ||పల్లవి

రామునిసేనలఁ గాచి రావణుగర్వ మడఁచి
ఆముకొన్న బలవంత హనుమంత
గోమున జలధి దాఁటి కొండతో సంజీవి దెచ్చి
ధీమంతుఁడ వైతి వింత దివ్యహనుమంత. ॥అన్ని॥

చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోఁచె
అక్కజపునీరూ పంత హనుమంత
చొక్కమై మీ రుండఁగాను సుగ్రీవాదుల కెల్లా
అక్కర లే దించుకంతా హనుమంత. ॥అన్ని॥

జంగచాఁచి చేయెత్తి సరిఁ బిడికిలించుక
అంగము నిక్కించి తెంత హనుమంత
రంగగు శ్రీవెంకటాద్రిరాముని దేవి కిచ్చితి
వంగులియ్యక మొక్కంత హనుమంత. ॥అన్ని॥ 15

రామక్రియ

మగటిమిగలహనుమంతరాయ
దిగువపట్టణములోనిదేవ హనుమంత. ॥పల్లవి॥

చక్కఁగాఁ దోఁక చాఁచి జంగవెట్టి చే చాఁచి
అక్కజప్రతాపపుహనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రాముని దేవులకు
దిక్కై వుంగర మిచ్చినదేవ హనుమంత. ॥మగ॥

కీలుగంటు గంటువేసుకొని కెరలి పిడికిలించి
ఆలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండఁ బెరిగి యక్షుని
తీలుపడఁ గొట్టినట్టిదేవ హనుమంతుఁడా. ॥మగ॥

తమితోడ దాసులను తప్పక కాచే నని
అమర నభయ మిచ్చినహనుమంతుఁడా
జమళి శ్రీ వెంకటేశుసరసపూడిగానకు
మెమురుచు నుండేయట్టిదేవ హనుమంతుఁడా. ॥మగ॥ 16

శ్రీరాగం

ఏమి చెప్పే దిది యీశ్వరమాయలు
దీము ప్రతిమకును త్రిజగము గలిగె. ॥పల్లవి॥

మలమూత్రంబులమాంసపుముద్దకు
కులగోత్రంబులగుణి గలిగె
తోలులు తోమ్మి దగుతోలుఁది త్తికిని
పిలువఁగఁ బేరునుఁ బెంపునుఁ గలిగె. ॥ఏమి॥

నెత్తురునెమ్ములనీరుబుగ్గకును
హాత్తినకర్మము లటు గలిగె
కొత్తవెంట్రుకలగుబురులగంతికి
పొత్తులసంసారభోగము గలిగె. ॥ఏమి॥

నానాముఖములనరములపిడుచకు
పూనినసిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీవెంకటాధిపుఁ డేలఁగ
దీనికిఁ బ్రాణము తిరముగఁ గలిగె. ॥ఏమి॥ 17

154_వ రేకు. బౌళి

పురుషుం డని శృతి పొగడీ నట ఆపురుషుఁడు నిరాకార మట
విరసవాక్యము లొండొంటికి నివి నిం టే నసంబద్ధములు. ॥పల్లవి॥

మొగమున బ్రాహ్మలు మొలచి రట ఆమూరితి అవయవరహితుఁ డట
తగుబాహువులను రాజు లట ఆతత్త్వమే యెంచఁగ శూన్య మట
పగటున తొడలను వైశ్యు లట ఆబ్రహ్మముదేహము బయ లట
అగపడి పాదాల శూద్రు లట ఆతనిరూపము లే దట. ॥పురు॥

తనవందనమునుఁ గల వట దైవము తనుఁ జూడఁ గన్నులు లే వట
తనవిన్నపమునుఁ జేయు నట ఆతనికిని వీనులు లే వట
తనయిచ్చినదే నైవేద్యం బట దైవము నోరే తే దట
తనయిచ్చేటిధూపంబును గల దట దైవము ముక్కును లే దట. ॥పురు॥

అంతాఁ దానే దైవ మటా యజ్ఞము లొరులకుఁ జేయు టట
సంతతమునుఁ దా స్వతంత్రుఁ డటా జపములవరముల చేకొం టట
చింతింపఁ దానే యోగి యటా చేరువ మోక్షము లే దట
పంతపుశ్రీవేంకటపతిమాయలు పచారించిన వివి యట. ॥పురు॥ 18

శంకరాభరణం

ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల. ॥పల్లవి॥

పాప మొక్కడు సేసితే పాపులే యిందఱుఁ గా వలదా
యేపున నొకరిపుణ్య మిందఱికి రా వలదా
కోపించి యొక్కఁడసు రైతే కోరి యిందఱుఁ గా వలదా
చూప దేవుఁ డొక్కఁ డైతే సుర లిందఱుఁ గా వలదా. ॥ఏకా॥

ఒకఁ డపవిత్రుఁ డైతే నొగి నిందఱుఁ గా వలదా
వొకఁడు శుచై వుండితే వోడ కిందఱుఁ గా వలదా
వొకనిరతిసుఖ మంటె యందఱును వొనరఁ బొంద వలదా
వొకనిదుఃఖ మందఱు వూరఁ బంచుకో వలదా. ॥ఏకా॥

ఆకడ నొకఁడు ముక్తుఁ డయితే నందఱును గా వలదా
దీకొని యొకఁడు బంధుఁ డయితే యిందఱుఁ గా వలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి
లోకపుమునులనుఁ దెలుసుకో వలదా. ॥ఏకా॥ 19

శంకరాభరణం

దేవుఁడుగలవారికి దిగులుఁ జింతయు లేదు
శ్రీవిభుఁడే అన్నిటా రక్షించుఁ గనక. ॥పల్లవి॥

యేలికగలబంటుకు యేవిచారము లేదు
వోలి మగఁడుగలాలికి వొప్పమి లేదు
పోలిమిఁ దండ్రిగలపుత్రుని కంగద లేదు
మేలుగాఁ బండినభూమికిఁ గరవు లేదు. ॥దేవు॥

బలముగలరాజుకు భయ మేమియు లేదు
కలిమిగలవాని కక్కుర లేదు
యిల నాచారవంతుని కేపాపమును లేదు
తలఁపుఁబుణ్యముగలఆతనికిఁ జేటుఁ లేదు. ॥దేవు॥

గురువుగలవానికిఁ గొఱంత యేమియు లేదు
పరముగలవానికి భ్రాంతులు లేవు
యిరవై శ్రీవెంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు
అరయ దాసులముమా కడ్డాఁకే లేదు. ॥దేవు॥ 20

కేదారగౌళ

కమలారమణునికల్పితపుమానిసిని
తమితోడ నాదిక్కు దయఁ జూడవే. ॥పల్లవి॥

ఆరీతి బ్రాహ్మణుఁడ ననుటే కాని దేహము
కోరి యాచారమునకుఁ గొలుపదు
పేరు వైష్ణవుఁడ ననే పెద్దరికమే కాని
సారమైనమనసులో జ్ఞానమే లేదు. ॥కమ॥

చదివితిననియెడిచలపాద మింతే కాని
అదన నందులోనిఅర్థ మెఱఁగ
పదరి సంసార మనే బహురూపమే కాని
చతురుఁదనాన నందు సమర్థుండఁ గాను. ॥కమ॥

దేవ మీభక్తుఁడ ననే తేజ మొకటే కాని
చేవమీరఁ నినుఁ బూజించ నేరను
శ్రీవెంకటేశ నీచేతిలోనివాఁడ నేను
భావించి మఱి యేపాపము నెఱఁగను. ॥కమ॥ 21

## కాంబోది

ఇన్నాళ్లు నందు నందు నేమి గంటిని
అన్నిటా శరణు చొచ్చి హరి నినుఁ గంటిని. ॥పల్లవి॥

అంగనలపసఁ జిక్కి అలయికలే కంటి
బంగారువెంటఁ దగిలి భ్రమ గంటిని
ముంగిటితీర్థా లంటి ముంచి వెట్టిసేయఁ గంటి
అంగపునన్నే చూచి అంతరాత్మఁ గంటి. ॥ఇన్నా॥

చుట్టాలఁ జేరి చూచి సుద్దుల వావులు గంటి
మట్టులేనివయసుతో మదము గంటి
వట్టికామములు సేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణా యని భక్తి నిన్నుఁ గంటిని. ॥ఇన్నా॥

వింతచదువులవల్ల వే వేలు మతాలు గంటి
సంతకర్మములవల్ల సాము గంటిని
యింతట శ్రీవెంకటేశ యిటు నాజీవభావము
చింతించి అందులోన నీశ్రీపాదాలు గంటి. ॥ఇన్నా॥ 22

155_వ రేకు. సామంతం

సారిది మా మిమ్మెట్టె దయఁ జూతువు గాక
వెరసి మరి యెక్కడా నేమి విన్నవించే మింకను. ॥పల్లవి॥

తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు
కలసితి నీదాసులగమిలోనను
చలివాసె భవములు సడిదీరెఁ గర్మములు
యెలమి నీమహిమలు యేమి చెప్పే మింకను. ॥సారి॥

నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి
చేముట్టి పూజించితి శ్రీయంగాలు
తామసము లెల్లా నూడె తతివచ్చె సాత్వికము
గోముగ మరేమి నిన్ను గోసరే మింకను. ॥సారి॥

తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి
విరివైన నీకథలు వీనుల వింటి
పరగ శ్రీవెంకటేశ పరము నిహము గంటి
అరసి యితర మేమి ఆశపడే మింకను. ॥సారి॥ 23

వరాళి

శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధు లన్నియు
పైపై నీశరణమే పరమపదంబు. ॥పల్లవి॥

పరమాత్మునిపై నాత్మ ప్రవేసింపఁ జేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము
గరిమ నాహృదయాకాశమునఁ దలఁచుటే
గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము. ॥శ్రీప॥

మంచిపరమహంసనామము ప్రాణులచే వింట
చంచులవినేటిదూరశ్రవణము
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట
యెంచఁగ దూరగమన మింటిలో నాట. ॥శ్రీప॥

సావధానమె లోచూపు సర్వదా నిన్ను జూచుట
తావులనే అనిమిషత్వము చేరుఁగా
శ్రీవెంకటేశ్వర నీసేవకుడై నిలుచుటే
వేవేలు తత్వజ్ఞానవిధుల నిలుచుటా. ॥శ్రీప॥ 24

## దేసాళం

అంతరంగములో నున్నహరియే గతి గాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును. ॥పల్లవి॥

పుట్టించినకర్మమే పోషించకుండదు నట
బెట్టుగా మనసే మఱపించు నట
పట్టినమేనే ఆసల బతిమాలింపించు నట
చుట్టము లెవ్వరు యెంచి చూచినఁ బ్రాణికిని. ॥అంత॥

పక్కన విత్తినభూమి పంట వండకుండు నట
యెక్కడా మాయే భ్రమయింపించు నట
అక్కఱతోఁ జేసినపుణ్యమే కట్టివేసు నట
దిక్కు దెన మెవ్వరు యీదేహిఁ గరుణించను. ॥అంత॥

ఆసలబెట్టేపాయమే అటమట మా నట
నేనేసంసారమే జ్ఞానిఁ జేయు నట
వేసరక యింతకూ శ్రీవెంకటేశుఁడేలి కట
మోసపుచ్చేవా రెవ్వరు ముదమే జీవునికి. ॥అంత॥ 25

దేసాళం

ధరణి నెంద రెన్నితపములు చేసినాను
హరికృపగలవాఁడే అన్నిటాఁ బూజ్యుఁడు. ॥పల్లవి॥

మితిలేనివిత్తు లెన్ని మేదినిపైఁ జల్లినాను
తతితో వి త్తినవే తగఁ బండును
ఇతరకాంతలు మఱి యెందరు గలిగినాను
పతి మన్నించినదే పట్టపుదేవులు. ॥ధర॥

పాలుపడి నరు లెన్నిపాట్లఁ బడి కొలిచినా
నేలిక చేపట్టినవాఁడే యెక్కుడుబంటు
మూల నెంతధనమున్నా ముంచి దానధర్మములు
తాలిమితో నిచ్చినదే దాఁపురమై నిల్చును. ॥ధర॥

యెన్నికకుఁ గొడుకులు యెందరు గలిగినాను
యిన్నిటా ధర్మపరుఁడే యీడేరును
వున్నతిఁ జదువు లెన్ని వుండినా శ్రీవెంకటేశు
సన్నుతించినమంత్రమే సతమై ఫలించును. ॥ధర॥ 26

దేవగాంధారి

అన్నిటికి మూల మని హరి నెంచరు
పన్నినమాయలో వారు బయలువాఁకేరు. ॥పల్లవి॥

ప్రకృతిబోనులలోపల జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాలసంధిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు. ॥అన్ని॥

కాముని యేట్ల దిగఁ గారేటిదేహులు
దోమటితమబదుకే దొడ్డ దనేరు
పామిడికోటికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తల మనేరు. ॥అన్ని॥

యితరలోకా లనెడియేఁతపుమెట్ల ప్రాణులు
కతలమోక్షమార్గము గంటి మనేరు
తతి నలమేల్మంగపతిశ్రీవెంకటేశ్వర
మతకాన నున్నవారు మాఱు మలనేరు. ॥అన్ని॥ 27

దేసాక్షి

ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా
వింతలై నసీమూర్తి వెనఁ దెలిసేమా. ॥పల్లవి॥

లోకములో సముద్రములోఁతు చెప్పగ రా దట
ఆకాశ మింతం తని యన రా దట
మోకొని భూరేణువులు మితి వెట్టఁగ రా దట
శ్రీకాంతుఁడ నీమహిమ చెప్పి చూప వశమా. ॥ఎంత॥

అల గాలి దెచ్చి ముడియగాఁ గట్టఁగ రా దట
వెలయఁ గాలము గంటువేయ రా దట
కలయ నలుదిక్కులకడ గానఁగ రాదట
జలజాక్ష నీరూపు తలపోయ గలనా. ॥ఎంత

కేవలమైననీమాయ గెలువనే రా దట
భావించి మనసుఁ జక్కఁ బట్ట రా దట
దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి
శ్రీవెంకటేశ నిన్నుఁ జేరి కొల్వ వశమా. ॥ఎంత॥ 28

156-వ రేకు. శంకరాభరణం

నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను
యేచి నీవు రక్షించేదే యెక్కుడుపుణ్య మింతే. ॥పల్లవి॥

పాటించి నీభావము పట్ట వశమా తలఁచి
మేటినామనసు నీకు మీఁదెత్తు టింతే
నూటికైననీనామము నుడుగఁగ వశమా
మాటలు నీసెలవుగా మట్టుపెట్టు టింతే. ॥నీచి॥

వేవేలైననీకథలు వినఁగ నాతరమా
సోవగా వీనులు తావు చూపుట యింతే
దేవ నీసాకారము ద్రిష్టించ నావశమా
పావనముగా నందులోఁ బనిగొను టింతే. ॥నీచి॥

గట్టిగా నిన్నుఁ బూజించఁ గమ్మటి నావశమా
నెట్టన నామేను నీకు నేమించు టింతే
పట్టపలమేల్మంగపతివి శ్రీవెంకటేశ
జట్టిగొనుకొరకు నీశరణను టింతే. ॥నీచి॥ 29

గౌళ.

నమ్మవలెఁ గాని యెన్నఁడు సందేహము లేక
యిమ్ముల దేవుఁడు వర మిచ్చుటే మరుదు. ॥పల్లవి॥

మగనిపై బత్తి సేసి మంచిలోకా లెక్కె రట
తగుదండ గొలవట్టి తత్వగతి గనే రట
పగటున నొకవేరువట్టి పాముఁ బట్టె రట
తగిలి హరిదాసులు ధన్యు లౌ టేమరుదు. ॥నమ్మ॥

యేలికకు ధన మిచ్చి హితభోగా లందే రట
కేలఁ గత్తి పూని పగ గెల్చె రట
గాలి లో లోఁ బూరించి ఘనసిద్ధు లయ్యే రట
యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు. ॥నమ్మ॥

దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యే రట
మొక్కి విప్రుల నర్చించి మంచి సిరు లందే రట
పక్కన నలమేల్మంగపతి శ్రీవెంకటేశ్వరుఁ
జక్కనఁ గొల్చినదాసులు జ్ఞాను లౌ టేమరుదు. ॥నమ్మ॥ 30

ముఖారి

నీ కేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి
యీడక లాలించితే మే మిటు నిన్ను గొలుతుము. ॥పల్లవి॥

మాటలకులోఁ గాని బ్రహ్మము నంటా దాఁచి దాఁచి
మాటాడ కుండేవు సుమ్మీ మాతో నీవు
నీటున మనసులో నిలుపరానివాఁడ నంటా
పాటించి మాకుఁ బొడచూప కుండే గతి యేది. ॥నీకే॥

శ్రుతులకుఁ బట్టరానిచోద్యపుబ్రహ్మము నంటా
మతకానఁ జిక్కక మానేవు సుమ్మీ
పతివి నీగంభీరము బయటఁబడీ నంటా
అతిగోప్యాన ని న్నది యె ట్టెఱిఁగేము. ॥నీకే॥

మాయవన్నుకొనినవుమ్మడిబ్రహ్మాము నంటా
యేయెడనైనా భ్రమయించేవు సుమ్మీ
పాయపుటలమేల్మంగపతివి శ్రీవెంకటేశ
యీయెడ నీశరణంటి మిన్నిటా మన్నెలుమీ. ॥నీకే॥ 31

దేసాళం

కోటానఁగోట్లాయ కోరికలు జన్మములు
కూటువ గూడి రాట్నపుగుండ్రలైనా రయ్యా. ॥పల్లవి॥

మిన్నుపై నున్నజీవులు మన్నుపైఁ బ్రవేసించి
అన్నద్వారమున దేహము మోఁచి
మున్నిటిదానఫలా లిమ్మల భుజంచి యప్పటి
తిన్ననికర్మములు గాదెలఁ బోసే రయ్యా. ॥కోటా॥

యిరవుమఱచి మఱి యేఱువులకాఁపిరేల
సురలు నరుల మంటాఁ జొక్కి చొక్కి
సొరిది లోకము లెల్లాఁ జొచ్చి కాలగతులను
పొరి నాయుష్యము గొల్చి పోయుచున్నా రయ్యా. ॥కోటా॥

దండగాఁగఁ దిరుమలకొండ యెక్కి సుజ్ఞానులు
పండినమనసుతోడ బత్తి సేసి
అండనే శ్రీవెంకటేశు నలమేల్మంగనుఁ గొల్చి
నిండునిధానములై నిల్చినా రయ్యా. ॥కోటా॥ 32

భూపాళం

మొదలనే యెచ్చరికతో మోసపోక యేపొద్దు
వెదకి హరికథలే వినుచుండవలయు. ॥పల్లవి॥

వెలఁదులసుద్దులు వీనులను వింటేను
పెలుచుఁజూపులఁజూడఁ బ్రేమ వుట్టించు
మలసి యాచూపులు మనసునఁ దగిలించు
తలఁపుమాటలాడఁ దమి రేఁచును. ॥మొద॥

మగువలతోడుత మాటలాడ దొరకొంటే
నగి నగి సంసారాల నంటు గల్పించు
తగిలిననవ్వులు తనువులు సోఁకింపించు
మిగులఁ దనుసోఁకులే మించి వలపించును. ॥మొద॥

సతులతో మోహము సంపదలు వోరించు
అతిసంపదలు దేహి నజ్ఞానిఁ జేయు
తతి నలమేలుమంగపతి శ్రీవెంకటేశుఁడే
గతి యని కొలిచితే ఘనునిఁగాఁ జేయును. ॥మొద॥ 33

ముఖారి

ఇందువల్ల నేమి గద్దు యినుపగుగ్గిళ్లింతే
యిందిరారమణుసేవే యిరవైనపదవి. ॥పల్లవి॥

సతులతో నవ్వులు చందమామగుటుకలు
మతితలపోఁత లెండమావులనీళ్లు
రతులలో మాటలు రావిమానిపువ్వులు
తతిఁ విరహపుకాఁక తాటిమానినీడ. ॥ఇందు॥

లలనలజవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని సేసేభత్తి నీటిపై వ్రాఁత
చెలువపువినయాలు చేమకూరశైత్యాలు
కొలఁదిలేనిననుపు గోడమీఁదిసున్నము. ॥ఇందు॥

పడఁతులవేడుకలు పచ్చివడఁగండ్లగుళ్లు
కడుమోవితేపు చింతకాయకజ్జము
బడి నలమేలుమంగపతి శ్రీవెంకటేశ్వరుఁ
డడరించినమాయలు అద్దములోనీడలు. ॥ఇందు॥ 34

157-వ రేకు. బౌళి

సత్యము సేయఁగ వచ్చును సర్వేశ్వర యీమాటకు
నిత్యము నీవే యెఱుఁగుదు నే నేమీ నెఱఁగఁ జుమీ. ॥పల్లవి॥

సులభుఁడ వౌదువు వొకమరి చూడఁగ దుర్లభుఁడ వౌదువు
తలపింతువు మఱపింతువు తగఁ బ్రాణములోనుండి
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు
వెలయఁగ నీవే వెలిగా వేరొకటి నేఁ జేయఁ జుమీ. ॥సత్య॥

వొనరఁగఁ బూజలు గొందువు వొక్కొకపరి మానుదు వటు
కను మూయింతువు నిదురలఁ గడు మేల్కొలుపుదువు
ఘనముగ నజ్ఞానిఁ జేతువు కరుణతో జ్ఞానిఁ జేతువు
ననుఁ బుట్టించితి నీవే నా కాపని గాదు సుమీ. ॥సత్య॥

నాలో నుందువు వొకపరి నగి శ్రీవెంకటగిరి నుందువు
పాలింతువు లాలింతువు భవ మీడేరింతువు
పోలింప సంసారిఁ జేతువు భువి నీదాసునిఁ జేతువు
కాలముఁ గర్మము నీవే కపటము నే నేరఁ జుమీ ॥సత్య॥ 35

రామక్రియ

వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ల
ధీరతతో నేది మేలో తెలుసుకోరో. ॥పల్లవి॥

అట్టె కొందరు మతము లన్నియు నేక మని
పట్టవర్ధనము నెత్తిఁ బెట్టి చూపిరి
జట్టిఁ గొందరు జీవులు జంగమే లింగము గాని
పుట్టు గెల్లా భస్మ మని పూసుక చూపిరి. ॥వారి॥

కొంద రేమియును లేదు కొట్టఁగొన లయ మని
అందివట్టి లలాటశూన్యము చూపిరి
కందువఁ గొందరు లక్ష్మీకాంతుఁ డంతరాత్మ యని
ముందె నామము శ్రీచూర్ణమునుఁ బెట్టి చూపిరి. ॥వారి॥

చెలఁగి దిష్ట మిప్పుడు శ్రీవెంకటేశుఁడు
అలమేలుమంగపతి యై యున్నవాఁడు
యిల వీరని దాసుల కిట్టిభాగ్యరేఖలు
వలసినవారి కెల్లా వ్రాసినాఁ డితఁడు. ॥వారి॥ 36

## లలిత

విచార మెన్నఁడు లేదు వీరిడిజీవులకును
పచారించేరు బ్రదుకు బ్రహ్మచాటనుండియు. ॥పల్లవి॥

పొద్దు వొడచుటయును పొరిఁ గూఁగ్రుటయె కాని
అద్దుకొని మిగులఁగ నం దేమి లేదు
వొద్దికఁ బుట్టుటయును వుదుగఁ జూచుటె కాని
కొద్దితోడఁగాల మేమి గురియై నిలువదు. ॥విచా

అన్నము భుజించేదియు నాఁకలిగొనేదె కాని
యెన్నికకుఁ జెప్పి చూప నేదియు లేదు
యిన్నిటఁ దిరిగాడేది యింటికి వచ్చే[illegible]
పన్ని తననిలుకడ భావించ లేదు.

జవ్వనము మోఁచేదియు సరి ముదుసేదె కాని
తవ్వి కట్టుకొనే దేది దాఁచే దేది
నవ్వుతా నలమేల్మంగనాయక శ్రీవెంకటేశ
రవ్వల నీ వేలికవు రక్షించు మిఁకను. ॥విచా॥ 37

శంకరాభరణం

ఇంతకంటే నేమి సేసే మిదే మా మానసపూజ
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుఁడవు ॥పల్లవి॥

అంతర్యామివైన మీకు నావాహన మదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపుఁగోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలముచల్లే మీకుఁ బాద్యము ॥ఇంత॥

జలధు లన్నియును నాచమనీయము మీకు
అల యా వరుణజల మదియే స్నానము
వలనుగా మీమహిమలే వస్త్రాభరణములు
అల వేదములే మీకు యజ్ఞోపవీతములు. ॥ఇంత॥

యిరవుగఁ గుబ్జ తొల్లిచ్చినదే మీకు గంధము
ధర మాలాకారుని పూదండలే మీకు పువ్వులు
ఉరుగతి మానులహోమనే మీకు ధూపము
తిరమైనమీకు రవితేజనే దీపము. ॥ఇంత॥

నానామృతములే మీకు నైవేద్యతాంబూలములు
పూనినభక్తి షోడశోపచారములు
ఆనుక శ్రీవెంకటేశ అలమేల్మంగపతివి
తానకపుజపములే తగ మీకు నుతులు. ॥ఇంత॥ 38

## శ్రీరాగం

రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ. ॥పల్లవి॥

దశరథతనూజాయ తాటకదమనాయ
కుశికసంభవయజ్ఞగోపనాయ
పశుపతిమహాధనుర్భంజనాయ నమో
విశదభార్గవరామవిజయకరణాయ. ॥రాజీ॥

భరితధర్మాయ శూర్పణఖాంగహరణాయ
ఖరదూషణాదిరిపుఖండనాయ
తరణిసంభవసైన్యరక్షకాయ నమో
నిరుపమమహావారినిధిబంధనాయ. ॥రాజీ॥

హతరావణాయ సంయమినాథవరదాయ
అతులితాయోధ్యాపురాధిపాయ
హితకరశ్రీవెంకటేశ్వరాయ నమో
వితతవావిలిపాటివీరరామాయ. ॥రాజీ॥ 39

## లలిత

భోగము నేను నీకు భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును. ॥పల్లవి॥

చక్కని జన్మపుసంసారవృక్షమునకు
పక్కన(వ?)ఫలము నీవు భావించఁగా
మక్కువఁ గర్మ మనేటి మత్తగజమునకును
యెక్కినమావటీఁడవు యెంచఁగ నీవు. ॥భోగ॥

నెట్టన దేహ మనేటి నిర్మలరాజ్యమునకు
పట్ట మేలుచుండినభూపతివి నీవే
దిట్టయైనచిత్త మనే తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు. ॥భో॥

సంతతమైన భక్తిచంద్రోదయమునకు
రంతులఁ జెలఁగుసముద్రమవు నీవు
చెంతల శ్రీవెంకటేశ జీవుఁ డనేమేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁ జూచినను. ॥భో॥ 40

158-వ రేకు. సాళంగనాట

కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసురవరద జయపరిపూర్ణరామ. ॥పల్లవి॥

మునుప దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి. ॥కౌస॥

సుప్పనాతి శిక్షించి సొరిది ఋషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయామృగము సోధించి హరియించి
కప్పి హనుమంతు బంటుఁగా నేలుకొంటివి. ॥కౌస॥

సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి
చెలఁగితి వయోధ్యలో శ్రీవెంకటేశుఁడ. ॥కౌస॥ 41

గౌళ

గట్టిగాఁ దెలుసుకొంటే కన్నదే కంటి గురుమ (తు ?)
దట్టమై సుజ్ఞానము తనలోనే వున్నది. ॥పల్లవి॥

బయలే పంటలు వండె బయలే పాఁడి విదికె
బయలు ప్రపంచమై భ్రమయించెను
బయటనే ప్రకృతియు బయటనే జీవులు
బయటనే బ్రహ్మము పరిపూర్ణమాయె. ॥గట్టి॥

ఆకసము చూలాయ నాకసము రూపు లాయ
నాకసము సంసారమై యలవడెను
ఆకసాన దివియును నాకసాన లోకములు
ఆకసాన శ్రీహరి యవతార మందెను. ॥గట్టి॥

అంతరంగమే భోగము అంతరంగమే యోగము
అంతరంగమే అన్నిటి కావాస మయ్యె
అంతరంగాన శ్రీవెంకటాధిపుఁ డున్నవాఁడు
అంతరంగాన మోక్షము అతఁడే యొసఁగెను. ॥గట్టి॥ 42

గౌళ

ఆతురబంధుగుఁడవు హరి నారాయణ కృష్ణ
మాతలఁ బెఱిఁగి నీవే మన్నించితి విపుడు. ॥పల్లవి॥

గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు
ధరలో గజరాజు నుద్ధరించినట్లు
గరిమఁ జెరలు మాన్పి కాంతల బెండ్లాడినట్లు
సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి. ॥ఆతు॥

నేరుపుననే రుకుమిణిదేవిఁ దెచ్చినయట్లు
ధీరత మునిపుత్రులఁ దెచ్చినయట్లు
భారమైనయహల్యాశాపము మానిపినయట్లు
గారవించి మము నేఁడు కరుణఁ జూచితివి. ॥ఆతు॥

లంకసాధించి సీతను లలిఁ జేకొనినయట్లు
తెంకికి ననిరుద్ధునిఁ దెచ్చినయట్లు
అంకెల శ్రీవెంకటేశ అట్టె నీదాసుల మని
పొంకముగ మాపాలిటఁ బొసఁగి యేలితివి. ॥ఆతు॥ 43

శంకరాభరణం

వేదములు నుతించఁగ వేడుకలు దైవారఁగ
ఆదరించీ దాసుల మోహననారసింహుఁడు. ॥పల్లవి॥

నెఱులజడలతోడ నిక్కుఁగర్ణములతోడ
కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ
వుఱక సిరిఁ దొడపై నుంచుక సింహాసనాన
మెఱసీఁ బ్రతాపములు మేటినారసింహుఁడు. ॥వేద॥

నిడుపమీసాలతోడ నిట్టూరుపులతోడ
మిడిగుడ్లతోఁ దెల్లనిమేనితోడ
వొడలసొమ్ములు వెట్టి వొడ్డోలగమై వుండీ
కడు మంచివరా లిచ్చీ ఘననారసింహుఁడు. ॥వేద॥

చిలుకుగోళ్లతోడ సెలవినవ్వులతోడ
బలుజిహ్వతోడ యోగపట్టముతోడ
అలరి శ్రీవెంకటాద్రి నహోబలగిరిని
అల ప్రహ్లాదునిఁ గాచె నాదినారసింహుఁడు. ॥వేద॥ 44

## శ్రీరాగం

సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు
శుకయోగివంద్యుని సుజ్ఞాన మెంత. ॥పల్లవి॥

మరునితండ్రికిని మరి చక్కఁదన మెంత
సిరిమగనిభాగ్యము చెప్ప నెంత
పురుషోత్తముఘనత పొగడఁగ నీఁక నెంత
గరిమ జలధిశాయిగంభీర మెంత ॥సక॥

వేవేలుముఖాలవానివిగ్రహము చెప్ప నెంత
భూవల్లభునివోరుపు పోలించ నెంత
వావిరిబ్రహ్మతండ్రికి వర్ణింప రాజస మెంత
యేవల్లఁ జక్రాయుధుని కెదురెంచ నెంత. ॥సక॥

అమితవరదునకు ఔదార్యగుణ మెంత
విమతాసురవైరి విక్రమ మెంత
మమతల నలమేలుమంగపతిసొబ గెంత
అమర శ్రీవెంకటేశుఆధిక్య మెంత. ॥సక॥ 45

## సామంతం

కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీమహిమలే పరబ్రహ్మము. ॥పల్లవి॥

ఆకాశమువంటిమేన నమరేమూర్తివి గాన
ఆకాశనదియే నీకు నభిషేకము
నేకొని నీవే నిండుమేఘవర్ణుఁడవు గాన
నీకు మేఘపుష్పాలే పన్నీరుకాపు. ॥కోటి॥

చంద్రుఁడు నీమనసులో జనించె నటు గాన
చంద్రికలు కప్రకాశ్పై సరి నిండెను
యింద్రనీలపుఁగనుల యిలధరుఁడవు గాన
తంద్రలేనియీపెచూపె తట్టుపునుఁ గాయను. ||కోటి||

లక్ష్మిపతివి గాన లాగుల నీవురముపై
లక్ష్మి యలమేలుమంగలలినితాళి
సూక్ష్మమై శ్రీవెంకటేశ చుక్కలపొడవు గాఁగ
పక్ష్మనక్షత్రములై యాభరణహారములు. ||కోటి|| 46

159-వ రేకు. పాడి

చంచలపడఁగ వద్దు సారె సారెఁ గోర వద్దు
పొంచుకున్నదైవమే బుద్ధులు నేర్పీని. ||పల్లవి||

లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁ డిదే
నాకు నభయము లిచ్చి నన్నుఁ గాచును
శ్రీకాంతుఁ డితఁడే నాచిత్తములో మలసీని
దాకొని శుభము లెల్లాఁ దానే వొసఁగును. ||చంచ||

పరమపురుషుఁడు నాప్రాణనాథుఁడై నాఁడు
పరగ నాపాలివాఁడై బ్రదికించును
ధరణీశుఁ డితఁడే నాదాపుదండై కడఁగీని
నిరతి నేపొద్దును మన్నించును మ మ్మెపుడు. ||చంచ||

శ్రీవెంకటేశుఁడు నాజిహ్వఁ దగిలి వున్నాఁడు
పావనునిఁ జేసి నాకు ఫల మిచ్చును
గోవిందుఁ డీస్వామి నన్నుఁ గొలిపించుకొన్నవాఁడు
యీవల నావల నాకు నిహపరా లిచ్చును. ||చంచ|| 47

రామక్రియ

నెట్టన శ్రీసతిమగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైన దేవునికే శరణు. ||పల్లవి||

చెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై వుండేయాతనికే శరణు
తెలివై మఱపై దేహాలలో సూత్రమై
వలనై రక్షించేయట్టివానికే శరణు. ||నెట్ట||

చక్కఁగా వేదములకు సకలశాస్త్రములకు
నెక్కొని గుఱుతైనవానికే శరణు
దిక్కుదెసయి స్వతంత్రుఁడయి తేరినఆదిమూలమై
అక్కజపుమహిమల యాతనికే శరణు. ||నెట్ట||

యిరవుగఁ గరుణించి యిహపరాలొసఁగేటి
నిరతి శ్రీవెంకటేశునికే శరణు
గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము
తెరవులేక యిచ్చేటియాతనికే శరణు. ||నెట్ట|| 48

మాళవి

పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా
పురుఁడు లేదిఁక నీకుఁ బురుషోత్తమా. ||పల్లవి||

పాలను లాడకు నీవు పురుషోత్తమా
బలిసి లోఁగఁగ నేల పురుషోత్తమా
పాలమురాజవు నీవు పురుషోత్తమా
పాలఁకు వదే కంబమునఁ బురుషోత్తమా. ||పు ||

పొడవులకుఁ బొడవైన పురుషోత్తమా బిరుదు
పుడిసిళ్లఁ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిఁ గైకొంటి పురుషోత్తమా
పొడమెఁ జీఁకటితప్పు పురుషోత్తమా. ॥పురు॥

బూటకపుబుద్ధిగల పురుషోత్తమా
ఘోటిగుఱప్పుఁబసల పురుషోత్తమా
నేఁటిశ్రీవేంకటముమీఁద నొసఁగే విది వో
పూఁటపూఁట వరాలు పురుషోత్తమా. ॥పురు॥ 49

## సామంతం

అన్నిటికి మూల మని హరి నెంచరు
పన్నినమాయలో వారు బయలువాఁకేరు. ॥పల్లవి॥

ప్రకృతిబోనులలోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాల సంధిజన్మములవారు
వెకలిసంసారాలకే వేడుకపడేరు. ॥అన్ని॥

కామునియేట్ల దిగఁగారేటిదేహాలు
దోమటిత్రపుబదుకే దొడ్డ దనేరు
పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తల మనేరు. ॥అన్ని॥

యితరలోకాలనేడి యెంతపుమెట్లప్రాణులు
కతల మోక్షమార్గము గంటి మనేరు
తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వర
మతకాన నున్నవారు మారు మలసేరు. ॥అన్ని॥ 50

### వరాళి

ఏటిజాణతనమే యేమే నీవు
కోటిసైనా యాఁటది కక్కురితికిఁ జొచ్చునా. ||పల్లవి||

వరుసకు వచ్చి యావనిత గాచుకుండఁగా
మొరవులసన్నఁబతి నేల పిల్చేవే
తెరమఱుఁగున నొక్కెతకు మీఁదెత్తినమోవి
యిరవుగ నీ కది యెంగిలి గాదా. ||ఏటి||

పొందైనసూపెయింటిలో బోనము వెట్టుకుండఁగా
విందు నీవేల చెప్పేవే విభునికిని
అందాకె మనసుపెట్టినటువంటికాఁగిలి
కిందటనే వాఁడి మిగిలినది గాకా. ||ఏటి||

నేసవెట్టినమగువచెఱఁగు వట్టుకుండఁగా
ఆసతో నీ వెట్టు గూడి యలరితివే
యీసరినే శ్రీవెంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వోసరించితే బువ్వము వూరఁబొత్తు గాదా. ||ఏటి|| 51

### ముఖారి

ఇంతిజవ్వనవనాన నిన్నియుఁ నెలకొనెను
వంతులవాసులతోడ వలరాచపాఁ[illegible] ||పల్లవి||

కుతిలాలు మాని సరిఁ గూచున్న[illegible]
సతియురముమీఁదట చక్రవాకాలు[illegible]
గతి గూడ గుంపుగట్టి కాఁపురము[illegible]
మితిమీరి శిరసుపై పేఁటేతుమ్మెదలు[illegible] ||ఇంతి||

ANDHRA PRADESH SA... LIBRARY
Call No. ........
Acc No. ........
Date ........
HYDERABAD-A

కలికితనాలతోడఁ గడుమించీఁ గదవే
జలజాక్షిమోముననె చకోరములు
పలుకులలోననే పాదుకొనె నిపు డిట్టె
చెలరేఁగి మోవిమీఁద చిలుకమొత్తములు. ॥ఇంతి॥

తగు శ్రీవెంకటేశ్వరుదండ నిల్చీఁ జూడవే
మగువనడపు లనే మంచిహంసలు
మిగుల రతివేళను మెరసీఁ దా మిన్నిటాను
పగటుఁగుత్తికలోన పావురములు. ॥ఇంతి॥ 52

160-వ రేకు. భైరవి

ఎవ్వరినేర్పులుఁ జెప్ప నిందు నేది
రవ్వ సేయక జీవుల రక్షించవయ్యా. ॥పల్లవి॥

తలపోసి తలపోసి ధ్యానము సేతురు నిన్ను
మొలమి నింతని నిశ్చయింప లేరు
పలుమారు నీగుణాలు పైకొని నుతింతురు
కొలఁది వెట్టుచు మీఁగుబుతు లెంచలేరు. ॥ఎవ్వ॥

పాదిగి పొదిగి నిన్నుఁ బూజ లెల్లాఁ జేతురు
యెదుట నీశ్రీమూర్తి యెఱఁగ లేరు
వెదకి వెదకి సారె విందురు నీకత లెల్లా
పదిలపునీభక్తి పట్టఁగ లేరు. ॥ఎవ్వ॥

నిక్కి నిక్కి చేతు లెత్తి నీకు మొక్కుదురు గాని
మక్కువ నీమహిమ నమ్మఁగ లేరు
యిక్కడ శ్రీవెంకటేశ యిటు నీకరుణచేత
తక్కక నిన్ను సేవించి తనియ లేరు. ॥ఎవ్వ॥ 53

మాళవిగౌళ

ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁ డింతే
పన్ని యాతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము. ॥పల్లవి॥

మనసునఁ బుట్టినమంకుఁగామక్రోధాలు
పనిలేవు తనకంటేఁ బాప మంటదు
పనివి తొడిమ నూడి పండు తీఁగె నంటదు
జనుల కెల్లాఁ బ్రకృతిసహజ మింతే. ॥ఇన్ని॥

చేతులారఁ జేసేటి చేకొన్నకర్మానకు
ఘాతలఁ గర్తఁ గా నంటే కట్టు వడఁడు
ఆతల నబక ముంచినట్టివేఁడి చెయ్యంటదు
జాతిదేహాలు మోఁచిన సహజ మింతే. ॥ఇన్ని॥

వాకున నాడినయట్టి వట్టి పల్లదాల నెల్లా
దాకొని పొరయ నంటే తప్పులే లేవు
పైకొని శ్రీవెంకటేశుబంటుకు వళకు లేదు
సైకమైనహరిభక్తి సహజ మింతే. ॥ఇన్ని॥ 54

సాళంగనాట

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద. ॥పల్లవి॥

మిహిరశశినయన మృగనరవేష
బహిరంతస్థలపరిపూర్ణ
అహినాయకసింహాసనరాజిత
బహుళగుణగణ ప్రహ్లాదవరద. ॥జయ॥

చటులపరాక్రమ సమఘనవిరహిత
నిటలనేత్ర మౌనిప్రణుత
కుటిలదైత్యతతికుక్షివిదారణ
పటువజ్రనఖ ప్రహ్లాదవరద. ॥జయ॥

శ్రీవనితాసంశ్రితవామాంక
భావజకోటిప్రతిమాన
శ్రీవేంకటగిరిశిఖరనివాస
పావనచరిత ప్రహ్లాదవరద. ॥జయ॥ 55

సామంతం

ఎంత వలచితి వయ్యా యింతికి
చెంత నుంటే లేతనవ్వే సేసపాలు గావా. ॥పల్లవి॥

చెలి నీపైఁ జిగురాకు చిదిమి వేసితేను
వలరాజ డిద మని వంచించితివి
వెలయఁగ విరహపువేళ వాఁ డెక్కుఁ గాక
మెలుపునఁ గదిసితే మెత్తనే కాదా. ॥ఎంత॥

బిసరుహాక్షి పుష్పాడి ప్రేమ నీపైఁ జల్లితేను
వసంతునిచో క్కనుచు వసివాడేవు
వెసఁ దెరమరఁ గైతే వేగమే నామెక్కుఁ గాక
రసికత నొద్ద నుంటే రజమే కాదా. ॥ఎంత॥

అలమేలుమంగ సుర టట్టే నీపై విసరితే
మలయానిలు వేఁ డంటా మాటువెట్టేవు
తలఁచి శ్రీవెంకటేశ దవ్వైతే వేఁ డెక్కుఁ గాక
చలపట్టి కూడితివి చల్లనే కాదా. ॥ఎంత॥ 56

శ్రీరాగం

ఎంత లేదు నీబత్తి యెఱఁగరా యిందరును
దొంతిబెట్టేవుట్టియాలు దొరకుదాఁకాను. ॥పల్లవి॥

పోరుగాపెపై వలపు పూసేవు నామీఁద
వరుసల వద్ది కాపె వచ్చుదాఁకాను
సరుస నావంక నీవు చక్కఁ జూచే వప్పటిని
అరసి అవ్వలిపొందు అద నోఁదాకాను. ॥ఎంత॥

కడవారిపొందు నాతోఁ గసి వుచ్చుకొనే విట్టె
అడరి వారితో మాఁట లందుదాఁకాను
నడుమ నవ్వు లెల్లాను నవ్వేవు యీవేళను
వుడివోనియట్టికౌఁగి లొనరుదాఁకాను. ॥ఎంత॥

పోరచి వనిత మారు పొదిగేవు నన్ను నిట్టే
చేరి యాపె నిన్నుఁగూడి చెలఁగుదాఁకా
యీరీతి శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోరిక లన్నియును జేకూరుదాఁకాను. ॥ఎంత॥ 57

శుద్ధవసంతం

ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు
జవళి నెంచి చూచితే సరి బేసి వంటివి. ॥పల్లవి॥

అంగనలచూపులు ఆరతులవంటివి
కుంగక నీవు కొలువై కూచున్నవేళ
చెంగట లేతనవ్వులు సేసపాలవంటివి
కొంగులు వట్టుచు నీవు కొసరేటివేళ. ॥ఇవి॥

కాంతలపలుకు లెల్లా కప్పురాలవంటివి
అంతలో నీవు సరసా లాడేటివేళ
బంతిమోవులయీవులు పాలకూళ్లవంటివి
మంతనాన నుండి నీవు మన్నించేవేళను. ॥ఇవి॥

వెలఁదులకౌఁగిళ్లు విడిదిండ్లవంటివి
చలముల నీరతులు సలిపేవేళ
యెలమి శ్రీవెంకటేశ యిట్టె నన్ను గూడితివి
తలపులవంటి వన్ని తమకపువేళను. ॥ఇవి॥ 58

55-వ రేకు. లలిత

ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన నెఱఁగ నీదు
అట్టె మాగురుననుమతినే ప్రత్యక్షమ వైతివి గాని. ॥పల్లవి॥

కరుణాకరా మిమ్మునుఁ గని తెలియఁగ లేను
ధరమీమహిమలు విని విని తగ నరు దందుదును
నరహరి నీవు నాలో నుండఁగ నమ్మక పురాణకథలందు
అరయఁగ మీచరితలు చెప్పఁగ నాసతోడ మిముఁ దలంతును ॥ఎట్టి॥

జగదీశా మీనామంబులు జపించ నలయుదును
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదకుదు నింతటను
నగధర మీపై భక్తి సేయఁగ మనంబున నోడఁబడను
పగటున మీరిచ్చువరములకోరకే పలుమారు మీకు మొక్కుకొందును ॥ఎట్టి॥

శ్రీవెంకటేశ నీమూరితి చింతించి చేపట్టఁగ లేను
దేవుఁడ వనియెడువిశ్వాసమునకే తిరముగఁ గొలిచెదను
శ్రీవనితాధిప వేదాలు మిమ్మునుఁ జెప్పఁగా నే తర్కింపుదును
వేవేలు పరుషలు సేవింపగఁ నీవే కర్త వని నిశ్చయింతును. ॥ఎట్టి॥ 59

లలిత

అతని నడుగవో చిత్రగుప్త నాయందలి యాఁగాఁపు లన్నియును
అతఁడే మీ కుత్తరము చెప్పెడిని యన్నిటికిని మఱుఁ దడవకుమీ. ॥పల్లవి॥

కరచరణాదులు నాకుఁ గల్పించిన యతఁడే
గరిమల నావుభయకర్మసంఘములకుఁ దాఁగర్త
సరుగఁ బ్రాణము లొసఁగి చైతన్య మతఁడే
పరగఁగ నాయపరాధంబులు పరిహరించఁ గర్త. ॥అత॥

రమణతో నను బుట్టించి రక్షించేయతఁడే
అమరఁగ నన్ను వహించుక నావళు కంతయుఁ దీర్పఁగఁ దాఁ గర్త
ప్రమదమున నాయంతరాత్మయై పాదుకొన్నయతఁడే
మమతల మీలోకము చొరకుండా మాఁట లాడుకొనఁ దానే కర్త. ॥అత॥

యెప్పుడుఁ బాయక దాసునిఁగా నేలుకొన్నయతఁడే
తప్పక యిహాముఁ బరము నిచ్చి వొరులు దడవకుండఁ జేయఁగఁ గర్త
చెప్పఁగ నాపాలిదేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే
అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నటు మమ్ముఁ గావఁగఁ దానే కర్త. ॥ 60

లలిత

అవధారు పరాకు సేయకు మపరాధముగా నెంచకు
వివరింపఁగ నీవే గతి విష్ణుఁడ మన్నించఁ గదే. ॥పల్లవి॥

నాకు నాకే నీసన్నిధానము గల్పించుకొని
చేకొని విన్నపము లెల్లాఁ జేయుచున్నాఁడను
కాకు సేసి నన్ను వీఁ డెంత గట్టువాయ యనక
శ్రీకాంతా నీ వింతట నుందువు చిత్తగించి వినవే. ॥అవ॥

చూచి చూచి నీమూరితి నాసొమ్ముగఁ జేసుకొని
చేచేత నాలో ధ్యానము సేయుచు నున్నాఁడను
కాచుకొని వీనికి నాకుఁ గారణ మే మనక
యేచోటా నీరూపమే హరి యెదలో నుండఁ గదే. ॥అవ॥

కోరి కోరి నే నూరక నీకొలువు గడించుకొని
చేరి నీవూడిగములు సేయుచు నున్నాఁడను
యీరీతులు శ్రీవెంకటేశ్వర యివి యేఁటి సలిగె లనక
నారాయణ సర్వేశ్వరుఁడవు నన్ను నేలఁ గదవే. ॥అవ॥ 61

## లలిత

ఎట్టు సేయఁ గలవాఁడవో యిఁక నీచేతిది నావునికి
నెట్టన నీదాసుఁడ నైతిని నీచిత్తం బిఁకను. ॥పల్లవి॥

సారెకుఁ గొలువు సేతు చనవులు నీ విత్తువో యనుచు
నేరకున్నాఁ బాడుదును నీవు మెత్తు వనుచు
వోరిచి వుపవాసము లుండుదు నొగి దయ దలంతువో యనుచు
చేరి వాకిలి గాచు కుండుదు చిత్తము రావలె ననుచు. ॥ఎట్టు॥

కమ్మటినిచ్చకములు నెరపుదు కైవసము గావలె ననుచు
వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగ మోడుదు వనుచు
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరము లెంచక కాతు వని
నమ్మి నిన్ను నేఁ బూజింతు నను నీ పీడేరింతు వని. ॥ఎట్టు॥

ఆసతో నిను భావింతు అన్నిట న న్నేలుదు వనుచు
వేసరక నీమంత్రము నుడుగుదు వేగమె వర మొసఁగుదు వనుచు
రాసికి నెక్కఁగ శ్రీవెంకటేశ రక్షించితి విప్పుడు నన్ను
వాసితోడ నే నిన్ను దగులుదును వదలక నాపాలఁ గల వనుచు. ॥ఎట్టు॥ 62

32-వ రేకు

గౌళ

ఇటువలెనే బుణ్యము నీకు యిది వుపకారం బౌను
తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును. ॥పల్లవి॥

సురాసురగంధర్వయక్షులు మిమ్ము దెలియఁగ లేరు
పరాశరాదులు మీరూపు భావించఁగ లేరు
నరు లెరుఁగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుఁడవై
కరీంద్రుఁ గాచినయటువలెఁ గాతువు గాక. ॥ఇటు॥

సనాతన బహువేదశాస్త్రంబులు మిము నుతింప లేవు
అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించఁగ లేవు
తనుధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను
వినోదముగాఁ గాచినయటువలె వెసఁ గాతువు గాక. ॥ఇటు॥

రమాసతినిళామహిరాములు మీంతల పెఱుంగరు
సమేతులైన శేషాదులు మీజాడ మీఱ లేరు
తమోమయు లిందరును ధరణీధర శ్రీవెంకటేశ
నమో నమో యని మొక్కంగా నను గాతువుగాక. ॥ఇటు॥ 63

సామంతం

సరిగాఁడు వీఁడన వలదు జగమున రాజు వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాఁట. ॥పల్లవి॥

జగదేకబంధుఁడవట సకలజీవులకును గుఱుతుగ
మొగము చూపవయా మీకు మొక్కెద నిదె నేను
తగులైనచుట్టరికము దాఁచఁగ నీకు నేలా
తెగరానిమమకారము తెలుపఁగవలెఁ గాని. ॥సరి॥

యితవైన ప్రాణమవట యీచరాచరములకు అభయము
సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను
మతిఁ బాయనికూటంబులు మానుప మరి యేలా
జతనంబునఁ జాలాబ్రియములు జరపఁగవలెఁ గాని. ॥సరి॥

నెలవైన యేలికవట నీదాసుల కెల్లా వేళలు
దెలియఁ జెప్పవయ్యా మిమ్మును తిరముగఁ గొలిచెదను
బలువయిన శ్రీవెంకటేశ పరాకు లేక నెలా
చెలరేఁగి నీసులభత్వమే చెల్లించవలెఁ గాని. ॥సరి॥ 64

## సామంతం

ఎదురుమాట లాడితి నీకు యీతప్పులు లోఁ గొను నీవు
పదరఁగఁ దగదు నీకు పంతము లిచ్చితిఁ గావఁ గదే. ॥పల్లవి॥

మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనక వేసుకో శరణు చొచ్చితిని విడువకు నన్ననుచు
ననుఁ జూచి దేహి యంటే నాస్తి యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడుదాతవు నీవు. ॥ఎదు॥

వెదకి నిను వేడుకొంటిని విచ్చేసితివి మాయింటికి
వదలఁ దగదు నీభక్తి యొసఁగు నీవాఁడను పాయకు మనుచు
పదిలంబుగ మొక్కినచేతులు బలిమిఁ గోయఁగాదు
యిదివో బంటను నేను యేలినవాఁడవు నీవు. ॥ఎదు॥

మరిగి నీముద్రలు మోచితిని మన్నించితి విటు నను నీవు
కరుణతోడ నాయపరాధంబులు కడవు కావు మనుచు
యిరవై నీపేరు వెట్టితే నియ్యకొనక పోరాదు
నరమాత్రుఁడ నే శ్రీవేంకటేశ నాయకుఁడవు నీవు. ॥ఎదు॥ 65

సామంతం

ఏది గతి నే నొక్కఁడనే యెందరి కోపుదును
నీదయచే మన్నించఁ గదవే నీరజనాభా. ||పల్లవి||

మోహాంధకారము యెక్కడ చూచిన ముంచుక వున్నది
దేహాభిమానము అందుకుఁ దోడు దీకొని వచ్చీని
సాహసభూతము ఘనహింసలకే చాఁపించీ జేయి
దాహాపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని. ||ఏది||

కోపాగ్నికణములు సారెకుఁ జుట్టుక గుబ్బతిలఁ దొడఁగె
పై పై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని
చాపలగర్వము యెవ్వరి నైనా సాధించీని
తీపులధనములు మీఁదిమీఁదనే తీదీప్పలు సేఁచీని. ||ఏది||

భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని
వేవేలు సంపద లెందు చూచినా వేడుక సేసీని
శ్రీవెంకటేశ యలమేల్మంగను చేకొను దేవుఁడ
యీవేళను నన్నేలితివి నాకు నిన్నియు తగ వస మయ్యాని. ||ఏది|| 66

163-వ రేకు. సామంతం

ఆస తియ్యఁ గదవే అందుకే కాచు కున్నాఁడను
పూనుక నీ వెంతనేర్పరి వైనా భువి మనసువేదను నేను. ||పల్లవి||

కొలిచే మనేబంట్లు నీకుఁ గోటానఁగోట్లు గలరు నిన్ను
దెలిసే మనేజ్ఞానులు తెందేప లున్నారు
తలఁచి వరము లడిగేవారలు తలవెంట్రుక లందరు వారె
యిల సందడిలో నాకొలువు యెటువలె నెక్కీనో. ||ఆస||

పనులకుఁ బొల్పుడినవారు బ్రహ్మాదిదేవత లట
వినుతులుసేయఁ దొడఁగీ నవె వేదరాసు లట
మునుకొని ధ్యానించువారు మును లెందరైనాఁ గల రట
వినయపునామనవినవులకు వేళ లెపుడు గలిగీనో. ||అన||

వున్నతితోడుత నిన్ను మోఁచుటకు వున్నారు గరుడఁడు శేషుఁడు నీకు
అన్నిటాను నీకాఁగిటిలోపల నలరీ నలమేల్మంగ
యెన్నఁగ శ్రీవెంకటేశ నన్నుఁ యేలితి వింతటిలోన
పన్ని ననామొక్కులు నీ కేబాగులఁ జేరీనో. ||అన|| 67

## సామంతం

ఇప్పుడే నే నొడఁబడ జెప్పితి యెల్లనాఁడు మరవఁగఁ దగదు
నెప్పున నే నెంతటికల్లరి నైనా నీదాసుఁడ నని యందురుగా. ||పల్లవి||

మఱతునో తలఁతునో నిన్ను మాఁటల నేతప్పు గలుగునో
యెఱఁగక నీదాసులఁ జూచి యేమని పలుకుదునో
నెఱసిననాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని
మఱి నామీఁదట నేరము లెంచక మాధవ యన్నిటు రక్షించవే. ||ఇప్పు||

అలతునో సొలతునో నే నీయందు భక్తి సేతునో సేయనో
యెలమిని నీకు నివేదించక యేనేమి భుజియింతునో
తలఁచేటినామనసే నీకును ధనముగాఁ గప్పము వెట్టితిని
పలుమరు నన్నును తగవుకుఁ దియ్యక పరమాత్మ ననుఁ గావఁ గదే. ||ఇప్పు||

నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము లేమేమి మానితినో
నీరూపము నే సేవించి యెక్కడ నే ననుమానించితినో
మేరతోడ మావారు చెప్పఁగా మి మ్మింతట నే నమ్మితిని
వారిఁ జూచైన శ్రీవెంకటేశ వరదుఁడవై మము మన్నించఁ గదవే. ||ఇప్పు|| 68

ముఖారి

సర్వేశ్వరా నీతో సరి యెవ్వరు
పూర్వపువారు చెప్పఁగాఁ బూఁచి కొలిచేఁ గాని. ॥పల్లవి॥

చేరి వేదములు నిన్నుఁ జెప్పఁగా వినుటే కాని
నీరూపము దర్శించేవార లెవ్వరు
ధారుణిలోనియవతారాలే చూఁచుట
దీరత నీమహిమలు తెలిసేవా రెవ్వరు. ॥సర్వే॥

భూమి వారిఁ జూచి నిన్ను బూజలు సేయుట గాని
కామించి నీతో మాటాడేఘను లెవ్వరు
దీమసాన నీదాసులద్దిష్ట మెరుఁగుట గాని
యీమేర నీదైవిక మెరిఁగేవా రెవ్వరు. ॥సర్వే॥

వరములు నీ వియ్యఁగా వచ్చి సేవించుట గాని
కెరలి నీమూర్తి వెదకేవా రెవ్వరు
హరి శ్రీవెంకటేశా నీకరుణ వాఁ గాఁట గాని
అరసి నిన్ను సుద్దు లడిగేవా రెవ్వరు. ॥సర్వే॥ 59

ముఖారి

ఇట్టి నాపెట్టితనము లే మని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁ జూడవే. ॥పల్లవి॥

పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడనేరుతు నంటా మరి నే నహంకరింతును
నీటున లోకము లెల్లా నీవే యేలుచుండఁగాను
గాటాన దొర నంటా గర్వింతు నేను. ॥ఇట్టి॥

నెమ్మదిఁ బ్రజల నెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నే నే బిడ్డలఁ గంటి నంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగగాను
యిమ్ముల గడించుకొంటి నివి నే నంటా నెంతు. ॥ఇట్టి॥

మన్నించి యిహాపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును
వున్నతి శ్రీవెంకటేశ నన్ను నేమి చూచేవు
అన్నిటా నాయాచార్యువిన్నపమే వినవే. ॥ఇట్టి॥ 70

ముఖారి

ఇటు నిను దెలియఁగ నెంతటివారము
తటుకన నాసలఁ దగులుట గాకా. ॥పల్లవి॥

నానామూర్తులు నగధర నీరూపు
యేనెలవు ని న్నెటువలెఁ దలఁచుట
పూని నీభావము పొందుగాఁ జెప్పఁగా
వీనులు చల్లఁగా వినుటే కాకా. ॥ఇటు॥

పెక్కునామములు బిరుదు లనంతము
లెక్కడ గొలదిగ నెన్నని పొగడుట
యిక్కువసేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుట గాకా. ॥ఇటు॥

వేవేలు గలవు నీవిహారభూములు
యేవిధమున నెం దెం దని తిరుగుట
శ్రీవెంకటేశా నీశృంగార మెల్లను
సేవించి ముదమునఁ జెలఁగుట గాకా. ॥ఇటు॥ 71

164-వ రేకు. ముఖారి

ఎవ్వరికి నెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు
అవ్వల నివ్వల నీ వనాథనాథుఁడవు. ॥పల్లవి॥

కాయకము లందరునుఁ గార్యవశపరులే
పాయని నీ వకారణబంధుఁడవు
దాయగాం డెవ్వరినైనా దప్పించుకొనేవారే
బాయిటనున్నా నీ వాపన్నశరణ్యుఁడవు. ॥ఎవ్వ॥

అట్టిలోకమువారు అర్థకామపరులే
జట్టిగాని నీ వైతే సర్వదాతవు
పొట్టఁబొరుగుచుట్టాలు భోజనసహాయులే
నెట్టన నీ వైతే మాకు నిర్వాహకుఁడవు. ॥ఎవ్వ॥

అంతటా వారికి వారు ఆత్మపోషకులే
రంతుల నీ వైతే నానారక్షకుఁడవు
సంతతము శ్రీవెంకటేశా మమ్ము నేలితివి
పంతమున నీవు భక్తపరిపాలకుఁడవు. ॥ఎవ్వ॥ 72

ముఖారి

దేవ నీవు గల్పించిన తెరువు లివి
నీవారైనవారి నేరుపు లివి. ॥పల్లవి॥

పరమశాంతునకుఁ బాపము రాదు
విరతిగలవానికి వెరపు లేదు
గురుసేవారతునకుఁ గోపము రాదు
ధర సత్యవిదునకుఁ దప్పు లేదు. ॥దేవ॥

పుట్టుబ్రహ్మచారికి బుద్ధి చెడదు
అట్టె ఆసలేనివారికి అలపు లేదు
తొట్టినసుజ్ఞానికి దుఃఖము లేదు
గట్టియైనమానికి కలహామే లేదు. ॥దేవ॥

సమచిత్తునకును చంచలము గాదు
విమలాచారునకు వెలితి లేదు
నెమకి శ్రీవెంకటేశ నీదాసులై కొల్చి
భ్రమయనివారికి భారము లేదు. ॥దేవ॥ 73

## శ్రీరాగం

వారివారికర్మములే వారిఁ జుట్టుకొనఁగాను
యీరీతి నీవే వారియెుుక మాన్పితివి. ॥పల్లవి॥

హిరణ్యకశిపుపాటు యెఱఁగఁడా రావణుఁడు
ధరలో హరికిఁ బగై తానూఁ బొలిసె
విరసపుకంసుగతి వినఁడా దుర్యోధనుఁడు
సరుగఁ దానూఁ బగై సమసినాఁడు. ॥వారి॥

తెగి మురాసురుజాడ తెలియఁడా నరకుఁడు
మొగిసి పోటుకుఁ బోయి మొక్కపోయను
సొగిసి సోముకుదెస చూడరా దానవు లెల్లా
మగిడి మగిడి పోరి మడిసిరి గాక. ॥వారి॥

బలి పోయినతెరువు బాణుఁడు విచారించఁడా
బలిమిఁ దొడరి భంగపడెఁ గాక
యెలమి శ్రీవెంకటేశా యెవ్వరి నే మనవచ్చు
యెలమి నిప్పటివారూ నెఱఁగరే కాక. ॥వారి॥ 74

శ్రీరాగం

హరి నీదాసులభాగ్య మది యెంతని చెప్పేము
విరివైన నీసుద్దులు వింటి మయ్యా. ॥పల్లవి॥

నెమ్మదిని నీ వనేటినిధానము గన్నవారు
కిమ్ముల సంపన్నులై సుఖింతు రయ్యా
కమ్మటినీ భక్తియనే కామధేను వున్నవారు
వుమ్మడి నచ్చికము లే కుందు రయ్యా. ॥హరి॥

చేరి నీపై చింతయనే చింతామణిగలవారు
కోరినట్లల్లా బదుకుదు రయ్యా
సారపునీకృపాపారిజాత మబ్బినవారు
బోరన సంతోసాలఁ బొదలుదు రయ్యా. ॥హరి॥

హత్తి నీనామమనే అమృతముగలవారు
నిత్యమైనపదవుల నిలుతు రయ్యా
యిత్తల శ్రీవెంకటేశ యిన్నిటా నన్నేలితివి
సత్తుగానీవారు నాకుఁ జన విత్తు రయ్యా. ॥హరి॥ 75

శ్రీరాగం

దైవమా నీ వొక్కఁడవే దక్కినధనము గాక
యేవలా నావలా మఱి యెంచ నే మున్నది. ॥పల్లవి॥

పుట్టినవారి కెల్లా పొత్తులది జగము
మెట్టి కూచుండేయరుగు మేదిని యెల్లా
బట్టబయటిభోగాలు బంతికూటిభోజనాలు
పట్టి తమవని యేరుపరచ నే మున్నది. ॥దైవ॥

పంచకోశాన్నభాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుప నే మున్నది. ॥దైవ॥

మనోవికారాలు మానుషపుటెఱుకలు
వినోదమాత్రాలు వేడుక లెల్లా
యెనలేని శ్రీవెంకటేశ నీమహిమ లివి
వెనకా ముందరా నిన్న వించ నే మున్నది. ॥దైవ॥ 76

శ్రీరాగం

ఇట్టివాఁడవు సులభ మెట్లా నైతివో కాక
అట్టి నీదయ దలఁచి అరుదయ్యీ నాకు. ॥పల్లవి॥

యే మేమి చదువవలె నెందరి నడుగవలె
ఆముక నిన్నుఁ దెలిసేయందుకొరకు
భూమిలోన నెంతేసిపుణ్యములు సేయవలె
కామించి నీపై భక్తి గలిగేటికొరకు. ॥ఇట్టి॥

యెన్ని జన్మా లెత్తవలె నెందెందు వెదకవలె
కన్నుల నీసాకారము గనేకొరకు
వున్నతి నెంతగాలము వోగ్గి కాచుకుండవలె
విన్నవించి నీసేవ వేఁడుకొనేకొరకు. ॥ఇట్టి॥

యేదేది యెఱఁగవలె యెట్లభ్యసించవలె
నీదాసుఁ డనిపించుకొనేటికొరకు
సాదరాన శ్రీవెంకటేశ్వర నన్ను మన్నించితి
వేదెసఁ బొగడవలె యింతసేసేకొరకు. ॥ఇట్టి॥ 77

165-వ రేకు. శ్రీరాగం

చెప్పితేఁ బాసు నందురు చేసినదోసము లెల్లా
వొప్పుగాని మన్నించ నుచితమా నీకు. ॥పల్లవి॥

క్షమియించుకొనవే సర్వాపరాధములు
క్రమ మెఱఁగ కే నేమి గావించితినో
రమణతో సర్వలోకరక్షకుఁడ వట నీవు
తమితోడ నన్నుఁ గావఁ దగ వౌను నీకు. ॥చెప్పి॥

పరిహరించఁగదవే బహునరకబాధలు
గరిమల నెటువలెఁ గాచుకున్నవో
అరుదుగా సురల మొరాలించితి వట తొల్లి
ధర నన్ను వహించుకోఁ దగ వౌను నీకు. ॥చెప్పి॥

వెనుకోని యడ్డము రావే శ్రీవెంకటేశ్వర
అనుభవించేకర్మము లవేమున్నవో
పనివడి భక్తపరిపాలకుఁడ వట నీవు
తనుభోగాలు భోగించఁ దగ వౌను నీకు. ॥చెప్పి॥ 78

నాదరామక్రియ

అతఁడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు
చతురుఁ డితఁడే రక్షించఁ గలవాఁడు శరణని బ్రదుకవో వో మనసా. ॥పల్లవి॥

మరుతండ్రిఁ జూచిన మంచికన్నులను మరొకరిఁ జూచిన నిం పౌనా
సిరివరునామము నొడిగిననోరను చిక్కినసేరులు యిత వౌనా
పరమాత్ముఁ దలఁచినమనసులోపలను పరులఁ దలఁచితే నోడఁ బడునా
కరుణానిధిపుణ్యకథలువినినచెవుల కడలసుద్దులు విన సమ్మతించునా. ॥అత॥

నరహరిఁ బూజించినయట్టికరములు నరులసేవ సేయ నరుహములా
మురహరు శరణని మొక్కినశిరసున మూఢులకు మొక్క నుచితములా
హరిమందిరమున కరిగెడుపదములు అధములిండ్ల కేఁగఁగ నలవడునా
పురుషోత్తములాంఛనము మోచినమేను భువి హీనవృత్తికిఁ బొసఁగీనా. ॥ఆత॥

గోవిందుఁడే దిక్కై వుండుఘనులకు కొలిపీనా దేవతాంతరంబులు
భూవల్లభుదెసఁ బుట్టినజ్ఞానము పొంది వేరొకట నిలిచీనా
శ్రీవెంకటపతిపై నిడినభక్తి చెలులపై నునుపఁగఁ దగ వపునా
దేవకినందనుఁ డితనిదాసులఁ దెలియఁగ జడులకుఁ దరమయ్యీనా. ॥ఆత॥ 79

నాదరామక్రియ

ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినాఁ దానే
యెదిటిబ్రహ్మాండము యిమ్ముచాల దిందుకు. ॥పల్లవి॥

పనిగొంటే భువిలో నేఁబదియే అక్షరములు
కొనాడితే నీగుణాలు కోటానఁగోటి
యెనసి పదునాలుగే యెడమైన లోకములు
అనిశము నీవియ్యైతే ననంతమహిమలు. ॥ఇది॥

మించి నిండుకొంటేనే నెనిమిదియే దిక్కులు
అంచల నీకతలైతే ననేకములు
యెంచి చూచితేఁ గల వీపంచమహాభూతాలే
ముంచిననీమాయ కొద మొదలే లేదు. ॥ఇది॥

వుపమించి తెలిసితే నొక్కటే జగము
అపురూపపునీసృష్టి అతిఘనము
అపరిమితపుజీవు లణుమాత్రులైనాను
యెపుడు శ్రీవెంకటేశ యెక్కుడు నీదాసులు. ॥ఇది॥ 80

నాదరామక్రియ

ఎంతకత నడపితి వేమిఁ జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా. ||పల్లవి||

కౌరవులఁ బాండవుల కలహము వెట్ట నేల
నేరిచి సారథ్యము నెఱప నేలా
కోరి భూభార మణఁచేకొఱకైతే నీచే చక్ర
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా. ||ఎంత||

చేకొని వానరులఁగాఁ జేయ నేల దేవతల
జోకతో లంకాపురి చుట్టుకో నేల
కాకాసురు వేసినకసవే రావణుమీఁద
నాకడఁ బంపువెట్టితే నప్పుడే సమయఁడా. ||ఎంత||

గక్కన శ్రీవెంకటేశ కంబములో వెళ్ల నేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగ నేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడసితే తానే పొలియఁడా. ||ఎంత|| 81

నాదరామక్రియ

పరులకైతే నిదే పాపము గాదా
పురిగొని నీవంకఁ బుణ్య మాయఁ గాకా. ||పల్లవి||

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీకెంటికి తండ్రితో విరోధించఁగ
దొరసి ప్రహ్లాదునకు దోషైనదే గురుతు. ||పరు||

నారాయణుఁడ నీవు నడపినదే తగవు
ఆరూఢి నీ వౌ నన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనఁగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు. ॥పరు॥

శ్రీవెంకటేశ నీవు చేసినదే నీతి
చేవతో నీ వొడఁబరచినదే మాటా
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్ర మెత్తి
ఆవేళ నడ్డ మైనందుకు అర్జునుఁడే గురుతు. ॥పరు॥ 82

166-వ రేకు. నాదరామక్రియ

ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగ వలయు. ॥పల్లవి॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరుశరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము. ॥ప్రప॥

మరహంకారము దుఃఖము సుఖమునుఁ
బూరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము. ॥ప్రప॥

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెప్పుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవెంకటనిలయుఁడే గతి యని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము. ॥ప్రప॥ 83

రామక్రియ

జతనము జతనము సర్వేశునగరిది
బతుకుఁదోవ యిదె బడకరము. ॥పల్లవి॥

హృదయములోపల నీశ్వరుఁ డున్నాఁడు
పదిలము మనసా బడకరము
తుద నల కామాదులఁ జొర నియ్యక
పదరక కావుము బడకరము. ॥జత॥

ఎంచుకొనీ నిదె యేలిక మిము నిఁక
పంచభూతములాల బడకరము
మించినపురి తొమ్మిదివాకిళ్లను
పంచుక వున్నారు బడకరము. ॥జత॥

నడుమ నడుమ ప్రాణములాలా మీరు
బడివాయకుండరో బడకరము
యొడయక శ్రీవెంకటేశ్వరునకు మీరు
బడలక కొలువరో బడకరము. ॥జత॥ 84

భైరవి

ఆతఁడే విష్ణుం డఖిలము నడపెడి
యీతల నెవ్వరి కేఁటికిఁ జింతా. ॥పల్లవి॥

పుట్టించఁ బెంచఁగ పొడ వెక్కించ దేహుల
గట్టిగా మాఁటలాడించఁ గదలించ
పట్టి వాన గురియించ పైరులు మొలపించ
తిట్ట పెట్ట నొకానొకదేవుఁడు గలఁడు. ॥ఆత॥

అన్నపానము లొసంగ నాపదలు గడపంగ
పన్ని మాయలు భువిఁ బచరించ
విన్నపాలు సురలవి విని యందరి రక్షింప
వున్నతోన్నతుఁడై వొకానొకకర్త గలఁడు. ॥ఆత॥

కాల మక్షయము సేయ కర్మము ఫలించఁ జేయ
తాళుకొని మరపించఁ దలఁపించ
పాలుపడి శ్రీవెంకటపతియై వేదాలుచెప్పే
యేలిక యొకానొకయీశ్వరుఁడు గలఁడు. ॥ఆత॥ 85

భైరవి

హరి హరి జగ మెఱంగ నీ వాతుమలోనే వున్నాఁడవు
సురలఁ గాచుటయు నసురల నడఁచుట చొప్పడియున్నది నీగురుతు. ॥పల్లవి॥

వేదార్థము దప్పఁ దెలిసినవిద్వాంసునివంటిది
పాదుగఁ జదువక తర్కించఁబోవు పాండిత్యమువంటిది
మేదిని నడవులఁ దెరువు దప్పి మరి మెలఁగేటి తెరువరివంటిది
ఆదిమూర్తి నీశరణుచొచ్చి నిను నారాధించనివానిబదుకు. ॥హరి॥

వట్టిజోలితో నూరక దేవరలేనిపూజవంటిది
వొట్టుక ఫలములులేనిపంటలకు వొడిగట్టేయటువంటిది
నెట్టనఁ గర్ణధారుఁడు లేని జలనిధినడిమియోడవంటిది
జట్టుబయటనే పరమేశ్వర నీపై భక్తిలేనివానిబదుకు. ॥హరి॥

పొందుగ ధర్మము బోధించెడిసత్పురుషులులేనిసభవంటిది
చెంది శ్రీవెంకటేశ్వర నీమహిమలుచెప్పనికథవంటిది.
సందడి నన్నియుఁ జేసి దక్షిణలుచాలనియజ్ఞమువంటిది
యిందిరారమణ నీ వెక్కుడనుచు నిన్నిటఁ దెలియనివానిబదుకు. ॥హరి॥ 86

భైరవి

అరుదు నీచరిత్రము హరి నే నిదియే తలఁచుకొని
శరణంటేఁ గావు మిదియ విన్నపము సరి లేరు నీకు. ॥పల్లవి॥

పరగ నీయకారణబంధుత్వ మహల్యయందుఁ గంటిమి
కరియందు నా ర్తరక్షకత్వము మెరయఁగఁ గంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము గంటిమి
శరణంటేఁ గాచుట ధర విభీషణునందుఁ గంటిమి. ॥అరు॥

మును భక్తవత్సలత్వము నీకు శబరియందుఁ గంటిమి
అనాథనాథుఁడవు నీ వగుట సుగ్రీవునందుఁ గంటిమి
పెనఁగి నిరుహేతుకప్రేమ పరీక్షితునందుఁ గంటిమి
నినుఁ గింకరాధీనుఁ డని ప్రహ్లాదునియందుఁ గంటిమి. ॥అరు॥

గోవర్ధనమందు సర్వజీవదయాపరత్వము గంటిమి
భావించి సాందీపునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవ శ్రీవెంకటేశ్వర నీవు దిష్టవరదుఁడవగుట
తావై నన్నీకోనేటిదండనొసఁగేయందే కంటిమి. ॥అరు॥ 87

167-వ రేకు. భైరవి

ఎంతపుణ్యమో యిటు మాకుఁ గలిగె
చెంతనే నీకృప సిద్ధించఁ బోలు. ॥పల్లవి॥

శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణఁగెను భయ ముడిగె
తీపుగఁ దులశితీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలం బాయ. ॥ఎంత॥

గోవింద మిముఁ గనుఁగొంటి మిప్పుడే
పావన మైతిమి బ్రతికితిమి
తావుల మీపాదములకు మొక్కితి
వేవేలుఁ గలిగెను వేడుక లాయ. ||ఎంత||

శ్రీవెంకటేశ్వర సేవించితి మిము
థావతి దీరెను తనిసితిమి
వావిరి మిమ్మారు పలగొని వచ్చితి
నీవార మైతిమి నిలిచితి మిపుడు. ||ఎంత|| 88

మలహరి

అనంతాపరాధి నేను అటుగాన శర ణంటిని
మొనలేనినీగుణాలు యేమిచూచే నయ్యా. ||పల్లవి||

దగ్గరి కొలుతు నాతారతమ్య మెంచుకోను
సిగ్గువడ నిట్టె నిన్నుఁ జేరి పాడుదు
వొగ్గి విన్నపాలు సేతు వుబ్బునఁ జిత్త మెరఁగ
మొగ్గు లెంచితే నావల్ల నెన్ని లేవయ్యా. ||అన||

పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలఁచను
సాధించి కొలువవత్తు సత్వచూడను
యేదెసనైనా నుతింతు యెంగిలినో రని మాన
పాదుగా విచారించితే బలుమూఢుఁడ నయ్యా. ||అన||

మంచముపైఁ దలపోతు మందెమేళ మని యన
కంచముకూడర్పింతుఁ గాదన నేర
మెంచఁగ శ్రీవెంకటేశ యిన్నిటా నీబంట నైతి
పంచలఁ జూచితే నీపాలివాఁడ నయ్యా. ||అన|| 89

## మలహరి

అన్నిటా నీవే వుందు నందువు గాన
యిన్ని నీవు వుట్టించిన వివి నీసొమ్ములే. ||పల్లవి||

నిలిచినరూపు లెల్లా నీగుళ్లుగాఁ దలఁతు
మెలఁగేటిచైతన్యము మిమ్ముగాఁ దలఁతు
యిలలోనిధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు
కలపంచభూతా లుపకరణాలుగాఁ దలఁతు. ||అన్ని||

నారుకొన్నపంటలు నీనైవేద్యాలుగాఁ దలఁతు
నీ రెల్లా నీతీర్థ మని నెమ్మిఁ దలఁతు
ధారుణి భోగాలు పూజాద్రవ్యాలుగాఁ దలఁతు
నేరిచినపను లెల్లా నీలీలలుగాఁ దలఁతును. ||అన్ని||

కాలత్రయము నీగతులుగా నే తలఁతు
చాలి సురల నీయనుచరులఁగా నే తలఁతు
నాలోని శ్రీవెంకటేశ నాతండ్రి వని తలఁతు
తాలిమి నీదేవులను తల్లి యని తలఁతును. ||అన్ని|| 90

## మలహరి

అందుకే పో నీపై నాసవుట్టి కొలిచేది
మందలించితి నిఁక మరి నీచిత్తము. ||పల్లవి||

యిందరుఁ జెప్పఁగా వింటి యెవ్వరికైనా విష్ణుఁడే
కందువ మోక్ష మియ్యఁ గర్త యనఁగా
ముందె వింటి నారదుఁడు ముంచి నిన్ను బాడఁగా
పొందుగ లోకములోనఁ బూజ్యుఁ డాయ ననుచు. ||అందు||

అప్పటివింటి లోకము లన్నిటికి హరియే
కప్పి రక్షకత్వానకుఁ గర్త యనఁగా
యిప్పుడె వింటి ధ్రువుఁడు యిటు నిన్ను నుతించె
వుప్పతిల్లి పట్ట మేలుచున్నాఁ డనుచును. ॥అందు॥

యిదె వింటి శ్రీవెంకటేశ బ్రహ్మకుఁ దండ్రివై
కదిసి పుట్టించఁ బెంచఁ గర్త వనుచు
వదలక వింటి నీకు వాల్మీకి కావ్యము చెప్పి
చెదర కాద్యులలోఁ బ్రసిద్ధుఁ డాయ ననుచు. ॥అందు॥ 91

భూపాళం

అపరాధిని నే నైనాను
కృపగలవారికిఁ గపటము లేదు. ॥పల్లవి॥

సనాతనా అచ్యుతా సర్వేశ్వరా
అనాదికారణ అనంతా
జనార్ధనా అచల సకలలోకేశ్వరా
నిను మరచి యున్నాఁడ ననుఁ దెలుపవయా. ॥అప॥

పురాణపురుషా పురుషోత్తమా
చరాచరాత్మక జగదీశా
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా
యిరవు నీవే యట యెఱఁగించఁగదే. ॥అప॥

దేవోత్తమా శశిదినకరనయనా
పావనచరితా పరమాత్మా
శ్రీవెంకటేశా జీవాంతరంగా
సేవకుఁడను బుద్ధి చెప్పఁగవలయు. ॥అప॥ 93

భూపాళం

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు
యెప్పుడును జింతిచే నిదేపనై నేను. ॥పల్లవి॥

పొలసి నీరూప మెట్టు పొడచూపేవో
యెలమి నాభాగ్య మింక నెట్టున్నదో
అలరి నా కేబుద్ధి ఆనతిచ్చేవో
కలిగిననీమాయ యేగతిఁ గడచేనో. ॥చెప్ప॥

వరుస నా కెట్లాఁ గై వసమయ్యేవో
యిరవై నాజన్మఫల మెట్టున్నదో
పరగ నామతి నెట్టు పాయకుండేవో
కరుణానిధివి ని న్నేకరణి మెప్పించేనో. ॥చెప్ప॥

పనివడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా
మనసు చంచల మెట్టు మట్టుపడీనో
మొనలేనినాతలఁపు మెఱిఁగి శ్రీవెంకటేశ
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో. ॥చెప్ప॥ 93

168-వ ఱేకు. భూపాళం

ఇవి సేయఁగ నే నలసుఁడ యెటువలె మోక్షం బడిగెదను
వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁగాక. ॥పల్లవి॥

జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగఁ జిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానంబులు యిల పాపవిమోచనములు
అపరిమితదేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు. ॥ఇవి॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలినపంచేంద్రియనిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళధర్మార్థకామంబులు మరి మైశ్వర్యములకు మూలములు
అవలగ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము. ॥ఇవి॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికిని సంసారభోగము
హరి నరహరి శ్రీవెంకటేశ్వరా అఖిలము నొసఁగెడిదాతవు
సరుగన నీవే దయతో రక్షించఁ జాలుదు వేకాలమును మమ్మును. ॥ఇవి॥ 94

## ధన్నాసి

నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము
కావు మానేర మెంచక కరుణానిధీ. ॥పల్లవి॥

నెట్టన సూర్యులోనినెలకొన్న తేజమా
గట్టిగాఁ జంద్రునిలోనికాంతిపుంజమా
పుట్టి రక్షించేయజ్ఞపురుషునిప్రకాశమా
వొట్టుక దేవతలలోనుండినశక్తి. ॥నీవే॥

సిరులు మించినయట్టిజీవులలో ప్రాణమా
గరిమ వేదములలోఁ గలయర్థమా
పరమపదమునందుఁ బాదుకొన్నబ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా. ॥నీవే॥

జగములో వెలసేటిసంసారసుఖమా
నిగిడినమంత్రములనిజమహిమా
మిగుల శ్రీవెంకటాద్రిమీఁదనున్నదైవమా
ముగురువేల్పులలోనిమూలకందమా. ॥నీవే॥ 95

## ధన్నాసి

నీ వెంత నే నెంత నేఁడు నాయగ్గలి కెంత
దేవ నీదాసులఁ జూచితేనే నిన్ను గనుట. ॥పల్లవి॥

వొకొక్కరోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
ఉక్కుమీరి ధరించుక ఉన్నాఁడవట
నిక్కిననీరూప మెంతో నిన్నుఁ గనుఁగొను టెట్టు
అక్కజపువేదముల కగోచరుఁడవు. ॥నీవెం॥

యెన్నో శిరసులట యెన్నో పాదములట
యెన్నరానిచేతులట యిట్టినీమూర్తి
కన్నులఁ జూచుట యెట్టు కడగురు తందు కేది
అన్నిటా మునీంద్రులకు నచింత్యుఁడవు. ॥నీవెం॥

కోటిసూర్యు లొక్కమాటే కూడ నుదయించినట్టు
గాటపునీతిరుమేనికాంతులట
మేటివి శ్రీవెంకటేశ మిమ్ము ద్రిష్టించుట యెట్టు
పోటిదేవతల కెల్లాఁ బొడవైనవాఁడవు. ॥నీవెం॥ 96

## ధన్నాసి

నారాయణ నీపంపో నాభాగ్యమో ఇది
పేరుకొని పిలువనిపేరటమై వున్నది. ॥పల్లవి॥

వుడిగినా గామాదు లొక్కొక్కవ్యాజాన వచ్చి
సుడిసి నడుముచొచ్చుచుట్టాలవలె
తడవకున్నాఁ గర్మాలు తమ్ముఁ దామె సేయించీ
బడిబడిఁ దిరుగును బంట్లవలె. ॥నారా॥

చూడకున్నా దుర్గుణాలు సొంట్లు సోదించ వచ్చీ
వాడవాడలఁ దలవరులవలె
యేడ నున్నా లంపటాలు యెదుటనే పొలసీని
జోడువాయనీక తోడునీడలవలె. ||నారా||

తలచకున్నా భోగాలు తనువుతోఁ బెనఁగీని
చెలరేఁగి గరడిలో జెట్లువలె
బలిమి శ్రీవెంకటేశ భావములో నీమూరితి
నిలుపవే యెందుకైనా నిగిడీ నామనసు. ||నారా|| 97

దేవగాంధారి

పసులఁ గాచుట యెట్టు బండిబోయిఁడ వౌ టెట్టు
వెస నిన్ను దలఁచితే వెరగయ్యీ నాకు. ||పల్లవి||

వరుస నంతరియామిత్వము నవతారములు
పరగ మూఁడుమూర్తుల ప్రభావము
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై
తిరమైనయాదిదేవదేవుఁడవు నీవు. ||పసు||

అనిశము జీవులకు నణువుకు మహాత్తుకు
వెనుకొన్నమాయకు విరాట్టుకు
పొనుఁగనిమహిమలపాదవుకుఁ బొడవైన
దినకరకోటికోటితేజమవు నీవు. ||పసు||

సర్వశాస్త్రములలో సనకాదులలో
పర్విన గరుడానంత ప్రముఖులలో
సర్వదా మెలఁగుచు జనవరదుఁడవై
వుర్వి శ్రీవెంకటాద్రినున్న దేవుఁడవు. ||పసు|| 98

169-వ రేకు. దేవగాంధారి

ఏపొద్దూ నీచేత లెల్లా యెదుటనే కానవచ్చీ
నీవు గాన రాఁగా దాఁగేవిద్య నీదిగాక. ॥పల్లవి॥

పుట్టినమొకానకుఁ బూరి మేయ నేరిపిరా
అట్టె పిల్లలఁ బెట్ట నటు నేర్పిరా
చుట్టి నీళ్లున్నచోటు సోదించ నేరిపిరా
మట్టులేని దింతా నీమాయ యింతేకాక. ॥ఏపొ॥

తీవెలకుఁ జుట్టి చుట్టి దిక్కులఁ బాఁక నేరిపిరా
తావులఁ దతికాలానఁ బూవ నేరిపిరా
వేవేలుపక్షొమ్మలు వెసఁ బెట్ట నేరిపిరా
యేవల జూచినా నీమహిమ లింతేకాక. ॥ఏపొ॥

కోరి పశువుల కోరులు గూండ్లువెట్ట నేరిపిరా
సారె జాతియ్యావహారాలచవి నేర్పిరా
యీరీతి శ్రీవెంకటేశ యిన్నియు లోకములోన
చేరి నీవు సేసినసృష్టి యింతేకాక ॥ఏపొ॥ 99

దేవగాంధారి

ఇంతకంటే మరి లేదు యెవ్వరికి నుపాయము
యెంతైనా నిదియు నీ విచ్చితేనే కలుగు. ॥పల్లవి॥

హరి నీచిత్తమువచ్చేయందుకు నుపాయము
ధర నిన్ను బోధించేనీదాసులమాఁటే
దురితములన్నిటిని తొలగించేనుపాయము
నిరంతరమును నీనామజపమే. ॥ఇంత॥

దండితోడ నీమాయదాఁటేయందు కుపాయము
నిండునిధానమైననీపై భక్తే
అండనున్న కామాదుల నణచుట కుపాయము
కొండవంటినీమూర్తిఁ గోరి శరణనుటే. ||ఇంత||

పుట్టుగులు గెలిచి నిన్ను బొందుట కుపాయము
అట్టె నీరూపమైనఆచార్యుఁడే
యిట్టె శ్రీవెంకటేశ యిన్నిటికి నుపాయము
మట్టులేనిరామానుజమతము చేకొనుటే. ||ఇంత|| 100

## దేవగాంధారి

తెలియరాదు నీమాయ తెరమఱఁగుపెక్కు-
వలలఁ జిక్కక నిన్నే కొలువఁగవలయు. ||పల్లవి||

చూడఁగ నీజగత్తుకు సూత్రధారివి నీవు
జోడై నీసూత్రాన నాడుచును సర్వంబునున్నది
యేడఁ జూచినా నీ వుందు వెవ్వరికిఁ గానరావు
వోడక స్వతంత్ర మొకరిపై వేతువు. ||తెలి||

మఱపించాఁ దలఁపించా మర్మజ్ఞుఁడవు నీవు
గుఱియై నీసంకల్పముకొలఁదే యీజీవు లెల్లా
మఱి నీ వీశ్వరుఁడవు మాఁటలకుఁ జిక్కవు
కఱకరి నితరులఁ గర్తలఁగాఁ జేతువు. ||తెలి||

అందరిమొగ లాలించి అట్టె రక్షింతువు నీవు
కందువ శ్రీవెంకటేశ కానవచ్చె నీమహిమ
చెంది వరము లిత్తువు చేతికి సులభుఁడవు
సందడి నెవ్వరినైనా సరిగా మన్నింతువు. ||తెలి|| 101

## ధన్నాసి

నీవే దయ దలఁచుక నెమ్మి రక్షించుటగాక
యీవలఁ గొలిచేనంటే యిందుకైనవాఁడనా. ॥పల్లవి॥

సరిగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే
హరి నీకు నెదురు మాఁటాడేవాఁడనా
గరిమ సువస్తువులు కానుక యిచ్చేనంటే
సరుస నీకన్నా నేను సంపన్నుఁడనా. ॥నీవే॥

మెలఁగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే
జలజాక్ష నే నీతో సరివాఁడనా
బలువైననీపరమపదము గోరేనంటే
వలనైననీతోడివంతువాఁడనా. ॥నీవే॥

తాలిమితో నాలోనిన్ను ధ్యానముసేసేనంటే
పాలసుఁడ నేను నీపాటివాఁడనా
యేలితివి శ్రీవెంకటేశ నన్ను గృపతోడ
యీలీల నీమహిమలు యెరిఁగేటివాఁడనా. ॥నీవే॥ 102

## దేవగాంధారి

చిత్తానఁ బెట్టకు మీమాఁట శ్రీరమణ మరవకు
హత్తి నిన్నే మెరుఁగుదు నజ్ఞాని నేను. ॥పల్లవి॥

నెలకొని నాలోన నీ వున్నాఁడవు గనక
తలఁచకున్నా నిన్నుఁ దలఁచినవాఁడనే
యెలమి నందరి నీవే యేలినవాఁడవు గనక
కొలువకున్నా నిన్ను గొలిచినవాఁడనే. ॥చిత్తా॥

నెక్కొని ఆకస మెల్లా నీపాదమే కనక
మొక్కకున్నా నేను నీకు మొక్కినవాఁడనే
నిక్కి నానాక్షరములు నీపేరులే కనక
పెక్కులుగాఁ బిలువకున్నాఁ బిలిచినవాఁడనే. ॥చిత్తా॥

వోజ నారుగమలాల నున్నాఁడవు గనక
పూజించకున్నా నిన్ను బూజించినవాఁడనే
తేజపు శ్రీవెంకటేశదేవ నీవే గతి గాన
సాజాన నే మఱచినా శరణన్నవాఁడనే. ॥చిత్తా॥ 103

గుండక్రియ

దాఁచుకొని పాదాలకుఁ దగ నేఁ జేసినపూజ లివి
పూఁచి నీకీరితిరూపపుష్పము లివి యయ్యా. ॥పల్లవి॥

వొక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాచి వుండని
వెక్కసమగునీనామము వెలసులభము ఫల మధికము
దిక్కై యె న న్నేలితి వింక నవి తీరనినాధన మయ్యా. ॥దాఁచు॥

నానాలికపై నుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితివి
వేనామాల వెన్నఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతే యయ్యా. ॥దాఁచు॥

యీమాఁట గర్వము గాదు నీమహిమే కొనియాడితిఁ గాని
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాఁడఁగాను
నేమానఁ బాడేవాఁడను నేరము లెంచకుమీ
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీవెంకటేశుఁడ నయ్యా. ॥దాఁచు॥ 104

70-వ రేకు. గుండక్రియ

హరి గోవిందా హరి గోవిందా
ఆనంద మానంద మాతుమకును
గురూపదేశాన వెదకఁగా వెదకఁగా
గరిమ నీయర్థము కంటి మోయయ్యా. ॥పల్లవి॥

సరి నన్యధర్మములు మాను మంటివి
శరణు నీకుఁ జొరు మంటివి
దురితము లణచే నంటివి
పరగ మోక్షం బిచ్చే నంటివి
హరి నీవచనము అమోఘము
నరులము నే మిది నమ్మితిమి
పరమపద మిప్పుడే కలిగెను
ధర నొక్కమనసుతో నున్నార మయ్యా. ॥హరి॥

యెందు నీవే గతి యనుమంటివి
యేచి యొక్కమాఁటే చాలు నంటివి
యిందరి కభయ మిత్తు నంటివి
యిది నీ కెపుడు వ్రత మంటివి
కందువ నీబిరుదుసత్యము
కానిమ్మని నేము చేపట్టితిమి
అంది నీవే మాకు దిక్కైతివి
అన్నిటా సంతోసాన నున్నార మయ్యా. ॥హరి॥

ఆసమానినవాఁ డెక్కు డంటివి
అతనివెంటఁ దిరిగే నంటివి

భాసురపాదరేణువు నే నంటివి
పావన మయ్యేనని యంటివి
మోసలేనిది నీసంకల్పము
మొక్కే మిందులకు శ్రీవెంకటేశా
ఆసపడ నితరుల నాకు నీవే యాస
యని నీదాసులమై యున్నార మయ్యా. ॥హరి॥ 105

గుండక్రియ

ఇదివో నాసంపదా ఆస్తియుఁ బాస్తి నీవు యితరంబు నాకుఁ బనిలేదు
పదిలంబుగ నాబ్రతు కెల్లా నీవే పాలించఁగదే నారాయణా. ॥పల్లవి॥

ఉపమల నే నార్జించినఉన్నతధనంబు నీవు
తపముసేయఁగాఁ గలిగెడుతత్ఫలంబు నీవు
జపములవలనఁ గలిగెడునా తేజః ప్రభావమును నీవు
కపురులదానధర్మపరోపకారంబులఁ బొందెడుమేలు నీవు ॥ఇది॥

పరము నాకు నీవు పరాత్పరమును నీవు
గరిమల నిలలోపలియనంతభోగంబులు నీవు
గరుడోరగామరసిద్ధసాధ్యగంధర్వపదములు నీవు
సురమునిపితృపూజవేదపాఠసుకృతంబులు నీవు. ॥ఇది॥

నాలు గాశ్రమంబులు నానావిద్యలు నీవు
తాలిమి నాపంచవింశతితత్వంబులు నీవు
ఈలీల శ్రీవెంకటేశ్వరా యిన్నియు నీవు నా కని యెఱిఁగితి
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు. ॥ఇది॥ 106

## శుద్ధవసంతం

అందుకే సుమ్మీ నేఁ జేసేఆచారాలు దైవమా
నిందవాయ నామనసు నీపై నిలుపవే. ||పల్లవి||

బట్టబయటఁ దోలితేను బందె మేయుఁ బసురము
పట్టి కేఁపితేను తనపనులు సేయు
యిట్టె వదలితేను యెందైనాఁ బారు మనసు
కట్టుక నేమస్తుఁడైతే కైవసమై యుండును. ||అందు||

బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు
యెడయక కూడుకొంటే హితు లౌదురు
విడిచితే నిటులనే కడకుఁ బారు మనసు
వొడలిలో నణఁచితే వొద్దికై వుండును. ||అందు||

చేవదలితే పెంచినచిలుకైనా నేడ లెక్క
రావించి గూఁటఁ బెట్టితే రామా యనును
భావించ కుండితే యిట్టె పారు నెందైనా మనసు
శ్రీవెంకటేశుఁ గొల్చితే చేతఁ జిక్కి వుండును. ||అందు|| 107

## బౌళి

జపములుఁ దపములు సంధ్యాదివిధులకు
నెపము నామీఁద నింతే నీకే సెలవు. ||పల్లవి||

ఫలము నినుఁ గోరని పంతమువాఁడాఁ గాను
వలెననడుగ నెంతవాఁడను నేను
చెలఁగి నీవు కర్మము సేయించఁగా జేసేటి
వెలలేక తెచ్చుకొన్న వెట్టివాఁడను. ||జప||

ఆస మానితి ననేటియహంకారి నేఁ గాను
వాసికి నీతోఁ బెనఁగేవాఁడనా నేను
వేసరకుండాఁ గట్లు విడిపించి యేలుకోఁగా
దాసుఁడనై బదికేటిధర్మపువాఁడ నేను. ॥జప॥

జ్ఞాని నైతి ననేగర్వాచారపువాఁడాఁ గాను
కానక నీపై మోపుగట్ట నోపను
ఆనుక శ్రీవెంకటేశ ఆతుమ నీ వుండఁగాను
మోనాన నీకు మొక్కేటిమునివాఁడ నేను. ॥జప॥ 108

## హిందోళవసంతం

అందరి రక్షించేదేవుఁ డాదరించీ జీవులను
పొందుగా మీమే లెరిఁగి పొగడరో లోకులు. ॥పల్లవి॥

వనము వెట్టినవాఁడు వాఁడకుండా నీరు వోసి
పెనచి కలుపు దీసి పెంచినయట్లు
పసివడి గొల్లవాఁడు పచ్చికపట్టునఁ బసుల
తనియఁగ నిల్పి నిల్పి తానే మేపినట్లు. ॥అంద॥

కన్నతల్లి బిడ్డలకు కాచుక వెన్నయుఁ బాలు
నన్నము నిడి రక్షించినటువలెను
యెన్నఁగ బంట్ల నేలేయేలిక జీతాలువెట్టి
మన్నించి కాచుకొని మనిపినయట్లు. ॥అంద॥

వసుధ వైద్యుఁడైనవాఁడు మందు మాకు లిచ్చి
పొసఁగ దేహధారులఁ బోషించినట్లు
యెసఁగ శ్రీవెంకటేశుఁ డితఁడే విశ్వకుటుంబి
పసగా వరము లిచ్చీ భావించినట్లు. ॥అంద॥ 109

171-వ రేకు. ధన్నాసి

ఎఱుఁగక వేసారు నిల జీవుఁడు
మెఱసి నిండుకున్నాఁడు కోఁటి యీదేవుఁడు. ॥పల్లవి॥

పూరకే పరాకైనట్టుండును దేవుఁడు
నారుకొన మతిలోఁ దనపైనే చింత
గారవాన మరి పలుకనియట్టె వుండును
యీరీతి మాటాడించేవాఁ డిన్నిటా నితఁడే. ॥ఎఱు॥

యెందు లేనియట్టేవుండు నెంచి చూచితే దేవుఁడు
చెంది లోకశరీరియై చెలరేఁగీని
అందరాక యెక్కడాను అడఁగినట్లనే యుండు
యిందరిఁ బోషించేవాఁడు యెప్పుడూ నితఁడే. ॥ఎఱు॥

చేరి లోనుగానట్టుండు శ్రీవెంకటేశదేవుఁడు
కోరినవరము లిచ్చు గురుతుగాను
నారక యలమేల్మంగవల్లభుఁ డిట్టిదేవుఁడు
యీరూపుతో నుండు నిందరిలో నితఁడే. ॥ఎఱు॥ 110

నాట

విష్ణుఁ డొక్కఁడే విశ్వాత్మకుఁడు
వైష్ణవమే సర్వంబును. ॥పల్లవి॥

పరమేష్టి సేయు బ్రహ్మాండసృష్టియు
హరునిలోనిసంహారశక్తి
పరగఁగ నింద్రునిపరిపాలనమును
అరసిచూడ శ్రీహరిమహిమ. ॥విష్ణు॥

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు నంబరు 2813

యిలఁ బంచభూతములలో గుణములు
అల నవగ్రహవిహారములు
తలకొను కాలత్రయధర్మంబును
అలరఁగ నారాయణునిమహిమలే. ॥విష్ణు॥

అంతటఁ గలమాయావిలాసములు
పొంతఁ బరమపదభోగములు
మంతుకు నెక్కిన మరి సమస్తమును
యింతయు శ్రీవెంకటేశుమహిమలే. ॥విష్ణు॥ 111

గుజ్జరి

ఒకటి కొకటి లంకె వూరకై నాఁ బెనగొను
అకటా యెవ్వరు దాఁటేరయ్యా నీమాయలు. ॥పల్లవి॥

తనయెదుటి వెల్లాను తలఁపులోఁ బారును
మనసులోపలి వెల్లా మర్మము లంటు
ఘనమర్మములు రేఁగి కాయ మెల్లాఁ గరఁగించు
తనువుసౌఖ్య మవ్వలితనువున నంటును. ॥ఒక॥

అవ్వలిదేహభోగము లట్టేకర్మము లౌను
మువ్వంకఁ గర్మాలు లోకములై, చెందును
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు
తెవ్వనికాలము నిద్రాఁదెలివినై ముంచును. ॥ఒక॥

వెనక నా తెలివి యొకవేళ నిన్నెఱిఁగించు
వసమై ఆయెఱుకకు వచ్చి మెత్తువు
యెసఁగి నీవు మెచ్చితే నిహపరము లిత్తువు
మిసిమిఁ శ్రీవెంకటేశ మెరయు నీయీవి. ఒక॥ 112॥

సాళంగనాట

శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైనరామకార్యధురంధరా. ॥పల్లవి॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస ॥శర॥

రవితనయసచివ రావణవనాపహర
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువనపూర్ణదేహ బుద్ధివిశారద
జవసత్వవేగ కలశాపురనివాస. ॥శర॥

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవెంకటేశకరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస. ॥శర॥ 113

బౌళిరామక్రియ

నమో నమో లక్ష్మీనరసింహా
నమో నమో సుగ్రీవనరసింహా. ॥పల్లవి॥

వరద సులభ భక్తవత్సల నరసింహా
నరమృగవేష శ్రీనరసింహా
పరమపురుష సర్వపరిపూర్ణ నరసింహా
గిరిగుహావాస సుగ్రీవనరసింహా. ॥నమో॥

కర్మము బంధక మైనా కర్మి నీసొమ్ముచేసితే
నర్మిలి మోక్ష మియ్య నాధార మౌను
మర్మము కోరిక మైనా మహి నీభక్తి కెక్కితే
ధర్మములకుఁ బరమధర్మము దా నౌను. ॥పని॥

జగ మెల్లా మాయ మైనా సరి నీకే శరణంటే
పగటున నదే తపఃఫల మౌను
అగపడి శ్రీవేంకటాధిప న న్నేలితివి
మిగుల నిహ మైనా మించి పర మౌను. ॥పని॥ 117

లలిత

మనసు నమ్మ నేర్చితే మనుజుఁడే దేవుఁ డౌను
తనలోనే వున్నవాఁడు తావుకొని దైవము. ॥పల్లవి॥

మగనిపై బత్తిచేసి మగువ యొక్కరితె
తెగి పరలోకము సాధించీనట
వొగి వీరవైష్ణవుఁడై వున్నవాఁడు హరిఁ గొల్చి
అగపడి ఘనమోక్ష మంద నోపఁడా. ॥మన॥

మేలికకై పగవారి నెదిరించి బంటొకఁడు
మేలైనపదవు లంది మెరసీనట
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలు చేసి
కాలమందే యందరిలో ఘనుఁడు గా నోపఁడా. ॥మన॥

పరమపురుషార్థపుపని చేసి యొకరుఁడు
అరిది నధికపుణ్యుఁ డయ్యీనట
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ బూజించీ దాసుఁడు
పరము నిహముఁ జెంది బ్రదుకఁగ నోపఁడా. ॥మన॥ 118

దేసాక్షి

సోదించి చూడఁబోతే చూచి మఱవు
నో దేవదేవ మించె నోహో నీమాయ. ॥పల్లవి॥

వొక్కటే పదార్థము వూరివా రెల్లాఁ జూచితే
గుక్కిళ్లు మింగించి యాసకొలుపుచుండు
మక్కళిం చందరిలోనిమనసులు వేరు వేరో
వొక్కటో యేమనవచ్చు నోహో నీమాయ. ॥సోదిం॥

ధరలో బిడ్డ వొక్కటి తల్లిదండ్రు లిద్దరు
తొరలింపువేడుకలై తోఁచుచుండు
పెరిగేటిపుట్టుగులు భేదమో అభేదమో
వారుల కేమనవచ్చు నోహో నీమాయ. ॥సోదిం॥

కోరేమోక్ష మొక్కటే కొలచే దిద్దరినట
చేరె నిన్నలమేల్మంగ శ్రీవెంకటేశ
మీ రిద్దరు నేకమో మీభావాలు వింతలో
వూరకే యేమనవచ్చు నోహో నీమాయ. ॥సోదిం॥ 119

దేసాళం

ఎన్నిపాట్లఁ బడ్డాను యెవ్వరికిఁ జెప్పినాను
పన్ని నీముద్రలఁ గాక పాపము వోయీనా. ॥పల్లవి॥

కందువ నీపాదాలపైఁ గట్టిపెట్టినఁ గాక
సందులు దూరేమనసు చక్క నుండీనా
నింద లేక యెపొద్దు నిన్నే కొలిచినఁ గాక
తుందుడుకునీమాయ తొలఁగి పోయీనా. ॥ఎన్ని॥

పుడివోనిరుచులు నీ కొప్పగించినఁ గాక
బడిఁ బంచేంద్రియములు పాయనిచ్చీనా
జడియక నే నీకు శరణుచొచ్చినఁ గాక
వొడలిలో కామక్రోధా లుడిగిపోయీనా. ॥ఎన్ని॥

నిక్కపునాకర్మములు నీకొరకునైనఁ గాక
యిక్కడనేఁ జేసేటిహింస మానీనా
పక్కన నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
అక్కర నీకు మొక్కక అజ్ఞానము వోయీనా. ॥ఎన్ని॥ 120

నాట

వాఁడె వో ప్రహ్లాదవరదుఁడు
వాఁడె వో భక్తవత్సలుఁడు. ॥పల్లవి॥

కోరదవడలతోడ కోటిసూర్యతేజముతో
హారకేయూరాది భూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదు లెల్లను సేవలు సేయఁగాను
సౌర మీరినశిరుల మేడలో నున్నాఁడు. ॥వాఁడె॥

తెల్లనిమేనితోడ తీగనవ్వులతోడ
చల్లనిగందములవాసనలతోడ
వెల్లుగా నారదాదులు పేరుకొని నుతించఁగా
వెల్లవిరిఁ గొలువై వేడుక నున్నాఁడు ॥వాఁడె॥

సంకుచక్రములతోడ జంటపూదండలతోడ
పొంకపునానావిధభోగములతో
అంకపుశ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెల నేపొద్దు నెలవై తా నున్నాఁడు. ॥వాఁడె॥ 121

73-వ రేకు. మలహరి

ఎఱిఁగినవారికి హింస లిన్నియు మాని
మఱి సత్య మాడితేను మాధవుఁడే దిక్కు. ॥పల్లవి॥

కలుగుఁ గారణములు కామక్రోధములు రేఁగ
వెలసినమాయావికార మది
కలఁగఁగ వలవదు కర్త లెవ్వరుఁ గారు
తెలిసి వోరుచుకొంటే దేవుఁడే దిక్కు. ॥ఎఱి॥

పదార్థా లెదుట నిలుచుఁ బంచేంద్రియాలు రేఁగ
వెదచల్లేటిమాయావికార మది
పదరి పైకొనవద్దు పట్టితేఁ బసలేదు
చెదరక వోరిచితే శ్రీపతే దిక్కు. ॥ఎఱి॥

సిరులు తానే వచ్చు చిత్తాన నాసలు రేఁగ
విరసపుమాయావికార మది
పరగ నలమేల్మంగపతి శ్రీవెంకటేశ్వరు
శరణంటే నితనిచరణాలే దిక్కు. ॥ఎఱి॥ 122

ధన్నాసి

ఒకటి సుజ్ఞానము వొకటి అజ్ఞానము
ప్రకటించి ఒకటి చేపట్టరో వివేకులు. ॥పల్లవి॥

తనుఁ దలఁచుకొంటేను తక్కిన దేహభోగాలు
పనికిరావు అవి ప్రకృతి గాన
ఘనమైనలోకభోగములతో లోలుఁడైతే
తనుఁ గానరాదు జీవతత్వము గాన. ॥ఒక॥

దైవము నెఱింగితేను తనకామ్యకర్మములు
భావించి మఱవవలె బంధాలు గాన
కావించేటితనకామ్యకర్మాలఁ గట్టువడితే
దైవము లోను గాఁడు స్వతంత్రుఁడు గాన. ॥ఒక॥

సరి మోక్షము గోరితే స్వర్గము తెరువు గాదు
అరయ స్వర్గము తెరు వల మోక్షానకు
పరగ నలమేల్మంగపతి శ్రీవెంకటేశుని
శరణాగతియె సర్వసాధనము గాన. ॥ఒక॥ 123

లలిత

హరి హరి నీమహిమ లనంతములు
నిరతి జీవుల కెల్ల నేరుపులై వున్నవి. ॥పల్లవి॥

యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి
అందరికిఁ దమతమదై వుండును
కందువ నెవ్వ రెవ్వరి కాణాచి యైనదో భూమి
సందడించిఁ బంటలను సకలసస్యములు. ॥హరి॥

చుట్టుక యందరికిని సొమ్మయినదో కాలము
అట్టె అందరిఆయుష్యమై యున్నది
గట్టిగా నెవ్వ రెవ్వరికంచముకూడో యీమాయ
దట్టపుసంసారములధర్మములై యున్నవి. ॥హరి॥

ముంచి యందరికై నాను మోపులై వుండె కర్మము
పంచు కందరికిఁ దమపనిపాటలై
వంచుక శ్రీవెంకటేశ వారివారిబ్రదుకులు
నించి నీవే యైతివి నిధినిధానమవై. ॥హరి॥ 124

భూపాళం

పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమారునుఁ బాడి. ॥పల్లవి॥

హరినామములే పాడి అతనిపట్టపురాణి
యిరవై మించినయట్టియిందిరఁ బాడి
సరి నిరువంకలను శంఖచక్రములఁ బాడి
వరదకటిహస్తాలు వరుసతోఁ బాడి. ॥పావ॥

ఆదిపురుషునిఁ బాడి అట్టె భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపుబ్రహ్మాండాలు మోచేవుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి. ॥పావ॥

శ్రీవెంకటేశుఁ బాడి శిరసుతులసిఁ బాడి
శ్రీవత్సముతోడురముఁ జెలఁగి పాడి
లావులమకరకుండలాలకర్ణములు పాడి
ఆవటించి యితనిసర్వాంగములుఁ బాడి. ॥పావ॥ 125

దేసాళం

నీవు వెట్టినట్టిచిక్కు నీవే తెలుపవలె
నావసమా తెలియ నారాయణా. ॥పల్లవి॥

నీటిలోన నొకబుగ్గ నిమిషములోనఁ బుట్టి
కోటిసేసినట్లుండుఁ గొంతవడి
పాటించి యందె యడఁగెఁ బ్రకృతియో బ్రహ్మమో
యేటిదో పీనియర్థ మెరిఁగించవయ్యా. ॥నీవు॥

ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయు విసరు లోలోన
మైకొని యుండె యడఁగె మాయమో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్యా. ॥నీవు॥

భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవెంకటేశ
వాములై వెలయుసేసేవారికి
ఆముక యుండే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెఱిఁగించవయ్యా. ॥నీవు॥ 126

నాట

ఎత్తుకొన్న బహురూప మిఁక మరి మానరాదు
చిత్తగించి మన్నించు శ్రీనరసింహా. ॥పల్లవి॥

పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి
గట్టిగా కనకదైత్యు ఖండించితివి
యిట్టె నీచేతలు విని యిందరుఁ గొల్చేరు నిన్ను
కట్టుకొంటి వింతపని ఘననారసింహా. ॥ఎత్తు॥

దేవతలమొరాలించి దీకొంటి వింతపనికి
చేవ నభయము లిచ్చి చే యెత్తితివి
దేవుఁడ వని యెఱిఁగి త్రిజగాలు మొక్కె నీకు
నీవల్లనే వచ్చె నిది నిత్యనారసింహా. ॥ఎత్తు॥

భూకాంతవిన్నపము పొంచి విని గుఱైతివి
శ్రీకాంతతోడమీఁదఁ జేకొంటివి
మీకును శ్రీవెంకటాద్రిమీఁదనే శరణంటిమి
దాకొనె మీమహిమలు దండినారసింహా. ॥ఎత్తు॥ 127

4-వ రేకు. లలిత

ఆతనిమూలమె జగ మంతా నిది
ఆతుమలో హరి కీలు అయివుండుఁ గాని. ॥పల్లవి॥

మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
మెచ్చు కుందు లేకున్న నెక్కుడైనా సుఖమే
యిచ్చకుఁడైన హరి తన కియ్యవలెఁ గాని. ॥ఆత॥

నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రత మైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టె హరి దనకు నియ్యవలెఁ గాని. ॥ఆత॥

చెప్పినట్టు సేసితేను చేరి దేహమె చుట్టము
తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పునహరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవెంకటేశుఁ డియ్యవలెఁ గాని. ॥ఆత॥ 128

సాళంగనాట

దిక్కు నీవే జీవులకు దేవసింహమా
తెక్కులగద్దియమీఁది దేవసింహమా. ॥పల్లవి॥

సుర లెల్లఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల
తిరమైనమహిమల దేవసింహమా
నిరతిఁ బ్రహ్మాదుఁడు నీయెదుట నిలిచితే
తెరదీసితి మాయకు దేవసింహమా. ॥దిక్కు॥

ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయ విసరు లోలోనె
మైకొని యుండె యడఁగె మాయమో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్యా. ॥నీవు॥

భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవెంకటేశ
వామునై వెలయుసేసేవారికి
ఆముక యుండే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెఱిఁగించవయ్యా. ॥నీవు॥ 126

నాట

ఎత్తుకొన్న బహురూప మిఁక మరి మానరాదు
చిత్తగించి మన్నించు శ్రీనరసింహా. ॥పల్లవి॥

పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి
గట్టిగా కనకదైత్యు ఖండించితివి
యిట్టి నీచేఁతలు విని యిందరుఁ గొల్చేరు నిన్ను
కట్టుకొంటి వింతపని ఘననారసింహా. ॥ఎత్తు॥

దేవతలమొరాలించి దీకొంటి వింతపనికి
చేవ నభయము లిచ్చి చే యెత్తితివి
దేవుఁడ వని యెఱిఁగి త్రిజగాలు మొక్కె నీకు
నీవల్లనే వచ్చె నిది నిత్యనారసింహా. ॥ఎత్తు॥

భూకాంతవిన్నపము పొంచి విని గురైతివి
శ్రీకాంతతొడమీఁదఁ జేకొంటివి
మీకును శ్రీవెంకటాద్రిమీఁదనే శరణంటిమి
దాకొనె మీమహిమలు దండినారసింహా. ॥ఎత్తు॥ 127

4-వ రేకు. లలిత

ఆతనిమూలమె జగమంతా నిది
ఆతుమలో హరి కీలు అయివుండుఁ గాని. ॥పల్లవి॥

మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
యెచ్చు కుందు లేకున్న నెక్కుడైనా సుఖమే
యిచ్చకుఁడై హరి తన కియ్యవలెఁ గాని. ॥ఆత॥

నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రత మైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టె హరి దనకు నియ్యవలెఁ గాని. ॥ఆత॥

చెప్పినట్టు సేసితేను చేరి దేహమె చుట్టము
తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పునహరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవెంకటేశుఁ డియ్యవలెఁ గాని. ॥ఆత॥ 128

సాళంగనాట

దిక్కు నీవే జీవులకు దేవసింహమా
తెక్కులగద్దియమీఁది దేవసింహమా. ॥పల్లవి॥

సుర లెల్లఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల
తిరమైనమహిమల దేవసింహమా
నిరతిఁ బ్రహ్మాదులు నీయెదుట నిలిచితే
తెరదీసితి మాయకు దేవసింహమా. ॥దిక్కు॥

భుజము లుప్పొంగఁగాను పూఁచినశంఖుచక్రాల
త్రిజగములు నేలేటిదేవసింహమా
గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి
ద్విజమునిసంఘములదేవసింహమా. ॥దిక్కు॥

ముప్పిరిదాసుల కెల్లా ముందు నుండె యొసగేటి
తిప్పరానివరముల దేవసింహమా
చిప్పిల నహోబలాన శ్రీవెంకటాద్రిమీఁద
తెప్పల దేలేటియట్టిదేవసింహమా. ॥దిక్కు॥ 129

బౌళి

కన్నులపండుగ లాయ కమ్మి సేవించేవారికి
సన్నల నీదాసులము సంతసించేము. ॥పల్లవి॥

పడఁతు లిద్దరు నీపాదములు వొత్తఁగాను
కొడుకు బ్రహ్మదేవుఁడు కొలువఁగాను
కడుపులో లోకములు కడు జయవెట్టగాను
గుడిగొనె నీబ్రదుకు గోవిందరాజా. ॥కన్ను॥

మెత్తఁగా శేషుఁడు నీకు మించుఁ బరపై వుండగా
జొత్తుమధుకైటభులు సుక్కి వోడఁగా
హత్తి దేవతలు నిన్ను నందరుఁ బూజించఁగాను
కొత్తలాయ నీబ్రదుకు గోవిందరాజా. ॥కన్ను॥

పరగి నీముందరను పంచబేరము లుండఁగా
గరిమఁ జక్రము నీకుఁ గాపై వుండఁగా
తిరమై శ్రీవెంకటాద్రితిరుపతిలోపలను
గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా. ॥కన్ను॥ 130

## శ్రీరాగం

కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూశినముత్తెమువలె మొక్కేము నీకు. ॥పల్లవి॥

నెమ్మిఁ జక్రాయుధుఁడవు నీవు గల వటుగాన
పమ్మి మాకు నెన్నఁడును భయమే లేదు
యిమ్ముల లక్ష్మీపతివి యేలిక వై తివిగన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు. ॥కేశ॥

పుట్టించినవాఁడవు భూధవుఁడ వటుగన
దట్టముగ నెంచగఁ బదస్థుఁడ నేను
తొట్టి కరిరాజవరదుఁడ నీవే దిక్కుగన
గట్టిగా నాకోరిక లిక్కడ ఫలియించెను. ॥కేశ॥

గురువవు గొల్లలకు గోవిందరాజవుగన
నిరంతరమునుఁబొఁడి నిండెను మాకు
చిరంతనదేవుఁడవు శ్రీవేంకటేశ్వర నీవు
పరము నిహము మాకు బలువుగా గలిగె. ॥కేశ॥ 131

## గౌళ

హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరంజ్యోతిస్స్వరూపపు పైఁడికుండ తేరు. ॥పల్లవి॥

గరుడధ్వజపుఁదేరు కనకమయపుఁదేరు
సురలు బొమ్మలై నారు చుట్లఁ దేరు
మెరుఁగుల మేఘములమించుఁగొణిఁగెల తేరు
సిరుల ధ్రువలోకపుశిఖరపుఁదేరు. ॥హరి॥

బలు కులపర్వతాలె బండికండ్లైనతేరు
నలుదిక్కు- లంచులవున్నతపుఁదేరు
కొలదిలేనిచుక్కలకుచ్చులముత్తేలతేరు
మెలుపునాకాశగంగమేలుకట్లతేరు. ॥హరి॥

మునులనే వృత్తమాశ్వములుగాఁ గట్టినతేరు
ఘనమహిమ లనేసింగారపుఁదేరు
యెనసి శ్రీవెంకటేశుఁ డెపుఁడు నలమేల్మంగ
దినదినభోగములఁ దిరమైనతేరు. ॥హరి॥ 132

బౌళి

పరమపురుష నిరుపమాన శరణు శరణు రే యిందిరానిజమందిరా. ॥పల్లవి॥

కమలనాభ కమలనయన కమలచరణు రే
అమితసురమునినాథయూథపనాయకా వరదాయకా. ॥పర॥

చతురమూరితి చతురబాహుశంఖచక్రధరా
అతిశయశ్రీవెంకటాధిప అంజనాకృతిరంజనా. ॥పర॥ 133

మాళవి

హా సమీచీనమపహాసం తే
భాసై ప్రకాశితందరిదంతులోకే. ॥పల్లవి॥

ద్వారకాపట్టణే త్వం పురా చ స్వయదీక్షితస్తు స్త్రియః కేశముష్టిః కథం
సారసకురువంతిసరసవేళాయాం. ॥హాస॥

వరశిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారిఅథోచేస్తదేతి గోప
తరుణాయః కిమితి వా తద్వసతి త్వం. ॥హాస॥

తత్తబృందావనే త్వం పురా చ శ్రియా వెంకటాద్రౌ ఇదంనివ్వి బాసి ఇదం
చిత్తమిత్యమరాశ్చదిసేవంతి సర్వే. * ॥హాస॥ 1?4

---

* ఈ సంకీర్తన సంస్కరింప వీలుకాకున్నది.

175-వ రేకు. దేవగాంధారి

సదానందము సర్వేశ్వర నీ
పదారవిందముపై భక్తి. ॥పల్లవి॥

నయనానందము నరులకు సురలకు
జయ మగు హరి నీసాకారము
నయ మగు శ్రవణానందము వినినను
క్రియగలిగిననీకీర్తనము. ॥సదా॥

చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁగొనునీప్రసాదము
నలుగడ దేహానందము బుధులకు
బలునీపాదప్రణామములు. ॥సదా॥

ధరఁ బరమానందము నీదాస్యము
గరిమల శ్రీవెంకటవిభుఁడా
నరహరి నిత్యానందము నినుఁ దగ
నరవిరిఁజేయు సమారాధనము. ॥సదా॥ 135

సామంతం

అరసి వేరొకచో ముక్తిదుగఁగ వలదు
సారపులౌకికవిమోచనమే ముక్తి. ॥పల్లవి॥

మొగిఁ బుణ్యపాపవిముక్తియే ముక్తి
వెగటుఁబ్రపంచపువిముక్తే ముక్తి
తగులుసంసారబంధవిముక్తే ముక్తి
జగములోఁ గలుగుయాశాముక్తే ముక్తి. ॥అర॥

కామక్రోధాదిసంగవిముక్తే ముక్తి
వేమారు రుచులపై విముక్తే ముక్తి
నాముల దేహాభిమానపుముక్తే ముక్తి
పామెడికోరికలసంపదముక్తే ముక్తి. ||ఆర||

ముందువెనకల కర్మమోచనమే ముక్తి
అంది సుఖదుఃఖభయముక్తే ముక్తి
కందువ శ్రీవెంకటేశుఁ గని యందే శరణని
విందుల నితరసేవావిముక్తే ముక్తి. ||ఆర|| 136

సాళంగనాట

ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచి చూచినా
చేతనే వరా లిచ్చీ శేషాచలేశుఁడు. ||పల్లవి||

విశ్వరూపపుబ్రహ్మము విరాట్టయినబ్రహ్మము
ఐశ్వర్యస్వరాట్టు సామ్రాట్టయినబ్రహ్మము
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైనబ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము. ||ఈత||

సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలునిభాస్వత్తేజము
కార్యపుటవతారాలఁ గనుఁగొనే తేజము
వీర్యపుటజ్ఞభాగాలవిష్ణునామ తేజము. ||ఈత||

పరమపురుషమూర్తి ప్రకృతియైనమూర్తి
గరిమతో మహదహంకారమూరితి
ధరఁ బంచతన్మాత్రలు తత్వము లైనమూరితి
గరుడానంతశనేశకర్తయైనమూరితి. ||ఈత||

భాగవతపుదైవము భారతములో దైవము
సాగినపురాణవేదశాస్త్రదైవము
పోగులైనబ్రహ్మలను బొడ్డునఁ గన్నదైవము
శ్రీగలిగి భూపతైనశ్రీవెంకటదైవము ॥ఈత॥ 137

దేసాళం

గతు లన్ని ఖిలమైనకలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము. ॥పల్లవి॥

యీతనికరుణనే కా యిల వైష్ణవుల మైతి
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర
మీతఁడే రామానుజులు యిహపరదైవము. ॥గతు॥

వెలయించె నితఁడే కా వేదపురహస్యములు
చలిమి నితఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డితఁడే కా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము. ॥గతు॥

నియమము లితఁడే కా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నితఁడే
నయమై శ్రీవెంకటేశునగ మెక్కె వాకిటను
దయఁ జూచీ మమ్ము నిట్టె తల్లితండ్రిదైవము. ॥గతు॥ 138

నాదరామక్రియ

నే నే మెరిఁగి సేసేనో నీకుఁ దిరువారాధన
ఆనిమున్నిటిబ్రహ్మరుద్రాదులు సేయఁగ లేరు. ॥పల్లవి॥

అనుగునీరూప మింతంత నెఱిఁగి నేనేనో
వునికై నీ వొక్కచోనే వుండే దెఱిఁగి నేనేనో
తనిసి నీకు నొక్కమంత్రమనెఱిఁగి నేనేనో
కనరానినీమహిమె కడ మొఱిఁగి నేనేనో. ॥నేనే॥

మరిగి నీకు నొక్కనామమనెఱిఁగి నేనేనో
అరసి యించుకే కాలమనెఱిఁగి నేనేనో
నిరతి నీ కేమి లేవని యెఱిఁగి నేనేనో
వెరసి నన్నుఁ గొంత మెప్పించ నెఱిఁగి నేనేనో. ॥నేనే॥

తెలిసి నీకు నొక్కమూర్తి యనెఱిఁగి నేనేనో
అలమిననీమాయఁ గొంత నెఱిఁగి నేనేనో
అలమేల్మంగకుఁ బతియగు శ్రీవెంకటేశుఁడ
వొలిసి నీ కుపమింప నొక్కటెఱిఁగి నేనేనో. ॥నేనే॥ 139

వరాళి

డోలాయాం చలడోలాయాం హరె డోలాయాం. ॥పల్లవి॥
మీనకూర్మవరాహా మృగపతిఅవతారా
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక. ॥డోలా॥
వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ. ॥డోలా॥
దారుణ బుద్ధ కలికి దశవిధఅవతారా
శీరపాణే గోసమాణే శ్రీవెంకటగిరికూటనిలయ. ॥డోలా॥ 140

176-వ రేకు. బౌళి

జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటు నాసోదంబు యిది నీవెలితో నావెలితో. ॥పల్లవి॥

యెన్నిమారులు సేవించినఁ గన్నులుఁ దనియవు
విన్న నీకథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వాయుఁ దనియదు
విన్న కన్నది గాదు యిది నావెలితో నీవెలితో. ॥జగ॥

కడఁగి నీప్రసాదమే కొని కాయముఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములు సేసి పాదములు నివిఁ దనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురును దనియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నావెలితో నీవెలితో. ॥జగ॥

చెలఁగి నిను నేఁ బూజించి చేతులుఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తముఁ దనియదు
అలరి శ్రీవెంకటగిరీశ్వర ఆత్మ నను మోహించఁ జేసితి
వెలయ నిన్నియుఁ దేరె మును నీవెలితో నావెలితో. ॥జగ॥ 141

దేవగాంధారి

అందుకే నేఁ జింతించెదను అచ్యుత నీశరణాగతుఁడ
సందడి నాభవ మిందువల్లనే సఫలం బాయ నయ్యా. ॥పల్లవి॥

వొక నీనామము వొగిఁ దలంచిన
అకలంకం బగునాపాపంబులు అన్నియుఁ బారణ్ణే సేసె
అకటా తక్కినఅనంతనామములు
వొకట నుపవాసము లున్నవో యయ్యా. ॥అందు॥

హరి నీపాదము లవి రెండే
పరమును నిహమును నా కొసఁగెను వయిపైఁ గృపతోడ
ధర నీయనంతకరములు తా మేమి
సిరు లిత్త మనుచు చెలఁగీ నయ్యా. ॥అందు॥

యిల నీదాస్యం బిడి యొకటే
సిలుగుల భవముల జిలుగు మాన్పె నదె చిత్తము తహ దీర
యెలమిని శ్రీవెంకటేశ్వర నీ విదె
తలఁపునఁ బాయక దక్కితి వయ్యా. ॥అందు॥ 142

మాళవి

దేవ నమో దేవా
పావనగుణగణభావా. ॥పల్లవి॥

జగదాకారచతుర్భుజ
గగననీలమేఘశ్యామ
నిగమపాదయుగ నీరజనాభ
అగణితలావణ్యాననా. ॥దేవ॥

ఘనవేదాంతైగణన వుదార
కనకశంఖచక్రకరాంకా
దినమణిశశాంకదివ్యవిలోచన
అనుపమరవిబింబాధరా. ॥దేవ॥

భావజకంజభవజనక
శ్రీవనితాహృదయేశ
శ్రీవెంకటగిరిశిఖరవిహార
పావనగుణగణభావా. ॥దేవ॥ 143

బౌళి

దేహం బొకటే దేహియు నొకఁడే
దాహం బెంతటఁ దనియునో తలఁపు. ॥పల్లవి॥

వినుకలి వెంటఁ వెడలీఁ దలఁపు
కనుకలి వెంటఁ గదలీఁ దలఁపు
కొననాలుక మదిఁ గూడీఁ దలఁపు
తనిగినయెన్నన్ని తునుకలో తలఁపు. ॥దేహ॥

నయ మగుచోటను నవ్వీఁ దలఁపు
భయమగుచోటను బడలీఁ దలఁపు
లయమై నిద్రల లవమౌఁ దలఁపు
క్రియ నెందరిపంగెనయో తలఁపు. ॥దేహ॥

భావించినగతిఁ బారీఁ దలఁపు
వేవేలు గతుల వెలసీఁ దలఁపు
శ్రీవెంకటపతి చిత్తములోపల
నీవే తెలుపఁగ నినుఁ గనె తలఁపు. ॥దేహం॥ 144

## సాళంగనాట

మొక్కరే మొక్కరే మీరు ముందు నుండే జయ లిడి
దక్క శ్రీవెంకటేశుఁడే తానైనదేవునికి. ॥పల్లవి॥

కరములు వే యవే కరములును భయం
కరనఖాయుధములు కడలే వవే
సిరిదొడపై నదె సింహాపునెమ్మొ మదే
నరరూపునగ మదె నరసింహునికి. ॥మొక్క॥

వంకరకోర లవే వజ్రపుదంతము లవే
సంకును జక్రము నిరువంకలా నవే
జంకెల నేత్రము లవే జడలు మూఁపున నవే
అంకె నభయహస్తము అదే నరహరికి. ॥మొక్క॥

నిక్కినకర్ణము లవే నీలిమచ్చపుర మదే
చుక్కలమొలపూసల నొక్కరూప మదే
తొక్కినపాదము లవే తోడనే శ్రీవెంకటాద్రి
పక్కరనరసింహపుప్రళయసింహునికి. ||మొక్క|| 145

బౌళి

తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లిదె నట్టనడుమ సంతేసి మెరసీ. ||పల్లవి||

పుట్టినప్పుడే దేహి బుద్ధు లేమీ నెఱఁగడు
యిట్టె లోకాలఁ జూచి యింత నేరిచె
పట్టుకొన్నయింద్రియాల నుదిసీ ముదిసీ రాఁగా
తట్టువడి తనమేను తానె మరచె. ||తొల్లి||

మనుజుఁ డైనప్పుడే తా మాట లేమి నెఱఁగఁడు
జను లాడుకొనఁగానె సంగడి నేర్చె
దినదినభోగాలదృష్టాంతము లెల్ల
అనుభవనై తనకడియాలమాయ. ||తొల్లి||

తచ్చితాఁగలప్పుడే దైవము నెఱఁగఁడు
సచ్చు నాచార్యునివల్ల నేఁ డెఱిఁగె
అచ్చపుశ్రీవెంకటేశుఁ డంతర్యామై యుండి
యిచ్చఁ గరుణించఁగాను యెక్కుడాయఁ దాను. ||తొల్లి|| 146

177-వ రేకు. గుజ్జరి

జగ మంతా నీమయము సర్వం విష్ణుమయంబు గాన. ||పల్లవి||
యెనయుచు నే గర్మమార్గముల నితరదేవతల భజియించెదను
అని యపరాధం బెంచకుమీ అన్యము నీకంటే మరి లేదు
పనివడి "మత్తఃపరతరం" బని పలికితి విన్నియు నీయాజ్ఞలు. ||జగ||

దేవ నావుదరపోషణకు తినిరి హింస చేసెదను
నీ విది నావల నెంచకుమీ నీవే అఖండచేతన్యుఁడవు
దేవ మిము "నై శేన వినా తృణాగ్రమపి" యని శ్రుతి వొగడెడిని. ॥జగ॥
భువిలో నా కట పూర్వకర్మ మట పోనఁగదు నే నీసరణి సేయఁడను
అవి నా కేమియుఁ బనిలేవు అంతరియామివి నీవు
ఆవలను "త్వమేవశరణంగతి" యనుటడినస్మృతి శ్రీవెంకటనిలయా. ॥జగ॥ 147

గుజ్జరి

ఆర్తుఁడ నేను నీ కడ్డ మెందును లేను
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే. ॥పల్లవి॥
సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుఁడవు
సర్వసర్వంసహాచక్రవర్తి
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే. ॥ఆర్తు॥
పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవు
పరమ పరానంద పరమపురుషా
కరిరాజవరదా కారుణ్యనిలయా
శరణాగతుఁడ నన్నుఁ బరిఁ గావవే. ॥ఆర్తు॥
అణువులోపలినీవు ఆదిమహత్తును నీవు
ప్రణుత శ్రీవెంకటప్రచురనిలయా
అణిమాదివిభవా ఆద్యంతరహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు. ॥ఆర్తు॥ 148

లలిత

విజాతు లన్నియు వృథా వృథా
అజామిళాదుల కది యేజాతి. ॥పల్లవి॥

జాతిభేదములు శరీరగుణములు
జాతి శరీరముఁదోడనే చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరి విజ్ఞానపుదాస్యం బిది యొక్కటే పో సుజాతి. ॥విజా॥

హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగు లీభావ మష్టమదము భవనికార మని మానిరి
ధరణిలోనఁ బరతత్త్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి. ॥విజా॥

లౌకికవైదికలంపటులకు నివి
కైకొనునవశ్యకర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవెంకటపతి సేసినసంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి. ॥విజా॥ 149

## గుజ్జరి

ఉపకారి దేవుఁడు అపకారి గాఁడు. ॥పల్లవి॥

దేహం బొసఁగెను దేవుఁడు తనుఁ దెలియఁగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముఁడు మరి దేహమై తన్యుఁడా దాను
దేహి యేలోకంబున కేఁగిన దేవుఁడు దా నెంటనే యేఁగును
దేహి కోరినట్టే కమ్మర దేవుఁ డనుమతి యిచ్చీఁ గాన. ॥ఉప॥

చేయుటకును చేయక మానుటకును జీవుఁడు స్వతంత్రుఁడాయం టేను
కాయపుసుఖములు గోరఁగఁ గర్తట కడ గనుటకుఁ గర్త గాఁడా
యీయెడ నాయెడ నంతర్యామే యిన్నిటికిని బ్రేరకుఁ డింతే
దాయక పాయక తనతలఁపుకొలఁది దైవమే సృజియించీఁ గాన. ॥ఉప॥

యిది యెఱిఁగి చిత్తమా నీ వితనందే అభిరతి సేయుము
సదయుఁడు మన శ్రీవెంకటగిరిసర్వేశ్వరుఁడు సత్యుఁడు
మొదలనే యీయర్థము కిరీటితో మొగి నానతి యిచ్చినాఁడు
అదె "సమోఽహం సర్వభూతేషు" అని గీతలలో నున్నది గాన. ॥ఉప॥ 150

బౌళి

తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన. ॥పల్లవి॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే. ॥తంద॥

కందువగుహీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ. ॥తంద॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁ డుండేటి సరిభూమి యొకటే. ॥తంద॥

అనుఁగుదేవతలకును అలకామసుఖ మొకటే
ఘనకీటపశువులకు కామసుఖ మొకటే
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిఱుపేదకును వొక్కటే అవియు. ॥తంద॥

కోరలి శిష్టాన్నములు గొను నాఁక లొకటే
తిరుగుదుష్టాన్నములు తిను నాఁక లొకటే

పరగ దుర్గంధములపై వాయు వొకటే
వరుసఁ బరిమళముపై వాయు వొకటే. ॥తంద॥

కడఁగి యేనుఁగుమీఁదఁ గాయుయెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయునెండొకటే
కడుఁ బుణ్యులనుఁబాపకర్ములను సరిగావ
జడియు శ్రీవెంకటేశ్వరు నామ మొకటే. ॥తంద॥ 151

178-వ తేకు. బౌళి

మచ్చికఁ బ్రపంచపుమరసే బ్రహ్మానంద
మిచ్చల తానే గురి యిన్నిటికి నాత్మ. ॥పల్లవి॥

లోచూపే వెలిఁ బడి లోకమయి తోఁచీని
ఆచూపే మరలితే నది మోక్షము
యేచి రెంటికి నెడమధ్య మీమాంసను
తాఁచి వొకఁడే గురి తా నాయ నాత్మ. ॥మచ్చి॥

మన సొక్కచోట నుండి మాయలై తోఁచీని
మనసు తనం దుంటే మహా యోగ్యము
వెనక మునుపులకు పీడుఁబట్టు జననము
కొన మొదలునుఁ దానే గురి యాయ నాత్మ. ॥మచ్చి॥

బయలు దునిసి బహుభానులై తోఁచీని
బయ లొక్కటే యఖండపరిపూర్ణము
నయమై శ్రీవెంకటనాథుకరుణచేత
జయమై తానున్నచోనే సత మాయ నాత్మ. ॥మచ్చి॥ 152

బౌళి

నందగోపనందనుండే నాఁటిబాలుఁడు
యిందు నేఁడే రేపల్లె నేచి పెరిగెను. ॥పల్లవి॥

పువ్వువంటిమజ్జిగయాకుపొత్తిఁ బవళించ నేర్చె
యెవ్వఁడో కాని తొల్లె యీబాలుఁడు
మువ్వంకవేదములను ముద్దుమాఁటలాడ నేర్చె
యెవ్వరుఁ గొంత నేర్చ నేఁటికే వీనికి. ॥నంద॥

తప్పటడుగు లిడఁగ నేర్చె ధరణియందు నాకసమున
నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే
గెప్ప లెత్తి చూడ నేర్చె గేసెఁ జంద్రునందు పగలు
గొప్పసూర్యునందు నింకఁ గొత్త నేర్చ నేఁటికే. ॥నంద॥

మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించ నేర్చె
సంచితముగ శ్రీవెంకటాద్రిమీఁదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కౌఁగిలించ నేర్చె
దించరాని పురముమీఁదదివ్యకాంతను. ॥నంద॥ 153

## లలిత

అంతరాత్మ హరి గలఁ డంతే చాలు
యెంత కెంత చింతించ నేలా వెఱవ. ॥పల్లవి॥

వెనక జన్మపుగతి వివరించి నే నెఱఁగ
అనుగు మీఁదటిజన్మ మది యెఱఁగ
ననిచి యీజన్మము నానాఁటఁ దెలిసేము
యెనసి యీభవముల కేలా వెఱవ. ॥అంత॥

నిన్నటిదినముకత నిముషమై తోఁచీని
కన్నుల రేపటిచేఁత కానఁగ రాదు
పన్ని నేఁటిదినము మున్నే నోఁచినట్లే
యెన్నఁగ నందుకున్న నా నేలా వెఱవ. ॥అంత॥

పరము నిహము నేఁ బైకొన నాయిచ్చ గాదు
హరి శ్రీవెంకటపతి యఖిలకర్త
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది
యిర వైతి నింకా నాకేలా వెఱవ. ॥అంత॥ 154

గుండక్రియ

అది మేల తా మాను మాయందు నిష్ఠూరమే కాక
చెదరి వివేకటియుఁ జెట్టాకటి యానా. ॥పల్లవి॥

కడుఁ బుణ్యపాపాలుగలిగిజన్మము
చెడుఁ బుణ్యపాపాలు సేయ కుండీనా
పుడమిలో ముష్టిమానఁ బొడమిన శాఖలు
బడిముష్టిపండ్లే పండ కుండీనా. ॥అది॥

పంచేంద్రియాలఁ బుట్టి పరగినయీమేను
పంచేంద్రియాలమీఁదిభ్రమ మానీనా
పొంచి హేయములోనఁ బుట్టినకీటము లెల్ల
కొంచి హేయమే చవిగొన కుండీనా. ॥అది॥

శ్రీవెంకటేశ నీవు చేసినయీమాయలు
నీవల్ల మానుఁ గాక నేఁ గర్తనా
దైవమవై నాలోనఁ దగిలి నాదుర్గుణాలు
వేవేగ మానుపఁగ వెత దీరెఁ గాక. ॥అది॥ 155

శ్రీరాగం

అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు
పొల్ప నెంతపనికిఁ బూనితి నయ్యా. ॥పల్లవి॥

నీపదధ్యానములోనే నిండెను నామన సెల్ల
యేపున నీసాకార మేమిట భావింతు నయ్యా
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ నిదే
ఆపి నే నీయంగకాంతు లవేమిటఁ జూతు నయ్యా. ॥అల్ప॥

నాలుక నీకడలేసినామములే నుడిగిని
మేలిమి నీగుణము లేమిటఁ బొగడుదు నయ్యా
గాలివంటివీనులు నీకథలఁ దవిసె నయ్యా
యీలీల నీయనంతమహిమ యెందు విందు నయ్యా. ॥అల్ప॥

నీకు శరణని యిట్టె నేధన్యుఁడ నైతి
యీకడ నీసేవ నేసి యేమి గట్టుకొందు నయ్యా
శ్రీకాంతుఁడవై నశ్రీవెంకటేశ నీకు
వ్రాకొన నాజన్మఫల మొకమొక్కు చాలు నయ్యా. ॥అల్ప॥ 156

బౌళి

గరుడగమన గరుడధ్వజ
నరహరి నమోనమోనమో. ॥పల్లవి॥

కమలాపతి కమలనాభా
కమలజజన్మకారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో. ॥గరు॥

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్యజంతుకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో. ॥గరు॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీవెంకటాధిపతే హం
అనుపమ నమో హరి నమో. ॥గరు॥ 157

179-వ రేకు. సాళంగనాట

జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువుఁ డీతఁడు
భావములోపలి పెరరేపకుఁడై భక్తి చేకొనును యీతఁడు. ॥పల్లవి॥

పరమున నిహమున వెంట వెంటనే పాయనిబంధువుఁ డీతఁడు
ధరఁ దనుఁ దలఁచిన మారుకు మారై తా రక్షించును యీతఁడు
నిరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
వురుగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు. ॥జీవు॥

వడిఁ గలకాలము యిరువదియొక్కటవావులబంధువుఁ డీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యిన్నిటఁ బనులకు నోదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నొప్పుఁ డీతఁడు
పొడలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతఁడు. ॥జీవు॥

ఘననిధినిక్షేపము లిచ్చేటివుపకారపుబంధువుఁ డీతఁడు
అనయము వెరవకు మని యేకాలము నభయం బొసగును యీతఁడు
వనిచిన శ్రీవెంకటేశ్వరుఁడై యిటు నాపాలఁ గలుగు నీతఁడు
పనివడి అరులను సూడువట్టి కడుఁ బగ సాధించును యీతఁడు. ॥జీవు॥ 158॥

బౌళి

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు. ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులును శివుఁ డనుఁచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు. ॥ఎంత॥

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు
దరిశనములు మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచినవారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచినఘనబుద్ధులకు ఘనుఁడవు. ॥ఎంత॥

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథిదరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవెంకటపతి నీ వైతే మముఁ జేకొనివున్నదైవ మని
యీవల నే నీశరణనియెదను యిదియే పరతత్వము నాకు. ॥ఎంత॥ 159

## సాళంగం

నీవే మూలముసువో నేరిచినపెద్దలకు
దేవుఁడు నీయందులోనే తిరమాయ నిదివో. ॥పల్లవి॥

బాపురే వో దేహమా బాపురే వో నీవు
వోపి నేఁ బెట్టినకొద్ది నుందువు గా
రూపు నీవు గలిగితే రుచులెల్లఁ గానఁ గద్దు
చాపలాన ధర్మములు సాధింపఁ గలదు. ॥నీవే॥

మెచ్చితినో మనసా మెచ్చితివో నీవూ నా
యిచ్చకొలఁది నెందైనా నేఁగుదువు గా
అచ్చపునీకతమున నవుఁగాము లెంచఁ గద్దు
పచ్చిగా యేమూర్తినైనా భావించఁ గలదు. ॥నీవే॥

మేలు మేలు నాలికె మేలు మేలు నీవు
వోలి యేమాటకునై నా నోనరుదు గా
చాలి నీవు మెలఁగంగ చదువు చదువఁ గద్దు
పోలించి శ్రీవెంకటేశుఁ బొగడఁగఁ గలదు. ||నీవే|| 160

### లలిత

హరి నీవే బుద్ధి చెప్పి యాదరించు నామనసు
హరి నీవే నాయంతర్యామివి గాన. ||పల్లవి||

వనముగానికరివంటిది నామనసు
యెనఁగి సారెకు మదియించీఁ గాన
పోనఁగఁ బాదరసముఁబోలిననామనసు
అనము దించక సదా అల్లాడీఁ గాన. ||హరి||

వడి నడవులచింకవంటిది నామనసు
బడిబడిఁ బట్టఁ బట్టఁ బారీఁ గాన
కడఁగి విసరుపెనుగాలివంటిది మనసు
విడువక కన్నచోట విహరించీఁ గాన. ||హరి||

వరుస నిండుజలధివంటిది నామనసు
వొరసి సర్వము లోనై వుండీఁ గాన
గరిమ శ్రీవెంకటేశ కావవే నామనసు
సరి నీయానతి నీకే శరణనీఁ గాన. ||హరి|| 161

### బౌళి

జలజనాభ హరి జయ జయ
యిల మానేరము లెంచకు వయ్యా. ||పల్లవి||

బహుసుఖముల నీప్రపంచము
సహజగుణంబుల చంచలము
మహిమల నీ విది మరి దిగవిడువవు
విహరణ జీవులు విడువఁగఁ గలరా. ॥జల॥

పలునటనలయీప్రకృతి యిది
తెలియఁగఁ గడు నింద్రియవశము
కలిసి నీ వందే కాఁపురము
మలినపుజీవులు మానఁగఁ గలరా. ॥జల॥

యిరవుగ శ్రీవెంకటేశుఁడ నీమాయ
మరలుచ నీవే సమర్థుఁడవు
శరణనుటకే నే శక్తుఁడను
పరు లెవ్వరైనాఁ బాపఁగఁ గలరా. ॥జల॥ 162

180-వ రేకు. సామంతం

ఇందుకా కోరి పుట్టి యిట్టి బదుకు
పొందుల శ్రీహరిఁగొడిపొత్తుల మాబదుకు. ॥పల్లవి॥

బడబాగ్నిఆఁకటిబారిఁ బడ్డబ్రదుకు
పడతులకూటములఁ బడ్డబదుకు
వొడిలితోలినెమ్ముల వొడిగట్టేబదుకు
బడిఁ బుణ్యపాపాల పై తరవుబదుకు. ॥ఇందు॥

నాలుక గడచితేను నరకపుబదుకు
మాలమలమూత్రాల మూటగట్టేబదుకు
కాలమునడపివూర్పుగాలిఁబుచ్చేబదుకు
పాలుమాలేయింద్రియాల పంగెమాయబదుకు. ॥ఇందు॥

యింపుసుఖదుఃఖాల యెండనీడబదుకు
వంపుఁగామక్రోధాల మాటుబదుకు
జంపుల శ్రీవెంకటేశుశరణు చొరఁగ నేఁడు
సొంపు లిన్నిటా మాకు సుఖ మాయ బదుకు. ॥ఇందు॥ 163

## రేవగుప్తి

నీ వెరఁగనిది లేదు నీయాజ్ఞ మోచితి నింతే
నీవాఁడ నింతే వారి నే నన( జోటేది. ॥పల్లవి॥

కన్నుల కెంతైనఁ జూపుకలది స్వభావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁ జోటేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్నినకర్మాలు నన్నుఁ బైకొనఁ జోటేది. ॥నీవె॥

నాలికకుఁ జవి యైతే నమలుటే సహజము
నాలి అభోజ్యపునింద నాకుఁ బనేమి
మూలవాసనగొనేది ముక్కునకు సహజము
జోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁ జోటేది. ॥నీవె॥

కాయము కాయముపొంతఁ గరఁగుటే ఆగుణము
నేయునిచేఁతలు నాపైఁ జెప్పఁ జోటేది
యీయెడ శ్రీవెంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో నుందువు పట్టఁగఁ జోటేది. ॥నీవె॥ 164

## లలిత

ఇదివో వున్నార మింతట నంతట
వెదకి కదియకుమీ విష్ణునిమాయ. ॥పల్లవి॥

హరిదాసులము హరికింకరులము
కరివరదునిడింగరులము
యిర వెతేఁగితి ననక యెఱఁగ ననక
సరి మాగురు తిది సర్వేశుమాయ. ॥ఇది॥

హితులము శరణాగతులము కేశవ
వ్రతులము వైష్ణవమతులము
గతి నినుఁ బొసితి కడు నీక మామీఁద
తతి దయ మరవకు దైవముమాయ. ॥ఇది॥

శ్రీవైష్ణవులము శ్రీవెంకటపతి
భావింప నితనిపరికరము
యీవల నావల నిహపరములకును
తోవదొలఁగుమీ తొలిఁ తొలి మాయ. ॥ఇది॥ 165

## రామక్రియ

ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా
యెంతసేసినా నీకు నెదురాడేనా. ॥పల్లవి॥

కోపగించి చంకబిడ్డ గోరి తల్లి డించితేను
పై పైనే పడుఁగాక పాసి పొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసరితే
నీపాదాలే గతి గాక నే మానేనా. ॥ఇంత॥

చదివించేలయ్యగారు జంకించి చూచితేను
వాదిగి చదువుఁ గాక వోపననీనా
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను
యిద నీకే మొక్కుదుఁగా కింక మానేను. ॥ఇంత॥

చెక్కు మీటి పాలు పెంచినదాది పోయఁగాను
గక్కన మింగుట గాక కాదనీనా
యిక్కడ శ్రీవెంకటేశ యిటుల రక్షించఁగ
నిక్కి నేమెరతుఁగాక నే మానేనా. ॥ఇంత॥ 166

మంగళకౌశిక

త్వే శరణ మహం తే శరణ మహం
కైశవకృష్ణ తే శరణం గతోఽస్మి. ॥పల్లవి॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసురదళన
దశదిశాపరిపూర్ణ తపనీయస్వరూప
దశావరణలోకతత్వాతీత. ॥తేశ॥

సహస్రలోచన సంతతవినుత
సహస్రముఖశేషశయనా
సహస్రకరకోటిసంపూర్ణతేజా
సహస్రారదివ్యచక్రాయుధా. ॥తేశ॥

అనంతచరణ సర్వాధారాధేయ
అనంతకరదివ్యాయుధా
అనంతనిజకల్యాణగుణార్ణవ
అనంతశ్రీవెంకటాద్రినివాసా. ॥తేశ॥ 167

శంకరాభరణం

అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము. ॥పల్లవి॥

మంచిమాఁట లైనాఁ గానిమాట లైన నొకచోట
ముంచి ముంచి యాకాశముననే యణఁగును
యెంచరాని నిట్టూర్పు లెన్ని వొడమినాను
అంచల నణఁగిపోవు నాకాశమునను. ||అది||

చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
ఆపొంతనే యణఁగు నాకాశమునను
రూపుల మైనీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున. ||అది||

యిలఁ జీఁకటి వెలుఁగు యెంచ నహోరాత్రాలఁ
గలసి మెలఁగు నాకాశ తత్త్వమున
చలువై శ్రీవెంకటేశు సాకారనిరాకారా
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున. ||అది|| 168

181-వ రేకు. తెలుఁగు కాంబోది

చూచి మోహించ కుందురా సురలైన నరులైన
తాచి నీవు ముందరఁ బ్రత్యక్ష మైనను. ||పల్లవి||

భాగీరథి పుట్టినపాదపద్మములు
భోగపుఁ బురునిజన్మభూమి నీతొడలు
యోగపునబ్రహ్మ లుండిననీనాభి
సాగరకన్యక లక్ష్మి సతమైనవురము. ||చూచి||

అందరి రక్షించేటిఅభయహస్తము
కంద నసురులఁ జంపేగదాహస్తము
సందడిలోకములయాజ్ఞాచక్రహస్తము
చెంది ధ్రువు నుతియించఁజేయుశంఖహస్తము. ||చూచి||

సకలవేదములుండేచక్కనినీమోము
వొకక్కై తులసిదేవివుండేటిశిరసు
ప్రకటపుమహిమలఁ బాయని నీరూపము
నెకలి శ్రీవెంకటాద్రిపభుఁడ నీభావము. ॥చూచి॥ 169

లలిత

వాదు లేల చదువులు వారు చెప్పినవే కావా
వాదు లేల మీమాట వారికంటే నెక్కుడా. ॥పల్లవి॥

నాలుగువేదాలబ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు
వాలినపురాణాలవ్యాసుఁ డెవ్వనిదాసుఁడు
లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు
ఆలకించి చెవ్వని గొల్చి రాతఁడే పో దేవుఁడు. ॥వాదు॥

భారత మెవ్వనికథ భాగవతము చెప్పిన
ఘేరుఁడై నశుకుఁడు యేదేవునికింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి సన్యసించి నుడిగేటి
నారాయణనామపునాథుఁడే పో దేవుఁడు. ॥వాదు॥

విష్ణువాజ్ఞ యని చెప్పేవిధిసంకల్ప మేఁడది
విష్ణుమాయ యని చెప్పేవిశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ" మనేవేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవెంకటాద్రివిభుఁడే ఆదేవుఁడు. ॥వాదు॥ 170

నాట

ఇతని కితఁడే కాక యితరులు సరియూ
మితిలోకా లితనికుక్షినిలోనే కావా. ॥పల్లవి॥

కమలనాభునిభయంకరకోపముతోడ
రమణ నేగోరివరంబులు సరిగా
తమితోడఁ దల దుంచి తగినవరము లిచ్చె
అమరఁగ నరకాసురాదులకు నితఁడు. ॥ఇత॥

కరివరదునిపేరుగలసినతిట్లతో
పరదేవతలమంత్రపఠనలు సరియా
నిరతి శిశుపాలునినిందకు శిక్షించి
పరలోక మిచ్చినట్టిభావము వినరా. ॥ఇత॥

చలిమి శ్రీవెంకటేశుశరణాగతితోడ
బలిమి మించినబ్రహ్మపట్టము సరియా
వొలిసినధ్రువునకు వున్నతలోక మిచ్చె
అల బ్రహ్మలోకమున కదె మీఁ దెఱఁగరా. ॥ఇత॥ 171

## పాడి

గొరబై మొద లుండఁగఁ గొనలకు నీ రేల
వొరబై వ మితఁడే తుదఁ గలఫలము. ॥పల్లవి॥

క్రతువులు హరియే కర్మము హరియే
పితరులకు హరియే పెనుఁదృప్తి
సతతమంత్రములసారము హరియే
యితనిసేవే పో యిన్నిటిఫలము. ॥గొర॥

అనలము హరియే ఆహుతి హరియే
జననీజనకులసరవి హరే
పనివడి వేదముఁ బ్రణవము హరియే
మొనసితనిపూజ యిన్నిటిఫలము. ॥గొర॥

మేలికె హరియే యిరవును హరియే
వాలాయమును సర్వము హరియే
కాలము శ్రీవెంకటగిరిహరియే
నేల నితనిశరణే సఫలంబు. ॥గౌర॥ 172

లలిత

దొంతివిషయములాల దొరలాల
చెంత మీఁదటిబుద్ధి చెప్పరో మాకు. ॥పల్లవి॥

దురితంబు లొకకొన్ని దుర్గుణము లొకకొన్ని
మరుగుటలు గొన్ని మర్మములు గొన్ని
ధర నెరుక లొకకొన్ని తగ నెరఁగములు గొన్ని
యిరవు మనపంట లివి యెందు వోయుదమో. ॥దొంతి॥

ఆస లొకకొన్ని మిథ్యాచారములు గొన్ని
వాసు లొకకొన్ని గర్వములు గొన్ని
నేసు లొకకొన్ని మీరినరుచులు నొకకొన్ని
యీసునఁ గడించితిమి యిముడఁ జోటేదో. ॥దొంతి॥

వైరాగ్యములు గొన్ని వరభక్తు లొకకొన్ని
నేరుపులు గొన్ని యిన్నియును గలిగి
యీరీతి శ్రీవెంకటేశుగతి చేరితిమి
వేర మిము మీరితిమి మాకు గతి యేదో ॥దొంతి॥ 173

శుద్ధవసంతం

పవుపాయములు మా కిఁకఁ బనికిరావు
నీవే హరి కావవే నిరుహేతుకముగ. ॥పల్లవి॥

యివల నింద్రియజయం బేడ నే నేడ
భువి నింద్రియములలోఁ బుట్టె నీతనువు
అవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెనే యెపుడు. ॥ఏవు॥

తెలమిఁ గర్మవిముక్తి యేడ నే నేడ
తెలియంగఁ గర్మాధీన మీబ్రదుకు
కులికమగుసాత్వికపుగుణ మేడ నే నేడ
కలియుగం బిది యిందుఁ గలవాఁడ నేను. ॥ఏవు॥

తనివోనిఘోరతప మేడ నే నేడ
అనిశంబు నీకు శరణాగతుఁడను
మొనలేని శ్రీవెంకటేశ్వరుఁడ నీబిరుదు
కనుఁగొనఁగ శరణాగతపారిజాతం. ॥ఏవు॥ 174

182వ రేకు సామంతం

సమబుద్ధే యిందరికి సర్వవేదసారము
సముఁ డిఁదరికి హరి సాధనమో యయ్యా. ॥పల్లవి॥

చీమకుఁ దనజన్మము చేరి సుఖమై తోఁచు
దోమకుఁ దనజన్మము దొడ్డసుఖము
ఆమని యీఁగకు సుఖ మాజన్మమై తోఁచు
యేమిటా నెక్కువసుఖ మెవ్వరి కేదయ్యా. ॥సమ॥

జంతురాసులకు నెల్లా జననము లొక్కటే
అంతటాను మరణము లవి యొక్కటే
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే
యింతటా నిందు కంటే నెవ్వ రేమి గట్టిరయ్యా. ॥సమ॥

ఇందులోన నెవ్వరైనా నేమి శ్రీవెంకటపతి
నందముగాఁ దలఁచిన దది సుఖము
యెందుఁ జూచినా నితఁ డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి స్వతంత్ర మేదయ్యా. ॥నను॥ 175

బౌళి

కరుణానిధివి గాన కాచితే నేమో కాని
సరికి బేసికి నిన్ను జరయఁ జోటున్నదా. ॥పల్లవి॥

కాయములోపలినిన్ను గని మని కొలువక
ఆయపుఁగర్మమె బ్రహ్మ మని వుంటిని
చీయనినాచేఁతకు నే సిగ్గువ డుండుట గాక
ఆయ మేమైనా నిన్ను నడుగఁ జోటున్నదా. ॥కరు॥

సకలచైతన్యుఁడవై సరి నాలో నుండఁగాను
వికటపువిషయాలవెంటఁ బారితి
వొకరు రక్షించఁగా వేరొకరిపాలై ననాకు
తుకతుకలే కాక దూరఁగఁ జోటున్నదా. ॥కరు॥

వట్టి శ్రీవెంకటగిరిఁ బ్రత్యక్షమై యుండఁగాను
యిట్టు నట్టు వైకుంఠ మేల కోరేను
దిట్టనై నానేరమి నే తెలిసి నవ్వుట యింతే
యిట్టె నీచిత్తము గాక యెంచఁగఁ జోటున్నదా. ॥కరు॥ 176

శంకరాభరణం

ఇన్నిటా నొరయక యేమి కేది
వెన్నునికృపఁగా వెలసేది. ॥పల్లవి॥

కోపము మతిలోఁ గుందినపుడు వో
పాపము లన్నియుఁ బాసేది
తీపులయాసలు దీరినపుడు వో
తాపత్రయములు దలఁగేది. ॥ఇన్ని॥

ఘనకర్మంబులు గడచినపుడు వో
వెనుకొనుభవములు విడిచేది
మునుకొని యింద్రియములు విడిసినఁ బో
పనివడి విరక్తి బలిసేది. ॥ఇన్ని॥

ఆకటిరుచు లివి యణఁగినపుడు వో
చేకొని సుఖమును జెందేది
యీకడ శ్రీవేంకటేశ్వరుశరణము
పైకొనినను బో బదికేది. ॥ఇన్ని॥ 177

సాళంగనాట

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రులు పూజించే యీసాకారమే ప్రమాణము. ॥పల్లవి॥

సగుణం బని నిను గొందరు సరి నిర్గుణ మని కొందరు
వగలఁ బెక్కుగతిఁ జదివినకోలఁదుల వారికి వారే వాదింతురు
అగణితస్వతంత్రుఁడవు గాన అల వాల్మీకి యిట్టి ట్టనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి యిచ్చుటే ప్రమాణము. ॥సక॥

"సోహం" బని కొందరు "దాసోహం" బని కొందరు
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు
దేహధారియై "దాసోహం" బని తేరి శుకుఁడు మీలోఁ గలసె
సోహంవుభావన సర్వజగత్తులఁ జూసినదే ప్రమాణము. ॥సక॥

ఆరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మముల నైనాను
యీరీతిల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగుభక్తు లిందరును నానాగతు లరసి చూచి
సారపుశ్రీవెంకటపతి మీకే శరణనుటే ప్రమాణము. ॥సర॥ 178

లలిత

ఇల జాణతనము లిన్నిటికిఁ గలదు
తలఁపే కూళ్లై తగిలీఁ గాని. ॥పల్లవి॥

మఱవదు దేహము మహిఁ దనగుణములు
గుఱి నాహారము గొను నెపుడు
మఱవ వింద్రియములు మర్మస్థలములు
మఱచితి నను నే మరులో కాని. ॥ఇల॥

చెదరదు కర్మము నేసినంతయును
పొదిగి జీవమును భోగించును
చెదరదు సంసారశీతలబంధము
మదిఁ జెదరేది నామరులే కాని. ॥ఇల॥

తొలఁగవు మాయలు తొడరి ప్రపంచము
కలవలెఁ బెనగొని కదిసీని
బలుశ్రీవెంకటపతికృపచే నాకు
తొలఁగె భవము లెటు దూరీనో మరులు. ॥ఇల॥ 179

మాళవి

హరి నెఱఁగనిజన్మ మది యేలా ఆ
సరుస నాతఁడులేనిచదు వేలా. ॥పల్లవి॥

దయదొలఁగినయట్టి తప మేలా
భయములేనియట్టి భక్తేలా
ప్రియముమానినయట్టి పెనఁగేలా మంచి
క్రియావిరుద్ధపుకీర్తన లేలా. ||హరి||

ఫలములేనియట్టిపను లేలా కడు
గలిమిలేనియట్టిగర్వ మేలా
బలిమిలేనియట్టిపంత మేలా శౌరి
దలఁచలేనియట్టితను వది యేలా. ||హరి||

తన కమరనిదొరతన మేలా
చనవులేనియట్టిసలిగె యేలా
యెనలేని శ్రీవెంకటేశ్వరుని శరణని
మనఁగలిగినమీఁద మరిచింత లేలా. ||హరి|| 180

183-వ రేకు. లలిత

దోమటి నిం తెరఁగరా తొల్లిటివారు
వామదేవవసిష్ఠవ్యాసాదులు. ||పల్లవి||

తానే దైవ మైతే తప మేల జప మేల
పూని సారెఁ బూజించేపూజ లేల
కూనువంగి యింటింటఁ గోర నేల వేఁడ నేల
యీనెపాన లోక మెల్లా నేలరాదా తాను. ||దోమ||

తగఁ దా స్వతంత్రుఁడై తే దరిద్రదుఃఖము లేల
నొగిలి వ్యాధులచేత నొవ్వ నేల
నగుఁబాటులై నజననమరణము లేల
ముగురువేల్పులదండ మొనచూపరాదా. ||దోమ||

శ్రీవెంకటేశుఁడే శేఖరపుదైవ మని
సావధానుఁ డితనికిశరణు చొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాసి
తావుల నాతనికృప దండ చేరరాదా. ॥దోమ॥ 18

## గుండక్రియ

అవియు నాకుఁ బ్రథమాచార్యులు
తవిలి యీనెపము మిముఁ దలఁపించుఁ గాన. ॥పల్లవి॥

ధనవాంఛమతిలోనఁ దగిలినప్పటివేళ
దనుజారి మీమీఁద దలఁపు గలుగు
పొనిగి భయదుఃఖములఁ బొరలినప్పటివేళ
పనివూని మీమీఁది భక్తి గలుగు. ॥అవి॥

చెలఁగి పాపములు మించినవేళ హరి మీ
నలువునామోచ్చారణంబు గలుగు
బలిమి భవరోగముల బడలినప్పటివేళ
పలుమారు మీసంప్రార్థనలు గలుగు. ॥అవి॥

యిన్నిటాఁ దొలఁగి మిము నెరిఁగి కొలిచినవేళ
మన్ననలపరిణామంబు గలుగు
వున్నతపుశ్రీవెంకటోత్తముఁడ మిము నెదుట
గన్నయీవేళ సౌఖ్యంబులే కలుగు. ॥అవి॥ 182

## లలిత

ఈతని మరచి వుంటి మిన్నాళ్లును
యీతల నేఁ డెచ్చరించె నీతఁడే పో విష్ణుఁడు. ॥పల్లవి॥

తల్లియై పోషించు తండ్రియై రక్షించు
వుల్లపుబంధువుఁడై వొడ లరయు
మెల్లనె దాతై యిచ్చు మెలుఁతయై యాదరించు
యెల్లవిధబంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు. ॥ఈత॥

యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధిచెప్పు
చాలుమానిసియై యంచలఁ దిరుగు.
బాలుఁడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు
యీలాగులబంధుఁ డీతఁడే పో విష్ణుఁడు. ॥ఈత॥

దేవుఁడై పూజ గొను దృష్టిగోచరమై
శ్రీవెంకటాద్రిమీఁద సిరు లొసగు
తావై యెడ మిచ్చు తలఁపై ఫల మిచ్చు
యీవల నావల బంధుఁ డీతఁడే పో విష్ణుఁడు. ॥ఈత॥ 183

లలిత

పీదిలోన నదే కదే విష్ణుపదము
ఆదెసనే పాయకుండు నాదిమూలము. ॥పల్లవి॥

చూచేటిచూపులకును సూటైయెనమొదలేదో
యేచి వినుకలిమర్మ మెందు దాఁకీనో
వాచవిచవులుచూచేవంటశాలచో టేదో
ఆచాయనే వుండు నాదిమూలము. ॥పీది॥

పూపతలపోఁతలకు పుట్టినయిల్లది యేదో
పైపై నూర్పులు నిలుపఁగఁ జో టేదో
మాపులు నిద్రించువేళ మరచేటిచో టేదో
ఆపొరుగుననే వుండు నాదిమూలము. ॥పీది॥

నేరిచినవిద్య లెల్లా నించి దాఁచేచో టేదో
కోరనియానందముకొన యేదో
ఆరయ శ్రీవెంకటేశుఁ డాడనే పాయక వుండు
ఆరితేరినాతఁ డితఁ డాదిమూలము. ॥వీది॥ 184

బౌళి

దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నామనసా యిది మరవకుమీ. ॥పల్లవి॥

గుదిఁబాఁతచీర మాని కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి మొగిఁ గొత్తమేను మోచు
అదన జంపఁగ లేవు ఆయుధము లితని
గదిసి యగ్నియు నీరు గాలియుఁ జంపఁగ లేవు. ॥దేహి॥

ఈతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ డేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు. ॥దేహి॥

చేరి కానరానివాఁడు చింతించరానివాఁడు
భారపువికారాలఁ బాసినవాఁ డీయాత్మ
ఆరయ శ్రీవెంకటేశు నాధీన మీతఁ డని
సారము దెలియుటే సత్యం జ్ఞానము. ॥దేహి॥ 185

బౌళి

హరినే వొకటే యనంతము
గురుబోధలకును గొలఁదే లేదు. ॥పల్లవి॥

తలఁచినకొలఁదే తనలో భావము
నిలిపినకొలఁదే నేమము
పలికినకొలఁదే పరమగు సత్యము
యిల నెవ్వరికిని యెక్కుడు లేదు. ॥హరి॥

జరపినకొలఁదే సకలాచారము
నెరపినకొలఁదే నిజకీర్తి
తిరము సేయుకొలఁదే ధర్మంబును
యిరవుగ నందుకు నెక్కుడు లేదు. ॥హరి॥

సేసినకొలఁదే చేకొనుకర్మము
రోసినకొలఁదే రుచివిరతి
ఆసల శ్రీవేంకటాధిపుశరణను
దాసుఁడే యెక్కుడు తప్పే లేదు. ॥హరి॥ 186

184-వ రేకు. లలిత

ఇది యరుదను నొకఁ డిది యరుదని చెప్పు
యిది యరుదని విను నెవ్వఁడు నెఱఁగఁడు. ॥పల్లవి॥

పుట్టినవానికి నెల్లా భువి మరణము నిత్య
మట్టె చచ్చినవారి కవ్వల జననము
పుట్టనినాఁ డై తేను పొడ గాన రాదు మేను
కొట్టఁగొనఁ గాన రాదు కొన్నాళ్లే కాని. ॥ఇది॥

జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తమధర్మములఁ బాయ రాదు
సావధాన మిదియే సంసారయోగము. ॥ఇది॥

చిత్తమా నీలోపలను శ్రీవెంకటేశ్వరుఁడు
పొత్తునఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము యిది జీవగుణ మిది
యిత్తలాద్వైతగుణము యిది మఱవకుమీ. ॥ఇది॥ 187

ముఖారి

నాకు నీవు గలవు హరి నాలోపలనుండి
పైకొని యిన్నియు బదుకనీవయ్యా. ॥పల్లవి॥

పసిగొని రుణానుబంధముకొలఁదే
పసులునుఁ బడతులు బహుసుతులు
వసము గావు తమవంతులు దీరిన
పసగా నవియే బదుకనీవయ్యా. ॥నాకు॥

పెనగొని భటులకుఁ బెట్టినకొలఁదియు
పనులును గీర్తులు పంతములు
అనువులు దప్పను అవిగడమైతే
పనివడి యివియే బదుకనీవయ్యా. ॥నాకు॥

కడుసంపదలును కాలముకొలఁదే
బడి బడిఁ జవులై ఫలియించు
యెడపక శ్రీవెంకటేశుఁ డిచ్చె నివే
పడసితి మివియును బదుకనీవయ్యా. ॥నాకు॥ 188

సామంతం

నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటినే. ॥పల్లవి॥

చలువయును వేడియును సటలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీరెండుఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు. ॥నారా॥

పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు
తగుమేను పొడచూపు తనుఁ దానె తొలఁగు
నగియించు నొకవేళ నలఁగించు నొకవేళ
వొగరుఁగారపువిడె మబ్బించినట్లు. ॥నారా॥

యిహముఁ బరమునువలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజశ్రీవెంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే. ॥నారా॥ 189

## గుండక్రియ

కలుగుట కలిగిననాఁడే నే ఘనపాపములకు దొలంగినా
యెలమి నే నిపుడే యెరిగితిని యిన్నాళ్లిమతి లేదు. ॥పల్లవి॥

జనియించినవే నిటకమునుపుసకలయోనిగతజన్మములు
కనుఁగొని యవె నే సారెకు బలుమరు ఘనవర్ణాశ్రమధర్మములు
అనుభవించినవే సకలార్థంబులు అయిహికవిషయము లన్నియును
మనసున వాకున శ్రీహరి నొకనినె మఱచియుఁ దలఁచుట లేదు. ॥కలు॥

తిరిగినవే నే నాసలకొరకును దిక్కు లన్నియును నేను
యిరవుగ తొల్లియు నెఱిఁగినవే యీసంసారపుసుఖము లివి
పొరలినవే నేఁ గామినీజనులపొందులసుఖములభోగములు
ధరవులదొరకలే శ్రీహరిదాస్యం బిది గతి యని యెరుఁగుట లేదు. ॥కలు॥

గడియించినవే నేఁ బూర్వకాలమున ఘనమగుసంపద లిన్నియును
నొడిగినవే నే శబ్దజాలములు నోరఁ గొలఁదులివి యిన్నియును
తడఁబడి నే నిటు సకలోపాయపుధర్మము లిన్నియుఁ జూచితిని
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణం బిటువలెఁ జేరుట లేదు. ॥కలు॥ 190

లలిత

నీ వొక్కఁడవే నాకుఁ జాలు నీరజాక్ష నారాయణ
నీవె నాకు గతి యని తెలిసితి నెక్కొని యితరము వృథా వృథా. ॥పల్లవి॥

మీనామోచ్చారణమే మెరసినదుఃఖనివారణము
మీనామోచ్చారణమే మెలఁగుశుభకరము
నానావేదశాస్త్రములు నవపురాణేతిహాసములు
మీనామములోనే వున్నవి మిగిలిన విన్నియు వృథా వృథా. ॥నీవొ॥

నీపాదమూలము నింగియు భువియు రసాతలము
నీపాదమూలము నిఖిలజీవపరిణామములు
దీపించిన చరాచరంబులు దివ్యులు మునులును సర్వమును
నీపాదమూలమే మరి నెరి నితరంబులు వృథా వృథా. ॥నీవొ॥

దేవ మీతిరుమే దిక్కును బ్రహ్మాండాధారము
దేవ మీతిరుమే నుత్పత్తిస్థితిలయమ్ములకును ఆకరము
శ్రీవెంకటపతి నాభావము చిత్తమ్ము నీకే సమర్పణ
దేవ మీశరణము చొచ్చితి దిక్కు లన్నియును వృథా వృథా. ॥నీవొ॥ 191

185-వ రేకు. గుండక్రియ

దేవునికి దేవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా. ॥పల్లవి॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుగువేదా లదె నీదరులు
నిర్మలపునీజలము నిండున పసాగరాలు
కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా. ॥దేవు॥

తగినగంగాదితీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁబుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మునులోయమ్మా. ॥దేవు॥

వైకుంఠనగరమువాకిలే నీయాకారము
చేకొనుపుణ్యములే నీజీవభావము
యేకడను శ్రీవెంకటేశుఁడే నీవునికి
దీకొనినీతీర్థ మాడితిమి కావవమ్మా. ॥దేవు॥ 192

కాంబోది

నన్నారఁగ లేనయ్యా నాయంతర్యామి
వున్నతపుహరి నాలో నున్నాఁడట. ॥పల్లవి॥

యిల నేడుజానలమే నిందులోనివాఁడ నింతే
తలఁపు బ్రహ్మాండాలు దాఁటి పొయ్యీ నాని
కలువరేకులంతేసికన్నులవాఁడ నింతే
సొలసి చూ పాకాశమే చూరగొనీని. ॥నన్నా॥

వెడవెంట్రుకదూరేటివీనులవాఁడ నింతే
కడలేనిశబ్దము లొక్కట వినేను
నడుమనే నల్లెఁడంతనాలికెవాఁడ నింతే
వుడివోనిసుద్దు లెల్లా నుగ్గడించేను. ॥నన్నా॥

లచ్చనఁ బదారంగుళాలప్రాణ మింతే
కుచ్చికాలపుదినాలు గొలచీని
కొచ్చినశ్రీవెంకటేశుకొలువుడుబంట నింతే
పచ్చియింద్రియాల కెల్లాఁ బంపు సేసేను ॥నన్నా॥ 193

సామంతం

నిక్కమైననాలోని నెలవు గాన లేను
దిక్కు నీవే హరి నా తెలి వేఁటితెలివి. ॥పల్లవి॥

నీటిలో మునిఁగి వచ్చి నిర్మలుఁడ ననుకొందు
గాటమై యావేగి లేచి కా నందును
తేటలఆదేహామే దిష్టము ఆ నేనే
పాటిలేనిభావపునాబదు కేఁటిబదుకు. ॥నిక్క॥

మొన్న నొకబంటు నేలి యేలికె నే ననుకొందు
పన్ని నే నొకరిఁ గొల్చి బంట నందును
మున్నిటినామనసె మొదలినాపుట్టు గే
యిన్నివికారాలనామెరు కేఁటిమెరుక. ॥నిక్క॥

కాంచనము చేత నుంటే కలవాఁడ ననుకొందు
పెంచి యొకవేళ నేఁ బేద నందును
కంచుమాయఁ బొరలఁగాఁ గాచితి శ్రీవెంకటేశ
కొంచినయిన్నాళ్లు నాగుణ మేఁటిగుణము. ॥నిక్క॥ 194

మాళవి

అరు దరుదు నీమహి మతిమానుషము చూడ
పురుషోత్తమనుదివ్యపురజగన్నాథా. ॥పల్లవి॥

పసులఁ గాచే దేవ బ్రహ్మ నుతియించు దేవ
సిసువా దేవ నాలుగుచేతు లేవ
కొసరి వేలనే యేవ కొండగొడ గెత్తు దేవ
వసమా నిన్నుఁ బొగడ నరజగన్నాథా. ॥అరు॥

జనవేమ మేడ పారిజాతము దెచ్చిన దేవ
తనివెన్న ముచ్చి మేడ దైవికమేడ
పని బండిబోయిఁ దేవ బాణుని నరకు దేవ
వినఁ గత నీమహిమ విష్ణు జగన్నాథా. ॥అరు॥

కమ్మి రోలఁ గట్టు దేవ గరుడవాహన దేవ
దొమ్మి భద్రసుభద్రులతోఁబుట్టు వేడ
చిమ్ముల నిలగిరిని (?) శ్రీవెంకటాద్రిమీఁద
నుమ్మడి నిరవుకొంటివో జగన్నాథా. ॥అరు॥ 195

మాళవిగౌళ

కలియుగ మెటులైనాఁగలదుగా నీకరుణ
జలజాక్ష హరి హరి సర్వేశ్వరా. ॥పల్లవి॥

పాప మెంత గలిగినఁ బరిహరించేయందుకు
నాపాలఁ గలదుగా నీనామము
కోప మెంతగలిగిన కొచ్చి శాంత మిచ్చుటకు
నేపట్టి కలవుగా నాచిత్తములో నీవు. ॥కలి॥

ధర నింద్రియా లెంత తరము కాడిన నన్ను
సరిఁ గావఁ గద్దు గా నీశరణాగతి
గరిమఁ గర్మబంధాలు గట్టినతాళ్లు వూడించ
నిరతిఁ గలదు గా నీభక్తి నాకు. ॥కలి॥

హితమైనయిహపరా లిష్టమైన వెల్లా నిత్య
సతమై కలదు గా నీనంకీర్తన
తతి శ్రీవెంకటేశ నాతపము ఫలియింపించ
గతి గలదు గా నీకమలాదేవి. ॥కలి॥ 196

గుండక్రియ

జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి. ॥పల్లవి॥

శరణాగతపారిజాతమా
పొరినసురలపాలిభూతమా
అరుదయినసృష్టికి నాదిమూలమా వో
హరి నమో పరమపుటాలవాలమా. ॥జయ॥

సకలదేవతాచక్రవర్తి
వికలివై నిండినవిశ్వమూర్తి
అకలంకమైనదయానిధి
వికచముఖ నమో విధికి విధి. ॥జయ॥

కొలచినవారలకొంగుపైడి
ములిగినవారికి మొనవాడి
కలిగినశ్రీవెంకటరాయా
మలసి దాసులమైనమాకు విధేయా. ॥జయ॥ 197

185-వ రేకు. దేవగాంధారి

అణురేణుపరిపూర్ణమైనరూపము
అణిమాదిసిరి యంజనాద్రిమీఁదిరూపము. ॥పల్లవి॥

వేదాంతవేత్తలెల్లా వెదకేటిరూపము
ఆదినంత్యములేని యారూపము
పాదుగ యోగీంద్రులు భావించురూపము
యీదెస నిదివో కోనేటిదరిరూపము. ॥అణు॥

పాలజలనిధిలోనఁ బవళించేరూపము
కాలపుసూర్యచంద్రాగ్నిగలరూపము
మేలిమి వైకుంఠాన మెరసినరూపము
కీలైన దిదే శేషగిరిమీఁదిరూపము. ॥అణు॥

మించిన బ్రహ్మాదులకుమూలమైనరూపము
కొంచనిమఱ్ఱాకుమీఁదికొనరూపము
మంచిపరబ్రహ్మమై మమ్మునేలినరూపము
మెంచఁగ శ్రీవెంకటాద్రి నిదేరూపము. ॥అణు॥ 198

గుండక్రియ

నే నేమీఁ జేయఁగ లేను నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నే నధికుఁడ వన్నిటా నీవు. ॥పల్లవి॥

దండము వెట్టుట నాది తప్పు లోఁగొనుట నీది
నిండి నీ వెప్పుడు దయానిధివి గాన
అండఁ జేరుకొంట నాది అందుకు నూఁకొంట నీది
దండియైనదేవదేవోత్తముఁడవు గాన. ॥నేనే॥

శరణు చొచ్చుట నాది సరుగఁ గాచుట నీది
పరమపురుష శ్రీపతివి నీవు
విరులు చల్లుట నాది వేవే లిచ్చుట నీది
హరి నీవు భక్తసులభుఁడ వటు గాన. ॥నేనే॥

దాసుఁడ ననుట నాది తప్పక యేలుట నీది
ఆసదీర్చేవరదుఁడ వటు గాన
నీసేవ యొక్కటి నాది నిచ్చలుఁ గైకొంట నీది
యీసులేని శ్రీవెంకటేశుఁడవు గాన. ॥నేనే॥ 199

బౌళి

ఎట్టైనాఁ గావక పోదు యే నెంత సేసినాను
యిట్టె నీకు శరణంటి నిదియే తెరఁగు. ॥పల్లవి॥

చేకొని నే మొక్కఁగాను చేతులు గోయఁగ రాదు
ఆకడఁ దప్పకుఁ దగినాజ్ఞ మాన రాదు
కైకొని యపరాధాలే కావించితి నెన్నైనా
యీకడ నీశరణంటి నికనో తెరఁగు. ॥ఎట్టై॥

చిక్కి దైన్యపడఁగాను చెలఁగి ఖండించ రాదు
చక్కఁగా నాద్రోహాలు సైరించ రాదు
అక్కడఁ జూచిన శరణాగతబిరుదు నీకు
యిక్కడ నీశరణంటి నికనో తెరఁగు. ॥ఎట్టై॥

సేవ సేయుచుండఁగాను జీతము మానుప రాదు
తమావిధి నాన ద్రోసితే నిందుకో రాదు
దేవుఁడ నిన్నుఁ గొలిచి తెగి కర్మా లుడిగితి
యీవల శ్రీవెంకటేశ యికనో తెరఁగు. ॥ఎట్టై॥ 200

గుండక్రియ

ధరలో “[illegible]ద్భావం తద్భవ తనేఁ” గాన
హరిమయమే జగ మంతాను. ॥పల్లవి॥

మహి నెదిటివారందు మలినము దలఁచిన
తహతహ మనసే తా మలినము
వహి నెదిటందు భావనము భావించిన
బహువిధముల దానూ భావనమే. ॥ధర॥

వెక్కువ నెదిటిపాపా లెంచి నిందించేటి
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటిపుణ్యా లుగ్గడించి ఘన మంటే
దక్కినపుణ్యపుజిహ్వా తానూ ఘనమే. ॥ధర॥

సారె శ్రీవెంకటపతి సగుణము దలఁచిన
సారపుజీవుఁడు తాను సగుణమే
నేరుపుల నాతనినిర్గుణము దలఁచిన
తారతమ్యములు లేని తానూ నిర్గుణమే. ॥ధర॥ 201

భూపాలం

ఎందాఁక నిద్ర నీకిదె తెల్లవారెఁ గదె
యిందిరారమణ నీ విటు మేలుకొనవే. ॥పల్లవి॥

కమలనాభుఁడ నీకు గంగాదినదు లెల్ల
నమర మొకమజ్జనం బాయితము సేసె
తమితోడఁ గనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే ॥ఎందా॥

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతముగువాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాయిత్తపడి సందడించేరు. ॥ఎందా॥

ANDHRA PRADESH SANGEETA ... LIBRARY
Call No............
Acc No............
Date............
HYDERABAD-A

కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీచేలాగు కది వో
యీమహిమ శ్రీవెంకటేశ నీకే చెల్లె
కామించి యన్నియునుఁ గైకొంటి విపుడు. ॥ఎందా॥ 202

సాళంగనాట

రామా రామభద్ర రవివంశరాఘవ
యేమి యరు దిది నీ కింతటివానికిని. ॥పల్లవి॥

నాఁడు రావణుతలలు నఱికినలావరివి
నేఁడు నాపాపములు ఖండించ రాదా
వాఁడిప్రతాపముతోడ వారిధి గట్టిననాఁటి
వాఁడ విట్టె నామనోవార్ధిఁ గట్ట రాదా. ॥రామా॥

తనిసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువ రాదా
మొనసి హరునివిల్లు మొక్కవెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచ రాదా. ॥రామా॥

సరుస విభీషణుఁడు శరణంటేఁ గాచితివి
గరిమ నే శరణంటిఁ గావ రాదా
తొరలి శ్రీవెంకటేశ దొడ్డు గొంచ మెంచ నేల
యిరవై లోకహితాన కేదైనా నేమీ. ॥రామా॥ 203

187-వ రేకు. లలిత

అని యాన తిచ్చెఁ గృష్ణుఁ డర్జునునితో
ఘని యాతని భజించు ఋషీకమా. ॥పల్లవి॥

"భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణుల నెల్ల
దీమసాననే మోచేటిదేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటిదేవుఁడ నేను. ॥అని॥

దీపనాగ్నినై జీవదేహములయన్నములు
తీపుల నరగించేటిదేవుఁడ నేను
యేపున నిందరిలోనిహృదయములోన నుందు
దీపింతుఁ దలఁపుమరపై దేవుఁడ నేను. ॥అని॥

వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచేతా
ఆది నే నెరఁగఁదగినయాదేవుఁడను
శ్రీదేవితోఁ గూడి శ్రీవెంకటాద్రిమీఁద
పాదైనదేవుఁడను భావించ నేను." ॥అని॥ 204

## గుండక్రియ

తలఁపులో కొట్టఁగొన దైవమే వున్నాఁడు
తలఁచినరూపులెల్లా తా నయ్యా నయ్యా. ॥పల్లవి॥

కలలో ప్రపంచము కంటి నే నొకటి
వెలినున్న ప్రపంచవిధివలెనే
కలనున్నవాఁడ నేనే వెలి నున్నవాఁడ నేనే
తెలి ( య ? ) మాబతుకు రెంట దెప్పరము లయ్యా. ॥తల॥

దేహమీఁద నుండఁగానే దిక్కులకేఁగీ మనసు
దేహముతో దిక్కు లెల్లాఁ దిరిగినట్టే
దేహములో వాఁడ నేనే దేహముపై వాఁడ నేనే
వోహో మాజన్మములో నొకటి రెండయ్యా. ॥తల॥

కన్ను లెదుట శ్రీవెంకటపతిఁ గొలిచెద
కన్ను మూసి యాతనినే కమ్మర భావించెదను
కన్నులలోపల నేనే కన్నులవెలిని నేనే
వున్నతి నీరెండును వొక్కటాయ నయ్యా. ॥తల॥ 205

## శ్రీరాగం

చాలు నిదే నావిరతి సకలసామ్రాజ్యము
నాలోనిపని యెంతైనా నాకుఁ గలదు. ॥పల్లవి॥

వడఁబడి పరులిండ్లవాకిలి గాచే నేను
వడి నాలో హరియున్నవాకిలి గాచేను
బడి నొకరిఁ గొలిచి బహురాజ్య మేలే నేను
యెడ నామనోరాజ్య మింతా నేలేను. ॥చాలు॥

చేరి యొరులకుఁ బనిసేసి యలసేనేను
సారె నాయోగాభ్యాసాన నలసేను
ఆరసి నే నడుగఁగ నన్నియలిచ్చేయీవులు
తారి పూర్వకర్మాదిదైవమే యిచ్చీని. ॥చాలు॥

అందు సంతోషమే ఫల మిందు సంతోషమే ఫల
మందును మాయాకల్పిత మిందును మాయే
అందు నిందు శ్రీవెంకటాధీశుఁడే కర్త
అందైతేఁ బరతంత్రుఁ డిందు నే స్వతంత్రుఁడ. ॥చాలు॥ 206

## సామంతం

నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్యా
దాసుఁడ నే నింతే దైవము నీవు. ॥పల్లవి॥

లోకము లేలుదువట లోకములోపలినేను
పైకొని నీ వేలినట్టిబంటనే సుమ్మీ
ఆకడ నావుఁ గొంటే నావువెంట దూడయును
జోకలఁ గొన్నట్టివారిసొమ్మే కాదా. ॥నీసొ॥

చేరి నన్ను నీవే పుట్టించితివట నేఁ జేసే
నేరతోఁ బుణ్యపాపాలు మీవే సుమ్మీ
ఆరుగ వి త్తినవాఁడు ఆరుగలోపలికంటే ( ? )
ఆరితేరి పండితేను ఆతనిదే కాదా. ॥నీసొ॥

శ్రీవెంకటేశ నీవు జీవాంతరాత్మవట
కావించి నాపాలఁ గలవే సుమ్మీ
కైవసమై చందురుఁడు కలువలజాతికెల్ల
భావింప సర్వవిధబంధువే కాఁడా. ॥నీసొ॥ 207

బౌళిరామక్రియ

అన్నిటికి హరి యంతర్యామి మూలము
విన్నకన్నగతు లెల్లా వృథా మూలము. ॥పల్లవి॥

లాలితవైరాగ్యమూలము మోక్షము
ఆలరిసంసారమూల మతిబంధము
వేలిమిశాంతమూలమే సుఖము
పీలి క్రోధమూలమే వెడదుఃఖము. ॥అన్ని॥

కైకొనుభవములే కర్మమూలము
శ్రీకాంతుపై భక్తి చిన్మూలము
పైకొన్నధ్యానమెల్ల భావమూలము
దీకొని లంపటములు దేహమూలము. ॥అన్ని॥

అరుదైన సుజ్ఞాన మాచార్యు ( ర్య ? ) మూలము
ధరణి జగత్తెల్లా ధనమూలము
పరము శ్రీవెంకటపతిమూలము
హరి నాకితనిశరణాగతి మూలము. ॥అన్ని॥ 208

దేవగాంధారి

వానికి ముదుల యిచ్చి వద్దని మానుపవే
శ్రీనారాయణ నీనిచేత నే వేసరితి. ॥పల్లవి॥

నీకల్పితములే యీనిఖిలేంద్రియములు
యీకడ నీయింద్రియాల నెట్టు గెలువఁగ వచ్చు
నీకడ నిన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వాని
పైకొని చోఁపుట గాక బలిమా రాచాజ్ఞతో. ॥వాని॥

నీపంపునఁ గప్పిననిజమైనమాయ యిది
మాపాటివారెల్లా మహి నెట్టు దాఁట వచ్చు
మీపాదాలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని
పైపైఁ ద్రోయుట గాక బలిమా రాచాజ్ఞతో. ॥వాని॥

శ్రీవెంకటేశ నీచిక్కులే యీపుట్టుగులు
నీవు నేసేచేఁతలకు నే నెట్టు దొలఁగ వచ్చు
నీవొద్ద శరణంటి నీయానతినే వాని
భావించి తోసితిఁ గాక బలిమా రాచాజ్ఞతో. ॥వాని॥ 209

188వ రేకు. గుండక్రియ

నీవే నేసినచేఁత నీవే చేకొనుటింతే
యీవల నీబొమ్మ నీకే యియ్య సిగ్గయ్యీ నయ్యా. ॥పల్లవి॥

ఆలు బిడ్డలఁ గని యటు దనమగనికి •
సీలాన సమర్పణ సేయవలెనటవయ్యా
తాలిమిఁ బుణ్యాలు సేసి దైవమా నే నీకు
యేలీల సమర్పించే నిందుకే నవ్వ వచ్చీనయ్యా. ॥నీవే॥

అంకెలఁ గన్నకొడుకటు దమతండ్రికిని
తెంకి నే నీవాఁడ నని తెలుపఁగవలెనటవయ్యా.
లంకె నాలోపలనున్నలక్ష్మీశ నే నీకు
పొంకపు ( నీ ) బంట నన్నుఁ బునరుక్తయ్యీ నయ్యా. ॥నీవే॥

తననీడయద్దములోఁ దానే యటు చూచి
పనివడి వూరకే భ్రమయవలె నటయ్యా
అనుగు శ్రీవెంకటేశ ఆతుమలో నున్ననిన్ను
గని మని శరణంటేఁ గడఁ బూజించ నేలయ్యా. ॥నీవే॥ 210

బౌళి

అనలము సూర్యుఁడు నన్నిటందు వెలసిన ( నా ? )
ఘనపవిత్రమైనట్టు ఘనుఁడే పో జ్ఞాని. ॥పల్లవి॥

కాంచనము అంటువడినఁ గలదా అందు నింద్యము
పెంచు ముట్టంటువడినఁ బెక్కువ దూష్యము. గాక
అంచల సుజ్ఞానిఁ బాప మంటునా తాఁ జేసినాను
పంచల నజ్ఞాని నైతేఁ బైకొనీఁ గాక. ॥అన॥

మెఱుఁగగల నాలిక నింతైనా జి డ్డంటునా
మెఱుఁగలేనిచేత నింతా జిడ్డంటుఁ గాక
కఱితలయోగిని కర్మములివంటునా
చుఱచుఱ జడునైతేఁ జుట్టుకొనుఁ గాక. ॥అన॥

తామెరపాకులనీరు తగ నందు నంటునా
ఆమేర నొద్దైనాను నంటుఁ గాక
యీమేర శ్రీవెంకటేశునిదాసుఁడు భూమిఁ
గామించి తానుండినాను గడు మాయ లంటునా. ॥అన॥ 211

చాయానాట

కమ్మంటేఁ గావా కాఁగల వన్నియు
చిమ్ముల మాయలు సేయఁగ నేలా. ॥పల్లవి॥

సరసిజాక్ష నీసంకల్పమాత్రము
అరుదగు ఘనబ్రహ్మాండ మిది
అరయఁగ ధరలోనల్పపుఁబనులకు
హరి యవతారంబందితి వేలా. ॥కమ్మ॥

సతతసురాసురజననమరణములు
మతి నీ హుంకారమాత్రములు
గతియై యమృతము గల్పించుకొరకును
తతి ఘోరజలధి దచ్చితి వేలా. ॥కమ్మ॥

యిహావైకుంఠము యీశేషగిరే
మహి నీ దర్శనమాత్రమిది
విహరింపఁగ శ్రీవేంకటేశ యిటు
బహులోకపుకల్పన లవి యేలా. ॥కమ్మ॥ 212

సామంతం

రాచాజ్ఞ మరలించ రాజే కర్త గాన
తోంచి నీకు శరణంటి నిది మానుపవే. ॥పల్లవి॥

కడు నహంకరించినను తొల్లి ఘనుఁడు నారదమౌని
బెడిదపుటింతిఁ జేసి నీమాయ ఆతని బిడ్డలఁ గనిపించెను
అడరి నే నఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁ గలనా
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁ జేయవే. ॥రాచా॥

మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనిని
సహజపునీహస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ
బహుముఖనుల నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ
అహిశయనుఁడ నే నీశరణంటిని అది నన్ను దగ్గరకుండఁ జేయవే. ॥రాచా॥

సారపుశ్రీవెంకటేశ స్వతంత్రుఁడవు నీవు
గారవపుమాను నీదే కమ్మి నే నీవాఁడనే
మారుదైవములు లేరు మరి నన్ను గావ నిన్నుఁ
జేరుకొని శరణంటేఁ బెడఁబాపు మాయ. ॥రాచా॥ 213

మాళవిగౌళ

ఎందుకు విచ్చేయు నేల యిన్నియు నాలోనివే
అంది యివే చేకొనవే ఆరడి నీకేల. ॥పల్లవి॥

కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియమైతే
కాముకత్వము నాయందుఁ గలదెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే
నాముల క్రోధ మిదివో నాలో నున్నది. ॥ఎందు॥

లోకులచీరలీకుండేలోభమే ప్రియమైతే
యీకడ లోభము నాలో హెచ్చిన దిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియమైతే
చేకొను మదము నాలోనేనానేన. ॥ఎందు॥

మాటి శిశుపాలునిపై మచ్చరమే ప్రియమైతే
మెఱయుమత్సర మిదే మించీ నాలో
తటి శ్రీవెంకటపతి ధాసులపై మోహము
నెటి నీకుఁ బ్రియమైతే నేనే కానా. ॥ఎందు॥ 214

శంకరాభరణం

కానవచ్చె నిందులోనే కారుణ్యానరసింహా
తానకమై నీకంటే దాస్యమే పో ఘనము. ॥పల్లవి॥

యెనసి ప్రహ్లాదుఁడు యెక్కడఁ జూపునో యని
ననిచి లోక మెల్ల నరసింహ గర్భములై
పనివూని వుంటి వటు భక్తపరతంత్రుఁడవై
తనిసి నీ వధికమో దాసులే యధికమో. ॥కాన॥

మక్కువ బ్రహ్మాదులు మానుపరానికోపము
యిక్కువై ప్రహ్లాదుఁడు యెదుట నిలిచితేను
తక్కక మానితి వట్టె దాసునియాధీనమై
నిక్కి నీకింకరుఁడే నీకంటే బలువుఁడు. ॥కాన॥

ఆరసి కమ్మర ప్రహ్లాదవరదుఁడని
పేరువెట్టుకొంటి విట్టె బెరసి శ్రీవెంకటేశ
సారె నీశరణాగతజనునికాధీనమైతి
వీరీతి నీదాసునికే యిదివో మొక్కేము. ॥కాన॥ 215

189-వ రేకు. ధన్నాసి

అటుగాన మోహనకోశ హరి నీకే అన్నియును
ఘటియించుటే యెక్కుడు కమలారమణ. ॥పల్లవి॥

నిన్ను జూడనికన్నులు నీచువలకన్నులు
చిన్ని నీకథలు విననిచెవులు రాట్నపుఁజెవులు
వున్నతి నీకడకు రాకున్నకాళ్లు మరగాళ్లు
నన్నుతిసేయనిజిహ్వా సరి నుపజిహ్వా. ॥అటు॥

చేరి నిన్ను బూజించనిచేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టితలయే పెడతల
సారె నీముద్రలేనిభుజములు బుద్భుజములు
తేరి నీదాస్యములేనిదేహము సందేహము. ॥అటు॥

వనమాలలున్నగ్రీవము కంబుగ్రీవము
ఘన మిది దెలియుటే కైవల్యము
యెనయ శ్రీవెంకటేశ యిటు నన్ను నేలితి౹౹
అనుమాన మెల్లఁ బాసె నన్నిటా నాకును. ॥అటు॥ 216

సామంతం.

అందుకుఁ గాదు నేఁ గొల్చుటామీఁదివళి కింతే
యిందు నందు నీవే కర్త యిందిరారమణ. ॥పల్లవి॥

యించుకంత వేలఁ గొండ యెత్తినదేవుఁడవు
ముంచి నాసంసారభారము మోవలేవా
అంచల దేవతలకు నమృత మిచ్చిననీవు
కంచాన నన్నము వెట్టి కాచుట నన్నెంత. ॥అందు॥

వడి ద్రౌపదికి కక్షయ వలువ లిచ్చిననీవు
బెడఁగునాకుఁ గట్నె ( ట్టని ? ) చ్చి పెంచు టెంత
జడిసి యింద్రాదులకు సంపదిచ్చినట్టినీవు
కడు నాకునైహికభోగము లిచ్చు టెంత. ॥అందు॥

పాసఁగలోకములెల్లఁ బూర్ణుఁడవై ననీవు
వుసురై నాలోన (నే?) నీవు వుండు టెంత
వసుధ శ్రీవెంకటేశ వరము లిచ్చేనీకు
దెస నాకోరిక లెల్లాఁదీర్చు టెంత. ॥అందు॥ 217

గుజ్జరి.

అందాఁకాఁదాఁ దాఁనే అంత కెక్కుడు గాఁడు
ముందు వెన కెంచెనా ముఖ్యుఁడే యతఁడు. ॥పల్లవి॥

చిత్త మంతర్ముఖము సేసుకొన నేర్చెనా
అత్తల నతఁడు యోగి యనఁ బడును
స త్తస త్తనెడిసువిచారంబు గలిగెనా
వుత్తమవివేకి యని వూహింపఁ బడును. ॥అందా॥

భావమునభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁ డని కానఁబడును
దైవంబుఁ దన్ను మతిఁ దలపోయ నేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు. ॥అందా॥

అడరి వైరాగ్యధన మర్జించ నోపెనా
దిడువై జితేంద్రియస్థిరుఁ డాతఁడు
జడియుశ్రీవెంకటేశ్వరుదాసుఁ డాయనా
బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు. ॥అందా॥ 218

మలహరి

పరమపురుష హరి పరమ పరాత్పర
పరరిపుభంజన పరిపూర్ణ నమో. ॥పల్లవి॥

కమలాపతి కమలనాభ కమలాసనవంద్య
కమలహితానంతకోటిఘనసముదయతేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
కమలష్టయోగీశ్వరహృదయంతే హం నమోనమో. (?) ॥పర॥

జలనిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
జలధియంతరవిహార మచ్ఛకచ్ఛపయవతారా (?)
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తకగమన
జలనిధికారుణ్యా నమో తే హం జలనిధిగంభీర నమో నమో. ॥పర॥

నగధర నగరిపునందిత నగచరయూథపనాథా
నగపారిజాతహారసారస పన్నగపతిరాజశయన (?)
నగకులవిజయశ్రీవెంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా హం తే సర్వేశ్వర నారాయణ నమో నమో. ॥పర॥ 219

పాడి.

అట్టయితే నాయంతర్యామి వేలైతి వయ్యా
మట్టు మీఱటి ముక్తియాస మానసట వయ్యా. ॥పల్లవి॥

పొలఁతులు లేరా భూమి భోగించే నే లేనా
కలకాల మింద్రియాలకాణాచి లేదా
తొలి యీసంసారము లేదో నాకాంక్షలు లేవో
వెలిమి నిన్నుఁ గొలుచు టిందుకట వయ్యా. ॥అట్ట॥

ధరలోఁ బసిఁడి లేదా తగిలి నా యాస లేదా
సిరులయజ్ఞానపుచీఁకటి లేదా
అరయఁ జవులు లేవా అందుకో నాలికె లేదా
యిరవై నిన్నుఁ గొలుచు టిందుకట వయ్యా ॥అట్ట॥

అట్టి సర్వాపరాధి నపరాధా లెంచ నేల
గట్టి రాళ్లలో మలిగం ద్లేర నేల
నెట్టన శ్రీవెంకటేశ నిన్నుఁజూచి కావకుంటే
యిట్టె నిన్నుఁ గొలుచుకొటిందుకట వయ్యా. ॥అట్టి॥ 220

బౌళి

మరిగితి నేమి సేతు మగిడి నే నెందు వోదు
సరుస దైవమ నీకే శరణుచొచ్చేను. ॥పల్లవి॥

తల్లి గోపించి మొత్తినఁ దనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
వెల్లవిరై వారి నీవు విషయాల జిక్కించితే
యిల్లిదే నిన్ను దలఁచి యిటు దూరేనేను. ॥మరి॥

కన్నతండ్రి బాలునిఁ జంకఁబెట్టి దించితేను
కొన్నె సివిలుచుముద్దు గునిసినట్టు (?)
వున్నతి నాలోనుండి వూరకే మాయ నాపై
బన్నితే నిన్నే సొలసి పగటులాడేను. ॥మరి॥

దైవము జాతవు నీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే. నీబంట నే నింతే
శ్రీవెంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడ నయిననేను చెలఁగి మొక్కేను. ॥మరి॥ 221

190-వ రేకు. లలిత

ఎట్టు వలసినఁ జేయు మిన్నియు నీచిత్తమే
నెట్టన (నె?) నొకఁడనా నీవే యింతాను. ॥పల్లవి॥

వేవేలు నీకు విన్నవించే దేమి తొల్లె
సావధానముగ సర్వసాక్షివి నీవు
ఆవల నా కిటు సేయు మని చెప్పేదేమి నేను
దైవిక మైనట్టిస్వతంత్రుఁడవు నీవు. ॥ఎట్టు॥

తగిలి నిన్ను నాలో ధ్యానించే దేమి తొల్లె
జగతి నీవు పూర్ణచైతన్యుఁడవు
జిగి నీనామము నోరఁ జిక్కించి నుడిగే దేమి
మగుడి శబ్దాక్షరమంత్రరూపుఁడవు. ॥ఎట్టు॥

చేవమీర సిరులఁ బూజించే దేమి నిన్ను
శ్రీవెంకటేశ నీవు శ్రీపతివి
దేవదేవ నిన్ను నీవే తేఁకు వెల్లా నెంచుకొని
కావుము నీ వొక్కఁడవే కరుణానిధివి. ॥ఎట్టు॥ 222

## బౌళి

ఈతనిమూలమె పో యిలఁ గలధనములు
యీతఁడు మాకు గలఁడు యెంత లేదు ధనము. ॥పల్లవి॥

విరతి మాధనము విజ్ఞానమే ధనము
మరిగినతత్వమే మాధనము
పరము మాధనము భక్తే మాధనము మా
కరిరాజవరదుఁడే కైవల్యధనము. ॥ఈత॥

శాంతమే మాధనము సంకీర్తనే ధనము
యెంతైనా నిశ్చింతమే యిహధనము
అంతరాత్మే మాధనము హరిదాస్యమే ధనము
యింతటా లక్ష్మీకాంతుఁ డింటిమూలధనము. ॥ఈత॥

ఆనందమే ధనము ఆచార్యుఁడే ధనము
నానాటఁ బరిపూర్ణమే ధనము
ధ్యానమే మాధనము దయే మాధనము
పానినశ్రీవెంకటాద్రిపతియే మాధనము. ॥ఈత॥ 223

బౌళి

నీమాయ కల్ల గాదు నిజము దెలియరాదు
కామించి హరి నీ వొక్కఁడవే నిజము. ॥పల్లవి॥

చచ్చేటి దొకమాయ సరిఁ బుట్టే దొకమాయ
మచ్చుమేపులసిరులు మాయలో మాయ
వచ్చేటి దొకమాయ వచ్చి పొయ్యే దొకమాయ
కచ్చుపెట్టి హరి నీ వొక్కఁడవే నిజము. ॥నీమా॥

పొద్దు వొడచేది మాయ పొద్దు గుంకే దొకమాయ
నిద్దురయు మేల్కనేది నిండుమాయ
వొద్దనే సుఖము మాయ వొగి దుఃఖ మొకమాయ
గద్దరి శ్రీహరి నీ వొక్కఁడవే నిజము. ॥నీమా॥

కూడేటి దొకమాయ కూడి పాసే దొకమాయ
యేడ నేర్చితి శ్రీవెంకటేశుఁడ నీవు
వేడుక నీశరణంటి విడిపించు మీమాయ
వోడక వెదకితి నీ వొక్కఁడవే నిజము. ॥నీమా॥ 224

దేసాళం

తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురతబిన్నాణరాయ సుగుణకోనేటిరాయ. ॥పల్లవి॥

సిరుల సింగారరాయ చెలువపుతిమ్మరాయ
సరసవైభవరాయ సకలవినోదరాయ
నరవసంతములరాయ వనితలవిటరాయ
గురుతైనతే ( తే ? ) గరాయ కొండలకోనేటిరాయ. ॥తిరు॥

గొల్లెతలవుద్దండరాయ గోపాలకృష్ణరాయ
చల్లువెదజాణరాయ చల్లఁబరిమళరాయ
చెల్లుబడిధర్మరాయ చెప్పరానివలరాయ
కొల్లలైనభోగరాయ కొండలకోనేటిరాయ. ॥తిరు॥

సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్యవిభాళరాయ
కామించి నిన్ను గోరితే గరుణించితివి నన్ను
శ్రీమంతుఁడ నీకు జయ శ్రీవెంకటరాయ. ॥తిరు॥ 225

బౌళి

అన్నిటా శాంతుఁడైతే హరిదాసుఁడు దానే
సన్నుతిఁ దానే పో సర్వదేవమయుఁడు. ॥పల్లవి॥

అత్తలమనసు యింద్రియాధీనమైతేను
చిత్తజుఁ డనెడివాఁడు జీవుఁడు దానే
కొత్తగాఁ దనమనసే కోపాన కాధీనమైతే
తత్తరపురుద్రుఁడును దానే తానే. ॥అన్ని॥

భావము వుద్యోగములప్రపంచాధీనమైతే
జీవుఁడు బ్రహ్మాంశమై చెలఁగుఁ దానే
కావిరి రేయిఁ బగలు కన్నుల కాధీనమైతే
ఆవలఁ జంద్రసూర్యాత్మకుఁడు దానే. ॥అన్ని॥

కోరికఁ దనబ్రదుకు గురువాక్యాధీన మైతే
మోరతోపులేనినిత్యముక్తుఁడు దానే
ఆరయ శ్రీవెంకటేశుఁ డాతుమఆధీన మైతే
ధారుణిలో దివ్యయోగి తానే తానే. ||అన్ని|| 226

సాళంగనాట

ఇహ మెట్టో పర మెట్టో యింక నాకు
సహజమై హరియే శరణమునాకు. ||పల్లవి||

చిత్త మిది యొకటే చింత వేవేలసంఖ్య
పొత్తుల హరిఁ దలఁచఁ బొద్దు లేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు
తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు. ||ఇహ||

చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిఁ బూజించ నిచ్చ లేదు
జాతినాలిక వొకటే చవులు కోటానఁ గోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు. ||ఇహ||

వీను లివి రెండే వినికి కొలఁది లేదు
పూని హరిభక్తి విన బుద్ధి లేదు
యీనటన శ్రీవెంకటేశుఁ డిటు చూచినను
తానే యేలె నీకఁ దడఁబాటు లేదు. ||ఇహ|| 227

191-వ రేకు. రామక్రియ

వినవమ్మ జానకి నీవిభుఁడ డింతనేసినాఁడు
ఘనసి యీరఘురాముఁ డీఁక నేమి నేసునో. ||పల్లవి||

వానరులదండు గూడి వారిధి కొండలఁ గట్టి
అని లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటము మెక్కె గొడగు లన్నియుఁ జెక్కె
యేనెపాన రఘురాముఁ డీఁక నేమి సేసునో. ॥విన॥

కోరి యింద్రజిత్తుఁ జంపె కుంభకర్ణు నిర్జించె
ఘోరదానవుల నెల్ల కూలఁ గుమ్మెను
మారణహోమముసేసె మతక మింతాఁ జెరిచె
యీరసాన రఘురాముఁ డీఁక నేమి సేసునో. ॥విన॥

లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె
చేవల నోసీత నిన్నుఁ జేకొనెను
భావించి శ్రీవెంకటాద్రిఁ బట్టము దాఁ గట్టుకొనె
యీవల నావల నాతఁ డీఁక నేమి సేసునో. ॥విన॥ 228

శ్రీరాగం

ఇంతటా హరినే కాని యెందునను గాన నన్ను
కొంతనాకుఁ దెలుపరో గురువులాల. ॥పల్లవి॥

తనువు హరియే తలఁపు హరియే
వినికి మనికియును విష్ణుఁడే
కనుఁగొనుచూపులు కమలనాభుఁడే
యెనసి జీవునిశక్తి యెడ నేడ నున్నదో. ॥ఇంత

లోక మెల్ల మాధవుఁడే లో నెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్య మెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నుండువాఁడనో. ॥ఇంత॥

వెనకను కృష్ణుఁడే వెస ముం దచ్యుతుఁడే
కొన మొదలు నడుము గోవిందుఁడే
మొనయఁగ శ్రీవెంకటేశుమయ మింతాను
అనుగు నాస్వతంత్ర మది యేడ నున్నదో. ॥ఇంత॥ 229

లలిత

కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథాశ్రవణం. ॥పల్లవి॥

అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతిశోభితం
అచలం బిది హరికీర్తనం. ॥కలి॥

నిరతం నిత్యం నిఖిలశుభకరం
దురిత(హారం ?)ం హర భవదూరం
పరమమంగళం భావాతీతం
కరివరదం నిజకైంకర్యం. ॥కలి॥

సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవెంకటపతిశరణం
జలజోదరనిచ్చ స్తోత్రం. ॥కలి॥ 230

బౌళి

ఎఱుఁగుటకంటె నెఱుఁగమే మేలు
మఱి తెలివికంటె మఱచే శుభము, ॥పల్లవి

లంపటాలెఱఁగము లవలవ లెఱఁగము
పంపులబాల్యమే పరిణామము
యింపులు నెఱఁగము యెగ్గులు నెఱఁగము
జంపులనిదురే సకలసౌఖ్యము. ॥ఎఱు॥

ఆసలివెఱఁగము అలమట లెఱఁగము
మూసినగర్భమే మును సుఖము
వాసులు నెఱఁగము వంతులు నెఱఁగము
వేసట వుట్టనివిధమే సుఖము. ॥ఎఱు॥

పాపము లెఱఁగము బంధము లెఱఁగము
శ్రీపతిదాస్యమే శేఖరము
యేపున శ్రీవెంకటేశ్వరుశరణమే
తీపులుమఱపేటి దివ్యానందము. ॥ఎఱు॥ 231

## లలిత

కలిగె నిదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది. ॥పల్లవి॥

జయ పురుషోత్తమ జయ పీతాంబర
జయ జయ కరుణాజలనిధి
దయ యెఱంగ నే ధర్మము నెఱఁగ నా
క్రియ యిది నీదివ్యకీర్తనమే. ॥కలి॥

శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీజనార్దన
పరమ మెఱంగను భక్తి యెఱంగను
నిరతము నాగతి నీదాస్యమే. ॥కలి॥

నమో నారాయణ నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా
అమిత శ్రీవెంకటాధిప యిదె నా
క్రమ మెల్లను నీకయింకర్యమే. ॥కలి॥ 232

శంకరాభరణం

హరియు నొక్కఁడే గురి ఆత్మలో నొక్కటే గురి
విరివి నెంత చదివినా వేరు గాఁబొయ్యీనా. ॥పల్లవి॥

అందరిచూపులు నొక్క టైనందుకు గురి
యెందుఁ గొండ కొండే కాక యితరముగాఁ జూచేరా
అందరిరుచులు నొక్క టైనందుకు గురి
చెంది తీపు తీపే కాక చేఁదుగాఁ జేకొనేరా. ॥హరి॥

వొప్పుగా నందరివూర్పు లొక్క టైనందుకు గురి
కప్పుర మదే కాక కస్తూరిగా మూఁకొనేరా
యెప్పుడు నిందరివిని కేక మైనందుకు గురి
తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా. ॥హరి॥

యీరీతి నిందరిచిత్త మేక మైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతి రయ్యీనా
తేరి శ్రీవెంకటపతి దేవుఁ డై నందుకు గురి
కోరినవారివరాలే కొంగుపైఁడి గాదా. ॥హరి॥ 233

192-వ రేకు. బౌళి

నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే
నిరతి సాకారకే పో నిను సేవించేది. ॥పల్లవి॥

ముందు సిరు లిత్తువని మోక్షము నీ విత్తువని
బందుకట్టుదుఃఖములఁ బాపుదు వని
యిందలియాసలనే పో యేచిననాభయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు. ॥నిరు॥

జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి
వెనకటినీకథలు విని విని
నినుపై యీయాసనే పో నిన్ను సారెఁ బొగడేది
వొనరనీయాసే పో వుపకారగురువు. ॥నిరు॥

లోకులు గొలువఁగాను లోన నీవు వుండఁగాను
దీకొని గురుఁడు బోధించఁగాను
కైకొని శ్రీవెంకటేశ కరుణించగా నీవు
దాకొని యీయాసకే నీదాసినై కొలిచితి. ॥నిరు॥ 234

సాళంగం.

నానాభక్తు లివి నరులమార్గములు
యేనెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి. ॥పల్లవి॥

హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి. ॥నానా॥

అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతనిదాసులసేవే అదియె తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతని వుండు టది వైరాగ్యభక్తి. ॥నానా॥

అట్టె స్వతంత్రుఁడౌటె అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవెంకటేశు కైంకర్యమే సేసి
తట్టు ముట్టులేనిదే తగ నిజభక్తి. ॥నానా॥ 235

సాళంగనాట

కంటిరా వింటిరా కమలనాభునిశక్తి
వొంటి నితనిశరణ మొకటే వుపాయము. ॥పల్లవి॥

యీతనినాభిఁ బొడమె యెక్కువైన బ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁ డాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పో హరి మన కిందరికి దైవము. ॥కంటి॥

యీతఁడే యసురబాధ లిన్నియుఁ బరిహరించె
నీతనిమూఁడడుగులే యీలోకాలు
యీతఁడే మూలమంటే నేతెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లేక మరి కలరా ॥కంటి॥

యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ
డీతఁడే వేదోక్తదైవమిన్నిటాఁ దానె
యీతఁడే అంతర్యామి యీచరాచరములకు
నీతఁడే శ్రీవెంకటేశుఁ డిహపరధనము. ॥కంటి॥ 236

సామంతం

సింగారమూరితివి చిత్తజగురుఁడవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా. ॥పల్లవి॥

పూవుల తెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి-
పూవు లాకసము మోవఁ బూఁచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధాన మగు నీకు సాసముఖా. ॥సింగా॥

అంగరంగవైభవాల నమరకామినులాడ
నింగినుండి దేవతలు నిన్నుఁజూడఁగా
సంగీతతాళవాద్యచతురతలు మెరయ
సంగడిఁ దేలేటిమీఁకు సాసముఖా. ॥సింగా॥

పరగఁ గోనేటిలోన పసిఁడిమేడనుండి
అరిది నిందిరయు నీవారగించి
గరిమ శ్రీవెంకటేశ కన్నులపండువ గాఁగ
సరవి నోలాడుమీఁకు సాసముఖా. ॥సింగా॥ 237

శంకరాభరణం.

పట్టలేనిమనభ్రమ గాక
నెట్టనఁ దాఁ గరుణించనివాఁడా. ॥పల్లవి॥

హితప్రవర్తకుఁ డీశ్వరుఁడు
తతి నంతరాత్మ తాఁ గాన
రతి నాతని దూరఁగ నేలా
గతి యని తలఁచిన కావనివాఁడా. ॥పట్ట॥

తెగనిబంధువుఁడు దేవుఁడు
బగివాయఁ డిహముఁ బరమునను
అగపడి సందేహము లేలా
తగ నమ్మిన దయదలఁచనివాఁడా. ॥పట్ట॥

హృదయము శ్రీవెంకటేశ్వరుఁడు
మొదలనే ఆనందమూర్తి గన
కదిసి వెలిని వెదకఁగ నేలో
యెదురఁ గనిన వర మియ్యనివాఁడా. ॥పట్టు॥ 238

గుండక్రియ.

తానే తెలియుఁ గాక తలఁచఁగ నెట్టు వచ్చు
నానాగతుల తననాటకపుమాయ. ॥పల్లవి॥

అట్టె యేబదియైనయక్షరాలలోనట
తిట్టులట వొకకొన్ని దీవెనలటా
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని
యిట్టివి చిక్కులు భూమి నిఁక నెన్ని గలవో. ॥తానే॥

కదిసిన యిఱువదిగడియలలోనట
పొదలు నడకలట భోగములటా
నిదురట వొకకొంత నేరుపులు కొన్నియట
యెదుట చూడఁగ జూడ నిఁకో నెన్ని గలవో. ॥తానే॥

రేవగలు కన్నులివి రెంటిలోనే యట
దైవము జీవులలోనే తానక మట
శ్రీవెంకటాద్రిమీఁదఁ జెలఁగి యీ (గీనా ?) తఁడే యట
యేవంక నీచేతలు యిఁక నెన్ని గలవో ॥తానే॥ 239

193-వ రేకు. దేసాళం.

ఇంతటఁ బో కానవచ్చు నెక్కువ తక్కువ లెల్ల
దొంతియింద్రియాల కెల్లఁ దొలఁగి వుండేను. ॥పల్లవి॥

మాటలాడవచ్చుఁ గాని మనసులు పట్టరాదు
చాటువకెక్కినయట్టిసతులఁ గంటే
కోటి చదువఁగ వచ్చు కోపము నిలుపరాదు
జూటరై వొకఁడు దన్ను జోఁక నాడితేను. ||ఇంత||

అందరి దూషించ వచ్చు నాసలు మానఁగ రాదు
కందువై నమించులబంగారు గంటే
అందాల మొక్కఁగ వచ్చు హరిభక్తిసేయరాదు
పొందులసంసారపుభోగము గంటేను. ||ఇంత||

మొదలఁ బుట్టఁగ వచ్చు మోక్షముఁ బొందఁగ రాదు
పొదిగి పుణ్యరాసులభోగము గంటే
యెదుట శ్రీవెంకటేశ యిదివో నీశరణంటే
కదిసితి నిశ్చే పో నీకరుణ గంటేను. ||ఇంత|| 240

## లలిత.

అంతర్యామీ అలసితి సొలసితి
యింతటనీశరణిదే చొచ్చితిని. ||పల్లవి||

కోరినకోర్కులు కోయనికట్లు
తీరవు నీవవి తెంచకా
భారపుఁబగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోవు నీవు వద్దనకా. ||అంత||

జనులసంగములఁ జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించకా
వినయపుదైన్యము విడువనికర్మము
చనదది నీవిటు సంతపరచకా. ||అంత||

మదిలో చింతలు మయిలలు మణుగులు
వదలవు నీవవి వద్దనకా
యెదుటనె శ్రీవెంకటేశ్వర నీవదె
అదనఁ గాచితివి అట్టిట్టనకా. ॥అంత॥ 241

మలహరి.

మగఁడు విడిచినా మామ విడువనియట్టు
నెగడినవేమి సేయు నే నే రోయఁ గాని. ॥పల్లవి॥

నరకము నను రోసి నరలోకాన విడిచె
నిరయముతోవ రోసి నేనే విడువఁ గాని
పరగ యోనులు రోసి బట్టబాయిట వేసె
సొరిది యోనుల రోసి చొరక నే మానఁ గాని. ॥మగ॥

పాపము రోసి నన్ను ప్రపంచాన విడిచె
పాపము సేయక రోసి పట్టకుండఁ గాని నేను
యేపున దేహము రోసి యింద్రలోకాన విడిచె
కైపు సేసి రోయక నేఁ గాయము మోచితిఁ గాని. ॥మగ॥

మాయ లెల్ల నన్ను రోసి మనసులోన విడిచె
మాయలనే విడువక మగుడఁ దగిలేఁ గాని
నాయల (?) నేమి విడిచినాను శ్రీవెంకటేశ
పాయక నన్నేలితివి భాగ్యము విడువఁ గాని. ॥మగ॥ 242

ధన్నాసి.

ఒక్కమనసున నేనుండేఁ గాక
యెక్కడిపనులు దానే యెఱఁగఁడా. ॥పల్లవి॥

బలుదేహ మిచ్చువాఁడు ప్రాణముపోసినవాఁడు
తలఁ పొసఁగినవాఁడు దైవమే కాఁడా
వెలుపలిలంపటాలు వేవేలు గడించి తాను
మలసి యింతలో నన్ను మఱచీనా. ॥ఒక్క॥

జగము లేలేటివాఁడు సంసారిఁ జేసినవాఁడు
తగులై యుండినవాఁడు తానే కాఁడా
బెగడకుండ దినాలు పెరుఁగఁజేసేటివాఁడు
తగినట్టునడపించఁదానేరఁడా. ॥ఒక్క॥

మొదలై యుండేటివాఁడు ముందరఁ దుదయ్యేవాఁడు
మొదలోవాఁడు శ్రీవెంకటేశుఁడే కాఁడా
చదివించి బుద్ధు లిచ్చి చైతన్యమైనవాఁడు
పొదిగి నాదాపుదండై భోగించఁడా. ॥ఒక్క॥ 243

సాళంగనాట.

దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ నింతటిలో భూభార మెల్ల నణఁగె. ॥పల్లవి॥

నేఁడు కృష్ణుఁడు జనించె నేఁడే శ్రీజయంతి
నేఁడె రేపల్లెలోన నెలవైనాఁడు
వేఁడుక యశోదకు బిడ్డఁడైనాఁ డిదె నేఁడే
పోఁడిమి జాతకర్మ మొప్పుగ నాయ నేఁడు. ॥దేవ॥

యిప్పు డిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము
యిప్పుడు తొట్టెల నిడి రింతులెల్లాను
చెప్పరానిబాలలీల సేయఁగల దెల్లాఁ జేసి
కప్పెను విష్ణుమాయలు గక్కన నేఁ డిపుడు. ॥దేవ॥

యిదివో వసుదేవునియింటిచెరలెల్లఁ బాసె
యిదివో దేవకితప మిట్టె ఫలించె
చెదరక తా నిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె
మొద నలమేల్మంగ నెక్కివున్నదిదివో. ॥దేవ॥ 244

బౌళి

హితవే నేసుఁగాకాతఁ డేల మానును
మితి నాతని దూరక మెచ్చవలెఁ గాక. ॥పల్లవి॥

ఆగమభోగములకు హరి నాలో నున్నవాఁడు
చేగదేర నాకు మేలె చింతించుఁ గాక
సాగినప్రపంచములో సంసారిఁ జేసినవాఁడు
యేగతి రక్షించఁ దానే యిన్నిటి కౌఁ గాక. ॥హిత॥

భూమిమీఁద దేహ మిచ్చి పుట్టించినట్టివాఁడు
ప్రేమతో నన్నపానాలు పెట్టుఁ గాక
ఆమని పంచేంద్రియాల నటు పెడరేఁచేవాఁడు
నేమపుఁబుత్రదారలై నిండుకుండుఁ గాక. ॥హిత॥

యిహపరములకుఁ దానిరవై నట్టివాఁడు
సహజాన నన్నియును జరపుఁ గాక
వహిఁ శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాఁడు
మహిమతో మమ్ము నేలిమన్నించుఁ గాక. ॥హిత॥ 245

194-వ రేకు. కన్నడగౌళ

ఎవ్వరి నేమనఁగల నెంత బలువుఁడ నేను
నవ్వుచు నీవే యిఁక నన్ను మన్నించ వయ్యా. ॥పల్లవి॥

కామక్రోధములకు కాణాచికాఁపను
ఆమనియింద్రియములకడిబంటను
దీమసపుటాసలకు తీరనిలగ్గసుఁడను ( ? )
యీమరఁగువాఁడ నిన్ను నెట్టు గొలిచే నయ్యా. ॥ఎవ్వ॥

పాయనిసంసారానకు బడివ ( ప ? ) నివాఁడను
కాయపుభోగాలవ్రాఁడిగపువాఁడను
పాయపుమదములకు పంగెమైనవాఁడను ( ? )
యీయెడ నీవాఁడ నని యెట్టు గొలిచే నయ్యా. ॥ఎవ్వ॥

సరిఁ గర్మముల కెల్ల చనవరిబాఁడుకను
పొరలేజన్మములయుప్పులవాఁడను
అరయ శ్రీవెంకటేశ అంతలో న న్నేలితివి
యిరవై యిట్టుండకున్న నెట్టు గొలిచే నయ్యా. ॥ఎవ్వ॥ 246

దేసాళి

ఎఱుఁగువా రెఱుఁగుదు రీయర్థము
మెఱఁగనివారి కిది మెఱఁగ నియ్యదు. ॥పల్లవి॥

మొదలఁ గలుగువాఁడే ముందరనుఁ గలవాఁడు
అదన నాతఁడేపరమాత్ముఁడు
యెదుటఁ గలిగినదే యిన్నిటాఁ గలిగినది
పదపడి యిదియే ప్రపంచము. ॥ఎఱు॥

చెదనిదానికి మరి చేటున్నఁడును లేదు
జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము
పుడివోఁగల దెన్నఁడు పుడివోఁ గలిగినదే
కడగడనే తిరుగు కర్మమార్గము. ॥ఎఱు॥

మెంచి తొల్లి నడచేవే యిప్పుడును నడచేవి
మంచి శ్రీవెంకటేశ్వరుమహిమలివి
అంచ నిపుడు గానని వల్లనాఁడుఁ గాననివే
మంచువంటివిమయపుమాయావాదములు. ॥ఎఱు॥ 247

లలిత

కేశవ దాసినైతి గెలిచితి నన్నిటాను
యీశరీరపునేరా లిఁక నేలా వెదక. ॥పల్లవి॥

నిచ్చలుఁ గోరికలియ్య నీనామమే చాలు
తెచ్చి పునీతుఁ జేయ నీతీర్థమే చాలు
పచ్చిపాపాలణఁచ నీప్రసాదమే చాలు
మెచ్చుకొందు వుపాయాలు యిఁక నేల వెదక. ॥కేశ॥

ఘనునిఁ జేయఁగను నీకైంకర్యమే చాలు
మొనసి రక్షించను నీముద్రలే చాలు
మనిపి కావఁగఁ దిరుమణిలాంఛనమే చాలు
ఘనసెను దిక్కుదెస యిఁక నేల వెదక. ॥కేశ॥

నెలవై ననుఖ మియ్య నీధ్యానమే చాలు
అలదాపుదండకు నీయర్చనే చాలు
యిలపై శ్రీవెంకటేశ యిన్నిటా మాకుఁ గలవు
మెలమి నితరములు యిఁక నేల వెదక. ॥కేశ॥ 248

దేసాళం

కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడ నీవు మాకుఁ జిక్కేమర్మ మిదివో. ॥పల్లవి॥

చేపట్టి నీశిరసు పూజించేలహామికకంటే
నీపాదాలు పూజించే నేమమెక్కుడు
మాపుదాఁకా నినుఁ గొల్చి మందెమేళమాకంటే
దాపగునీదాసుల శేమత్వ మెక్కుడు. ॥కై వ॥

హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే
నరయ నీదాసులలెంకో లెక్కుడు
వెరవున నీచెవిలో విన్నపాలు సేయుకంటే
ధర నీపూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు. ॥కై వ॥

జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే
అట్టె నీనామఫలమందు టెక్కుడు
యిట్టె శ్రీవెంకటేశ యేలితి విందువంకనే
తిట్టపుమాగురునుపదేశ మెక్కుడు. ॥కై వ॥ 249

## శ్రీరాగం

నావల్ల నీకేమున్నది నారాయణ నీవు నన్ను
కావించి రక్షించేవుపకార మింతే కాక. ॥పల్లవి॥

సొమ్ము దినఁ బుట్టినట్టిసోమరిబంటులికకు
యిమ్మల నందుకుఁ బ్రతి యేమి సేసీని
చిమ్ముచు నాతఁడు నేమించినపనిపాటలలో
పుమ్మడిఁ జేసేటివట్టిపూడిగాలే కాక. ॥నావ॥

ఆసపడి వచ్చినట్టిఅతిథి బలురాజుకు
రాసినేసి యేమిచ్చిన రతికెక్కీని
జేసబెల్లితనమున ప్రియాన నిచ్చకమాడి
మూసి దైన్యపుఁజేతులమొక్కు లింతే కాక. ॥నావ॥

శరణాగతుఁడ నీకెచ్చట శ్రీవెంకటేశుఁడ
దొరవై యేమిట సరిదూఁగఁ గలను
ధరలోన నీవు దయ దలఁచి నన్నేలుకోఁగా
పరగు నీమఱుఁగున బదుకుదుఁ గాక. ॥నావ॥ 250

రామక్రియ

అదె శిరశ్చక్రము లేనట్టిదేవర లేడు
యిదె హరి ముద్రాంకిత మిందే తెలియరో. ॥పల్లవి॥

"అనాయుధాసో అసురా అదేవా" యని
వినోదముగ ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాదిప్రమాణ మందే తెలియరో. ॥అదె॥

"యచ్చ యింద్రే" యని "యచ్చ సూర్యే" యని
అచ్చుగ తుద కెక్కె (క్క ?) నదే పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణ మందే తెలియరో. ॥అదె॥

మును "నేమినా తప్త ముద్రాం ధారయే" తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవిరి సేసీని
మొనసి శ్రీవెంకటేశుముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో. ॥అదె॥ 251

195-వ రేకు. పాడి

ఇట్టి బ్రాహ్మణ్య మెక్కడు యిన్నిటిలోన
దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము. ॥పల్లవి॥

హరిఁ గొలిచేవారి కమరు బ్రాహ్మణ్యము
పరమవైష్ణవమే పో బ్రాహ్మణ్యము
హరినోర్ధ్వపుండ్రదేహులలోనే బ్రాహ్మణ్యము
తిరుమంత్రవిధులదే తేఁకువ బ్రాహ్మణ్యము. ॥ఇట్టి॥

సతమై చక్రాంకితులచరితే బ్రాహ్మణ్యము
పతిశరణాగతియే బ్రాహ్మణ్యము
వెతలేని వీరలసాత్వికమే బ్రాహ్మణ్యము
తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము. ॥ఇట్టి॥

అంచఁ బరమభాగవతాధీనము బ్రాహ్మణ్యము
పంచసంస్కారాదులదే బ్రాహ్మణ్యము
యెంచఁగ శ్రీవెంకటేశుఁ డితఁడేఁ బ్రమ్మణ్యుఁడు
ముంచి యీతనివారలే మొదలిబ్రాహ్మణ్యము. ॥ఇట్టి॥ 252

మాళవిగౌళ

వీదుల వీదుల నెల్లా విష్ణుఁడు సంచరించీని
పోది మాని కన్నుగత్తై పొండు మీరసురలు. ॥పల్లవి॥

తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముఁడు వాఁడె
సారమైన శంఖచక్రశార్ఙ్గాయుధము లవే
కారుకమ్మి నాకాసాన గరుడధ్వజంబదే
పారరో దానవులాల పంతములు విడిచి. ॥వీదు॥

దండవెట్టె నల్లవాఁడే దైవాలరాయఁడు
దండి నెట్టెపుఁ జుట్లతపారపుచుంగులవే
కొండవంటిరథమదె కొన్నపైఁడికుండలవే
గుండు గూలి విరుగరో గొబ్బున దైతేయులు. ॥వీదు॥

విజయశంఖము వట్టె వీఁడె శ్రీవెంకటేశుఁడు
భజన నలమేల్మంగ పలుమారు మెచ్చినది.
త్రిజగాన నాతనిఁ జేరినదాసులిదె వీరె
గజబెజలేక నుదుగరో రాక్షసులు. ॥వీదు॥ 253

లలిత

కామధేనువిదే కల్పవృక్షమిదే.
ప్రామాణ్యముగల ప్రపన్నులకు. ॥పల్లవి॥

హరినామజపమే ఆభరణంబులు
పరమాత్మునినుతి పరిమళము.
ధరణీధరుపాదసేవే భోగము
పరమం బెరిఁగినప్రపన్నులకు. ॥కామ॥

దేవునిధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభుభక్తే జీవనము
ఆవిష్ణుకైంకర్యమే సంసారము
పావనులగు యీప్రపన్నులకు. ॥కామ॥

యేపున శ్రీవెంకటేశుఁడే సర్వము
దాపై యితనివందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు
పైపయి గెలిచినప్రపన్నులకు. ॥కామ॥ 254

మాళవిగౌళ

నీచిత్తమిందరి నేరుపు నేరమిఁ
తోఁచి కాచి యిటు తుద కీడేర్చె. ॥పల్లవి॥

దేవతలపాలు తీరనిపుణ్యము
ఆవలఁ బాపం బసురలది
భావింప మనుజులపాలివి రెండును
శ్రీవల్లభ నీసేసినమాయ. ॥నీచి॥

వేదశాస్త్రములు విజ్ఞానమూలము
ఆది నసత్యము లజ్ఞానమూలము
సాదింప రెండును జగత్తుమూలము
భేదించి యివి నీపెరరేచణలు. ॥నీచి॥

కావింపఁగఁ గర్మము కాయముచేతిది
భావముచేతిది పరమము
తావుల రెండునుఁ దప్పనిప్రకృతివి
శ్రీవెంకటేశ్వర చేఁతలు నీవి. ॥నీచి॥ 255

## దేవగాంధారి

అడ్డము చెప్పఁగ రాదు అవుఁ గాదనఁగ రాదు
వొడ్డిన దనుభవించే దోపిక జీవులది. ॥పల్లవి॥

యీరికలెత్తెజన్మము లిన్ని జంతువులయందు
కోరికలు గొనసాగెఁ గోటానఁ గోటి
నారుకొనె సంపదలు నానారూపములై
తీరదేమిటా నీచిక్కు దేవుడుఁ వెట్టినది. ॥అడ్డ॥

అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి
వెల్లవిరాయను మాయ వెనకా ముందు
కెల్లురేఁగె దేహమందే కిమ్ములచుట్టరికాలు
పొల్లువో దెన్నఁడు భూమి పుట్టఁగాఁ బుట్టినది. ॥అడ్డ॥

పండెను సంసారము ఫలమైననానాఁటికి
నిండెను నాలికకు నెమ్మదిఁ జవులు
అండనే శ్రీవెంకటేశుఁ డంతర్యామై వుండి
వండ వండనట్లుగ ( ? ) వన్నెకెక్కించినది. ॥అడ్డ॥ 256

శంకరాభరణం

ఎంత కెంత యిది యేమని పొగడుట
యింత సేయ నీకు నెదురా వీరు. ॥పల్లవి॥

పిడుగులఁబోలెడి పెనునీనఖముల
కెడయక హిరణ్యుఁ డెట్లుండెనో
వుడికెటి చక్రాయుధమువేఁడికిని
జడియక మకరెటు సహించెనో. ॥ఎంత॥

శరపరంపరల శిరములు నఱకఁగ
మెరగొని రావణుఁ డేమనెనో
పరియలువారఁగ బ్రహ్మాండభాండము
ఉరుశంఖరవం బోర్చుట యెట్లో. ॥ఎంత॥

గాటపునిష్ఠురగదాహతికి మధు
కైటభులతలల కతలెట్లో
యీటన శ్రీవెంకటేశనీకృపను
పాటించిదాసులు బ్రదుకుట యెట్లో. ॥ఎంత॥ 257

196-వ రేకు. దేవగాంధారి

నీయంత నీవే యెరిఁగి నిచ్చ నన్ను గాతు గాక
మాయలలోఁ బొరలే దిమ్మరివాఁడ నేను, ॥పల్లవి॥

నీసరివాఁడనా నిన్ను దూరేవాఁడనా
దాసుఁడనై కొలిచిన తనుధారిని
వేసరించ నోపుదునా వెరపించఁ గలనా
మాసినపాపాలలోనిమైల సోఁకినాఁడను. ॥నీయ॥

విన్నవించేవాఁడనా విడుజోడువాఁడనా
అన్నిటా శరణుచొచ్చినట్టి జీవిని
యెన్నిటి కుత్తరమిచ్చే యేపని సేసి మెప్పించే
మున్నిటికర్మములకు ముంగిటనున్నాఁడను. ॥నీయ॥

యెదురాడేవాఁడనా యెలయించేవాఁడనా
సదరాన నీకు మొక్కేజంతువ నేను
యిదివో శ్రీవెంకటేశ యెరుక నీవొసఁగఁగా
పొదిగి నీమహిమలు పొగడుచున్నాఁడను. ॥నీయ॥ 258

సాళంగనాట

ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను
చెచ్చెరఁ దగవులింకఁ జెప్పఁగదరో. ॥పల్లవి॥

నిలిచినది జగము నిండినది భోగము
కలిగె జీవుల కొక్కకాణాచి
వలయశాసనాలు వడి నాల్గువేదములు
చలపట్టి జాణలు చదువుకోరో. ॥ఇచ్చి॥

పారినవి మనసులు పట్టినది జననము
పోరు దీరెఁ గర్మములపొలమేర
కోరికలె సాక్షులు గుట్టలు త్రిగుణములు
వూరుఁ బేరుఁ దెలుసుక వోడఁబడరో. ॥ఇచ్చి॥

లలిత

చిరకాలధర్మములు చివుకు దవ్వఁగఁ బోతే
హరి మఱఁగు చొచ్చితి మాతఁడే రక్షించెను. ॥పల్లవి॥

భువిఁ దొల్లి లేరా పుణ్యముసేసినవారు
జవళిశాస్త్రము లెల్లాఁ జదివినవారు లేరా
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా
యివల నేమివి సేసి యెవ్వరిఁ బోలేము. ॥చిర॥

తగఁ దొల్లి వినమా తపముసేసినవారి
జిగి నన్నియజ్ఞములు సేసినవారి
మిగుల సిద్ధి వడసి మించినవారి వినమా
యొగువ నే మింతకంటే యెక్కుఁడు సేసేమా. ॥చిర॥

పెక్కుమతములు చూచి బెండుపడ్డవారు లేరా
పక్కన నన్నివిద్యలఁ బరగినవారు లేరా
వొక్కఁడే శ్రీవెంకటేశుఁ డుల్లములో నుండఁగాను
యెక్కుడితనిఁ గొలువ కెవ్వరిఁ బోలేము. ॥చిర॥ 261

197-వ రేకు. శంకరాభరణం

చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ
శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా. ॥పల్లవి॥

చెలఁగు వేయి చేతుల శ్రీనరసింహా
చిలికేటినగవుల శ్రీనరసింహా
సిలుగు లేని మంచి శ్రీనరసింహా నీ
చెలిఁ దొడకెక్కించుకొన్న శ్రీనరసింహా. ॥చేప॥

క్షీరసముద్రమువంటి శ్రీనరసింహా దైత్యుఁ
జీరినవజ్రపుగోళ్ల శ్రీనరసింహా
చేరి ప్రహ్లాదుని మెచ్చే శ్రీనరసింహా నుతిం
చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా. ॥చేవ॥

శ్రీవనితతో మెలపు ( గు ? ) శ్రీనరసింహా
చేవ దేరె నీమహిమ శ్రీనరసింహా
శ్రీవెంకటాద్రిమీఁది శ్రీనరసింహా సర్వ
జీవదయాపరుఁడ వో శ్రీనరసింహా. ॥చేవ॥ 262

సాళంగనాట

నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడు గాక
ధరణిఁ గిరితి కెక్కె దశరథసుతుఁడు. ॥పల్లవి॥

యీతఁడా తాటకిఁ జంపె నీమారీచసుబాహుల
నీతఁడా మదమణఁచె నిందరుఁ జూడ
యేతులకు హరువిల్లు యీతఁడా విరిచి యట్టె
సీతఁ బెండ్లియాడెను యీ చిన్నరాముఁడా. ॥నరు॥

చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యులఁ జంపి
అప్పుడిట్టె వాలినేసినాతఁ డీతఁడా
గుప్పించి కోతుల సేలి కొండల జలధి గట్టి
కప్పి లంక సాధించె నీ కౌసల్యానందనుఁడా. ॥నరు॥

రావణాదులనుఁ జంపి రక్షించి విభీషణుని
భావించ యోధ్య సీతఁడు పట్టమేలెను
శ్రీవెంకటేశుఁ డితఁడే సృష్టి రక్షించె నితఁడే
యీవల మాపాల నున్న యీరామచంద్రుఁడా. ॥నరు॥ 263

పాడి

అదివో చూడరో అందరు మొక్కరో
గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని. ॥పల్లవి॥

రవిమండలమున రంజిల్లు తేజము
దివిఁ జంద్రునిలో తేజము
భువి ననలంబునఁ బొడమిన తేజము
వివిధంబులైన విశ్వతేజము. ॥అది॥

క్షీరాంబుధిలోఁ జెలఁగు సాకారము
సారె వైకుంఠపు సాకారము
యీరీతి యోగీంద్రులెంచు సాకారము
సారెకు జగముల సాకారము. ॥అది॥

పొలసినయాగంబులలో ఫలమును
పలుతపములలో ఫలమును
తలఁచినతలఁపుల దానఫలంబును
బలిమి శ్రీవెంకటపతియే ఫలము. ॥అది॥ 264

రామక్రియ

ఆతనిఁబో పొగడేము ఆతని శరణంటిమి
ఆతఁడే సర్వజీవుల అంతర్యామి. ॥పల్లవి॥

పెక్కు బ్రహ్మాండకోట్లు పెక్కు బ్రహ్మకోట్లు
పెక్కు రుద్రకోట్లును పెక్కు యింద్రులు
వొక్కొక్కరోమకూపాల నొగి నించుకుండునట్టి
వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు. ॥ఆత॥

అనంతసూర్యచంద్రులు అనంతవాయువులును
అనంతనక్షత్రము లనంతమేరువులును
కొనలు సాగి నన్నిటికూటువ గూడుకొన్నట్టి
అనంతుఁ డొక్కఁడే మించినాదిమూరితి. ॥ఆత॥

అసంఖ్యమహిమలును అసంఖ్యమాయలు
అసంఖ్యశక్తులు వరాలసంఖ్యములు
పొసఁగ నిన్నిటిఁ దానే పుట్టించి రక్షించినట్టి
అసంఖ్యాతుఁడు శ్రీవెంకటాద్రీశుఁడు. ॥ఆత॥ 265

దేసాళం

నీవే రక్షింతువు గాక నిన్ను నమ్మితిమి నేము
దైవమవై నీ వుండఁగ తగ మాదే బ్రదుకు. ॥పల్లవి॥

కోరి వొకరాతివేరుఁ గొల్చి బతికీ నొకఁడు
పైరు వొక్కచెట్టు వెట్టి బతికే ననీ నొకఁడు
కూరిమిఁ బాము చేఁబట్టుకొని బతికీ నొకఁడు
శ్రీరమణునిదాసులచేతిదే పో భాగ్యము. ॥నీవే॥

యినుమంతమన్ను వట్టి యేచి బతికీ నొకఁడు
పసురము నింటఁ గట్టి బతికే ననీ నొకఁడు
పసగా వేలె డినుము పట్టి బతికీ నొకఁడు
వసుధేశ నీవు గలవారి కేమి గడమ. ॥నీవే॥

ఆకు నలముఁ గసవు నంటి బతికీ నొకఁడు
లోకులు పెక్కుపాయాల లోలులై బతికే రదె
యీకడ శ్రీవెంకటేశ యివెల్లా నీమహిమలే
చేకొని నీమరఁగు చొచ్చినవారే ఘనులు. ॥నీవే॥ 266

శంకరాభరణం

ఇతని ప్రసాదమే యిన్నియును
గతి యితనిదే కన కా దనరాదు. ॥పల్లవి॥

కాయములో నొకఘనసంసారము
ప్రాయంబులతోఁ బ్రబలీని
ఆయమందుకును హరి దానై
దాయక పాయక తగి లున్నాఁడు. ॥ఇత॥

వొనరినకలలో నొకసంసారము
మనసుతోడనే మలసీని
ననిచి యందుకును నారాయణుఁడే
కొన మొదలై తా గురియైనాఁడు. ॥ఇత॥

వుడిబడి కోర్కుల నొకసంసారము
బడిబడి యాసలఁ బరగీని
విడువక యిది శ్రీవెంకటేశ్వరుఁడే
తోడఁబడఁ గల్పించి ధ్రువమయినాఁడు. ॥ఇత॥ 270

ముఖారి

ఊరకే కలుగునా వున్నకేతవుమోక్షము
శ్రీరమణుకృపచేతఁ జేరు మోక్షము. ॥పల్లవి॥

కలుషముఁ బెడఁబాసి కర్మగండము గడచి
మలసినప్పుడు గా మరి మోక్షము
చలన మించుకలేక సంసారవారిధి దాఁటి
నిలిచినప్పుడు గా నిజమోక్షము. ॥ఊర॥

పంచేంద్రియాల మీరి భక్తి హరిమీఁదఁ బెట్టి
మంచివాఁ డైనప్పుడు గా మరి మోక్షము
అంచల యాసలు మాని ఆచార్యసేవ చేసి
మించినప్పుడు గా ఆమీఁదిమోక్షము. ॥ఊర॥

శాంతమే కూడుగా నుండి సమచిత్తమునఁ బొంది
మంతు కెక్కినప్పుడు గా మరిమోక్షము
అంతట శ్రీవెంకటేశుఁ డాదరించి మన్నించితే
నంతరంగమున నున్న దనాదిమోక్షము. ॥ఊర॥ 271

## వరాళి

వెదక నేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని
మొదలఁ గలిగితేనే ముందరాఁ గలుగుట. ॥పల్లవి॥

తనపూర్వభావము తలఁచి మరవకుంటే
పనివడి తనపుణ్యఫల మబ్బుట
మనవార్తినానాఁటిమాయ చూపెట్టు కుండితే
జనించినతనకు విజ్ఞానసిద్ధి యగుట. ॥వెద॥

పుట్టినయప్పటితనభోగముఁ దలఁచుకొంటే
కొట్టఁగొన తనకోర్కి కొనసాగుట
నట్టనడిమిజగమునటనఁ దెలుసుకొంటే
గుట్టుతోడిగురుబోధగురుతు చేచిక్కుట. ॥వెద॥

జీవకళ నంటినట్టిచిక్కు విదిలించుకొంటే
దేవుఁడు తనచేఁ జిక్కి తిరమాట
శ్రీవెంకటేశుఁ డితనిఁ జేరి శరణంటేను
ఆవల నివలఁ దాను అన్నిటా గెలుచుట. ॥వెద॥ 272

లలిత

ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే. ॥పల్లవి॥

అదె చంద్రుఁ డుదయించె నచ్యుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి దివిజులు పొలిసిరి రాక్షసులు
సదర మీశివునకు శరణనరే. ॥ఎన్న॥

పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁ డిదె వచ్చె
చండిదుర్యోధనుమూఁక జల్లన విచ్చె
దండిగోకులము నిండె ద్రౌపదితపము పండె
చండప్రతాపున కిట్టె శరణనరే. ॥ఎన్న॥

రేపల్లె పుణ్యము సేసె శ్రీవెంకటేశుఁడు డాసె
గోపికలమనసుల కోరిక వాసె
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపల మేఁటి కితని శరణనరే. ॥ఎన్న॥ 276

ముఖారి

అతఁడే గతి యని యంటే నన్నిటా మాన్యుఁడు
యితరాలు మానఁగానే యీతనికే శలవు. ॥పల్లవి॥

శ్రీరమణునినిత్యసేవకులకుఁ దోల్లె
వేరులేనికర్మముల వెట్టిమాన్యము
ఆరీతి నితనిభక్తులై నచనవరులకు
ఆరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు. ॥అత॥

తక్కక యితనిముద్ర ధరించినదాసులకు
చొక్కుల భవబంధాల సుంకమాన్యము
లెక్కించ నితనికైన లెంకలకు బొడుకల
కొక్కట విధినిషేధా లూహించ లేవు. ॥అత॥

పరుస శ్రీవెంకటేశుశరణాగతులకును
పరగ మాయలదొడ్డి బందెమాన్యము
పరమమైనయితనిపల్లెము కూటివారికి
ధరలో నేమిటివంకాఁదప్పులే లేవు. ॥అత॥ 277

సామంతం

నీచేతలోవారము నీవారము
యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము. ॥పల్లవి॥

యిన్నిటా బూర్ణుఁడవు నీ వెరఁగనియర్థ మేది
విన్నపము నేఁ జేసేవిధ మేది
మన్నించిననీమన్ననే మహిమలో మాబ్రదు కెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము. ॥నీచే॥

ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి
గొనకొని నే నిన్నుఁ గొసరే దేమి
పొనుగక యేలితివి పుట్టినమాపుట్టు గెల్ల
ననిచి నిన్ను నమ్మిననమ్మికే మావ్రతము. ॥నీచే॥

శ్రీవెంకటేశుఁడ నీవు చిత్తగించనిది యేది
భావించి నేఁ బొందనిభాగ్య మేది
యేవల మాపరభారా లింతయు నీ కెక్కినది
ఆవటించి నే నీశరణన్నదే మావ్రతము. ॥నీచే॥ 278

దేసాక్షి

కనియుండి భ్రమసితిఁ గట్టా నేను
మొనలేక గురి యైతి నిట్టె నేను. ॥పల్లవి॥

తోలు నెముకలు గట్టి దొర నంటా మురిసేను
ఆలుబిడ్డలమరఁగు ఆహా నేను
గాలి యావటించుకొని కాలము కడపేను
వోలిఁ బుణ్యపాపమందు వోహో నేను. ॥కని॥

మంటివంకబదుకుతా మదియించి మురిసేను
యింటిముంగిటనే వుండి యాహీ నేను
వొంటివాఁడనై వుండి వూరఁ గలవెల్లాఁ గోరే
వొంటినయాసలతోడ నూహూ నేను. ॥కని॥

నూలికోకఁ గట్టువడి నున్ననై నే మురిసేను
యీలాగు నాబదు కెల్ల యేహీ నేను
పాలించి శ్రీవెంకటాద్రిపతి నాకుఁ గలుగఁగ
ఆలరినై గెలిచితి హైహై నేను. ॥కని॥ 279

200-వ రేకు. మాళవిగౌళ

నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొకదుర్గుణిని
మానవు నన్నొకయెదురు చేసుకొని మనసుచూడ నేలా అయ్యా. ॥పల్లవి॥

యేలినవాఁడవు నీవు యెటు నేఁ గొలిచినవాఁడ
పోలింపఁగ నీవే దేవుఁడవు భువి నే నొకజీవుఁడను
పాలించేవాఁడవు నీవు బ్రదికేవాఁడను నేను
తాలిమి నన్నొకసరిచేసుక ననుఁ దప్పు లెంచ నేలా అయ్యా. ॥నీవు॥

అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు జగి నేఁ బరతంత్రుఁడను
యింత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు నే నిర్దయుఁడను
చెంతల నన్నొకమొన సేసుక నాచేఁత లెంచ నేలా అయ్యా. ॥నీవు॥

శ్రీవెంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను యిటు నేను
ఆవల నివల దాతవు నీవు యాచకుఁడను నేను
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవసమగు నను ప్రతిపెట్టుక నాకథలు యెంచ నేలా అయ్యా. ॥నీవు॥ 280

నాట

వెడలె వెడలె నదె వీధుల వీధుల
తొడికి దైత్యులను దుంచఁగను. ॥పల్లవి॥

కోటిసూర్య లోకకూటువ గూడుక
చాటువ మెరసేటిచక్రము
గాటపువేవేలు కాలరుద్రు లటు
నీటునఁ దొలఁకేటినిబిడచక్రము. ॥వెడ॥

ప్రళయకాలముల బడబాగ్ని లొలుకు
చలమరిప్రతాపచక్రము
కలకలరవముల కాలభైరవులు
కలసి మెలంగేటి గండచక్రము. ॥వెడ॥

యమసహస్రములనంతమేకమై
సమరముగెలిచేటి చక్రము
అమరుచు శ్రీవెంకటాధిపుకరమున
దెమలకయుండేటి దివ్యచక్రము. ॥వెడ॥ 281

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇన్నిటా నారయక మెఱుకేది | శంకరాభరణం | 177 |
| ఇన్నిటికి ప్రేరకుఁడు | మాళవిగౌళ | 54 |
| ఇప్పుడే నే నోడఁబడ | సామంతం | 68 |
| ఇల జాణతనము లిన్నిటికి | లలిత | 179 |
| ఇవిగో మీమహిమలు | శుద్ధవసంతం | 85 |
| ఇవి సేయఁగ నే నలసుఁడ | భూపాళం | 94 |
| ఇహా మెట్టో పర మెట్టో | సాళంగనాట | 227 |
| ఈతఁడే యీతఁడే సుండి | సాళంగనాట | 137 |
| ఈతని మరచి వుంటి మిన్నాళ్లను | లలిత | 183 |
| ఈతనిమూలమె పో యిలఁ గల | బౌళి | 223 |
| ఈరూపమై వున్నాఁడు | పాడి | 10 |
| ఉపకారి దేవుఁడు అపకారి | గుజ్జరి | 150 |
| ఊరకే కలుగునా వున్నతపు | ముఖారి | 271 |
| ఎంచి చూడరో ఘనులార | దేసాక్షి | 1 |
| ఎంత కంత యిది యేమని | శంకరాభరణం | 257 |
| ఎంతకత నడపితి వేమి | నాదరామక్రియ | 81 |
| ఎంతపుణ్యమో యిటు | భైరవి | 88 |
| ఎంతమాత్రమున నెవ్వరు | బౌళి | 159 |
| ఎంత లేదు నీబత్తి యెఱఁగరా | శ్రీరాగం | 57 |
| ఎంత వలచితి వయ్యా | సామంతం | 56 |
| ఎంత సోదించి చూచినా | దేసాక్షి | 28 |
| ఎందాఁక నిద్ర నీ కిదె | భూపాళం | 202 |
| ఎందుకు విచ్చేయ నేల | మాళవిగౌళ | 214 |
| ఎట్టిదో మీమాయావిలాసము | లలిత | 59 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎట్టు వలసినఁ జేయు మిన్నియు | లలిత | 222 |
| ఎట్టు సేయఁ గలవాఁడవో | లలిత | 62 |
| ఎట్టినాఁ గావక పోదు యే నెంత | బౌళి | 200 |
| ఎత్తుకొన్న బహురూప మిక | నాట | 127 |
| ఎదురుమాట లాడితి | సామంతం | 65 |
| ఎన్నఁడు గలుగు మరి యీ | లలిత | 276 |
| ఎన్నిపాట్లఁ బడ్డాను యెవ్వరికి | దేసాళం | 120 |
| ఎఱఁగక వేసారు నిల | ధన్నాసి | 110 |
| ఎఱిఁగితి నమ్మితి నితఁడు | శ్రీరాగం | 268 |
| ఎఱిఁగినవారికి హింస లిన్నియు | మలహరి | 122 |
| ఎఱుఁగుటకంటే నెఱఁగమే | బౌళి | 231 |
| ఎఱుఁగువా రెఱుఁగుదు | దేసాక్షి | 247 |
| ఎవ్వరికి యెవ్వ రయ్యేరు | ముఖారి | 72 |
| ఎవ్వరి నేమనఁగల నెంత | కన్నడగౌళ | 246 |
| ఎవ్వరినేర్పులు జెప్ప | భైరవి | 53 |
| ఏకాత్మవాదులాల యిందు కేది | శంకరాభరణం | 19 |
| ఏటిజాణతనమే యేమే | వరాళి | 51 |
| ఏది గతి నే నొక్కఁడనే | సామంతం | 66 |
| ఏపొద్దూ నీచేత లెల్లా | దేవగాంధారి | 99 |
| ఏమని నుతించవచ్చు | ప్రతాపనాట | 116 |
| ఏమి చెప్పే దిది యీశ్వర | శ్రీరాగం | 17 |
| ఏవుపాయములు మా కింక | శుద్ధవసంతం | 174 |
| ఐన ట్టయ్యీఁగాక హరి | కాంబోది | 13 |
| ఒకటి కొకటి లంకై | గుజ్జరి | 112 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తానే తెలియుఁ గాక తలఁచఁగ | గుండక్రియ | 239 |
| తిరుమలగిరిరాయ దేవ | దేసాళం | 225 |
| తెలియరాదు నీమాయ | దేవగాంధారి | 101 |
| తే శరణ మహం తే | మంగళకౌశిక | 167 |
| తొల్లి యెట్టుండునో తాను | బౌళి | 146 |
| త్రికరణశుద్ధిగఁ జేసిన | గుజ్జరి | 2 |
| దాఁచుకొని పాదాలకుఁ | గుండక్రియ | 104 |
| దిక్కు నీవే జీవులకు | సాళంగనాట | 129 |
| దిక్కులు సాధించఁ బూని | సాళంగనాట | 5 |
| దేవతలు గెలువరో తెగి | సాళంగనాట | 244 |
| దేవ నమో దేవా | మాళవి | 143 |
| దేవ నీవు గల్పించిన | ముఖారి | 73 |
| దేవుఁడుగలవారికి దిగులు | శంకరాభరణం | 20 |
| దేవుఁ డొక్కఁడే గురి | మంగళకౌశిక | 7 |
| దేవునికి దేవికిని తెప్పల | గుండక్రియ | 192 |
| దేహం బొకటే దేహియు | బౌళి | 144 |
| దేహి నిత్యుఁడు దేహము | బౌళి | 185 |
| దైవమా నీ వొక్కఁడవే | శ్రీరాగం | 76 |
| దొంతివిషయములాల | లలిత | 173 |
| దోమటి నిం తెరఁగరా | లలిత | 181 |
| ధరణి నెంద రెన్నితపములు | దేసాళం | 26 |
| ధరలో సద్భావం తద్భవ | గుండక్రియ | 201 |
| నందగోపనందనుఁడే నాఁటి | బౌళి | 156 |
| నమో నమో లక్ష్మీనారసింహా | బౌళిరామక్రియ | 114 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నరుఁడా యీతఁడు ఆది | సాళంగనాట | 263 |
| నన్నేరఁగ లేనయ్యో | కాంబోది | 193 |
| నమ్మవలెఁ గాని యెన్నఁడు | గౌళ | 30 |
| నాకు నీవు గలవు హరి | ముఖారి | 188 |
| నానాభక్తు లివి నరుల | సాళంగం | 235 |
| నారాయణ నీపంపో | ధన్నాసి | 97 |
| నారాయణాచ్యుతానంత | సామంతం | 189 |
| నావల్ల నీ కేమున్నది | శ్రీరాగం | 250 |
| నిండె నిన్నిచోటులను | నాట | 14 |
| నిక్కమైననాలోని నెలవు | సామంత | 194 |
| నిరుహేతుకాన నన్ను నీవు | బౌళి | 234 |
| నీ కేల యీగుణము | ముఖారి | 31 |
| నీచిత్త మిందరినేరుపు | మాళవిగౌళ | 255 |
| నీచిత్తము నాభాగ్యము | శంకరాభరణం | 29 |
| నీచేతలోవారము నీవారము | సామంతం | 278 |
| నీమాయ కల్ల గాదు నిజము | బౌళి | 224 |
| నీయంత నీవే యెరిఁగి నిచ్చ | దేవగాంధారి | 258 |
| నీవు వెట్టినట్టిచిక్కు | దేసాక్షి | 126 |
| నీవు సర్వగుణసంపన్నుఁడవు | మాళవిగౌళ | 280 |
| నీ వెంత నే నెంత | ధన్నాసి | 96 |
| నీ వెరఁగనిది లేదు నీయాజ్ఞ | రేవగుప్తి | 164 |
| నీవే దయ దలఁచుక | ధన్నాసి | 102 |
| నీవే మాకు దిక్కు నిన్నే | ధన్నాసి | 95 |
| నీవే మూలమువో నేరిచిన | సాళంగం | 160 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వెన్నెలలాల మీకు వేడుక | రామక్రియ | 260 |
| వేదములు నుతించఁగ వేడుకలు | శంకరాభరణం | 44 |
| శరణు శరణు వేదశాస్త్ర | సాళంగనాట | 113 |
| శ్రీపతి నీవు సిద్ధించుటే | వరాళి | 2[illegible] |
| సకలలోకనాథుఁడు జనార్దను | శ్రీరాగం | 45 |
| సకలోపాసకులకు నందును | సాళంగనాట | 178 |
| సత్యము సేయఁగ వచ్చును | బౌళి | 35 |
| సదానందము సర్వేశ్వర | దేవగాంధారి | 135 |
| సమబుద్ధే యిందరికి సర్వవేద | సామంతం | 175 |
| సరిగాఁడు వీఁ డన వలదు | సామంతం | 64 |
| సర్వేశ్వరా నీతో సరి | ముఖారి | 69 |
| సింగారమూరితివి చిత్తజ | సామంతం | 237 |
| సారిది మ మ్మిట్టె దయ | సామంతం | 23 |
| సోదించి చూడఁబోతే | దేసాక్షి | 119 |
| హరి గోవిందా హరి గోవిందా | గుండక్రియ | 105 |
| హరి నారాయణ కృష్ణ | పాడి | 273 |
| హరి నీదాసులభాగ్య మది | శ్రీరాగం | 75 |
| హరి నీవే బుద్ధి చెప్పి | లలిత | 161 |
| హరి నెఱఁగనిజన్మ మది | మాళవి | 180 |
| హరియు నొక్కఁడే గురి | శంకరాభరణం | [illegible] |
| హరియు సిరియు నేఁగే | గౌళ | [illegible] |
| హరిసే వొకటే యనంతము | బౌళి | 186 |
| హరి హరి జగమెఱింగ | భైరవి | 86 |
| హరి హరి నీమహిమ లనంతములు | లలిత | 124 |
| హా సమీచీనమపహాసంతే | మాళవి | 134 |
| హితవే సేసుఁగా కాతఁ డేల | బౌళి | 245 |


తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రాక్షరశాల తిరుపతి. ప్ర. 250 24-11-51.

## సంస్కరణములు. *

| పేజి | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 2 | 4 | తలపులు మేఘముల | తలపులు పలుమేఘముల |
| 2 | 10 | గయాదిక్షేత్రంబుల | గయాదిముఖ్యక్షేత్రంబుల |
| 7 | 9 | పాలించేప్రతాపపు | పాలించే భక్తులప్రతాపపు |
| 7 | 17 | పట్టిన | పుట్టిన |
| 8 | 12 | సతము | సతతము |
| 8 | 10 | కాఁగిన | కాఁచిన |
| 8 | 17 | మొత్తి | మొత్తి |
| 9 | 13 | దావాతని శరణనీ | దాదాత నీశరణని |
| 11 | 21 | గంటు గంటువేసుకొని | గంటు వేసుకొని |
| 13 | 6 | తనవందనముఁ గల వట | తనవందనమునుఁ గల దట |
| 14 | 22 | కమలారమణుని | కమలారమణ నీ |
| 31 | 23 | మేఘపుప్వాలె | మేఘపుప్వాలె |
| 33 | 22 | పురుషోత్తమా | పురుషోత్తమా నీ |
| 35 | 12 | మిగిలినది గాకా | మిగిలినది గాకా ( దా ? ) |
| 41 | 7 | బ్రాణము లోసఁగి | బ్రాణము లోసఁగి ( గే ? ) |
| 43 | 13 | నిఖామహిరాములు | నీఖామహిరాములు |
| 46 | 12 | నెంతటికల్లరి | నెంతకల్లరి |
| 48 | 14 | యేనెలవ్వని | యేనెలవుల ని |
| 51 | 19 | యావలా | యీవలా |
| 54 | 17 | నిండుకొంటునే నెనిమిది | నిండుకొంటే నెనిమిది |
| 60 | 8 | పలగొని | వలగొని |
| 70 | 14 | వుండని | వుండనీ |
| 73 | 23 | పెట్టివాఁడను | వెట్టివాఁడనేను |
| 78 | 23 | శ్రీవెంకటేశుఁడు | శ్రీవెంకటేశుఁడు ( శ్వర ? ) |
| 80 | 6 | శరణంటి | శరణంటే |
| 80 | 21 | పరమపురుషార్థపు | పరపురుషార్థపు |
| 84 | 16 | నందడించి | నందడించీ |

| | | | |
|---|---|---|---|
| 84 | 21 | యందరికి...వుండికర్మము | యెందరికి...వుండేఁగర్మము |
| 92 | 24 | శనేశ | సేనేశ |
| 96 | 13 | వేదాంతై గణన | వేదాంతై ( క ? ) గణన |
| 98 | 3 | నొక్కరూప మదే | నొక్కరూపదే |
| 100 | 3 | శరీరముఁదోడనె | శరీరము సరి తోడనె |
| 103 | 7 | నెప్పగా | నొప్పగా |
| 104 | 9 | కలిగి | కలిగిన |
| 104 | 23 | పొల్చ | పోల్చ |
| 107 | 21 | మెచ్చితినోమనసా | మెచ్చితినో ( వో ? ) మనసా |
| 109 | 19 | వొడిల | వొడలి |
| 117 | 10 | తనివొనిఘోర | తనివోనిఘనఘోర |
| 127 | 15 | దొలంగీనా | దొలంగి నా |
| 127 | 17 | యించిననేనిటక | యించిననేనిటక (వేనేనిటకు ?) |
| 127 | 18 | కనుఁగొని యవె | కనుఁగొని య ( న ? ) వె |
| 128 | 17 | తిరుమే దిక్కును | తిరువేఁను దిక్కును |
| 131 | 11 | సుభద్రులతో | సుభద్రు ( ద్ర ? ) లతో |
| 133 | 16 | పన్నిటా | విన్నిటా |
| 133 | 22 | నీవు | నీవు ( గాన ? ) |
| 163 | 19 | వేఁడుక | వేఁడుక |
| 179 | 3 | మేరువులు[illegible] | [illegible]వులు |
| 182 | 18 | వున్న[illegible]పు | పున్న[illegible]పు |
| 186 | 8 | శివున[illegible] | శిశు[illegible]కు |
| 188 | 7 | కాల[illegible] | కా[illegible]ములు |
| 188 | 19 | మాన[illegible] | [illegible]వు ( ? ) |
| 191 | 11 | కానవచ్చి | కానవచ్చిఁ |
| 192 | 7 | బడికపోడు | బడకపోడు ( దు ? ) |

* అత్యావశ్యక [illegible] మిందు సూచింపఁ బడినవి.

తెలుగు విశ్వవిద్యాలయము

[illegible] సంగ్రహము

ANDHRA PRADESH SANGEETA ... LIBRARY
Call No.............
Acc No.............
Date...............
HYDERABAD-4

SRI VENKATESVARA ORIENTAL SERIES No 33

Editor :—Prof. P. V. Ramanujaswami, M.A.

# తాళ్లపాకవారి గేయరచనములు

## IX. సంపుటము

# అధ్యాత్మసంకీర్తనలు

## అన్నమాచార్యరచితములు

శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయములో సంగీతవాఙ్మయ పరిశోధకుఁడగు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మచే

పరిశోధింపఁబడినవి.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి తరఫున

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ చెలికాని అన్నారావు, B. A. వారియనుమతిని

ప్రకటింపఁబడినది.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల

1952

# పీఠిక

ఈ తొమ్మిదవ సంపుటమున ౨౫౧-వ రేకు మొదలు ౨౯౯-వ రేకు వఱకును గల ౨౮౮ అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు ప్రకటింపఁబడినవి. ఒక్కొక్క సంపుటమందు ౫౦ రేకుల సంకీర్తనములను క్రమముగా ప్రచురించుట యీవల నేమవలంబించిన పద్ధతి. 300-వ రేకు మాకు లభింపమిచే ౪౯ రేకుల సారస్వతము మాత్రమే ఇందు చేర్పఁబడినది. ౮-వ సంపుటమునఁగూడ ౨౧౬-వ రేకు లభింపమిచే ఇట్లే ౪౯ రేకులకే సంపుటము ముగింపఁబడినది. ఈ సంపుటమున ౨౯౬-వ రేకును పేర్కొనక పోవుట పొరఁబాటు. ౨౬౫-వ సంకీర్తనము మొదలు ఆఱు పదములు ఆ సంఖ్యగల రేకులోనివి.

౧౮౪-వ సంకీర్తనము 'ఆరీతిఁ దాళ్ళపాక అన్నమయ్య ఘనుఁడాయ — వారివారమై సేసు వహించె నెక్కితిను' అని ముగియుటచే, ౮-వ సంపుటమందలి ౧౨౬, ౧౨౩ సంఖ్యల సంకీర్తనములవలె, ఇదియు అన్నమాచార్యుల రచన కాదనియు, పుత్రపౌత్రులలో ఎవరో రచించినదనియు, సంకలనముచేసినవారి పొరఁబాటున ఇందు చేరినదనియు ఊహింపవలసియున్నది.

యథాపూర్వముగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ మందలి గ్రంథభాండాగారపండితులు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఈ సంపుటమును సిద్ధపఱుచుటయందు నాకు చేసిన తోడ్పాటు శ్రీ శ్రీనివాసుని పరమానుగ్రహమునకుఁ పాత్రమైనది.

తప్పొప్పుల పట్టిక యావశ్యకత లేకుండవలెనను సంకల్పముతో చిత్తులు దిద్దుట జరిగినది. ఐనను అందందు కొన్ని చిఱుతప్పులు కన్నుమీఱి నిలిచినవి. సహృదయులు వానిని సులభముగా సవరించు కొందురు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, తిరుపతి.
18—6—1952

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,
సంగీతవాఙ్మయ పరిశోధకుఁడు.

శుభమస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు (నిరోధానకు ? తిరోధానానకు) తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

251-వ రేకు. ముఖారి

హేయము తనవాసన లేలమానును
చీ యన్న మాన దిదే చెప్పరాని మాయ. ॥పల్లవి॥

జంగిలి మనుజునకు సరుసఁ బాపమే చవి
అంగవించ వలదంటే నగ్గలమౌను
ముంగిట నిల్లా లుండఁగ ముట్టఁగోరుఁ బరస్త్రీల
యెంగిలికిరెండు సరే యిదివో మాయ. ॥హేయ॥

పరగిన జీవునికి పంచేంద్రియాలే సుఖము
ధర నెంతగాలమైన తనివి లేదు
సిరులు దనకుండినాఁ జేయి చాఁచుఁ బరులకు
యిరవులెరఁగరాదు యిదివో మాయ. ॥హేయ॥

శ్రీవెంకటేశ్వరుఁడు చేరి యాత్మలో నుండఁగ
భావించు నితనికృప ఫలించునాఁడు
పూవువంటి సంసారము పొదుగుక వుండఁగాను
ఆవటించుఁ బుణ్యఫలా లదివో మాయ. ॥హేయ॥ 1

రామక్రియ

ఆతఁడు సేసేచేఁత లన్యులు సేయఁగలరా
జాతుల మనుజు లెల్లా సతమయ్యేరా. ॥పల్లవి॥

దిక్కులేనివారి కెల్లా దేవుఁ డొక్కఁడే దిక్కు
చిక్కినవారికి నెల్లా శ్రీపతే గతి
తక్కినఅనాథులకు దైవమే రక్షకుఁడు
యెక్కడా నాతఁ డుండఁగా నేఁటి కిఁక చింత. ॥ఆత॥

బలిమిలేనివారికి పరమాత్ముఁడే బలిమి
కలిమిచాలనివారి కలిమి హరే
యిల నేరనివారికి నిందిరానాథుఁడే నేర్పు
వెలసీతనికే విన్నవించు టింతే కాక. ॥ఆత॥

పొందులేనివారి కెల్లాఁ బురుషోత్తముఁడే పొందు
విందును వేడుకయు శ్రీవెంకటేశుఁడే
యెందరెందరుండినాను యాతఁడు గలఁడు మాకు
సందడి నాతఁడే అన్ని చక్కఁబెట్టీఁ బనులు. ॥ఆత॥ 2

సామంతం

ధ్రువవిభీషణాదులు సాక్షి
వివరపుజీవులు వెదకేదిది. ॥పల్లవి॥

దేవేంద్రసంపద దిక్కులకెక్కుడు
కావిరినది యొక కాలముది
తావున శ్రీహరిదాసులసంపద
తేవల నెన్నఁడుఁ దీరనిది. ॥ధ్రువ॥

బలువుగ నడచేటి బ్రహ్మపట్టమును
తొలుబ్రహ్మాండముతో డిది
జలజాక్షుని నిజశరణాగతి యిది
కలకాలమునకుఁ గాణాచి. ॥ధ్రువ॥

వైకుంఠమునకివ్వలి లోకంబులు
రాకల పోకల రచన లవి
యీకడ శ్రీవేంకటేశ్వరుసన్నిధి
పైకొని దొరకిన బ్రదికేదిది. ॥ధ్రువ॥ 3

## వరాళి

బయలీఁదించీ నదివో ప్రాణులను హరిమాయ
క్రియ దెలుసుకొనేటి కీలింతే కాని. ॥పల్లవి॥

పెక్కు పురుషులలోన బెరసొకసతి యుంటే
యిక్కువై యుండే నాఁటు నిందరిచూపు
దక్కి యందరికౌఁగిళ్ల తరుణి యుండుట లేదు
గక్కన వట్టియాసలఁ గరఁగుటే కాని. ॥బయ॥

చింతకాయ కజ్జాయము చేరి యిసుమంత వుంటే
అంతటనే నోరూరు నందరికిని
పొంతనే నాలుకలకు పులుసై యుండుటే లేదు
కొంత భావించి మింగేటి గుటుకతే కాని. ॥బయ॥

శ్రీవెంకటేశు తేరు దీసేటి మనుజు లెల్లాను
సేవగా నేమే తీసితి మందురు
ఆవల నాతఁడే తమ అంతరాత్మయై యుండి
కావించుట యెఱఁగరు గర్వములే కాని. ॥బయ॥ 4

పూర్వగౌళ

ఏమని చెప్పేనో కాక యిలఁ గల శాస్త్రాలు
కామించి వాదించేవారి కడమేదో. ॥పల్లవి॥

అంచెల జగములకు హరియే ఆధారము
యెంచఁగ నాధారము యితని కేదో
పొంచిన వేదార్థముల పురుషార్థమీతఁడు
నించిన యర్థము యీతనికి నేదో. ॥ఏమ॥

పొందిన ప్రాణులకెల్లా పుట్టుగై నాఁడితఁడు
యెందును తనకుఁ బుట్టుగిఁక నేదో
చందపుఁగర్మములకు సాధనమీ దేవుఁడు
మందలించ సాధనము మరి తన కేదో. ॥ఏమ॥

కలయన్ని మాయలకుఁ గారణమీమూరితి
తలపఁగ కారణము తన కేదో
యెలమి శ్రీవెంకటేశుఁ డితఁడే సర్వసాక్షి
కలసి యీతనికిఁక మరి సాక్షి యేదో. ॥ఏమ॥ 5

సామంతం

ఎక్కడఁ గడచేరీ నరులు
తక్కులఁ బెట్టేరు తరుణులు భువిని. ॥పల్లవి॥

కన్నుల చూపులు గాలపు చిలుకులు
వెన్నెల నవ్వులే వలి తెరలు
మిన్నక పురుషామృగముల వేఁటలు
పన్నక యాడేరు పడఁతులు భువిని. ॥ఎక్క॥

మించిన మాఁటలే మోహనఘంటలు
మంచి యధరములే మచ్చులవి
మించిన పురుషామృగముల వేఁటలు
అంచెల నాడేరు అతివలు భువిని. ॥ఎక్క॥

కట్టువగట్లు కందువకుచములు
పట్టు శ్రీవెంకటపతిమాయ
మెట్టుగ పురుషామృగముల వేఁటలు
నెట్టన నాడేరు నెలఁతలు భువిని. ॥ఎక్క॥ 6

252-వ రేకు. మలహారి

ఇన్నిటిమూలం బీశ్వరుఁ డాతని
మన్ననకోలఁదినె మలయుట గాక. ॥పల్లవి॥

మాయామయమై మనిమెడి జగమిది
చాయల నిందు నిజము గలదా
కాయము సుఖదుఃఖములకుఁ బొత్తిది
రేయిఁ బగలు నొకరీతే కలదా. ॥ఇన్ని॥

దైవాధీనము తగు సంసారము
వావిరి జీవుల వసమవునా
ధావతి మనసిది తన కర్మమూలము
వేవేలైనా విడువఁగ వశమా. ॥ఇన్ని॥

పంచేంద్రియములఁ బరగేటి బ్రదుకిది
చంచలంబు నిశ్చల మవునా
యెంచఁగ శ్రీవెంకటేశ్వరుకృపతో
సంచయమయితే సతమవుఁగాక. ॥ఇన్ని॥ 7

## ధన్నాసి

ఎందుకుఁ బని గొందము యేమి సేతమివి యెల్లా
చెందిన మా కేఁక బుద్ధి చెప్పవే నారాయణా. ॥పల్లవి॥

హరినామమొకటనే అణఁగెఁ బాపములు
వారసి యన్ని నామములూరకున్నవి
సిరు లిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామము లెల్లా పెట్టెలలో నున్నవి. ॥ఎందు॥

గోవిందనామ మొకటే కూడవోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా
శ్రీవిష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావై యున్ననామములు తమకించినివికి ( ? ). ॥ఎందు॥

యిత్తల కేశవునామ మియ్యఁగల వెల్లా నిచ్చె
పొత్తులనామము లెల్లాఁ బొంచుకున్నవి
చిత్తమున నిన్నుఁ జూపె శ్రీవెంకటేశనామమే
హత్తిన నామము లెల్లా నందులోనే వున్నవి. ॥ఎందు॥ 8

## భూపాలం

వేఁకునఁ దిరుపళ్చ్చి విష్ణునికిఁ జేయరో
ఆఁకటి కొదగినట్టి ఆరగింపులు. ॥పల్లవి॥

అతి బ్రహ్మాండాలు గుక్షి నటు ధరించినయట్టి
అతనికిఁ జేయరో ఆరగింపులు
ప్రతిలేని క్షీరాబ్ధిఁ బవళించి లేచినట్టి
చతురునికిఁ జేయరో చవి నారగింపులు. ॥వేఁకు॥

యేడు దినములదాఁకా నెత్తెను గోవర్ధనము
ఆడి వచ్చెబాలునికి నారగింపులు
మేడెపు గోపికలతో మిక్కిలిఁ బెనఁగినట్టి
వేడుకకానికిఁ దేరో విందులారగింపులు. ॥వేఁకు॥

పట్టపుదేవుల్లఁ దాను బంతి సాగి వున్నవాఁడు
అట్టె సేయరో పులుగమారగింపులు
నెట్టన శ్రీవెంకటాద్రినిలయుఁడారగించీని
మట్టులేక వడ్డించరో మంచి యారగింపులు. ॥వేఁకు॥ 9

## దేసాక్షి

ఏ పొద్దు చూచిన దేవుఁ డిట్లానె యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెను. ॥పల్లవి॥

మేరుమందరాలవలె మెరయు నిడెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁ బళ్ళేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసిపోసినట్లుండెను. ॥ఏపొ॥

పలు జలధులవంటి పైఁడివెండిగిన్నెలు
వెలి గొండలంతలేసి వెన్నముద్దలు
బలసిన చిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెలరసమందించినట్లుండెను. ॥ఏపొ॥

పండిన పంటలవంటి పచ్చళ్ళుఁ గూరలును
వండి యలమేలుమంగ వడ్డించఁగా
అండనే శ్రీవెంకటేశుఁ డారగించి మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను. ॥పహ॥ 10

గుండక్రియ

జయ జయ రామా సమరవిజయ రామా
భయహర నిజభక్తపారీణ రామా ॥పల్లవి॥

జలధి బంధించిన సౌమిత్రి రామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవు నేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞము గాచే కౌసల్యరామా ॥జయ॥

అరిరావణాంతక ఆదిత్యకులరామా
గురు మౌనులను గాచే కోదండరామా
ధర నహల్యపాలిటి దశరథరామా
హరురాణినుతుల లోకాభిరామా. ॥జయ॥

అతిప్రతాపముల మాయామృగాంతక రామా
సుతకుశలవప్రియ సుగుణ రామా
వితతమహిమల శ్రీ వెంకటాద్రిరామా
మతిలోనఁ బాయని మనువంశ రామా. ॥జయ॥ 11

సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు
ఎక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు. ॥పల్లవి॥

పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుఁడు
పట్టెను యెడమచేతి బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాశితలలు
కొట్టె ననుచు నెత్తె గొప్ప వలకేలు. ॥మొక్క॥

వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోక
పెంచెను మిన్నులు మోవ పెనుదేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటి దవడల
కాంచనపు పట్టుకాశ కడు బిగియించెను. ॥మొక్క॥

పెనచి తొడలు దాఁక పెద్ద పదకము వేసె
తనువుపై వేలాడే దండలతోడ
అనయము శ్రీవెంకటాద్రి దేవునిబంటు
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను. ॥మొక్క॥ 12

253-వ రేకు. గుండక్రియ

ఘను డాతఁడా యితఁడు కలశాపురముకాడ
హనుమంతుఁ డితఁడా అంజనాతనయుఁడు. ॥పల్లవి॥

పెడచేత లోచేత బెరసి కొందరిఁ గొట్టె
అడరి దానవుల హనుమంతుఁడు
బెడిదంపుఁ బెనుదోఁక బిరబిరఁ దిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు. ॥ఘను॥

దాకాల మోఁకాలఁ దాటించెఁ గొందరి
ఆకాశవీధినుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడదాకెఁ గొందరి
ఆకడ జలధిలోను హనుమంతుఁడు. ॥ఘను॥

ఆరుపుల నూరుపుల నందరిఁ బారఁగఁ ద్రోలె
బూరా సంజీవికొండ హనుమంతుఁడు
నేరతో శ్రీవెంకటాద్రిమీఁది దేవునిబంటు
ఆరితేరినబిరుదు హనుమంతుఁడు. ॥ఘను॥ 13

బౌళి

హరి దగ్గరనే వున్నాఁ డందాఁకాఁ బారనీదు
కరుచలోనే మగుడు గోవిందుమాయ. ॥పల్లవి॥

చెనకి పంచేంద్రియపు చెరువులై దింటికి
మనసనెడిదొకటి మహాప్రవాహము
దినముఁ బారుచు నుండు దిగువకు వెళ్ల లేదు
తనలోనే తానిగురు దైవమాయ. ॥హరి॥

తూలని పంచభూతాలతోఁటలై దింటికి
కాలమనియెడి దొక్క కాలువ వారుచు నుండు
నేలాఁ దడియదు నీరూఁ దివియదు
తోలుఁదిత్తికే కొలఁది దొరకొన్నమాయ. ॥హరి॥

ముట్టి పంచప్రాణముల మొలకలై దింటికి
పుట్టుగులనియేటి యేరు పొదలి పారుచు నుండు
చెట్టు చెట్టుకే కొలఁది శ్రీవెంకటేశ్వరుఁడు
నట్టనడుమ నున్నాఁడు నాననీదు మాయ. ॥హరి॥ 14

పాడి

రామభద్ర రఘువీర రవివంశతిలక
నామమే కామధేనువు నమో నమో. ॥పల్లవి॥

కౌసల్యానందవర్ధన ఘన దశరథసుత
భాసురయజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క (క్కు ?) కోదండరచన విద్యాగురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా. ॥రామ॥

మారీచసుబాహుమర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్యరత్నాకర కాకాసురవరద
సారెకు వేదవిదులు జయవెట్టేరయ్యా. ॥రామ॥

సీతారమణ రాజశేఖరశిరోమణి
భూతలపుటయోధ్యాపురనిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవ
ఘాత నీప్రతాపమెల్లాఁ గడు నిండెనయ్యా. ॥రామ॥ 15

బౌళి

ఎట్టువలసినాఁ జేయు మేమీ నననేరమయ్య
వొట్టిన నామనసు నీ కొప్పన సుమ్మయ్యా. ॥పల్లవి॥

అదిగో శ్రీహరి నీవంపిన యింద్రియాలకు
చెదరక నేము పంపు సేతుమయ్యా
వెదకి యాసలకెల్లా వెట్టియుఁ జేతుమయ్యా
మది మది నేనీమాయకు లోనయ్యా. ॥ఎట్టు॥

దేవ నీవిచ్చినయట్టి దేహపుటూరిలోన
చేవమీరఁ గాఁపురము సేసేమయ్యా
ఆవల నీకర్మముల కప్పనము నత్తుమయ్యా
అవటించి కామాదుల కౌన మీరమయ్యా. ॥ఎట్టు॥

నిన్ను దలచుటకంటె నీవు చెప్పినవనులే
యెన్నికc జేసినదే యెక్కుడయ్యా
అన్నిటా శ్రీవెంకటేశ ఆత్మలో నున్నాcడవు
విన్నపము లేల యిది విడువ మయ్యా ॥ఎట్టు॥ 16

గుజ్జరి

ఇతని మఱచితిమి యెదుటనె యుండcగ యున్నాళ్లును నే మెరcగక
ప్రతిలే దితనికి జీవకోట్లకుc బ్రాణబంధుc డితcడు. ॥పల్లవి॥

ముందు నేను ఘనగర్భనరకమున మునిcగి యున్ననాcడు
బొందితోడనే సుఖదుఃఖంబులc బొరయు తోడునీడితcడు
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడc దా వెనువెంటనే
చందపు నాయాతుమలోcబాయని సర్వాత్మకుcడితడే. ॥ఇత॥

ఆనిపట్టి నేc బాపపుణ్యములు అనుభవించవలె నన్నప్పుడు
మానిప నొల్లcడు తాc బెరరేcచును మతికనుకూలంబితcడు
నానావిధులను బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు
తానును ఆపరిణామంబులకు తగులై వుండును యీతcడు. ॥ఇత॥

తలcచిన దగ్గరc దడవక యుండిన దవ్వాయి వుండు నితcడు
కలసి మెలసి యిహపరములోనంగcగc గాచుక వుండునుయీతcడు
మెలcగుచు సాకారముతో నున్నాcడు మేటి శ్రీవేంకటపతి
వలసిన వావుల రూపులు దాల్చినవాcడొకcడేపో యీతcడు. ॥ఇత॥ 17

గుండక్రియ

కడనుండి రావు కానివి సైనవి
పుడుగని దయ నీదొకటే కలది. ॥పల్లవి॥

హరి నీచక్రం బంటినయప్పుడే
సారిది నసురలే సురలైరి
నిరతపు చీఁకటి నిండినయింటను
వెరవున రవిచే వెలుఁగైనట్లు. ॥కడ॥

తతి నీనామము దలఁచిన వారి
అతిపాపమె పుణ్యం బాయ
గతియై పరుసముఁ గదిసినలోహమె
ప్రతి లేక ధరణిఁ బసిఁడి యైనట్లు. ॥కడ॥

కొంకక నిను నిటు గొలిచినమనుజులె
అంకెల శుకాదులైనారు
యింకను శ్రీవెంకటేశ నీజగము (?)
సంకల్పమె మోక్షంబై నిలిచె. ॥కడ॥ 18

254-వ రేకు. లలిత

ఇవ్వల వెదకితేనే యేమి లేదు
అవ్వలికి దాఁటి మీరు అందుకోరో శుభము ॥పల్లవి॥

కనురెప్పలతుదలఁ గట్టువడెఁ గాలము
ఘనమై చేతులతుదఁ గర్మమున్నది
మనసుకొట్టఁగొననే మరి దైవ మున్నాఁడు
చెనకి యిఁక నెన్నఁడు సేయరో పుణ్యములు. ॥ఇవ్వ॥

కనకము దాఁటితేనే ఘనసుఖ మున్నది
వెనక చీఁకటికొన వెలుఁగున్నది
వనితల అవ్వలనే వరవిజ్ఞాన మున్నది
పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు. ॥ఇవ్వ॥

కాయముకొట్టఁగొననే ఘనవై కుంతమున్నది
బాయట శ్రీవెంకటపతి వున్నాఁడు
మాయలకొనల నెల్లా మనమున్నారము
పాయక తెలుసుకొని పట్టరో యీ తెరువు. ॥ఇవ్వ॥ 19

దేసాళం

ఇంతగా మన్నించి నన్ను నేలుకొంటివిలలోన
వింతగా నెవ్వరినిఁక వేడఁబోయ్యే నయ్యా. ॥పల్లవి॥

కలవారిలోన నీవు గలవాఁడ (వని) నేను
కలసి లేనివారిలో కర్మములేనివాఁడను
బలువులలో నీదాస్యబలవంతుఁడ నేను
యెలమి మాకిఁకఁ జూడ నేమి గడమయ్యా. ॥ఇంత॥

నెమ్మదిలోనివారిలోనీ కుక్షిలోపలివాఁడ
నమ్మని వెలివారిలో నాస్తికుల వెలివాఁడ
పమ్మి పదస్థులలోన పరమపదమువాఁడ
యిమ్మని నిన్నడిగేది యిఁక నేఁటిదయ్యా. ॥ఇంత॥

ధర్మపువారిలో నీదయాధర్మపువాఁడ
మర్మపువారిలో నీమాయలమర్మమువాఁడ
అర్మిలి శ్రీవెంకటేశ అంతర్యామివి నీవు
నిర్మించినవాఁడ నేను నెలకొంటి నయ్యా. ॥ఇంత॥ 20

గుండక్రియ

అందాఁకా వైష్ణవ మటకటకే
నిందకుఁ బాసిన నిర్మలుఁ డగును. ॥పల్లవి॥

పాపపురాసులు పరిహారమైతే
దీపించు హరిభక్తి బోధమును
చేపట్టి పుణ్యము చేరువలయితే
శ్రీపతిదాసులసేవే దొరకు. ॥అందా॥

కొట్టఁగొనకు మతి గోరి పారితే
జట్టిగ హరికథ చవి గలుగు
పట్టిన జన్మము పావనమైతే
మట్టులేని తిరుమంత్రము దొరకు. ॥అందా॥

గురుకటాక్షము కొంత సోఁకితే
శరణాగతి నిశ్చల మవును
యిరవుగ శ్రీవెంకటేశ్వరుఁ గొలిచితె
పరమపదమునకుఁ బాత్రుం డవును ॥అందా॥ 21

ఆహిరి

సేయరానిచేఁత లెల్లాఁ జేసితి నేను నీ
గా(కా?)యగంటివాఁడ నేను గతి చూపవయ్యా. ॥పల్లవి॥

శరణాగతులఁ గూడి జ్ఞానము దొంగిలినాఁడ
అరిది నీకర్మపుటా నాజ్ఞలు మీరినవాఁడ
సరిఁ బ్రపంచకులముజాడ వాసినవాఁడ
ధరణి నీతప్పులకు దండన యేదయ్యా. ॥సేయ॥

బహుసంసారము లెల్లఁ బంచలఁ దోసినవాఁడ
సహజపుటింద్రియముల జారినవాఁడ
మహి నాపుట్టుగులకే మరి బొమ్మఁ బెట్టినాఁడ
విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా. ॥సేయ॥

గురుమంత్రమునకుఁ గొండెము చెప్పినవాఁడ
పరకాంతఁ గూడే లోకభయము మానినవాఁడ
సిరుల మించినయట్టి శ్రీవెంకటేశ నిన్ను
మరిగి శరణంటిని మన్నించవయ్యా. ॥నేయ॥ 22

గుండక్రియ

ఇది గాదది గాదిన్నియు నింతే
పదిఁబది హరి నీపదమే నిజము. ॥పల్లవి॥

సురలును నసురలు చూపట్టు రాజులు
అరసి కనక(గ?)గతమగువారే
సిరుల వీరిఁ గొలిచేద మంటే మఱి
కెరలి పరుల రక్షింపఁగఁ గలరా. ॥ఇది॥

పదునాలుగవది బ్రహ్మలోకమును
కదిసి నీరుము నుకలపాలను
చెదరక యిఁకఁ దనుఁజేరినవారల
వుదుటున నిముడుక వుండఁగఁ గలరా(దా?). ॥ఇది॥

అచ్చుతుఁడవు నీయచ్యుతపద మది
యిచ్చట శ్రీవెంకటేశుఁడవు
చొచ్చిరి నీశరణు శుకసనకాదులు
మచ్చిక నిదిగని మరిగితి మయ్యా. ॥ఇది॥ 23

వరాళి

పెట్టినదైవ మెరుఁగు బీరకాయలోని చిక్కు-
దిట్ట కూళప్రాణులమై తిరుగుత గాకా. ॥పల్లవి॥

కాయము మోచి పుట్టి కర్మమున కొడిగట్టి
రోయఁబోతే మేనిలోనిరోఁత వోయీనా
పాయపు వలఁ దగిలి పాపపుణ్యములఁ జిక్కి
తీయఁబోతే వచ్చునా తెగరాని బంధము. ॥పెట్టి॥

జగములోఁ గట్టువడి సంసారదుఃఖమంది
నగఁబోతేఁ గొంతైనా నవ్వు వచ్చీనా
చిగురుటాసఁ దగిలి చింతాజలధిఁ బడి
యెగదిగఁ జూడఁబోతే యెందుకు నెక్కీనది. ॥పెట్టి॥

పరమాత్మమతిఁ గని భవములెల్లఁ గడచి
ధరణి మాయలతోడితగులున్నదా
సిరుల మించినయట్టి శ్రీవెంకటేశ్వరుని
మరిగి కొల్చిన మాకు మరి చింత లేలా. ॥పెట్టి॥ 24

255-వ రేకు. లలిత

ఏల వెట్టి సేయించే విందున నీకేమి వచ్చె
కాలముఁ గర్మముచేతఁ గప్పేవు లోకులను. ॥పల్లవి॥

బద్దుల మాటలాడి భ్రమయించి రేపల్లెలో
ముద్దులు చూపి వెన్నలు ముచ్చిలినట్టు
కొద్దిమాలినకర్మము కొంత మాఁ గడియించి
వద్ద నిన్ను గానివాని (?) వలె దాఁగవలెనా. ॥ఏల॥

మఱి పాండవులకు నెమ్మది వావులటు చెప్పి
మొఱఁగి యిందరిలోన మొక్కినయట్టు
కుఱకుఱ దై వాలఁ గొందరను గడియించి
యెఱిఁగి నెఱఁగనట్టె యేమి సేసేవయ్యా. ॥ఏల॥

వరమడుగఁగఁ బోయి వడి ఘంటాకర్ణునికి
యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు
తిరమై శ్రీవెంకటాద్రిఁ దిరువారాధన గొని
వరుస నీదాసులకు వరమిచ్చేవయ్యా. ॥ఏలి॥ 25

ధన్నాసి

తగు మునులు ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మము దెగదా. ॥పల్లవి॥

ధరణిధర మందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁ గాచితి కాకముఁ గాచితి నీ
కరుణకుఁ బాత్రము గలదిదియా. ॥తగు॥

భవహార మురహర భక్తపాపహర
భువనభారహర పురహరా
కవిసినవురుతను గద్దను మెచ్చితి
వివల నీదయకు నిజియా గురుతు. ॥తగు॥

శ్రీ వెంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవుల నేలితి కోతుల నేలితి
పావనపుఁ గృపకుఁ బాత్రము లివియా. ॥తగు॥ 26

శంకరాభరణం

ఎవ్వరుఁ గాననివాఁడు యశోద గని నట్టి
పవ్వళించే బ్రహ్మతండ్రి బాలుఁ డయ్యె నట్టె. ॥పల్లవి॥

ఘనయోగీంద్రులమతిఁ గట్టువడనట్టివాఁడు
పనిలేక రోలఁ గట్టువడినాఁ డట్టె
తనియ సురలకు పాదము చూపనట్టివాఁడు
మొనసి బండిమీఁద మోపినాఁ డట్టె. ॥ఎవ్వ॥

అమృతము చేతఁ దచ్చి అందరికిచ్చినవాఁడు
తమితో వెన్న దొంగిలెఁ దానె యట్టె
గుమురై దేవదానవకోటికిఁ జిక్కనివాఁడు
భ్రమసి గోపికలపాలఁ జిక్కినాఁ డట్టె. ॥ఎవ్వ॥

యిందుఁ గలఁ డిందు లేఁడ నెంచి చూపరానివాఁడు
అందమై రేపల్లెవాడ నాడినట్టె
అంది కృష్ణావతారమయినట్టి దేవుఁడే
యిందున శ్రీ వెంకటాద్రి యెక్కి నిలిచె నట్టె. ॥ఎవ్వ॥ 27

## రామక్రియ

పెరిగి పెద్దఁ గాను మరి పిన్నవాఁడఁ గాను
యిరవుగ నే బుద్ధెరిఁగెడి దెపుడు. ॥పల్లవి॥

కంటిగ బహునరకంబులు చొచ్చితి
నింకా భయము మది నెరఁగను
జంకెనలనె పలు చదువులు చదివితి
మంకుఁదనం బిది మానదు. ॥పెరి॥

తియ్యక కడుఁ బెనుదేహాలు మోచితి
నయ్యో యింకా నలయను
నెయ్యపు హేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గూఁ బడను. ॥పెరి॥

ధర్మము నేసితి దానము లొసఁగితి
కర్మము లింకాఁ గడవను
అర్మిలి శ్రీవెంకటాధిప నీకృప
నిర్మల మైతిని నే నిపుడు. ॥పెరి॥ 28

బౌళి

కన్న దేఁటిదో విన్న దేఁటిదో కాఁగలదిఁక నేదో
నన్నుం గానను నిన్నుం గానను నమము బట్టబయలు. ॥పల్లవి.

నీమాయమహిమో నే నేరనికడమో
భూమిలోన నీవున్నాఁడవు నా పుట్టుగులుం గలవు
యేమి గాఁగలనో యింకా మీఁదట నిటక తొల్లి యే మైతినో
సోమార్కుల వుదయాస్తమయంబులు చూచుచు నున్నాఁడను నేను. ॥కన్న॥

జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో
నీనామంబులు అనంతకోట్లు నిలుకడగాఁ గాను
కానఁగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో
కానరాని యీ ముక్కున నూర్పులు కాలముఁ గొలిచేటి కుంచములు. ॥

నీకు నీవే నను దయ దలఁచితివో నేనాచార్యుని నమ్మితినో
కైకొని నాయంతర్యామివి న్నినుఁ గంటి నిపుడే నేను
శ్రీకాంతుఁడవో శ్రీవెంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము
యేకడ చూచిన నీదాసులు నా యెదుటనే వున్నారు. ॥కన్న॥ 29

దేసాక్షి

కానరు నాలుగుకరముల వానిని
శ్రీనాథుం డని చేరఁగ వలదా ॥పల్లవి॥

ఘనచక్రముతో గరుడని నెక్కక
కినిసి మెరయు నల కృష్ణునిని
ఘనులై యిప్పటికాలపు మనుజులు
మునుప విష్ణుఁ డని మొక్కఁగ వలదా. ||కాన||

పలుదేవతలకు భయములు మాన్పుచు
అల విశ్వరూప మైనపుడు
చలము మాని యచ్చటి కౌరవులును
తెలిసి దేవుఁ డని కొలువఁగ వలదా. ||కాన||

చెప్పిన యితఁడే శ్రీవెంకటమున
యెప్పుడు వరములు యియ్యఁగను
తప్పక యీతని దాసులవలెనే
యిప్పటివారలె యెఱఁగఁగ వలదా. ||కాన|| 30

256-వ రేకు. బౌళి

నిండుమనసే నీపూజ
అండఁ గోరకుండుటదియు నీపూజ. ||పల్లవి||

యిందు హరి గలఁ డందు లేఁ డనేటి
నిందకుఁ బాయుటే నీపూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే
అందదుకు మానుటదియే నీపూజ. ||నిండు||

తిట్టులు గొన్నని దీవెన గొం తని
నెట్టుకోనిదే నీపూజ
పెట్టినబంగారు పెంకును నినుమును
అట్టె సరి యనుటదియు నీపూజ ||నిండు||

సర్వము నీ వని స్వతంత్ర ముడిగి
నిర్వహించుటే నీపూజ
పర్వి శ్రీవెంకటపతి నీదాసుల
పూర్వ మనియెడి బుద్ధి నీపూజ. ॥నిండు॥ 31

రామక్రియ

పలుదెరువులు నీకుఁ బాటించఁ జెల్లును
వొలిసి మీదాసు లవు టొక్కటే మా తెరువు. ॥పల్లవి॥

హరి నీకు జీవరాసులందరును సరియే
సురల కెక్కుడు నీవు చూడ మాకైతే
యిరవులు గలవు నీ కెక్కడ చూచినను
అరిది నీ శ్రీపాదాలందె మాయిరవు. ॥పలు॥

నందగోపాదుల కెల్ల నందనుఁడవు నీవు
యిందరికిఁ దండ్రివి మా కిటు నీవైతే
అందిన శబరివిందు అఖిలభాగ్యము నీకు
చిందిన నీప్రసాదమే సిరు లిచ్చె మాకును. ॥పలు॥

అచ్చుగ మునులు ఋషు లందరును నీబంట్లే
తచ్చిన యేలికలు నీదాసులు మాకు
యిచ్చల శ్రీవెంకటేశ యిహపరమెల్లా నీవు
చొచ్చితిమి నీమరఁగు సూదివెంట దారమై. ॥పలు॥ 32

శుద్ధవసంతం

భక్తి నీపై దొకటె పరమసుఖము
యుక్తిఁ జూచిన నిజం బొక్కటే లేదు. ॥పల్లవి॥

కుల మెంత గలిగె నది కూడించు గర్వంబు
చల మెంత గలిగె నది జగడమే రేచు
తలఁ పెంత పెంచినాఁ దగిలించు కోరికలు
మెలమి విజ్ఞానంబు యేమిటా లేదు. ॥భక్తి॥

ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ జక్కఁదనంబు మోహములు రేచు
ఘనవిద్య గలిగినను కప్పఁ బైపై మదము
యెనయుంగఁ బరమపద మించుకయు లేదు. ॥భక్తి॥

తరుణు లెందరు అయిన తాపములు సమకూడు
సిరు లెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవెంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లిఁక లేవు. ॥భక్తి॥ 33

## లలిత

ఇంత గాల మాయ నన్ను యేమీ నన్నవారు లేరు
చింతసంసారపు మాయఁ జిక్కించనే కాని. ॥పల్లవి॥

యెందరు బ్రహ్మలో నన్ను యిటు పుట్టించినవారు
యెందరు యములో హరియించినవారు
యిందుకు నందుకే కాని యిల నేఁ జేసినపాప
మంది వహించుక కాచినట్టివారు లేరు. ॥ఇంత॥

తల్లిదండ్రు లెందరో తనువు పెంచినవారు
కొల్లగా సతు లెందరో కూడినవారు
చిల్లర పనికే కాని చేరఁ బిలిచి వైకుంఠ
ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు. ॥ఇంత॥

కాలమును వీటిఁబోయె కర్మమును దెగ దాయ
మూలనుండి యెవ్వరికి మొర వెట్టేను
ఆలించి శ్రీవెంకటేశ అంతరాత్మవై నన్ను
నేలితివి యింతపని కెవ్వరును లేరు. ॥ఇంత॥ 34

సాళంగనాట

పంచేంద్రియములనే పట్టణస్వాములాల
తెంచి బేర మాడుకొని దించరో బరవు. ॥పల్లవి॥

తగిన సంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువు దేహపుటోడ బేహారివాఁడ
జగతిఁ బుణ్యపాపపు సరకులు దెచ్చినాఁడ
దిగితి బూతురేవునఁ దీగుచరో సుంకము. ॥పంచే॥

అడరి గుణత్రయము లనేటి తెడ్డులచేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁడంచలములనే గాలిచాపలెత్తినాఁడ
వెడ మాయపు సరకు వెలకియ్యరో. ॥పంచే॥

ఆతుమ యనేటి కంభ మంతరాత్ముఁ డెక్కి యుండి
నీతితో మమ్ముఁ గాచుక నిలుచున్నాఁడు
ఆతఁడే శ్రీవెంకటేశుఁ డటు మాకు మీకుఁ గర్త
ఘాత మాని యిఁక మాకు కడు గుణ మియ్యరో. ॥పంచే॥ 35

పాడి

ఏడే జేనలు యీదేహంబును
యేడా నిఁక మరి యెరఁగము నేము, ॥పల్లవి॥

నిండును జలధులు నిమిషమాత్రమున
నిండియు నిండదు నేటి మనసు
పండును భువిఁగల పంట లన్నియును
పండదు నాలోఁ బాపపు మనసు. ॥ఏడే॥

పట్టవచ్చు నల పారేటి పామును
పట్టరాదు నాపాయము
అట్టె ఆరును అనలము నీటను
యెట్టిన నారదు యీకోపంబు. ॥ఏడే॥

కానవచ్చు నదె ఘనపాతాళము
కానరాదు నాకాలము
శ్రీనగవిహార శ్రీవెంకటేశ్వర
సోనలఁ బుట్టిన సుద్దులు నివిగో. ॥ఏడే॥ 36

257-వ రేకు సాళంగనాట

ఎక్కడిది వివేక మెంతవారికిని యిన్నియు నీమాయఁ దోయక లేదు
పక్కన అజ్ఞానపు జీవుల యీ పాప మిట్లనే వుండఁగను. ॥పల్లవి॥

విచ్చనవిడి నటు కౌరవులెదుటను విశ్వరూపు చూపినయపుడు
యిచ్చల నిను నమ్మఁగ లేకే కా యింద్రజాల మనిరి
తచ్చన నిప్పటి నాస్తికజనులును తగు నీ సాకారము చూచి
నిచ్చలుఁ గల్లని నిరాకారము నిజ మని తర్కించక మానుదురా. ॥ఎక్క॥

గరుడవాహనము శంఖచక్రములు కని యుండియు ద్వాపరజనులు
ధరలో నిను హరి మూర్తని తెలియక తమ యాదవుఁ డొకఁ డితఁ డనిరి
సరుస దేవతాంతరములఁ గొలిచేటి చంచలచిత్తులు యిఁక నిన్నే
పరదైవం బన నేరరు సరిగా బ్రహ్మాదులలో నొకఁడ వందురు. ॥ఎక్క॥

యెఱిఁగిన దాసులు యెఱుఁగుదురు నీ నెక్కు డనుచు యేకాలమును
యెఱఁగని పామరు లెఱఁగరు నిను మతి నెట్టైనా నాఁడు నేఁడును
తఱితో శ్రీవేంకటేశ్వర నిను గని తగు శరణాగతు లున్నట్లు
మఱుఁగున నుండిన ప్రాకృతులకు నీమహిమలు గానఁగఁ దరమవునా. ॥ఎ॥ 37

లలిత

పుట్టినమొదలు నేను పుణ్య మేమీఁ గాన నైతి
యెట్టు గాచేవయ్య నన్ను యిందిరానాథా. ॥పల్లవి॥

కామినులఁ జూచి చూచి కన్నులఁ గొంత పాపము
వేమరు నిందలు విని వీనులఁ గొంత పాపము
నాముచారఁ గల్లలాడి నాలికఁ గొంత పాపము
గోమునఁ బాపము మేనఁ గుప్ప లాయ నివిగో. ॥పుట్టి॥

కానిచోట్లకు నేఁగి కౌఁగిళ్ళఁ గొంత పాపము
సేనదానా లందుకొని చేతులఁ గొంత పాపము
మానని కోపమే పెంచి మతిఁ గొంత పాపము
పూని పాపములే నాలోఁ బోగు లాయ నివిగో. ॥పుట్టి॥

చేసినట్టివాఁడ గాన చెప్ప నీకుఁ జోటు లేదు
దాసుఁడ నే నైతిఁ గాన దయ దలఁచితివయ్య
యీసరవు లెల్లఁ జూచి యేమని నుతింతు నిన్ను
ఆసల శ్రీవేంకటేశ ఆయఁబోయఁ బనులు. ॥పుట్టి॥ 38

వరాళి

కలిమి లేము లెల్లా కాలము స్వభావము
తలఁపులో జ్ఞానము దక్కెడి దొకటే. ॥పల్లవి॥

పుట్టుగులు జీవునికి పుట్టించినస్వభావము
వొట్టి యిదె సారెసారె వోము నేలా
పట్టి నానాటిబ్రదుకు ప్రపంచముస్వభావము
కొట్టగొన హరి ముక్తి గోరెటి దొకటే. ॥కలి॥

మక్కువ సంసారము మాయలస్వభావము
చిక్కినవారికెల్లా మొక్కుకో నేలా
తక్కక రక్షించేది దైవముస్వభావము
నిక్కపు వైరాగ్యము నిలుచుట వొకటే. ॥కలి॥

కప్పిన భోగము లెల్లా కర్మము స్వభావము
తప్పక ప్రియము చెప్పే దైన్యమేలా
యెప్పుడు శ్రీవెంకటేశ యెదలో నాకుఁ గలవు
చప్పుడు సేయక నీకు శరణనే దొకటే. ॥కలి॥ 39

కన్నడగౌళ

ఏమి సేయఁగల యెంతాశకుఁడను
తామసపు మనసు తనియదు నాకు. ॥పల్లవి॥

యిలలోపల నూరేండ్లు బ్రదుకే
కలవుద్యోగము కల్పాంతంబులు
నిలిచినవాఁడను నేనొక్కఁడనే
పలుసంసారము బండ్లకొలది. ॥ఏమి॥

ఆరయఁ బట్టెఁడు అన్నమువాఁడను
కోరిన కోర్కులు కోటానగోట్లు
నారవంటిదే నల్లెఁడు నాలుక
తీరవు రుచు లివె తెప్పల కొలఁది. ॥ఏమి॥

నిరతరతిసుఖము నిమిషములోనిదె
విరహపు వేదలు వేవేలు
యిరవుగ శ్రీవెంకటేశ నీమఱఁగు
చొరఁగా నాకివి సులభములాయ. ॥ఏమి॥ 40

లలిత

ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరువీకులై
నవ్వుచు నీశరణంటి నన్నుఁ గావవయ్యా. ॥పల్లవి॥

తగఁ బంచేంద్రియములు తమవాఁడ ననేరు
వగఁ దల్లిదండ్రి తమవాఁడ ననేరు
చిగురుఁ గర్మాలు తమసీమవాఁడ ననేరు
తెగదీ తగవు నీవే తిద్దవయ్యా. ॥ఎవ్వ॥

కొందరు నరకమందు కొంత వళకు వేసేరు
కొందరు స్వర్గమువారు కొంత వళకు వేసేరు
యిందుకు నందుకుఁ బోనీరిహాలోకమందువారు
దిందుపడని వళకు తీరుచవయ్యా. ॥ఎవ్వ॥

కాంతలు తమవాఁడంటాఁ గనుచూపులఁగట్టేరు
చెంతలఁ గాంచనములు చేయి పట్టుకొనె నన్ను
యింతటా శ్రీవెంకటేశ యెదలో నున్నాఁడవు
వంతుకీ తగవు నీవే వహించుకోవయ్యా. ॥ఎవ్వ॥ 41

258-వ రేకు సామంతం

ఇంకనైన హరిఁ జేరు యింతే చాలు
సంకెలెల్లాఁ బెడ బాపి చక్కఁజేసీ నతఁడే. ॥పల్లవి॥

మెఱఁగక పుట్టితివి యిన్ని యోనులందుఁ దొల్లి
తఱి నాఁటికాయఁ బోయ దాని కేమి
నెఱి నరకములో నానితివియుఁ గొన్నాళ్ళు
తఱవాయి దెలుసుకో దాని కేమి. ॥ఇంక॥

పాపపుణ్యములు నేసి పరులఁ గొలిచి తొల్లి
తాపములఁ బొందితివి దాని కేమి
పూపసంసారము నమ్మి పుంగుఁడై యిన్నాళ్ళుదాఁకా
దాపు లేక బ్రతికితి దాని కేమి ॥ఇంక॥

జగములో వారిఁ జూచి సారె సారె నాసలనే
దగదొట్టి నీకుఁ దొల్లి దాని కేమి
జిగి శ్రీవెంకటపతి చిత్తములో నున్నవాఁడు
తగ వెంచుకో జీవుఁడ దాని కేమి. ॥ఇంక॥ 42

## ముఖారి

గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవల నీవల నోరఁ గుమ్మలుగ నాడుద మీతనిఁ బాడుదము ॥పల్లవి॥

సత్యము సత్యము సకలసురలలో
నిత్యుఁడు శ్రీహరి నిర్మలుఁడు
ప్రత్యక్ష మిదే ప్రాణులలోపల
అత్యంతము శరణనరో యితని. ॥గోవిం॥

చాటెడి చాటెడి సకలవేదములు
పాటించినహరి పరమ మని
కూటస్థుఁ డితఁడు గోపవధూపతి
కోటికి యీతనిఁ గొలువరో జనులు. ॥గోవిం॥

నిలుచున్నాఁ డిదె నేఁడును నెదుటను
కలిగిన శ్రీవెంకటవిభుఁడు
వలసినవారికి వరదుం డీతఁడు
కలఁడు గలఁ డితనిఁ గని మనరో. ॥గోవిం॥ 43

## దేసాక్షి

ఒక్కఁ డెవ్వఁడో వుర్వికి దైవము
యెక్కువ నాతని నెరఁగవో మనసా. ॥పల్లవి॥

పుట్టిన జీవుల కొక బ్రహ్మ గలఁడు
పట్టిన విప్రులు బ్రహ్మల మందురు
నట్టనడుమ వారే నవబ్రహ్మలు
జట్టిగ బ్రహ్మల సంతాయ జగము. ॥ఒక్క॥

కైలాసంబునఁ గలఁ డొక రుద్రుఁడు
తాలిమి నేకాదశరుద్రులు మరి
కాలరుద్రుఁడును కడపట నదివో
చాలిన రుద్రుల సంతాయ జగము. ॥ఒక్క॥

అవతారంబున నలరిన విష్ణువు
అవల విష్ణుమయ మనియెడి విష్ణువు
భువి శ్రీవెంకటమున నున్నాఁ డిదె
జవళివరంబుల సంతాయ జగము. ॥ఒక్క॥ 44

## దేవగాంధారి

ఇంకనైనా రోయ రాదా యీపాటి వార మింతే
మంకుఁదన మేల మామాట వినరాదా. ॥పల్లవి॥

తోలుబొంత గట్టుకొన్నదొర నింతే నన్ను నీవు
కూళసంసారమా యేల కొసరేవు
యీలకొన్న యెముకలయింటిలో కాఁపుర మింతే
యేల మాయ వెంటఁబెట్టే వేమి గద్దు నీకును. ॥ఇంక॥

పంచభూతపుచుట్టాల బదుకులోవాఁడ నింతే
యెంచ కింద్రియయాచకు లేల వచ్చేరు
కంచపుగాలావటించే కలిమిలోవార మింతే
చంచలపుటాసలు చేయి చాఁచ నేఁటికి. ॥ఇంక॥

నెత్తురుజలదుర్గాన నిలిచినవాఁడ నింతే
జొత్తుఁబాపములు యేల చోటడిగేరు
హత్తిన శ్రీవెంకటేశుఁ డాత్మలోన నున్నవాఁడు
మత్తపుటజ్ఞానమా మ మ్మేమి చూచేవు. ॥ఇంక॥ 45

మలహరి

తమయెఱుక తమకుఁ దగినంతే
నెమకిన మాకును నీకృప యింతే. ॥పల్లవి॥

పొసఁగ నీనాభినిఁ బుట్టినబ్రహ్మలు
యెసఁగిన నీపూర్వ మెఱిఁగేరా
వెస నీముఖమున వెడలినవేదము
దెసల నీమహిమ తెలియఁగఁ గలదా. ॥తమ॥

నగుచు నీమాయల నడచే జగములు
సొగసి నీమూరితి చూపెడినా
తగ నిను గానఁగ తపించు మునులును
పొగరుల మము నీక బోధించేరా. ॥తమ॥

అంతేసివారల కటువలె నుండఁగ
వింతజీవులకు వివేక మెట్లో కో
యింతట శ్రీవెంకటేశ నీవే మము
చెంతఁ జేరి దయ సేయఁగదే ॥తమ॥ 46

శంకరాభరణం

ఎన్నఁడు దెలిసే మెచ్చరి కెపుడో
యిన్నియుఁ గన్నవె యెఱిఁగీ నెఱఁగ. ॥పల్లవి॥

నిన్నయాఁకలి నేఁడూ నున్నది
కన్నదినంబే కడ చనెను
పన్ని నిదుర మాపటికి నున్న దదె
యెన్నఁగ రాతిరి యెందో పోయ. ॥ఎన్న॥

కాయపు సుఖములు గంపల నున్నవి
పాయమే కై వాలి పండె నదే
యీయెడ సంసార మింటనె నున్నది
చేయును నోరును చెనకై నిలిచె. ॥ఎన్న॥

విడువనిజన్మములు వెంటనే వచ్చి
తడవేటిమోక్షము దవ్వాయ
యెడపక శ్రీవెంకటేశ నీమఱఁగు
బడిఁ జొచ్చితి నాధారము నీదే. ॥ఎన్న॥ 47

ముఖారి

259-వ రేకు

పుణ్యమున నన్ను గాచి పురుషార్థి వౌదుగాక
గణ్యమా నే నీకు నాకత యెంత వున్నది. ॥పల్లవి॥

వెలయ నిన్ను బొగడేవేదము లనంతములు
యెలమి నిన్ను బొగడ నెంతవాఁడను
యిల నిన్ను బూజించేరు ఋషులు కోటానఁగోటి
అలరి నిన్ను బూజించేయంతవాఁడనా. ॥పుణ్య॥

శరణు నీకుఁ జొచ్చిన జంతువు లనంతములు
వరుస నే నందులో నెవ్వరిఁబోలుదు
సొరిది నిన్ను గొలిచేసురలు సేనాసేన
పరగ నే గొలిచేటిపని నీకు నెంత. ॥పుణ్య॥

కాల మెంతైనాఁ గద్దు కర్మములు వేవేలు
ఆలించ నందులో నేనణుమాత్రము
తాలిమి శ్రీవెంకటేశ దయాధర్మము నీది
పాలించవే నీవు నన్ను బలుకు లేమిటికి. ॥పుణ్య॥ 48

లలిత

నాలో నున్నాఁడవు నన్ను గావ నీకుఁ బోదు
యీాలీలఁ బట్టుచీరెరవిచ్చినవానివలె. ॥పల్లవి॥

చుట్టుకొంటిఁ గర్మములు సొరిదిఁ బసిరికాయ
నట్టనడిమి పురువునడకవలె
వట్టిజాలిఁ దిరిగితి వడి బంచేంద్రియముల
పట్టినసీటిలో జల్రభమణమువలెను ?. ॥నాలో॥

ధరలోనఁ బుట్టి పుట్టి తగ వచ్చినందే వచ్చి
వరుస రాట్నపుగుండ్రవలె నైతిని
అరసి నే నంటుకొంటి అంగనలపొందులను
చొరఁబారి వేలుకాడే సూదిరాతివలెను. ॥నాలో॥

అంతటను సర్వనరకాదిలోకాలు మెట్టితి
బంతిగట్టి నురిపెడి పసురమునై
చెంతల శ్రీవెంకటేశ చేరితి నీవద్ద నేఁడు
వంతుకుఁ గామధేనువువద్ది దూడవలెను. ॥నాలో॥ 49

## సామంతం

జననమరణములు జంతురాసులకు
వెనక ముందరను విడువని కొలలు. ॥పల్లవి॥

తలఁచినచోటను తగు దేహములై
పొలసి పోయినాఁ బోనీవు
వెలుపల లోపల వెలయ భోగములు
కలలోపలివలెఁ గం ( ని ? ) నది తెలివి. ॥జన॥

పూఁచినచోటుల పుత్రమిత్రులై
కాఁచి కిరఁచినాఁ గరఁగవివి
తూఁచిన నిరుదెస దుఃఖసుఖంబులు
వ్రాఁచి విడుచుటే వోపిన తెలివి. ॥జన॥

అనాదివాసన లంటినజిగురులు
మనోగుణములై మానవివి
వినోదములు శ్రీవెంకటేశుకని
కనేవుపాయము కందువ తెలివి. ॥జన॥ 50

## ధన్న్యాసి

అక్కడ నెక్కడినరకము ఆమాటే కల్లా
దిక్కుల ని(నిం ?) దె యున్నియుఁ దీరుచుకొంటి మయ్యా. ॥పల్లవి॥

తనువిది మలమూత్రంబుల దాకొనియుండిన పట్ణము
దినదినము పుచ్చిష్టపు దిడ్డం దూరెదము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడిగుంతలు
మని మసి నరకము చొచ్చిన మనుజుల మిదె నేము. ॥అక్క॥

మదనజలంబుల కాలువ మాపెద్దలపూర్వంబులు (?)
పొదలిన పుత్రుల యిస్ళ్లపుట్టలు వెట్టెదము
మొదటనె సంసారంబులు యొశయని కారాగృహములు
మది మది నరకము చవిగొను మనుజుల మిదె నేము. ॥అక్క॥

పుట్టినదే నగ్నత్వము బూతోబండో యెరఁగము
చిట్టంట్ల వాచవులగు జీవుం బ్రమింగెదము
నెట్టన శ్రీవేంకటేశ్వర సిత్తో గూడఁగ జగములు
మట్టినచోట మట్టే మనుజుల మిదె నేము. ॥అక్క॥ 51

## దేసాక్షి

తప్పులు వొప్పులు దేహి తనమూలనే
రెప్పలతుద నివిగో రేపులు మాపులును. ॥పల్లవి॥

తనలోనిపాపములే తగిలి యెదిటివారి
నినుపు నేరములై నిందింపించు
మనసులో పుణ్యములే మహిఁ గన్నవారిమీఁద
పొనుఁగని నేరుపులై పొగడింపించును. ॥తప్పు॥

తొల్లిటి మరణములు తోడనే పుట్టినపుడే
యెల్లవారుఁ జూడఁగాను యేడుపించును
పెల్లురేఁగి తాఁ జేసే పెనుఁగర్మబంధములే
మెల్లనే నానాఁటికి మేను గొప్ప చేసును. ॥తప్పు॥

సావిఁ దననడకలే స్వర్గనరకములై
జీవులకు మాయఁగప్పి చిక్కించించు
శ్రీవెంకటేశ్వరుసేవ చేతిలోని మోక్షమై
కేవలపు ప్రపంచము గెలుపించును. ॥తప్పు॥ 52

శ్రీరాగం

నమము రెంటికిని నామేను
వమఁబడె యెందలివాఁడనో నేను. ॥పల్లవి॥

కంటిమి జగ మిది కన్నుల యెదుటను
అంటి యిదియు నిజమునగాదు
వింటిమి స్వర్గము వేరే కలదని
కంటగించి అదిగాదనరాదు. ॥నడు॥

కట్టుకొంటి మిదె ఘనసంసారము
గట్టిగ నిదిఁ దొలఁగఁగరాదు
పట్టుకొంటి మిదె పాపపుణ్యములు
తెట్టఁదెరువునని దించాలేను. ॥నడు॥

నగితి నొక్క పెలవి నానాఁటిబదుకు
మొగి నొకచే నిను మొక్కితిని
అగపడె శ్రీవెంకటాధిప నీకృప
నిగుడి గురుచే నినుఁ గనఁగలిగె. ॥నడు॥ 53

260-వ రేకు భూపాలం

వెట్టి దెలిసి జగము వెస రోఁకలి చుట్టెను
వొత్తె దేవతలవరా లొగి నెందు కెక్కునో. ॥పల్లవి॥

తగిలి సంపదలచేఁ దనిసినవారు లేరు
అగపడి దైవమానుషాలందును
వొగరుసంసారభార మోపనన్నవారు లేరు
వగవఁగఁ జదువు లెవ్వారికిఁ జెప్పెనో. ॥వెట్టి॥

జడిసి ఆయుష్యము చాలు నన్నవారు లేరు
పొడసుటి పదునాల్గు భువనాలందు
తడవి తనముదిమితా రోసేవాఁడు లేఁడు
యెడయని తపముల మెవ్వరిఁ దెచ్చెనో(?). ॥వెట్టి॥

నడుమనే తిరిగాడీ నానాధర్మములు
పడని పాట్ల నేము పడఁగాను
తడవి శ్రీవెంకటేశుదాసులు మమ్ముఁ గాచిరి
బడిబడి నిత్యకర్మఫలము లెన్నటికో. ॥వెట్టి॥ 54

రాయగౌళ

ఇంతగాల మాయను యేడ నున్నారో వీరు
వింతలై యడవిఁ గాసేవెన్నె లాయ బ్రదుకు. ॥పల్లవి॥

యేలేవారి దూరితి యెడరుపుట్టినవేళ
కాలమును దూరితిని కలఁగేవేళ
తాలిమిలేనివేళ తగుఁ గర్మము దూరితి
యేలాగని కాచేవారి నెవ్వరిఁ గానము. ॥ఇంత॥

దైవమును దూరితి తమకించినట్టివేళ
కావించి నన్ను దూరితిఁ గాఁగినవేళ
సోవగాఁ గోపపువేళ చుట్టాల దూరితిమి
యీవలఁ దోడైనవారి నెవ్వరిఁ గానము. ॥ఇంత॥

పుట్టుగు దూఱితిమి పోరానియట్టివేళ
కట్టఁగడ నేఁడు వంకఁగానమైతిమి
జట్టి శ్రీవెంకటేశుఁడు శరణంటేనే కాచె
యిట్టి యింతటివారు యెవ్వరును లేరు. ॥ఇంత॥ 55

నాట

తల మొలా నొక్కసరా తను వొక్కటాఁ గాక
కొలఁది యెఱిఁగతనిఁ గొలువరో మీరు. ॥పల్లవి॥

బొడ్డున బ్రహ్మఁ గనినపురాణపురుషుఁడే
దొడ్డుగాక ఆతనితోడివాఁడా
వొడ్డిన కైలాసమేలే వుమాపతిఁగడుపులో
వెడ్డువెట్టి పెంచేవాఁడు వీరితోవాఁడా. ॥తల॥

చక్కని కన్నుల సూర్యచంద్రులుగాఁ గలవాఁడు
యెక్కుడుగా కిందరిలో నీడు వెట్టేదా
అక్కర యీదేవతలకాపద మానిపేవాఁడు
వెక్కసమే కాక యెంచ వీరిలోనే వొకఁడా. ॥తల॥

అందరు నితనియందే అయితే నౌదురుగాక
యెందును శ్రీపతితోడి యీడు వారా
కందువ శ్రీవెంకటాద్రి ఘనవరము లొసఁగి
దిందు పడ్డలోకులకు ద్రిష్ట మిదే కాదా. ॥తల॥ 56

పాడి

ఏమి చెప్పెడినో శాస్త్రరహస్యము యేమి చెప్పెడినో వేదములు
తామసమై బహునాయక మాయను తత్వ మెఱఁగఁగఁ దర మేదయ్యా ॥

కొన్ని జంతువులు రోసిన హేయము కొన్ని జంతువుల కమృతము
కొన్ని జంతువుల దివములై రాత్రులు కొన్ని జంతువులకు
అన్నియు నిట్లనె వొక్క టొక్కటికి అన్యోన్యవిరుద్ధములు
పన్ని నజీవుల కేకసమ్మతము భావించఁగ మరి యిక నేదయ్యా. ॥ఏమి॥

కొందరు విడిచినసంసారము మరికొందరికి నది భోగ్యంబు
కొందరి వునుకులు వూర్ధ్వలోకములు కొందరి వునుకులు పాతాళంబు
అందరు నందరె వారి వారి రుచు లవి గా దిది (వి ?) యనగాదు
కందువ జీవులు విచారించేటి కార్యాకార్యము లిఁక నేదయ్యా. ॥ఏమి॥

కొంత భూమి నటు చీఁకటి నిండిసఁ గొంత భూమి వెన్నెల గాయు
కొంతట సురలును కొంతట నసురలు కోరికై కొనిరి జగ మెల్లా
యింతట శ్రీవెంకటేశ్వర నీవే యిందరి యంతర్యామివి
చింతలు వాయవు మెవ్వరిమనసునఁ జేరి నీకు శరణంటేఁ గాని ॥ఏమి॥ 57

సామంతం

అణుమాత్రపుదేహి నంతే నేను
మునిఁగెద లేచెద నుందర గానను. ॥పల్లవి॥

తగు సంసారపు తరఁగలు నీమాయ
నిగమముల యడవి నీమాయ
పగలు నిద్రలువుచ్చే భవములు నీమాయ
గగనపు నీమాయఁ గడవఁగ వశమా. ॥అణు॥

బయలు వ దిసి కర్మబంధములు నీమాయ
నియమపుఁ బెనుగాలి నీమాయ
క్రియ నిసుకపాతర కెల్లొత్తు నీమాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా. ॥ అణు॥

కులధనములతోఁ జిగురుఁగండె నీమాయ
నిలువు నివురగాయ (?) నీమాయ
యెలమితో శ్రీవెంకటేశ నీకు శరణని
గెలుచుట గాక యిదె గెలువఁగ వశమా. ॥అణు॥ 58

బౌళి

ఎన్నఁడు దీరవు యీపనులు
పన్నిన నీమాయ బహుళ్యం బాయ. ॥పల్లవి॥

పెక్కు మతంబుల పెద్దలు నడచిరి
వొక్క సమ్మతై వొడఁబడరు
పెక్కు దేవతలు పేరు వాడెదరు
తక్కక ఘనులము తామే యనుచు. ॥ఎన్న॥

పలికెటి చదువులు బహుమార్గంబులు
కలసి యేకవాక్యత గాదు
చ (ఛ ?) లవాదంబులు జనులును మానరు
పలు తర్కంబులె పచరించేరు. ॥ఎన్న॥

శరణాగతులకు శ్రీవెంకటేశ్వర
తిరముగ నీవే తీర్చితివి
పరమవైష్ణవులు పట్టిరి వ్రతము
యిరవుగ నాచార్యు లెరుఁగుదురు. ॥ఎన్న॥ 59

261-వ రేకు. బౌళి

ఇంతలోనే మెచ్చరేది యింతలో మోసపోయేది
చెంత వలసినట్లఁ జేసుకొంట (?) దేహికి. ॥పల్లవి॥

నిమిషములోనిది నింగిఁ దిరిగాడేది
జమళిలోను వెలికి సరి తూఁగేది
సమతై వుంటే నుండు చాలించి పోతేఁ బోవు
భ్రమవంటిది ప్రాణము పట్టరాదు దేహికి. ॥ఇంత॥

నీరుబుగ్గవంటిది నిచ్చకొత్తలైనది
పోరచి పంచభూతాల పొరుగైనది
తీరితేనే తీరును తీరకుండితే నిలుచు
నారువంటిది మేను నమ్మరాదు దేహికి. ॥ఇంత॥

రేపు మాపులైనది రెండు మొకాలైనది
పై పై శ్రీవెంకటేశుభారమైనది
రూపై దగ్గరి యుండు రుచులై యెదుట నుండు
తీపువంటిది కాలము తెగదెందు దేహికి. ॥ఇంత॥ 60

## దేవగాంధారి

పాపము పాపము ప్రజలాలా
పైపై నిటువలెఁ బలుకకురో. ॥పల్లవి॥

హరియందుఁ బుట్టినవాఁడును శివుఁడును
హరితో సరివీరను రటు
పోరిఁ గొండలందుఁ బుట్టినశిల లివి
సరుసఁ బెట్టితే సరియౌనా. ॥పాప॥

యిందిరాధిపుని విలఁగల సిరు లివి
అంది మరొకరివి అను ట్లొ
కొఁదరము పేరు గుడిచి కాలువలఁ
బొంది పొగడితేఁ బొసఁగీనా. ॥పాప॥

శ్రీవేంకటపతిసేవకులకు సరి
ఆవల మరి కల రను టెట్లు
కావించిన యల కామధేనువుల
కేవి యూరఁబసు లీడవునా. ॥పాప॥ 61

గుజ్జరి

చెప్పఁగా నెఱఁగరా చేరి వేదవ్యాసులు
తప్పక చేతు లెత్తి దైవమితఁ డన్నది. ॥పల్లవి॥

యిరవుగా నెఱఁగరా యెల్ల దేవతలలో
పొరిఁ గృష్ణుఁడు అగ్రపూజ గొన్నది
థిరమై తెలియరా యీదేవునిపాదపూజ
హరుని శిరసుమీఁద నమరి వుండినది. ॥చెప్ప॥

యింకా నెఱఁగరా యితని రామమంత్రము
తెంకినుండి హరుఁడుపదేశించేది
పొంకమెఱఁగరా భువిమీఁద శరభము
మంకుదనమెల్లఁ దీర మాఁపివేసినది. ॥చెప్ప॥

చూచియు నెఱఁగరా సారిది శ్రీవెంకటాద్రి
నేచినవరము లెల్లా నియ్యఁగాను
కాచేదెఱఁగరా ఘనుడితఁ డెవ్వరైనా
చేచేత శరణంటేఁ జేకొనే బిరుదు. ॥చెప్ప॥ 62

వసంతవరాళి

పెఱుగఁగ బెఱుగఁగఁ బెద్దలమైతిమి నేము
కలకలలే కాని కడగంట లేము, ॥పల్లవి॥

సరి నిన్న భుజియించి చాలు నన్నయన్నవే
అరిది నేఁడప్పటిని నాస రేఁచీని
ధరలో రాతిరి గూడి తనిసినసతులే
పరగ నప్పటిని విభ్రాంతి రేఁచీని. ॥పెఱు॥

మాయఁ గట్టినిడిచిన మలినపుఁ గోకలు
యీయెడ నుదికితేనే యిచ్చ రేఁచీని
కాయముపై మోఁచి పెట్టెఁ గట్టివేసిన సొమ్ములు
మాయలై దినదినము మమత రేఁచీని. ॥పెఱు॥

నీవు వట్టిన చలమో నేను సేసినట్టి తప్పో
శ్రీవెంకటేశ్వరుఁడ చిక్కితి మిందు
మోవరాని మోపయి మొలుగనియ్యదు మమ్ము
చేవసంసారముపైఁ జిమ్మి రేఁచీని. ॥పెఱు॥ 63

బౌళి

ఇంకా నేలా తర్కవాదములు యిన్నియు నిందునే ముగిసెను
యింకా నేలా కొందరు మోక్షం బెవ్వరికిని లేదనుమాటా ॥పల్లవి॥

సరయువుపొంతను సకలజీవులకు
సిరుల మోక్ష మిచ్చితి వని విన్నపుడే
మరలుచు నాయనుమానము వాసెను
ధరసీ వొకఁడవే దైవమవని కంటి నయ్యా. ॥ఇంకా॥

తగిన లంకవొద్దను రాక్షసులను
తెగ నడిచి ముక్తితెరువు చూపినపుడే
వగలఁ బెక్కు దేవతల వరంబులు
బగితి సీమగకు సరిగా వయ్యా. ॥ఇంకా॥

యేమని చెప్పుదు నిట్టి నీమహిమ
వేమరుఁ బురాణవిధి విన్నపుడు
శ్రీమంతుఁడవు శ్రీవేంకటేశ్వర
కామించ నీకంటే ఘనము లేదు గదవో యయ్యా. ॥ఇంకా॥ 64

సామంతం

అన్నియుఁ జదివితిఁగా ఆహా నేను
నున్నని మాటల నోరు నుడిగెఁ దేవో. ॥పల్లవి॥

వొద్దనుండే నాజన్మ మోహో మఱచితిఁగా
చద్దినంటి మాతల్లి చన్ను మఱచితిఁగా
బుద్దులతోఁ బొరలే మలమూత్రగు మఱచితిఁగా
యెద్దువంటివాఁడ నేను యెఱిఁగేటి దేవో. ॥అన్ని॥

యిప్పటివి రేపటి కెంచి తనియలేఁగా
తప్పక కాంతలఁ జూచి తలఁపు దనియలేఁగా
ముప్పిరిఁ బెక్కుగాలను ముదిసిఁ దనియలేఁగా
పిప్పివంటివాఁడ నేను పెనఁగేటి దేవో. ॥అన్ని॥

యేడదో యీదేహ మాత్ర యే నేను నెఱఁగఁగా
కూడినమరు వెక్కడో గురుతూ నెఱఁగఁగా
యీడనే శ్రీవెంకటేశుఁ డిట్టె నన్నుఁ గాచెఁగా
నీడవంటివాఁడ నేను నేయుపింకనేదో. ॥అన్ని॥ 65

262-వ రేకు దేవగాంధారి

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ. ॥పల్లవి॥

ఆదినుండి సంధ్యాదివిధులలో
వేదం బయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీధివీధులనే విష్ణుకథ. ॥విన॥

వదలక వేదవ్యాసులు నుడిగిన
విదితపావనము విష్ణుకథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకినచోటనే విష్ణుకథ. ॥విన॥

గొల్లెతలు చల్లలుగొనకొని చిలుకఁగ
వెల్లవిరి యాయ విష్ణుకథ
యిల్లిదె శ్రీవెంకటేశ్వరునామము
వెల్లిగొలిపె నీ విష్ణుకథ. ॥విన॥ 66

సాళంగనాట

భవరోగవైద్యుఁడవు పాటించ నీవొకఁడవే
నవనీతచోర నీకు నమో నమో. ॥పల్లవి॥

అతివ లనెడి సర్పాలవిషాలు గఱచిన
తతి మదనవిషాలు తల కెక్కెను
మితిలేనిరతులఁ దిమ్మిరి వట్టె దేహాలు
మతి మఱచె నిందుకు మందేదొకో. ॥భవ॥

పొలఁతులనెడి మహాభూతాలు సోఁకిన
తలమొలలు విడి బిత్తలై యున్నారు
అలరు చెనకులచే సంగములు జీర లాయ
మలసి యిందుకు నిఁక మంత్రమేదొకో. ॥భవ॥

తరుణులకౌఁగి లనే తాపజ్వరాలు వట్టి
కరఁగి మేనెల్ల దిగఁ గారఁ జొచ్చెను
నిరతి శ్రీవెంకటేశ నీవే లోకులకు దిక్కు-
అరుదు సుఖానకుండే యంత్ర మేదొకో. ॥భవ॥ 67

సామంతం

కలిగిననాఁడే చుట్టరికంబులఁ దిరుగు నివి
నలుగడ నివి నత మని మాటి నమ్ముట పాపమయా. ॥పల్లవి॥

దేహముతోడనె పెరుగును తీరని యీ యింద్రియములు
దేహముతోడనె ముదియును తేటతెల్లమిగను
ఆహా పుట్టిననాఁడును అంతమునొందిననాఁడును
శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ నివి. ॥కలి॥

తెలిసున్నపుడే తగులును తియ్యని యీసంసారము
తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో
మలయక నిండ్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు
చలమారి జీవునితోడుత సమ్మతమే లేదు. ॥కలి॥

కన్నులు దెరచినయప్పుడే కాన్పించును యీలోకము
కన్నులు మూసినయప్పుడె కడ కడఁ దా నణుగు
అన్నిట శ్రీవెంకటేశ్వరుఁ డాత్మను వెలిగెడివేళను
వున్నతి జీవులఁ దగులవు వోడుగుచుఁ దిరుగు నివి. ॥కలి॥ 68

దేసాళం

ఆతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు
ఆతని మాఁనుట లెల్లా నవిధిపూర్వకము. ॥పల్లవి॥

యెవ్వనిపేరఁ బిలుతురిలఁ బుట్టిన జీవుల
నవ్వుచు మాసనక్షత్రనామములను
అవ్వల నెవ్వని కేశవాదినామములే
రవ్వగా నాచమనాలు రచియింతురు. ॥ఆత॥

అచ్చమై దేవుని నారాయణనామమే గతి
చచ్చేటి వారికి సన్యాసము వారికి
యిచ్చ నెవ్వనిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వనినామములనే సంకల్పము. ॥ఆత॥

నారదుఁడు దలఁచేటి నామమది యెవ్వనిది
గౌరి నుడిగేటి నామకథ యేడది
తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరినామము
యీరీతి శ్రీవెంకటాద్రి నెవ్వఁ డిచ్చీ వరము. ॥ఆత॥ 69

దేవగాంధారి

పంటల భాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటి ముట్టి యిట్లఁ గాపాడుదురు ఘనులు. ॥పల్లవి॥

పొత్తుల పాపమనేటి పోడు నఱకివేసి
చిత్త మనియెడు చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచి వానపదనున
విత్తుదురు హరిభక్తి వివేకులు. ॥పంట॥

కామక్రోధాములనే కలుపు దవ్వివేసి
వేమరు వైరాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువుంబు వేసి
వోముచున్నారు జ్ఞానపుఁబైరు యవ్యోగజనులు. ॥పంట॥

యెందు చూచిన శ్రీవెంకటేశుఁ డున్నాఁడనియెడి
అందినచేనిపంట లనుభవించి
సందడించి తమవంటి శరణాగతులుఁ దాము
గొంది నిముడుకొందురు గురుకృప జనులు. ॥పంట॥ 70

శంకరాభరణం

మానుప వశమా మాయ లివిన్నియు
శ్రీనాథుఁడు మును సేసినవే. ॥పల్లవి॥

రాతిరి చీఁకటి రతిఁ బగలు వెలుఁగు
ఘాతల నెప్పుడు గల దిదియే
యీతల జ్ఞానుల కిలనజ్ఞానుల
జాతివైరములు సహజములే. ॥మాను॥

అసురలకు సురల కనాదినుండియు
అసమున వైరంబది గలదే
పొసగి వైష్ణవుల కిలఁ బ్రాకృతులకు
పొసఁగని వాదము భువిఁ గలదే. ॥మాను॥

యిహమును బరమును యీలంకెలతో
విహితము చెప్పెడి వేదములే
అహిపతి శ్రీవెంకటాధిపు మత మిది
నిహితం బెటిఁగిన నిశ్చలమే. ॥మాను॥ 71

263-వ రేకు సామంతం

ఎక్కడ నున్నాఁ బోదు యేతులైనఁ బోనీదు
వొక్కటి కొక్కబంధము వూహింప నెక్కుడు. ॥పల్లవి॥

బుడిబుడి మాయలఁ బొరలేటి దేహికి
కడవరాని బంధము కాంతలు
యెడపడ కందుకంటే నెక్కుడైన బంధము
కడు నాసఁ బొరలించు కనకము. ॥ఎక్క॥

బాలులకు వృద్ధులకు పాయపు వివేకులకు
తేలించే బంధములు దినరుచులు
మూల నున్నాఁ బోనీదు మున్నిటినే వేసేది
వేళ గాచిన బంధము విద్యాగర్వము. ॥ఎక్క॥

పాయ దేజంతువులైనాఁ బశుపక్షులకునైనా
బాయటి గిములఁ గట్టుఁబాటు బంధము
యేయెడ శ్రీవెంకటేశ యింక నీదాసులకైతే
చాయైె చెప్పినట్టు నేసు సకలబంధములు. ॥ఎక్క॥ 72

## మలహరి

దైవమా యేమి సేతు తలఁప నీవే దిక్కు-
భావించి చదువఁబోయి పశుబుద్ధి నైతి. ॥పల్లవి॥

కననా సంసారము కడలేని భారమాట
కనినాఁ దొలఁగరాదు కాలురులు
విననా యీదేహము విరసపు హేయమాట
వినినా జిగురుఁగండె విడిపించరాదు. ॥దైవ॥

తెలియనా యింద్రియాలు ద్రిష్టపు విరోధమాట
తెలిసినాఁ బోఁగువలె దెంచరాదు
పలుకనా పాపములు పాయని బంధములని
పలికినాఁ గొన్న వెట్టిపట్టి తోయరాదు. ॥దైవ॥

మెఱఁగనా యీలోక మిది మాయమయ మని
మెఱిఁగినాఁ బడ్డవోఁద మెక్కరాదు
మెఱయ శ్రీవెంకటేశ మేనిలోననే వుండి
మఱియును నన్ను నేల మన్నన సేసితివి. ॥దైవ॥ 73

పాడి

మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి
కొంచెము (మొ?) దొడ్డో సరి కోరి యిందు కందుకు. ॥పల్లవి॥

చేసేటి పుణ్యములకు చెందేటి పాపములకు
యీసుల సరికి సరి యిందు కిందుకు
వాసులఁ బుట్టుగులకు వడి మరణాలకును
ఆసల సరికి సరి అందు కందుకు. ॥మించి॥

దినదిన సుఖాలు తీదీపు దుఃఖములకు
మొనసి సరికి సరి యిందు కిందుకు
ఆనుఁగుఁ బున్నమలకు అమాసచీఁకట్లకు
అనయము సరికే సరందు కందుకు. ॥మించి॥

శ్రీవెంకటేశ యిట్టి జీవులకు నేది గతి
యేవి చూచిన సరికి సరిందు కిందుకు
వేవేగ నీశరణని వెలసి బ్రతికితిమి
యేవల్ల లేదు సరి యెందు కం(కెం?)దుకు. ॥మించి॥ 74

సాళంగనాట

హరి యిచ్చినవరము లటువలెఁ గావుగా
తిరమై వివేకు లెల్లాఁ దెలిసేటి దిదియె. ॥పల్లవి॥

శిరసులు తుంచి తుంచి చిచ్చులోన వేలిచి
వరములు వడసె రావణుఁ డెన్నైనా
నిరతి రామునిచేత నిమిషములోననే
వరము లన్నియు నెందో వరతిపా లాయ. ॥హరి॥

వీరఘోరతపముల వెలయ బాణాసురుఁడు
కోరి చేకొన్న వరాలు కోటానఁగోటి
వూరకే కృష్ణునిచేత నొక యినుమంతలోనే
తోరమై వరములు తుత్తునియలాయ. ॥హరి॥

వట్టి జాలిఁ బొరలక వరుస విభీషణుఁడు
జట్టిగ రఘుపతికి శరణనెను
నెట్టన నాతనిఁ గాచె నేఁడూ నున్నాఁ డదె
యిట్టె శ్రీవెంకటాద్రి నిచ్చు వరములు. ॥హరి॥ 75

మాళవి

వీఁడు గదే శేషుఁడు శ్రీవెంకటాద్రి శేషుఁడు
వేఁడుక గరుడనితోఁ బెన్నుద్దైన శేషుఁడు. ॥పల్లవి॥

వేయిపడిగలతోడ వెలసిన శేషుఁడు
చాయమేని తళుకువజ్రాల శేషుఁడు
మాయని శిరసులపై మాణికాల శేషుఁడు
యేయెడ హరికి నీడై యేఁగేటి శేషుఁడు. ॥వీఁడు॥

పట్టపు వాహనమైన బంగారు శేషుఁడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుఁడు
నట్టుకొన్న రెండువేలు నాలుకల శేషుఁడు
నెట్టన హరిఁ బొగడ నేరుపరి శేషుఁడు. ॥వీఁడు॥

కదిసి పనులకెల్లఁ గాచుకున్న శేషుఁడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుఁడు
అదె శ్రీవేంకటపతి కలనేలుమంగకును
పదరక యేపొద్దూ పానుపైన శేషుఁడు. ॥పీఁడు॥ 76

శ్రీరాగం

ఎక్కడి విరతి మాకు నిహా మెల్లాఁ దగులు
మక్కళించీ మక్కళించీ మాయకింతాఁ దగులు. ॥పల్లవి॥

పుట్టినప్పుడే పాపపుణ్యములు దగులు
అట్టె యీదేహమున కన్నమూఁ దగులు
గట్టిగా నీరెండూ నైతే కర్మమూఁ దగులు
యెట్టునుఁ బోరాదు మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥

మనికి సంసారి యైతే మమతలు దగులు
పెనగఁగఁ బెనగఁగా బిడ్డలూఁ దగులు
అనువై యీలంపటాన కాసలెల్లాఁ దగులు
మన సొక్కటొక్కటై మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥

అరయ శ్రీవెంకటేశుఁ డాత్మలోనే తగులు
శరణన్నవారికి విజ్ఞానము దగులు
గరిమ నిందువల్లనే ఘనమోక్షమూఁ దగులు
కూరిగినప్పుడే సుమ్మీ మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥ 77

264-వ రేకు శుద్ధవసంతం

కడనుండే విజ్ఞానికిఁ గ్గా దిటువలెను
వొడలిరోఁతలు చూచి వూరకైనా నవ్వను. ॥పల్లవి॥

ఆఱడిఁ బ్రామగరచినట్టివాఁడు దినఁబోతే
జాఱని వేఁపచేఁదైనాఁ జప్పనై తోఁచు
వీఱిడై సంసారపు విష మెక్కినవానికి
చూఱలై హేయకాంతలు సుఖములై తోఁచును. ॥కడ॥

చెంగట వెట్టివానికి చేసిన చేఁత లెల్ల
తొంగలించి వివేకాలై తోఁచినట్లు
మింగుచుఁ గర్మపు నామమేసిన సంసారికి
అంగడి కర్మనే బ్రహ్మమై తోఁచును. ॥కడ॥

జగమిది యొక్కటే చవులు వేరే వేరే
మొగి నెఱుక మఱపు ముడి చున్నది
పగటు శ్రీవెంకటేశుఁ బట్టి కొలువనివాఁడు
తెగని మాయలలోనఁ దేలాడవలసె. ॥కడ॥ 78

బౌళి

నరహరి నీదయమీఁదట నాచేఁతలు గొన్నా
శరణాగతియును జీవుని స్వతంత్రము రెండా. ॥పల్లవి॥

మొఱయుచు నరకపు వాకిలి మూసిరి హరి నీదాసులు
తెఱచిరి వైకుంఠపురము తెరువుల వాకిళ్ళు
నఱకిరి పాపము లన్నియు నుగ్గుగ నిటు తూర్పెత్తిరి
పెఱవము వెఱవము కర్మపువిధులిఁక మా కేలా. ॥నర॥

పాపిరి నాయజ్ఞానము పరమాత్ముఁడ నీదాసులు
చూపిరి నిను నామతిలో సులభముగా నాకు
రేపిరి నీపై భక్తిని రేయినిఁ బగలును నాలో
వోపము వోపము తపములు వూరకె యిఁక నేలా. ॥నర॥

డిద్దరి నీధర్మమునకు దేవా శ్రీవెంకటేశ్వర
అద్దిరి నీదాసులు నీఆనందములోన
యిద్దరి నీ నా పొందులు యేర్పరచిటువలెఁ గూర్చిరి
వొద్దిక నొద్దిక నా కేఁక నుద్యోగము శేలా. ॥నర॥ 79

ముఖారి

ఎంత విచారించుకొన్నా నిదియే తత్వము హరి
వంతుకు నీకృప గలవాఁడె యెరుఁగు హరి. ॥పల్లవి॥

నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్ను నొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మ్రొక్కి బ్రదికిరి హరి
వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి. ॥ఎంత॥

యేపున నీ పేరిటివాఁడిన్నిటా ధన్యుఁడు హరి
నీపే రొల్లనివాఁడు నిర్భాగ్యుఁడు హరి
కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్ను దిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి. ॥ఎంత॥

యిట్టి నీవిచ్చిన పరమెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగ నీవియ్యనివి కపటములే హరి
అట్టి శ్రీవెంకటేశుఁడవంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న వొచ్చెము దేహికి హరి. ॥ఎంత॥ ౮౦

సామంతం

ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము తానె. ॥పల్లవి॥

మది జలధుల నొక దైవము వెదకిన మత్స్యావతారంబితఁడు
అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీ విష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదఱక కొండల గుహల వెదకితే శ్రీనరసింహంబున్నాఁడు. ॥ఇత॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁ డొకఁ డైనాఁడు
తలఁపున శివుఁడును బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు
కెలఁకుల నావులమందల వెదకిన కృష్ణుఁడు రాముఁడు నైనారు. ॥ఇత॥

పొంచి యసురకాంతలలో వెదకిన బుద్ధావతారం బైనాఁడు
మించినకాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యవతారము
అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుకయిహమునబరమున వెదకినయీతఁడే శ్రీవేంకటవిభుఁడు. ॥ఇత॥ 81

## లలిత

చాలుఁ జాలు నీ హరియే మాకును సకలక్రియలకు నాయకుఁడు
నాలుకతుదనే యీతఁడుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము. ॥పల్లవి॥

యేలినవాఁడట లక్ష్మివిభుఁడట యేమిటను గొరత మాకిఁకను
నాలో నున్నాఁడు బ్రహ్మతంత్రియట నాకాయుష్యము బాఁతా
పాలజలధిపై దేవునివారము పాఁడి మాకు నిఁక నే మరుదు
ఆలింపఁగ నే మింతటివారము అన్యుల కిఁకఁ జెయి చాఁచేమా. ॥చాలు॥

భూకాంతాపతికింకరులము యీ భూము లన్నియును మాసొమ్మే
పైకొని చక్రాయుధుఁడే మా దాపు భయము లిన్నిటాఁ బాసితిమి
యీకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశము లేదు
యేకొఱఁతని యిఁక నాసపడుచు నే మెవ్వరికి నోళ్లు దెరచెదము. ॥చాలు॥

శ్రీవైకుంఠునిదాసులమట యరచేతిది మోక్షము మా కిదివో
పావనగంగాజనకునిబంట్లము పాపములన్నిటఁ బాసితిమి
శ్రీవెంకటపతి వరములియ్యఁగాఁ జిక్కిన వెలుతులు మా కేవి
యీవైభవములఁ దనిసిన మాకును యితరులఁ దగిలెడి దిఁక నేది. ॥చా॥ 82

265-వ రేకు. లలిత

ధరఁ గడపట నే జంతువుకైనా తన జన్మమె సుఖమై తోఁచు
హరి గలఁడని తా నమ్మి వుండఁగా నతఁడిచ్చేసుఖమెవ్వరు. ॥పల్లవి॥

మొదలఁ గొందరికి స్వర్గలోకమే మోక్షసుఖంబని తోఁచును
అదె కొందరికి దేవత్వమె బ్రహ్మానందంబై తోఁచును
వుదుటునఁ గొందరికి సంసారమే వున్నతసుఖమై తోఁచును
తుదనా మీఁదటి హరిదాస్యసుఖము ధ్రువపట్టంబని కానరు. ॥ధర॥

సారిది గొందరటు శూన్యతత్త్వమే సుఖమని మాటలనందురు
యిరవెరఁగని వారికి ధనధాన్యము లెక్కువ సుఖమై తోఁచును
నిరతిఁ గొందరికి చిరజీవు లౌటె నిత్యసుఖంబని తోఁచును
వరుసల శ్రీపతిపై భారంబిడె వైరాగ్యపుసుఖ మెఱుంగరు. ॥ధర॥

యెక్కడ చూచిన మాయలసుఖములు యెన్నైనాఁ గలవెప్పుడును
చొక్కపు శ్రీవెంకటపతితోడుత సుఖియించెటిసుఖ మెవ్వరు
యిక్కడ నక్కడ నితనిదాసులే యేచి సుఖంతురు నిజసుఖము
కిక్కిరిసిన యజ్ఞానాంధకారులు కిందును మీఁదును నెరఁగరు. ॥ధర॥ 83

మాలవారి

నీ కెటు వలసె నటు సేయి నీ చిత్తము నాభాగ్యము
యేకధనైనా లక్ష్మీకాంతుఁడ యిదియే పో నా విన్నపము. ॥పల్లవి॥

నా గుణములే యెంచితినా నరకకూపములు చాలవు
ఆగతినే నాకర్మములు అనుభవించి తీర్చేనంటే
నీగుణములే యెంచితివా నిఖిలసంపదలు చాలవు
యీగి నను గరుణించి యెపుడు నీవిచ్చే నంటేను. ॥నీకె॥

నా పాపములే లెక్కించితినా నదులయిసుకలును జాలవు
యేపున నెంతైనా గలదు అది యెన్నఁడు దీరును దేవా
చేపట్టి నీవు రక్షించిన యాజీవుల నెంచితివా తొల్లి
చూపట్టెడి యీ యాకాసంబుపై చుక్కలకంటే ఘనము. ॥నీకె॥

మఱి నాసుద్దులు యెంచఁగ నెంచఁగ మంచముకిందె నూయి
గుఱి నీకథలివి వినఁబోతే నివే కొండలుఁ గోటానఁగోట్లు
నెఱవుగ శ్రీవెంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని
తఱి దరి చేర్పఁగఁ గూడు వెట్టఁగా దైవగు నీకే భారము. ॥నీకె॥ 84

## లలిత

అరసి నన్ను గాచినాతనికి శరణు
పరము నిహాము నేలే పతికిని శరణు. ॥పల్లవి॥

వేదములుదెచ్చినట్టి విభునికి శరణు
ఆదిమూల మంటే వచ్చినతనికి శరణు
యేదెసాఁ దానై యున్న యీతనికి శరణు
శ్రీదేవిమగఁడైన శ్రీపతికి శరణు. ॥అర॥

అందరికిఁ బ్రాణమైన ఆతనికి శరణు
ముందు మూఁడుమూర్తుల మూర్తికి శరణు
దిందుపడి దేవతలదేవునికి శరణు
అంది మిన్ను నేల నేకమైనతనికి శరణు ॥అర॥

తానె చేతన్యమైన దైవానకు శరణు
నానాబ్రహ్మాండాల నాథునికి శరణు
ఆనుక శ్రీవెంకటాద్రియందునుండి వరములు
దీనులకిందరికిచ్చే దేవునికి శరణు. ॥అర॥ 85

మంగళకౌశిక

ఇది నమ్మలేఁడు ప్రుణ్యా లేమేమో చేసీ దేహి
పొదలి యిందువంకనే పొడ వెక్క లేఁడా. ॥పల్లవి॥

మంచి మందు గొన్నవాఁడు మహామహారోగముల
అంచెలఁ బాసి సుఖ యయ్యీ నట
అంచితపు హరినామ మనే మందు గొన్నవాఁడు
పొంచి పాపరోగములఁ బోఁ దోల లేఁడా. ॥ఇది॥

జోడు దొడిగినవాఁడు చొక్కపు టలుగులకు
వోడక రణజయము నొందీ నట
వాడక హరిదాస్యపు వజ్రపంజరపువాఁడు
వీడ జన్మపుటమ్ములు విదలించ లేఁడా. ॥ఇది॥

వైపగుఁ గాణాచి గలవాఁడు దరిద్రముఁ బాసి
పైపై సంపదలతో బ్రదికీ నట
దాపై శ్రీవెంకటేశుపాదములందుఁ గాణాచి
యేపొద్దూఁ గలుగువాఁడు యెక్కువ గాలేఁడా. ॥ఇది॥ 86

గుండక్రియ

ఎక్కడి వుద్యోగాలు నేడ కెక్క జీవునికి
నిక్కి చూచి హరి గరుణించినదాఁకాను. ॥పల్లవి॥

తనిసినవారు లేరు తగ నింద్రియభోగాలు
పెనఁగఁ బెనఁగఁ బైపైఁ బెరుగుఁ గాని
మనసులోనికి రాదు మాటలలోని విరతి
తునిగినట్లు నుండు దొరకుదాఁకాను. ॥ఎక్క॥

విడిచినవారు లేరు విషయాలు సంపదలు
వుడుగక కోరఁగోర నొదగుఁ గాని
పుడమి విన్నట్టుండదు పుస్తకాలలో చదువు
నడుమంత్రముల నుండు నానినదాఁకాను. ॥ఎక్క॥

తెలిసినవారు లేరు దేవుని నాతుమలోన
పలు లంపటాలఁ బడి భ్రమసుఁ గాని
యెలమి శ్రీవెంకటేశుఁ డేమిటా మెచ్చఁడు తన్ను
దలఁచి భక్తితోడ దగ్గరుదాఁకాను. ॥ఎక్క॥ 87

266-వ తేకు పాడి

సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె బదికించు నిదియె. ॥పల్లవి॥

మనసులో పాపబుద్ధి మరి యెంత దలఁచినా
నిను దలఁచినంతనే నీరౌను
కనుఁగొన్న పాపములు కడలేని వైనాను
ఘనుఁడ నిన్నుఁ జూచితే కడకుఁ దొలఁగును. ॥సక॥

చేత నంటి పాతకాలు నేనగా నేఁ జేసినాఁను
ఆతల నీకు మొక్కితే నన్నియుఁ బాయు
ఘాతలఁ జెవుల వినఁగా నంటినపాపము
నీతితో నీకథ వింటే నిమిషానఁ బాయును. ॥సక॥

కాయమునఁ జేసేటి కర్మపుఁ బాపములెల్ల
కాయపు నీముద్రలచే గక్కన విడు
యేయెడ శ్రీవెంకటేశ యే యే పాతకమైనా
ఆయమైన నీశరణాగతిచే నణఁగు. ॥సక॥ 88

లలిత

రెప్పల మరఁ గడే రేపును మాపును
యిప్పుడె తోచీ నిదివో కీలు. ॥పల్లవి॥

మనసున నున్నవి మాయ లన్నియును
మనసు మరచితే మాయలు మరచును
పనివడి మనసును బారఁగ విడిచిన
కనుఁగొన మాయలు కడ లేవివిగో. ॥రెప్ప॥

దేహమున నున్నది తెగని లంపటము
దేహ మఱఁచితేఁ దెగును లంపటము
వూహల దేహాన నోమఁగఁ దొడఁగిన
మోహపు మాయలు మోపులకోలఁది. ॥రెప్ప॥

ఆతుమ నున్నాఁడు అంతరాత్మకుఁడు
ఆతుమ మరచిన నాతఁడు మరచును
యీతఁడె శ్రీవెంకటేశ్వరుఁ గొలిచిన
చేచేతనే సుఖములు సేనాసేన. ॥రెప్ప॥ 89

మాళవి

అన్నియు నాయందే కంటి నన్నిటివాఁడా నేనే
మున్నె నాభావములో ముడిచివేసినది. ॥పల్లవి॥

చెలఁగి సంసారమే చింతించి సంసారి నైతి
ములిగి ముక్తి దలఁచి ముక్తుఁడ నైతి
పలు మతాలు దలఁచి పాషండబుద్ధి నైతి
చెలఁగి శ్రీపతిఁ దలఁచి వైష్ణవుఁడ నైతి. ॥అన్ని॥

పొసఁగఁ బుణ్యము సేసి పుణ్యాత్ముఁడ నైతి
పసలఁ బాపము చేసి పాపకర్ముఁడ నైతి
వెస బ్రహ్మచారి నైతి వేరే యాచారమున
ముసిపి మరొకాచారమున సన్యాసి నైతి. ॥అన్ని॥

వాగి నోడ్డభాషలాడి వోడ్డవాఁడ నైతిని
తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగువాఁడ నైతి
అగడై శ్రీవెంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీదాసుఁడనై దాసరి నే నైతి. ॥అన్ని॥ 90

## సాళంగనాట

ఇహాపరములు గొనానీ దేవుఁడే
సహజ మిన్నిటాను సర్వేశుఁడే. ॥పల్లవి॥

తలఁచి చూచినాను తనలోనే మఱచిన (నా ?)
తలఁపులకొనవాఁడు దైవ మొకఁడే
పలికి చూచినాను పలుకక మానినాను
పలుకులకొనవాఁడు పరమాత్ముఁడే. ॥ఇహా॥

కనుఁగొని చూచినాను కనురెప్ప మూసినాను
కనుచూపుకొనవాఁడు కమలాక్షుఁడే
విని యాలకించినాను విన కట్టి మానినాను
వినుకులకొన నెల్లా విష్ణుఁ డొక్కఁడే. ॥ఇహా॥

మేలుకొని వుండినాను మించి నిద్దిరించినాను
కాలముకొనలవాఁడు ఘనుఁ డీ హరే
యీలాగు శ్రీవెంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
కీలు విచారించితే కృష్ణుఁ డితడే. ॥ఇహ॥ 91

## ధన్నాసి

నే నేమి బ్రాఁతి నీకు నీ ఋణము పాపలేను
నానావిధముల నీవే నన్ను బ్రోయవుగా. ॥పల్లవి॥

మతిలో చీఁకటి మాన్ప మాణిక్యదీపమవై
సతమై నాలికెపై కీ చవిదేనవై
కతలై నన్ను జొక్కించఁ గర్ణామృతమవయి
గతి వైతివిగా నాకుఁ గమలారమణా. ॥నేనే॥

చేరి నా కన్నులెదుట శృంగారరసమవై
ఆరసి రక్షింపఁ బితురార్జితమవై
సారపు టిహాపరాల సంసారసుఖమవై
యీరీతిఁ బెంచితిగా నా కిందిరారమణా. ॥నేనే॥

తను విచ్చి జీవునికిఁ దల్లివి దండ్రివినై
ధనమవై నాదాతవు దైవమవునై
అనుఁగు శ్రీవెంకటేశ అంతరాత్మవు నీవై
నను మన్నించితివిగా నారాయణా. ॥నేనే॥ 92

## శంకరాభరణం

ముగియదు కాలము ముందరి కింకాఁ
దెగని ప్రవాహము దినదిన మిదిగో. ॥పల్లవి॥

పొంకపు హరిచే బొడమిన జగమిది
యింకాఁ బొడమీ నివి గొన్ని
కంకిగఁ జెరువులు కాల్వలు నంటా
అంకెల నిర్మితమయ్యీ నివిగో. ॥ముని॥

దేహము భోగించి దించినవిషయము
లీహల మీఁదెత్తె నివి గొన్ని
ఆహారములై అన్యస్త్రీలై
వూహలనే నోరూరించీ నివిగో. ॥ముని॥

మనసునఁ దలఁచిన మాయలు కమ్మర
నినుమడించె మతి నివి గొన్ని
కనుఁగొని శ్రీవెంకటపతిదాసులు
పెనఁగి పెంచఁగాఁ బెరిగీ నిదిగో. ॥ముని॥ 93

267_వ రేకు. లలిత

పెద్దతెరు వుండఁగాను పెడగంతలు దీసుక
పొద్దువోక యడవులఁ బుంగుడయ్యేరు. ॥పల్లవి॥

తొల్లిటిపెద్ద లెంచిరి దొడ్డవాఁడు హరి యంటా
అల్లదె భారత రామాయణ భాగవతములు
యిల్లిదె నేఁటిపెద్దలు యెవ్వరో దైవము లంటా
వెల్లవిరిగా నింకా వెదకేరు. ॥పెద్ద॥

దేవలోకమువారు దేవుఁడు శ్రీపతి యని
భావించి మొర వెట్టి బ్రదికిరి
యీవల నిప్పటివారు యిందరికి మొర వెట్టి
కావిరి నెవ్వరివారు గాక వున్నారు. ॥పెద్ద॥

నానా భూములవారు నమ్మి శ్రీవెంకటపతిఁ
గాన వచ్చి యేఁట నేఁట ఘనులయ్యేరు
యీ నిజ మిక్కడివారు యిన్నియుఁ దెలి శుండియు
మానక చలాలఁ బోయి మాయలఁ బొందేరు. ॥పెద్ద॥ 94

లలిత

నా కేల విచారము నా కేల యాచారము
సాక్షిరై నవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు. ॥పల్లవి॥

ప్రపంచమధీనము పాలుపడ్డ దేహ మిది
ప్రపంచముతోడి పాటు పరగీని
యెపుడు నీయాతుమ యీశ్వరాధీనము
అపు డాతఁడెట్టునిచె నట్టె అయ్యీని. ॥నా కే॥

కర్మాన కధీనము కలిములు లేములు
కర్మమెట్టు గల్పించెఁ గలిగీని
అర్మిలి నా యాచార్యునధీనము మోక్షము
ధర్మ మతనికృపను తానే వచ్చీని. ॥నా కే॥

చిత్తమున కధీనము చిల్లరయింద్రియములు
చిత్తము చిక్కినప్పుడు చిక్కీనవి
హత్తి శ్రీవెంకటేశుదాస్యమధీనము జన్మము
పొత్తుల నందుకు నది పూఁచినట్టయ్యీని. ॥నా కే॥ 95

మాళవి

ఏఁటి పరిణామము హమ్మేల యడిగే రయ్యా
గాఁటపు హరి యొక్కఁడే గతి మాకిఁక నయ్యా. ॥పల్లవి॥

మరుగుచు శ్రీహరిమాయలోఁ జిక్కినయట్టు
గరిమలఁ గులకాంతకౌఁగిటఁ జిక్కితిమయ్యా
తిరముగఁ గాలములు దిగమింగినయట్టు
సొరిది చవు(ల) మింగుచు నున్నారమయ్యా. ॥ఏఁటి॥

జననిగర్భములోనఁ జక్కఁగా మునిఁగినట్టు
మునుకొని నిద్దురల మునిఁగి వున్నారమయ్యా
చనవునఁ గర్మమనే జలధిలో నున్నట్టు
ధనధాన్యాలనడుమఁ దగిలి వున్నారమయ్యా. ॥ఏఁటి॥

పేదవాఁడు నిధి గని పెక్కువ బతికినట్టు
గాదిలి శ్రీవెంకటేశుఁ గని చెలఁగితి మయ్యా
యీడెస మొక్క దైవ మెదురుగావచ్చినట్టు
ఆ దేవుఁడే మాకు నంతరాత్ముఁ డాయెనయ్యా. ॥ఏఁటి॥ 96॥

బౌళి

సాసముఖా నదె సాసముఖా
ఆసలపరివారము అవధారు దేవా. ॥పల్లవి॥

మత్తిలి జీవుఁ డనేటి మహిమ గలుగురాజు
చిత్త మనియెడి పెద్ద సింహాసనం బెక్కి
బత్తితోఁ బంచేంద్రియపు పరివారము గొలువ
చిత్తజుప రుపత్యము సేసీ నిదివో. ॥సాస॥

కడు మదించినహంకార మనే యేనుగపై
యెడ నెడ నెక్కి తోలీ నిదె జీవుఁ డనురాజు
బడిబడిఁ గర్మముల పౌఁజులు దీర్చరో
వెడమాయపట్టణపువీధుల నేఁగీని. ॥సాస॥

మించిన సంసారమనేమేడలో నేకాంతమున
పొంచి జీవుఁడనేరాజు భోగము భోగించఁగా
అంచెల శ్రీవెంకటేశుఁడనేదేవుఁడు వచ్చి
మంచితనమునఁ దానె మన్నించె నదివో. ॥సాస॥ 97

ముఖారి

నీకు నీ సహజ మిది నాకు నా సహజమిది
యేకడా నీవే నిరుహేతుకబంధుఁడవు. ॥పల్లవి॥

నే నిన్ను దలఁచినా నెఱి నిన్ను మఱచినా
వూని నా యంతరాత్మవై వుండక పోవు
పూని నిన్ను బూజించినాఁ బూజించకుండినాను
కానీ లే యీశ్వరుఁడవు గాక మానవు. ॥నీకు॥

యిట్టె నే నడిగినా నేమీ నడుగకుండినా
జట్టిగా నీవు రక్షించక మానవు
తొట్టి నిన్ను దగ్గరినా దూరమున నుండినాను
పుట్టించి నీగర్భములో బొదలించ కుండవు. ॥నీకు॥

భావించి నీకు మొక్కినాఁ బరాకై మానినా
నేవి చూచినా నీవై యిఁకఁ బాయవు
శ్రీవెంకటేశుఁడ నీవే చింతాయకుఁడవు
కావించేటి నా వుద్యోగము లేమి బాఁతి. ॥నీకు॥ 98

రామక్రియ

కాంతలమానమనేటి కరవట్నాలకు దిగె
మంతనాన జీవుఁ డనే మంచి మరకాఁడు. ॥పల్లవి॥

అరిది సంసార మనే యంబుధిలోనఁ దిరిగి
పురుగతి దేహపుటోడమీఁద
సరిఁ బాపపుణ్యములసరకులు నించుకొని
దరి చేరె జీవుఁ డనే తలమరకాఁడు. ॥కాంత॥

కడలేని నిట్టూర్పుగాలి విసరఁగాను
జడియుఁ గోరికలనే చాపలెత్తి
అడి బరవుగ మాయ అందు నిండా నించుకొని
యెడ తాఁకె జీవుఁ డనే యీ మరకాఁడు. ॥కాంత॥

అలర శ్రీవెంకటేశుఁ డనియేటి మాలిమి
నలుదిక్కులకు నోడ నడపఁగాను
ములిగె ధర్మార్థకామమోక్షధనము గడించి
పలుమాఱు జీవుఁ డనే బలు మరకాఁడు. ॥కాంత॥ 99

268-వ రేకు లలిత

చంకగుదియు యిదే శరణార్తి నే నిదే
తెంకి నా భావము దేవుఁడే యెరుఁగు. ॥పల్లవి॥

కోరెడి చిత్తము కోరక మానదు
వైరాగ్యము నే వదలను
యీరీతి దినములు యిట్లనే కడచి
తేరిన పను లిఁక దేవుఁడే యెరుఁగు. ॥చంక॥

తగు సంసారము తనువునఁ బెనఁగె
వెగటై మోక్షము వెదకేను
పగటున రెంటాఁ బరగిన జీవుఁడు
తెగువలుఁ దగులమి దేవుఁడే యెరుఁగు. ॥చంక॥

పంచేంద్రియములు పారీ నిక్కడ
పెంచఁ బెద్దనై పెరిగేను
అంచెల శ్రీవెంకటాధిపుఁ గొలిచితి
దించని యీమాయ దేవుఁడే యెరుఁగు. ॥చంక॥ 100

లలిత

ఆడుతాఁ బాడుతా నీతో నట్టె ముద్దు గునుసుతా
వోడక నీ దండ చేరి వున్నారమయ్యా. ॥పల్లవి॥

ఆసఁ దల్లిదండ్రిమోము అట్టె చూచి శిశువులు
యే సుఖదుఃఖములుఁ దా మెరఁగనట్టు
వాసుల శ్రీపతి మిమ్ము నడి నాత్మఁ దలఁచుక
యీసుల పుణ్యపాపము లెఱఁగమయ్యా. ॥ఆడు॥

యేలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు
ఆలకించి పనులఁ బోయడుగనట్టు
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా
యేలని యేమియుఁ గోర నెరఁగమయ్యా. ॥ఆడు॥

చేతఁ జిక్కి నిధానము చేరి యింటఁ గలవాఁడు
యేతులఁ గలిమిలేము లెరఁగనట్టు
ఆతుమలో శ్రీవెంకటాధిప నీ వుండఁగాను
యీతల నేవెలుతులు నెరఁగమయ్యా. ॥ఆడు॥ 101

బౌళి

బాపురే వో ప్రాణి బాపురే వో మనసా
వోపనన వెందుకైనా నోడఁబడేవు. ॥పల్లవి॥

మురికిదేహమొకటి మోచుక నీవప్పటిని
మురికిదేహసతుల మోవఁ గోరేవప్పటిని
కరకుహేయము గొంత కడుపున నించుకొని
తిరిగి హేయమేకాను (?) తినఁబోయే వప్పటి. ॥బాపు॥

పసిఁడి కమ్మడు వోయి పరులఁ గొలిచి మరిఁ
బసిఁడి సొమ్మంటాఁ బైఁబెట్టఁ గోరేవు
పిసరుఁ బాపపుణ్యాలఁ బెనఁగేలు గట్టించుక
విసువక అవిద్యే కావించఁబోయే వప్పటి. ॥బాపు॥

పంచభూతములచేతఁ బట్టువడి కమ్మరాను
పంచభూతాల దేహాల బంధులంటాఁ దగిలేవు
అంచెల శ్రీవెంకటేశుఁ డాతుమలో నున్నవాఁడు
యెంచుక తెలిసియును యిట్టె మఱచేవప్పటి. ॥బాపు॥ 102

## భూపాలం

నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగాదేవియును
ధారుణిలోపలఁ బుట్టించితివి తరువాతిపనులు నీకే సెలవు. ॥పల్లవి॥

శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లె
యేపున విషయములందులోఁ దగిలె యేమయిన నీకే సెలవు
చూపరఁబసురము తొరలు వోయినను సొమ్ముగలుగువాఁడే పరవంజూక
పైపైఁ దానే వేదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారము గాన. ॥నారా॥

యీడు లేక శ్రీహరి నీ వుండెడి యీదేహపు నీపరికరమూ
బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడిఁ దిప్పెడి నీకే సెలవు
వోడక యధికులు తమ దాసులు మరివొకరి పంపు లటు సేయఁగను
చూడరు తమబలములనే విడిపించుక తామే రక్షింతురు గాని. ॥నారా॥

శ్రీవెంకటపతి నీవే నన్నిటు సృష్టించినజీవుఁడనింతే
కావిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు
ధావతిఁ దలిదండ్రులు తమబిడ్డలతనువులఁ బంకము లంటినను
యేవిధముల నీరార్చి పెంతు రటు యిన్నిట నీవే గతి నాకు. ॥నారా॥ 103

ధన్నాసి

అందితినిఁ బొందితి నీయం దఖిలభోగములు
కందర్పజనక నాకుఁ గలిగితివిన్నిటా. ॥పల్లవి॥

ఘనకుండలములు నీకథలు నా చెవులకు
ననుపైన రుచులు నీనామములు నాలుకకు
అనువై నీకు మొక్కఁగ నంటిన నొసలిమన్ను
ఎనివడి నాకు నది పట్టబద్ధ(ంధ ?)ము. ॥అంది॥

మంచి నిర్మాల్యపుదండ మంగళసూత్రము నాకు
కాంచనపురాసి నీ చక్కనిరూపు నా మతికి
పంచామృతములు నీ పాదతీర్థము మేనికి
వంచిన ముద్ర లదే వజ్రాంగిజోడు. ॥అంది॥

సకలబంధులు నిదాసానదాసులే నాకు
అకలంక జన్మఫలమన్నిటా నీకృప నాకు
ప్రకటపు శ్రీవెంకటపతివి నాయాతుమలో
మొకరివై యుండి నన్ను మోహించఁ జేసితివి. ॥అంది॥ 104

భూపాలం

పాపముఁ బుణ్యముఁ బరకట నున్నది
చేపట్టుము నీచేతిది ప్రాణి. ॥పల్లవి॥

నాలుకకొనలనె నానుచు నున్నది
గాలపు నిజమును గల్లయును
వాలుచును తాసువలె నున్న దిదే
తాలిమి ధర్మాధర్మములు. ॥పాప॥

చేతులకొనలను చేఁతై యున్నది
జాతిగ నరకము స్వర్గమును
ఆతల వేదోక్తమైన కర్మములు
దాతనె పిడికిటఁ దగిలెను వెదకు (?). ॥పాప॥

మనసుకొట్టఁగొన మాయయు నున్నది
వెనక శ్రీవెంకటవిభుఁడు నదే
తనరిన యాతనిదాస్యము నున్నది
విని చేకొందువు వెదకవో నీవు. ॥పాప॥ 105

269-వ రేకు. లలిత

తప్పదీయర్థమొకటి దాఁచినధనము సుండి
విప్పరాదు చెప్పరాదు వేదమందు నున్నది. ॥పల్లవి॥

హరిభక్తి గలిగినయతనికి మోక్షము
పొరుగుననున్నట్టు పొసఁగినది
దరిశనభక్తిచేఁ దనరినవారికి
యిరవైన మోక్షము యెదిటిది. ॥తప్ప॥

మక్కువ భాగవతాభిమానము గలవారి
కక్కరలేని మోక్షమరచేతిది
నిక్కి యాచార్యాభిమాననిరతులైనవారికిని
తక్కక మోక్ష మింతాఁ దనలోనిది. ॥తప్ప॥

యెంత విచారించుకొన్నా నేనేమి చదివినా
నెంతవారికైనా మోక్ష మిందులోనిది
వింతగా శ్రీవెంకటవిభునిసంకీర్తన
వంతులకు మోక్షము వదనములోనిది. ॥తప్ప॥ 106

మలహరి

ఎవ్వరి దూరఁగఁ జోటు లేదు మరి యేమనఁ గల దిదియో తగవు
యివ్వల నందరి బడిబడిఁ దిరిగే యీకర్మముదే నేరమి. ॥పల్లవి॥

నీదాసులకును నేరమి లేదు నీవే గతి యని వుండఁగను
ఆదినుండి నీకును నేరమి లేదఖిలానకుఁ గర్తవు గాన
పాదుపడక నడుమను దిరిగాడెడి ప్రపంచము దే నేరమి
యేదెస నొకచో నిజమేరుపడక యిటువలెఁ దిరిగాడెడిఁ గాన. ॥ఎవ్వ॥

పాపము లేదిదె యజ్ఞానులకును భావమెఱంగని పశువులు గాన
మోపై సుజ్ఞానులకును బాపము మోవదు నినుఁ గొలిచిరి గాన
చాపలముగ నమ్మించి చెరుచు పలుచదువులదే యీ పాతకము
పైపై నొకయర్థ మేరుపరచక భ్రమయఁగ వాదము వెట్టెడిఁ గాన. ॥ఎవ్వ॥

యీలోకులకును అధర్మము లే దిన్నియు నీచేతలె కాన
మూలనున్న ముక్తులకు నధర్మము మొదల లేదు నీకృప గనక
కాలము గడపుచు నీవు రచించిన కపటపుమాయదె అధర్మము
అలరి శ్రీవెంకటేశ్వర య(యె?)క్కడ నడ్డము తానే వచ్చెఁ గాన. ॥ఎవ్వ॥ 107

బౌళి

ఇదె చిక్కితి విఁక నెందు వోయెదవు
వుదిరి తొలఁగరా దోహో నీవు. ॥పల్లవి॥

జీవులలోపలఁ జెలఁగెటి మూర్తివి
దేవతలకు పరదేవుఁడవు
కైవల్యమునకుఁ గలుగు బ్రహ్మమవు
ఆవలి పరమున కర్థమవు. ॥ఇదె॥

ఘనకర్మమునకుఁ గలిగిన ఫలమవు
మనసులోనికిని మాయవు
తనియని చదువుకు దాఁచిన ధనమవు
మునుప జగములకు మూలమవు. ॥ఇదె॥

వలసినవారికి వర్ణించు రూపవు
సులభులకు సంసార సుఖమవు
అలరిన దాసులమగు మా కైతే
కలిగిన శ్రీవెంకటపతివి. ॥ఇదె॥ 108

## భూపాలం

తెలిసియుఁ దెలియను తెగదీచిక్కేమిటాను
కలకాల మిందుననే గరివడె బ్రదుకు. ॥పల్లవి॥

దేహముపై రోఁత తెలుసుకొనేటివేళ
ఆహా యిదే హేయమై తోఁచును
మోహించి విషయాల మునిఁగినవేళ నిదే
యీహల నంతటిలోనే యితవులై వుండును. ॥తెలి॥

చదివి నేఁ బురాణాలు సారెకు వినేటివేళ
అదివో విరతి ఘనమై వుండును
కదిసి సంసారసుఖకాంక్షలఁ బొందేటివేళ
మది నన్నియు మరచి మద మెక్కి వుండును. ॥తెలి॥

యెక్కడిది వివేక మెవ్వరు గెలిచినారు
చక్కఁ బొడ వెక్కించు చరిఁ దోనును
దిక్కు నీవే శ్రీవెంకటదేవుఁడ నీశరణంటే
యెక్కువ బ్రదుకుఁదోవ యిదియే కలది. ॥తెలి॥ 109

## దేసాక్షి

అల్ల నాఁడే యిదెరఁగమైతిమి గాని
యిల్లిదె దేవునికృప యీడ నున్నది సుండి. ॥పల్లవి॥

చేరువవో మోక్షము శ్రీహరిభక్తికిని
ధారుణిఁ గర్మమునకే దవ్వు గాని
యీరీతి నింద్రియముల నించుకంతే దాఁటిన
దూరముగాదు జ్ఞానపుతోవ వున్నది సుండి. ॥అల్ల॥

ధరఁ జేతిది వైకుంఠ మతనిదాస్యమునకు
పరధర్మముల కగపడదు గాని
అరుదైన యీసల ఆయము వొడిచితేనే
అరసి యీకంతగుండా నంద వచ్చుఁ జూడి. ॥అల్ల॥

తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి
శిలుగుఁ బుణ్యములకుఁ జిక్కదు గాని
తెలిసి శ్రీవెంకటేశుతిరుమంత్రము నాలికెఁ
బలికినాఁడనే దివ్యపద మబ్బుఁ జూడి. ॥అల్ల॥ 110

## సామంతం

మూఁడు మూర్తులనైన ముంచుకొను నీవలపు
వేఁడి విరహానులోనె వేఁచు నీవలపు. ॥పల్లవి॥

పాప మెఱఁగదు వలపు భయ మెఱంగదు వలపు
రూపెఱంగదు మతికి రుచిసేయు వలపు
ప్రాపవయసున పండు వాడమించు నీవలపు
తీపులకుఁ గడు దీప్తి దినదినము వలపు. ॥మూఁడు॥

సిగ్గెఱంగదు వలపు శిరసు కెక్కును వలపు
వొగ్గించు నన్నిటికి వొడిగట్టు వలపు
బగ్గనను నటు గుండె పగిలించు నీవలపు
అగ్గలపు జాణలకు నాయమీ వలపు. ॥మూఁడు॥

తెగువ దెచ్చును వలపు తేలించు నీవలపు
యిగిరించి కలిమి లే మెఱఁగదీవలపు
వగల శ్రీవెంకటేశ్వరుమాయలీవలపు
తగులు విరిగాని(?)వలెఁ దగిలించు వలపు. ॥మూఁడు॥ 111

270-వ రేకు. దేసాళం

ఎదురు లేక చరింతు రెట్టైనా శ్రీవైష్ణవులు
మదించి నేనుగులకు మట్టు మేర వున్నదా. ॥పల్లవి॥

భాగీరథిలోనఁ బాపమున్నదా పుణ్య
భోగపు వేదములలో బొంకు లున్నవా
సాగరపు టమృతపు చవిలోఁ జేఁదున్నదా
ఆగతి హరిదాసుల కపరాధ మున్నదా. ॥ఎదు॥

ఆకసములోన నెరు సందున్నదా భూమిఁ
జేకొని రవియెదుటఁ జీఁక టున్నదా
యీకడఁ గామధేనువు కియ్యరానివున్నవా
కైకొన్న ప్రపన్నులను గరిసిం(హించి?)చ మున్నదా. ॥ఎదు॥

హరినామమంత్రములో నోఁగానులున్నవా
గురుకృపగలిగియుఁ గొరతున్నదా
సరవి శ్రీవేంకటేశు శరణన్నవారికి
విరసంబులందులో వెదకఁగఁ గలదా. ॥ఎదు॥ 112

## రామక్రియ

వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండ విహరించే దేవుఁడు. ॥పల్లవి॥

కొండ గొడుగుగ నెత్తి గోవులఁ గాచేనాఁడు
కొండవంటి దానవునిఁ గోరి చించెను
కొండ శ్రీవేంకట మెక్కి కొలు వున్నాఁ డప్పటిని
కొండవంటి దేవుఁ డిదే కోనేటికలుతను. ॥వీఁడి॥

మాఁకుల మద్దులు దొబ్బి మరి కల్పభూజ మనే
మాఁకు వెరికి తెచ్చెను మహిమీఁదికి
మాఁకుమీఁద నెక్కి గొల్లమగువలచీరలిచ్చి
మాఁకుల కోనేటిదండ మరిగినాఁ డిదివో. ॥వీఁడి॥

శేషునిపడగనీడఁ జేరి యశోదయింటికి
శేషజాతి కాళింగుఁ జక్కించి కాచె
శేషాచలమనేటి శ్రీవెంకటాద్రిపై
శేషమై కోనేటిదండఁ జెలఁగీని దేవుఁడు ॥వీఁడి॥ 113

## సామంతం

కడుపు నిండె నికఁ గడమేది మును
తడవినయపుడే నే ధన్యుఁడ నైతి. ॥పల్లవి॥

హరిహరి యని నే నన్నునాఁడె నా
పరగిన జన్మము ఫలియించె
కెరలి మీఁద మిక్కిలి నీసేవలు
వరుస జలధిలో వానలు. ॥కదు॥

సుందర నీకును మొక్కినయపుడే
అందితిఁ దుదిపద మగు సుఖము
నిందుగ మీఁదటి వేవేలు సేనలు
యెందును శ్రీసుంతు కిచ్చిన సిరులు. ॥కదు॥

శ్రీవెంకటపతి శరణనినపుడే
దైవము నా పాల దక్కితివి
చేవలఁ గమ్మర సేవించుసేవలు
వేవేలు పూజలవేడుకలు. ॥కదు॥ 114

## దేవగాంధారి

మాయలఁ బొరలఁగ నేఁటికి మనసా కలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతు డీతనిఁ దలఁచవుగా. ॥పల్లవి॥

మన్ననఁ బుట్టినకాయము మన్నున నణఁగెటి దింతే
మిన్నుల మీఁదికిఁ బోవదు మెరయుచు నెంతైనా
అన్నిట నీజీవునికిని అంతర్యామీ దేవుఁడు
యెన్నఁడుఁ బాయనిబంధువుఁ డీతనిఁ దలఁచవుగా ॥మాయ॥

ధరపైఁ బుట్టినదేహము ధరపైఁ బుట్టి(ట్టు?)న దింతే
పరమానందము గోరదు పైపై నెంతయినా
గరిమల నీజీవునికిని గతి యగు దేవుం డీతఁడు
నిరతపు సుఖములె యొసఁగును నీ విటు దలఁచవుగా. ॥మాయ॥

శ్రీవెంకటపతి సొమ్ములు చేరెడి దాతని నింతే
ఆవల నితరుల నంటవు ఆతుమ లన్నియును
యేవిధముల నీజీవుని కేలిక యీదేవుండే
పావనముగ బ్రదికించెను సయికొని తలఁచవుగా. ॥మాయ॥ 115

మాళవిగౌళ

రుచులు నే నిటు గోనని వేడవి రోఁత లయ్యెడిఁ గాక నేఁడు
వచనముల హరి నీకు శరణని వసుధఁ బావన మైతిఁ గాక. ॥పల్లవి॥

నేను సేయనిపాపమేడది నిఖిలలోకములందును
నేను చొరనినరక మేడది నెఱయ దుర్గతుల
నేను పొడమని యోను లేడవి నిఖిలజంతువులందును
పూని హరి నిను శరణు చొరఁగాఁ బుణ్యుఁగాఁ జేసితివిగాక ॥రుచు॥

నిరతి నాడని కల్ల లేడవి నేను నాలుకతుదలయందును
తిరలి నడపని కర్మ మేడది భువి ననాచారములలో
తిరిగి తిరిగి నీచులిండ్లను తిరియనర్థము లింక నేడవి
గరిమ హరినే నిన్ను శర ణనఁగాను ఘనుఁ జేసితివి గాక. ॥రుచి॥

తలఁప నజ్ఞానములు నపరాధములు నాకెడ లేని వేడవి
యెలమి నన్నిట్లెలఁ దగునా కేలిలితివి గాక
నిలిచి శ్రీవెంకటగిరీశ్వర నీకు శరణనుమాత్ర మింతే
కలసి నాయెడ కేమి గంటివి కాచితివి భువనములలోను. ॥రుచు॥

271-వ రేకు సామంతం

ఎవ్వరి దూరఁగ నేల యేమిన్నా ననఁగ నేల
నవ్వుచు హరికి మొక్కి నమ్మటి గాక. ॥పల్లవి॥

కోపమే యెక్కుడు సేసు కొందరిగుణములోన
పాపమే యెక్కుడుసేసు పరులఁ గొందరికి
దీపన మెక్కుడు సేసు దేహములఁ గొందరికి
శ్రీపతి ఆనాజ్ఞ లివి చెల్లీ లోకానను. ||ఎవ్వ||

కొందరి నసురలఁగా గుట్టులోడ నటు సేసు
కొందరి దేవతలఁగా కోరి తానే యిటు సేసు
కొందరి మనుజులఁగా కూటపు జీవులఁ జేసు
విందువలె హరిమాయ వెలసీ లోకానను. ||ఎవ్వ||

వరుస నెరిఁగి నడవ నెవ్వరికిచ్చ గాదు
సరినివనాదినుండే సహజమే కలది
చిరపుణ్యు లిన్నిటిలో శ్రీవెంకటేశుఁ గని
శరణనఁగా సుఖము జరగీ లోకానను. ||ఎవ్వ|| 117

గుండక్రియ

పొదలఁ బొదలఁగఁ దనువు పుణ్యపాపముపొత్తు
వదల వదలఁగ మనసువద్దనే నిలుచు. ||వల్లవి||

పెరుగు నింద్రియసుఖము పెంచఁగాఁ బెంచఁగా
ధరఁ బెరుగుఁ గోరికలు తలఁచఁ దలఁచ
కెరలు లంపటము మిక్కిలి కూర్చఁ (ర్చఁ ?) గూర్చఁగా
మరలింప మరలింప మనసులో నణఁగు. ||పొద||

కలుగు పను లేమైనఁ గడుఁ జేయఁ జేయఁగా
మలసి కలుగును రుచులు మరుగ మరుగ
బలియు నజ్ఞానంబు భ్రమయఁగా భ్రమయఁగా
నిలువ నిలువఁగ మనసు నిశ్చలం బవ్వును. ||పొద||

నగడు గుణములు పెక్కు నించఁగా నించఁగా
మిగుల సంసారంబు మెలఁగ మెలఁగ
తగిలి శ్రీవెంకటేశు దగ్గరి కొలువఁగఁ గొలువ
పొగడఁ బొగడఁగ నతఁడు పొంతనే నిలుచు. ॥పొద॥ 118

## ధన్నాసి

నీ వెటు సేసిన నిజభోగ్యం బౌ
చేవలఁ గైకొని చెలఁగుట గాక. ॥పల్లవి॥

దేవ నీయానతిఁ దిరిగెటి చిత్తము
నావద్ద నిలుపఁగ నా వసమా
యీవల నీవే యిచ్చిన పుట్టుగు
యేవిధిఁ దప్పిన యిఁక మాన వశమా. ॥నీవె॥

వామన నీపంపు వచ్చినప్రకృతిదే
నామాట వినుమన నా వసమా
శ్రీమంతుఁడ నీచేఁతదేహ మిది
దోమటి గుడువక తోయఁగ వశమా. ॥నీవె॥

నగధర నీ విటు నడపెటి కర్మము
నగినగి తోయఁగ నా వసమా
తగు శ్రీవెంకటదైవమ నాపాలఁ
దగిలితి వితరముఁ దలఁచఁగ వశమా. ॥నీవె॥ 119

## భైరవి

విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో
శాశ్వతుల మైతి మింక జయము మా జన్మము. ॥పల్లవి॥

కొండవంటి హరిరూపు గురుతైన తిరుమల
పండిన వృక్షములే కల్పతరువులు
నిండిన మృగాదు లెల్ల నిత్యముక్తజనములు
మెండుగఁ బ్రత్యక్షమాయ మేలువో నా జన్మము. ॥విశ్వ॥

మేడవంటి హరిరూపు మించైన పైఁడిగోపుర
మాడనే వాలినపక్షు లమరులు
వాడలఁ గోనేటిచుట్ల వైకుంఠనగరము
యీడ మాకుఁ బొడచూపె యిహామే పో పరము. ॥విశ్వ॥

కోటిమదనులవంటి గుడిలో చక్కనిమూర్తి
యీటులేని శ్రీవేంకటేశుఁ డితఁడు
వాటపు సొమ్ములు ముద్రవక్షపు టలమేల్మంగ
కూటువైన న్నేలితి యెక్కువవో నా తపము. ॥విశ్వ॥ 120

ఆహిరి

నీకే శరణంటి నిన్నే నమ్మితి నయ్యా
పైకొని శ్రీహరి నీవే పరిహరించవే. ॥పల్లవి॥

విజ్ఞానములు గొన్ని వింది నే నూరకే
సుజ్ఞానములు గొన్ని చూతు నే నేపొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞాహీనుఁడ నెంత పాపకర్మమో. ॥నీకే॥

సుకృతములొక మరి సారిది నే బోధింతు
ప్రకృతి యొక్కొకవేళ భావింతు నాత్మలో
అకృతములే నే ననిశముఁ జేసేది
వికృతాచారుఁడ నింకా వికార మెంతో. ॥నీకే॥

ధర్మమార్గమూ గొంత తలఁపున నెరిఁగితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరిఁగితి
నిర్మించి శ్రీవెంకటేశ నీవు నన్ను నేలఁగాను
మర్మ మెరిఁగితి నెట్ల మన్ననఁ గాచితివో. ॥నీకే॥ 121

రామక్రియ

ఇంతటి దైవము లేఁడు యెందుఁ జెప్పి చూపఁగ
వంతులకుఁ గొలిచేటివారి భాగ్య మిఁకను. ॥పల్లవి॥

గక్కన మన్మథునిఁ గన్నతండ్రి గనక
యెక్కువ చక్కఁదనాల కితఁడె దొడ్డ
నిక్కపు సూర్యచంద్రాగ్నినేత్రుఁడు గనక
దిక్కులఁ గాంతుల నీ దేవుఁడే దొడ్డ. ॥ఇంత॥

అంచెల లక్ష్మికి మగఁ డైనాఁడు గనక
యెంచరాని సంపదల కితఁడే దొడ్డ
పంచిన చోటఁ జక్రము పంపుచేసీఁ గనక
మించిన ప్రతాపాన మిక్కిలిని దొడ్డ. ॥ఇంత॥

దైవికపుఁ బురుషోత్తముఁ డితఁడు గనక
దేవతల కెల్లా నీ దేవుఁడే దొడ్డ
వావాత శ్రీవెంకటాద్రి వరము లిచ్చీఁ గనక
యేవల దాతలలోన నితఁడే దొడ్డ. ॥ఇంత॥ 122

272-వ రేకు. దేసాక్షి

కలవి రెండే భూమి కామనిదానంబులు
జలజాక్షుఁడు నతని శరణాగతియును. ॥పల్లవి॥

నరులు లేరా భూమి నానాదిక్కులలోన
హరిదాసుఁ డొక్కఁడే యరుదు గాక
సురలు లేరా మింట సోధించ ఘనుఁ డొక్కఁడే
పరమపద మేలు శ్రీపతియె కాక. ||కల||

మాటలు లేవా భూమి మంత్రము లెంచి చూడఁగ
తేటల హరినామము తేఁకువ గాక
కోటిపూజలిల లేవా కుమతులు సేసేవి
పాటల ప్రపన్నుని భక్తి దొడ్డు గాక. ||కల||

విహితసుఖము లేదా విశ్వములో భోగించ
సహజమోక్షసుఖమె సారము గాక
యిహమున శ్రీవేంకటేశుఁడిందరికి లేఁడా
మహి శ్రీవైష్ణవులకే మనికాయఁ గాక. ||కల|| 123

ముఖారి

విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁ డవి
వైష్ణవు లానతియ్యఁగా వట్టి చదువు లేల. ||పల్లవి||

వెన్న చేతఁ బట్టి నేయి వెదకఁగ నీక నేల
నిన్ను లోన నించుకొని నిజమేదో యన నేల
వున్నతి దీపము వట్టి వోగి నూతఁ బడ నేల
పన్ని నీదాస్యము గల్గ బహుకర్మమేల. ||విష్ణు||

చాలా ధనము గల్గి సంతలఁ దిరియ నేల
నాలుక నీపేరు గల్గ నానాజపము లేల
కాలము నేరు గుడిచి కాలువ వోగడ నేల
పాలించ నీవుండఁగాను పరచింతలేల. ||విష్ణు||

మిన్ను చూచేయందుకుఁగా మిక్కిలి తోదోపు లేల
అన్నిటా నీవుండఁగాను అడుగ నేల
యెన్నఁగ శ్రీవెంకటేశ యిందరి నేలేవు నీవే
నిన్నే కొలుచుట గాక నీటు గర్వా లేల. ॥విష్ణు॥ 124

వరాళి

చంచలము మానితేను సంసారమే సుఖము
పొంచి హరిదాసుఁడైతే భూమెల్లా సుఖము. ॥పల్లవి॥

వారుల వేడకవుంటే వున్నచోనే సుఖము
పరనింద విడచితే భావమెల్లా సుఖము
సరవిఁ గోపించకుంటే జన్మమెల్లా సుఖమే
హరిఁ గొలిచినవారికన్నిటాను సుఖమే. ॥చంచ॥

కానివని సేయకుంటే కాయమే సుఖము
మానమున నుండితేను మరులైనా సుఖము
దీనత విడిచితేను దినములెల్లా సుఖము
అని హరిఁ దలఁచితే నంతటా సుఖమే. ॥చంచ॥

చలము విడిచితేను సంతతము సుఖము
యిల నాసలుడిగితే నిహమెల్లా సుఖమే
తలఁగి శ్రీవెంకటేశుదాసులైనవారు వీని
గెలిచి నటించఁగాను కిందా మీఁదా సుఖమే. ॥చంచ॥ 125

దేసాళం

వెదకవో చిత్తమా వివేకించి నీవు
అదనఁ దదియ్యసేవ అంతకంటే మేలు. ॥పల్లవి॥

చూపులెన్నైనాఁ గలవు సూర్యమండలముదాఁకా
చూపులు శ్రీహరిరూపు చూడ దొరకదు గాని
తీపులెన్నైనాఁ గలవు తినఁ దిన నాలికకు
తీపు శ్రీహరిప్రసాదతీర్థమని కోరదు. ॥వెద॥

మాటలెన్నైనాఁ గలవు మరిగితే లోకమందు
మాటలు శ్రీహరినామము మరపఁగ వలె
తేటలెన్నైనాఁ గలవు తీరని చదువులందు
తేటగా రామానుజులు తెరిచె వేదములలో. ॥వెద॥

చేఁతలెన్నైనాఁ గలవు సేసేమంటే భూమి
చేఁతల శ్రీవేంకటేశుసేవ సేయవలెను
వ్రాఁత లెన్నైనాఁ గలవు వనజభవునిముద్ర
వ్రాఁతలు చక్రాంకితాలె వహికెక్కే ముద్రలు. ॥వెద॥ 126

లలిత

బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో
విహగగమన నాకు వెరగయ్యీ నిందుకే. ॥పల్లవి॥

పుట్టేటి జంతువులు భువనము లెల్లా నిండె
యిట్టె బ్రహ్మాండకోట్లు యిన్నియు నీమేన నిండె
యిట్టె అందరి రక్షించే యిత్వైన విధమేదో
వొట్టుగ కాఁపురము నీ వుండఁగఁ జోటేదో. ॥బహు॥

చిన్ని చిన్ని దేవతలచేఁతల ముద్దులు నిండె
కన్నుల నీకివి చూచి కడు సంతసాలు నిండె
మన్ననలు వీరికిచ్చి మలసేటి విధమేదో
వున్నతిని చింతదీరి వుండు టేఁక నెన్నఁడో. ॥బహు॥

నీదేవివైన లక్ష్మి నిచ్చు సంపదలు నిండె
ఆదివై శ్రీవెంకటేశ ఆకె నీ వురాన నిండె
పోదివై నీవివి యెల్లా భోగించేదేపొద్దో
నీదాసులము నేము నినుఁ జింతించితిమి. ॥బహు॥ 127

లలిత

నిలిచినచోట నెల్లా నిధానమీతఁడు
యిల వెలవ వెలవ నేమిటికి నికను. ॥పల్లవి॥

హరి నాకుఁ గలఁడుగా అన్నిటిఁ బరిహరించ
నిరతి గర్మములెంత నిండుకుండినా
దరిదాపు యితఁడే కా తగ వెనుకవేసుకో
విరవిరఁ బాపాలు నావెంటఁ బడినాను. ॥నిలి॥

గోవిందుఁడు గలఁడుగా, కొంకు దీర్చి నను గావ
కావరపు భవములు గదిమినాను
దేవుఁడితఁ డున్నాఁడుగా దిక్కుదెసై నిలువఁగా
భావపు సంసారవార్ధి పైకొని ముంచినను. ॥నిలి॥

శ్రీవెంకటేశుఁడే చిత్తగించి నన్నేలెఁగా
హావాత నింద్రియాలు వళకాడినా
యీవల నావల నితఁ డిహపరాలిచ్చెఁగా
వావిరి నే ధాన్యగర్వముతో నుండినను. ॥నిలి॥ 128

273-వ రేకు. శాళి

దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు
యీవల నీటంటు నాకు నెదురింక నేది. ॥పల్లవి॥

కామధేనువుఁ బిదుకఁ (కుఁ?) గల కోరిక లివెల్ల
కామధేనువులు పెక్కు గాచే కృష్ణుఁడే వట
కామించి నీ బంటనట కమ్మి నిన్ను దలఁచితి
నేమి మాకుఁ గడమయ్య యిందిరారమణా. ॥దేవ॥

యెంచఁ గల్పవృక్షమును యిచ్చు సిరు లెల్లాను
నించి కల్పవృక్షముల నీడల కృష్ణుఁడవట
అంచెల నీ బంటనట ఆత్మలో నిన్ను నమ్మితి
వంచించఁ గడమ యేది వసుధాధీశ. ॥దేవ॥

తగ నొక్క చింతామణి తలఁచినట్లఁ జేసు
మిగులఁ గౌస్తుభమణి మించిన కృష్ణుఁడవట
పగటు శ్రీవెంకటేశ భక్తుఁడ నీకట నేను
జగములోఁ గొఱతేది జగదేకవిభుఁడా. ॥దేవ॥ 129

## సాళంగం

కొలిచినవారల కొంగుపైఁ డితఁడు
బలిమిఁ దారకబ్రహ్మమీతఁడు. ॥పల్లవి॥

యినవంశాంబుధి నెగసిన తేజము
ఘనయజ్ఞంబులఁ గల ఫలము
మనుజరూపమున మనియెడి బ్రహ్మము
నినుపుల రఘుకులనిధానమితఁడు. ॥కొలి॥

పరమాన్నములోపలి సారపుఁ జవి
పరగిన దివిజుల భయహరము
మరిగిన సీతామంగళసూత్రము
ధరలో రామావతారం బితఁడు. ॥కొలి॥

చకితదానవుల సంహారచక్రము
సకలవనచరుల జయకరము
వికసితమగు శ్రీవెంకటనిలయము
ప్రకటిత దశరథభాగ్యంబితఁడు. ॥కొలి॥ 130

బౌళిరామక్రియ

అభయదాయకుఁడవదె నీవే గతి
యిభరక్షక నను నిపుడు గావవే. ॥పల్లవి॥

భయహర దైతేయభంజన కేశవ
జయ జయ నృసింహ సర్వేశ్వరా
నియతము మాకిదె నీపాదములె గతి
క్రియగా మమ్మేలి కింకలుడుపవే. ॥అభ॥

బంధవిమోచన పాపవినాశన
సింధురవరదా శ్రితరక్షా
కంధరవర్ణుఁడ గతి నీ నామమె
అంధకారముల నణఁచి మనుపవే. ॥అభ॥

దైవశిఖామణి తతచక్రాయుధ
శ్రీవెంకటగిరి శ్రీరమణా
సావధాన నీ శరణ్యమే గతి
వేవేలకు నావిన్నప మిదియే. అభ॥ 131

శంకరాభరణం

శరణు కపీశ్వర శరణంబనిలజ
సరవి నెంచ నీసరి యిఁక వేరీ. ॥పల్లవి॥

పుట్టిననాఁడే భువనము లెఱఁగఁగ
పట్టితి సూర్యునిఁ బండనుచు
ముట్టిన చుక్కలు మోవఁగఁ బెరిగితి
విట్టి ప్రతాపివి యెదురేదయ్యా. ||శర||

అంపిన యప్పుడె యంబుధి దాఁటితి
వింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపునుఁ బేర్కొన వశమా. ||శర||

చెదరక నేఁడే శ్రీవెంకటగిరిఁ
గదిసి రాముకృప గైకొంటి
వదలక నీకృపవాఁడ నైతి నిదె
యెదుటనే కాచితి విఁకఁ గడమేమీ. ||శర|| 132

## నారాయణి

దేవ నీపక్షపాతమో తిరిగేలోకుల వెల్తో
శ్రీవిభుఁడ నీవే కాదా చిత్తములోనయ్యా. ||పల్లవి||

దివములు సరియే దినరాత్రులును సరే
యివల సుఖదుఃఖాలు హెచ్చు కుందు లేలయ్యా
భవనులు సరియే ప్రాణములు సరియే
భువిఁ బుణ్యపాపముల భోగము వేరేలయ్యా. ||దేవ||

విని కిందరి కొకటే విషయాలు నొకరీతి
మునిఁగేటి జాతిభేదము లివేలయ్యా
అనయముఁ జూపొక్కటే ఆకలియు నొకటే
పెనఁగేటి గుణముల పెక్కుజాడ లేలయ్యా. ||దేవ||

అంతరాత్మ నీవొక్కడ వన్నిటా శ్రీవెంకటేశ
చింతలు వేవేలైన సిలుగేలయ్యా
యింత సేసీ నీమాయలిందుకే నీశరణంటే
కాంతుఁడ వన్నిందుకే కాచితివి నేఁడయ్యా. ॥దేవ॥ 133

మంగళకౌశిక

నేమెంత మూఢులమైనా నీలవర్ణుఁ డంతరాత్మ
మామనసు వెలితేల మంచిదేఁ గాక. ॥పల్లవి॥

దైవముకృప గలి (గి ?) తే తనకర్మాలడ్డమా
ఆవేళ ఘనపుణ్యుఁడౌఁ గాక
గోవిందుఁడు మన్నించితేఁ గొంచము దొడ్డున్నదా
కోవరపు సిరులంది కొన కెక్కుఁ గాక. ॥నేమెం॥

పరమాత్ముఁ డేలుకొంటే బంధములు గలవా
తెరదీసినట్లానె తెగుఁ గాక
హరి విజ్ఞానమిచ్చితే నడ్డము మాయలుండునా
తొరలి జీవుఁడు మాయఁ దొలఁగుఁ గాక. ॥నేమెం॥

శ్రీవెంకటేశ్వరురూపు చిత్తములోఁ జిక్కితేను
చావుఁ బుట్టుగులున్నవా జయమౌఁ గాక
కైవల్యమిత్తఁ డిచ్చితేఁ గడమలు గలవా
కేవలపు జగ మెల్లా గెలుపించుఁ గాక. ॥నేమెం॥ 134

274-వ రేకు మంగళకౌశిక

విడువవో మాయావిష్ణువశీనము
వొడలిది నీ కెందు నున్నికే లేదు. ॥పల్లవి॥

శ్రీపతినామము చేకొనె నాలుక
యేపాపములకు నెడ లేదు
దాపగు గోవిందుఁ దలఁచిన మనసిది
కోపముల కిరవు కొన నెడ లేదు. ॥విడు॥

నెలవుగ హరికథ నిండెను వీనుల
కలిదోషము: లిక్కడ లేవు
అలరిన జన్మంబచ్యుతు శరణని
నిలిచె దుఃఖముల నివారణము. ॥విడు॥

శ్రీవెంకటపతిఁ జేరె నాత్మ యిది
భావవికారము పని లేదు
దైవాధీనము తత్వవిచారము
వేవేలు కర్మపు విధులే లేవు. ॥విడు॥ 135

## లలిత

ఇన్నిటా శ్రీహరిభక్తి యిది లాభము
పన్నిన తపముచేత బడలుటే లాభము. ॥పల్లవి॥

ఈనయఁ గర్మదేహమిదెన్ని పాట్లు వచ్చినా
ననుభవించి తీరుచు టది లాభము
తన పాపవర్తన యితరు లెంత నిందించినా
ననుమానించక పడుటది లాభము. ॥ఇన్ని॥

తగు సంసారశీవుఁడు తన్నెంత వేసరించినా
నగి ఋణము దీర్చుట నానాలాభము
చిగురువంటి చిత్తము చేరి మొందు దిప్పినాను
తగిలి యలయుటే దక్కినట్టి లాభము. ॥ఇన్ని॥

శ్రీవెంకటేశ్వరుఁడు జీవములో నుండఁగాను
యేవేళ నెట్లయినా నివి లాభము
పావనమైనట్టి యాత్మ భావమెంత మఱచినా
ఆవల నానందించుటది లాభము. ॥ఇన్ని॥ 136

లలిత

మనసొకటి కోరికలు మూలు గలపుచు ( ? ) నుండు
తనిసితే నదియు పరతత్త్వమై నిలుచు. ॥పల్లవి॥

కన్నులనియెడి పాపకర్మంబులివి రెండు
పన్ని తామెన్నింటిపై నైనఁ బారు
మున్నె యివి హరిపాదముల మీఁద నిలిపినను
అన్ని పుణ్యంబులును అందునే కలుగు. ॥మన॥

వీనులనియెడి మహాపెడఘోరనరకములు
ఆని పరనిందలే ఆలింపుచుండు
నానాట యిందులో నారాయణునికథలు
పూని నించిన పుణ్యభోగములే యొసఁగు. ॥మన॥

నాలుకనియెడి గుహను నాచుబాముది యొకటి
గాలి అనృతపు విషము గ్రక్కుచుండు
యీలీల శ్రీవెంకటేశు నామామృతము
పోలి నించవె ఆత్మ శుభములే కలుగు ॥మన॥ 137

కన్నడగౌళ

ఎన్ని చందముల నెట్టైన నుతింతు
కన్నుల నిన్నే కనుఁగొంటేఁ గాన. ॥పల్లవి॥

గోవిందా యని కొలిచిన నిన్నే
శ్రీవల్లభుఁ డని చింతింతును
భూవిభుఁడవు యిది పునరుక్తనకుమీ
దైవ మొకఁడవే ధరణికిఁ గాన. ॥ఎన్ని॥

పరమాత్ముఁడ వని భక్తి సేసి నిను
నరహరి వని ధ్యానము సేతు
సరవులఁ జర్వితచర్వణ మనకుమీ
అరయఁగ గురి యంతరాత్మవు గాన. ॥ఎన్ని॥

సరుగ శ్రీవెంకటేశ్వర నీదాస్యము
మరిగితి నదె ముమ్మాటికిని
తిరిగిన యందే తిరిగెద ననకుమీ
యిరవుగ నితరంబిఁక లేదు గాన. ॥ఎన్ని॥ 138

గుజ్జరి

దేవ నీవేకాల మెట్టు దిప్పినాఁ దిరుగుట గా
కీవలఁ బెద్దరికము యెక్కడిదో తనకు. ॥పల్లవి॥

దొరకొని జీవుఁడు దుఃఖముల కోపఁడు
నరకములోనఁ దననాటి పాలించఁడు గాని
సిరులకొరకుఁ గాఁ జేఁదు వందయ్యాఁ బ్రాణి
పురుషై పుట్టినపుడే బుద్ధులెందు వోయనో. ॥దేవ॥

పొల్లువోకీ నేను నేఁడు భోగించకుండ లేదు
తల్లికడుపులోనుండి తానేమి భోగించెనో
యిల్లు ముంగి లాసపడీ నిప్పుడే యీగుణము
తొల్లి జనించనినాఁడు తొలఁగి యెందుండెనో. ॥దేవ॥

గుక్కక మనసు నేఁడు కోరక వుండఁగ లేదు
తక్కి బ్రహ్మ ప్రళయానఁ దానెట్లుండెనో
నిక్కి శ్రీవెంకటేశ్వర నీమరఁగు నేఁ జొచ్చితి
యెక్కనఁ దానిటమీఁద నెందుకు దాఁగీనో. ॥దేవ॥ 139

కన్నడగౌళ

నడపే వేఁటికి నాటకము
అడరి నిజముగా నానతి యీవే. ॥పల్లవి॥

విశ్వమూర్తి కొక విన్నపము
శాశ్వతము లాయ జగము లివి
యీశ్వరేశ్వరున కింకొక విన్నపము
ఐశ్వర్యమోక్షం బాత్మల కేది. ॥నడ॥

రమాధిపతికొక రహస్యము
సమానుఁడవు నీవు సర్వమున
క్రమాన నిఁక నొక రహస్యము
సమో హి (?) నరకము స్వర్గము నేలా. ॥నడ॥

హరి నే నొక మాఁ టడిగెదను
నిరంతరాత్మవు నీవు గదే
యిరవుగ శ్రీవెంకటేశ నే నడిగెద
విరసము లే దిఁక విచార మేలా. ॥నడ॥ 140

275-వ రేకు శంకరాభరణం

చానిపిలోపలఁ జవి గలదా యివి
మానిపి నీగతి మరపుదు గాకా. ॥పల్లవి॥

చంచలపు గుణముల జడిసిన జీవుఁడు
మంచి గుణంబుల మలసీనా
అంచెల హరి నీ వంతర్యామివి
నించి నీగుణమె నెరపుదు గాకా. ॥చాని॥

బూతుల యెంగిలిఁ బుట్టినదేహము
బాతిగ శుచియై పరగీనా
చైతన్య మందులో శ్రీపతివి నీవు
నీతత్వఫలమే నెరపుదు గాకా. ॥చాని॥

లలి సుఖదుఃఖపు లంకెకాపురము
మెలుపున సాజాన మెలఁగీనా
యిలపై శ్రీవెంకటేశ్వర నీవిది
కలిగించితి వీకఁ గాతువు గాకా. ॥చాని॥ 141

లలిత

అన్నిటికి నారదాదులదివో సాక్షి
యిన్నిటా మాకుఁ గలిగె నేమైనాఁ గాని. ॥పల్లవి॥

భూమిలోన నెన్నియైనా పుణ్యములు గలవు
కామింప నాచారాలు కల వెన్నైనా
సామజవరదు నొక్కసారె దలఁచినందుకు
యేమియును సరిగావు యెట్టయినాఁ గాని. ॥అన్ని॥

వుత్తమలోకసుఖము లోగినెన్నైనాఁ గలవు
యిత్తల సిరులుగల విల నెన్నైనా
చిత్తజగురుని నటు సేవించేపుణ్యమువలె
నిత్తెము గావు గాని నిచ్చలు నెంత్తైనను. ॥అన్ని॥

కలవు మతాలు గొన్ని కలవు ముక్తులు గొన్ని
కలవు మాయలు పెక్కు గల్పించేవి
తలఁచి శ్రీవెంకటేశు దాసుఁడైన భాగ్యమిది
కలిగె నిట్టె మాకుఁ గాణాచి గాని. ॥అన్ని॥ 142

లలిత

రామకృష్ణ నీవు నందే రాజ్య మేలుచుండుదువు
యేమి సేసేవిక్కడ నీయిరవుకే పదవే. ॥పల్లవి॥

లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
అంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
వెంకటాద్రిపొంత నుండ వేగ మమ్ము నంపవే. ॥రామ॥

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁ గపుల నిండ్ల కంపినట్టు
వొనర గోపికలొద్ది కుద్ధవుని నంపినట్టు
ననుపు శేషాద్రి నుండ నన్ను నంపవే. ॥రామ॥

పెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనే సుందరఁ గంత కంపినయట్టు
వెండియు శ్రీవెంకటేశ వేఁట వచ్చి మరలితి
వుండ(దు?)చోట నుండి నన్ను వ్రాఁడిగాన కంపవే. ॥రామ॥ 143

రామక్రియ

విచ్చేయవయ్యా వెంకటాచలముపొంత
కచ్చుగా నేమున్న చోటికచ్యుత నారాయణా. ॥పల్లవి॥

అల్ల నాఁడు లంక సాధించందరును బొగడఁగ
మల్లడి నయోధ్యకు మరలినట్లు
యెల్లగాఁ గైలాసయాత్ర కేఁగి కమ్మర మరలి
వెల్లవిరి ద్వారకకు విచ్చేసినట్లు. ॥విచ్చే॥

యెన్నికతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరలినట్లు
అన్నిచోట్లానుండి అల్లిరముఁలారగించ
వెన్నుఁడవై వేడుకతో విచ్చేసినట్లు. ॥విచ్చే॥

వహి కెక్కఁ ద్రిపురాలవనితల బోధించి
మహి నిందిరవొద్దికి మరలినట్లు
విహాగగమన శ్రీవెంకటేశ మముఁ గావ
విహితమై నామతిలో విచ్చేసినట్లు. ॥విచ్చే॥ 144

బౌళి

మాదురితములు వాపి మమ్ముఁ గాచు టరుదా
శ్రీదేవిరమణుఁడ శ్రీవెంకటేశ. ॥పల్లవి॥

అంబరీషుఁ బైకొన్న ఆపద లన్నియుఁ బాపి
బెంబడిఁ గాచె నీచేపెనుచక్రము
అంబరాననున్న ధ్రువు నజ్ఞాన మెల్లఁ బాపె
పంబి నీచేత నుండినపాంచజన్యము. ॥మాదు॥

పక్కన జరాసంధుబలమెల్ల నుగ్గాడి
నిక్కము మధుర నిల్పె నీచేగద
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరిసేటి నీఖడ్గము. ॥మాదు॥

వెడరావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిడుముడి పడక నీచేశార్ఙ్గము
యెడ మీఁక శ్రీవెంకటేశ నేఁడు నన్ను గాచె
బడిబడి నీనామపఠన( నేఁ డి )దిగో. ॥మాఁదు॥ 145

దేవగాంధారి

తప్పు లెంచ కిఁక దరి చేర్చవయ్యా
చెప్ప నేల నీచిత్తమయ్యా. ॥పల్లవి॥

కలిదోషహరణ కర్మవిదారణ
సులభపునీదాసులమయ్యా
కలిగిన శరణాగతవజ్రపంజర
వలనగు నీమఱఁగువారమయ్యా. ॥తప్పు॥

దురితనివారణ దుఃఖవిమోచన
ద్వారకొని నీభక్తులమయ్యా
కరిరాజవరద కరుణాసముద్ర
సరి నిను నమ్మినజంతులమయ్యా. ॥తప్పు॥

శ్రీకాంతప్రియ శ్రీవెంకటేశ్వర
కైకొన్న నీకింకరులమయ్యా
మాకేల యితరపు మతదైన్యంబులు
పైకొనఁ బోఁజేసి పాలించవయ్యా. ॥తప్పు॥ 146

276_వ రేకు. రామక్రియ

ఎంతగాలమైనాను హెచ్చీ నాసలు శ్రీ
కాంతుఁడవింతటన్నైనాఁ గరుణించరాదా. ॥పల్లవి॥

పచ్చితనానఁ దిరిగి పండవద్దా చిత్తము
గచ్చులఁ దాఁ గసుఁగాయే కలకాలము
చచ్చి చచ్చి పుట్టి పుట్టి జారవద్దా కర్మము
కొచ్చి కొచ్చి సేసి సేసి గోరపడీఁ గాక. ॥ఎంత॥

రోఁతగడుపున నించి రోయవద్దా దేహము
కూఁతలతో రుచులెల్లాఁ గోరీఁ గాక
చేఁతలు యీగుణమైన సిగ్గువడ వలదా
బాఁతిపడి విషయాలఁ బరచయ్యీఁ గాక. ॥ఎంత॥

నానాఁడే విరతిఁ బొంది నవ్వు నవ్వవలదా
మానక యీజీవుఁడనుభవించీఁ గాక
మోనాన శ్రీవేంకటేశు మొక్కి నీదాసుఁడఁ గాఁగా
ఆనినవిన్నియుఁ బరిహార మయ్యీఁ గాక. ॥ఎంత॥ 147

## లలిత

సొమ్ముగలవాఁడు తనసొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీసొమ్మను నేను కాపాడవే హరి. ॥పల్లవి॥

పసురమడవిఁ బడ్డ బసురముగలవాఁడు
దెసలు వెదకింటికిఁ దెచ్చుకొన్నట్టు
వసగా నాసలలోన వడిఁ బడ్డనామనసు
యెసగ మళ్లించవే నన్నేలిన గోవిందుఁడా. ॥సొమ్ము॥

గొందిఁ బంట సేయువాఁడు కొలుచులు పరకళ్లఁ
జిందకుండా గాదెఁ బోసి చేరి కాచీని
కందువ మమ్ముఁ బుట్టించి కన్నవారివాకిళ్లఁ
జెంది కావనియ్యకువే జీవునిలో దేవుఁడా. ॥సొమ్ము॥

కడుపులోనిశిశువు కన్నతల్లి దన్ని తేను
బెడగులెంచక కని పెంచీనటా
యెడమీక శ్రీవెంకటేశ నీకుక్షిలో నేను
తడవి తప్పుసేసినా దయఁ గావవే. ॥సొమ్ము॥ 148

ధన్నాసి

మెచ్చుల దంపతులార మీరే గతి
మెచ్చితి నిన్నిట మిమ్ము మెరసె మీచేతలు. ॥పల్లవి॥

తమ్మిలోనిమగువా వో ధరణీధరుఁడా
విమ్మునే నమ్మితి నాకు మీరే గతి
నెమ్మది నో యిందిరా నీరజలోచనుఁడా
కమ్మి యేపొద్దును మీరే కలరు నాపాలను. ॥మెచ్చు॥

పాలజలధికూఁతుర భక్తవత్సలుఁడ హరి
మేలిచ్చి రక్షించి నాకు మీరే గతి
కేలి నో శ్రీమహాలక్ష్మి కేశవ దయానిధి
తాలిమి మీరే నాకు దాపు దండ యెపుడు. ॥మెచ్చు॥

చెన్నగు రమాకాంత చెందిన వో మాధవ
మిన్నక యేపొద్దు మాకు మీరే గతి
చిన్ని యలమేలుమంగ శ్రీవెంకటేశుఁడా
యెన్నిక కెక్కించి నన్ను నేలుకొంటిరిదిగో. ॥మెచ్చు॥ 149

శంకరాభరణం

దైవంబవు కర్తవు నీవే హరి
యీవల నావల నెవ్వఁడ నయ్యా. ॥పల్లవి॥

తలఁచిన తలఁపులు దైవయోగములు
కలిగిన చేఁతలు కర్మములు
వెలసిన దేహము విషయాధీనము
యిల నేఁ గాదన నెవ్వఁడ నయ్యా. ॥దైవం॥

జిగి నింద్రియములు చిత్తపుమూలము
తగులమి (ము ?) మాయకుఁ దనుగుణము
జగతిఁ బ్రాణములు సంసారబంధము
యెగ దిగ నాఁగఁగ నెవ్వఁడ నయ్యా. ॥దైవం॥

శ్రీతరుణీశ్వర శ్రీవేంకటపతి
ఆతుమ యిది నీయధీనము
యీతల నివిఁక నెట్టనఁ జేయుము
యేతలపోఁతకు నెవ్వఁడ నయ్యా. ॥దైవం॥ 150

దేసాక్షి

ఎన్నఁ డీఁక యేది గొలఁదిపాటు
వున్నతపుమాయలకే వోడిగట్టవలసె. ॥పల్లవి॥

చీ చీ మనసా చీ మనసా
కాచేటి పూచేటి వో ఘనజన్మమా
నీచు యెండమావులెల్లా నీళ్లంటా నమ్మినట్టు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె. ॥ఎన్న॥

కట్టా జీవుఁడా కటకటా జీవుఁడా
తొట్టిన పంచభూతాలతోడిదేహమా
వెట్టిఁ జెఱకుపోలికి వెదురు నమలినట్టు
పట్టిన యీశనకమే బ్రహ్మ మనవలసె. ॥ఎన్న॥

బాపు బాపు దైవమా భావపు శ్రీవేంకటేశ
చూపుల నాయాతుమలో సుజ్ఞానమా
దోపుచుఁ బూవులవల్ల తుంగ దలకెక్కినట్టు
దావగు నాలిక నిన్ను దలఁచఁగ వలసె. ॥ఎన్న॥ 151

దేవగాంధారి

పొందినవెల్లా భోగ్యములే
అందరిలో నీక ననుమానమేలా. ॥పల్లవి॥

హరి నీసంకల్ప మన్నిట నుండఁగ
గరిమల మాసంకల్పము లేఁటికి
దురితము లణఁచీ దొర నీనామము
సొరిది విధికిఁగా సుడివడ నేలా. ॥పొంది॥

జిగి నీధ్యానము చింతలు మాన్పఁగ
వెగటున మాకిఁక వెడ చింతేఁటికి
తగు నీతత్త్వము తపఃఫల మొసఁగ
అగడుఁగోరికల ఆస లిఁకేలా. ॥పొంది॥

కమ్మి నీశరణు గతి యిటు చూపఁగ
కమ్మర నుద్యోగము మాకేఁటికి
యిమ్ముల శ్రీవేంకటేశ్వర మాపాల
నెమ్మదిగలవిఁక సేనాడ నేలా. ॥పొంది॥ 152

277-వ తేకు. రామక్రియ

రాతిరిఁ బగలనేటి రంటి నడుమను జిక్కి-
వ్రాంతగాన వెళ్లసీరో వో యానఁగాల. ॥పల్లవి॥

దైవమెప్పుడు గలఁడు తలఁచఁగ లేము గాని
కైవసమై జీవుఁడుండు కాన రాదు గాని
వూవు పిందెవంటి పాపపుణ్యములఁ జిక్కినాఁడ
తోవ చూపరో మాకు తొలుజన్మములాల. ॥రాతి॥

లోకము మాయామయమై లోను గాకుండుఁ గాని
జోక పరమాత్మలోనే సోధించము గాని
కైకొని మూసి తెరచే కనురెప్పలను జిక్కి
వాకిలిఁ గనెఁ జూపరో వద్దనున్న కాలమా (?). ॥రాతి॥

రూపము విజ్ఞానమే రూఢి కెక్కనైతిఁ గాని
కాపు శ్రీవేంకటేశుఁడే గతి గంటిఁ గాని
యీపారి నేనైతే నిహపరాలకుఁ జిక్కి
పైపూఁత లేమి గానఁ బాలించవో గురుఁడా. ॥రాతి॥ 153

సామంతం

ఇంతటఁ గావఁ గదే యిందిరానాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు. ॥పల్లవి॥

దించని పంచభూతాల దేహము మోచితిఁ గాన
నించిన యజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ బట్టువడ్డవాఁడఁ గాన
యెంచరాని పాపములే యిన్నియుఁ జేసితిని. ॥ఇంత॥

మిన్నువంటి జఠరాగ్ని మింగి వున్నవాఁడఁ గాన
కన్నవెల్లా వేఁడి వేఁడి కష్టపడితి
పన్నిన సంసారపుభ్రమఁ బడ్డవాఁడఁ గాన
అన్నిటా దేవతలకు నరిగాఁపన్నైతి. ॥ఇంత॥

ఆతుమలో నీ వుండేభాగ్యము గలవాఁడఁ గాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవెంకటేశ నీపాలివాఁడఁ గాన
చాతితో సర్వము నీకొప్పనము సేసితిని. ॥ఇంత॥ 154

లలిత

తనిసితి మిన్నిటి తగులేలో
మినుకుల దినముల మెచ్చే మయ్యా. ॥పల్లవి॥

మనసూ రోసితి మరులూ బాసితి
తనువేలో పైతరవాయ
వెనకాఁ దెలిసితి మునుపూఁ జూచితి
నను నేనే యిఁక నవ్వే మయ్యా. ॥తని॥

మాయల వెడలితి మమతల బడలితి
పాయంబేలో పదరీని
దాయల గెలిచితి ధర్మముఁ దెలిచితి
పోయినజన్మముఁ బొగడే మయ్యా. ॥తని॥

శరణూఁ జొచ్చితి జయముల హెచ్చితి
దురితము లెందో తొలఁగీని
గరిమల శ్రీవెంకటపతిఁ గొలిచితి
తరతర మిందే దక్కితి మయ్యా. ॥తని॥ 155

శ్రీరాగం

నీవు నట్ల నేరుపు నేరమి నేఁడు నాయెడకుఁ జూడకుమీ
సేవలయెడ తృణము మేరువుగఁ జేసుకోఁ గలవు నీమహిమలను. ॥పల్లవి॥

తప్పులేరంగము వొప్పులేరంగము దైవమనే నిను నుతియించేదా
నెప్పున వేదము సకలశబ్దము నీవే యని చాటఁగ వినుచు
యిప్పుడు ద్రిష్టాంత మొకటి చెప్పెద నిందుకు సముద్రమఁ డిటు తనలో
చిప్పలు గుల్లలు బహురత్నంబులు చేకొని గర్భీకరించుఁ గదా. ॥నీవు॥

కర్మ మెరంగ నకర్మమెరంగను కరుణానిధి నిను బూజించేదా
నిర్మలవేదము చైతన్యంబిది నీవే యని చాటఁగ వినుచు
అర్మిలి ద్రిష్టాంత మిందుకు నొకటి అన్నియు గర్భీకరించుకొని
ధర్మాధర్మపు మనుజుల నెల్లాఁ డగ నీభూకాంత మోచుఁ గదా. ॥నీవు॥

జ్ఞాన మెరఁగ నజ్ఞాన మెరఁగను సారెకు నిను నేఁ దలఁచేదా
ఆనినవేదము శ్రీవెంకటేశ్వర అంతరాత్మ నినుఁ జాటఁగను
పూని ద్రిష్టాంతము మీకిటు సరిగాఁ బోలుపరా దిఁక నైనాను
తానే సూర్యుఁడు రాత్రి గలబయుట తనగుణము వేగి నెరపుఁ గదా. ॥నీవు॥

లలిత

కలదందే పో సర్వముఁ గలదు కామితార్థమును గలదు
కలదు కలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు. ॥పల్లవి॥

ఆకాశంబున మోక్షము వెదకిన నందు లోపలా లేదు
పైకొని తానెంత వెదకి చూచినా పాతాళంబున లేదు
యీకడ ధరిలో మూలమూలలను యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతిఁ జింతించి యాసలఁ జిక్కక తొలఁగిన నందే కలదు ॥కల॥

కోటిజన్మములు యెత్తిన ముక్తికి కొన మొదలేమియుఁ గనరాదు
వాటపు సంసారములోఁ గర్మపువార్థి యీఁదినాఁ గనరాదు
కూటువతో స్వర్గాదిలోకములఁ గోరి వెదకినాఁ గనరాదు
గాటపు కేశవభక్తి గలిగితే కైవల్యము మతిఁ గానఁగవచ్చు. ॥కల॥

సకలశాస్త్రములు చదివినాఁ బరము చక్కటిమార్గము దొరకదు
వికటపు పలువేల్పుల నెందరిఁ గడు వెదకి కొలిచినా దొరకదు
అకలంకుఁడు శ్రీవెంకటగిరిపతి అంతరంగమున నున్నాఁ డనుచును
ప్రకటముగా గురుఁ డానతి యిచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు ॥కల॥

278-వ రేకు సామంతం

సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకునిభక్తి గలిగితే మేలు. ॥పల్లవి॥

వినయపు మాటల విద్య సాధించితే మేలు
తనిసి యప్పులలోన దాఁగకుంటే మేలు
మునుపనె భూమి దన్ను మోచి దించకుంటే మేలు
వెనుకొన్న కోపము విడిచితే మేలు. ॥సంసా॥

కోరి వొకరినడిగి కొంచపడకుంటే మేలు
సారె సారె జీవులను చంపకుంటే మేలు
ఘోరపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్ల కొడిగట్టకుంటే మేలు. ॥సంసా॥

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీవెంకటాద్రివిభునిఁ గొల్చి
యిరవై నిశ్చింతుఁడైతే నిన్నిటాను మేలు. ॥సంసా॥ 149

లలిత

భగవద్విభవపు ప్రత్యక్షం బిది
జగినిం దొకటియుఁ జేయఁగఁ గలమా. ॥పల్లవి॥

దైవికమె పో తతియగు వానలు
తావగు మొలకలు దైవికమే
కావిరి నివెల్లాఁ గంటా వింటా
దైవము నేలో తలఁచను మనసు. ॥భగ॥

జననమరణములు సరి దైవికమే,
తనుపోషణములు దైవికమే
మొనసి యివెల్లా నెఱిఁగియు మఱిఁగియు
కొనదైవము నేలో కొలువను మనసు. ॥భగ॥

యిహాపరంబులును యివి దైవికమే
తహతహాలుడుఁగ దైవికమే
అహిపతి శ్రీవెంకటాధిపుకృపచే
మహిమ గంటిమిఁక మఱవను మనసు. ॥భగ॥ 159

బౌళి

నన్నించఁ బని లేదు నిన్నించుటే కాని
మన్నించు హరి నీమఱఁగు చొచ్చితిని. ॥పల్లవి॥

రాజుఁ బెండ్లాడినయట్టి రమణి యేజాతైనా
పూజితమై యిన్నిటాను భోగించినట్టు
సాజాన నేనెంతసకలహీనుఁడనైనా
వోజతో నిన్ను గొలిచి వున్నతుఁడనైతిని. ॥నన్నిం॥

వేల ముద్దుటుంగరము వేడుకనిడి ప్రధాని
కేలెత్తి యిందరిచే మొక్కించుకొన్నట్టు
నేలనే నీముద్రమోచి నేనేఁటివాఁడనైనా
పేలరి జగములోనఁ బెద్దనైతి నిదివో. ॥నన్నిం॥

తల్లి దండ్రి గలవాఁడు తప్పులేమైనాఁ జేసి
తల్లిఁ జో మద్దు గుసిసి తప్పించినట్టు
చల్లని శ్రీవెంకటేశ సరవి నీకృపవల్ల
కెల్లున నిన్ను నుతించి గెలిచితి నిదివో. ॥నన్నో॥ 160

శుద్ధవసంతం

ఎందు వెదకనేల యేప్రయాసాలు నేల
యిందే వున్నది బ్రదుకిహాపరములకు. ॥పల్లవి॥

ముక్కోటి తీర్థములు ముకుందుదాసుల
వొక్క పాదాంగుటమున నొలికేనిదె
చిక్కిలి జపతపాలు మించిన ప్రపన్నుల
చిక్కని కృపాకటాక్షసీమ నున్న దిదివో. ॥ఎందు॥

చేసేటి పుణ్యఫలాలు శ్రీవైష్ణవులచేత
రాసులై యిరుదెసల రాలీనివే
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల
భాసురపుఁ బెదవులఁ బాఁతి పైపై నున్నది. ॥ఎందు॥

సకలదేవతలచే సాధించే వరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవెంకటాద్రివిభునిమహిమలెల్లా
ప్రకటించి వీరిసల్లాపాన నున్న దిదివో. ॥ఎందు॥ 161

సాళంగం

నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపుదయ
జోక నురాత మెచ్చిన సులభుఁడవే కా. ॥పల్లవి॥

నేరములు దొలఁగించ నెలవులు గలిగించ
గారవించ హరి నీవే కలవు నాకు
నారపేరఁ బిలిచితే నారాయణ యనె నంటా
చేరి కాచినటువంటి శ్రీపతివి గా. ॥నీకు॥

దురితములణఁగించ దుఃఖములు పెడఁబాప
గరిమఁ గేశవ నీవే కలవు నాకు
మరమరా యంటేను మరి రామ యనెనంటా
తిరముగఁ గాచినట్టి దేవుఁడవు గా . ॥నీకు॥

వినుతులు చేకొని వేడుకతో నన్ను గావ
ఘనుఁడ శ్రీవెంకటేశ కలవు నాకు
మనసునఁ దలఁచితే మాటలఁ బిలిచె నంటా
తనిసి కంబాన వెళ్లే దైవమవు గా. ॥నీకు॥ 162

## గుండక్రియ

ఏపాటి తనకర్మమాపాటి కాపాటు
శ్రీపతిదాసుఁ డయితే చిహ్నలిటువలెఁ బో. ॥పల్లవి॥

అందరిని నిర్మలులే యని తలఁచిన తన
నిందలేని మనసే నిర్మలము
మందలించి లోకులతో మంచిమాఁటలాడితేను
బందెలేని తన నోరే భావించ మంచిది. ॥ఏపా॥

అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన
యంతరంగమున నుండు నాదేవుఁడే
చింతించి యీజగము చేకొని పావనమంటే
పంతపు తనదేహముఁ బరమపావనమే. ॥ఏపా॥

పుట్టితేఁ దనపాలికిఁ బుట్టె నీప్రపంచము
దట్టమైన పుట్టిల్లఁ దనతోడిదే
యిట్టె శ్రీవెంకటేశుఁ డిచ్చినాఁడీగుణము
పట్టమై నావద్దనుండు పరమవిజ్ఞానము. ॥ఏపా॥ 163

279-వ రేకు రామక్రియ

బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే
తలఁచాతనికి మొక్కఁ దగులింతే నేము. ॥పల్లవి॥

దైవమే భారకుఁడు ధరణి రక్షించుటకు
భావింప నరులచేఁత పని లేదు
శ్రీవల్లభుఁ డతఁడు సేసినట్లా నవును
వావాత ననుభవించేవారమింతే నేము. ॥బలు॥

హరియే స్వతంత్రుఁడు అన్ని పనులు గాఁజేయ
పరులవుద్యోగాలు పని లేవు
సురనాథుఁ డాతఁడు చూచినట్లా నవును
వరుసతోఁ దిరిగాడేవారమింతే నేము. ॥బలు॥

సకలేశుఁడే కర్త జగములు గాచుటకు
ప్రకటించ నేర్పులు పని లేవు
వొకటి శ్రీవెంకటేశుఁడొనరించి నట్లవును
సుకియించి పొగడేటి సుద్దులింతే నేము. ॥బలు॥ 164

భవుళి

వద్దిక నోపము వట్టిస్వతంత్రము
వొద్దిక శాంతితో నుండే మయ్యా. ॥పల్లవి॥

నడవక మానవు నానాజగములు
కడఁగిన హరిసంకల్పానను
పుడుగకిందు నా వుద్యోగమేఁటిది
నడుమనే కనుఁగొని నవ్వే మయ్యా. ॥వద్ది॥

కలుగక మానదు కాఁగల భోగము
కలిమిఁ బురాకృతకర్మమిది
అలసి యిందు నాయాస లేమిటికి
కలిగినపాటే కానీ వయ్యా. వద్ది॥

తగులక మానదు తన సంసారము
వెగటగు మాయావిలాసము
అగపడి శ్రీవెంకటాదిపుకృపచే
తగినపాటనే తనిసేమయ్యా. ॥వద్ది॥ 165

దేవగాంధారి

ఒక్కమాటు శరణని వుండేనింతే కాక
పెక్కు విధములనెట్టు పెనఁగే నయ్యా. ॥పల్లవి॥

నాలిక వొక్కటే నీనామము లనంతము
పోలించి నే నిన్నెట్టు పొగడేదయ్యా
వోలి నాకన్నులు రెండే వొగి నీమూర్తులు పెక్కు
సోలి నే నిన్నెటువలెఁ జూచెదనయ్యా. ॥ఒక్క॥

పట్టి నాచేతులుఁ రెండే పదములు నీకుఁ బెక్కు
వొట్టి నిన్నుఁ బూజించ నోపికేదయ్యా
గట్టి నాచెవులిసుమంత కథలు నీకవి యెన్నో
పట్టవు నే నెట్టు విని భజియించేనయ్యా. ॥ఒక్క॥

యేమిటాఁ జిక్కవు నీవు యింతదేవుఁడవు గాన
కామించి నీడాగు మోచి గతి గనేను
యీమేర శ్రీవెంకటేశ నీవే నన్నుఁ గావు
దీమసాన నీకఁ వేరే తెరువు లేదయ్యా. ॥ఒక్క॥ 166

సామంతం

గరిమల నెరఁగరు గాక మానవులు
సిరులఁ దియ్యనినోరఁ జేఁదు మేసేదా. ॥పల్లవి॥

హరి నారాయణ యనియెడి నోరను
ధర నితరులపేళ్లు దడవుటెట్టు
సరవితో వేదములు చదివేటి నోరను
పరులమీఁది పదాలు పాడేదా. ॥గరి॥

మునుప శ్రీపతికి మొక్కినచేతుల
అనరుహాలకు దండమనుట యెట్టు
మునుకొని పూవులు ముడిచినసిరసున
కనలు కట్టెలు మోచి కాకయ్యేదా. ॥గరి॥

బలిమి శ్రీవెంకటపతిఁ గొలిచినవారు
తెలియకల్పులఁ గొల్చి తిరుగుటెట్లు
జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగ
వలవని జోలితో వదరువట్టేదా. ॥గరి॥ 167

బౌళి

వేళ లేదు జాడ లేదు వీనితోడిదే పాటు
కూళఁడన్నై తిరిగేను గుణమేది నాకు, ॥పల్లవి॥

వేగిరించి పెరరేఁచి వేసరించీఁ బనులు
సాఁగి ముందరఁ బొలసి చలపట్టీ సిరులు
జాగుసేసి వచ్చి వచ్చి చవి చూపీఁ బాయము
యేగతి నిన్ను దలఁతు నేది బుద్ధి నాకు. ॥వేళ॥

తన్ను దానే వచ్చి వచ్చి తగిలీ లంపటము
వున్నతి భోగముల నోరూరించీ సుఖము
కన్నచోనే మెలయించి కదిమీ సంసారము
యెన్నఁడు నిన్ను దలఁతు నెఱుకేది నాకు. ॥వేళ॥

తాలిమిఁకో మీఁద మీఁదఁ దరవయ్యీఁ గర్మము
నాలితోడ నన్ను సేసి నవ్వ నవ్వీ మర్మము
యేలితివి శ్రీవెంకటేశ్వరుఁడ నన్ను నీవు
నీలోన నీవాఁడనైతిఁ జెప్పనేది నాకు. ॥వేళ॥ 168

లలిత

అంతర్యామీ వో అంతర్యామీ
బంతి నాకేమి గల్లా నాపాలివాఁడవు గావా. ॥పల్లవి॥

దొంతులై అన్నిమోనులఁ దొల్లి నేఁ బుట్టినాఁడే
అంతరాత్మవై నవాఁడవటు నీవే కా
యింతట విడిచేవా నన్నింద్రియాలఁ గట్టివేసి
పొంతఁ జూచేవిటు నాకుఁ బొత్తులకాఁపవు గా. ॥అంత॥

తొడరి స్వర్గనరకదుఃఖసుఖముల నాఁడు
అడరి కర్మసాక్షి వటు నీవే కా
విడువవెప్పుడు నన్ను విషయాలఁ జిక్కినాఁడ
కడ నూరకుండ నేల కన్నవాఁడవు గావా. ॥అంత॥

నీచేతఁ గానిది లేదు నీవు నాకుఁ బ్రాణమవు
కాచుటకు నీకంటే నొక్కరు వచ్చేరా
చేచేత శ్రీవెంకటేశ చేరి నీకు శరణంటి
యేచి నన్ను మన్నించితివిది నీతేజము గాదా. ॥అంత॥ 169

280-వ తేకు. సాళంగనాట

తీరుచు నతఁడే దినకర్మంబది
నూరిటి రుణమొక నూలిపోఁగునా. ॥పల్లవి॥

తొల్లిటి కర్మముతోడఁ గుడుచుటకె
తెల్లమి జీవుఁడు దేహము మోచుట
వొల్లనన్నఁ బో దున్నంతగాలము
వల్లాడి హరినే మఱవఁగ వలదు. ॥తీరు॥

కోరినకోర్కికి గురియగునందుకె
సారపుసంసారసంగమిది
నేరిచి బ్రదికేటినెపమునఁ బోదది
కూరిమి హరినే కొలువఁగవలయు. ॥తీరు॥

తెంచనియాసలఁ దిప్పుటకే పో
పంచేంద్రియముల పంతమిది
చించినఁ బో దిది శ్రీవెంకటపతి
నించి మనసులో నించగవలయు. ॥తీరు॥ 170

లలిత

ఎక్కడి పుట్టుగు లేక నెక్కడి మరణములు
మిక్కిలి నీముద్రలు నామేన నున్నవివిగో. ॥పల్లవి॥

కెరల(బా?) పాపములకుఁ గెరల(గ?) కర్మములకు
హరి నీనామము నోర నంటితేఁ జాలు
నరకము లేమి సేసు నానేరమేమి సేసు
నిరతి నాహృతిలోన నీవుండఁగాను. ॥ఎక్క॥

చిక్కనింద్రియములకు చిక్కను బంధములకు
చొక్కి హరి నీమఱఁగు చొచ్చితేఁ జాలు
మొక్క నేల యెవ్వరికి మొర వెట్ట నేమిటికి
నిక్కపు మాయిలువేల్పు నీవై వుండఁగా. ॥ఎక్క॥

దగ్గరవు మాయలింక దగ్గరవు దుర్గుణాలు
నిగ్గుల శ్రీవెంకటేశ నీవు గల్గఁగా
యెగ్గు లేదు తగ్గు లేదు యిఁక నీదాసులలోన
వుగ్గువలేని ప్రసాద మూనినది వోడల. ॥ఎక్క॥ 171

దేసాళం

జోజో యని మీరు జోల పాడరో
సాజపు జయంతి నేడే సఫలమిందరికి. ॥పల్లవి॥

అదె చంద్రోదయ మాయ హరి యవతార మందె
మొదల జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణముఁ జేయరో. ॥జోజో॥

కాయము దేవకికిచ్చి గక్కన వాసుదేవుని
కీయరో గంధాక్షతలిటు పేడేలు
కాయకపు గాడిదెకు కవణము వెట్టి మరి
పీయుపు చుట్టాలెల్ల పీడు వెట్టరో. ॥జోజో॥

షోడశోపచారములఁ జొక్కించి శ్రీవెంకటేశుఁ
బాడరో ధర్మము నిల్పె భార మణఁచె
వోడించెఁ గౌరవదానవులఁ గంసాదుల జంపె
ఆడనే పాండవులఁ గాచె నని యర్ఘ్య మియ్యరో. ॥జోజో॥ 172

సాళంగం

చరమార్థమందు నీవు చాటితివి గాన
యిరవిది నమ్మితి నాకెదురెందు లేదు. ॥పల్లవి॥

పతికిఁ జనవరైన ప్రాణధారి లెంకలకు
తతి నేమి సేసినాను తప్పు లేదు
సతతము హరి నీశరణాగతుఁడ నాకు (గాక?)
అతిపాపము సేసిన అది నాకు లేదు. ॥చర॥

పారుచు నగరి డాగు పసుర మెవ్వనిచేవి
పైరుమేసినా నందు బందె లేదు
సారె నీముద్రలు మోచి సంసారవిషయాల
యేరీతిఁ బొరలినా యెగ్గ లేదు. ॥చర॥

ధర్మానఁ గొని తెచ్చిన దాసులకు పూరవెట్టి
అర్మిలిఁ జేయఁగఁ బని అంత లేదు
నిర్మల శ్రీవెంకటేశ నీకరుణగల నాకు
కర్మ లోపమైనా ను కడమ లేదు. ॥చర॥ 173

పాడి

నీమాయ లింతే కాక నీరజనాభుఁడ యివి
నామది నిజమనెట్టు నమ్మేదయ్యా. ॥పల్లవి॥

బాలుఁడనై నేఁ జన్నుఁబాలు దాగేనాఁడు
వోలి ననుష్ఠానము లెందుండె నయ్యా
చాలి యానేనె బ్రహ్మచారి నయినమీఁద
వాలి యవె యెందుండి వచ్చె నయ్యా. ॥నీమా॥

నేను దినదినమును నిద్దుర వోయేవేళ
వూని నిత్యకర్మములెందుండె నయ్యా
జ్ఞానముతో మేలుకొని సంసారినైనవేళ
ఆనుకొని యెందుండి అంటుకొనె నయ్యా. ॥నీమా॥

యేడ కర్మ మేడ ధర్మ మింతలో సన్యాసై తే
వేడుక కివి యెల్లా నీవిలాసాలు
జాడ నీమనసు వస్తే సరుగఁ గరుణింతువు
వోడక శ్రీవెంకటేశ వున్నసుద్దులేఁటికి. ॥నీమా॥ 174

రామక్రియ

హరి హరి యని వెరగందుట గాక
సిరివర మాకు బుద్ధి చెప్పఁగద వయ్యా. ॥పల్లవి॥

పాపపుకొంపలోవారు పంచమహాపాతకులు
కాపులకు పదుగురు కర్తలుగాను
తాపికాండ్లారుగురు ధర్మాసనమువారు
చాపలమే పను లెట్టు జరగీనయ్యా. ॥హరి॥

పలుకంతలచేను బండవెవసాయము
బలిమిఁ ద్రొక్కీఁ గుంటిపసురము
తలవరులు ముగురు తగువాదు లేఁబై యేఁరు
సొలసి ఆనాజ్ఞ కిందుఁ జో టేదయ్యా. ॥హరి॥

బూతాల పొంగటికే పొడమినవంటలెల్లా
కోతవేత చూచుకొని కోరు కొటారు (?)
యీతల శ్రీవెంకటేశ యిన్ని విచారించి నీ
చేతే నిలిపితి వింకఁ జెప్పేదేటిదయ్యా. ॥హరి॥ 175

281-వ రేకు. శుద్ధవసంతం

ఏమి సేయుదును నాకేది బుద్ధి యంతర్యామి
యీమతులఁ జిక్కి నీచిత్తమునకు నెట్టుండునో యని చింతయ్యీడిని. ॥పల్లవి॥

కులగోత్రంబులు గుణశీలంబులు
తెలియఁగ గర్వోద్రేకములు
కలసి-మెలఁగినఁ గలుగదు జ్ఞానము
తొలఁగిన లోకద్రోహంబు. ॥ఏమి॥

మరియు గృహారామక్షేత్రంబులు
ఱిటిగొను మాయాజనకములు
మఱవఁగ నివియే మదకారణములు
విఱిగిన సంసారవిరుద్ధము(?). ॥ఏమి॥

అనుపమవ్రతకర్మానుష్ఠానము
లెన లేని బంధహేతువులు
తనిసితి నింక నీదాస్యంబే గతి
ఘనుఁడవు శ్రీవెంకటనాథా. ॥ఏమి॥ 176

శాళి

పారవేసినపుల్లాకు బండికట్టె మించినట్లు
కోరి నీముద్రలు మోచి కొండగొంటి నిదివో. ॥పల్లవి॥

మూఁడుగుణములలోన మునిఁగేటి వాఁడఁ గాన
పోడిమిఁ నాకొక బుద్ధి పుట్ట దెందును
నేఁడు నీశరణమనే నిశ్చయ మిచ్చితి గాన
వాఁడిమి నిన్నిటా నేఁ బావన మైతి నిదివో. ॥పార॥

పంచభూతాల తనువు పాటించి మోచితిఁ గాన
పంచేంద్రియవికారాలు పాయవు నాకు
యెంచఁగ నీదాస్యము నాకనామిచ్చితి గాన
పంచల నాపుట్టుగు సఫల మాయ నిదివో. ॥పార॥

తగిలి యిన్నిటికి స్వతంత్రుఁడ నేఁ గాను గానఁ
జిగి నిన్ను నెరిఁగి పూజించలేను
నగుతా శ్రీవెంకటేశ నాలో నుండుదు గాన
వగటున నిన్ను నమ్మి బ్రదికితి నిదివో. ॥పార॥ 177

బౌళి

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక నుప్పది రెండువేళల రాగాలను. ॥పల్లవి॥

తనువే వొళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టినతాళ్ళు
మనసే నీబద్దితాడు మరి గుణాలె జీవాళి
మొనసిన పుట్టుగే మూలమైన కరడి. ॥పాడే॥

పాపపుణ్యా లిరువంక పైఁడి వెండి యనుసులు
పైపై గుత్తికె మేటిపై చనిగె
కోపుల నాలికలోనఁ గుచ్చి కట్టినట్టితాడు
చూపరాని సంసారమే సూత్రపు గణికె. ॥పాడే॥

జీవునికిని దండనసేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరాలిచ్చితివి మెచ్చితివి
శ్రీవెంకటేశ నీవె చేకొన్నదాతవు. ॥పాడే॥ 178

సాళంగనాట

తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత
మానవుల లంపటాలు మరి చెప్పఁ గలదా. ॥పల్లవి॥

చెలఁగి నేలఁ బారేటి చీమ సయితమును
కలసి ఘూరకే పాఱుఁ గమ్మర నెందో మరలు
తల మోఁచి కాఁపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము దనకిఁక నెంత గలదో. ॥తానెం॥

యేడో (?) బాయిటఁ బాఱే యీఁగ సయితమును
వాడుదేర నడవుల వాలి వాలి
కూడపెట్టుఁదేనెలు గొందులఁ బిల్లలఁ బెట్టు
యేడకేడ సంసార మిఁక నెంత గలదో. ॥తానెం॥

హెచ్చి గిజగాండ్లు సయిత మెంతో గూఁడువెట్టు
తెచ్చి మిణుఁగురుఁబురువు దీపము వెట్టు
తచ్చి శ్రీవెంకటేశ నీదాసులు చూచి నగుదు
రిచ్చలఁ దా నీ సంసార మిఁక నెంత గలదో. ॥తానెం॥ 179

దేవగాంధారి

చెలఁగి యధర్మము వుట్టింప నీకేల సృష్టింపఁగ మరి నీకేల
పులులను లేళ్ల నొక్కకడుపుగా పులు నేపుదు రటె మాధవుఁడా. ॥పల్లవి॥

గొనకొని పాషండుల దుర్భాషల క్రోధము సహింపరాదు
దనుజుల పుట్టువువారలనుచు నిజతత్వజ్ఞానము నీ వియ్యవు
అనిశముఁ జూచిన వారికి మాకును అంతర్యామివి నీవు
పెనఁచి చీఁకటియు వెలుఁగును నొకచోఁ బెంచెదవేలే ముకుందుఁడా. ॥చెల॥

ఖలుల తామసపు దేవతార్చనలు కనుఁగొని యవి యోర్వఁగ రాదు
నెలకొని వారలు నరకవాసులని నీమీఁది భక్తియు నీవియ్యవు
పొలుపుగ నిందరిలోపలఁ గ్రమ్మరఁ బూజ గొనేటివాఁడవు నీవే
చలమునఁ బుణ్యము పాపము నొకచో సరిచేతురటవే గోవిందుఁడా. ॥చెల॥

సతతము నీదాస్యద్రోహులతో సహయోగంబును సహింపదు
క్షితిలో నీవటువంటివారలను సృజింపకేర్పడ మానవు
హితవుగ శ్రీవెంకటేశ్వర నీవే యిహపరములకుఁ గర్తవు
గతి నీశరణాగతి యని నమ్మిన గల విందరికిని నారాయణా. ॥చెల॥ 180

282-వ రేకు. లలిత

అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ
డతనికంటె మరి యధికులు వేరయ్యా. ॥పల్లవి॥

కమలవాసిని లక్ష్మి కలదా యెవ్వరికైనాఁ
గమలనాభునికి నొక్కనికే కాక
కమలజుఁడైన బ్రహ్మ కలఁడా యెవ్వనినాభి
నమరవంద్యుఁడు హరికే కాక. ॥అత॥

అందరు నుండెడిభూమి యన్యులకుఁ గలదా
అందపు గోవిందునికే ఆలాయఁ గాక
చెందిన భాగీరథి శ్రీపాదాలఁ గలదా
మందరధరుఁడయిన మాధవునికేఁ గాక. ॥అత॥

నిచ్చలు నభయమిచ్చే నేరుపు యెందుఁ గలదా
అచ్చుగ నారాయణునియందే కాక
రచ్చల శరణాగతరక్షణ మెందుఁ గలదా
తచ్చిన శ్రీవెంకటాద్రిదైవానకే కాక. ॥అత॥ 181

## రామక్రియ

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టలాయ మహిమలే తిరుమలకొండ. ॥పల్లవి॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనలకొండ
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీకొండ. ॥కట్టె॥

సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్విఁ దపసులే తరువులై నిలిచినకొండ
పూర్వపు టంజనాద్రి యీపొడవాటికొండ. ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కాణించి పెంచేకొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపుఁగొండ
కురిసి సంపద లెల్ల గుహల నిండినకొండ
విరివైన దిదివో శ్రీవెంకటపుఁగొండ. ॥కట్టె॥ 182

## సామంతం

విజయపు టమ్ము వేసె వెంకటేశుఁడు
విజయుని సఖుఁడు యీవేదమూరితి. ॥పల్లవి॥

పాటి తెంచి దశకంఠుపదిశిరసులమీఁద
ఆటికె ( ? ) నమ్మ్మ వేసె నాదిదేవుఁడు
ఆఅడి సేనలతోడ నంభుధిమీఁద వేసె
వేటాకయమ్మ్మ దొడిగి విష్ణుదేవుఁడు. ॥విజ॥

చాలుగ నేడు దాళ్లు సర్వము నొక్కటి గాఁగ
ఆలములో నమ్మ్మవేసె నఖిలేశుఁడు
ఆలించి రుక్మిణిఁ బెండ్లియాడునాఁడు వైరులపై
ఝాలి ( ? ) యమ్మ్మ వేసెను విజయకృష్ణుఁడు. ॥విజ॥

భజన నిందిరఁ గూడి పంతమున నమ్మ్మ వేసె
విజయదశమిని శ్రీవెంకటేశుఁడు
సుజనుల దేవతల సొంది నిందరిఁ గాచు
విజయము చేకొని విష్ణుదేవుఁడు. ॥విజ॥ 183

లలిత

నీదాఁకా వలెనా నిచ్చలు నారాయణా
ఆది నీదాసుఁడే చాలు నందరి రక్షించును. ॥పల్లవి॥

నీపాదమూలమున నిలిచిన జలమును
మోపుగా మోచె రుద్రుఁడు ముందు ముందె
కాపాడు నీనామమునఁ గలిగినమహిమచే
పైపై మునులు యిహపరములు గనిరి. ॥నీదా॥

పండేటి పాలవెల్లి నీప్రసాదమునఁ గాదె
దండిగా దేవతలెల్ల ధన్యులైరి
అండనే నీసాకారమాతుమఁ దలఁచి కాదె
నిండినయోగీంద్రులు నిత్యముక్తులైరి. ॥నీదా॥

చేరి నీవిహారమైన శ్రీవెంకటాద్రిఁ గాదె
కోరి నరులు వరాలు కొల్లగొనిరి
ఆరీతిఁ దాళ్లపాక అన్నమయ్య ఘనుఁ డాయ
వారివారమై నేము వహికెక్కితిమి. ॥నీదా॥ 184

## శుద్ధవసంతం

దీనుఁడ నేను దేవుఁడవు నీవు
నీనిజమహిమే నెరపుట గాకా. ॥పల్లవి॥

మఱి జనన మెఱఁగ మరణం బెఱఁగను
యిఱవుగ నిను నిఁక నెఱిఁగేనా
క్షితిఁ బుట్టించిన శ్రీపతివి నీవే
తతి నాపై దయ దలఁతువు గాకా. ॥దీను॥

తలఁచఁ బాపమని తలఁచఁ బుణ్యమని
తలఁపున యిఁక నిను దలఁచేనా
అలరిన నాలో నంతర్యామివి
కలుష మెడయ నను గాతువు గాకా. ॥దీను

తడవ నాహేయము తడవ నామలినము
తడయక నీమేలు దడవేనా
విడువలేని శ్రీవెంకటవిభుఁడవు
కడదాఁకా నిఁకఁ గాతువు గాకా. ॥దీను॥ 185

## మాళవి

నారాయణాచ్యుతానంత నిన్నొకచోట
గోరి వెదకనేల పేరివల్లఁ గంటిఁ బో. ॥పల్లవి॥

సొలసి నీరూపము శ్రుతులలోఁ జెప్పఁ గాని
బలిమి నాచార్యుఁడై తేఁ బ్రత్యక్షము
పలికి నీతీర్థము భావనలందే కాని
అల నీదాసులతీర్థ మరచేత నిదివో. ॥నారా॥

నీయానతు లెన్నఁడు నేము దెలియము గాని
నూయాచార్యునిమాట మంత్రరాజము
కాయములో నీవుండేది కడు మఱఁగులు గాని
యీయెడ నీపరికర మిన్నిటా నున్నది వో. ॥నారా॥

అరిది నీవఁదన మొకర్చావతారానఁ గాని
గురుపరంపరనై తేఁ గోట్లాయఁ బో
హరి నిన్ను శ్రీవెంకటాద్రినే చూచితిఁ గాని
పరమున నిహమునఁ బంచి చూపె నతఁడు. ॥నారా॥ 186

283-వ రేకు దేసాళం

నేరుపు నతఁడే నేరమి నతఁడే
భారమెల్ల నాతఁడే పని లేదు మాకు. ॥పల్లవి॥

దేవుఁడట యంతరాత్మ దేహమెంచి చూచితేను
ఠోవుల కర్మాలు సేయఁ బుట్టిన దట
జీవుఁడేటివాఁడిందు శ్రీపతి యూనాజ్ఞ గాక
భావించఁ బాపపుణ్యాలు పని లేదు మాకు. ॥నేరు॥

హరి లోకా లెలు నట అతనిమాయకులోనై
నరుల జీవనములు నడచీ నట
పెరవులు మాకేల విష్ణుఁడే యింతాఁ గాక
పరచు విచారాలు పని లేదు మాకు. ॥నేరు॥

వేడుక నాలుకను శ్రీవెంకటేశునామమట
పాడితో నాతనికి నే బంట నట
తోడునీడ యాతఁడే తోవ చూప నాతఁడే
పాడయిన కోరికలు పని లేదు మాకు. ॥నేరు॥ 187

శంకరాభరణం

మునుల తపము నదె మూలభూతి యదె
వనజాక్షుఁడె గతి వలసినను. ॥పల్లవి॥

నరహరినామము నాలుక నుండఁగ
పరమొకరి నడుగఁ బని యేల
చిరపుణ్యమునదె జీవరక్ష యదె
సరుగఁ గాచు నొకసారె నుడిగినా. ॥ముని॥

మనసులోననే మాధవుఁ డుండఁగ
వెనుకొని యొకచో వెదకఁగ నేఁటికి
కొనకుఁ గొన యదే కోరెడిదదియే
తనుఁ దా రక్షించుఁ దలఁచినను. ॥ముని॥

శ్రీవెంకటపతి చేరువ నుండఁగ
భావకర్మముల భ్రమయఁగ నేఁటికి
దేవుఁడు నతఁడే తెరువూనదియే
కావలెనంటేఁ గావక పోఁడు. ॥ముని॥ 188

వరాళి

విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా
మెత్తిన శ్రీహరి సేవే యీడేర్చవయ్యా. ॥పల్లవి॥

పాపపుణ్య దేహికి బంధములే సహజము
యేపునఁ గాదని తోయ నెట్టు వచ్చును
పూపవంటి మనసుకు భోగములే సహజము
తేపగా విరతి యెందుఁ దెచ్చుకొనేమయ్యా ॥విత్తొ॥

మాయల జన్మమునకు మమతలే సహజము
యేయెడఁ జొరక మాన నెట్టు వచ్చును
కాయవంటి గుణానకు కర్మమే సహజము
చాయల నేమెటువలె శాంతిఁ బొందేమయ్యా ॥విత్తొ॥

తప్పని జ్ఞానమునకు దైవమే సహజము
యెప్పుడు స్వతంత్రుఁడుగా నెట్టు వచ్చును
నెప్పున శ్రీవెంకటేశ నీమహిమే యింతాను
చెప్పఁ జూపఁ జోటు లేదు చేరి వుండేమయ్యా. ॥విత్తొ॥ 189

## మాళవిగౌళ

ధరలో నాజన్మమే తనువు నదియె
యిరవై నీదాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే. ॥పల్లవి॥

అల రావణునితమ్ముఁ డసురనరభోజనుఁ
డలరి తొల్లెన్నఁ నీవాఁడై నమిూఁదను
కులజుఁడు పుణ్యుఁడు గుణనిధి యిందరును
దలఁప యోగ్యుఁడు నట దాస్యమహి మెట్టిదో. ॥ధర॥

జాతిబోయ పాతకుఁడు సత్యతపుఁ డట తొల్లి
నీతి నరణి యనేటి నీదాసుఁ జేరి
ఆతల బ్రహ్మఋషాయ నష్టాక్షరమంత్రాన
చేతల నీదాసుల సేవాఫల మెట్టిదో. ॥ధర॥

నానాజంతువులందు నవభక్తి గలిగితే
హీనాధిక్యము లేక యేచి కాతువు
శ్రీనాథ కాచితివి శ్రీవెంకటేశ మమ్ము
నేను ధన్యుఁడ నైతి నీమహిమ యెట్టిదో. ॥ధర॥ 190

శంకరాభరణం

తెలిసినవారికి దేవుఁ డితఁడే
వలవని దుష్టుల వాదము లేలా. ॥పల్లవి॥

పురుషులలోపలఁ బురుషోత్తముఁడు
నరులలోన నరనారాయణుఁడు
పరదైవములకుఁ బరమేశ్వరుఁడు
వరుస మాధులకెవ్వరో యితఁడు. ॥తెలి॥

పలుబ్రహ్మలకును పరబ్రహ్మము
మలయు నీశులకు మహేశుఁ డితఁడు
యిల నాత్మలలో నిటు పరమాత్ముఁడు
ఖలులకెట్లుండునో కానము యితఁడు. ॥తెలి॥

వేదంబులలో వేదాంతవేద్యుఁడు
సోదించ కరిఁ గాచుచో నాదిమూలము
యీడెన శ్రీవెంకటేశుఁ డిందరికి
గాదిలి మతులను గైకొనఁ డితఁడు. ॥తెలి॥ 191

లలిత

సంసారికిఁ గల సహజ మిది మతిఁ
గంసారి మనకుఁ గల్గఁ డటు గాన. ॥పల్లవి॥

చేతులు చాఁచుచు సేయఁగఁ దొడఁగిన
ఘాతల నిన్నిఁ గర్మములే
వాతులు మోవఁగ వలెనని వెదకిన
పూతల నిన్నియు భోగములే. ॥సంసా॥

వోగి లంపటముల కోపిక గలిగిన
జగమింతాఁ బో సంపదలు
జిగిఁ జిత్తములోఁ జింతించి చూచిన
సగుణం బింతా సంతోషములు. ॥సంసా॥

యేచిన శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చూచిన వెల్లా సులభములే
తాచి యీతనికె దాసుల మయితిమి
కాచె నతఁడు మను గడమలు లేవు. ॥సంసా॥ 192

234-వ రేకు. శ్రీరాగం

కొలిచినవారిపాలి కొల్లలివివో
యిల నిట్టి దైవము యిఁక వేరే కలరా. ॥పల్లవి॥

యెట్టైన నభయహస్త మెత్తుక కాచుకున్నాడ
వట్టిదాసులఁ గాచే నంటా నీవు
తొట్టిన పాపాలు పోఁ దోలు నీనామమంత్రాలు
జట్టిగా లోకాల వెదచల్లినాఁడవు. ॥కొలి॥

తలఁచినవారికెల్లా ధనధాన్యా లిత్తు నంటా
వొలసి శ్రీసతి మోచుకున్నాఁడవు
యిలఁ బావనులఁగా నిందరిఁ జేసే నంటా
నెలవిఁ బాదతీర్థ మేరు చేసినాఁడవు. ॥కొలి॥

పుట్టించ జీవులను భువనములో నల
గట్టిగ బ్రహ్మను నాభిఁ గన్నాఁడవు
అట్టుగఁ బాలుపడి చుట్టి రక్షకత్వానికే
యిట్టి శ్రీవేంకటాద్రి యెక్కినాఁడవు. ॥కో॥ 193

భైరవి

కాను స్వతంత్రుఁడ ననఁ గా దని తలఁగ లేను
నేను నీ కింకరుఁడ నీ రచనలే. ॥పల్లవి॥

యెంతైనాఁ దీర దిదే యెందు చూచినపనులు
అంతటాను నీమాయ అలయించఁగా
దొంతులగుఁ గర్మములు తోడనే తిరిగీని
సంతకూటపుబ్రతుకు సటలఁ బెట్టీని. ॥కాను॥

మానవింద్రియము లివి మతిలోనఁ బెరరేఁచు
నానాగము(తు?)ల బ్రకృతి నటియించఁగా
పూని పురాకృతములు పోసీక తిరిగీని
పానఁ బట్టినవయసు సటలఁ బెట్టీని. ॥కాను॥

తరవులనే పెట్టీని తతిలేని యాస లివి
నిరతంపు జన్మములు నిమ నాగఁగా
వరుస శ్రీవేంకటేశ్వర నీవు నన్నేలి
కరుణించఁగా భక్తి ఘనత మీరీని. ॥కాను॥ 194

భూపాలం

ఏమి నిద్దిరించేవు యెందాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లఁ గాచుకున్నా రిదివో. ॥పల్లవి॥

పులుఁగాలుఁ బచ్చళ్ళు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాసవేళయు నిదే
బలసి సంకీర్తనపరులు పాడేరిదే
జలజాక్షుఁడ లేచి జలక మాడవయ్యా. ॥ఏమి॥

తోడనే గ్రంథాక్షతలు ధూపదీపాలివిగో
కూడిన విప్రుల వేదఘోషణలివే
వాడు దేరఁ బూజించవలెఁ గమ్మఁబువ్వులివె
వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా. ॥ఏమి॥

చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాముడిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవెంకటాధిప మాచరపిదే
యెదుట నిన్నటి మాపే యియ్యకొంటివయ్యా. ॥ఏమి॥ 195

## శుద్ధవసంతం

చేరి యశోదకు శిశువితఁడు
ధారుణి బ్రహ్మకు దండ్రియు నితఁడు. ॥పల్లవి॥

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదచల్లెడు లక్షణుఁడు
నిలిచిన నిలువున నిఖిలదేవతల
కలిగించు సురల గనివో యితఁడు. ॥చేరి॥

మాటలాడినను మరి యజాండములు
కోటులు వొడమేటి గుణరాశి
నీటగు నూర్పుల నిఖిలవేదములు
చాటువనూరెటి సముద్ర మితఁడు. ॥చేరి॥

ముంగిటఁ బొలసిన మోహాన మాత్మలఁ
బొంగించే ఘనపురుషుఁడు
సంగతి మావంటి శరణాగతులకు
సంగము శ్రీవేంకటాధిపుఁ డితఁడు. ॥చే॥ 196

సాళంగం

జీవన్ముక్తులము శ్రీపతిదాసులము
భావించవో మమ్మును ప్రపంచపు మాయా. ॥పల్లవి॥

యివల దానధర్మము లేమిఁ జేయుట లేదు
తవిలిన పాతకాలు దైవము సహించుకొనె
భువిలోన నా కిఁకఁ బుట్టఁ బనిలేదు లేదు
భవరోగవైద్యుఁడు శ్రీపతి గలఁడు గాన. ॥జీవ॥

యెలమి స్వర్గాదిలోకా లేమి గోరుట లేదు
కల వైకుంఠము హరి కొలమునాఁడే యిచ్చె
తొలుత నాకుఁ జావులతోడి సడ్డ వద్దు వద్దు
బలువైన యచ్యుతుని బట్టము గాన. ॥జీవ॥

పూపసుఖమూ నొల్లము పొంచి దుఃఖమూ నొల్లము
చేపట్టి బ్రహ్మానందము శ్రీవేంకటేశుఁ డిచ్చెను
మాపయి నాఁకటికిఁగా తోదోపు మా కిఁక వద్దు
కాపమృతమథనుఁడు గలఁ డిట్టెకాన. ॥జీవ॥ 197

పాడి

కాపులము నేము కర్తవు నీవు
దాపు దండై మము నిట్టే దయఁ జూడవయ్యా. ॥పల్లవి॥

నెట్టన నైదుగురికి నేము డాగు వెట్టేము
చుట్టి చుట్టి వీఁకఁబట్టు చూపి వున్నది
అట్టె కర్మగలకు నరిగోరు వెటేను
నట్టుకొట్టి ( ట్టే ? ) జవుఁకు నరకము లేలయ్యా. ॥కాపు॥

మించిన యాసల కిదే మేర లెల్లాఁ బెట్టేము
పొంచి మమతలలోఁ గాఁపురి మున్నారం
పంచేంద్రియములకే పైరులు సేసితిమి
అంచెలఁ బ్రాణులకేఁక నానాజ్ఞ లేలయ్యా. ॥కాపు॥

కూరిమి విషయముల కొట్నాలు దంచేము
చేరి నీవు చెప్పినట్టే సేసేము
యీరీతి శ్రీవెంకటేశ యిటు నీకే దాసులము
ఆరూఢిగా మన్నించితి వంతే చాలు నౌనయ్యా. ॥కాపు॥ 198

285-వ రేకు. మలహరి

సకలముఁ జదివిన శాస్త్రము లెఱిఁగిన
శుకబ్రహ్మవాదు లిటు చూపినది. ॥పల్లవి॥

భవభవములగను ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం బెప్పుడు నొకటే
కవిసిన నీమాయఁ గడచినది. ॥సక॥

మతము మతమునకు మార్గము వేరే
అతి సంశయములు అవి వేరే
గతి నీశరణము గలిగినవొకటే
యితవగు మోక్షంబిచ్చేది. ॥సక॥

జాతిజాతి యాచారము వేరే
ఆతల మోక్షంబది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవెంకటేశ్వర
చేత మాగురుఁడు చెప్పినది. ॥నక॥ 199

ముఖారి

తొల్లిటివారికంటె దొడ్డ నేను పాతకాన
బల్లిదుఁడవగుటకుఁ బ్రతాపమిదివో. ॥పల్లవి॥

నరహరి యచ్యుత వో నారాయణా
గురుఁడు నిన్నుఁ గొండించె(?)గోరి నే వింటి
గరిమ నొక్క తప్పున కాకికిఁ బరమిచ్చితి
సిరులఁ బెక్కు తప్పులు సేసితి నేమిచ్చేవే. ॥తొల్లి॥

మందరధరుఁడ వో మధుసూదనా
అందరు ని న్నొకమాఁట ఆడఁగా వింటి
నిందకొకటి బొంకితే నీవు ధర్మజుఁ గూడితి
వంది పెక్కు బొంకుల నాయందుఁ గూటమెంతో. ॥తొల్లి॥

శ్రీవెంకటేశ్వర శ్రీసతిమనోహర
సేవ నీదాసులే నిన్ను చేతఁ జూపేరు
మోవ నొక్కశునకము మొర యాలించితివట
వేవేలు జన్మా లెత్తితి యీవిధమెట్లాలించేవో. ॥తొల్లి॥ 200

వరాళి

ఇదె చాలదా మమ్ము నీడేర్చను
అదన నెవ్వఁడెరుఁగు నటమీఁది పనులు. ॥పల్లవి॥

యిట్టి పంచసంస్కారా లెచ్చోట నుండినాను
పట్టినవారే మాకుఁ బ్రమాణము
మట్టుగ నీరూపనామము లెందు నుండినాను
కట్టఁగడవారైన ఘనపుణ్యులు. ॥ఇదె॥

పలుక వైష్ణవవేషభాష లెందు నుండినాను
వలనుగ మాకు సహవాసయోగ్యులే
తలకొన్న దాసానుదాస్యమెందు నుండినాను
అల కర్మదూరులైన సంతరంగులు. ॥ఇదె॥

యెక్కువ సంకీర్తన మెచ్చోట నుండినాను
అక్కడ పరమపద మది భాగ్యము
చక్కఁగ వేదశాస్త్ర సమ్మతము నిదియే
పక్కన శ్రీవెంకటేశుపరమార్థము నిదే. ॥ఇదె॥ 201

రామక్రియ

అన్నిటిమూలం బతఁడు
వెన్నునికంటెను వేల్పులు లేరు. ॥పల్లవి॥

పంచభూతముల ప్రపంచమూలము
ముంచినబ్రహ్మకు మూలము
పొంచిన జీవుల పుట్టుగు మూలము
యెంచఁగ దైవము యితఁడే కాఁడా. ॥అన్ని॥

వెనుకొని పొగడెటి వేదాలమూలము
మునుల తపములకు మూలము
ఘనయజ్ఞాదుల కర్మపుమూలము
మొనలేని దైవమితఁడే కాఁడా. ॥అన్ని॥

అగపడి సురలకు నమృతమూలము
ముగురు మూర్తులకు మూలము
నగు శ్రీవెంకటనాథుఁడె మూలము
మెగువలోకపతి యితఁడే కాఁడా. ॥అన్ని॥ 202

## లలిత

అవధారు రఘుపతి యందరిని జిత్తగించు
యివల నిందెఁ గొలు విదె నదె సముఖా. ॥పల్లవి॥

రామ రాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమ నారదుఁడు వాఁడీఁ బెక్కు రంభాదులాడేరు
మోమెత్తి కపులెల్లా మొక్కేరదివో. ॥అవ॥

యినవంశకులజాత యిక్ష్వాకుతిలకా
ఘనదశరథసుత కౌశికప్రియ
మునులు దీవించేరు ముందట భరతుఁడదె
వెనక లక్ష్మణుఁడు సేవించీ వింజామర. ॥అవ॥

కందువ కౌసల్యాగర్భరత్నాకర
చెందిన శ్రీవెంకటాద్రి శ్రీనివాసా
సందడిఁ గుశలవులు చదివేరు వొకవంక
చెంది సీరాజసను చెప్పరాదు రామా. ॥అవ॥ 203

## దేసాళం

అక్కటా రావణుబ్రహ్మహత్య నీకు నేడది
పుక్కటిపురాణలింగపూజ నీకు నేడది. ॥పల్లవి॥

గురుహత్య బ్రహ్మహత్యఁ గూడీ ద్రోణాచార్యువంక
హరి నీకృప నర్జును కవి లేవాయ
యెరవుగాఁ గల్లలాడి యేచిన ధర్మజునకు
పరగ నీయనుమతిఁ బాపము లేదాయను. ||అక్క||

అదివో రుద్రుని బ్రహ్మహత్య వాయఁ గాసి యిచ్చి
పొదలిన నీ వతనిఁ బూజింతువా
అదనఁ బార్వతిదేవి కాతఁడే నీమంత్రమిచ్చె
వదరుమాటల మాయావచనాలేమిటికి. ||అక్క||

తగిలిన నీనామమే తారకబ్రహ్మమై
జగమువారి పాపాలు సంతతముఁ బాపఁగాను
మిగుల శ్రీవెంకటేశ మీకు నేడ పాతకాలు
నగుఁబాటులింతే కాక నానాదేశముల. ||అక్క|| 204

286-వ రేకు. సామంతం

నారాయణుఁడ నీ నామము మంత్రించి వేసి
పారేటి యీ జంతువుల భ్రమ విడిపించవే. ||పల్లవి||

మదనభూతము సోఁకి మగువలుఁ బురుషులు
అదన విరిదలై యంగమొలలై
పెదవి నెత్తురు పీర్చి పెనుగోళ్ళఁ జించుకొంటా
కొదలు కుత్తికలనుఁ గూసేరు జీవులు. ||నారా||

పంచభూతములు సోఁకి భ్రమసి యజ్ఞానులై
పొంచి హేయములు మన్నుఁ బూసుకొంటాను
అంచెల పీడెపురసమందు నిందు గురియుచు
యెంచి ధనముపిశాచాలిట్లైరి జీవులు. ||నారా||

తమితోడ మాయాభూతము సోఁకి బహుజాతి
మొనుకలుఁ దోలు నరాలిరవుచేసి
నెమకి శ్రీవెంకటేశ నిన్నుఁ జేరకెక్కుడైన
తముఁ దా మెరఁగరింతటాఁ జూడు జీవులు. ॥నారా॥ 205

వసంతం

నీ శరణమె గతి నే నితరమెరఁగ
పాశబంధముల పనులేలయ్యా. ॥పల్లవి॥

పూఁచిన తొలుకర్మంబులు భోగించక పోవు
చాఁచుకున్న యీ శరీరగుణములు చాలు నన్నుఁ బోవు
రేఁచిన జననమరణములు రెంటికిఁ దీసీని
మోఁచి వచ్చితే విజ్ఞాన మెరఁగఁ(గ) మొదలికిఁ గొనకును మెడయేదయ్యా॥

కోరిన నా కోరికలు కొనసాగక పోవు
బారిఁబడుచు కాలము దా బడిఁ దగులక పోదు
మేరతో పంచేంద్రియములు మెడ చుట్టక పోవు
యేరీతుల సంసారము గెలువఁగ నెదురుబడిని బలిమి(నిఁ)క నేదయ్యా ॥నీ శ॥

మనసును వాకునుఁ జేఁతయు మాను మన్నుఁ బోవు
తనువులోన నా యంతర్యామివి తలఁచక యిఁకఁ బోదు
ఘనుఁడవు శ్రీవెంకటపతి నన్ను గావక యిఁక: బోదు
కని కానని యజ్ఞానజంతువను కడమ లెంచ నిఁకఁ గొల దేదయ్యా. ॥నీ శ॥

ముఖారి

కడవ రాదు హరి ఘనమాయ తెగి
విడువఁగ రాదు వేసర రాదు. ॥పల్లవి

చూపుల యెదిటికి సోద్యంబైనది
పాపపుణ్యముల ప్రపంచము
తీపులు పుట్టించు దినదినరుచులై
పూపల సంసారభోగములు. ॥కడ॥

మనసులోపలికి మర్మంబైనది
జననమరణముల శరీరము
వెనవెనకఁ దిరుగు వెడ లంపటమై
కనకపుటాసల కర్మములు. ॥కడ॥

తగు మోక్షమునకుఁ దాప యైన దిదె
నగి హరిఁ దలఁచిన నాలు కిది
వెగటు దీరె శ్రీవెంకటపతియై
యగపడె నిపుడు పురాకృతము. ॥కడ॥ 207

## రామక్రియ

పంచేంద్రియములాల పంచభూతములాల
అంచెలఁ దొమ్మి సేయకురో మీరు. ॥పల్లవి॥

కొందరికి మంచివాఁడ కొందరికిఁ గానివాఁడ
నిందకుఁ గీర్తికిఁ బొత్తు నే నొకఁడనే
అంది నిద్దిరించువాఁడ నటు మేలుకొనువాఁడ
బొందితో నెఱుక మఱపులకు నొక్కఁడనే. ॥పంచేం॥

దైవము నిర్మించినది ధరణిఁ బొడమినది
యీవలావలికిఁ బొత్తు యీ దేహానే
వేవేలు పుణ్యములకు వెలయుఁ బాపములకు
యీవల రెంటికి గురి యిదివో నా మనసు. ॥పంచేం॥

తుంచి సగమటు వోవు తోడనే సగము వచ్చు
పంచి లోనికి వెలికిఁ బ్రాణమొక్కటే
కొంచక శ్రీవెంకటేశుఁ గొలిచి నే శరణంటి
మంచివాయఁ బను లెల్లా మమ్ముఁ గాచె నితఁడు. ॥పంచే॥ 208

భైరవి

అట మీఁద శర ణంటి నన్నిటా మాన్యము నాకు
యెటు సేసినా జెల్లె నీక నేల మాటలు. ॥పల్లవి॥

ఏది పుణ్యమో నాకు నేది పాపమో కాని
శ్రీదేవుఁడవు నీవే సేయించేవు
సేద దేర నామీఁదఁ జిత్రగుప్తుఁ డేల వా (వ్రా ?) సీ
మేదిని స్వతంత్ర మేది మెరయనిబంటను. ॥అట॥

పుట్టినట్టి తెరువేదో పోయేటి జాడ యేదో
పుట్టించితి నీవే పురుషోత్తమ
వెట్టి సంసారబంధాలు వెంట వెంట నేల వచ్చీ
యిట్టె యెవ్వరివాఁడ నిందులోన నేను. ॥అట॥

చిత్త మెటువంటిదో జీవుఁ డెటువంటివాఁడో
హత్తిన శ్రీవెంకటేశ అంతరాత్మవు
ఒత్తిర మదము నిన్ను నేల కాన నియ్యదాయ
నిత్తెము తొల్లే నేను నీవాఁడఁ గాన. ॥అట॥ 209

పాడి

సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా. ॥పల్లవి॥

చెలిమి సుగ్రీవుతోడఁ జేసిన రామ తొల్లి
శిలను బడఁతిఁ గావించిన రామా
చెలరేఁగిన వానరసేనల రామా
శిలుగు మాయామృగముఁ జంచిన రామా. ॥సామి॥

తరణివంశ తాటకాంతక రామా
నరనాథ కౌసల్యానందన రామా
సిరులఁ బెండ్లాడిన సీతారామా
గరిమతో సేతువుగట్టిన రామా. ॥సామి॥

రావణాది దనుజహరణ రామా
కావించి విభీషణునిఁ గాచిన రామా
దీవెనలయోధ్యలోఁ జెందిన రామా
శ్రీవెంకటాద్రిమీఁది శ్రీరామా. ॥సామి॥ 310

287.వ రేకు. సాళంగనాట

అదివో నీప్రతాపము హనుమంతా
యెదురు లేదు నీకు నెక్కడా హనుమంతా. ॥పల్లవి॥

యెత్తిన నీ కుడిహస్తమిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీ యెడమచేతిపిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా. ॥అది॥

నలియఁ ద్రొక్కిన నీవున్నతపుఁ బాదముకింద
నలమటించేరరులు హనుమంతా
చలపట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలుదానవులు భంగపడిరి హనుమంతా. ॥అది॥

వడి నీవు మీఁదికి వాలమల్లార్చిన
అడఁగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవెంకటేశుపంపున నీవు గెల్వఁగ
బెడిదమై పొగడేరు పెద్దహనుమంతా. ॥అది॥ 211

మాళవి

దిక్కు లెల్లా సాధించి దేవదుందుభులు మ్రోయ
నెక్కడ చూచినఁ దానే యేగీ సేవించరో. ॥పల్లవి॥

అదివో శ్రీహరితేరు అదె గరుడధ్వజము
కదలేటి ఘనతురంగములవిగో
పొదలుఁ బూదండలవే పూఁచి వాఁగే ఘంటలవే
యెదుటఁ దిరువీధుల నేఁగీ సేవించరో. ॥దిక్కు॥

వారె అచ్చరలేమలు వారె మునులు ఋషులు
వారక కొలిచే దేవతలు వారే
వీరే యనంతగరుడవిష్వక్సేనాదులు
యీరీతిఁ బ్రతాపాన నేఁగీ సేవించరో. ॥దిక్కు॥

వీఁడె శ్రీవెంకటేశుఁడు వీఁడలమేల్మంగపతి
వీఁడె శంఖచక్రాదుల వెలసినాఁడు
పోఁడిమి వరములిచ్చీఁ బొసఁగ దాసులకెల్లా
యేఁడేఁడు దప్పకుండాను యేఁగి సేవించరో. ॥దిక్కు॥ 212

శాళి

ఆనందనిలయ ప్రహ్లాదవరదా
భానుశశినేత్ర జయ ప్రహ్లాదవరదా. ॥పల్లవి॥

పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా
హరి యచ్యుతానంత ప్రహ్లాదవరదా
పరిపూర్ణగోవింద ప్రహ్లాదవరదా
భరితకల్యాణగుణ ప్రహ్లాదవరదా. ॥ఆన॥

భవరోగసంహరణ ప్రహ్లాదవరదా
అవిరళకేశవ ప్రహ్లాదవరదా
పవమాననుతకీర్తి ప్రహ్లాదవరదా
భవపితామహవంద్య ప్రహ్లాదవరదా. ॥ఆన॥

బలయుక్తనరసింహ ప్రహ్లాదవరదా
లలిత శ్రీవెంకటాద్రి ప్రహ్లాదవరదా
ఫలితకరుణారస ప్రహ్లాదవరదా
బలివంశకారణప్రహ్లాదవరదా. ॥ఆన॥ 213

రామక్రియ

పంతగాఁడు మిక్కిలి బంటతనమునను
అంతటాఁ గలశాపుర హనుమంతరాయఁడు. ॥పల్లవి॥

నీరధి చంగన దాఁటి నెట్టన లంక చొచ్చి
శ్రీరామునుంగరము సీతకిచ్చి
మేర మీరి యక్షుఁ గొట్టి మేటి వనము వెరికె
ఆరయఁ గలశాపుర హనుమంతరాయఁడు. ॥పంత॥

ఘాతతో లంక గాలిచి గక్కన లంకిణిఁ జంపి
యీతలికి మగుడఁ దా నేతెంచి
సీతాశిరోమణి శ్రీరామునకునిచ్చె
ఆతఁడే కలశాపుర హనుమంతరాయఁడు. ॥పంత॥

అల రావణుని గెల్చి అయోధ్యాపురికి వచ్చి
బలురాముని సీతతోఁ బట్టము గట్టి
నిలిచె శ్రీవెంకటాద్రినిలయుని యెదుటను
అలరెఁ గలశాపుర హనుమంతరాయఁడు. ॥పంత॥ 214

ముఖారి

అవధారు సకలలోకైకనాథ
సువర్ణరూపమైన సుగ్రీవనారసింహా. ॥పల్లవి॥

అరుదుగ మీరు సింహాసనముపై నుండఁగ
యిరుగడ సేవించేరు యింద్రాదులు
పరగ నెట్టనెదుట ప్రహ్లాదుడున్నవాఁడు
సారిదినే చిత్తగించు సుగ్రీవనారసింహా. ॥అవ॥

చాపలపు హిరణ్యుని సమయించివున్న మీకు
చేపట్టి మొక్కేరు వశిష్ఠాదులు
యేపొద్దు మీతొడమీఁద నిందిర గాచుకున్నది
చూపులఁ గరుణ నించు సుగ్రీవనారసింహా. ॥అవ॥

సలలితముగ నీవు జగములు రక్షించఁగా
వలనుగఁ బొగడేరు వ్యాసాదులు
యెలమి శ్రీవెంకటేశ యిందు నందు నెలకొని
సులభమూర్తివైతివి సుగ్రీవనారసింహా. ॥అవ॥ 215

శ్రీరాగం

శరణు శరణు రామచంద్ర నరేంద్రా
సరి మమ్ముఁ గావు రామచంద్ర నరేంద్రా. ॥పల్లవి॥

ఘనదశరథునకుఁ గౌసల్యాదేవికిని
జననమందిన రామచంద్ర నరేంద్రా
కనలి తాటకిఁ జంపి కౌశికుజన్నము గాచి
చనవులిచ్చిన రామచంద్ర నరేంద్రా. ॥శర॥

అరిది సీతఁ బెండ్లాడి అభయమందరికిచ్చి
శరధి గట్టిన రామచంద్ర నరేంద్రా
అరసి రావణు జంపి అయోధ్యానగర(రి?)మలి
సరవి నేలిన రామచంద్ర నరేంద్రా. ॥శర॥

పన్నగ నలమేల్మంగపతి శ్రీవెంకటేశ్వరు
సన్నిధి నిల్చిన రామచంద్ర నరేంద్రా
అన్నిటా లక్ష్మణభరతాంజనేయశత్రుఘ్నుల
సన్నుతి కెక్కిన రామచంద్ర నరేంద్రా. ॥శర॥ 216

288-వ రేకు. నాట

కంభమున వెడలి ఘననరసింహము
కుంభిని హిరణ్యుఁ గూలిచెను. ॥పల్లవి॥

తొడికి దైత్యుఁ దనతొడపై కిఁ దిగిచి
కడుపు చించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడఁ దగిలించుక మెరసీ వాఁడే. ॥కంభ॥

పెదవులు చింపుచు పెనుగోళ్ల నదిమి
వుదుటుఁ బునుక గొరికుమియుచును
సదరపు గుండెలు చప్పరింపుచును
మెదడు గందముగ మెత్తీ వాఁడే. ॥కంభ॥

దేవతలభయము దీర్చి యంకమున
శ్రీవనితను గృపసేయుచును
పావనపు టహోబలగిరిదైవము
శ్రీవెంకటగిరిఁ జెలఁగీ వాఁడే. ॥కంభ॥ 217

సాళంగనాట

ఆదిమపురుషుఁడు అహోబలమునను,
వేదాద్రిగుహాలో వెలసీ వాఁడే. ॥పల్లవి॥

వుదయించె నదిగో వుక్కుఁగంభమున
చెదరక శ్రీనరసింహుఁడు
కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు
నెదుట గద్దెపై నిరవై నిలిచె. ॥ఆది॥

పొడచూపె నదిగో భువి దేవతలకు
చిడుముడి శ్రీనరసింహుఁడు
అడర నందరికి నభయంబొసగుచు
నిడుకొనెఁ దొడపై నిందిరను. ॥ఆది॥

సేవలు గొనె నదె చెలఁగి సురలచే
శ్రీవెంకటనరసింహుఁడు
దైవమై మమ్మేలి దాసుల రక్షించె
తావుకొనఁగ నిటు దయతోఁ జూచి. ॥ఆది॥ 218

దేవగాంధారి

ఏమని నుతింతు నేను యిందిరానాయక నీవు
కామించి కోరినవారి కల్పలతవు. ॥పల్లవి॥

నెట్టనఁ దలఁచేవారి నిండు నిధానమవు
పట్టినవారి చేతిబంగారమవు
చుట్టరిక మెంచేవారి కోటికిఁ దల్లిదండ్రివి
ముట్టి కొలిచినవారి ముంజేతమవు. ॥ఏమ॥

సేవ చేసినవారికి చేతిలో మాణికమవు
భావించువారికి పరబ్రహ్మమవు
కావలెనన్నవారికి ఘనమనోరథమవు
వావిరిఁ బూజించువారి వజ్రపంజరమవు. ॥ఏమ॥

బత్తిసేసినవారికి భవరోగవైద్యుఁడవు
హత్తి నుతించినవారి యానందమవు
పొత్తుల అలమేల్మంగబువ్వాపు శ్రీవెంకటేశ
యిత్తల మాపాలిటికి నిహపరదాతవు. ॥ఏమ॥ 219

దేసాళం

సురలు సంతోషించి రసురలెల్లా నడఁగిరి
తొరలి దిక్కుల దేవదుందుభులు మొరసె. ॥పల్లవి॥

కడగి వసుదేవునికాంత దేవకిదేవికి
పుడివోని వేడుకఁ జంద్రోదయవేళ
కొడుకై జన్మించినాఁడు కూరిమి శ్రీకృష్ణుఁడు
నడురేయి నిదే శ్రావణబహుళాష్టమిని. ॥సుర॥

రేపల్లెకేమున దాఁటి రేతిరే తెచ్చి తండ్రి
పాపని యశోదవద్దఁ బండఁగ బెట్టి
ఆపొద్దే మధురలోని కాఁడుఁబాపఁ దెచ్చుకొని
కోపగించి కంసుని మార్కొనె నందనందని. ॥సుర॥

పురుఁడు వెళ్లెను మరి పుణ్యాహవాచన సేసిరి
మురిపేన గొల్లెతలు ముద్దాడిరి
అరిది శ్రీవెంకటేశుఁ డలమేలుమంగపతై
యిరవై కొల్చినవారి నిందరి రక్షించెను. ॥సుర॥ 220

బౌళి

దేవదుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను. ॥పల్లవి॥
గరుడధ్వజముతోడ కనకపు గుత్తాలతో
పరపై యష్టదిక్కుల బండికండ్లతో
నిరతితో పట్టునూలి నిడుపపగ్గాలతోడ
యిరవై శ్రీపతితేరు యేఁగీ వీధులను. ॥దేవ॥
పచ్చల ప్రతిమలతో పగడపు నొగలతో
హెచ్చిన వైడూర్యపు టిరుసులతో
కుచ్చుల ముత్యాలతో గూపుఁ బైఁడికుండలతో
యిచ్చల భూధవుతేరు యేఁగీ వీధులను. ॥దేవ॥
మంచి నీలాలగద్దెతో మణిదర్పణాలతోడ
పొంచిన సింగారాలతో పూదండలతో
అంచె శ్రీవెంకటేశుతో నలమేలుమంగతోడ
మెంచఁగ దేవుఁతేరు యేఁగీ వీధులను. ॥దేవ॥ 221

పాడి

సేవించి చేకొన్నవారి చేతి భాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను. ॥పల్లవి॥

గరుడగంభముకాడ కడుఁ బ్రాణాచారులకు
వరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలము లెల్ల
పరుమల కొసఁగీని పరమాత్ముఁడు. ॥సేవి॥

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించీని నారాయణుఁడు
కానుక పైఁడిగాదెలకాడఁ దన నిజరూపు
ఆనుక పొడచూపీని అఖిలేశుఁడు. ॥సేవి॥

సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి
విన్నపాలు వినీ శ్రీవెంకటేశుఁడు
యెన్నికఁ బాదాలవద్ద యిహముఁ బరముఁ జూపీ
మన్ననల అలమేలుమంగవిభుఁడు. ॥సేవి॥ 222

289-వ రేకు సాళంగనాట

చూడరో చూడరో నేఁడు సురలార నరులార
వాడి వోయి దనుజుల దండించి తావచ్చె. ॥పల్లవి॥

వాయువేగమున వచ్చె వనజాక్షునరదము
వేయిసూర్యుల ప్రతాపవిభవముతో
చాయఁల చక్రవాళాద్రి సముద్రాలు దాఁటివచ్చె
ఆయితమై పైఁడిటెక్కెలవే కానవచ్చె. ॥చూడ॥

మునుకొని మనోవేగమున వచ్చె హరితేరు
తనరారు కోటిచంద్రప్రభలతో
పెనుకొని దిక్కులెల్లా విజయము సేసి వచ్చె
కనకాచలముతో గక్కన నరి వచ్చె. ॥చూడ॥

గరుడవేగాన శ్రీవెంకటేశురథము వచ్చె
మరిగిన యలమేలుమంగసిరితో
ధరలోన వీధులేఁగి తన నెలవుకు వచ్చె
వరగ హరిదాసులపంతములు వచ్చె. ॥చూడ॥ 223

సామంతం

నానాభరణముల నరసింహా
పూనిన ప్రతాపముల నరసింహా. ॥పల్లవి॥

నగవుల నెమ్మోము నరసింహా
పొగరు మించు టూర్పుల నరసింహా
నగముమీఁది ఘననరసింహా
తగు కాంతుల యందపు నరసింహా. ॥నానా॥

నలిననేత్ర శ్రీనరసింహా
పొలుపొందు నఖంబుల నరసింహా
నలుదెసల మెఱయు నరసింహా
వెలయు మూఁడుగన్నుల నరసింహా. ॥నానా॥

నమితసురాసుర నరసింహా
కమనీయగుణాకర నరసింహా
నమోస్తు తే శుభనరసింహా
కమలాంత శ్రీవెంకటనరసింహా. ॥నానా॥ 224

శంకరాభరణం

నమితదేవం భజే నారసింహం
సుముఖకరుణేక్షణం సులభనరసింహం. ॥పల్లవి॥

విజయనరసింహం వీరనరసింహం
భుజబలపరాక్రమస్ఫుటనృసింహం
రజనిచరవిదళనవిరాజితనృసింహం
సుజనరక్షకమహాశూరనరసింహం. ॥నమి॥

దారుణనృసింహం ప్రతాపనరసింహం
చారుకల్యాణనిశ్చలనృసింహం
ధీరచిత్తావాసదివ్యనరసింహం
సారయోగానందచతురనరసింహం. ॥నమి॥

విమలనరసింహం విక్రమనృసింహం
కమనియ్యగుణగణాకరనృసింహం
అమితసుశ్రీవెంకటాద్రినరసింహం
రమణీయ్యభూషాభిరామనరసింహం ॥నమి॥ 225

వరాళి

దేవుఁడవు నీవు జీవులు నీబంట్లు
సేవ దేరి నీ సేఁతే శేఖరమై నిలిచె. ॥పల్లవి॥

చేరి నేరమి సేసేది జీవునికి స్వభావము
నేరిచి రక్షించేది నీస్వభావము
ధారుణిలోపల మారి తప్పులెంచఁ జోటేది
మేర మీరి నీ మహిమే మిక్కుటమై నిలిచె. ॥దేవు॥

మత్తుఁడై వుండేదే మనుజుని స్వభావము
నిత్తెపు జ్ఞాన మిచ్చేది నీస్వభావము
వొత్తి గుణావగుణాలు వోరయఁగఁ జోటేది
సత్తుగా నీకరుణే సతమయి నిలిచె. ॥దేవు॥

చెలఁగి నీశరణు చొచ్చేదే నాస్వభావము
నెలవై యేలుకొనేది నీస్వభావము
మలసి శ్రీవెంకటేశ మనసు సోదించ నేది
చలిమి బలిమిని నీస్వతంత్రమే నిలిచె. ॥దేవు॥ 226

సాళంగనాట

సీతాసమేత రామ శ్రీరామ
రాతి నాతిఁ జేసిన శ్రీరామ రామ. ॥పల్లవి॥

ఆదిత్యకులమునందు నవతరించిన రామ
కోదండభంజన రఘుకుల రామ
ఆదరించి విశ్వామిత్రుయాగము గాచిన రామ
వేదవేదాంతములలో వెలసిన రామ. ॥సీతా॥

బలిమి సుగ్రీవునిపాలి నిధానమ రామ
యిల మునులకభయ మిచ్చిన రామ
జలధి నమ్మమొనను సాధించిన రామ
అలరు రావణదర్పహరణ రామ. ॥సీతా॥

లాలించి విభీషణుని లంక యేలించిన రామ
చాలి శరణాగతరక్షక రామ
మేలిమి శ్రీవెంకటాద్రిమీఁద వెలసిన రామ
తాలిమితో వెలయు ప్రతాపపు రామ. ॥సీతా॥ 227

దేసాళం

కోనేటిదరులఁ గనుఁగొనరో మూఁడు దేరులు
నానాదేవతలార నరులార మీరు. ॥పల్లవి॥

తెంకిగా ముందర నొక్క తే రెక్కె శ్రీకృష్ణుఁడు
వెంకటేశుఁ డెక్కె నదె వే రొక్క తేరు
లంకెలై శ్రీభూసతులు లలి నొక్క తేరెక్కిరి
కొంకక వీధుల నడగొండలో యనఁగను. ॥కో నే॥

యిరవై శ్రీకృష్ణునిది యిదె వానరధ్వజము
గరుడధ్వజము శ్రీవెంకటపతిది
కరిలాంఛనధ్వజము కమలకు మేదినికి
అలరి(రిది?) చూపట్టెను బ్రహ్మాండాలవలెను. ॥కో నే॥

చెలఁగి చెఱకువిల్లు చేతఁబట్టె శ్రీకృష్ణుఁడు
బలు శ్రీవెంకటేశుఁడు పట్టెఁ జక్రము
అలమేలుమంగ భూమి యంబుజాలు చేఁ బట్టిరి
కలసి మెలసేరు బంగారుమేడ లనఁగ. ॥కో నే॥ 228

290-వ రేకు. నాట

దోరతనముతోడ తొడపై శ్రీసతితోడ
కేరలీఁ బంతములు సుగ్రీవనారసింహము. ॥పల్లవి॥

నిక్కిన కర్ణములతో నిట్టచూపు గుడ్లతో
మిక్కుటమైన పెద్ద మీసాలతోడ
వెక్కసపు నోరితోడ వెలయు బుగ్గలతోడ
క్రిక్కిరిసీ నవ్వుల సుగ్రీవనారసింహము. ॥దోర॥

చల్లు నూరుపులతోడ సంకుఁజక్రములతోడ
మొల్లమైన సహస్రకరములతోడ
తెల్లని మేనితోడ దిండైన పిరుఁదుతోడ
కెల్లు రేఁగీఁ గరుణ సుగ్రీవనారసింహము. ॥దోర॥

విరులపాదాలతోడ వెలయు సొమ్ములతోడ
తిరమైన కోటిసూర్యతేజముతోడ
విరులదండలతోడ వేడుక శ్రీవెంకట
గిరిమీఁద వెలసె సుగ్రీవనారసింహము. ॥దార॥ 229

బౌళి

వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
పేడుకొన్న ప్రతాపానఁ బెద్ద హనుమంతుఁడు. ॥పల్లవి॥

యిదె పుట్టుఁగౌపీనము హేమకుండలములతో
నుదయించినాఁ డితఁడుర్వీమీఁదను
పదరి బాలార్కుని పండనుచుఁ బట్టినాఁడు
వదలక దేవతల వరమందినాఁడు. ॥వీఁడి॥

నులిచి తా వాలము మిన్నులు మోవఁ జాఁచినాఁడు
జలధి దాఁటఁగ జంగ చాఁచినాఁడు
యిల నసురలమీఁద వలచెయ్యెత్తినవాఁడు
నిలువెల్ల సాహసమై నిండుకొనున్నాఁడు. ॥వీఁడి॥

పెక్కు పండ్లగొలలు పిడికిలించినవాఁడు
మిక్కిలి లంక సాధించి మించినవాఁడు
యిక్కువతో శ్రీవెంకటేశ్వరు బంటైనవాఁడు
తక్కక లోకములెల్లా దయఁ గాచేవాఁడు. ॥వీఁడి॥ 230

సామంతం

అనిశము దలఁచరో అహోబలం
అనంతఫలదం బహోబలం. ॥పల్లవి॥

హరినిజనిలయం బహోబలం
హరవిరించినుత మహోబలం
అరుణమణిశిఖర మహోబలం
అరిదైత్యహరణ మహోబలం. ॥అని॥

అతిశయశుభదం బహోబలం
అతులమనోహర మహోబలం
హతదురితచయం బహోబలం
యతిమతసిద్ధం బహోబలం. ॥అని॥

అగు శ్రీవెంకట మహోబలం
అగమ్య మసురల కహోబలం
అగపడుఁ బుణ్యుల కహోబలం
అగకులరాజం బహోబలం. ॥అని॥ 231

పాడి

కలశాపురముకాడ గంధపు మాకులనీడ
నలరేవు మేలు మేలు హనుమంతరాయ. ॥పల్లవి॥

సంజీవికొండ దెచ్చి సౌమిత్రి బ్రతికించితి
భంజించితి వసురుల బలువిడిని
కంజాప్తకులరాఘవుని మెప్పించితివి
అంజనీతనయ వో హనుమంతరాయ. ॥కల॥

లంక సాధించితివి నీ లావు లెల్లాఁ జూపితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి
అంకెలెల్లాఁ నీకుఁ జెల్లె హనుమంతరాయ. ॥కల॥

దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
యిక్కువతో శ్రీవెంకటేశ్వరుబంట వైతివి
అక్కజపు మహిమల హనుమంతరాయ. ॥కల॥ 232

రామక్రియ

అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి. ॥పల్లవి॥

అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజ దూత వైతి గురుహనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి. ॥అఖి॥

అంజనీదేవికుమార హనుమంతుఁడ
కంజాప్తఫలహస్త ఘనహనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకులరక్షకుఁడవైతివి. ॥అఖి॥

అట లంక సాధించిన హనుమంతుఁడ
చటులసత్వసమేత జయ హనుమంతుఁడ
ఘటన నలమేల్మంగకాంతు శ్రీవెంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్చితివి. ॥అఖి॥ 233

గౌళ

త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు
[illegible]జునిజనకుఁడైన ఆదినారాయణుఁడు. ॥పల్లవి॥

గరుడనిమీఁద నెక్కి ఘనచక్రము చేఁబట్టి
పరమపదాననుండి పరతెంచి
మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు
అరుదైన ప్రతాపపు ఆదినారాయణుఁడు. ॥త్రి॥

కనకాంబరము గట్టి కౌస్తుభము మెడఁ బెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండఁగా
పనివూని కరముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు. ॥త్రి॥

త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్ల
ముదమున దాసులెల్లా మొక్కఁగాను
వదల కెల్లవారికి వరము లిచ్చీ వాఁడే
అదె శ్రీవెంకటవిభుఁ డాదినారాయణుఁడు. ॥త్రి॥ 234

291-వ రేకు. దేసాళి

ఇది యెరిఁగినవారే యెంచఁగ నీదాసులు
వెదకి తెలుసుకొంటే వేదాంతాల నున్నవి. ॥పల్లవి॥

పట్టితే నీస్వరూపము బయలు లోపల నిండి
అట్టె సర్వశక్తితో సాకారముతో
యెట్టు దలఁచినాఁ జిత్తాయిత్తమై వున్నాఁడవు
వొట్టి ప్రకృతిపురుషు లొంగి నీదేహములు. ॥ఇది॥

అనంతమైనప్రకృతి అఖిలవికారమూర్తై
పనివడి నీమాయయై ప్రపంచమై

.... ఈఁగుర్తుల యక్షరములు రేకులలో నస్పష్టములు.

వొనరి జడమై యుండ నొకఁటో దివ్యమై యుండు
నినుపై యిహాపరాలు నీమైశ్వర్యములు. ॥ఇది॥

జీవుఁడణువు జ్ఞానము చింతించఁగా విభువు
యీవిధము నానాజీవులివె నీయందె
శ్రీవెంకటేశుఁడ నీవే చేకొన్న చైతన్యమవు
కావింపఁ గర్మ భక్తులే కారణఫలములు. ॥ఇది॥ 235

పాడి

కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దు వోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో. ॥పల్లవి॥

యీపొద్దుకుఁ బోయి రారో యింద్రాదిదేవతలు
శ్రీపతి పవ్వళించెను శేషునిమీఁద
తీపులఁ బ్రసాద మీరో దేవమునులకు నెల్ల
పైపుగఁ దెల్లవారఁగ వత్తురు గాని. ॥కొలు॥

పాళెలపట్టుకుఁ బోరో బ్రహ్మరుద్రాదులిందరు
పాలసముద్రాన హరి పవ్వళించెను
వేళ గాదు లోనికిట్టె విచ్చేసె హరి ద్వార
పాలకులు వాకిళ్ళఁ బదిలము సుండరో. ॥కొలు॥

గీత మొయ్యనే పాడరో కిన్నరకింపురుషులు
యీతల శ్రీవెంకటేశుఁ డెక్కెను మేడ
ఘాత నెడ నెడ నూడిగకాండ్లు నిలువరో
రాతిరెప్పుడైనా మిమ్ము రమ్మనునో యతఁడు. ॥కొలు॥ 236

లలిత

ఇతరుల నడుగను యితఁడే మా దాత
యితని యీవి వొరులియ్యఁగఁ గలరా. ॥పల్లవి॥

దేవదేవుఁడాదిమపురుషుఁడు హరి
శ్రీవత్సాంకుఁడు చిన్మయుఁడు
యీవల నావల యిలువేలుపతఁడు
భావజగురుఁడు మా పాలిటివాఁడు. ॥ఇత॥

జగదేకగురుఁడు శాశ్వతుఁ డచ్యుతుఁ
డగజకు వరదుఁడు అనంతుఁడు
తగి మము నేలిన దైవము యేలిక
నిగమమూర్తి మా నిజబంధువుఁడు. ॥ఇత॥

కలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
అలరిన శ్రీవెంకటాధిపుఁడు
చలిమి బలిమి మా జననియు జనకుఁడు
అలమి యితఁడు మాయంతర్యామి. ॥ఇత॥ 237

భైరవి

శ్రీహరి నిత్య శేషగిరీశ
మోహనాకార ముకుంద నమో శ్రీహరి. ॥పల్లవి॥

దేవకీసుత దేవ వామన
గోవిందా గోపగోపీనాథా శ్రీహరి
గోవర్ధనధర గోకులపాలక
దేవేశాధిక తే నమోనమో. ॥శ్రీహ॥

సామజాన(వ?)న సారంగ(శార్ఙ్గ?)పాణి
వామనా కృష్ణ వాసుదేవా శ్రీహరి
రామనామ నారాయణ విష్ణో
దామోధర శ్రీధర నమో నమో. ॥శ్రీహ॥

పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి శ్రీహరి
చిరంతనాచ్యుత శ్రీవెంకటేశ
నరమృగ తే నమో నమో. ॥శ్రీహ॥ 238

దేవగాంధారి

వేసరితేనే లేదు విచారించితేఁ గద్దు
మూసినదిదే కీలు మంచి వివేకులకు. ॥పల్లవి॥

యెవ్వరు మనసులోన నిందిరేశుఁ దలఁచిన
అవ్వలఁ బాయక వుండునదియే వైకుంఠము
దవ్వులకు నేఁగ వద్దు తపము జపము వద్దు
యివ్వల నిదే కీలు యెరిఁగినవారికి. ॥వేస॥

నాలుక నెవ్వరైనాను నారాయణుఁ బొగడిన
చాలి యాతఁడాడ నుండు జగములూ నుండును
కాలము నడుగ వద్దు కర్మము నడుగ వద్దు
పోలింప నిదే కీలు పుణ్యమానసులకు. వేస॥

శ్రీవెంకటేశ్వరునిఁ జేరి యెవ్వరు నమ్మినా
కైవసమై యాతఁడింటఁ గాచుకుండును
సావధానములు వద్దు శరణంటేనే చాలు
భావింప నిదే కీలు పరమయోగులకు, ॥వేస॥ 239

శంకరాభరణం

దనుజులు గనిరి తత్వ మిది
వనజాక్షునికృప వసించ నేలా. ॥పల్లవి॥

హరి పరమాత్ముఁ డనాదిపురుషుఁడు
సురలకు నరులకు సులభుఁడు
హరికోపముతో నన్యులవరములు
సరిగా వెంచఁగ జగములలోన. ॥దను॥

వేదాంతవిదుఁడు విష్ణుఁడు కృష్ణుఁడు
శ్రీదేవికిఁ బతి శేఖరుఁడు
పోదిఁ బరస్తుతి పుణ్యముకంటే
పాదుగ హరిఁ దిట్టేపాపము మేలు. ॥దను॥

నారాయణుఁ డున్నతుఁ డచ్యుతుఁ డుప
కారుఁడు శ్రీవెంకటవిభుఁడు
చేరి యీతఁడే శిక్షించ రక్షించ
ధీరదయినములు వొగినితనిసరా. ॥దను॥ 240

292-వ రేకు. మలహరి

విశ్వ మెల్ల నీ విరాడ్రూపము
శాశ్వతహరి నీ శరణులము. ॥పల్లవి॥

కన్నుల సూర్యుఁడు కమలాప్తుఁడు నీ
పన్నిన మోమున బ్రాహ్మణులు
వున్నతి వైశ్యులు వూరువులందును
యెన్నఁగ శూద్రులు యిదె పాదముల. ॥విశ్వ॥

యింద్రాదిదేవత లీశానబ్రహ్మము
నీంద్రు లంగముల నెనఁగిరదే.
సాంద్రలోకములు జఠరంబున నవె
రుద్రతేజ మదె రోమముల. ॥విశ్వ॥

కాలముఁ గర్మముఁ గైవల్యంబును
ఆ లోను వెలియు నది నీవు
శ్రీలలనాధిప శ్రీవెంకటేశ్వర
కోలు ముందు నీవు గొలిచితిమయ్యా. ॥విశ్వ॥ 241

దేవగాంధారి

కలదు తిరుమంత్రము కల దిహముఁ బరము
కలిమి గలుగు మాకుఁ గడమే లేదు. ॥పల్లవి॥

కమలాక్ష నీవు మాకుఁ గలిగి యుండఁగ భూమి
నమరలేనిదొకటి నవ్వాలలేదు
నెమకి నాలుకమీఁద నీనామము మెలఁగఁగ
తమితోఁ బరుల వేఁడఁ దాఁ జోటు లేదు. ॥కల॥

శౌరి నీ చక్రము నా భుజముమీఁద నుండఁగాను
యీరసపుఁ బగ లేదు యెదురూ లేదు
చేరువ నీ సేవ నా చేతులపై నుండఁగాను
తీరని కర్మపు వెట్టిదినమూ లేదు. ॥కల॥

అచ్యుత నీపై భక్తి యాతుమలో నుండఁగాను
రచ్చలఁ బుట్టిన యపరాధమూ లేదు
నిచ్చలు శ్రీవెంకటేశ నీశరణాగతుండఁగా
విచ్చినవిడే కాని విచారమే లేదు. ॥కల॥ 242

### దేసాక్షి

దేవుఁ డొక్కఁడే మాకు దిక్కుఁగాని
కావ నెవ్వరును లేరు కతలింతే కాని. ॥పల్లవి॥

పచ్చి వొళ్లు మోచితిమి పాపమెల్లాఁ జేసితిమి
హెచ్చిన మీఁదటిసుద్దు లేఁటివో కాని
రచ్చలఁ బడె మా గుట్టు రమణులచేఁత బెట్టు
అచ్చమై యిందుకుఁ బరిహార మేదో కాని. ॥దేవు॥

గాలిమూఁటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటివారమయ్యేమో కాని
మైల గొంత మనసూ మఱఁగు గొంతానాయ
తాలిమి నా [illegible]ధి యేమి దలఁచీనో కాని. ॥దేవు॥

మాయలఁ బొరలితిమి మరచితి మింతలోనే
చాయల శ్రీవెంకటేశు శరణంటిమి
రోయఁ జొచ్చె జగమెల్లా రుచియాయ వైరాగ్య
మాయము నాలోపలి అంతరాత్మే కాని. ॥దేవు॥ 243

### వసంతవరాళి

అతని నమ్మ లేరల్పమతులు భువి
నతఁ డాద్యుఁడు పరమాత్ముఁడు. ॥పల్లవి॥

సకలలోకపతి సర్వేశ్వరుఁ డట
వొకఁ డితఁ డొర మరి వున్నాఁడా
ప్రకటించఁగ శ్రీపతియే దాతట
వెకలి నియ్యఁ గొన వేరే కలరా. ॥అత॥

దివిజవందితుఁడు దిక్కుల హరి యట
యివల మొక్క సురలేక వేరీ
కవ నంతర్యామి కరుణాకరుఁ డట
వివిధభంగులను వెదకఁగ నేలా. ॥అత॥

వేదాంగుఁడు శ్రీవెంకటపతి యట
ఆదిమతములేక నరసేదా
యేదెస నెవ్వరి కెప్పుడుఁ గలఁడితఁ
డీ దేవుఁడే మన కిహపర మొసఁగ. ॥అత॥ 244

సాళంగనాట

ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు
సకలము హరి యని సరిఁ దోఁచీని. ॥పల్లవి॥

అంతరాత్మ శ్రీహరి యతఁ డొకఁడే
జంతువులన్నియు సమములే
బంతులఁ బాత్రాపాత్రము వెదకిన
అంతట హరిదాస్యమే పో ఘనము. ॥ఒక॥

జగమును నొకటే చైతన్యమొకటే
తగిన పంచభూతములొకటే
నగుతా నెదిరిని నన్నును నెంచిన
మొగి నాపై హరిముద్రలె ఘనము. ॥ఒక॥

కారు స్వతంత్రులు కడపట నొకరును
యీరీతి నొకగాము లేక నేలా
శ్రీరమణీపతి శ్రీవెంకటేశుఁడే
కారణము శరణాగతియే ఘనము. ॥ఒక॥ 245

సాళంగనాట

వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడైన విష్ణుని నెఱఁగరా. ॥పల్లవి॥

తోలె నదె గరుడనిఁ దోడఁగి బాణునిమీఁద
వాలెను కంసునిమీఁద వడి నెగసి
కేలు చాఁచి చక్రమునఁ గెడపె శిశుపాలుని
వేలుపులరాయఁడైన విష్ణుని నెఱఁగరా. ॥వేద॥

తొక్కెను బలీంద్రునిఁ దొల్లి పాతాళానఁ గుంగ
మొక్కలాన జలధమ్ము మొనకుఁ దెచ్చె
పక్కన బ్రహ్మాండము పగులించెఁ బెనువేల
వెక్కసపు దైవమైన విష్ణుని నెఱఁగరా. ॥వేద॥

భేదించె రావణాది భీకరదైత్యుల నెల్ల
నాదించె శంఖమున నున్నతజయము
సేద దేర నిపుడును శ్రీవెంకటాద్రిమీఁద
పీది పీది మెరసేటి విష్ణుని నెఱఁగరా. ॥వేద॥ 246

293-వ రేకు. లలిత

ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేఱు గుడిచి కాలువ పొగడుట. ॥పల్లవి॥

హరిపాదమునసే యుడఁగె లోకము లెల్ల
హరినాభినే పొడమి రదివో బ్రహ్మాదులు
హరినామము వేదాల కాదియు నంత్యము నాయ
హరిదాసులే వశిష్ఠాదులిందరును. ॥ఈత॥

విష్ణుఁడే యమృతమిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె
విష్ణువాజ్ఞ నడచేది విశ్వమింతాను
విష్ణుచక్రమున దైత్యవీరులెల్లా నడఁగిరి
విష్ణువుముఖమునందే విప్రులు జనించిరి. ॥ఈత॥

పరమపు శ్రీపతివే భారతరామాయణాలు
పరమాత్ముఁ డితఁడే పలుజీవులయందెల్లా
పరము చేచేతఁ జూపె పట్టి శ్రీవెంకటేశుఁడు
పరమానంద మొసఁగు భక్తులకు నితఁడు. ॥ఈత॥ 247

శుద్ధవసంతం

నిండిన జగము లెల్లా నీ యాధీనము
బండు జన్మములవాఁడ భయమేమీ నెఱఁగ. ॥పల్లవి॥

పాతకపు దేహమిది ప్రకృతియాధీనము
ఆతుమ శ్రీహరి నీ యాధీనము
యీతల నాతల నే నెవ్వరి నేమనలేను
చేతనుఁడ నింతే నేను చిక్కినవేమెఱఁగ. ॥నిండి॥

వెలయు నా కర్మము నీ వేదశాస్త్రాధీనము
నిలిచిన జ్ఞాన మెల్లా నీ యాధీనము
తలఁచి యెవ్వరినేఁ దగుఁ దగదనలేను
కొలఁది జీవుఁడ నింతే కొన మొదలెఱఁగ. ॥నిండి॥

అక్కడ నామనసిక నాచార్యాధీనము
నిక్కపు నామోక్షము నీ యాధీనము
యెక్కువ శ్రీవెంకటేశ యెవ్వరి నేమనలేను
పక్కన నీ బంట నింతే పరచింతలెఱఁగ. ॥నిండి॥ 248

రామక్రియ

ఏమి సేయఁ గలదు తా నీ జగమెల్లాను
కోమలపు దేహా కొక్క కోకే కలది. ॥పల్లవి॥

మించిన కోరిక లివి మిన్నుల పొడవులు
కొంచపు దేహము దనకొలఁది గాదు
యెంచరాని సిరు లవి యెన్ని గలిగినా
కంచములోని కూడే కలిగినది. ॥ఏమి॥

గోరపడి గడించేవి కోట్లకొలఁదులు
తారి తూరి నోటికిఁ దగ్గంత గాదు
యేరుపరచి యింతుల నెందరిఁ బెండ్లాడినాను
కూరిమి సతి యొకతె కూటమికిఁ గలది. ॥ఏమి॥

తలఁచి మొక్కే సురలు తలవెంట్రుక లందరు
యిలఁ దన బతుకెంతో యెరఁగ రాదు
చెలఁగి రక్షించేవాఁడు శ్రీవెంకటేశుఁ డొకఁడే
కలడంతరంగమునఁ గైవల్యమే కలది. ॥ఏమి॥ 249

లలిత

వీరు వారనేటి వింతేల
శ్రీరమణునికృప సిద్ధము గాక. ॥పల్లవి॥

యెక్కడి పాపము యెక్కడి పుణ్యము
దక్కిన శ్రీపతిదాసునికి
పక్కన లోహము పరుసము దాఁకిన
వెక్కువ నంతా హేమమె కాదా. ॥వీరు॥

యేది హీనము యేది యధికము
పొదుగ నడచు ప్రపన్నునికి
మేదినీశుఁ డేమెలుఁతఁ బెండ్లాడిన
సాదించ నేలికసానే కాదా. ॥వీరు॥

యేడ నిందలిఁక నేడ సంస్తుతులు
జాడల శ్రీవైష్ణవునికిని
యీడనే శ్రీవెంకటేశుఁ డాత్మ యట
యీడులేని యతఁ డెక్కుడే కాదా. ॥వీరు॥ 250

రామక్రియ

నేనా(ను?) గెలువ లేను నీమాయ
శ్రీనాథ నీవు సేసే చేఁతలే నీమాయ. ॥పల్లవి॥

తమకము గడు రేఁచు తలఁపు ఉబ్బాఁత లూఁచు
నిమిష మూరకుండదు నీ మాయ
తిమిరము బుద్ధిఁ గప్పు తెలివల వెంటఁ దిప్పు
అమరి శోదునీడ ఆయఁ బో నీ మాయ. ॥నేనా॥

పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులు సేసు
నిట్టి పిడిఁ బోనీదు నీమాయ
కొట్టఁగొన కెక్కించుఁ గోరిమొదలికి దించు
మట్టులేదింతింతని మరియు నీమాయ. ॥నేనా॥

పలులంపటాల ముంచు భావజుచే భ్రమయించు
నిలిచినచోట నెల్లా నీమాయ
యెలమి శ్రీవెంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
మలసి సొలసి నన్ను మన్నించె నీమాయ. ॥నేనా॥ 251

సామవరాళి

తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే
మనసులోనే కలుగు మహామహిమ. ॥పల్లవి॥

కనురెప్ప మూసితేనే కడ దాఁగె జగ మెల్ల
కను దెరచినంతనే కలిగెఁ దాను
ననిచి వుండుట లేదు నమ్మకపోవుట లేదు
తనతోడిదే యిన్నిఁ దాఁ గలితేఁ గలవు. ॥తను॥

కడుపు నిండినంతనే కైపాయ రుచులెల్లా
బెడిదపు టాఁకలై తేఁ బ్రియమాయను
యెడ నెడఁ జేదు గాదు యింతలోనే తీపు గాదు
వొడలితోడివే యివి వుండినట్టే వుండును. ॥తను॥

అద్దములోఁ దన నీడ అంతటా మెరసినట్లు
పొద్దు వొద్దు తనతోనే భోగా లెల్లా
అద్దిన శ్రీవెంకటేశుఁ డంతరాత్మయైనవాఁడు
కొద్ది లేదాతనిమాయ కొనసాగుచుండును. ॥తను॥ 252

294-వ రేకు. శంకరాభరణం

చవి చేసుక యిటు జరగెదము
జవదాఁటకురో సంసారులార. ॥పల్లవి॥

యేది చూచినా నెరవెరవే
పోదిఁ గూడఁగా పొదపింతే
ఆదికి నాది హరి యొకఁడే
పాదుగఁ బుట్టెడి భవములె వేరు. ॥చవి॥

కలుములు లేములు కతలింతే
నిలుకడ గలచో నిజమాను
యిలయును జగమును యిదే యిదే
తెలిసి చూడఁగా దినములె ఘనము. ॥చవి॥

చెంతల నిందరు జీవులే
బంతులఁ బుణ్యముఁ బాపమునే
యింతట శ్రీవెంకటేశ్వరుఁడే
కాంతలుఁ బురుషుల గతులై నిలిచె. ॥చవి॥ 253

భూపాళం

హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నామోము తప్పకేటు చూడు. ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడి నాడను
చాలు నిఁక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు
వేళాయ నాతండ్రి వేగ లేవే. ॥హరి॥

కను దెరవు నాతండ్రి కమలాప్తుఁడుదయించె
వనిత మొకమజ్జనము వడిఁ దెచ్చెను
మొనసి మీతండ్రి యిదె ముద్దాడఁ జెలఁగీని
దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే. ॥హరి॥

లేవె నాతండ్రి నీలీలలటు వొగడేరు
శ్రీవెంకటాద్రిపతి శ్రీరమణుఁడా
దేవతలు మునులుఁ జెందిన నారదాదులు
ఆవలనుఁ బాడేరు ఆకసమునందు. ॥హరి॥ 254

### లలిత

విశ్వాత్మ నీకంటె వేరేమియును గాన
ఐశ్వర్య మెల్ల నీయతివచందములే. ॥పల్లవి॥

కలవు మతములు పెక్కు కర్మభేదములగుచు
కలవెల్ల నీయందె కల్పితములే
కలరు దేవతలు బహుగతుల మహిమల మెరయు
అలరి వారెల్ల నీ యంగభేదములే. ॥విశ్వా॥

ఘనమంత్రములు పెక్కు గలవు వరముల నొసగు
ననిచి యవి యెల్ల నీనామంబులే
పెనగొన్న జంతువులు పెక్కు లెన్నే గలవు
పనిగొన్న నీదాసపరికరములే. ॥విశ్వా॥

యెందును దగులువడ కేకరూపని నిన్ను
కందువఁ గొలుచువాఁడె ఘనపుణ్యుఁడు
అందపు శ్రీవెంకటాద్రీశ అన్నిటా
నందిన పొందిన వెల్లా హరి నీయనుమతే. ॥విశ్వా॥ 255

### సామంతం

ఇహాపరములకును యిది సుఖము
సహజావస్థ జరగేటి సుఖము. ॥పల్లవి॥

శ్రీరమణుఁడే చింతాయకుఁ డని
పూరక వుండుట వొక సుఖము
కోరకుండఁగా గూడిన యర్థము
ఆరయఁ గైకొనుటది సుఖము. ॥ఇహా॥

వసముగాని పని వడిఁ దలకెత్తుక
అసురుసురు గానిదది సుఖము
యెసరెత్తుక లే ళ్లేవని తోలక
పసఁ దనవిధిఁ గల పాటే సుఖము. ॥ఇహా॥

పెక్కు చంచలము పెనచుక తిరుగక
వొక్క సుఖంబొటురు సుఖము
యెక్కువ శ్రీవేంకటేశ్వరు శరణని
నిక్కితిమిదె మానిజమే సుఖము. ॥ఇహా॥ 256

లలిత

వింటిమి నీకతలు కంటిమి నీమాయలు
బంటుల మచ్యుత నీపాలివారమయ్యా. ॥పల్లవి॥

కలిగిరి నీవల్లనే కడఁగి బ్రహ్మాదులు
నిలిచిరి సురలెల్లా నీవల్లనే
తెలిసిరి మునులెల్లా దేవుఁడవు నీవే యని
చలపట్టి హరి నీకు శరణనేమయ్యా. ॥వింటి॥

నుతియించీ వేదములు నోరార నీమహిమ
గతి యాయ ప్రపన్నులకెల్లా
ప్రతిలేని నిరూపే భావించేరు యోగీంద్రులు
తతితో శ్రీపతి నీకే దాసులమయ్యా. ॥వింటి॥

అదె నీచక్రముచేత నడఁగిరసురలెల్లా
బదికిరి విప్రులు నీపాదసేవను
పొదలి శ్రీవెంకటేశ పొంది నీకరుణచేత
మొదల వెనక నీకే మొక్కేమయ్యా. ॥వింటి॥ 257

గుండక్రియ

ఎట్టొకో దైవమా యిదె నీకు శరణంటి
తొట్టిన నా బ్రతుకుకుఁ దుదయు లేదు. ॥పల్లవి॥

నాని యీజన్మమెత్తి నాటివెల్లా నుఱచితి
పూని యేమిటా విరతి పుట్ట నేరదు
కానను ముందరవచ్చే ఘనకర్మపాశములు
పానిపట్టి (?) యించుకంతా భయము లేదు. ॥ఎట్టొ॥

పంచేంద్రియములఁ జిక్కి భావ మెల్లాఁ జిక్కువడె
అంచెల మోక్షము తోవ అరయ లేను
యెంచి నాదేహములోని హేయమును సాత్వికించె
చంచలపు దుర్గుణాలు చక్కనైనాఁ గావు. ॥ఎట్టొ॥

నగు సంపదలచేత నన్ను నేనే మరచితి
తెగువడి వివేకించఁ దీర దెప్పుడు
నిగిడి శ్రీవెంకటేశ నీవు నన్ను నేలఁగాను
జగమెల్లా నెరఁగ నే సాత్వికుఁడ నైతి. ॥ఎట్టొ॥ 258

295-వ తేకు. తెలుగుకాంబోది

ఇందునే తుదిపద మెక్కె రిందరును
మందరధర నీమహిమిదివో. ॥పల్లవి॥

మరిగిన పుణ్యులమతిలో కోరిక
పరమపు హరి నీపాదములు
గరిమ గోపికలు గావలె నన్నది
హరి నీసంభోగమదియే పో. ॥ఇందు॥

పొంచి వేదములు పొగడెడి యర్థము
అంచెల గుణకథ లవి నీవి
వంచి యజ్ఞములఫలమై యున్నవి
నించి దేవ నీ నిజపూజలె పో. ॥ఇందు॥

కైవల్యమునకుఁ గడుఁ దెరువైనది
ఆవల నీశరణాగతియే
శ్రీవేంకటేశ్వర చెప్పె మాగురుఁడు
మావద్ద నిదె నీ మంత్రమె పో. ॥ఇందు॥ 259

సామంతం

గోవిందుదాసులమై కొన కెక్కుదుము గాక
వేవేలు విధుల నమ్మి వెతఁ బడఁ గలమా. ॥పల్లవి॥

మనసులోపలి మా మర్మము దెలియ లేము
ఘనుఁడైన హరి నెట్టు గానఁగలము
తనువుతో భోగాలు తగులు వీడఁగ లేము
వెనక కర్మపాశాలు వీడించుకోఁ గలమా. ॥గోవిం॥

వడిఁ బెట్టే యింద్రియాల వద్దని మానుప లేము
తొడరి సంసారము తోయఁ గలమా
బడిబడి నానాటి బతుకు చెప్పుకో లేము
పొడలేటి యితరుల బోధించఁ గలమా. ॥గోవిం॥

కొంకక ఆడినమాట గురుతువెట్టఁగ లేము
లంకె వేదవాక్యము దలఁచఁ గలమా
యింకా శ్రీవేంకటేశుఁ డితఁడే మా దేవుఁ డని
సంకె లేకుందుము గాక జాలిఁ బడఁ గలమా. ॥గోవిం॥ 260

బౌళి

పుట్టుగులు నొక్కటే పుణ్యపాపములే వేరు
యెట్టుసేసినాఁ జేసె నేమి సేయ వచ్చును. ॥పల్లవి॥

పగలే రేయి యీబడిఁ గొన్ని జీవులకు
వొగి నారేయి పగలౌ నొకరికిని
తగు దైవ మొకఁడే తమ మతములే వేరు
పగటుల విష్ణుమాయ భ్రమయించీ నిదివో. ॥పుట్టు॥

నిలు వెల్లాఁ జేఁదే నెరిఁ గొన్ని వృక్షములు
కలదెల్లఁ దీపే కమ్మరఁ గొన్ని
తలఁపును నొకటే తత్త్వములే వేరు వేరు
చెలరేఁగి విష్ణుమాయ చిక్కువెట్టీ నిదివో. ॥పుట్టు॥

యిహామే పరము యెరిఁగితేఁ గొందరికి
మహిఁ బరమే యిహాము మరొకరికి
వహితో శ్రీవెంకటేశు వలెనని కొలిచితే
సహజపు విష్ణుమాయ జారిపోవు నపుడే. ॥పుట్టు॥ 261

కన్నడగౌళ

దైవమా యిందు నీవే దయ దలఁచుట గాక
తోవనున్న జీవు లెట్లు తొసేరు నీమాయ. ॥పల్లవి॥

పలుచదువులందు నెల్ల ప్రాణమే మిక్కిలి చవి
బలిమి తీపులలోనఁ బ్రాణమే తీపు
యిలపైఁ బూజ్యాలలోన నింతులే కడుఁ బూజ్యాలు
తలఁచి జీవులు యెట్టు దాఁటేరు నీమాయ. ॥దైవ॥

తగు చుట్టరికాలలో ధనమే చుట్టరికము
జగతిఁ గట్టనికట్టు సంసారము
వగలైన గుణాలలో వైరమే నిజగుణము
జిగిఁ బ్రాణు లెట్లు గెలిచేరు నీమాయ. ॥దైవ॥

తమలో నెవ్వరికైనా తమ జాతి తమ నేర్పు
తమకు నెక్కుడై తోఁచు తక్కువనరు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులకే కాని
భ్రమసిన జీవులెల్లాఁ బాయరు నీమాయ. ॥దైవ॥ 262

లలిత

తెలిసినవారి కింతా దేవుఁడై యుండు
కలఁ డన్నచోట హరి గలఁడటు గాన. ॥పల్లవి॥

అందు నిందుఁ బోయి శ్రీహరిని వెదకనేల
పొందితోడిరూపు లెల్లాఁ బోరి నతఁడే
కొందరిలో నుండి యిచ్చుఁ గోరినట్టి యీవు లెల్ల
కొందరిలో మాటలాడుఁ గొందరిలోనగును. ॥తెలి॥

లోన వెలిఁ జూచి పరలోకము వెదక నేల
యేనెలవైన వైకుంఠమెదుట నదె
పూని వొకచోట నెండ పొడచూపు నక్కడనే
నానిసవెన్నెల గాసు నానారీతులను. ॥తెలి॥

చొక్కి చొక్కి యానందసుఖము వెదక నేల
మక్కువఁ దా శాంతుఁడైతే మతిలో నదె
యెక్కువ శ్రీవేంకటేశ్వరుదాసుఁడ నైతి
వొక్కఁడే మాకిన్నిటికి నొడయఁడై నిలిచె. ॥తెలి॥ 263

భవుళి

ఇంక మాబోంట్ల కేది విధో
కింకరులమనియెడి గెలుపే కాక. ॥పల్లవి॥

యెవ్వరు గడచిరి యింతక తొలుతను
నివ్వటిల్లు హరి నీమాయ
నవ్వుచు నీశరణాగతి నమ్మిన
మువ్వంక శుకాదిమునులే కాక. ॥ఇంక॥

కన్నవా రెవ్వరు ఘనవైకుంఠము
వున్నతమగు నీ వురుమహిమ
మున్ను నిపుడు నీ ముద్రలు మోంచిన
అన్నిటా ఘనసనకాదులు గాక. ॥ఇంక॥

తెలియువా రెవ్వరు దివ్యజ్ఞానము
చలనముగాఁ జెప్పు శాస్త్రములు
యిలలో శ్రీవెంకటేశ నీ వారై
చెలఁగిరి శేషాది జీవులు గాక. ॥ఇంక॥ 264

సాళంగనాట

ఎందరు గలిగిన నితనిలోనే
ముందు వెనకలను ముఖ్యంబితఁడే. ॥పల్లవి॥

భవవిదూరుఁ డాపద్బంధుఁడు హరి
వివరించి కొలువ వేల్పితఁడు
కవతో లక్ష్మీకాంతుఁ డితఁడు
రవిశశినేత్రుఁడు రక్షకుఁడు. ॥ఎంద॥

కలిదోషహరుఁడు కారుణ్యనిలయుఁడు
వలె నను వారికి వరదుఁడు
తలఁపులోనఁగల తత్వంబితఁడు
సులభుఁ డితఁడరసి చూచినను. ॥ఎంద॥

శ్రీవెంకటేశుఁడు చిత్తజగురుఁడు
యేవలఁ జూచిన నితఁడే
గోవిందుఁ డితనిఁ గొలిచితిమిదివో
తోవయుఁ గంటిమి తుదకెక్కితిమి. ॥ఎంద॥ 265

శుద్ధవసంతం

కనుఁగొన నిది హరికల్పితము
తనకు నిందులోఁ దగినంతే. ॥పల్లవి॥

నానాభేదములు నరుల గుణంబులు
నానారుచులివి నవపదార్థములు
ఔ ననేదేది యటుగాదనేదేది
వాని వాని విధి వలసినయట్టు. ॥కను॥

నడచుఁబ్రపంచము నడవేవిధముల
నడచు మాయ లెన్నఁగ రావు
విడిచేటి వేఁటివి విడువని వేఁటివి
పడఁగఁ బడఁగ నవి పరచినయట్లు. ॥కను॥

తెగనికర్మములు దేహధర్మములు
తెగనియాస లివె దినదినము
తగు శ్రీవెంకటదైవముదాసులు
నగుదు రిన్నిటిని నటనలు చూచి. ॥కను॥ 266

వరాళి

అరిగాఁపులము నేము అంతర్యామివి నీకు (వు?)
యిరవై నీ చెప్పినట్టు యేమి సేతుమయ్యా. ॥పల్లవి॥

గాలి ముడి గట్టినట్టు కాయము మోచితిమి
కాలము గొలచితిమి కనురెప్పల
జాలి రొప్పితిమి వట్టి సటలనే యేపొద్దు
యేల మెచ్చవింకాను యేమి సేతుమయ్యా. ॥అరి॥

చుక్కలు లెక్కించినట్టు చూడఁగ మా జన్మములు
వుక్కునఁ గర్మములకు నొడి గట్టితి (మి?)
తెక్కులను వెంట వెంటఁ దిరిగేము బంట్లమై
యెక్కువాయ వెట్టి మాకు నేమి సేతుమయ్యా. ॥అరి॥

పాలు పొంగినటువలెఁ బాయము మోచితిమి
నాలుక కెక్కినవెల్లా నమలితిమి
యీలీల శ్రీవెంకటేశ యింత సేసితివి
యేలినవాఁడవు యింకా నేమి సేతుమయ్యా. ॥అరి॥ 267

శంకరాభరణం

మిగిలిన దే మిఁక మీఁదట దేహికి
అగపడు నొక పడెఁ డన్నంబు. ॥పల్లవి॥

రతిఁ బగటివెలుఁగు రాత్రిచీఁకటికి
సతము గాదు అది సరికి సరి
అతిభోగములకు నార్జించుటకును
ఛతురపు సంపద సరికి సరి, ॥మిగి॥

అల యపథ్యమున కౌషధము గొనుట
చలువకు వేఁడికి సరికి సరి
నిలిచిన పుణ్యము నిండుఁ బాపములు
జలువు వెలువులకు (?) సరికి సరి. ॥మిగి॥

మహి మరణములకు మరి పుట్టుగులకు
సహజమందరికి సరికి సరి
యిహమున శ్రీవెంకటేశ్వరుఁ డాత్మకు
సహకారి యతఁడు సరికి సరి. ॥మిగి॥ 268

మాళవి

తెలుపఁగ రా దిది దేవుని మాయలు
ఫలమెఱఁగరు యీ పట్టిన వెట్టి. ॥పల్లవి॥

పుట్టిరి దివిజులు పురుషోత్తమునం
దట్టే యణఁగిరి యతనందు
యిట్టె యీతని యిందరితో సరి
వెట్టి గొలుచుటే పెను వెట్టి. ॥తెలు॥

హరివరమువనే యందరు బదికిరి
పరుల వరము గని బడలిరి యసురలు
యిర వెటిఁ గీతని నిందరిలోపల
సరిగా మొక్కుట సహజపు వెట్టి. ॥తెలు॥

జీవాంతరాత్ముఁడు శ్రీవెంకటేశుఁడు
యేవల శ్రీలక్ష్మి యీతనిదేవులు
వేవేలు సిరులు వీరె యొసఁగి రని
భావించువారికిఁ బట్టదు వెట్టి. ॥తెలు॥ 269

ముఖారి

కలలోని నిట్లనే కాఁపురము నిట్లనే
నిలువు గల్లందమో నిజమందమో. ॥పల్లవి॥

వొక్కనాటి ప్రపంచము వొక్కనాటివలె రాదు
వొక్క నిమిషమువలె నొకటి గాదు
పక్కన మాయమై పోవు బడిబడినే వచ్చు
నెక్కొని కల్లందమో నిజమందమో. ॥కల॥

పొద్దు వొడచేది గొంత పొద్దు గూఁకేది గొంత
చద్ది గొంత వేఁడి గొంత చవులు గొంత
వొద్దనే కాలము నుండు వుండుండీ దవ్వయిపోవు
నిద్దపుఁ గల్లందమో నిజమందమో. ॥కల॥

పాపపుణ్యాలంటె నంటూఁ బాయవు సుఖదుఃఖాలు
పైపై ననుభవించఁ బరసిపోవు
యేపొద్దు శ్రీవెంకటేశుఁడెదలోనే వున్నాఁడు
యేపునఁ గల్లందమో యిది నిజ మందమో. ॥కల॥ 270

297-వ రేకు. నారాయణి

ఏటి విచారము యెక్కడి యాచారము
మాటున జీవుఁ డింతేసి మాయలఁ బొరలును. ॥పల్లవి॥

పరగ నూరేండ్ల బ్రతుకునకే కా
ధర నన్నియును గూర్చి దాఁచుకొనేది
పొరసి నానాసుఖభోగాలు చింతించుఁ గాని
పరమున కేపాటి ప్రయాన పడఁడు. ॥ఏటి॥

కడుపు నించుకొరకుఁ గామసుఖమునకే కా
చెడని పుద్యోగాలు సేయఁ గోరును
మిడిసి లోకములెల్ల మెప్పించ నడచుఁ గాని
చిడిముడి హరి మెప్పించే ననలేఁడు. ॥పటి॥

సారె సారెఁ జచ్చి చచ్చి జననము నొందేదెల్లా
వూరఁగల కర్మము లొాగిఁ జేయుట
నేర లేక నరులను మెచ్చుగఁ గొలుచుఁ గాని
కూరిమి శ్రీవెంకటేశుఁ గొలువఁగ లేఁడు. ॥పటి॥ 271

## దేసాక్షి

భావములోనా బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువవో మనసా. ॥పల్లవి॥

హరియవతారములే యఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామములే అన్నిమంత్రములు
హరి హరి హరి యనవో మనసా. ॥భావ॥

విష్ణుని మహిమలే విహితకర్మములు
విష్ణునిఁ బొగడెడి వేదములు
విష్ణుఁ డొక్కఁడే విశ్వాంతరాత్ముఁడు
విష్ణు విష్ణు వని వెదకవో మనసా. ॥భావ॥

అచ్యుతుఁ డితఁడే ఆదియు నంత్యము
అచ్యుతుఁడే యసురాంతకుఁడు
అచ్యుతుఁడు శ్రీవెంకటాద్రిమీఁద నిదె
అచ్యుత యచ్యుత శరణనవో మనసా. ॥భావ॥ 272

గుండక్రియ

అంతయు నతని మహామహిమే అతఁ
డెంత సేసినా నెట్టయిన నవును. ॥పల్లవి॥

రావలె నన్నవి రాక మానవు
పోవలె నన్నవి పోకుండవు
ఆవల నీవల నలమట లేఁటికి
దైవమొక్కఁడే తగిలిన గుఱుతు. ॥అంత॥

కాయపు గుణములు కలిగినవే భువి
నీయెడ జీవుఁడు యిటు గలఁడే
ఆయమిందుఁ గాదవు నన నెవ్వరు
కాయజగురుఁ డొక్కఁడే ప్రేరకుఁడు. ॥అంత॥

అంతరంగమే యాత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడ మాయ
చింతించి రక్షించ శ్రీవెంకటేశుఁడు
మంతు కెక్కె నిఁక మతకము లేల. ॥అంత॥ 273

సాళంగం

ఒక్కఁడే దైవంబున్నతుఁ డితఁడు
తక్కిన తలఁపులు తప్పుఁ దెరువులు. ॥పల్లవి॥

పురుషుల కెల్లాఁ బురుషోత్తముఁడు
సురేంద్రాదులకు సురేంద్రుఁడు
హరునికి నజునికి నవ్వలి మూరితి
హరి యితఁడే పరమాత్ముఁడు. ॥ఒక్క॥

వేదాంతంబుల వేద్యుఁ డీతఁడు
ఆదికి నాదియు నన నితఁడే
మేదిని నరులకు మేదినీశ్వరుఁడు
యేదెసఁ జూచిన నీశ్వరుఁ డితఁడే. ॥ఒక్క॥

మొక్కువలకెల్ల నెక్కువ యీతఁడు
మక్కువ మరునికి మరుఁడితఁడు
యిక్కడ శ్రీవెంకటేశుఁడై మిగుల
పక్కన నిదివో ప్రత్యక్షమితఁడు. ॥ఒక్క॥ 274

శ్రీరాగం

ఓహో నిలిచిన దొకటిదియే
శ్రీహరిసాకారచింతనము. ॥పల్లవి॥

పంచమవేదపు పద్మాక్షునామము
అంచెఁ బాపహర మౌషధము
పంచల పీతాంబరు శరణాగతి
ముంచిన యజ్ఞానమునకు దీపము. ॥ఓహో॥

విందుల కుడుపులు విష్ణుకీర్తనము
చందపు వైకుంఠసంబళము
పొందుగ నచ్యుతుఁ బూజించు పూజలు
కిందటఁ గొనకెక్కిడి నిచ్చెనలు. ॥ఓహో॥

కట్టిన ముడుపగు ఘనకృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము
యిట్టె శ్రీవెంకటేశ్వరుకృప యిది
పట్టినవారికి బలువగు సొమ్ము (మ్మ?). ॥ఓహో॥ 275

శంకరాభరణం

వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియుఁ దీర్చదు యిది నీమాయ. ॥పల్లవి॥

నీవల్ల బ్రదికిరి నిందు దేవతలు
నీవల్ల నసురలు నెట్టెఁ జెడిరి
ఆవల నిందరికాత్మవు నీవే
చేవ దేరె నీచిక్కులే భువిని. ॥వేద॥

నెమ్మిఁ బాండవుల నీవారంటివి
కమ్మర విడిచితి కౌరవుల
యిమ్ముల నీవావి యిద్దరికొకటే
తెమ్మలాయ నీ తీరనిచిక్కు. ॥వేద॥

జగమున నీదే స్వతంత్రమెల్లా
నెగడిన జీవులు నీవారు
తగు శ్రీవెంకటదయివమ యిన్నియు
తెగి నీదాసులు తెలిసినచిక్కు. ॥వేద॥ 276

298-వ రేకు. దేవగాంధారి

మాయామోహము మానదిది
శ్రీయచ్యుత నీచిత్తమే కలది. ॥పల్లవి॥

యెంత వెలుఁగునకు నంతే చీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధ మపథ్యమును సరి
వింతే మిగిలెను వేసటే కలది. ॥మాయా॥

చేసిన కూలికి జీతమునకు సరి
పూసిన కర్మభోగము సరి
వాసుల జన్మము వడి మరణము సరి
ఆసల మిగిలినదలపే కలది. ॥మాయా॥

మొలచిన దేహము ముదియుటకును సరి
తలఁచినదైవము తనలోను
యిలలో శ్రీవెంకటేశ నీ కరుణ
గలిగిన మా కెల్ల ఘనతే కలది. ॥మాయా॥ 277

సాళంగనాట

చేకొని కొలువరో శ్రీనరసింహము
శ్రీకరమగు నిదె శ్రీనరసింహము. ॥పల్లవి॥

వెడలేటి పూర్పుల వేఁడిమి చల్లీ
చిడుముడి కోపపు శ్రీనరసింహము
గడగడ వడఁకేటి గండస్థలములు
జెడలు గదలిచీ శ్రీనరసింహము. ॥చేకొ॥

వంకరగోళ్లవైపులు వెదకీ
చింకచూపులను శ్రీనరసింహము
హుంకారంబుల నుదధులు గలఁచీ
నంకెల శ్రీపతియగు నరసింహము. ॥చేకొ॥

వదనము దిప్పుచు వడి నసురమేను
చిద్రుపలు చేసెను శ్రీనరసింహము
అదివో శ్రీవెంకటాద్రి యెక్కి యిటు
చెదరక నిలిచెను శ్రీనరసింహము, ॥చేకొ॥ 278

వరాళి

అతనిలోనే యణఁగె నన్నియును
కతలెన్నైనాఁ గలవు కమలాక్షుఁ గనరో. ॥పల్లవి॥

యినుక లెక్క వెట్టితే నెంతైనాఁ గలదు
అసము దించని పుణ్యాలటువంటివే
వసగాని పెక్కుదేవతలఁ గొలుచుకంటే
సుసరాన హరివారై సుఖయించరో. ॥అత॥

గోడ గడుగఁగఁ బోతేఁ గొనదాఁకా రొంపే
ఆడుకోలు తర్కవాదా లటువంటివే
నాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివారై యీడేరరో. ॥అత॥

మనసునఁ బాలు దాగితే మట్టు లేదు మేర లేదు
అనుగు సంసారభోగాలటువంటివే
దినదిన తపములఁ దీదీపులవుకంటే
తనిసి శ్రీవెంకటేశుదాసులై బ్రదుకరో. ॥అత॥ 279

సౌరాష్ట్రం

మరల విచారించితే మంచముకిందే నుయ్యి
శిరుల హరివారై రి శివాదులు. ॥పల్లవి॥

ఆడేటి మాటల కెల్ల నాది నంతము లేదు
పీడలి కర్మములకు విధి లేదు
తాడుపడ్డ మనసుకు దైవము విష్ణుఁడే యని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు. ॥మర॥

వుట్టిపడే జన్మముల కూరట యెందూ లేదు
కట్టడి యింద్రియాలకు గతి లేదు
తట్టువడ్డ జీవునికి దైవము శ్రీహరి యని
యిట్టె మొరయిడిరి యింద్రాదులు. ॥మర॥

కప్పిన యీమాయలకు కడవరెందూ లేదు
తిప్పని హరిభక్తికిఁ దిరుగు లేదు
వొప్పుగా శ్రీవెంకటేశుఁ డొక్కఁడే దైవమని
చొప్పువట్టి కొలిచిరి శుకాదులు. ॥మర॥ 280

సామవరాళి

ఏపల్ల నొఁగాను లి(క నేవి అ)న్నియు నీలోనే
శ్రీవల్లభుఁడ నిన్నుఁ జేటితిమి నేము. ॥పల్లవి॥

సగుణనిర్గుణములును సావయవ నిరవయువ
మగుఁ దర్కవాదకలహాములు ఘనము
జగములో చదువులును సంశయంబే కాని
తెగనీదు నీమాయ తెలియ వసమా. ॥ఏవ॥

వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత
పోదిమతములవారి పోరు ఘనము
పాదైన మునిరుషులు బహుముఖములే కాని
సోదించి వొకమాట చూపంగ లేరు. ॥ఏవ॥

వెసఁ గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక
వస గావు రెంటి బలవంతములును
వసుధ శ్రీవెంకటేశ్వర నీవు గావు మిఁక
ముసుఁగువెట్టిన వాదు ముగియ దెంతైనా. ॥ఏవ॥ 281

జా(బా?)ళి

సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ నా
పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి. ॥పల్లవి॥

వేగి లేచి నేఁ జేసే వెడచేఁత నీ చేఁతే
ఆగడపు మాటాడిన నది నీ మాటే
ఆగము భోగములు నా యన్నపానాదులు మరి
శ్రీగురుఁడ నాలోని చింతయు నీ చింతే. ॥సర్వా॥

కోపము శాంతములును గుణావగుణము నా
రూపును నీ సాకారరూపమే
పాపపుణ్యములు నా ప్రాణవాయువులును
శ్రీపతి నా సంసారసేవయు నీ సేవే. ॥సర్వా॥

ఉదయాస్తమపు దినా లున్నాఁడ నీ దినములే (?)
యెదురు నేను నీ వాఁడ నింతా నీదె
అదివో శ్రీవెంకటేశ అంతరియామివి నీవే
నిదుర మేల్కొనుటయు నీ మహిమే. ॥సర్వా॥ 282

299-వ రేకు. శంకరాభరణం

తన చిత్తముకొలఁది తమకించ నేక నేల
మనసు వచ్చినప్పుడే మన్నించీఁ గాక. ॥పల్లవి॥

కొండలందు నదులందుఁ గోరి యాకసాన భువి
నిండి యున్నాఁడు తొలుతే నీలవర్ణుఁడు
అండనే నాయందు లోకులందు నుండుటరుదా
గండికాఁడై తన మాయ గాననీఁడు గాక. ॥తన॥

గాలియై పంచమ(హా?)వాద్యగతులై శబ్దములై
ఆలకించి పలికీని యాదిమూరితి
నాలుకకొనసే వుండి నానాభావలాడీని
కాలముతో నెదిరికిఁ గానీఁడు గాక. ॥తన॥

వేదమందు శాస్త్రమందు వేవేలువాదములందు
పాదుకొని బోధించీఁ బరమాత్ముఁడు
యీదెసనే శ్రీవెంకటేశుఁడై పొడచూపె
గాదిలి తన దాసులఁ గరుణించీఁ గాక. ॥తన॥ 283

లలిత

శ్రీపతి యొకఁడే శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది. ॥పల్లవి॥

ఆసలు మిగులా నాతుమ నున్నవి
యీసు లేని సుఖమెక్కడిది
చేసిన పాపము చేతుల నున్నది
మోసపోనిగతి ముందర నేది. ॥శ్రీప॥

కోపము గొందుల గుణముల నున్నది
యేపున నిజసుఖమింక నేది
దీపనాగ్నితోఁ దిరిగెటి దేహము
పైపై విరతికిఁ బట్టేది. ॥శ్రీప॥

పంచేంద్రియములపాలిటి బదుకిది
యించుక నిలుకడ కెడ యేది
యెంచఁగ శ్రీవెంకటేశ్వరుఁడొకఁడే
పంచిన విధులను పాలించుఁ గాక. ॥శ్రీప॥ 284

### మాళవిగౌళ

నారాయణ నీ నామమహిమలకు
గోరఁ బోవుటకు గొడ్డలి దగునా. ॥పల్లవి॥

హరి యని నొడిగిన నణఁగేటి పాపము
సిరుల నేను నుతిసేయఁగఁ గలనా
పరగిన పిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకొని వూరకె తొడిగినయట్లు. ॥నారా॥

అచ్యుత యనఁగా నందేటి సంపద
యిచ్ఛల నెంచిన నిలఁ గలవా
కొచ్చి కొచ్చి యొక కొండంత కనకము
వెచ్చపుఁ బోఁకకు వెల యిడినట్లు. ॥నారా॥

యెదుటను శ్రీవేంకటేశ్వర యనఁగాఁ
బొదిగేటి తపముల పుణ్యము గలదా
కదిసి సముద్రము గడచి వోడలోఁ
జిదిసి యినుము దెచ్చినయట్లు ॥నారా॥ 285

### లలిత

నీ వెటు దలఁచిన నిఖిలము నట్టా
యేవల స్వతంత్ర మింతా నీది. ॥పల్లవి॥

యేటి పురాకృత మెక్కుడి కర్మము
దాటక హరి నీదయ గలితే
నీటున నిన్నియు నీ కల్పితములు
పాటించి నీవె పాపఁగ లేవా. ॥నీవె॥

యెక్కడి జన్మము లెక్కడి మరణము
లొక్కడవె నీవు వొద్దంటే
యెక్కువ నిందరి నేలెటి వాఁడవు
యిక్కడఁ గొలిచితి మితరము లేలా. ॥నీవె॥

యేది పాపము యేది పుణ్యము
పోదిగ నీవే పొమ్మంటే
చేదోడిందుకు శ్రీవెంకటేశ్వర
ఆదెస నిను శర ణంటిమి గొంత. ॥నీవె॥ 286

ముఖారి

నానాఁటి బదుకు నాఁటకము
కానక కన్నది కైవల్యము. ॥పల్లవి॥

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాఁటకము
యెట్ట నెదుటఁ గల దీప్రపంచమును
కట్టఁగడపటిది కైవల్యము. ॥నానా॥

కుడిచేదన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాఁటకము
వొడిఁ గట్టుకొనిన వుభయకర్మములు
గడి దాఁటినపుడె కైవల్యము. ॥నానా॥

తెగదు పాపమును తీరదు పుణ్యము
నగి నగి కాలము నాఁటకము
యెగువనె శ్రీవెంకటేశ్వరుఁడేలిక
గగనముమీఁదిది కైవల్యము ॥నానా॥ 287

## సాళంగనాట

ముద్దుగారే యశోద ముంగిటిముత్యము వీఁడు
తిద్దరాని మహిమల దేవకిసుతుఁడు. ॥పల్లవి॥

అంత నింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసునిపాలి వజ్రము
కాంతుల మూఁడులోకాల గరుడపచ్చఁబూస
చెంతల మాలో నున్న చిన్నికృష్ణుఁడు. ॥ము॥

రతికేలి రుక్మిణికి రంగుమోవిపగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ముఁ గాచేటి కమలాక్షుఁడు. ॥ముద్దు॥

కాళింగునితలలపైఁ గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవెంకటాద్రి యింద్రనీలము
పాలజలనిధిలోనఁ బాయని దివ్యరత్నము
బాలునివలెఁ దిరిగీఁ బద్మనాభుఁడు. ॥ముద్దు॥ 288

# సూచికలు ౧

## సంకీర్తన రాగముల అకారాది సూచి

| రాగములు. | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|
| ఆహిరి | 22, 121. |
| కన్నడగౌళ | 40, 138, 140, 262. |
| గుండక్రియ | 11, 13, 18, 21, 23, 87, 118, 163, 258, 273. |
| గుజ్జరి | 17, 62, 139. |
| గౌళ | 234. |
| జాళి | 282. ( ఇది బౌళి కావచ్చు ) |
| తెలుగు కాంబోది | 259. |
| దేవగాంధారి | 45, 61, 66, 70, 115, 146, 152, 166, 180, 219, 239, 242, 277. |
| దేసాక్షి | 10, 30, 44, 52, 110, 123, 151, 235, 243, 272. |
| దేసాళం | 20, 69, 112, 126, 172, 187, 204, 220, 228. |
| దన్నాసి | 8, 26, 51, 92, 104, 119, 149. |
| నాట | 56, 217, 229. |
| నారాయణి | 133, 271. |
| పాడి | 15, 36, 57, 74, 88, 174, 198, 210, 222, 232, 236. |
| పూర్వగౌళ | 5. |
| బౌళి | 14, 16, 29, 31, 59, 60, 64, 79, 97, 102, 108, 129, 145, 160, 168, 177, 178, 213, 221, 230, 261, 264. |
| బౌళిరామక్రియ | 131. |
| భవుళి | 165. ( ఇది బౌళి కావచ్చు ) |
| భూపాళం | 9, 54, 103, 105, 109, 195, 254. |
| భైరవి | 120, 194, 209, 233. |
| మంగళకౌశిక | 86, 134, 135. |

| రాగములు. | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|
| మలహరి | 7, 46, 73, 84, 107, 199, 241. |
| మాళవి | 76, 90, 96, 186, 200, 212, 269. |
| మాళవిగౌళ | 116, 190, 285. |
| ముఖారి | 1, 43, 48, 80, 98, 124, 20[illegible], 215, 270, 287. |
| రామక్రియ | 2, 28, 32, 99, 113, 122, 144, 147, 153, 164, 175, 182, 202, 208, 214, 2[illegible]3, 249, 251. |
| రాయగౌళ | 55. |
| లలిత | 19, 25, 34, 38, 41, 49, 82, 83, 85, 89, 94, 95, 100, 101, 106, 127, 128, 136, 137, 142, 143, 148, 155, 157, 159, 169, 171, 181, 184, 192, 203, 237, 247, 250, 255, 257, 263, 284, 286. |
| వరాళి | 4, 24, 29, 125, 189, 201, 226, 267, 279. |
| వసంతం | 206. |
| వసంతవరాళి | 63, 244. |
| శంకరాభరణం | 27, 47, 71, 93, 132, 141, 150, 188, 191, 225 240, 253, 268, 276, 283. |
| శుద్ధవసంతం | 33, 78, 161, 176, 185, 196, 248, 266. |
| శ్రీరాగం | 53, 77, 156, 193, 216, 275. |
| సామంతం | 3, 6, 42, 50, 58, 65, 68, 72, 81, 111, 114, 117, 154, 158, 167, 183, 205, 224, 231, 256, 260. |
| సామవరాళి | 252, 281. |
| సాళంగం | 130, 162, 173, 197, 274. |
| సాళంగనాట | 12, 35, 37, 67, 75, 91, 170, 179, 211, 218, 223, 227, 245, 246, 265, 278, 288. |
| సౌరాష్ట్రం | 280. |

## అ

### సంకీర్తనల అకారాది సూచిక.


| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంతయు నతని | గుండక్రియ | 273 |
| అంతర్యామి వో | లలిత | 169 |
| అందాఁకా వైష్ణవ మట | గుండక్రియ | 21 |
| అందితిని బొందితి | ధన్నాసి | 104 |
| అక్కటా రావణుబ్రహ్మహత్య | దేసాళం | 204 |
| అక్కడ నెక్కడినరకము | ధన్నాసి | 51 |
| అఖిలలోకైకవంద్య | రామక్రియ | 233 |
| అట మీఁద శర ణంటి | భైరవి | 209 |
| అణుమాత్రపుదేహి నంతే | సామంతం | 58 |
| అతఁడే పరబ్రహ్మ | లలిత | 181 |
| అతని నమ్మ లే | వసంతవరాళి | 244 |
| అతనిలోనే యణఁగె | వరాళి | 279 |
| అదివో నీప్రతాపము | సాళంగనాట | 211 |
| అనిశము దలఁచరో | సామంతం | 231 |
| అన్నిటికి నారదాదులదివో | లలిత | 142 |
| అన్నిటిమూలం బతఁడు | రామక్రియ | 202 |
| అన్నియుఁ జదివితిఁగా | సామంతం | 65 |
| అన్నియు నాయందే | మాళవి | 90 |
| అభయదాయకుఁడ | బౌళిరామక్రియ | 131 |
| అరసి నిన్ను గాచి | లలిత | 85 |
| అరిగాపులము నేము | వరాళి | 267 |
| అల్ల నాఁడే యి దెరఁగ | దేసాక్షి | 110 |
| అవధారు రఘుపతి | లలిత | 203 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అవధారు సకలలోకైకనాథ | ముఖారి | 315 |
| ఆడుతా పాడుతా | లలిత | 101 |
| ఆతఁడు నేసేచేఁత | రామక్రియ | 2 |
| ఆతఁడే బ్రాహ్మణ్యదైవ | దేసాళం | 69 |
| ఆదిమపురుషుఁడు | సాళంగనాట | 218 |
| ఆనందనిలయ ప్రహ్లాద | బౌళి | 213 |
| ఇంకనైన హరిఁ జేరు | సామంతం | 42 |
| ఇంకనైనా రోయ రాదా | దేవగాంధారి | 45 |
| ఇంక మాబోంట్ల కేది | బౌళి | 264 |
| ఇంకా నేలా తర్కవాదములు | బౌళి | 64 |
| ఇంతగా మన్నించి నన్ను | దేసాళం | 30 |
| ఇంతగాల మాయ నన్ను | లలిత | 34 |
| ఇంతగాల మాయను | రాయగౌళ | 55 |
| ఇంతటఁ గావఁ గదె | సామంతం | 154 |
| ఇంతటి దైవము లేఁడు | రామక్రియ | 122 |
| ఇంతలోనే యెచ్చరేది | బౌళి | 60 |
| ఇందునే తుదిపద | తెలుగుకాంబోది | 259 |
| ఇతనికంటే మరి దైవము | సామంతం | 81 |
| ఇతని నుతించితిమి | గుజ్జరి | 17 |
| ఇతరుల నడుగము | లలిత | 287 |
| ఇది గా దది గా దిన్నియు | గుండక్రియ | 23 |
| ఇది నమ్మలేఁడు | మంగళకౌశిక | 86 |
| ఇది యెఱిఁగినవారే | దేసాక్షి | 235 |
| ఇదె చాలదా మమ్ము | వరాళి | 201 |
| ఇదె చిక్కితి వీఁక | బౌళి | 108 |
| ఇన్నిటా శ్రీహరిభక్తి | లలిత | 136 |
| ఇన్నిటిమూలం బీశ్వరు | మలహరి | 7 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇవ్వాల వెదకితేనే | లలిత | 19 |
| ఇహపరములకును | సామంతం | 256 |
| ఇహపరములు | సాళంగనాట | 91 |
| ఈతని నెఱఁగకుంటే | లలిత | 247 |
| ఎంతగాల మైనాను | రామక్రియ | 147 |
| ఎంత విచారించుకొన్నా | ముఖారి | 80 |
| ఎందరు గలిగిన | సాళంగనాట | 265 |
| ఎందుకుఁ బని గొందము | ధన్నాసి | 8 |
| ఎందు వెదకఁ నేల | శుద్ధవసంతం | 161 |
| ఎక్కడఁ గడ చేరీ నరులు | సామంతం | 6 |
| ఎక్కడ నున్నాఁ బోదు | సామంతం | 72 |
| ఎక్కడిది వివేక మెంత | సాళంగనాట | 37 |
| ఎక్కడి పుట్టుగు లిఁక | లలిత | 171 |
| ఎక్కడి విరతి మాకు | శ్రీరాగం | 77 |
| ఎక్కడి వుద్యోగాలు | గుండక్రియ | 87 |
| ఎట్టు వలసినాఁ జేయు | బౌళి | 16 |
| ఎట్టొకో దైవమా | గుండక్రియ | 258 |
| ఎదురు లేక చరింతు | దేసాళం | 112 |
| ఎన్నఁ డిఁక ఏది | దేసాక్షి | 151 |
| ఎన్నడుఁ దీరవు | బౌళి | 59 |
| ఎన్నడుఁ దెలిసే | శంకరాభరణం | 47 |
| ఎన్ని చందముల | కన్నడగౌళ | 138 |
| ఎవ్వరిఁ దూరఁగఁ జోటు | మలహరి | 107 |
| ఎవ్వరిఁ దూరఁగఁ నేల | సామంత | 117 |
| ఎవ్వరివాఁడోఁ గాను | లలిత | 41 |
| ఎవ్వరుఁ గాననివాఁడు | శంకరాభరణం | 27 |
| ఏఁటి పరిణామము | మాళవి | 96 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏటి విచారము | నారాయణి | 271 |
| ఏడే జానలు యీ | పాడి | 36 |
| ఏపాటి తనకర్మ మాపాటి | గుండక్రియ | 163 |
| ఏ పొద్దు చూచిన | దేసాళి | 10 |
| ఏమని చెప్పీనో కాక | పూర్వగౌళ | 5 |
| ఏమని నుతింతు నేను | దేవగాంధారి | 219 |
| ఏమి చెప్పెడినో | పాడి | 57 |
| ఏమి నిద్దిరించేవు | భూపాలం | 195 |
| ఏమి సేయఁ గలఁడు | రామక్రియ | 249 |
| ఏమి సేయఁగల వొంతా | కన్నడగౌళ | 40 |
| ఏమి సేయుదును | శుద్ధవసంత | 176 |
| ఏల వెట్టి సేయించే | లలిత | 25 |
| ఏవల్ల నౌఁగాము లిఁక | సామవగాళి | 281 |
| ఒకరిఁ గానఁగ నోడ | సాళంగనాట | 245 |
| ఒక్కఁ డెవ్వఁడో వుర్వికి | దేసాళి | 44 |
| ఒక్కఁడే దైవం | సాళంగం | 274 |
| ఒక్కమాటు శరణని | దేవగాంధారి | 166 |
| ఓహో నిలిచిన దిది | శ్రీరాగం | 275 |
| కంభమున వెడలి | నాట | 217 |
| కట్టెదుర వైకుంఠము | రామక్రియ | 182 |
| కడనుండి రావు కా | గుండక్రియ | 18 |
| కడనుండే విజ్ఞానికి | శుద్ధవసంతం | 78 |
| కడవ రాదు హరి | ముఖారి | 207 |
| కడుపు నిండె నిఁక | సామంతం | 114 |
| కనుఁగొన నిది హరి | శుద్ధవసంతం | 266 |
| కన్ను దేటిదో | బౌళి | 29 |
| కల దందె పో | లలిత | 157 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కలదు తిరుమంత్రము | దేవగాంధారి | 242 |
| కలతోన నిట్లనే | ముఖారి | 270 |
| కలవి రెండే భూమి | దేసాళి | 123 |
| కలశాపురముకాడ | పాడి | 232 |
| కలిగిననాఁడే చుట్టరికంబుల | సామంతం | 68 |
| కలిమిలేము లెల్లా | వరాళి | 39 |
| కాంతలమాన మనేటి | రామక్రియ | 99 |
| కానరునాలుగు కరముల | దేసాళి | 30 |
| కాను స్వతంత్రుఁడ | భైరవి | 194 |
| కాపులము నేము కర్తవు | పాడి | 198 |
| కొలిచినవారల కొంగు | సాళంగం | 130 |
| కొలిచినవారిపాలి | శ్రీరాగం | 198 |
| కొలువు విరిసె నిదె | పాడి | 236 |
| కోనేటిదరులఁ గనుఁగొనరో | దేసాళం | 228 |
| గరిమల నెరఁగరుఁగాక | సామంతం | 167 |
| గోవిందాది నామోచ్చారణ | ముఖారి | 43 |
| గోవిందుదాసులమై | సామంతం | 260 |
| ఘనుఁ డాతఁడా యితఁడు | గుండక్రియ | 18 |
| చంకగుదియ యిదే | లలిత | 100 |
| చంచలము మానితేను | వరాళి | 125 |
| చరమార్థమందు నీవు | సాళంగం | 178 |
| చవి చేసుక యిటు | శంకరాభరణం | 258 |
| చానిపిలోపలఁ జవి | శంకరాభరణం | 141 |
| చాలుఁ జాలు నీ హరిహో | లలిత | 82 |
| చూడరో చూడరో నేఁడు | సాళంగనాట | 228 |
| చెప్పఁగా నెఱఁగరా | గుజ్జరి | 62 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చేకొని కొలువరో | సాళంగనాట | 278 |
| చేరి యశోదకు | శుద్ధవసంతం | 196 |
| జననమరణములు జంతు | సామంతం | 50 |
| జయ జయ రామా | గుండక్రియ | 11 |
| జీవన్ముక్తులము శ్రీపతి | సాళంగం | 197 |
| జోజో యని మీరు | దేసాళం | 172 |
| తగు మును ఋషులు | ధన్నాసి | 26 |
| తన చిత్తముకొలఁది | శంకరాభరణం | 283 |
| తనిసితి మిన్నిటి తగు | లలిత | 155 |
| తనుఁ దా నేమఱక | సామవరాళి | 252 |
| తప్ప దీ యర్థ మొకటి | లలిత | 106 |
| తప్పులు వొప్పులు | దేసాక్షి | 52 |
| తప్పులెంచ కిఁక | దేవగాంధారి | 146 |
| తమయెఱుక తమకు | మలహరి | 46 |
| తల మొలా నొక్కసరా | నాట | 56 |
| తా నెంత బ్రదు కెంత | సాళంగనాట | 179 |
| తీరుచు నతఁడే దిన | సాళంగనాట | 170 |
| తెలిసినవారి కింతా | లలిత | 263 |
| తెలిసినవారికి దేవు | శంకరాభరణం | 191 |
| తెలిసియుఁ దెలియను | భూపాలం | 109 |
| తెలుసుఁగ రా దిది | మాళవి | 269 |
| తొల్లిటివారికంటె | సుఖారి | 200 |
| త్రిజగముల నెరుఁగు | గౌళ | 234 |
| దనుజులు గనిరి | శంకరాభరణం | 240 |
| దిక్కు లెల్లా సాధించి | మాళవి | 212 |
| దీనుఁడ నేను దేవుఁడవు | శుద్ధవసంతం | 185 |
| దేవదుందుభులతోడ | బౌళి | 221 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దేవ నీపక్షపాతమో | నారాయణి | 183 |
| దేవ నీ వేకాల మెట్టు | గుజ్జరి | 189 |
| దేవశిఖామణివి | బౌళి | 129 |
| దేవుఁడవు నీవు | వరాళి | 226 |
| దేవుఁ డొకఁడే మాకు | దేసాళి | 243 |
| దైవంబవు కర్తవు | శంకరాభరణం | 150 |
| దైవమా యిందు | కన్నడగౌళ | 262 |
| దైవమా యేమి సేతు | మలహరి | 73 |
| దొరతనముతోడ తోడపై | నాట | 229 |
| ధరఁ గడపట నే జంతువు | లలిత | 83 |
| ధరలో నాజన్మనే | మాళవిగౌళ | 190 |
| ధ్రువవిభీషణాదులు | సామంతం | 3 |
| నిండిన జగము లెల్లా | శుద్ధవసంతం | 248 |
| నిండుమననే నీపూజ | బౌళి | 81 |
| నడపే వేఁటికి నాటకము | కన్నడగౌళ | 140 |
| నడుమ రెంటికిని | శ్రీరాగం | 53 |
| నన్నెంచఁ బని లేదు | బౌళి | 160 |
| నమితదేవం భజే | శంకరాభరణం | 225 |
| నరహరి నీదయమీఁదట | బౌళి | 79 |
| నా కేల విచారము | లలిత | 95 |
| నానాఁటి బదుకు | ముఖారి | 287 |
| నానాభరణముల | సామంతం | 224 |
| నారాయణ నీ నామ | మాళవిగౌళ | 285 |
| నారాయణ నే నవ్వ | భూపాలం | 108 |
| నారాయణాచ్యుతానంత | మాళవి | 186 |
| నారాయణుఁడ నీ నామము | సామంతం | 205 |
| నాలో నున్నాఁడవు | లలిత | 49 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నిలిచినచోట నెల్లా | లలిత | 128 |
| నీకుఁ దొల్లే యలవాటు | సాళంగం | 162 |
| నీకు నీ సహజ మిది | ముఖారి | 98 |
| నీ కెటు వలసె నటు | మలహరి | 84 |
| నీకే శరణంటి నిన్నే | ఆహిరి | 121 |
| నీదాఁకా వలెనా నిచ్చలు | లలిత | 184 |
| నీమాయ లింతే కాక | పాడి | 174 |
| నీవు నట్ల నేరుపు | శ్రీరాగం | 156 |
| నీ వెటు దలఁచిన | లలిత | 286 |
| నీ వెటు సేసిన | ధన్నాసి | 119 |
| నీ శరణమే గతి | వసంతం | 206 |
| నేనా గెలువ లేను | రామక్రియ | 251 |
| నే నేమి బాఁతి నీకు | ధన్నాసి | 92 |
| నే నెంత మూఢుల మైనా | మంగళకౌశిక | 134 |
| నేరుపు నతఁడే నేర | దేసాళం | 187 |
| పంచేంద్రియముల నే | సాళంగనాట | 35 |
| పంచేంద్రియములాల | రామక్రియ | 208 |
| పంటల భాగ్యులు వీరా | దేవగాంధారి | 70 |
| పంతగాఁడు మిక్కిలి | రామక్రియ | 214 |
| పలుదెరువులు | రామక్రియ | 32 |
| పొందిన వెల్లా భోగ్యములే | దేవగాంధారి | 152 |
| పాతేము నేము పరమాత్మ | బౌళి | 178 |
| పాపము పాపము ప్రజ | దేవగాంధారి | 61 |
| పాపముఁ బుణ్యము | భూపాలం | 105 |
| పాతవేసినపుల్లాకు | బౌళి | 177 |
| పుట్టినమొదలు నేను | లలిత | 38 |
| పుట్టుగులు నొక్కటే | బౌళి | 261 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పుణ్యమున నన్ను గాచి | ముఖారి | 48 |
| పెట్టినదైవ మెఱుఁగు | వరాళి | 24 |
| పెద్దతెరు వుండఁగాను | లలిత | 94 |
| పెరిగి పెద్దఁ గాను | రామక్రియ | 28 |
| పెఱుగఁగఁ బెఱుగఁగ | వసంతవరాళి | 63 |
| పొదలఁ బొదలఁగ | గుండక్రియ | 118 |
| బయ లీదించీ నదివో | వరాళి | 4 |
| బలువుఁడు నాతఁడే | రామక్రియ | 164 |
| బహుకుటుంబివి నీవు | లలిత | 127 |
| బాపురే వో ప్రాణి | బౌళి | 102 |
| భక్తి నీపై దొరకే | శుద్ధవసంతం | 38 |
| భగవద్విభవపు | లలిత | 159 |
| భవరోగవైద్యుఁడవు | సాళంగనాట | 67 |
| భావములోనా బాహ్యము | దేసాళి | 272 |
| మించిన తలపోఁతలే | పాడి | 74 |
| మూఁడు మూర్తులనైన | సామంతం | 111 |
| మును పొకటి కోరికలు | లలిత | 137 |
| మరల విచారించితే | సౌరాష్ట్రం | 280 |
| మాదురితములు వాపి | బౌళి | 145 |
| మానుప వశమా మాయ | శంకరాభరణం | 71 |
| మాయలఁ బొరలఁగ | దేవగాంధారి | 115 |
| మాయామోహము | దేవగాంధారి | 277 |
| మిఁగిలిన దే మిఁక | శంకరాభరణం | 268 |
| ముగియదు కాలము | శంకరాభరణం | 93 |
| ముద్దుగారే యశోద | సాళంగనాట | 288 |
| మునుల తపము నదె | శంకరాభరణం | 188 |
| మెచ్చుల దంపతులార | ధన్నాసి | 149 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మొక్కరో మొక్కరో | సాళంగనాట | 12 |
| రాతిరిఁ బగ లనేటి | రామక్రియ | 153 |
| రామకృష్ణ నీవు నందే | లలిత | 148 |
| రామభద్ర రఘువీర | పాడి | 15 |
| రుచులు నే నిఁక గొనని | మాళవిగౌళ | 116 |
| రెప్పల మరఁ గదే | లలిత | 89 |
| వింటిమి నీకతలు | లలిత | 257 |
| వీఁడిగో నిలుచున్నాఁడు | బౌళి | 230 |
| వీఁడివో లక్ష్మీపతి | రామక్రియ | 113 |
| వీఁడు గదే శేషుఁడు | మాళవి | 76 |
| వేకునఁ దిరుపళ్ళిచ్చి | భూపాలం | 9 |
| వద్దిక నోపము వట్టి | బౌళి | 105 |
| విచ్చేయవయ్యా వెంకటాచలము | రామక్రియ | 144 |
| విజయపు టమ్ము వేసె | సామంతం | 183 |
| విడువవో మాయా | మంగళకౌశిక | 135 |
| విత్తొకటి వెట్టతేను | వరాళి | 189 |
| వినరో భాగ్యము విష్ణుకథా | దేవగాంధారి | 66 |
| విశ్వ మెల్ల నీ | మలహరి | 241 |
| విశ్వరూప మిదివో | భైరవి | 120 |
| విశ్వాత్మకునికంటె | లలిత | 255 |
| విష్ణుఁడ వచ్యుతుఁడవు | ముఖారి | 124 |
| వీరు వా రనేటి | లలిత | 250 |
| వెదకవో చిత్తమా | దేసాళం | 126 |
| వెదవట్టి యిఁక నేమి | సాళంగనాట | 246 |
| వెట్టి దెలిసి జగము | భూపాలం | 54 |
| వేదము దీర్చదు | శంకరాభరణం | 276 |
| వేసరితేనే లేదు | దేవగాంధారి | 239 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వేళ లేదు జాడ లేదు | బౌళి | 168 |
| శరణు కవీశ్వర శరణం | శంకరాభరణం | 132 |
| శరణు శరణు రామచంద్ర | శ్రీరాగం | 216 |
| శ్రీపతి యొకఁడే | లలిత | 284 |
| శ్రీహరి నిత్యశేషగిరీశ | భైరవి | 238 |
| సంసారమే మేలు | సామంతం | 158 |
| సంసారికిఁ గల సహజ మిది | లలిత | 192 |
| సకలముఁ జదివిన | మలహరి | 199 |
| సకలశాంతికరము | పాడి | 88 |
| సర్వాత్మకుఁడవు | బౌళి | 232 |
| సాసముఖా నడె | బౌళి | 97 |
| సీతాసమేత రామ | సాళంగనాట | 227 |
| సురలు సంతోషించి | దేసాళం | 220 |
| సేయరానిచేఁత లెల్లా | ఆహిరి | 22 |
| సేవించి చేకొన్నవారి | పాడి | 222 |
| సొమ్ముగలవాఁడా తనసొమ్ము | లలిత | 148 |
| సౌమిత్రిసహోదర | పాడి | 210 |
| హరి కృష్ణ మేలుకోను | భూపాలం | 254 |
| హరి దగ్గరనే వున్నాఁడు దండాఁకా | బౌళి | 14 |
| హరి యిచ్చినవరము | సాళంగనాట | 75 |
| హరి హరి యని వెరగందుట | రామక్రియ | 175 |
| హేయము తనపావన | ముఖారి | 1 |


తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్, తిరుపతి ప్ర. 250. 20-5-52.

## LIST OF SRI VENKATESVARA ORIENTAL INSTITUTE PUBLICATIONS

| *Sri Venkatesvara Oriental Series :—* | | Rs. A. P. |
|---|---|---|
| 15. | **Kathopanishad Bhashya** of Rangaramanuja Ed. with English translation by Dr. K. C. Varadachari and Sri D. T. Tatacharya ... | 3 12 0 |
| 16. | **Sri Venkatesvara Laghu Kritulu** Ed. by Sri V. Prabhakara Sastri ... | 1 8 0 |
| 17. | **Annamacharya Charitramu** Ed. by Sri V. Prabhakara Sastri ... | 2 8 0 |
| 18. | **Tiruvengada Sthalapuranam** by Madhurakavi Viraraghavaswami Ed. by Sri T.P. Palaniappa Pillai. | 1 8 0 |
| 19. | **Alankarasangraha** by Amritananda Yogi Ed. by Sri P. Balakrishnamurti ... | 3 4 0 |
| 20. | **Subhadra Kalyanamu** (Telugu) by Tallapaka Timmakka, Ed. by Sri V. Prabhakara Sastri ... | 0 12 0 |
| 20a. | **Sankaravilasamu** by Chidambaranatha Ed. by Sri T. P. Palaniappa Pillai ... | 3 4 |
| 21. | **Janasrayi** (Sanskrit) Ed. by Sri M. Ramakrishna Kavi ... | 1 0 |
| 22. | **Adhyatmasankirtanalu** Vol. V by Tallapaka Annamacharyulu (Tel.) Ed. by Sri V. Prabhakara Sastri | 3 4 0 |
| 23. | **Tiruvengada Ula** (Tamil) Ed. by Sri T. P. Palaniappa Pillai ... | 1 8 ( |
| 24. | **Adhyatmasankirtanalu**, Vol. VI by Tallapaka Annamacharyulu (Tel.) Ed. by Sri A. V. Srinivasachari .. | 2 0 ( |
| 25. | **Prasnopanish d Bhashya** of Rangaramanuja (Sanskrit-English) Ed. and translated by Dr. K. C. Varadachari and Sri D. T. Tatacharya ... | 2 12 ( |
| 26. | **Sri Venkatesvara Stutiratnamala** (Telugu) Ed. by Sri V. Prabhakara Sastri ... | 1 2 ( |
| 27. | **Dharma[illegible]** (Sans.) Ed. by Prof. P. V. Ramanujaswami | (In the press |
| 28. | **Nipata[illegible]** (Sanskrit) Ed. by [illegible] Pravira Sri A. [illegible] varmasarma | do |
| 29. | **Adhyatmasankirtanalu**, Volume VII by Tallapaka Annamacharyulu (Telugu) Ed. by Sri R. Anantakrishna Sarma & Sri A. V. Srinivasachari ... | do |
| 30. | **Bharata Kosa** (Sanskrit) Ed. by Sri M. Ramakrishna Kavi ... | do |
| 31. | **Adhyatmasankirtanalu**, Volume VIII of Tallapaka Annamacharyulu (Telugu) Ed. by Sri R. Anantakrishna Sarma & Sri A. V. Srinivasachari ... | do |
| 32. | **Raghuvamsa Maha Kavyam** of Kalidasa Ed. with Tamil commentary by Sri D. T. Tatacharya ... | do |

*Copies can be had of :*—THE DIRECTOR

S. V. ORIENTAL INSTITUTE, TIRUPATI (Chittoor Dt., S.I.)

SRI VENKATESVARA ORIENTAL SERIES No 35.

*Editor* :— Prof: P. V. RAMANUJASWAMI, M. A.

# తాళ్లపాకవారి గేయరచనములు

X. సంపుటము

# అధ్యాత్మ సంకీర్తనలు

## అన్నమాచార్యరచితములు

శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయములో సంగీతవాఙ్మయ పరిశోధకుండగు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మచే

పరిశోధింపఁబడినవి.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆఫ్ ట్రస్టీజువారి తరఫున

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వారగు

శ్రీ చెలికాని అన్నారావు, బి. ఏ., గారి యనుమతిని

ప్రకటింపఁబడినది.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల

**1952**

శ్రీః

# పీఠిక

ఈ పదవ సంపుటమున శ్రీఅన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనల రేకులలో 301 వది మొదలు 350 వ దాని వఱకును గల సంకీర్తనలు అనుక్రమముగా ప్రకటింపఁబడినవి. ఎప్పటివలెనే శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల కైంకర్యమిందు చాలా కలదు.

ఈ సంపుటమునఁగూడ అన్నమాచార్యుల రచన కాఁజాలని 'హరియవతారమె అతఁడితఁడు' అను పాట (192 వ సంకీర్తన) ఎట్లో రేకులలో చొచ్చుకొని యుండి ప్రకటింపఁబడినది. 'ఉన్నాఁడు వైకుంఠము' అను మాట యొక్కటే చాలును దీనియన్యకర్తృకత్వమును తెలుపుటకు.

'ఓవో రాకాసులాల' (295) అను పదము 2 వ సంపుటములోని 146 వ సంకీర్తనమే. కొన్ని చిల్లరపాఠభేదములు మాత్రమందుఁ గలవు. కాని ముఖ్యమైన భేదము రెంటిరాగమునకు సంబంధించినది. ఇందలిది 'శోకవరాళి' లో, అందలిది 'గౌళ' లో నున్నది. * ఈ రాగభేదము ఆకాలమందే యెట్లు, ఏల యేర్పడెనో దురూహము. అన్నమాచార్యులే ఈ సంకీర్తనను వేఱువేఱుకాలములందు వేఱురాగములందు పాడెనో, లేక తరువాతి అనుయాయులు వ్యుత్పత్తికొలఁది రుచికొలఁది రాగము మార్చిరో, చెప్పఁజాలము. కాని సంగీతకళయందిట్టి మార్పులు సహజములు, దుర్నిరోధములు గూడ.

శ్రీవేంకటేశ్వరప్రాచ్యవిద్యా పరిశోధనాలయము.
తిరుపతి
18—10—52

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

---

* ఇట్లే అన్నమాచార్య సంకీర్తనల రెండవ సంపుటమున 'గౌళ' రాగముననున్న 'వెన్నలు దొంగిలి నాఁటి' అను (౨౬౫) సంకీర్తనమే 6 వ సంపుటమున చిఱుమార్పులతో 'పాడి' రాగముననున్నది.

శుభమస్తు

శ్రీ తాళ్ల పాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుధానకు (నిరోధానకు ? తిరోధానానకు) తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

301-వ రేకు. రామక్రియ

ఎక్కడి కంసుఁడు యిఁక నెక్కడి భూభారము
చిక్కు వాప జనియించె శ్రీకృష్ణుఁడు. ॥పల్లవి॥

అదివో చంద్రోదయ మదివో రోహిణిపొద్దు
అదన శ్రీకృష్ణుఁడందె నవతారము
గదయు శంఖచక్రాలు గల నాలుగుచేతుల
నెదిరించి యున్నాఁడు యిదివో బాలుఁడు. ॥ఎక్క॥

వసుదేవుఁడల్లవాఁడే వరుస దేవకి యదే
కొసరే బ్రహ్మాదుల కొండాట మదే
పొసఁగఁ బొత్తుల మీఁదఁ బురుఁటింటిలోపల
సిసువై మహిమ చూపె శ్రీకృష్ణుఁడు. ॥ఎక్క॥

పరంజ్యోతిరూపమిదె పాండవుల బ్రదికించె
అరిది కౌరవుల సంహారమూ నిదె
హరికర్తృత్వము లిరో జయంతి పండుగ సేయరో
కెరలి శ్రీవెంకటాద్రి కృష్ణుఁ డితఁడు. ॥ఎక్క॥ 1

దేసాళం

నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించఁ జెయ్యొగ్గేఁ గాని. ॥పల్లవి॥

సేయరాని పాపములు సేసి వచ్చి యేనోర
నాయెడ నిన్ను వరము లడిగేను
కాయముతో నింద్రియకింకరుఁడనై యేమని
చేయూర నీ బంటనని చెప్పుకొనేను. ॥నాకు॥

వేగి లేచి సంసారవిధులకే వొడి గట్టి
యేగతిఁ గొసరి నీపై నేఁట (?) వేసేము
ఆగడపు బంగారుకాతుమనేన (య?)మ్ముకొని
భోగపు మోక్షము నెట్టు వొందించు మనేము. ॥నాకు॥

కలపుట్టుగు బదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేఁడెట్టు నీవారమయ్యేము
నెలవై శ్రీవెంకటేశ నీవే కరుణించితివి
బలిమి సేసి నీకెట్టు భారము వేసేము. ॥నాకు॥ 2

శంకరాభరణం

అచ్చుతుశరణమె అన్నిటికిని గురి
హెచ్చు కుందు మరి యెంచఁగ నేది. ॥పల్లవి॥

యోనిజనకమగు యొడ లిది
యే నెలవైనా నేఁటి కులము
తానును మలమూత్రపుఁ జెలమ
నానాచారము నడచీనా. ॥అచ్చు॥

పాపపుణ్యముల బదుకిది
యేపొద్దు మోక్షంబెటువలె దొరకు
దీపన బాధల దినము లివి
చూపట్టి వెదకఁగ సుఖమిందేది. ॥అచ్చు॥

మరిగిన తెరువుల మనసు యిది
సరవి నెన్న విజ్ఞానంబేది
యిరవుగ శ్రీవెంకటేశ్వరుఁడే
వెరవనికంటె వెలితిఁక నేది. ॥అచ్చు॥ 3

బౌళి

నిజమో కల్లో నిమిషములోననె
భజించువారల భాగ్యముకొలఁది. ॥పల్లవి॥

వొకఁడు కను దెరచి వున్నది జగమను
వొకఁడు కన్ను మూసొగి లేదనును
సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును
వెకలినరులు భావించినకొలఁది ॥నిజ॥

కడుపు నిండొకఁడు లోకము దనిసె నను
కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు
తడవిన నిట్లనే దైవమిందరికి
వెడగు నరులు భావించినకొలఁది. ॥నిజ॥

ముదిసి యొకఁడనును మోక్షము చేర్వని
తుదఁ బుట్టొకఁడది దూరమనును
యెదుటనే శ్రీవెంకటేశ్వరుఁ డిట్లనే
వెదకి నరులు భావించినకొలఁది. ||నిజ|| 4

వసంతవరాళి

ఏమందు మిందుకు నెఱఁగినదే తొల్లి
శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి. ||పల్లవి||

వొక మానఁ జేఁదూ వొక మానఁ దీపూ
కకపికలై రెండూఁ గలవే తొల్లి
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము
సకలానఁ గలుగుట సహజమె తొల్లి. ||ఏమం||

పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి
నిగిడె లోకములను నిజమే తొల్లి
మొగి సురలకు మేలు మించి దైత్యులకుఁ గీడు
తగిలి నొసలివ్రాఁత తప్పదిది తొల్లి. ||ఏమం

వెన్నెలలుచంద్రునందు వెడయెండసూర్యునందు
కన్నుల లోకమువారు గన్నదే తొల్లి
యెన్నఁగ శ్రీవెంకటేశ యేలినవాఁడవు నీవు
వున్నవారు నీకింద నున్నవారు తొల్లి. ||ఏమం|| 5

లలిత

ఆతఁడితఁడా వెన్న లంతట దొంగిలినాఁడు
యెతులకు మద్దులు రెండిలఁ దోసినాఁడు. ||పల్లవి||

యీతఁడా దేవకి గన్న యింద్రనీలమాణికము
పూతకిచన్ను దాగి పొదలినాఁడు
యీతఁడా వసుదేవునియింటిలో నిధానము
చేతనే కంసునిఁ బుట్టచెండు సేసినాఁడు. ॥ఆత॥

మేటియైన గొంతిదేవిమేనల్లుఁడీతఁడా
కోటికిఁ బడగె గాను కొండ యెత్తెను
పాటించి పెంచే యశోదపాలి భాగ్యమీతఁడా
వాటమై గొల్లెతలను వలపించినాఁడు. ॥ఆత॥

ముగురు వేలుపులకు మూలభూతి యీతఁడా
జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను
మిగుల శ్రీవెంకటాద్రిమీఁది దైవమీతఁడా
తగి రామకృష్ణావతారమందె నిపుడు. ॥ఆత॥ 6

302-వ రేకు. శుద్ధవసంతం

పనిగొనువారల భాగ్య మిది
వెనక ముందరికి వివేక మొకటే. ॥పల్లవి॥

బలు పుణ్యములకుఁ బాపములకు గురి
కలియుగ మొకటే కలది
చెలఁగి చేయుటకు చేయించుటకును
తలఁపూ నొకటే తనలోఁ గలది. ॥పని॥

మోదపు భోగము మోక్షమునకు గురి
యీదేహ మొకటె యెత్తినది
గోదిలి కడుఁ గుంగుటకు నెక్కుటకు
యీదెస విజ్ఞానమే కలది. ॥పని॥

అర్మిలి దుఃఖము నతిసుఖములకు గురి
కర్మం బొకటే కలది
కూర్మి శ్రీవెంకటగురుఁడై వమ్ముఁ గను
ధర్మమున కతనిదాస్యమే కలది. ॥పని॥ 7

### మంగళకౌశిక

ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు
చెంది నీ సుద్దులు యేమి చిత్రమో కాని. ॥పల్లవి॥

నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మాని
నీ నామము వినక నెరవేరె నొకఁడు
పూని నిన్ను నుతియించి భోగి యాయ నొకఁడు
మోనమున నిన్ను దిట్టి మోక్ష మందె నొకఁడు. ॥ఇంద॥

మతిలో నిన్ను దలఁచి మహిమందె నొక యోగి
తతి నిన్ను దలఁచకే తగిలె నిన్నొకఁడు
అతిభక్తిఁ బని సేసి అధికుఁడాయ నొకఁడు
సతతముఁ బని గొని సఖుఁడాయ నొకఁడు. ॥ఇంద॥

కౌఁగిటి సుఖము లిచ్చి కలసిరి గొందరు
ఆఁగి నిన్ను వెంటఁ దిప్పి ఆవులు మేలందెను
దాఁగక శ్రీవెంకటేశ దగ్గరైన దవ్వయిన
మూఁగి నిన్ను దలపోసే మనసే గుఱుతు. ॥ఇంద॥ 8

### ముఖారి

గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు
పరమపద మొక్కటే ఫలమింతే కాక. ॥పల్లవి॥

పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు
దాఁప నవి నిమిషమాత్రములే కాక
లోపలేడ వెలి యాడ లోకులకింతే కాక
మోపినదంతా నేకముఖమే కాక. ॥గరి॥

రాతిరేది పగలేది రమించు సాత్వికులకు
యీతల నింతా వెలుఁగింతే కాక
ఘాతలఁ గర్మాకర్మగతులు యీసందివింతే
పోతరించి యెక్క నెక్కఁ బొడవే కాక. ॥గరి॥

చింతలేల సిలుగేల శ్రీవెంకటేశ్వరుని
వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు
జంతువుల పురుఁడులు జడులకింతే కాక
వింత వింత సుద్దులేల విభవమే కాక. ॥గరి॥ 9

## గుండక్రియ

అనాది జీవుఁడన్నియుఁ గన్నవే
వినోదమిందలి విరతే వలయు. ॥పల్లవి॥

వెలిఁ దోఁచిన యీ విశ్వంబెల్లా
కలసిన మనోగతములివి
పలు విషయేంద్రియభావములెల్లా
వెలయఁ దా ననుభవించినవే. ॥అనా॥

సహజపు వర్ణాశ్రమములివెల్లా
యిహమునఁ దా ధరియించినవే
బహువేదశాస్త్రపరన లివెల్లా
వహికెక్కఁగఁ దా వచియించినవే. ॥అనా॥

దినదినసంసారతిమిరంబెల్లా
ఘనముగఁ దను మున్ను గప్పినవే (దే?)
అనయము శ్రీవెంకటాధిపుఁ డాత్మకు
ననిచి తొల్లి కల నాయకుఁడే. ॥అనా॥ 10

## సామంతం

ఇతరమేదియు లేదు యెఱఁగ మింతే కాని
రతి కెక్కే పనులెల్లా రామచంద్రుఁడే పో. ॥పల్లవి॥

ధనమై చేరేవాఁడు దైవమై కాచేవాఁడు
మనసులోఁ దలఁచేటి మాధవుఁడే
మునుకొన్న గ్రామములై ముందర నుండేవాఁడు
కొననాలుకమీఁదటి గోవిందుఁడే పో. ॥ఇత॥

తల్లియై పెంచేవాఁడు తండ్రియై పుట్టించేవాఁడు
వెల్లవిరిఁ దాఁ గొలిచే విష్ణుమూరితి
యిల్లాలై సుఖమిచ్చి యెంచఁ బుత్రులైనవాఁడు
చెల్లుబడిఁ దామొక్కటి చేతిపై శ్రీహరియే. ॥ఇత॥

దేహమై వుండేటివాఁడు దినభోగమైనవాఁడు
యీహల శ్రీవెంకటేశుఁ డితఁడొక్కఁడే
మోహాచార మైనవాఁడు మోక్షమై నిలిచేవాఁడు
సాహసించి నమ్మఁ గల సర్వేశుఁడితఁడే. ॥ఇత॥ 11

## భవుళి

విడిచితి మానరాదు అవి మరి విడువమనఁగ రాదు
అడరిన శ్రీహరి అనుమతికొలఁదే. ॥పల్లవి॥

పెంచినఁ బెరుగును పెను యింద్రియములు
కొంచము సేసినఁ గుందును
పంచినదిందును పాపముఁ బుణ్యము
యెంచఁగ నీశ్వరుఁ డిచ్చిన కొలఁదే. ॥విడి॥

తెలిసినఁ దేటగు తిరమగు మనసిది
కలఁచిన లోలోఁ గలఁగును
తొలఁ(లి?)చిన దిందునె దుఃఖము సుఖమును
యిల నంతర్యామిచ్చిన కొలఁదే. ॥విడి॥

చేసినఁ జెలఁగును చేఁతల కర్మము
పాసినఁ బాయును బంధముతో
ఆసల శ్రీవెంకటాధీశుఁ డిందుకు
యీసరిఁ గర్తఁడిచ్చిన కొలఁదే. ॥విడి॥ 12

303-వ రేకు. శంకరాభరణం

అతఁడేమి సేసినా మాకదే గురి
మతిలో నాతఁడుండఁగా మాయలు మాకేఁటికి. ॥పల్లవి॥

ఆసలకెల్లా గురి హరి యొక్కఁడే కాని
వేసరక కన్నవారి వేఁడ నోపను(ము?)
చేసేటి సేఁతకు గురి శ్రీవిభుఁడే కాని
వాసి దప్పి హీనుల సేవలు సేయ నోపము. ॥అత॥

ముచ్చటకెల్లా గురి మురహరుఁడే కాని
చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్ప నోపము
నిచ్చలు మాఁబదుకెల్లా నీలవర్ణునికే కాని
రచ్చల దుష్టులతోడి రాఁపులకు నోపము. ॥అత॥

పరము నిహామునకు పరమాత్ముఁడే గురి
పరులకధీనమైన భ్రాంతి యేఁటికి
సిరులకెల్లా గురి శ్రీవెంకటేశుఁడే కాని
అర పిరికి తనపుటలమట లేదు. ||అత|| 13

దేసాక్షి

ఎన్నఁడుఁ జెడని యీవు లిచ్చీని మాధవుఁడు
పన్నిన యాసలితనిపైపై నిలుపవో. ||పల్లవి||

కొననాలుకా హరిగుణములే నుడుగవో
మనసా అతని దివ్యమహిమెంచవో
తనువా శ్రీపతితీర్థదాహమే కోరవో
యెన లేని అడియాస లేఁటికి నీ కిఁకను. ||ఎన్న||

వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో
ఆనిన చేతులితనికంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో
యీనేటి పాపాలబారి నేల పడేవిఁ(రిఁ ?)కను. ||ఎన్న||

నలిఁ బాదాలాల హరినగరికే నడవరో
కలభక్తి యాతనిపై ఘటియించవో
చలమా శ్రీవెంకటేశుసంగతినే వుండవో
మెలయింపుఁ గోరికలకేల పారే విఁకను. ||ఎన్న|| 14

సామంతం

కొసరి కొసరి యిఁకఁ గోరఁగ నేఁటికి
అసురవైరి శరణనుటే చాలు. ||పల్లవి||

సంతత భోగము జనన బంధములు
జంతురాసులకు సహజము
వంతు రక్షకత్వము కరుణ భువి
నంతర్యామికి నది సహజము. ॥కొస॥

కలకాలంబును గామముఁ గ్రోధము
చలమును బ్రాణుల సహజము
సులభత్వంబును సొరిది వదాన్యత
అల లక్ష్మీపతికది సహజము. ॥కొస॥

పుడుగని కర్మము లొడలోముటలును
జడులము మాకిది సహజము
యెడయక శ్రీవెంకటేశ నీకు మము
నడరి కాచుటే అది సహజము. ॥కొస॥ 15

శుద్ధవసంతం

ఇహ పర సాధన మిది యొకటే
సహజపు మురారిసంకీర్తనొకటే. ॥పల్లవి॥

భవసాగరములఁ బాపెడిది తేప
భువి నజ్ఞానముపులివాకట్టిది
జవళి నాశాపాశములకుఁ గొడువలి
నవనీతచోరు నామం బొకటే. ॥ఇహ॥

చింతాతిమిరముఁ జెరిచెడి సూర్యుఁడు
అంతట దరిద్రహరపు నిధానము
వింతమరణభయ వినాశమంత్రము
మంతుకు హరినామం బిది యొకటే. ॥ఇహ॥

మించు దుఃఖముల మృతసంజీవని
అంచలఁ బంచేంద్రియముల కంకుశము
యెంచగఁ శ్రీవెంకటేశుదాసులకు
బంచిన పాళ్లఁ బరగిన దొకటే. ॥ఇహ॥ 16

సాళంగనాట

ఏమని పొగడుదు నిట్టి నీ గుణము
యీ మహిమకుఁ బ్రతి యితరులు గలరా. ॥పల్లవి॥

నిండెను జగముల నీ ప్రతాపములు
చెండిన బాణునిచేతులంతో
కొండలంతలై కుప్పలు వడియెను
వండఁ దరగు రావణుతలలయి (లు?). ॥ఏమ॥

పూడెను జలధులు పోరిఁ గోపించిన
తోడ బ్రహ్మాండము తూఁటాయ
చూడఁ బాతాళము చొచ్చె బలీంద్రుఁడు
కూడిన కౌరవకులములు నడఁగె. ॥ఏమ॥

యెత్తితివి జగము లీరేడు నొకపరి
యిత్తల నభయం బిచ్చితివి
హత్తిన శ్రీవెంకటాధిప నీ కృప
నిత్తెమాయ నీ నిజదాసులకు. ॥ఏమ॥ 17

దేసాళం

నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్ము
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీ నయ్యా. ॥పల్లవి॥

పాపమూల మటు తొల్లి పైకొన్న దేహము
పాపము సేయకుండితే పక్కన నేల మాను
కోపమే కూడుగఁ గుడిచిన యీ బుద్ధి
కోపము విడువుమంటే గుణమేల మాను. ॥నీకు॥

అప్పు దీర్చ వచ్చినట్టి ఆయపు సంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను
తప్పు వేయ వచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు
తప్పులు వేయక సారెఁ దా మేల మాను. ॥నీకు॥

పంచమహాపాతకాలే పట్టుకొనే యింద్రియాలు
పంచమహాపాతకాలే(ల?) బారిఁ దోయ కేల మాను
అంచెల శ్రీ వెంకటేశ ఆత్మలో నివుండఁగాను
పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను. ॥నీకు॥ 18

304-వ రేకు. లలిత

భావించువారలపాలి భాగ్యమితఁ
డావల నీవల నంతర్యామి. ॥పల్లవి॥

యీశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు
విశ్వాత్మకుఁ డీ వివిధజీవులకు
ఐశ్వర్యము మా యంతర్యామి. ॥భావిం॥

నిత్యుఁ డితఁ డొకఁడె నెరిఁ గాలములకు
సత్యం బితఁడు చదువులకు
ప్రత్యక్షం బిదె భక్తకోటికిని
అత్యంతము మా యంతర్యామి. ॥భావిం॥

గుణి నిర్గుణి తఁడు గురుమునిజనులకు
ప్రణవము వేదాంతపంక్తులకు
ప్రణుతి శ్రీ వెంకటపతి లోకులకితఁ
డణురేణుపూర్ణుఁ డంతర్యామి. ॥భావిం॥ 19

సాళంగనాట

జగము లెల్లా నీడేరె జయవెట్టి రిందరును
తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో. ॥పల్లవి॥

అచ్యుతుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతారమాయ నిదివో. ॥జగ॥

గోవిందుఁడు జనించె గోకులష్టమిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో. ॥జగ॥

అనంతుఁడు శ్రీ వెంకటాద్రీశుఁడు జనియించె
ఘనశిశుపాలాదులు గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో
అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో. ॥జగ॥ 20

మాళవి

పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి
తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి ॥పల్లవి॥

గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై
అరదము దోలవో చయ్యన దారకా
ధర యెల్లఁ గుమ్మరిలె పాతాళ మదే కాన వచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను. ॥పారి॥

దనుజాంతకునిసేన దగ్గరి నడవఁ జొచ్చె
చొనిపి రొప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి పగ్గములు బిగించవో పయిపైన. ॥పారి॥

శ్రీవెంకటేశుబలము చిమ్మి రేఁగి మించఁ జొచ్చె
సేవించలమెల్లంగను సేనాపతీ
దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యము లాయ
తావుకు మరలించవో తానకము గాను. ॥పారి॥ 21

లలిత

ఘనుఁ డాతఁడే మముఁ గాచుఁ గాక హరి
అనిశము నే మీఁక నతనికె శరణు. ॥పల్లవి॥

యెవ్వని నాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి
యెవ్వని మూలము యీ సచరాచర
మవ్వల నివ్వల నతనికె శరణు. ॥ఘను॥

పురుషోత్తముఁ డని పొగడి రెవ్వరిని
కరి నెవ్వఁడు గక్కనఁ గాచె
ధర యెవ్వఁడెత్తె దనుజులఁ బొరిగొనె
అరుదుగ నే మీఁక నతనికె శరణు. ॥ఘను॥

శ్రీసతి యెవ్వని జేరి పురమునను
భాసిలె నెవ్వడు పరముండై
దాసులకొరకై తగు శ్రీవెంకట
మాస చూపు నితఁ డతనికె శరణు. ॥ఘను॥ 22

మంగళకౌశిక

జాలే నే నొకపనికి నవ్వుదు నీకును
కూళలలో నెంచి చూడ గురి యవ్వుదును. ॥పల్లవి॥

పసురమువంటి వాఁడ పాపపు బండెలు దెత్తు
శిసువువంటి వాఁడ సిగ్గు నెగ్గు నెరఁగ
వసుధలో రాయివంటి వాఁడను దయ దలఁచ
మెసఁగ న న్నేరీతి నీ వేలితివి దైవమా. ॥జాలే॥

మాఁకువంటి వాఁడ నే మతి లేదు పుచ్చిన
పోఁకవంటి వాఁడ నెప్పుడు కొరగాను
రోఁకలివంటి వాఁడ రోటిలోని పోట్లకు
యేఁకట న న్నిటువలె నేలితివి దైవమా. ॥జాలే॥

పామువంటి వాఁడ నే పట్టినవారిఁ గరతు
గామువంటి వాఁడ లోకమువారిఁ బీడింతు
నేమపు శ్రీవెంకటేశ నీవు నన్ను బంటంటా
నేమిటికిఁ గృపతోడ నేలితివి దైవమా. ॥జాలే॥ 23

వరాళి

దేహముతోడిది లంకె తీరదిది హరిమాయ
సాహసపు జీవులకు సహజమెప్పుడును ॥పల్లవి॥

నెట్టనఁ బెక్కండ్లవిందు నిండుకొన్న యాఁకలి
వొట్టి నిచ్చకల్యాణి కామోద్రేకము
కట్టిన వోడదూలము కాయపు సంసారము
దట్టమైన ప్రాణులకుఁ దనివేడదయ్యా. ॥దేహ॥

పొద్దోక వైరూపము పొదలేటి యీ వయసు
తిద్దుబడి గుజ్జము హత్తిన గుణము
వొద్దనుండినట్టి నీడ వుడివోనియట్టి నిద్ర
అద్దుకొని వుండుఁ గాక అది యేల మానును. ॥దేహ॥

పచ్చిగరికెకాలము ప్రపంచములో బ్రదుకు
తచ్చి చూచేటి సూత్రము తన జ్ఞానము
అచ్చపు శ్రీవెంకటేశుఁ డాత్మలో నిధానము
యిచ్చ నెరుఁగుకొంటేనే యిహామే పరము. ॥దేహ॥ 24

305-వ రేకు. రామక్రియ

భావించరో వేదములు పలికేటి వునికి
జీవులు బ్రహ్మానందముఁ జెందేటి వునికి. ॥పల్లవి॥

నిచ్చలు నిద్దురలకు నెలవైన వునికి
యిచ్చలఁ గలలు గన నిరవైన వునికి
కుచ్చిన నిట్టూర్పుల కొన దాఁకే వునికి
తచ్చిన మాటల ధ్వని దాఁకేటి వునికి. ॥భావిం॥

మునుకొన్న చూపులకు మొదలైన వునికి
అనిశము కతలెల్ల నాలకించే వునికి
వెనుకొన్న చవులెల్లా వెల వెట్టే వునికి
గునిసి మేల్ కనుటకు గురియైన వునికి. ॥భావిం॥

వావిరి నింద్రియపరవశమందే వునికి
కైవశమై పదియారు కళలుండే వునికి
చావకుండా నమృతము జాలువారే వునికి
శ్రీవేంకటేశుపాదాలు చింతించే వునికి. ॥భావిం॥ 25

## దేవగాంధారి

అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు. ॥పల్లవి॥

గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు. ॥అమ॥

యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు. ॥అమ॥

అలమేల్మంగతో నటు శ్రీవెంకట
నిలయుఁ డరదముపై నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగులఁ గడుఁ బొగడేరు. ॥అమ॥ 26

## దేసాళం

అడుకులు చక్కిలాలు అనవాలు నురుగులు
వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు, ॥పల్లవి॥

దేవకి కొడుకుఁ గన్న దిన మిది శ్రీజయంతి
భావించ మన కన్నులపండుగులాయ
దేవునిఁ బూజించితిమి తేరో నైవేద్యాలు
కైవసమై కృష్ణునికి గంపల కొలఁదులు. ॥అడు॥

వసుదేవుఁ డెత్తెను శ్రావణబహుళాష్టమిని
పసగాఁ దొట్ల నూఁచి పాడఁ గలిగె
పెసువితివికి మొక్కి చేసేము జాగరాలు
కొసరరో వరములు కోట్లకొలఁదులు. ॥అడు॥

బలభద్రుతమ్ముఁ డాయ పతి యలమేల్మంగకు
నెలమితో మనకెల్ల నేలికాయ
తలఁచి శ్రీవేంకటాద్రిఁ దానే యవతారమందె
అల సంతోషమందరో అబ్బినకొలఁదులు. ॥అడు॥ 27

## ముఖారి

ఏ బలిమి నమ్మి వెరపెరఁగరు దేహులాల
గాబువలెఁ బెరిగేరు కాలము మీఁచుట్టమా. ॥పల్లవి॥

చెలరేఁగి దానములు సేసినట్టి బలిమో
అలరి కర్మము సేసినట్టి బలిమో
చలపట్టి తపము లాచరించిన బలిమో
కొలఁది లేక సురలఁ గొలిచిన భలిమో ॥ఏబ॥

ధీరత సుజ్ఞానము దెలిసిన బలిమో
కోరక విరక్తి గైకొన్న బలిమో
శూరత లోకాన కెల్లఁ జుట్టమైన బలిమో
వూరకే బ్రహ్మకల్పములుండేటట్టి బలిమో ॥ఏబ॥

పరగ శ్రీపతినామపఠనము బలిమో
హరిదాసుల శరణన్నట్టి బలిమో
సిరుల శ్రీ వెంకటేశుసేవ చేసిన బలిమో
గురుభక్తితోడ నెక్కుడవయిన బలిమో. ॥పబ॥ 28

## నారాయణి

అనాది జగమున శౌభళము
అనేకాద్భుతం బౌభళము. ॥పల్లవి॥

హరినివాస మీ యౌభళము
అరిది పరమపద మౌభళము
అరిదైత్యాంతక మౌభళము
హరిముఖసేవిత మౌభళము. ॥అనా॥

అమలరమాకర మౌభళము
అమితమునీంద్రం బౌభళము
అమరవందితం బౌభళము
అమరెఁ బుణ్యముల నౌభళము. ॥అనా॥

అగరాజంబీ యౌభళము
అగణితతీర్థం బౌభళము
తగు శ్రీవెంకటధామవిహారం
బగు శుభాంచితం బౌభళము. ॥అనా॥ 29

## మాళవిగౌళ

విచారించుకొనేవారి వివేకాల కొలఁదులు
పచారించి వున్నవెల్ల భావనమాత్రములు. ॥పల్లవి॥

జగములన్ని నీ శరీరమే కనక
తగు వైకుంఠాలే వుండేతావులెల్లాను
పొగరు స్వర్గ నరక భూములనే లోకాలెల్ల
పగటున తమలోని భావనమాత్రములు. ||విచా||

అన్ని పదార్థాలు నీయందే పుట్టి వచ్చెఁ గాన
తిన్నని నీప్రసాదాలే దినభోగాలు
వన్నెల నిష్టానిష్ట వస్తుభేదములెల్లాను
పన్నుకొన్న యటువంటి భావనమాత్రములు. ||విచా||

అంతరాత్మవు శ్రీవెంకటాధిప నీవే కాన
చెంతల నీకైంకర్యాలే చేఁతలెల్లాను
వింతలైన సంసారవిహారములెల్లాను
బంతినే నానావిధ భావనమాత్రములు. ||విచా|| 30

306-వ రేకు. బౌళి

ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేఁగి వచ్చీని యిందిరానాథుఁడు. ||పల్లవి||

గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదముల చేరుల తేరు
సురలు మునులుఁ బట్టి సొంపుశోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగి వచ్చీనిందిరానాథుఁడు. ||ఎత్త||

జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువఁగా
యీవల నేఁగి వచ్చీనిందిరానాథుఁడు. ||ఎత్త||

పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవెంకటాద్రిమీఁదటి తేరు
కొంచక యలమేల్మంగఁ గూడి వచ్చీనదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుఁడు. ॥ఎ త్తె॥ 31

### నాట

కదిరి నృసింహుఁడు కంభమున వెడలె
విదితముగా సేవించరో మునులు. ॥పల్లవి॥

ఫాలలోచనము భయదోగ్రముఖము
జ్వాలామయ కేసరములును
కాలరౌద్రసంఘటితదంతములు
హేలాగతి ధరియించుక నిలిచె. ॥కది॥

ముడివడు బొమ్మలు ముంచిన పూర్పులు
గడగడ నదరెటి కటములును
నిడుద నాలికెయు నిక్కుఁగర్ణములు
నడియాలపురూపై తా వెలసె. ॥కది॥

సకలాయుధములు సహస్రభుజములు
వికటనఖంబులు వెసఁ బూని
వెకలి యగుచు శ్రీవెంకటేశ్వరుఁడె
ప్రకటపు దుష్టుల భంజించె నిదివో. ॥కది॥ 32

### దేసాళం

చదివి బతుకరో సర్వజనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షర మిదియే. ॥పల్లవి॥

సాదించి మున్ను శుకుఁడు చదివినట్టి చదువు
వేదవ్యాసులు చదివిన చదువు
ఆదికాలపు వైష్ణవులందరి నోటిచదువు
గాదిలి నారాయణాష్టాక్షర మిదియే. ॥చది॥

సతతము మునులెల్ల చదివినట్టి చదువు
వెత దీర బ్రహ్మ చదివిన చదువు
జతనమై ప్రహ్లాదుఁడు చదివినట్టి చదువు
గతిగా నారాయణాష్టాక్షర మిదియే. ॥చది॥

చలపట్టి దేవతలు చదివినట్టి చదువు
వెలయ విప్రులు చదివేటి చదువు
పలుమారు శ్రీవెంకటపతినామమై భువిఁ
గలుగు నారాయణాష్టాక్షర మిదియే. ॥చది॥ 33

భైరవి

శరణ మాతనికే సర్వభావాల
యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు. ॥పల్లవి॥

వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు
చొచ్చేటి త్రోవెరఁగము సోదించి మీఁద
కుచ్చిన కర్మములంత్రో గుదియై వేలుకాడేము
హెచ్చు మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెఱుఁగు. ॥శర॥

నన్ను నేనే యెఱఁగను నానాచందములను
అన్నిటా నాలోనున్న హరిఁ గానను
కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ
యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెఱుఁగు. ॥శర॥

మొదలు దెలియను మొంచి కొన దెలియను
చదువుచు నున్నవాఁడ సర్వవేదాలు
హృదయములోనుండి యిటు నన్ను గావఁగ
యిదివో శ్రీవెంకటాద్రియీశ్వరుఁడే యెఱుఁగు ॥శర॥ 34

పాడి

అప్పఁడైన హరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు. ॥పల్లవి॥

సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపైఁ బరపెఁ దేరు
తిమురుచు రుక్మకుపైఁ దిరుగఁ దోలెఁ దేరు
ప్రమదాన సృగాలునిపైఁ దోలెఁ దేరు. ॥అప్ప॥

కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁ దేరు
బమ్మరపో దంతవక్త్రుపైఁ దోలెఁ దేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాఁ దోలిన తేరు
దొమ్మి రుక్మిణిపెండ్లికిఁ దోలినట్టి తేరు. ॥అప్ప॥

మీఱి హంసడిచికులమీఁదఁ దోలినట్టి తేరు
తూఱి సంధిమాటలకుఁ దోలిన తేరు
ఆరడి శ్రీవెంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చూఱలుగొన నెక్కెను శోభనపు తేరు. ॥అప్ప॥ 35

గౌళ

మొదలివేల్పు మా మొఱ యాలించవె
యెదుటఁ గావు మము నిదివో దేవా. ॥పల్లవి॥

ధరపైఁ దపసుల తపములు చెరిచెను
నిరతపుణ్యముల నీరుసేసె నదె
పరకామినులను భంగపెట్టె నదె
హిరణ్యకశిపుఁ డిదివో దేవా. ॥మొద॥

మునులజడలవిగో మోఁపుల కొలఁదులు
యినచంద్రాదుల నెక్కుడ గెలిచెను
చనవరి యింద్రునిస్వర్గము చేకొనె
యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా. ॥మొద॥

పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను
బలిమినె ప్రహ్లాదుఁ బరచీని
యెలమిని శ్రీవేంకటేశ నీవలన
యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా. ॥మొద॥ 36

307-వ రేకు. సామంతం

మేలెల్ల నొక్కటే మించు తెలూ నొకటే
తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే. ॥పల్లవి॥

ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకము. ॥మేలె॥

యెందు నొడఁబడ్డఁ గాని యింపునీడఁ గోరఁడు
కందువ సంసారియైనఁ గాని మోక్షము గోరఁడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువ బద్ధున కదే కట్టినట్టి కట్లు. ॥మేలె॥

కలయఁ జీఁకటి యైతేఁగాని దీప మిడుకోఁడు
యిల నజ్ఞుఁడైనఁ గాని యెరుక వెదకఁడు
తలఁచి శ్రీవెంకటేశుదాసుని కింతా జయమే
బలిమిఁ జంచలునికి బహుళ దుఃఖములే. ॥నే॥ 37

లలిత

ఇదియే సులభం బిందరికి
కదియఁగ వసమా కరుణనె కాక. ॥పల్లవి॥

నగధరుండు పన్నగశయనుఁడు భూ
గగనాంతరిక్షగాత్రుండు
అగణితుండితని నరసి తెలియఁగాఁ
దగునా కనెడిది దాస్యమె కాక. ॥ఇది॥

కమలజజనకుఁడు కామునిజనకుఁడు
కమలాసతిపతి ఘనగుణుఁడు
విమలుండిహరి వెదకి కానఁగను
అమరునా శరణాగతిఁ గాక. ॥ఇది॥

దేవుఁడు త్రిగుణాతీతుఁ డనంతుఁడు
కైవల్య మొసఁగు ఘనుఁడు
శ్రీవెంకటపతి జీవాంతరాత్ముఁడు
భావించ వసమా భక్తినె కాక. ॥ఇది॥ 38

ధన్నాసి

హరి నీవు మాలోన నడు(డఁ?)గు టరుదు గాక
శరణని నీకు నే జయ మందుటరుదా. ॥పల్లవి॥

పాపపుణ్యాలంపటమైనది మేను
కూపపు యోనులఁ గుంగెటిది మేను
దీపనాగ్ని గల దిష్టము యీమేను
మోపు మోచిన నేము ములిగేది యరుదా. ॥హరి॥

పొలసి పొద్దొకచాయఁ బొరలేటి మనసు
కొలఁది లేని యాసఁ గుదురైన మనసు
మలసి సంసారమే మరిగిన మనసు
కల నేము తిమ్మటలు గైకొనేది యరుదా. ॥హరి॥

పెనచి యింద్రియములఁ బేఁడిన భవము
పనివడి చింతలకె పాలైన భవము
యెనలేని శ్రీవెంకటేశ నీకే శరణని
మనేఁ గాన యిఁక మీఁద మంచిదొటరుదా. ॥హరి॥ 39

గుండక్రియ

కోటికిఁ బడగయెత్తి కొంక నేల
యీటులేని పద మెక్కి యిఁక నేల చింత. ॥పల్లవి॥

పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలఁ జిన్న కౌపీనము
పట్టినది శ్రీహరిపాదపద్మమూలము
మెట్టయినా మాకు మేలే యిఁక నేల చింత. ॥కోటి॥

చిక్కె నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
తొక్కినది భవముల తుదిపదము
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగ
మొక్కువ కెక్కువే కాక యిఁక నేల చింత. ॥కోటి॥

చిత్తములో నిండినది శ్రీపతిరూపము
హత్తినది వైరాగ్య మాత్మధనము
యెత్తలఁ జూచిన మాకు నిదివో శ్రీవెంకటేశుఁ
డెత్తి మముఁ గావఁగాను యిఁక నేల చింత. ॥కోటి॥ 40

## దేవగాంధారి

ఓహో వోడలు మాని (మా వోడలు నీ?) వోపికె గడు మేలు
యీహల నీవుపకారమేమని నుతింతు ॥పల్లవి॥

పుట్టినవోటంటినా అది భూతముల నెలవు
నెట్టన మూసిన నేను నిఖిలహేయమయము
యిట్టి నా యాతుమలోన హరి యెట్టుంటివి నీవు
అట్టె నీ చేతలు దలఁచి అరుదయ్యా నాకు. ॥ఓహో॥

మించుల మనసంటిమా అది మిగులఁ జంచలంబు
పంచల నా సంపదలు పాపపుణ్యవిధులు
యెంచఁగా యిటువంటి నన్ను యెట్టు ధరియించితి
నించిన నీ చేతలు విని నివ్వెరగయ్యాని. ॥ఓహో॥

పాయ మిది యంటిమా పంచేంద్రియముల వశము
ఆయము నా కంటిమా అది అయిదు భూతముల మొరఁగు
యీయెడ శ్రీవెంకటేశ యీడా యెట్టేలితి నన్ను
మాయల నీశరణంబిందుకే మనసయ్యా నాకు. ॥ఓహో॥ 41

## శుద్ధవసంతం

విత్తొకటి వెట్టఁగా వేరొకటి మొలచునా
యెత్తి హరి నీవు నను నీడేర్తు గాక. ॥పల్లవి॥

మోహబాంధవములకు మూలంబు తనువు
వూహాపోహాలకు వునికి యీ తనువు
దాహమున కాఁకటికి తగులు యీ తనువు
యీహీ వైరాగ్య మిందెట్టు గలుగు. ॥విత్తో॥

పంచేంద్రియములకు పాదు యీతనువు
చంచలపుటాసలకు జంట యీ తనువు
అంచె దుర్గుణములకు నాకరము తనువు
యెంచి చూడ వివేక మిందెట్టు నిలుచు. ॥విత్తో॥

యిహలోకసుఖములకు హేతువీ తనువు
బహుపుణ్యపాపాల(కు) ఫలము యీ తనువు
యిహమునకు శ్రీవెంకటేశ నీదాస్యమున
విహరించెఁ దనువు యిఁక వెలిపేల కలుగు. ॥విత్తో॥ 42

308-వ రేకు. లలిత

హీనాధికము లింక నేడ నున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికి నొకటే. ॥పల్లవి॥

నానావర్ణములవారు నరహరిఁ దలఁచేటి
ఆనామమంత్రజప మది యొకటే
పూని యీతనిఁ గొలిచి భువి నేజాతైనాను
మోనమునఁ బొందేటి మోక్షమూ నొకటే. ॥హీన॥

వెనకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తియొక్కటే
వునికి నా దేవుఁడు వొకఁడే అంతర్యామి
మనెడి వైష్ణవకులమతమెల్లా నొకటే. ॥హీన॥

భేదాభేదము లేదు పెక్కు మఱఁగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మ లొక్కటే
శ్రీదేవుఁ డైనట్టి శ్రీవెంకటేశ్వరుని
యాదరానఁ బొందు శరణాగతియు నొకటే. ॥సోనా॥ 43

గౌళ

హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను
గరిమ నీ మాయలోనే కల గంటిఁ గాక. ॥పల్లవి॥

యీమేనే కాదా హేయ మెల్లా మోఁచినది
అవిూఁదఁ బుణ్యతీర్థము లాడీఁ గాక
కామించి యీరెంటిసంగాతంబు నేఁ జేసి
గామిడినై యెందువాఁడాఁ గానైతిఁ గాక. ॥హరి॥

చిత్త మిదే కాదా చింతించెఁ బాపాలు దొల్లి
పొత్తులకు పుణ్యాలు దలపోసీఁ గాక
రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపు రొంపిలోని కంబ మైతిఁ గాక. ॥హరి॥

యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేటి
తానకపు వేదములు తడవీఁ గాక
పూనిన శ్రీవెంకటేశ వొంటి నీకు శరణని
తోనే యీరెండుఁ గడచి తుద కెక్కేఁ గాక. ॥హరి॥ 44

వరాళి

యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాదిఫలరూప మిటు నీవై వుండవే. ॥పల్లవి॥

పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతిఁ బ్రాణప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ముఁ గాచేడికోరకు
హరి నీమూర్తి ప్రాణ మావహించవే. ॥యజ్ఞ॥

జగతికి నీపాదజలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేఁడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేక మందవే. ॥యజ్ఞ॥

వేదములు దెచ్చిన శ్రీవెంకటేశ నేము నీకు
వేదమంత్రముల పూజావిధి సేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁ గాచుటకు
వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే. ॥యజ్ఞ॥ 45

## సౌరాష్ట్రం

నేము సేసేయందుమూరు నీవే చేకొంటివి
నేమపు నాపూజ లెల్లా నీకు నెక్క- నయ్యా. ॥పల్లవి॥

పాలజలనిధిలోనఁ బవ్వళించినదియే పో
వాలిన నీకు జలాధివాసము
కోలు ముందై బ్రహ్మయజ్ఞకుండము లాహుతి గొని
వోలి నుండే అది నీకు హోమము. ॥నేము॥

అదన నాపో నారాయణుఁడ వయిన నీకు
అదియు పో మంత్రకలశాభిషేకము
మొదల నంతర్యామిమూర్తివయిన నీకు
పదవి మీర నదియే ప్రాణప్రతిష్ఠ. ॥నేము॥

అక్కడన శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వొక్కటై వుండినదే నిత్యోత్సవము
లెక్కలేని వరములు లీలతో మా కిచ్చితివి
యిక్కడ నేపొద్దు మాయింట నుండవయ్య. ॥నేము॥ 46

శ్రీరాగం

ఎందుఁ గాఁపురము సేతు నేది నిజ మేది గల్ల
ముందర నొక్క దినసే మూఁడు గాలములు. ॥పల్లవి॥

తనుభోగముల నివే తగ నొక లోకము
మనసులో తలపోఁత మరి యొక్క లోకము
యెనసిన కలలోని దిది యొక్క లోకము
మునుపు వెనకలివే మూఁడు లోకములు. ॥ఎందు॥

పంచభూతముల చేతిబంధ మొక్క దేహము
యెంచఁగ నూరుపుగాలి యిది యొక్క దేహము
కొంచక త్రిగుణముల గురి సూక్ష్మదేహము
ముంచె నిదె వొకటిలో మూఁడు దేహములు. ॥ఎందు॥

జీవుని లోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు
తావై వెలి నున్నవాఁడు తా నొక్కఁడే
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగినాతఁ డితఁడే
మావంకల మముఁ గాచె మొక్కితి మాతనికి. ॥ఎందు॥ 47

లలిత

బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మఁ గన్న తండ్రియైన పరమాత్మచింత. ॥పల్లవి॥

మూఁడు లోకములకెల్లా మొదలిచింత
మేడె(డ?)పుఁ గర్మములకు మీఁదిచింత
తోడ జనించిననాటి తొల్లిటి చింత
వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత. ॥బ్రహ్మ॥

అంగములో వెదకేటి యానందచింత
నింగివలెఁ బొడచూపే నిర్మలచింత
కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁ గలిగె మాకు నోహో యీచింత. ॥బ్రహ్మ॥

కిందు మీఁదు నేకమైన కేవలచింత
నందు లేక నిజమైన సహజచింత
కందువ శ్రీవెంకటేశుఁ గన్నచింత
యిందునే మాకుఁ గలిగె నితఁడే చింత. ॥బ్రహ్మ॥ 48

309-వ రేకు. ముఖారి

ఆదిమూలమే మాకు నంగరక్ష
శ్రీదేవుఁడే మాకు జీవరక్ష. ॥పల్లవి॥

భూమిదేవిపతియైన పురుషోత్తముఁడె మాకు
భూమిపై నేడ నుండినా భూమిరక్ష
ఆమని జలధిశాయి అయిన దేవుఁడే మాకు
సామీప్యమందున్న జలరక్ష. ॥ఆది॥

మ్రోయుచు నగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుఁడే
ఆయములు దాఁకకుండా నగ్నిరక్ష
వాయుసుతు నేలినట్టి వనజనాభుఁడే మాకు
వాయువందుఁ గందకుండా వాయురక్ష. ॥ఆది॥

పాదమాకసమునకుఁ జాఁచే విష్ణువే
గాదిలియై మాకు సాక్షాత్కరత
సాదించి శ్రీవెంకటాద్రి సర్వేశ్వరుఁడె మాకు
సాదరము మీఁరినట్టి సర్వరక్ష. ॥ఆది॥ 49

## దేసాక్షి

ఎంచి సేయుపను లేక లేవు
కొంచక యాతనిఁ గొలుచుటె కలది. ॥పల్లవి॥

తప్పదు కర్మము తా నెందున్నా
చెప్పఁగ దీనికిఁ జింతేలా
అప్పఁడు తొల్లే అనుమతించె నివి
తప్పక యాతనిఁ దలఁచుటే కలది. ॥ఎంచి॥

ఆయము నన్నమునందొక లంకె
వేయిట దీనికి వెతలేలా
కాయములో హరి గలఁడంతరాత్మ
యీయెడఁ దను నుతియించుటే కలది. ॥ఎంచి॥

వెలిని లోన శ్రీవెంకటేశుఁడే
తెలియని మతి సందియమేలా
యిలలో మనముల నేలె నాతఁడే
సలిగె మనకతని శరణమె కలది. ॥ఎంచి॥ 50

## దేవగాంధారి

అన్ని విధములుఁ దానై యాతుమలో హరి వీఁడే
పన్నిన యీ పరమాత్మభావనే మా బ్రదుకు. ॥పల్లవి॥

గోపాలకృష్ణుని చూపే కోరిన పసులపాఁడి
గోపికావల్లభు కృపే కూర్మి వనిత
శ్రీపతిదయే మాకుఁజేరే ధనధాన్యములు
చేపట్టిన బ్రహ్మతండ్రిచిత్తమే మాపుత్రులు. ॥అన్ని॥

జలధిశాయికరుణే సర్వరత్నముల సొమ్ము
అల పీతాంబరు వాత్సల్యమే వస్త్రములు
మలయు గరుడధ్వజు మన్ననే వాహనములు
యిల నచ్యుతనామమే యిదే మాకాయుష్యము. ॥అన్ని॥

అమృతమథను మహిమదె మా గాదెల కొల్చు
విమతదైత్యారి యావేశమే భయహరము
అమర శ్రీవెంకటేశునమగులే మాకు నిండ్లు
తమితో నాతనిదేవే తల్లియుఁ దండ్రియును. ॥అన్ని॥ 51

## సామంతం

తిమ్మిరెడ్డి మాకు నిచ్చె దిట్టమైన పొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోఁది సేసెఁ బొలము. ॥పల్లవి॥

నిండినట్టి మడుగుల నీరువంక పొలము
కొండలు మోఁచిన పెద్ద గొబ్బురపుఁ బొలము
అండనే పొలము రాజులుండేటి పొలము
చెండి వేసి మాకులెల్లా సెలగిన పొలము. ॥తిమ్మి॥

ఆసపడి వరదానమడిగిన పొలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైన పొలము
రాసికెక్కె మునులకు రచ్చైన పొలము
వేసరక నాఁగేటి వేగిలైన పొలము. ॥తిమ్మి॥

మంచి గురుతైన రావిమాని చేని పొలము
వంచిన గుజ్జముం దోలే వయ్యాళి పొలము
యెంచంగ శ్రీవెంకటేశు నిరవైన పొలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటి పొలము. ॥తిమ్మ॥ 52

గుండక్రియ

నే నేమి సేయుదును నిన్నుం బో వివేకము (?)
శ్రీనాథుమహిమలు చిమ్మి రేచంగాను. ॥పల్లవి॥

జీవుండేమి సేయును చిత్తము వసము గాక
యీవల నావలం బరువెత్తంగాను
చేవల నా చిత్తమేమి సేయు నందులోన నున్న
శ్రీవల్లభునిమాయ చిమ్మి రేచంగాను. ॥నేనే॥

దేహ మేమి సేయును దేహములోపలనున్న
దాహపుటాసలు వెట్టి దవ్వంగాను
యీహల నాయాసలును యేమి సేయు నన్నిటికి
శ్రీహరి యానాజ్ఞ లిటు చిమ్మి రేచంగాను. ॥నేనే॥

పుట్టుగేమి సేయును పురాకృతము వెంటం
గట్టిన బంధములై కలంచంగాను
గుట్టుతో శ్రీవెంకటేశుం గొలువంగా నన్న తండు
మట్టుమీరం బదవిచ్చి మన్నించంగాను. ॥నేనే॥ 53

లలిత

సిరిమగండే మొగసిరిరతు
మరుగురుండే మా మర్మపురతు. ॥పల్లవి॥

పులుగు నెక్కినవాఁడే పులుగుదోషపురక్ష
బలు బాలుఁడైనవాఁడే బాలగ్రహారక్ష
మొలచి పిన్నై మిన్ను ముట్టఁ బెరిగినవాఁడే
తొలఁగఁ దోసేటి ముట్టుదోషపురక్ష ॥సిరి॥

బూ(పూ?)తకిఁ జంపినవాఁడే బూతకి వాకట్టురక్ష
పాతాళానఁ గూర్మమైనపతి గుంతదోషరక్ష
ఘాతఁగరుణాకరుఁడై కరుణాదృష్టివాఁడే
మా తరతరము ద్రిష్టిమంత్రపురక్ష. ॥సిరి॥

పాముపైఁ బండేటివాఁడే పాముల వాకట్టు రక్ష
సేమపు సర్వజీవాత్మ జీవరక్ష
నేమపు శ్రీవెంకటాద్రినిలయుఁడై యున్నవాఁడే
యెమిటాను మా పురుఁటియింటిరక్ష. ॥సిరి॥ 54

310-వరేకు. మాళవిగౌళ

నానావర్ణముల నడగొండవలెను
దానవారితేరదె తగ తిరువీధుల. ॥పల్లవి॥

కదలె కదలె నదె గరుడధ్వజుని తేరు
అదె మిన్ను మోచిన నీలాద్రివలెను
మెదిరె నెదిరె నదె యిందిరాధిపుని తేరు
కదిసి చుక్కలు మోచె కనకాద్రివలెను. ॥నానా॥

తిరిగె తిరిగె నదె దేవదేవుని తేరు
అరుదైన ఘనమందరాద్రివలెను
పరువులిడీ నదె పట్టపు శ్రీపతి తేరు
విరివిఁ గైలాసపు వెండికొండవలెను. ॥నానా॥

దగ్గరె దగ్గరె నదె దైవశిఖామణి తేరు
అగ్గలపు శ్రీవెంకటాద్రివలెను
అగ్గమై శ్రీవెంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
తగ్గులేని మొత్తపు దొంతరకొండవలెను. ॥నానా॥ 55

శ్రీరాగం

కాకున్న మాపాటు కడమున్నదా
నీ కృపవంకనే నిలిచితిఁ గాక. ॥పల్లవి॥

యీ నాలికే కాదా యిందరి నిందించినది
శ్రీనిధి నిన్నుఁ బొగడి చెలఁగెఁ గాక
నానాపాపములు విన్న నా వీనులే కావా
దానవారి నీ కథల ధన్యమాయఁ గాక. ॥కాకు॥

యీ మేనే కాదా హేయపుటింతులఁ గూడె
నీ ముద్రలు ధరియించి నిక్కెఁ గాక
యీ మనసే కాదా యిన్నిటిపైఁ బారినది
కామించి నిన్నుఁ దలఁచి కట్టువడెఁ గాక. ॥కాకు॥

యీ పుట్టుగే కాదా హీనాధికములఁ బొందె
వోపి నీ దాస్యము చేరి వొప్పెఁ గాక
యేపున శ్రీవెంకటేశ యిన్ని నేరములు నాకుఁ
బాపఁగా నే నిన్ను నమ్మి బ్రదికితిఁ గాక. ॥కాకు॥ 56

దేసాళం

నేనే పో ఘనుఁడను నీకంటెను
దానవారి నీవు నాకు దైవమవు గాన. ॥పల్లవి॥

నేరుపున నాకైతే ని దిక్కు గలదు గాని
చేరి నీ కావల దిక్కు చెప్పి చూపఁ గలదా
ఆరయ నీవైతే నాకు నాధారము గలవు గా(ని?)
నూ(వ్రా?)రకే నీ కాధారము వున్నదా యెక్కడను. ॥నేనే॥

నిన్నుఁ గొల్చిన సలిగె నేఁడు నాఁకు గద్దు గాని
సన్నుతి నీకు నొకరి సలిగున్నదా
పెన్నిధి నిన్నుఁ దలఁచే పేరు నాకుఁ గద్దు గాని
వున్నదా నీకుఁ దలఁచ నొకరి పేరైనను. ॥నేనే॥

యీవులెల్ల నాకైతే నియ్యఁ గలవు గాక
ఆవల నీకీవులియ్య నన్యులున్నారా
శ్రీవెంకటేశ నాకు జీవాంతరాత్మవు నీవు
భావించ నంతరాత్మ యప్పటి నీకు నున్నదా. ॥నేనే॥ 57

గుండక్రియ

కాయము నాదే అట కర్తను నే నట నా
చాయకవి రావు నన్నే జరసీఁ గాని. ॥పల్లవి॥

తలఁచినట్టుండదు తలఁపు నాదైనాను
కులికి నన్నే పనిగొనీఁ గాని
నిలిపినయట్టుండవు నేఁడు నా మాటలే నాకు
పొలసి నన్నే కడు బొంకించీఁ గాని. ॥కాయ॥

కలిమి లేమెరఁగదు కాయము నాదైనాను
కొలఁదికి నేమైనాఁ గోరీఁ గాని
యిల నాయంకెకు రావు యింద్రియములు నావైనా
కలసి నా మర్మములే కాఁడి పారీఁ గాని, ॥కాయ॥

పంపు నాకుఁ జేయదు భవమిది నాదైనా
తెంపున కర్మవిధులఁ దిప్పీఁ గాని
యింపుల శ్రీవెంకటేశ యిది యరాజకమాయ
పంపున నీ కిదె మొఱ ప్రతిపాలించఁ గదే. ||కాయ|| 58

## గుండక్రియ

అతఁడు లక్ష్మీకాంతుఁ డన్నియు నొసఁగుఁ గాక
యితరుల వేఁడుకొంటే నేమి గలదు. ||పల్లవి||

మోదముతో నొకమాని మొదలఁ బోసిన నీరు
పాదుకొని కొనకెక్కి ఫలించుఁ గాక
ఆదిమూలమగు హరి నాతుమ సేవించక
యే దైవములఁ గన్నా నేమి సెలవు. ||అత||

తల్లి భుజించినవెల్లా తగు గర్భము శిశువు
కెల్ల గాఁగఁ బరిణామ మిచ్చుఁ గాక
వుల్లములోపలి హరి కొసగని పూజలెల్లా
వెల్లిఁ జింతపంటివలె వృథా వృథా. ||అత||

వోలి నెంత జారి పడ్డా నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై నిలుచుఁ గాక
తాలిమి శ్రీవెంకటేశుఁ దలఁచక తలఁచినా
పాలించ నాతఁడే కాక పరులకు వశమా. ||అత|| 59

## బౌళి

గోనెల కొత్తఁలు కోడెలెప్పటివి
నానినలోఘాము నయమయ్యీనా. ||పల్లవి||

మున్నిటి జగమే మున్నిటి లోకమె
యెన్నఁగఁ బుట్టుగులివె వేరు
నన్ను నెవ్వరున్నతి బోధించిన
నిన్న నేటనే నేనెఱిఁగేనా. ॥గోన॥

చిత్తము నాఁటిదె చింతలు నాఁటివె
యిత్తల భోగములివె వేరు
సత్తగు శాస్త్రము చాయ చూపినా
కొత్తగ నే నిఁక గుణినయ్యేనా. ॥గోన॥

జీవాంతరాత్ముఁడు శ్రీ వెంకటేశుఁడే
యీవల భావనలివె వేరు
ధావతి కర్మము తప్పఁ దీసినా
దైవము గావక తలఁగీనా. ॥గోన॥ 60

311-వ రేకు. శుద్ధవసంతం

జాలు దింటా మలిగండ్లాడి రాసిగా నేరేము
తేలుచు శ్రీహరి నీవే దిక్కాఁట గాక. ॥పల్లవి॥

ఆసలేల మానుఁ దన ఆఁకలి లో నుండఁగాను
బేసబెల్లి దేహముతోఁ బెరుగుఁ గాక
గాసి బంధమేల మానుఁ గాముఁడు లో నుండఁగాను
వేసట సంసారమై వెన్నడించుఁ గాక. ॥జాలు॥

ధావతులేఁటికి మానుఁ దనుభోగాలుండఁగాను
మోవరాని చింతలతో ములుగుఁ గాక
కావరములేల మాను కంతలవేసుండఁగాను
తోవ చేసుకొని వెళ్లఁ దోయుచుండుఁ గాక. ॥జాలు॥

వొక్క చిత్తమేల యేను పూర్వగాలి విసరఁగా
చిక్కి గుణత్రయముచేఁ జెదరుఁ గాక
నిక్కి శ్రీ వెంకటపతి నీకు నేనే శరణంటి
గక్కన నీజీవమును గరుణింతు గాక. ||తాలు|| 61

## మాళవిగౌళ

పొందగు నాత్మపుత్రసోమ మను
చందపు వేదమె సరి నిలిపితివి. ||పల్లవి||

పుత్రుఁడు మరుఁడట పుత్రుఁడు బ్రహ్మట నీ
పుత్రపౌత్రులే భువి నెల్లా
పుత్రకామేష్టిని బొడమితి దశరథ
పుత్రుఁడవై యిది పొగడఁగ నరులు. ||పొంద||

మనుమఁడు రుద్రుఁడు మనుమఁడు వశిష్టు
మనుమని మనుమలే మహి యెల్లా
మనుమఁడవై యదితిమాన్యగర్భమున
జననమందితివి జగమున కరుదు. ||పొంద||

యిదె నీగోత్రంబీచరాచరం
బెదుట మెరసె నిదె యిహమెల్లా
కదిసిటు శ్రీ వెంకటగోత్రంబున
నుదయించి మెరసితో హరి నీవు. ||పొంద|| 62

## శుద్ధవసంతం

ఏమి సేయువాఁడ నివి విరసమొకటొకటి
తామసం బొకవంక తత్త్వమొకవంక. ||పల్లవి||

యితరోపాయరాహిత్యుండు గాఁడేని
అతిశయంబగు మోక్ష మది యబ్బదు
సతతోద్యోగానుచరితుండు గాఁడేని
వితతసంసారసుఖవిధి నడవదు. ॥ఏమి॥

వివిధేంద్రియ విషయవిముఖుండు గాఁడేని
యివల వైష్ణవధర్మమిది యబ్బదు
అవిరళంబగు దేహానుసరణము లేక
భవమాత్రమున సుకృతఫలమబ్బదు. ॥ఏమి॥

పరమానందసంపన్నుండు గాఁడేని
చరమవిజ్ఞాన నిశ్చలుఁడు గాఁడు
యిరవయిన శ్రీ వెంకటేశ యిటువలె నీవు
కరుణించకున్న దుర్గతులచే భ్రమసీ. ॥నేమి॥ 63

ముఖారి

ఇన్నియుఁ జదువ నేల యింతా వెదక నేల
కన్ను దెరచుటొకటి కను మూయుటొకటి. ॥పల్లవి॥

వలెననే దొకమాఁట వలదనేదొకమాఁట
సిలుగులీ రెంటికిని చిత్తమే గురి
వలెనంటే బంధము వలదంటే మోక్షము
తెలసే విజ్ఞానులకు తెరువిది యొకటే. ॥ఇన్ని॥

పుట్టెడిదొకటే పోయెడిదొకటే
తిట్టమై యీ రెంటికిని దేహమే గురి
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము
వొట్టిన విజ్ఞానులకు నుపమిది యొకటే. ॥ఇన్ని॥

పరమమనేదొకటే ప్రపంచమొకటే
సిరుల నీ రెంటికిని జీవుఁడే గురి
యిరవై శ్రీ వెంకటేశుఁ డిహాపరముల కర్త
శరణాగతులకెల్ల సతమీతఁ డొకఁడే. ॥ఇన్ని॥ 64

## దేసాళం

తక్కిన చదువులొల్ల తప్పనొల్లా
చక్కఁగ శ్రీహరి నీశరణే చాలు. ॥పల్లవి॥

మోపులు మోవఁగ నొల్ల ములుగఁగ నేనొల్ల
తీపు నంజనొల్ల చేఁదు దినఁగ నొల్ల
పాపపుణ్యా లవి యొల్ల భవమునఁ బుట్టనొల్ల
శ్రీపతినే నిరతము చింతించుటే చాలు. ॥తక్కి॥

వడిగాఁ బరువులొల్ల వగరింప నేనొల్ల
వెడఁగుఁజీఁకటి యొల్ల వెలుఁగు నొల్ల
యిడుమల వేఁడనొల్ల యెక్కువ భోగము లొల్ల
తడయక హరి నీదాస్యమే చాలు. ॥తక్కి॥

అట్టె పథ్యము లొల్ల అవుషధము గొన నొల్ల
మట్టులేని మణుఁగొల్ల మైలగా నొల్ల
యిట్టె శ్రీ వెంకటేశు నిరవుగ సేవించి
చుట్టుకొన్న యానందసుఖమే చాలు. ॥తక్కి॥ 65

## రామక్రియ

ముందే తొలఁగవలె మోసపోక సంగమొల్ల
కందువఁ బోయిననీళ్లు కట్ట గట్ట వచ్చునా. ॥పల్లవి॥

అనలముఁ బొడగంటే నండ నున్న మిడుతలు
పనిలేకున్నా నందుఁ బడకుండీనా
పొనిఁగి చెలులఁ గంటే పురుషులచూపులెల్లా
ననిశము నందు మీఁద నంటఁ బారకుండునా. ॥ముందే॥

గాలపుటెఱ్ఱలఁ గంటే కమ్మి నీటిలో మీలు
జాలి నాపసలఁ జిక్కి చావకుండీనా
ఆలరి బంగారుగంటే నందరిమనసులూను
పోలిమి నాపసఁ జిక్కి పుంగుడు గాకుండునా. ॥ముందే॥

చేరి ముత్యపుఁజిప్పల చినుకులు నినిచితే
మేర తేటముత్యములై మించకుండీనా
ధారుణి శ్రీ వెంకటేశుదాసులసంగతి నుంటే
పోరచి నే జీవులై నఁ బుణ్యులు గాకుండురా. ॥ముందే॥ 66

312-వ రేకు. దేసాళి

నిరంతరంబును నీమాయే పరం
పరములాయ పాపవే నీ మాయ. ॥పల్లవి॥

మును తల్లిగర్భమున ముంచెను నీమాయ
వెనక జనించినట్టే వెలసె నీమాయ
అనుగు కౌమారబాల్యయవ్వనములు నీ మాయ
జనులకు దాఁటరాని జలధి నీ మాయ. ॥నిర॥

ఆస నీ మాయ అంగము నీ మాయ
యీసునఁ గామక్రోధము లివి నీ మాయ
వాసుల సంసారమున వలఁబెట్టీ నీ మాయ
గాసిఁబడి యీఁక నెట్టు గడచే నీ మాయ. ॥నిర॥

యెదురెల్ల నీ మాయ యిహమెల్ల నీ మాయ
పొదలి స్వర్గనరకభోగము (నీ?) మాయ
అదన శ్రీ వెంకటేశ అంతరాత్మవు నీవె
యిదె నీకె శరణంటి నిఁక నేల మాయ ॥నిర॥ 67

లలిత

ఏతపములు నేల యేదానములు నేల
శ్రీతరుణీపతి నిత్యసేవే జన్మఫలము. ॥పల్లవి॥

దేహపుటింద్రియముల దేహమందే యణఁచుటే
దేహముతోనే తాను దేవుఁడౌట
సోహలను వెలిఁ జూచేచూపు లోనుచూచుటే
ఆహా దేవతలఁ దనందే తాఁ గనుట. ॥ఏత॥

వెలి నిట్టూరుపుగాలి వెళ్లకుండా నాఁగుటే
కలికి తపోధనము గూడపెట్టుట
తలఁపు తనందే తగ లయము సేయుటే
లలిఁ బాపబంధముల లయము సేయుట. ॥ఏత॥

వెనక సంసారమందు విషయవిముక్తుఁడౌటే
మునుపనే తా జీవన్ముక్తుఁడౌట
పనివి శ్రీ వెంకటేశుపదములు శరణంటే
అనువైన దివ్యపదమప్పుడే తా నందుట. ॥ఏత॥ 68

గుండక్రియ

పంతపుటాసలు బండ్లు రాఁగా
దొంతుల యలఁతుటఁ దొలఁగేనా. ॥పల్లవి॥

మును దీపనాగ్ని మోఁచిన దేహిని
అనిశముఁ గ్రోధాగ్ని నణఁచేనా
మనసిజుకతమున మహిఁ జన్మించితి
విను మరునాజ్ఞకు వెలి యయ్యేనా. ॥పంత॥

సటలోభపు సంసారము చొచ్చితి
ఘటన విడుముడికిఁ గలిగీనా
నటించు చపలపునాలుక గల నే
మటమాయపు చవి మానేనా. ॥పంత॥

పాపపుణ్యముల భవముల జీవిని
తోపడ కర్మము దొబ్బేనా
యేపున శ్రీ వెంకటేశ్వరుశరణమే
పైపయి భజించి బ్రదికితిఁ గాక. ॥పంత॥ 69

బౌళి

తెలియుట యెన్నఁడు దేహి తనంతట
తెలియఁగ హరి నీ దిక్కే కలది. పల్లవి॥

రాపుగ రేపే మూత్రపురీషంబులు
ఆపై నాఁకటి యలమటలు
కైపుగ నింతటఁ గామవికారము
మాపు నిద్దురల మంపులె కలది. ॥తెలి॥

కొన్నాళ్లు బాల్యము కొన్నాళ్లు కౌమార
మన్నిటఁ గొన్నాళ్లు యౌవనము
పన్నిన ముదిమియుఁ బైపైఁ గొన్నాళ్లు
వున్నతి నంతట నుడుగుట కలది. ॥తెలి॥

జంతువులకు యీ సరవులు నీవే
పొంతలఁ గల్పించి పొదిపితివి
యింతట శ్రీ వెంకటేశ్వర నీకృప
చింతించి కావవే చేకొని నన్ను. ॥తెలి॥ 70

బౌళిరామక్రియ

ఇదివో శ్రుతిమూల మెదుటనే వున్నది
సధరముగా హరి చాటీనదివో. ॥పల్లవి॥

యెనసి పుణ్యము సేసి యే లోక మెక్కిన
మనికై భూమియందు మగుడఁ బొడము కే
పొనిగి "యా బ్రహ్మభువనా లోకాః
పునరావృత్తి" యనెఁ బురుషోత్తముఁడు. ॥ఇది॥

తటుకున శ్రీహరి తన్ననే కొలిచిన
పటుగతితో మోక్షపదము సులభమనె
ఘటన "మాముపేత్యతు కౌంతేయ మహాని
నటనఁ బునర్జన్మ న విద్యతే". ॥ఇది॥

యిన్నిటా శ్రీ వెంకటేశ్వరు సేవె
పన్నినగతి నిహాపరసాధన మదే
మన్నించి యాతఁడే "మన్మనా భవ" యని
అన్నిటా నందరి కానతిచ్చెఁ గాన. ॥ఇది॥ 71

ధన్నాసి

అందులకు నందులకు హరిసేసిన లంకే
కందువ సంసారమందే కలదు మోక్షము గాన(క ?). ॥పల్లవి॥

దేహామెన్నాళ్లు దిరిగె భూమిమీఁద
దాహాపు లంపటముల తగులన్నాళ్లు
వూహించి విసుగ వద్దు వోల్లనన్నఁ బోవవి
శ్రీహరి నందే తలఁచి చెలఁగఁగ వలెఁ గాన(క ?). ॥అందు॥

దీపనమెన్నాళ్లు మేనఁ దిరమై మెలఁగుచుండు
తాపపుటాసలమీఁది తగులన్నాళ్లు
పైపైఁ గోపించరాదు పాయుమన్నఁ బాయవవి
శ్రీపతి నందే తలఁచి చెలఁగఁగ వలె గాన(క ?). ॥అందు॥

యెఱుక యెన్నాళ్లు మతి నెనసి పాయక యుండె
తఱమే యింద్రియముల తగులన్నాళ్లే
వోఱలి బంధించ వద్దు వున్నతి శ్రీవెంకటేశు
మఱఁగు చొచ్చి మఱచి మట్టుపడవలెఁ గాన(క ?). ॥అందు॥ 72

313-వ రేకు. పాడి

తొల్లి కలవే యివియు తొల్లి తానుఁ గలఁడే
కల్లయునుఁ గాదు యిది కడు నిజము గాదు. ॥పల్లవి॥

కనుదెరచినంతనే కలుగు నీ జగము
కనుమూసినంతనే కడు శూన్యమౌను
కనురెప్ప మరఁగుననె కలిమియును లేమియును
తన మనోభావనలఁ దగిలి తోఁచీని. ॥తొల్లి॥

తలఁచినంతనె యెంత దవ్వయినఁ గాన్పించు
తలఁపు మరచిన మతికి దట్టమౌఁ దమము
పొలసి మతి మరఁగుననె పుట్టుటలుఁ బోవుటలు
పలు చంచలవికారభావ మీగుణము. ॥తొల్లి॥

ముందు దాఁ గలిగితే మూఁడు లోకములుఁ గల
వెందుఁ దా లేకుంటే నేమియును లేదు
అంది శ్రీ వెంకటేశుఁ డాత్మలోననె వీఁడె
కందువల నితని సంకల్పమీ పనులు. ॥త్రో॥ 73

శ్రీరాగం

చదివితిఁ దొల్లి కొంత చదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను యెంతైన నయ్యో. ॥పల్లవి॥

వోరుల దూషింతుఁ గాని వోకమారైన నా
దురితకర్మములను దూషించను
పరుల నవ్వుదుఁ గాని పలుయోనికూపముల
నరకపు నామేను నవ్వుకోను. ॥చది॥

లోకులఁ గోపింతుఁ గాని లోని కామాదులనేటి
కాకరి శత్రులమీఁదఁ గడుఁ గోపించ
ఆకడ బుద్ధులు చెప్పే అన్యుల బోధింతుఁ గాని
తేకువ నాలోని హరిఁ దెలుసుకో లేను. ॥చది॥

యితరుల దుర్గుణములెంచి యెంచి రోతుఁ గాని
మతిలో నా యాసలు మాన లేను
గతిగా శ్రీ వెంకటేశుఁ గని బ్రదికితిఁ గాని
తతి నిన్నాళ్లదాఁకా దలపోయ లేను. ॥చది॥ 74

బౌళి

ఉన్నదిందునే వొక్క విచారము
కన్నది గానుపు ఘనపుణ్యులకు. ॥పల్లవి॥

అగపడి పవిత్ర మపవిత్రంబును
జగమొక్కటనే జరగెడిని
పగటున నిది నా భావవికారమొ
జగదీశ్వరుని రచననేరుపులో. ॥ఉన్న॥

అలరిన జ్ఞానము నజ్ఞానంబును
తలఁ పొక్కటనే తగిలెడిని
చలమున నిది నా సహజపు గుణమో
పెలుచగు శ్రీహరి పెరరేఁపనలో. ॥ఉన్న॥

దాహపు నాలో ధర్మ మధర్మము
దేహ మొక్కటనె తిరిగెడిని
శ్రీహరి నాయాత్మ చేరిన ఫలమో
యీహల శ్రీ వెంకటేశ్వరు కరుణో. ॥ఉన్న॥ 75

గుజ్జరి

ఇహమే పరము మరి యింతా నీ మయము గాన
సహజపు సంసారమే మోక్షము సరుస విరక్తికి నెడమేదయ్యా. ॥పల్లవి॥

నీయందే బ్రహ్మ మరి నీయందే రుద్రుఁడు
నీయందే సచరాచరమును నీయందే యీజగము
చాయలనే యెడనెడ నేనేమి చూచినా సర్వము నీధ్యానమే కాక
యీయెడ నీయర్థములో నితరంబిది యోఁగాదన నెడమేదయ్యా. ॥ఇహ॥

నీ చేతలే రాత్రులుఁ బగళ్లు నీ చేతలే కాలత్రయము
నీ చేతలే సర్వజంతువుల నిశ్చలచైతన్యములు
చేచేత నే చేసినవెల్లా శ్రీపతి నీయాజ్ఞావిధులే
యేచాయలఁ బుణ్యపాపములకును యెంచఁగ ఁబంచఁగ నెడమేదయ్యా. ॥

నీ శరణాగతి యొక్కటి గలిగిన నిజము గల్లలకు వెలి వేలా
ఆశల నీవంతర్యామివి గన అందిన దేహమె వైకుంఠము
రాసికి నెక్కిన శ్రీ వెంకటగిరిరమణుఁడ నీవుపదేశమిది
యీశ పరాత్పర తనిసితిమిందే యిఁక నొకటి గోర నెడమేదయ్యా. 76

శుద్ధవసంతం

హరి "సర్వపాపేభ్యో అహం త్వా" యనె
గరిమ నా వాక్యమే ప్రమాణమైనట్టి గతి యొక్కటే నాకు. ॥పల్లవి॥

యిన్ని జన్మములఁ బుట్టి యేఁ జేసిన పాపములు యిఁక
నన్ని జన్మములఁ బుట్టి అట్టె పుణ్యములు సేసి అవి పాపుకోఁ గలనా
పన్నిన దొంతులపైఁ బడ నొక్క గుదియవెట్టు
వున్నతి మోఁదినయట్టు హరి శరణాగతి యది యొక్కటే నాకు. ॥హరి॥

యింతగాల మింద్రియముల నిట్టె పాఁగిన తలఁపు యిఁక
నంతగాలము చిత్తమాఁగి నే నది దిప్పుకోఁ గలనా
చెంతఁ బంటేఁడు పాలలో నొక చల్లబొట్టు చేమిరి పెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యది యొక్కటే నాకు. ॥హరి॥

పలుశాస్త్రములు చూచి బహుదేవతలఁ గొలిచి పఱచైన యీదేహము
పలుసందేహములను వచ్చిన తెరువునను పాపుకో నేఁ గలనా
యిల నంధకారపుటింటిలో నొక దీపమెత్తి మెఱసినట్టు
వొలసి శ్రీ వెంకటపతిశరణాగతి వొకటే గతి నాకు. ॥హరి॥ 77

314-వ రేకు. లలిత

నిత్య సుఖానందమిదె నీ దాస్యము
సత్యము లేని సుఖాలు చాలుఁ జాలు నయ్యా. ॥పల్లవి॥

కన్నుచూపులసుఖము కడు నీచక్కని రూపె
యెన్నఁగ వీనులసుఖమిదె నీపేరు
పన్ని నాలుకసుఖము పాదపు నీతులసి
వున్నసుఖముల తెరువోడఁబడమయ్యా. ॥నిత్య॥

తనువుతోడిసుఖము తగు నీకైంకర్యము
మనసులోసుఖము నీ మంచిధ్యానము
పనివి యూర్పుసుఖము పాదపద్మమువాసన
యెనయని పెరసుఖ మేమి సేసేనయ్యా. ॥నిత్య॥

పుట్టుగుకెల్ల సుఖము పొల్లులేని నీభక్తి
తొట్టి కాళ్ల సుఖము పాతురలాడుట
జట్టి శ్రీ వెంకటేశ మాచనవోలి చెన్నుఁడవై
వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా. ॥నిత్య॥ 78

మంగళకౌశిక

జీవములు దవ్వ వోయ చీమలునుఁ బుట్ట చొచ్చె
వేవేలయిన నిది విడువనయ్యా. ॥పల్లవి॥

చింతలన్నియుఁ బాసె చిత్తమింతట రోసె
యెంత లేదీ యాసలు యిఁక నేలయ్యా
అంతలో గురుని గంటి హరికే శరణంటి
దొంతులభవము లాల తొలఁగరో. ॥జీవ॥

గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె
యెక్కడి పలురుచులు యిఁక నేలయ్యా
చిక్కె విజ్ఞానము నేఁడె జిహ్వ నారాయణుఁ గూడె
వుక్కునఁ బాపములాల వుడుగరో. ॥జీవ॥

జీవుఁడు పావనమాయ దేవుఁడే జీవనమాయ
యీావలి యావని(లి?) కర్మమిఁక నేలయ్యా
శ్రీ వెంకటేశు భక్తిఁ జేరి శరణంటి-నేను
భావపు బంధములాల పారరో. ॥జీవ॥ 79

## తోండి

ఇంతే యింతే యింకా నెంత చూచినా
చింతలఁ జిగురులెక్కి చేఁగదేరినట్లు. ॥పల్లవి॥

వుల్లములో నెంచనెంచ నుద్యోగములే పెక్కు-
వొల్లకట్టు దంచదంచఁ బోగులైనట్టు
బల్లిదుని హరినాత్మ భావించుటొకటే
ముల్ల(ల్లు?) ముంటఁ దీసి సుఖమున నుండినట్లు. ॥ఇంతే॥

ఆనిన సంసారమున నలయికలే పెక్కు-
చానిపిఁ జవి వేఁడితేఁ జప్పనైనట్టు
పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే
నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు (?). ॥ఇంతే॥

వెనకఁ దలఁచుకొంటే విజ్ఞానములే పెక్కు-
తినఁ దిన వేమొల్లాఁ దీపైనట్టు
చనవై శ్రీ వెంకటేశుశరణను టొక్కటే
పనివడి చెఱకునఁ బండు వండినట్లు. ॥ఇంతే॥ 80

## నారాయణి

హరిశరణాగతి యాతుమది
సరుస నిదియ పో సత మయ్యీడిది. ॥పల్లవి॥

దినదినరుచులివి దేహమువి
చెనకెటి కోరిక చిత్తమువి
యెనసెటి కాంతలు యింద్రియంబులవి
పనివి యాత్మకివి పనిలేదయ్యా. ॥హరి॥

పదరెటి కోపము పావ(ప?)మువి
అదనఁ గాలములు అనాదివి
నిదుర తమోగుణనిలయమువి
యెదుట నాత్మకివి యెరవెరవయ్యా. ॥హరి॥

కాయపు జననము కర్మమువి
మాయలంపటము మమతలవి
యేయెడ శ్రీ వెంకటేశుఁ డితనికృప
పాయని యాత్మకుఁ బ్రమాణమయ్యా. ॥హరి॥ 81

## దేసాళి

ఎదిరికి మాకును యెక్కుడు తక్కువలివి
పదిలపు జ్ఞానముచేఁ బవిత్రమాయ. ॥పల్లవి॥

మహిఁ బొడమినవెల్లా మంచివే యందులోఁ
దహతహ దేహమే తగనిది
యిహములో తృణములు యెండినా యోగ్యము లాయ
బహి నిర్జీవపు మేను పనికి రాదాయ. ॥ఎది॥

పుడమిఁ జల్లినవెల్ల పురుషార్థపదములే
కడుపున నిడుకొంటేఁ గానివి
గుడికొని యితరపు గోమయమే శుద్ధి యాయ
అడరి మానుషధర్మ మతిహేయ మాయ. ॥ఎది॥

హరిసేవ గురుసేవ నాత్మజ్ఞానమున కెక్కె-
హారలింపుఁ గర్మమే పుణ్యమంటె కే (?)
అరిది శ్రీ వెంకటేశుఁడంతరాత్మకుఁ డితని
శరణనుటే సర్వసాధన మాయ. ॥ఎది॥ 82

## దేసాళం

గుల్ల గుల్లే రాయి రాయే గురి యెంత వేసినాను
అల్లనాఁడే అడియాసలవి యేల విడుతు. ॥పల్లవి॥

మహిలోన రోగములు మాన మందు గద్దు గాక
సహజగుణము మాన్పఁ జాలు మందు గలదా
బహు బంధములు నీవే పాపితే నేమో కాని
అహరహమును నేనే అవి యేల విడుతు. ॥గుల్ల॥

తనరూపమద్దములో తగఁ జూడవచ్చుఁ గాక
మనసు దా నద్దములో మరి చూడవచ్చునా
దినచంచలము నీవే తీర్చితేనేమో కాని
అనఁగు సంశయము నేనది యేల విడుతు. ॥గుల్ల॥

నాలుకచే రుచులెల్ల నంజి చూడవచ్చుఁ గాక
జాలిఁబడ్డ కన్నులచేఁ జవి గానవచ్చునా
యేలి శ్రీ వెంకటేశ నీవిట్టే కాతువు గాక
వేళ జీవుఁడను నా విధమేల విడుతు. ॥గుల్ల॥ 83

315-వ రేకు. సామంతం

పట్టిన వ్రతమే పంతము హరితో
గుట్టున శరణని కొంకఁగఁ దగవా. ॥పల్లవి॥

అవ్వల రోసినయన్నము గుడిచిన
నెవ్వరు నవ్వరు యిఁక నేలా
రవ్వగ నొల్లక రాజసము విడిచి
దవ్వులఁ జేకొనఁ దగవా మనకు. ॥పట్టి॥

విడిచిన భూతము వెస మరలించిన
యెడయని యేహిత వీఁకనేలా
యిడుమలఁ బిలుచుచు నిచ్చిన నొల్లక
అడుగఁ బోయితే నమరునె మనకు. ॥పట్టి॥

శ్రీ వెంకటపతి సేవవారమై
యీవిధిఁ బరులసేవిఁకనేలా
కైవసమీతఁడు కంటిమితనికృప
యీవల నావల నెదురా మనకు. ॥పట్టి॥ 84

సాళంగనాట

ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు
వొక్కఁడే నిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు. ॥పల్లవి॥

పెట్టిన జంగదండ పిడికిటి మొలచేయి
అట్టె వలచేయెత్తిన యాయితము
తొట్టిన పెంజెమటలు తోడనె బుసకొట్టులు
వుట్టిపడీఁ జూడరమ్మ వుగ్రహనుమంతుఁడు. ॥ఎక్క॥

నిక్కిన కర్ణములు నింగిమోఁచిన బొమ్మలు
చక్క శిరసుపైఁ బారఁజాఁచిన తోఁక
చుక్కలు మొలపూసలు సూదులవాఁడి రోమాలు
వుక్కు మీరెఁ జూడరమ్మ వుగ్రహనుమంతుఁడు. ॥ఎక్క॥

పుట్టుఁ గాపీనము మహాద్భుతయజ్ఞోపవీతము
గుట్టు చూపని కనకకుండలములు
పట్టపు శ్రీ వెంకటేశుబంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజనగరపు వుగ్రహనుమంతుఁడు. ॥ఎక్క॥ 85

శంకరాభరణం

పరమవైష్ణవుల భాగ్యం బిదివో
నిరతి వారలకె నే మొక్కెదను. ॥పల్లవి॥

తలఁచరొకప్పుడు ధరణిభోగములు
తలఁచరితరమతదైవముల
తలఁతురొకటి హరిదాసుల దాస్యము
తలఁపు మోక్షముల తగులమి(మె?) గాన. ॥పర॥

కోరరు బ్రహ్మాదిగురుతరపదములు
కోరరు మేరువుకొనసుఖము
కోరుదురు తదియ్యకోట్ల సంగము
కోరిక భక్తితోఁ గూడి గాన. ॥పర॥

వొల్లరు కల్మము లొల్లరు పుణ్యము
లొల్లరహంకారమొకపరియు
వుల్లము శ్రీవెంకటోత్తము శరణని
యెల్లందుఁ దుదిపద మెక్కిరి గాన. ॥పర॥ 86

ముఖారి

ఇందులోనఁ గల సుఖ మింతే చాలు మాకు
నిందు వెలిమైన సిరు లేమియు నొల్లము. ॥పల్లవి॥

ఆదిదేవు నచ్యుతు సర్వాంతరాత్మకుని
వేదవేద్యుఁ గమలాక్షు విశ్వపూర్ణుని
శ్రీదేవు హరి నాశ్రితపారిజాతుని
ఆది గొని శరణంటి మన్యము నేమొల్లము. ॥ఇందు॥

పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము. ॥ఇందు॥

అనుపమగుణదేహు నణురేణు పరిపూర్ణు
ఘనుఁ జిరంతనుని కలిభంజను
దనుజాంతకుని సర్వధరు శ్రీ వెంకటపతిఁ
గని కొలిచితిమి యేగతులు నేమొల్లము. ॥ఇందు॥ 87

వరాళి

హరికే మొఱవెట్టుటంతే కాక
గరిమ వేరొకటను గతి గానవచ్చునా. ॥పల్లవి॥

పాపపుణ్యాలంపటాలఁ బరగిన జీవునికి
నోపననవచ్చునా వొడలిమోపు
కోపపు శాంతము(?) చేతఁ గొట్టువడ్డ ప్రాణికి
తాపపు కర్మపువెట్టి తప్పించుకో వచ్చునా. ॥హరి॥

ఆఁకటి నీరువట్టులకగపడ్డ దేహికి
తోఁక సంసారపుటాజ్ఞ తోయవచ్చునా
సోఁకు సుఖదుఃఖములఁ జొచ్చిన జంతువునకు
మూఁకల లోకపు లగ్గములఁ బాయవచ్చునా. ॥హరి॥

పారె రాత్రిఁ బగటాను చచ్చి పుట్టే జంతువులకు
భారపుటాసల లోనఁ బాయవచ్చునా
యీరీతి శ్రీ వెంకటేశు నిటు శరణన్నఁ గాక
ధారుణిఁ బంచబాణము దప్పఁగొన వచ్చునా. ॥హరి॥ 88

బౌళి

అడ్డములేని నాలికె నాడుదురు గాక భూమి
దొడ్డవాఁడేమి సేసినా దోసమందు నేది. ॥పల్లవి॥

ఆతుమలో మదనుఁడవయ్యేవాఁడవు నీవే
ఆతల నాలిమగఁడు ననేవారలు నీవే
ఘాతల పరాంగనఁ గలసితివని నిన్ను
తోత్రో మునుల కీఁక దూరఁ జోటేదయ్యా. ॥అడ్డ॥

దేహములోపలనున్న దీపనాగ్నియు నీవే
దాహము నాఁకలి నీవే తగు రుచులెల్ల నీవే
ఆహా శబరియెంగిలారగించితనుమాట
షోహల నిందించి నవ్వఁ జోటిందు నేది. ॥అడ్డ॥

పుట్టుగులోపలనున్న భోగములన్నియు నీవే
యిట్టె ఆచారములు హీనాధికములు నీవే
గుట్టున శ్రీవెంకటేశ గొల్లఁడవై పుట్టినందు
కట్టిపడి యెవ్వరికి నూహించఁ జోటేది. ॥అడ్డ॥ 89

316-వ రేకు. గుజ్జరి

సర్వం విష్ణుమయం బను భావము సత్యం సత్యం బిన్నిటను
సర్వేశ్వరుఁడే పొందెటి వస్తువు శరణాగతియే వుపాయము. ॥పల్లవి॥

తా ననియెడి బుద్ధి దైవంబందు నునిచి
తానే తనమతి మరచిన సుఖతత్త్వానందమిది
మేనని యెడి బుద్ధి యీమేదిని ప్రకృతియందు
ఆనింపుచుఁ దా మమతలు విడిచిన నాత్మజ్ఞానంబు. ॥సర్వ॥

పొరలి జగమనే బుద్ధి మాయపై నునిచి
పరగిన యింద్రియముల గెలిచినదే పరమపు యోగంబు
పొరిఁ గర్మపుబుద్ధి పుట్టువుపై నునిచి
వెరపునఁ బాపముఁ బుణ్యము విడుచుట వివేకమగు దుదిపదము. ॥సర్వ॥

వెలిఁ దోఁచినబుద్ధి వేగమె లోనునిచి
చలమున చంచలముడిగి యుండుటే సమాధిలక్షణము
పలుభావపు బుద్ధి భక్తి వొకట నునిచి
యెలమి శ్రీవెంకటపతిఁ గలయుటే యిది తుర్యావస్థ ॥సర్వ॥ 90

లలిత

తలఁపులోని వెలితే దైవము వెలితో
కలిగిన యిదియే కారణము. ॥పల్లవి॥

యెదిటి యాసలకు నెడసి తొలఁగుటే
తుద నరకములకుఁ దొలఁగుట
వదలక యింద్రియవర్గము గెలుచుటె
పదపడి తనపాపముల గెలుచుట. ॥తల॥

మగటిమి సంసారమాయ దాఁటుటే
తగు భవవారిధి దాఁటుట
జగములోపలను శాంతి గలుగుటే
అగణితమోక్షమునందుఁ బొందుట. ॥తల॥

మహి యింతా హరిమయముగఁ గనుటే
విహితపు జ్ఞానము వెసఁ గనుట
యిహమున శ్రీవెంకటేశు శరణనుటే
సహజపు జన్మము సఫలం బనుట. ॥తల॥ 91

రామక్రియ

మరుగుచుఁ జేసీ మానదుద్యోగము
నరహరి నీకృపే నాగతి గలది. ॥పల్లవి॥

అనుపమమైన భయంబున నరకము
వినియెదఁ గాని వెరచి విడువను
మనియెడి జీవుల మరణభవంబులు
కనియెదఁ గాని కలంగదు మనసు. ॥మరు॥

రాసుల మలమూత్రపు సోదన లిటు
సేసీఁ గాని ఛీ యనదు తనువు
ఆసల నర్థపుటార్జన యలపుల
వేసరుదుఁ గాని విరతి నిలుపను. ॥మరు॥

నిరతముఁ దలఁపఁగ నిదురయుఁ దెలివియు
తొరలీఁ గాని తొరలనీదు గుణము
యిరవగు శ్రీవెంకటేశ్వర నీవే
పరమాత్మవు నను( బాలించఁగదే. ॥మరు॥ 92

సాళంగనాట

వెలినుండు లోనుండు విశ్వమింతట నుండు
జలజాక్షుశరణమే సాధనము నుండి. ॥పల్లవి॥

మిక్కిలిఁజేసే పాపమే మీఁద నరకమై తోఁచు
నిక్కి తానే అద్వ ( ద్ద ? ) ములోనీదై ( డై ? ) నట్లు
వొక్కట మొదలులేక వుంటేఁ గొనా లేదు
గుక్కకిహపరములు కోరినంతే సుండీ. ॥వెలి॥

మహిఁ దొల్లి చూచినూరే మతిలోనఁ దోఁచీని
గహనపు కాఁపురమే కల యైనట్లు
సహజమై పుట్టు లేక చావు లేదెవ్వరికి
విహిత సుఖదుఃఖములు వేఁడినంతే సుండీ. ॥వెలి॥

యెండ గాసే బయటనే యెక్కువ వెన్నెల గాసీ
దిండు రేయిఁబగలొక్కదినమైనట్లు
నిండు జీవుఁడు లేకుంటే నిక్కపు దేవుఁడు లేఁడు
అండ శ్రీవెంకటేశుఁడే అంతరాత్మ సుండీ. ॥వెలి॥ ౯౮

పాడి

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము
నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా. ॥పల్లవి॥

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు
వెల్లవిరి మహాలక్ష్మి విలాసములు
తల్లి యీకెమగనినే దైవమని కొలిచేము
వొల్లఁగే మాకే సిరులు వొరులియ్యవలెనా. ॥పుట్టు॥

గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమనిభూకాంతకు సంగభేదాలు
భామిని యీకెమగని ప్రాణధారి లెంకలము
వోమి మాకాతఁడే యిచ్చి వొరులియ్యవలెనా. ॥పుట్టు॥

పసగల పదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీవెంకటేశుఁడు
మొసఁగి యాతఁడే మమ్ము నేలి యిన్నియు నిచ్చె
వొనగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా. ॥పుట్టు॥ 94

రామక్రియ

దైవమ నీవే దయదలఁచుట గా
కావలఁ బ్రాణికి యా (నా ?) సేదయ్యా. ॥పల్లవి॥

ఆస వొకటి యెంతయినాఁ దనియదు
వాసి యొకటి తనవంతులు మానదు
యీసొకటి శాంతమెరఁగని దిదె
మోసపు దేహికి ముక్తి యేదయ్యా. ॥దైవ॥

పాపమొకటి భవబంధముఁ బాపదు
దీపనమొక్కటి ధీరత యొల్లదు
మూపొకటింద్రియసుఖముల గెలువదు
యేపునఁ బ్రాణికి యొఱుకేదయ్యా. ॥దైవ॥

పాయమొకటి చాపలములు మానదు
కాయమొకటి తనకర్మము విడువదు
యీయెడ శ్రీవెంకటేశ్వర నీసేవ
సేయని యాత (త్మ ?) కు సెలవేదయ్యా. ॥దైవ॥ 95

317-వ రేకు. మలహరి

కటకట యీమాయ గడచుట యెట్లో
ఘటనల హరికృప గలిగినఁ గాక. ॥పల్లవి॥

యిరవగు జీవులకెంత గలిగినా
పరధనకాంతలే బలుప్రియము
ధరఁ గర్మపుఁజేఁతలలో నెల్లా
సొరిదిఁ బాపమే సులభము. ||కట||

నానారుచులు యనంతము గలిగిన
కాని పదార్థమె కడుఁ దీపు
పానినచదువుల పరవలుండఁగా
మానిన దుర్భాషమాఁటలే హితవు. ||కట||

మొదలో శ్రీవెంకటేశ్వరుఁడుండఁగ
సదరపు దివిజులు చవులయిరి (?)
అదనను శ్రీగురుయానతి గలుగఁగ
పొదిగొని యివి తలపోయఁగ వలసె. ||కట|| 96

## దేవగాంధారి

ఆహా నమో నమో ఆదిపురుష నీకు
యీహల నే నెంతవాఁడ నెట్టు గాచితివి. ||పల్లవి||

లోకాలోకములు లోన నించుకొన్న నీవు
యీకడ నాయాత్మలోన నెట్టణఁగితి
ఆకడ వేదములకు నగోచరమైన నీవు
వాకుచే నీనామములు ( ల ? ) వడి నెట్టణఁగితి. ||ఆహా||

అన్నిటా బ్రహ్మాదుల యజ్ఞభోక్తవైన నీవు
అన్నపానములివి యెట్టారగించితి
సన్నుతి పూర్ణుఁడవై జనియించిన నీవు
వున్నతి నాపుట్టుగులో వొకచో నెట్టుంటివి. ||ఆహా||

దేవతలచే పూజ తివిరి కొనిన నీవు
యీవల నాచే పూజ యెట్టు గొంటివి
శ్రీవెంకటాద్రిమీఁద సిరితోఁ గూడిన నీవు
యీవిధి నాయింట (నీవు) యెట్టు నిలిచితివి. ॥ఆహా॥ 97

బౌళి

నీవే నీదాసులని నినుగంటిఁ గంటిని
ఆవలనీవే అంతర్యామివి గాన. ॥పల్లవి॥

నీదాసుల శిరసులే నీదివ్యశిరసులు
నీదాసుల పాదములే నీదివ్యపాదములు
నీదాసులకన్నులే నీ దివ్యనేత్రములు
నీదాసుల రూపమే నీ విశ్వరూపము. ॥నీవే॥

నీకింకరుల గుణాలే నీదివ్యగుణములు
నీకింకరులున్న-చోటే నీకు నిత్యవైకుంఠము
నీకింకరులసేవ నీవు మెచ్చు నిజసేవ
నీకింకరులకూటమే నీకు సర్వాంగములు. ॥నీవే॥

యిందరిలో శ్రీవెంకటేశ నీవే పో యంటే
అంది తల్లి ముట్టై యుంటే నంటవచ్చునా
యెందు నజ్ఞానపు ముట్టు యెడసినాత్మలు గాన
నిందలేని నీదాసులే నీవని సేవింతును. ॥నీవే॥ 98

ధన్నాసి

ఆయంబిది తెలియంగలదీయాత్మజ్ఞానంబు
మాయలు యీకాలము కర్మము మాధవునాధీనము. ॥పల్లవి॥

దేహమునకు నీడ తిరిగినయటువలెనే
శ్రీహరికిని కళావిధమై జీవుఁడటు దిరుగు
దేహమునకుఁ గల చైతన్యము తెగి నీడకు లేదు
శ్రీహరికిని గల స్వతంత్రము జీవునికి లేదు. ॥ఆయం॥

కలలోపలఁ గల సుఖము ఘనసంతోషము కొరకే
యిలలోపలఁ గలిగిన సుఖము యిది సంతోషము కొరకే
కలలోపలివి జీవునిసంకల్పనలిన్నియును
యిలలోపలిప్రపంచమింతయు నీశ్వరుసంకల్పము. ॥ఆయం॥

చెదరని బాహ్యపువిషయములు జీవునిపాలిటివి
పదిలంబగు అంతరంగమే పరమపు వైకుంఠము
అదనెరిఁగి కాలగాలమున ఆతుమ శ్రీవెంకటపతికి
పొదిగి యాతనికి శరణని కొలిచిన పొందగు ముక్తి యిది గీలు. ॥ఆయం॥ 99

పాడి

పాపపుణ్యముల పక్వమిదెరిఁగను
నాపాలిటిహరి నమో నమో. ॥పల్లవి॥

మానసవాచక మరి కర్మంబుల
తానకముగ నీ దాసుఁడను
పూని త్రిసంధ్యల భోగభోగ్యముల
నానాగతులను నమో నమో. ॥పాప॥

వలనుగ జాగ్రస్వ ( త్స్వ ? ) ప్నసుషుప్తుల
యిలలో నీకే (ని) హితభటుఁడ
వెలుపల లోపల వేళావేళల
ఒలినాథ నీకె నమో నమో. ॥పాప॥

పుట్టుకతోలుతను పుట్టినమీఁదట
అట్టె నీశరణాగతుఁడ
గట్టిగ శ్రీవెంకటపతి నీకృప
నట్టనడుమైతి నమో నమో. ॥పాప॥ 100

రామక్రియ

ఇందరిపై భిన్నభక్తులేటికి మా కిఁక
అందరిలో అంతరాత్మ యాతనిరూపే. ॥పల్లవి॥

తల్లియై యుండేవాఁడు తగ నితనిరూపే
మెల్లగాఁ దండ్రైనవాఁడు నితనిరూపే
యిల్లాలై సుఖమిచ్చు నితనిమహిమరూపే
వెల్లవిరిఁ దనయులే విష్ణునిరూపే. ॥ఇంద॥

గ్రామదేశకులములు ఘనుఁ డితనిరూపే
కామించు నర్థమీతఁడై కలుగు నీరూపే
దీవసాన నిహపరద్రిష్టములితనిరూపే
యేమేర దాతయు దైవమీతనిరూపే. ॥ఇంద॥

కాలము నితనిరూపే కర్మము నితనిరూపే
మేలి యాచార్యుఁడు చెప్పేదితనిరూపే
శ్రీలలనాపతి శ్రీ వెంకటేశ్వరుఁడే
పాలించఁగాఁ గంటి నే నీపరమాత్మురూపే. ॥ఇంద॥ 101

**318-వ రేకు.** గుండక్రియ

ఏపనులెవ్వరికిఁ గలదెంత యంతే కాని
శ్రీపతియాజ్ఞ(నా?)జ్ఞలు మీఁఱఁగ చింతింపఁగఁ దరమా. ॥పల్లవి॥

సులభంబున సుఖయించుటఁ బోలదు సొంపుగ భిక్షాన్నముతోడ
పలు లంపటములఁ బడి ఘడియించెటి బహుధనమిది యేల
తొలుతే జంతువులకు వ్రాసెను తొడఁగి నుదుట బ్రహ్మ
కలది దైవికములఁ గడచెదమని కడు బడలెదరేలో నరులు. ॥ఏప॥

పాపము సేయక మానుటఁ బోలదు పరమశాంతితోను
కోపము మానక బహుపుణ్యంబులు కోట్లు చేసినను
దీపింపఁగ వేదశాస్త్రములు తెలిపెడి యర్థ మిదే
కైవుగ నిది దెలియక జీవులు కడు బడలెదరేలో నరులు. ॥ఏప॥

సహజము జగమున యీపనులెల్లను జరగుచు నుండుట స్వభావము
గహనము ప్రాణులకే పనులవు ననఁ గాదన కర్తవ్యమింతేది
యిహమేల శ్రీవెంకటేశ్వరు నమ్మిన యీతనిశరణాగతులు
మహిలోఁ జాతురు నవ్వెదు రిటువలె మానరేటికో నరులు. ॥ఏప॥ 102

భవుళి

నీకంటే నితరము మరి లేదు నేనెవ్వరితో భాషింతు
యేకో నారాయణుఁడవు నీవని యెన్నుచు నున్నవి వేదములు. ॥పల్లవి॥

యెక్కడ చూచిన నీ రూపంబులే యెవ్వరిఁ జూచినఁ దోఁచీని
వెక్కసముగ నీమహిమ యనంతము విశ్వాత్మకుఁడవు గాన
నిక్కి యెవ్వరిని బేర్కొని పిలిచిన నీనామములై తోఁచీని
వక్కణించఁగా సకలశబ్దముల వాచ్యుఁడవటుగాన. ॥నీక౦॥

యేపని చేసిన నీపనులే అవి యివ్వలనవ్వలఁ దోఁచీని
పాపపుణ్యమని తోఁచదు నీవే పరచైతన్యమవటు గాన
దాపుగ మతిలో నేమి దలఁచినా ధ్యానము నీదై తోఁచీని
లోపల వెలుపల నిండుక వుండెటి లోకపూర్ణుఁడవు గాన. ॥నీక౦॥

యీ యర్థమునకు నే ననువాఁడను యెక్కడ నున్నాఁడ నీలోనే
కాయధారినై యేర్పడి నీలోఁ గాక చరించితి యిన్నాళ్లు
యీ యపరాధము యెంచకుమీ నను యిందున పో నీశరణంటి
పాయను నిన్నిఁక శ్రీవెంకటపతి పరబ్రహమవు అటుగాన. ॥నీకం॥ 103

## సామంతం

అచ్యుతుఁ డనియెడి నామము గలిగినయట్టి నీవె కాక
కుచ్చి నీకు నేశరణని కొలిచితి గురుతుగఁ గావఁ గదే. ॥పల్లవి॥

అణురూపగు మశకములోపల నణఁగిన నీకంటే
గుణించి యెంచి చూచినను కొంచె మింక నేది
ప్రణుతింపంగ బ్రహ్మాండకోట్లు భరియించు నీకంటే
గణనకు నెక్కుడు నీవే కాక ఘన మింక నేది. ॥అచ్యు॥

దాకొని జగములు పుట్టించు బ్రహ్మకు తండ్రివి నీవే
కైకొని చదువులఁ దెలిసి చూడ రక్షకులిఁక మరి వేరీ
యేకోదకముగ వటపత్రమున యీఁదెటి నీకంటే
డీకొని పలికిన కాలంబుల కొనదేవుఁడు మఱి వేఁడీ. ॥అచ్యు॥

శ్రీవేంకటమున వరములొసఁగేటి శ్రీపతి నీకంటే
తావునఁ గన్నులఁ జూడఁగఁ బ్రత్యక్షదైవము మరివేఁడీ
వేవేలకు వైకుంఠవిభుఁడవై వెలసిన నీకంటే
భావించి చూచిన నంతరంగమునఁ బరోక్షదైవము మరి వేఁడీ. ॥అచ్యు॥ 104

## దేవగాంధారి

హరి నే నిన్నిందులకుఁ గాదర్చించి కోరెడిది
గరిమల నా యంతరంగమున నినుఁ గానఁగ నడిగెదను. ॥పల్లవి॥

మునుపే యీజగమెల్లా నీవు మొలవఁగఁ బెట్టినది
వెనుకొని నేను నీవాఁడనే యని విన్నవించ నేల
నినుపై యీజీవరాసులన్నియు నీరక్షణలోనివి
కనుఁగొని నన్నును రక్షించుమని మరి కమ్మరఁ జెప్పఁగ నేల. ||హరి||

యిహమునఁ గర్మాధీనంబయి సిరులియ్యఁగ నిను నింకా
మహిలోనివి యవి నాకు నిమ్మనుచు మరి యడుగఁగ నేల
సహజపుఁ దల్లియుఁ దండ్రియు బంధులు సంతతి నీవై యుండఁగను
విహితముగా నిను నక్కడ నిక్కడ వెదకఁగ మరి యేల. ||హరి||

శ్రీవెంకటపతి వరము లొసంగుచు చేరువ నీవై యుండఁగను
ఆవల నీవల నితరదేవతలయాసలఁ బడ నేల
దైవశిఖామణి వాదిమూరితివి తగిన స్వతంత్రుఁడవు
యేవిధులు నే నెఱఁగను నీవే యింతాఁ జుమ్మా దాఁచఁగ నేల. ||హరి|| 105

819-వ రేకు. సామంతం

పరమాత్మా నాజాడ భావించ నిట్టిది (నీవు)
నిరుహేతుకాన నాకు నీవు బుద్ధియ్యఁ గదె.

అపరాధములు పెక్కు లటు నాయందున్నఁ గాని
వుపమఁ బుణ్యముత్రోవలూహించ లేను
విపరీతపాపములు వేవేలు సేసినఁ గాని
చపలగర్వము మాని శరణనలేను. ||పర||

పలు లంపటాలఁ బడి బడలినఁ గాని నాకు
పలవి నిన్నుఁ దలఁచే భక్తి లేదు
పులుసు నంజినఁ గాని భూమిలో మిక్కిలి తీపు
తలపోయ నోటికి నితవు గానరాదు. ||పర||

వేవేలు నేరాలు సేసి వెరపు పుట్టినఁ గాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరదు మతి
వావిరి లోకపుమాయవలలఁ జిక్కినఁ గాని
వేవేగ వెడలి ముక్తి వెదకఁడు జీవుఁడు. ॥పర॥ 106

గుజ్జరి

శ్రీపతి నీసేవ చిత్తము గోరదు
పాపములవెంటనే పారీ నయ్యా. ॥పల్లవి॥

తెగనికర్మములు దేహములు గోరు
వగల యీపీఁగ వ్రణాలు గోరు
నగుచుఁ దొల్లింటి నా పూర్వకర్మములు
పొగరుభోగములే పొందించె నయ్యా. ॥శ్రీప॥

సాకిరివయసు సంసారము గోరు
చీకురువాయులు జీడిమాను గోరు
దీకొని నాతోడి తీరనింద్రియములు
కైకొని మర్మములు గలఁచీ నయ్యా. ॥శ్రీప॥

వేదవిజ్ఞానము విరతియే కోరు
నీదాసుఁడై తేనే నీశరణు గోరు
యీదెస శ్రీవెంకటేశ నీవు నాలో
పాదై యుండి నన్ను బ్రదికించే న(వ?)య్యా. ॥శ్రీప॥ 107

లలిత

అతని భజియించరో ఆతుమలాల శ్రీ
పతి యితనికరుణే ఫలమింతే కాని. ॥పల్లవి॥

సంగమే భంగమే(ము?) సుండి సకలవిరక్తులాల
వెంగలి విష(య?)ములే విషము సుండి
అంగపు బంధువులెల్ల అంటుబంధములు సుండి
సంగతి హరి యొకఁడే సతమింతే కాని. ॥అత॥

మోహమే దాహము సుండి మోక్షోపాయకులాల
సాహసపంసారమే నిస్సారము సుండి
దేహము గొన్నాళ్ళకు సందేహమై తోఁచు సుండి
శ్రీహరిసేవొక్కటే వచ్చినదింతే కాని. ॥అత॥

కోపమే తాపము సుండి కోరని సాత్వికులాల
రూపులేని భోగమెల్ల రుణము సుండి
కైపు సేసి యిన్నిటాను గడచి శ్రీవెంకటేశు
నోపి శరణని మనేదొక్కటే సుండి. ॥అత॥ 108

## మాళవి

ఆతఁడే పో మాయేలిక ఆతఁడే జగన్మాల
మాతఁడే శ్రీవెంకటాద్రియందు మీఁదిదైవము ॥పల్లవి॥

కమలవాసినియైన కాంతఁ బెండ్లాడినా(నవా?)డు
కమలములో బిడ్డఁ గన్నవాఁడు
కమలాప్తునిలోనఁ గలిగి మెరయువాఁడు
కమలనాభుఁడే పో కలుగు మా దైవము. ॥ఆత॥

జలధి బంధించి లంక సంహరించినవాఁడు
జలధి చొచ్చినదైత్యుఁ జంపినవాఁడు
జలధిసుతునకు సరుస బావైనవాఁడు
జలధిశయనుఁడే పో చక్కని మా దైవము. ॥ఆత॥

కొండ గొడుగుగ నెత్తి గోవులఁ గాచినవాఁడు
కొండవంటి రాకాసిఁ గొట్టినవాఁడు
కొండలకు నెక్కుడైన గురుతు శ్రీవెంకటాద్రి
కొండరూపు దానే పో కోరిన మాదైవము. ॥అత॥ 109

నాట

వొద్దునీవు నాకెదురా వోరి కంసుఁడా
కొద్ది గాదు పెనఁగఁగ గోవిందుతోఁ గంసుఁడా. ॥పల్లవి॥

పెరిగీ రేపల్లె నదె బిరుదు నీవె(వై?)రివాఁడే
వొరసి నన్నేల పట్టేవోరి కంసుఁడా
విరసాన వెరవను విష్ణునిమాయను నీ
గొరబైన వెడబుద్ధి గొలుపదు వోరా. ॥వొద్దు॥

వెదకీ నీవైరి వాఁడె వీరదానవుల నదె
వుదుటు నాతో నేల వోరి కంసుఁడా
చిదుమనా నిన్నిపుడే సెలవీఁడుగాకతఁడు
పెదవుల చేటింతే పేదవానికోపము. ॥వొద్దు॥

వెన్నలుఁ బాలారగించి వెసఁ వాఁడె సత్వగూడ
నున్నవాఁడు నిన్ను గెల్వ నోరి కంసుఁడా
వెన్నుఁడు శ్రీవెంకటాద్రివిభుఁడు లోకులఁ గాచె
నన్నిటాఁ గృష్ణావతార మందఁబట్టె నేఁడు. ॥వొద్దు॥ 110

సామంతం

ఈతఁడే దిష్టవరము లియ్యఁగాఁ గాక
ఆతలీతలి సుద్దులవి నమ్మఁ గలమా. ॥పల్లవి॥

హరిరూపెరుఁగుదుమా అరసి యింతక తొల్లి
సొరిది శ్రీవెంకటేశుఁ జూచికాక
గురుమంత్రము నేర్తుమా గోవిందుఁ డితనినామ
మురుశై లోకాలనెల్ల నుండఁగా గాక. ||ఈత||

వైకుంఠ మెరుఁగుదుమా వర్ణించి యింతక తొల్లి
దీకొని శ్రీవెంకటాద్రిఁ దిరిగి కాక
యేకడ దేవతల నేమొందునై నాఁ గంటిమా
చేకొని హరిదాసులఁ జేరి మొక్కే కాక. ||ఈత||

పుట్టు నేఁ గంటినా పొంచి శ్రీవెంకటపతి
వొట్టి నాయంతరాత్మై యుండఁగాఁ గాక
కొట్టఁగొనవరమేడ కొంచెపుదేహి నేనేడ
అట్టె యాతనికి శరణని కొలిచి కాక. ||ఈత|| 111

320-వ రేకు శుద్ధవసంతం

హరి నీవే సకలలోకారాధ్యుఁడవు గాక
ధర నీకు శరణంటే తలఁపిదే చాలును. ||పల్లవి||

కింద నేఁ జేసినయట్టి కీడు నీవు వాపఁగాను
అందుమీఁదు నడిగేదా అది చాలక
పొంది పుట్టించేటి బ్రహ్మ పుత్రుఁడు నీకై వుండఁగ
యిందరిని గొలిచేదా యెంత కూళతనము. ||హరి||

దీకొని నాలో నీవు దిక్కై వుండఁగాను
నాకొక స్వతంత్రమా నాఁడు(?) చాలక
కైకొని లోకములు నీకడుపులో నుండఁగాను
నీకంటేఁ బరులున్నారా నేరమింతే కాక. ||హరి||

యిహాపరము సిరులు యిన్నియు నీవియ్యఁగాను
సహజాన నుండవొద్దా చాలదా యింత
విహితమైన శ్రీవెంకటేశ వొక్కఁడవే
బహుళమై వుండఁగాను బంట నంట గాక. ॥హరి॥ 112

## గుండక్రియ

జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము
శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను. ॥పల్లవి॥

అఱుతఁ గట్టిన తాళి యవె వనమాలికలు
సరుస మోఁచిన డాగు శంఖచక్రములు
వరుస నొసల గురి వ్రాసినది తిరుమణి
యిరవెరిఁగితి మిఁక నెపుడైనఁ గావుము. ॥జ్ఞాన॥

పళ్ళెము ప్రసాద మింతే పసగా నా రుచులివె
పి(పె?)ల్లునేఁ బాగడేవి నీ బిరుదులు
కొల్లపుడుఁ బూజించేది యిది నీరూపుపతిమ
కల్లలేదిందుల నీవు గన్నదింతే కానుపు. ॥జ్ఞాన॥

దిక్కము నేఁ జొచ్చినది నీ లెంకతనము
చక్క నా జీవనము నీ శరణాగతి
యెక్కువ శ్రీవెంకటేశ యెదలో నున్నాఁడ నిదె
దిక్కనదేమియు లేదు చిత్తమింతే యిఁకను. ॥జ్ఞాన॥ 113

## సాళంగనాట

నిన్ను నీవే తెలుసుకో నిరుహేతుకబంధుఁడ
వన్నిటాఁ బరతంత్రుఁడ నంతే పో నేను. ॥పల్లవి॥

యేమి గూడీ నేఁ గర్మ మిలపైఁ జేయఁగ నీకు
యేమి మాని నేఁ గర్మ మిటు మానఁగ
భూమినీనాటక మేల పూర్ణకాముఁడవు నీవు
కామించి కాతువు గాక కరుణానిలయ. ॥నిన్ను॥

యెంత గూడపెట్టితి నే నిలమీఁదఁ బుట్టఁగాను
యెంత నష్టినే జనించకిట్టుండగా
వింతగు యీయుక్తులెల్ల వృథావాదము లింతే
సంతతము నను( గావు సర్వేశ్వరా. ॥నిన్ను॥

యెవ్వరు విన్నవించేరు యిటు నాదెస నీకు
యెవ్వరు వద్దనేరు నీ విలఁ గావఁగా
రవ్వల శ్రీవెంకటేశ రక్షింతువు గాక
అవ్వల నివ్వల శరణాగతరక్షకుఁడా. ॥నిన్ను॥ 114

బౌళి

కనియెడి దిదియె వినియెడి దిదియే కడలఁ జదివెడి దిదియ పో
నినుపు నీరై సర్వజగముల నిలిచె శ్రీహరిమాయ. ॥పల్లవి॥

తలఁపు నొకటే తాను నొకఁడే దైవ మొకఁడే పో
కలిసి పెక్కుముఖంబులై లోకంబు దోఁచెనే(చీ?)ని
తెలియఁ జిల్లులకడవలోపలి దీపమువలెనే
అలరి వెలిఁగెడి చూడఁ జూడఁగ హరిప్రపంచపుమాయ. ॥కని॥

దేహ మొక్కటె జీవుఁ డొక్కఁడె దినము నొక్కటె పో
మోహజాగ్రత్స్వప్ననిద్రలు మొనపె(సె?) భేదములై
వూహఁ బెక్కుల యద్దముల చంద్రోదయమువలెను
సాహసంబున భ్రమలఁ బెట్టెడి చదల నిదె హరిమాయ. ॥కని॥

గురువు నొక్కఁడె మంత్ర మొక్కటె కొలువు నొక్కటె పో
అరయ భక్తియ వేరు వేరై యలరుచున్న దిదే
గరిమ శ్రీ వెంకటగిరీశ్వరు కల్పితమువలెనె
వెరసి వారికి వారికే యిది వింతవో హరిమాయ. ॥కని॥ 115

పాడి

సచరాచరమిదె సర్వేశ్వరుఁడే
పచరించి యితని భావింపు మనసా. ॥పల్లవి॥

కదలటిదంతయు కమలారమణుని
సదరపు సత్యపు చైతన్యమె
నిదిరించెటి యీ నిశ్చేష్టజగమును
పుదుటున నాతఁడు వుండే సహజమె. ॥సచ॥

కలిగి వుండినదె కలదింతయు హరి
నలుగడఁ బరిపూర్ణపు గుణమే
మలసి లేనిదియు మహిమల నాతని
నిలుకడ గలిగిన నిర్గుణమే. ॥సచ॥

జీవరాసులగు సృష్టి యింతయును
శ్రీ వెంకటపతి చిత్తంబే
కైవల్యమె లోకపు టిహమునుఁ బరమును
భావించ నేర్చిన పరమునిదులకు. ॥సచ॥ 116

సామంతం

అందుల కిదె ప్రతియౌషధము
యిందిరాపతికి నెక్కసచింత. ॥పల్లవి॥

పంచబాణముల బాసటమంటిన
చంచలమా నిశ్చలమనసు
పంచబాణగురుపాదము దలఁచిన
కంచుఁ జంచలము గక్కున మాను. ॥అందు॥

కనకపుటాసల గరళంబంటిన
నని చిన విజ్ఞానము చెదరు
కనకగర్భు నటు గన్నతండ్రిపై
మనసిడితే నిర్మలమా గుణము. ॥అందు॥

మునుకొని మొదలను మొలచిన నసికిని
పనివడి కొనసే ఫలియించు
అనయము శ్రీ వెంకటాధిపుకృప గల
జనునికిహపరను సఫలంబు. ॥అందు॥ 117

321-వ రేకు. సాళంగం

వెన్న చేతఁ బట్టి నేయి వెదకినట్టు
యెన్నఁగ నీవుండఁగాను యెక్కడో చూచేను. ॥పల్లవి॥

కన్నులు మిన్నులు దాఁకి కాయ మీఁద వున్నఁ(ండఁ?)గానే
తిన్నని వీనులు మెట్టీ దిక్కుల నెల్ల
యిన్నిటికొడయఁడవై యిందిరేశ నీవు నాలో
నున్నరూపు గానలేను వూహించి యిపుడు. ॥వెన్న॥

కాయము పాయము గోరీ కాల మీఁద నుండఁగానే
ఆయపు మనసు ముంచీ నన్నిటియందు
యేమొడ నాలోనున్న యీశ్వర నీ నిలయము
పాయకుండఁ గోరలేనుపాయము నాకెట్టిదో. ॥వెన్న॥

యిహామే పరము గోరి యీాడ నిట్టె వుండఁగాను
మహిలో శ్రీ వెంకటేశమహిమెట్టిదో
అహరహము నీ వంతర్యామివై
సహజమై యుండఁ గంటి చాలు నిఁక నాకు. ॥వెన్న॥ 118

లలిత

నేఁడు గాక దొరనైతి నేను నారాయణుఁ గొల్చి
పోఁడిమి నాచార్యునిబోధవంకను. ॥పల్లవి॥

దీనవృత్తి నేఁ దిరుగని చోటేది
నానాచంచలము నా మనసు
పూని నేఁ గొనని భువిలోని రుచులేవి
హీనజన్మములెత్తినది మేను. ॥నేఁడు॥

చేరి నేఁ జేచేతఁ జేయని పాపమేది
ధారుణి మోహపైన సంసారమునను
ఆరయ మున్ను నేనాడని కల్లలేవి
సారెకు నుదరపోషణమునకు. ॥నేఁడు॥

సూటి దప్పక నేఁ జూడని చూపేది
చేటు లేని చిరకాల జీవుఁడనే
చాటువ శ్రీవెంకటేశు శరణు చొరక తొల్లి
బూటకము లెన్ని లేవు పొలయదు కాలము(?) ॥నేఁడు॥ 119

దేసాళం

అన్నిటా నిట్టే కాని యగపడదు
అన్నమదమునఁ జిత్తమగపడదు. ॥పల్లవి॥

పొలసి సంసారములో సుఖముఁ బొందే నంటే
అలమటలే కాని యగపడదు
పలుచదువులశంకఁ బరము గనేనంటే
అల సంశయమే కాని యగపడదు. ॥అన్ని॥

వెడదేహము మోఁచి విరతిఁ బొందేనంటే
అడియాసలే కాని యగపడదు
సడిఁ గోపమే యుండఁగ శాంతిఁ బొందే నంటే
అడవిఁ బడుటే కాని యగపడదు. ॥అన్ని॥

నేరిచి నీ మాయలోన నిజభక్తి గనే నంటే
ఆరీతి నాటడే కాని యగపడదు
మేరలో శ్రీవెంకటేశ మించి నీకే శరణంటే
ఆరి తేరి కర్మబంధ మగపడదు. ॥అన్ని॥ 120

బౌళి

చదివి చదివి వట్టి జాలిఁ బడుటింతే కాక
యెదుట నిన్ను గానఁగ నితరుల వశమా. ॥పల్లవి॥

ఆకాశము పొడవు ఆకాశమే యెరుఁగు
ఆకడ జలధిలోఁతు ఆ జలధే యెరుఁగు
శ్రీకాంతుఁడ నీ ఘనము చేరి నీవే యెరుఁగుదు
వీకడ నింతంతన నితరుల వశమా. ॥చది॥

నదుల యిసుకలెల్ల నదులే యెరుఁగును
కదిసి గాలియిరవు గాలికే తెలుసు
అదన నాత్మగుణములంతరాత్మ నీవెరుగు
దిది యది యని చెప్ప నితరుల వశమా. ॥చది॥

శ్రీవెంకటేశ యిన్నిచింతలకు మొదలు
యీవల నీ శరణంటే యిటు నీవే యెరిగింతు
దైవమా నీ కల్పనలు తగ నీవే యెరుఁగుదు
ఏవల నొఁ గాదన నితరుల వశమా. ॥చది॥ 121

శ్రీరాగం

ప్రత్యక్షనే మాకుఁ బ్రమాణము
సత్యరూప జోలి దవ్వి జాలిఁ బడ నోపము. ॥పల్లవి॥

కన్నవారెవ్వరు నిన్ను కన్నుల యెదుటను
పన్ని నీదాసులు చూచే భావమువలె
విన్నవారెవ్వరు నీ విభవపు మాటలు
అన్నిటా నాచార్యుని యానతివలె. ॥ప్రత్య॥

తొడఁగి నీ ప్రసాదము దొరకినవారెవ్వరు
జడియు నీ దాసుల ప్రసాదమువలె
కడు నీ పాదతీర్థము కడ గన్నవారెవ్వరు
బడి బడి నీ భక్తపాదజలమువలె. ॥ప్రత్య॥

యేచి పరంధామమున కేఁగినవారెవ్వరు
చాచిన నీ దాసుల సన్నిధివలె
చూచితి శ్రీవెంకటేశ సొంపుల నీ మహిమెల్ల
తాచిన నీ దాసానుదాసులయందే. ॥ప్రత్య॥ 122

దేవగాంధారి

తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి
రిల నిదెరఁగనిది యేఁటిదో కాక. ॥పల్లవి॥

కరుణానిలయుఁ డట కరుణకు వెలితా
వెరవుతో నేఁ గొల్వని వెలితి గాక
నరహరి యితఁడట నరులఁ గాచుటరుదా
శరణనని వెలితి జనములది గాక. ॥తెలి॥

వెస లక్ష్మీపతి యట వితరణము లేదా
పసఁ దన్నే కోరని మాపాపము గాక
యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
పసుపై మొక్కని వెల్తి జగములది గాక. ॥తెలి॥

శ్రీవెంకటేశుఁ డట చిత్తములో లేఁడా
భావించి నమ్మినది మాభాగ్యము గాక
వావాత నింతటివాఁడు వరములీలేఁడా
వోవలఁ గొలఁగొనేదేమోటికింతే కాక(?). ॥తెలి॥ 123

322-వ రేకు నారాయణి

అన్నిటిపై నున్నట్లు హరిపై నుండదు మతి
కన్నులఁ బ్రహ్మాదులకె కనుఁగొనుటరుదా. ॥పల్లవి॥

పులుగు నర్చించొకఁడు పూఁచెనాగతమెరిఁగి
వెలసి ఘనుఁడనంటా విఱ్ఱవీఁగీని
జలజాక్షుపాదములు సారె నర్చించేటివారు
యిలలోనఁ బరమార్థమెరుఁగుటయరుదా. ॥అన్ని॥

మానివోఁడ నమ్మొకఁడు మహాజలధి దాఁటి
నానార్థములు గూర్చి నటియించీని
శ్రీనాథుపాదములు చేకొని నమ్మినవాఁడు
పూని భవవార్ధి దాఁటి పుణ్యమందుటరుదా. ॥అన్ని॥

దీపము వట్టి యొకఁడు తెగని చీఁకటిఁ బాసి
చూపులన్నిటిఁ గని సుఖమందీని
చేపట్టి పరంజ్యోతి శ్రీవెంకటేశుభక్తుఁ
డోపి ముక్తి కడ గని వున్నతుఁడౌటరుదా. ॥అన్ని॥ 124

గుండక్రియ

హరి పరతత్త్వంబగుటకు గురి యిది
నరులమితఁడె యని నమ్మితిమిదివో. ॥పల్లవి॥

కవ గూడిన భూకాంతుఁ దుంచి పో
దివి వెలుఁగందిరి దేవతలు
జవమున రఘుపతి శరణని మనిరిదె
భువి విభీషణాదిపుణ్యులు. ॥హరి॥

శ్రీతరుణీపతిసేవనె చెలఁగిరి
పాతాళాధిపబలిముఖులు
ఖ్యాతిగ వైకుంఠభక్తినే బదికిరి
ఘాతల ననంతగరుడాదులు. ॥హరి॥

శ్రీవెంకటపతిచింతనే పొదలిరి
ఠోవ ముక్తిగల శుకాదులు
వావిరి నీతనివరముల వెలసెను
తోవలఁ బరమసందోహములు. ॥హరి॥ 125

లలిత

కావఁగ (క?) నీకే పోదు కరుణానిధివి గాన
దేవ నీ బంట్లము మాతెరువేటి తెరువు. ॥పల్లవి॥

బండుబండై వూరఁగల పనులెల్లాఁ జేసేము
యెండా (డా ?) తా నీడాతా నెఱఁగము
కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు
బెండువంటి వారము మా బిగువేఁటి బిగువు. ॥కావ॥

దీనుఁడనై (లమై ?) యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము
కానిదేందో మంచి దేందో కానము
శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండఁగాను
మానువంటి వారము మా మనసేటి మనసు. ॥కావ॥

బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా
యెందుకా (కా ?) తా నేడకౌతా నెఱఁగము
యిందును శ్రీవెంకటేశ యిహముఁ బరము నీవే
చెంది నీ దాసులము మా చేఁత యేఁటి చేఁత. ॥కావ॥ 126

## పాడి

కామధేనువు దేవకల్పితము భువిలోన
వోముచును భోగించ యుక్తి వలెఁ గాని. ॥పల్లవి॥

తలఁచినట్లనా దైవము వ్రాసిన వ్రాఁత
పలికినట్లనా పలు మంత్రజపములు
నిలిపినట్లనా నిర్మలచిత్తముకీలు
నెలవునఁ బనిగొన నేర్పు వలెఁ గాని. ॥కామ॥

యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము
కమ్మన్నట్లనా ఘనతపములశక్తి
తెమ్మనినయట్లఁ దెచ్చు ద్రిష్టము యక్షిణీవిద్య
చిమ్ములను దన కంత చింతే వలెఁ గాని. ॥కామ॥

పునిచినట్లనుండు నొక్కడే దేహగుణము
మొనలేని శ్రీవెంకటేశ్వరుమాయలివి
పెనచిన యిహానే పో బీజము వుద్యోగులకు
తనివి నలమేల్మంగదయ వలెఁ గాని. ॥కాయ॥ 127

శ్రీరాగం

గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁ గాని
యీవల సంసారమైన (నా?) యిది ధ్రువపట్టమే. ॥పల్లవి॥

తలఁపులోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాఁపురముఁ గైవల్యమే
బెళకు నాలుకకు నీపేరు వచ్చితేఁ జాలు
పలికినవన్నియు పరమవేదములే. ॥గోవిం॥

తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు
పడుచుల బొమ్మరిండ్లు బ్రహ్మలోకమే
కడలేని నీభక్తి గలిగితేనే చాలు
కడజన్మమయినా నిక్కపు విప్రకులమే. ॥గోవిం॥

కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు
పాయపు రతిసుఖము పరతత్వమే
యేయెడ శ్రీవెంకటేశ యిటు నీకే శరణంటి
పోయిన నాపాపమెల్లాఁ బుణ్యకర్మమే. ॥గోవిం॥ 128

సామంతం

దీవమట రాతిరట తీరుచున్నదా
కవకూడఁ బొయఁ గొక కాణాచి వున్నదా. ॥పల్లవి॥

మానుషజన్మమట మలమూత్రదేహమట
సోనల హేయమే కాక శుద్ధి వున్నదా
మాననికోరికలట మాయలసంసారమట
దీనవృత్తే కాక యిందుఁ దేజమున్నదా. ॥దివ॥

చంచలపుఁ జిత్తమట సకలేంద్రియములట
పొంచిన పాపమే కాక పుణ్యమున్నదా
సంచితపుఁ గర్మమట జననలయములట
ముంచిన తీదీపే కాక మోదమున్నదా. ॥దివ॥

శ్రీ వెంకటేశుఁ డట జీవుఁడ నేనట యిందు
దైవపుదాస్యమే కాకితరమున్నదా
యీవల నావల నట యిహముం బరము నట
కైవశము లాయఁ గాక కడమున్నదా. ॥దివ॥ 129

323-వ రేకు. భూపాలం

రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో
రీతి గాదు హరి నెచ్చరిక సేయరే. ॥పల్లవి॥

పైపైఁ బొద్దు వొడచీ పంకజములు విరిసె
గోపగోవిందుని మేలుకొనుమనరే
దీపములు దెల్లఁబారె తిమిరమింతయు జారె
శ్రీ పురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే. ॥రాతి॥

కలువలు ముకుళించీ కలివింకలెలుగించీ
నెలఁతలు దేవదేవు నిద్ర దెల్పరే
జలనిధి పొంగణఁగె చాయల చుక్కలు మాసె
వలరాచగురునుప్పవడము గమ్మనరే. ॥రాతి॥

జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు
భావించి యచ్యుతు నిట్టె పలికించరే
కావిరింతయు విరిసె కడుసంధ్యకుఁ బొద్దాయ
శ్రీ వెంకటేశుని విచ్చేయుమనరే. ॥రాతి॥ 130

బౌళి

పుట్టెడి దింతా బూటకంబులే
గట్టి మాయ హరిఁ గానఁగ నీదు. ॥పల్లవి॥

ముక్కున నున్నది ముందటఁ బ్రాణము
యెక్కడ నమ్మె దిఁకఁ దనువు
చుక్కలు మోఁచీఁ జూపులెదుటనే
నిక్కను మతికిని నిలుకడ యేది. ॥పుట్టె॥

నాలుక నున్నవి నానారుచులును
వేళావేళకు వెరవేది
తోలున నున్నది దొరకొని బ్రతుకిది
కాలంబెటువలెఁ గడపేది. ॥పుట్టె॥

ఆతుమనున్నది యఖిలజ్ఞానము
ఘాతల నెటువలెఁ గనియేది
శ్రీ తరుణీపతి శ్రీ వెంకటపతి
యాతనిఁ గొలిచితి మడ్డంబేది. ॥పుట్టె॥ 131

సాళంగనాట

ఉమ్మడి కర్మములాల వుండఁ జోటు మీకు లేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివిలేని చోటికి. ॥పల్లవి॥

పెట్టినది నుదుటను పెరుమాళ్ల లాంఛనము
దట్టమై భుజములందు దైవశిఖామణిముద్ర
నెట్టన నాలుకమీఁద నీలవర్ణునామమిదె
అట్టె హరిదాసులకంటునా పాపములు. ॥ఉమ్మ॥

మనసునఁ దలఁచేది మాధవుని పాదములు
దినముఁ గడుపు నించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసి పద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు. ॥ఉమ్మ॥

సంతతముఁ జేసేది సదాచార్యసేవ
అంతరంగమున శరణాగతుల సంగమిదే
యింతటాను శ్రీవేంకటేశుఁడు మమ్మేలినాఁడు
అంతటా హరిదాసుల నందునా అజ్ఞానము. ॥ఉమ్మ॥ 132

శ్రీరాగం

ఇలువేల్పితఁడే యిందరికిని మరి
పలువేల్పులతో పని యిఁక నేలా. ॥పల్లవి॥

కమలారమణుని కరుణే కాదా
అమరులు గొనియెడి యమృతము
అమితపు శ్రీహరి యాధారము గాదా (గద ?)
నెమకెటి ప్రాణులు నిలిచినభూమి. ॥ఇలు॥

దనుజాంతకు బొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు
మనికై హరిసతిమహిమే కాదా
నినుపై భువిలో నిండినసిరులు. ॥ఇలు॥

యితని కొడుకురచనింతాఁ గాదా
సతుల పతుల సంసారరతి
గతి శ్రీవెంకటపతిలోకమె వు
న్నతి వైకుంఠపు నగరపు ముక్తి. ॥ఇలు॥ 133

భవుళి

పురుషుఁడే యధముఁడు పొంచి యెందుఁ దగులక
పురుషోత్తమునికంటే పుణ్యుఁడవు నపుడే. ॥పల్లవి॥

పురుషజంతువులెల్ల పొంచి యాఁడుజంతువుల
తరవాయి గొని వెంటఁ దగులుఁ గాని
ధర నాఁడుజంతువులు తగ పురుషజంతువుల
యిరవు వెదకఁ బోవు యిది యెట్టి మాయో. ॥పురు॥

సారెకు నర్థమునకు జనులెల్ల దాసులై
కోరి వెదకుచుఁ దిరుగుదురు గాని
చేరువ యర్థములెల్ల జీవులకు దాసులై
యీరీతి వెదకవు యిది యెట్టి మాయో. ॥పురు॥

లోకము నడవడిది లోను గాక యిందుకెల్లా
యేకచిత్తమున నుంటే యెక్కుడు గాని
దాకొని శ్రీవెంకటేశు దాసుఁడై నవానికిని
యేకముగఁ బంపు సేసు నేమి మాయో కాని. ॥పురు॥ 134

మలహరి

మఱి విచారించఁ బోతే మంచముకిందే నూయి
మెఱయఁగ హరిఁ గొల్చి మించరో ప్రజలు. ॥పల్లవి॥

యేల మాను దేహమెప్పటి తనగుణము
యేల మాను మనసెడలేని యాసలు
ఊలు దింటా మలిగండ్లేటుఁగ నేల హరి మన
పాలఁ బెట్టక కొలిచి బ్రతుకరో ప్రజలు ॥మతి॥

పొమ్మంటే నేల పోవు పూర్వకర్మములు
పొమ్మంటే నేల పోవు పొంచిన యింద్రియములు
కుమ్మరావమునఁ జెంబు కోరి వెదక నేల
పమ్మిన శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు. ॥మతి॥

భోగించకేల పోవుఁ బుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలుపెంచనేల
వేగిరకాఁటికి శ్రీవెంకటేశుమాయలివి
బాగుగ నాతనిఁ గొల్చి బదుకరో ప్రజలు. ॥మతి॥ 135

324-వ రేకు. భవుళి

కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతి నీవే కావఁగదవయ్యా. ॥పల్లవి॥

పుడమిఁ బుట్టితిమి బుద్ధి నెరిఁగితిమి
కడుపే చెరువవుత గానమయ్యా
వొడలు మోఁచితిమి వున్నతిఁ బెరిగితిమి
వెడఁ జిల్లులఁ గారేది విడిపించ లేమయ్యా. ॥కట॥

నిన్న నిద్రించితిమి నేఁడే మేలుకొంటిమి
తిన్నవెల్లఁ దీరినకే తెలియమయ్యా
కన్నులఁ జూచితిమి కమ్మర మూసితిమి
వున్నచో వుండదు మతి వూరట లేదయ్యా. ॥కట॥

సరిఁ జదివితిమి శాస్త్రముఁ జూచితిమి
గురుఁడే రక్షకుఁడౌత గురుతౌనయ్యా
నిరతి శ్రీవెంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడి పని మాకు లేదయ్యా. ॥కట॥ 136

## దేసాక్షి

ఇందే వున్నది కానమెందో వెదకితిమి
కందర్పగురుభక్తి గంటిమి నేమిదివో. ॥పల్లవి॥

కోటికోటివేదముల కొనయర్థము
సాటివేదములలోని సకలార్థము
సూటిగా గురుఁడు మాకుఁ జూపినర్థము
గాటపు మనసు దవ్వి కనుఁగొంటి మిదివో. ॥ఇందే॥

పరమయోగీంద్రులు పట్టిన యర్థము
సురలు మునులు నెంచి చూచినర్థము
సరి మూఁడులోకములఁ జాటినర్థము
గరిమ నీదేహమెత్తి కంటిమి మేమిదివో. ॥ఇందే॥

పలు శరణాగతులపాలియర్థము
మలయుచుండేటి తిరుమంత్రార్థము
నిలిచి శ్రీవెంకటాద్రి నిండినర్థము
కలసి విజ్ఞానవీథిఁ గనుఁగొంటి మయ్యా. ॥ఇందే॥ 137

## ధన్నాసి

తొల్లిటివారు వెట్టిన తోవ యిది
బల్లిదులై యిందునే బదుకుటే మేలు. ॥పల్లవి॥

కలఁడు సర్వేశ్వరుఁడొక్కఁడు దిక్కందరికిని
సులభుఁడు శరణము చొచ్చితేఁ గాచు నతఁడు
బలుతపములు చేసి పాట్లఁ బడ నోప మని (ము ?)
బలువుఁడాతని నమ్మి బ్రదుకుటే మేలు. ॥తొల్లి॥

వున్నాఁడు మనసులోనే వొక్కచో వెదక వద్దు
యిన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చ నిహముఁ బరము
కన్నచోట్ల వెదకి కడు నలయ నోపము
పన్నగ నితనిఁ గొల్చి బ్రదుకుటే మేలు. ॥తొల్లి॥

శ్రీవెంకటేశ్వరుఁడు చేరి నిలుచున్నవాఁడు
సేవించినయంతలోనే చేకొని యేలు నితఁడు
దేవతలఁ బ్రార్థించి తెలియఁగ నేరము
భావించితని నుతించి బ్రదుకుటే మేలు. ॥తొల్లి॥ 138

సాళంగనాట

శ్రావణబహుళాష్టమి జయంతి నేఁడు
సేవించరో నరులాల శ్రీకృష్ణుఁడితఁడు. ॥పల్లవి॥

భావింప వసుదేవునిపాలిటి భాగ్యదేవత
దేవకి గనినయట్టి దివ్యరత్నము
చేవ మీఱ సురల రక్షించే కల్పతరువు
యీవేళ జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు. ॥శ్రావ॥

హరవిరించాదులకు నాదిమూలకారణము
పరమమునుల తపఃఫలసారము
గరుడోరగేంద్రులకుఁ గలిగిన నిధానము
యిరవుగా నుదయించె నిదె కృష్ణుఁడు. ॥శ్రావ॥

బలు యోగీశ్వరుల బ్రహ్మానందము
చెలఁగు భాగవతుల చింతామణి
అలమేల్మంగకుఁ బతి యట్టి శ్రీవెంకటాద్రి
నిలపై జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు. ॥శ్రావ॥ 139

రామక్రియ

వెల (ర ?) సె నహోబలాన విదారణసింహము
సురల నరుల దయఁ జూచీని వీఁడివో. ॥పల్లవి॥

సరి వలకేలను చక్రము వీఁటగాఁ బెట్టి
గరిమ నొకచేత శంఖము వట్టి
హిరణ్యకసిపుని నిరుచేతులాఁ జించి
అరిదిఁ బేగులు జందేలవే వేసుకొనెను. ॥వెల॥

ఘనమైన కోరలతో కహకహ నవ్వుకొంటా
దనుజు ముందరొకచేతనుఁ బట్టి
పెనఁగకుండా రొమ్ము పెడచేతుల నడిచి
నినుపు వంకరగోళ్ల నెత్తురు చిమ్మిని. ॥వెల॥

అంతటఁ బ్రహ్లాదుని నటు దయఁ జూచి లక్ష్మి
కాంతఁ దొడపై నిడుక కడు శాంతుఁడై
చింత దీర గరుడాద్రి శ్రీవెంకటాద్రిని
వంతము మెరసి నిల్చి ప్రతాపించీని. ॥వెల॥ 140

శంకరాభరణం

అతఁడా యాతఁడు పెద్ద హనుమంతుఁడు
చేతులారా నతనిఁ జెండి వేసినాఁడటు. ॥పల్లవి॥

తొలుత రామునిగాంచి తోడనే సుగ్రీవుని
కొలువఁ బెట్టి యాతని కొమ్మ నిప్పించి
జలనిధి దాఁటి లంక సాధించి చొచ్చి సీతకు
నలర నుంగరమిచ్చె నతిసాహసమున. ॥అత॥

సీతాదేవియానవాలు శ్రీరామునికి నిచ్చి
నీతి విభీషణుని మన్నించఁ జేసి
చేతులనే పోట్లాడి చెండి వేసి రాక్షసుల
ఘాతల సంజీవికొండ గక్కనఁ దాఁ దెచ్చెను. ॥అత॥

గక్కన రావణుఁ గొట్టి కాంతను రామునిఁ గూర్చి
అక్కడ నయోధ్యఁ బట్టమటు గట్టి
నిక్కి కలశాపురిని నిండి శ్రీవెంకటాద్రిని
వుక్కు మీరి హరిఁ గొల్చి వున్నాఁడు వేడుకల. ॥అత॥ 141

325-వ రేకు. వరాళి

ఎవ్వరివాఁడాఁ గాను యేమందు నిందుకు
నవ్వుచు నాలోనిహరి నన్నుఁ గావవే. ॥పల్లవి॥

కోపుల రాజుల నెల్ల కొలిచి కొన్నాళ్లు మేను
చూపుడుఁబూఁట వెట్టితి సొగిసి నేను
యేపున సంసారమున యిది గాక కమ్మటాను
దాపుగ తొర్లుఁబూఁట తగిలించుకొంటిని. ॥ఎవ్వ॥

మొదలఁ గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువ వెట్టితి నే గురి గానక
వెదకి కామునికి విషయములకునే
అదివో నావయసెల్ల నాహివెట్టితిని. ॥ఎవ్వ॥

యిప్పుడే శ్రీవెంకటేశ యీడేర్చి నామనసు
కప్పిన గురుఁడు నీకు క్రయ మిచ్చెను
వొప్పించిరిందరు బలువుఁడు చేపట్టెననుచు
అప్పులెల్లఁ బాసి నీ సొమ్మైతినయ్యా. ॥ఎవ్వ॥ 142

దేసాళం

వాసుదేవ నీవు నెలవరివి మగుడ నేల
యీసరి నీవద్దనుండే యె(నె?)ట్టైనఁ జేయవయ్యా. ॥పల్లవి॥

మాయ దెచ్చి నాబదుకు మనుజలోకాన వేసె
కాయము సంసారవార్ధి గడ్డపై వేసె
పాయపు నాతమకము భామలవలల వేసె
చాయ నేనుండి వచ్చినజాడెఱఁగనయ్యా. ॥వాసు॥

ఘనమైన యింద్రియాలు కర్మముల వాత వేసె
మనసు సంపద యామనిలో వేసె
పనులెల్ల లంపటాలపయిఁ బక్కలా వేసె
కొనకెక్క నేనె నాగురుతు గాననయ్యా. ॥వాసు॥

అంచెల నాదినములు ఆఁకటిబారి వేసె
ముంచిన నాగుణములు మోహముల వేసె
యెంచఁగ శ్రీవెంకటేశ యెందెందున్నాఁడనో
పొంచి నీకు శరణంటి బోధించవయ్యా. ॥వాసు॥ 143

బౌళి

నమో నమో దశరథనందన రామ
కమనియ్య యాగభాగకర్త రామ. ॥పల్లవి॥

కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకరగుణోన్నత శ్రీరామ
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ
భీకరతాటకాంతకబిరుద రామ. ॥నమో॥

వారిధిబంధన రామ వాలిహరణ రామ
చారుహరకోదండభంజన రామ
ధారుణిజపతి రామ దశకంఠహర రామ
సారవిభీషణాభిషేచన రామ. ॥నమో॥

అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ సర్వజ్ఞ రామ
విమల రామ శ్రీవెంకటగిరిరామ
రమణ శరణాగతరక్షక రామ. ॥నమో॥ 144

సాళంగనాట

హరికి లంకిణీహంతకంతరమిట్టున్నది
కరుణ నింత మన్నించె కమలావిభుఁడు. ॥పల్లవి॥

విశ్వరూపు చూపినాఁడు విష్ణుఁడు దొల్లి యట్టె
విశ్వరూపాంజనేయుఁడు వీఁడె చూపెను
శాశ్వతుఁడై యున్నవాఁడు సర్వేశ్వరుఁడు వీఁడె
శాశ్వతుఁడై యున్నాఁడు జగములో నితఁడు. ॥హరి॥

ప్రాణవాయుసంబంధి పరమాత్ముఁడు అట్టె
ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు
రాణింప రవివంశుఁడు రామచంద్రుఁడు తాను
నాఁడెపు రవిసుతుని నమ్మినప్రధాని. ॥హరి॥

దేవహితార్థము సేసెఁ ద్రివిక్రముఁడు అట్టె
దేవహితార్థమే జలధిలంఘనుఁడు
శ్రీవెంకటేశుఁడు చిన్మయమూర్తి తాను
కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్ప హనుమంతుఁడు. ॥హరి॥ 145

పాడి

సుగ్రీవనారసింహునిఁ జూడరో వాఁడె
అగ్రపూజ గొన్నవాఁడు ఆదిసింహము. ॥పల్లవి॥

దేవతలు జయవెట్టి దివినుండి పొగడఁగ
దేవులతోఁ గూడున్నాఁడు దివ్యసింహము
భావింప నెట్టనెదుట ప్రహ్లాదుఁడుండఁగాను
వేవేలు నవ్వులు నవ్వీ విజయసింహము. ॥సుగ్రీ॥

అసురలను గెలిచి అదె సింహాసనముపై
వెసఁ గొలువున్నాఁడు వీరసింహము
పసిఁడివర్ణముతోడ బహుదివ్యాయుధాలతో
దెసల వెలుఁగొందీని ధీరసింహము. ॥సుగ్రీ॥

నానాభరణాలు వెట్టి నమ్మినదాసులనెల్ల
ఆనుకొని రక్షించీఁ బ్రత్యక్షసింహము
పూని శ్రీవెంకటాద్రిని బుధులెల్లాఁ గొలువఁగా
నానావరములొసఁగీ మానవసింహము. ॥సుగ్రీ॥ 146

శ్రీరాగం

రామచంద్రుఁడితఁడు రఘువీరుఁడు
కామితఫలములియ్యఁ గలిగె నిందరికి. ॥పల్లవి॥

గౌతముభార్యపాలిటి కామధేనువితఁడు
ఘాతలఁ గౌశికుపాలి కల్పవృక్షము
సీతాదేవిపాలిటి చింతామణీతఁడు
యీతఁడు దాసులపాలి యిహపరదైవము. ॥రామ॥

పరగ సుగ్రీవుపాలి పరమబంధుఁడితఁడు
సరి హనుమంతుపాలి సామ్రాజ్యము
నిరతి విభీషణునిపాలి నిధానము
గరిమ జనకుపాలి ఘనపారిజాతము. ॥రామ॥

తలఁప శబరిపాలి తత్త్వపురహస్యము
అలరి గుహునిపాలి ఆదిమూలము
కలఁడన్న వారిపాలి కన్నులెదుటిమూరితి
వెలయ శ్రీవెంకటాద్రివిభుఁడితఁడు. ॥రామ॥ 147

326-వ రేకు గుండక్రియ

కైకొంటే కాక కమలనాభునియాజ్ఞ
పైకొని యిన్నిటాను బాసి వుండనేది. ॥పల్లవి॥

హరినిర్మితములే అఖిలప్రపంచము
తొరలి యేమిటి నిందు దూషించేది
ధరణీధరునికి దాసులే జీవులెల్లా
గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది. ॥కైకొ॥

వాసుదేవుకల్పితమే పరసంసారబంధము
దోసమంటా యెందెందు దొలఁగేది
శ్రీసతీశురచనలే చేకొన్నరుచులెల్ల
యీసుతోడ నిందుమీఁద నెట్టు రోసేది. ॥కైకొ॥

గోవిందుమాయలే కూడినట్టిపనులెల్ల
వేవేలై యిందునట్టు వేసరేది
శ్రీవెంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా
పావనమైతిమి యిఁకఁ బరచింత యేది. ॥కై కొ॥ 148

## లలిత

విష్ణుదేవుపాదమువలె విద్యాబుద్ధి మాకు
వైష్ణవులమైతిమింక వదలవో కర్మమా. ॥పల్లవి॥

గోవిందునిపాదములె కోరి యిహపరములు
శ్రీవిభునిపాదములె చేరువేదశాస్త్రములు
దేవదేవునిపాదములె దిక్కును దెసయు మాకు
భావములో నిలిపితిఁ బాయరో పాపములు. ॥విష్ణు॥

హరిపాదములె మాకు నన్నపానభోగములు
పరమాత్ముపాదములె పాఁడీఁ బంటా మాకు
మురహరుపాదములె ముందర వెనకా మాకు
శరణంటిమెందైనాఁ జనరో దుఃఖములు. ॥విష్ణు॥

అనంతునిపాదములె ఆయుష్యభాగ్యములు
దనుజారిపాదములె ధనధాన్యధర్మములు
మొనలేని శ్రీవెంకటేశుఁ డితనిపాదాలె
మనసునఁ గొలిచితి మానరో భవములు. ॥విష్ణు॥ 149

## దేసాక్షి

ఇందుకేది వుపాయమో యీశ్వర నీకే తెలుసు
మందలించ నశక్తుఁడ మరి నీదాసుఁడను

ధీరుఁడనై ధరలోన దేహము నే మోచితి
కోరి పుణ్యపాపాలకు గురియు నైతి
వూరట యేమిటా లేదు వోపనని మానరాదు
తీరదు భోగించక దినదినకర్మము. ॥ఇందు॥

గరిమ సంసారి నైతి కంటిఁ బెక్కు సుతులను
యిరవుగఁ గట్టుకొంటి నీలంపటాలు
వెరవేమీ నెరఁగను విడువవెంతైనాను
హరిహరి రాచినా సమయువు బలుకాంతులు. ॥ఇందు॥

అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి
జట్టిగొని నీపాదాలే శరణంటిని
గట్టిగా నలమేల్మంగకాంతుఁడ శ్రీవెంకటేశ
యిట్టె నిన్నెరఁగలేనిదిన్నాళ్ళు నానేరమి. ॥ఇందు॥ 150

ధన్నాసి

దేవదేవుఁ డితఁడే దివ్యమూరితి
యేవలఁ జూచినఁ దానే యీరూపై వున్నాఁడు. ॥పల్లవి॥

వెంకటాచలముమీఁది విశ్వరూపవిశేషము
అంకెల ననంతావతారాలైన విశేషము
లంకె సింగారాది సర్వాలంకారవిశేషము
యింకని మహిమలతో నీరూపై వున్నాఁడు. ॥దేవ॥

అందరిలో నంతర్యామియైన విశేషము
కందర్పుఁ బుట్టించిన ఘనవిశేషము
ముందు జగము సృష్టించి మూలమైన విశేషము
యిందరితోఁ గూడుకొని యీరూపై వున్నాఁడు. ॥దేవ॥

పరము(మ?) యోగీంద్రు లెల్ల భావించినవిశేషము
అరుదైన వేదవేదాంతార్థవిశేషము
పరగ నలమేల్మంగపతియై శ్రీవెంకటేశుఁ
డిరవై దాసులఁ గావ నీరూపై వున్నాఁడు. ॥దేవ॥ 151

వరాళి

మఱి తనుభోగములు మాయావిలాసములు
యెఱిఁగినట్ల నుండు మఱపించుఁ దలఁపు. ॥పల్లవి॥

అనిశము నీకొలువు అది యొకటే నిజము
నినుఁ దలఁచుటొకటే నిజము
పనివడి నీదాసుఁడై బ్రదుకుటొకటే నిజ
మొనర నిన్ను నుతించేదొక్కటే నిజము ॥మఱి॥

పరగ నీమీఁదఁ జేయు భక్తియే నిలిచినది
నిరతపు వైరాగ్యమే నిలిచినది
శరణని నీకు మొక్కే జ్ఞానమే నిలిచినది
అరసి నిన్నుఁ బూజించినదే నిలిచినది ॥మఱి॥

చదివి నిన్ను వెదకి సాధించుటే ఫలము
అదన నీకృపాపాత్రుఁ డౌటే ఫలము
యెదుట నలమేల్మంగ నేలిన శ్రీవెంకటేశ
యెదలోన నీధ్యానమిన్నిటికి ఫలము. ॥మఱి॥ 152

సామంతం

ఏది మాకు గతి యిఁక నీశ్వరేశ్వరా
యీదెస మముఁ గరుణ నీడేర్చవయ్యా. ॥పల్లవి॥

పొంచి మున్ను భోగించిన భోగములు దలఁచి
అంచెల నాలుబిడ్డల నటు దలఁచి
కంచపుటాహారములు కన్నవెల్లాను దలఁచి
యెంచి నిన్నుఁ దలఁచక యిట్లున్నారమయ్యా. ॥పది॥

కన్నులఁ జూచినదెల్లా కడు నాసలఁ దగిలి
విన్న వినుకులకెల్లా వేడ్కఁ దగిలి
పన్నిన సుఖములకుఁ బైకొని వెను తగిలి
వున్నతి నిన్నుఁ దగులకున్నారమయ్యా. ॥పది॥

చెంది గృహారామక్షేత్రములు మరిగి
పొందగు సంసారమిప్పుడు మరిగి
అందపు శ్రీవెంకటేశ అలమేల్మంగపతివి
కందువ మరిగీ మరుగకున్నార మయ్యా. ॥పది॥ 158

827-వ రేకు. దేసాక్షి

ఇన్నిటికి మూలము యెప్పుడు నీవే
పన్ని మామీఁద నేరాలు పచరించకువయ్యా. ॥పల్లవి॥

కోటానఁ గోటులు మదిఁ గోరికలు
చీటికి మాటికి నివే చిగిరించీని
వాటమై యెవ్వరికిని వసము గావు
పాటించి వీటిని వొప్పన గొనవయ్యా. ॥ఇన్ని॥

లక్షోపలక్షలు కర్మలంపటములు
అక్షయపు తీగలై అల్లుకొనీని
వీక్షించ నెన్నఁ గలవు వింతవింతలు
రక్షించ నిన్నిటికి భారము నీదే యయ్యా. ॥ఇన్ని॥

నానాముఖములు పుణ్యములెల్లాను
తానక భోగములై తగిలించీని
మానువరాదలమేలుమంగపతివి
శ్రీనాథ శ్రీవేంకటేశ చిత్తగించవయ్యా. ॥ఇన్ని॥ 154

మాళవి

అందరికి నెక్కుడైన హనుమంతుఁడు
అందుకొనె సూర్యు ఫలమని హనుమంతుఁడు. ॥పల్లవి॥

బల్లిదుఁడై లంక చొచ్చి బలురాకాసులఁ గొట్టి
హల్లకల్లోలము చేసె హనుమంతుఁడు
వొల్లనె రాములముద్దుటుంగరము సీతకిచ్చె
అల్లదె నిలుచున్నాఁడు హనుమంతుఁడు. ॥అంద॥

దాకొని యాకెముందర తనగుఱుతెరుఁగించి
ఆకారమటు చూపె హనుమంతుఁడు
చేకొని శిరోమణి చేతఁబట్టి జలనిధి
ఆకసాన దాఁటి వచ్చె హనుమంతుఁడు. ॥అంద॥

కొంకకిట్టె సంజీవికొండ దెచ్చి రిపులకు
నంకకాఁడై నిలిచెను హనుమంతుఁడు
తెంకినే శ్రీవెంకటాద్రి దేవుని మెప్పించినాఁడు
అంకెఁ గలశాపురపు హనుమంతుఁడు. ॥అంద॥ 155

పాడి

రామా దశరథరామా నిజసత్య
కామా నమో నమో కాకుత్థ్సరామ. ॥పల్లవి॥

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమపురుష సీతాపతి రామ
శరధిబంధన రామ సవనరక్షక రామ
గురుతరరవివంశ కోదండరామ. ॥రామా॥

దనుజహరణ రామ దశరథసుత రామ
వినుత(న?)తామరస్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణ రామ
అనిలజప్రియ రామ అయోధ్యారామ. ॥రామా॥

సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుషరావణభయంకర రామ
విలసితరఘురామ వేదగోచర రామ
కలితప్రతాప శ్రీవెంకటగిరిరామ. ॥రామా॥ 156

ముఖారి

సేవించరో జనులాల చిత్తజగురుఁడితఁడు
కేవలదయానిధి సుగ్రీవనారసింహుఁడు. ॥పల్లవి॥

వేయిచేతులతోడ వెన్నెలనవ్వులతోడ
చాయలు దేరేటి శంఖచక్రాలతోడ
ఆయితమై వున్నవాఁడు అదె సింహాసనముపై
శ్రీయుతుఁడై యెదుట సుగ్రీవనారసింహుఁడు. ॥సేవి॥

కుంకుమగోళ్లతోడ కోరదాడలతోడ
అంకెల రవిచంద్రనయనములతో
తెంకి నసురలఁ గొట్టి దేవతలకందరికి
కింకలెల్లాఁ బాపెను సుగ్రీవనారసింహుఁడు. ॥సేవి॥

బిరుదు పెండేలతోడ పీతాంబరముతోడ
సరిఁ గిరీటాదిభూషణములతో
సిరులకెల్లా నెలవై చెలఁగి శ్రీ వెంకటాద్రి
గిరిమీఁద వెలసెను సుగ్రీవనారసింహుఁడు. ॥సేవి॥ 157

నాట

ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నవాఁడు
పిక్కటిల్లి సంతోసానఁ బెద్ద హనుమంతుఁడు. ॥పల్లవి॥

తూరుపుఁ బడుమరాను దొడ్డగా జంగ చాఁచి
సారెకుఁ నర్కునివద్దఁ జదివీ వాఁడే
ధీరతతోఁ దనమేను దిక్కులెల్లాఁ బిక్కటిల్ల
బీరము చూపీ వాఁడె పెద్ద హనుమంతుఁడు. ॥ఎక్కు॥

మిన్ను నేల నేకముగా మించిన వాలమెత్తి
సన్నుతిగా వలకేలు చాఁచినవాఁడు
పన్నుగడై రాఘవునిబంట్లలోపలనెల్లా
పెన్నిధియై యున్నవాఁడు పెద్ద హనుమంతుఁడు. ॥ఎక్కు॥

నురిగి రేయుఁ బగలు మతంగపర్వతమీఁద
బిరుదులతోడను బెరసీ వాఁడే
యిరవై శ్రీ వెంకటేశుహితుఁడై యెప్పుడుఁ బెచ్చు
పెరుగుచు నున్నవాఁడు పెద్ద హనుమంతుఁడు. ॥ఎక్కు॥ 158

బౌళి

ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుఁడు
రతికెక్కఁ గొలిచిన రక్షించు నితఁడు. ॥పల్లవి॥

తరణివంశజుఁడై తాటకను హరియించి
అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లియాడి
పరశురాముని నిజబలిమి చేకొనెను. ॥ఇత॥

మునులకభయమిచ్చి మొగి నసురలఁ ద్రుంచి
ఘనమైన మాయామృగముఁ జంపి
కినిసి వాలిఁ గొట్టి సుగ్రీవునిఁ బట్టము గట్టి
వనధి బంధించి లంక వడిఁ జుట్టుముట్టెను. ॥ఇత॥

బలు రావణునిఁ జంపి పుష్పకముపైఁ దాఁ జేకొని
లలి విభీషణునకు లంక యిచ్చి
చెలఁగి యయోధ్య యేలి శ్రీవెంకటాద్రిమీఁద
వెలయ రాముఁడు దానై విశ్వమెల్లా నేలెను. ॥ఇత॥ 159

328-వ రేకు. రామక్రియ

అడర శ్రావణబహుళాష్టమి నేఁడితఁడు
నడురేయి జనియించినాఁడు చూడఁ గదరే. ॥పల్లవి॥

గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు
పంతపుపాండవులకు బావమరఁది
వంతుతో వసుదేవదేవకుల కుమారుఁడు
యింతటి కృష్ణుఁడు జనియించినాఁడు గదరే. ॥అడ॥

బలరాముని తమ్ముఁడు పంచసాయకుని తండ్రి
మలసి మేటైన యభిమన్యుని మామ
లలి సాత్యకిసుభద్రలకుఁ దోఁబుట్టిన యన్న
యిలపైఁ గృష్ణుఁడు జనియించినాఁడు గదరే. ॥అడ॥

సూరసేనుమనుమఁ డచ్చుగ ననిరుద్ధుతాత
పౌరవయాదవలోకబాంధవుఁడు
ఆరయ శ్రీవెంకటేశుఁ డలమేల్మంగకుఁ బతి
యీరీతిఁ గృష్ణుఁడు జనియించినాఁడు గదరే. ॥అడ॥ 160

లలిత

చూడవమ్మ కృష్ణుఁడు నీసుతుఁడోయమ్మ
ఆడి వీధులవెంట యశోదమ్మా. ॥పల్లవి॥

కోలలు చాఁచి వుట్లు గొట్టఁగాఁ బాలుఁ బెరుగు
కాలువలు గట్టి పారెఁ గదవమ్మా
నేలమూలాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మ యశోదమ్మా. ॥చూడ॥

చక్కెలాలకుండలెల్లా చలాన దొండ్లు వోడిచి
దిక్కన దోఁటికోలలఁ దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాత వేసితే
అక్కడ జోరునఁ గారె యశోదమ్మా. ॥చూడ॥

అల్లంతనుండి తనకందరాని తెంకాయలు
వల్లెతాళ్లు వేసి వంచీనమ్మా
బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవెంకటేశుఁడు
అల్లిబిల్లై యున్నాఁడమ్మ యశోదమ్మా. ॥చూడ॥ 161

గౌళ

ఎంచి చూచితే నితనికెవ్వరెదురు
కొంచఁ డేమిటికి వీఁడె ఘోరనారసింహుఁడు. ॥పల్లవి॥

గక్కన నహోబలాన కంబములోన వెడలి
వుక్కు మీరి హిరణ్యుని నొడిసిపట్టి
చెక్కులువార గోళ్లఁ జించి చెండాడినయట్టి
వెక్కసీఁడు వీఁడివో వీరనారసింహుఁడు. ॥ఎంచి॥

భవనాసియేటిదండఁ బాదుకొని కూచుండి
జవళి దైత్యుపేగులు జందేలు వేసి
భువియు దివియు నొక్కపాదవుతో నిండుకొని
తివురుచున్నాఁడు వీఁడె దివ్యనారసింహుఁడు. ॥ఎంచి॥

కదిసి శ్రీసతిఁ గూడి గద్దెమీఁదఁ గూచుండి
యెదుటఁ బ్రహ్లాదుఁడు చేయెత్తి మొక్కఁగా
అదన శ్రీవేంకటాద్రి నందరికి వరాలిచ్చి
సదరమైనాఁడు వీఁడె శాంతనారసింహుఁడు. ॥ఎంచి॥ 162

సామంతం

కొలువై తా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద
బలవంతుఁడితఁడు ప్రహ్లాదవరదుఁడు. ॥పల్లవి॥

చిడుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ
తొడమీఁదఁ గూచున్నతొయ్యలితోడ
కడలేని నవ్వుతోడ కడు రాజసముతోడ
అడరించీఁ బంతము ప్రహ్లాదవరదుఁడు. ॥కొలు॥

సంకుఁజక్రములతోడ చాయలమేనితోడ
సంకె దేర్చే యభయహస్తముతోడ
బింకపు మీసాలతోడ పెనువదనముతోడ
అంకె వరములిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు. ॥కొలు॥

వనితకాఁగిటితోడ వామకరముతోడ
ననుపైన తమలోనానందముతోడ
యెనయుచు శ్రీవెంకటేశుఁడై యీడా నాడా
అనిశము వెలసెఁ బ్రహ్లాదవరదుఁడు. ॥నా॥ 163

దేసాళం

జూటుఁదనాలవాఁడవు సుగ్రీవనారసింహా
పాటించి నిన్ను నేము పంగించేవారమా. ॥పల్లవి॥

మొగము సింహపురూపు మొగి మై మానిసిరూపు
జిగిఁ దొడమీఁదట శ్రీమహాలక్ష్మి
తగు నీకు నిటువంటి తగవులెల్లాఁ జెల్లు
మొగసక్కెలాడ మాకు నేలయ్య నిన్నును. ॥జూటు॥

కట్టినది పైఁడికాశ కంబములోన వునికి
నెట్టుకొన్న నవ్వులు నీలోనివే
యిట్టివల్లా నీకమరు యెన్ని లేవు నీచేతలు
అట్టిట్టని నిన్ను మాకు నడుగనేమిటికి. ॥జూటు॥

అమరుల కేలికవు అసురలకు వైరివి
రమణఁ బ్రహ్లాదునకు రక్షకుఁడవు
కొమరై శ్రీవెంకటాద్రిఁ గొత్తలు నీగుణములు
సముకానఁ బలుమారు సంతోసించే మిఁకను. ॥జూటు॥ 164

లలిత

మతంగపర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీవెంకటేశ్వరుఁడున్నవాఁడు. ॥పల్లవి॥

కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి
తలఁచినవారి నెల్లా ధన్యులఁ జేసి
పొలుపు మిగుల మంచి పువ్వులతోఁటలనీడ
విలసిల్లీనదివో శ్రీవెంకటేశ్వరుఁడు. ॥మతం॥

శరణన్నవారికి చనవిచ్చి రక్షించి
గరిమఁ బూజించువారిఁ గరుణఁ జూచి
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నాఁడు శ్రీవెంకటేశ్వరుఁడు, ॥మతం॥

తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి
కని నుతించేవారికిఁ గామధేనువై
కనకమయములైన ఘనమైన మేడలలో
వినుతికెక్కెను శ్రీవెంకటేశ్వరుఁడు. ॥మతం॥ 165

829-వ రేకు. రామక్రియ

లెండో లెండో మాటాలించరో మీరు
కొండలరాయనినే పేర్కొన్న దిదె జాలి. ॥పల్లవి॥

మితిమీరెఁ జీఁకట్లు మేటి తలవరులాల
జతనము జతనము జాలో జాలి
యితవరులాల వాయించే వాద్యాలకంటె
నతిఘోషములతోడ ననరో జాలి. ॥లెండో॥

గాములువారెడి పొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమసపు పారివార డివెపంజులు చేఁబట్టి
యేమరక ఖీల్లో మీరు యియ్యరో జాలి, ॥లెండో॥

కారుకమ్మె నడురేయి గడచెఁ గట్టికవార
సారెసారెఁ బలుకరో జాలో జాలి
యీరీతి శ్రీవెంకటేశుఁ డిట్టె మేలుకొన్నాఁడు
గారవాన నీక మానఁ గదరో జాలి. ॥లెండో॥ 166

వరాళి

పదియారువన్నెల బంగారుకాంతులతోడ
పొదలిన కలశాపుర హనుమంతుఁడు. ॥పల్లవి॥

యెడమచేతఁ బట్టె నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసిగుంపులఁ గొట్టె
తొడిఁబడ నూరుపులతోఁ దూరుపుమొగమైనాఁడు
పొడవైన కలశాపురహనుమంతుఁడు. ॥పది॥

తొక్కె యక్షకుమారునిఁ దుంచి యడగాళ(పెడగాళ్ళ?)సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవఁ బెరిగి సుతు (సూర్యు?) వద్ద వేదాలు
పుక్కిటఁ బెట్టెఁ గలశాపురహనుమంతుఁడు. ॥పది॥

గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవెంకటేశుబంటు తానాయ
అట్టె వాయువుకును అంజనిదేవికిని
పుట్టినాఁడు కలశాపురహనుమంతుఁడు. ॥పది॥ 167

శ్రీరాగం

నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకు మరి యిన్నిటాఁ బ్రసన్నుఁడు. ॥పల్లవి

కమలావరుఁడు శ్రీకరమదనగురుఁడు
సమరదానవకులసంహారుఁడు
విమలగుణాకరుఁడు విజయచక్రధరుఁడు
కమనీయభక్తజనకరుణాకరుఁడు. ॥నల్ల॥

వేదాంతవేద్యుఁడు విశ్వహితాపాద్యుఁడు
ఆదియు నంత్యము లేని యనవద్యుఁడు
సాదితయోగిహృద్యుఁడు శమితోగ్రచైద్యుఁడు
సోదించి చూచితేను సురలకు నాద్యుఁడు. ॥నల్ల॥

కామితఫలశక్తుఁడు ఘనమహిమయుక్తుఁడు
ఆముకొన్న లోకరక్షణాసక్తుఁడు
నేమాన శ్రీవెంకటాద్రి నిలిచి మమ్మేలినాఁడు
కోమలుఁడు వీఁడిగో గోపికాస(ను?)రక్తుఁడు ॥నల్ల॥ 168

## పాడి

రాముఁడు రాఘవుఁడు రవికులుఁడితఁడు
భూమిజకుఁ బతియైన పురుషనిధానము. ॥పల్లవి॥

అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపఁగ నసురల శిక్షింపఁగ
తిరమై యుదయించిన దివ్యతేజము. ॥రాము॥

చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
నంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకి కనేయట్టి
కాంతులఁ జెన్ను మీరిన కైవల్యపదము. ॥రాము॥

వేదవేదాంతములందు విజ్ఞానశాస్త్రములందు
పాదుకొనఁ బలికేటి పరమార్థము
పోదితో శ్రీవెంకటాద్రిఁ బొంచి విజనగరాన
ఆదికి ననాదియైన అర్చావతారము. ॥రాము॥ 169

కన్నడగౌళ

శరణు శరణు దేవ సర్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యానందన. ॥పల్లవి॥

వారిధిబంధన రావణశిరశ్ఛేదక
మారీచసుబాహు బలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజసంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ. ॥శర॥

సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధసప్తతాల విధ్వంసనచతుర
భువనేశ సాకేతపురవాస రామ. ॥శర॥

హరచాపహర అహల్యాశాపవిమోచక
ఖరశరవాలి నిగ్రహబిరుద
నిరతి శ్రీవెంకటేశ నిజభక్తరక్షక
ధరణిజాసమేత దశరథరామా. ॥శర॥ 170

శంకరాభరణం

వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టు వచ్చు విఠలేశ్వరా. ॥పల్లవి॥

పసులఁ గావఁగానె బ్రహ్మ నిన్ను నుతించె
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాలవయసున బండి దన్ని విరిచితి
పొసగె నీమాయలెల్లా యివె విఠలేశ్వరా. ॥విన్నో॥

వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విఠలేశ్వరా
చన్ను దాగి రాకాసిపీఁచము హరించితివి
యెన్నికకెక్కె నీబిరుదిటు విఠలేశ్వరా. ॥విన్నో॥

గొల్లెతలఁ గూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విఠలేశ్వరా
బల్లిదపు శ్రీవెంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా. ॥విన్నో॥ 171

330-వ రేకు. దేవక్రియ

విచ్చనవిడినె యాడీ వీఁడె కృష్ణుఁడు
వొచ్చములేనివాఁడు వుద్దగిరి కృష్ణుఁడు. ॥పల్లవి॥

గల్లుగల్లుమనఁగాను గజ్జలు నందెలతోడ
బిల్లఁగోట్లాడీని పిన్నకృష్ణుఁడు
కెల్లురేఁగి వీధులనుఁ గేరి పుట్టచెండులాడీ
బల్లిదుఁడు గదవమ్మ బాలకృష్ణుఁడు. ॥విచ్చ॥

తమితోడ గోపాలులు తానుఁ గూడి ముంగిటను
సముద్రబిల్లలాడీ సాధుకృష్ణుఁడు
చెమటలు గార సిరిసింగనవత్తి యాడీ
గుమితాన వీఁడే యమ్మా గోపాలకృష్ణుఁడు. ॥విచ్చ॥

వుదుటునఁ బారి పారి వుడ్డగచ్చకాయలాడీ
ముదము దొలఁకఁగాను ముద్దుకృష్ణుఁడు
అదివో శ్రీవెంకటేశుఁ డాటలెల్లాఁ దానె యాడీ
పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుఁడు. ॥విచ్చు॥ 172

మేఘరంజి

వట్టి జాలిఁ బడ వలదిఁకను
గట్టి విచారముగలవారికిని. ॥పల్లవి॥

దేవుఁడు సులభుఁడు తెలియఁగ నేర్చిన
వేవేలు లాభము విరతి
భావించు జ్ఞానమె పాదైన సౌఖ్యము
తావగు శాంతమె ధనధాన్యములు. ॥వట్టి॥

గురుఁడె సాధనము కోరి వెదకినను
పరగు నాచారమె బ్రదుకెల్లా
శరణాగతియె సామ్రాజ్యపదవి
ధర జితేంద్రియత్వమె వైభవము. ॥వట్టి॥

తననిజభక్తియె దండయు దాపును
మనసు నిలుపుటే మరి శుభము
యెనయఁగ శ్రీవెంకటేశుమహిమలివి
కని మని యుండుటె ఘనవివేకము. ॥వట్టి॥ 173

కురంజి

చేపట్టుఁ గుంచము శ్రీవిభుఁడు
వై పెరిఁగి పొగడవలెఁ గాక. ॥పల్లవి॥

మనసులోనిహరి మరవక తలఁచిన
యెనయు నిహపరము లేమరుదు
పెనగొన నాతనిపేరు నుడిగినను
తనకు మహానందము లేమరుదు. ॥చేప॥

పుట్టించినాతని పాసఁగఁగఁ గొలిచిన
యిట్టి వివేకంబేమరుదు
చుట్టి యతనిదాసులకు మొక్కినను
పుట్టుగు గెలుచుట భువి నేమరుదు. ॥చేప॥

శ్రీవెంకటేశ్వరుఁ జేరి భజించిన
యేవేళ సాత్వికమేమరుదు
భావించి యాతనిపై భక్తి నిలిపినను
కైవసముగఁ దనుఁ గనుటేమరుదు. ॥చేప॥ 174

బౌళిరామక్రియ

ఎంత పరాక్రమము యీసింహము
చెంతనే దివిజులు సేవించేరు. ॥పల్లవి॥

కొండమీఁదఁ గూచుండి దైత్యుమై
చెండివేసె నీ సింహము
నిండునగవుతో నెలఁత దనతొడపై
నుండఁగ నెరసీ నుదుటుఁదనమున. ॥ఎంత॥

తటుకనఁ బ్రహ్లాదుఘటనచేఁ గంభము
చిటిలి వెడలె నీ సింహము
చటులకరంబులఁ గుటిలదానవుని
బటుగతిఁ బట్టెను బశుబంధముగా. ॥ఎంత॥

పగయెల్ల నడఁచి జగములేలుచును
జిగి మించిన నరసింహము
నిగిడి శ్రీవెంకటనిధి యహోబలము
తగు నివాసముగఁ దనరీ నిదివో. ॥ఎంత॥ 175

నాదరామక్రియ

కొసర నేల నాగుణము లివి
రసికత నీవిన్నిటా రక్షించుకొనుమీ. ॥పల్లవి॥

నేరమి నాది నేరుపు నీదే
దూరు నాది బంధుఁడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమీ. ॥కొస॥

నేను యాచకుఁడ నీవే దాతవు
దీనుఁడ నేఁ బరదేవుఁడవు
జ్ఞానరహితుఁడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిఁక ననుఁ జేరి కావుమీ. ॥కొస॥

అరయ నే జీవుఁడ నంతర్యామివి
యిరవుగ దాసుఁడ నేలికవు
చిరజీవిని నే శ్రీవెంకటపతివి
వరదుఁడ ననుఁ జేవదలకుమీ. ॥కొస॥ 176

హిందోళవసంతం

ఎన్నిమహిమలవాఁడె యీదేవుఁడు
కన్నులపండువులెల్లాఁ గదిసినట్టుండెను. ॥పల్లవి॥

పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి
యేలీల నుండెనని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవళింపఁగా నేన
మేలిమి మీఁగఁడంటిన మెలుపుతో నుండెను. ॥ఎన్ని॥

తట్టుపునుఁగుకాపు దైవశిఖామణికి
యెట్టుండెనని మరినెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టె రాత్రులు మేననంటినట్టుండెను. ॥ఎన్ని॥

అలమేలుమంగతోడ నట్టె సొమ్ము ధరించఁగ
యెలమి శ్రీవెంకటేశు నెంచి చూచితే
కలిమిగల యీ కాంత కౌఁగిటఁ బెనఁగఁ గాను
నిలువెల్లా సిరులై నిండినట్టుండెను ॥ఎన్ని॥ 177

331-వ రేకు. ఆందోళి

కన్నులపండుగలాయఁ గన్నవారికిందరికి
వెన్నుఁడేఁగీ నిల్లిదివో వీధులను. ॥పల్లవి॥

అదె యెక్కెఁ దిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదచల్లుఁ గాంతులతో వీధుల వీధులను. ॥కన్ను॥

తోలి యాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
వాలుకొని శిష్టులెల్ల జయవెట్టఁగ
గాలికిఁ బడగలెల్లాఁ గడు నల్లాడఁగఁ జొచ్చె
వేలేటి పువ్వుదండలతో వీధుల వీధులను. ॥కన్ను॥

తావు చేరెఁ దిరుతేరు ధర్మములు నిలువఁగ
యీవల నలమేల్మంగ యిచ్చగించఁగా
శ్రీవెంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను. ॥కన్ను॥ 178

భల్లాటి

జగతిలో మనకెల్ల జయంతి నేఁడు
పగటున నందరికి పండుగ నేఁడు. ॥పల్లవి॥

అదివో శ్రావణబహుళాష్టమి నేఁడు
పొదిగొన్న రోహిణి సంపూర్ణము నేఁడు
కదిసి యుద్ధమరేత్రికాడ నేఁడు
వుదయించెఁ గృష్ణుఁడు చంద్రోదయాన నేఁడు. ॥జగ॥

వసుదేవదేవకుల వరము నేఁడు
పసగా ఫలియించె రేపల్లెలో నేఁడు
కొసరి యశోద నందగోపుఁడు నేఁడు యీ
సిసువును సుతుఁడంటాఁ జెలఁగిరి నేఁడు. ॥జగ॥

హరిమాయ కంసుమదమడఁచె నేఁడు
పొరుగిరుగులవారుప్పొంగిరి నేఁడు
సిరి నలమేల్మంగతో శ్రీవెంకటేశుఁడై నిల్చె
అరుదుగా గొల్లెతలు ఆడుకొనేరు నేఁడు. ॥జగ॥ 179

ఆహిరి

కొలిచితే రక్షించే గోవిందుఁ డితఁడు
యిలకు లక్ష్మికి మగఁడీ గోవిందుఁ డితఁడు. ॥పల్లవి॥

గోవర్ధనమెత్తినట్టి గోవిందుఁ డితఁడు
వేవేలు గొల్లెతల గోవిందుఁ డితఁడు
గోవిదుఁడై ఆలఁ గాచే గోవిందుఁ డితఁడు
ఆవలఁ గంసుఁ జంపిన ఆ గోవిందుఁ డితఁడు. ॥గోలి॥

క్రూరకాళింగమర్దన గోవిందుఁ డితఁడు
వీరచక్రాయుధపు గోవిందుఁ డితఁడు
కోరి సముద్రాలు దాఁటే గోవిందుఁ డితఁడు
ఆరితి బాలురఁ దెచ్చే యా గోవిందుఁ డితఁడు. ॥గోలి॥

కుందనపు కాశతోడి గోవిందుఁ డితఁడు
విందుల రేపల్లె గోవిందుఁ డితఁడు
పొంది శ్రీవెంకటాద్రిపై పొసఁగఁ దిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుఁ డితఁడు. ॥గోలి॥ 180

### కాశి

కొండంత పొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథ మెక్కి నిలుచున్నవాఁడు. ॥పల్లవి॥

పాతాళవాసులైన బలురక్కసులమీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధి చొచ్చినట్టి దానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున. ॥కొండ॥

ఆకాశము దూరినట్టి యదటు దైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి. ॥కొండ॥

ధరమీఁదఁ గలిగిన దనుజకోట్ల నెల్ల
సారిది శ్రీవెంకటేశుఁడు పారఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరము కొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి. ॥కొండ॥ 181

వరాళి

నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము. ॥పల్లవి॥

నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము
నగముపై యోగానంద నరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము. ॥నవ॥

నాఁటుకొన్న భార్గవూటు నరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమళ్లి నరసింహము
నాఁటి యీ కానుగమాని నరసింహము వీఁడె
మేఁటి వరాహపు లక్ష్మీనారసింహము. ॥నవ॥

పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన
నలిరేఁగిన ప్రహ్లాదనరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీవెంకటాద్రిమీఁద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము. ॥నవ॥ 182

శంకరాభరణం

కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు
తెలియ నీతఁడే సుండి దేవదేవోత్తముఁడు. ॥పల్లవి॥

పుడమికాధారము పురుషోత్తముఁడె
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి
విడువుఁ డేఁటికిఁ బారవేసినగుంటికి నెల్ల
వొడయఁ డీతఁడె నుండి వున్నతోన్నతుఁడు. ॥కో॥

అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడె
సముద్రై జీవించువారు సతానసంఖ్య(?)
భ్రమయకుఁ డెండమావిబయళ్లు చెరువులంటా
అమర నీతఁడే నుండి హరి వాసుదేవుఁడు. ॥కో॥

చెలువుఁ డీతఁడె నుండి శ్రీవెంకటేశుఁడె
పలుకుఁ బంతాలవారు పదివేగురు
తలఁచకుఁడీ దోమ దంతితోను సరిగా
జలజనాభుఁడె నుండి సకలలోకేశుఁడు. ॥కో॥ 183

332-వ రేకు. వసంతం

రంటదెప్పరపు రచన మా బదుకు
జంటల శ్రీపతిశరణమె నిజము. ॥పల్లవి॥

కన్నుల యెదుటను గలిగిన జగమే
మిన్నక మనసున మెరసేది
తిన్నఁగ రేయి నిద్రించినవాఁడనె
యెన్నఁగ రేపే యెరిఁగినవాఁడ. ॥రంట॥

బాయట నూరక పారెటి గాలే
కాయములోపలఁ గలిగేది
పోయిన జన్మపుఁ బొరుగులవాఁడనె
యీయెడ నిటు జనియించితిఁ గాని. ॥రంట

పుడమి వెలుపలను బుట్టిన రుచులే
కడుపులోపలను గరఁగేది
కడఁగి శ్రీవెంకటపతి నాలోననె
యెడయఁడు యతనినె యిటు గొలిచితిని. ॥రంట॥ 184

## సాళంగనాట

వైష్ణవులసొమ్ము నేను వారు నీసొమ్మిలింతే
విష్ణుఁడ నీవెట్టైన వివరించుకో వయ్యా. ॥పల్లవి॥

నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన
తఱి నీదాసులకే నే దాసుఁడఁ గాక
గుఱుతెరుఁగుదునా నేఁ గోరి యింతక తొల్లి
గుఱుతు చూపిన మా గురువునే కాక. ॥వైష్ణ॥

ముంచి నీకు మొక్కేఁ గాక ముందె నీశరణులు
పెంచి పాదాలు నా నెత్తిఁ బెట్టిరయ్య
పొంచి నీవేడ నేనేడ బుజముల ముద్రవెట్టి
సంచితమై సేసినట్టి సంబంధమే కాక. ॥వైష్ణ॥

శ్రీవెంకటేశ నీ సేవే సేసేఁగాక నేఁడి
సేవకుఁ దెచ్చను వారిసేవే కాదా
భావమొక్కటిగా నాకుఁ బట్టిచ్చిరి నిన్ను వారు
ఆవలీవలికిఁ బరమార్థమే కాక. ॥వైష్ణ॥ 185

## రామక్రియ

విత్తొకటి వెట్టఁగాను వేరొకటి మొలచీనా
హత్తి దేహగుణములు ఆతుమకయ్యీనా. ॥పల్లవి॥

చెంది చేయుదిన్న నోరు చేఁదే యయివుండుఁ గాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంసారికి బలు లంపటాలే కాక
అందు హరిఁ జేరి సుఖ మందఁ దీరీనా. ॥విత్తొ॥

యెంగిలిఁ బుట్టిన మేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనము సేసుకోనీనా
ముంగిటి దేహికిఁ గర్మములు ముంచుకొనుఁ గాక
రంగుగ శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా. ॥విత్తొ॥

చేతికి వచ్చినసొమ్ము చేరి నాఁచుకొనుఁగాక
యేతులఁ దా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవెంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నదా. ॥విత్తొ॥ 186

మలహరి

అందుకు హరికథ యను తీర్థంబున
నింద వాసె నిఁక నిర్మల మైతి. ॥పల్లవి॥

కంతుని ముట్టంటు గలసె మదిలో
వెంతట శుద్ధానో యెరఁగ మిఁక
సంతత సంసార జలధుల మునిఁగెద
పొంత గర్మము పోదింకాను. ॥అందు॥

మాయపుటాసల మాలు గలసె మది
యెమెడ శుద్ధానో యెరఁగమిఁక
ఆయపు భవముల యనలము చొచ్చితి
పోయినఁ గర్మము పోదింకాను. ॥అందు॥

చక్కఁగఁ గలిదోసము గలసెను మది
నెక్కడ నోమెనో యెఱఁగమిఁక
దక్కి శ్రీవెంకటదైవముఁ గొలిచితి
పుక్కట గర్వము పోదింకాను. ॥అందు॥ 187

దేశాక్షి

కర్మమూలము జగము గాదని విడువక
మర్మపు మోక్షము లేదు మాన లేరో గర్వము. ॥పల్లవి॥

సకలకర్మాలు మాని సన్యాసి యైతేను
వొకట వెలితిలేని వున్నతుఁ డట
ముక్తమై వుభయకర్మములు బంధహేతువని
ప్రకటించి వేదాంతపరనమే యెక్కుడు. ॥కర్మ॥

బహురూపములు మరచి బ్రహ్మనిష్ఠుఁడైన యోగి
యిహపరముల కతఁడెక్కు డట
విహితకర్మము దక్క వీరఘోరకర్మములు
సహజపాతకమనే శాస్త్రాలే యెక్కుడు. ॥కర్మ॥

సంతతకర్మములెల్ల సంసారమూలములు
అంతట నిస్సంగుఁ డైతే నధికుఁడట
చింతించి చింతించి శ్రీవెంకటేశ్వరు
వంతుకుఁ జెప్పిన హరివాక్యమే యెక్కుడు. ॥కర్మ॥ 188

దేవగాంధారి

పుట్టించినవాఁడు దానే బుద్ధి చెప్పేవాఁడు దానే
యిట్టె శ్రీహరి నన్నేట్టడరించీనో. ॥పల్లవి॥

యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని
యించుక వడిలోనే మోహింతు నందుకు
కంచువంటిదీ మనసు కటకటా యేది వాటి
చంచలుఁడ హరి నన్నే సంగతి సేసీనో. ॥పుట్టి॥

తలఁతు నేనొకవేళ దైవము గినేనని
కలిమి సంతటిలోనె కడు మరతు
చలపట్టి నిదివో నాజన్మములకేది వాటి
కలుషచిత్తుఁడ నన్నే కందువఁ బెట్టీనో. ॥పుట్టి॥

జ్ఞాని నౌదు నొకవేళ సరిఁ గర్మి నౌదును
మానువంటిదీగుణము మరేది వాటి
కోనల శ్రీవెంకటేశుఁ గొలిచి నే శరణంటి
మానిసి నింతే యెట్టు మన్నించీనో. ॥పుట్టి॥ 189

333-వ రేకు. గుండక్రియ

అన్నియు నాలో నుండఁగ నవ్వుల నేమి చూచేము
యెన్నఁడు గానని మాయ యెఱఁగవో మనసా. ॥పల్లవి॥

యీడనె సంసార మిదె యింద్రజాలమై యుండఁగ
యేడకై నాఁ జూడఁ బోయే మింద్రజాలము
పాడితో నా పుట్టుగులే బహురూపాలై యుండఁగ
వేడుకయ్యీ బహురూపవిద్యలు చూడఁగను. ॥అన్ని॥

నటన దినదినము నాటకమై యుండఁగాను
సటవట నాటకాలు సారెఁ జూచేము
ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను
అటమటపు విద్యలు అన్నియుఁ జూచేము. ॥అన్ని॥

పాపపుణ్యములు రెండు బారివిద్యలుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము
యేపున శ్రీవెంకటేశుఁ డిటు మమ్ము భ్రమసాపె
నాపనులు నేనె చూచి నవ్వులు నవ్వేను. ॥అన్ని॥ 190

గుజ్జరి

ఇతరోపాయము లెల్ల యీసందివే
అతిశయపదమైతే హరిదాస్యఫలమే. ॥పల్లవి॥

కర్మము సేయ నేరరా కడఁగి సన్యాసులు
కర్మము విడిచి మోక్షముఁ బొందిరి
ధర్మమెరఁగనివారా తత్వపుయోగీంద్రులు సర్వ
ధర్మము విడిచి హరిఁ దమలోనే కనిరి. ॥ఇత॥

దానాలుసేయనేరరా తగిలి యోగీంద్రులన్ని
మాని హరిజపమే నెమ్మదిఁ జేసిరి
నానావిధులెరఁగరా నారదు విభీషణాదులు
శ్రీనాథ శరణని చిరదేహులైరి. ॥ఇత॥

సతతసంగములెల్ల జన్మబంధహేతువని
మతిమంతులైనవారు మానిరి గాక
హితవైన శ్రీవెంకటేశ్వరుని శరణని
బ్రతుకరా యిందు నందుఁబ్రపన్ను లెల్లను. ॥ఇత॥ 191

సౌరాష్ట్రం

హరియవతారమె అతఁడితఁడు
పరము సంకీర్తనఫలములో నిలిపె. ॥పల్లవి॥

వున్నాఁడు వైకుంఠమున నున్నాఁడు యాచార్యునొద్ద
వున్నతోన్నతమహిమ నన్నమయ్య
వున్నవి సంకీర్తనాలు వొట్టుక లోకములందు
పన్నిన నారదాదులు పైపైఁ బాడఁగను. ॥హరి॥

చరియించు నొకవేళ సనకాదిమునులలో
హరిఁ బాడుఁ దాళ్ళపాక అన్నమయ్య
తిరమై యాయావారల తేజము దానై యుండు
గరుడానంతముఖ్యసూరులసంగడిని. ॥హరి॥

శ్రీవెంకటాద్రిమీఁద శ్రీపతికొలువునందు
ఆవహించెఁ దాళ్ళపాక అన్నమయ్య
దేవతలు మునులును దేవుఁడని జయవెట్టఁ
గోవిదుఁడై తిరిగాడీఁ గోనేటిదండను. ॥హరి॥ 192

## రామక్రియ

ఉండినట్టే వుండును వుండకున్న మానును
అండనే శ్రీహరిమాయ నమరిన లోకము. ॥పల్లవి॥

యేదైనా మంచిదే యెట్టయినా మంచిదే
సేద దేరఁగట్టి పూర్ణచిత్తులకును
కాదు గూడదనరాదు కలస్వభావమునకు
ఆదినుండి హరిమాయ నత్తినది లోకము. ॥ఉండి॥

యెండైనా మంచిదే యెంత నీడైనా మంచిదే
పండినజ్ఞానభక్తులప్రపన్నులకు
నిండె నిండదనరాదు నిచ్చనిచ్చఁ బ్రకృతికి
కొండవంటి హరిమాయ గురియైన లోకము. ॥ఉండి॥

పాపమైన మంచిదే బలుపుణ్యమైన మంచిదే
శ్రీపతిని శరణన్న జీవునికిని
వోప నోపేననరాదు వొద్దిక శ్రీవేంకటేశు
చేపట్టినమాయలోనఁ జిక్కినది లోకము ॥ఉండి॥ 193

శంకరాభరణం

నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు
యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నారిఁకను. ॥పల్లవి॥

కన్నులఁ జంద్రసూర్యులు గల వేలుపవు నీవు
పన్నిన లక్ష్మీభూమిపతివి నీవు
అన్నిటా బ్రహ్మకుఁ దండ్రివైన యాదివేలుపవు
యెన్నఁగ నీకంటే ఘనమెవ్వరున్నారిఁకను. ॥నీకే॥

దేవతలందరు నీ తిరుమేనైనమూర్తి
ఆవలఁ బాదాన లోక మణఁచితివి
నీవొక్కఁడవే నిలిచిన దేవుఁడవు
యేవేళ నీకంటే నెక్కుడెవ్వరున్నారిఁకను. ॥నీకే॥

అరసి జీవులకెల్ల నంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముఁడవు భువనరక్షకుఁడవు
యిరవైన నీవే కాక యెవ్వరున్నారిఁకను. ॥నీకే॥ 194

శుద్ధవసంతం

కటకటా యీ ప్రాణిగతి గనుట యెన్నఁడో
అటు నావశము గాదు హరి నీచేఁ గాని, ॥పల్లవి॥

పాపము నెఱుఁగుదు బంధము నెఱుఁగుదు
మాపుదాఁకా నివి నేను మానలేఁ గాని
కోపము దుర్గుణమని కొంత గొంత యెఱుఁగుదు
తీపుల యాసలఁ బడి తిప్పలేఁ గాని ॥కట॥

చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి
యీతల నాకు వెరపు యించుక లేదు
గాతల నామనసెల్లఁ గల్పించినట్లవును
చేతనైనా చెప్పినట్టు సేయలేఁ గాని. ॥కట॥

నావంకఁ గడమ గాఁక నా గురుఁడు తొల్లె నన్ను
శ్రీవెంకటేశుఁడ నీచేతికిచ్చెను
దైవమొక్కఁడవే నీ దాసానుదాసుఁడనైతి
యేవిధులు నే నెఱఁగ నిటు నిన్నే కాని ॥కట॥ 195

334-వ రేకు. సామంతం

ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె వున్నదిదె చెప్పరాని ఫలము. ॥పల్లవి॥

కోపము విడిచితేనె పాపము దానే పోవు
దీపించ సుజ్ఞానము తెరువిదివో
లోపల మలినుఁడై లోకము మెచ్చుకొరకు
పైపైఁగడిగితేను పావనుఁడౌనా. ॥ఊర॥

ముందరి కోరిక వోతే ముంచిన బంధాలు వీడు
కందువ నాస మానితే కైవల్యము
బొందిలోన నొకటియు భూమిలోన నొకటియు
చిందు వందు చిత్తమైతే చేరునా వైకుంఠము. ॥ఊర॥

కాంతలపొందొల్లకుంటే ఘనదుఃఖమే లేదు
అంతరాత్మ శ్రీవెంకటాద్రీశుఁడు
అంతట మాటలె యాడి హరి శరణనకుంటె
దొంతి నున్న భవములు తొలఁగునా వివేకికి. ॥ఊర॥ 196

లలిత

ఎప్పుడూను నడచేవె యేకాలమైనాను
కప్పి నిష్ఠూరమేల కట్టేరయ్యా. ॥పల్లవి॥

శ్రీపతి యాజ్ఞచేతఁ జిక్కినది జగము
యేపున మా యాజ్ఞ లేఁటివయ్యా
కోపగించుకొనుటింతె కొంకక లోకాలు నేము
మాపుదాఁకా మానుమంటే మానఁ బొయ్యీనా. ॥ఎప్పు॥

నరహరిరక్షణమె నడచీని లోకము
యిరవై నేము రక్షించేదేఁటిదయ్యా
పొరలే గర్వ మింతె బూతులసంసారము
మరలి నేమూరకుంటె మానఁబొయ్యీనా. ॥ఎప్పు॥

సృష్టికిఁ గర్తైనవాఁడు శ్రీవెంకటేశుఁ డింతే
యిష్టానిష్టము మాకు నేఁటిదయ్యా
నష్టి లేదు నడచేది నడవక మానరాదు
తప్పి గట్టుకొంటిఁ(?)గాక తా మానఁబొయ్యీనా. ॥ఎప్పు॥ 197

బౌళి

ఇంత లేకుంటే సది యొక్కఁడే సుజ్ఞానము
దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా. ॥పల్లవి॥

యెదిటివా రెరిఁగితే యేమీ ననక మరి
చెదరకుండుటె పో శ్రీవైష్ణవం
కదిసిన కాంతలను కనకము వొడగంటె
పదరకుండుటే పో పరమసాత్వికము. ॥ఇంత॥

క్రియ యెరఁగనివారు కీడు సేసితేఁ దాను
దయఁ జూచుటే హరిదాస్యఫలము
రయమునఁ దామసము రాజసము గలిగితే
భయపడి తొలఁగుటే ప్రపన్నగుణము. ॥ఇంత॥

వొరసి యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన
నిరతితో వీఁగనిదే నిచ్చ(శ్చ)లబుద్ధి
యిరవై శ్రీవెంకటేశ్వరదాసులఁ గని
శరణని మొక్కుటె సర్వజ్ఞగుణము. ॥ఇంత॥ 198

మలహరి

పరమోపకారులు ప్రత్యక్షదైవములు
హరిదాసులిత్తురు బ్రహ్మానందసుఖము. ॥పల్లవి॥

పాపుదురు లోకములో పాపపంకమెల్లాను
దీపించ శ్రీపాదతీర్థమున
వోపుదురు హీనుల వున్నతులఁగాఁ జేయ
చేపట్టి కన్నులెదుటి సేవామాత్రమున ॥పర॥

చెఱుతురజ్ఞానమెల్లా జనులు తమ్ముఁ జేరిన
మఱియుఁ దమప్రసాదమహిమవల్ల
తెలిచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా
మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున. ॥పర॥

చెల్లఁబెట్టుదు రెండై నా చిల్లరకులముపారి
తెల్లమిగా మంత్రోపదేశమున
యిల్లిదె శ్రీవెంకటేశ యెక్కుడు సేసిరి మమ్ము
సల్లాపనల తమసహవాసములను. ॥పర॥ 199

ధన్నాసి

నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు
శ్రీకాంతుఁడవు నాకు సిద్ధించుకొరకు. ॥పల్లవి॥

జలధివంటిది సుమీ చంచలపు నామనసు
కలవింద్రియముల నెటి జలచరములు
వొలసి భక్తినెటి వోడ యెక్కితి నేను
జలశాయి నీవ నెటి సరకు దెచ్చుటకు ॥నాకు॥

కొండవంటిది సుమీ కొనకెక్కు నామనసు
వుండుఁ గామాదులను పురుమృగములు
వుండి నీశరణమను వూఁత గొని యెక్కితిని
కొండలప్ప నీవ నెటి కొనఫలముకొరకు. ॥నాకు॥

ట్కే(గికి)వులను ధరణివంటిది సుమీ నామనసు
నివె శ్రీవెంకటేశ నిక్షేపము
వావాత నీవనెటి వసిదవ్వి కైకొంటి
భూవిభుఁడ నీవ నెటి పురుషార్థము. ॥నాకు॥ 200

కాంభోది

అంతటనె వచ్చి కాచు నాపద్బంధుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడనంటేఁ జాలు. ॥పల్లవి॥

బంతిఁగట్టి నురిపేటి పసురముగెడ నెడఁ
బొంత నొక్కొక్క గవుక వుచ్చుకొన్నట్టు
చెంతల సంసారము సేయు నరుఁడందులోనె
కొంత గొంత హరి నాత్మఁ గొలుచుటే చాలు. ॥అంత॥

వరుసఁ జేఁదు దినేవాఁడు యెడనెడఁ గొంత
సరవితోడుతఁ దీపు చవిగొన్నట్టు
దురితవిధులు సేసి దుఃఖించు మానవుఁడు
తరువాత హరిసేరు దలఁచుటే చాలు. ॥అంత॥

కడుఁ బేదైనవాఁడు కాలకర్మవశమున
అడుగులోనె నిధానము గన్నట్టు
యెడసి శ్రీవేంకటేశు నెరఁగక గురునాజ్ఞ
పొడగన్నవాని భక్తి పొడముటే చాలు. ॥అంత॥ 201

335-వ రేకు నాగవరాళి

దైవామా నీవే దయాధర్మము దలఁచుటింతే
వావిరి నోఁగాదన నవ్వల నీక నెవ్వరో. ॥పల్లవి॥

యెంచఁగ నీదేహమిది యింద్రియాలకుఁ జర(ఁజెఱ?)
వంచనతో విడిపించువారలెవ్వరో
పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంత దయఁ జూపే నీక నెవ్వరో. ॥దైవ॥

పోరచి నామనసిది పుణ్యపాపాలకుఁ జర
మారుకొని విడిపించ మరి యెవ్వరో
తీరని నాజన్మ మిది దినభోగాలకుఁ జర
యీరీతి విడిపించ నీక నెవ్వరో. ॥దైవ॥

ఆతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర
ఆతల నెవ్వరికైనా నరుహమానా
యీతల శ్రీవేంకటేశ యిటు నీవె కాతు గాక
ఘాతల నీదాసులకు గతి యెవ్వరో. ॥దైవ॥ 202

నారాయణి

ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేతలకుఁ దగవు గాదనరా. ॥పల్లవి॥

ఘనకర్మానుభవమె కావలె నొండె నాకు
వనజాక్ష నీసేవె వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి యిందుకు నిన్ను నవ్వేరు సుమ్మీ. ॥ఏలి॥

పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె
తూకొని నీనామముచేఁ దుంచుట యొండె
సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
నేకొని యీమాట వింటె మెత్తురా నిన్నును. ॥ఏలి॥

యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె
సరస రెండును నైన సంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరి జేసి జంటమాట జరపకుమిఁకను. ॥ఏలి॥ 203

బలహంస

ఏమి సేతు నిందుకు మందేమైనఁ బోయ రాదా
సామజగురుఁడ నీతో సంగ మొల్ల దేటికే. ॥పల్లవి॥

మాయలసంసారము మరిగిన కర్మము
యీయెడ నిను మరుగ దేఁటికో హరి
కాయజకేలిపైఁ దమిగలిగిన మనసు
కాయజుతండ్రి నీపైఁ గలుగదిదేఁటికే. ॥ఏమి॥

నాటకపుఁ గనకము నమ్మినట్టి బదుకు
నేఁటికి నీభక్తి నమ్మదేలే హరి
గూఁటఁ బడే పదవులు గోరేటిజీవుఁడు
కూటువైన నిజముక్తి గోరది(డి?)ది యేఁటికే ॥ఏమి॥

పాపపుణ్యములకె పాలుపడ్డ నేను
యేపున నీపాలఁ జిక్క నేలకో హరి
శ్రీపతివి నాలోని శ్రీవెంకటేశుఁడ
నీపేరివాఁడ నాకు నిండు మాయ లేఁటికే. ॥ఏమి॥ 204

దేసాళం

తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడె కాక
యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు. ॥పల్లవి॥

యీ సంసారమునకు యితఁడె దిక్కు నేఁ
జేసేటి చేఁతలకెల్ల శ్రీపతే లోను
పాసిపోఁడెప్పుడు నన్ను బంధువుఁడితఁడె నాకు
దాసుఁడైనవాఁడు హరిఁ దగదు దూరఁగను. ॥తల్లి॥

చావుఁబుట్టుగులవేళ సతము నీతఁడే
సావి భోగములకు నిచ్చకుఁడీతఁడే
భావములోపల నుండుప్రాణమీతఁడె నాకు
దైవము దూరగ నేల తనకేమి వచ్చినా. ॥తల్లి॥

తలఁపులోపలికి యీాదైవమె తోడు
యిలఁ గలిమిలేములకీతఁడె తోడు
పలుకులోపలనందు భాగ్యమీాతఁడె నాకు
కొలిచి శ్రీవెంకటేశుఁ గొసరఁగ నేఁటికి. ॥తల్లి॥ 205

సౌరాష్ట్రం

విడువ విడువ నింక విష్ణుఁడ నీపాదములు
కడఁగి సంసారవార్ధి కడు ముంచుకొనిన ॥పల్లవి॥

పరమాత్మ నీవెందో పరాకై యున్నాను
పరగ నన్నింద్రియాలు పరచినాను
ధరణిపైఁ జెలరేఁగి తనువు వేసరినాను
దురితాలు నలువంకఁ దోడికి తీసినను. ॥విడు॥

పుట్టుగులిట్టె రానీ భువి లేక మాననీ
వట్టి ముదిమైన రానీ వయసే రానీ
చుట్టుకొన్న బంధములు చూడనీ వీడనీ
నెట్టుకొన్న యంతరాత్మ నీకు నాకుఁ బోదు. ॥విడు॥

యీాదేహమె యయిన యిఁక నొకటైనాను
కాదు గూడదని ముక్తి కడకేఁగినా
శ్రీదేవుఁడవైన శ్రీవెంకటేశ నీకు (నిను?)
సోదించి నీశరణమె చొచ్చితి నే నిఁకను. ॥విడు॥ 206

భంగాళం

చెప్పినంతపని నేఁ జేయగలవాఁడ నింతే
అప్పటి నపరాధమూ ఆదరించవలదా. ॥పల్లవి॥

నీయాజ్ఞ దేహము నే మోచితినింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వోయయ్య కొంతైన వూరడించవలదా ॥చెప్పి॥

నీవు సేసే కర్మము నేఁ జేయువాఁడ నింతె
యీవల నానందసుఖమియ్యవయ్యా
కోవ(వు?)రమై వెంట వెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంత వడై నా దప్పిదీర్చ వలదా. ॥చెప్పి॥

మతిలో శ్రీవెంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నాపాటుకు దయ దలఁచవయ్య
యితవై పనిసేసేటి యింటిపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెద్దు నెట్టఁ దగదా. ॥చెప్పి॥ 207

336-వ రేకు నాదరామక్రియ

ఏమని విన్నవించేను యెన్నని కాచేవు నీవు
శ్రీమాధవుఁడ నీకుఁ జేతికి లోనయ్య. ॥పల్లవి॥

పుట్టినదే వొక తప్పు భువిమీఁద నటమీఁద
నెట్టన సంసారి నౌటె నిజము రెండో తప్పు
రట్టుకెక్కి దొరనౌటే నెట్టన మూఁడో తప్పు
యిట్టె కావు కావకుండు మిదివో నాతప్పు. ॥ఏమ॥

అన్నపానములు గోరినదియె మొదలి బందె
యెన్నఁగఁ గాంతలఁగూడుటిదివో రాతిటి బందె
కన్నవారి వేఁడేది కడ తోడుకు బందె
కొన్నిట నేమి గొనేవు కొనవయ్య బందె. ॥ఏమ॥

కోనఁ బుణ్యపాపాలె గోడియకట్లు రెండు
కొనిరి నీదాసులె కోరినతప్పు దండము
వినవయ్య యిదివో శ్రీవెంకటేశ నామనవి
మనుఁగాఁపుఁ జేసితివి మన్నించవయ్య. ॥ఏమ॥ 208

### కేదారగౌళ

ఇందిరానాథుఁడవు యిందరికి నేలికవు
చిందరవందరలైన చింతలు మరేలా. ॥పల్లవి॥

వుండుమంటే నుండవీ(డినవి ?) వూరకే బ్రహ్మాండాలు
నిండుమంటే నిండినవి నీరధులెల్లా
మెండుగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె
వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా. ॥ఇంది॥

పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచిన దేవతలెల్ల
అట్టె యణఁగిరి గా అసురలెల్ల
పట్టిన నీచలమిదె బహళస్వతంత్రమిదె
నెట్టి దైవాలపనులు వేరే మరేలా. ॥ఇంది॥

కమ్మంటె నాయను కైవల్యపదవులు
రమ్మంటే వచ్చు వేదరాసులెల్లను
కమ్మిన శ్రీవెంకటాద్రి కిడపరాయఁడ నీకు
యిమ్ముల నీమహిమిదె యితరములేలా. ॥ఇంది॥ 209

### బౌళిరామక్రియ

పలికేటి వేదమె ప్రమాణము
తెలఁచిన వారికి తత్వము సుండీ. ॥పల్లవి॥

నరహరి యజాండనాయకుఁడు
సురలితనినె సంస్తుతించిరి
పురుషోత్తముఁ డీదే భూమికి యీ
హరిఁ గొలువనివారసురలు సుండీ. ॥పలి॥

కమలారమణుఁడె ఘనుఁడు
అమరులె మ్రొక్కుదురాతనికి
విమతులఁ దునిమె విష్ణుఁడు
తమిఁ బూజించక తగు గతి లేదు. ॥పలి॥

భావజజనకుఁడు బ్రహ్మము
సేవగఁ గొలిచిరి శుకాదులు
శ్రీవేంకటపతి చెలువుఁడు
దైవశిఖామణిఁ దలఁచరో బుధులు. ॥పలి॥ 210

పళవంజరం

ఒక్కమాఁటలోనినే వోగి బంధమోక్షాలు
చిక్కనందాఁకా దేహా చింతెఁ బొందీఁ గాని. ॥పల్లవి॥

హరి యనఁ నుడిగి రెండక్షరాలఁ బాపటి
దురితాలు భువిలోనఁ వొల్ల లేవు
పురిగొని యందు మీఁద పొంచి విశ్వాసము లేక
పెరుగఁగఁ దరుగఁగ పచ్చి రేఁగీఁ గాని. ॥ఒక్క॥

మతిలో గోవింద యన్న మాత్రమున నంటటి
అతిపుణ్యాలిలమీఁద నన్ని గలవా
కతగా నట్టె మహిమ గానలేక వుండఁగాను
బతిమాలఁగానె యింత బయలాయఁ గాని. ॥ఒక్క॥

శ్రీవేంకటేశ నిన్ను సేవించితే నిచ్చేటి
యేవల వరాలు లెక్క నెంచ వసమా
భావించి తెలిసి చేపట్టెడి యరుదింత
దైవము నా కియ్యఁగాను దక్కె నింతె కాని. ॥ఒక్క॥ 211

కన్నడగౌళ

తలరో లోకాంత(ర?)పరులు తడవను పుణ్యపాపమును
వలె నని శ్రీవైష్ణవులకు వంగవమే సేసెడివాఁడ. ॥పల్లవి॥

తపసిఁ గాను ధర్మిఁ గాను
కృపగల శ్రీపతికింకరుఁడ
జపితఁ గాను శాస్త్రి గాను
వుపదేశపు గురువ్రాళిగ కాఁడ. ॥తల॥

భయము లేదు భక్తి లేదు
జయభాగవతుల దయవాఁడ
ప్రియము న్నెరఁగను పెరిమన్నెరఁగను
ద్వయాధికారముఁ దగిలినవాఁడ. ॥తల॥

జ్ఞానము లేదు మోనము లేదు
పూని శ్రీవెంకటపురుషుఁడిదె
నానాటఁ దెలిపి నను మన్నించెను
సానఁ దేరి తన శరణనువాఁడ ॥తల॥ 212

సామంతం

చలువకు వేఁడికి సరికి సరి
కలదిఁక హరి నీ కరుణే మాకు. ॥పల్లవి॥

కాయము గలిగినఁ గలుగుఁ దోడనే
పాయపుమదములు పైపైనే
రోయదు తనుఁ గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుఁగుట యెపుడో. ॥చలు॥

కడుపు నిండితే ఘనమై నిండును
బడిఁ బంచేంద్రియపదిలములు (?)
విడువ వాసలును వెలయు బంధములు
కడగని మోక్షము గైకొను టెపుడో. ॥చలు॥

పెక్కులు చదివిన పెనఁగుఁ దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా
నిక్కపు తేల్పవు నీచిత్త మిఁకను. ॥చలు॥ 218

337-వ రేకు హిందోళవసంతం

దైవమొక్కఁడె మాతలఁపు నొకటే
పావనమైతిమి పదవేమా. ॥పల్లవి॥

హరి యొకఁ దలఁచిన నటయీ(ట్రియ్యా?)ని
పరగుఁ గోరికల పనులేలా
ధర నభయమొసఁగు దైవముబంట్లము
మఱలి యితరులకు మఱి వెరచేమా. ॥దైవ॥

పురుషోత్తమానతిఁ బుట్టినవారము
అరిది సిరులకై యలపేలా
సరి లక్ష్మీపతిశరణాగతులము
అరయఁగ నితరుల నడిగేమా. ॥దైవ॥

శ్రీవెంకటపతిచేత జీవులము
దావతి నితరము తగులేలా
వావిరిని కరివరదునివారము
తావున బందాలఁ దగిలేమా. ॥దై వ॥ 214

నాగవరాళి

చాలుఁ జాలు నీసటలఁ బొరలితిమి
వాలి కొంత వెరవకుమనలేవు. ॥పల్లవి॥

కలవు లోకముల ఘనమంత్రంబులు
అలరి ముక్తి యియ్యఁగ లేవు
సులభానఁ గలరు సొరిది దేవతలు
వలగొను పాపము వారించలేరు. ॥చాలు॥

వున్నవి పుణ్యము లూరక యిచిగో
పన్నిన హరిఁ జూపఁగ లేవు
నన్నితి(ధి?) నున్నవి సకళశాస్త్రములు
కొన్నైన భవముల కొన గన నీవు ॥చాలు॥

ధరలో సేనలు ధనధాన్యంబులు
పరమజ్ఞానవిభవ మీదు(వు?)
అరుదుగ శ్రీవెంకటాధిపుఁడే మాకు
యిరవై కావఁగ యీడేరితిమి. ॥చాలు॥ 215

శోకవరాళి

నిడువుము మనసా వీరిడి చేఁతలు
తడయక శ్రీహరిఁ దలఁచవో యిఁకను. ॥పల్లవి॥

నానాఁడె యెనఁబదినాలుగు లక్షలు
యోనుల వెడలితి నొక్కఁడనే
ఆనిన భోగములందలివే పో
కానము యింక నేమి గడియించేము. ॥విడు॥

నలుగడ నటు పదునాల్గు లోకములు
వెలయఁ జొచ్చితిని వెడలితిని
కలిగిన దేదో కలుగని దేదో
తెలియ దేమిటికిఁ దిరిగేమో. ॥విడు॥

భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము
కవిసి యాఫలము గైకొంటిని
యివల శ్రీవెంకటేశుఁడింతలో
తవిలి యేలఁగా ధన్యుఁడ నైతి. ॥విడు ॥216

గుండక్రియ

ఇరవుగా నిన్నెరిఁగిరి యిదివో నీదాసులు
పరదైవములమీఁద నోల వేయ నేల పనిలేవు నీమాయలు కరుణానిధి.
॥పల్లవి॥

ముంచెను నీపాదములు మూఁడులోకములయందును
యెంచెను నీ వేయినామాలు యిలలో వేదవ్యాసుఁడు
చంచులఁ దలఁచిరి నిన్ను మున్ను సనకాది యోగీంద్రులు
పొంచి యింకా నీకు దాఁగఁ జోటు లేదు యిందు పొడచూపవే
యింక వెడమాయ లేలా. ॥ఇర॥

కొనెను నీపాదతీర్థము బ్రహ్మ కోరి నీపాదము గడిగి
వినుతించె నీమహిమ తొల్లె వేయినోళ్లుగల శేషుఁడు

అనిరి నిన్నెక్కుడనుచు మొదల శుకాదిమునీంద్రులెల్లా
పానిగి నీవు మాయ సేయఁ జోటు లేదు మమ్ము పానఁగియేలుకోవె
పురుషోత్తముఁడా. ॥ఇర॥

ఎక్కెను ధ్రువుఁడు పట్టము యిదివో నిన్నుఁ గొలిచి
చిక్కెను నీశరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను
గక్కన శ్రీవెంకటేశుఁడా యిట్టె కాచితివి మాటకే మమ్ము
యిక్కడ నీమాయ సేయఁ జోటు లేదు నిన్ను నెరిఁగిరి నీదాసు
లిందిరారమణా. ॥ఇర॥ 217

హిజ్జిజి

పాపముఁ బుణ్యము పరగ నొకట నదె
వోపినవారలు వొడిఁగట్టెడిది. ॥పల్లవి॥

నాలుకతుదనే నానారుచులును
నాలుకవే(దే?) హరినామమును
పోలింప నొక్కటి భోగమూలము
మూల నొకటది మోక్షమూలము. ॥పాప॥

మనసున నదివో మగువలమోహము
అనుగు మనసుననె హరిచింత
పనివడి యొక్కటె ప్రపంచమార్గము
కొన నొకటే వైకుంఠమార్గము. ॥పాప॥

వెలుఁగుఁ జీఁకటియు వెస నొకనాఁడే
కలిగె నట్లనివి కలిగినవి
యిలలో శ్రీవెంకటేశు మాయొకటి
తలఁప నొకటతనిదాసులసుగతి. ॥పాప॥ 218

సౌరాష్ట్రం

హరిదాసులే మాకు నడ్డమై కాతురు గాక
శరణంటే వారికి నే సకలోపాయములు. ॥పల్లవి॥

పెరుగఁ బెరుఁగఁగాని పెద్దలాయ నింద్రియాలు
యిరవైన మాబుద్ధులిందు గొల్చినా
తిరిగి తిరిగి మాకు ద్రిష్టమాయ జన్మములు
దురితాలుఁ బుణ్యాలుఁ దోసెమా యిఁకను. ॥హరి॥

కూడఁ గూడ నానాఁటఁ గొనకెక్కెఁ గోరికలు
వీడని బంధములన్నీ విడిచీనా
పాడితో నీడా నాడఁ బ్రాణములుఁ దీపులాయ
యేడనున్న నేము నేమే యెరిఁగేమా యిఁకను. ॥హరి॥

చింతించఁ జింతించఁ జేతికి వచ్చె మనసు
అంతలో శ్రీవెంకటేశుఁ డండి కాచెను
దొంతులై తిరుమంత్రము తోడనె నాలుకనంటె
మంతనాన గురుసేవ మరచేమా యిఁకను. ॥హరి॥ 219

388-వ రేకు. బౌళిరామక్రియ

కైకొన్నకొలది కర్మము
వాకుచ్చి తనతోనె వగవఁగ నేలా. ॥పల్లవి॥

తలఁచినకొలఁదే దైవము తన
కలవుకొలుకొలఁదే కడనరులు
బలువుకొలఁదియే పంతము
తొలఁగర(క?) యితరుల దూరఁగ నేలా. ॥కైకొ॥

మచ్చిక నొడివినంతే మంత్రము
అచ్చపు భక్తికొలఁదే యాచార్యుఁడు
నిచ్చలుఁ గోరినయంతే నిజమైన లోకము
పచ్చి వెచ్చి చదువుల భ్రమయఁగ నేలా. ॥కై కొ॥

నెమ్మది జాతంతే నియమము
సమ్మతించినంతే సంతోషము
యిమ్ముల శ్రీవెంకటేశుఁ డిచ్చినంతే యిహాపర
మిమ్మేలకిది మరచి యేమరఁగ నేలో. ॥కై కొ॥ 220

వరాళి

ఇన్నిజన్మము లెత్తిన యిం (దిం ?) దుకా నేము
పన్నిన సంసారముల బంధనే మిగిలెను. ॥పల్లవి॥

తీరెఁ దీరె అన్నములు దినదినకోరికలు
కోరఁబోనే యాసలెల్ల కోటానఁగోటి
సారెఁ గొన్నరుచులెల్ల చవితో మేనిలో లేవు
ఆరి తేరి బతుకఁగా నాపలే మిగిలెను. ॥ఇన్ని॥

పోయఁ బోయ స్వర్గాదిభోగములు వెనకకే
సేయఁబోతే పుణ్యములు సేనాసేన
ఆయమంటి వెతకితే నాతుమలోనా లేవు
కాయముతో వెంట వెంట కర్మమే మిగిలెను. ॥ఇన్ని॥

అందె నందె మోక్షము హరిదాసులవల్లను
ముందు వెనకెంచితేను మూలమే హరి
గొందిఁ జిక్కె నరకాలు కోపముఁ బాపముఁబాసి
యింద నందు శ్రీవెంకటేశుఁడే మిగిలెను. ॥ఇన్ని॥ 321

### బౌళి

ఏమిటికిఁక నితరపుణ్యములు
తాము దామె హరి దాసుఁడ నేను. ॥పల్లవి॥

దురితములు హరి తొల్లే తను
శరణన్నపుడే చాలించినాఁడు
నరకములు మరినాఁడే (తన ?)
తిరుమంత్రముచేఁ దీరిచినాఁడు. ॥ఏమి॥

పుట్టుగులు హరి భువి మునుపే
గట్టి ముద్రలనే కడపినవాఁడు
నట్టుకొను అజ్ఞానము వెనకకే
పట్టి గురునిచేఁ బాపినవాఁడు. ॥ఏమి॥

ఇహపరములివియును నపుడే
సహజధర్మమున జరపినవాఁడు
విహితముగా శ్రీవెంకటపతి నను
బహుదాసులలోఁ బాలించినాఁడు. ॥ఏమి॥ 222

### ఆహిరి

ఆపదలు లేని సుఖమదియెపో విరతి
వోపితేనే కైకొంట వొల్లకుంటే మానుట. ॥పల్లవి॥

అలిగించు మలిగించు నంతలోనె భ్రమయించు
కొలఁది సంసారపుగుణమిది
వులిసి రాలు దింటాఁ వులిగండ్లన నేల
వాలిసితేఁ కైకొంట వొల్లకుంటే మానుట. ॥ఆప॥

ఆనపెట్టు మోసపెట్టు నంతలోనె వాసిపెట్టు
గాసిలనీ సిరులకుఁ గలదిది
వేసరి చానిపిఁ జవి వెదక నదిఁక నేల
వ్రాసి వాసిఁ గైకొంట వొల్లకుంటే మానుట. ॥ఆప॥

మరపించుఁ దలపించు మరి యేమైనాఁ జేసు
మరియును దనకర్మమహిమిది
గురిగా శ్రీవెంకటేశుఁ గొలిచినవారికిది
వుఱకై (వై ?)నఁ గైకొంట వొల్లకుంటే మానుట. ॥ఆప॥ 228

సాళంగనాట

నీట ముంచు పాల ముంచు నీచిత్త మిఁకను
చాటితి నీకృప గురి సంసారమునకు. ॥పల్లవి॥

హరి నీవే గురి నాయాతుమలోపలికి
అరిది శంఖచక్రాలె యంగపు గురి
పరమపదమె గురి పట్టినవ్రతమునకు
తిరుమంత్రమె గురి దిష్టపునాలికకు. ॥నీట॥

గోవింద నీపాదపూజె గురి నాదాస్యమునకు
తావుల నాభక్తికి నీదాసులే గురి
ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు. ॥నీట॥

నగు శ్రీపతి గురి నన్ను రక్షించుటకును
తగు సంకీర్తన గురి తపమునకు
తెగని జ్ఞానమునకు తిరుమణులే గురి
మిగుల శ్రీవెంకటేశ మించి నీవే గురి. ॥నీట॥ 229

## లలిత

బంటుకు బంటవుదురా పాపము గాక నీ
బంటుకు బంట్లమై బదికేము నేము. ॥పల్లవి॥

పాతాళమున నున్న బలివాకిలి గాచేవు
దూతవై పాండవులపొందున నుంటివి
యీతల యేలిక బంటు యీవరుస దప్పె నీకు
చేతనే నిన్నుఁ గొలువఁ జింతయ్యా నిందుకే. ॥బంటు॥

పాండవులదూతవై పనిసేసితివి వారు
అండ నీదూతలయ్యేది అమరుఁ గాక
నిండి గురుదైవమనే నియమము దప్పె నిదే
మెండు నీదాసులకెల్ల నేర మితి యేదయ్యా. ॥బంటు॥

పరగ నాలే నీవు భక్తవత్సలుండవాదు
తిరమై యెరఁగకాడితిమి యిందాఁకాను
అరుదైన శ్రీవెంకటాద్రీశుఁడవు నీకు
సిరులనే శరణంటిఁ జేసినట్టు సేయవే. ॥బంటు॥ 225

339-వ రేకు. మాళవశ్రీ

వేగిరించ నేల విష్ణుఁడే యింతకుఁ గర్త
బాగుగా నాతనియిచ్చఁ బరగుటే కాక. ॥పల్లవి॥

తలపోఁతలేల దైవము గలుగఁగాను
చెలఁగి యాతఁడే యిన్నిఁ జేసీఁగాక
యిల నేఁడె పుట్టినా యింకాఁ గలది గాదా
పలు లోకాలు నడప భారము దేవునిదే. ॥వేగి॥

చింతలేఁక నేలా శ్రీపతి గలుగఁగాను
మంతుకుఁ బుట్టించి తానె మనుపుఁ గాక
వింతా యీ దేహము వేరా యీ యింద్రియాలు
యింతట బ్రహ్మాండనాథుఁ డిందరికి నొకఁడే ||వేగ||

సిలుఁగు గోరికలేల శ్రీవెంకటేశ్వరుఁడు
కలఁడాతఁడె మనలఁ గాచీఁ గాక
వెలసి యాతనిమాయె విశ్వమింతా నిండినది
తెలిపి రక్షించుటకు దిక్కు దెస యితఁడె. ||వేగ|| 226

వరాళి

అటు గొన్నాళ్లుందాఁక యిటు గొన్నాళ్లిందాఁక
కటకటా శునకపుగతి యాయఁ గావవే. ||పల్లవి||

పసిమిఁ బాపమనేటి బందెలు మేసితిని
కసరి దేహపుకట్టుగాడి నుంటిని
కొసరి కర్మపుమెడగుదియ మోఁచితిని
పసురమువంటివాఁడఁ బాలించవే. ||అటు||

పంచేంద్రియములనే బాడిగె మోఁచితిని
లంచపుసంసారమనే లాడిఁ బడితి
పంచల నాసలచేత బందమ(ము?)వెట్టించుకొంటి
ముంచినగుఱ్ఱమువంటి మూఢుఁడఁ గావవే. ||అటు||

మరిగి యజ్ఞానమనే మదమెత్తి తిరిగితి
మరుఁడనె మావటీనిమాయఁ జిక్కితి
గరిమ శ్రీవెంకటేశ కరిఁ గాచితివి గాన
కరినైతి నన్ను నీవు కరుణించవే. ||అటు|| 227

### దేసి

లోకమింతా నిండె లోచూపు వెలిచూపు
శ్రీకాంతుఁడై తోఁచె చిక్కినవి యేలా. ॥పల్లవి॥

సకలజీవులలోన సర్వేశ్వరుఁడు వాఁడె
వాకిరి నేఁ గాదన నోపను నేను
ఆకట యాతనిచేఁతె అందరునుఁ జేసేవారె
వికటాలెందుకు నాడవెరపయ్యీ నాకు. ॥లోక॥

భువియందు దివి (దివి ?) యందు పురుషోత్తముఁడు వాఁడె
వివరించ మేలు గీడు వెదక నేనోప
చెవి విన్నమాటలెల్ల శ్రీపతివై తోఁచీని
యివల కల్లనిజాలు యెంచఁజాల నేను. ॥లోక॥

పగటందు రేయందు పరమాత్ముఁడు వీఁడె
తగిలి పాసే నన్ను తలఁపువోప
జిగి మించ నాలోన శ్రీవెంకటేశుఁడే
బగివాయఁ డెన్నఁడును బదుకవో మనసా. ॥లోక॥ 228

### లలిత

వర్ణాశ్రమములాల వడిఁ జిత్రగుప్తులాల
వర్ణించి మమ్మెఁకఁ దడవకురో మీరు. ॥పల్లవి॥

చదువులు దెచ్చినట్టి సర్వేశుఁ గొలిచితి
చదువు నామారతఁడు చదివీఁ బోరో
అదన యోగీంద్రవంద్యుఁడైన కృష్ణుఁ గొలిచితి
చదల నాయోగములు సాదిఁచు నతఁడే. ॥వర్ణా॥

కూరిమి యజ్ఞకర్తైన గోవిందుఁ దలఁచితి
చేరి నామారతఁడవి సేసీఁ బోరో
ఆరయ విజ్ఞానమూర్తియైన హరి శరణంటి
ఫూరకె నాకాతఁడవి పుత్తరువిచ్చీని. ॥వర్ణా॥

దేవతాశిఖామణియైన దేవునిఁ బూజించితిని
దేవఋషిఋణములు తీరిచీఁ బోరో
శ్రీవెంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
చేవఁ బాపాలెల్లఁ బాసె సెలవిచ్చెఁ జేఁతలు. ॥వర్ణా॥ 229

దేసాళి

ఊరకే నోరు మూసుక వొంటి నీకు మొక్కేమయ్య
చేరి నారాయణ నీవు చేసినట్టు సేయవే. ॥పల్లవి॥

హరినామముఁ దలఁచి అణఁచే నంటే నయ్య
సరి నా పాతకములు చాలవందుకు
నరహరినామ మెంచి నాకుఁ గూడపెట్టే నంటే
అరుదైన పుణ్యములు అన్ని లేవు భూమిని. ॥ఊర॥

రామనామము నొడిగి రవ్వలఁ బోఁ జోఁపే నంటే
తామసపు నరకాలు దగ్గరవందు
వామననామ మెంచి వరస్వర్గమెక్కే నంటే
యేమిటా నాకడ వారికెడచాలదదియు. ॥ఊర॥

గోవిందనామముచేతఁ గుదించే భవములంటె
పావన మాయను నీభక్తివల్లను
శ్రీవెంకటేశ నేను చేకొని నీశరణంటి
యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము. ॥ఊర॥ 230

శాళిరామక్రియ

జ్ఞానంబొకటే జగమున కధికం మరి
నానావిధములు నటనలు. ॥పల్లవి॥

బహుదానఫలము పడయుటకంటే
యిహమున వైరాగ్య మెక్కుడు
సహజకర్మములు శతములకంటే
అహింశయనుని భక్తధికము. ॥జ్ఞానం॥

ధరఁ దపములనంతంబులకంటే
గరిమల శాంతము ఘనము
విరసాచారము వేవేలకంటె
హరినామపఠన మధికము. ॥జ్ఞానం॥

ఆవల వ్రతము లన్నిటికంటే
శ్రీవైష్ణవమే శేఖరము
శ్రీవెంకటేశ్వరుచేతలె యివి గన
సేవ యిదొకటే చింతింప ఘనము. ॥జ్ఞానం॥ 331

840-వ రేకు. మంగళకౌశిక

మమ్ముఁ జూడనేల నీమహిమె చూతువు గాక
వుమ్మడిఁ బరుసమంటేదొక్కమాఁటేకాదా. ॥పల్లవి॥

పెక్కుమారులు నిన్నుఁ బేరుకొని జపించఁగ
మక్కళించి నీకుఁ గొంత మహిమెక్కెనా
వొక్కమారు జపించి నే నూరకుండినంతలోన
తక్కక నీమహిమలోఁ దరగి పోయీనా. ॥మమ్ము॥

తగిలి నేఁ గాలమెల్ల ధ్యానము సేయఁగ నీకు
జిగి నీమేనికిఁ గొంత చేవ యెక్కీనా
అగపడి యొకవేళ నటు దలఁచి మానితే
చిగురై యంతటిలోనె చిక్కి వాడీనా. ॥మమ్ము॥

యిన్ని యేల శ్రీవెంకటేశ మాయింటిలోననె
వున్నతి నీవారమని వుంటేఁ జాలు
సన్నము దొడ్డెంచ నేల సరివలసీచోట
అన్నియు నిత్యమింతె యలమట కోపము. ॥మమ్ము॥ 232

మాళవి

ఇదిగో రూపై తోఁచీ యిందరియెదుట నివి
మదిఁ జేపట్టేది లేక మానెఁ గాని. ॥పల్లవి॥

కోపమై పొడచూపుఁ గొంత పాపము
దీ(ద్రీ?)పమై పొడచూపుఁ గొంత పాపము
మాపులు నిద్దురై చూపు దేహపాపము
కైపుగాఁ బరుల నింద కడమ పాపము. ॥ఇది॥

శాంతమే పుణ్యము సత్యదయే పుణ్యము
అంతటాను హరిభక్తి యది పుణ్యము
చింతించ వైరాగ్యమే చేతిలోని పుణ్యము
మంతనపుజ్ఞానమె మహిఁ గల పుణ్యము. ॥ఇది॥

హరినామమే ముక్తి యరసి కైకొంటేను
ధర నాతనిదాస్యమే తగిన ముక్తి
సొరిది శ్రీవెంకటేశుఁడె పరతత్వము
యిరవై కొలుచుటే యిహా నిత్యముక్తి. ॥ఇది॥ 233

పాడి

అనుచుఁ బొగడఁ జొచ్చిరదె బ్రహ్మాదులు మింట
మొనసి యీ బాలునికే మొక్కేము నేము. ॥పల్లవి॥

వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు
అన్నువ నీ దేవకిగర్భమందు వుట్టెను
మన్నించి యోగీంద్రులమదిలో నుండేడువాఁడు
పన్నిన పొత్తులలోన బాలుఁడై వున్నాఁడు. ॥అను॥

పాలజలధిలోన పాయని గోవిందుఁడు
పాలు వెన్నలారగించి పైఁడికోరను
నోలిఁ దన విష్ణుమాయ నోలలాడినట్టివాఁడు
చాలి మంత్రసానులచే జలకమాడిని. ॥అను॥

ముగురువేల్పులకు మూలమైన యిట్టివాఁడు
తగు బలభద్రునికి తమ్ముఁ డాయను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి
మొగుడ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడె. ॥అను॥ 234

శుద్ధవసంతం

హరిపూజే బ్రహ్మాండ మవ్వలి కవ్వల గాసి
మెరవెల్లా నాసందికీసందివే. ॥పల్లవి॥

తపములు జపములు దానధర్మములెల్ల
యెపుడును బ్రహ్మలోక మాసందివే
నివరీతభోగాలు వెలలేనిపుణ్యాలు
కపురులు స్వర్గలోకముకాడిపె. ॥హరి॥

వట్టి నటరాజసాలు వర్ణాశ్రమములును
పుట్టుగులిన్నియును యీభూమిమీఁదివే
చుట్టపు సంబంధాలు జోలి వావివర్తనలు
దిట్టతనములెల్ల యీదేహముతోడివే. ॥హరి॥

పూఁట పూఁట కోరికలు పొరలే వుపాయాలు
మాఁటలుఁ జేతలు నెల్ల మతిలో నివే
గాఁటపు శ్రీవేంకటేశుఁ గని కొలిచినఁ జాలు
నాఁటకపు మతములు నవ్వులలోనివే. ॥హరి॥ 235

హిందోళం

ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్ననికి మొక్కేటి వేవేలు మాకు. ॥పల్లవి॥

నగధర నందగోప నరసింహ వామన
జగదేకపతి యనే జపము మాది
తగు హరిడింగరీఁడ దాసుఁడ బంట ననేటి
మిగులఁ బెద్దతనము మించేది మాకు. ॥ఉన్న॥

హరి పుండరీకాక్ష ఆదినారాయణ యనేటి
ధర నామమంత్రములె ధనము మాకు
పరున శంఖచక్రాలు సర్వేశుదాసులసేవె(వ?)
మరిగినది మామతమును మరికె(కి?). ॥ఉన్న॥

శ్రీవేంకటేశ యని శేషగిరి వేదాద్రి
భావించి కొలుచుటె మాబ్రదుకెల్లను
కైవల్యమిదియె కంటిమిట్టె మంచిత్రోవ
పావనమైతిమి మమ్ముఁ బాలించె నితఁడు. ॥ఉన్న॥ 236

శంకరాభరణం

ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ
గాఁటపు దేవతలెల్లఁ గాచుకున్నారితని. ॥పల్లవి॥

చెక్కు మీఁటి పాలు వోయ చేరి నోరు దెరచితే
పక్కననుఁ బొడచూపె బ్రహ్మాండాలు
అక్కన నలముకొంటే నంగజతాపము మోఁచె
మక్కువకు వెరతుము మాయపు బాలునికి. ॥ఏఁటి॥

పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగు దోఁచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకొన్న వేఁకమై యెవ్వరికి వసగాఁడు
హత్తి చూడ వెరతుమీ యారడి బాలునికి. ॥ఏఁటి॥

తేఱి వీనితోడిముద్దు దేవలోకము పనులు
మీఱి యేవి చూచినాను మితిలేనివి
ఆఱడి గొల్లెతలము అట్టె కూడి యాడితిమి
వేఱుసేయ వెరతు(ము?) శ్రీవెంకటాద్రిబాలుని. ॥ఏఁటి॥ 237

341-వ రేకు. భూపాళం

కన్నవారివద్ద నెల్ల గావంగ నేమి గద్దు
యిన్నిటికి నియ్యఁ గొవ నీతఁడే స్వతంత్రుఁడు. ॥పల్లవి॥

పరమేష్ఠిఁ గన్నతండ్రిఁ బాటించి కొలువరో
అరుదై లోకాలకెల్ల నతఁడే తండ్రి
సిరిమగఁడై నవానిఁ జేపట్టి తలఁచరో
సిరులిచ్చే మేఁటిదాత సృష్టికెల్ల నతఁడే. ॥కన్న॥

అంబరీషుఁ గావఁ జక్రమంపినవానిఁ జేరరో
అంబుజభవాండాన కతఁడే రక్ష
పంబిన భూకాంతపతిఁ బాయక సేవించరో
వుంబళ్లు వూళ్లు నిచ్చే వున్నతుఁడు నతఁడె. ॥కన్న॥

మూలమంటేఁ గరిఁ గాచే ముఖ్యునికి మొక్కరో
మూలధనమై యుండీ ముందర నిట్టె
యీలీలఁ జిత్తజుతండ్రి నెదలోనఁ గొలువరో
పాలించ శ్రీవెంకటాద్రిపతి యాయ నితఁడే. ॥కన్న॥ 238

## లలిత

తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరి యని
యెల్ల సందేహాలుఁ బాసె నిఁక నేల చింత. ॥పల్లవి॥

నారదుఁడు సోదించి నారాయణు నెరిఁగె
సారెకు శివుఁడెరిఁగి చాటె రాముని
చేరి సోదించెఁ బార్వతి శ్రీరామచంద్రుని
యేరీతుల సోదించేము యింతకంటె నేము. ॥తొల్లి॥

వేదవ్యాసులు దెలిసే వెదకి విష్ణునిఁ జెప్పె
సాదించి(రి ?)తని యోగిసనకాదులు
యీదెస శుకాదులెల్ల నెరిఁగిరి మాధవుని
కాదని వీరికంటె గతి గానఁ గలమా. ॥తొల్లి॥

పెక్కు గాలము చదివి పెక్కేండ్లు బదికి
పెక్కు ఋషులిందునవె పెద్దలై రి
దక్కఁగ శ్రీవెంకటేశు ధనముగాఁ జూపిరిదె
తక్కక కొలిచితిమి దైవమని కంటిమి. ॥తొల్లి॥ 239

కాశి

నీవంటిదైవాలు వేరీ నిఖిలలోకములందు
యీవల నావల నెందు నెంచి చూడ మాకును. ॥పల్లవి॥

తగిలి నీమోముచక్కఁదన మెంచి చూచితిమా
తగిన మరునిఁగన్నతండ్రివి నీవు
అగపడ్డ నీగుణములవి యెంచి చూచితిమా
నిగిడి కల్యాణగుణనిధివనీ శ్రుతులు. ॥నీవం॥

గుట్టు నీపెద్దతనము కులమెంచిచూచితిమా
అట్టె బ్రహ్మాదులును నీయందుఁ బుట్టెను
దట్టపు నీపనులవర్తన మెంచి చూచితిమా
ముట్టి సర్వరక్షకత్వమున వెలసితివి. ॥నీవం॥

బెడిదమైన నీబిరుదెంచి చూచితిమా
వడి శరణాగతవత్సలుఁడవు
కడఁగి శ్రీవేంకటేశ కంటిమి నీమహిమలు
బడి నిన్నే సేవించి బ్రదికితిమిదివో. ॥నీవం॥ 247

మంగళకౌశి(క?)

నీవనే నమ్మినయట్టి నీవారము
వేవేలు విధాలఁ జేసే విన్నపమిదయ్యా. ॥పల్లవి॥

పండెను మాకర్మములు పాలు గోరు గొనవయ్యా
అండనె నామతిలోని అంతర్యామి
నిండెను నాకోరికలు నినుపువారిధులై
వెండిబంగారాలతోడ విఱవీఁగవయ్యా. ॥నీవ॥

మలసె మాపుట్టుగులు మారుమూల నరకలై
కలసుంకము దీరుచు కరుణాకర
వెలసె సంసారాలు వెక్కసపుఁ బౌఁజులె
తొలఁగక యిటు నీవు తోడుచూడవయ్యా. ॥నీవ॥

కూడెను మానుతులనే గోకులపుఁ గదుపులు
యీడుగాఁ బుల్లరి గొని యేలవయ్యా
వోడక శ్రీవెంకటేశ వొప్పగించితిమి నీకు
వేడుకలు దైవార విహరించవయ్యా. ॥నీవ॥ 241

నాగవరాళి

వెగ్గల మింతా వృథా వృథా
తగ్గి పరులతో దైన్యము లేలా. ॥పల్లవి॥

పెంచఁగఁ బెంచఁగఁ బెరిగీ నాసలు
తుంచఁగఁ దుంచఁగఁ దొలఁగు నవి
కంచముకూడును కట్టినకోకయు
వంచన మేమికి వలసినదింతే. ॥వెగ్గ॥

తడవఁగఁ దడవఁగఁ దగిలీ బంధము
విడువఁగఁ విడువఁగ వీడునవి (దిః)
గుడిశలోన నొకకుక్కి మంచమున
వొడలు సగమునను వుండెడిదింతే. ॥వెగ్గ॥

మరవఁగ మరవఁగ మాయలె యింతా
మురహరుఁ దలచితె మోక్షము
నిరతి శ్రీవెంకటనిలయుఁడె కాయపు
గరిమల నిలిచిన కాణాచింతే. ॥వెగ్గ॥ 242

శుద్ధవసంతం

హరి నీవు లేవా అన్నిచోట్లను తొల్లి
అరయ నీదాసులే యరుదింతే కాక. ||పల్లవి||

కంటిమి నీదాసులను కన్నులపండుగగాను
కొంటిమి పాదతీర్థము కొల్లలుగాను
వింటిమి నీనామములను వీనులపండుగగాను
అంటిన మోక్షముత్రోవ అడుగనేమిటికి. ||హరి||

నుతించి మాటాడితిమి నోరార నీదాసులను
మతిఁ జొక్కితిమి దాస్యమహిమచేత
మతి గంటిమి వారిసంగతి కూటములవల్ల
వెతకి విజ్ఞానము వేఁడ నేమిటికి. ||హరి||

మొక్కితిఁ జాగిల నీమహాపుదాసులకును
యెక్కితిఁ బరమపదమిహమందునె
తక్కక మన్నించిరె నీదాసులె నన్నన్నిటాను
గక్కన శ్రీవేంకటేశ కడమలేమిటికి. ||హరి|| 243

342-వ రేకు సాళంగం

హరివల్ల కడమ లేదంత చింతే మున్నవాఁడా
గరిమఁ గాననివారి కల్ల యింతే సుండీ. ||పల్లవి||

లోనఁ హరిఁ దలఁచితే లోపలందె పొడచూపు
పూని వెలిఁ దలఁచితే భూమిసల్లాఁ బొడచూపు
తాని యిందరిలోన దైవమయి వున్నవాఁడు
కానక వుండినవారికల్ల యింతే సుండీ. ||హరి||

పట్టి విచారించుకొంటేఁ బ్రాణముతోఁ బొడచూపు
జట్టిఁ దనదండనల్లా సంసారమై చూపు
పట్టపగలై వున్నాఁడు బాయట నెందు చూచిన
గట్టిగాఁ గాననివారి కల్ల యింతే సుండీ. ||హరి||

శరణము చొచ్చితేనె చేతిలోనే వున్నవాఁడు
పరమభాగవతులపలుకులో నున్నవాఁడు
యిరవుగ శ్రీవెంకటేశుఁడెదుటనే వున్నాఁడతని
కరుణ గాననివారి కల్ల యింతే సుండీ. ||హరి|| 244

ఆహిరి

మాకు నేవిగాఁ బనిగాదు మరి యేమి గలిగినా
శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల ||పల్లవి||

ధరణీశులపనులకుఁ దగు బందె లేదట
హరిదాసులకుఁ బాప మంటునా మరి
సరిఁ జక్రపుడాగు లిచ్చుటఁ జూచుకోరో మీరు
అరసి మీఁదటి మాటలాతని నడుగరో. ||మాకు||

లావరి మన్ననపాత్రులకు వెట్టి లేదట
కావింప వైష్ణవులకుఁ గర్మమున్నగా
దేవునిలాంఛన మిదె తిరుమణి చూచుకోరో
ఆవల నేమి గల్లాను ఆతనినడుగరో. ||మాకు||

సతి రాణివాసమైతే జాతికులమెంచరట
హితశరణాగతులకేది జాతి
తతి శ్రీవెంకటపతిదాస్యమిది చూచుకోరో
యితవై మరేమి గల్లా నీతని నడుగరో. ||మాకు|| 245

## లలిత

ఎంచి చూచితే మాకు నిందే నిత్యసుఖము
కొంచి యనుమానమైతే కొనదాఁకా లేదు. ॥పల్లవి॥

హరి నీగర్భములోన నంగమయి వున్నారము
యిరవై వేరె మోక్షమెంచ నున్నదా
నిరతిఁ జూచినవెల్లా నీరూపులే మాకు
ధరలోన నింతకంటె ధ్యానమున్నదా. ॥ఎంచి॥

అంతరాత్మవైన నిన్ను యాతుమకు నిచ్చితిని
యింతకంటె నే నడిగేది యింకనున్నదా
పొంతనే భూకాంత పుట్టిన నెలవు మాకు
యింతకంటె తల్లిదండ్రులింక నున్నారా. ॥ఎంచి॥

పోరి నెరుకే జ్ఞానము పొంచి మరపె సమాధి
సోరిది నేఁడింతకంటె సుఖమున్నదా
గరిమ శ్రీవేంకటేశ కల్పితమింతా నీదె
శరణంటె యింకా విచారమున్నదా. ॥ఎంచి॥ 246

## శుద్ధవసంతం

దైవమా నీచేఁతలు తప్పదు మా రోఁతలు
యేవలఁ జూచినఁ బాయదేమందుమయ్యా. ॥పల్లవి॥

కాయములలో హేయమదె యిమ్ముఁ బూఁతె మీఁద నదె
రోయదు చిత్తమునకు రుచియే కోఁతీ
మాయలనే పొం లేది మాఁటలనే విసిగేది
యేయెడఁ గని గానమె (యే)మందమయ్యా. ॥దైవ॥

పుట్టఁగది యెంగిలి పూఁచినదాచారము
గుట్టు చెడదందునాను గుణమే తోఁచీ
వట్టి యాసఁ బొరలేది వంతఁ బడి తిరిగేది
యెట్టు వేగించఁగ వచ్చు నేమందమయ్యా. ॥దైవ॥

నిక్కి చూచితే నెరుక నిద్దిరించితే మరపు
మక్కళించిన బదుకు మంచిదై తోఁచీ
మిక్కిలి శ్రీవెంకటేశ మీకు నేను శరణంటి
యెక్కువాయ నాపదవి యేమందమయ్యా. ॥దైవ॥ 247

శ్రీరాగం

అటమీఁదిపనులకు హరి నీవె కలవు
సటలైనా నిజమైనా జరపేము గాక ॥పల్లవి॥

పరమాత్మ నీమాయఁ బాయఁగ నే నెంతవాఁడ
దొర యైతే రాజాజ్ఞ దోయవచ్చునా
తొరలిన యింద్రియాలఁ దోసి పోవ నెట్టు వచ్చు
సిరుల నేలిక పంపు సేయుటింతే కాక. ॥అట॥

శ్రీపతి యీసంసారము సేయకుండ నెంతవాఁడ
మాపుదాఁకా రాచవెట్టి మానవచ్చునా
పాపపుణ్యములొల్లక పరగ నాకెట్టు వచ్చు
తేపఁ దల్లి వుగ్గువెట్టఁ దినకుండవచ్చునా. ॥అట॥

దేవ నీవిచ్చినమేను తెగి రోయ నెంతవాఁడ
కావించి రాచయీవికిఁ గడమున్నదా
శ్రీవెంకటేశ నీచిత్తములోవాఁడ నింతే
యేవిధిఁ బెట్టినా నేనియ్యకొంట గాక. ॥అట॥ 248

భైరవి

అనుచు మునులు ఋషులంత నింత నాడఁగాను
వినియు విననియట్లె వీడె యాడీఁ గాని. ॥పల్లవి॥

ముకుందుఁడితఁడు మురహరుఁడితఁడు
అకటా నందునికొడుకాయఁ గాని
శకుంతగమనుఁడితఁడు సర్వేశుఁడితఁడు
వెకలి రేపల్లెవీధి విహరించీఁ గాని. ॥అను॥

వేదమూరితి యితఁడు విష్ణుదేవుఁడితఁడు
కాదనలేక పసులఁ గాచీఁ గాని
ఆదిమూలమితఁడు యమరవంద్యుఁ డితఁడు
గాదిలిచేఁతల రోలఁ గట్టువడెఁ గాని. ॥అను॥

పరమాత్ముఁడితఁడె బాలుఁడై వున్నాఁడు గాని
హరి యీతఁడె వెన్నముచ్చాయఁ గాని
పరగ శ్రీవెంకటాద్రిపతియును నీతఁడె
తిరమై గొల్లెతలచేఁ దిట్టువడీఁ గాని. ॥అను॥ 249

343-వ రేకు మలహరి

మానరో మీ లోకులాల మాకు మీకు నేమి దోసము
నానాఁటికిఁక మీకు నవ్వఁబాటు నేము ॥పల్లవి॥

యిరవై నానోటికె మెన్నెన్ని చదివిన
హరి యనేయంతరుచి అందు లేదు
గరిమ నెన్నిరూపులు కన్నుల నేఁ జూచినాను
పురుషోత్తముఁ జూచిన పూర్తి యందు లేదు. ॥మాన॥

యెచ్చోట నుండినాను యిందిరేశుమందిరము
చొచ్చి యుండేసుఖమంత చొప్పడదందు
కచ్చుపెట్టి పీనులకుఁ గతలెన్ని విన్నాను
అచ్చుతుకీర్తన వినే యందు సరి రాదు. ॥మాన॥

కైపుగాఁ గన్నవారికాళ్ళకు మొక్కినాను
శ్రీపతికి మొక్కినంత సెలవు గాదు
యేపున శ్రీవెంకటేశు నిటులఁ బూజించినట్టు
మాపుదాఁకా నితరుల మనసు రాదు. ॥మాన॥ 250

దేవగాంధారి

పట్టిన ముట్లు నుండరు పదరుదుగంతలోనె
యెట్టనె(యె?)దుటిమిమ్ము నెరిఁగీ నెరఁగరు. ॥పల్లవి॥

గుక్కక మూఁడులోకాలు గొలిచితివని నీకు
మొక్కుదురు పరులకు మొక్కకుండరు
అక్కరదీర శ్రీపతివని నిన్ను నేఁడుదురు
వెక్కసపుఁ దైవాల వేఁడుకోక మానరు. ॥పట్టి॥

కందువ బ్రహ్మగన్నట్టి ఘనుఁడవు నీవార
మందురు పరులచారమనకుండరు
అంది వేదాలు దెచ్చేయాతఁడవు నీవే యని
యెందు నెంచి పరులను యెంచకుండరు. ॥పట్టి॥

యిత్తల నారదాదులకేలికని నీమరఁగు
చొత్తురు పరులమాఁటు చొరకుండరు
అత్తిన శ్రీవెంకటేశ యన్నియు నీమాయలింతే
మెత్తినవెఱ్ఱులు లోకులిట్టే భ్రమతురు. ॥పట్టి॥ 251

లలిత

ఇంక నేమి సేసేము యిన్నిటాఁ దనిసితిమి
సంకెలెల్లాఁ దీరెఁ దీరె చాలుఁ జాలుఁ గర్మము. ॥పల్లవి॥

కోరి పుణ్యము లేమైనాఁ గొన్ని సేసేమంటిమా
కోరిక లిచ్చేటి హరి కూడి మాలో నున్నాఁడు
చేరఁ జోటు వెదకి పొంచి తిరిగేమంటిమా
చేరేటి వైకుంఠపతి చేతిలో నున్నాఁడు. ॥ఇంక॥

భవహారముగ వేదపఠన సేసేమంటే
భవహారమగు హరిపాటలు నోట నున్నవి
తవిలి సంపదలకై దానమిచ్చే మంటిమా
భువిలోన శ్రీపతి మాపూజలో నున్నాఁడు. ॥ఇంక॥

యిహసుఖములకుఁగా యిందరి వేఁడేమంటే
యిహ మిచ్చే శ్రీవెంకటేశుఁ డెదుట నున్నాఁడు
సహజమయినయట్టి సర్వేశుఁ డితఁడే
మహిమలన్నియుఁ దానె మాకు నిచ్చినాఁడు. ॥ఇంక॥ 252

ధన్నాసి

నీవె దయసేసి నేఁడు మన్నుఁ గాకు గాక
శ్రీవల్లభుఁడ నీకు సేవ సేసేవారమా. ॥పల్లవి॥

యిది పుణ్యమిది పాప మెట్టని తెలిసేమయ్యా
అదన నన్నపు నామె యన్నువట్టెను
యిదె దైవమిదె గురుఁ డెట్టని యెరిఁగేమయ్యా
మొదల నానాయోనిముట్టంటువారము. ॥నీవె॥

ఆచారమేదీ యిఁక ననాచారమేదయ్యా
కాచినయాఁకటికరిగాఁపులము
యేచినబంధమిది మోఁక్షమిది యనలేమయ్యా
పూచిన పంచేంద్రియాల పొరుగై తిమిదివో. ॥నీవె॥

ముందరిది కనకది చుట్టి యేమనెంచేమయ్యా
కందువ సంసారపు గర్వమెక్కేఁము
అందపు శ్రీవేంకటేశ యన్నియు నీమాయలివి
పొంది నీకొప్పనసేసి భోగించేమయ్యా. ॥నీవె॥ 253

## పళవంజరం

హరినే యడుగరో ఆమాఁట
సరుగ నిందరికి సర్వేశ్వరుఁడు ॥పల్లవి॥

కామముఁ గ్రోధము కాయపు గుణములు
నేమపుటాత్మకు నిందేది
గామిడి మాయే కర్త యిందుకును
సోమరి మమ్మంటఁ జోటేది. ॥హరి॥

పాపముఁ బుణ్యము భావవికారము
పైపై నాత్మకుఁ బనిలేదు
శ్రీపతిపంపిటు సేసితి మింతే
తాపి మమ్ముఁ దగులఁ దగవేది. ॥హరి॥

కాయముఁ బ్రాయము కర్మపు గుణములు
సేయని యాత్మకు సెలవేది
యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి
చాయల నితనికి శరణంటిమి. ॥హరి॥ 254

నాదరామక్రియ

కలఁడా యింతటి దాత కమలనాభుఁడె కాక
కలఁ డన్నవారిపాలఁ గలిగిన దైవము. ||పల్లవి||

యిచ్చెను సంపదలితఁడింద్రాదులకు నెల్ల
యిచ్చెను శుకాదులకిహపరాలు
యిచ్చెను వాయుజునికి యిటమీఁదిబ్రహ్మపట్ట
మిచ్చెల ఘంటాకర్ణునికిచ్చెఁ గుబేరత్వము. ||కల||

కట్టెను ధ్రువపట్టము కమలజుకంటె మీఁద
కట్టె విభీషణుకు లంకారాజ్యము
కట్టి యిచ్చె నజునికి గతచన్న వేదాలు
కట్టెను శ్రీసతిచేతఁ గంకణసూత్రములు. ||కల||

పెట్టెను దేవతలకు పెరినమృతపువిందు
వెట్టెను భక్తవత్సలబిరుదితఁడు
యిట్టె శ్రీవెంకటాద్రి నిందరికిఁ బొడచూపి
పెట్టెఁ దనప్రసాదము పృథివి జీవులకు. ||కల|| 255

344-వ రేకు దేసాళం

ఏదు లేది యింక మాకు యెందు చూచినను నీ
పదము లివి రెండు సంపదలు సౌఖ్యములు ||పల్లవి||

గోపికానాథ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మథా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీపాదములె మాకు నిధినిధానములు. ||ఏదు||

పురుషోత్తమా హరీ భువనపరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుందరక్షకా
ధరణి నీపాదములె తల్లియును దండ్రి. ॥ఎదు॥

దేవకీనందనా దేవేంద్రవందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీపాదములె గతి యిహముఁ బరము. ॥ఎదు॥ 256

గౌళ

బాపుగే నీమాయ భ్రమయించీ జీవులను
దాపున నున్నదె కాని దవ్వులకుఁ జొరదు. ॥పల్లవి॥

మోక్షమురుచి గానదు ముందరి నుండఁగాను
సాక్షియై జగమిది చవి చూపఁగా
దీక్షకుఁ జొరదు మరి దేవ నీపై భక్తి లేదు
దక్షులై యాలుబిడ్డలు దండనుండఁగాను. ॥బాపు॥

జ్ఞానమితవు గాదు సంగడి నుండదు గాన
నానాయోనులమేను నసిచుండఁగా
ఆనకమై వైరాగ్యమంటదలవాటు లేక
కానఁబడ కర్మములు గాసిఁ బెట్టఁగాను. ॥బాపు॥

మంచిదని నీ తిరుమంత్రము దలఁచుకోదు
పంచేంద్రియములాత్మ బలిసుండఁగా
యెంచుకొని శ్రీవేంకటేశ నీకె శరణని
అంచల నీదాసులై తే నన్నిటా గెలిచిరి. ॥బాపు॥ 257

పళవంజరం

వెఱపించఁ బోయి తానె వెఱచెఁ దల్లి యశోద
మఱచి యీబాలు నెట్టు మానిసెంటా నుండెనో. ॥పల్లవి॥

వెంట రాకు మని కృష్ణు వెరపించి యశోద
వొంటి మందలో గొంగ వున్నాఁడనె
అంటి గొంగ యెందున్నాఁడని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను. ॥వెఱ॥

చందమామఁ బాడి తల్లి సరిఁ బొత్తుకు రమ్మంటే
చందురుఁ జూచి కృష్ణుఁడు సన్న సేసెను
ముందరఁ జంద్రుఁడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యంటినో యని ముంచి వెరగందెను. ॥వెఱ॥

పాలార్చి తొట్టెలలోఁ బండఁబెట్టి యశోద
నీలవర్ణుఁ దొంగిచూచె నిద్దురో యని
వోలి శంఖచక్రాలతో నురము శ్రీసతితోడ
యీలీల శ్రీవెంకటేశుఁడై యున్నాఁడు. ॥వెఱ॥ 258

గుజ్జరి

ఏమన వచ్చును గెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు గొన్ని
శ్రీమాధవ నీ చిత్తము కొలఁదికె చెప్పెడి దేఁటికి జీవులకు. ॥పల్లవి॥

కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు మిముఁ దలఁచనివారిది నేమి
కలుషమెడలి సూర్యోదయమైనా కానవు కొన్ని జంతువులు
తెలిసినవారలు కందురు యీ తెరఁ(గు?)గలు రెంటికి దినమొకటే ॥ఏమ॥

శరణాగతరక్షణచతుర సర్వాంతరాత్మక యచ్యుత
సరి నిన్నుఁ గొలిచినవారిది పుణ్యము చలమున మానుటె పాపము
సరుగనఁ గాచెటి చల్లని చంద్రుఁడు జారచోరులకుఁ గడు వేఁడి
అరయఁగఁ గలువలకును హితుఁడు అందుకు నిందుకు గురి యితఁడే. ॥పమ॥

శ్రీవెంకటగిరినిలయా శ్రీసతీశ పురుషోత్తమ
మీవొద్దనుండితే వైకుంఠము మిమ్ము నెడసితే నరకము
భావములోపల నీవే వుండఁగ భక్తి లేదు కొందరికైతే
శ్రీవైష్ణవులకు నిత్యము యీ చింతలు రెంటికి నీ మహిమె. ॥పమ॥ 259

దేసి

అజ్ఞానులకివి యరుహము లింతే
సుజ్ఞానులకివి చొర నేలయ్యా. ॥పల్లవి॥

దైవము నమ్మిన దాసులకు
కావింపఁగ మరి కర్మము లేదు
దావతి జలనిధి దాఁటినవారికి
నోవల మరియును వోడేలయ్యా. ॥అజ్ఞా॥

గురుకృపగలిగిన గుణనిధికి
అరయఁ బాపపుణ్యము మరి లేదు
విరసపుఁ జీఁకటి వెడలినవారికి
పరగ మరియు దీపంబేలయ్యా. ॥అజ్ఞా॥

జగములెరుఁగు వైష్ణవులకును
తగిలెటి యపరాధంబులు లేవు
అగపడి శ్రీవెంకటాధిపుఁ గొలిచితే
యెగువ దిగువ మాఁకెదురేదయ్యా. ॥అజ్ఞా॥ 260

బౌళి

హరి సర్వాత్మకుఁ డాదిమపురుషుఁడు
హరి నెఱుఁగువారి పుణ్యము గాన. ||పల్లవి||

నాలుకకొననే నారాయణుఁడిదె
వైళము దలఁచనివారిదె పాపము
నేలయు మిన్నును నిజవైకుంఠము
పోలించి చూడని పురుషుల వెలితి. ||హరి||

మనసులోననే మాధవుఁడున్నాఁడు
కనుఁగొననివారికడమింతే
తనువే విష్ణుని తత్త్వసాధనము
వొనరఁగ శ్రీపతి యున్నాఁడు గాన. ||హరి||

చేరువ నిదివో శ్రీవేంకటపతి
ధారుణిఁ గొలిచెటి దాసులభాగ్యము
కారణ మితఁడే కలిగినదైవము
కోరినవారల కొంగులపసిఁడి. ||హరి|| 261

345-వ రేకు మేఘరంజి

అని బ్రహ్మాదులెంచేరు హరిబాలలీలలు
వెనక శుకాదులచే వింటిమి నేమిదివో. ||పల్లవి||

పొత్తులలోఁ బవ్వళించె పురుషోత్తముఁడు దొల్లి
హత్తి మఱ్ఱాకుపైఁ బడినటువలెనె
వొత్తగిలి బోరగిలి వుండఁజొచ్చెఁ గృష్ణుఁడు
తత్తరానఁ గూర్మావతారమైన గతిని. ||అని||

తప్పటడుగులు వెట్టె తగఁ ద్రివిక్రముఁడై
గొప్పపాదాలను భూమి గొలిచినట్టు
అప్పుడే కొదలు మాఁటలాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
తప్ప నసురసతులఁ దగఁ బోధించినట్లు. ||అని||

అచ్చపు రేపల్లెలోన నాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
మెచ్చుల వైకుంఠాన మెరసినట్లు
నిచ్చలు శ్రీవెంకటాద్రినిలయుఁడై యున్నవాఁడు
అచ్చుగ జీవులలోన నాతుమైనయట్లు. ||అని|| 262

గుండక్రియ

నర(వ?)రూప ప్రహ్లాదనరసింహా
అవిరళతేజ ప్రహ్లాదనరసింహా. ||పల్లవి||

పగరపై కోపము బంటుఁ జూచి మరచితి
నగుమొగము ప్రహ్లాదనరసింహా
మొగువ నీకోపమున కితఁడె మాఁటుమందు
అగపడె మాకును ప్రహ్లాదనరసింహా. ||నర||

అంట ముట్టరాని కోపమంగసఁ జూచి మానితి
నంటు చెల్లుఁ బ్రహ్లాదనరసింహా
జంట నీబుద్ధి తిప్ప సతియె యంకుశము
అంటు వాయమికను ప్రహ్లాదనరసింహా. ||నర||

ధర మొరవెట్ట దేవతలె మొక్కితే మానితి
గరుడాద్రిఁ బ్రహ్లాదనరసింహా
యిరవై శ్రీవెంకటాద్రి నిందు నందు నీదె సుద్ది
అరసితిమిదివో ప్రహ్లాదనరసింహా. ||నర|| 263

లలిత

ఏదాయ నేమి హరి యిచ్చిన జన్మమే చాలు
ఆదినారాయణుఁడే యఖిలరక్షకుఁడు ॥పల్లవి॥

శునకము బతుకును సుఖమయ్యే తోఁచుఁ గాని
తనకది హీనమని తలఁచుకోదు
మనసొడఁబడితేను మంచిదేమి కానిదేమి
తనువులో నంతరాత్మ దైవమాట దప్పదు. ॥ఏదా॥

పురువుకుండేనెలవు భువనేశ్వరమై తోఁచు
పెరచోటి గుంతయైన ప్రియమై యుండు
యిరవై వుండితేఁ జాలు యెగువేమి దిగువేమి
పరుస లోకములు సర్వం విష్ణుమయము. ॥ఏదా॥

అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెరఁ దన తిమ్మటె జీవన్ముక్తి
కిచ్చుపెట్టె శ్రీవెంకటపతిదాసుఁడైతే
హెచ్చుకుందేమి లేదు యేలినవాఁడితఁడే. ॥ఏదా॥ 264

ఆహిరి

ఎందరి వెంటల నేఁగేను
చందపు హరి నీ శరణనియెదము. ॥పల్లవి॥

పెంచినఁ బెరుఁగును పెక్కు బంధములు
తుంచినఁ దునుఁగును దుఃఖములు
యెంచఁగ నేటికి యింద్రియమహిమలు
చుంచుల హరి నీ సూత్రములివియే. ॥ఎంద॥

పఱపినఁ బారును బహుళపుటాసలు
తఱపినఁ దరగును తన పాదము
వెఱవఁగ నేఁటికి వెడ కర్మములకు
కఱకుల హరి నీ కల్పితమివియే. ॥ఎంద॥

చేసినఁ జెలఁగును జిగి సంసారము
మూసిన ముణుఁగును మోహములు
యీసుల శ్రీవెంకటేశ్వర యివి నీ
దాసులఁ దడవవు తగు నీ మహిమ. ॥ఎంద॥ 265

పాడి

కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ
యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి. ॥పల్లవి॥

మనసులోనికి గురి మాధవ నీ పాదాలు
తనువుపై గురి నీ సుదర్శనము
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు
పనులెన్ని గలిగినఁ బట్టకు నా నేరమి. ॥కల॥

చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు
నీతి దా నాలికె గురి నీ నామము
కాతరపు నుదుటికిఁ గల తిరుమణి గురి
పాతకపు నావలపఁ బట్టకుమీ నేరమి. ॥కల॥

యిహపరాలకు గురి యీ నీ శరణాగతి
సహజ మాత్మకు గురి సంతతభక్తి
మహిలో శ్రీవెంకటేశ మన్నించి నన్నేలితివి
బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి. ॥కల॥ 266

నాదరామక్రియ

దైవము దూరఁగ నేల తనునేర్పునేరమింతే
యీవలఁ దమకర్మను లెంచరు మనుజులు. ॥పల్లవి॥

మొల్లమి గాలి యొకటె మించి తూరుపెత్తుచోట
పొల్లకట్టు కడఁ బడె పోగువడె గట్టివెల్లా
వల్లెనములో శ్రీహరి ఒకఁడే వుండునతని
నొల్లరైరి యసురలు కొలిసిరి సురలు ॥దైవ॥

మించిన జల్లి యొకటె మీఁదనుండు దొడ్డవెల్ల
దంచుల సన్నములెల్లా సందులఁ గారు
యెంచఁగ హానె యొకఁడే యెరఁగక కొందరైతే
కొంచమైరిగానిఁ గొల్చి కొందరైతే (రె?) ఘనులు. ॥దైవ॥

కోవిలలుఁ గాకులును కోరి యొక్కరీతి నుండు
యీవల వసంతవేళ నేరుపడును
శ్రీవెంకటేశ్వరుని సేవకులు మనుజుల
భావమొకరీతి నుండు ఫలములే వేరు. ॥దైవ॥ 267

346-వ రేకు సాళంగనాట

అలబ్రహ్మాదుల కణఁగదిది
గెలువఁగ వశమా కేశవ మాయ. ॥పల్లవి॥

పాపము మనసునఁ బారక మానదు
కోపము మానఁగఁ గూడదు
యేపున దేహంబెన్నాళ్ళు మోఁచెను(చిన?)
తీపుల యిది యీ దేహపుగుణము. ॥అల॥

ఆఁకలి దీరదు యటు నానాఁటికి
కాఁకలు మానవు కాంత లేక
మాఁకువంటి జన్మము గలకాలను
చీఁకటిదేహపు చిత్తపుగుణము. ||అల||

నీవు వోసఁగినదె నిర్మల దేహము
నీవె నా నేర్పునేరములు
శ్రీవెంకటేశుఁడ జిగి నీ శరణని
దీవెనఁ బొందితి దేహపుగుణము. ||అల|| 268

కేదారగౌళ

మీ మతము పరిభాష మీవల్లనే పుట్టెఁ గాక
నేముమతై నాఁ దొల్లి యెంచిరా యీమాఁట ||పల్లవి||

ముడిగి నాలుగు సూత్రములె మీ వివరణము
కడమ వ్యాససూత్రాలు కల్లలా యేమి
కడు ముఖ్యము మహావాక్యమె చాలుననెను (నేరు?)
అడరి వసిష్ఠాదులాడిరా యీమాఁట. ||మీమ||

తానె బ్రహ్మమనంటె తగజీవన్ముక్తనేరు
పూని లోకులెల్లా ముక్తిఁ బొందవలెఁగా
పాని కర్మానుభవాలు బాధితానువృత్తనేరు
వీనుల సర్వపురాణాల వింటిమా యీమాఁట. ||మీమ||

పైకొని బ్రహ్మజ్ఞానము భక్తిరూపము గాదని
చేకొని కొల్చెదరట్టె శ్రీవెంకటేశు
దీకొనుచుఁ జేసేరు దేవపూజాది యజ్ఞాలు
యేకాత్మవాదులాల యితవా యీమాట- ||మీమ|| 269

శంకరాభరణం

చెప్పఁబోతే యీ యర్థము చిత్తము వోడఁబడదు
తప్పులు వెదకకురో తత్త్వజ్ఞులాల. ॥పల్లవి॥

చెలఁగి మిథ్య యంటాఁ జేసే యజ్ఞాలు ఫలించునా
యిల శూన్యోపాసకుల కేడ దేవుఁడు
లలిమాయా శబళితులకు మోక్షమెక్కడిది
నలి నభేదవాదికా నందానుభవమేది. ॥చెప్ప॥

హరిశరణు చొరనియట్టివారికి దిక్కేది
గురుఁడు వేరే లేఁడట కోరి వుపదేశమేది
వెరసి శిఖాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరగ భక్తి వెదకి భవమెట్లు గడచెను. ॥చెప్ప॥

శ్రీవేంకటేశుముద్ర ధరించక వైకుంఠమేది
యీ విభుపేరు జపించకెట్టు పాపాలు తరించు
వేవేగ దాసుఁడు గాక వెట్టికేల కరుణించు
సేవించినఁ గాక సర్వచింతలేల యుడుగు. ॥చెప్ప॥ 270

శ్రీరాగం

అహోబలేశ్వరుఁ డఖిలవందితుఁడు
మహి నితనిఁ గొలిచి మనుఁడేక జనులు ॥పల్లవి॥

మూఁడు మూర్తులకు మూలంబితఁడు
వేఁడి ప్రతాపపు విభుఁడితఁడు
వాఁడి చక్రాయుధవరదుఁడితఁడు
పోఁడిమిఁ బురాణపురుషుఁడితఁడు. ॥అహో॥

అసురలకెల్లఁ గాలాంతకుఁ డీతఁడు
వసుధ దివ్యసింహాంబితఁడు
వినువని యేకాంగవీరుఁడీతఁడు
దెసలఁ బరాత్పరతేజం బితఁడు ॥అహో॥

నిగిడి శ్రీవెంకటనిలయుఁడీతఁడు
బగివాయని శ్రీపతి యితఁడు
సొగిసి దాసులకు సులభుఁడీతఁడు
తగు నిహాపరముల దాతయు నీతఁడు. ॥అహో॥ 271

మాళవి

అంజనీదేవికొడుకు హనుమంతుఁడు
సంజీవిని దెచ్చినాఁడు సారె హనుమంతుఁడు ॥పల్లవి॥

కలశాపురముకాడ కదలీవనాల నీడ
అలవాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండల కోనలంవలి గుహాలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు. ॥అంజ॥

పసలుగా జంగ వెట్టి పండ్లగుత్తి చేతఁ బట్టి
అసురలనెల్లఁ గొట్టీ హనుమంతుఁడు
వసుధఁ బ్రతాపించి వడిఁ దోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు. అంజ॥

వుద్దవిడి లంక చొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవెంకటేశు బంటై వరమిచ్చి
కొద్దిమీర సంతోసాలె గుప్పీ హనుమంతుఁడు. ॥అంజ॥ 272

వరాళి

పంతగాఁడు మిక్కిలినీ పవనజుఁడు
రంతు కెక్కె మతింగపర్వత పవనజుఁడు. ॥పల్లవి॥

వాలాయమై యెంత భాగ్యవంతుఁడో దేవతలచే
బాలుఁడై వరములందెఁ బవనజుఁడు
పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి
యేలికకుఁ దరఁ బెట్టె నీ పవనజుఁడు. ॥పంత॥

పొంటులు సోదించి తెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటు గాఁగఁ బొందుసేసెఁ బవనజుఁడు
వొంటనే రామునిముద్ర వొసఁగి సీతకుఁదర
నింటిపాడవై పెరిగె మేఁటి పవనజుఁడు. ॥పంత॥

కిట్టి శ్రీవెంకటేశ్వరుకృపచే ముందరిబ్రహ్మ
పట్టమేలనున్నవాఁడు పవనజుఁడు
చుట్టి చుట్టి తనకు దాసులయినవారికి
గట్టి వరము లిచ్చె నీ ఘనపవనజుఁడు. ॥పంత॥ 273

347-వ రేకు శ్రీరాగం

ఏడకేడ నీచరితలేమని పొగడవచ్చు
యీడులేని మహిమల యినవంశరామా. ॥పల్లవి॥

పరమాన్నములోఁ బుట్టి పక్కనఁ దాటకిఁ జంపి
సరుస విశ్వామిత్రుయజ్ఞము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లాడి
పరశురామునిచేత బలము చేకొంటివి. ॥ఏడ॥

వైపుగాఁ సుగ్రీవుఁ గూడి వాలినొక్క కోల నేసి
యేపున జలధి గట్టి యెసగితివి
దీపించు రావణుఁ జంపి దివిజులను మన్నించి
యేపుగా విభీషణుని రాజ్యమేలించితివి. ॥ఏడ॥

సీతతోఁ బుష్పకమెక్కి జగి నయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టము గట్టుకొంటివి
యీతల శ్రీవెంకటాద్రి విటు పజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి. ॥ఏడ॥ 274

ఆహిరి

సులభుఁ డీతఁడిదివో సుగ్రీవనారసింహుఁడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో. ॥పల్లవి॥

నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు
రవ్వలుగా దేవతల రక్షించేవాఁడు
పువ్విళ్ళూర కంభములో నుదయించినవాఁడు
నివ్వటిల్లు ప్రతాపాన నెగడినవాఁడు. ॥సుల॥

హేమపు చాయలవాఁడు యెదుటఁ గొల్వున్నవాఁడు
కోమలిఁ దొడపై నిడుకొన్నవాఁడు
కోమలపు మేనివాఁడు గొప్ప కిరీటమువాఁడు
చేముంచి హిరణ్యుదైత్యుఁ జించినవాఁడు. ॥సుల॥

వాలుకగోళ్లవాఁడు వాఁడికోరలవాఁడు
మేలిమి కరుణతోడ మించినవాఁడు
వోలిఁ దుంగభద్రకాడనుండి శ్రీవెంకటాద్రిని
లీలతోఁ బ్రహ్లాదుని కేలికైనవాఁడు. ॥సుల॥ 275

చాయ

శరణు శరణు నీకు జగదేకవందిత
కరుణతో మమ్ము నేలు కౌసల్యనందన. ॥పల్లవి॥

ఘనరణరంగవిక్రమ దశరథపుత్ర
వినుతామన(ర?)స్తోమ వీరరాఘవ
మునులును ఋషులును ముదము నొందిరి నీవు
జననమందినందుకు జానకీరమణ. ॥శర॥

సులభ లక్ష్మణాగ్రజ సూర్యవంశతిలక
జలధిబంధన విభీషణవరద
తలఁకి యసురలు పాతాళము చొచ్చిరి నీవు
విలువిద్య నేర్చితేనే విజయరామ. ॥శర॥

రావణాంతక సర్వరక్షక నిర్మలభక్త
పావన దివ్యసాకేతపట్టణవాస
వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నినుఁ జూచి శ్రీవెంకటేశ. ॥శర॥ 276

నాట

రాముఁడు లోకాభిరాముఁడందరికి రక్షకుఁడీతనిఁ దెలిసికొలువరో
కామితఫలదుఁడు చరాచరములకుఁ గర్తయైనసర్వేశ్వరుఁడితఁడు ॥పల్లవి॥

తలఁప దశరథునితనయుఁడట తానె తారకబ్రహ్మమట
వెలయ మానుషపు వేషమట వెగటు హరువిల్లు విరిచెనట
అలరఁగ తానొక రాజట పాదాన నహల్యశాపము మాన్పెనట
సొలవక దైవికమానుషలీలలు చూపుచు మెరసీఁ జూఁడరో యితఁడు ॥

జగతి వసిష్ఠుని శిష్యుఁడట జటాయువుకు మోక్షమిచ్చె నట
అగచరులే తనసేనలట అంబుధి కొండలఁగట్టె నట
మగువకొరకుఁగానట కమలాసను మనుమని రావణుఁ జంపెనట
తగ లౌకిక వైదికములునొక్కటట తానొనరించీఁ జూడరో యితఁడు ॥

వెస నమరుల వరమడిగె నట విభీషణపట్టము గట్టెనట
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకుఁ గొలువిచ్చె నట
పొసగ శ్రీవెంకటగిరి నివాసమట భువనములుదరంబున ధరించెనట
సుసరపుసూక్ష్మాధికములు తనందుఁ జూపుచునున్నాఁడు చూడరో
యితఁడు. ॥రాము॥ 277

గౌళ

అఱిముఱి హనుమంతుఁడట్టి బంటు
వెఱపు లేని రఘువీరునికి బంటు. ॥పల్లవి॥

యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడె బంటు
తాలిమి గలిగినయాతఁడె బంటు
పాలుమాలక యేపొద్దు పని సేయువాఁడె బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు. ॥అఱి॥

తను మనోవంచనలెంతటా లేనివాఁడె బంటు
ధనముపట్టున శుద్ధాత్మకుఁడు బంటు
అనిశము నెదురు మాటాడనివాఁడె బంటు
అనిమొనఁ దిరుగనియతఁడె బంటు ॥అఱి॥

చెప్పినట్లనే నడచినయాతఁడె బంటు
తప్పులేక హితుఁడై నాతఁడె బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడె బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుఁడె బంటు. ॥అఱి॥

అక్కర గలిగి కడు నాప్తుఁడైనవాఁడే బంటు
యెక్కడా విడిచిపోని యిష్టుఁడే బంటు
తక్కక రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తి గలవాఁడె బంటు ॥అతి॥

కానిపనులకు లోను గానివాఁడె బంటు
ఆనాజ్ఞ మీరనియాతఁడె బంటు
నానాగతి శ్రీవెంకటోన్నతుఁడైన యతనికి
తా నిన్నిటా దాసుఁడైనధన్యుఁడే బంటు. ॥అతి॥ 278

348-వ రేకు దేవక్రియ

ఏమి చెప్పేది ప్రతాప మేట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడె మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు. ॥పల్లవి॥

విడిసెఁ గపిబలమువెస సముద్రముదరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని. ॥ఏమి॥

చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలు గాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
మెచ్చిరందరు సీతాసమేతుఁ డాయ నితఁడు. ॥ఏమి॥

మగుడెఁ బుష్పకముపై మహిమ నితనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవెంకటాద్రిపై నిల్చె నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు. ॥ఏమి॥ 279

మేఘరంజి

ఇందులోనే కానవచ్చె నిన్నిటా నీ మహిమలు
చెంది నీవే దిక్కు మాకు సీతాపతి రామా. ॥పల్లవి॥

దేవ నీకు వలసితే తృణము బ్రహ్మాస్త్ర మాయ
భావించి రాతికిఁ బ్రాణము వచ్చె
కావలసి యేసితే నాకాశము కట్లు దెగె
దైవమవంటే నీవే దశరథరామా. ॥ఇందు॥

కూరుచుక యేలితేను కోఁతులు రాజ్యము సేసె
కోరితేనే నీటిపైఁ గొండలు దేలె
సారెఁ గదలి వచ్చె నీ సన్నల సంజీవికొండ
యేరీతి నీసరి వేరీ యినకులరామా. ॥ఇందు॥

నూటి నీవు దలఁచితే సురలు పంపు సేసిరి
చాటితేనే నీపేరు జపమాయను
ఆటల నీకతలెల్లా నాచంద్రార్కమై నిలిచె
గాటపు సిరుల శ్రీవెంకటగిరిరామా. ॥ఇందు॥ 280

దేసి

ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ ప్రతాపము
రామ రామభద్ర సీతారమణ సర్వేశ. ॥పల్లవి॥

పెరవున హరువిల్లు విరుఁగఁ దీసిననాఁడె
అరయ విరిగె వీపు లసురలకు
వరుస వనవాసవ్రతము వట్టినపుడె
పరులమతుల భీతి వట్టె రఘురామ. ॥ఏమ॥

వచ్చి నీవు దండకావనము చొచ్చిననాఁడె
చొచ్చిరి పాతాళ మసురలెల్లాను
ముచ్చటాడి చుప్పనాతిముక్కు గోసిననాఁడె
కొచ్చి దైత్యులాస తెగఁగోసిరి శ్రీరామ. ॥ఏమ॥

అడరి మారీచుపై నమ్ము విడిచిననాఁడె
విడిచిరి దానవులు వేడుకలెల్లాను
బడి విభీషణునిఁ జేపట్టితే రక్కసులెల్లా
చిడిసి మల్లెవట్టిరి శ్రీవెంకటరామ. ॥ఏమ॥ 281

ముఖారి

కొలువరో మొక్కరో కోరి తలఁచరో
చెలఁగి మనల రక్షించీని వీఁడె. ॥పల్లవి॥

పాయపువాఁడు నల్లఁబల్లి చెన్నుఁడు
వేయినామముల వెన్నుఁడు
పాయక కొల్చిన భక్త ప్రసన్నుఁడు
యీయెడనే వరములు యిచ్చీని వీఁడె. ॥కొలు॥

పరిపూర్ణుఁడు మహానుభావుఁడు
తిరమగు దేవాదిదేవుఁడు
పరమానందస్వభావుఁడు
గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె. ॥కొలు॥

తెలియుఁడీతఁడె దేవాగ్రగణ్యుఁడు
వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు
అలరఁగ శ్రీవెంకటాచలేశపుణ్యుఁడు
నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె. ॥కొలు॥ 282

సామంతం

రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరో
యేమిటికి విచారాలు యిఁక దైత్యులాల. ॥పల్లవి॥

చలమునఁ దాటకిఁ జదిపినబాణము
లలి మారీచసుబాహులపై బాణము
మెలఁగి పరశురాము మెట్లేసిన బాణము
తళతళ మెరిసీని తలరో యసురలు. ॥రాము॥

మాయామృగముమీఁద మరి వేసినబాణము
చేయి చాఁచి వాలి నేసినబాణము
తోయధిమీఁద నటు తొడిగినబాణము
చాయలు దేరుచున్నది చనరో దైతేయులు. ॥రాము॥

తగఁ గుంభకర్ణునితల ద్రుంచినబాణము
జిగి రావణుఁ బరిమార్చినబాణము
మిగుల శ్రీవెంకటేశు మేఁటిపాద(ది?)లో నున్నది
పగ సాధించీ నిఁకఁ బారరో రాకాసులు. ॥రాము॥ 283

నాదరామక్రియ

అప్పటి సుఖమె కాని యటమీఁదెంచుకోనఁడు
వుప్పతిల్లు జీవుని వుద్యోగాలిట్టివి. ॥పల్లవి॥

తనుభోగపురతులు దలపోయుచుండుఁ గాని
తన నరకకూపాలు దలపోయఁడు
కనకభూషణములు గని వెరగందుఁ గాని
ఘనకర్మబంధాలకుఁ గడు వెరగందఁడు. ॥అప్ప॥

యీకడాకడఁ దాఁ జేసేటి యెమ్మెలే యెంచుఁ గాని
పైకొని కూడేటి పాపములెంచఁడు
దీకొని జగములోని ద్రిష్టములే చూచుఁ గాని
భీకరపు జన్మముల పిరివీకు చూడఁడు. ॥అప్ప॥

వింతవింతమాటల వేడుకలే వినుఁ గాని
అంతటఁ దాఁ బడేపాట్లవి వినఁడు
యింతటా శ్రీవెంకటేశుఁడేలఁగా నెరిఁగెఁ గాని
యెంత చెప్పినాను బుద్ధి యిన్నాళ్లు నెరఁగఁడు. ॥అప్ప॥ 284

349-వ రేకు. గుండక్రియ

జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార
మగణితముగఁ గూడె నదె స్వాతియోగము. ॥పల్లవి॥

పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్యకసిపుఁ దొడికి పట్టి
చక్కఁగాఁ గడపమీఁద సంధ్యాకాలమున
వక్కలు సేసె నురవడి నరసింహుఁడు. ॥జగ॥

పిప్పిగాఁగఁ జప్పరించి పేగులు జందేలు వేసి
తొప్పఁదోఁగుచు నెత్తురు దోసిటఁ జల్లె
రొప్పుచుఁ గోపముతోఁ గేరుచుఁ బకపక నవ్వె
తప్పక చూచె వాని నుదగ్రనరసింహుఁడు. ॥జగ॥

యెదుటఁ బ్రహ్లాదుఁ జూచి యిందిరఁ దొడపై నుంచె
అదన నందరికి నభయమిచ్చె
కదసి శ్రీవెంకటాద్రిగద్దెమీఁదఁ గూచుండె
వెదచల్లెఁ గృపయెల్ల వీరనరసింహుఁడు. ॥జగ॥ 285

## సౌరాష్ట్రం

వీధులవీధుల విభుఁడేఁగీ నిదె
మోదముతోడుత మొక్కరో జనులు. ॥పల్లవి॥

గరుడధ్వజమదె కనకరథంబదె
అరదముపై హరి యలవాఁడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరఁగ బగ్గములు పట్టరో జనులు. ॥వీధు॥

ఆడేరదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరునుఁ జూడరో జనులు. ॥వీధు॥

శ్రీవెంకటపతిశిఖరము చాయదె
భావింప బహుళ్లై భవములవే
గోవిందనామపు ఘోషణలిడుచును
దైవంబితఁడని తలఁచరో జనులు. ॥వీధు॥ 286

## మాళవశ్రీ

శ్రావణబహుళాష్టమి సవరేత్రికాడను
శ్రీవిభుఁడుదయించె జెలులాల వినరె. ॥పల్లవి॥

అసురల శిక్షించ నమరుల రక్షించ
వసుధభారమెల్లా నివారింపను
వసుదేవునికిని దేవకిదేవికిని
అసదృశమగు కృష్ణుఁడవతారమందెను. ॥శ్రావ॥

గోపికల మన్నించ గొల్లల నెల్లాఁ గావఁగ
దాఁపై మునులనెల్లా దయసేయను
దీపించ నందునికి దేవియైన యశోదకు
యేపున సుతుఁడై కృష్ణుఁడిన్నిటాఁ బెరిగెను. ||శ్రావ||

పాండవుల మనుపఁగ పదారువేలఁ బెండ్లాడఁగ
నిండి శ్రీవెంకటాద్రిపై నిలుచుండఁగా
అండ నలమేల్మంగ నక్కునఁ గాఁగలించఁగ
దండియై యుండఁ గృష్ణుఁడు తగ నుతికెక్కెను. ||శ్రావ|| 287

వసంతం

కోలలెత్తుకొని గోపాలులునుఁ దాను
యీలీల సోదించె యీతఁడే కదవె. ||పల్లవి||

జన్నెవట్టి వుట్టిఁ జక్కఁగఁ బెట్టిన
వెన్న దిన్నవాఁడు వీఁడు గదె
పన్నారు దొంతుల పాలుఁ బెరుగులు
యిన్ని నారగించె యీతఁడు గదవె. ||కోల||

మెఱసి యుట్టుగమీఁది చక్కిలాలు
వెఱచి కైకొనె వీఁడె కదె
కఱమి కఱమి నములు గంపల నురుగులు
యెఱిఁగి దొంగిలె యీతఁడే కదవె. ||కోల||

శ్రీవెంకటాద్రి దాఁచిన తేనె లెల్లా
వేవేగ సాధించె వీఁడె కదె
కావించలమేలుమంగపతయి మమ్మేలె
యేవంకఁ జూచినా యీతఁడే కదవె. ||కోల|| 288

శుద్ధవసంతం

ఈడ నిందరికి నేలికై వున్నాఁడు
వాడల రేపల్లెవాఁడా వీఁడు. ॥పల్లవి॥

భారపు వుట్ల పాలుఁ బెరుగులు
వారలు వట్టినవాఁడా వీఁడు
కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలు దీసిన శిశువా వీఁడు. ॥ఈడ॥

ఆవులఁ బేయల నందరియిండ్ల
వావిరిఁ గాచిన వాఁడా వీఁడు
వావు లొక్కటిగా వనితలఁ గూడి
వేవేలు నేర్చిన విటుఁడా వీఁడు. ॥ఈడ॥

అరుదై శ్రీవెంకటాద్రిమీఁద నుండి
వరములిచ్చేటి వాఁడా వీఁడు
మరిగలమేల్మంగతో మమ్మేలె
సరసుఁడై వుండే జాణా వీఁడు. ॥ఈడ॥ 289

శంకరాభరణం

ధర్మమునకె మము దయఁ గావవె యిఁక
నిర్మలుఁడవు నిను నే మెరిఁగేమా. ॥పల్లవి॥

కాయధారులము కర్మలోలులము
మాయకగపడిన మనుజులము
పాయపు మదమున భ్రమసే మా మనసు
నీమొదఁ దగులై నిలిచీనా. ॥ధర్మ॥

చాపల్యగుణము జడులమన్నిటాను
పాపపుణ్యసంబద్ధులము
పైపైఁ గోర్కులఁ బ్రబలే మా బ్రదుకు
యేపనులకు నీకెక్కీనా. ॥ధర్మ॥

అతిప్రాకృతులము అహంకారులము
సతతంబునుఁ జంచలులము
హితవుగ శ్రీవెంకటేశ యేలితివి
తతితో నీభ_క్తతగ మరచేమా. ॥ధర్మ॥ 290

350_వ రేకు. భంగాళం

భావించి తెలుసుకొంటే భాగ్యఫలము
ఆవలీవలి ఫలములంగజజనకుఁడే. ॥పల్లవి॥

దానములలో ఫలము తపములలో ఫలము
మోనములలో ఫలము ముకుందుఁడే
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము
నానాఫలములును నారాయణుఁడే. ॥భావిం॥

వినుతులలో ఫలము వేదములలో ఫలము
మనసులోని ఫలము మాధవుఁడే
దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము
ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే. ॥భావిం॥

సతతయోగఫలము చదువులలో ఫలము
అతిశయోన్నతఫలము యచ్యుతుఁడే
యతులలోని ఫలము జితకామితఫలము
క్షితి మోక్షముఫలము శ్రీవెంకటేశుఁడే ॥భావిం॥ 291

## మధ్యమావతి

చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహ
బత్తి సేసేరు మునులు పరికించవయ్యా. ॥పల్లవి॥

సకలదేవతలును జయవెట్టుచున్నారు
చకితులై దానవులు సమసిరదె
అకలంకయగు లక్ష్మి యటు నీ తొడపై నెక్కె
ప్రకటమైన నీ కోపము మానవయ్యా. ॥చిత్త॥

తుంబురునారదాదులు దొరకొని పాడేరు
అంబుజాసనుఁడభయమడిగీ నదె
అంబరవీధి నాడేరు యచ్చరలందరుఁ గూడి
శంబరరిపుజనక శాంతము చూపవయ్యా. ॥చిత్త॥

హత్తి కొలిచేరదె యక్షులును గంధర్వులు
చిత్తగించు పొగడేరు సిద్ధసాధ్యులు
సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితిమిదె
యిత్తల శ్రీవెంకటేశ యేలుకొనవయ్యా. ॥చిత్త॥ 292

## నారాయణి

హరి హరి నీ మాయామహిమ
సరవి దెలియ నను గరుణించఁ గదే. ॥పల్లవి॥

తలఁతును నా పాలిదైవమవని నిను
తలఁతును తల్లివిఁ దండ్రివని
మలసి యంతలో మఱతును తెలుతును
కలవలె నున్నది కడ గనరాదు. ॥హరి॥

మొక్కుదు నొకపరి మోగి నేలికవని
మొక్కుదు నీ వాదిమూలమని
ప్రుక్కున గర్వించి యుబ్బుదు సగ్గుదు
కక్కసమైనది కడ గనరాదు. ॥హరి॥

చూతును నీమూర్తి సులభుఁడవనుచును
చూతు జగములకు సోద్యమని
యీతల శ్రీవెంకటేశ నన్నేలితివి
కౌతుకమొదవెను కడ గనరాదు. ॥హరి॥ 293

నాగవరాళి

దైవము నెరఁగము తత్త్వముఁ దలఁచము
చేవై హరి రక్షించీ నిదివో. ॥పల్లవి॥

పాపముఁ బుణ్యముఁ బైకొను దేహము
కోపము శాంతపు గుణములది
వోపికవోపము లుదుటు చూపెడిది(వి ?)
చేపట్టుక యిటు చెలఁగేమిదివో. ॥దైవ॥

వెలికిని లోనికి విడిపెటి ప్రాణము
చలువలు వేండ్లు చల్లెడిది
తెలివికి నిదురకుఁ దేపై యున్నది
బలిమిఁ జేపట్టుక బ్రదికే మిదివో. ॥దైవ॥

పరమును నిహామునుఁ బట్టిన జీవుఁడ
పొరుగుకు నింటికిఁ బొత్తైతి
గరిమల శ్రీవెంకటపతి శరణని
నిరతపు మహిమల నెగడే మిదివో. ॥దైవ॥ 294

### * శోకవరాళి

ఓహో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో. ॥పల్లవి॥

జగములో రాముఁడై జనియించె విష్ణుఁడదె
అగపడి లక్ష్మి సీతయై పుట్టెను
తగు శేషచక్ర శంఖ దైవసాధనములెల్ల
జిగి లక్ష్మణభరతాంచితశత్రుఘ్నులైరి. ॥ఓహో॥

సురలు వానరులైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగిఁ రుద్రుఁడె హనుమంతుఁడాయను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి. ॥ఓహో॥

కట్టిరి సేతువపుడె ఘనులెల్ల దాఁటిరి
ముట్టిరి లంకానగరము నీదళము
యిట్టె శ్రీవెంకటేశుఁ డితఁడై రావణుఁ జంపె
వొట్టుక వరము లిచ్చీ నొనర దాసులకు. ॥ఓహో॥ 295

### గౌళ

జీవుఁడూ నొక్కఁటె చిత్తమూ నొక్కఁటె
వేవేలు మాయలచే వెలయుఁ గొన్నాళ్లు. ॥పల్లవి॥

వొక్కటే దేహము పూరకె బాల్యావస్థ
యెక్కడౌతా నెరఁగడు యిటు గొన్నాళ్లు

---

ఈ సంకీర్తనమే గౌళరాగమున స్వల్పపాఠభేదములతో ౨-వ సంపుటమున ౧౮౬-వ పాటగా ముద్రితము. ఈ పునరుక్తి రేకులలోనిదే.

చక్కఁగ నంతటిలోనె జవ్వనపాయమునాఁడు
మిక్కిలి పోకలఁ బోయి మెరయుఁ గొన్నాళ్లు. ॥జీవు॥

ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు
వోఁకరెన్నఁడో (?) దాఁగి వుండుఁ గొన్నాళ్లు
కాఁకల నంతటిలోనె కమ్మరఁ బుట్టినప్పుడె
వేఁకమై పలురుచులు వెదకుఁ గొన్నాళ్లు. ॥జీవు॥

దేవుఁడూ నొక్కఁడె తెలియుదాఁకాఁ బెక్కు
దేవతలై భ్రమయించు దేహము గొన్నాళ్లు
చేవమీర నంతలోనె శ్రీవెంకటేశుఁడై
సేవ గొని సుజ్ఞానిఁ జేసుఁ గొన్నాళ్లు. ॥జీవు॥ 296

# సూచిక ౧

## సంకీర్తన రాగముల అకారాదిసూచిక


| రాగములు. | సంకీర్తనసంఖ్యలు. |
|---|---|
| ఆందోళి | 178. |
| ఆహిరి | 180, 223, 245, 265, 275. |
| కన్నడగౌళ | 170, 212. |
| కాంబోది | 201. |
| కురంజి | 174. |
| కేదారగౌళ | 209, 269. |
| గౌళ | 181, 240. |
| గుండక్రియ | 10, 40, 53, 58, 59, 69, 102, 113, 125, 148, 190, 217, 263, 285. |
| గుజ్జరి | 76, 90, 107, 191, 259. |
| చాయ | 276. |
| తోండి | 80. |
| దేవక్రియ | 172, 279. |
| దేవగాంధారి | 26, 41, 51, 97, 105, 123, 189, 251. |
| దేసాళం | 2, 18, 27, 33, 57, 65, 83, 120, 143, 164, 205, 256. |
| దేసాక్షి | 14, 50, 67, 82, 137, 150, 154, 188, 230. |
| దేసి | 228, 260, 281. |
| ధన్నాసి | 39, 72, 99, 138, 151, 200, 253. |
| నాట | 32, 110, 158, 276. |
| నాగవరాళి | 202, 215, 242, 294. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| నాదరామక్రియ | 176, 203, 255, 267, 284. |
| నారాయణి | 29, 81, 124, 203, 293. |
| పళవంజరం | 211, 254, 258. |
| పాడి | 35, 73, 94, 100, 116, 127, 146, 156, 169, 234, 266. |
| బలహంస | 204. |
| బౌళి (భవుళి) | 4, 12, 31, 60, 70, 75, 89, 98, 103, 115, 121, 131, 134, 136, 144, 159, 198, 222, 261, 296. |
| బౌళిరామక్రియ | 7, 175, 210, 220, 231. |
| భంగాళం | 207, 291. |
| భల్లాటి | 179. |
| భూపాళం | 130, 238. |
| భైరవి | 34, 249. |
| మంగళకౌశిక | 8, 23, 79, 132, 241. |
| మధ్యమావతి | 292. |
| మలహరి | 96, 135, 187, 199, 250. |
| మాళవశ్రీ | 226, 287. |
| మాళవి | 21, 109, 155, 233, 272. |
| మాళవిగౌళ | 30, 55, 62. |
| ముఖారి | 9, 28, 49, 64, 87, 157, 282. |
| మేఘరంజి | 173, 262, 280. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
| --- | --- |
| రామక్రియ | 1, 25, 66, 92, 95, 101, 140, 160, 166, 168, 193. |
| లలిత | 6, 19, 22, 38, 43, 48, 54, 68, 78, 91, 108, 119, 126, 149, 161, 165, 197, 225, 229, 239, 246, 252, 264. |
| వరాళి | 24, 45, 88, 142, 152, 167, 182, 221, 227, 273. |
| వసంతవరాళి | 5. |
| వసంతం | 184, 288. |
| శంకరాభరణం | 3, 13, 86, 141, 171, 183, 194, 237, 270, 290. |
| శుద్ధవసంతం | 7, 16, 42, 61, 63, 77, 112, 195, 235, 243, 247, 289. |
| శోకవరాళి | 216, 295. |
| శ్రీరాగం | 47, 56, 74, 122, 128, 133, 147, 168, 248, 271, 274. |
| సామంతం | 11, 15, 37, 52, 84, 104, 106, 111, 117, 129, 153, 163, 196, 213, 283. |
| సాళంగం | 118, 244. |
| సాళంగనాట | 17, 20, 85, 93, 114, 132, 139, 145, 185, 224, 268. |
| సౌరాష్ట్రం | 46, 102, 206, 219, 286. |
| హిందోళం | 236. |
| హిందోళవసంతం | 177, 214. |
| హిజ్జిజి | 218. |

# సూచిక ౨

## సంకీర్తనల అకారాదిసూచిక.


| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంజనీదేవికొడుకు | మాళవి | 272 |
| అంతటనె వచ్చి | కాంబోది | 201 |
| అందుకు హరికథ | మలహరి | 187 |
| అందరికి నెక్కుడైన | మాళవి | 155 |
| అందులకిదె ప్రతి | సామంతం | 117 |
| అందులకు సందులకు | ధన్నాసి | 72 |
| అచ్యుతుఁడనియెడి | సామంతం | 104 |
| అచ్యుతు శరణ | శంకరాభరణం | 3 |
| అజ్ఞానులకివి | దేసి | 260 |
| అటమీఁదిపనులకు | శ్రీరాగం | 248 |
| అఁటగొన్నాళ్ళుందాఁక | వరాళి | 227 |
| అడర శ్రావణబహు | రామక్రియ | 160 |
| అడుకులు చక్కిలా | దేసాళం | 27 |
| అడ్డము లేని నాలిక | బౌళి | 89 |
| అతఁడు లక్ష్మీకాంతు | గుండక్రియ | 59 |
| అతఁడేమి సేసినా | శంకరాభరణం | 13 |
| అతని భజయించరో | లలిత | 108 |
| అనాది జగమున | నారాయణి | 29 |
| అనాదిజీవుఁడన్ని | గుండక్రియ | 10 |
| అని బ్రహ్మాదులెంచేరు | మేఘరంజి | 262 |
| అన్నిటానిట్టే కాని | దేసాళం | 120 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అన్నిటిపై నున్నట్లు | నారాయణి | 124 |
| అన్నియు నాలోనుండఁగ | గుండక్రియ | 190 |
| అన్నివిధములుఁ దానై | దేవగాంధారి | 51 |
| అనుచుఁ బొగడ | పాడి | 234 |
| అనుచు మునులు ఋషులు | భైరవి | 249 |
| అప్పటి సుఖమే కాని | నాదరామక్రియ | 284 |
| అప్పుడైన హరి | పాడి | 35 |
| అమరాంగనలదె | దేవగాంధారి | 26 |
| అతిమతి హనుమంతు | గౌళ | 278 |
| అల బ్రహ్మదులకెణఁగ | సాళంగనాట | 268 |
| అహోబలేశ్వరుఁ డఖిల | శ్రీరాగం | 271 |
| ఆతఁడా యీతఁడు | శంకరాభరణం | 141 |
| ఆతఁడితఁడా వెన్న | లలిత | 6 |
| ఆతఁడే పోమాయేలిక | మాళవి | 109 |
| ఆదిమూలమే | ముఖారి | 49 |
| ఆపదలు లేని సుఖ | ఆహిరి | 223 |
| ఆయంబిది తెలియఁగల | ధన్నాసి | 99 |
| ఆహా నమో నమో | దేవగాంధారి | 97 |
| ఇంకనేమి సేసేము | లలిత | 252 |
| ఇంత లేకుంటే | బౌళి | 198 |
| ఇంతేయింతే యింకా | తోండి | 80 |
| ఇందరిపై భిన్నభక్తి | రామక్రియ | 101 |
| ఇందరు నీకొక్కసరి | మంగళకౌశిక | 8 |
| ఇందిరానాథుఁడవు | కేదారగౌళ | 209 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇందు కేదివుపాయ | దేసాక్షి | 150 |
| ఇందులోనఁ గలసుఖ | ముఖారి | 87 |
| ఇందులోనే కానవచ్చె | మేఘరంజి | 280 |
| ఇందేవున్నది కాన | దేసాక్షి | 137 |
| ఇతఁడు తారక | బౌళి | 159 |
| ఇతరమేదియు లేదు | సామంతం | 11 |
| ఇతరోపాయములెల్ల | గుజ్జరి | 191 |
| ఇదిగో రూపమై తోఁచీ | మాళవి | 233 |
| ఇదియే సులభం | లలిత | 38 |
| ఇదిగో శ్రుతిమూల | బౌళిరామక్రియ | 71 |
| ఇన్ని జన్మములెత్తిన | వరాళి | 221 |
| ఇన్నిటికి మూలమను | దేసాక్షి | 154 |
| ఇన్నియుఁ జదువనేల | ముఖారి | 64 |
| ఇరవుగా సన్నెరిఁగిరి | గుండక్రియ | 217 |
| ఇలువేల్పితఁడే | శ్రీరాగం | 133 |
| ఇహాపరసాధన | శుద్ధవసంతం | 16 |
| ఇహామే పరముమరి | గుజ్జరి | 76 |
| ఈడనిందరికి నేలిక | శుద్ధవసంతం | 289 |
| ఈతఁడే ద్రిష్టవరము | సామంతం | 111 |
| ఉండిట్టే వుండును | రామక్రియ | 193 |
| ఉన్నదిందునే వాక్క | బౌళి | 75 |
| ఉన్నసుద్దు లేల | హిందోళం | 236 |
| ఉమ్మడి కర్మములాల | సాళంగనాట | 132 |
| ఊరకే నోరు మూసుక | దేసాక్షి | 230 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
| --- | --- | --- |
| ఊరకే వెదకనేల | సామంతం | 196 |
| ఎంచి చూచితే | గౌళ | 162 |
| ఎంచి చూచితే | లలిత | 246 |
| ఎంచి సేయు పను | దేసాక్షి | 50 |
| ఎంతపరాక్రమము | బౌళిరామక్రియ | 175 |
| ఎందరివెంటల | ఆహిరి | 265 |
| ఎందుఁ గాపురము | శ్రీరాగం | 47 |
| ఎక్కడ నెదురు లేక | సాళంగనాట | 85 |
| ఎక్కడి కంసుఁడు | రామక్రియ | 1 |
| ఎక్కుడు బ్రహ్మాఁట్టాన | నాట | 158 |
| ఎత్తరే ఆరతులు | బౌళి | 31 |
| ఎదరికి నూకును | దేసాక్షి | 82 |
| ఎదురేది యింకనూకు | దేసాళం | 256 |
| ఎన్నఁడుఁ జెడని యీ | దేసాక్షి | 14 |
| ఎన్నిమహిమలవాఁడె | హిందోళవసంతం | 177 |
| ఎప్పుడూను నడచేవే | లలిత | 197 |
| ఎవ్వరివాఁడాఁ గాను | వరాళి | 142 |
| ఏటిబిడ్డఁ గంటివమ్మ | శంకరాభరణం | 237 |
| ఏడకేడ నీచరిత | శ్రీరాగం | 274 |
| ఏతపములు నేల | లలిత | 68 |
| ఏదాయనేమి హరి | లలిత | 264 |
| ఏది మాకు గతియిఁక | సామంతం | 153 |
| ఏపనులెవ్వరికిఁ గల | గుండక్రియ | 102 |
| ఏబలిమి నమ్మి | ముఖారి | 28 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమందు మిందును | వసంతవరాళి | 5 |
| ఏమనవచ్చును | గుజ్జరి | 259 |
| ఏమని చెప్పఁగ వచ్చు | దేసి | 281 |
| ఏమని పొగడుదు | సాళంగనాట | 17 |
| ఏమని విన్నవించేను | నాదరామక్రియ | 208 |
| ఏమి చెప్పేది ప్రతాప | దేవక్రియ | 279 |
| ఏమిటికేఁక నితర | బౌళి | 222 |
| ఏమిసేతు నిందుకు | బలహంస | 204 |
| ఏమిసేయువాఁడ | శుద్ధవసంతం | 63 |
| ఏలికవు నీవట | నారాయణి | 203 |
| ఒక్కమాఁటలోనివే | పళవంజరం | 211 |
| ఓహో రాకాసులార | శోకవరాళి | 295 |
| ఓహో వోడలుమాని | దేవగాంధారి | 41 |
| ఔ లే నేనొకపనికి | మంగళకౌశిక | 23 |
| కటకట నేమూ కిర్త | భవుళి | 136 |
| కటకట యీ మాయ | మలహరి | 96 |
| కటకటా యీ ప్రాణి | శుద్ధవసంతం | 195 |
| కదిరి నృసింహుఁడు | నాట | 32 |
| కనియెడి దిదియే | బౌళి | 115 |
| కన్నవారి వద్దనెల్ల | భూపాళం | 238 |
| కన్నులపండుగులాయ | ఆందోళి | 178 |
| కర్మమూలము జగము | దేశాక్షి | 188 |
| కలఁడా యింతటిదాత | నాదరామక్రియ | 255 |
| కలదొక్కటే గురి | పాడి | 266 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కాకున్న మాపాటు | శ్రీరాగం | 56 |
| కామధేనువు దేవ | పాడి | 127 |
| కాయము నాదేఅట | గుండక్రియ | 58 |
| కావక నీకే పోదు | లలిత | 126 |
| కైకొంటే కాక కమల | గుండక్రియ | 148 |
| కైకొన్నకోలది | బౌళిరామక్రియ | 220 |
| కొండంత పాడవుతో | కౌశి | 181 |
| కొలిచితే రక్షించే | ఆహిరి | 180 |
| కొలువరో మొక్కరో | ముఖారి | 282 |
| కొలువుండు వలసితే | శంకరాభరణం | 183 |
| కొలువై తానల్లవాఁడె | సామంతం | 163 |
| కొసరనేల నాగుణ | నాదరామక్రియ | 176 |
| కొసరి కొసరి యింక | సామంతం | 15 |
| కోటికిఁ బడగమెత్తి | గుండక్రియ | 40 |
| కోలలెత్తుకొని | వసంతం | 288 |
| గరిమతో వెరపేల | ముఖారి | 9 |
| గుల్లగుల్లే రాయి రాయే | దేసాళం | 83 |
| గోనెలే కొత్తలు | బౌళి | 60 |
| గోవింద నీవన్నిటిలో | శ్రీరాగం | 128 |
| ఘనుఁడాతఁడె మము | లలిత | 22 |
| చదివి చదివి వట్టి | బౌళి | 121 |
| చదివితిఁ దొల్లి కొంత | శ్రీరాగం | 74 |
| చదివి బదుకరో | దేసాళం | 33 |
| చలువకు వేడికి | సామంతం | 213 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చాలుఁ జాలు నీసటల | నాగవరాళి | 215 |
| చిత్తజగురుఁడవో | మధ్యమావతి | 292 |
| చూడవమ్మ కృష్ణుఁడు | లలిత | 161 |
| చెప్పఁబోతే యీ యర్థ | శంకరాభరణం | 270 |
| చెప్పినంతపనినే | భంగాళం | 207 |
| చేపట్టుఁ గుంచము | కురంజి | 174 |
| జగతిలో మనకెల్ల | భల్లాటి | 179 |
| జగతి పై శాఖశుద్ధ | గుండక్రియ | 285 |
| జగములెల్లా నీడేరె | సాళంగనాట | 20 |
| జీవములు దవ్వవోయ | మంగళకౌశిక | 79 |
| జీవుఁడూ నొక్కఁడే | బౌళి | 296 |
| జూటుఁదనాల వాఁడవు | దేసాళం | 164 |
| జ్ఞానంబొకటే జగ | బౌళిరామక్రియ | 231 |
| జ్ఞానము నెఱఁగను | గుండక్రియ | 113 |
| తక్కిన చదువులొల్ల | దేసాళం | 65 |
| తలఁపులోని వెలిసే | లలిత | 91 |
| తలరో లోకాంతర | కన్నడగౌళ | 212 |
| తల్లియుఁ దండ్రియు | దేసాళం | 205 |
| తిమ్మరెడ్డి మాకునిచ్చె | సామంతం | 52 |
| తెలియుట యెన్నఁడు | బౌళి | 70 |
| తెలిసినవారెల్లా | దేవగాంధారి | 23 |
| తొల్లి కలవేయివియు | పాడి | 73 |
| తొల్లిటివారు పెట్టిన | ధన్నాసి | 138 |
| తొల్లి యేరుపరిచిరి | లలిత | 239 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దినమట రాతిరట | సామంతం | 129 |
| దేవదేవుఁ డితఁడే | ధన్నాసి | 151 |
| దేహముతోఁడిది లంకె | వరాళి | 24 |
| దైవము నీవేదయ | రామక్రియ | 95 |
| దైవమా నీచేఁతలు | శుద్ధవసంతం | 247 |
| దైవమా నీవే దయా | నాగవరాళి | 202 |
| దైవము దూరఁగ నేల | నాదరామక్రియ | 267 |
| దైవము నెరఁగము | నాగవరాళి | 294 |
| దైవమొకఁడే మా | హిందోళవసంతం | 214 |
| ధర్మమునకె మము | శంకరాభరణం | 290 |
| నమోనమో దశరథ | బౌళి | 144 |
| నల్లఁ బల్లి చెన్నుఁడు | శ్రీరాగం | 168 |
| నవమూర్తులై నట్టి | వరాళి | 182 |
| నవరూప ప్రహ్లాద | గుండక్రియ | 263 |
| నాకుఁ గల పనియిదే | ధన్నాసి | 200 |
| నాకు నాకే సిగ్గయ్యీని | దేసాళం | 2 |
| నానావర్ణముల | మాళవిగౌళ | 55 |
| నిజమో కల్లో నిమిష | బౌళి | 7 |
| నిత్యసుఖానందమిదే | లలిత | 78 |
| నిన్ను నీవే తెలుసుకో | సాళంగనాట | 114 |
| నిరంతరంబును నీమాయే | దేసాక్షి | 67 |
| నీకంటే నితరను మరి | భవుళి | 103 |
| నీకు నీవే వలసితే | దేసాళం | 18 |
| నీకే నేశరణు | శంకరాభరణం | 194 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీట ముంచు పాలముంచు | సాళంగనాట | 224 |
| నీవంటి దైవాలు వేరీ | కౌశి | 240 |
| నీవనే నమ్మిన యట్టి | మంగళకౌశిక | 241 |
| నీవే దయసేసి | ధన్నాసి | 253 |
| నీవే నీదాసులని | బౌళి | 98 |
| నేడు గాక దొరనైతి | లలిత | 119 |
| నేనే పో ఘనుడను | దేసాళం | 57 |
| నేనేమి సేయుదును | గుండక్రియ | 53 |
| నేము సేసేయందు | సౌరాష్ట్రం | 46 |
| పంతగాడు మిక్కిలి | వరాళి | 273 |
| పంతపుటాసలులు బండ్ల | గుండక్రియ | 69 |
| పట్టిన ముట్టనుండరు | దేవగాంధారి | 251 |
| పట్టిన వ్రతమే పంతము | సామంతం | 84 |
| పదియారు వన్నెల | వరాళి | 167 |
| పనిగొనువారల | శుద్ధవసంతం | 7 |
| పరమవైష్ణవుల | శంకరాభరణం | 86 |
| పరమాత్మా నాజాడ | సామంతం | 106 |
| పరమోపకారులు | మలహరి | 199 |
| పలికెటి వేదము | బౌళిరామక్రియ | 210 |
| పాపపుణ్యముల | పాడి | 100 |
| పాపముం బుణ్యము | హిజ్జిజి | 218 |
| పారిరి దానవులెల్లా | మాళవి | 21 |
| పుట్టించినవాడు దానే | దేవగాంధారి | 189 |
| పుట్టుభోగులము | పాడి | 94 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పుట్టిడి దింతా బూటకం | బౌళి | 131 |
| పురుషుఁడే యధముఁడు | బౌళి | 134 |
| పొందగు నాత్మపుత్ర | మాళవిగౌళ | 62 |
| ప్రత్యక్షమే మాకుఁ బ్రమా | శ్రీరాగం | 122 |
| బంటుకు బంటవుదురా | లలిత | 225 |
| బాపురే నీ మాయ | గౌళ | 257 |
| బ్రహ్మాదులకు నిదే | లలిత | 48 |
| భావించరో వేదములు | రామక్రియ | 25 |
| భావించి తెలుసుకొంటే | భంగాళం | 291 |
| భావించువారల పాలి | లలిత | 19 |
| మతంగపర్వతము | లలిత | 165 |
| మనుష్మఁ జూడనేల | మంగళకౌశిక | 232 |
| మరి విచారించఁ బోతే | మేఁహరి | 135 |
| మరుగుచుఁ జేసే | రామక్రియ | 92 |
| మఱి తనుభోగములు | వరాళి | 152 |
| మాకునేమీఁ బని గాదు | ఆహిరి | 245 |
| మానరో వో లోకులాల | మలహరి | 250 |
| మీ మతము పరిభాష | కేదారగౌళ | 269 |
| ముందే తొలఁగవలె | రామక్రియ | 66 |
| మేలెల్ల నొక్కటే | సామంతం | 37 |
| మొదలివేల్పు మా | గౌళ | 36 |
| యజ్ఞమూర్తి యజ్ఞకర్త | వరాళి | 45 |
| రంట దెప్పరపు రచన | వసంతం | 184 |
| రాతికెల్ల సతులతో | భూపాళం | 130 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| రామచంద్రుఁ డితఁడు | శ్రీరాగం | 147 |
| రామా దశరథరామా | పాడి | 156 |
| రాముఁడు రాఘవుఁడు | పాడి | 169 |
| రాముఁడు లోకాభి | నాట | 277 |
| రామునికి శరణు చే | సామంతం | 283 |
| లాలుదింటా మలిగండ్లా | శుద్ధవసంతం | 61 |
| లెండో లెండో మాటా | రామక్రియ | 166 |
| లోకమంతా నిండె | దేసి | 228 |
| వట్టి జాలిఁ బడవల | మేఘరంజి | 173 |
| వర్ణాశ్రమములాల | లలిత | 229 |
| వాసుదేవ నివు | దేసాళం | 143 |
| విచారించుకొనే వారి | మాళవిగౌళ | 30 |
| విచ్చన విడినె యూడి | దేవక్రియ | 172 |
| విడిచితి మనరాదు | భవుళి | 12 |
| విడువ విడువ నింక | సౌరాష్ట్రం | 206 |
| విడువుము మనసా | శోకవరాళి | 216 |
| విత్తొకటి పెట్టఁగా | శుద్ధవసంతం | 42 |
| విత్తొకటి వెట్టఁగాను | రామక్రియ | 186 |
| వినోదకాఁడవాడు | శంకరాభరణం | 171 |
| విష్ణుదేవు పాదములే | లలిత | 149 |
| వీధుల వీధుల విభు | సౌరాష్ట్రం | 286 |
| వెగ్గలమింతా వృథా | నాగవరాళి | 242 |
| వెన్న చేతఁబట్టి | సాళంగం | 118 |
| వెరసె నహోబలాన | రామక్రియ | 140 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| తెలిపించఁ బోయి | పళవంజరం | 258 |
| వెలినుండు లోనుండు | సాళంగనాట | 93 |
| వేగిరించనేల | మాళవశ్రీ | 226 |
| వైష్ణవుల సొమ్ము నేను | సాళంగనాట | 185 |
| వొద్దు నీవు నాకెదురా | నాట | 110 |
| శరణమాతనికే | భైరవి | 34 |
| శరణు శరణు దేవ | కన్నడగౌళ | 170 |
| శరణు శరణు నీకు | ఛాయ | 276 |
| శ్రావణబహుళాష్టమి జయం | సాళంగనాట | 130 |
| శ్రావణబహుళాష్టమి సవ | మాళవశ్రీ | 287 |
| శ్రీపతి నీసేవ | గుజ్జరి | 107 |
| సచరాచరమిదె | పాడి | 116 |
| సర్వం విష్ణుమయం | గుజ్జరి | 90 |
| సిరిమగఁడే మొగ | లలిత | 54 |
| సుగ్రీవనారసింహుని | పాడి | 146 |
| సులభుఁడీతఁడిదివో సుగ్రీ | ఆహిరి | 275 |
| సేవించరో జనులాల | ముఖారి | 157 |
| హరికి లంకిణీ హంత | సాళంగనాట | 145 |
| హరికే మొరవెట్టు | వరాళి | 88 |
| హరిదాసులే మాకు | సౌరాష్ట్రం | 219 |
| హరి నీవాఁడనే కా | గౌళ | 44 |
| హరి నీవు మాలోన | ధన్నాసి | 39 |
| హరి నీవు లేవా | శుద్ధవసంతం | 243 |
| హరినీవే సకలలో | శుద్ధవసంతం | 112 |

| | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| హరి నే నిన్నిందులకు | దేవగాంధారి | 105 |
| హరినే యెఱుఁగరో | పళవంజరం | 254 |
| హరి పరతత్వంబగు | గుండక్రియ | 125 |
| హరిపూజే బ్రహ్మాండ | శుద్ధవసంతం | 235 |
| హరి యవతారమే | సౌరాష్ట్రం | 192 |
| హరివల్ల కడమలే | సాళంగం | 244 |
| హరి సర్వపాపేభ్యో | శుద్ధవసంతం | 77 |
| హరి సర్వాత్మకుఁడా | బౌళి | 261 |
| హరి శరణాగతి | నారాయణి | 81 |
| హరి హరి నీమాయా | నారాయణి | 293 |
| హీనాధికములింక | లలిత | 43 |


తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్, తిరుపతి. ప్ర. 250. 11-10-52.

SRI VENKATESVARA ORIENTAL INSTITUTE, TIRUPATI

## Price list of Publications

*General Editor* —PROF. P. V. RAMANUJASWAMI, M A, *Director*.

*Sri Venkatesvara Oriental Series* ·—

| | | Rs. | A. |
|---|---|---|---|
| 1. | **Sri Venkatesvara Kavya Kalapa,** (Sanskrit) Ed. by Sri D. T Tatacharya, M.O L ... | 4 | 0 |
| 2 | **History of Tirupati**, Volume II (English) by Dr. S. Krishnaswami Aiyangar, M.A., Ph D (*Out of Stock*) | | |
| 3 | **A Glossary of Indian Philosophical Terms**, (Sanskrit-English) by Sri C. V. Sankara Rao, M.A. | 1 | 8 |
| 4. | **Psychology**, (Telugu) by Dr. K. C. Varadachari, M.A., Ph.D (*Out of Stock*) | | |
| 5 | **Isavasyopanishad Bhashya**, of Venkatanatha, (Sanskrit-English) Ed & Translated by Dr K. C. Varadachari, M A., Ph.D. & Sri D T. Tatacharya, M.O.L. (*Out of Stock*) | | |
| 6. | **Samurtarchanadhikarana (Atri Samhita)**, (Sanskrit) Ed. by Mr Raghunatha Chakravarthi Bhattacharya & Sri M. Ramakrishna Kavi, M A. | 6 | 0 |
| 7. | **Suvarnasaptati Sastra.** (Sanskrit) Reconstructed from the Chinese & Ed. by Sri N. Aiyaswami Sastri ... | 3 | 0 |
| 8. | **Kenopanishad Bhashya**, by Rangaramanuja (Sanskrit-English) Ed. & Translated by Dr. K. C. Varadachari, M.A, Ph.D. & Sri D. T. Tatacharya, M.O.L. . ... ... ... | 1 | 0 |
| 9. | **Tirukkural-Kamattuppal**, with the commentaries of Kalingar and Paripperumal (Tamil) Ed. by Sri T. P. Palaniappa Pillai, B.O.L. .. ... | 2 | 0 |

| No. | Title | Rs. | A. |
|---|---|---|---|
| 10. | **Sri Venkatesvara Vachanamulu,** (Telugu) Edited by Sri V. Prabhakara Sastri ... ... | 1 | 8 |
| 11. | **Sringarasankirtanamulu,** Vol. IV of Tallapaka Annamacharyulu (Telugu) Ed. by Sri V. Prabhakara Sastri ... ... .. ... | 2 | 0 |
| 12 | **Kasyapa-Jnanakanda (Kasyapa Samhita),** (Sanskrit) Ed. by Sri R. Parthasarthi Bhattachar .. | 3 | 0 |
| 13 | **Andhra-Kuvalayanandamu** ,(Telugu) by Ubhayabhasha Pravina Sri K. Subrahmanya Sastri ... | 3 | 12 |
| 14 | **Tirukkural-Porutpal,** with the commentaries of Kalingar and Paripperumal (Tamil) Ed. by Sri T P Palaniappa Pillai, B O L ... | 4 | 0 |
| 15 | **Kathopanishad Bhashya,** of Rangaramanuja (Sanskrit-English) Ed and Translated by Dr. K. C. Varadachari, M.A., Ph. D and Sri D. T Tatacharya, M.O L .. . ... | 3 | 12 |
| 16 | **Sri Venkatesvara Laghu Kritulu,** (Telugu) Edited by Sri V. Prabhakara Sastri . .. | 1 | 8 |
| 17 | **Annamacharya Charitramu,** (Telugu) Edited by Sri V Prabhakara Sastri . ... | 2 | 8 |
| 18. | **Tiruvengada Sthalapuranam,** (Tamil) with prose supplement Ed by Sri T P. Palaniappa Pillai, B O L. .. ... ... ... | 1 | 8 |
| 19 | **Alankarasangraha,** of Amritanandayogi, (Sanskrit) Edited by Sri P. Balakrishnamurti, M A. | 3 | 4 |
| 20 | **Subhadra Kalyanamu,** (Telugu) by Tallapaka Timmakka, Ed by Sri V Prabhakara Sastri | 0 | 12 |
| 20a. | **Sankaravilasam,** (Tamil) Ed. by Sri T P. Palaniappa Pillai, B.O.L ... ... .. | 3 | 4 |
| 21 | **Janasrayi,** (Sanskrit) Ed. by Sri M. Ramakrishna Kavi, M.A. ... ... ... | 1 | 0 |

| No. | Title | Rs. | A. |
|---|---|---|---|
| 22. | **Adhyatmasankirtanalu,** Vol. V of Tallapaka Annamacharyulu (Telugu) Ed. by Sri V. Prabhakara Sastri ... ... .. | 3 | 4 |
| 23. | **Tiruvengada Ula,** (Tamil) Ed. by Sri T. P. Palaniappa Pillai, B.O.L ... | 1 | 8 |
| 24. | **Adhyatmasankirtanalu,** Vol. VI of Tallapaka Annamacharyulu (Telugu) Ed. by Sri A. V. Srinivasachari ... ... | 2 | 0 |
| 25. | **Prasnopanishad Bhashya,** of Rangaramanuja (Sanskrit-English) Ed and Translated by Dr. K. C Varadachari, M A , Ph.D. and Sri D. T. Tatacharya, M.O.L ... ... ... | 2 | 12 |
| 26. | **Sri Venkatesvara Stuti Ratnamala,** (Telugu) Ed. by Sri V Prabhakara Sastri .. ... | 1 | 2 |
| 27. | **Dharmasangraha,** (Sanskrit) Ed. by Prof P V. Ramanujaswami, M.A . ... | 2 | 0 |
| 28. | **Nipatavyayopasargavritti,** (Sanskrit) Ed. by Vidya Pravina Sri A Someswarasarma, P O.L. . | 2 | 0 |
| 29. | **Adhyatmasankirtanalu,** Vol VII of Tallapaka Annamacharyulu (Telugu) Ed by Sri R. Anantakrishna Sarma & Sri A V Srinivasachari ... | 3 | 0 |
| 30 | **Bharata Kosa,** (Sanskrit) Ed. by Sri M Ramakrishna Kavi, M.A. .. ... ... | 22 | 0 |
| 31. | **Adhyatmasankirtanalu,** Vol VIII of Tallapaka Annamacharyulu (Tel.) Ed by Sri R. Anantakrishna Sarma & A V. Srinivasachari ... | 3 | 0 |
| 32. | **Raghuvamsa,** (Cantos 1 & 2), Translated into Tamil and Ed. by Sri D T Tatacharya, M O L (*Shortly*) | | |
| 33. | **Adhyatmasankirtanalu,** Vol IX of Tallapaka Annamacharyulu (Tel.) Ed. by Sri R. Anantakrishna Sarma ... ... .. ... | 3 | 0 |
| 34. | **Sri Venkatesvara Stuti Ratnamala,** (Tel ) Vol. II Ed. by Sri K. Ramakrishnaiya, M A ... | 2 | 0 |

*Ve Sirnkatesvara Oriental Institute Studies :—* Rs. A.

| | | | |
|---|---|---|---|
| 1. | **Theory of Knowledge in the Philosophy of Sri Ramanuja** (English) by Dr. K. C. Varadachari, M.A. Ph.D. ... ... ... | 3 | 0 |
| 2. | **Rupakaparisuddhi** (Sanskrıt) by Srı D. T. Tatacharya, M.O.L. ... ... | 1 | 0 |
| 3 | **Idea of God** (Englısh) by Dr. K. C. Varadachari, M.A., Ph. D. ... ... ... ... | 3 | 0 |
| 4. | **Sahityavimarsa** (Sanskrıt) by Vıdya Pravına Sri A. Someswarasarma, P.O.L. ... . | 2 | 0 |
| 5. | **The Dharmasutras & the Dharmasastras** (Englısh) by Dewan Bahadur K. S. Ramaswamı Sastrı, B.A., B.L. ... ... ... ... | 0 | 12 |
| 6. | **Virasaiva Literature,** (Telugu) by Srı S Ramakrishna Sastrı, M.A., B.O.L. ... ... . | 5 | 0 |

*For copies of the above apply to :—*

THE DIRECTOR,

S. V. Oriental Institute, TIRUPATI,

*(Chittoor Dist.) South India*